హాకీ విజేతలు నెల్లూరు, తూర్పు గోదావరి

నక్కపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-19 బాలురు, బాలికల హాకీ పోటీల్లో నెల్లూరు, తూర్పుగోదావరి జట్లు విజేతలుగా నిలిచాయి. సోమవారం తుది పోరులో బాలుర విభాగంలో తూర్పుగోదావరిపై నెల్లూరు 3-0 తేడాతో విజయం సాధించి విజేతగా నిలవగా, రన్నర్‌గా తూర్పు గోదావరి, తృతీయ స్థానంలో విశాఖ నిలిచాయి. బాలికల విభాగంలో విశాఖపై తూర్పు గోదావరి జట్టు 2-1 తేడాతో విజయం సాధించింది. విశాఖ, అనంతపురం ద్వితీయ, తృతీయస్థానాలు సాధించాయి.

కలిసి కదిలారు.. కష్టం తీర్చారు !

అనంతగిరి, న్యూస్‌టుడే: మన్యంలోని పలు గ్రామాల్లో రహదారి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో స్థానికులే శ్రమదానంతో బాగు చేసుకుంటున్నారు. అనంతగిరి మండలంలోని పెద్దబిడ్డ పంచాయతీ ధనుకోట గ్రామానికి రహదారి నిర్మాణానికి గత వైకాపా ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయి. పనులు మాత్రం ముందుకు కదల్లేదు. కొద్దిపాటి పనులు చేసి వదిలివేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో శ్రమదానంతో రహదారి మరమ్మతులు చేసుకునేందుకు స్థానికులు చర్యలు చేపట్టారు. ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద రాళ్లు పేర్చి.. మట్టి పోసి రాకపోకలకు వీలుగా మార్చుకున్నారు. అధికారులు, కూటమి ప్రభుత్వం స్పందించి రహదారి పనులు పూర్తి చేయాలని కోరారు.

శ్రమదానం చేస్తున్న స్థానికులు

ఇరుకింట.. ఆటాపాటా లేదంట!

జామిగుడలోని అంగన్‌వాడీ కార్యకర్త ఇంట్లోని వంట గదిలో చిన్నారులు

పెదబయలు మండలం అతి మారుమూల జామిగుడ పంచాయతీలో అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పునాదుల స్థాయిలోనే నిలిపేశారు. అంగన్‌వాడీ కార్యకర్త ఇంట్లోనే కేంద్రాన్ని నడపాల్సిన దుస్థితి నెలకొంది. ఏడుగురు పిల్లలకు కార్యకర్త తన ఇంటిలోనే ఓవైపు సామగ్రి ఉంచి.. మరోవైపు పిల్లలకు పాఠాలు చెబుతున్నారు. చినుకుపడినా, ఏ ఇతర సమస్య ఎదురైనా ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆమె చెబుతున్నారు. అంగన్‌వాడీ భవనాన్ని సత్వరమే పూర్తిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– పెదబయలు, న్యూస్‌టుడే

సహనానికి పరీక్ష.. ప్రయాణమే శిక్ష

ఆంధ్రా ఊటీ అరకులోయ సమీపంలోని పర్యాటక ప్రదేశమైన రణజిల్లెడ జలపాతానికి పద్మాపురం ఉద్యానం నుంచి వెళ్లే రహదారి ఛిద్రంగా మారింది. పూర్తిగా గోతులమయమై రాళ్లు తేలి వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తోంది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదానికి గురయ్యే ఆస్కారముంది. నిత్యం పర్యాటకులు రాకపోకలు సాగించే ఈ రహదారిని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ రహదారిని బాగు చేయించాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు.

– అరకులోయ, న్యూస్‌టుడే

రాళ్లు తేలిన రణజిల్లెడ జలపాతం రహదారి

గబగబా చదవాలి.. చకచకా లెక్కెట్టాలి!

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు, సొంతంగా ఆలోచించే సృజనాత్మకత పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రైవేటు దీటుగా సర్కారు బడుల్లోని విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు పాఠశాల విద్యాశాఖ పలు వినూత్న కార్యక్రమాలు ప్రవేశపెట్టనుంది. జిల్లాలోని విద్యార్థుల్లో కొంత మంది ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తయినా కనీస పదాలు చదవలేకపోతున్నారు. చిన్నచిన్న కూడికలు, తీసివేతలు చేయలేకపోతున్నారు. ఇప్పటివరకూ పదో తరగతి చదువుతున్న విద్యార్థులకే ఏటా వంద రోజుల ప్రణాళిక తయారు చేసి పరీక్షలకు సన్నద్ధత చేసేవారు. ఇకపై ఇదే స్ఫూర్తితో ప్రతి విద్యార్థికి రాయడం, చదవడం రావాలనే లక్ష్యంతో వందరోజుల ప్రణాళిక (గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని ఒకటో తరగతి నుంచే అమలు చేయనున్నారు. త్వరలో పిల్లల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా సర్వే చేపట్టనున్నారు.

పాఠశాలలు: 2,800

పదిలోపు విద్యార్థులు: 1.49 లక్షలు

సామర్థ్యాల్లో వెనుకబడిన వారు: 55 వేల వరకు

● పిల్లల స్థాయినిబట్టి విద్యాబోధన (టీచింగ్ ఎట్ రైట్ లెవెల్-తరల్) కార్యక్రమాన్ని ప్రభుత్వ బడుల్లో ఇప్పటికే అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గత జులైలో పిల్లలకు బేస్‌లైన్ పరీక్ష (తెలుగు, ఆంగ్లం, లెక్కలు) నిర్వహించారు. ఈ పరీక్ష ఫలితాల ఆధారంగా పిల్లలను మూడు గ్రేడ్‌లుగా విభజించారు.

● కనీసం అక్షరాలు, అంకెలు రానివారిని 'సి' గ్రేడ్, అక్షరాలు పోల్చి ఒకట్రెండు అక్షరాలతో ఉన్న పదాలను చదువుతున్న వారికి 'బి' గ్రేడ్.. పేరాలు, కథలు చదువుతున్న వారిని 'ఎ' గ్రేడ్‌గా విభజించారు.

● గ్రూపులు, గ్రేడ్ల ఆధారంగా రోజూ పాఠశాలలో రెండు గంటల పాటు 'తరల్' శిక్షణ అందిస్తున్నారు. దీనికి సంబంధించి వచ్చేనెల 15న మిడ్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. ఈ ఫలితాల ఆధారంగా ప్రత్యేక సర్వే నిర్వహించి విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చేందుకు 'గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్' వందరోజుల ప్రణాళిక రూపొందిస్తారు. వంద రోజుల అనంతరం చివరి పరీక్షలో సామర్థ్యాలు ఎంతమేరకు పెరిగాయో పరిశీలిస్తారు.

వంద రోజుల ప్రణాళికలో కీలకాంశాలు

✦ విద్యార్థులకు కనీస సామర్థ్యాలైన 'చదవడం.. రాయడం' నేర్పాలి.

✦ తెలుగు అయితే బొమ్మలను పోల్చడం, అక్షరాలు, అంకెలు గుర్తించడం, పేరాలు చదవడం, సొంతంగా కథ రాసి.. చెప్పగలగడం.. చిన్నచిన్న సంయుక్తాక్షర పదాలను పేరాలో గుర్తించడం చేయగలగాలి.

✦ లెక్కలపరంగా చూస్తే ఒకటి, రెండు వరుసల సంఖ్యలతో చిన్నచిన్న కూడికలు, తీసివేతలు చేయాలి. ఇందుకు లెక్కలంటే భయం పోగొట్టేలా సులభ పద్ధతిలో బోధించాలి.

పుష్ప బ్రిడ్జిగా గుర్తింపు పొందిన పాల్గూరులోని ప్రదేశం

మనోహరం.. చిత్రీకరణకు నిలయం!

చింతూరు మండలం మోతుగూడెం పరిధిలోని పర్యాటక ప్రాంతాల అందాలు సినీ దర్శక, నిర్మాతలను ఆకట్టుకుంటున్నాయి. నిత్యం షూటింగ్‌లతో ఇక్కడి పర్యాటక ప్రాంతాలు సందడిగా మారుతున్నాయి. ప్రీ వెడ్డింగ్, ఫ్యామిలీ, బేబీ, మెటర్నిటీ (ప్రెగ్నెన్సీ) షూట్‌లు, షార్ట్‌ఫిల్మ్‌లు, బుల్లితెర సీరియల్స్, భారీ బ్యానర్లతో సినిమా షూటింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఇటీవల సుకుమార్, బోయపాటి శ్రీను దర్శకత్వంలో పుష్ప-1, 2, అఖండ-2 సినిమా షూటింగ్‌లు ఇక్కడ జరిగాయి. గతంలో తమ్ముడు సినిమాలో కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. ఇటీవల కాలంలో కొన్ని సినీ నిర్మాతలు, దర్శకులు, డ్యాన్స్ మాస్టర్లు మోతుగూడెం పర్యాటక ప్రాంతాలను షూటింగ్ కోసం ఎంపిక చేసుకుంటున్నారు. గతంలో ఇక్కడ అల్లూరి సీతారామరాజు, ఎన్‌కౌంటర్, దొరబాబు, ప్రేమనగర్, దొంగలబండి, ఛాయ వంటి సినిమాలను చిత్రీకరించారు. ఈటీవీలో ప్రసారమయ్యే కుంకుమ పువ్వు, గంగోత్రిలో కొన్ని సన్నివేశాలను ఇక్కడే చిత్రీకరించారు. ఫొటో షూట్‌లకు సంబంధించి దుస్తులు ఇక్కడే అద్దె నిమిత్తం ఇస్తుండటంతో చిత్రీకరణ వారికి సులభమైంది. – న్యూస్‌టుడే, మోతుగూడెం

స్ట్రాబెరీ వచ్చేసింది!

చింతపల్లి మండలంలో స్ట్రాబెరీ అమ్మకాలు మొదలయ్యాయి. అతిశీతల ప్రాంతంగా గుర్తింపు పొందిన లంబసింగి, చింతపల్లి ప్రాంతాల్లో స్ట్రాబెరీ సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండటంతో కొందరు రైతులు దీన్ని వాణిజ్యపరంగా పండిస్తున్నారు. ఏటా చలికాలంలో ఇక్కడకు దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా ఈ సాగును రైతులు ఎంచుకున్నారు. కొందరు మైదాన ప్రాంతాలకు చెందిన కౌలు రైతులు స్థానికంగా ఉన్న గిరిజనుల భూములను లీజుకు తీసుకుని అందులో పలు రకాల పంటలను పండిస్తున్నారు. ఏటా నవంబరు నుంచి ఫిబ్రవరి వరకూ స్ట్రాబెరీ పంట దిగుబడులు ఇస్తుంది. ప్రస్తుతం ఈ దిగుబడులు చింతపల్లి మండలంలో ప్రారంభమయ్యాయి. 200 గ్రాముల బరువున్న స్ట్రాబెరీలను స్థానికంగానే రూ.100కు విక్రయిస్తున్నారు. రైతుల వద్ద నుంచి వ్యాపారులు రూ. 80కి కొనుగోలు చేస్తున్నారు. ప్రారంభ సీజను కావడంతో ప్రస్తుతం ధరలు అధికంగానే ఉన్నాయి.

– న్యూస్‌టుడే, చింతపల్లి

మన్యంలో మాణిక్యాలు

క్రీడల్లో రాణిస్తున్న గిరి విద్యార్థులు

జి.మాడుగుల, న్యూస్‌టుడే

మన్యంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ మట్టిలో మాణిక్యాలని నిరూపిస్తున్నారు. తమను ప్రోత్సహిస్తే మరిన్ని విజయాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయిలో మెరిసిన రాజేష్

జి.మాడుగుల బాలుర ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో చదువుతున్న పాంగి రాజేష్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మెరిసి జాతీయ స్థాయికి అర్హత సాధించాడు. శ్రీకాకుళం జిల్లాలో ఇటీవల జరిగిన అండర్ -14 పోటీల్లో ఈ బాలుడు లాంగ్ జంప్‌లో ప్రథమ, డిస్కస్ త్రోలో ద్వితీయ స్థానాలను సాధించాడు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. చదువులో ముందుంటున్నాడు. క్రీడల్లో కష్టపడి సాధన చేసి విజయాలు సాధించాడు. పాఠశాలలో ఉపాధ్యాయులు, కోచ్‌ల మార్గదర్శకత్వం అతడు జాతీయ స్థాయికి ఎంపికవడానికి దోహదపడ్డాయి. డిసెంబర్ 4, 5 తేదీల్లో మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు.

పరిమిత వసతులతో సాధన.. నుర్మతి బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయికి పోటీలకు ఎంపికయ్యారు. కె.చిన్నారి 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ఎం.దేవకుమారి వాలీబాల్‌లో ప్రథమ, కె.కళ్యాణి జావలిన్ త్రోలో ద్వితీయ స్థానాలు సాధించారు. పరిమిత వసతులు ఉన్నప్పటికీ నిరంతర సాధనతో ఈ విజయాలను సాధించిన విద్యార్థులను పాడేరు ఐటీడీఏ డీడీ, ఏటీడబ్ల్యూఓ, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న అధికారులు

క్రీడల్లో ప్రోత్సహిస్తున్నాం... ఆశ్రమ పాఠశాలల విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సహిస్తున్నాం. జి.మాడుగుల, నుర్మతి ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు పలు క్రీడల్లో జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఆయా పోటీల్లో రాణించేలా మరింత తర్ఫీదు ఇస్తున్నాం.

– నాగశిరీష, ఏటీడబ్ల్యూఓ, జి.మాడుగుల

దివ్యాంగులకు బాసట

వంద శాతం రాయితీపై త్రిచక్ర వాహనాలు

25 వరకు దరఖాస్తుల స్వీకరణ

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే

వైకల్యాన్ని తలచుకుంటూ కుమిలిపోకుండా తమ పనులు తాము చేసుకుంటూ ఆసక్తి ఉన్న రంగంలో సత్తా చాటాలని దివ్యాంగులు ముందుకు సాగుతున్నారు. విభిన్న ప్రతిభావంతులకు చేదోడుగా, వారు గమ్యం చేరేందుకు వీలుగా త్రిచక్ర వాహనాలు అందజేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.

ఎవరు అర్హులు?

రెగ్యులర్ గ్రాడ్యుయేషన్, ఆపై కోర్సులు చదువుతున్న విద్యార్థులు, స్వయం ఉపాధి, వ్యవసాయం, అనుబంధ రంగాలు / పదో తరగతి ఉత్తీర్ణత సాధించి స్వయం ఉపాధితో జీవించే దివ్యాంగులకు వంద శాతం రాయితీపై ఉచితంగా అందజేస్తారు.

● ఈ నెల 25వ తేదీలోగా https://apdascac.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

● 18-45 ఏళ్ల మధ్య వయసు ఉండి, 70 శాతం, అంతకుమించి వైకల్యంతో కుటుంబ వార్షికాదాయం రూ.3 లక్షల్లోపు ఉన్న వారు అర్హులు.

● ఎంపిక చేసిన తేదీ నుంచి వాహనం నడిపేందుకు డ్రైవింగ్ లైసెన్సు పొంది ఉండాలి.

ఏమేం కావాలంటే..:

దివ్యాంగ ధ్రువపత్రం, ఆధార్, పదో తరగతి, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, గతంలో ప్రభుత్వం నుంచి వాహనం పొందలేదని స్వీయ ధ్రువీకరణ పత్రం జత చేయాలి.

● జిల్లాలో 13,600 మంది దివ్యాంగులు ఉన్నారు. వీరిలో ఆర్థో సంబంధ వైకల్యం ఉన్న వారు 9,800 మంది ఉన్నారు. నియోజకవర్గానికి 10 చొప్పున మూడు నియోజకవర్గాల్లో 30 త్రిచక్ర వాహనాలను అందజేశారు. వీటిలో 50 శాతం మహిళలకు కేటాయించారు. ఒక్కో యూనిట్ విలువ రూ1.30 లక్షలని దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ కవిత చెప్పారు.

వారం పేరుతో ఊరు!

మీకు తెలుసా?

మన్యంలో భౌగోళిక, వాతావరణ పరిస్థితులతోపాటు ఊరిపేర్లు కూడా విచిత్రంగా ఉంటాయి. శ్రీలంక రాజధాని కొలంబో పేరుతో పాడేరు మండలంలో ఒక ఊరు ఉంది. అక్కడ చాలాకాలం క్రితం కొలంబో అనే పండ్లసాగు జరిగేదట. అలా ఆ ఊరి పేరు కొలంబోగా మారింది. చింతపల్లి మండలంలో వారాల పేరుతో ఊర్లు ఉన్నాయి. అంజలం, శనివారం అనే రెండు గ్రామాలు పక్కపక్కనే ఉన్నాయి. ఈ రెండింటినీ కలిపి అంజలీ శనివారంగా పిలుస్తుంటారు. ఇదే మండలం అన్నవరం పంచాయతీలో సోమవరం అనే ఊరు ఉంది. వ్యక్తులకు సైతం సోమవారం పుట్టిన వారికి సొమ్రు, అని మంగళవారం పుట్టిన వారిపేరు మంగ్లు, బుధవారం పుడితే బుద్ధు, గురువారం పుడితే గురు, శుక్రవారం నాడు పుట్టిన వారికి శుక్ర, శుక్ల అని పెడుతుంటారు.

– చింతపల్లి, న్యూస్‌టుడే

డల్లాపల్లి.. చేరేవరకూ దడే!

పాడేరు ఘాట్‌రోడ్డులోని మోద కొండమ్మ పాదాల నుంచి డల్లాపల్లి వరకు సుమారు ఆరు కిలోమీటర్ల రహదారి ప్రమాదకరంగా మరింది. ప్రధాన మలుపుల్లో వరదనీరు చేరడంతో రోడ్డు కోతకు గురైంది. కొన్నిచోట్ల ప్రధాన రహదారిపై కంకర రాళ్లు తేలిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏడాదిన్నర నిర్మించిన తారురోడ్డు పక్కన సెల్‌ఫోన్ కేబుల్ పైపులైన్ల కోసం తీసిన గుంతలు సరిగా కప్పకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. – పాడేరు, న్యూస్‌టుడే

మీ పేరుతో ఉన్న సిమ్‌కార్డులెన్ని?

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే:

ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. అందుకు తగ్గట్టుగా అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో మోసగిస్తున్నారు. సైబర్ నేరాల్లో సిమ్‌కార్డు మోసాలు రోజురోజుకు అధికమవుతున్నాయి. మనకు తెలియకుండానే మన పేరుమీద సిమ్‌కార్డులు వాడుతున్నారు. నేరగాళ్లు మన పేరుతో ఉన్న సిమ్‌ను యాక్టివేట్ చేసి అనేక మోసాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆధార్ కార్డుతో మన పేరుమీద ఎన్ని సిమ్‌కార్డులు ఉన్నాయో, సులువుగా తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 'సంచార్ సాథీ మొబైల్ యాప్'ను అందుబాటులోకి తీసుకురావడం విశేషం.



మోసం చేసేందుకు ఎన్నో మార్గాలు ... కొత్త సిమ్‌కార్డు తీసుకునేందుకు దుకాణానికి వెళ్లినప్పుడు వినియోగదారుల నుంచి ఆధార్ కార్డు, వేలి ముద్రలు తీసుకుంటారు. కొంత మంది నేరగాళ్లు వేలిముద్రలు, ఐరిస్ సేకరించే ప్రక్రియ ఒకటికి రెండు సార్లు చేస్తారు. దీంతో రెండు సిమ్ కార్డులు మన పేరుమీద నమోదవుతాయి. మనం అడిగిన సిమ్ తీసుకుని మనం అక్కడి నుంచి వెళ్లిపోయాక.. రెండోది మనకు తెలియకుండా వారి వద్ద ఉండిపోతుంది. వీటిని అధిక ధరలకు సైబర్ నేరగాళ్లకు అమ్మి సొమ్ము చేసుకునే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి జాగ్రత్త వహించడం మంచిది.

మీకోసం

ఎలా పసిగట్టవచ్చంటే.. సంచార్ సాథీ మొబైల్ యాప్‌తో ఈ మోసాలకు చెక్ పెట్టొచ్చు. ఆండ్రాయిడ్, ఐఓఎస్‌లలో యాప్ అందుబాటులో ఉంది. అదేవిధంగా www.sancharsaathi.gov. in వెబ్‌సైట్‌ను సందర్శించి అందులో సిటిజన్ సెంట్రిక్ సేవలకు సంబంధించి పలు ఆప్షన్లు కనిపిస్తాయి. వాటిలో 'నో మొబైల్ కనెక్షన్ ఇన్ యువర్ నేమ్'పై క్లిక్ చేయాలి. అక్కడ సూచించిన పది అంకెల చరవాణి కింద క్యాప్చా నమోదు చేసి సబ్‌మిట్ చేస్తే ఓటీపీ వస్తుంది. ఆపై మన పేరు మీద నమోదైన సిమ్‌కార్డు నంబర్లు కనిపిస్తాయి. ఆ నంబర్ ఎంపిక చేస్తే నాట్ మై నంబర్, రిక్వైర్డ్ ఎంపికలు వస్తాయి. వీటిలో ఒకటి ఎంచుకుని ఫిర్యాదు చేయవచ్చు.

అందం.. ఆరోగ్యం

పర్యావరణానికి విఘాతం కలిగించే వాటిలో ప్రధానమైనవి పాలిథిన్, ప్లాస్టిక్ వ్యర్థాలు. ఒక్కసారి వాడి వీటిని పడేస్తే భూమిలో కలవకుండా ఇవి పర్యావరణానికి ముప్పు తలపెడుతుంటాయి. చింతపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థులు వినూత్నంగా ఆలోచించారు. పాఠశాల పరిసరాల్లో వినియోగానికి పనికిరాని ప్లాస్టిక్‌వాటర్ ట్యాంకులను పర్యావరణ హితానికి వినియోగిస్తున్నారు. ఈ ట్యాంకుల్లో మట్టి నింపి అందులో ఆక్సీజన్ ఇచ్చే మొక్కలతోపాటు వివిధ రకాల పూలమొక్కలను పెంచుతున్నారు. అందంగా కనిపించేలా ఖాళీ డ్రమ్ములకు రంగులు అద్దారు. పాఠశాల ప్రాంగణంలోకి అడుగు పెట్టగానే అందమైన మొక్కలతో.. వివిధరకాల పూలతో నిండిన ఉద్యానం అందరినీ ఆకట్టుకుంటోంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.ఎస్.ఎన్. రాజు, వసతిగృహ సంక్షేమాధికారి నూకరత్నం, పీడీ వరలక్ష్మి చొరవతో విద్యార్థినులు పాఠశాల, వసతిగృహాల ప్రాంగణాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. పాఠశాల ప్రాంగణంలోనే పెరటి తోటలు పెంచుతున్నారు. అందులో వివిధరకాల కాయగూరలు, ఆకుకూరలు, గుమ్మడి వంటివి సాగుచేస్తున్నారు. పూర్తిగా సేంద్రియ ఎరువులతో పండిస్తున్న ఇవి విద్యార్థులకు పోషకాహారం, ఆరోగ్యాన్ని అందిస్తున్నాయి.

– న్యూస్‌టుడే, చింతపల్లి

పనికిరాని ప్లాస్టిక్ వాటర్ ట్యాంకులో పెంచుతున్న పూలమొక్కలు

హరిహరసుతా.. శరణు!

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరులో అయ్యప్ప అంబలం పూజ సోమవారం ఘనంగా జరిగింది. స్థానిక దుర్గావీధిలో మణి గురుస్వామి పీఠం వద్ద ఈ పూజ ఏర్పాటుచేశారు. అరటిడొప్పలతో స్వామి ఆలయం మాదిరి సెట్ వేశారు. గణపతి పూజ, పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. భారీగా మాలధారులు పాల్గొన్నారు.

అతివల చేతిలో అస్త్రాలు

అరకులోయ, న్యూస్‌టుడే

సమాజంలో అతివల చుట్టూ ఆపదలు పొంచి ఉంటున్న రోజులివి. దీంతో వారి రక్షణార్థం మహిళ రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక సహాయ కేంద్రాలు నిర్వహిస్తున్నాయి. ఇవి 24 గంటలు పనిచేస్తాయి. దాడులు, గృహహింసకు గురైనా తక్షణం సంబంధిత ఫోను నంబర్లతో వీటిని సంప్రదిస్తే రక్షణకు తోడు వైద్య సాయం, పునరావాసాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటాయి. జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ అధికారులు, పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయం చేసుకొని బాధితులకు అండగా నిలుస్తారు.

1098 బాలల విముక్తికి

బాలలపై హింస, దాడులకు పాల్పడితే 1098 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చు. వీరితో వెట్టిచాకిరీ చేయించుకోవడం, పారిశ్రామిక, కర్మాగారాల్లో పనుల్లో ఉంచితే ఈ నంబరుకు తెలియజేస్తే అధికారులు వచ్చి విముక్తులను చేస్తారు.

1930 సైబర్ నేరాలు

సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయాలు పెంచుకొని మహిళలను మోసగిస్తున్న సంఘటనలు ఎక్కువవుతున్నాయి. దీనికితోడు ఆర్థిక, సైబర్ మోసాలకు సంబంధించి రక్షణకు 1930కి ఫోన్‌చేసి పోలీసుల సాయం పొందొచ్చు.

100 తక్షణ సాయం..

మహిళలు, విద్యార్థినులు, యువతులను ఎవరైనా వేధిస్తే తక్షణ సాయం కోసం 100 నంబర్‌కు డయల్ చేయవచ్చు. అధికారులు వెంటనే స్పందించి ఆదుకుంటారు. దూరంగా ఉన్న వారైతే ఆ ప్రాంతం పోలీసులకు సమాచారం చేరవేసి రక్షణ కల్పించేలా ఏర్పాట్లు చేస్తారు.

15100 న్యాయ సహాయం

న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అన్యాయానికి గురయ్యే మహిళలు ఉచితంగానే న్యాయ సేవలను పొందవచ్చు. 15100 నంబరుకు తెలియజేయడం లేదా కోర్టులోని న్యాయమూర్తులకు తమ సమస్యపై లేఖ రాసినా సాయం లభిస్తుంది. న్యాయస్థానాల్లోని కేసులకు ఉచితంగానే న్యాయవాదిని సమకూరుస్తారు.

181 వేధింపులపై..

మహిళలను కట్నం కోసం ఇబ్బందులకు గురిచేయడం, శారీరక, మానసిక వేధింపులకు పాల్పడిన సందర్భంలో బాధితులు 181 నంబరుకు సంప్రదించి సమస్యను వివరించవచ్చు. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది వివరాలు నమోదు చేసుకొని ఫిర్యాదుదారులను ఆదుకునేలా చర్యలు తీసుకుంటారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు, న్యూస్‌టుడే: సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు పాడేరు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు పి.బి.కె.పరిమళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన ఎస్టీ అభ్యర్థులు తమ బయోడేటా, రెండు ఫొటోలు, విద్య, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్ కార్డు, ఇతర నకళ్లతో ఈనెల 26 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు పాడేరు ఐటీడీఏ డీడీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రైతును రాజుగా మార్చడమే లక్ష్యం

తుంపాడలో రైతులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ శ్రీపూజ

హుకుంపేట, న్యూస్‌టుడే: రైతును రాజుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. సూకూరు పంచాయతీ బిర్సింగి గ్రామంలో రైతన్నా-మీకోసం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రైతులకు అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. అధిక లాభాలు వచ్చే పంటలపై అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. ప్రకృతి వ్యవసాయంపై పట్టు సాధించాలన్నారు. దళారులను నమ్మొద్దని, పంటలను నేరుగా మార్కెట్లకు తీసుకెళ్లి విక్రయించుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి నందు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కర్ణ, వ్యవసాయాధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాడేరు, న్యూస్‌టుడే: గిరిజన రైతుల సంక్షేమమే లక్ష్యంగా చేపట్టిన రైతన్నా మీకోసం కార్యక్రమం విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి జేసీ, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి శ్రీపూజ పేర్కొన్నారు. తుంపాడ రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కొత్తరకాల విత్తనాల వినియోగంపై వ్యవసాయాధికారులు రైతులకు వివరించారు. తమ ప్రాంతంలో నీటిపారుదల, మార్కెటింగ్ సదుపాయం లేకపోవడం ప్రధాన సమస్య అని స్థానిక రైతులు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు అందుబాటులో టీకాలు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్తూరులో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జయరాజ్ పాల్గొన్నారు. పశువైద్యశాఖ అందిస్తున్న పథకాలను వివరించారు. ప్రాంతీయ సంచాలకులు శ్రీనుబాబు, కాశీపట్నం ఎంపీటీసీ సభ్యుడు ఎం. సన్యాసిరావు, నరేంద్ర, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాశాఖలో విలీనం చేయాలి

పాడేరు, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షులు ఎం.అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. పాడేరు పట్టణంలో సోమవారం సమగ్ర శిక్షా ఉద్యోగులు నిరసన చేపట్టారు. స్థానిక పాత బస్టాండు కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద బైఠాయించారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం, హెచ్‌ఆర్‌ఏ, డీఏ అందించాలన్నారు. పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా కనీసం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘ జిల్లా కార్యదర్శి జయరాజు, కోశాధికారి సింహాచలం, ఉపాధ్యక్షులు అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగుల ధర్నా

శుభ్రతతో వ్యాధులు దూరం

విద్యార్థినిని పరీక్షిస్తున్న వైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి

మోతుగూడెం, న్యూస్‌టుడే: చదలవాడ పంచాయతీలోని లక్కవరం ఏకలవ్య మోడల్, బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలను సోమవారం తులసిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. పాఠశాలల్లోని కిచెన్, కూరగాయల నిల్వ గదులు, తాగునీరు, మరుగుదొడ్లు పరిశీలించారు. ప్రతిఒక్కరూ శుభ్రత పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండొచ్చని పేర్కొన్నారు. చలికాలంలో వ్యాపించే చర్మవ్యాధులు, జలుబు, దగ్గు, వైరల్ జ్వరాల నివారణపై అవగాహన కల్పించారు. ఆసుపత్రి సిబ్బంది గంగరాజు, లతశ్రీ, అంజిబాబు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

కొయ్యూరు, న్యూస్‌టుడే: రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పాడేరు ఆర్డీవో ఎంవీఎస్ లోకేశ్వరరావు ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆర్.ఐ, వీఆర్వో, బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రీవెన్స్ ఫిర్యాదులతో పాటు భూసమస్యలు, 516ఈ జాతీయ రహదారి భూసేకరణ సమస్యలు, ఆర్వోఎఫ్ఆర్ పట్టాల జారీపై చర్చించారు. తహసీల్దార్ ఎన్ఎన్వీ ప్రసాద్, ఆర్ఐలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందితో సమీక్షిస్తున్న ఆర్డీవో లోకేశ్వరరావు

వినతుల పరిష్కారంపై శ్రద్ధ

రంపచోడవరం, న్యూస్‌టుడే: వివిధ సమస్యలపై గిరిజనులు అందించిన వినతుల పరిష్కారంపై అధికారులు శ్రద్ధ చూపాలని ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం సబ్ కలెక్టర్ శుభం నొఖ్వాల్, గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఏజెన్సీ నలుమూలల నుంచి వివిధ సమస్యలపై 85 వినతులు అందజేశారు. వై.రామవరం మండలం గుర్తేడు సమీపంలో నివసిస్తున్న తమకు పక్కా గృహాలు మంజూరు చేయాలని కొండరెడ్డి (పీవీటీజీ) జాతికి చెందిన గిరిజనులు వినతిపత్రం అందజేశారు. పాడైన రోడ్లకు మరమ్మతులు చేయించాలని గుర్తేడు సర్పంచి దుష్యంతుడు ఆధ్వర్యంలో గిరిజనులు విన్నవించారు. ఇందుకూరులో పునరావాసకాలనీలో శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని గ్రామస్థులు నాగిరెడ్డి, అబ్బాయిరెడ్డి, మంగాయమ్మ తదితరులు కోరారు. ఈఈ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ డీఈలు వెంకటరమణ, భవానీ, జీసీసీ డీఎం జయశ్రీ, తహసీల్దారు బాలాజీ, ఎంపీడీఓ ప్రసాద్, ఏజెన్సీ డీఈఓ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్

సేంద్రియం.. తీయదనం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: చెరకు సాగు కలిసి రావడం లేదని చాలామంది ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారిస్తుంటే పాయకరావుపేట మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు ఎం.శ్రీనివాసరాజు సేంద్రియ విధానంలో చెరకు సాగు చేస్తూ మేలైన దిగుబడులు సాధిస్తున్నారు. చెరకులో అనుసరిస్తున్న పద్ధతులు, మార్కెటింగ్ గురించి ఆయన ఏమంటున్నారంటే..



బెల్లం దిమ్మెలు

గోమూత్రం, పేడ: ఎరువులు, పురుగు మందుల వినియోగం మానేసి 14 ఏళ్లు అవుతోంది. 15 ఎకరాల్లో ఏటా చెరకు పండిస్తున్నా. సేంద్రియ ఎరువు కోసం ఒంగోలు జాతి ఆవును పెంచుతున్నా. గోమూత్రం, పేడ, పుట్టమన్ను, ఉలవ పిండిని నీటిలో నానబెడతాం. ఐదు రోజుల తర్వాత ఆ మిశ్రమాన్ని పొలంలో చల్లుతాం. చెరకు నాటిన మొదటి ఏడాది 25 టన్నులే దిగుబడి వస్తుంది. రెండో ఏడాది నుంచి 30 టన్నులకు తగ్గకుండా వస్తోంది.

సొంతంగా బెల్లం, చెరకు రసం తయారీ: ఆర్గానిక్ విధానాలను అనుసరిస్తూ బెల్లం తయారు చేస్తున్నాం. బెల్లంతోపాటు చెరకు రసం అమ్మకాలు చేపట్టాం. సేంద్రియ పద్ధతుల్లో తయారు చేసిన రెండు ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంటోంది. రోజుకు 500 లీటర్ల రసం అమ్ముడవుతోంది. బెల్లం కేజీ పరిమాణంలోనూ, చిన్న ఉండలు రూపంలోనూ తయారు చేస్తున్నాం. వీటిని హైదరాబాద్, విశాఖపట్నం, ఖమ్మం, రాజమహేంద్రవరం, విజయవాడ మార్కెట్‌కు పంపుతున్నాం.

● కేజీ బెల్లం రూ.90, చిన్నసైజులో ఉన్నవి కేజీ రూ.120 చొప్పున ధర పలుకుతోంది. చెరకు రసం లీటరు రూ.70 చొప్పున అమ్ముతున్నాం. ఎకరా విస్తీర్ణంలో చెరకు సాగుకు మొదటి ఏడాది రూ.15 వేలు, రెండో ఏడాది నుంచి రూ.10 వేలకు మించి ఖర్చు కావడం లేదు. ఎకరాకు రూ.70 వేల వరకు ఆదాయం వస్తోంది.

విద్యార్థులకు పాఠాలు: అగ్రికల్చర్ బీఎస్సీ, డిప్లమో చదువుతున్న విద్యార్థులకు బెల్లం తయారీపై అవగాహన కల్పిస్తున్నాం. ఏటా వ్యవసాయ కళాశాలలకు చెందిన విద్యార్థులు క్షేత్ర సందర్శనకు వస్తున్నారు. వారికి సేంద్రియ వ్యవసాయ పద్ధతులను వివరిస్తున్నాం. - ఎం.శ్రీనివాసరాజు

రైతేరాజు

బెల్లం ధరలు తగ్గుముఖం

రకం	గత వారం	ఈ వారం
రంగులు	4645	4180
మధ్య	4250	3895
నాసిరకం	4130	3765

గత వారం రోజులుగా అనకాపల్లి బెల్లం మార్కెట్‌లో అన్ని రకాల ధరలు తగ్గాయి. రంగులు రూ.465, మధ్య రకాలు రూ.355, నాసి రకాలు రూ.365 తగ్గాయి.

నువ్వులు లాభదాయకం

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఉత్తర కోస్తాలో పండించే అన్ని పంటల కంటే నువ్వులు లాభదాయకమని వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్తలు లెక్క తేల్చారు. ఉత్తర కోస్తా జిల్లాల్లో వరితోపాటు చెరకు, మొక్కజొన్న, అపరాలు, నూనె గింజల పంటలు సాగు చేస్తున్నారు. ఈ పంటల్లో సాగు ఖర్చు, దిగుబడి, ఆదాయం ఎంత వస్తుందనే అంశంపై పరిశీలన చేశారు.

● ముగిసిన సీజన్ (2024-25)లో వివిధ పంటల్లో ఆదాయ, వ్యయ నిష్పత్తులను లెక్క చూస్తే అన్నింటికంటే నువ్వులు లాభదాయకంగా ఉన్నాయని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆర్థిక శాస్త్రవేత్త డాక్టర్ ఎం.చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు.

నువ్వు పంట

● నువ్వుల సాగుకు ఎకరాకు రూ.3,750 ఖర్చవుతుంది. 2.08 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో క్వింటాల్ ధర రూ.9,850 పలికింది.

● చోడి సాగుకు రూ.6,230 పెట్టుబడి కాగా, 4.9 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటాల్ ధర రూ.3,800గా ఉంది.

● మొక్కజొన్న సాగుకు రూ.25,542 ఖర్చవగా దిగుబడి 28.75 క్వింటాళ్లు వచ్చాయి. మార్కెట్ ధర రూ.2,080 పలికింది. తద్వారా రూ.59,800 ఆదాయం వచ్చింది.

● మినుము కంటే పెసర లాభదాయకంగా ఉంది. పెసర సాగు ఖర్చు తక్కువ. మినుము సాగుకు ఎకరాకు రూ.12,280 అయితే పెసరకు రూ.8,672 సరిపోతుంది. దిగుబడులు రెండు సమానంగానే వస్తున్నాయి. మార్కెట్‌లో మినుము క్వింటాల్ ధర రూ.6,880 ఉంటే పెసర రూ.7,200 పలికింది.

వరిలో వెద విధానం మేలు: వరి సాగుకు రైతులు పలు విధానాలు ఆచరిస్తున్నారు. ఎక్కువ మంది నారు పెంచి నాట్లు వేస్తారు. కొందరు విత్తనాలను నేరుగా వెదజల్లుతారు. మొలకెత్తిన విత్తనాన్ని డ్రమ్‌సీడర్ సహాయంతో మరికొందరు వేస్తారు. తక్కువ నీటితో సాగు చేసే శ్రీవిధానం మరో పద్ధతి ఉంది. అన్నింటికంటే వెద జల్లే విధానమే ప్రయోజనకరంగా ఉంది. ఎకరా విస్తీర్ణంలో నారు విధానంలో రూ.34,775 ఖర్చయితే, వెద విధానంలో రూ.29,808 అవుతుంది. వెదలోనే రెండు క్వింటాళ్ల దిగుబడి అధికంగా వస్తుంది.

రూపాయి ఖర్చుకు వచ్చే ఆదాయం ఇలా..

పంట	ఆదాయ, వ్యయాల నిష్పత్తి
నువ్వులు	3.12
చోడి	1.98
మొక్కజొన్న	1.34
పెసర	1.19
గోగు	1.02
వేరుశనగ	0.72
వరి	0.67
మినుము	0.56
కంది	0.34
చెరకు	0.13

45 శాతం కూలీల ఖర్చు: సాగులో కూలీల ఖర్చు 45 శాతంగా ఉంది. యాంత్రీకరణ ద్వారా ఖర్చు తగ్గించుకోవచ్చు. నాణ్యమైన విత్తనం వేసుకోవాలి. ఎంత ఖర్చు చేసినా విత్తనం బాగోలేకపోతే దిగుబడులు రావు. బిందు సేద్యం విధానంపై దృష్టిసారించాలి.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సలహా

? వేరుసెనగలో మన్యానికి అనువైన రకాలేంటి. - బాబూరావు, దిగువపాకలు

✔: ధరణి, నిత్యహరితి, విశిష్ట రకాలున్నాయి. ఇవి వర్షాభావ పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే రకాలుగా పరిశీలనలో గుర్తించాం.

వర్షాభావ పరిస్థితులను తట్టుకునే రకాలివే..

? నీటి సదుపాయం ఉండటంతో కాయగూరల్లో అంతర పంటగా రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నా. పంటను కత్తెర పురుగు ఆశించి నష్టపరుస్తోంది. నివారణకు ఏం చేయాలి. - కిల్లో అర్జున్ చౌడుపల్లి

✔: పురుగు ఉధృతి అధికంగా ఉంటే ఎకరాకు 200 లీటర్ల నీటిలో ఎమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాములు/స్పైనో శాడ్ 60 మి.లీ. కలిపి మొక్కలు, ఆకులు తడిచేలా పిచికారీ చేయాలి.

? రెండెకరాల పొలం ఉంది. నీటి సదుపాయం లేక ఖాళీగా ఉంచాల్సి వస్తోంది. రబీలో నీటి సదుపాయం లేకపోయినా పంటలను పండించ వచ్చా. - రాంబాబు తాజంగి

✔: రబీలో నీటి సదుపాయం లేకపోయినా కొమ్ము సెనగ, పొద్దుతిరుగుడు వంటివి సాగు చేయవచ్చు. ఆరుతడి పంటలుగా వేరుసెనగ, పెసలు, అపరాలను పరిశీలించవచ్చు.

రైతుల ప్రశ్నలు, సందేహాలకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సేద్యపు విభాగం శాస్త్రవేత్త బీఎన్ సందీప్‌నాయక్ సమాధానాలు ఇచ్చారు. - న్యూస్‌టుడే, చింతపల్లి

సాగులో సందేహాలా.. ఫోన్ చేయండి

రైతుల ప్రశ్నలు, సందేహాలకు అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కేవీ రమణమూర్తి సమాధానాలిస్తారు. మంగళవారం ఉ. 10 - సా. 4 గంటల వరకు 9849636324 నంబరుకు ఫోన్‌చేయవచ్చు.

విద్యతోనే బాలికల భవిష్యత్తు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: బాలికల భవిష్యత్తుకు విద్యే రక్షణ కవచమని ఐసీడీఎస్ సీడీపీవో కె.బాలచంద్ర మణిదేవి తెలిపారు. జి.మాడుగుల మండల పరిషత్తు కార్యాలయంలో బేటీ బచావో- బేటీ పఢావో కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ రాజేకుమార్, ఎంపీడీవో నాగశేఖర్, వైద్యులు అంబిక హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. బాలికల రక్షణ, విద్య, హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, లైంగిక దాడులు, మాదకద్రవ్యాల వల్ల అనర్థాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో డ్రాపవుట్స్ లేకుండా చూడాలని చెప్పారు. సచివాలయ ఉద్యోగులు, వెలుగు సీసీలు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో బాలచంద్ర మణిదేవి

పద్మావతి పరిణయం.. చూసిన కనులదే పరవశం!

సాంస్కృతిక నృత్య ప్రదర్శనలో అనకాపల్లి కళాకారులు అలరించారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 24 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అనకాపల్లికి చెందిన ఇంద్రజశంకు, మోహన్‌శ్రీ, లిఖితలాస్య, సోనియా, శ్రీలోహిత్య 'పద్మావతి పరిణయం' నృత్య రూపకాన్ని ప్రదర్శించి ప్రథమ శ్రేణిలో నిలిచారు. –న్యూస్‌టుడే, నెహ్రూచౌక్ (అనకాపల్లి)

కానరాని ఇద్దరు యువకుల జాడ

రైవాడ జలాశయంలో ముమ్మర గాలింపు

దేవరాపల్లి, అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: రైవాడ జలాశయంలో ఆదివారం జరిగిన బోటు ప్రమాదంలో గల్లంతైన ఇద్దరు యువకుల జాడ ఇంకా కనిపించలేదు. వారి ఆచూకీ కోసం రాష్ట్ర విపత్తుల స్పందన దళంతోపాటు (ఎన్‌డీఆర్ఎఫ్) స్థానికులు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రైవాడ జలాశయంలో గాలించారు. అయినా వారి ఆచూకీ కనిపించకపోవడంతో కుటుంబసభ్యులతోపాటు బంధువులు, స్నేహితులు జీనబాడు బోటు రేవువద్ద ఆశగా ఎదురు చూస్తున్నారు. బోటు మునిగిపోయిన ఘటనలో అనంతగిరి మండలం జీనబాడుకు చెందిన నలుగురు ప్రమాదానికి గురవగా.. ప్రసాదు ప్రాణాలతో బయటపడ్డాడు. గంజాయి జీవన్‌కుమార్ మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఫారెస్టు ప్రొటెక్షన్ వాచరు గాలి అప్పలరాజు, దెబర రమేష్ ఆచూకీ ఇంకా లభించలేదు. చీకటిపడటంతో గాలింపు నిలిపివేశామని.. మంగళవారం కొనసాగిస్తామని జాతీయ విపత్తు సహాయక దళం (ఎన్‌డీఆర్ఎఫ్) ఇన్‌స్పెక్టరు టి.రామకృష్ణ తెలిపారు. 23 సభ్యులతో కూడిన తమ బృందం గాలించిందన్నారు. జీనబాడు రేంజర్ ఆర్.రాజబాబు, ఫారెస్టు సెక్షన్ అధికారి పి.శివకుమార్, తహసీల్దారు వీరభద్రాచారి తదితరులు దగ్గరుండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. బాధిత కుటుంబాలను అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం కుమారుడితోపాటు జడ్పీటీసీ సభ్యుడు తదితరులు పరామర్శించారు. జీవన్ కుమార్ అంత్యక్రియలు సోమవారం సాయంత్రం జరిగాయి.

జలాశయంలో గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

ఆర్థిక సాయం అందిస్తున్న తెదేపా నాయకులు

అనంతగిరి, న్యూస్‌టుడే: జీనబాడు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఆదివారం రైవాడ జలాశయంలో బోటు ప్రమాదంలో గల్లంతవగా.. ఒకరి మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. తెదేపా మండల కార్యదర్శి నరసింహమూర్తి, పలువురు నేతలు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. రైవాడ నదిపై కేవలం నాటు పడవలే ఆధారం కావడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లుగా స్థానికులు తెలిపారన్నారు. జీసీసీ ఛైర్మన్, గిరిజన సంక్షేమశాఖ మంత్రి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లి. ప్రత్యామ్నాయం చూపాలని కోరతామని తెదేపా నేతలు తెలిపారు. జంప్రంగి దేముడు, లక్ష్మణ్, నిర్మళ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడి

జి.మాడుగుల, న్యూస్‌టుడే: రైతులు సేంద్రియ పద్ధతిలో పంటలు పండిస్తే అధిక దిగుబడి పొందవచ్చని రాష్ట్ర రైతు సాధికార సంస్థ డైరెక్టర్ తమర్భ బాబూరావునాయుడు తెలిపారు. జి.మాడుగుల పంచాయతీ జీ.ఎం.కొత్తూరులో ఆర్‌వైఎస్ఎస్ సంస్థ ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పసుపు, కాఫీ, మిరియాలు, అపరాలు, వరి పంటలు సేంద్రియ పద్ధతిలో పండించాలన్నారు. కాఫీకి జీసీసీ మంచి ధర ప్రకటించిందని పేర్కొన్నారు. మండల వ్యవసాయాధికారి వరప్రసాద్, కూటమి నాయకులు బాలయ్యదొర, సతీష్‌పడాల్, నాగం నాయుడు, ఆర్‌వైఎస్ఎస్ సంస్థ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

జీ.ఎం.కొత్తూరులో రైతులతో బాబూరావునాయుడు

సెక్టోరియల్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖపట్నం సమగ్ర శిక్షా కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులుగా పనిచేయడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు అదనపు పథక సంచాలకుడు జె.చంద్రశేఖరరావు ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అర్హులని పేర్కొన్నారు. సీఎంవో పోస్టుకు పీజీ చదివి, అయిదేళ్ల బోధన అనుభవం ఉన్న స్కూల్ అసిస్టెంట్లు, ఎనిమిదేళ్ల అనుభవం ఉన్న ఎస్జీటీ ఉపాధ్యాయులు అర్హులని తెలిపారు.

క్రికెట్, త్రోబాల్ పోటీలకు వేళాయె!

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పాఠ్యాంశాలు బోధిస్తూ ఒత్తిడిలో ఉన్న ఉపాధ్యాయులు ఆటలతో సేదతీరనున్నారు. క్రికెట్, త్రోబాల్ ఆడే వారికి పోటీలు నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. దీనిలో భాగంగా పాఠశాలల్లో క్రికెట్ (ఉపాధ్యాయులు), త్రోబాల్(ఉపాధ్యాయినులు) వివరాలు సోమవారం సేకరించారు. వీరికి మండల స్థాయిలో ఈనెల 29, 30 తేదీల్లోనూ, డివిజన్ స్థాయిలో డిసెంబరు 13, 14 తేదీల్లోనూ పోటీలు జరుగుతాయి. జిల్లాస్థాయిలో డిసెంబరు 20, 21, 22 తేదీల్లో, రాష్ట్రస్థాయిలో జనవరి 2, 3, 4 తేదీల్లో జరుగుతాయి. ఆసక్తి ఉన్న ఉపాధ్యాయుల వివరాలు తీసుకుంటున్నామని ఎంఈఓ-2 రమేష్‌బాబు చెప్పారు.

నిఘా మరిచిన కళ్లు.. నిబంధనలకు నీళ్లు

క్వారీ లారీల అక్రమాలు పట్టని జిల్లా అధికారులు

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

జిల్లాలో నిబంధనలు మీరి రోడ్లపైకొస్తున్న భారీ వాహనాలు స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. క్వారీ లారీలు ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. వాటిని కట్టడి చేయాల్సిన అధికారులు హెచ్చరికలకే పరిమితమవుతున్నారు. అనకాపల్లి సమీప కొండలన్నింటి నుంచి రాంబిల్లి ప్రత్యామ్నాయ నావికా స్థావరం (ఎన్ఏఓబీ) పనులకు బండరాళ్లను తరలిస్తున్నారు. వైకాపా హయాంలో పరిమితికి మించి లోడుతో వాహనాలు తిరుగుతుండటంతో.. రోడ్లన్నీ ఛిద్రం అయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బండరాళ్ల రవాణా చేతులు మారింది కానీ.. నిబంధనల ఉల్లంఘనలో మాత్రం తీరు మారలేదు. అనకాపల్లి నుంచి ప్రతి ఐదు నిమిషాలకు ఒక లారీ వెళ్తోంది. నిబంధనల ప్రకారం.. 12 టైర్ల లారీలు 20 టన్నులు, 10 టైర్ల లారీలు 16 టన్నుల వరకు రాళ్లు తరలించడానికి అనుమతులు ఉన్నాయి. కానీ.. డబ్బు ఆశతో వాహనదారులు పరిమితికి మించి 50-60 టన్నుల వరకు నింపుతున్నారు. ఇంతే కాకుండా 60 కి.మీ వేగం తగ్గకుండా నడుపుతున్నారు. సోమవారం వేకువజామున ఓ క్వారీ లారీ విజయరామరాజుపేట రైల్వే అండర్‌బ్రిడ్జి రక్షణ గడ్డర్‌ను ఢీకొట్టింది.

విజయరామరాజుపేట వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి గడ్డర్‌ను మార్చుతున్న అధికారులు

★విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రక్షణ గడ్డర్‌ను మార్చి 17న ఓ క్వారీ లారీ బలంగా ఢీ కొట్టింది. దీంతో వంతెనపై ఉన్న పట్టాలు కొంతమేర ధ్వంసమయ్యాయి. లారీకి రూ.1.01 లక్షలు జరిమానా వేశారు. అప్పటి నుంచి క్వారీ వాహనాలు బొజ్జన్నకొండ మార్గం నుంచి హైవేపైకి చేరేలా ఆదేశించారు. కానీ ఇప్పటికీ రాత్రి 11 గంటలు దాటితే చాలు.. క్వారీ వాహనాలు పట్టణంలో నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి.

అమలు కాని ఆదేశాలు

కలెక్టర్, ఎస్పీ కొద్దినెలల క్రితం క్వారీ నిర్వాహకులతో సమావేశమయ్యారు. పట్టణం మీదుగా రాత్రివేళ బండరాళ్లు తరలించొద్దని ఆదేశించారు. కొన్నాళ్లు తూతూమంత్రంగా పాటించినా.. రాత్రివేళల్లో మళ్లీ పట్టణంమీదుగా రాకపోకలు ప్రారంభించారు.

నిఘా పెడుతున్నాం..

జిల్లాలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. నిబంధలను పాటించని వాహనాలకు అపరాధ రుసుం వేస్తున్నాం. అనకాపల్లి పట్టణంలో నుంచి క్వారీ వాహనాలు నడపొద్దని యజమానులకు ఇదివరకే చెప్పాం. రాత్రివేళల్లో నిఘా పెడుతున్నాం. విజయరామరాజు పేట వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిని ఢీకొట్టిన వాహనానికి రూ. 48 వేలు అపరాధ రుసుం విధించాం. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవు.

– మనోహర్, జిల్లా రవాణా శాఖ అధికారి, అనకాపల్లి

తెదేపాలో యువతకు ప్రాధాన్యం

హోం మంత్రి అనిత

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనిత

నక్కపల్లి, న్యూస్‌టుడే: తెదేపాలో పదవులంటే అలంకారం కాదని, బాధ్యతనే విషయం గుర్తించాలని హోంమంత్రి వంగలపూడి అనిత ఉద్బోధ చేశారు. పాయకరావుపేట నియోజకవర్గ బూత్, గ్రామ, మండల, నియోజకవర్గస్థాయి కమిటీ సభ్యులతో సారిపల్లిపాలెం వద్ద క్యాంపు ఆఫీసు ఎదుట సోమవారం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబుతో కలిసి ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం పార్టీకి చెందిన నాయకులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, జ్యోతిప్రజ్వలన చేసి, కేకు కోశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా అందరం ఎన్నో కష్టాలు, అవమానాలు ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. దీనిపై విసిగిపోయిన ప్రజలు తెదేపాపై ఉన్న నమ్మకంతో చాలా పెద్ద బాధ్యత అప్పగించారన్నారు. పదవుల కేటాయింపులో యువతకు 40 శాతం అవకాశం కల్పించామని, అనివార్య కారణాలతో పదవులు రానివారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. తనను కలిసేందుకు వచ్చిన అందరికీ అవకాశం కల్పించేలా ఓ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.

అందరికీ ఉపాధి అవకాశాలు

త్వరలోనే ఈ ప్రాంతంలో బొమ్మల పరిశ్రమ ఏర్పాటవుతుందని, దీనికి సంబంధించి మంత్రి లోకేశ్ జీఓ జారీ చేయించారన్నారు. దీని ద్వారా 25 వేల మందికి మహిళలకు ఉద్యోగ, ఉపాధి కలుగుతాయని తెలిపారు. స్థానికంగా ఏర్పాటుకానున్న పరిశ్రమలతో జిల్లా తలసరి ఆదాయం పెరగనుందని, 2029 నాటికి ప్రతి ఇంటికో ఉద్యోగం వచ్చేలా చేస్తానన్నారు. అడ్డురోడ్డు కోటవురట్ల రహదారి పనులు త్వరలోనే మొదలవుతాయని వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ఓట్లు తగ్గిన ప్రాంతాలపై దృష్టి పెట్టి స్థానిక ఎన్నికలకు బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కొప్పిశెట్టి వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పరిశీలకులు వెంకటేశ్వరరావు, నాయకులు గింజాల లక్ష్మణరావు, కురందాసు నూకరాజు, దేవర సత్యనారాయణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: బడదనాంపల్లి పంచాయతీ అమ్మిరేకులలో ఆదివారం తాటాకిల్లు దగ్ధమవడంతో నిరాశ్రయులైన రాజుబాబు కుటుంబానికి సోమవారం సర్పంచి లక్ష్మీదుర్గ ఆధ్వర్యంలో సాయం చేశారు. 25 కిలోల బియ్యం, నిత్యావసర సరకులు, ఆర్థిక సాయం అందజేశారు. రాజవొమ్మంగి సర్పంచి రమణి, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు సత్తిబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు చినతల్లి, తెదేపా నాయకులు అబ్బులు, గంగరాజు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	100	98
లైవ్	127	118
డ్రెస్‌డ్	184	206
స్కిన్‌లెస్	210	216

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు 89853 66570
అరకులోయ: 63034 86346
రంపచోడవరం: 94908 77172

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టు నుంచి కుమడ వెళ్లే రహదారిలో డేగలపుట్టు సమీపంలో రోడ్డు మధ్యలో ఏర్పడిన

గుంత ప్రమాదకరంగా ఉంది. - నారాయణరావు, స్థానికుడు, ✓: మరమ్మతులు చేయిస్తాం. - రాముడు, ఏఈ, గి.సం.శాఖ, ముంచంగిపుట్టు

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారిలో గుంతలు పడ్డాయి. వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. - సత్యనారాయణ, రంపచోడవరం, ✓: మరమ్మతులుచేయిస్తాం. - ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ, రంపచోడవరం

హుకుంపేట, న్యూస్‌టుడే: హుకుంపేట పశువైద్య ఆసుపత్రి వీధిలో బోరు లేక తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. - లకే ఉదయ్, స్థానికుడు, ✓: ప్రతిపాదనలు పంపించాం. పశువైద్య ఆసుపత్రి వీధిలో బోరు ఏర్పాటు చేస్తాం. - జగదీష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

అడ్డుమండలో సంతకాలు సేకరిస్తున్న యువకులు

అంతర్జాలం లేక అవస్థలు

హుకుంపేట, న్యూస్‌టుడే: అడ్డుమండ, సన్యాసమ్మపాలెం పంచాయతీల్లో సెల్‌టవర్లు లేకపోవడంతో అభివృద్ధికి దూరమవుతున్నామని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెల్‌టవర్లు ఏర్పాటుచేయాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన లక్ష్మేష్, యువకులు కలిసి పంచాయతీలో సంతకాలు సేకరించి ఐటీడీఏ పీవోకు అందించారు. గ్రామాల్లో అంతర్జాల సేవలు లేక తీవ్ర అవస్థలకు గురవుతున్నామన్నారు.

బడి.. సమస్యల సుడి!

పెదపేటలో వంటషెడ్డులో చదువుతున్న చిన్నారులు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: మన్యంలోని ప్రాథమిక పాఠశాలలకు భవనాలు సమకూరక చిన్నారులు అవస్థలకు గురవుతున్నారు. రేకుల షెడ్లలో, వంటశాలలో, శిథిల భవనాల్లో చదువులు సాగిస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా పాఠశాలల రూపుమారడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ముంచంగిపుట్టు మండలంలోని 55 బడులకు భవనాలు లేవు. దారెల పంచాయతీలోని పెదపేట, చీకుచింత, రంగిలిసింగి గ్రామాల్లోని పాఠశాలలకు సొంత భవనాలు కరవయ్యాయి. పెదపేటలో మధ్యాహ్న భోజనం అందించేందుకు నిర్మించిన వంటశాలలో బాలలు కూర్చుని చదువుకుంటున్నారు. రంగిలిసింగిలోనూ ఇదే పరిస్థితి. చీకుచింతలో రేకులషెడ్డులో నిర్వహిస్తున్నారు. లక్ష్మీపురం పంచాయతీలోని సుత్తిగుడలో అసంపూర్తిగా ఉన్న వంటషెడ్డులో పాఠాలు చెబుతున్నారు. బొండాపుట్టు, లబడాపుట్టు, వెచ్చంగి గ్రామాల్లోని పాఠశాలల్లో ఇదే పరిస్థితి.

పెదబయలు, న్యూస్‌టుడే: పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల సరిహద్దు దిగువకుమడలో ప్రాథమిక పాఠశాల భవనం అసంపూర్తిగా ఉండడంతో వంటషెడ్డులోనే విద్యాబోధన జరుగుతోంది. ఇక్కడ ఒకటి నుంచి ఐదోతరగతి వరకు సుమారు 25 మంది విద్యార్థులున్నారు. చిన్నపాటి వంటషెడ్డులో విద్యార్థులు, ఆరుబయట ఉపాధ్యాయురాలుండి అష్టకష్టాలతో నెట్టుకొస్తున్నారు. చినుకుపడితే బాలల బాధలు వర్ణనాతీతం. వంటషెడ్డునే పాఠశాలగా మార్చడంతో మధ్యాహ్న భోజన పథకం ఆయా ఇంట్లో వండి తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా కలెక్టర్ గతంలో ఈ ప్రాంతంలో పర్యటించినపుడు పాఠశాల భవనానికి నిధులు మంజూరుచేసినా.. నేటికీ పూర్తికాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు.

దిగువ కుమడలో బడి ఇదే..

మొక్కే కదా అని వదిలేస్తే!

మాచ్‌ఖండ్ జలవిద్యుత్తు కేంద్రంలోని వించ్ మార్గంలో పెరిగిపోయిన మొక్కలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వించ్‌హౌస్ నుంచి విద్యుత్కేంద్రానికి వెళ్లే మార్గంలో పెన్‌స్టాక్‌ల వద్ద భారీగా మొక్కలు పెరిగాయి. వీటిని ఇలాగే వదిలిస్తే పెన్‌స్టాక్‌లకే ముప్పు తెచ్చే ఆస్కారం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.
- ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే

సీలేరు పీహెచ్‌సీ వైద్యాధికారిగా నారాయణరావు

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు పీహెచ్‌సీ నూతన వైద్యాధికారిగా డిప్యుటేషన్‌పై నియమితులైన పసుపులేటి నారాయణరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ పీహెచ్‌సీకి ఉన్న ఇద్దరు వైద్యులను బదిలీ చేయడంతో వారి స్థానంలో నారాయణరావు నియమితులయ్యారు. నూతన వైద్యాధికారికి స్థానికులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అందుబాటులోకి రాని అంబులెన్స్

గూడెంకొత్తవీధి మండలంలోని ఆర్వీనగర్ ప్రభుత్వ ఆసుపత్రి అంబులెన్సు అందుబాటులోకి రాలేదు. ఈ ఆసుపత్రి పరిధిలో గ్రామాలు మారుమూలన ఉండటంతో రోగులను తరలించేందుకు అంబులెన్స్ వినియోగించేవారు. గత నాలుగు నెలలుగా ఇది మూలకు చేరింది. దీని స్థానంలో కొత్త అంబులెన్స్ జీవీకే మంజూరు చేశారు. మళ్లీ సర్వీసింగ్‌కు పంపించారు. దాన్ని తిరిగి పంపేందుకు అధికారులు జాప్యం చేస్తుండటంతో అందుబాటులోకి రాలేదు. ఈ ప్రాంత రోగులకు అత్యవసర సమయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానిక గ్రామపెద్ద అంజనేయులు తెలిపారు. కొత్త అంబులెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు.
- న్యూస్‌టుడే, గూడెంకొత్తవీధి

ఆర్వీనగర్‌కు కేటాయించిన అంబులెన్స్

ఏపుగా తుప్పలు.. తప్పని తిప్పలు

అరకులోయలోని గర్భిణుల వసతిగృహం ఆవరణలో పిచ్చిమొక్కలు, పొదలు పెరిగిపోయి దోమలకు ఆవాసంగా మారింది. ప్రసవానికి ముందు ఆశ్రయం పొందేందుకు వీలుగా స్థానిక ఐటీడీఏ నివాసగృహాల వద్ద దీన్ని ఏర్పాటు చేశారు. ఈ వసతిగృహం ఆవరణంతా అస్తవ్యస్తంగా మారింది. అధికారులు పట్టించుకోకపోవడంతో గర్భిణులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి ఇబ్బందులు తీర్చాలని వారు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, అరకులోయ

ఆదమరిస్తే అంతే!

రూ.లక్షలు వెచ్చించి చేపట్టిన నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేయడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అరకులోయ మండలంలోని పద్మాపురం కూడలి నుంచి పద్మాపురం ఉద్యానం వరకు ఆరు నెలల క్రితం రహదారి విస్తరణ పనులు ప్రారంభించారు. పద్మాపురం ఉద్యానం సమీపంలో కల్వర్టు నిర్మించిన అధికారులు అప్రోచ్ రహదారిని ఏర్పాటు చేయకుండా వదిలేశారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఏమరుపాటుగా ఉంటే ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, అరకులోయ

కూలి సొమ్ము చెల్లించరూ..

కెందుగుడలో పూర్తయిన సిమెంటు రోడ్డు

జామిగుడ పంచాయతీ కెందుగుడలో రూ.పది లక్షలతో కొద్ది రోజుల క్రితం సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. సీసీ రోడ్డు పూర్తయినా కూలి సొమ్ము సుమారు రూ. 25 వేల ఇవ్వలేదని, పనిపూర్తయిన సర్పంచి ప్రతినిధి టి.వెంకటరావును పలుమార్లు అడుగుతున్నా పట్టించుకోవడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కూలి సొమ్ము ఇప్పించాలని వేడుకుంటున్నారు. దీనిపై వెంకటరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. కూలీలకు రూ.25 వేల రూపాయలు బకాయి ఉండటం వాస్తవమని, గుత్తేదారుడు ఇటీవల స్వగ్రామానికి వెళ్లారని చెప్పారు. రెండురోజుల్లో ఆయనతో మాట్లాడి కూలి సొమ్ము చెల్లిస్తామని పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, పెదబయలు

కాలువ నిర్మాణానికి శంకుస్థాపన

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: లక్ష్మీపురం పంచాయతీలోని తుమిడిపుట్టులో 15వ ఆర్థిక సంఘం నిధులతో మురుగు కాలువలు నిర్మిస్తున్నట్లు సర్పంచి త్రినాథ్ తెలిపారు. గ్రామంలో కాలువ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. పంచాయతీ పాలకవర్గం ఆమోదంతో రూ.5 లక్షలు కేటాయించామని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యుడు సాధురామ్, వార్డు సభ్యులు, పెసా కమిటీ సభ్యులు విక్రమ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తుమిడిపుట్టులో కాలువ పనులు ప్రారంభిస్తున్న సర్పంచి త్రినాథ్

సేవలతోనే సంతృప్తి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: నిరుపేదలకు సేవా కార్యక్రమాలు చేయడంలోనే సంతృప్తి ఉంటుందని చింతపల్లి ఏరియా ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి అన్నారు. దేవా సోషల్ సర్వీసు (రాజమహేంద్రవరం) సభ్యులకు రూ.10 వేల నగదు, ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంచిపెట్టారు. ప్రతి నెలా నిరుపేదలకు తనకు తోచినమేరకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కాకినాడకు చెందిన రైల్వే ఉద్యోగులు సత్యప్రసాద్, రాజబాబు ఆధ్వర్యంలో చింతపల్లి, రింతాడ, కందులగాదే, ఊబపాలెం, తీములబంద గ్రామాలకు చెందిన 50 మంది చిన్నారులకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. రైల్వే ఉద్యోగులు ఏవీరావు, ఈశ్వర్‌రెడ్డి, ఫణీంద్రయాదవ్, గోవింద్, తెదేపా నాయకుడు నాగభూషణం పాల్గొన్నారు.

చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేసిన రైల్వే సిబ్బంది

జియోట్యాగింగ్ తప్పనిసరి

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: నూతన గృహాల మంజూరుకు అర్హులైన లబ్ధిదారులు తప్పనిసరిగా జియోట్యాగింగ్ చేసుకోవాలని గృహ నిర్మాణసంస్థ ఏఈ పి.లక్ష్మివిమల తెలిపారు. దామనాపల్లి పంచాయతీ దొడ్డికొండలో జియోట్యాగింగ్‌ను సోమవారం ఆమె పరిశీలించారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి గృహాలు మంజూరుకాని వారికి అవకాశం ఉందన్నారు. పెసా కమిటీ ప్రతినిధి మాదిరి చంటిబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జియోట్యాగింగ్ పరిశీలిస్తున్న ఏఈ

తాగునీటి సమస్య పరిష్కరించరూ..

దేవీపట్నం, న్యూస్‌టుడే: వి.రామన్నపాలెం పంచాయతీ పరిధిలోని గుంపెనపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో తాగునీటి పైపులైన్లు మరమ్మతులకు గురవడంతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని అక్కడి గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదన్నారు. చొప్పకొండ పంచాయతీ యర్రమెట్ల, డి.ఎన్.పాలెం పంచాయతీ పరిధిలోని పెద్దూరులోని గిరిజనులను తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

అనంతగిరి గ్రామీణం, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని ఆర్టీసీ రీజియన్ ఛైర్మన్ సియ్యారి దొన్నుదొర పేర్కొన్నారు. అనంతగిరి మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సోమవారం రైతన్నా- మీకోసం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రైతులకు సుఖీభవ లబ్ధి పత్రాలు అందజేశారు. సర్పంచి సారా సీతయ్య, తెదేపా మండల అధ్యక్షుడు సివేరి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు భీమరాజు, గాలి నరేంద్ర, మహేష్, దుంబరి కృష్ణ, సింహాచలం పాల్గొన్నారు. పోతంగి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు. టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, భీమరాజు, దన్నేరావు, భాస్కరరావు, రవి పాల్గొన్నారు.

చింతపల్లి మండలం చౌడుపల్లిలో...

కించాయిపుట్టు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షురాలు సన్యాసమ్మ మాట్లాడుతూ.. మారుతున్న ఆహార అలవాట్లకు అనుగుణంగా అన్నదాతలు పంట మార్పిడి చేపట్టాలన్నారు. ఏవో మురళీకృష్ణ, జనసేన మండల ఉపాధ్యక్షులు సూర్యనారాయణ, రాజేంద్రప్రసాద్, నవీన్‌కుమార్, సోమలింగం, నగేష్, బొంజుబాబు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి, వరరామచంద్రాపురం, కూనవరం, ఎటపాక, న్యూస్‌టుడే: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఎంపీడీవో యాదగిరీశ్వరరావు అన్నారు. గింజర్తిలో రైతన్నా మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి శుభలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

★ వీఆర్‌పురం మండలంలో ఎంపీడీవో ఇమ్మానుయేల్, తెదేపా మండల అధ్యక్షులు బొర్రా నరేష్, ఏవో వర్మ, కూనవరంలో మండల తెదేపా అధ్యక్షులు ఎడవల్లి భాస్కర్ ఆధ్వర్యంలో రైతుల ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించారు. అప్పారావు, సోమయ్య, రవి, వెంకన్న, చిన్ని పాల్గొన్నారు.

★ ఎటపాక, త్రిపురపెంటవీడు, లక్ష్మీపురం, గుండాల, గన్నవరం తదితర గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో కూటమి నాయకులు చలపతిరావు, పుల్లయ్య, చందు, మధు,

కొత్తూరులో పత్రాలు అందజేస్తున్న దొన్నుదొర

కూనవరంలో రైతుకు వివరిస్తున్న తెదేపా నాయకులు

శ్రీకాంత్, సతీష్ పాల్గొన్నారు.

చింతపల్లి గ్రామీణం, గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: చౌడుపల్లి పంచాయతీ సోమరవీధి రైతులకు నూతన సాగు పద్ధతులను ఏడీఏ బీవీ తిరుమలరావు వివరించారు. వీఏఏ రాజు, ఏపీ సీఎన్ఎఫ్ మోహన్ పాల్గొన్నారు. అసరాడ, జీకేవీధిలలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ఏడీఏ తిరుమలరావు, తహసీల్దార్ అన్నాజీరావు, ఎంపీడీవో రమణబాబు ప్రారంభించారు. మండల వ్యవసాయాధికారి గిరిబాబు, వ్యవసాయ సహాయకులు, రైతు సేవా కేంద్రాల ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఎంపిక

పెదబయలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సైన్సు చెకుముకి పోటీలకు ప్రైవేటు విభాగంలో స్థానిక సెయింటాన్స్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ స్టాజీ, సైన్సు ఉపాధ్యాయుడు కొంటా కేశవరావు తెలిపారు. ఈనెల 23న జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని, వీరు డిసెంబరు 23న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈవోలు సత్యనారాయణదొర, సూరయ్యరెడ్డి అన్నారు. ముసురుమిల్లిలో జరిగిన జిల్లాస్థాయి చెకుముకి సంబరాల్లో స్థానిక గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల విద్యార్థుల బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రతిభ కనబరిచిన నదీస్, జానకిరామ్, రవికుమార్‌లకు ప్రధానోపాధ్యాయుడు రాంబాబు ఆధ్వర్యంలో అభినందించారు.

రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఎంపికైన పెదబయలు విద్యార్థులు

రాజవొమ్మంగిలో విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయుడు

వైరం మరిచి స్నేహం

అనంతగిరి మండలంలోని కాశీపట్నం గ్రామంలో రామారావు ఇంటి వద్ద కుక్క, పిల్లి రెండూ కలిసిమెలిసి పెరుగుతున్నాయి. సాధారణంగా.. కుక్క, పిల్లికి జాతి వైరం ఉంటుంది. కానీ ఇవి రెండూ కలిసే భోజనంతో పాటు అన్ని పనులు చేస్తుంటాయని రామారావు తెలిపారు. పిల్లి చిన్నపిల్లగా ఉన్న సమయంలోనే తల్లి వదిలి వెళ్లిపోయిందని.. అప్పటినుంచి కుక్క తన పిల్లలా దీన్ని

చూస్తోందని పేర్కొన్నారు.
- అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సాయికుమార్‌రెడ్డి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 18న కాకినాడలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీలో ప్రథమ స్థానంలో నిలిచాడు. బాలుడిని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయురాలు భవానీ తదితరులు అభినందించారు.

విద్యార్థితో ఉపాధ్యాయులు

సాంకేతికతతో పథకాల అమలు

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి సాంకేతికతను మరింత అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. మూడు ఐటీడీఏల పీఓలు, సబ్ కలెక్టర్లు, సర్వీస్ ప్రొవైడర్లు, రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక సమస్యలను అధిగమించడానికి సెల్ టవర్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పీఓలు శ్రీపూజ, స్మరణ్‌రాజ్, శుభం నొఖ్వాల్, పాడేరు ఇన్‌ఛార్జి ఆర్డీఓ ఎస్.వి.ఎస్ లోకేశ్వరరావు పాల్గొన్నారు.

పాడేరు, న్యూస్‌టుడే: కొయ్యూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సరమండ లక్ష్మి సికెల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్నారు. ఈమెకు జీవనోపాధి కల్పించే ఉద్దేశంతో కలెక్టర్ దినేష్‌కుమార్ తన సొంత నిధులతో కుట్టుమిషన్ అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమం జరిగింది. కలెక్టర్‌కు లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ మురళి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థికసాయం చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు, న్యూస్‌టుడే: జాతీయస్థాయి విలువిద్య క్రీడా పోటీలకు అరుణాచల్‌ప్రదేశ్ వెళ్తున్న క్రీడాకారుడికి కలెక్టర్ దినేష్‌కుమార్ ఆర్థిక సహాయం అందించారు. పాడేరులోని మోదమాంబ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సీహెచ్ మోహిత్ సాయి ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ విలువిద్య పోటీల్లో రెండో స్థానంలో నిలిచాడు. నవంబర్ 28 నుంచి జరిగే జాతీయస్థాయి పోటీలకు వెళ్తున్న ఇతడికి కలెక్టర్ ఆర్థికసాయం చేశారు.

రుణాల చెల్లింపుతో ఆర్థికాభివృద్ధి

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధిలో మన డబ్బులు- మన లెక్కల యాప్‌పై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వెలుగు ఏపీఎం సూర్యారావు మాట్లాడుతూ.. మహిళలు రుణాలు సకాలంలో చెల్లించి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. అకౌంటెంట్, సీసీలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న వెలుగు అధికారులు

సీలేరులో షూటింగ్ ప్రారంభం

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు పరిసర ప్రాంతాల్లో రవితేజ హీరోగా నటిస్తున్న సినిమా చిత్రీకరణ సోమవారం ప్రారంభమైంది. ముందుగా మారెమ్మ ఆలయం, ఇన్‌టేక్ డ్యాం వద్ద పూజలు చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ ఇన్‌టేక్, రెగ్యులేటరీ డ్యాంలు, గుంటవాడ జలాశయం, చింతపల్లి క్యాంప్ ఎంబేక్‌మెంట్ వద్ద జరుగుతోంది. హీరో రవితేజ, బేబీ నక్షత్రలతో చింతపల్లి క్యాంప్ ఎంబేక్‌మెంట్ వద్ద, గుంటవాడ జలాశయం వద్ద హీరో, జూనియర్ నటులతో కొన్ని సన్నివేశాలను దర్శకుడు శివ నిర్వాణ చిత్రీకరించారు. షూటింగ్ చూడటానికి సీలేరు పరిసర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో తరలివచ్చారు.

ఎంబేక్‌మెంట్ వద్ద చిత్రీకరణ

నైపుణ్యాభివృద్ధితో ఉన్నత భవిత

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ విజయభారతి ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. నైపుణ్యాలను పెంచుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. బ్లూంకెంట్, స్విగ్గీ తదితర కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. సుమారు 180 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. ఎంపికైనవారు బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై నగరాల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అధ్యాపకులు కెజియా, సంతోషి, లీలాపావని పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ప్రతినిధులు

మావోయిస్టులతో మాకు నష్టం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆర్వీనగర్ వారపు సంతలో పరిసర గ్రామాలకు చెందిన గిరిజనులు సోమవారం ప్లకార్డులతో నిరసన చేపట్టారు. మావోయిస్టుల బంద్‌లు, నిరసన కారణంగా ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారని.. వారి వల్ల తమకు నష్టమే తప్ప ఎటువంటి ప్రయోజనం లేదని పేర్కొన్నారు. హింసను వీడాలని కోరారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు.

వారపుసంతలో గిరిజనుల ర్యాలీ

రోగులకు మెరుగైన వైద్యం

రంపచోడవరం, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వస్తున్న రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్(ఎన్‌క్యూఏఎస్) బృందం ప్రతినిధులు డాక్టర్లు ఆరుముగం, సబీర్‌పటేల్ ఆదేశించారు. ఎన్‌క్యూఏఎస్ బృందం సోమవారం మండలంలోని నరసాపురం పీహెచ్‌సీని సందర్శించింది. ఆసుపత్రిలో రోగులకు మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. రికార్డులు, ఫీడర్ అంబులెన్సును తనిఖీ చేశారు. డాక్టర్లు సుజిత, డేవిడ్, కృష్ణ పవన్, కెవిన్, ఈఎంటీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎంటీతో మాట్లాడుతున్న ఎన్‌క్యూఏఎస్ బృందం

16 నెలలైనా పట్టించుకోరా?

పాడేరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట వీఆర్‌ఏల ధర్నా

పాడేరు, న్యూస్‌టుడే: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సుందర్‌రావు ఆధ్వర్యంలో వారంతా ధర్నా చేపట్టారు. వీఆర్‌ఏల సంఘ జిల్లా అధ్యక్షులు బి.కొండబాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినప్పటికీ తమ సమస్యలు పరిష్కరించలేదన్నారు. అనేకమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రీ సర్వే పేరుతో ఇతర గ్రామాల్లో విధులు రద్దు చేయాలని కోరారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలోని ఏఓ అప్పలస్వామికి వినతిపత్రం అందజేశారు.

చింతూరు, న్యూస్‌టుడే: వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చింతూరు ఐటీడీఏ ఎదుట వారు నిరసన వ్యక్తం చేశారు. అర్హత కలిగిన వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. ఏవో సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు నాగేశ్వరరావు, కామేశ్వరరావు, రవీంద్ర, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చింతూరులో ఏవోకు వినతిపత్రం అందిస్తూ..

బడి భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు

కొయ్యూరు, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని పాఠశాలలకు పక్కా భవనాలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సమగ్ర శిక్షా ఏపీసీ స్వామినాయుడు

పాఠశాలను తనిఖీచేస్తున్న ఏపీసీ స్వామినాయుడు

తెలిపారు. రాజేంద్రపాలెం కస్తూర్బా పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, నిత్యావసర సరకులు పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాలకు సంబంధించిన 375 కిలోల బియ్యం బీసీ వసతిగృహంలో ఉన్నట్లుగా గుర్తించారు. పాఠశాల ఎస్‌వో పరిమళ విధులకు గైర్హాజరవడంపై విచారణ జరుపుతామని పేర్కొన్నారు. జిల్లాలోని 384 పాఠశాలలకు భవనాలు అవసరమని గుర్తించామని చెప్పారు. పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా 49 పాఠశాలలకు రూ.2.5 కోట్లు చొప్పున నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

(c) eenadu

ఈనాడు
అమరావతి
గుంటూరు
మంగళవారం నవంబరు 25, 2025 5

'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన'ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు. వేదికపై కృష్ణా జిల్లా డీఈవో రామారావు, పి.వి.పి. సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శివాజీబాబు, శ్రీ చైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ జీఎం ఎం.మురళీకృష్ణ, ఈనాడు ఏపీ బ్యూరో చీఫ్ కసవర్ల శ్రీనివాస్, ఈనాడు విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్‌కే కిషోర్‌కుమార్

బాల ఉషస్సు.. భావి యశస్సు

ఆధునిక పరిజ్ఞానంతో.. సమస్యలకు పరిష్కారాలు

'ఈనాడు' వైజ్ఞానిక ప్రదర్శన'లో అబ్బురపరిచిన ఆవిష్కరణలు

– ఈనాడు, అమరావతి
– కానూరు, పటమట, న్యూస్‌టుడే

సమాజంలో ఎదురయ్యే ప్రధాన సమస్యలన్నింటికీ ఆధునిక పరిజ్ఞానంతో పరిష్కారం చూపించొచ్చని పలువురు విద్యార్థులు చాటిచెప్పారు. రహదారి ప్రమాదాలను నివారించేందుకు వాహనాలకు ఆటోమేటిక్ బ్రేక్ సిస్టమ్, నగరాల్లో స్మార్ట్ పార్కింగ్, వ్యవసాయంలో కీటకాల ముప్పును నివారించేందుకు సోలార్ ట్రాప్స్, వరదల వేళ మునిగిపోకుండా ఉండే స్మార్ట్ వంతెనలు, కృత్రిమ మేధతో పనిచేసే ఫైర్ ఇంజిన్లు, రైలు ప్రమాదాలను నివారించే రోబో టెక్నాలజీ, కుక్క కాటు నుంచి రక్షించేందుకు చేతులు, కాళ్లకు కవచాలు, యాంటీ సూసైడ్ ఫ్యాన్లు, విద్యుత్తును ఆదా చేసేలా స్మార్ట్‌సిటీ ప్రణాళికలు.. ఇలా విద్యార్థులు రూపొందించిన 85 ప్రాజెక్టులు ఔరా అనిపించాయి. వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు నిర్వహించిన 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన'కు అనూహ్య స్పందన వచ్చింది. కానూరులోని పి.వి.పి.సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో.. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు సోమవారం నిర్వహించిన ఈ మెగా సైన్స్ ఫెయిర్‌ను తిలకించేందుకు వేలాదిగా విద్యార్థులు తరలివచ్చారు.

ఎనర్జీ ఎఫిషియెన్సీ స్మార్ట్ సిటీ 1

విద్యార్థులు: తేజస్విని, భరత్, 10వ తరగతి, జడ్పీహెచ్‌ఎస్ కానూరు

ఆధునిక పరిజ్ఞానంతో సమస్యలకు పరిష్కారం చూపించే నగరం నమూనా. వాహనాలు వచ్చేటప్పుడు వీధి దీపాలు వెలగడం, జాతీయ రహదారులపై గాలి మరల ద్వారా ఆటోమేటిక్‌గా దీపాలను వెలిగించడం, సెన్సార్ల ద్వారా బ్యాంకు చోరీలు జరగకుండా అప్రమత్తమవ్వడం, స్మార్ట్ చెత్త డబ్బాలు, అగ్నిప్రమాదాల వేళ మంటలను నీటితో ఆర్పే సెన్సార్ల వ్యవస్థ.. ఈ ఆరు అంశాలతో రూపొందించిన ఈ ప్రాజెక్టుకు మొదటి బహుమతి వచ్చింది.

స్మార్ట్ బ్రిడ్జి 2

విద్యార్థులు: జి.రోహిత్(9వ తరగతి), ఆర్.దుర్గ(8వ తరగతి), శ్రీమల్లికార్జున హైస్కూల్, గన్నవరం

వరదల సమయంలో వంతెనలు మునిగిపోకుండా పరిష్కారం చూపించే ప్రాజెక్టు. నీటిలో ఉండే సెన్సార్ల ద్వారా వరద ప్రవాహం ఉద్ధృతి, ఎత్తును అంచనా వేసి.. దానికి తగ్గట్టు వంతెన ఆటోమేటిక్‌గా పైకి వస్తుంది. దీని వల్ల వాహనాలకు వరద ముంపు ప్రమాదం ఉండదు. ఈ ప్రాజెక్టుకు రెండో బహుమతి వచ్చింది.

యాంటీ సూసైడ్ ఫ్యాన్ 3

విద్యార్థులు: జి.కార్తికేయ, జి.వెంకట సందీప్, కె.కార్తీక్, క్రైస్ట్ ది కింగ్ పాఠశాల, శ్రీసూర్యారావుపేట, విజయవాడ

హాస్టల్ గదులు, ఇళ్లు, హోటళ్లలో ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడేవారు ఫ్యాన్లకు ఉరేసుకుంటారు. వీటిని నివారించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. బరువు పెరిగిన వెంటనే ఆటోమేటిక్‌గా ఫ్యాన్ నేల మీదకి దిగిపోతుంది. వెంటనే ఈ ప్రాజెక్టు బిగించిన సమయంలో నమోదు చేసిన ఫోన్ నంబరుకు అలర్ట్ మెసేజ్ వెళ్లిపోతుంది. పెద్ద శబ్దంతో అలారం మోగుతుంది. ఈ ప్రాజెక్టుకు మూడో బహుమతి వచ్చింది.

ప్రాజెక్టులకు పేటెంట్ తెప్పించాలి

-విజయరామరాజు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్

విద్యార్థులు చేసే ప్రాజెక్టులకు పేటెంట్ కోసం సైన్స్ టీచర్లు దరఖాస్తు చేయాలి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు ఉండాలి. విద్యార్థులు ఏ ఆవిష్కరణ చేయాలన్నా సామగ్రి అందుబాటులో ఉండాలి. కొందరు ఇంజినీరింగ్ విద్యార్థుల్ని అడిగినా చెప్పలేని విషయాలు, సెన్సార్ల గురించి ఈ విద్యార్థులు చెప్పడం అభినందనీయం. ప్రభుత్వ పాఠశాలల్లోనూ అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రదర్శన ఏర్పాటు చేసినందుకు 'ఈనాడు'కు ధన్యవాదాలు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల సందడే సందడి

ప్రాజెక్టులను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

మరిన్ని నిర్వహించాలి..

-పాలడుగు లక్ష్మణరావు, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి

వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థి జీవితంలో కీలకం. సుమారు 85 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని తమ ప్రాజెక్టుల ప్రదర్శన చేయడం అభినందనీయం. 'ఈనాడు' ఆధ్వర్యంలో సమాజ చైతన్యం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. భవిష్యత్తులోనూ మరిన్ని జరగాలి.

లేజర్ సెక్యూరిటీ అలారం

విద్యార్థులు: సీహెచ్.నవీన్, ఇస్మాయిల్, 9వ తరగతి, జడ్పీహెచ్‌ఎస్ బంటుమిల్లి

ఇళ్లకు పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేయడమే లక్ష్యం. ఇళ్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి సెన్సార్లతో అనుసంధానిస్తారు. ఎవరైనా వచ్చి దానిని తాకగానే పెద్ద శబ్దంతో అలారం మోగుతుంది. సెల్‌ఫోన్‌కు అలర్ట్ మెసేజ్ వెళ్లిపోతుంది.

రహదారులపై ప్రమాదాల నివారణ

విద్యార్థులు: పవన్‌కుమార్(10వ తరగతి), ప్రేమ్‌చంద్(9వ తరగతి), ఎం.కె.బేగ్ హైస్కూల్, అజిత్‌సింగ్‌నగర్

వాహనం వెళ్లేటప్పుడు ఆకస్మాత్తుగా వచ్చే ప్రమాదాల వేళ ఆటోమేటిక్‌గా బ్రేకులు పడి ఆగిపోతుంది. వాహనానికి బిగించిన సెన్సార్ల ద్వారా.. నాలుగు వైపులా ఎంత దూరంలో ప్రమాదం ఉన్నా వెంటనే కారులో హెచ్చరిక సంకేతాలు వస్తాయి.

వినూత్నంగా ఆలోచిస్తే...

–రాజశేఖరబాబు, సీపీ

ప్రతి విషయాన్ని వినూత్నంగా ఆలోచించడం అలవాటు చేసుకోవాలి. అప్పుడే ఆకాశమే హద్దుగా చెలరేగిపోవచ్చు. ప్రతి సందర్భంలోనూ ఇంతకంటే బాగా ఎలా చేయొచ్చు అని ఆలోచించి ఆ దిశగా ప్రయత్నిస్తే మన ప్రయాణం అద్భుతంగా సాగుతుంది. ఏఐ, మిషన్‌లెర్నింగ్, డ్రోన్ ఇలా అన్నీ ఆధునిక పరిజ్ఞానం నుంచి పుట్టుకొచ్చినవే. ప్రతి రంగంలోనూ ఆవిష్కరణలు అవసరం.

పరిశ్రమల వ్యర్థాల నుంచి ఇంకు తయారీ

విద్యార్థులు: యు.ధనశ్రీనివాస్(10వ తరగతి), వేముల అఖిల్(8వ తరగతి), జడ్పీహెచ్‌ఎస్ పరిటాల

పరిశ్రమల నుంచి వాయువులు వదిలిపెట్టి.. వాటి నుంచి నల్లని ఇంకు తయారు చేయడం లక్ష్యం. ఒక కంటైనర్ లాంటి యంత్రాన్ని పరిశ్రమలు ఉండే ప్రాంతంలో పెడతారు. దాని ద్వారా వచ్చే గాలిలో నుంచి రసాయన వ్యర్థాలను పౌడర్‌గా మారుస్తారు. స్వచ్ఛమైన గాలిని వదిలేస్తారు. ఆ పౌడర్‌కు నూనెలను కలిపి ఇంకు తయారు చేస్తారు.

డాగ్ బైట్ సాక్స్

విద్యార్థులు: బి.విక్రాంత్, షేక్ బషీరుల్లా, 9వ తరగతి, జడ్పీహెచ్‌ఎస్ తెల్లపోలు

కుక్కలు కరిచినా గాయం కాకుండా తప్పించుకోవచ్చు. పలుచని కార్బన్ రేకు, దానిపైన తోలు, గుడ్డతో సాక్స్ రూపంలో తయారు చేసి చేతులు, కాళ్లకు తొడుక్కోవచ్చు. ప్రస్తుతం వీధి కుక్కల బెడద పెరిగిపోయి చాలా మంది చిన్నారులు వాటి బారినపడుతున్నారు. ప్రధానంగా కాళ్లు, చేతులపైనే అవి కరుస్తున్నాయి. అందుకే ఈ డాగ్ బైట్ సాక్స్ తయారు చేశారు.

ప్రోత్సాహక బహుమతులు

మరిన్ని వార్తలు, చిత్రాలు..www.eenadu.net లో

Expert Advice Exclusive Properties
ప్రవేశం ఉచితం
EENADU PROPERTY SHOW 2025
29th - 30th November-2025 Saturday - Sunday
Timing: 10am - 8pm
Place: A.Convention Centre, Bunder Road, Vijayawada Time: 10 AM to 8 PM
For Details Contact
80080 03297, 74168 34488

ఉద్యోగం ఇప్పిస్తానని స్నేహితురాలికే టోకరా

మత్స్యశాఖ సూపరింటెండెంట్‌పై కేసు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: 'నాకు పెద్ద పెద్ద అధికారులు తెలుసు. మీ అమ్మాయికి మత్స్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తా. కొంత సొమ్ము చేబదులుగా ఇస్తే ఎక్కువ మొత్తం తిరిగిస్తా...' అంటూ స్నేహితురాలినే నమ్మించింది. రూ.48లక్షల మేర మోసం చేసి, ఆపై చంపుతానని బెదిరించిన గుంటూరు కలెక్టరేట్‌లోని మత్స్యశాఖ సూపరింటెండెంట్‌పై విజయవాడ సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన పూర్వాపరాలు... అజిత్‌సింగ్‌నగర్, నందమూరినగర్‌కు చెందిన షేక్ షామిమ్ (50) టైలరింగ్ షాపు నిర్వహిస్తుంటారు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు. గుంటూరు కలెక్టరేట్‌లోని మత్స్యశాఖ సూపరింటెండెంట్ నిమ్మకాయల లలితకుమారి, ఆమె భర్త కూచిపూడి జాన్సన్‌లు షామిమ్‌కు చిన్ననాటి స్నేహితులు. లలితకుమారి అల్లుడు సుధాకర్, కుటుంబ మిత్రుడు దాసరి నాగరాజు తదితరులు షామిమ్ ఇంటికి రాకపోకలు సాగిస్తుంటారు. ఉన్నతాధికారులతో తనకు పరిచయం ఉందని, మీ కుమార్తెకు మత్స్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని షామిమ్‌కు లలితకుమారి హామీ ఇచ్చింది. ఇందుకు రూ.20 లక్షలు చెల్లించాలనడంతో.. 2023, సెప్టెంబరులో ఇచ్చారు. తన భర్త జాన్సన్, అల్లుడు సుధాకర్‌లు పాస్టర్లుగా పనిచేస్తున్నారని.. వారికి విదేశాల నుంచి పెద్ద మొత్తంలో నిధులు వస్తుంటాయని లలితకుమారి చెప్పింది. వారికి అత్యవసరంగా డబ్బులు కావాల్సి ఉందని, చేబదులు ఇస్తే రూ.కోటి తిరిగి ఇస్తాననడంతో గత మే నెలలో మరో రూ.28 లక్షలు చెల్లించారు. ఆ రూ.48 లక్షల గురించి అడుగుతుంటే.. సరైన సమాధానం ఇవ్వకపోవడంతో నిలదీశారు. తమ వద్ద డబ్బులు లేవని.. మరోసారి అడిగితే చంపుతామని లలితకుమారి బెదిరించడంతో.. మోసపోయినట్లు గుర్తించారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఈ నెల 21న ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేశారు.

మిరప మిలమిల

ఈనాడు, అమరావతి

- పెరుగుతున్న ధరలు
- క్వింటా రూ.20 వేలకు చేరే అవకాశం

రెండేళ్లుగా చతికిలపడిన ఎండు మిర్చి ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. క్వింటాలు రూ.20 వేల మార్కును తాకే అవకాశం కనిపిస్తుండడంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. శీతల గోదాముల్లో నిల్వలు క్రమంగా తగ్గిపోతుండడం, కొత్త పంట మార్కెట్‌కు పెద్దగా రాదన్న సంకేతాలే దీనికి ప్రధాన కారణం. మనరాష్ట్రంతోపాటు తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వర్షాల వల్ల దిగుబడులు ప్రభావితమవుతాయన్న అంచనాలున్నాయి. కర్ణాటకలో సాగు విస్తీర్ణం తగ్గడంతో ఏటా మాదిరిగా ఈసారి యార్డుకు సరకు వస్తుందా? రాదా? అన్న మీమాంస మార్కెట్‌ను ప్రభావితం చేస్తోంది. ఈ నేపథ్యంలో అక్టోబరులో మొదలైన మార్కెట్ చలనం నవంబరులోనూ కొనసాగుతోంది. ప్రత్యేక రకాల ధరలు అనూహ్యంగా పెరుగుదల నమోదు చేస్తున్నాయి.

నవంబరు 21న మిర్చి యార్డులో ధరలు ఇలా.. (క్వింటాలుకు రూ.ల్లో)

రకం	గరిష్ఠం
334	18,000
341	18,000
బ్యాడిగి	18,500
దేవనూర్ డీలక్స్	17,500
నంబరు-5	16,400
తేజ	16,000

వాతావరణం దెబ్బ.. సాధారణంగా జూన్ నుంచి ఆగస్టు వరకు వర్షాలెక్కువగా కురుస్తాయి. మొక్కల పెరుగుదలకు ఆటంకం ఏర్పడడం, కలుపు పెరగడం, ఎరువులు చల్లే అవకాశం తగ్గడం తదితర కారణాల వల్ల చాలా మంది రైతులు ఆగస్టు వరకు వేచి చూస్తుంటారు. ఆ తరువాత మొక్కలు నాటుతారు. ఈ ఏడాది పరిస్థితి మారిపోయింది. అధిక వర్షాలకు రైతులు ధైర్యం చేయలేకపోయారు.

సరకు రాక... ముందుగా సాగైన పొలాల్లో కొత్త పంట చేతికి రావడం, పెట్టుబడుల కోసం రైతులు గోదాములోని సరకు అమ్మేందుకు ఆసక్తి చూపడంతో నిత్యం యార్డుకు 45 వేల నుంచి 50 వేల బస్తాలొస్తున్నాయి.

తగ్గిన సాగు.. రెండేళ్లుగా ధరలు తగ్గుముఖం పట్టడంతో అన్నదాతలు నష్టాలను చవిచూశారు. ఏడాదికిపైగా శీతల గోదాముల్లో నిల్వ చేసినా.. రేట్లు పుంజుకోలేదు. ఈ కారణంగానే సాగు విస్తీర్ణం తగ్గుతోంది. రాష్ట్రంలో 2024 సీజన్లో 3.64 లక్షల ఎకరాల్లో సాగవగా... ఈ సంవత్సరం 2.67 లక్షల ఎకరాలకు పరిమితమైంది. ఏటా సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో నర్సరీల్లో ఎక్కువ రోజులు పెంచిన మిరప మొక్కలను ఆలస్యంగా నాటేవారు. ఈ ఏడాది పరిస్థితి మరీ మందకొడిగా ఉంది.

నవంబరు మూడోవారం ముగిసేసరికి 3 రకాల మిర్చి ధరలు బాగా పెరిగాయి. క్వింటాలుకు గరిష్ఠంగా రూ.18,600 పలికింది.

కొరత పేరుతో ధరల మోత

అవసరాలకు మించి యూరియా సరఫరా

నల్లబజారులో అధిక రేట్లకు విక్రయం

ఈనాడు – అమరావతి

నవంబరు 24నాటికి యూరియా నిల్వలు మెట్రిక్ టన్నుల్లో....

టోకు వ్యాపారులు	: 2,908.46
రిటైల్ వ్యాపారులు	: 1,934.75
రవాణాలో ఉన్నవి	: 937.48
మొత్తం	: 5,780.69

జిల్లాలో సొసైటీలు.. డీసీఎంఎస్, రైతు సేవా కేంద్రాల్లో యూరియా గరిష్ఠ చిల్లర ధర రూ.266.50...

నల్లబజారులో ధర రూ.350 నుంచి రూ.400..

యూరియా కృత్రిమ కొరత కొనసాగుతూనే ఉంది. ఖరీఫ్‌లో ఏటా సరఫరా చేసే పరిమాణంకంటే అదనంగా 10 వేల టన్నులు జిల్లాకు వచ్చినా.. ఈ పరిస్థితి ఎదురవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. యూరియా దొరకడం లేదని కొంతమంది వదంతులు సృష్టించడం.. కొన్ని దుకాణాల్లో విక్రయించకపోవడం ద్వారా కృత్రిమ కొరత సృష్టించారు. అన్నదాతలు ముందుజాగ్రత్తగా రబీకి కావాల్సినంత ఒకేసారి కొనుగోలు చేయడం వల్లనే ఎంత సరఫరా చేసినా సరిపోవడం లేదు. డెల్టాలో మొక్కజొన్న రైతులు నల్లబజారులో అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

రైతుల ఆత్రుత... ప్రస్తుతం వరి కోతలు జరుగుతున్నందున అవసరం ఉన్న గ్రామాలకే వ్యవసాయ శాఖ యూరియా పంపుతోంది. అవసరం లేనివారు సైతం ఆత్రుతతో కొనుగోలు చేస్తున్నారు. దీన్ని కొంత మంది వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.

వ్యాపారుల ఎత్తుగడ... యూరియాలో 70 శాతం మార్క్‌ఫెడ్‌కు, 30 శాతండీలర్లకు ఇస్తున్నారు. ఈ 30 శాతం రిటైల్ మార్కెట్‌లో కొందరికే సరఫరా చేస్తున్నారు. దీన్ని అనుకూలంగా మార్చుకున్న వ్యాపారులు.. యూరియా నిల్వలు లేనందునే కొందరికే ఇస్తున్నారని, సీజన్లో ఇంకా డిమాండ్ పెరిగి లభ్యత ఉండదని ప్రచారం చేశారు.

నమ్మితే నట్టేట ముంచారు..!

- కురగల్లు సొసైటీ డిపాజిట్‌దారుల ఆవేదన
- మంగళగిరి జీడీసీసీ బ్యాంక్ ఎదుట ఆందోళన
- రూ. 15 కోట్ల మేర సొమ్ము స్వాహా..?

మంగళగిరి, తాడేపల్లి, న్యూస్‌టుడే: డిపాజిట్ల నగదు తిరిగివ్వాలంటూ కురగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం డిపాజిట్‌దారులు మంగళగిరిలోని జీడీసీసీ బ్యాంక్ ఎదుట సోమవారం బైఠాయించారు. పారిపోయిన ఉద్యోగి రమేష్‌బాబును తీసుకొచ్చి నగదును రికవరీ చేసి ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు కంటతడి పెట్టుకున్నారు. తాను రూ.70 లక్షలు, కుటుంబ సభ్యులు రూ.30 లక్షలు డిపాజిట్ చేసినట్లు తాడిబోయిన హనుమంతరావు అనే రైతు వాపోయారు. తోటా పేర్లయ్య నెల రోజుల క్రితం రూ.4 లక్షల డిపాజిట్ చేసినట్లు చెప్పారు. ఉద్యోగి సస్పెండైన తరువాత తన వద్ద నుంచి రెండు సార్లు రూ.2 లక్షల చొప్పున నగదు తీసుకున్నారన్నారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 4 గంటల పాటు ఆందోళన చేసినా.. బ్యాంక్ అధికారులు సమాధానం చెప్పలేదని ఆందోళనకారులు వాపోయారు.

సస్పెండ్ చేసినా డబ్బు వసూలు.. డిపాజిట్‌దారుల అమాయకత్వాన్ని, నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని సొసైటీ సీఈవోగా పనిచేసిన రమేష్‌బాబు నకిలీ బాండ్లు ఇచ్చి డిపాజిట్ సొమ్మును దోచుకుపోయారు. దీనిపై విచారణ జరిపిన అధికారులు అతడిని నెల రోజుల కింద సస్పెండ్ చేశారు. ఇది గ్రామస్థులకు తెలియలేదు. ఇదే అదనుగా అతడు స్థానికుల నుంచి రూ.1.50 కోట్ల వరకు సేకరించినట్లు ఇప్పటివరకు లెక్క తేలింది. ఈ మొత్తం రూ.15 కోట్ల వరకు ఉండొచ్చంటున్నారు. అతను సస్పెండైయినట్లు నోటీసును మూడురోజుల క్రితం గ్రామస్థులకు కనిపించకుండా కార్యాలయం లోపల అంటించారు.

కాజలో గుబులు.. మంగళగిరి సొసైటీ పరిధిలోని కాజ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడా గతంలో పనిచేసిన రమేష్‌బాబు రూ.1.80 కోట్లసొమ్మును స్వాహా చేశాడు.

జీడీసీసీ బ్యాంక్ ఎదుట బైఠాయించిన డిపాజిట్‌దారులు

దీనిపై సొసైటీ అధ్యక్షుడు గాదె పిచ్చిరెడ్డి గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమాదేవి సోమవారం విచారణ జరిపారు. సిబ్బంది నుంచి లిఖిత పూర్వక సమాచారం సేకరించారు.

రూ.5 లక్షలు డిపాజిట్ చేశా.. నేను వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాయని సొసైటీలో రూ.5 లక్షలు డిపాజిట్ చేశా. వడ్డీతో జీవనం సాగిస్తున్నా. కొంత కాలం బాగానే ఇచ్చారు. ఇప్పుడు డబ్బుతో ఉద్యోగి వెళ్లిపోయాడని తెలిసింది. నకిలీ పత్రాలిచ్చి నట్టేట ముంచారు.
– శనగారపు వెంకటేశ్వర్లు

జీవనం ఎలాగో అర్థం కావడం లేదు.. నేను రూ.10 లక్షలు డిపాజిట్ చేశాను. డబ్బులు కట్టించుకున్న వ్యక్తి సస్పెండయ్యాడన్న విషయం మాకు ఆలస్యంగా తెలిసింది. గ్రామంలో ప్రచారం చేసి ఉంటే జాగ్రత్త పడేవాళ్లం. వృద్ధాప్యంతో జీవనం ఎలాగో అర్థం కావడంలేదు. – శివమ్మ

29న మంగళగిరిలో జాబ్ మేళా

మంగళగిరి, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈ నెల 29వ తేదీ జాబ్ మేళా నిర్వహించనుంది. వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగే ఈ మేళా ప్రచార ప్రతులను కలెక్టర్ తమీమ్ అన్సారియా గుంటూరులో సోమవారం ఆవిష్కరించారు. ఇందులో 10కిపైగా కంపెనీలు పాల్గొంటాయి. విద్యార్హత ఆధారంగా రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనాలు ఉండవచ్చని, పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ చదువుతున్న 18 నుంచి 25 సంవత్సరాలు వయస్సు గల నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

పూర్తిస్థాయిలో పత్తి కొనుగోలు చేస్తాం

మేడికొండూరు, ఫిరంగిపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం పూర్తిస్థాయిలో పత్తి కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టిందని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత పేర్కొన్నారు. పేరేచర్ల శివారు పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. కొనుగోలు విధానం గురించి ఆరా తీశారు. జిన్నింగ్ మిల్లు పని తీరు పరిశీలించారు. ఈ సందర్భంగా విజయసునీత మాట్లాడుతూ తేమ 12 శాతం ఉన్నా కొనుగోలు జరుగుతుందన్నారు.

పశ్చిమ బైపాస్... ఎన్‌హెచ్-16లో విలీనం!

చినఆవుటపల్లి-కాజ ఆర్అండ్‌బీ స్టేట్ హైవేదే బాధ్యత

ఈనాడు – అమరావతి

పశ్చిమ బైపాస్ ఎన్‌హెచ్-16లో విలీనమయ్యే సమయం ఆసన్నం అవుతోంది. బైపాస్‌లో ప్యాకేజీ-1 గుండుగొలను-కలపర్రు, ప్యాకేజీ-2 కలపర్రు-చినఆవుటపల్లి ఇప్పటికే ఎన్‌హెచ్-16లో మమేకమయ్యాయి. ప్యాకేజీ-3, 4 నిర్మాణం దాదాపు కొలిక్కి వచ్చింది. ఈ నేపథ్యంలో బైపాస్‌లో భాగమైన చినఆవుటపల్లి-కాజ వరకు దాదాపు 47 కిమీ ఎన్‌హెచ్-16లో కలవనుంది. దీంతో ప్రస్తుతం ఎన్‌హెచ్-16లో భాగంగా గన్నవరం మండలం చినఆవుటపల్లి నుంచి విజయవాడ బెంజ్ సర్కిల్ మీదుగా గుంటూరు జిల్లా కాజ వరకు దాదాపు 40 కి.మీ ఆర్అండ్‌బీ రాష్ట్ర హైవేలకు అప్పగిస్తారు. పశ్చిమ బైపాస్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాగానే ఈ మార్పులు జరగనున్నాయి. అక్కడ నుంచి 40 కి.మీ నిర్వహణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి.

కాజ దగ్గర ఎన్‌హెచ్-16, పశ్చిమ బైపాస్ అనుసంధాన పనులు

వన్‌టైమ్ ఇంప్రూవ్‌మెంట్ అనంతరమే... ఎన్‌హెచ్ నిబంధనల ప్రకారం బైపాస్ నిర్మాణం చేపట్టినప్పుడు ఆ పరిధిలో ఇప్పటి వరకు ఎన్‌హెచ్‌లో భాగంగా కొనసాగుతున్న రహదారిని ఆర్అండ్‌బీ రాష్ట్ర హైవేలకు బదిలీ చేస్తారు. బదిలీకి ముందే ఆ పరిధిలోని రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసివ్వాలి. మరమ్మతులకు గురైన విద్యుత్తు దీపాలను పునరుద్ధరించాలి. పంచాయతీ, నగరపాలిక సమన్వయంతో డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేయాలి. ఇవన్నీ చేసిన తర్వాతే బదిలీ చేయాలి.

★ ఎన్‌హెచ్ నుంచి రాష్ట్ర హైవేకు బదిలీ అవుతున్నందున ఈ పరిధిలోని టోల్ ప్లాజాలు తొలగిస్తారు. ప్రస్తుతం ఎన్‌హెచ్-16లో పొట్టిపాడు టోల్‌గేటు తొలగించి. పశ్చిమ బైపాస్‌లో వెంకటపాలెం, వెదురుపావులూరులో రెండు కొత్త టోల్‌గేట్లు ఏర్పాటు చేస్తారు.

విద్యుత్తు టవర్ల వివాదం వాయిదా...

పశ్చిమ బైపాస్ మీదుగా వెళ్లిన నున్న హైటెన్షన్ విద్యుత్తు టవర్ల వివాదం మళ్లీ వాయిదా పడింది. సోమవారం కోర్టులో విచారణకు రాగా రైతులు కొంత సమయం కావాలని కోరడంతో నాలుగు వారాలు వాయిదా వేస్తూ న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది.

పేరేచర్లలో 'స్క్రబ్ టైఫస్' జ్వరం కేసులు

మేడికొండూరు, న్యూస్‌టుడే: మేడికొండూరు మండలంలో జ్వరం కేసులు నమోదవుతున్నాయి. పేరేచర్ల లక్ష్మీనరసింహ కాలనీలో నివాసం ఉంటున్న ఓ మహిళకు నెల రోజుల కిందట విపరీతమైన జ్వరం వచ్చింది. తొలుత గ్రామంలో చికిత్స తీసుకున్నారు. రోజులు గడిచినా తగ్గకపోవడంతో గుంటూరులోని ప్రయివేట్ ఆసుపత్రికి వెళ్లారు అక్కడ వైద్యులు పరీక్షించి 'స్క్రబ్ టైఫస్'గా నిర్ధారించారు. చికిత్స అందించడంతో ఆమె కోలుకుని పది రోజుల కిందట ఇంటికి వచ్చారు. వైద్య ఖర్చులు సుమారు రూ.3 లక్షలు అయ్యాయి. ఇదిలా ఉండగా నాలుగు రోజుల కిందట ఆమె కుమార్తె కూడా ఇదే జ్వరం బారిన పడ్డారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ అధికారులు గ్రామంలో సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ జ్వరాన్ని 'బుష్ టైఫస్' అని కూడా వ్యవహరిస్తుంటారు. ఇది 'చిగ్గర్' అనే కీటకం కుట్టడం ద్వారా వచ్చే బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్. ఈ జ్వరం ప్రాణాంతకమైనది కాదని, భయపడాల్సిన అవసరం లేదని మేడికొండూరు వైద్యాధికారి సిద్ధిక్ తెలిపారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని చెప్పారు.

(c) eenadu

హామీలు అమలు చేయాల్సిందే

కలెక్టరేట్ ఎదుట పోరాట దీక్షలో సమగ్రశిక్షా ఉద్యోగులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనని ఏపీ సమగ్ర శిక్షా ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సమాఖ్య పిలుపు మేరకు ఐకాస ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సమగ్రశిక్షా ఉద్యోగులు సోమవారం పోరాట దీక్షకు పూనుకున్నారు. ఈ సందర్భంగా ఐకాస జిల్లా అధ్యక్షుడు ఎస్.ప్రకాష్, కోశాధికారి ఎం.గంగరాజు, ఉపాధ్యక్షుడు కె.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో 21 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులను రాష్ట్ర విద్యా శాఖలో విలీనం చేయాలన్నారు. ధరలకు అనుగుణంగా అన్ని కేటగిరీలకు వేతనాలు పెంచి, ఎంటీఎస్, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఒడిశా, పంజాబ్, కేరళ ప్రభుత్వాల మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లోనూ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. తాత్కాలిక సిబ్బందిని శాశ్వత పద్ధతికి మార్చాలని, సీఆర్పీలను దూరప్రాంతాలకు బదిలీ చేయడాన్ని నిలుపుదల చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే డిసెంబరు 10న రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని పేర్కొన్నారు. దీక్షకు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యు.రాజశేఖర్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సంధ్య, అరుణ్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అస్మిత అథ్లెటిక్స్ పోటీలు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో లీగ్ పోటీలు నిర్వహించారు. పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్ ఖాన్, మంగళగిరి గ్రామీణ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 100 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. డీఎస్‌డీవో అధికారి అఫ్రోజ్ ఖాన్ మాట్లాడుతూ.. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాతీయ క్రీడాకారుడు, మంగళగిరి గ్రామీణ ఎస్ఐ వెంకట్ మాట్లాడుతూ.. క్రీడల ద్వారా ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని చెప్పారు. జిల్లా కార్యదర్శి ప్రసాద్, శిక్షకులు రజనీకుమార్, అంతర్జాతీయ క్రీడాకారుడు కృష్ణమోహన్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఛైర్మన్ శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

What your parents meant by responsible spending.

Beyond betteR offer: On-road Price = Ex-showroom Price*

FASTFEST

LM AUTO CARS

VIJAYAWADA	GUNTUR	NELLORE	ONGOLE	BHIMAVARAM
8886691748	7799711129	7799711102	7799711125	8886691749

పీజీఆర్ఎస్ అర్జీలన్నీ పరిష్కరించండి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్ అర్జీలన్నీ నిశితంగా పరిశీలించి పరిష్కరించాల్సిందేనని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమానికి నిర్దేశించిన సమయానికి ముందుగానే వచ్చి ఆమె సంబంధిత విభాగాలను తనిఖీ చేశారు. అర్జీల నమోదు, కంప్యూటర్ విభాగంలో సిబ్బంది చేస్తున్న పనులను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం 290 అర్జీలు స్వీకరించి ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఛానల్ విస్తరణకు నోటిఫికేషన్ ఇవ్వండి : గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించేందుకు అన్ని గ్రామాలకు గజిట్ నోటిఫికేషన్ ఇచ్చి భూసేకరణ పూర్తి చేయాలని నల్లమడ రైతు సంఘం నాయకుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ వినతిపత్రం అందించారు. నల్లమడ వాగు గండ్లు యుద్ధ ప్రాతిపదికన పూడ్చి ఆధునికీకరణకు చర్యలు చేపట్టాలన్నారు. మార్క్‌ఫెడ్‌కు అమ్ముకున్న నల్లబర్లీ పొగాకుకు సంబంధించిన నగదును రైతుల ఖాతాలకు జమ చేయాలని కోరారు.

పత్తి కొనుగోలు చేయాలని వినతి

ప్రత్తిపాడు మండలంలో పండించిన పత్తి పంటను కొనుగోలు చేయాలని సీసీఐ అధికారులను కోరినా కొనడం లేదని రైతు పి.గంగిరెడ్డి, రైతులు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు. ఇటీవల తుపాను వల్ల పంట దెబ్బతిందని, మొత్తంగా 4 క్వింటాలు మాత్రమే వస్తుందన్నారు. అధికారులు స్పందించి పత్తి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

☛ మేడికొండూరులోని సాయిరాం పొదుపు మహిళ సంఘం సభ్యులు స్త్రీనిధి ద్వారా రుణం తీసుకుని తిరిగి చెల్లించినా ఏపీఎం ఇంకా రూ.45 వేలు చెల్లించాలంటున్నారని, దీనిపై విచారించి న్యాయం చేయాలని సభ్యులు కోరారు.

నినాదాలు చేస్తున్న నల్లమడ రైతు సంఘం నాయకుడు డాక్టర్ కొల్లా రాజమోహన్, రైతులు

కలెక్టరేట్‌కు ప్రదర్శనగా వస్తున్న మహిళలు

☛ గుంటూరు శివారు వాసవీనగర్ పరిధిలోని కోమలాంగి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కోమలాంగి, ఇతర సామాజికవర్గంలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. అఖిల భారత రైతు కూలీ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు.

☛ ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని భాజపా జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ ధారా అంబేడ్కర్ పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు. గత వైకాపా హయాంలో ఎస్సీల సంక్షేమాన్ని గాలికి వదిలేశారన్నారు.

వృత్తిపన్ను రిటర్న్స్ దాఖలు వచ్చే నెలలో

పట్నంబజారు, న్యూస్‌టుడే: వ్యాపారవర్గాల వారు ఆన్‌లైన్ ద్వారా వృత్తి పన్ను చెల్లించాలని బ్రాడీపేట సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ కేదారేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాదికి రూ.10 లక్షలకు మించి టర్నోవర్ ఉన్న జీఎస్టీ వ్యాపారులు ఏడాదికోసారి చెల్లించాలని పేర్కొన్నారు. ముఖ్యాంశాలు... * సంస్థలో పని చేసే ఉద్యోగులకు నెలకు రూ.15 వేలకు మించి జీతం చెల్లిస్తుంటే.. వారి తరపున నిర్వాహకులు ప్రతి నెలా వృత్తి పన్ను చెల్లించాలి. ☛ ఉద్యోగుల ఆధార్, పాన్ నంబర్లతోపాటు బ్యాంకు ఖాతాల వివరాలు, సెల్ నంబరు, మెయిల్ ఐడీలను నవంబరు 30లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించాలి. ☛ డిసెంబరులో వృత్తిపన్ను రిటర్న్స్ దాఖలు చేయాలి. ☛ జీఎస్టీ ఉన్న వ్యాపారులు ఏపీ ప్రొఫెషనల్ టాక్స్ పోర్టల్‌లో లాగిన్ అయి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ☛ ప్రతి వ్యాపారసంస్థ నిర్వాహకులు వారికి సంబంధించిన భాగస్వాములు, డైరెక్టర్లు, అదనపు వ్యాపార సంస్థలకు విధిగా రిజిస్ట్రేషన్ పొంది వార్షిక ప్రాతిపదికన వృత్తి పన్ను చెల్లించాలి. ఈ ప్రక్రియ నవంబరు 30లోగా పూర్తి చేయాలి. ☛ వివరాలకు 70365 33088, 81428 28899 నంబర్లను సంప్రదించాలి.

వెలుగు సిబ్బందిపై చర్యలకు రంగం సిద్ధం

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నల్లపాడు బ్రాంచి నుంచి బోగస్ ఎస్‌హెచ్‌జీ మహిళల పేరుతో రుణాలు పంపిణీ చేయించి నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఆర్‌డీఏ, మెప్మా, బ్యాంకు ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించడంతో శాఖల వారీగా చర్యలకు అధికారులు సిద్ధమవుతున్నారు. డీఆర్‌డీఏ- వెలుగుకు సంబంధించి ఆరుగురిపై చర్యలకు సిఫార్సు చేయడంతో డీఆర్‌డీఏ పీడీ టి.వి.విజయలక్ష్మి నివేదికను పరిశీలించి చర్యలకు నిర్ణయం తీసుకున్నారు. గతంలో గ్రామీణ గుంటూరు మండలంలో పనిచేసిన ఏపీఎం, సీసీ, వీవోఏలు ఐదుగురిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నారు.

☛ పూర్వం ఏపీఎంగా పనిచేసిన జొన్నకూటి సమాధానం ప్రస్తుతం పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ఏపీఎంగా పని చేస్తుండడంతో ఆమెపై చర్యలకు పల్నాడు డీఆర్‌డీఏ పీడీకి సిఫార్సు చేయనున్నారు. ☛ దాసుపాలెం సీసీగా పనిచేసిన పిట్ల ఏడుకొండలరెడ్డి, వెంగళాయపాలెం వీవోఏ నల్లపాటి చినవీరమ్మ, దాసుపాలెం వీవోఏ దాసరి సుజాత, తోకవారిపాలెం వీవోఏ దొడ్డా దివ్యవాణిలపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశించారు. చినవీరమ్మ అనారోగ్యంతో మరణించడంతో ఆమె పేరు పక్కన పెట్టనున్నారు. ఏడుకొండలరెడ్డి ప్రస్తుతం పెదకాకాని మండలంలో పని చేస్తున్నారు. ☛ గ్రామీణ గుంటూరు మండలం సీసీగా పనిచేసిన పిడతల గురుశంకర్‌ని గతంలోనే సస్పెండ్ చేశారు.

పూర్తిస్థాయిలో పరిశీలించాకే..

జిల్లా కేంద్ర సహకార బ్యాంకుతో పాటు జిల్లా సహకార శాఖ అధికారి నుంచి డీఆర్‌డీఏ- వెలుగుకు సంబంధించి ఆరుగురిపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేయడంతో పూర్తి స్థాయి పరిశీలన చేసిన తర్వాత వారిపై చర్యలు తీసుకుంటాం. ఏపీఎం సమాధానం పల్నాడు జిల్లాలో పని చేస్తున్నందున అక్కడి పీడీకి లేఖ ప్రతిని పంపనున్నాం. మిగిలిన వారిపై చర్యలు తీసుకుంటాం.

- టి.వి.విజయలక్ష్మి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్

తక్కువ ధరకు బంగారం పేరుతో రూ.1.20 కోట్లకు టోకరా

ఎంపీటీసీ సభ్యురాలు గుల్జార్, పక్కన ఆమె తల్లి బాబీ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానంటూ నంబూరుకు చెందిన మాధురి రూ.1.20 కోట్లకు టోకరా వేసిందని ఆరోపిస్తూ పెదకాకాని ఎంపీటీసీ ఎస్కే గుల్జార్ మరికొంతమంది సోమవారం పోలీసు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు విచారించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం గుల్జార్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. పెదకాకానికి చెందిన ఓ మహిళ ద్వారా పరిచయమైన మాధురి తాను ఓ బ్యాంకులో పని చేస్తున్నట్టు చెప్పిందన్నారు. బ్యాంకులో తాకట్టులో ఉన్న బంగారాన్ని యజమానులు విడిపించుకోకపోతే వేలం వేస్తుంటారని, అది చాలా తక్కువ ధరకు ఇప్పిస్తానని నమ్మించిందన్నారు. మొదట రూ.6 లక్షల విలువైన బంగారాన్ని రూ.3 లక్షలకు ఇప్పించిందని, ఇంకా చాలా ఉందని, మీ బంధువులెవరైనా ఉంటే వారికీ తక్కువకే ఇప్పించుకోవచ్చని చెప్పిందన్నారు. ఆమె మాటలు నమ్మి.. ఇంట్లో దాచుకున్న బంగారాన్ని అమ్మి రూ.20 లక్షలు, ఇంటిని తనఖా పెట్టి మరో రూ.20 లక్షలు ఇచ్చానని తెలిపారు. తన తల్లి, బంధువులు, స్నేహితుల నుంచి రూ.80 లక్షలు వసూలు చేసి ఇచ్చానని చెప్పారు. గత ఫిబ్రవరి నుంచి మొత్తం రూ.1.20 కోట్లు తీసుకుని మాధురి మొహం చాటేసిందన్నారు. నంబూరు నుంచి ఇబ్రహీంపట్నానికి మకాం మార్చేసి.. అక్కడ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనుగోలు చేసిందన్నారు. డబ్బులు తిరిగివ్వమంటే బెదిరిస్తోందని చెప్పారు.

ఎన్‌జీవో టవర్ల నిర్మాణంలో 10 లక్షల సురక్షిత పని గంటలు

టవర్ల వద్ద భవన నిర్మాణ కార్మికులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిలో నిర్మిస్తున్న హౌసింగ్ అండ్ బిల్డింగ్ ప్రాజెక్టుల్లో భాగంగా ఎన్‌జీవో టవర్స్ నిర్మాణ పనులను ఎల్ అండ్ టీ నిర్మాణ సంస్థ చేపట్టింది. ఈ నెల 18 వరకు జరిగిన నిర్మాణ పనుల్లో 'లాస్ట్ టైమ్ ఇంజ్యూరీ' (ఎల్‌టీఐ) లేకుండా 10 లక్షల సురక్షిత పని గంటలు పూర్తి చేసుకోవడం జరిగిందని సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉద్యోగులు, ఇతర భాగస్వాములకు సీఆర్డీఏ అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా ఎన్‌జీవో టవర్స్ వద్ద సీఆర్డీఏ అధికారులు, గుత్తేదారు సంస్థ ప్రతినిధులు కార్మికులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఆర్డీఏ ఈఎస్ఎం విభాగం డైరెక్టర్ నితిన్ శర్మ మాట్లాడుతూ.. అమరావతి నిర్మాణ ప్రాజెక్టుల్లో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ముందస్తు ప్రణాళిక, తగిన జాగ్రత్తలతో కలసి పని చేస్తే నిర్మాణ ప్రదేశంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని వివరించారు. కార్యక్రమంలో సీఆర్డీఏ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బి.అనితావాణి, హార్టికల్చర్ డైరెక్టర్ ఎం.హరిప్రసాద్, సీనియర్ ఓహెచ్ఎస్ స్పెషలిస్ట్ జి.గోపికృష్ణ, ఎల్ అండ్ టీ ప్రాజెక్ట్ మేనేజర్ వి.మణికందన్, పీజీఎంసీ, పీఎంసీ, సీఆర్డీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)

వచ్చిన బస్తాలు:	37,422
అమ్మకాలు:	35,077
నిల్వలు:	8,679

నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ..ల్లో)

334	10,000-18,200
నంబర్ 5	11,500-16,000
341	10,000-17,200
సూపర్ 10	11,500-16,000

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10,000-15,500
బాడిగ	11,000-18,000
దేవనూరు డీలక్స్	11,000-17,000
ఆర్మూర్	10,500-14,000

ఏసీ కామన్ వెరైటీ

334	10,000-17,800
నంబర్ 5	11,500-16,500
341	11,500-18,000
4884	11,000-14,500

ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	11,000-15,600
బాడిగ	11,000-18,200
దేవనూరు డీలక్స్	10,500-17,200
తాలు	5,300-8,500

- న్యూస్‌టుడే, మిర్చియార్డు

పర్యావరణహిత నగరాల అభివృద్ధిపై శిక్షణ

ప్రారంభ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధ్యాపకులు

గ్రామీణ గుంటూరు, న్యూస్‌టుడే: పర్యావరణహిత నగరాల రూపకల్పనకు అవసరమైన నిపుణుల అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో అటల్-ఏసీఐటీ సహకారంతో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. 29వ తేదీ వరకు 'ఇంటిగ్రేషన్ ఆఫ్ గ్రీన్ ఎనర్జీ, అండ్ ఏఐ యుటిలిటీ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్స్ సిస్టమ్స్ ఫర్ షేపింగ్ సస్టెన్‌బుల్ స్మార్ట్ సిటీ ఎకో సిస్టమ్స్' అనే అంశంపై ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. స్మార్ట్ సిటీల రూపకల్పనకు అవసరమైన పరిశోధనలు విద్యార్థులు చేసేలా ప్రోత్సహించేందుకు అధ్యాపకులకు కావాల్సిన నైపుణ్యాలు కార్యక్రమం ద్వారా సమకూరుతాయన్నారు. 137 కళాశాలలకు చెందిన 283 మంది అధ్యాపకులు తరగతులకు హాజరయ్యారు. ప్రిన్సిపల్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్ రవీంద్ర, కన్వీనర్ రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

అనుచిత తీరు.. ఎంపీడీవోకు మెమో

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: 'నేను గ్రూప్ అధికారిని. నీ కేడర్ ఏమిటి? నన్ను ఫోన్‌లో వివరాలు అడుగుతావా..?' అని డెల్టా ప్రాంతంలోని ఓ ఎంపీడీవో.. జిల్లాపరిషత్తు కార్యాలయ ఉద్యోగినిపై చిందులు తొక్కారు. పీజీఆర్ఎస్‌తో పాటు కలెక్టర్‌కు అందిన అర్జీలకు సంబంధించి జిల్లా పరిషత్తుకు చెందిన అధికారి సూచన మేరకు సదరు ఎంపీడీవోకు ఉద్యోగి ఫోన్ చేసి సమాచారం అడిగేందుకు ప్రయత్నించగా.. ఎంపీడీవో ఈవిధంగా శివాలెత్తారు. కొన్ని రోజుల తర్వాత జడ్పీకి వచ్చి సెక్షన్‌కు వెళ్లి ఉద్యోగినిపై పరుషంగా మాట్లాడడంతో హతాశురాలైన ఆమె అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దాంతో ఉన్నతాధికారి ద్వితీయ శ్రేణి అధికారిని విచారణకు ఆదేశించడంతో ఎంపీడీవోకు మెమో ఇచ్చారు. ఇది జడ్పీలో చర్చనీయాంశంగా మారింది.

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 108, రిటైల్ ధర - 135, చికెన్ విత్‌స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్ - 223.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 117, 124, 136 చికెన్ విత్ స్కిన్ - 222 చికెన్ స్కిన్‌లెస్ - 232.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

కెనరా బ్యాంక్ Canara Bank
గుంటూరు మెయిన్ బ్రాంచ్ (0605)
అమ్మకం ప్రకటన (స్థిరాస్తుల అమ్మకం కొరకు)

స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

ఇ-వేలం తేది & సమయం: 17.12.2025, మ॥ 12.00 గం.ల నుండి మ॥ 02.00 గం. వరకు

రిజర్వు ధర: రూ. 77,00,000/- ధరావత్తు సొమ్ము: రూ. 7,70,000/-

రిజర్వు ధర: రూ. 1,55,00,000/- ధరావత్తు సొమ్ము: రూ. 15,50,000/-

రిజర్వు ధర: రూ. 3,58,00,000/- ధరావత్తు సొమ్ము: రూ. 35,80,000/-

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి. ఫోన్: 83310 15700.

వెబ్‌పోర్టల్ https://baanknet.com/

తేదీ: 24.11.2025, ప్రదేశం: గుంటూరు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank
ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మీ అపార్ట్‌మెంట్స్, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ ఏపీ-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

ఇ-వేలం తేది & సమయం: 15.12.2025, మ॥ 02.00 గం.ల నుండి సా॥ 04.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేలోపు ప్రతి 5 నిమిషాలు వృద్ధిలో అపరిమిత పొడిగింపుతో)

ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 15.12.2025, మ॥ 12.00 గం॥ల లోపు

రిజర్వు ధర (రూ.లో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
రూ. 1253.00 లక్షలు	రూ. 125.30 లక్షలు

ఆస్తి తనిఖీ తేదీ & సమయం: 03.12.2025, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు.

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి. ఫోన్: 8331011695

వెబ్‌పోర్టల్ https://baanknet.com/eauction-psb
ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేదీ: 21.11.2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ దర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికదరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

MARRIAGE SERVICES

వనజారావు క్విక్ మ్యారేజెస్ నందు అన్ని కులముల వారికి సంబంధములు కుదర్చబడును. లక్ష్మీపురం, గుంటూరు. సంప్ర॥ 98666 33988.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూపు, GNT. వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/వంట, బేబికేర్‌కు పర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 9154085588, 9154935588.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

ఫ్లాష్! ఫ్లాష్! చిలకలూరిపేట హైవే ఫేసింగ్ CRDA అప్రూవల్ వెంచర్. బ్యాంకు లోన్ సౌకర్యం. గజం 7500/- మాత్రమే. Phone: 9133574455.

JOBS

URGENT Req office Manager to Manage and Coordinate field Incharges & Employees, Manage inventory (Drones), deal with customers & formers. Age: 30+, Q: Any Degree/ MBA. Exp any field. Adelix pvt ltd, GNT. 93811 75886.

భారతదేశ అగ్రగామి సంస్థలో పార్ట్/ఫుల్ టైం బిజినెస్ పార్టనర్‌గా చేరండి అధిక కమిషన్ పొందండి. అ॥ 10th, వ: 30-65 సం॥. 79892 46788.

PARUL University, GNT ఆఫీసులో పనిచేయుటకు టెలికాలర్స్ & టెక్నీషియన్ కావలెను. జీ॥ 10-20K ✆ 83743 25002 & 88858 79076.

చైతన్య సాయి పేపర్‌మిల్స్, యడవల్లి నందు పనిచేయుటకు 1) సీనియర్ అకౌంటెంట్ 2) మెయింటెన్స్ సూపర్‌వైజర్స్ (మేనేజర్) 3) లోడింగ్ సూపర్‌వైజర్స్ (10th క్లాస్) 4) Eicher డ్రైవర్స్ (10th క్లాస్) 5) అటెండర్స్ (గుంటూరు ఆఫీస్). 9059514555.

మంగళగిరిలో క్రొత్తగా (ప్రారంభం కాబోతున్న) భారత్ పెట్రోలియం బంకులో పనిచేయుటకు పంపు బాయిస్ & గర్ల్స్ మరియు మేనేజరు కావలెను. Ph 9849582369.

గుంటూరులోని ఆస్పత్రి కోసం ఎంట్రీ కన్సల్టెన్సీకు 30 B.Sc/ GNM నర్సింగ్ సిబ్బంది అవసరం. ఆసక్తి ఉన్నవారు. ✆ 83673 77590కు కాల్ చేయండి.

గుంటూరు, ఆటోనగర్‌లో HP పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మేనేజర్, పంపు బాయ్స్/గర్ల్స్ కావలెను. పార్ట్‌టైమ్/ ఫుల్ టైమ్. 77996 89889, 80745 46302.

బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, 3సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30సం॥ల లోపువారు రెజ్యూములను kamatham.job@gmail.com కు పంపగలరు.

FACULTY/ TEACHERS

Faculty: Bio Chemistry - B.Sc., MSc & Nursing: B.Sc., M.Sc. & Employ: Inter, Degree, Computer. Age: 19-25, Con: Victoria Paramedical Institute, Gnt. ✆: 0863-2222683, 98481 34028, 8332004478.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

తెనాలి

•తెనాలి •పొన్నూరు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

పొన్నూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధిలోని రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకోవాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. మండల పరిధిలోని చింతలపూడిలో ధాన్యం కొనుగోలును సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుని మద్దతు ధర పొందాలని సూచించారు. అంతకుముందు నిడుబ్రోలులో ఏడీఏ రామకోటేశ్వరి, ఏవో రాజవరపు వెంకటేశ్వరరావుతో కలిసి ‘రైతన్న మీకోసం’ అనే కరపత్రాలను విడుదల చేశారు.

అంతర్జాలం నేటి తరానికి అద్భుతమైన వనరు

పోటీలో పాల్గొన్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందించిన వీరనారాయణరావు, ఉపాధ్యాయులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: అంతర్జాల అనుసంధాన చరవాణి నేటి తరానికి అందివచ్చిన అద్భుతమైన విద్యా వనరు అని, సద్వినియోగం చేసుకుంటే ఉన్నత లక్ష్యాలను సాకారం చేసుకునే నైపుణ్యాలను చేరువ చేస్తూ బంగారు భవితను అందిస్తుందని.. దుర్వినియోగం చేసుకుంటే జీవితాన్ని చీకటి మయం చేస్తుందని వివేకా విద్యా సంస్థల అధినేత డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు పేర్కొన్నారు. ‘ఈనాడు’ ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా పట్టణ నాజరుపేటలోని పాఠశాలలో సోమవారం ‘విద్యార్థుల జీవితాలపై చరవాణుల ప్రభావం’ అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీలను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. విద్యార్థులు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. డి.గగనశ్రీ (9వ తరగతి), కె.పూజాశ్రావ్యశ్రీ (10వ తరగతి), షేక్.హఫ్స జువేరియా తస్వీర్ (9వ తరగతి) వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలవగా.. వారిని అభినందించి బహుమతులు, ధ్రువపత్రాలు అందించారు. రామరాజు, శ్రావణి, శివనాగేశ్వరరావు, నాగేశ్వరరావు, గణేష్, మురళి, రాంబాబు పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి ముత్తంశెట్టివారిపాలెం కల్యాణ మండపం రోడ్డులోని కాలువల్లో మురుగు పారుదల లేదు. దోమలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. **- నరసింహారావు, ముత్తంశెట్టివారిపాలెం**
✔ పూడికలు తొలగించి సమస్యను పరిష్కరిస్తాం.

? తెనాలి పట్టణ జయప్రకాష్‌నగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. **- మోహనరావు, జయప్రకాష్‌నగర్** ✔ మరమ్మతులు చేయిస్తాం. **- రామఅప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్.**
– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

? పొన్నూరు పరిధిలోని శాంతినగర్‌లో వీధి దీపం వెలగడం లేదు. బాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.
- అబ్దుల్ మౌలాలి, శాంతినగర్ ✔ బాగు చేయించే విధంగా చర్యలు తీసుకుంటాం. - షేక్ హసీనా, సహాయ ఇంజినీరు

? పొన్నూరు పట్టణ పరిధి 14వ వార్డులో చెత్త పేరుకుంది.
- ఎ.డేవిడ్, 14వ వార్డు ✔ చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి**

స్పందనకు వందనం

★ తెనాలి కొత్తపేటలో రోడ్డు వెంబడి వ్యర్థాల గుట్టలు పడి ఉన్నాయని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. కార్మికులతో వాటికి తీయించారు.
★ తెనాలి నాలుగు వరుసల రోడ్డులోని మార్కెట్ ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి.. మరమ్మతులు చేయించారు.
– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

★ పట్టణ పరిధి 28వ వార్డు ప్రధాన రహదారిలోని మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకున్నాయని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. కార్మికులతో వాటిని తొలగింపజేశారు. ★ 15వ వార్డులో రహదారిపై ఏర్పడిన గొయ్యికి మరమ్మతులు చేశారు. **– న్యూస్‌టుడే, పొన్నూరు**

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు

రైతులతో మాట్లాడుతున్న సతీష్‌బాబు

పొన్నూరు, న్యూస్‌టుడే: విత్తన శుద్ధి చేసి సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని లాంఫామ్ శాస్త్రవేత్త జె.సతీష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం నిడుబ్రోలులో ‘రైతన్నా.. మీ కోసం’ కార్యక్రమంలో భాగంగా రైతులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. రబీలో సాగు చేసిన పైరులో కలుపును నివారించుకోవాలని సూచించారు. మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వాడొద్దని చెప్పారు. ఏవో వెంకటేశ్వరరావు, ఏఈవో శ్రీకాంత్ పాల్గొన్నారు.

అభ్యర్థులకు అభినందన

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలి గంగానమ్మపేటలోని శిక్షణ కేంద్రంలో శిక్షణ తీసుకొని రైల్వేలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను వైకాపా తెనాలి, వేమూరు నియోజకవర్గాల సమన్వయకర్తలు అన్నాబత్తుని శివకుమార్, వరికూటి అశోక్‌బాబు, నాయకుడు కె.వెంకటరెడ్డి అభినందించారు.

భళా.. చిత్ర కళా

న్యూస్‌టుడే, తెనాలి టౌన్

ఆ ఆవిష్కరణలు చూస్తే వావ్ అనాల్సిందే.. వాటిని చూసిన వారు నిష్ణాతులైన గురువుల వద్ద సాధన చేసి రూపొందించి ఉంటారులే అనుకుంటారు. కానీ వారు అలా చేయలేదు. అంతర్జాలన్నే గురువుగా మలచుకున్నారు. చక్కటి చిత్రాలతో అందరి ప్రశంసలు పొందుతున్నారు ఈ విద్యార్థినులు.

ఇంటి లోపలి గోడపై మ్యూరల్ ఆర్ట్‌తో మురిపించి..

చిత్ర సృజనం.. ప్రతిభ ఘనం..

తెనాలి వివేక జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న **ప్రగడ వెంకటలక్ష్మీ సరస్వతీదేవి** సామాజిక మాధ్యమాలను సద్వినియోగం చేసుకుంటూ చిత్ర కళను సొంతం చేసుకుంది. తల్లి వాత్సల్య ప్రోత్సాహంతో సాధన చేస్తూ చక్కటి చిత్రాలు గీస్తూ అందరి మన్ననలు పొందుతుంది. జీవ కళ ఉట్టిపడేలా చిత్రాలను గీస్తూ పాఠశాల, కళాశాల స్థాయిల్లో నిర్వహించిన పోటీల్లో బహుమతులు అందుకుంది. చిత్రకళలో మరింత నైపుణ్యాన్ని సాధించడం, సివిల్ ఇంజినీర్ పట్టా అందుకుని ఆర్కిటెక్ట్‌గా రాణించడమే లక్ష్యమని చెబుతుంది.

కళా మెరుపు ‘అమృత వర్షిణి’

తెనాలికి చెందిన లోకనాథ శాస్త్రి, ప్రవీణ దంపతుల కుమార్తె అమృతవర్షిణి. శ్రీవివేకానంద కేంద్రీయ విద్యాలయంలో 12వ తరగతి చదువుతోంది. తల్లి నుంచి చిత్ర కళకు పునాది పడగా అటుపై అంతర్జాల శోధనతో.. నిరంతర సాధనతో చక్కటి చిత్రాలను గీసే నైపుణ్యాన్ని సొంతం చేసుకుంది. మరింత లోతుగా అధ్యయనం చేస్తూ మ్యూరల్ ఆర్ట్స్, రెజిన్ ఆర్ట్‌లనూ సాధన చేసి వాటిల్లోనూ ప్రతిభను కనబరుస్తోంది. 3డీ సహిత మ్యూరల్ ఆర్ట్‌తో ఇంటి గోడలను అలంకరించింది. రెజిన్ మిశ్రమంతోనూ అనేక వస్తువులు తయారు చేసింది. పాఠశాల, కళాశాల స్థాయిల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో బహుమతులు అందుకుంది. ఫ్యాషన్ డిజైనింగ్ రంగంలో రాణించాలనేది తన లక్ష్యమని చెబుతుంది.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

మాట్లాడుతున్న సౌమ్యారెడ్డి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్య పోరాట కాలం నుంచి ప్రజల పట్ల అంకితభావంతో.. ప్రజాస్వామ్య విధానంలో ప్రజలతో మమేకమై పనిచేస్తుందని ఏఐసీసీ పరిశీలకురాలు సౌమ్యారెడ్డి అన్నారు. ఆమె సోమవారం పట్టణ పరిధి మారీసుపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. జాతిపిత మహాత్మాగాంధీ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తదితరులు పార్టీ బలోపేతానికి విశేష కృషి చేసినట్లు పేర్కొన్నారు. పార్టీ, అనుబంధ విభాగాల నాయకులు పార్టీ బలోపేతానికి నిజాయతీగా తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు టి.వెంకటేశ్వరరావు, అయ్యప్ప, డీసీసీ అధ్యక్షుడు సీహెచ్ విజయ్‌కుమార్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులను రారాజులుగా చేసేందుకే ‘రైతన్నా మీకోసం’

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీపీఎం రాజకుమారి, ఏడీఏ రామకోటేశ్వరి, రైతులు

వేజండ్ల(చేబ్రోలు), న్యూస్‌టుడే: రానున్న ఐదు సంవత్సరాల్లో రైతులను రారాజులుగా చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఐదు సూత్రాలను ప్రవేశ పెట్టారని సేంద్రియ వ్యవసాయ శాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి అన్నారు. మండలంలోని వేజండ్లలో సోమవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి, స్థానిక తెదేపా నాయకులు, సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులు పాల్గొన్నారు.

కొల్లిపర: వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పంచ సూత్రాలను తీసుకు వచ్చిందని మండల వ్యవసాయ అధికారి ఎన్.శ్రీనివాసరెడ్డి అన్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం కొల్లిపర శివారు గుదిబండివారిపాలెంలో పర్యటించారు. ఏఈవోలు సోని, అనూరాధ, రైతులు కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక

కొల్లిపర, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా నున్నలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ (స్కేటింగ్ విభాగం)లో తూములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నాగదుర్గాసాహితి, వి.వర్షిణి, ఎ.సాయిగణేష్ ప్రతిభ కనబరిచినట్లు పీడీ సాంబశివరావు తెలిపారు. రాష్ట్రస్థాయిలో గెలుపొంది జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు స్థానాన్ని దక్కించుకున్నారని చెప్పారు. ఉపాధ్యాయులు, గ్రామస్థులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ. (క్వింటా)

అత్యధికం: 1400
అత్యల్పం: 1000
సగటు: 1200

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

‘గత వైకాపా పాలకులు ప్రజల సొమ్ము దోచుకున్నారు’

శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు, న్యూస్‌టుడే: గత వైకాపా పాలకులు ప్రజల సొమ్మును అడ్డగోలుగా దోచుకున్నారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ విమర్శించారు. పట్టణ శివారు నిడుబ్రోలులో రక్షిత మంచినీటి పథకం వద్ద రూ.58 లక్షలు, 15వ వార్డులో సిమెంటు మురుగు కాలువకు రూ.26 లక్షలు, 8వ వార్డులో రూ.10 లక్షలతో నిర్మించిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత వైకాపా పాలనలో రక్షిత మంచినీటి పథకం వద్ద నీటి శుద్ధి పరికరాలు పాడైపోయిన పట్టించుకోలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతా రూ.59 లక్షలు ఖర్చు చేసి వాటిని అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. నిడుబ్రోలులో ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీరు అందించేందుకు రూ.1.65 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి అందజేసినట్లు పేర్కొన్నారు. రోజు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నీటి నమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వడ్రాణం మార్కండేయబాబు, కమిషనర్ ఎం.రమేషబాబు, డీఈ పి.వెంకయ్య, నిడుబ్రోలు తెదేపా అధ్యక్షుడు సుధీర్‌బాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణపై సమావేశం నేడు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: మదర్ ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, మెప్మా సంయుక్తంగా మంగళవారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నియోజకవర్గంలోని మహిళలకు ఉచిత కుట్టు శిక్షణపై సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జె.రామఅప్పలనాయుడు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్, మదర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు బొజ్జా సంధ్యారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా శతాబ్ది వేడుకలు

తెనాలి టౌన్: ఐతానగర్‌లోని సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి శతాబ్ది వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రార్థనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంచ సూత్రాలు పాటిస్తే ప్రయోజనం

పెదకాకాని, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు తీసుకొచ్చిన పంచ సూత్రాలతో రైతులకు మేలు జరుగుతుందని ఏడీఏ ఎం.మోహనరావు తెలిపారు. పెదకాకానిలో సోమవారం నిర్వహించిన ‘రైతన్నా మీకోసం’ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రిన్సిపల్ శాస్త్రవేత్త పి.వెంకట్రావు, ఉపసర్పంచి వలివేటి మురళీకృష్ణ, నీటి సంఘాల అధ్యక్షుడు పెండ్యాల శ్రీకాంత్‌తో కలిసి గ్రామంలోని రైతుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు వంటి పంచ సూత్రాలు పాటిస్తే కచ్చితంగా అన్నదాతలకు అన్నిరకాల ప్రయోజనం ఉంటుందని ఏడీఏ చెప్పారు. రైతు సేవా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బసవ మందిర స్థలం లీజుకు ఇవ్వొద్దని వినతి

సబ్ కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న జంగం సంక్షేమ సంఘ ప్రతినిధులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 10 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో సబ్ కలెక్టర్ సంజనా సింహ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారాలకు హామీ ఇచ్చారు. తెనాలి నందులపేటలోని బసవ మందిరానికి చెందిన విలువైన స్థలాన్ని దీర్ఘకాలిక లీజుకు ఇస్తున్నారని తెలిసిందని.. అదే జరిగితే ప్రధాన ధార్మిక సంస్థకు నష్టం జరుగుతుందని.. ఆ లీజును వెంటనే నిలిపివేయాలని ఆ సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందించారు.

ఇద్దరు కండక్టర్లపై చర్యలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మహిళల ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించే స్త్రీ శక్తి పథక టిక్కెట్లను పురుషులకు ఇచ్చినట్లు తెనాలి ఆర్టీసీ డిపో పరిధిలోని ఇద్దరు కండక్టర్లపై అభియోగాలు నమోదయ్యాయి. కొద్ది రోజుల కిందట జరిగిన తనిఖీల్లో ఈ విషయం బయటపడింది. దీంతో తొలుత ఇద్దరిని సస్పెండ్ చేశారు. విచారణ అనంతరం ఒక కండక్టర్‌ను జిల్లాలోని మరో డిపోకు బదిలీ చేయగా మరొకరిపై విచారణ కొనసాగుతుంది.

మొరాయించిన వాహనాలు.. వినియోగంలోకి తెస్తే మేలు

మున్సిపాలిటీలోని 1, 2 రెండు పారిశుద్ధ్య డివిజన్లలో చెత్త తరలించేందుకు కేటాయించిన కాంపాక్టర్లు, ట్రాక్టర్లు మొరాయించి రెండు నెలలు దాటింది. దీంతో ఆయా డివిజన్లలో రోజు వారీ చెత్త తరలింపులో జాప్యం జరుగుతుండటంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వీటి మరమ్మతుల్లో జరుగుతున్న నిర్లక్ష్యమే దీనికి కారణంగా చెప్పవచ్చు. వీటిపై కమిషనర్ రామ అప్పలనాయుడు నిర్వహించిన సమీక్ష సమావేశాలు మొక్కుబడిగా మారాయి. వాటిని వినియోగంలోకి తెచ్చి చెత్త తరలింపు పనులు సజావుగా జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, తెనాలి కొత్తపేట

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి

అవగాహన కల్పిస్తున్న వైద్యులు సుచరిత

పొన్నూరు, న్యూస్‌టుడే: సీపీఆర్‌పై ప్రతి విద్యార్థికి ప్రాథమిక అవగాహన ఉండాలని మన్నవ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సుచరిత పేర్కొన్నారు. సోమవారం వెల్లలూరులో ఎన్ఎస్ఎస్ సేవ కార్యక్రమాల్లో పాల్గొన్న చేబ్రోలు డిగ్రీ కళాశాల విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. సీపీఆర్ చేయడం ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ వి.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

4న తెనాలిలో రాష్ట్ర స్థాయి షార్ట్ ఫిల్మ్ వేడుక

తెనాలి(కొత్తపేట): ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించేందుకు వచ్చే సంవత్సరం జనవరి 4న తెనాలిలో రాష్ట్ర స్థాయి షార్ట్ ఫిల్మ్ వేడుక నిర్వహించనున్నట్లు మా ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా పేర్కొన్నారు. ఆయన సోమవారం తెనాలిలో మాట్లాడారు. ఈ సందర్భంగా పోటీల గోడ పత్రికను విడుదల చేశారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రవీణ్ (పాత చిత్రం)

కొల్లిపర, న్యూస్‌టుడే: గుండెపోటుతో ప్రవీణ్ (36) మృతి చెందిన ఘటన కొల్లిపర మండలం తూములూరులో సోమవారం చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి పెళ్లి వేడుకలో డీజే పాటలకు తన స్నేహితులతో కలిసి సరదాగా డ్యాన్సులేసిన ప్రవీణ్ తెల్లవారుజామున గుండెపోటుతో ఆకస్మికంగా కుప్పకూలిపోయినట్లు అతని సోదరుడు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే శివకుమార్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

ప్రకటన

నా క్లయింటు మొహమ్మద్ బురహానుద్దీన్, తండ్రి (లేటు) అబ్దుల్ కరీం, డో.నెం. 15-110, నంబూరు గ్రామం, పెదకాకాని మండలం, గుంటూరు జిల్లా వారి సంజాయిషీ పొందితెలియజేయునది ఏమనగా ది.22-11-2025న తిరుపతి - విజయవాడ ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ నుండి రాజమండ్రి ప్రయాణం చేయుచున్నంతలో, ఏలూరు రైల్వేస్టేషన్ చేరుకొనే సమీపంలో నా క్లయింటు తాలూకు నంబూరు గ్రామం, పెదకాకాని మండలం, గుంటూరు జిల్లా సర్వే నెం.191/బి లో సబ్ రిజిస్ట్రారు ఆఫీసు, మంగళగిరిలో లోగడ రిజిస్ట్రేషన్స్ అయిన ఒరిజినల్ డాక్యుమెంట్లు 668, 669, 670 తేది. 24-04-1974, లింక్ డాక్యుమెంట్లు 1918 తేది 22-08-1966 మరియు 1801 తేది. 07-08-1965ను ఉంచిన ప్లాస్టిక్ సంచి పోయినది. ఎవరికి అయినా దొరికిన యెడల తెలియజేసినచో తగిన పారితోషికం ఇప్పించబడును.

ఇట్లు: జె.వి.ఆర్.ఎల్.నరసింహం
అడ్వకేట్
సెల్: 96760 45519, 95199 45937

జిల్లాలో మరికొన్ని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు

నారాకోడూరు(చేబ్రోలు), న్యూస్‌టుడే: విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తయారు చేసేందుకు పీఎంశ్రీ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు చక్కగా ఉపయోగపడతాయని రాష్ట్ర నోడల్ అధికారి మాధవీ లత అన్నారు. నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ పాఠశాల నుంచి వచ్చిన ప్రధానోపాధ్యాయులు, సైన్సు ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. వచ్చే విద్యా సంవత్సరం జిల్లాలోని మరికొన్ని పాఠశాలల్లో ఈ ప్రయోగశాలలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. జిల్లా సైన్సు అధికారి గౌసుల్ మీరా, ఎంఈవో సుబ్బారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏడు కొండలు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి గ్రామీణ సీఐగా నాయబ్ రసూల్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి గ్రామీణ సీఐగా షేక్ నాయబ్ రసూల్ సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భగా ఎస్సైలు, సిబ్బంది ఆయన్ను అభినందించారు. సత్తెనపల్లి, పొన్నూరు రూరల్, ఒంగోలు, ఇంకొల్లు, టంగుటూరు తదితర ప్రాంతాల్లో ఆయన ఎస్సైగా విధులు నిర్వహించారు. అందరి సమన్వయం, సహకారంతో మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు. కాగా ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన ఉమేష్ రేంజ్ వీఆర్‌కు బదిలీ అయ్యారు.

దివ్య దీపిక ఆవిష్కరణ

శ్రీఅరవిందుల సిద్ధి దినోత్సవం, గుళ్లపల్లి సత్యనారాయణ సంస్మరణ సభ తెనాలి అరవింద విద్యాకేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్య దీపిక ఆధ్యాత్మిక పత్రికను ఆవిష్కరించారు. వెంకట్రావు, రఘురామ్, కస్తూరి, శ్రీనివాస్, ఆంజనేయులు, సంపూర్ణ, నిర్మలాకుమారి, దుర్గా రఘురామ్, శేఖర్‌ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **-న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

ట్రాక్టరు పైనుంచి పడి వ్యక్తి మృతి

చేబ్రోలు, న్యూస్‌టుడే: ట్రాక్టరు ట్రక్కు నుంచి కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన నారాకోడూరు బుడంపాడు గ్రామాల మధ్యలో చోటుచేసుకుంది. ఎస్సై వీర నారాయణ కథనం మేరకు.. మండల పరిధి మంచాలకు చెందిన వల్లభదాసు మోహనరావు కూలీ పనులకు వెళ్తుంటారు. సోమవారం గుంటూరు రూరల్ మండలం బుడంపాడులో ధాన్యం బస్తాలను ట్రాక్టరులో లోడు చేసుకుని మంచాలకు తిరిగి వస్తుండగా నారాకోడూరు శివారులో ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని దుర్మరణం

తెనాలి టౌన్: తెనాలి మండలం కొలకలూరు రైల్వే స్టేషన్‌లో సోమవారం పట్టాలు దాటుతున్న దుగ్గిరాలకు చెందిన సుధీర్‌బాబు (42)ను రైలు ఢీకొట్టింది. ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందారని రైల్వే పోలీసులు తెలిపారు.

తాకట్టు వ్యాపారి.. పోలీసుల మధ్య వాగ్వాదం

తెనాలి టౌన్: వేమూరు పోలీసులు సోమవారం రాత్రి తెనాలి పట్టణ గంగానమ్మపేటలోని తాకట్టు వ్యాపారి వద్దకు వచ్చారు. ఓ కేసు విషయమై రికవరీ ప్రక్రియలో భాగంగా విచారణ చేస్తున్న క్రమంలో కెమెరాల రికార్డింగ్‌తో కూడిన డీవీఆర్ ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో వ్యాపారి.. పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు వ్యాపారిని జీపు ఎక్కించిన క్రమంలో దుకాణంలోని మహిళలు అడ్డుకోవడంతో వారిలో ఓ మహిళను కూడా జీపు ఎక్కించినట్లు స్థానిక వ్యాపారులు తెలిపారు. రాత్రి 11 గంటల సమయంలో పెద్ద సంఖ్యలో వ్యాపారులు, జైనులు తెనాలి రెండో పట్టణ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

పునీతశౌరి తిరునాళ్ల జెండా ప్రతిష్ఠ

ముట్లూరు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: ముట్లూరు గ్రామంలో పునీతశౌరివారి దేవాలయం ముందు డిసెంబర్ 3వ తేదీ వరకు జరిగే తిరునాళ్ల జెండా ప్రతిష్ఠ సోమవారం రాత్రి నిర్వహించారు. విచారణ గురువు మార్నేని దిలీప్ కుమార్, ఫాదర్ డి.కిరణ్‌లు వాక్యోపదేశం చేశారు. తిరునాళ్ల జరిగే 10 రోజుల్లో నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల వివరాలను వివరించారు. తొలుత జెండాను సెయింట్ గ్జేవియర్స్ ఉన్నత పాఠశాల నుంచి చర్చి వరకు ఊరేగించారు.

జెండా ప్రతిష్ఠిస్తున్న మత గురువులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: నీరుకొండ గ్రామ పరిధిలో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు పంచాయితీ కార్యదర్శి సత్యసాయి దృష్టికి 'మేమున్నాం..మీకుతోడుగా' ద్వారా తీసుకెళ్లారు. ఆయన స్పందించి అన్ని వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు.

స్పందనకు వందనం

తాడికొండ, న్యూస్‌టుడే: పొన్నెకల్లు గ్రామం బీసీ కాలనీలో డ్రెయిన్ పూడిపోయి మురుగు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి జానీ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించారు. జేసీబీతో మురుగు కాలువ తవ్వించి కాంక్రీట్ డ్రైనేజీని నిర్మించారు.

వ్యవసాయ శాఖ మంత్రి పర్యటన నేడు

మేడికొండూరు, న్యూస్‌టుడే: మేడికొండూరు మండలంలో మంగళవారం తెదేపా నేతలు పర్యటించనున్నారు. పేరేచర్ల శివార్లో భారత పత్తి సంస్థ(సీసీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ పరిశీలించనున్నారు. సీసీఐ అధికారులు, రైతులతో వారు నేరుగా మాట్లాడి కొనుగోళ్లపై ఆరా తీస్తారు. అనంతరం మేడికొండూరులో పత్తి పంటను పరిశీలిస్తారు. అక్కడ నుంచి పల్నాడు జిల్లా సత్తెనపల్లి వెళ్తారు.

26న రాజధానిలో రాజ్యాంగ వజ్రోత్సవం

గోడప్రతులను ఆవిష్కరిస్తున్న దళిత నాయకులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధానిలో అమరావతి దళిత ఐకాస, దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో ఈ నెల 26న రాజ్యాంగ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు తుళ్లూరులో ఐకాస నాయకులు కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. దళిత బహుజన ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న నేపథ్యంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ముఖ్య అతిథిగా, ప్రధాన వక్తగా కొరివి వినయకుమార్ పాల్గొంటారని చెప్పారు. సాయంత్రం 4 గంటలకు తుళ్లూరు బస్టాండ్ సెంటర్‌లోని హెచ్‌ఎస్‌ఆర్ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం ఉంటుందని వివరించారు. దళిత ఐకాస కన్వీనర్ చిలకా బసవయ్య మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం చీకటి జీవోలు, మూడు రాజధానులంటూ అమరావతిని నాశనం చేస్తుంటే రాజ్యాంగమే రక్షణగా నిలిచిందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తెదేపా మండల అధ్యక్షుడు ధనేకుల వెంకటసుబ్బారావు, దళిత నాయకులు పాల్గొన్నారు.

దుమ్ముతో నరకం చూస్తున్నా స్పందించరేం..?

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతి నిర్మాణ పనుల కోసం వస్తున్న లారీల కారణంగా విపరీతంగా దుమ్ము ధూళి పడుతుందని సోమవారం తుళ్లూరులో లారీలను అడ్డుకొని స్థానికులు నిరసన తెలిపారు. మితిమీరిన వేగంతో లారీలు, వాహనాలు నడుపుతున్నారు. దీంతో తీవ్రంగా దుమ్ము పడుతున్నా అమరావతి నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారులు నీళ్లు చల్లటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐ కె.శ్రీనివాసరావు వచ్చి మాట్లాడటంతో స్థానికులు నిరసన విరమించారు. దుమ్ముతో నిత్యం నరకం చూస్తున్నా స్పందించరు ఎందుకు అని పోలీసులతో స్థానికులు కొద్దిసేపు వాగ్వాదం చేశారు. సీఆర్డీఏ అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పారు.

గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసులు

కూలేదాకా చూస్తూనే ఉంటారేమో..!

బెంబేలెత్తిస్తున్న పాత భవనాలు

కురగల్లులో ప్రమాదకరంగా ఇలా.

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి మండలంలో పలు చోట్ల పంచాయతీ పాత భవనాలు బెంబేలెత్తిస్తున్నాయి. ఇది శిథిలావస్థకు చేరి ఏళ్లు గడుస్తున్నా వీటిని కూల్చడం లేదు. కురగల్లు పంచాయితీ కార్యాలయం ప్రధాన రహదారికి ఆనుకొని ఉండటం వల్ల వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. వందలాది మంది ఇటుగా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం చిన్న చిన్న రాళ్లు పెచ్చులూడి పడుతున్నాయని, ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనంపై పెద్ద పెద్ద వృక్షాలు పెరిగి గోడలను చీల్చేశాయని, పెద్ద గాలివీస్తే ముప్పు తప్పదని వారు చెబుతున్నారు. ఆ కొమ్మలు విద్యుత్తు తీగలకు తగిలి సరఫరా నిలిచిపోతోందని, డ్రెయినేజీ కూడా స్తంభించి మురుగునీరు ఇళ్ల ముందు తిష్ఠ వేస్తోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పాత భవనాన్ని నిర్మూలించాలని వారు కోరుతున్నారు. ★ పెదవడ్లపూడి గ్రామ సెంటర్ సమీపంలో ఉన్న పంచాయతీ భవనం కూడా కూలేందుకు సిద్ధంగా ఉంది. ప్రస్తుతం దీని ప్రాంగణంలో పారిశుద్ధ్య కార్మికులు ఉపకరణాలు ఉంచుతున్నారు. ఇక్కడి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయి.

చేనేత కార్మికులకు మజూరీ 12 శాతం పెంపు



ఒప్పంద పత్రం మార్చుకుంటున్న ప్రతినిధులు

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరిలో చేనేత కార్మికులకు 12 శాతం మజూరీ పెంచేందుకు మాస్టర్ వీవర్స్ అసోసియేషన్, చేనేత వస్త్ర ఉత్పత్తి విక్రయదారుల సంఘం అంగీకరించింది. ఈమేరకు పట్టణంలోని మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీతో జరిగిన చర్చల్లో మజూరీ పెంపు ఒప్పందం కుదిరింది. 40శాతం మజూరీలు పెంచాలని కార్మిక సంఘాల సమన్వయ కమిటీ కోరింది. అయితే సామరస్యంగా జరిగిన చర్చల్లో 12 శాతానికి అంగీకరించారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 2027 నవంబర్ 30 వరకు రెండేళ్ల పాటు ఇది అమల్లో ఉంటుందని అసోసియేషన్ అధ్యక్షుడు జొన్నాదుల వరప్రసాదరావు తెలిపారు. కార్యదర్శి రావెల శివసత్యనారాయణ, కోశాధికారి ఊట్ల పెద సుబ్బారావు, వస్త్ర ఉత్పత్తి విక్రయదారుల సంఘం ప్రతినిధులు కాసుల రవికుమార్, పొట్లాబత్తుని లక్ష్మణరావు, చేనేత కార్మికసంఘాల సమన్వయ కమిటీ ప్రతినిధులు పిల్లలమర్రి బాలకృష్ణ, నాగేశ్వరరావు, రామనాదం పూర్ణచంద్రరావు, గుత్తికొండ ధనుంజయరావు, కూరపాటి కోటేశ్వరరావు చర్చల్లో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి మండలం కుంచనపల్లి కాలువ కట్ట వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన సుధాకర్(33) సోమవారం తెల్లవారుజామున వడ్డేశ్వరం నుంచి వస్తుండగా అదుపుతప్పి పడిపోవడంతో గాయాలపాలై మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాడి పశువును కాపాడిన స్థానికులు

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి వీవర్స్ కాలనీలో సోమవారం ఓ పాడిపశువు కాలువలో పడి ఇరుక్కుపోయింది. అది బయటకు వచ్చే ప్రయత్నం చేసినా ఫలించలేదు. ఈ క్రమంలో గాయాలయ్యాయి. ఎటూ కదల్లేని నిస్సహాయ స్థితిలో ఉండటంతో స్థానికులు గమనించి మూగజీవాన్ని అతికష్టం మీద బయటకు తీసి మానవత్వాన్ని చాటుకున్నారు.

బాల్యానికి భద్రత.. భవితకు భరోసా

బాలల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

మేడికొండూరులో సమావేశమైన సంరక్షణ కమిటీ సభ్యులు

మేడికొండూరు, ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు బాలలు, వారి హక్కుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. ఇందుకోసం ప్రవేశ పెట్టిన 'మిషన్ వాత్సల్య' కేంద్రం 2022లో ప్రవేశపెట్టినప్పటికీ గత వైకాపా ప్రభుత్వం దీని అమలును పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమం చురుగ్గా అమలు అయ్యేలా ప్రణాళిక రూపొందించింది. ఇందుకోసం ప్రతి ఊర్లో సమగ్ర బాలల సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేశారు. దీంట్లో మహిళాభివృద్ధి - శిశు సంక్షేమ శాఖ ప్రధాన పాత్ర పోషిస్తోంది.

మండలం	గ్రామాలు	కమిటీలు
మేడికొండూరు	14	14
ఫిరంగిపురం	17	17
తాడికొండ	16	16
తుళ్లూరు	19	19

సభ్యులు వీరు.. వారిలో ముఖ్యంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయుడు, గ్రామ సమాఖ్య సభ్యులు, ఎన్నికల ద్వారా ఎంపికైన మహిళా ప్రజాప్రతినిధి, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్త, మహిళా సంరక్షణ కార్యదర్శి (మహిళా పోలీసు), ఎన్జీవో ప్రతినిధి, యువజన సంస్థకు చెందిన మహిళ కమిటీలో సభ్యులుగా కొనసాగుతారు.

లక్ష్యం ఇదీ.. నెలలో రెండు సార్లు సమావేశం అవుతారు. తల్లిదండ్రులు, యువతీయువకులకు బాల్య వివాహాలు గురించి అవగాహన కల్పిస్తూ జరగకుండా ప్రత్యేక చొరవ తీసుకుంటారు. పిల్లల హక్కులు, రక్షణ, కౌమార దశలో యువతీ, యువకులు ఎదుర్కొనే సమస్యలు తదితరాలపై అవగాహన కల్పిస్తారు. అన్ని వర్గాల ప్రజలు, మహిళలు సమావేశంలో పాల్గొనేలా చూస్తారు. బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని సర్కారు పాఠశాలల్లో చేర్పిస్తారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ తల్లిదండ్రులు లేని పిల్లలను కనిపెట్టి మిషన్ వాత్సల్య పథకం ద్వారా వారికి ఏటా రూ.5 వేలు ఆర్థిక సాయం అందేలా చూస్తారు. 0 - 5 ఏళ్లలోపు పిల్లలు ఆరోగ్య పరిస్థితులు క్షుణ్ణంగా తెలుసుకుంటారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తూ మెరుగైన సేవలందిస్తారు. తాడికొండ నియోజకవర్గ పరిధిలో 66 గ్రామాల్లో ఈ కమిటీలను ఏర్పాటు చేసినట్లు సీడీపీవో అనురాధ తెలిపారు.

తాడేపల్లి, న్యూస్‌టుడే: వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో క్యూఎన్ఎక్స్ అనే సాఫ్ట్‌వేర్ సంస్థతో కలిసి కేఎల్‌యూ సోమవారం అధ్యాపకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రొవైస్‌ఛాన్సలర్ డాక్టర్ వెంకట్రామ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అధ్యాపకులు, విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. ఏపీలోని 19 కళాశాలలతో

అధ్యాపకులకు కేఎల్‌యూలో శిక్షణ

పాటు విశ్వవిద్యాలయాల్లో పని చేసే 58మంది అధ్యాపకులను ఎంపిక చేసినట్లు వివరించారు. వర్సిటీ నైపుణ్యాభివృద్ధి డీన్ డాక్టర్ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'కురగల్లు రైతులకు న్యాయం చేయండి'

మంగళగిరి, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో డిపాజిట్ చేసిన రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు కోరారు. నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి చిన్నితిరుపతయ్య, మండల పార్టీ కార్యదర్శి జాలాదిజాన్‌బాబుతో కలసి మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను మోసం చేసిన సొసైటీ సీఈవో రమేష్‌బాబుని అదుపులోకి తీసుకుని రైతులు డిపాజిట్లను తిరిగి ఇప్పించాలని కోరారు. కురగల్లు రైతులకు రైతు సంఘం అండగా ఉంటుందని తెలిపారు.

విహార యాత్రలతో విజ్ఞానం

రేవేంద్రపాడు(దుగ్గిరాల), న్యూస్‌టుడే: విహార యాత్రల వల్ల విద్యార్థులు జ్ఞాన సముపార్జన చేస్తారని రేవేంద్రపాడులోని పీఎంశ్రీ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీవీ కృష్ణారావు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్కూలు విద్యార్థులు సోమవారం విహారయాత్రకు వెళ్లారు. అమరావతి, సచివాలయం, శాసనసభ, మ్యూజియం, బుద్ధుని విగ్రహం, ఉండవల్లి గుహలు వంటివి చూశారని ఆయన చెప్పారు. వీటి విశిష్టతను గైడ్ టీచర్లు బి.శ్రీనివాసరావు, శివకుమారి, అనసూర్యాదేవి, భారతీ దేవి, సరోజిని బాలబాలికలకు వివరించారన్నారు.

సంక్షేమం అందిస్తాం.. అభివృద్ధి చేస్తాం

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు, మాజీ మంత్రి పెద రత్తయ్య, తదితరులు

ప్రత్తిపాడు(కాకుమాను), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని అందిస్తూ... అభివృద్ధి పనులు కూడా చేస్తుందని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. ప్రత్తిపాడు మండలంలోని పలు గ్రామాలలో అభివృద్ధి పనులకు సోమవారం రాత్రి ఆయన శంకుస్థాపనలు, శిలాఫలకాలను ఆవిష్కరించారు. తొలుత కోయవారిపాలెంలోని విఘ్నేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వంగిపురం, పల్లపాడు, పుసులూరు వెళ్లే రహదారికి రూ. 70 లక్షలు, అంతర్గత సీసీ రహదారికి రూ. 10 లక్షలతో చేపట్టిన పనులకు శంకుస్థాపన చేశారు. గింజుపల్లి వారిపాలెంలో రూ. 12.50 లక్షలతో చెరువు చుట్టూ ఫెన్సింగ్, రూ. 3 లక్షలతో రహదారి, తిమ్మాపురంలో రూ. 32 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణం, రూ. 42 లక్షలతో చేపట్టిన సీసీ రహదారుల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. మల్లాయపాలెంలో రూ. 14.50 లక్షల ఖర్చుతో సీసీ రహదారుల నిర్మాణం, బొర్రావారిపాలెంలో రూ. 6 లక్షలతో మ్యాజిక్ డ్రెయిన్‌కు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, సమన్వయకర్త నాగేశ్వరరావు, తెదేపా నాయకులు శివరాం ప్రసాద్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, నీటి సంఘాల ఛైర్మన్ కుసుమ కుమారి, ఎంపీడీఓ శివపార్వతి పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

తాడికొండ, న్యూస్‌టుడే: బాలికలు ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి పేర్కొన్నారు. తాడికొండ గ్రామంలోని శ్రీసత్యసాయిబాబా పాఠశాలలో కిశోర బాలికలకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కృష్ణకుమారి పాల్గొని.. బాల హక్కులు, 198, 100, 112 టోల్‌ఫ్రీ నంబర్ల ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యకర్తలు సీహెచ్ విజయలక్ష్మి, షేక్ నూర్జహాన్, షేక్ మహాజబీన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

పెదవడ్లపూడిలో కరపత్రాలు ఆవిష్కరించిన కిరణ్‌చంద్

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: పెదవడ్లపూడి గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 'రైతన్న మీకోసం' కరపత్రాలను మంగళగిరి మార్కెట్ యార్డు ఛైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న సేవలను ఏపీ ఏఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. యార్డు వైస్ ఛైర్మెన్ యర్రగుంట్ల భాగ్యారావు, ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి జె.శైలజ రాణి, ఉద్యానాధికారి కె.దీపిక, తెదేపా నాయకులు మాదల రమేష్ బాబు, శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సాధనలో వ్యవసాయ రంగం కీలకం

దుగ్గిరాల, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర సాధనలో వ్యవసాయరంగం కీలకమని తెనాలి ఏడీఏగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న దుగ్గిరాల ఏవో ఆర్.విజయ్‌బాబు అన్నారు. సోమవారం మండల గ్రామాల్లో 'రైతన్నా మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారంగా పంటలు ఉత్పత్తి చేయడం, వ్యవసాయ యాంత్రీకరణ, విలువ ఆధారిత ఆహార ఉత్పత్తుల తయారీ అనే పంచ సూత్రాలు పాటిస్తూ ప్రభుత్వ, వ్యవసాయ అనుబంధ శాఖలతో పాటుగా రైతులూ కృషి చేయాలన్నారు.

పెదనందిపాడు, న్యూస్‌టుడే: రైతులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం నాగులపాడు, అన్నవరం, పాలపర్రు, వరగాని గ్రామాలలో జరిగిన సమావేశాలలో పాల్గొని మాట్లాడారు.

పొంచి ఉన్న ప్రమాదం

నవులూరు గ్రామ టిడ్కో సముదాయం ప్రాంతంలో ఓ పాత బావి ప్రమాదకరంగా ఉంది. సుమారు 30 అడుగుల లోతు ఉండే ఈ బావి సమీపంలోనే చిన్నారులు నిత్యం ఆడుకుంటూ ఉంటారు. ఎలాంటి రక్షణ మూత లేకపోవడంతో ఎప్పుడు ఏం ముంచుకొస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో విషసర్పాలు సంచరిస్తున్నాయని వారు చెబుతున్నారు. గతంలో పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని, ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మంగళగిరి గ్రామీణం**

పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించరూ..

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో పేదలు ప్రదర్శన నిర్వహించారు ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పి. రామారావు మాట్లాడుతూ నల్లమడ వాగు కట్ట, ప్రభుత్వాసుపత్రి వద్ద 30 ఏళ్ల పైబడి పాకల్లో నివసిస్తున్న వారికి వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించాలన్నారు. కనీస వసతులు కరవై వాగు వరదసమయంలో వాగు పొంగి ఇళ్లలోకి నీరు వచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా వాగ్దానాలు చేయడం తప్ప వారిని పట్టించుకున్నవారు లేరన్నారు. సీపీఎం మండల కార్యదర్శి రమేష్ బాబు, నాయకులు వెంకటేశ్వర్లు, రాజేంద్ర, భువనేశ్వరి, ఆశీర్వాదం పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు, పేదల ఆందోళన

ఉచిత కుట్టుశిక్షణ ప్రారంభం నేడు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడులోని కొల్లా వెంకయ్య స్మారక గ్రంథాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం కానుందని నిర్వాహకులు రాజమోహనరావు, వెంకయ్యచౌదరి తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు శిక్షణ పొందవచ్చని వారు పేర్కొన్నారు.

'ఉపాధ్యాయులకు బోధనేతర పనులు చెప్పొద్దు'

జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న నాయకులు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఉండవని మూడు రోజుల కిందట మంత్రి నారా లోకేశ్ చెప్పిన మాటల్ని ఆచరణలోకి తీసుకురావాలని కోరుతున్నామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సాయంత్రం దుగ్గిరాలలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల సమావేశం కె.కామాక్షి అధ్యక్షతన జరిగింది. నూతనంగా నిర్మించిన జెండా దిమ్మె శిలాఫలకాన్ని వెంకటేశ్వర్లు ప్రారంభించగా, యూటీఎఫ్ ఆడిట్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ టి.ఎస్.ఎల్.ఎన్.మల్లేశ్వరరావు పతాకావిష్కరణ చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బోధనేతర పనులు ఉండవని మంత్రి చెబుతున్నా విద్యాశాఖ అధికారులు కర్మయోగి, సాసా ఇలా వివిధ యాప్‌ల పేరిట, సమాచారం పేరిట ఉపాధ్యాయులపై పెద్ద ఎత్తున ఒత్తిడి తెస్తున్నారన్నారు. కొన్ని జిల్లాల్లో అధికారులు ఇచ్చిన షోకాజ్ నోటీసులు రద్దుచేయాలని వెంకటేశ్వర్లు కోరారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కళాధర్, జి.వెంకటేశ్వర్లు, మహమ్మద్ గయాసుద్దౌలా, చలపతిరావు, గోపినాథ్, హుస్సేన్, ఆర్.వి.ప్రసాద్, శోభాదేవి తదితరులున్నారు.

విద్యార్థుల సేవా కార్యక్రమాలు

మంగళగిరిలో విద్యార్థుల ర్యాలీ

మేడికొండూరు, న్యూస్‌టుడే: విశదల అడ్డరోడ్డులోని ఎన్ఆర్ఐఐటీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సోమవారం గుండ్లపాలెంలో శ్రమదానం చేశారు. వీధులు, ఖాళీ స్థలాలను శుభ్రం చేశారు. గుంటూరుకు చెందిన స్టేఫ్ స్వశక్తి, యువజన శాఖ కార్యదర్శి రాధిక మాట్లాడుతూ. . గుండ్లపాలేన్ని కళాశాల దత్తత తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రతినిధి రవికుమార్, పంచాయతీ కార్యదర్శి రోజా పాల్గొన్నారు.

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి పట్టణంలోని వి.జె.డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్- 2 ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, విద్యా ప్రచారం కార్యక్రమాలు చేపడుతున్నట్లు కళాశాల సెక్రటరీ ప్రెగడ రాజశేఖర్ సోమవారం తెలిపారు. మొదటి రోజు ద్వారకానగర్ ప్రాంతంలో మహిళ విద్యపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సురేష్‌బాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలల సంరక్షణకు అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ప్రిన్సిపల్ నాదెళ్ల శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ గంజి లక్ష్మీ, సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ ఎస్.సుమలత పాల్గొన్నారు.

విజేతలకు అభినందన

పెదనందిపాడు: విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు సాధించాలని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్ర (పెదనందిపాడు) సమన్వయకర్త డి. రమేష్‌బాబు అన్నారు. పాలపర్రు ఎస్.ఎన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎస్.కే ఫజీల తబసుం (పదో తరగతి), ఎం. దివ్య (9వ తరగతి), ఎస్.కే రఫాన్ (8వ తరగతి) చెకుముకి టాలెంట్ టెస్టులో జిల్లా స్థాయిలో ప్రథమస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నేపథ్యంలో సోమవారం విజేతలకు ఆయన, రామారావు బహుమతులు అందజేశారు.

పాఠశాల అభివృద్ధికి సహకరిస్తాం

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని ఆంధ్ర బ్యాంక్ విశ్రాంత మేనేజర్, పూర్వ విద్యార్థి కట్టా జనార్దనరావు అన్నారు. వరగాని ఎస్‌డబ్ల్యూయూ మాదిరి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఆయన సోమవారం క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడారు. పాఠశాలలో వనరులు కల్పన కు గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు సహకారం అందించాలన్నారు. వందేళ్ల పండుగ నిర్వహించేందుకు అందరు ఏకతాటి పైకి రావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకటప్పయ్య, దిరిశాల శ్రీనివాసరావు, సురేంద్ర, ఆర్. శ్రీనివాసరావు, బుల్లెయ్య, ప్రధానోపాధ్యాయుడు రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుళ్లూరు గీతా మందిరం వద్ద ఉద్రిక్తత

కిందపడిన మహిళను పైకి లేపుతున్న స్థానికులు

తుళ్లూరు: తుళ్లూరులోని గీతా మందిరం వద్ద ఉద్రిక్తత నెలకొంది. కొద్ది రోజుల కిందట కోర్టు ఆదేశాల మేరకు ఇక్కడి చెరువు కట్టపై నిర్మించిన వినాయక మండపాన్ని అధికారులు తొలగించారు. ఇనుప స్తంభాలు, రేకులను అక్కడే వదిలేశారు. సోమవారం ఆ శిథిలాలను తొలగించటానికి అధికారులు అక్కడికి వచ్చిన సమయంలో స్థానికులు, మహిళలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆందోళనకారులు, పోలీసుల మధ్య వాగ్వాదం, స్వల్ప తోపులాట జరిగింది. ఆ సమయంలో ఒక మహిళ రోడ్డుపై పడిపోయారు. మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. చెరువు కట్టపైన వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని పూజలు చేస్తుంటే దామినేని శ్రీనివాసరావు అనే వ్యక్తి అధికార బలంతో తమపై దౌర్జన్యం చేయిస్తున్నారని ఆందోళనకారులు ఆరోపించారు. ★ ఈ ఘటనపై తుళ్లూరుకు చెందిన తెదేపా రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు విలేకరులకు వివరణ ఇచ్చారు. గుడి కట్టించడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. గీతా మందిరం పక్కన అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఆలయం పక్కన అనధికార నిర్మాణంపై గ్రామానికి చెందిన కొందరు కోర్టు ఆశ్రయించడంతో కోర్టు తీర్పుతో అధికారులు తాత్కాలిక నిర్మాణాలను తొలగించారన్నారు. తనపై ఒక వర్గం అసత్య ఆరోపణలు చేయిస్తుందన్నారు.

ఆసరా లేదన్నా ఆలకించరా..!

కలెక్టరేట్(గుంటూరు): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం గుంటూరులో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో పలువురు అర్జీలు అందజేశారు. వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడికి చెందిన బి.సుధారాణి మాట్లాడుతూ.. 'మా కుమార్తె కృష్ణవేణి దివ్యాంగురాలు. ఆమెకు పింఛను కోసం దరఖాస్తు చేసుకుంటే రేషన్ కార్డు కావాలన్నారు. అది వచ్చాక దరఖాస్తు చేసుకుంటే హౌస్ హోల్డ్ మ్యాపింగ్ అవ్వలేదన్నారు. ఇటీవల ఆ ప్రక్రియ పూర్తి చేసుకుని మూడు నెలల కిందట పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం అందించాం. అప్పుటి కలెక్టర్ ప్రత్యేక కేసుగా పరిగణించి పింఛను మంజూరు చేయాలని సూచించినా కాలేదు. అధికారులు స్పందించి పింఛను ఇప్పించాలి.' అని ఆవేదన వ్యక్తం చేశారు.

కుమార్తె కృష్ణవేణిని ఎత్తుకుని పీజీఆర్ఎస్‌కు వచ్చిన తల్లి సుధారాణి

అక్రమ మైనింగ్‌ను అడ్డుకుంటే బెదిరిస్తున్నారు..

తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ మండలం లచ్చన్నగుడిపూడి గ్రామంలో వైకాపా సానుభూతి పరుడు చేస్తున్న అక్రమ మైనింగ్‌ను అడ్డుకున్నందుకు మోతడకకు చెందిన తెదేపా నాయకుడు యడ్లపల్లి సాంబశివరావు బెదిరింపులకు గురిచేస్తున్నాడని కుర్రా శ్రీధర్ సోమవారం గుంటూరు ఎస్పీ కార్యాలయం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని వినతిలో పేర్కొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాకారమే లక్ష్యం

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాకారమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. 41వ డివిజన్ స్వర్ణభారతీనగర్ ఎస్టీకాలనీ కమ్యూనిటీ హాలులో మెప్మా ఆధ్వర్యంలో నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ సహకారంతో ఏర్పాటు చేసిన సఖీ సురక్ష మెడికల్ హెల్త్ స్క్రీనింగ్ క్యాంపును సోమవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళల శారీరక, మానసిక, పోషకాహార ఆరోగ్యాన్ని కాపాడి వారి ఆర్థిక సుస్థిరత సాధించటమే సురక్ష కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు. 35 ఏళ్లు పైబడిన మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలతో పాటు ఆధునిక యంత్రాలతో ఇంటి వద్దనే హెల్త్ స్క్రీనింగ్ చేస్తారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ తదితర వంటి పరీక్షలు చేస్తారని వివరించారు. మెప్మా అధికారులు, వైద్య సిబ్బంది, కార్పొరేటర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

(c) eenadu

గుంటూరు తూర్పు

ఖేలో ఇండియా పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా ఎంపిక

గుంటూరుక్రీడలు, న్యూస్‌టుడే: రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగే ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్-2025 స్విమ్మింగ్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా ఎన్టీఆర్ స్విమ్మింగ్ పూల్ శిక్షకుడు షేక్ ఖాజీమొహిద్దీన్ ఎంపికయ్యారు. గతంలో ఆయన గుజరాత్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలకు, ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌కు టెక్నికల్ అఫీషియల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు క్రీడాకారులు అభినందించారు.

ధర వరలు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 50, వంగ 40, బెండ 49, పచ్చిమిర్చి 40, కాకర 50, క్యారెట్ 59, క్యాబేజీ 30, బీర 36, దొండ 58, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 17, గోరుచిక్కుళ్లు 58, దోస 32, పొట్ల 45, చామదుంప 25, మునగ 10, గోంగూర 12, తోటకూర 15, చుక్కకూర 14, కొత్తిమీర 25, బీట్‌రూట్ 43, కీర 29, క్యాప్సికం 80, అల్లం 78, ఫ్రెంచి బీన్స్ 50, సొర 20, అరటి 7. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

స్పందనకు వందనం

☛ నవభారత్‌కాలనీ 2వలైన్ సైడు కాలువల్లో పూడికలు చేరి మురుగునీరు పారుదలకు ఆటంకం కలిగి దోమలవ్యాప్తి అధికంగా ఉంటోందని స్థానికుడు సుమంత్ 'మేమున్నాం.. మీకు తోడుగా' తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో పూడికలు తీయించారు.

☛ జామియానగర్ ప్రధాన రోడ్డులో చెత్తకుప్పలు తొలగించక పోవడంతో వీధులు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికుడు శేఖర్‌బాబు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ప్రజారోగ్య విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో చెత్త తొలగించి తరలించారు.

☛ తారకరామనగర్ 4వ లైన్ సైడు కాలువల్లో పూడికలు చేరి మురుగునీటి పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికుడు కోటేశ్వరరావు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్‌కు తెలియజేయడంతో పూడికలు తీయించారు.

☛ సుద్దపల్లిడొంక విజయశాంతినగర్ రెండోలైన్‌లో చెత్తకుప్పలు తీయకుండా వదిలేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయని స్థానికుడు మణికంఠ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను ప్రజారోగ్య అధికారులకు తెలియజేయడంతో ట్రాక్టర్ పంపి చెత్తకుప్పలు తీయించి తరలించారు.

☛ వాసవినగర్ మూడోలైన్‌లో సైడు కాలువల్లో పూడికలు తీయకపోవడంతో మురుగునీటి పారుదలకు ఆటంకం కలుగుతోందని స్థానికుడు చంద్ర 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో పూడికలు తీయించారు.

☛ ఎల్.ఆర్.కాలనీ ప్రధాన రోడ్డులో చెత్తకుప్పలు వదిలేయడం వల్ల వీధులు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికుడు శ్యాంకుమార్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ప్రజారోగ్య అధికారులకు తెలియజేయడంతో చెత్తకుప్పలు తీయించి తరలించారు. **- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ**

? పాతగుంటూరు గాంధీబొమ్మసెంటర్‌లోని మెయిన్ డ్రెయిన్‌లో పూడిత తీయటం లేదు. వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. **- వాసు** ✔ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- రత్నం, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

? బీఆర్ స్టేడియం సెంటర్ నుంచి జిన్నాటవర్ సెంటర్ వరకు ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి. ఆ ప్రాంతంలో ట్రాఫిక్ నిలిచిపోతోంది. **- కొండలు** ✔ ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకుంటాం. **- అశోక్‌కుమార్, ట్రాఫిక్ సీఐ**

? మార్కెట్ సెంటర్‌లోని కొందరు చిరు వ్యాపారులు కాటాలపై ముద్రలు లేకుండా పండ్లు విక్రయిస్తున్నారు. **-మౌలాలి**

✔ తప్పుడు తూకాలు వేసే వారిపై చర్యలు తీసుకుంటాం.

-సునీల్, తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ - న్యూస్‌టుడే, పట్నంబజారు

నాణ్యత డొల్ల.. రహదారులు గుల్ల

కమీషన్లు మరిగి పర్యవేక్షణ మరచిన అధికారులు

న్యూస్‌టుడే - నగరపాలక సంస్థ, పట్టాభిపురం

✪ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని నవభారత్‌నగర్ మొదటి లైన్‌లో ఓ రహదారి నిర్మాణం ఇటీవలే పూర్తి చేశారు. బీటీ లేయర్ సక్రమంగా వేయలేదు. నాసిరకం మెటీరియల్ వాడారు. కానీ.. ప్రమాణాల ప్రకారమే రోడ్డు వేసినట్టు బిల్లులు చేసుకుంటున్నారు.

సుద్దపల్లి డొంకరోడ్డులో గుల్లగా మారుతున్న రహదారి

✪ తూర్పు నియోజకవర్గ పరిధిలోని సుద్దపల్లిడొంకరోడ్డు తిరుపతమ్మ గుడి వద్ద నుంచి దుర్గానగర్ చర్చి అవతలి వరకు కొన్ని నెలల క్రితమే బీటీ రోడ్డు వేశారు. నాసిరకంగా నిర్మించడంతో కాస్త వర్షాలకే గుల్లగా మారిపోతోంది. యూజీడీ మ్యాన్‌హోల్స్ ఉన్నచోట సక్రమంగా పనులు చేయకపోవడంతో వాహనదారులు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు.

లెవల్ చేయకుండా వదిలేసిన మ్యాన్‌హోల్

✪ కన్యకాపరమేశ్వరి దేవాలయం నుంచి బారా ఇమాం పంజా వరకు సీసీ రోడ్డును కొన్ని నెలల క్రితమే నిర్మించారు. నాణ్యత ప్రమాణాల్లేకపోవడంతో మొత్తం గోతులమయంగా మారింది.

నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగ పనితీరుకు నిదర్శనాలివి. పనులపై పర్యవేక్షణ లేక.. గుత్తేదారుల ఇష్టారాజ్యం నడుస్తోంది. కమీషన్లు తినమరిగిన కొందరు అధికారుల తీరు ప్రజాధనానికి తూట్లు పొడుస్తోంది. సాధారణంగా బీటీ రహదారులను నాణ్యతతో నిర్మిస్తే కనీసం ఐదేళ్ల పాటు మన్నిక ఉంటుంది. ప్రస్తుతం నిర్మించినవి రెండు, మూడు నెలలకే రూపు కోల్పోతున్నాయి. మొత్తంగా గుల్లగా మారిపోతున్నాయి.

కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.60 కోట్లకుపైగా పనులు చేశారు. ఇటీవల మరో రూ.40 కోట్ల విలువైన పనులకు ఆమోదం లభించింది. వీటి పర్యవేక్షణను ఎస్‌ఈ, ఈఈ స్థాయి అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. కేవలం దస్త్రాల్లోనే పనులకు ఆమోదం, ఎంబుక్ నమోదు వంటి వాటికే పరిమితమవుతున్నారు.

థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఎక్కడ?

పనులను ఏఈ, డీఈ స్థాయి అధికారులు తరచూ పరిశీలించాల్సి ఉన్నా.. ఆ బాధ్యతలను వార్డు సచివాలయ కార్యదర్శులకు వదిలేస్తున్నారు. థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్ పరిశీలనను విజయవాడలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలకు అప్పగించినట్టు అధికారులు చెబుతున్నా. వాటి ఫలితాలు ఏమవుతున్నాయో వారికే తెలియాలి.

సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయండి

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత తెదేపా కార్యకర్తలపైనే ఉందని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ సూచించారు. క్యాంప్ కార్యాలయంలో ఆయన తెదేపా నాయకులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసినప్పుడు అక్కడ సిబ్బంది లేకపోవడం, ఎలాంటి పథకాలు అమలవుతున్నాయో ప్రజలకు తెలియజేయకపోవడాన్ని గుర్తించామన్నారు. మూడు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టిందని, దివ్యాంగులకు ఉచితంగా మూడు చక్రాల వాహనాలు పంపిణీ చేస్తోందని, తల్లికి వందనం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పిల్లి మాణిక్యరావు, జాగర్లమూడి శ్రీనివాసరావు, ఎల్లపు అశోక్, మహంకాళి నరసింహారావు, గోళ్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

తెదేపా నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

గుంటూరునగరం, న్యూస్‌టుడే: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. 41వ డివిజన్ స్వర్ణభారతీనగర్ ఎస్టీకాలనీ కమ్యూనిటీ హాలులో మెప్మా ఆధ్వర్యంలో నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ సహకారంలో ఏర్పాటు చేసిన సఖీ సురక్ష మెడికల్ హెల్త్ స్క్రీనింగ్ క్యాంపును సోమవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లోని మహిళల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడి వారి ఆర్థిక సుస్థిరత సాధించటమే సురక్ష కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు. 35 ఏళ్లు పైబడిన మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలతో పాటు ఇంటివద్దనే హెల్త్ స్క్రీనింగ్ చేస్తారన్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద ప్రత్యేక ఆరోగ్య కార్డు, రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు, వైద్య సిబ్బంది, కార్పొరేటర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

అన్, అండర్ అసెస్‌మెంట్లు ఉండడానికి వీల్లేదు

మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర పరిధిలో అన్, అండర్ అసెస్‌మెంట్లు ఉండడానికి వీల్లేదని, మంగళవారం నుంచి వార్డు సచివాలయాల కార్యదర్శులు క్లస్టర్లవారీగా సమగ్ర సర్వే చేపట్టాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జీఎంసీ పరిధిలో వార్డు సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో ప్రతీ నిర్మాణాన్ని పరిశీలించాలన్నారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. రిపోర్టుల్లో తప్పులుంటే సంబంధిత సిబ్బందితో పాటు పర్యవేక్షణ అధికారులు కూడా బాధ్యులవుతారని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఓబులేసు, డీసీలు సీహెచ్ శ్రీనివాస్, వెంకటకృష్ణయ్య, బి.శ్రీనివాసరావు, సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ, మేనేజరు బాలాజీ బాషా తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

పట్నంబజారు, న్యూస్‌టుడే: పాతగుంటూరు కొండయ్యకాలనీలో సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. యువకులంతా కలిసి ముందు భాగంలో క్రిస్మస్ స్టార్ ఏర్పాటు చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాల్మన్ రాజు, గోపీ, నాగరాజు, జయరాజు, నవీన్, సాలు తదితరులు పాల్గొన్నారు.

కొండయ్యకాలనీలో క్రిస్మస్ స్టార్

ఘనంగా 'పట్టాభి' అవార్డుల ప్రదానం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరున స్థాపించిన పట్టాభి కళాపీఠం 15వ వార్షికోత్సవం, పట్టాభి అవార్డుల ప్రదానోత్సవం సోమవారం ఘనంగా జరిగాయి. బ్రాడీపేటలోని కొరటాల భవనంలో ఈ సందర్భంగా జరిగిన సభకు కళాపీఠం అధ్యక్షుడు తూములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లోని ప్రతిభావంతులైన మహిళలను ఎంపిక చేసి పట్టాభి అవార్డులతో సత్కరిస్తున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అఖిల భారత పంచాయితీ పరిషత్ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు సంస్థ నిర్వహిస్తున్న సామాజిక సేవలను, పట్టాభి సీతారామయ్య జీవిత విశేషాలను వివరించారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత వలివేటి శుభావతి, జిల్లా అటవీ శాఖాధికారిణి హిమశైలజ, నాటక రచయిత కావూరి సత్యనారాయణ, డాక్టర్ ఆంధ్రూ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వలివేటి శుభావతి, డాక్టర్ లలితా సింధూరి, డాక్టర్ లావణ్య, డాక్టర్ ప్రశాంతిలక్ష్మీదేవి, కె.అనూరాధ, ధారా శ్రీలక్ష్మి, వి.నాగరత్నం, హిమ శైలజలకు పట్టాభి స్మారక అవార్డులిచ్చి నిర్వాహకులు సత్కరించారు.

వేగం వద్దు.. జాగ్రత్తలు పాటించండి

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఆటో డ్రైవర్లు మితిమీరిన వేగంతో నడపరాదని తూర్పు విభాగపు ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ సూచించారు. ట్రాఫిక్ డీఎస్పీ పర్యవేక్షణలో సోమవారం మార్కెట్ సెంటర్లో వాహనదారులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి ఆటోలు నడపొద్దని, డ్రైవరు సీటు పక్కన ప్రయాణికులను ఎక్కించుకోరాదని చెప్పారు. ద్విచక్రవాహనంపై ముగ్గురు ప్రయాణించడం నేరమన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్.ఐ.రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్

గుంటూరు ఐఎంఏకు పురస్కారాలు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: వివిధ రంగాల్లో అందించిన సేవలకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖకు రాష్ట్ర స్థాయిలో ఐదు పురస్కారాలు లభించాయి. ఇటీవల అన్నమయ్య జిల్లా రాజంపేటలో నిర్వహించిన ఐఎంఏ రాష్ట్ర సదస్సులో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ బన్సాలి ఈ అవార్డులు ప్రదానం చేశారు.

ఇదేమి సుందరీకరణ? ..

బస్టాండు సెంటర్లోని ఎన్టీఆర్ ఐలాండ్ శిథిలావస్థకు చేరింది. ఇటీవల లారీ ఒకటి ఐలాండ్‌ను ఢీకొట్టింది. దీంతో అది పగుళ్లిచ్చింది. నగరాన్ని సుందరీకరణ చేస్తామని చెబుతున్న అధికారులు ఇక్కడి ఐలాండ్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవటం లేదు. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

పొంగుతున్న మురుగు నీరు

పాతగుంటూరు బాలాజీనగర్ 5/5 లైనులో ఇళ్ల మధ్య మురుగు కాలువలు స్తంభించాయి. శానిటరీ సిబ్బంది కొద్ది రోజులుగా సైడు కాలువలను శుభ్రం చేయడం లేదు. దీంతో మురుగునీరు రోడ్లపైకి వస్తోంది. దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలుతున్నాయని హరిప్రసాద్ అనే స్థానికుడు తెలిపారు. సచివాలయంలో ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు.

- న్యూస్‌టుడే, పట్నంబజారు

గుంతల రోడ్డుతో తంటాలు

జిన్నాటవర్ సెంటర్లోని రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. నగర నడిబొడ్డున గుంతలమయంగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మార్కెట్ వైపు నుంచి బస్టాండు వైపు వెళ్లే వాహనదారులు జిన్నాటవర్ సెంటర్లోని మలుపు వద్ద గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారు. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

టచ్ చేస్తే.. కేసే

మూడేళ్లలో నమోదైన పోక్సో కేసులు: 372 (2023లో 154, 2024లో 146, 2025లో 72)

పకడ్బందీగా పోక్సో అమలు

న్యూస్‌టుడే - నెహ్రూనగర్

వెంగళాయపాలేనికి చెందిన 16 ఏళ్ల బాలికను నెల్లూరుకు చెందిన యువకుడు ప్రేమ పేరుతో బలవంతంగా తనతో తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. పోలీసు దర్యాప్తులో అతని తల్లి, అమ్మమ్మ సహకారం కూడా ఉందని తేలడంతో ఇటీవల అరెస్టు చేశారు. బాలికను తీసుకెళ్లడానికి సహకరించిన అతని స్నేహితుడిపైనా కేసు పెట్టారు.

కొద్ది నెలల కిందట పదో తరగతి బాలికను ప్రేమ పేరుతో వెంటపడి.. పుట్టినరోజు జరుపుకొందామని ఆటోలో తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడు, అతని స్నేహితులపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

పోక్సో చట్టం ఇలా...

లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం 2012లో అమల్లోకి వచ్చింది. 18 ఏళ్లలోపు బాలిక/బాలుడితో అసభ్యంగా ప్రవర్తించినా.. వారి వీడియోలు తీసినా.. లైంగిక వేధింపులకు పాల్పడినా.. శిక్షార్హులవుతారు. మూడేళ్ల జైలు శిక్ష పడుతుంది. 16 ఏళ్లలోపు పిల్లలపై లైంగిక దాడి చేస్తే 20 ఏళ్ల వరకు జైలుశిక్ష పడే అవకాశం ఉంది.

☛ మైనర్ మరణిస్తే దోషికి మరణ శిక్ష విధించవచ్చు.

☛ బాలికలను టచ్ చేయాలంటేనే భయపడేలా పోక్సో చట్టంలోని సెక్షన్ 17ను పకడ్బందీగా అమలు చేయాలని పోలీసులు నిర్ణయించారు. దీనికింద నిందితులకు సహకరించినవారిపైనా కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తున్నారు.

సహకరించినవారిపైనా.. పోక్సో చట్టంలోని సెక్షన్ 17 ప్రకారం.. ప్రధాన నిందితుడు సహ అతనికి సహకరించిన వారిపైనా ఇది వర్తిస్తుంది. ప్రధాన నిందితుడికి ఎటువంటి శిక్ష పడుతుందో.. సహకరించిన వారికీ అవే శిక్షలు వర్తిస్తాయి. **- డీఎస్పీ భానోదయ**

దీనుల ఆ'వేదన'

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి బాధితులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఏఎస్పీ రమణమూర్తి, డీఎస్పీలు మధుసూదనరావు, శ్రీనివాసరెడ్డి, బెల్లం శ్రీనివాసరావు ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి ఆదేశించారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఎస్పీ మధుసూదనరావు

డబ్బులు అడిగితే బెదిరిస్తున్నారు - రత్నకుమారి, కృష్ణబాబుకాలనీ

నా భర్త రవి న్యాయవాది. అతని వద్ద సహాయకురాలిగా పని చేస్తున్నా. గుంటూరుకు చెందిన ఓ మహిళా కానిస్టేబుల్ తన పోలీస్‌స్టేషన్‌కు వచ్చే కేసులు మాకు ఇప్పిస్తానని చెప్పింది. అలా ఆమె తీసుకొచ్చిన ఓ కేసు విషయమై మాకిస్తామన్న రూ.50 వేలు అడిగినందుకు బెదిరిస్తోంది. మాపై తప్పుడు కేసు పెట్టించి, తన బంధువులతో దాడి చేయించింది.

బ్యాంకు లోను పేరుతో మోసం - సునీత, రాజీవ్‌గృహకల్ప

కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నా. తేజ అనే యువకుడు బ్యాంకు రుణం ఇప్పిస్తానని నమ్మించాడు. నా ఫోన్ తీసుకుని ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా రూ.1.40 లక్షలు తన ఖాతాలో జమ చేసుకున్నాడు. కిస్తీలు కట్టలేదని బ్యాంకు వారు ఫోన్ చేయడంతో అతను చేసిన మోసం తెలిసింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. రూ.40 వేలిచ్చాడు. రూ.లక్ష ఇవ్వకుండా బెదిరిస్తున్నాడు.

ఆస్తి తీసుకొని గెంటేశారు - ఓ మహిళ, గోరంట్ల

నేను దివ్యాంగురాలిని. తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నా. మా స్థలంలో ఇల్లు కట్టించి అమ్మానాన్నలను తీసుకెళతానని నమ్మించి మా సోదరుడు ఆస్తిని తన పేరుతో రాయించుకున్నాడు. ఇప్పుడు తల్లిదండ్రులను చూడడం లేదు. ఇంట్లోంచి గెంటేయడంతో రోడ్డున పడ్డాం.

బాలికను మోసం చేసిన కూలీపై పోక్సో కేసు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై పట్టాభిపురం ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. అచ్చంపేట మండలానికి చెందిన ఓ బాలిక నగరంలోని బంధువుల ఇంట్లో ఉంటూ.. ఓ ప్రైవేట్ కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన కూలి పనులు చేసుకునే తిరుపతయ్య ఆమెకు మాయమాటలు చెప్పి అత్యాచారం చేశాడు. బాలిక కనిపించకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు మొదట పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. తర్వాత బాలిక ఆచూకీ లభ్యమైంది. వైద్య పరీక్షలు నిర్వహించగా గర్భవతి అని తేలింది. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జీఎంసీకి వివిధ మార్గాల్లో వస్తున్న ప్రజా ఫిర్యాదులు, సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం ఆయన డయల్ యువర్ కమిషనర్ నిర్వహించారు. 25 ఫిర్యాదులు రాగా వీటిని ఆయా విభాగాల అధికారులకు పంపి పరిష్కారానికి ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ హాలులో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 27 అర్జీలు స్వీకరించారు. వాటిని ఆయా ఫిర్యాదులు విభాగాల అధికారులకు పంపించారు. క్షేత్రస్థాయిలో పనులు జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఓబులేసు, డీసీలు సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సీపీ రాంబాబు, ఇన్‌ఛార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ, మేనేజరు బాలాజీ బాషా తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభంకాని టెండర్ల రద్దు

★ కమిషనర్ ఆదేశం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: టెండర్ల ద్వారా పనులు పొంది.. క్షేత్రస్థాయిలో ప్రారంభించనివాటిని రద్దు చేయాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం ఉద్యోగనగర్, విజయపురికాలనీ, రెడ్డిపాలెం ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అసంపూర్తి పనులను ఏఈల వారీగా గుర్తించి రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలవాలని ఆదేశించారు. ఉద్యోగనగర్‌లో స్థానికుల ఫిర్యాదుల మేరకు డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కమిషనర్ వెంట డీఈఈ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

★ కమిషనర్ శ్రీనివాసులు ఆర్టీవో కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు.

అనధికార వ్యాపారాన్ని అడ్డుకోండి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: బుడంపాడు బైపాస్ వద్ద బాబా ఆశ్రమం పక్కన నిర్వహిస్తున్న అనధికార హోల్‌సేల్ కూరగాయల వ్యాపారాన్ని నిలిపేయాలని కొల్లి శారద మార్కెట్ దుకాణదారులు డిమాండ్ చేశారు. సోమవారం కౌన్సిల్ హాల్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం ఇచ్చి బయటకు వచ్చాక నిరసన వ్యక్తంచేశారు. భూమిని కొన్నట్టు దొంగ అగ్రిమెంట్ పత్రాలు చూపి ఆ స్థలంలో వ్యాపారాలు చేస్తున్నారని విమర్శించారు.

కౌన్సిల్ హాల్ ఎదుట కొల్లి శారద మార్కెట్ దుకాణదారుల నిరసన

➤గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

గుంటూరు నగరం: లంబసింగి నుంచి గంజాయి తీసుకొచ్చి గుంటూరు పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్న సూర్యతేజ (అంకమ్మనగర్), ఖాజావలి (ఇందిరాప్రియదర్శిని కాలనీ)ని సోమవారం నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 3,115 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరూ వ్యసనాలకు అలవాటు పడి ద్విచక్రవాహనాలు చోరీ చేసేవారు. వాటిని లంబసింగిలో విక్రయించి.. ఆ డబ్బుతో గంజాయి కొని ఇక్కడకు తీసుకొచ్చేవారు. వీరు గంజాయి అమ్ముతుండగా ఎస్సై మహేష్ దాడి చేసి పట్టుకున్నారు. మరికొందరు పరారీలో ఉన్నారని పోలీసులు చెప్పారు.

➤కృష్ణనగర్‌లో విద్యుత్తు కోత నేడు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: రహదారి విస్తరణ పనుల్లో భాగంగా లైన్ల మార్పు, చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున కృష్ణనగర్, కుందులు రోడ్డు తదితర ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్టు డీఈఈ గురవయ్య తెలిపారు.

➤ ఆటో డ్రైవర్ అదృశ్యం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రామిరెడ్డినగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సంజయ్‌కుమార్‌చౌదరి అదృశ్యంపై సోమవారం నగరంపాలెం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. బాడుగలు సరిగా లేక అప్పులు చేశాడని, ఈ నెల 8 నుంచి ఇంటికి రాలేదని భార్య సమిష్టి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

సత్యసాయి సేవలు స్ఫూర్తిదాయకం

పట్నంబజారు, న్యూస్‌టుడే: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమని చలమయ్య కాలేజీ కార్యదర్శి కర్పూరపు సూర్యనారాయణ అన్నారు. శ్రీసత్యసాయి బాబా శతవర్ష జయంతి ఉత్సవాల సందర్భంగా చలమయ్య కళాశాలకు చెందిన 8మంది విద్యార్థులు రక్తదానం చేశారు. సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎ.శ్రీధర్ పాల్గొన్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న చలమయ్య కాలేజీ కార్యదర్శి సూర్యనారాయణ

రాజ్యాంగంపై అవగాహన

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగం ఉన్నతమైనదని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు అన్నారు. సోమవారం బ్రాడీపేటలోని జాషువా విజ్ఞానకేంద్రంలో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు విల్సన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, మహిళలకు రాజ్యాంగంపై అవగాహన సెమినార్ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు రచించిన బాలల కోసం రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాన్ని అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. జనచైతన్యవేదిక అధ్యక్షుడు వల్లం లక్ష్మణరెడ్డి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పీఏ కిరణ్‌కుమార్, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు సుధ వివిధ సంఘాల నాయకులు చిష్టి, భగత్‌సింగ్ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణలో మాజీ మంత్రి మాణిక్యవరప్రసాద్, లక్ష్మణరావు, విల్సన్, లక్ష్మణరెడ్డి, కిరణ్‌కుమార్

వేలం ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి : సీనియర్ డివిజన్ : గుంటూరు కోర్టులో

E.P.69/2023 in O.S.170/2018 (బాపట్ల SCJ కోర్టు ఫైల్)

ప్రత్తిపాటి శ్రీనివాస రావు - డిక్రీ హోల్డర్

మరియు

డొప్పలపూడి శ్యామల మరియు ఇతరులు - జె.డి.ఆర్స్

జె.డి.ఆర్స్ నుండి డిక్రీ హోల్డర్‌కి రావలసిన డిక్రీ బాకీ పనూలు నిమిత్తం జె.డి.ఆర్స్ తాలూకు దిగువ తెలిపిన జప్తు చేయబడిన ఆస్తిని శ్రీకోర్టు వారిచే ది.10.12.2025 ఉదయం 10.30 గంటలకు బహిరంగ వేలం వేయబడునని ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయటమైనది. ఆసక్తి కలవారు వేలంలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు

గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరు సిటీ, మంగళదాస్ నగర్ 1/2 లైన్, గుంటూరు గ్రామ డి నెం.403, ఎ. 5.06 సెంట్లు మింజుమల్లై మున్సిపల్ లే-అవుట్ అప్రూవల్ నెం.2/60 దాఖలా ప్లాట్ నెంబరు 70 గల 150 చ.గ.ల స్థలం అందులోని డోర్ నెం. 8-18-41/1, అసెస్‌మెంట్ నెం.50539 గల RCC నివాస గృహమునకు **హద్దులు : తూర్పు :** నుంకర సాంబశివరావు ఆస్తి - 45 అ॥లు, **దక్షిణం :** పోతనబోయిన ప్రభాకర రావు వగైరాల ఆస్తి - 30 అ॥లు, **పడమర :** బోడ చెంచయ్య గారి ఆస్తి - 45 అ॥లు, **ఉత్తరం :** 20 అ॥ల వెడల్పు గల మున్సిపల్ కార్పొరేషన్ రోడ్ - 30 అ॥లు.

ఈ హద్దుల మధ్య 150 చ.గజములు లేక 125-41 చ.మీటర్లు స్థలమున్నూ, సదరు స్థలంలోని R.C.C. డాబా గ్రౌండ్ ఫ్లోరున్నూ మరియు మొదటి అంతస్తు ఇల్లున్నూ యావద్వి శిష్టములున్నూ మరియు మున్సిపల్ పంపు కనెక్షన్నూ, డిపాజిట్ హక్కున్నూ గల ఆస్తిలో జె.డి.ఆర్స్‌కి గల 1/4 వంతు హక్కు మాత్రం.

D.H.R. విలువ : రూ.5,00,000/-

అమీనా విలువ : రూ.15,00,000/-

వేలం తేది : 10-12-2025

యన్. దుర్గా ప్రసాద్

డిక్రీ హోల్డర్ తరపు న్యాయవాది

(c) eenadu

గుంటూరు పశ్చిమ

సాగు పద్ధతులు మార్పు చేసుకోవాలి

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గోరంట్ల, న్యూస్‌టుడే: మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా అన్నదాతలు సాగు పద్ధతుల్లో మార్పు చేసుకోవాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. గుంటూరు రూరల్ మండలం చినపలకలూరు గ్రామంలో సోమవారం రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా రైతులతో మాట్లాడారు. వారికి అందుతున్న పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సూచించిన పంచసూత్రాలను వివరించారు. ప్రభుత్వం రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చిన పథకాలను అధికారులు.. రైతుల ఇంటికే వెళ్లి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జేడీఏ ఎం.నవ్యశ్రీ, రూరల్ మండలం ప్రత్యేక అధికారి ఎల్.వజ్రశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80086 22566, 97042 53525, 80085 74897

రహదారిలో చెత్త తొలగింపు: స్థానిక బజ్జి బంక్ వెనుక తెలుగు అపార్ట్‌మెంట్‌కి వెళ్లే దారిలో చెత్త పేరుకుపోయింది. సైడ్ కాలువ వెంబడి పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో దోమల బెడద ఎక్కువైంది. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో చెత్త తీసివేయించే చర్యలు తీసుకున్నారు.
? లక్ష్మీనగర్ రెండో లైనులో సైడ్ కాలువలో మురుగు ముందుకు కదలకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. - స్థానికులు ✔ సిబ్బందిని పంపి కాలువలో పూడిక తీసేలా చర్యలు తీసుకుంటాం. - నాగేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ - న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: రహదారి విస్తరణ పనుల్లో భాగంగా లైన్ల మార్పు, చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున కృష్ణనగర్, కుందులు రోడ్డు తదితర ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు డీఈఈ గురవయ్య తెలిపారు.

నాణ్యత డొల్ల.. రహదారులు గుల్ల

కమీషన్ల మత్తులో పర్యవేక్షణ మరచిన అధికారులు

న్యూస్‌టుడే-నగరపాలక సంస్థ, పట్టాభిపురం

✪ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని నవభారత్‌నగర్ మొదటి లైన్‌లో ఓ రహదారి నిర్మాణం ఇటీవలే పూర్తి చేశారు. బీటీ లేయర్ సక్రమంగా వేయలేదు. నాసిరకం మెటీరియల్ వాడారు. కానీ.. ప్రమాణాల ప్రకారమే రోడ్డు వేసినట్లు బిల్లులు చేసుకుంటున్నారు.

✪ తూర్పు నియోజకవర్గ పరిధిలోని సుద్దపల్లిడొంకరోడ్డు తిరుపతమ్మ గుడి వద్ద నుంచి దుర్గానగర్ చర్చి అవతలి వరకు కొన్ని నెలల క్రితమే బీటీ రోడ్డు వేశారు. నాసిరకంగా నిర్మించడంతో కాస్త వర్షాలకే గుల్లగా మారిపోతోంది. యూజీడీ మ్యాన్‌హోల్స్ ఉన్నచోట సక్రమంగా పనులు చేయకపోవడంతో వాహనదారులు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు.

నవభారత్‌నగర్‌లో నాసిరకంగా వేసిన బీటీరోడ్డు

మ్యాన్‌హోల్స్ వద్ద లెవల్స్ సరిగా చేయకుండా వదిలేశారు

✪ కన్యకాపరమేశ్వరి దేవాలయం నుంచి బారా ఇమాం పంజా వరకు సీసీ రోడ్డును కొన్ని నెలల క్రితమే నిర్మించారు. నాణ్యతా ప్రమాణాల్లేకపోవడంతో మొత్తం గోతులమయంగా మారింది.

నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగ పనితీరు నిరర్థకంగా ఉంది. పనులపై పర్యవేక్షణ లేక.. గుత్తేదారుల ఇష్టారాజ్యం నడుస్తోంది. కమీషన్లు తినమరిగిన కొందరు అధికారుల తీరు ప్రజాధనానికి తూట్లు పొడుస్తోంది. సాధారణంగా బీటీ రహదారులను నాణ్యతతో నిర్మిస్తే కనీసం ఐదేళ్లపాటు మన్నిక ఉంటుంది. ప్రస్తుతం నిర్మించినవి రెండు, మూడు నెలలకే రూపు కోల్పోతున్నాయి. మొత్తంగా గుల్లగా మారిపోతున్నాయి.

కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.60 కోట్లకుపైగా పనులు చేశారు. ఇటీవల మరో రూ.40 కోట్ల విలువైన పనులకు ఆమోదం లభించింది. వీటి పర్యవేక్షణను ఎస్‌ఈ, ఈఈ స్థాయి అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. కేవలం డ్వొప్లోనే పనులకు బిల్లులు, ఎంబుక్ నమోదు వంటి వాటికే పరిమితమవుతున్నారు.

థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఎక్కడ?

పనులను ఏఈ, డీఈ స్థాయి అధికారులు తరచూ పరిశీలించాల్సి ఉన్నా.. ఆ బాధ్యతలను వార్డు సచివాలయ కార్యదర్శులకు అప్పగించారు. థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్ పరిశీలనను విజయవాడలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలకు అప్పగించినట్లు అధికారులు చెబుతున్నారు. . వాటి ఫలితాలు ఏమవుతున్నాయో వారికే తెలియాలి.

ధర వరలు

కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 52, వంగ (సన్నాలు) 45, బెండ 39, పచ్చిమిర్చి 45, కాకర 54, బీర 46, క్యాలీఫ్లవర్ 25, క్యాబేజి 30, క్యారెట్ 61, దొండ 44, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 22, గోరుచిక్కుడు 59, దోస 32, సొర 27, పొట్ల 40, అరటికాయ 7, పెద్దచిక్కుళ్లు 120, చామదుంప 22, ముల్లంగి 14, బీట్‌రూట్ 41, కీరదోసకాయ 29, బీన్స్ 49, క్యాప్సికమ్ 79, కొత్తిమీర 25, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 28, అల్లం 80, వెల్లుల్లి 110. - న్యూస్‌టుడే, పట్టాభిపురం

అందరికీ ఆధార్ నమోదు చేయాలి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరికీ ఆధార్ నమోదు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. కలెక్టరేట్ నుంచి సోమవారం రీసర్వే, గృహనిర్మాణం, గ్రామ, వార్డు సచివాలయ సేవలు, ఉపాధి పథకం అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డివిజన్, మండల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ రీసర్వేలో ముటేషన్ల దరఖాస్తులపై రెవెన్యూ డివిజన్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అర్హులందరికీ పీఎం ఆవాస్ యోజన గ్రామీణ్ సర్వేలో నమోదు చేయాలన్నారు. ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం ఎన్‌పీసీఐ, ఆటో డ్రైవర్ల సేవలో కేవైసీ పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలని, కౌశలం సర్వే, స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించేలా చూడాలన్నారు. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ మార్గదర్శకాల ప్రకారం రీసర్వే నిర్వహించాలని తహసీల్దార్లు, రెవెన్యూ డివిజన్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో ఖాజావలి, జడ్పీ సీఈఓ జ్యోతిబసు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ మంత్రి పర్యటన నేడు

గోరంట్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మంగళవారం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు పరిశీలించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు మేడికొండూరు మండలం పేరేచర్లలోని పత్తి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అక్కడి కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలిస్తారు. అనంతరం మేడికొండూరులో పత్తి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడతారు. తర్వాత సత్తెనపల్లిలోని పత్తి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించనున్నారు. అనంతరం బయలుదేరి విజయవాడలోని అతిథిగృహానికి చేరుకుంటారు. ఈ మేరకు జిల్లా పౌరసంబంధాల శాఖ సోమవారం ప్రకటన విడుదల చేసింది.

'పట్టాభి' అవార్డుల ప్రదానం

పురస్కార గ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరున స్థాపించిన పట్టాభి కళాపీఠం 15వ వార్షికోత్సవం, పట్టాభి అవార్డుల ప్రదానోత్సవం సోమవారం ఘనంగా జరిగాయి. బ్రాడీపేటలోని కొరటాల భవనంలో ఈ సందర్భంగా జరిగిన సభకు కళాపీఠం అధ్యక్షుడు తూములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లోని ప్రతిభావంతులైన మహిళలను ఎంపిక చేసి పట్టాభి అవార్డులతో సత్కరిస్తున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అఖిల భారత పంచాయితీ పరిషత్ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు సంస్థ నిర్వహిస్తున్న సామాజిక సేవలను, పట్టాభి సీతారామయ్య జీవిత విశేషాలను వివరించారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత వలివేటి శుభావతి, జిల్లా అటవీ శాఖాధికారిణి హిమ్మశైలజ, నాటక రచయిత కావూరి సత్యనారాయణ, డాక్టర్ ఆంధ్రూ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వలివేటి శుభావతి, డాక్టర్ లలితా సింధూరి, డాక్టర్ లావణ్య, డాక్టర్ ప్రశాంతిలక్ష్మీదేవి, కె.అనూరాధ, ధారా శ్రీలక్ష్మి, వి.నాగరత్నం, హిమ శైలజలకు పట్టాభి స్మారక అవార్డులిచ్చి నిర్వాహకులు సత్కరించారు.

సీతారామయ్యకు ఘన నివాళి

ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య జయంతి సందర్భంగా సోమవారం బ్యాంకు అధికారులు, విశ్రాంత ఉద్యోగులు హిందూ కళాశాల కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ హెడ్ సయ్యద్ జవహర్, నాయకులు జయంతి సభలో పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, కలెక్టరేట్

అర్జీల పరిష్కారానికి చర్యలు

నగరపాలక సంస్థ: జీఎంసీకి వివిధ మార్గాల్లో వస్తున్న ప్రజా ఫిర్యాదులు, సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం ఆయన డయల్ యువర్ కమిషనర్ నిర్వహించారు. కౌన్సిల్ హాలులో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 27 అర్జీలు స్వీకరించారు. వాటిని ఆయా ఫిర్యాదులు విభాగాల అధికారులకు పంపించారు.

కళ్లప్పగించి చూస్తారా.. కట్టడి చేస్తారా..

నగరంలోకి ప్రవేశించేందుకు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు భారీ వాహనాలకు అనుమతి లేదు. ఏదైనా అత్యవసర పనులు ఉంటేనే వాటికి మినహాయింపు ఇస్తారు. ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రహదారి భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై ఇటీవల జీఎంసీలో సమీక్ష నిర్వహించి కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు తెలిపారు. నగరంలోకి లారీలు, టిప్పర్లు వంటివి పగటి సమయంలో ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగిస్తున్నాయి. అవి వేగంగా వెళ్తుండడంతో ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘించే భారీ వాహనాల విషయంలో కఠినంగా వ్యవహరించి కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

మారుతీనగర్: మధ్యాహ్నం వేళ..

రోడ్డెక్కిన మురుగు.. వేయలేవు అడుగు..

రామన్నపేట నాలుగో లైన్‌లో ఏళ్లుగా మురుగు నీటి సమస్యలతో స్థానికులు అవస్థలు పడుతున్నా ఇంజినీరింగ్ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. మురుగు కాల్వల నిర్మాణం లేకపోవడంతో ఇళ్లలో వాడిన నీరు రోడ్డుపైకి వదిలేస్తున్నారు. ఈ మురుగు నీరు రోజుల తరబడి రహదారిపైనే నిలిచిపోతుంది. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హెచ్ఎల్ఆర్ దగ్గరగా ఉన్నా.. అధికారులకు ఇక్కడ సమస్య కనిపించకపోవడం దారుణం. వెంటనే ఇక్కడ కాల్వల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకుని మురుగునీటి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

ఇలా తవ్వి వదిలేస్తే ఎలా..?

ఇన్నర్ రింగు రోడ్డులో విజయ్ డిజిటల్స్ వద్ద సైడు కాల్వల నిర్మాణం కోసం దుకాణాలు, గృహాల ఎదుట తవ్వేశారు. నెల రోజులు దాటుతున్నా.. అక్కడ ఎటువంటి పనులు చేపట్టకుండా వదిలేయడం వల్ల చెక్కలపైనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. సైడు కాల్వల నిర్మాణాలు వెంటనే చేపట్టేలా అధికారులు దృష్టి సారించాలని ఆ ప్రాంత దుకాణాల యజమానులు, ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

సమయపాలనతో విధులు నిర్వహిస్తే ఒత్తిడి దూరం

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: సమయపాలనతో కూడిన దినచర్య పాటించడం ద్వారా వైద్య విద్యార్థులు ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి తెలిపారు. గుంటూరు వైద్య కళాశాలలో సైకియాట్రీ విభాగం, మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ సంయుక్తంగా అధ్యాపకులతో విద్యార్థుల భావోద్వేగ అంచనా కార్యక్రమంలో అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. మొదటి సంవత్సర వైద్య విద్యార్థులకు ఒత్తిడిని ఎలా జయించాలి, ఒత్తిడిలో ఉన్న సహ విద్యార్థులను ఎలా గుర్తించాలి అనే అంశాలపై సుందరాచారి అవగాహన కల్పించారు. సైకియాట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నిమిషా, ఈఏఎస్ఈ ప్రోగ్రామ్ సమన్వయకర్త డాక్టర్ అపర్ణ, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఆసరా లేదన్నా ఆలకించరా..!

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు మంచానికే పరిమితమై కుటుంబ జీవనానికి సహకారం అందించాలంటూ ఒకరు.. పింఛను కోసం దరఖాస్తు చేసుకుంటే పత్రాలు లేవంటూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ మరొకరు. ఇలా ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులకు విన్నవించినా సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అర్జీదారులు వ్యయప్రయాసలకోర్చి వస్తున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పలువురు పింఛను కోరుతూ.. మరికొందరు అదనపు పింఛను మంజూరు చేయాలని అర్జీలు అందించారు.

సరకు రవాణా వాహనంలో జాన్‌సైదాను తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు

మంచానికే పరిమితమై..

కొల్లిపర మండలం దావులూరుకు చెందిన జాన్‌సైదా కొన్నేళ్ల కిందట పని ప్రదేశంలో విద్యుదాఘాతంతో డాబాపై నుంచి పడిపోయారు. వెన్నుపూసలో నరం తెగిపోయి మంచానికే పరిమితమవ్వడంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. ప్రస్తుతం రూ.6 వేల పింఛను వస్తున్నా సరిపోవడంలేదు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అధికారులు స్పందించి అదనపు పింఛను మంజూరు చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. కనీసం కూర్చోలేని స్థితిలో ఉన్న జాన్‌సైదాను ఓ సరకు రవాణా వాహనంలో మంచంపై పడుకోబెట్టుకుని పీజీఆర్ఎస్‌కు తీసుకొచ్చారు. అధికారులు అక్కడకు వచ్చి చూసి వెళ్లారు.

ఏదొక కారణంతో తిప్పుతున్నారు: బి.సుధారాణి

మాది వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడి గ్రామం. కుమార్తె కృష్ణవేణి దివ్యాంగురాలు. ఆమెకు పింఛను కోసం దరఖాస్తు చేసుకుంటే రేషన్ కార్డు కావాలన్నారు. అది వచ్చాక దరఖాస్తు చేసుకుంటే హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ అవ్వలేదన్నారు. ఇటీవల ఆ ప్రక్రియ పూర్తి చేసుకుని మూడు నెలల కిందట పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించాం. అప్పటి కలెక్టర్ ప్రత్యేక కేసుగా పరిగణించి పింఛను మంజూరు చేయాలని సూచించినా కాలేదు. అధికారులు స్పందించి కుమార్తెకి పింఛను ఇప్పించాలి.

కుమార్తె కృష్ణవేణితో వచ్చిన తల్లి సుధారాణి

ఎన్నికలకు ముందుగానే కులగణన జరపాలి

కలెక్టరేట్‌కు వచ్చిన కేసన శంకరరావు, కుమ్మర క్రాంతికుమార్ తదితరులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలయ్యేలా ప్రభుత్వం ముందుగానే డెడికేటెడ్ కమిషన్ ద్వారా కులగణన జరిపించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో సోమవారం వినతిపత్రం అందించారు. కేసన శంకరరావు మాట్లాడుతూ సామాజిక వర్గాలు ఎవరెంత మంది ఉన్నారో తెలియకుండా, ఎవరికి ఎంతెంతని రిజర్వేషన్లు అమలు చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ కేంద్రం ఏవిధంగా ఈడబ్ల్యూఎస్ పేరిట అగ్రకుల పేదలకు రిజర్వేషన్లు ఇచ్చిందో. . అదేవిధంగా బీసీల రిజర్వేషన్లను న్యాయ-రాజ్యాంగపర అవరోధాలు రాకుండా రాష్ట్రాలు పెంచుకునేలా... పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కన్నా మాస్టర్, రాష్ట్ర యువజన అధ్యక్షుడు పారేపల్లి మహేష్, డి.రామకృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోలా అశోక్, బాదినేడి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ల వారీగా సమగ్ర సర్వే చేపట్టండి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర పరిధిలో అన్, అండర్ అసెస్‌మెంట్లు ఉండడానికి వీల్లేదని, మంగళవారం నుంచి వార్డు సచివాలయాల కార్యదర్శులు క్లస్టర్లవారీగా సమగ్ర సర్వే చేపట్టాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జీఎంసీ పరిధిలో వార్డు సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో ప్రతీ నిర్మాణాన్ని పరిశీలించాలన్నారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. రిపోర్టుల్లో తప్పులుంటే సంబంధిత సిబ్బందితో పాటు పర్యవేక్షణ అధికారులు కూడా బాధ్యులవుతారని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఓబులేసు, డీసీలు సీహెచ్ శ్రీనివాస్, వెంకటకృష్ణయ్య, బి.శ్రీనివాసరావు, సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ, మేనేజరు బాలాజీ బాషా తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

నేటి నుంచి సమానత్వమే లక్ష్యంగా ప్రచారోద్యమం

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: స్త్రీ, పురుషుల మధ్య లింగ సమానత్వం కోసం నయీ చేతన 4.0 కార్యక్రమాన్ని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నారు. కలెక్టర్ కార్యాలయం నుంచి కన్నావారితోట మూడు బొమ్మల వరకు ప్రదర్శన జరగనుంది. వికసిత్ గ్రామీణ భారత్ దిశగా సమ్మిళిత వృద్ధికి ఆర్థిక సాధికారతకు మహిళలు ముందుండాలి అనే స్ఫూర్తితో డిసెంబరు 23వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈమేరకు డీఆర్‌డీఏ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్ణయించిన కార్యక్రమాలు చేస్తారు.

పనులు ప్రారంభంకాని టెండర్ల రద్దు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: టెండర్ల ద్వారా పనులు పొంది.. క్షేత్రస్థాయిలో ప్రారంభించనివాటిని రద్దు చేయాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం ఉద్యోగనగర్, విజయపురికాలనీ, రెడ్డిపాలెం ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అసంపూర్తి పనులను ఏఈల వారీగా గుర్తించి రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలవాలని ఆదేశించారు. ఉద్యోగనగర్‌లో స్థానికుల ఫిర్యాదుల మేరకు డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కమిషనర్ వెంట డీఈఈ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా ఎంపిక

షేక్ ఖాజా మొహిద్దీన్

గుంటూరుక్రీడలు, న్యూస్‌టుడే: రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగే ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్-2025 స్విమ్మింగ్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా ఎన్టీఆర్ స్విమ్మింగ్ పూల్ శిక్షకుడు షేక్ ఖాజీమొహిద్దీన్ ఎంపికయ్యారు. గతంలో ఆయన గుజరాత్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలకు, ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌కు టెక్నికల్ అఫీషియల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు క్రీడాకారులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించాలి

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీల్లోనూ రాణించాలని పాటిబండ్ల సీతారామయ్య పాఠశాల కార్యదర్శి విష్ణువర్ధన్ పేర్కొన్నారు. ఇటీవల పొరంకిలో నిర్వహించిన జిల్లా స్థాయి టెన్నిస్ పోటీల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న హర్షవర్ధన్ ప్రథమ స్థానంలో నిలిచాడు. హర్షవర్ధన్‌ను సోమవారం ఆయనతో పాటు అకడమిక్ డైరెక్టర్ కృష్ణవేణి అభినందించారు. విష్ణువర్ధన్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దుర్గాశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన హర్షవర్ధన్‌ను అభినందిస్తున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి

విరిగిన చెట్టు కొమ్మ.. రాకపోకలకు అంతరాయం..

పట్టాభిపురం, న్యూస్‌టుడే: చంద్రమౌళీనగర్ నాలుగో లైనులో ఒక భారీ వృక్షం చెట్టు కొమ్మ విరిగిపడింది. సరకు రవాణా చేసే లారీ అటువైపుగా వెళ్లడంతో చెట్టు కొమ్మ విరిగిందని స్థానికులు తెలిపారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ ప్రాంతంలో విద్యా సంస్థలు ఉండడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్ అక్కడకు చేరుకుని చెట్టు కొమ్మలు తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

టీజేపీఎస్ కళాశాలలో మెగా స్పోర్ట్స్ మీట్

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: టీజేపీఎస్ కళాశాలలో డిసెంబరు 11, 12 తేదీల్లో మెగా స్పోర్ట్స్ మీట్-2025 నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం తెలిపారు. స్పోర్ట్స్ మీట్ బ్రోచర్‌ని కోశాధికారి వి.కృష్ణానంద్, పీజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, ప్రిన్సిపల్ డాక్టర్ కామేశ్వరశాస్త్రి, కోచ్ ఆర్.శివాజీ, వ్యాయామ అధ్యాపకుడు వాసుదేవరావుతో కలిసి ఆయన సోమవారం ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి మాట్లాడుతూ వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, టేబుల్ టెన్నిస్, షటిల్, వెయిట్ లిఫ్టింగ్, చెస్, క్యారమ్స్ పోటీలు బాలుర, బాలికలకు వేర్వేరుగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేవారు తప్పనిసరిగా పాఠశాల, కళాశాల నుంచి గుర్తింపు కార్డు, క్రీడా కిట్, యూనిఫాం, వయసు ధ్రువపత్రం తెచ్చుకోవాలన్నారు. విజేతలకు పతకాలతో పాటు పాల్గొన్నవారికి ధ్రువపత్రాలు ఇస్తామని చెప్పారు. వివరాలకు 80008 314907, 9849703144 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బ్రహ్మం తదితరులు

అనధికార వ్యాపారాన్ని అడ్డుకోండి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: బుడంపాడు బైపాస్ వద్ద బాబా ఆశ్రమం పక్కన నిర్వహిస్తున్న అనధికార హోల్‌సేల్ కూరగాయల వ్యాపారాన్ని నిలిపేయాలని కొల్లి శారద మార్కెట్ దుకాణదారులు డిమాండ్ చేశారు. సోమవారం కౌన్సిల్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం ఇచ్చి బయటకు వచ్చాక నిరసన వ్యక్తంచేశారు. భూమిని కొన్నట్టు దొంగ అగ్రిమెంట్ పత్రాలు చూపి ఆ స్థలంలో వ్యాపారాలు చేస్తున్నారని విమర్శించారు.

బాలికను మోసం చేసిన కూలీపై పోక్సో కేసు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడి మోసం చేసిన వ్యక్తిపై పట్టాభిపురం ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. అచ్చంపేట మండలానికి చెందిన ఓ బాలిక నగరంలోని బంధువుల ఇంట్లో ఉంటూ.. ఓ ప్రైవేట్ కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన కూలి పనులు చేసుకునే తిరుపతయ్య బాలికకు మాయమాటలు చెప్పి లాడ్జిలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక కనిపించకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు మొదట పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. తర్వాత బాలిక ఆచూకీ లభ్యమైంది. ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా గర్భవతి అని తేలింది. దీంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చేవారికి కంటి వైద్య సదుపాయం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు సుదర్శన కంటి ఆసుపత్రి ఏర్పాటు చేసిన మొబైల్ యూనిట్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం పరిశీలించారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చేవారికి కంటి వైద్యసేవలు అందించనున్నట్లు సుదర్శని కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రాజేష్ గణేశుని తెలిపారు. అనంతరం మొబైల్ యూనిట్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, సుదర్శని కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దుర్గా చైతన్య, డాక్టర్ అదితి సిబ్బంది పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, కలెక్టరేట్

రాజ్యాంగంపై అవగాహన

నెహ్రూనగర్: భారత రాజ్యాంగం ఉన్నతమైనదని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు అన్నారు. బ్రాడీపేటలోని జాషువా విజ్ఞానకేంద్రంలోఅంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు విల్సన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, మహిళలకు రాజ్యాంగంపై అవగాహన సెమినార్ సోమవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు రచించిన బాలల కోసం రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాన్ని అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

గుంటూరు ఐఎంఏకు పురస్కారాలు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: వివిధ రంగాల్లో అందించిన సేవలకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖకు రాష్ట్ర స్థాయిలో ఐదు పురస్కారాలు లభించాయి. ఇటీవల అన్నమయ్య జిల్లా రాజంపేటలో నిర్వహించిన ఐఎంఏ రాష్ట్ర సదస్సులో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ బన్సాలి ఈ అవార్డులు ప్రదానం చేశారు. ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్, కార్యదర్శి బి.సాయికృష్ణ, వి.మహేష్, డి.అమరలింగేశ్వరరావు, ఎస్.కిషోర్, ఎం.పరిణికుమార్ తదితరులు వీటిని అందుకున్నారు.

డాక్టర్ దిలీప్ బన్సాలి నుంచి అవార్డులు అందుకుంటున్న డాక్టర్ సేవకుమార్, డాక్టర్ సాయికృష్ణ తదితరులు

(c) eenadu

'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన'ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు. వేదికపై కృష్ణా జిల్లా డీఈవో రామారావు, పి.వి.పి. సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శివాజీబాబు, శ్రీ చైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ జీఎం ఎం.మురళీకృష్ణ, ఈనాడు ఏపీ బ్యూరో చీఫ్ కనపర్తి శ్రీనివాస్, ఈనాడు విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్‌కే కిషోర్‌కుమార్

ఈనాడు అమరావతి
కృష్ణా
మంగళవారం నవంబరు 25, 2025

బాల ఉషస్సు.. భావి యశస్సు

ఆధునిక పరిజ్ఞానంతో.. సమస్యలకు పరిష్కారాలు

'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన'లో అబ్బురపరిచిన ఆవిష్కరణలు

– ఈనాడు, అమరావతి
– కానూరు, పటమట, న్యూస్‌టుడే

సమాజంలో ఎదురయ్యే ప్రధాన సమస్యలన్నింటికీ ఆధునిక పరిజ్ఞానంతో పరిష్కారం చూపించొచ్చని పలువురు విద్యార్థులు చాటిచెప్పారు. రహదారి ప్రమాదాలను నివారించేందుకు వాహనాలకు ఆటోమేటిక్ బ్రేక్ సిస్టమ్, నగరాల్లో స్మార్ట్ పార్కింగ్, వ్యవసాయంలో కీటకాల ముప్పును నివారించేందుకు సోలార్ ట్రాపర్స్, వరదల వేళ మునిగిపోకుండా ఉండే స్మార్ట్ వంతెనలు, కృత్రిమ మేధతో పనిచేసే ఫైర్ ఇంజిన్లు, రైలు ప్రమాదాలను నివారించే రోబో టెక్నాలజీ, కుక్క కాటు నుంచి రక్షించేందుకు చేతులు, కాళ్లకు కవచాలు, యాంటీ సూసైడ్ ఫ్యాన్లు, విద్యుత్తును ఆదా చేసేలా స్మార్ట్‌సిటీ ప్రణాళికలు.. ఇలా విద్యార్థులు రూపొందించిన 85 ప్రాజెక్టులు ఔరా అనిపించాయి. వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు నిర్వహించిన 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన'కు అనూహ్య స్పందన వచ్చింది. కానూరులోని పి.వి.పి.సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో.. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని ఆరు నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులకు సోమవారం నిర్వహించిన ఈ మెగా సైన్స్ ఫెయిర్‌ను తిలకించేందుకు వేలాదిగా విద్యార్థులు తరలివచ్చారు.

శ్రీచైతన్య విద్యాసంస్థలు

1 ఎనర్జీ ఎఫిషియన్సీ స్మార్ట్ సిటీ

విద్యార్థులు: తేజస్విని, భరత్, 10వ తరగతి, జడ్పీహెచ్‌ఎస్ కానూరు

ఆధునిక పరిజ్ఞానంతో సమస్యలకు పరిష్కారం చూపించే నగరం నమూనా. వాహనాలు వచ్చేటప్పుడు వీధి దీపాలు వెలగడం, జాతీయ రహదారులపై గాలి మరల ద్వారా ఆటోమేటిక్‌గా దీపాలను వెలిగించడం, సెన్సార్ల ద్వారా బ్యాంకు చోరీలు జరగకుండా అప్రమత్తమవ్వడం, స్మార్ట్ చెత్త డబ్బాలు, అగ్నిప్రమాదాల వేళ మంటలను నీటితో ఆర్పే సెన్సార్ల వ్యవస్థ.. ఈ ఆరు అంశాలతో రూపొందించిన ఈ ప్రాజెక్టుకు మొదటి బహుమతి వచ్చింది.

2 స్మార్ట్ బ్రిడ్జి

విద్యార్థులు: జి.రోహిత్(9వ తరగతి), ఆర్.దుర్గ(8వ తరగతి), శ్రీమల్లికార్జున హైస్కూల్, గన్నవరం

వరదల సమయంలో వంతెనలు మునిగిపోకుండా పరిష్కారం చూపించే ప్రాజెక్టు. నీటిలో ఉండే సెన్సార్ల ద్వారా వరద ప్రవాహం ఉద్ధృతి, ఎత్తును అంచనా వేసి. దానికి తగ్గట్టుగా వంతెన ఆటోమేటిక్‌గా పైకి వస్తుంది. దీని వల్ల వాహనాలకు వరద ముంపు ప్రమాదం ఉండదు. ఈ ప్రాజెక్టుకు రెండో బహుమతి వచ్చింది.

3 యాంటీ సూసైడ్ ఫ్యాన్

విద్యార్థులు: బి.కార్తికేయ, బి.వెంకట సందీప్, కె.కార్తీక్, క్రైస్ట్ ది కింగ్ పాఠశాల, క్రీస్తురాజపురం, విజయవాడ

హాస్టల్ గదులు, ఇళ్లు, హోటళ్లలో ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడేవారు ఫ్యాన్లకే ఉరేసుకుంటారు. వీటిని నివారించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. బరువు పెరిగిన వెంటనే ఆటోమేటిక్‌గా ఫ్యాన్ నేల మీదకి దిగిపోతుంది. వెంటనే ఈ ఫ్యాన్లను బిగించిన సమయంలో నమోదు చేసిన ఫోన్ నంబరుకు అలర్ట్ మెసేజ్ వెళ్లిపోతుంది. పెద్ద శబ్దంతో అలారం మోగుతుంది. ఈ ప్రాజెక్టుకు మూడో బహుమతి వచ్చింది.

ప్రాజెక్టులకు పేటెంట్ తెప్పించాలి

-విజయరామరాజు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్

విద్యార్థులు చేసే ప్రాజెక్టులకు పేటెంట్ కోసం సైన్స్ టీచర్లు దరఖాస్తు చేయాలి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు ఉండాలి. విద్యార్థులు ఏ ఆవిష్కరణ చేయాలన్నా సామగ్రి అందుబాటులో ఉండాలి. కొందరు ఇంజినీరింగ్ విద్యార్థుల్ని అడిగినా చెప్పలేని చిప్‌లు, సెన్సార్ల గురించి ఈ విద్యార్థులు చెప్పడం అభినందనీయం. ప్రభుత్వ పాఠశాలల్లోనూ అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రదర్శన ఏర్పాటు చేసినందుకు 'ఈనాడు'కు ధన్యవాదాలు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థినుల సందడే సందడి

ప్రాజెక్టులను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

మరిన్ని నిర్వహించాలి..

-పాలడుగు లక్ష్మణరావు, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి

వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థి జీవితంలో కీలకం. సుమారు 85 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని తమ ప్రాజెక్టులను ప్రదర్శించడం అభినందనీయం. 'ఈనాడు' ఆధ్వర్యంలో సమాజ చైతన్యం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. భవిష్యత్తులోనూ మరిన్ని జరగాలి.

లేజర్ సెక్యూరిటీ అలారం

విద్యార్థులు: సీహెచ్.నవీన్, ఇస్మాయిల్, 9వ తరగతి, జడ్పీహెచ్‌ఎస్ బంటుమిల్లి

ఇళ్లకు పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేయడమే లక్ష్యం. ఇళ్ల చుట్టూ పెన్సిళ్ళ ఏర్పాటు చేసి సెన్సార్లతో అనుసంధానిస్తారు. ఎవరైనా వచ్చి దానిని తాకగానే పెద్ద శబ్దంతో అలారం మోగుతుంది. సెల్‌ఫోన్‌కు అలర్ట్ మెసేజ్ వెళ్లిపోతుంది.

రహదారులపై ప్రమాదాల నివారణ

విద్యార్థులు: పవన్‌కుమార్(10వ తరగతి), ప్రేమ్‌నాథ్(9వ తరగతి), ఎం.కె.బేగ్ హైస్కూల్, అజిత్‌సింగ్‌నగర్

వాహనం వెళ్లేటప్పుడు అకస్మాత్తుగా వచ్చే ప్రమాదాల వేళ ఆటోమేటిక్‌గా బ్రేకులు పడి ఆగిపోతుంది. వాహనానికి బిగించిన సెన్సార్ల ద్వారా.. నాలుగు వైపులా ఎంత దూరంలో ప్రమాదం ఉన్నా వెంటనే కారులో హెచ్చరిక సంకేతాలు వస్తాయి.

ప్రోత్సాహక బహుమతులు

వినూత్నంగా ఆలోచిస్తే...

–రాజశేఖరబాబు, సీపీ

ప్రతి విషయాన్ని వినూత్నంగా ఆలోచించడం అలవాటు చేసుకోవాలి. అప్పుడే ఆకాశమే హద్దుగా చెలరేగిపోవచ్చు. ప్రతి సందర్భంలోనూ ఇంతకంటే బాగా ఎలా చేయొచ్చు అని ఆలోచించి ఆ దిశగా ప్రయత్నిస్తే మన ప్రయాణం అద్భుతంగా సాగుతుంది. ఏఐ, మిషన్‌లెర్నింగ్, డ్రోన్ ఇలా అన్నీ ఆధునిక పరిజ్ఞానం నుంచి పుట్టుకొచ్చినవే. ప్రతి రంగంలోనూ ఆవిష్కరణలు అవసరం.

పరిశ్రమల వ్యర్థాల నుంచి ఇంకు తయారీ

విద్యార్థులు: యు.ధనశ్రీనివాస్(10వ తరగతి), వేముల అఖిల్(8వ తరగతి), జడ్పీహెచ్‌ఎస్ పరిటాల

పరిశ్రమల నుంచి వాయువులను ఒడిసిపట్టి. వాటి నుంచి నల్లని ఇంకు తయారు చేయడం ఉద్దేశం. ఒక కంటైనర్ లాంటి యంత్రాన్ని పరిశ్రమలు ఉండే ప్రాంతంలో పెడతారు. దాని ద్వారా వచ్చే గాలిలో నుంచి రసాయన వ్యర్థాలను తీసి పౌడర్‌గా మారుస్తారు. స్వచ్ఛమైన గాలిని వదిలేస్తారు. ఆ పౌడర్‌కు నూనెలను కలిపి ఇంకు తయారు చేస్తారు.

డాగ్ బైట్ సాక్స్

విద్యార్థులు: టి.విశ్వాస్, కుశల్ పవన్‌సాయి, 9వ తరగతి, జడ్పీహెచ్‌ఎస్ తేలప్రోలు

కుక్కలు కరిచినా గాయం కాకుండా తప్పించుకోవచ్చు. పలుచని కాపర్ రేకు, దానిపైన తోలు, గుడ్డతో సాక్స్ రూపంలో తయారు చేసి చేతులు, కాళ్లకు తొడుక్కోవచ్చు. ప్రస్తుతం వీధి కుక్కల బెడద పెరిగిపోయి చాలా మంది చిన్నారులు వాటి బారినపడుతున్నారు. ప్రధానంగా కాళ్లు, చేతులపైనే అవి కరుస్తున్నాయి. అందుకే ఈ డాగ్ బైట్ సాక్స్ తయారు చేశారు.

ప్రోత్సాహక బహుమతులు

మరిన్ని వార్తలు, చిత్రాలు..www.eenadu.net లో

Expert Advice Exclusive Properties
ప్రవేశం ఉచితం
EENADU PROPERTY SHOW 2025
29th - 30th November-2025 Saturday - Sunday
Timing: 10am - 8pm
Place: A.Convention Centre. Bunder Road, Vijayawada
Time: 10 AM to 8 PM
For Details Contact
80080 03297, 99590 21800

1912లో బ్రిటీషు వారు ఏర్పాటు చేసిన దస్త్రాల గది

నేటికీ చెక్కు చెదరలేదు!

బ్రిటిషు కాలంలో 1912లో ఏర్పాటుచేసిన దస్త్రాల గది, దానిలోని రేక్‌లు నేటికీ చెక్కుచెదరకుండా మన్నికగా ఉన్నాయి. 1912లో బ్రిటీషు వారు అవనిగడ్డలో తహసీల్దార్ కార్యాలయం నిర్మించి, పై అంతస్తులో ప్రత్యేకంగా దస్త్రాల గది ఏర్పాటు చేశారు. నాటి రాక్‌లు 12 అడుగుల ఎత్తు ఉండి, అవి పడిపోకుండా కింది భాగంలో చక్రాల వంటి దిమ్మలను ఏర్పాటు చేశారు. నాడు వేసిన రంగులు ఇప్పటికీ చెరిగిపోలేదు. భద్రపరచిన దస్త్రాల నుంచి కావలసిన దస్త్రం తీసుకోవడానికి కూడా నాడు ప్రత్యేకంగా ఒక విధానం ఉండేది. బి.5 గుమస్తాకు తప్ప ఎవరికీ ఈ గదిలోకి వెళ్లడానికి అనుమతి లేదని రాసిన బోర్డు ఇప్పటికీ ఉంది. అంటే.. రికార్డులకు అంత పటిష్ఠ భద్రత ఉండేది. ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే మంటలను ఆర్పడానికి కూడా ఫైరెక్స్ ఫోమ్ మిషన్ ఇప్పటికీ గుర్తుగా ఉంది. ప్రధాన ద్వారం తెరిచిన తర్వాత ఐరన్ గ్రిల్స్‌తో ఉన్న మరో తలుపు తీస్తే గాని లోపలకు వెళ్లడానికి అవకాశం లేదు. పై అంతస్తుకు ఏర్పాటుచేసిన రంగూన్ టేకుతో తయారు చేసిన మెట్లు 113 సంవత్సరాలైనా ఇప్పటికీ చెక్కుచెదరకుండా, రంగు కూడా పోకుండా ఉండటం చిత్రమే. - అవనిగడ్డ, న్యూస్‌టుడే

కొత్తపేట.. గురువుల కోట

ఒకే గ్రామం నుంచి 200 మంది ఉపాధ్యాయులు

అవనిగడ్డ, న్యూస్‌టుడే

అవనిగడ్డ శివారులోని కొత్తపేట చిన్న గ్రామం. 600 మంది జనాభా. మోటారు ఫీల్డే. ఇక్కడ ఎక్కువ మందికి జీవనాధారంగా ఉండేది. ఫ్యాక్షన్ గ్రామంగా కూడా ముద్ర ఉంది. ఇది గతం.

గ్రామంలో కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని మంచిగా, క్రమశిక్షణతో పెంచి ఉపాధ్యాయులను చేయాలనుకున్నారు. దాంతో వారు కష్టపడి పిల్లల్ని చదివించారు. 1964 నుంచీ ఈ మార్పు ప్రారంభమైంది. ఉపాధ్యాయులుగా స్థిరపడిన కొందరి నుంచి యువత స్ఫూర్తి పొందారు. దానికి అవనిగడ్డలో 1974లో వచ్చిన ఇంటర్మీడియట్ టీచర్ ట్రైనింగ్ తోడైంది. దానిలో చేరిన వారు పలువురు సెకండరీ గ్రేడ్ టీచర్లుగా నియమితులయ్యారు. ఆతర్వాత క్రమంగా ప్రతి డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికవుతూ వచ్చారు. వీరిలో మరికొంత మంది ఇంజినీర్లుగా, డాక్టర్లుగా కూడా స్థిరపడ్డారు. ఒకప్పుడు లారీ డ్రైవర్లు/క్లీనర్లుగా పనిచేసిన తల్లిదండ్రుల ఆశలు నెరవేరి గ్రామం రూపురేఖలు మారిపోయాయి.

కొత్తపేటలోని ప్రధాన వీధి...



☛ కొత్తపేటలో సుమారు 200 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వారి పేర్లతో సహా రికార్డు చేశాం. మరికొంత మంది ఇంజినీర్లుగా, డాక్టర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. చిన్న గ్రామంలో ఇంత మంది ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించడం గ్రామానికే గర్వకారణంగా ఉంది.

– కూనపరెడ్డి జీవేంద్రరావు, ఉపాధ్యాయుడు

☛ కొత్తపేట గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు కొంత మంది రిటైరు కాగా, ఎక్కువ మంది జిల్లాలో వివిధ గ్రామాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క ఉపాధ్యాయుడిని స్ఫూర్తిగా తీసుకొని మిగిలిన వారు ఉపాధ్యాయులుగా జీవితంలో స్థిరపడాలని చదువుపై శ్రద్ధ పెట్టి, కష్టపడి చదివారు.

– అన్నపరెడ్డి నాగచెంచయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు

కష్టమేమీ కాదంత..!

ఆకట్టుకుంటున్న కృత్రిమ దంతాల తయారీ యంత్రం

వైద్య రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకుంటే రోగులకు మెరుగైన చికిత్సలు అందించవచ్చని అంటున్నారు.. చిన్నఆవుటపల్లిలోని డా. సుధా, నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల వైద్యులు. సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా కొనసాగుతున్న ఉచిత దంత వైద్య శిబిరంలో అత్యాధునిక సాంకేతికతో రూపొందించిన కృత్రిమ దంతాల తయారీ యంత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆధునిక దంత వైద్య విధానాలను బలోపేతం చేసేందుకు ఎయిడెడ్ తయారీ విధానంతో రూపొందిన రూ.80 లక్షల విలువైన డెంట్స్ ప్లై సిరోనా క్యాడ్‌కామ్ యంత్రంతో గంటన్నర వ్యవధిలోనే కృత్రిమ దంతాలు తయారు చేయవచ్చని కళాశాల ప్రిన్సిపల్ డా.రామోజీరావు, హెచ్‌వోడీ డా.సునీల్‌చంద్ర తెలిపారు. ఎటువంటి లోహం లేని జిర్కోనియాతో తయారయ్యే ఈ కృత్రిమ దంతాలతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. వైద్య విద్యార్థులకు ఈ అత్యాధునిక సాంకేతిక చికిత్సపై ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నట్లు వెల్లడించారు. సాధారణంగా లోహంతో దంతం తయారీకి సుమారు నెల రోజుల సమయం పడుతుంది. కానీ కచ్చితత్వం ఉండదు. క్యాడ్‌కామ్ మీద గంటల వ్యవధిలో తయారయ్యే కృత్రిమ దంతాల్లో నూరుశాతం కచ్చితత్వం ఉంటుందని తెలిపారు..

–ఈనాడు, కృష్ణా, గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

ప్రత్యేక కంప్యూటర్‌లో పన్ను తయారీ

గంట వ్యవధిలో తయారైన కృత్రిమ పళ్లు ఇవే..

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త..!

విజయవాడ నేరవార్తలు : పోలీసులు ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త ఎత్తులు వేస్తున్నారని, సమాజానికి పెనుసవాలుగా మారారని పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు పేర్కొన్నారు. సైబర్ సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం సీపీ కార్యాలయంలో సీనియర్ సిటిజన్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేరాల బారినపడే వారిలో అధికంగా వృద్ధులు ఉన్నారని చెప్పారు. డిజిటల్ అరెస్టు అనేది లేనే లేదని స్పష్టం చేశారు. పోలీసులమంటూ ఎవరైనా వీడియో కాల్ చేసి.. అరెస్టు చేస్తున్నట్లు బెదిరిస్తే భయపడవద్దని సూచించారు. సీబీఐ, పోలీస్, కస్టమ్స్, ఈడీ, న్యాయమూర్తులు వీడియో కాల్ చేయరని వివరించారు.

పీటీ వారెంట్‌పై విజయ్‌భాస్కర్‌రెడ్డి కోర్టులో హాజరు

14 రోజులు రిమాండ్ విధించిన న్యాయాధికారి

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: సామాజిక మాధ్యమాల్లో మహిళలు, కూటమి నేతలు, న్యాయమూర్తులపై అసభ్య పోస్టులతో రెచ్చిపోయి అరెస్టు అయిన వైకాపా సోషల్ మీడియా కార్యకర్త మాలపాటి విజయ్‌భాస్కర్‌రెడ్డికి మరో కేసులో 14 రోజుల రిమాండ్ విధించారు. అసభ్య పోస్టులు పెట్టిన కేసులో విజయ్‌భాస్కర్‌రెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన పోలీసులపై నిందితుడు దాడిచేయడంతో పీటీ వారెంట్ దాఖలైంది. దీంతో నెల్లూరు జైల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితుడిని విజయవాడలోని ఆరో అదనపు కోర్టులో సోమవారం హాజరు పరిచారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయాధికారి లెనిన్‌బాబు విజయ్‌భాస్కర్‌రెడ్డికి 14 రోజులు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులు పెట్టిన కేసులో నిందితుడికి డిసెంబరు 5 వరకు రిమాండ్ పొడిగించిన విషయం తెలిసిందే. ✪ పోలీసులపై దాడి కేసులో అరెస్టు అయిన విజయ్‌భాస్కర్‌రెడ్డి సోదరుడు ఓబుల్‌రెడ్డికి కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది.

కొండంత ఆదరణ.. కోరినంత ఆదాయం

ఆర్టీసీ కార్గో సేవలపై ప్రజల నమ్మకం

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

ఆదాయ మార్గాల అన్వేషణలో భాగంగా ఆర్టీసీ చేపట్టిన పార్సిల్ రవాణా... ప్రజల్లో నమ్మకం పెంచుకోవడంతో ఆదాయం ఏటేటా పెరుగుతోంది. మచిలీపట్నం, గుడివాడ, అవనిగడ్డ బస్టాండ్ల పరిధిలో డోర్ డెలివరీ సేవలు అందిస్తున్నారు. పది కిలోమీటర్ల లోపు 1-50 కిలోల వరకు రూ.18-80 ఛార్జీ వసూలు చేస్తున్నారు.

మచిలీపట్నం నుంచే ఎక్కువ... బందరు పార్సిల్ సర్వీస్‌లో రోజూ గరిష్ఠంగా 300 పార్సిళ్లు.. రూ.50 వేల ఆదాయం సమకూరుతోంది. ఎక్కువగా చేపలు, రోల్డ్‌గోల్డ్ ఆభరణాలు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాలు, కర్ణాటక, చెన్నైలకు విజయవాడ మీదుగా పార్శిల్స్ వెళ్తాయి. 'ఒకే పాంత్రానికి బల్క్ వస్తువులు పంపేవారు, ఇళ్లు ఖాళీ చేసి వేరే ప్రాంతాలకు వెళ్లే వారికి రెండు కంటైనర్లు అందుబాటులో ఉన్నాయి. బయట కంటే తక్కువకే రవాణా చేస్తామని' ఏటీఎం మోషే తెలిపారు.

విస్తరించేలా అడుగులు...మచిలీపట్నం, గుడివాడ, అవనిగడ్డ, గన్నవరం, ఉయ్యూరు బస్టాండ్లలో పార్సిల్ సర్వీస్ అందుబాటులో ఉంది. వీటిని మరింత విస్తరించేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఆసక్తి ఉన్నవారికి మండల కేంద్రాలు, మున్సిపాటిల్లో ఏజెంట్లు చేరే అవకాశం ఇస్తున్నారు. పెడన, పోతేపల్లి, లక్ష్మీపురం, కూచిపూడి, చల్లపల్లి, కోడూరు, నాగాయలంక, హనుమాన్‌జంక్షన్ సహా మొత్తం 15 చోట్ల కలెక్షన్ పాయింట్లు ఉన్నాయి.

బయట కంటే చాలా తక్కువ: మచిలీపట్నం నుంచి 10 కేజీల పార్శిల్‌ను విజయవాడ చేర్చేందుకు ఓ ప్రైవేటు సర్వీస్ వద్దకు వెళ్లి అడగగా.. కేజీకి రూ.50 అవుతుందన్నారు. తగ్గించమంటే సమయం పడుతుందని, బల్క్ ఆర్డర్స్ ఇవ్వాలన్నారు. అదే పార్శిల్ బాక్స్ మొత్తానికి ఆర్టీసీలో రూ.100లోపే తీసుకుని వేగంగా భద్రంగా విజయవాడ చేర్చారు. - శ్రీనివాస్, గొడుగుపేట

మచిలీపట్నం బస్టాండ్‌లో పార్సిల్ కేంద్రం

పార్సిళ్లు - ఆదాయం (రూ.లక్షల్లో)

డిపో	2024	2025
ఉయ్యూరు	3,198 – 7.11	4,151– 7.89
గన్నవరం	5,914 – 19.23	6,943– 20.93
అవనిగడ్డ	9,332 – 23.30	11,991– 27.80
గుడివాడ	15,320– 21.45	18,082– 25.03
మచిలీపట్నం	51,587 –1.06 కోట్లు	62,089– 1.20

పశ్చిమ బైపాస్.. ఎన్‌హెచ్-16లో విలీనం!

చినఆవుటపల్లి-కాజ ఆర్‌అండ్‌బీ స్టేట్ హైవేదే బాధ్యత

ఈనాడు – అమరావతి

పశ్చిమ బైపాస్ ఎన్‌హెచ్-16లో విలీనమయ్యే సమయం ఆసన్నం అవుతోంది. బైపాస్‌లో ప్యాకేజీ-1 గుండుగొలను-కలపర్రు, ప్యాకేజీ-2 కలపర్రు-చినఆవుటపల్లి ఇప్పటికే ఎన్‌హెచ్-16లో మమేకమయ్యాయి. ప్యాకేజీ-3, 4 నిర్మాణం దాదాపు కొలిక్కి వచ్చింది. ఈ నేపథ్యంలో బైపాస్‌లో భాగమైన చినఆవుటపల్లి-కాజ వరకు దాదాపు 47 కిమీ ఎన్‌హెచ్-16లో కలవనుంది. దీంతో ప్రస్తుతం

ఎన్‌హెచ్-16లో భాగంగా గన్నవరం మండలం చినఆవుటపల్లి నుంచి విజయవాడ బెంజ్ సర్కిల్ మీదుగా గుంటూరు జిల్లా కాజ వరకు దాదాపు 40 కి.మీ ఆర్‌అండ్‌బీ రాష్ట్ర హైవేలకు అప్పగిస్తారు. పశ్చిమ బైపాస్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాగానే ఈ మార్పులు జరగనున్నాయి. అక్కడ నుంచి 40 కి.మీ నిర్వహణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి.

వన్‌టైం ఇంప్రూవ్‌మెంట్ అనంతరమే...

★ ఎన్‌హెచ్ నిబంధనల ప్రకారం బైపాస్ నిర్మాణం చేపట్టినప్పుడు ఆ పరిధిలో ఇప్పటి వరకు ఎన్‌హెచ్‌లో భాగంగా కొనసాగుతున్న రహదారిని ఆర్‌అండ్‌బీ రాష్ట్ర హైవేలకు బదిలీ చేస్తారు. బదిలీకి ముందే ఆ పరిధిలోని రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసివ్వాలి. మరమ్మతులకు గురైన విద్యుత్తు దీపాలను పునరుద్ధరించాలి. పంచాయతీ, నగరపాలిక సమన్వయంతో డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేయాలి. ఇవన్నీ చేసిన తర్వాతే బదిలీ చేయాలి.

★ ఎన్‌హెచ్ నుంచి రాష్ట్ర హైవేకు బదిలీ అవుతున్నందున ఈ పరిధిలోని టోల్ ప్లాజాలు తొలగిస్తారు. ప్రస్తుతం ఎన్‌హెచ్-16లో పొట్టిపాడు టోల్‌గేటు తొలగించి. పశ్చిమ బైపాస్‌లో వెంకటపాలెం, వెదురుపావులూరులో రెండు కొత్త టోల్‌గేట్లు ఏర్పాటు చేస్తారు.

కాజ దగ్గర ఎన్‌హెచ్-16, పశ్చిమ బైపాస్ అనుసంధాన పనులు

విద్యుత్తు టవర్ల కేసు వాయిదా...

పశ్చిమ బైపాస్ మీదుగా వెళ్లిన నున్న హైటెన్షన్ విద్యుత్తు టవర్ల వివాదం మళ్లీ వాయిదా పడింది. సోమవారం కోర్టులో విచారణకు రాగా రైతులు కొంత సమయం కావాలని కోరడంతో నాలుగు వారాలు వాయిదా వేస్తూ న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

(c) eenadu

నదీమ తల్లికి సమర్పించిన మహావస్త్రం

ప్రత్యేక అలంకరణలో కృష్ణవేణి మాత

కృష్ణమ్మకు చీరల హారం

నాగాయలంక శ్రీరామపాద పుష్కర్ ఘాట్‌లో సోమవారం నిర్వహించిన కృష్ణమ్మకు మహావస్త్ర సమర్పణ కార్యక్రమానికి భక్తులు పోటెత్తారు. నదీమతల్లికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. - నాగాయలంక, న్యూస్‌టుడే

రహదారులను ధ్వంసం చేసేవారిపై కఠిన చర్యలు

ఎస్.ఎన్.గొల్లపాలెం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: రోడ్లపై దమ్ముచక్రాల ట్రాక్టర్లతో ప్రయాణం చేసి వాటి ధ్వంసానికి కారణమవుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. మచిలీపట్నం మండలం ఎస్.ఎన్.గొల్లపాలెంలో సోమవారం నాబార్డు నిధులు రూ.కోటితో 1.3 కి.మీ మేర చేపట్టనున్న రోడ్డుకు మంత్రి రవీంద్ర ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో రూ.50కోట్లు ఖర్చు చేసి సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఎస్.ఎన్.గొల్లపాలెంలో రూ.60లక్షలతో సీసీ రోడ్లు పూర్తి చేశామని, ఉపాధి పథకం నిధులతో త్వరలో డ్రైనేజీలు నిర్మిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు స్థలాలు మంజూరు చేస్తామన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఇప్పటికే పలు రహదారులను ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కుంచె నాని, తెదేపా నాయకులు కాగిత వెంకటేశ్వరరావు, గొర్రెపాటి గోపీచంద్, లంకే నారాయణప్రసాద్, గోపు సత్యనారాయణ, తలారి సోమశేఖర్, తహసీల్దార్ మధుసూదనరావు, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

రహదారి పనులకు కొబ్బరికాయ కొడుతున్న మంత్రి రవీంద్ర

ఆర్టీసీ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ ప్రజల దీర్ఘకాల వాంఛ అయిన ఆర్టీసీ బస్టాండు అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోకుండా నూతన నిర్మాణ వివరాలు తీసుకుని రమ్మంటే 2019లోని ప్లాన్ తేవడం దారుణమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆర్టీసీ ఇంజినీరింగ్ సిబ్బంది, డిపో మేనేజర్ సుగుణ కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండును సోమవారం రాత్రి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు సుమారు రూ.6 కోట్లతో ప్లాట్‌ఫారాల నిర్మాణానికి సంబంధించిన ప్లానులు చూపారు. ఈ విషయంలో అధికారులు కనీస అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడాలని సూచించారు. రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పాతికేళ్ల క్రితం 11 ప్లాట్‌ఫారాలు ఉండే ఇక్కడ ఇప్పుడు మళ్లీ అన్నే ఉంటే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. జనసేన గుడివాడ బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, నేతలు దింట్యాల రాంబాబు, వాసే మురళి, లింగం ప్రసాద్, డాక్టర్ గోర్ల సత్యనారాయణ, పండ్రాజు సాంబశివరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, పొట్లూరి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండులో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

రైలు ప్రయాణికుల రూ.11 లక్షల సొత్తు అప్పగింత

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: విజయవాడ డివిజన్ ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా ప్రయాణికుల సొత్తు చోరీకి గురి కాకుండా సకాలంలో స్పందించి వారికి అప్పగించారు. ఈ నెల 23న రైలు నంబరు 17481లో అసపర్తికి చెందిన విశ్వనాథరెడ్డి దంపతులు అన్నవరం నుంచి విజయవాడ వస్తున్న క్రమంలో బీ5 బోగీలో రెండు లగేజీ బ్యాగులు మర్చిపోయారు. వారు వెంటనే రైల్వే పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా.. అన్నవరం జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ త్రినాథరావు స్పందించి బ్యాగులు తిరిగి ప్రయాణికులకు అప్పగించారు. వాటిలో రూ.8 లక్షల విలువ చేసే బంగారం వస్తువులు ఉన్నాయి. ☛ తిరుపతికి చెందిన గోవిందకృష్ణ రైలు నంబరు 20677 వందే భారత్‌లో తెనాలి నుంచి రేణిగుంటకు ప్రయాణిస్తుండగా బ్రాస్‌లెట్ రేణిగుంట రైల్వే స్టేషన్‌లో పడిపోయింది. ఆయన ఫిర్యాదు మేరకు వెంటనే పోలీసులు స్పందించి వెతికి బ్రాస్‌లెట్ తిరిగి ప్రయాణికుడికి అప్పగించారు. దాని విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుంది. రెండు కేసుల్లో బంగారాన్ని ప్రయాణికులకు అప్పగించినట్లు రైల్వే పోలీసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆగిన బిల్లులు.. సాగని పనులు

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్, బంటుమిల్లి

పల్లె పండగ పేరుతో ఆయా ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పలుచోట్ల అసంపూర్తిగా ఆగిపోయాయి. చేసిన పనులకు బిల్లులు రాక గుత్తేదారులు మిగిలినవి చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. దీంతో అసంపూర్తిగా వదిలేసిన రోడ్లపై రాకపోకలు సాగించలేక జనం ఇబ్బందులు పడుతున్నారు.

కొన్ని మొదలుపెట్టలేదు.. : జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ప్రధాన, అంతర్గ రహదారుల నిర్మాణ పనులతో పాటు శ్మశానవాటికల ప్రహరీలు, షెల్టర్లు చేపట్టారు. ప్రారంభంలో వేగంగా జరిగినా ఆ తర్వాత ఆగిపోయాయి. గతేడాది అక్టోబరులో పనులు ప్రారంభించగా ఇప్పటికీ కొన్ని ప్రారంభోత్సవానికీ నోచుకోలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అధికారిక గణాంకాల ప్రకారం ఇప్పటివరకు 1894 పనులు పూర్తి చేశారు. బిల్లులు చెల్లిస్తే మిగిలినవీ పట్టాలెక్కే అవకాశం ఉంది.

గూడూరు: అసంపూర్తిగా వదిలేసిన గండ్రం-ముక్కొల్లు రోడ్డు

బందరు, పెడన నియోజకవర్గాల పరంగా చూస్తే కేవలం బంటుమిల్లి మండలంలో మాత్రమే పనులు నూరుశాతం పూర్తయ్యాయి. బందరు, పెడన, గూడూరు, కృత్తివెన్ను మండలాల్లో కొన్ని పూర్తవగా మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. గూడూరు మండలంలోని గండ్రం నుంచి ముక్కొల్లు వెళ్లే రహదారి చివరి దశలో ఆగిపోయింది. ఇదే మండలంలో కోకనారాయణపాలెం-అనంతాయిపేట రోడ్డు నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని పరిస్థితి. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

రూ.54కోట్ల బకాయిలు...ఏడాదిగా ఎదురుచూపులు: జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో పూర్తి చేసిన పనులకు సంబంధించి రూ.117.08 కోట్లు చెల్లించాలని అధికారులు నివేదించగా రూ.62.15 కోట్లు మాత్రమే విడుదల అయ్యాయి. ఇంకా రూ.54.90కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. వీటి కోసం గుత్తేదారులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కేవలం బిల్లులు సకాలంలో విడుదల కాని కారణంగా ఇంకా అనేక పనులు ప్రారంభం కాలేదు. వాటిని ఎలా ప్రారంభించాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇది కొత్తగా చేపట్టబోయే పనులపై కూడా ప్రభావం చూపుతుంది. ఇటీవల కొత్తగా జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య కేంద్రాల నిర్మాణంతో పాటు అసంపూర్తిగా ఉన్నవాటిని పూర్తి చేసేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా నిధులు కేటాయించారు. బిల్లుల జాప్యం ఈ పనులపై కూడా ప్రభావం చూపుతుంది. వాటిని చేపట్టేందుకు కూడా గుత్తేదారులు వెనుకంజ వేసే పరిస్థితులు దాపురించాయి. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను గమనించి బకాయిలు విడుదల చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చేపట్టాల్సిన పనులు:	2,114
కేటాయించిన నిధులు:	రూ.171.78కోట్లు
పూర్తయినవి:	1820
అసంపూర్తిగా ఉన్నవి:	146
ఇంకా ప్రారంభంకానివి:	74

పంచ సూత్రాలతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు

ఘంటసాలలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

ఘంటసాల, న్యూస్‌టుడే: పంచ సూత్రాలతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం ఘంటసాల రైతుభరోసా కేంద్రం వద్ద, కృషి విజ్ఞాన కేంద్రంలో 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో భాగంగా రైతులకు పంచసూత్రాల కరపత్రాలను ఆవిష్కరించారు. రైతులకు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్‌ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు అంశాలపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో రైతులకు ధాన్యం సొమ్ము 7నెలలకు కూడా ఇవ్వలేదని కూటమి ప్రభుత్వం రైతులకు 48 గంటలలో చెల్లించిందన్నారు. ఘంటసాలలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. భావదేవరపల్లిలో మత్స్య పాలిటెక్నిక్‌ను కళాశాలగా ఉన్నతీకరించాలన్నారు. మొదట సేంద్రియ పద్ధతులతో పండించిన కూరగాయలను పరిశీలించారు. స్థానిక వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించారు. కౌలు రైతు సంఘం నాయకులు రంగారావు, రామచంద్రరావు ఆధ్వర్యంలో కౌలు రైతు సమస్యలను గూర్చి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు, కలెక్టర్ బాలాజీ, జేసీ ఎం.నవీన్, కేడీసీ సమన్వయకర్త డి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లో సమాచారం నిక్షిప్తం

ఎస్.ఎన్.గొల్లపాలెం (మచిలీపట్నం): రైతులకు ఉపయోగపడే సమాచారాన్ని ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన యాప్‌లో అందుబాటులో ఉంచిందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమాన్ని మంత్రి రవీంద్ర సోమవారం ఎస్.ఎన్.గొల్లపాలెంలో ప్రారంభించారు. రైతన్న మీకోసంలో వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రతి గ్రామంలో కనీసం 90 రైతు కుటుంబాలను కలుసుకుని వివరాలను అందజేస్తారన్నారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టం యాప్‌ను రైతులు మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే ఇన్సూరెన్స్, నష్టపరిహార జాబితా, విత్తనాల ఫోన్ నంబర్లు, చీడపీడల నివారణకు అనుసరించాల్సిన పద్ధతులు నేరుగా తెలుసుకునే అవకాశముందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుంచె నాని, తెదేపా మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, సీతారామపురం పీఏసీఎస్ అధ్యక్షుడు ఈడే రాంబాబు, ఎంపీడీవో వెంకటేష్, మండల వ్యవసాయాధికారి ఎం.రామ్‌కుమార్, టెక్నికల్ ఏడీ హారిక తదితరులు పాల్గొన్నారు.

పట్టాభి స్మారక భవనాన్ని సాకారం చేస్తాం

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: ఎవరెన్ని కుట్రలు చేసినా డా.భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనాన్ని సాకారం చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. పట్టాభి 146వ జయంతిని పురస్కరించుకుని జడ్పీ సెంటరులోని ఆయన విగ్రహానికి మంత్రితో పాటు ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టాభి సార్మక భవనం నిర్మాణ విషయంలో అప్పటి మాజీ మంత్రి పేర్ని నాని, వైకాపా కార్పొరేటర్లు హైకోర్టు ఉత్తర్వులను సైతం లెక్క చేయకుండా అడ్డుపడి చరిత్రహీనులుగా నిలిచారన్నారు. త్వరలో భవనాన్ని నిర్మించి పేదలకు వివిధ రకాల శిక్షణలు ఇప్పించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. కొనకళ్ల మాట్లాడుతూ రైతు ప్రయోజనాల కోసం పట్టాభి చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఆయన పేరిట ప్రజల అవసరాల కోసం నిర్మించ తలపెట్టిన స్మారక భవనానికి వైకాపా నాయకులు అడ్డుపడడం హేయమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గొర్రెపాటి గోపీచంద్, ఫణికుమార్, బాబాప్రసాద్, గడ్డం రాజు, యూనియన్ బ్యాంక్ అధికారులు, పట్టాభి అభిమానులు ఆయనకు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

పట్టాభి విగ్రహం వద్ద నివాళులర్పించిన మంత్రి రవీంద్ర, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల తదితరులు

న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను

ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో పటిష్ఠమైన వార్తా వ్యవస్థను కలిగి, తాజా వార్తలను సేకరించి, వాటిని **ఈనాడు**తోపాటు ఈనాడు.నెట్, ఈటీవీ, ఈటీవీ భారత్ వంటి సంస్థలకు అందిస్తున్న న్యూస్ ఏజెన్సీ 'న్యూస్‌టుడే'కు న్యూస్ కంట్రిబ్యూటర్లుగా వార్తలు అందించేందుకు ఔత్సాహికులైన యువకులు కావలెను.

అర్హత: డిగ్రీ, **వయసు:** 30 సంవత్సరాల లోపు

అభిరుచి: వార్తల రూపంలో ప్రజా సమస్యలను వెలుగులోకి తేవాలన్న తపన, స్థానికులై, పరిసర ప్రాంతాలపై అవగాహన, కనీస సామాజిక-రాజకీయ పరిజ్ఞానం, కలివిడిగా ఉండే తత్వం కలిగి ఉండాలి.

న్యూస్ కంట్రిబ్యూటర్లు అవసరమైన ప్రాంతాలు:

ఉంగుటూరు, నందివాడ, గన్నవరం టౌన్

సరళమైన తెలుగులో రాయగల నేర్పు, లోకజ్ఞానం, వర్తమాన రాజకీయ-సామాజిక తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలి.

ఆసక్తి గలవారు నవంబరు 25, మంగళవారం ఉదయం 10.30 గంటలకు జరిగే అర్హత పరీక్షకు ఈ క్రింది చిరునామాలో హాజరుకాగలరు.

గతంలో హాజరైన వారు తిరిగి ఈ పరీక్షకు రానవసరం లేదు.

న్యూస్‌టుడే ప్రైవేట్ లిమిటెడ్
C/o. ఈనాడు కార్యాలయం
గూడవల్లి గ్రామం, విజయవాడ రూరల్ మండలం, ఎన్టీఆర్ జిల్లా–521 104

ప్రజా అర్జీలకు సంతృప్తికర పరిష్కారం

కలెక్టరేట్ (మచిలీపట్నం): ప్రజలు సమస్యల పరిష్కారం కోరుతూ ఇచ్చే అర్జీలకు సంతృప్తికర పరిష్కారాలు చూపాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు. తక్షణ పరిష్కార యోగ్యం కాని అర్జీలకు తగు సమాధానాన్ని అర్జీదారునికి అర్థమయ్యే తీరులో అధికారులే వివరించాలన్నారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ప్రభుత్వ జానియర్, డిగ్రీ, పీజీ కళాశాలలను ఏర్పాటు చేయాలని ఏబీవీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. తుపాను కారణంగా నష్టపోయిన వరి, వాణిజ్య పంటల రైతులను ఆదుకోవాలని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలు సవరించేలా చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు దుర్గామల్లేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, అధికారులు

ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల స్వీకరణ

మచిలీపట్నం క్రైం: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఇచ్చే ప్రతి ఫిర్యాదుకు పారదర్శకంగా పరిష్కారం చూపుతామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు స్పష్టం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం వివిధ ప్రాంతాల ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించారు. వరకట్న వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని పామర్రు ప్రాంతానికి చెందిన వనజ, వ్యాపార భాగస్వామి మోసం చేసి, లెక్కలు అడుగుతుంటే తనను అడ్డు తప్పించుకునేందుకు చేస్తున్న కుట్ర నుంచి తనను కాపాడాలని తాడిగడపకు చెందిన పృథ్వీ, కుమారులు ఆస్తి కోసం చేస్తున్న వేధింపుల నుంచి విముక్తి ప్రసాదించేలా చర్యలు తీసుకోవాలని అవనిగడ్డ ప్రాంతానికి చెందిన వీరయ్య అనే వృద్ధుడు ఫిర్యాదులు సమర్పించారు. ఇతర వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోరుతూ ఇచ్చిన వేర్వేరు ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ వాటిని విచారించి చట్ట పరిధిలో సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు.

ఫిర్యాదుదారుల సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

సంజయ్ రిమాండ్ పొడిగింపు

ఈనాడు - అమరావతి: అగ్నిమాపక, సీఐడీ డీజీగా పనిచేసిన కాలంలో ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసులో ఐపీఎస్ అధికారి సంజయ్ రిమాండ్‌ను కోర్టు పొడిగించింది. సోమవారంతో రిమాండ్ ముగియనుండడంతో.. ఏసీబీ అధికారులు విజయవాడలోని ఏసీబీ కోర్టులో నిందితుడిని హాజరుపర్చారు. వచ్చే నెల 3 వరకు పొడిగిస్తూ ఏసీబీ కోర్టు న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు. ఈ కేసులో కోర్టులో లొంగిపోయిన సంజయ్.. ఆగస్టు, 26 నుంచి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే.

పెళ్లి బస్సుకు తప్పిన ప్రమాదం

చిన్నఅవుటపల్లి(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే : చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిపై వరుస బస్సు ప్రమాదాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి... విజయవాడకు చెందిన ఇరవై మంది ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో శ్రీకాకుళంలో జరిగిన పెళ్లికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. గన్నవరం పట్టణ శివారులోని ఆర్టీవో చెక్ పోస్టు వద్ద ఆదివారం అర్ధరాత్రి మూలమలుపు తిరుగుతున్న లారీని ఈ బస్సు ఢీకొంది. ప్రమాదానికి గురైన బస్సును వెనుక నుంచి వచ్చిన మరో కారు ఢీకొట్టింది. ఆయా ఘటనల్లో బస్సు డ్రైవర్ కాలు విరగ్గా.. మరో ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆత్కూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రయాణికులను ప్రత్యామ్నాయ బస్సుల్లో వారి గమ్యస్థానాలకు తరలించారు.

ప్రమాదధాటికి నుజ్జునుజ్జయిన కారు

రోడ్డు ప్రమాదంలో భవానీ భక్తుడి దుర్మరణం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో భవానీ భక్తుడు మృతి చెందాడు. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన కుక్కునూని జయరామ్(33) స్థానికంగా నూనె గానుగ నిర్వహిస్తుంటారు. ఇటీవల భవానీ మాల ధరించిన ఆయన విజయవాడ కనక దుర్గమ్మను దర్శించుకునేందుకు స్నేహితుడు అల్లబాని సాయితేజతో కలిసి ద్విచక్ర వాహనంపై వచ్చారు. అమ్మవారి దర్శనం అనంతరం తిరుగు పయనమవ్వగా, వీరి వాహనం కోడూరుపాడు ఫ్లైఓవర్ సమీపంలో అదుపు తప్పి రహదారి రక్షణ గోడను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న జయరామ్‌కు తీవ్ర గాయాలవ్వడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. అత్యవసర వాహనం సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించే సరికే ప్రాణాలు కోల్పోయారు. సాయితేజ మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వీరవల్లి పోలీసులు మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

91.9FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

గుదిబండలుగా మారిన గోదాములు

పమిడిముక్కల (మంటాడ), న్యూస్‌టుడే

గత ప్రభుత్వ హయాంలో అప్పటికే అనాలోచితంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) గోదాములు ఇప్పుడు తమ సంఘాల పాలిట గుదిబండలుగా మారాయని పలు సహకార సంఘాల ఛైర్మన్లు, సభ్యులు ఆరోపిస్తున్నారు. వైకాపా పాలనలో జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 130 గోదాములు నిర్మాణానికి ప్రతిపాదించి 120 నిర్మాణాలు పూర్తిచేసింది. ఇందుకుగాను అప్పట్లో కేంద్ర ప్రభుత్వ రుణంతో 500 టన్నుల సామర్థ్యం గల ఒక్కో గోదాముకు రూ.40 లక్షలతో నిర్మించారు. ఈ రుణాన్ని తిరిగి సంఘం 4శాతం వడ్డీతో పదేళ్లలో చెల్లించాల్సి ఉంది. ఈ సందర్భంగా వీరంకిలాకు కేడీసీసీ బ్యాంకు పరిధిలో కృష్ణాపురం, బోరగుడి, హనుమంతపురం, అమీనపురం పీఏసీఎస్‌లకు నాలుగు గోదాములు మంజూరయ్యాయి. వీటికి ప్రభుత్వ స్థలాలు దొరకలేదంటూ కృష్ణాపురం సంఘ గోదామును కూడేరు శ్మశానభూమిలో, అమీనపురం గోదాం సమీప శ్మశానభూమిలో, హనుమంతపురం గోదాము ఐనంపూడి మరుభూమి సమీపంలో, బోరగుడిని లంకపల్లిలో కలుపు కాలువ దగ్గర నిర్మించారు. అప్పట్లో వీటి నిర్మాణంపై విమర్శలు రాగా అవి కూడా ప్రభుత్వ భూములేనంటూ అధికారులు సర్దిచెప్పారు. స్వార్థంతో ఇలా ప్రజావసరాన్ని దుర్వినియోగం చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఇప్పుడు సంఘ పరిధిలోని వీటి అవసరం లేదని, ఇక్కడి వాణిజ్య పంటలు లేకపోవటంతో గోదాముల్లో నిల్వచేసే ఉత్పత్తులు లేవని, పైగా ఈ గోదాములు ఊరికి దూరంగా ఉండటంతో పలు సంఘాల వారు పమిడిముక్కల మండలంలో నిర్మించిన నాలుగు గోదాముల సంఘ పరిధిలో ఉన్న పుట్టికి ఊరికి దూరంగా, శ్మశాన భూముల్లో నిర్మించారు.

కూడేరు శ్మశానభూమిలో నిర్మించిన కృష్ణాపురం గోదాము

☛ ఇప్పటికే సహకార సంఘాల నిర్వహణలో సీజనుల ఎరువులు నిల్వచేయటం మినహా మరో ప్రయోజనం కనపడటం లేదు. మరోవిధంగా దీనిపైనా వాడుకుంటే ఊరికి దూరంగా ఉంది. తగిన రహదారి వసతులు, రక్షణ లేక ఎవరూ గోదాం వినియోగించుకునేందుకు ముందుకు రాలేదు. సంఘాలు రుణాలు, వడ్డీ చెల్లింపలేక చతికిలపడకుండా ప్రభుత్వమే కలుగచేసుకొని ప్రత్యామ్నాయం చూడాలి. **- రాజులపాటి శ్రీనివాసరావు, ఛైర్మన్, పీఏసీఎస్, కృష్ణాపురం.**

☛ వీటిపై పైసా ఆదాయం లేకపోగా నిర్వహణ ఖర్చులతో సంఘాలు నష్టాల బాటపట్టక తప్పదు. దీని ప్రభావం సంఘ సభ్యులైన రైతుల మీద ఉంటుంది. గత ప్రభుత్వం తీసుకున్న ఈ అనాలోచిత చర్య కారణంగా జిల్లాలోని సంఘాలు నష్టపోకుండా ఈ ప్రభుత్వం జోక్యం చేసుకొని గోదాములకు రహదారి సౌకర్యం, ఇతర అవసరాల ఏర్పాటుకు రుణం మంజూరు చేయాలి. చెల్లింపు వాయిదాలు పెంచి వడ్డీరేటు తగ్గించాల్సి ఉంది. **-రాజులపాటి రామాంజనేయ ప్రసాద్, ఛైర్మన్, పీఏసీఎస్, హనుమంతపురం**

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కలెక్టరేట్ (మచిలీపట్నం): కనీస వేతనం లేకుండా దీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న వారికి తగు ఉద్యోగ భద్రత కల్పించాలని సమగ్రశిక్షా ఉద్యోగులు డిమాండ్ చేశారు. సమగ్రశిక్షా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా చౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జేఏసీ ఛైర్మన్ జాన్‌మోడీ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌బాబు, తదితరులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు నిర్వహించిన సమ్మె సందర్భంగా కుదుర్చుకున్న ఒప్పందాలను తక్షణం అమలు చేయాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీ, ఎంటీఎస్‌లను వెంటనే అమలు చేయాలన్నారు. ఈపీఎఫ్, ఆరోగ్యబీమా, పింఛను తదితర ప్రయోజనాలు కల్పించాలన్నారు. సీడబ్ల్యూఎస్‌ఎన్ విద్యార్థులకు ఏడాది పొడవునా ఫిజియోథెరపీ అందించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. డీఎస్సీ, ప్రభుత్వ రెగ్యులర్ పోస్టుల నోటిఫికేషన్‌ల్లో సమగ్రశిక్షా ఉద్యోగులకు సర్వీస్ వెయిటేజ్ ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలు కావొస్తున్నా తమ సమస్యల పరిష్కారంలో ఎటువంటి కదలిక లేకపోవడం గర్హనీయమన్నారు. అనంతరం కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు ఎం.ప్రశాంతి, దుర్గాభవానీ, రామకృష్ణ, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యోగులు పాల్గొన్నారు.

ధర్నాచౌక్‌లో సమగ్రశిక్షా ఉద్యోగుల నిరసన

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ-1
షార్ట్ సీల్డ్ టెండరు ప్రకటన ఆర్.సి.నెం.జె1/3749/2025, తేది:23.11.2025

భవాని దీక్షా విరమణలు-2025 సందర్భముగా ది:10-12-2025 నుండి 17-12-2025 వరకు భక్తులకు ఉచిత ప్రసాదములు/అన్న ప్రసాదములు తయారు చేసి వితరణ చేయు ప్రదేశమునకు చేర్చుటకు అవసరమైన అదనపు పనివారులు మ్యాన్ పవర్ సప్లయి కొరకు అనుభవం గల హోటల్స్, కేటరర్స్ వారి నుండి గాని గతములో దేవస్థానం నందు మెస్ పనులు నిర్వహించిన టెండరుదారుల నుండి గాని సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. ది.02-12-2025 ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 2.00 గం॥ లోపు సీల్డు టెండరును టెండరు బాక్సు నందు సమర్పించవలెను. సీల్డు టెండరు షెడ్యూలు కొరకు అన్నదాన విభాగం నోటీసు బోర్డు నందు తెలిపిన వివరములతో దరఖాస్తు చేసుకొని పొందవచ్చును. మిగిలిన వివరములు అన్నదానం పనిచేయు వేళలయందు గాని, ఫోన్ నెం:9573720337, 7207562297 లను సంప్రదించవచ్చును.

ఆర్జిత సేవ, పరోక్ష సేవా మరియు వివరాలముల కొరకు https:// kanakadurgamma.org నందు చూడగలరు.

శ్రీ బొర్రా రాధాకృష్ణ, ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు

సం/- వి.కె. శీనా నాయక్, యమ్.ఎ, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు & కార్యనిర్వహణాధికారి

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్‌క్యాష్) ✆ 87907 41166

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూపు, VJA వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/వంట బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 96401 76677, 9553786677

REAL ESTATE

PLOT FOR SALE

చ.గ. 7999/-లకే CRDA అప్రూవల్ వెంచర్ నందు ORRకి దగ్గర కంచికచర్ల సమీపంలో స్పాట్ రిజిస్ట్రేషన్ సంప్ర ✆ 70758 14389.

JOBS

30-65Yrs బ్యాంక్ అనుబంధ సంస్థలో జీతం+Inc 35వేలు టీంమేనేజర్స్ ఎగ్జిక్యూటివ్స్. Q: 10th/డిగ్రీ రిటైర్డ్ బిజినెస్, ఇన్సూరెన్స్ ఏజంట్స్ మ్యూచువల్‌ఫండ్స్ మార్కెటింగ్. నోటార్గెట్. ✆ 90524 70111.

రజా హిందూస్తాన్ నిధి బ్యాంకులో పనిచేయుటకు మండలాల వారీగా అనుభవం ఉన్న ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ మేనేజర్లు కావలెను. జీతం: 12k-40K, 8328281861

స్వగృహ ఫుడ్స్‌లో పనిచేయుటకు సేల్స్ బాయస్ /గరల్స్ కావలెను. 18to 30 సం||లోపు. అనుభవం ఉన్న వారికి మంచి జీతం. అర్హత: 10th, MG రోడ్. ✆ 81425 45000

FACULTY/ TEACHERS

మచిలీపట్నంలోని ప్రముఖ ప్లే స్కూల్ నందు Female Teachers (Min Degree) కావలెను. Contact: 72079 13971

DRIVERS

కీర్తి ఫైనాన్స్, బావాజీపేట, 1వ లైన్ ఆఫీస్ నందు పనిచేయుటకు ఇంటర్ చదివి, అనుభవం కల్గిన కార్‌డ్రైవర్ కావలెను. Age: 40 సం||లోపు ✆ 9246922778

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రతి టనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

26 వరకు ఆధార్ శిబిరాలు

శిబిరంలో బాలలు, తల్లిదండ్రులు

పెడన, న్యూస్‌టుడే: విద్యారంగ సంస్కరణల్లో భాగంగా ప్రతి విద్యార్థి ఆధార్‌ను కలిగి ఉండాలని ఎంఈవో-2 వైవీ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక విశ్వభారతి హైస్కూల్లో సోమవారం నిర్వహించిన ఆధార్ శిబిరాన్ని ఆయన సందర్శించారు. మున్సిపల్ పరిధిలో ఈ నెల 17న ప్రారంభించిన ఆధార్ శిబిరాలు 26 వరకు కొనసాగుతాయని చెప్పారు. 25న శ్యామల కాన్వెంట్, 26న వివేకానంద హైస్కూల్లో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విశ్వభారతి ప్రిన్సిపల్ గౌరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

ధర వరలు

టమాట 53, వంగ 40, బెండ 45, పచ్చిమిర్చి 44, కాకర 44, క్యాబేజీ 28, క్యారెట్ 64, దొండ 39, బంగాళదుంప 31, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 60, దోస 32, సొర 20, అరటికాయ 7,6, చిక్కుళ్లు 90, బీర 37, చామదుంప 26,మునగ 20/18, కంద 42, బీట్‌రూట్ 46, కీరదోస 32, బీన్స్ 65, క్యాప్సికం 80, అలసందలు 60, చిలకడదుంప 40, కొత్తిమీర 22/11, పుదీనా 20/15 మంగళవారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి.
- మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

సినిమాలు

రేవతి: శివ మిరాయ్
వశి: ప్రేమంటే సిరి
కృష్ణ: రాజు వెడ్స్ రాంబాయి సిరిమా
కట్: 12ఏ రైల్వేకాలనీ
- మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

నగరంలోని ఇంగ్లీషుపాలెంలో డ్రెయిన్ పూడిపోవడంతో మురుగు పారుదలకు ఆటంకంగా మారింది. సమస్యను ఆ ప్రాంతవాసులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు వివరించడంతో సిబ్బందిని పంపి పూడిక తొలగించేలా చర్యలు తీసుకున్నారు. • నగరంలోని సుకర్లాబాద పరిసర ప్రాంతాల్లో రాత్రిపూట దోమల బెడదతో పడుతున్న ఇబ్బందులను ఆ ప్రాంతవాసులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు వివరించగా సిబ్బందిని సోమవారం రాత్రి ఫాగింగ్ చేయించేలా చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

ఉద్యోగోన్నతిపై సీనియర్ అసిస్టెంట్ బదిలీ

పెడన, న్యూస్‌టుడే: మండల పరిషత్తు సీనియర్ అసిస్టెంట్ బి. విజయకుమారి ఉద్యోగోన్నతిపై మండల గ్రామ సచివాలయ అధికారిగా బదిలీ అయ్యారు. ఆమెకు ఇంకా పోస్టింగ్ కేటాయించలేదు. పెడనకు మండల గ్రామ సచివాలయ అధికారిగా ఎం.ప్రకాశ్ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం అవనిగడ్డలో మండల పరిషత్తు సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

నేర్చుకుంటే సులువు.. కొల్లగొట్టొచ్చు కొలువు

న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

చదువు పూర్తి చేయడం ఒకెత్తయితే ఉద్యోగం సాధించడం మరో ఎత్తు. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది బాలికలు ఇంటర్ తరవాత త్వరితగతిన ఉపాధి పొందాలన్న ఆసక్తితో ఒకేషనల్ కోర్సులను ఆశ్రయస్తున్నారు. అలాంటివారి కోసం మచిలీపట్నంలోని లేడియాంప్తిల్ ప్రభుత్వ కళాశాలలో ఎకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్, ఆఫీస్ అసిస్టెంట్‌షిప్, కంప్యూటర్స్ అండ్ సైన్స్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఎంతో మంది బాలికలు ఆయా కోర్సుల్లో చేరి చదువుతో పాటు వివిధ కార్యాలయాల్లో వృత్తిపరమైన శిక్షణ పొందుతూ తమ అనుభవాలను వివరించారు.

బాలికలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అయితే ఉద్యోగం లేదా డిగ్రీ: సల్మా, ఎంపీ హెచ్‌డబ్ల్యూ, ప్రథమ సంవత్సరం

మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్(ఎంపీ హెచ్‌డబ్ల్యూ) కోర్సులో చేరా. దీని ద్వారా ల్యాబ్‌కు పరిమితమైపోకుండా ఏ విభాగంలో అయినా ఉపాధి పొందడానికి అవకాశం ఉంటుంది. వర్రేగూడెం పట్టణ ఆరోగ్య కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్నా. భవిష్యత్తులో నేను చేయబోయే ఉద్యోగం, విధులు ఎలా ఉంటాయో అర్థమైంది. మంచి సంస్థలో ఉద్యోగం దొరికితే చేరిపోతాను. లేదంటే డిగ్రీ చదువుతా.

అవగాహన కలిగింది: పి.నాగమంజుల, ఎంఎల్‌టీ ద్వితీయ సంవత్సరం

త్వరితగతిన ఉద్యోగం సంపాదించడానికి అనువుగా ఉంటుందని ఎంఎల్‌టీ కోర్సులో చేరా. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. చదువులో భాగంగా చిలకలపూడి పట్టణ ఆరోగ్య కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్నా. ప్రాక్టికల్‌గా ఇక్కడ రక్త పరీక్షలు చేయడం, రోగులకు వివిధ రకాల సేవలు అందించడం ఎంతో ఉపయోగపడుతోంది.

కేడీసీసీ బ్యాంకులో శిక్షణ: చార్మి, ఎకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్ విద్యార్థిని

ఎకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్ కోర్సు ప్రథమ సంవత్సరం చదువుతున్నా. కేడీసీసీ బ్యాంకులో వృత్తిపరమైన శిక్షణ తీసుకుంటున్నా. కేడీసీసీ బ్యాంకు పరిధిలో ఎన్ని శాఖలు ఉన్నాయి.రైతులకు ఎలాంటి సేవలు అందుతాయి. రుణాలు, రాయితీలు.. ఇలా వివిధ అంశాలపై అవగాహన కలిగింది. ఇది నేను ఉద్యోగం పొందడానికి ఎంతగానో దోహదపడుతుంది. మాకు తెలిసినవారు చాలా మంది ఈ కోర్సులు చేసి వివిధ ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నారు.

అనేక సంస్థల్లో శిక్షణ: ఎస్.సరళకుమారి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి

ప్రస్తుతం వృత్తి విద్యా కోర్సులకు మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం బందరులోనే 330 మందికి పైగా విద్యార్థులు వివిధ సంస్థల్లో శిక్షణ పొందుతున్నారు. 30 రోజుల పాటు శిక్షణ ఇవ్వడంతో కళాశాల నుంచి బయటకు వెళ్లేసరికి ఉద్యోగానికి అవసరమైన అనుభవం వస్తుంది.

నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో యువతకు స్కిల్ హబ్‌ల ద్వారా నైపుణ్య శిక్షణ అందజేయనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేష్ తెలిపారు. పెడన, గన్నవరం, గుడివాడ, పెనమలూరు, పామర్రు, అవనిగడ్డ నియోజకవర్గాల హబ్‌ల ద్వారా శిక్షణ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. బీటెక్, డిప్లొమా, బీఎస్సీ, బీకాం చదివిన నిరుద్యోగ యువతకు అప్లికేషన్ డెవలపర్, వెబ్, మొబైల్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందజేయనున్నట్లు వెల్లడించారు. ఎంఎన్‌సీ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించే కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వ గుర్తింపు ధ్రువపత్రం అందజేస్తారని పేర్కొన్నారు. పెడన నియోజకవర్గ కేంద్రంలో త్వరలో ప్రాంగణ ఎంపికలు చేపట్టనున్నట్లు తెలిపారు. పలు ఎంఎన్‌సీ కంపెనీలు ఎంపికల్లో పాల్గొంటాయన్నారు.

నేడు వెలుగు మహిళలకు..

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: ఈనెల 25న ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు వీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు మెరుగుపరచేందుకు ఒక్కో గ్రామం నుంచి నలుగురు మహిళలకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణకుమారి, డిప్యూటీ తహసీల్దార్ రవి కిరణ్ తదితరులు పాల్గొంటారని వివరించారు.

కర్షకుల ప్రగతితోనే రాష్ట్ర పురోగతి

రైతులకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

పెడన, పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లెలు పాడి పంటలతో వర్ధిల్లినప్పుడే రాష్ట్ర పురోగతి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని మండలంలోని నందమూరులో ఆయన సోమవారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. సాగును లాభసాటిగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం సాంకేతికతను అందుబాటులోకి తీసుకువస్తోందన్నారు. నేల స్వభావం ఆధారంగా పంటలను సాగు చేయాలని సూచించారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని, పత్రికల్లో వస్తున్న రైతుల విజయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. ఏవో సజ్జా జెస్సీ, ఎంపీడీవో అరుణకుమారి, నందమూరు పీఏసీఎస్ అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, సీతారామ్ మోహనరావు, కూటమి నేతలు ప్రసాద్, పరసా రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే నందమూరులో రైతులకు టార్పాలిన్లు అందజేశారు.

డిమాండ్ ఆధారంగా పంటల సాగు..

గూడూరు, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ సెంట్రల్ పోతన లక్ష్మీనరసింహస్వామి అన్నారు. 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో భాగంగా సోమవారం గూడూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రైతును రాజును చేసే దిశగా ప్రణాళిక సిద్ధం చేసిందని చెప్పారు. డిమాండ్ ఆధారిత పంటలు సాగు చేయించడంతోపాటు పండించిన పంటలకు అదనపు విలువలు జోడించడం, ఇలా వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు అందరూ ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. పలువురు రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి నాయకులు ఎస్‌ఏ బేగ్, బూసిరెడ్డి విజయ్, పంచాయతీ కార్యదర్శి భాస్కరరావు, వీఆర్వో శేఖర్, వ్యవసాయ సహాయకులు పూజ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం అమ్మిన రోజే చెల్లింపులు

కృత్తివెన్ను, బంటుమిల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతుల కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని నాయకులు అన్నారు. ధాన్యం విక్రయించిన వెంటనే నగదు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. బంటుమిల్లి మండలంలో తెదేపా మండల కన్వీనర్ కూనపురెడ్డి వీరబాబు, టీడీపీ మైనారిటీ నాయకులు, మల్లేశ్వరం సర్పంచి చెన్ను శ్రీనివాసరావు, ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగర రంగనాథ్, కృత్తివెన్ను మండలంలో కూటమి నాయకులు పులగం చిన్నబ్బులు, పులగం శ్రీను, కొప్పినేని ఆదిశేషు, రావూరి తాతాజీ, తదితరులు రైతన్న మీకోసం కార్యక్రమాల్లో పాల్గొని కరపత్రాలు అందించారు.

మోహినీపురంలో నేటి నుంచి షష్ఠి కల్యాణోత్సవాలు

ఆర్జిత సేవలు రద్దు

మోపిదేవి, న్యూస్‌టుడే: మంగళవారం నుంచి గురువారం వరకు జరిగే మార్గశిర మాస షష్ఠి కల్యాణ మహోత్సవాలకు మోహినీపురం ముస్తాబైంది. మూడు రోజుల పాటు స్వామికి నిర్వహించే అన్నిరకాల ఆర్జిత సేవలను తాత్కాలికంగా రద్దు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. మంగళవారం స్వామి వారికి పెద్ది కుమారుని ఉత్సవం, యాగశాల ప్రవేశం తదితర పూజలు నిర్వహిస్తారు. 26న ఉదయం 11గంటలకు స్వామి దివ్య కల్యాణం, సాయంత్రం 6గంటలకు మయూర వాహనంపై గ్రామోత్సవం జరుగుతాయి. గురువారం ఉదయం 11గంటలకు పంచామృత స్నపన, వసంతోత్సవం, మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమంలో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయని ఈవో తెలిపారు.

యూనియన్ బ్యాంకు ప్రధాన బ్రాంచి వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు, సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు

జిల్లా పరిషత్ సెంటరులో ..

బందరు ఘనకీర్తికి భోగరాజు ఓ చిహ్నం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: బందరు ఘనకీర్తికి భోగరాజు పట్టాభి సీతారామయ్య ఓ చిహ్నం అని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకులు డా.భోగరాజు పట్టాభి సీతారామయ్య 146వ జయంతి కార్యక్రమాన్ని సోమవారం ఆంధ్రా బ్యాంకు విశ్రాంత ఉద్యోగులు, యూనియన్ బ్యాంకు అధికారులు, ఉద్యోగులు వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ కె.వెంకట్రావు, డిప్యూటీ రీజనల్ హెడ్ కె.రామలింగేశ్వరరెడ్డి, ఆంధ్రా బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు కొల్లు సాయిమోహన్‌రావు, రాజారామ్, విశ్వేశ్వరరావు, మహ్మద్‌మునీర్, డీవీ సుబ్రహ్మణ్యం, నూకల హరిప్రసాద్ తదితరులు జిల్లా పరిషత్ సెంటరు కూడలితో పాటు యూనియన్ బ్యాంకు ప్రధాన బ్రాంచి వద్ద భోగరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

ఇలాగే వదిలేస్తే.. రాకపోకలు ఎలా?

తుపాను కారణంగా వీచిన గాలులకు జడ్పీ కార్యాలయ ప్రాంగణంలోని పలుచోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. వాటిలో కొన్నింటిని తొలగించారు. మిగిలిన వాటిని అలాగే వదిలేశారు. ప్రధానంగా జడ్పీ కార్యాలయానికి వెళ్లే రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును అలాగే వదిలేయడంతో ఉద్యోగులతో పాటు, వివిధ సేవల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

ప్రమాదం.. ఆపే వీలుంది..!

వేగ నిరోధకం ఏర్పాటు చేయాల్సిన ప్రాంతం

బందరు మండలం చిన్నాపురం సమీపంలోని పెట్రోలు బంక్ ప్రాంతంలో తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఇక్కడ వేగనిరోధకం ఏర్పాటు చేయాలని స్థానికులతో పాటు వాహనదారులు కోరినా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇలాగే వదిలేస్తే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
– మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

రాళ్లు లేచి...అధ్వానంగా మారి..

నగరంలోని సర్కారు తోట, ఎస్టేట్ ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. కొన్నిచోట్ల రాళ్లు లేచి మొనలు తేలి ఉంటే మరికొన్నిచోట్ల అడుగులోతు గుంతలతో అధ్వానంగా ఉన్నాయి. ఆ రోడ్ల వెంట రాకపోకలు సాగించడానికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్లను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.
– మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే

అల్లుకున్న తీగ.. ప్రాణం మీదకేగా..

నగరంలోని జడ్పీ కూడలి సమీపంలో ఎస్టేట్‌కు వెళ్లే రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కనిపించని విధంగా పొదలు ఆవరించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఉన్నా పొదలు దట్టంగా అల్లుకుపోవడంతో పాటు స్తంభాల నుంచి తీగల వైపు పాకుతున్నాయి. అధికారులు స్పందించి పొదలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.
– మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

రమణమ్మకు జాతీయ సాహితీ పురస్కారం

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ సీసీఎస్ సీఐ వింజరపు రమణమ్మ మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ ఇటీవల విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జాతీయ సాహితీ పురస్కారం అందుకున్నారు. 'పేగు బంధం' అనే కవితను చదివినందుకుగాను ఆమెకు ఈ పురస్కారం అందించారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ కృష్ణా జిల్లా మచిలీపట్నం అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. No. 36/2022
in O.S. No. 173/2015

Between :
కంచర్లపల్లి రాంబాబు ... D. Hr
మరియు
కూరేటి లీలా ప్రసాద్ ... J.Dr

పై నెంబరు E.P.లో శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము పై నెంబరు వారెంటు బాకీ వసూలు నిమిత్తము యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది. 11-12-2025న ఉదయం గం. 10.30 ని॥ల నుండి పై కోర్టు వారి యెదుట వేలం వేయబడును. కావున సదరు వేలం పాటలో పాల్గొనేవారు వేలం షరతులకు లోబడి పాట పాడుకొనవచ్చును అని యిందుమూలంగా యావన్మందికీ తెలియజేయటమైనది.

షెడ్యూలు: కృష్ణా జిల్లా, మచిలీపట్నం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, మచిలీపట్నం మున్సిపల్ ఏరియాలోని కాలేఖాన్‌పేట నందు J.Dr యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో కలిగియుండి పై నెంబరు దావా బాకీ క్రింద హామీగా జప్తు కాబడి ఈ నెంబరు డిక్రీ బాకీ క్రింద వేలం కావలసిన **స్థిరాస్తి వివరము:** 1వ వార్డులోని 274.68 చ॥గ॥ల స్థలములో డోర్.నెం. 1/189/2రున నిర్మించబడిన మెడ్రాస్ టెర్రస్డ్ డాబా మరియు రేకుల కప్పు గల ఇంటికి హద్దులు. **తూర్పు:** యీ ఆస్తి ప్రహరీ గోడ అవతల మున్సిపల్ రోడ్డు అ॥ 55.5లు, **దక్షిణం:** అడపాల పాండురంగ వీరయ్య నాయుడు గారి ప్రహరీ గోడ అ॥ 42.400లు, **పడమర:** ఈ ఆస్తి ప్రహరీ గోడ అవతల వంకా బాబ్జీ గారి స్థలము అ॥ 58.5లు, **ఉత్తరం:** చల్లపల్లి రోడ్డు అ॥ 44.6లు. ఈ హద్దుల మధ్య 1వ వార్డులోని 274.68 చ॥గ॥ల స్థలములో డోర్.నెం. 1/189/2రున నిర్మించబడిన మెడ్రాస్ టెర్రస్డ్ డాబా మరియు రేకుల కప్పు గల ఇంటికి అమర్చబడియున్న ఎలక్ట్రికల్ ఫిట్టింగులు మరియు యావద్విశిష్ట కలప సామానులతో సహా.

D.Hr కిమ్మత్తు Rs. 5,00,000/–
అమీనా కిమ్మత్తు Rs. 25,00,000/–
NOTE: EC దాఖలా అన్యాక్రాంతములు ఏమియునూ లేవు.

పేర్ని సురేష్ బాబు
D. Hr తరఫున న్యాయవాది
ఈడేపల్లి, మచిలీపట్నం. Ph: 93464 22969

కలెక్టరేట్‌లో అర్జీ అందించిన రైతులు

డొంకదారి ఆక్రమించారు.. పట్టించుకోండి

గూడూరు, న్యూస్‌టుడే: డొంకదారి ఆక్రమించారు.. పట్టించుకోండి అంటూ మండల పరిధిలోని మల్లవోలు, రాయవరం గ్రామాలకు చెందిన రైతులు అధికారులకు మొరపెట్టుకున్నారు. ఆయా గ్రామాల రైతులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందించారు. అర్జీ స్వీకరించిన ఉన్నతాధికారులు మండల తహసీల్దారు రాజ్యలక్ష్మికి ఫోన్ చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో ఆమె ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

సూర్యఘర్ పథకం.. ప్రజలకు వరం

ప్రచారం చేస్తున్న బాలాజీ, విజన్ ఎనర్జీ ప్రతినిధులు

పెడన, న్యూస్‌టుడే: కేంద్రం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకం ప్రజలకు వరం లాంటిదని న్యాయవాది లంకిశెట్టి బాలాజీ అన్నారు. ఈ పథకం కింద విద్యుత్తు సర్వీసులు ఏర్పాటు చేసేందుకు పెడనలో ఏర్పాటు చేసిన సోలార్ విజన్ ఎనర్జీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. మూడు స్లాబుల్లో ఈ పథకం కింద సర్వీసును తీసుకునేందుకు అవకాశం ఉందని. . ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటి అవసరాలకు వినియోగించగా మిగిలిన విద్యుత్తును ప్రభుత్వ సంస్థలకు విక్రయించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమని చెప్పారు. సంస్థ నిర్వాహకుడు ఉస్మాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ఉత్తమ ఫలితాల సాధనకు పోటీలు దోహదం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీల్లో పాల్గొనడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించడానికి దోహదపడతాయని నగరంలోని జవ్వారుపేట రామకృష్ణ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు అన్నారు. సోమవారం ఈనాడు, ఈటీవీ ఆధ్వర్యంలో పాఠశాలలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించగా వివిధ తరగతుల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో బి.కృష్ణశ్రీ ఫణిసాయి(10వ తరగతి), అబ్దుల్‌వసి(7వ తరగతి), ఎం.అఖిల(9వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు కరస్పాండెంట్‌తో పాటు ఉపాధ్యాయులు సీహెచ్ సంధ్యారాణి, ఏ.మల్లేశ్వరి, హుస్సేన్, కె.శేఖరరావు తదితరులు బహుమతులు అందజేశారు. ఈనాడు సంస్థలు విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించేలా పోటీలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, విజేతలతో కరస్పాండెంట్ రామకృష్ణ, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్(257) నాయకులు కోరారు. డీఎస్సీ-2025 ఉపాధ్యాయుల జీతాలు విడుదల చేయడంతో పాటు పలు సమస్యలు పరిష్కరించాలని సోమవారం మచిలీపట్నంలోని జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఏడీ రవూఫ్‌కు వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటిపూడి సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి వి.సాంబశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటుకున్న విద్యార్థులు

బహుమతులు అందుకున్న విద్యార్థులతో కోచ్

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: ఇటీవల నంద్యాలలో నిర్వహించిన స్పైక్-స్పోర్ట్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ పోటీల్లో మచిలీపట్నం విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు. నగరంలోని శ్రీ వెంకటేశ్వర త్రైక్వాండో అకాడమీకి చెందిన కె.యశ్వంత్, టి.దినేష్, కె.భవేష్, ఎస్.వెంకట్‌లు బంగారు పతకాలు, కె.యశశ్రీ, కె.కారుణ్యశ్రీలు రజతం, షేక్ షాహిద్‌అలీ, ప్రణీత్, కృష్ణ, కె.ధీరజ్‌లు కాంస్య పతకాలు సాధించారు. మార్షల్‌ఆర్ట్స్ పోటీల్లో బహుమతులు అందుకున్న విద్యార్థులతో పాటు ప్రోత్సహించిన కోచ్ అరవింద్‌ను మార్షల్ ఆర్ట్స్ జిల్లా అధ్యక్షుడు పి. ఈశ్వర్, కార్యదర్శి పి.విశ్వ తదితరులు అభినందించారు.

ధాన్యం సేకరణలో అప్రమత్తత అవసరం

పెడన, న్యూస్‌టుడే: రైతుల నుంచి ధాన్యాన్ని త్వరితగతిన సేకరించేందుకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ అధికారులకు సూచించారు. మండలంలో పది ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ (ఎఫ్‌పీసీ)ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ఈ కేంద్రాల్లో ఇప్పటివరకు సేకరించిన ధాన్యం, చెల్లింపులు, పెండింగ్‌లో ఉన్న ధాన్యం నమూనాలు తదితర అంశాలపై తహసీల్దార్ సోమవారం సమీక్షించారు. గురివిందగుంటలో ధాన్యం సేకరణ వెనుకంజలో ఉందని రైతులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆ కేంద్రంలో వేగాన్ని పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. రైతులతో మర్యాదగా వ్యవహరించాలని.. ధాన్యం తేమ శాతం 17లోపు ఉండేలా చైతన్యపర్చాలని సూచించారు. ఎఫ్‌పీసీ సీఈవో కె.కిశోర్, ఆర్ఐ ఈడే విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీవో ప్రతినిధులతో చర్చిస్తున్న తహసీల్దార్

క్రీడల్లోనూ రాణించండి


బాలికల రాష్ట్ర స్థాయి జట్టుతో అతిథులు, అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మచిలీపట్నంలోని నోబుల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 బాల, బాలికల అంతర్‌జిల్లా పోటీలు సోమవారంతో ముగిశాయి. బాలికల విభాగంలో కృష్ణా, శ్రీకాకుళం, అనంతపురం జిల్లా జట్లు, బాలుర విభాగంలో కర్నూలు, శ్రీకాకుళం, ప్రకాశం జిల్లా జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. కార్పొరేటర్ దేవరపల్లి అనిత, తెదేపా రాష్ట్ర నాయకుడు కొనకళ్ల జగన్నాథరావు, కూటమి నాయకులు కొట్టే వెంకట్రావు, మాదివాడ రాము, డీవైఈవో శేఖర్ సింగ్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఝాన్సీ తదితరులు విజేతలకు బహుమతులు అందించారు. ఉత్తమ ప్రతిభ సాధించిన క్రీడాకారులతో రాష్ట్ర స్థాయి జట్లు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మత్తి అరుణ తెలిపారు.

పోషకాహారంతో ఆరోగ్యానికి మేలు

బంటుమిల్లి, న్యూస్‌టుడే : మధ్యాహ్న భోజన పథకం ద్వారా ప్రభుత్వాలు విద్యార్థులకు అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని బంటుమిల్లి మండల వైద్యాధికారి పవన్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. సోమవారం పెందుర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. చిక్కీలు, గుడ్డు, పప్పు వంటివి పూర్తిగా తినాలని తెలిపారు. ఇన్‌ఛార్జి హెచ్‌ఎం మోహన్‌రావు, ఉపాధ్యాయురాలు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి : పెందుర్రులో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

IDBI BANK
ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్
మచిలిపట్నం బ్రాంచి (Sol-871)
ఫోన్: 0867-2224002,
ఇమెయిల్: rb871@idbi.co.in,
www.idbibank.in
CIN: 65190MH2004GOI148838

స్థిరాస్తుల విక్రయానికి అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) యొక్క నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన సాధారణ ప్రజలకు ప్రత్యేకించి రుణగ్రహీత(లు) శ్రీ పంచపరవల శ్రీనివాసరావు మరియు పంచపరవల నాగ మౌనిక కు నోటీసు ఇచ్చేదేమంటే, దిగువ వివరించబడిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తాకట్టుంచబడింది/ఛార్జి చేయబడింది మరియు ఐడిబిఐ బ్యాంకు లిమిటెడ్ అధీకృత అధికారిచేత భౌతిక స్వాధీనం చేసుకొనబడినది, ఇది "ఎక్కడ ఏది ఎలా ఉన్నదో అది అక్కడ అలాగే" ప్రాతిపదికన ఐడిబిఐ బ్యాంకు లిమిటెడ్‌కు 18.11.2025నాటికి గల బకాయి రూ.26,10,280/–ని అదనపు వడ్డీ మరియు ఇతర వ్యయాలతో సహా శ్రీ పంచపరవల శ్రీనివాసరావు మరియు పంచపరవల నాగ మౌనిక నుంచి రాబట్టుకొనుటకు 26.12.2025 న విక్రయించబడును.

రిజర్వు ధర	ధరావతు	వేలం తేదీ
రూ.24,77,530/–	రూ.2,47,753/–	26.12.2025.

స్థిరాస్తి వివరణ: చిన్నాపురం గ్రామం, మచిలీపట్నం, క్రిష్ణాజిల్లా ఆంధ్రప్రదేశ్-521001 లో ఆర్.ఎస్.నం.40, డి.నం11/60లోని 280.90 చ.గజాలు లేదా 234.86 చ.మీల విస్తీర్ణం గల నివేశన స్థలంలో మరియు ప్రతిపాదిత ఆర్‌సిసి పై కప్పు భవనం మరియు ఇతర సామాగ్రిగా గల స్థిరాస్తి, భూమిలోని అవిభాజ్యవాటా సహా మరియు దానిలోని నిర్మాణాలు. హద్దులు: తూర్పు: పంచాయతీ రోడ్డు. దక్షిణం: కొప్పినేని వెంకటేశ్వరరావు ప్రహరీ గోడ. పడమర: చలమలసెట్టి సత్యనారాయణ స్థలం. ఉత్తరం: దాత మిగిలిన స్థలం. ఈహద్దులలో 280.90 చ.గజాలు లేదా 234.86 చ.మీల నివేశన స్థలం మరియు ప్రతిపాదిత ఆర్‌సిసి పై కప్పు భవన నిర్మాణం మరియు ఇతర సామాగ్రి మాత్రమే.

విక్రయం తాలూకు వివరంగా గల నియమ నిబంధనలకు దయచేసి సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ అనగా www.idbibank.in లో ఇవ్వబడిన లింకును చూడండి.

తేది 24.11.2025.
స్థలం: మచిలీపట్నం.
అధీకృత అధికారి
ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్.

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

ప్రతిభ చాటారు.. గెలుపొందారు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : గన్నవరం పట్టణంలోని రవీంద్ర భారతీ హైస్కూల్‌లో సోమవారం 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలో జె.రోహిత్, ఎం.గోస్వామి, కె.యజ్ఞరూప్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఉపాధ్యాయులతో కలిసి ప్రిన్సిపల్ ఎస్.సుష్మ బహుమతులు అందజేశారు.

విజేతలతో ప్రిన్సిపల్ సుష్మ, ఉపాధ్యాయులు

చిత్రలేఖనం పోటీలో సత్తా

నున్న, న్యూస్‌టుడే : నీతోడు మానసిక కేంద్రం, నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో సోమవారం నున్న జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బాలలపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జోనల్ కోఆర్డినేటర్ ఎన్.దేవమణి ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. షేక్.రేష్మ, పవిత్ర, టి.రిత్విక్ మొదటి మూడు స్థానాలు పొందారు. వీరికి ఉపాధ్యాయులు అన్నపూర్ణ, గోపినాథ్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందనకు వందనం

★ పెనమలూరు అన్నేబాబూరావు కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని కాలనీ వాసులు ఆదివారం మేమున్నాం మీకు తోడుగా ద్వారా గ్రామ కార్యదర్శి అహ్మద్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్యదర్శి సోమవారం కాలనీలోని మరమ్మతులకు గురైన 15 దీపాల స్థానంలో నూతన దీపాలు ఏర్పాటు చేయించారు.

★ పెనమలూరు జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న తాగునీటి బోరు పైపులు పూడి పోయాయని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా గ్రామ కార్యదర్శి అహ్మద్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్యదర్శి సోమవారం పైపులైన్‌ను తొలగించి నూతన పైపులైన్‌ను ఏర్పాటు చేయించారు.

- న్యూస్‌టుడే, పెనమలూరు

? గన్నవరం శివారు రాజీవ్ నగర్‌లోని కాలువల్లో పూడిక తొలగించాలి. **- ఈశ్వరరావు, స్థానికుడు** ✔ సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం. **- ప్రసాద్, ఈవో బుద్ధవరం**

? గన్నవరం గాంధీ బొమ్మ కూడలిలో రోడ్డుపై ఉన్న ఇసుకను తొలగించాలి. **- మల్లికార్జునరావు, వ్యాపారి**

✔ సత్వరమే ఇసుక, ఇతర వాటిని తొలగించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. **- దాస్, పంచాయతీరాజ్ ఇంజినీర్**

- న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

ఉచితంగా గ్రహణం మొర్రి శస్త్రచికిత్సలు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : గన్నవరం మండలం చిన్నఅవుటపల్లిలోని డా.పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాలలో ఆపరేషన్ స్మైల్ స్వచ్ఛంద సంస్థ, కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా గ్రహణం మొర్రి శస్త్రచికిత్సలను నిర్వహించనున్నట్లు డీజీ డా.చదలవాడ నాగేశ్వరరావు తెలిపారు. చీలు పెదవి, చీలు అంగిలితో బాధపడుతున్న చిన్నారులు, పెద్దలకు ఈ నెల 30 వరకు శస్త్రచికిత్సలు చేస్తామన్నారు. ఈ వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఏర్పాట్లను కళాశాల డైరెక్టర్ డా.సీవీ.రావు, ప్రిన్సిపల్ డా.మేజర్ ఎమ్వీ భీమేశ్వర్, సూపరింటెండెంట్ డా.అనిల్ కుమార్ బృందం పర్యవేక్షించింది.

విక్రయాలు పేలవం.. తగ్గిన ఆదాయం

ఆస్తుల రిజిస్ట్రేషన్లు అంతంతే..

ఉయ్యూరు, న్యూస్‌టుడే

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని ఉయ్యూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సాధించడంలో వెనుకంజలోనే ఉంది. గత మూడేళ్లలో కూడా లక్ష్యాన్ని చేరుకోలేదు. సీఆర్‌డీఏ ప్రాంతంగా ఉయ్యూరు పరిసరాలున్నా ఆశించిన మేరకు వ్యాపారం ఊపందుకోలేదు. దీని కారణంగా ఈ కార్యాలయం పరిధిలో క్రయవిక్రయాలు జరగలేదని వ్యాఖ్యలు వినిస్తున్నాయి. కుటుంబీకులకు, బంధువులకు ఆస్తుల్ని దాన విక్రయాలతోనే రిజిస్ట్రేషన్లు కూడా జరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి ఆదాయం తగ్గే పరిస్థితి.

★ ఉయ్యూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఉయ్యూరు, పమిడిముక్కల, తోట్లవల్లూరు మండలాల్లోని 40 గ్రామాలుండగా అందులో ఉయ్యూరు పురపాలక సంఘం, గండిగుంట గ్రామాలు అత్యంత కీలకం. ఇక్కడే భూముల ప్రభుత్వ నిర్ణీత ధరలు కూడా ఎక్కువగా ఉంటాయి. దీని పరిధిలో భూముల ధరలు పరిశీలిస్తే వ్యవసాయ భూములైతే ఎకరం రూ.15 లక్షల నుంచి రూ.45 లక్షలుగా ఉంది. నిర్మాణ స్థలాలు గజం రూ.1,500 నుంచి రూ.9,500 వరకు ధర పలుకుతుంది. ప్రధాన ఆదాయం చేకూర్చేది ఉయ్యూరు పట్టణం, దాని పరిసరాల్లోని భూములే. కాని గత మూడేళ్లుగా ఉయ్యూరు ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చతికిలపడింది. ఆశించిన మేరకు క్రయవిక్రయాలు లేనందున కార్యాలయం ఆదాయం తగ్గిపోయింది. ఆస్తుల ధరలు పెరగడం, రిజిస్ట్రేషన్ల ఫీజులు ఎక్కువగా ఉండడంతో ఆదాయం లక్ష్యాలకు దూరంగా ఉన్నాయి. భవిష్యత్తులో పెనమలూరు నియోజకవర్గం ఎన్టీఆర్ జిల్లాలో విలీనమైతే పరిస్థితి కొంత ఆశాజనకంగా ఉంటుందని రియల్టర్లు ఆశాభావంతో ఉన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వేసిన వెంచర్లు ఏళ్లుగా విక్రయాలు లేక బీడువారి పోతున్నాయి. ప్రస్తుతం ఎల్ఆర్ఎస్, బీపీఎస్ పథకాలు ప్రభుత్వం అమలు చేస్తున్న నేపథ్యంలో క్రయవిక్రయాలు పెరిగే సూచనలున్నాయని అధికారులు చెబుతున్నారు.

ఉయ్యూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వేచి ఉన్న ప్రజలు

పరిధి	ఏడాది	లక్ష్యం	సాధించింది	రిజిస్ట్రేషన్ల
		(రూ.కోట్లలో)		సంఖ్య
ఉయ్యూరు	2023-24	41.44	33.15	8031
	2024-25	55.03	36.94	7210

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

రామవరప్పాడు, న్యూస్‌టుడే : విద్యుత్తు తీగల మరమ్మతుల నేపథ్యంలో ఎనికేపాడు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో మంగళవారం ఉదయం 8.30 నుంచి 11.30 మధ్య ఎనికేపాడు హరిజనవాడ, జెండా చెట్టు సెంటర్, విజయ ఆగ్రో కట్ట, రైలు కట్ట, జామ తోట ఏరియాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పరమేశ్వర్ సోమవారం తెలిపారు.

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : గుణదల- కానుమోలు, గుణదల- రంగన్నగూడెం 132 కేవీ విద్యుత్తు మార్గంలో ఈ నెల 25 నుంచి 27 వరకు గన్నవరం విమానాశ్రయం ఉపకేంద్రానికి ఫీడర్లను అనుసంధానం చేసే పనులు చేపడుతున్న నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నారు. ఈ కారణంగా సాధారణ విద్యుత్తు వినియోగదారులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని, అత్యవసర పరిస్థితుల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ట్రాన్స్‌కో విజయవాడ ఈఈ ఎస్.కోటేశ్వరరావు తెలిపారు.

చిన ఓగిరాల ఆరోగ్య కేంద్రం పరిశీలన

చిన ఓగిరాల(ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే : మండలంలోని చిన ఓగిరాలలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టీకా అధికారి డాక్టర్ ప్రేమ్‌చంద్ సోమవారం సందర్శించారు. ఓపీ రిజిస్టర్, దస్త్రాలు, ల్యాబ్ తదితర వాటిని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్.తేజస్విని, ఎంపీహెచ్ఈవో పి.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో జిల్లా టీకా అధికారి ప్రేమ్‌చంద్, వైద్యులు తదితరులు

ఆలయ నిర్మాణానికి విరాళం

రసీదు అందుకుంటున్న దాతలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : బాపులపాడులో నూతనంగా నిర్మిస్తున్న శ్రీహరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన మువ్వా కృష్ణప్రసాద్, ప్రీతి దంపతులు రూ.1.30 లక్షలు, శివాలయానికి మరో రూ.10,116 విరాళంగా అందించారు. ఈ మేరకు సోమవారం ఆలయ కమిటీ సభ్యులు గూడపాటి రత్నశేఖర్, గూడవల్లి చిన్నారావు దీనికి సంబంధించిన నగదును వారు అందజేశారు.

రైతు సంక్షేమమే కూటమి ధ్యేయం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతుందని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చేపట్టిన 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమాన్ని సోమవారం బాపులపాడు మండలంలోని 19 రైతు సేవా కేంద్రాల్లో ప్రారంభించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : గన్నవరం మండలం ముస్తాబాద, కేసరపల్లి పంచాయతీల పరిధిలో సోమవారం 'రైతన్నా మీకోసం' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ఏవో శివ ప్రసాద్ వివరించారు. అనంతరం ప్రచార కరపత్రాలను అన్నదాతలకు అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గూడవల్లి నరసయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.


రంగన్నగూడెంలో గోపాలకృష్ణ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ

గన్నవరం ఏఎంసీ ఛైర్మన్ గూడవల్లి నరసయ్య ఆధ్వర్యంలో..

వాలంటీర్లకు ప్రత్యేక శిబిరాలు

పునాదిపాడు/కంకిపాడు, న్యూస్‌టుడే : విజయవాడలోని శ్రీదుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలకు చెందిన రెండు ఎన్ఎస్ఎస్ బృందాలు కంకిపాడు, పునాదిపాడు గ్రామాల్లో ఏడు రోజులపాటు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పీవోలు కె.సరళ, టి.నాగరాణి తెలిపారు. వీటిలో భాగంగా సోమవారం అవగాహన ప్రదర్శనలు, ఇంటింటి సర్వేల్లో వాలంటీర్లు పాల్గొన్నారు. శిబిరాలను కంకిపాడు ఉపసర్పంచి రాచూరి చిరంజీవి, పునాదిపాడు పంచాయతీ కార్యదర్శి బాపూజీ ప్రారంభించారు.

పునాదిపాడు: ర్యాలీలో పీవోలు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

మాలధారణ భక్తులకు సద్ది ఏర్పాటు

నెప్పల్లి (కంకిపాడు), న్యూస్‌టుడే : చలసాని నాగమణి (అమ్మాజీ) ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామస్థుల సహకారంతో నెప్పల్లి శివాలయ ప్రాంగణంలో 40 రోజుల పాటు అయ్యప్ప, భవానీ మాలధారులకు సద్ది ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహక ప్రతినిధి చలసాని అరుణ ప్రసాద్ తెలిపారు. దీనిలో భాగంగా సోమవారం గ్రామానికి చెందిన చలసాని నాగ సురేష్ కుటుంబ సభ్యులు సద్ది ఏర్పాటు చేశారు. ఆలయ ప్రతినిధి కొలుసు గోవింద్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షధారులతో దాతలు

ఉత్తమ సేవకు సత్కారం

దివ్యాంగులకు హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ, స్పందన మానసిక వికాస కేంద్రం ఏర్పాటుతో ఉచితంగా సేవలు అందిస్తున్న సంజాతక్కల రజిత వెంకట్‌ను తెలుగు వెలుగు సాహితీ వేదిక ప్రతినిధులు సత్కరించారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకల్లో భాగంగా ఉత్తమ సేవలకు గాను భారత స్ఫూర్తి కిరీటీ జాతీయ పురస్కారాన్ని రజిత వెంకట్‌కు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గన్నవరం మండలం దావాజీగూడేనికి చెందిన రజిత వెంకట్‌ను పలువురు సోమవారం అభినందించారు.

- న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం



'108' వాహనాలు తుప్పు పడుతున్నాయ్..!

పాత '108' వాహనాలు గత ఆరు నెలలుగా ఆరు బయట ఉండడంతో తుప్పు పడుతున్నాయి. కొత్త అంబులెన్స్‌లు అందుబాటులోకి రావడంతో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో దాదాపు వంద వాహనాలను పక్కన పెట్టేశారు. ఎండ ఎండుతూ.. వానకు తడుస్తుండడంతో ఇవి త్వరిత గతిన ధ్వంసమవుతున్నాయి. కొన్ని చోట్ల చక్రాలు, టైర్లు చోరీకి గురవుతున్నాయని పలువురు స్థానికులు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, కంకిపాడు.**

అడ్డుగా నిర్మాణ సామగ్రి

ఉయ్యూరు-కాటూరు రోడ్డు నుంచి గండిగుంట గ్రామంలోకి వెళ్లే రహదారి పక్కన భవన నిర్మాణ సామగ్రి గుట్టలుగా పడి ఉన్నాయి. వీటి వల్ల రాకపోకల సమయంలో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో అవి కనిపించక ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గండిగుంట(ఉయ్యూరు గ్రామీణం)**

పునాదుల్లో ఆగి.. పొదలు పెరిగి

బాపులపాడు మండలం కానుమోలులో రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి నాలుగేళ్ల కిందట శంకుస్థాపన చేసి, ప్రాథమికంగా పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి కేవలం పునాదుల దశకే పరిమితమవ్వడంతో పిల్లర్ల కోసం ఏర్పాటు చేసిన ఇనుప చువ్వలు సైతం కనిపించకుండా ఇలా దట్టంగా పొదలు పెరిగాయి. గన్నవరం నియోజకవర్గంలో గత వైకాపా ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య క్లినిక్ భవనాల నిర్మాణ పురోగతి అత్యంత దారుణంగా తయారైందనే దానికి ఈ ఉదంతం నిదర్శనంగా నిలుస్తోంది. **- న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్**

మురుగుమయంగా పెద్దఆవుటపల్లి

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : పెద్దఆవుటపల్లి సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గ్రామంలో ఎక్కడ చూసినా మురుగే దర్శనమిస్తోంది. డ్రెయిన్లలో పూడిక తీయక.. అంతర్గత రహదారులపై గోతులు పడి రాకపోకలకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 7,500ల జనాభా రూ.40 లక్షల ఆదాయం కలిగిన పంచాయతీలో పక్కా డ్రెయిన్ల కొరత, ఖాళీ స్థలాల్లో మురుగు చేరికతో గ్రామం అధ్వానంగా తయారైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదాయం రూ.లక్షల్లో ఉన్నా.. ప్రజారోగ్యంపై అధికారులకు శ్రద్ధ లేకపోవడంతోనే ఈ పరిస్థితికి కారణమని ఆరోపిస్తున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఫ్లైఓవర్‌పై కారు బీభత్సం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : హనుమాన్‌జంక్షన్ ఫ్లైఓవర్‌పై ఆదివారం అర్ధరాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. జంక్షన్ వైపు నుంచి నూజివీడు వెళ్తున్న కారు అతి వేగంతో దూసుకుపోతూ, ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. అదే ఊపులో ఫ్లైఓవర్ రక్షణ గోడని ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఆకునూరి ప్రశాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాపులపాడు మండలం కానుమోలుకు చెందిన ప్రశాంత్ మల్లవల్లి పారిశ్రామికవాడలో పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. హనుమాన్‌జంక్షన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గోడని ఢీకొట్టి ఆగిన కారు

కాలువలో పడి మహిళ మృతి

పెనమలూరు, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు బందరు కాలువలో పడి ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పీతా వెంకటేశ్వరమ్మ (55) తాడిగడప శ్రీనివాసనగర్ కట్టపై నివాసముంటున్నారు. సోమవారం మధ్యాహ్నం ఆమె ఇంట్లోని చెత్త కాలువలో పడేయడానికి బందరు కాలువ ఒడ్డుకు వెళ్లారు. చెత్త పడేసే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు కాలువలోకి జారి పడిపోయారు. గమనించిన స్థానికులు కాపాడడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. సాయంత్రం మృతదేహం సమీపంలోని చెట్లకు చిక్కుకొని కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సముద్రంలో గల్లంతైన విద్యార్థి..

మొగల్తూరు: పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో గల్లంతైన ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందారు. ఏలూరు పరిధి కొత్తపేటకు చెందిన మునగాల మోహనసాయి గణేశ్ (19) కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలులోని ప్రయివేటు కళాశాలలో ఇంజినీరింగ్ రెండో ఏడాది చదువుతున్నారు. ఆదివారం ముగ్గురు మిత్రులతో కలిసి ద్విచక్ర వాహనాలపై పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. సముద్రంలో స్నానానికి దిగిన గణేశ్ అలల ఉద్ధృతికి లోనికి కొట్టుకువెళ్లి గల్లంతయ్యారు. అతడి ఆచూకీ కోసం మెరైన్ పోలీసులు, బంధువులు, స్నేహితులు తీరంలో గాలిస్తుండగా సోమవారం మోళ్లపర్రు వద్ద మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నరసాపురం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై జి.వాసు తెలిపారు.

రూరల్ మండలం భాజపా అధ్యక్షుడిగా బత్తుల

రామవరప్పాడు, న్యూస్‌టుడే : విజయవాడ రూరల్ మండలం భాజపా అధ్యక్షుడిగా ప్రసాదంపాడుకు చెందిన బత్తుల చిన్నారావును నియమించారు. సోమవారం ప్రసాదంపాడు గ్రామంలో కృష్ణా జిల్లా భాజపా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, జిల్లా కార్యదర్శి సింగవరపు భాస్కర్ గణేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో చిన్నారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు మట్టా ఝాన్సీ, జిల్లా యువ మోర్చా ప్రధాన కార్యదర్శి నాగ శ్రీనివాస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారావుకు నియామక పత్రం అందిస్తున్న నాయకులు

CHANGE OF NAME

I, LATA GADDIPATI (Old Name) (SSC Mark list) aged 48 years, Resident of Door No. Q.No.A-15, K.C.P. Officers Colony, VUYYURU Town and Mandal, Krishna District, A.P. - 521 165, hereby declare that I have changed my name as GUTTIKONDA SRILATHA (New Name) (Aadhar Card) D/o KOTESWARA RAO

మధుమేహం వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు

తాడిగడప(కానూరు), న్యూస్‌టుడే : మధుమేహం వ్యాధి పట్ల నిర్లక్ష్యం వహిస్తే డయాబెటిక్ రెటినోపతి కారణంగా కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందని ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వైద్యుడు ఆదిత్యకపూర్ తెలిపారు. సోమవారం ఆస్పత్రిలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. గుర్తింపు లక్షణాలు లేకుండా వ్యాధి వృద్ధి చెందుతుందని చెప్పారు. టైప్-1 డయాబెటిక్ రోగులు వ్యాధి నిర్ధారణ అయ్యాక 5 ఏళ్ల తర్వాత కంటి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. టైప్-2 డయాబెటిక్ నిర్ధారణ వ్యక్తులు వెంటనే కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : మహిళలు క్రీడల్లో రాణించేందుకు అస్మిత ఖేలో ఇండియా పోటీలు దోహద పడతాయని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర సాఫ్ట్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ లీగ్‌ను సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లీగ్ ద్వారా మహిళల్లో క్రీడల పట్ల ఆసక్తి మరింత పెరుగుతుందని, గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభ గుర్తించి ప్రోత్సహించే వేదికగా ఇది మారుతుందన్నారు. శాప్ బోర్డు సభ్యుడు ఎస్.సంతోష్‌కుమార్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కాకర్ల కోటేశ్వరరావు, రాష్ట్ర సాఫ్ట్ టెన్నిస్ సంఘం ఛైర్మన్ డి.నవీన్‌కుమార్, సంయుక్త కార్యదర్శి డి.సుధీర్, నీలిమ పాల్గొన్నారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ

పెనమలూరు, న్యూస్‌టుడే: రైతులకు అందిస్తున్న అన్నదాత సుఖీభవ పథకం అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం వర్తింపజేస్తుందని గన్నవరం డివిజన్ వ్యవసాయ సంచాలకుడు ఎం.సునీల్ వివరించారు. 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో భాగంగా ఆయన అధికారులతో కలిసి సోమవారం పెదపులిపాకలో పర్యటించారు. అన్నదాత సుఖీభవ అందని రైతులు త్వరలో ఆన్‌లైన్ ద్వారా గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అన్నదాత సుఖీభవ అందని అర్హులైన రైతుల జాబితాను వ్యవసాయ శాఖాధికారులు సేకరించారు. రైతులు దాళ్వా ధాన్యాన్ని తేమశాతం 17 వచ్చే వరకూ ఆరబెట్టాలని ప్రకృతి వ్యవసాయాధికారులు అరుణ, శ్రీకర్ రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో కె.శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖాధికారులు

అపరాల సాగు.. లాభాల బాగు..

రబీలో గన్నవరం రైతుల మొగ్గు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

ఈ ఏడాది ఖరీఫ్ వరి కోతలు దాదాపు పూర్తవ్వడంతో రబీలో అపరాల సాగుగా మినుము పంటపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. కొన్నేళ్లుగా గన్నవరం నియోజకవర్గంలోని ఉంగుటూరు, ఎలుకపాడు, వెన్నూతల, వెల్దిపాడు, తరిగొప్పుల, ముస్తాబాద, సావరగూడెం, బుద్ధవరం, బూతిమిల్లిపాడు ఇతర ప్రాంతాల్లో రబీ పంటగా మినుము ఎక్కువగా సాగు చేస్తున్నారు. జిల్లాలో పదివేల హెక్టార్లలో అపరాలు(పప్పు ధాన్యాలు)గా సాగు చేస్తున్న మినుము, పెసల, ఇతర తృణ ధాన్యాలు లాభసాటిగా ఉండడంతో పరిసర ప్రాంత రైతులు కూడా మొగ్గు చూపుతున్నారు.

వెదజల్లేందుకు మినుములు సిద్ధం చేస్తున్న రైతు

ప్రస్తుతం మార్కెట్ ధరలు (క్వింటా)..	
మినుము	రూ. 6,524
పెసలు	రూ. 8,296
వేరుశెనగ	రూ. 6,390

★ ఖరీఫ్‌లో వాతావరణ మార్పులతో వరి అంచనాకు మించిన దిగుబడి ఇవ్వలేదు. ఫలితంగా ఆ పెట్టుబడి భారాన్ని అపరాలతో భర్తీ చేసేందుకు కౌలు రైతులు కూడా అపరాలకే మొగ్గు చూపుతున్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు 10 వేల ఎకరాల్లో దాళ్వా పంటగా మినుము వెదజల్లారు.

లాభదాయకంగా ఉంది..

సుమారు ఐదేళ్ల నుంచి దాళ్వా కాలంలో అపరాలు సాగు చేస్తున్నాం. ఖరీఫ్‌లో ఏమైనా నష్టం వచ్చినా దాన్ని ఈ అపరాల సాగుతో లాభం వస్తుంది. జనవరి నెలాఖరు నుంచే ఎండలు మొదలవుతాయి. కాబట్టి నీటి లభ్యత కూడా అపరాలకు అంతగా అవసరం లేదు. పెట్టుబడి కూడా తక్కువగా ఉంటుంది. అపరాల సాగు లాభదాయకంగా ఉంది. **- వెంకటేశ్వరరావు, రైతు, గన్నవరం**

పదేళ్ల నుంచి సాగు చేస్తున్నా..

ఏటా పదెకరాల్లో దాళ్వాగా అపరాలు వేస్తున్నా. పంట లాభసాటిగా ఉంటోంది. రైతుకు నష్ట భయం తక్కువ. గిట్టుబాటు ధర కూడా ఆశాజనకంగా ఉండడంతో పరిసర ప్రాంత రైతులు కూడా ఎక్కువగా అపరాల వైపే మొగ్గు చూపుతున్నారు. **- రాజేశ్, రైతు, కేసరపల్లి**

ప్రకటన

మా క్లయింటు కృష్ణా జిల్లా, కానూరు గ్రామ కాపురస్తులు అజ్గర్ ఆలీ గారి కుమారుడు షేక్ మోబీన్ గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా.. కృష్ణా జిల్లా, కానూరు కాపురస్తులు మహమ్మద్ అబ్దుల్ ఖుద్దూస్‌బేగ్ గారి కుమారుడు మహమ్మద్ మున్వర్‌బేగ్ గారు ది. 31-12-2001వ తేదీన హసన్ అహ్మద్ గారి కుమారుడు మహమ్మద్ జిక్రియా గారి వలన క్రయం పొంది శ్రీ పటమట సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు 1వ పుస్తకం, నెం. 4242/2001రుగా రిజిస్టరు కాబడిన విక్రయ దస్తావేజు రీత్యా వారికి సంక్రమించి నేటి వరకు వారికి మాత్రమే సర్వ సంపూర్ణ స్వాధీన యాజమాన్య హక్కు భుక్తములతో అనుభవించుచున్నారు. సదరు షెడ్యూలు దాఖలా ఆస్తిని మా క్లయింటు క్రయమును పొందుటకు విక్రయ ఒప్పందము కుదుర్చుకుని కొంత సొమ్ము బయానాగా చెల్లించి త్వరలో మా క్లయింటు పేరగాని, వారు కోరిన వారి పేరున గాని రిజిస్టరు దస్తావేజును వ్రాసుకొనబోవుచున్నారు. కావున ఈ దిగువ షెడ్యూలు దాఖలాస్తిపై ఎవ్వరికి ఎట్టి ఆక్షేపణలు, తనఖాలు, కోర్టు దావాలు, డబుల్ రిజిస్ట్రేషన్‌లు, క్లయిమ్‌లు, మైనరు హక్కులు, వారసత్వపు హక్కులు వగైరాలు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ లగాయతు 10 రోజుల లోపల చేరునట్లుగా ఎక్నాలెడ్జిమెంట్ గల రిజిస్టరు పోస్టు ద్వారా మా చిరునామాకు తెలియపరచవలసినది. అట్లు గడువు తేదీలోపు ఎట్టి అభ్యంతరములు, ఆక్షేపణలు వగైరాలు రాని యెడల దిగువ షెడ్యూలు దాఖలాస్తి నిర్వివాదమైన ఆస్తిగా పరిగణించి మా క్లయింటు క్రయమును పొందుదురు. గడువుతేదీ దాటి వచ్చు ఎట్టి క్లయిమ్‌లు, చార్జీలు, అభ్యంతరములు, ఆక్షేపణలు వగైరాలు మా క్లయింటును బద్ధలను చేయజాలవని ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడమైనది.

షెడ్యూలు: కృష్ణా జిల్లా, పటమట సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో పెనమలూరు మండలం, కానూరు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన కానూరు గ్రామ రీసర్వే నెం. 219/4రు దాఖలా చ.గ. 121లు ఖాళీ నివేశన స్థలముకు **హద్దులు: తూర్పు:** జమీలున్నీసా గారి ఆస్తి అ. 32.4లు, **దక్షిణం:** గ్రామ పంచాయితీ రోడ్డు అ. 33.0లు, **పడమర:** గ్రామ పంచాయితీ రోడ్డు అ. 32.4లు, **ఉత్తరం:** కాకర్ల సీతమ్మగారి ఆస్తి అ. 32.4లు.

ఇట్లు **యలమంచిలి రామకృష్ణ, యలమంచిలి యశస్విని పద్మావతి,**
న్యాయవాదులు, షాపు నెం. 10, రాధాకృష్ణ రెసిడెన్సీ, న్యూ ఆర్.టి.సి.కాలనీ, పటమట, విజయవాడ-7.
ఫోన్ నెం. 94946 23679, 99594 54322.
విజయవాడ, తేది: 24-11-2025

(c) eenadu

సత్కారం అందుకుంటున్న సీఐ రమణమ్మ

సీఐ రమణమ్మకు జాతీయ సాహితీ పురస్కారం

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ సీసీఎస్ సీఐ విజరపు రమణమ్మ మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ ఇటీవల విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జాతీయ సాహితీ పురస్కారం అందుకున్నారు. 'పేగు బంధం' అనే కవితను చదివినందుకుగాను ఆమెకు ఈ పురస్కారం అందించారు. దీంతో ఆమెను సోమవారం సీసీఎస్ సిబ్బంది అభినందించారు.

గుడివాడ

• గుడివాడ • పామర్రు • అవనిగడ్డ

డ్రగ్స్ రహిత సమాజం కోసం సైక్లోథాన్

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ సైకిల్ క్లబ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత గుడివాడ లక్ష్యంగా ఈనెల 30న గుడివాడ సైక్లోథాన్‌ను నిర్వహిస్తున్నామని, విద్యార్థులు అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలని ఐఎంఏ నేత డాక్టర్ పొట్లూరి వంశీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక విద్యాలయా ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్, ఆచార్యుడు జీటీఎస్ నరేంద్ర, బొప్పన వెంకట విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐఎంఏ నేత డాక్టర్ పొట్లూరి వంశీకృష్ణ

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు: 80085 74684 అవనిగడ్డ: 80085 74679

? గుడివాడ రైల్వే లైన్లపై నిర్మాణంలో ఉన్న పై వంతెన పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అధికారులు త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోగలరు. –సురేష్, గుడివాడ.

✔ కొంత మేర స్థల సేకరణ జరగాల్సి ఉంది. రైల్వే లైన్లపై త్వరలో పై వంతెన నిర్మాణానికి పనులు ప్రారంభిస్తారు. –పైవంతెన నిర్మాణ అధికారి

? గుడివాడ బంటుమిల్లి రోడ్డు నుంచి బైపాస్ రోడ్డుకు తిరిగ్గానే రహదారిపై ఆక్రమణలు వెలిశాయి. రోడ్డుపైనే మందుబాబులు మద్యంతో సంచరిస్తున్నారు. చర్యలు తీసుకోగలరు. –నాగకుమార్, గుడివాడ

✔ వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాము. –ఎక్సైజ్ సీఐ వి.వెంకటరమణ

బైపాస్ రోడ్డుకు మోక్షమెన్నడో

గుడివాడ, న్యూస్‌టుడే

భారీ గుంతలతో ఉన్న బైపాస్ రోడ్డు

గుడివాడ బైపాస్ రోడ్డులో ప్రయాణం నానాటికీ జటిలమవుతోంది. రహదారి పై గుంతలు రోజు రోజుకీ మరింత పెద్దవి అవుతున్నాయి. కానీ సమస్య మాత్రం పరిష్కారం కావడంలేదు. ఏలూరు రోడ్డు నుంచి బంటుమిల్లి రోడ్డు వరకు వందలకు పైగా గుంతలు ఉన్నాయి. ముఖ్యంగా టీచర్సు కాలనీ నుంచి పెద్ద పెద్ద గుంతలు పడి రహదారి నాశనం అయ్యింది. అక్కడ నుంచి వేద అపార్టుమెంటు సమీపంలో, స్కంధ సమీపంలో, ఇక్తూస్ బైబిల్ కళాశాల వద్ద రోడ్డుపై వాహనాలను మింగేంత పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. ఈ రహదారిలో వాహనాలు పడుతూ లేస్తూ ప్రయాణిస్తున్నాయి. పైగా పామర్రు రోడ్డులో పైవంతెన నిర్మాణపు పనులు జరుగుతుండటం వల్ల భీమవరం, ముదినేపల్లి, బంటుమిల్లి ప్రాంతాలకు వెళ్లే ప్రతీ బస్సు ఈ రహదారి మీదుగానే ప్రయాణిస్తుండటంతో గుంతలధాటికి ప్రయాణికులు బెంబేలెత్తి పోతున్నారు. ఎన్ని మార్లు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నా గత వైకాపా పాలకులు ప్రజల గోడు వినలేదు. కనీసం భారీ గుంతలలో గుప్పెడు మట్టి వేయలేదు. ఈ బైపాస్ రోడ్డులో చాలా విద్యాసంస్థలు ఉండటంతో నిత్యం వేలాది మంది విద్యార్థులు, వారి కోసం వచ్చే తల్లిదండ్రులు పడుతూ లేస్తూ ప్రయాణిస్తునే ఉన్నారు.

నిధులు వచ్చినా జాప్యం ఎందుకు ?

సుమారు 2.8 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ రహదారులు భవనాల శాఖ, డ్రెయిన్ల నిర్మాణానికి పురపాలక శాఖలకు ప్రభుత్వం రూ.3.96 కోట్ల నిధులను కేటాయించింది. దీంతో ఈ పనులకు టెండర్లు కూడా పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి రూ.2.50 కోట్లు నిధులు కేటాయించారు. రహదారికి రెండు వైపులా డ్రెయిన్ నిర్మాణానికి రూ.1.46 కోట్లు నిధులు మంజూరయ్యాయి. కానీ ఇంతవరకూ రోడ్డు నిర్మాణం కానీ డ్రెయిన్ నిర్మాణం కానీ చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ రోడ్డులో ప్రయాణించలేక నడుములు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

☛ ఏలూరు నుంచి వలివర్తిపాడు వరకూ 2.8 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.2.5 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని ఆర్ అండ్ బీ డీఈఈ కామేశ్వరరావు తెలిపారు. వారం రోజులలో పనులు ప్రారంభిస్తారన్నారు.

అవసరం మేరకే సెల్‌ఫోన్ వినియోగంతో మేలు

గుడివాడ, న్యూస్‌టుడే: చరవాణి అధికంగా వినియోగించే విద్యార్థులలో కేంద్రీయ నాడీ వ్యవస్థ ప్రభావం చూపి వెన్నుపూస సంబంధిత సమస్యలు, మానసిక, చలనాత్మక నైపుణ్యాలలో ఇబ్బందులు వస్తాయని ఎస్జీవీఎస్జీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.సంధ్య పేర్కొన్నారు. బేతవోలులోని ఎస్జీవీఎస్జీ పురపాలక ఉన్నత పాఠశాలలో ఈనాడు ప్రతిభా పాటవ పోటీలలో భాగంగా 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై ఉపన్యాసం పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థులు జి.లీలా ప్రవల్లిక ప్రథమ, ఎస్‌కె.లక్మాన్ అహ్మద్ ద్వితీయ, పి.నాగధనశ్రీ తృతీయ స్థానాలను కైవశం చేసుకున్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ఎస్జీవీఎస్జీ పురపాలక ఉన్నత పాఠశాలలో..

త్రివేణి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో..

❖ జగన్నాధపురంలోని త్రివేణి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో జరిగిన ఈనాడు ప్రతిభా పాటవ పోటీలలో వి.సాయి స్నేహ మొదటి, ఎం.అనన్య ప్రపూర్ణ రెండవ, సీహెచ్ శ్రీవర్ష మూడవ స్థానాలు సొంతం చేసుకున్నారు. పాఠశాల డైరెక్టర్ ఎన్.శివశంకర్, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

అవనిగడ్డ, న్యూస్‌టుడే: సెల్‌ఫోన్ అవసరం మేరకే ఉపయోగించుకోవాలని, అతిగా వినియోగించడం వలన అనర్థాలకు దారితీస్తుందని వక్తలు చెప్పారు. ఈనాడు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాసం పోటీలో విద్యార్థులు అభిప్రాయాలు వెల్లడించారు. ఈ పోటీలో రాశంశెట్టి వర్షిణి ప్రథమ, మాతంగి సాత్విక ద్వితీయ, మెంగు నాగ సుబ్బారావు తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు ప్రధానోపాధ్యాయిని కందుల సుజాత బహుమతి ప్రదానం చేశారు. పోటీ పర్యవేక్షకుడిగా దారపురెడ్డి లక్ష్మీనారాయణ వ్యవహరించారు.

విజేతలతో ప్రధానోపాధ్యాయిని కందుల సుజాత

గుడివాడ అభివృద్ధికి కృషి

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ అభివృద్ధికి మున్సిపల్ ఛైర్మన్‌గా యలవర్తి శ్రీనివాసరావు కృషి చేశారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక యలవర్తి స్వగృహంలో ఆయన జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అభిమానులు, తెదేపా నేతలు యలవర్తి, రాముకు గజ మాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. రావి వెంకటేశ్వరరావు, శ్రీకాంత్, తెదేపా, జనసేన, భాజపా నేతలు పాల్గొన్నారు.

27న మండల పరిషత్ సమావేశం

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: గత నెలలో మొంథా తుపాన్ కారణంగా వాయిదా పడిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జరగనుంది. ఎంపీపీ కొడాలి సురేశ్ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఇమ్మాన్ వెల్లడించారు.

బాస్కెట్‌బాల్ పోటీలలో బంగారు పతకం

గుడివాడ, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో బాస్కెట్ బాల్ అండర్ 17 విభాగంలో గుడివాడ మాంటిస్సోరి విద్యార్థి గూడపల్లి రాకేష్ వీరమాధవ్ విజేతగా నిలిచి బంగారు పతకం సాధించాడని ప్రధానోపాధ్యాయిని జి.పద్మావతి పేర్కొన్నారు. సోమవారం విజేతను అభినందించారు. ఉపాధ్యాయులు డి.రాజ్యలక్ష్మి, జి.శ్రీనివాసరావు, మడకా సత్యనారాయణ పాల్గొన్నారు.

రాకేష్ వీర మాధవ్‌తో ఉపాధ్యాయులు

మాజేరు తెదేపా నేతకు సతీ వియోగం

చల్లపల్లి, న్యూస్‌టుడే : చల్లపల్లి మండలం కొత్తమాజేరు పాలకేంద్రం అధ్యక్షుడు, సీనియర్ తెదేపా నాయకుడు తుమ్మల వెంకట్రావ్(తాతయ్య)కు సతీవియోగం కలిగింది. తాతయ్య సతీమణి జాన్సీ(75) ఆదివారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. యువనేత మండలి వెంకట్రామ్, మోర్ల రాంబాబు, సర్పంచి కళ్లేపల్లి లక్ష్మి, ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, కూటమి నాయకులు సంతాపం తెలిపారు.

సీపీ బ్రౌన్ పురస్కారం అందజేత

గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే: తెలుగు ఇంగ్లీష్ నిఘంటువు రూపకర్త, తెలుగు భాష ఉద్ధరణకు సేవలందించిన సీపీ బ్రౌన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఆంజనేయ పేట సీపీఎం కార్యాలయంలో బ్రౌన్ చిత్రపటానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ నేపథ్యంలో లింగం చిట్టిబాబు మాట్లాడుతూ వేమన పద్యాలను ఆంగ్లంలోకి నిఘంటువు రూపకర్త, తెలుగు భాషా సంపదను బ్రిటీష్ వారికి తెలియజేసిన వ్యక్తి సీపీ బ్రౌన్ అని తెలిపారు. తెలుగు భాషాభివృద్ధికి ఎంతో కృషి చేసిన అవనిగడ్డకు చెందిన రచయిత గొరుముచ్చు సూర్యనారాయణకు సీపీ బ్రౌన్ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో కావూరి శ్రీధర్, ఆర్‌సీపీ రెడ్డి, లీలాప్రసాద్, పి.అనీల్, బసవేశ్వరరావు, డీఆర్‌బీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణకు పురస్కారం అందజేస్తున్న దృశ్యం

మత్తుకు బానిసలైతే జీవితం అంధకారమే

పులిగడ్డ (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు యువత బానిసలైతే జీవితం అంధకారమేనని అవనిగడ్డ సీఐ గాజుల యువకుమార్ చెప్పారు. స్థానిక గురుకులంలో జిల్లా ఈగల్ బృందం ప్రతినిధి కేబీకే మూర్తి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణపై సోమవారం అవగాహన సదస్సు జరిగింది. సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. మత్తు పదార్థాల విక్రయం, వినియోగంపై 1972కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అవనిగడ్డ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధి కొల్లిపర రాధాకృష్ణ, ఎన్‌సీసీ అధికారి సురేష్, పీఈటీ వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న సీఐ యువకుమార్

మద్దత ధరకు అమ్మండి

వల్లూరుపాలెం(తోట్లవల్లూరు), న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా కోరారు. వల్లూరుపాలెంలో రైతుసేవా కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేసి, రైతులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యం క్వింటా రూ.2389, సాధారణ రకం రూ.2369కు కొంటున్నట్లు చెప్పారు. రైతు సేవా కేంద్రాల్లో గోనెసంచులు అందుబాటులో ఉంచామని, ట్రాక్టర్లకు జీపీఎస్ ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని సౌకర్యాలు అందిస్తోందని తెలిపారు.

వల్లూరుపాలెంలో రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

వెంకటేశ్వరరావు గౌడ్‌కు సన్మానం

రాష్ట్ర అధ్యక్షుడికి గౌడ సంఘీయుల సన్మానం

చల్లపల్లి, న్యూస్‌టుడే : గౌడ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన చల్లపల్లి మండలం వెలివోలు గ్రామానికి చెందిన బొల్లా వెంకటేశ్వరరావు గౌడ్‌ను చల్లపల్లిలో గౌడ సంఘీయులు సన్మానించారు. స్థానిక గౌడపాలెం ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మోర్ల ప్రసాద్, గీత సంఘం అధ్యక్షుడు వేముల సాయిబాబు, వేముల హరికృష్ణ, బెల్లంకొండ అర్జునరావు, పామర్తి నాని, లుక్కా రాఘవులు, మురారి సత్యనారాయణ, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ కాదిది... చెత్త గ్యారేజ్

ఎక్కడైనా బస్టాండ్ అంటే ప్రయాణికులు కూర్చునే, నుంచునే ప్రదేశం...దీన్ని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత పంచాయతీది... కానీ మండలంలోని కౌతవరం బస్టాండ్‌ను మాత్రం పంచాయతీ ఆక్రమించి రోడ్ల వెంబడి చెత్తను తరలించే రిక్షాలు, సామగ్రితో నింపేసింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన ఎంఎన్‌కే రహదారి పక్కనే ఉన్న ఈ బస్టాండ్ పంచాయతీ కార్యాలయం, సచివాలయం పక్కనే ఉండటం గమనార్హం.

–కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే

ఖాళీ స్థలం.. రోగాలకు కేంద్రం

మండల కేంద్రమైన చల్లపల్లిలో దశాబ్దాలకాలంగా తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల వెనుక వైపున నాలుగైదు ఎకరాల రెవెన్యూ భూమి ఖాళీగా మురుగునీరు, గుర్రపుడెక్క, జమ్మిగడ్డితో నిండి ఉంది. చల్లపల్లిలోని నారాయణరావు కాలనీ, ఇతర పలు కాలనీలకు సంబంధించిన మురుగునీరు ఈ ఖాళీ స్థలంలోకి చేరుతోంది. దీనివలన దోమలు, ఈగలు వృద్ధి చెందడంతో సమీప కాలనీల్లోని ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. స్థానికుల ఇళ్లల్లో సెప్టిక్‌ట్యాంక్‌లు నిండిపోతున్నాయి. ఈ ప్రాంతాన్ని మెరక చేసి కాలనీవాసుల కష్టాలను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. – చల్లపల్లి, న్యూస్‌టుడే

మంత్రికి వినతిపత్రం ఇస్తున్న బండే శ్రీనివాసరావు

భూముల సమస్యలు పరిష్కరించండి

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: కోడూరు మండలంలో రైతులు పడుతున్న 22ఏ భూముల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి అచ్చన్నాయుడుకు వినతిపత్రం ఇచ్చినట్లు మండల తెదేపా అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు చెప్పారు. కోడూరు పట్టణ అధ్యక్షుడు పూతబోయిన శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో రైతన్నలను కలిసిన తెదేపా శ్రేణులు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: రైతుల ఖాతాల్లోకి రెండు పర్యాయాలు నగదు జమ కావడంపై సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో తెదేపా శ్రేణులు ఇంటింటికీ వెళ్లి రైతులకు కరపత్రాలను అందజేశారు. ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి రవికుమార్, సొసైటీ అధ్యక్షులు వెనిగళ్ల నాగేశ్వరరావు, రంగారావు, భగవాన్‌సాయి, వీఆర్వో ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారుల గృహాల దగ్గరకు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా స్వయంగా వెళ్లి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం అందజేశారు. వల్లూరుపాలెం గ్రామంలో యార్లగడ్డ మురళీకృష్ణకు రూ.50వేలు, కంచర్ల వెంకటేశ్వరరావుకు రూ.53,795లు, బొడ్డపాడులో లక్ష్మీకు రూ.25,166లు, దేవరపల్లి గ్రామంలో అక్షరాణికు రూ.40వేలు అందజేశారు.

ఐనపూరు(పమిడిముక్కల), న్యూస్‌టుడే: ఐనపూరులో కొండ బాపిరెడ్డికి రూ.25వేలు, వెణుతురుమిల్లి జయవెంకట సాయికి రూ.41084 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు ఎమ్మెల్యే వర్ల అందచేశారు.

ఉచిత వైద్య శిబిరం

రొయ్యూరు(తోట్లవల్లూరు), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల తెదేపా అధ్యక్షుడు వీరపనేని శివరామప్రసాద్ పేర్కొన్నారు. రొయ్యూరు గ్రామంలో ఎన్టీఆర్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద మెగా వైద్యాశిబిరాన్ని సోమవారం మండల తెదేపా అధ్యక్షుడు వీరపనేని శివరామప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టరు రత్నకుమారి, డాక్టరు సాయిప్రసన్నా, పీఏసీఎస్ ఛైర్మన్ లుక్కా రేణుకారావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రొయ్యూరు వైద్య శిబిరంలో ప్రసంగిస్తున్న శివరామప్రసాద్

నేటి నుంచి షష్ఠి కల్యాణోత్సవాలు

మూడు రోజులపాటు ఆర్జిత సేవలు రద్దు

మోపిదేవి, న్యూస్‌టుడే: మంగళవారం నుంచి గురువారం వరకు జరిగే మార్గశిర మాస షష్ఠి కల్యాణ మహోత్సవాలకు మోహినీపురం ముస్తాబైంది. మూడు రోజుల పాటు స్వామికి నిర్వహించే అన్నిరకాల ఆర్జిత సేవలను తాత్కాలికంగా రద్దు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ❖ మంగళవారం స్వామి వారికి పెండ్లి కుమారుని ఉత్సవం, యాగశాల ప్రవేశం తదితర పూజలు నిర్వహిస్తారు. ❖ 26న ఉదయం 11 గంటలకు స్వామి దివ్య కల్యాణం, సాయంత్రం 6గంటలకు మయూర వాహనంపై గ్రామోత్సవం జరుగుతాయి.

❖ గురువారం ఉదయం 11గంటలకు పంచామృత స్నపన, వసంతోత్సవం, మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమంలో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయని ఈవో తెలిపారు.

పాల కావెళ్లు సమర్పించిన మాలధారులు

పాల కావెళ్లతో వస్తున్న స్వామి మాలధారులు

నాగాయతిప్ప(మోపిదేవి), న్యూస్‌టుడే: నాగాయతిప్ప గ్రామానికి చెందిన మాలధారులు దాదాపు 70మంది సోమవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పాల కావెళ్ల భక్తిపూర్వకంగా సమర్పించారు. దాదాపు 3 కిలోమీటర్లు నడిచి మోపిదేవికి వచ్చారు. ప్రధానార్చకులు బుద్ధ పవన్ కుమార్‌శర్మ, అర్చక బృందం స్వామికి అభిషేకం చేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ముందస్తు కోతలు వద్దు...

శేరికల్వపూడి(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: వరిపంట పక్వానికి రాకుండా రైతులు ముందస్తు కోతలు చేయరాదని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. సోమవారం ఆయన మండలంలోని శేరికల్వపూడిలో వరిపంట కోతలు, ధాన్యం నూర్పిడులు, ఆరబోతలను పరిశీలించారు. ప్రతి గింజా ప్రభుత్వం కొంటుందని వెల్లడించారు. గ్రామంలో తాగునీటి దుస్థితిపై ఎమ్మెల్యేకు స్థానికులు వివరించగా ఆయన తక్షణం మరమ్మతులు జరిపి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. సొసైటీ అధ్యక్షులు అట్లూరి శ్రీరామచంద్రప్రసాద్, చేకూరి జగన్మోహన్‌రావు, అట్లూరి నాని, వల్లభనేని జగ్గయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆరబెట్టిన ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాము

చల్లపల్లిలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వనజాక్షి

ఆందోళనతో ధాన్యాన్ని దళారుల పాల్జేయవద్దు

చల్లపల్లి, న్యూస్‌టుడే: తుపాన్ ఆందోళనతో ధాన్యాన్ని దళారుల పాల్జేయవద్దని చల్లపల్లి తహసీల్దార్ డి.వనజాక్షి సూచించారు. సోమవారం చల్లపల్లిలో జాతీయ రహదారిపై ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు, యంత్రంతో వరికోతలు కోయిస్తున్న రైతులను కలసి మాట్లాడారు. తుపాన్ ప్రభావం మన ప్రాంతంపై పెద్దగా ఉండకపోవచ్చునన్నారు.

పెదప్రోలు పీఏసీఎస్ ముందంజ

పెదప్రోలు(మోపిదేవి), న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలులో పెదప్రోలు సహకార సంఘం మండలంలో ముందంజలో ఉందని తహసీల్దార్ హరనాథ్ పేర్కొన్నారు. సోమవారం రైతులతో ధాన్యం కొనుగోళ్లు, సమస్యలు, తదితర అంశాలపై సంఘ ఛైర్‌పర్సన్ నాదెళ్ల శరశ్చంద్రబాబు అధ్యక్షతన ముఖాముఖి జరిపారు. సీఈవో నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజుగా చేయటమే లక్ష్యం

గురజాడ(పమిడిముక్కల)న్యూస్‌టుడే: గురజాడలో జరిగిన 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.గణేష్‌రెడ్డి, విస్తరణాధికారి సునీల్‌గవాస్కర్, పంచాయతీ కార్యదర్శి భార్గవి తదితరులు పాల్గొన్నారు.

పెదపారుపూడి: 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనునాయక్, ఎంపీడీవో విమాదేవి, ఏవో ఆంజనేయరావు

❖ పమిడిముక్కలలో తహసిల్దారు నవీన్‌కుమార్, ఎంపీడీఓ సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీఓ తవార్య, తెదేపా నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు కృషి

చల్లపల్లి, న్యూస్‌టుడే : సాంకేతికతను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చి నికర ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ అన్నారు. యార్లగడ్డలో 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. మండలంలోని 11 రైతు సేవా కేంద్రాల పరిధిలో 29వ తేదీ వరకు ప్రతి రైతుకి పంచసూత్రాలపై అవగాహన కల్పించనున్నట్లు ఏవో కె.మురళీకృష్ణ తెలిపారు. రాధాకృష్ణయ్య, కృష్ణారావు, షేక్ ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.


నగదు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

రూ. 10 లక్షల చెక్కు అందజేత

చినగొన్నూరు (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని చినగొన్నూరుకు చెందిన కోటప్రోలు శివ, సీతల తల్లిదండ్రులు ఒకేసారి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి వీరికి మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ నాగబాబు రూ.10 లక్షల నగదు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరగడ్డ శ్రీకాంత్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ శాయన పుష్పావతి, నీటిసంఘ అధ్యక్షులు శాయన సూర్యప్రసాదరావు, కోటప్రోలు నాని తదితరులు పాల్గొన్నారు.

చోరగుడిలో వేదపారాయణ సభ

చోరగుడి(పమిడిముక్కల), న్యూస్‌టుడే: చోరగుడిలోని శ్రీరాజనరేంద్రస్వామి ఆలయంలో సోమవారం కృత్తికామండల వేదపారాయణ జరిగింది. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పాటిబండ్ల చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : రొయ్యూరు గ్రామంలో జిల్లా పరిషత్తు నిధులు రూ.5 లక్షలు, ఉపాధిహామీ నిధులు రూ.5లక్షలు, పీ4 పథకంలో భాగంగా దాత ఉప్పులూరి గోపాలకృష్ణ రూ.1,05,000లతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కలుగజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు వీరపనేని శివరామప్రసాద్, తహసీల్దార్ ఎం.కుసుమ కుమారి, ఎంపీడీవో రవికాంత్, పీఏసీఎస్ ఛైర్మన్లు లుక్కా రేణుకారావు, కళ్లం వంశీకృష్ణారెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

(c) eenadu

'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన'ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు. వేదికపై కృష్ణా జిల్లా డీఈవో రామారావు, పి.వి.పి. సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శివాజీబాబు, శ్రీ చైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ జీఎం ఎం.మురళీకృష్ణ, ఈనాడు ఏపీ బ్యూరో చీఫ్ కనపర్తి శ్రీనివాస్, ఈనాడు విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్‌కే కిషోర్‌కుమార్

ఈనాడు అమరావతి ఎన్టీఆర్

మంగళవారం నవంబరు 25, 2025 5

బాల ఉషస్సు.. భావి యశస్సు

ఆధునిక పరిజ్ఞానంతో.. సమస్యలకు పరిష్కారాలు

'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన'లో అబ్బురపరిచిన ఆవిష్కరణలు

– ఈనాడు, అమరావతి
– కానూరు, పటమట, న్యూస్‌టుడే

సమాజంలో ఎదురయ్యే ప్రధాన సమస్యలన్నింటికీ ఆధునిక పరిజ్ఞానంతో పరిష్కారం చూపించొచ్చని పలువురు విద్యార్థులు చాటిచెప్పారు. రహదారి ప్రమాదాలను నివారించేందుకు వాహనాలకు ఆటోమేటిక్ బ్రేక్ సిస్టమ్, నగరాల్లో స్మార్ట్ పార్కింగ్, వ్యవసాయంలో కీటకాల ముప్పును నివారించేందుకు సోలార్ ట్రాపర్స్, వరదల వేళ మునిగిపోకుండా ఉండే స్మార్ట్ వంతెనలు, కృత్రిమ మేధతో పనిచేసే ఫైర్ ఇంజిన్లు, రైలు ప్రమాదాలను నివారించే రోబో టెక్నాలజీ, కుక్క కాటు నుంచి రక్షించేందుకు చేతులు, కాళ్లకు కవచాలు, యాంటీ సూసైడ్ ఫ్యాన్లు, విద్యుత్తును ఆదా చేసేలా స్మార్ట్‌సిటీ ప్రణాళికలు.. ఇలా విద్యార్థులు రూపొందించిన 85 ప్రాజెక్టులు ఔరా అనిపించాయి. వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు నిర్వహించిన 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన'కు అనూహ్య స్పందన వచ్చింది. కానూరులోని పి.వి.పి.సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో.. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని ఆరు నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులకు సోమవారం నిర్వహించిన ఈ మెగా సైన్స్ ఫెయిర్‌ను తిలకించేందుకు వేలాదిగా విద్యార్థులు తరలివచ్చారు.

శ్రీచైతన్య విద్యాసంస్థలు

1 ఎనర్జీ ఎఫిషియన్సీ స్మార్ట్ సిటీ

విద్యార్థులు: తేజస్విని, భరత్, 10వ తరగతి, జడ్పీహెచ్ఎస్ కానూరు

ఆధునిక పరిజ్ఞానంతో సమస్యలకు పరిష్కారం చూపించే నగరం నమూనా. వాహనాలు వచ్చేటప్పుడు వీధి దీపాలు వెలగడం, జాతీయ రహదారులపై గాలి మరల ద్వారా ఆటోమేటిక్‌గా దీపాలను వెలిగించడం, సెన్సార్ల ద్వారా బ్యాంకు చోరీలు జరగకుండా అప్రమత్తమవ్వడం, స్మార్ట్ చెత్త డబ్బాలు, అగ్నిప్రమాదాల వేళ మంటలను నీటితో ఆర్పే సెన్సార్ల వ్యవస్థ.. ఈ ఆరు అంశాలతో రూపొందించిన ఈ ప్రాజెక్టుకు మొదటి బహుమతి వచ్చింది.

2 స్మార్ట్ బ్రిడ్జి

విద్యార్థులు: జి.రోహిత్(9వ తరగతి), ఆర్.దుర్గ(8వ తరగతి), శ్రీమల్లికార్జున హైస్కూల్, గన్నవరం

వరదల సమయంలో వంతెనలు మునిగిపోకుండా పరిష్కారం చూపించే ప్రాజెక్టు. నీటిలో ఉండే సెన్సార్ల ద్వారా వరద ప్రవాహం ఉద్ధృతి, ఎత్తును అంచనా వేసి. దానికి తగ్గట్టుగా వంతెన ఆటోమేటిక్‌గా పైకి వస్తుంది. దీని వల్ల వాహనాలకు వరద ముంపు ప్రమాదం ఉండదు. ఈ ప్రాజెక్టుకు రెండో బహుమతి వచ్చింది.

3 యాంటీ సూసైడ్ ఫ్యాన్

విద్యార్థులు: బి.కార్తికేయ, బి.వెంకట సందీప్, కె.కార్తీక్, క్రైస్ట్ ది కింగ్ పాఠశాల, క్రీస్తురాజపురం, విజయవాడ

హాస్టల్ గదులు, ఇళ్లు, హోటళ్లలో ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడేవారు ఫ్యాన్లకే ఉరేసుకుంటారు. వీటిని నివారించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. బరువు పెరిగిన వెంటనే ఆటోమేటిక్‌గా ఫ్యాన్ నేల మీదకి దిగిపోతుంది. వెంటనే ఈ ఫ్యాన్లను బిగించిన సమయంలో నమోదు చేసిన ఫోన్ నంబరుకు అలర్ట్ మెసేజ్ వెళ్లిపోతుంది. పెద్ద శబ్దంతో అలారం మోగుతుంది. ఈ ప్రాజెక్టుకు మూడో బహుమతి వచ్చింది.

ప్రాజెక్టులకు పేటెంట్ తెప్పించాలి

-విజయరామరాజు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్

విద్యార్థులు చేసే ప్రాజెక్టులకు పేటెంట్ కోసం సైన్స్ టీచర్లు దరఖాస్తు చేయాలి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు ఉండాలి. విద్యార్థులు ఏ ఆవిష్కరణ చేయాలన్నా సామగ్రి అందుబాటులో ఉండాలి. కొందరు ఇంజినీరింగ్ విద్యార్థుల్ని అడిగినా చెప్పలేని చిప్‌లు, సెన్సార్ల గురించి ఈ విద్యార్థులు చెప్పడం అభినందనీయం. ప్రభుత్వ పాఠశాలల్లోనూ అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రదర్శన ఏర్పాటు చేసినందుకు 'ఈనాడు'కు ధన్యవాదాలు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థినుల సందడే సందడి

ప్రాజెక్టులను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

మరిన్ని నిర్వహించాలి..

-పాలడుగు లక్ష్మణరావు, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి

వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థి జీవితంలో కీలకం. సుమారు 85 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని తమ ప్రాజెక్టులను ప్రదర్శించడం అభినందనీయం. 'ఈనాడు' ఆధ్వర్యంలో సమాజ చైతన్యం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. భవిష్యత్తులోనూ మరిన్ని జరగాలి.

లేజర్ సెక్యూరిటీ అలారం

విద్యార్థులు: సీహెచ్.నవీన్, ఇస్మాయిల్, 9వ తరగతి, జడ్పీహెచ్ఎస్ బంటుమిల్లి

ఇళ్లకు పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేయడమే లక్ష్యం. ఇళ్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి సెన్సార్లతో అనుసంధానిస్తారు. ఎవరైనా వచ్చి దానిని తాకగానే పెద్ద శబ్దంతో అలారం మోగుతుంది. సెల్‌ఫోన్‌కు అలర్ట్ మెసేజ్ వెళ్లిపోతుంది.

రహదారులపై ప్రమాదాల నివారణ

విద్యార్థులు: పవన్‌కుమార్(10వ తరగతి), ప్రేమ్‌నాథ్(9వ తరగతి), ఎం.కె.బేగ్ హైస్కూల్, అజిత్‌సింగ్‌నగర్

వాహనం వెళ్లేటప్పుడు అకస్మాత్తుగా వచ్చే ప్రమాదాల వేళ ఆటోమేటిక్‌గా బ్రేకులు పడి ఆగిపోతుంది. వాహనానికి బిగించిన సెన్సార్ల ద్వారా.. నాలుగు వైపులా ఎంత దూరంలో ప్రమాదం ఉన్నా వెంటనే కారులో హెచ్చరిక సంకేతాలు వస్తాయి.

ప్రోత్సాహక బహుమతులు

వినూత్నంగా ఆలోచిస్తే...

–రాజశేఖరబాబు, సీపీ

ప్రతి విషయాన్ని వినూత్నంగా ఆలోచించడం అలవాటు చేసుకోవాలి. అప్పుడే ఆకాశమే హద్దుగా చెలరేగిపోవచ్చు. ప్రతి సందర్భంలోనూ ఇంతకంటే బాగా ఎలా చేయొచ్చు అని ఆలోచించి ఆ దిశగా ప్రయత్నిస్తే మన ప్రయాణం అద్భుతంగా సాగుతుంది. ఏఐ, మిషన్‌లెర్నింగ్, డ్రోన్ ఇలా అన్నీ ఆధునిక పరిజ్ఞానం నుంచి పుట్టుకొచ్చినవే. ప్రతి రంగంలోనూ ఆవిష్కరణలు అవసరం.

పరిశ్రమల వ్యర్థాల నుంచి ఇంకు తయారీ

విద్యార్థులు: యు.ధనశ్రీనివాస్(10వ తరగతి), వేముల అఖిల్(8వ తరగతి), జడ్పీహెచ్ఎస్ పరిటాల

పరిశ్రమల నుంచి వాయువులను ఒడిసిపట్టి. వాటి నుంచి నల్లని ఇంకు తయారు చేయడం లక్ష్యం. ఒక కంటైనర్ లాంటి యంత్రాన్ని పరిశ్రమలు ఉండే ప్రాంతంలో పెడతారు. దాని ద్వారా వచ్చే గాలిలో నుంచి రసాయన వ్యర్థాలను తీసి పొడర్‌గా మారుస్తారు. స్వచ్ఛమైన గాలిని వదిలేస్తారు. ఆ పొడర్‌కు నూనెలను కలిపి ఇంకు తయారు చేస్తారు.

డాగ్ బైట్ సాక్స్

విద్యార్థులు: టి.విశ్వాస్, కుశల్ పవన్‌సాయి, 9వ తరగతి, జడ్పీహెచ్ఎస్ తేలప్రోలు

కుక్కలు కరిచినా గాయం కాకుండా తప్పించుకోవచ్చు. పలుచని కాపర్ రేకు, దానిపైన తోలు, గుడ్డతో సాక్స్ రూపంలో తయారు చేసి చేతులు, కాళ్లకు తొడుక్కోవచ్చు. ప్రస్తుతం వీధి కుక్కల బెడద పెరిగిపోయి చాలా మంది చిన్నారులు వాటి బారినపడుతున్నారు. ప్రధానంగా కాళ్లు, చేతులపైనే అవి కరుస్తున్నాయి. అందుకే ఈ డాగ్ బైట్ సాక్స్ తయారు చేశారు.

ప్రోత్సాహక బహుమతులు

మరిన్ని వార్తలు, చిత్రాలు.. www.eenadu.net లో

Expert Advice Exclusive Properties
ప్రవేశం ఉచితం
EENADU PROPERTY SHOW 2025
29th - 30th November-2025 Saturday - Sunday
Timing: 10am - 8pm
Place: A.Convention Centre, Bunder Road, Vijayawada
Time: 10 AM to 8 PM
For Details Contact
80080 03297, 99590 21800

అదిరే దందా.. ఆపేదుండా?!

పండగ వేళ ప్రైవేటు ట్రావెల్స్ బాదుడు

ఈనాడు – అమరావతి



ఇదీ... 2026 జనవరి 14న... హైదరాబాద్ నుంచి విజయవాడకు ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు నిర్ధారించిన టికెట్ ధర. ఒకరు రూ.3 వేలు, మరొకరు రూ.5 వేలు అని అడ్డగోలు ధరలు పెట్టేశారు. ఇది స్లీపర్, ఏసీ కాదు... నాన్ ఏసీ సీటు మాత్రమే. ఇదే ప్రయాణానికి ఆర్టీసీలో కేవలం. రూ.450 చెల్లిస్తే చాలు.

★ విజయవాడవాసి విజయ్ చెన్నైలో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. సంక్రాంతి సెలవులకు భార్య, ఇద్దరు పిల్లలను జనవరి 10న విజయవాడ పంపాలని బస్ టిక్కెట్ కోసం ప్రైవేటు ట్రావెల్స్‌ను సంప్రదించారు. ఒక్కో టిక్కెట్ రూ.3,500 చొప్పున రూ.10,500లు అవుతుందని చెప్పారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఇది ఈ రోజు రేటు... రోజులు గడిచే కొద్దీ రేటు పెరుగుతుందన్నారు. చేసేది లేక తీసుకున్నారు. ఎంతో మంది పరిస్థితి ఇదే.

ప్రైవేటు ట్రావెల్స్ దందాతో సంక్రాంతి వేళ ప్రయాణం అంటేనే వెన్నులో వణుకు పుడుతోంది. ఆర్టీసీకి.. ప్రైవేటు ట్రావెల్ సర్వీసుల టిక్కెట్ల ధరకు పొంతన లేదు. రూ.వందల్లో ఉండాల్సిన ధరలు రూ.వేలల్లో దర్శనమిస్తున్నాయి. దీంతో సామాన్యుడికి పండగ ఖర్చు కంటే ప్రయాణ ఖర్చే భారంగా మారుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జనవరి 10-14 మధ్య టికెట్ ధరల తేడా (రూ.లలో)..

విజయవాడకు	ఆర్టీసీ	ప్రైవేటు
హైదరాబాద్	450	3,000
బెంగళూరు	1,087	2,990
చెన్నై	723	3,500
విశాఖ	579	1,490
తిరుపతి	508	2,900
నెల్లూరు	352	2,400
కాకినాడ	355	2,500

45 రోజుల ముందే ఇంతా?

పండగ ప్రయాణానికి 45 రోజుల ముందే ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల ధరలు ఆకాశంలో ఉంటే రానున్న రోజుల్లో మరింత పెరగనున్నాయి. ఆర్టీసీలో ప్రత్యేక సర్వీసులపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం... మరోవైపు రైళ్లు ఖాళీ లేక.. ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించక తప్పడం లేదు. అక్కడ మాత్రం నాన్ ఏసీ, సీట్ల ధరలే చుక్కలు చూపిస్తున్నాయి. తిరుగు ప్రయాణానికి ఇదే బాదుడు ఉండనుంది. మొత్తమ్మీద ఓ కుటుంబం ఇతర రాష్ట్రం నుంచి వచ్చి వెళ్లాలంటే రమారమి రూ.10-20 వేల వరకు భారం పడనుంది. అధికారులు ఇప్పుడే తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటే పరిస్థితి చక్కబడే వీలుంది. రవాణాశాఖ అధికారులను చరవాణిలో సంప్రదించే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు.

పశ్చిమ బైపాస్.. ఎన్‌హెచ్-16లో విలీనం!

చినఆవుటపల్లి-కాజ ఆర్‌అండ్‌బీ స్టేట్ హైవేదే బాధ్యత

ఈనాడు – అమరావతి

పశ్చిమ బైపాస్ ఎన్‌హెచ్-16లో విలీనమయ్యే సమయం ఆసన్నం అవుతోంది. బైపాస్‌లో ప్యాకేజీ-1 గుండుగొలను-కలపర్రు, ప్యాకేజీ-2 కలపర్రు-చినఆవుటపల్లి ఇప్పటికే ఎన్‌హెచ్-16లో మమేకమయ్యాయి. ప్యాకేజీ-3, 4 నిర్మాణం దాదాపు కొలిక్కి వచ్చింది. ఈ నేపథ్యంలో బైపాస్‌లో భాగమైన చినఆవుటపల్లి-కాజ వరకు దాదాపు 47 కిమీ ఎన్‌హెచ్-16లో కలవనుంది. దీంతో ప్రస్తుతం

కాజ దగ్గర ఎన్‌హెచ్-16, పశ్చిమ బైపాస్ అనుసంధాన పనులు

ఎన్‌హెచ్-16లో భాగంగా గన్నవరం మండలం చినఆవుటపల్లి నుంచి విజయవాడ బెంజ్ సర్కిల్ మీదుగా గుంటూరు జిల్లా కాజ వరకు దాదాపు 40 కి.మీ ఆర్‌అండ్‌బీ రాష్ట్ర హైవేలకు అప్పగిస్తారు. పశ్చిమ బైపాస్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాగానే ఈ మార్పులు జరగనున్నాయి. అక్కడ నుంచి 40 కి.మీ నిర్వహణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి.

వన్‌టైం ఇంప్రూవ్‌మెంట్ అనంతరమే...

★ ఎన్‌హెచ్ నిబంధనల ప్రకారం బైపాస్ నిర్మాణం చేపట్టినప్పుడు ఆ పరిధిలో ఇప్పటి వరకు ఎన్‌హెచ్‌లో భాగంగా కొనసాగుతున్న రహదారిని ఆర్‌అండ్‌బీ రాష్ట్ర హైవేలకు బదిలీ చేస్తారు. బదిలీకి ముందే ఆ పరిధిలోని రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసివ్వాలి. మరమ్మతులకు గురైన విద్యుత్తు దీపాలను పునరుద్ధరించాలి. పంచాయతీ, నగరపాలిక సమన్వయంతో డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేయాలి. ఇవన్నీ చేసిన తర్వాతే బదిలీ చేయాలి.

★ ఎన్‌హెచ్ నుంచి రాష్ట్ర హైవేకు బదిలీ అవుతున్నందున ఈ పరిధిలోని టోల్ ప్లాజాలు తొలగిస్తారు. ప్రస్తుతం ఎన్‌హెచ్-16లో పొట్టిపాడు టోల్‌గేటు తొలగించి. పశ్చిమ బైపాస్‌లో వెంకటపాలెం, వెదురుపావులూరులో రెండు కొత్త టోల్‌గేట్లు ఏర్పాటు చేస్తారు.

విద్యుత్తు టవర్ల కేసు వాయిదా...

పశ్చిమ బైపాస్ మీదుగా వెళ్లిన నున్న హైటెన్షన్ విద్యుత్తు టవర్ల వివాదం మళ్లీ వాయిదా పడింది. సోమవారం కోర్టులో విచారణకు రాగా రైతులు కొంత సమయం కావాలని కోరడంతో నాలుగు వారాలు వాయిదా వేస్తూ న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది.

ఆస్తి.. భూ వివాదాల ఫిర్యాదులే అధికం

మహిళ సమస్య వింటున్న డీసీపీ ఉదయరాణి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 69 ఫిర్యాదులు వచ్చాయి. ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు డీసీపీ ఉదయరాణి బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. వీటిల్లో అత్యధికంగా 31 భూ, ఆస్తి, నగదు లావాదేవీలవే ఉన్నాయి. కుటుంబ కలహాలు 6, మహిళా సంబంధ నేరాలు 5, వివిధ మోసాలు 4, దొంగతనాలు 4, కొట్లాటలు 3, ఇతర ఫిర్యాదులు 16 చొప్పున వచ్చాయి. వీటిని సంబంధిత పోలీస్‌స్టేషన్లకు పంపించి సత్వరమే పరిష్కరించాలని ఆమె ఆదేశించారు.

1912లో బ్రిటీషు వారు ఏర్పాటు చేసిన దస్త్రాల గది

నేటికీ చెక్కు చెదరలేదు!

బ్రిటిషు కాలంలో 1912లో ఏర్పాటుచేసిన దస్త్రాల గది, దానిలోని రేకులు నేటికీ చెక్కుచెదరకుండా మన్నికగా ఉన్నాయి. 1912లో బ్రిటీషు వారు అవనిగడ్డలో తహసీల్దార్ కార్యాలయం నిర్మించి, పై అంతస్తులో ప్రత్యేకంగా దస్త్రాల గది ఏర్పాటు చేశారు. నాటి రాక్‌లు 12 అడుగుల ఎత్తు ఉండి, అవి పడిపోకుండా కింది భాగంలో చక్రాల వంటి దిమ్మలను ఏర్పాటు చేశారు. నాడు వేసిన రంగులు ఇప్పటికీ చెరిగిపోలేదు. భద్రపరచిన దస్త్రాల నుంచి కావలసిన దస్త్రం తీసుకోవడానికి కూడా నాడు ప్రత్యేకంగా ఒక విధానం ఉండేది. బి.5 గుమస్తాకు తప్ప ఎవరికీ ఈ గదిలోకి వెళ్లడానికి అనుమతి లేదని రాసిన బోర్డు ఇప్పటికీ ఉంది. అంటే.. రికార్డులకు అంత పటిష్ఠ భద్రత ఉండేది. ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే మంటలను ఆర్పడానికి కూడా ఫైరెక్స్ ఫోమ్ మిషన్ ఇప్పటికీ గుర్తుగా ఉంది. ప్రధాన ద్వారం తెరిచిన తర్వాత ఐరన్ గ్రిల్స్‌తో ఉన్న మరో తలుపు తీస్తే గాని లోపలకు వెళ్లడానికి అవకాశం లేదు. పై అంతస్తుకు ఏర్పాటుచేసిన రంగూన్ టేకుతో తయారు చేసిన మెట్లు 113 సంవత్సరాలైనా ఇప్పటికీ చెక్కుచెదరకుండా, రంగు కూడా పోకుండా ఉండటం చిత్రమే. - అవనిగడ్డ, న్యూస్‌టుడే

కొత్తపేట.. గురువుల కోట

ఒకే గ్రామం నుంచి 200 మంది ఉపాధ్యాయులు

అవనిగడ్డ, న్యూస్‌టుడే

అవనిగడ్డ శివారులోని కొత్తపేట చిన్న గ్రామం. 600 మంది జనాభా. మోటారు ఫీల్డే. ఇక్కడ ఎక్కువ మందికి జీవనాధారంగా ఉండేది. ఫ్యాక్షన్ గ్రామంగా కూడా ముద్ర ఉంది. ఇది గతం.

కొత్తపేటలోని ప్రధాన వీధి...

గ్రామంలో కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని మంచిగా, క్రమశిక్షణతో పెంచి ఉపాధ్యాయులను చేయాలనుకున్నారు. దాంతో వారు కష్టపడి పిల్లల్ని చదివించారు. 1964 నుంచీ ఈ మార్పు ప్రారంభమైంది. ఉపాధ్యాయులుగా స్థిరపడిన కొందరి నుంచి యువత స్ఫూర్తి పొందారు. దానికి అవనిగడ్డలో 1974లో వచ్చిన ఇంటర్మీడియట్ టీచర్ ట్రైనింగ్ తోడైంది. దానిలో చేరిన వారు పలువురు సెకండరీ గ్రేడ్ టీచర్లుగా నియమితులయ్యారు. ఆతర్వాత క్రమంగా ప్రతి డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికవుతూ వచ్చారు. వీరిలో మరికొంత మంది ఇంజినీర్లుగా, డాక్టర్లుగా కూడా స్థిరపడ్డారు. ఒకప్పుడు లారీ డ్రైవర్లు/క్లీనర్లుగా పనిచేసిన తల్లిదండ్రుల ఆశలు నెరవేరి గ్రామం రూపురేఖలు మారిపోయాయి.



☛ కొత్తపేటలో సుమారు 200 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వారి పేర్లతో సహా రికార్డు చేశాం. మరికొంత మంది ఇంజినీర్లుగా, డాక్టర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. చిన్న గ్రామంలో ఇంత మంది ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించడం గ్రామానికే గర్వకారణంగా ఉంది.

– కూనపరెడ్డి జీవేంద్రరావు, ఉపాధ్యాయుడు



☛ కొత్తపేట గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు కొంత మంది రిటైరు కాగా, ఎక్కువ మంది జిల్లాలో వివిధ గ్రామాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క ఉపాధ్యాయుడిని స్ఫూర్తిగా తీసుకొని మిగిలిన వారు ఉపాధ్యాయులుగా జీవితంలో స్థిరపడాలని చదువుపై శ్రద్ధ పెట్టి, కష్టపడి చదివారు.

– అన్నపరెడ్డి నాగవెంచయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు

కష్టమేమీ కాదంత..!

ఆకట్టుకుంటున్న కృత్రిమ దంతాల తయారీ యంత్రం

ప్రత్యేక కంప్యూటర్‌లో పన్ను తయారీ

గంట వ్యవధిలో తయారైన కృత్రిమ పళ్లు ఇవే..

వైద్య రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకుంటే రోగులకు మెరుగైన చికిత్సలు అందించవచ్చని అంటున్నారు.. చిన్నఆవుటపల్లిలోని డా.సుధా, నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల వైద్యులు. సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా కొనసాగుతున్న ఉచిత దంత వైద్య శిబిరంలో అత్యాధునిక సాంకేతికతో రూపొందించిన కృత్రిమ దంతాల తయారీ యంత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆధునిక దంత వైద్య విధానాలను బలోపేతం చేసేందుకు ఎయిడెడ్ తయారీ విధానంతో రూపొందిన రూ.80 లక్షల విలువైన డెంట్స్ ప్లై సిరోనా క్యాడ్‌కామ్ యంత్రంతో గంటన్నర వ్యవధిలోనే కృత్రిమ దంతాలు తయారు చేయవచ్చని కళాశాల ప్రిన్సిపల్ డా.రామోజీరావు, హెచ్‌వోడీ డా.సునీల్‌చంద్ర తెలిపారు. ఎటువంటి లోహం లేని జిర్కోనియాతో తయారయ్యే ఈ కృత్రిమ దంతాలతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. వైద్య విద్యార్థులకు ఈ అత్యాధునిక సాంకేతిక చికిత్సపై ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నట్లు వెల్లడించారు. సాధారణంగా లోహంతో దంతం తయారీకి సుమారు నెల రోజుల సమయం పడుతుంది. కానీ కచ్చితత్వం ఉండదు. క్యాడ్‌కామ్ మీద గంటల వ్యవధిలో తయారయ్యే కృత్రిమ దంతాల్లో నూరు శాతం కచ్చితత్వం ఉంటుందని తెలిపారు..

–ఈనాడు, కృష్ణా, గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

2 వరకు రైతన్నా... మీకోసం

పాయకాపురం: అన్నదాతల సాధికారిత లక్ష్యంగా 24 నుంచి డిసెంబరు 2 వరకు జిల్లాలో రైతన్నా... మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రచార పత్రాలు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక సాధనానికి మూలస్తంభమైన వ్యవసాయ రంగం పరిపుష్టికి, స్వర్ణాంధ్ర-2047 సాధనకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. రైతును రాజును చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కార్యక్రమం ప్రవేశపెట్టారని తెలిపారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది, వ్యవసాయ అనుబంధ శాఖలు, శాస్త్రవేత్తలు. రైతులతో ముఖాముఖిగా చర్చిస్తామన్నారు.

WALK-IN-INTERVIEW
DATA ENTRY OPERATOR
Male candidates with experience in Data Entry in any reputed organisation.
Attractive Salary for deserving candidates.
Walk in for an Interview with full biodata & Photograph on 25th November, 2025 between 11 am - 1 pm at
60 Years Prakash Arts Private Limited
LEADING OUTDOORS IN SOUTH INDIA
Museum Road, Governorpet, VIJAYAWADA.

(c) eenadu

ఇస్రో.. ప్రయోగం ఇదిగో...!

ఇస్రో.. అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన బస్సును ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రదర్శనకు ఉంచారు. ఇందులో వివిధ రాకెట్‌లు, క్రయోజనిక్ ఇంజిన్లు, మంగళయాన్, చంద్రయాన్, శాటిలైట్‌ల నమూనాలు ఏర్పాటు చేశారు. వీటిని వీక్షకుల కోసం అందుబాటులో ఉంచారు. రాకెట్‌లను విజయవంతంగా ఎలా ప్రయోగిస్తున్నారు.. మానవాళికి కలిగే లాభాలను వివరించేలా 10 నిమిషాల వీడియోను ప్రదర్శిస్తున్నారు. పరిశోధనలు సులువుగా అర్థమయ్యేలా ఇవి ఉన్నాయి. ఈ బస్సును అన్ని ప్రాంతాలకు తీసుకెళ్లి ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నామని ఇస్రో సిబ్బంది తెలియజేశారు. కలెక్టర్ లక్ష్మీశ చొరవతో కలెక్టరేట్‌లో ఈ నెల 23, 24వ తేదీల్లో ప్రదర్శించగా.. పెద్దఎత్తున ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు తరలివచ్చారు.

విద్యార్థులకు వివరిస్తున్న షార్ టెక్నికల్ అధికారి కిరణ్

అంతరిక్ష ప్రయోగాల నమూనాలు

- ఈనాడు, అమరావతి, - న్యూస్‌టుడే, పాయకాపురం

మధ్యాహ్న భోజనం.. మరింత రుచిగా..

వంట ఛార్జీలు పెంచిన కూటమి ప్రభుత్వం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. వీటిలో మధ్యాహ్న భోజన పథకంలో వడ్డించే భోజనం నాణ్యంగా లేదని ఎక్కువ మంది తినడానికి ఇష్టపడేవారు కాదు. దీంతో పాలన ప్రారంభించిన ఏడాదిలోపే సన్న బియ్యాన్ని అందించింది. దీంతో భోజనం తినేవారి సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో పెరిగిన నిత్యావసరాల ధరలను దృష్టిలో పెట్టుకొని వంట ఛార్జీలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీని వల్ల మరింత రుచిగా.. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకుంది.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో సుబ్బారావు

సంఖ్య పెరిగింది

మధ్యాహ్న భోజనం పథకాన్ని తరచూ పరిశీలిస్తూ ఉంటాను. గతంతో పోల్చుకుంటే సన్న బియ్యం వచ్చిన తర్వాత నుంచి నాణ్యంగా, రుచికరంగా ఉండటంతో భోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఈ పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేసేలా ప్రభుత్వం ఏజెన్సీలకు వంట ఛార్జీలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడం శుభపరిణామం.

-యు.వి.సుబ్బారావు, డీఈవో

ప్రతి విద్యార్థికి వంట ఛార్జీలు రోజుకు (రూ)

తరగతి	పాత ధర	కొత్త
1-5	5.45	6.19
6-8	8.17	9.29
9 నుంచి ఇంటర్	8.17	9.29

☛ జిల్లాలో 95.46 శాతం మంది భోజనం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే 84,822 మంది విద్యార్థులకు శనివారం 65,834 మంది హాజరయ్యారు. వీరిలో 62,851 మంది భోజనం చేశారు. 95.46 శాతం మంది సద్వినియోగం చేసుకున్నారు.

☛ పాఠశాలల వారీగా వివరాలు పరిశీలిస్తే ప్రాథమిక పాఠశాలల్లో (ఒకటి నుంచి ఐదో తరగతి) 29,822 మంది విద్యార్థులకు 24,908 మంది హాజరయ్యారు. 24,700 మంది (99.16) శాతం మంది తిన్నారు.

☛ ప్రాథమికోన్నత పాఠశాలలు (ఆరు నుంచి ఎనిమిదో తరగతి) 1611 మందికి 1337 మంది హాజరయ్యారు. 1309 మంది (97.91) శాతం మంది భోజనం చేశారు.

☛ ఉన్నత పాఠశాలలు (తొమ్మిది నుంచి పదో తరగతి) 50,108 మందికి 37,546 మంది హాజరయ్యారు. 34,975 మంది (93.15) శాతం తినగా.. ఇంటర్మీడియట్ (11-12 తరగతులు) 3281 మందికి 2043 మంది హాజరయ్యారు. 1867 మంది (95.46) శాతం మంది భోజనం చేసినట్లు జిల్లా విద్యాశాఖ తెలియజేసింది.

ఈట్ స్ట్రీట్‌లో ఆకస్మిక తనిఖీలు

ఈనాడు కథనానికి స్పందన

సూర్యారావుపేట: ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద నిర్వహించే 'ఈట్ స్ట్రీట్'లో సోమవారం రాత్రి ఆహార తనిఖీ అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవీంద్రరెడ్డి నేతృత్వంలో సిబ్బంది అల్పాహార దుకాణాలు, బిర్యానీ విక్రయ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ నెల 23న 'సదిరియు ఉండి.. నాసి కదండి..' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దాదాపు గంట సేపు దుకాణాలను తనిఖీ చేసి వినియోగిస్తున్న పదార్థాలను పరిశీలించారు.

బిర్యానీ పరిశీలిస్తున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్

రంగులు వాడితే కఠిన చర్యలు : బిర్యానీలు, చికెన్, మటన్ ఆహారంలో, ఐస్‌క్రీమ్, కుల్ఫీల్లో నాసిరకం ఉత్పత్తులు వాడుతున్నట్టు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. నూనెను సైతం రీసైకిల్ చేసి వినియోగిస్తుండడంతో రోగాల బారిన పడుతున్నారు. 'ఈనాడు' కథనంతో కదిలిన అధికారులు.. పలు దుకాణాల్లో నమూనాలు సేకరించారు. నిషేధిత రంగులు వాడినా, పరిమితికి మించి వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాంసాహార ఉత్పత్తులు, ఐస్‌క్రీమ్, కుల్ఫీలు ఆకర్షణీయంగా కనిపించేందుకు రంగులను ఎక్కువ వినియోగిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. దీని వల్ల జీర్ణకోశ వ్యాధులు, కాలేయ సంబంధ వ్యాధులు ఇతర సమస్యలపై వస్తున్న వరుస ఫిర్యాదులతో ఈ దాడులు చేశారు.

ఉద్యోగం ఇప్పిస్తానని స్నేహితురాలికే టోకరా

రూ.48 లక్షలు నొక్కేసి.. ఆపై బెదిరింపులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : 'నాకు పెద్ద పెద్ద అధికారులు తెలుసు. మీ అమ్మాయికి మత్స్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తా. కొంత సొమ్ము చేబదులుగా ఇస్తే ఎక్కువ మొత్తంలో డబ్బులు తిరిగిస్తా..' అంటూ స్నేహితురాలినే నమ్మించింది. రూ.48లక్షల మేర మోసం చేసి, ఆపై చంపుతానని బెదిరించిన గుంటూరు కలెక్టరేట్‌లోని మత్స్యశాఖ సూపరింటెండెంట్‌పై విజయవాడ సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి... అజిత్‌సింగ్‌నగర్, నందమూరినగర్‌కు చెందిన షేక్ షామీమ్ (50) టైలరింగ్ షాపు నిర్వహిస్తుంటారు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గుంటూరు కలెక్టరేట్‌లోని మత్స్యశాఖ సూపరింటెండెంట్‌గా పనిచేసే నిమ్మగడ్డ లలితకుమారి, ఆమె భర్త కుంచపు జాన్సన్‌లు ఇద్దరూ షామీమ్‌కు చిన్ననాటి స్నేహితులు. లలితకుమారి అల్లుడు సుధాకర్, కుటుంబ మిత్రుడు దాసరి నాగరాజు తదితరులు షామీమ్ ఇంటికి రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో పెద్ద పెద్ద అధికారులతో తనకు పరిచయం ఉందని.. మీ కుమార్తెకు మత్స్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని షామీమ్‌కు లలితకుమారి హామీ ఇచ్చింది. దీని కోసం రూ.20 లక్షలు చెల్లించాలనడంతో.. 2023, సెప్టెంబరులో ఇచ్చారు. తన భర్త జాన్సన్, అల్లుడు సుధాకర్‌లు పోస్టల్ ఉద్యోగులని చెప్పింది. [illegible] డబ్బులు కావాలి ఉందని, చేబదులు ఇస్తే రూ.కోటి తిరిగి ఇస్తానని [illegible] ఏడాది మే నెలలో మరో రూ.28 లక్షలు చెల్లించారు. తర్వాత నుంచి కుమార్తె ఉద్యోగం, చేబదులుగా ఇచ్చిన డబ్బులు గురించి అడుగుతుంటే.. సరైన సమాధానం ఇవ్వకపోవడంతో నిలదీశారు. తమ వద్ద డబ్బులు లేవని.. మరోసారి డబ్బులు అడిగితే చంపుతామని లలితకుమారి బెదిరించడంతో.. మోసపోయినట్లు గుర్తించారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఈ నెల 21న ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేశారు.

'రైతుల ఆత్మహత్యలపై స్పందించకపోవడం బాధాకరం'

గవర్నర్‌పేట: దేశంలో ఏటా లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా.. ప్రభుత్వాల్లో స్పందన లేకపోవడం బాధాకరమని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి.చంద్రకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అనవసరమైన మతోన్మాదం, ఉగ్రవాద చర్యలపై అతిగా స్పందిస్తున్నారని దుయ్యబట్టారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందని, అన్నం పెట్టే రైతు కోసం అందరూ పోట్లాడాలని పిలుపునిచ్చారు. 5 సంవత్సరాల రైతు ఉద్యమం సందర్భంగా సోమవారం గవర్నర్‌పేటలోని ఐ.ఎం.ఎ. హాలులో ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు రచించిన 'ఎన్నాళ్లీ అన్యాయం సహించాలి?' అనే పుస్తకాన్ని జస్టిస్ చంద్రకుమార్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. స్వేచ్ఛా వాణిజ్యం ఒప్పందాల కారణంగా దేశంలో వ్యవసాయ రంగం అధోగతి పాలైందన్నారు. విదేశాల ఎగుమతులపై ఉన్న ఆంక్షలు, షరతులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. స్వదేశంలో పండే పంటలకు కాకుండా ఇతర పంటలకు మాత్రమే దిగుమతులకు అవకాశం ఇవ్వాలని సూచించారు. కేంద్ర ఎన్నికల కమిషన్‌ను [illegible] మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం, మావోయిస్టులు ఇద్దరూ కాల్పులు విరమించుకుని, శాంతియుత వాతావరణం నెలకొల్పాలని పిలుపునిచ్చారు. 83 ఏళ్ల వయసులో వడ్డే శోభనాద్రీశ్వరరావు రైతుల పక్షాన అవిశ్రాంత పోరాటం చేస్తున్నారని కొనియాడారు. సీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. రైతు సంఘాల నాయకులు వై. కేశవరావు, పి.జమలయ్య, బి.దశరథరామిరెడ్డి, సింహాద్రి ఝాన్సీ, రమణమూర్తి, మహదేవ్, సి. హెచ్.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణలో జస్టిస్ చంద్రకుమార్, శోభనాద్రీశ్వరరావు, దశరథరామిరెడ్డి తదితరులు

న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను

ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో పటిష్ఠమైన వార్తా వ్యవస్థను కలిగి, తాజా వార్తలను సేకరించి, వాటిని **ఈనాడు**తోపాటు ఈనాడు.నెట్, ఈటీవీ, ఈటీవీ భారత్ వంటి సంస్థలకు అందిస్తున్న న్యూస్ ఏజెన్సీ 'న్యూస్‌టుడే'కు న్యూస్ కంట్రిబ్యూటర్లుగా వార్తలు అందించేందుకు ఔత్సాహికులైన యువకులు కావలెను.

అర్హత: డిగ్రీ, **వయసు:** 30 సంవత్సరాల లోపు

అభిరుచి: వార్తల రూపంలో ప్రజా సమస్యలను వెలుగులోకి తేవాలన్న తపన, స్థానికులై, పరిసర ప్రాంతాలపై అవగాహన, కనీస సామాజిక-రాజకీయ పరిజ్ఞానం, కలివిడిగా ఉండే తత్వం కలిగి ఉండాలి.

న్యూస్ కంట్రిబ్యూటర్లు అవసరమైన ప్రాంతాలు:

ఎ.కొండూరు, జగ్గయ్యపేట టౌన్, గుణదల, సత్యనారాయణపురం, విజయవాడ లీగల్, ధర్నాచౌక్, బీఆర్‌టీఎస్ రోడ్డు, సబ్ కలెక్టరేట్

సరళమైన తెలుగులో రాయగల నేర్పు, లోకజ్ఞానం, వర్తమాన రాజకీయ-సామాజిక తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలి.

ఆసక్తి గలవారు నవంబరు 25, మంగళవారం ఉదయం 10.30 గంటలకు జరిగే అర్హత పరీక్షకు ఈ క్రింది చిరునామాలో హాజరుకాగలరు.
గతంలో హాజరైన వారు తిరిగి ఈ పరీక్షకు రానవసరం లేదు.

న్యూస్‌టుడే ప్రైవేట్ లిమిటెడ్
C/o. ఈనాడు కార్యాలయం
గూడవల్లి గ్రామం, విజయవాడ రూరల్ మండలం, ఎన్టీఆర్ జిల్లా–521 104

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

సమస్యల పరిష్కారంలో ఉదాసీనత వద్దు

పాయకాపురం, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ఉదాసీనతగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ జి.లక్ష్మీశ హెచ్చరించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఒక గంటపాటు దృష్టిసారిస్తే ఆయా సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ సూచించారు. మొత్తం 182 వినతులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖ 53, మున్సిపల్ 31, పోలీసు 18, విద్య 8, పంచాయతీ 8, విభిన్న ప్రతిభావంతులు, సర్వే రవాణా శాఖలకు ఆరేసి చొప్పున అర్జీలు వచ్చాయి. డీఆర్డీయే 5, వైద్య ఆరోగ్యశాఖ మూడు, ఆర్‌అండ్‌బీ 3, కోఆపరేటివ్, సాంకేతిక విద్య, దేవాదాయశాఖ 2, సాంఘిక సంక్షేమశాఖలకు రెండేసి, మత్స్య, కార్మిక, డ్వామా, ఇరిగేషన్, రిజిస్ట్రేషన్, బీసీ వెల్ఫేర్, పొల్యూషన్ తదితర శాఖలకు ఒక్కో వినతి పత్రం అందాయి. జేసీ ఎస్.ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, కేఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, ఏసీపీ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త..!

విజయవాడ నేరవార్తలు : పోలీసులు ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త ఎత్తులు వేస్తున్నారని, సమాజానికి పెనుసవాలుగా మారారని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. సైబర్ సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం సీపీ కార్యాలయంలో సీనియర్ సిటిజన్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేరాల బారినపడే వారిలో అధికంగా వృద్ధులు ఉన్నారని చెప్పారు. డిజిటల్ అరెస్టు అనేది లేనే లేదని స్పష్టం చేశారు. పోలీసులమంటూ ఎవరైనా వీడియో కాల్ చేసి.. అరెస్టు చేస్తున్నట్లు బెదిరిస్తే భయపడవద్దని సూచించారు. సీబీఐ, పోలీస్, కస్టమ్స్, ఈడీ, న్యాయమూర్తులు వీడియో కాల్ చేయరని వివరించారు. ఎవరికైనా బెదిరింపులు వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అప్పుడే మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు. ఒకవేళ నగదు బదిలీ చేస్తే.. 24 గంటల్లోపు సమీప పోలీస్‌స్టేషన్ లేదా సైబర్ పోర్టల్ 1930కి సమాచారం అందించాలని కోరారు. ఆన్‌లైన్‌లో వచ్చే పెట్టుబడుల మోసాలపై జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఫేస్‌బుక్, టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టా తదితర సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలను చూసి మోసపోవద్దని సూచించారు. సరైన డి మ్యాట్ ఖాతా లేకుండా పెట్టుబడులు పెట్టకూడదని తెలియజేశారు. సైబర్ క్రైం డీసీపీ కృష్ణప్రసన్న పాల్గొన్నారు.

వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న సీపీ రాజశేఖరబాబు

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ-1
షార్ట్ సీల్డ్ టెండరు ప్రకటన ఆర్.సి.నెం.జె1/3749/2025, తేది:23.11.2025

భవాని దీక్షా విరమణలు-2025 సందర్భముగా ది:10-12-2025 నుండి 17-12-2025 వరకు భక్తులకు ఉచిత ప్రసాదములు/అన్నప్రసాదములు తయారు చేసి వితరణ చేయు ప్రదేశమునకు చేర్చుటకు అవసరమైన అదనపు పనివారులు మ్యాన్ పవర్ సప్లయి కొరకు అనుభవం గల హోటల్స్, కేటరర్స్ వారి నుండి గాని గతములో దేవస్థానం నందు మెస్ పనులు నిర్వహించిన టెండరుదారుల నుండి గాని సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. ది.02-12-2025 ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 2.00 గం॥ లోపు సీల్డు టెండరును టెండరు బాక్సు నందు సమర్పించవలెను. సీల్డు టెండరు షెడ్యూలు కొరకు అన్నదాన విభాగం నోటీసు బోర్డు నందు తెలిపిన వివరములతో ధరఖాస్తు చేసుకొని పొందవచ్చును. మిగిలిన వివరములు అన్నదానం పనిచేయు వేళల యందు గాని, ఫోన్ నెం: 9573720337, 7207562297 లను సంప్రదించవచ్చును.

ఆర్జిత సేవ, పరోక్ష సేవా మరియు విరాళముల కొరకు https:// kanakadurgamma.org నందు చూడగలరు.
శ్రీ బొర్రా రాధాకృష్ణ, చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు
సం/- వి.కె. శీనా నాయక్, యమ్.ఎ, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు & కార్యనిర్వహణాధికారి

OFFICE OF THE EXECUTIVE ENGINEER
AP EDUCATION & WELFARE INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION, NTR DISTRICT, VIJAYAWADA

'E' Procurement Short Tender Notice
Short Tender Notice. No. 04/DB/EE/APEWIDC/NTR/2025-26, Dated 24-11-2025.
Tenders are invited for Repairs to Dr.B.R.Ambedkar Study Circle at Vijayawada Work of 1 No. **(Vide NIT. Nos. 08)** of APEWIDC., Division in NTR District on e-procurement platform of Government of Andhra Pradesh. Further Details are can be viewed 'E' procurement market place i.e., www.apeprocurement.gov.in.
Bid Document Downloading Start Date from : 26-11-2025.
Bid Document Downloading End Date : 05-12-2025 up to 3.00 PM.
Bid Submission Closing Date : 05-12-2025 up to 4.00 PM.
Bid Opening Date : 05-12-2025 @ 4.30 PM.
Note: Tender Published through online Executive Engineer, APEWIDC, Krishna, Machilipatnam
Sd/- Executive Engineer, APEWIDC, NTR, Vijayawada

అప్పుల భారంతో బలవన్మరణం

జి.కొండూరు, న్యూస్‌టుడే : అప్పుల భారంతో ఓ యువకుడు ఉరేసుకుని మృతి చెందిన సంఘటన ఇది. పోలీసుల సమాచారం మేరకు.. జి.కొండూరు మండలం చెవుటూరుకు చెందిన గుడూరు బలరామిరెడ్డి(35) మంగళగిరి సమీపంలోని ఓ ఆసుపత్రిలో ఏసీ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. గతంలో అప్పులు చేయడంతో వాటిని తీర్చే వీలులేక మానసిక ఒత్తిడికి గురై ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో సోమవారం తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కొంత సమయానికి కుటుంబ సభ్యులు గమనించి మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అతని తండ్రి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు జి.కొండూరు ఎస్సై కె.సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బలరామిరెడ్డి (పాత చిత్రం)

సంజయ్ రిమాండ్ పొడిగింపు

ఈనాడు - అమరావతి: అగ్నిమాపక, సీఐడీ డీజీగా పనిచేసిన కాలంలో ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసులో ఐపీఎస్ అధికారి సంజయ్ రిమాండ్‌ను కోర్టు పొడిగించింది. సోమవారంతో రిమాండ్ ముగియనుండడంతో.. ఏసీబీ అధికారులు విజయవాడలోని ఏసీబీ కోర్టులో నిందితుడిని హాజరుపర్చారు. వచ్చే నెల 3 వరకు పొడిగిస్తూ ఏసీబీ కోర్టు న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు. ఈ కేసులో కోర్టులో లొంగిపోయిన సంజయ్.. ఆగస్టు, 26 నుంచి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే.

కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి

పాయకాపురం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో కీలకమైన ఎన్టీఆర్ జిల్లాకు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి, సమస్యల పరిష్కారంతో పాటు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడంలో తనదైన పనితీరుతో గుర్తింపు పొందారు కలెక్టర్ జి.లక్ష్మీశ. జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు వినూత్న కార్యాచరణతో ముందుకెళ్తున్నానని ఆయన చెప్పారు. టూరిజం, ప్యాకేజీల వివరాలతో త్వరలో ఆంధ్రా ట్యాక్సీ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్టు సోమవారం తెలిపారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఏడాది కాలం పూర్తయిన నేపథ్యంలో వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. అందరూ సహకారం అందిస్తున్నారని కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

కలెక్టర్ లక్ష్మీశకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

కందకంలోకి జారిన పాఠశాల బస్సు

చందర్లపాడు, న్యూస్‌టుడే : కోనాయపాలెం సమీపంలో పాఠశాల బస్సు ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన కందకంలోకి జారగా విద్యార్థులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. నందిగామ నారాయణ ఆంగ్లో వేదిక్ పాఠశాల బస్సు సోమవారం సాయంత్రం విద్యార్థులను ఎక్కించుకుని గుడిమెట్ల బయలుదేరింది. మార్గమధ్యలో కోనాయపాలెంలో పిల్లలను దింపి వెనుకకు తిప్పుటానికి ప్రయత్నించగా అదుపు తప్పి వెనుక భాగం కందకంలోకి జారిపోగా ముందు భాగం పైకి లేచింది. దీంతో బస్సులోని విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గ్రామస్థులు గమనించి వారిని కిందకు దించారు. ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై ధర్మరాజు సంఘటనా స్థలానికి వెళ్లి వాహన చోదకుడిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పైకి లేచిన బస్సు ముందుభాగం

రంగయ్య ముందస్తు బెయిల్ పిటిషన్ డిస్మిస్

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితుడైన తలారి రంగయ్య (ఏ14) ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. లేబుళ్లను డిజైన్ చేసి, సరఫరా చేసిన రంగయ్య.. గత కొన్ని రోజులుగా అజ్ఞాతంలో ఉన్నాడు. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని దాఖలు చేసుకున్న పిటిషన్ సోమవారం 7వ ఏడీజే కోర్టు తోసిపుచ్చింది. నిందితుడి నుంచి లేబుళ్లకు సంబంధించి కీలక సమాచారం రాబట్టాల్సి ఉందన్న ప్రాసిక్యూషన్ వాదనలతో న్యాయాధికారి ఏకీభవిస్తూ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చింది.

మద్యం కేసులో పిటిషన్ల విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కుంభకోణంలో వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేష్ నాయుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విచారణ 25వ తేదీకి వాయిదా పడింది. జైలులో తనకు అదనపు సౌకర్యాలు కల్పించాలని చెవిరెడ్డి వేసిన పిటిషన్‌పై విచారణ మంగళవారానికి కోర్టు వాయిదా వేసింది. గుంటూరు కారాగారంలో రిమాండ్‌లో ఉన్న నిందితులు బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణలు తమను విజయవాడ జైలుకు మార్చాలని సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. పార్లమెంటు సమావేశాల్లో పాల్గొనేందుకు బెయిల్ షరతులు సడలించాలని వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి పిటిషన్‌పై విచారణను 25వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు.

రైలు ప్రయాణికుల రూ.11 లక్షల సొత్తు అప్పగింత

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: విజయవాడ డివిజన్ ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా ప్రయాణికుల సొత్తు చోరీకి గురి కాకుండా సకాలంలో స్పందించి వారికి అప్పగించారు. ఈ నెల 23న రైలు నంబరు 17481లో అనపర్తికి చెందిన విశ్వనాథరెడ్డి దంపతులు అన్నవరం నుంచి విజయవాడ వస్తున్న క్రమంలో బీ5 బోగీలో రెండు లగేజీ బ్యాగులు మర్చిపోయారు. వారు వెంటనే రైల్వే పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా.. అన్నవరం జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ త్రినాథరావు స్పందించి బ్యాగులు తిరిగి ప్రయాణికులకు అప్పగించారు. అందులో రూ.8 లక్షల విలువ చేసే బంగారం వస్తువులు ఉన్నాయి.

☛ తిరుపతికి చెందిన గోపాలకృష్ణ రైలు నంబరు 20677 వందే భారత్‌లో తెనాలి నుంచి రేణిగుంటకు ప్రయాణిస్తుండగా బ్రాస్‌లెట్ రేణిగుంట రైల్వేస్టేషన్‌లో పడిపోయింది. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు స్పందించి వెతికి బ్రాస్‌లెట్ తిరిగి ప్రయాణికుడికి అప్పగించారు. దాని విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని.. రెండు కేసుల్లో బంగారాన్ని ప్రయాణికులకు అప్పగించినట్లు రైల్వే పోలీసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వాసుపత్రికి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: మద్యం కుంభకోణం కేసులో ఏ38గా ఉన్న వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని జైలు అధికారులు సోమవారం విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. గతంలో వచ్చిన సమయంలో తాను ఆర్థరైటిస్ రుమటాలజీతో ఇబ్బంది పడుతున్నానని వైద్యులకు చెప్పారు. దీంతో రుమటాలజిస్టుకు చూపించి ఆయనకు బాగానే ఉందని నిర్ధారించారు. రెండు రోజులుగా తన కాళ్లు వాపు వస్తున్నాయని, తనకు వెరికోస్ వీయిన్స్ ఉందని జైలు అధికారులతో చెవిరెడ్డి చెప్పారు. వాస్కులర్ సర్జన్‌కు చూపించాలని కోరడంతో సాధారణ పరీక్షల నిమిత్తం ఆయన్ను కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎయిమ్స్‌కు రిఫర్ చేస్తూ సూపరింటెండెంట్ ఎయిమ్స్‌కు లేఖ రాశారు. అనంతరం ఆయన్ను జైలు అధికారులు జైలుకు తరలించారు. ఆయన విజ్ఞప్తి మేరకు ఎయిమ్స్‌కు రిఫర్ చేశామని, ఎయిమ్స్ నుంచి అధికారిక ఆమోదం రాగానే ఆయన్ను జైలు అధికారులు ఎయిమ్స్‌కు తరలిస్తారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

ప్రజలకు లిఫ్ట్ సౌకర్యం

పాయకాపురం: నగరంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యార్థం లిఫ్టును ఏర్పాటు చేశారు. సోమవారం దీనిని కలెక్టర్ జి.లక్ష్మీశ.. ఓ వృద్ధురాలి చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. మౌలిక వసతులు, సౌకర్యాల కల్పనపై ఆయన ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. జేసీ ఎస్.ఇలక్కియా పాల్గొన్నారు.

91.9FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297



EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్‌క్యాష్) ✆ 87907 41166

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ దరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూపు, VJA వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/వంట బేబికేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 96401 76677, 9553786677

REAL ESTATE

PLOT FOR SALE

చ.గ. 7999/-లకే CRDA అప్రూవల్ వెంచర్ నందు ORRకి దగ్గర కంచికచర్ల సమీపంలో స్పాట్ రిజిస్ట్రేషన్ సంప్ర ✆ 70758 14389.

JOBS

30-65Yrs బ్యాంక్ అనుబంధ సంస్థలో జీతం+Inc 35వేలు టీంమేనేజర్స్ ఎగ్జిక్యూటివ్స్. Q: 10th/డిగ్రీ రిటైర్డ్ బిజినెస్, ఇన్సూరెన్స్ ఏజంట్స్ మ్యూచువల్‌ఫండ్స్ మార్కెటింగ్. నోటార్గెట్. ✆ 90524 70111.

రజా హిందూస్తాన్ నిధి బ్యాంకులో పనిచేయుటకు మండలాల వారీగా అనుభవం ఉన్న ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ మేనేజర్లు కావలెను. జీతం: 12k-40K, 8328281861

స్వగృహ ఫుడ్స్‌లో పనిచేయుటకు సేల్స్ బాయస్ /గరల్స్ కావలెను. 18to 30 సం॥లోపు. అనుభవం ఉన్న వారికి మంచి జీతం. అర్హత: 10th, MG రోడ్. ✆ 81425 45000

FACULTY/ TEACHERS

మచిలీపట్నంలోని ప్రముఖ ప్లే స్కూల్ నందు Female Teachers (Min Degree) కావలెను. Contact: 72079 13971

DRIVERS

కీర్తి ఫైనాన్స్, బావాజీపేట, 1వ లైన్ ఆఫీస్ నందు పనిచేయుటకు ఇంటర్ చదివి, అనుభవం కల్గిన కార్‌డ్రైవర్ కావలెను. Age: 40 సం॥లోపు ✆ 9246922778

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

BOOK YOUR COLOUR CLASSIFIED
₹1200/- (5 Lines)
PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

కార్మికులకు కనీస వేతనం ఇవ్వండి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే : పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు మంజూరు చేయాలని సీఐటీయూ ఇబ్రహీంపట్నం మండల శాఖ కార్యదర్శి మహేష్ కోరారు. గుంటుపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పీఎఫ్, ఈఎస్ఐ, తదితర చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకుకు మరమ్మతులు

మైలవరం, న్యూస్‌టుడే : మండలంలోని గణపవరంలో శిథిలావస్థకు చేరిన సురక్షిత మంచినీటి పథకం ట్యాంకుకు మరమ్మతులను సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు జిల్లా పరిషత్ నుంచి రూ.5 లక్షలు మంజూరు కాగా, మరమ్మతులను చేపట్టినట్లు తెదేపా నాయకులు బుజ్జిరెడ్డి, శ్యాం ప్రసాద్ తెలిపారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల పరిధిలోని గ్రామాల శివాలయాల్లో అర్చకులు సోమవారం విశేష పూజలు నిర్వహించారు. శివలింగాలకు అభిషేకాలు, అర్చనలు, పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు పరిశీలించారు.

తిరువూరులో చంద్రమౌళీశ్వర స్వామి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన వందనం

★ కొండపల్లి పోస్టాఫీస్ రోడ్డులోని కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయని స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పారిశుద్ధ్య అధికారులు స్పందించి తమ సిబ్బందితో సోమవారం కాలువలను శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, కొండపల్లి

★ తిరువూరు 9వ వార్డులోని డ్రెయిన్ జిలో వ్యర్థాలు పేరుకుని మురుగు పారుదలకు ఆటంకంగా మారిందని స్థానికులు సోమేశ్వరరావు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి డ్రెయిన్లను శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

★ తాతకుంట్ల గ్రామంలో ప్రధాన రహదారి వెంట చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని నివాసితులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పంచాయతీ అధికారులకు తెలిపారు. గ్రామ కార్యదర్శి గోపాలకృష్ణ స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయించి సమస్య పరిష్కరించారు. - న్యూస్‌టుడే, విస్సన్నపేట

జోరుగా విక్రయాలు..
మోసపోతున్న కొనుగోలుదారులు

జి.కొండూరు, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం వచ్చాక స్థిరాస్తి వ్యాపారం ఊపందుకొని జి.కొండూరు మండలం చుట్టుపక్కల పొలాలన్నీ వెంచర్లుగా దర్శనమిస్తున్నాయి. మండలంలో సీఆర్‌డీఏ పరిధిలోని భూములు ఎటువంటి అనుమతులు లేకుండానే వెంచర్ల రూపంలో వెలుస్తున్నాయి. కొనుగోలుదారులకు స్థలాలు విక్రయించేందుకు మధ్యవర్తులు పక్కనే ఔటర్ రింగ్ రోడ్డు, గ్రీన్ ఫీల్డ్ హైవేలు వస్తున్నాయని చెప్పి దోచుకుంటున్నారు. అసలు విషయం బయటపడే సరికి స్థలాలు కొనుక్కున్న వారు మోసపోయామని గ్రహించి ఏమి చేయాలో తెలియక ఆవేదన చెందుతున్నారు. ఇంత జరుగుతున్న సీఆర్‌డీఏ అధికారులు దీనిపై చర్యలు చేపట్టకపోవడం విస్మయానికి గురి చేస్తోంది. ఆశతో కొనుగోలు చేసిన వారు మోసాన్ని గ్రహించి కొందరు న్యాయస్థానం మెట్లు ఎక్కుతున్నారు. మరికొందరు పోలీస్ స్టేషను చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నామని వాపోతున్నారు.

జి.కొండూరు శివారులో రూపుదిద్దుకుంటున్న వెంచరు

అనుమతులు లేకుండా..

రైతుల నుంచి వ్యవసాయ భూములను తక్కువ ధరకు కొనుక్కుని ప్రైవేటు సర్వేయర్లతో కొలిపించి రాళ్లు పాతి స్థిరాస్తి వ్యాపారులు అందినకాడికి విక్రయిస్తున్నారు. సీఆర్‌డీఏ అనుమతులు లేకుండానే ఉందని చెప్పడం, మౌలిక సదుపాయాలైన డ్రెయిన్లు, విద్యుత్తు వంటి సౌకర్యాలు కల్పించకుండానే వ్యాపారం చేస్తున్నారు. దీంతో కొనుక్కున్న వారు ఇంటి నిర్మాణం చేపట్టాలంటే సీఆర్‌డీఏ అనుమతులు పొందేందుకు వ్యయప్రయాసలు పడాల్సి వస్తోంది.

స్థలం కేటాయించకుండానే...

వెంచర్లు నిర్మించేటప్పుడు ఎకరం పొలానికి 10 సెంట్ల స్థలాన్ని సామాజిక అవసరాలకు కేటాయించాలి. అలాంటిది ఏమి లేకుండానే వెంచర్లు వేసి స్థలాలు అమ్ముకుంటున్న స్థానిక అధికారులు చర్యలు చేపట్టడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్లు, తాగునీటి ట్యాంకులు నిర్మించాల్సి ఉన్నా ఎటువంటి ఏర్పాట్లు లేకపోవడంతో గృహ నిర్మాణాలకు అవస్థలు పడుతున్నామని కొనుగోలుదారులు వాపోతున్నారు. ఇదంతా ఒక ఎత్తు అయితే అన్ని ప్లాట్లు అమ్ముకున్న కొన్నేళ్లకు, అక్కడ ఎటువంటి అభివృద్ధి చోటు చేసుకోకపోవడంతో దాన్ని మరలా ప్లానింగ్ మార్చి అక్కడే ప్లాట్లు వేయడం, అమ్మడం జరుగుతోంది. ఇప్పటికైనా సీఆర్‌డీఏ అధికారులు అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కొనుగోలుదారులు కోరుతున్నారు.

ఫిర్యాదు అందలేదు

అక్రమ వెంచర్ల విషయమై తనకు ఎటువంటి ఫిర్యాదు రాలేదు. తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. వీటిని నిర్మూలించేందుకు సీఆర్‌డీఏ అధికారులకు నివేదికలు అందించి వాటిని తొలగించేందుకు చర్యలు చేపడతాం. - వెంకటేశ్వర్లు, తహసీల్దార్, జి.కొండూరు మండలం

ఉపన్యసించి.. బహుమతులు సాధించి..

మైలవరం, న్యూస్‌టుడే : అనర్గళంగా ఉపన్యసించారు. అద్భుత ప్రసంగాలతో బహుమతులు సాధించారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా సోమవారం మండలంలోని చిలుకూరివారిగూడెం(పుల్లూరు) జడ్పీ ఉన్నత పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై పోటీలు జరిగాయి. ఇందులో 9వ తరగతి విద్యార్థినులు బి.సాహిత్య, సీహెచ్.చైత్ర, బి.పూజిత వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. ఈ మేరకు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు బి.ఉషారాణి, ఉపాధ్యాయులు రత్నకమల్‌బాబు, రమేష్, ఎండీ.షఫీ విజేతలకు బహుమతులు అందించి అభినందనలు తెలిపారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బహుమతులు సాధించిన వారితో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు

రఘునందన్‌కు సత్కారం

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, మల్లెతీగా సాంస్కృతిక సాహిత్య మాసపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన జాతీయ సాహితీ సభలో తిరువూరు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి రేపాక రఘునందన్‌ను సత్కరించి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందించారు. సభలో రఘునందన్ పఠించిన కవిత సాహిత్యాభిమానులను ఆకట్టుకుంది.

అభివృద్ధి.. సంక్షేమంతో దూసుకెళ్తున్న కూటమి ప్రభుత్వం

శ్రీరాంపురం(రెడ్డిగూడెం), న్యూస్‌టుడే : రాష్ట్రంలో అభివృద్ధి.. సంక్షేమంతో డబుల్ ఇంజిన్ సర్కార్ ముందుకు దూసుకెళ్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం శ్రీరాంపురం గ్రామంలో రూ.32 లక్షలతో పంచాయతీ భవనం, రూ.40 లక్షలతో పీఏసీఎస్ సొసైటీ భవనం నిర్మాణానికి కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాంతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం 26 మంది రైతులకు రూ.2.16 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. స్థల దాతలు నాదెళ్ల చెన్నకేశవరావు, సర్పంచి అట్లూరి శ్రీనివాసరావు, బి.వెంకట కృష్ణారావు, బి.చంద్రశేఖర్‌లను సత్కరించారు. జనసేన మైలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామ్మోహన్‌రావు, తెదేపా మండల అధ్యక్షుడు జె.వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, నెట్టెం రఘురాం, అధికారులు

ప్రజలకు శుద్ధ జలాలు అందించేందుకు చర్యలు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండల ప్రజలకు కృష్ణా జలాలు అందించేందుకు నీటి సరఫరా పథకం పనులను సత్వరమే పూర్తి చేయాలని తిరువూరు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం శుద్ధ జలాల సరఫరాకు సంబంధించి జరుగుతున్న నిర్మాణాలు, పనులపై ఆ శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. గిరిజన తండాలకు నాలుగు రోజుల నుంచి కుదప సంప్ నుంచి ట్యాంకర్ల ద్వారా కృష్ణా జలాల సరఫరా నిలిచిందన్నారు. వారికి తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా మంగళవారం నుంచి ట్యాంకర్లతో నీరు సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. తిరువూరు, మైలవరం డీఈఈలు కె.రాఘవేంద్ర, కె.రవికుమార్, ఏఈలు సీహెచ్.సాయివెంకట లక్ష్మి, దయానంద్ పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

జాతీయ రహదారిపై ఆందోళన

జి.కొండూరు, న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నం వీటీపీఎస్ బూడిద ప్రభావిత గ్రామాల్లోని లారీలకు లోడింగ్ చేసే ధరకే తమకు లోడింగ్ చేపట్టాలని జి.కొండూరు, మైలవరం మండలాల్లోని లారీ యజమానులు నిరసన తెలిపారు. మండలంలోని చెవుటూరు గ్రామ శివారు బైపాస్ సమీపంలో జాతీయ రహదారి- 30పై సోమవారం లారీ యజమానులు బైఠాయించారు. ఇబ్రహీంపట్నంలో వీటీపీఎస్ బూడిద ప్రభావిత గ్రామాల లారీ యజమానులు ధర్నా చేసినప్పుడు తాము కూడా మద్దతు తెలిపి నిరసనలో పాల్గొన్నామని, వారితో పాటు తమకు న్యాయం చేయాలని కోరారు. వీరికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలుపడంతో చెవుటూరు శివారు బైపాస్‌లో బూడిద లారీలను అడ్డుకుని నిలిపేశారు. ఈ విషయం జి.కొండూరు పోలీసులకు తెలిసి లారీ యజమానులను అదుపులోకి తీసుకుని నిరసన విరమింపజేశారు.

బూడిద లారీ ముందు కూర్చొని నిరసన తెలుపుతున్న లారీ యజమానులు

క్రీడల్లో రాణించి ప్రతిష్ఠ పెంచాలి

మైలవరం, న్యూస్‌టుడే : క్రీడల్లో రాణించడం ద్వారా వ్యక్తిగతంగా ఎదగడమే గాక, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్‌తో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం, సర్పంచి మంజుభార్గవి, స్టేడియం నిర్మాణ దాత హనిమిరెడ్డి, జయప్రకాశరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ జట్ల మధ్య నాలుగు పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

పోటీలో తలపడుతున్న ఆటగాళ్లు

జగన్మాత సేవలో శాసన సభ స్పీకర్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఏఈవో వెంకటరెడ్డి వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

'అన్నదాతలను పట్టించుకోని జగన్'

గొల్లపూడి, న్యూస్‌టుడే : వైకాపా పాలనలో రైతుల సమస్యలను జగన్ పట్టించుకోలేదని, వారిని రోడ్డున పడేశారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం గొల్లపూడిలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయాన్ని వైకాపా నాయకులు అస్తవ్యస్తం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం పంచసూత్రాల ద్వారా వ్యవసాయాన్ని పునర్నిర్మాణం చేసే దిశగా ముందుకెళ్తుందన్నారు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి అన్నదాతకు స్థిరమైన ఆదాయం వచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.



గొల్లపూడిలో మాట్లాడుతున్న దేవినేని

బడి తోట.. ఆరోగ్యానికి బాట

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

★ ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం కాచవరంలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో బడి తోటలో పెంచిన అరటి చెట్ల ఫలాలను విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పంపిణీ చేశారు.

★ మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల తోటలో పండిన సొర, బీర కాయాలను కూడా మధ్యాహ్న భోజనంలో వినియోగిస్తున్నారు.

పాఠశాల అంటే కేవలం చదువు ఒక్కటే కాదు. విద్యార్థి దశలోనే అన్ని అంశాలపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో వారికి ఏదో విధంగా మేలు జరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పోషకాహారం అందించడానికి ప్రభుత్వం బడి తోట కార్యక్రమం అమలు చేస్తోంది. ఎటువంటి ఎరువులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు పండించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అందించాలనేది దీని లక్ష్యం. కిచెన్ గార్డెన్ పేరుతో విద్యార్థులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పిస్తున్నారు. రోజూ కొంత సమయం అందరూ తోట పని చేసే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు సేంద్రియ పద్ధతుల్లో ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకుకూరలను పండిస్తున్నారు.

కాచవరం ప్రాథమిక పాఠశాలలో ఆకుకూరల నారు నాటుతున్న విద్యార్థులు

మైలవరం నియోజకవర్గంలో ఇలా..

మైలవరం నియోజకవర్గంలో 45 ప్రాథమిక, తొమ్మిది ఉన్నత పాఠశాలలో బడి తోటలను పెంచుతున్నారు. వీటిల్లో వంగ, బీర, బెండ, చిక్కుడు, గోంగూర, తోటకూర తదితరాలను పండించి మధ్యాహ్న భోజనానికి ఉపయోగిస్తున్నారు. సీజన్‌కు అనుగుణంగా వీటిని పండించడం, ఖాళీ సమయాల్లో విద్యార్థులతో నీరు పోయించడం, మొక్కలు నాటించడం, కలుపు మొక్కలు తీయడం తదితర సులభమైన వ్యవసాయ పనులతో పాటు ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించడం వంటివి చేయిస్తున్నారు. తద్వారా విద్యార్థులకు వ్యాయామంతో పాటు వ్యవసాయంపై అవగాహన కలిగిస్తున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం

బడి తోట కార్యక్రమం ద్వారా సేంద్రియ విధానంలో ఆకుకూరలు, కాయకూరల మొక్కలు పెంచుతున్నాం. ప్రస్తుతం నీటి సౌకర్యం, వసతి ఉన్న పాఠశాలల్లో దీని అమలు చేస్తున్నాం. స్థలం లేని బడుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి చూస్తున్నాం. - పీవీ.మాలిని, ఎంఈవో- 2, ఇబ్రహీంపట్నం

రైతుల అభివృద్ధే లక్ష్యంగా పంచసూత్రాలు అమలు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : రైతులను రాజును చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం 'రైతన్నా.. మీకోసం' ద్వారా పంచసూత్రాలు పథకం అమలు చేస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. తిరువూరు మండలం కోకిలంపాడు, మల్లేల గ్రామాల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు మంగళవారం ఉదయం గృహ నిర్మాణ సంస్థ, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులతో తిరువూరులోని తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపారు. సాయంత్రం ఉమ్మడి దేవరపల్లి, దుందిరాలపాడులో నిర్వహించే రైతన్నా.. మీకోసం కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు.

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే : గుంటుపల్లిలో జరిగిన కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టరు డాక్టరు హనుమంతరావు పాల్గొని మాట్లాడారు. వైద్యురాలు స్వాతి అయ్యప్ప, సిబ్బంది పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించి పంచసూత్రాలపై అవగాహన కల్పించారు.

గుంటుపల్లి: స్థానికులకు పథకాలు వివరిస్తున్న హనుమంతరావు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల పరిధి గోసవీడులో తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి కొత్తా రజనీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమం కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు కిశోర్, కిరణ్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని పోలిశెట్టిపాడులో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి బి.చిట్టిబాబు, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వి.మునియ్య, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఎ.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేటలో నిర్వహించిన కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి షేక్ టిప్పుసుల్తాన్ ప్రారంభించారు. రైతుల సమక్షంలో కరపత్రాలు విడుదల చేశారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : చెవుటూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు వేములకొండ వెంకటేశ్వరరావు, చెవుటూరు ఎన్నెస్పీ కాలువ డీసీ ఛైర్మన్ ఉమ్మడి వెంకటస్వామి, తెదేపా గ్రామ అధ్యక్షుడు పామర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో సత్తా

బరువెత్తుతున్న ఉపాధ్యాయురాలు

మైలవరం, న్యూస్‌టుడే : ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో మండలంలోని పుల్లూరు(వీసీ) ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని మర్రి శ్రీలక్ష్మి, వెల్వాడం(టీఆర్) ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని కంపా వరలక్ష్మి సత్తా చాటి బహుమతులు సాధించారు. వీరిని, శిక్షకుడు వెంకట్రావును ఎంఈవోలు బండి రాజు, ఎల్.బాలు సోమవారం అభినందించారు.

విజేతలకు బహుమతుల అందజేత

గొల్లపూడి, న్యూస్‌టుడే : నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో గొల్లపూడి వన్‌సెంటర్ రోడ్డులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో ఎ.శృతి, వి.మేఘన, ఈ.సాయిగీతం మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు నీతోడు మానసిక వికాస కేంద్రం కోఆర్డినేటర్ సాయిబాబు, ప్రధానోపాధ్యాయుడు శేషగిరిరావు బహుమతులు అందజేశారు.

గెలుపొందిన వారితో నిర్వాహకులు

జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో..

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో మండలంలోని నాగులూరు హైస్కూల్ విద్యార్థులు తృతీయ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.వరలక్ష్మి సోమవారం తెలిపారు. పి.ముఖేష్ కుమార్, ఎం.రసజ్ఞ, జె.రోహన్‌శనిలు ప్రతిభ చాటినట్లు చెప్పారు. వీరిని ఆమెతో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

'కోటి సంతకాలతో కుట్రలు తిప్పికొడదాం'

ఇబ్రహీంపట్నం: కోటి సంతకాలతో కూటమి కుట్రలను తిప్పి కొడదామని వైకాపా నేతలు అన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నంలో సోమవారం నిర్వహించారు. ఇందులో వారు మాట్లాడుతూ ప్రైవేటుకు అవకాశం కల్పిస్తే పేదలు, మధ్య తరగతి వారు మెడిసిన్ చదివే రోజులు దూరమవుతాయని చెప్పారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలు కదలిరావాలని పిలుపునిచ్చారు. కె.జయరాజు, వైకాపా బీసీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

పొరుగు సేవల ఉద్యోగులకు భద్రత కల్పించాలి

గొల్లపూడి, న్యూస్‌టుడే : ఆర్టీసీ, ప్రభుత్వ శాఖల్లో పని చేసే పొరుగు సేవల ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గొల్లపూడిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం ఆర్టీసీలో పని చేసే పొరుగు సేవల ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీలో ఎనిమిది వేల మంది పొరుగు సేవల ఉద్యోగులు పని చేస్తున్నారని, వారికి పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, నాయకులు దామోదరరావు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి, పక్కన నాయకులు

తిరువూరులో ముందుకు సాగని అభివృద్ధి పనులు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు మున్సిపల్ కౌన్సిల్లో కొనసాగుతున్న అవ్యవస్థపై ఆగ్రహం వ్యక్తం చేసిన కౌన్సిలర్లు సోమవారం ఆర్డీవో కార్యాలయాన్ని ఆశ్రయించారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు నెలల తరబడి నిలిచి పోతున్నాయని ఆర్డీవో కె.మాధురికి ఫిర్యాదు చేశారు. కౌన్సిల్ సమావేశాలు సక్రమంగా నిర్వహించక పోవడం, నిధుల విడుదలలో అలసత్వం తదితర సమస్యలు తీవ్రమవుతున్నాయని కౌన్సిలర్లు వాపోయారు. దీనిపై విచారణ నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు.

ఆర్డీవో మాధురికి వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్లు

గొలుసు దుకాణాల్లో తనిఖీలు

తిరువూరు టౌన్ న్యూస్‌టుడే : తిరువూరు మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న గొలుసు దుకాణాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఎరుకోపాడులో గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్న పరిశే. మల్లికార్జునరావు, పార్శపు.రవిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, వారిపై కేసులు నమోదు చేసినట్లు ఆ శాఖ సీఐ డా.నిక్సన్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్రమంగా గొలుసు దుకాణాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మానసిక వికాసంపై అవగాహన

కుంటముక్కల గురుకులంలోని విద్యార్థులతో కేశవ్, ఝాన్సీ

జి.కొండూరు, న్యూస్‌టుడే : విద్యార్థులు పరీక్షల సమయంలో సమయపాలన పాటిస్తే ఒత్తిడిని జయించవచ్చని వాసవ్య మహిళా మండలి సమన్వయకర్త కేశవ్, కౌన్సిలర్ ఝాన్సీ పేర్కొన్నారు. కుంటముక్కలలోని డా.బీఆర్.అంబేడ్కర్ గురుకులంలో ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థినులకు సోమవారం వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించే లీవ్ లవ్ లాఫ్ ఫౌండేషన్, బిర్లా న్యూ కంపెనీ సంయుక్తంగా చేపట్టిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. ప్రిన్సిపల్ బ్యూలా, కమ్యూనిటీ యానిమేటర్ స్వాతి, సునీత పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన అవకాశాలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : భవిష్యత్తులో ఫార్మసీ రంగంలోని విద్యార్థులకు మెరుగైన ఉద్యోగాలు సాధించే అవకాశం ఉందని నిమ్రా విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టరు డాక్టరు తమ్మినేని నారాయణమూర్తి చెప్పారు. సోమవారం జూపూడి నోవా ఫార్మసీ కళాశాలలో నూతన విద్యార్థులకు ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. నోవా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఈవి నాగ బాబు, ఫార్మసీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న నారాయణమూర్తి

దస్తావేజులు పోయినవి

N.T.R. జిల్లా, విజయవాడ రూరల్ మం., నిడమానూరు, డోర్ నెం. 3-143 కాపురస్తులు చనుమోలు పద్మావతి W/o. సూర్యప్రకాశరావు, వయస్సు: 53 సం॥లు అను నాకు N.T.R. జిల్లా మైలవరం గ్రామ R.S.No. 137/1లో చ.గ. 138లు స్థలం, అందలి యావత్తు కట్టడములతో సహా ఆస్తి రిజిష్టర్డు విక్రయ దస్తావేజు నెం: 15929/2022 ద్వారా సంక్రమించినది. దీనికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు బ్యాగులో ఉంచుకుని నా కుమార్తె వద్దకు వెళ్ళు నిమిత్తం మైలవరంలో బస్సు ఎక్కుచుండగా నా బ్యాగు ఎక్కడో జారిపోయినది. ఆ చుట్టుప్రక్కల ఎంత వెదికిననూ దొరకలేదు. కావున దస్తావేజు నెం. 15929/2022 ఎవరికైననూ దొరికినయెడల ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

సెల్: 96404 48589

విజయవాడ తూర్పు

ప్రతిభ చూపి.. విజేతలుగా నిలిచారు

విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ షేక్ మున్నూర్, దుర్గా రమేష్

పోటీలో మాట్లాడుతున్న విద్యార్థిని

కృష్ణలంక, న్యూస్‌టుడే : రాణిగారితోట కెన్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలను సోమవారం నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాల్లో చరవాణి ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు ఏర్పాటు చేశారు. ప్రథమ స్థానంలో అన్విక వర్మ (9వ తరగతి), ద్వితీయ స్థానంలో పొట్లపాటి మెరిష (10వ తరగతి), తృతీయ స్థానంలో ఎస్. శ్రీవాణి సంవిత (8వ తరగతి) నిలిచి.. బహుమతులను సాధించారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ షేక్ మహబూబ్, ప్రిన్సిపల్ షేక్ మున్నూర్, ఇన్‌ఛార్జి దుర్గా రమేష్, ఫ్లోర్ ఇన్‌ఛార్జి యారం తహురున్నీసా బేగమ్ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

అంతర్జాతీయ బిలో 1800 ఫిడే రేటింగ్ చెస్ విజేత సహృద్

తొలి మూడు స్థానాలు సాధించిన క్రీడాకారులతో శాప్ ఛైర్మన్ రవినాయుడు, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే : స్థానిక మారిస్ స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు ఎకోసెన్ అంతర్జాతీయ బిలో 1800 ఫిడే రేటింగ్ చెస్ టోర్నీలో ఎం.పి.సహృద్ (ఆంధ్రప్రదేశ్) విజేతగా నిలిచారు. తొమ్మిది రౌండ్ల పాటు జరిగిన ఈ టోర్నీలో ఎనిమిది పాయింట్లతో సహృద్, వంశీకృష్ణ ఆర్. రాజాపేరిం వీర భగవతీశ్వర్‌రెడ్డి (ఆంధ్రప్రదేశ్) సమానంగా నిలిచారు. దీంతో ప్రోగ్రెసివ్ స్కోర్ ఆధారంగా వరుసగా తొలి మూడు స్థానాలు కేటాయించారు.. సహృద్ విజేతగా నిలిచారు. పుల్లి పవన్ కుమార్, శ్రేయాన్ ఉప్పర్తి, ఎస్.సుబ్బరాజు, పి.శ్రీసాయి వేదాన్ష్ (తెలంగాణ), మామిళ్ల యుగంధర్ (ఏపీ), బి.ఆదర్ష్ కుమార్ (ఒడిశా), కుమార శ్రీవత్స సోమంచి (తెలంగాణ), సుప్రతిమ్ భద్ర (ఢిల్లీ) సంయుక్తంగా 7.5 పాయింట్లతో నిలిచి ప్రోగ్రెసివ్ స్కోర్ ఆధారంగా వరుసగా నాలుగు నుంచి 11వ స్థానాల్లో నిలిచారు. బిలో 1800 రేటింగ్‌లో తొలి 30 స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు అందజేశారు. ముగింపు కార్యక్రమానికి శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, కలెక్టర్ జి.లక్ష్మీశ అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, నగదు బహూకరించారు. కార్యక్రమంలో ఏఐసీఎఫ్ చెస్ ఇన్ స్కూల్స్ ఛైర్మన్ కేవీఎస్ ప్రసాద్, రాష్ట్ర చెస్ సంఘం ముఖ్య సలహాదారు కేవీవీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక కమిటీ భేటీ..

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరపాలక సంస్థకు సంబంధించిన మంచినీరు, భూగర్భ మురుగు పారుదల వ్యవస్థ ప్రత్యేక కమిటీ సమావేశం మంగళవారం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ సమావేశం శనివారం జరగాల్సి ఉండగా.. సభ్యుల కోరం లేక వాయిదా వేశారు. సమావేశంలో ఆయా కమిటీ సభ్యులు ప్రతిపాదించే పలు అంశాలపై చర్చించి తీర్మానాలు ఆమోదించడంతో పాటు, వాటిని కౌన్సిల్‌కు రిఫర్ చేస్తూ తీర్మానిస్తారు.

ఆలోచన... ఆవిష్కరణ

నూతన ఔషధాలను రూపొందిస్తున్న విద్యార్థులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

వివిధ వ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే వాటికి ప్రస్తుతం మార్కెట్‌లో ఔషధాలు లభిస్తున్నాయి. వాటికంటే మెరుగైన, ఆరోగ్యంపై ఎటువంటి ప్రభావం చూపకుండా నూతన ఆవిష్కరణలు రూపొందించేందుకు సిద్ధార్థ ఫార్మసీ కళాశాల విద్యార్థులు పరిశోధనలు చేస్తూ భళా అనిపిస్తున్నారు. అందులో భాగంగా శనివారం తాము తయారు చేసిన వివిధ ఔషధాలు, జెల్, ఆయిల్ తదితర ఉత్పత్తులను ప్రదర్శించారు.

రక్తపోటును తగ్గిస్తుంది.. దైనందిన జీవితంలో వృత్తి, ఉద్యోగపరంగా ఎదురయ్యే ఒత్తిడి వల్ల రక్తపోటు వస్తోంది. తెల్లవారుజామున ఇది మరింత ఎక్కువగా ఉంటుంది. దీన్ని నియంత్రించడానికి ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న వాటి కంటే మెరుగైన ఔషధాన్ని ఫార్మాడి ఆరో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు **సీహెచ్ కోవిద, యామిని దుర్గ** తయారు చేశారు. స్టెమ్ కోటెడ్ క్రోనోథెరప్యూటిక్ డ్రగ్ డెలివరీ విధానాన్ని ఉపయోగించి మొక్కల ద్వారా దీన్ని తయారు చేసి ప్రదర్శించారు. దీనిపై మరింత పరిశోధన చేస్తున్నామని తెలిపారు.

నొప్పి నుంచి ఉపశమనం.. కండరాలు ఒత్తిడి గురవడం వల్ల నొప్పి వస్తుంది. దాని నుంచి వెంటనే ఉపశమనం కలిగేందుకు ఫార్మాడి నాలుగు, ఐదో సంవత్సరం చదువుతున్న **పి.సాయి రోహిత్, ఎన్.వినీల** డైక్లోమెంతోల్ జెల్‌ను తయారు చేశారు. దీన్ని చర్మంపై రాసినప్పుడు చల్లగా ఉంటుంది. త్వరగా నొప్పి తగ్గుతుంది. సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని విద్యార్థులు చెబుతున్నారు.

శిరోజాల సంరక్షణ.. బీఫార్మసీ తృతీయ సంవత్సరం విద్యార్థులు **టి.ప్రభుల్ చిన్నా, టి.జయశ్రీ, టి.రేష్మా, ఎం.డి.అంజుమ్ షీరిన్..** శిరోజాల సంరక్షణకు రసాయన రహితంగా ఎనిమిది మూలికలతో హెర్బల్ హెయిర్ ఆయిల్ తయారు చేశారు. శిరోజాల కుదుళ్లను బలపరచడం, రక్త ప్రసరణ ఇది పెంచుతోంది. చుండ్రును తగ్గిస్తోంది. శిరోజాల ఊడిపోకుండా, పెరిగేలా చేస్తుందని వారు వివరించారు.

చర్మవ్యాధులను తగ్గిస్తుంది.. కేటోకోనాజోల్ కార్బోమర్ ఆధారిత నానో-జెల్ ఫార్ములేషన్ విధానంతో ఆధునిక నానో స్ట్రక్చర్ సాంకేతికతతో జెల్‌ను ఫార్మాడి ఐదో సంవత్సరం చదువుతున్న **ఎస్.తేజ మణికంఠ, కె.మనస్విని** రూపొందించారు. ఇందులో కేటోకోనాజోల్ నానో డిస్పర్షన్ రూపంలో ఉండటం వల్ల చర్మంలోకి లోతుగా ప్రవేశిస్తోంది. దీని వల్ల వివిధ చర్మవ్యాధులతో బాధపడుతున్న వారు ఈ జెల్ రాసుకుంటే త్వరగా తగ్గుతాయని పేర్కొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి వినతి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలోని కృష్ణలంక శ్మశానవాటిక ప్రాంగణంలో సరైన వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నందున చర్యలు తీసుకోవాలని 52వ డివిజన్ తెదేపా కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) ఇన్‌ఛార్జి కమిషనర్ డి.చంద్రశేఖర్‌ను కోరారు. ఈమేరకు సోమవారం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మృతుల ఖననం, దహన సంస్కారాలకు వారి కుటుంబ సభ్యులు అనేక మంది వస్తుంటారని, అయితే శ్మశాన వాటి ప్రాంగణంలోని ప్లాట్‌ఫారాలు, బల్లలు పాడై.. అపరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. ప్రాంగణం మొత్తం చెత్తతో ఉందని తెలిపారు. మౌలిక వసతులు కల్పించాలని, అధునాతన పద్ధతిలో శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.

ఎంపీ శివనాథ్‌ను కలిసిన ఫరూక్ షిబ్లీ

పటమట: రాష్ట్ర ఉర్దూ అకాడమీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన ఫరూక్ షిబ్లీ సోమవారం మత గురువు అల్తాఫ్ బాబాతో కలసి ఎంపీ శివనాథ్‌ను గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఫరూక్ షిబ్లీను ఎంపీ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. మైనార్టీ సంక్షేమం కోసం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, వైకాపా పాలనలో ముస్లింలపై జరిగిన దాడులకు వ్యతిరేకంగా ఆయన పోరాటం చేశారని ఎంపీ గుర్తు చేశారు. మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

మెప్మా వార్షిక సంచిక 'అవని' ఆవిష్కరణ

అధికారులతో కలిసి సంచిక ఆవిష్కరిస్తున్న ఎంపీ శివనాథ్

పటమట, న్యూస్‌టుడే : మెప్మా రూపొందించిన మెప్మా వార్షిక సంచిక 'అవని'ని ఎంపీ కేశినేని శివనాథ్ సోమవారం గురునానక్ కాలనీలో ఎన్టీఆర్ భవన్‌లో మెప్మా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అవని' సంచికలో స్ఫూర్తి గొలిపే గాథలు ప్రచురించడమే కాకుండా వివిధ జిల్లాల్లో మహిళా సంఘాలు సాధించిన విజయగాథలు ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మహిళ పారిశ్రామిక విప్లవానికి గట్టి పునాదులు పడుతున్నాయని చెప్పారు. ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్తను తయారు చేయాలనే సీఎం చంద్రబాబు ఆలోచన వల్ల రాష్ట్రంలో మహిళాశక్తిని మహోన్నత శక్తిగా మార్చే ప్రక్రియకు నాంది పలికిందన్నారు. వీఎంసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట నారాయణ, ఎన్టీఆర్ జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.మురళీకృష్ణ ప్రసాద్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాంచారరావు, నాయకులు నరసింహ చౌదరి, కె.మీనాక్షి కల్పన పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ ఓవరాల్ ఛాంప్స్ 'పీబీఎస్'

పతకాలు సాధించిన క్రీడాకారులతో రమేష్, నాగేశ్వరరావు, హేమచంద్రరావు తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : స్థానిక పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ (పీబీఎస్) ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల స్త్రీ, పురుషుల వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆతిథ్య కళాశాల స్త్రీ, పురుషుల జట్లు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించాయి. పురుషుల జట్టు 281 పాయింట్లు, మహిళల జట్టు 127 పాయింట్లతో నిలిచి ఈ ఘనత దక్కించుకున్నాయి. ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్, పోటీల కార్య నిర్వాహక కమిటీ ఛైర్మన్ మేకా రమేష్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పతకాలు బహూకరించారు. కార్యక్రమంలో వి.నాగేశ్వరరావు (పీడీ, కేవీఆర్ కళాశాల, నందిగామ), డి.హేమచంద్రరావు (పీడీ, కేబీఎన్ కళాశాల), డి.నవీన్‌కుమార్ (అతిథి వ్యాయామ సంచాలకుడు, ఎస్ఆర్ఆర్), ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ కోచ్ స్వామి, కృష్ణా జిల్లా వెయిట్ లిఫ్టింగ్ సంఘ కార్యదర్శి గుర్రాల రవి పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఛార్టెడ్ అకౌంటెంట్ల పాత్ర కీలకం

✤ రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : మన రాష్ట్ర రాజధాని అమరావతి వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రపంచ స్థాయిలో పేరెన్నిక కలిగిన సంస్థలు, పెద్ద పరిశ్రమలను స్థాపించనున్నారని రాష్ట్ర ఎక్సైజ్, మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) విజయవాడ బ్రాంచ్ ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని ఓ ఫంక్షన్ హాలులో ఇగ్నైటు- 2025 పేరుతో సీఏ విద్యార్థులకు కల్చరల్ ఫెస్ట్ సోమవారం నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ దేశ, రాష్ట్ర అభివృద్ధిలో ఛార్టెడ్ అకౌంటెంట్ల పాత్ర కీలకమని తెలిపారు. ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ ఛైర్మన్ కంచమరెడ్డి నారాయణ, విజయవాడ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జయంత్, కార్యదర్శి మనీష్‌కుమార్ జైన్, కోశాధికారి వి.వీర పవన్ కుమార్, విద్యార్థి విభాగం ఛైర్మన్ టి.వినీల, దామ వేణు, బొర్రా అజయ్ చౌదరి పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మంత్రి రవీంద్రను సత్కరిస్తున్న ఐసీఏఐ ప్రతినిధులు

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం

క్రీడాకారులతో శాప్ ఛైర్మన్ రవినాయుడు, డీఎస్‌డీవో కోటేశ్వరరావు, నిర్వాహకులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : మహిళలు క్రీడల్లో రాణించేందుకు అస్మిత ఖేలో ఇండియా పోటీలు దోహద పడతాయని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర సాఫ్ట్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ లీగ్‌ను సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లీగ్ ద్వారా మహిళల్లో క్రీడల పట్ల ఆసక్తి మరింత పెరుగుతుందని, గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభ గుర్తించి ప్రోత్సహించే వేదికగా ఇది మారుతుందన్నారు. శాప్ బోర్డు సభ్యుడు ఎస్.సంతోష్‌కుమార్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కాకర్ల కోటేశ్వరరావు, రాష్ట్ర సాఫ్ట్ టెన్నిస్ సంఘం ఛైర్మన్ డి.నవీన్‌కుమార్, సంయుక్త కార్యదర్శి డి.సుధీర్, నీలిమ పాల్గొన్నారు.

భారీ గుంతలు.. చీకట్లో అవస్థలు

ఆటోనగర్ వందడుగుల రోడ్డులో ఎగ్జిబిషన్ హాల్, మెస్సీయ్యా ఫెలోషిప్ సమీపంలో రెండు భారీ గుంతలు పడ్డాయి. గుంతలు రెండు అడుగుల లోతు ఉన్నాయి. రాత్రి పూట, వర్షం పడి రోడ్డుపై నీరు నిలిచిన సమయంలో వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు. - ఆటోనగర్, న్యూస్‌టుడే

కంకర.. తొలగించరా?

విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రి ఏ బ్లాక్ ఆవరణలో డివైడర్ పక్కన ఆరు నెలలుగా కంకర పోసి వదిలేశారు. ఏపీఎస్ ఎంఐడీసీ వారు ఆసుపత్రిలో పలు మరమ్మతుల నిమిత్తం దాన్ని అక్కడ వేశారు. అప్పటి నుంచి తీయలేదు. ఓపీ చీటీల కోసం రోగులు అధిక సంఖ్యలో ఉదయం క్యూలైన్‌లో నిలబడతారు. కంకరపై కాలేసి జారి పడిపోతున్నారు. కంకరను అక్కడి నుంచి తరలించాలని వారంతా కోరుతున్నారు. - న్యూస్‌టుడే, విజయవాడ వైద్యం

వృథాగా పోతున్నా పట్టించుకోరేం..!

విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాల ఆవరణలోని సీడీసీ (సెంట్రల్ డయాగ్నోస్టిక్ సెంటర్) రోడ్డు మార్గం ఎదురుగా ఉన్న పార్క్‌లో నుంచి నీరు వృథాగా పోతోంది. వారం రోజులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఇలా జరుగుతోందని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డంతా బురదమయంగా మారుతోందని, సంబంధిత అధికారులు నీటి వృథా అరికట్టాలని వారు కోరుతున్నారు.

-విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే

అలరించిన మిస్‌బ్లాక్ పోటీలు

పటమట, న్యూస్‌టుడే : స్టెల్లా కళాశాలలో సోమవారం క్రిస్మస్ ఫెట్ డే వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం కళాశాల సపోర్ట్ సిబ్బందికి మిస్ బ్లాక్ పోటీలు నిర్వహించారు. బ్లాక్ దుస్తుల్లో ర్యాంప్ వాక్ చేసి అలరించారు. మిస్ బ్లాక్ షో విన్నర్‌గా మధులత ఎంపికయ్యారు. తొలి మూడుస్థానాల్లో నిలిచి వారికి ప్రిన్సిపల్ ఇన్యాసమ్మ బహుమతులు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80085 74652

★ 5వ డివిజన్ గుణదల గంగిరెడ్డుల దిబ్బ వైఎస్ఆర్ కాలనీ ప్రాంతంలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగుతున్నాయని స్థానిక నివాసి రామేశ్వరి మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన యంత్ర సాయంతో పూడిక తీయించారు. ★ 3వ డివిజన్ కామినేని నగర్, విజయలక్ష్మి కాలనీ ప్రాంతాల్లో దోమలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక నివాసి మహ్మద్ బేగ్ మలేరియా అధికారి హెచ్.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో దోమల మందులు పిచికారీ చేయించారు. ★ 4వ డివిజన్ భారతీనగర్ 7వ రోడ్డులో 4-7/83 విద్యుత్తు స్తంభానికున్న దీపం వెలగడం లేదని స్థానిక నివాసి రత్నాకర్ ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

స్పందనకు వందనం

ఆవిష్కరణలు రూపొందించే వారిని ప్రోత్సహిస్తాం

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : పీబీ సిద్ధార్థ కళాశాల, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. వీటికి సంబంధించిన పత్రాలను ప్రిన్సిపల్ మేకా రమేశ్, సంస్థ ముఖ్య కార్య నిర్వహణాధికారి జి.కృష్ణన్ సోమవారం మార్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలతో ముందుకు వచ్చే యువతకు, అంకుర సంస్థలు ఏర్పాటు చేసే ఆలోచన ఉన్న విద్యార్థులకు ఇన్నోవేషన్ హబ్ ద్వారా శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ ఆచార్య రాజేశ్ సి.జంపాల, ఉపాధి కల్పనాధికారి కావూరి శ్రీధర్ పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ఉత్సాహంగా డివిజనల్ పారా స్పోర్ట్స్ మీట్

వీల్‌ఛైర్ రేస్ ప్రారంభిస్తున్న పీఈ ఎడ్విన్, డాక్టర్ ప్రసాద్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : స్థానిక రైల్వే మినీ స్టేడియంలో సోమవారం ద.మ. రైల్వే పర్సన్ విత్ డిజబిల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్, ద.మ. రైల్వే విజయవాడ డివిజన్ స్పోర్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'డివిజనల్ పారా స్పోర్ట్స్ మీట్'లో పలువురు ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీల్‌ఛైర్ రేస్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, చెస్, క్యారమ్స్, అంధుల క్రికెట్, ఆర్థో క్రికెట్ పోటీలను స్త్రీ, పురుషులకు వేర్వేరుగా బధిరులు, అంధ, ఆర్థో కేటగిరిల్లో నిర్వహించామని పోటీల నిర్వాహకుడు, అంతర్జాతీయ పారా అథ్లెట్ ఎస్.తిరుమలై కుమార్ తెలిపారు. పోటీల్లో సుమారు వంద మంది పారా అథ్లెట్లు తలపడ్డారని పేర్కొన్నారు. వచ్చే నెల 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏడీఆర్ఎం (ఇన్‌ఫ్రా) పీఈ ఎడ్విన్, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, సీనియర్ డీపీవో ప్రేమ్‌కుమార్ లకావత్, డివిజనల్ స్పోర్ట్స్ అధికారి, సీనియర్ డీవోఎం/జి ఎం.దినేష్‌కుమార్, రైల్వే ఇన్‌ఛార్జి స్పోర్ట్స్ అసిస్టెంట్ ఎ.శరత్‌చంద్ర, పాల్గొన్నారు.

నమోదు గడువు పెంచండి

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : వక్ఫ్ జాబితాలో ఉన్న భూములను ఉమీద్ పోర్టల్‌లో చేర్చేందుకు కేంద్రం విధించిన డిసెంబర్ 5 తుది గడువును ఆరు నెలలు పొడిగించాలని ముస్లిం జేఏసీ కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్ అన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపి కేంద్రాన్ని గడువు పెంచేలా ఒప్పించాలని కోరారు. వక్ఫ్ భూముల నమోదు సమస్యపై ముస్లిం సంఘాల సమావేశాన్ని విజయవాడ లబ్బీపేటలోని ముస్లిం ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తుల నమోదులో తీవ్ర సాంకేతిక సమస్యలు వస్తున్నాయని, దీని వల్ల జాప్యం అవుతోందని పేర్కొన్నారు. నమోదుపై అవగాహన లేక గందరగోళంలో ఉన్నారని, వక్ఫ్‌బోర్డు, సమాచార శాఖ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు, సమావేశాలు నిర్వహించి మైనార్టీ వర్గాల్లో చైతన్యం తీసుకు రావాలని, దీనిపై జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. జామియాత్ అహిలే హదీస్ ప్రతినిధి నసీర్ ఉమ్రి, జమాతే ఇస్లామీ హింద్ ప్రతినిధి మొహమ్మద్ లుక్మాన్, ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రతినిధులు ముఫ్తి యూసఫ్ ఆలీ, మజ్లిసుల్ ఉలేమా అధ్యక్షుడు ముఫ్తి హబీబ్, ముస్లిం అడ్వకేట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మతీన్, సున్నతుల్ జమాత్ ప్రతినిధి ముక్తార్ అలీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముస్లిం జేఏసీ కన్వీనర్ మునీర్ అహ్మద్

సమస్యలపై 17 వినతులు

విజయవాడ నగరపాలక సంస్థ న్యూస్‌టుడే : వివిధ సమస్యలపై నగరవాసుల నుంచి అందే వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సకాలంలో పరిష్కరించాలని ఇన్‌ఛార్జి కమిషనర్ డి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి, వివిధ సమస్యలపై ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినతులను బాధ్యులైన అధికారులు పరిశీలించి గడువు లోపు పరిష్కరించాలని అన్నారు. వివిధ సమస్యల పరిష్కారంలో అధికారుల వైఖరిపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలపై 17 వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో అధికారులు కె.అర్జునరావు, పి.సత్యకుమారి, జి.సృజన, శ్రీనివాసరెడ్డి, లత, ఏ.శ్రీధర్, చంద్రశేఖర్, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

1 నుంచి రాష్ట్ర స్థాయి పారా బ్యాడ్మింటన్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : వచ్చే నెల 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు వచ్చే నెల ఒకటి నుంచి రెండు రోజులు గుంటూరు డీఎస్ఏలో రాష్ట్ర స్థాయి పారా బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహిస్తామని సోమవారం శాప్ కార్యాలయ అధికారులు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో సామగ్రి దగ్ధం

కృష్ణలంక, న్యూస్‌టుడే : విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా 17వ డివిజన్ బాపనయ్య నగర్‌లో రేకులషెడ్డుకు మంటలు వ్యాపించి.. గృహోపకరణాలు కాలిపోయాయి. బాపనయ్య నగర్ మొదటి లైనులో ఇంటిపై అంతస్తు రేకులషెడ్డులో లక్ష్మీరెడ్డి కుటుంబంతో నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి వారి వారి పనుల నిమిత్తం కుటుంబ సభ్యులు బయటకు వెళ్లారు. తర్వాత ఇంటి నుంచి పొగలు రాగా స్థానికులు లక్ష్మీరెడ్డికి, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఈలోపు స్థానికులు ఇంటి తాళం పగులగొట్టి లోపలున్న రెండు వంట గ్యాస్ సిలిండర్లు బయటకు తెచ్చారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పినా అప్పటికే గృహోపకరణాలు దగ్ధం అయ్యాయి.

స్ఫూర్తి కలిగించిన అంధ మహిళా క్రికెట్ జట్టు విజయం

పటమట, న్యూస్‌టుడే : అంధ మహిళా టీ- 20 క్రికెట్ తొలి ప్రపంచ కప్‌ను భారత జట్టు కైవసం చేసుకోవడం అభినందనీయమని తెదేపా నాయకుడు గద్దె క్రాంతికుమార్ తెలిపారు. ప్రతికూల పరిస్థితులను, ఎదురుదెబ్బలను ధైర్యంగా ఎదుర్కొని అద్భుత ఆత్మ విశ్వాసం, దృఢ సంకల్పంతో ప్రపంచ కప్‌ను గెలుచుకున్న భారత అంధ మహిళా క్రికెట్ జట్టు దేశ పౌరులకు మహత్తర స్ఫూర్తి అని కొనియాడారు. అంతర్జాతీయ వేదికపై దృఢమైన పోరాటపటిమ ప్రదర్శించి, దేశం గర్వించేలా నేపాల్‌పై విజయం సాధించి తొలి టీ-20 ప్రపంచ కప్ టైటిల్‌ను సొంతం చేసుకోవడం చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. ఈ విజయంలో కీలకపాత్ర పోషించిన తెలుగుతేజం పి.కరుణకుమారికి ఆయన అభినందనలు తెలిపారు.

భర్త మీద అలిగి కుమార్తెతో బస్‌స్టేషన్‌కు వచ్చిన మహిళ

కృష్ణలంక, న్యూస్‌టుడే : భర్త మీద అలిగి విజయవాడ బస్‌స్టేషన్‌కు చేరుకున్న వివాహితను పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి బాపట్లలో దుకాణం నిర్వహిస్తున్నారు. భార్య, మూడేళ్ల వయసున్న కుమార్తెలతో బాపట్ల ఆదర్శనగర్ బీచ్‌రోడ్‌లో నివాసం ఉంటున్నారు. ఇటీవల ఇద్దరి మధ్య విభేదాలు రాగా భార్య.. భర్తపై అలిగి మూడేళ్ల కుమార్తెతో ఆదివారం విజయవాడ చేరుకుంది. దీంతో భర్త బాపట్ల పీఎస్‌లో భార్య అదృశ్యంపై ఫిర్యాదు చేశారు. సాంకేతికత సాయంతో దర్యాప్తు చేపట్టిన బాపట్ల పోలీసులకు లొకేషన్ విజయవాడ పీఎన్‌బీఎస్ సమీపంలో ఉన్నట్లుగా రాగా కృష్ణలంక పోలీసులను అప్రమత్తం చేశారు. ఈ క్రమంలో వివాహిత కుమార్తెతో లేడీ డార్మిటరీలో ఉన్నట్లు గుర్తించి వారిని కృష్ణలంక పీఎస్‌కు తరలించారు. సీఐ నాగరాజు కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తల్లిదండ్రులు మందలించారని బాలిక...

కృష్ణలంక, న్యూస్‌టుడే : తల్లిదండ్రులు మందలించగా కలత చెందిన బాలిక (11) విజయవాడ బస్‌స్టేషన్‌కు చేరింది. పోలీసుల వివరాల ప్రకారం.. నందిగామకు చెందిన బాలిక అక్కడే 6వ తరగతి చదువుతోంది. కాగా పరీక్షల్లో మార్కులు తక్కువగా రాగా తల్లిదండ్రులు మందలించారు. దీంతో కలత చెందిన బాలిక సోమవారం ఉదయం బడికి వెళుతున్నట్లుగా బస్సెక్కి విజయవాడ పీఎన్‌బీఎస్‌కు చేరుకుంది. అక్కడ ఒంటరిగా ఉన్న బాలికను విధుల్లో ఉన్న కృష్ణలంక పోలీసులు గుర్తించి పీఎస్‌కు తరలించి వివరాలు అడుగగా వారికి విషయాన్ని వివరించింది. వారు విషయం తల్లిదండ్రులకు తెలపగా.. వారు వచ్చారు. పోలీసులు వారికి కౌన్సెలింగ్ నిర్వహించి బాలికను అప్పగించారు.

ప్రకటన

మా క్లయింటు యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ కాపురస్తులు పోలవరపు రాధాకృష్ణమూర్తి గారి కుమారుడు ప్రశాంత్ వర్ధన్ గారి సంజాయిషీ పొంది తెలియచేయునది ఏమనగా.. యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ కాపురస్తులు కామినేని నాగేంద్రబాబు గారి కుమారుడు కామినేని మురళీకృష్ణ గారు ది. 21.07.2008వ తేదీన కామినేని నాగేంద్రబాబు గారి భార్య కామినేని శోభారాణి గారి వలన దఖలు పొంది శ్రీ పటమట సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం, నెం. 4879/2008 రుగా రిజిష్టరు కాబడిన దఖలు దస్తావేజు రీత్యా వారికి సంక్రమించిన దరిమిలా సదరు దఖలు దస్తావేజునకు కొలతలను సరిచేసి సవరణ దస్తావేజును వ్రాయించి సదరు దస్తావేజును ది. 10.02.2025వ తేదీన సవరణ పొంది శ్రీ పటమట సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం, నెం. 2483/2025 రుగా రిజిష్టరు కాబడిన సవరణ దస్తావేజు రీత్యా వారికి సంక్రమించి తదుపరి ది.13.02.2025న కామినేని వెంకట నారాయణ గారు, కామినేని బాపూజి గార్లు సదరు షెడ్యూలాస్తికి సంబంధించి ఒక ఒప్పుదల దస్తావేజును వ్రాయించి శ్రీ పటమట సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం, నెం. 2751/2025 రుగా రిజిష్టరు కాబడిన ఒప్పుదల దస్తావేజు రీత్యా వారికి సంక్రమించి నేటి వరకు వారికి మాత్రమే సర్వ సంపూర్ణ స్వాధీన యాజమాన్య హక్కు భుక్తములతో అనుభవించుచున్నారు. సదరు షెడ్యూలు దాఖలా ఆస్తులను మా క్లయింటు క్రయమును పొందుటకు విక్రయ ఒప్పందము కుదుర్చుకుని కొంత సొమ్ము బయానాగా చెల్లించి త్వరలో మా క్లయింటు పేరగాని, వారు కోరిన వారి పేరున గాని రిజిష్టరు దస్తావేజును వ్రాసుకొనబోవుచున్నారు. కావున యీ దిగువ షెడ్యూలు దాఖలాస్తిపై ఎవ్వరికీ ఎట్టి ఆక్షేపణలు, తనఖాలు, కోర్టు దావాలు, డబల్ రిజిస్ట్రేషన్లు, క్లయిములు, మైనరు హక్కులు, వారసత్వపు హక్కులు వగైరాలు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ లగాయతు 10 రోజుల లోపల చేరునట్లుగా ఎక్నాలెడ్జిమెంట్ గల రిజిస్టరు పోస్టు ద్వారా మా చిరునామాకు తెలియపరచవలసినది. అట్లు గడువు తేదీ లోపు ఎట్టి అభ్యంతరములు, ఆక్షేపణలు వగైరాలు రానియెడల దిగువ షెడ్యూలు దాఖలాస్తి నిర్వివాదమైన ఆస్తిగా పరిగణించి మా క్లయింటు క్రయమును పొందుదురు. గడువు తేదీ దాటి వచ్చు ఎట్టి క్లయిములు, ఛార్జీలు, అభ్యంతరములు, ఆక్షేపణలు వగైరాలు మా క్లయింటును బద్ధులను చేయజాలవని ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడమైనది.

షెడ్యూలు: యన్.టి.ఆర్. జిల్లా, పటమట సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరినటువంటి విజయవాడ సిటీ, పటమట రీ. సర్వే నెం. 224/8డి రు దాఖలా చ.గ. 842.58రులో చ.గ. 261.11లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమునకు **హద్దులు: తూర్పు:** అ. 33లు వెడల్పు గల రోడ్డు అ. 40లు, **దక్షిణం:** లంకా లలిత గారి ఆస్తి అ. 59.3లు, **పడమర:** యం. విశ్వనాధ్ మరియు యితరుల ఆస్తి అ. 40లు, **ఉత్తరం:** కామినేని మురళీకృష్ణ గారికి మిగిలియున్న ఆస్తి అ.58.3లు.

ఇట్లు: **యలమంచిలి రామకృష్ణ, యలమంచిలి యశస్వని పద్మావతి**
న్యాయవాదులు
షాపు నెం. 10, రాధాకృష్ణ రెసిడెన్సీ, న్యూ ఆర్.టి.సి. కాలనీ, పటమట, విజయవాడ - 7
✆ 94946 23679, 99594 54322
విజయవాడ, తేది: 24-11-2025

(c) eenadu

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

కేపీఎల్ క్రికెట్ పోటీల విజేత విక్టర్ జట్టు

కంచికచర్ల, న్యూస్‌టుడే : స్థానిక మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో కేపీఎల్ క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. విక్టర్ టీం విజేతగా నిలిచింది. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా సీఐ సత్యకిషోర్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా శిక్షణ ఎస్సై నాయుడు ఎంపికయ్యారు. పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు. పోటీల సందర్భంగా సందడి నెలకుంది.

గ్రామాల్లో పంచసూత్రాలపై అవగాహన

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల ద్వారా జరుగుతున్న కార్యక్రమాలతో పాటు అన్నదాతలకు అవసరమైన పంచసూత్రాలను ప్రచారం చేసే అవగాహన కార్యక్రమాన్ని జగ్గయ్యపేట ఏడీఏ భవాని సోమవారం ప్రారంభించారు. సబ్ డివిజన్ పరిధిలోని 40,585 మంది రైతులకు అన్నదాత సుఖీభవ, సీఎం కిసాన్ పథకం కింద రూ.14 వేలు అందిన విషయాన్ని నిర్ధారిస్తున్నారు.

కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

పుష్పాలంకరణలో మూలమూర్తి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : నందిగామ గాంధీనగర్‌లోని వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్చకుడు లక్ష్మణచార్యులు క్రతువులు, హోమం నిర్వహించారు. స్వామి మూలమూర్తిని పుష్పాలతో అలంకరించారు.

మెట్టప్రాంత మణిదీపం.. నిధుల లేమితో సతమతం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్

మెట్టప్రాంత మణిదీపంగా పేర్కొనే వేదాద్రి-కంచల ఎత్తిపోతల మరమ్మతులు పూర్తిస్థాయిలో గాడిన పడలేదు. వైకాపా ప్రభుత్వంలో అయిదేళ్ల నిర్లక్ష్యానికి గురైన ఈ పథకం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వినియోగంలోకి రాలేదు. మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య చొరవతో మోటారు మరమ్మతులు, పైపులైన్ వాల్వ్‌ల లీకులకు మరమ్మతులు చేశారు. ఈ ఎత్తిపోతల ఆయకట్టుకు ఒక మోటారు ద్వారా ఖరీఫ్‌లో నీరివ్వలేని పరిస్థితి ఏర్పడింది.

సీఎం హామీ ఇచ్చినా..

ఈ ఎత్తిపోతలలో 2300 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న నాలుగు విద్యుత్తు మోటార్లు, పంపుసెట్లు ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో ముప్పాళ్ల పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు ఎత్తిపోతల మరమ్మతులకు రూ.15 కోట్లు మంజూరుకు హామీ ఇచ్చారు. ఐడీసీ, ఎన్నెస్పీ అధికారులు నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటి వరకు ఈ నిధులు రాలేదు. అవి మంజూరైతే నాలుగు మోటార్లకు మరమ్మతులు పూర్తి చేయించి పూర్తి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వడానికి వీలుపడుతుంది.

కృష్ణానది ఒడ్డున నిర్మించిన వేదాద్రి-కంచల ఎత్తిపోతల ఆయకట్టులో 17,366 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. నందిగామ, చందర్లపాడు మండలాల్లోని ఎన్నెస్పీ కంచల, ఏటూరు మేజరు కాలువల ద్వారా నీటిని సరఫరా చేయాలి. వైకాపా ప్రభుత్వంలో నాలుగు మోటార్లు మూలకు చేరాయి. మరమ్మతులు పట్టించుకోక చుక్కనీరు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2300 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న ఒక మోటారుకు పవర్‌మెక్ ఇంజినీర్లతో మరమ్మతులు చేయించారు. ఎంపీ శివనాథ్ ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.33 లక్షలు ఇవ్వడంతో ఈ పనులు పూర్తి చేశారు. ఒక మోటారు ద్వారా నీరు విడుదల చేయాల్సిన సమయంలో పైపులైన్ వాల్వ్‌ల లీకులతో నీటి సరఫరాకు వీలు పడలేదు. ప్రస్తుతం వాల్వ్‌ల లీకులకు మరమ్మతులు పూర్తికావచ్చాయి. అయిదేళ్ల ఎత్తిపోతల విద్యుత్తు బకాయిలు రూ.21 కోట్లకు పేరుకోగా సరఫరా నిలిపివేశారు. రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి నీటి సంఘాల అధ్యక్షులు, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తీసుకు వెళ్లడంతో తాత్కాలికంగా సరఫరా పునరుద్ధరించారు. ఖరీఫ్ సీజన్ ముగిసింది. రబీ సీజన్‌లో అయినా ఆయకట్టులో సాగు చేస్తున్న మిర్చి, పసుపు తదితర పంటలకు నీరందించాలని రైతులు ఆశిస్తున్నారు.

ఉపన్యాస పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : నందిగామ డీబీహెచ్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించారు. ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అన్న అంశంపై ఉపన్యాస పోటీలు పెట్టారు. పోటీల్లో డీబీహెచ్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులు ఎం.నవ్యశ్రీ (ఎనిమిదో తరగతి), ఎం.గౌరి (ఎనిమిదో తరగతి), టి.శిల్ప (తొమ్మిదో తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులను పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ టి.కవిత, ఉపాధ్యాయుడు భద్రాచారి అందజేశారు.

డాన్‌బోస్కో పాఠశాలలో విజేతలతో ప్రిన్సిపల్ కవిత, భద్రాచారి

ఏవీఆర్‌పీఎం పాఠశాలలో విజేతలతో వైస్ ప్రిన్సిపల్ గౌరీ సుభాషిని

○ ఏవీఆర్‌పీఎం పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు సీహెచ్ మన్విత్ (ఎనిమిదో తరగతి), ఎ.మనస్వి భవాని (తొమ్మిదో తరగతి), బి.శ్రీహిత (తొమ్మిదో తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులను పాఠశాల వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ గౌరీ సుభాషిని అందజేసి.. అభినందించారు.

ప్రజా సమస్యలకు నిర్ణీత వ్యవధిలో పరిష్కారం

సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో బాలకృష్ణ

నందిగామ, న్యూస్‌టుడే : ప్రజా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని స్థానిక ఆర్డీవో కె.బాలకృష్ణ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆర్డీవో అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దీనిలో 24 అర్జీలు రాగా 13 రెవెన్యూ శాఖకు సంబంధించినవి ఉన్నాయి.

రైతులకు అండగా ప్రభుత్వం

వెల్లంకి (వీరులపాడు), న్యూస్‌టుడే : రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మాలని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య సూచించారు. వెల్లంకి పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. రైతులకు అండగా ఉండేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర దక్కడంతో పాటు, తూకంలో పారదర్శకత ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, వ్యవసాయ, సహకార శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం తూకం వేస్తున్న ప్రభుత్వ విప్ సౌమ్య, చిత్రంలో నేతలు, అధికారులు

రాళ్లు తేలి అధ్వానంగా రహదారి

ప్రయాణం.. మహా ప్రయాస

కంచికచర్ల నుంచి చెవిటికల్లు మీదుగా కునికినపాడు వెళ్లే రహదారి ప్రయాణికులకు నరకం చూపిస్తోంది. గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో అధ్వానంగా మారిన రోడ్డు.. గత ఏడాది కురిసిన భారీ వర్షాలు, వరదలకు కంకర తేలి ఆనవాలు లేకుండా పోయింది. గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు లేకపోవడంతో గ్రామస్థులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. గ్రామంలో మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన తాగునీటి పథకం ట్యాంకు శిథిలావస్థకు చేరింది. పక్కనే ఉన్న మునేరు నుంచి పైపులైన్ ద్వారా నిర్ణీత వేళల్లో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో తాగునీరు వచ్చే సమయానికి పనులకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కాలనీల్లో మినీ ట్యాంకులు నిర్మించినప్పటికీ అవి ప్రజల అవసరాలు తీర్చలేక పోతున్నాయి. ఈ సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కునికినపాడు (కంచికచర్ల)

జారుతున్నా.. పట్టదా?

65వ నంబరు జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. కీసర వద్ద జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేసిన ఇసుక స్టాకు పాయింట్ నుంచి ఇసుక లోడ్‌తో వెళ్లే వాహనాల నుంచి ఇసుక రహదారిపై జారి పడుతుండటంతో రహదారి మొత్తం ఇసుకతో ప్రమాదకరంగా మారింది. వేగంగా వచ్చే వాహనదారులు రహదారిపై ఉన్న ఇసుకను గమనించలేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రహదారిపై పడిన ఇసుక తొలగించే చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. - కీసర (కంచికచర్ల), న్యూస్‌టుడే

ఒకటో వార్డులో పార్కు ఏర్పాటుకు కార్యాచరణ

పార్కు ప్రతిపాదిత స్థలం పరిశీలిస్తున్న తాతయ్య తదితరులు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట పట్టణంలోని ఒకటో వార్డులో ఆ ప్రాంత వాసులందరికీ ఉపయోగంలో ఉండేలా బహుళ ప్రయోజనకరమైన పార్కు నిర్మాణానికి కార్యాచరణ చేస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య తెలిపారు. కోహెన్స్ కర్మాగారం సహకారంతో 40 సెంట్ల స్థలంలో చేపట్టే ఈ పార్కులో ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్నిచ్చే వాకింగ్‌ట్రాక్, ఓపెన్‌జిమ్‌ను ప్రతిపాదిస్తున్నట్లు ఆయన తెలిపారు. పురపాలక సంఘం ప్రతినిధులతో కలిసి సోమవారం స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కోహెన్స్ ప్రతినిధులు, కమిషనర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని ఇల్లు వదలిన బాలిక

కృష్ణలంక, న్యూస్‌టుడే : మార్కులు తక్కువగా వస్తున్నాయని తల్లిదండ్రులు మందలించగా కలత చెందిన 11 ఏళ్ల బాలిక విజయవాడ బస్‌స్టేషన్‌కు చేరింది. పోలీసుల వివరాల ప్రకారం.. నందిగామకు చెందిన 11 ఏళ్ల బాలిక అక్కడే ఓ ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. కాగా ఇటీవల పరీక్షల్లో మార్కులు తక్కువగా రావటంతో తల్లిదండ్రులు కుమార్తెను మందలించారు. దీంతో కలత చెందిన బాలిక సోమవారం ఉదయం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బస్సెక్కి విజయవాడ పీఎన్‌బీఎస్‌కు చేరుకుంది. అక్కడ ఒంటరిగా ఉన్న బాలికను విధుల్లో ఉన్న కృష్ణలంక పోలీసులు గుర్తించి పీఎస్‌కు తరలించి వివరాలు అడుగగా వారికి విషయాన్ని వివరించింది. వారు విషయం తల్లిదండ్రులకు తెలపగా.. వారు వచ్చారు. పోలీసులు వారికి కౌన్సెలింగ్ నిర్వహించి బాలికను అప్పగించారు.

కూలేందుకు సిద్ధంగా

మండలంలోని లింగాలపాడులో లక్ష్మీ పేరంటాలు అమ్మవారి దేవాలయం ఎదురుగా ఉన్న ట్యాంకు ఏ క్షణంలో కూలుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ట్యాంకు పిల్లర్లు దెబ్బతిన్నాయి. పైభాగంలో సైతం పెచ్చులూడుతున్నాయి. ఈ నేపథ్యంలో దీన్ని కూల్చాల్సి ఉంది. జల్ జీవన్ మిషన్ నిధులతో నూతన ట్యాంకు నిర్మించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం అడవి రావులపాడు పథకం కింద నేరుగా పైపులైన్ ద్వారా తాగునీరు వీధి కుళాయిలకు విడుదల చేస్తున్నారు. ట్యాంకు నిర్మించి ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

బీసీ సంక్షేమ సంఘంలో పలువురికి పదవులు

రామారావుకు నియామక పత్రం ఇస్తున్న కృష్ణయ్య

నందిగామ, న్యూస్‌టుడే : నందిగామ నియోజకవర్గానికి చెందిన పలువురు బీసీ నాయకులు జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సమక్షంలో బీసీ సంక్షేమ సంఘంలో చేరారు. హైదరాబాద్‌లో సంఘ ఏపీ ఇన్‌ఛార్జి యలగాల నూకానమ్మ ఆధ్వర్యంలో వారికి కండువాలు కప్పి కృష్ణయ్య, డీసీఎంఎస్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, నూకానమ్మ ఆహ్వానించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వీరంకి వీరాస్వామి, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శిగా గువ్వల సత్యనారాయణ, నందిగామ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఆలా రామారావు, చందర్లపాడు, కంచికచర్ల, వీరులపాడు, మండలాల అధ్యక్షులుగా గోకిర్ల చిన్న నరసింహారావు, అల్లాడి కోటేశ్వరరావు, తమ్మిశెట్టి వీరబాబు, రాష్ట్ర కార్యదర్శులుగా మనబోతుల శ్రీరామ్, దుద్దుకూరి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధిగా దుద్దుకూరి కృష్ణ, నందిగామ మీడియా కో- ఆర్డినేటర్‌గా షేక్ బాషా, రాష్ట్ర లీగల్ కార్యదర్శిగా షేక్ దాదాహుస్సేన్, జిల్లా కార్యదర్శిగా కె.వెంకయ్య, నందిగామ యూత్ కార్యదర్శిగా తొగట అశోక్, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా షేక్ ఖలీల్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బిట్టు రమేష్, జిల్లా యువజన విభాగం అధికార ప్రతినిధిగా దాసరి గంగాధర్ నియమితులయ్యారు.

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గ ఎన్నిక

బెనర్జి, లక్ష్మీనారాయణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : నందిగామ యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా ములుగు శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా ఎంవీవీఎస్ బెనర్జి, సహాధ్యక్షుడిగా మెరుగు రామారావు, సహాధ్యక్షురాలిగా గిరి సుజ, ప్రధాన కార్యదర్శిగా గడ్డం లక్ష్మీనారాయణ, కార్యదర్శులుగా షేక్ నాగుల్ మీరా, జి.యలమందయ్య, డి.శ్రీనివాసరావు, వి.భూషణం, ఎస్.నరసింహస్వామి, వేముల జ్యోతి, టి.వెంకటేశ్వరరావు, ఆడిట్ కమిటీ సభ్యుడిగా బండారు రామారావును ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా మన్నేపల్లి కృష్ణయ్య వ్యవహరించారు. సంఘ నాయకులు కుంచం లక్ష్మీనారాయణ, జక్కానాచార్యులు, దేవర శ్రీనివాసరావు, కేతేపల్లి రామారావు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలి

ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉద్యోగులకు వెంటనే పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అలవాల సుందరయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో యూనియన్ జిల్లా కార్యదర్శి బొద్దుకోలు రమణయ్య అధ్యక్షతన నూతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, విద్యారంగ పరిరక్షణకు తమ సంఘం కృషి చేస్తుందని చెప్పారు. జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మహేశ్వర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు.. పీడిస్తున్న సమస్యలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న పెనుగంచిప్రోలులో పక్కనే మునేరు ప్రవహిస్తున్నా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో ప్రముఖ దేవాలయమైన తిరుపతమ్మ ఆలయం ఉంది. వేలమంది భక్తులు తరలి వస్తుంటారు. అయినా గ్రామాభివృద్ధికి, పారిశుద్ధ్యం మెరుగుకు ఆలయం నుంచి నిధులు కేటాయించట్లేదు. గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పనులను గుత్తేదారు ఆపినా అధికారులు పట్టించుకోవట్లేదు. కేవలం మునేరు పైపులైన్ వేసి, సంపు నిర్మించి గుత్తేదారు మొహం చాటేశాడు. గతంలో రక్షిత మంచినీటి పథకం ద్వారా నీటిని అందిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.2.18 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో గ్రామంలో ట్యాంకుల వద్దనే సంప్ నిర్మించారు. మునేరు నుంచి నీటి సరఫరాకు పైపులైన్ వేశారు. పైపులైన్‌ను సంపునకు కలపలేదు. మునేరు అవతలి వైపున బోర్లు వేయకుండా పనులు నిలిపివేశారు. దీనిపై కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు సర్పంచి వేల్పుల పద్మకుమారి వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేదు.

నిరుపయోగంగా తాగునీటి సంపు

○ ప్రస్తుతం మునేరు అవతలి వైపు ఉన్న బోర్ల నుంచి గ్రామంలోని ట్యాంక్‌లకు నేరుగా నీరు పైకి ఎక్కాల్సి వస్తోంది. దీనివల్ల ఆరు గంటలకు ఒక ట్యాంక్ నిండటం కష్టం అవుతోంది. దీంతో పాటు మునేరు అవతల వైపు మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటు, అక్రమ ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. మునేరుకు వరదలు వస్తే పైపులు దెబ్బతింటున్నాయి. ఈ సమయంలో తాగునీటి సమస్యతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. వెంటనే జల్‌జీవన్ మిషన్ పనులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పీహెచ్‌సీ సమీపంలో అధ్వానంగా మురుగు కాలువ

కాలువలు లేక అవస్థలు

గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నుంచి పాత సినిమాహాలు సెంటర్ వరకు మక్కపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన డ్రెయిన్లు లేక వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో రోడ్డు గుంతలు పడింది. తుపాను, మోడల్ కాలనీల్లోని నీరంతా ఈ రోడ్డు పక్కన మురుగు కాల్వపై పారుతోంది. ప్రభుత్వం, తిరుపతమ్మ ఆలయం నుంచి నిధులు మంజూరు చేయించి.. సమస్యలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీఐ పత్తి కొనుగోలు చేయక అవస్థలు

రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ భవానీ

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేయట్లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికి మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పెనుగంచిప్రోలులో 'రైతన్న- మీ కోసం' కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ఏడీ సీహెచ్. భవానీ సోమవారం ఇంటింటికీ వెళ్లి రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర, బిందు సేద్యం, ప్రకృతి వ్యవసాయం, పాడి పరిశ్రమ, ఆహార ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటు గురించి అవగాహన కల్పించారు. దీనిలో రైతులు పత్తి కొనుగోలు చేయట్లేదని ఏడీఏ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఏడీఏ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు సమస్య తెలియజేస్తానన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు పొందవచ్చన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు చింతల వెంకట సీతారామయ్య, సొసైటీ అధ్యక్షుడు కర్ల వెంకటనారాయణ, మాజీ సర్పంచి జిల్లేపల్లి సుధీర్‌బాబు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు గజ్జి కృష్ణమూర్తి, తెదేపా పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి సతీష్, నాయకులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాది కొత్త కోర్సులు ప్రారంభం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: ఆరు దశాబ్దాలుగా విద్యాసేవలు అందించిన కళాశాలలో వచ్చే ఏడాది నుంచి కొత్త కోర్సులు ప్రారంభించనున్నట్లు గెంటేల శకుంతలమ్మ కళాశాల కార్యదర్శి గెంటేల అశోకచక్రవర్తి అన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందించే కోర్సులను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. కళాశాల మీటింగ్ హాల్లో సోమవారం నిర్వహించిన కమిటీ సమావేశంలో అశోకచక్రవర్తి మాట్లాడారు. కళాశాల అభివృద్ధి కోసం అధ్యక్షుడు సామినేని ఉదయభాను చేస్తున్న కృషికి తోడు ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య, మాజీ మంత్రి నెట్టెం రఘురాం సహకారం అందించి కొత్త కోర్సులు మంజూరుకు కృషి చేస్తున్నారన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐటీఐ కళాశాల, పీజీలో కొత్త కోర్సులతో పాటు న్యాయ కళాశాల సాధనకు ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఏవో కె.సత్యనారాయణరావు (కేవీఎస్ఆర్), కళాశాల ప్రతినిధులు గెంటేల రాజా నారాయణరావు, కోలపల్లి బుల్లిబాబు, సాలాది సూరిబాబు, నాగండ్ల వాసు, అత్తులూరి వెంకటేశ్వర్లు, ఇంటూరి రంగారావు, ప్రిన్సిపల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాల అందజేత

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పలు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. పెనుగంచిప్రోలులోని స్వామి పుల్లయ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నక్కా బాబూరావు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంచుతాయని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మధు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

అక్రమ నిర్మాణం అడ్డుకున్న అధికారులు

కీసర(కంచికచర్ల), న్యూస్‌టుడే : జాతీయ రహదారిపై ఉన్న బస్టాఫ్ కూల్చి నిర్మిస్తున్న దుకాణ సముదాయ నిర్మాణాన్ని అధికారులు మరోసారి అడ్డుకున్నారు. గత నెల 23న కీసర టోల్ ప్లాజా సమీపంలో హైవే పక్కన బస్టాఫ్‌ను కొందరు అక్రమంగా కూల్చివేసి దుకాణ సముదాయ నిర్మాణం చేపట్టారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు అందగా పోలీసులు నిర్మాణదారులపై కేసు చేశారు. అయినా లెక్క చేయకుండా సోమవారం మళ్లీ నిర్మాణం మొదలు పెట్టారు. సమాచారం అందుకున్న హైవే అధికారులు పనులను నిలిపి వేయించారు.

అవీ ఇవీ

మొక్కజొన్నలు ప్రభుత్వం కొనాల్సిందే

వీరులపాడు, న్యూస్‌టుడే : ప్రభుత్వం రైతుల నుంచి మొక్కజొన్నలు వెంటనే కొనాలని రైతు సంఘ నాయకులు సోమవారం ఆందోళన చేశారు. రైతులు సరైన ధరకు మొక్కజొన్నలు అమ్ముకోలేక, బహిరంగ మార్కెట్లో తక్కువ ధరకు అమ్మాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. ప్రభుత్వం స్పందించి మద్దతు ధరకు కొనాలని.. లేకుంటే రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని అన్నారు. సంఘ నాయకులు పి.వి.ఆంజనేయులు, చనుమోలు సైదులు, కోట కల్యాణ్, చాట్ల రవి, రైతులు పాల్గొన్నారు.

ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కంచికచర్ల : కంచికచర్ల బైపాస్ వద్ద సోమవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనగా ఒకరి కాలు విరిగింది. మురళీకృష్ణ ద్విచక్ర వాహనంపై నందిగామ నుంచి విజయవాడ వైపు వెళుతున్నాడు. కంచికచర్ల బైపాస్ పైకి చేరుకున్న అతను కంచికచర్ల వెళదామని తన వాహనాన్ని బైపాస్‌పై యూ టర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొంది. ఈ ఘటనలో మురళీకృష్ణకు కాలు విరిగింది. నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రహదారుల విస్తరణ పనుల పరిశీలన

నందిగామ గ్రామీణం : మండలంలోని మాగల్లులో సోమవారం సిమెంటు రహదారుల నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఇన్‌ఛార్జి డీఈఈ రమేష్ పరిశీలించారు. పంచాయతీ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.14 లక్షలతో గ్రామంలో ఆరు సిమెంటు రహదారులు నిర్మిస్తున్నారు. ఈ పనులను పరిశీలించి ఆయన సూచనలు చేశారు. ఇంజినీరింగ్ సహాయకురాలు మణిచందన, మురళి పాల్గొన్నారు.

పంచసూత్రాల కరపత్రాల పంపిణీ

నందిగామ గ్రామీణం : కూటమి ప్రభుత్వం వ్యవసాయంలో అమలు చేస్తున్న పంచసూత్రాలను అన్నదాతలు ఆచరించాలని నందిగామ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ఐకే శ్రీనివాస్ కోరారు. సోమవారం మండలంలోని అంబారుపేటలో 'రైతన్నా మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పంచసూత్రాల కరపత్రాలు పంపిణీ చేశారు. పాతకంచలలో తెదేపా మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు పంచారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు కొట్టె గోపీకృష్ణ, గ్రామ పశు వైద్య సహాయకురాలు సుష్మ, తెదేపా నాయకుడు రామిరెడ్డి సుబ్బారావు పాల్గొన్నారు.

పట్టాభి సీతారామయ్యకు నివాళి

నందిగామ : స్థానిక గ్రంథాలయంలో సోమవారం స్వాతంత్ర్య సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య 145వ జయంతి నిర్వహించి.. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన అందించిన సేవలను నాయకులు కొనియాడారు. గ్రంథాలయ అధికారి అల్లూరు రామచంద్రుడు, సొసైటీ అధ్యక్షుడు గర్మిడి సురేష్, జమ్మలమడుగు విష్ణు, నాయకులు కిలారు హనుమంతురావు, వెంకట్రావు పాల్గొన్నారు.

పాస్టర్ ఫెయిత్, ఫైర్ సంఘ కార్యవర్గ ఎన్నిక

నందిగామ : స్థానిక ఉమాకాలనీలోని బేతెస్త ప్రార్థన మందిరంలో సోమవారం పాస్టర్స్ ఫెయిత్, ఫైర్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా పాస్టర్ బంక ఎలీషా, కార్యదర్శిగా కురువెల్ల జోసెఫ్, కోశాధికారిగా మంద జయరాజు, ఉపాధ్యక్షుడిగా మర్రి రాజారావు, కోర్ కమిటీ ఛైర్మన్‌గా మోజెస్, గౌరవాధ్యక్షుడిగా కోట శాలెం ఎన్నికయ్యారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వరా?

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు ప్రభుత్వం టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని పీఆర్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గడ్డం నారాయణరావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని గోళ్లమూడి, కమ్మవారిపాలెం, పల్లగిరి, రాఘవాపురం, ఐతవరం, సోమవరం, దాములూరు, జొన్నలగడ్డ, రామిరెడ్డిపల్లి, మాగల్లు గ్రామాల్లో పీఆర్టీయూ సభ్యత్వాలను ఆయన నమోదు చేయించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు షేక్ నవాబ్ జాని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంటముక్కల సత్యనారాయణ, మండల అధ్యక్షుడు మార్కపూడి ప్రభాకరరావు, జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాధాకృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు ముల్లంగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలని వినతి

జగ్గయ్యపేట : పట్టణంలోని కోదాడ రోడ్డులో పుట్టబజార్ వద్ద స్థలంలో నిర్మాణం చేపట్టిన విజయ గణపతి ఆలయం అభివృద్ధికి సహకరించాలని ఆలయ కమిటీ ప్రతినిధులు తహసీల్దార్ మనోహర్‌ని కోరారు. ఆ స్థలం జడ్పీదని పేర్కొంటూ.. అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టారని దంతిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, కనపర్తి సత్యనారాయణ ప్రసాద్, గద్దె తులసి ప్రసాద్, దంతిరెడ్డి కిరణ్మయి, సురేష్, నాగమణి, కల్పన, పిన్నం వెంగళరావు వినతిపత్రం అందించారు.

వ్యాసరచన పోటీల విజేతలకు అభినందనలు

నందిగామ గ్రామీణం : నందిగామ ఏవీఆర్ పీఎం గ్రూపు పాఠశాలలో భగవాన్ సత్య సాయి బాబా శత జయంతి పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలను వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ గౌరీ సుభాషిని అభినందించారు.

(c) eenadu

విజయవాడ పశ్చిమ

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళం

దాత శంకర్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి మధురానగర్‌కు చెందిన వంగపండు శంకర్ రూ.లక్ష విరాళాన్ని సోమవారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ శ్రీనివాస్ వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

జగన్మాత సేవలో శాసనసభ స్పీకర్

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దేవస్థానం ఏఈవో వెంకటరెడ్డి వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320

స్పందనకు వందనం

★ బంకారామకృష్ణ వీధిలో పునుగుల కొట్టు వద్ద మురుగు కాలువలో పూడిక పేరుకుందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇవ్వగా, స్పందించిన పారిశుధ్య అధికారులు కార్మికులతో ఆ కాలువలోని పూడిక తొలగించారు. ★ పాల ఫ్యాక్టరీ ఎస్ఏఎస్ కళాశాల వెనుక కొండ ప్రాంతంలో రంగుమారిన మంచినీరు సరఫరా అవుతోందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనిపై స్పందించిన మంచినీటి విభాగం అధికారులు ఆ ప్రాంతంలో మంచినీటి పరీక్షలు చేశారు. సమస్య లేదని తెలిపారు. ★ వాగుసెంటర్ వద్రుపేట ప్రాంతంలో చెత్తను రోడ్డుపై చెత్త తరలించడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇవ్వగా, స్పందించిన పారిశుధ్య అధికారులు కార్మికులతో రోడ్డుపై ఉన్న చెత్త తీయించారు.

- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

? గణపతిరావు రోడ్డులోని శ్రీధర్బేశ్వరాలయం వద్ద మురుగు కాలువలో పూడిక పేరుకుంది. **- హరీష్, స్థానికుడు.**

✔ పూడిక తీయిస్తాం. **- నరసింహారావు, స్థానిక శానిటరీ అధికారి**

? పంజాసెంటర్ ఉర్దూ హైస్కూల్ ఎదురు టీస్టాల్ వద్ద పూడిక తీయడం లేదు. **- సమీయుల్లా, స్థానికుడు.**

✔ పరిశీలించి తీయిస్తాం. **- దుర్గారావు, స్థానిక శానిటరీ అధికారి**

- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

ప్రత్యేక కమిటీ భేటీ నేడు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరపాలక సంస్థకు సంబంధించిన మంచినీరు, భూగర్భ మురుగు పారుదల వ్యవస్థ ప్రత్యేక కమిటీ సమావేశం మంగళవారం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ సమావేశం శనివారం జరగాల్సి ఉండగా.. సభ్యుల కోరం లేక వాయిదా వేశారు. సమావేశంలో ఆయా కమిటీ సభ్యులు ప్రతిపాదించే పలు అంశాలపై చర్చించి తీర్మానాలు ఆమోదించడంతో పాటు, వాటిని కౌన్సిల్‌కు రిఫర్ చేస్తూ తీర్మానిస్తారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం ★ 'ఈనాడు' ఫోన్‌ఇన్‌లో కొత్తపేట సీఐ చిన కొండలరావు

ఈనాడు మీతోడు

చిట్టినగర్, న్యూస్‌టుడే

కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల దృష్ట్యా ప్రజా సమస్యలపై 'ఈనాడు' ఆధ్వర్యంలో సీఐ చిన కొండలరావుతో ఫోన్‌ఇన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. దీనికి విశేష స్పందన వచ్చింది. కార్యక్రమంలో పాఠకులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. పలువురు తమ ప్రాంతాల్లో కలిగే ఇబ్బందులు గురించి సీఐ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా ఆటోల్లో యువకులు కూర్చొని గంజాయి, మద్యం, సిగరెట్లు తాగుతూ స్థానికులతో పాటు వచ్చే పోయే వారికి ఇబ్బంది కలిగిస్తున్నారని సీఐ దృష్టి సమస్యలు తీసుకొచ్చారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

? బంగారయ్య కొట్టు సెంటర్ నెహ్రూబొమ్మ వద్ద, అదే వీధిలోని అడ్డరోడ్డు ప్రాంతంలో ఆకతాయిలు వచ్చే పోయే వారికి అసౌకర్యం కలిగిస్తున్నారు.

- వి.మహేంద్ర, బంగారయ్య కొట్టు సెంటర్

సీఐ: సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తాం.

? కేఎల్‌రావునగర్ పార్కు రోడ్డులో వీఎంసీ కాలనీ ప్రాంతంలో యువకులు గంజాయి తాగుతూ స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

- లక్ష్మణకుమార్, సిండికేటు బ్యాంకు కాలనీ

సీఐ: పలువురు యువకులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చాం. ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

? కొత్తపేటలో నెహ్రూబొమ్మ సెంటర్‌లో ఇళ్ల ముందు పెట్టిన ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయి. **- సాంబశివరావు, స్థానికుడు**

సీఐ: వాహనదారులు జియో ట్యాగింగ్ చేయించుకోవాలి. దీని వల్ల వాహనాలు చోరీకి గురి కాకుండా ఉంటాయి. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

? సాయిరాం సెంటర్ ఎమ్మార్ లక్ష్మణరావు వీధిలో, వైఎస్ఆర్ కాలనీలో చెరువు వైపు, ప్రధాన గ్రౌండ్ వద్ద రోడ్లపై గంజాయి, మందుబాబులతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. **- షేక్ గఫార్, (వైఎస్ఆర్ కాలనీ), ఎస్.విజయ్‌కుమార్, (భీమనవారిపేట)**

సీఐ: కాలనీలో 32 కెమెరాలు పెట్టాం. అవుట్‌పోస్టు ఉంది. నిఘా పెంచుతాం. అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

? కేబీఎన్ కళాశాల చుట్టూ వీధుల్లో, టేనర్‌పేట, లంబాడీపేట అడ్డరోడ్డులోని పాత, కొత్త రామాలయాల వద్ద బైక్‌ల సైలెన్సర్లు తీసి నడుపుతున్నారు. ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారు.

- ఎం.రాజేశ్వరరావు(మార్కుపేట), కడగట్ల శ్రీనివాసరావు, కొత్తపేట

సీఐ: ప్రత్యేక దృష్టి పెడతాం. సమస్య లేకుండా చూస్తాం.

? కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్ వీధుల్లో ఆటోలు పార్కింగ్ చేసి రోజుల తరబడి ఉంచుతారు. కొండపైకి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. లంబాడీపేట అడ్డరోడ్డులోని పాత హాస్టల్ భవనం ర్యాంపు వద్ద ఆటోల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. **- కిరణ్ కుమార్, లంబాడీపేట, రాజా, కొత్తపేట**

సీఐ: కెమెరాలు ఏర్పాటు చేశాం. వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. ఆటోలకు సంబంధించిన వారిని గుర్తించి పార్కింగ్ చేయకుండా చూస్తాం.

? వన్‌టౌన్ బీఆర్పీ రోడ్డు గ్యాస్ కంపెనీ వద్ద చెట్టు కొమ్మల వల్ల ప్రమాదభరితంగా ఉంది. కొమ్మలు కొట్టించాలి

- కె.వెంకటరత్నం, వన్‌టౌన్

సీఐ: మున్సిపాల్టీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి సమస్య పరిష్కరిస్తాం.

? కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల కాలంలో దాదాపు 10 ద్విచక్ర వాహనాలు దహనం చేశారు.

-వి. వెంకటేశ్వర్లు, స్థానికుడు

సీఐ: ఈ ఘటనలపై మాకు ఫిర్యాదులు అందాయి.. విచారణ చేస్తే కొన్ని షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగాయి. వ్యక్తిగత గొడవల్ల దహనం చేశారని స్థానికులు చెబుతున్నారు. విచారిస్తున్నాం.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

స్పందనకు వందనం

లంబాడీపేట అడ్డరోడ్డులోని వాటర్ ట్యాంక్ వీధి సంపు వద్ద పైపులైన్ లీకై తాగునీరు వృథాగా పోతుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 24న 'ఈనాడు' విజయవాడ పశ్చిమ పేజీలో 'పైపులైన్ లీకు తాగునీరు వృథా' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి నగరపాలక సంస్థ నీటి విభాగం అధికారులు స్పందించి లీకవుతున్న పైపులైన్‌కు మరమ్మతులు చేయించి నీటి వృథా అరికట్టారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, చిట్టినగర్**

వ్యక్తిగత శుభ్రత అవసరం

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: చలికాలంలో దోమలు, కలుషిత నీరు, వ్యాధుల వ్యాప్తికి అనువైన పరిస్థితులు సృష్టిస్తాయని.. ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రత పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా.ఎం.సుహాసిని సూచించారు. ప్రతి గంటకు ఒకసారి చేతులను శుభ్రం చేసుకోవాలని ఆమె తెలిపారు.

విద్యాసంస్థలు సాంకేతికంగా ఎదగాలి

మాట్లాడుతున్న ఆచార్యుడు నాగరాజు

చిట్టినగర్, న్యూస్‌టుడే: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యాసంస్థలు సాంకేతికంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని యోగి వేమన విశ్వవిద్యాలయం కంప్యూటర్స్ విభాగం ఆచార్యుడు సి.నాగరాజు తెలిపారు. కేబీఎన్ కళాశాల ఐక్యూ ఏసీ కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం 'ఏఐ టూల్స్ ఫర్ ఎకడమిక్ ఎక్సలెన్స్' అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక యుగంలో విద్యార్థులను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దడానికి విద్యా సంస్థలు మరింతగా కృషి చేయాలని చెప్పారు. కృత్రిమ మేధ.. బోధన, సంస్థాగత నాణ్యతను ఎలా మెరుగు పరుస్తుందో ఉదాహరణలతో వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ ఎం.వెంకటేశ్వరరావు, కె.రామకృష్ణ, పి.ఎల్.రమేష్, ఐక్యూ ఏసీ సమన్వయకర్త షమీమ్, కంప్యూటర్ విభాగాధిపతి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై 17 వినతులు

అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జి కమిషనర్ చంద్రశేఖర్

విజయవాడ నగరపాలక సంస్థ: వివిధ సమస్యలపై నగరవాసుల నుంచి అందే వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సకాలంలో పరిష్కరించాలని ఇన్‌ఛార్జి కమిషనర్ డి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి, వివిధ సమస్యలపై ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినతులను బాధ్యులైన అధికారులు పరిశీలించి గడువులోపు పరిష్కరించాలని అన్నారు. వివిధ సమస్యల పరిష్కారంలో అధికారుల వైఖరిపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలపై 17 వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో అధికారులు కె.అర్జునరావు, పి.సత్యకుమారి, జి.సృజన, శ్రీనివాసరెడ్డి, లత, ఏ.శ్రీధర్, చంద్రశేఖర్, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన

వినతి పత్రం అందుకుంటున్న శ్రీధర్, నాయకులు

భవానీపురం, న్యూస్‌టుడే: నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని భవానీపురంలోని వీఎంసీ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా భాజపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను తెలుసుకోవాలనే ఉద్దేశంతో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలా ఈ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. ప్రజలు ఇచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, నాయకులు అబ్దుల్ ఖాదర్, అప్పాజీ, బుల్లా విజయ్ కుమార్, తిరుపతి అనూష తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా డివిజనల్ పారా స్పోర్ట్స్ మీట్

రేస్ ప్రారంభిస్తున్న పీఈ ఎడ్విన్, డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : స్థానిక రైల్వే మినీ స్టేడియంలో సోమవారం ద.మ. రైల్వే పర్సన్ విత్ డిజబిల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్, ద.మ. రైల్వే విజయవాడ డివిజన్ స్పోర్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'డివిజనల్ పారా స్పోర్ట్స్ మీట్‌'లో పలువురు ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీల్‌ఛైర్ రేస్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, చెస్, క్యారమ్స్, అంధుల క్రికెట్, ఆర్థో క్రికెట్ పోటీలను స్త్రీ, పురుషులకు వేర్వేరుగా బధిరులు, అంధ, ఆర్థో కేటగిరిల్లో నిర్వహించామని పోటీల నిర్వాహకుడు, అంతర్జాతీయ పారా అథ్లెట్ ఎస్.తిరుమలై కుమార్ తెలిపారు. పోటీల్లో సుమారు వంద మంది పారా అథ్లెట్లు తలపడ్డారని పేర్కొన్నారు. వచ్చే నెల 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏడీఆర్ఎం (ఇన్‌ఫ్రా) పీఈ ఎడ్విన్, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, సీనియర్ డీపీవో ప్రేమ్‌కుమార్ లకావత్, డివిజనల్ స్పోర్ట్స్ అధికారి, సీనియర్ డీవోఎం/జి ఎం.దినేష్‌కుమార్, రైల్వే ఇన్‌ఛార్జి స్పోర్ట్స్ అసిస్టెంట్ ఎ.శరత్‌చంద్ర పాల్గొన్నారు.

ఎంపీ శివనాథ్‌ను కలిసిన ఫరూక్ షిబ్లీ

పటమట: రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్‌గా నియమితులైన ఫరూక్ షిబ్లీ సోమవారం మత గురువు అల్తాఫ్ బాబాతో కలిసి ఎంపీ శివనాథ్‌ను గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఫరూక్ షిబ్లీను ఎంపీ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. మైనార్టీ సంక్షేమం కోసం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు.

వీధుల్లో పేరుకున్న చెత్త

చిట్టినగర్‌లోని పలు వీధుల్లో రోడపై చెత్త పేరుకుపోయింది. దీంతో రాకపోకల సమయంలో దుర్గంధం వెదజల్లుతుందని ప్రజలు, పాదచారులు వాపోతున్నారు. ఆత్మూరి రామారావు వీధి నాలుగు వీధుల కూడలిలో రోడ్డు మీదే చెత్త పేరుకుపోయి అధ్వానంగా ఉంది. ముక్కా అప్పారావు వీధి, తాజోనోత్ రాములు వీధి, ఏసురత్నం వీధి తదితర ప్రాంతాల్లో చెత్త కుప్పలుగా దర్శనం ఇస్తున్నాయి. సంబంధిత శానిటరీ అధికారి ఆనంద్‌కృపాల్ దృష్టికి తీసుకు వెళితే అడ్డరోడ్డులో ఆటోలు, ఇతర వాహనాలు పార్కింగ్ వల్ల చెత్త వాహనం, ట్రాక్టర్లు రాలేని పరిస్థితి ఉందని చెబుతున్నారు. సిబ్బందితో చెత్త తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారు. **- న్యూస్‌టుడే, చిట్టినగర్**

సొరంగం రోడ్డు చూడతరమా..

నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే చిట్టినగర్ రోడ్డు దెబ్బతింది. విద్యాధరపురం, హెచ్‌బీ కాలనీ, కబేళా, గొల్లపూడి, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి అలాగే నగరంలో నుంచి బయట ప్రాంతాలకు వాహనాలు రాకపోకలు ఈ రహదారిలోనే సాగిస్తాయి. చిట్టినగర్ నుంచి సొరంగం వైపు వచ్చేపోయే రహదారిలో కంకర చిప్స్ బయట పడ్డాయి. రోడ్డుతో పాటు మ్యాన్‌హోల్స్ కుంగుతున్నాయి. రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, చిట్టినగర్**

శిథిలమైన బస్టాప్

భవానీపురం బైపాస్ రహదారి వెంట చర్చి సెంటర్ సమీపంలో బస్టాప్ అధ్వానంగా మారింది. ప్రయాణికులు నిలబడేందుకు, కూర్చునేందుకు వీలు లేకుండా పోయింది. గతంలో చర్చి సెంటర్ సమీపంలో బస్టాప్ ఉండేది. కొన్నాళ్ల కిందట బస్టాప్‌ను ఒక హోటల్ యజమాని పక్కకు జరిపించారు. పక్కకు జరిపించి ఫ్లోరింగ్ చేయకుండానే వదిలేశాడు. దీంతో ప్రయాణికులకు అసౌకర్యంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి బస్టాప్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, భవానీపురం**

అధ్వానంగా మ్యాన్‌హోల్స్

భవానీపురంలోని పలు ప్రాంతాల్లో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారుతుంది. ఊర్మిళానగర్, జోజినగర్, ఏకలవ్యనగర్ తదితర ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ నిర్వహణ సరిగా లేదు. దీంతో వాటిల్లోంచి మురుగు నీరు రహదారి మీదకు చేరడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల రహదారి కంటే ఎత్తుగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పలు చోట్ల మ్యాన్‌హోల్స్ మూతలు పాడై రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని పాదచారులు, వాహనచోదకులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ మెరుగు పరిచేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.**– న్యూస్‌టుడే, భవానీపురం**

బస్సు సర్వీసు రద్దు సబబు కాదు

ఆర్ఎంకు వినతిపత్రం అందిస్తున్న ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు

విజయవాడ బస్టేషన్: రూట్ నంబరు 41 బస్సు సర్వీస్‌ను రద్దు చేయడం సబబు కాదని దాన్ని తిరిగి పునరుద్ధరించాలని ఎన్టీఆర్ జిల్లా ఐద్వా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ప్రాంతీయ రవాణాధికారి ఎం.వై దానంకు వినతిపత్రం అందించారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా ఐద్వా కార్యదర్శి సరోజ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశ పెట్టిన దగ్గర నుంచి మహిళలకు లబ్ధి చేకూరుతుంది.. కాని కొందరు డ్రైవర్లు, కండక్టర్లు అగౌరవంగా మాట్లాడుతున్నారని తెలిపారు. కండ్రికలో శానిటరీ కార్యాలయం వద్ద రిక్వెస్ట్ స్టాప్ పెట్టాలని, మధురానగర్‌కు బస్సు రూటు ఏర్పాటు చేయాలని ఆర్ఎంను కోరినట్లు పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన తగు చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. కార్యక్రమంలో ఐద్వా సెంట్రల్ కార్యదర్శి జి.ఝాన్సీరాణి, వాంబేకాలనీ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రత్నకుమారి, ఎస్‌కె. రషీద పాల్గొన్నారు.

సినిమాలు

★ **ప్రేమంటే, 12ఏ రైల్వే కాలనీ, కాంత:** జీ-3(రాజ్-యువరాజ్), మిరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్ (గుణదల), సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు) ★ **రాజు వెడ్స్ రాంబాయి:** జీ-3(రాజ్-యువరాజ్), మిరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు)★ **పాంచ్‌మినార్:** మిరాజ్, జయరామ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), పీవీపీ, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు)★ **మఫ్టిపోలీస్:** ఊర్వశి ఐనాక్స్ (గాంధీనగర్), అప్సర, స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), పీవీపీ, పీవీఆర్ మాల్ (బందరురోడ్డు) ★ **సంతాన ప్రాప్తిరస్తు:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్ (గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్ (గుణదల) లైలా మాల్, ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్ (పటమట), పవర్ వన్ మాల్(కానూరు).

- **న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

భవానీద్వీపంలో భాజపా నాయకుల సందడి

బోటులో వెళ్తున్న ఎంపీ పురందేశ్వరి, మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు

భవానీపురం, న్యూస్‌టుడే: భాజపా ఆధ్వర్యంలో సంస్థాగత యోజన బైఠక్ సమావేశాన్ని భవానీద్వీపంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాజపా ఏపీ అధ్యక్షుడు మాధవ్, మంత్రి సత్యకుమార్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితర నాయకులు కృష్ణానదిపై బోటులో ప్రయాణం చేశారు. కృష్ణానది అందాలు, భవానీద్వీపంలోని పచ్చదనాన్ని ఆస్వాదించారు. భవానీద్వీపాన్ని పరిశీలించి పర్యాటకశాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి వినతి

విజయవాడ నగరపాలక సంస్థ: నగరంలోని కృష్ణలంక శ్మశానవాటిక ప్రాంగణంలో సరైన వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నందున చర్యలు తీసుకోవాలని 52వ డివిజన్ తెదేపా కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) ఇన్‌ఛార్జి కమిషనర్ డి.చంద్రశేఖర్‌ను కోరారు. ఈమేరకు సోమవారం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మృతుల ఖననం, దహన సంస్కారాలకు వారి కుటుంబ సభ్యులు అనేక మంది వస్తుంటారని, అయితే శ్మశాన వాటి ప్రాంగణంలోని ప్లాట్‌ఫారాలు, బల్లలు పాడై.. అపరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. ప్రాంగణం మొత్తం చెత్తతో ఉందని తెలిపారు. మౌలిక వసతులు కల్పించాలని, అధునాతన పద్ధతిలో శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.

In the cout of the I-Addl. Civil Judge (Junior Division) at, Vijayawada

OS 1966/2024 in E.P 290/2025

Between:

M/s. Mohana Krishna Garments and Cloth, Vijayawada by its K.Laxminarayana Gupta -DHR

Kandukuri Ramani, W/o. Nagaraju, 4th Floor, Deltas Rosan Apt, Madhuranagar,Vijayawada. -JDR

పై నెంబరులోని JDRకు order 21 Rule 43 epc Notice నిమిత్తం ది. 28-11-2025కి వాయిదా. సదరు JDR ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల వాయిదా రోజు ఉదయం 10-30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనవలయును, లేనియెడల మీ పరోక్షమందు తీర్మానింపబడును.

ఇట్లు: **Beeram Subbarao,** B.A., L.L.B., Advocate

\# 25-3-7/2, Siripurapuvari Street, Seetannapeta,Vijayawada- 520 003. ✆ 0866-2578710, 90005 36666.

Vijayawada, 24-11-2025

మద్యపానానికి దూరంగా ఉండాలి

బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

పెజ్జోనిపేట, న్యూస్‌టుడే: యువత మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలని నీతోడు మానసిక వికాస కేంద్రం కోఆర్డినేటర్ జాకబ్‌రాజు సూచించారు. సోమవారం స్థానిక కొత్తా సుబ్బారావు పాఠశాలలో మద్యపానం, ధూమపానం ఆరోగ్యానికి హానికరం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యపానం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయని కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశం కూడా ఉందని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు జె.సత్యనారాయణ చేతుల మీదుగా విజేతలు ఎస్.నాగమల్లేశ్వరి, ఎం.డి.సుహానా, ఎస్.కె. సమీరాకు బహుమతులు అందజేశారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

భవానీపురం, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడని భార్య భవానీపురం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. స్థానిక కోళ్లఫారం రోడ్డులో ఎం.శశికళ, చిరంజీవి దంపతులు నివాసం ఉంటున్నారు. వారిద్దరికీ ఐదేళ్ల కిందట వివాహమైంది. కొంతకాలంగా భర్త చిరంజీవి, ఆయన కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం ఆమెను వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

శత వార్షికోత్సవం విజయవంతానికి పిలుపు

మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు, నాయకులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవ వేడుకలు పేదలకు పండుగ కావాలని సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు అన్నారు. కుమ్మరిపాలెం సెంటరు సమీపంలోని గుప్తా కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన 38, 40, 44, 45 డివిజన్ల సర్వసభ్య సమావేశంలో కోటేశ్వరరావు మాట్లాడారు. డిసెంబరు 26న దేశ వ్యాప్తంగా శత వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు పంచదార్ల దుర్గాంబ, నాయకులు బుద్దె రాజా, శివప్రసాద్ రాజు, నాగేశ్వరరావు, పూర్ణయ్య పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువతి అదృశ్యం

చిట్టినగర్, న్యూస్‌టుడే: మతిస్థిమితం లేని యువతి అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. లంబాడీపేటకు చెందిన 20 ఏళ్ల యువతి చదువు మానేసి ఆరేళ్లుగా ఇంట్లో ఉంటున్నారు. ఆమె మానసిక పరిస్థితి సరిగా ఉండదు. ఈనెల 12న రాత్రి కిరాణా దుకాణానికి వెళ్తున్న అని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేదు. దీంతో కుటుంబ సభ్యులు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మేనత్తపై మేనల్లుడి దాడి

చిట్టినగర్, న్యూస్‌టుడే: ఆస్తి వివాదంలో మేనత్తపై మేనల్లుడు దాడికి పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. ఆంజనేయ వాగు కొరికాని అప్పారావువీధిలో నివాసం ఉండే సూర నాగమణి భర్త 2024లో చనిపోయారు. ఆమె కూలీ పనులు చేస్తుంటారు. మామయ్య సూర పెద్దులుకు కృష్ణ అనే బాలుడిని 6 ఏళ్ల వయస్సులో తెచ్చి పెంచుకుంటున్నారు. అనంతరం అతడికి వివాహం చేయడంతో కృష్ణ వేరే చోట కాపురం పెట్టి నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణ పెద్దకొడుకు జోసఫ్ వరసకు మేనత్త నాగమణి ఇంటికి వచ్చి 'మా నాన్నకి వివాహం చేసి వదిలేశారు. ఆస్తి ఇవ్వకుండా మమ్మల్ని ఇంటిలో నుంచి గెంటేశారని' తరచూ గొడవ చేసేవాడు. ఈ క్రమంలో ఈనెల 23న ఇంటికి వచ్చి ఆస్తిలో వాటా ఇవ్వాలని గొడవ చేశాడు. ఈ విషయం గురించి నీకెందుకని మేనల్లుడికి చెప్పడంతో ఆవేశంగా పక్కనే ఉన్న ఇనుప రాడ్డు తీసుకుని ఆమెపై దాడి చేశారు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

తండ్రి అదృశ్యంపై ఫిర్యాదు

భవానీపురం, న్యూస్‌టుడే: తండ్రి అదృశ్యమైన ఘటనపై కుమారుడు భవానీపురం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. విజయవాడ సమీపంలోని అంబాపురం గ్రామంలో వెంకట దుర్గా వరప్రసాద్ (64) కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆయన గొల్లపూడిలోని మహాత్మాగాంధీ టోకు వ్యాపార కేంద్రంలోని దుకాణంలో పని చేస్తున్నారు. ఈనెల 21వ తేదీ ఉదయం దుకాణానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో కుమారుడు ఆదిత్య సాయిరాం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు.

జన్మదిన శుభాకాంక్షలు

నిస్వార్థ సేవాతత్పరులు, అక్వాడెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ లింగిపిల్లి రామకృష్ణ గారి జన్మదినోత్సవ శుభవేళ.. నిండు నూరేళ్ళూ సుఖసంతోషాలతో విలసిల్లాలని కోరుకుంటూ..

శ్రీ లింగిపిల్లి రామకృష్ణ గారు B.Com., B.L. Advocate

గర్రె భాస్కరరావు

శ్రీ సూర్యా బ్యాంబూస్ డిపో

గులాం మొహిద్దీన్ వీధి, కొత్తపేట, విజయవాడ-1

(c) eenadu

విజయవాడ మధ్య

విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందిస్తున్న సుమ కిరణ్, పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉపన్యసించి.. విజయం సాధించి..

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : స్థానిక కృష్ణా హోటల్ సెంటర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. బాల బాలికలు ఆసక్తిగా పాల్గొని తమ ఉపన్యాసాలు ఇచ్చారు. 9వ తరగతి విద్యార్థులు ఎం.మౌల్యశ్రీ ప్రథమ, ఎం.నిరుప ద్వితీయ, ఎ.తేజ వర్షశ్రీ తృతీయ స్థానాల్లో గెలుపొందారు. ప్రిన్సిపల్ పువ్వుల సుమ కిరణ్ విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

ఈత పోటీల్లో ప్రతిభ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : వివిధ ఈత పోటీల్లో పతకాలు సాధించిన ఎన్టీఆర్ జిల్లా పోలీసుల పిల్లలను సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు సోమవారం అభినందించారు. స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ తులసి చైతన్య కుమార్తె తమన్నా (5) అతి పిన్న వయస్సులో జర్మనీ నుంచి ఇస్తాంబుల్ 6.3 కిలోమీటర్ల బోస్ఫరస్ సరస్సును ఈదారు. నాల్గో ట్రాఫిక్ కానిస్టేబుల్ రామారావు కుమార్తె ఆర్.జెస్సిత ఇండోర్‌లో జరిగిన జాతీయ ఆధునిక పెంటాథ్లాన్ మీట్‌లో రజతం, విజయవాడలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ మీట్‌లో 3 బంగారు పతకాలు, ఉత్తమ స్విమ్మర్ అవార్డు గెలుచుకున్నారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ ఎం.నరేష్ కుమారుడు ఎం.చేతన్‌సాయి శ్రీరాజ్ కాకినాడలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ పెంటాథ్లాన్ మీట్‌లో మిశ్రమ రిలేలో బంగారు పతకం సొంతం చేసుకున్నారు. విద్యార్థుల విజయాలను తెలుసుకున్న సీపీ వారు మరిన్ని పోటీల్లో పాల్గొని రాష్ట్రానికి, ఎన్టీఆర్ జిల్లా పోలీసులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పతకాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సీపీ రాజశేఖరబాబు

మర్యాదపూర్వక కలయిక

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్‌గా నియమితులైన ఫరూఖ్ షిబ్లీని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అభినందించారు. సోమవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యేని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమా.. శాలువాతో సత్కరించారు. ఉర్దూ అకాడమీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఉర్దూ భాషాభివృద్ధి, సంస్కృతి పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని ఛైర్మన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ గఫూర్, షేక్ బాబు, షమీ తదితరులు పాల్గొన్నారు.

ఫరూఖ్ షిబ్లీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఉమా

వీనులవిందుగా గాత్ర కచేరి

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో సోమవారం సద్గురు సంగీత సభ 32వ వార్షికోత్సవ సభ నిర్వహించారు. బి.వి.ఎస్.ప్రకాష్ అధ్యక్షత వహించారు. కళాశాల ప్రిన్సిపల్ సి.జ్యోతిర్మయి, న్యాయవాది పి.శ్రీదేవి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయని వి.దీపిక, వి.నందికలు తమ గాత్రంతో పలు పాటలు చక్కగా ఆలపించి ఆకట్టుకున్నారు. కల్యాణి ఆట తాళం వర్ణం, గిరిరాజ సుతా, వీణా పుస్తక ధారిణి, కరుణ జూడ వమ్మా, శోభిల్లు సప్తస్వరా, తుక్కుదాస్ కీర్తనలతో రంజింపచేశారు. వయొలిన్‌తో బి.దుర్గాభవాని, మృదంగంతో బుర్రా శ్రీరామ్, ఘటంతో ఎస్.ఎ.ఫణిభూషణ్ సహకరించారు. సంస్థ కార్యదర్శి పోపూరి గౌరీనాథ్, సహాయ కార్యదర్శి జె.ఎస్.ఎస్.ప్రసాద్‌శర్మ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యక్షుడు బి.హరిప్రసాద్, కోశాధికారి వి.ఆర్.సుబ్రహ్మణ్యం, అధిక సంఖ్యలో శ్రోతలు పాల్గొన్నారు.

ఆలపిస్తున్న దీపిక, నందిక

దాత శంకర్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి మధురానగర్‌కు చెందిన వంగపండు శంకర్ రూ.లక్ష విరాళాన్ని సోమవారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ శ్రీనివాస్ వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : ముత్యాలంపాడు సెక్షన్ పరిధిలో విద్యుత్తు లైన్ల మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్ రాజు రోడ్డు, ఒడుగు వారి వీధి, దాట్ల బ్రహ్మరాజు వీధి, దేవాలయం, సుబ్బారావు వీధి, బెజ్జం వారి వీధి, శివాలయం, గొట్టుముక్కల ప్రభుత్వ పాఠశాల, పశుసంవర్ధక శాఖ కార్యాలయం తదితర ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదని ఆయన వెల్లడించారు.

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : తనిఖీలు, మరమ్మతుల కారణంగా సూర్యారావుపేట విద్యుత్తు సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాలకు మంగళవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు రైల్వేస్టేషన్, దోర్నకల్ రోడ్డు, బెల్లం కోటజాన్ వీధి, చలసాని వెంకట కృష్ణయ్యవీధి, ఆటోసేవా కార్యాలయం, సెయింట్ పాల్ స్కూల్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, కమిషనరేట్ కార్యాలయం, కోనేరు రోడ్డు, ప్రకాశంరోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ తెలిపారు.

ప్రత్యేక కమిటీ భేటీ నేడు

విజయవాడ నగరపాలక సంస్థ : నగరపాలక సంస్థకు సంబంధించిన మంచినీరు, భూగర్భ మురుగు పారుదల వ్యవస్థ ప్రత్యేక కమిటీ సమావేశం మంగళవారం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ సమావేశం శనివారం జరగాల్సి ఉండగా.. సభ్యుల కోరం లేక వాయిదా వేశారు. సమావేశంలో ఆయా కమిటీ సభ్యులు ప్రతిపాదించే పలు అంశాలపై చర్చించి తీర్మానాలు ఆమోదించడంతో పాటు, వాటిని కౌన్సిల్‌కు రిఫర్ చేస్తూ తీర్మానిస్తారు.

ఆలోచన... ఆవిష్కరణ

నూతన ఔషధాలను రూపొందిస్తున్న విద్యార్థులు

విజయవాడ సిటీ, మధురానగర్

వివిధ వ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే వాటికి ప్రస్తుతం మార్కెట్‌లో ఔషధాలు లభిస్తున్నాయి. వాటికంటే మెరుగైన, ఆరోగ్యంపై ఎటువంటి ప్రభావం చూపకుండా నూతన ఆవిష్కరణలు రూపొందించేందుకు సిద్ధార్థ ఫార్మసీ కళాశాల విద్యార్థులు పరిశోధనలు చేస్తూ భళా అనిపిస్తున్నారు. అందులో భాగంగా శనివారం తాము తయారు చేసిన వివిధ ఔషధాలు, జెల్, ఆయిల్ తదితర ఉత్పత్తులను ప్రదర్శించారు.

శిరోజాల సంరక్షణ.. బీఫార్మసీ తృతీయ సంవత్సరం విద్యార్థులు టి.ప్రభుల చిన్నా, టి.జయశ్రీ, టి.రేష్మా, ఎం.డి.అంజుమ్ షీరిన్.. శిరోజాల సంరక్షణకు రసాయన రహితంగా పలు మూలికలతో హెర్బల్ హెయిర్ ఆయిల్ తయారు చేశారు. శిరోజాల కుదుళ్లను బలపరచడం, రక్త ప్రసరణ ఇది మెరుగుపరిచి, చుండ్రును తగ్గిస్తుంది. శిరోజాలు ఊడిపోకుండా, పెరిగేలా చేస్తుందని వారు వివరించారు.

రక్తపోటును తగ్గిస్తుంది.. దైనందిన జీవితంలో వృత్తి, ఉద్యోగపరంగా ఎదురయ్యే ఒత్తిడి వల్ల రక్తపోటు వస్తోంది. తెల్లవారుజామున ఇది మరింత ఎక్కువగా ఉంటుంది. దీన్ని నియంత్రించడానికి ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న వాటి కంటే మెరుగైన ఔషధాన్ని ఫార్మా డీ ఆరో సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు సీహెచ్ కోవిద, యామిని దుర్గ తయారు చేశారు. ప్రెస్ కోటెడ్ క్రోనోథెరపుటిక్ డ్రగ్ డెలివరీ విధానాన్ని ఉపయోగించి మెరుగైన మందును తయారు చేసి ప్రదర్శించారు. దీనిపై మరింత పరిశోధన చేస్తున్నామని తెలిపారు.

చర్మవ్యాధులను తగ్గిస్తుంది.. కీటోకోనాజోల్ కార్బోమర్ ఆధారిత నానో జెల్ ఫార్ములేషన్ విధానంతో ఆధునిక నానో స్ట్రక్చర్ సాంకేతికతతో జెల్‌ను ఫార్మసీ ఐదో సంవత్సరం చదువుతున్న ఎస్.తేజ మణికంఠ, కె.మనస్వినిలు రూపొందించారు. ఇందులో కీటోకోనాజోల్ నానో స్ట్రక్చర్ రూపంలో ఉండటం వల్ల చర్మంలోకి లోతుగా ప్రవేశిస్తోంది. దీని వల్ల వివిధ చర్మవ్యాధులతో బాధపడుతున్న వారు ఈ జెల్ రాసుకుంటే త్వరగా తగ్గుతాయని పేర్కొన్నారు.

నొప్పి నుంచి ఉపశమనం.. కండరాలు ఒత్తిడికి గురవడం వల్ల నొప్పి వస్తుంది. దాని నుంచి వెంటనే ఉపశమనం కలిగించేందుకు ఫార్మసీ నాలుగు, ఐదో సంవత్సరం చదువుతున్న పి.సాయి రోహిత్, ఎన్.వినీల ఫైబ్రోమెంటల్ జెల్‌ను తయారు చేశారు. దీన్ని దర్దాపై రాసినప్పుడు చల్లగా ఉంటుంది. త్వరగా నొప్పి తగ్గుతుంది. సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని విద్యార్థులు చెబుతున్నారు.

ట్రాఫిక్ రద్దీ నియంత్రణపై కసరత్తు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నగరంలో శనివారం వాహన రద్దీ అత్యధికంగా నమోదు అవుతోంది.. దీన్ని నియంత్రించేందుకు సమర్థమైన చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ డీసీపీ షేక్ షిరీన్‌బేగం పేర్కొన్నారు. సోమవారం లబ్బీపేటలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో సిబ్బందితో కార్యశాల నిర్వహించారు. విధుల్లో ఉన్న వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. 190 మంది సిబ్బంది 19 బృందాలుగా పని చేస్తున్నారు. వీరు ఎదుర్కొంటున్న సవాళ్లు తెలుసుకున్నారు. అలాగే సూచనలు స్వీకరించారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలో ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని ఆమె పేర్కొన్నారు. శనివారం రద్దీకి కారణాలను విశ్లేషించి.. దానిని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ట్రాఫిక్ ఏసీపీలు వంశీధర్‌గౌడ్, రామచందర్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ భానుప్రకాశ్‌రెడ్డితో పాటు ట్రాఫిక్ సీఐలు, ఎస్సైలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందితో చర్చిస్తున్న డీసీపీ షిరీన్‌బేగం

శ్మశానవాటిక అభివృద్ధికి వినతి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలోని కృష్ణలంక శ్మశానవాటిక ప్రాంగణంలో సరైన వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నందున చర్యలు తీసుకోవాలని 52వ డివిజన్ తెదేపా కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) ఇన్‌ఛార్జి కమిషనర్ డి.చంద్రశేఖర్‌ను కోరారు. ఈమేరకు సోమవారం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మృతుల ఖననం, దహన సంస్కారాలకు వారి కుటుంబ సభ్యులు అనేక ఇబ్బందులు పడుతున్నారు, అయితే శ్మశాన వాటిక ప్రాంగణంలోని ప్లాట్‌ఫారాలు, బల్లలు పాడై.. అపరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. ప్రాంగణం మొత్తం చెత్తతో ఉందని తెలిపారు. మౌలిక వసతులు కల్పించాలని, అధునాతన పద్ధతిలో శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.

డిసెంబరులో సైన్స్ సంబరాలు

రాఘవయ్యపార్కు కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : జన విజ్ఞాన వేదిక (జవివే) ఆధ్వర్యంలో డిసెంబరు 21 నుంచి 23 వరకు కాకినాడ జేఎన్‌టీయూలో రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ రావు తెలిపారు. సోమవారం బాలోత్సవ భవన్‌లో కార్యక్రమ గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ సమాజమే ఏర్పాటు లక్ష్యంగా ఏర్పాటైన సంస్థ 35ఏళ్లుగా విద్యార్థులకు చెకుముకి సైన్స్ పోటీలు నిర్వహిస్తోందన్నారు. ఈ ఏడాది పాఠశాల స్థాయిలో సుమారు 5 లక్షల మంది పాల్గొన్నారని చెప్పారు. జవివే రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, శాతవాహన కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ వి.సాంబిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు రాత పరీక్షతో పాటు క్విజ్, ఎక్స్‌పెరిమెంటల్ రౌండ్లలో పోటీలు ఉంటాయని చెప్పారు. ఇస్రో, ఓషనోగ్రఫీ, పర్యావరణ శాస్త్రవేత్తలు, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్స్‌కు చెందిన శాస్త్రవేత్తలతో ముఖాముఖి, ఇస్రో మొబైల్ ఎగ్జిబిషన్, వ్యాసరచన, విజ్ఞానవినోద యాత్ర వంటి అంశాలు ప్రత్యేకగా ఉంటాయన్నారు. మూఢ నమ్మకాల నిరోధానికి విద్యావంతులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకత వెలికితీసేందుకు సంబరాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. సమావేశంలో డాక్టర్ లెనిన్‌బాబు, యశ్వంత్, సూర్యారావు, శోభన్ కుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు, శ్రీనివాస్, సాంబిరెడ్డి తదితరులు

నీటి రేవును శుభ్రం చేయరూ

గుణదల ఒకటో డివిజన్, లెనిన్‌నగర్‌లో రైవస్ కాలువపై ఏర్పాటు చేసిన నీటి రేవు చెత్త కుప్పలతో నిండిపోయింది. ఇక్కడ స్థానికుల అవసరాల నిమిత్తం రేవు నిర్మించారు. అయితే పర్యవేక్షణ లోపంతో అందులో చెత్త పేరుకుపోయింది. కాలువలో కొట్టుకువచ్చిన గుర్రపుడెక్క వ్యర్థాలు నిలిచిపోయాయి. ఫలితంగా ఇది పాములు, విష పురుగులకు నిలయంగా మారింది. దీన్ని శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మధురానగర్**

విద్యుత్తు వెలుగులు వృథా

భరతమాత కాలనీలో విద్యుత్తు వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఒకటో లైన్ నుంచి 7వ లైన్ వరకూ పట్టపగలే వెలుగుతున్నాయి. గత పది రోజులుగా ఈ సమస్య ఉందని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళ వెలగని వాటికి మరమ్మతులు చేయాలని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్**

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : అయ్యప్ప మండల కాలం సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మొగల్రాజపురంలోని స్వగృహంలో సోమవారం నిర్వహించిన మహా పడిపూజతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. మురళీధరన్ నంబూద్రి గురుస్వామి పర్యవేక్షణలో కేరళ సంప్రదాయంతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. వేద మంత్రాలు, భజనలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. ఎమ్మెల్యే ఉమా.. మండల దీక్ష పవిత్రత, పడిపూజ ప్రాధాన్యాన్ని వివరించారు. సమాజంలో ధర్మం నిలవాలని, ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యాలు చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భవానీలు, శివయ్య స్వాములు, భక్తులు పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

దుర్గమ్మ రూపంలో కళాకారిణి

విద్యుదాఘాతంతో వాచ్‌మెన్ మృతి

మధురానగర్, న్యూస్‌టుడే : ఇసుక అన్‌లోడ్ చేస్తున్న టిప్పర్‌కు విద్యుత్తు తీగలు తగిలి.. వాచ్‌మెన్ మృతిచెందిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన సత్యనారాయణ (36) తోటవారివీధి పదో లైనులో కొత్తగా కడుతున్న అపార్ట్‌మెంట్‌కు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 21వ తేదీ రాత్రి సమయంలో ఇసుక అన్‌లోడ్ చేసేందుకు లారీ వచ్చింది. డ్రైవర్ కొండారెడ్డి ఇసుక దింపేటపుడు.. పైన ఉన్న విద్యుత్తు తీగల గురించి చెప్పమంటూ సత్యనారాయణను కోరారు. వెనుక భాగం పైకి లేపుతుండగా.. దాని పక్కనే నిలబడి సత్యనారాయణ చెబుతున్నారు. ఈ క్రమంలో లారీ పైభాగానికి విద్యుత్తు తీగలు తాకగా.. సత్యనారాయణకు కరెంట్ షాక్ తగిలింది. వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని యువతి ..

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : గుర్తు తెలియని ఓ యువతి (35) విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. రెండు రోజుల క్రితం కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డులో అనారోగ్యంతో పడి ఉండగా.. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ఆమెను ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందారు. యువతి స్థానికంగా భిక్షాటన చేస్తుంటుందని స్థానికులు చెబుతున్నారు. ఆమె వివరాలు తెలిసిన వారు గవర్నర్‌పేట పోలీసులను సంప్రదించాలని కోరారు.

మద్యం తాగిన చోదకులకు జరిమానా

సత్యనారాయణపురం(గాంధీనగర్): నిబంధనలకు విరుద్ధంగా.. అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన 52 మంది చోదకులపై మూడో ట్రాఫిక్ సీఐ కొత్తూరు కిషోర్‌బాబు, ఆర్.ఎస్.ఐ జీవీఎన్ కుమార్ సోమవారం కేసులు నమోదు చేశారు. వీరిని రైల్వే కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఆర్.వి.శర్మ.. 50 మందికి రూ.10వేల చొప్పున ఐదు లక్షల జరిమానా విధించారు. మరో ఇద్దరికి 7 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. సీపీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీసీపీ షేక్ షెరీన్ బేగం పర్యవేక్షణలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

'కులగణన ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలి'

పాయకాపురం, న్యూస్‌టుడే : కులగణన నిర్వహించి.. బీసీల రిజర్వేషన్లు అమలు చేయాలని, ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తదితరులు కోరారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వారు కలెక్టర్‌ను కోరారు. తమ డిమాండ్లు తీర్చాలని కోరుతూ వినతి పత్రం అందించారు. నాయకులు మేకా వెంకటేశ్వరరావు, మరీదు రాంబాబు, అన్నవరపు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వినతి పత్రంతో బీసీ సంక్షేమ సంఘం నాయకులు

మట్టి తవ్వకాలతో ప్రభుత్వానికి నష్టం : గత ప్రభుత్వంలో విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి, వేమవరం, జక్కంపూడి, పి.నైనవరం, అప్పారావుపేట, పాతపాడు, జి.కొండూరు మండలం వెలగలేరు, చెగిరెడ్డిపాడు గ్రామాల పరిధిలో వందలకోట్ల రూపాయల విలువైన మట్టిని అక్రమంగా తవ్వారని ఎం.జమలయ్య పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో వినతి పత్రం అందించారు. చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అక్రమ మట్టితవ్వకాల వల్ల ప్రభుత్వానికి రూ.కోట్లలో నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్య షష్ఠికి సిద్ధం

మధురానగర్, న్యూస్‌టుడే : మధురానగర్‌లో స్వయంభువుగా వెలిసిన బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం (నేటి) నుంచి సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు నిర్వహించనున్నారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా, రంగు రంగుల దీపాలతో తీర్చిదిద్దారు. విఘ్నేశ్వర పూజతో వేడుకలు ప్రారంభిస్తారు. స్వామి వారి కావడి ఉత్సవం, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం జరుగుతుందని ఆలయ ధర్మకర్తలు బోయిన గోపాలకృష్ణమూర్తి, శ్యామల, హరికృష్ణ, నాగ సునీత తెలిపారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు వారు వివరించారు.



విద్యుద్దీపాల అలంకరణలో ఆలయం

గాంధీనగర్, న్యూస్‌టుడే : సుబ్రహ్మణ్య షష్ఠి పురస్కరించుకుని బుధవారం ఏలూరు లాకుల సెంటరులోని కోదండ దాసాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ వేముల హజరత్తయ్య గుప్తా తెలిపారు. ఆ రోజు ఉదయం నుంచి స్వామి వారికి సుగంధ ద్రవ్యాలతో ఏకాదశ రుద్రాభిషేకాలు, పంచ హారతులు, విశేష పూజలు నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

పాడుతున్న చంద్రశేఖర్ తదితరులు

అలరించిన సంగీత విభావరి

విజయవాడ సాంస్కృతికం: గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానంద కళావేదికపై సోమవారం నిర్వహించిన తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. తెలుగు కళా వాహిని, పోలవరపు సాంస్కృతిక సమితి, కళాభారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. గాయకులు ఆనంద్, సాయిబాబు, హనుమంతరావు, నాగమణి, స్వాతి, అయ్యప్పన్, ఎం.శ్యాంప్రసాద్, దండు చంద్రశేఖర్, పెదబ్రహ్మం, ఎ.శ్రీనివాస్, సుమలతలు తెలుగు, హిందీ పాటలు పాడి శ్రోతలను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళా సంస్థల ప్రముఖులు చింతకాయల చిట్టిబాబు, పరుచూరి విజయలక్ష్మి, ప్రసూనా రామన్, కె.డేవిడ్‌రాజు, బి.ఆంజనేయరాజు పాల్గొన్నారు.

వాగులోకి దూసుకెళ్లిన కారు

పెద్దారవీడు, న్యూస్‌టుడే: వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి వాగులోకి దూసుకుపోయింది. వెంటనే స్థానికులు స్పందించి వారిని రక్షించడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ సంఘటన ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం రాజంపల్లి సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..విజయవాడ నగరంలోని అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన బుగత నాగరాజు, కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలానికి కారులో బయలుదేరారు. వారి వాహనం సోమవారం మధ్యాహ్నం పెద్దారవీడు మండలం రాజంపల్లి సమీపంలో అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న వాగులోకి దూసుకుపోయింది. వెంటనే గమనించిన స్థానికులు వాగులోకి దూకి..కారులో ఉన్న నలుగురిని కాపాడారు. వారికి స్వల్ప గాయాలు కావడంతో మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు.

నిరసన ప్రదర్శన రేపు

గాంధీనగర్: దేశ వ్యాప్త రైతు, కార్మిక సంఘాల పిలుపుతో ఈ నెల 26న నగరంలోని రైల్వేస్టేషన్ నుంచి ధర్నాచౌక్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు మల్నీడు యలమంద రావు, పి.ఆంజనేయులు, ఎ.వెంకటేశ్వరరావు, ఎం.సాంబ శివరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఉద్యోగిని బ్రాస్‌లెట్ చోరీ

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : మంగళగిరిలోని ఏపీ డీజీపీ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సుల్తానా ఖాన్ బ్రాస్‌లెట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. కానూరు కృష్ణనగర్‌కు చెందిన సుల్తానా ఖాన్ గత నెల 28న సిరీస్ కంపెనీ సమీపంలోని బస్టాపులో బస్సు ఎక్కారు. మహాత్మా గాంధీ రోడ్డులోని పంచాయతీరాజ్ కార్యాలయం బస్టాపు వద్ద దిగారు. అక్కడి నుంచి భర్త ద్విచక్రవాహనంపై డీజీపీ కార్యాలయానికి బయలుదేరారు. ఆ సమయంలో చేతికి ఉండాల్సిన బ్రాస్‌లెట్ కనిపించలేదు. దీనిపై ఆమె సూర్యారావుపేట పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపకారవేతన పరీక్షలో ఉత్తీర్ణులు కావాలి

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రతిభా ఉపకారవేతన పరీక్షలో అందరూ ఉత్తీర్ణులు కావాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆకాంక్షించారు. ఎన్ఎంఎంఎస్ ఉపకారవేతన పరీక్ష కోసం విద్యార్థులకు మెంటల్ ఎబిలిటీలో అవగాహన కల్పించేందుకు సోమవారం ఎంబీ విజ్ఞాన కేంద్రంలో అమరావతి బాలోత్సవం ఆధ్వర్యంలో కార్యశాల నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు యూటీఎఫ్, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మెటీరియల్ అందించినట్లు చెప్పారు. పిల్లలు మరిన్ని మంచి మార్కులు పొందేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. అమరావతి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు మాట్లాడుతూ.. ఇప్పటికి ఏడు పిల్లల పండుగలు దిగ్విజయంగా నిర్వహించామని చెప్పారు. అకడమిక్‌గా రాణించడమే కాకుండా.. వారు చదువులో మరింత రాణించేందుకు కార్యశాలలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. డిసెంబరు 9, 10, 11 తేదీల్లో జరిగే బాలోత్సవంలో పిల్లలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శ్రీధర్ అకాడమీ డైరెక్టర్ శ్రీధర్, నాగార్జున విశ్వవిద్యాలయం గెస్ట్ ఫ్యాకల్టీ లెనిన్ బాబు సూచనలు, సలహాలు ఇచ్చారు. బాలోత్సవం ఉపాధ్యక్షుడు సాంబిరెడ్డి, కార్యదర్శి యు.వి.రామరాజు, శ్రీనివాస్, టి.క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న రామకోటేశ్వరరావు, శరత్ తదితరులు

విజయవంతంగా కంప్యూటర్ శిక్షణ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : కంప్యూటర్ నైపుణ్యాలు కలిగిన యువత సామాజిక మాధ్యమాల పట్ల బాధ్యతతో ఉండాలని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. గవర్నర్‌పేటలో సన్ ఇన్ఫో టెక్నాలజీస్, సుజాతదేవి ఛారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణ సోమవారం ముగిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత కంప్యూటర్ స్కిల్స్ మెరుగుపరుచుకుని ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఉచితంగా టాలీ, ఫొటోషాప్, వెబ్ డిజైనింగ్, తెలుగు టైపింగ్‌లో శిక్షణ ఇచ్చిన ట్రస్టు సభ్యులను, సన్ ఇన్ఫో నిర్వాహకులను అభినందించారు. సన్ ఇన్ఫో వ్యవస్థాపకుడు మంచెం శరత్, సెంటర్ ఇన్‌ఛార్జి టి.విజయలక్ష్మి, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు మొహమ్మద్ బురహానుద్దీన్, తండ్రి: (లేటు) అబ్దుల్ కరీం, డో.నెం. 15-110, నంబూరు గ్రామం, పెదకాకాని మండలం, గుంటూరు జిల్లా వారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా ది.22-11-2025న తిరుపతి - విజయవాడ ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ నుండి రాజమండ్రి ప్రయాణం చేయుచున్నంతలో, ఏలూరు రైల్వేస్టేషన్ చేరుకొనే సమీపంలో నా క్లయింటు తాలూకు నంబూరు గ్రామం, పెదకాకాని మండలం, గుంటూరు జిల్లా సర్వే నెం.191/బి లో సబ్ రిజిస్ట్రారు ఆఫీసు, మంగళగిరిలో లోగడ రిజిస్ట్రేషన్స్ అయిన ఒరిజినల్ డాక్యుమెంట్సు 668, 669, 670 తేది. 24-04-1974, లింక్ డాక్యుమెంట్సు 1918 తేది 22-08-1966 మరియు 1801 తేది. 07-08-1965ను ఉంచిన ప్లాస్టిక్ సంచి పోయినది. ఎవరికి అయిన దొరికిన యెడల తెలియజేసినచో తగిన పారితోషికం ఇప్పించబడును.

ఇట్లు: **జె.వి.ఆర్.ఎల్.నరసింహం**
అడ్వకేట్
సెల్: 96760 45519, 95199 45937

(c) eenadu

క్రికెట్, త్రోబాల్ పోటీలకు వేళాయె!

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పాఠ్యాంశాలు బోధిస్తూ ఒత్తిడిలో ఉన్న ఉపాధ్యాయులు ఆటలతో సేదతీరనున్నారు. క్రికెట్, త్రోబాల్ ఆడే వారికి పోటీలు నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. దీనిలో భాగంగా పాఠశాలల్లో క్రికెట్ (ఉపాధ్యాయులు), త్రోబాల్ (ఉపాధ్యాయినులు) వివరాలు సోమవారం సేకరించారు. వీరికి మండల స్థాయిలో ఈనెల 29, 30 తేదీల్లోనూ, డివిజన్ స్థాయిలో డిసెంబరు 13, 14 తేదీల్లోనూ పోటీలు జరుగుతాయి. జిల్లాస్థాయిలో డిసెంబరు 20, 21, 22 తేదీల్లో, రాష్ట్రస్థాయిలో జనవరి 2, 3, 4 తేదీల్లో జరుగుతాయి. ఆసక్తి ఉన్న ఉపాధ్యాయుల వివరాలు తీసుకుంటున్నామని ఎంఈఓ-2 రమేష్‌బాబు చెప్పారు.

పద్మావతి పరిణయం.. చూసిన కనులదే పరవశం!

సాంస్కృతిక నృత్య ప్రదర్శనలో అనకాపల్లి కళాకారులు అలరించారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 24 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అనకాపల్లికి చెందిన ఇంద్రజశంకు, మోహన్‌శ్రీ, లిఖితలాస్య, సోనియా, శ్రీలోహిత్య 'పద్మావతి పరిణయం' నృత్య రూపకాన్ని ప్రదర్శించి ప్రథమశ్రేణిలో నిలిచారు. ఈ సందర్భంగా వీరిని పలువురు సత్కరించారు.

-న్యూస్‌టుడే, నెహ్రూచౌక్ (అనకాపల్లి)

రేషన్ కార్డుదారులకు తీపికబురు

కొత్తగా 14884 మందికి లబ్ధి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: రేషన్ లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. కొత్తగా మంజూరైన కార్డుదారులకు డిసెంబరు నుంచి రేషన్ సరకులు పంపిణీ చేయనున్నారు. కూటమి ప్రభుత్వం ఇటీవల కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు ఆహ్వానించింది. గత మే నుంచి నవంబరు 15 వరకు జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. అర్హుల దరఖాస్తులను పరిశీలించి ఇటీవల కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి కార్డులు మంజూరు చేశారు. పాత రేషన్ కార్డుల్లో తల్లిదండ్రులు, పెళ్లయిన కుమారులను విభజన చేసేందుకు కార్డుల విభజనకు అవకాశం కల్పించింది. దీంతో జిల్లావ్యాప్తంగా 24 మండలాలతోపాటు అనకాపల్లి జీవీఎంసీ, ఎలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీల పరిధిలో 14,884 మందికి కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డులకు అవకాశం కల్పించారు. వీరిలో కొత్త రేషన్ కార్డుదారులు 2,636 మంది, విభజన కార్డుదారులు 12,248 మంది ఉన్నారు. వీరందరికీ డిసెంబరు నుంచి జిల్లాలో 106 డిపోల పరిధిలో సరకులు పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం జిల్లాలో కొత్త కార్డుదారులతో కలిపి మొత్తం 5,35,492 మంది బియ్యం కార్డుదారులు ఉన్నారు. కొత్త రేషన్ కార్డుదారులకు డిపోల ద్వారా డిసెంబరు నుంచి సరకులు పంపిణీ చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మూర్తి తెలిపారు. ఈ మేరకు డిపోలకు ముందుగా సరకులు చేరేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కొత్తగా రేషన్ కార్డు తీసుకున్నవారు డిపోలకు వెళ్లి సరకులు తీసుకోవచ్చన్నారు.

నిఘా మరిచిన కళ్లు.. నిబంధనలకు నీళ్లు

క్వారీ లారీల అక్రమాలు పట్టని జిల్లా అధికారులు

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

జిల్లాలో నిబంధనలు మీరి రోడ్లపైకొస్తున్న భారీ వాహనాలు స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. క్వారీ లారీలు ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. వాటిని కట్టడి చేయాల్సిన అధికారులు హెచ్చరికలకే పరిమితమవుతున్నారు. అనకాపల్లి సమీప కొండలన్నింటి నుంచి రాంబిల్లి ప్రత్యామ్నాయ నావికా స్థావరం (ఎన్ఏబీ) పనులకు బండరాళ్లను తరలిస్తున్నారు. వైకాపా హయాంలో పరిమితికి మించి లోడుతో వాహనాలు తిరుగుతుండటంతో.. రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బండరాళ్ల రవాణా చేతులు మారింది కానీ.. నిబంధనల ఉల్లంఘనలో మాత్రం తీరు మారలేదు.

- అనకాపల్లి నుంచి ప్రతి ఐదు నిమిషాలకు ఒకటి లారీ వెళ్తోంది. నిబంధనల ప్రకారం.. 12 టైర్ల లారీలు 20 టన్నులు, 10 టైర్ల లారీలు 16 టన్నుల వరకు రాళ్లు తరలించడానికి అనుమతులు ఉన్నాయి.
- కానీ.. డబ్బు ఆశతో వాహనదారులు పరిమితికి మించి 50-60 టన్నుల వరకు నింపుతున్నారు. ఇంతే కాకుండా 60 కి.మీ వేగం తగ్గకుండా నడుపుతున్నారు. ఇలాగే అతివేగంతో సోమవారం వేకువజామున ఓ క్వారీ లారీ విజయరామరాజుపేట రైల్వే అండర్‌బ్రిడ్జి రక్షణ గడ్డర్‌ను ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది.

విజయరామరాజుపేట బ్రిడ్జి వద్ద దెబ్బతిన్న గడ్డర్

★విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రక్షణ గడ్డర్‌ను మార్చి 17న ఓ క్వారీ లారీ బలంగా ఢీ కొట్టింది. దీంతో వంతెనపై ఉన్న పట్టాలు కొంతమేర ధ్వంసమయ్యాయి. లారీకి రూ.1.01 లక్షలు జరిమానా వేశారు. అప్పటి నుంచి క్వారీ వాహనాలు బొజ్జన్నకొండ మార్గం నుంచి హైవేపైకి చేరేలా ఆదేశించారు. కానీ ఇప్పటికీ రాత్రి 11 గంటలు దాటితే చాలు.. క్వారీ వాహనాలు పట్టణంలో నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి.

అమలు కాని ఆదేశాలు

కలెక్టర్, ఎస్పీ కొద్దినెలల క్రితం క్వారీ నిర్వాహకులతో సమావేశమయ్యారు. పట్టణం మీదుగా రాత్రివేళ బండరాళ్లు తరలించొద్దని ఆదేశించారు. దీనిని నిర్వాహకులు ఏమాత్రం ఖాతారు చేయలేదు. రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నామని చెబుతున్నా.. కట్టడి చేయలేకపోతున్నారు.

నిఘా పెడుతున్నాం..

జిల్లాలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. నిబంధనలను పాటించని వాహనాలకు అపరాధ రుసుం వేస్తున్నాం. అనకాపల్లి పట్టణంలో నుంచి క్వారీ వాహనాలు నపడొద్దని యజమానులకు ఇదివరకే చెప్పాం. రాత్రివేళల్లో నిఘా పెడుతున్నాం. విజయరామరాజు పేట వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిని ఢీకొట్టిన వాహనానికి రూ. 48 వేలు అపరాధ రుసుం విధించాం. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవు.

– మనోహర్, జిల్లా రవాణా శాఖ అధికారి, అనకాపల్లి

ఇక సాగుకు సజావుగా సరఫరా

పాయకరావుపేట, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగానికి స్థిరమైన 9 గంటల విద్యుత్తు సరఫరా చేయాలనే లక్ష్యంతో చేపట్టిన ఆర్‌డీఎస్ఎస్ పనులు తుదిదశకు చేరుకున్నాయి. దీనిలోభాగంగా గృహాలకు, వ్యవసాయ రంగానికి సరఫరా చేసేందుకు వీలుగా వేర్వేరుగా స్తంభాలు ఏర్పాటు చేసి తీగలు అమర్చుతున్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ గ్రామీణ సరఫరా వ్యవస్థ బలోపేతం (రూరల్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ స్ట్రెంగ్తెనింగ్-ఆర్‌డీఎస్ఎస్) పథకంలో పనులు చేపట్టారు. దీనికోసం రూ. 125.51 కోట్లతో జిల్లాలోని 43 ఫీడర్ల పరిధిలో పనులు చేపట్టారు. ఇప్పటికే పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం తదితర మండలాల పరిధిలో పనులు సాగుతున్నాయి. మండలంలోని పాల్మన్‌పేట, పాల్తేరు, రాజవరం, కుమారపురం, పెంటకోట, గోపాలపట్నం ప్రాంతాల్లో కొత్త లైన్లు ఏర్పాటు చేశారు.

➤ గృహావసరాలకు, వ్యవసాయానికి విడివిడిగా సరఫరా చేసేందుకు లైన్ల విభజన చేపట్టారు. కొత్త స్తంభాల ఏర్పాటు పూర్తయితే వ్యవసాయానికి నిరంతరాయంగా 9 గంటల సరఫరా అందుతుంది. లోఓల్టేజీ సమస్యలు ఉండవు.

➤ తీరంలో హేచరీలు, రొయ్యల చెరువులకు నిరంతరాయ సరఫరా ఇవ్వనున్నారు.

➤ గ్రామీణ ప్రాంతాల్లోనూ పరిశ్రమలకు త్రీఫేజ్ సరఫరా అందుబాటులోకి వస్తుంది.

పాల్తేరులో తీగలు అమర్చుతున్న సిబ్బంది

వారి నాటుడు.. వీరి నరుకుడు

ఎలమంచిలి, న్యూస్‌టుడే

★ పదేళ్లలో నాటిన మొక్కలు : ఆరువేలకు పైగా

★ ఖర్చు చేసిన నిధులు రూ. 6 లక్షలకు పైగా..

పురపాలక సంఘం పరిధిలో పచ్చదనాన్ని పెంచడానికి అధికారులు రూ.లక్షలు ఖర్చుచేసి మొక్కలు నాటిస్తుంటే అక్రమార్కులు వీటిని అడ్డంగా నరికి అమ్ముకుంటున్నారు. ఫలితంగా పర్యావరణ పరిరక్షణ కోసం నాటి పెంచిన మొక్కలు కాస్తా కనుమరుగవుతున్నాయి. ఇటు ప్రభుత్వ ధనం వృథా అవుతుండగా.. అటు పర్యావరణ పరిరక్షణ ఆశయం నెరవేరడం లేదు.

హుద్‌హుద్ తుపానుతో ఎలమంచిలిలో చాలా చెట్లు నేలకూలాయి. అప్పటి నుంచి పాలక వర్గం, అధికారులు, సామాజిక కార్యకర్తలు ఎంతో శ్రమించి పట్టణంలోని పాత జాతీయ రహదారికి ఇరువైపులా, వీధుల్లో, ఎనిమిది విలీన గ్రామాలకు వెళ్లే మార్గాల్లో మొక్కలు నాటారు. అవన్నీ ఇప్పుడు బాగా పెద్దవయ్యాయి. ఇప్పుడు వీటిపై గొడ్డలివేటు పడుతోంది. ఇటీవల స్టేషన్ రోడ్డులో ఒక దుకాణం నిర్మించుకునే వ్యక్తి దాని అడ్డంగా ఉందని భారీ వృక్షం నరికించేశాడు. కానీ పురపాలక అధికారులు కిమ్మనలేదు.

కారణాలివీ..

« ప్రత్యేక ఆర్థిక మండలిలో ప్లైవుడ్ కంపెనీ ఎటువంటి కర్ర అయినా కొనుగోలు చేస్తోంది. దీంతో కొందరు శివారు ప్రాంతాల్లో ఏపుగా పెరిగిన చెట్లు నరికి కలపను గుట్టుగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

« మున్సిపాలిటీ పరిధిలో ఉత్సవాలు వస్తే చాలు.. వీధుల్లో విద్యుద్దీపాలు, ఫ్లెక్సీల ఏర్పాటుగా అడ్డుగా ఉంటున్నాయని కొమ్మలన్నీ కొట్టేస్తున్నారు. ఉత్సవాలు వచ్చినప్పుడల్లా కనీసం 20 నుంచి 30 చెట్లను దారుణంగా నరికివేస్తున్నారు.

« విద్యుత్తు తీగలకు ఆనుకుని ఉన్న కొమ్మలు నరకడానికి పనులు పొందిన గుత్తేదారు మొత్తం చెట్లనే నరికి వేస్తున్నాడు. అధికారుల పర్యవేక్షణ లేకుండా పనులు జరగడంతో ఈ విధంగా జరుగుతోంది.

« కట్టుపాలెం, సోమలింగపాలెం, కొత్తపాలెం, కొక్కిరాపల్లి, అగ్రహారం, పెదపల్లి, రామారాయడుపాలెం, తెరువుపల్లి గ్రామాలకు వెళ్లే మార్గాలకు ఇరువైపులా ఉన్న పలు చెట్లు మాయమయ్యాయి.

కట్టుపాలెం సమీపంలో మోడుగా మిగిలిన చెట్లు

చర్యలు తీసుకుంటాం..

మున్సిపల్ నిధులతో నాటించి పెంచిన మొక్కలు, చెట్లు నరికివేతకు గురికావడం వాస్తవమే. చెట్లు అక్రమంగా నరికినవారికి జరిమానా వేయడంతోపాటు వారితో చెట్లు నాటిస్తాం. విద్యుత్తు అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా నిర్వహణ పేరుతో చెట్లు నరికేస్తున్నారు. ఎవరైనా ఒక మొక్క నరికితే వారికి అపరాధ రుసుం విధించి వారితో వంద మొక్కలు నాటించమని ఛైర్‌పర్సన్ రమాకుమారి ఆదేశించారు.

- బాకూరి ప్రసాదరాజు, ఎలమంచిలి కమిషనర్

అతివల చేతిలో అస్త్రాలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే

సమాజంలో అతివల చుట్టూ ఆపదలు పొంచి ఉంటున్న రోజులివి. దీంతో వారి రక్షణార్థం మహిళ రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక సహాయ కేంద్రాలు నిర్వహిస్తున్నాయి. ఇవి 24 గంటలు పనిచేస్తాయి. దాడులు, గృహహింసకు గురైనా తక్షణం సంబంధిత ఫోను నంబర్లతో వీటిని సంప్రదిస్తే రక్షణకు తోడు వైద్య సాయం, పునరావాసాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటాయి. జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ అధికారులు, పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయం చేసుకొని బాధితులకు అండగా నిలుస్తారు.

1098 బాలల విముక్తి

బాలలపై హింస, దాడులకు పాల్పడితే 1098 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చు. వీరితో వెట్టిచాకిరీ చేయించుకోవడం, పారిశ్రామిక, కర్మాగారాల్లో పనుల్లో ఉంచితే ఈ నంబరుకు తెలియజేస్తే అధికారులు వచ్చి విముక్తులను చేస్తారు.

1930 సైబర్ నేరాలు

సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయాలు పెంచుకొని మహిళలను మోసగిస్తున్న సంఘటనలు ఎక్కువవుతున్నాయి. దీనికితోడు ఆర్థిక, సైబర్ మోసాలకు సంబంధించి రక్షణకు 1930కి ఫోన్‌చేసి పోలీసుల సాయం పొందొచ్చు.

100 తక్షణ సాయం..

మహిళలు, విద్యార్థినులు, యువతులను ఎవరైనా వేధిస్తే తక్షణ సాయం కోసం 100 నంబర్‌కు డయల్ చేయవచ్చు. అధికారులు వెంటనే స్పందించి ఆదుకుంటారు. దూరంగా ఉన్న వారైతే ఆ ప్రాంతం పోలీసులకు సమాచారం చేరవేసి రక్షణ కల్పించేలా ఏర్పాట్లు చేస్తారు.

15100 న్యాయ సహాయం

న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అన్యాయానికి గురయ్యే మహిళలు ఉచితంగానే న్యాయ సేవలను పొందవచ్చు. 15100 నంబరుకు తెలియజేయడం లేదా కోర్టులోని న్యాయమూర్తులకు తమ సమస్యపై లేఖ రాసినా సాయం లభిస్తుంది. న్యాయ స్థానాల్లోని కేసులకు ఉచితంగానే న్యాయవాదిని సమకూరుస్తారు.

181 వేధింపులపై..

మహిళలను కట్నం కోసం ఇబ్బందులకు గురిచేయడం, శారీరక, మానసిక వేధింపులకు పాల్పడిన సందర్భంలో బాధితులు 181 నంబరుకు సంప్రదించి సమస్యను వివరించవచ్చు. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది వివరాలు నమోదు చేసుకొని ఫిర్యాదుదారులను ఆదుకునేలా చర్యలు తీసుకుంటారు.

స్ట్రాబెరీ వచ్చేసింది!

చింతపల్లి మండలంలో స్ట్రాబెరీ అమ్మకాలు మొదలయ్యాయి. అతిశీతల ప్రాంతంగా గుర్తింపు పొందిన లంబసింగి, చింతపల్లి ప్రాంతాల్లో స్ట్రాబెరీ సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండటంతో కొందరు రైతులు దీన్ని వాణిజ్యపరంగా పండిస్తున్నారు. ఏటా చలికాలంలో ఇక్కడకు దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా ఈ సాగును రైతులు ఎంచుకున్నారు. కొందరు మైదాన ప్రాంతాలకు చెందిన కౌలు రైతులు స్థానికంగా ఉన్న గిరిజనుల భూములను లీజుకు తీసుకుని అందులో పలు రకాల పంటలను పండిస్తున్నారు. ఏటా నవంబరు నుంచి ఫిబ్రవరి వరకూ స్ట్రాబెరీ పంట దిగుబడులు ఇస్తుంది. – న్యూస్‌టుడే, చింతపల్లి

పంచసూత్రాలపై ప్రతి రైతుకు అవగాహన

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రైతన్న మీకోసం వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం 'రైతన్న మీకోసం' వారోత్సవాల గోడప్రతులను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 450 రైతు సేవా కేంద్రాల ద్వారా బృందాలు ప్రతి రైతు కుటుంబాన్ని సందర్శించి ప్రభుత్వ ఐదు సూత్రాలను రైతులకు వివరిస్తున్నారన్నారు. జిల్లా అంతటా ఈ కార్యక్రమంలో ప్రారంభమైందన్నారు. సోమవారం 16431 రైతు కుటుంబాలను సందర్శించి 57,888 మంది రైతులకు పంచసూత్రాలపై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం.ఆశాదేవి, అధికారులు పాల్గొన్నారు.

గోడప్రతులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, అధికారులు

గుడ్డు గుటుక్కు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే

ఆరోగ్యవంతమైన సమాజాన్ని సృష్టించాలనే ఆలోచనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చుచేసి చిన్నారులు, విద్యార్థులు, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు ప్రతినెలా కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నాయి. అయితే వీటి పంపిణీపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో గుత్తేదారు కుళ్లిపోయిన, బరువు తక్కువ గుడ్లను సరఫరా చేస్తున్నా ఇటువైపు అధికారులు కన్నెత్తి చూడని పరిస్థితులు కనిపిస్తున్నాయి.

జిల్లాలో 1906 అంగన్‌వాడీ, 183 మినీ కేంద్రాలు ఉండగా... 1065 ప్రాథమిక, 57 ప్రాథమికోన్నత, 262 జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటితోపాటు గురుకుల, బీసీ, ఎస్సీ, సమీకృత వసతిగృహాల్లో విద్యార్థులు చదువుకుంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలసంజీవని ప్లస్ పథకం పేరుతో వి.మాడుగుల, చీడికాడ, గొలుగొండ, నాతవరం, రావికమతం, రోలుగుంట మండలాల్లోని వారికి నెలకి 30 గుడ్లు, మిగిలిన మండలాల వారికి నెలకి 25 గుడ్లు అందిస్తున్నారు. ఇలా జిల్లాలో ప్రతి నెలా లక్షల్లో కోడిగుడ్లను ప్రభుత్వం అందిస్తున్నా వీటిపై పర్యవేక్షణ మాత్రం తక్కువగా ఉందనే అభిప్రాయం లబ్ధిదారులు, అంగన్‌వాడీ, ఉపాధ్యాయుల్లో నెలకొంది.

సరఫరా చేసిన చిన్నసైజు గుడ్లు

తూకాన్ని పక్కనపెట్టారు

★ గుడ్ల నాణ్యత, బరువులో తేడాలుండటంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకీకృత టెండర్ విధానాన్ని అమలు చేసి పంపిణీ బాధ్యత ఒక్కరికే అప్పగించింది. ఇలా అనకాపల్లి జిల్లా వరకు సంస్థ టెండర్ దక్కించుకొని సరఫరా చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా ఈ సంస్థతో మిగిలిన వ్యాపారులు కలిసి జిల్లాలో గుడ్లు సరఫరా చేస్తున్నారు.

★ బరువు ఒక్కొక్కటి 45 నుంచి 52 గ్రాములు వరకు ఉండాలి. ఇలా 30 ఉన్న అట్ట 1.5 కేజీల బరువు ఉండాల్సి ఉండగా ఇది 1.2 కేజీల లోపే ఉంటోంది. నిర్దేశించిన బరువు ఉంటేనే వీటిని తీసుకోవాల్సి ఉన్నా క్షేత్రస్థాయిలో ఇది అమలు కావడంలేదు.

★ విద్యాసంస్థలకు తీసుకొచ్చే అట్టల్లో బయటకు కనిపించే గుడ్లు పెద్దవిగా... కింద అట్టల్లో చిన్నవాటిని పెట్టి తీసుకొస్తూ బురిడీ కొట్టిస్తున్నారు. తూకం వేసే పరిస్థితి ఎక్కడా లేకపోవడంతో కొన్నేళ్లగా ఈ దందా వ్యవస్థీకృతంగా జరుగుతోంది.

★ అధిక బరువు ఉండే గుడ్లు బహిరంగ మార్కెట్‌కు తరలించి చిన్నసైజువి పేద విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు.

జిల్లాలో నెలకి సరఫరా చేస్తున్న గుడ్లు

అంగన్‌వాడీలకు : 16,45,598

పాఠశాలలకు : 13 లక్షలు

చెల్లిస్తున్న : రూ. 1.9 కోట్ల వరకు

తక్కువుంటే తీసుకోవద్దు

ఒక్కో గుడ్డు తప్పకుండా 50 గ్రాముల బరువు ఉండాలి. 30 గుడ్లు ఉన్న అట్ట తప్పకుండా 1.5 కేజీల బరువు ఉంటేనే తీసుకోవాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించాం. నాణ్యమైనవి సరఫరా చేసేలా దృష్టి సారించాం.

– అప్పారావునాయుడు, డీఈఓ

ఇంత మోసం చేస్తారా?

తప్పుడు లెక్కలపై మత్స్యకారుల ఆగ్రహం

దేవరాపల్లి, న్యూస్‌టుడే : రైవాడ జలాశయంలో విడుదల చేయాల్సిన చేపపిల్లల సంఖ్యలో అధికారుల లెక్కలకు.. వాస్తవానికి మధ్య పొంతన లేకపోవడం మత్స్యకారులకు తీవ్ర ఆగ్రహం కలిగింది. ఈ వ్యవహారంలో భారీగా అవినీతి చోటు చేసుకుందంటూ అధికారుల తీరుపై మండిపడుతూ నిరసనకు దిగారు. జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో రైవాడ జలాశయంలో సోమవారం ఉదయం ఎమ్మెల్యే 4.27 లక్షల చేపపిల్లల్ని విడిచిపెట్టే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. చేపల వేటపై ఆధారపడి జీవనం సాగించే వారికి అందించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను ఎమ్మెల్యే వారికి వివరించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం తాటిపూడి నుంచి తీసుకొచ్చిన చేపపిల్లలను లీటరు డొక్కుతో కొలిచే ప్రక్రియను మత్స్యకారులు చేపట్టారు. మొత్తం 25 వేల పిల్లలు మాత్రమే ఉన్నట్లు లెక్క తేలడంతో మత్స్యశాఖ అధికారులు చేసిన మోసం బయటపడింది. దీంతో వారిని నిలదీసేసరికి అక్కడి నుంచి జారుకున్నారు. అధికారులంతా రైవాడ సచివాలయంలో ఉన్నారని తెలుసుకున్న చేపల వేటగాళ్లంతా అక్కడికి చేరుకొని ఆందోళనకు దిగారు. సుమారు 4లక్షల చేపపిల్లలు వేయాల్సి ఉన్నా తప్పుడు లెక్కలు చూపించారంటూ బైఠాయించి నినాదాలు చేశారు. సర్పంచి చల్లా లక్ష్మి, ఉప ఎంపీపీ ఉగ్రాకల గంగాభవాని తదితరులు మత్స్యశాఖ అధికారుల మోసంపై మండిపడ్డారు. అనంతరం సచివాలయంలో ఉన్న నర్సీపట్నం ఎఫ్‌డీఓ నాగమణి బయటకు వచ్చి సమాధానం చెప్పినా అది మత్స్యకారులకు సంతృప్తి కలిగించలేదు. ప్రస్తుతం ఎన్ని చేప పిల్లలు వేశారు, మిగతావి ఎప్పటిలోగా వేస్తారో లిఖితపూర్వకంగా సమాధానం చెప్పాలని భీష్మించారు. దీంతో చేసేది లేక సోమవారం కేవలం 50 వేల పిల్లలు మాత్రమే వేశామని.. మిగతావి 15 రోజుల్లోగా వేస్తామంటూ ఎఫ్‌డీఓ నాగమణి వారికి రాసి ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

★ మత్స్యకారుల ఆందోళన విషయం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వెళ్లడంతో మత్స్యశాఖ అధికారులపై మండిపడ్డారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి దీనిపై సమగ్ర విచారణ చేయిస్తామని తెలిపారు. ఆరోపణలు రుజువైతే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

జలాశయంలో చేప పిల్లలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ఇదిగో వరల్డ్ కప్!

హాకీ మెన్స్ జూనియర్ వరల్డ్‌కప్ పోటీలు తమిళనాడులో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో విజేతలకు అందించే ట్రోఫీని నగరంలో ప్రదర్శించి హాకీ క్రీడాకారుల్లో సరికొత్త ఉత్సాహం నింపారు. విశాఖ ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. –విశాఖపట్నం, న్యూస్‌టుడే

తెదేపాలో యువతకు ప్రాధాన్యం

హోం మంత్రి అనిత

నక్కపల్లి, న్యూస్‌టుడే: తెదేపాలో పదవులంటే అలంకారం కాదని, బాధ్యతనే విషయం గుర్తించాలని హోంమంత్రి వంగలపూడి అనిత ఉద్బోధ చేశారు. పాయకరావుపేట నియోజకవర్గ బూత్, గ్రామ, మండల, నియోజకవర్గస్థాయి కమిటీ సభ్యులతో సారిపల్లిపాలెం వద్ద క్యాంపు ఆఫీసు ఎదుట సోమవారం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబుతో కలిసి ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం పార్టీకి చెందిన నాయకులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, జ్యోతిప్రజ్వలన చేసి, కేకు కోశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా అందరం ఎన్నో కష్టాలు, అవమానాలు ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. దీనిపై విసిగిపోయిన ప్రజలు తెదేపాపై ఉన్న నమ్మకంతో చాలా పెద్ద బాధ్యత అప్పగించారన్నారు. పదవుల కేటాయింపులో యువతకు 40 శాతం అవకాశం కల్పించామని, అనివార్య కారణాలతో పదవులు రానివారికీ ప్రాధాన్యం ఇస్తామన్నారు. తనను కలిసేందుకు వచ్చిన అందరికీ అవకాశం కల్పించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.

అందరికీ ఉపాధి అవకాశాలు దక్కేలా చర్యలు

త్వరలోనే ఈ ప్రాంతంలో బొమ్మల పరిశ్రమ ఏర్పాటవుతుందని దీని ద్వారా 25 వేల మందికి మహిళలకు ఉద్యోగ, ఉపాధి లభిస్తుందని మంత్రి అనిత తెలిపారు. స్థానికంగా ఏర్పాటు కానున్న పరిశ్రమలతో జిల్లా తలసరి ఆదాయం పెరగనుందని, 2029 నాటికి ప్రతి ఇంటికో ఉద్యోగం వచ్చేలా చేస్తానన్నారు. అడ్డురోడ్డు-కోటవురట్ల రహదారి పనులు త్వరలోనే మొదలవుతాయని వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ఓట్లు తగ్గిన ప్రాంతాలపై దృష్టి పెట్టి స్థానిక ఎన్నికలకు బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కొప్పిశెట్టి వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పరిశీలకులు వెంకటేశ్వరరావు, నాయకులు గింజాల లక్ష్మణరావు, కురందాసు నూకరాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనిత

హాకీ విజేతలు నెల్లూరు, తూర్పు గోదావరి

నక్కపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-19 బాలురు, బాలికల హాకీ పోటీల్లో నెల్లూరు, తూర్పుగోదావరి జట్లు విజేతలుగా నిలిచాయి. సోమవారం జరిగిన తుది పోరులో బాలుర విభాగంలో తూర్పు గోదావరిపై నెల్లూరు 3-0 తేడాతో విజయం సాధించి విజేతగా నిలవగా, రన్నర్‌గా తూర్పు గోదావరి, తృతీయ స్థానంలో విశాఖ నిలిచాయి. బాలికల విభాగంలో విశాఖపై తూర్పు గోదావరి జట్టు 2-1 తేడాతో విజయం సాధించింది. విశాఖ రన్నర్‌గా, అనంతపురం తృతీయస్థానం సాధించాయి. విజేతలకు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ.పుష్పలత, వీసం రామకృష్ణ, రవిరాజ్, వెలగా ఈశ్వరరావు బహుమతి ప్రదానం చేశారు.

ట్రోఫీ అందుకుంటున్న నెల్లూరు బాలుర జట్టు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) వివిధ సమస్యలపై 295 వినతులు వచ్చాయి. వీటిలో రెవెన్యూ 151, పంచాయతీరాజ్ 37, పోలీసు 13, మున్సిపల్ 19 ఉన్నాయి. కలెక్టర్‌తో పాటు డీఆర్వో సత్యనారాయణ వీటిని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వీటికి పరిష్కారం చూపాలన్నారు. సమస్య పరిష్కారం అవుతుందని ఎంతో ఆశతో వస్తున్నవారిలో నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. పరిష్కారం కాని వాటిపై సమీక్ష చేపట్టారు. సంబంధిత శాఖల అధికారులను వివరాలను అడిగి తీసుకున్నారు. ప్రతిశాఖకు చెందిన అధికారులు నిత్యం వీటి స్థితిగతులపై సమీక్ష చేపట్టాలన్నారు. 1100 నంబరుకు ఫోన్ చేసి వీటి స్థితిగతులు తెలుసుకోవచ్చన్నారు.

జగన్మాత సేవలో స్పీకర్ అయ్యన్న

విజయవాడ, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దేవస్థానం ఏఈవో వెంకటరెడ్డి వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అయ్యన్నపాత్రుడు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో

హామీలు అమలు చేయాలని ఆందోళన

కలెక్టరేట్, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కార్యాచరణ సమితి (జేఏసీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు సోమవారం ధర్నా చేపట్టారు. ఏపీ ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సమాఖ్య జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సమస్యలు పరిష్కరించాలని 22 రోజుల సమ్మె చేపట్టామని, ఆమోదం తెలిపిన ఒప్పందాలను అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. జేఏసీ నాయకులు పూడి వెంకటరావు, టి.కృష్ణ మాట్లాడుతూ విద్యాశాఖా మంత్రి ఇచ్చిన హామీలను వందరోజుల్లో అమలు చేయాలన్నారు. పదవీ విరమణకు దగ్గరలో ఉన్న వారికి 62 ఏళ్ల పెంపు పరిమితి వర్తింపజేయాలని, మినిమం టైంస్కేల్ అమలు చేయాలన్నారు. ప్రభుత్వం సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీతో తక్షణమే చర్చలు జరిపి తక్షణమే న్యాయం చేయాలన్నారు. డిసెంబరు 10న విజయవాడలో ఆందోళన చేపడతామన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

★ మాడుగుల మండలం జాలంపల్లి భీమలింగేశ్వర రజక కో ఆపరేటివ్ సొసైటీకి చెందిన 30 మంది తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని ఎకరా భూమిలో ఏళ్ల తరబడి రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, గ్రామానికి చెందిన కొంతమంది ఈ స్థలం ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

★ అనకాపల్లి మండలం తగరంపూడి అంగన్వాడీ కేంద్రం ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పాటించని అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మండల అధికారులు, ఎంపీపీ, స్థానిక ఎంపీటీసీ సభ్యుడికి ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. విచారణ చేసి న్యాయం చేయాలన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: రైతులు ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఆశాదేవి పేర్కొన్నారు. బవులువాడలో సోమవారం 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులతో మాట్లాడి కష్టాలు అడిగి తెలుసుకున్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ ద్వారా లబ్ధిపొందుతున్న రైతులు, పంట పొలాల్లో యూరియా వాడకం తగ్గించడం, రాబోయే సీజన్లలో ఏ విత్తనాలు అవసరం అవుతాయి, ఏ పంటలు సాగు చేస్తారు, నీటి వినియోగం తదితర అంశాలపై రైతులతో చర్చించారు. వారం రోజుల్లో ప్రతి గ్రామంలో సిబ్బంది ఒక బృందంగా ఏర్పడి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సుబ్రహ్మణ్యం, వ్యవసాయాధికారి రంగారావు, అధికారులు పాల్గొన్నారు.

బవులువాడలో రైతులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి ఆశాదేవి

శాఖల సమన్వయంతో నేరాల నియంత్రణ: ఎస్పీ

మహిళా సంరక్షణ కార్యదర్శులకు అభినందిస్తున్న ఎస్పీ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: గ్రామ, వార్డుల్లో అన్నిశాఖల సమన్వయంతో నేరాలను నియంత్రించేలా మహిళా సంరక్షణ కార్యదర్శులు చొరవ చూపాలని ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన మహిళా సంరక్షణ కార్యదర్శులు ఉమ, సయిదా, వీరలక్ష్మి, అరుణ, రాజేశ్వరి, లలితను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళా, బాలల భద్రత, గంజాయి నిర్మూలన, సైబర్ నేరాలపై దృష్టి సారించాలన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శులు అన్నిశాఖలను సమన్వయం చేసుకుంటూ నేరాలను నియంత్రించేలా నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. అసాంఘిక కార్యక్రమాలకు అరికట్టేలా చూడాలన్నారు. బాల్యవివాహాలు జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఈ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 60 ఫిర్యాదులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఫిర్యాదులను పరిశీలించి సమస్యలు పరిష్కరించేలా 'స్పెషల్ ఎస్‌హెచ్‌ఓలు' ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 60 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులకు పంపి చట్టపరంగా వెంటనే పరిష్కరించాలన్నారు. ఏడు రోజుల్లోగా ఫిర్యాదుల నివేదికను పంపాలని ఆదేశాలు జారీ చేశారు. అదనపు ఎస్పీలు ఎల్.దేవ ప్రసాద్, మోహనరావు పాల్గొన్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌పై ఆధారాలు లేకుండా తప్పుడు వార్తలు రాస్తున్న ఒక పత్రికపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఎస్పీ మోహనరావుకు మునగపాక మండల మాజీ తెదేపా అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు.

సేంద్రియం.. తీయదనం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: చెరకు సాగు కలిసి రావడం లేదని చాలామంది ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారిస్తుంటే పాయకరావుపేట మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు ఎం.శ్రీనివాసరాజు సేంద్రియ విధానంలో చెరకు సాగు చేస్తూ మేలైన దిగుబడులు సాధిస్తున్నారు. చెరకుతో అనుసరిస్తున్న పద్ధతులు, మార్కెటింగ్ గురించి ఆయన ఏమంటున్నారంటే..

బెల్లం దిమ్మెలు

గోమూత్రం, పేడ: ఎరువులు, పురుగు మందుల వినియోగం మానేసి 14 ఏళ్లు అవుతోంది. 15 ఎకరాల్లో ఏటా చెరకు పండిస్తున్నా. సేంద్రియ ఎరువు కోసం ఒంగోలు జాతి ఆవును పెంచుతున్నా. గోమూత్రం, పేడ, పుట్టమన్ను, ఉలవ పిండిని నీటిలో నానబెడతాం. ఐదు రోజుల తర్వాత ఆ మిశ్రమాన్ని పొలంలో చల్లుతాం. చెరకు నాటిన మొదటి ఏడాది 25 టన్నులే దిగుబడి వస్తుంది. రెండో ఏడాది నుంచి 30 టన్నులకు తగ్గకుండా వస్తోంది.

రైతేరాజు

సొంతంగా బెల్లం, చెరకు రసం తయారీ: ఆర్గానిక్ విధానాలను అనుసరిస్తూ బెల్లం తయారు చేస్తున్నాం. బెల్లంతోపాటు చెరకు రసం అమ్మకాలు చేపట్టాం. సేంద్రియ పద్ధతుల్లో తయారు చేసిన రెండు ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంటోంది. రోజుకు 500 లీటర్ల రసం అమ్ముడవుతోంది. బెల్లం కేజీ పరిమాణంలోనూ, చిన్న ఉండలు రూపంలోనూ తయారు చేస్తున్నాం. వీటిని హైదరాబాద్, విశాఖపట్నం, ఖమ్మం, రాజమహేంద్రవరం, విజయవాడ మార్కెట్లకు పంపుతున్నాం.

● కేజీ బెల్లం రూ.90, చిన్నసైజులో ఉన్నవి కేజీ రూ.120 చొప్పున ధర పలుకుతోంది. చెరకు రసం లీటరు రూ.70 చొప్పున అమ్ముతున్నాం. ఎకరా విస్తీర్ణంలో చెరకు సాగుకు మొదటి ఏడాది రూ.15 వేలు, రెండో ఏడాది నుంచి రూ.10 వేలకు మించి ఖర్చు కావడం లేదు. ఎకరాకు రూ.70 వేల వరకు ఆదాయం వస్తోంది.

విద్యార్థులకు పాఠాలు: అగ్రికల్చర్ బీఎస్సీ, డిప్లొమా చదువుతున్న విద్యార్థులకు బెల్లం తయారీపై అవగాహన కల్పిస్తున్నా. ఏటా వ్యవసాయ కళాశాలలకు చెందిన విద్యార్థులు క్షేత్ర సందర్శనకు వస్తున్నారు. వారికి సేంద్రియ వ్యవసాయ పద్ధతులను వివరిస్తున్నా. - ఎం.శ్రీనివాసరాజు



బెల్లం ధరలు తగ్గు ముఖం

రకం	గత వారం	ఈ వారం
రంగులు	4645	4180
మధ్య	4250	3895
నాసిరకం	4130	3765

గత వారం రోజులుగా అనకాపల్లి బెల్లం మార్కెట్లో అన్ని రకాల ధరలు తగ్గాయి. రంగులు రూ.465, మధ్య రకాలు రూ.355, నాసి రకాలు రూ.365 తగ్గాయి.

రైతు ప్రశ్న - శాస్త్రవేత్త సలహా

? వేరుసెనగలో మచ్చాకు ఆనవాళ్ల రకాలేంటి. - బాబూరావు, దిబ్బపాలెం

✓: ధరణి, నిత్యహరిత, విశిష్ఠ రకాలున్నాయి. ఇవి వర్షాభావ పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే రకాలుగా పరిశీలనలో గుర్తించారు.

వర్షాభావ పరిస్థితులను తట్టుకునే రకాలివే..

? నీటి సదుపాయం ఉండటంతో కాయగూరల్లో అంతర పంటగా రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నా. పంటను కత్తెర పురుగు ఆశించి నష్టపోతున్నా. నివారణకు ఏం చేయాలి. - కిల్లో అర్జున్ చౌడుపల్లి

✓: పురుగు ఉధృతి అధికంగా ఉంటే ఎకరాకు 200 లీటర్ల నీటిలో ఎమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాములు/స్పైనోశాడ్ 60 మి.లీ. కలిపి మొక్కలు, ఆకులు తడిసేలా పిచికారీ చేయాలి.

? రెండెకరాల పొలం ఉంది. నీటి సదుపాయం లేక ఖాళీగా ఉంచాల్సి వస్తోంది. రబీలో నీటి సదుపాయం లేకపోయినా పంటలను పండించ వచ్చా. - రాంబాబు తాజంగి

✓: రబీలో నీటి సదుపాయం లేకపోయినా కొమ్ము సెనగ, పొద్దుతిరుగుడు వంటివి సాగు చేయవచ్చు. ఆరుతడి పంటలుగా వేరుసెనగ, పెసలు, అపరాలను పరిశీలించవచ్చు.

రైతుల ప్రశ్నలు, సందేహాలకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సేద్యపు విభాగం శాస్త్రవేత్త బీఎస్ సందీప్‌నాయక్ సమాధానాలు ఇచ్చారు. - న్యూస్‌టుడే, చింతపల్లి

సాగులో సందేహాలా.. ఫోన్ చేయండి రైతుల ప్రశ్నలు, సందేహాలకు అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కేవీ రమణమూర్తి సమాధానాలిస్తారు. మంగళవారం ఉ. 10 - సా. 4 గంటల వరకు 9849636324 నంబరుకు ఫోన్‌చేయవచ్చు.

నువ్వులు లాభదాయకం

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఉత్తర కోస్తాలో పండించే అన్ని పంటల కంటే నువ్వులు లాభదాయకమని వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్తలు లెక్క తేల్చారు. ఉత్తర కోస్తా జిల్లాల్లో వరితోపాటు చెరకు, మొక్కజొన్న, అపరాలు, నూనె గింజల పంటలు సాగు చేస్తున్నారు. ఈ పంటల్లో సాగు ఖర్చు, దిగుబడి, ఆదాయం ఎంత వస్తుందనే అంశంపై పరిశీలన చేశారు.

● మునిసిన సీజన్ (2024-25)లో వివిధ పంటల్లో ఆదాయం, వ్యయ నిష్పత్తులను లెక్క చూస్తే అన్నింటికంటే నువ్వులు లాభదాయకంగా ఉన్నాయని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆర్థిక శాస్త్రవేత్త డాక్టర్ ఎం.చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు.


నువ్వు పంట

● నువ్వుల సాగుకు ఎకరాకు రూ.3,750 ఖర్చవుతుంది. 2.08 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మార్కెట్లో క్వింటాల్ ధర రూ.9,850 పలికింది.

● చోడి సాగుకు రూ.6,230 పెట్టుబడి కాగా, 4.9 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటాల్ ధర రూ.3,800గా ఉంది.

● మొక్కజొన్న సాగుకు రూ.25,542 ఖర్చవగా దిగుబడి 28.75 క్వింటాళ్లు వచ్చాయి. మార్కెట్ ధర రూ.2,080 పలికింది. తద్వారా రూ.59,800 ఆదాయం వచ్చింది.

● మినుము కంటే పెసర లాభదాయకంగా ఉంది. పెసర సాగు ఖర్చు తక్కువ. మినుము సాగుకు ఎకరాకు రూ.12,280 అయితే పెసరకు రూ.8,672 సరిపోతుంది. దిగుబడులు రెండు సమానంగానే వస్తున్నాయి. మార్కెట్లో మినుము క్వింటాల్ ధర రూ.6,880 ఉంటే పెసర రూ.7,200 పలికింది.

వరిలో వెద విధానం మేలు: వరి సాగుకు రైతులు పలు విధానాలను ఆచరిస్తున్నారు. ఎక్కువ మంది నారు పెంచి వేస్తారు. కొందరు విత్తనాలను నేరుగా వెదజల్లుతారు. మొలకెత్తిన విత్తనాన్ని డ్రమ్‌సీడర్ సహాయంతో మరికొందరు వేస్తారు. తక్కువ నీటితో సాగు చేసే శ్రీవిధానం మరో పద్ధతి ఉంది. అన్నింటికంటే వెద జల్లే విధానమే ప్రయోజనకరంగా ఉంది. ఎకరా విస్తీర్ణంలో నారు విధానంలో రూ.34,775 ఖర్చయితే, వెద విధానంలో రూ.29,808 అవుతుంది. వెదలోనే రెండు క్వింటాళ్ల దిగుబడి అధికంగా వస్తుంది.

రూపాయి ఖర్చుకు వచ్చే ఆదాయం ఇలా..

పంట	ఆదాయ, వ్యయాల నిష్పత్తి
నువ్వులు	3.12
చోడి	1.98
మొక్కజొన్న	1.34
పెసర	1.19
గోగు	1.02
వేరుశనగ	0.72
వరి	0.67
మినుము	0.56
కంది	0.34
చెరకు	0.13

45 శాతం కూలీల ఖర్చు: సాగులో కూలీల ఖర్చు 45 శాతంగా ఉంది. యాంత్రీకరణ ద్వారా ఖర్చు తగ్గించుకోవచ్చు. నాణ్యమైన విత్తనం వేసుకోవాలి. ఎంత ఖర్చు చేసినా విత్తనం బాగోలేకపోతే దిగుబడులు రావు. బిందు సేద్యం విధానంపై దృష్టిసారించాలి.

మత్స్యకారుల ధర్నా విరమణ

నక్కపల్లి, న్యూస్‌టుడే: బల్క్‌డ్రగ్ పార్కు సమస్య పరిష్కారంలో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడిని కలిసేందుకు రాజయ్యపేటలో 77 రోజులుగా సాగిన ధర్నాను విరమిస్తున్నట్లు మత్స్యకార నాయకులు సోమవారం ప్రకటించారు. అనంతరం తహసీల్దారు ఆర్.నరసింహమూర్తి, సీఐ జె.మురళీని కలిసి ఆమోదపత్రం అందించారు. మంత్రి సూచనల మేరకు చర్చలు విజయవంతంగా సాగేందుకు తామంతా కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. చర్చలు ఫలించకపోతే తిరిగి ధర్నా కొనసాగిస్తామన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, ఎరిపల్లి నాగేశ్, పిక్కి సత్తియ్య, పిక్కి కోదండరావు, ఎం.మహేశ్ బాబు, పిక్కి స్వామి, జి.సోమేశ్వరరావు, అప్పలరాజు, నూకమ్మ, వెంకటేష్, కాశీ, నూకరాజు పాల్గొన్నారు. అంతకుముందు మత్స్యకార నాయకులతో మండల పరిషత్తు కార్యాలయంలో మంత్రి అనిత సమావేశమయ్యారు. ఇటీవల ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లే కమిటీకి సంబంధించి ఆమె చర్చించారు. ఆందోళన నిలిపివేస్తే నాలుగైదు రోజుల్లోనే సీఎం చంద్రబాబు వద్దకు కమిటీని తీసుకెళ్తానని చెప్పారు. దీనిపై నాయకుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో శిబిరాన్ని కొనసాగిస్తూనే వస్తామని పలువురు వెల్లడించగా, ఇందుకు మంత్రి ఒప్పుకోలేదు. సీఎంనే నేరుగా గ్రామానికి తీసుకువచ్చి మాట్లాడించాలనే అభ్యర్థన రాగా, చర్చలు విజయవంతమైతే అప్పుడు తీసుకువస్తానని వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వీవీ రమణ, డీఎస్పీ పి.శ్రీనివాసరావు, తహసీల్దారు ఆర్.నరసింహమూర్తి, పిక్కి తాతీలు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు ఆమోదపత్రం ఇస్తున్న నాయకులు

THE THANDAVA COOPERATIVE SUGARS LIMITED, NO.C.181.
PAYAKARAOPETA-531126. ANAKAPALLI DISTRICT (A.P).
E-AUCTION SHORT TENDER NOTICE
E-Auction for sale of Molasses of the M/s. The Thandava Co-op. Sugars Limited, Payakaraopeta, will be conducted through A.P. E-Procurement (Konugolu Portal) the details are as follows.

Sl.No	Description of Material	Tender ID	Tender Date And Time
1	Molasses	25387	10.12.2025, 14.05 to 17.05

The bidders can go through A.P. E-Procurement (Konugolu Portal) konugolu.ap.gov.in for terms and conditions for e-auction details. Contact Cell No.80960 14411
Payakaraopeta. Dt.24.11.2025.
Sd/- P.PRASADA RAO. Managing Director

క్వారీ లారీ బీభత్సం

లక్ష్మీదేవిపేట, అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని విజయరామరాజు పేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సోమవారం తెల్లవారుజామున క్వారీ లారీ బీభత్సం చేసింది. భారీ బండరాళ్ల లోడ్‌తో ఒక్కసారిగా ట్రాక్ రక్షణ కోసం అండర్ బ్రిడ్జికి ఇరువైపులా ఏర్పాటు చేసిన ఐదు గడ్డర్లను ఢీకొట్టింది. దీంతో ఒక గడ్డర్ పూర్తిగా విరిగిపోయి రహదారిపై పడిపోయింది. మిగిలిన గడ్డర్లు ధ్వంసమయ్యాయి. భారీ బండరాయి ఒకటి ఫుట్‌పాత్‌పై పడిపోయింది. ఆ సమయంలో ఎలాంటి వాహనాలు రాకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న ఆర్పీఎఫ్ ఎస్సై నవీన్ ఆధ్వర్యంలో పోలీసులు, ట్రాక్ విభాగం సిబ్బంది ఇక్కడికి చేరుకుని ధ్వంసమైన గడ్డర్లను క్రేన్ సహాయంతో తొలగించారు. ట్రాక్ విభాగం సిబ్బంది ట్రాక్‌ను పరిశీలించి ఎలాంటి నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. చిన్న చిన్న మరమ్మతులు చేపట్టారు. రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఆటంకం లేకుండా చేశారు. దేవరాపల్లి క్వారీ నుంచి బండరాయిల లోడ్‌తో రాంబిల్లి ఎన్ఏఓబీకి రవాణా చేస్తుండగా గడ్డర్‌ను ఢీకొట్టినట్లు సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించినట్లు ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తెలిపారు. రాంబిల్లి వద్ద క్వారీ లారీని పట్టుకుని రూ. 42 వేల జరిమానా విధించామన్నారు. డ్రైవర్ జితేంద్ర సింగ్ లైసెన్సును రవాణాశాఖ అధికారులకు పంపి రద్దు చేయించామన్నారు. క్వారీ లారీ డ్రైవర్‌పై రైల్వే అధికారులు కేసు నమోదుచేశారు. సంఘటనా స్థలాన్ని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పరిశీలించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాదానికి కారణమైన లారీ

ఆవిరైన ఆశలు..

సాయితనూజ్‌కుమార్ (పాతచిత్రం)

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: భర్త మృతిచెందాడు.. ఆశలన్నీ బిడ్డలపై పెట్టుకుని కూలీ పనిచేస్తూ జీవిస్తున్న తల్లికి కుమారుడు మృతి తీరని వేదన మిగిల్చింది. దేవుడా నేను ఏ పాపం చేశానంటూ తల్లి రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది. తుమ్మపాల శారదానదిలో ఆదివారం గల్లంతైన బాలుడి మృతదేహాన్ని సోమవారం పోలీసులు కనుగొన్నారు. గోపాలపట్నంలో ఉంటున్న మహేశ్వరి భర్త రామకృష్ణ రైల్వేలో కాంట్రాక్టు పనుల్లో పనిచేసేవాడు. వీరికి ఎస్.కోట సమీపంలోని ఉసిరి గ్రామం. ఉపాధి కోసం గోపాలపట్నం వచ్చి ఇక్కడే నివాసం ఉండేవారు. రామకృష్ణ అనారోగ్యంతో మృతి చెందడంతో మహేశ్వరి తన కుమారుడు, కుమార్తెను కూలీ పని చేసుకుంటూ చదువు చెప్పిస్తోంది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సాయి తనూజ్‌కుమార్ తన స్నేహితులతో కలిసి ఆదివారం అనకాపల్లి వచ్చారు. బొజ్జన్నకొండ వద్ద గడిపి అక్కడి నుంచి తుమ్మపాల శారదానది వద్దకు వచ్చి స్నానానికి దిగారు. నది ప్రవాహం ఎక్కువగా ఉండడంతో తనూజ్‌కుమార్‌తో పాటు లక్ష్మణ్ నదిలో గల్లంతయ్యారు. దగ్గరలోని మత్స్యకారులు లక్ష్మణ్‌ను కాపాడారు. సాయి తనూజ్‌కుమార్ గల్లంతవడంతో సోమవారం గాలించగా మృతిచెందాడు. భర్తను పోగొట్టుకుని ఆశలన్నీ కుమారుడిపైనే పెట్టుకుని జీవిస్తున్న తమకు తీరని అన్యాయం చేశావా? అంటూ బాలుడి తల్లి, కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది. కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

వ్యాన్ ఢీ: ఇద్దరికి గాయాలు

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై రేగుపాలెం సమీపాన వ్యాన్ ఢీకొని భార్యాభర్తలకు గాయాలయ్యాయి. ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం కోసం వెళ్తూ అనధికార డివైడర్ దాటుతుండగా ఈ ఘటన జరిగినట్లు తెలిసింది. తీవ్రంగా గాయపడి రోడ్డుమీద పడిపోయిన ఈ ఇద్దరిని అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్లు తెలిసింది. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని గ్రామీణ పోలీసులు తెలిపారు.

ఉన్నత లక్ష్యాలే కీలకం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పట్టణ ఎస్సై సావిత్రి కోరారు. సోమవారం కొత్తపేట ఉన్నత పాఠశాలలో ఆమె విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి పథకాలు అమలు చేస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్‌ఎం వెంకటరమణ, పీఈటీ కిషోర్, ఏఎస్ఐ చల్లారావు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సావిత్రి

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి, ✆ 73862 01191.

స్థిరాస్తులపై విశాఖ జిల్లా, విజయనగరం జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఎక్కడ ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ ✆ ✆ 9396 999 669

REAL ESTATE

FLAT FOR SALE

SEETHAMMADHARA

Rs.6999/Sft Luxury 3BHK 2450 Sft New Flat. North East Facing. 100% Vastu, Lift, Generator, 2 Parkings. Ph: 7893126804

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

121Sq.Yds. Cellar+G+1 Building for sale. North-East Facing. Exclnt Vastu - Prime Location Assured Rental. A.G.M.T. ✆ 9885824528.

PLOT FOR SALE

BHOGAPURAM

భోగాపురం /సవరవిల్లి Nr. ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టు. కమర్షియల్ 2000 గ॥లు VMRDA RERA నెం.తో కలదు. 9493244471, 9396972239

EENADU eClassifieds

GENERAL

పినగాడి దగ్గర్లో 100 Ft. రోడ్‌ని ఆనుకొని కమర్షియల్ ప్లాట్స్ కలవు & వెంటనే ఇల్లు కట్టుకొనుటకు తక్కువ ధరలో స్థలాలు. ✆ 9491884445.

JOBS

Golden Opportunity to Earn Un-Limited income for everyone (M/F) as part/ full time just Reffer VRS/ RTD employees with zero investment not MLM trust (Face value) is your earnings. (5K-10K/ Day) Preference to Team Leaders/ Tax Consultants/ Bank Managers/ Working Professionals ✆ 8790189686

Need Teaching Staff and Principal for ITI Anakapalli and Atchuthapuram. Salary: 15K/ 25K. Contact: 7032015042.

Wanted Male Worker for Musical Showroom @ Sampath Vinayaka Temple Road, Asilmetta. Salary: 12,000. Ph: 9949466685

Walk in interview 25-11-25 10:30 AM to 4:00 PM 1. Accountant, 2. Computer Operator, 3. Office Assistant 4. Receptionist Candidates with fluency in English &Min 3 yrs Exp. Joshi Chambers G.K. Towers 3rd floor Dwarakanagar. Ct: 0891-2541137.

మా కంపెనీలో పనిచేయుటకు Telecallers (F), Marketing Executives (M) Min. 1 Year.Exp. కావలెను. Ph: 9703398398.

ప్రైవేటు బ్యాంకులోకి 10th, ఇంటర్, All (డిగ్రీ, B.Tech., Dip. & ITI) కావలెను. Sal.: 18-25K, Age 35లోపు, స్పాట్ జాయిన్. ✆ 7995439539

నేవల్ డాక్‌యార్డ్‌లో పనిచేయుటకు మేనేజర్స్ (సివిల్&ఎలక్ట్రికల్), డ్రైవర్స్, సూపర్‌వైజర్స్, హెల్పర్స్ (స్త్రీ&పు) కావలెను. మల్కాపురం, శ్రీహరిపురం, గాజువాక, ప్రాంతాల వారికి ప్రాధాన్యత. PVC (పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికేట్) తప్పనిసరి. 7995476203, 9989554270, 9395122999.

వైజాగ్ లాడ్జిలో పనిచేయుటకు మధ్య వయస్కుడైన పార్ట్ టైమ్ సూపర్‌వైజర్ (8AM to 1PM) కావలెను. ఫోన్ : 9441335999.

విశాఖ మద్దిపాలెం 104ఏరియా కాలేజీలో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12గ డ్యూటీ 13-14 వేలు - శాలరీ అర్హత SSC: 40-45 సం॥లు ✆ 8520977729.

అచ్యుతాపురం దువ్వాడ పరవాడ ఆటోనగర్ కంపెనీల్లో 10th-డిగ్రీ, MBA, బి.టెక్, డిప్లొమో, ITI, క్యాషియర్, సూపర్‌వైజర్, రిసెప్షనిస్టు, హెల్పర్స్, సెక్యూరిటీస్. ✆8341177761, 8019647888

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గల్లంతైన మృతదేహాలు లభ్యం

రావికమతం, న్యూస్‌టుడే: జలాశయంలో స్నానానికి దిగి గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తకోటకు చెందిన ట్రాక్టర్ కూలీగా పనిచేస్తున్న గుమ్ముడు శ్రీనివాస్ (29) సహచరులతో కలిసి కల్యాణపులోవ జలాశయం వద్దకు విహారయాత్రకు వెళ్లాడు. జలాశయంలో స్నానానికి దిగి ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. వెంటనే కొత్తకోట పోలీసులు, స్థానిక యువకులు ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో తల్లి రుక్మిణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రావికమతం అగ్నిమాపక సిబ్బంది జలాశయంలో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు తీసుకొచ్చారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించినట్లు కొత్తకోట ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

మృతదేహానికి శవ పంచనామా నిర్వహిస్తున్న అధికారులు

శారదానదిలో..

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట మండలం తేగాడ సమీపాన శారదా నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది. వృద్ధురాలి అంత్యక్రియలకు వెళ్లి గ్రామానికి చెందిన రైతు నగిరెడ్డి చినరమణ (49) నదిలో స్నానానికి దిగి గల్లంతైన విషయం తెలిసిందే. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లు నదిలో గాలించి మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈయనకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్సై మనోజ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కానరాని ఇద్దరు యువకుల జాడ

దేవరాపల్లి, అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: రైవాడ జలాశయంలో ఆదివారం జరిగిన బోటు ప్రమాదంలో గల్లంతైన ఇద్దరు యువకుల జాడ ఇంకా కనిపించలేదు. వారి ఆచూకీ కోసం రాష్ట్ర విపత్తుల స్పందన దళంతోపాటు (ఎన్‌డీఆర్‌ఎఫ్) స్థానికులు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రైవాడ జలాశయంలో గాలించారు. అయినా వారి ఆచూకీ కనిపించకపోవడంతో కుటుంబసభ్యులతోపాటు బంధువులు, స్నేహితులు జీనబాడు బోటు రేవువద్ద ఆశగా ఎదురుచూస్తున్నారు. బోటు మునిగిపోయిన ఘటనలో అనంతగిరి మండలం జీనబాడుకు చెందిన నలుగురు ప్రమాదానికి గురవగా.. ప్రసాదు ప్రాణాలతో బయటపడ్డాడు. గంజాయి జీవన్‌కుమార్ మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఫారెస్టు ప్రొటెక్షన్ వాచరు గాలి అప్పలరాజు, దెబర రమేష్ ఆచూకీ ఇంకా లభించలేదు. చీకటిపడటంతో గాలింపు నిలిపివేశామని.. మంగళవారం కొనసాగిస్తామని జాతీయ విపత్తు సహాయక దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) ఇన్‌స్పెక్టరు టి.రామకృష్ణ తెలిపారు. 23 సభ్యులతో కూడిన తమ బృందం గాలించిందన్నారు. జీనబాడు రేంజర్ ఆర్.రాజబాబు, ఫారెస్టు సెక్షన్ అధికారి పి.శివకుమార్, తహసీల్దారు వీరభద్రాచారి తదితరులు దగ్గరుండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. బాధిత కుటుంబాలను అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం కుమారుడు తదితరులు పరామర్శించారు. జీవన్ కుమార్ అంత్యక్రియలు సోమవారం సాయంత్రం జరిగాయి.

రైవాడ జలాశయంలో ముమ్మర గాలింపు

రైవాడ జలాశయంలో గాలింపు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	100	98
లైవ్	127	118
డ్రెస్‌డ్	184	206
స్కిన్‌లెస్	210	216

(c) eenadu

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: **రాజు వెడ్స్ రాంబాయి,** సత్య నారాయణ స్క్రీన్2: **రోడ్డు టు రివెన్స్,** పర్తిసాయి: **ప్రేమంటే,** షిర్డిసాయి: **గర్ల్‌ఫ్రెండ్,** రామచంద్ర: **12ఎ రైల్వేకాలనీ,** సత్య నారాయణ స్క్రీన్1: **పాంచ్‌మినార్,** వెంకటేశ్వర: **మఫ్టీ పోలీస్,** అచ్యుతాపురం: ఎస్‌టీబీఎల్ సినీవరల్డ్ స్క్రీన్-1 **12ఎ రైల్వేకాలనీ,** స్క్రీన్-2: **ప్రేమంటే**

రేపు విద్యుత్తు సరఫరా నిలుపుదల

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కొండకర్ల విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో ఎం.జగన్నాథపురం ఫీడర్ పరిధిలో యర్రవరంతో పాటు మరికొన్ని ప్రాంతాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్, ఏఈ భానుప్రకాశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు స్తంభాల ఏర్పాటు కోసం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

పశువైద్యాధికారిని నియమించండి

మునగపాక, న్యూస్‌టుడే: తోటాడ కేంద్రంలో పశువైద్యాధికారి పోస్టును తక్షణమే భర్తీ చేయాలని పాడిరైతులు సోమవారం పశువైద్యకేంద్రం ఎదుట ఆందోళన చేపట్టారు. గత మూడు నెలలుగా పశువైద్యాధికారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ ప్రాంతంలో 50 శాతం రైతులు పాడిపరిశ్రమపైనే ఆధారపడ్డామని పేర్కొన్నారు. తక్షణమే వైద్యుడిని నియమించాలని కోరారు.

పాడిరైతుల ఆందోళన

టార్పాలిన్లకు అన్నదాతల ఎదురుచూపు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కాపాడుకునేందుకు సహాయపడే టార్పాలిన్లను రైతులకు అందించడానికి వ్యవసాయ శాఖ ముందుకురావడం లేదు. భారీ వర్షాలు కురిసినా, వరద ముంచెత్తినా, పంట నూర్పిడి చేసే సమయాల్లో అకాల వర్షం కురిసినా వీటితో ఉపశమనం లభిస్తుంది. గత తెదేపా పాలనలో ప్రతి రైతుకు రాయితీపై వీటిని అందించేవారు. వైకాపా హయాంలో వీటి పంపిణీ పట్ల మొండిచెయ్యి చూపింది. అప్పటి నుంచి రైతులు వీటిని అద్దెకు తెచ్చుకుని పంటలను కాపాడుకుంటున్నారు.

జిల్లాలో ఈఏడాది అధిక సంఖ్యలో రైతులు వరిని సాగుచేస్తున్నారు. వాతావరణ కలిసి రావడంతో పంట ఏపుగా పెరిగింది. పండిన పంటను డిసెంబరులో కోతలు కోస్తారు. ఈ సమయంలో వర్షాలు కురిస్తే టార్పాలిన్లు చాలా ఉపయోగపడతాయి. వీటిని బహిరంగ మార్కెట్‌లో అద్దెకు తీసుకుంటే రైతులపై భారం పడుతుంది. మార్కెట్‌లో వీటిని ధర రూ.7 వేల నుంచి రూ.12 వేల వరకు పలుకుతోంది.

మెట్టప్రాంతాల్లో వినియోగిస్తున్న టార్పాలిన్లు

ప్రభుత్వానికి నివేదించాం..: రైతులకు టార్పాలిన్లు చాలా అవసరమని ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. టార్పాలిన్లు ఇవ్వాలని రైతులు సైతం రైతు సేవా కేంద్రాల్లో అడుగుతున్నారు. గతంలో వీటిని రాయితీపై అందించాం. ఇప్పుడు మళ్లీ అందించడానికి చర్యలు తీసుకుంటాం. **- ఆశాదేవి, జిల్లా వ్యవసాయాధికారిణి**

అదరగొట్టిన ప్రసంగాలు.. అందుకున్న బహుమానాలు

ప్రసంగిస్తున్నవిద్యాధరి పాఠశాల విద్యార్థిని

బహుమతులు సాధించిన విద్యార్థులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: వక్తృత్వ పోటీల్లో విద్యార్థుల ప్రసంగాలు అందరినీ ఆలోచింపచేశాయి. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో అనకాపల్లిలోని విద్యాధరి పాఠశాల, సిటీ పబ్లిక్ పాఠశాలల్లో సోమవారం నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ల ప్రభావం' అంశంపై నిర్వహించిన పోటీల్లో అద్భుత ఉపన్యాసాలు ఇచ్చారు. వీటి ప్రభావం వల్ల చదువులో వెనుకబాటు, కంటిచూపు సమస్య, చెడుదారి పట్టే అవకాశాలపై క్షుణ్ణంగా వివరించారు. విద్యాధరి పాఠశాలలో ప్రతిభ చూపిన మళ్ల అమృత (9వ తరగతి), బొడ్డేడ తాప్సి (10వ తరగతి), కర్రి మనస్విని (10వ తరగతి)కి పాఠశాల కరస్పాండెంట్ యల్లపు శివరామకృష్ణ బహుమతులు అందజేశారు. సిటీ పబ్లిక్ పాఠశాలలో ప్రతిభ చూపిన ఈ.లాస్యశ్రీ కుమారి (8వ తరగతి), జి.రమ్య (9వ తరగతి), కులశాలిక్ (9వ తరగతి)లకు పాఠశాల హెచ్‌ఎం ఉమాదేవి బహుమతులు ఇచ్చారు.

పోటీలో సిటీ పబ్లిక్ పాఠశాల విద్యార్థిని

విజేతలతో సిటీ పబ్లిక్ పాఠశాల హెచ్‌ఎం తదితరులు

ఫిర్యాదుల పరిష్కారానికి పెద్దపీట

పాయకరావుపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఫిర్యాదుల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నామని తహసీల్దారు ఎస్.ఎ.మహేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సమస్యలపై వచ్చిన వాటిని తక్షణమే పరిష్కరిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ-2 రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మంగవరంలో ఎన్ఎస్ఎస్ శిబిరం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: మంగవరంలో స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఏడు రోజుల పాటు సేవా కార్యక్రమాలు చేపడతామని ప్రోగ్రాం అధికారి జి.తాతయ్యనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంగలపూడి రామారావు, గోవింద్, కొండలరావు, డాక్టర్ అరుణకుమార్ త్రిపాఠి పాల్గొన్నారు.

వీఆర్వో సంఘాల ఎన్నిక

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), కశింకోట, న్యూస్‌టుడే: వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడుగా పాలిక దుర్గారావు, ఉపాధ్యక్షురాలిగా ఎస్.ఇందును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఈ ఎన్నిక జరిగింది. జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.శివజోగినాయుడు, డివిజన్ అధ్యక్షుడు ఏవీ గణపతి, ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ పాల్గొన్నారు. కశింకోట వీఆర్వోల సంఘం అధ్యక్షునిగా బొడ్డేడ శివాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా పరవాడ నాయుడుబాబు, కార్యదర్శిగా కంకనాల అప్పారావు, సహాయ కార్యదర్శి నడిపల్లి మీనాకుమారి, కోశాధికారిగా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

బాధిత కుటుంబానికి పరిహారం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పాముకాటుకి గురై ఎలమంచిలి ధర్మవరం వీధికి చెందిన జనసేన కార్యకర్త కోలపాటి సన్యాసిరావు మృతిచెందగా కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు రూ. 5 లక్షల బీమా చెక్కును అందించారు. ఆదివారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మృతుడి భార్య కోలపాటి లక్ష్మి ఆయన చెక్కును అందించారు. నాయకులు కొఠారు నరేష్, నగేష్, శ్యాం పాల్గొన్నారు.

సదుపాయాలపై జాగ్రత్తలు తప్పనిసరి

మునగపాక, న్యూస్‌టుడే: ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు సరైన రీతిగా చదువు చెప్పడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనపై జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ ప్రసాదరావు సూచించారు. ఈ సందర్భంగా యాజమాన్యాలతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. అరబుపాలెంలో రాత్రి సైబర్ నేరాల నియంత్రణపై ఆయన గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

ద్విచక్ర వాహనం చోరీ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఇంటి ముందు ఉంచిన మోటారు బైకు చోరీకి గురైంది. రాజమహేంద్రవరానికి చెందిన ఎం.డి.అక్రమ్ తన ద్విచక్ర వాహనంపై తునిలో జరిగే పెళ్లి ఫొటోలు తీసేందుకు ఈనెల 21న వచ్చారు. పాయకరావుపేటలోని ఎర్రతమ్మయ్య వీధిలో ఉన్న ఇంట్లో విశ్రాంతి తీసుకునేందుకు బైకును ఉంచారు. 22న ఉదయం 7 గంటలకు నిద్ర లేచి చూడగా బైకు చోరీ అయినట్లు గుర్తించారు. సీసీ కెమెరాలు పరిశీలించగా శనివారం తెల్లవారు జాము 2 గంటల దాటిన తర్వాత స్కూటీపై ఇద్దరు వచ్చి వీరిలో ఒకరు బైక్‌ను తీసుకువెళ్లినట్లు కెమెరాల్లో రికార్డైంది. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భారీ వాహనాలను అడ్డుకోరా?

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: భారీ వాహనాలను నిలువరించే అధికారులు విఫలమయ్యారని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, ఆమ్‌ఆద్మీ పార్టీ బాధ్యుడు కొణతాల హరినాథబాబు ఆరోపించారు. అనకాపల్లిలో సోమవారం కనీస జాగ్రత్తలు, రక్షణ చర్యలు లేకుండా భారీ రాళ్లతో వెళుతున్న వాహన ప్రమాద ప్రాంతాన్ని వారు పరిశీలించారు. జోనల్ కమిషనర్ చక్రవర్తి, ఇతర అధికారులతో మాట్లాడారు. పోలీస్, మైనింగ్, రైల్వే, రెవెన్యూ, రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వెంటనే వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పరిమితికి మించిన బరువులతో వెళుతున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలో జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు ఉల్లాసంగా జరిగాయి. పాఠశాలకు చెందిన 1975-76 పూర్వవిద్యార్థులు గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జీవీఎంసీ పరిధిలో ఆరు ఉన్నత పాఠశాలల నుంచి 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డిసెంబర్ 6, 7 తేదీల్లో జరిగే ఉత్సవాల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు షేక్ ఇస్మాయిల్, మళ్ల లోకేష్, కోశాధికారి రాపేటి నారాయణరావు పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బ్రహ్మాజీ, పీఈటీ నరసింహ పాల్గొన్నారు.

తెలుగు యువత అధ్యక్షుడిగా శ్రీను

ఎస్.రాయవరం, పాయకరావుపేట, నక్కపల్లి, న్యూస్‌టుడే: పేట నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడిగా ధర్మవరానికి చెందిన సుంకర శ్రీను నియమితులయ్యారు. ఈ మేరకు హోం మంత్రి అనిత నియమించారు. పేట తెదేపా బీసీ సెల్ మండలశాఖ అధ్యక్షునిగా వంకా శివకుమార్‌ను, 'పేట' ఐ టీడీపీ అధ్యక్షుడిగా నక్కపల్లి మండలం రేబాక గ్రామానికి చెందిన గంట్యాడ రమేష్‌ను నియమించారు.

పని ఒత్తిడితో ఉద్యోగులు సతమతం

కొవ్వొత్తుల ప్రదర్శనలో ప్రతినిధులు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: సచివాలయ వార్డు వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్యదర్శి ఎం.సూరిబాబు మానసిక ఒత్తిడితోనే మరణించారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు ఆరోపించారు. సూరిబాబు మృతికి సంతాపంగా సోమవారం అనకాపల్లిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కూడలిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సూరిబాబు మృతిపై సమగ్ర విచారణ నిర్వహించాలన్నారు. జిల్లాలో ఉద్యోగులు అధికారుల ఒత్తిడితో విధులు నిర్వహిస్తున్నారన్నారు. అన్ని శాఖల్లో ఉద్యోగులు వేధింపులకు గురవుతున్నారన్నారు. అనకాపల్లి జోనల్ కమిషనర్ సెలవు ఇవ్వకపోవడంతో మానసిక వేదన, పని ఒత్తిడికి గురై సూరిబాబు మరణించారని ఆరోపించారు. అనంతరం కూడలిలో మానవహారం నిర్వహించారు. సీపీఎస్ ఉద్యోగుల సంఘ నాయకులు ఎం.ఉమామహేశ్వరరావు, కోటకొండ సతీష్, ఎన్‌జీవో జిల్లా కార్యదర్శి నక్కా శ్రీనుబాబు, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాటల తూటాలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: వక్తృత్వ పోటీల్లో మాటల తూటాలు పేల్చి...ప్రతిభకు బహుమతులు అందుకున్నారు. 'ఈనాడు ప్రతిభ పాటవ పోటీలు' సోమవారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. దీనిలోభాగంగా వక్తృత్వంలో విద్యార్థినులు సత్తా చాటారు. ఈ పోటీల్లో జి.మంజూష (9వ తరగతి), పి.భువనేశ్వరి (8వ తరగతి), ఎం.కుసుమ సద్భుద్ధ (9వ తరగతి)లకు ప్రధానోపాధ్యాయిని డి.ఎస్.భవాని బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.చిన్నిమాంబ, కె.నాగామణి, లలిత, ఎం.మీనా, ఎం.మూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విద్యార్థిని

విజేతలతో పాఠశాల ఉపాధ్యాయినులు

బాగుచేస్తే ఉపయోగం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి ఆసుపత్రిలో రోగుల కోసం కేటాయించిన ఆధునిక మంచాలపై నిర్లక్ష్యం అలముకుంది. ఐసీయూలో ఉండే రోగుల కోసం ఆధునిక సదుపాయాలతో మంచాలను సమకూర్చారు. వీటిలో కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. వీటిని బాగు చేయిస్తే రోగులకు ఉపయోగపడతాయి. ఈ దిశగా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు విన్నవించుకుంటున్నారు. మరమ్మతులకు గురైన మంచాలు, సామాగ్రి ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. వీటిని మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

సంపద కేంద్రం నిరుపయోగం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: తుమ్మపాలలో సంపద కేంద్రం నిర్వహణ నిరుగారుతోంది. దీంతో డంపింగ్‌యార్డులా మారి చెత్త పేరుకుపోతోంది. యార్డులో తడి, పొడి చెత్తగా వేరు చేసే ప్రక్రియ నిలిచిపోవడంతో సంపద కేంద్రం ఆశించిన లక్ష్యాలు సాధించడంలేదు. ఇక్కడి పరిస్థితిని చక్కదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తుమ్మపాల వాసులు కోరుతున్నారు.

మురుగుతో అవస్థలు

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బట్లపూడిలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. కాలువల్లో పూడిక తీత పనులు సరిగా చేపట్టడంలేదు. ఎస్సీకాలనీలో మురుగు రహదారిపై ప్రవహిస్తోంది. ఇళ్లల్లో ఉండలేపోతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి ఇక్కడి పరిస్థితిని చక్కదిద్దేందుకు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

ఆక్రమణల తొలగింపు

స్పందనకు వందనం

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక మండలం టి.సిరసపల్లిలోని ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను సోమవారం రెవెన్యూ సిబ్బంది తొలగించారు. దిగువ టి.సిరసపల్లి ప్రాథమిక పాఠశాల ఆటస్థలంతో పాటు తారకరామకాలనీలో స్థలాలను కొందరు ఆక్రమించి రక్షణగోడలు ఏర్పాటు చేశారు. వీటిపై 'ఈనాడు'లో 'పాఠశాల స్థలం ఆక్రమణ' అనే శీర్షికన కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. స్థానికులు ఎమ్మెల్యే విజయకుమార్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ స్పందించి పూర్తిస్థాయిలో సర్వే చేయించారు. ఆయా ప్రాంతాల్లో ఆక్రమణలు జరిగినట్లు గుర్తించి పొక్లెయిన్‌తో రక్షణగోడలు తొలగించారు.

పొక్లెయిన్‌తో రక్షణగోడ కూల్చివేత

రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయం

పాయకరావుపేట గ్రామీణం, ఎలమంచిలి గ్రామీణం, రాంబిల్లి, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగాన్ని మరింత సబలతం చేసేందుకు ప్రభుత్వం 'రైతన్న మీకోసం' కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు హోంమంత్రి అనిత తెలిపారు. పెదరామభద్రపురంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులతో ముఖాముఖి, క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన, యాంత్రికరణ పరికరాల పరిశీలన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో సుమారు 39 వేల మంది రైతులకు దాదాపు రూ. 25 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు. అన్నదాతలు సేంద్రియ వ్యవసాయ విధానాలపై దృష్టిసారించాలన్నారు. రసాయనాలు వాడకం తగ్గించి ఆరోగ్యకరమైన పంటలు పండించాలన్నారు. ఆధునిక వ్యవసాయ విధానాలను అవలంబించాలన్నారు. అనంతరం స్ప్రేయర్ పరికరం, డ్రోన్ల యంత్రం వినియోగించారు. డీఏవో ఆశాదేవి, ఏడీ ఉమా ప్రసాద్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవర సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కురుకూటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఎలమంచిలి, తెరువుపల్లి తదితర గ్రామాల్లో ఏడీ మోహనరావు, రాంబిల్లిలో తెదేపా నాయకుడు లాలం తాతబాబు, దిమిలి, రాజకోడూరు తదితర గ్రామాల్లో ఏవో సుమంత రైతులకు అవగాహన కల్పించారు.

పెదరామభద్రపురంలో రైతులతో ముఖాముఖి నిర్వహిస్తున్న హోంమంత్రి అనిత

భోగలింగేశ్వరస్వామికి పూజలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: గవరపాలెంలోని శ్రీభోగలింగేశ్వరస్వామిని సోమవారం అరుణాచల ప్రదేశ్ రాష్ట్ర స్టాఫ్ సెలక్షన్ కార్యదర్శి యల్లపు రాజశేఖర్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఛైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

రాజశేఖర్‌కు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న సత్యనారాయణ

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: తురంగలపాలెంలో సోమవారం సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సర్పంచి చందక శాంతి శంకర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శిథిల భవనాలపై అధికారులకు నివేదిక

పాయకరావుపేట గ్రామీణం: ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న భవనాలపై నివేదిక ఇవ్వాలని సమగ్ర శిక్షా అభియాన్ డీఈ గణేష్, ఏఈ స్వరూప్ కోరారు. ప్రభుత్వ పాఠశాల శిథిల భవనాలతో పొంచి ఉన్న ముప్పుపై సోమవారం 'ఈనాడు'లో 'ప్రాణాలకేదీ రక్షణ' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు ఎంఈవో రమేష్‌తో మాట్లాడారు. పాత భవనాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

వేతనాలు పెంచాలని ఆందోళన

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా నాయకులు గంగాధర్, శాంతి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు కోరారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేసి, ఆర్డీఓ ఆయీషాకు వినతిపత్రం అందజేశారు. వీఆర్ఏలకు సంబంధం లేని అన్ని విధులు అప్పగిస్తున్నారన్నారు. రాత్రి పగలూ తేడా లేకుండా పనులు అప్పగిస్తున్నారన్నారు. తొమ్మిదేళ్లుగా వేతనాలు పెంచలేదని, పదోన్నతులు కల్పించ లేదన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీను, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

స్వయం ఉపాధిపై దృష్టి పెట్టాలి

నక్కపల్లి, న్యూస్‌టుడే: పొదుపు సంఘాల సభ్యులు స్వయం ఉపాధిపై దృష్టి పెట్టాలని సీఎంఎస్ జిల్లా సమన్వయకర్త పద్మిని, వెలుగు జిల్లా అధికారి సత్యనారాయణ సూచించారు. ఉద్దండపురంలో ఒత్తుల తయారీ యూనిట్‌ను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో మాట్లాడారు.

ధర్మ పరిరక్షణకు కృషి

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: హైందవ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హైందవ ధర్మం యజ్ఞం అధ్యక్షులు రాజేష్ తెలిపారు. పాల్తేరులో ఏర్పాటు చేసిన సభలో శ్రీరామ రామరాజు, అల్లూరి రాజు, నీలాపు వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722	పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726	

అనకాపల్లి, న్యూస్‌టుడే గవరపాలెం బాలకృష్ణ బస్ స్టాప్ ఎదురుగా గొయ్యి ఉంది. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. **- బుద్ధ శ్రీను, అనకాపల్లి,** ✓: గోతులు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. **- ఎస్.శేఖర్, ఈఈ**

అనకాపల్లి పట్టణం, పట్టణంలోని విజయరామరాజుపేట శ్రీకృష్ణుడి మందిరం వద్ద చెత్త పేరుకుపోయింది. **- సాంబశివ,** ✓: పరిశుభ్రత పనులు ఎప్పటికప్పుడు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. **- రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్**

అచ్యుతాపురం, అచ్యుతాపురం కూడలిలో హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేయాలి. **- షణ్ముఖశర్మ, సెజ్ ఉద్యోగి,** ✓: దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **- సూర్యనారాయణ, డీజెడ్‌ఎం, ఏపీఐఐసీ,**

పాయకరావుపేట, పాయకరావుపేటలోని ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలి. గతంలో ఇక్కడ మార్కెట్ నిర్వహించేవారు. ఆతర్వాత ఆపేశారు. దీనివల్ల తుని వెళ్లాల్సి వస్తోంది. **- డి.ప్రసాద్, ఎల్.టి. కాలనీ,** ✓: మార్కెట్ నిర్వహణకు అవసరమైన షెడ్లు సిద్ధంగా ఉన్నాయి. దుకాణాదారులతో చర్చించి మార్కెట్ ఏర్పాటు చేయిస్తాం. **- కె.డేవిడ్, ఈవో**

రోడ్డుపై మురుగు తొలగింపు

స్పందనకు వందనం

పాయకరావుపేట: రాజానగరంలో రోడ్డుపై చేరిన మురుగునీటిని తొలగించారు. 'ఈనాడు'లో 'రోడ్డు మధ్యలో మురుగు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పారిశుద్ధ్యం మెరుగుపరిచారు. గ్రామ కార్యదర్శి వై.సత్యనారాయణ మాట్లాడుతూ కొత్తగా రోడ్డు వేస్తున్నామని, దీన్ని తడిపేందుకు వచ్చిన నీరు నిల్వ ఉండిపోయిందన్నారు. అపరిశుభ్రత లేకుండా చర్యలు చేపట్టామని చెప్పారు.

'ప్రజల సొమ్ము స్వప్రయోజనాలకా?'


మాట్లాడుతున్న ఎంపీపీ గోవింద్

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: 'ఏటికొప్పాకలో బిల్‌కలెక్టర్ ఇంటిపన్ను నిధులు సొంత ప్రయోజనాలకు వినియోగించుకుంటే మిగిలిన అధికారులు ఏం చేస్తున్నారని ఎంపీపీ గోవింద్ అధికారులను నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 'ఏటికొప్పాక బిల్ కలెక్టర్.. గతంలో చోడవరంలో పనిచేసినప్పుడు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. అలాంటప్పుడు అతని పనితీరుపై ఎందుకు నిఘా పెట్టలేదని' ఎంపీపీ అధికారులను నిలదీశారు. దీనిపై ఈవోఆర్డీ దీపిక మాట్లాడుతూ ఈ అవకతవకలపై ఇప్పటికే డీపీఓ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం అని బదులిచ్చారు. రేగుపాలెం సర్పంచి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా మూడు అంతస్థులకు పైగా భవనాలు నిర్మిస్తున్నారు. పంచాయతీ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో పనుల కోసం కొనుగోలు చేసిన ఇసుక, ఇటుకలు, ఇతర సామగ్రికి భద్రత కరవైందని సర్పంచి మహాలక్ష్మి పేర్కొన్నారు. గ్రామాల్లోని సమస్యలపై ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని పలువురు సర్పంచులు ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు.

దేశ సమగ్రతకు పటేల్ కృషి ఆదర్శం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: దేశసమగ్రతకు పటేల్ కృషి ఆదర్శనీయమని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పటేల్ జయంతి సందర్భంగా కేంద్ర యువజన సర్వీసుల, రాష్ట్ర యువజనశాఖ, ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల సంయుక్తంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. అంతకముందు పటేల్, భారతమాత చిత్రపటాలకు పూలమాలవేశారు. ఈ కార్యక్రమంలో మైభారత్ డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ మోహనరావు, ప్రశాంతి విద్యాసంస్థల ఛైర్మన్ ధర్మిరెడ్డి ప్రదీప్, నాయకులు రాజాన సన్యాసినాయుడు, డ్రీమ్స్ నాయుడు, మోటూరు శ్రీవేణి, రమేష్‌బాబు, గొంతిన శ్రీనివాసరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

పటేల్, భారతమాత చిత్రపటాలకు పూలమాల వేసిన ఎమ్మెల్యే

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

ఎల్.బి.పట్నంలో కోసిన వరిపంటను ఒబ్బుకు తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతులు

అన్నదాతల ఆందోళన

చీడికాడ, న్యూస్‌టుడే: వాతావరణంలో కొద్దిపాటి మార్పులు జోరు చేసుకోవడంతో అన్నదాతలు కలవర పడుతున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన వరిపంట దిగుబడికి వచ్చింది. ఇప్పుడిప్పుడే వరి కోతలు మొదలయ్యాయి. ఈ సమయంలో తుపాను హెచ్చరిక ఉరుములు, పరుగులు పట్టిస్తోంది. చీడికాడ ప్రాంతంలో మేఘాలు కమ్ముకున్నాయి. దీంతో రైతులు కోసిన పంటను ఒబ్బుకు తరలించేందుకు పరుగులు తీశారు. కొందరు పొలాల్లోనే చిన్నపాటి కుప్పలుగా పెడుతున్నారు.

మత్తు వైద్యురాలి నియామకం

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో మత్తు వైద్యురాలిగా పద్మ విధుల్లో చేరారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో మత్తువైద్యుడు పోస్టు ఖాళీగా ఉండటంతో శస్త్రచికిత్సలు నిలిచిపోయాయి. ఈ పోస్టు భర్తీ కావడంతో మెరుగైన సేవలు అందించేందుకు వీలు కలిగింది. మత్తు వైద్యుల పోస్టును భర్తీ చేయడంలో ఎమ్మెల్యే రాజు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకృష్ణ ఆడి1: రాజు వెడ్స్ రాంబాయి, ప్రేమంటే, శివ రోడ్డు టు రివెంజ్, ఆడి 2: ది గర్ల్ ఫ్రెండ్, ఆడి 3: 12ఎ రైల్వే కాలనీ, మస్త్ పోలీస్, ఆడి 4: ప్రేమంటే, రాజు వెడ్స్ రాంబాయి, బంగార్రాజు: ప్రీ వెడ్డింగ్ షో, రాజు: జిగిరి, చోడవరం: శ్రీసాయిలక్ష్మి: కాంత, సాయి లక్ష్మి: శివ, పూర్ణ: 12ఎ రైల్వే

పనుల్లో జాప్యం..

రావికమతం, న్యూస్‌టుడే: సుమారు 15వేలకు పైగా జనాభా ఉన్న మేజర్ పంచాయతీ కొత్తకోటలో నేటికీ తాగునీటి వెతలు తప్పట్లేదు. దీనికి తోడు ఉచితంగా తాగునీటిని అందించే 2.50 లక్షల సామర్థ్యంగల భారీ తాగునీటి పథకం మరమ్మతు పనుల్లో తీవ్ర జాప్యం కారణంగా తాగునీటి సరఫరాకు ఇబ్బంది అవుతోంది. దీంతో రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయాల్సి వస్తుంది.

★ కొత్తకోటలోని బారికర్లీత ట్యాంకు చాలాకాలం కిందట నిర్మించినది కావడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంతో నీరు లీకవుతోంది. గ్రామంలోని 16 వార్డుల్లో మూడొవంతు ఈ పథకం ద్వారానే సరఫరా అవుతోంది. ఏ కారణం చేతో సరఫరాకు విఘాతం కలిగితే దాన్ని పునరుద్ధరించేంత వరకు చేతిబోరు, నేల బావులు మీదనే ఆధారపడుతున్నారు. ట్యాంకు మరమ్మతుకు జిల్లా పరిషత్తు గ్రాంటు నుంచి రూ.5లక్షల నిధులు సెప్టెంబరులో మంజూరయ్యాయి. అక్టోబరులో గుత్తేదారు పనులు ప్రారంభించారు. ఇప్పటికే ఈ పనులు పూర్తికావాల్సి ఉన్నా తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో పనులు పూర్తిచేయడానికి మరో 20 రోజులు నుంచి నెల రోజులు వరకు సమయం పట్టే అవకాశం ఉంది.

చేతిబోరు వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

ప్రతి గొంతు తడిసేలా..

• సమగ్ర తాగునీటి ప్రణాళికకు ఆదేశం
• పంచాయతీల్లో నెలాఖరుకు సర్వే పూర్తి

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సగటున ఒక్కొక్కరికి 55 లీటర్ల చొప్పున రక్షిత తాగునీరు అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఎంపిక చేసిన పంచాయతీల్లో ఇందుకు అవసరమైన ప్రణాళిక ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈలు నుంచి ఏఈలు వరకు అందరికీ ఇప్పటికే శిక్షణ పూర్తయింది.

క్షేత్రస్థాయిలో సర్వే చేస్తూ వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. గ్రామంలో ఎన్ని తాగునీటి ట్యాంకులు ఉన్నాయి. ఏ వనరు నుంచి నీరు వస్తోంది. ఒక్కొక్కరికి 55 లీటర్ల చొప్పున సరఫరా చేసేందుకు నీరు సరిపోతుందా, లేదంటే ఏం చేయాలి. ఇందుకు ఎన్ని నిధులు అవసరం. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్తుల నుంచి నిధులు సమకూర్చుకోవచ్చా. ప్రభుత్వమే కేటాయించాలా అన్న వివరాలను యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది.

▼ తొలివిడతగా ఒక్కో మండలంలో ఒక్కో పంచాయతీని ఎంపిక చేశారు. వీటిలో ఈ నెలాఖరులోగా సర్వే పూర్తి చేయాల్సి ఉంది. నర్సీపట్నం మండలంలో దుగ్గాడ, నాతవరం మండలంలో వీబీ అగ్రహారం, మాకవరపాలెం మండలంలో తూటిపాల పంచాయతీలను సర్వేకు ఎంపిక చేశారు. గొలుగొండ మండలంలో ఏ పంచాయతీని ఎంపిక చేయాలో గుర్తించాల్సి ఉంది.

▼ డిప్యూటీ ఎంపీడీవోలు, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈలు ఈ సర్వేలో భాగస్వాములవుతారు. చేపట్టాల్సిన పనులపై డిసెంబరు నుంచి కార్యాచరణ చేపడతామని నర్సీపట్నం డీఈఈ జయరామ్ తెలిపారు. అన్ని పంచాయతీల్లో సర్వే జరుగుతోందన్నారు.

వేములపూడిలోని తాగునీటి పథకం

నర్సీపట్నం నియోజకవర్గంలో ఇలా..

మండలం	పంచాయతీలు	కాలనీలు పథకాలు	జనాభా
మాకవరపాలెం	31	99	57,674
నర్సీపట్నం	12	54	32,043
నాతవరం	31	123	68,769
గొలుగొండ	27	117	51,742

పంట నష్టం వివరాల గుర్తింపు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో ఈ ఏడాది 12,600 ఎకరాల్లో వరిసాగు జరిగింది. ఇటీవల మొంథా తుపాను కారణంగా కొంత మేరకు వరిపైరులు నష్టపోయారు. మొత్తం 71 రైతులకు గాను 12.7 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు తుది నివేదికలు అధికారులు రూపొందించారు. నష్టపోయిన పంటలకు కూటమి ప్రభుత్వం పరిహారం పెంచినట్లు అధికారులు తెలుపుతున్నారు. ఒక హెక్టారుకు రూ.25 వేలు కూటమి ప్రభుత్వం పెంచింది. ప్రస్తుతం ఈ పరిహారం కోసం నష్టపోయిన రైతులు ఎదురుచూస్తున్నారు. దీనిపై వ్యవసాయ విస్తరణాధికారి సతీష్ మాట్లాడుతూ ఇప్పటికే పంట నష్టం సర్వే పూర్తయిందన్నారు. దీనికి సంబంధించిన జాబితాను గ్రామస్థాయిలో ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. సామాజిక తనిఖీలో అభ్యంతరాలను పరిశీలించి మార్పులు చేశామని, ప్రభుత్వానికి పంపిన నివేదిక మేరకు త్వరలో రైతుల ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు.

నేల వాలిన వరి పైరు

అవీ ఇవీ

న్యాయవాది మూర్తి మృతి

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం పట్టణానికి చెందిన న్యాయవాది వెంపి వెంకట వరహా నర్సింహమూర్తి(59) మృతి చెందారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ సోమవారం కన్నుమూశారు. గతంలో ఈయన బార్ అసోసియేషన్ గ్రంథాలయ కార్యదర్శిగా పనిచేశారు. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు మృతదేహం వద్ద నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కామిరెడ్డి వెంకటరావు, ప్రధాన కార్యదర్శి చీపురుపల్లి సూర్యనారాయణ, మాజీ అధ్యక్షుడు పోతల ప్రకాశ్, డేవిడ్ న్యాయవాదులు, గోర్లె సుదాకర్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజు, మల్లునాయుడు

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన నేడు

కె.కోటపాడు, న్యూస్‌టుడే : కె.కోటపాడు మండలం ఆనందపురం సమీపంలోని కృష్ణారాయుడుపేట సమీపంలోని జీవీఎంసీకి చెందిన రైవాడ కాలువపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుందని మండల తెదేపా అధ్యక్షుడు రొంగలి మహేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, విశాఖ మేయరు పీలా శ్రీనివాసరావు పాల్గొంటారన్నారు.

కాపు వనసమారాధన గోడపత్రిక ఆవిష్కరణ

చోడవరం/ పట్టణం : స్థానిక సాయిరాం గ్రాండ్‌లో తూర్పు కాపు వనసమారాధన పోస్టర్‌ను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు సోమవారం ఆవిష్కరించారు. వచ్చేనెల 14న గౌరీపట్నం రోడ్డులో సూర్యనారాయణమూర్తి ఆలయం ప్రాంగణంలో తూర్పుకాపు వనసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు యువజన సంక్షేమ సంఘం, కేఆర్ సభ్యులు పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

కె.కోటపాడు : కె.కోటపాడు మండల వీఆర్వోల సంఘ నూతన కార్యవర్గం సోమవారం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా అనంత్, ఉపాధ్యక్షురాలిగా రాజేశ్వరి, కార్యదర్శిగా జగదీశ్, సహాయ కార్యదర్శిగా సునంద ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నాతవరం : వీఆర్వోల నూతన కార్యవర్గం సోమవారం ఇక్కడి రెవెన్యూ కార్యాలయం వద్ద ఏర్పాటైంది. అధ్యక్షులుగా బి.కృష్ణశేషులు, ఉపాధ్యక్షులు హరిబాబు, కార్యదర్శి సిహెచ్. రామకృష్ణ, సహాయ కార్యదర్శి ఉషారాణి, కోశాధికారి పి.మాణిక్యాలరావును ఎన్నుకున్నారు.

నీటికోసం బిందెలతో భిక్షాటన

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: ఇంటింటి కుళాయి ఏర్పాటు చేయాలని మహిళలు ఖాళీ బిందెలతో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. మండలంలోని తాటిపర్తి పంచాయతీ పరిధిలోని లక్ష్మీపేట జరిగిన ఈ కార్యక్రమానికి మద్దతుగా ఆదివాసీ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి బోనంగి నరసింహమూర్తి మాట్లాడారు. లక్ష్మీపేట గ్రామంలో సుమారుగా 15 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇన్ని ఏళ్లు చేతిబోరు నుంచి నీరు రాకపోవడంతో తాగునీటి కోసం నెలలుగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీ బిందెలతో నిరసన పాల్గొన్న గిరిజన మహిళలు

తుదిదశలో రైతుబజారు పనులు

చోడవరం, న్యూస్‌టుడే: నియోజకవర్గ కేంద్రమైన చోడవరం పట్టణంలో నిర్మాణంలో ఉన్న రైతు బజారు పూర్తయ్యే దశకు వచ్చింది. పట్టణ ప్రజలకు అన్ని రకాల కూరగాయలు, మాంసాహారం, పండ్లు, డ్రై ఫ్రూట్స్, తినుబండారాల వస్తువుని ఒకే చోట అందుబాటులో తేవాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రేమసమాజం పక్కన శుక్రవారం సంతబయలు సమీపంలో రైతుబజారు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. దాదాపు రూ.కోటికి పైగా ఖర్చు చేసి ఆధునాతన సదుపాయాలతో పనులు జరుగుతున్నాయి. మండల ఇంజినీరింగ్ సహాయక అధికారి శాంతారాం మాట్లాడుతూ ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నామన్నారు. బజారు బయట ప్రధాన కాలువల నిర్మాణం చేపట్టి గేటు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.

కాంక్రీటుతో వేసిన రైతు బజారు ప్లాట్ ఫామ్

ఏపీజీవీబీ నూతన కార్యాలయం ప్రారంభం నేడు

రోలుగుంట: రోలుగుంటలో నూతనంగా ఏర్పాటుచేసిన భవనంలోకి తమ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు తరలిస్తూ మంగళవారం లాంఛనంగా ప్రారంభిస్తున్నామని రోలుగుంటశాఖ బ్రాంచి మేనేజరు మహేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏపీ జనరల్ మేనేజరు రాజశేఖరంతోపాటు రీజినల్ మేనేజరు సతీష్‌చంద్ర తదితరులు హాజరవుతున్నారని తెలిపారు.

చెరిగిన అక్షరాలు.. మిగిలిన బోర్డులు..!

చీడికాడ-అప్పలరాజుపురం ప్రధానరోడ్డులోని మర్లగుమ్మి కాలువపై పురాతన వంతెన శిథిలమైంది. అడుగున ఇనుపచువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. దీంతో వంతెన ప్రమాదకరంగా మారడంతో పంచాయతీరాజ్‌శాఖ అధికారులు వంతెనకు ఇరువైపులా భారీ వాహనాలు ప్రవేశించకుండా హెచ్చరిక బోర్డులను కొన్నాళ్ల కిందట ఏర్పాటుచేశారు. ప్రస్తుతం బోర్డుపై ఉన్న వివరాలు చెరిగిపోయి ఖాళీగా మిగిలిపోయాయి. అధికారులు స్పందించి వంతెన వద్ద కొత్తగా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – చీడికాడ, న్యూస్‌టుడే

వంతెన వద్ద హెచ్చరిక బోర్డులు..

కాలువల మరమ్మతుకు నిధులు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి సోమవారం దేవరాపల్లి మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. పలు ప్రారంభోత్సవాలతో పాటు వివిధ అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్సులో తెదేపా మండల ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో జ్యోతి దంపతులు నూతనంగా ఏర్పాటు చేసిన బుద్ధుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. అక్కడ నుంచి రైవాడ జలాశయానికి వెళ్లి చేప పిల్లల విడిచిపెట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇసుక అనధికార వేలం పాటల నిర్వహణపై జీవిల 'ఈనాడు'లో వచ్చిన కథనంపై స్పందించిన ఆయన స్థానిక తహసీల్దారు పి.లక్ష్మీదేవి, ఎస్ఐ వి.సత్యనారాయణ తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. ★ ఒక్కొక్క నీటి సంఘంలో కాలువల మరమ్మతులకు రూ.15 లక్షల చొప్పున పది సంఘాలకు నిధులు కేటాయించామన్నారు. ఎమ్మెల్యే నిర్వహించిన సమావేశాల్లో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ ఛైర్మన్ పాత్రునాయుడు, డీఈఈ సత్యంనాయుడు, మండల తెదేపా అధ్యక్ష కార్యదర్శులు వెంకటరమణ, డి.డి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్సులోని బుద్ధుడి విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు తదితరులు

కోర్టు భవనాలకు రూ.21.18 కోట్లు మంజూరు

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం కోర్టు భవనాల సముదాయం భవనాల పునర్నిర్మాణ పనులకు రూ.21.18 కోట్లు మంజూరయ్యాయని స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు తెలిపారు. ప్రభుత్వం నుంచి జీవో ఎస్.నెం162 సోమవారం విడుదలైందన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే సోమవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. 2017-18లో కోర్టు భవనాలకు తాను ఎమ్మెల్యేగా రూ.19.53 కోట్లు మంజూరు చేయించాను. అప్పట్లో నిర్మాణ పనులు జీఓమెంట్ స్థాయికి జరిగినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఈ పనులు నిలిపివేశారు. కూటమి పాలనలో మళ్లీ పట్టాలెక్కినట్లు పేర్కొన్నారు. కోర్టులో అన్ని సదుపాయాలతో పాటు న్యాయాధికారుల ఛాంబర్స్, కక్షి దారులు కూర్చోనేందుకు వీలుగా వరండాలు నిర్మిస్తామని చెప్పారు. త్వరలోనే పనులు చేపడతారని ఆయన తెలిపారు. పాత రాతి భవనాలను పరిరక్షించే చర్యలు చేపట్టనున్నట్లు రాజు చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కామిరెడ్డి వెంకటరావు, ప్రధాన కార్యదర్శి చీపురుపల్లి సూర్యనారాయణ, గూనూరు లక్ష్మినారాయణ, పాత్రిని నాయుడు, జి.కృష్ణవేణీవేలప్ప వెంకటరావు, ఎస్.శ్రీనివాసరావు, కొల్లి శ్రీనివాసరావు, ఉగ్గిన దొర, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం: కోర్టు భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే రాజుకు స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కామిరెడ్డి వెంకటరావు, ప్రధాన కార్యదర్శి చీపురుపల్లి సూర్యనారాయణ, సీనియర్ న్యాయవాది లాలం పాత్రునాయుడు పూలమాలలు వేసి శాలువా కప్పారు.

ఎమ్మెల్యే రాజును సత్కరించిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

విద్యారంగ సమస్యలపై పోరాటం: ఈశ్వరయ్య

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం అనుసరిస్తున్న విద్య వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడ నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగిస్తూ ఫీజు రియింబర్స్‌మెంట్ కింద రూ.6,400 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. ఈ మొత్తం విడుదల చేయకపోవడంతో కళాశాలల్లో ధ్రువపత్రాలు ఇవ్వడం లేదన్నారు. జైళ్లలోని ఖైదీలకు భోజనం నిమిత్తం రోజుకు రూ.150 చెల్లిస్తుంటే హాస్టల్ విద్యార్థులకు మాత్రం రూ.53మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు జి.ఫణీంద్రకుమార్, డీసీహెచ్ క్రాంతి తదితరులు మాట్లాడారు. నాయకులు అజయ్, నవీన్, నాగదుర్గ తదితరులు పాల్గొన్నారు. నాతవరం ఎంపీటీసీ సభ్యుడు షేక్ రజాక్ సహా పట్టణంలోని పలువురు అభిమానులు ఈశ్వరయ్యను కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సీపీఐ కార్యదర్శిగా ఎన్నికైనందుకు అభినందనలు తెలిపారు.

ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

ఆనందమయం.. అనుపు మహోత్సవం

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని కొమిర గ్రామంలో గౌరీ పరమేశ్వర్ల అనుపు మహోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దీపావళి తర్వాత గౌరీ పరమేశ్వర్ల విగ్రహం ప్రతిష్ఠించి నెల రోజులపాటు పూజా కార్యక్రమాలు జరిపించారు. సోమవారం రాత్రి గౌరీపరమేశ్వర్ల విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై మేళ తాళాలు, బాణసంచా కాల్పులు, కోలాటం తదితర కార్యక్రమాలతో ఊరేగించి నివాళులు అర్పించారు.

గౌరీపరమేశ్వరుల విగ్రహం ఊరేగింపు

ప్రజాసేవే లక్ష్యంగా పని చేయండి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు కుమారుడు, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పుట్టినరోజుని నర్సీపట్నంలో నాయకులు, కార్యకర్తలు సోమవారం ఘనంగా జరిగాయి. అబీద్‌కూడలిలో భారీ కటౌట్ ఏర్పాటు చేసి క్రేన్‌తో గజమాలను వేశారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెంకటరమణ, రావణాపల్లి జలాశయ నీటి సంఘం ఛైర్మన్ రుత్తల రాజేశ్వరరావు, పీఏసీఎస్ ఛైర్మన్ రుత్తల కృష్ణ, లాలం మురళీ తదితరులు పాల్గొన్నారు.

★ ఉండవల్లిలోని సీఎం నివాసానికి వెళ్లిన విజయ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా విజయ్‌కు సీఎం శాలువా కప్పి మిఠాయిలను అందజేశారు. ప్రజాసేవే లక్ష్యంగా మరింత చురుగ్గా పనిచేయాలని సీఎం సూచించారు. ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో 'హ్యాపీ బర్త్‌డే విజయ్' హాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌లో నిలిచింది.

నాతవరం, రోలుగుంట : మాకవరపాలెంలోని తెదేపా కార్యాలయంలో నాయకులంతా కేక్ కట్ చేశారు. మండల కమిటీ అధ్యక్షుడు రుత్తల యర్రాపాత్రుడు, నాయకులు అల్లు నాయుడు, శీరం రెడ్డి చినబాబు పాల్గొన్నారు.

★ ఈ మేరకు కేఎస్సార్ టీమ్ ఆధ్వర్యంలో ఇక్కడి తెదేపా కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. గణేష్ అసోసియేట్స్ సాంకేతిక సహకారం అందించారు. రోలుగుంట మండల ఐటీడీపీ అధ్యక్షుడు బంటు రాజు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి వేడుకలను జరిపారు.

ఉండవల్లి నివాసంలో విజయ్‌కు మిఠాయి పెట్టి అందజేస్తున్న సీఎం చంద్రబాబు

'రైతన్న మీ కోసం' ప్రారంభం

చీడికాడ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ, అనుబంధ శాఖలు సంయుక్తంగా సోమవారం అన్ని గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కార్యక్రమాలు వివరించారు. పంచ సూత్రాలపై అవగాహన కల్పించారు.

రైతుకు కరపత్రం అందజేస్తున్న జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ

వడ్డాదిలో సర్వే చేస్తున్న సిబ్బంది

చీడికాడలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ కృష్ణవేణి

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

రోలుగుంట, న్యూస్‌టుడే: ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు నీటిని అందించే జానకిరాంపురం నది నుంచి కొమరవోలు, రోలుగుంట గ్రామాల మీదుగా సరఫరా చేసే రెగ్యులేటింగ్ పంపు పైకప్పు అధ్వానంగా తయారైంది. దీనివల్ల మెరుగైన తాగునీరు కలుషితమయ్యే ప్రమాదముంది. – అప్పలనాయుడు, కొమరవోలు, ✓: ఈ సమస్యను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. సిబ్బందికి అవసరమైన ఆదేశాలిస్తాం. – లగుడు కృష్ణంనాయుడు, సర్పంచి, జానకిరాంపురం

గొలుగొండ, న్యూస్‌టుడే: నర్సీపట్నం-కృష్ణదేవిపేట మధ్య మలుపుల వద్ద ఏర్పాటు చేసిన సోలార్ హెచ్చరిక దీపాలు పాడవడంతో తొలగించారు. దీన్ని పునరుద్ధరించాలి. – రాధాకృష్ణ, సామాజిక కార్యకర్త, ✓: సోలార్ దీపాలు లేక పోవడంతో మలుపుల వద్ద వాహనచోదకులు ఇబ్బంది పడుతున్న విషయం గుర్తించాం. కొత్తవి ఏర్పాటు చేసి ఇబ్బందులు తొలగిస్తాం. – ప్రసాదరావు, జేఈ, ర.భ.శాఖ

గొయ్యిని పూడ్చారు

స్పందనకు వందనం

గొలుగొండ, న్యూస్‌టుడే: కొత్తజోగుంపేట సమీపంలో ప్రధాన రహదారిలో ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. రాత్రిపూట ద్విచక్రవాహనం ఇందులో పడి గాయాలపాలవుతున్నారు. దీనిపై ఈ నెల 22న 'మేమున్నాం..మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన సంబంధిత శాఖ యంత్రాంగం గుంతను పూడ్చించి సమస్యను పరిష్కరించారు.

ఉర్లోవ డీపట్టా భూముల రీసర్వే

రావికమతం, న్యూస్‌టుడే: వి.మాడుగుల- రావికమతం మండలాల సరిహద్దులోని ఉర్లోవ రెవెన్యూలో పేదలకు ఇచ్చిన డి.పట్టా భూములు వెబ్‌ల్యాండ్ నమోదు కోసం సోమవారం నుంచి అధికారులు రీసర్వే పనులు మొదలుపెట్టారు. ఇందుకోసం జాయింట్ కలెక్టర్ ఛైర్మన్‌గా నర్సీపట్నం, అనకాపల్లి ఆర్డీవోలు, వి.మాడుగుల తహసీల్దారు, సర్వేయర్లతో కలిసి సర్వే నిర్వహించి రికార్డులు తయారు చేసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. గతనెలలో మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ మూర్తి, కేఎస్ఎన్ఎస్‌రాజు సమక్షంలో గ్రామసభ నిర్వహించారు. వెబ్‌ల్యాండ్ నమోదు కోసం ఎవరికి ఎంత భూమి ఉందో నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం నుంచి రెండు మండలాల రెవెన్యూ, సర్వే అధికారులు డి.పట్టా భూముల రీసర్వే పనులు ప్రారంభించారు. వి.జె.పురం, కొమిర వీఆర్వోలు సింహాచలమ్మ, కమలమ్మ, సర్వేయర్ భాష, సురేష్‌లు కొమిర గ్రామానికి చెందిన రైతులతో కలిసి ఉర్లోవ కొండ బంజరు భూమిని సోమవారం నుంచి సర్వే చేస్తున్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు పాల్గొన్నారు.

సర్వే పనులు ప్రారంభిస్తున్న రెవెన్యూ, సర్వే అధికారులు

ఓటర్ల మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయండి

నర్సీపట్నం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో 2002 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఓటర్లుగా కొనసాగుతున్న వారి మ్యాపింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలని స్థానిక తహసీల్దారు రామారావు బీఎల్ఓలను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నియోజకవర్గంలోని బీఎల్ఓలతో ఏర్పాటైన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పనుల్లో కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో 2002 నుంచి 2025 వరకు ఓటర్లుగా ఉన్నవారి మ్యాపింగ్ సకాలంలో పూర్తి కావాలన్నారు. ఎన్నికల ఉపతహసీల్దారు సుదారాణి తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం : సబ్ కలెక్టరేట్‌లో తహసీల్దారు రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 19 అర్జీలు దాఖలయ్యాయి. గిరిజన హక్కుల చట్టాలను వర్తింపజేసి తమ భూములను అప్పగించాల్సిందిగా కోరుతూ నాతవరం మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ చోడవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 50/2019 - EP 59/2022

బిట్వీన్: ఉడావెంకట బెన్నేశ్వరరావు ...DHr
అండ్: పడాల లక్ష్మి ...JDr

పై నెంబరు DHrకు JDrవల్ల రావలసిన పై నెంబరు డిక్రీ అమలు పైకంనకు JDr తాలూకా యిందలి అమలు షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారి వలన తే:10-12-2025దీన ఉదయం గం॥ 10.30లకు లగాయితు సాయంకాలం గం॥ 5.00ల లోగా బహిరంగ వేలం వేయబడును. సదరు వేలం పాడదలచినవారు వేలం తేదీన పైకోర్టుకు హాజరు అయి వేలం పాడుకోవలెనని యిందుమూలంగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

Item No.1: Now Anakapalli District (Erstwhile Visakhapatnam Dt.) Chidikada Mandalam, Vintipalem Village, S.No. 42-12 an Extent of Ac. 0-16 Cents Zeroyathi Wet Land bounded by: **East:** Wet Land of Kakara Kondamma etc., **South:** Wet Land of Padala Satyanarayana etc., **West:** Wet Land of Padala Yerakanna Dora, **North:** Gorja.

Item No.2: Survey No.42-1B an extent of Ac. 0-08 Cents Zeroyathi Wet Land Bounded by: **East** : Wet Land of Padala Varahalu, **South:** Wet Land of Padala Suribabu etc., **West:** Wet Land of Padala Satyanarayana, **North:** Gorja.

Item No.3: Survey No.42-1D an extent of Ac. 0-03 1/2 Cents Zeroyathi Wet Land Bounded by: **East:** Wet Land of Padala Suribabu etc., **South:** Channel, **West:** Wet land of Padala Simhachalam **North:** Wet Land of Padala Satyanarayana etc.,

DHR Value of Rs. 2,20,000-00
Ameen Value Rs. 11,00,000-00

Chodavaram
Dt. 24-11-2025

V. PALAVELLI, Advocate
Chodavaram, Ph: 8367755669

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ స్క్రీన్-1 **ప్రేమంటే** (మార్నింగ్, ఫస్ట్ షో), **12ఎ రైల్వేకాలనీ** (మ్యాట్నీ, సెకెండ్ షో) స్క్రీన్-2 - **రాజు వెడ్స్ రాంబాయి**

భూలోకమాంబ పండగ ప్రారంభం

వేపగుంట, న్యూస్‌టుడే: భూలోకమాంబ అమ్మవారి పండగ మంగళవారం జరపనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పేర్కొన్నారు. తెల్లవారుజాము నుంచే పూజలు మొదలవుతాయన్నారు. సాయంత్రం అమ్మవారి ఘటాలు పురవీధుల్లో ఊరేగింపు జరిపి రాత్రి అనుపు ఉత్సవం జరుగుతుందన్నారు. డిసెంబరు 2న అమ్మవారి మారు వారం పండగ రోజున భారీ అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

పెండింగ్ పనులపై చర్చ

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న ఎన్.తేజ్‌భరత్‌ను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం నగరంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెందుర్తి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఆయా పనులను వేగవంతం చేయాలని కమిషనర్‌ను కోరారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్ తేజ్‌భరత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: నాయుడుతోట నుంచి మేహాద్రి రిజర్వాయరుకు వెళ్లే రహదారిలో గోతులు స్థానికుల రాకపోకలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. **– రాజారావు, నాయుడుతోట** ✓: ఈ రహదారిలో పైపు లైను నిర్మాణం జరుగుతోంది. ఆ పనులు పూర్తయిన అనంతరం రహదారి నిర్మాణానికి పూర్తిచర్యలు తీసుకుంటాం. **– శంకర్రావు, ఇన్‌ఛార్జి జోనల్ కమిషనర్**

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం కేజీబీవీ వద్ద వ్యర్థాలు పేరుకుపోయాయి. **– పి. వెంకటరావు, సబ్బవరం.** ✓: పరిశీలించి వ్యర్థాలను తరలించే ఏర్పాటు చేస్తాం. **– డి. ప్రసాదరావు, గ్రామ సర్పంచి సబ్బవరం**

?: సబ్బవరం మండలం ఇరువాడ కాలనీ సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. **– స్థానికులు.** ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **– వై. రాజేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ సబ్బవరం**

పరవాడ, న్యూస్‌టుడే: ?: మండలంలోని పెద్దస్వయంభూవరంలోని నిరుపయోగంగా ఉన్న శిథిల పాఠశాల భవనం భయపెడుతోంది. **– శ్రీను, స్థానికుడు.** ✓: శిథిల భవనం తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **– మురళీధర్ పట్నాయక్, ఈవోపీఆర్డీ, పరవాడ**

స్వాగత ద్వారం.. అభివృద్ధికి దూరం

విస్తరణకు నోచుకోని పెందుర్తి బీఆర్టీఎస్ రహదారి

పెందుర్తి, న్యూస్‌టుడే

జిల్లాల పునర్విభజన అనంతరం మన్యం, అల్లూరి, విజయనగరం జిల్లాల నుంచి విశాఖ వచ్చే వారికి పెందుర్తి కూడలి ముఖద్వారంగా మారింది. తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్న ప్రముఖ పర్యాటక కేంద్రం అరకు వెళ్లే పర్యటకులు పెందుర్తి కూడలి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. దేశ విదేశాలకు చెందిన పర్యాటకులు, ప్రముఖులు ప్రయాణించే ఈ పెందుర్తి బీఆర్టీఎస్ రహదారి గత పదిహేనేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో నగరంలోకి స్వాగతం పలికే ఈ కూడలి గ్రేటర్‌లో ఉన్నా.. ఇంకా పల్లెటూరుగానే మిగిలిపోయింది.

పెందుర్తి బీఆర్టీఎస్ రహదారిలో వాహనాల రద్దీ

పెరుగుతున్న వాహనాల రద్దీ..

పెందుర్తి బీఆర్టీఎస్ రహదారిలో వాహనాల రద్దీ విపరీతంగా పెరుగుతోంది. పరిసర ప్రాంతాల్లో నివాసాలు విస్తరించడంతో నగరానికి రాకపోకలు సాగించే వారి సంఖ్య గణనీయంగా ఉంటోంది. ఉద్యోగాలు, చదువులు, ఇతర పనులపై ప్రయాణాలు చేసే వారు నిత్యం వేలల్లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం కార్యాలయాలు, విద్యాలయాల సమయాల్లో తరచుగా ట్రాఫిక్ నిలిచిపోతుంది. ప్రజారవాణా వాహనాలతో పాటు వ్యక్తిగత వాహనాల వినియోగం బాగా ఎక్కువైన నేపథ్యంలో ఇరుకైన రహదారుల సామర్థ్యం చాలడం లేదు.

పదిహేనేళ్లుగా నిలిచిన విస్తరణ..

★ పెందుర్తి పాత పీహెచ్‌సీ కూడలి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు బీఆర్టీఎస్ రహదారి గత పదిహేనేళ్లుగా నిలిచిపోయింది. ఈ మార్గంలో కొందరు నివాసితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో విస్తరణకు ఆటంకం ఏర్పడింది. పాలకులు, అధికారులు వివాదం పరిష్కారంపై కనీసం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

★ ప్రభుత్వాలు మారినా పెందుర్తి కూడలి దశ, దిశ మారడం లేదు. బీఆర్టీఎస్ రహదారి నిర్మాణంతో సుజాతనగర్, చినముషిడివాడ ప్రాంతాలు నగరానికి దీటుగా అభివృద్ధి చెందగా పనులు నిలిచిపోయిన పెందుర్తి మాత్రం పాత పట్టణంగానే మిగిలిపోయింది. అంతగా ప్రాధాన్యం లేని అనకాపల్లి - ఆనందపురం మార్గాన్ని విస్తరిస్తున్న పాలకులు బీఆర్టీఎస్‌ను పట్టించుకోవడం లేదన్న విమర్శలొస్తున్నాయి.

★ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భోగాపురం విమానాశ్రయాన్ని అనుసంధానించేలా రహదారుల అభివృద్ధిపై దృష్టిసారించింది. అదే క్రమంలో పెందుర్తి రహదారి ప్రాధాన్యతను గుర్తించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

'అధికారంలో ఉన్నా పనులు చేసుకోలేని పరిస్థితి'

పీజీఆర్ఎస్‌లో అధికారులతో మాట్లాడుతున్న గండి బాబ్జీ

సబ్బవరం, న్యూస్‌టుడే: అధికారంలో ఉన్నా పనులు చేసుకోలేని పరిస్థితి తమకు ఏర్పడిందని తెదేపా పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అన్నారు. ఆయన సోమవారం కార్యకర్తలతో కలిసి పీజీఆర్ఎస్‌కు హాజరయ్యారు. 'కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కాలం అవుతోంది. ఉమ్మడి నాయకులంతా కలిసి పని చేయాల్సి ఉంది. కానీ ఇక్కడ అలా జరగడం లేదు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నాకు ఏం జరిగినా పర్వాలేదు కానీ కార్యకర్తలు వచ్చినపుడు ఒక పనికి పదిసార్లు తిరిగితే మనం గవర్నమెంట్‌లో ఉన్నామా? లేక ప్రతిపక్షంలో ఉన్నామా? అన్న అనుమానం వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. ఈ విషయమై తహసీల్దార్, అధికారులను అడిగామన్నారు. గత పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులు ఎంత వరకు పరిష్కరించారని తహసీల్దార్ చెప్పలేకపోయారన్నారు. కొత్తగా మరో 5 దరఖాస్తులు రాగా వాటిని కూడా పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో సబ్బవరం మండల తెదేపా అధ్యక్షుడు గండి ముత్యాలు నాయుడు, తాతారావు, బొండా కల్యాణ్, దాడి కన్నంనాయుడు, బొండా రాజు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

పెందుర్తి, న్యూస్‌టుడే: రాంపురం పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మినగర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు విశాఖ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం సమర్పించారు. కాలనీలో రోడ్లు, కాలువలు, అంతర్గత రహదారులు నిర్మించాలని విన్నవించారు. ఆయనతో పాటు కాలనీవాసులు నరసింహమూర్తి, విజయకుమార్ పాల్గొన్నారు. అక్కడ జరిగిన పీజీఆర్ఎస్‌లో మండల తెదేపా అధ్యక్షుడు గంటి కనకరాజు, నాయకులు అవగడ్డ అప్పలనాయుడు, కోయిలపల్లి సుందరరావు, తదితరులు పలు సమస్యలపై ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతులు సమర్పించారు.

కలెక్టరేట్‌కు వినతిపత్రం అందిస్తున్న రెడ్డి నారాయణరావు

ఉత్తమ ఉద్యోగులకు అవార్డుల ప్రదానం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదాలను నివారించడంలో కీలకపాత్ర పోషించిన పలువురు రైల్వే ఉద్యోగులను వాల్తేర్ డీఆర్ఎం లలిత్ బోహ్రా సోమవారం అవార్డులు అందజేసి సత్కరించారు. ఉద్యోగుల అసాధారణ పని తీరును ప్రశంసించారు. 2025-26వ సంవత్సరంలో రైలు కార్యకలాపాల సమయంలో ఎదురయ్యే భద్రతా ముప్పులకు వృత్తి నైపుణ్యం, వేగవంతమైన ప్రతిస్పందనకు గుర్తింపుగా ట్రాక్‌మెన్, కీమెన్, స్టేషన్ మాస్టర్లు, లోకోపైలెట్లకు అవార్డులు ప్రదానం చేశారు. ట్రాక్‌మెన్స్ కుమార్ సాహెబ్, సురేష్‌కుమార్, జ్ఞానరంజన్ సాహూ, ఎన్.వరప్రసాద్, ఎం.కూర్మారావు, కీమెన్ రాకేష్ కుమార్, పియాంట్స్ మెన్ ఎం.కృష్ణంనాయుడు, స్టేషన్ మాస్టర్ సంతోష్‌కుమార్, ఏఎల్‌పీ బి.తిరుపతిరావు తదితరులకు వీటిని అందజేశారు.

ట్రాక్ నిర్వాహకుడికి ధ్రువపత్రం అందజేస్తున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా

పునరావాస కేంద్రానికి తరలింపు

పెందుర్తి, న్యూస్‌టుడే: మద్యానికి బానిసైన ఓ వ్యక్తిని పెందుర్తి పోలీసులు సోమవారం పునరావాస కేంద్రంలో చేర్పించారు. దీనికి సంబంధించి పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాపయ్యరాజుపాలేనికి చెందిన నైపల్లి కనకరాజు(36) మద్యానికి బానిసై కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అతడి కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వారి అభ్యర్థన మేరకు పోలీసులు అతడిని చినముషిడివాడలోని న్యూలైఫ్ డ్రగ్ రిహాబిలిటేషన్ కేంద్రంలో చేర్పించారు. అతడితో మద్యం అలవాటు మాన్పించాలని నిర్వాహకులను కోరారు.

పునరావాస కేంద్రం నిర్వాహకులకు వ్యక్తిని అప్పగిస్తున్న పోలీసులు

పీజీ వైద్య కోర్సుల్లో ప్రవేశాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ)లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు శ్రీకారం చుట్టారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలు ఆరంభమయ్యాయి. అఖిల భారత కోటా(ఏఐక్యూ) కింద కళాశాలకు కేటాయించిన సీట్లలో సోమవారం కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో డాక్టర్ ఎన్.సోనుకు తొలి ప్రవేశం కల్పించారు. ఈ మేరకు సీటు కేటాయిస్తూ ప్రవేశపత్రాన్ని డాక్టర్ సోనుకు ప్రిన్సిపల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి అందజేశారు. ఏఐక్యూ ప్రవేశాలు పూర్తయిన తర్వాత రాష్ట్ర కోటా ప్రవేశాలు చేపడతామని ప్రిన్సిపల్ తెలిపారు. కార్యక్రమంలో ఉప ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.కృష్ణవేణి, ఏడీ ఎం.రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతులు

వేపగుంట, న్యూస్‌టుడే : జోనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ 18 అర్జీలు ఇచ్చారు. ఇన్‌ఛార్జి జోనల్ కమిషనర్ శంకర్రావు సమస్యల పరిష్కారానికి తగుచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాజీ జంక్షన్‌లో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు, పశువుల ఆసుపత్రి ఎదురుగా అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని, పురుషోత్తపురంలో యూజీడీ సమస్య పరిష్కరించాలని వినతుల్లో కోరారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఇన్‌ఛార్జి జెడ్సీ శంకర్రావు

సేవా శిబిరం ప్రారంభం

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తికి చెందిన ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1లో సోమవారం సేవా శిబిరం ప్రారంభమైంది. కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలస్, ఎన్ఎస్ఎస్ పీవో డీఎస్ ప్రదీప్ ఆధ్వర్యంలో తొలిరోజు సత్యానగర్ పార్కు ఆవరణలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సత్యానగర్, అశోక్‌నగర్‌కాలనీ సంఘం ప్రతినిధులు సీఎన్ రావు, సన్యాసిరావులను శాలువాతో సత్కరించారు. విద్యార్థులు పార్కు ఆవరణలో పరిశుభ్రత పనులు చేశారు.

పార్కు ఆవరణలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

25 నుంచి నయా చేతన 4.0 కార్యక్రమం

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: లింగ ఆధారిత వివక్షపై పోరాటం చేసేందుకు పౌరులందరిలో బాధ్యత పెరగాలని, క్రియాశీల అవగాహన కల్పించడం ద్వారా నివారణ చర్యలను బలోపేతం చేయవచ్చునని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. స్త్రీ, పురుషుల సమానత్వం ద్వారానే సమాజం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నవంబరు 25 నుంచి డిసెంబరు 3వరకు 'నయా చేతన 4.0 - మార్పు కోసం ముందడుగు' అనే పేరుతో చేపట్టనున్న కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను సోమవారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఏడీసీ వర్మ, ఎన్ఐసీ అధికారి హమీద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సంబంధిత ఉత్పత్తులపై అవగాహన

కార్యక్రమంలో పాల్గొన్న ఐఐఎం విద్యార్థులు, ప్రొఫెసర్లు

సబ్బవరం, న్యూస్‌టుడే: జగ్గిరి సంస్థ, అమ్మవలస రైతు ఉత్పత్తిదారుల కంపెనీలను సోమవారం విశాఖపట్నం ఐఐఎం మేనేజ్‌మెంట్ విద్యార్థులు, ప్రొఫెసర్లు సందర్శించారు. ఆ క్యాంపస్ నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన 80 మంది విద్యార్థులకు ఇక్కడ గ్రామీణ భారతదేశంలో వ్యాపార అవకాశాలపై శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా జగ్గిరి సంస్థ ఎండీ కె.సుజాత హాజరయ్యారు. ఈ సంస్థ మూడు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతంలో సమాజ సేవలు అందిస్తున్న ఆర్థిక, సామాజిక, వ్యవసాయ, డిజిటలైజేషన్, బ్యాంకింగ్ తదితర సర్వీసులు ఆ సంస్థ సీఈవో కెవిఎస్ వివరించారు. రైతులతో చేస్తున్న వివిధ కార్యక్రమాలు, మార్కెటింగ్ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. అమ్మవలస గ్రామంలో టమాట, మిరప, డ్రాగన్‌ఫ్రూట్, తదితర పంటలను సందర్శించి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమం ఐఐఎం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రొఫెసర్ జయంత్, సుదర్శి, భరత్ పేర్కొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత భవితకు బాటలు

విద్యార్థులకు సూచనలు చేస్తున్న రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్

పరవాడ, న్యూస్‌టుడే: విద్యార్థులంతా క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే ఉన్నత భవిష్యత్తు లభిస్తుందని రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్ అన్నారు. రాంకీ ఫౌండేషన్, మ్యాజిక్ బస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం లంకెలపాలెం హైస్కూల్‌లోని 9, 10 తరగతుల విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులంతా బాల్యం నుంచి మంచి ప్రణాళికలతో పాటు పట్టుదల, క్రమశిక్షణతో చదివితేనే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించవచ్చన్నారు. మ్యాజిక్ బస్ ఇండియా సంస్థ మేనేజర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులంతా ఒత్తిడి లేని విద్యను అభ్యసించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, రాంకీ ఫౌండేషన్, మ్యాజిక్ బస్ ఇండియా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అసలే గోతులు... ఆపై తవ్వకాలు..

ఫోకస్

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట పినగాడి రహదారి గోతులతో ప్రమాదకరంగా ఉన్న విషయం అందరికీ తెలిసిందే. దీనికితోడు ప్రస్తుతం భూగర్భ విద్యుత్తు లైను కోసం తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో రహదారి మరింత చిన్నదిగా మారింది. ఓ వైపు గతంలో ఏర్పడిన గోతులు, మరోవైపు భూగర్భ విద్యుత్తు లైను పనులతో వాహనదారులు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే రహదారిలో భారీవాహనాల రాకపోకలు సాగుతున్నాయి. రహదారి చిన్నదిగా ఉండటంతో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ రహదారిని 60 అడుగులకు విస్తరించే పనులు ప్రారంభించాలని జీవీఎంసీ అధికారులు ప్రకటించారు. పనులు ఎంతో వేగవంతంగా పూర్తిచేసి వాహనదారులకు ఇబ్బందిలేకుండా చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. వేపగుంట నుంచి చింతల అగ్రహారం బ్రిడ్జి వరకు పనులు జీవీఎంసీ చేయాలని నిర్ణయించింది. ఆ పనులు ఇంకా ఎక్కడా ప్రారంభం కాకపోవడంతో ఎప్పటికి పూర్తవుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వేపగుంట - పినగాడి రహదారిలో జరుగుతున్న భూగర్భ విద్యుత్తు లైను పనులు

అర్జీల స్వీకరణ

వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగరాజు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో రమేశ్‌నాయుడు మండలస్థాయి అధికారులు హాజరయ్యారు. ప్రజల నుంచి 5 అర్జీలను స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

★ అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో మండల పరిషత్తు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఇళ్లులేని పేదలకు స్థలాలు, ఇళ్లు అందించి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం, అన్నపూర్ణ, సీతమ్మ పాల్గొన్నారు.

గోదాము పైనుంచి పడి వ్యక్తి మృతి

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే: ఆటోనగర్‌లో ఓ గోదాము పైకప్పు మీద నుంచి పడి దినసరి కూలీ ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే విజయనగరానికి చెందిన జుత్తాడ వంశీ(32) అక్కడ ఆటోనగర్‌లోని ఓ కార్గో గోదాము పైకప్పు మరమ్మతులు పని చేస్తుండగా సిమెంట్ రేకు ఆకస్మాత్తుగా విరిగిపోవడంతో పై నుంచి కిందకు పడిపోయాడు. ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం మృతిచెందాడు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రధానార్చక వివాదంపై నోటీసుల జారీకి సన్నాహాలు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి ఆలయ ప్రధానార్చకుల నియామకంలో సీనియారిటీని పరిగణనలోకి తీసుకోలేదని ఆలయ ఉపప్రధానార్చకుడు కేకేఎస్ ప్రసాదాచార్యులు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నేపథ్యంలో న్యాయమూర్తి ఇటీవల వివాద పరిష్కారానికి ఉత్తర్వులు వెలువరించారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఆలయ ప్రధానార్చకుడిగా తనకు అధికారులు ఉద్యోగోన్నతి కల్పించకుండా చేశారని అభియోగాలు చేస్తూ 2022లో ప్రసాదాచార్యులు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ప్రధానార్చక నియామకంపై నూతన ఉత్తర్వులు జారీ చేయాలని రెండు నెలల క్రితం న్యాయస్థానం ఆదేశించడంతో వాటి అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి డాక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ ఈ నెల 6న ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే విషయంపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఈ నెల 18న సింహాచలం దేవస్థానం ఈవోకు మెమో ద్వారా ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాలకు నోటీసులు జారీ చేసి సీనియారిటీకి సంబంధించి లిఖిత పూర్వక అభిప్రాయాలు, ఆధారాలు తీసుకోనున్నట్లు దేవస్థానం పరిపాలనా విభాగం పర్యవేక్షకుడు కంచి మూర్తి తెలిపారు. ఈ మేరకు పిటిషనర్‌తో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి నోటీసులు జారీ చేయడానికి దేవస్థానం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

పోలీసు శాఖకు 115 ఫిర్యాదులు రాక

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 115 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ శంఖబ్రత బాగ్చీ ఫిర్యాదులను పరిశీలించి వారితో స్వయంగా మాట్లాడారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఫిర్యాదులపై విచారణ జరిపి త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్యాభర్తల గొడవలు, మోసాలకు సంబంధించి అధిక ఫిర్యాదులు అందాయన్నారు.

బాధితుల సమస్యలు వింటున్న సీపీ శంఖబ్రతబాగ్చీ

ప్రకృతి సాగుపై దృష్టి సారించాలి

పరవాడ, న్యూస్‌టుడే: రైతులంతా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని అనకాపల్లి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సీహెచ్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలోని తానాం గ్రామంలో సోమవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ వ్యవసాయం చేయడం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. భూసారం పెరగడంతో పాటు భూమిలో వానపాములు వృద్ధి చెందుతాయన్నారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి కషాయాలు వాడటం వల్ల తెగుళ్లు, పురుగులను నివారించవచ్చునన్నారు. రైతులంతా దీనిపట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి రమాదేవి, ఆత్మసంస్థ ఏటీఎం రామకృష్ణ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

E.A.No. 70/2024 in E.P. No. 15/2018 in O.S.No. 393/1997

Between:
Smt. Gopey Vajramma - పిటీషనర్లు/DHR's
And
Sri Chinnam Bhimanna (died) & Others - రెస్పాండెంట్లు/JDR's

To: 9వ రెస్పాండెంట్లు / 9వ JDR
అరిగెల జ్యోత్స్న, W/o. రజని గారు (బాలు) గారు, నియర్ వేపగుంట జంక్షన్, సింహాచలం హిల్స్, విశాఖపట్టణం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు గ్రంథములో 9వ రెస్పాండెంటు / 9వ JDR అయిన మీకు నోటీసులు పంపగా, మీరు నోటీసు సంగతులు తెలిసి యుండి నోటీసు తీసుకొనకుండా evade చేయుచున్నందున Substitute Service ద్వారా అమలు జరుపుటకు గాను ది. 02-12-2025వ సం॥రం॥ తేదీకి శ్రీ కోర్టు వారు order చేసినారు. కావున ది. 02-12-2025న వాయిదా రోజు ఉదయం గం. 10.30 ని॥లకు పై కోర్టులో మీరు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీపై పరోక్షమందు పై నెంబరు దావా తీర్మానించబడును. ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

సం/- **BVSRK Manohar**
Advocate, Tadepalligudem,
West Godavari District, Cell: 94410 54463

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సబ్బవరం, న్యూస్‌టుడే: పరవాడ మండలంలో ఈ నెల 15న జరిగిన అండర్-17 జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో సబ్బవరం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని కె.లాస్య ప్రతిభ చూపింది. దీంతో రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. సోమవారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.తిరుపతిరావు, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఆర్.ప్రసాద్ విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ శంకరరావు, వైస్ ఛైర్మన్ వై.జ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయుడు అబ్దుల్ రెహ్మాన్, రత్నాలమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కె.లాస్యను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావు

ఏకగ్రీవంగా వీఆర్వోల సంఘం ఎన్నిక

సబ్బవరం, న్యూస్‌టుడే: మండలంలోని వీఆర్వోల సంఘం ఎన్నిక మాజీ వీఆర్‌వో కె.శేఖర్‌రావు అధ్యక్షతన సోమవారం జరిగింది. అధ్యక్షులుగా కోడూరు శేఖర్, ఉపాధ్యక్షులుగా ఆదిరెడ్డి రవి, కార్యదర్శిగా కె.వాత్సల్యరాయ్, సహాయ కార్యదర్శిగా ఎం.గోవిందరావు, కోశాధికారిగా ఎస్.నూకరత్నంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కె.శేఖరరావు, ఎస్.కామరాజు, అప్పారావు, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గంతో సంఘం సభ్యులు

ఖోఖో పోటీలకు ఏర్పాట్లు

లంకెలపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు జరగనున్నాయని పాఠశాల హెచ్ఎం ఆర్.నాగేశ్వరరావు తెలిపారు. బాల బాలికలకు వేర్వేరుగా జరిగే పోటీలకు క్రీడా మైదానం సిద్ధం చేయడంతో పాటు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. క్రీడామైదానం అభివృద్ధి పనులను సోమవారం వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. నిర్వహణకు సంబంధించి లారస్‌ల్యాబ్స్ సంస్థ ఆర్థిక సహకారాలు అందించడానికి ముందుకొచ్చిందని వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడామైదానం అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

అమృతమూర్తికి అశ్రునివాళి

మంచికి, మమతానురాగాలకు మారుపేరుగా నిలిచి మేము గౌరవప్రదమైన స్థానంలో ఉండడానికి కారణమై మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మహోన్నత మాతృమూర్తి కీ॥శే॥ కొట్టక్కి సరస్వతి పట్నాయక్ ఆకస్మిక మరణం మాకు తీరనిలోటు... దైవసన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ కొట్టక్కి సరస్వతి పట్నాయక్
రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్
జననం: 16-08-1942 మరణం: 15-11-2025

కుమారులు	కోడళ్లు
సత్యానంద పట్నాయక్	కస్తూరి కుమారి (సురేఖ)
చక్రపాణి పట్నాయక్	సత్యవాణి
వెంకట కృష్ణ కుచేల్	కమల ధరణి

కుమార్తెలు	అల్లుళ్లు
జయశ్రీ పట్నాయక్	కీ॥శే॥ మోహనరావు
శాంతిశ్రీ పట్నాయక్	కీ॥శే॥ విజయానందరావు
వాణిశ్రీ పట్నాయక్	తిరుపతిరావు

మనుమలు మరియు మనుమరాళ్లు, మునిమనుమరాళ్లు, బంధుమిత్రులు

పెద్దకర్మ: తేది: 26-11-2025 బుధవారం నాడు మా స్వగృహమునందు జరుగును

Address: Flat No: 301/Block - A, MVV Enclave, Water Tank Road, Midhilapuri Vuda Colony, Madhurawada, Visakhapatnam

(c) eenadu

కన్నుపడితే.. కబ్జానే

నార్పల, బుక్కరాయసముద్రంలో ఆక్రమణలపర్వం

గాంధీనగర్ వెళ్లే మార్గంలో ఆక్రమణకు గురైన రహదారి స్థలం

బుక్కరాయసముద్రం, నార్పల, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం, నార్పల మేజర్ పంచాయతీల్లోని ఖాళీ స్థలాలను కబ్జాదారులు ఆక్రమిస్తున్నారు. అరికట్టాల్సిన పంచాయతీ, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తుండడంతో వారు మరింత రెచ్చిపోతున్నారు. బుక్కరాయసముద్రం అనంతపురం జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉండటంతో ఇక్కడ భూములు ధరలు అమాంతం పెరిగాయి. ఈ నేపథ్యంలో కొందరు అక్రమార్కులు మారుతి హోటల్ నుంచి గాంధీనగర్ వైపు వెళ్లే మార్గంలో రోడ్డు స్థలాన్ని దర్జాగా కబ్జా చేశారు. ఆ స్థలాల్లో బండలు, కట్టెల వ్యాపారాలు నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అంతటితో ఆగని అక్రమార్కులు పోలీస్‌స్టేషన్ దగ్గర అంబేడ్కర్ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలంలోనూ పాగా వేసి దుకాణాలు, హోటళ్లు నడుపుతున్నారు.

● నార్పల మేజర్ పంచాయతీ ప్రధాన వాణిజ్య కేంద్రంగా మారడంతో ఇళ్ల స్థలాల ధరలకు రెక్కలొచ్చాయి. సెంటు స్థలం రూ.5లక్షలకుపైనే పలుకుతోంది. ఇదే అదునుగా నార్పల బస్టాండు సమీపంలోని కూతలేరు వాగులో కబ్జాదారులు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. పంచాయతీ కార్యాలయం దగ్గర, దుగుమర్రి రోడ్డులోనూ ఆక్రమణలు వెలిశాయి. దుకాణాలను అద్దెకు ఇస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఆక్రమణలపై న్యూస్‌టుడే బుక్కరాయసముద్రం తహసీల్దారు శ్రీధరమూర్తిని వివరణ కోరగా స్పందించారు. రహదారుల స్థలాల ఆక్రమణలపై ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కుడి కాలువ గేట్లకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

ముమ్మరంగా పీఏబీఆర్ గేట్ల మరమ్మతు

రేపు కుడి కాలువకు నీరు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: పీఏబీఆర్ కుడి కాలువ గేట్ల (షట్టర్ల) మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ గేట్ల మరమ్మతు కోసం రాష్ట్ర ప్రభుత్వం అత్యవసరంగా రూ.29 లక్షలు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. టెండర్ ద్వారా గుత్తేదారుడిని ఎంపిక చేసి ఈ పనులను చేయిస్తున్నారు. మరమ్మతు పనుల కారణంగా ఈనెల 15న కుడి కాలువకు నీరు విడుదల చేయాల్సి ఉండగా.. ఇదే నెల 25కు వాయిదా పడింది. మంగళవారం (25న) నీటి విడుదల చేసే అవకాశం లేదు. ఇక్కడి గేట్ల పనులు ప్రాథమిక దశలోనే ఉన్నాయి. మంగళవారం గేట్ల పనులు ఓ కొలిక్కి వచ్చే వీలుంది. బుధవారం (26న) కుడి కాలువకు నీరు విడుదల చేసే అవకాశాలు మెండుగా ఉన్నట్లు తెలుస్తోంది. పీఏబీఆర్ సబ్ డివిజన్-2 డీఈ కవిత, ఏఈ ఓబిరెడ్డిల సారథ్యంలో ఈ పనులు వేగంగా సాగుతున్నాయి. దగ్గరుండి పనులు కొనసాగిస్తున్నారు. హెచ్చెల్సీ ఎస్‌ఈ సుధాకర్‌రావు మంగళవారం ఆ మరమ్మతు పనులను పర్యవేక్షిస్తారు. అక్కడే నీటి విడుదలపై స్పష్టత రానుంది. ప్రస్తుతం గేట్ల మరమ్మతు ఫలితంగా కుడి కాలువ సర్వీసు గేటును పైకి ఎత్తారు. అత్యవసర గేటు పైకి లేపాల్సి ఉంది. ఈ గేటు పైకి లేస్తే నీరు విడుదల అయినట్లే. ఈ కుడి కాలువ నీటి కోసం ఉరవకొండ, శింగనమల, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల పరిధిలో ఆయకట్టుదారులు నిరీక్షిస్తున్నారు. 40 చెరువులకు నీరు ఇవ్వాల్సి ఉంది. పండ్లతోటల రైతులు నెల రోజులుగా ఎదురు చూస్తున్నారు.

వందేళ్ల పండగ.. చిరస్మరణీయంగా!

15.65 లక్షల మందికి అన్న ప్రసాదం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శత జయంతి వేడుకలను పురస్కరించుకుని ఈనెల 13 నుంచి 24 వరకు నారాయణసేవ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా 15.65 లక్షల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

సేవాదళ్ సభ్యులు 11,250

వివిధ రాష్ట్రాలకు చెందిన 11,250 మంది సేవాదళ్ సభ్యులు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందించారు.

64,530 మందికి వైద్యసేవలు

అంతర్జాతీయ వైద్యశిబిరంలో 64,530 మంది సేవలందుకున్నారు. ఈనెల 1 నుంచి 24వ తేదీ దాకా నిర్వహించిన శిబిరంలో వివిధ దేశాలకు చెందిన 65 మంది వైద్యులు, 160 మంది సిబ్బంది చికిత్సలు చేసి.. మందులు ఉచితంగా అందించారు.

ఈనాడు, పుట్టపర్తి: పుట్టపర్తిలో సత్యసాయి శతజయంతి వేడుకలు పదిరోజులపాటు వైభవంగా నిర్వహించారు. దేశ అత్యున్నత పదవుల్లో ఉన్న వారితోపాటు దేశ, విదేశాల నుంచి దాదాపు 8.50 లక్షల మంది వేడుకల్లో పాల్గొన్నారు. బృహత్తర కార్యక్రమంలో ప్రముఖులు, భక్తులకు భద్రత, వసతి సౌకర్యాలు కల్పించడం కత్తిమీద సామే. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సజావుగా నిర్వహించారు.

● సత్యసాయి శతజయంతి ఉత్సవాలు ఈనెల 13 నుంచి 23 వరకు పుట్టపర్తిలో నిర్వహించారు. ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించింది. అంతేకాదు.. రూ.10 కోట్లు విడుదల చేసింది. సీఎం మొదలు మంత్రులు, అధికారుల వరకు కార్యాచరణలో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దాదాపు 3 రోజులు పుట్టపర్తిలోనే ఉన్నారంటే ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారో అవగతమవుతుంది.

సమన్వయంతో పనిచేశాం

- శ్యామ్‌ప్రసాద్, కలెక్టర్, సత్యసాయి

ఉత్సవాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం చక్కటి సమన్వయంతో పనిచేసింది. అందరూ అంకితభావంతో పనిచేశారు. ఏర్పాట్లు పరిశీలనకు కమిటీలను పర్యవేక్షణ చేయడానికి సాయి ఆరామంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ సత్ఫలితాలనిచ్చింది. వీవీఐపీల నుంచి సామాన్యుల వరకు సంతృప్తి వ్యక్తం చేశారు.

నిరంతర తనిఖీలతో..

- సతీశ్‌కుమార్, ఎస్పీ

వీవీఐపీలు, భక్తుల భద్రత, వారి రాకపోకలకు ఎక్కడికక్కడ ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశాం. మందిరం, ఎయిర్‌పోర్టు, హిల్‌వ్యూ స్టేడియంలలో 24 గంటలూ ప్రత్యేక దళాలను నియమించాం. నిరంతరం తనిఖీలు చేయడం సత్ఫలితాలనిచ్చింది.

పతకాలు అందుకున్న విద్యార్థినులు

ప్రతిభావంతులకు బంగారు పతకాలు

శత జయంతి వేడుకలను పురస్కరించుకుని, ఏపీ సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. సోమవారం సాయి కుల్వంత్ మహాసమాధి చెంత విద్యార్థినులకు బంగారు పతకాలను ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సతీమణి హిమహిని పంపిణీ చేసి, అభినందించారు. పోటీల్లో మొత్తం 4,182 విద్యాసంస్థల నుంచి 1,73,030 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 3,360 పాఠశాలల నుంచి 1,32,136 మంది, 566 జూనియర్ కళాశాలల నుంచి 25,684 మంది, 256 డిగ్రీ కళాశాలల నుంచి 15,210 మంది పాల్గొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు.

జాలువారే జలసిరి

అక్కడ జాలువారుతున్న నీరు కనువిందు చేస్తుంది. జలసవ్వడి అందరినీ ఆకట్టుకుంటోంది. విడపనకల్లు మండలం హావళిగి సమీపాన పెద్దవంక మీద నిర్మించిన ఎంపీ ట్యాంకు పరవళ్లు తొక్కుతోంది. కరవు నివారణలో భాగంగా హెచ్చెల్సీ జీబీసీలో వృథా అయ్యే నీటిని ఒడిసి పట్టడానికి నిర్మించారు. ఐదేళ్ల హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి వచ్చిన వృథా నీరు ఇక్కడికే చేరింది. ఈ నీటితో ప్రస్తుతం సుమారు 800 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ట్యాంకు కింద భాగంలో వంక నుంచి వెళ్లే నీటిని మోటార్ల సాయంతో రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. తద్వారా మరో 3 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. జలసిరిని చూడడానికి వస్తున్న ప్రజలు అక్కడ కాసేపు సరదాగా గడుపుతుంటారు.

-న్యూస్‌టుడే, ఉరవకొండ, విడపనకల్లు

ఊపిరితిత్తుల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయా..?

ఆయాసం వేధిస్తోందా...

ఈనాడు మీ తోడు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: ఇప్పుడిప్పుడే చలి మొదలవుతోంది. జలుబు, దగ్గు, విపరీతంగా తుమ్ములు రావటం, ముక్కులో నీరు కారడం వంటి సమస్యలు వస్తున్నాయి. ఊపిరితిత్తుల్లో నిమ్ము, ఆయాసం, శ్వాస తీసుకునేటప్పుడు పిల్లి కూతలు వస్తుంటాయి. వంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..? వాటి నివారణతోపాటు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలుసుకోవాలనుకుంటున్నారా.. ఇందుకు 'ఈనాడు-మీతోడు' చక్కటి వేదిక కల్పిస్తోంది. ప్రభుత్వ సర్వజన వైద్యశాల పల్మనాలజిస్ట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సతీష్‌కుమార్‌తో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. మీరు నిర్దేశిత సమయంలో ఫోన్ చేసి ఆయన సలహాలు, సూచనలు అందిస్తారు.

ఫోన్ చేయాల్సిన రోజు: 26-11-2025
సమయం: ఉదయం 9గంటల నుంచి 10 గంటల మధ్య
ఫోన్ నంబరు: 80085 73008

ఆర్టీసీ బస్టాండ్ వద్ద..

జంక్షన్ జాం.. నియంత్రణ శూన్యం

శ్రీకంఠం కూడలిలో..

అనంత నగరంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కూడళ్లు అన్నీ వాహనాలతో రద్దీగా మారుతున్నాయి. నాలుగు వైపులా వాహనాలు ఒకేసారి వచ్చి కూడలి మధ్యలో నేను ముందు వెళ్లాలి అంటే నేనే ముందు వెళ్లాలి అని ఆధిపత్యానికి పోతుండటంతో ఎక్కడి వాహనాలు అక్కడనే ఉండిపోయి జంక్షన్ జాం అనే మాట గుర్తు వచ్చేటట్లు చేస్తున్నారు. అదే సమయంలో పోలీసులు కూడా ఎక్కువమంది లేక ఒక వైపు నియంత్రణ చేస్తుంటే రెండో వైపు నుంచి వాహనదారులు వారి ఇష్టానుసారం వెళ్లిపోతుండటంతో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. రాంనగర్ వద్ద నిత్యం అంబులెన్స్‌లు తిరుగుతుంటాయి. ఇవన్నీ ఉదయం, సాయంత్రం ట్రాఫిక్‌లో చిక్కుకుని చాలా ఇబ్బందులు పడుతున్నాయి. **- ఈనాడు, అనంతపురం**

పరిశ్రమలతోనే కాదు.. ఉద్యాన సాగుతోనూ ఆదాయమే

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఈనాడు, అమరావతి: "రాయలసీమ రైతులకు మరింత ఆదాయం పెరగాలంటే ఉద్యాన పంటల సాగును మరింత విస్తృతం చేయాలి. సీమలో మరింత అభివృద్ధి జరిగేందుకు అపారమైన అన్ని వనరులూ ఉన్నాయి. ఇప్పటికే అనేక పరిశ్రమలు, కంపెనీలను ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయిస్తోంది. దీనికి తోడు పండ్ల ఎగుమతుల ద్వారా చక్కని ఆదాయం పొందొచ్చు" అని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సోమవారం ఆయన రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక, జలవనరుల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. రాయలసీమ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్, కార్యదర్శి రోనాల్డ్ రోస్, జలవనరుల శాఖ సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి కేశవ్ ఏమన్నారంటే..

● తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను ఆనుకుని రాయలసీమ ఉంది. ఇది ఎంతో అనుకూలాంశం. ఉద్యాన పంటల ఉత్పత్తులను ఆయా రాష్ట్రాలకు ఎగుమతి చేయవచ్చు. కొన్ని ఉద్యాన పంటలకు విదేశాల్లో ఎంతో డిమాండ్ ఉంది. ఆ పంటలను సాగు చేపట్టడం వల్ల విదేశాలకు ఎగుమతి చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.

● ఉద్యాన పంటల సమాచారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇప్పటికే సీమలో గతంలో ఎన్నడూ లేని స్థాయిలో సాగునీటిని అందిస్తున్నాం. నీటిని సద్వినియోగం చేసుకుని పంటలో లాభాలు పొందేలా పండ్ల తోటల పెంపకం చేపట్టాలి. అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి.

● కియా పరిశ్రమ వల్ల ఉమ్మడి అనంతపురం జిల్లాలో జీఎస్‌డీపీ పెరిగింది. పరిశ్రమల వల్లే కాదు.. ఉద్యాన పంటల ద్వారా ఆదాయం సృష్టించవచ్చని రాయలసీమ రైతులు నిరూపించాలి.

● కోనసీమలో వరి సాగు చేసే రైతుల కన్నా రాయలసీమలో ఉద్యాన పంటలు సాగు చేసే వారికి ఆదాయం ఎక్కువ వస్తోంది. రెండు ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేసి రూ.కోట్లలో ఆదాయం పొందిన వారూ ఉన్నారు. ఆర్గానిక్ పంటలతో రాబడి ఎంతో బాగుంది.

రైల్వే సీఐ మృతి కేసు సీబీఐకి అప్పగించాలి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: రాయదుర్గానికి చెందిన మాజీ తితిదే అసిస్టెంట్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ (ఏవీఎస్‌వో) రైల్వే సీఐ సతీశ్‌కుమార్ మృతి కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ జిల్లా కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో నగరంలోని గడియార స్తంభం నుంచి ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఎస్పీ జగదీశ్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు రామాంజనేయులు, ఓబులపతి, గోపాల్, తదితరులు మాట్లాడారు. తితిదే పరకామణి కేసులో కీలకమైన సాక్షి కావడంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారే ఏవీఎస్‌వోను హత్య చేయించి ఉంటారని భావిస్తున్నామన్నారు. కేసును సీబీఐకి బదిలీ చేయాలని కోరారు.

గ్రేడ్ 1 పురపాలికగా రాయదుర్గం

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం పురపాలక సంఘం 24 ఏళ్ల తర్వాత గ్రేడ్ వన్‌గా అవతరించింది. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచన మేరకు అక్టోబరు 27న స్థానిక కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. సోమవారం గ్రేడ్ 1 మున్సిపాలిటీగా గెజిట్ నోటిఫికేషన్‌తోపాటు జీవో జారీ అయినట్లు స్థానిక కమిషనర్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 1963లో తృతీయ గ్రేడ్ పురపాలక సంఘంగా గుర్తించారు. 2001లో గ్రేడ్ 2గా గుర్తింపు పొందింది. ప్రస్తుతం గ్రేడ్ రావడంతో వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎక్కువ మొత్తంలో నిధులు మంజూరు కానున్నాయి. ఉద్యోగుల సంఖ్య కూడా పెరగనుంది.

పబ్లిక్ నోటీస్

ఇందుమూలముగా యావన్మందికి తెలుపడం ఏమనగా, నా కక్షిదారులు మా కంపెనీ **V.R.L. LOGISTICS LIMITED** వారు క్రింద కనపరచిన 1వ అయిటం భూమిని 1) మల్లెల పుల్లారెడ్డి, 2) పూల ఆనంద్, 3) కరణం శివయ్య, 4) యావర్ల తిరుపాల రెడ్డి గార్ల నుండి మరియు 2) అయిటం భూమిని యాపర్ల తిరుపాల్ రెడ్డి గారి నుండి విక్రయం పొందవలెనని సంకల్పించినారు. ఈ విక్రయంపై ఎవరికైనా ఆక్షేపణలున్న యెడల మాకు వారం రోజులు లోపల తెలుపవలెను. అట్లు తెలపని యెడల ఎవరికి ఆక్షేపణ లేదని భావిస్తాము.

షెడ్యూలు: అనంతపురము జిల్లా, బుక్కరాయసముద్రం మండలము, గోవిందంపల్లి గ్రామంలో భూమి వివరము:

అయిటం 1) సర్వే నెం. 78-4, వి. 6.00 ఎకరముల పైకి ఎ॥ 2.89 సెంట్లు **హద్దులు: తూర్పు:** ఇదే సర్వేనెంబరులో విక్రయదారుల భూమి. **పడమర:** సర్వే నెంబరు 77లో శివరాం భూమి **ఉత్తరము:** సర్వే నెంబరు 78/3లో రోడ్డు **దక్షిణం:** సర్వే నెంబరు 134 లో భూమి **అయిటం 2)** సర్వే నెం. 134-1ఎ2, వి. ఎ॥ 0.77 సెంట్ల పైకి ఎ॥ 0.28 సెంట్లు **హద్దులు: తూర్పు:** ఇదే సర్వే నెంబరులో మహమ్మద్ రఫీ భూమి **పడమర:** ఇదే సర్వే నెంబరులో మిగతా భూమి **ఉత్తరము:** సర్వే నెంబరు 78/4లో భూమి దక్షిణం: రోడ్డు

పి. కృష్ణస్వామికుమార్, అడ్వకేట్,
డి.నెం. 7-118, ప్రకాష్ రోడ్డు, అనంతపురము.
సెల్: **9441081584, 9966316772**

చింతలరాయుడి పవిత్రోత్సవాలు ప్రారంభం

తాడిపత్రి, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన తాడిపత్రి పట్టణంలోని చింతల వెంకటరమణస్వామి దేవాలయంలో సోమవారం నుంచి పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అర్చకులు స్వామి మూలవిగ్రహానికి వివిధ రకాల అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉత్సవాలు 28వ తేదీ వరకు సాగుతాయని అర్చకులు వెల్లడించారు. అధికసంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకొని భజనలు చేశారు.

శిశుగృహ సిబ్బంది తొలగింపు

■ మేనేజర్‌తోసహా ఆరుగురిపై వేటు
■ పసిబిడ్డ మృతి ఘటనే కారణం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: పసిబిడ్డ మృతి చెందిన యాభై రోజుల తర్వాత శిశుగృహ ఘటన బాధ్యులపై జిల్లా యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. కేంద్రంలో పని చేస్తున్న మొత్తం ఏడుగురిని తొలగిస్తూ కలెక్టర్ ఆనంద్ సోమవారం ప్రత్యేక దస్త్రంపై ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి ధ్రువీకరించారు. శిశుగృహ మేనేజర్ దీప్తి, సోషల్ వర్కర్ లక్ష్మీదేవి, ఏఎన్‌ఎం, ముగ్గురు ఆయాలు, ఒక వాచ్‌మెన్‌లను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. వీరి తొలగింపుతో శిశుగృహ మొత్తం ఖాళీ అయినట్లే. ఒకటి రెండు రోజుల్లో సదరు సిబ్బందికి ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. శిశుగృహలో రెండు మాసాల అనాథ పసిబిడ్డ ఆకలికి తాళలేక మృతి చెందిందన్న ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఈమేరకు గతనెల 5న 'పాపం.. పసివాడి ప్రాణం!' శీర్షికన 'ఈనాడు' ప్రధాన సంచికలో ప్రచురితమైంది. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు.

ముఖ్యమంత్రి ఆదేశాలతో..

గత నెల 3వ తేదీ తెల్లవారుజామున పసిబిడ్డ మృతి చెందింది. అదే రోజు గుట్టుచప్పుడు కాకుండా శ్మశానంలో పాతిపెట్టారు. ఈ విషయాన్ని అప్పటి పీడీ, కలెక్టర్, ప్రభుత్వ ఉన్నతాధికారులకు చెప్పలేదు. 4వ తేదీన బయటకు పొక్కింది. దీన్ని 'ఈనాడు' వెలుగులోకి తీసుకొచ్చింది. అదే రోజు సీఎం చంద్రబాబు సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు. 5వ తేదీనే డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీదేవి, అప్పటి పీడీ నాగమణి, సర్వజన ఆస్పత్రి చిన్నపిల్లల వైద్యుడు ప్రవీణ్‌దీన్‌కుమార్‌తో కూడిన త్రిసభ్య కమిటీ విచారణ చేపట్టింది. 6న రాష్ట్ర మహిళా,శిశు సంక్షేమ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. ఈ ఘటన సమాచారాన్ని రాష్ట్ర కార్యాలయానికి సకాలంలో చెప్పలేదన్న అభియోగంపై పీడీ నాగమణిని సస్పెండ్ చేశారు. తర్వాత డీసీఓ అరుణకుమారికి ఇన్‌ఛార్జి పీడీ బాధ్యతలు అప్పగించారు.

పోస్టుల భర్తీపై కసరత్తు

ఏడుగురిని తొలగించడంతో శిశుగృహ కేంద్రంలో సిబ్బంది మొత్తం ఖాళీ అవుతుంది. దీంతో కలెక్టర్ ఆనంద్ ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రోజుకు మూడు షిఫ్టుల్లో ఆరోగ్య శాఖ ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. ఈ గృహంలో ప్రస్తుతం నలుగురు శిశువులు ఉన్నారు. వారి ఆలనాపాలన చూసుకోడానికి ఏఎన్‌ఎం, ఆశాలు బాధ్యతల్లో ఉన్నారు. ఈ కేంద్రంలో అన్ని కేడర్ల పోస్టుల భర్తీకి త్వరలో ప్రత్యేక ప్రకటన ఇచ్చే అవకాశం ఉంది. అప్పటివరకు సర్వజన ఆసుపత్రి, నగర పాలక సంస్థ నుంచి కొందరి పారిశుద్ధ్య కార్మికులను కొంత కాలం డిప్యుటేషన్‌పై నియమించే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం శిశుగృహలో ఒప్పంద విధానంలో పని చేస్తున్న సిబ్బంది నియామక గడువు ఈ ఏడాది మార్చికే ముగిసింది. అప్పటి నుంచి రెన్యూవల్ చేయనట్లు తెలుస్తోంది. రానున్న ప్రకటనతో కొత్త వారిని నియమిస్తారు.

వినతులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్, డీఆర్‌ఓ మాలోల, తదితరులు

'అర్జీలపై అసంతృప్తి వస్తే సస్పెన్షనే'

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: 'కొందరు సిబ్బంది నిర్లక్ష్యం, బాధ్యత లేని తనంతో అర్జీల పరిష్కారంలో నాణ్యత కొరవడింది. బాధితుల నుంచి అసంతృప్తి ఎక్కువగా వినిపిస్తోంది. ఇక నుంచి ఇలాంటి వాటిని ఉపేక్షించేది లేదు. తప్పు చేస్తే సస్పెండ్ చేస్తాం' అని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం రెవెన్యూ భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అర్జీలను తీసుకున్నారు. కలెక్టర్‌తోపాటు డీఆర్‌ఓ మాలోల, ప్రత్యేక ఉప కలెక్టర్లు రామకృష్ణారెడ్డి, మల్లికార్జునుడు, ఆనంద్, రామ్మోహన్, రమేశ్ రెడ్డి, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, తదితరులు ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. మొత్తం 450 మంది అర్జీలు అందజేశారు. తర్వాత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీల పరిష్కార ప్రక్రియపై క్షేత్ర సిబ్బందిలో బాధ్యత లేదు. ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. జిల్లా అధికారులు, ఆర్డీఓలు విధిగా పర్యవేక్షణ ఉండాలన్నారు.

పదోన్నతుల్లో అక్రమాలు

పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-6 నుంచి గ్రేడ్-5 పదోన్నతుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని బాధిత ఉద్యోగులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సీనియార్టీ జాబితా వెల్లడిలోనే చేతివాటం చూపారని విమర్శలు వచ్చాయి. రోస్టర్ పాయింట్ల నమోదులో గందరగోళం ఏర్పడింది. సమగ్ర వివరాలతో సీనియారిటీ జాబితా ప్రకటించలేదు. అభ్యంతరాలకు గడువు ఇవ్వలేదు. ఎస్సీల ఉప కులాల పోస్టుల కేటాయింపులో అస్తవ్యస్తంగా ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

అంతర్జాతీయ స్కేటింగ్ పోటీల్లో మెరిసిన అమిన్‌తాజ్

పతకాలతో అమిన్‌తాజ్

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: పుణేలో జరిగిన అంతర్జాతీయ అండర్-7 రోలర్ స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన అమిన్‌తాజ్ మెరుపులు మెరిపించింది. ఆ బాలిక అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి మూడు పతకాలు సాధించింది. అందులో రెండు బంగారు, ఒక రజత పతకం సాధించి జిల్లా కీర్తిని ఇనుమడింపజేసింది. ఏడేళ్లకే అంతర్జాతీయ పోటీల్లో పతకం సాధించడం జిల్లాకే గర్వకారణం. కఠోర సాధన, శిక్షకుల మెలకువలతో పోటీల్లో ఆమె సత్తాచాటింది. జిల్లా నుంచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికై ఏకంగా పతకాలు కైవసం చేసుకోవడం విశేషం. అనంతపురం నగరానికి చెందిన రుబీనా, ఖలీల్ దంపతులు కుమార్తెను అన్ని విధాలా ప్రోత్సహించారు.



(c) eenadu

పీఎం ఆవాస్ యోజనతో లబ్ధి ఎలా?

దరఖాస్తు చేయడంలో ఇబ్బందులా..

ఈనాడు మీ తోడు

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అర్హులకు సొంతింటి కల సాకారం చేసుకోవడానికి అవకాశం కల్పించారు. సంబంధిత సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్ ద్వారా దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించినా పలు సందేహాలు తలెత్తుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల మంజూరులో ఎదురవుతున్న సమస్యలు, బిల్లుల మంజూరు, నిర్మాణంలో ఉన్న గృహాలకు సంబంధించి అర్బన్-3 నుంచి 1, 2కు బదిలీ కావడం, తదితర సమస్యలను సంబంధిత జిల్లా అధికారిణి దృష్టికి తీసుకెళ్లడానికి 'ఈనాడు' చక్కటి అవకాశం కల్పిస్తోంది. ఒక్క ఫోన్ కాల్‌తో అనంతపురం జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు అధికారిణి శైలజతో నేరుగా మాట్లాడి.. మీ సమస్య, సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

ఫోన్ చేయాల్సిన తేదీ: 25-11-2025 (నేడే)
సమయం: ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్య
ఫోన్ నంబర్లు: 70939 30112, 80085 73011

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నేడు(మంగళవారం) ఉదయం పది గంటలకు శ్రీవారికి అర్జిత కల్యాణోత్సవం ఉంటుంది. రాత్రి ఏడున్నర గంటలకు వెండిరథ ప్రాకారోత్సవం జరుగుతుంది. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు సాధారణ దర్శనం. ఏడు నుంచి తొమ్మిది గంటల మధ్య అభిషేక, స్వర్ణకవచ సేవలు ఉంటాయి. తర్వాత తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది.

40 శాతం రాయితీతో విత్తన పంపిణీ

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: రబీలో నీటి ఆధారం కింద సాగు చేసుకునే రైతులకు 40 శాతం రాయితీతో వేరుసెనగ విత్తనం పంపిణీ చేయడం జరుగుతుందని వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఉమామహేశ్వరమ్మ తెలిపారు. జిల్లాకు 7,300 క్వింటాళ్లు వేరుసెనగ విత్తనం కేటాయించారని, అందులో కదిరి-6 రకం 6 వేల క్వింటాళ్లు, టీసీజీఎస్-1694 రకం 1300 క్వింటాళ్లు కేటాయించారన్నారు. క్వింటా పూర్తి ధర రూ.9,200 కాగా రాయితీ రూ.3,680 పోను రూ.5,520 రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థకు సరఫరా బాధ్యతను అప్పగించారన్నారు. వేరుసెనగ విత్తనం కావాల్సిన రైతులు రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలని జేడీఏ తెలియజేశారు.

తీగజాతి పంట.. లాభాలే రైతింట!

ఆశాజనకంగా బీర దిగుబడి

సాగు చేసిన బీర పంట

కళ్యాణదుర్గం (గ్రామీణం, న్యూస్‌టుడే: స్వల్ప కాలిక తీగజాతి పంటలు దిగుబడులతో పాటు మంచి లాభాలు అందిస్తున్నాయి. కళ్యాణదుర్గం మండలం పాతచెరువు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ అనే రైతు ఆరెకరాల్లో బీర పంట సాగు చేస్తూ దిగ్విజయంగా ముందుకెళ్తున్నారు.

● రైతు మూడెకరాల్లో బీర పంట సాగు చేస్తున్నాడు. ఒక్కోసారి పంట సాగుకు రూ.4.50 లక్షల పెట్టుబడి పెట్టారు. అనంతపురం నుంచి నీలో రకం బీర విత్తనాలను రెండున్నర కిలోలు రూ.30వేలు వెచ్చించి కొనుగోలు చేశారు. కర్రలకు రూ.లక్ష, దారాలకు, కూలీలకు రూ.80వేలు, మల్చింగ్ కవర్ ఒక్కో బండిల్ రూ.2,180 వంతున 9 బండిళ్లు కొనుగోలు చేశారు. పురుగు మందుకు రూ.40వేలు వెచ్చించారు. పంటను ఎప్పటికప్పుడు కంటికి రెప్పలా చూసుకుంటూ అదే స్థాయిలో దిగుబడులు పొందుతున్నారు.

ప్రణాళికతో దిగుబడులు ఇలా..

పంట సాగు చేసిన రెండునెలల్లో మొదటి విడత 8 సార్లు పంట కోత కోయగా 30 టన్నుల వరకు దిగుబడి రాగా రూ.7లక్షల వరకు లాభాలు వచ్చాయి. మరో ఆరు సార్లు కోత కోస్తే దాదాపుగా 20-25 టన్నుల దిగుబడి వస్తుందని, అదే స్థాయిలో మార్కెట్లో మంచి ధరలు ఉన్నాయంటే సుమారుగా రూ.8.50 లక్షల వరకు ఆదాయం రానుంది. తోట వద్దనే కిలో రూ.32లతో విక్రయిస్తున్నారు. దీంతో రవాణా, కమీషన్లు మిగులుతున్నాయి. ఒక్కోసారి పంటను అనంతపురం, బెంగళూరు మార్కెట్లకు రైతే తీసుకెళ్తున్నారు.

మంచి లాభాలొస్తున్నాయి

గతంలో వేరుసెనగ, టమోటా, కర్బూజ పంటలు సాగు చేసి లక్షలాది రూపాయలు నష్టపోయా. ఇతర ప్రాంతాలకు వెళ్లిన సమయంలో తీగజాతి పంటల సాగు చేస్తున్న రైతులతో ఆరా తీశా. ఆరెకరాల్లో బీర పంట సాగు చేస్తూ దిగుబడులతో పాటు లాభాలు గడిస్తున్నా. మరికొంత మందికి పంట సాగుపై సలహాలు, సూచనలు ఇస్తున్నా. **- చంద్రశేఖర్, రైతు, పాతచెరువు**

పొలంలో గడ్డి కాలిస్తే నష్టం!

చిట్కా

వరిపంట వ్యర్థాలు కాలుస్తున్న రైతులు

నార్పల , న్యూస్‌టుడే : వరి కోతలు పూర్తయ్యాక కొంతమంది రైతులు పంట అవశేషాలు, గడ్డిని కాల్చడం వల్ల రైతులకు అధిక నష్టాలు ఉంటాయని రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. గడ్డిని కాల్చడం వల్ల భూమిలో సేంద్రియ పోషకాలు కూడా కాలిపోయి వచ్చే పంట దిగుబడి తగ్గుతుందన్నారు. దీనికితోడు భూమి చౌడు భూమిగా మారుతుందన్నారు. వరి కొయ్యలు, గడ్డిని పొలంలో కాల్చకుండా రైతులు ట్రాక్టరుతో కలియ దున్నుకుని, రెండు వారాలు నీరు పెడితే గడ్డి కుళ్లిపోయి పోషకాలుగా మారుతాయన్నారు. తద్వారా సాగు చేసే పంటలు అధిక దిగుబడి సాధించవచ్చన్నారు.

రైతేరాజు

టమాటాను రక్షించుకుందామిలా!

కళ్యాణదుర్గం గ్రామీణం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జాగ్రత్తలు తీసుకుంటే టమాటా పంటను రక్షించుకోవచ్చునని కళ్యాణదుర్గం ఉద్యాన అధికారి కృష్ణతేజ చెబుతున్నారు. నీటిముంపు, పోషకాలు కోల్పోవడం, కాయలు, మొక్కలు కుళ్లిపోవడం, చీడపీడల బెడద నుంచి రక్షించుకోవాలంటే మల్చింగ్, స్టేకింగ్ చేసుకోవాలి. వర్షాకాలంలో బ్యాక్టీరియాతో పాటు మచ్చ తెగుళ్ల నివారణకు 10 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, గ్రాము స్ట్రెప్టో మైసిన్ 10 లీటర్ల నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

సమస్య సమాధానం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు పంటల సాగులో ఎలాంటి సందేహాలున్నా రేకులకుంట వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త నారాయణ స్వామి చరవాణి నంబరు: 62812 84235 ఫోన్‌చేసి తగిన సలహాలు, సూచనలు పొందవచ్చు.

నారాయణస్వామి

సమస్య : టమాటా పంటకు సూదిముక్కు పురుగులు ఆశించడంతో టమాటా కాయల నాణ్యత దెబ్బతింటోంది. ఈ పురుగులను ఎలా నివారించాలి.

- నరసింహులు, గూగూడు

సమాధానం: టమాటాకు ఆశించిన సూదిముక్కు పురుగులను నివారించడానికి రైతులు స్పైనోసాయిడ్ 0.3 మి.లీ, ఇండాక్సాకార్బ్ 0.2 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే తెగులు ఉద్ధృతి తగ్గుతుంది.

సమస్య : వేరుసెనగ పంట 25 రోజుల దశలో ఉంది. పంటలో కలుపు తొలగించడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలి. **- యల్లప్ప, యాడికి**

సమాధానం : 25 రోజుల దశలో ఉన్న రెండు నుంచి మూడు ఆకుల దశలో ఉన్న వేరుసెనగ పంటలో గడ్డిజాతి మొక్కలను నివారించడానికి రైతులు ఇమజితపైర్ కలుపు మందును 300 మి.లీ ద్రావణం, 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే కలుపు సమస్య తగ్గుతుంది.

మల్లెసాగులో తెగుళ్లా?

ముదిగుబ్బ, న్యూస్‌టుడే : శీతాకాలంలో గుండుమల్లెకు తెగుళ్లు విపరీతంగా సోకుతాయి. కొమ్మకత్తిరింపు తర్వాత మొక్కలు కొత్తగా చిగురించి మొగ్గలు ఏర్పడుతున్నాయి. ఈక్రమంలో నల్లిపురుగు ఎండుతెగులు, మొగ్గతొలుచు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు.

కత్తిరించిన మల్లెతోట

ఎండిపోయిన మొగ్గలు

నల్లి నివారణకు

పొడి వాతావరణంలో నల్లిపురుగు ఆకుల అడుగు భాగంలో చేరి రసాన్ని పీల్చడం వల్ల ఆకులు పసుపు రంగులోకి మారి రాలిపోతాయి. ఇది తొలి దశలో ఉన్నప్పుడు వేపనూనె ఒక మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. తీవ్రత పెరుగుతున్న సమయంలో పోనజాక్విన్ 1 ఎంఎల్ లేదా స్పిరో మెసిఫిన్ ఒక మి.లీ లీటరు నీటలో కలిపి పిచికారీ చేస్తే నల్లిపురుగు నశిస్తుంది.

ఆకుఎండు..

తెగులుసోకిన ఆకులపై ఎరుపు రంగు మచ్చలు రావడంతో వాటి తీవ్రత పెరిగేకొద్దీ సగానికిపైగా దిగుబడి తగ్గుతుంది. వాటి నివారణకు మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా కార్బండజిమ్ ఒక గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మొగ్గతొలుచు పురుగు

పురుగు లార్వా మొగ్గల్లోనికి చొచ్చుకునిపోయి లోపలిభాగాన్ని తినేస్తుంది. దీంతో మొగ్గ పూర్తిగా ముడుచుకుపోతుంది. నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా కార్బరిల్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

జిల్లా క్రికెట్ సంఘంలో మైనార్టీలకు పెద్దపీట

ఆరు పదవుల్లో మూడు వారికే

సి.శ్రీనాథ్

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: అందరూ ఊహించినట్లే జిల్లా క్రికెట్ సంఘం ఎన్నికలు మరోసారి ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్ష, కార్యదర్శి పదవులకు అనేక మంది పోటీ పడినా సీనియర్ల సముదాయించడంతో చివరికి విరమించుకున్నారు. ఆరు పదవులకు ఒక్కో నామినేషన్ చొప్పున దాఖలు అయ్యాయి. సోమవారం అనంత క్రీడాగ్రామంలో జరిగిన నామినేషన్ల పర్వం ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల అధికారి, విశ్రాంత ఆర్డీఓ ఈశ్వర్ నామినేషన్లు స్వీకరించారు. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా సి.శ్రీనాథ్, ఉపాధ్యక్షుడిగా నూర్‌మహమ్మద్ ఖాన్, కార్యదర్శిగా ఎ.యుగంధర్‌రెడ్డి, కోశాధికారిగా జె.మురళీకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా ఎన్.సర్దార్, కౌన్సిలర్‌గా హెచ్.అన్సర్ ఖాన్‌లు నామినేషన్లు సమర్పించారు. ఆరు పదవుల్లో మూడు మైనార్టీలకు కేటాయించడం విశేషం.

● ఎన్నో ఏళ్ల నుంచి క్రికెట్ సంఘాన్ని పరోక్షంగా నడిపిస్తున్న సి.శ్రీనాథ్‌ను అధ్యక్షుడిగా పోటీ చేయాలని పలువురు ఒత్తిడి తేవడంతో ఎట్టకేలకు అంగీకరించారు. అన్ని పదవులకు ఎలాంటి పోటీ లేకుండా సింగిల్ నామినేషను దాఖలైంది. మంగళవారం నామినేషన్ల పరిశీలన, బుధవారం ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన తర్వాత ఈ నెల 29న అధికారికంగా ప్రకటిస్తారు. పదవులన్నీ ఏకగ్రీవం కావడంతో నామినేషన్ దాఖలు చేసిన ఎ.యుగంధర్‌రెడ్డి, నూర్ మహమ్మద్ ఖాన్, సర్దార్‌ను పలువురు అభినందించారు. ఈనెల 29 అధికారికంగా ప్రకటిస్తామని ఎన్నికల అధికారి ఈశ్వర్ తెలిపారు.

కృత్రిమ కాళ్లు, చేతుల ఉచిత పంపిణీకి దరఖాస్తుల ఆహ్వానం

అనంత సాంస్కృతికం: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జనవరి 12న దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ కాళ్లు, చేతులు కాలిపర్స్ పంపిణీ చేయనున్నట్లు ప్రాంతీయ పరిషత్ కన్వీనర్ పరుచూరు రమేశ్‌బాబు తెలిపారు. ఉమ్మడి అనంత జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, హరికృష్ణ, కన్వీనర్ రమణానాయుడులతో కలిసి ఆయన వివరాలను వెల్లడించారు. అర్హులైన వారు డిసెంబరు 12లోగా అనంతపురం సుభాష్‌రోడ్డు, రఘువీర టవర్స్ పక్కన ఉన్న శ్రీనివాస క్లాత్‌స్టోర్సులో పేరు నమోదు చేయించుకోవాలన్నారు. మరింత సమాచారానికి 98495 08904, 98667 98863, 94402 85285 నంబర్లలో తెలుసుకోవాలని సూచించారు.

హనుమద్ వ్రతం ఏర్పాట్లపై సమీక్ష

మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్, అధికారులు

గుంతకల్లు పట్టణం: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో డిసెంబరు 2, 3 తేదీల్లో జరగనున్న హనుమద్ వ్రతానికి చేయాల్సిన ఏర్పాట్లపై సోమవారం అధికారులు చర్చించారు. ఆలయ ఈవో విజయరాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆర్డీఓ శ్రీనివాస్, డీఎస్పీ శ్రీనివాసులు, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ భక్తులకు అన్ని వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. 2న గుంతకల్లులో హనుమాన్ సర్కిల్ నుంచి స్వామి ఉత్సవమూర్తి, ఇరుముళ్లతో హనుమ మాలధారులు ఊరేగింపుగా కసాపురం చేరుకుంటారన్నారు. 3న వ్రతం ముగిసిన తర్వాత మాలధారుల దీక్షా విరమణ ఉంటుందన్నారు. సమావేశంలో మున్సిపల్, విద్యుత్తు, ఆర్ అండ్‌బీ, వైద్య, ఆర్టీసీ, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అప్రెంటీస్‌షిప్ అభ్యర్థుల పత్రాలు కర్నూలులో పరిశీలన

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: ఏపీఎస్‌ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్ ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో ఐటీఐ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు కర్నూలు జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాలలో పరిశీలిస్తారని ఐటీఐ ప్రిన్సిపల్ రాయపరెడ్డి తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ ఎన్‌సీవీటీ, కులధ్రువీకరణ పత్రాలు డిసెంబరు ఒకటిన పరిశీలిస్తారని ఆయన వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల అభ్యర్థులకు శాశ్వత కులధ్రువీకరణ లేకుంటే ఆరు నెలల్లోపు జారీ చేసిన పత్రాలు సమర్పించాలని ఆయన తెలిపారు. దివ్యాంగులు, మాజీ సైనికులు కూడా వారి వారి అర్హత పత్రాలు ఒరిజినల్ తీసుకువెళ్లాలని సూచించారు. డీజిల్ మెకానిక్ అభ్యర్థులకు డిసెంబరు ఒకటిన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి మోటరు మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్) అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. అనంతపురం జిల్లా నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఐటీఐ అభ్యర్థులు మాత్రమే హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు కర్నూలు శిక్షణ కళాశాల ఫోన్ నంబరు 08518-257025ను సంప్రదించాలన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647

JOBS

PET with M.Ped, Tutors any Degree, Montessori Elite EM School, Gollapalli, Rapthadu, ATP. Contact: 9866676304, 9666332816.

FACULTY/ TEACHERS

Headmistress: Looking for an experienced headmistress to start a primary school (high school in the future) in Puttaparthi. At least 10 years of proven experience running an English Medium school as a senior teacher is mandatory. M.Ed. is preferable. B.Ed. is acceptable for 15 years of experience. Decent Salary + Accommodation. WhatsApp resume to: + 91 72075 92548

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU Classifieds
5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

పాఠశాల క్రీడల క్రికెట్ జట్ల ఎంపికకు విశేష స్పందన

బాలుర అండర్-17 క్రికెట్ జట్టు

అనంతపురం క్రీడలు: పాఠశాల క్రీడల అండర్-17 క్రికెట్ సెలెక్షన్ ట్రయల్స్‌కు భారీ స్పందన లభించింది. అనంత క్రీడా గ్రామంలో సోమవారం నిర్వహించిన ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 360 మంది క్రీడాకారులు హాజరు కావడం విశేషం. క్రికెట్ ఆటకు ఏ మాత్రం ఆదరణ తగ్గలేదని చెప్పడానికి ఇదో ఉదాహరణ. ఉదయం నుంచి సాయంత్రం వరకు సెలెక్షన్ ట్రయల్స్ నిర్వహించి అందులో ప్రతిభను ప్రామాణికంగా తీసుకుని తుది జట్లను ఎంపిక చేశారు. బాలికల విభాగం ఎంపిక పోటీలకు కూడా 50 మంది హాజరయ్యారు. బ్యాటింగ్, బౌలింగ్ శైలిని పరీక్షించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలను జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, పీడీలు గౌసియా, ఆనంద్, వెంకటేశులు, యమున, శ్యామల, చామంతి, లీలారాణి పర్యవేక్షించి తుది జట్లను ప్రకటించారు.

బాలికల జట్టు: పూర్ణచంద్రిక, తరుణిక, చక్రిక, హిమవర్షిని, లక్ష మోహన్, చాయశ్రీ, అక్షర, బృంద, సంజన, జస్మిక, మహమ్మద్, శ్రావణి, గోపీచందన, కాత్యాయని, శ్రుతి కీర్తన, సమత.

బాలుర జట్టు: జయప్రకాశ్, రంజిత్ కుమార్, పుణితేశ్వర్, గోవర్ధన్, కౌశిక్, సీతారాం, తన్మయి కృష్ణ, జయదీప్, వెంకటసాయి, సంతోష్, కార్తిక్, మహమ్మద్ సాబీర్, తరుణ్ కుమార్‌రెడ్డి, మనోజ్, లిఖిత్, మహేంద్ర.

అండర్-14 ఇంటర్ జోన్ క్రికెట్ పోటీలకు ఐదుగురి ఎంపిక

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: ఇంటర్ జోన్ అండర్-14 క్రికెట్ పోటీలకు జిల్లా నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. ఇటీవల కడపలో జరిగిన అంతర్ జిల్లా పోటీల్లో ప్రతిభ పాటవాలు చూపిన క్రీడాకారులను సౌత్ జోన్ జట్టుకు ఎంపిక చేశారు. జిల్లాకు చెందిన ఎం.మోక్షన తేజ్, పంకజ్, హేమచంద్రానాయక్, కె.రోహిత్, ఎల్.క్రిటిక్‌సాయిలు సౌత్‌జోన్ జట్టుకు ఎంపికయ్యారు. ఇంటర్ జోన్ పోటీల్లో సత్తాచాటి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావాలని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి పిలుపునిచ్చారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వర్షిత

వర్షితతో పీడీ ఓబులేసు

గుంతకల్లు పట్టణం: గుంతకల్లు గ్రామీణ మండలం నరసాపురం గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థిని వర్షిత జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. గుంటూరు జిల్లా వినుకొండలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-17 విభాగంలో 800 మీటర్ల పరుగులో ప్రథమ స్థానంలో నిలిచింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో డిసెంబర్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటుందని పీడీ ఓబులేసు తెలిపారు.

● కర్ణాటకలోని తుమకూరులో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో స్థానిక మాంటిస్సోరి స్కూల్‌కు చెందిన విద్యార్థులు లక్షిత్, తారక, ఇసాన్ ప్రథమ, హర్షితరెడ్డి మూడో స్థానంలో నిలిచారు.

O/o Executive Engineer, APMSIDC Division, JNTU Engineering College Road, Sarada Nagar, Govt. Nursing College Campus, Ananthapuramu
'e' Procurement Short Tender Notice No. 7/EE/APMSIDC/ATP/2025-26/Dt. 24-11-2025

Tenders are invited through 'e' procurement platform for the work "4 works Repairs & Renovation to the existing ward for establishing of Kangaro Mother Care Unit at A.H. Guntakal (Rs. 4.70 Lakhs), CHC Gooty (Rs.5.50 Lakhs), Pamidi (Rs.1.70 Lakhs) & CHC Uravakonda (Rs. 3.00 Lakhs) in Ananthapuramu District" with total estimate cost of Rs. 14.90 Lakhs. The other details can be seen at website: www.apeprocurement.gov.in. Contact No. 8297467436.

Sd/- Executive Engineer, APMSIDC, Ananthapuramu

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY ANANTAPUR
ANANTHAPURAMU - 515002 (A.P.) INDIA.
e-Procurement Tender Notices

1 | Providing CC Cameras for newly allotted Block for School of Management Studies in JNT University, Anantapur, Ananthapuramu. With Tender ID No. 866823

Further Details can be seen at e-procurement market place i.e., www.tender.apeprocurement.gov.in.

Sd/- REGISTRAR

క్రైమ్.. కార్నర్

హంద్రీనీవా కాలువలో గొర్రెల కాపరి గల్లంతు

గాలింపు చేపడుతున్న పోలీసులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతైన ఘటన మండలంలోని పంపనూరు హంద్రీనీవా కాలువలో సోమవారం చోటు చేసుకుంది. కళ్యాణదుర్గం మండలం పీటీఆర్ పల్లికి చెందిన రామాంజనేయులు మండలం వై.కొత్తపల్లిలో నివాసం ఉంటున్నాడు. గత 12 సంవత్సరాల క్రితం వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన మహిళను వివాహం చేసుకొని ఇల్లరికం వచ్చి నివసిస్తున్నాడు. నిత్యం గొర్రెలు మేపుకొంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజువారీగా ఉదయం 10 గంటలకు గొర్రెలు తీసుకొని హంద్రీనీవా కాలువ వద్దకు రాగా అక్కడ చేపలు పట్టేందుకు కిందకు దిగాడు. కాలు జారి కాలువలో పడి కొట్టుకుపోయాడు. గమనించి తోటి గొర్రెల కాపర్లు సాయం చేసేందుకు ప్రయత్నించినా అప్పటికే నీటిలో మునిగిపోయాడు. గల్లంతయిన వ్యక్తికి భార్య, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కాలువ వెంబడి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే గత మూడు నెలల్లో నలుగురు కాలువలో పడి మృతి చెందారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఏ దుర్మరణం

వెంకటరాముడు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని యర్రగుంట్ల గ్రామ వీఆర్‌ఏ వెంకటరాముడు(50) సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వివరాలు.. గార్లదిన్నెలోని తహసీల్దారు కార్యాలయంలో విధులు ముగించుకున్న వెంకట రాముడు ఇంటికి బయలుదేరారు. ఈక్రమంలో తెలిసిన వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్నారు. మార్గమధ్యలో వాహనం పైనుంచి కిందపడి అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే 108లో చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చనిపోయినట్లు నిర్ధారించారు. ఆయన భార్య రెండేళ్ల క్రితం మృతి చెందారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న ఉపతహసీల్దారు మల్లికార్జున, ఆర్ఐ హేమలత, వీఆర్‌ఓలు ఆసుపత్రికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

మహిళ అనుమానాస్పద మృతి

తాడిపత్రి, న్యూస్‌టుడే: మండలంలోని పులిపొద్దుటూరు గ్రామంలో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి, రత్నమ్మ(50) దంపతులు. వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నారు. వీరికిద్దరు కుమార్తెలు ఉన్నారు. కొన్నిరోజులుగా భార్యాభర్తలు గొడవలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రత్నమ్మ పంకాకు ఉరేసుకున్నట్లు స్థానికులు గుర్తించారు. ఆమె కాళ్లు మంచానికి తాకుతుండటంతో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి సోదరుల ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విజృంభించిన ఆంధ్ర బౌలర్లు.. కుప్పకూలిన ఒడిశా జట్టు

ఒడిశా పతనాన్ని శాసించిన లోహిత్, కార్తీక్‌రెడ్డి

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్ర స్పిన్ బౌలర్ల ధాటికి ఒడిశా జట్టు కకావికలమైంది. మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 124 పరుగులకే కుప్పకూలింది. ఆంధ్ర జట్టు స్పిన్ మాయజాలానికి ఒడిశా జట్టు కుదేలయింది. ఫలితంగా మొదటి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర జట్టు 158 పరుగుల ఆధిక్యత సాధించింది. రాయలసీమ క్రికెట్ మైదానంలో సోమవారం ఉదయం 246/7 ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు 94.4 ఓవర్లలో 282 పరుగులకు ఆలౌటైంది. ఏఎన్‌వీ లోహిత్ (71) చక్కటి బ్యాటింగ్ ప్రదర్శించాడు. ఒడిశా బౌలర్లు రాజ్ యాదవ్ (4/57), సంబిత్ కె బేజా (3/63)లు కట్టడి చేశారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఒడిశా జట్టు ఆంధ్ర స్పిన్నర్లు ఏఎన్‌వీ లోహిత్, సిద్ధూ కార్తీక్‌రెడ్డిల ధాటికి 63.3 ఓవర్లలో 124 పరుగులకే ఆలౌటైంది. ఒడిశా బ్యాటర్లు సుభాషిస్ మల్లిక్ (40), ప్రశాంత్‌మోక్షిత్ (35)లు కాస్త మెరుగ్గా రాణించడంతో జట్టు స్కోరు మూడంకెలు దాటింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు ఆటముగిసే సమయానికి 15 ఓవర్లలో 2 వికెట్లకు 46 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్ అయిన వీరారెడ్డి రెండో ఇన్నింగ్స్‌లో (28 బ్యాటింగ్) పుంజుకున్నాడు. ఈ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు విజయం ఖరారయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఏసీఎల్‌ఓ కమలాకర్‌నాయుడు, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, సంయుక్త కార్యదర్శి మురళీకృష్ణ, ఆర్డీటీ మైదానాల ముఖ్య క్యురేటర్ మధు ఆచారి ఈ పోటీని పర్యవేక్షించారు.

ఇంటర్ విద్యార్థులకు 'సంకల్ప్'

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి ఇంటర్మీడియట్ బోర్డు 'సంకల్ప్-2026' పేరుతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. సోమవారం ఈ కార్యక్రమం ఆరంభించారు. నవంబరు-24 నుంచి ఫిబ్రవరి 20 వరకూ 50 రోజుల పాటు కొనసాగుతుంది. విద్యార్థుల్లో అభ్యసన లోపాలు గుర్తించి వారికి వ్యక్తిగత శ్రద్ధను కలిగిస్తారు. అక్టోబరులో నిర్వహించిన అర్ధవార్షిక పరీక్షల ఆధారంగా ఏ,బీ,సీ కేటగిరీలుగా విభజించారు. విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా శిక్షణ ఇస్తారు. సిలబస్ పూర్తి చేయడం, రోజువారి తరగతుల రివిజన్, అసైన్‌మెంట్లు, స్టడీ అవర్లు, స్లిప్ టెస్టులు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. డీవీఈవో వారానికి 3 కళాశాలలు, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వారానికి 2 కళాశాలలు తనిఖీ చేయాల్సి ఉంటుంది. ప్రిన్సిపాళ్లు, కేర్‌టేకర్లు, సబ్జెక్టు అధ్యాపకులు సంయుక్తంగా పరీక్ష ఫలితాలు మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి వెంకటరమణ నాయక్ తెలిపారు.

జోరుగా పైరవీ.. ఎవరికో పదవి?

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: వ్యవసాయ శాఖలో పనిచేస్తూ గతంలో మహిళా ఉద్యోగులపట్ల అసభ్యంగా వ్యవహరించిన ఓ ఏడీఏ తీరుపై రాష్ట్ర వ్యవసాయాధికారులు విచారణ చేపట్టారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ ఏడీఏకు వ్యవసాయ సంయుక్త సంచాలకులు(జేడీఏ) పోస్టుపై కన్నుపడింది. ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి ప్రస్తుత జేడీఏ ఉమామహేశ్వరమ్మ పదవీ విరమణ పొందనున్నారు. ఆ పోస్టుకు ఇన్‌ఛార్జి జేడీఏగా కొనసాగేందుకు ఆయన విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు ఉమ్మడి జిల్లా వ్యవసాయశాఖలో చర్చ జరుగుతోంది. కనీసం ఒక్క నెలైనా ఇన్‌ఛార్జి జేడీఏ పదవి దక్కించుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతూ, అడిగినంత ఇచ్చేందుకు సిద్ధమైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇప్పటికే ఇద్దరు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అక్రమాల గురించి తెలియడంతో ప్రజాప్రతినిధులు హెచ్చరించి పంపినట్లు తెలుస్తోంది. 'రాష్ట్రంలో నాకు ఓ మంత్రి అండగా ఉన్నారు. ఎవరేమనుకుంటే నాకేంటి?' అన్నట్లు ఆయన తీరు ఉంటోంది.

సీనియర్ ఏడీఏలున్నా..

వ్యవసాయశాఖలో సాధారణంగా జేడీఏ పోస్టు ఖాళీ అయితే డీడీఏలకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగిస్తారు. వారు లేకపోతే పక్క జిల్లాల జేడీఏలకు ఇస్తారు. ఎవరూ లేని పక్షంలో జిల్లాలోని సీనియర్ ఏడీఏలకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించవచ్చు. జిల్లాలో భూసార సంరక్షణ విభాగంలో డీడీఏగా పోలప్ప విధులు నిర్వహిస్తున్నారు. (ప్రస్తుతం కమిషనరేట్‌లో డెప్యూటేషన్‌పై ఉన్నారు). ఏడీఏ నుంచి డీడీఏలుగా పదోన్నతుల జాబితాలో ముగ్గురు సీనియర్లు ఉన్నారు. వారిలో ఆత్మకూరు ఇన్‌ఛార్జి పీడీ పద్మలత, కణేకల్లులో విధులు నిర్వర్తిస్తున్న నారాయణ నాయక్ (జేడీఏ కార్యాలయంలో ఇన్‌ఛార్జి డీడీఏగా కొనసాగుతున్నారు), రాయదుర్గంలో పద్మజ ఉన్నారు. వీళ్లని కాదని ఆ ఏడీఏ జేడీఏ ఇన్‌ఛార్జి పోస్టుకు పైరవీలు కొనసాగిస్తున్నారు.

ఆసుపత్రిపై దాడి ఘటనలో ఏడుగురి అరెస్ట్

దాడి చేసిన వారి అరెస్టు చూపుతున్న రెండో పట్టణ సీఐ శ్రీకాంత్, సిబ్బంది

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరంలో సాయినగర్ మూడో క్రాస్‌లోని శ్రీనివాస మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిపై దాడి చేసిన ఘటనలో రెండో పట్టణ పోలీసులు ఏడుగురిని సోమవారం అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు మొగలి సత్యనారాయణరెడ్డి, చిన్న గొర్ల సాయినాథ్‌రెడ్డి, బోయ సీతారాములు, యువరాజ్, ఎరుకల చంద్రశేఖర్, సున్నీ షాషావలి, బురుజుల నవీన్‌లను నగరంలోని ప్రసన్నాయపల్లి రైల్వే గేటు వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నేరానికి వినియోగించిన మూడు సుత్తిలు, రెండు మచ్చుకత్తులు, రెండు చెట్ల అడ్డాలు, రెండు కర్రలు, మూడు కార్లు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి జిల్లా కోర్టు ఎదుట హాజరుపరచగా.. కోర్టు నిందితులకు రిమాండ్ విధించింది. కేసు వివరాలను సీఐ శ్రీకాంత్ వెల్లడించారు. 2020లో సాయినగర్ మూడో క్రాస్ ఓల్డ్ పావని ఆసుపత్రి యజమాని గుత్తా పావని నుంచి శ్రీనివాసరావు, మొగలి సత్యనారాయణరెడ్డి, రాఘవేంద్ర, శ్రీలతలు భవనం కొనుగోలు చేసి, శ్రీనిలయం ఫర్మ్ మీద రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. భవనాన్ని పదేళ్లపాటు లీజుకు ఇచ్చారు. అందులో భాగంగా ఆసుపత్రి ఓనర్లు శ్రీనివాసరావు, రాఘవేంద్ర రెనోవేషన్ చేసుకుని త్వరలో ప్రారంభించాలనుకున్నారు. సత్యనారాయణరెడ్డి దురుద్దేశంతో ఆసుపత్రిలో వాటా కావాలని ఆదివారం ఉదయం అనుచరులతో అక్రమంగా ప్రవేశించి మారణాయుధాలతో భయపెట్టి ఆసుపత్రిని ధ్వంసం చేశారని, ఆసుపత్రి ఓనర్లపై హత్యాయత్నానికి పాల్పడ్డాడని ఫిర్యాదు అందింది. ఈ ఘటనపై ఎస్పీ జగదీశ్ ఆదేశాలతో దాడికి పాల్పడిన నిందితులను పట్టుకుని కటకటాల వెనక్కు పంపారు.

(c) eenadu

రాయదుర్గం
• రాయదుర్గం • కళ్యాణదుర్గం • ఉరవకొండ

ఉత్తమ సేవలకు గుర్తింపు

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో నవంబర్ 8, 9, 10వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఏపీ రెవెన్యూ క్రీడలు విజయవంతానికి సహకరించిన గుమ్మఘట్ట రెవెన్యూ సిబ్బందికి జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు దివాకర్, కళ్యాణదుర్గం డివిజన్ కార్యవర్గ బృందాన్ని అభినందించారు. దుర్గం డివిజన్ అధ్యక్షులు శ్యామ్‌రాయ్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, ట్రెజరర్ గురు కార్యాలయ సిబ్బంది డీటీ విజయలక్ష్మి, రఘు, ఆర్ఐ రామాంజినేయులు పాల్గొన్నారు.

శెట్టూరు: ఇటీవల నిర్వహించిన క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలువిజయవంతం అయినందుకు జిల్లా, డివిజన్, మండలస్థాయి రెవెన్యూ ఉన్నతస్థాయి అధికారులను సత్కరిస్తున్నట్లు ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు ఆర్.ఎన్ దివాకర్‌రావు పేర్కొన్నారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన

కళ్యాణదుర్గం గ్రామీణం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శ్రీరామిరెడ్డి నీటి పథకం కార్మికులు చేపడుతున్న రిలే దీక్ష సోమవారంతో 8వ రోజుకు చేరుకొంది. మోకాళ్లపై కూర్చొని నినాదాలతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నీటి పథకం కార్మిక సంఘం జిల్లా కోశాధికారి వన్నూరుస్వామి, సీఐటీయూ తాలూకా అధ్యక్షుడు రంగనాథ్, కార్మికులు ఓబుళపతి, అల్లాబకాష్, తిప్పేస్వామి, అనిల్, సురేష్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: భైరసముద్రం నుంచి నాగిరెడ్డిపల్లికి వెళ్లే దారికి ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. **- సోము**

సమాధానం: కంపచెట్లు తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **- ఉమాదేవి, ఎంపీడీవో**

సమస్య: కోనాపురంలో తాగునీటి మోటారు పనిచేయకపోవడంతో తాగునీటికి ఇబ్బందిగా మారింది. **- నలమల్ల**

సమాధానం: విద్యుత్తు మోటార్ బోరుబావిలో ఇరుక్కుపోయింది. కొత్తది ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. **- అనిత, కార్యదర్శి**

సమస్య: గొంచిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో రోడ్డుపై మురుగు వల్ల పారిశుద్ధ్య సమస్య నెలకొంది. **- బాలు**

సమాధానం: పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటాం.
- చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో
- న్యూస్‌టుడే, బ్రహ్మసముద్రం

మొండి బకాయిలు.. పురకు భారం!

పన్ను వసూలు చేస్తున్న పుర సిబ్బంది

న్యూస్‌టుడే, రాయదుర్గం

● నిధుల్లేక అభివృద్ధి పనులపై ప్రభావం

రాయదుర్గం పట్టణాభివృద్ధిలో కీలకమైన ఆస్తి పన్నుల వసూళ్లలో ఏటా ఇబ్బందులు తప్పటం లేదు. కొన్నేళ్లుగా పాత బకాయిలు పేరుకుపోవటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు పన్నులు చెల్లిస్తుండగా బడా బాబులు, వాణిజ్య సముదాయాల నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల పన్నులు రూ.3 కోట్లకు పైగా పేరుకుపోయాయి. ఏటా నోటీసులు ఇచ్చినా.. చెల్లింపులు మాత్రం కావడం లేదు.

క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం

ఆస్తిపన్ను వసూళ్ల పక్కాగా ఉండాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నా క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు రావటం లేదు. కమిషనర్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నా.. సిబ్బంది తగు చొరవ చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో రూ.3.51 కోట్ల మేర పాత బకాయిలు పెరిగిపోయాయి.

పాత బకాయిలే ఉన్నాయి!

పట్టణంలో ప్రైవేటు ఆస్తుల పాత బకాయిలు రూ.50 లక్షలకు కేవలం రూ.20 లక్షలు మాత్రమే వసూలయ్యాయి. 2025-26లో రూ.4.43 కోట్ల మేర ఆస్తిపన్ను వసూలు డిమాండ్ ఉండగా నేటికీ రూ.2.30 కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయి. ఖాళీ స్థలాల పన్నులు రూ.కోటి ఉండగా.. కేవలం రూ.13 లక్షలు మాత్రమే వసూలయ్యాయి. నీటి పన్ను రూ.3.50 కోట్లు ఉండగా కేవలం రూ.50 లక్షలు మాత్రమే చెల్లింపులు జరగడం గమనార్హం.

ప్రత్యేక బృందాలతో పరిశీలనకు చర్యలు

పన్నుల వసూళ్లకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి లక్ష్యాలు నిర్దేశించాం. సుమారు 50 శాతం మేర పన్నులు వసూలు చేశాం. డిసెంబరులోగా లక్ష్య సాధనకు చర్యలు తీసుకుంటాం. పాత బకాయిల వసూలు నిమిత్తం పలువురితోపాటు కార్యాలయాలకు తాఖీదులు ఇచ్చాం. **- దివాకర్‌రెడ్డి, కమిషనర్**

రైతుల అభ్యున్నతికి కృషి

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని వేర్వేరు మండలాలు, గ్రామాల్లో సోమవారం వ్యవసాయ సిబ్బంది 'రైతన్నా మీకోసం' కార్యక్రమం ప్రారంభించారు. రైతుల అభివృద్ధే ధ్యేయమని చెప్పారు. రైతులకు ప్రభుత్వం అందించే అవకాశాలు సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలన్నారు. **- న్యూస్‌టుడే బృందం**

సమస్యలు పరిష్కరించండి

కణేకల్లు: భూసమస్యలు పరిష్కరించాలని వివిధ గ్రామాలకు చెందిన రైతులు సోమవారం తహసీల్దారు బ్రహ్మయ్యకు వినతులు అందించారు. ఇంటి స్థలం, తదితర సమస్యలపై ఆరు మంది రైతులు వినతులు అందించినట్లు తహసీల్దారు వివరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఉరవకొండ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై జనార్దన్ నాయుడు తెలిపారు. కూడేరు మండలం మరుట్ల-2 గ్రామానికి చెందిన ఎర్రిస్వామి(24) ఆదివారం రాత్రి ఉరవకొండ నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తున్నాడు. చిన్న ముష్టూరు వద్ద జాతీయ రహదారిలో కుక్క అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఉండబండలో నాగూరు దాదా ఉరుసు

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం ఉండబండలో హజ్రత్ సయ్యద్ మహమ్మద్ నాగూరు దాదా ఉరుసు సందర్భంగా సోమవారం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉండబండ భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గొల్లల దేవర పండగ

ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

మహంతపురం (కుందుర్పి), న్యూస్‌టుడే: మహంతపురంలో సోమవారం గొల్లల దేవర పండగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గొల్లల ఆరాధ్య దైవాలైన ఈరన్నస్వామి, చిత్రలింగ స్వామి తదితర ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి రథోత్సవం

గుమ్మఘట్ట: బేలోడులో ఆంజనేయస్వామి రథోత్సవం ఘనంగా సాగింది. స్వామివారికి ప్రత్యేక పూజాకార్యక్రమాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. తదుపరి పురవీధుల్లో ఊరేగించారు.

వేడుకగా జలాభిషేకం

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం స్వామి వారికి 108 పచ్చి టెంకాయల జలంతో అభిషేకాన్ని నిర్వహించారు. ఆ తరువాత సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు దివాకర్‌శర్మ, నాగరాజు శర్మ తదితరులు పాల్గొన్నారు.

మద్దానేశ్వరస్వామికి పూజలు

రాయదుర్గం గ్రామీణం: మండలంలోని 74ఉడేగోళం గ్రామ సమీపంలో వెలసిన మద్దానేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి భక్తులు ఉత్సవాలు నిర్వహించుకున్నారు. బళ్లారికి చెందిన ఉజ్జయినీ పీఠాధిపతి త్రిలోచనా శివాచార్య మహాస్వాములు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు ఐస్వామి, కుమారస్వామి, రాయదుర్గం దేవాదాయశాఖ ఈఓ నరసింహారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బసవరాజు, సభ్యులు, జయన్న, అప్పాజి, పృథ్వీ, దరణేష్, మహానంది పాల్గొన్నారు.

74ఉడేగోళం గ్రామంలోని మద్దానేశ్వరస్వామి ఆలయంలో లక్ష దీపోత్సవం

ఇనుప బల్లల ఏర్పాటుకు విరాళం

చెక్కు అందిస్తున్న రవీంద్ర తదితరులు

ఉరవకొండ, న్యూస్‌టుడే: కరిబసవస్వామి ఉన్నత పాఠశాలలో 200 ఇనుప బల్లలను ఏర్పాటు చేయడానికి 'అభయ ఫౌండేషన్' ముందుకొచ్చింది. ఎస్కేఆర్ క్లబ్ కార్యదర్శి రవీంద్రనాథ్ సోమవారం లక్ష మొత్తాన్ని చెక్కు రూపంలో హెచ్ఎం సత్యనారాయణకు అందించారు. మిగిలిన మొత్తాన్ని పూర్వ విద్యార్థుల కుటుంబాలకు చెందిన వారు సమకూర్చుకున్నారు

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష

శెట్టూరు: శెట్టూరు ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనం నమూనా పరీక్ష సోమవారం నిర్వహించగా.. 150 మంది విద్యార్థులు హాజరైనట్లు ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బద్దేనాయక్ తెలిపారు.

యువతకు ఉపాధి కల్పించండి

మంత్రితో తెదేపా నాయకులు తదితరులు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతమని, ఇక్కడ పరిశ్రమలు లేకపోవడంతో యువతకు ఉపాధి అవకాశాలు లేవని తెదేపా మండల కన్వీనరు విజయభాస్కర్, పార్టీ ప్రతినిధి యర్రగుంట్ల వెంకటేశ్ అమరావతిలో మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి విన్నవించారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

అందరి సహకారంతోనే పోటీలు విజయవంతం

తహసీల్దారును సత్కరిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో ఈనెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు విజయవంతం అయ్యాయని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్ఎస్ఏ) జిల్లా అధ్యక్షుడు ఆర్.ఎన్.దివాకరరావు, జిల్లా క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి తిప్పేస్వామి పేర్కొన్నారు. సోమవారం అసోసియేషన్ సభ్యులు కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత్‌బాబుతోపాటు రెవెన్యూ డివిజన్‌లోని 11 మండలాల తహసీల్దార్లను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. క్రీడలు విజయవంతానికి ప్రతి ఒక్కరు ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ కళ్యాణదుర్గం డివిజన్ అధ్యక్షులు శ్యాంరాయ్, కార్యదర్శి గురుబ్రహ్మ, కోశాధికారి వెంకటేశులు, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ పోటీలకు పురుషోత్తం

కంబదూరు, న్యూస్‌టుడే: నూతిమడుగు గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి జి.పురుషోత్తం జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయినట్లు ప్రిన్సిపల్ జయప్ప, పీఈటీ ప్రభాకర్ తెలిపారు. ఇటీవల శ్రీకాకుళంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ విద్యార్థి ప్రతిభ చూపినట్లు తెలిపారు. ఈ విద్యార్థిని ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృంద సభ్యులు అభినందించారు.

పొరబడితే.. ప్రమాదమే

ఉరవకొండ పట్టణంలో సీవీవీ నగర్ నుంచి లత్తవరం దారిలోని కల్వర్టుపై రంధ్రం పడింది. దీనికి పంచాయతీ అధికారులు సకాలంలో మరమ్మతులు చేయించలేదు. పైగా అక్కడ ఇనుప చువ్వలు తేలడంతో ప్రమాదకరంగా మారింది. వాహనదారులు, పాదచారులు పొరబడితే ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. ఈ దారిలో రాకపోకలు సాగించే పది గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఉప ఎంపీడీవో సతీశ్‌కుమార్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి కల్వర్టుకు మరమ్మతు చేయిస్తామన్నారు.
- న్యూస్‌టుడే, ఉరవకొండ

మురుగు కాదు... తాగునీరే!

అధికారుల అలసత్వం స్థానికుల పాలిట సమస్యగా మారింది. కూడేరు మండలం మరుట్ల-1 గ్రామంలో పైపులైన్ లీకేజీ వల్ల కొన్ని నెలలుగా తాగునీరు సిమెంట్ దారుల్లో పారుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. మరోవైపు స్వచ్ఛనీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉంది. కొన్ని నెలలుగా వీధులు అస్తవ్యస్తంగా మారుతుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారే కరవయ్యారు. ఎంపీడీవో కుళ్లాయిస్వామి మాట్లాడుతూ సత్వరమే తగిన చర్యలు చేపడుతామన్నారు. **- న్యూస్‌టుడే, కూడేరు(ఉరవకొండ)**

పొంచి ఉన్న ప్రమాదం

వజ్రకరూరు మండలం గడేహోతూరు నుంచి ఛాయాపురం వెళ్లే ప్రధాన దారి ప్రమాదకంగా మారింది. కొన్ని నెలల కిందటే ఇది కుంగిపోవడంతోపాటు పడిన రంధ్రం పెద్దదిగా మారింది. రోడ్డుపై వెళ్తున్న చోదకులకు ఎదురుగా ఏదైనా వాహనం వచ్చినప్పుడు తరచుగా ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగున్నాయి. రోడ్డు కిందకు వెళ్లాలంటే మట్టి దిబ్బలు, పొదలున్నాయి. మరోవైపు కల్వర్టుకు అంచున గోడలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ద్విచక్రవాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, వజ్రకరూరు

ప్రభుత్వ భూమి విక్రయానికి ప్రయత్నం

బెళుగుప్ప, న్యూస్‌టుడే: గ్రామంలోని ప్రభుత్వ భూమిని విక్రయించడానికి ఓ వ్యక్తి ప్రభుత్వ సర్వేయర్ సహాయంతో ప్రయత్నాలు చేస్తున్నాడని యలగలవంక గ్రామస్థులు సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ భూమిని ఇతరులకు అమ్మడానికి అగ్రిమెంట్ కుడాచేసుకోవడంతో సర్వేయర్‌తో కలిసి ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. దస్త్రాలు పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని తహసీల్దార్ వివరించారు.

26న మహిళా చట్టాలపై అవగాహన

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 26న ఐసీడీఎస్ కార్యాలయంలో మహిళా రక్షణ చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు జడ్జి రమ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు. వరకట్న నిషేధ దినోత్సవం సందర్భంగా సభను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న అధికారులు, మహిళలు

మన డబ్బులు.. మన లెక్కలపై ర్యాలీ

కుందుర్పి, న్యూస్‌టుడే: మహిళా సంఘాలు మండల కేంద్రంలో.. సోమవారం మన డబ్బులు, మన లెక్కలు.. కార్యక్రమంలో భాగంగా వెలుగు ఏపీఎం సర్దానప్ప ఆధ్వర్యంలో వెలుగు అధికారులు, మహిళా సంఘాల సభ్యులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక కెనరా బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ముత్తన్న, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు

వజ్రకరూరు, న్యూస్‌టుడే: గడేహోతూరు శివారులో ద్విచక్రవాహనం బోల్తాపడిన ఘటనలో ఉరవకొండ స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ అశోక్‌కు గాయాలయ్యాయి. ద్విచక్రవాహనంపై ఆయన గుంతకల్ నుంచి ఉరవకొండకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

ఇంటి స్థలాలు ఇవ్వాలని ధర్నా

విడపనకల్లు: విడపనకల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐకి చెందిన చెన్నరాయుడు ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా చేశారు. తదుపరి తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు.

కార్యకర్త కుటుంబానికి సాయం

ఉరవకొండ, న్యూస్‌టుడే: వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్దతండాకు చెందిన రూపానాయక్ కొన్ని నెలల కిందట విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఆయన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడిగా కొనసాగారు. పార్టీ చెల్లించిన రూ.5 లక్షలు బీమా చెక్కును అతడి తల్లి కమలమ్మకు జనసేన పార్టీ ఎమ్మెల్సీ నాగబాబు అందించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతమ్‌కుమార్, వజ్రకరూరు మండల నాయకులు కేశవ్, సూర్యానాయక్ పాల్గొన్నారు.

అ వీ.. ఇ వీ.. అ న్నీ..

'ప్రిన్సిపల్‌పై చర్యలకు డిమాండ్'

కణేకల్లు: కణేకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల ప్రసాద్ సోమవారం డిమాండ్ చేశారు. కళాశాలకు కుర్చీల కొనుగోలు, టీసీ, మార్కుల జాబితా జారీ సమయంలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు డిమాండ్ చేశారు. సోమవారం కల్యం, మురడి, గొడిశలపల్లి, సోమలాపురం, కాదలూరు, పులకుర్తి తదితర పాఠశాలలో జిల్లా ఎస్టీయూ విభాగంలో సభ్యత్వాలను నమోదు కార్యక్రమం చేపట్టాక వారు మాట్లాడారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించండి

కళ్యాణదుర్గం: క్రమశిక్షణ విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని విశ్రాంత ప్రిన్సిపల్ జయరామరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ప్రిన్సిపల్ హర్షలత అధ్యక్షత ఏర్పాటు చేసిన స్వాగతోత్సవంలో ఆయన మాట్లాడారు.

పది పరీక్ష కేంద్రాలు కొనసాగించాలి

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలను కొనసాగించాలని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లిరాజు ఆధ్వర్యంలో స్థానికులు, ఇతర పార్టీ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల సభ్యులు కలిసి ఎంఈవో-1 వేణుగోపాల్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం అబ్దుల్ మునఫ్, స్కూల్ కమిటీ అధ్యక్షులు సురేష్, మైనార్టీ సంఘం మండల అధ్యక్షులు రహంతుల్లా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైకాపా సమన్వయకర్త రంగయ్య

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వైకాపా సమన్వయకర్త తలారి రంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో వసంతబాబును కలిసి వినతి పత్రం అందజేశారు.

కంబదూరు: రైతులు పండించే ప్రధాన పంటలైన ధాన్యాలకు గిట్టుబాటు ధర కల్పించాలని వైకాపా నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

కుందుర్పి: తహసీల్దార్ కార్యాలయం వద్ద వైకాపా నాయకులు సోమవారం నిరసన చేపట్టారు. తహసీల్దార్ ఓబులేశుకు మండల వినతి పత్రం అందజేశారు.

శెట్టూరు: రైతుల సమస్యలు పరిష్కరించాలని వైకాపా నాయకులు శెట్టూరు తహసీల్దారు ఈశ్వరమ్మకు వినతి పత్రం అందజేశారు. మండల వైకాపా కన్వీనర్ రాయుడు, ఇతరులు పాల్గొన్నారు.

సమకూరని భవనాలు.. నిర్వహణకు తిప్పలు!

న్యూస్‌టుడే, ఉరవకొండ

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు అత్యంత ప్రాధాన్యం ఉంది. మహిళా సంక్షేమంతోపాటు చిన్నారుల పూర్వ ప్రాథమిక విద్యకు కేంద్రాలు నిలుస్తున్నాయి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన అంగన్‌వాడీ సొంత భవనాలు సమకూరకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో మెజార్టీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. దీంతో ఎక్కువ కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మరిన్ని ఉచిత అద్దె విధానంలో కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో సంక్షేమ కార్యక్రమాలు, పూర్వ ప్రాథమిక విద్య బోధనకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి.

ఉరవకొండ: ఇరుకైన గదిలో ఇబ్బందులు

ఏళ్లుగా ఇదే దుస్థితి: ఉరవకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 325 కేంద్రాల్లో 167కు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. 114 కేంద్రాలు అద్దె గదులు, 44 కేంద్రాలు ఉచిత ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. ఈ కేంద్రాల పరిధిలో 15472 మంది చిన్నారులు, 1738 మంది గర్భిణులు, 1807 మంది బాలింతలు ఉన్నారు. అద్దె ప్రాతిపదిక నడుస్తున్న కేంద్రాల్లో సిబ్బంది, చిన్నారులకు కష్టాలు తప్పడం లేదు. ఉన్నతాధికారులు కనీసం భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు.

పనుల పూర్తికి చర్యలు

నియోజకవర్గంలోని పలు మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపిస్తాం. 'మనబడి మన భవిష్యత్తు' కార్యక్రమంలో గతంలో ప్రారంభించిన కొన్ని భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. వీటిని త్వరలో అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం.
- శ్రీదేవి, సీడీపీవో

కూలిన స్తంభం... అధికారుల అలసత్వం

న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం, కంబదూరు

✧ విద్యుత్తు, నీరు లేక ప్రజల ఇక్కట్లు

కంబదూరు మండలం పాత ఐపార్శపల్లి ఎస్సీ కాలనీలో ఓ విద్యుత్తు స్తంభాన్ని వాహనం ఢీకొనడంతో అది ధ్వంసమై కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఇది జరిగి ఐదు రోజులు అవుతున్నా సంబంధిత అధికారులు కొత్త స్తంభం ఏర్పాటు చేయడంతో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కరెంటు లేని కారణంగా మోటార్లు నడవక ప్రజలు తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

చరవాణి ఛార్జింగ్‌కూ ఇబ్బందులు

కరెంటు లేక ఐదు రోజులవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చీకట్లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజలు చరవాణులకు ఛార్జింగ్ నిమిత్తం పక్క కాలనీల్లోని తెలిసిన వారి ఇళ్లకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఏడీ సోమశేఖర్‌ను వివరణ కోరగా.. స్తంభానికి మరమ్మతులు చేయాలని ఆదేశించినట్లు, ఆలస్యం ఎక్కడ జరిగిందో తెలుసుకుని సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఐపార్శపల్లి శేఖర్ మాట్లాడుతూ కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని అధికారికి ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంతో పట్టించుకోవడం లేదని కాలయాపన చేస్తున్నారన్నారు. ఐపార్శపల్లికి చెందిన కుళ్లాయమ్మ మాట్లాడుతూ ఇంటిపై స్తంభం పడడంతో రేకులు ధ్వంసమైనట్లు వాపోయారు. అక్కడే ఉంటే ప్రాణాలు పోయేవి. స్తంభం విరిగిపడినప్పటి నుంచి ఎవరూ పట్టించుకోవడం లేదని, దీనికి అధికారుల నిర్లక్ష్యమేనని మారెన్న పేర్కొన్నారు.

విరిగిన విద్యుత్తు స్తంభం

భవనాల క్రమబద్ధీకరణకు అవకాశం

రాయదుర్గం, న్యూస్‌టుడే: ప్రభుత్వ భవన నిర్మాణ అనుమతి పొందకుండా నిర్మించిన భవనాలను, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ గడువును 2026 జనవరి 26 వరకు పొడిగించిన విషయాన్ని పట్టణ ప్రజలు గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ దివాకర్ రెడ్డి పేర్కొన్నారు. లైసెన్స్ టెక్నికల్ పర్సన్‌ని సంప్రదించి వారి లాగిన్‌లో దరఖాస్తులు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు.

● పట్టణంలోని అర్హులైన వారు ఇంటి స్థలం కోసం ఈనెల30వ తేదీలోగా వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు.

ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్తు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: ఎన్‌సీసీ క్యాడెట్లకు విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఉంటుందని ప్రిన్సిపల్ డా.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్‌సీసీ సీటీవో కిరణ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ లెక్కలపై ఆరా

దస్త్రాలు పరిశీలిస్తున్న అధికారులు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను తనిఖీ చేయాలని ఎంపీడీవో విజయ భాస్కర్, ఏపీవో లక్ష్మీకాంత బాయి, డీఆర్‌పీ పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు.

డి.హీరేహాళ్: ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై సోమవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. పలు దస్త్రాలు పరిశీలించారు. ఎంపీడీవో దాసనాయక్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటుచేసి పలు అంశాలపై చర్చించారు. ఏపీవో సంజీవ్‌కుమార్, సామాజిక తనిఖీ అధికారులు ఆనంద్, రవి, ఓబులేష్‌లు తెలియజేశారు.

(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

'రైతన్న మీకోసం'తో సమస్యలు పరిష్కారం

తాడిపత్రి: కర్షకులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రవి

తాడిపత్రి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రైతన్న మీకోసం' కార్యక్రమంతో కర్షకుల సమస్యల చాలావరకు పరిష్కారమవుతున్నాయని ఏడీఏ రవి తెలిపారు. ఆయన సోమవారం యర్రగుంటపల్లిలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్షకులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. పప్పుసెనగ, కంది, మొక్కజొన్న, కరివేపాకు పంటలకు సోకే తెగుళ్లు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలు అందకపోతే ఈ కార్యక్రమంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏవో ఆంజనేయులు ఉన్నారు.

గార్లదిన్నె గ్రామీణం: సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు, లాభాలు పొందవచ్చని ఏవో సోమశేఖర్ సూచించారు. ఆయన 'రైతన్న మీకోసం' వారోత్సవాల్లో భాగంగా గార్లదిన్నె, జంబులదిన్నె గ్రామాల్లో పర్యటించారు. రైతు సేవా కేంద్రం సిబ్బందితో కలిసి కర్షకుల ఇంటింటికి వెళ్లి సీఎం అందజేసిన లేఖలను పంచి పలు సూచనలు చేశారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, సేంద్రియ ఎరువులతో కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. వారి అవసరాలు, సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట పశువైద్యాధికారి రమేష్, శింగనమల మార్కెట్ యార్డు సూపర్‌వైజర్ కృపావతి, ఏఈఓ హరి తదితరులున్నారు.

అందుబాటులో క్రీడా వేదికలు

క్రికెట్ సాధనకు నెట్, పిచ్ సిద్ధం

గుంతకల్లు, న్యూస్‌టుడే: క్రీడాకారులు సాధన చేయడానికి రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో మరో రెండు వేదికలు సిద్ధమయ్యాయి. అధికారులు త్వరలో ప్రారంభించనున్నారు. వాలీబాల్, క్రికెట్ సాధనకు అవసరమైన వేదికలకు రైల్వే ఇన్‌స్టిట్యూట్ గత కార్యదర్శి మల్లికార్జున అంకురార్పణ చేయగా, కొత్త కార్యదర్శి ఎల్లప్ప, కార్యవర్గం పనులు పూర్తిచేశారు. ఇందుకు రూ.5లక్షలకుపైగా వ్యయం చేశారు. వీటితో ఏడాది పొడవునా ఔత్సాహిక క్రీడాకారులు ఆడుకోవడానికి వెసులుబాటు కలిగింది.

కనుమరుగవుతున్న.. ఊటకాలువలు

బీళ్లుగా మారిన పంటపొలాలు

చిట్టడవిని తలపిస్తున్న చిన్నవడుగూరు సమీపంలోని ఊటకాలువ

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: తాడిపత్రి నియోజకవర్గంలోని మండలాల్లో ఒకప్పుడు ఊటకాలువలతో రైతులు మాగాణి పండించేవారు. పదేళ్లుగా ఊటకాలువల్లో చుక్కనీరు ఊరకపోవడంతో వినియోగంలో లేక కంపచెట్లు పెరిగి కనుమరుగవుతున్నాయి. తాడిపత్రి గ్రామీణం, పెద్దపప్పూరు మండలాలతో పోలిస్తే పెద్దవడుగూరులో ఇవి ఎక్కువగా ఉన్నాయి. కొండూరు, చిట్టూరు, పెద్దవడుగూరు, చిన్నవడుగూరు పెన్నానది పరివాహక ప్రాంతాలు కావడంతో నదిలో ఊటకాలువలను తవ్వించారు. వాటి ద్వారా రైతులు నీటిని భూములకు సరఫరా చేసుకొని పంటలు పండించేవారు. రానురాను వర్షాలు తక్కువవడం, భూగర్భజలాలు అడుగంటి ఊటకాలువలు ఒట్టిపోవడంతో రైతులు భూములు బీళ్లుగా మారాయి. మరోవైపు నదిలోని ఇసుకను అక్రమార్కులు ఇష్టానుసారంగా తవ్వేయడంతో ఊట కాలువల్లో నీరు పాతాళానికి వెళ్లిపోయింది. పంటలకు నీరందక అన్నదాతలు వలస కూలీలుగా మారాల్సి వచ్చింది. 2014లో తెదేపా ప్రభుత్వ హయాంలో కొండూరు సమీపంలో రూ.9లక్షలు వెచ్చించి ఊటకాలువలను శుభ్రం చేయించి పూడిక తీసినా నీరు ఉబకపోవడంతో పంటపొలాలు బీళ్లుగా మారాయి.

పెద్దవడుగూరులో భూముల అమ్మకం: పెద్దవడుగూరు, చిన్నవడుగూరు గ్రామాల్లో నెలకొన్న వర్షాభావంతో ఊట కాలువలు ఒట్టిపోయాయి. 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండు ఊటకాలువలకు రూ.25 లక్షలు వెచ్చించి పూడికతీసి, కంపచెట్లు తొలగించినా నీరు రాలేదు. నిధుల వృథాతో పాటు భూములకు చుక్కనీరు అందలేదు. ఫలితంగా పెద్దవడుగూరులో సుమారు 60మంది రైతులు తమ భూములను ఇతరులకు అమ్మేశారు.

సరైన చర్యలు చేపట్టాలి

కొన్నేళ్లుగా వర్షాలు ఆశాజనకంగా ఉండటంతో కొండూరు, చిట్టూరు, పెద్దవడుగూరు, చిన్నవడుగూరులోని ఊటకాలువలు బాగు చేయడానికి సరైన చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఇసుక తరలించకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని కోరుతున్నారు. దీనిపై తహసీల్దారు ఉషారాణిని సంప్రదించగా, ఆయా గ్రామాల్లో గ్రామసభలు పెట్టి రైతులతో చర్చించి, ఊట కాలువల బాగుకు అవసరమైన నిధులకు ప్రతిపాదనలు పంపించడానికి కృషి చేస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: బెంచికొట్టాలలోని పట్టణ ఆరోగ్య కేంద్రం పక్క వీధిలో చెత్తాచెదారం తీయడం లేదు. **- సీతాపతి, స్థానికుడు**

సమస్య: భాగ్యనగర్ ప్రాంతంలోని చెత్తకుండీలు రంధ్రాలు పడి పూర్తిగా దెబ్బతిన్నాయి. **- తిమ్మరాజు, స్థానికుడు**

సమాధానం: కార్మికులను పంపించి చెత్తను తీయిస్తాం. భాగ్యనగర్‌లోని సమస్యను పరిష్కరిస్తాం. **- వేణుగోపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్.**

- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

సమస్య: చామలూరులోని ప్రభుత్వ పాఠశాల నుంచి పెద్దమ్మ ఆలయం వరకున్న ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ లేదు. గ్రామంలోని మురుగు రోడ్డుపైకి వస్తోంది. **- చౌడప్ప, గ్రామస్థుడు**

సమాధానం: త్వరలోనే సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం. **- మమత, ఎంపీడీవో**

- న్యూస్‌టుడే, నార్పల

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం

విజేతకు బహుమతి అందజేస్తున్న ఎన్‌సీసీ అధికారి బల్బీర్‌సింగ్

పామిడి, న్యూస్‌టుడే: పట్టణంలోని టీసీ ప్రభుత్వోన్నత పాఠశాలలో సోమవారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ముఖ్య అతిథులుగా 6వ బెటాలియన్ అధికారులు బల్బీర్‌సింగ్, అజీత్‌సింగ్, ఉప విద్యాశాఖాధికారి మల్లారెడ్డి, సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకార్తిక్‌రెడ్డి, ఎంఈవోలు జయనాయక్, సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌సీసీతో పిల్లలకు క్రమశిక్షణ అలవడటమే కాకుండా నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని చెప్పారు. అనంతరం పాఠశాల, ఎన్‌సీసీ యూనిట్‌కు విరాళాలు ప్రకటించిన గణిత ఉపాధ్యాయుడు రామ్మోహన్, పూర్వ విద్యార్థులు నరేశ్, విశ్వనాథ్, మంజునాథ్‌ను సన్మానించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు రామాంజనేయులు, ప్రధానోపాధ్యాయుడు రామ్‌కుమార్ పర్యవేక్షించారు.

తెదేపా మండల కన్వీనర్ల నియామకం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: శింగనమల నియోజకవర్గంలోని ఆరు మండలాలకు తెదేపా కొత్త కన్వీనర్లు నియమితులయ్యారు. పార్టీ జోన్-5 ఇన్‌ఛార్జి కోవెలమూడి రవీంద్ర సోమవారం రాత్రి కన్వీనర్ల పేర్లను ప్రకటించారు. బుక్కరాయసముద్రం మండలానికి లక్ష్మీనారాయణ, నార్పలకు తలారి కుల్లాయప్ప, శింగనమలకు మారుతీనాయుడు, యల్లనూరుకు రామాంజనేయులు, గార్లదిన్నెకు రంగనాయకులు, పుట్లూరుకు గుత్తా శ్రీనివాసులు నియమితులైనారు.

స్ఫూర్తిప్రదాత సర్దార్ పటేల్

ప్రచార గోడప్రతులను విడుదల చేస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్ తదితరులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: దేశ ఐక్యతకు చివరివరకు కృషి చేసిన దేశ దివంగత ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిప్రదాత అని ఆర్డీఓ శ్రీనివాస్ అన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ అనుబంధంగా ఉన్న స్థానిక 'ఆ నలుగురు సేవా సమితి' ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ఐక్యతా యాత్ర జరగనుంది. దీనికి సంబంధించిన ప్రచార గోడ ప్రతులను ఆర్డీఓ తన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర్యం తర్వాత పటేల్ పలు సంస్థానాల విలీనంలో చూపిన ధైర్యసాహసాలు మరువలేనివన్నారు. బీరప్ప కూడలి నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ఐక్యతా యాత్ర సాగుతుందన్నారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సమితి అధ్యక్షుడు మంజులా వెంకటేశ్ కోరారు. కార్యక్రమంలో మై భారత్ ఇన్‌ఛార్జి జీవన్ కుమార్, సమితి నాయకులు మారుతి, కేశవ, లింగేశ్వర్, చక్రపాణి, సాయికుమార్ పాల్గొన్నారు.

పత్తి గిట్టుబాటు ధరకు డిమాండ్

సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, రైతులు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: ప్రస్తుతం రైతులు పండించిన పత్తి పంటకు ప్రభుత్వం రూ.12వేలు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని అప్పేచెర్ల సచివాలయం వద్ద సోమవారం పార్టీ నాయకులు వెంకటరాముడుయాదవ్, రంగనాయకులు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ప్రాంతంలో కర్షకులు పత్తిని ఎక్కువగా సాగు చేశారని, పంట ఎలాగున్నా ప్రభుత్వమే కొనుగోలు చేయాలంటూ నినాదాలు చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సచివాలయ సిబ్బందికి అందజేశారు. నారాయణ, అల్లాబకాష్, నాగేంద్ర, రామాంజనేయులు, కిరణ్‌కుమార్, నారాయణస్వామి తదితరులు ధర్నా చేశారు.

'రోడ్డు వేయకుంటే నిరాహార దీక్ష'

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కోటంక గ్రామానికి తారురోడ్డు వేయకుంటే తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేపడుతామని రాయలసీమ రైతు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ హెచ్చరించారు. ఈమేరకు తహసీల్దారు ఈరమ్మకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా రోడ్డు వేయడం లేదన్నారు. ఆయన వెంట సంఘం మండల కార్యదర్శి వెంకటరమణారెడ్డి, నాయకులు వన్నూరప్ప, భాషా, ఖలందర్, వెంకటశివ, జనార్థన, ఆదెప్ప తదితరులున్నారు.

ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణకు వినతి

గుంతకల్లు పట్టణం: పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నిరసనకారులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: బూటకపు ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులను చంపారని, దీనిపై న్యాయ విచారణ చేయాలంటూ సోమవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఐఎఫ్‌టీయూ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద సోమవారం డెమోక్రసీ డివిజన్ కమిటీ కార్యదర్శి సురేశ్, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టు హిడ్మా, ఆయన భార్య రాజక్క, మరికొందరిని చిత్రహింసలకు గురిచేసి హత్య చేశారని ఆరోపించారు.

గుత్తి గ్రామీణం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అబద్ధపు ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని అఖిలభారత రైతు కూలీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు కోరారు. గుత్తిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన రైతు కూలీలతో ధర్నా చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సిబ్బందికి అందజేశారు.

గొలుసు దుకాణాలు లేకుండా చేయాలి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధి గ్రామాల్లో గొలుసు దుకాణాలు లేకుండా చూడాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. ఆయన సోమవారం స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. కార్యాలయంలో పలు రికార్డులు పరిశీలించి మాట్లాడారు. అనుమతి పొందిన మద్యం దుకాణాల్లో నిర్వాహకులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో గొలుసు దుకాణాలపై సమాచారం ఇచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సీఐ నాగసునీతరాణి, ఎస్సై గురు రాజా తదితరులు పాల్గొన్నారు.

'గిరిజనులపై దాడులు దారుణం'

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: కేంద్రంలో భాజపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 ఏళ్లలో గిరిజనులు, దళితులు, మైనార్టీలపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని సీపీఐ నాయకులు ఆరోపించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. సీపీఐ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోవిందు, జిల్లా కార్యదర్శి నారాయణస్వామి మాట్లాడారు. గిరిజనులు, మైనార్టీలపై దాడులను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నేటివరకు నిరుద్యోగ భృతి ఊసే ఎత్తడం లేదన్నారు. 19 ఏళ్లపైబడిన మహిళలకు నెలకు రూ.1500లు ఇస్తామని హామీ అమలు కాలేదన్నారు. సమావేశంలో పార్టీ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిథిల వంతెన కనపడదా..

మండలంలోని మర్తాడు, కోటంక గ్రామాలకు వెళ్లేందుకు హెచ్చెల్సీ కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. కొత్త వంతెన నిర్మాణానికి పదేళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం శిలాఫలకం వేసింది. నాటి నుంచి నేటివరకు పనులు చేపట్టిన పాపానా పోలేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. పెనుప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు మేల్కొని పనులు చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గార్లదిన్నె

ఒరిగింది.. విరుగుతుంది

బుక్కరాయసముద్రంలో అంబేడ్కర్ విగ్రహం పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా మారింది. ఓవైపునకు పూర్తిగా ఒరిగి పోవడంతో ఏక్షణంలోనైనా విరిగి విగ్రహంపై పడిపోవచ్చని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకముందే విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని, లేదా మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం

మలుపును కమ్మిన కంపలు

బుక్కరాయసముద్రం పరిధి చెరువుకట్ట రోడ్డులో ఓ మలుపు కనబడకుండా ముళ్లచెట్లు విపరీతంగా పెరిగాయి. ఈ మార్గంలో వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గతంలో ప్రమాదాలు జరిగాయి. పంచాయతీ అధికారులు స్పందించి ముళ్లకంపలు తొలగించడంతో పాటు గుంతలు పూడ్చాల్సని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం

సారూ.. ఓసారిటు చూడరూ

తాడిపత్రి మండలం సజ్జలదిన్నె నుంచి ఆలూరు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కనున్న విద్యుత్తు స్తంభంతో పాటు తీగలకు పిచ్చిమొక్కలు అల్లుకున్నాయి. అంతే గాకుండా ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. బలమైన గాలులు వీచినప్పుడు తీగలు ఒరుసుకొని మంటలు వస్తున్నాయని రైతులు తెలిపారు. దీనిపై ఏడీఈ ప్రభాకర్ రావు దృష్టికి తేగా, వెంటనే సిబ్బందిని పంపించి పిచ్చి మొక్కలు తొలగించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

- న్యూస్‌టుడే, తాడిపత్రి

యువ ఆవిష్కర్తకు సన్మానం

లలిత్ శివసాయిని సత్కరిస్తున్న రామాంజనేయులు, మధుసూదన్‌రావ్ తదితరులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన అఖిలభారత యువ శాస్త్రవేత్తల పోటీల్లో రెండో స్థానంలో నిలిచిన స్థానిక రైల్వే ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి లలిత్ శివసాయిని తెదేపా ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. లలిత్ గూడ్సు రైలులో గార్డులుండే వ్యాగన్‌లో వెలుతురు అందించడానికి రూపొందించిన డైనమోకు జాతీయ స్థాయిలో రెండో బహుమతి దక్కిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక చర్చి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని తెదేపా మాజీ అధ్యక్షుడు రామాంజనేయులు, రైల్వే పాఠశాల ప్రధానాచార్యుడు మధుసూదన్‌రావ్ సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుబ్బరాయుడు, ప్రధానోపాధ్యాయులు రంగస్వామి, దయ తదితరులు పాల్గొన్నారు.

సేవకు మరోపేరు ఎన్‌ఎస్‌ఎస్

ఎన్ఎస్‌ఎస్‌లో చేరి సామాజిక సేవలో పాలుపంచుకోవాలని ఆ పథకం పీఓ అక్కులన్న సూచించారు. సోమవారం జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో నీలూరులో ఎన్ఎస్‌ఎస్ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో భాగంగా గ్రామాల్లో మొక్కలు నాటడం, వీధులను శుభ్రం చేయడంతో పాటు సీజనల్ వ్యాధులు, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు తదితరాలపై గ్రామీణులకు అవగాహన కల్పిస్తారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకుడు నారాయణ రెడ్డి, ఎన్ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, పామిడి**

అంగన్‌వాడీల సమస్యలు తీర్చండి

తాడిపత్రి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలంటూ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. పాత చరవాణుల స్థానంలో కొత్తవి ఇవ్వాలని, అధిక పనిభారం వద్దని, వేధింపులు ఆపాలని, శిక్షణ ఇవ్వకుండా బాధ్యతలు ఇవ్వకూడదని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీఐటీయూ నాయకులు నరసింహారెడ్డి, ఉమా గౌడు, అంగన్‌వాడీ ఉద్యోగులు శంకరమ్మ, భాగ్యలక్ష్మీ తదితరులున్నారు.

ప్రభుత్వోన్నత పాఠశాలలో సామగ్రి ధ్వంసం

నార్పల, న్యూస్‌టుడే: నార్పల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సామగ్రి ధ్వంసం చేశారని ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బడి ఆవరణలోని తాగునీటి కుళాయిలు, నీటి సంపు, మోటారు పైపులు నాశనం చేశారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు చేపట్టారు.

అసత్య ప్రచారాలపై కఠినచర్యలు: సీఐ

బుక్కరాయసముద్రం: పోలీసుల ప్రతిష్ఠ దెబ్బతీసేలా సామాజిక మాధ్యమాల్లో ఎవరైనా పోస్టులు పెడితే కఠినచర్యలు తప్పవని సీఐ పుల్లయ్య తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది పోలీసుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారన్నారు. స్టేషన్‌లో పంచాయతీలు చేస్తున్నారని నిరాధార పోస్టులు పెట్టడం తగదన్నారు. ఆధారాలు చూపకుంటే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

పాడిరైతుల కోసమే పథకాలు

పెద్దవడుగూరు: పశుసంవర్ధక శాఖ ద్వారా అందజేస్తున్న ప్రభుత్వ పథకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెద్దవడుగూరు పశువైద్యుడు రమేష్ కోరారు. మండలంలోని మల్లేనిపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పశువుల కొనుగోలుకు ఇస్తున్న రాయితీ రుణాలను ఉపయోగించుకొని పాడిని అభివృద్ధి చేసుకోవాలన్నారు. రుణాల కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో అవగాహన కల్పించారు.

బంగారం వ్యాపారుల అరెస్టు

తనికంటి సోదరులను తీసుకెళుతున్న పోలీసులు

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరుకు చెందిన బంగారం వ్యాపారులు తనికంటి శ్రీనివాసులు, అతడి సోదరుడు తాడిపత్రిలో ఉంటున్న వెంకటస్వామిని పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు 10 కిలోల బంగారం తీసుకుని డబ్బులు చెల్లించకుండా మోసం చేయడమే కాకుండా, కిడ్నాప్, దాడిచేసి బెదిరించారంటూ హైదరాబాద్‌కు చెందిన బంగారం వ్యాపారి హేమంత్‌శర్మ పోలీసులకు వీరిపై ఫిర్యాదు చేశారు. ఈ నెల 20న కేసు నమోదు చేసిన పోలీసులు వీరిని అదుపులోకి తీసుకోవడం వివాదంగా మారిన విషయం తెలిసిందే. పోలీసులు ఇద్దరిని వైద్య పరీక్షల అనంతరం రాత్రి ప్రొద్దుటూరు కోర్టులో మెజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచారు. ఈ సందర్భంగా సోదరులు తమపట్ల పోలీసులు వ్యవహరించిన తీరును, కొట్టిన గాయాలను మెజిస్ట్రేట్‌కు చూపించారు. ఆయన ఆదేశాలతో వెంకటస్వామిని వైద్య పరీక్షల కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

రైలుకింద పడి యువతి బలవన్మరణం

క్రైమ్.. కార్నర్

గుంతకల్లు, న్యూస్‌టుడే: పట్టణంలోని హనుమేశ్‌నగర్‌లో ఉంటున్న వీరన్న కుమార్తె లక్ష్మి(22) సోమవారం రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే సీఐ అజయ్‌బాబు తెలిపారు. ఘటన ధర్మవరం రైల్వేగేటు-హనుమాన్ సర్కిల్ స్టేషన్ల మధ్య జరిగినట్లు చెప్పారు. ఆమెకు కొన్నాళ్లుగా మతిస్థిమితం సరిగ్గా లేదని, ఈ నేపథ్యంలో రైలు కిందపడి చనిపోయినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

చికిత్స పొందుతూ సీపీఎం నేత మృతి

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని కల్లూరుకు చెందిన సీపీఎం సీనియర్ నేత ఇస్మాయిల్(79) కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 19న కల్లూరు సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డారన్నారు. చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారని, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారన్నారు. ప్రమాదానికి కారణమైన బొలెరో వాహన చోదకుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఇస్మాయిల్ మృతిపట్ల సీపీఎం నాయకులు సంతాపం తెలిపారు.

చోరీపై కేసు నమోదు

యాడికి, న్యూస్‌టుడే: మండలంలోని బోయరెడ్డిపల్లి సమీప అదానీ సిమెంటు పరిశ్రమలో జరిగిన చోరీపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. సిమెంటు పరిశ్రమలోని ఉద్యోగులు ఉంటున్న కాలనీలో 18న అర్ధరాత్రి మూడిళ్లలో చోరీ జరిగింది. రెండు కేజీల వెండి, దుస్తులు, గడియారాలు చోరీకి గురయ్యాయి. ఉద్యోగి అభిషేక్ శర్మ ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ ఎం. ఈరన్న తెలిపారు.

వస్త్ర దుకాణంలో మహిళల చేతివాటం

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గుత్తి పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో సోమవారం ముగ్గురు మహిళలు చేతివాటం ప్రదర్శించారు. అతివలు దుకాణంలో చీరల కొనుగోలుకు వెళ్లారు. కొంటున్నట్లు నటించి ఎవరూ లేని సమయంలో చీరలను దొంగలించారు. అందులో ఒక మహిళను దుకాణం సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారు చోరీ చేస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయినట్లు పోలీసులు వెల్లడించారు.

కుస్తీ క్రీడాకారిణికి ప్రోత్సాహకం

పామిడి, న్యూస్‌టుడే: పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైన విద్యార్థిని దాసరి లావణ్యకు సోమవారం రూ.5వేలు ప్రోత్సాహకం అందజేశారు. బాలికకు క్రీడా దుస్తులు, మ్యాట్, బూట్లు ఇప్పించలేని తల్లిదండ్రుల దీనస్థితిని శిక్షకుడు రాఘవేంద్ర ఉపాధ్యాయ బృందం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు ప్రధానోపాధ్యాయిని శ్యామలాదేవి చేతుల మీదుగా లావణ్యకు నగదు అందజేశారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి

అమూల్య, నందినిలను సత్కరిస్తున్న జేవీవే నాయకులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులు భారత జట్టులో స్థానం పొందడానికి కృషి చేయాలని ఒన్‌టౌన్ సీఐ మనోహర్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు అమూల్య, నందిని జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపికైన సందర్భంగా వారిని జేవీవే నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురుషులను దీటుగా మహిళలు అన్నిరకాల క్రీడల్లో దూసుకుపోతున్నారని గుర్తుచేశారు. ఈసారి జాతీయ పోటీల్లో బాగా రాణించి గుంతకల్లు పేరు మారుమోగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు సాలమ్మ, ఎన్ఎస్ఎస్ అధికారి వెంకటేశ్వర్లు, మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ప్రభాకర్, వేదిక నాయకులు చంద్రశేఖర్, రవిప్రసాద్ పాల్గొన్నారు.

(c) eenadu

అనంతపురం

● అనంతపురం ● రాప్తాడు

‘పుట్టపర్తి అభివృద్ధిలో భాగస్వాములుకండి’

రుద్రంపేట: భగవాన్ సత్యసాయి నడయాడిన పుట్టపర్తి అభివృద్ధిలో ప్రపంచ వ్యాప్తంగా భక్తులు, ప్రజలు భాగస్వాములు కావాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి ఆమె పత్రికా విలేకర్ల సమావేశం నిర్వహించారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం అరుదైన అవకాశంగా భావిస్తున్నామని తెలిపారు. చిన్న వయసులో పుట్టపర్తి ఎమ్మెల్యేగా అవకాశం రావడం పూర్వ జన్మ సుకృతమన్నారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులందరికీ, సత్యసాయి సేవా సంస్థ సేవకులకు జిల్లా యంత్రాంగం తరపున అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారంతో సాంత్వన

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి నగరపాలక కమిషనరు బాలస్వామి, అధికారులు చొరవ చూపారు. దీంతో స్థానికులకు సాంత్వన చేకూరింది. ఈనెల 21న ‘ఆనవాళ్లు లేని రోడ్లు.. వణికించే గుంతలు’ శీర్షికన ఈనాడులో కథనం ప్రచురించడంతో మ్యాన్‌హోల్స్ మీద ఇనుప కవచాలు ఏర్పాటు చేశారు. సోమవారం ప్రచురించిన ‘లీకేజీని అరికట్టరూ!’ శీర్షికన ప్రచురితం కావడంతో తాగునీటి విభాగం సిబ్బంది వెళ్లి లీకేజీ అరికట్టారు. ఈనెల 22న ప్రచురించిన ‘దుర్వాసన దోమలు’, చెట్టు కొమ్మలు తరలించరూ..శీర్షికలతో చిత్ర కథనం ప్రచురితం కావడంతో మురుగు తొలగించడంతో పాటు చెట్టు కొమ్మలు తరలించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్ : 8008573011
రాంనగర్: 8008573001
కమలానగర్: 7032975446

సమస్య : అనంతపురం నగరం మారుతీనగర్ ఇంటి నంబరు 6-4-176-2 సమీపాన కేశవ రెడ్డి పాఠశాల వెనక వైపున ఎస్వీ అపార్ట్‌మెంట్ వద్ద ఖాళీ స్థలంలో చెత్త పడేస్తున్నారు. చెత్త తీయక దిబ్బలాగా మారింది.
- శివయ్యనాయుడు, మారుతీనగర్

సమస్య : శ్రీనివాసనగర్‌లో వసతి గృహాలు, ఆసుపత్రులు, ఇళ్లలోని చెత్తంతా పక్కనున్న అనంతపురం కొత్తూరు జూనియర్ కళాశాల మైదానంలో పడేస్తున్నారు. ఇది డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది. నిత్యం ఉదయం మైదానానికి నడక కోసం వచ్చేవారు నగరపాలక సంస్థ అధికారులకు ఎంత చెప్పిన స్పందించడంలేదు **- వాకర్స్**

సమాధానం : చెత్తను తొలగించేందుకు తగు చర్యలు తీసుకుంటాం.
- నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి ప్రజారోగ్య అధికారి నరసింహా

– న్యూస్‌టుడే, రాంనగర్ (అనంతపురం)

కాలుష్య ఘంటిక.. వేదన ఎన్నాళ్లిక?

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: నగరంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే కనిపిస్తున్నాయి. వాటికి నిప్పు పెట్టడంతో నగరం కాలుష్య కాసారంగా మారుతోంది. పలు ప్రాంతాల్లోని చెత్త కుప్పల్లో ఎక్కువ మోతాదులో ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. నగరంలో ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు తీసుకుంటున్నా ఆశించిన స్థాయిలో ఫలితం లేదు. మద్యం దుకాణాల వద్ద ప్లాస్టిక్ గ్లాసులు పడేస్తుండటంతో అవి మురుగు కాలువల్లో చేరి నీటి ప్రవాహానికి అడ్డు పడుతున్నాయి. నగరంలోని ప్రధాన రోడ్లు, వీధుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోంది. చెత్త బిన్నుల వద్ద పడేసిన వ్యర్థాలను పశువులు తిని అనారోగ్యం బారిన పడుతున్నాయి.

ప్రధాన రోడ్డు పక్కనే

నగరంలోని పీటీసీ రోడ్డుకు వెళ్లే దారిలోని లక్ష్మీనగర్ వైపుకు వెళ్లే కూడలి వద్ద చెత్తకు నిప్పుపెట్టారు. ఉదయాన్నే ఈ మార్గంలో నడకకు వెళ్లే వారు ఆరోగ్యం కోసం వెళితే కాలుష్యంతో కూడిన పొగను పీల్చి వెళ్లే పరిస్థితి నెలకొంది. పీటీసీ, లక్ష్మీనగర్ వైపు వెళ్లే వేలాది మంది పొగ పీలుస్తూ ప్రయాణించాల్సిన ఇబ్బందికర పరిస్థితి ఉంటోంది.

రోడ్డు పక్కన కాలుతున్న ప్లాస్టిక్, చెత్త వ్యర్థాలు

ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు

నగరంలో ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలుసార్లు తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించాం. ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. **- బాలస్వామి, నగర కమిషనరు**

మురుగు కాలువల నిండా

మురుగు కాలువల్లో పలు రకాల వ్యర్థాలు పోగవుతున్నాయి. ఇందులో ఎక్కువగా ప్లాస్టిక్ కవర్లు, మద్యం తాగిన గ్లాసులు, నీళ్ల సీసాలు, థర్మాకోల్ ఉంటున్నాయి. ఇవి కాలువల్లో మురుగు ప్రవాహానికి అడ్డుపడుతున్నాయి. దీంతో దుర్వాసన వస్తోంది. నగరంలో ప్రధాన కాలువలు 12 కిలోమీటర్లు ఉండగా.. సిమెంటుతో నిర్మించిన మురుగు కాలువలు 380 కిలోమీటర్ల వరకు ఉన్నాయి. వీటిలోని వ్యర్థాలను తీసి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. బయోమైనింగ్ చేసే ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పోగవుతున్నాయి.

వ్యర్థాలతో నిండిన కాలువ

విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపల్ నేత్రావతి, ఉపాధ్యాయురాలు ఇంద్రజ

విపరీతంగా సెల్‌ఫోన్ వాడితే అనర్థాలే..

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు సెల్‌ఫోన్లను వాడితే అనర్థాలు తప్పవని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపల్ నేత్రావతి పేర్కొన్నారు. హౌసింగ్‌బోర్డులోని శ్రీచైతన్య ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో సోమవారం ఈనాడు ఆధ్వర్యంలో ప్రతిభా పాటవపోటీలు నిర్వహించారు. ‘విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం’ అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 9వ తరగతి విద్యార్థులు ఉమేష్‌చరణ్ ప్రథమ, ఆదిత్యరాజ్ వర్ధన్ ద్వితీయ, 7వ తరగతి విద్యార్థిని ప్రణతిశ్రీ తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. విజేతలకు ప్రిన్సిపల్ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. డీన్ సుప్రజ, ఉపాధ్యాయురాలు ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

రాప్తాడు, న్యూస్‌టుడే: రాప్తాడు జగన్ సభలో ఆదివారం ఓ వ్యక్తి జేబులో దొంగతనం చేసిన వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతపురానికి చెందిన గంగన లక్ష్మీరెడ్డి ఆదివారం జగన్ చూడటానికి రాప్తాడు సభకు వచ్చిన సమయంలో తన జేబులో ఉన్న 20 వేల రూపాయలను ఓ దొంగ దొంగలించండంతో రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం రాప్తాడు సమీపంలోని పంగల్‌రోడ్డులో తాడేపల్లికి చెందిన గోదావరిబాబును అరెస్ట్ చేసి విచారణ చేయగా దొంగతనం చేసినట్లు ఒప్పుకోవడంతో సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలో స్థానిక పీటీసీ ఉపరితల వంతెన పైనుంచి కిందికి దూకి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉదయం ఏడు గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వంతెన ఎక్కాడు. రెండో రోడ్డు, మూడో రోడ్డుకు మధ్యలో సర్వీసు రోడ్డుపైకి దూకాడు. బోర్లా పడటంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుని వయసు సుమారు 40 నుంచి 45 లోపు ఉంటుంది. ఎరుపు రంగు గీతలు కల్గిన చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. అనంతపురం నుంచి గుంతకల్లు వెళ్లడానికి తీసుకున్న రైలు టికెట్ జేబులో లభించింది. ఇంకా ఎలాంటి గుర్తింపు కార్డులు మృతుడి వద్ద లేవు. సమాచారం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని సర్వజన వైద్యశాలలోని శవాగారానికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ (94906 18679) కోరారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు చేయూత

మహిళా సంఘాల సభ్యులకు మెగా చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ లక్ష్మీనారాయణ, కమిషనరు బాలస్వామి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: ప్రతి ఇంట్లో మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను తీర్చి దిద్దుతామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు, వీధి వ్యాపారులకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కమిషనరు బాలస్వామితో కలిసి సోమవారం మెగా చెక్కులు అందజేశారు. నగరంలోని 846 స్వయం సహాయక సంఘాలలోని 8460 మంది సంఘ సభ్యులకు రూ.126.46 కోట్లు, 879 మంది వీధి విక్రయదారులకు పీఎం స్వానిధి 2.0 పథకం ద్వారా రూ.2.02 కోట్లు నమూనా చెక్కును విడుదల చేశారు. 25 మంది స్వయం సహాయక సభ్యులకు 25 ర్యాపిడో ఈ-బైకులను, ఒక్కో బైకు రూ.1,22,500 ప్రభుత్వ సబ్సిడీతో అందజేశారు.

‘మేయర్ సొంత డివిజన్‌లో..’

ఐదేళ్ల వైకాపా పాలనలో అభివృద్ధి లేక ప్రజలు ఇబ్బంది పడ్డారని, మేయర్ వసీం సొంత డివిజన్‌లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోలేకపోయారని దగ్గుపాటి ప్రసాద్ విమర్శించారు. సోమవారం అంబేడ్కర్ భవన్ సమీపంలో రూ.22 లక్షలతో సీసీ రోడ్డుకు భూమి పూజ చేయడంతోపాటు మరో రూ.32 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. అనంతరం అశోక్ నగర్ సచివాలయం వద్ద పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా మహిళలకు డీజీ లక్ష్మి కియోస్క్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పటికే రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

పరిపాలనలో సృజనాత్మకత అవసరం

ముస్సోరీ డైరెక్టర్ శ్రీరామ్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, డీఆర్ఓ మాలోల

జిల్లా సచివాలయం: ప్రతి అధికారి నాయకత్వ లక్షణాలతో పని చేస్తేనే ఫలితాలు ఒనగూరుతాయని ముస్సోరీ ఐఏఎస్‌ల శిక్షణ సంస్థ డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి పేర్కొన్నారు. పరిపాలనలో నిత్యం సృజనాత్మకత చాలా కీలకమన్నారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనకు కలెక్టర్ ఆనంద్, డీఆర్ఓ మాలోల పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఆ తర్వాత కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో జిల్లాఅధికారులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ఐఏఎస్‌లకే శిక్షణ ఇచ్చే అనుభవం జిల్లా అధికారులకు ఉంది. మరింత నైపుణ్యత శిక్షణ కోసం మార్పులు, చేర్పులు చేస్తున్నాం. దీనికి జిల్లా అధికారులు అనుభవాలను పంచుకోవాలన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే: జిల్లావ్యాప్తంగా విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, దేవాలయాలు, ఆర్టీసీ బస్టాండ్లు..వంటి ప్రాంతాల్లో ప్రతి శుక్రవారం విధిగా డ్రైడేగా పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సామాజిక శానిటరీ సముదాయాలు నిర్మించాలని కలెక్టర్ చెప్పారు. ప్రతి పంచాయతీకి రెండు చొప్పున మరుగుదొడ్లు నిర్మించాలని 577 పంచాయతీలల్లో గార్బేజ్ కేంద్రాలను గుర్తించాలని సూచించారు.

శిశుగృహకు చేరిన పసికందు

అనంతపురం (వైద్యం): రెండు నెలలపాటు సర్వజన వైద్యశాల నవజాత శిశుకేంద్రంలో చికిత్స పొంది కోలుకున్న అనాథ శిశువు శిశుగృహ చేరింది. సోమవారం డిప్యూటీ ఆర్ఎంవో డాక్టర్ హేమలత, వైద్యులు రవికుమార్, మురళి, హరిణి, శ్రీధర్, దినకర్, నవీన్ ఐసీపీఎస్ ప్రొటెక్షన్ అధికారి మంజునాథ్ సమక్షంలో శిశు గృహ సిబ్బందికి శిశువును అప్పగించారు. ఈ ఏడాది సెప్టెంబరు 25న అనంతపురం సాయినగర్ ఏడో క్రాస్‌లో రోడ్డు పక్కన పాలథిన్ కవర్లో అపుడే పుట్టిన ఓ ఆడశిశువును ఓ తల్లి వదిలేసి వెళ్లింది. బిడ్డను ఐసీడీఎస్, చైల్డ్‌లైన్, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అధికారులు, పోలీసులు బిడ్డను సర్వజన వైద్యశాలకు తరలించారు. బిడ్డకు దోమలు కుట్టటంతో ఆరోగ్యం క్షీణించింది. పుట్టిన సమయంలో శిశువు 2 కిలోల బరువు ఉంది. శిశుకేంద్రంలో ఉంచి చికిత్స అందిస్తూనే..మిల్క్ బ్యాంకు సిబ్బంది రోజు పాలుపట్టించారు. బిడ్డ కోలుకుని బరువు 3.2 కిలోలు పెరిగింది. వైద్యులు, సిబ్బందికి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఐసీపీఎస్ అధికారి అభినందనలు తెలిపారు.

అభ్యసన సామర్థ్యాల పెంపునకు కార్యాచరణ

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ పేరుతో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. సోమవారం నుంచి జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో పిల్లల అభ్యసన సామర్థ్యల సర్వే ఆరంభమైంది. అనంత జిల్లాలో 135 పాఠశాల క్లస్టర్లున్నాయి. 135 మంది సీఆర్పీలు, ప్రభుత్వ, ప్రైవేటు డీఈడీ కళాశాలల్లోని డైట్ విద్యార్థులు కలసి విద్యార్థులపై ఈ సర్వే చేస్తున్నారు. మొబైల్ ఫోనులోని లీప్‌యాప్ ద్వారా విద్యార్థులను పరీక్షిస్తారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులకు డిసెంబరు 6 నుంచి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తారు.

దాడి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఎస్పీ జగదీశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెదేపా నాయకులు

అనంత నేరవార్తలు: నగరంలోని సాయినగర్ మూడో క్రాస్‌లో ఉన్న శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిపై వైకాపా నాయకులు దాడి చేయడంపై నగర తెదేపా నాయకులు ఎస్పీ జగదీశ్‌కు సోమవారం ఫిర్యాదు చేసి దాడి జరిగిన తీరును వివరించారు. దాడి వెనక వైకాపా నాయకులు, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ అనుచరులు ఉన్నారన్నారు. ఈ దాడిలో వైకాపా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అనుచరుడు సత్యనారాయణరెడ్డి, రమణారెడ్డి, సాయినాథ్‌రెడ్డి, మరికొందరు పాల్గొన్నారన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీని కలిసిన వారిలో తెదేపా జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌యాదవ్, తెదేపా మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, నాయకులు మోహన్‌కుమార్, చేపల హరి, శ్రీధర్, ఇస్మాయిల్ ఉన్నారు.

ఉపాధ్యాయురాలికి నివాళి

సుమలత

ఆత్మకూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయురాలు సుమలత (56) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. సుమలత 1989లో డీఎస్సీలో ఉద్యోగాన్ని సాధించారు. వివిధ పాఠశాలలో విధులు నిర్వహిస్తూ 2021లో బదిలీమీద ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వచ్చారు. కొన్ని సంవత్సరాల నుంచి గొంతుక్యాన్సర్‌తో ఇబ్బంది పడుతూ చికిత్స తీసుకుంటున్నారు. ఆరోగ్యం క్షీణించి 2 నెలల నుంచి సెలవులపై ఇంటి వద్దే ఉంటున్నారు. రెండు రోజుల క్రితం పాఠశాలకు వచ్చి అందరినీ మాట్లాడించి వెళ్లారు. అనారోగ్యంతో ఇంటివద్ద మృతి చెందారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

అపరిశుభ్రం, అస్తవ్యస్తం

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంపురం గ్రామీణం బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారికి అనుకుని ఏపీ ఆయిల్‌ఫెడ్ సర్వీసురోడ్డులో ఎ.నారాయణపురం పంచాయతీ పరిధిలో రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే) ఉంది. శివారు ప్రాంతం కావడంతో ఆర్ఎస్‌కే పరిధిలో పాలిచ్చే పశువులు ఎక్కువగా ఉన్నాయి. పశువులకు ఏర్పాటు చేసిన బోను చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి అపరిశుభ్రంగా ఉంది. సరిగా మందులు ఉండటం లేదు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్

కలెక్టరేట్ గేటు ముందు మెడికల్ రెప్‌ల నిరసన

శ్రీనివాస్‌నగర్: కార్మిక వ్యతిరేక విధానాలకు దోహదం చేసే లేబర్ కోడ్‌లను సత్వరమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ సేల్స్ రెప్రజెంటేటివ్‌ల సంఘం నిరసన చేపట్టింది. సోమవారం కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేటు ముందు ధర్నా చేపట్టారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మాట్లాడుతూ పోరాటాలతో సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి..కార్మిక కోడ్‌లను తేవడం అన్యాయమన్నారు. ఉద్యోగ భద్రతకు విఘాతం కలిగే వీటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత డీఆర్ఓకు వినతి అందజేశారు. సంఘం జాతీయ కార్యదర్శి మనోహర్, రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ్, జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు కొత్త భవనాలు ప్రారంభం

తపోవనం, రాప్తాడు: వినియోగదారుల సౌకర్యార్థం కెనరా బ్యాంక్‌కు కొత్త భవనాలను నిర్మించి ప్రారంభించామని జనరల్ మేనేజర్ పాండురంగ మితంతయా, రీజనల్ మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి, అనంతపురం రూరల్ చియ్యేడు గ్రామాల్లో కొత్త భవనాలను ప్రారంభించారు. గొందిరెడ్డిపల్లిలో నాలుగు కుట్టుమిషన్‌లు, చెయ్యేడులో పాఠశాల విద్యార్థులకు క్రికెట్ కిట్లు అందజేశారు.

అవీ.. ఇవీ..

26న దివ్యాంగుల క్రీడాపోటీలు

అనంతపురం క్రీడలు: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 26న దివ్యాంగులకు వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీఓ ఎస్ఎం మంజుల తెలిపారు. నీలం సంజీవరెడ్డి స్టేడియంలో 100 మీ., 400 మీ. పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, పవర్ లిఫ్టింగ్, ఫెన్సింగ్ పోటీలు జరుగుతాయని, పాల్గొనదలచిన దివ్యాంగులు నేరుగా హాజరు కావాలన్నారు.

జేఎన్‌టీయూ సమీపంలో స్థల వివాదం

జేఎన్‌టీయూ: జేఎన్‌టీయూ సమీపంలో స్థల వివాదం నెలకొంది. క్రైస్తవ శ్మశానవాటిక ఎదురుగా ఉన్న స్థలాన్ని ఓ మహిళ కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. కానీ అదేస్థలంలో మరో మహిళ పేరుతో రెవెన్యూ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చారు. ఇరువర్గాల మధ్య వివాదం కొన సాగుతోంది. రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికెళ్లినా వివాదం పరిష్కారం కాలేదని వాపోయారు. ఒక వర్గం వారు ఇళ్లు నిర్మిస్తుండగా మరోవర్గం వారు అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య సోమవారం గొడవ జరిగింది. పోలీసులు గొడవ సద్దుమణిగేలా చేశారు.

నిజాయతీ చాటిన విశ్రాంత ఉద్యోగి

అనంత నేరవార్తలు: విలువైన వస్తువులున్న బ్యాగును పోగొట్టుకున్న బాధితులకు అందజేసి నిజాయతీని చాటుకున్నాడు నగరానికి చెందిన విశ్రాంత మిలిటరీ ఉద్యోగి రవికిరణ్ రాజు. నగరానికి చెందిన తిరుపాల్, అతని భార్య సరోజమ్మ బళ్లారి నుంచి ఆర్టీసీ బస్సులో వచ్చి బస్టాండులో దిగారు. అక్కడి నుంచి ఇంటికి ఆటోలో వెళుతూ తమ బ్యాగును ముత్యాలరెడ్డి మిల్క్ డెయిరీ సమీపంలో జారవిడుచుకున్నారు. ఇది గమనించిన రవికిరణ్ రాజు బ్యాగును పరిశీలించగా అందులో చెవి కమ్మలు, చరవాణి గుర్తించారు. వెంటనే అతడు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బ్యాగును పోలీసులు అప్పగించాడు. పోలీసులు చరవాణి ఆధారంగా బాధితుల చిరునామా కనుగొని వారిని స్టేషన్‌కు పిలిపించి బ్యాగును అందజేశారు. బ్యాగును అప్పగించిన రిటైర్డ్ మిలిటరీ ఉద్యోగిని సీఐ రాజేంద్రనాథయాదవ్ అభినందించారు.

అరటికి గిట్టుబాటు ధర కల్పించాలి..

రాప్తాడు: ధరలు లేక నష్టపోతున్న అరటిపంటకు రైతుల నుంచి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ కౌలు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నీళ్లపాల రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఉద్యానపంటలకు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలని తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం అందజేశారు. అరటి రైతులు లక్షల రూపాయిలు ఖర్చు చేసి సాగు చేస్తే దళారులు, వ్యాపారస్థులు కుమ్మక్కై అరటి టన్ను 25 వేలు నుంచి 2 వేలుకు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. ప్రభుత్వమే టన్ను 22 వేలతో కొనుగోలు చేయాలన్నారు.

రూ.5 లక్షల బీమా పంపిణీ

తపోవనం: జనసేన పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ రహదారి ప్రమాదంలో మరణించిన ఓబుళశెట్టి పవన్‌కుమార్ కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమాను పంపిణీ చేశారు. సోమవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి తల్లిదండ్రుల చేతికి చెక్కును అందజేశారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్, అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్, నగర అధ్యక్షుడు పి.బాబురావు పరిహారాన్ని అందజేశారు.

కమలానగర్.. సమస్యలతో బేజార్

దెబ్బతిన్న పలు కల్వర్టులు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే : అనంత నగరంలోని అధిక జన సంచారం ఉన్న కాలనీల్లో మొదటిది కమలానగర్. నిత్యం వందల సంఖ్యలో ప్రజలు ఈ ప్రాంతంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ నెలకొన్న పలు సమస్యలతో జనం బేజారవుతున్నారు. ప్రధానంగా అధ్వాన మురుగు కాలువలు, ఎక్కడబడితే అక్కడ చెత్తా చెదారం, మరమ్మతుకు చేరిన కల్వర్టులు, గుంతల దారులతో జనం విసిగిపోతున్నారు. మురుగు కాలువల దుర్వాసనతో ముక్కుమూసుకునే పరిస్థితి ఉంది. చెత్త కుప్పలపై పశువులు, పందులు విచ్చల విడిగా సంచరిస్తున్నాయి. గుంతల దారిలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రూ.కోట్ల వ్యాపార సముదాయం ఉన్న ఈప్రాంతంలో ప్రజలకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి.

శ్రీసాయి డిగ్రీ కళాశాల సమీపంలో కల్వర్టు కొన్ని నెలలుగా అధ్వానంగా ఉంది. వాహనదారులు, పాదచారులు, విదార్థులు సైతం ఈ గుంత కారణంగా ప్రమాదాల బారిన పడ్డారు. రాత్రిళ్లు వాహనదారులు ఎక్కువ శాతం ఈ గుంతల కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారు. కల్వర్టుకు మరమ్మతులు చేసి ప్రమాదాలు తప్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బాషా హోటల్ సమీపంలో నిత్యం భారీ వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడా కల్వర్టు దారుణంగా ఉంది. ప్రమాదం ఉందని హెచ్చరిస్తూ కర్రలు ఏర్పాటు చేశారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా గుంతలో పడే ప్రమాదం ఉంది. రాత్రి సమయంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు కమలానగర్ ప్రాంతాల్లో ఉంటే కల్వర్టులకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గంగులకుంటలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం

రాప్తాడు, న్యూస్‌టుడే: రాప్తాడు మండలం గంగులకుంట గ్రామంలో సోమవారం ఎస్ఎస్‌బీఎన్ కళాశాల విద్యార్థులు ప్రత్యేక శిబిరం నిర్వహించారు. భాగంగా గ్రామంలోని ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన తెలియజేస్తూ ర్యాలీని నిర్వహించారు. ప్రజల వద్ద సమస్యలకు సంబంధించిన వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ భార్గవి,రేష్మా, 50 మంది వాలంటీర్లు పాల్గొన్నారు.

తెదేపా మండల కన్వీనర్ల నియామకం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: శింగనమల నియోజకవర్గంలోని ఆరు మండలాలకు తెదేపా కొత్త కన్వీనర్లు నియమితులయ్యారు. పార్టీ జోన్-5 ఇన్‌ఛార్జి కోవెలమూడి రవీంద్ర సోమవారం రాత్రి కన్వీనర్ల పేర్లను ప్రకటించారు. బుక్కరాయసముద్రం మండలానికి లక్ష్మీనారాయణ, నార్పలకు తలారి కుళ్లాయప్ప, శింగనమలకు మారుతీనాయుడు, యల్లనూరుకు రామాంజనేయులు, గార్లదిన్నెకు రంగనాయకులు, పుట్లూరుకు గుత్తా శ్రీనివాసులు నియమితులైన వారిలో ఉన్నారు.

26న శివకోటిలో సుబ్రహ్మణ్య షష్ఠి

అనంత సాంస్కృతికం: నగరంలోని బెంగళూరు రోడ్డు శ్రీ శివకోటి పీఠంలో పళని సుబ్రహ్మణ్యస్వామికి భస్మ అభిషేకం ఈనెల 26న బుధవారం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మార్గశిర సుబ్రహ్మణ్య షష్ఠి పురస్కరించుకుని స్వామి వారికి ఉదయం 8 గంటలకు విశేష పంచామృతాభిషేకం అనంతరం కిలోలకొద్ది భస్మ అభిషేకం జరుగుతుందన్నారు. పూజలో పాల్గొనదలచిన వారు 85008 50016, 70366 46646 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అయ్యప్ప విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం

అలంకరణలో స్వామివారు

అనంత సాంస్కృతికం: నగరంలోని రాంనగర్ 80 ఫీట్ రోడ్డులోని అయ్యప్ప స్వామి (ధర్మశాస్త) ఆలయంలో ఈనెల 26 నుంచి 5 రోజులపాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతన విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరగనున్నవి. తిరుచానూరు నుంచి తెచ్చిన 260 కేజీల అయ్యప్ప స్వామి పంచలోహ విగ్రహం, ద్వారకాపాలకులు, శిఖర ప్రతిష్ఠ కలశాలు 15, స్వామివారి పీఠం ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని కమిటీ తెలిపింది. ఆలయానికి చేరిన నూతన విగ్రహాలను గంగలో ఉంచి జలాభిషేకం నిర్వహించారు. ఉత్సవాల్లో ప్రధానమైన గ్రామోత్సవం 28న శుక్రవారం సాయంత్రం 5.30కు, 30న ఆదివారం తెల్లవారుజాము 4.35కు నూతన విగ్రహ ప్రాణ ప్రతిష్ఠతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

‘కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేకం’

అనంత నగరపాలక: కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేకమని వైకాపా శింగనమల నియోజకవర్గం సమన్వయకర్త శైలజానాథ్ విమర్శించారు. సోమవారం వైకాపా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి రూపాయి విదిల్చకుండా ప్రజా ధనంలో స్పెషల్ ఫ్లైట్లలో ముఖ్యమంత్రి విహారాలు చేస్తున్నారని ఆరోపించారు.

తెరపై ఈనాడు

అనంతపురం(కమలానగర్): గంగ : **ప్రేమంటే..** గౌరి : **కాంత,** గాయత్రి : **శిసు2023,** త్రివేణి : **కొదమసింహం,** నీలిమ : **ఆవారా,** తరంగిణి : **హ్యాపీ జర్నీ, మఫ్టీ పోలీస్,** తేజశ్విని : **పాంచ్ మినార్,** ఎస్వీ సినిమా : **రాజు వెడ్స్ రాంబాయి,** శాంతి : **12ఏ రైల్వేకాలనీ,** సుధా : **ది గర్ల్‌ఫ్రెండ్.**

కాయగూరల ధరలు

అరవిందనగర్ (అనంతపురం నగరం పాతూరు మార్కెట్లో ధరలు కిలో రూ.లలో) టమాటాలు 40, రెండోరకం 20, ఉల్లిగడ్డలు 25, రెండోరకం 15, బంగాళాదుంపలు 40, మిరపకాయలు50, బెండకాయలు25, వంకాయలు40, ముల్లంగి35, బీట్‌రూట్40, బీరకాయలు40, కాకరకాయలు40, చౌళకాయలు40, క్యాప్సికం40, చిక్కుడుకాయలు40, క్యారెట్60, బీన్స్ 50

(c) eenadu

కడప.. హాకీ విజేత

తిరుపతి జిల్లా చంద్రగిరిలో నిర్వహించిన అండర్-14 రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో వైఎస్సార్ కడప బాల, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. విశాఖపట్నం బాలుర, అనంతపురం బాలికల జట్టు గెలుపొంది ట్రోఫీలు అందుకున్నాయి. అనంతరం వివిధ జిల్లాల తరఫున సత్తా చాటిన వారిని రాష్ట్రస్థాయి జట్టుకు నిర్వాహకులు ఎంపిక చేశారు. - న్యూస్‌టుడే, చంద్రగిరి

పాఠశాల పక్కన గుంత నక్కలు

ఎవరు తీసిన గోతిలో వారే పడతారంటారు. గాలివీడులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనాల వద్ద పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. ఇక్కడి గుత్తేదారులు గుట్టలో లభించే ఎర్రమట్టిపై అక్రమార్కుల కన్ను పడింది. యంత్రాలతో తవ్వి తరలించి జేబులు నింపుకొన్నారు. ఇష్టారీతిన తీసిన గోతులతో పాఠశాల భవనాలకు ప్రమాదం తలెత్తుతోంది. - న్యూస్‌టుడే, గాలివీడు

తెదేపా నేతలతో కలిసి మొక్క నాటుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

తిన్నదెవరో తేలుద్దాం.. సవాల్‌కు సిద్ధమా!

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రజల భూములు దోచుకునే సంస్కృతి వైకాపా నాయకులదేనని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విమర్శించారు. రాయచోటి పట్టణంలోని ఏపీ గార్డెన్‌లో ఆయన సోమవారం నీటి పథకం బోరును ప్రారంభించారు. మొక్క నాటి నీరు పోశారు. అనంతరం మాట్లాడుతూ.. గత పదిహేళ్లలో వైకాపా నేతలు చేయలేని అభివృద్ధిని కేవలం పదిహేను నెలల్లో చేసి చూపిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు. జగనన్న కాలనీల పేరుతో తక్కువకు భూములు కొని ప్రభుత్వానికి ఎక్కువ ధరలకు అమ్ముకున్న సంస్కృతి వైకాపా నాయకులదని ఎద్దేవా చేశారు. జగనన్న కాలనీల్లో అవినీతిని విచారించేందుకు తాను సిద్ధమని.. సవాల్‌ను స్వీకరించే వైకాపా నాయకులు ఉన్నారా అని ప్రశ్నించారు. ఫ్రీహోల్డ్ పేరుతో వైకాపా బడా నాయకులు, అనుచరులు జిల్లాలో 30 వేల ఎకరాల భూములను కొట్టేశారని విమర్శించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు శ్రీనివాసులురెడ్డి, రంజిత్ రాయల తదితరులు పాల్గొన్నారు.

నకిలీ.. జనార్దన్ రావే అసలు మకిలీ

- అతను చెబితేనే అన్నీ అమలు చేశాం
- ఎక్సైజ్ పోలీసులకు నిందితుల వాంగ్మూలం

ఈనాడు, కడప, న్యూస్‌టుడే- ములకలచెరువు, మదనపల్లె నేరవార్తలు: జనార్దన్‌రావు సూచన మేరకే ములకలచెరువులో నకిలీ మద్యం తయారు చేసినట్లు ఇబ్రహీంపట్నానికి చెందిన కట్టా రాజు తెలిపారు. ఈ కేసులో కీలక నిందితుడైన ఏ2 కట్టా రాజుతో పాటు కొడాలి శ్రీనివాస్‌రావు(ఏ12), బెంగళూరుకు చెందిన బాలాజీ(ఏ15), సుదర్శన్(ఏ20), పీటీఎం మండలానికి చెందిన చైతన్యబాబు(ఏ22), తెదేపా నుంచి సస్పెండ్ అయిన జయచంద్రారెడ్డి ఎస్కార్ట్ వాహనం డ్రైవర్ ములకలచెరువుకు చెందిన అశ్రఫ్(ఏ21)లను ఎక్సైజ్ పోలీసులు సోమవారం కస్టడీలోకి తీసుకుని విచారించారు. మదనపల్లె సబ్‌జైలు నుంచి తొలుత ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయానికి తీసుకెళ్లారు. కడప ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి నిందితులను వేర్వేరుగా విచారించారు.

సీసాల్లో నింపేందుకు ప్రత్యేక శిక్షణ

నకిలీ మద్యం తయారీ కేసులో ప్రధాన నిందితుడైన అద్దెపల్లి జనార్దన్‌రావు అనుచరుడైన కట్టా రాజును విచారించారు. పథకం ప్రకారం ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ ఫార్ములా అమలు చేశామన్నారు. కేరళకు చెందిన జినేష్ ద్వారా బెంగళూరుకి స్పిరిట్ తెచ్చి అక్కడి నుంచి బాలాజీతో ఇబ్రహీంపట్నం, ములకలచెరువుకు సరఫరా చేయించినట్లు అంగీకరించారు. గోవాలో బాలాజీకి మద్యం తయారీ ఫార్ములా తెలిసి ఉండడంతో అతని ద్వారా ఇక్కడా అమలు చేశామన్నారు. సీసాలకు నకిలీ మద్యం నింపడానికి ప్రత్యేకంగా కొందరికి శిక్షణ ఇచ్చినట్లు వివరించారు.

వైద్య పరీక్షల అనంతరం నిందితులను మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో కస్టడీకి తీసుకెళ్తున్న ఎక్సైజ్ పోలీసులు

● **నేడు ములకలచెరువుకు సిట్ అధికారులు:** నకిలీ మద్యం తయారీపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ అధికారులు మంగళవారం ములకలచెరువు రానున్నారు. మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకుని ఆరుగురు నిందితులను మూడు రోజుల పాటు విచారించనున్నారు.

పెద్దలు చెప్పినట్లు చేశా

నకిలీ మద్యాన్ని గొలుసు దుకాణాలకు సరఫరా చేశామని, ఈ విషయంలో స్థానిక నేతలు కొందరు సహకారం అందించారని నిందితులు వివరించారు. తండ్రీ, కుమారులైన బాలాజీ, సుదర్శన్‌లను విచారించగా స్పిరిట్ సరఫరాతో పాటు లావాదేవీల విషయాలను బయట పెట్టారు. జినేష్ తెచ్చిన స్పిరిట్‌ను బాలాజీ తన వాహనంలో ఇబ్రహీంపట్నం, ములకలచెరువుకు తరలించినట్లు తెలిపారు. చైతన్యబాబు పీటీఎం మండలంలోని ఆంధ్రా వైన్స్‌లో మేనేజర్‌గా పని చేస్తూ లావాదేవీలు సాగించినట్లు ఒప్పుకొన్నారు. అశ్రఫ్.. జయచంద్రారెడ్డి ఎస్కార్ట్ వాహనం తీసుకెళ్లి తయారు చేసిన నకిలీ మద్యాన్ని గొలుసు దుకాణాలకు తరలించానని, ఇవన్నీ పెద్దలు చెప్పినట్లు చేశానని వివరించారు. కట్టా రాజు తయారీ కేంద్రానికి ఇన్‌ఛార్జిగా వ్యవహరించాడని, లావాదేవీలన్నీ డైరీలో నమోదు చేసినట్లు విచారణలో తేలింది.

వెలిగల్లు జలాశయం గరిష్ఠ నీటి సామర్థ్యం 4.64 టీఎంసీలుండగా సోమవారం నాటికి 4.17కు చేరింది. ఇంకా ఎగువ నుంచి 374 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. కుడి కాలువకు 110, రాయచోటి, గాలివీడుకు మంచినీటి పథకాలకు ప్రతి రోజూ ఆరు క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టును కలెక్టర్ నిశాంత్ కుమార్, ఈఈ భరత్ కుమార్ పరిశీలించారు. జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యానికి చేరువలో ఉండటంతో భద్రత దృష్ట్యా రేయింబవళ్లు సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేశారు. నీటి మట్టం పెరిగితే స్పిల్‌వే గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తామని, పాపఘ్ని నదీ పరివాహక వాసులు అప్రమత్తంగా ఉండాలని ఇంజినీర్లు హెచ్చరించారు. - న్యూస్‌టుడే, గాలివీడు

రాజు మంచి బాలుడు



'నేను కమలాపురంలో చదివే సమయంలో హెచ్.అయ్యంగార్ అనే ఉపాధ్యాయుడు ఉండేవారు. ఆయనంటే విద్యార్థులంతా భయపడేవారు. వస్తున్నారంటే మేమందరం మరో మార్గంలో వెళ్లేవాళ్లం. ఓ రోజు ఆయన నన్ను దగ్గర తీసుకుని రాజూ అని పిలిచారు. ఆ తర్వాత ఎందుకు నన్ను చూసి వేరే దారిలో వెళ్తున్నావని అడిగారు. నేను మిమ్మల్ని చూడలేదు సార్.. నోట్ బుక్ తెచ్చుకునేందుకు వెళ్లానంటూ సత్యం చెప్పాను. కాదు నువ్వు అబద్ధం చెబుతున్నావంటూ కొట్టేందుకు కర్ర ఎత్తారు. మీకు కొట్టాలని ఆశ ఉంటే కొట్టండి సార్ అంటూ నేను ధైర్యంగా చెయ్యి చాచాను. దాంతో ఆయన కర్ర కింద పెట్టేశారు. తప్పు చేయని నిన్ను శిక్షించను అన్నారు. గుడ్ బాయ్ అని మెచ్చుకున్నారు. ఆ తర్వాత నిర్వహించిన పరీక్షల్లో మంచిగా రాసినందుకు వెరీ వెరీ గుడ్ అని రాశారు. ఓ రోజు హెచ్ఎం నన్ను పిలిచి ప్రార్థనకు పాట పాడమన్నారు. సర్వమతాల పేర్లతో పాడటంతో అందరూ ఆశ్చర్యపోయారు. నాటి నుంచీ సర్వమత సమ్మతం అని బోధిస్తూ వచ్చాను'

- ఇవీ పుట్టపర్తిలో చేసిన ఓ ప్రసంగంలో సత్య సాయిబాబా మాటలు. కమలాపురంలో తాను చదివిన పాఠశాల.. అక్కడ ఉపాధ్యాయులు తనపై చూపిన అభిమానాన్ని ఆయన గుర్తు చేసుకున్నసందర్భంలోని ఓ వీడియో విస్తృతంగా ప్రచారమైంది. - కమలాపురం, న్యూస్‌టుడే

కమలాపురంలో సత్య సాయిబాబా విద్యాభ్యాసం

సత్య సాయిబాబా చిన్ననాటి పేరు రత్నాకరం సత్యనారాయణరాజు. ఆయన కడప జిల్లా కమలాపురం పట్టణంలోని బీఎం పాఠశాలలో ఫస్ట్ ఫారం చదివారు. పుట్టపర్తికి చెందిన సత్యనారాయణరాజు సోదరుడైన శేషమరాజు ఈ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించారు. దీంతో తమ్ముడైన సత్యనారాయణరాజును ఆయన తమతోపాటే తెచ్చి పాఠశాలలో ఫస్ట్ ఫారంలో చేర్పించారు. తర్వాత ఆయన తన స్వగ్రామానికి బదిలీ కావడంతో రాజు కూడా అక్కడికే వెళ్లి విద్యాభ్యాసం కొనసాగించారు. ఇప్పటికీ సత్య సాయిబాబా చదివినట్లు గుర్తుగా బదిలీ సర్టిఫికెట్(టీసీ)ని కమలాపురం పాఠశాలలో భద్రంగా ఉంచారు.

సమావేశ మందిరంలో చిత్రపటం వద్ద ప్రార్థనలు చేస్తున్న సాయిబాబా సేవా సమితి సభ్యులు, హెచ్ఎం, భక్తులు

● **గుర్తుగా సామాజిక సేవలు:** సత్యనారాయణరాజు పుట్టపర్తిలో భగవాన్ సత్య సాయిబాబాగా అవతరించిన తర్వాత కూడా తాను చదువుకున్న కమలాపురం పాఠశాలను మర్చిపోలేదు. ట్రస్ట్ తరఫున అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. పేరును కూడా భగవాన్ శ్రీ సత్యసాయి పాఠశాలగా మార్చారు. సేవా సమితి సభ్యులు, భక్తులు రూ.లక్షలు వెచ్చించి సమావేశ హాల్ నిర్మించారు. అందులో బాబా చిత్రపటాలు ఏర్పాటు చేశారు. ఏటా జన్మదినాన్ని ఘనంగా నిర్వహించేవారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సత్య సాయిబాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్న వేళ.. ఈ విషయాలను స్థానికులు స్మరించుకుంటున్నారు.

సాయిబాబా బదిలీ సర్టిఫికెట్(టీసీ)

బెంగళూరులో విద్యార్థిని దారుణ హత్య

రామసముద్రం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని ఆచార్య కళాశాలలో బీఫార్మసీ డిగ్రీ నాలుగో సంవత్సరం చదువుతున్న దేవశ్రీ(21) అనే జిల్లా విద్యార్థిని దారుణ హత్యకు గురైంది. దేవశ్రీ రామసముద్రం మండలం బిక్కింవారిపల్లెకు చెందిన రెడ్డెప్ప, జగదాంబ దంపతుల కుమార్తె. కళాశాలలో చదువుతూ అక్కడే ఓ అద్దె గదిలో ఉంటోంది. ఆమెకు సన్నిహితుడైన చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం పెద్దకొండామర్రికి చెందిన ప్రేమవర్ధన్ అనే యువకుడు తలపై మోది హత్య చేసినట్లు మాదనాయకనహళ్లి పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. నిందితుడు పరారీలో ఉండటంతో గాలింపు తీవ్రం చేశారు. చదువు పూర్తి చేసుకుని పట్టాతో ఇంటికి వస్తుందన్న కుమార్తె హత్యకు గురికావడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేక గుండెలవిసేలా రోదిస్తున్నారు.

దేవశ్రీ (పాత చిత్రం)

ప్రేమవర్ధన్

రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇష్టారాజ్యం

అధికారులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీస్తున్న డీజీఐ రామలక్ష్మీ పట్నాయక్

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అక్రమాలకు నిలయంగా మారిందని, కొందరు దస్తావేజు లేఖరులే దళారులుగా మారి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారంటూ ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లాయి. స్పందించిన సీఎం కార్యాలయం విచారణకు ఆదేశించింది. ఈ మేరకు రిజిస్ట్రేషన్ల శాఖ(కడప) డీఐజీ పి.రామలక్ష్మీ పట్నాయక్ సోమవారం బి.కొత్తకోట కార్యాలయానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కార్యాలయంలో సాగుతున్న అక్రమాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మార్కెట్ విలువలో ఒక శాతాన్ని లంచంగా ఇవ్వకుంటే రిజిస్ట్రేషన్‌లు చేయకుండా తిప్పుకొంటున్నారని తెలిపారు. డాక్యుమెంట్ రైటర్లతో పాటు ప్రైవేట్ వ్యక్తులు కార్యాలయంలో చక్రం తిప్పుతున్నారని చెప్పారు. వివరాలను నోటీసు బోర్డులో ప్రదర్శించడం లేదని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ.. బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లుతో పాటు సిబ్బంది స్లాట్ బుకింగ్‌ను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇతర ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారిస్తామని చెప్పారు. కార్యాలయానికి సంబంధించిన సీసీటీవీ పుటేజీలతో పాటు రికార్డులను పరిశీలిస్తామని తెలిపారు. స్టాంపులను అధిక ధరకు విక్రయిస్తున్న వెండర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమగ్రంగా విచారణ చేసి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.

రైతులతో కలిసి కరపత్రాలను చూపుతున్న పీలేరు ఏడీఏ రమణారావు, సిబ్బంది

రైతన్నల కోసం కదిలిన యంత్రాంగం

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: వ్యవసాయంలో రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని, వ్యవసాయం లాభసాటిగా సాగాలని 'రైతన్నా - మీకోసం' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం వారోత్సవాలను సోమవారం ప్రారంభించింది. ఈ నెల 29వ తేదీ వరకు నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళికను జిల్లా వ్యవసాయ శాఖ రూపొందించింది.

● **యాప్‌లో వివరాల నమోదు:** ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొంటారు. రైతు ఇంటి వద్దకు వెళ్లిన అధికారులు ఎంత భూమి ఉంది.. సాగు విస్తీర్ణం ఎంత.. ఏ పంటలు సాగు చేస్తున్నారు.. ఆదాయం, చేస్తున్న వ్యయం.. సాగు నీటి ఆధారం కాలువలా, చెరువులా, ప్రాజెక్టులా.. అనే వివరాలు తెలుసుకుంటారు. సాగులో ప్రయోజనాలు, చేకూరే ప్రయోజనాలు, సాగు ప్రోత్సాహకాలు చేరుతున్నాయా, అవసరమైన రాయితీలు తదితర వివరాలను సేకరిస్తారు. ఏపీ ఏఐఎంఎస్ అనే యాప్‌లో నమోదు చేస్తున్నారు.

● **డిసెంబరు 3న సమావేశాలు:** వారోత్సవాలు ముగిసిన తర్వాత డిసెంబరు 3న రైతులతో సమావేశం నిర్వహించి, ప్రస్తుతం రబీ, రానున్న ఖరీఫ్, రబీ సీజన్లకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తారు. కార్యక్రమాలపై జిల్లా వ్యవసాయ అధికారి శివ నారాయణ మాట్లాడుతూ.. రైతన్నా - మీ కోసం వారోత్సవాలను పక్కాగా అమలు చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి రైతుల వివరాలు సేకరిస్తామని తెలిపారు.

ఆడబోతే ప్రయాణం భారం

రైలు, బస్సుల్లో లభించని రాయితీ

కడప క్రీడలు, న్యూస్‌టుడే: క్రీడలు ఐక్యతకు నిదర్శనాలు.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతుంటాయి. ఇతర ప్రాంతాలకు వెళ్లి ఆడేందుకు 75 శాతం ప్రయాణ రాయితీని అందించేవి. కరోనా సమయంలో వీటిని రద్దు చేశాయి. కరోనా తర్వాత కూడా పునరుద్ధరించలేదు. దీంతో క్రీడాకారులపై ఆర్థిక భారం పడుతోంది. స్కూల్ గేమ్స్‌లో ఆడేవారికి రాష్ట్ర ప్రభుత్వమే ఆ మొత్తాన్ని భరిస్తుండగా.. అసోసియేషన్ క్రీడలకు వెళ్లే వారికి మాత్రం ఆర్థిక భారం తప్పడం లేదు. దీంతో చాలా మంది పేద క్రీడాకారులు దూర ప్రాంతాల్లో నిర్వహించే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ముఖం చాటేస్తున్నారు.

ఖోఖో క్రీడలో సత్తా చాటుతున్న క్రీడాకారులు

● **పోటీలపై ప్రభావం:** ఉమ్మడి కడప జిల్లాలో సుమారు నాలుగు వేల మందికి పైగా క్రీడాకారులు ఏటా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు వెళుతుంటారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిని రైలు జనరల్ బోగీల్లో పంపుతున్నారు. కిక్కిరిసిన ప్రయాణికుల మధ్య తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. దూర ప్రాంతాలకు ప్రయాణం చేసి వెంటనే పోటీల్లో పాల్గొనడం ఆటతీరుపై ప్రభావం చూపుతోంది. జాతీయ స్థాయి పోటీలకు సంబంధించి ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు స్లీపర్ తరగతిలో ప్రయాణించొచ్చు. దగ్గర ప్రాంతాలకు వెళ్లేందుకు మహిళా క్రీడాకారిణిలకు స్త్రీశక్తి పథకం ఉపయోగపడుతున్నా.. పురుషులకు వ్యయం తప్పడం లేదు. రైళ్లల్లో కూడా గతంలో వలే 75 శాతం ప్రయాణ రాయితీని కొనసాగిస్తే క్రీడాకారులను కొంతైనా ఆర్థిక భారం తగ్గుతుంది.

● **పునరుద్ధరణతో ప్రోత్సాహం:** కొన్నిచోట్ల క్రీడా సంఘాలే దాతల ద్వారా సేకరించి క్రీడా దుస్తులు, ఛార్జీలు అందిస్తున్నాయి. మరికొన్ని ఆర్థిక ఇబ్బందులతో క్రీడాకారులను పోటీలకు పంపించలేకపోతున్నాయి. ప్రయాణ రాయితీని పునరుద్ధరిస్తే క్రీడాకారులకు ఎంతో మేలు. క్రీడాభివృద్ధికి కూడా ఎంతో ప్రోత్సాహం అందించినట్లు అవుతుంది.
- శివశంకర్‌రెడ్డి, ఏపీ పీఈటీస్-ఎస్ఏ పీఈ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

వనంలో ఉన్నా.. వీడినా మరణమేనా!

- మదనపల్లె పట్టణం పరిసర ప్రాంతాల్లోని మాదినికొండ, కొత్త యిండ్లు, చెంబకూరు రోడ్డు, అంకిశెట్టిపల్లెలో నెమళ్ల సంతతి ఎక్కువ. వీటిలో కొన్ని వేటగాళ్ల ఉచ్చుకు బలవుతుంటే.. మరికొన్ని ప్రమాదాలకు గురై ప్రాణాలు విడుస్తున్నాయి. మూడు నెలల క్రితం పట్టణ శివారు టీచర్స్ కాలనీ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి ఓ నెమలి చనిపోయింది.
- నిమ్మనపల్లె రోడ్డు బోడిమలదిన్నె అడవిలో ఒకేసారి పది నెమళ్లను కొందరు వేటాడారు.
- ములకలచెరువు, పీటీఎం మండలాల్లో ఒకే సంవత్సరంలో సుమారు 25 జింకలు మృత్యువాత పడ్డాయి. ఆహారం, నీటి కోసం అడవిని వదిలి బయటకు వచ్చి రోడ్డు ప్రమాదాల్లో మరికొన్ని మృతి చెందుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో ఇంకొన్ని కుక్కల దాడిలో గాయపడుతున్నాయి.
- పీటీఎం - ములకలచెరువు రోడ్డులో కృష్ణజింకలు రోడ్డు దాటుతూ పదుల సంఖ్యలో ఏటా మృత్యువాత పడుతున్నాయి.
- నిమ్మనపల్లె మండలం నూరుకుప్పలకొండ సమీపంలోని అటవీ ప్రాంతంలో వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుని అడవి పందులు మరణించాయి.
- మదనపల్లె అటవీ శాఖ పరిధిలో వేటగాళ్ల బారిన పడి నాలుగు చిరుతలు మృతి చెందాయి. గత ఏప్రిల్‌లో మదనపల్లె మండలం పొన్నూటిపాళెం సమీపంలోని అటవీ ప్రాంతంలో వేటగాళ్లు పన్నిన ఉచ్చులో చిక్కి ఓ చిరుత ప్రాణం విడిచింది.

కుక్కల దాడిలో గాయపడిన జింకకు వైద్యచికిత్సలు అందిస్తున్న వైద్యులు (పాత చిత్రం)

పొన్నూటిపాళెం అడవి సమీపంలో ఉచ్చులో చిక్కుకుని మృతి చెందిన చిరుత (పాత చిత్రం)

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: వన్యప్రాణులకు క్రమేపీ రక్షణ కరవవుతోంది. అడవిలో వేటగాళ్లకు చిక్కి ప్రాణాలు విడుస్తున్నాయి. వనాన్ని వీడి జనంలోకి వస్తే ప్రమాదాలకు లోనై మృత్యువాత పడుతున్నాయి. ఈ తరహా ఉదంతాలు మదనపల్లె అటవీ శాఖ పరిధిలో ఇటీవల కాలంలో ఎక్కువ చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిధిలో మొత్తం 50 వేల హెక్టార్ల అటవీ ప్రాంతం ఉంది. ఇందులో చిరుతలు, జింకలు, కృష్ణజింకలు, కణితులు, ఎలుగుబంట్లు, దుప్పులు, అడవి పందులు, నెమళ్లతో పాటు అనేక రకాల ప్రాణులు నివసిస్తున్నాయి. వీటి ప్రాణాలకు కొందరి చేష్టలు, అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో ముప్పు తలెత్తుతోంది. సమస్యపై మదనపల్లె అటవీ శాఖ రేంజర్ ప్రసాదరావు మాట్లాడుతూ.. జంతువులు రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా అవి సంచరించే ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించామన్నారు. వేసవిలో నీటిని అందించడానికి సాసర్‌పిట్స్ ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. అడవి జంతువుల సంరక్షణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఏఐ చెప్పేస్తుంది.. గుట్టు విప్పేస్తుంది

లక్కిరెడ్డిపల్లె, వీరబల్లి, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో పొరపాట్లు, అవకతవకలకు ఆస్కారం లేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతతో కూడిన హాస్టల్ పర్మినెంట్ ట్రాకింగ్ సిస్టం(హెచ్‌పీటీఎస్) అనే ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌లో ప్రతి చిన్న పని ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇటీవల జిల్లాలోని అన్ని వసతి గృహాల సంక్షేమ అధికారుల చరవాణుల్లో ఈ యాప్‌ను అధికారులు ఇన్‌స్టాల్ చేసి పని తీరుపై అవగాహన కల్పించారు. వసతి గృహాలను గాడిన పెట్టేందుకు ఈ యాప్ దోహద పడుతుందని పలువురు భావిస్తున్నారు.

● **భోజనం చాలుతుందో లేదో తెలుపుతుంది:** ● యాప్ ద్వారా రోజూ చేపట్టే పనులతో పాటు వారాంతం, నెలవారీ కార్యక్రమాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ● వసతి గృహాల్లో కంచాలు కడగడం నుంచి పిల్లల హాజరు, భోజనాలు వండిన పదార్థాలు, ఆవరణ, మరుగుదొడ్లు, తాగునీరు, గదులు శుభ్రత అన్నీ ఎప్పటికప్పుడు నిక్షిప్తం చేసేలా ఆప్షన్లు పొందుపరిచారు. ● ప్రధానంగా భోజనాల సమయంలో ఫొటోలు తీస్తే అప్పటికే నమోదైన విద్యార్థుల సంఖ్యకు సరిపోతుందా.. లేదా అనే విషయాన్ని ఏఐ ద్వారా తెలుసుకోవచ్చు. ఆహార పదార్థాలు నాణ్యతగా ఉన్నదీ? లేనిదీ? తెలుసుకునే వెసులుబాటు ఉంది. పొరపాటు దొర్లితే సంబంధిత వార్డెన్లకు యాప్‌లోనే హెచ్చరికలు వెళ్తాయి. అవకతవకలకు పాల్పడితే సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటారు.

ఇక పక్కాగా వసతి గృహాల సమాచారం

జిల్లాలో ఎస్సీ, బీసీ వసతి గృహాలు	98
అందులోని విద్యార్థుల సంఖ్య	9,050

రైతేరాజు 6లో



(c) eenadu

పొదుగునకు అపరిశుభ్రతే శత్రువు

ఆవుకు సోకిన పొదుగు వ్యాధి

చిట్కా

పీలేరు, న్యూస్‌టుడే: పశువుల ఆరోగ్య సమస్యల్లో ప్రధానమైనది పొదుగు వాపు వ్యాధి. ఇది సూక్ష్మ జీవుల కారణంతో పాటు పోషకాల లోపంతో కలుగుతుందని పీలేరు మండల పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్ రెడ్డి చెప్పారు. పాలు పితికే వ్యక్తి పరిశుభ్రతను పాటించకపోవడం వ్యాధికి ప్రేరకాలని చెప్పారు. పశువులను వీలయినంత పొడిగా, శుభ్రంగా ఉంచాలి. పాడి పశువులకు ఇదే నియమం పాటించాలి. పాలు పితికే ముందు పొదుగును నీళ్లతో కడిగి శుభ్రమైన వస్త్రంతో తుడవాలి. నివారణకు 'డ్రైకో థెరఫీ'ని అమలు చేయాలని సూచించారు.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

ప్రశ్న: మినుములో తామర పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తెలుపగలరు.?

- రెడ్డిప్రసాద్, రైతు నాగిరెడ్డిపల్లి

సమాధానం: ఎకరాకు 20 నీలిరంగు జిగురు అట్టలను ఉంచితే పురుగు ఉనికి, ఉద్ధృతిని అంచనా వేసుకోవచ్చు. ఎసిఫేట్-1 గ్రాము లేదా ఫిప్రోనిల్ 1.5 మి.లీ.లేక థమోమిథాక్సామ్ 0.2 గ్రా.లు ఇందులో ఏదైనా ఒక మందు తీసుకుని ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల తామర పురుగును నివారించవచ్చు. - నాగలక్ష్మి, ఏవో రాజంపేట

- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

చీడలను నివారిస్తే జామలో చేసుకోవచ్చు లాభాలు

కడప, న్యూస్‌టుడే: జామ ఫలాల వినియోగం పెరగడంతో మార్కెట్లో మంచి గిరాకీ లభిస్తోంది. మరోవైపు చీడల ఉద్ధృతి పంటను దెబ్బతీస్తోంది. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే జామ పంట లాభదాయకమవుతుందని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.మానస సూచించారు.

పండు ఈగ

కాయపై పండు ఈగలు

కాయలు పక్వానికి రాగానే పండు ఈగ ఆశిస్తుంది. ఇది సోకిన కాయలను తోటల్లోనే ఏరి నాశనం చేయాలి. పిందె దశ దాటిన నుంచి మిథైల్ యూజినాల్ ఎరలను ఎకరాకు 6-8 చొప్పున ఏర్పాటు చేయాలి. నెలకొకసారి పంట కాలంలో మార్పు చేసే ఈగల బెడదను తగ్గించవచ్చు. తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చు. మిథైల్ యూజినాల్ 2 మి.లీ+మలాథియాన్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి ఈ ద్రావణంలో నానబెట్టిన చిన్న చిన్న ప్లైవుడ్ ముక్కలను ప్లాస్టిక్ సీసాల్లో ఉంచి తోటల్లో అమర్చితే ఈగలు చెట్లకు వ్యాప్తి చెందవు. ప్లైవుడ్ ముక్కలను సీసాలో దారంతో వేలాడదీసి సీసా అడుగున పులిసిన గంజిని పెడితే పండు ఈగతో జరిగే నష్టాన్ని తగ్గించవచ్చు.

తెల్లసుడి దోమ

చెట్టుకు అల్లుకున్న బూజు

ఆకులపై తెల్లని దూది లాంటి మెత్తని పదార్థంతో కప్పబడుతుంది. రసం పీల్చడంతో ఆకులు ఎర్రగా మారి ముడతలు పడతాయి. రాత్రి పూట జిగురు పూసిన పసుపు రంగు డబ్బాలను తెల్లదోమ ఆశించిన చెట్ల వద్ద ఉంచాలి. ప్రథమ దశలో అయితే ఆశించిన కొమ్మలను కత్తిరించాలి. వేపనూనె 5 మి.లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే వీటి తీవ్రతను అదుపు చేయవచ్చు.

కాండం తొలిచే పురుగు

ఈ రకం పురుగు చెట్టు మొదళ్లలోకి చొచ్చుకొని పోయి విసర్జించిన పదార్థం రంధ్రాల్లో నిండి ఉంటుంది. వాటిని శుభ్రపరిచి ఇనుప చువ్వ సహాయంతో పురుగును చంపి తర్వాత రంధ్రాల్లో పెట్రోలు లేదా కిరోసిన్‌లో తడపాలి. ఆ తరువాత దూదిని ఉంచి రంధ్రాలను తడి రేగడి మట్టితో పూడ్చాలి.

కాయ తొలుచు పురుగు

జామలో రెండు రకాల కాయ తొలుచు పురుగులు ఆశించి నష్టాన్ని కలుగజేస్తాయి. రెక్కల పురుగులు గుడ్లను పూత, పిందెలపై పెడతాయి. లార్వాలు కాయ లోపలికి తొలుచుకొనిపోయి గుజ్జును తింటాయి. వీటి నివారణకు నివారణకు పూత, మొగ్గ దశలోనే ఉన్నప్పుడు 5 శాతం వేపగింజల కషాయం లేదా వేపనూనె 5 మి.లీ లీటరు నీటికి లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఆశించిన కాయలను ఏరి నాశనం చేయాలి.

రైతేరాజు

మెరిసెనమ్మా విజయమ్మ

దిగుబడులను చూపుతున్న మహిళా రైతు జయమ్మ

స్ఫూర్తి

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటి మండలం యండపల్లెకు చెందిన మహిళా రైతు జయమ్మ తనకున్న 1.50 ఎకరాల పొలంలో గత ఖరీఫ్‌లో వర్షాధారంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించి వేరుసెనగ పంటను సాగు చేశారు. తొలుత లోతు దుక్కులు దున్ని పంటకు అవసరమైన పశువుల ఎరువులు వేశారు. విత్తనం, దున్నకాలు, ఎరువులు కలిపి రూ.20 వేలలోపు పెట్టుబడి ఖర్చులు వచ్చాయి. 1.50 ఎకరా భూమిలోనే వేరుసెనగ ప్రధాన పంటగా వేయగా అనుబంధ పంటలుగా కంది, అలసంద, పెసలు, ఆముదం వంటి రకాలను వేశారు. పూత, పిందె దశలో పంటను ఆశించిన తెగుళ్ల నివారణకు రసాయనిక మందులకు బదులు పంట వద్దనే తయారు చేసిన కషాయాలను పిచికారీ చేసి తెగుళ్లను నివారించారు. పంటకు సరిపడా వర్షం కురవడంతో వేరుసెనగ చెట్టుకు 20-50 కాయలు వరకు దిగుబడి ఇచ్చింది. పశువుల ఎరువు వాడకంతో కాయ నాణ్యతగా రావడంతో ఔటన్ బాగుందని ప్రకృతి వ్యవసాయ అధికారులు గుర్తించారు. మార్కెట్‌లో ప్రస్తుతం 42 కిలోల వేరుసెనగ బస్తా రూ.3,300 ధర పలుకుతోంది. ఈ లెక్కన జయమ్మకు రూ.80 వేల వరకు ఆదాయం సమకూరింది.

సమస్యలు అనేకం.. పరిష్కారానికి ఎందుకు ఆలస్యం!

అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రజలు సమస్యల పరిష్కారానికి కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. క్షేత్ర, మండల స్థాయిలో పరిష్కారం లభించకపోవడంతో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు వందలాది మంది ప్రజలు తరలి వస్తున్నారు. సమస్యలు ఉన్నప్పుడు వాటి పరిష్కారంపై ఎందుకు దృష్టి సారించలేకపోతున్నారని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ప్రశ్నించారు. స్థానిక కలెక్టరేట్‌లో బాధితుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు.. అధికారులు తరచూ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, ఏడీ భరత్‌కుమార్, జీడబ్ల్యుఎస్‌వో లక్ష్మీపతి, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మచ్చుకు కొన్ని వినతులు

★ వీరబల్లి మండలం కావలిగడ్డకు చెందిన బి.రాజా సర్వే నెంబరు 103లో గ్రామ కంఠం భూమి ఉందని పూర్వీకుల నుంచి మా కుటుంబ ఆధీనంలోనే ఉందని ఇటీవల కొందరు ఆ భూమికి డి.ఫారం తెప్పించుకుని ఇళ్ల పట్టాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆ భూమిని ఇతరులకు ఇవ్వకుండా తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

★ కలకడ మండలం గంగిరెడ్డిగారిపల్లె హరిజనవాడకు చెందిన జయమ్మ అనే మహిళ రైతు తన పేరిట భూములు ఉన్నప్పటికీ అన్నదాత సుఖీభవ నిధులు జమ కావడం లేదని కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని తనకు న్యాయం చేసి అన్నదాత సుఖీభవ డబ్బులు జమ అయ్యేలా చూడాలని కోరారు.

★ ములకలచెరువు మండలం నాయనచెరువుపల్లి పంచాయతీలోని ఉంగరాపల్లికు చెందిన బి.మంగమ్మ గతంలో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో 30 ఏళ్ల కిందట ఇళ్లు నిర్మించుకున్నామని ఇటీవల కొందరు ఇంటికి అడ్డంగా అక్రమంగా అడ్డంగా గోడ కట్టి ఇంటికి దారి లేకుండా చేశారని కలెక్టర్‌కు అర్జీ అందజేశారు.

★ కావలిగడ్డకు చెందిన నాగమ్మ అనే మహిళ తన భర్త 2023లో మరణించాడని తాను నిరుపేదనని కుటుంబ పోషణ నిమిత్తం వితంతు పింఛను మంజూరు చేయాలని కోరారు.

అభ్యసన సామర్థ్యాల మెరుగుకు బేస్‌లైన్ సర్వే

రాయచోటి, న్యూస్‌టుడే: విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను మెరుగు పరచడానికి ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసి బేస్‌లైన్ సర్వే నిర్వహిస్తున్నామని డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.నరసింహారెడ్డి తెలిపారు. అబ్బవరం ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న సర్వేని సోమవారం ఆయన పరిశీలించారు. కడప, అన్నమయ్య జిల్లాలలోని 3,689 ప్రాథమిక పాఠశాలల్లో 1,11,587 మంది విద్యార్థులకు యాప్ ద్వారా బేస్‌లైన్ సర్వే కొనసాగుతుందన్నారు. సర్వే డైట్ విద్యార్థులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లు పాల్గొంటున్నారన్నారు. జిల్లా స్థాయిలో సమగ్ర వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఫలితంగా విద్యార్థి ఏ విషయంలో బలహీనత కలిగి ఉన్నాడో.. ఏ పాఠశాలలో వెనకబడిన వారి సంఖ్య ఎక్కువగా ఉందో తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఛాత్రోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నరసింహారెడ్డి

అన్నదాతల సంక్షేమానికే రైతన్నా మీకోసం

బలిజపల్లెలో రైతులకు కరపత్రాలు పంచి మాట్లాడుతున్న డీవో శివనారాయణ, డీపీఎం వెంకటమోహన్

చిన్నమండెం, న్యూస్‌టుడే: రైతు సంక్షేమం కోసమే రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు డీవో శివనారాయణ అన్నారు. చిన్నమండెం బలిజపల్లెలో రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్, ఎంపీడీవో ఆదినారాయణ, ఏవో గీతతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు కరపత్రాలు పంపిణీ చేసి ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. వారం రోజుల పాటు అధికారుల బృందాలు ప్రతి రైతు ఇంటిని సందర్శించి సర్వే చేస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతన్నా మీకోసం కార్యక్రమాలు సాగాయి. కార్యక్రమంలో ఏపీఎం నవంత్, సచివాలయాలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పనులు చేయకుండానే బొక్కేశారు

కాట్నగల్లు సచివాలయం వద్ద గ్రామస్థుల ధర్నా

గ్రామస్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో ప్రతాప్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: పీటీఎం మండలంలోని కాట్నగల్లు సచివాలయంలోని పంచాయతీ నిధులు ఆ గ్రామ సర్పంచి పనులు చేపట్టకుండానే నిధులు గోల్‌మాల్ చేశారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం సచివాలయానికి తాళాలు వేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పంచాయతీకి రూ.10లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. కాని ఇక్కడ కనీసం వీధిలైట్లు కూడా ఏర్పాటు చేయకుండానే బిల్లులు డ్రా చేసుకుని మిన్నకుండి పోయారన్నారు. పల్లెల్లో వాటర్‌మెన్‌కు, హరిత కార్మికులకు 9 నెలలుగా జీతాలు ఇవ్వకుండా నిలిపేశారని చెప్పారు. వారి పేరిట సమాచార హక్కు చట్టంలో వివరాలు సేకరిస్తే డబ్బులు డ్రా అయినట్లు తెలిసిందన్నారు. సర్పంచి, పంచాయతీ కార్యదర్శి గుట్టుచప్పుడు కాకుండా బిల్లులు డ్రా చేసుకున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ ఎంపీడీవో సచివాలయం వద్దకు చేరుకుని గ్రామస్థులతో మాట్లాడారు. దీనిపై ప్రత్యేక అధికారిని నియమించి నిధుల దుర్వినియోగంపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో సచివాలయం తాళాలు తీశారు.

నకిలీ మద్యం కేసులో నిందితుడికి రిమాండ్

ములకలచెరువు, న్యూస్‌టుడే: ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో నిందితుడిగా ఉన్న హైదరాబాద్‌కు చెందిన నకిరికంటి రవిని పీటీ వారెంట్‌పై ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో సోమవారం హాజరు పరిచారు. తంబళ్లపల్లె కోర్టు న్యాయమూర్తి ఉమర్‌ఫరూక్ నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ కేసులో రవి(ఏ16) ఉన్నాడు. ఇబ్రహీంపట్నం కేసులో నిందితుడిగా ఉండటంతో విజయవాడ ఎక్సైజ్ పోలీసులు రవిని అరెస్ట్ చేసి నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. దీంతో పీటీ వారెంట్‌పై ఎక్సైజ్ పోలీసులు నిందితుడిని తీసుకొచ్చి కోర్టులో హాజరు పరిచారు. రిమాండ్ అనంతరం రవిని మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు.

అయిదుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

కలకడ, న్యూస్‌టుడే: కులం పేరుతో ఒకరిని దూషించి దుర్భాషలాడటంతో అయిదుగురిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ రామాంజనేయులు సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు రాయచోటిలోని రామాలయం వీధికి చెందిన సంపూర్ణమ్మ తన మనువరాలు పెళ్లి కలకడలోని ఆలయంలో శనివారం రాత్రి జరుగుతుండగా వెళ్లారు. అదే సమయంలో రాయచోటికి చెందిన సందీప్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి, శివారెడ్డి, రెడ్డిప్రసాద్, రాజేష్‌నాయక్‌లు అక్కడికి వచ్చారు. అక్కడ సంపూర్ణమ్మ అల్లుడు నరేష్ కోసం గాలించారు. అతన్ని పిలిపించండి అంటూ గొడవ చేస్తుంటే అడ్డుకున్న ఆమెను దుర్భాషలాడి, కులం పేరుతో దూషించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ పేర్కొన్నారు.

గొలుసు దొంగల ముఠా అరెస్టు

రాయచోటి, కలకడ, న్యూస్‌టుడే: మహిళల మెడలో నుంచి బంగారు నగలు లాక్కెళ్తున్న చైన్ స్నాచింగ్ దొంగల ముఠాను అన్నమయ్య జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ పట్టుబడిన నగలతో పాటు అరెస్టు చేసిన దొంగలను మీడియా ముందు ప్రవేశ పెట్టారు. పట్టుబడిన దొంగలు జిల్లాలోని కలకడ, కలికిరి, పీలేరు, మదనపల్లె ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతూ వచ్చారని ఆయన తెలిపారు. కె.వి.పల్లి మండలానికి చెందిన కుంచెపు పురుషోత్తం(28), పూజారి శంకరయ్య(26), బండి బాలాజీ(28), కలకడకు చెందిన కుంచపు మోహన్‌బాబు(27)లు ఒంటరిగా వెళ్తున్న మహిళలను గుర్తించి వారి మెడలోని బంగారు నగలు లాక్కెళ్లే వారన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారన్నారు. సోమవారం తిమ్మాపురం క్రాస్ వద్ద పక్కా సమాచారంతో నిందితులను అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో కుంచపు మోహన్‌బాబు కలకడ మండలం దొడ్డిపల్లె పంచాయతీలో వెటర్నరీ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారని ఆయన వెల్లడించారు. మిగిలిన ముగ్గురు కూలీ పనులు చేస్తూ కొంత కాలంగా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ వచ్చారన్నారు. ఈ నెల 10న బట్టల వ్యాపారి నుంచి రూ.40,150 నగదు దోచుకెళ్లారని ఆయన తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.15 లక్షల విలువైన 140 గ్రాముల బంగారు నగలు, నగదు, 4 మోటారు సైకిళ్లు, 4 చరవాణిలు, 15 చీరలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. జిల్లాలో ఫేస్ ఐడెంటిఫికేషన్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. చోరీలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పట్టుబడిన నగలు పరిశీలిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, డీఎస్పీ కృష్ణమోహన్

ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

రాయచోటి, న్యూస్‌టుడే: సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం పోరాట దీక్ష చేశారు. పట్టణంలోని మాసాపేటలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ఎదుట దీక్ష చేసిన అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు గడిచినా తమ సమస్యలు పరిష్కారం కాలేదని వాపోయారు. ఉద్యోగ భద్రత లేకుండా తక్కువ జీతాలతో కుటుంబాలు పోషించుకోవడం కష్టంగా మారిందన్నారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా కార్యదర్శి ఆలీఖాన్, వెంకటరమణ, ఆపస్ జిల్లా కార్యదర్శి ఆర్.రామాంజనేయులు రెడ్డి, పీఎస్‌టీయూ గౌరవాధ్యక్షుడు పి. చిన్నరెడ్డెన్న, జిల్లా కార్యదర్శి జక్రియా బాషా, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద పోరాట దీక్ష చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

ప్రాధాన్య ప్రాజెక్టుల నిర్మాణాలకు భూసేకరణ చేపట్టాలి

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలో చేపట్టనున్న వివిధ ప్రాధాన్య ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను అధికారులు పూర్తి చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రధాన మంత్రి అవాస్ యోజన గ్రామీణ పథకానికి సంబంధించి సర్వే పనులను నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలన్నారు. రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమంలో సంబేపల్లె, ములకలచెరువు, చిన్నమండెం మండలాలు వెనుకపడ్డాయని చెత్త సేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రాజంపేట, మదనపల్లె సబ్ కలెక్టర్లు భావన, కల్యాణి, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డ్వామా, గృహ నిర్మాణ శాఖ, ముఖ్య ప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలపై అదనపు పని భారం తగదు



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

రాజంపేట, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించకపోగా పోరాడి సాధించుకున్న రూ.300 డీఏని వెనక్కి తీసుకుందని.. కూటమి ప్రభుత్వం అదనపు పని భారం వీఆర్‌ఏలను ప్రభుత్వం వేధిస్తోందని వీఆర్‌ఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్ తెలిపారు. వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం సీఐటీయూ నాయకులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ తెలంగాణ తరహాలో వీరికి పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ హెచ్.ఎస్. భావనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్, డివిజన్ కార్యదర్శి మధు పాల్గొన్నారు.

స్మార్ట్ గ్రిడ్లపై విద్యార్థులకు అవగాహన

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో సోమవారం సెక్యూరింగ్ స్మార్ట్ గ్రిడ్స్ విత్ క్వాంటం- సెక్యూర్ సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్స్ అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ సాయిబాబారెడ్డి, ప్రొఫెసర్లు డాక్టర్ విక్రమ్ కుమార్ పూడి, శివ నాయక్‌లు మాట్లాడుతూ.. జేఎన్టీయూఏ-ఫ్యాకల్టీ డెవలప్మెంట్ సెంటర్, జేఎన్టీయూఏ-ఎఫ్‌డీసీ స్పాన్సర్‌తో అన్నమాచార్య కళాశాలలో ఐదు రోజులు పాటు జాతీయ సదస్సు ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్మార్ట్ గ్రిడ్లలో పెరుగుతున్న సైబర్ ముప్పులు, క్వాంటం కంప్యూటింగ్‌తో ఏర్పడే భవిష్యత్తు భద్రత సవాళ్లు తదితర అంశాలుపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వివరించారు.

స్టాంప్ వెండర్ల లైసెన్సులు రద్దు

● సబ్ రిజిస్ట్రార్‌కు డీఐజీ ఆదేశం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోటలో నలుగురు స్టాంపు వెండర్ల లైసెన్సులను రద్దు చేశారు. స్థానికంగా స్టాంపులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. సోమవారం బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన రిజిస్ట్రేషన్‌లశాఖ డీఐజీ దృష్టికి కొందరు ఇదే విషయాన్ని తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన స్థానికంగా ఉన్న నలుగురు స్టాంపు వెండర్ల లైసెన్సులను రద్దు చేయాలని సబ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. స్టాంపు వెండర్ల వద్ద ఉన్న స్టాకుతో పాటు రిజిస్టర్‌ను సీజ్ చేయాలని సూచించారు. ఆస్తుల క్రయ, విక్రయాల కోసం డాక్యుమెంట్ల రైటర్లపై ఆధారపడకుండా స్లాట్ బుకింగ్ సేవలను వినియోగించుకునేలా ప్రజలను చైతన్య పర్చాలని, దస్తావేజులను నేరుగా ప్రజలు సిద్ధం చేసి ఇచ్చిన రిజిస్ట్రేషన్‌లు చేయాలని సూచించారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

విద్యార్థిని దీపికను అభినందిస్తున్న పాఠశాల ప్రతినిధులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: బోయనపల్లి శాన్వి ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని దీపిక జాతీయ స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ఛైర్మన్ శరత్‌కుమార్‌రాజు సోమవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో రాష్ట్ర జట్టుకు తమ పాఠశాల విద్యార్థి ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి

క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ముఖ్యవక్తలు, నిర్వాహకులు

మదనపల్లె విద్య: రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని క్రీడాకారులకు సీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు డాక్టర్ బాబు, నాగరాజు, ఝాన్సీరాణి సూచించారు. సోమవారం మదనపల్లె మండలం సీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో అండర్- 14 రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ... మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి బాలబాలికల జట్లు హాజరయ్యాయన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని క్రీడలపై దృష్టి పెట్టి రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించాలన్నారు. అనంతరం విద్యార్థులచే గౌరవ వందనం స్వీకరించి క్రీడా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ పోటీల రాష్ట్ర పరిశీలకుడు త్రినాథ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో మదనపల్లె విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో ఇటీవల నిర్వహించిన ఒకినావా గోజూ-ర్యూ కరాటే మలేషియా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మదనపల్లె విజయభారతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల ఛైర్మన్ డాక్టర్ ఎన్.సేతు, ప్రిన్సిపల్ నిశ్చిత సోమవానం తెలిపారు. పాఠశాల నుంచి 17 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని ఏడుగురు ప్రథమ స్థానం, ఐదుగురు ద్వితీయ స్థానం, ఐదుగురు తృతీయ స్థానంలో నిలిచారన్నారు. మదనపల్లె యూత్ కరాటే క్లబ్‌కు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ లభించిందన్నారు. ఈ సందర్భంగా వారిని కరాటే మాస్టర్ మణిసాయి, ఛైర్మన్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

★ కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో ఈ నెల 22, 23వ తేదీన జరిగిన తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో బాపూజి మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయుడు కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇందులో నవనీత, జ్ఞానవి, బి.హేమంత్‌కుమార్, పవన్‌కల్యాణ్, నిఖిల్‌లు బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడితో పాటు కోచ్‌లు గంగరాజు, ధాత్రీ అభినందించారు.

విజేతలతో విజయభారతి ఛైర్మన్ డాక్టర్ ఎన్.సేతు, కరాటే మాస్టర్ మణిసాయి

తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులతో బాపూజి మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిరణ్‌కుమార్‌రెడ్డి

EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647

ఎలక్ట్రీషియన్లు కావలెను. APSPDCL పరిధిలో చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు & అనంతపురం జిల్లాల్లో వర్క్స్ చేయుటకు ఎలక్ట్రీషియన్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్లు కావలెను. జీతం 20K To 30K. Con: 73307 05344, 089131 41574.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

TO LET

COMMERCIAL

ITI సర్కిల్ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ క్రింద పార్క్ దగ్గర BNR రైస్ మిల్ ప్రక్కన 7400 SFT గల గోడౌన్ బాడుగకు ఇవ్వబడును. సెల్: 9848277001, 9110593250.

JOBS

Wanted Service Technicians Fresher or Exp. Electrical and Electronics ITI, Diploma or any Technical Exp. ✆ 93901 52768

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మదనపల్లె

●మదనపల్లె ● పీలేరు ● తంబళ్లపల్లె

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత

చెక్కు అందజేస్తున్న నాగబాబు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: గతేడాది ప్రమాదంలో మరణించిన నిమ్మనపల్లె మండలం చౌకిళ్లవారి పల్లెకు చెందిన జనసేనపార్టీ కార్యకర్త శివ కుటుంబానికి ఎమ్మెల్సీ, జనసేనపార్టీ నాయకులు నాగబాబు ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఆదివారం మంగళగిరిలోని ఓ ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.5లక్షలు చెక్కును మృతుడు భార్య శివజ్యోతికి అందజేశారు. శివ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని నాగబాబు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి అడప సురేంద్ర పాల్గొన్నారు.

స్పందించారు.. పరిష్కారం చూపారు

కత్తివారిపల్లెలో బోరు వద్ద నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్థులు

మదనపల్లె గ్రామీణ: మండలంలోని మాలేపాడు పంచాయతీ కత్తివారిపల్లెలో అధికారులు తాగునీటి సమస్యను పరిష్కరించారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని గతవారం రోజుల కిందట సబ్‌కలెక్టరేట్ ఎదుట గ్రామస్థులు ధర్నా చేశారు. దీంతో స్పందించిన డీఎల్‌డీవో అమర్‌నాథ్, డీఎల్‌పీవో నాగరాజుల ఆదేశాల మేరకు ఎంపీడీవో తాజ్‌మస్రూర్, ఆర్‌డబ్ల్యూఎస్ నాగరాజులు స్పందించి పంచాయతీ నిధులతో నూతన తాగునీటి బోరును వేయించి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని కమిటీ ఛైర్మన్ గంగారపు నవీన్ చౌదరి వెల్లడించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సోమవారం కమిటీ సభ్యులు గంగారపు నవీన్ చౌదరి, వి.అజయ్ పండిట్, డి.భాస్కర్, కే.మల్లిక, కే.శ్రీరాములు, టి.మంజునాథ, వి.మారుతి, ఎస్.నాగమణి, కే.రాజేష్, బి.బుజ్జమ్మ, ఎం.ఉష, ఆలయ అర్చకులు గోవర్ధన్ చేత ఈఓ రమణ సోమవారం ప్రమాణం చేయించారు. అనంతరం ఛైర్మన్‌గా ఎంపికైన గంగారపు నవీన్ చౌదరి మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న కల్యాణ మంటపాన్ని కొత్తగా నిర్మించడంతో పాటు ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ... ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మదనపల్లె అర్బన్: పశుసంవర్ధక శాఖను అన్ని అంశాల్లో ఉత్తమ స్థాయిలో ఉండేందుకు కృషి చేస్తానని ఉప సంచాలకులు డాక్టర్ ఎ.రసూల్‌సాహెబ్ అన్నారు. కార్యాలయంలో డివిజన్ ఉప సంచాలకులుగా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రతి ఆసుపత్రిని పరిశీలించి, అక్కడ సమస్యల్ని పరిష్కరిస్తానన్నారు.

వెల్లువెత్తిన ప్రజా సమస్యలు

● కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోని అధికారులు

అర్జీదారులను విచారిస్తున్న సబ్‌కలెక్టర్ చల్లాకల్యాణి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: భూ సర్వే సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. రుసుము చెల్లించిన ప్పటికీ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేచేయడం లేదు. ఉన్నతాధికారులకు అర్జీలు ఇచ్చి వారి ఆదేశాల మేరకు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తాయి. సోమవారం సబ్‌కలెక్టర్ చల్లాకల్యాణి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కావేదిక నిర్వహించారు. డివిజన్‌లోని వివిధ మండలాలకు చెందిన 105 మంది అర్జీదారులు తమ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. దీనిపై సబ్‌కలెక్టర్ బాధితులను విచారించారు. కలికిరి మండలానికి చెందిన బావాజీ కు సంబంధించిన 6.01 ఎకరాల భూమిలో 5.01 ఎకరాలు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని వ్యవసాయ కళాశాలకు కేటాయించారు. మిగిలిన భూమిని సర్వేచేసి చూపించాలని అధికారులను అడిగితే రూ.20వేలు డిమాండ్ చేస్తున్నారని బాధితుడు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారించి నివేదిక ఇవ్వాలని డివిజన్ సర్వేయర్‌ను ఆదేశించారు. ఇదే విధంగా డివిజన్‌లోని పలు మండలాలల్లో సర్వే సమస్యలపై బాధితులు ఫిర్యాదు చేశారు.

మూడు నెలలుగా తిరుగుతున్నా

మా తల్లి ఎల్లమ్మ పేరున అరికెల గ్రామంలో 59 సెంట్ల భూమిని కొనుగోలుచేసి సాగు చేసుకుంటున్నాను. కొనుగోలుచేసిన భూమి దస్త్రాలన్నీ మావద్ద ఉన్నాయి. కానీ 1బీలో మాత్రం 30 సెంట్లు మాత్రమే చూపిస్తుంది. దీనిపై మూడు నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కరించడం లేదు.

- గంగిరెడ్డి, గౌసువారిపల్లె, రామసముద్రం

వంకలను ఆక్రమిస్తున్నారు

గొల్లపల్లె వద్ద కానగల కుంట, సాకిరేవుకుంటలతో పాటు దీనికింద ఉన్న వంకలను కూడా కొందరు ఆక్రమిస్తున్నారు. దీన్ని ప్రశ్నిస్తే పట్టాలిచ్చారని చెబుతున్నారు. కుంటలను పూడ్చేస్తే మా పొలాలకు సాగు నీటికి కష్టమవుతుంది.

- ఈశ్వరప్ప, గొల్లపల్లె, పెంచుపాడు, మదనపల్లె

ఉన్నతాధికారులకు ఫిర్యాదు



సామాజిక బాధ్యతతో బి.కొత్తకోటలో ప్రభుత్వ భూములు, చెరువులు, వంకలను ఆక్రమిస్తున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాను. గత 20 ఏళ్లుగా ఇక్కడి ఆక్రమణలపై జిల్లా కలెక్టర్లు, సబ్‌కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై ప్రశ్నిస్తే నాపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- ఖాదర్‌వల్లి, బి.కొత్తకోట

వ్యాపార రంగంలో విద్యార్థులు రాణించాలి

మాట్లాడుతున్న విశాల్ విజయ్‌నాయర్

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు కొత్త ఆలోచనలతో వ్యాపార అవకాశాలను పెంచుకోవాలని బెంగళూరుకు చెందిన సీనియర్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఎడ్యుకేటర్ విశాల్ విజయ్‌నాయర్ అన్నారు. సోమవారం మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయంలో ఎంట్రప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ యూనిట్ కెరీర్ అడ్వాన్స్‌మెంట్ అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉద్యోగాలకు ఎదురు చూడకుండా కొత్త ఆలోచనలతో వ్యాపార అవకాశాలు కల్పించేలా పరిశ్రమలను అభివృద్ధి చేసే దిశగా ఎదగాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అకాడమిక్స్ డీన్ డా.రామా కె కొమరగిరి, విభాగాధిపతి డా.ఎన్.భాస్కరన్, ఈడీ సెల్ సమన్వయకర్త డా.కె.కిరీష్ పాల్గొన్నారు.

చెరువు కట్టపై పిచ్చిమొక్కల తొలగింపు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని కమ్మవారిచెరువు కట్టపై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య కార్మికులను తీసుకెళ్లి కట్టపై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. చెరువు కట్టపై జరుగుతున్న పనులను పురపాలక సంఘం కమిషనర్ ప్రమీల పర్యవేక్షించారు.

రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ బాలాజీ, అధికారులు

కార్యాచరణ పత్రాలను ఆవిష్కరిస్తున్న జంగాల శివరాం

ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: రైతులను రాజుగా చూడడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మదనపల్లె ఏడీఏ రమేష్‌నాథ్, ఏవోలు ప్రమీలరెడ్డి, ప్రవంతి, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ బాలాజీ అన్నారు. సోమవారం 'రైతన్నా! మీ కోసం' కార్యక్రమంలో అధికారులు వేర్వేరుగా పీటీఎం మండలం, తుమ్మరకుంట, ములకలచెరువు మండలంలోని బురకాయలకోట, పాతములకలచెరువు గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. రైతులు పండిస్తున్న పంటల వివరాలు, వారికి కావాల్సిన అవసరాల గురించి సిబ్బంది సేకరించి అంతర్జాలంలో నమోదు చేస్తారన్నారు. అగ్రిటెక్ ల్యాబ్‌లతో భూసార పరీక్షలు నిర్వహించి సాగు చేసే పంటల వివరాలను వెల్లడిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ సిబ్బంది సునీల్, రాజు, రమేష్, ఏఈవో ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జంగాలశివరాం చెప్పారు. మండలంలోని బోడిమలదిన్నెలో వ్యవసాయశాఖ, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో 'రైతే రాజు' కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతుల కోసం రానున్న 5 సంవత్సరాల్లో అమలుచేసే కార్యాచరణనికి సంబంధించిన 'రైతన్నా..! మీకోసం' అనే కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టమాట మార్కెట్ యార్డు కార్యదర్శి జగదీష్, వ్యవసాయాధికారి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందని మార్కెట్ కమిటీ ఛైర్మన్ కోసూరి చంద్రమౌళి అన్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మనోహర్‌గౌడ్ మాట్లాడుతూ రైతన్నా మీకోసం కార్యక్రమం ద్వారా అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై రైతులకు వివరించాలన్నారు. అనంతరం తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఎంపీడీవో, ఇతర శాఖల అధికారులతో కలిసి రైతన్న కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ సెక్రటరీ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

ప్రతిభ చాటి.. ప్రత్యేకంగా నిలిచి

విజేతలతో గౌతమ్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు

ప్రశంసా పత్రాలు చూపుతున్న భాష్యం ఇంగ్లిషు మీడియం హైస్కూల్ విద్యార్థులు పక్కన ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు

బహుమతులు అందజేస్తున్న ఎస్‌వీబీ ఇంగ్లిషు మీడియం హైస్కూల్ ప్రిన్సిపల్ ఆర్.ప్రసాద్, ఉపాధ్యాయులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: మదనపల్లె పట్టణంలోని గౌతమ్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో 'ఈనాడు ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభాపాటవ పోటీలు విద్యార్థులకు నిర్వహించారు. ఇందులో భాగంగా 'విద్యార్థుల జీవితంపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాసం (స్పీచ్) పోటీలు నిర్వహించగా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎన్.నవీనా (10వతరగతి), జి.వైష్ణవి (10వ తరగతి), జి.జోష్ణ (9వ తరగతి)లు విజేతలుగా నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు శ్యామల, భావన, ఉష బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

● మదనపల్లెలోని భాష్యం ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో సోమవారం 'ఈనాడు ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'విద్యార్థుల జీవితంపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాసం (స్పీచ్) పోటీలు జరిగాయి. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా ఎం.జాహ్నవి (10వ తరగతి), కె.భావ్యశ్రీ (9వతరగతి), టి.ధాత్రిక (8వతరగతి) విజేతలుగా నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

● మదనపల్లెలోని ఎస్‌వీబీ ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో సోమవారం 'ఈనాడు, ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'విద్యార్థుల జీవితంపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాసం (స్పీచ్) పోటీలు జరిగాయి. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో జి.భావన (10వ తరగతి), ఎం.హనీషా (9వ తరగతి), టి.నందకిషోర్‌రెడ్డి (10వతరగతి)లు విజేతలుగా నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ ఆర్.ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత బహుమతులు, ప్రశంసా ప్రతాలు అందజేశారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: పీలేరులోని జ్యోతిబాపులే బాలికల గురుకుల పాఠశాలకు చెందిన చందు, అశ్విని అనే విద్యార్థినులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పకరున్నీసా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె మాట్లాడుతూ వచ్చే డిసెంబరులో విజవాడలో జరగబోయే జూనియర్ కబడ్డీ అసోసియేషన్ క్రీడల్లో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థినులను, పీడీ అమరావతిని ప్రిన్సిపల్ అభినందించారు.

సమస్యల పరిష్కారానికే పీజీఆర్ఎస్ నిర్వహణ

మదనపల్లె పట్టణం: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించడానికే ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను (పీజీఆర్ఎస్) ప్రభుత్వం నిర్వహిస్తోందని పురపాలకసంఘం కమిషనర్ ప్రమీల తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను విచారించి వెంటనే పరిష్కరించాలని విభాగాధికారులకు సూచించారు. డీఈఈ శ్రావణి, పట్టణ ప్రణాళికా విభాగం పర్యవేక్షణాధికారిణి రెడ్డెమ్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పోలీసులకు రివార్డులు

కలకడ, న్యూస్‌టుడే: వివిధ చోరీలకు సంబంధించిన కేసులో నిందితులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన కలకడ, కంభంవారిపల్లె ఎస్సైలు రామాంజినేయులు, చిన్నరెడ్డెప్పలతో పాటు పోలీసు సిబ్బందికి జిల్లా ఏఎస్పీ వెంకటాద్రి (పరిపాలన) రివార్డులు ప్రకటించి అందజేశారు. కలకడ, పీలేరు, రాయచోటి, మదనపల్లె ప్రాంతాలలో పలు చోరీలకు పాల్పడిన కంభంవారిపల్లె మండలం తీతాగుంటపల్లెకు చెందిన నిందితులను సోమవారం అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.15 లక్షలు విలువ చేసే బంగారు చైన్లు స్వాధీనం చేసుకున్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని రాయచోటిలో రివార్డులు అందజేశారు.

ఏఎస్పీ నుంచి రివార్డు అందుకొంటున్న ఎస్ఐ రామాంజినేయులు

మెరుగైన విద్యుత్తు సరఫరాకు చర్యలు

నియంత్రికను ప్రారంభించిన డీఈ గంగాధరం, అధికారులు

ములకలచెరువు, న్యూస్‌టుడే: నియోజకవర్గ కేంద్రమైన తంబళ్లపల్లెలో మెరుగైన విద్యుత్తు సరఫరాకు చర్యలు తీసుకున్నట్లు ట్రాన్స్‌కో డిఈ గంగాధరం తెలిపారు. సోమవారం తంబళ్లపల్లెలో ఆయన 33/11 కేవీఏ విద్యుత్తు సబ్ స్టేషన్‌లో 5 ఎంవీఏ అదనపు ట్రాన్స్‌ఫార్మర్, ఎల్‌వీ బ్రేకర్‌ను పూజలు చేసి ప్రారంభించారు. తంబళ్లపల్లె మండలంలోని రైతులు, వినియోగదారులుకు నిరంతర మెరుగైన విద్యుత్తు అందించడమే లక్ష్యమన్నారు. బిల్లుల వసూళ్లపై శ్రద్ధ చూపాలని హెచ్చరించారు. వినియోగదారులకు సమస్యలు ఏర్పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఏడిఈ గోవింద్‌రెడ్డి, నారాయణ, ఏఈ సురేంద్ర, శేషు, లైన్ ఇన్స్‌పెక్టర్లు భాస్కర్, నాగరాజు తదితరులు ఉన్నారు.

సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడండి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిపుణులు రత్నశేఖర్

ములకలచెరువు, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ నిపుణులు రత్నశేఖర్, హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ అన్నారు. తంబళ్లపల్లెలోని ఐటీఐ కళాశాలలో సోమవారం హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో డాక్టర్ రమేష్‌నాథ్ రిచ్‌గ్లోబల్ ఫౌండేషన్ సహకారంతో సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుండె ఆగిన సమయంలో సీపీఆర్ చేయడంతో ప్రాణాలు నిలబెట్టే అవకాశం ఉంటుందన్నారు. దీనిపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాగరాజు, అసిస్టెంట్ ట్రైనింగ్ అధికారి అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

తెదేపా బలోపేతానికి కృషి

మాట్లాడుతున్న దినేష్‌రెడ్డి

ములకలచెరువు, బి.కొత్తకోట, న్యూస్‌టుడే: పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని నియోజకవర్గ పరిశీలకుడు దినేష్‌రెడ్డి అన్నారు. సోమవారం కురబలకోట మండలంలో సంస్థాగత ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. మండలంలోని తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో నష్టపోయిన ప్రతి కార్యకర్తను పార్టీ ఆదుకుంటుందన్నారు. కురబలకోట మండల అధ్యక్ష పదవికి మండలంలో 11 మంది పోటీలో ఉన్నారన్నారు. అందరూ పార్టీ బలోతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం బి.కొత్తకోటలో కూడా ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పరిశీలకులు ప్రశాంత్‌రెడ్డి, ఖాన్, చిట్టిబాబు, నాగరాజు, మాజీ ఎంపీపీ భూమిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: మదనపల్లె పట్టణంలోని నక్కలదిన్నె ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులకు సోమవారం బ్రిడ్జ్ ఇండియా సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్‌డబ్ల్యూఓ గంగిరెడ్డి, వార్డెన్ రాంప్రసాద్‌లు మాట్లాడుతూ వసతి గృహంలో ఉన్న 60 మంది విద్యార్థులకు బెడ్ షీట్లు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో గ్రామీణ బ్యాంకు మేనేజర్ సుధాకర్, బ్రిడ్జ్ ఇండియా సొసైటీ సభ్యులు సహదేవ, బీసీరెడ్డి, రామలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

తీసుకున్న నగదు అడిగితే దాడికి యత్నం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: తనకు రావాల్సిన సొమ్మును అడిగితే సోదరుడు, అతని భార్య దాడికి వస్తున్నారని శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం తలపలకు చెందిన లక్ష్మీదేవి సోమవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... 'నా బాగోగులు చూసుకునేందుకు ఎవరూ లేకపోవడంతో మదనపల్లెలోని ఏవీనాయుడు కాలనీలో నివాసం ఉంటున్న నా సోదరుడు శ్రీనివాసులు ఇంట్లో ఉంటున్నా. ఈ క్రమంలో నా వద్ద ఉన్న రూ.4.50 లక్షల నగదు కుటుంబ అవసరాలకు తీసుకున్నారు. ప్రస్తుతం నా ఆరోగ్య పరిస్థితి బాగలేక పోవడంతో తిరిగి ఇవ్వాలని అడిగితే ఇవ్వనంటూ నాపైకే దాడికి వచ్చారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశానని వివరించారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

సమావేశమైన వాల్మీకి రిజర్వేషన్ సమితి నాయకులు

మదనపల్లె పట్టణం: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు వాల్మీకి సాధన సమితి చేస్తున్న పోరాటంలో యువత పాల్గొనాలని ఆ సంఘం అధ్యక్షుడు పొదల నరసింహులు అన్నారు. సోమవారం ఆ సంఘం నాయకులు యువకులతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. ఎన్నికల సమయంలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని హామి ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించడం సరికాదన్నారు. పాలకులు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే పోరాటమే ఏకైక మార్గమన్నారు. ఇందులో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని కోరారు. అనంతరం మండల అధ్యక్షుడుగా పురుషోత్తంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అమృతం అందించని పథకం

రూ.9.81కోట్ల నిధులపై సన్నగిల్లుతున్న ఆశలు

కాలుష్యమైన పెద్దచెరువు ఇదే..

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట నగర పంచాయతీలో అమృత్-2.0 పథకం అమలుపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. పట్టణ అభివృద్ధికి ఈ పథకం కింద రూ.9.81 కోట్ల నిధులు మూడేళ్లక్రితం మంజూరైనా వినియోగించుకునే అవకాశాలు మృగ్యమైపోతున్నాయి. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు బృహత్తరమైన ఈ పథకాన్ని పట్టించుకోకుండా వదిలేయడం ఈ నగర పంచాయతీ పాలిట శాపంగా మారింది. గత సార్వత్రిక ఎన్నికల అనంతరం కేంద్ర, రాష్ట్రాల్లో ఎన్డీఏ ప్రభుత్వాలు అధికారంలోకి రావడంతో అమృత్-2.0 పథకం అమలవుతుందని పట్టణ ప్రజలు ఆశించారు. కాని ఇప్పటి వరకు ఈ పథకం అమలు చేయడంపై అధికార యంత్రాంగం దృష్టిని కేంద్రీకరించకపోవడంతో పట్టణ ప్రజలు నిరాశకు పడుతున్నారు. పట్టణ, నగర ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభా అవసరాలకు తగినట్లుగా కనీస వసతులను కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా అమృత్-2.0 పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఈ క్రమంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో బి.కొత్తకోటకు రూ.9.81కోట్ల నిధులను కేటాయించారు. ఈ పథకంతో పట్టణంలో తాగునీటి సరఫరాను మెరుగుపర్చడానికి అదనంగా వారపుసంతలో ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించడంతో పాటు కొత్తగా పైపులైన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పట్టణ శివారు ప్రాంతాల్లో ఉన్న బద్దిపల్లె, కురవానికుంట కాలనీల్లో కనీస వసతులను మెరుగుపర్చాలని నిర్ణయించారు. నిరుపేదలు అధికంగా ఉన్న ఈ కాలనీల్లో తాగునీరు, రహదారులు, వీధిలైట్లు వంటి మౌలిక సదుపాయాలను కల్పించడానికి నిధులను కేటాయించారు. పెద్దచెరువు కాలుష్యం కోరల్లో పట్టణ నడిబొడ్డున ఉన్న పెద్దచెరువు కాలుష్యం అంచుల్లో చిక్కుకుంది. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగునీరు ఈ చెరువులోకి చేరుతుండటంతో వర్షపునీరు కలుషితమవుతున్నాయి. ఈ కారణంగా దోమల బెడదతో పాటు దుర్వాసన పెరిగి ప్రజారోగ్యం దెబ్బతింటోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి మురుగునీరు చెరువులోకి చేరకుండా మళ్లించడానికి కొత్తగా కాలువను నిర్మించాలని నిర్ణయించారు. పురపాలక ప్రజారోగ్యశాఖ పెద్దచెరువు మురుగునీటి మళ్లింపు కాలువ నిర్మాణానికి టెండర్ల ప్రక్రియను ప్రారంభించినా.. పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో ఈ వ్యవహారం మరుగునపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ ఈ పథకం అమలును రెండుసార్లు సమీక్షించారు. మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా నూతనంగా ఆవిర్భవించిన బి.కొత్తకోటలో అభివృద్ధి పనులకు నిధులను కేటాయించడంపై అధికారులతో చర్చించారు. కాని ఇప్పటివరకు ఈ పథకం అమలు చేసేదిశగా అడుగులు పడకపోవడం స్థానికులను నిరుత్సాహానికి గురి చేస్తోంది. ఈ విషయంపై నగర పంచాయతీ కమిషనర్ జీవీ పల్లవిని వివరణ కోరగా.. అమృత్ పథకం కింద పనులను చేపట్టడంపై తమ శాఖకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి సమాచారం అందలేదని స్పష్టం చేశారు.

వైకాపా నాయకులు వేధిస్తున్నారు...

● వైకాపా నాయకులపై పోలీసులకు ఫిర్యాదు

మదనపల్లె నేరవార్తలు, గ్రామీణ, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమం వేదికగా గత 15 రోజులుగా కొంత మంది వైకాపా నాయకులు బృందంగా ఏర్పడి తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబుతో పాటు పలువురు తెదేపా నాయకులు సోమవారం రెండోపట్టణ సీఐ రాజారెడ్డికి ఫిర్యాదు చేశారు. పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలువురు వైకాపా నాయకులు వేధింపులకు పాల్పడటంతో పాటు తన వ్యక్తిగత, సామాజిక ఖ్యాతిని దెబ్బ తీస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సీఐ వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండో పట్టణ సీఐ రాజారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

గ్రామాల్లో సమస్యలపై ఎంపీడీవోతో ఫోన్‌ఇన్ నేడు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట మండలం 25 పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో తాగు నీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, సమస్యలు వేధిస్తున్నాయా? మురుగు కాలువలు అధ్వానంగా మారి దోమలు వృద్ధి చెందుతున్నాయా? వీటితో స్థానికంగా ఉన్న సమస్యలను రాజంపేట ఎంపీడీవో వరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోరవచ్చు. ఈ అవకాశాన్ని ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా ఈనాడు కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా కింద నంబరుకు ఫోన్ చేయడమే.

9849900084 | మంగళవారం 25-11-2025 | ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు

కింద పడిన సూచిక.. కనిపించక

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: రాయచోటి మండల పరిధిలోని యండపల్లె వద్ద ప్రధాన రహదారిపై గ్రామాన్ని సూచించే సూచిక బోర్డు నెల రోజుల క్రితం ఊడి కిందపడిపోయింది. స్థానికులు అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని తెలిపారు. ఈ మార్గంలో చాలా ప్రాంతాల్లో మలుపులు, గ్రామాల పేర్లను సూచించే సూచిక బోర్డులను మళ్లీ పొదలు కప్పేశాయి. దీంతో మలుపులు ఉన్న విషయం తెలియక పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మళ్లీ పొదలను తొలగించి సూచిక బోర్డులను సరిచేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ రజీ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జీవితాల్లో సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై ఉపన్యాస పోటీలు ఏర్పాటు చేయగా పలువురు విద్యార్థులు హాజరై ఉపన్యసించారు. అందులో తొమ్మిదో తరగతికి చెందిన సి.శక్తిశ్రీ, యు.నిరంజన్‌కుమార్, కె.చేతన్‌శ్రీ అనే విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కరస్పాండెంట్ నాగరాజు వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ సుకుమార్, హెచ్‌ఎం రామరాజు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని

విజేతలకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ నాగరాజు, ఉపాధ్యాయులు

అడ్డగోలు పార్కింగ్‌తో ట్రాఫికర్

గాలివీడు నాలుగు వరుసల రహదారిపై దుస్థితి

గాలివీడులో రహదారిపైనే పార్కింగ్ చేసిన వాహనాలు

గాలివీడు, న్యూస్‌టుడే: గాలివీడులో నాలుగు వరుసల రహదారి ఉన్నా ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి బస్టాండు వరకు పార్కింగ్ స్థలం కేటాయించకపోవడంతో వాహనాలను వాహనదారులు రహదారిపైనే నిలుపుతున్నారు. అధికారులు స్పందించి గాలివీడులో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

★ గాలివీడు రోడ్ల విస్తరణ సమయంలో నీటి గొట్టాలు, స్తంభాల ముక్కలు రహదారి మధ్యలోకి వచ్చాయి. వీటిని తొలగించకపోవడంతో పాదచారులు, వృద్ధులు, పిల్లలు కిందపడి ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందిన సందర్భాలున్నాయి. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న తాగునీటి పైపులైన్ గేట్‌వాల్‌ను ఢీకొని ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. రద్దీ ప్రాంతాలు, మలుపుల వద్ద మాంసం, టీ, తదితర దుకాణాలు ఏర్పాటు చేయడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దుకాణదారులు రహదారిపైకి చొచ్చుకొని వచ్చి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు అడ్డు చెప్పకపోవడం గమనార్హం.

★ ఈ విషయమై ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్ మాట్లాడుతూ.. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామన్నారు. ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ.. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా అడ్డంకులు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సమాజ సేవకు విద్యార్థులు ముందుకురావాలి

ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు

వీరబల్లి, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి సేవాభావాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అజంతుల్లా, ఎన్‌ఎస్‌ఎస్ పీవో రఘురామయ్య అన్నారు. ఆసాదివాండ్లపల్లిలో ఎన్‌ఎస్‌ఎస్-2 వాలంటీర్లు సోమవారం ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. సమాజంపై బాధ్యతతో మెలిగి స్వచ్ఛందంగా సేవ చేయడానికి ముందుకు రావాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవో భాస్కర్, అధ్యాపకులు శ్యాంసుందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, వాలంటీర్లు పాల్గొన్నారు.

సీఐగా బాధ్యతల స్వీకరణ

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట రూరల్ సర్కిల్ సీఐగా **ఏపీ మస్తాన్** స్థానిక కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కడప, మైదుకూరు సర్కిల్ సీఐగా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన సీఐ రమణను అనంతపురం కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుల్లంపేట, నందలూరు, పెనగలూరు మండలాల పరిధిలోని ఎలాంటి చట్టవ్యతిరేక పనులు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

27న ప్రమాణ స్వీకారం

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని అమ్మవారిశాలలో ఈ నెల 27న ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా పెండ్యాల విజయ్‌కుమార్, పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహిస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్య వైశ్య సంక్షేమ, అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు డూండి రాకేష్ హాజరవుతారని వివరించారు.

గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవశ్రీధర్, కుడా ఛైర్మన్ రూపానందరెడ్డి

పుల్లంపేట, న్యూస్‌టుడే: గ్రామీణులకు మరింత సేవలు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందారెడ్డి అన్నారు. పుల్లంపేట మండలం పీవీజీపల్లెలో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సోమవారం వారు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయన్నారు. గతంలో సచివాలయం అనంతయ్యగారిపల్లెలో ఏర్పాటు చేశారని ప్రజలకు అది అందుబాటు లేకపోవడంతో వెంటనే మార్పు చేశామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచి చంద్రకళ, తెదేపా నాయకులు కృష్ణమనాయుడు, వెంకటరమణనాయుడు, రామచంద్రనాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, నారాయణనాయుడు, వరలక్ష్మి, చిన్నం శివ, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని మండల పరిషత్తు ప్రాంగణంలో ఇటీవల నూతనంగా నిర్మించిన ఆర్‌డబ్ల్యూఎస్ (గ్రామీణ తాగు నీటి పారుదల శాఖ) కార్యాలయాన్ని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సోమవారం ప్రారంభించారు. రూ.30 లక్షల ప్రభుత్వ నిధులతో ఈ భవనం నిర్మించినట్లు వారు చెప్పారు. ఆ శాఖకు చెందిన పాత కార్యాలయం పూర్తిగా శిథిలమవడంతో కొత్త భవనాలను నిర్మించినట్లు చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ రాజంపేట, కోడూరు డీఈలు విజయ్, మహేశ్వర, ఏఈలు రమేష్, సుబ్రహ్మణ్యం, గిరిధర్, సునీత, దినేష్ పాల్గొన్నారు.

కోనమ్మ చెరువుకు జలహారతి

పుల్లంపేట మండలంలో కోనమ్మ చెరువుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ జలహారతి కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కుడా ఛైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి, వరలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ఈ నెల 26న లక్కిరెడ్డిపల్లె మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రెడ్డెయ్య తెలిపారు. సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొంటున్నారని అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

టి.సుధాకర్‌రెడ్డి

పీవీ రమణారెడ్డి

వీరబల్లి, న్యూస్‌టుడే: వీరబల్లి మండల ఎస్టీయూ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి.సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.రఘుప్రసాద్, ఆర్థిక కార్యదర్శిగా ఎం.చంద్రమౌళీ, సభ్యులు ఎంపికయ్యారు.

చిన్నమండెం: చిన్నమండెం మండల ఎస్టీయూ అధ్యక్షుడిగా పీవీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కమాల్‌బాషా, ఆర్థిక కార్యదర్శిగా రామరాజు ఎన్నికయ్యారు.

మార్కెట్ డైరెక్టర్‌కు సత్కారం

పాపయ్యకు జ్ఞాపిక అందిస్తున్న శ్రీశైలం ఆలయ ఛైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన భాజపా కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.పాపయ్యను సోమవారం శ్రీశైలం ఆలయ ఛైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు సత్కరించారు. రైతులకు తోడ్పాటు అందించాలని, వారికి కావాల్సిన సౌకర్యాలను కల్పించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పి.ఆదినారాయణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

పోలు రంగారెడ్డి, తండ్రి శేఖర్‌రెడ్డి, గుట్టక్రింద పల్లె, మాధవరం గ్రామం, రాయచోటి మండలం, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్ అను నాకు సంబంధించి డాక్యుమెంట్ నెంబర్స్ 2565/2025, 4255/2002, 4085/2001 మరియు 1040/2001 గల డాక్యుమెంట్స్ పోయినవి. నేను మా స్వగ్రామం నుండి రాయచోటికి ఆటోలో వెళుతుండగా పైన కనపర్చిన నెంబర్లు గల డాక్యుమెంట్స్ మార్గంమధ్యలో పోయినవి. కావున అవి ఎవరికైనా దొరికి ఉన్న యెడల ఈ క్రింది సెల్ నెంబర్‌కు తెలియజేసి తగిన పారితోషికం పొందగలరని మనవి.

ఇట్లు: పోలు రంగారెడ్డి
Cell : 8555905614

మహారాజశ్రీ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P.No. 12/2025

పసుపులేటి వెంకటేశ్వర, తండ్రి రెడ్డెప్ప, హిందూ, వయస్సు 35 సం॥లు, వ్యాపారం, సాకిన్, డి.నెం. 49/21/3, బోస్‌నగర్ వీధి, రాయచోటి టౌన్ & మం. - పిటీషనరు

Vs

1) ఎం.జనార్దన, తండ్రి రెడ్డెప్ప, హిందూ, వయస్సు 38 సం॥లు, డి.నెం. 2/3, యర్రకోటపల్లె (గ్రా), కలకడ (మం), 2) టి.రమేష్ బాబు, తండ్రి గోపాల్ నాయుడు, 46 సం॥లు, హిందూ, డి.నెం. 25/510, తాళ్లగుండ్లపల్లె (గ్రా), తవకంపల్లె (మం), 3) వెంకటేష్ శెట్టి, వ్యాపారం, డి.నెం. 25-510/8, కె.జి.నగర్, రెడ్డికుంట పోస్టు, చిత్తూరు జిల్లా, 4) డి.కళ్యాణ్, తండ్రి వెంకటేష్, 36 సం॥లు, 8/52, రెడ్డికుంట పోస్టు, 5) మోహన్‌బాబు, తండ్రి సుబ్రమణ్యం, 30 సం॥లు, రెడ్డికుంట పోస్టు, చిత్తూరు జిల్లా, 6) శివరాజ, తండ్రి రాజ, రంగరోడ్డు, శ్రీనివాసపూర్, కోలార్ జిల్లా, 7) టి.రెడ్డి శేఖర్, తండ్రి రెడ్డెప్ప, 4/28, యర్రకోటపల్లె, కలకడ (మం), 8) ఆర్.దేవి, భర్త నాగరాజ, దేవి ఫ్యాన్సీ స్టోర్, పుల్లారెడ్డి హోటల్ వద్ద, శ్రీనివాసపూర్, కోలార్ జిల్లా, 9) టి.ప్రదీప్‌కుమార్, తండ్రి రామమూర్తి, రెడ్డికుంట పోస్టు, చిత్తూరు జిల్లా, 10) గోపి, 38 సం॥లు, 25-510-22, జి.కె.నగర్, రెడ్డికుంట, చిత్తూరు జిల్లా, 11) బి.వెంకటేసు, 30 సం॥లు, ఇంటి నెం. 21, శ్రీ వెంకటేశ్వర లే అవుట్, కట్టిహసల్లి, యల్లహంక, 12) ఎస్.ఎన్.మురళి క్రిష్ణ, తండ్రి తెలియదు, సుభాష్ రోడ్డు, శ్రీనివాసపూర్, కోలార్ జిల్లా, 13) డి.దిల్లి బానుప్రసాద్, తండ్రి తెలియదు, 38 సం॥లు, కొంగారెడ్డిపల్లె, చిత్తూరు జిల్లా, 14) కె.మనోజ్‌రెడ్డి, తండ్రి రెడ్డి, పొట్టేకులవారిపల్లి, కలికిరి (మం), 15) సోమశేఖర్, వయస్సు 55 సం॥లు, డి.నెం. 32/2, మిట్టూర్, చిత్తూరు జిల్లా, 16) సుధాకర, తండ్రి వెంకటేశ్వర, 58-6-2, కొర్లకుంట, జీవకోన, తిరుపతి, 17) సి.రామాంజులు, తండ్రి నాగులయ్య, హయగ్రీవ స్కూల్, తేనెబండ, చిత్తూరు జిల్లా, 18) బి.రవిచంద్ర, తండ్రి తెలియదు, 55 సం॥లు, ఛైర్మెన్, హయగ్రీవ స్కూల్, తేనెబండ గ్రామం, చిత్తూరు జిల్లా, 19) రాము, డి.నెం. 58-6-35, కొర్లకుంట, తిరుపతి. - రెస్పాండెంట్లు

నోటీసు ప్రకటన

పై నెంబరు దావాలో పిటీషనరును ఇన్‌సాల్వెన్సీగా తీర్మానించమని రెస్పాండెంట్లు అయిన మీపైన ఐ.పి. పిటీషన్ను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్నులో మీరు **04-12-2025** తేదీన ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గానీ, వకీలు గారి ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలయును. లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.

ఇట్లు : శ్రీ పి.రెడ్డి బాషా, B.Sc. LL.B., పిటీషనరు పరం అడ్వకేటు, రాయచోటి.

రాజంపేటలో ఉద్యోగ మేళా 28న

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేటలోని ప్రభుత్వ ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 28న ఏపీ రాష్ట్ర డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి నాగార్జున సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రెడ్డీస్, ఫోన్‌పే, ముత్తూట్ ఫైనాన్స్, చాతుర్య స్కిల్స్ వంటి కంపెనీలు వచ్చే ఈ జాబ్‌మేళాకు పది, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, నర్సింగ్, బీటెక్, ఐటీఐ, డిప్లొమా వంటి కోర్సులు చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి సమాచారం కోసం 96037 70097, 95025 27277, 88977 76368కి సంప్రదించాలని తెలిపారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసు అధికారులు అలసత్వం వహించవద్దని జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం.వెంకటాద్రి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చట్ట పరిధిలో బాధితులకు సత్వరం న్యాయం అందించాలన్నారు. పీజీఆర్‌ఎస్‌కు వచ్చే అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత పోలీసు అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమస్య పరిష్కారం కాకపోవడానికి గల కారణాలను తెలుసుకున్నారు. ప్రజలు పోలీసు ఠాణాల వద్దకు తిరగాల్సిన అవసరం లేకుండా నిర్ణీత గడువు లోపు సమస్యలకు పరిష్కారం చూడాలని ఆయన తెలిపారు.

బీసీలకు సీట్లు కేటాయించాలని వినతి

రాయచోటి, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన కులాల వారికి సీట్లు కేటాయించాలని బీసీ సంఘం నాయకులు నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందించారు. దేశ జనాభాలో 50 శాతానికి మించి ఉన్న బీసీలకు ఎన్నికల్లో అధిక ప్రాధాన్యం ఇవ్వాలని విన్నవించారు.

రైతులను ఆదుకోవడంలో విఫలం

రాయచోటి, న్యూస్‌టుడే: రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. ఎస్‌ఎన్‌కాలనీలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. గిట్టుబాటు ధరలు లేక రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. 18 నెలల కూటమి పాలనలో రైతులకు చేసింది శూన్యమన్నారు. రాయచోటిలో అధికార పార్టీ నాయకుల భూకబ్జాలు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని ఆరోపించారు. దాడులు, దౌర్జన్యాలపై పూర్తి స్థాయి విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసు అధికారులను కోరారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ ఎస్.ఫయాజ్‌బాషా, వైకాపా నాయకులు బేపారి మహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

కూటమి ప్రభుత్వంలో రైతుకు పెద్దపీట

రాజంపేట గ్రామీణ: రైతులతో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

సంబేపల్లె, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో రైతుకు పెద్దపీట వేస్తున్నారని వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీలత అన్నారు. సంబేపల్లె మండల పరిధిలోని గుట్టపల్లె, ఎస్.సోమవరం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం రానున్న రోజుల్లో రైతును రాజును చేసేందుకు అయిదు విధానాలతో కార్యాచరణ అమలు చేస్తోందన్నారు.

రామాపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు రైతు బాంధవుడు అని మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రమేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీలో అన్నదాత సుఖీభవ ద్వారా రైతుల ఖాతాలో ప్రభుత్వం రూ. 7 వేల నగదును జమ చేసిందన్నారు.

లక్కిరెడ్డిపల్లె: రైతును రాజు చేసేది కూటమి ప్రభుత్వమేనని ఏపీ అటవీ శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డెయ్య యాదవ్, తెదేపా మండలాధ్యక్షుడు యనమల మదన్ మోహన్, ఏఎంసీ ఛైర్మన్ షఫీనాయక్ అన్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై రూపొందించిన కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు.

సుండుపల్లి, న్యూస్‌టుడే: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు, ప్రకృతి సేద్యం తదితర విషయాలను రైతులకు తెలియజేసి అవగాహన పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సోమవారం నుంచి శనివారం వరకు రైతన్న మీకోసం వారోత్సవాలు అనే కార్యక్రమం చేపట్టిందని ఏవో మహబూబ్‌భాష తెలిపారు. సుండుపల్లి-2 సచివాలయ పరిధి ఎగువ ఈడిగపల్లిలో రైతులతో సమావేశమై ఇందుకు సంబంధించిన ప్రచార పత్రాలను విడుదల చేశారు.

రాజంపేట గ్రామీణ: రైతులకు సాగు నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు తెలిపారు. మండలంలోని వరదయ్యగారిపల్లిలో సోమవారం స్థానిక తెదేపా నేతలతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచి ప్రభుత్వం- రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా సాగు చేసే పంటల వివరాలు, ఎరువుల వాడకం, మార్కెటింగ్ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మేడికొండు రవి కుమార్‌నాయుడు, దగ్గుపాటి సుబ్రహ్మణ్యంనాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంబేపల్లె మండలం గుట్టపల్లెలో సీఎం సందేశ ప్రతులతో రైతులు, వ్యవసాయాధికారులు

5వ వర్ధంతి

మీరు భౌతికంగా మా నుండి దూరమై 5 సంవత్సరములు గడిచిననూ... మీ మధురజ్ఞాపకాలు, దీవెనలు నేటికి, ఎప్పటికీ మా వెన్నంటే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థిస్తున్నాము.

స్వర్గీయ శ్రీమతి కరణం ఇంద్రావతమ్మ గారు
(W/o కీ॥శే॥ కరణం కోదండ రామలింగయ్య)
డి.బి.ఎన్.పల్లి, రాజంపేట.
మరణం : 25-11-2020

కుమారులు: డా॥ కరణం భాస్కర్‌రావు, BDS; కరణం పార్థసారధి
కోడళ్ళు: శ్రీమతి నాగవేణి; శ్రీమతి మహేశ్వరి
కుమార్తె: శ్రీమతి భార్గవి
అల్లుడు: రాపూరి తిరుపతి, Software Engineer, USA

మనుమలు, మనుమరాండ్రు : సిద్ధార్థరామ్, యజ్ఞ కార్తికేయ, ప్రణీత్ క్రిష్ణ, మనశ్విని
మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

ప్రథమ వర్ధంతి



జననం : 11-02-1960
కీ॥శే॥ నాగా పిచ్చిరెడ్డి గారు
మరణం : 07-12-2024
సర్పంచ్, కోనయ్యగారిపల్లె, పుల్లంపేట (మం॥), రాజంపేట.

మంచితనం, మానవత్వం, ఆప్యాయత, అనురాగాలు పంచి మా హృదయాలలో చెరగని జ్ఞాపకాలు మిగిల్చిన కీ॥శే॥ నాగా పిచ్చిరెడ్డి గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

పుల్లంపేట మండలం, కోనయ్యగారిపల్లెలో 26-11-2025వ తేదీ బుధవారం ప్రథమ వర్ధంతి జరుగును.

ఇట్లు : కుటుంబ సభ్యులు

3న ఆర్టీసీ దరఖాస్తుల పరిశీలన

రాజంపేట, న్యూస్‌టుడే: ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తులు డిసెంబరు 3న మధ్యాహ్నం 1 గంటకు పరిశీలన ప్రక్రియ ఉంటుందని రాజంపేట ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ రామమూర్తి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పొందుపరిచిన ధ్రువపత్రాలతో పాటు నమోదు పత్రాన్ని తీసుకుని కర్నూలులోని ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో హాజరు కావాలని సూచించారు.

చోరీపై కేసు నమోదు

సుండుపల్లి, న్యూస్‌టుడే: చోరీపై కేసు నమోదు చేశామని పోలీసులు సోమవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని రెడ్డివారిపల్లెకు చెందిన సురేష్ మంగళ వాయిద్య మేళానికి వెళ్తూ ఉంటారు. ఈ క్రమంలో ఆదివారం ఆయన పనికి వెళ్లగా, భార్య కూడా లక్కిరెడ్డిపల్లి గురుకుల పాఠశాలలో చదువుతున్న కుమార్తె వద్దకు వెళ్లారు. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, వెండి పట్టీలు, రూ.80వేల నగదు చోరీ చేశారు. సాయంత్రానికి తిరిగి వచ్చిన వారు ఇది గమనించి చోరీ అయినట్లు గుర్తించారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఎలక్ట్రీషియన్స్ కావలెను

రాయచోటిలో ఎలక్ట్రీషియన్స్‌గా వర్క్ చేయుటకు డిప్లమా, ITI సర్టిఫికెట్, అనుభవము గల అభ్యర్థులు కావలెను. ఉ॥ 10.00 గం॥ల నుండి 1.00 గంటలోపు క్రింది సెల్ నెంబర్లను సంప్రదించగలరు. Cell : 9989997361, 9989987462.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

విద్యార్థినికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: పెనగలూరు మండలం చక్రంపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం విద్యార్థులకు కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 250 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లేబాకు గోపాల కృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ మస్తానయ్య, ఉపాధ్యాయులు హరిప్రసాద్, అన్వర్‌బాషా, కృష్ణకుమారి, శ్రీవాణి, సదర్శన్, నరసింహులు పాల్గొన్నారు.

15వ వర్ధంతి

అనురాగం, ఆప్యాయత, అనుబంధాలతో ఆదరించిన పుణ్యమూర్తి. కుటుంబ శ్రేయస్సుకు ఎంతో శ్రమించి మమ్మలను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన కార్యశీలి, మీ జ్ఞాపకాలు ఎల్లప్పుడూ మా మదిలో పదిలం. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శోకతప్త హృదయాలతో ...

భార్య : కొండా రామాంజులమ్మ, మాజీ ఎం.పి.టి.సి.
కుమారులు: కొండా భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్; కొండా గంగి రెడ్డి
మరియు కుటుంబ సభ్యులు

కీ॥శే॥ శ్రీ కొండా పక్కీరా రెడ్డి గారు
Ex. Sarpanch, కాటిమాయకుంట (గ్రా), రాయచోటి మండలం, అన్నమయ్య జిల్లా

పారిశ్రామికాభివృద్ధికి అడుగులు

సర్కారు చొరవతో ఆటోనగర్‌లో ఊపందుకున్న పనులు

ఈపూరుపాలెం (చీరాల గ్రామీణం), న్యూస్‌టుడే

ఎట్టకేలకు చీరాల ఆటోనగర్ కల సాకారమవుతోంది. గతంలో వైకాపా పాలకులు తెచ్చిన పారిశ్రామిక విధానాన్ని కూటమి సర్కారు రద్దు చేసి, సరిచేయడంతో పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నారు.

ఈపూరుపాలెం వద్ద ఆటోనగర్ ఏర్పాటు చేసి ఆటోమొబైల్, పలు లఘు,

ఆటోనగర్

మధ్యతరహా పరిశ్రమలు నెలకొల్పాలన్న ప్రణాళికలు 50 ఏళ్ల క్రితమే రూపొందించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తొలినాళ్లలోనే ఎన్టీఆర్ పేరిట 44.57 ఎకరాల్లో ఆటోనగర్‌కు శంకుస్థాపన చేశారు. కానీ స్థలం వద్ద సమస్య ఏర్పడి దశాబ్దాల పాటు జాప్యం చోటుచేసుకుంది. చివరికి న్యాయస్థానం తీర్పుతో అది తొలగి, ఏపీఐఐసీ రూ.కోట్ల వ్యయంతో రహదారులు, విద్యుత్తు సౌకర్యం కల్పించింది. ప్లాట్లు కేటాయించే సమయంలో వైకాపా అధికారంలోకి రావడంతో లబ్ధిదారులు నిరాశ చెందారు. తిరిగి చంద్రబాబు సీఎం కావడంతో ఆటోనగర్‌లో ప్లాట్లు లీజుకు కాకుండా లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసే విధానాన్ని తేవడంతో పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారు.

ఆటోనగర్‌లో మొత్తం 464 ప్లాట్లను మూడు నుంచి అయిదు సెంట్ల విస్తీర్ణంలో వేశారు. చదరపు మీటరుకు రూ.2405 చొప్పున చెల్లిస్తే రిజిస్ట్రేషన్ చేస్తారు. దీనికిముందు మూడు ధ్రువపత్రాలు సమర్పించాలి. ఆడిటర్ వద్ద ప్రాజెక్టు నివేదిక, నెలకొల్పే పరిశ్రమలో ఉద్యోగులు, యంత్రాలు, ఆదాయ వివరాలు తయారుచేసి అందించాలి. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో బ్యాంకులు 70 శాతం రుణం ఇవ్వడానికి ముందుకొస్తున్నాయి. ఇప్పటికి 398 మంది నమోదు చేయించుకున్నారు. నిర్ణీత గడువులోపు పరిశ్రమ పెట్టకపోతే సర్కారు రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసి, వారి ఖాతాలో నగదు జమ చేస్తుంది. ఇప్పటికి నలుగురు పరిశ్రమల ఏర్పాటు పూర్తి చేసి ఈ నెల 28న ప్రారంభించనున్నారు. ఇప్పటికి వంద మంది భవనాల నిర్మాణానికి అనుమతులు పొందారు. 45 మంది బోర్లు ఏర్పాటు చేసుకున్నారు. 20 మంది విద్యుత్తు మీటర్లు పొందారు. మరి కొందరు పునాది పనులు ప్రారంభించారు. తొలి దశలో పేపర్ ప్లేట్ల తయారీ పరిశ్రమలు పెడుతున్నారు. టు ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఇతర పరిశ్రమల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. దీంతో స్థానికంగా ఉంటున్న యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

ఇప్పటికి 398 మంది నమోదు

అభివృద్ధి పనులకు ప్రణాళికలు

ప్రస్తుతం విద్యుత్తు స్తంభాల వరకు ఏర్పాటుచేశారు. త్వరలో వీధి దీపాలు బిగించనున్నారు. ప్రస్తుతం 60 దీపాలు మంజూరయ్యాయి. ఆటోనగర్ నుంచి నేరుగా పక్కనే ఉన్న ఎన్‌హెచ్‌కు అనుసంధానంగా ఒక రహదారి అవసరాన్ని గుర్తించారు. చుట్టూ ప్రహరీ నిర్మించాలని అధికారులు ఆలోచిస్తున్నట్లు ఆటోనగర్ ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామరాజు తెలిపారు.

రేషన్ బండి.. బడ్డీకొట్టుగా మారిందండి

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసేందుకు రూ.1.50 లక్షలతో ఔత్సాహికులు వాహనం తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ వాహనాలు నిలిపివేసింది. దీంతో చందోలుకు చెందిన ఒక వ్యక్తి రేషన్ వాహనాన్ని దుకాణంగా మార్చుకుని అందులో నిత్యావసరాలు, శీతల పానీయాలు విక్రయిస్తున్నారు. బ్యాంకులో రుణం ఉందని.. అది చెల్లించేందుకు ఉపాధి నిమిత్తం వాహనాన్ని ఇలా మార్పు చేసినట్లు తెలిపారు.

- న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం

బాలారిష్టాలు దాటని రైతుబజార్లు

వినియోగదారులు.. రైతుల ప్రయోజనాలకు విఘాతం

న్యూస్‌టుడే, రైలుపేట (బాపట్ల), అంతమ్మచెట్టు (రేపల్లె అర్బన్), నిజాంపట్నం

జిల్లాలో కూరగాయల సాగు విస్తారంగా ఉన్నా రైతుబజార్లు లేక ప్రజలకు తక్కువ ధరలకే నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలు లభించడం లేదు. మార్కెట్లలో దళారులు, వ్యాపారుల మాయాజాలంతో అధిక ధరలకు కొనాల్సి వస్తోంది. రైతుబజార్ల ఏర్పాటులో మార్కెటింగ్ శాఖ క్రియాశీలంగా వ్యవహరించాల్సి ఉంది.

బాపట్లలో ఏడాది కిందట రైతుబజారును ప్రారంభించారు. భవనాన్ని నిర్మించిన ఆరేళ్లకు వినియోగంలోకి వచ్చింది. అయితే అది మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. రైతులు, డ్వాక్రా మహిళలకు దుకాణాలు కేటాయించే విషయంలో మార్కెటింగ్ శాఖ అధికారులు సరిగా వ్యవహరించలేదు. కొద్ది రోజులు రైతు బజారులో విక్రయాలు సాగినా.. తర్వాత విక్రేతలు బయటకు వచ్చి రోడ్డుపై వ్యాపారం చేస్తున్నారు. అధికారులు పలుమార్లు ప్రయత్నించినా వారు భవనం లోపలికి వచ్చి విక్రయించడం లేదు. రైతుబజారును వినియోగంలోకి తీసుకు రావాల్సి ఉంది.

రేపల్లెలో నిర్మాణంలో ఉన్న రైతు బజారు భవనం

● మార్కెటింగ్ శాఖ ఏడీ రమేష్‌బాబు మాట్లాడుతూ ఆరు నియోజకవర్గాల్లో రైతుబజార్లు అందుబాటులోకి తెస్తామన్నారు. వీటి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. కొత్తవి త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

● రేపల్లెలో పురపాలక సంఘానికి చెందిన స్థలంలో రైతుబజారు భవనాలు నిర్మిస్తున్నారు. స్థల వివాదం ఏర్పడి పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. అద్దంకి ఏఎంసీలో రైతుబజారు ఏర్పాటుచేయడానికి స్థలం సిద్ధంగా ఉంది. దుకాణాలు నిర్మించి రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలకు కేటాయించాల్సి ఉంది. చీరాల, వేమూరుల్లో ఎక్కడ ఏర్పాటు చేసేది ఇంకా నిర్ణయించలేదు. పర్చూరు లేదా ఇంకొల్లులో ఒకచోట ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ● మొంథా తుపాను అనంతరం కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. రూ.500 ఖర్చు చేసినా కూరగాయల సంచి నిండని పరిస్థితి. ఆ తర్వాత ధరలు పెద్దగా తగ్గలేదు. రైతులు నేరుగా తమ ఉత్పత్తుల్ని రైతుబజార్ల ద్వారా విక్రయించుకోవడానికి అవకాశం కల్పిస్తే సామాన్యులపై ధరభారం తగ్గుతుంది. నియోజకవర్గ కేంద్రాలతో పాటు చెరుకుపల్లి, నిజాంపట్నం, భట్టిప్రోలు, చినగంజాం, వేటపాలెం, మార్టూరు, మేదరమెట్ల తదితర మండల కేంద్రాల్లోనూ రైతుబజార్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ

పాపరాజుతోట (చీరాల), న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎం.మాధవి తెలిపారు. 18 నుంచి 30 ఏళ్లలోపు ఉండి ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 79814 43777 నంబరును సంప్రదించాలన్నారు.

సాగర్ నీటిమట్టం 583.10 అడుగులు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం సాయంత్రం 7 గంటలకు 583.10 అడుగులకు చేరింది. ఇది 291.9562 టీఎంసీలకు సమానం. శ్రీశైలం నుంచి 36,705 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 21071, కుడి కాలువకు 9,500, ఎడమ కాలువకు 4034, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 1800, లోలెవల్ కెనాల్‌కు 300 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

వ్యాపారులకే ధాన్యం

తేమ శాతం ఎక్కువగా ఉండటమే కారణం ● బ్యాంకు గ్యారెంటీల సమర్పణలో మిల్లర్ల జాప్యం

న్యూస్‌టుడే, బాపట్ల, వేమూరు

పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ధాన్యం సేకరణ ఆశించినట్లుగా లేదు. బ్యాంకు గ్యారెంటీల సమర్పణలో మిల్లర్లు జాప్యం చేస్తున్నారు. ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉండటం.. తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో రైతులు ఎంఎస్‌పీ కన్నా తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

జిల్లాలో 117 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. వేమూరు నియోజకవర్గంలో ఈ నెల 18న ధాన్యం సేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆ నియోజకవర్గ పరిధిలో ఒక్క మిల్లర్ కూడా బ్యాంకు గ్యారెంటీ(బీజీ) సమర్పించలేదు. బీజీలు ఇస్తేనే రైస్ మిల్లులను మ్యాపింగ్ చేసి ఆర్ఎస్‌కేలలో విక్రయించిన ధాన్యాన్ని కేటాయిస్తారు. జిల్లా మొత్తం మీద సోమవారం

బస్తాల్లో నింపిన ధాన్యం

మధ్యాహ్నం వరకు నాలుగు బ్యాంకు గ్యారెంటీలు మాత్రమే మిల్లర్ల నుంచి వచ్చాయి. యంత్రాలతో నూర్పిడి చేయడం వల్ల ధాన్యంలో తేమ శాతం 24 వరకు ఉంటోంది. పౌరసరఫరాల సంస్థ నిబంధనల ప్రకారం తేమ శాతం 17లోపు ఉంటేనే కొనుగోలు చేస్తారు. సాగుదారులు ఆర్ఎస్‌కేలకు వచ్చి పరీక్ష కోసం ధాన్యం నమూనాలు ఇస్తున్నారు. పరికరంతో పరీక్ష చేయగా తేమ శాతం 20పైనే ఉంటోంది. ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలని సిబ్బంది పంపుతున్నారు.

● బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈ నెల 27 నాటికి తుపానుగా మారి భారీవర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ధాన్యాన్ని త్వరగా విక్రయించాలనుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆరబెట్టడానికి ఇష్టపడటం లేదు. వేమూరు నియోజకవర్గ పరిధిలో ఇంతవరకు ఒక బస్తా కూడా విక్రయించ లేదు. 75 కిలోల బస్తా ధాన్యాన్ని రూ.1450కే వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఎంఎస్‌పీ రూ.1792 కన్నా బస్తాకు రూ.342 కోల్పోతున్నారు. ఎకరాకు రూ.12 వేల వరకు నష్టం వస్తున్నా భరిస్తున్నారు. ఇప్పటి వరకు చెరుకుపల్లి, ఖాజీపాలెంలో ఐదుగురు రైతుల నుంచి మాత్రమే ఆర్ఎస్‌కే సిబ్బంది ధాన్యం కొనుగోలు చేశారు. సేకరణ 600 క్వింటాళ్లలోపే ఉంది.

కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంకర్ల నుంచి బీజీలు వెంటనే తీసుకోవాలని పౌరసరఫరాల డీఎంను ఆదేశించినట్లు తెలిపారు. నిర్దేశిత తేమ శాతం లోపు ధాన్యాన్ని రైతులు ఆర్ఎస్‌కేల వద్దకు తీసుకొస్తే కొనుగోలు చేసి సమీపంలో బీజీ చెల్లించిన రైస్ మిల్లుకు కేటాయిస్తామని వివరించారు.

రైతు, రాష్ట్ర ప్రగతికి తోడ్పాటు

మంత్రి గొట్టిపాటి

నాగులపాడు (అద్దంకి), న్యూస్‌టుడే: రైతు, రాష్ట్ర ప్రగతికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన 'రైతన్నా.. మీకోసం' నాగులపాడులో సోమవారం మంత్రి ప్రారంభించారు. రైతుసేవా కేంద్రం వద్ద పథకానికి సంబంధించిన ప్రచార పత్రాన్ని జిల్లా వ్యవసాయాధికారిణి కె.అన్నపూర్ణ పంపిణీ చేశారు. అనంతరం రైతుల ఇళ్లకు వెళ్లి వివరాలు అందించారు. రైతుకు ఆదాయం సమకూర్చడం, ప్రభుత్వ తలసరి ఆదాయం పెంచాలన్నదే పథకం ముఖ్య ఉద్దేశమని వ్యవసాయాధికారులు వెల్లడించారు. సచివాలయాల పరిధిలో పని చేసే సిబ్బందిని బృందంగా ఏర్పాటు చేసి సర్వే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నీటి లభ్యత, పంట గిరాకీ, సాంకేతిక పరిజ్ఞానం, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు తదితర అంశాలను దీనిలో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 326 రైతుసేవా కేంద్రాల్లో ఇది కొనసాగుతున్నట్లు వివరించారు. మండల వ్యవసాయాధికారి కె.వెంకట కృష్ణ, సహాయ వ్యవసాయ సంచాలకుడు బి.ఎఫ్రాయిం, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ప్రచార కరపత్రం అందిస్తున్న రవికుమార్

మిరప మిలమిల

● పెరుగుతున్న ధరలు
● క్వింటా రూ.20 వేలకు చేరే అవకాశం

ఈనాడు - అమరావతి

రెండేళ్లుగా చతికిలపడిన ఎండుమిర్చి ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. క్వింటాలు రూ.20 వేల మార్కును తాకే అవకాశం కనిపిస్తుండడంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. శీతల గోదాముల్లో నిల్వలు క్రమంగా తగ్గిపోతుండడం, కొత్త పంట మార్కెట్‌కు పెద్దగా రాదన్న సంకేతాలే దీనికి ప్రధాన కారణం. మనరాష్ట్రంతోపాటు తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వర్షాల వల్ల దిగుబడులు ప్రభావితమవుతాయన్న అంచనాలున్నాయి. కర్ణాటకలో సాగు విస్తీర్ణం తగ్గడంతో ఏటా మాదిరిగా ఈసారి యార్డుకు సరకు వస్తుందా? రాదా? అన్న మీమాంస మార్కెట్‌ను ప్రభావితం చేస్తోంది. ఈ నేపథ్యంలో అక్టోబరులో మొదలైన మార్కెట్ చలనం నవంబరులోనూ కొనసాగుతోంది. ప్రత్యేక రకాల ధరలు అనూహ్యంగా పెరుగుదల నమోదు చేస్తున్నాయి.

వాతావరణం దెబ్బ.. సాధారణంగా జూన్ నుంచి ఆగస్టు వరకు వర్షాలెక్కువగా కురుస్తాయి. మొక్కల పెరుగుదలకు ఆటంకం ఏర్పడడం, కలుపు పెరగడం, ఎరువులు చల్లే అవకాశం తగ్గడం తదితర కారణాల వల్ల చాలామంది రైతులు ఆగస్టు వరకు వేచి చూస్తుంటారు. ఆ తరువాత మొక్కలు నాటుతారు. ఈ ఏడాది పరిస్థితి మారిపోయింది. అధిక వర్షాలకు రైతులు ధైర్యం చేయలేకపోయారు.

తగ్గిన సాగు రెండేళ్లుగా ధరలు తగ్గుముఖం పట్టడంతో అన్నదాతలు నష్టాలను చవిచూశారు. ఏడాదికిపైగా శీతల గోదాముల్లో నిల్వ చేసినా.. రేట్లు పుంజుకోలేదు. ఈ కారణంగానే సాగు విస్తీర్ణం తగ్గుతోంది. రాష్ట్రంలో 2024 సీజన్లో 3.64 లక్షల ఎకరాల్లో సాగవగా... ఈ సంవత్సరం 2.67 లక్షల ఎకరాలకు పరిమితమైంది. ఏటా సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో నర్సరీల్లో ఎక్కువ రోజులు పెంచిన మిరప మొక్కలను ఆలస్యంగా నాటేవారు. ఈ ఏడాది పరిస్థితి మరీ మందకొడిగా ఉంది.

సరకు రాక... ముందుగా సాగైన పొలాల్లో కొత్త పంట చేతికి రావడం, పెట్టుబడుల కోసం రైతులు గోదాముల్లోని సరకు అమ్మేందుకు ఆసక్తి చూపడంతో నిత్యం యార్డుకు 45 వేల నుంచి 50 వేల బస్తాలొస్తున్నాయి.

నవంబరు 21న మిర్చి యార్డులో ధరలు ఇలా.. (క్వింటాలుకు రూ.ల్లో)

రకం	గరిష్ఠం
334	18,000
341	18,000
బ్యాడిగి	18,500
దేవనూర్ డీలక్స్	17,500
నంబరు-5	16,400
తేజ	16,000

నవంబరు మూడోవారం ముగిసేసరికి 3 రకాల మిర్చి ధరలు బాగా పెరిగాయి. క్వింటాలుకు గరిష్ఠంగా రూ.18,600 పలికింది.

విద్యుత్తు సౌకర్యం సులువుగా పొందొచ్చు

పిట్టలవానిపాలెం, కర్లపాలెం, న్యూస్‌టుడే : ఇప్పటి వరకు విద్యుత్తు లైన్‌కు కొత్తగా కనెక్షన్ తీసుకునే ఇంటికి 30 మీటర్ల దూరం దాటితే స్తంభాల ఖర్చు వినియోగదారుడే భరించాల్సి వచ్చేది. దరఖాస్తు చేశాక, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అధికారులు రుసుం నిర్ణయించేవారు. దానికి అదనంగా సర్వీస్ లైన్, డెవలప్‌మెంట్ ఛార్జీలు అధికారికంగా, సిబ్బంది అనధికారికంగా వసూలు చేసేవారు. ● ఇక నుంచి.. వినియోగదారులకు సత్వర సేవలందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీఈఆర్‌సీ) కొత్త విద్యుత్తు కనెక్షన్ల జారీలో సంస్కరణలు తీసుకొచ్చింది. కొత్త కనెక్షన్, అదనపు లోడ్‌కు కేటగిరీ ఆధారంగా స్థిర ఛార్జీలు నిర్ణయించింది. అదనపు ఛార్జీలు ఎత్తేసింది. సత్వరం కనెక్షన్ అందిస్తామని ఏపీఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు.

కొత్త ఛార్జీలు ఇలా

● **గృహ అవసరాల కనెక్షన్లు (ఎల్‌టీ):** కిలోవాట్‌కు రూ.1,500, ఒకటి నుంచి 20 కిలోవాట్ల వరకు అదనంగా ప్రతి కిలోవాట్‌కు రూ.2 వేల చొప్పున చెల్లించాలి. 20 నుంచి 150 వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.12,600 చొప్పున చెల్లించాలి. ● **వాణిజ్య కనెక్షన్లు:** కిలోవాట్‌కు రూ.1,800, 20 కిలోవాట్ల వరకు అదనంగా ప్రతి కిలోవాట్‌కు రూ.2వేల చొప్పున చెల్లించాలి. 20 నుంచి 150 వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.12,600 చొప్పున చెల్లించాలి. ● **హెచ్‌టీ కనెక్షన్లు:** 75 నుంచి 150 వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.4,400 చొప్పున చెల్లించాలి. నియంత్రికను వినియోగదారే ఏర్పాటు చేసుకోవాలి.

సౌత్ జోన్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని రాధా డిగ్రీ కళాశాల మొదటి ఏడాది విద్యార్థిని ఆకుమల్ల సమీర సౌత్ జోన్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. తమిళనాడులోని తెన్‌కాశిలో ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహించే 44వ సౌత్‌జోన్ పోటీల్లో మన రాష్ట్ర జట్టు తరఫున పాల్గొననుంది. రాష్ట్ర జట్టుకు తిరుపతిలో సోమవారం ప్రారంభమైన శిక్షణకు ఆమె హాజరైంది. ఆమెను కళాశాల డైరెక్టర్ కేవీ రాధాకృష్ణమూర్తి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, అధ్యక్షుడు శివశంకర్, సంయుక్త కార్యదర్శి జోనానాయక్ అభినందించారు.

ఆలేరు వాగు

పరిహారం ఇంకెప్పుడు?

ఆలేరు వాగు అభివృద్ధికి భూములిచ్చిన రైతుల అవస్థలు

ఇంకొల్లు, చినగంజాం, కారంచేడు, న్యూస్‌టుడే

ఆలేరు వాగు ఆధునికీకరణకు భూములిచ్చిన రైతులకు పుష్కర కాలం గడిచినా పరిహారం అందలేదు. 2012లో నియోజకవర్గంలోని వాగుల అభివృద్ధికి అప్పటి ప్రభుత్వం రూ.290 కోట్లు మంజూరు చేసింది. మురుగునీటి పారుదల శాఖ ఆలేరు వాగు ఆధునికీకరణకు ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం మండలాల పరిధిలోని 370 మంది రైతుల నుంచి 117 ఎకరాలు సేకరించింది. వీటి విలువ అప్పటి రెవెన్యూ లెక్కల ప్రకారం రూ.18 కోట్లు. పనులు పూర్తయి ఏళ్లు గడిచినా పరిహారం అందలేదు. ప్రభుత్వాలు మారినా రైతుల గోడు పట్టించుకున్న అధికారులు, నేతలు లేరు.

ఏలూరి సాంబశివరావు మూడోసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన తరువాత దస్త్రాలకు చలనం వచ్చింది. రైతులకు చెల్లించాల్సిన పరిహారం విషయమై అధికారులతో చర్చించి 2012 నుంచి వడ్డీతో లెక్కించి రూ.18 కోట్లకు మరో రూ.4 కోట్లు వడ్డీ కలిపి రూ.22 కోట్లు మంజూరు చేయించారు. ఇది జరిగి ఆరు నెలలు గడిచినా నిధులు విడుదల కాలేదు. దగ్గుబాడు, నాయుడువారిపాలెం, హనుమోజిపాలెం, జరుగులవారిపాలెం గ్రామాల రైతులు శాసన సభ్యుడు సాంబశివరావు ద్వారా పత్రం తీసుకుని గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. విచారించి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కలెక్టర్‌కు ఆదేశాలు అందాయి. గత వారం ఈ విషయమై బాధిత రైతులు మళ్లీ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

సాంకేతిక సమస్య అంటున్నారు.. 'నిధుల విడుదలలో సాంకేతిక సమస్య ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై కలెక్టరు, డిప్యూటీ కలెక్టర్లను కలిసి సమస్యను వివరించాం. సాంకేతిక అంశాలను సరిచేసి, వీలైనంత త్వరగా నిధులు విడుదల చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు' అని దగ్గుబాడుకు చెందిన రైతు ప్రతినిధి ఘంటా విజయకుమార్ తెలిపారు.



ఖేలో ఇండియా పోటీలకు సాంకేతిక అధికారిగా చందోలు వాసి

ఖాజా మొహిద్దీన్

బాపట్ల: రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో ఈ నెల 25 నుంచి 28 వరకు నిర్వహిస్తున్న ఖేలో ఇండియా అంతర విశ్వవిద్యాలయాల జాతీయస్థాయి ఈతల పోటీలకు సాంకేతిక అధికారిగా పిట్టలవానిపాలెం మండలం చందోలుకు చెందిన సీనియర్ క్రీడాకారుడు షేక్ ఖాజామొహిద్దీన్ నియమితులయ్యారు. ఆయన 2022, 2023లో గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీలకు సాంకేతిక అధికారిగా సేవలందించారు. గుంటూరు నగరపాలక సంస్థలో ఈత శిక్షకుడిగా వ్యవహరిస్తున్నారు.

సొంత బిడ్డలా.. ఆడబిడ్డకు అండగా..

యోగా క్రీడాకారిణికి జడ అల్లుతున్న బామ్మ

ఈ చిత్రంలో బామ్మ జడవేస్తున్నది తన మనవరాలికి అనుకుంటే మీరు పొరబడినట్లే.. ఆ బాలిక ఓ యోగా క్రీడాకారిణి. ఏంటీ కథ అనుకుంటున్నారా.. చందలూరులో ప్రస్తుతం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ 69వ రాష్ట్ర స్థాయి యోగా పోటీలు జరుగుతున్నాయి. వీటిలో పాల్గొనేందుకు ఉమ్మడి 13 జిల్లాల నుంచి బాలబాలికలు వచ్చారు. బాలురకు వడ్డవల్లి శేషయ్య, అడ్డగడ్డ భద్రయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో వసతి కల్పించారు. బాలికలకు మాత్రం గ్రామంలో 25 ఇళ్లను ఎంపిక చేసి, వసతి ఏర్పాట్లుచేశారు. ఓ గృహంలోని సుమారు 80 ఏళ్ల వృద్ధురాలు ఇంటికి తన మనవరాలు వచ్చినట్లు.. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన బాలికకు ఎంతో ప్రేమగా జడ వేయడం, క్రీడాకారిణులతో ఆప్యాయంగా మాట్లాడుతున్న దృశ్యాలను 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.

- న్యూస్‌టుడే, చందలూరు (అద్దంకి, జె.పంగులూరు)

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

భూసేకరణ వేగవంతానికి ఆదేశం

బాపట్ల, న్యూస్‌టుడే: జాతీయ రహదారుల ప్రాజెక్టులకు భూసేకరణ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్లో అధికారులతో సోమవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూసేకరణలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. రైల్వే విద్యుత్తు ఉపకేంద్ర నిర్మాణానికి 2.53 ఎకరాల భూసేకరణపై ఆరా తీశారు. రైల్వేస్టేషన్ పరిసరాల అభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. చుండూరు వద్ద లోలెవల్ క్రాసింగ్ పనులు సత్వరమే పూర్తి చేయాలని చెప్పారు. నల్లమడ వాగు, తుంగభద్ర, రొంపేరు రైట్ ఆర్మ్, గణపవరం, సాకీ మురుగుకాలువలు, గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, విస్తరణ పనుల్లో సమస్యలు అధిగమించాలని జలవనరులశాఖ అధికారులకు సూచించారు. బాపట్ల, చీరాల, రేపల్లె, అద్దంకి మండలాల్లో ఎస్టీపీ ప్లాంట్ల నిర్మాణానికి భూసేకరణ పూర్తి చేయాలని చెప్పారు. జిల్లాలో సౌర విద్యుత్తు ప్లాంట్ నిర్మాణ పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు. డీఆర్వో గంగాధర్ గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

అడిగేదెవరు.. అడ్డుకునేదెవరు?

జోరుగా ఇసుక అక్రమ తవ్వకాలు

న్యూస్‌టుడే, బాపట్ల, వేమూరు

చీరాల - బాపట్ల మండలాల సరిహద్దుల్లో ఇసుక, బుసక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అసైన్డ్ భూములు, కుందేరు వాగులో యంత్రాలతో పగలు, రాత్రులు అడ్డగోలుగా తవ్వి రవాణా చేస్తున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదు. చీరాలకు చెందిన కూటమి నేత అండదండలతో దందా సాగుతుండటంతో ఇసుక తరలించే ట్రాక్టర్లపై మాత్రమే కేసులు నమోదు చేసి చేతులు దులిపేసుకుంటున్నారు.

కృష్ణానది పరీవాహక ప్రాంతంలో వేమూరు నియోజకవర్గ పరిధిలోని కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో స్థానిక నేతల అండదండలతో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ట్రాక్టర్లు, లారీల్లో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గనుల శాఖ ఆధ్వర్యంలో ఇంకా ఇసుక తవ్వకాలు ప్రారంభం కాలేదు. నిర్మాణ రంగంలో ఇసుకకు ఉన్న డిమాండ్‌ను అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.

బాపట్ల, చీరాల నియోజకవర్గాల సరిహద్దుల్లో కుందేరు వాగు అక్రమ తవ్వకాలకు అడ్డాగా మారింది. అసైన్డ్ భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి అనుమతులు తీసుకోకుండా యంత్రాలతో ఇష్టారీతిన తవ్వుతున్నారు. 15 నుంచి 20 అడుగుల లోతున పెద్ద గోతులు ఏర్పడ్డాయి. స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా లెక్క చేయడం లేదు. రెండు నియోజకవర్గాల సరిహద్దు కావడంతో అధికారులు ఎవరికి వారు తమది కాదని తప్పించుకుంటున్నారు. వాగు ఆక్రమణలకు గురై తవ్వకాలు

సూవర్ణపురం-ఈపూరుపాలెం సరిహద్దుల్లో ఇసుక తవ్వకం, అసైన్డ్ భూముల్లో ఏర్పడ్డ గొయ్యి

జరుగుతున్నా మురుగునీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. అక్రమ తవ్వకాల విషయాన్ని ఆర్డీవో గ్లోరియా దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భారీ గోతులు ప్రమాదకరంగా తయారయ్యాయి. ప్రమాదవశాత్తూ ఎవరైనా వాటిలో పడితే ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది.

(c) eenadu

బాల ఉషస్సు.. భావి యశస్సు

ఆధునిక పరిజ్ఞానంతో.. సమస్యలకు పరిష్కారాలు
'ఈనాడు' వైజ్ఞానిక ప్రదర్శన'లో అబ్బురపరిచిన ఆవిష్కరణలు

– ఈనాడు, అమరావతి
– కానూరు, పటమట, న్యూస్‌టుడే

సమాజంలో ఎదురయ్యే ప్రధాన సమస్యలన్నింటికీ ఆధునిక పరిజ్ఞానంతో పరిష్కారం చూపించొచ్చని పలువురు విద్యార్థులు చాటిచెప్పారు. రహదారి ప్రమాదాలను నివారించేందుకు వాహనాలకు ఆటోమేటిక్ బ్రేక్ సిస్టమ్, నగరాల్లో స్మార్ట్ పార్కింగ్, వ్యవసాయంలో కీటకాల ముప్పును నివారించేందుకు సోలార్ ట్రాపర్స్, వరదల వేళ మునిగిపోకుండా ఉండే స్మార్ట్ వంతెనలు, కృత్రిమ మేధతో పనిచేసే ఫైర్ ఇంజిన్లు, రైలు ప్రమాదాలను నివారించే రోబో టెక్నాలజీ, కుక్కకాటు నుంచి రక్షించేందుకు చేతులు, కాళ్లకు కవచాలు, యాంటీ సూసైడ్ ఫ్యాన్లు, విద్యుత్తును ఆదా చేసేలా స్మార్ట్‌సిటీ ప్రణాళికలు.. ఇలా విద్యార్థులు రూపొందించిన 85 ప్రాజెక్టులు ఔరా అనిపించాయి. వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు నిర్వహించిన 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన'కు అనూహ్య స్పందన వచ్చింది. కానూరులోని పి.వి.పి.సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో.. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని ఆరు నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులకు సోమవారం నిర్వహించిన ఈ మెగా సైన్స్ ఫెయిర్‌ను తిలకించేందుకు వేలాదిగా విద్యార్థులు తరలివచ్చారు.

శ్రీచైతన్య విద్యాసంస్థలు

1 ఎనర్జీ ఎఫీషియన్సీ స్మార్ట్ సిటీ

విద్యార్థులు: తేజస్విని, భరత్, 10వ తరగతి, జడ్పీహెచ్‌ఎస్ కానూరు

ఆధునిక పరిజ్ఞానంతో సమస్యలకు పరిష్కారం చూపించే నగరం నమూనా. వాహనాలు వచ్చేటప్పుడు వీధి దీపాలు వెలగడం, జాతీయ రహదారులపై గాలి మరల ద్వారా ఆటోమేటిక్‌గా దీపాలను వెలిగించడం, సెన్సార్ల ద్వారా బ్యాంకు చోరీలు జరగకుండా అప్రమత్తమవ్వడం, స్మార్ట్ చెత్త డబ్బాలు, అగ్నిప్రమాదాల వేళ మంటలను నీటితో ఆర్పే సెన్సార్ల వ్యవస్థ.. ఈ ఆరు అంశాలతో రూపొందించిన ఈ ప్రాజెక్టుకు మొదటి బహుమతి వచ్చింది.

2 స్మార్ట్ బ్రిడ్జి

విద్యార్థులు: జి.రోహిత్(9వ తరగతి), ఆర్.దుర్గ(8వ తరగతి), శ్రీమల్లికార్జున హైస్కూల్, గన్నవరం

వరదల సమయంలో వంతెనలు మునిగిపోకుండా పరిష్కారం చూపించే ప్రాజెక్టు. నీటిలో ఉండే సెన్సార్ల ద్వారా వరద ప్రవాహం ఉద్ధృతి, ఎత్తును అంచనా వేసి. . దానికి తగ్గట్టుగా వంతెన ఆటోమేటిక్‌గా పైకి వస్తుంది. దీని వల్ల వాహనాలకు వరద ముంపు ప్రమాదం ఉండదు. ఈ ప్రాజెక్టుకు రెండో బహుమతి వచ్చింది.

3 యాంటీ సూసైడ్ ఫ్యాన్

విద్యార్థులు: జి.కార్తికేయ, బి.వెంకట సందీప్, కె.కార్తిక్, క్రైస్ట్ ది కింగ్ పాఠశాల, క్రీస్తురాజపురం, విజయవాడ

హాస్టల్ గదులు, ఇళ్లు, హోటళ్లలో ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడేవారు ఫ్యాన్లకే ఉరేసుకుంటారు. వీటిని నివారించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. బరువు పెరిగిన వెంటనే ఆటోమేటిక్‌గా ఫ్యాన్ నేల మీదకి దిగిపోతుంది. వెంటనే ఈ ఫ్యానుకు బిగించిన సమయంలో నమోదు చేసిన ఫోన్ నంబరుకు అలర్ట్ మెసేజ్ వెళ్లిపోతుంది. పెద్ద శబ్దంతో అలారం మోగుతుంది. ఈ ప్రాజెక్టుకు మూడో బహుమతి వచ్చింది.

సందడే సందడి..

జ్యోతి వెలిగిస్తున్న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు

ప్రాజెక్టులకు పేటెంట్ తెప్పించాలి

-విజయరామరాజు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్

విద్యార్థులు చేసే ప్రాజెక్టులకు పేటెంట్ కోసం సైన్స్ టీచర్లు దరఖాస్తు చేయాలి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు ఉండాలి. విద్యార్థులు ఏ ఆవిష్కరణ చేయాలన్నా సామగ్రి అందుబాటులో ఉండాలి. కొందరు ఇంజినీరింగ్ విద్యార్థుల్ని అడిగినా చెప్పలేని చిట్కాలు, సెన్సార్ల గురించి ఈ విద్యార్థులు చెప్పడం అభినందనీయం. ప్రభుత్వ పాఠశాలల్లోనూ అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రదర్శన ఏర్పాటు చేసినందుకు 'ఈనాడు'కు ధన్యవాదాలు.

మరిన్ని నిర్వహించాలి..

-పాలడుగు లక్ష్మణరావు, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి

వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థి జీవితంలో కీలకం. సుమారు 85 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని తమ ప్రాజెక్టులను ప్రదర్శించడం అభినందనీయం. 'ఈనాడు' ఆధ్వర్యంలో సమాజ చైతన్యం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. భవిష్యత్తులోనూ మరిన్ని జరగాలి.

ప్రాజెక్టులను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

వినూత్నంగా ఆలోచిస్తే...

–రాజశేఖరబాబు, సీపీ

ప్రతి విషయాన్ని వినూత్నంగా ఆలోచించడం అలవాటు చేసుకోవాలి. అప్పుడే ఆకాశమే హద్దుగా చెలరేగిపోవచ్చు. ప్రతి సందర్భంలోనూ ఇంతకంటే బాగా ఎలా చేయొచ్చు అని ఆలోచించి ఆ దిశగా ప్రయత్నిస్తే మన ప్రయాణం అద్భుతంగా సాగుతుంది. ఏఐ, మిషన్‌లెర్నింగ్, డ్రోన్ ఇలా అన్నీ ఆధునిక పరిజ్ఞానం నుంచి పుట్టుకొచ్చినవే. పాలన, పోలీసింగ్ ఇలా ప్రతి రంగంలోనూ ఆవిష్కరణలు అవసరం.

ప్రోత్సాహక బహుమతులు

లేజర్ సెక్యూరిటీ అలారం

విద్యార్థులు: సీహెచ్.నవీన్, ఇస్మాయిల్, 9వ తరగతి, జడ్పీహెచ్‌ఎస్ బంటుమిల్లి

ఇళ్లకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయడమే లక్ష్యం. ఇళ్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి సెన్సార్లతో అనుసంధానిస్తారు. ఎవరైనా వచ్చి దానిని తాకగానే పెద్ద శబ్దంతో అలారం మోగుతుంది. సెల్‌ఫోన్‌కు అలర్ట్ మెసేజ్ వెళ్లిపోతుంది.

రహదారులపై ప్రమాదాల నివారణ

విద్యార్థులు: పవన్‌కుమార్(10వ తరగతి), ప్రేమ్‌నాథ్(9వ తరగతి), ఎం.కె.బేగ్ హైస్కూల్, అజిత్‌సింగ్‌నగర్

వాహనం వెళ్లేటప్పుడు అకస్మాత్తుగా వచ్చే ప్రమాదాల వేళ ఆటోమేటిక్‌గా బ్రేకులు పడి ఆగిపోతుంది. వాహనానికి బిగించిన సెన్సార్ల ద్వారా.. నాలుగు వైపులా ఎంత దూరంలో ప్రమాదం ఉన్నా వెంటనే కారులో హెచ్చరిక సంకేతాలు వస్తాయి.

పరిశ్రమల వ్యర్థాల నుంచి ఇంకు తయారీ

విద్యార్థులు: యు.ధనశ్రీనివాస్(10వ తరగతి), వేముల అఖిల్(8వ తరగతి), జడ్పీహెచ్‌ఎస్ పరిటాల

పరిశ్రమల నుంచి వాయువులను ఒడిసిపట్టి. . వాటి నుంచి నల్లని ఇంకు తయారు చేయడం లక్ష్యం. ఒక కంటైనర్ లాంటి యంత్రాన్ని పరిశ్రమలు ఉండే ప్రాంతంలో పెడతారు. దాని ద్వారా వచ్చే గాలిలో నుంచి రసాయన వ్యర్థాలను తీసి పౌడర్‌గా మారుస్తారు. స్వచ్ఛమైన గాలిని వదిలేస్తారు. ఆ పౌడర్‌కు నూనెలను కలిపి ఇంకు తయారు చేస్తారు.

డాగ్ బైట్ సాక్స్

విద్యార్థులు: టీ.విశ్వాస్, కుశల్ పవన్‌సాయి, 9వ తరగతి, జడ్పీహెచ్‌ఎస్ తేలప్రోలు

కుక్కలు కరిచినా గాయం కాకుండా తప్పించుకోవచ్చు. పలుచని కాపర్ రేకు, దానిపైన తోలు, గుడ్డతో సాక్స్ రూపంలో తయారు చేసి చేతులు, కాళ్లకు తొడుక్కోవచ్చు. ప్రస్తుతం వీధి కుక్కల బెడద పెరిగిపోయి చాలా మంది చిన్నారులు వాటి బారినపడుతున్నారు. ప్రధానంగా కాళ్లు, చేతులపైనే అవి కరుస్తున్నాయి. అందుకే ఈ డాగ్ బైట్ సాక్స్ తయారు చేశారు.

చట్ట పరిధిలో సత్వర న్యాయం

బాపట్ల, న్యూస్‌టుడే: పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీలను చట్ట పరిధిలో సత్వరమే విచారించి అర్జీదారులకు న్యాయం చేస్తామని ఎస్పీ ఉమామహేశ్వర్ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో మొత్తం 62 అర్జీలు వచ్చాయి. అర్జీదారుల సమస్యలను ఎస్పీ స్వయంగా విని సంబంధిత పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్సైలకు ఫోన్ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలపై తీసుకున్న చర్యల నివేదికలను డీపీవోకు పంపించాలని చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కుటుంబ కలహాలు అత్తింటి వేధింపులు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక మోసాలపై ఎక్కువ అర్జీలు వచ్చాయి. సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్, సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

What your parents meant by responsible spending.

Beyond betteR offer: On-road Price = Ex-showroom Price*

FASTFEST

4 year Standard Warranty 4 year Road Side Assistance 3 Free Services | Exchange through Certified Pre-Owned | Call 1800 102 0909 | volkswagen.co.in

* Terms and conditions apply. Images are for representation purpose. Features and accessories shown may not be a part of standard equipment and are subject to change without prior notice. The actual car colour may vary. The dark shade on the glass is due to the lighting effect. ** 3 Free services applicable on 1 000 kilometers, 7 500 kilometers and 15 000 kilometers. In service, only labour charges are free. To know more on the schemes, please visit your nearest Volkswagen dealership. 1% cess extra for Kerala.

LM AUTO CARS

VIJAYAWADA 8886691748 | GUNTUR 7799711129 | NELLORE 7799711102 | ONGOLE 7799711125 | BHIMAVARAM 8886691749

పిల్లలను బాగా చదివించండి: మంత్రి

నాగులపాడు (అద్దంకి): పిల్లల్ని బాగా చదివించి ప్రయోజకుల్ని చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని నాగులపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం 37 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు సైకిళ్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. రహదారులపైకి వచ్చినపుడు తిరిగి ఇంటికి చేరుకునే వరకు గమనిస్తుండాలని సూచించారు. ముందుగా నాలుగు రోడ్ల కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి, తెదేపా నేతలు నివాళులు అర్పించారు. అనంతరం ఎస్సీ కాలనీలో రూ.30 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని మంత్రి ప్రారంభించారు. రాజధాని అమరావతి నిర్మాణానికి పాఠశాల ఉపాధ్యాయులు పోతినేని శంకర్ కుటుంబ సభ్యులు రూ.50 వేల చెక్కును మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అందించారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)ను సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు మినహాయించాలని ఏపీటీఎఫ్ నేతలు మలాది నాగరాజు, కరి రామయ్యలు మంత్రి రవికుమార్‌కు వినతిపత్రం అందించారు.

విద్యార్థినులతో కరచాలనం చేస్తున్న మంత్రి గొట్టిపాటి

సందడిగా యోగాసన పోటీలు

జె.పంగులూరు, న్యూస్‌టుడే: జె.పంగులూరు మండలం చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న 69వ రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలు ప్రేక్షకులను అబ్బురపరుస్తున్నాయి. సోమవారం రెండోరోజు అండర్-14, 17 కేటగిరీలలో నాలుగు విభాగాల్లో పోటీలు పూర్తయినట్లు నిర్వాహకులు ప్రకటించారు. మూడో రోజు అండర్ 19 విభాగంలో పోటీలు ఉంటాయని చెప్పారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయిని చందలూరి గిరిజ అధ్యక్షతన బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచి, జాతీయ జట్టుకు ఎంపికైనవారు త్వరలో త్రిపుర రాష్ట్రంలో జరిగే జాతీయ యోగాసన పోటీల్లో పాల్గొంటారని రాష్ట్ర పరిశీలకులు పూర్ణచంద్రరావు, శ్రీనివాసరెడ్డి, రాజ్ కుమార్ తెలిపారు. తహసీల్దారు పోపూరి శింగారావు, ఎంపీడీవో కె.స్వరూపరాణి, ఎంఈవో వీరాంజనేయులు, ఎస్సై వినోద్‌బాబు, పీడీలు ప్రతిమ, మధుమూర్తితోపాటు కె.వి.సుబ్బారావు, అడ్డగడ్డ సుబ్బయ్య, వడ్డవల్లి వీరనారాయణ, రావి శ్రీనివాసరావు, రామలింగస్వామి పాల్గొన్నారు.

★ అండర్-14 బాలికల్లో నాయిపాము శృతి (ప్రకాశం, ట్రెడిషనల్ విభాగం), ఆర్టిస్టిక్ ఫెయిర్‌లో కుంచాల హెప్సిబా, నాయిపాము శృతి (ప్రకాశం), రిథమిక్ ఫెయిర్‌లో బి.హర్షిత, ఎస్.జాన్సీలక్ష్మి (విశాఖపట్నం), బాలుర విభాగంలో సురేంద్ర (కృష్ణా ట్రెడిషనల్) ప్రథమ స్థానంలో నిలిచారు.

★ అండర్ -17 బాలికల్లో ఐ.అమృత భవానీ చౌదరి (పశ్చిమ గోదావరి, ట్రెడిషనల్), రిథమిక్ ఫెయిర్‌లో వైష్ణవి, కౌసల్య(విశాఖపట్నం), బాలుర విభాగంలో కార్తీక్‌రామ్ (తూర్పు గోదావరి, ట్రెడిషనల్) ప్రథమ స్థానంలో నిలిచారు.

శృతికి బహుమతి అందజేస్తున్న అధికారులు

వృత్తి పన్ను తప్పనిసరి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ఏదైనా సంస్థలో ఉద్యోగులకు నెలకు రూ.15 వేలకు మించి జీతం చెల్లిస్తున్న ప్రతి యజమాని వారి తరఫున ప్రతినెలా వృత్తి పన్ను కట్టాలని, దీనికోసం ఉద్యోగుల వివరాలు ఆధార్, పాన్, బ్యాంక్ ఖాతా, మొబైల్ నంబరు, మెయిల్ ఐడీ వివరాలను ఈనెల 30 తేదీలోపు అప్‌లోడ్ చేయాలని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనరు ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఇలా చేయడంతో డిసెంబరులో వృత్తి పన్ను రిటర్న్స్ వేయడానికి అవకాశం కలుగుతుందని డిప్యూటీ కమిషనర్లు డి.లక్ష్మీ కుమార్, పి.మల్లికార్జునరావు చెప్పారు. దీనికోసం ఏపీ ప్రొఫెషనల్ ట్యాక్స్ పోర్టల్‌లో నమోదు చేసుకొని, యూజర్ ఐడీ పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలన్నారు. వృత్తి పన్ను అనేది ఆన్‌లైన్ ద్వారానే చెల్లించాలన్నారు. ఏడాదికి రూ.10 లక్షలకు మించి టర్నోవర్ ఉన్న జీఎస్టీ నమోదిత చెల్లింపుదారులు వృత్తి పన్ను ఏడాదికి చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని వారు కోరారు.

ఉపకార వేతన మాక్ పరీక్ష విజేతలు

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని గుళ్లపల్లి జడ్పీఉన్నత పాఠశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యార్థులకు ఉపకార వేతన అర్హత పోటీకి సన్నద్ధమయ్యే విద్యార్థులకు నమూనా పరీక్ష నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం, ముట్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన డి.గాయత్రి, ఎం.సిద్ధి తొలి రెండుస్థానాల్లో నిలిచారు. ఈపురుపాలెం ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థి చైతన్య తృతీయ స్థానంలో నిలిచాడు. ముట్లూరు పాఠశాలకు చెందిన ఎన్.భార్గవి, వి.చరణ్, ప్రకాష్, భావనశ్రీ, రేపల్లె మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన మేఘన, పేటేరు జడ్పీఉన్నత పాఠశాలకు చెందిన లోహిత చరణ్, ఈపూరుపాలెం ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన అభిరామ్ ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో (కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 108, రిటైల్ ధర - 135, చికెన్ విత్‌స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్ - 223.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 117, 124, 136 చికెన్ విత్ స్కిన్ - 222 చికెన్ స్కిన్‌లెస్ - 232.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

91.9 FM Vijayawada 91.9 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించండి

అమృతలూరు, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని కలెక్టరు వినోద్‌కుమార్ చెప్పారు. అమృతలూరు రైతు సేవా కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి పొలాల్లోని ధాన్యాన్ని చూశారు. రైతు సోదరులు మధ్యవర్తులను నమ్మి ధాన్యాన్ని తక్కువ ధరలకు విక్రయించి నష్టపోరాదని సూచించారు. ప్రభుత్వం 75కిలోల బస్తా 'ఏ' గ్రేడు ధాన్యానికి రూ.1792, సాధారణ రకం రూ.1777గా మద్దతు నిర్ణయించినందున కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, బాపట్ల ఏడీఏ ధనరాజు, ఏవో భరత్‌కుమార్, తహశీల్దారు నెహ్రూబాబు, ఎంపీడీవో శేషమాంబ తదితరులున్నారు.

ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పీజీఆర్‌ఎస్‌కు 210 అర్జీలు

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఆయన మాట్లాడుతూ పరిష్కరించని అర్జీలపై అందుకు కారణాలను ఫోన్, వాట్సాప్ ద్వారా అర్జీదారులకు తెలియజేయాలన్నారు. మొంథా తుపాను కారణంగా నష్టపోయిన మత్స్యకారులు, చేనేతలకు నిత్యావసరాలు, పరిహారం పంపిణీని తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. సూర్యలంకలో ఖాళీ భూమిలో ఎనిమిదేళ్లుగా నివాస గృహాలు నిర్మించుకుని ఉంటున్న 30 మత్స్యకార కుటుంబాలను వెంటనే ఖాళీ చేయాలని అధికారులు నోటీసులు ఇచ్చారని మహిళలు ఫిర్యాదు చేశారు. తమ గూడు తొలగించరాదని విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ నిషేధం వ్యవహారంలో పురపాలక అధికారులు ఓ వ్యాపారిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని ఇండియా కూటమి నేతలు సింగరకొండ, రవి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 210 అర్జీలు వచ్చాయి. జేసీ భావన, డీఆర్వో గంగాధర్ గౌడ్, ఆర్డీవో గ్లోరియా పాల్గొన్నారు.

ప్రధాని పురస్కారం జిల్లాకు సాధించేలా కృషి

బాపట్ల, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు సంపూర్ణంగా అమలు చేసి రానున్న ఏప్రిల్ ఒకటిన జిల్లాకు ప్రధానమంత్రి పురస్కారం సాధించేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్లో సోమవారం రాత్రి నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పురస్కారానికి జిల్లా నుంచి దరఖాస్తు చేస్తామన్నారు. దేశంలో 747 జిల్లాలు పురస్కారం కోసం పోటీ పడుతున్నాయన్నారు. హర్ ఘర్ జల్ యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ), పీఎంఏవై అర్బన్, మిషన్ ఇంద్రధనుష్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, పీఎం ఉజ్వల యోజన, పీఎం స్వనిధి, పీఎం మాతృత్వ వందన యోజన, పీఎం విశ్వకర్మ, పీఎం పోషణ్, పీఎం ముద్రా తదితర పథకాలు జిల్లాలో సంతృప్తి స్థాయిలో అమలు చేసేలా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. డీఎంహెచ్‌వో విజయమ్మ, సీపీవో ఎస్.రాజు, పీడీలు రాధ మాధవి, వెంకటేశ్వరరావు, సమన్వయకర్త యశ్వంత్ పాల్గొన్నారు.

EENADU Classifieds

FACULTY/ TEACHERS
Faculty: Bio Chemistry - B.Sc., MSc & Nursing: B.Sc., M.Sc. & Employ: Inter, Degree, Computer. Age: 19-25, Con: Victoria Paramedical Institute, Gnt. ✆: 0863-2222683, 98481 34028, 8332004478.

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.
బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

MARRIAGE SERVICES
వనజారావు క్విక్ మ్యారేజెస్ నందు అన్ని కులముల వారికి సంబంధములు కుదర్చబడును. లక్ష్మీపురం, గుంటూరు. సంప్ర॥ 98666 33988.

PEOPLE CARE

OLD AGE HOME
రామకృష్ణ గ్రూపు, GNT. వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 9154085588, 9154935588.

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL
ఫ్లాష్! ఫ్లాష్! చిలకలూరిపేట హైవే ఫేసింగ్ CRDA అప్రూవల్ వెంచర్. బ్యాంకు లోన్ సౌకర్యం. గజం 7500/- మాత్రమే. Phone: 9133574455.

JOBS
URGENT Req office Manager to Manage and Co-ordinate field Incharges & Employees, Manage inventory (Drones), deal with customers & formers. Age: 30+, Q: Any Degree/ MBA. Exp any field. Adelix pvt ltd, GNT. 93811 75886.
భారతదేశ అగ్రగామి సంస్థలో పార్ట్/ఫుల్ టైం బిజినెస్ పార్టనర్‌గా చేరండి అధిక కమిషన్ పొందండి. అ॥ 10th, వ: 30-65 సం॥. 79892 46788.
PARUL University, GNT ఆఫీసులో పనిచేయుటకు టెలీకాలర్స్ & టెక్నీషియన్ కావలెను. జీ॥ 10-20K ✆ 83743 25002 & 88858 79076.
చైతన్య సాయి పేపర్‌మిల్స్, యడవల్లి నందు పనిచేయుటకు 1) సీనియర్ అకౌంటెంట్ 2) మెయింటెన్స్ సూపర్‌వైజర్స్ (మేనేజర్) 3) లోడింగ్ సూపర్ వైజర్స్ (10th క్లాస్) 4) Eicher డ్రైవర్స్ (10th క్లాస్) 5) అటెండర్స్ (గుంటూరు ఆఫీస్). 9059514555.
మంగళగిరిలో క్రొత్తగా (ప్రారంభం కాబోతున్న) భారత్ పెట్రోలియం బంకులో పనిచేయుటకు పంపు బాయిస్ & గర్ల్స్ మరియు మేనేజరు కావలెను. Ph 9849582369.
గుంటూరులోని ఆస్పత్రి కోసం ఎంట్రీ కన్సల్టెన్సీకు 30 B.Sc/ GNM నర్సింగ్ సిబ్బంది అవసరం. ఆసక్తి ఉన్నవారు. ✆ 83673 77590కు కాల్ చేయండి.
గుంటూరు, ఆటోనగర్‌లో HP పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మేనేజర్, పంపు బాయ్స్/గర్ల్స్ కావలెను. పార్ట్‌టైమ్/ ఫుల్ టైమ్. 77996 89889, 80745 46302.
బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, 3సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30సం॥ల లోపువారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

GOVERNMENT OF ANDHRA PRADESH
SAMAGRA SHIKSHA, BAPATLA DISTRICT

Tenders are invited through e-procurement platform for Tender Notice NIT No. 1 to 5/APSS/CWs/2024-25 dt.24.11.2025 in Samagra Shiksha, Bapatla District for 5 works in the Bapatla District.
Tenders Down loading Starts from : 26.11.2025 after 05.00 PM
Last date for receipt of Tenders : 03.12.2025 up to 05.00 PM
Note: Further details can be viewed at https://tender.apeprocurement.gov.in or contact 7093592009.

Additional Project Coordinator
Samagra Shiksha, Bapatla District.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం – మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ
జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి వారి కార్యాలయము, బాపట్ల, బాపట్ల జిల్లా.
ఆర్.సి.నెం.106/ICPS/CHL/2025 తేది.24.11.2025.

షార్ట్ టెండరు నోటిఫికేషన్

బాపట్ల జిల్లాలో నూతనంగా ప్రారంభించబడుతున్న Child Helpline (CHL) కార్యాలయమునకు అవసరమైన Non-Recurring items అయిన కంప్యూటర్లు మరియు ఫర్నిచరు మొదలగునవి సరఫరా చేయుటకు అర్హులైన సంస్థల నుండి సీల్డ్ టెండర్లు కోరడమైనది. రూ.5,000/- (అక్షరముల ఐదు వేల రూపాయలు) బ్యాంకు డ్రాఫ్ట్ రూపములో జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి, బాపట్ల, బాపట్ల జిల్లా పేరిట చెల్లించి టెండర్ డాక్యుమెంట్లు తేది.25.11.2025 నుండి 02.12.2025, 5.00PM వరకు కార్యాలయ పనివేళలలో పొందవలెను. టెండరును 03.12.2025 తేదీన సాయంత్రం 4.00 గంటలకు శ్రీయుత సంయుక్త కలెక్టరు వారి కార్యాలయము నందు కమిటీ సమక్షంలో తెరువబడును. టెండర్ మార్పులు చేయుటకు, వాయిదా వేయుటకు మరియు రద్దు పరచుటకు ఈ క్రింది సంతకము చేయువారికి పూర్తి అధికారము కలదు. షరతులు వర్తించును. ఇతర వివరములకు జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి వారి కార్యాలయము, బాపట్ల, బాపట్లజిల్లా వారిని సంప్రదించగలరు.

సం/– సంయుక్త కలెక్టరు మరియు ఛైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ, బాపట్ల.

(c) eenadu

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

బీసీలకు సామాజిక న్యాయం అందించాలి

బాపట్లటౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన వాగ్దానాలను చట్టబద్ధంగా అమలు జరపాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు బి.రవికుమార్ అన్నారు. కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో సోమవారం బీసీ నాయకులు కలెక్టర్ వినోద్ కుమార్‌కు పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. పారదర్శకంగా బీసీల కులగణన జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరు ఎంతశాతం ఉన్నారనే విషయం తెలియకుండా రిజర్వేషన్లు కేటాయించటం సరికాదన్నారు. నేతలు తాతయ్య, శివకుమార్, మారం రవికుమార్, కె.రాంబాబు, కృష్ణ, జగదీష్ తదితరులున్నారు.

కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ నాయకులు

భట్టిప్రోలు బౌద్ధ స్తూపాన్ని అభివృద్ధి చేయాలని వినతి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: భట్టిప్రోలు బౌద్ధ స్తూపాన్ని అమరావతి బుద్ధిస్ట్ ప్రాంతంలో చేర్చి అభివృద్ధి చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు బుద్ధిస్ట్ సొసైటీ సభ్యులు వినతిపత్రం అందించారు. ఇటీవల ప్రభుత్వం పర్యాటక శాఖలో ఉన్న బౌద్ధ స్తూపాలను అభివృద్ధి చేసేందుకు సిద్ధమవుతోందని తెలిపారు. భట్టిప్రోలు స్తూపాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే పర్యాటకులు పెరుగుతారని చెప్పారు. సొసైటీ జిల్లా కార్యదర్శి దోవా రమేష్‌రాంజి, అఖిల భారత బహుజన సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.కోటయ్య, సభ్యులు ఉన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధి పనుల పరిశీలన

నగరం, న్యూస్‌టుడే: పూడివాడ ఎస్సీ కాలనీ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను ఎంపీడీవో బొర్రా శ్రీను సోమవారం పరిశీలించారు. ముళ్ల పొదలతో నిండిన శ్మశాన వాటిక రహదారికి రూ.లక్షతో మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. స్థానిక నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమాజహితం కోరి.. ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరి..

న్యూస్‌టుడే, బేతపూడి (రేపల్లె అర్బన్), అడవులదీవి, (నిజాంపట్నం)

కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కావడం లేదు. పల్లె ప్రజల జీవన విధానాన్ని తెలుసుకుని వారిని చైతన్య పర్చేందుకు ముందుకొస్తున్నారు. జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)లో వాలంటీర్లుగా చేరి సమాజ సేవలో భాగస్వాములు అవుతున్నారు. గ్రామాలను దత్తత తీసుకుని ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. రేపల్లె అనగాని భగవంతరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రేపల్లె మండలం బేతపూడిలో ఈనెల 22 నుంచి 28 వరకు సేవా శిబిరం నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి పచ్చదనం పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం, మత్తుపదార్థాలతో కలిగే నష్టాలు, పౌష్టికాహారం ఆరోగ్యం, మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రజలను చైతన్యం చేస్తున్న విద్యార్థులు

ప్రజల సాంఘిక, ఆర్థిక స్థితిగతులు, అక్షరాస్యత, మరుగుదొడ్లు, సంక్షేమ పథకాల సద్వినియోగం, ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే చేస్తున్నారు. సేకరించిన సమాచారాన్ని నివేదిక రూపంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేందుకు కృషి చేస్తున్నారు. నిజాంపట్నం మండలంలోని పలువురు విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరాల్లో పాల్గొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరంలో విద్యార్థులు

ఇంటింటికీ వెళ్లి అవగాహన

విద్యార్థులకు సమాజంపై కొంత అవగాహన అవసరం. ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొని గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పచ్చదనం, పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన కల్పించడం సంతోషంగా ఉంది. ప్లాస్టిక్ అనర్థాలు వివరించగా జనం స్పందించిన తీరు బాగుంది. కొంతమంది ఇప్పటికే ఆచరిస్తున్నామని చెప్పడం సంతోషానిచ్చింది.

-దిల్‌రూబా, ప్రమీలారాణి ద్వితీయ బీఎస్సీ

కొత్త విషయాలు నేర్చుకున్నాం

విద్యార్థులకు క్షేత్ర పర్యటనలు, సమైక్యతా శిబిరాలు ఎంతోగానో ఉపయోగపడుతున్నాయి. క్రమశిక్షణ, సమయపాలన, ఎదుట వ్యక్తులతో ఎలా నడుచుకోవాలో నేర్చుకున్నాం. గ్రామీణ ప్రాంత ప్రజల జీవన విధానం, వారి ఆర్థిక వనరులు, సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై అవగాహన పెరిగింది. జీవితంలో ఉన్నత లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చన్న ఆత్మవిశ్వాసం పెరిగింది.

-అక్షిత, నూర్జహాన్‌షాజియా

వ్యక్తిత్వ వికాసానికి నాంది

విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్ది మంచి పౌరులుగా తయారు చేయడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం. గ్రామంలో నిర్వహిస్తున్న సేవా శిబిరంలో విద్యార్థులు ప్రజలతో మమేకమవుతున్నారు. వారిలో సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలు, బృందంలో పని చేయగల శక్తి సామర్థ్యాలు పెరిగి జీవితంలో రాణించేందుకు కార్యక్రమాలు దోహదపడతాయి.

-డాక్టర్ దాస్, ఎన్ఎస్ఎస్ అధికారి

ఎస్టీయూ మండల నూతన కార్యవర్గం

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ): ఎస్టీయూ చెరుకుపల్లి మండల నూతన కార్యవర్గం ఏర్పాటైంది. సోమవారం చెరుకుపల్లిలోని సంఘ కార్యాలయంలో అధ్యక్షుడు మల్లెల వెంకటశ్రీనివాసరావు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న కార్యవర్గ పదవి కాలం పూర్తి కావడంతో నూతన కార్యవర్గ ఎన్నిక చేపట్టారు. సంఘ పిట్టలవానిపాలెం శాఖ అధ్యక్షుడు ఈమని సాంబశివరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. గుళ్లపల్లి జడ్పీఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కరుకుట్ల కిరణ్ నూతన అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా శిగిరిశెట్టి వేణుగోపాలరావు, ఆర్థిక కార్యదర్శిగా మాణిక్యాలరావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులు ఎం.శ్రీనివాసరెడ్డి, కేసన కోటేశ్వరరావు, ఎన్.సుబ్రహ్మణ్యం, దినేష్, కరిముల్లా, రవిబాబు పాల్గొన్నారు.

కరుకుట్ల కిరణ్

వేణుగోపాలరావు

రేపల్లెలో అయిదు అర్జీలు

రేపల్లె అర్బన్: రేపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అయిదు అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. రేపల్లె మండలం మైనేనివారిపాలెంలో నాలుగురోడ్ల కూడలి పరిసరాల్లో ఆక్రమణలు తొలగించాలని, కారుమూరు ఫిషరీస్ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని, రేపల్లె మూడోవార్డులో ఆక్రమణలు తొలగించాలని, రేపల్లె నాలుగో వార్డు పురాతన భవనంలో వ్యర్థాల నిల్వతో దుర్వాసన వస్తోందని, ఏలేటిపాలెంలో భూమికి సర్వే చేయించి ఆన్‌లైన్లో నమోదు చేయాలని పలువురు అర్జీలు అందజేశారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda — బాపట్ల బ్రాంచి
12-4-11, చడాల వీధి (ఆంజనేయ గుడి వీధి), బాపట్ల-522101, ఫోన్: 08643-220409, మెయిల్: BAPATL@bankofbaroda.com

స్వాధీనతా ప్రకటన (Appendix IV సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 8(1)వ నిబంధన క్రింద స్థిరాస్తిపై)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం **బ్యాంక్ ఆఫ్ బరోడా, బాపట్ల బ్రాంచి,** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, సెక్షన్ 13(12) లోని రూలు 3 ప్రకారం తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **ఋణగ్రహీత: శ్రీ లంకె నాగేశ్వరరావు, తండ్రి: శ్రీ వెంకటేశ్వర్లు,** నివాసము: హౌస్ నెం.7-17, నిజాంపట్నం, బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్-522101, వారిని నోటీసులో పేర్కొనబడిన బకాయి **తేది.23-08-2025 నాటికి రూ.30,71,783.90 పై॥ (అక్షరాల ముప్పై లక్షల డెబ్బైఒక్క వెయ్యి ఏడు వందల ఎనభైమూడు రూపాయలు మరియు పైసలు తొంభై మాత్రమే) ప్లస్ ది.24-08-2025 నుండి వర్తించని వడ్డీ ప్లస్ చెల్లించునాటికి వర్తించు ఇతర ఛార్జీలు** మొ॥నవి నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ది.01-09-2025న డిమాండు నోటీసు జారీ చేయడమైనది.**
సదరు మొత్తాన్ని ఋణగ్రహీత, హామీదారు మరియు తనఖాదారు చెల్లించడంలో విఫలమైనందున, సదరు చట్టంలోని సెక్షన్ 13(4) నందలి రూలు 8 ప్రకారం సంక్రమించిన అధికారాలనువినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ పేర్కొన్న ఆస్తిని **ది.20-11-2025న స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీతలు, హామీదారులు మరియు తనఖాదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.
సదరు ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదనీ, ఎటువంటి లావాదేవీలైనా బకాయిసొమ్ము **తేది.23-08-2025 నాటికి రూ.30,71,783.90 పై॥ (అక్షరాల ముప్పై లక్షల డెబ్బైఒక్క వెయ్యి ఏడు వందల ఎనభైమూడు రూపాయలు మరియు పైసలు తొంభై మాత్రమే) ప్లస్ ది.24-08-2025 నుండి వర్తించని వడ్డీ ప్లస్ చెల్లించునాటికి అయ్యే ఇతర ఛార్జీలు బ్యాంక్ ఆఫ్ బరోడా, బాపట్ల బ్రాంచి** వారి ఛార్జీకి లోబడి ఉంటాయని ఇందుమూలముగా ముఖ్యముగా ఋణగ్రహీతలు, హామీదారులు మరియు తనఖాదారులు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.
సదరు చట్టంలో సెక్షన్ 13(8) ప్రకారం ఋణగ్రహీత, హామీదారు తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

స్థిరాస్తి వివరణ

తనఖాపుంచబడిన స్థిరాస్తి వివరములు: గుంటూరు జిల్లా(ప్రస్తుతం బాపట్ల జిల్లా), మంతెనవారిపాలెం సబ్ జిల్లా, నిజాంపట్నం పంచాయతీ ఏరియా,7వ బ్లాక్, సర్వే నెం.431/10 నందు గల 304 చ॥గ॥ల విస్తీర్ణంలో డోర్ నెం.7-24, అసెస్‌మెంట్ నెం.890తో గల ఆర్‌సిసి భవనమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** కొత్వాల్ షేక్ సుభాని యొక్క ఇంటి స్థలం-60 లి॥లు, **దక్షిణం:** రాజ వీధి-95 లి॥లు, **పడమర:** అబ్దుల్ ఖాదర్ సాహెబ్ యొక్క ఇంటి స్థలం-72 లి॥లు, **ఉత్తరం:** కొత్వాల్ జకారియా యొక్క స్థలం-95 లి॥లు.
స్థలం : బాపట్ల
తేది: 20-11-2025
సం/- చీఫ్‌మేనేజర్ & అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా, బాపట్ల బ్రాంచి, బాపట్ల.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

బాపట్ల, న్యూస్‌టుడే: ? మండల పరిధిలోని పూండ్లలో నివాస గృహాల ముందు రహదారి మార్జిన్లను ఆక్రమించటం వల్ల మురుగు కాలువల్లో పూడిక తీయటానికి వీలులేకుండా ఉంది. **-పూర్ణచంద్రరావు, (గ్రామస్థుడు)**
✔ గ్రామంలోని రహదారి మార్జిన్‌లో ఆక్రమణలు తొలగించి కాలువల్లో పూడిక తీయించేలా చర్యలు తీసుకుంటాం. **-రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో**
? పట్టణంలోని రైలుపేట మెయిన్ రోడ్డులో ప్రైవేటు పాఠశాల వద్ద నెల రోజులుగా వీధి దీపం వెలగటం లేదు. **-వెంకటేష్, కాలనీవాసి**
✔ వెంటనే సిబ్బందిని పంపి కొత్తది ఏర్పాటు చేయిస్తా. **కృష్ణారెడ్డి, పురపాలక డీఈ**
రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ? రేపల్లె 26వ వార్డు పోలీసుల వద్ద మురుగు రోడ్డుపైకి చేరింది. రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. **-బాషా, స్థానికుడు.**
✔ వెంటనే మురుగు తొలగించేలా చర్యలు చేపడతాం. **-శామ్యూల్, ఇన్‌ఛార్జి శానిటరీ అధికారి రేపల్లె**
పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: ? భాజీపాలెం పంచాయతీ పరిధిలోని నాంచారమ్మ ఆలయం వీధిలో ఇళ్ల మధ్యలో చెత్త, వ్యర్థాలు వేస్తున్నారు. **-మనోహర్, భాజీపాలెం**
✔ పరిశీలించి వెంటనే తొలగిస్తాం. **-శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, భాజీపాలెం**

రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యం

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

కూచినపూడి, (అమృతలూరు), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. ఆయన కూచినపూడిలో సోమవారం 'అన్నదాత సుఖీభవ-ఇంటింటి ప్రచారం'లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ విధానం అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని రైతుల ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలను అందజేశారు. వేమూరు మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, బాపట్ల ఏడీఏ దనరాజు, ఏవో భరత్‌కుమార్, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

బేతపూడిలో 'రైతన్న-మీకోసం' కార్యక్రమం

బేతపూడి(రేపల్లె అర్బన్), వేమూరు: రేపల్లె మండలం బేతపూడిలో సోమవారం రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రైతులకు సీఎం సందేశం, కరపత్రాలు అందజేశారు. తొలుత బేతపూడిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. పేటేరు, సింగుపాలెం, గంగడిపాలెం, రాజుకాలువ, గుడిదేవరయంక, నల్లూరు, లైపల్లి రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేస్తారని తెలిపారు. తహసీల్దారు శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ ఏవో మహేష్, వీఆర్వో వెంకటేశ్వర్లు, శివకృష్ణ పాల్గొన్నారు. వేమూరు మండల పరిధిలోని రైతు సేవా కేంద్రాల ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా అన్నదాతల వివరాలను సేకరిస్తున్నట్లు ఏవో ప్రేమ్‌సాగర్ తెలిపారు.

వేమూరు: కరపత్రాలు చూపుతున్న రైతులు

సృజనతో మెరిసి.. బహుమతులు గెలిచి..

బాపట్ల: పట్టణంలోని శ్రీచైతన్య ఉన్నత పాఠశాల, ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు సోమవారం నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీచైతన్య పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు వసంత కిరణ్‌కుమార్ ప్రథమ, ఆసిఫ్ ద్వితీయ, దర్శిరెడ్డి తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ ఎన్వీ మాధురి, ఇన్‌ఛార్జి బి.అజయ్‌కుమార్ బహుమతులు అందజేశారు. విద్యార్థులు లుల్లూ లుకమాన్, హెప్సిబా గ్రేస్, లాస్య మొదటి స్థానాలు సాధించారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ పి.శివాని, ఇన్‌ఛార్జి గాయత్రీదేవి బహుమతులు ప్రదానం చేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ మాధురి, ఇన్‌ఛార్జి అజయ్‌కుమార్

అమృతలూరులో సోషల్ క్లబ్ ప్రారంభం

అమృతలూరు: అమృతలూరు జడ్పీ పాఠశాలలో సోమవారం నూతనంగా 20మంది సభ్యులతో సోషల్ క్లబ్‌ను ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు నిరీక్షణరావు వారికి బ్యాడ్జీలు అందజేశారు. మూడేళ్ల క్లబ్ సేవలందించిన విద్యార్థులు పదో తరగతికి వెళ్లడంతో కొత్తగా ఎనిమిదో తరగతి విద్యార్థులతో క్లబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ముఖ్యమైన దినోత్సవాలు క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, రవి పాల్గొన్నారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda — రేపల్లె బ్రాంచి
5-9-77, మెయిన్ రోడ్డు, కృష్ణా టాకీస్ ఎదురు, రేపల్లె-522265, బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఫోన్: 08648-225055, మెయిల్: repalle@bankofbaroda.com

స్వాధీనతా ప్రకటన (Appendix IV సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 8(1)వ నిబంధన క్రింద స్థిరాస్తిపై)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం **బ్యాంక్ ఆఫ్ బరోడా, రేపల్లె బ్రాంచి,** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, సెక్షన్ 13(12) లోని రూలు 3 ప్రకారం తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **ఋణగ్రహీతలు: 1) శ్రీ అద్దంకి శ్రీనివాసరావు, తండ్రి: అద్దంకి సోమేశ్వరరావు,** హౌస్ నెం.1-132, అల్లముడి, కోనేటిపురం, భట్టిప్రోలు మండలం,బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్-522256, & **2) శ్రీ అద్దంకి గోపి, తండ్రి: అద్దంకి శ్రీనివాసరావు,** హౌస్ నెం.1-132, అల్లముడి, కోనేటిపురం, భట్టిప్రోలు మండలం,బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్-522256, వారికి నోటీసులో పేర్కొనబడిన బకాయి **తేది.31-07-2025 నాటికి రూ.12,59,900.11 పై॥ (అక్షరాల పన్నెండు లక్షల యాభై తొమ్మిది వేల తొమ్మిది వందల రూపాయలు మరియు పైసలు పదకొండు మాత్రమే) ప్లస్ ది.01-08-2025 నుండి వర్తించని వడ్డీ ప్లస్ చెల్లించునాటికి వర్తించు ఇతర ఛార్జీలు** మొ॥నవి నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ది.08-08-2025న డిమాండు నోటీసు జారీ చేయడమైనది. డిమాండు నోటీసు జారీ చేసిన తరువాత ఋణగ్రహీత ది. 31-08-2025న రూ.12,000/- మరియు ది.01-09-2025న రూ.12,000/- మరియు ది.04-09-2025న రూ.12,000/- జమచేసియున్నారు, చెల్లింపులు జమ చేయబడిన తరువాత ది.31-10-2025 నాటికి రూ.12,59,263.42 పై॥ (అక్షరాల పన్నెండు లక్షల యాభై తొమ్మిది వేల రెండు వందల అరవై మూడు రూపాయలు మరియు పైసలు నలభైరెండు మాత్రమే) ప్లస్ వర్తించని వడ్డీ ప్లస్ చెల్లించునాటికి వర్తించు ఇతర ఛార్జీలతో సహా.**
సదరు మొత్తాన్ని ఋణగ్రహీత, తనఖాదారు చెల్లించడంలో విఫలమైనందున, సదరు చట్టంలోని సెక్షన్ 13(4) నందలి రూలు 8 ప్రకారం సంక్రమించిన అధికారాలనువినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ పేర్కొన్న ఆస్తిని **ది.20-11-2025న స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీతలు, హామీదారులు మరియు తనఖాదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.
సదరు ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదనీ, ఎటువంటి లావాదేవీలైనా బకాయిసొమ్ము **ది.31-10-2025 నాటికి రూ.12,59,263.42 పై॥ (అక్షరాల పన్నెండు లక్షల యాభై తొమ్మిది వేల రెండు వందల అరవై మూడు రూపాయలు మరియు పైసలు నలభైరెండు మాత్రమే) ప్లస్ వర్తించని వడ్డీ ప్లస్ చెల్లించునాటికి అయ్యే ఇతర ఛార్జీలు బ్యాంక్ ఆఫ్ బరోడా, రేపల్లె బ్రాంచి** వారి ఛార్జీకి లోబడి ఉంటాయని ఇందుమూలముగా ముఖ్యముగా ఋణగ్రహీతలు, హామీదారులు మరియు తనఖాదారులు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.
సదరు చట్టంలో సెక్షన్ 13(8) ప్రకారం ఋణగ్రహీత, హామీదారు తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

స్థిరాస్తి వివరణ

గుంటూరు జిల్లా, భట్టిప్రోలు సబ్ డివిజన్, భట్టిప్రోలు మండలం, అల్లముడి గ్రామ పంచాయతీ ఏరియా, అల్లముడి గ్రామం, కోనేటిపురం గ్రామ శివారు, డి.నెం.278-1 నందలి 145.2 చ॥గ॥లు లేదా 121.96 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలం అందులో డోర్ నెం.1-132తో గల ఇంటికి సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** రాకపోకలు కోసం ఉమ్మడి మార్గం, **దక్షిణం:** ఆర్ & బి రోడ్డు, **పడమర:** మోర్ల చిన వెంకటేశ్వరరావు ఆస్తి, **ఉత్తరం:** అద్దంకి రామ మోహనరావు ఆస్తి.
స్థలం : రేపల్లె
తేది: 20-11-2025
సం/- చీఫ్‌మేనేజర్ & అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా, రేపల్లె బ్రాంచి, బాపట్ల జిల్లా.

రక్షిత నీరందక ఇబ్బందులు

నాలుగు రోజులుగా రక్షిత మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో ధూళిపూడి ఎస్సీ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లెళ్ల రామిరెడ్డి చెరువు సమీపంలో పంప్‌హౌస్ ఏర్పాటు చేసి కాలనీ ప్రజలకు రక్షిత నీరు సరఫరా చేస్తున్నారు. వరుసగా నాలుగు రోజులు తాగునీరు రాకపోవడంతో కాలనీ వాసులు సచివాలయ ఉద్యోగులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గ్రామకార్యదర్శి సుమ మాట్లాడుతూ బోర్లకు నీరందక నీటిని పంప్ చేసే మోటారు కాలిపోయిందని మరమ్మతులు చేయించి మంగళవారం తాగునీరు పంపిణీ చేస్తామన్నారు. **-న్యూస్‌టుడే, నగరం**

ధూళిపూడి ఎస్సీ కాలనీకి మంచి నీరు అందించే పంప్‌హౌస్

అధ్వాన రోడ్డుతో అవస్థలు

బాపట్ల, న్యూస్‌టుడే: మొంథా తుపానుకు పట్టణంలోని అంతర్గత రోడ్లు దెబ్బతిన్నాయి. సిమెంటు రోడ్లు సైతం గుంతలతో ఎగుడు దిగుడుగా మారాయి. పోలేరమ్మ ఆలయం నుంచి ఇస్లాంపేటకు వెళ్లే రోడ్డు కుంగి, గతుకుల మయంగా ఉండి రాకపోకలకు వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ఒక్కోసారి ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్యపై పురపాలక డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరలో రోడ్డుకు మరమ్మతులు చేయిస్తానని తెలిపారు.

దెబ్బతిన్న సిమెంటు రహదారి

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

చావలి ఉన్నత పాఠశాలలో సైకిల్ స్టాండ్ లేకపోవడంతో విద్యార్థుల సైకిళ్లు ఆరుబయట ఎండలోనే ఉంచాల్సి వస్తోంది. నిత్యం పాఠశాలకు 100 మంది విద్యార్థులు సైకిళ్లపై వస్తుంటారు. అయితే అవి ఎండకు, వర్షానికి తడవడంతో పాడవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. అధికారులు సైకిల్ స్టాండ్ నిర్మాణానికి చొరవ చూపాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో వెంకటేశ్వరరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని చెప్పారు. **-న్యూస్‌టుడే, పెరవలి(వేమూరు)**

చావలి పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల సైకిళ్లు ఇలా..

పీజీఆర్ఎస్‌లో అర్జీదారులకు ఇబ్బందులు

బాపట్ల: కలెక్టరేట్లో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌లో అర్జీదారులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో అర్జీలు ఆన్‌లైన్లో సిబ్బంది రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత కలెక్టర్, జేసీల వద్దకు ప్రజలు వెళ్లి తమ సమస్య తెలియజేసేవారు. ప్రస్తుతం తొలుత కలెక్టర్‌ను కలిసి సమస్య విన్నవించిన తర్వాత అర్జీలను రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. దీని కోసం అర్జీదారులు బారులు తీరి గంటకు పైగా నిలబడాల్సి వస్తోంది. అర్జీ ఇవ్వటానికి వచ్చిన ఓ మహిళ కలెక్టరేట్లో నిలబడి ఉండగా సొమ్మసిల్లి పడిపోయింది. సిబ్బంది, తోటి అర్జీదారులు ఆమెకు సపర్యలు చేశారు.

ఆహార రంగంలో అపార అవకాశాలు

బాపట్ల, న్యూస్‌టుడే: ఆహార సాంకేతిక రంగంలో పట్టభద్రులకు అవకాశాలు అపారంగా ఉన్నాయని ఫుడ్ టెక్నాలజీ నిపుణురాలు సుచరిత అన్నారు. ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు రెండురోజుల దీక్షారంభ్ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులతో ఆమె మాట్లాడుతూ ఆహార రంగంలో అంతర్జాతీయ ప్రమాణాలపై నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. ఆంగ్రూ విశ్రాంత రిజిస్ట్రార్ డి.భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతికవిలువలు, సేవా భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఏడీ బేగ్, ఆచార్యులు సౌజన్య, వినోద్‌కుమార్, సునీత, దిలీప్‌సేన్ తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడి వంగడాలే లక్ష్యం

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: సంగం డెయిరీ అంటే పాడి పరిశ్రమ ఒక్కటే కాదని, రైతులకు కావాల్సిన విత్తనాలు అందిస్తుందని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ నరేంద్రకుమార్ అన్నారు. మండలంలోని కోడూరులో సంగం డెయిరీ అందించిన అర్జున్ ఎస్ఎస్ఆర్-4 రకాలతో సాగు చేసిన వరి పైరును సోమవారం ఆయన పరిశీలించారు. డెయిరీ నూతనంగా అందించిన వరి వంగడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో డెయిరీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వరి పొలం వద్ద ఎమ్మెల్యే నరేంద్రకుమార్, సంగం డెయిరీ సిబ్బంది

కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యం

బాపట్ల, న్యూస్‌టుడే: కష్టపడి పని చేస్తున్న కార్యకర్తలకు పార్టీలో సముచిత గుర్తింపు ఇచ్చి సంక్షేమానికి అధినేత చంద్రబాబు, యువ నేత లోకేష్ చర్యలు తీసుకుంటున్నారని పార్టీ జోన్-3 సమన్వయకర్త, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయనను జిల్లాకు చెందిన నేతలు, కార్యకర్తలు సోమవారం కలిసి పలు సమస్యలు వివరించారు. రెవెన్యూ సమస్యలు పరిష్కారం కావటం లేదని, పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదని సమన్వయకర్త దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, తెదేపా జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి కావటం లేదని బలవన్మరణం

బాపట్ల, న్యూస్‌టుడే: మూడున్నర పదుల వయసు దాటినా వివాహం కావటం లేదన్న బాధతో రైతు కుటుంబానికి చెందిన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పర్చూరు మండలం రమణాయపాలేనికి చెందిన మోదుగుల రామాంజనేయరెడ్డి(37) సూర్యలంకలోని ఓ రిసార్టులో బస చేశాడు. పురుగుమందు తాగి సోమవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. రిసార్టు సిబ్బంది గుర్తించి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనా స్థలాన్ని బాపట్ల గ్రామీణ సీఐ శ్రీనివాసరావు పరిశీలించారు. మృతుడు రాసిన లేఖను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వ్యక్తికి గాయాలు

బాపట్లటౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని సూర్యలంక రోడ్డులో బాపట్లకు చెందిన హనుమంతరావును ద్విచక్ర వాహనం సోమవారం ఢీకొట్టింది. ఘటనలో గాయపడిన బాధితుడిని 108లో ఏరియా వైద్యశాలకు తరలించారు.

నాలుగు లేబర్‌కోడ్లు రద్దు చేయాలని నిరసన

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో రేపల్లె ఆర్టీసీ బస్టాండ్ ఎదుట సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ బాపట్ల జిల్లా కోశాధికారి సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానం పెంచడం దుర్మార్గమన్నారు. పర్మినెంట్‌గా భర్తీ చేయాల్సిన ఉద్యోగాల్లో తాత్కాలిక కార్మికులను నియమిస్తూ దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. లేబర్ కోడ్లు రద్దు చేయాలని ఈనెల 26న పెద్దఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు సాగర్, శివప్రసాద్, రామకృష్ణప్రసాద్, విజయబాబు, ఆశీర్వాదం, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనలో మాట్లాడుతున్న సీహెచ్ మణిలాల్

ఖాళీ స్థలాలు.. విషపురుగుల ఆవాసాలు

న్యూస్‌టుడే, చందోలు (పిట్టలవానిపాలెం), బావాజీపాలెం, కూచినపూడి (నిజాంపట్నం)

పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు, జి.ఎన్.పాలెం, ఖాజీపాలెం, భవనంవారిపాలెం, అల్లూరు, నిజాంపట్నం మండలం బావాజీపాలెం, కూచినపూడి తదితర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి చిట్టడవిలా తయారయ్యాయి. చెట్లు గుబురుగా పెరగడంతో విషసర్పాలకు ఆవాసాలుగా మారాయి. పగలు, రాత్రి తేడా లేకుండా వాటిల్లో నుంచి పాములు, విషపురుగులు, తేళ్లు గృహాల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఒక్కోసారి తలుపులు తీయాలన్నా భయమేస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎటు వైపు నుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాపోతున్నారు.

చందోలులో గుబురుగా పెరిగిన పిచ్చి చెట్లు

అధికారులు చూసి వెళ్తున్నారు అంతే..

కొంతమంది స్థల యజమానులు స్థలాల్లో ముళ్లపొదలు పెరిగినా పట్టించుకోవడం లేదు. సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా ఫలితం ఉండటం లేదు. ఫిర్యాదు ఇచ్చినప్పుడు ఆ స్థలాల వద్దకు వచ్చి చూసి వెళ్తున్నారు తప్ప పరిష్కారం చూపడం లేదు. స్థల యజమానులను పిలిపించి మాట్లాడటం లేదని స్థానికులు వాపోతున్నారు. కొన్ని స్థలాలు పల్లంగా ఉండటంతో వర్షపు నీరు చేరుతోంది. రోజులు తరబడి ఆ నీరు బయటకు వెళ్లకపోవడంతో పరిసర ప్రాంతాల్లోకి దుర్వాసన వ్యాప్తిస్తోంది. దోమల సమస్య ఎక్కువగా ఉందని, దోమ కాటుతో విషజ్వరాలు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ స్థల యజమానులకు నోటీసులు జారీ చేసి వాటిని శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై పిట్టలవానిపాలెం ఎంపీడీవో శేఖర్ మాట్లాడుతూ ఖాళీ స్థల యజమానులకు నోటీసులు అందించమని పంచాయతీ కార్యదర్శులకు చెబుతామన్నారు. నోటీసులకు స్పందించకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భర్త మీద అలిగి విజయవాడకు వెళ్లిన భార్య

కృష్ణలంక, న్యూస్‌టుడే : భర్త మీద అలిగి విజయవాడ బస్‌స్టేషన్‌కు చేరుకున్న వివాహితను పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి బాపట్లలో దుకాణం నిర్వహిస్తున్నారు. భార్య, మూడేళ్ల వయసున్న కుమార్తెతో బాపట్ల ఆదర్శనగర్ బీచ్ రోడ్‌లో ఉంటున్నారు. ఇటీవల ఇద్దరి మధ్య విభేదాలు రాగా భార్య.. భర్తపై అలిగి మూడేళ్ల కుమార్తెతో ఆదివారం విజయవాడ చేరుకుంది. దీంతో భర్త బాపట్ల పీఎస్‌లో భార్య అదృశ్యంపై ఫిర్యాదు చేశారు. సాంకేతికత సాయంతో దర్యాప్తు చేపట్టిన బాపట్ల పోలీసులకు లొకేషన్ విజయవాడ పీఎన్‌బీఎస్ సమీపంలో ఉన్నట్లుగా రాగా కృష్ణలంక పోలీసులను అప్రమత్తం చేశారు. ఈక్రమంలో కృష్ణలంక పోలీసులు బస్‌స్టేషన్‌లో గాలింపు చేపట్టిన క్రమంలో వివాహిత కుమార్తెతో లేడీ డార్మిటరీలో ఉన్నట్లు గుర్తించి వారిని కృష్ణలంక పీఎస్‌కు తరలించారు. సీఐ నాగరాజు కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda — బాపట్ల బ్రాంచి
12-4-11, చడాల వీధి (ఆంజనేయ గుడి వీధి), బాపట్ల-522101, ఫోన్: 08643-220409, మెయిల్: BAPATL@bankofbaroda.com

స్వాధీనతా ప్రకటన (Appendix IV సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 8(1)వ నిబంధన క్రింద స్థిరాస్తిపై)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం **బ్యాంక్ ఆఫ్ బరోడా, బాపట్ల బ్రాంచి,** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, సెక్షన్ 13(12) లోని రూలు 3 ప్రకారం తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **ఋణగ్రహీత: శ్రీ చెన్ను వెంకటరావు, తండ్రి: చెన్ను సాంబశివరావు,** నెం.24-49, గోకర్ణమఠం, నిజాంపట్నం, బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్-522314, **హామీదారు: శ్రీ చెన్ను సాంబశివరావు, తండ్రి: చెన్ను వెంకట రత్నం,** నెం.24-49, గోకర్ణమఠం, నిజాంపట్నం, బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్-522314, వారిని నోటీసులో పేర్కొనబడిన బకాయి **తేది.17-08-2025 నాటికి రూ.26,44,376.64 పై॥ (అక్షరాల ఇరవై ఆరు లక్షల నలభై నాలుగు వేల మూడు వందల డెబ్బైఆరు రూపాయలు మరియు పైసలు అరవైనాలుగు మాత్రమే) ప్లస్ ది.18-08-2025 నుండి వర్తించని వడ్డీ ప్లస్ చెల్లించునాటికి వర్తించు ఇతర ఛార్జీలు** మొ॥నవి నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ది.25-08-2025 న డిమాండు నోటీసు జారీ చేయడమైనది.**
సదరు మొత్తాన్ని ఋణగ్రహీత, హామీదారు మరియు తనఖాదారు చెల్లించడంలో విఫలమైనందున, సదరు చట్టంలోని సెక్షన్ 13(4) నందలి రూలు 8 ప్రకారం సంక్రమించిన అధికారాలనువినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ పేర్కొన్న ఆస్తిని **ది.20-11-2025న స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీతలు, హామీదారులు మరియు తనఖాదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.
సదరు ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదనీ, ఎటువంటి లావాదేవీలైనా బకాయిసొమ్ము **ది.17-08-2025 నాటికి రూ.26,44,376.64 పై॥ (అక్షరాల ఇరవై ఆరు లక్షల నలభై నాలుగు వేల మూడు వందల డెబ్బైఆరు రూపాయలు మరియు పైసలు అరవైనాలుగు మాత్రమే) ప్లస్ ది.18-08-2025 నుండి వర్తించని వడ్డీ ప్లస్ చెల్లించునాటికి అయ్యే ఇతర ఛార్జీలు బ్యాంక్ ఆఫ్ బరోడా, బాపట్ల బ్రాంచి** వారి ఛార్జీకి లోబడి ఉంటాయని ఇందుమూలముగా ముఖ్యముగా ఋణగ్రహీతలు, హామీదారులు మరియు తనఖాదారులు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.
సదరు చట్టంలో సెక్షన్ 13(8) ప్రకారం ఋణగ్రహీత, హామీదారు తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

స్థిరాస్తి వివరణ

తనఖాపుంచబడిన స్థిరాస్తి వివరములు: ఆస్తి నెం.1: గుంటూరు జిల్లా(ప్రస్తుతం బాపట్ల జిల్లా), నిజాంపట్నం గ్రామ పంచాయతీ & మండలం, గోకర్ణమఠం గ్రామం, మంతెనవారిపాలెం సబ్ జిల్లా, సర్వే నెం.340/3ఇ నందు గల ఎ.0.06 సెంట్లు మరియు 76 లి॥లు లేదా 249.07 చ॥గ॥లు విస్తీర్ణంలో డోర్ నెం.24-29తో గల ఆర్‌సిసి భవనమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** పులుగు గౌరమ్మ యొక్క మిగిలిన స్థలం, **పడమర:** పులుగు గౌరమ్మ యొక్క మిగిలిన స్థలం, **ఉత్తరం:** పులుగు గౌరమ్మ యొక్క మిగిలిన స్థలం, **దక్షిణం:** రోడ్డు.
ఆస్తి నెం.1: గుంటూరు జిల్లా(ప్రస్తుతం బాపట్ల జిల్లా), నిజాంపట్నం గ్రామ పంచాయతీ & మండలం, గోకర్ణమఠం గ్రామం, మంతెనవారిపాలెం సబ్ జిల్లా, సర్వే నెం.340/3ఇ నందు గల 2395 లి॥లు లేదా 115.9 చ॥గ॥లు విస్తీర్ణంలో డోర్ నెం.24-29తో గల ఆర్‌సిసి భవనమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** చెన్ను రమణారావు యొక్క భూమి, **పడమర:** పులుగు సాంబశివరావు యొక్క స్థలం కొంతమేర మరియు పులుగు గౌరమ్మ యొక్క మిగిలిన స్థలం కొంతమేర, **ఉత్తరం:** పులుగు సాంబశివరావు యొక్క భూమి, **దక్షిణం:** షెడ్యూలు ఆస్తిలోని ఐటం నెం.1 యొక్క ఆస్తి.
ప్రస్తుత మరియు భవిష్యత్తులో అందులో నిర్మించిన, నిర్మించబోయే అన్ని భవనాలు, నిర్మాణములు మరియు అన్ని పై సౌకర్యములతో కలిపి (ముఖ్యంగా 1) ది.24-01-1994 నాటి దస్తావేజు నెం.26/1994 2) ది.05-05-1994 నాటి దస్తావేజు నెం.296/1994 (క్రింద వివరించబడినవి)
స్థలం : బాపట్ల
తేది: 20-11-2025
సం/- చీఫ్‌మేనేజర్ & అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా, బాపట్ల బ్రాంచి, బాపట్ల.

(c) eenadu

నేడు ప్రాంగణ ఎంపికలు

పావరాజుతోట (చీరాల), న్యూస్‌టుడే: ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రాంగణ ఎంపికలు జరగనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మురళి తెలిపారు. 30 ఏళ్లలోపు వయసు కలిగి ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన యువతీయువకులు తమ ధ్రువపత్రాలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావచ్చని చెప్పారు.

25 అర్జీలు దాఖలు

చీరాల (గ్రామీణం), న్యూస్‌టుడే: చీరాల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 25 అర్జీలు దాఖలయ్యాయి. వీటిలో ఇళ్ల స్థలాల కోసం 20, సర్వే 2, పింఛన్, వెబ్‌ల్యాండ్, రెవెన్యూ రికార్డుల సరి చేయడం కోసం ఒక్కోటి ఉన్నాయి. తహసీల్దార్ గోపీకృష్ణ, డీటీ సూర్యనారాయణ, పలు శాఖాధికారులు పాల్గొన్నారు.

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

26న నిరసన

మార్టూరు, న్యూస్‌టుడే: రైతుల న్యాయమైన సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఈనెల 26న అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో తలపెట్టిన నిరసనలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఏపీ రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతుల సంఘం, సీఐటీయూ నాయకులు కోరారు. సోమవారం నిరసన కార్యక్రమ కరపత్రాలను సీఐటీయూ కార్యాలయం వద్ద విడుదల చేశారు. నాయకులు వి.హనుమంతరావు, సూరిబాబు, శేషాద్రి, రాంబాబు, వి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

27న సీతారాముల కల్యాణం

పర్చూరు: స్థానిక శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో ఈనెల 27న శ్రీ సీతారాములవారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన కల్యాణ వేదిక, వంటశాల, అతిథి గృహాలను ఈనెల 26న ప్రారంభించనున్నట్లు చెప్పారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రామ్‌నగర్ మలుపులో తీవ్ర దుర్గంధం

నాగులపాడు రహదారి వెంబడి నిలిచిన మురుగు

రామ్‌నగర్(అద్దంకి), న్యూస్‌టుడే: రామ్‌నగర్ నుంచి నాగులపాడు వెళ్లే రహదారి వెంబడి మురుగునీటి కాలువలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. విస్తరిస్తున్న పట్టణంలో భాగంగా ఈ మార్గంలో బహుళ అంతస్తు భవనాలు, కల్యాణ మండపం, ఎక్సైజ్ కార్యాలయం వంటివి ఉన్నాయి. దీనికితోడు జాతీయ రహదారి, నాగులపాడు, వెంకటాపురం తదితర గ్రామాలకు వెళ్లేందుకు ఇదే దగ్గరి దారి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రోడ్డు వెంబడి మురుగునీటి గుంతల్లో నీరు నిలిచి, దుర్వాసన వెదజల్లుతుండటంతో ప్రయాణికులు, ఉదయం నడక సాగించే వారు విమర్శిస్తున్నారు. ఈ ప్రాంతంలో నిర్మిస్తున్న అంతర్గత రహదారి కారణంగా సామగ్రి కాలువలో పడటంతో మురుగు పారుదల నిలిచినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈవిషయమై పురపాలక ఏఈ జి.లోకేష్‌ను వివరణ కోరగా రూ.30 లక్షలతో రామ్‌నగర్ నుంచి 250 మీటర్ల పొడవున కాలువ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. ఈలోగా కచ్చా కాలువ ఏర్పాటు చేసి మురుగునీటిని దిగువకు పారుదల అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నీటి పారుదలకు అడ్డంకులు.. ముంపులో గృహాలు

చెరువుకు వెళ్లకుండా కాలువలో నిలిచిన నీరు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: వర్షపు నీటిని చెరువుకు వెళ్లకుండా అడ్డంకులు కల్పించడంతో తమ గృహాలు, భూములు ముంపునకు గురవుతున్నాయని రైతులు, ప్రజలు కలెక్టరు ఫిర్యాదు చేశారు. నాగుల చెరువుకు గతంలో వర్షపు నీరు వచ్చేది. ఇటీవల చెరువుకు నీరు వెళ్లే మార్గంలో కాలువ ఏర్పాటు చేయడంతో నీరు దిగువకు వెళ్లకుండా ఇదుపులపాడు డొంక పొర్లి గృహాలు, సాగుభూములు మునిగిపోయి, కోతకు గురయ్యాయి. చెరువు అభివృద్ధి పేరుతో ఈ ఏడాది సుమారు రూ.55 లక్షలు ఖర్చుచేశారు. సమస్య పూర్తిగా పరిష్కారం కాకపోగా కొత్తది తెచ్చిపెట్టారు. అధికారులు స్థానిక నాయకుల మాటలు విని నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టడంతో సమస్య ఏర్పడిందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఒకవైపు నూతనంగా చెరువులు, కుంటలు ఏర్పాటు చేసుకోమని ప్రోత్సహిస్తుంటే చెరువుకు నీరువచ్చే మార్గంలోని సుద్దబావి కుంటను పంచాయతీ సభ్యుల అనుమతి లేకుండా పూడ్చి వేశారని, విచారణ జరిపి సమస్యలు పరిష్కరించాలని కలెక్టరుకు 30 మంది సంతకాలతో పంపిన వినతిలో పేర్కొన్నారు. కలెక్టరుకు పంపిన ప్రతిని పంచాయతీ కార్యదర్శికి, సోమవారం రెవెన్యూ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులకు అందజేశారు.

కాలువ మాయం.. తప్పని అదనపు వ్యయం

పైపులతో నీరు పెట్టుకుంటున్న రైతులు

చందలూరు(జె.పంగులూరు, అద్దంకి), న్యూస్‌టుడే: పమిడిపాడు మేజరు నుంచి చందలూరు మైనరు కాలువ ద్వారా పొలాలకు నీరు అందాలి. పొలాల్లోని పంట కాలువల్లో రైతులు దున్నేయడంతో దిగువ రైతులు నీటి తడుల కోసం ఆయిల్ ఇంజిన్లు, పైపులు ఉపయోగించాల్సి వస్తోంది. ఈ పరిస్థితి జె.పంగులూరు మండలం చందలూరు-పంగులూరు మధ్య నెలకొంది. చందలూరు గ్రామానికి చెందిన రైతు మంగిశెట్టి హరి నాలుగు ఎకరాల్లో మిరప సాగు చేశారు. కౌలు భూమి అయినందున మిరప తోటలకు నీరు పెట్టుకోవాలంటే ఎగువన గల పొలాల్లోని కాలువలు లేకుండా పోయాయి. దీంతో చేనుకు రెండోవైపున గల కుంట నీటిని చమురు యంత్రానికి పైపులు అమర్చుకుని తడులు అందిస్తున్నారు. ఒక్కో తడికి రూ.3వేలు అదనపు ఖర్చు అవుతోందని, ఎగువన పదెకరాల్లోని కాలువను దున్నేసి పొలంలో కలుపుకొన్నారని తెలిపారు. తక్షణం ఆక్రమణలు తొలగించి పంట కాలువల్ని పునరుద్ధరిస్తే నీటి సరఫరా జరుగుతుందని చెప్పారు.

ఉపన్యాసం అదరగొట్టారు... బహుమతులు పట్టేశారు

చీరాల, అద్దంకిలో విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న పాఠశాల ప్రతినిధులు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. సోమవారం ఫ్రైడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా వి.వెన్నెల, పి.సోహిత్ కుమార్, ఎ.మౌనిక శ్రావ్య సాధించారు. వీరికి 'ఈనాడు' తరఫున జ్ఞాపికలను పాఠశాల ప్రధానాచార్యుడు అశోక్ బాబు అందజేశారు. ఉపాధ్యాయినులు మస్తానమ్మ, సాయి ఉన్నారు.

అద్దంకి, న్యూస్‌టుడే: చరవాణితో కలిగే మంచిని మాత్రమే గ్రహించాలని, చెడును వదిలేయాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 'చరవాణి వలన కలిగే ప్రయోజనాలు, నష్టాలు'పై విద్యార్థినులు మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బి.లాస్య, ఎం.ప్రేమలత, షేక్ మిస్బాటబాసుంలు నిలిచారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు టి.నాగప్రసన్న, ఉపాధ్యాయులు కె.శారద, జేకే.సుదర్శన రాజు, ఎం.ఉమాజ్యోతి పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలకు 150 మంది హాజరు

వేటపాలెం, న్యూస్‌టుడే: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం అలెంబిక్ ఫార్మాస్యూటికల్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు ఫార్మసీ, ఎంబీఏ విభాగాలకు చెందిన 150 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఎంపికలకు ముందు నిర్వహించిన సమావేశంలో కంపెనీ ఆవిర్భావం తదితర విషయాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థులకు దాని ప్రతినిధులు వివరించారు. ఎంపికల అధికారి ఎన్.పూర్ణచంద్రరావు ఉన్నారు.

కలగా అండర్‌పాస్ నిర్మాణం

ఏల్చూరు (సంతమాగులూరు), న్యూస్‌టుడే: నార్కట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల(నామ్) ఎక్స్‌ప్రెస్ రహదారిలో సంతమాగులూరు మండలం ఏల్చూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు వెళ్లే మలుపు వద్ద ప్రతిపాదిత అండర్‌పాస్ నిర్మాణం స్థానికులకు కలగా మిగిలింది. పది వేలకు పైగా జనాభా, వేల సంఖ్యలో పశుసంపద, 600 మందికి పైగా విద్యార్థులు రోజూ రహదారి దాటి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు వెళ్లే మలుపు వద్ద అండర్‌పాస్ నిర్మించాల్సి ఉంది. 2010లో నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మాణం ఈ మార్గంలో చేపట్టారు. ఏల్చూరు పంచాయతీ పరిధిలో టోల్‌ప్లాజా నిర్మాణం పూర్తి చేసి, నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగించే వేల సంఖ్యలో వాహనదారుల నుంచి టోల్ రుసుం వసూలు చేస్తున్నారు. ఏల్చూరు జడ్పీ పాఠశాల మలుపు వద్ద, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం సమీపంలోని మూల మలుపు దగ్గర నామ్ రహదారి విస్తరణ పనులు పూర్తి చేయలేదు. ఈ క్రమంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మలుపు వద్ద రహదారి అంచుల్ని ప్రైవేటు శుద్ధజల కేంద్రాల నిర్వాహకులు ఆక్రమించి, నీటి వ్యాపారం చేస్తున్నారు. దీంతో నిత్యం భారీ వాహనాలు తాగు నీటిని డబ్బాల్లో నింపుకొనేందుకు ఈ మలుపు వద్ద పదుల సంఖ్యలో బారులు తీరి, ఆగుతున్నాయి. దీంతో ప్రమాదకర మలుపులో అండర్‌పాస్ లేకపోవడం, నిత్యం రవాణా స్తంభించడంతో రహదారి దాటి పాఠశాలకు వెళ్లే 600 మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఇక్కడ ఎలాంటి ప్రమాదం జరుగుతోందని క్షణం క్షణం భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలేదు. ఈ ప్రాంతంలో శాశ్వత పరిష్కారానికి అండర్‌పాస్ నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానికులు కోరుతున్నారు.

ఏల్చూరు మలుపు వద్ద నిర్మించాల్సిన ప్రతిపాదిత ప్రదేశం

ఎంపీడీవోగా విజయ

చీరాల (గ్రామీణం), న్యూస్‌టుడే: చీరాల ఎంపీడీవోగా తిరిగి ఎన్.విజయ నియమితులయ్యారు. పెద్దదోర్నాల ఎంపీడీవోగా ఉన్న ఈమె చీరాలకు డిప్యూటేషన్‌పై వచ్చిన సంగతి తెలిసిందే. అక్కడ ఈవోగా ఉన్న ప్రసూన పదోన్నతిపై ఎంపీడీవోగా చీరాల కోరుకొని ఇక్కడ విధుల్లో చేరారు. వారం రోజులు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి మళ్లీ డిప్యూటేషన్‌పై పెద్దదోర్నాల ఎంపీడీవోగా ప్రసన్న వెళ్లగా.. అక్కడ ఉన్న విజయ తిరిగి చీరాల రావడం విశేషం. సోమవారం ఈమె తాజాగా బాధ్యతలు స్వీకరించారు.

దుర్గంధంతో అవస్థలు

రోడ్డు పక్కన వ్యర్థాలు

దండుబాట (చీరాల), న్యూస్‌టుడే: స్థానిక దండుబాటలో వేస్తున్న చెత్తతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో సేకరించిన చెత్తను కొన్ని సందర్భాల్లో దండుబాట పక్కన వేస్తుండటంతో దుర్వాసనతో పాటు దోమలు ఇబ్బంది పెడుతున్నాయి. దీనికితోడు అపరిశుభ్ర వాతావరణంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. అధికారులు స్పందించి చెత్తను రోడ్డు పక్కన వేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

మేదరమెట్ల, న్యూస్‌టుడే: ? మేదరమెట్ల బస్టాండ్ ఆవరణలో దీపాలు లేవు. ఒంగోలు వైపు వెళ్లే ప్రయాణికులు రాత్రి సమయంలో చీకట్లోనే బస్సు కోసం వేచిఉండాల్సి వస్తోంది. దీపాలు ఏర్పాటు చేయగలరు. **ప్రయాణికులు, మేదరమెట్ల**. ✔ త్వరలోనే దీపాలు ఏర్పాటు చేయిస్తాం. సమస్యను పరిష్కరిస్తాం. మోహబూబీ, ఇన్‌ఛార్జి డీఎం, అద్దంకి డిపో

చినగంజాం, న్యూస్‌టుడే: ? సంతరావూరు పశువైద్యశాల ప్రాంతంలోని వీధి దీపాలు వెలగక రాత్రులు ఇబ్బందిగా ఉంది. సమస్యను పరిష్కరించండి. సుబ్బారావు, స్థానికుడు ✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి, రెండు రోజుల్లో వీధి దీపాల సమస్యను పరిష్కరిస్తా. **కె.కృపారావు, కార్యదర్శి, సంతరావూరు**

తొలగిన చెత్త

వేటపాలెం, న్యూస్‌టుడే: బద్రిరాజు తోటలో వారం రోజులుగా చెత్తను తొలగించడంలేదు. దీంతో దుర్వాసన వస్తోందని ఆ ప్రాంతవాసులు 'మేమున్నాం... మీకు తోడుగా' దృష్టికి సోమవారం తీసుకొచ్చారు. దీనికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి సురేంద్ర పారిశుద్ధ్య సిబ్బందిని పంపి, అక్కడ బాగుచేయించారు. అంతేకాకుండా ఇంటింటి చెత్త సేకరణ చేపట్టారు.

చెత్త సంపద కేంద్రం వద్ద బాగు

పర్చూరు, న్యూస్‌టుడే: కొల్లావారిపాలెంలో చెత్తసంపద కేంద్రం వద్ద బయటే చెత్తాచెదారం వేయడంతో దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు ఈనెల 22న 'మేమున్నాం..మీతోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై వార్త ప్రచురించగా స్పందించిన పంచాయతీ కార్యదర్శి అనూష సోమవారం ఆ ప్రాంతంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి, బ్లీచింగ్ చల్లించారు.

స్పందనకు వందనం

నెరవేరిన ముప్పవరం వాసుల కల

మినీ బైపాస్ రహదారి

ముప్పవరం(జె.పంగులూరు, అద్దంకి), న్యూస్‌టుడే: జె.పంగులూరు మండలం ముప్పవరం వాసులు ఆశించిన విధంగా జాతీయ రహదారి నుంచి మినీ బైపాస్ నిర్మాణం తొలి దశ పూర్తయింది. జాతీయ రహదారి నుంచి జిల్లా కేంద్రం బాపట్ల, చీరాల రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, జె.పంగులూరు మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లాలంటే ఇరుకు రహదారి దిక్కు.

ఈక్రమంలో మినీ బైపాస్ నిర్మాణానికి కొండమూరు డొంక మలుపులోని పెట్రోలు బంకు నుంచి హైవే వరకు సుమారు 1.2 కి.మీ. పాత రోడ్డును గుర్తించారు. దాని అభివృద్ధి, విస్తరణ పనులకు ర.భ శాఖ నిధులు రూ.కోటి మంజూరు చేశారు. 35 అడుగుల వెడల్పుతో గ్రావెల్ రహదారి నిర్మించారు. జాతీయ రహదారి పక్కనే గల ఎస్సీ కాలనీ సమీపంలో రోడ్డు మధ్యలో విద్యుత్తు స్తంభాలు తొలగించాల్సి ఉంది. రెండో విడతలో మరో రూ.రెండు కోట్ల నిధులతో తారు రోడ్డు నిర్మాణానికి ఒకటి, రెండు రోజుల్లో మంజూరయ్యే అవకాశం ఉందని ర.భ. శాఖ ఏఈ శివన్నారాయణ వెల్లడించారు.

వివాదాస్పద భూములపై నివేదిక సిద్ధం చేయండి

కొమ్మాలపాడులో మాట్లాడుతున్న విద్యుత్తు శాఖ మంత్రి రవికుమార్

అద్దంకి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో వివాదాస్పద భూములకు సంబంధించి నివేదిక సిద్ధం చేయాలని విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రెవెన్యూ అధికారులకు సూచించారు. మండలంలోని నాగులపాడు ఎస్సీ కాలనీలో రూ.30 లక్షలతో నిర్మించిన సామాజిక భవనం ప్రారంభించిన అనంతరం అర్జీదారులతో మాట్లాడారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ అద్దంకి ప్రాంతంలో ప్రభుత్వ భూములు పూర్తిస్థాయిలో అన్యాక్రాంతమయ్యాయని, దేవాదాయ శాఖ భూములు ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నట్లు చెప్పారు. అన్ని వివరాలను సర్వే అనంతరం నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ జి.శ్రీచరణ్‌కు సూచించారు. చుక్కల భూములు, నిషేధిత భూముల్లో సాగు చేసుకునే వారు అనుభవించేందుకు మాత్రమే అర్హులని, వాటికి పట్టాలు ఇచ్చే అవకాశం లేదన్నారు.

18 సామాజిక భవనాల నిర్మాణం: అద్దంకి నియోజకవర్గంలో 18 సామాజిక భవనాలు నిర్మించినట్లు మంత్రి వెల్లడించారు. వాటిని పారిశ్రామికవేత్తల సాయంతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. దీంతోపాటు ఎనిమిది గ్రామాల్లో పూర్తిస్థాయిలో విద్యుత్తు స్తంభాలు మార్పు చేశామని, తరువాత నాగులపాడులోనూ మారుస్తామన్నారు. ఈఈ నల్లూరి మస్తాన్ రావు, వ్యవసాయ, స్వచ్ఛాంధ్ర మిషన్ సంచాలకులు నాగినేని రామకృష్ణ, చిన్ని శ్రీనివాసరావు, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఛైర్మన్‌లు చుండూరి మురళీసుధాకరరావు, గుంజి శ్రీనివాస్, తెదేపా నేతలు కరి పరమేష్, పెంట్యాల రామాంజనేయులు పాల్గొన్నారు.

రైతులందరికీ ప్రయోజనం చేకూరాలి

కొమ్మాలపాడు (సంతమాగులూరు), న్యూస్‌టుడే: అర్హులైన రైతులందరికీ లబ్ధి చేకూరేలా ప్రభుత్వ యంత్రాంగం, బ్యాంకులు సహకరించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. కొమ్మాలపాడులో ఈనాం భూములు సాగు చేసుకుంటున్న లబ్ధిదారులకు విడుదలైన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కార్యక్రమం ద్వారా అందిన లబ్ధి గురించి విచారించారు. అనంతరం స్థానిక కెనరా బ్యాంకు శాఖ ద్వారా రైతు ఖాతాలకు జమైన మొత్తాలను పరిశీలించారు. తహసీల్దారు కె.రవిబాబు, ఏవో సైదా, ఏఎంసీ ఛైర్మన్ తేలప్రోలు రమేష్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

కొత్తపేట(చీరాల), న్యూస్‌టుడే: గ్రామస్థాయిలో ప్రతి కార్యకర్త, నాయకుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య పేర్కొన్నారు. సోమవారం రాత్రి క్యాంపు కార్యాలయంలో గ్రామపార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల వారీగా ఉన్న పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఏఎంసీ ఛైర్మన్ కె.జనార్దన్, చంద్రమౌళి, పురుషోత్తం, సురేష్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

యర్రంవారిపాలెం(కారంచేడు), న్యూస్‌టుడే: గ్రామంలోని శ్రీ జంట నాగేంద్రస్వామి దేవాలయం వద్ద సోమవారం మయూర వాహన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం నిర్వహించగా టీటీడీ వ్యాఖ్యాత ఆలూరు శివకోటేశ్వరరావు కల్యాణ ఘట్టాన్ని, స్వామివారి వైభవాన్ని వివరించిన తీరు భక్తులను ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందించారు.

ఆహార రంగంలో అపార అవకాశాలు

బాపట్ల, న్యూస్‌టుడే: ఆహార సాంకేతిక రంగంలో పట్టభద్రులకు అవకాశాలు అపారంగా ఉన్నాయని ఫుడ్ టెక్నాలజీ నిపుణురాలు సుచరిత అన్నారు. ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు రెండురోజుల దీక్షారంభ్ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులతో ఆమె మాట్లాడుతూ ఆహార రంగంలో అంతర్జాతీయ ప్రమాణాలపై నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. ఆంగ్రూ విశ్రాంత రిజిస్ట్రార్ డి.భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతికవిలువలు, సేవా భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఏడీ బేగ్, ఆచార్యులు సౌజన్య, వినోద్‌కుమార్, సునీత, దిలీప్‌సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు కళాశాల ఫీజులు చెల్లింపు

ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

వేటపాలెం, న్యూస్‌టుడే: బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రవాస భారతీయుడు కొత్తపల్లి వంశీ లక్ష్మీ పద్మజ దంపతులు ఫీజు రూపంలో రూ.60 వేలు సోమవారం చెల్లించారు. ఈ మొత్తాన్ని వారి అమ్మమ్మ తాత జ్ఞాపకార్థం అందజేశారు. దాతలను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చల్లా వాసుదేవరావు అభినందించారు. ఏవో జి.రాజశేఖర్‌బాబు ఉన్నారు.

పొలాలు కోల్పోయిన వారికి న్యాయం చేయండి

బొల్లవరప్పాడు (మేదరమెట్ల), న్యూస్‌టుడే: యర్రం చినపోలిరెడ్డి కొరిశపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా బొల్లవరప్పాడు సమీపంలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను నిర్మించాల్సి ఉంది. దీనివల్ల బొల్లవరప్పాడు, పమిడిపాడు గ్రామాలకు సంబంధించిన పొలాలు ముంపునకు గురవుతాయని అధికారులు గుర్తించారు. ముంపునకు గురయ్యే పొలాలకు 2009లో అవార్డు ప్రకటించారు. ఈ నష్టపరిహారాన్ని రైతులకు అందించేందుకు ప్రయత్నించగా వారు తీసుకునేందుకు నిరాకరించడంతో సివిల్ కోర్టులో డిపాజిట్ చేశారు. నష్టపరిహారం పెంచాలని కోరుతూ రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఈక్రమంలో ఈ నెల 27న బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే సమావేశంలో తమ అభ్యంతరాలు తెలియజేయాలని ఎస్‌డీసీ కార్యాలయం నుంచి రైతులకు సమాచారం అందించారు. తమకు వచ్చిన లేఖను సోమవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వారు చూపించారు. పొలాలు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని వారు మంత్రిని కోరారు.

రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

మార్టూరులో పత్రాలు అందజేస్తున్న ఆంజనేయులు, శివనాగేశ్వరరావు

నాగులపాలెం(పర్చూరు), మార్టూరు, న్యూస్‌టుడే: రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని చేపట్టిందని, ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ జీబీపీ ప్రవీణ అన్నారు. సోమవారం నాగులపాలెంలో కర్షకులకు కరపత్రాలు అందజేశారు. ఏవోలు కె.భాస్కరరావు, ఎం.నాగరాజు పాల్గొన్నారు. మార్టూరులోని 24వ బూత్‌లో రైతన్న సేవా పత్రాలను నీటి సంఘం అధ్యక్షుడు తాటి ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచి కమ్మ శివనాగేశ్వరరావు అందజేశారు.

వేటపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపట్టిన రైతన్నా...మీకోసంలో భాగంగా నిర్వహిస్తున్న సర్వేలో అన్నదాతలు పూర్తి వివరాలను వ్యవసాయ సిబ్బందికి అందజేయాలని చీరాల ఏడీఏ రత్నకుమారి తెలిపారు. సోమవారం పాపాయిపాలెం, అక్కాయిపాలెం, చల్లారెడ్డిపాలెం, పందిళ్లపల్లి రైతు సేవా కేంద్రాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఏవో సరిత పాల్గొన్నారు.

దుకాణ సముదాయం నిర్మాణానికి భూమి పూజ

పూజలో అధికారులు నాయకులు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లులోని పాతచెన్నై ప్రధాన రహదారి పక్కన దుకాణ సముదాయ నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. బస్ స్టేషన్ కూడలిలో దక్షిణంవైపు ఖాళీస్థలంలో గదుల నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. రూ.25 లక్షలతో ఎనిమిది గదులు నిర్మిస్తున్నారు. రహదారికి తూర్పున ఖాళీస్థలంలో మరో 10 గదులు నిర్మించుకునే వెసులుబాటు ఉంది. రెండు వైపులా గదుల నిర్మాణం పూర్తయితే ఏటా పంచాయతీకి అద్దెల రూపేణా లక్షల్లో ఆదాయం సమకూరనుంది. సర్పంచి ప్రసన్న, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాసరావు, కార్యదర్శి రామసుబ్బారెడ్డి, తెదేపా నాయకులు హనుమంతరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, శివయ్య పాల్గొన్నారు.

బీసీలకు సామాజిక న్యాయం అందించాలి

బాపట్లటౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన వాగ్దానాలను చట్టబద్ధంగా అమలు జరపాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు బి.రవికుమార్ అన్నారు. కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో సోమవారం బీసీ నాయకులు కలెక్టర్ వినోద్ కుమార్‌కు పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు.

విద్యుదాఘాతంతో యంత్రం దగ్ధం

ద్రోణాదుల(మార్టూరు), న్యూస్‌టుడే: మండల పరిధి ద్రోణాదులలోని రాళ్ల తయారీ కంపెనీలో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా రాళ్ల తయారీకి వినియోగించే యంత్రంలో విద్యుదాఘాతంతో మంటలు ఎగిసిపడి, పూర్తిగా దగ్ధమైందని యజమాని పి.లలితబాబు తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

వేటపాలెం, న్యూస్‌టుడే: పందిళ్లపల్లి నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు. వీటిని స్థానిక పోలీసు స్టేషన్‌కి తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

క్రైం కార్నర్

కుమార్తె కొట్టిందంటూ ఫిర్యాదు

కారంచేడు, న్యూస్‌టుడే: ఆస్తి రాయమంటూ కుమార్తె తనను కొట్టి గాయపరిచిందంటూ యజ్ఞశాలపేటకు చెందిన గొట్టిపాటి దేవి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ఖాదర్ బాషా తెలిపారు. తాను నివసిస్తున్న ఇంటిని తన పేరు మీదుగా రాయమని కుమార్తె చాగంటి సుజాత ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి గొడవ పెట్టుకుని, ఇనుపచువ్వ చుట్టిన కర్రతో చేతులు, కాళ్లపై కొట్టిందని, కుడిచేతికి రక్తగాయం కాగా చీరాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు బాధితురాలు ఫిర్యాదు ఇచ్చిందని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరికి గాయాలు

పర్చూరు, న్యూస్‌టుడే: ఒకే మార్గంలో ప్రయాణిస్తున్న ఇరు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఇద్దరు గాయాలపాలైనట్లు స్థానికులు తెలిపారు. సోమవారం రాత్రి క్రీడావికాస కేంద్రం వైపు నుంచి బొమ్మల కూడలి సెంటర్‌వైపు వస్తున్న ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్నాయని, ఈ ఘటనలో గాయాలపాలైన వారు నాగులపాలెం ప్రాంతానికి చెందిన వ్యక్తులని వెల్లడించారు. చికిత్స నిమిత్తం పర్చూరు సీహెచ్‌సీకి తరలించినట్లు చెప్పారు.

వ్యక్తిపై దాడి, కేసు

అద్దంకి, న్యూస్‌టుడే: భూవివాదం నేపథ్యంలో జరిగిన దాడిపై అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఇది ఈనెల 12న చోటుచేసుకోగా, అద్దంకి న్యాయస్థానం అనుమతితో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై జేవీవీ.నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని కుంకుబాడు గ్రామానికి చెందిన వి.వెంకట్రావుకు చెందిన 22 సెంట్ల భూమి విషయమై, అదే గ్రామానికి చెందిన సీహెచ్.బ్రహ్మయ్య ఇంటి వద్దకు వెళ్లి ప్రశ్నించాడు. ఆగ్రహించిన బ్రహ్మయ్య, ఆయన కుటుంబ సభ్యులు వెంకట్రావుపై దాడి చేసి గాయపరిచారు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం ఒంగోలు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వచ్చిన నివేదిక మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెల్లడించారు.

స్థల వివాదంపై..

కారంచేడు, న్యూస్‌టుడే: ఇంటి స్థలాల హద్దుల విషయంలో మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన దేవరపల్లి రమేష్ తనపై కర్రతో దాడి చేసి గాయపరిచాడని అదే గ్రామానికి చెందిన దాసి యేసయ్య సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ఖాదర్ బాషా తెలిపారు. తలపై గాయం కావడంతో చీరాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సెల్‌ఫోను చోరీ చేసిన వ్యక్తి అరెస్టు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ గ్రామానికి చెందిన మహ్మద్ సికందర్ దూపం వేస్తూ భిక్షాటన చేస్తుంటాడు. అతడు ఇటీవల పట్టణంలోని ఎల్‌బీఎస్ నగర్‌లో ఓ ముస్లిం మహిళ ఇంటికి వెళ్లి దూపం వేశాడు. ఆ సమయంలో మంచినీరు కావాలని అడగడంతో ఆమె తన చేతిలో ఉన్న సెల్‌ఫోనును టేబుల్‌పై పెట్టి, లోపలికి వెళ్లింది. అతడు దాన్ని తస్కరించి సమీపంలోని ఓ చెట్టు వద్ద ఉంచాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదు కావడంతో మహిళ ఫిర్యాదు మేరకు అతడ్ని సోమవారం రెండో పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పోలీసులు చెప్పారు.

(c) eenadu

సుదూర ప్రయాణం... సూర్యచంద్రులే ఆధారం

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి వలస పక్షులు వేలాది కిలో మీటర్లు రేయింబవళ్లు ప్రయాణించి చేరుకుంటాయి. సూర్య, చంద్రుల గమనాన్ని ఆధారంగా చేసుకొని అవి గమ్యస్థానానికి చేరుకుంటాయి. ఇక్కడి రక్షిత కేంద్రానికి గూడబాతులు, తెడ్డుముక్కు కొంగలు, తెల్లకంకణాయిలు, శబరి కొంగలు సుదూర ప్రాంతాల నుంచి వలస వస్తాయి.



ఇలా చేరుకుంటాయి..

- వలస పక్షులు పగలు సూర్యుడు, రాత్రిళ్లు చంద్రుడు, ధ్రువ నక్షత్ర గమనం ఆధారంగా తమ ప్రయాణాన్ని సాగిస్తాయి.
- పక్షులు సముద్ర తీర ప్రాంతాలు, నదుల మీదుగా ప్రయాణం చేస్తాయి. అక్కడక్కడ ఆగి ఆహారం తీసుకొని.. విశ్రాంతి పొంది తరువాత ప్రయాణాన్ని కొనసాగిస్తాయి.
- ఆకాశంలో ఎగిరేటప్పుడు గాలి ఒత్తిడిని, వేగాన్ని అధిగమించేందుకు 'వి' ఆకారంలో ప్రయాణం చేస్తాయి. సుదూర ప్రాంతాలకు వలస వెళ్లేటప్పుడు ఆకాశంలో వీలైనంత ఎత్తులో ఎగురుతాయి.

ఆకాశంలో ప్రయాణిస్తున్న గూడబాతులు

పక్షులకూ పైలెట్..

కొన్ని పైలెట్ పక్షులు ముందు వెళ్లి.. మిగిలిన వాటికి మార్గం చుపుతూ దిశానిర్దేశం చేస్తాయి. అవి తరచుగా శీతాకాలంలో ఉత్తర ధ్రువం నుంచి దక్షిణ ధ్రువానికి వలస వస్తాయి. ఈ రెండు ధ్రువాల మధ్య దూరం సుమారు 20 వేల కిలోమీటర్లు ఉంటుంది. వాతావరణ పరిస్థితులను బట్టి సుమారు నెల నుంచి రెండు నెలల కాలం పడుతుంది.



కనుల పండువగా రథోత్సవం

తిరుచానూరు, న్యూస్‌టుడే: కార్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ పద్మావతి అమ్మవారి రథోత్సవం సోమవారం కనుల పండువగా సాగింది. ముత్యపు కవచ అలంకరణలో సర్వాలంకార శోభితురాలైన అమ్మవారిని రథ మండపానికి తీసుకొచ్చి బ్రహ్మరథంపై కొలువుదీర్చారు. భక్తులు తిరువీధుల్లో రథాన్ని లాగుతూ ముందుకు కదిలారు. సుమారు రెండు గంటల పాటు రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. రాత్రి అశ్వవాహన సేవలో అమ్మవారు కల్కి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ప్రధాన కేంద్రాలుగా మినీ అంగన్‌వాడీలు

జిల్లాలో 523 కేంద్రాలు అప్‌గ్రేడ్

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి సోమవారం పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం ఐదు వేల కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయగా, అందులో అత్యధికంగా రాష్ట్రంలోనే చిత్తూరు జిల్లాలో 523 మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేశారు. వాటిలోని కార్యకర్తను అంగన్‌వాడీ కార్యకర్తగా ఉద్యోగోన్నతి కల్పించారు.

- అంగన్‌వాడీ కేంద్రాలు: 2,420
- ప్రధాన కేంద్రాలు: 1,795
- మినీ కేంద్రాలు: 625
- ఇందులో అప్‌గ్రేడ్ చేసినవి: 523
- సమీప కేంద్రాల్లో విలీనమైనవి: 23

వినతులు స్వీకరించి.. పరిష్కారం చూపించి

ఈనాడు– చిత్తూరు: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తరచూ అధికారులను ఆదేశిస్తున్నారు. అక్కడితో ఆగకుండా ప్రజల సంతృప్తి స్థాయిని ఐవీఆర్ఎస్ ద్వారా తెలుసుకుంటున్నారు. ఇలా పకడ్బందీగా వ్యవహరిస్తుండటంతో ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో వస్తున్న అర్జీల్లో రెండు జిల్లాల్లో 88 శాతం దరఖాస్తులు పరిష్కారమయ్యాయి.

బీసీ సంఘం నేతల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఎప్పటికప్పుడు సమీక్ష

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రజలు ఇచ్చే అర్జీల్లో సింహభాగం రెవెన్యూ సమస్యలే ఉంటున్నాయి. కొంత కాలంగా ఇలాంటి వాటిపై అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కుటుంబ, న్యాయ వివాదాలు ఉన్నవాటిని మినహాయించి మిగతా దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత తహసీల్దార్లు సర్వేయర్లకు సూచిస్తున్నారు. అర్జీలు స్వీకరించిన అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు.

పక్కాగా ఆడిట్ నిర్వహిస్తూ

కొన్ని సందర్భాల్లో జనాలు ఇచ్చిన అర్జీలను పరిష్కరించకుండానే అధికారులు మూసేస్తున్నారు. ఈక్రమంలోనే నేరుగా దరఖాస్తుదారుడికే ఫోన్ చేసి అధికారి, సిబ్బంది వ్యవహారశైలి ఎలా ఉంది? మీరు సంతృప్తిగా ఉన్నారా? అంటూ అడుగుతున్నారు. ఇలా పక్కాగా ఆడిట్ నిర్వహిస్తుండటంతో అధికారుల్లో జవాబుదారీతనం పెరిగింది.

15 మంది డీటీలతో పర్యవేక్షణ

అర్జీలపై సంబంధిత తహసీల్దారుకు ఫోన్ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తున్నాం. కలెక్టరేట్‌లో 15 మంది డీటీలు పర్యవేక్షిస్తున్నారు. కొందరి సమస్యలు పరిష్కారం కాకపోతే 15- 20 రోజుల్లో నా వద్దకు రావాలని సూచిస్తున్నారు.

– సుమిత్‌కుమార్, చిత్తూరు కలెక్టర్

గతేడాది జూన్ 15 నుంచి ఈ ఏడాది అక్టోబరు 21 వరకు ఇలా..

చిత్తూరు జిల్లాలో

మొత్తం అర్జీలు	31,799
పరిష్కరించినవి	28,046
పెండింగ్	3,753
పరిష్కార శాతం	88.20

దారి చూపు గోవిందా..!

- జాతీయ రహదారుల్లో అసంపూర్తి పనులు
- నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న వాహన చోదకులు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడంతో తిరుపతి నగర పరిధిలో పూతలపట్టు-నాయుడుపేట 'యాక్సెస్ కంట్రోల్డ్ హైవే' పనులకు నిధులు విడుదలయ్యాయి. ఈ మేరకు పది నెలల కిందట పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు 20 శాతం కూడా కాలేదు.

సి.మల్లవరం వద్ద నాలుగు నెలలుగా వదిలేసిన వంతెన పనులు

అడ్డంకులివీ..

- సి.మల్లవరం వద్ద నాలుగు నెలల కిందట పనులు ప్రారంభించారు. ఇక్కడ వంతెన నిర్మాణంలో భాగంగా పిల్లర్లు వేసి వదిలేయడంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- ఉప్పరపల్లి క్రాస్ వద్ద పనులు నత్తనడకన సాగుతున్నాయి. అక్కడ కూడా ఇదే పరిస్థితి.
- తిరుచానూరు నుంచి కేఎల్ఎం జంక్షన్ వరకు పనులు సక్రమంగా జరగక నిత్యం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు.

- జాతీయ రహదారి: పూతలపట్టు - నాయుడుపేట
- పెండింగ్ పనులు: 17.40 కి.మీ. (సి.మల్లవరం నుంచి కేఎల్ఎం సర్కిల్ వరకు)
- గడువు: 13.12.2026

చేయాల్సిన నిర్మాణాలు:

- ఐదు కింద వంతెనలు
- మూడు భారీ ఫ్లైఓవర్లు
- ఐదు అండర్‌పాస్‌లు

సుదూర ప్రాంతాల నుంచి తిరుమల, శ్రీకాళహస్తి, కాణిపాకం పుణ్యక్షేత్రాలకు తరలివచ్చే భక్తులకు జాతీయ రహదారుల పనుల్లో జాప్యం నిత్యం అగ్నిపరీక్ష పెడుతోంది. రోడ్డు పనులు జరుగుతున్నాయని కనీసం సూచికలు ఉంచకపోవడంతో ప్రయాణాన్ని గండాలమయం చేస్తోంది. కొన్ని ఘటనల్లో వాహన చోదకులు మృత్యువాత పడుతున్నా జాతీయ రహదారుల సంస్థ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పూతలపట్టు-నాయుడుపేట, తిరుపతి - చెన్నై జాతీయ రహదారుల అసంపూర్తి పనులను పరిశీలిస్తే ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు నిత్యం ఆందోళన చెందుతున్నారు.

– న్యూస్‌టుడే, పుత్తూరు

అడ్డంకులివీ..

- పుత్తూరు మండలం పరమేశ్వర మంగళం ఆదిఆంధ్రవాడ వద్ద భూసేకరణ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ఆ గ్రామం వద్ద పనులు ప్రారంభించలేదు. ఇక్కడ రెండు వంతెనలు నిర్మించాల్సి ఉంది. ఈ ప్రాంతంలో సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో ఇటీవల ఓ ద్విచక్ర వాహన చోదకుడు కల్వర్టు గొయ్యిలో పడి గుండె సమీపంలో ఇనుప కమ్మీ గుచ్చుకుంది.

పరమేశ్వరమంగళం వద్ద సాగుతున్న కల్వర్టు పనులు

- జాతీయ రహదారి: తిరుపతి - చెన్నై
- పెండింగ్ పనులు: 20.03 కి.మీ. (పుత్తూరు మరాఠీగేటు నుంచి తడుకుపేట వరకు)
- ఇప్పటి వరకు జరిగింది: 20 శాతం
- గడువు: 13.12.2026

చేయాల్సిన నిర్మాణాలు:

- నాలుగు పై వంతెనలు

- పుత్తూరు మండలం వేపగుంట క్రాస్ వద్ద వంతెన పనులు ఓ పక్క చేపట్టారు. మరో పక్క ప్రారంభించకపోవడంతో రోడ్డు ఇరుగ్గా మారింది.
- పుత్తూరు మండలం మిద్దిగుంట క్రాస్ రోడ్డు వద్ద తవ్వేసి వదిలేయడంతో ఐదు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.
- కొన్ని గ్రామాల వద్ద పనులు అసంపూర్తిగా ఉండటంతో రాత్రిళ్లు వాహన చోదకులు ఇబ్బందులుపడుతున్నారు.
- పుత్తూరు మరాఠీగేటు నుంచి పరమేశ్వరమంగళం వరకు పూర్తి స్థాయిలో రోడ్డు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను వదిలేయవచ్చు.

ఆరు నెలల్లో.. ◆ జరిగిన ప్రమాదాలు: 10 ◆ మృతులు: ఐదుగురు ◆ క్షతగాత్రులు: 20 మంది

పాస్‌పోర్టు కావాలా.. ఆన్‌లైన్లో దరఖాస్తు చేయండి

ఉన్నత విద్య, ఉపాధి, పర్యాటక ప్రాంతాల సందర్శనకు చాలామంది విదేశాలకు వెళ్తుంటారు. ఇందుకు పాస్‌పోర్టు తప్పనిసరి. దీన్ని ఎలా పొందాలో ఇప్పటికీ చాలా మందికి తెలియదు. ఆన్‌లైన్లో వివరాలను నమోదు చేసుకొని పాస్‌పోర్టు సులువుగా పొందవచ్చు.

- https://www.passportindia.gov.in వెబ్‌సైట్‌లో మెయిల్ ఐడీ లేదా ఫోన్ నంబరుతో రిజిస్టర్ చేసుకుని, పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి. లాగిన్‌ై దరఖాస్తు నింపాలి.

వ్యక్తిగత వివరాల నమోదు

- ఇంటి పేరు, వ్యక్తి పేరు పూరించాలి. కుటుంబ సభ్యులు, చిరునామా, అత్యవసర పరిస్థితిలో సంప్రదించాల్సిన వారి వివరాలు, చరవాణి నంబర్లు నమోదు చేయాలి.
- రెన్యువల్ అయితే పాత పాస్‌పోర్టు నంబరు, ఇతర వివరాలు నమోదు చేయాలి.
- దరఖాస్తును సబ్‌మిట్ చేశాక.. మార్పులు, చేర్పులకు అవకాశం ఉండదు.
- సబ్‌మిట్ చేయగానే రిఫరెన్స్ నంబరు (ఏఆర్ఎన్) వస్తుంది. పెద్దలకు రూ.1500, పిల్లలకు రూ.1000 చొప్పున రుసుము చెల్లించాలి.
- ఏ రోజు, ఎన్ని గంటలకు, ఎక్కడికి రావాలో సూచిస్తారు.

గుర్తింపు పత్రాలు..

చిరునామా గుర్తింపు పత్రం, పుట్టినరోజు ధ్రువీకరణ పత్రం ఒరిజనల్ ఉండాలి. ప్రభుత్వం సూచించిన 12 రకాల పత్రాల్లో ఏ ఒక్కటి తీసుకెళ్లినా చిరునామా గుర్తింపుగా పరిగణిస్తారు.

ధ్రువీకరణాలు, నకళ్లతో..

దరఖాస్తు ఫీజు చెల్లించిన పత్రం ప్రింట్ తీసుకోవాలి. చిరునామా, పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం అసలు, జిరాక్సు ప్రతులతో కేటాయించిన సమయానికి అర గంట ముందే పాస్‌పోర్టు సేవా కేంద్రానికి చేరుకోవాలి.
- అసలు పత్రాలు చూసి ఒక సీరియల్ నంబరు ఇస్తారు. ఫొటో, వేలిముద్రలు సేకరిస్తారు. దరఖాస్తు పరిశీలించి ఒక పత్రం ఇస్తారు. చరవాణికి ఒక నంబరు వస్తుంది. దాంతో స్టేటస్ తెలుసుకోవచ్చు.

పోలీస్ విచారణ..

చివరగా పోలీసు విచారణ ఉంటుంది. ఏమైనా కేసులు ఉన్నాయో విచారిస్తారు. అన్నీ సక్రమంగా ఉంటే పోలీసులు నివేదికను పై అధికారులకు పంపిస్తారు. ఆ తర్వాత ఎలక్ట్రానిక్ చిప్‌తో కూడిన పాస్‌పోర్టు వస్తుంది.

న్యూస్‌టుడే, తిరుపతి (విద్య)

రైతు సంక్షేమమే ధ్యేయం

మహిళా రైతుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. పెరుమాళ్లకండ్రిగలో రైతన్నా-మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించి, రైతు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.

'పది' పరీక్షలకు గ్రీవెన్స్ సెల్

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: పదో తరగతి పబ్లిక్ పరీక్షల రుసుం చెల్లింపు, నామినల్ రోల్స్ తదితర సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామని డీఈవో వరలక్ష్మి సోమవారం తెలిపారు. యూడైస్ సాంకేతిక సమస్యలకు సంబంధించిన ఏఎస్వో ఆనందుడిని సంప్రదించాలని సూచించారు. పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు పొడిగింపు లేదని ప్రభుత్వం స్పష్టం చేసిందని డీఈవో పేర్కొన్నారు.

సంప్రదించాల్సిన నంబర్లు

- అరుణకుమార్, అసిస్టెంట్ కమిషనర్: 98666 50815
- స్వర్ణ కుమారి, సూపరింటెండెంట్: 83282 16165
- సలార్‌ఖాన్, సీనియర్ అసిస్టెంట్: 94931 43522
- లక్ష్మి, డేటా ఎంట్రీ ఆపరేటర్: 63021 64703

రైతేరాజు 6లో

పుస్తక నిలయం.. సాకారం దిశగా

రూ.3.11 కోట్లతో జిల్లా గ్రంథాలయ సంస్థ భవనం

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: చిత్తూరులో జిల్లా గ్రంథాలయ సంస్థ పరిపాలన గత ఏడేళ్లుగా అద్దె భవనంలోనే సాగుతున్న పరిస్థితి. రోడ్డు విస్తరణ కారణంగా పాత భవనాన్ని తొలగించారు. పాలనను అద్దె భవనం నుంచి సాగించారు. దీంతో పాఠకులు ఇబ్బందులు పడ్డారు. గ్రంథాలయ సంస్థకు నూతన భవన నిర్మాణాన్ని వైకాపా ప్రభుత్వ కాలంలో పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నూతన భవన నిర్మాణానికి అడుగులు పడ్డాయి. చిత్తూరు ఆర్డీవో కార్యాలయం సమీపంలోని స్థలంలో సంస్థ నూతన భవన నిర్మాణానికి రూ.3.11 కోట్లు విడుదలయ్యాయి.

నిర్మాణంలో జిల్లా గ్రంథాలయ సంస్థ భవనం

రెండు అంతస్తుల్లో భవనం

గ్రంథాలయ భవనాన్ని రెండు అంతస్తుల్లో నిర్మిస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పత్రికా పఠన విభాగం, మొదటి అంతస్తులో జిల్లా కార్యాలయం, రెండో అంతస్తులో పుస్తక విభాగాల్ని నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించారు. నూతన గ్రంథాలయ భవనాన్ని వచ్చే జూన్‌లోగా పాఠకులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషిచేస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ అంటున్నారు.

ఖాతా ఇస్తే.. ఖతమే..!

- కమీషన్ ఆశచూపుతున్న సైబర్ నేరగాళ్లు
- వివరాలు ఇస్తే కటకటాలే

నీ బ్యాంకు ఖాతా వివరాలు ఇస్తావా.. అందులో జమయ్యే నా డబ్బులకు కమీషన్ ఇస్తాను..

నీ పేరుతో కరెంటు ఖాతా ఓపెన్ చేసి వివరాలు ఇవ్వు.. నీకు నెలనెలా జీతంలా కొత్త మొత్తం చెల్లిస్తాను..

ఈ మాటలు నమ్మి బ్యాంకు ఖాతా వివరాలు ఇచ్చావో.. ఎప్పుడో ఒకప్పుడు కటకటాలు లెక్కించాల్సిందే. సైబర్ నేరగాళ్లు అమాయకులకు కమీషన్ ఆశ చూపి వారి ఖాతాలను వాడుకుంటూ నేరాల ఉచ్చులోకి లాగుతున్నారు. ఇటీవల తిరుపతి పోలీసుల దర్యాప్తులో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

- న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం)



మ్యూల్ ఖాతా అంటే..?

మోసగాళ్లు వేరొకరి ఖాతాల్లోకి అక్రమంగా సొమ్ములు మళ్లిస్తారు. ఖాతా ఇచ్చినందుకు కొత్త మొత్తం కమీషన్‌గా ఇస్తారు. దీన్నే మ్యూల్ ఖాతా అంటారు.

బ్యాంకు సిబ్బందిపై అనుమానం

బ్యాంకు ఖాతా తెరిచే వ్యక్తి.. సిఫార్సు చేసే వ్యక్తి బ్యాంకుకు సరైన పత్రాలతో వెళ్తే కానీ ఖాతా తెరవరు. అలాంటిది చనిపోయిన వారు.. తప్పుడు పత్రాలు సమర్పించినా.. ఖాతా తెరుస్తుండటంతో బ్యాంకు సిబ్బందిపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మన ఖాతాలతో వాళ్లు 'గేమింగ్'

సాఫ్ట్‌వేర్, కాల్‌సెంటర్లలో ఉద్యోగాల పేరుతో తెలుగు యువతను కాంబోడియాకు రప్పించుకొని రెండు రాష్ట్రాల్లోని ప్రజలను మోసం చేసేలా బెదిరిస్తున్నారు. చివరికి వారికి భారీగా సహకరిస్తూ ప్రతి లావాదేవీపై కమీషన్ పొందుతున్నారు. ఇటీవల పోలీసులకు పట్టుబడ్డ హైదరాబాద్‌కు చెందిన కోటిబాబు ఇలాగే చేశారు. మోసం చేసిన సొమ్ము మ్యూల్ ఖాతాల్లో జమ చేసి తరువాత ఆన్‌లైన్ గేమింగ్‌లో డబ్బులు వచ్చిన వారి ఖాతాలకు జమ చేస్తారు.

బతికి చెడిన వారిపైనే గురి

గతంలో కరెంట్ బ్యాంకు ఖాతాల ద్వారా భారీగా లావాదేవీలు జరిపి ప్రస్తుతం స్తబ్దుగా ఉంచిన వారిపైనే సైబర్ నేరగాళ్లు దృష్టి పెడుతున్నారు. 'మీ ఖాతాకు మా కంపెనీ నుంచి డబ్బు వస్తుంది. దాన్ని మా సిబ్బంది ఖాతాల్లో జమ చేసుకునేందుకు' సహకరిస్తే కమీషన్ ఇస్తామని నమ్మిస్తారు. ఇలా సైబర్ వలలో పడిన వారి నుంచి ఈ ఖాతాలకు జమ చేసుకుని.. అక్కడి నుంచి వివిధ ఖాతాలకు బదిలీ చేస్తున్నారు. నా కమీషన్ నాకు వచ్చేస్తోంది అని మిన్నకుండిపోతే ఇబ్బందులు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వ ఐటీఐలో కొత్త కోర్సు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేవీవై-4.0) ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ అసెంబ్లీ ఆపరేటర్ కోర్సుకు సంబంధించి మూడు నెలల శిక్షణ డిసెంబరు పదో తేదీ నుంచి ప్రారంభించనున్నామని ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి సోమవారం తెలిపారు.
- 18 నుంచి 40 ఏళ్ల లోపు వయస్సు కలిగినవారు, పదో తరగతి, ఆపై విద్యార్హత ఉన్నవారు అర్హులు.
- కోర్సు పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్ అందిస్తారు.

సంప్రదించాల్సిన నంబరు: 85003 84812, 91609 40479

104FM Tirupati ఈ FM 104 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008555167, 9154991499

ఆక్రమించేయ్.. అడిగేదెవరు..?

కుంచించుకుపోతున్న చెరువులు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: చిత్తూరు నగరంలోని నీటి వనరులు క్రమేణా ఆక్రమణల పాలవుతున్నాయి. ఒకనాడు రైతులకు ఉపయోగపడిన చెరువులు, కాలువలు, సప్లై ఛానళ్లు ఒక్కొక్కటిగా ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్తున్నాయి. వర్షాలు కురిస్తే వీధులు, రహదారులను వరద ముంచెత్తుతోంది.

దుర్గానగర్ కాలనీ చెరువు చుట్టూ నిర్మాణాలు

కొన్ని ఉదాహరణలు..

- దుర్గానగర్ కాలనీ నడిబొడ్డున ఉన్న కుమ్మరవాని చెరువు చుట్టూ యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీని విస్తీర్ణం ఏడున్నర ఎకరాలు కాగా.. ప్రస్తుతం చెరువు చుట్టూ, సమీప స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి.
- గంగినేని చెరువు గట్టును చదును చేస్తూ తాత్కాలిక షెడ్ల నిర్మాణం చేపట్టారు. 15 ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువు ఆక్రమణలతో కుంచించుకుపోయింది.
- సంతపేట దొంగలబావి వీధి ఎగువన ఉన్న బుడమాల చెరువు 13 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇదీ ఆక్రమణల కోరల్లో చిక్కుకుంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో చెరువు దిగువన ఖాళీ స్థలాన్ని ప్లాట్లుగా చేసి విక్రయించడానికి కొందరు సిద్ధంకాగా.. స్థానికులు అడ్డుకున్నారు.
- ఆశ్రమం వీధిలోని చెరువు స్థలంలో అక్రమంగా కంచె వేశారు.
- చెరువు చుట్టూ తాత్కాలిక గృహ నిర్మాణాల కోసం దశాబ్దాల క్రితం ప్రభుత్వం పేదలకు పట్టాలు మంజూరు చేసింది. కుమార్‌నగర్ కాలనీ పేరిట కాలనీ ఏర్పడినా.. దీని ముసుగులో కొందరు ఆక్రమణదారులు చెరువును ఆనుకుని నిర్మాణాలు చేపట్టారు. చెరువు నిండితే వరద ఇళ్లలోకి వచ్చేస్తోంది. బఫర్ జోన్‌లోనూ అనుమతులు ఇవ్వడంతో భవనాలు నిర్మించారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

పాల ఉత్పత్తులు పెంచుకోండిలా..

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పశుపోషకులు పాల ఉత్పత్తులను పెంచుకోవడంతో పాటు తద్వారా ఆర్థిక ప్రయోజనాన్ని పొందడంపై అవగాహన కలిగి ఉండాలని శ్రీకళహస్తి ఏడీఏ భాస్కర్ తెలిపారు. ■ పాలల్లో వెన్న, మన పదార్థాల శాతం (ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్) పెరగాలంటే పాడి పశువులకు రోజూ పాలకం కల దాణలో కనీసం 20 నుంచి 30 కిలోల పచ్చి మేతతో పాటు కచ్చితంగా 8 కిలోల ఎండు మేతను చిన్న ముక్కలుగా(ఒక ఇంచి సైజులో) ఇవ్వాలి. ■ రోజూ పాలు పితికే సమయం, వ్యక్తి, విధానం ఒకే విధంగా ఉండేలా చూసుకోవాలి. ■ పశువుకు పాలు పితికే ఒక గంట ముందు నీటిని ఇవ్వరాదు. ■ బీరపొట్టు, పాలబడి పిండి, మొక్కజొన్న పిండి, మిగిలి పోయిన అన్నం ఎక్కువగా ఇవ్వడం వల్ల ఆమ్ల ఆటిక్ట్రత పెరిగి పశువుల అనారోగ్యానికి గురికావడంతో పాటు పాల ఉత్పత్తి, ఫ్యాట్ ఎస్ఎన్ఎఫ్ తగ్గిపోతుంది. తద్వారా ధర తగ్గే అవకాశముంది. ■ పాలు పితికేటప్పుడు మొదటిసారి మాత్రమే దూడను వదలాలి, చివరి పాలల్లో ఫ్యాట్ ఎస్ఎన్ఎఫ్ ఎక్కువగా ఉండటం కారణంగా పూర్తిగా పిండుకోవాలి. ■ వాతావరణానికి అనుగుణంగా పాడి పశువులను కాపాడుకోవాలి. ఎండలు ఎక్కువగా ఉంటే పాల ఉత్పత్తి తగ్గిపోతుంది కాబట్టి పశువులను నీటితో తడిపి చల్లబరచాలి. చలి ఎక్కువగా ఉంటే వెచ్చని ప్రదేశంలో కట్టివేయాలి. ■ మేతలకు పశువులను ఎక్కువ దూరం నడిపించరాదు. వాటి శరీరంపై పిడుదులు, గోమార్లు వంటి బాహ్య పరాన్న జీవులు లేకుండా చూసుకోవాలి. జలగలు, నత్తల వంటి అంతర పరాన్న జీవుల నివారణకు తరచూ మందులు వేయాలి. ■ మేతతో పాటు రోజూ ప్రతి మూడు లీటర్ల పాలకు ఒక కేజీ దాణా, పూటకు 50 గ్రాముల మినరల్ మిక్చర్ (ఖనిజ లవణ మిశ్రమం) ఇవ్వడం వల్ల ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ పెరుగుతుంది. ■ పాలు పితికే సమయంలో పొదుగును సున్నితంగా రుద్దడం ద్వారా పాల దిగుబడితో పాటు ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ పెంపుకు నేందుకు వీలుంటుంది. ■ పాలను ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ తక్కువగా వచ్చే పశువులకు రోజూ వంట సోడా 120 గ్రాముల నుంచి 240 గ్రాముల మూడు రోజుల పాటు తినిపించడం వల్ల పెంచుకునే వీలుంటుంది. ■ పొదుగువాపు వ్యాధి రాకుండా పాలు పితికిన వెంటనే శుభ్రంగా నీటితో కడిగి శుభ్రమైన వస్త్రంతో తుడవాలి. ■ పాలు పితికిన వెంటనే 15 నిమిషాల పాటు పడుకోకుండా పచ్చిదాణా తినిపించాలి. దీంతో పొదుగు వాపు రాకుండా నివారించవచ్చు.

సిరులు పంచే పుచ్చ

డ్రిప్ ఇరిగేషన్‌తో అధిక దిగుబడులు

కోట, న్యూస్‌టుడే: గూడూరు నియోజకవర్గ పరిధిలోని కోట, చిల్లకూరు, చిట్టమూరు, వాకాడు మండలాల్లోని పలు గ్రామాల్లో 400 ఎకరాల్లో పుచ్చసాగు చేస్తూ రైతులు మంచి లాభాలు పొందుతున్నారు. ప్రధానంగా డ్రిప్ ఇరిగేషన్, ప్లాస్టిక్ మల్చింగ్ ద్వారా అధిక దిగుబడులు పొందే అవకాశముందని కోట మండలం గూడలికి చెందిన దేవేంద్రరెడ్డి నిరూపిస్తున్నారు. నాలుగు ఎకరాల్లో నవంబరు నుంచి పుచ్చ సాగుకు భూమిని సిద్ధం చేస్తారు. ఎకరాకు రూ.50వేలు నుంచి రూ.60వేలు వరకు ఆదాయాన్ని పొందుతున్నారు.

సాగు చేసే విధానం

● పుచ్చసాగుకు ఇసుక నేలలు, నల్లరేగడి నేలలను ఎంపిక చేసుకోవాలి. ● సాగు చేసే భూమిలో ముందుగా పచ్చిరొట్ట పంట నాటాలి. ● భూమిని చదును చేసుకోవాలి. ● ఎంపిక చేసిన విత్తనాలను పాదుల్లో 45 సెంటీ మీటర్ల దూరంలో వేసుకోవాలి. ● నీటికి డ్రిప్ ఏర్పాట్లు చేసుకోవాలి. తద్వారా నీటి వసతితో పాటు మందులను సమపాళ్లలో పిచికారీ చేసే అవకాశముంది. సేంద్రియ ఎరువులను వినియోగించాలి. ● ఎండ, వేడికి, వర్షాలకు తట్టుకొనే విధంగా ప్లాస్టిక్ మల్చింగ్ వినియోగించాలి.

● 90 రోజుల వ్యవధిలో పంట దిగుబడికి వస్తుంది.

మార్కెటింగ్: నెల్లూరు, తిరుపతి, చెన్నైతో పాటు పలు రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తారు. స్థానిక మార్కెట్లలో వేసవిలో మంచి గిరాకీ ఉంది. కేజీ ధర రూ.20లు నుంచి రూ.50 వరకు ఉంటుంది.

మంచి లాభాలు.. గూడలిలో మూడేళ్లుగా పుచ్చసాగు చేస్తున్నా. లాభాలు పొందుతున్నా. యాజమాన్య పద్ధతులతోపాటు సేంద్రియ ఎరువులు వాడడం, డ్రిప్ ఇరిగేషన్, ప్లాస్టిక్ మల్చింగ్ చేస్తే లాభాలు పొందొచ్చు. పుచ్చసాగులో విజయం సాధిస్తా. **- దేవేంద్రరెడ్డి, గూడలి, రైతు**

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: ప్రశ్న: నారుమడి నుంచి నారు ప్రధాన పొలంలో నాటేటప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి? **- ధనంజయ, రైతు, గాజులమండ్యం**

జవాబు: 21 నుంచి 25 రోజుల నారు నాటడం లేదా మూడు లేదా నాలుగు ఆకుల దశలో నాటుకోవాలి. అంతకంటే ముదురు నారు నాటడంతో అధిక పిలకలు వచ్చి మంచి దిగుబడి ఇస్తుంది. నారును పైపైనా నాటుకోవాలి. లోపలికి నాటితే వేళ్లకు గాలి ఆడక కుళ్లిపోయి పంట త్వరగా కుదురుకోదు, పిలకల సంఖ్య తగ్గి, దిగుబడి తగ్గుతుంది. పంట ఎండి పోయినట్లు కనపడటంతో రైతులు రోగం వచ్చిందని గుళికలు, మందులు వాడుతున్నారు. ఈ కారణంగా ఖర్చు పెరగడం తప్ప ఏమీ లాభం లేదు. **- సునీల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, రేణిగుంట**

జింకుతో మంచి ఫలితాలు

తిరుపతి(వ్యవసాయం), న్యూస్‌టుడే: వరికి జింకు అతి తక్కువ పరిమాణంలో అవసరమయ్యే సూక్ష్మ పోషక పదార్థం. మొక్కల ఎదుగుదలకు అవసరమైన అనేక జీవ రసాయన చర్యలలో జింకు కీలకమైన పాత్ర పోషిస్తుంది. వరిని సాగు చేసే ప్రాంతాల్లో భూములు కొంత వరకు చౌడు లక్షణాలు కలిగి ఉంటాయి. భాస్వరం కలిగిన కాంప్లెక్స్ ఎరువుల వాడకం వలన భూముల్లో భాస్వరం నిలువలు అధికంగానే ఉంటున్నాయి. చౌడు గుణం, అధిక భాస్వరం ఉన్న నేలల్లో జింకు మొక్కలకు అందని రూపంలో ఉంటుంది. ఈ నేలల్లో జింక్ ఉన్నప్పటికీ మొక్కలు దాన్ని గ్రహించలేవు. ఇలాంటి భూముల్లో రైతులు పంటపై జింక్ పిచికారీ చేయడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చు. పైరు పిలకలు పెట్టే దశలో ఉన్నపుడు లీటరు నీటికి 2 గ్రా. జింక్ సల్ఫేట్, 5 గ్రాముల యూరియాను కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది. * చీలేటెడ్ రూపంలో జింకును నేడు అనేక కంపెనీలు అందిస్తున్నాయి. చీలేటెడ్ జింకును పైరుపైన లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. **- మెరుగు భాస్కరయ్య, ఏడీఏ(విశ్రాంత), సాగు సలహాదారు**

కార్డులు వెనక్కే.. బియ్యం హుళక్కే..!

● లబ్ధిదారులకు తప్పని కష్టాలు ● గ్రామాల్లోనే అధికం

న్యూస్‌టుడే, చిత్తూరు(మిట్టూరు)

స్మార్ట్ బియ్యం కార్డుల వివరాలిలా..
- ● మండలాలు: **31**
- ● స్మార్ట్ బియ్యం కార్డులు: **5,27,680**
- ● పంపిణీ: **4,90,046**
- మిగిలినవి: **37,634**

జిల్లాలో కార్డుదారులకు స్మార్ట్ బియ్యం కార్డులు ఇంకెప్పుడు అందజేస్తారో తెలియడం లేదు.. అధికారులు స్మార్ట్ కార్డుల పంపిణీపై దృష్టి సారించలేదనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.. కూటమి ప్రభుత్వం కొత్తగా ఈ కార్డులను రెండు నెలల క్రితం అందుబాటులోకి తీసుకొచ్చింది.. వీటి పంపిణీ బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి, చౌక దుకాణాల డీలర్లకు అప్పగించారు. రెండు నెలలు గడిచినా వేల సంఖ్యలో వాటిని అందజేయలేదు.. కార్డులు పొందేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపలేదా..? వలస వెళ్లారా..? అధికారులు ఇవ్వలేదా..? అసలు లబ్ధిదారులు ఉన్నారా..? లేదా తదితర వివరాలను తెలియజేసి పంపిణీకి నోచుకోని కార్డులను ఈ నెల 30 తర్వాత వెనక్కి ఇవ్వాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ.. జిల్లా అధికారులను ఆదేశించింది.

స్మార్ట్ బియ్యం కార్డు

తీసుకోకుంటే వెనక్కి పంపుతాం..
ఈ నెలాఖరులోగా స్మార్ట్ కార్డులు పొందకపోతే వెనక్కు పంపేస్తాం. త్వరపడి వాటినీ తీసుకోవాలి. **-శంకరన్, డీఎస్వో**

చిత్తూరు మండలంలోనే ఎక్కువగా..

చిత్తూరు అర్బన్, గ్రామీణ మండలాల పరిధిలోనే ఎక్కువగా 4,009 స్మార్ట్ కార్డులు పంపిణీకి నోచుకోలేదు. ఆపై పుంగనూరులో 3.542, వి.కోట 2187, గంగాధరనెల్లూరు 1,849, పలమనేరు 1,811, రామకుప్పం 1,776, కుప్పం 1,686, పెనుమూరు 1,538, బంగారుపాళ్యం 1,363, వెదురుకుప్పం 1,267, శాంతిపురం 1,237, ఐరాల 1,154, కార్వేటినగరం 1,084, బైరెడ్డిపల్లె 1,091, పూతలపట్టు 1,045, సోమల 979, చౌడేపల్లె 936, నగరి 866, గంగవరం 813, పెద్దపంజాణి 811, తవణంపల్లె 751, ఎస్ఆర్‌పురం 739, గుడిపాల 714, పులిచెర్ల 713, సదుం 694, యాదమరి 615, పాలసముద్రం 590, గుడుపల్లె 547, నింద్ర 456, రొంపిచెర్ల 415, విజయపురం 381 మంది నేటికి పొందలేదు. అసలు వీటిని కార్డుదారులకు పంపిణీ చేయకపోవడం వెనక వారొచ్చి తీసుకోలేదా.. లేక వీటిని అధికారులు చొరవ చూపి పంపిణీ చేయలేదా అనేది పౌరసరఫరాల శాఖ అధికారులు తేల్చాల్సి ఉంది.

పాలకమండలి నియామక జీవో జారీ

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పాలకమండలి నియామకానికి సంబంధించిన జీవోను రాష్ట్ర ప్రభుత్వ ఎక్స్‌అఫిషియో కార్యదర్శి ఎం.హరిజవహర్‌లాల్ సోమవారం జారీ చేశారు. ఐరాల మండలం బొమ్మసముద్రం గ్రామానికి చెందిన వి.సురేంద్రబాబు అలియాస్ మణినాయుడిని ఛైర్మన్‌గా సెప్టెంబరు 18న కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అనంతరం అక్టోబరు 8న 16 మంది సభ్యులకు ప్రభుత్వం పాలకమండలిలో చోటుకల్పించింది. తెదేపాకు 14, జనసేనకు రెండు, ఒకటి భాజపాకు కేటాయించారు. ఆలయ ప్రధాన అర్చకుడిని ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా నియమిస్తూ జీవోలో పేర్కొన్నారు. బుధవారం పాలకమండలి బాధ్యతలు స్వీకరించనుంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ఆలయ ఛైర్మన్ మణినాయుడు, తెదేపా మండల అధ్యక్షుడు వి.హరిబాబు నాయుడు.. సీఎం చంద్రబాబును సోమవారం అమరావతిలో కలిసి ఆలయ అభివృద్ధి పనులను వివరించారు.

అబ్బురపరిచే నిర్మాణాలు చేపట్టండి

లడ్డూ పోటులో పరిశీలిస్తున్న ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్, ఈవో పెంచల కిషోర్

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద ఏసీ, నాన్ ఏసీ కల్యాణ మండపాలు, అతిథి గృహాల నిర్మాణాలకు తితిదే కేటాయించిన రూ.25 కోట్లతో అబ్బురపరిచేలా నిర్మాణాలు చేపట్టాలని దేవాదాయశాఖ ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశించారు. ఈవో పెంచల కిషోర్, ఈఈ వెంకటనారాయణతో కలిసి ఆయా నిర్మాణాలు చేపట్టనున్న ప్రాంతాలను సోమవారం పరిశీలించి ఆర్జేసీ మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి తితిదే నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. నిర్మాణాల్లో నాణ్యత పాటించి శాశ్వతంగా నిలిచేలా చూడాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధునాతన వసతులు కల్పించాలన్నారు. అనంతరం అన్నదానం, లడ్డూ పోటు, పడితరం గిడ్డంగిని ఆయన పరిశీలించారు. దేవాదాయ శాఖ ఏసీ చిట్టెమ్మ, ఏఈవోలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనుంజయ పాల్గొన్నారు.

తోటివారి సాయం.. సమస్యకు పరిష్కారం

ఇతరుల సాయం లేనిదే అడుగు కూడా కదపలేని స్థితిలో ఉన్న కొందరు దివ్యాంగులు తోటివారి సాయంతో తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్‌ను వేడుకునేందుకు చిత్తూరుకు తరలివస్తున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలు విన్నవించేందుకు పలు ప్రాంతాల ప్రజలు కలెక్టరేట్ ప్రాంగణానికి తరలి వస్తుంటారు. వీరిలో కొందరు దివ్యాంగులు తోటివారి సాయంతో వచ్చి తమ సమస్యలు ఉన్నతాధికారులకు విన్నవించి ఇలా ప్రయాసకోర్చి తిరిగి వెళ్తూ ఇలా కనిపించారు. **-ఈనాడు, చిత్తూరు**

పద్మావతి పంచమీ తీర్థానికి సర్వం సిద్ధం

లక్ష మందికి పైగా భక్తులు వస్తారని అంచనా

పద్మసరోవరంలో పంచమీ తీర్థం వేదిక

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు జరిగే పంచమీ తీర్థానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇక్కడ పుణ్యస్నానాలకు లక్ష మందికి పైగా తరలిరానున్న నేపథ్యంలో తితిదే, పోలీసు యంత్రాంగం భద్రత చర్యలు చేపట్టింది. మధ్యాహ్నం 12.10 నుంచి 12.20 మధ్య అమ్మవారికి చక్రస్నానం చేయనున్నారు. పద్మ సరోవరంలో స్నపన తిరుమంజనం జరిగే మండపాన్ని పుష్పాలతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. పుణ్యస్నానాలు చేసేందుకు భక్తులు సోమవారం రాత్రే తిరుచానూరు చేరుకున్నారు. వీరు వేచి ఉండేందుకు తిరుచానూరు ముఖద్వారం వద్ద షెడ్డు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించారు. తితిదే 150 అన్న ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేసింది. రాత్రి వచ్చిన వారు ముఖ ద్వారం వద్దనున్న షెడ్డు సమీప గేట్ నంబరు-3 ద్వారా పద్మ సరోవరంలోకి వెళ్లాలి. ఇక్కడ 20 వేల మంది మాత్రమే పట్టే అవకాశం ఉండటంతో ఉదయం 10.30 తర్వాత భక్తులను దశల వారీగా స్నానాలకు అనుమతించనున్నారు. బందోబస్తుకు సుమారు 2 వేల మంది పోలీసులు తరలివచ్చారు.

భక్తులకు మర్యాదపూర్వక సేవలు

పంచమీ తీర్థానికి వచ్చే భక్తులకు పోలీసులు మర్యాదపూర్వక సేవలు అందించాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. పుణ్యస్నానాలు చేసేందుకు వచ్చే భక్తులను క్యూలైన్ల ద్వారా మాత్రమే అనుమతించాలన్నారు.

సోమవారం రాత్రే గ్యాలరీల్లోకి వచ్చిన భక్తులు

నేడు పద్మావతికి శ్రీవారి సారె

తిరుమల: తిరుచానూరు బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని తిరుమల శ్రీవారి ఆలయం నుంచి పసుపు, కుంకుమ, ప్రసాదాలు, తులసి, వస్త్రాలు, ఆభరణాలతో కూడిన సారెను గజాలపై పంపనున్నారు. పద్మ పుష్కరిణి వద్ద సారె సమర్పిస్తారు.

EENADU Classifieds
JOBS
WANTED CHEMIST (Male) B.Sc., Chemistry/ B.Pharmacy M/s. Coastal Laboratories, Akkampeta, TADA. 70133 32427, info@coastal-labs.com.
Wanted Service Technicians Fresher or Exp. Electrical and Electronics ITI, Diploma or any Technical Exp. ✆ 93901 52768
ఎలక్ట్రీషియన్లు కావలెను. AP SPDCL పరిధిలో చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు & అనంతపురం జిల్లాల్లో వర్క్స్ చేయుటకు ఎలక్ట్రీషియన్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్లు కావలెను. జీతం 20K To 30K. Con: 73307 05344, 089131 41574.
THE EENADU WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

బియ్యం నేరుగా పాఠశాలలకు సరఫరా చేయాలి

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన బియ్యాన్ని పాఠశాలలకు నేరుగా సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని డీఆర్వో మోహన్‌కుమార్‌కు.. యూటీఎఫ్ నాయకులు సోమవారం విన్నవించారు. అర్హులైన విద్యార్థులకు రవాణా భత్యం అందజేయాలన్నారు. మనబడి-మన భవిష్యత్తు రెండో దశ పనుల్లో భాగంగా పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. నాయకులు జీవీరమణ, మణిగండన్, సుధాకర్‌రెడ్డి, రెడ్డెప్ప నాయుడు, రెహానా బేగం, ఏకాంబరం, సరిత పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరి మృతి.. ఒకరికి గాయాలు

కార్వేటినగరం: సురేంద్రనగరం సమీప పెద్దకనుమ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం నుంచి పుత్తూరుకు వస్తున్న ఇటుకల ట్రాక్టర్ మార్గమధ్యలో సురేంద్రనగరం పెద్ద కనుమ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ఉన్న పుత్తూరు మండలం పిళ్లారిపట్టుకు చెందిన సంతోష్(21), అదే మండలం కొత్తతిమ్మాపురానికి చెందిన సెల్వి(50) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో తీవ్రగాయాలైన పుత్తూరు మండలం పాతపల్లూరుకు చెందిన రాధ(45)ను మెరుగైన వైద్య సేవల కోసం తిరుపతికి తరలించారు. ఎస్సై రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెంగళూరులో యువతి హత్య

చౌడేపల్లె, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బిక్కంగారిపల్లెకు చెందిన దేవిశ్రీ(21) అనే యువతిని చౌడేపల్లె మండలం పెద్దకొండామర్రికి చెందిన యువకుడు ప్రేమవర్ధన్ అలియాస్ గోవర్ధన్ బెంగళూరులో హత్య చేసి పరారైనట్లు సోమవారం సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. బెంగళూరులో బీబీఏ చదువుకుంటూ అక్కడే ఉంటున్న యువతిని గోవర్ధన్ హత్య చేసినట్లు కర్ణాటక పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కాగా గోవర్ధన్ ఎంబీఏ పూర్తి చేసి కొన్నేళ్లుగా తిరుపతిలో ఉంటున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఇద్దరిపై పీడీ యాక్టు

ఈనాడు- తిరుపతి: గంజాయి, హత్య కేసుల్లో నిందితులైన ఇద్దరిపై పీడీ యాక్టు ప్రయోగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. పులిచెర్ల మండలం కమ్మపల్లికి చెందిన వట్టికుంట అరుణ్‌కుమార్(32)పై నాలుగు కేసులు ఉన్నాయి. తిరుపతి నగరం కొర్లగుంటకు చెందిన సయ్యద్ అజీమ్ (30) గంజాయి, హత్య, దొమ్మీ కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే వీరిద్దరిపై పీడీ యాక్టు నమోదు చేశారు. ఈ నెల 21న తిరుపతి జిల్లాకు చెందిన నలుగురిపై పీడీ యాక్టు ప్రయోగించిన సంగతి తెలిసిందే.

తిరుమల ఘాట్‌రోడ్డులో కారు బోల్తా

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో కారు అదుపు తప్పి బోల్తా పడింది. చెన్నైకు చెందిన భక్తులు కారులో తిరుమల నుంచి తిరుపతి బయలుదేరారు. 2వ కిలోమీటర్ వద్ద బ్రేకులు ఫెయిలవడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ముగ్గురు భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఘాట్‌రోడ్డు భద్రతా సిబ్బంది కారును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ప్రేమించిన వ్యక్తి కాదన్నాడని యువతి ఆత్మహత్య

గౌతమి (పాతచిత్రం)

చౌడేపల్లె, న్యూస్‌టుడే: కులం వేరు కావడంతో వివాహానికి తల్లిదండ్రులు అంగీకరించలేదని ప్రాణంగా ప్రేమించిన వ్యక్తి చెప్పడంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన చౌడేపల్లె మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. దిగువపల్లె పంచాయతీ మిట్టపల్లెకు చెందిన గంగరాజు కుమార్తె గౌతమి(23) బెంగళూరులో ఓ కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తోంది. ప్రకాశం జిల్లా మార్కాపురంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుకుంటున్న సమయంలో అదే కళాశాల విద్యార్థి, సోమల మండలం కందూరుకు చెందిన కార్తిక్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. అతనూ బెంగళూరులో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే పెళ్లి చేసుకుందామని కార్తిక్‌ను గౌతమి కోరింది. మీ కులం వేరు కావడంతో తల్లిదండ్రులు అంగీకరించడం లేదని సమాధానం చెప్పడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గౌతమి శనివారం స్వగ్రామానికి చేరుకుని ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పింది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి నాగరత్న ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు.

26న దివ్యాంగుల క్రీడా పోటీలు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: దివ్యాంగుల క్రీడా పోటీలను ఈ నెల 26న ఉదయం 9 గంటలకు చిత్తూరులోని డీఎస్ఏ మైదానంలో నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో బాలాజీ సోమవారం తెలిపారు. షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు 12 నుంచి 21 ఏళ్ల లోపు బాలబాలికలు అర్హులని చెప్పారు. అథ్లెటిక్స్, చెస్ పోటీలకు అన్ని వయస్సుల వారు అర్హులని పేర్కొన్నారు.

గోదాముకు చేరిన నియంత్రికలు

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ జిల్లా గోదాముకు సోమవారం 25 హెచ్‌పీ నియంత్రికలు 96 చేరాయి. ప్రస్తుతం గోదాములో నియంత్రికలు, అనుబంధ పరికరాల కొరత లేదని, అవసరమైన మేరకు అందుబాటులో ఉన్నాయని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. నిర్దేశిత లక్ష్యం మేరకు వ్యవసాయ సర్వీసుల జారీకి చర్యలు చేపట్టామన్నారు. గోదాము నుంచి తీసుకెళ్లిన నియంత్రికలను సత్వరమే అమర్చాలని, జాప్యం వహిస్తే సంబంధిత ఇంజినీర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాతా, శిశు మరణాలు తగ్గించండి

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసూతి సేవలను మెరుగుపరచి.. మాతా, శిశు మరణాలను తగ్గించాలని జిల్లా టీకాల అధికారి హనుమంతరావు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం మాతా, శిశు మరణాలపై సమీక్ష జరిగింది. అక్టోబరులో జరిగిన ఒక మాతృ, 17 శిశు మరణాలపై సంజాయిషీ ఇవ్వాలని సూచించారు. వైద్యులు ఉషశ్రీ, లత, అయేషా, ప్రశాంతి, రోజారాణి, వెంకటేశ్వరి, మోహన్‌బాబు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మళ్లీ కూర్మానిపల్లిలో కర్ణాటక పోలీసుల సోదాలు

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: బెంగళూరులో ఇటీవల భారీ మొత్తంలో నగదు దోపిడీ జరిగిన విషయం విదితమే. దీనిపై రంగంలోకి దిగిన కర్ణాటక పోలీసులు సోమవారం రాత్రి మళ్లీ కుప్పం మండలం కూర్మానిపల్లి గ్రామానికి చేరుకుని సోదాలు నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన నవీన్ ఇంట్లో తనిఖీలు చేపట్టి మరో రూ.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ఏఐపీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జోబ్

నియామకపత్రం అందుకుంటున్న రెవరెండ్ జోబ్

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: అఖిల భారత పాస్టర్ల సమాఖ్య(ఏఐపీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చిత్తూరు నగరంలోని షకీనా ప్రార్థనా మందిరం ప్రబోధకులు రెవరెండ్ డాక్టర్ జోబ్ నియమితులయ్యారు. గుంటూరులో ఆదివారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన.. ఏఐపీఎఫ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రెబ్బ ఇమ్మాన్యుల్ చేతుల మీదుగా నియామక ప్రతి అందుకున్నారు. క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని జోబ్ పేర్కొన్నారు.

రైతులను గౌరవంగా చూడాలన్నదే లక్ష్యం

దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: రైతులను గౌరవంగా చూడాలన్నదే సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వ ఆశయమని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎంకిసాన్ నిధులను రైతుల ఖాతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జమ చేశాయని, ఈ పథకాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారని స్పష్టం చేశారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.48,340 కోట్లు వ్యవసాయ రంగానికి కేటాయించిందన్నారు. వ్యవసాయాన్ని లాభదాయకం చేసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు.

వినికిడి యంత్రాల వితరణ

తిరుపతి (తితిదే): తిరుపతికి చెందిన ఎన్.విరాట్ రూ.20 లక్షల విలువైన 105 వినికిడి యంత్రాలను సోమవారం తిరుమల తిరుపతి దేవస్థానానికి అందజేశారు. యంత్రాలను తితిదే పరిపాలన భవనంలో ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు సోమవారం ఇచ్చారు. శ్రవణం ప్రాజెక్టులో శిక్షణ పూర్తి చేసుకుని బయటకు వెళ్లే పిల్లలకు వీటిని ఇవ్వనున్నారు.

బీసీల జనాభా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలి

నిరసనలో సమగ్ర శిక్షా ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై 292 వినతులు వచ్చాయి. శిక్షణ కలెక్టర్ నరేంద్ర పాడల్, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, అధికారులు ఉన్నారు.
● బీసీల జనాభా మేరకు రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డీగా వర్గీకరించి చట్టబద్ధం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జ్ఞాన జగదీష్ విన్నవించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ అమలు చేయడానికి ముందు కులగణన నిర్వహించాలన్నారు. రాజ్యాంగం షెడ్యూల్-9లో జనాభా దామాషా మేరకు బీసీ రిజర్వేషన్ల పెంపును చేర్పించాలని ఆ వినతిలో పేర్కొన్నారు. నాయకులు చంద్ర, సెల్వరాజ్, మురుగన్, మంజునాథ్, శరత్ ఉన్నారు. ● తమ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ జిల్లా సమగ్ర శిక్షా ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఐకాస ఛైర్మన్ కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మినిమమ్ టైం స్కేల్, ఈపీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ, హెచ్ఆర్ పాలసీ వర్తింపు, ఉద్యోగ విరమణ వయస్సు పెంపు, వివిధ ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

(c) eenadu

చిత్తూరు

•చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

కలెక్టర్ వెంకటేశ్వర్‌కు మొక్క అందజేస్తున్న కమిషనర్ నాగేశ్వరరావు

తిరుపతి జిల్లా కలెక్టర్‌కు సత్కారం

పుత్తూరు, న్యూస్‌టుడే: నూతన మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు.. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఆయనకు మొక్క అందజేశారు. పుత్తూరు పురపాలికకు సంబంధించిన పలు సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట డీఈఈ లోకేష్ తదితరులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు

గుడిపాల: రామభద్రాపురం నుంచి దాయంవారిపల్లెకు సీసీరోడ్డు వేయడానికి రూ.15.5 లక్షలు మంజూరయ్యాయని సర్పంచి గోళ్ల హరిణి తెలిపారు. రోడ్డు సమస్యను ఎమ్మెల్యే జగన్మోహన్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి ఉపాధి హామీ కింద నిధులు మంజూరు చేయించారన్నారు. పనులు సోమవారం ప్రారంభించామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

న్యూస్‌టుడే, యాదమరి: సమస్య: అంతర్రాష్ట్ర రహదారిలో కొత్తగా వేసిన రోడ్డులో అక్కడక్కడా గుంతలు ఏర్పడ్డాయి. కొత్తూరు కల్వర్టు వద్ద రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **-వాహన చోదకులు**

సమాధానం: పనులు వెంటనే పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాం. గుంతలనూ బాగు చేయిస్తాం. **-ఆదికేశవులు, ఏఈ, ఆర్‌అండ్‌బీ**

న్యూస్‌టుడే, పాలసముద్రం: సమస్య: సింహరాజుపురం పంచాయతీ పరిధిలోని గ్రామ వీధిలోని కుళాయి పైపు విరిగిపోయి నీరు వృథాగా పోతోంది. **- శ్రీను, గ్రామస్థుడు**

సమాధానం: తాగునీటి పైపునకు మరమ్మతులు చేయించి వృథా అరికడతాం. **- తిరుమల, పంచాయతీ కార్యదర్శి**

విద్యార్థులకు ఉపయుక్తం

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, డీఆర్వో మోహన్‌కుమార్

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: విద్యార్థులకు ఉపయుక్తమైన పుస్తకాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. వి.కోట బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ కణ్ణన్.. భౌగోళిక, చరిత్ర, రాజనీతి, అర్థశాస్త్రాల్ని సమ్మిళితం చేసి రచించిన కాంప్రహెన్సివ్ స్టడీ మెటీరియల్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. పుస్తకాలను పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయడం ప్రశంసనీయమన్నారు. శిక్షణ కలెక్టర్ నరేంద్ర పాడల్, డీఆర్వో మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

అర్జీదారుతో మాట్లాడుతున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై అందే ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రెవెన్యూ 1, ఇంజినీరింగ్ 1, ప్రజారోగ్యం 1, పట్టణ ప్రణాళిక 1, టిడ్కోకు 1 చొప్పున మొత్తం 5 వినతులు అందాయి. సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంఈ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలకించేవారు లేరయ్యా..!

✪ మండలాల్లో స్పందన కరవు
✪ బాధలకోర్చి తిరుగుతున్నాం
✪ అర్జీదారుల కన్నీటి వేదన

విత‌ంతు పింఛను ఇప్పించండి..

వితంతు పింఛను అందజేయాలని చిత్తూరు నగరం టి.చవటపల్లెకు చెందిన శృతి వేడుకున్నారు. అనారోగ్యం కారణంగా తన భర్త వినోద్‌కుమార్ ఎనిమిది నెలల క్రితం మృతి చెందాడని, తనకు ఏ ఆధారం లేదని వాపోయారు. ప్రస్తుతం తాను కూలి పనులకెళ్లి జీవిస్తున్నానని చెప్పారు. తనకు ఉపాధి కల్పించడంతో పాటు వితంతు పింఛను ఇప్పించాలని అధికారులకు విన్నవించారు.

న్యూస్‌టుడే, చిత్తూరు(మిట్టూరు), కలెక్టరేట్

తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి.. ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. మండలాల్లో తమను పట్టించుకునేవారే లేరని వాపోయారు పలువురు అర్జీదారులు.. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది కరుణించడం లేదని, చేసేదేమీ లేక విసిగి వేసారి దూరాభారమైనా కలెక్టరేట్‌కు వచ్చామన్నారు.. ఉన్నతాధికారులైనా తమ గోడు ఆలకించి పరిష్కారం చూపాలని ఆవేదన వ్యక్తం చేశారు.. తమపై దయ చూపాలని కన్నీటిపర్యంతమయ్యారు.

సర్వే చేసి న్యాయం చేయరూ..

తన భూమిని సర్వే చేసి తనకు అప్పగించాలని చిత్తూరు మండలం చెర్లోపల్లెకు రైతు రమణారెడ్డి అధికారులకు వినతి అందజేశారు. తేనెబండ రెవెన్యూ పరిధిలో ఇతరుల నుంచి కొనుగోలు చేసిన 0.21 సెంట్ల భూమి ఉందని, అయితే కొందరు అక్రమంగా తన భూమి నమోదు చేసుకుని పట్టాదారు పుస్తకం పొందారని ఆరోపించారు. అక్రమ పట్టాదారు పుస్తకాన్ని రద్దు చేసి తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

రోడ్డు నిర్మించండి..

తమ గ్రామానికి రోడ్డు నిర్మించాలని ఐరాల మండలం ముదిగోళం పంచాయతీ గాజులపల్లె హరిజనవాడ వాసులు వినతి అందజేశారు. తిరుపతి-కాణిపాకం హైవే నుంచి తమ గ్రామానికి మట్టి రహదారి ఉందన్నారు. 1983లో ఈ రహదారి ఏర్పాటుకు సబ్-డివిజన్ చేసి సరిహద్దులు గుర్తించారన్నారు. ప్రస్తుతం కొందరు రోడ్డు వేయకుండా ఆటంకం కలిగిస్తున్నారని వాపోయారు. వర్షం కురిస్తే ఆ దారిలో వెళ్లలేక అవస్థలు పడుతున్నామని చెప్పారు. రికార్డుల ప్రకారం రోడ్డు నిర్మించాలని వేడుకున్నారు.

దారి సౌకర్యం కల్పించాలి..

తమ పొలాలకు వెళ్లేందుకు దారి సౌకర్యం కల్పించాలని వెదురుకుప్పం మండలం కురివికుప్పం పంచాయతీ అడపాలబైలు గ్రామస్థులు దొరస్వామి శెట్టి, రామచంద్రయ్య శెట్టి, నాగరాజు శెట్టి, కృష్ణమూర్తి విన్నవించారు. తమకు కురివికుప్పం రెవెన్యూ లెక్క దాఖలా వ్యవసాయం భూమి ఉందని, గతంలో రెవెన్యూ అధికారులు సర్వే చేసి దారి కల్పించారన్నారు. అయితే గ్రామానికి చెందిన కొందరు ఆ దారిని ఆక్రమించి మూసేశారని వాపోయారు. తమకు దారి లేకుండా చేశారని, న్యాయం చేయాలని విన్నవించారు.

మాట్లాడుతున్న ఏఐసీసీ జిల్లా పరిశీలకులు జయకుమార్

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా సంస్థాగత నిర్మాణాన్ని చేపడుతున్నామని మాజీ ఎంపీ, ఏఐసీసీ జిల్లా పరిశీలకులు జయకుమార్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు అన్ని జిల్లాలకు నూతన అధ్యక్షులను నియమిస్తున్నామని, చిత్తూరు జిల్లా అధ్యక్షుడి ఎంపిక డిసెంబరు 3న ఉంటుందని, ఎనిమిదో తేదీ తరవాత అధికారికంగా ప్రకటిస్తామన్నారు. కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్, ఏపీ పీసీసీ పరిశీలకులు రాంగోపాల్ రెడ్డి, దామోదర్‌రావు, జిల్లా అధ్యక్షులు భాస్కర్, నాయకులు టిక్కీ రాయల్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. ఆసుపత్రికే

ఐరాల-పాటూరు ప్రధాన రహదారి రెడ్డివారిపల్లె వద్ద రోడ్డుపై గుంత ఏర్పడింది. ఇటీవల నూతన రోడ్డు నిర్మించారు. వేసిన నెలల వ్యవధిలో గుంత ఏర్పడటంపై నాణ్యత బాగోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రోడ్డు మధ్య గుంత ఏర్పడటంతో ఆదమరిచి వెళ్తే ప్రమాదం తప్పదు. ర.భ అధికారులు పరిశీలించి గుంతను పూడ్చి వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, ఐరాల**

సేవాగుణాన్ని పెంపొందించుకోవాలి

పాలసముద్రం: మొక్క నాటుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

నగరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజుల.. ఏకాంబరకుప్పం దళితవాడలో సోమవారం ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రారంభించారు. మానవసేవే మాధవసేవ అనే సత్యాన్ని అందరూ గ్రహించి, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ అధికారి బ్రహ్మానందం, ప్రధానోపాధ్యాయుడు పాపయ్య, అధ్యాపకులు సుదర్శన్, ఉమారాణి, విద్యార్థులు పాల్గొన్నారు. **పుత్తూరు, న్యూస్‌టుడే:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రమౌళి.. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సీటీఆర్‌నత్తంలో ప్రత్యేక శిబిరం నిర్వహించి ఆపై ర్యాలీ చేపట్టారు. వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీనివాసులు, బాబురావు, తిరుమలయ్య, గంగయ్య తదితరులు పాల్గొన్నారు. **పాలసముద్రం, న్యూస్‌టుడే:** విద్యార్థులు సేవా గుణం అలవరచుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హేమలత, ఎంఈవో రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించారు. అధ్యాపకులు షణ్ముగం, సూరియన్, హరి పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 32 ఫిర్యాదులు

చిత్తూరు(నేరవార్తలు): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్‌కు 32 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాలతో డీఎస్పీ సాయినాథ్ ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ సమస్యలు 7, భూ సమస్యలు 10, నగదు సమస్యలు 10, ఆస్తి తగాదాలు 2, మోసం 3 చొప్పున 32 ఫిర్యాదులు అందాయి.

బాధితులను ఆదుకోవడమే ధ్యేయం

పాలసముద్రం: పేదలను ఆదుకోవడానికి జనసేన ముందుంటుందని పార్టీ నియోజకవర్గ బాధ్యులు, మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ దళితవాడ గ్రామానికి చెందిన నాగవేణి ప్రమాదవశాత్తూ గాయపడి మంచానికే పరిమితమైంది. ఆమెకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. మండల పార్టీ అధ్యక్షుడు లతీష్, రాఘవ, చందు, జవాద్, అలీ, దేవదాసు, రమేష్ పాల్గొన్నారు.

అధ్యాపకులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

క్రీడల్లో అధ్యాపకుల ప్రతిభ

నగరి, న్యూస్‌టుడే: శ్రీ వెంకటేశ్వర వర్సిటీ పరిధిలోని కళాశాలల బోధనా సిబ్బందికి జరిగిన క్రీడా పోటీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ వేణుగోపాల్ తెలిపారు. త్రోబాల్ పోటీలో అధ్యాపకులు ఇందిరా ప్రియదర్శిని, అరుణకుమారి విజేతలుగా, బాల్‌బ్యాడ్మింటన్‌లో రన్నర్లుగా నిలిచారన్నారు. టెన్నిస్ సింగిల్ విభాగంలో భాస్కరరాజు విజేతగా నిలిచారన్నారు. సోమవారం కళాశాలలో వీరిని ప్రత్యేకంగా అభినందించారు.

లేబర్ కోడ్‌లు రద్దుచేయాలి

నగరి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కోదండయ్య డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. మురళీ, శేఖర్, వేలన్, బాషా, అహ్మద్, సిరాఉద్దీన్, సతీష్, సురేష్, ఏసయ్య పాల్గొన్నారు.

పెనుమూరు.. ఉన్నత పాఠశాలలో వెలిగించిన కార్తిక దీపాలు

వేడుకగా కార్తిక వనభోజనం

కాణిపాకం, న్యూస్‌టుడే: తమిళ కార్తిక మాసం సందర్భంగా శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన శ్రీ మరగదాంబికా సమేత మణికంఠేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవార పూజలు నిర్వహించారు. నెల్లి, ఉసిరి చెట్ల కింద మహిళలు దీపాలు వెలిగించి మొక్కు తీర్చుకున్నారు. **విజయపురం:** జగన్నాథపురం శ్రీరామనామ క్షేత్రంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. పురోహితులు రాంప్రసాద్‌శర్మ పాల్గొన్నారు. **శ్రీరంగరాజపురం:** పల్లేరుకాయల కోనలోని ఆత్మలింగేశ్వర స్వామి ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం నిర్వహించారు. అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ మోహన్‌నాయుడు పూజాది కార్యక్రమాలు పర్యవేక్షించారు. **పెనుమూరు:** ఎంప్రాళ్ల కొత్తూరు గ్రామస్థులు కార్తిక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సమీప అడవిలో ఉసిరి చెట్టు వద్ద శివలింగం, శివపార్వతుల చిత్రపటాలు ఉంచి అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, శేషుబాబుశర్మ ప్రత్యేక పూజలు చేసి కార్తిక వనభోజన విశిష్టత వివరించారు. మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. అన్నదానం చేశారు. **బంగారుపాళ్యం:** మొగిలీశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు, జిల్లాలోని పలు ప్రాంతాల భక్తులు తరలివచ్చి కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలను వెలిగించి మొక్కు తీర్చుకున్నారు. అన్నదానం చేశారు. ఆలయ సిబ్బంది భక్తులకు వసతులు కల్పించారు. అయ్యప్ప భక్తులకు మెరుగైన సేవలందించేందుకు పుష్కరిణి వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టారు. తెదేపా మండల గౌరవాధ్యక్షులు జయప్రకాష్‌నాయుడు పర్యవేక్షించారు. ఆయన వెంట పార్టీ నాయకులు ప్రసాద్, ధనంజయనాయుడు ఉన్నారు. **వెదురుకుప్పం:** ముళాళంలో వెలసిన శ్రీ మరకతవల్లి సిద్ధేశ్వరునికి సహస్ర కలశాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఏకవీరా సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ సిద్ధేశ్వరుడికి సహస్ర కలశాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విజేతలతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు

పీఎన్‌సీ నగరపాలకొన్నత పాఠశాల హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులతో విజేతలు

వాక్చాతుర్యంతో మెప్పించి.. బహుమతులు సాధించి

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అంశంపై ఏడు, ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు సోమవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఎస్.అఫియ, ఆర్.శ్రీలేఖ, సీఎస్.హనీషా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. వీరికి ఇన్‌ఛార్జి హెచ్‌ఎం శ్రీనివాసులు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ● సంతపేట పీఎన్‌సీ నగరపాలకొన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపన్యాస పోటీలో బి.భార్గవి, ఎస్.తస్మీయ, వీడీ.శ్రీరామ్ విజేతలుగా నిలిచారు. వీరికి హెచ్‌ఎం భారతి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న బాలికల జడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భువనేశ్వరి

విజేతలతో ఎస్ఆర్ఎస్ జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం మోహన్‌కుమార్

ప్రతిభ చూపి.. బహుమతులు గెలిచి

పుత్తూరు, న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా పట్టణంలోని బాలికల జడ్పీ ప్రభుత్వ, ఎస్ఆర్ఎస్ జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 'విద్యార్థులపై చరవాణి ప్రభావం' అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీలో 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో సంజన, శరణ్యశ్రీ, భువి, మోక్షిత, తులసీరామ్, రెహాన్ నిలిచారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరి, మోహన్‌కుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్ప, సుధారాణి, రాజేశ్వరి, చంద్రకళ, తులసీబాబు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి.. పుత్తూరు: స్థానిక జ్యోతిబసు నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతి అందజేశారు. గోపాలకృష్ణాపురం ఎస్టీకాలనీ వాసులు 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను 2014లో పుత్తూరుకు చెందిన ఓ వ్యక్తి ఆక్రమించాడని, అతడిపై చర్యలు చేపట్టి ఆ భూములు ఎస్టీలకు ఇప్పించాలన్నారు. దళిత, గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి నందయ్య, గ్రామస్థులు రాఘవమ్మ, నాగభూషణం, లీలావతి పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి .. బంగారుపాళ్యం: విద్యార్థులు, ప్రజలు ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలని పలువురు వక్తలు కోరారు. పీవీఆర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది బస్టాండులో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ స్టాల్ ఏర్పాటు చేశారు.

పైప్‌లైన్ ఏర్పాటుకు సహకరించండి.. వెదురుకుప్పం: గ్రామానికి తాగునీరందించడానికి అవసరమైన పైపులైను ఏర్పాటుకు సహకరించాలని మండల ప్రత్యేకాధికారి శాంతరాజు కోరారు. సోమవారం జక్కదొనలో ఆయన పర్యటించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గాయత్రి, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, ఇంజినీరింగ్ సహాయకుడు ప్రభాకర్, సీనియర్ నేత మాధవనాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గణనాథుడి సేవలో ప్రముఖులు

ప్రతిభా భారతి, ఎమ్మెల్సీ గ్రీష్మకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో పెంచల కిషోర్

కాణిపాకం, న్యూస్‌టుడే: వరసిద్ధి వినాయకస్వామిని ఎమ్మెల్సీ గ్రీష్మ, శాసనసభ మాజీ స్పీకర్ ప్రతిభా భారతి సోమవారం దర్శించుకున్నారు. ఈవో పెంచల కిషోర్, అర్చకులు వారికి స్వాగతం పలికారు. మూలమూర్తి దర్శన అనంతరం వారికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: మహదేవమంగళం వ్యవసాయ క్షేత్రంలో సోమవారం బంగారెడ్డిపల్లెకు చెందిన వెంకటరెడ్డి కుమారుడు కోదండరెడ్డి(31) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సీఐ శ్రీనివాసంతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతివేగం వద్దన్నందుకు దాడి

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మొగిలి వెంకటగిరికి చెందిన హర్షద్ ద్విచక్ర వాహనాన్ని అతి వేగంగా నడుపుతున్నాడు. ఆదే గ్రామానికి చెందిన మురళీమోహన్.. డ్రైవింగ్ లైసెన్స్ ఉందా.. వేగంగా వాహనాన్ని నడపొద్దని సూచించాడు. దీంతో కోపోద్రిక్తుడైన హర్షద్.. మురళీమోహన్‌ను రాయితో కొట్టి గాయపరిచాడు. బాధితుడి భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

నింద్ర.. అగరంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

రైతుల శ్రేయస్సే లక్ష్యం

గుడిపాల: రైతుల శ్రేయస్సే లక్ష్యమని ఎమ్మెల్యే జగన్మోహన్ అన్నారు. మండల కేంద్రంలో 'రైతన్నా మీకోసం'లో పాల్గొన్నారు. రైతు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ హేమలత, ఉద్యానశాఖ డీడీ మధుసూదనరెడ్డి, ఏడీఏ ఉమ, చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ పాల్గొన్నారు. **చిత్తూరు గ్రామీణ:** ఎమ్మెల్యే జగన్మోహన్.. పెరుమాళ్లకండ్రిగలో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ భూమిపూజలో పాల్గొన్నారు. **నగరి:** అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. చిన్నతాంగల్‌లో రైతన్నా-మీకోసం కార్యక్రమంలో పాల్గొని రైతులను కలిసి ప్రభుత్వ పథకాలు, రాయితీలు, డ్రోన్లు, బిందు సేద్యంపై మాట్లాడారు. తెదేపా మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, కార్యదర్శి వేణు, ఏడీఏ కవిత, పశుసంవర్ధక శాఖ ఏడీ వాసు, ఏవోలు రాఘవేంద్ర, జలంధర్ తులసి పాల్గొన్నారు. **పుత్తూరు:** ఏడీఏ లక్ష్మీదేవి.. వేపగుంటలో కార్యక్రమం నిర్వహించారు. ఏవో కోదండయ్య, వీపీఏ మురళి, వీఏఎస్ శ్రీదేవి, మండల తెదేపా అధ్యక్షుడు బాలాజీ పాల్గొన్నారు. **నింద్ర:** పశుసంవర్ధక శాఖ డీడీ గోవిందయ్య.. మండల కేంద్రంలో వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ అధికారులు కార్యక్రమాన్ని పరిశీలించారు. అగరంలో సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకటేశ్వరరావు సమక్షంలో రైతులు సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పశుసంవర్ధక శాఖ ఏడీ మునిలక్ష్మీపతి, ఏవో తులసీరామ్, పశువైద్యాధికారిణి సాయిసౌందర్య, తెదేపా నాయకులు రమేష్, కుప్పానాయుడు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. **విజయపురం:** మండలంలో అధికారులు అన్ని గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. ● **పాలసముద్రం:** పెనుమూరు ఏఎంసీ వైస్ ఛైర్మన్ అరుణ్‌నాథన్.. ఆముదాల పంచాయతీలో కరపత్రాలు అందజేశారు. **యాదమరి:** 12.కమ్మపల్లిలో వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ అధికారులు, సిబ్బంది రైతు కుటుంబ సభ్యులను కలిసి ప్రభుత్వ పథకాలు వివరించారు. 184 గొల్లపల్లిలో పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ చిత్ర, కీనాటంపల్లిలో తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి అమరనాథనాయుడు కరపత్రాలు పంపిణీ చేశారు. ● **పెనుమూరు:** ఏవో సుహర్లత.. కార్యక్రమాన్ని ప్రారంభించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, మండల తెదేపా అధ్యక్షుడు రుద్రయ్య పాల్గొన్నారు. ● **వెదురుకుప్పం:** దేవళంపేటలో మండల తెదేపా మాజీ అధ్యక్షుడు లోకనాథరెడ్డి, నియోజకవర్గ నేత కిషన్‌చంద్ కరపత్రాలు పంపిణీ చేశారు. వెదురుకుప్పంలో ఏవో వనిత ఆధ్వర్యంలో మండల తెదేపా అధ్యక్షుడు మోహన్‌మురళి కరపత్రాలు అందజేశారు. **జీడీనెల్లూరు:** జిల్లా తెదేపా నేత దేవరాజులు నాయుడు.. నెల్లేపల్లెలో ఏవో భవాని, ఉద్యానశాఖ అధికారి డిల్లీప్రసాద్ కార్యక్రమాన్ని చేపట్టారు. **తవణంపల్లె:** అరగొండలో ఉద్యానశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. **బంగారుపాళ్యం:** జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదనరెడ్డి 170గొల్లపల్లిలో అధికారులతో కలిసి పాల్గొన్నారు.

నగరి: మహిళా రైతుకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

క్రీడా రత్నాలు

రాణిస్తున్న విద్యార్థులు

పూతలపట్టు, న్యూస్‌టుడే: చదువుతో పాటు పిల్లల్లో ఉన్న ఆసక్తి గుర్తించి వారు క్రీడల్లో రాణించేలా వ్యాయామ సంచాలకులు తీర్చిదిద్దుతున్నారు.. ప్రతిభ కలిగిన క్రీడాకారులుగా గుర్తించిన తర్వాత ఏ క్రీడ ఇష్టమనేది తెలుసుకుని అందులో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.. ఫలితంగా పూతలపట్టు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడల్లో చక్కగా రాణించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

అథ్లెటిక్స్‌లో రాణింపు..

పూతలపట్టుకు చెందిన హుమయూన్ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. తల్లి హంసవేణి పార్ట్‌టైం టీచర్. ఖాదర్‌బాషా పూల వ్యాపారి. పేద కుటుంబమైనా ఆర్థిక ఇబ్బందులు పిల్లలకు తెలియనీయకుండా చదివిస్తున్నారు. ఈ విద్యార్థికి చిన్నప్పటి నుంచి ఆటలపై మక్కువ. తమ కుమారుడి ఆసక్తి గమనించిన తల్లిదండ్రులకు వ్యాయామ ఉపాధ్యాయులకు చెప్పడంతో వారు చక్కటి శిక్షణ ఇచ్చారు. తదనుగుణంగా చక్కటి నైపుణ్యాన్ని ప్రదర్శించి అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్‌లో జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 100 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలనే లక్ష్యంతో శిక్షణ పొందుతున్నాడు.

జట్టు గెలుపులో కీలకం..

పూతలపట్టుకు చెందిన రితీష్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తల్లి శిరీష(పార్ట్‌టైం లెక్చరర్). తండ్రి ఉదయ్‌కుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. తమ కుమారుడు మంచి మార్కులు సాధిస్తున్నాడు. క్రీడలపై ఆసక్తి చూపుతుండటంతో వారు ప్రోత్సహించారు. దీంతో అతడు పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పోటీల వరకు సత్తా చాటుతున్నాడు. సాఫ్ట్‌బాల్, బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లా స్థాయిలో చక్కగా రాణిస్తున్నాడు. జిల్లాస్థాయి పోటీల్లో చక్కగా రాణించి అంతర జిల్లాల పోటీలకు ఎంపికై జట్టు గెలుపులో కీలక భూమిక పోషించాడు.

(c) eenadu

పలమనేరు

•పలమనేరు • కుప్పం •పుంగనూరు

నరసింహారెడ్డి విగ్రహం ఎదుట నాయకులు

ఘనంగా ఉయ్యాలవాడ జయంతి

పుంగనూరు: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతిని సోమవారం స్థానిక యూఎన్ఆర్ సర్కిల్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూజలు చేసి నివాళులు అర్పించారు. యూఎన్ఆర్ సంఘం నాయకులు చెంగారెడ్డి, బాలచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

కరి రావద్దంటే.. పద్ధతి మారాలి మరి..!

✦ ఏనుగుల నుంచి రక్షణకు పంట మార్పిడే ఉత్తమం

పలమనేరు, న్యూస్‌టుడే: ఏనుగుల దాడుల నుంచి పంటలను కాపాడుకోవడానికి రైతులు కొన్ని పద్ధతులు పాటించాలని అటవీ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఏనుగులు వరి, అరటి పంటలను తినడానికి ఎక్కువగా ఇష్టపడతాయి. కాబట్టి అవి తినని పంటలను పండించాలని చెబుతున్నారు. అటవీ సమీప గ్రామాల్లోని రైతులు ఈ విధానం పాటిస్తే కొంత వరకు ఏనుగుల దాడుల నుంచి తప్పించుకోవచ్చు.

గజరాజులు మెచ్చేవి..

చెరకు, వెదురు, గడ్డి, రాగి, మొక్కజొన్న, సజ్జలు, జొన్నలు, వరిని ఏనుగులు ఇష్టపడి తింటాయి. ఈ ప్రాంతంలో రైతులు వరి సాగు ఎక్కువ చేస్తారు. నియోజకవర్గం పరిధిలోని పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లె, వి.కోట మండలాల పరిధిలో దాదాపు 200 ఎకరాల్లో వరి సాగవుతోంది. అందులో సగం అటవీ సమీప గ్రామాల్లోనే. కి.మీ దూరం నుంచే అవి తినే పంటను గుర్తించగలవు. ఒకసారి వచ్చి తినడం అలవాటు చేసుకుంటే తర్వాత ఏడాది కూడా గుర్తుపట్టుకుని ఆ ప్రాంతానికి వచ్చేస్తాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఏనుగులు ఒక్కసారి మామిడితోటలోకి వచ్చాయంటే.. ఎన్నో ఏళ్ల నుంచి పెంచుకున్న చెట్లను సైతం విచ్చలవిడిగా విరిచేస్తాయి.

తేనెటీగలతో రక్షణ

పొలం గట్లపై బాక్సులను ఏర్పాటు చేసుకొని తేనెటీగలను పెంచుకోవాలి. గజాలు వీటిని చూస్తే పొలాల్లోకి రావు. వాటి శబ్దం విన్నా వెనక్కు వెళ్లిపోతాయి.

ఇష్టపడని పంటలు

మిరప, పొద్దుతిరుగుడు, పత్తి వంటి వాటిపై వీటికి ఆసక్తి ఉండదు. వాటిని పండించడానికి రైతులు మొగ్గు చూపాలి. కొన్ని రాష్ట్రాల్లో నిమ్మ, కలిమి చెట్లను పొలానికి కంచెలుగా పండిస్తున్నారు. వాటికి ఉన్న ముళ్ల కారణంగా ఏనుగులు పంట దగ్గరకు రావు. బహుళ పంట పద్ధతిని కూడా రైతులు అనుసరించాలి. అరటి చెట్లను మొదటికే పీకేస్తాయి.

రైతులతో సమీక్షిస్తున్నాం

అటవీ సమీప గ్రామాల రైతులతో సమీక్షిస్తున్నాం. ఏనుగులు గ్రామాల మీదికి రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. రైతులు మిరప, పొద్దుతిరుగుడు పండిస్తే లాభాలతో పాటు ఏనుగుల దాడుల నుంచి రక్షణ పొందవచ్చని వివరిస్తున్నాం. **- శ్రీనివాసులు, అటవీశాఖ అధికారి, చిత్తూరు**

శంకరాయలపేట విద్యార్థుల ప్రతిభ

బిందు, శంకరాయలపేట

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: మండలంలోని శంకరాయలపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్‌రెడ్డి, పీడీ సాధిక్ తెలిపారు. వినుకొండలో సోమవారం జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల హైజంప్‌లో పోటీల్లో పదో తరగతి విద్యార్థిని బిందు నాలుగో స్థానం సాధించినట్లు చెప్పారు. జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో అండర్-14 బాలుర వాలీబాల్ విభాగంలో తొమ్మిదో తరగతి చదువుతున్న రాంప్రసాద్ ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం ఉన్నత పాఠశాలలో డిసెంబరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అండర్-17 బాలుర సాఫ్ట్‌బాల్ విభాగంలో పదోతరగతి విద్యార్థి రవీంద్ర ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

రాంప్రసాద్, రవీంద్ర

మాట్లాడుతున్న విద్యార్థి, విజేతలతో ఉపాధ్యాయులు

పోటీలో పాల్గొని.. బహుమతులు సాధించి

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని వాణి విద్యాశ్రమం పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు 'ప్రతిభా పాటవ' పోటీలు నిర్వహించారు. విద్యార్థులపై చరవాణి ప్రభావం అంశంపై చేపట్టిన పోటీలో విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. వీరిలో తేజశ్రీ(9వ తరగతి), రూపశ్రీ(8వ తరగతి), భవ్యశ్రీ ప్రసన్న(7వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీప్రసాద్ బహుమతులు పంపిణీ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. **- స్థానికులు**

సమాధానం: సిబ్బందిని పంపి శుభ్రత పనులు చేయిస్తాం. **- ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్**

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: రెస్కో పరిధిలో రెండు నెలలుగా విద్యుత్తు బిల్లులు ఇవ్వలేదు. దీంతో బకాయిలకు సంబంధించి పెనాల్టీ పడుతోంది. **- ప్రసాద్**

సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- సోమశేఖర్, ఎండీ, రెస్కో**

సమస్యలు పరిష్కారం

స్పందనకు వందనం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ముత్యాచ్చారిపాళ్యం వీధిలో మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధిలో కాలువలు అపరిశుభ్రంగా ఉండటంతో 'ఈనాడు'లో మేమున్నాం మీకు తోడుగాలో వార్త ప్రచురితం కావడంతో అధికారులు శుభ్రత పనులు చేపట్టారు. **సోమల:** మండలంలోని తుగవారిపల్లె మార్గంలో గ్రామానికి నీరందించే బోరు సమీపంలో పైపు నీరు లీకై వృథాగా వెళ్తుండటంతో సమస్య ప్రచురితమైంది. స్పందించిన కార్యదర్శి మునికుమార్ పైప్‌లైన్ మరమ్మతుకు చొరవ తీసుకొన్నారు. ✦ సోమల పోలీస్‌స్టేషన్ ప్రహరీకి ఆనుకొని ఉన్న శుద్ధజల కేంద్రం సమీపంలో పైప్‌లైన్ లీకై నీరు వృథాగా పోతుండటంతో సమస్యపై వార్త ప్రచురితమైంది. కార్యదర్శి విశ్వనాథ్ పైప్‌లైన్ మరమ్మతుకు చొరవ తీసుకున్నారు. **పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని పట్రపల్లెలో మంచినీటి కుళాయిలు శుభ్రం చేయించినట్లు కార్యదర్శి నరసింహులు తెలిపారు. ✦ బసినాయనపల్లెలో కార్యదర్శి సుబ్రహ్మణ్యం పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.

ఐక్యతా ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం

కుప్పం పట్టణం: ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏక్ భారత్-ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఐక్యత ర్యాలీని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, కడా పీడీ వికాస్ మర్మత్, పీకేఎం ఉడా చైర్మన్ డా.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు కుసుమాంబ

నంజంపేట విద్యార్థుల రాణింపు

సోమల, న్యూస్‌టుడే: మండలంలోని నంజంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు చెకుముకి, ప్రతిభ పోటీల్లో రాణించినట్లు ప్రధానోపాధ్యాయిని కుసుమాంబ తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి, సైన్స్ ప్రతిభ పోటీల్లో పాఠశాల, మండల, జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థులు మునేష్, కావ్యశ్రీ, లాస్యశ్రీ రాణించారన్నారు. సోమవారం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

అవార్డు అందుకుంటున్న యుగంధర్

పలమనేరు వైద్యుడికి పురస్కారం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ ఏటిగడ్డ యుగంధర్‌కు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉత్తమ ప్రతిభ అవార్డును ప్రకటించింది. ఆదివారం రాజంపేటలో జరిగిన 67వ రాష్ట్ర ఐఎంఏ కాన్ఫరెన్స్‌లో ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు దిలిప్ బన్సాలీ చేతుల మీదుగా జ్ఞాపికను అందుకున్నట్లు సోమవారం తెలిపారు.

ప్రాంగణ ఎంపికలో 238 మందికి ఉద్యోగాలు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక కుప్పం డిగ్రీ కళాశాలలో సోమవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. వివిధ కంపెనీల్లో 238 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల వైస్ చైర్మన్ సాగర్‌రాజ్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుధారాణి, ప్లేస్‌మెంట్ అధికారి పార్థిబన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులతో యాజమాన్యం

నేడు సహాయక పరికరాల గుర్తింపు శిబిరం

గుడుపల్లె, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం దివ్యాంగులు, వృద్ధులకు సహాయ పరికరాలు ఉచితంగా పంపిణీ చేసేందుకు శిబిరం నిర్వహించనున్నట్లు తహసీల్దారు సీతారాం, ఎంపీడీవో రాధాకృష్ణ తెలిపారు. 60ఏళ్లలోపు వారు ఆధార్, మెడికల్ సర్టిఫికేట్, ఫొటోలు, రేషన్‌కార్డు జిరాక్స్‌లు తీసుకురావాలన్నారు.

కేసులు రద్దు చేసుకోవడానికి మంచి అవకాశం

మాట్లాడుతున్న నాగేశ్వరనాయుడు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో అక్రమంగా నమోదైన కేసులను రద్దు చేసుకునేందుకు కార్యకర్తలకు మంత్రి లోకేశ్ మంచి అవకాశాన్ని కల్పించారని పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ నాగేశ్వరనాయుడు పేర్కొన్నారు. స్థానిక శ్రీనివాస కల్యాణ మండపంలో చౌడేపల్లె మండల గ్రామ కమిటీ ఎన్నికలను నిర్వహించారు. అక్రమ కేసులతో విసుగు చెందిన కార్యకర్తలందరూ తమపై నమోదైన కేసుల వివరాలను అర్జీ రూపంలో రాసి ఇవ్వాలన్నారు. వారితో లోకేశ్ మాట్లాడి సమస్య పరిష్కరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

నేడు తెదేపా మండల అధ్యక్షుడి ఎన్నిక

రొంపిచెర్ల, న్యూస్‌టుడే: తెదేపా మండల అధ్యక్షుడి ఎన్నిక మంగళవారం రొంపిచెర్లలోని షాదీమహల్‌లో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు స్థానిక నేతలు తెలిపారు. ఈ ఎన్నికలో పాల్గొనడానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

యోగా పోటీల్లో బహుమతి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: బాపట్లలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో అండర్-14 యోగా పోటీల్లో కుప్పానికి చెందిన తేజశ్రీ తృతీయ బహుమతి సాధించినట్లు తల్లిదండ్రులు సోమవారం తెలిపారు.

బహుమతి అందుకుంటున్న తేజశ్రీ

వానర సైన్యం.. స్వైర విహారం

దశాబ్దాల కిందట గ్రామాలకే పరిమితమైన వానరులు... కరవు కాటకాలతో పట్టణాలకు చేరాయి. వాటిని నివారించడానికి పురపాలికల్లో, మండల కేంద్రాల్లో ప్రజల అవస్థలు వర్ణణాతీతం. ఇటీవల వానరులను పట్టి అడవుల్లో వదలడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే కొందరు దూరప్రాంతాల నుంచి వాటిని తీసుకొచ్చి ఎక్కడపడితే అక్కడ వదిలేస్తుండటంతో ఇలా రోడ్లపై స్వైరవిహారం చేస్తున్నాయి. పుంగనూరు-తిరుపతి మార్గంలో ప్రధాన రహదారిపై వానరులు ఇలా గుంపులుగా కనిపించాయి. **– న్యూస్‌టుడే, పుంగనూరు**

నిత్యం ఇదే దుస్థితి

పట్టణంలోని నాగప్పాళ్యం వీధిలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉంటోంది. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, వాణిజ్య దుకాణాలు ఈ ప్రాంతంలో అధికం. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణకు గతంలో పోలీసులు వన్ వే విధానం అమలు చేయడంతో పాటు ట్రాక్టర్లు, ఆటోలు ప్రవేశించకుండా చర్యలు తీసుకున్నారు. ఇటీవల ఆ నిబంధనలు తొలగడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. అధికారులు స్పందించి ఈ వీధిలో ఆక్రమణలు తొలగించి, వన్ వే అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పుంగనూరు**

కూలిన వసతిగృహం ప్రహరీ

పట్టణంలోని ఎస్టీ వసతి గృహం ప్రహరీ నేలకూలింది. విషపురుగుల బెడద అధికంగా ఉందని మరమ్మతులు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఏఎస్‌డబ్ల్యూవో శ్రీరాములనాయక్‌ను వివరణ కోరగా వెంటనే మరమ్మతులు చేయిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ

ఇష్టానుసారం.. భవిష్యత్తు ప్రశ్నార్థకం

గ్రామాలకు నిరంతరంగా విద్యుత్తు సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా విద్యుత్తు స్తంభాలు నాటే పనులను మండలంలో ఓ గుత్తేదారు సంస్థ చేపడుతోంది. సోమల-నంజంపేట, పెద్దఉప్పరపల్లె మార్గంలో ర.భశాఖకు చెందిన తారురోడ్డుకు మూడు అడుగుల దూరంలో మాత్రమే స్తంభాలు నాటారు. గత ప్రభుత్వంలో సోమల-పెద్దఉప్పరపల్లెకు డబుల్ రోడ్డు వేసేందుకు నిధులు కూడా మంజూరయ్యాయి. ప్రస్తుతం ఆ రోడ్డులో స్తంభాలు నాటడంతో భవిష్యత్తులో పనులు చేసేందుకు వీలు లేకపోయే అవకాశం ఉంది. **– న్యూస్‌టుడే, సోమల**

పార్టీ బలోపేతమే లక్ష్యం

సమావేశంలో మాట్లాడుతున్న సోమశేఖర్

పుంగనూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ప్రజల వ్యక్తిగత, సామాజిక సమస్యలను పరిష్కరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని నియోజకవర్గ జనసేన నాయకుడు కోలా సోమశేఖర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పలమనేరు రోడ్డులో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కష్టపడాలన్నారు. సమావేశంలో సింగిల్ విండో మండల అధ్యక్షుడు పగడాల రమణ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి సీవీ చిన్నా, నాయకులు చైతన్య, నరేష్ పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

శాంతిపురం: ఎస్టీయూ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా రాధాకృష్ణ, అధ్యక్షుడిగా ఉమాపతి, ప్రధాన కార్యదర్శిగా వీరభద్ర, ఆర్థిక కార్యదర్శిగా చంద్రశేఖర్‌నాయుడుతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాధాకృష్ణ, ఉమాపతి, వీరభద్ర

సైబర్ దాడుల నుంచి రక్షణ

పలమనేరు, న్యూస్‌టుడే: సైబర్ దాడుల నుంచి రక్షణ పొందటానికి ప్రజలు ప్రాథమిక సూత్రాలను తెలుసుకోవాలని సీఐ మురళీమోహన్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. చరవాణిలో అనుమానాస్పద యాప్‌లను తొలగించాలని.. తెలియని లింకులను క్లిక్ చేయరాదని సూచించారు.

పంటలపై ఒంటరి ఏనుగు దాడి

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని కల్లూరు పాళెం పంచాయతీల్లో ఆదివారం రాత్రి ఒంటరి ఏనుగు పంటలపై దాడి చేసింది. కల్లూరుకు చెందిన ఇమామ్ మోటారు, మామిడి చెట్లు, పాళెం పంచాయతీకి చెందిన పలువురి మామిడి చెట్లను విరిచేసింది.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

శాంతిపురం, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ప్రాధాన్యం ఇస్తోందని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం సొన్నేగానిపల్లె పంచాయతీలో రైతన్నా మీకోసం.. కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 'హంద్రీ-నీవా' జలాల రాకతో కుప్పం నియోజకవర్గంలోని రైతుల కళ్లల్లో ఎనలేని సంతోషం కనిపిస్తోందన్నారు. ఆధునిక సేద్యం, సాగునీటి పొదుపు పథకాల ద్వారా అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని వివరించారు. నాయకులు మంజునాథరెడ్డి, మునేగౌడు, సోమారెడ్డి, తిమ్మారెడ్డి, మాజీ సర్పంచి శ్రీనివాసులు పాల్గొన్నారు. **పలమనేరు:** మండలంలోని పెరంగుంటలో రైతన్నా-మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

కరపత్రాలు అందజేస్తున్న గౌనివారి శ్రీనివాసులు ❖ గుడుపల్లె: 'రైతన్నా-మీకోసం' కరపత్రాలను అందిస్తున్న నాయకులు, అధికారులు. ❖ సోమల: ఇరికిపెంటలో గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాసులునాయుడు

ఊరు లేకుండా పేరెలా వచ్చిందబ్బా!

పుంగనూరు, న్యూస్‌టుడే: గ్రామాలుగా ఓ వెలుగు వెలిగిన పల్లెలు నేడు కనుమరుగయ్యాయి. ఒకప్పుడు మేమూ దర్జాగా బతికిన వాళ్లమే అన్నట్టుగా పేరుకే పరిమితమయ్యాయి. పుంగనూరు నియోజకవర్గంలోని 8 పంచాయతీ కేంద్రాలకు పేర్లు ఉన్నాయి కానీ గ్రామాలే లేవు. వాటి పేరుతో ఇతర గ్రామాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

కుమ్మరనత్తం పంచాయతీ కేంద్రంగా నడుస్తున్న కల్లువపల్లె గ్రామం

రొంపిచెర్ల మండలంలో..

రొంపిచెర్ల మండలంలోని పెద్దగొట్టిగల్లు, మోటుమల్లెల, గానుగచింత, పెద్దమల్లెల పంచాయతీ కేంద్రాల పేర్లు ఉన్నా క్షేత్రసాయిలో గ్రామాలు లేవు. గానుగచింత నగరిలో, పెద్దగొట్టిగల్లు శ్రీనాథపురంలో, పెద్దమల్లెల నడింపల్లెలో, మోటుమల్లెల ఎగువపాలెంలో పరిపాలన సాగుతోంది.

ప్రభుత్వ దస్త్రాల్లో..

పుంగనూరు మండలం కుమ్మరనత్తం పంచాయతీ కేంద్రంగా ప్రభుత్వ దస్త్రాల్లో ఉంది. వాస్తవానికి ఆ గ్రామమే లేదు. దీని పరిధిలో కల్లుపల్లె, రాజులూరు, కొండసముద్రం, బాలగురవయ్యగారిపల్లె, కపాడమిట్టపల్లె, పిచ్చిగుండ్లపల్లె, చిన్నమిట్టపల్లె గ్రామాలు ఉన్నాయి. కుమ్మరనత్తం కార్యకలాపాలన్నీ కల్లుపల్లి కేంద్రంగా జరుగుతున్నాయి.

సదుం ప్రాంతంలో ..

సదుం మండలంలోని 79ఎ.చింతమాకులపల్లె పంచాయతీకి చెందిన కార్యక్రమాల నిర్వహణకు గుట్టమీదపల్లెలో భవనం నిర్మించారు. పాలమంద విధులు పెద్దూరు కేంద్రంగా నడుస్తున్నాయి. సోమల మండలంలోని వల్లిగట్ల పంచాయతీ కార్యక్రమాలను పాతూరు గ్రామంలో నిర్వర్తిస్తున్నారు. పాలకులు మారినా కేంద్రాల పేర్లు మారకపోవడం విచిత్రం.

ఆలయ గోడను ఢీకొన్న వాహనం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలిక పరిధి కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలోని తంజంకొట్టాలులో నెలకొన్న శ్రీరంగనాథస్వామి ఆలయ రాతి కట్టడాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ధ్వంసమైంది. ఈ విషయమై గ్రామస్థులు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు.

17 మండలాల్లో వర్షం

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో ఆదివారం రాత్రి జిల్లాలోని 17 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. విజయపురం మండలంలో 20.2 మి.మీటర్లు, సదుం 11.2, పెద్దపంజాణి 10.6, సోమల. రొంపిచెర్ల 8.6, కార్వేటినగరం 8.2, నింద్ర, పుంగనూరు 7.2, ఐరాల ఏడు మి.మీటర్లు కురవగా.. మిగిలిన మండలాల్లో చిరుజల్లుల వర్షపాతం నమోదైంది.

ఖాళీ జాగాలు.. ప్రజలకు తిప్పలు

పట్టణంలోని పలమనేరు రోడ్డులో నివాస గృహాల మధ్య ఖాళీ జాగాలు అధికంగా ఉండటంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. స్థల యజమానులు వాటిని శుభ్రంగా ఉంచకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి విష పురుగులకు ఆవాసాలుగా మారుతున్నాయి. మురుగు కారణంగా దోమలు వృద్ధి చెందుతున్నాయని వాపోతున్నారు. పురపాలక అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పుంగనూరు

పరిసరాలు శుభ్రం

పుంగనూరు, న్యూస్‌టుడే: మేలుపట్లలోని ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల చుట్టూ పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాల చుట్టూ అపరిశుభ్రంగా ఉండటంతో దోమలు పెరుగుతున్నాయని ఈ నెల 23న కమిషనరుకు జంజారా సంఘం నాయకులు వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన కమిషనరు మధుసూదనరెడ్డి సమస్య పరిష్కరించారు

ప్రకృతి చెక్కిన బొమ్మగుండు

మదనపల్లె-చౌడేపల్లె ప్రధాన రహదారి పక్కనే ప్రకృతి చెక్కిన గుండు ఇది. మండలంలోని పెద్ద కొండామర్రికి శిఖరంగా ఉన్న ఈ గుండును స్థానికులు బొమ్మగుండుగా పలుస్తారు. గ్రామం నుంచి సుమారు 5 కి.మీ. దూరం నుంచి ఏ వైపు నుంచి చూసినా కనిపిస్తుంది.

- న్యూస్‌టుడే, చౌడేపల్లె



(c) eenadu

కదిలొచ్చిన సాంకేతికత

అన్ని రకాల వైద్య విద్యలకు సంబంధించిన అధునాతన శిక్షణ అందించే మొబైల్ ట్రైనింగ్ సెంటర్ 'జాన్సన్ అండ్ జాన్సన్ ఇనిస్టిట్యూట్ ఆన్ వీల్స్' సోమవారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాలకు చేరుకుంది. దీనిని డీఎంఈ డా. రఘునందన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. లావణ్యకుమారి, ప్రిన్సిపల్ డా. ఎ. విష్ణువర్ధన్ ప్రారంభించారు. **-న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్**

సీఎం సహాయనిధి సాంత్వన

మీ కోసం

అనారోగ్య సమస్యలు, ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి వర్గాలు వైద్యసేవలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అలాంటి సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) అండగా నిలుస్తోంది. అన్ని ధ్రువపత్రాలు ఉంటే సీఎంఆర్‌ఎఫ్ పొందేందుకు ఎంతో సులభతరం. అవేంటో తెలుసుకుందాం..

■ **ఏయే పత్రాలు కావాలంటే..** ❖ ఆధార్ కార్డు ❖ తెల్లరేషన్‌కార్డు ❖ ఆదాయ ధ్రువీకరణపత్రం ❖ ఎక్సరే, స్కాన్‌తోపాటు రోగ నిర్ధారణ రిపోర్టులు ❖ ఆసుపత్రిలో రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం ❖ చికిత్స వివరాలు, మందుల బిల్లులు స్టాంపు, తేదీతో ఉండాలి. ❖ డిస్‌ఛార్జి వివరాలు, దానిపై వైద్యుడి సంతకం, స్టాంపు ఉండాలి. ❖ బ్యాంకు పాసు పుస్తకం మొదటి పేజీ నకలు

■ **దరఖాస్తు ఇలా..:** వైద్యం కోసం ఎన్టీఆర్ వైద్యసేవ పథకాన్ని వినియోగించకుండా సొంత డబ్బు వెచ్చించి ఉండాలి. స్థానిక వార్డు, గ్రామ సచివాలయం, ఎమ్మెల్యే కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. దరఖాస్తుదారుడి వివరాలు, ఫోన్ నంబరు, బ్యాంకు ఖాతా, ఆసుపత్రి పేరు, మందుల ఖర్చు వంటి వివరాలను నమోదు చేయాలి. తగిన పత్రాలు జమ చేసి ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేయాలి.

-న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

గుండెకు.. కొండంత అండ..!

ప్రభుత్వాసుపత్రుల్లో 31 మందికి టెనెక్ట్ ప్లేస్ ఇంజక్షన్

"ముమ్మిడివరానికి చెందిన సత్యనారాయణకు ఇటీవల గుండెలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరిశీలించి గుండె వ్యాధి నిపుణులను సంప్రదించారు. వారి సూచనల మేరకు రూ.40 వేల విలువైన 'టెనెక్ట్ ప్లేస్' ఇంజక్షన్ ఉచితంగా వేశారు. కాకినాడలోని ఆసుపత్రికి వెళ్లే వరకు ఎలాంటి ప్రాణహాని లేకుండా అది పనిచేసింది.

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

మారుతున్న జీవన శైలి, ఒత్తిడి, చిన్నచిన్న విషయాలకు ఆందోళనకు గురికావడం వంటి కారణాలతో ఇటీవల గుండెపోటు బాధితులు ఎక్కువవుతున్నారు. సకాలంలో వైద్యం అందక కొంతమంది మృత్యువాత పడుతున్నారు. గుండె నొప్పి వచ్చిన తర్వాత మొదటి గంట సమయం ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో గుండెపోటుకు గురైన వారికి తక్షణ వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాసుపత్రుల్లో 'టెనెక్ట్ ప్లేస్' ఇంజక్షన్లు ఉచితంగా అందుబాటులోకి తెచ్చారు. స్టెమీ పేరిట 2023 అక్టోబరు 23 నుంచి ప్రభుత్వం దీనిని అమలు చేస్తోంది.

ఈ ఆసుపత్రుల్లో..

జిల్లాలో అమలాపురం, రామచంద్రపురం ప్రాంతీయ ఆసుపత్రులు..9 సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ ఇంజక్షన్లు అందుబాటులో ఉంచారు. ఇప్పటివరకు 900 మంది గుండె నొప్పితో ఆసుపత్రులకు వెళ్లగా ఈసీజీ, హృద్రోగ నిపుణుల సూచనల మేరకు 31 మందికి తక్షణం ఇంజక్షన్లు ఇచ్చారు. సకాలంలో వైద్య సేవలు అందించి ప్రాణాలను నిలబెట్టారు.

తొలి గంట కీలకం..

గుండెవ్యాధి నిపుణులతో జిల్లాలో ఓ బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు 24/7 అందుబాటులో ఉంటారు. గుండె నొప్పి వచ్చిన రోగికి తొలి గంట కీలకం. నొప్పి వస్తున్నట్లు గుర్తిస్తే ఆలస్యం చేయకుండా దగ్గర్లోని ఆసుపత్రి, సీహెచ్‌సీలకు వెళ్లాలి. వైద్యులు పరీక్షించి ఈసీజీ తీసి నిపుణుల బృందానికి వాట్సాప్‌లో పంపిస్తారు. వారి సూచనలతో రూ.40 వేల విలువ చేసే ఇంజక్షన్ ఉచితంగా ఇస్తారు. **-కార్తిక్, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త**

● ఆసుపత్రుల వారీగా వేసిన ఇంజక్షన్లు ● అమలాపురం: 4 ● రామచంద్రపురం: 8 ● రాజోలు: 1 ● కొత్తపేట: 3 ● మండపేట: 4 ● ఆలమూరు: 1 ● కపిలేశ్వరపురం: 5 ● టి.కొత్తపల్లి: 2 ● ముమ్మిడివరం: 1 ● అల్లవరం: 1 ● పి.గన్నవరం: 1

తిరగలి.. తిరగాలి సంస్కృతి వెలగాలి

గతంలో వివాహాలు సంప్రదాయాల మేళవింపుతో జరిగేవి. వాటిలో చాలావరకు కనుమరుగైపోయినా ఈతరం వారు మరచిపోకుండా బొమ్మల కొలువుల రూపంలో కొందరు ప్రదర్శిస్తున్నారు. మామిడికుదురు మండలం పెదపట్నంలంకలోని 'మన మండువా'లో మంగళవారం జరిగే పెళ్లికిగాను పలురకాల నమూనా బొమ్మలను సిద్ధం చేయడంతో ఆకట్టుకుంటున్నాయి. డోలు, సన్నాయి మోగిస్తున్న కళాకారులు, తిరగలి తిప్పుతున్న పల్లె పడుచు బొమ్మలు అలరిస్తున్నాయి.

- న్యూస్‌టుడే, మామిడికుదురు

స్మార్ట్‌కార్డులో జిల్లా పేరు మార్చేందుకు చర్యలు

అమలాపురం కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ కార్డుల్లో జిల్లా పేరు తూర్పుగోదావరిగా ప్రచురితమైందని, దీనిని మార్పు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు జేసీ నిశాంతి తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల జాప్యం జరుగుతోందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా మార్చుతామన్నారు.

అయిదు గ్రామాల ప్రజలకు ఆధారమైన చింతలమోరి-గుడిమెల్లంక పంచాయతీ రహదారి అధ్వానంగా ఉంది.

మామిడికుదురు హైవే-గోగన్నమఠం వెళ్లే పీఆర్ రోడ్డుపై 12 గ్రామాల ప్రజలు కష్టాలు పడుతున్నారు. మామిడికుదురు ఆర్ అండ్‌బి మార్గం-ఎర్రచెరువు వెళ్లే రోడ్డూ దుర్భరమే.

రామరాజులంక-సఖినేటిపల్లికి అనుసంధానంగా ఉన్న రహదారి నరకం చూపిస్తోంది.

◀ అధ్వానంగా ఉన్న కేశనపల్లి సినిమా హాల్ రోడ్డు

నిధులడిగితే కస్సుబుస్సు.. పనులేమో తుస్సు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే

వైకాపా సర్కారు హయాంలో పీఆర్ రోడ్ల దుస్థితి

పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఉన్న రోడ్లను ఏఐఐబీ(ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు) నిధులతో బాగుచేసేందుకు 2018లో తెదేపా ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. మంజూరైన సమయానికి వైకాపా ప్రభుత్వం రావడం, తనవంతు నిధులివ్వక వీటికి అతీగతి లేకపోయింది.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

ఈనెల 26న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాజోలు నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో ఈ రహదారుల అభివృద్ధిపై ఆశలు పెరుగుతున్నాయి. మళ్లీ ఏఐఐబీ బ్యాంకు ద్వారా నిధులొచ్చేలా చూడాలని కోరుతున్నారు. పీఆర్ ఎస్ఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశిస్తే సవరించిన అంచనాల మేరకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

నిర్లక్ష్యపు జాడలు

▮ అమలాపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు, రామచంద్రపురం నియోజకవర్గాల్లో 96.84 కి.మీ. మేర పీఆర్ రహదారుల ఆధునికీకరణకు రూ.68.82 కోట్లతో అయిదేళ్ల క్రితం ప్రణాళికలు వెళ్లాయి. ఏఐఐబీ రూ.41.29 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.27.52 కోట్లు ఇవ్వాలి. వైకాపా ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వక ఏఐఐబీ సైతం ముందుకురాలేదు.

▮ గుత్తేదారులను ఒప్పించి అమలాపురంలో 32 కి.మీ. రోడ్ల పనులను గత ప్రభుత్వంలో రూ.19.97 కోట్లతో చేయించారు. బిల్లులడిగితే ఆగ్రహం వ్యక్తంచేసిందే తప్ప విదల్చలేదు. కూటమి ప్రభుత్వమే విడుదల చేసింది.

▮ ఇంకా నాలుగు నియోజకవర్గాల్లో 64.84 కి.మీ. మేర రహదారులు ఆధునికీకరణకు నోచుకోలేదు.

ఓఎన్జీసీ పరిహారంపై చర్చలు

యానాం: దరియాలతిప్ప ఐలాండ్ వద్ద జరిగిన ఓఎన్జీసీ గ్యాస్ పైప్‌లైన్ ప్రమాదం నేపథ్యంలో యానాంతోపాటు పరిసర నియోజకవర్గాలు, జిల్లాలకు ఏటా రూ.150 కోట్లు వరకు సీఎస్ఆర్ నిధులివ్వాలని డిమాండ్ చేసినట్లు పుదుచ్చేరి ప్రభుత్వం ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. కాకినాడ కలెక్టర్ ఎస్.షాన్ మోహన్, పుదుచ్చేరి కలెక్టర్ కుళోత్తుంగన్ సమక్షంలో యానాం, ముమ్మిడివరం ఎమ్మెల్యేలు గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, దాట్ల సుబ్బరాజు, పరిపాలనాధికారి అంకిత్‌కుమార్, ఓఎన్జీసీ ఈడీ ప్రబల్‌సేన్ బృందంతో సోమవారం చర్చలు జరిపారు. అనంతరం దరియాలతిప్ప వద్ద 41 రోజులుగా ఆందోళన చేస్తున్న ప్రజలతో కలెక్టర్ కుళోత్తుంగన్, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మాట్లాడారు.

ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు

కిట్లను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఇన్‌ఛార్జి ప్రతిమాకుమారి

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేయకపోవడంపై సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌టీపీ రాఘవకుమార్ ఆదేశాలతో అమలాపురం డిపోలోని అన్ని ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్లు తనిఖీ చేశారు. కొన్నింటిలో కిట్లు లేని విషయాన్ని గమనించి ఏర్పాటు చేశారు. ఇక నుంచి అన్ని బస్సుల్లో కిట్లు తప్పనిసరిగా ఉండేలా చూస్తామని డిపో మేనేజర్ డి.ఎల్.ఎన్.శర్మ తెలిపారు.

ఆలయ గదుల శుభ్రం

ఈనాడు కథనాలకు స్పందన

అమలాపురం పట్టణం: అమలాపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని గదుల నిర్వహణ అధ్వానంగా మారడంపై సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆలయ కార్యనిర్వాహణాధికారి సత్యకుమార్ స్పందించారు. సిబ్బందితో గదులను, పరిసరాలను శుభ్రం చేయించారు. మళ్లీ ఇలా జరగకుండా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

హోరాహోరీ.. విజయంపై గురి

సఖినేటిపల్లి మండలం మోరి జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఫెన్సింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. విజయం కోసం కత్తి ఝళిపిస్తున్న క్రీడాకారుల చిత్రమిది. –న్యూస్‌టుడే, సఖినేటిపల్లి

లింగ వివక్షకు తావులేదు

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అమలాపురం కలెక్టరేట్: లింగ వివక్ష విడనాడి, బాల, బాలికలనందరినీ సమానంగా చూడాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. లింగ వివక్షకు వ్యతిరేకంగా చేపట్టే కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను సోమవారం ఆయన ఆవిష్కరించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి డిసెంబరు 23 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. డీఆర్‌డీఏ పీడీ జయచంద్ర గాంధీ, విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

వనరులున్నా.. అభివృద్ధి సున్నా

అంతర్వేది పర్యాటకంపై శ్రద్ధ కరవు

న్యూస్‌టుడే, అంతర్వేది

అంతర్వేది.. పురాతన లక్ష్మీనరసింహస్వామి, అశ్వరూఢాంబిక, వశిష్ఠ దేవాలయాలు.. విశాలమైన సముద్ర తీరం, బోటింగ్‌కు అనుకూలించే సాగరసంగమం, దీప స్తంభం, జలచరాలు, చుట్టూ మడఅడవుల అందాలకు నెలవు. ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా ప్రాముఖ్యం ఉంది. సందర్శకులకు సరైన సౌకర్యాలు లేవు. అందుబాటులో ఉన్న వనరులను సక్రమంగా వినియోగించుకుంటే పర్యాటకంగా అభివృద్ధి కావడంతోపాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అంటున్నారు.

అంతర్వేది బీచ్‌లో అరకొరగా సందర్శకులు

ఇవీ అవసరం

భక్తులు, పర్యాటకులు ఒకటి రెండు రోజులు ఉండేలా దేవాదాయశాఖ తక్కువ రుసుముతో తగినన్ని వసతిగదులు ఏర్పాటు చేయాలి. దేవస్థానం రాత్రిపూట అన్నప్రసాదం ఏర్పాటు చేయాలి. బీచ్‌లో సేదతీరడానికి షెల్టర్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలి.

వివిధ ప్రాంతాల నుంచి..

భక్తులు లక్ష్మీనరసింహుడిని దర్శించుకుని స్థానిక బీచ్ చూడడానికి వెళ్తుంటారు. సందర్శకుల తాకిడి ఎక్కువే. సేద తీరడానికి షెల్టర్లు లేవు. ఎండకు, వానకు ఉండలేక వెనుదిరుగుతున్నారు. తాగునీరు లేదు. స్నానం చేసేందుకు ప్రైవేట్ వ్యక్తులు విక్రయించే బకెట్ నీటిని రూ.50 కొనుగోలు చేసుకునే పరిస్థితి. సాగర సంగమానికి వెళ్లే దారి ముళ్లచెట్లతో నిండిపోయింది. రోడ్డు ఛిద్రంగా మారింది. దేవస్థానానికి తక్కువ వసతి గదులు ఉండటంతో ప్రైవేటును ఆశ్రయించాల్సి వస్తోంది. రోజుకు రూ.1500 నుంచి రూ.2000 వరకు అద్దె తీసుకోవడంతో ఆర్థికభారం అవుతోంది.

నిత్యం వచ్చేవారి వివరాలు

సాధారణ రోజుల్లో 3 నుంచి 4 వేల మంది వస్తుంటారు. వారాంతం, పర్వదినాలు, పండగ సమయాల్లో 10 వేల నుంచి 15 వేల మంది వరకు ఉంటారు. ఉత్సవాలు, తీర్థాల సమయాల్లో ఈ సంఖ్య లక్షల్లో ఉంటుంది.

టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేస్తాం

అంతర్వేదిని టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం దృష్టిలో పెట్టాం. రోడ్లను వెడల్పు చేయిస్తున్నాం. వసతుల కల్పనకు ప్రణాళిక తయారు చేశాం. సంక్రాంతికి బీచ్‌లో ఉత్సవాలు నిర్వహిస్తాం.

- దేవ వరప్రసాద్, రాజోలు ఎమ్మెల్యే

రైతేరాజు

అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

నేటి నుంచి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

అన్నవరం: అన్నవరంలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి కల్యాణ మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 25న స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలను చేస్తారు. 26న స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం జరగనుంది.

శ్రద్ధాంజలి

జననం: 20-8-1944
మరణం: 16-11-2025

వలవల రాధా కృష్ణ మురళీ మోహన్ రావు గారు

16-11-2025 ఆదివారం నాడు స్వర్గస్తులు అయ్యినారు

పెద్దకర్మ: 26-11-2025 మధ్యాహ్నం 12:00 గంటలకు క్లబ్ హౌస్, 2వ అంతస్తు, హరివిల్లు అపార్ట్‌మెంట్స్ మణికొండ, హైదరాబాద్.

ఇట్లు
కుమారులు - కోడళ్లు:
వలవల రవీంద్ర కుమార్ - పద్మజ రాణి
వలవల శ్రీధర్ - వరలక్ష్మి
కూతురు - అల్లుడు:
Dr. పగడాల లత - Dr. సూర్యనారాయణ
శ్రీమతి
వలవల విజయ లక్ష్మి
Scan for Location

WALK - IN INTERVIEWS

MAHAVEER FINANCE INDIA LTD., is looking for the Following Positions:
- SALES MANAGERS
- Sr.SALES EXECUTIVES
- SALES EXECUTIVES
- COLLECTION MANAGERS
- COLLECTION EXECUTIVES

For Used Commercial Vehicles, Construction Equipment & Cars.
LOCATIONS: Rajamundry,Kakinada,Tadepalligudem, Eluru, Visakhapatnam, Gajuvaka, Srikakulam, Vizianagaram.
Qalification & Exp: 10th & Inter for Sr.Sales Executives & Sales Executives, Minimum Degree For Managers.Min 2 years experience in NBFC for Sales Managers and collection manager positions Min.1 Year Experience in relevant field for Sales Executive and Sr.Sales Execurive,collection executive positions. Freshers also can apply as sales executive.
Interview: 26/11/2025, Wednesday, 9.30AM onwards

MAHAVEER FINANCE INDIA LTD.,
D.No.46-12-21/2,3, Venkat Plaza, Opp; Skvt High School, Ttd Kalyana Mandapam Road, Danavayi Peta, Rajamundry-533103.
WhatsApp: 8522082223, tvrsarama@mahaveerfinance.com

మధురమే... మధురమే... మధురమే...
ఈ క్షణములు ఇంకా మధురమే...
పదవీ విరమణ శుభాకాంక్షలు

మీ కుటుంబసభ్యులు, మీ బంధుమిత్రులు,
మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా!
అయితే వారికి అందించండి, అభినందన చందనాలు.
వారి భావి జీవితం సుఖమయంగా సాగాలని ఆకాంక్షిస్తూ,
ఈనాడు ద్వారా వారికి అందించండి,
పదవీ విరమణ శుభాకాంక్షలు.
మరిన్ని వివరాలకు :
80085 97607

ధాన్యం రైతుల్ని దగా చేస్తే సహించం

తూర్పుగోదావరి జిల్లా చాగల్లు, దొమ్మేరులోని రైతు సేవా కేంద్రాలను మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకల్ని సహించేది లేదని పేర్కొన్నారు.

–న్యూస్‌టుడే, చాగల్లు

ఎస్ఐఆర్ నమోదులో యానాం ప్రథమం

యానాం: పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నమోదు ప్రక్రియలో యానాం ప్రథమ స్థానంలో ఉందని ఆ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి జవహర్ తెలిపారు. పుదుచ్చేరి, కారైకాల్, మహే, యానాంలలో ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నామన్నారు. యానాంలో 40,043 మంది ఓటర్లకు 28,559 మంది వివరాలు (71.32 శాతం) ఎస్ఐఆర్‌లో నమోదు చేసి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. రాజ్‌భవన్ నియోజకవర్గం 44.30 శాతంతో అట్టడుగున ఉందని జవహర్ వివరించారు. డిసెంబరు నాలుగో తేదీలోగా తమ ఫారాలను సమర్పించాలని, 9న డ్రాఫ్ట్ ప్రకటిస్తారని చెప్పారు.

పుష్కలంగా నిధులివ్వండి..

రూ.5.77 కోట్ల కోసం ప్రతిపాదనలు

న్యూస్‌టుడే, పి.గన్నవరం

గోదావరి పుష్కర విధుల్లో అగ్నిమాపకశాఖ సిబ్బంది అత్యంత కీలకం. యంత్రాలతో ఘాట్‌లను పరిశుభ్రంగా ఉంచడం, రేవుల్లో స్నానాలు చేసే భక్తులకు ఎలాంటి ఆపద రాకుండా చూడటం తదితర పనులు చేస్తుంటారు. 2027లో మహా పుష్కరాల నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తమకు అవసరమైన సామగ్రి, మరపడవలు, ఇతర అంశాలవారీ ఎన్ని నిధులు అవసరం అవుతాయో వివరాలతో జిల్లా అగ్నిమాపకశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. మొత్తం రూ.5.77 కోట్లు అవసరం ఉంటుందని విన్నవించారు.

అంశాల వారీగా..: రెయిన్‌కోట్లు 300, మరపడవలు 5, బకెట్లు 300, హెచ్.డి.పి.ఇ. బోటు 1, బ్లాంకెట్లు 300, పోర్టబుల్ పంపులు 150, లైఫ్‌జాకెట్లు 200, రోప్స్ 300, మంటలు ఆర్పేందుకు సిలిండర్లు 150, అస్కాలైట్లు 20, డ్రాగన్ లైట్లు 20 తదితర వివరాలతో నిధుల కోసం ప్రతిపాదనలు అందజేశారు.

వివరాలు అందజేశాం..

పుష్కర ఘాట్‌లలో అగ్నిమాపకశాఖ పరంగా అంశాలవారీ ఎంతెంత నిధులు అవసరం ఉంటుందో ప్రభుత్వానికి నివేదిక అందజేశాం. నిధుల కేటాయింపు కాగానే తదుపరి కార్యాచరణ చేపడతాం.

-ఎన్.పార్థసారథి, జిల్లా అగ్నిమాపకశాఖాధికారి

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం జంక్షన్, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ బి. వరప్రసాద్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం.77028 77188, ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు : 8330952080

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6)కు 9(1) నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు నిర్మాణాత్మక స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (**SARFAESI** చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత: మెస్సర్స్ వీర వెంకట శ్రీనివాస పికెల్స్, ప్రొప్రయిటర్ : బాలం గోపి హనుమంతరావు, తండ్రి : బి. రామకృష్ణారావు, డి.నెం.1-22, హనుమాన్ సెంటర్, నార్కెడిమిల్లి గ్రామం, ఆత్రేయపురం మండలం, తూర్పు గోదావరి జిల్లా – 533236. హామీదారులు: 1. శ్రీ బాలం రామకృష్ణ, తండ్రి : పానయ్య, డి.నెం.1-22, హనుమాన్ సెంటర్, నార్కెడిమిల్లి గ్రామం, ఆత్రేయపురం మండలం, తూర్పు గోదావరి జిల్లా – 533236. 2. శ్రీమతి బాలం దేవి, భర్త: బాలం గోపి హనుమంతరావు, డి.నెం.1-22, హనుమాన్ సెంటర్, నార్కెడిమిల్లి గ్రామం, ఆత్రేయపురం మండలం, తూర్పు గోదావరి జిల్లా – 533236. డిమాండ్ నోటీసు తేది: 03-02-2023

బకాయి మొత్తం : తేది.03-02-2023 నాటికి రూ.38,60,810/- + తేది.04.02.2023 నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.

ప్రస్తుత బకాయి మొత్తం: తేది.21-11-2025 నాటికి రూ.60,23,772/- + తేది.22.11.2025 నుండి భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి (తదుపరి జమలు మినహాయించబడును).

షెడ్యూలు ఆస్తి వివరములు:

గిఫ్ట్ డీడ్ నెం.420/1990, తేది.31.03.1990 ఆత్రేయపురం ఎస్ఆర్ఓ ప్రకారం శ్రీ బాలం రామకృష్ణ, తండ్రి : పానయ్య గారి పేరున గల ఆస్తి: తూర్పు గోదావరి జిల్లా, ఆత్రేయపురం మండలం, ఆత్రేయపురం సబ్ రిజిస్ట్రార్, నార్కెడిమిల్లి గ్రామం, నార్కెడిమిల్లి గ్రామ పంచాయితీ ఆర్.ఎస్.నెం.176/5లోని ఎ.0.10 సెంట్ల మొత్తం విస్తీర్ణంలో ఉత్తరం వైపు గల ఎ.0.3.1/2 సెంట్లు (డాక్యుమెంట్ ప్రకారం 177.50 చ॥గ॥లు) (వాల్యుయేషన్ రిపోర్ట్ ప్రకారం 169.40 చ॥గ॥లు గా కలదు) విస్తీర్ణం గల స్థలం యావత్తు ఆస్తి. హద్దులు: తూర్పు: యడ్ల పానకాలు మరియు ఇతరులకు చెందిన స్థలం, దక్షిణం: టి. వెంకటరత్నం గారికి చెందిన స్థలం మరియు ఇల్లు, పడమర: పంచాయితీ రోడ్డు, ఉత్తరం: కొమ్మిరెడ్డి ఆదినారాయణ గారికి చెందిన ఇల్లు.

రిజర్వు ధర : రూ.12,15,000/-	ధరావత్తు : రూ.1,21,500/-	బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 11-12-2025 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది:25-11-2025 నుండి 10-12-2025 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింకును రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఐయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎసెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.

గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది, బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించటమైనది.

గమనిక -2 : ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ రూ.50,00,000/- (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై TDS @ 1% వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు గవర్నమెంట్ గైడ్‌లైన్స్ ధర లేదా అమ్మకం ధరలో ఏది ఎక్కువైతే దానిలో 1% TDS ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం.16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ TDS సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను.(వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

తేది: 21-11-2025, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

నీరు తగ్గింది.. రోడ్డు వచ్చింది

వశిష్ఠ గోదావరి నది మధ్యలో ఉన్న ఊడుమూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేట, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజల రాకపోకల కోసం బూరుగులంక రేవులో ప్రత్యేకంగా బాట ఏర్పాటు చేస్తున్నారు. ఈ నాలుగు లంక గ్రామాల కోసం ఇక్కడ వంతెన నిర్మిస్తున్న గుత్తేదారు సంస్థ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. మొత్తం పూర్తవ్వడానికి నాలుగు రోజుల సమయం పడుతుందని గుత్తేదారు సంస్థ ప్రతినిధి పీసీ రాజు తెలిపారు. ప్రస్తుతం నదిలో నీటి ప్రవాహం కనిష్ఠ స్థాయికి పడిపోయింది. దీంతో తాత్కాలికంగా రోడ్డు వేస్తున్నారు. దీనిపై జూన్ వరకు రాకపోకలు సాగించే వెసులుబాటు కలుగుతుంది.

- న్యూస్‌టుడే, పి.గన్నవరం

క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాష్ట్రస్థాయి కత్తిసాము పోటీలు ప్రారంభం

సఖినేటిపల్లి: ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే క్రీడలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మోరి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎస్జీఎఫ్ అండర్-17 రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. డీఈవో సలీంబాషా మాట్లాడుతూ కత్తిసాము పోటీ 1896 నుంచి ఒలింపిక్స్‌లో స్థానం పొందిందన్నారు. ఈ పోటీల్లో విజేతలు డిసెంబరు 28 నుంచి 30వ తేదీ వరకు మహారాష్ట్ర శివాజీ సంభాజీనగర్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి 360 మంది బాలబాలికలు హాజరుకాగా రాత్రి 10 గంటల వరకు పోటీలు కొనసాగాయి. ఎంపీపీ మల్లిబాబు, ఎంఈవో కిషోర్‌కుమార్, పాఠశాల హెచ్ఎం శ్రీధర్‌కృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో ఆధునిక వస్త్రాలు

కాకినాడలో లక్ష్మీ షాపింగ్ మాల్ ప్రారంభం

గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడ మెయిన్‌రోడ్డులో జైన్ టెంపుల్ దగ్గర నూతనంగా ఏర్పాటుచేసిన లక్ష్మీ షాపింగ్ మాల్‌ను సోమవారం సినీనటి, ఓజీ ఫేం ప్రియాంక మోహన్, యాంకర్, నటి అనసూయ, కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. వేడుకపై నటుడు హైపర్ ఆది, నటి, యాంకర్ ఐశ్వర్య అందరినీ ఉత్సాహపరిచారు. ప్రియాంక మోహన్, అనసూయ మాట్లాడుతూ లక్ష్మీ షాపింగ్ మాల్‌ను కాకినాడలో ప్రారంభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. దుకాణ అధినేతలు సూర్య, రత్నయ్య, శ్రీను మాట్లాడుతూ నాలుగంతస్తుల విశాలమైన షోరూంలో అన్ని వర్గాల వారికి నచ్చేలా అద్భుతమైన కలెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్లు అందిస్తున్నామన్నారు. ది గోదావరి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గ్రంధి బాబ్జి, కాకినాడ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బచ్చు శేఖర్, ముత్తా శశిధర్, బాదం బాలకృష్ణ, సోము ప్రసాద్, సంగిశెట్టి అశోక్, నేమాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న సినీ నటి అనసూయ, షాపింగ్ మాల్ నిర్వాహకులు

చీరను ప్రదర్శిస్తున్న హీరోయిన్ ప్రియాంక మోహన్

పవన్‌కల్యాణ్ దృష్టికి 'శంకరగుప్తం' సమస్య

మలికిపురం, న్యూస్‌టుడే: ఐటీడీ జెన్ల అధికారుల సూచనల అనుగుణంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాజోలు పర్యటన ఉంటుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. సోమవారం గూడపల్లిలో 'హెలిప్యాడ్' నిర్మాణాన్ని, కేశనపల్లిలో పవన్‌కల్యాణ్ పరిశీలించనున్న కొబ్బరి తోటలను అధికారులతో కలిసి పరిశీలించారు. తుపాను ఆశ్రయ భవనం వద్ద స్థానికులతో మాట్లాడారు. 26న వచ్చే ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతామన్నారు. అనంతరం శంకరగుప్తం మేజరు డ్రెయిను వంతెనపై నుంచి చూపించి నష్టాన్ని వివరిస్తామన్నారు. అనంతరం మోడువారిన కొబ్బరి చెట్లను పరిశీలిస్తారని, అక్కడ ఏర్పాటు చేసే ఫొటో ప్రదర్శనను తిలకిస్తారని చెప్పారు. కేశవదాసుపాలెంలో పవన్ కల్యాణ్‌కు రైతులు తమ ఇబ్బందులు చెప్పుకునేలా ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. డ్రెయినులో పూడిక తొలగింపు, గట్ల నిర్మాణానికి రూ.20.62 కోట్లు మంజూరు ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందన్నారు. రాజోలు, మామిడికుదురు (రూరల్) సీఐలు టి.వి.నరేశ్‌కుమార్, ప్రశాంత్, స్థానిక ఎస్సై ఏ.సురేశ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళ నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇస్తున్న అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇతర అధికారులతో కలిసి వినతులు స్వీకరించారు. 200 మంది తమ సమస్యలపై ఫిర్యాదులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ చిరునామా: డి.నెం. 6-12-5/1, రెండవ అంతస్తు, కోటిపల్లి బస్ స్టాండ్ ఎదురుగా, ఇన్నీస్ పేట, రాజమహేంద్రవరం-533101, తూర్పు గోదావరి జిల్లా.

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్) (గౌరవనీయులైన ఎన్.సి.ఎల్.టి చెన్నై ఆదేశాల మేరకు 09.11.2022న సి.పి.నెం: 69-76 ఆఫ్ 2022 లో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌ను శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌తో విలీనం చేశారు. తదనంతరం ది.30.11.2022 నుండి మెస్సర్స్ శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ పేరు మార్పుకు అనుగుణంగా ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికేట్ & కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ క్రింద కంపెనీల రిజిస్ట్రార్ ధృవీకరించిన ప్రకారం మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడింది) కంపెనీల చట్టం క్రింద నమోదు చేయబడిన కంపెనీ మరియు బ్యాంకింగ్ యేతర ఫైనాన్స్ వ్యాపారం చేయడానికి ఆర్.బి.ఐ లో కూడా నమోదు చేయబడిన కంపెనీ. రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 మరియు బ్రాంచి ఆఫీస్ చిరునామా: **రావులపాలెం,** డి.నెం. 8-298/1, కెనరా బ్యాంక్ పై అంతస్తులో, అమలాపురం రోడ్డు, రావులపాలెం-533238, డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఇందుమూలంగా ఈ క్రింది నోటీసును జారీ చేస్తున్నాము.

ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదిల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా పరిగణించారు. నోటీసులు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులో తెలిపిన మొత్తం పై కాంట్రాక్టువల్ రేటున తదుపరి వడ్డీతో పాటు నోటీసులో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసి చట్టం 2002లోని 13(2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదిలో డిమాండ్ నోటీసు జారీచేశారు.

చివరగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందజేయబడకుండ తిరిగి వచ్చినందుకు సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

ఋణగ్రహీత (లు) / సహ ఋణగ్రహీతలు / హామీదారు(లు) పేరు	ఎన్.పి.ఏ తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1. **కేత శ్రీనివాసు @ శ్రీనివాస రావు,** తండ్రి: సత్యనారాయణ, కన్‌స్ట్రక్షన్స్ పని, డి.నెం. 8-134/3, రాకుర్తి వారి పాలెం, మోడేకుర్రు, కొత్తపేట-533229, డా. బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా. 2. **కేత వెంకటేశ్వర్లు @ వెంకటేశ్వర రావు,** తండ్రి: సత్యనారాయణ, డిటిపి సెంటర్ వ్యాపారం, డి.నెం. 8-134/3, రాకుర్తి వారి పాలెం, మోడేకుర్రు, కొత్తపేట-533229, డా. బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా. 3. **చిట్టూరి అనిల్ కుమార్,** తండ్రి: సూర్యనారాయణ, ఎలక్ట్రికల్ & ప్లంబింగ్ పని, డి.నెం. 1-71, గొల్లపాలెం, అల్లవరం-533217. డా. బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా.	10-05-2022 / రూ. 10,00,000/- (అక్షరాలా పది లక్షల రూపాయలు మాత్రమే)	24-10-2025 / ది. 23-10-2025 తేది నాటికి రూ. 23,37,429/- (అక్షరాలా ఇరవై మూడు లక్షల ముప్ఫై ఏడు వేల నాలుగు వందల ఇరవై తొమ్మిది రూపాయలు మాత్రమే)

ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. **RVPLMTF2102240002,** తేది: 24.02.2021

ఆస్తి వివరములు: తూర్పు గోదావరి జిల్లా, కొత్తపేట మండలం, కొత్తపేట సబ్-జిల్లా, మోడేకుర్రు గ్రామ పంచాయతీ మరియు గ్రామం ఖాతాలకు సంబంధించిన జిరాయితీ మెట్ట భూమిలో, సర్వే నెం. 24/5 యొక్క మొత్తం విస్తీర్ణం ఎకరా 2.3 సెంట్లు నుండి ఎకరా 0.03 1/3 సెంట్లు లేదా 162 చదరపు గజాలు లేదా 136.24 చదరపు మీటర్లు విస్తీర్ణంలో ఉన్న స్థలం మరియు దానిపై గల ఇల్లు, డోర్ నెం. 8-220, అసెస్‌మెంట్ నెం. 1177. **హద్దులు: తూర్పు:** కడలి రఘునాథ రావు గారికి చెందిన భూమి, **దక్షిణం:** కడలి ధర్మారావు గారికి చెందిన భూమి, **పడమర:** గుట్టుపల్లి ఆదినారాయణ గారికి చెందిన స్థలం మరియు రోడ్డు, **ఉత్తరం:** వాసంశెట్టి రామకృష్ణ గారికి చెందిన భూమి.

పైన పేర్కొన్న పరిస్థితులలో ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్తు వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతో పాటు పైన పేర్కొన్న విధంగా చెల్లించవలసిన మిగులు బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు మరియు / లేదా వారి హామీదార్లు (వర్తించునపుడు) కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. ఆ విధంగా చేయుటలో విఫలమైతే ఈ నోటీసు తేది నుండి 60 రోజులు ముగిసిన తరువాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(4) మరియు దాని క్రింద వర్తించే రూల్స్ క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా పెట్టిన వ్యక్తుల సెక్యూర్డ్ ఆస్తుల స్వాధీనం చేసుకొనుటతో సహా సెక్యూర్డ్ ఆస్తుల పైన తదుపరి చర్యలు చేపట్టబడును. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద ఏ ఋణగ్రహీత సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక సమ్మతి లేకుండా పొందకుండా నోటీసులో రిఫర్ చేసిన అతని సెక్యూర్డ్ ఆస్తులు వేటినీ అమ్మకం, లీజు ఇతరత్రా బదిలీ చేయరాదని గమనించవలెను.

ప్రదేశం: రాజమండ్రి **సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ చిరునామా: డి.నెం. 6-12-5/1, రెండవ అంతస్తు, కోటిపల్లి బస్ స్టాండ్ ఎదురుగా, ఇన్నీస్ పేట, రాజమహేంద్రవరం-533101, తూర్పు గోదావరి జిల్లా.

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్) (గౌరవనీయులైన ఎన్.సి.ఎల్.టి చెన్నై ఆదేశాల మేరకు 09.11.2022న సి.పి.నెం: 69-76 ఆఫ్ 2022 లో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌ను శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌తో విలీనం చేశారు. తదనంతరం ది.30.11.2022 నుండి మెస్సర్స్ శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ పేరు మార్పుకు అనుగుణంగా ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికేట్ & కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ క్రింద కంపెనీల రిజిస్ట్రార్ ధృవీకరించిన ప్రకారం మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడింది) కంపెనీల చట్టం క్రింద నమోదు చేయబడిన కంపెనీ మరియు బ్యాంకింగ్ యేతర ఫైనాన్స్ వ్యాపారం చేయడానికి ఆర్.బి.ఐ లో కూడా నమోదు చేయబడిన కంపెనీ. రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 మరియు బ్రాంచి ఆఫీస్ చిరునామా: **నిడదవోలు,** డి.నెం. 20-44, 1వ అంతస్తు, పాటిమీద, రామ్ నగర్, నిడదవోలు-534301, తూర్పు గోదావరి జిల్లా. ఇందుమూలంగా ఈ క్రింది నోటీసును జారీ చేస్తున్నాము.

ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదిల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా పరిగణించారు. నోటీసులు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులో తెలిపిన మొత్తం పై కాంట్రాక్టువల్ రేటున తదుపరి వడ్డీతో పాటు నోటీసులో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసి చట్టం 2002లోని 13(2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదిలో డిమాండ్ నోటీసు జారీచేశారు.

చివరగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందజేయబడకుండ తిరిగి వచ్చినందుకు సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

ఋణగ్రహీత (లు) / సహ ఋణగ్రహీతలు / హామీదారు(లు) పేరు	ఎన్.పి.ఏ తేది / ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1. **పిల్లిల్లి సత్యనారాయణ,** తండ్రి: సూర్యారావు, స్వర్ణశ్రీ ప్యాకేజింగ్ వ్యాపారం, డి.నెం. 2-4, ఎస్.సి. పేట, మెయిన్ రోడ్డు, వి.టి.సి పాలతోడు, పాలతోడు-533340, డా. బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా. 2. **పిల్లిల్లి సురేంద్ర,** తండ్రి: సత్యనారాయణ, సూర్య సాయి ప్యాకేజింగ్ వ్యాపారం, డి.నెం. 2-2/1, ఎస్.సి. పేట, మెయిన్ రోడ్డు, పాలతోడు-533340, డా. బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా. 3. **పిల్లిల్లి మోహన్ కుమార్,** తండ్రి: రూబీన్, మోహన్ కిరాణా షాప్ వ్యాపారం, డి.నెం. 2-12-188, న్యూ కాలనీ, మండపేట-533308, డా. బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా.	07-10-2023 / రూ. 15,00,000/- (అక్షరాలా పదిహేను లక్షల రూపాయలు మాత్రమే)	27-10-2025 / ది. 27-10-2025 తేది నాటికి రూ. 28,71,670/- (అక్షరాలా ఇరవై ఎనిమిది లక్షల డెబ్బై ఒక్క వేల ఆరు వందల డెబ్బై రూపాయలు మాత్రమే)

ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. **NDVL1TF2303310002,** తేది: 31.03.2023

ఆస్తి వివరములు: ఐటమ్ నెం.01: పిల్లిల్లి సత్యనారాయణ గారి ఆస్తి. గతంలో తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతము డా. బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా, మండపేట సబ్-రిజిస్ట్రీ, మండపేట మండలం, పాలతోడు గ్రామ పంచాయతీ, పాలతోడు గ్రామం సర్వే నెం. 55/4 లో గల 120.03 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఆర్‌సిసి రూఫ్ ఇల్లు మరియు స్థలం, డోర్ నెం. 2-4, లోని అన్ని సౌకర్యాలు, నీరు, దారులు మరియు అన్ని సులభ హక్కులతో సహా. **హద్దులు: తూర్పు:** 36.04 అడుగుల పిల్లిల్లి సురేంద్ర గారి ఆస్తి (ఇందులో ఐటమ్ నెం.2), **పడమర:** 36 అడుగుల కాకర్ల చంద్రమ్మ గారి ఇంటి స్థలం, **దక్షిణం:** 29.9 అడుగుల పిల్లిల్లి శ్రీనివాస రావు గారి ఇల్లు, **ఉత్తరం:** 30 అడుగుల 11 అడుగుల వెడల్పు సి.సి. రోడ్డు.

ఐటమ్ నెం.02: పిల్లిల్లి సురేంద్ర గారి ఆస్తి. గతంలో తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతము డా. బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా, మండపేట సబ్-రిజిస్ట్రీ, మండపేట మండలం, పాలతోడు గ్రామ పంచాయతీ, పాలతోడు గ్రామం సర్వే నెం. 55/4 లో గల 59.68 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఖాళీ స్థలం లోని అన్ని సౌకర్యాలు, నీరు, దారులు మరియు అన్ని సులభ హక్కులతో సహా. **హద్దులు: తూర్పు:** 36.06 అడుగుల రాజవీధి, **పడమర:** 36.04 అడుగుల పిల్లిల్లి సత్యనారాయణ గారి ఆస్తి (ఇందులో ఐటమ్ నెం.01), **దక్షిణం:** 14.09 అడుగుల పిల్లిల్లి శ్రీనివాస రావు గారి ఇల్లు, **ఉత్తరం:** 14.09 అడుగుల 11 అడుగుల వెడల్పు సి.సి. రోడ్డు.

పైన పేర్కొన్న పరిస్థితులలో ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్తు వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతో పాటు పైన పేర్కొన్న విధంగా చెల్లించవలసిన మిగులు బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు మరియు / లేదా వారి హామీదార్లు (వర్తించునపుడు) కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. ఆ విధంగా చేయుటలో విఫలమైతే ఈ నోటీసు తేది నుండి 60 రోజులు ముగిసిన తరువాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(4) మరియు దాని క్రింద వర్తించే రూల్స్ క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా పెట్టిన వ్యక్తుల సెక్యూర్డ్ ఆస్తుల స్వాధీనం చేసుకొనుటతో సహా సెక్యూర్డ్ ఆస్తుల పైన తదుపరి చర్యలు చేపట్టబడును. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద ఏ ఋణగ్రహీత సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక సమ్మతి లేకుండా పొందకుండా నోటీసులో రిఫర్ చేసిన అతని సెక్యూర్డ్ ఆస్తులు వేటినీ అమ్మకం, లీజు ఇతరత్రా బదిలీ చేయరాదని గమనించవలెను.

ప్రదేశం: రాజమండ్రి **సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం, వాడపల్లి
సీల్డ్ కొటేషన్ కొరకు - ప్రకటన

Dr.B.R.Ambedkar కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం, వాడపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు ది: 14-01-2026 (భోగి రోజు) నాడు జరుగు శ్రీ గోదాదేవి కళ్యాణం సందర్భంగా మెటీరియల్ సప్లై/నిర్వహణ/ ఏర్పాట్లు చేయుట, తదుపరి తిరిగి తీసుకొని వెళ్లుటకు కొటేషన్లు కోరుచున్నది. ఈ పనులయందు తగిన అనుభవం మరియు అర్హత గల సంస్థల నుండి కొటేషన్లు కోరుచున్నది. తమ సీల్డ్ కొటేషన్లు దేవస్థానము వారి కార్యాలయం నందు ది: 01/12/2025 తేది సాయంత్రం 6PM వరకు స్వీకరించబడును. మిగతా వివరముల కొరకు ఈ website: https://vsvstemple.com/pdfs/Godadevi_kalyanam.pdf ను సంప్రదించగలరు.

Dt: 24/11/2025 సం/- డిప్యూటీ కమిషనరు మరియు
Place: Vadapalli కార్యనిర్వహణాధికారి

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అంబాజీపేట బ్రాంచ్, అంబాజీపేట, తూర్పుగోదావరి జిల్లా

అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన

SARFAESI చట్టం 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ 8 (6) ప్రకారం జారీ చేయడమైనది.

టు,

ఋణగ్రహీత'ల చిరునామా: **శ్రీమతి ఉప్పుడి నూకరత్నం,** భర్త: రాధాకృష్ణ, డి.నెం.3-2-83, శెట్టిబలిజ గ్రంథాలయం, జెడ్పీ బాయ్స్ హై స్కూల్ ఎదురుగా, అమలాపురం, అమలాపురం మండలం, తూర్పుగోదావరి జిల్లా. **శ్రీ ఉప్పుడి జయరామ్,** తండ్రి : రాధాకృష్ణ, డి.నెం.3-2-83, శెట్టిబలిజ గ్రంథాలయం, జెడ్పీ బాయ్స్ హై స్కూల్ ఎదురుగా, అమలాపురం, అమలాపురం మండలం, తూర్పుగోదావరి జిల్లా. శ్రీమతి పసుపులేటి శైలజ, భర్త: పి. వీరబాబు, బ్లాక్ నెం.1, ఫ్లాట్ నెం.ఎస్ఎఫ్1, ఇందిరమ్మ ఎపిటిఎస్, ఎస్. అచ్యుతాపురం, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా.

సర్ / మేడమ్

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 లోని సెక్షన్ 13(12) దీనితో చదువుకోలసిన సదరు రూల్స్‌లోని రూల్ 3 ప్రకారం ఋణగ్రహీతలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి **తేది. 05-05-2025న** జారీచేసిన డిమాండ్ నోటీసులో తెలిపిన విధంగా **తేది.05-05-2025** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.32,58,625/-** (అక్షరాల ముప్ఫై రెండు లక్షల యాభై ఎనిమిది వేల ఆరు వందల ఇరవై ఐదు రూపాయలు మాత్రమే) + **తేది.06.05.2025** నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు వసూలు నిమిత్తం పైన తెలిపినట్లు 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తెలియజేయడమైనది.

మీరు మొత్తం ఋణాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సదరు ఆస్తులను సెక్షన్ 13(4) దీనితో సదరు రూల్స్‌లోని రూలు 8(1) ప్రకారం అధీకృత అధికారి సదరు తనఖా ఆస్తిని **తేది.17.07.2025న** స్వాధీనం చేసుకున్నారు. సదరు స్వాధీనత నోటీసును **తేది.18-07-2025న (ఈనాడు : రాజోలు క్లస్టర్ ఎడిషన్ (తెలుగు) మరియు ది హిందూ : విశాఖపట్నం అవుట్ స్టేషన్ ఎడిషన్ (ఇంగ్లీష్))** దినపత్రికలలో రూలు 8(2) ప్రకారము ప్రచురించడమైనది.

తనఖా ఉంచిన దిగువ తెలిపిన ఆస్తులపై గల **తేది.05-05-2025న** డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తమును ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా చెల్లించవలెను. లేని యెడల సదరు ఆస్తులు విక్రయించుటకు బహిరంగ వేలం కొరకు టెండర్లు / కొటేషన్లు సాధారణ ప్రజానీకం వద్ద నుండి ఆహ్వానించబడును.

స్థిరాస్తి వివరములు

శ్రీమతి ఉప్పుడి నూకరత్నం, భర్త: రాధాకృష్ణ, ఉప్పుడి జయరామ్, తండ్రి : రాధాకృష్ణ, ఉప్పుడి శైలజ, తండ్రి : రాధాకృష్ణ వారికి చెందిన ఆస్తి: తూర్పుగోదావరి జిల్లా, అమలాపురం సబ్ రిజిస్ట్రీ, అమలాపురం మున్సిపాలిటీ, ఆర్.ఎస్.నెం.431/7 లోని 97.5 చ॥గ॥ల జిరాయితీ డ్రై విస్తీర్ణంలో డి.నెం.3-2-87తో గల ఆర్‌సిసి భవనం. **హద్దులు: తూర్పు :** సానబోయిన ప్రసాదరావు గారి స్థలం - 48 అ॥లు, **దక్షిణం:** దారి - 18.3 అ॥లు, **పడమర:** ముంగండ రమేష్ గారి స్థలం - 48 అ॥లు, **ఉత్తరం:** సి. మార్క్ షేర్ గారి స్థలం - 18.3 అ॥లు.,

తేది: 24-11-2025 **సం/- అధీకృత అధికారి,**
ప్రదేశం: అంబాజీపేట **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

తైవాన్ జామ.. లాభాలు అందుకుందామా

రైతేరాజు

స్ఫూర్తి

న్యూస్‌టుడే, అంబాజీపేట

కోనసీమ జిల్లాలోని కొబ్బరి తోటల్లో సాధారణంగా అంతర పంటలుగా అరటి, కోకో, వక్క, కూరగాయలు పండిస్తుంటారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారానికి చెందిన అభ్యుదయ రైతు దొంగ నాగేశ్వరరావు ఇందుకు భిన్నంగా ముందుకు సాగుతున్నారు. తనకున్న నాలుగు ఎకరాల కొబ్బరి తోటలో అంతర పంటగా తైవాన్ జామ పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. కడియపులంక నుంచి మొక్కలు తీసుకొచ్చి నాటారు. ఎకరాకు 200 చొప్పున మొత్తం 800 నాటారు. గట్ల పైన మరో 200 మొక్కలు నాటారు. ఎకరాకు రూ.20 వేలు చొప్పున నాలుగు ఎకరాలకు రూ.80 వేలు పెట్టుబడి అయ్యింది. మొదటి రెండేళ్లలోనే పెట్టుబడి వచ్చేసింది. ఇంకా 20 నుంచి 30 ఏళ్ల వరకు ఆదాయం తీసే అవకాశం ఉంది. పూర్తిగా సేంద్రియ పద్ధతులు అవలంబించడం ద్వారా ఎక్కువ కాలం ఆదాయం తీస్తున్నారు.

సేంద్రియ పద్ధతిలోనే..

అందుబాటులో ఉన్న ప్రకృతి వనరులను వినియోగించుకుని కొబ్బరి తోటల్లో యాజమాన్య పద్ధతులను శాస్త్రవేత్తల సూచనలు, సలహాల మేరకు పాటిస్తున్నారు. వీటికి అందించిన పోషకాలే జామకు కూడా అందుతున్నాయి. డ్రిప్ పద్ధతిలో తోటకు సాగునీరు అందిస్తున్నారు. పశువుల పెంట, గోమూత్రం, వివిధ రకాల పత్రులతో తయారు చేసిన కషాయాలను పిచికారీ చేస్తున్నారు. కిలో పరిమాణం గల జామకాయ రూ.30 నుంచి రూ.35కు వర్తకులు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. ప్రకృతి సిద్ధంగా పండించిన కావడంతో దీనికి డిమాండ్ ఉంటుంది. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి రూ.60కు విక్రయిస్తున్నారు.

కొబ్బరితోటలో సాగు చేసిన జామ పంటను పరిశీలిస్తున్న రైతు నాగేశ్వరరావు

మార్కెటింగ్ సమస్య లేదు

జామ తోటలో 45 రోజులకు ఒకసారి కొమ్మ కత్తిరింపులు చేయడంతో చెట్టుకు పూత అధికంగా వచ్చి దిగుబడి బాగుంటుంది. మార్కెటింగ్ సమస్య లేదు. నెలకు రూ.25-30 వేల ఆదాయం వస్తుంది. పూర్తిగా సేంద్రియ పద్ధతిలో పాటించడంతో కాయ పరిమాణంతో పాటు రుచి బాగుంటుంది. **- దొంగ నాగేశ్వరరావు, గంగలకుర్రుఅగ్రహారం, అంబాజీపేట**

ఆయిల్‌పామ్‌లో కొమ్ముపురుగు నివారిద్దాం

మీ కోసం

నల్లజర్ల, న్యూస్‌టుడే: ఆయిల్‌పామ్ మొక్కలపై కొమ్ము పురుగు ప్రభావంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. నివారణ చర్యలను కృషి విజ్ఞాన కేంద్రం(వెంకట్రామన్నగూడెం) ప్రధాన శాస్త్రవేత్త విజయలక్ష్మి వివరించారు. నాలుగేళ్ల వయస్సున్న మొక్కలపై పురుగు ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఆకుల మీద 'వి' ఆకారంలో కత్తిరించినట్లు కనిపిస్తుంది. పురుగు ఆకులను కొరికి పత్ర హరితాన్ని బయటకు నెడుతుంది. మొవ్వలో ఈ పదార్థం ఉండిపోయి నష్టాన్ని సూచిస్తుంది.

నివారణ ఇలా..

కొమ్ముపురుగును ఒక ఇనుప చువ్వ ఉపయోగించి బయటకు తీసిన తర్వాత 25 గ్రాముల కార్బరిల్ మందును 10 గ్రాముల తడి ఇసుకలో కలిపి మొవ్వలో ఉంచాలి. 30 గ్రాముల వేపపిండిని మొవ్వలో వేయడం ద్వారా నివారించవచ్చు. 20 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు మొవ్వలో పెట్టాలి. పిల్ల పురుగులు పెరగకుండా నిరోధించడానికి పెంట కుప్పలపై కార్బరిల్ మందు పిచికారీ చేయాలి. లింగాకర్షక బుట్టలను అమర్చడం వల్ల ఉధృతిని తగ్గించొచ్చు. తోటలను తరచూ కలుపు మొక్కలు లేకుండా ఉంచుకోవాలి.

ఉద్యాన రైతుకు రాయితీల తోడు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: కొత్తగా పండ్లతోటలు, కూరగాయలు, పూలసాగు చేపట్టే రైతులకు అందించే రాయితీల వివరాలను గొల్లప్రోలు ఉద్యానాధికారి రాజశేఖర్ వివరించారు. అర్హులు ఉద్యానశాఖ సిబ్బందికి దరఖాస్తులు అందించాలన్నారు.

● బంతి, చామంతి, గులాబి, లిల్లీ వంటి పూలసాగు చేపట్టేందుకు హెక్టారుకు రూ.20 వేలు, హైబ్రిడ్ కూరగాయలు చేపట్టేందుకు రూ.24 వేలు చొప్పున రాయితీ అందజేస్తారు.

మామిడి తోట

రాయితీ వివరాలు (రూ.లలో)		
పంట	మొదటి ఏడాది	రెండో ఏడాది
మామిడి	30	20
జీడిమామిడి	18	12
బొప్పాయి	18	12
డ్రాగన్‌ఫ్రూట్	1,62,000	1,08,000

● శాశ్వత పందిరిపై హైబ్రిడ్ కూరగాయలు సాగు చేస్తే హెక్టారుకు రూ.లక్ష చొప్పున అందిస్తారు.

● ఆయిల్‌పామ్ తోట సాగుకు హెక్టారుకు మొక్కల రాయితీగా రూ.27,599, నిర్వహణ రాయితీ రూ.5,250, అంతరపంట రాయితీగా రూ.5,250 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు అందజేస్తారు.

తెలుసుకుందాం..

● విద్యుత్తు పంపుసెట్లు, బోరు నీటిని నిల్వ చేసుకునే కుంటలు, వర్మీకంపోస్టు యూనిట్ ఏర్పాటు, ఆయిల్‌పామ్ కట్టర్, వైర్‌మెష్, అల్యూమినియం నిచ్చెన, చాఫ్‌కట్టర్ వంటి పరికరాలకు 50 శాతం రాయితీ వర్తింపజేస్తారు. బిందుసేద్యం ఏర్పాటుకు 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు 90, 5 ఎకరాల కన్నా ఎక్కువ ఉన్న రైతులకు 50 శాతం రాయితీ వర్తింపజేస్తారు.

యాజమాన్య పద్ధతులతో మేలైన దిగుబడి

ఆత్రేయపురం: పంట పొలాల్లో తగు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి ఫలితాలు పొందవచ్చని **కొత్తపేట సబ్‌డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎంఎస్ రామారావు** సూచించారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

? ప్రశ్న సమాధానం

? మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించి మొక్కలు దెబ్బతింటున్నాయి. నివారణ చర్యలు తెలపండి. - సుబ్రహ్మణ్యం, రావులపాలెం

☛ పురుగు ఉధృతి తక్కువగా ఉంటే క్లోరాంట్రనిలిప్రోల్ 500 మి.లీ. ఎకరాకు, ఉధృతి ఎక్కువగా ఉంటే స్పైనోశాడ్ 45 శాతం, ఎస్.సి. ద్రావణం 60 మి.లీ. కలిపి మొవ్వు లోపల ఆకులు పూర్తిగా తడిసేలా పిచికారీ చేయాలి.

? కొద్ది రోజుల్లో దాళ్వాసాగు ప్రారంభం కానుంది. ఇందులో వెదజల్లే పద్ధతులు వివరించండి. - ప్రకాష్, కట్టుంగ

☛ ఈ విధానంలో సాధారణ పద్ధతి కంటే పది రోజుల ముందుగా పంట చేతికొస్తుంది. దమ్ము చేసే ముందు జింక్, జిప్సం వినియోగించాలి. 15 రోజుల్లో రెండుసార్లు దమ్ము చేయాలి. వెదజల్లే ముందు కిలో విత్తనానికి మూడు గ్రాముల కార్బండిజమ్ లేదా మాంకోజెబ్ పొడిమందు కలిపి చల్లాలి. విత్తనాలు వేసిన తర్వాత చేలో నీటిని పూర్తిగా తొలగించి ఆపై ఎరువు చల్లుకోవాలి.

కార్టూనిస్ట్ వినోద్‌కు జాతీయస్థాయి పురస్కారం

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సాంస్కృతిక శాఖ, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సహకారంతో మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కార్టూన్ పోటీల్లో సఖినేటిపల్లికి చెందిన కార్టూనిస్ట్, ఉపాధ్యాయుడు చింతా వినోద్‌కుమార్ గీసిన 'సెల్ ఫోన్ వ్యసనం - పుస్తకానికి దూరం' కార్టూన్‌కు ప్రథమ స్థానం లభించింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి జరిగిన జాతీయ సాంస్కృతిక ఉత్సవాల్లో వినోద్‌కు పురస్కారం, నగదు బహుమతి అందజేసి జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సత్కరించారు. అవార్డు పొందడం చాలా సంతోషంగా ఉందని వినోద్‌కుమార్ తెలిపారు. పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

పురస్కారం స్వీకరిస్తున్న వినోద్

వాడపల్లి దేవస్థానానికి ప్రత్యేక అంబులెన్స్

ఆత్రేయపురం: వాడపల్లి వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి ఎస్బీఐ వైద్యసేవా (ఉచిత 108) ప్రత్యేక అంబులెన్స్ సౌకర్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఈవో చక్రధరరావు తెలిపారు. అంబులెన్స్‌లో ఈసీజీ, వెంటిలేటర్, ఆక్సిజన్ సహాయంతో పాటు బీపీ, షుగర్, గుండెకు సంబంధించిన వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు.

మండపేట మున్సిపల్ మాజీ ఛైర్మన్ శ్రీవరప్రకాష్ మృతి



మండపేట, న్యూస్‌టుడే: తెదేపా సీనియర్ నేత, మండపేట మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ (61) గుండెపోటుతో ఆదివారం అర్ధరాత్రి మృతిచెందారు. మండపేటలో దాసిరెడ్డివారి వీధిలో ఆయన నివాసానికి సోమవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పి.నూకరత్నం తదితరులు చేరుకుని నివాళులర్పించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, కౌన్సిలర్లు, కార్మిక సంఘాల నాయకులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, లయన్స్, రోటరీ క్లబ్ సభ్యులు నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపంగా పట్టణంలో వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ప్రైవేట్ విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ప్రకటించారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

● 2014-2019 మధ్య కాలంలో తెదేపా నుంచి మున్సిపల్ ఛైర్మన్‌గా శ్రీవరప్రకాష్ వ్యవహరించారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్రొత్తకాయ)	ధర (వెయ్యి)
కొత్తకాయ పెద్దది (వెయ్యి)	19,000
పాతకాయ గండేరా	29,000
రెండోరకం	27,000
కొత్తకాయ గండేరా	28,000
రెండోరకం	26,000
నీటి కాయ	17,000-18,000
రెండోరకం	15,000-16,000
కొబ్బరి నూనె 15 కిలోలు	6,000
[illegible]	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు [illegible]

వెన్‌కాబ్ చికెన్ ధర కిలో రూ.లలో

హోల్‌సేల్	103.00
రిటైల్ లైవ్	130.00
విత్ స్కిన్	189.00
స్కిన్‌లెస్	215.00

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నది విడిపించి ఎక్కువ ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మణప్పురం లో ఉన్నవి విడిపించి ఎక్కువ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 99491 38626

FINANCIAL SERVICES

అర్జెంట్‌లోన్ Govt. ఉద్యోగస్థులకు ... ✆ 73862 01191.

... 2nd ... 9396999669.

JOBS

Siris Electrik Corporation Vizag Requires: Marketing Executives for Rajamundry/ Kakinada to Market Electrical Products. Freshers (or) Experience in B2B Segment are welcome. Contact: 9553392229.

Wanted Sales and Marketing person for hair transplantation center at Rajahmundry contact: 7674999906

సేల్స్‌గర్ల్స్ కావలెను. ... Contact: 91339 59999

ఆఫీస్‌లో పనిచేయుటకు కంప్యూటర్ వర్క్ చేయగలిగిన యువతులు కావలెను. Qly: Degree Cont: 92954 01801, రాజమండ్రి దానవాయిపేట

రాజమండ్రి దానవాయిపేట నందు పనిచేయుటకు నర్సులు కావలెను. (నో నైట్ డ్యూటీస్) Contact Cell: 76749 99906

HEALTH & CARE

SKIN

ఉచిత "బాల్డ్ మధ్యలో" లేజర్ చికిత్స శిబిరం

Triple Combination Treatment

Dr.M.N.Rao, MBBS(OSM), DD(UHS)

తేది:27.11.2025 (గురువారం)

BARBIE SKIN & LASER CLINIC

7330696252

EENADU for Advertisement Contact: 8008597607

For the Information of Trade & Industry ... 6-45 ... 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ప్రచురించేటప్పుడు ... పాఠకులు స్వయంగా విచారించుకుని వ్యవహరించాలి ...

రాజోలు
• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

బూత్‌స్థాయిలో తెదేపాను పటిష్ఠం చేయాలి

పి.గన్నవరం, న్యూస్‌టుడే: బూత్ స్థాయిలో తెదేపాను మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పి.గన్నవరం నియోజకవర్గ కోకన్వీనర్ మోకా ఆనందసాగర్ పిలుపునిచ్చారు. పి.గన్నవరంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించాలన్నారు. పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి, అంబాజీపేట మండలాలకు మట్టా ప్రభాకరరావు, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, కేతా శ్రీను, జయలక్ష్మిలను పరిశీలకులుగా అధిష్ఠానం నియమించిందని వెల్లడించారు. మరో కోకన్వీనర్ దాసరి వీరవెంకటసత్యనారాయణ, అంబాజీపేట ఎ.ఎం.సి. ఛైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు చెల్లుబోయిన గంగాదేవి, మట్టపర్తి భారతి, అంబటి భూలక్ష్మి, గుత్తుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య షష్ఠికి ఏర్పాట్లు

అంబాజీపేట, రాజోలు: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవానికి ఆలయాలను సిద్ధం చేశారు. మాచవరం, ఇరుసుమండ, పుల్లేటికుర్రు గ్రామాల్లోని స్వామివారి ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేకువజాము నుంచి ప్రత్యేక అభిషేకాలు చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. బారికేడ్లు ఏర్పాటు చేశారు. ✦ కడలిలో కపోతేశ్వర స్వామి ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇబ్బందులు లేకుండా బారికేడ్లు, ఇతర ఏర్పాట్లు చేసినట్లు ఈవో నాగవిష్ణు తెలిపారు. భక్తులకు పులిహోర పంపిణీ చేయనున్నట్లు పోలిశెట్టి ప్రసాద్ చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884
ఉ. 10 - మ. 1

పూడికలు తొలగింపు

ఆత్రేయపురం: పులిదిండిలోని డ్రెయిన్లలో పూడిక పేరుకుపోవడంతో మురుగు ముందుకు సాగడం లేదని స్థానికులు తెలిపిన సమస్యను సర్పంచి కనుమూరి సూర్య సుందర సీతాకుమారి వద్ద ప్రస్తావించగా పూడికలు తీయించి శుభ్రం చేయించారు.

రావులపాలెం పట్టణం: రావులపాలెంలో పంచాయతీ వెనుక డ్రెయిన్‌లో వ్యర్థాల కారణంగా మురుగు పారక ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమస్యను పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

వీధి దీపాలకు మరమ్మతులు

రావులపాలెం గ్రామీణం: గోపాలపురంలో వీధి దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో ప్రజలు రాత్రి సమయంలో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని పంచాయతీ కార్యదర్శి సాయిపట్టాభిరామయ్య దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించారు.

మెరుగైన సేవలందేలా.. ప్రగతి పల్లవించేలా

క్లస్టర్ విధానం రద్దుతో పంచాయతీల అభివృద్ధి

న్యూస్‌టుడే, రావులపాలెం పట్టణం

గ్రామ పంచాయతీల్లో క్లస్టర్ విధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో గ్రామాలకు మంచి రోజులు రానున్నాయి. ఇప్పటివరకు ఈ విధానంలో నాలుగైదు పంచాయతీలకు ఒక్క కార్యదర్శే విధులు నిర్వర్తించడం వల్ల పరిపాలన కష్టతరంగా మారింది. జనాభా, ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకుని పంచాయతీలను గ్రేడ్లుగా విభజించనున్నారు. దీనివల్ల ప్రజలకు సేవలు మెరుగుపడటంతోపాటు ప్రభుత్వ పాలన మరింత చేరువ కానుంది. పంచాయతీలకు ఆర్థిక సంఘ నిధులను నేరుగా విడుదల చేయడం వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడుతుంది. గ్రేడ్‌ల ఆధారంగా ప్రత్యేకించి గ్రాంట్లు విడుదల చేస్తే అభివృద్ధి మెరుగవుతుంది.

మండలం	పంచాయతీలు
రావులపాలెం	12
ఆత్రేయపురం	17
కొత్తపేట	10
ఆలమూరు	18

నియోజకవర్గంలో..

కొత్తపేట నియోజకవర్గంలోని రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు కొత్తపేట మండలాల్లో మొత్తం 57 గ్రామాలు ఉన్నాయి. ఈ పంచాయతీలన్నీ మూడు గ్రేడ్లుగా మారనున్నాయి. ప్రతి పంచాయతీకి విధిగా కార్యదర్శి ఉండేలా మార్పులు చేస్తున్నారు. పదివేలకుపైగా జనాభా, ఏడాదికి రూ.కోటి ఆదాయం ఉన్న పంచాయతీలను స్పెషల్ గ్రేడ్‌గా పరిగణిస్తారు. 4 వేల నుంచి 10 వేలలోపు జనాభా ఉన్న పంచాయతీలను గ్రేడ్ 1, వెయ్యికిపైగా జనాభా ఉన్న పంచాయతీలను గ్రేడ్ 2, వెయ్యిలోపు జనాభా, రూ.5 లక్షలలోపు ఆదాయం ఉన్న పంచాయతీలను గ్రేడ్ 3గా మార్పులు చేయనున్నారు. నియోజకవర్గంలో రావులపాలెం, కొత్తపేట, ర్యాలి పంచాయతీలు స్పెషల్ గ్రేడ్‌గా మారతాయి. ప్రస్తుతం పనిచేస్తున్న కార్యదర్శులకు గ్రేడ్ 3, 4గా పదోన్నతులు కల్పించనున్నారు.

రావులపాలెం పంచాయతీ కార్యాలయం

అందుబాటులో కార్యదర్శులు..

గ్రేడ్‌ల వారీగా పంచాయతీలను మార్పు చేయడం వల్ల ప్రతీ పంచాయతీకి కార్యదర్శి నియమిస్తారు. ఈ క్రమంలో పరిపాలన మెరుగుపడుతుంది. కార్యదర్శులు అందుబాటులో ఉండటం వల్ల ప్రజలకు సేవలు త్వరితగతిన అందుతాయి.

– సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో, రావులపాలెం

దేవస్థానాల అభివృద్ధికి కృషి

పి.గన్నవరం, న్యూస్‌టుడే: అయినవిల్లి సిద్ధివినాయకుడు, అప్పనపల్లి బాలబాలాజీస్వామి దేవస్థానాలకు సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సోమవారం ఆవిష్కరించారు. పి.గన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేవస్థానాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అప్పనపల్లి, అయినవిల్లి ఆలయాల ఈవో ఎం.సత్యనారాయణరాజు, బాలబాలాజీ దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త మొల్లేటి లక్ష్మీనారాయణ, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి వాసంశెట్టి కుమార్ పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయానికి రూ. 70 లక్షల ఆదాయం

అంతర్వేది: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారికి అక్టోబర్ 22 నుంచి నవంబర్ 20 వరకు కార్తిక మాసంలో రూ.70,11,390 ఆదాయం వచ్చిందని ఆలయ ఏసీ నాగవరప్రసాద్ తెలిపారు. ఇందులో ప్రత్యేక దర్శనాలు, ఆర్జిత సేవలు, ప్రసాదం అమ్మకం ద్వారా రూ.37,99,038, నిత్యాన్నదానానికి విరాళాలు రూ.32,12,352 సమకూరినట్లు వెల్లడించారు. 86,005 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని చెప్పారు. మొంథా తుపాను, దిండి-చించినాడ వంతెనపై వాహనాల రాకపోకలు నిలిపివేయడం వల్ల భక్తుల రాక తగ్గిందన్నారు.

మహారాజశ్రీ రాజోలు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No.18/2024 O.S.No.26/2023
బిట్వీన్:
DHR: వేగేశ్న రంగరాజు
మరియు
JDR: గుబ్బల విష్ణుమూర్తి
పై నెంబరు పిటీషన్ నందు DHRకు రావలసిన డిక్రీ బాకీ వసూలు నిమిత్తం JDRకు చెందిన ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని ది.10-12-2025న ఉదయం గం.10.30 నిలకు ఆగాయిత్తు పై కోర్టువారి ఎదుట వేలం వేయబడును. వేలంలో పాల్గొనదలచిన వారు 1/4 వంతు ధరావతు సొమ్ముతో పాల్గొనవచ్చును.
ఆస్తి వివరము
తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం Dr. B.R.అంబేడ్కర్ కోనసీమ జిల్లా, మలికిపురం సబ్-రిజిస్ట్రార్, లక్కవరం గ్రామానికి చెందిన R.S.No.191/8 :: ZD :: 0-34 1/4 ట్లు (పూరా 0-62 సెంట్లు). R.S.No.191/7 :: ZD :: 0-07 సెంట్లు (Out of 0-28 ట్లు) మొత్తం 0-41 1/4 సెంట్లకు హద్దులు. తూర్పు: గుబ్బల నాగిరెడ్డి గారి భూమి; దక్షిణం: కందికట్ల వీరాస్వామి గారి భూమి; పడమర: ముదునూరి సూరపరాజు గారి భూమి; ఉత్తరం: కాలువ.
ఈ హద్దుల మధ్య గల నానావిధ వృక్షములు సహా.
DHR విలువ - Rs.10,00,000
JDR విలువ - ఇవ్వలేదు
అమీనా విలువ - Rs.66,87,500/-
K.P.R.R.నాయుడు
D.L.రవిచంద్ర
న్యాయవాదులు, రాజోలు

బాల్య వివాహాలతో అనర్థాలు

రావులపాడులో విద్యార్థుల ర్యాలీ

రావులపాలెం గ్రామీణం: బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు ఉన్నందున వాటిని పూర్తిగా అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రావులపాలెం డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు కోరారు. రావులపాడులో ఎన్.ఎస్.ఎస్ సేవా శిబిరంలో భాగంగా సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలు వద్దు.. చదువే ముద్దు, ఇల్లాలి చదువు.. ఇంటికి వెలుగు అంటూ నినాదాలు చేశారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్, పి.నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు మదుసూదన్‌రావు, జ్యోతిబసు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య బోధించాలి

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ప్రతి ఉపాధ్యాయుడు విలువలతో కూడిన విద్య బోధించాలని పరిశీలకురాలు, ఉపాధ్యాయ శిక్షణ సంస్థ ఉపన్యాసకురాలు ఎల్.చూడామణి సూచించారు. ఆమె సోమవారం ర్యాలి ప్రధాన ప్రాథమిక ఫౌండేషన్ పాఠశాలను తనిఖీ చేశారు. గుణాత్మక విద్యకు ప్రత్యేకంగా రూపొందించిన జీఎఫ్ఎల్ఎన్ పరీక్ష విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులు కిచెన్ గార్డెన్‌లో పెంచుతున్న కూరగాయల తోటను పరిశీలించి అభినందించారు.

అర్హులందరికి లబ్ధి చేకూర్చాలి

పి.గన్నవరం: అర్హులందరూ పక్కా ఇళ్లు నిర్మించుకునేవిధంగా ప్రోత్సహించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆదేశించారు. సోమవారం పి.గన్నవరం ఎంపీపీ కార్యాలయంలో గృహనిర్మాణ పథకంపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన సర్వేను ఆధారంగా చేసుకుని 2029 సంవత్సరం వరకు ఇళ్లు కేటాయిస్తారని, ఈ నేపథ్యంలో అర్హులందరినీ లబ్ధిదారులుగా గుర్తించాలని సూచించారు. హౌసింగ్ పి.డి. ఎ.నరసింహారావు, ఈఈ చంద్రశేఖర్, డీఈఈ ధర్నాల శ్రీనివాస్, ఎంపీడీవో జి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి కృషి

మామిడికుదురు: కూటమి ప్రభుత్వం వ్యవసాయంతోపాటు వాటి అనుబంధ రంగాల అభివృద్ధికి కృషి చేస్తోందని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మామిడికుదురులో ఉన్న నగరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నగదు జమ విభాగాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. రైతులకు దాణా బస్తాలు, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నవధాన్యాల విత్తనాలు అందజేశారు. సంఘ ఛైర్మన్ ఈలి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ జిల్లా సభ్యుడు జాలెం శ్రీనివాసరాజా, సర్పంచి గౌస్ మొహిద్దీన్, సొసైటీ డైరెక్టర్లు మట్టా సత్తిబాబు, కాకి శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటరావు, తహసీల్దారు సునీల్‌కుమార్, ఎంపీడీవో భవాని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతులకు దాణా బస్తాలను అందిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

దర్గాను సందర్శించిన ఎమ్మెల్యే

పాశర్లపూడిలోని చారిత్రక బీబీ ఫాతెమాజహెరా దర్గాను ఎమ్మెల్యే సత్యనారాయణ సందర్శించి, మంగళవారం జరగనున్న షహదత్‌కు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని స్థానిక అధికారులకు ఆయన సూచించారు. సంఘ నాయకుడు రజ్వీ తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే ప్రభుత్వ ధ్యేయం

రైతులకు పత్రాలు అందజేసిన తహసీల్దార్, ఎంపీడీవో, ఏవో తదితరులు

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: రైతును అన్ని విధాలా ఆదుకుని రాజులా చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ముమ్మిడివరప్పాడులో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు డ్రోన్లు అందిస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ, పి.ఎం కిసాన్ పథకాల ద్వారా ఇప్పటికే రైతులకు రూ.14 వేలు చొప్పున నగదు జమ చేశారన్నారు. ఎమ్మెల్యేతోపాటు తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, నాయకులు గ్రామంలో రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలతో కరపత్రాలు అందజేశారు.

రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యానందరావు

సంక్షేమ పథకాలతో ప్రయోజనం

మామిడికుదురు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలతో ప్రయోజనం దక్కుతుందని, అన్ని అంశాలపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీవో భవాని తెలిపారు. 'రైతన్నా.. మీ కోసం' వారోత్సవాల్లో భాగంగా తొలిరోజు సోమవారం మామిడికుదురులో రైతులకు కరపత్రాలను అందజేసి, అందులో ప్రధానమైన అయిదు విభాగాలకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. మండలంలోని 14 రైతు సేవా కేంద్రాల పరిధిలో కార్యక్రమం చేపట్టినట్లు ఏవో ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నిధుల్లేక.. భవనం పూర్తికాక

ఆత్రేయపురం ఎస్సీపేట పాఠశాల చెంతన అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచాయి. గుమ్మం, కిటికీలు ఏర్పాటు, ప్లాస్టరింగ్ వంటి పనులు చేయాల్సి ఉంది. తగినన్ని నిధులు కేటాయిస్తే మిగిలిన పనులు పూర్తవుతాయి. ఈ విషయాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ దృష్టికి తీసుకెళ్లగా ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించినట్లు చెప్పారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

గుంతలతో ఇక్కట్లు

అయినవిల్లిలంక-వీరవల్లిపాలెం ప్రధాన రహదారిలో గుంతలు ప్రమాదకరంగా మారాయి. దీంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. గుంతలను తప్పించే క్రమంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారిని పరిశీలించి మరమ్మతులు చేపట్టేవిధంగా చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి వీరన్న తెలిపారు.– న్యూస్‌టుడే, అయినవిల్లి

డంపింగ్‌యార్డ్ కాదు.. రహదారే..

ఆత్రేయపురం తితిదే కల్యాణ మండపం వెనక నుంచి సంత మార్కెట్‌కు వెళ్లే సిమెంట్ రోడ్డు డంపింగ్‌యార్డును తలపిస్తోంది. ముక్కుపుటాలు అదిరేలా దుర్గంధం వ్యాపిస్తోంది. అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. ఈ విషయాన్ని ఎంపీడీవో బీకేఎస్ఎస్ వెంకటరామన్ వద్ద ప్రస్తావించగా శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

బస్టాండ్‌కు డస్ట్‌బిన్‌లు అందజేత

అధికారులకు డస్ట్‌బిన్‌లు అందించిన సంస్థ ప్రతినిధులు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెంలోని ఆర్టీసీ బస్టాండుకు ఈతకోటలోని అవంతి ఫౌండేషన్ రూ.60 వేల విలువైన 15 డస్ట్‌బిన్‌లు సమకూర్చింది. సోమవారం బస్టాండులో జరిగిన కార్యక్రమంలో వీటిని డిపో మేనేజర్ కుమార్‌కు ఫౌండేషన్ హెచ్‌ఆర్ ప్రసాద్ సోమవారం అందజేశారు. స్టేషన్ మేనేజరు ఎం.గురవయ్య, అసిస్టెంట్ మేనేజరు అచ్యుతాంబ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఉయ్యాలవాడ

ఆలమూరు, న్యూస్‌టుడే: భారత స్వాతంత్ర్య పోరాటంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిరస్మరణీయుడని జొన్నాడ వేమన రెడ్డి సంఘం నాయకులు అన్నారు. సోమవారం ఆయన జయంతి సందర్భంగా జొన్నాడలోని తోకలరుగు వద్ద ఉయ్యాలవాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

అంబాజీపేట, న్యూస్‌టుడే: గంగలకుర్రు ప్రాథమిక పాఠశాల వద్ద రూ.20 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యతతో నిర్మాణం చేపట్టాలన్నారు. విద్యార్థులకు రుచికరమైన భోజనంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల కమిటీ ఛైర్మన్ మృతికి సంతాపం

కొత్తపేట, న్యూస్‌టుడే: కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల కమిటీ ఛైర్మన్ నక్కా రామకృష్ణ మృతికి ఎంపీటీసీ సభ్యుడు బండి రాజు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సంతాపం తెలిపారు. సోమవారం పాఠశాలలో రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు.

ఉప ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు

అమలాపురం కలెక్టరేట్: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. 26న పవన్ కల్యాణ్ పర్యటన సాగే ప్రాంతాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. హెలిప్యాడ్, రైతులతో ముఖాముఖి నిర్వహించే ప్రాంతాల్లో తక్కువ పరిమితిలో జనం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శంకరగుప్తం డ్రెయిన్ సమస్య, కొబ్బరి చెట్ల ధ్వంసంపై సమగ్ర వివరాలను రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో పల్లె పండగ 1.0 ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలతో సభా వేదిక వద్ద ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఉపాధి హామీ పథకం అధికారులను ఆదేశించారు.

రాజోలు: శివకోటిలో సభ జరిగే ప్రాంగణాన్ని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం డైరెక్టర్ వై.షణ్ముఖ్‌కుమార్, అమలాపురం ఆర్డీవో కె.మాధవి పరిశీలించారు. ఎన్ఆర్ఈజీఎస్ సంయుక్త కమిషనర్ జె.సుజాత, డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్, తహసీల్దార్ సీహెచ్.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో డీఈవో తనిఖీ

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: సఖినేటిపల్లి మండలం వీవీమెరక జడ్పీ ఉన్నత, మోడల్ ప్రైమరీ పాఠశాలలను డీఈవో సలీం బాషా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. ఎంఈవోలు కిషోర్‌కుమార్, వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు జగదీష్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ఖండన నోటీసు

ది. 19-11-2025వ తేదీన శ్రీమతి పెన్మెత్స సూర్యకాంతం, విశాఖపట్నం వారి తరపున న్యాయవాది శ్రీ పి.వి. కృష్ణంరాజు గారు ఇచ్చిన ప్రకటనకు మా క్లయింటు అంతర్వేదిపాలెం గ్రామ కాపురస్థులు శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజు గారి కుమారుడు వెంకట సత్యనారాయణ రాజు అనే బండు మాస్టారు గారు ఇచ్చిన సంజాయిషీ మరియు ఇస్తున్న ఖండన ప్రకటన.

ది. 19-11-2025వ తేదీ ప్రకటన తాలూకు సంగతులు అన్నియు అవాస్తవములు, సత్యదూరములు అయి యున్నవి. ప్రకటన షెడ్యూలు సర్వే నెం.307/1బి తాలూకు య.2-47 సెంట్లు తన తండ్రి గారి మరణానంతరం నుండి మా క్లయింటు యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో గత 36 సం.రం. లుగా నిరాటంకముగా నిష్పేచీగా అనుభవిస్తున్న ఆస్తి అయి ఉన్నది. ప్రకటన షెడ్యూలు సర్వే నెం.309/8ఏ లోని భూమి ప్రభుత్వ భూమి అయి ఉండి దశాబ్దాలుగా మా క్లయింటు యొక్క వ్యక్తిగత సేద్యంలో ఉన్న ఆస్తి అయియుండి మా క్లయింటును ప్రభుత్వం వారు హక్కుదారుగా గుర్తించడమైనది. మా క్లయింటు యొక్క స్వాధీన హక్కు భుక్తములను గుర్తించి రెవెన్యూ వారు సంబంధిత రికార్డులలో మా క్లయింటు పేరిట ఆయన తండ్రి గారి మరణానంతరం నమోదు చేసి 1995 సం.రం.లో పట్టాదారు, టైటిల్ డీడ్ పాస్ బుక్కులను మంజూరు చేసియున్నారు. సదరు విషయములన్నియు పెన్మెత్స సూర్యకాంతం గారు తెలిసి యుండి ఎన్నడూ అభ్యంతరం చెప్పడం కానీ ఏవిధమైన హక్కులు, క్లెయిమ్ లు చేయడం గానీ జరగలేదు. 36 సం.రం.ల తదుపరి తన యొక్క అల్లుడు గారి ప్రోద్బలంతో శ్రీమతి సూర్యకాంతం గారు ఈ విధమైన తప్పుడు క్లెయిములు చేస్తున్నారు.

సదరు శ్రీమతి పెన్మెత్స సూర్యకాంతం గారికి ప్రకటన షెడ్యూలు ఆస్తులపై ఎటువంటి హక్కులు లేవు. కేవలం అక్రమ లబ్ధి పొందాలనే ఉద్దేశ్యంతో మొట్టమొదటి సారిగా 2024 సం.రం. నుండి ఆమె తప్పుడు క్లెయిములు చేయుచున్నారు. కావున ఈ బహిరంగ ఖండన ప్రకటన జారీ చేయడమైనది.

మామిడిశెట్టి శ్రీనివాసరావు, బి.ఏ., బి.యల్., న్యాయవాది, రాజోలు.

ప్రింటర్ బహూకరణ

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం జడ్పీ బాలికోన్నత పాఠశాలకు పెన్మెత్స పెద వెంకట సోమరాజు కుటుంబ సభ్యులు సోమవారం ప్రింటర్‌ను బహూకరించారు. పాఠశాల కమిటీ ఛైర్మన్ కోట సోమేషుకు అందించారు.

కొబ్బరి మొక్కల పంపిణీ

రాజోలు, న్యూస్‌టుడే: పొన్నమండ జడ్పీ ఉన్నత పాఠశాలకు రాజోలు రోటరీ క్లబ్ కొబ్బరి మొక్కలను వితరణ చేసింది. సోమవారం ప్రధానోపాధ్యాయుడు కస్తూరి హనుమంతరావుకు క్లబ్ అధ్యక్షుడు సోమిశెట్టి ఆంజనేయులు, కార్యదర్శి నామన షణ్ముఖ్ 30 మొక్కలు అందజేశారు. క్లబ్ సభ్యులు దార్ల పెద బాబు, చిట్నీడి లక్ష్మణరావు, నార్కెడుమిల్లి బాలకృష్ణ, కసుకుర్తి రామకృష్ణ, లక్కింశెట్టి శ్రీబాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం

దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న పర్యవేక్షకుడు

వాడపల్లి (ఆత్రేయపురం): వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఆలమూరుకు చెందిన వెత్సా శ్రీరామకృష్ణమూర్తి, కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళాన్ని సోమవారం సమర్పించారు. దేవస్థానం పర్యవేక్షకుడు పి.రాంబాబు వీరికి స్వామివారి చిత్రపటం అందజేసి అభినందించారు.

పరిశ్రమలను సందర్శించిన విద్యార్థులు

మామిడికుదురు: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ పొందుతున్న 9, 10 తరగతుల విద్యార్థులు 60 మంది సోమవారం అమలాపురంలోని పలు దుకాణాలు, పరిశ్రమలను సందర్శించారు. వాటిలో వెళ్లి లావాదేవీలను పరిశీలించి, వినియోగదారుల సేవల గురించి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు బి.చిరంజీవిరావు, వృత్తివిద్య కోర్సు శిక్షకులు పాల్గొన్నారు.

వాహనాల చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్టు

మామిడికుదురు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాల చోరీ కేసులకు సంబంధించి ముగ్గురు నిందితులను సోమవారం అరెస్టు చేసినట్లు నగరం ఎస్సై చైతన్యకుమార్ తెలిపారు. రాజోలు మండలం శివకోటికి చెందిన నాగళ్ల అరవింద్ అలియాస్ తారక్‌తోపాటు మరో ఇద్దరు బాలురను కోర్టులో హాజరుపరచగా రిమాండుకు ఆదేశించినట్లు చెప్పారు. వీరి నుంచి నగరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మూడు, రాజోలు, మలికిపురం, పాలకొల్లు పోలీస్ స్టేషన్ల పరిధుల్లోని ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఐ భీమరాజు, ఎస్సై చైతన్యకుమార్, సిబ్బందిని జిల్లా ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

ట్యాంకులు కలుషితం.. అందని శుద్ధజలం

శుభ్రతపై పట్టించుకోని పంచాయతీలు

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకోసారి శుభ్రం చేయించాలని ప్రభుత్వం చెబుతున్నా చాలా పంచాయతీలు పట్టించుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో పంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా అధికారుల పర్యవేక్షణ కొరవడటం, రెండు శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా ప్రజలకు శుద్ధజలం అందడం లేదు. ఆత్రేయపురం మండలంలో మొత్తం 36 తాగునీటి పథకాలు ఉన్నాయి. ఓవర్‌హెడ్ ట్యాంకుల శుభ్రతను 80 శాతం పంచాయతీల్లో అధికారులు విస్మరిస్తుండటంతో కలుషిత నీరు సరఫరా అవుతోంది.

కనిపించని వివరాల నమోదు..

సాధారణంగా బోర్ల నుంచి నీటిని ట్యాంకులకు ఎక్కించి క్లోరినేషన్ చేసి సురక్షిత నీటిని ప్రజలకు అందించాలి. కానీ ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. ట్యాంకుల చుట్టూ పిచ్చిమొక్కలు, వ్యర్థాలు పేరుకుపోతున్నా పట్టించుకోవడం లేదు. పాత ట్యాంకులకు మూతలు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిలో దుమ్ము, ధూళి పడి నీరు అపరిశుభ్రంగా మారుతోంది. కొన్ని ట్యాంకులకు మెట్లు పాడవడంతో సిబ్బంది పైకి ఎక్కి శుభ్రం చేసేందుకు వీలుండటం లేదు. ట్యాంకులను ఎప్పుడు శుభ్రం చేశారు, మళ్లీ ఎప్పుడు చేయాలనే వివరాలు అక్కడ నమోదు చేయడం లేదు. నిత్యం బ్లీచింగ్ లేదా ఆలంతో క్లోరినేషన్ చేయాల్సి ఉండగా ఎక్కడా కనిపించడం లేదు. ర్యాలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ సమీపంలోని రక్షిత పథకం నీరు రంగుమారి వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో బీకేఎస్ఎస్ వెంకటరామన్ వద్ద ప్రస్తావించగా ట్యాంకులన్నింటినీ శుభ్రం చేయించడంతోపాటు క్లోరినేషన్ చేయించేందుకు తక్షణం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

రైతుబజార్‌లో నిన్నటి ధరలు (కిలోకు)

అమలాపురం పట్టణం: టమాట - 40, వంకాయలు నలుపు - 54, వంకాయలు తెలుపు - 50, బెండకాయలు - 50, పచ్చిమిర్చి - 50, కాకరకాయ - 44, బీరకాయలు - 55, కాలీఫ్లవర్ -28, క్యాబేజీ - 38, క్యారెట్ - 58, దొండకాయలు - 42, బంగాళదుంపలు - 25, ఉల్లిపాయలు - 26, గోరు చిక్కుళ్లు - 45, దోసకాయలు - 35, చిక్కుడుకాయలు - 120, చేమదుంపలు - 43, కంద - 55, బీట్‌రూట్ - 54, కీరదోసకాయలు -35, అల్లం - 75, క్యాప్సికం - 98, చిలకడదుంపలు - 50, గుమ్మడి -30, ఉసిరి - 80, ముల్లంగి - 45, బరబాటి -55, నిమ్మకాయలు - 30, మామిడికాయ - 70. ఒక్కొక్కటి చొప్పున: అనపకాయ - 30, పొట్లకాయ -25, అరటికాయ -6, మునగకాయ -12, ఆకుకూరల కట్ట - 10, 15, కొత్తిమీర కట్ట - 25, కొబ్బరికాయ - 25.

పథకాలను ప్రజలకు వివరించాలి

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లబ్ధిని ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. బందారులంకలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో సోమవారం పాల్గొని మాట్లాడారు. రైతులకు అండగా ఉండేందుకు అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఏఎంసీ ఛైర్‌పర్సన్ అధికారి జయవెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, సర్పంచి పెనుమాల సునీత, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు.

ద్వితీయ స్థానం సాధించిన బాలుర జట్టు

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: కడప జిల్లా పులివెందులలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 24 వరకు నిర్వహించిన అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలుర, బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఐ.పోలవరం మండలం జి.వేమవరం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బాలికల జట్టులో ఏడుగురు, బాలుర జట్టులో ఆరుగురు జట్టు విజయంలో కీలక భూమిక పోషించారని ఇరుజట్ల కోచింగ్ మేనేజర్ నాగరాంప్రసాద్ తెలిపారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న 69వ జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు నిమ్మకాయల చరిష్మా సాయిరుత్వి ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ పరసా భరత్ తెలిపారు. అమలాపురం వడ్డిగూడెం శ్రీవాగ్దేవి పాఠశాలలో ఛరిష్మాను డైరెక్టర్ పరసా భరత్, ప్రిన్సిపల్ శ్రీరామచంద్రమూర్తి, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు సోమవారం అభినందించారు. ఏలూరు జిల్లా నూజివీడులో జరిగిన అంతర జిల్లా బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన చెప్పారు.

ఛరిష్మాను అభినందిస్తున్న డైరెక్టర్ భరత్, ప్రిన్సిపల్ శ్రీరామచంద్రమూర్తి

కరాటేలో సత్తా చాటారు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: వచ్చే నెల 19 నుంచి 24 వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు అమలాపురం కరాటే క్రీడాకారులు ఎంపికయ్యారని న్యాయనిర్ణేత రవి తెలిపారు. కాకినాడ వెంకట్రావు హాల్‌లో జేయూ, జేఐటీయూ సంఘ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ ఎంపిక పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అండర్ -14 విభాగంలో బండారు మోహన్‌సాయి, అడబాల సూర్య, గురుచరణ్, సోహన్, గోవర్ధన్ ఎంపికైనట్లు తెలిపారు.

సమాజ సేవకు తోవ

• గ్రామాల్లో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ప్రత్యేక కార్యక్రమాలు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

విద్యార్థులకు చదువుతోపాటు సమాజం పట్ల అవగాహన అవసరం. చుట్టూ ఉన్న సమస్యలపై స్పందించే గుణం ఉండాలి. అందుకే పాఠశాలల్లో విద్యార్థులు జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్)ను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందించేందుకు వెళ్తున్నారు. గ్రామాల్లో పర్యటన సందర్భంగా తమ వైపుణ్యాలు మెరుగుపర్చుకోవడంతో పాటు సమాజంలో పరిస్థితులపై అవగాహన పెంచుకుంటున్నారు.

సోమిదేవరపాలెంలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

రెండు నియోజకవర్గాల్లో..

ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల్లో 35 ఎన్ఎస్ఎస్ యూనిట్లలో 1800 మంది వాలంటీర్లు ఉన్నారు. ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీ, పీజీ కళాశాలల్లోని విద్యార్థులు జాతీయ సేవా పథకంలో సభ్యులుగా నమోదయ్యారు. దీంతో పాటు ఇంజినీరింగ్ కళాశాలల్లోనూ యూనిట్లు ఉన్నాయి. కేంద్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పథకంలో ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారు. పరిసరాల శుభ్రత, స్వచ్ఛ భారత్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పరిష్కార మార్గాలు తెలుస్తాయి

విద్యార్థులు బృందాలుగా ఏర్పడి బయటకు వచ్చి గ్రామాల్లో శిబిరాలు నిర్వహించడం ద్వారా సమాజం పట్ల అవగాహన కల్పించుకోవడానికి అవకాశం కలుగుతుంది. జాతీయ సమైక్యతా భావం అలవర్చుకోవడం.. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరడానికి మెట్లుగా మలుచుకోవడానికి ఎన్ఎస్ఎస్ ఎంతగానో దోహదపడుతుంది. గ్రామాల్లో సమస్యలు తెలుసుకోవడం.. వాటి పరిష్కార మార్గాలు వెతకడం ద్వారా విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకుంటున్నారు.

శుభ్రతపై అవగాహన

ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు గ్రామాల్లో చెత్తడి వాతావరణం నెలకొంది. మా కళాశాల తరఫున ముమ్మిడివరం మండలంలోని సోమిదేవరపాలెం, కొత్తలంక గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ శిబిరాలు ఏర్పాటు చేసి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాం. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం గురించి ప్రజలకు వివరించాం. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాం.

-కముజు కృష్ణ సిరి, డిగ్రీ విద్యార్థిని

సైబర్ మోసాలపై అప్రమత్తత

ప్రస్తుతం సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. తమ సెల్‌ఫోన్‌లకు అపరిచిత వ్యక్తుల ఫోన్ చేసి.. వివరాలు అడిగితే చెప్పకూడదని చెప్పాం. ఆధార్, బ్యాంకు ఖాతాలు, ఓటీపీలు వంటివి ఫోన్‌లో చెప్పడం వల్ల కలిగే అనర్థాలను వివరించాం. ఏ పథకానికైనా ఈ-కేవైసీ తప్పనిసరి చేసిన నేపథ్యంలో నేరుగా ఇంటికి వచ్చిన అధికారుల వద్ద మాత్రమే వాటిని చేయించుకోవాలని చెప్పాం.

-బి.దివ్య శిరీష, డిగ్రీ విద్యార్థిని

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

అమలాపురం పట్టణం: 79939 35935,
గ్రామీణం: 91000 20948
అల్లవరం: 91548 46718 ,
ముమ్మిడివరం: 80085 74166
కాట్రేనికోన: 79950 67044
ఉప్పలగుప్తం: 91548 46716

సమస్య: అమలాపురం గారపాటివారి వీధి మురుగుకాలువలో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు.

-కాసు, స్థానికుడు

సమస్య: దేవాంగులవీధిలో రోడ్డు దుమ్ము, ధూళితో నిండి అపరిశుభ్రంగా తయారైంది.

-బాబి, స్థానికుడు

సమస్య: గొల్లగూడెం బైపాస్ రోడ్డు మురుగుకాలువలో పూడికలు తొలగించకపోవడంతో దోమలు పెరిగిపోయాయి.

-అశోక్, వ్యాపారి

సమస్య: సినిమా రోడ్డుపై చెత్తవ్యర్థాలు వేస్తున్నారు. దుర్వాసన వస్తోంది.

-స్టాలిన్, స్థానికుడు

పరిష్కారం: గారపాటివారివీధి, దేవాంగుల వీధి, గొల్లగూడెం బైపాస్‌రోడ్డు, సినిమా రోడ్డులో సమస్యలు తెలుపగా ఆయా వార్డుల సచివాలయ కార్యదర్శులు స్పందించారు. సిబ్బందితో వాటిని తొలగింపజేశారు.

–న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

ఆసుపత్రిని అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే

అమలాపురం పట్టణం: ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే, ఆసుపత్రి ఛైర్మన్ అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రిని ఎమ్మెల్యే ఆనందరావు సోమవారం తనిఖీ చేశారు. రోగుల సమస్యలను తెలుసుకుని, త్వరలో పై భవనాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: విద్యాశాఖ పరిధిలో సమగ్ర శిక్ష పరిధిలో ఒప్పంద పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నల్లవంతెన వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లాలో క్లస్టర్ల కంటే ఎక్కువగా ఉన్న సీఆర్పీలను ఇతర జిల్లాలకు బదిలీ చేయాలనే ప్రయత్నాలు ఆపాలన్నారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

విద్యుత్తు సమస్యల పరిష్కారానికి చర్యలు

అమలాపురం గ్రామీణం: గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణంలోని విద్యుత్తు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అమలాపురం మండల పరిషత్తు కార్యాలయంలో విద్యుత్తు సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. తొలుత మండలంలోని 22 గ్రామాలకు సంబంధించి పోలింగ్ బూత్‌ల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్తు స్తంభాలు, నియంత్రికలు, లోఓల్టేజీ సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం పీఎం సూర్యాఘర్ పథకానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఏఎంసీ ఛైర్‌పర్సన్ అధికారి జయవెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పెచ్చెట్టి విజయలక్ష్మి, విద్యుత్తుశాఖ ఈఈ కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఉప ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కోనసీమలో ఈ నెల 26న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. పవన్ కల్యాణ్ పర్యటన సాగే ప్రాంతాల్లో ఎక్కడా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. పెద్ద ఎత్తున రాజకీయ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. హెలిప్యాడ్, రైతులతో ముఖాముఖి నిర్వహించే ప్రాంతాల్లో తక్కువ పరిమితిలో జనం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శంకరగుప్తం డ్రెయిన్ సమస్య, కొబ్బరి చెట్ల ధ్వంసంపై సమగ్ర వివరాలను రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో పల్లె పండగ 1.0 ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలతో సభా వేదిక వద్ద ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఉపాధి హామీ పథకం అధికారులను కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్

అమలాపురం పట్టణం: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏపీ ఔషధ విక్రయ ప్రతినిధులు (మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్) అమలాపురం శాఖ ప్రతినిధులు కోరారు. అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో ఔషధ విక్రయ ప్రతినిధులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక రంగానికి సంబంధించి 29 చట్టాలను నిర్వీర్యం చేస్తూ కోడ్‌లను తీసుకువచ్చారన్నారు. కార్మికులకు న్యాయ సంబంధిత ఐడీ యాక్టు, ముఖ్యమైన చట్టాలు కనుమరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేశవరావు, సంతోష్, రమేష్, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది లేక.. మూత

అమలాపురం మండలం విద్యాశాఖ కార్యాలయమిది. ఉదయం 10 గంటలకు తెరవాల్సి ఉండగా.. సోమవారం ఉదయం 11.30 గంటలైనా తెరవలేదు. ఈ కార్యాలయంలో పనిచేసే సమగ్రశిక్షా సిబ్బంది అమలాపురం పట్టణంలో జరిగే నిరసనలో పాల్గొనేందుకు వెళ్లడంతో తాళాలు తెరుచుకోలేదు. అదనపు సిబ్బందిని కేటాయించి కార్యాలయాన్ని తెరవాల్సి ఉండగా.. విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదు. వివిధ అవసరాల కోసం వచ్చిన వారు వెనుతిరిగి వెళ్లారు.

–న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

ప్రమాదం పొంచి ఉంది..!

ఎస్.యానాంలో రూ.లక్షలతో నిర్మించిన రహదారి బెర్ములు లేక పాడవుతోంది. రహదారి కింద భాగం కొట్టుకుపోయి గల్లలా మారుతోంది. వాహనాలు వెళ్లే రోడ్డు విరిగి పోయే ప్రమాదం ఉంది. బెర్ములు, డ్రెయిన్ నిర్మించి అధికారులు రోడ్డుకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

అసంపూర్తిగా మిగిలింది..!

గత ప్రభుత్వం గ్రామాల్లో ఆర్భాటంగా నిర్మాణాలు ప్రారంభించిన ఆరోగ్య భవనాలు పలుచోట్ల అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఆ భవనాల చెంత అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్.కొత్తపల్లిలో నల్లవారిపేటకు వెళ్లే దారిలో వెల్‌నెస్ కేంద్రం నిర్మాణం చివరి దశకు చేరుకుని ఆగిపోయింది. కిటికీలు, విద్యుత్తు సౌకర్యం, ఫ్లోరింగ్ వంటి పనులు మిగిలిపోయాయి. ఈ నిర్మాణం పూర్తిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆగిన వెల్‌నెస్ సెంటర్ భవనాలను త్వరలో పూర్తిచేస్తామని పీఆర్ ఏఈ రాధాకృష్ణ తెలిపారు. – న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

అధ్వాన దారిలో ఇక్కట్లు

రెడ్డివారిపాలెం-మల్లాయిపాలెం రోడ్డులో పరిస్థితి ఇలా..

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని రెడ్డివారిపాలెం నుంచి మల్లాయిపాలెం వెళ్లే రహదారి ఇది. ఇరువైపులా తుప్పలు పెరిగి.. విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోయి.. కొబ్బరి చెట్లు రోడ్డు వైపు వాలిపోయి ప్రమాదం పొంచి ఉంది. స్తంభాలను సరిచేసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుళోత్తుంగన్

దరఖాస్తుల స్వీకరణ పూర్తి చేయండి: కలెక్టర్

యానాం, న్యూస్‌టుడే: యానాం ఎన్నికల యంత్రాంగం ప్రత్యేక సమగ్ర పరిశీలన (ఎస్ఐఆర్) నిమిత్తం జారీ చేసిన 37,674వేల దరఖాస్తులను ఓటర్లతో సకాలంలో పూర్తి చేయించాలని పుదుచ్చేరి కలెక్టర్ కుళోత్తుంగన్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం పరిపాలనాధికారి కార్యాలయంలో బూత్, సెక్టార్ అధికారులతో దరఖాస్తుల జారీ, స్వీకరణ, ఎదురవుతున్న ఇబ్బందులపై సమీక్ష చేశారు. సమావేశంలో పరిపాలనాధికారి అంకిత్‌కుమార్, బేతాళం కుమార్, సాధనాల బాబు, చింతా మల్లి బృందం పాల్గొన్నారు. 40,043 మంది ఓటర్లున్న యానాంలో సుమారు 2,700 మంది ఓటర్లు దరఖాస్తులు తీసుకోవడానికే అందుబాటులో లేని పరిస్థితి ఉంది. **రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం:** ఎస్ఐఆర్ నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని, బూత్‌స్థాయి ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ కుళోత్తుంగన్ అన్నారు. సావిత్రినగర్, గోపాల్‌నగర్ ప్రాంతాల్లో దరఖాస్తులు తక్కువగా వచ్చాయన్నారు. భాజపా అధ్యక్షుడు కనకాల రాజు, అన్నాడీఎంకే కార్యదర్శి మంచాల సాయికుమార్, కాంగ్రెస్ అధ్యక్షుడు అరదాని దినేష్, డీఎంకే కన్వీనర్ ఎస్ఎంటీ బాషా పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

అమలాపురం పట్టణం: ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎస్పీ రాహుల్‌మీనా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 27 మంది అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూతగాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి, సివిల్ తగాదాలు, భార్యాభర్తల గొడవలు, ఆర్థిక వివాదాలపై అర్జీలు అందజేశారు.

అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌మీనా

అవసరం మేరకే చరవాణి వినియోగించాలి

• 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

అమలాపురం పట్టణం న్యూస్‌టుడే: అవసరం మేరకే చరవాణి వినియోగించాలని విద్యార్థులు పేర్కొన్నారు. మలాపురం అబ్బిరెడ్డివారి వీధిలోని శ్రీచైతన్య పాఠశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. వి.రేఖ, టి.షణ్ముఖ, కె.పార్థవి శాంతి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అనంతరం విజేతలకు 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను, ప్రశంసా పత్రాలను ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు, డీన్ శ్రీనివాస్‌లు అందజేశారు.

శ్రీచైతన్య పాఠశాలలో ఉపన్యాసం ఇస్తున్న విద్యార్థిని

విజేతలతో ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు, డీన్ శ్రీనివాస్

కిట్ అందిస్తున్న డీబీఆర్‌సీ సిబ్బంది

తుపాను బాధితులకు ఆర్థికసాయం

కాట్రేనికోన, న్యూస్‌టుడే : కాట్రేనికోన మండలంలో మొంథా తుపాను బాధిత ఎస్సీ, ఎస్టీలకు గుంటూరుకు చెందిన దళిత బహుజన్ రిసోర్స్ సెంటర్(డీబీఆర్‌సీ) సేవా సంస్థ అండగా నిలిచింది. డీబీఆర్‌సీ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అల్లాడి దేవకుమార్ మాట్లాడుతూ తుపాను ప్రభావంతో డీబీఆర్‌సీ, సీఐడీ, ద స్టార్ట్ నెట్‌వర్క్ సేవా సంస్థలతో కలిసి జిల్లాలో 2,500 మంది పేద ఎస్సీ, ఎస్టీలను ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.4,500 చొప్పున అందిస్తున్నామన్నారు. జిల్లాలో 300 మందికి ఒక్కొక్కటి రూ.6వేలు విలువచేసే దుప్పటి, వంటపాత్రలు, నిత్యావసరాలతో కూడిన కిట్‌లను అందిస్తున్నామన్నారు. సోమవారం కాట్రేనికోనలో 715 మందికి రూ.32.17 లక్షలు ఖాతాల్లో జమ చేశామన్నారు. స్థానిక పంచాయతీ వద్ద కార్మికులకు కిట్లు అందించారు. సర్పంచి గంటి సుధాకర్, సామ్యేల్ అనిల్‌కుమార్, శ్రీనివాస్, కె.వెంకటేశ్వరరావు, ప్రవీణ్‌కుమార్, ఎం.హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పూర్వ వైభవానికి కృషి

మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు అఖిలేష్ శుక్లా

అమలాపురం పట్టణం: జిల్లాలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేలా కృషి చేస్తామని ఏఐసీసీ పరిశీలకుడు అఖిలేష్ శుక్లా అన్నారు. అమలాపురంలోని అశోక్‌నగర్ వేడుకమందిరంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు జిల్లా సంస్థాగత నిర్మాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలేష్ శుక్లా మాట్లాడుతూ జిల్లాలో ప్రజాస్వామ్యబద్ధంగా అధ్యక్షుడిని ఎన్నుకుని వారం రోజుల పాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తామన్నారు.

అన్నిరంగాల్లో మహిళల రాణింపు

యానాం: మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా ఎదుగుతున్నారని వక్తలు పేర్కొన్నారు. స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో స్త్రీ, శిశు అభివృద్ధి శాఖాధికారి సూరంపూడి రాజేంద్ర ఆధ్వర్యంలో సోమవారం జాతీయ మహిళాదినోత్సవం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ అద్దంకి మల్లికార్జునరావు వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్‌ఆర్‌కే కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.రత్నప్రభ, తదితరులు మాట్లాడారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

విజేతకు బహుమతి అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునరావు

స్నానాలకు వసతులేవీ..?

కుండలేశ్వరాలయంలో భక్తుల అవస్థలు

న్యూస్‌టుడే, కాట్రేనికోన

పూడికతో పుష్కరఘాట్

ప్రముఖ పుణ్యక్షేత్రం కుండలేశ్వరంలో వృద్ధ గౌతమి గోదావరి చెంతన ఉన్న పుష్కరఘాట్‌లో సమస్యలతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఏటా సంభవించే వరదలకు పుష్కరఘాట్ పూడికపోయింది. సుమారు పదిమీటర్ల మేర ఇసుకమేటతో పూడికపోయింది. భక్తులు స్నానానికి కొంత ఇబ్బంది ఉంది. మూడేళ్లుగా భక్తుల సంఖ్య భాగా పెరిగింది. మహాశివరాత్రి, ముక్కోటి ఏకాదశి వంటి పండగ రోజుల్లో సుమారు 10వేల నుంచి 15 వేల మంది దర్శించుకుంటారు. గోదావరి ఇక్కడ మలుపుతిరిగి ఉంటుంది. దీంతో నది కోతకు గురవ్వకుండా గతంలో ఈ ప్రాంతంలో గ్రోయిన్స్ ఏర్పాటు చేశారు. దాత సాయంతో ఇక్కడ ఆరేళ్ల క్రితం జల్లు స్నానానికి ఏర్పాట్లు చేశారు. అది చాలకపోవడంతో ఓ గ్రోయిన్స్ ముందు చుట్టూ కర్రలు కట్టారు. రక్షణగా ఇనుప కంచె ఏర్పాటు చేశారు. గతేడాది ఇక్కడే ఓ భక్తుడు మునిగి మృతి చెందాడు. ఎక్కువ మంది భక్తులు వచ్చినప్పుడు ఇక్కడ ఇరుకుగా ఉంటుంది. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు చిన్న షెడ్డు ఉంది. దానిని విస్తరించాలి. పుష్కరాల వేళ వేల మంది భక్తులు తరలివస్తారు. వచ్చే పుష్కరాల నాటికైనా అవసరమైన వసతులు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి, భీమనపల్లి గ్రామాల్లో సోమవారం రైతన్నా.. మీకోసం కార్యక్రమాలను నిర్వహించారు. కూటమి ప్రభుత్వం రైతన్నల సంక్షేమం కోసం ప్రత్యేక అభివృద్ధి పథకాలు చేపడుతుందని పలువురు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో తెదేపా మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ, పీఏసీఎస్ ఛైర్మన్ ఆకేటి పెద్ద, తదితరులు పాల్గొన్నారు.

భీమనపల్లి పీఏసీఎస్‌లో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

ఇంటి స్థలం దస్తావేజులు పోయినవి

సుంకర సీతారాముడు, S/o సుంకర సత్యనారాయణ (లేటు), D.No.6-12, రజక స్ట్రీట్, ముమ్మిడివరం మండలం, Dr. B.R.అంబేద్కర్ కోనసీమ జిల్లా. మా యొక్క ఒరిజినల్ దస్తావేజు నెం. 2819/1981 ది.09-11-2025న మా ఇంటి నుండి ముమ్మిడివరం సెంటర్‌కు జిరాక్స్ నిమిత్తం మోటార్‌సైకిల్‌పై వెళ్లుచున్నప్పుడు దస్తావేజులు గల బ్యాగ్ మార్గ మధ్యలో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది నెంబర్‌కు తెలియపరచగలరు.

దాసం అన్నపూర్ణరావు
సెల్: 98480 27790

(c) eenadu

మండపేట

•మండపేట •రామచంద్రపురం

దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ పర్యవేక్షకుడు రాంబాబు

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం

వాడపల్లి (ఆత్రేయపురం): వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఆలమూరుకు చెందిన వెత్సా శ్రీరామకృష్ణమూర్తి, కుటుంబ సభ్యులు రూ.100,116 విరాళాన్ని సోమవారం సమర్పించారు. దేవస్థానం పర్యవేక్షకుడు పి.రాంబాబు వీరికి స్వామివారి చిత్రపటం అందజేసి అభినందించారు.

చిత్రలేఖనంలో విద్యార్థులకు అబ్దుల్ కలాం పురస్కారం

మండపేట, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో మెగా రికార్డ్స్ సంస్థ ఈనెల 23న నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో మండపేటకు చెందిన విద్యార్థినులకు డాక్టర్ అబ్దుల్ కలామ్ పురస్కారాలు దక్కినట్లు శ్రీసత్య డ్రాయింగ్ అకాడమీ వ్యవస్థాపకుడు మందపల్లి సత్యానందం తెలిపారు. వీరిలో శివలీల, రోజా, హరిప్రియ అవార్డులు అందుకున్నారని వివరించారు.

ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థినులు

ఉప ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కోనసీమలో ఈ నెల 26న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. పవన్ కల్యాణ్ పర్యటన సాగే ప్రాంతాల్లో ఎక్కడా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. పెద్ద ఎత్తున రాజకీయ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. హెలిప్యాడ్, రైతులతో ముఖాముఖి నిర్వహించే ప్రాంతాల్లో తక్కువ పరిమితిలో జనం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శంకరగుప్తం డ్రెయిన్ సమస్య, కొబ్బరి చెట్ల ధ్వంసంపై సమగ్ర వివరాలను రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో పల్లె పండగ 1.0 ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలతో సభా వేదిక వద్ద ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఉపాధి హామీ పథకం అధికారులను కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు.

ఈనాడు మీ తోడు
డిసెంబర్‌లో టిడ్కో గృహాల కేటాయింపు

● 'ఈనాడు' ఫోన్‌ఇన్‌లో రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్.రాజు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రధాన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. సోమవారం నిర్వహించిన 'ఈనాడు ఫోన్ ఇన్' కార్యక్రమంలో పట్టణవాసులు సంధించిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. మున్సిపల్ డీఈ, శానిటరీ, టీపీవో, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

? సమస్య: తొలి విడతలో టిడ్కో ఇల్లు ఇస్తామన్నారు. రూ.25 వేలు చెల్లించాం. ఇంతవరకు ఇవ్వలేదు.

- పోలిశెట్టి సత్యకుమారి రైలుకట్ట రోడ్డు, బి.సోమశేఖర్, స్థానికుడు

✔ సమాధానం: ఆధార్‌కార్డుతో పురపాలక సంఘంలోని టిడ్కో సిబ్బందిని సంప్రదించండి. లేదా నన్ను నేరుగా కలవండి. రూ.25 వేలు చెల్లించినవారు చాలా మంది ఉన్నారు. గృహం అందనివారికి ఆ డబ్బు తిరిగి చెల్లిస్తాం. కనీస వసతులు కల్పించిన గృహాలను డిసెంబర్‌లో కేటాయిస్తాం.

? కొత్తూరు టిడ్కో గృహాల్లో నీటిట్యాంకు నిర్మాణం పూర్తయినా ప్రారంభించలేదు.

? టిడ్కో గృహాల్లో సీ21 తదితర ప్రాంతాల్లో ఫ్లోరింగ్ పాడైంది. - ఎం.శ్రీనివాసరావు, రబ్బానీ, టిడ్కోకాలనీ

✔ ఆయా సమస్యలను టిడ్కో అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. వెనువెంటనే ఒక్కొక్కటిగా పరిష్కరిస్తాం.

? : గుల్లవారిపేటలో రోడ్డు ఎత్తుపల్లాలుగా ఉంది. గుంతలతో ఇబ్బందులు తప్పడం లేదు. - వనజ, స్థానికురాలు

✔ : ఆ రోడ్డును పరిశీలించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. డీఈ శ్రీకాంత్ ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తారు.

? : 13వ వార్డు శ్రీరామ్‌పేటలో మురుగుకాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం లేదు. - షేక్ వలీ, శ్రీరామ్‌పేట

✔ : పట్టణంలోని అన్ని కాలనీల్లో కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రంచేస్తాం. స్థానికులు కాలువల్లో చెత్త వేయకుండా పురపాలక వాహనంలో వేయాలి.

? : అంకంవారివీధి, ఆర్టీసీ బస్‌కాంప్లెక్స్ రోడ్డులో చెత్త పేరుకుపోయింది. వీధి దీపాలు వెలగడం లేదు. - పొన్నగంటి మాధవి, స్థానికురాలు

✔ : అంకంవారివీధితో పాటు ఆ రోడ్డును వెంటనే శుభ్రం చేయిస్తాం. వీధి దీపాలు వెలిగేలా చూస్తాం.

? : శ్రీరామ్‌పేట, చర్చివీధి తదితర ప్రాంతాల్లో వీధికుక్కల సమస్య తీవ్రంగా ఉంది. - వరప్రసాద్, శ్రీరామ్‌పేట

✔ : ఆయా ప్రాంతాల్లో కుక్కలను పట్టించి కొత్తూరురోడ్డులోని డంపింగ్‌యార్డు వద్ద తాత్కాలిక కేంద్రంలో వాటిని ఉంచుతాం. అక్కడే వాటికి ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుకుంటాం.

? : ఇంటి పన్ను రికార్డుల్లో పేర్ల మార్పులు ఎలా చేసుకోవాలి. - కాజులూరు లక్ష్మి, తోటవారివీధి

✔ : వార్డు సచివాలయంలో లేదా పురపాలక సంఘం కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలి.

? : పట్టణంలో భవనాల క్రమబద్ధీకరణకు గడువు ఉందా లేదా..? - సిరిగిరి వెంకటేశ్వర నాయుడు, రామచంద్రపురం

✔ : ఇంకా గడువు ఉంది. పట్టణ ప్రణాళికా విభాగంలో కలిస్తే మరిన్ని వివరాలు వెల్లడిస్తారు.

? : రెండో విడత టిడ్కో గృహాలు ఎప్పుడిస్తారు. - యండమూరి శ్రీరాములు, డి.దుర్గాదేవి, కొత్తూరు

✔ : పట్టణంలో రెండో విడత గృహాల్లో మౌలిక వసతుల కల్పన పూర్తయిన తర్వాత డిసెంబర్‌లో లబ్ధిదారులకు కేటాయిస్తాం.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కాజులూరు: విద్యుత్తు కొత్త లైన్ల ఏర్పాటులో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎన్.ఉదయ్ భాస్కర్ తెలిపారు. సోమవారం ఆయన ఆర్యవటం సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. కాజులూరు సబ్‌స్టేషన్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని కాజులూరు, అయితపూడి, టీఆర్‌పాలెం గ్రామాలకు సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

అధ్యయన సామగ్రి అందజేత

అంగర: కపిలేశ్వరపురం సర్వారాయ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు వేదరాజు లక్ష్మణరాజు అధ్యయన సామగ్రిని సమకూర్చారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న 20 మంది విద్యార్థులకు ఆయన పుస్తకాలను సోమవారం ప్రధానోపాధ్యాయుడు వంగా శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. వెదురుమూడి ప్రాథమికోన్నత పాఠశాలలో నవోదయ పరీక్షకు సిద్ధమవుతున్న మరో పది మంది చిన్నారులకు స్టడీ మెటీరియల్ అందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు (ఉ॥ 10 - మ॥ 1): మండపేట: 80085 74183, రామచంద్రపురం: 80085 74191

చెత్తకుప్పలు తొలగించారు

రాయవరం, న్యూస్‌టుడే: లొల్ల ఎస్సీకాలనీ సీసీరహదారిలో చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోందని 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి ఎ.గోవిందరాజులు దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో చెత్త తొలగించే పనులు చేయించారు.

స్పందనకు వందనం

వీధి దీపాలు వెలిగాయి..

సమస్య: మండపేట మండలం ఏడిద గ్రామం రథంవీధిలో రాత్రి వేళల్లో వీధిదీపాలు వెలగడం లేదు. చీకటిలో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - జీవీఎస్ స్వామి, ఏడిద

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాస్‌కు తెలపగా వెంటనే ఆయన స్పందించారు. సిబ్బందిని పంపించి దీపాలకు మరమ్మతులు చేయించారు. - న్యూస్‌టుడే, ద్వారపూడి

తెదేపా కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా



బాధిత మహిళకు చెక్కు అందిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: తెదేపా అభివృద్ధికి కష్టపడి పనిచేసిన కార్యకర్తల కష్టసుఖాల్లో పార్టీ అధిష్ఠానం తోడుగా ఉంటుందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురంలో ఇటీవల మృతిచెందిన ఇద్దరు కార్యకర్తల కుటుంబాలకు కార్యకర్తల సంక్షేమ విభాగం నుంచి మంజూరైన రూ.5 లక్షల చొప్పున రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని మంత్రి బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం అందించారు. కార్యకర్తలు నక్కా వెంకటేశ్, ఉజూరి శంకర్రావు పార్టీ సభ్యత్వాలు పొందారని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, పట్టణ తెదేపా అధ్యక్షుడు ఉండవల్లి శివ, కంచుమర్తి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత

రామచంద్రపురం: ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత నిస్తున్నామని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన మాట్లాడారు. పలువురి నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతీ సమస్యకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. తెదేపా నేతలు వాసంశెట్టి సత్యం, వుండవిల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

పేద పురోహితుడికి ఆర్థిక సాయం..

పట్టణానికి చెందిన పేద పురోహితుడు నందిగామ సూర్యనారాయణమూర్తికి మంత్రి సుభాష్ సోమవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. శివాలయానికి సోమవారం వెళ్లిన మంత్రి సుభాష్ పురోహితుడితో మాట్లాడి అతని సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఇంటికి వెళ్లి నగదు అందజేశారు.

మాజీ మంత్రి వేణుకి మతిభ్రమించింది: మంత్రి సుభాష్

రామచంద్రపురం: మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మతిభ్రమించి మాట్లాడుతున్నారని, అడిగిన దానికి సూటిగా సమాధానం చెప్పకుండా విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నారని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ విమర్శించారు. రామచంద్రపురంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి మంత్రి విలేకరులతో మాట్లాడారు. అయిదేళ్ల వైకాపా పాలనలో గీత ఉపకులాలకు ఆయన ఏంచేశారో చెప్పాలని మంత్రి నిలదీశారు. శెట్టిబలిజ, గౌడ, శ్రీసేన, యాత, ఈడిగ కులాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. ఆయా ఉపకులాలకు కూటమి ప్రభుత్వం ఏం చేసిందో వివరంగా చెప్పామన్నారు. వైకాపా పాలనలో ఏం చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. గీత ఉపకులాల వారి మనోభావాలతో ఆడుకున్న మాజీ మంత్రి వేణు జాతికి క్షమాపణలు చెప్పాలని మంత్రి సుభాష్ డిమాండ్ చేశారు.

ప్రతిభాపాటవ పోటీలో విద్యార్థులు

బహుమతులు అందుకున్నవారితో ఉపాధ్యాయులు

బాగా చెప్పారు.. కనువిప్పు కలిగించారు

మండపేట, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం అన్నపూర్ణ హైస్కూలులో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలో 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస (స్పీచ్) పోటీలో ఒక్కొక్కరూ ఒక్కో ఆలోచనను పంచుకున్నారు. వీరిలో 7వ తరగతి విద్యార్థిని ఇమ్మిన మిష్మాంకిత ప్రథమ బహుమతి, 7వ తరగతి విద్యార్థి పెనుగొండ సాయికృష్ణ భానుశ్రీ ద్వితీయ బహుమతి, 9వ తరగతి విద్యార్థిని సుంకర భవ్య సాయి వీర లక్ష్మి తృతీయ బహుమతి సాధించారు. వీరికి 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను ప్రిన్సిపల్ ముత్యాల జ్యోతి ప్రసన్నకుమారి అందించారు. పోటీలకు ఉపాధ్యాయులు వి.జయశ్రీ, సి.సోల్మిన్ ఫిన్ని, వి.మల్లికార్జునరావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

కాజులూరు: రాజమహేంద్రవరంలో ఈనెల 28, 29 తేదీల్లో జరగనున్న పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు కోరారు. సోమవారం గొల్లపాలెంలోని శ్రీకాకతీయ జూనియర్ కళాశాలలో మహాసభల గోడపత్రికలను పిన్సిపల్ సీహెచ్.రాంబాబు ఆవిష్కరించారు. విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు హాజరవ్వాలని కోరారు. కార్యక్రమంలో రామచంద్రపురం డివిజన్ నాయకులు కె.నవీన్, పి.అనీల్‌కుమార్, ఎన్.బన్ని, పి.జయరాం, పి.సత్యచంద్ర, ఎ.పవిత్ర, ఎం.అమృత పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

అమలాపురం కలెక్టరేట్: విద్యాశాఖ పరిధిలో సమగ్ర శిక్ష పరిధిలో ఒప్పంద పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నల్లవంతెన వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లాలో క్లస్టర్ల కంటే ఎక్కువగా ఉన్న సీఆర్పీలను ఇతర జిల్లాలకు బదిలీ చేయాలనే ప్రయత్నాలు ఆపాలన్నారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

అంతర్వేది ఆలయానికి రూ.70 లక్షల ఆదాయం

అంతర్వేది: లక్ష్మీనరసింహస్వామివారికి అక్టోబర్ 22 నుంచి నవంబర్ 20 వరకు కార్తిక మాసంలో రూ.70,11,390 ఆదాయం వచ్చిందని ఆలయ ఏసీ నాగవరప్రసాద్ తెలిపారు. ఇందులో ప్రత్యేక దర్శనాలు, ఆర్జిత సేవలు, ప్రసాదం అమ్మకం ద్వారా రూ.37,99,038, నిత్యాన్నదానానికి విరాళాలు రూ.32,12,352 సమకూరినట్లు వెల్లడించారు. 86,005 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని చెప్పారు. మొంథా తుపాను, దిండి-చించినాడ వంతెనపై వాహనాల రాకపోకలు నిలిపివేయడం వల్ల భక్తుల రాక తగ్గిందన్నారు.

దేవస్థానాల అభివృద్ధికి కృషి

పి.గన్నవరం, న్యూస్‌టుడే: అయినవిల్లి సిద్ధివినాయకుడు, అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దేవస్థానాలకు సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సోమవారం ఆవిష్కరించారు. పి.గన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేవస్థానాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అప్పనపల్లి, అయినవిల్లి ఆలయాల ఈవో ఎం.సత్యనారాయణరాజు, బాలబాలాజీ దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త మొల్లేటి లక్ష్మీనారాయణ, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి వాసంశెట్టి కుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్ కాంప్లెక్సులో చెత్త

మండపేట మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న దుకాణ సముదాయం మేడ మెట్లపై వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. దుకాణ నిర్వాహకులు తమ షాపుల్లోని చెత్తను తీసుకొచ్చి పడేస్తున్నారు. ప్రతి నెలా మున్సిపాలిటీకి అద్దె చెల్లిస్తున్నామని, వ్యర్థాలు తొలగించడంలేదని వారు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్తిరాజు దృష్టికి తీసుకువెళ్లగా వ్యర్థాలు తొలగించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, మండపేట

తుపాను బాధితులకు ఆర్థికసాయం

కాట్రేనికోన: కాట్రేనికోన మండలంలో మొంథా తుపాను బాధిత ఎస్సీ, ఎస్టీలకు గుంటూరుకు చెందిన దళిత బహుజన్ రిసోర్స్ సెంటర్(డీబీఆర్‌సీ) సేవా సంస్థ అండగా నిలిచింది. డీబీఆర్‌సీ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అల్లాడి దేవకుమార్ మాట్లాడుతూ తుపాను ప్రభావంతో డీబీఆర్‌సీ, సీఐడీ, ద స్టార్ట్ నెట్‌వర్క్ సేవా సంస్థలతో కలిసి జిల్లాలో 2,500 మంది పేద ఎస్సీ, ఎస్టీలను ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.4,500 చొప్పున అందిస్తున్నామన్నారు. జిల్లాలో 300 మందికి ఒక్కొక్కటి రూ.6వేలు విలువచేసే దుప్పటి, వంటపాత్రలు, నిత్యావసరాలతో కూడిన కిట్‌లను అందిస్తున్నామన్నారు. సోమవారం కాట్రేనికోనలో 715 మందికి రూ.32.17 లక్షలు ఖాతాలో జమ చేశామన్నారు. స్థానిక పంచాయతీ వద్ద కార్మికులకు కిట్లు అందించారు.

హాల్‌టికెట్‌పై క్యూఆర్ కోడ్

పది విద్యార్థులకు పరీక్ష కేంద్రాలను చూపే నేస్తం

రాయవరం, న్యూస్‌టుడే: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు 2026 మార్చి 16 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు నిర్వహించనున్నట్లు విద్యా శాఖ షెడ్యూల్ ప్రకటించింది. విద్యారంగంలో సంస్కరణలకు చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు మార్పులు అమల్లోకి తీసుకొచ్చింది. హాల్‌టికెట్లు జారీచేసిన అనంతరం పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు వెళ్లే సమయంలో ఎదురవుతున్న ఇక్కట్లను తొలగించేందుకు మరో అడుగు ముందుకేసింది. హాల్‌టికెట్‌పై క్యూఆర్ కోడ్ ముద్రించనుంది. దాన్ని స్కాన్ చేయడం ద్వారా విద్యార్థులు కేంద్రాలకు సులభంగా సకాలంలో చేరుకోవచ్చు. ఇంటి నుంచి బయలుదేరి పట్టణానికి చేరుకొని పరీక్ష కేంద్రం ఎక్కడుందో వెతుక్కునే ఇబ్బందులు ఇకపై ఉండవు. జాప్యం లేకుండా నిర్ణీత సమయానికే కేంద్రానికి చేరుకోవచ్చు.

ఒత్తిడికి గురవకుండా..

పదో తరగతి పరీక్షలంటేనే విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. పరీక్ష రోజున కేంద్రానికి చేరుకోవడం చాలా మందికి సవాలుగా మారుతోంది. జంబ్లింగ్ విధానంతో ఎవరికి ఎక్కడ కేంద్రం కేటాయిస్తారో తెలియని పరిస్థితి. ప్రభుత్వం ఈ సమస్యపై ఇప్పుడు సానుకూలంగా స్పందించింది. సాంకేతిక సాయంతో ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు తీసుకుంది. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో వచ్చే ఏడాది మార్చిలో జరిగే పరీక్షలకు 38 కేంద్రాల్లో 5,194 మంది హాజరు కానున్నారు. పరీక్షల మొదటి రోజున కేంద్రానికి చేరుకోవం చాలామందికి సవాలుగా మారుతోంది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మ్యాప్ ఆధారంగా కేంద్రానికి చేరుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రామచంద్రపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ప్రత్తి రామలక్ష్మణమూర్తి తెలిపారు

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో పదో తరగతి విద్యార్థుల వివరాలు..

మండలం	ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు	బాలురు	బాలికలు	మొత్తం విద్యార్థులు
కె.గంగవరం	10	223	254	477
రామచంద్రపురం	33	885	777	1,662
మండపేట	29	930	948	1,878
కపిలేశ్వరపురం	11	230	254	484
రాయవరం	13	368	325	693
మొత్తం	96	2,636	2,558	5,194



చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో తృతీయస్థానం పొందిన విద్యార్థులు

చెకుముకి పోటీల్లో రాయవరం విద్యార్థుల ప్రతిభ

రాయవరం, న్యూస్‌టుడే: చెకుముకి టాలెంట్ టెస్ట్‌ల్లో రాయవరం శ్రీరామయ్య జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయస్థానం సాధించారు. సోమవారం ప్రధానోపాధ్యాయురాలు వి.శాంతిసునీత మాట్లాడుతూ రావులపాలెంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన పిచ్చుక జయంత్ వెంకటనాగ్, కాకరపర్తి ధాత్రిలలిత, బూర ఆనంద్‌బాబు పురస్కారాలు అందుకున్నారని పేర్కొన్నారు. విజేతలను గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ వుండవిల్లి రాంబాబు, ఎస్ఎంసీ ఛైర్మన్ దేవిశెట్టి చిన్ని, ఉపాధ్యాయులు అభినందించారు.

అభ్యాసన సామర్థ్యాల మదింపునకే ఎఫ్ఎల్ఎన్ సర్వే



రాయవరంలో ఎఫ్ఎల్ఎన్ సర్వేను పరిశీలిస్తున్న ఏఎంవో రాంబాబు

రాయవరం, న్యూస్‌టుడే: విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాల మదింపునకే పాఠశాల విద్యా శాఖ గ్యారెంటెడ్ ఎఫ్ఎల్ఎన్ సర్వేను ప్రాథమిక పాఠశాలల్లో చేపట్టిందని సమగ్ర శిక్షా జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు తెలిపారు. సోమవారం రాయవరం రాజరాజేశ్వరికాలనీలోని ప్రధాన ప్రాథమిక పాఠశాలలో సర్వే తీరును ఆయన పరిశీలించారు. జిల్లాలో 1,377 ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ, ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి అయిదు వరకు చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను లీప్ యాప్ ద్వారా ఆన్‌లైన్ సర్వేలో పరీక్షిస్తున్నామని వివరించారు. జిల్లావ్యాప్తంగా 87 పాఠశాలల సముదాయాల పరిధిలోని పాఠశాలల్లో సర్వే నిమిత్తం డైట్ విద్యార్థులు, సీఆర్ఎంటీలు, క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లను నియమించామన్నారు. ఈ సర్వేతో 30,881 మంది విద్యార్థుల తెలుగు, ఆంగ్లం, గణిత అభ్యాసనా సామర్థ్యాలు వెలుగులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో డైట్ విద్యార్థి భాను, ఉపాధ్యాయులు లచ్చిరెడ్డి సత్యనారాయణ, కొవ్వూరి నాగిరెడ్డి, ఎస్.వెంకటరమణ, మల్లేశ్వరపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచి మృతికి నివాళులు

పామర్రు, న్యూస్‌టుడే: ఊడిమూడి మాజీ సర్పంచి యర్రంశెట్టి సత్యనారాయణ మృతి వైకాపాతో పాటు గ్రామానికి తీరనిలోటని నియోజకవర్గం పార్టీ ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. సత్యనారాయణ ఇటీవల మృతి చెందగా సోమవారం నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు.

సుబ్రహ్మణ్య షష్ఠికి ద్రాక్షారామలో ఏర్పాట్లు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో బుధవారం నిర్వహించే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. విశేష సంఖ్యలో భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో బారికేడ్లు అమర్చామని, బుధవారం ఉదయం 4 గంటలకే ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని ఈవో, సహాయ కమిషనరు ఏవీ దుర్గాభవాని తెలిపారు. సాయంత్రం సర్ప వాహనంపై గ్రామోత్సవం, అనంతరం ఆలయ ప్రాంగణంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు.

ద్రాక్షారామలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ఉత్సవాల ఆహ్వాన పత్రికల పంపిణీ

అంగర: కపిలేశ్వరపురం మండలం అంగరలో మంగళవారం జరగనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రాత్రి సమయంలో నిర్వహించే స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించడానికి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరుతూ నిర్వాహకులు, భక్తులు మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆహ్వానపత్రికలు అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సైన్సు అధికారి సుబ్రహ్మణ్యం, ఎంఈవో తదితరులు

రాజ్యాంగ పరిరక్షణ సదస్సు విజయవంతానికి పిలుపు

ద్రాక్షారామ: భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 26వ తేదీన అమలాపురంలో నిర్వహించే రాజ్యాంగ పరిరక్షణ సదస్సును విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. సోమవారం వెంకటాయపాలెంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, దళిత ఐక్యవేదిక నాయకుడు గుబ్బల శ్రీనివాసు తదితరులు కరపత్రాలు ఆవిష్కరించారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, మైనార్టీలు, దళితులు, పీడితవర్గాలకు జరుగుతున్న అన్యాయాల గురించి వివరించారు. కార్యక్రమంలో వెంటపల్లి భీమశంకరం, చల్లపూడి పట్టాభిరామయ్య, చింతా రాజారెడ్డి, కె.నవీన్, వెంటపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం ఆదర్శనీయం

పామర్రు: భారత రాజ్యాంగం ఆదర్శనీయమైందని జిల్లా సైన్సు అధికారి గిరిజాల వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోమవారం కె.గంగవరంలో పోటీలు నిర్వహించారు. అనంతరం ఎంఈవో అలజంగి నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సభలో నిర్వాహకుడు జిల్లెళ్ల ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ రచనలో అంబేడ్కర్ కృషి అంశంపై వ్యాసరచన, వక్తృత్వం, అంబేడ్కర్ ముఖచిత్రం గీయడం, పాటల పోటీలు ఏర్పాటు చేశామన్నారు. విజేతలకు బుధవారం జరిగే కార్యక్రమంలో బహుమతులు, ప్రశంసాపత్రాలు అందిస్తామని ఎంఈవో-2 చోడిశెట్టి ఆంజనేయులు చెప్పారు.

పథకాలపై అవగాహనకే రైతన్నా.. మీకోసం

భీమక్రోసుపాలెంలో రైతులతో మాట్లాడుతున్న ఏడీ, ఏవోలు

పామర్రు, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలుచేస్తున్న కూటమి ప్రభుత్వం ఆయా పథకాలపై రైతులకు అవగాహన కల్పించడానికే రైతన్నా.. మీకోసం.. కార్యక్రమం నిర్వహిస్తోందని ఏవో ఎ.సద్గురుమూర్తి అన్నారు. కె.గంగవరంలో సోమవారం ఉద్యాన, పశుసంవర్ధక, రెవెన్యూ, ఇంజినీరింగ్, ఎనర్జీ అసిస్టెంట్లతో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల రెండో తేదీ వరకు అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. తెదేపా నాయకులు అల్లూరి దొరబాబు, కొరిపెల్ల సుబ్బారావు, జనసేన, భాజపా ప్రతినిధులు, వీవీపీ నవ్య, సుధా చంద్రశేఖర్ పలువురు రైతులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు రూపొందించిన రైతన్నా.. మీకోసం వారోత్సవాలను అన్ని గ్రామాల్లో సోమవారం ప్రారంభించారు. ఏడీ నాగకుమార్, ఏవో మణిదీప్ ద్రాక్షారామ, భీమక్రోసుపాలెంలో జరిగిన కార్యక్రమాల్లో మాట్లాడారు. ఈనెల 29 వరకు జరిగే కార్యక్రమాల్లో రైతుల ఇళ్లను సందర్శించాలని, 30 నుంచి డిసెంబరు 2 వరకు సేకరించిన డేటాను విశ్లేషించాలని సిబ్బందికి సూచించారు.

విలువలతో కూడిన విద్య బోధించాలి

ఆత్రేయపురం: ప్రతి ఉపాధ్యాయుడు విలువలతో కూడిన విద్య బోధించాలని పరిశీలకురాలు, ఉపాధ్యాయ శిక్షణ సంస్థ ఉపన్యాసకురాలు ఎల్.చూడామణి సూచించారు. ఆమె సోమవారం ర్యాలి ప్రధాన ప్రాథమిక ఫౌండేషన్ పాఠశాలను తనిఖీ చేశారు. గుణాత్మక విద్యకు ప్రత్యేకంగా రూపొందించిన జీఎఫ్ఎల్ఎన్ పరీక్ష విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులు కిచెన్ గార్డెన్‌లో పెంచుతున్న కూరగాయల తోటను పరిశీలించి అభినందించారు.

PUBLIC NOTICE

I am instructed by my client **Dr.Jabbar Singh Chohan, S/o.Bhava Singh Chohan,** R/o D.No.8-18-53 Rajhamahendravaram and Sri Ashok Singh Khabavath S/o. Gula Singh Khabavath R/o D.No.21-1-27, Ramachandrapuram both of them jointly entered onto an Sale Agreement with Puppala Ganga Bhavani and Puppala Durga Prasad and my clients intends to avail loan from SBI, RASMECC, Kakinada with regard to notice schedule property and in that process the Vendors of my clients gave their Title Deeds Xerox Copies and inthat they found docuement no.3472/2007 was lost and in that regard in the year 2013 a paper publication was made and no claims whatsoever came from the General Public. As per Bank norms once again calling General Public if anybody having any rights, claims or objections over the same they can intimate to our counsel within 7 days of this notice. Otherwise my clients treats that there are no claims over the property and it will not bind my client whatsoever.

Schedule Property: Item No.1 : Previously E.G.Dist., at present Dr.B.R.Ambedkar Konaseema District, SRO, Ramachandrapuram, Ramachandrapuram Municipality area Machumilli Sivaru Anisettivari Savaram, S.No.258/2B total extent Ac.0-64 cents out of which 76.66 sq.yards of site with RCC Daba House bearing D.No.28-1-1/3 within following boundaries and measurements **East:** 30' or 9.144 meters joint way. **West:** 30' or 9.144 meters Murugu Kalva. **South:** 23' or 7.010 Meters House site of Puppala Ganga Bhavani. **North:** 23' or 7.010 Meters Boundary House wall of Beeraka Bosu.With all easemantary rights etc.,

Item No.2 : Previously E.G.Dist., at present Dr.B.R.Ambedkar Konaseema District, SRO, Ramachandrapuram, Ramachandrapuram Municipality area Machumilli Sivaru Anisettivari Savaram, Block No.28, Main road old bus stand center to an extent of 48 sq.yards of site with RCC Daba shops bearing D.No.28-1-1/2 within following boundaries and measurements **East:** 18' or 5.49 meters joint way. **West:** 18' or 5.49 meters Murugu Drain. **South:** 24' or 7.31 meters House of Puppala Durga Prasad. **North:** 24' or 7.31 meters Main road. With all easementary rights etc.,

H. VISWANATH, Advocate
D.No. 8-23-2, Jammalamadakavari Street, Flat No. G-4, Sri Lalitha Heights, Gandhi Nagar, KAKINADA - 4. Cell: 98663 02686

(c) eenadu

రత్న'సిరి'..

అన్నవరం, న్యూస్‌టుడే: ఈ ఏడాది కార్తికమాసంలో అన్నవరం దేవస్థానానికి వివిధ విభాగాల ద్వారా రూ.21.76 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాది కార్తికంలో రూ.21.14 కోట్లు ఆదాయం వచ్చింది. గత ఏడాది కన్నా వసతి, ప్రసాదం, వ్రతాలు, రవాణా తదితర ప్రధాన విభాగాల ద్వారా తగ్గినా లీజుల ఆదాయం ఎక్కువగా చూపించడం గమనార్హం. 49 రోజుల హుండీ ఆదాయాన్ని కార్తిక ఆదాయంగా లెక్కల్లో చూపించి గతం కన్నా పెరిగినట్లు పేర్కొన్నారు. మొంథా దృష్ట్యా వ్రతాలు, దర్శనానికి వచ్చిన భక్తుల సంఖ్య తగ్గినట్లు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఈవో సుబ్బారావు వివరాలు వెల్లడించారు.

అన్నవరంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

ప్రధాన విభాగాల ఆదాయం (అక్టోబరు 22 నుంచి నవంబరు 20 వరకు)

విభాగం	ఆదాయం (రూ.కోట్లలో)
వసతి	1.23
హుండీల ద్వారా	3.51
ప్రసాదం	4.57
వ్రతాలు	7.81
లీజులు, ఇతరాలు	2.27
దర్శనాలు	0.89
రవాణా	0.38

1,34,476 వ్రతాలు

◗ కార్తికంలో 1,34,476 వ్రతాలు జరిగాయి. గత ఏడాది కన్నా 12,666 తక్కువగా జరిగాయి. ◗ ఈ ఏడాది 10 లక్షల మంది స్వామిని దర్శించుకున్నారు. గత ఏడాది కన్నా ఈసారి 2.60 లక్షల మంది తక్కువగా వచ్చారని తేల్చారు. ◗ క్యూలైన్లు, మరుగుదొడ్లు, పార్కింగ్ తదితర అదనపు ఏర్పాట్లు, గిరి ప్రదక్షిణ, తెప్పోత్సవం నిర్వహణకు రూ.1.01 కోట్లు ఖర్చు చేశారు.

రైతులను ఇబ్బందులు పెడితే ఉపేక్షించం : నాదెండ్ల

చాగల్లు, కొవ్వూరు పట్టణం, కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సోమవారం చాగల్లు, దొమ్మేరులోని రైతు సేవా కేంద్రాలను మంత్రి కందుల దుర్గేష్, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. గతంలో మాదిరి రైసు మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఉపేక్షించేదిలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 వేల లారీలు, ట్రాక్టర్లతో ధాన్యాన్ని మిల్లులకు చేర్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. తమ ఆధార్ నంబర్ అప్డేట్ కాలేదని చాగల్లులో పలువురు రైతులు మంత్రి మనోహర్ దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ● ధాన్యం రవాణాకు ఈ నెల 27 నాటికి అదనపు వాహనాలు సిద్ధం చేసుకోవాలని నాదెండ్ల అధికారులకు సూచించారు. ధాన్యం సేకరణ, పౌరసరఫరాల శాఖ పనితీరుపై జిల్లాస్థాయి సమీక్ష సమావేశం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జరిగింది. ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి 24 నుంచి 48 గంటల వ్యవధిలోనే రూ.240 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. ● గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యం 2.56 లక్షల మెట్రిక్ టన్నులు పెరిగిందని మంత్రి దుర్గేష్ అన్నారు. రైతులకు అందించే టార్పాలిన్లు, గోనె సంచుల నాణ్యతపై వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు

చాగల్లు రైతు సేవా కేంద్రంలో ధాన్యం నాణ్యత పరిశీలిస్తున్న మంత్రులు మనోహర్, దుర్గేష్, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు

ఆమాత్రం.. చూడరా..

ఈనాడు, రాజమహేంద్రవరం

"రాజమహేంద్రవరం నగరం నారాయణపురం ప్రాంతంలోని చౌడేశ్వరనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు 55 ఏళ్ల మహిళ సెప్టెంబరులో వెళ్తే అక్టోబరుతో గడువు ముగిసే 30 బీపీ మాత్రలు ఇచ్చారు. వాటిని ఆమె నిర్ణీత గడువులోగా వినియోగించలేదు."

"నవంబరు 8న మరో దఫా ఆమె అదే ఆసుపత్రికి వెళ్తే అదే నెలలో గడువు ముగిసే బీపీ మాత్రలు ఇచ్చారు. అంత తక్కువ కాలపరిమితి ఉన్న మందులిస్తే వారికి ఎలా తెలుస్తుందన్న ప్రశ్నకు అధికారుల నుంచి సమాధానం లేదు."

ప్రజారోగ్యం.. భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా... ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం ఉంటే క్షేత్ర స్థాయిలో దస్త్రాల నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంది. ఔషధాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో సమగ్ర వివరాలు సైతం నమోదు చేయకపోవడం గమనార్హం.

తక్కువ గడువు ఉన్న మందుల సరఫరా

నెల, రెండు నెలల్లో గడువు ముగిసిపోతున్న ఔషధాలను అర్బన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సెంట్రల్ డ్రగ్ స్టోర్ల (సీడీఎస్) నుంచి సరఫరా చేస్తున్నారు.

ఈ ఆగస్టులో సరఫరా చేసిన మందుల్లో కొన్ని రకాలు నవంబరు, డిసెంబరులో గడువు ముగుస్తాయి.

ఇలాంటి మందులను రోగులకు ఇచ్చినప్పుడు వారు సకాలంలో వినియోగించకుండా దాచుకుంటే ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది.

కారణాలు పరిశీలిస్తే...

జిల్లాకు ఏపీఎంఎస్ఐడీసీ నుంచి జూన్ 2024న పంపిణీ చేసిన మందులను సక్రమంగా పంపిణీ చేయకపోవడం వల్ల 1,42,800 మాత్రలు మూలకు చేర్చారు. ఆసుపత్రుల్లోని స్టోర్స్‌లో నెల, రెండు నెలల్లో కాలం తీరేవాటిని వేరుగా ఉంచి, ముందుగా వాటిని పంపిణీ చేస్తున్నారు. ఆ సమయంలో రోగులకు కొందరు తేదీలపై అవగాహన కల్పిస్తుంటే, మరికొందరు విస్మరించడం వల్ల సమస్య నెలకొంటోంది.

అవసరాల కంటే అధికంగా..

కొన్ని మందులు ఆసుపత్రుల నుంచి వచ్చిన ఇండెంట్ కంటే అధికంగా సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వాటిని వినియోగించకపోవడం వల్ల మూలకు చేరుతున్నాయి. ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, సిరప్‌లు ఈ కోవకే చెందుతాయి. గతంలో ఈఎస్ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఇబ్బడి ముబ్బడిగా వైద్య శిబిరాలు నిర్వహించి ఇలాంటి మందులను అవసరానికి మించి పంపిణీ చేసిన సందర్భాలున్నాయి. సకాలంలో ఔషధాలను పంపిణీ చేయకపోవడం వల్లే ఈ సమస్య వస్తోందని డ్రగ్స్ జీఎం బాలు ప్రాథమికంగా నిర్ధారించారు. ఫార్మాసిస్టులు పుస్తకాల్లో నమోదు చేస్తున్నారే తప్ప, పూర్తి వివరాలు ఆన్‌లైన్ చేయడం లేదు.

ముంపు నుంచి గట్టెక్కేనా..?

మురుగు కాలువల ఆధునికీకరణపై దృష్టి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : రానున్న పుష్కరాల నేపథ్యంలో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు పూర్తి చేసే దిశగా యంత్రాంగం అడుగులేస్తోంది. ముఖ్యంగా ముంపు సమస్యపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు నగరం నీట మునిగే పరిస్థితులు ఉన్నాయి. పురపాలిక శాఖ మంత్రి నారాయణ ఇటీవల నిర్వహించిన సమీక్షలో ఇదే విషయాన్ని ప్రస్తావించారు. పుష్కరాలు జులై, ఆగస్టు నెలలో నిర్వహిస్తారు. ఆ సమయంలో వర్షాలు జోరుగా కురుస్తాయి. కాలువలు ఆధునికీకరించకపోతే భక్తులకు ఇక్కట్లు తప్పవు

ఇటీవల కురిసిన వర్షానికి ఆల్కట్‌గార్డెన్స్‌లో ఇలా..



ఇదీ పరిస్థితి

● బొమ్మూరు జాతీయ రహదారి నుంచి దిగువకు ఆవచానల్‌లో కలిసే విధంగా ప్రధాన కాలువ విస్తరిస్తే.. వీఎల్‌పురం, మోరంపూడి, తాడితోట, ఆవ ప్రాంతాల్లో ముంపు సమస్య తప్పుతుంది. కాతేరు నుంచి మేడుమిల్లి, సీతంపేట, నల్లాఛానల్‌లో కలిసే విధంగా కాలువలు నిర్మించాలి.

● ఎగువ కోటిపల్లి, మెయిన్ రోడ్డు, దేవీచౌక్ సెంటర్, కోటిపల్లి బస్టాండ్ మీదుగా ఆవ ఛానల్ వరకు కాలువ పనులు ప్రారంభించాల్సి ఉంది.

● ఆల్కట్‌గార్డెన్స్, రైల్వే స్టేషన్ మీదుగా నిర్మించాల్సిన ముఖ్య కాలువ పూర్తి చేయడం ద్వారా చుట్టుపక్కల నాలుగైదు డివిజన్లలో ముంపు సమస్య పరిష్కారం అవుతుంది.

● నల్లాఛానల్ నుంచి మురుగునీరు గోదావరిలో కలవకుండా గోరక్షణ పేట మీదుగా ఆవ ప్రాంతంలో ప్రారంభమైన ఎస్‌టీపీ ప్లాంటు నిర్మాణ పనులు కూడా పుష్కరాల నాటికి పూర్తి చేయాల్సి ఉంది.

కీర్తి పతాక.. చైతన్య గీతిక

ప్రతి ఒక్కరూ దేశంపై ప్రేమ పెంచుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయ్ 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా మేరా భారత్ ఆధ్వర్యంలో సోమవారం అనపర్తిలో ఐక్యతా యాత్ర చేపట్టారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించగా రైల్వేస్టేషన్ నుంచి దేవీచౌక్ వరకు జాతీయ పతాకాలతో పాదయాత్ర చేశారు. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి మాట్లాడారు. దేశసమైక్యత, సమగ్రత కోసం పాటుపడిన మహనీయులను స్మరించుకోవాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, తహసీల్దారు అనిల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, అనపర్తి గ్రామీణం

ఇక పక్కాగా.. సమాచారం

వసతిగృహాల పర్యవేక్షణపై ప్రత్యేక యాప్

న్యూస్‌టుడే, వీఎల్‌పురం

వసతిగృహాల్లో పొరపాట్లు, అవకతవకలకు ఆస్కారం లేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టేలా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఇందులో భాగంగా కృత్రిమమేధ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా ప్రతి చిన్న పని ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. వార్డెన్ పనితీరును గాడిన పెట్టేందుకు ఈ యాప్ సూచికగా నిలవనుంది. ఇటీవల జిల్లాలోని అన్ని వసతిగృహాల్లోని సంక్షేమ అధికారులకు ఈ యాప్‌ను చరవాణిల్లో వేయడమే కాకుండా పనితీరును వివరించారు.

జిల్లా సమాచారం
సాంఘిక సంక్షేమ వసతిగృహాలు 32
మొత్తం విద్యార్థులు 2300
బీసీ 21
విద్యార్థుల సంఖ్య 1460
గిరిజన సంక్షేమ వసతిగృహాలు 10
పిల్లల సంఖ్య 1975

ప్రత్యేకతలు ఇవే

వసతి గృహాల్లో పారదర్శకతను పెంచేలా హాస్టల్ పర్మినెంట్ ట్రాకింగ్ సిస్టం (హెచ్‌పీటీఎస్) పేరుతో ఓ సరికొత్త యాప్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. రోజూ చేపట్టే పనులతోపాటు వారాంతం, నెలవారీ కార్యక్రమాలు ఎప్పటికప్పుడు అమలు చేసేలా చర్యలు తీసుకుంటుంది. వసతి గృహాల్లో కంచాలు కడగడం నుంచి పిల్లల హాజరు, భోజనాలు, వండిన పదార్థాలు, ఆవరణ, మరుగుదొడ్లు, తాగునీరు, గదుల శుభ్రత అన్నీ ఈ యాప్‌లో ఎప్పటికప్పుడు నిక్షిప్తం చేసేలా పొందుపరిచారు. వసతి గృహాల్లో ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరిగినా ఈ యాప్ ద్వారా తక్షణమే హెచ్చరికలు వెళ్తాయి.

నిరంతర నిఘా..

హెచ్‌పీటీఎస్ యాప్‌తో వసతిగృహాల్లో జరిగే అక్రమాలకు అడ్డుకట్టపడనుంది. ప్రధానంగా భోజనాల సమయంలో ఫొటోలు తీస్తే అప్పటికే నమోదైన విద్యార్థుల సంఖ్యకు ఆ ఆహారం సరిపోతుందా.. లేదా అనే విషయాన్ని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా తెలుసుకోవచ్చు. ఆహార పదార్థాల నాణ్యత సక్రమంగా ఉన్నదీ..? లేనిదీ..? తెలుసుకునే వెసులుబాటు ఉంది. అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ జరిగితే ఉన్నతాధికారులు సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటారు.

రైతేరాజు
అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

తిరగలి.. తిరగాలి సంస్కృతి వెలగాలి

గతంలో వివాహాలు సంప్రదాయాల మేళవింపుతో జరిగేవి. వాటిలో చాలావరకు కనుమరుగైపోయినా ఈ తరం వారు మరచిపోకుండా బొమ్మల కొలువుల రూపంలో కొందరు ప్రదర్శిస్తున్నారు. మామిడికుదురు మండలం పెదపట్నంలంకలోని 'మన మండువా'లో మంగళవారం జరిగే పెళ్లికిగాను పలురకాల నమూనా బొమ్మలను సిద్ధం చేయడంతో ఆకట్టుకుంటున్నాయి. డోలు, సన్నాయి మోగిస్తున్న కళాకారులు, తిరగలి తిప్పుతున్న పల్లె పడుచు బొమ్మలు అలరిస్తున్నాయి.
- న్యూస్‌టుడే, మామిడికుదురు

హూ..హా..!

జిల్లా స్కూల్ గేమ్స్ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కరాటే బాల, బాలికల ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో జరిగాయి. అండర్-17, 19 బాలుర విభాగంలో జరిగిన పోటీలకు వివిధ జిల్లాలకు చెందిన సుమారు 550 మంది క్రీడాకారులు హాజరయ్యారు.
-న్యూస్‌టుడే, శ్యామలాసెంటర్

వ్యాయామం చేస్తా.. స్ఫూర్తి నింపుతా..!

నగరంలోని 17వ డివిజన్ మున్సిపల్ పార్కులో రాజమహేంద్రవరం గ్రామీణం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి వ్యాయామ పరికరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాయామం చేసి ఆకట్టుకున్నారు. ఈ ప్రాంతంలో ఆధునికీకరించిన పార్కులను ప్రారంభించారు. -న్యూస్‌టుడే, టి.నగర్

నిడదవోలుకు రండి

రాజమహేంద్రవరంలో పవన్‌ను కలిసిన మంత్రి దుర్గేష్, ఛైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ నెల 26న నిడదవోలు విచ్చేస్తున్నట్లు సమాచారం. ఈనెల 26 నుంచి 28 వరకు నిడదవోలు పురపాలక సంఘ వజ్రోత్సవాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. వీటికి హాజరు కావాలని ఏలూరు జిల్లా పర్యటనకు వచ్చిన పవన్‌కల్యాణ్‌ను సోమవారం రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టులో మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్‌ఛైర్మన్ వజీరుద్దీన్ తదితరులు ఆహ్వానించారు. పట్టణంలో పవన్ పర్యటనకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు, పోలీస్ యంత్రాగం సిద్ధమవుతోంది.

WALK - IN INTERVIEWS
MAHAVEER FINANCE INDIA LTD., is looking for the Following Positions:
▸SALES MANAGERS ▸Sr.SALES EXECUTIVES
▸SALES EXECUTIVES ▸COLLECTION MANAGERS
▸COLLECTION EXECUTIVES
For Used Commercial Vehicles, Construction Equipment & Cars.
LOCATIONS: Rajamundry,Kakinada,Tadepalligudem, Eluru, Visakhapatnam, Gajuvaka, Srikakulam, Vizianagaram.
Qalification & Exp: 10th & Inter for Sr.Sales Executives & Sales Executives, Minimum Degree For Managers.Min 2 years experience in NBFC for Sales Managers and collection manager positions Min.1 Year Experience in relevant field for Sales Executive and Sr.Sales Execurive,collection executive positions. Freshers also can apply as sales executive.
Interview: 26/11/2025, Wednesday, 9.30AM onwards
MAHAVEER FINANCE INDIA LTD.,
D.No.46-12-21/2,3, Venkat Plaza, Opp; Skvt High School, Ttd Kalyana Mandapam Road, Danavayi Peta, Rajamundry-533103.
WhatsApp: 8522082223, tvrsarama@mahaveerfinance.com

సుబ్బరాయుడి షష్ఠి.. చూతమురారండి..

బిక్కవోలు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో బిక్కవోలు సుబ్రహ్మణ్యేశ్వరాలయం ఎంతో ప్రసిద్ధి. ప్రతి మంగళవారం 20వేల మందికి పైగా భక్తులు వచ్చి పూజలు చేయించుకుంటారు. ఈ క్రమంలో సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలకు అంగరంగ వైభవంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం ముందు పెద్ద పెద్ద స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. పశ్చిమబంగా నుంచి వచ్చిన కళాకారులు ముఖద్వారం, పందిరిని చక్కగా తీర్చిదిద్దారు. ప్రధాన వీధులన్నీ విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ఆరోజు సుమారు 2లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. ఈ ఉత్సవాల్లో బాణసంచా కాల్పులు ఎంతో ప్రత్యేకం. దానికోసం భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

● ఆలయంలో 75 ఏళ్లుగా షష్ఠి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ● మంగళవారం అర్ధరాత్రి 1.10 గంటలకు (తెల్లారితే బుధవారం) తీర్థపు బిందెలు తీసుకురావడంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ● బుధవారం ఉదయం 7.20

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

పూజా కార్యక్రమాలు..

లకు స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. ● ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు విశేష పూజా కార్యక్రమాలు, సంగీత విభావరిలు జరుగుతాయి. ● రాత్రి 7.35లకు రెండోసారి గ్రామోత్సవం. ● సాయంత్రం ఒకసారి, రాత్రి రెండోసారి బాణసంచా కాల్చుతారు. కేవలం దీన్ని చూసేందుకు వేలమంది వస్తారు. ● గురువారం మధ్యాహ్నం 1.17 స్వామివారి రథోత్సవం. ● 26 నుంచి డిసెంబరు 2 వరకు కుమార వ్రతాలు జరుగుతాయి.

సుమారు రూ.5 కోట్ల వ్యాపారం..

ఈ వారంపాటు లక్షల మంది వస్తారు. గుడి చుట్టుపక్కల దాదాపు రూ.5 కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా. చిరు, తోపుడు బండ్ల వ్యాపారులు దుకాణాలు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 35 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తారు. వైద్య శిబిరాలు పెడతారు. అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచుతారు. పోలీసుల గస్తీ ఉంటుంది.

కదిలొచ్చిన సాంకేతికత

అన్ని రకాల వైద్య విద్యలకు సంబంధించిన అధునాతన శిక్షణ అందించే మొబైల్ ట్రైనింగ్ సెంటర్ 'జాన్సన్ అండ్ జాన్సన్ ఇన్‌స్టిట్యూట్ ఆన్ వీల్స్' శనివారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాలకు చేరుకుంది. దీనిని డీఎంఈ డా.రఘునందన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి, ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్ ప్రారంభించారు. -న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

వినతులు @ 166

కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఉన్నతాధికారులు

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో విచారణ చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో జరిగిన జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో 166 అర్జీలు ఉన్నతాధికారులకు అందాయి. కలెక్టర్‌తోపాటు డీఆర్వో సీతారామమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాగ్యలక్ష్మి, సీపీవో అప్పలకొండ, డీఎస్పీ విద్య డీఎల్‌డీవో వీణాదేవి, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు. ● నిషేధిత జాబితాలో ఉన్న భూమి దస్త్రాలు సవరణ చేయాలని కోరుతూ కాతేరుకు చెందిన కె.దళయ అర్జీ ఇచ్చారు. ● గతంలో తమ కూతుళ్ల పేరుతో చేసిన భూరిజిస్ట్రేషన్ రద్దు చేయాలని పెరవలి మండలం ముక్కామలకు చెందిన కె.వెంకట్రావు, సరోజి అందించిన అర్జీని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

చిత్రకళ.. ఆకట్టుకునేలా..!

కళాఖండాల్లో మురాల్ కళాకృతులకు ప్రత్యేకత ఉంది. చారిత్రక నగరంలో ఇవి ఆకట్టుకొంటున్నాయి. సమాజహితం కోరే ఏదైనా సందేశాన్ని దీని ద్వారా వివరించవచ్చు. వంద మాటల సారాంశం ఒక కళాకృతిలో చెప్పవచ్చు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పలుచోట్ల మురాల్ కళాకృతులు ఆకట్టుకొంటున్నాయి. మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల గోడలకు ఈ పెయింటింగ్స్ వేశారు. పుష్కరాల సమయానికి నగరంలో పూర్తి స్థాయిలో కళాకృతులు ఏర్పాటు చేయనున్నారు.
–న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ



నీటి పొదుపుపై సందేశాత్మక చిత్రం

సీఎం సహాయనిధితో సాంత్వన

మీ కోసం

అనారోగ్య సమస్యలు, ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి వర్గాలు వైద్య సేవలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అలాంటి సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోంది. అన్ని ధ్రువపత్రాలు ఉంటే సీఎంఆర్ఎఫ్ పొందేందుకు ఎంతో సులభతరం. అవేంటో తెలుసుకుందాం..

■ ఏయే పత్రాలు కావాలంటే..
❖ ఆధార్‌కార్డు ❖ తెల్లరేషన్‌కార్డు ❖ ఆదాయ ధ్రువీకరణపత్రం ❖ ఎక్సరే, స్కాన్‌తోపాటు రోగ నిర్ధారణ రిపోర్టులు ❖ ఆసుపత్రిలో రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం ❖ చికిత్స వివరాలు, మందుల బిల్లులు స్టాంపు, తేదీతో ఉండాలి. ❖ డిస్‌ఛార్జి వివరాలు, దానిపై వైద్యుడి సంతకం, స్టాంపు ఉండాలి. ❖ బ్యాంకు పాసు పుస్తకం మొదటి పేజీ నకలు

■ దరఖాస్తు ఇలా..:
వైద్యం కోసం ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని వినియోగించకుండా సొంత డబ్బు వెచ్చించి ఉండాలి. స్థానిక వార్డు, గ్రామ సచివాలయం, ఎమ్మెల్యే కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. దరఖాస్తుదారుడి వివరాలు, ఫోన్ నంబరు, బ్యాంకు ఖాతా, ఆసుపత్రి పేరు, మందుల ఖర్చు వంటి వివరాలను నమోదు చేయాలి. తగిన పత్రాలు జమ చేసి ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేయాలి.
-న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

మధురమే... మధురమే... మధురమే...
ఈ క్షణములు ఇంకా మధురమే...
పదవీ విరమణ శుభాకాంక్షలు
మీ కుటుంబసభ్యులు, మీ బంధుమిత్రులు,
మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా!
అయితే వారికి అందించండి, అభినందన చందనాలు.
వారి భావి జీవితం సుఖమయంగా సాగాలని ఆకాంక్షిస్తూ,
ఈనాడు ద్వారా వారికి అందించండి,
పదవీ విరమణ శుభాకాంక్షలు.
మరిన్ని వివరాలకు :
80085 97607

(c) eenadu

నీరు తగ్గింది.. రోడ్డు వచ్చింది

వశిష్ఠ గోదావరి నది మధ్యలో ఉన్న ఊడుమూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేట, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజల రాకపోకల కోసం బూరుగులంక రేవులో ప్రత్యేకంగా బాట ఏర్పాటు చేస్తున్నారు. ఈ నాలుగు లంక గ్రామాల కోసం ఇక్కడ వంతెన నిర్మిస్తున్న గుత్తేదారు సంస్థ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. మొత్తం పూర్తవ్వడానికి నాలుగు రోజుల సమయం పడుతుందని గుత్తేదారు సంస్థ ప్రతినిధి పీఎస్ రాజు తెలిపారు. ప్రస్తుతం నదిలో నీటి ప్రవాహం కనిష్ఠ స్థాయికి పడిపోయింది. దీంతో తాత్కాలికంగా రోడ్డు వేస్తున్నారు. దీనిపై జూన్ వరకు రాకపోకలు సాగించే వెసులుబాటు కలుగుతుంది.

- న్యూస్‌టుడే, పి.గన్నవరం

క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాష్ట్రస్థాయి కత్తిసాము పోటీలు ప్రారంభం

సఖినేటిపల్లి: ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే క్రీడలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మోరి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ అండర్-17 రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. డీఈవో సలీంబాషా మాట్లాడుతూ కత్తిసాము పోటీ 1896 నుంచి ఒలింపిక్స్‌లో స్థానం పొందిందన్నారు. ఈ పోటీల్లో విజేతలు డిసెంబరు 28 నుంచి 30వ తేదీ వరకు మహారాష్ట్ర శివాజీ సంభాజీనగర్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి 360 మంది బాలబాలికలు హాజరుకాగా రాత్రి 10 గంటల వరకు పోటీలు కొనసాగాయి. ఎంపీపీ మల్లిబాబు, ఎంఈవో కిషోర్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్‌కృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తైవాన్ జామ.. లాభాలు అందుకుందామా

రైతేరాజు

స్ఫూర్తి

న్యూస్‌టుడే, అంబాజీపేట

కోనసీమ జిల్లాలోని కొబ్బరి తోటల్లో సాధారణంగా అంతర పంటలుగా అరటి, కోకో, వక్క, కూరగాయలు పండిస్తుంటారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారానికి చెందిన అభ్యుదయ రైతు దొంగ నాగేశ్వరరావు ఇందుకు భిన్నంగా ముందుకు సాగుతున్నారు. తనకున్న నాలుగు ఎకరాల కొబ్బరి తోటలో అంతర పంటగా తైవాన్‌జామ పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. కడియపులంక నుంచి మొక్కలు తీసుకొచ్చి నాటారు. ఎకరాకు 200 చొప్పున మొత్తం 800 నాటారు. గట్లపైన మరో 200 మొక్కలు నాటారు. ఎకరాకు రూ.20 వేలు చొప్పున నాలుగు ఎకరాలకు రూ.80 వేలు పెట్టుబడి అయ్యింది. మొదటి రెండేళ్లలోనే పెట్టుబడి వచ్చేసింది. ఇంకా 20 నుంచి 30 ఏళ్ల వరకు ఆదాయం తీసే అవకాశం ఉంది. పూర్తిగా సేంద్రియ పద్ధతులు అవలంబించడం ద్వారా ఎక్కువ కాలం ఆదాయం తీస్తున్నారు.

సేంద్రియ పద్ధతిలోనే..

అందుబాటులో ఉన్న ప్రకృతి వనరులను వినియోగించుకుని కొబ్బరి తోటల్లో యాజమాన్య పద్ధతులను శాస్త్రవేత్తల సూచనలు, సలహాల మేరకు పాటిస్తున్నారు. వీటికి అందించిన పోషకాలే జామకు కూడా అందుతున్నాయి. డ్రిప్ పద్ధతిలో తోటకు సాగునీరు అందిస్తున్నారు. పశువుల పెంట, గోమూత్రం, వివిధ రకాల పత్రులతో తయారు చేసిన కషాయాలను పిచికారీ చేస్తున్నారు. కిలో పరిమాణం గల జామకాయ రూ.30 నుంచి రూ.35కు తోటకు వచ్చి వర్తకులు కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. ప్రకృతి సిద్ధంగా పండించినవి కావడంతో వీటికి డిమాండ్ ఉంటుంది. వర్తకులు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి రూ.60కు విక్రయిస్తున్నారు.

కొబ్బరితోటలో సాగు చేసిన జామ పంటను పరిశీలిస్తున్న రైతు నాగేశ్వరరావు

మార్కెటింగ్ సమస్య లేదు

జామ తోటలో 45 రోజులకు ఒకసారి కొమ్మ కత్తిరింపులు చేయడంతో చెట్లకు పూత అధికంగా వచ్చి దిగుబడి బాగుంటుంది. మార్కెటింగ్ సమస్య లేదు. నెలకు రూ.25-30 వేల అదనపు ఆదాయం వస్తుంది. పూర్తిగా సేంద్రియ పద్ధతిలో పాటించడంతో కాయ పరిమాణంతో పాటు రుచి బాగుంటుంది. **- దొంగ నాగేశ్వరరావు, గంగలకుర్రుఅగ్రహారం, అంబాజీపేట**

అందరికీ అందుబాటులో ఆధునిక వస్త్రాలు

కాకినాడలో లక్ష్మీ షాపింగ్ మాల్ ప్రారంభం

గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడ మెయిన్‌రోడ్డులో జైన్ టెంపుల్ దగ్గర నూతనంగా ఏర్పాటుచేసిన లక్ష్మీ షాపింగ్ మాల్‌ను సోమవారం సినీనటి, ఓజీ ఫేం ప్రియాంక మోహన్, యాంకర్, నటి అనసూయ, కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. వేదికపై నటుడు హైపర్ ఆది, నటి, యాంకర్ ఐశ్వర్య అందరినీ ఉత్సాహపరిచారు. ప్రియాంక మోహన్, అనసూయ మాట్లాడుతూ లక్ష్మీ షాపింగ్ మాల్‌ను కాకినాడలో ప్రారంభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. దుకాణ అధినేతలు స్వామి, రత్తయ్య, శ్రీను మాట్లాడుతూ నాలుగంతస్తుల విశాలమైన షోరూంలో అన్ని వర్గాల వారికి నచ్చేలా అద్భుతమైన కలెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్లు అందిస్తున్నామన్నారు. ది గోదావరి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గ్రంధి బాబ్జి, కాకినాడ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బచ్చు శేఖర్, ముత్తా శశిధర్, బాదం బాలకృష్ణ, సోము ప్రసాద్, సంగిశెట్టి అశోక్, నేమాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న సినీ నటి అనసూయ, షాపింగ్ మాల్ నిర్వాహకులు

చీరను ప్రదర్శిస్తున్న హీరోయిన్ ప్రియాంక మోహన్

28న వాలీబాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : ఉమ్మడి పశ్చిమ జిల్లా వాలీబాల్ బాలుర, బాలికల జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గారపాటి రాఘవేంద్రరావు తెలిపారు. బాలికల జట్ల ఎంపిక దేవరపల్లి మండలం దుద్దుకూరు ఉన్నత పాఠశాల, బాలుర జట్ల ఎంపిక కొవ్వూరు ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రక్రియ ప్రారంభమవుతుంది. సబ్ జూనియర్స్, జూనియర్స్, యూత్ విభాగాల్లో జట్ల ఎంపిక ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 63035 78996, 82979 72333, 78933 83748 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆయిల్‌పామ్‌లో కొమ్ముపురుగు నివారిద్దాం

మీ కోసం

నల్లజర్ల, న్యూస్‌టుడే: ఆయిల్‌పామ్ మొక్కలపై కొమ్ము పురుగు ప్రభావంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. నివారణ చర్యలను కృషి విజ్ఞాన కేంద్రం(వెంకట్రామన్నగూడెం) ప్రధాన శాస్త్రవేత్త విజయలక్ష్మి వివరించారు. నాలుగేళ్ల వయసున్న మొక్కలపై పురుగు ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఆకుల చివర 'వి' ఆకారంలో కత్తిరించినట్టు కనిపిస్తాయి. పురుగు ఆకులను కొరికి పత్ర హరితాన్ని బయటకు నెడుతుంది. మొవ్వులో ఈ పదార్థం ఉండిపోయి నష్టాన్ని సూచిస్తుంది.

నివారణ ఇలా..

కొమ్ముపురుగును ఒక తీగ ఉపయోగించి బయటకు తీసిన తర్వాత 25 గ్రాముల కార్బరిల్ మందును 10 గ్రాముల తడి ఇసుకలో కలిపి మొవ్వులో ఉంచాలి. 30 గ్రాముల వేపపిండిని మొవ్వులో వేయడం ద్వారా నివారించవచ్చు. 20 గ్రాముల కార్బాఫ్ హైడ్రోక్లోరైడ్ గుళికలు మొవ్వులో పెట్టాలి. పిల్ల పురుగులు పెరగకుండా నిరోధించడానికి పెంటకుప్పలపై కార్బరిల్ మందు పిచికారీ చేయాలి. లింగాకర్షక బుట్టలను అమర్చడం వల్ల ఉద్ధృతిని తగ్గించొచ్చు. తోటలను తరచూ కలుపు మొక్కలు లేకుండా ఉంచుకోవాలి.

ఉద్యాన రైతుకు రాయితీల తోడు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: కొత్తగా పండ్లతోటలు, కూరగాయలు, పూలసాగు చేపట్టే రైతులకు అందించే రాయితీల వివరాలను గొల్లప్రోలు ఉద్యానాధికారి రాజశేఖర్ వివరించారు. అర్హులు ఉద్యానశాఖ సిబ్బందికి దరఖాస్తులు అందించాలన్నారు.

- బంతి, చామంతి, గులాబి, లిల్లీ వంటి పూలసాగు చేపట్టేందుకు హెక్టారుకు రూ.20 వేలు, హైబ్రిడ్ కూరగాయలు చేపట్టేందుకు రూ.24 వేలు చొప్పున రాయితీ అందజేస్తారు.

మామిడి తోట

రాయితీ వివరాలు (రూ.లలో)		
పంట	మొదటి ఏడాది	రెండో ఏడాది
మామిడి	30	20
జీడిమామిడి	18	12
బొప్పాయి	18	12
డ్రాగన్‌ఫ్రూట్	1,62,000	1,08,000

- శాశ్వత పందిరిపై హైబ్రిడ్ కూరగాయలు సాగు చేపట్టేందుకు హెక్టారుకు రూ.లక్ష చొప్పున అందిస్తారు.
- ఆయిల్‌పామ్ తోటల సాగుకు హెక్టారుకు మొక్కల రాయితీగా రూ.27,599, నిర్వహణ రాయితీ రూ.5,250, అంతరపంట రాయితీగా రూ.5,250 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు అందజేస్తారు.

తెలుసుకుందాం..

- విద్యుత్తు పంపుసెట్లు, బోరు నీటిని నిల్వ చేసుకునే కుంటలు, వర్మీకంపోస్ట్ యూనిట్ ఏర్పాటుకు, ఆయిల్‌పామ్ కట్టర్, వైర్ మెష్, అల్యూమినియం నిచ్చెన, చాఫ్‌కట్టర్ వంటి పరికరాలకు 50 శాతం రాయితీ వర్తింపజేస్తారు. బిందుసేద్యం ఏర్పాటుకు 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు 90, 5 ఎకరాల కన్నా ఎక్కువ ఉన్న రైతులకు 50 శాతం రాయితీ వర్తింపజేస్తారు.

224 మంది నవ వధువులకు నెహ్రూ ఫౌండేషన్ పెళ్లి కానుక

జగ్గంపేట గ్రామీణం(జగ్గంపేట), న్యూస్‌టుడే: జగ్గంపేట నియోజకవర్గంలో గత ఆరునెలల్లో వివాహం చేసుకున్న 224 మంది నవ వధువులకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం 'పెళ్లి కానుక' అందించారు. ఒక్కొక్కరికి రూ.20వేల వంతున రూ.44.80లక్షలు చెక్కులను అందజేశారు. గోకవరం రోడ్డులోని కాపు కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ నాలుగు మండలాల పరిధిలో ఇప్పటివరకు 434 మంది నవ వధువులకు రూ.86.80 లక్షలు అందజేశామన్నారు. ఊపిరి ఉన్నంతవరకు సేవా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ముఖ్య అతిథి రాష్ట్ర [illegible] సంస్థ ఛైర్మన్, మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి నెహ్రూ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారన్నారు. ఫౌండేషన్ ఛైర్మన్ జ్యోతుల మణెమ్మ మాట్లాడుతూ.. పెళ్లి చేసుకున్నవారు అన్యోన్యంగా జీవించాలన్నారు. ఫౌండర్ జ్యోతుల నవీన్ మాట్లాడుతూ.. తొలుత విద్యకు ప్రాధాన్యమిస్తూ పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణం, కుర్చీలు, బెంచీలు సమకూర్చామన్నారు. ఈయేడాది ప్రత్యేక డీఎస్సీ శిక్షణతో 24 మంది ఉపాధ్యాయులుగా కొలువులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. పలువురికి జ్ఞాపికలు అందజేశారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కావిడి ఉత్సవం

అనపర్తి గ్రామీణం: సుబ్రహ్మణ్యస్వామి షష్ఠిని పురస్కరించుకొని అనపర్తిలోని వీర్రాజు మామిడివద్ద గల కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం కావిడి ఉత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. స్వామి వారి కావిడి భుజాన ఎత్తుకుని ఉత్సవాన్ని ప్రారంభించారు. అర్చకుడు చందుశర్మ విశేష పూజల అనంతరం కావిడి భుజాన ధరించి నేలపై పడుకొని ఉన్న మహిళలను దాటుకుంటూ వెళ్లారు. ఇలా చేస్తే సంతానం కలుగుతుందనే నమ్మకంతో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయం నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి మూర్తులను ప్రత్యేక రథంపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పులు, కోలాట నృత్యాలు నడుమ స్వామి రథంతో పాటు కావిడి ధరించిన భక్తులు గ్రామంలో పేటతుల్లి ఆడుతూ తిరిగారు. వారి పాదాలకు మహిళలు పసుపు నీళ్లు చల్లుతూ స్వాగతం పలికారు.

మహిళలపై నుంచి కావిడి పట్టుకొని దాటుతున్న అర్చకుడు

యాజమాన్య పద్ధతులతో మేలైన దిగుబడి

ఆత్రేయపురం: పంట పొలాల్లో తగు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి ఫలితాలు పొందవచ్చని **కొత్తపేట సబ్‌డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎంవీ రామారావు** సూచించారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

? ప్రశ్న సమాధానం

? మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించి మొక్కలు దెబ్బతింటున్నాయి. నివారణ చర్యలు తెలపండి. **- సుబ్రహ్మణ్యం, రాజవరం**

☛ పురుగు ఉద్ధృతి తక్కువగా ఉంటే క్లోరిఫైరిపాస్ 500 మి.లీ. ఎకరాకు, ఉద్ధృతి ఎక్కువగా ఉంటే స్పైనోసాడ్ 45 శాతం, ఎస్.సి. ద్రావణం 60 మి.లీ. కలిపి మొవ్వు లోపల ఆకులు పూర్తిగా తడిసేలా పిచికారీ చేయాలి.

? కొద్ది రోజుల్లో దాళ్వాసాగు ప్రారంభం కానుంది. ఇందులో వెదజల్లే పద్ధతులు వివరించండి. **- ప్రకాష్, కట్టుంగ**

☛ ఈ విధానంలో సాధారణ పద్ధతి కంటే పది రోజుల ముందుగానే పంట చేతికొస్తుంది. దమ్ము చేసే ముందు జింక, జిప్సం వినియోగించాలి. 15 రోజుల్లో రెండుసార్లు దమ్ము చేయాలి. వెదజల్లే ముందు కిలో విత్తనానికి మూడు గ్రాముల కార్బండిజమ్ లేదా మాంకోజెబ్ పొడిమందు కలిపి చల్లాలి. విత్తనాలు వేసిన తర్వాత చేలో నీటిని పూర్తిగా తొలగించి ఆపై ఎరువు చల్లుకోవాలి.

భారతీయ భాషలపై జాతీయ కార్యశాల

రానున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 8, 9 తేదీల్లో భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం అనే అంశంపై జాతీయ కార్యశాల నిర్వహిస్తున్నట్లు వీసీ ప్రసన్నశ్రీ తెలిపారు. ముఖ్యఅతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు హాజరవుతారన్నారు. దీనికి సంబంధించిన గోడపత్రికను సోమవారం ఆవిష్కరించారు. భారతీయ భాషా సమితి మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ న్యూఢిల్లీ వారి సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. భారతీయ భాషా సమితి సీనియర్ ఎక్స్‌పర్ట్ ఆర్.ఎస్.సర్రాజు, తానా సాహితీ వేదిక అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, భారతీయ భాషా సమితి అకడమిక్స్ కోఆర్డినేటర్ కె.గిరిధరరావు తదితర ప్రముఖులు వస్తారన్నారు. పదజాలంపై మరింత అవగాహన పెంచేందుకు నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ డిగ్రీ కళాశాలల తెలుగు, హిందీ, సంస్కృతం అధ్యాపకులను, పాఠ్యపుస్తకాలు రచించిన విద్యావేత్తలను, భాషాభిమానులను ఆహ్వానిస్తున్నామన్నారు. రిజిస్ట్రార్ కె.వి.స్వామి, ప్రిన్సిపల్ డి.జ్యోతిర్మయి, కార్యశాల కోఆర్డినేటర్ డా.తలారి వాసు తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ తదితరులు

ఉప ముఖ్యమంత్రికి స్వాగతం

కోరుకొండ, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఏలూరు జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ప్రత్యేక విమానంలో రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి, నిడదవోలు మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ ఛైర్మన్ షేక్ వజీరుద్దీన్, ఎస్పీ నరసింహ కిషోర్, ఆర్డీవో కృష్ణ నాయక్, బత్తుల వెంకటలక్ష్మి తదితరులు పవన్‌కు స్వాగతం పలికారు. ఇక్కడ నుంచి రోడ్డు మార్గంలో ఏలూరు జిల్లా పర్యటనకు వెళ్లారు. డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ వై.సత్యకిషోర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ప్రభుత్వాసుపత్రి, కళాశాల ఏర్పాటుకు వినతి

నల్లజర్ల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం ఐ.ఎస్.జగన్నాథపురం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నల్లజర్ల మండలం చీపురుగూడెం వద్ద గ్రామస్థులు, జనసేన శ్రేణులను చూసి కాన్వాయ్ నిలుపుదల చేసి అభివాదం చేశారు. గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల్లోని పిల్లలు చదువుకోవడానికి, తక్షణ వైద్యానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వీటి మధ్యలో ప్రభుత్వ ఆసుపత్రి, కళాశాలను ఏర్పాటు చేయాలని చెల్లు శ్రీనివాస్‌నాయుడు ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌ను కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బత్తుల, బీఆర్ చౌదరి

జూడో ఛాంపియన్ కాకినాడ

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ డీఎస్ఏలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్స్ జూడో బాలుర విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌గా కాకినాడ, ద్వితీయ స్థానంలో తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు నిలిచారు. బాలికల విభాగంలోనూ కాకినాడ క్రీడాకారిణులు ఓవరాల్‌గా రెండో స్థానం సాధించారు. ప్రకాశం జట్టు విజేతగా నిలిచింది. చిత్తూరు ద్వితీయ, విశాఖ తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. సోమవారం జరిగిన ముగింపు వేడుకలకు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యంతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర జట్టును ఎంపికచేశారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో రాష్ట్ర జట్టును ఎంపిక చేస్తామని చెప్పారు. విజేతలకు ముఖ్యఅతిథుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. రాష్ట్ర జూడో సంఘ సీఈవో వెంకట్, జిల్లా కోశాధికారి రమణ, సంఘ ఛైర్మన్ వెంకటకృష్ణారావు, కాజా మస్తాన్, పీవీ తేజ, పవన్ సందీప్, గోవిందు, రామకృష్ణ, గమిడి శ్రీనివాసరావు, ఉషారాణి, తేజ తదితరులు పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన జిల్లా జూడో క్రీడాకారులు

ఖోఖో పోటీల విజేత ప్రకాశం

కాకినాడలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల అండర్-17 బాలుర ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రకాశం జట్టు విజేతగా నిలిచింది. అనంతరం ఖోఖో ఆట ద్వారా ఉద్యోగాలు సాధించిన క్రీడాకారులను జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. డీఎస్‌డీవో సతీష్‌కుమార్, ఎంఈవోలు టీవీఎస్ రంగారావు, కె.శ్రీనివాస్, జిల్లా వ్యాయామోపాధ్యాయులు సంఘ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, మాచరరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శులు కె.శ్రీనివాస్, పి.సుధారాణి, టోర్నమెంట్ సహకార్యదర్శి కె.పట్టాభిరామం, పరిశీలకుడు గురుప్రసాద్, ఖోఖో రాష్ట్ర కార్యదర్శి సీతారామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్	
కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	19,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	17,000-18,000
కొత్త (పచ్చి) కాయ	15,000-16,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో	
ఫారంరేటు	103-00
రిటైల్ లైవ్	130-00
డ్రెస్డ్	189-00
స్కిన్‌లెస్	215-00

అంగన్‌వాడీ కేంద్రంలో బాలుడికి పాముకాటు

గోకవరం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రం వద్దకు వెళ్లిన బాలుడు పాము కాటుకు గురయ్యాడు. వివరాలివీ.. గోకవరం మండలం కృష్ణునిపాలెం గ్రామానికి చెందిన కోటిరెడ్డి సాత్విక్ అనే అయిదేళ్ల బాలుడు గ్రామంలో శివాలయం వెనుక పాత పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రానికి సోమవారం వెళ్లాడు. అక్కడ ఆడుకుంటుండగా పాముకాటుకు గురయ్యాడు. గుర్తించిన స్థానికులు ఆ బాలుడిని గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంటనే చికిత్స అందడంతో బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. అంగన్‌వాడీ కేంద్రం వద్ద పాముల సంచారం ఉండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి

వినాయక చిట్‌ఫండ్ బాధితులకు న్యాయం చేయాలి

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: మూడేళ్ల కిందట సుమారు 500 మంది నుంచి చిట్టీల రూపంలో రూ.30 కోట్లు వసూలు చేసి, బోర్డు తిప్పేసిన వినాయక చిట్స్ అండ్ ఫైనాన్స్ కంపెనీ డైరెక్టర్లపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని బాధితులు కోరారు. దీనిపై ఎస్పీ బిందుమాధవ్‌ని సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన సూచన మేరకు టూటౌన్ సీఐని కలిసి వివరాలు తెలిపారు. తెలుగు జనతా పార్టీ ప్రతినిధి వెంకటేశ్వరరావు, బాధితులు మాట్లాడుతూ రెండేళ్ల కిందట వినాయక మాధవరావు ఒక్కరిపైనే కేసు నమోదు చేశారన్నారు. చిట్ కంపెనీలో ఉన్న మిగతా డైరెక్టర్లు, వారి బంధువులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలుస్తామన్నారు.

జీజీహెచ్‌లో గర్భిణి మృతిపై విచారణ

సాంబమూర్తినగర్(కాకినాడ), మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ జీజీహెచ్‌లో తాళ్లరేవు మండలం చినవలసలకు చెందిన గర్భిణి మల్లీశ్వరి మృతిచెందిన ఘటనపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) జి.రఘునందన్ సోమవారం విచారణ చేపట్టారు. సూపరింటెండెంట్ లావణ్యకుమారితో కలిసి యూనిట్ హెడ్, హెచ్‌ఓడీలు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెన్స్, హౌస్‌సర్జన్లు, పీజీలు, సిబ్బందిని విచారించారు. బాధిత కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తీసుకున్నారు. తొలుత గాడిమొగ పీహెచ్‌సీ సిబ్బందిని పిలిపించి విచారించారు. గర్భిణి తొలుత అక్కడ పీహెచ్‌సీలోనే చికిత్స తీసుకుంది. అక్కడ అంతా బాగానే ఉందని సమాచారం. అనంతరం డీఎంఈ మాట్లాడుతూ నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అన్ని సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జీజీహెచ్ సిబ్బందిపై రోగులు, వారి సహాయకుల నుంచి ఫిర్యాదులొస్తున్నాయని, దీనిపై కూడా విచారణ చేపడుతున్నామని పేర్కొన్నారు. కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్(ఇన్‌ఛార్జి) సుబ్రహ్మణ్యేశ్వరి తదితరులు ఉన్నారు.

వైద్యురాలి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై కేసు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని అత్యవసర వైద్య విభాగం వద్ద ఈ నెల 23న రాత్రి వైద్యురాలి విధులకు ఆటంకం కలిగించిన ఘటనకు సంబంధించి ఇద్దరిపై మూడోపట్టణ పోలీసుస్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. 23న రాత్రి వైద్యసేవలకు జీజీహెచ్‌కొచ్చిన ఇద్దరు వ్యక్తులు విధుల్లో ఉన్న వైద్యురాలితో వాగ్వాదానికి దిగారు. దీనిపై ఆమె 112కు ఫోన్ చేసి మూడోపట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కార్టూనిస్ట్ వినోద్‌కు జాతీయస్థాయి పురస్కారం

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక, సాంస్కృతిక శాఖ, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సహకారంతో మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆన్‌లైన్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కార్టూన్ పోటీల్లో సఖినేటిపల్లికి చెందిన కార్టూనిస్ట్, ఉపాధ్యాయుడు చింతా వినోద్‌కుమార్ గీసిన 'సెల్ ఫోన్ వ్యసనం - పుస్తకానికి దూరం' కార్టూన్‌కు ప్రథమ స్థానం లభించింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి జరిగిన జాతీయ సాంస్కృతిక ఉత్సవాల్లో వినోద్‌కు పురస్కారం, నగదు బహుమతి అందజేసి జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సత్కరించారు. అవార్డు పొందడం చాలా సంతోషంగా ఉందని వినోద్‌కుమార్ తెలిపారు. పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

పురస్కారం స్వీకరిస్తున్న వినోద్

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మణప్పురం ఏ ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 98491 38626

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా సెలరీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ. ✆ 73862 01191.

స్థిరాస్తులపై తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్ స్థిరాస్తి ఏ సంస్థలో ఉన్నా Xerox పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరంలేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ 9396999669.

HEALTH & CARE

SKIN

ఉచిత "బొల్లి మచ్చల" లేజర్ చికిత్స శిబిరం

అవును! మన అమలాపురంలో బొల్లి మచ్చలకు అద్భుత పరిష్కారం

Triple Combination Treatment

అపాయింట్‌మెంట్ పొందిన 25 మంది పేద రోగులకు మాత్రమే. ఉచిత ప్రత్యేక కన్సల్టేషన్ హైదరాబాద్ నుండి

Dr.M.N.Rao, MBBS(OSM), DD(UHS) Skin, Cosmetology & Laser Specialist

తేది: 27.11.2025 (గురువారం) సమయము: ఉ.11గం॥ నుండి మ.2గం॥ వరకు

ప్రదేశం: శ్రీ శ్రీనివాస్ డయాగ్నొస్టిక్స్, వెంకటరమణ థియేటర్ వెనుక, గడియారం స్తంభం, అమలాపురం

BARBIE SKIN & LASER CLINIC

7330696252

JOBS

Siris Electrik Corporation Vizag Requires: Marketing Executives for Rajamundry/Kakinada to Market Electrical Products. Freshers (or) Experience in B2B Segment are welcome. Contact: 9553392229.

Wanted Sales and Marketing person for hair transplantation center at Rajahmundry cont: 7674999906

సేల్స్‌గర్ల్స్ కావలెను. అనుభవం ఉన్నవారు మాత్రమే సంప్రదించండి. భవాని సిల్క్స్, శశికాంత్‌నగర్, కాకినాడ. Contact: 91339 59999

ఆఫీస్‌లో పనిచేయుటకు కంప్యూటర్ వర్క్ చేయగలిగిన యువకుడు కావలెను. Qly: Degree Cont: 92954 01601, రాజమండ్రి వారు మాత్రమే.

రాజమండ్రి దానవాయిపేట నందు పనిచేయుటకు నర్సులు కావలెను. (నో నైట్ డ్యూటీస్) Contact Cell: 76749 99906

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ఫ్లాక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-45 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారుల సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏటీ డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU for Advertisement Contact: 8008597607

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

(c) eenadu

రాజమహేంద్రవరం

కాలం చెల్లిన మందుల సరఫరాపై విచారణ

టి.నగర్, న్యూస్‌టుడే : నారాయణపురం పీహెచ్‌సీలో కాలం చెల్లిన మందులు ఇచ్చారని వస్తున్న వార్తలపై విచారణ చేపట్టినట్లు డీఎంవో శ్రీవల్లి తెలిపారు. సోమవారం పీహెచ్‌సీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 55 యేళ్ల నూర్జహాన్ అనే మహిళ సెప్టెంబరు 6న వైద్య పరీక్షలకు చేయించుకున్నారన్నారు. ఆమెకు బీపీ మందులు ఇచ్చారన్నారు. ఆమెకు నెల రోజులకు మాత్రమే మందులు ఇచ్చారన్నారు. ఆ మందుల కాలపరిమితి నెల పదిహేను రోజులు మాత్రమే ఉందన్నారు. నెల రోజులు దాటిన తర్వాత వినియోగించకుండా ఉంటే వాటిని పక్కన పెట్టాలని అప్పుడే సూచించారన్నారు. కానీ వాటిని వినియోగించకుండా రెండు నెలల తర్వాత కాలం చెల్లిన మందులు ఇచ్చారని సోషల్ మీడియాలో పోస్టు చేశారన్నారని పేర్కొన్నారు.

జీజీహెచ్‌లో భద్రతపై దృష్టి

భద్రతా సిబ్బందికి సూచనలు చేస్తున్న సూపరింటెండెంట్ సత్యనారాయణ

రాజమహేంద్రవరం వైద్యం: రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో భద్రత మరింత కట్టుదిట్టం చేస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. జీజీహెచ్‌లో ఈ నెల 23న రాత్రి వైద్యులు, సిబ్బందిపై కొందరు దురుసుగా ప్రవర్తించిన ఘటనపై సోమవారం ఆయన స్పందించారు. సెక్యూరిటీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాత్రి సమయాల్లో క్యాజువాలిటీ వద్ద కచ్చితంగా ఇద్దరు సెక్యూరిటీ సిబ్బంది ఉండాలన్నారు. అవుట్‌పోస్ట్‌లో పోలీసులు పురుషులే ఉండేలా ఎస్పీకి లేఖ రాస్తామన్నారు. ఇకపై మరింత అప్రమత్తంగా భద్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఐడీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకటరాజు చౌదరి

వెంకటరాజును అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

టి.నగర్, న్యూస్‌టుడే: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా రాజమహేంద్రవరం విజయ డెంటల్ ఆసుపత్రి వైద్యులు ఉప్పలపాటి వెంకటరాజు చౌదరి నియమితులయ్యారు. విజయనగరంలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డాక్టర్ అజయ్ బెనర్జీని కార్యదర్శిగా నియమించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దంత వైద్య విధానాలపై ఈ సమావేశంలో చర్చించారు.

జీతాలు పెంచాలంటూ ఆందోళన

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే : జిల్లా, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాలు, వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగుల ఫెడరేషన్ డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగుల పోరాట దీక్ష చేపట్టారు. అన్ని కేటగిరీలకు జీవో-2ను సవరించి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, జీతాలు పెంచాలని, ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు వంశీకృష్ణరాజు, అధ్యక్షుడు రఘునాథ్, కార్యదర్శి ఎ.వీరవెంకట్రావు, ఉపాధ్యక్షుడు సీహెచ్.దుర్గాప్రసాద్, ట్రెజరర్ కె.వీరపండు, ఎం.రాజు, వెంకట్, పెద్దసంఖ్యలో సమగ్రశిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల నిరసన

ఆలకించండి.. పరిష్కరించండి..!

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం : వారంతా అర్జీదారులు.. మౌలిక సదుపాయాల సమస్యలతో కొందరు.. భూవివాదాలతో మరికొందరు... సంక్షేమ పథకాల లబ్ధి కోసం ఇంకొందరు..ఇలా వివిధ సమస్యలతో కలెక్టరేట్‌కు వచ్చారు. సోమవారం ఇక్కడ జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతులు అందించారు. ● రీ సర్వే నివేదిక సవరణ కోరుతూ స్థానిక కోటిలింగాలపేటకు చెందిన పి.జగదీష్ అర్జీ అందించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత దస్త్రాలు పరిశీలించి నివేదించాలని అధికారులను ఆదేశించారు. ● యానిమేటర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ యోచన విరమించుకోవాలని కోరుతూ పలు స్వయంసహాయక సంఘాల మహిళలు వినతిపత్రాలు ఇచ్చారు.

హాస్టల్ సమస్యలపై ..

స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతిగృహం-1లో పలు సమస్యలపై రిపబ్లికన్ పార్టీ ప్రధాన రాష్ట్ర కార్యదర్శి నక్కా వెంకటరత్నరాజు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సిబ్బంది కొరత అంటూ ఇక్కడి వంటమనిషి(కుక్)తో కార్యాలయంలో పని చేయించుకుంటున్నారని, సమయానికి భోజనం అందించాలని కోరితే విద్యార్థులపై ఆరోపణలు చేస్తూ కేసులు పెడుతున్నారన్నారు.

వినతులు ఇచ్చేందుకు నిరీక్షిస్తున్న ప్రజలు

మౌలిక సదుపాయాలు కల్పించండి

మౌలిక సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నామని ధవళేశ్వరం రాజీవ్ గృహకల్ప కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలోని 144 కుటుంబాలకు గృహాలు మంజూరు చేశారన్నారు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, సరైన డ్రైనేజీ వ్యవస్థలేక దోమలు విజృంభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు

రిజర్వేషన్లు అమలు చేయాలి

జనాభా దామాషా మేరకు బీసీలను వర్గీకరించి చట్టబద్ధంగా రిజర్వేషన్లు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. పీజీఆర్ఎస్‌లో అధికారులకు వినతిపత్రం అందజేసింది. రిజర్వేషన్ల అమలుకు ముందుగా కులగణన చేయాల్సి ఉందన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, రాజమహేంద్రవరం నగరం , గ్రామీణ నియోజకవర్గాల అధ్యక్షులు బిల్డర్ చిన్న ఇతర నాయకులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ దీక్ష

వెనుకబడిన వర్గానికి చెందిన వృద్ధ దంపతులకు న్యాయం చేయాలంటూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగరానికి చెందిన నాయకులు కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.రామారావు, ఉపచైర్మన్ ఎల్.వి.ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు జార్జి ఆంటోని, ప్రధాన కార్యదర్శి బత్తిన ఏడుకొండలు తదితరులు మాట్లాడుతూ యాదవోలు గ్రామంలో 50 ఏళ్లుగా నివాసముంటున్న వృద్ధ దంపతులు రమణయ్య, అంజమ్మలపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి దాడి చేసి, ఇంటి నుంచి బయటకు గెంటివేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్‌ను కలిసి బాధిత వృద్ధ దంపతులకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు.

వినతుల స్వీకరణ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని ఏఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ పేర్కొన్నారు. ఎస్పీ నరసింహకిషోర్ ఆధ్వర్యంలో సోమవారం రాజమహేంద్రవరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఫిర్యాదులతో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 36 మందితో నేరుగా మాట్లాడి వారి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.

ర్యాంపు పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

ర్యాంపులో ఏం జరుగుతోంది..?

రాష్ట్ర హై కోర్టు ఆదేశాల మేరకు కలెక్టర్ కీర్తి చేకూరి సోమవారం రాత్రి ధవళేశ్వరం గాయిత్రి ర్యాంపును పరిశీలన చేశారు. ఇసుక డంపింగ్ యార్డుకు సంబంధించి బొబ్బ ఆనందకుమార్ ఫిర్యాదు మేరకు అటవీ శాఖ అధికారులు, బోట్స్ మ్యాన్ సొసైటీ తదితరులు మధ్య భూ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు విచారణ చేపట్టి నివేదికను కోర్టుకు అందిస్తామని కలెక్టర్ తెలిపారు.

–న్యూస్‌టుడే, టి.నగర్

వీరే మన గిరిజన యోధులు..!

జనజాతి గౌరవ దివస్ సందర్భంగా జార్ఖండ్ వీరుడు, గిరిజన స్వాతంత్ర్య సమర యోధుడు బిర్సాముండా జయంతి వేడుకలు క్వారీపేట మున్సిపల్ పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని శాంతకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ట్రైబల్ రైట్స్ ఫౌండర్ ఆర్ఎస్ వరహాల దొర ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

–న్యూస్‌టుడే, శ్యామలా సెంటర్

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజేతలతో పాఠశాల యాజమాన్యం

చరవాణులకు దూరంగా ఉండాలి

● 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: నగరంలోని శాటిలైట్‌సిటీ జిల్లా పరిషత్ పాఠశాలలో ఈనాడు ఈటీవీ ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు సోమవారం జరిగాయి. విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం అంశంపై జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని ఎన్.ప్రశాంతి మాట్లాడుతూ చరవాణుల కారణంగా విద్యార్థులు వ్యాయామ కార్యక్రమాలకు దూరమవుతున్నారన్నారు. బి.ప్రేమలత (9వ తరగతి), వి.కార్తీక్ (10వ తరగతి), ఆర్.లోకేష్ (9వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను ప్రశాంతి, సహాయ ప్రధానోపాధ్యాయుడు డి.రాముడు బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా కె.శ్రీనివాసు వ్యవహరించారు.

ఖాళీలు భర్తీ చేయాలని వినతి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: ఖాళీగా ఉన్న ఆశాకార్యకర్తల పోస్టులు భర్తీ చేయాలని సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో ఆశావర్కర్ల యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో ఆశాకార్యకర్తల పోస్టులు 300కుపైగా ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. వీటిలో ఆరునెలల కిందట 30 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి నేటికీ భర్తీ చేయలేదన్నారు. వెంటనే పోస్టులు భర్తీ చేయాలని అధికారులను కోరారు.

అపూర్వ సమ్మేళనం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : వంకాయలవారి వీధిలో గతంలో ఉన్న మార్కెట్ ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్ (నాయుడు గారి బడి) 1982- 1987లో ఒకటో తరగతి నుంచి ఐదోతరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ది ఐరన్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో సుదీర్ఘ కాలం తర్వాత కలుసుకున్న స్నేహితులంతా జీవితంలో తాము సాధించిన విజయాలు, అలనాటి ముచ్చట్లు పంచుకున్నారు. అప్పటి గురువులు పసలపూడి కృష్ణమూర్తి, సీతామహాలక్ష్మి, అంజమ్మ తదితరులను సత్కరించారు. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన 35 మంది పూర్వవిద్యార్థులు హాజరయ్యారు.

వేలాడుతున్న ప్రమాదం

స్థానిక గౌతమిఘాట్‌కు వెళ్లే మార్గంలో అరటి పళ్ల మార్కెట్ సమీపంలో వీధి దీపానికి సంబంధించి విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా బయట నేలపైనే చేతికందేలా ఉన్నాయి. పొరపాటున మూగజీవాలు లేదా ఎవరైనా వీటిని తాకితే విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంది. ప్రమాదాలు జరగకుండా వెంటనే తగిన రక్షణ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే,దేవీచౌక్

కొరవడిన చైతన్యం

నగరంలోని చాలా ప్రాంతాల్లో కాలువల్లో చెత్త, పూడిక పేరుకుపోయింది. చెత్తను ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య సిబ్బంది సేకరిస్తున్నా.. ప్రయోజనం ఉండటం లేదు. ఆయా ప్రాంతాల్లో పురపాలిక సిబ్బంది 'చెత్త వేయరాదు' అంటూ బోర్డులు ఏర్పాటు చేసినా కొంతమంది అక్కడే చెత్త వేస్తుండటం గమనార్హం. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

రహదారిపై ఇసుకతో వెతలు

నగరంలో నిత్యం రద్దీగా ఉండే మార్గాల్లో ఒకటైన పేపరు మిల్లు నుంచి కాతేరు వెళ్లే మార్గంలో సుమారు కిలోమీటరు పొడవునా ఇసుక ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నగరం మీదుగా విజయవాడ వైపు వెళ్లే బస్సులు, భారీ వాహనాలు ఈ మార్గం నుంచే ప్రయాణిస్తుంటాయి. ద్విచక్ర వాహనాలు, పాఠశాల బస్సులతో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన మార్గం ఇది. సంబంధిత అధికారులు స్పందించి ఇసుకను తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

ముంచెత్తిన మురుగు

నగరంలోని ఆల్కట్‌తోట ప్రాంతంలో వీధులు చెత్త, మురుగునీటితో అధ్వానంగా మారాయి. మురుగు కాలువల్లో పూడిక తొలగించడం లేదు. ఈ ప్రాంతంలో కాలువ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి వీధులన్నీ మురుగు నీటిలోనే ఉన్నాయి. సోమవారానికి మురుగంతా రహదారిపైకి చేరింది. మంచి నీటి కుళాయిలు ఈ నీటిలో మునిగిపోయాయి. గతంలో ఈ ప్రాంతంలో తీవ్ర స్థాయిలో డయేరియా ప్రబలింది. ఈ నేపథ్యంలో తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

కుంగిన మార్గం

రాజమహేంద్రవరం కోరుకొండరోడ్డులోని సీటీఆర్ఐ క్వార్టర్స్ ఎదురుగా నడక మార్గం కుంగిపోయి, బీటలుబారి ప్రమాదకరంగా ఉంది. దీనిపై నడిచేందుకు భయపడాల్సిన పరిస్థితి. కోరుకొండరోడ్డులో ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు కాలువలపై నడక మార్గాలు చాలా వరకు దెబ్బతిన్నాయి. వీటికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, దేవీచౌక్

పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ సర్వే

వివరాలు తెలుసుకుంటున్న డీఐ బి.దిలీప్‌కుమార్

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) సర్వే నగరంలోని పాఠశాలల్లో ప్రారంభమైనట్లు డీఐ దిలీప్‌కుమార్ తెలిపారు. స్థానిక వీరభద్రపురం స్పెషల్ నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన సర్వే ఆయన పరిశీలించారు. విద్యార్థుల్లో తెలుగు, గణితం, ఆంగ్లభాషలో విద్యార్థి స్థాయిని మదింపు చేస్తారన్నారు. ఈ ప్రక్రియ డిసెంబరు 3నాటికి పూర్తవుతుందన్నారు.

సముద్రంలో గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

పెదవాల్తేరు (విశాఖపట్నం): విశాఖలోని సముద్రంలో గల్లంతైన రాజమహేంద్రవరానికి చెందిన విద్యార్థి మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. ఈనెల 22న సాయంత్రం బీచ్‌రోడ్డు ఎం.జి.ఎం. పార్కు వెనుక లైట్‌హౌస్ సమీపంలో ఇద్దరు విద్యార్థులు సాగరంలో స్నానానికి దిగారు. అలల తాకిడికి ఇద్దరూ గల్లంతవగా అదే రోజు మూడో పట్టణ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. 23న సాలూరు ప్రాంతానికి చెందిన మానేపల్లి తేజేష్ మృతదేహం ఒడ్డుకు చేరింది. సోమవారం ఉదయం రాజమహేంద్రవరానికి చెందిన ఆదిత్య (20) మృతదేహం ఎంజీఎం పార్కు సమీపంలో తీరానికి కొట్టుకొచ్చింది. పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించినట్లు సీఐ పైడయ్య తెలిపారు. వీరిద్దరూ బుల్లయ్య కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నారు.

ఉరేసుకుని ఉద్యోగి ఆత్మహత్య

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సొంతంగా వ్యాపారం చేసుకుంటానంటే ఇంట్లో వాళ్లు వద్దన్నారని ఓ వ్యక్తి మనస్తాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని గంటాలమ్మగుడి వీధికి చెందిన గాజాని అర్జున్‌కుమార్(35) ఓ ఎలక్ట్రికల్ దుకాణంలో మేనేజర్ గా ఉద్యోగం చేస్తున్నారు. తాను పని చేస్తున్న దుకాణంలోనే పంకాకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, నాలుగేళ్ల పాప ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడోపట్టణ పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): క్వారీ మార్కెట్ సమీపంలో సిద్ధార్థ నగర్‌కు చెందిన భీమాన శ్రీనివాస్ ఈ నెల 13 నుంచి కనిపించడం లేదని అతని భార్య లక్ష్మీదేవి సోమవారం మూడోపట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పుష్కర పనుల నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

కలెక్టరేట్(రాజమహేంద్రవరం): గోదావరి మహా పుష్కరాలు-2027కు జిల్లాలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి అవసరమైన నిధుల మంజూరుకు శాఖల వారీగా అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై విభాగాల వారీగా అధికారులతో సమీక్షించారు. అనంతరం జిల్లా రెవెన్యూ, అభివృద్ధి, హౌసింగ్, సంక్షేమ శాఖల అధికారులతో పలు సమస్యలపై చర్చించారు. హౌసింగ్, సర్వే పురోగతి, రెవెన్యూ వివాదాల పరిష్కారం, పారదర్శక సేవలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్‌యోజనలో భాగంగా గృహాల మంజూరుకు చేపట్టిన సర్వే ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు.

టి.నగర్: గోదావరి పుష్కరాలను సమర్థంగా నిర్వహించేందుకు శాఖల వారీగా నిర్దిష్ట అంచనాలు రూపొందించాలని కమిషనర్ రాహుల్‌మీనా సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమీక్షలో కమిషనర్ మాట్లాడారు. విభాగాల వారీగా చేపట్టాల్సిన పనులపై నివేదిక రూపొందించాలన్నారు. అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, దేవాదాయ శాఖ అధికారి వెంకట సుబ్బారావు, ఎస్ఈ తిలక్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌కు మూత ఏర్పాటు

నగరంలోని నిత్యం రద్దీగా ఉండే ప్రాంతమైన మెయిన్ రోడ్డులో ఇసుక వీధిలో మ్యాన్‌హోల్ గ్రిల్ పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. గ్రిల్ మధ్యలో ఊచలు పాడై పాదచారులు, వాహనదారులకు అవస్థలు తప్పడం లేదని గత నెల 'ఈనాడు'లో ప్రచురించిన చిత్రకథనానికి సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి, మ్యాన్‌హోల్‌కు మూత ఏర్పాటు చేశారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

స్పందనకు వందనం

ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచండి

యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు, ఉద్యోగుల ప్రదర్శన

వి.ఎల్.పురం: పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులను పెంచాలని, హైడ్రాలిక్ డోర్లు ఏర్పాటు చేసి మహిళా ప్రయాణికులు ప్రమాదాలకు గురి కాకుండా చూడాలని ఏపీ పీటీడీ యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో వద్ద గేట్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రావు, డిపో కార్యదర్శి బి.ఆర్.కె.కుమారి, అధ్యక్షుడు ఎ.ఎస్.నారాయణ తదితరులు మాట్లాడారు. ఎటువంటి అదనపు బస్సులు ఏర్పాటు చేయకుండా స్త్రీశక్తి అమలు చేయడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అన్ని సర్వీసులకు రన్నింగ్ సమయాలు నిర్ధారించి రీషెడ్యూల్ చేసి సమయానుకూలంగా బస్సులు తిరిగేలా చూడాలన్నారు. అనంతరం ఆర్టీసీ డీఎం కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. గేట్‌మీట్‌లో అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో మెరుగైన ఫలితాలు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఉద్యోగుల సమష్టి కృషితో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. జల్ సంచాయ్ అవార్డు అందుకున్న నేపథ్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారదర్శకతతోనే లక్ష్యాలు చేరుకోగలమన్నారు. అనంతరం ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాల్లో సిబ్బందిని సత్కరించి మెమెంటోలు అందజేశారు. మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మెమెంటో అందిస్తున్న కమిషనర్ రాహుల్ మీనా

టిడ్కో లబ్ధిదారులకు త్వరలో రుణాలు

టి.నగర్: టిడ్కో లబ్ధిదారులకు రుణాలపై అవగాహన కల్పించాల్సి ఉందని అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర పరిధిలో 304 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు తెలిపారు. వీరికి త్వరలో రుణాలు మంజూరు చేస్తామన్నారు. ప్రాజెక్టు జిల్లా డైరెక్టర్ కనకరాజు, డీసీఓ ప్రసాద్, సీఎంఎం రామలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలంటూ ఆందోళన

వి.ఎల్.పురం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో పేపరుమిల్లు గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్ ప్రతులను దహనం చేశారు. లేబర్ కోడ్‌లతో కార్మికులకు నష్టం జరుగుతుందని, వీటి అమలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు అరుణ్, ఏఐటీయూసీ నాయకులు రామారావు, రాంబాబు, ప్రధాన కార్యదర్శి పవన్, పేపరుమిల్లు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలలకు ట్యాబ్‌లు

ట్యాబ్‌లతో ప్రధానోపాధ్యాయులు

శ్యామలా సెంటర్: జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలల్లో పాల్‌ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నామని డీఎస్ఈవో వాసుదేవరావు తెలిపారు. దీనికి సంబంధించి ఒకరోజు శిక్షణ కార్యక్రమం స్థానిక ఇన్నీసుపేట ప్రభుత్వ బాలుర పాఠశాలలో ప్రారంభించారు. పాల్‌ల్యాబ్‌లకు అవసరమైన ప్రత్యేక ట్యాబ్‌లను ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెరగడానికి పాల్‌ల్యాబ్‌లు ఉపయోగపడతాయన్నారు. పాల్‌ల్యాబ్ స్టేట్ కన్వీనర్ రూపేష్, పరిశీలకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రీపెయిడ్ స్టాండ్‌లు ఏర్పాటు చేయండి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: నిత్యం రద్దీగా ఉండే స్థానిక ప్రధాన రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల భద్రతలో భాగంగా ప్రీపెయిడ్ ఆటో, ట్యాక్సీ స్టాండ్‌లను ఏర్పాటు చేయాలని రైల్వేస్టేషన్ అభివృద్ధి సలహా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం, సత్యప్రసాద్, హరిరామ్, రామారావు, యానాపు ఏసు తదితరులు సోమవారం అడిషనల్ ఎస్పీ ఎన్.బి.ఎం. మురళీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఒరిజినల్ దస్తావేజు పోయినది
వేమన శ్రీదేవి w/o వెంకటేశ్వర్లు డోర్.నెం 46-6-38 శివాలయం వీధి జాంపేట రాజమండ్రి తూ॥గో॥జిల్లా నివసిస్తున్న నా యొక్క ఒరిజినల్ దస్తావేజు నెంబరు.5293/2004 తేది. 3-8-2004 సం॥ర రాజమండ్రి,జిల్లా రిజిష్టర్ రాజమండ్రి కిమ్మత్తు స్థిరాస్తి w/o దానపట్టా దస్తావేజు ఒరిజినల్ దస్తావేజు ది. 20-11-2025 తేదిన రాజమండ్రి కోటిపల్లి బస్‌స్టాండ్ నందు కలర్ జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా కోటిపల్లి బస్‌స్టాండ్ మార్గం మధ్యలో పడిపోయింది. ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కి తెలియజేయగలరు. వేమన శ్రీదేవి w/o వెంకటేశ్వర్లు డో.నెం. 46-6-38 శివాలయం వీధి జాంపేట రాజమండ్రి తూ॥గో॥జిల్లా సెల్:8332893947

(c) eenadu

ఏపీఎం, సీసీలపై చర్యలకు డిమాండ్

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరం మండలం వెలుగు ఏపీఎం జి.సునీత, సీసీ లక్ష్మిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కొండగుంటూరులోని డ్వాక్రా సంఘాల కలెక్టరేట్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై గతంలో అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. నిధుల విషయంలో వారు అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. విచారణ చేసి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వీవోఏ దాట్ల లలితకు మూడు నెలలుగా గౌరవ వేతనం ఇవ్వట్లేదన్నారు. ఆమెకు వెంటనే జీతం మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

విద్యుత్తు స్తంభాల ఏర్పాటుపై విజిలెన్స్ విచారణ

రంగంపేట: మండలంలోని జి.దొంతమూరులో విద్యుత్తు స్తంభాల ఏర్పాటుపై సోమవారం విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. గతంలో విద్యుత్తు స్తంభాలు కూలడంతో వాటి స్థానంలో తిరిగి ఏర్పాటు చేశారు. అందులో అవకతవకలు జరిగాయని, ఒక్కో పోల్ కూడా మరోచోట నిలబెట్టారని సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యుత్తు ఏఈ తోట శిరీష, రెవెన్యూ ఉద్యోగులతో మాట్లాడి వివరాలు నమోదు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
ధవళేశ్వరం: 91212 29057
కడియం: 91212 29062
అనపర్తి: 95333 66637
ఉ 10 - మ 1

పేరుకుపోయిన వ్యర్థాలు..

సమస్య: శాటిలైట్ సిటీ-బి బ్లాక్‌లో ప్రధాన రహదారి పక్కన వ్యర్థాలు పేరుకుపోయాయి. ఆ ప్రాంతమంతా దుర్వాసనతో నిండిపోయింది. పశువులు వాటిని రోడ్డుపైకి లాగి అపరిశుభ్రంగా మారుస్తున్నాయి.
- ఎం.శాంతి, స్థానికురాలు

సమాధానం: తప్పకుండా చెత్త తొలగిస్తాం. రోజూ పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటున్నాం. - బి.కృష్ణ, పంచాయతీ కార్యదర్శి
- న్యూస్‌టుడే, మోరంపూడి

కొత్తవారు రాక.. ఉన్నవారిపైనే పనిభారం

- న్యూస్‌టుడే, హుకుంపేట, కొంతమూరు, సీతానగరం

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, సామాన్యులకు ఆరోగ్య సేవలు అందించడంలో, సమాచారం పంపిణీలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషిస్తుంటారు. నేషనల్ హెల్త్ మిషన్ నిబంధన ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 1,000 జనాభాకు ఒకరు, పట్టణ ప్రాంతాల్లో 2వేలమంది జనాభాకు ఒకరు పనిచేయాలనే నిబంధన ఉంది. జనాభా పెరుగుదల, అందుకు తగిన సిబ్బంది లేకపోవడంతో పనిభారం పెరుగుతుందని వారు వాపోతున్నారు. హెల్త్‌సెంటర్ల పరిధిలో 4వేల నుంచి 5వేల జనాభా ఉన్న ప్రాంతాల్లో ఒకరు, ఇద్దరు పనిచేస్తున్నారు. వీటికి తోడు సర్వేలు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. జిల్లాలో ఆశా కార్యకర్తల నియామకానికి గతంలో నోటిఫికేషన్ ఇచ్చారు. నెలలు గడుస్తున్నా నియామకాలు జరగలేదు. రాజమహేంద్రవరం గ్రామీణం, రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల పరిధిలో కొత్తగా 50 మందికి పైగా అవసరం ఉందని అంచనా. ఈ సమస్యపై సోమవారం కలెక్టర్ కీర్తి చేకూరికి వినతిపత్రం అందజేశారు. పనిభారం తగ్గించాలని కోరారు.

గ్రామీణంలో సర్వే చేస్తున్న ఆశా కార్యకర్త

పెరుగుతున్న అవసరాలు..

రాజమహేంద్రవరం గ్రామీణ పరిధి పిడింగొయ్యిలో ఒకరు, శాటిలైట్‌సిటీ-డి బ్లాక్‌లో 11 మందిలో ఇద్దరు పదవీ విరమణ చేశారు. వారి పనిభారం మరొకరిపై పడింది. కొంతమూరులో 3, కాతేరులో 5 గురు విధులు నిర్వహిస్తున్నారు. తొర్రేడులో జగనన్న కాలనీలు ఏర్పడటంతో ఆశాల అవసరం మరింత ఏర్పడింది.

ఇవీ ప్రధాన విధులు..

● పిల్లలకు, మహిళలకు టీకాలు వేయడం. ● గర్భిణుల వివరాలు నమోదు. ప్రసవాల సమయంలో ఆసుపత్రికి తీసుకెళ్లడం. ● లెప్రసీ, ఫీవర్ సర్వేల నిర్వహణ. ● ఎప్పటికప్పుడు వివరాలు నమోదు. ● వీటికి అదనంగా కొత్తగా వచ్చే ఆదేశాలకు అనుగుణంగా సర్వేలు. ● ప్రత్యేక సందర్భాల్లో వైద్య శిబిరాల నిర్వహణ. ● దీనిపై దుళ్లేశ్వరం పీహెచ్‌సీ వైద్యుడు ఆర్.వి.వి.సత్యనారాయణను సంప్రదించగా గ్రామాల్లో కొరత ఉందన్నారు. ప్రస్తుతం ఉన్నవారితో సేవలు అందిస్తున్నామన్నారు. ఉన్నతాధికారులకు సమస్య తెలియజేశామన్నారు.

పీహెచ్‌సీ/ పీహెచ్‌సీల పరిధిలో..

మండలం	ఖాళీలు	ఆశావర్కర్లు
రాజమహేంద్రవరం గ్రామీణం	1	79
కడియం	1	60
కోరుకొండ	3	71
అనపర్తి	2	165
రాజానగరం	2	67

కొత్తవారిని నియమించలేదు..

2019 నుంచి 2025 వరకు చాలా మంది పదవీ విరమణ చేశారు. మరి కొంత మంది వివిధ కారణాలతో మృతిచెందారు. వారి స్థానాల్లో కొత్తవారిని భర్తీ చేయలేదు. వారి కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా ఉద్యోగం ఇస్తే కుటుంబానికి భరోసాగా ఉంటుంది. సిబ్బంది కొరత, పనిభారంతో ఇబ్బందులు పడుతున్నాం.

- ఎం.వెంకటలక్ష్మి, ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

అనపర్తిలో మంత్రి మనోహర్ పర్యటన నేడు

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ అనపర్తి నియోజకవర్గంలో మంగళవారం పర్యటించనున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం బలభద్రపురంలోని రైతుసేవా కేంద్రానికి వస్తారు. అక్కడ రైతులతో సమావేశం అవుతారు. అనంతరం అనపర్తి మండలం పొలమూరులో జరిగే రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొంటారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొననున్నారు.

ఒరిజినల్ దస్తావేజు పోయినది

వేమన శ్రీదేవి w/o వెంకటేశ్వర్లు డో.నెం. 46-6-38 శివాలయం వీధి జాంపేట రాజమండ్రి తూగోజిల్లా [illegible] ఒరిజినల్ దస్తావేజు నెంబరు.5293/2004 తేది. 3-8-2004 [illegible] 20-11-2025 [illegible] పడిపోయింది. ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కి తెలియజేయగలరు. వేమన శ్రీదేవి w/o వెంకటేశ్వర్లు డో.నెం. 46-6-38 శివాలయం వీధి జాంపేట రాజమండ్రి తూ॥గో॥జిల్లా సెల్:8332893947

ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
కాతేరు బ్రాంచ్, 60-12-01, కోరుకొండ రోడ్డు, పి & టి కాలనీ, రాజమండ్రి : ఫోన్ నెం. : 0883-2442782

స్వాధీనతా ప్రకటన
(అనుబంధం -IV సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 యొక్క రూల్ 8(1) ప్రకారం)
(స్థిరాస్తి కొరకు)

దిగువ సంతకందారుడు ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, కాతేరు బ్రాంచ్ అధీకృత అధికారి వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (చట్టం 2002 యొక్క 54) మరియు 2002 నాటి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనల 2002 లోని నిబంధన 3 తో చదువుకొనేలా చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద లభించిన అధికారాలను వినియోగించుకొని ఋణగ్రహీత : శ్రీ వీరమల్లు సత్యనారాయణ (103327), తండ్రి : సత్యనారాయణ, డి.నెం. 115-18-326, భవానీపురం, శానిటోరియం వెనుక వైపు, రాజమండ్రి : తూ.గో.జిల్లా, ఆం.ప్ర. వారికి నోటీసులో తెలిపిన బకాయి MORT LOAN లోన్ ఖాతా నెం.12412 కు చెంది రూ.7,66,632/- (అక్షరాల ఏడు లక్షల అరవై ఆరు వేల ఆరు వందల ముప్పై రెండు రూపాయలు మాత్రమే) మరియు MORT LOAN లోన్ ఖాతా నెం.12607 కు చెంది రూ.1,96,039/- (అక్షరాల ఒక లక్షా తొంభై ఆరు వేల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రమే) మొత్తం కలిపి తేది.30-09-2024 నాటికి రూ.9,62,671/- (అక్షరాల తొమ్మిది లక్షల అరవై రెండు వేల ఆరు వందల డెబ్బై ఒక్క రూపాయలు మాత్రమే) తేది.01-10-2024 నుండి జమకూడు భవిష్య వడ్డీ, అయిన ఖర్చులు, ఛార్జీలు, కాస్ట్స్ మొదలగు వాటితో సహా నోటీసు అందిన 60రోజుల లోగా చెల్లించమని కోరుతూ తేది.04-12-2023న డిమాండ్ నోటీసు ఇవ్వడమైనది.

సదరు బకాయి మొత్తాన్ని ఋణగ్రహీత చెల్లించనందు వలన క్రింద వివరించిన ఆస్తులను సదరు నిబంధనలులోని నిబంధన 8 తో చదువుకొనే చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద లభించిన అధికారాలను వినియోగించుకొని తేది.20-11-2025న క్రింది సంతకందారుడు స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీత/హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

సదరు ఆస్తులతో ఎవ్వరూ ఎలాంటి వ్యవహారం చేయరాదని మరియు ఒక వేళ ఎవ్వరైనా సదరు ఆసులతో వ్యవహారం చేసినచో ఋణగ్రహీతలు చెల్లించాల్సిన బకాయి మొత్తం MORT LOAN లోన్ ఖాతా నెం.12412 కు చెంది రూ.7,66,632/- (అక్షరాల ఏడు లక్షల అరవై ఆరు వేల ఆరు వందల ముప్పై రెండు రూపాయలు మాత్రమే) మరియు MORT LOAN లోన్ ఖాతా నెం.12607 కు చెంది రూ.1,96,039/- (అక్షరాల ఒక లక్షా తొంభై ఆరు వేల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రమే) మొత్తం కలిపి తేది.30-09-2024 నాటికి రూ.9,62,671/- (అక్షరాల తొమ్మిది లక్షల అరవై రెండు వేల ఆరు వందల డెబ్బై ఒక్క రూపాయలు మాత్రమే) తేది.01-10-2024 నుండి జమకూడు భవిష్య వడ్డీ, అయిన ఖర్చులు, ఛార్జీలు, కాస్ట్స్ మొదలగు వాటితో సహా మొత్తాలకు ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, కాతేరు వారి ఛార్జ్‌కి లోబడి ఉండునని ముఖ్యంగా ఋణగ్రహీత / హామీదారు / సహ-దరఖాస్తుదారుల కు మరియు ప్రజలకు ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

శ్రీ వీరమళ్ళ సత్యనారాయణ (103327), తండ్రి : బాపనయ్య గారు యజమానిగా గల ఆస్థి యొక్క వివరములు : డాక్యుమెంట్ ప్రకారం గల షెడ్యూలు

ఆస్థి షెడ్యూలు

రిజిష్టర్డు అమ్మకం దస్తావేజు డాక్యుమెంట్ నెం.4890/2003, తేది.28-08-2003 ప్రకారం వీరమళ్ళ సత్యనారాయణ, తండ్రి : సత్యనారాయణ గారికి చెందినది. : తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి జిల్లా రిజిస్ట్రార్ పరిధి, రాజమహేంద్రవరం రూరల్ మండలం, కొలమూరు గ్రామ పంచాయితీ ఏరియా, కొలమూరు గ్రామం తాలూకా, జిరాయితీ మెట్ట భూమి ఆర్.యస్.నెం.349 లోని ఎకరా పూర్తి విస్తీర్ణం ఎ.12.68 సెంట్లులో ఎ.4.20 సెంట్లు విస్తీర్ణం గల భూమి లే అవుట్ ఇంటి ప్లాట్లుగా మార్చబడిన వాటిలో ప్లాటు నెం.26 లోని పడమర వైపు భాగం 250 చ.గ.లు విస్తీర్ణం అందలి ఉత్తరం వైపు 125 చ.గ.లు విస్తీర్ణం. హద్దులు : తూర్పు : ఈ నెంబరులోని ఇతరులకు చెందిన ప్లాటు స్థలము---30.0 అ.లు, దక్షిణం : అయితాబత్తుల ఝాన్సీ గారి 125 చ.గ.ల స్థలము---37.6 అ.లు, పడమర : 30 అడుగులు వెడల్పు రోడ్డు---30.0 అ.లు, ఉత్తరం : 30 అడుగులు లే అవుట్ ప్లాను రోడ్డు---37.6.
ఈ పై హద్దుల మధ్య 125 చ.గ.లు విస్తీర్ణం గల స్థలము అందలి నిర్మాణాలు అన్ని యాజిమెంట్ హక్కులతో కలవు.

తేది : 20.11.2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : కాతేరు ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్

హుండీల ఆదాయం లెక్కింపు

బిక్కవోలు: బిక్కవోలు గోలింగేశ్వరస్వామి, లక్ష్మీగణపతి స్వామివారి ఆలయాల హుండీలను సోమవారం లెక్కించారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో తెరిచి, భక్తులు సమర్పించిన కానుకలు, నగదు లెక్కించారు. బిక్కవోలు లక్ష్మీగణపతి స్వామి ఆలయంలో హుండీ ఆదాయం రూ.12,08,715, గోలింగేశ్వర స్వామి వారి హుండీ ఆదాయం రూ.3,12,268 వచ్చినట్లు దేవస్థానం ఈవో భాస్కర్ చెప్పారు.

ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్

జగ్గంపేట: అన్న క్యాంటీన్లు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేటలో సోమవారం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో భోజనాలు వడ్డించారు. గోకవరానికి చెందిన తెదేపా నాయకులు గండ్రెడ్డి సన్యాసిరావు ఆర్థిక సహకారంతో కార్యక్రమం నిర్వహించారు.

పట్టాభి సీతారామయ్య జయంతి

రంగంపేట: ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకుడు పట్టాభి సీతారామయ్య 145వ జయంతిని సోమవారం రంగంపేట మండలం సుభద్రంపేటలో నిర్వహించారు. బ్యాంకింగ్ సేవలను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చిన మహనీయుడు పట్టాభి సీతారామయ్య అని సినీ విశ్లేషకుడు అడబాల మరిడయ్య పేర్కొన్నారు. ఆయన చిత్రపటానికి పేపకాయల కాశీవిశ్వేశ్వరుడు, నివాళులర్పించారు.

ప్రకృతి సేద్యంతో ప్రయోజనాలు

బొమ్మూరు: రైతుల నుంచి ధాన్యం సేకరించిన 48 గంటల్లో సొమ్ము జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. రాజవోలులో సోమవారం రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ సంక్షోభాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు, లాభసాటిగా మార్చడానికి ప్రభుత్వం నూతన ఒరవడితో వెళ్తోందన్నారు. ఒకే పంట ఎంచుకోకుండా డిమాండ్ ఉన్న పంట ఎంచుకోవాలన్నారు. డ్రోన్లు, యాంత్రీకరణ వినియోగం, భూసార పరీక్షల వంటి ఆధునాతన విధానాలు అవలంబించాలన్నారు. రాయితీలో డ్రిప్ ఇరిగేషన్ సౌలభ్యం కల్పిస్తున్నామన్నారు. అధిక మోతాదులో రసాయనాలు వినియోగించకుండా, ప్రకృతి సేద్యం చేయాలన్నారు. రైతుల ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌లో వివరాలు నమోదు చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు మత్యేటి ప్రసాద్, సొసైటీ ఛైర్మన్ చెందరాజు, నిమ్మలపూడి రామకృష్ణ, తహసీల్దారు శ్రీనివాసరావు, ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు మొక్క అందిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలి

రాజానగరం: వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు, ప్రధాన శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ సూచించారు. సోమవారం నరేంద్రపురం, శ్రీకృష్ణపట్నం గ్రామాలలో రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, వ్యవసాయ సాంకేతికత, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన కొత్తవరి, మొక్కజొన్న, మినుము, పెసర, నువ్వులు రకాలను వినియోగించుకోవాలన్నారు.

తొస్సిపూడిలో అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

లాభసాటి వ్యవసాయానికి పంచసూత్రాలు

బిక్కవోలు: వ్యవసాయ రంగంలో నవశకాన్ని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం పంచసూత్రాలు ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. తొస్సిపూడిలో రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. వ్యవసాయంలో సంక్షోభాలను శాశ్వతంగా పరిష్కరించి, లాభసాటిగా మార్చటానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతుల ఇళ్లకు వెళ్లి పంచసూత్రాలు, ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్ వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు ధర పంచసూత్రాలుగా రూపుదిద్దుకున్నాయని తెలిపారు. ఎంపీపీ తేతలి సుమ, సర్పంచి కొవ్వూరి సీతారత్నం, కూటమి నేతలు పాల్గొన్నారు.

అనపర్తి గ్రామీణం: అనపర్తి మండలం దుప్పలపూడిలో కార్యక్రమాన్ని తెదేపా నేత నల్లమిల్లి మనోజ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పంపించిన సందేశ లేఖలను, కరపత్రాలను ఆవిష్కరించారు. రైతుల ఇళ్లవద్దకు వెళ్లి ముఖ్యమంత్రి సందేశ లేఖలను అందజేశారు. నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పూడిపోయిన కాలువ..

శాటిలైట్‌సిటీలో ప్రభుత్వ పాఠశాల వెనుక వీధిలో మురుగు కాలువ పూడిపోయింది. ఎండు కొమ్మలు, ఆకులు, చెత్తతో నిండిపోయి మురుగు ముందుకు పారట్లేదు. దుర్వాసనకు తోడు దోమలు విపరీతంగా పెరిగాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, మోరంపూడి

పందుల స్వైరవిహారం..

శాటిలైట్‌సిటీ-బి బ్లాక్ ప్రధాన ప్రవేశ రహదారి పక్కన పందుల సంచారం విపరీతంగా ఉంది. విచ్చలవిడిగా తిరుగుతూ హఠాత్తుగా వస్తున్నాయని వాహన చోదకులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆ ప్రాంతంలో అధికంగా చెత్త పేరుకపోవడంతో వాటి సంచారం అధికంగా ఉంటుందని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మోరంపూడి

ఇరుకు రోడ్డులో ఇబ్బందేగా..!

దివాన్‌చెరువు-శ్రీకృష్ణపట్నం మధ్య రహదారిలో పాఠశాల బస్సులు, ఆటోలు ఎక్కువగా తిరుగుతాయి. పరిమితికి మించిన పిల్లలు, వేలాడే బ్యాగులతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఎదురెదురుగా వచ్చే క్రమంలో ప్రమాదాలకు అవకాశం ఉంది. ఆటో చోదకులు నిబంధనలు పాటించేలా, అన్ని జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, రాజానగరం

కొండంత భక్తితో.. కోరుకొండ షష్ఠికి..

కోరుకొండ: కోరుకొండ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి షష్ఠి వేడుకలు ఆరు రోజుల పాటు అంగరంగవైభవంగా జరగనున్నాయి. జిల్లాల్లో పేరు గాంచిన ఉత్సవాల్లో కోరుకొండ షష్ఠి ఒకటి. ఈనెల 26 నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నాయి. మందుగుండు సామగ్రి భారీగా కాల్చనున్నారు. ఆలయ పునర్నిర్మాణం తర్వాత తొలిసారిగా ఈ ఏడాది ప్రతిష్ఠాత్మకంగా వేడుకలను నిర్వహించనున్నారు. వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడితో పాటు నాగబంధం విగ్రహం ఈ ఆలయంలో ఉండటం విశేషం. పాత ఆలయ ప్రాంగణంలో పాము పుట్టను అలాగే ఉంచారు. తొలిరోజున స్వామివారి దర్శనం కోసం భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఇందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు వుల్లి బుజ్జిబాబు తెలిపారు.

ఆలయం, పరిసరాల్లో ఆకట్టుకునేలా విద్యుత్తు అలంకరణ

ఆధ్యాత్మిక కార్యక్రమాలు

❖ 26న స్వామివారి కల్యాణ మహోత్సవం, వీరభద్రుని సంబరం. ❖ 30న 108 దంపతులతో శాంతి కల్యాణం ❖ 1న స్వామివారి గ్రామోత్సవం.

ఆకట్టుకోనున్న సాంస్కృతిక కార్యక్రమాలు:
❖ 26న సంగీత విభావరి.
❖ 27న బాలుర నృత్య ప్రదర్శన. ❖ 28న మ్యూజికల్ నైట్. ❖ 29న కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శన, వినూత్న బుర్రకథ.
❖ 30న మ్యూజికల్ నైట్.
❖ 1న సంగీత విభావరి.

సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

బిక్కవోలు: పందలపాకలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకల్లో భాగంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈవో రామలింగ భాస్కర్, ప్రసాద్, ఈశ్వర్ ఆలయ కమిటీ ఛైర్మన్ కర్రి శ్రీను, కర్రి అయ్యప్పరెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌యూపీపీ శత వసంతాల వేడుకకు సన్నాహాలు

రాజానగరం: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) స్థాపించి వందేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో శత వసంతాల వేడుక నిర్వహించడానికి జీజీయూలో సంఘ నాయకులు సోమవారం సమావేశం నిర్వహించారు. సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.వి.వి.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఎప్పుడు, ఎక్కడ నిర్వహించాలనే దానిపై చర్చించారు. భవిష్యత్తు కార్యాచరణ రూపొందించారు. సంఘ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.సంపత్‌కృష్ణ, యు.రవిచంద్ర కుమార్, గౌరవ సలహాదారులు టి.గిరిరాజ్, బి.శివారెడ్డి, ఎర్ర స్వామి, టి.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనానికి ప్రతిజ్ఞ

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని నన్నయ విశ్వవిద్యాలయ వీసీ ఎస్.ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో శ్రీరామ్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో దివాన్‌చెరువు సచివాలయం వద్ద సోమవారం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ప్రారంభించారు. వీసీ ప్రసన్నశ్రీ సచివాలయ ప్రాంగణంలో మొక్క నాటారు. విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. వాలంటీర్లు సచివాలయం పరిసరాల్లో మొక్కలు నాటారు. సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపల్ పి.విజయనిర్మల, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణ, పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, రాజానగరం

తెదేపా శ్రేణుల వాగ్వాదం

కోరుకొండ: రాజమహేంద్రవరం విమానాశ్రయంలో తెదేపా శ్రేణులు ఒకరికొకరు వాగ్వాదానికి దిగారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏలూరు జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం విమానాశ్రయానికి వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనకు స్వాగతం పలికేందుకు తెదేపా నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు వచ్చారు. టెర్మినల్ భవనం లోపలికి వెళ్లే నేపథ్యంలో రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రొటోకాల్ లేనివారు లోపలికి వెళ్లారని, తమను ఎందుకు పంపరంటూ కొంతమంది గట్టిగా మాట్లాడారు. ఇరు వర్గాలకు చెందిన నాయకులు ఒకరినొకరు దూషించుకున్నారు. కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొనగా డీఎస్పీ శ్రీకాంత్, సీఐ సత్య కిషోర్ వారితో మాట్లాడారు. అందరికీ నచ్చజెప్పి పంపించడంతో వివాదం సద్దుమణిగింది.

పుష్కర పనుల నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

కలెక్టరేట్(రాజమహేంద్రవరం): గోదావరి మహా పుష్కరాలు-2027కు జిల్లాలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి అవసరమైన నిధుల మంజూరుకు శాఖల వారీగా అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై విభాగాల వారీగా అధికారులతో సమీక్షించారు. అనంతరం జిల్లా రెవెన్యూ, అభివృద్ధి, హౌసింగ్, సంక్షేమ శాఖల అధికారులతో పలు సమస్యలపై చర్చించారు. హౌసింగ్, సర్వే పురోగతి, రెవెన్యూ వివాదాల పరిష్కారం, పారదర్శక సేవలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్‌యోజనలో భాగంగా గృహాల మంజూరుకు చేపట్టిన సర్వే ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు.

ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
కాతేరు బ్రాంచ్, # 60-12-01, కోరుకొండ రోడ్, పి & టి కాలనీ, రాజమండ్రి, ఫోన్ : 0883-2442782.

ముందస్తు అమ్మకం ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 యొక్క రూల్స్ 8(6) మరియు (6) నిబంధనల ప్రకారము జారీచేయబడినది)
సర్ఫేసి చట్టం 2002 ప్రకారం, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్స్ 8(6) r/w 9(1) కింద నోటీసు

ఇక్కడ షెడ్యూల్‌లో మరింత పూర్తిగా వివరించబడిన బ్యాంక్‌కు తనఖా పెట్టబడిన/ఛార్జ్ చేయబడిన సురక్షిత ఆస్తులు ఈ నోటీసు తేదీ నుండి 30 రోజుల వ్యవధి ముగిసిన తర్వాత ఏ తేదీన అయినా పబ్లిక్ ఇ-వేలం ద్వారా విక్రయించబడతాయని దయచేసి గమనించండి. ఇ-వేలం ద్వారా ఆస్తిని వేలం వేయాలని బ్యాంక్ నిర్ణయించినప్పుడు మరియు మీకు ప్రత్యేక పబ్లిక్ ఇ-వేలం నోటీసు పంపబడుతుంది.

వ.నెం.	ఋణగ్రహీత పేరు మరియు చిరునామా మరియు ఆస్థి వివరములు
1)	**ఋణగ్రహీత పేరు మరియు చిరునామా :** 1). శ్రీమతి బత్తిన విజయలక్ష్మి, భర్త : సత్యనారాయణ, డి.నెం.118-1-178, మధురపూడి, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా, 2). శ్రీ బత్తిన సత్యనారాయణ, తండ్రి : సుబ్బారావు, డి.నెం.118-1-178, మధురపూడి, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా. **బకాయి సొమ్ము:** ADVIMMOV లోన్ ఖాతా నెం.117 కు చెంది రూ.7,88,603/- (అక్షరాల ఏడు లక్షల ఎనభై ఎనిమిది వేల ఆరు వందల మూడు రూపాయలు మాత్రమే), ADVIMMOVI లోన్ ఖాతా నెం: 313 కు చెంది రూ.2,24,796/-(అక్షరాల రెండు లక్షల ఇరవై నాలుగు వేల ఏడు వందల తొంభై ఆరు రూపాయలు మాత్రమే) మొత్తం కలిపి తేది.28.02.2025 నాటికి రూ.10,13,399/-(అక్షరాల పది లక్షల పదమూడు వేల మూడు వందల తొంభై తొమ్మిది రూపాయలు మాత్రమే) మరియు తేది.01-03-2025 నుండి జమకూడు తదుపరి వడ్డీ+ ఇతర ఖర్చులు **ముందస్తు అమ్మకం ప్రకటన నోటీసు తేది.20-11-2025** **వేలం వేయడానికి ప్రతిపాదించిన ఆస్తి యొక్క షెడ్యూలు & బ్యాంకు వారికి తనఖా పెట్టిన స్థిరాస్తి వివరములు** తేది.30-10-2014 నాటి రిజిష్టర్డ్ సెటిల్‌మెంట్ డీడ్ డాక్యుమెంట్ నెం: 13726/2014, తేది.30-12-2014 రిజిస్టర్ రెక్టిఫికేషన్ డీడ్ డాక్యుమెంట్ నెం: 16993/2014, ప్రకారం శ్రీమతి బత్తిన విజయలక్ష్మి, భర్త : సత్యనారాయణ గారికి చెందిన ఆస్తి. మధురపూడి గ్రామ పంచాయితీ, తూర్పు గోదావరి జిల్లా, కోరుకొండ సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్ లిమిట్స్, కోరుకొండ మండలం, మధురపూడి గ్రామం తాలూకా, జియోరితీ పొడి నేల ఆర్.ఎస్.నెం.160, లో మొత్తం ఎ.3.04 సెంట్లు లో 968 చ.గ.లు, దక్షిణభాగంలో 387.75చదరపు గజాల ఖాళీ స్థలం నిర్మించబడింది. **హద్దులు: తూర్పు:** ఆకుల యేసు గారి స్థలము-49.50 అడుగులు, **దక్షిణం:** 70.50 అడుగులు పబ్లిక్ బావికి వెళ్ళే మార్గం, **పడమర:** పంచాయితీ రోడ్-49-50 అడుగులు, **ఉత్తరం:** అమ్మకందారుల స్థలము 70.50 అడుగులు. పై హద్దులలో 387.75 చదరపు గజాల స్థలం మరియు అందులోని ఇల్లు, అన్ని ఈజ్‌మెంట్ హక్కులతో సహా.
2)	**ఋణగ్రహీత పేరు మరియు చిరునామా :** శ్రీమతి కొల్లి దేవి, భర్త : కె.సారంగ, డి.నెం.3-25/1, పంచాయితీ దగ్గర, కాతేరు, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా. ఆంధ్రప్రదేశ్-533105. **బకాయి సొమ్ము:** తేది.30-04-2025 నాటికి చెల్లించవలసిన బకాయి CLRLN. లోన్ A/C No:1189 కు చెంది రూ.21,79,313/- (అక్షరాల ఇరవై ఒక్క లక్ష డెబ్బై తొమ్మిది వేల మూడు వందల పదమూడు రూపాయలు మాత్రమే) మరియు తేది.01.05.2025 నుండి జమకూడు తదుపరి వడ్డీ+ ఇతర ఖర్చులు **ముందస్తు అమ్మకం ప్రకటన నోటీసు తేది.13-11-2025** **వేలం వేయడానికి ప్రతిపాదించిన ఆస్తి యొక్క షెడ్యూలు & బ్యాంకు వారికి తనఖా పెట్టిన స్థిరాస్తి వివరములు** E.M. గిఫ్ట్ సెటిల్ మెంట్ డీడ్ డాక్యుమెంట్ నెం: 10617/2014, తేదీ 18-08-2014 ప్రకారం శ్రీమతి కొల్లి దేవి, భర్త: సారంగ చెందిన తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి జిల్లారిజిస్ట్రార్ ఆఫీస్ పరిధిలోని, పిడిమి గొయ్యి సబ్-రిజిస్ట్రీ ఆఫీస్ లిమిట్స్, రాజమండ్రి రూరల్ కాతేరు గ్రామ పంచాయతీ ఏరియా, కాతేరు గ్రామ తాలూకా, ఆర్.యస్.నెం:238/1లో గల మొత్తం 2832 చదరపు గజాలు ఉత్తరం వైపున 102.6 చదరపు గజాలు విస్తీర్ణంలో ఉన్న స్థలం, డోర్ నెం.సంఖ్య :3-25/1,ఆర్.సి.సి. భవన స్థలం కలదు. **హద్దులు: తూర్పు:** 28.0 అడుగుల ఆర్.సి.సి. భవన స్థలం పెనుమాక నరేష్ కుమార్ కు చెందినది, **దక్షిణం:** 33.0 అడుగుల రాజా వీధి, **పడమర :**28.0 అడుగుల కొండ్రు దావీదు మొక్క గడ్డి ఇల్లు, **ఉత్తరం:** మండపల్లి శేషమ్మ గారి సిమెంట్ షీట్ షెడ్-30.0 అడుగులు. పై సరిహద్దుల లోపల 102.6 చదరపు గజాలు లేదా 85.78 చదరపు మీటర్లు స్థలం ఆర్.సి.సి. భవన సెంట్ల స్థలం, అన్ని యాజిమెంట్ హక్కులతో సహా.
3)	**ఋణగ్రహీత పేరు మరియు చిరునామా :** శ్రీ పరిమి శ్రీనివాస్ (9823), తండ్రి : రామారావు అలియాస్ రామస్వామి, డి.నెం: 115-2-152, పోస్టాఫీస్ వీధి, కొలమూరు, రాజమండ్రి రూరల్, తూర్పు గోదావరి జిల్లా., ఆంధ్రప్రదేశ్. **బకాయి సొమ్ము:** తేది.30-09-2024 నాటికి చెల్లించవలసిన బకాయి ADVIMMOV లోన్ A/C No.94 కు చెంది రూ.10,65,561/- (అక్షరాల పది లక్షల అరవై ఐదు వేల ఐదు వందల అరవై ఒక్క రూపాయలు మాత్రమే) మరియు తేది.01.10.2024 నుండి జమకూడు తదుపరి వడ్డీ+ ఇతర ఖర్చులు **ముందస్తు అమ్మకం ప్రకటన నోటీసు తేది.13-11-2025** **వేలం వేయడానికి ప్రతిపాదించిన ఆస్తి యొక్క షెడ్యూలు & బ్యాంకు వారికి తనఖా పెట్టిన స్థిరాస్తి వివరములు** పరిమి శ్రీనివాస్ తండ్రి : రామారావు అలియాస్ రామస్వామి గారు యజమానిగా గల స్థిరాస్తి యొక్క వివరములు - డాక్యుమెంట్ ప్రకారం గల షెడ్యూలు : E .M. డాక్యుమెంటు రిజిష్టర్డు అమ్మకం దస్తావేజు డాక్యుమెంట్ నెం:14188/2014, తేది.10-11-2014 ప్రకారం శ్రీ పరిమి శ్రీనివాస్, తండ్రి : రామారావు అలియాస్ రామస్వామి గారికి చెందిన తూర్పు గోదావరి జిల్లా, పిడిమి గొయ్యి సబ్-రిజిస్ట్రీ ఆఫీస్ లిమిట్స్, రాజమండ్రి రూరల్ మండలం, కొలమూరు గ్రామ పంచాయితీ ఏరియా, కొలమూరు గ్రామం తాలూకా, జియోరితీ పొడి నేల ఆర్.ఎస్.నెం.587/2, ఎ.మొత్తం, ఎ.4.46 సెంట్లు, లే అవుట్ గా మార్చబడిన భూమి ఇంటి ప్లాట్లు, మరియు ప్లాటు నెం:22,698 చదరపు గజాలు, దాని ఆగ్నేయ మూల వైపు 201.32 చదరపు గజాలు, లేదా 168.32 చదరపు మీటర్ల స్థలంలో నిర్మించబడిన ఆస్థి. **హద్దులు: తూర్పు :** పుంత-38.3 అడుగులు, **దక్షిణం :** ప్లాట్ నెం:31 స్థలం---46.6 అడుగులు, **పడమర :** ఈ నెంబరు ప్లాటులోని హక్కుదారుల స్థలం---38.3 అ.లు, **ఉత్తరం :** పరిమి గంగాధర్ గారి స్థలం--48.3 అడుగులు. పై హద్దుల లోపల 201.32 చదరపు గజాలు 168.32 చదరపు మీటర్లు స్థలం, అన్ని ఈజ్‌మెంట్ హక్కులతో సహా.
4)	**ఋణగ్రహీత పేరు మరియు చిరునామా :** 1) పులిదిండి మరియమ్మ (9631), భర్త : పి.కోటేశ్వర రావు, 2) పులిదిండి యేషయ్య (9632), తండ్రి : పి.కోటేశ్వర రావు, 3) పులిదిండి ప్రసాద్ (9633), తండ్రి : పి.కోటేశ్వర రావు, 4. పులిదిండి మధుబాబు (9634), తండ్రి : పి.కోటేశ్వర రావు, డి.నెం.122-5-91, పంచాయితీ ఆఫీస్ ఎదురుగా, అంబేడ్కర్ విగ్రహం దగ్గర, కాతేరు, రాజమండ్రి రూరల్ మండలం, తూ.గో.జిల్లా, ఆం.ప్ర.-533105. **బకాయి సొమ్ము:** ADVIMMOV లోన్ ఖాతా నెం.88 కు చెంది తేది.30-09-2024 నాటికి రూ.4,25,858/- (అక్షరాల నాలుగు లక్షల ఇరవై ఐదు వేల ఎనిమిది వందల యాభై ఎనిమిది రూపాయలు మాత్రమే) మరియు తేది.01-10-2024 నుండి జమకూడు భవిష్య వడ్డీ, + ఇతర ఖర్చులు **ముందస్తు అమ్మకం ప్రకటన నోటీసు తేది.20-11-2025** **వేలం వేయడానికి ప్రతిపాదించిన ఆస్తి యొక్క షెడ్యూలు & బ్యాంకు వారికి తనఖా పెట్టిన స్థిరాస్తి వివరములు** డాక్యుమెంట్ నెం.3344/2010, తేది.11-11-2010 ప్రకారం పులిదిండి కోటేశ్వర రావు, తండ్రి : బాపనయ్య (పులిదిండి మరియమ్మ గారి మరణానంతరం చట్టరీత్యా వారసులుగా వ్యవహరిస్తున్న వారి భార్య మరియు 3 కుమారులు) గారికి చెందిన సదరు ఆస్థి తూర్పు గోదావరి జిల్లా, పిడింగొయ్యి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, రాజమండ్రి రూరల్ మండలం, కాతేరు గ్రామ పంచాయితీ, గ్రామం తాలూకా, జిరాయితీ మెట్ట ఆర్ యస్ నెం.112/1 లో 73 చ.గ.లు విస్తీర్ణంలో పడమర వైపు డోర్ నెం.5-65తో పాత తిరిగి నిర్మించిన, పడగొట్టిన పెంకుటిల్లు స్థలము మరియు అందలి నిర్మించిన ఆస్థి. **హద్దులు : తూర్పు :** విన్నకోట ప్రేమజ్యోతి మరియు ఇతరులు ఆస్థి ---36.6 అ.లు, **దక్షిణం :** సాదే రత్నకుమారి గారి ఆస్థి ---18.0 అ.లు, **పడమర :** విన్నకోట పోశమ్మ మరియు ఇతరులు ఆస్థి ---36.6 అ.లు, **ఉత్తరం :** రోడ్డు---18.0 అ.లు. ఈ పై హద్దుల మధ్య 73 చ.గ.లు లేదా 61.03 చ.మీ.లు విస్తీర్ణం గల స్థలము అన్ని యాజిమెంటరీ హక్కులతో సహా.

తేది : 22.11.2025, ప్రదేశం : కాతేరు సం/- అధీకృత అధికారి, ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్

(c) eenadu

పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచాలని ధర్నా

నిడదవోలు: నిడదవోలు మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులను అదనంగా నియమించి పని భారం తగ్గించాలని కోరుతూ పట్టణ ప్రజల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పురపాలక కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అధ్యక్షుడు జువ్వల రాంబాబు మాట్లాడుతూ పట్టణంలో 24 వార్డులు ఉన్న కాలంలో 200 మంది కార్మికులు పారిశుద్ధ్య ఇంజినీరింగ్ పనులు నిర్వహించే వారని 28 వార్డులకు విస్తరించిన తర్వాత 110 మంది మాత్రమే కార్మికులు ఉండగా వారిలో 20 మంది డిప్యుటేషన్‌పై కార్యాలయంలో పని చేస్తున్నారన్నారు. 200 మంది కార్మికులు ఉండేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దయామణి, బైపే రాజేశ్వరరావు, కొడమంచిలి జార్జి, ఎం.సారధి, చిరంజీవి, సాయిరమణ, నాగేశ్వరరావు, కె.నారాయణ పాల్గొన్నారు.

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

పారదర్శకంగా ఆర్థిక లావాదేవీలు

గోపాలపురం: స్వయం సహాయక సంఘాలు పొదుపు, రుణాలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా నిర్వహించాలని డీఆర్డీఏ ప్రాజెక్టు మేనేజర్ సంపత్‌కుమార్ సూచించారు. స్థానిక మండల కార్యాలయ సమావేశ మందిరంలో 'మన డబ్బులు- మన లెక్కలు' అనే యాప్‌పై సీఏలకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది మార్చి నుంచి సంఘ సభ్యుల పొదుపు, రుణాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్ పొందుపరచడం కోసం యాప్ అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన తెలిపారు. ఇకపై ఏటా సభ్యులు చేసే లావాదేవీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేమనోహర్, ఏపీఎం రోజీమాణిక్యం, దేవరపల్లి, గోపాలపురం మండల పరిధిలోని సీఏలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తాళ్లపూడి: 80085 74498
ఉ. 10 - మ. 1 ఉండ్రాజవరం: 80085 74503, నల్లజర్ల: 97011 37112

భూగర్భ డ్రెయిన్ శుభ్రం

స్పందనకు స్పందన

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లి కొత్తపేటలో భూగర్భ డ్రెయిన్ పూడుకుపోవడంతో మురుగు పారక ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను సర్పంచి రాపాక రాజేశ్వరి, కార్యదర్శి కామేశ్వరి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి సిబ్బందితో కాలువను శుభ్రం చేయించారు.

మురుగు పారక అవస్థలు..

సమస్య: తాళ్లపూడి బీసీ కాలనీకి వెళ్లే దారిలో మురుగు కాలువకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగాయి. కాలువలో వ్యర్థాలు పేరుకు పోవడంతో మురుగు పారడం లేదు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికుడు

సమాధానం: మురుగు కాలువ పరిశుభ్రంగా ఉంచేలా బాగుచేయిస్తాం. - వీరన్న, పంచాయతీ కార్యదర్శి

- న్యూస్‌టుడే, తాళ్లపూడి

ఉద్యోగులకు ఆటల పోటీలు

నిడదవోలు: నిడదవోలు మున్సిపాలిటీ వజ్రోత్సవాల్లో భాగంగా సోమవారం ఎస్వీడీ మహిళా డిగ్రీ కళాశాల, రోటరీ ఆడిటోరియంలో కౌన్సిలర్లు, పురపాలక సంఘ ఉద్యోగులకు షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కృష్ణవేణి, కౌన్సిలర్లు షకీరా బేగం, ఉసురుమర్తి జానకిరాం, కారింకి నాగేశ్వరరావు, నాయకులు ఎండీ ఫయాజ్, గంగుల గోపి తదితరులు పాల్గొన్నారు.

క్యారమ్స్ ఆడుతున్న సిబ్బంది

సకాలంలో అర్జీల పరిష్కారం

కొవ్వూరు పట్టణం: ప్రజా వినతులను సకాలంలో పరిష్కరించడానికి మండల యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. డివిజన్‌స్థాయిలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 10 మంది నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. భూమి స్వాధీన హక్కు, పాసు పుస్తకం మంజూరు, భూమికి సరిహద్దులు, సంక్షేమ పథకాలకు అర్హత తదితర అంశాలపై అర్జీలు అందాయి. అర్జీల స్థితిగతులను 1100 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా తెలుసుకోవచ్చని ఆర్డీవో తెలిపారు. డివిజన్‌స్థాయిలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీ పరిశీలిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

అతివకు ఆలంబన

▲ లింగ వివక్ష చూపితే చర్యలు ▲ మండల కేంద్రాల్లో జీఆర్సీ కేంద్రాలు

న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం, నిడదవోలు

సృష్టికి ఆధారం మహిళ. వారి గొప్పతనాన్ని చాటి చెప్పేందుకు ఏటా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తుంటారు. వాస్తవంలో ఇల్లు, బడి, గుడి, కార్యాలయం.. ఇలా అన్ని చోట్లా వారు అవమానాలు, ఆరాటాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం శ్రద్ధ చూపుతోంది. మహిళలకు ఆలంబనగా మండల కేంద్రాల్లో జెండర్ రిసోర్స్ సెంటర్ (జీఆర్సీ) పేరిట వసతి కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. స్వయం సహాయక, మండల సమాఖ్యలోని మహిళలకు సహాయం చేసేందుకు ఈ కేంద్రాలు కీలకంగా మారనున్నాయి.

కొవ్వూరు డివిజన్లో ఇలా..

కొవ్వూరు డివిజన్లో ప్రస్తుతం మూడు జీఆర్సీ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. కొవ్వూరు, దేవరపల్లి, పెరవలి మండల సమాఖ్య కార్యాలయాల్లో ఒక గదిని ఇందుకు కేటాయించారు. దేవరపల్లి, పెరవలి కేంద్రాలకు నిధులు మంజూరయ్యాయి. కొవ్వూరు కేంద్రానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రభుత్వానికి రూ.5 లక్షలతో ప్రతిపాదనలు పంపింది.

కొవ్వూరు మండల సమాఖ్య కార్యాలయంలో జేఆర్సీ విభాగం

అవగాహన కల్పిస్తున్నాం..

లింగ ఆధారిత హింసను ఎదుర్కొనే సురక్షిత వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ సంకల్పం. ఇప్పటికే జిల్లాలో అయిదు కేంద్రాలు ఏర్పాటయ్యాయి. సమాఖ్య కార్యాలయాలతోపాటు క్షేత్ర స్థాయిలో మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. - ఎన్‌వీవీఎస్ మూర్తి, డీఆర్డీఏ పీడీ

అవగాహన.. వసతి

● లింగ వివక్షకు గురైన మహిళలను జీఆర్సీ కేంద్రాలకు తీసుకొస్తారు. వారి సమస్య విని పరిష్కారంపై అవగాహన కల్పిస్తారు. అవసరమైతే కొన్ని రోజులు వసతి కల్పిస్తారు. సమస్య పరిష్కామైన తర్వాత ఇంటికి పంపిస్తారు.

● ప్రతి కేంద్రంలో ఫిర్యాదు పెట్టె ఏర్పాటు చేశారు. బాధితులు సమస్యను రాసి ఆ పెట్టెలో వేయవచ్చు. వాటిని కమిటీ పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపడుతుంది.

మండలం నుంచి జిల్లా వరకు..

● ప్రతి మహిళా సంఘంలో ఒకరు జేపీసీ (జెండర్ పాయింట్ పర్సన్) ఉంటారు. గ్రామ సమాఖ్య స్థాయిలో ముగ్గురిని సోషల్ యాక్షన్ కమిటీగా ఏర్పాటు చేస్తారు.

● గ్రామ పంచాయతీ స్థాయిలో పంచాయతీ జెండర్ ఫోరం ఉంటుంది. సర్పంచి మహిళ అయితే ఛైర్‌పర్సన్‌గా ఉంటారు. లేని చోట పంచాయతీ పాలకవర్గంలో ఉండే మహిళకు ఆ బాధ్యత అప్పగిస్తారు.

● కమిటీలో ఏఎన్ఎం, మహిళా పోలీసు, అంగన్‌వాడీ కార్యకర్త ఉంటారు. మండల, జిల్లా స్థాయిల్లోనూ అధికారుల బృందంతో కమిటీలు నడుస్తాయి.

'రైతన్న మీకోసం'ను వినియోగించుకోవాలి

ఉండ్రాజవరం: 'రైతన్న మీకోసం'ను వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పీవీఎస్ ప్రసాద్, ఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి రాజారావు కోరారు. ఉండ్రాజవరం తదితర గ్రామాల్లో కర పత్రాలు పంపిణీ చేసి ప్రదర్శనలు నిర్వహించారు. యాప్ ద్వారా కలిగే ప్రయోజనాలు, వినియోగంపై అవగాహన కల్పించారు.

గోపాలపురం, దేవరపల్లి: గోపాలపురం, దేవరపల్లి మండలాల్లోని రైతు సేవా కేంద్రాల పరిధిలో ఉన్న కొందరు రైతుల ఇళ్లకు వెళ్లి వ్యవసాయ, ఉద్యాన శాఖలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సూచనలతో కూడిన కరపత్రాలను అందజేశారు.

ఆర్థిక సాయం అందజేత

దేవరపల్లి: లైటింగ్ పనులు చేస్తూ విద్యుదాఘాతానికి గురై గాయపడి చికిత్స పొందుతున్న సుబ్బారావుపురానికి చెందిన జనసైనికుడు ఉండ్రాజవరపు తరుణ్‌తేజకు వైద్య ఖర్చుల నిమిత్తం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, నాయకులు సోమవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

తాళ్లపూడి: ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థి కె. సందీప్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.6 వేలు సాయం అందించినట్లు మానవత సంస్థ అధ్యక్షుడు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు

పెరవలి: మండలంలోని ముక్కామలవారిపాలెంలో కొలువైన వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి ప్రథమ షష్ఠి ఉత్సవాల్లో భాగంగా సోమవారం విశేష పూజ, అభిషేకాలు, అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఆర్‌యూపీపీ శత వసంతాల వేడుకకు సన్నాహాలు

రాజానగరం: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) స్థాపించి వందేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో శత వసంతాల వేడుక నిర్వహించాలని జిల్లాలోని సంఘ నాయకులు సోమవారం సమావేశం నిర్వహించారు. సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.వి.వి.సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఎప్పుడు, ఎక్కడ నిర్వహించాలనే దానిపై చర్చించారు. భవిష్యత్తు కార్యాచరణ రూపొందించారు. సంఘ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్. సంపత్‌కృష్ణ, యు.రవిచంద్ర కుమార్, గౌరవ సలహాదారులు టి.గిరిరాజ్, బి.శివారెడ్డి, ఎర్రస్వామి, టి.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపన్యసించి.. విజేతలుగా నిలిచి

ఉపన్యసిస్తున్న విద్యార్థి

విజేతలతో పంగిడి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీరామారావు, ఉపాధ్యాయులు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో పంగిడిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు ఉత్సాహ వాతావరణంలో జరిగాయి. 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని చక్కగా ఉపన్యసించి సత్తా చాటారు. జి.యశస్విని (10వ తరగతి), కె.రవీంద్ర (7వ తరగతి), వి.యశ్వంత్ (9వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 'ఈనాడు' సమకూర్చిన బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీరామారావు చేతుల మీదుగా విజేతలకు అందించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీలో ఉపన్యసిస్తున్న విద్యార్థి

శ్రీరాజరాజేశ్వరి విద్యాలయంలో..

చాగల్లు: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో చాగల్లులోని శ్రీరాజరాజేశ్వరి విద్యాలయంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బి.మౌనిక శృతి ప్రశాంతి (10వ తరగతి), కె. సత్యప్రియాంక (9వ తరగతి), ఎస్. అనుప్రియమ(8వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 'ఈనాడు' సమకూర్చిన బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రిన్సిపల్ వల్లిపల్లి వెంకట రామారావు చేతుల మీదుగా విజేతలకు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెలుపొందిన విద్యార్థులతో శ్రీరాజరాజేశ్వరి విద్యాలయ పాఠశాల ఉపాధ్యాయులు


నిడదవోలు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అలంకారప్రాయంగా టీవీ, నీటి శుద్ధి పరికరం

టీవీలు పని చేయవు.. శుద్ధ జలాలు అందవు!

● ఇదీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిస్థితి

న్యూస్‌టుడే, నిడదవోలు

డివిజన్ పరిధిలో ఇలా...

ప్రాజెక్టు	అంగన్‌వాడీ కేంద్రాలు	చిన్నారులు	టీవీలిచ్చిన కేంద్రాలు
పెరవలి	211	2283	131
కొవ్వూరు	223	2458	112
గోపాలపురం	234	3323	172

పరిశీలన

చిన్నారుల విద్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నా.. అవి క్షేత్రస్థాయిలో ఆచరణలోకి రావడం లేదు. ఆ కేంద్రాలకు అందించిన టీవీలు, ఆర్వో పరికరాలే ఇందుకు నిదర్శనం. సొంత భవనాలున్న కేంద్రాలకు (సక్షం కేంద్రాలు) స్మార్ట్ టీవీలు అందించారు. వాటిలో వీడియో పాఠాలతోపాటు వివిధ రకాల బొమ్మలు, పద్యాలు, గణిత కృత్యాలు పిల్లలకు చూపించి వారితో చేయించాల్సి ఉంది. తద్వారా చిన్నారులకు వాటిపై త్వరగా అవగాహన ఏర్పడి వారిలో సామర్థ్యాలు మెరుగవుతాయన్న వీటి ఏర్పాటు వెనుకున్న ఉద్దేశం. వీటి ద్వారా రోజూ రెండు గంటలపాటు ఆటపాటల విద్యను అందించాల్సి ఉంది. సక్షం కింద ఎంపిక చేసిన పెరవలి, కొవ్వూరు, నిడదవోలు ప్రాజెక్టుల పరిధిలోని 415 కేంద్రాల్లో టీవీలను గోడలకు ఏర్పాటు చేశారు. నెట్ సదుపాయం లేక పోవడంతో అవి అలంకారప్రాయంగా మిగిలాయి. అక్కడక్కడ అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సొంత చరవాణి ద్వారా నెట్‌ను ఉపయోగించి కొంత వరకు టీవీలను వినియోగించి చిన్నారులకు పాఠాలు నేర్పిస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు గతంలో ప్రభుత్వం అందించిన చరవాణిలు చాలా వరకు పనిచేయడం లేదు. ఈ కారణంగా వాటిని ఐసీడీఎస్ కార్యాలయాల్లో అప్పగించారు. తిరిగి తీసుకున్నా అవి సక్రమంగా పని చేయడం లేదు. తక్షణమే కొత్త చరవాణిలు అందించాలని వారు కోరుతున్నారు. వీటిని వినియోగంలోకి తెస్తే చిన్నారులను మరింత ఆకర్షించి విద్యను సులభంగా అందించడానికి వీలు కలుగుతుందని అంగన్‌వాడీ కార్యకర్తలు అంటున్నారు.

ఆర్వో ప్లాంట్లది అదే దారి...

అంగన్‌వాడీ కేంద్రాలకు సమకూర్చిన నీటి శుద్ధి పరికరాలది అదే పరిస్థితి. అవి కూడా గోడలకు వేలాడదీసి కనిపిస్తున్నాయి. చిన్నారులు తాగునీటి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని టీవీలు, ఆర్వో పరికరాలను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

త్వరలో నెట్ సదుపాయం..

సాక్ష్యం కింద ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు అందించిన టీవీలకు త్వరలో నెట్ కనెక్షన్ ఇచ్చి వినియోగంలోకి తీసుకొస్తాం. అర్వో పరికరాలను వినియోగంలోకి తీసుకొచ్చి చిన్నారులకు శుద్ధ జలాలు అందించే దిశగా చర్యలు తీసుకుంటాం.
- ఆశారోహిణి, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి, పెరవలి

ఎదురొచ్చే వాహనం కనిపించేదెలా..?

నల్లజర్ల నుంచి ప్రకాశరావుపాలేనికి వెళ్లే బీటీ రహదారిలో నల్లవంతెన వద్ద ఉన్న మలుపులో ఒకవైపు తుప్పలు పెరిగాయి. దీంతో ఎదురొచ్చే వాహనాలు దగ్గరకొచ్చే వరకు కనిపించక చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో మరీ ఇబ్బందిగా ఉంటోందని, తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వారు వాపోతున్నారు. దీనిపై ర.భ.శాఖ డీఈ వెంకటరమణను వివరణ కోరగా పరిశీలించి సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, నల్లజర్ల

కాలువ గట్టే డంపింగ్ యార్డు

నిడదవోలు మండలం గోపవరం, సమిశ్రగూడెం వద్ద పశ్చిమ డెల్టా కాలువల పక్కనే చెత్త వేస్తున్నారు. అది క్రమంగా కాలువలోకి చేరుతుండడంతో నీరు కలుషితమవుతోంది. ఆ నీటినే తాగు, ఇతర అవసరాలకు వినియోగిస్తుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకొని కాలువ గట్లపై చెత్త వేయకుండా తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నిడదవోలు

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

గోపాలపురం, న్యూస్‌టుడే: నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎన్.పార్వతి అన్నారు. గోపాలపురం పంచాయతీ పరిధిలో సుమారు రూ.83 లక్షలతో చేపడుతున్న డ్రెయిన్ నిర్మాణాలను ఆమె సోమవారం పరిశీలించారు. ఏటా వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీరు కారణంగా గోపాలపురంలో పలు చోట్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారానికి అవసరమైన చోట్ల మురుగు కాలువలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ బంగారయ్య, నాయకులు జ్యేష్ట శ్రీధర్, మద్దిపాటి రమేష్‌బాబు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఈ పార్వతి

నిడదవోలులో కోటి సంతకాల సేకరణ

నిడదవోలు: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైకాపా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నిడదవోలు 26వ వార్డులో పార్టీ శ్రేణులు సంతకాల సేకరణ చేపట్టారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి వెంకటసత్యనారాయణ, కౌన్సిలర్లు తోలేటి ఝాన్సీ, ఆకుల ముకుందరావు, నాయకులు మేడపాటి రాంబాబురెడ్డి, తోలేటి కోటేశ్వరరావు, ఆలమూరి రాజా పాల్గొన్నారు.

సీఎం సందేశ లేఖలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, తదితరులు

అన్నదాతల సంక్షేమానికి ప్రాధాన్యం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: అన్నదాతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమాన్ని కొవ్వూరు మండలం దొమ్మేరులో సోమవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. అధికారులు, కూటమి నాయకులతో కలసి సీఎం సందేశ లేఖ, కరపత్రాలను రైతులకు అందించారు. రానున్న రబీ; ఖరీఫ్ సీజన్లలో అనుసరించాల్సిన ప్రణాళిక, ధాన్యం అమ్మకాలపై ఆరా తీశారు. రైతుల నుంచి సూచనలు, సలహాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్, జడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ, మండల తెదేపా అధ్యక్షుడు బేతిన నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దూబచర్లలో...

నల్లజర్ల: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. రైతన్న మీకోసం కార్యక్రమాన్ని సోమవారం దూబచర్లలో ఎమ్మెల్యే ప్రారంభించి రైతుల ఇళ్లకు వెళ్లి పంచసూత్రాల సందేశాన్ని వివరించారు. ఏఎంసీ ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజు, తెదేపా మండలశాఖ అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, సర్పంచి తాడిగడప బాలయ్య, మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు తపస్విరెడ్డి ఎంపిక

నిడదవోలు: నిడదవోలు నారాయణ పాఠశాల 8వ తరగతి విద్యార్థి కేవీస్వీ తపస్విరెడ్డి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తరపున అండర్-14 బాలుర క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. ఏలూరులోని వంగూరు ఏఎన్ఎం క్రికెట్ అకాడమీలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు అభినందించారు.

ఉరేసుకుని ఆత్మహత్య

యాదం అప్పలసూరి (పాత చిత్రం)

కొవ్వూరు పట్టణం: అనారోగ్య కారణాలతో వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం వెలుగు చూసింది. వివరాల ప్రకారం.. కొవ్వూరు పట్టణానికి చెందిన యాదం అప్పలసూరి (55) మేదర వృత్తి చేస్తూ జీవిస్తున్నారు. ర.భ.శాఖ కార్యాలయం వద్ద పురపాలక వాణిజ్య సముదాయంలో దుకాణాన్ని అద్దెకు తీసుకుని కుర్చీలు, చాపలు అల్లడంతోపాటు భవన నిర్మాణ పనులకు వాడే సామగ్రి అద్దెకు ఇచ్చేవారు. రోజూ మాదిరిగా ఈనెల 23న (ఆదివారం) రాత్రి దుకాణాన్ని మూసి ఇంటికి వచ్చారు. పని ఉందని చెప్పి బయటకు వెళ్లిన ఆయన రాత్రి ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో భార్య సత్యకల్యాణి దుకాణం వద్దకు వెళ్లి షెట్టర్ తెరవగా కుర్చీలు అల్లే తీగలతో పెద్ద గెడంచికి ఉరి వేసుకుని చనిపోయిన భర్త కనిపించడంతో స్థానికులు, పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని కిందికి దింపి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు వీర నాగార్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మూడేళ్ల క్రితం అప్పలసూరి గుండెకు శస్త్ర చికిత్స చేశారు. ఆ తర్వాత పక్షవాతానికి గురై అనారోగ్యం బారిన పడ్డారు. ఈ క్రమంలోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని తెలుస్తోంది.

మధ్యాహ్న భోజనం.. మరింత రుచికరం

చార్జీల పెంపుతో పథకం నిర్వాహకులకు ఉపశమనం

న్యూస్‌టుడే, తాళ్లపూడి

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత పక్కాగా అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే సన్న బియ్యం, కొత్త మెనూతో బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నారు. విద్యార్థులు ఇష్టపడి తినేలా మార్పులు చేశారు. నిత్యావసరాల ధరలు పెరగడంతో భోజన పథకం నిర్వహణ ఏజెన్సీలకు భారంగా మారినట్లు గుర్తించిన ప్రభుత్వం వంట చార్జీల పెంపునకు చర్యలు చేపట్టింది. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీ నుంచి, 9 నుంచి ఇంటర్ వరకు ఆగస్టు 8వ తేదీ నుంచి పెంచిన చార్జీలు వర్తిస్తాయని ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తద్వారా పథకం మరింత బలోపేతమవుతుందని, నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించింది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థికి రోజుకు 0.74 పైసలు, ఆరు నుంచి ఇంటర్ వరకు రూ.1.12 పైసలు మేర ప్రభుత్వం పెంచిందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. దీనివల్ల పథకం నిర్వాహకులకు కొంత భారం తగ్గుతుందని, విద్యార్థులకు మరింత రుచికరంగా భోజనం అందుతుందన్నారు.

తాళ్లపూడిలో భోజనం వడ్డిస్తూ...

కొవ్వూరు డివిజన్‌లో..

నియోజకవర్గం	బడులు	విద్యార్థులు
కొవ్వూరు	123	10,175
గోపాలపురం	153	13410
నిడదవోలు	157	10,819

✦ ఆయా నియోజకవర్గాల పరిధిలో ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో సుమారు రెండు వేలమంది విద్యార్థులు ఉన్నారు.

చార్జీ పెంపు ఇలా (రూ.ల్లో..)

తరగతి	పాత ధర	కొత్తది
1 నుంచి 5	5.45	6.19
6 నుంచి ఇంటర్	8.17	9.29

అనారోగ్యంతో పంచాయతీ కార్యదర్శి మృతి

వంగపండు శ్రీదేవి (పాతచిత్రం)

నల్లజర్ల, న్యూస్‌టుడే: అనంతపల్లి పంచాయతీ కార్యదర్శి వంగపండు శ్రీదేవి (56) అనారోగ్య కారణాలతో రాజమహేంద్రవరంలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆమెకు భర్త త్రిమూర్తులు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్వగ్రామం ఏలూరు జిల్లా ఉంగుటూరు. రావులపర్రు, కాగుపాడు తదితర పంచాయతీల్లో కార్యదర్శిగా పని చేశారు. ఇటీవల బదిలీపై అనంతపల్లికి వచ్చారు. ఉంగుటూరులో శ్రీదేవి భౌతికకాయాన్ని అనంతపల్లి సర్పంచి వెంగళి కమలకుమారి, మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సందర్శించి నివాళులర్పించారు.

ఆటోలు ఢీ : ఇద్దరికి స్వల్ప గాయాలు

దేవరపల్లి: మండలంలోని కృష్ణంపాలెం శివారులో సోమవారం ఎదురెదురుగా వస్తున్న ట్రక్కు, ప్రయాణికుల ఆటోలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ప్రయాణికుల ఆటోని ఇద్దరు మహిళలకు స్వల్ప గాయాలు కావడంతో దేవరపల్లి పీహెచ్‌కి తరలించి చికిత్స అందించినట్లు హైవే పోలీసులు తెలిపారు.

(c) eenadu

చేయిచేయి కలుపుదాం..

భారతదేశాన్ని ఐక్యంగా నిలపడానికి ఎంతో శ్రమించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్మరణార్థం కోలారు నగరంలో సోమవారం పెద్దఎత్తున ఏక్తా యాత్ర నిర్వహించారు. వివిధ కళాశాలల విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు జాతీయ పతాకాలను చేబూని.. నగర వీధుల్లో భారతీయత చాటే నినాదాలతో ముందుకు సాగారు. (న్యూస్‌టుడే, కోలారు)

శివుడి నాగాస్త్రం

ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో నాగసాధువులు సోమవారం ప్రత్యేకంగా చర్చలు జరిపారు. ఆయనను ఆశీర్వదించి వెళ్లారు. బెంగళూరు సదాశివనగరలోని డీకే ఇంటికి సోమవారం ఉదయం చేరుకున్న నాగసాధువులు.. ముఖ్యమంత్రి పీఠం అధిరోహిస్తావని దీవించారు. కొద్దిసేపు మంత్రాలు జపించి.. భవిష్యవాణి వినిపించారు. డీకే వారికి దక్షిణ తాంబూలాదులు సమర్పించి.. వీడ్కోలు పలికారు. (న్యూస్‌టుడే, యశ్వంతపురం)

అధిష్ఠానం.. అడుగడుగునా తడబాటు

ఈనాడు, బెంగళూరు : అధికార కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పు వదంతులు ఇప్పటివి కావు. రెండున్నరేళ్లుగా చర్చలో ఉన్నవే. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య పోటీ 2023 ఎన్నికల ఫలితాలు వెల్లడైన రోజే మొదలైంది. అప్పట్లోనూ వారం రోజుల పాటు సందిగ్ధతే కొనసాగింది. ఆ గండాన్ని ఎలాగోలా గట్టెక్కిన ..పెద్దలు నేడు అంతకు మించిన తడబాటుకు గురవుతున్నారు. అప్పుడు ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్యను ఎన్నుకునేందుకు అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు పార్టీ ప్రధాన కార్యదర్శులు కె.సి.వేణుగోపాల్, రణదీప్ సింగ్ సుర్జేవాల మధ్య సుదీర్ఘ చర్చలు కొనసాగాయి. ఈసారీ నిర్ణయాధికారం వీరిదే అయినా గతంలో మాదిరి సాధికారికంగా వ్యవహరించలేక పోతున్నారు.

ప్రజాస్వామ్య విధానం..

జాతీయ పార్టీల్లో ఏదేని నిర్ణయాన్ని ప్రజాస్వామ్య విధానాలకు అనుగుణంగానే తీసుకుంటారు. కీలక నిర్ణయాలు పార్టీ అధిష్ఠానం, జాతీయ కార్యవర్గ సమితి సభ్యుల చర్చల తర్వాత తీసుకున్నా వాటిని అమలు చేసే ముందు శాసనసభాపక్ష (ఎల్‌పీ) సమావేశంలో అభిప్రాయ సేకరణ చేస్తారు. ఈ సమావేశంలో అధిష్ఠానం ఆదేశాలు తప్పక పాటించాలన్నది జాతీయ కార్యవర్గ అంతర్గత సూత్రం. భాజపా, కాంగ్రెస్‌ల్లో దాదాపు ఇదే విధానాన్ని అనుసరిస్తారు. సరిగ్గా ఇదే సూత్రాన్ని పాటించేందుకు రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభ పక్షం (సీఎల్‌పీ) తిరకాసు పెడుతోంది. రెండున్నరేళ్ల కిందట పార్టీ శాసనసభా పక్ష నేతగా సిద్ధరామయ్యను ఎన్నుకునే సమయంలో అధికార పంపిణీ ఒప్పందం గురించి కనీస చర్చ సీఎల్‌పీ సమావేశం ముందు చేయకపోవటమే ఆ పార్టీ అధిష్ఠానం చేసిన తప్పిదంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఏదేని ఎన్నికల్లో పార్టీ లక్ష్యం ఐదేళ్ల కాలపరిమితి కోసమే. ఆ సమయంలో ఎవరి నాయకత్వంలో ఎన్నికలకు వెళ్తారో వారే ఐదేళ్లకు ముఖ్యమంత్రి అనే భావన నేతల్లో ఉంటుంది. రెండున్నరేళ్లకే నాయకుడి మార్పు అనగానే సహజంగానే నేతల్లో అలజడి మొదలవుతుంది. ఇదే ప్రస్తుత అధికార పక్షంలోనూ చోటు చేసుకుంది.

పార్టీకి సవాళ్లివే

ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్ఠానానికి అధికార పంపిణీ చేయగానే సమస్య ముగిసినట్లు కాదు. సిద్ధరామయ్యను ఎలాగోలా బుజ్జగించి డీకేకు పట్టం కట్టడం అధిష్ఠానానికి సులువైన పనే. ఆ తర్వాత చెలరేగే పరిణామాలకు పార్టీ బాధ్యత వహించాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి పీఠానికి అర్హులు పార్టీలో ఎక్కువగానే ఉన్నారు. సీనియార్టీతో పాటు సముదాయాలు, ప్రాంతాల వారీగా కనీసం పది మంది ముఖ్యమంత్రి పదవికి అర్హులున్నారు. డీకేకు పట్టం కట్టగానే వీరందరూ అధిష్ఠానంపై తిరగబడే అవకాశాలు లేకపోలేదు. జిల్లాల వారీగా ఉద్దండులైన నాయకులను ఒక్క డీకే కోసం కాదనుకుంటే 2028 ఎన్నికల్లో మొదటికే మోసం వస్తుంది. అన్నింటికీ మించి సిద్ధరామయ్యను ముఖ్యమంత్రి పదవిని తొలగించగానే పార్టీ జాతీయ స్థాయిలో తీవ్రమైన విమర్శలు ఎదుర్కోక తప్పదు. బిహార్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రచారంలో ఎక్కువగా ప్రస్తావించిన అంశం బీసీల సంక్షేమం. రాహుల్‌గాంధీ

ఖర్గే వచ్చినా అదే సంకటం

మల్లికార్జున ఖర్గే

ప్రతి ప్రచార సభలోనూ వీరి గురించే ఎక్కువగా మాట్లాడారు. నేడు ఆ వర్గాలకు నాయకుడిగా గుర్తింపు పొందిన సిద్ధరామయ్యను తొలగిస్తే.. తక్షణమే కాంగ్రెస్‌పై విమర్శలు మొదలవుతాయి. ఇన్ని కోణాల్లో పార్టీ ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

ఓటింగ్ సాధ్యమేనా?

సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య ఎమ్మెల్యేల మద్దతు సమీకరణ జోరుగా సాగుతోంది. సిద్ధరామయ్యకు సహజంగానే డీకేతో పోలిస్తే ఎమ్మెల్యేల మద్దతు అధికంగా ఉన్నా రోజులు గడిచే కొద్దీ డీకే శిబిరంలో చేరే వారి సంఖ్య పెరుగుతున్నట్లే తెలుస్తోంది. గత వారం రోజులుగా దిల్లీకి వెళ్తున్న డీకే మద్దతుదారుల సంఖ్య 20కి చేరటం, వారి బలం మరో రెండ్రోజుల్లో 40కి చేరినా ఆశ్చర్యం లేదు. మంత్రి పదవులు, తాయిలాల రూపంలో ప్రతి ఎమ్మెల్యే ధర రూ.50 కోట్ల నుంచి రూ.100 కోట్లకు చేరినట్లు భాజపా నేతలు ఆర్.అశోక్ మొదలు ఎంపీ బసవరాజ బొమ్మై, చలువాది నారాయణస్వామి, గోవింద కారజోళ తదితరులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఇందులో వాస్తవికత లేదని డీకే అభ్యంతరం చెబుతున్నా.. ఓ ఎమ్మెల్యే మద్దతు పోగేసుకోవాలంటే ఏదో ఒక 'ఒప్పందం' కుదరాల్సిందే. ఈ ఒప్పంద ప్రకారం వీరంతా రహస్య ఓటింగ్‌లో పాల్గొని తమ నాయకుడిని ఎన్నుకునేలా చేయగలిగితే అధిష్ఠానం పని మరింత సులువు కాక మానదు. త్వరలోనే బెళగావి వేదికగా సువర్ణవిధానసౌధలో సభాపర్వం ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికార పార్టీకి ముందుంది ముసళ్ల పండగ!

హస్తినలో డీకే వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు నయనా మోటెమ్మ తదితరులు

ఖజానా.. నిండుకుండ

● తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దు ● ప్రజలకు ముఖ్యమంత్రి పిలుపు

అభివృద్ధి పనుల ప్రారంభవేళ.. రిమోట్ మీట నొక్కుతున్న సిద్ధరామయ్య. చిత్రంలో డీకేతో పాటు మంత్రులు మునియప్ప, సుధాకర్, మహదేవప్ప, దినేశ్ గుండూరావు

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని, ప్రభుత్వం పతనమవుతుందని విపక్షాలు చేస్తున్న ప్రచారం నమ్మవద్దని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రజలను కోరారు. చిక్కబళ్లాపుర జిల్లా శిడ్లఘట్టలో రూ.2 వేల కోట్ల విలువైన పనులను ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు డాక్టర్ ఎంసీ సుధాకర్, కేహెచ్ మునియప్ప, మహదేవ ప్రసాద్, దినేశ్ గుండూరావు, జమీర్ అహ్మద్ ఖాన్ తదితరులతో కలిసి ఆయన సోమవారం ప్రారంభించి, బహిరంగ సభా వేదికపై నుంచి ఆవేశంగా మాట్లాడారు. ఖజానా ఖాళీ అయిందని భాజపా నాయకులు ప్రచారాన్ని మొదలుపెట్టినప్పటి నుంచి మా ప్రభుత్వం రూ. లక్ష కోట్ల విలువైన పనులు ప్రారంభించిందని గుర్తు చేశారు. తమది సర్వధర్మ, సకల కులాలను కలుపుకొని వెళ్లే ప్రభుత్వమని పేర్కొన్నారు. శిడ్లఘట్టలో హైటెక్ పట్టుగూళ్ల మార్కెట్, హెచ్‌ఎన్ వ్యాలీ 3వ దశ పనులతో 164 చెరువులకు నీటిని నింపే పథకం, వివిధ శాఖల తరపున లబ్ధిదారులకు ఉపకరణాలు, వాహనాలను వితరణ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నన్ని రోజులూ గ్యారంటీలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. చిన్ననీటి పారుదల, నగరాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘిక సంక్షేమ శాఖలకు తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని వివరించారు. భాజపాకు అవకాశాలు ఇచ్చినా, ప్రజా సంక్షేమాన్ని ఒక్కసారి కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. ఈసారి ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఎక్కువ సీట్లు గెల్చుకుని అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. భాజపాకు అబద్ధమే కులదేవత అని ఎద్దేవా చేశారు.

లబ్ధిదారునికి వాహనం తాళం నమూనా అందిస్తున్న సిద్ధరామయ్య, డీకే శివకుమార్

శిడ్లఘట్ట కార్యక్రమానికి హాజరైన స్థానికులు, కాంగ్రెస్ కార్యకర్తలు

గుంతల బాటలో కాగితం పడవలు

మురుగు గుంతలో కాగితం పడవలతో ఆడుకుంటున్న అశోక్ తదితరులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : రహదారిపై గుంతలను పూడ్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును ఖండిస్తున్నామని, ప్రజా గళాన్ని వినిపిస్తున్న తమను విమర్శించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని విపక్ష నేత ఆర్.అశోక్ దుయ్యబట్టారు. విధానసౌధకు కూతవేటు దూరంలో అంబేడ్కర్ వీధిలో మురుగు నీరు నిండిన గుంతలో పార్టీ నాయకులతో కలిసి కాగితం పడవలు వదులుతూ ఆయన నిరసన వ్యక్తం చేశారు. రహదారులపై గుంతల విషయంలో ఉన్నత న్యాయస్థానం చీవాట్లు పెట్టినా ప్రభుత్వ తీరులో మార్పు రాకపోవడం శోచనీయమన్నారు. పార్టీ నాయకులు చలువాది నారాయణ స్వామి, రవికుమార్, ఎఎస్ పాటిల్ నడహళ్లి, శరణు తల్లికేరి, భారతి మల్లికార్జున్, మోహన్ విశ్వ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనలో మార్పు

ఉడుపి, న్యూస్‌టుడే : ఉడుపి శ్రీకృష్ణ మఠానికి వచ్చే సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించతలపెట్టిన రోడ్‌షోను రద్దు చేసుకున్నారు. నవంబరు 28న దిల్లీ నుంచి మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి ఉదయం 11.05కు ప్రధాని చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 11.10కి ఉడుపికి బయలుదేరతారు. హెలిప్యాడ్ నుంచి ఉడుపి కృష్ణ మఠాల వరకు రోడ్‌షో నిర్వహించాలని ముందస్తుగా నిర్ణయించారు. భద్రత, రద్దీ, ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకుని రోడ్‌షోను రద్దు చేశారు. హెలిప్యాడ్ నుంచి నేరుగా మఠానికి చేరుకుని, కృష్ణుని దర్శనాన్ని చేసుకుంటారు. చరిత్రాత్మక 'లక్ష కంఠ గీత గాయన' కార్యక్రమంలో మోదీ పాల్గొని తిరిగి హస్తినకు వెళతారని అధికారులు తెలిపారు.

ఈడీ అధికారులమంటూ..

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : కేరళలో ఆభరణాలను తయారు చేసి, నగరంలోని వ్యాపారులకు అందించేందుకు వచ్చిన ఎంఆర్ సుదీన్ అనే వ్యాపారి దారి దోపిడీకి గురయ్యారు. నీలిజన్ రహదారిలో ఆయన వెళుతున్న కారును ఐదుగురు ఆగంతకులు అడ్డుకుని తాము ఈడీ అధికారులమంటూ హిందీలో హెచ్చరించారు. ఆభరణాలను అక్రమంగా తరలిస్తున్నారని బెదిరించి, ఆయనను, డ్రైవరు వివేక్‌ను కారు నుంచి కిందకు దించి తమ కారులోకి ఎక్కించుకున్నారు. కిత్తూరు సమీపంలో వివేక్‌ను కిందకు దించారు. ఎంకె హుబ్బళ్లి రోడ్డులో సుదీన్ వద్ద ఉన్న 2.942 కిలోల ఆభరణాలు, రూ.2 లక్షల నగదు తీసుకుని నిందితులు పరారయ్యారు. హుబ్బళ్లి ఉపనగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కండక్టర్‌పై శక్తి ప్రదర్శన

మండ్య, న్యూస్‌టుడే : మైసూరు నుంచి తుమకూరుకు 'శక్తి' పథకం కింద జీరో టికెట్ తీసుకున్న ఒక మహిళ శ్రీరంగపట్టణం బస్టాండ్‌లోనే దిగేందుకు సిద్ధమైంది. తుమకూరు వరకు టికెట్ తీసుకున్న మీరు మధ్యలో దిగకూడదని, చివరి వరకు ప్రయాణం చేయాలని కండక్టర్ సూచించారు. స్క్వాడ్ వస్తే తనకు ఇబ్బంది అని ఆమెకు వివరించారు. తననే అడ్డుకుంటావా అంటూ ఆ మహిళ కండక్టర్‌పై దాడి చేసింది. ఆర్టీసీ సిబ్బంది అక్కడకు వచ్చి, ఆమెను పట్టుకుని, శ్రీరంగపట్టణ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

కూర్మానిపల్లిలో నగదు స్వాధీనం

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: బెంగళూరులో ఇటీవల భారీ మొత్తంలో నగదు దోపిడీ జరిగిన విషయం విదితమే. దీనిపై రంగంలోకి దిగిన కర్ణాటక పోలీసులు సోమవారం రాత్రి మళ్లీ ఆంధ్రప్రదేశ్‌లోని కుప్పం మండలం కూర్మానిపల్లి గ్రామానికి చేరుకుని సోదాలు నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన నవీన్ ఇంట్లో తనిఖీలు చేపట్టి మరో రూ.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

మొక్కజొన్న రైతుల పోరుబాట

హావేరి, న్యూస్‌టుడే : క్వింటాల్ మొక్కజొన్నకు రూ.3 వేలు మద్దతు ధరగా ప్రకటించాలని కోరుతూ రైతులు పోరుబాట పట్టారు. హావేరి జిల్లా కేంద్రంతో పాటు, తాలూకా కేంద్రాల్లోనూ రైతులు పెద్ద సంఖ్యలో రోడ్డు రోకోలు, నిరసన ప్రదర్శనలు చేశారు. అటు.. హుబ్బళ్లి- ధర్వాడ, కలబురగి ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ ఆందోళనకు హసిరుసేన, జిల్లా రైతు సంఘం కార్యకర్తలు మద్దతు ప్రకటించారు. హావేరి హొసమని కూడలి వద్ద రోడ్డురోకో నిర్వహించిన ఆందోళనకారులు అంబులెన్సులు, శవయాత్రలకు దారి కల్పించారు. అగడి అక్కిమఠం గురులింగ స్వామి చేతిలో చర్నాకోలు పట్టుకుని, భుజంపై ఆకుపచ్చ కండువా ధరించి ఆందోళనలో పాల్గొన్నారు.

హావేరిలో మొక్కజొన్న రైతుల ధర్నా

● మరోవైపు.. రైతుల కష్టాలను సర్కారు పట్టించుకోవడం లేదని భారతీయ జనతాపార్టీ విమర్శించింది. పార్టీ నాయకుడు, విధానసభలో విపక్షనేత ఆర్.అశోక్ సోమవారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ ఇక రైతుల ఇక్కట్లపై ఉద్యమించడానికి నిర్ణయించామన్నారు. నవంబరు 27, 28 తేదీల్లో నియోజకవర్గాల స్థాయిలో, డిసెంబరు 1, 2 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో ఆందోళనలను దశలవారీగా చేపడతామన్నారు. ప్రభుత్వ అసమర్థత కారణంగానే తుంగభద్ర జలాశయ మరమ్మతులు మొండికేశాయని మండిపడ్డారు.

వారి విజయం.. విశ్వానికే తేజం!

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : తొలి ప్రపంచకప్ అంధుల మహిళల టీ-20 క్రికెట్ పోటీల్లో ఛాంపియన్స్ గౌరవాన్ని దక్కించుకున్న భారత జట్టు సభ్యులకు సోమవారం బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయంలో అధికారులు, అభిమానులు జాతీయ పతాకాలతో ఎదురేగి ఘన స్వాగతం పలికారు. చెన్నై మీదుగా ఇక్కడికి విచ్చేసిన వారికి అభిమానులు బ్రహ్మరథం పట్టారు. పూలహారాలు, మైసూరు పేటా, పూలగుత్తులతో సత్కరించారు. శ్రీలంక దేశ కొలంబో నగరంలో ఆదివారం నిర్వహించిన ఫైనల్ పోటీలో నేపాల్ జట్టుపై భారత్ ఏడు వికెట్ల తేడాతో గెలుపొందిన విషయం తెలిసిందే. భారత అంధుల క్రికెట్ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ మహంతేశ్ నేతృత్వంలో స్వాగత ఏర్పాట్లు ఘనంగా నిర్వహించారు.

విమానాశ్రయంలో భారత అంధుల క్రికెట్ జట్టుతో డాక్టర్ మహంతేశ్

అమిత్‌షా పేరు చెప్పి అడ్డంగా ముంచేశాడు

బెంగళూరు (మహాలక్ష్మి లేఅవుట్), న్యూస్‌టుడే : కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు తాను దత్తపుత్రుడి లాంటి వాడినని చెప్పుకొంటూ వంచనలకు పాల్పడుతున్న సంజయ్ అలియాస్ సుజయేంద్ర అనే వంచకుడిని విజయనగర ఠాణా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. తాను అమిత్‌షా కార్యాలయంలో వ్యక్తిగత సిబ్బంది హోదాలో పని చేస్తున్నానని జమ్ము కశ్మీరుకు చెందిన ఒక వైద్యుడిని వంచించి రూ.2.7 కోట్లు తీసుకున్నాడు. దేవనహళ్లి వద్ద ఆయుర్వేద ఆసుపత్రిని ప్రారంభించేందుకు కావలసిన సాయం చేస్తానని నమ్మించాడు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తనకు బాగా తెలుసంటూ, వేదికపై ఆయనతో కలిసి ఉన్న ఒక ఫొటోను చూపించి, వంచనకు పాల్పడ్డాడని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. నిందితుడి నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు విచారణను తీవ్రం చేశారు.

పొగమంచు వేళ.. మరణమృదంగం

నలుగురు చెన్నైవాసుల మృతి

కోలారు, న్యూస్‌టుడే : బెంగళూరు- చెన్నై జాతీయ రహదారిపై కర్ణాటకలోని మాలూరు తాలూకా అబ్బేనహళ్లి సమీపాన ఆదివారం అర్ధరాత్రి దాటిన అనంతరం సంభవించిన రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. చెన్నైకు చెందిన గోపి (38), గౌతమ రమేశ్ (28), హరిహరన్ (27), జయశంకర్ (30)లను మృతులుగా గుర్తించారు. పొగమంచు తీవ్రత ఎక్కువగా ఉండడంతో వారి కారు అదుపు తప్పి రహదారి విభాజకాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. మరణోత్తర పరీక్షలు పూర్తి చేసి, మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు. మాలూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సంఘటన స్థలంలో తిరగబడిన కారు

సాయి నామం.. జగమంత కుటుంబం!



సద్గురు, గావస్కర్ చేతుల మీదుగా స్మరణిక అందుకుంటున్న చంద్రశేఖర్

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ముద్దేనహళ్లి సత్యసాయి గ్రామంలో 'వన్ వరల్డ్, వన్ ఫ్యామిలీ మిషన్' పేరిట 100 రోజులుగా నిర్వహిస్తూ వచ్చిన కార్యక్రమాలకు ఆదివారం రాత్రి తెరపడింది. వేర్వేరు దేశాలకు చెందిన అధినేతలు, కళాకారులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. కళలు, సంగీత, నృత్యం, సాంస్కృతిక ప్రదర్శనలు, సేవా కార్యక్రమాలతో మానవత్వాన్ని ఏకం చేసింది. ఈ ఉత్సవాల్లో 100 మంది మానవతావాదులు, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న 140 మందికి పైగా కార్పొరేట్ ప్రతినిధులు, 45కు పైగా ప్రపంచ మేధావులు, రాజకీయ నాయకులను సద్గురు మధుసూదన సాయి సత్కరించారు. చివరి రోజు కార్యక్రమంలో టాటా గ్రూపు సంస్థల ప్రతినిధి ఎన్.చంద్రశేఖర్, సీనియరు రాజకీయ నాయకుడు ఇంద్రసేనారెడ్డిలను సద్గురు సత్కరించారు.



స్మరణిక అందుకుంటున్న ఇంద్రసేనారెడ్డి

ధర్మస్థల కేసులో చిన్నయ్యకు బెయిలు

మంగళూరు, న్యూస్‌టుడే : ధర్మస్థల చుట్టుపక్కల ప్రాంతాల్లో వందలాది మృతదేహాలను ఖననం చేశానని ప్రకటించుకున్న ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు చిన్నయ్యకు దక్షిణ కన్నడ జిల్లా సెషన్స్ న్యాయస్థానం ఎట్టకేలకు సోమవారం బెయిలు మంజూరు చేసింది. రూ.లక్ష వ్యక్తిగత పూచీకత్తుతో పాటు 12 షరతులను న్యాయమూర్తి విధించారు. చిన్నయ్య విచారణ పూర్తి కావడం, ప్రత్యేక దర్యాప్తు దళం అధికారులు ఇప్పటికే అభియోగపత్రాన్ని దాఖలు చేయడంతో బెయిలు మంజూరు చేస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

ప్రజ్వల్ కేసు విచారణ వాయిదా

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : పనిమనిషిపై అత్యాచారానికి పాల్పడిన ఆరోపణలు రుజువు కావడంతో జీవిత ఖైదు, రూ.11 లక్షల జరిమానా విధిస్తూ ఇచ్చిన ఆదేశాలను ప్రశ్నిస్తూ హాసన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ వేసుకున్న అర్జీ విచారణ మంగళవారానికి వాయిదా పడింది. తనకు బెయిలు మంజూరు చేయాలని వేసుకున్న ప్రత్యేక అర్జీపైనా విచారణ కొనసాగింది. ప్రత్యేక దర్యాప్తు దళం తరపున ఆచార్య రవివర్మకుమార్ వాదనలు వినిపించారు. ప్రజ్వల్‌పై మరికొన్ని కేసుల విచారణ కొనసాగుతోందని, బెయిలు ఇవ్వకూడదని వాదించారు. వాదనలు ఆలకించిన ఉన్నత న్యాయస్థానం తదుపరి విచారణను నేటికి వాయిదా వేసింది.

కార్మికుల ఆర్థిక భద్రతకు చర్యలు

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : గిగ్ కార్మికులకు పని భవిష్యత్తుకు, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ఫిన్‌టెక్ మైగిగ్‌స్టర్స్ ముందుకు వచ్చింది. ఆస్ట్రేలియా ప్రభుత్వ సహకారంతో, అక్కడ స్థిరపడిన భారతీయులు ఆయా మార్కెట్లు, ఆర్థిక సంస్థల భాగస్వామ్యంతో ప్రణాళికలను రూపొందించారు. ఆస్ట్రేలియన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషన్ సహకారంతో భారత్‌లోనూ తమ సేవలు అందిస్తున్నామని మైగిగ్‌స్టర్స్ వ్యవస్థాపకుడు బెంజమన్ ఎలెంగోవన్ బెంగళూరులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో వెల్లడించారు. భారతదేశంలో 2030 నాటికి కోటి మంది స్వతంత్ర కార్మికుల ఆర్థిక భద్రతకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. భారతదేశంలో ప్రస్తుతం 1.2 కోట్ల గిగ్ కార్మికులు ఉండగా, ఏటా 17 శాతం వృద్ధితో 2047 నాటికి 62 మిలియన్లకు చేరుకుంటుందని అంచనా అని చెప్పారు. కార్యక్రమంలో ఆస్ట్రేలియన్ ప్రభుత్వ ప్రతినిధి మేరీ ఓవరింగ్టన్, ఇతర సంస్థల ప్రతినిధులు అజీమ్ జైనుల్‌భాయ్, గౌరవ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో సంగీత రససాగరం!

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఉద్యాననగరిలోని చౌడయ్య స్మారక ఆడిటోరియంలో ఆదివారం రాత్రి సుర్‌సాగర్ సంస్థ తమ 43వ వార్షికోత్సవాలను నిర్వహించింది. ప్రముఖ కళాకారులు పండిట్ వినాయక్ తోర్వి, మురళీ వాదకుడు అశ్విన్ శ్రీనివాసన్, తబలా వాదకుడు ఓజస్ ఆది, ఇతర కళాకారులు రవీంద్ర యావగల్, వ్యాసమూర్తి కట్టి రెండు గంటల పాటు ఇచ్చిన ప్రదర్శనలు ప్రేక్షకుల వీనులకు విందు అందించింది.

పండిట్ వినాయక్ తోర్వి

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

తాత్కాలిక కార్మికుల తొలగింపుపై కన్నెర్ర

రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేస్తున్న కార్మికులు

సండూరు (బళ్లారి), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎన్ఎండీసీలో విధులు నిర్వహిస్తున్న తాత్కాలిక కార్మికులను ఉన్నఫళంగా తొలగించడం సరికాదు.. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కార్మికులు సోమవారం సండూరు పట్టణంలో ఆందోళన నిర్వహించారు. ఏఐయూటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సోమశేఖర్ నేతృత్వంలో కార్మికులు సండూరు పట్టణంలో ప్రదర్శనగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. పెలెట్ ప్లాంట్, బెనిఫికేషన్ ప్లాంట్‌లో తాత్కాలిక కార్మికులుగా విధుల నిర్వహిస్తున్న వారిని ఈ నెల 18న ఉన్నఫళంగా తొలగించారని ఆయన ఆరోపించారు. సంస్థ కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. కొత్త శాఖను ప్రారంభించే వరకు తీసుకోవడం లేదని అధికారులు తెలియజేస్తున్నారని, కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ మేటి, కార్యదర్శి డా.ప్రమోద్, దేవదాసు, సభ్యులు సురేష్, హులిగేశ్, మంజునాథ, సంతోష్, నాగేశ్, రాజప్ప, యర్రిస్వామి పాల్గొన్నారు.

చదువులమ్మ ఇంట విజ్ఞాన గంట!

కేపీఎస్ ప్రాంగణాల్లో విద్యార్థి వికాసం!

బెంగళూరు (యశవంతపుర), న్యూస్‌టుడే: ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక పబ్లిక్‌స్కూల్ (కేపీఎస్) వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న అపోహలన్నీ పటాపంచలై పోతున్నాయి. ఈ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలోనే ప్రవేశం పొందేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు బారులు తీరుతుండటం తాజా పరిణామం. కార్పొరేట్ స్కూల్‌లో ఉన్న సౌకర్యాలు, నాణ్యమైన బోధనలకు కేపీఎస్ తక్కువేమీ కాదు. ప్రభుత్వ కన్నడ పాఠశాలలను పూర్తిగా కర్ణాటక పబ్లిక్‌పాఠశాలలుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఈ విద్యాలయాల్లో ఆంగ్ల మాధ్యమానికి ప్రాధాన్యమిచ్చారు. పెద్దల్లో ఇప్పటికే పాదుకున్న ఆంగ్ల వ్యామోహం నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలలు పాతుకుపోయాయి. వారి ఆసక్తిని గమనించి.. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఆంగ్ల మాధ్యమానికి ఊతమిచ్చారు. అనేక విద్యాలయాల్లో ఈ మాధ్యమానికి అనుమతులిచ్చారు. ఆంగ్లంతో పాటు కన్నడభాష ప్రాధాన్యమేమీ తగ్గించకపోవడంతో ఆసక్తి ఇనుమడించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 308 కేపీఎస్ ప్రాంగణాలు ప్రారంభించారు. వీటిలో విద్యార్థుల ప్రవేశం ఇప్పుడు పోటీతో కూడుకున్నది. బెంగళూరు ఉత్తరం కృష్ణనంద నగర, బెంగళూరు దక్షిణంలో ఆదుగోడి, కోలారు జిల్లా మాలూరులో మాస్తి, చెన్నపట్టణ సమీప హొంగనూరు, మైసూరు జిల్లా టి.నరసీపుర తాలూకాలోని మూగూరు, బెళగావి జిల్లా రామతీర్థనగర, యాదగిరిలో గుర్జకట్ కేపీఎస్ ప్రాంగణాలు చూడదగ్గ ప్రదర్శనశాలలు. ఆయా ప్రాంతాల్లోని ప్రైవేట్ పాఠశాలలను మించి నెట్టే శైలిలో సమాచారం అధికారుల్లో కొత్త ఉత్సాహాన్నిస్తోంది. రాష్ట్రంలో ఇలాంటివి వెయ్యి పాఠశాలలు ప్రారంభించి, 15 లక్షల మంది విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పుతున్నారు. కేజీ నుంచి డిగ్రీ వరకు ఇక్కడే చదువుకోవచ్చు. ఈ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, కోడిగుడ్డు, పాలు, రాగిమాల్ట్, పాఠ్య పుస్తకాలు, సమవస్త్రాలు సర్కారు అందిస్తోంది. ప్రపంచంతో పోటీ పడేలా విద్యార్థులను తీర్చిదిద్దేలా ఈ వ్యవస్థ రూపాంతరం చెందుతోందని ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప సంతోషం వ్యక్తం చేశారు.

> ప్రైవేట విద్యకే పెద్దపీట వేసే తల్లిదండ్రుల ఆలోచనా ధోరణి మారిపోతోంది. కర్ణాటక రాష్ట్ర పబ్లిక్‌స్కూల్ విధానం కొత్త ప్రయోగంగా తెరపైకి వచ్చింది. విద్య, విజ్ఞాన, సాంస్కృతిక, క్రీడారంగాల్లో బాలలను మెరికల్లా తీర్చిదిద్దే వ్యవస్థ.. కేపీఎస్!

విజ్ఞానానికి ప్రాధాన్యమిచ్చేలా చదువు సంధ్యలు

ప్రయోగాలకు కేంద్ర బిందువు కేపీఎస్

ఉత్తరహళ్లి కర్ణాటక పబ్లిక్‌స్కూల్ ప్రార్థన ప్రాంగణం

రాకెట్ ప్రయోగాల్లో బాలలు మమేకం

పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడిగా అవ్వారు మంజునాథ్

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: పద్మశాలి సంఘం జిల్లా పదాధికారులను సోమవారం రాత్రి సంఘం కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అవ్వారు మంజునాథ్, గౌరవాధ్యక్షుడిగా గడ్డం శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ఎస్.పి.వెంకటేశులు, కోడి నాగరాజు, కార్యదర్శిగా శ్రీరామ సత్యనారాయణ, కోశాధికారిగా రామాంజనేయులు, సంయుక్త కార్యదర్శులుగా పెనుగొండ మంజునాథ్, మేడం మధుకుమార్, మార్కాండేయస్వామి ఆలయ ధర్మకర్తగా తిరుమలేశ్ వెంకటేశులు, కార్యవర్గసభ్యులుగా 12మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అవ్వారు మంజునాథ్ మాట్లాడుతూ 2025-27కు రెండేళ్ల అవధికి నూతన పదాధికారులను ఎన్నుకున్నామన్నారు. సంఘం అభివృద్ధికి కార్యవర్గ సభ్యులు, సమాజబాంధవుల సహకారంతో తమ శాయశక్తులా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మంజునాథ్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

అక్క దళం ప్రారంభ సన్నాహాలు

ఖర్గేను ఆహ్వానిస్తున్న లక్ష్మీ హెబ్బాళ్కర్ తదితరులు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: స్త్రీ-శిశు సంక్షేమ శాఖ- వికలాంగుల, సువర్ణ మహోత్సవాల సందర్భంగా ఈనెల 28న నగరంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి హాజరు కావాలని ఆ శాఖ మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేను ఆహ్వానించారు. బెంగళూరు సదాశివనగరలోని ఖర్గే నివాసానికి వెళ్లిన ఆమె ప్రత్యేక ఆహ్వాన పత్రాన్ని అందించారు. యువతుల రక్షణ కోసం 'అక్క, దళం', గృహలక్ష్మి సహకార బ్యాంకు తదితర పథకాలను ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. పార్టీ రాష్ట్రాధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు రణదీప్‌సింగ్ సుర్జేవాల, కేసీ వేణుగోపాల్‌నూ ఆహ్వానించినట్లు ఆమె వెల్లడించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రంలో కళాశాల విద్యార్థుల రక్షణకు అక్కదళం ప్రత్యేకంగా పనిచేస్తుందని మంత్రి వివరించారు. దళ సభ్యులు నిరంతరం అప్రమత్తంగా మసలుతూ కళాశాలలు, వివిధ వాణిజ్య కేంద్రాల వద్ద భద్రత కోసం నిగూఢంగా మసలుతూ.. పని చక్కబెడతారని వెల్లడించారు.

'వందేభారత్' ఢీకొని.. ఇద్దరు విద్యార్థుల విషాదాంతం

మృతులు స్టెరిన్ ఎల్జా సజి, జోసెఫ్

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : చిక్కబాణావర రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం వందే భారత్ రైలు ఢీకొని జస్టిన్ జోసెఫ్ (21), స్టెరిన్ ఎల్జా సజి (19) అనే నర్సింగ్ విద్యార్థులు దుర్మరణం చెందారు. కేరళలోని పట్టనంతిట్టకు చెందిన వీరిద్దరూ సప్తగిరి నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ రెండో సెమిస్టర్ విద్యార్థులు. రైలు వస్తున్న సమయంలో వీరు పట్టాలపైకి రావడంతో ప్రమాదం సంభవించింది. తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించినా అప్పటికే మరణించారని తేలింది. ప్రాథమిక దర్యాప్తులో వీరిద్దరూ ఆత్మహత్య చేసుకునేందుకే పట్టాలపైకి వచ్చారని అనుమానిస్తున్నామని రైల్వే ఎస్పీ ఎన్ యతీశ్ చెప్పారు. ఇప్పటి వరకు ఎటువంటి డెత్‌నోట్ లభించలేదన్నారు. గ్రామీణ రైల్వే ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఐక్యతతోనే గ్రామాభివృద్ధి

సాణికెర గ్రామపంచాయతీ కార్యాలయం నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘుమూర్తి

చెళ్లకెర, న్యూస్‌టుడే: రాజకీయాలకు దూరంగా ప్రజలందరూ ఐకమత్యంగా పనిచేస్తే గ్రామాలు త్వరితగతిన అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే టి.రఘుమూర్తి పేర్కొన్నారు. సోమవారం తాలూకాలోని సాణికెరలో రూ.60 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాలకు అవసరమైన వసతులను సమకూర్చుకోవడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా 50 మంది మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. జడ్పీ ఉపకార్యదర్శి రంగస్వామి, తాలూకా పంచాయతీ ఈవో శశిధర్, పీడీవో దేవరాజ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు బళ్లారి క్రీడాహాస్టల్ జట్టు

రాష్ట్ర స్థాయిలో నెగ్గి జాతీయ స్థాయికి ఎంపికైన జట్టు కోచ్ జాకీర్‌కు కప్ అందజేస్తున్న అధికారులు

బళ్లారి, న్యూస్‌టుడే: హాసనలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో బళ్లారి క్రీడా హాస్టల్ విద్యార్థులు గెలుపొంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ జట్టు బళ్లారి జిల్లా, కలబురగి విభాగంలో సత్తా చాటి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విషయం తెలిసిందే.. హాసన క్రీడామైదానంలో హాకీ పోటీలకు అండర్-14 విభాగంలో బెళగావి, మైసూరు, బెంగళూరు, కొడుగు క్రీడా హాస్టల్, బళ్లారి క్రీడా హాస్టల్ జట్లు పాల్గొన్నాయి. బళ్లారి క్రీడా హాస్టల్ జట్టు సభ్యులు సత్తా చాటారు. జట్టులో బళ్లారి క్రీడా హాస్టల్ నుంచి మణికంఠ, మహేష్, గౌరవ్, లోకేష్, ధనుష్, పవన్, పండురి(గోల్ కీపర్) వార్డ్లు పాఠశాలకు చెందిన ఇద్దరు, ప్యూపుల్ ట్రీ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా క్రీడాశాఖాధికారి గౌసియా, కోచ్ జాకీర్, తదితరులు అభినందించారు.

కీళ్లు, ఎముకలకు నేడు ఉచిత చికిత్స

మాన్వి, న్యూస్‌టుడే: స్థానిక కేపీఎస్‌వీపీ ఆయుర్వేద వైద్యకళాశాల, ఆసుపత్రి కాయచికిత్సా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవనేశ్వరయ్య తెలిపారు. కీళ్ళు, ఎముకల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారిని దృష్టిలో పెట్టుకుని ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నడుము నొప్పి, మెడనొప్పి, భుజాల నొప్పితో బాధపడే వారికి కూడా చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. కళాశాలలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 వరకు శిబిరం ఉంటుందన్నారు. పట్టణ, తాలూకా ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు మహిళలపై దౌర్జన్య నివారణ దినోత్సవం

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా న్యాయశాఖ, జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు స్థానిక తాళూరు రహదారిలోని నూతన కోర్టు అవరణలో మహిళలపై దౌర్జన్య నివారణ అంతర్జాతీయ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు న్యాయమూర్తి రాజేష్ ఎన్. హొసమని ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.జి.శాంతి, ఇతర న్యాయమూర్తులు హాజరవుతారని పేర్కొన్నారు.

రాష్ట్ర రైతు సంఘం కార్యాధ్యక్షుడిగా నారాయణ రెడ్డి

హొసపేటె, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం, హరిత సేన రాష్ట్ర కార్యాధ్యక్షుడిగా పి.నారాయణ రెడ్డి(కంప్లి), గౌరవాధ్యక్షుడిగా జె.ఎన్.కాళిదాస్(హొసపేటె) ఎంపికయ్యారు. సోమవారం ఇక్కడ రైతు సంఘం నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. జిల్లా గౌరవాధ్యక్షులుగా మల్లప్ప, కొట్రప్ప, హనుమంతప్ప, అధ్యక్షుడిగా హెచ్.జి.మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా ఎల్.ఎస్.రుద్రప్ప ఎంపికయ్యారు. మహిళావిభాగం అధ్యక్షురాలిగా జె.ఉమాదేవిని ఎంపిక చేశామని జిల్లాధ్యక్షుడు ఒక ప్రకటనలో తెలిపారు.

అయ్యప్పమాల ధరించిన భక్తులతో గురుస్వామి రామ్‌బాబు స్వామి తదితరులు

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పూజలు

కురుగోడు (బళ్లారి): తాలూకా బాదనహట్టి గ్రామంలో సోమవారం 55 మంది అయ్యప్ప భక్తులు మాల ధరించారు. గురుస్వామి రామ్‌బాబు స్వామి 25 ఏళ్లుగా అయ్యప్ప మాల ధరిస్తున్నారు. గురుస్వామి మార్గదర్శనంలో గ్రామానికి చెందిన 55 మంది భక్తులు ప్రత్యేక పూజలు చేసి మాల ధరించారు. గురుస్వాములు నాగరాజు, మల్లికార్జున, బసప్ప పాల్గొన్నారు.

ఎస్డీఎంసీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులుగా ఎన్నికైన వారికి సన్మానం

కల్లుకంబ పాఠశాల ఎస్డీఎంసీ ఎన్నిక

కురుగోడు(బళ్లారి), న్యూస్‌టుడే: తాలూకా కల్లుకంబ కర్ణాటక పబ్లిక్ పాఠశాల ఎస్డీఎంసీ నూతన అధ్యక్షుడిగా ఎర్రిస్వామి నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం పాఠశాల ఆవరణలో ఎస్డీఎంసీ అధ్యక్ష, సభ్యుల ఎన్నిక నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్దలు కోరిక మేరకు అధ్యక్షుడిగా ఎర్రిస్వామి నాయక్, ఉపాధ్యక్షురాలిగా సువర్ణ, సభ్యులుగా హనుమణ్ణ, రత్నమ్మ, శిల్ప, దొడ్డప్ప, మేఘనా, మల్లేశ, సరస్వతి, హేమంత్, విరుపాక్షి, హనుమంత, ఆనందమ్మ, లోకనగౌడ, నాగరాజ్, సిద్ధయ్య, మంజుళను ఎన్నుకున్నారు. నూతనంగా ఎంపికైన వారిని పలువురు అభినందించారు.

ప్రభుత్వం మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రప్ప, భాజపా కార్యదర్శి అంబికా నాయ్కర్, కుమారస్వామి

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మద్దతు ధరలతో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని హొళల్కెర ఎమ్మెల్యే డాక్టర్ ఎం.చంద్రప్ప డిమాండ్ చేశారు. సోమవారం భాజపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ కుర్చీ కోసం పాకులాడుకోవడం, మంత్రులు, ఎమ్మెల్యేలు వారి చుట్టూ తిరుగుతూ రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా ప్రజలు అతివృష్టి, అనావృష్టితో తీవ్రంగా నష్టపోయారని అలాంటి వారికి ఇంతవరకు పంట నష్టపరిహారం చెల్లించలేదన్నారు. భాజపా రాష్ట్ర కార్యదర్శి అంబికా నాయ్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న రైతు సి.హెచ్.మహాకాళి రాజు

మహాకాళి రాజుకు శ్రేష్ఠ మత్స్య పురస్కారం

బళ్లారి, న్యూస్‌టుడే: సిరుగుప్ప తాలూకా హళె మురవణి గ్రామానికి చెందిన సి.హెచ్.మహాకాళి రాజు 2025-26 ఏడాదికి శ్రేష్ఠ మత్స్యసాగు పురస్కారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేతులు మీదుగా అందుకున్నారు. బెంగళూరు హెబ్బాళ పశువైద్య మహావిద్యాలయం ఆవరణలో నెల 21 నుంచి 23 వరకు జరిగిన మత్స్యమేళా కార్యక్రమంలో రాజుకు పురస్కారం అందజేసి అభినందించారు. రైతు రాజు ప్రతి ఎకరా విస్తీర్ణంలో 4.5 నుంచి 5 టన్నుల చొప్పున మొత్తం 225 టన్నుల చేపలు పెంచడంతోపాటు ఏటా రూ.కోటి ఆదాయం పొందుతున్నారు. రైతు పడుతున్న శ్రమకు గుర్తుగా పురస్కారం అందజేశారు. చేపల ఉత్పత్తిలో ఆదర్శ రైతులను గుర్తించి పురస్కారం అందజేస్తున్నట్లు ఉపనిర్దేశకుడు శివణ్ణ తెలిపారు.

మూడు కేసుల్లో నలుగురి అరెస్టు

నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, నగదును ప్రదర్శిస్తున్న అరసీకెరె పోలీసులు

హొసపేటె, న్యూస్‌టుడే: సంతలో మహిళల దృష్టి మళ్లించి బంగారు ఆభరణాలు, నగదు దోచుకుంటున్న రెండు కేసుల్లో ముగ్గురు, గొర్రెలను దొంగిలిస్తున్న కేసులో మరో వ్యక్తిని అరెస్టు చేసిన అరసీకెరె పోలీసులు వారినుంచి రూ.1.30 లక్షల నగదు, రూ.2.30లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ఓ బైకును స్వాధీనం చేసుకున్నారు. మొదటి రెండు కేసుల్లో ఓ మహిళ కూడా ఉండటం విశేషం. ఈ నెల 20న ఉచ్చంగిదుర్గ గ్రామ సంతలో ఇద్దరు మహిళల దృష్టి మళ్లించిన ఓ మహిళ, ఇద్దరు పురుషులు వారినుంచి రూ.2.30లక్షల విలువైన బంగారు నగలను దోచుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఐ మహంతేశ్ సజ్జన్, ఎస్సై విజయకృష్ణ నేతృత్వంలో కూపీలాగి సిబ్బంది దావణగెరె జిల్లా చెన్నగిరి తాలూకా, సంతెబెన్నూరుకు చెందిన సిద్ధరామ, ప్రకాశ్, జయమ్మలను అరెస్టు చేసి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో గొర్రెలను దొంగిలిస్తున్న కూడ్లిగి తాలూకా పాలయ్యనకోటెకు చెందిన నిందితుడు హనుమంతను అరెస్టు చేసి, అతన్నుంచి రూ.1.30లక్షల నగదు, ఓ బైకు స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదించిన పోలీస్ అధికారులు, సిబ్బంది రవిదాదాపుర, మహంతేశ్ బిళిచోడ, ఆనంద్, దాదాపీర్, హరీశ్, అజ్జప్పలను విజయనగర ఎస్పీ ఎస్.జాహ్నవి అభినందించారు.

పెళ్లింట చోరీ కోసం యువకుడి యత్నం

దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

యువకుడిని తరలిస్తున్న పోలీసులు

బళ్లారి, న్యూస్‌టుడే: దొంగతనం అంటే ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడలో బంగారు గొలుసును లాక్కొని వెళ్లడం.. తాళం వేసిన ఇళ్లను లక్ష్యం చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఘటనలు చూస్తుంటాం. ఓ యువకుడు దొంగతనం కోసం కొత్త అవతారమెత్తాడు. బళ్లారి నగరం విద్యానగర్‌లో ఆదివారం ఓ ఇంట పెళ్లి జరిగింది. బంధువులంతా తిరిగింపులకు ఇంటికి వచ్చారు. వారిలో ఎక్కువ మంది మహిళలు బంగారు ఆభరణాలు ధరించారు. వాటిని దొంగలించడానికి ఓ యువకుడు పెళ్లి బంధువు అవతారమెత్తాడు. మధ్యాహ్నం నుంచి పెళ్లి బంధువులతో పాటు భోజనం చేసి చల్లటి పానీయాలు తీసుకున్నాడు. పెళ్లికొడుకు వారు పెళ్లి కుమార్తె వైపు నుంచి వచ్చి ఉంటాడని, పెళ్లి కుమార్తె వారు పెళ్లి కొడుకు వైపు వచ్చి ఉంటాడని భావించారు. చివరికి రాత్రికి గదుల్లో నిద్రపోతున్న సమయంలో ఆ యువకుడు గది ముందు కుర్చీలో కూర్చుని గదిలో నిద్రపోతున్న మహిళలవైపు చూడటం, దేవుని గది వైపు చూస్తుండగా అక్కడే కూర్చున్న ఓ వ్యక్తి గుర్తించి నిలదీశాడు. చివరికి ఆ యువకుడు నేను ఎవరి తరఫునా రాలేదని ఒప్పుకొన్నాడు. వెంటనే అతడు స్నేహితులు, బంధువులకు సమాచారం ఇవ్వడంతో అందరూ కలిసి యువకుడికి దేహశుద్ధి చేసి కౌల్‌బజార్ పోలీసులకు అప్పగించారు. విచారణలో అతడిని బళ్లారి తాలూకా కొర్లగొంది గ్రామానికి చెందిన శంకర్‌గా గుర్తించారు. నగరంలో ఫాస్ట్‌ఫుడ్ బండి వద్ద పనిచేస్తున్నట్లు తెలిపారు. నిందితున్ని న్యాయమూర్తి ముందు హాజరు పరిచి కేంద్ర కారాగారానికి తరలించినట్లు సీఐ సుభాష్‌చంద్ర తెలిపారు. ఇతనితోపాటు మరో ముగ్గురు వచ్చారని, వారి కోసం గాలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పట్టపగలే ఎడ్లపై చిరుత దాడి

ఎద్దు గొంతు వద్ద చిరుత దాడితో గాయం

హొసపేటె, న్యూస్‌టుడే: ఇంటి నుంచి కొంత దూరంలో కట్టివేసిన ఎడ్లపై వేకువజామున చిరుత దాడిచేసి గాయపరిచిన ఘటన సోమవారం పట్టణ శివారు జంబునాథనహళ్లిలో జరిగింది. చిరుత దాడిలో రెండూ ఎడ్లకు గాయాలయ్యాయి. అదే సమయంలో కుక్కలు మొరగడంతో రైతు కటిగి హేమణ్ణ, కుటుంబ సభ్యులు బయటకు వచ్చి పరిశీలించగా, చీకట్లో చిరుత పరుగులు తీయడం గుర్తించారు. కుక్కలు మొరగకపోతే తన ఎడ్లు చిరుతకు బలయ్యేవని రైతు తీవ్ర భయాందోళన వ్యక్తం చేశారు. వారం క్రితం ఆ ప్రాంతంలో చిరుత రెండు కుక్కలను చంపింది. ఇక్కడ చిరుత బెడద ఉంది, దాన్ని బంధించాలని అటవీశాఖకు మొరపెట్టుకున్నా ఫలితంలేదని ఆ ప్రాంత రైతులు వాపోతున్నారు.

సత్తాచాటిన బెస్ట్ కళాశాల విద్యార్థులు

పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి పదవీ పూర్వ విద్యా శాఖ, బళ్లారి బీబీసీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జరిగిన వివిధ పోటీ పరీక్షల్లో బళ్లారి బెస్ట్ పదవీ పూర్వ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఆర్థికశాస్త్రం ప్రశ్నల విభాగంలో ఆకాంక్ష, దీక్షిత, సాంస్కృతిక కార్యక్రమంలో హెచ్.సృష్టి, సాయి హర్షిత, మేధాశక్తి పోటీల్లో సుహాసిని, ప్రసన్నాక్షి, అంకిత గెలుపొంది విభాగ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు కోనంకి రామప్ప, ఉపాధ్యక్షుడు తిలక్‌కుమార్, కార్యదర్శి మన్నెం శ్రీనివాసులు, ప్రధానాచార్యుడు వెంకటేశ్వరరావ్, ఉపాచార్యుడు శ్రీనివాసరెడ్డి తదితరులు విజేతలను అభినందించారు.

మేయర్ పూజారి గాదెప్ప బాధ్యతల స్వీకరణ

దుర్గమ్మ గుడి నుంచి ఊరేగింపుగా వస్తున్న మేయర్ పూజారి గాదెప్ప, కార్యకర్తలు అభిమానులు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికె 24వ మేయర్‌గా పూజారి గాదెప్ప సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నగర పాలికె 23వ వార్డు కార్పొరేటర్‌గా గెలుపొందిన పూజారి గాదెప్ప ఈ నెల 15న బళ్లారి నగర మేయర్‌గా ఎన్నికైన విషయం తెలిసిందే. సోమవారం బళ్లారి కనక దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించి అక్కడి నుంచి నగర పాలికె కార్యాలయం వరకు ఊరేగింపుగా వచ్చారు. నగర పాలికె అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం బాధ్యతలు స్వీకరించడంతో డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, శ్రీరామరాజు, కమిషనర్ మంజునాథ, కార్పొరేటర్లు, అధికారులు సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా మేయర్ విలేకరులతో మాట్లాడుతూ నగర పాలికె కార్పొరేటర్లు, అధికారులతో సహకారంతో ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడానికి ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. పాలికెలో ప్రధానంగా నగరంలో పారిశుద్ధ్యం, శుద్ధమైన తాగునీరు, వీధిదీపాలు, రహదారులు వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

పలువురు అభినందన


మేయర్ పూజారి గాదెప్పను సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లంప్రశాంత్, కార్యాధ్యక్షుడు బోయపాటి విష్ణు, కల్యాణస్వామి

మేయర్‌కు సత్కారం

బళ్లారి గ్రామీణ: బళ్లారి నగరపాలికె సంస్థ మేయర్‌గా సోమవారం పూజారి గాదెప్ప తన కార్యాలయంలో పూజలు చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, కార్యాధ్యక్షుడు బోయపాటి విష్ణువర్ధన్, కల్యాణస్వామి, కాంగ్రెస్ నాయకుడు రాజు, కార్పొరేటర్ ఆసిఫ్ తదితరులు మేయర్ కార్యాలయంలో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ నగర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

(c) eenadu

బళ్ళారి
• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

కళాకారులను అభినందిస్తున్న పద్మశ్రీ పురస్కార గ్రహీత డా.కె.ఎస్.రాజణ్ణ, నవీన్, ప్రశాంత్ తదితరులు

అమ్మభాషను మరువరాదు

బళ్లారి గ్రామీణ: అమ్మభాషను ఎప్పుడూ మరువరాదని, భాషాభిమానం పెంచుకుని ముందుకెళ్లాలని పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. కె.ఎస్.రాజణ్ణ పేర్కొన్నారు. నిమగాని నాళ్ళ సంస్థ ఆధ్వర్యంలో జె.టి.ఎస్. పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన విదోత్సవ కన్నడజాతర కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు కన్నడ కణ్మణి పురస్కారాన్ని అందజేశారు. సాహితీవేత్త శివలింగప్ప, కార్పొరేటర్ గోవిందరాజులు, చిత్రకళాకారుడు రవి, వీరభద్రగౌడ, జి.కె.స్వామి, రుద్రప్ప, సంఘం అధ్యక్షుడు వినయ్‌కుమార్, ప్రశాంత్ పాల్గొన్నారు.

చలో బెంగళూరుకు తరలిరండి

ఎత్తినబూదిహాళ్ గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న రైతు సంఘం సభ్యులు

బళ్లారి: రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై ఈ నెల 26న నిర్వహించే చలో బెంగళూరుకు రైతులు మద్దతు ఇవ్వాలని అఖిల భారత రైతు కృషి కార్మికుల సంఘం నేతృత్వంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గోవింద ఆధ్వర్యంలో తాలూకా ఎత్తినబూదిహాళ్ వ్యవసాయ పొలాల్లో రైతులకు అవగాహన కల్పించారు. బగర్‌హుకుం సాగు చేస్తున్న రైతులకు సాగు పట్టాలు ఇవ్వాలని, ఉపాధికూలి రూ.600 లకు పెంచాలన్నారు. సభ్యులు హనుమంతప్ప, హులుగప్ప, రమేశ్, రామదాసు, మహాలింగప్ప పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘానికి హోరాహోరీగా ఎన్నికలు

నూతన అధ్యక్షుడు రవికుమార్‌పాటిల్‌ను సత్కరించిన న్యాయవాదులు

మాన్వి, న్యూస్‌టుడే: న్యాయవాదుల సంఘానికి ఆదివారం నిర్వహించిన ఎన్నికలు ఉత్కంఠభరితంగా సాగాయి. రవికుమార్‌పాటిల్, సత్యనారాయణ ముష్టూరు ప్యానెల్ మధ్య హోరాహోరీ పోటీ ఏర్పడింది. ఈ పోరులో రవికుమార్‌పాటిల్ న్యాయవాదుల సంఘానికి రెండో సారి భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2025-26కి సంబంధించి ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా విశ్వనాథ్‌రాయప్ప, శివప్రసన్నకుమార్ గెలుపొందారు. ప్రధాన కార్యదర్శి స్థానానికి యల్లప్ప బాదరదిన్ని, హనుమంతరాయ నాయక్ బల్లటగిపై 9 ఓట్ల తేడాతో నెగ్గారు. సంయుక్త కార్యదర్శి స్థానానికి జరిగిన ఎన్నికలో నాగరాజగూగల్ హనుమంత బ్యాగవాట్‌పై 5 ఓట్ల తేడాతో గెలుపొందారు. మహిళా విభాగం నుంచి స్టెల్లాశర్లాట్, చంద్రకళా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కె.శ్రీనివాస్‌రావు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా అరవింద్ దేశాయి సహాయక అధికారిగా వ్యవహరించారు. రవికుమార్ పాటిల్ ప్యానల్ ఘన విజయం సాధించిన క్రమంలో న్యాయవాదులు, అభిమానులు రాత్రి విజయోత్సవం నిర్వహించారు. మిఠాయిలు పంచుకున్నారు. టపాసులు కాల్చారు. రవిని పూల మాలలతో ముంచెత్తారు.

అల్లకల్లోలం

ఏపీఎంసీలో సదుపాయాల కొరత
రోడ్లపైనే ధాన్యం ఆరబోత

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం (ఏపీఎంసీ)లో ధాన్యం ఆరబోయడానికి కమీషన్ ఏజెంట్లు ఉత్పత్తులను విక్రయించుకోవడానికి కల్లాల (ప్లాట్‌ఫాం) కొరతతో రహదారులపై వేసుకోవడం, వ్యాపారాలు చేయడంతో నిత్యం ట్రాఫిక్ అంతరాయంతో పాటు రైతులు తీసుకుని వచ్చిన ధాన్యాలు వృథాగా మట్టిలో కలుస్తున్నాయి.

సక్రమంగా సాగని కార్యకలాపాలు

బళ్లారి ఏపీఎంసీ మార్కెట్ వారం పొడవునా జరుగుతుంది. మూడు రోజులు మాత్రమే వేరుసెనగ కాయలను రైతులు తీసుకుని వస్తున్నారు. గట్టి గింజలు వారంరోజులూ విక్రయాలు జరుగుతాయి. ధాన్యాలను ప్లాట్‌ఫాంపై వేసుకుని టెండర్ వేయడం, తూకాలు అక్కడే వేసుకుంటే మార్కెట్‌కు వచ్చే వాహనాలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ధాన్యాలు కూడా నాణ్యతగా ఉండడంతోపాటు వృథా కావు. కల్లాల కొరత కారణంతో పాటు.. కమీషన్ ఏజెంట్లు తమ అనుకూలంగా దుకాణాల ముందు, రోడ్డుపైనే పంట ఉత్పత్తులను రాశులు పోస్తున్నారు. అక్కడే తూకాలు వేస్తున్నారు. విక్రయాలు పూర్తయిన తర్వాత కూడా రోడ్డుపైనే వేసుకొని, మరుసటి రోజు లారీల్లోకి లోడింగ్ చేస్తున్నారు. ఇలా చేయడంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం వృథా కావడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

దుస్థితికి చేరిన సిమెంటు కల్లం

పెరిగిన వాహనాల రద్దీ

బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌లో వ్యాపారులు మాత్రమే విక్రయం చేయడం లేదు.. టోకు కిరాణా దుకాణాలు, కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్ కూడా ఉన్నాయి. కమీషన్ ఏజెంట్ల కార్యాలయాలు, పోలీస్ స్టేషన్, గోదాములు ఉండటంతో వాహనాలతో రద్దీగా ఉంటుంది. రోడ్లపై ధాన్యం, ఇతర ఉత్పత్తులు వేయడంతో నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఏపీఎంసీ ప్రధాన ద్వారం ముందు రహదారిపై వేసిన ధాన్యం రాసులు

రూ.2.50 కోట్లతో ప్లాట్‌ఫాంలు నిర్మిస్తున్నాం

ప్రస్తుతం మార్కెట్‌కు వచ్చే ధాన్యాలకు ప్లాట్‌ఫాంలు సరిపోవడం లేదు. దీంతో రోడ్లపైనే ధాన్యాలు వేసుకుంటున్నారు. రూ.2.50కోట్లతో రెండు ప్లాట్‌ఫాంలు నిర్మించడానికి టెండర్ ప్రక్రియలో ఉంది. ఇవి పూర్తయితే రోడ్డుపై విక్రయాలు అరికట్టేందుకు అవకాశం ఉంది.

- జయకుమార్, ఏపీఎంసీ కార్యాదర్శి, బళ్లారి

రోడ్లపై ధాన్యం వేయడంతో వాహనదారుల ఇబ్బందులు

బయలాటలు గ్రామీణ జీవనానికి ప్రతిబింబాలు

రేణుకా యల్లమ్మ బయలాటలో ప్రదర్శన చేస్తున్న కళాకారులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: బయలాట నాటకాలు మన గ్రామీణ జీవన విధానానికి ప్రతిబింబాలు అని విశ్వనాథ సాహుకార వీరయ స్వామి తాతా పేర్కొన్నారు. బూదగుంప గ్రామంలో ఆంజనేయ స్వామి ఉత్సవాన్ని పురస్కరించుకుని కన్నడ సాంస్కృతిక శాఖ, వాల్మీకి విద్యాభివృద్ధి ట్రస్ట్, మారుతి కళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రేణుకా యల్లమ్మ బయలాట నాటక ప్రదర్శనను ఆదివారం రాత్రి నిర్వహించారు. బయలాట ప్రదర్శనను ప్రారంభించి ఆయన మాట్లాడుతూ బళ్లారి జిల్లాలో 150 సంవత్సరాల చరిత్ర గల బయలాట ప్రదర్శనలు గ్రామీణ ప్రజల జీవన విధానం, మన కళలు, సంస్కృతిని తెలిపే విషయాలతో ప్రదర్శన చేపడుతున్నారు. నేటి ఆధునిక యుగంలో ఇవి మూలన పడుతున్నాయి. కళాకారులను ఆదరించి ప్రోత్సహిస్తే కళలను భావితరాల వారికి అందించేందుకు దోహద పడుతుందని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు బయలాట నాటక ప్రదర్శనతో శ్రోతలను ఆకట్టుకున్నారు.

'గృహలక్ష్మి' ఆగస్టు నెల నిధులు విడుదల

కారటగి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పంచ గ్యారంటీ పథకాల్లోని గృహలక్ష్మి 2025- 25 ఆర్థిక సంవత్సర అయిదో (ఆగస్టు) నెల నిధులు విడుదల అయ్యాయని పంచ గ్యారంటీ పథకాల అనుష్టాన సమితి కొప్పళ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన 'న్యూస్‌టుడే' తో మాట్లాడుతూ జిల్లాలో 3,18,086 మంది గృహలక్ష్మి లబ్ధిదారులకు తలా రూ.2 వేల చొప్పున రూ.63,61,72000 విడుదల చేశారన్నారు. రెండు, మూడు రోజుల్లో మహిళల బ్యాంకు ఖాతాలకు రూ.2 వేలు జమ అవుతాయన్నారు.

గర్భిణులూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

మోకా సముదాయ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రతి నెల 9 నుంచి 24 వరకు గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వారు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆర్.సి.హెచ్.అధికారి డా.హనుమంతప్ప సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ నేపథ్యంలో సోమవారం తాలూకా సంగనకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మోకా సముదాయ ఆరోగ్య కేంద్రాలను ఆయన పరిశీలించి చికిత్స కోసం వచ్చిన గర్భిణులతో మాట్లాడారు. గర్భిణి అని తెలుసుకున్న రోజే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి తల్లి కార్డులో తన మొత్తం సమాచారాన్ని నమోదు చేయించుకోవాలన్నారు. విభాగం వైద్యుల సలహాల ప్రకారం ప్రతి నెల బరువు, రక్తపోటు, మధుమేహం, రక్తహీనత వంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యాధికారులు రేవణ సిద్ధప్ప, భారతి, శరశ్చంద్ర, సయ్యద్ హఫీజ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మల తుంగభద్రకు శ్రీరామనగర్ ప్రజల మద్దతు


సీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిర్మల తుంగభద్ర జాగృతి

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: నిర్మల తుంగభద్ర జాగృతి అభియానకు శ్రీరామనగర్ ప్రజలు మద్దతు తెలిపారు. న్యూఢిల్లీ జాతీయ స్వాభిమాన ఆందోళన, శివమొగ్గ నిర్మల తుంగభద్ర అభియాన, పర్యావరణ ట్రస్టు సంయుక్తంగా డిసెంబరు 27న కిష్కింద (గంగావతి) నుంచి మంత్రాలయానికి పాద యాత్ర నిర్వహించనున్నాయి. తుంగభద్ర స్వచ్ఛత ఈ పాద యాత్ర ప్రధాన ఉద్దేశం. గ్రామంలోని చిలుకూరి నాగేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీయూ కళాశాల, ఉన్నత పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయం తదితర చోట్ల జాగృతి నిర్వహించారు. విద్యార్థులు, గ్రామ పెద్దలు, రైతులు, యువకులు నిర్మల తుంగభద్ర అభియానకు మద్దతు తెలిపారు.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు

మల్లికార్జున

బళ్లారి, న్యూస్‌టుడే: సండూరు తాలూకా కురెకుప్ప గ్రామానికి చెందిన మల్లికార్జున(13) అనే బాలుడు అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు పి.డి.హళ్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కురెకుప్ప గ్రామానికి చెందిన మల్లికార్జున బళ్లారి తాలూకా చెళ్లగుర్కి ప్రభుత్వ గాంధీతత్వ ఆధారిత వసతి పాఠశాలలో చదువుతున్నాడు. ఈ నెల 13న చెళ్లగుర్కి గ్రామంలో అదృశ్యమయ్యాడు. ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో ఫిర్యాదు చేశారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

24-11-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1623.62	1630.42
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	2,542	3,118
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	6,327	6,798
నీటి నిల్వ (టి.ఎం.సి)	72.076	95.657

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

విద్యాశాఖ నిర్ణయంపై నిరసన

మాట్లాడుతున్న ఏఐడీఎస్‌వో జిల్లా అధ్యక్షుడు ఈరణ్ణ చిత్రంలో సభ్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: కె.పి.ఎస్. మ్యాగ్నెట్ పథకాన్ని బ్లాక్ పథకంగా ప్రకటిస్తున్నాం..రాష్ట్రంలో 40వేల పాఠశాలలు మూసివేయడానికి ప్రభుత్వం సిద్ధం చేసిందని ఏఐడీఎస్‌వో జిల్లా అధ్యక్షుడు ఈరణ్ణ ఆరోపించారు. సోమవారం పత్రికాభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్క పాఠశాలనూ మూసివేయడం లేదని ప్రభుత్వం స్పష్టం చేస్తున్నా.. కె.పి.ఎస్.మ్యాగ్నెట్ పథకం పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడానికి ప్రయత్నాలు ప్రారంభించిందని ఆరోపించారు. గ్రామపంచాయతీకి ఒక పాఠశాల అని రాష్ట్రంలో 6,000 కె.పి.ఎస్. మ్యాగ్నెట్ పాఠశాలలను ప్రారంభించే ఆలోచనలో ఉందన్నారు. మొదట విడతలో 800 ప్రభుత్వ పాఠశాలలను కె.పి.ఎస్ మ్యాగ్నెట్ పాఠశాలలను గుర్తించిందన్నారు. 2025 అక్టోబరు 15న ప్రభుత్వ ఆదేశాలు విడుదల చేసిందన్నారు. రామనగర జిల్లా చెన్నపట్టణ తాలూకాలోని హొంగనూరు పాఠశాలను కె.పి.ఎస్ మ్యాగ్నెట్ పాఠశాలగా గుర్తించినట్లు వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనిక్కి తీసుకోవాలి. లేకుంటే ఆందోళన చేయాల్సి వస్తోందని తెలిపారు. సభ్యులు కంబళి మంజునాథ, సభ్యులు అనుపమా, తిప్పేస్వామి, మంజునాథ, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

రామాలయ సముదాయ భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి తంగడగి

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: స్థానిక ఎమ్మెల్యే, జిల్లా బాధ్య మంత్రి శివరాజ్ తంగడగి గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు సోమవారం భూమి పూజ చేశారు. బరగూరు క్యాంపులో రూ.25 లక్షలతో నిర్మిస్తున్న రామాలయ సముదాయ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలు క్యాంపు రోడ్డు దుస్థితిని మంత్రికి వివరించగా త్వరలో నిర్మాణ పనులు చేపడతామన్నారు. అంతకుముందు ఆయన తిమ్మాపురలో గుడ్డద లక్ష్మీ మల్లయ్య ఆలయ సముదాయ భవనం, హణవాళలో శ్రీకృష్ణ దేవస్థాన సముదాయ భవనం, గుళదాళ (మసారి క్యాంపు)లో లక్ష్మీ దేవి ఆలయ సముదాయ భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. జంగమరకల్లుడిలో స్వసహాయ సంఘ షెడ్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ పంచ గ్యారంటీ పథకాల అనుష్టాన సమితి జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శరణేగౌడ మాలిపాటిల్, ఆయా గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అవగాహన అవసరం

మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస రెడ్డి

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంటు వ్యాధులపై అవగాహన కార్యక్రమం సోమవారం జరిగింది. మలేరియా, డెంగీ, అతిసారం, గన్యా, క్షయ తదితర వ్యాధుల గురించి వైద్యులు తెలియజేసి అవి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. పౌష్టికాహార సేవనం వల్ల ప్రయోజనాలను వివరించారు. రెడ్ క్రాస్, ఎన్‌ఎస్‌ఎస్, తాలూకా ఆరోగ్య శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాయి. ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస రెడ్డి, డాక్టర్ శృతి, డాక్టర్ చంద్రశేఖర్, క్షేత్ర ఆరోగ్య శిక్షణ అధికారిణి కె.శోభ, ఉపన్యాసకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకులూ! సమయాన్ని వృథా చేసుకోవద్దు!

సిరివార,(మాన్వి): యువత సొంత కాళ్లపై నిలబడేందుకు ఎన్నో అవకాశాలున్నాయని, కాలాన్ని వృథా చేసుకోకుండా ప్రయత్నిస్తే ఫలితం తప్పకుండా లభిస్తుందని ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పేర్కొన్నారు. స్థానిక బసవేశ్వర కూడలి వద్ద కరునాడ కెఫెను ప్రారంభించి మాట్లాడారు. 18ఏళ్లు వచ్చిన ప్రతి ఒక్కరూ ఉద్యోగం, ఉపాధి, సొంత వ్యాపారం, పరిశ్రమపై దృష్టి సారించాలన్నారు. నీలోగల్ మఠం రేణుకా శాంతమల్ల స్వామీజీ మాట్లాడారు. పట్టణ పంచాయతీ అధ్యక్షుడు వై.భూపనగౌడ, పంచగ్యారంటీ అమలు సమితి అధ్యక్షుడు బ్రిజేష్‌పాటిల్, కాంగ్రెస్ ప్రముఖులు చుక్కిసూగప్ప సాహుకార్, యువ ప్రముఖులు రమేశ్ దర్శనకర్, శివశరణ అరకేరి, రంగనాథ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హంపయ్యనాయక్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

రాజ్యాంగ దినోత్సవాన్ని అర్థవంతంగా ఆచరిద్దాం

సమావేశంలో మాట్లాడుతున్న ఛలవాది మహాసభ తాలూకా అధ్యక్షుడు చెన్నప్ప

కంప్లి, న్యూస్‌టుడే: ఈనెల 26న భారత రాజ్యాంగ దినోత్సవాన్ని అర్థవంతంగా ఆచరిద్దామని ఛలవాది మహాసభ తాలూకా అధ్యక్షుడు సి.ఎ.చెన్నప్ప తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగిన రాజ్యాంగ దినోత్సవ పూర్వసిద్ధతా సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆచరించాలి. విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవం పట్ల అవగాహన కలిగించాలన్నారు. తహసీల్దార్ మంజు నాయక్ మాట్లాడుతూ అంబేడ్కర్ కూడలిలో ఆరోజు ఉదయం అంబేడ్కర్ చిత్ర పటానికి పూజ అనంతరం సాంగత్రయ సంస్కృత పాఠశాల నుంచి బీఎస్‌వీ పాఠశాల వరకు ఊరేగింపు ఉంటుందన్నారు. టీపీ అధికారి శ్రీకుమార్, పురసభ ముఖ్యాధికారి బి.మల్లికార్జున, ఇతర అధికారులు, వివిధ సముదాయ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై విత్తనాలు

రైతుకు విత్తనాలు అందిస్తున్న వ్యవసాయ అధికారులు

కంప్లి: కంప్లి రైతు సంపర్క కేంద్రంలో లబ్ధిదారులకు రాయితీపై సెనగ, నవణి విత్తనాలు అందిస్తున్నామని కేంద్రం అధికారి సోమశేఖర్ తెలిపారు. శనగ విత్తనాలు సామాన్య రైతులకు క్వింటాలుకు రూ.5,800, దళిత, గిరిజన రైతులకు రూ.4,600కు ఇస్తున్నాం. నవణి సామాన్య రైతులకు 4 కిలోల విత్తనాలకు రూ.207, దళిత, గిరిజన రైతులకు రూ.170కి ఇస్తున్నాం. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొక్కజొన్నకు మద్దతు ధర ప్రకటించాలని నిరసన

డీసీ కార్యాలయంలో ఆందోళన నిర్వహిస్తున్న సంఘం అధ్యక్షుడు, సభ్యులు, రైతులు

బళ్లారి, న్యూస్‌టుడే: మొక్కజొన్నకు కనీస మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ కన్నడనాడు రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం డీసీ కార్యాలయం ఆవరణలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న పంటను సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో ప్రైవేట్ వ్యాపారులు క్వింటాల్ రూ.1400 నుంచి రూ.1,700 వరకు కొనుగోలు చేస్తున్నారు. రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదు. ప్రభుత్వం కేంద్రాలను ప్రారంభించి కనీస మద్దతు ధర ప్రకారం క్వింటాల్ రూ.2400 చొప్పున కొనుగోలు చేయాలని కోరారు. అధ్యక్షుడు ఈశ్వరప్ప, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మరేగౌడ, ఈరణ్ణ, ఎర్రిస్వామి గౌడ, ఆర్.ప్రహ్లాద్, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

మిర్చిరైతుకు తీరని నష్టం

పంటను నాశనం చేసిన దుండగులు

పట్టణ శివారు సంక్లాపురలో మిర్చి పంటను నాశనం చేసిన దుండగులు

హొసపేటె, న్యూస్‌టుడే: గుర్తు తెలియని దుండగులు హనుమంతప్ప అనే రైతుకు సంబంధించిన మిర్చిపంటను నాశనం చేశారు. ఈ ఘటన సోమవారం ఉదయం పట్టణ శివారు సంక్లాపురలో వెలుగు చూసింది. ఉదయం రైతు పొలానికి వెళ్లగా, ఎవరో మిరప చెట్లను పీకిపారేశారు. కొన్ని చోట్ల వాటిని తొక్కి నాశనం చేసినట్లు గుర్తించారు. అడుగు దాకా పెరిగిన మిరపచెట్లు నాశనం కావడంతో రైతు లబోదిబోమంటున్నాడు. విపణిలో ఎండుమిర్చికి మంచి గిరాకీ ఉందని మొదటిసారి మిరప పంట వేసిన రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు రూ.3లక్షలదాకా నష్టం జరిగిందని బాధిత రైతు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

అధునాతన చితాగారం నిర్మాణానికి భూమిపూజ

చితాగారం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గవియప్ప

హొసపేటె, న్యూస్‌టుడే: కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంజూరు చేసిన రూ.4.3 కోట్లతో పట్టణంలో చేపట్టనున్న అధునాతన చితాగారం (వైకుంఠ ధామ) నిర్మాణానికి సోమవారం స్థానిక ఎమ్మెల్యే గవియప్ప భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో హొసపేటె సహా ఐదు పట్టణాలకు మాత్రం ఇలాంటి చితాగారాలు మంజూరయ్యాయని తెలిపారు. విద్యుత్తు, గ్యాస్‌వల్ల ఇక్కడ శవసంస్కారం జరిపేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అంతిమ వీడ్కోలుకు వచ్చినవారికి స్నాన, శౌచాలయ, విశ్రాంతి గదులూ నిర్మాణమవుతాయి. దీనికోసం 4.5ఎకరాల స్థలాన్ని వినియోగిస్తున్నారని తెలిపారు. దీని నిర్వహణను నగరసభకు అప్పగిస్తామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పుంజుకున్నాయని, పట్టణం పరిధిలో చేపట్టిన తారురోడ్డు నిర్మాణ పనులు మొన్ననే పూర్తయ్యాయని తెలిపారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించే ప్రయత్నాలు చేస్తామని హామీ ఇచ్చారు. నగరసభ అధ్యక్షుడు ఎన్.రూపేశ్‌కుమార్, ఉపాధ్యక్షుడు జీవరత్నం, కమిషనర్ మన్సూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో సంపూర్ణ విజయానికి కృషి

మాన్వి,న్యూస్‌టుడే: రాయచూరు జిల్లాలో పల్స్‌పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేసే దిశగా తమ విభాగం చర్యలు తీసుకుంటుందని ఇందుకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని జిల్లా ఆరోగ్యాధికారి డాక్టర్ సురేంద్రబాబు సూచించారు. సోమవారం స్థానిక వందపడకల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బందికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. 2011 జనవరి 13న భారత్‌లో చివరి పోలియో కేసు నమోదయిందన్నారు. 14ఏళ్లుగా దేశంలో పోలియో కేసులు కానరాకపోవడం గర్వించదగ్గ విషయమన్నారు. డి.ఎస్.ఒ. డాక్టర్ గణేశ్, టి.ఎం.ఒ. డాక్టర్ చంద్రశేఖరయ్య స్వామి, డాక్టర్ శివకుమార్, జిల్లా ఆరోగ్య ఉప ఆరోగ్య శిక్షణాధికారి బసయ్య, వివిధ తాలూకాల ఆరోగ్యాధికారులు, వైద్యులు, ఆరోగ్య నిరీక్షణాధికారులు పాల్గొన్నారు.

ఆయుర్వేద చికిత్సలకు విశ్వవ్యాప్త ఆదరణ

మాన్వి,న్యూస్‌టుడే: ఆయుర్వేద వైద్యానికి భారత్‌తో పాటు విశ్వవ్యాప్తంగా ఆదరణనుందని కరేబియన్ సెయింట్ కిట్స్ ఐలాండ్ వైద్య విశ్వవిద్యాలయ ఔషధ విభాగ ఆచార్యుడు డాక్టర్ వీరభద్రప్పగౌడ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కేపీఎస్‌వీఎస్ ఆయుర్వేద వైద్య కళాశాల ఆసుపత్రి ప్రాంగణంలో 2025-26 ఆయుర్ ప్రవేశిక పాఠ్యక్రమ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆయుర్వేద వైద్య పద్ధతిని ఇతర వైద్యరీతులతో సమ్మిళితం చేయడం వల్ల చికిత్సలు సులభతరం అయ్యాయన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ జీవనేశ్వరయ్య మాట్లాడుతూ బీఎఎంఎస్ వైద్య విధానంలో ప్రాచీన ఆయుర్వేద వైద్య పద్ధతులను కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. పరిపాలనాధికారి విశ్వరాధ్యస్వామీజీ, ఉప ప్రిన్సిపల్ డాక్టర్ సుమంగళ, ఉమాశంకర్, డాక్టర్ నారాయణ, డాక్టర్ హిరేమఠ శివరాజ్ ఒడెయర్, డాక్టర్ రమ్య, డాక్టర్ అంజుమా పర్వీన్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ వీరభద్రప్పగౌడని సన్మానిస్తున్న వైద్య కళాశాల నిర్వాహకులు

(c) eenadu

ఆశచూపి.. నిలువునా మోసం

'ఆన్‌లైన్ ట్రేడింగ్' దారుణం

కార్వార, న్యూస్‌టుడే : ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్ పేరిట వంచనలకు పాల్పడుతున్న ఆరోపణలపై నలుగురిని హొన్నావర ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. బిహారుకు చెందిన ఎండీ ఆలమ్‌ను బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో, ఆర్‌బీఎల్ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్లుగా పని చేస్తున్న బిల్లె ప్రవీణ్ కుమార్ (35), వినయ్‌కుమార్ (30)లను హైదరాబాద్‌లో అరెస్టు చేయగా, బిహారుకు చెందిన మరో నిందితుడు షమీమ్ అఖ్తర్ (55)ను బెంగళూరులో అరెస్టు చేశామని పోలీసులు సోమవారం ఇక్కడ ధ్రువీకరించారు. ఫేస్‌బుక్‌లో ఫారెక్స్ ట్రేడింగ్ యాప్ పేరిట నిందితులు పోస్టులు పెట్టారు. దాన్ని విశ్వసించి హొన్నావరలోని ప్రభాతనగరకు చెందిన గిరీశ్ (35) అనే వ్యాపారి వారిని సంప్రదించి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. ఈ ఏడాది మే 28 నుంచి దశల వారీగా రూ.46.50 లక్షలు మదుపు చేసి మోసపోయాడు. బాధితుని ఫిర్యాదుతో కార్యాచరణను పూర్తి చేసి, వంచకులను అరెస్టు చేశారు. వీరి నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు విచారణను తీవ్రం చేశారు.

వృద్ధ రైతు బలవన్మరణం

బీదర్, న్యూస్‌టుడే : చిటగుప్ప తాలూకా బశిరాపుర గ్రామానికి చెందిన భీమణ్ణ (92) అనే వృద్ధ రైతు ఒంటికి నిప్పు పెట్టుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. కుమారులు, మనవళ్లతో కలిసి సేద్యం చేస్తున్న భీమణ్ణ ఆయా బ్యాంకుల్లో రూ.8 లక్షలకు పైగా రుణం తీసుకున్నారు. పంట నష్టం కావడం, అప్పు చెల్లించాలని నోటీసులు రావడంతో వ్యధకు గురై ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. బేమళఖేడా ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'హేమావతి'లో దంపతుల గల్లంతు

భర్త మృతదేహం గుర్తింపు

హాసన, న్యూస్‌టుడే : హేమావతి కాలువలో దుస్తులు ఉతుక్కునేందుకు వెళ్లిన నంబిహళ్లి నివాసి గోపాల్ (27), ఆయన భార్య దీపు (24) నీటిలో కొట్టుకుపోయారు. ఆదివారమే వారు కాలువ వద్దకు వెళ్లి.. మళ్లీ ఇంటికి తిరిగి వెళ్లలేదు. వారి కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టగా కాలువ ఒడ్డున దుస్తులు కనిపించాయి. చెన్నరాయపట్టణ ఠాణాలో ఫిర్యాదు చేయగా, కాలువలో సోమవారం ఉదయం నుంచి గాలింపు చేపట్టారు. మధ్యాహ్నానికి గోపాల్ మృతదేహం కనిపించింది. దీపు మృతదేహం కోసం గాలింపు తీవ్రం చేశారు. చెన్నరాయపట్టణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జీబీఏ కార్యాలయంలో భారీ అగ్నిప్రమాదం

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : జయనగర నాలుగో బ్లాకులోని జీబీఏ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళ సిబ్బంది రెండు వాహనాల్లో వచ్చి మంటల్ని ఆర్పారు. విద్యుత్తు షార్ట్‌సర్క్యూటే ప్రమాదానికి కారణమని జయనగర ఠాణా పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. మంటల్ని గుర్తించిన సిబ్బంది కేకలు వేసుకుంటూ కిందకు పరుగుపెట్టుకుంటూ వచ్చారు. ఈ సమయంలో లిఫ్టులో చిక్కుకున్న ఇద్దరిని అగ్నిమాపకదళ సిబ్బంది రక్షించారు. కొద్దిలో వారికి ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు ప్రమాద నష్టం అంచనా వేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

టమాటా.. ఆకాశం బాట!

బెంగళూరు కృష్ణరాజేంద్ర విపణిలో టమాటా దుకాణం

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : వంటింటి రారాజుగా విరాజిల్లుతోన్న టమాటా ధరలు ఒక్కసారిగా ఆకాశం దిశగా దూసుకెళుతున్నాయి. మొన్నటివరకు దిబ్బల్లో పారబోసిన సరకు. . నేడు దుకాణాల్లో కళకళలాడుతోంది. మొన్నటి వరకు కిలో ధర రూ.20 నుంచి రూ.25 మధ్య ఉండగా.. ఇపుడది ఏకంగా అర్ధ సెంచరీ బద్దలు కొట్టింది. కిలో ధర బెంగళూరు విపణిలో రూ.50 నుంచి రూ.70 వరకు పలుకుతోంది. కన్నడనాట 1.95 లక్షల ఎకరాల్లో సాగులోకి తేగా.. ధరలు పడుతూ.. లేస్తూ ఊరించడం పరిపాటిగా మారింది. ఇరుగు పొరుగు రాష్ట్రాల సరకు పోటీకి వచ్చిన ప్రతిసారీ ధర పడిపోవడం.. అక్కడ పంట తగ్గితే ఇక్కడ మోతెక్కడం సాధారణాంశంగా మారింది. ఇప్పటికిప్పుడు రైతులు ఆనంద వ్యక్తం చేస్తుండగా.. వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ పరిస్థితి చూస్తుంటే.. అపుడో ఇపుడో కిలో రూ.వంద పలుకుతుందనే అంచనాలూ లేకపోలేదు. విపరీతమైన చలి, మంచు, తుపాను వర్షాల కారణంగా మంచి టమాటా చేతికందితే అదే చాలని రైతులు ఆశపడుతున్నారు. కోలారు, చిక్కబళ్లాపుర, రామనగర, తుమకూరు, బెంగళూరు గ్రామీణ జిల్లాలో ఈ పంట ఎక్కువగా పండుతోంది. తెగుళ్లు అధికం కావడంతో దిగుబడి తగ్గినట్లు వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. అతిపెద్ద కోలారు విపణిలో రెండువారాల కింద 15 కిలోల ధర రూ.250 నుంచి రూ.350 వరకు పలికింది. ఇపుడది రూ.500 నుంచి రూ.600 పలుకుతున్నట్లు వ్యాపారులు వివరించారు.

> ఏ వంటలోనైనా ఇట్టే ఒదిగిపోయి.. రుచి పుట్టించే టమాటా ధరలు పెరిగిపోతున్నాయి. ఒకందుకు రైతులు సంబరం చేసుకుంటుండగా.. వినియోగదారులు పెదవి విరుస్తున్నారు. ఓ వైపు ఎగుమతులు పెరగడం.. మరో వైపు ఉత్పత్తి తగ్గిన ప్రస్తుత పరిస్థితిలో రేపటికి ధరలు ఎలా ఉంటాయో అంచనాకందడం లేదు.

అక్క దళం ప్రారంభ సన్నాహాలు

ఖర్గేను ఆహ్వానిస్తున్న లక్ష్మీ హెబ్బాళ్కర్ తదితరులు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : స్త్రీ- శిశు సంక్షేమ శాఖ- ఐసీడీఎస్ సువర్ణ మహోత్సవాల సందర్భంగా ఈనెల 28న నగరంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి హాజరు కావాలని ఆ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేను ఆహ్వానించారు. బెంగళూరు సదాశివనగరలోని ఖర్గే నివాసినికి వెళ్లిన ఆమె ప్రత్యేక ఆహ్వాన పత్రాన్ని అందించారు. యువతుల రక్షణ కోసం 'అక్క దళం', గృహలక్ష్మి సహకార బ్యాంకు తదితర పథకాలను ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. పార్టీ రాష్ట్రాధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు రణదీప్‌సింగ్ సుర్జేవాల, కేసీ వేణుగోపాల్‌నూ ఆహ్వానించినట్లు ఆమె వెల్లడించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రంలో కళాశాల విద్యార్థుల రక్షణకు అక్కదళం ప్రత్యేకంగా పనిచేస్తుందని మంత్రి వివరించారు. దళ సభ్యులు నిరంతరం అప్రమత్తంగా మసలుతూ కళాశాలలు, వివిధ వాణిజ్య కేంద్రాల వద్ద భద్రత కోసం నిగూఢంగా మసలుతూ.. పని చక్కబెడతారని వెల్లడించారు.

'వందేభారత్' ఢీకొని.. ఇద్దరు విద్యార్థుల విషాదాంతం

మృతులు స్టెరిన్ ఎల్జా సజి, జోసెఫ్

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : చిక్కబాణావర రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం వందే భారత్ రైలు ఢీకొని జస్టిన్ జోసెఫ్ (21), స్టెరిన్ ఎల్జా సజి (19) అనే నర్సింగ్ విద్యార్థులు దుర్మరణం చెందారు. కేరళలోని పట్టనంతిట్టకు చెందిన వీరిద్దరూ సప్తగిరి నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ రెండో సెమిస్టర్ విద్యార్థులు. రైలు వస్తున్న సమయంలో వీరు పట్టాలపైకి రావడంతో ప్రమాదం సంభవించింది. తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించినా అప్పటికే మరణించారని తేలింది. ప్రాథమిక దర్యాప్తులో వీరిద్దరూ ఆత్మహత్య చేసుకునేందుకే పట్టాలపైకి వచ్చారని అనుమానిస్తున్నామని రైల్వే ఎస్పీ ఎస్ యతీశ్ చెప్పారు. ఇప్పటి వరకు ఎటువంటి డెత్‌నోట్ లభించలేదన్నారు. గ్రామీణ రైల్వే ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆగ్రహావేశాలతో 'ఫుట్‌బాల్' ఆడుకున్నారు

మడికేరి, న్యూస్‌టుడే : విరాజపేటలోని తాలూకా మైదానంలో ఫ్లడ్ లైట్ల వెలుగులో రాత్రుళ్లు నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ ఆట సమయంలో అభిమానులు- ప్రేక్షకుల మధ్య గొడవ తలెత్తింది. ఒకరిపై మరొకరు దాడి చేసుకోగా, కొందరు స్వల్పంగా గాయపడ్డారు. కండగ గ్రామానికి చెందిన జట్టు, కేరళ నుంచి వచ్చిన ఆటగాళ్ల మధ్య ఆదివారం రాత్రి సెమీఫైనల్స్ జరుగుతున్న సమయంలో గొడవ మొదలైంది. తమకు నచ్చిన జట్లకు చప్పట్లు కొడుతూ, ఈలలు, కేకలు వేస్తుండగా ప్రేక్షకులు- అభిమానుల మధ్య వాగ్యుద్ధం మొదలైంది. కుర్చీలను ఒకరిపై మరొకరు వేసుకుంటూ కొట్టుకున్నారు. విరాజపేట ఠాణా పోలీసులు అక్కడకు వచ్చి పరిస్థితులను నియంత్రించారు. గొడవతో కొంత సమయం మ్యాచ్ నిలిచిపోయింది. పరిస్థితులు సర్దుకున్న అనంతరం పోలీసుల నిఘాలో మ్యాచ్ కొనసాగింది.

దోపిడీలకు తెగించి.. దొరికిపోయారు

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : పోలీసుమంటూ దారి దోపిడీలు, దొమ్మీలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను హెచ్ఏఎల్ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. కేరళకు చెందిన నజాస్, సరుణ్, బెంగళూరుకు చెందిన విష్ణు, కేటీ దివాకర్, మధుకుమార్, కిరణ్ అనే యువకులను నిందితులుగా గుర్తించారు. విద్య, ఉద్యోగం, ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన యువతను లక్ష్యంగా చేసుకుని దారి దోపిడీలకు పాల్పడ్డారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న వారి వద్దకు వెళ్లి డెలివరీ బాయ్‌లమని చెప్పి తలుపులు తీయించి, దోచుకుని వెళ్లేవారు. ఇటీవల ఒక ఇంట్లో ఇద్దరు యువతులను బెదిరించి రెండు చరవాణులు తీసుకువెళ్లారు. రూ.5 లక్షలు ఇస్తేనే ఫోన్లు ఇస్తామన్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కార్యాచరణ పూర్తి చేసి నిందితులను అరెస్టు చేశారు.

చదువులమ్మ ఇంట విజ్ఞాన గంట!

కేపీఎస్ ప్రాంగణాల్లో విద్యార్థి వికాసం!

విజ్ఞానానికి ప్రాధాన్యమిచ్చేలా చదువు సంధ్యలు

ప్రయోగాలకు కేంద్ర బిందువు కేపీఎస్

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక పబ్లిక్‌స్కూల్ (కేపీఎస్) వ్యవస్థను అందుబాటులోకి తెచ్చాక.. ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న అపోహలన్నీ పటాపంచలై పోతున్నాయి. ఈ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలోనే ప్రవేశం పొందేందుకు విద్యార్థులు తల్లిదండ్రులు బారులు తీరుతుండటం తాజా పరిణామం. కార్పొరేట్ స్కూల్‌లో ఉన్న సౌకర్యాలు, నాణ్యమైన బోధనలకు కేపీఎస్ తక్కువేమీ కాదు. ప్రభుత్వ కన్నడ పాఠశాలలను పూర్తిగా కర్ణాటక పబ్లిక్‌పాఠశాలలుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఈ విద్యాలయాల్లో ఆంగ్ల మాధ్యమానికి ప్రాధాన్యమిచ్చారు. పెద్దల్లో ఇప్పటికే పాదుకున్న ఆంగ్ల వ్యామోహం నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలలు పాతుకుపోయాయి. వారి ఆసక్తిని గమనించి.. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఆంగ్ల మాధ్యమానికి ఊతమిచ్చారు. అనేక విద్యాలయాల్లో ఈ మాధ్యమానికి అనుమతులిచ్చారు. ఆంగ్లంతో పాటు కన్నడ భాష ప్రాధాన్యమేమీ తగ్గించకపోవడంతో ఆసక్తి ఇనుమడించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 308 కేపీఎస్ ప్రాంగణాలు ప్రారంభించారు. వీటిలో విద్యార్థులకు ప్రవేశం ఇపుడు పోటీతో కూడుకున్నది. బెంగళూరు ఉత్తరలో కృష్ణనంద నగర, బెంగళూరు దక్షిణలో ఆడుగోడి, కోలారు జిల్లా మాలూరులో మాస్తి, చెన్నపట్టణ సమీప హొంగనూరు, మైసూరు జిల్లా టి.నరసిపుర తాలూకాలోని మూగూరు, బెళగావి జిల్లా రామతీర్థనగర, యాదగిరిలో గజర్‌కోట్ కేపీఎస్ ప్రాంగణాలు దూకుడు ప్రదర్శిస్తూ ఆయా ప్రాంతాల్లోని ప్రైవేట్ పాఠశాలలను వెనక్కి నెట్టేశాయనే సమాచారం అధికారుల్లో కొత్త ఉత్సాహాన్నిస్తోంది. రాష్ట్రంలో ఇలాంటివి వెయ్యి పాఠశాలలు ప్రారంభించి, 15 లక్షల మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతామన్నారు. కేజీ నుంచి డిగ్రీ వరకు ఇక్కడే వరుసగా చదువుకోవచ్చు. ఈ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, కోడిగుడ్డు, పాలు, రాగిమాల్ట్, పాఠ్యపుస్తకాలు, సమవస్త్రాలు సర్కారు అందిస్తోంది. ప్రపంచంతో పేద విద్యార్థులు పోటీపడేలా ఈ వ్యవస్థ రూపాంతరం చెందుతోందని ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప సంతోషం వ్యక్తం చేశారు.

> ప్రైవేటు విద్యకే పెద్దపీట వేసే తల్లిదండ్రుల ఆలోచనా ధోరణి మారిపోతోంది. కర్ణాటక రాష్ట్ర పబ్లిక్‌స్కూల్ విధానం కొత్త ప్రయోగంగా తెరపైకి వచ్చింది. విద్య, విజ్ఞాన, సాంస్కృతిక, క్రీడారంగాల్లో బాలలను మెరికల్లా తీర్చిదిద్దే వ్యవస్థ.. కేపీఎస్!

ఉత్తరహళ్లి కర్ణాటక పబ్లిక్‌స్కూల్ ప్రార్థన ప్రాంగణం

రాకెట్ ప్రయోగాల్లో బాలలు మమేకం

మెజిస్టిక్‌లో.. మెగా ప్రాంగణం

రాజధాని నడిబొడ్డున విస్తరించిన బీఎంటీసీ బస్టాండు

> బెంగళూరు నగర ప్రయాణమంటూనే ఎవరికైనా 'మెజిస్టిక్' బస్టాండే గుర్తుకొస్తుంది. అదొక వినూత్న ప్రపంచం! అటు రైల్వే.. ఇటు మెజిస్టిక్.. మధ్యలో ఆర్టీసీ, బీఎంటీసీ వాహనాలు ఆగడానికి వేర్వేరు ప్రాంగణాలు ఒకేచోట ఒదిగిపోయి కనిపిస్తాయి. రైల్వే, మెట్రోతో పోలిస్తే బస్సుల రాకపోకల విభాగం పాతదిగా కనిపిస్తుంది. దాన్ని సమూలంగా మార్చేయబోతున్నారు.

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : బెంగళూరు నగర నడిబొడ్డు ప్రదేశంలో పది అంతస్తుల హైటెక్ బస్టాండు భవన నిర్మాణానికి సర్కారు ముందడుగు వేసింది. దీని కోసం టెండర్ల ప్రక్రియ ప్రారంభించారు. మెజిస్టిక్ పరిధిలో 32 ఎకరాల్లో ప్రభుత్వ-ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో రూ.15 వేల కోట్ల వ్యయంతో ఈ ప్రాంగణాన్ని నిర్మించేందుకు కార్యాచరణ పథకాన్ని రూపొందించారు. 'కెంపేగౌడ ప్రాంగణం' పేరిట కె.ఎస్.ఆర్టీసీ, బీఎంటీసీ బస్టాండ్లను ప్రయాణికులకు అనుకూలంగా నిర్మిస్తారు. ప్రయాణికులకు అవసరమైన విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, హోటళ్లు, మాల్స్ తదితర సౌకర్యాలను కల్పిస్తారు. బస్టాండులోకి ప్రవేశిస్తే.. అన్ని వసతులూ అక్కడ లభించేలా చర్యలు తీసుకుంటారు. బస్టాండులో దిగిన ప్రయాణికుడు తనఇంటికి వెళ్లేందుకు బీఎంటీసీ బస్సు లేక పోతే మెట్రో రైలు ఎక్కి వెళ్లేలా దారులు, కదిలే మెట్లను ఏర్పాటు చేస్తారు. సమీపంలోని సిటీరైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు ప్రత్యేక అనుబంధ వంతెన నిర్మిస్తారు. ఈ ప్రాంగణాన్ని రాకపోకల అవసరాలకే కాక.. వాణిజ్య కేంద్రంగానూ విస్తరిస్తారు. బీఎంటీసీ బస్టాండు నుంచి నిత్యం ఆరువేల బస్సులు సంచరిస్తుండగా 30 లక్షల మంది ఈ వ్యవస్థ సేవలు వినియోగించుకుంటున్నారు. ఆర్టీసీ బస్టాండు నుంచి దూర ప్రాంతాలకు మూడువేల బస్సులు కదులుతుంటాయి.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	75
క్యారెట్-	70
బీరకాయలు-	60
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)	-30
సొరకాయ-	50
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	95
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	60
టమాటా(సాధారణ)	-50
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	25
ఉల్లి(సాధారణ)-	20
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	65
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	140

పండ్లు, ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	385
సిమ్లా ఆపిల్-	155
గ్రీన్ ఆపిల్-	295
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	65
బొప్పాయి-	30
ఆరంజి-	70
బత్తాయి-	65

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

మేయర్ పూజారి గాదెప్ప బాధ్యతల స్వీకరణ

దుర్గమ్మ గుడి నుంచి ఊరేగింపుగా వస్తున్న మేయర్ పూజారి గాదెప్ప, కార్యకర్తలు అభిమానులు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికె 24వ మేయర్‌గా పూజారి గాదెప్ప సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నగర పాలికె 23వ వార్డు కార్పొరేటర్‌గా గెలుపొందిన పూజారి గాదెప్ప ఈ నెల 15న బళ్లారి నగర మేయర్‌గా ఎన్నికైన విషయం తెలిసిందే. బళ్లారి కనక దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించి అక్కడి నుంచి నగర పాలికె కార్యాలయం వరకు ఊరేగింపుగా వచ్చారు. నగర పాలికె అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం బాధ్యతలు స్వీకరించడంతో డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, శ్రీరామరాజు, కమిషనర్ మంజునాథ, కార్పొరేటర్లు, అధికారులు సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా మేయర్ విలేకరులతో మాట్లాడుతూ నగర పాలికె కార్పొరేటర్లు, అధికారుల సహకారంతో నగర పాలికె ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడానికి ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. పాలికెలో ప్రధానంగా నగరంలో పారిశుద్ధ్యం, శుద్ధమైన తాగునీరు, వీధిదీపాలు, రహదారులు వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

పలువురి అభినందన

మేయర్‌ను అభినందిస్తున్న డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, కల్యాణ స్వామి

పట్టపగలే ఎడ్లపై చిరుత దాడి

హొసపేటె, న్యూస్‌టుడే: ఇంటి నుంచి కొంత దూరంలో కట్టివేసిన ఎడ్లపై వేకువజామున చిరుత దాడిచేసి గాయపరిచిన ఘటన సోమవారం పట్టణ శివారు జంబునాథనహళ్లిలో జరిగింది. చిరుత దాడిలో రెండూ ఎడ్లకు గాయాలయ్యాయి. అదే సమయంలో కుక్కలు మొరగడంతో రైతు కటిగి హేమణ్ణ, కుటుంబ సభ్యులు బయటకు వచ్చి పరిశీలించగా, చీకట్లో చిరుత పరుగులు తీయడం గుర్తించారు. కుక్కలు మొరగకపోతే తన ఎడ్లు చిరుతకు బలయ్యేవని రైతు తీవ్ర భయాందోళన వ్యక్తం చేశారు. వారం క్రితం ఆ ప్రాంతంలో చిరుత రెండు కుక్కలను చంపింది. ఇక్కడ చిరుత బెడద ఉంది, దాన్ని బంధించాలని అటవీశాఖకు మొరపెట్టుకున్నా ఫలితంలేదని ఆ ప్రాంత రైతులు వాపోతున్నారు.

ఎద్దు గొంతు వద్ద చిరుత దాడితో కలిగిన గాయం

మూడు కేసుల్లో నలుగురి అరెస్టు

నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, నగదును ప్రదర్శిస్తున్న అరసీకెరె పోలీసులు

హొసపేటె, న్యూస్‌టుడే: సంతలో మహిళల దృష్టి మళ్లించి బంగారు ఆభరణాలు, నగదు దోచుకుంటున్న రెండు కేసుల్లో ముగ్గురు, గొర్రెలను దొంగిలిస్తున్న కేసులో మరో వ్యక్తిని అరెస్టు చేసిన అరసీకెరె పోలీసులు వారినుంచి రూ.1.30 లక్షల నగదు, రూ.2.30లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ఓ బైకును స్వాధీనం చేసుకున్నారు. మొదటి రెండు కేసుల్లో ఓ మహిళ కూడా ఉండటం విశేషం. ఈ నెల 20న ఉచ్చంగిదుర్గ గ్రామ సంతలో ఇద్దరు మహిళల దృష్టి మళ్లించిన ఓ మహిళ, ఇద్దరు పురుషులు వారినుంచి రూ.2.30లక్షల విలువైన బంగారు నగలను దోచుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఐ మహంతేశ్ సజ్జన్, ఎస్సై విజయకృష్ణ నేతృత్వంలో కూపీలాగిన సిబ్బంది దావణగెరె జిల్లా చెన్నగిరి తాలూకా, సంతెబెన్నూరుకు చెందిన సిద్ధరామ, ప్రకాశ్, జయమ్మలను అరెస్టు చేసి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో గొర్రెలను దొంగిలిస్తున్న కూడ్లిగి తాలూకా పాలయ్యనకోటెకు చెందిన నిందితుడు హనుమంతను అరెస్టు చేసి, అతన్నుంచి రూ.1.30లక్షల నగదు, ఓ బైకు స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదించిన పోలీస్ అధికారులు, సిబ్బంది రవిదాదాపుర, మహంతేశ్ బిళిచోడ, ఆనంద్, దాదాపీర్, హరీశ్, అజ్జప్పలను విజయనగర ఎస్పీ ఎస్.జాహ్నవి అభినందించారు.

దోపిడీదొంగల వేట కొనసాగింపు

చెన్నైలో మరో ఇద్దరి అరెస్ట్

జప్తు చేసుకున్న నగదును గోతాములో తీసుకువస్తున్న సిబ్బంది

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : ఏటీఎం యంత్రాల్లో నింపేందుకు తీసుకువెళుతున్న రూ.7.11 కోట్ల నగదు దోపిడీ కేసులో మరో ఇద్దరు ప్రధాన నిందితులను చెన్నైలో అరెస్టు చేశామని సంబంధిత అధికారులు సోమవారం ధ్రువీకరించారు. మిగిలిన నిందితుల వేట తుది దశకు చేరువైందని నగర పోలీసు కమిషనర్ సీమంత్ కుమార్‌సింగ్ వివరించారు. చెన్నైలో దినేశ్, జినేశ్ అనే ఆ ఇద్దరి వద్ద ఎలాంటి నగదూ లభించలేదు. ఇప్పటి వరకు అరెస్టు చేసిన నిందితుల నుంచి రూ.6.29 కోట్లు జప్తు చేసుకున్నామని కమిషనర్ వివరించారు. సీఎంఎస్ వాహనం పర్యవేక్షకుడు గోపాల్ ప్రసాద్, మాజీ ఉద్యోగి జేవియర్, గోవిందపుర ఠాణా నుంచి సస్పెండైన కానిస్టేబుల్ అణ్ణప్ప నాయక్, దోపిడీకి సహకారాన్ని అందించిన నవీన్, నెల్సన్, రవిలను అరెస్టు చేశారు. నిందితులు కొంత నగదును వేర్వేరు చోట్ల దాచి పెట్టి ఉంటారని అనుమానిస్తున్నామని కొత్వాలు తెలిపారు. దోపిడీకి మూడు నెలల నుంచి ప్రణాళిక రూపొందించుకుని ఈ నెల 19న మధ్యాహ్నం భారతీయ రిజర్వు బ్యాంకు అధికారులమని బెదిరింపులకు, దోపిడీకి పాల్పడి పరారయ్యారని గుర్తు చేశారు. దోపిడీకి పాల్పడిన 54 గంటల్లో ప్రధాన నిందితులందరినీ అరెస్టు చేసి, బెంగళూరు పోలీసులు తమ సామర్థ్యాన్ని మరోసారి నిరూపించుకున్నారని వివరించారు. ఇద్దరు జాయింటు పోలీసు కమిషనర్లు, ఇద్దరు డీసీపీల నేతృత్వంలో 200 మంది సిబ్బంది కార్యాచరణలో పాల్గొన్నారని చెప్పారు. మొత్తం 11 బృందాలుగా కేరళ, తమిళనాడు, తెలంగాణ తదితర ప్రాంతాలకు వెళ్లి నిందితులను అరెస్టు చేసుకు వచ్చారు. మిగిలిన నగదును రికవరీ చేసేందుకు విచారణ కొనసాగిస్తున్నామని వివరించారు.

నృత్య విహారానికి చక్కని వేదిక

నాట్యమయూరాల సుందర భంగిమలు (పాతచిత్రం)

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : నగరంలోని 'సాధన సంగమ ముకుళ నృత్యోత్సవం-2025' ఈనెల 30న నిర్వహించనున్నారు. ప్రముఖ నాట్య గురువులు జ్యోతి పట్టాభిరామ్, డాక్టర్ పి.సాధనశ్రీ నేతృత్వంలో ఈ వేడుకకు ఏర్పాట్లు చేస్తున్నారు. నృత్యకళా విద్యార్థుల ప్రతిభ చాటడానికి ఇదొక చక్కని వేదిక. ఆదివారం సాయంత్రం బసవేశ్వరనగరంలోని రంగోపనిషత్ కళా ప్రాంగణంలో నృత్యవిహారాలకు నాందీవాచకం పలుకుతారు. బెంగళూరు స్థిత నృత్య విద్యాలయం నృత్య గురువు వి.స్నేహాభాగవత్, నాదనర్తన నృత్యగురు వి.దేవికా శిష్యురాళ్ల ప్రదర్శనలు ప్రత్యేకం. చలనచిత్ర నటి రోహిణి రఘునందన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

(c) eenadu

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

సనాతన ధర్మం గొప్పదనాన్ని చాటాలి

బెంగళూరు(పిణ్యాదాసరహళ్లి),న్యూస్‌టుడే: ప్రతి హిందువు తమ సంస్కృతి, సంప్రదాయాలతోపాటు సనాతన ధర్మం గొప్పదనాన్ని చాటి చెప్పాలని శెట్టి హళ్లి వార్డు అధ్యక్షుడు బి.సురేష్ పేర్కొన్నారు. ఇక్కడ చిక్కసంద్ర సప్తగిరి బడవాణిలో అమ్మణ్ణమ్మ, మారెమ్మ దేవతల పూజల్లో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. విదేశాల్లోనూ హిందూ సంస్కృతి, సంప్రదాయాలు, పద్ధతులు పాటిస్తుండడం విశేషమన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి దేవతలను పూజించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆలయ ధర్మకర్తలు ఆయనను ప్రత్యేకంగా సత్కరించి అమ్మవారి ప్రతిమలను ప్రదానం చేశారు.

మహిళా పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

సీడీపీఓ అధికారిణి సునీత

పావగడ,న్యూస్‌టుడే: రాష్ట్ర మహిళాభివృద్ధి సంస్థ మహిళ అభ్యున్నతి కోసం 2025-26 సంవత్సరానికి అందించే వివిధ పథకాలకు తాలూకాలోని అర్హులైన మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని సోమవారం సీడీపీఓ డి.జె.సునీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగి, చేతన, ధనశ్రీ, మైనారిటీ పునరావాస పథకం, మాజీ దేవదాసి తదితర పథకాలకు మహిళల నుంచి దరఖాస్తులు కోరుతున్నా మన్నారు. ఆసక్తి గల వారు 24నవంబరు25 నుంచి 15డిసెంబరు25 లోపుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

హోసూరు కబుర్లు

ఇన్‌ఛార్జిగా నియమితులైన మురళీధరన్

హోసూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు 2026 ఏప్రిల్, మే ల్లో జరుగనున్న నేపథ్యంలో డి.ఎం.కె కూటమిలో మిత్ర పక్షంగా కొనసాగే పార్టీల చర్చలు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ బలంగా ఉన్న హోసూరు లాంటి అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడానికి నాయకులు యత్నిస్తున్నారు. కృష్ణగిరి జిల్లా వెస్ట్ ఎన్నికల ఇన్‌ఛార్జిగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.ఎ.మురళీధర న్‌ను పార్టీ అధిష్ఠానం నియమించింది. ఎస్.ఎ.మురళీధరన్ గత 15 సంవత్సరాలుగా జిల్లా అధ్యక్ష పదవిలో కొనసాగుతున్నారు. ఆయనతో పాటు జిల్లా కమిటీ ఈస్ట్ అధ్యక్షుడిగా నటరాజన్‌ను నియమించింది. జిల్లా పరిశీలకుడిగా ఎ.ఐ.సి.సి. సభ్యుడు రిజ్వాన్ అర్షీద్ విధులు నిర్వ ర్తించనున్నారు. జిల్లాలోని హోసూరు, తళి, వేపనహళ్లి అసెంబ్లీ స్థానాల బాధ్యుడిగా వ్యవహరిస్తారు. జిల్లా అధ్యక్ష పదవిలో మూడోసారి కొనసా గుతున్న మురళీధరన్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

కావేరి ప్రవాహంలో కొట్టుకుపోయిన కార్మికుడు

హోసూరు,న్యూస్‌టుడే: పట్నాకు చెందిన మున్నా(31) కృష్ణగిరి సమీ పంలోని పెరియాంపట్టి గ్రామంలో ఇటుకల తయారీ పరిశ్రమలో కూలీగా పని చేస్తున్నాడు. ఆదివారం సెలవురోజు కావడంతో హొగెనక్కల్‌లో గడ పడానికి మిత్రులతో కలిసి వెళ్లాడు. మొత్తం తొమ్మిది మంది ధర్మపురి సమీపంలోని హొగెనక్కల్ జలపాతాన్ని చూడ్డానికి వెళ్లారు. అక్కడ స్నానం చేయడానికి నీటిలో దిగి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. ఈత తెలియక పోవడంతో కొద్ది సేపటికి మునిగిపోయాడు. అతని కోసం మిత్రులు కేకలు పెడుతూ తోటి పర్యాటకుల సాయాన్ని కోరారు. సమా చారం అందుకున్న హొగెనక్కల్ పోలీసులు గాలింపు ప్రారంభించారు. మరోవైపు అగ్నిమాపక సిబ్బంది గాలింపు కొనసాగుతోంది.

కళోత్సవాలతో ప్రతిభ వెలికితీత

పోటీలను ప్రారంభిస్తున్న అశోక్ చలవాది, లక్ష్మణ్‌దాస్, యువ ప్రతిభావంతులు

తుమకూరు, న్యూస్‌టుడే: యువజనుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి కళోత్సవం ఓ చక్కటి వేదికని కన్నడ సాంస్కృతిక శాఖ జాయింట్ డైరెక్టర్ అశోక్ చలవాది అన్నారు. స్థానిక డాక్టర్ గుబ్బి వీరణ్ణ కళా క్షేత్రంలో కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సోమ వారం ఏర్పాటు చేసిన కళా ప్రతిభోత్సవ-2025 పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. జిల్లా, డివిజన్, రాష్ట్ర స్థాయి మూడు దశల్లో పోటీలు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయిలో కళాకారులు పాల్గొని కళలను ప్రోత్సహించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్నడ సాహిత్య పరిషత్తు అధ్యక్షుడు సిద్ధలింగప్ప, కన్నడ అభివృద్ధి ప్రాధికారం సభ్యుడు డాక్టర్ రవికు మార్, కళాశ్రీ లక్ష్మణ్‌దాస్, కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఈశ్వర్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

అపహరణ, దాడి కేసులో రక్షకభటుడికి బేడీలు

ముళబాగిలు, న్యూస్‌టుడే: బెంగళూరు కాల్‌సెంటర్‌పై దాడి, దోపిడీ కేసు నిందితులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మాలూరు పోలీసు హెడ్ కానిస్టేబులు చలపతి, ఇతరులను బెంగళూరు పోలీసులు అరెస్టు చేశారు. కోరమంగళలో ఒక వ్యాపారవేత్తకు చెందిన కాల్‌సెంటర్‌పై నిందితులు దాడికి పాల్పడ్డారు. అంతేకాకుండా వారిని గదిలో బంధించారు. విడుదల చేయడానికి రూ.25 లక్షలు డిమాండ్ చేశారు. ఈ కేసులో ప్రమేయం ఉన్నవారికి ప్రోత్సాహం అందిస్తున్నారని హెడ్ కానిస్టేబులు చల పతిపై అభియోగాలు రావడంతో అతనికి పోలీసులు అరదండాలు వేశారు.

పెట్రోల్ పోసుకుని టెంపో డ్రైవర్ ఆత్మహత్య

ముళబాగిలు, న్యూస్‌టుడే: జేజీఎస్ తాలూకా బెతమంగలలో ఆదివారం రాత్రి టెంపో డ్రైవర్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. మానసిక కుంగుబాటుకు గురైన గిరీష్ (35) ఆత్మహత్య చేసు కున్నట్లు బెతమంగల పోలీసులు అనుమానిస్తున్నారు.

చెట్టుకు ఉరేసుకొని యువకుడి బలవన్మరణం

పావగడ,న్యూస్‌టుడే: పట్టణంలోని కె.ఇ.బి. కార్యాలయం వెనుక చింతచె ట్టుకు ఉరి వేసుకొని చందన్ కుమార్(27) అనే యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పునగరలో నివాసమున్న రామ కుటుంబ సభ్యులు ఆరుబయలు యాత్రకు వెళ్లారు. ఇంట్లో తన కుమారుడికి తోడుగా ఉండాలని తుమకూరులో ఉంటున్న అక్క ఆదిలక్ష్మమ్మ కుమారుడు నందన్ కుమార్‌ను పిలిపించారు. అయితే అతను ఇక్కడికొచ్చి బలవన్మరణానికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలానికి సీఐ సురేశ్ చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తు న్నారు. ఉపాధి లేకపోవడం, పెళ్లి కాకపోవడమే కారణంగా అనుమానిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో.. గృహిణి

బెంగళూరు (జేపీనగర): ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుని, బెళగావి నుంచి భర్తతో కలిసి బెంగళూరుకు వచ్చి ఉంటున్న రేఖ (25) అనే యువతి అనుమానాస్పద రీతిలో మరణించింది. వీరికి ఒక బాబు (4), ఒక పాప (2) ఉన్నారు. ఆమె భర్త మాయణ్ణ గ్రేటర్ బెంగళూరు ప్రాధికారంలో మార్షల్‌గా పని చేస్తున్నాడు. ఆమెను హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించాడని మాయ ణ్ణపై రేఖ తల్లిదండ్రులు గోవిందరాజనగర ఠాణాలో ఫిర్యాదు చేశారు.

పెద్ద మొత్తంలో నగదు చేతులు మారుతోంది

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించు కునే క్రమంలో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారుతోందని విపక్ష నేత అశోక్ ఆరోపించారు. ఇప్పటి వరకు శివకుమార్‌కు కేవలం 12 మంది ఎమ్మె ల్యేల మద్దతు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 70కు ఎలా పెరిగిందని ప్రశ్నిం చారు. పరప్పన అగ్రహార కారాగారంలో ఉన్న ఇద్దరు ఎమ్మెల్యేలతోనూ డీకే సంతకాలు చేయించుకున్నారని ఆరోపించారు. మద్దతు కోసం రూ.60-100 కోట్ల నగదు, ఫార్చ్యూనర్ కారు, ఒక ఫ్లాట్‌ను బహుమతిగా ఇస్తున్నట్లు ఆరో పణలు వచ్చాయన్నారు. త్వరలో ఈ అంశంలోని వాస్తవాలను తాము బయ టకు తీసుకువస్తామని చెప్పారు.

ఆస్తి పన్ను వసూలు చేయండి

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: గ్రేటర్ బెంగళూరు ప్రాధి కార(జీబీఏ)పరిధిలోని ఐదు నగరపాలికెలు అధిక ఆస్తి పన్ను బకాయిల వసూలుపై దృష్టి సారించాలని చీఫ్‌కమిషనర్ మహేశ్వరరావు ఆయా పాలికె కమిషనర్లకు సూచించారు. సోమవారం ఇక్కడ కమిషనర్లతో వర్చు వల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్తి పన్ను బకాయిదారులను గుర్తించి నోటీసులు ఇచ్చి పన్ను వసూలు చేయాలని తెలిపారు. ఈ ఏడాది రూ.6700 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాలన్న లక్ష్యం కాగా ఇప్పటికి రూ.3533 కోట్లు వసూలైనట్లు చెప్పారు. 22వేలు ఆస్తుల నుంచి రూ.598 కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఆస్తి పన్ను చెల్లించని వాణిజ్య వ్యాపార కేంద్రాలను గుర్తించి వాటికి నోటీసులు ఇచ్చి సీజ్ చేయాలని సూచించారు. సమావేశంలో కమిషనర్లు రాజేంద్ర చోళన్, సునీల్‌కుమార్, రమేశ్, కె.ఎన్.రమేశ్, డాక్టర్ రాజేంద్ర తదితరులు హాజరయ్యారు.

ఆ పాత మధురం..తిరిగొచ్చిన జ్ఞాపకం

తిరిగి సొంతమైన పాత కారుతో డాక్టర్ రాయ్ జోసెఫ్

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే: నగరానికి చెందిన కాన్ఫిడెంట్ గ్రూపు డెవలపర్, సినీ నిర్మాత డాక్టర్ రాయ్ చిరియం కందత్ జోసెఫ్ 31 ఏళ్ల క్రితం మారుతి 800 కొన్నారు. ఆ సమయంలో ఆయనకు పాతికేళ్ల వయసు. 1994లో దానికి రూ.1.10 లక్షలు చెల్లించారు. కారుతో పాటు ఆయన సర్జాపురలో 2 ఎకరాల భూమిని కూడా కొనుక్కున్నారు. అనంతరం మరో కారు కొనుక్కునేందుకు 1997లో ఆ కారును విక్రయించారు. మళ్లీ ఆ కారును సొంతం చేసుకోవాలని ఆయన ఎన్నో ప్రయత్నాలు చేశారు. చివరికి ఇన్‌స్టాగ్రామ్‌లో తన పాత కారు వివరాలు నమోదు చేశారు. కారును తీసుకొచ్చి ఇస్తే రూ.10 లక్షలు ఇస్తానని నజరానా ప్రకటించారు. కేవలం 12 గంటల్లో 20 లక్షల మంది ఆయన ప్రకటనను చూశారు. ఆనంద్, అనిల్ అనే యువకులు కారును గుర్తించి, జోసెఫ్‌కు అప్పగించి రూ.10 లక్షలు అందుకున్నారు.

బెళ్లందూరు రైల్వేస్టేషన్ సిద్ధం

కొత్తగా నిర్మించిన రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం

బెంగళూరు(ఆడుగోడి),న్యూస్‌టుడే: నగరంలోని ఐటీ బీటీ కారిడార్‌గా గుర్తింపు పొందిన బెళ్లందూరులో నూతన రైల్వేస్టేషన్‌ను సిద్ధం చేశారు. ఆ స్టేషన్‌లో లోకల్, ప్యాసింజర్ రైళ్లు నిలబడతాయి. అందు కోసం కొత్తగా రెండు ప్లాట్‌ఫారాలను నిర్మిం చారు. ప్లాట్‌ఫారానికి ఇరువైపులా రైళ్లు నిల బడే విధంగా రూపకల్పన చేశారు. విశాలమైన ప్లాట్‌ఫారం నిర్మించడంతో పాటు ప్రయాణికులకు ఆసనాలు, మంచినీరు కుళాయిలు, మరుగుదొడ్లను నిర్మించారు. ప్రయాణికుల కోసం టికెట్ కౌంటర్, విశ్రాంతి గదులను ఏర్పాటు చేశారు. ఉదయం సాయంత్రం స్టేషన్‌లో కంటోన్మెంట్ రైల్వేస్టేషన్, యశ్వంతపుర, బాణసవాడి, కృష్ణరాజపురం స్టేషన్ల నుంచి హోసూరు, కుప్పం తదితర ప్రాంతాలకు సంచరించే రైళ్లు, ప్యాసింజర్ రైళ్లు ఆగుతాయి. వందలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. వారిలో ఐటీ బీటీ కంపెనీలు ఉద్యో గులు కూడా సంచరిస్తున్నారు. ఈ స్టేషన్ ఐటీ ఉద్యోగులకు ఉపయోగకరంగా ఉందని అధి కారులు తెలిపారు. ఇప్పటికే వైట్‌ఫీల్డ్, కాలరాం, బాణసవాడి స్టేషన్లను అభివృద్ధి చేసిన విషయం తెల్సిందే. రానున్న రోజుల్లో సబర్బన్ రైలు సంచారానికి స్టేషన్ ఉపయోగపడే విధంగా రూ.10 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు.

కల్పవృక్షవాహన సేవలో నృత్యం చేస్తున్న మేఘనా రేవణకర్, చరణ్ అంబరిణి

పద్మావతి అమ్మవారి బ్రహోత్సవాల్లో రేవణకర్

బెంగళూరు (కెంగేరి): తిరుచానూరు-అలివేలు మంగాపురంలో పద్మావతి అమ్మవారి బ్రహోత్సవం కల్పవృక్ష వాహన సేవలో ప్రముఖ భరతనాట్య కళాకారిణి మేఘనా రేవణకర్ పాల్గొన్నారు. పద్మావతి వేషధారణతో నృత్య సేవలో పాల్గొనడం విశేషం. మేఘనతో పాటు చరణ్, అంబరిణి తదితరులు నృత్యకళారాధనతో భక్తుల ప్రశంసలు పొందారు. అమ్మవారి బ్రహోత్సవంలో కళాకారుల ప్రదర్శనకు అవకాశం కల్పించిన దాససాహిత్య పథకం, గోపికా భజనమండలికి మేఘనా రేవణకర్ బృందం కృతజ్ఞతలు తెలిపింది.

27 నుంచి పరిక్రమ ఫుట్‌బాల్ ఛాంపియన్స్ లీగ్

జెర్సీ ఆవిష్కరణలో అస్లాంఖాన్, శుక్లాబోస్ తదితరులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: భారత్ అండర్-16 విభాగంలో పేరొందిన ఫుట్‌బాల్ జట్లలో ఒకటైన పరిక్రమ ఛాంపియన్స్ లీగ్ ఈక్వాలిటీ కప్ పోటీలు ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న కర్ణాటక ఫుట్‌బాల్ సంఘం ఉప ప్రధాన కార్యదర్శి అస్లాంఖాన్ టోర్నీ జెర్సీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పన్నెండేళ్ల నుంచి ఈ పోటీలు జరుగుతున్నాయి. యువ ఆట గాళ్లకు చక్కని వేదికగా ఈ పోటీలు ఏర్పాటు చెయ్యడం హర్షణీయమన్నారు. ఈ సమా వేశంలో పాల్గొన్న పరిక్రమ హ్యూమానిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శుక్లాబోస్ మాట్లా డుతూ ఫుట్‌బాల్ క్రీడాకారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపేందుకు ఏర్పాటు చేసిన ఈ టోర్న మెంట్‌లో గోవా, ఉదయ్‌పూర్, ఒడిశా జట్లతో సహా మొత్తం 16 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. బెంగళూరు ఫుట్‌బాల్ మైదానంలో మూడు రోజుల పాటు ఈ పోటీలు జరగ నున్నాయి. విలేకరుల సమావేశంలో వివిధ పాఠశాలల నుంచి కోచ్‌లు పాల్గొన్నారు.

సేవల విస్తరణతో ఉద్యోగావకాశాలు

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: ఆర్థిక లావాదేవీల నిర్వాహకులు, అకౌంటెంట్లకు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలను విస్తరించేందుకు భారత్‌లో తమ సేవలను అందుబాటులోకి తీసుకొ స్తున్నట్లు యూకేకు చెందిన అంతర్జాతీయ అకౌం టెంట్ల సంఘం (ఏఐఏ) ప్రకటించింది. అర్హులకు కౌశల్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి వచ్చే మూడేళ్లలో పది వేల మంది వృత్తి నిపుణులకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని సంఘం విధాన నిర్వహణ సంచాలకుడు డేవిడ్ పాట్స్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆనందకుమార్, ఎస్ఆర్ నాయర్ పాల్గొన్నారు.

నేనింకా శిశువునే

రామనగర్: తాను కాంగ్రెస్‌లో చేరి ఏడాదైందని, ఏ వర్గానికీ కొమ్ము కాసే నాయకుడ్ని కాదని ఎమ్మెల్యే సీపీ యోగీశ్వర్ పేర్కొన్నారు. మంత్రివర్గ విస్తరణలో తనకు అవకాశం లభిస్తుందని భావిస్తు న్నట్లు చెప్పారు. పార్టీలో అధికార పీఠం మార్పునకు సంబంధించి తనకు ఏమీ తెలియదన్నారు.

పారా ఈతలో పీఈఎస్ విద్యార్థికి మూడు పతకాలు

సాధించిన పతకాలతో నవీన్ వెంకటేశ్

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: పీఈఎస్ విశ్వ విద్యాలయానికి చెందిన ఎంబీఏ రెండో ఏడాది విద్యార్థి నవీన్ వెంకటేశ్ క్రీడా పతకాలతో మెరిశాడు. హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన 25వ జాతీయ పారా ఈత పోటీలో మూడు పతకాలు సాధించి సత్తా చాటాడు. 200 మీటర్ల వ్యక్తిగత మిడ్లేలో బంగారు పతకాన్ని సాధించిన నవీన్ వెంకటేశ్ 100 మీటర్ల బటర్‌ఫ్లైలో రజతపతకాన్ని సొంతం చేసుకున్నాడు. అదే ఊపుతో 50 మీటర్ల బటర్‌ఫ్లైలో కాంస్యపతకాన్ని దక్కించుకున్నాడు. నవీన్ వెంక టేశ్ పతక సాధనలకు సోమవారం పీఈఎస్ విశ్వవిద్యాలయం ఛాన్స్ లర్ ప్రొ.జవహర్ దొరైస్వామి, వైస్ ఛాన్సలర్ జె.సూర్యప్రసాద్ అభి నందనలు తెలిపారు.

మహిళా వ్యాపారుల్ని సంరక్షిస్తాం

దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ నాగలక్ష్మీచౌదరి తదితరులు

బెంగళూరు(యలహంక), న్యూస్‌డే: వీధి వ్యాపారం చేస్తున్న మహిళల ప్రయోజనాలను సంరక్షిస్తామని కర్ణాటక మహిళా కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ నాగలక్ష్మీ చౌదరి తెలిపారు. సోమవారం ఇక్కడ కర్ణాటక వీధి వ్యాపారుల సంఘం మహిళా విభాగం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు వ్యాపారం నిమిత్తం మహిళా అభివృద్ధి మండలి నుంచి రుణాలు ఇప్పించి ఆర్థికంగా బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు. మహిళలు కుటుంబ వ్యవహారాలను చూడడంతో పాటు పోషణ కోసం వ్యాపారం చేస్తున్నారని వారిని గౌరవించాలని కోరారు. వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు కార్మికశాఖ తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పించేందుకు ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన వికాసంతో గ్రామీణ మహిళాభ్యుదయం

శ్రద్ధాఅమిత్ తదితర ముఖ్యులతో గ్రామస్థులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళల జ్ఞానాన్ని పెంచడంతో పాటు వారు ఆర్థికంగా బలపడేందుకు జ్ఞాన వికాసం ప్రధాన పాత్ర వహిస్తుందని బెంగళూరు క్షేమ వన కార్యనిర్వాహణాధికారి శ్రద్ధ అమిత్ తెలిపారు. సోమవారం మూడబిదిరే తాలూకా నెల్లికార గ్రామం బడకొడిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సభ్యులతో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు నాలుగు గోడల మధ్య నుంచి బయటికొచ్చి జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి పథకం ట్రస్టీలు సంపత్ సామ్రాజ్య, ప్రాంతీయ డైరెక్టర్ ఆనందసువర్ణ, గ్రామపంచాయతీ అధ్యక్షుడు ఉదయ్, జనజాగృతి వేదిక లక్ష్మణసువర్ణ, మహావీరహెగ్డే ప్రముఖులు, జ్ఞానవికాస సభ్యులు పాల్గొన్నారు.

చెత్త కాలిస్తే జరిమానా

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: రహదారులు పాద చారి మార్గాలు ఖాళీ ప్రదేశాల్లో ఉన్న చెత్తకుప్పలకు నిప్పుపెడితే గ్రేటర్ బెంగళూరు ప్రాధికార(జీబీఏ) కఠిన చర్యలు తీసుకొం టోంది. చెత్తకు నిప్పుపెడితే రూ.25వేలు జరిమానా విధించ డంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేస్తారు. కొందరు చెత్త తొలగించకుండా నిప్పుపెడుతున్నారు. తొలగించడం కన్నా నిప్పు పెట్టడం సులభం. నిప్పుపెట్టడం ద్వారా వచ్చే పొగ వాతావర ణంలో కలిసి వాయుమాలిన్యం ఏర్పడుతుంది. ప్రజలు శ్వాసకోశ వ్యాధులకు లోనవుతున్నారు. చలికాలంలో ఈ చేష్టలు ఎక్కువ. అందువల్ల చెత్తకు నిప్పు పెట్టడాన్ని నిషేధించారు. కాని శివా ర్లలో చెత్తకు కొందరు నిప్పు పెడుతున్నారు. ఆ ప్రదేశాలపై ప్రాధికార అధికారులు నిఘా వేశారు. నిప్పు పెట్టే వారిని గుర్తించే పనిలో మార్షల్స్ నిమగ్నమైనట్లు తెలిపారు.

శివార్లలో చెత్త కుప్పకు నిప్పు

పురస్కారాన్ని అందుకున్న ప్రయోగ

ట్రోఫీ అందుకుంటున్న ప్రయోగ సంస్థ ట్రస్టీ సభ్యులు

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే: విద్యార్థులలో సైన్సు పట్ల ఆసక్తి పెంచేందుకు నగ రానికి చెందిన ప్రయోగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకే షన్ రీసెర్చ్‌కు నెక్సస్ ఆఫ్ గుడ్ పురస్కారం దక్కింది. తొమ్మిది నుంచి 12వ తరగతి విద్యార్థు లకు అన్వేషణ పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమాలు, కార్యశాలలకు, గ్రీన్ కెమిస్ట్రీ, అడ్వాన్స్‌డ్ మెటీరి యల్స్, ఎర్త్ సైన్సెస్, అగ్రికల్చరల్ సైన్సెస్‌లకు యూపీఎస్సీ అధ్యక్షుడు దీపక్ గుప్త నుంచి ట్రస్టీలు ట్రోఫీ అందుకున్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బీఆర్ నాగరాజ్, డాక్టర్ వెంకట కృష్ణ బాయినేని, ప్రవీణ్ సుబ్రహ్మణ్యం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాబోయే తల్లులకు సీమంతం

వైద్యులతో కాబోయే తల్లిదండ్రులు

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: తమ సంస్థ 16వ వార్షికోత్సవంలో భాగంగా కాబోయే తల్లులకు ఒయాసిస్ ఫౌండేషన్ సీమంతాన్ని నిర్వహించింది. మొదటి కాన్పుకు సిద్ధమైన గర్భిణులు, తమ జీవిత భాగస్వామితో కలిసి కార్యక్రమానికి హాజరయ్యారు. గర్భిణులు, కాన్పు అనంతరం బాలింతలు తీసుకోవల సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం, బిడ్డ ఆరోగ్యం తదితర అంశాలపై సంస్థ సహ వ్యవస్థాపకురాలు డాక్టర్ జి దుర్గారావు వివరించారు. దేశంలో 19 నగరాల్లో 31 కేంద్రాలతో తాము అందిస్తున్న సేవ లను సంస్థ సీఈఓ పుష్కరాజ్ శెణై తెలిపారు. బనశంకరిలోని ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ప్రియాంక బజాజ్, ఇతర వైద్యులు, వైద్యేతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల వితరణ

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే: ఈ ఏడాది వెయ్యి కృత్రిమ పాదాలు, కృత్రిమ చేతుల వితరణకు రూ.30 లక్షల విరాళాలను సేకరి చామని రౌండ్ టేబుల్ ఇండియా, లేడీస్ సర్కిల్ ప్రతినిధులు ప్రకటించారు. గత 47 ఏళ్లలో తాము ఆరు వేల మందికి కృత్రిమ పాదాలు ఏర్పాటు చేసి సహ కారాన్ని అందించామని బెంగళూరు లేడీస్ సర్కిల్ 19 అధ్యక్షురాలు నటాషా అహూజా తెలిపారు. కర్ణాటక మార్వారి యూత్ ఫెడరేషన్ సహకారంతో కొందరు లబ్ధిదారులకు కృత్రిమ పాదాలు, చేతులు, కొంత నగ దును అందజేసి మాట్లాడారు. ఒక కృత్రిమ పాదానికి రూ.2500, కృత్రిమ చేతికి రూ.5 వేల ఖర్చు వస్తుం దన్నారు. పలువురు దాతలు స్పందించి నిధులు అందిస్తుండడంతో తమ కార్యక్రమాలు దిగ్విజయంగా అమలవుతున్నాయని వివరించారు. బెంగళూరు రౌండ్ టేబుల్ ప్రతినిధి అభిషేక్ అహూజా, ఇతర ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



లబ్ధిదారులతో సంస్థ ప్రతినిధులు

రమ్యంగా రంగ్‌మంచ్

నృత్యరూపకంలో విద్యార్థినులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: విద్యార్థులలో సాంస్కృతిక ప్రతిభను వెలికి తీసేందుకు నారాయణ నీట్ క్యాంపస్ కువెంపు భవన్‌లో నిర్వహించిన వార్షిక రంగ్ మంచ్-2025కు విశేష స్పందన లభించింది. ఈ ఏడాది నీట్‌లో 312 మంది విద్యార్థుల్లో 164 మంది వైద్య విద్య ప్రవేశానికి ర్యాంకులు సాధించారని సంస్థ డైరెక్టర్ డాక్టర్ పి సింధూర తెలిపారు. విద్యార్థుల్లోని సాంస్కృతిక ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ప్రతి ఏటా చక్కని స్పందన లభిస్తోందని చెప్పారు. సంప్రదాయ, సమకాలీన, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, నృత్య రూపకాలు, నాటక ప్రదర్శనలను విద్యార్థులు ఆస్వాదించారు. విద్యా విభాగానికి నేతృత్వం వహిస్తున్న డాక్టర్ ప్రమీల, ఇతర బోధకులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులకు ప్రమాణ పత్రాలు వితరణ చేశారు.

జ్యోతి వెలిగిస్తున్న డాక్టర్ సింధూర

ప్రపంచకప్ కబడ్డీలో రాణించిన ధనలక్ష్మీ పూజారి

టీం ఇండియా బృందం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: కర్ణాటక అమెచ్యూర్ కబడ్డీ సంఘం, దక్షిణ కన్నడ జిల్లా అమెచ్యూర్ కబడ్డీ సంఘాలతో పాటు ఆళ్వాస్ స్పోర్ట్స్ క్లబ్ తనకిచ్చిన సహకారం, ప్రోత్సాహంతో విజేత కాగల్గినట్లు ధనలక్ష్మీ పూజారి పేర్కొంది. సోమవారం విలేకరులతో ముచ్చటిస్తూ ప్రపంచకప్ కబడ్డీ విజేతగా నిల్చిన భారత జట్టు సభ్యురాలిగా ఉండడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపింది. బాంగ్లాదేశ్‌లోని ఢాకాలో జరిగిన ప్రపంచకప్-2025 మహిళల కబడ్డీ పోటీలో భారత జట్టు ఛాంపియన్ గౌరవాన్ని దక్కించుకొంది. ఈ గెలుపును సాధించిన జాతీయ జట్టులో దక్షిణ భారత్ తరవున పాల్గొన్న ఏకైక క్రీడాకారిణి ధనలక్ష్మీ. ఫైనల్ పోరులో 35-28 పాయింట్ల తేడాతో చైనీస్‌తైపీపై గెలుపొం దిన భారత జట్టులో ధనలక్ష్మీ చక్కని ఆల్ రౌండర్‌గా ప్రతిభ కనబరిచింది. ఆళ్వాస్ శిక్షణ ప్రతిష్ఠానంలో సంపూర్ణ క్రీడా దత్తత పథకంలో ధనలక్ష్మీ ఉచిత శిక్షణను పొందింది. ఈ సందర్భంగా విద్యాసంస్థ ముఖ్యుడు డా.ఎం.మోహన్‌ఆళ్వా మాట్లా డుతూ ధనలక్ష్మీపూజారి వంటి విద్యార్థులు ప్రపంచ వేదికలో భారత కీర్తిను నిలబెడు తుండడం తమ సంస్థకు గర్వకారణంగా ఉందని తెలిపారు.

గెలుపొందిన భారత జట్టు సభ్యురాలు ధనలక్ష్మీ పూజారి

(c) eenadu

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

శివుడి నాగాస్త్రం

ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో నాగసాధువులు సోమవారం ప్రత్యేకంగా చర్చలు జరిపారు. ఆయనను ఆశీర్వదించి వెళ్లారు. బెంగళూరు సదాశివనగరలోని డీకే ఇంటికి సోమవారం ఉదయం చేరుకున్న నాగసాధువులు.. ముఖ్యమంత్రి పీఠం అధిరోహిస్తావని దీవించారు. కొద్దిసేపు మంత్రాలు జపించి.. భవిష్యవాణి వినిపించారు. డీకే వారికి దక్షిణ తాంబూలాదులు సమర్పించి.. వీడ్కోలు పలికారు.

- న్యూస్‌టుడే, యశ్వంతపుర

నిర్దేశక ఎన్నికల్లో కృష్ణమూర్తి ప్యానెల్ విజయం

గెలుపొందిన డైరెక్టర్లు

రాయచూరు, న్యూస్‌టుడే: అల్లం ప్రభు గృహ నిర్మాణ సహకార సంఘం నిర్దేశక పదవులకు జరిగిన ఎన్నికల్లో మోదీ కృష్ణమూర్తి ప్యానెల్ ఘన విజయాన్ని సాధించింది. మొత్తం 13 స్థానాలను కైవశం చేసుకుంది. లక్ష్మణ హులిగార, రంగప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన 11 పదవులకు ఆదివారం ఎన్నిక నిర్వహించారు. మొత్తం 25 మంది పోటీ పడ్డారు. మోదీ ప్యానెల్ నుంచి నిలబడిన కృష్ణమూర్తి, బాషుమియా, డి.శరణమ్మ, వి.లక్ష్మీదేవి, రాయప్ప మాస్టర్, చంద్రశేఖర్, శరణగౌడ, వీరేశ్, తిమ్మణ్ణ యాదవ్, సురేష్ సాహుకార్, రామప్ప ప్రత్యర్థి ప్యానెల్ అభ్యర్థులపై గెలిచారు. విజేతలకు సోమవారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

కనీస మద్దతు ధరకు వినతి

అధికారిని అభ్యర్థిస్తున్న ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే: 'కేంద్రం కంది, మొక్కజొన్న, జొన్న, ఉల్లి పంటలకు కనీస మద్దతు ధరను పెంచాలి. మార్కెట్‌లో ధరలు పతనమైనందున రాష్ట్రం కొనుగోలు కేంద్రాలు తెరవాలి. అతివృష్టి పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని' జిల్లా రైతు సంఘం ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చింది. ఈ మేరకు సోమవారం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ మజీద్, గౌరవాధ్యక్షుడు లక్ష్మణగౌడ, తాలూకా అధ్యక్షుడు రమేశ్ నాయకత్వంలో జిల్లా పాలనాధికారి కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. పత్తి సేకరణ కేంద్రాల్లో వ్యాపారులు సూట్ పేరుతో కిలో పత్తిని తీసివేయకుండా సూచించాలని, ఆన్‌లైన్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యలను తొలగించాలని, పంపుసెట్లకు 12 గంటల త్రీ ఫేజ్ విద్యుత్తు సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాలు విస్తరించిన దృష్ట్యా కొత్త మ్యాప్‌లు రూపొందించాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే సరిహద్దులను గుర్తించాలని కోరారు. ప్రతినిధులు నరసప్ప వక్రాణి, వీరేశ్‌గౌడ, తిమ్మప్ప బాపూరు, హులిగప్ప జాలిబెంచి, ఇబ్రహీం, మహబూబ్ పాల్గొన్నారు.

ఫలించిన మహిళల నిరీక్షణ

● త్వరలో ఒక నెల గృహలక్ష్మి పింఛను

రాయచూరు, న్యూస్‌టుడే: పింఛన్ కోసం ఎదురుచూస్తున్న మహిళల నిరీక్షణ ఫలించనుంది. గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఖాతాల్లో రెండు మూడు రోజుల్లో సొమ్ము జమ కానుంది. త్వరలో రూ.2 వేలు విడుదలవుతుందని జిల్లా గ్యారంటీ పథకాల అమలు సమితి అధ్యక్షుడు పామయ్య మురారీ సోమవారం అధికారికంగా ధ్రువీకరించారు. జిల్లా వ్యాప్తంగా 4 లక్షల 48 వేల 741 మంది పథకానికి అర్హులు. లబ్ధిదారులకు మొత్తం రూ.89 కోట్ల 74 లక్షల 82 వేల సొమ్మును శిశు అభివృద్ధి యోజన అధికారులు డీబీటీ విధానంలో నేరుగా జమ చేస్తారు. జులై పింఛన్‌ను ఆగస్టులో వరలక్ష్మీ వ్రతం పండగ వేళ చెల్లించారు. ఆగస్టు, సెప్టెంబరులో మొండి చెయ్యి చూపారు. నవంబరులో ఒక నెల మొత్తం ఇచ్చారు. రెండు మాసాలకు సంబంధించి బాకీ అలాగే ఉంది. నవంబరులో రూ.4 వేలు ఒకేసారి ఇస్తామని ఇటీవల మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మి హెబ్బాళకర హామీ ఇచ్చారు. విడుదలవుతున్న మొత్తం నగదు, లబ్ధిదారుల సంఖ్యతో పోలిస్తే ఒక నెలదే చెల్లించనున్నారు.



పథకం ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాహుల్ తదితరులు(దాచిన చిత్రం)



పామయ్య మురారీ

రాష్ట్ర వ్యాప్తంగా కోటి 28 లక్షల మంది

ప్రభుత్వ గ్యారంటీ పథకాల్లో ఒకటైన గృహలక్ష్మి యోజనను మైసూరులో 30ఆగస్టు2023లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి సిద్దరామయ్య లాంఛనంగా ప్రారంభించారు. మహిళల ఆదరణ పొందిన ఈ పథకంలో రాష్ట్రంలో కోటి 28 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసే వరకు ప్రతి నెలా వేశారు. ఆ తర్వాత క్రమం తప్పింది. ఒకసారి మాత్రమే రూ.4 వేలు ఇచ్చారు. ఆర్థిక శాఖ అనుమతిలో జాప్యం అవుతున్నందునే సకాలంలో చెల్లించలేకపోతున్నామని మంత్రి లక్ష్మి హెబ్బాళకర వివరణ ఇచ్చుకోవడం సాధారణంగా మారింది. ప్రతి నెలా చెల్లిస్తామని హామీ ఇవ్వలేదని గతంలో ఉప ముఖ్యమంత్రి శివకుమార్ ప్రకటించి విమర్శల పాలయ్యారు. ఆయన వ్యాఖ్యానించినట్లే జరుగుతుండడం గమనార్హం.

పల్స్‌పోలియో సంపూర్ణ విజయానికి కృషి

మాన్వి,న్యూస్‌టుడే: రాయచూరు జిల్లాలో పల్స్‌పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేసే దిశగా తమ విభాగం చర్యలు తీసుకుంటుందని ఇందుకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని జిల్లా ఆరోగ్యాధికారి డాక్టర్ సురేంద్రబాబు సూచించారు. సోమవారం స్థానిక వందపడకల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బందికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. 2011 జనవరి 13న భారత్‌లో చివరి పోలియో కేసు నమోదైందన్నారు. గత 14ఏళ్లుగా దేశంలో పోలియో కేసులు కానరాకపోవడం గర్వించదగ్గ విషయమన్నారు. డి.ఎస్.ఒ డాక్టర్ గణేశ్, టి.ఎం.ఒ డాక్టర్ చంద్రశేఖరయ్య స్వామి, డాక్టర్ శివకుమార్, జిల్లా ఆరోగ్య ఉప ఆరోగ్య శిక్షణాధికారి బసయ్య, వివిధ తాలూకాల ఆరోగ్యాధికారులు, వైద్యులు, ఆరోగ్య నిరీక్షణాధికారులు పాల్గొన్నారు.

30న భగవద్గీత సమర్పణ

రాయచూరు, న్యూస్‌టుడే: భగవద్గీత మహా సమర్పణ కార్యక్రమం నగరంలోని యాదవ్ సంఘం మైదానంలో ఈ నెల 30న సాయంత్రం నిర్వహిస్తున్నట్లు భగవద్గీత అభియాన్ సంచాలకుడు డాక్టర్ ఆనంద్ ఫడ్నీస్ వెల్లడించారు. ఆయన సోమవారం పత్రికా భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. శివానంద భారతి శ్రీ పాదంగళ స్వామి సారథ్యం వహిస్తారని, మంత్రి బోసురాజు, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, ఎమ్మెల్సీ వసంత కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ జుబిన్ మహోపాత్ర హాజరవుతారని వివరించారు. గీతకు సంబంధించిన, చిత్రకళా, కంఠాపాఠం, వేషభూషణల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. సభ్యురాలు సునీతా మాట్లాడుతూ అభియాన్‌లో భాగంగా ఆంజనేయ స్వామి ఆలయంలో సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు గీత పారాయణం చేస్తామని చెప్పారు. సమావేశంలో ఈశ్వర హెగ్డే, వసంతరావ్, వినోద్, హరీష్, సంధ్యా, రేఖా పాల్గొన్నారు.

గుంతల బాటలో కాగితం పడవలు

బెంగళూరు (శివాజీనగర): రహదారిపై గుంతలను పూడ్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును ఖండిస్తున్నామని, ప్రజా గళాన్ని వినిపిస్తున్న తమను విమర్శించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని విపక్ష నేత ఆర్.అశోక్ దుయ్యబట్టారు. విధానసౌధకు కూతవేటు దూరంలో అంబేడ్కర్ వీధిలో మురుగు నీరు నిండిన గుంతలో పార్టీ నాయకులతో కలిసి కాగితం పడవలు వదులుతూ ఆయన నిరసన వ్యక్తం చేశారు. రహదారులపై గుంతల విషయంలో ఉన్నత న్యాయస్థానం చీవాట్లు పెట్టినా ప్రభుత్వ తీరులో మార్పు రాకపోవడం శోచనీయమన్నారు. నాయకులు చలువాది నారాయణ స్వామి, రవికుమార్, ఏఎస్ పాటిల్ నడహళ్లి, శరణు తళ్లికేరి, భారతి మల్లికార్జున్, మోహన్ విశ్వ తదితరులు పాల్గొన్నారు.

కాగితం పడవలతో ఆడుకుంటున్న అశోక్ తదితరులు

టమాటా.. ఆకాశం బాట!

బెంగళూరు కృష్ణరాజేంద్ర విపణిలో టమాటా దుకాణం

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : వంటింటి రారాజుగా విరాజిల్లుతోన్న టమాటా ధరలు ఒక్కసారిగా ఆకాశం దిశగా దూసుకెళుతున్నాయి. మొన్నటివరకు దిబ్బల్లో పారబోసిన సరకు.. నేడు దుకాణాల్లో కళకళలాడుతోంది. మొన్నటి వరకు కిలో ధర రూ.20 నుంచి రూ.25 మధ్య ఉండగా.. ఇపుడది ఏకంగా అర్ధ సెంచరీ బద్ధలు కొట్టింది. కిలో ధర బెంగళూరు విపణిలో రూ.50 నుంచి రూ.70 వరకు పలుకుతోంది. కన్నడనాట 1.95 లక్షల ఎకరాల్లో సాగులోకి తేగా.. ధరలు పడుతూ.. లేస్తూ ఊరించడం పరిపాటిగా మారింది. ఇరుగు పొరుగు రాష్ట్రాల సరకు పోటీకి వచ్చిన ప్రతిసారీ ధర పడిపోవడం.. అక్కడ పంట తగ్గితే ఇక్కడ మోతెక్కడం సాధారణాంశంగా మారింది. ఇప్పటికిప్పుడు రైతులు ఆనంద వ్యక్తం చేస్తుండగా.. వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ పరిస్థితి చూస్తుంటే.. అపుడో ఇపుడో కిలో రూ.వంద పలుకుతుందనే అంచనాలూ లేకపోలేదు. విపరీతమైన చలి, మంచు, తుపాను వర్షాల కారణంగా మంచి టమాటా చేతికందితే అదే చాలని రైతులు ఆశపడుతున్నారు. కోలారు, చిక్కబళ్లాపుర, రామనగర, తుమకూరు, బెంగళూరు గ్రామీణ జిల్లాలో ఈ పంట ఎక్కువగా పండుతోంది. తెగుళ్లు అధికం కావడంతో దిగుబడి తగ్గినట్లు వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. అతిపెద్ద కోలారు విపణిలో రెండువారాల కింద 15 కిలోల ధర రూ.250 నుంచి రూ.350 వరకు పలికింది. ఇపుడది రూ.500 నుంచి రూ.600 పలుకుతున్నట్లు వ్యాపారులు వివరించారు.

ఏ వంటలోనైనా ఇట్టే ఒదిగిపోయి.. రుచి పుట్టించే టమాటా ధరలు పెరిగిపోతున్నాయి. ఒకందుకు రైతులు సంబరం చేసుకుంటుండగా.. వినియోగదారులు పెదవి విరుస్తున్నారు. ఓ వైపు ఎగుమతులు పెరగడం.. మరో వైపు ఉత్పత్తి తగ్గిన ప్రస్తుత పరిస్థితిలో రేపటికి ధరలు ఎలా ఉంటాయో అంచనాకందడం లేదు.

చెన్నయ్య జయంతిని దిగ్విజయం చేద్దాం

రాయచూరు, న్యూస్‌టుడే: శివశరణ మాదర చెన్నయ్య జయంతిని నగరంలో డిసెంబరు 4న జరుపుకుంటామని శివ శరణ చెన్నయ్య సేవా సమితి అధ్యక్షుడు యమునప్ప గిరిజాలె తెలిపారు. ఆయన సోమవారం పత్రికా భవన్‌లో విలేకరుల గోష్ఠిలో మాట్లాడారు. ప్రతి ఏటా మాదిరి ఈసారి ఘనంగా నిర్వహిస్తామని చెబుతూ ప్రజలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. దళిత సామాజిక వర్గం ప్రముఖుడు అంబణ్ణ అరోలి మాట్లాడుతూ ఆ రోజు ఉదయం చెన్నయ్య కూడలిలో చిత్రపటానికి పూజలు చేసిన తర్వాత ఊరేగింపు మొదలవుతుందని చెప్పారు. రంగమందిరంలో జరిగే జయంత్యుత్సవంలో స్వామీజీ షడక్షరి, మాజీ మంత్రి హెచ్.ఆంజనేయ, కేంద్ర మాజీ మంత్రి నారాయణ స్వామి, పలువురు ప్రముఖులు పాల్గొంటారని వివరించారు. మాదార చెన్నయ్య జయంతిని ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తామన్నారు. ప్రతినిధులు పి.యల్లప్ప, నరసింహులు, కె.పి.అనిల్ కుమార్, బసవరాజ్, లక్ష్మణ్. జి.అమరేశ్, రాజు, జనార్దన్ హళ్లి బెంచితో కలిసి జయంతి గోడపత్రాన్ని ఆవిష్కరించారు.

గోడపత్రం విడుదల చేస్తున్న గిరిజాలె తదితరులు

యువకులూ! సమయాన్ని వృథా చేసుకోవద్దు!

సిరివార,(మాన్వి): యువత సొంత కాళ్లపై నిలబడేందుకు ఎన్నో అవకాశాలున్నాయని, కాలాన్ని వృథా చేసుకోకుండా ప్రయత్నిస్తే ఫలితం తప్పకుండా లభిస్తుందని ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పేర్కొన్నారు. స్థానిక బసవేశ్వర కూడలి వద్ద కరునాడ కఫెను ప్రారంభించి మాట్లాడారు. 18ఏళ్లు వచ్చిన ప్రతి ఒక్కరూ ఉద్యోగం, ఉపాధి, సొంత వ్యాపారం, పరిశ్రమపై దృష్టి సారించాలన్నారు. నీలోగల్ మఠం రేణుకా శాంతమల్ల స్వామీజీ మాట్లాడారు. పట్టణ పంచాయతీ అధ్యక్షుడు వై.భూపన గౌడ, పంచగ్యారంటీ అమలు సమితి అధ్యక్షుడు బ్రిజేష్‌పాటిల్, కాంగ్రెస్ ప్రముఖులు చుక్కిసూగప్ప సాహుకార్, యువ ప్రముఖులు రమేశ్ దర్శనకర్, శివశరణ అరకేరి, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హంపయ్యనాయక్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

న్యాయవాదుల సంఘానికి హోరాహోరీగా ఎన్నికలు

మాన్వి, న్యూస్‌టుడే: న్యాయవాదుల సంఘానికి ఆదివారం నిర్వహించిన ఎన్నికలు ఉత్కంఠభరితంగా సాగాయి. రవికుమార్‌పాటిల్, సత్యనారాయణ ముష్టూరు ప్యానళ్ల మధ్య హోరాహోరీ పోటీ ఏర్పడింది. ఈ పోరులో రవికుమార్‌పాటిల్ న్యాయవాదుల సంఘానికి రెండో సారి భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2025-26కి సంబంధించి ఎన్నిక నిర్వహించారు. మొత్తం 234 మంది ఓటు హక్కు కల్గి ఉండగా 221 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 12మంది ఓటింగ్‌కి దూరంగా ఉండగా ఓ ఓటరు మృతి చెందారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎన్నిక నిర్వహించారు. రాత్రి ఓట్ల లెక్కింపు నిర్వహించారు. రవికుమార్‌కి 131ఓట్లు రాగా సత్యనారాయణకు 89ఓట్లు పడ్డాయి. ఉపాధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికలో హనుమంత్రాయ కపగల్, మనోహర్ విశ్వకర్మలపై విశ్వనాథ్‌రాయప్ప, శివప్పసుంకనూర్ గెలుపొందారు. ప్రధాన కార్యదర్శి స్థానానికి యల్లప్ప బాదరదిన్ని హనుమంతరాయ నాయక్ బల్లటగిపై 9 ఓట్ల తేడాతో నెగ్గారు. జంటి కార్యదర్శి స్థానానికి జరిగిన ఎన్నికలో నాగరాజ్‌గూగల్ హనుమంతబ్యాగవాట్‌పై 5ఓట్లతో గెలుపొందారు. మహిళా విభాగం నుంచి స్టెల్లాశర్లాట్, చంద్రకళా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కె.శ్రీనివాస్‌రావు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా అరవింద్ దేశాయి సహాయక అధికారిగా వ్యవహరించారు.

విజయోత్సవం: రవికుమార్ పాటిల్ ప్యానల్ ఘన విజయం సాధించిన క్రమంలో న్యాయవాదులు, అభిమానులు రాత్రి విజయోత్సవం నిర్వహించారు. మిఠాయిలు పంచుకున్నారు. టపాసులు కాల్చారు. రవిని పూల మాలలతో ముంచెత్తారు.

నూతన అధ్యక్షుడు రవికుమార్‌పాటిల్‌ను సత్కరించిన న్యాయవాదులు

26న విద్యుత్తు సరఫరాలో అంతరాయం

రాయచూరు: తాలూకా మటమారి విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 26న విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తామని జెస్కాం ఇంజినీర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలోని 110/11 కేవీ ఉప కేంద్రం వద్ద అత్యవసర పనుల నిమిత్తం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్తంభింపచేస్తున్నట్లు వివరించారు. విద్యుత్తు అంతరాయానికి గ్రామీణులు సహకరించాలని కోరారు.

వృద్ధ రైతు బలవన్మరణం

బీదర్, న్యూస్‌టుడే : చిటగుప్ప తాలూకా బశిరాపుర గ్రామానికి చెందిన భీమణ్ణ (92) అనే వృద్ధ రైతు ఒంటికి నిప్పు పెట్టుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. కుమారులు, మనవళ్లతో కలిసి సేద్యం చేస్తున్న భీమణ్ణ ఆయా బ్యాంకుల్లో రూ.8 లక్షలకు పైగా రుణం తీసుకున్నారు. పంట నష్టం కావడం, అప్పు చెల్లించాలని నోటీసులు రావడంతో వృద్ధకు గురై ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. బేమళఖేడా ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఎంపీ పత్తి కొనుగోలు కేంద్రం పరిశీలన

రాయచూరు, న్యూస్‌టుడే: స్థానిక ఆర్ఏపీఎంసీ (రాయచూరు వ్యవసాయ విక్రయాల విపణి సంస్కరణ సహకార సంఘం) ఆవరణలో నెలకొల్పిన పత్తి సేకరణ కేంద్రాన్ని ఎంపీ కుమారనాయక్ సోమవారం వీక్షించారు. రైతులను పలకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం ఖరారు చేసిన మద్దతు ధరతో కొనుగోలు చేయాలని, సకాలంలో సొమ్మును అన్నదాతల ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులకు సూచించారు. ఆర్ఏపీఎంసీ అధ్యక్షుడు జయంతరావ్ పతంగె, ఉపాధ్యక్షుడు శశిధర్ పాటిల్, డైరెక్టర్లు మల్లనగౌడ పాటిల్, శరబణ్ణ పాటిల్, శంకరరెడ్డి తదితరులు ఎంపీని సన్మానించారు.

జాతర సందర్భంగా మద్య నిషేధం

రాయచూరు, న్యూస్‌టుడే: తాలూకాలోని దేవసూగూరు సూగూరేశ్వర జాతరను పురస్కరించుకుని మంగళవారం ఉదయం 6 నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు మద్య నిషేధాన్ని విధిస్తూ జిల్లా పాలనాధికారి నీతీష్ ఆదేశాలు జారీ చేశారు. శక్తినగర్ పోలీస్ ఠాణా పరిధిలోని అన్ని రకాల మద్యం దుకాణాలను మూసి వేయాలని సూచించారు. బుధవారం జాతర జరుగనున్న నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తరాదన్న ఉద్దేశంతో, శాంతి, భద్రతలను కాపాడేందుకు నిషేధాజ్ఞలు విధించారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మెజిస్టిక్‌లో.. మెగా ప్రాంగణం

రాజధాని నడిబొడ్డున విస్తరించిన బీఎంటీసీ బస్టాండు

బెంగళూరు నగర ప్రయాణమంటూనే ఎవరికైనా 'మెజిస్టిక్' బస్టాండే గుర్తుకొస్తుంది. అదొక వినూత్న ప్రపంచం! అటు రైల్వే.. ఇటు మెజిస్టిక్.. మధ్యలో ఆర్టీసీ, బీఎంటీసీ వాహనాలు ఆగడానికి వేర్వేరు ప్రాంగణాలు ఒకేచోట ఒదిగిపోయి కనిపిస్తాయి. రైల్వే, మెట్రోతో పోలిస్తే బస్సుల రాకపోకల విభాగం పాతదిగా కనిపిస్తుంది. దాన్ని సమూలంగా మార్చేయబోతున్నారు.

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : బెంగళూరు నగర నడిబొడ్డు ప్రదేశంలో పది అంతస్తుల హైటెక్ బస్టాండు భవన నిర్మాణానికి సర్కారు ముందడుగు వేసింది. దీని కోసం టెండర్ల ప్రక్రియ ప్రారంభించారు. మెజిస్టిక్ పరిధిలో 32 ఎకరాల్లో ప్రభుత్వ-ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో రూ.15 వేల కోట్ల వ్యయంతో ఈ ప్రాంగణాన్ని నిర్మించేందుకు కార్యాచరణ పథకాన్ని రూపొందించారు. 'కెంపేగౌడ ప్రాంగణం' పేరిట కె.ఎస్.ఆర్టీసీ, బీఎంటీసీ బస్టాండ్లను ప్రయాణికులకు అనుకూలంగా నిర్మిస్తారు. ప్రయాణికులకు అవసరమైన విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, హోటళ్లు, మాల్స్ తదితర సౌకర్యాలను కల్పిస్తారు. బస్టాండులోకి ప్రవేశిస్తే.. అన్ని వసతులూ అక్కడ లభించేలా చర్యలు తీసుకుంటారు. బస్టాండులో దిగిన ప్రయాణికుడు తనఇంటికి వెళ్లేందుకు బీఎంటీసీ బస్సు లేక పోతే మెట్రో రైలు ఎక్కి వెళ్లేలా దారులు, కదిలే మెట్లను ఏర్పాటు చేస్తారు. సమీపంలోని సిటీరైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు ప్రత్యేక అనుబంధ వంతెన నిర్మిస్తారు. ఈ ప్రాంగణాన్ని రాకపోకల అవసరాలకే కాక.. వాణిజ్య కేంద్రంగానూ విస్తరిస్తారు. బీఎంటీసీ బస్టాండు నుంచి నిత్యం ఆరువేల బస్సులు సంచరిస్తుండగా 30 లక్షల మంది ఈ వ్యవస్థ సేవలు వినియోగించుకుంటున్నారు. ఆర్టీసీ బస్టాండు నుంచి దూర ప్రాంతాలకు మూడువేల బస్సులు కదులుతుంటాయి.

ఆయుర్వేద చికిత్సలకు విశ్వవ్యాప్త ఆదరణ

డాక్టర్ వీరభద్రప్పగౌడని సన్మానిస్తున్న వైద్య కళాశాల నిర్వాహకులు

మాన్వి,న్యూస్‌టుడే: ఆయుర్వేద వైద్యానికి భారత్‌తో పాటు విశ్వవ్యాప్తంగా ఆదరణనుందని కరేబియన్ సెయింట్ కిట్స్ ఐలాండ్ యూనివర్సిటీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఫార్మకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ వీరభద్రప్పగౌడ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కేపీఎస్‌వీఎస్ ఆయుర్వేద వైద్య కళాశాల ఆసుపత్రి ప్రాంగణంలో 2025-26 ఆయుర్ ప్రవేశిక పాఠ్యక్రమ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆయుర్వేద వైద్య పద్ధతిని ఇతర వైద్యరీతులతో సమ్మిళితం చేయడం వల్ల చికిత్సలు సులభతరం అయ్యాయన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ జీవనేశ్వరయ్య మాట్లాడుతూ బీఏఎంఎస్ వైద్య విధానంలో ప్రాచీన ఆయుర్వేద వైద్య పద్ధతులను కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. పరిపాలనాధికారి విశ్వారాధ్యస్వామీజీ, ఉప ప్రిన్సిపల్ డాక్టర్ సుమంగళ, ఉమాశంకర్, డాక్టర్ నారాయణ, డాక్టర్ హిరేమఠ శివరాజ్ ఒడెయర్, డాక్టర్ రమ్య, డాక్టర్ అంజుమా పర్వీన్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల ఆర్థిక భద్రతకు చర్యలు

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : గిగ్ కార్మికులకు పని భవిష్యత్తుకు, ఉపాధి అవకాశాలను మెరుగుపరచేందుకు ఫిన్‌టెక్ మైగిగ్‌స్టర్స్ ముందుకు వచ్చింది. ఆస్ట్రేలియా ప్రభుత్వ సహకారంతో, అక్కడ స్థిరపడిన భారతీయులు ఆయా మార్కెట్లు, ఆర్థిక సంస్థల భాగస్వామ్యంతో ప్రణాళికలను రూపొందించారు. ఆస్ట్రేలియన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషన్ సహకారంతో భారత్‌లోనూ తమ సేవలు అందిస్తున్నామని మైగిగ్‌స్టర్స్ వ్యవస్థాపకుడు బెంజెమన్ ఎలెంగోవన్ బెంగళూరులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో వెల్లడించారు. భారతదేశంలో 2030 నాటికి కోటి మంది స్వతంత్ర కార్మికుల ఆర్థిక భద్రతకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. భారతదేశంలో ప్రస్తుతం 1.2 కోట్ల మంది గిగ్ కార్మికులు ఉండగా, ఏటా 17 శాతం వృద్ధితో 2047 నాటికి 62 మిలియన్లకు చేరుకుంటుందని అంచనా అని చెప్పారు. కార్యక్రమంలో ఆస్ట్రేలియన్ ప్రభుత్వ ప్రతినిధి మేరీ ఓవరింగ్టన్, ఇతర సంస్థల ప్రతినిధులు అజీమ్ జైనుల్‌భాయ్, గౌరవ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

సాయి నామం.. జగమంత కుటుంబం!

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ముద్దేనహళ్లి సత్యసాయి గ్రామంలో 'వన్ వరల్డ్, వన్ ఫ్యామిలీ మిషన్' పేరిట 100 రోజులుగా నిర్వహిస్తూ వచ్చిన కార్యక్రమాలకు ఆదివారం రాత్రి తెరపడింది. వేర్వేరు దేశాలకు చెందిన అధినేతలు, కళాకారులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. కళలు, సంగీత, నృత్యం, సాంస్కృతిక ప్రదర్శనలు, సేవా కార్యక్రమాలతో మానవత్వాన్ని ఏకం చేసింది. ఈ ఉత్సవాల్లో 100 మంది మానవతావాదులు, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న 140కు పైగా కార్పొరేట్ ప్రతినిధులు, 45కు పైగా ప్రపంచ మేధావులు, రాజకీయ నాయకులను సద్గురు మధుసూదన సాయి సత్కరించారు. చివరి రోజు కార్యక్రమంలో టాటా గ్రూపు సంస్థల ప్రతినిధి ఎన్.చంద్రశేఖర్, సీనియరు రాజకీయ నాయకుడు ఇంద్రసేనారెడ్డిలను సద్గురు సత్కరించారు.

సద్గురు, గావస్కర్ చేతుల మీదుగా స్మరణిక అందుకుంటున్న చంద్రశేఖర్, ఇంద్రసేనారెడ్డి

'వందేభారత్' ఢీకొని.. ఇద్దరు విద్యార్థుల విషాదాంతం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : చిక్కబాణావర రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం వందే భారత్ రైలు ఢీకొని జస్టిన్ జోసెఫ్ (21), స్టెరిన్ ఎల్జా సజి (19) అనే నర్సింగ్ విద్యార్థులు దుర్మరణం చెందారు. కేరళలోని పట్టనంతిట్టకు చెందిన వీరిద్దరూ సప్తగిరి నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ రెండో సెమిస్టర్ విద్యార్థులు. రైలు వస్తున్న సమయంలో వీరు పట్టాలపైకి రావడంతో ప్రమాదం సంభవించింది. తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించినా అప్పటికే మరణించారని తేలింది. ప్రాథమిక దర్యాప్తులో వీరిద్దరూ ఆత్మహత్య చేసుకునేందుకే పట్టాలపైకి వచ్చారని అనుమానిస్తున్నామని రైల్వే ఎస్పీ ఎన్ యతీశ్ చెప్పారు. ఇప్పటి వరకు ఎటువంటి డెత్‌నోట్ లభించలేదన్నారు. గ్రామీణ రైల్వే ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

స్టెరిన్ ఎల్జా సజి, జోసెఫ్

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

24-11-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1623.62	1630.42
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	2,542	3,118
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	6,327	6,798
నీటి నిల్వ (టి.ఎం.సి)	72.076	95.657

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

కీళ్లు, ఎముకలకు ఉచిత చికిత్స

మాన్వి,న్యూస్‌టుడే: స్థానిక కేపీఎస్‌వీఎస్ ఆయుర్వేద వైద్యకళాశాల, ఆసుపత్రి కాయకచికిత్సా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవనేశ్వరయ్య తెలిపారు. కీళ్లు, ఎముకల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారిని దృష్టిలో పెట్టుకుని ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నడుము నొప్పి, మెడనొప్పి, భుజాల నొప్పితో బాధపడే వారికి కూడా చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. కళాశాలలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 వరకు శిబిరం ఉంటుందన్నారు. పట్టణ, తాలూకా ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వారి విజయం.. విశ్వానికే తేజం!



భారత అంధుల క్రికెట్ జట్టుతో డాక్టర్ మహంతేశ్

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : తొలి ప్రపంచకప్ అంధుల మహిళల టీ-20 క్రికెట్ పోటీల్లో ఛాంపియన్స్ గౌరవాన్ని దక్కించుకున్న భారత జట్టు సభ్యులకు సోమవారం బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయంలో అధికారులు, అభిమానులు జాతీయ పతాకాలతో ఎదురేగి ఘన స్వాగతం పలికారు. చెన్నై మీదుగా ఇక్కడికి విచ్చేసిన వారికి అభిమానులు బ్రహ్మరథం పట్టారు. పూలహారాలు, మైసూరు పేటా, పూలగుత్తులతో సత్కరించారు. శ్రీలంక దేశ కొలంబో నగరంలో ఆదివారం నిర్వహించిన ఫైనల్ పోటీలో నేపాల్ జట్టుపై భారత్ ఏడు వికెట్ల తేడాతో గెలుపొందిన విషయం తెలిసిందే. భారత అంధుల క్రికెట్ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ మహంతేశ్ నేతృత్వంలో స్వాగత ఏర్పాట్లు ఘనంగా నిర్వహించారు.

(c) eenadu

స్థిరంగా కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం

సురేష్ పూజారి

- సమీపంలో మరో ద్రోణి: తుపానుగా మారే అవకాశం
- జాగ్రత్తలు తీసుకున్నామన్న మంత్రి సురేష్

గోపాలపూర్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో మలక్కా వద్ద ఏర్పడిన తీవ్ర అల్పపీడనం అదేచోట కొనసాగుతోందని, దీనికి చేరువలో దక్షిణ అండమాన్ సముద్ర ఉపరితలంలో 7.6 కిలోమీటర్ల ఎత్తులో మరో ద్రోణి ఏర్పడిందని, అది కూడా అల్పపీడనంగా మారనుందని గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ) అధికారి ఉమాశంకర్ దాస్ సోమవారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. మలక్కా వద్ద కొనసాగుతున్న పీడనం కొద్ది గంటల్లో వాయుగుండంగా మారుతుందని, అండమాన్ వద్ద ఏర్పడిన పీడనంతో ఇది విలీనమై బుధవారం (26) నాటికి తుపానుగా మారుతుందన్న అంచనా ఉందన్నారు. దీనికి సంబంధించి ఎలాంటి హెచ్చరికలు జారీ చేయలేదని, త్వరలో పూర్తి వివరాలు ప్రకటిస్తామన్నారు. వాతావరణ అధ్యయన శాస్త్రజ్ఞుడు డా॥శరత్‌చంద్ర సాహు మాట్లాడుతూ తుపానుగా మారిన తర్వాత ఇది తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ సరిహద్దు తీరానికి చేరువయ్యే సూచనలున్నాయని, ఒడిశాపై పాక్షిక ప్రభావం ఉండొచ్చన్నారు. 26న దీనిపై పూర్తి స్పష్టత వస్తుందని, తుపానుగా మారిన తర్వాత ఏ దిశగా ప్రయాణిస్తుందన్నది తేటతెల్లమవుతుందన్నారు.

ఆందోళన వద్దు

రెవెన్యూ, విపత్తు నివారణ శాఖల మంత్రి సురేష్ పూజారి భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ఈ విపత్తు గురించి అధ్యయనం చేస్తున్నామని, ఐఎండీ ఇంతవరకు ఎలాంటి హెచ్చరికలు జారీ చేయలేదన్నారు. దీన్ని తేలికగా తీసుకోకుండా ముందస్తు చర్యలన్నీ తీసుకుంటున్నామని, విపత్తుల నివారణ శాఖ అప్రమత్తంగా ఉందని, ప్రజలు ఆందోళన చెందొద్దని పేర్కొన్నారు.

మాది ప్రజల ప్రభుత్వం

సీఎం మోహన్

ఓ దివ్యాంగురాలి వేదన వింటున్న సీఎం మోహన్, పక్కన ఉపముఖ్యమంత్రి సింగ్‌దేవ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: తమది ప్రజల ప్రభుత్వమని, వారి ఇబ్బందులు స్వయంగా విని పరిష్కరించడానికి ప్రాధాన్యమిస్తున్నామని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. సోమవారం భువనేశ్వర్ యూనిట్-2లోని క్యాపిటల్ నర్సరీ కేంద్రంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. దరఖాస్తు చేసుకున్న వెయ్యిమంది ఇబ్బందులు ముఖ్యమంత్రి మోహన్, ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్, ఆయా శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించారు. తక్షణం కొన్ని సమస్యలు పరిష్కారం కాగా, మరికొన్ని అధికారులకు అప్పగించి 10 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. దివ్యాంగులు, వ్యాధిపీడితులు, విశ్రాంత ఉద్యోగులు, రెవెన్యూపరమైన సమస్యలు ఎక్కువగా పరిశీలనకు వచ్చాయి.

ఫిర్యాదుల స్వీకరణ ఆరంభ శూరత్వం కాదు

సాయంత్రం సీఎం విలేకర్లతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే తాము ప్రజలను స్వయంగా కలుసుకొని వారి ఇబ్బందులు పరిష్కరించాలన్న సదాశయంతో చేపట్టిన ఈ కార్యక్రమం ఆరంభశూరత్వం కాదని, దీన్ని కొనసాగిస్తామన్నారు. సమీప భవిష్యత్తులో అన్ని జిల్లా కేంద్రాల్లో చేపడతామన్నారు.

పాలనాధికారులను హెచ్చరించిన సురేష్

రెవెన్యూ, విపత్తు నివారణ శాఖల మంత్రి సురేష్ పూజారి ఫిర్యాదుల స్వీకరణలో భాగంగా పాలనాధికారులను హెచ్చరించారు. జిల్లా కేంద్రాల్లో పరిష్కారమయ్యే సమస్యలతో ప్రజలు వ్యయప్రయాసలకోర్చి భువనేశ్వర్ వస్తున్నారని, ఇది పాలనాధికారుల వైఫల్యమేనని పేర్కొన్నారు. ఇక చూస్తూ ఊరుకోబోమని ప్రతి జిల్లాలో సోమవారాల్లో ప్రజా సమస్యలు వినాలని, రెవెన్యూపరంగా ఎక్కువ సమస్యలు వస్తున్నందున పరిష్కరించాలని ఆదేశించారు.

నేటి నుంచి మండీల్లో ధాన్యం కొనుగోళ్లు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ధాన్యం మండీలు మంగళవారం (25) నుంచి తెరుచుకోనున్నాయి. పశ్చిమ ఒడిశాలో వరి కోతలు, నూర్పిళ్లు జరిగాయి. బరగఢ్‌లో అన్నదాతలు ధాన్యం విక్రయానికి అంతా సిద్ధం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మండీల్లో విస్తృత ఏర్పాట్లు చేసింది. సహకార శాఖ మంత్రి ప్రదీప్ బలసా

బరగఢ్‌లో విక్రయానికి సిద్ధంగా ధాన్యం

పారదర్శకంగా కొనుగోళ్లు: మంత్రి ప్రదీప్

ప్రదీప్ బలసామంత

మంత సోమవారం భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా చేస్తామని, మండీల వద్ద అన్నదాతలకు ఆహారం, పానీయం, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. మండీలకు ధాన్యం తరలించడానికి వాహనాలు సిద్ధంగా ఉంచాలని యాజమాన్యాలను సూచించామని, తూకాల్లో అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ధాన్యం విక్రయించిన రైతుల బ్యాంకు ఖాతాల్లో 48 గంటల్లో నగదు జమయ్యేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సహకార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన స్క్వాడ్లు మండీలకు వెళ్లి తనిఖీలు చేస్తాయని, ఈసారి అన్నదాతలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పంట అమ్ముకునేలా చర్యలు తీసుకున్నామన్నారు.

ధర్మేంద్ర నటన మరువలేనిది

సీఎం మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బాలీవుడ్‌లో హీ మ్యాన్‌గా గుర్తింపు పొందిన ధర్మేంద్ర (89) మృతితో భరతమాత ఒక ప్రముఖ నటుడ్ని కోల్పోయిందని ప్రముఖులు సంతాపం తెలిపారు. ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తాను ధర్మేంద్ర అభిమానినని, ఆయన నటన మరువలేనిదని, ఎన్నో హిట్ చిత్రాలతో ప్రేక్షకుల్ని మెప్పించారని పేర్కొన్నారు. బికనీర్ (రాజస్థాన్) పార్లమెంటరీ స్థానం నుంచి భాజపా తరఫున విజయం సాధించి ప్రజాసేవ చేశారని గుర్తు చేశారు. ఉపముఖ్యమంత్రులు కనకవర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిడ, కేంద్రమంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, జోయల్ ఓరం, భాజపా కేంద్రశాఖ అధ్యక్షుడు బైజయంత్ పండా, రాష్ట్రశాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ ధర్మేంద్ర మృతికి సంతాపం తెలిపారు. ఓలీవుడ్ దర్శక, నిర్మాతలు, నటీనటులు, సాంకేతిక నిపుణులు ధర్మేంద్ర మృతి సినీ జగత్తుకు తీరని లోటని, ఆయన నటించిన 300 చిత్రాలు ప్రేక్షకుల్లో చెరగని ముద్ర వేశాయని పేర్కొన్నారు.

అంగన్‌వాడీల గర్జన

భువనేశ్వర్ లోయర్ పీఎంజీ వద్ద అంగన్‌వాడీల ఆందోళన

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని లోయర్ పీఎంజీ కూడలి వద్ద సోమవారం అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. తమ 11 డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన సుమారు 50 వేల మంది ఇందులో పాల్గొన్నారు. అంగన్‌వాడీ సంఘం ప్రతినిధులు, బీఎంఎస్ నేతలు మాట్లాడుతూ చిన్నారులకు శిక్షణ, గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ, సామాజిక సేవలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న తమను గతంలో బిజద ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. గతేడాది అధికారంలోకి వచ్చిన భాజపా సర్కారు హామీలిచ్చి నెరవేర్చలేదని, మేనిఫెస్టోలో పేర్కొన్నవి అమలు చేయలేదన్నారు. తమను టీచర్లుగా గుర్తించాలని, గౌరవవేతనం రూ.18 వేలకు పెంచాలని, 5జీ మొబైళ్లు ఇవ్వాలని, సేవల విరమణ తర్వాత రూ.5 వేలు పింఛను, కుటుంబంలో ఒకరికి పని చేసే అవకాశం కల్పించాలన్నది ప్రధాన డిమాండ్లు. అంగన్‌వాడీ సహాయకుల వేతనం రూ.9 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇదివరకు అంగన్‌వాడీలకు రూ.7,500లు చెల్లించేవారు. తర్వాత ఈ మొత్తం రూ.10 వేలకు పెంచారు. ఈ ఏడాది సెప్టెంబరులో అంగన్‌వాడీల వేతనం రూ.13,500లకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించినా అమలుకాలేదు.

తరచూ ఆందోళనలు

తమకు న్యాయం చేయాలని అంగన్‌వాడీలు తరచూ భువనేశ్వర్‌లో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయాల్లో ఆందోళనలు చేస్తున్నారు. ఈ నెల 27 నుంచి శాసనసభ కొలువుదీరనుండగా, దీనికి ముందుగా అంగన్‌వాడీలు మరోసారి ఆందోళన చేపట్టారు. ఈసారి జరగనున్న శీతాకాల సమావేశాల్లో భాజపా పాలకులు తమ డిమాండ్లు నెరవేర్చని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

చెరువులో మునిగి ఏడేళ్ల బాలుడి మృతి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా ధారాకోట సమితిలోని మహులపల్లి గ్రామంలో సోమవారం చెరువులో మునిగి సింగిపూర్ గ్రామానికి చెందిన ఆయుష్ నాయక్ (7) మృతిచెందాడు. మహులపల్లిలో బంధువుల ఇంట్లో విందు భోజనాలకు కుటుంబ సభ్యులతో వచ్చిన ఆయుష్ మరికొందరు బాలలతో కలిసి మధ్యాహ్నం చెరువులో స్నానం చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ మునిగిపోయాడు. సమీపంలో ఉన్న గ్రామస్థులు ఆయనను కాపాడి, ధారాకోటలోని ఆరోగ్య కేంద్రానికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆరోగ్య కేంద్రానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

డూప్లి 'కేటుగాడు'

నకిలీ పోలీసు వసూళ్ల దందా

పోలీసు దుస్తుల్లో కేదారనాథ్ స్వయిన్

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: నకిలీ పోలీసు అవతారం ఎత్తి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఓ యువకుడ్ని బ్రహ్మపుర సదర్ ఠాణా పోలీసులు అరెస్టు చేసి ఆదివారం న్యాయస్థానానికి తరలించారు. నిందితుడు సదర్ ఠాణా పరిధిలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన కేదారనాథ్ స్వయిన్ అలియాస్ మనోజ్ స్వయిన్ (37) అని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే ఠాణా పరిధిలోని లాఠి గ్రామంలో కేదారనాథ్ భార్యతో కలిసి అద్దెకు ఉంటున్న ఇంట్లో ఒక జత బూట్లు, ఏకరూప దుస్తులు జత, ఒక బెల్టు, రెండు పోలీసు టోపీలు, బొమ్మ పిస్తోలు, ఫైబర్ లాఠీ, ఒడిశా పోలీసు ఎంబ్లమ్‌తో మనోజ్ కుమార్ స్వయిన్ అని రాసి ఉన్న నేమ్ ప్లేట్ స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

ఇలా చిక్కాడు.. సదర్ ఠాణా పరిధిలోని పొదరబలి కూడలి వద్ద ఆదివారం పోలీసు దుస్తులు ధరించిన కేదారనాథ్ వచ్చీపోయే వాహనాల తనిఖీ పేరిట చోదకుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఠాణా పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు హుటాహుటిన అక్కడికి చేరుకోవడంతో ఆయన పరారయ్యేందుకు ప్రయత్నించాడు. పోలీసులు వెంబడించి పట్టుకొని ఆయన అద్దె ఇంట్లో ఏకరూప దుస్తులు తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. కేదారనాథ్ పది నెలలుగా ఇంటి అద్దె కూడా ఇవ్వడంలేదని యజమాని పోలీసులకు చెప్పాడు. పోలీసుగా చెప్పుకుంటూ నిందితుడు రైలు, బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేవాడని, వాహనచోదకుల నుంచి వసూళ్లకు పాల్పడేవాడని పోలీసుల దర్యాప్తులో తేలింది.

చెత్తతో నింపేస్తున్నారు ఆ నీరే తాగేస్తున్నారు

జయపురం, న్యూస్‌టుడే: తాగు, సాగునీటిని వినియోగిస్తున్న జయపురం పట్టణంలో కొలాబ్ కాలువలో చెత్త పెరిగిపోవడంతో నీరు కలుషితమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు, ప్రజలు కాలువలో చెత్త వేసి పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారు. సతీగూడ ప్రధాన కాలువలో చెత్త నిండిపోయింది. ధన్‌పూర్ కాలువలో దేవుళ్ల విగ్రహాలు, గృహోపకరణాలు, నిర్మాణ సామగ్రి పడి ఉన్నాయి. విగ్రహాలను అక్కడ నిమజ్జనం చేయకూడదని ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నప్పటికీ ఎవరూ వాటిని పాటించడం లేదు. మరికొందరు కాలువ సమీపంలో చెత్తను తగలబెడుతున్నారు. కాలువలకు సమీపంలో ఉన్న మద్యం దుకాణాల వద్ద తాగి సీసాలు, గ్లాసులు కాలువలో పడేస్తున్నారు. పట్టణంలోని కాలువల్లో చెత్త వేయకుండా ఉండేందుకు పురపాలిక సిబ్బంది చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ విషయంపై 'న్యూస్‌టుడే' ఈవో, సబ్ కలెక్టర్ సస్యరెడ్డిని అడగ్గా, చెత్త సేకరణ వాహనాలు మరమ్మతులకు గురవ్వడంతో ప్రతి ప్రాంతంలో చెత్తను సిబ్బంది సేకరించలేకపోతున్నారన్నారు. మరికొన్నిచోట్లకు వాహనాలు వెళుతున్నా వ్యాపారులు చెత్తను కాలువలోనే పడేస్తున్నారన్నారు. దీనిపై జరిమానాలు విధిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొలాబ్ కాలువ వద్ద పేరుకుపోయిన చెత్త

నబకృష్ణ సేవలు చిరస్మరణీయం

వేదికపై ఉపముఖ్యమంత్రులు సింగ్‌దేవ్, ప్రభాతి, సభాపతి సురమా తదితర ప్రముఖులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: దివంగత మాజీ ముఖ్యమంత్రి నబకృష్ణచౌదరి రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, భౌతికంగా ఆయన లేకపోయినా ప్రజల హృదయాల్లో నిలిచే ఉన్నారని ఉపముఖ్యమంత్రులు కనకవర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతిపరిడ, శాసనసభాపతి సురమాపాఢి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి భువనేశ్వర్‌లోని జయదేవ్ భవన్‌లో నబకృష్ణ 124వ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, నబకృష్ణ స్మృతి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. దివంగత నేత పేరిట ముద్రించిన సంచికను ఆవిష్కరించారు.

రెండు వర్గాల కొట్లాట.. 12 మంది అరెస్టు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం గోపబంధునగర్, బాపూజీనగర్ ప్రాంతాలకు చెందిన రెండు వర్గాల మధ్య జరిగిన కొట్లాట కేసులో పోలీసులు 12 మందిని అరెస్టు చేశారు. ఐఐసీ ఉల్లాస్ చంద్రరౌత్ తెలిపిన వివరాలు మేరకు.. ఈ నెల 21న రాత్రి పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు బాపూజీనగర్‌కు చెందిన సంతోష్‌ఖరా, హరి హంతాల్, రబి బాగ్, చింటు ఖరా, మనోరంజన్ హంతాల్, గణేశ్వర్‌ఖరా, మదన్ ఖరా, పూర్ణ ఖరా, దిబాకర్ ఖరా, కెల్లానగర్‌కు చెందిన గురుప్రీత్‌సింగ్‌లతో పాటు ఇద్దరు బాలురను సోమవారం అరెస్టు చేశారు. జామీను రాకపోవడంతో వారిని జైలుకు, మైనర్లను మల్కాన్‌గిరి జువనైల్‌కు తరలించారు. నిందితుల వద్ద కత్తులు, ఇనుపరాడ్లు, కర్రలు, ఇతరత్రా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

అంతర్జాతీయంగా దేశ గౌరవం పెంచుతున్న క్రీడలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: క్రీడలు దేశాల మధ్య స్నేహం, సోదరభావం చిగురింపజేస్తున్నాయని, ఇటీవల కాలంలో భారత్ క్రీడల్లో రాణించి అంతర్జాతీయంగా దేశ గౌరవం పెంచుకుంటోందని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. ఆదివారం సంబల్‌పూర్ క్రీడా మైదానంలో ఎంపీ నిధులతో ఖేలో ఇండియా శీతాకాలం క్రీడలు ఏర్పాటయ్యాయి. సాయంత్రం జరిగిన ముగింపు వేడుకలో సంబల్‌పూర్ పార్లమెంటు స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మేంద్ర క్రీడాకారులను అభినందిస్తూ విద్య, క్రీడా రంగాల్లో రాణించి ఉత్కళ ప్రతిష్ఠ పెంచాలని కోరారు. రాత్రి వరకు క్రీడాకారులతో ముచ్చటించిన కేంద్రమంత్రి వారితో బృంద చిత్రం తీయించుకున్నారు. ఈ వేడుకలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి రబినారాయణ నాయక్, ఎమ్మెల్యేలు, సంబల్‌పూర్‌కి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

క్రీడాకారులతో ధర్మేంద్ర కరచాలనం

ఆటగాళ్లతో కేంద్ర, రాష్ట్రమంత్రుల బృంద చిత్రం

వివాహ బంధంతో ఒక్కటైన అమీయ, శ్వేత

అమీయ, శ్వేత దంపతులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రముఖ అథ్లెటిక్ క్రీడాకారుడు అమీయ మల్లిక్ వివాహం ఫిజియోథెరపిస్ట్ శ్వేత అతిలితో ఆదివారం రాత్రి ముంబయిలోని ఒక హోటల్‌లో ఘనంగా జరిగింది. కటక్ జిల్లా బిలాసుని సమితిలోని ఒలంశా గ్రామానికి చెందిన అరక్షిత్, ప్రతిమా దంపతుల ఏకైక కుమారుడు అమీయ జాతీయ, అంతర్జాతీయ పరుగు పోటీల్లో పాల్గొని దేశ ప్రతిష్ఠ పెంచి అందరి మన్ననలందుకున్నారు. శ్వేత భువనేశ్వర్‌లోని అభినవ బింద్రా మార్కెటింగ్ పెర్ఫార్మెన్స్ కేంద్రంలో ఫిజియోథెరపిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మ్యాట్రిమోనీ ద్వారా వీరిద్దరూ ఒకరి గురించి ఒకరు తెలుసుకొని ఏడడుగులతో ఒక్కటయ్యారు.

సీజేఐ సూర్యకాంత్ జగన్నాథుని భక్తుడు

సుప్రీం న్యాయమూర్తి హోదాలో శ్రీక్షేత్రానికి వచ్చిన ప్రస్తుత సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు నమస్కరిస్తున్న పాలనాధికారి అరవిందపాఢి

గోపాలపూర్, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ సూర్యకాంత్ పూరీ జగన్నాథుని భక్తుడు. ఇటీవల ఆయన పూరీ ధామానికి వచ్చి స్వామి సన్నిధిలో పూజలు చేశారు. శ్రీక్షేత్ర పాలనాధికారి అరవిందపాఢి జస్టిస్ సూర్యకాంత్ పురుషోత్తముని తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ నేపథ్యంలో ఆయన సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అరవిందపాఢి పూరీ శ్రీక్షేత్రాన్ని ఇటీవల జస్టిస్ సూర్యకాంత్ సందర్శించిన ఫొటోను ప్రసార సాధనాలకు విడుదల చేశారు.

అవయవదానంతో ముగ్గురికి ప్రాణభిక్ష పెట్టిన వలస కార్మికుడు

రెండు మూత్రపిండాలు, కాలేయం దానం

పొంచు ప్రధాన్

అవయవదాత కుటుంబానికి ఆసుపత్రివర్గాలు అందజేసిన ప్రశంసా, ధ్రువపత్రం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కళ్లికోట సమితిలోని అంబఝొర గ్రామం నువాపల్లికి చెందిన పొంచు ప్రధాన్ (39) అనే వలస కార్మికుడు సూరత్ (గుజరాత్)లో ఇటీవల మరణానంతరం అవయవదానంతో మరో ముగ్గురికి ప్రాణభిక్ష పెట్టి అమరుడయ్యాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన కబిరాజ్ ప్రధాన్ చిన్న కుమారుడు పొంచు ప్రధాన్ 15 ఏళ్లుగా సూరత్‌లోని వస్త్ర పరిశ్రమలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య, కొడుకు, కుమార్తెలతో సూరత్‌లోనే నివాసముంటున్నాడు. ఈ నెల 17న వస్త్ర పరిశ్రమ నుంచి ఇంటికి తిరిగొస్తుండగా మార్గమధ్యంలో రహదారి పక్కన హఠాత్తుగా పడిపోయాడు. గాయపడ్డ పొంచును స్థానికులు సూరత్‌లోని న్యూ సివిల్ ఆసుపత్రిలో చికిత్సకు చేర్పించారు. ఈ నెల 21న ఆయనకు బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు పొంచు అన్నయ్య దివాకర్ ప్రధాన్‌కు తెలియజేశారు. అవయవదానంపై వైద్యులతోపాటు సూరత్‌లోని ప్రవాస ఒడియా సామాజిక కార్యకర్త శ్రీకాంత్ రౌత్ దివాకర్‌ను ప్రోత్సహించగా, కుటుంబం అంగీకరించింది. దీంతో ఆసుపత్రిలో పొంచు రెండు మూత్రపిండాలు, కాలేయం తొలగించి, మరో ముగ్గురికి అమర్చారు. మరణానంతరం అవయవదానంతో అమరుడైన పొంచు కుటుంబాన్ని పలువురు అభినందించారు.

వీఎస్ఎస్‌యూటీ విద్యార్థుల అద్భుత ప్రతిభ

వీరు రూపొందించిన ఫార్ములా రేసింగ్ కారుకు జాతీయ గుర్తింపు

ఫార్ములా రేసింగ్ కారుతో విద్యార్థులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: బుర్లాలోని వీర్ సురేంద్ర సాయి సాంకేతిక విశ్వవిద్యాలయం (వీఎస్ఎస్‌యూటీ) విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారు. వీరు రూపొందించిన ఫార్ములా రేసింగ్ కారుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. విద్యార్థుల బృందం మెంటర్ దేబాశిష్ త్రిపాఠి, కెప్టెన్ సాయిశంకర్ పట్నాయక్‌లు ఈ వివరాలను వెల్లడించారు. కోయంబత్తూరులో గత నెల 30 నుంచి నవంబరు 3 వరకు జరిగిన ఇంపీరియల్-2025 జాతీయస్థాయి ఈవెంట్‌లో వీరు రూపొందించిన రేసింగ్ కారు ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. వీఎస్ఎస్‌యూటీలోని వివిధ విభాగాలకు చెందిన 60 మంది విద్యార్థులు దీనిని రూపొందించడంలో పాలు పంచుకున్నారు. ఏర్స్ అని నామకరణం చేసిన దీని రూపకల్పనకు రూ.6.5 లక్షలు ఖర్చు కాగా, మనదేశంలో ఫార్ములా కార్ల ధర రూ.13 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పలుకుతుండటం గమనార్హం. దీని రూపకల్పనకు దాదాపు ఏడు నెలల సమయం పట్టినట్లు బృందం పేర్కొంది.

ఇదేనా సమయ పాలన... విద్యార్థులకేం నేర్పుతారు క్రమశిక్షణ

చికిటిపెంఠో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులపై ఎమ్మెల్యే అసంతృప్తి

ఉపాధ్యాయులతో సమావేశమైన మనోరంజన్

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: 'ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలకు రాకుంటే ఎలా?.. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పే మీరే ఇలా సమయపాలన పాటించకపోవడం ఏంటి' అని గంజాం జిల్లా చికిటి ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యాన్ సామంత్రాయ్ అసహనం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన చికిటిపెంఠోలోని ప్రభుత్వ నోడల్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఉదయం 10 గంటలకు ఆయన ప్రధానోపాధ్యాయుని గదిలోకి వెళ్లి, ఉపాధ్యాయుల హాజరు పట్టిక తనిఖీ చేశారు. ఇరవై మంది ఉపాధ్యాయులకుగాను ఆ సమయంలో ఇద్దరే హాజరై పట్టికలో సంతకాలు చేశారు. మరో గుమస్తా ఉన్నారు. దీంతో అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన దీనిపై దర్యాప్తు చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని తన వెంట వచ్చిన చికిటి సమితి విద్యాధికారి (బీఈవో) పన్నగభూషణ మాఝిని ఆదేశించారు. పాఠశాలలో ప్రార్థన జరుగుతున్న సమయానికి కొందరు ఉపాధ్యాయులు హాజరవగా, సుమారు 20 నిముషాలు ఆలస్యంగా ఓ ఉపాధ్యాయుడు రావడాన్ని ఎమ్మెల్యే గమనించారు. అనంతరం ఆయన చికిటి బీఈవో మాఝి, ప్రధానోపాధ్యాయుడు రబీంద్రనాథ్ నాయక్, ఉపాధ్యాయులతో పాఠశాలలో సమావేశం నిర్వహించి చికిటిపెంఠో వంటి పట్టణ ప్రాంతంలోని పాఠశాలకు ఉపాధ్యాయులు ఆలస్యంగా రావడాన్ని ప్రశ్నించారు. పాఠశాలలో పదో తరగతి పరీక్షా ఫలితాల్ని పరిశీలించిన ఆయన విద్యా ప్రమాణాలు మరింత పెంచాలని, విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. చికిటి బీఈవో మాఝి మధ్యాహ్నం 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ చికిటిపెంఠో ఉన్నత పాఠశాలలో శిశు వాటిక నుంచి పదో తరగతి వరకూ మొత్తం 535 విద్యార్థులున్నారని చెప్పారు. వీరిలో ఓ ఉపాధ్యాయిని మాతృత్వ సెలవుల్లో ఉన్నారని, ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపీ క్రీడోత్సవాల నిర్వహణకు వెళ్లారన్నారు. ఓ గుమస్తా అధికారిక పనిమీద బీఈవో కార్యాలయానికి వచ్చారని మాఝి పేర్కొన్నారు. మిగిలిన ఉపాధ్యాయులు పాఠశాలలో ప్రార్థన జరుగుతున్న సమయంలో వచ్చారని, దీనిపై దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

పాఠశాల ఆవరణలో పరిస్థితిని పరిశీలిస్తున్న చికిటి ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యాన్ సామంత్రాయ్. చిత్రంలో చికిటి బీఈవో మాఝి తదితరులు

(c) eenadu

27న రాజధానికి రాష్ట్రపతి

ద్రౌపదీ ముర్ము

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఈ నెల 27న రెండు రోజులు రాష్ట్రపర్యటనకు భువనేశ్వర్ చేరుకోనున్నారు. గురువారం (27న) మధ్యాహ్నం 2 గంటలకు వాయుసేనకు చెందిన ప్రత్యేక విమానంలో దిల్లీ నుంచి భువనేశ్వర్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా రాజ్‌భవన్‌కు వెళతారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని సాయంత్రం 4.30 గంటలకు శాసనసభ ప్రాంగణానికి వస్తారు. అసెంబ్లీలో సభ్యులనుద్దేశించి ప్రసంగిస్తారు. తర్వాత భువనేశ్వర్‌లోని జయదేవ్ భవన్‌లో ఏర్పాటయ్యే మరో కార్యక్రమంలో పాల్గొని రాత్రికి రాజ్‌భవన్ చేరుకుని విడిది చేస్తారు. 28న ఆమె దిల్లీ ప్రయాణమవుతారు. రాష్ట్రపతి రాక నేపథ్యంలో సోమవారం సాయంత్రం లోక్‌సేవా భవన్‌లో హోంశాఖ, భువనేశ్వర్ విమానాశ్రయం, సాధారణ పాలనా విభాగం అధికారుల సంయుక్త సమీక్షా సమావేశం జరిగింది. అనంతరం హోంశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సత్యవ్రత సాహు విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రపతి పర్యటనకు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు.

సందడిగా పరబ్ వేడుకలు

పరబ్ జ్యోతి ఊరేగిస్తున్న దృశ్యం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో ఆదివాసీ కళా సంస్కృతిని పరిరక్షించేందుకు నిర్వహిస్తున్న పరబ్ వేడుకలు సోమవారం పురపాలక సంస్థ స్థాయిలో ప్రారంభమయ్యాయి. సునాబెడ పురపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. స్థానిక జడగుడ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పరబ్ జ్యోతిని వివిధ నృత్యాలు, మేళ తాళాల నడుమ ఊరేగింపుతో ఏఈఎఫ్ మైదానానికి చేర్చారు. పురాధ్యక్షుడు రాజేంద్రకుమార్ పాత్ర్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యనిర్వాహక అధికారి సుజిత్ కుమార్ చౌదరి అధ్యక్షతన ఉపాధ్యక్షురాలు రీతు కంట, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మూడు రోజులపాటు క్రీడాపోటీలు జరగనున్నాయి.

గాయత్రీ చేతనా కేంద్రం ప్రారంభోత్సవాలు

స్థానిక గాయత్రీ విహార్‌లో కొత్తగా నిర్మాణమైన 'గాయత్రీ చేతనా కేంద్రం' ప్రారంభోత్సవాలు ఆదివారం జరిగాయి. విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. పాండవ జెనా, భగవాన్ సాహు తదితరులు ఆయా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

–న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

దివ్యాంగులకు ఉపకరణాలు అందజేత

దివ్యాంగుడికి చేతి కర్రను అందజేస్తున్న ఫాల్గుణ మాఝి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ బ్రహ్మపుర ఈస్ట్, జైపూర్ బిజూ మహావీర్ ఫుడ్ సెంటర్ ఖుర్దా, రాష్ట్ర సామాజిక భద్రత శాఖ సహకారంతో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ సోమవారం నిర్వహించారు. పర్లాఖెముండిలోని గజపతి క్రీడా మైదానంలో ఈ శిబిరాన్ని అదనపు కలెక్టర్ ఫాల్గుణ మాఝి ప్రారంభించారు. ఈ నెల 27వ తేదీ వరకు పంపిణీ కొనసాగుతుందన్నారు. ఇందులో 51 మంది దివ్యాంగులు పాల్గొనగా పలువురికి ఉపకరణాలు అందజేశారు. ప్రాజెక్టు ఛైర్మన్ అజిత్‌కుమార్ పృష్టి, సభ్యులు, సీసీడీ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి డి.జగన్నాథ రాజు, జిల్లా సామాజిక భద్రత శాఖ అధికారిణి ఉచ్చరిత బడరైత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గౌరవం ఇనుమడింప జేయండి

ప్రసంగిస్తున్న సురేష్‌కుమార్ పాణిగ్రహి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి, దివంగత అబ్దుల్ కలాం యువతకు కలలు కనండి, సాకారం చేసుకోండి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్‌ను అగ్రగామిగా చేయండి అని సందేశమిచ్చారని, దీన్ని రాష్ట్ర యువతీ యువకులు భగవద్గీతగా భావించి అభివృద్ధి సాధించాలని భువనేశ్వర్‌లోని హైటెక్ వైద్య, విద్యాసంస్థల సీఈవో సురేష్‌కుమార్ పాణిగ్రహి పిలుపునిచ్చారు. భువనేశ్వర్ చేరువలోని జట్నీ కోణార్క్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో అయిదురోజుల శిక్షణ సదస్సు ముగింపు కార్యక్రమం ఆదివారం రాత్రి జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సురేష్ మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక, ఖగోళ, భూగర్భ పరిశోధన రంగాల్లో రాణించి రాష్ట్ర ప్రతిష్ఠ ఇనుమడింపజేయాలని పేర్కొన్నారు. హైటెక్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ తిరుపతి పాణిగ్రహి, శాస్త్రజ్ఞులు ప్రొఫెసర్ చంద్రశేఖర్ మహంతి, డాక్టర్ లింగరాజ్ పాణిగ్రహి, డాక్టర్ దేబాశిష్ మిశ్ర, డాక్టర్ సులోచనానంద తదితరులు పాల్గొన్నారు.

కానిమూసా పాఠశాల సమస్యలు పరిష్కరిస్తా

పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పవిత్ర

సిమిలిగుడ, న్యూస్‌టుడే: లక్ష్మీపూర్ సమితి కానిమూసా ప్రాథమిక పాఠశాల సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే పవిత్ర శాంత హామీ ఇచ్చారు. కానిమూసా ప్రాథమిక పాఠశాల అధ్వాన స్థితిలో ఉన్న విషయం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో సోమవారం ఆయన పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. మంచినీటి సమస్య, తరగతి గదులు, భవనాల కొరత, ప్రహరీ తదితర సమస్యలు వెంటాడుతున్నట్లు ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. పాఠశాల భవనం పనులు వెంటనే పూర్తి చేయాలని సమితి అభివృద్ధి అధికారి సవ్యసాచి బెహరాను ఆదేశించారు.

బీఈఎంసీ డీఎల్ఆర్‌లను శాశ్వత ఉద్యోగులుగా నియమించాలి

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ)లోని వివిధ విభాగాల్లో రోజువారీ కార్మికులు (డీఎల్ఆర్) పని చేస్తున్న వారిని శాశ్వత ప్రాతిపదికన నియమించాలని బ్రహ్మపుర మహానగర నిగమ్ తాత్కాలిక ఉద్యోగుల సంఘం వినతి చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు టి.సూర్యప్రకాశ్‌రావు, ఉపాధ్యక్షుడు క్రైస్ట్ సామల, ప్రధాన కార్యదర్శి సుబేందుసుందర తదితరులు సోమవారం బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే వారితో మాట్లాడుతూ ఈ సమస్యపై శాసనసభలో ప్రస్తావించానని, మరోసారి దీనిపై ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు.

సాహిత్య ఉత్సవానికి ఎంపిక

నవరంగపూర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్ శిక్ష 'ఓ' అనుసంధాన్(సోయా) విశ్వవిద్యాలయంలో ఈ నెల 29, 30 తేదీల్లో జరగనున్న జాతీయ స్థాయి సాహిత్య ఉత్సవంలో పాల్గొనేందుకు నవరంగపూర్‌కు చెందిన సబ్యశాచి బిసోయి ఎంపికయ్యారు. దేశం నుంచి 100 మంది సాహిత్య, సాంస్కృతిక, భాషావేత్తలు, చలనచిత్ర ప్రముఖులు పాల్గొనున్నారు. సబ్యశాచి ఇప్పటికే అవిభక్త కొరాపుట్ జిల్లాలోని గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక ఆచారాలు, చారిత్రక ప్రదేశాలపై మూడు పుస్తకాలు రచించారు. ఈమేరకు స్థానిక సాహిత్యవేత్తలు సబ్యశాచిని అభినందించారు.

వైభవంగా సత్యసాయి శత జయంత్యుత్సవాలు

సత్యసాయి ఊయల సేవలో బ్రహ్మపుర ఎమ్మెల్యే అనిల్ కుమార్. చిత్రంలో ఇతరులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: శ్రీ సత్యసాయి సేవా సమితి (బ్రహ్మపుర) ఆధ్వర్యంలో స్థానిక డైమండ్ ట్యాంకు రోడ్డులో ఆదివారం 'శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు' కోలాహలంగా జరిగాయి. సాయంత్రం ఓంకారం, సాయి అష్టోత్తరం, వేద పఠనం, సామూహిక దీపారాధన తదితరాలు నిర్వహించారు. అనంతరం భజన, సర్వధర్మ ప్రార్థన, మంగళహారతితో వేడుకలు ముగిశాయి. అంతకుముందు ఉదయం విశేష కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్ కుమార్ ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు. నిర్వాహక సమితి కన్వీనర్ స్వాధీన్ కుమార్ పట్నాయక్, ఇతర ప్రతినిధులు మొత్తం కార్యక్రమాల్ని పర్యవేక్షించారు.

బాధితులకు చేయూత

నిత్యావసరాలు అందిస్తున్న శివప్రసాద్

రాయగడ, న్యూస్‌టుడే: గుణుపురం పట్టణం దెప్పాసాహిలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లతోపాటు సర్వం కోల్పోయిన బాధితులకు పురపాలక సంస్థ ఉపాధ్యక్షుడు శివప్రసాద్‌గౌడ సహకారం అందించారు. సోమవారం బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు అందించారు. కౌన్సిలర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉచితంగా ఆరోగ్య పరీక్షలు

వృద్ధురాలికి రక్తపోటు పరీక్షిస్తున్న వైద్యుడు నకుల్ సాహు

బ్రహ్మపుర నీలకంఠనగర్‌లో హరిహర నగర్‌లోని 'భరద్వాజ ప్రతిష్ఠాన్' ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా ఆరోగ్య పరీక్షల శిబిరం జరిగింది. వైద్యుడు నకుల్ సాహు పాల్గొని పలువురు వృద్ధులకు రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పులు తదితరాలు పరీక్షించి, అవసరమయ్యే వారికి ఉచితంగా ఔషధాలు పంపిణీ చేశారు.

–న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షలు విరాళం

పర్లాఖెముండి పట్టణంలోని రాజావీధి ప్రాంతంలో ఉన్న జగన్నాథ మందిర నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నిర్మాణం కోసం పలువురు విరాళాలు అందజేస్తున్నారు. పట్టణంలోని కామాక్షీనగర్-2వ లైనుకు చెందిన భాస్కర్‌సాహు, శాంతిలత దంపతులు రూ.2 లక్షల విరాళాన్ని పురోహితులకు అందజేశారు.

– న్యూస్‌టుడే, పర్లాఖెముండి

కోటేశ్వరరావు మృతికి సంతాపం

రాయగడ–గుణుపురం, న్యూస్‌టుడే: గుణుపురం పట్టణం గాయత్రి విద్యాసంస్థల పాలనాధికారి పి.వి.కోటేశ్వరరావు(59) మృతి చెందారు. కొద్ది రోజుల కిందట ఆయనకు గుండెపోటు రావడంతో బ్రహ్మపుర తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. మంచి పాలనాధికారిగా గుర్తింపు పొందిన ఆయన పలుమార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించారు. కోటేశ్వరరావు మృతికి గాయత్రి విద్యాసంస్థల అధ్యక్షుడు అక్షయ్‌దాస్, ఎండీ సంజయ్‌కుమార్ సాహు, సిబ్బంది సంతాపం ప్రకటించారు. సోమవారం గుణుపురంలో అంత్యక్రియలు నిర్వహించారు.

దారి మధ్యలోనే ప్రసవం

నవరంగపూర్, న్యూస్‌టుడే: దారి మధ్యలోనే గర్భిణి ప్రసవించిన ఘటన నవరంగపూర్ జిల్లా టెంటులిఖుంటి ఆరోగ్య కేంద్రం పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. సమితి లమతగూడ పంచాయతీ గొడిగావ్ గ్రామానికి చెందిన ప్రతాప్ దళపతి సోదరి క్షీరభాణువాకు సోమవారం పురిటినొప్పులు మొదలయ్యాయి. ఆమెను కుటుంబ సభ్యులు వెంటనే టెంటులిఖుంటి ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వెంటనే డీహెచ్‌హెచ్‌కు అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా పడాలగూడ వద్ద ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వైద్యులు లేకపోవడంతో ప్రతి ఒక్కరినీ డీహెచ్‌హెచ్‌కు తరలించి, స్థానిక నర్సులు చేతులు దులుపుకొంటున్నారని, చికిత్స కోసం రోగులు అత్యవసర సమయంలో వేరే ఆసుపత్రులకు పరుగులు తీయాల్సి వస్తోందని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

రోలర్ స్కేటింగ్‌లో బాలల ప్రతిభ

● విజేతలు ఖుర్దా, గంజాం, గజపతి జిల్లాలు

పతకాలతో గంజాం, ఖుర్దా, గజపతి జిల్లాల బాలలు

స్కేటింగ్ చేస్తున్న బాలలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడా శాఖ సహకారంతో ఒడిశా రోలర్ స్కేటింగ్ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులు జరిగిన 16వ రాష్ట్ర రోలర్ స్కేటింగ్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. భువనేశ్వర్‌లోని కళింగ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఏర్పాటైన ఈ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన మూడు వందలమందికిపైగా బాలబాలికలు వివిధ కేటగిరీలలో పోటీపడ్డారు. వీరిలో 77 పతకాలు గెలుచుకున్న ఖుర్దా జిల్లా జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. 47 పతకాలతో గంజాం జిల్లా జట్టు ద్వితీయస్థానంలో నిలవగా, 15 పతకాలతో గజపతి జిల్లా జట్టు తృతీయస్థానం పొందింది.

ఏరోనాటిక్స్ కళాశాల జట్టు విజయం

బహుమతి అందుకుంటున్న జట్టు సభ్యులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: అంతర కళాశాల ఫుట్‌బాల్ పోటీల్లో ఏరోనాటిక్స్ కళాశాల ఛాంపియన్‌గా నిలిచింది. జయపురం విక్రమ్‌దేవ్ విశ్వవిద్యాలయానికి చెందిన స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో లమతపుట్ డిగ్రీ కళాశాలలో 6 రోజులు పాటు జరిగిన అంతర కళాశాల ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన 18 కళాశాలల జట్లు పాల్గొన్నాయి. ఫైనల్లో హోరాహోరీగా జరిగిన పోరులో ఉమ్మర్‌కోట్ జట్టుపై సునాబెడ ఏరోనాటిక్స్ టీం గెలుపొందింది. ముఖ్యఅతిథిగా సమితి అధ్యక్షుడు తపస్‌కుమార్, అతిథులుగా సమితి అభివృద్ధి అధికారి జయంత్‌కుమార్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. మనోజ్‌కుమార్ హంటల్‌ను ఉత్తమ స్కోరర్‌గా ఎంపిక చేసి బహుమతి అందజేశారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు పింఛను ఇవ్వండి

ర్యాలీ చేస్తున్న కార్మిక నాయకులు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజనానికి సంబంధించి వంట కార్మికులకు పింఛను అమలు చేయాలని కోరుతూ ఏఐసీసీటీయూ ఆధ్వర్యంలో రామన్నగూడలో సోమవారం భారీ ర్యాలీ చేపట్టారు. కార్మిక రాష్ట్ర నాయకుడు తిరుపతి గోమాంగొ అధ్యక్షతన గుణుపురం సబ్‌డివిజన్ పరిధిలోని కార్మికులు పాల్గొన్నారు. సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 16 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమితి అధికారికి అందజేశారు.

27 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ మలంచా తిరుపతి వేంకటేశ్వర పెరుమాళ్ల ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 27 నుంచి వచ్చే నెల 1 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. 27వ తేదీ ఉదయం 8 గంటల బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 28న ఉదయం వేద పారాయణ, సామూహిక కుంకుమార్చనలు, రాత్రి స్వామికి హంస వాహన సేవ, 29న శ్రీవారి కల్యాణోత్సవం, రాత్రి గజ వాహన సేవ, ఇతర కార్యక్రమాలు జరుగుతాయి. 30న సూర్య నమస్కారాలు, 1న అష్టోత్తర శతకలశ ఆవాహన, చక్ర స్నానం, 2న అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు జరగనున్నట్లు పేర్కొంది.

ప్రపంచ ఎబిలిటీ పోటీల్లో
ఒడిశా పారా క్రీడాకారుల సత్తా

● రాష్ట్రానికి 12 పతకాలు

పసిడి, రజత, కాంస్య పతకాలతో రాష్ట్ర క్రీడాకారులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: థాయిలాండ్‌లో ఈ నెల 17నుంచి 24 వరకు జరిగిన ప్రపంచ ఎబిలిటీ క్రీడల్లో రాష్ట్రానికి మొత్తం 12 పతకాలు వరించాయి. ఆదివారం పురుషుల విభాగంలో నిర్వహించిన షాట్‌పుట్ త్రోలో కమలకాంత్‌నాయక్ పసిడి పతకం, మహిళా విభాగంలో సుచిత్ర పరిడా, రంజనా నాహక్‌లు చెరో రజత పతకం గెలుచుకున్నారు. దీంతో మొత్తం పోటీల్లో రాష్ట్రానికి 6 పసిడి, 4 రజత, 2 కాంస్య పతకాలు దక్కాయని ఒడిశా పారా క్రీడల సంఘం కార్యదర్శి సునీల్ ప్రధాన్ సోమవారం సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

చిత్రంలో అతిథులు, అధ్యాపకులు, క్యాడెట్లు

రాయగడ, గుణుపురం, న్యూస్‌టుడే: సేవా, అంకితభావంతో ఎన్‌సీసీ శిక్షణ పొందితే దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవరతాయని అతిథులు అన్నారు. రాయగడ జిల్లా గుణుపురం సబ్‌డివిజన్ దంబు సార డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ కృష్ణచంద్ర పండా, కళాశాల కమిటీ అధ్యక్షుడు బాసుదేవ్‌సాహు, అధ్యాపకులు పూర్ణచంద్ర మాలి, రామకృష్ణ, రవికాంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఒడిశా మహిళా బెటాలియన్‌కు చెందిన సుమారు 100 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు 'తాళా బంద్' ఆందోళన

వైద్య కళాశాల గేటుకు తాళం వేసి ఆందోళన నిర్వహిస్తున్న సంఘం ప్రతినిధులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: న్యాయమైన డిమాండ్లు నెరవేర్చడంలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా 'ఆల్ ఒడిశా ఆయుష్ విద్యార్థుల సంఘం' సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగింది. బ్రహ్మపురలో సిటీ ఆసుపత్రి రోడ్డులోని బిజు పట్నాయక్ హోమియోపతిక్ వైద్య కళాశాల ఆసుపత్రి, అంకుశపూర్‌లోని కేఏటీఎస్ ఆయుర్వేదిక్ వైద్య కళాశాల ఆసుపత్రి విద్యార్థులు నిరవధిక 'తాళా బంద్' చేపట్టారు. ఆయాచోట్ల వైద్య కళాశాలల ప్రధాన గేట్లకు తాళాలు వేసి బైఠాయించారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుతంగా ఆందోళన కొనసాగిస్తామని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

రాజస్థాన్‌కు ప్రజాప్రతినిధులు పయనం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్, బాలేశ్వర్, అనుగుల్ జిల్లాలకు చెందిన 32 మంది ప్రజాప్రతినిధులు ఆదివారం రాత్రి రాజస్థాన్‌కు క్షేత్ర పర్యటనకు బయలుదేరి వెళ్లారు. స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు కార్యక్రమంలో పాల్గొనున్నారు. కొరాపుట్ జిల్లా పరిషత్తు అధ్యక్షురాలు సస్మిత మెలకా, జిల్లా పరిషత్ సభ్యురాలు టికాయి గామెల్‌తో పాటు మరో 8 మంది ప్రజా ప్రతినిధులకు అవకాశం లభించింది.

88 వినతుల స్వీకరణ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా రాయగడ సమితి కుములుసింగి పంచాయతీ కార్యాలయంలో సోమవారం వినతులు స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ ఏడీఎం మునీంద్రా, అదనపు ఎస్పీ సునీల్ మహంత్, అదనపు జిల్లా పరిషత్ కార్య నిర్వహణ అధికారి పృథ్వీరాజ్ మండల్ తదితరులు పంచాయతీ పరిధిలోని ప్రజల నుంచి 88 వినతులు స్వీకరించారు. సమితి అధ్యక్షురాలు పూర్ణ బాసి నాయక్, సమితి అభివృద్ధి అధికారి సంతోష్ బారిక్ తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం ఓట్ల లెక్కింపు పూర్తి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాయగడ పురపాలక సంస్థ ఉపాధ్యక్షురాలు శుభ్రపండాపై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ఓట్ల లెక్కింపు సోమవారం పూర్తయింది. పురపాలక కార్యాలయంలో ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ రమేష్‌చంద్ర జెనా పర్యవేక్షణలో కౌన్సిలర్ల సమక్షంలో జరిగింది. లెక్కింపు అనంతరం జెనా మీడియాతో మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు లెక్కింపు ఫలితాలను గోప్యంగా ఉంచినట్లు పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చాక వివరాలను వెల్లడిస్తామన్నారు. లెక్కింపు నేపథ్యంలో కార్యాలయ పరిసరాల్లో భారీగా పోలీసులు మొహరించారు.

14న రెవెన్యూ సంఘ ఎన్నికలు

సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు శశిభూషణ్ దాస్

జయపురం, న్యూస్‌టుడే: ఈ ఏడాది డిసెంబరు 14న కొరాపుట్ జిల్లా రెవెన్యూ గుమస్తా సంఘం ఎన్నికలు జరగనున్నట్లు సంఘం నేతలు తెలిపారు. 30న జయపురం మాధవ్ భవనంలో అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని ప్రస్తుత అధ్యక్షుడు శశిభూషణ్‌దాస్ తెలిపారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఈ విషయాలు వెల్లడించారు. 2026 ఫిబ్రవరి నాటికి ప్రస్తుత సంఘం గడువు ముగుస్తుండటంతో, అందుకోసం డిసెంబరులో ఎన్నికలు నిర్వహించేందుకు సంఘం నిర్ణయించిందన్నారు. ఎన్నికల అధికారి సునాకర్‌రౌత్ అధ్యక్షతన ఎన్నికలు జరగనున్నాయి.

ఎస్ఐఆర్ దరఖాస్తులు సమర్పించేందుకు పడిగాపులు

ఖరగపూర్, న్యూస్‌టుడే: ఎస్ఐఆర్ దరఖాస్తులు నింపి వాటిని అధికారులకు సమర్పించడానికి ఓటర్లు అష్టకష్టాలు పడుతున్నారు. గంటలపాటు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. బీఎల్‌వోలు మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 వరకు దరఖాస్తులు జమ చేసుకోవడంలోనే తీరిక లేకుండా గడుపుతున్నారు. కొందరు బీఎల్‌వోలు ఓటర్ల దరఖాస్తులు నింపుతున్నారు.

బెహరాగుడలో రక్తదాన శిబిరం

సిమిలిగుడకు చెందిన గుప్తేశ్వర్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో భోబినీపాత్ర్ జ్ఞాపకార్థం బెహరాగుడలో సోమవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సంస్థ యజమాన్య సభ్యుడు బనాజ్‌పాత్ర్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా రక్తనిధి అధికారుల పర్యవేక్షణలో 56 మంది రక్తదానం చేశారు. జిల్లా రక్తదాతల సంఘం ప్రతినిధులు షేక్ ఇబ్రహీం, గోవిందపాడి, విజయ్‌కుమార్‌సాహు తదితరులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, సిమిలిగుడ

వాహనం అదుపుతప్పి ఉపాధ్యాయుడి దుర్మరణం

హనుమంత్ గౌడ్ (పాతచిత్రం)

నవరంగపూర్, న్యూస్‌టుడే: వాహనం అదుపుతప్పి ఉపాధ్యాయుడు మృతిచెందిన ఘటన నవరంగపూర్ జిల్లా జోరిగావ్ సమితిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చచర పంచాయతీ దాబిరిముండా గ్రామానికి చెందిన హనుమంత్‌గౌడ్(54) చకల పొదర పంచాయతీ డకరికోట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. సోమవారం ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వెళ్తుండగా బేజిగూడ మలుపు వద్ద అదుపు తప్పి లోయలో పడిపోయాడు. రక్తపు మడుగులో పడి ఉన్న అతడిని ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పరీక్షల అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కారులో న్యాయవాది మృతదేహం లభ్యం

గులేష్ గొచ్చాయత్

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: గత రెండు వారాల నుంచి కనిపించకుండాపోయిన న్యాయవాది మృతదేహం కారులో లభించింది. మయూర్‌భంజ్ జిల్లాలో సోమవారం వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బిసోయి ప్రాంతానికి చెందిన గులేష్ గొచ్చాయత్(42) అనే న్యాయవాది స్నేహితుడిని వదిలేందుకు ఈ నెల 11న ఖరగ్‌పూర్ వెళ్లారు. ఆయన అప్పటి నుంచి కనిపించకుండా పోయారు. సోమవారం ఝార్పోఖరియ పోలీసుస్టేషన్ పరిధి శిల్పోహది గ్రామ సమీపాన చెరువులో ఓ కారు తేలి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది సాయంతో కారును బయటకు తీయగా, అందులో గులేష్ మృతదేహాన్ని గుర్తించారు. ఆయన మృతికి కారణాలు తెలియలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు.

చందకా ప్రాంతంలో..

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని చందకా ప్రాంతం గడబారి రోడ్డు పక్కన తుప్పల్లో పోలీసులు సోమవారం సాయంత్రం ఒక యువకుని మృతదేహం గుర్తించారు. దీనికి చేరువలో ఒక మద్యం బాటిల్, స్కూటీ ఉన్నాయి. మృతదేహాన్ని పరిశీలించిన చందకా ఠాణా పోలీసులు, సైంటిఫిక్ దళాలు హత్యగా ప్రాథమికంగా అనుమానించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి దర్యాప్తు ప్రారంభించారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది.

దిఘాలో పర్యాటకుడి గల్లంతు

సముద్రం వద్ద పర్యాటకుడి కోసం గాలిస్తున్న అధికారులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ప్రముఖ పర్యాటక కేంద్రం దిఘాలో మిత్రులతో వెళ్లిన ఒక యువకుడు సముద్రంలో స్నానానికి దిగి గల్లంతై 24 గంటలు కావస్తున్నా ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు. దిఘా పర్యాటక ప్రాంతం దగ్గరలో గల మందరమణి ప్రాంతంలో బర్ద్వాన్‌కు చెందిన యువకుడు శుభ్రత బసు(25) స్నేహితులతో స్నానానికి వచ్చి గల్లంతయ్యాడు. పోలీసులు, అధికారులు గాలింపు ముమ్మరం చేస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: స్థానిక టౌన్ ఠాణా పరిధిలోని నీలాద్రివిహార్ రెండో లైనులో మనోజ్ పాత్ర్ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి పాత్ర్ కుటుంబ సభ్యులు బయటకు వెళ్లారు. ఇంటి తాళం విరిచి లోపలికి ప్రవేశించిన దొంగలు పెద్దమొత్తంలో బంగారం, నగదు చోరీ చేసినట్లు తెలిసింది. బాధితుడు సోమవారం ఠాణాలో ఫిర్యాదు చేయగా, పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

దళిత బాలికపై సామూహిక అత్యాచారం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఖుర్దా జిల్లా కేంద్రానికి చెందిన 16 ఏళ్ల దళిత బాలికపై ఇటీవల సామూహిక అత్యాచారం జరిగింది. ఈ ఘటనపై బాధితురాలి తల్లి నవంబరు 19న పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన కుమార్తె కనిపించడం లేదని, పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని అందులో పేర్కొంది. తర్వాత బాలిక స్నేహితురాళ్ల సమాచారం మేరకు..కొందరు ఆమెను సామూహిక అత్యాచారం చేశారు. తర్వాత బాలికను ఒకచోట గుర్తించిన తల్లి నవంబరు 20న ఖుర్దా ఆసుపత్రిలో చికిత్సకు చేర్పించింది. తర్వాత బాధితురాల్ని భువనేశ్వర్‌లోని కేపిటల్ ఆసుపత్రికి తరలించారు. ఆమె పూర్తిగా కోలుకుంది. ఇంతవరకు నిందితులు పట్టుపడలేదు. దీనిపై విపక్షనేత నవీన్‌పట్నాయక్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో విచారం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం ఈ ఘటనను సీరియస్‌గా పరిగణించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేత పృథ్వీవల్లభ్ పట్నాయక్ భాజపా పాలనలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవైందని, శాంతిభద్రతలు క్షీణించాయన్నారు.

హత్య కేసులో ఆరుగురి అరెస్టు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నందపూర్ సమితిలో భూ వివాదానికి సంబంధించిన హత్య కేసులో పాడువా పోలీసులు సోమవారం ఆరుగురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నందపూర్ ఎస్‌డీపీవో దేవేంద్ర మల్లిక్ అందించిన వివరాల మేరకు.. నందపూర్ సమితి తుబా గ్రామ పంచాయతీ పరిధిలో పారటాలో ప్రధాని, గల్లూరి కుటుంబాల మధ్య ఏళ్లుగా భూ వివాదాలు నడుస్తున్నాయి. పలుసార్లు ఘర్షణలు జరిగాయి. ఈనెల 21న వరికోతల సమయంలో రెండువర్గాల మధ్య మరోమారు ఘర్షణ చోటుచేసుకుంది. ఇందులో కొందరు మారణాయుధాలతో దాడి చేయడంతో గేను ప్రధాని భార్య జిము(63) అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. పోలీసులు దర్యాప్తు చేసి రతో గొల్లూరి, శుక్ర, బుడు, మంగళ, భూషణ్ దొర, బలరాం దొరలను అరెస్టు చేశారు. పాడువా ఠాణా అధికారి అశోక్‌కుమార్ బిసోయి ఆధ్వర్యంలో ఒక బృందం దర్యాప్తు కొనసాగిస్తోంది.

ఆరు ఎకరాల్లో గంజాయి మొక్కలకు నిప్పు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా బడగడ ఠాణా పరిధిలోని మారుమూల ప్రాంతాల్లో సుమారు ఆరు ఎకరాల్లో సాగు చేస్తున్న గంజాయి మొక్కల్ని పోలీసులు తొలగించి దహనం చేశారు. ఈ మేరకు గంజాం ఎస్పీ కార్యాలయం అధికారులు సోమవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు.

ఏవోబీలో ఎక్సైజ్ దాడులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నందపూర్ సమితిలో ఒడిశా-ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన సుదుబు పరిసరాల్లో సోమవారం జోరుగా ఎక్సైజ్ దాడులు జరిగాయి. నందపూర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ అభయకుమార్ నాయక్ అందించిన వివరాల మేరకు. సరిహద్దులో ఉన్న సుదుబు అటవీ ప్రాంతంలో సారా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది దాడులు చేసి అక్కడ ఉన్న బట్టీ, సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు.

సారా తయారీ కేంద్రాలపై..

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా జగన్నాథప్రసాద్ ఠాణా పరిధిలోని కె.నువాపల్లి, గండాధర గ్రామ శివార్లలో సారా తయారీ కేంద్రాలపై పోలీసులు దాడి చేశారు. ఆయాచోట్ల 500 లీటర్ల ఊటసారాను ధ్వంసం చేశారని గంజాం ఎస్పీ కార్యాలయం అధికారులు సోమవారం తెలిపారు.

(c) eenadu

కుట్టడం ఆపం..! నిద్ర పట్టనివ్వం..!

● పట్టణాల్లో దోమల దండయాత్ర

న్యూస్‌టుడే, పలాస, ఇచ్ఛాపురం, ఆమదాలవలస పట్టణం, శ్రీకాకుళం నగరం

న్యూస్‌టుడే పరిశీలన

జిల్లాలోని పురపాలక సంఘాలు, శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడం.. ఇళ్ల ముందే వాడుక నీరు నిలిచి ఉండటం.. దోమల నివారణకు మందు పిచికారీ చేయకపోవడం, ఫాగింగ్ యంత్రాలు మూలకు చేరడం ఇతర కారణాలతో ప్రజలకు కంటి మీద కునుకు ఉండటం లేదు. మరుగుదొడ్ల గొట్టాలకు నెట్ కట్టకపోవడంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. మరోవైపు బడ్జెట్‌లో పెద్దఎత్తున నిధులు కేటాయించి ఖర్చు చేస్తున్నా సమస్య పరిష్కారం కాకపోగా తీవ్రత పెరుగుతుండటం గమనార్హం.

మూలకు చేరిన యంత్రాలు

✪ పలాస - కాశీబుగ్గ ✦31 ▼16 ✸64 వేలు

జంట పట్టణాల పరిధిలో మురుగు గుంతలు, వాడుక నీరు నిలిచి ఉన్న ప్రాంతాల్లో దోమల మోత తప్పడం లేదు. రెండు ఫాగింగ్ యంత్రాలు మూలకు చేరాయి. పారిశుద్ధ్య కార్మికుల కొరత, సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. 2025-26 బడ్జెట్‌లో సుమారు రూ.3 లక్షలు కేటాయించగా ఫాగింగ్‌కు సంబంధించి నిధులు ఖర్చు చేయలేదు.

✪పురపాలక సంఘం ✦వార్డులు ▼సచివాలయాలు ✸జనాభా

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో మూలకు చేరిన ఫాగింగ్ యంత్రం

పని చేస్తున్నవి రెండే..

✪ ఇచ్ఛాపురం ✦23 ▼10 ✸46 వేలు

నాలుగు ఫాగింగ్ యంత్రాలు ఉండగా రెండే పని చేస్తున్నాయి. రోజూ సాయంత్రం వాటిని వినియోగించాల్సి ఉన్నా వారంలో నాలుగు రోజులు వివిధ వార్డుల్లో తిప్పుతున్నారు. 2025-26 బడ్జెట్‌లో రూ.1.50 లక్షలు కేటాయించగా ఈ నెల 23 వరకు రూ.60 వేలు వినియోగించినట్లు లెక్కల్లో చూపారు.

ప్రజలపై ఆర్థిక భారం

పట్టణాల్లో ఏడాది పొడవునా దోమలు విజృంభిస్తుండటంతో ద్రావణాలు, అగరబత్తీలు వినియోగిస్తున్నారు. నెలకు ఒక్కో కుటుంబం రూ.200 వరకు ఖర్చు చేస్తోంది. ద్రావణాల వినియోగంతో వృద్ధులు, పిల్లల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని వైద్యులు సూచిస్తున్నారు. ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస, శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని పురపాలక కమిషనర్లు ‘న్యూస్‌టుడే’కు తెలిపారు.

తప్పని ఇక్కట్లు

నాలుగు ఫాగింగ్ యంత్రాల్లో రెండు పని చేయకపోగా.. అందుబాటులో ఉన్నవీ వినియోగించడం లేదు. మురుగు గుంతల్లో లార్వా నివారణకు రసాయనాలు పిచికారీ చేసిన దాఖలాలు లేవు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.6 లక్షలు కేటాయించగా.. రూ.3.50 లక్షలు ఖర్చు చేశారు.

✪ ఆమదాలవలస ✦23 ▼11 ✸49 వేలు

భారీ వ్యయం.. ఫలితం శూన్యం

✪ నగరపాలకసంస్థ : శ్రీకాకుళం
✦ డివిజన్లు: 50
▼ వార్డు సచివాలయాలు: 48
✸ జనాభా: 1.85 లక్షలు

ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నా ఇటీవల వినియోగించిన దాఖలాలు లేవు. నీరు నిలిచి ఉన్న ప్రాంతాలు, కాలువల్లో గంబూషియా చేపలు, ఆయిల్ బాల్స్ వేయడం, ఇతర రసాయనాలు వాడటం లేదు. 2025-26 బడ్జెట్‌లో రూ.15 లక్షలు కేటాయించగా ఇప్పటివరకు రూ.5 లక్షలు ఖర్చు చేశారు.

భోజనం.. మరింత రుచికరం

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు : 2067 ఉన్నత పాఠశాలలు: 360 మొత్తం విద్యార్థులు: 1,34,885

న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం, పొందూరు

పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరం నుంచి సన్నబియ్యం అందజేస్తున్నారు. దీంతో పాఠశాలల్లో భోజనం తినేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది.

● ఇటీవల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో వంట ఏజెన్సీల నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం, పీఎం పోషణ్ ద్వారా విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించేందుకు వంట ఛార్జీలను పెంచింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తద్వారా పథకం మరింత బలోపేతమవుతుందని, నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని కోరారు.

పెరిగిన మధ్యాహ్న భోజనం వంట ఛార్జీలు

● ప్రస్తుతం నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరగడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి ప్రస్తుతం అందజేసే ఛార్జీలను ఇంకొంచెం పెంచి ఉంటే బాగుంటుందని నిర్వాహకులు అభిప్రాయ పడ్డారు. పెంచిన ధరలు ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి అమలు కానున్నాయి.

పెంచిన ధరల వివరాలు ఒక్కొక్కరికి

తరగతులు	గతంలో రూ.	ప్రస్తుతం రూ.
1 నుంచి 5	5.45	6.19
6 నుంచి ఇంటర్	8.17	9.29
ఇంటర్	8.17	9.29

ఆశల దీపం ఆరిపోయింది

● నాగావళి కాలువలో మునిగి యువకుడి మృతి

మణికంఠ (పాతచిత్రం)

గరుగుబిల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అమ్మానాన్నలకు కబుర్లు చెబుతూ నిద్రపోయాడా కుర్రాడు.. ఎప్పటిలాగే తెల్లవారింది.. అమ్మా.. ఫ్రెండ్స్‌తో రన్నింగ్‌కు వెళ్లొస్తా అంటూ బయటికి పరుగులు తీశాడు బిడ్డ. అల్పాహార సమయానికి వచ్చేస్తాడని ఎదురుచూసిందామె.. కానీ దయలేని విధి మరొకటి తలచింది. నాగావళి కాలువలో మునిగిపోయాడన్న పిడుగులాంటి మాట విని తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో గుండెలు అవిసేలా రోదిస్తున్నారు.

గరుగుబిల్లి మండలం నందివానివలసకు చెందిన రెడ్డి సింహాచలం, చిన్నమ్మ వ్యవసాయ కూలీలు. వీరి కుమార్తె జయంతి శ్రీకాకుళంలో బీఎస్సీ నర్సింగు చదువుతోంది. కొడుకు ఆర్.మణికంఠ(17) కురుపాంలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. యువకుడు రోజూ తెల్లవారుజామున 5 గంటలకు తోటివారితో తోటపల్లి జలాశయం గట్టుపై రన్నింగుకు వెళ్తుండేవాడు. ఆదివారం నలుగురు యువకులతో పరుగు ముగించుకొని ఉదయం 6.30 గంటలకు నాగావళి ఎడమ కాలువ వద్దకు చేరుకున్నారు. మణికంఠ నాగావళి కాలువలో స్నానం చేద్దామని దిగి, సాగునీటి మదుము వద్ద కాలుజారిపడ్డాడు. అక్కడ లోతైన గొయ్యిలో ఈతకొట్టలేక మునిగి కన్నుమూశాడు. విషయం తెలుసుకున్న తండ్రి సింహాచలం అక్కడికి చేరుకొని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. అల్లారుముద్దుగా పెంచిన బిడ్డ మరణంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గరుగుబిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం కొమరాడలో ముగ్గురు యువకులు నీటమునిగి మృతిచెందిన ఘటన వెంటనే బాలుడి మరణం ఆందోళన కలిగిస్తోంది.

సత్యసాయికి రథోత్సవం

సత్యసాయిబాబా చిత్రపటాన్ని రథంలో ఊరేగిస్తున్న భక్తులు

మందస, న్యూస్‌టుడే: మందసలో సత్యసాయిబాబా జయంతి కార్యక్రమాల్లో భాగంగా సోమవారం నగర సంకీర్తన, ప్రశాంతి పతాకావిష్కరణ, రథోత్సవం నిర్వహించారు. సాయంత్రం శత దీపారాధన, నామసంకీర్తన, బాలవికాస్, చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, ఊయల ఉత్సవాన్ని చేపట్టారు. సత్యసాయి సేవాసమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వి.ఈశ్వరరావు, మద్ది శివ, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభా పోటీల విజేత మంచినీళ్లపేట

కంబాలరాయుడుపేటలో మాతృభూమి అభివృద్ధి సంఘాల సమాఖ్య నేతృత్వంలో ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ పర్యవేక్షణలో 3, 4, 5 తరగతుల విద్యార్థులకు సోమవారం ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఇందులో మంచినీళ్లపేట, కంబాలరాయుడుపేట, పీఎంపురం పాఠశాలలు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు మాతృభూమి సంఘాల సమాఖ్య సభ్యులు, గ్రామస్థులు బహుమతులు అందజేశారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

సాగర తీరాన.. సౌర కాంతులు..!

మండలాలు: 9 గ్రామాలు: 82	ఏర్పాటు చేయాల్సిన దీపాలు: 1726	అమర్చినవి: 797

–న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్, కాశీబుగ్గ

● దేవునల్తాడ గ్రామానికి చెందిన నలుగురు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లేందుకు ఇంటి నుంచి బయల్దేరారు. 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న తీరానికి నడిచి వెళ్తుండగా ఆ అంధకారంలో హైనాలు వారిపై దాడికి యత్నించాయి. చేతిలో ఉన్న సామగ్రితో అదుపుచేసి ప్రాణాలతో బయటపడ్డారు.

సముద్ర తీర ప్రాంతంలో ఇలాంటి ప్రమాదకర పరిస్థితులు మత్స్యకారులకు ఎదురవుతున్నాయి. దీంతో విద్యుత్తు దీపాలు ఏర్పాటుకు కోల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ జిల్లాకు సీఎస్ఆర్ నిధుల కింద రూ.4 కోట్లు అందజేసింది. 193 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న తీరంలో సౌర విద్యుత్తు దీపాలు అమర్చనున్నారు. నెడ్‌క్యాప్ పర్యవేక్షణలో ఆర్టీ సొల్యూషన్స్ సంస్థ పనులు చేపడుతోంది.

ఇచ్ఛాపురం మండలంలోని ఇద్దివానిపాలెంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలు

● జిల్లాలో 193 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతం విస్తరించి ఉంది. 11 మండలాల్లో తీరం వెంబడి అనేక మత్స్యకార గ్రామాలున్నాయి. శ్రీకాకుళం ప్రాంతంలో నియోజకవర్గం పరిధిలో 9 మండలాలు ఉన్నాయి. ఇంటి నుంచి మత్స్యకారులు తీరానికి చేరుకోవాలంటే 2 నుంచి 3 కిలోమీటర్లు నడిచి వెళ్లాలి. నిత్యం అర్ధరాత్రి సమయంలో వలలు, ఇతర సామగ్రి తీసుకుని బయల్దేరతారు. ఈ క్రమంలో పాములు, ఇతర విష కీటకాలు, వన్య ప్రాణుల నుంచి ప్రమాదాలు ఎదురవుతున్నాయి. దీపాలు ఏర్పాటు చేస్తే వీటికి ప్రయోజనకరంగా మారుతుంది.

● మైదానం, ఏజెన్సీ ప్రాంతాల్లో మైనింగ్ కార్యకలాపాలు సాగుతుండటంతో అడవుల్లో ఆవాసాలు కరవై వన్య ప్రాణులు తీరానికి చేరుతున్నాయి. అడవి పందులు, హైనా, కోతులు, పాముల సంచారం తీరంలో ఇటీవల పెరిగింది. ఈ కారణంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మత్స్యకార సాగర్ మాల పేరిట కార్యక్రమాన్ని రూపొందించి దీపాలు ఏర్పాటు చేయనున్నారు.

● ‘ఉపాధి నిధులతో తీరంలో రోడ్ల నిర్మాణం పనులు చేపడుతున్నాం. సాగర్‌మాల కార్యక్రమంలో భాగంగా దీపాలు ఏర్పాటు చేస్తాం.’ అని నెడ్‌క్యాప్ అభివృద్ధి అధికారి ఎస్.సతీష్ కుమార్ తెలిపారు.

ఉద్యానాలు.. ఉసూరుమంటున్నాయి..

న్యూస్‌టుడే, పలాస, ఇచ్ఛాపురం

పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పురపాలక సంఘాల పరిధిలో పార్కులు అధ్వానంగా ఉన్నాయి. పాలకవర్గాలు మారుతున్నా ప్రత్యేక దృష్టిసారించకపోవడంతో అభివృద్ధి లేక ఇలా తయారయ్యాయి. సాధారణ, ప్రత్యేక నిధులతో మౌలిక సదుపాయాలు కల్పిస్తే పట్టణవాసులు ఆహ్లాదం పొందే అవకాశం ఉంది.

మౌలిక సౌకర్యాల లేమితో అవస్థలు

పలాస ముత్యాలమ్మ కోనేరులో దుస్థితి

పలాస-కాశీబుగ్గ పుర పరిధి ముత్యాలమ్మకోనేరు, నెహ్రూపార్కుల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో బాటసారులు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నడవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. చిన్నారులు జంట పట్టణాలకు చెందిన పలువురు పార్కుల్లో నడుస్తున్నారు. దీపాలు లేకపోవడంతో వినోద పరికరాలులేక రాత్రి పూట భయాందోళనతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

● కోనేరులో పనికిరాని మొక్కలు పెరిగిపోవడంతో విషకీటకాలు సంచరిస్తాయనే భయంతోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఉద్యానానికి రెండువైపులా ప్రహరీ నిర్మాణ పనులు సగంలోనే ఆగిపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. మౌలిక సదుపాయాలు కల్పించి కాపలాదారులను ఏర్పాటు చేయాలని జంట పట్టణాల వాసులు కోరుతున్నారు.

● ముత్యాలమ్మ కోనేరు, నెహ్రూపార్కుల్లో మౌలిక సదుపాయాలు కల్పన కోసం పరిశీలిస్తున్నాం, త్వరలో పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఇ.శ్రీనివాసులు తెలిపారు.

● ఇచ్ఛాపురం పట్టణానికే కాదు..మండలానికి కూడా ఏకైక ఉద్యానం గాంధీ పార్కు. పుర పరిధిలో రెండు పార్కులున్నా ఇదొక్కటే వినియోగంలో ఉంది. పుర పాలనలో నానాటికి తీసికట్టులా మిగిలింది. పాలకమండళ్లు రూ.లక్షలు వెచ్చిస్తున్నా ఏవీ ఉపయోగంలో లేవు. కనీస ఆటపరికరాలు లేవు. ఊయలలు లేవు. జలవనరుల పేరిట ఆర్భాటంగా పెట్టిన పౌంటెయిన్ ఏడాదిలోనే మూలకు చేరింది. ప్రస్తుతం స్టీలు కుర్చీలు, మహిళల జిమ్ ఉపకరణాలే మిగిలాయి. కుండపోత వద్ద పార్కుకు స్థలమున్నా కనీస అభివృద్ధి చేయక నిరుపయోగంగా మారింది.

● ‘ఉద్యాన అభివృద్ధికి కౌన్సిల్ తీర్మానాలు చేశాం. ఆ నిధులతో కొంత వరకు అభివృద్ధి జరిపాం. ప్రహరీ నిర్మాణం, నడకదారి, మొక్కలు నాటడం చేశాం. ఆటపరికరాలు ఏర్పాటుకు నిధులు కేటాయించాం. గుత్తేదారు ఆలస్యం చేయడంతో పనులు జరగలేద'ని కమిషనర్ నల్లి రమేష్ తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రధానోపాధ్యాయులు ఎం.మురళీప్రకాశ్ అన్నారు. సోమవారం స్థానిక యువకుల ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం యువకులను అభినందించారు. ఉపాధ్యాయులు పి.పాపారావు, దుర్గారావు, లింగరాజు, స్థానిక యువకులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కవిటి

ఎమ్మెల్సీ పరామర్శ

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దకర్రివానిపాలెంలో వైకాపా నాయకులు ఎం.కేశవరావు, చిన్నకర్రివానిపాలెంలో చీకటి సీమారావు ఇటీవల మృతి చెందడంతో ఆయా కుటుంబాలను ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం పరామర్శించారు.

నడవలేం.. ముందుకు సాగలేం..

బాలకృష్ణాపురం నుంచి మునిభద్ర వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. నాలుగేళ్ల కిందట రోడ్డు నిర్మాణానికి రాళ్లు పరిచి వదిలేశారు. దీంతో అప్పటి నుంచి వాహనాలు కదలక వాహనదారులు.. నడవలేక పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ శాఖ ఏఈ ధనంజయను వివరణ కోరగా ప్రస్తుతం ప్రారంభానికి సిద్ధంగా ఉందని, త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

బండి వస్తోంది.. జరగండి!

ఇక్కడ భారీ లోడుతో వెళ్తోంది లారీ కాదు.. ట్రాక్టర్. బెండిగేటు నుంచి పూండి వైపు ఓ ట్రాక్టర్ పరిమితికి మించి నూక లోడుతో ప్రమాదకరంగా వెళ్తుంది. కాగా మరో వైపు అటు నుంచి వచ్చే వాహనదారులకు అవస్థలు తప్పలేదు. అది ఒక లైను రోడ్డు కావడంతోపాటు ఇరువైపులా బెర్ములు లేక గోతులతో భయంకరంగా మారింది. ఆయా వాహనదారులపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

ఇసుక డంప్ కాదండీ బాబూ

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధి కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో ఇసుక కుప్పతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. పై అంతస్తు నిర్మాణ పనుల కోసం వేసిన ఇసుకపై కుక్కలు, ఆవులు మలమూత్ర విసర్జన చేస్తున్నాయి. దీనికితోడు బస్సులు వచ్చే సమయంలో నిలుపుదల చేసేందుకు అవకాశం లేకుండా పోతోంది. గుత్తేదారుకి సమాచారం అందించి ఇసుక కుప్ప తొలగించేలా చర్యలు తీసుకుంటామని ఏఈ కిరణ్ కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస

దారి చూపరూ..

బిడిమి-మీలగంగువాడ రహదారి నుంచి రాంపురం వెళ్లే మట్టి రోడ్డు ఇది. పదేళ్ల కిందట ఉపాధి పథకం ద్వారా నిర్మించారు. కనీస మరమ్మతులు లేకపోవడంతో ఏటా వర్షాలకు కోతకు గురవ్వడంతోపాటు రెండు వైపులా పొదలతో మూసుకుపోతోంది. ఎలుగుబంట్లు తిరిగే ప్రాంతం కావడంతో రాకపోకలకు జనం భయపడుతున్నారు. ఉపాధి పనులు ప్రారంభమవ్వగానే పొదలు తొలగించి, రహదారిని అభివృద్ధి చేస్తామని సర్పంచి ధర్మారావు తెలిపారు.
– న్యూస్‌టుడే, హరిపురం (మందస)

BEFORE THE HONOURABLE COURT OF MACT CUM THE I- ADDITIONAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
M.V.O.P No: 232/2025

Between:
Kondagorri Thejavathi and others ..Petitioners
And:
Ramachandar Sathapathi @ Ramach and others ..Respondents

R1) Ramachandar Sathapathi alias Ramach Son of Late Udaya Chandar Sathapathi alias Udayach, Hindu, 42 years, Resident of Radha Madhava Street, Jeypore, Koraput District, Odissa State (Driver of Oil Tanker bearing No. OD 02B 3373).

R2) Archana Hotha W/o late Ashish Kumar Mishra, Aged about 42 years, owner of Oil Tanker bearing No. OD 02B 3773, Resident of Pailo Street, Near Municipality Girl's High School, Jeypore Post, Koraput District, Odissa as above State.

NOTICE

Please take notice that the above-named Petitioners filed the above M.O.P. against you for claiming compensation and the matter coming for your apperance and stands posted to **11-12-2025** on that day your personally or through Advocate attend before the Honourable Court at **10.30 AM** failing which the Honourable I-Addl., District Judge Court, Vizianagaram is decided under the Court of Law.

T. Santha Kumar
Advocate for the petitioners
Vizianagaram, **Cell No: 77805 28099**

యువ.. సామాజిక సేవ

– న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం, నరసన్నపేట

★ నియోజకవర్గాలు: టెక్కలి, నరసన్నపేట
★ డిగ్రీ కళాశాలలు: 12
★ ఎన్ఎస్ఎస్ సేవలందిస్తున్నవి: 7
★ యూనిట్లు: 12
★ వాలంటీర్ల సంఖ్య: 1,200
★ నిర్వహించిన శిబిరాలు: 118

కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కావడంలేదు. పల్లె ప్రజల జీవన విధానాన్ని తెలుసుకుని వారిని చైతన్య పరిచేందుకు ముందుకొస్తున్నారు. జాతీయ సేవాపథకం(ఎన్ఎస్ఎస్)లో వాలంటీర్లుగా చేరుతూ సమాజ శ్రేయస్సులో భాగస్వాములవుతున్నారు. గ్రామాలను దత్తత తీసుకుని ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు.

సేవే లక్ష్యంగా కార్యక్రమాలు

టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాల్లోని పలు కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామాల్లో ప్రత్యేక సేవా శిబిరాలను నిర్వహిస్తున్నారు. టెక్కలి సమీపంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం కె.కొత్తూరు గ్రామాన్ని దత్తత తీసుకుంది. రక్తదాన, వైద్య శిబిరాలతో పాటు ఎన్నికల విధుల్లోనూ పాలుపంచుకుంది. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు ఇటీవల సన్యాసినీలాపురం, డమర, సవరకిల్లి గ్రామాల్లో వారం రోజుల పాటు శిబిరాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. నరసన్నపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలతో పాటు పద్మావతి, జ్ఞానజ్యోతి, డీఆర్ఎన్, ఎల్వీఆర్, జలుమూరు మండలంలోని వంశధార డిగ్రీ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్లు నడుస్తున్నాయి. వీటి ద్వారా జీఎస్టీ, క్యాన్సర్, పిల్లల రక్షణ, మహిళలపై దాడులు, ఓటు హక్కు ప్రాధాన్యం గురించి వాలంటీర్లు వివరిస్తున్నారు.

కె.కొత్తూరులో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

కొత్త అనుభూతి పొందుతున్నాం

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాల్లో వారం రోజుల పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల మధ్య ఉండి, వారి కష్టసుఖాలు తెలుసుకుని కొత్త అనుభూతి పొందుతున్నాం. ఐక్యతకు ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు అద్దం పడుతున్నాయి. దేశ సమైక్యతకు ఇది ఎంతో తోడ్పాటునిస్తుంది. సర్వేలు, రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహించడం వల్ల విద్యార్థి దశ నుంచే క్షేత్రస్థాయి పరిస్థితిపై అవగాహన కలుగుతోంది.
– బి.సోనియా, బీకాం ద్వితీయ సంవత్సరం, పద్మావతి డిగ్రీ కళాశాల, నరసన్నపేట

వ్యక్తిత్వ వికాసానికి నాంది.. విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్ది మంచి పౌరులుగా తయారు చేయడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం. గ్రామాల్లో ప్రత్యేక సేవా శిబిరాల సమయంలో వాలంటీర్లు ప్రజలతో మమేకమవుతున్నారు. వారిలో సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలు, బృందాల్లో పనిచేయగల శక్తి సామర్థ్యాలు పెరిగి జీవితంలో రాణించేందుకు ఈ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.
- కె.రాములు, వెంకట మారుతీప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీవోలు, పద్మావతి డిగ్రీ కళాశాల (నరసన్నపేట), ఐతమ్ (టెక్కలి)

పైపు మరమ్మతులు.. విద్యార్థులకు ఇక్కట్లు

డొంకూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మూడు రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు నీటిని అందించే పైపులైన్ మరమ్మతులకు గురికావడంతో ఈ సమస్య తలెత్తింది. దీన్ని పంచాయతీ కార్యదర్శి కృష్ణ దృష్టికి తీసుకెళ్లగా సోమవారం మరమ్మతులు చేపట్టారు. ఆ పాఠశాలలో సుమారు 300 మంది విద్యార్థులున్నారు. వారికి ఇబ్బంది కలగకుండా స్కూల్ ఛైర్మన్ జానకిరావు, సర్పంచి కల్యాణ్ పాఠశాలకు నీటి ట్యాంకర్లు పంపించారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

సమస్యలు పరిష్కరించాలి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు త్రినాథ్ అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ డివిజన్ పరిధి వీఆర్ఏలు పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న వీఆర్ఏలను వీఆర్వోలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని కోరారు. అనంతరం ఆర్డీవో వెంకటేశ్‌కు వినతిపత్రం అందజేశారు. సింహాచలం, కామరాజు, పురుషోత్తం పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వీఆర్ఏలు

తిరువణ్ణామలైలో కార్తిక దీపోత్సవాలు పారంభం

ధ్వజారోహణంలో వేద పండితులు

ప్రత్యేక అలంకరణలో వినాయకుడు

ఉన్నాములై సమేత చంద్రశేఖరస్వామి

తరలివచ్చిన భక్తులు

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో కార్తిక దీపోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని వేకువజామున తెరిచి వినాయకుడు, మురుగన్, అరుణాచలేశ్వరస్వామి, ఉన్నాములై అమ్మవారు, చండికేశ్వర పంచమూర్తులకు ప్రత్యేక అభిషేక, ఆరాధనలు నిర్వహించారు. అనంతరం అరుణాచలేశ్వరస్వామి సన్నిధి ఎదుట పంచమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వివిధ వాహనాల్లో తీసుకొచ్చారు. ఉదయం 6.30కు ధ్వజారోహణం జరిగింది. శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె.పిచ్చాండి, జిల్లా కలెక్టరు తర్పగరాజ్, ఎస్పీ సుధాకర్, రెవెన్యూ అధికారి రామ్‌ప్రతిబన్ తదితరులు పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు పాల్గొని పంచమూర్తులను దర్శనం చేసుకున్నారు.

రైతుల డిమాండ్లను ఈపీఎస్ ఆలకించారా?: స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్ర రైతుల డిమాండ్లను ఒక్కసారైనా ఆలకించినట్లు ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిసామి చెప్పగలరా అని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రశ్నించారు. ఆయన తన 'ఎక్స్' పేజీలో... డెల్టా రైతుల కన్నీళ్లు తుడిచేందుకు వారికి అండగా నిలవకుండా ఎడప్పాడి పళనిసామి మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని ఆరోపించారు. ధాన్యం తేమశాతాన్ని 22శాతంగా పెంచాలని, ఇతర డిమాండ్లతో ప్రధాని మోదీకి లేఖ రాయగా కేంద్రం నిరాకరించిందని తెలిపారు. మూడు వ్యవసాయ చట్టాలకు మద్దతు పలికిన ఆయన అన్నదాతల సంక్షేమాన్ని విస్మరించారన్నారు.

భారత మహిళల జట్టుకు అభినందన

చెన్నై: అంధుల టీ20 ప్రపంచ కప్‌ను కైవసం చేసుకున్న భారత మహిళా జట్టుకు ముఖ్యమంత్రి స్టాలిన్ అభినందనలు తెలిపారు. తన 'ఎక్స్' పేజీలో.. ధైర్యం ముందుకు నడిపించేటప్పుడు చరిత్ర రూపొందుతోందని తెలిపారు. తొలి టీ20 ప్రపంచ కప్‌ను గెలిచిన అంధుల భారత మహిళా జట్టుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వారు భారత గర్వకారణంగా, ప్రపంచానికి ఓ నిదర్శనంగా ఎదిగి నిలిచారని తెలిపారు.

30 వరకు భారీవర్షాలు

తూత్తుకుడి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రి ప్రాంగణంలో వాన నీరు

ప్యారిస్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 30 వరకు భారీవర్షాలు కొనసాగే అవకాశం ఉందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఈ మేరకు విడదల చేసిన ప్రకటనలో.. దక్షిణ అండమాన్ తీరంలో నెలకొన్న తీవ్ర అల్పపీడనం ఆగ్నేయ బంగాళాఖాతంలో 27న తుపానుగా మారే అవకాశం ఉంది. సోమవారం కన్నియాకుమరి, దానిని ఆనుకుని ఉన్న శ్రీలంక, నైరుతి బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. అది మరింత బలపడే అవకాశం ఉంది. ఆగ్నేయ అరేబియా సముద్రంలో ఉపరితల ఆవర్తనం నెలకొంది. ఈ మూడు ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉన్నాయని, కలిసి కూడా కదిలే అవకాశం ఉందని, కదలికలను పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొంది.

- 25న కన్నియాకుమరి, తిరునెల్వేలి, తూత్తుకుడి, రామనాథపురం, 26 తూత్తుకుడి, రామనాథపురం, పుదుక్కోట్టై, తిరువారూరు, తంజావూరు, నాగపట్టినం జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీవర్షం కురిసే అవకాశం ఉంది.
- 27న తూత్తుకుడి, రామనాథపురం, పుదుక్కోట్టై, తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, 28న తంజావూరు తిరువరూరు, నాగపట్టినం, కారైక్కాల్‌లో భారీనుంచి అతిభారీ వర్షాలు, తూత్తుకుడి, రామనాథపురం, పుదుక్కోట్టై, మైలాడుతురై, కడలూరు జిల్లాలో భారీవర్షాలకు అవకాశం.
- 29న మైలాడతుర్రై, కడలూరు, విళుపురం, చెంగల్పట్టు, చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, పుదుచ్చేరిలో భారీ నుంచి అతిభారీవర్షం, నాగపట్టినం, తంజావూరు, తిరువారూరు, అరియలూరు, కళ్లకురిచ్చి, తిరువణ్ణామలై, రాణిపేట, వేలూర్, కారైక్కాల్‌లో భారీ వర్షం, 30న తిరువళ్లూరు జిల్లాలో భారీ నుంచి అతి భారీవర్షం, చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, రాణిపేట, వేలూర్, తిరువణ్ణామలై, విళుపురం, పుదుచ్చేరిలో భారీవర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

చేపల వేటకు వెళ్లొద్దు

రెడ్‌హిల్స్: గాలులు బలంగా వీచే అవకాశం ఉండడంతో చేపల వేటకు వెళ్లొద్దని పుదుచ్చేరి ప్రభుత్వం జాలర్లను హెచ్చరించింది. అల్పపీడనం కారణంగా తమిళనాడుతో పాటు పుదుచ్చేరి సముద్ర తీర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గంటకు 45 నుంచి 55 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ప్రకటనలో తెలిపింది.

సాధరణంకన్నా అధికం..

కన్నియాకుమరి సముద్రతీరంలో అల్పపీడనం ఏర్పడనుందని, జాలర్లు వెంటనే సముద్రతీరానికి చేరుకోవాలని, తమిళనాడు, కేరళ సముద్రతీరాలకు వెళ్లొద్దని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం డైరక్టర్ అముద తెలిపారు. ఈశాన్య రుతుపవనాల వర్షం సాధారణం కన్నా 5 శాతం అధికంగా కురిసినట్లు పేర్కొన్నారు. తెన్‌కాశి, తిరునెల్వేలి జిల్లాల్లో అత్యంత అధికంగా, తిరుప్పూర్, కరూర్, దిండుక్కల్, సేలం, పెరంబలూరు, చెంగల్పట్టు, చెన్నై తదితర జిల్లాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

మనోన్మణియం సుందరనార్ వర్సిటీ పరీక్షలు వాయిదా

టీనగర్: తిరునెల్వేలి జిల్లాలో భారీ వర్షాల దృష్ట్యా అక్కడి మనోన్మణియం సుందరనార్ యూనివర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ కళాశాలల్లో మంగళవారం జరగాల్సిన సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశారు. తదుపరి తేదీలను త్వరలోనే ప్రకటించనున్నారు. జిల్లాలో ఇప్పటికే పాఠశాలలు, ఇతర విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. విద్యార్థులు, అధ్యాపకులు అధికారిక ప్రకటనల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

దళితులకు ద్రోహం చేస్తున్న డీఎంకే: అన్బుమణి

సైదాపేట, న్యూస్‌టుడే: డీఎంకే దళితులకు ద్రోహం చేస్తోందని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి ఆరోపించారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. ఎస్సీలకు అంతర్గత రిజర్వేషన్‌ను డీఎంకే ప్రభుత్వం అమలు చేయడంలేదన్నారు. తమిళనాడుకు సంబంధించినంత వరకు వన్నియర్లు, దళితులకు సామాజిక న్యాయం దక్కకూడదనేదే డీఎంకే సిద్ధాంతమని తెలిపారు.

కోయంబేడు నుంచి నందంబాక్కం వరకు..

☛ వచ్చే జూన్‌కి మెట్రో రైలు సేవలు

ట్రాక్ నిర్మాణం

వడపళని, న్యూస్‌టుడే: మెట్రోరైలు రెండో దశ ఐదో మార్గంలోని మాధవరం నుంచి షోలింగనల్లూరు వరకు 46 స్టేషన్లతో నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. మాధవరం, రెట్టేరి, కొలత్తూరు, అన్నానగర్ ప్రాంతాల్లో ప్రస్తుతం ట్రాక్ నిర్మాణం సాగుతోంది. కోయంబేడు మార్కెట్ నుంచి విరుగంబాక్కం మధ్య పైవంతెన అనుసంధాన పనులు ఊపందుకున్నాయి. ఈ మార్గంలో 100కుపైగా స్తంభాల పనులు పూర్తయ్యాయి. కోయంబేడు నుంచి ఆళ్వార్‌తిరునగర్ మధ్య స్థల సమస్యతో పనుల్లో మొదట్లో జాప్యం జరిగిందని సీఎంఆర్ఎల్ అధికారులు పేర్కొన్నారు. గతేడాది నుంచి నిరవధికంగా జరుగుతున్నాయని చెప్పారు. కోయంబేడు నుంచి నందంబాక్కం వరకు 60 శాతం వరకు పూర్తయ్యాయి. ట్రాక్ నిర్మాణం, సిగ్నల్‌కు సంబంధించిన పనులు వేగవంతమయ్యాయి. కోయంబేడు నుంచి నందంబాక్కం వరకు వచ్చే సంవత్సరం జూన్ నుంచి సేవలు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని సీఎంఆర్ఎల్ అధికారులు పేర్కొంటున్నారు.

కూటమిని సరైన సమయంలో ప్రకటిస్తాం

☛ ప్రేమలత విజయ్‌కాంత్

ప్యారిస్, న్యూస్‌టుడే: కూటమిపై సరైన సమయంలో ప్రకటిస్తామని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత తెలిపారు. శివగంగై జిల్లా తిరుపత్తూర్‌లో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... కెప్టెన్ విజయ్‌కాంత్ కఠినమైన శ్రమ, అంకితభావంతో డీఎండీకే ఏర్పడిందన్నారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో డీఎండీకే తనదైన ముద్ర వేస్తుందని, తమ మద్దతు పొందే కూటమి విజయం సాధిస్తుందని చెప్పారు. సరైన సమయంలో కూటమిని ప్రకటిస్తామన్నారు. మదురై, కోయంబత్తూరులో మెట్రో రైలు ప్రాజెక్టు అమలు చేయాలని, తమిళనాడుకు అదనపు వందేభారత్ రైళ్లను నడిపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు.

జనవరి 2 నుంచి 4 వరకు ఐఐటీఎంలో ఓపెన్ హౌస్

వడపళని, న్యూస్‌టుడే: ఐఐటీ మద్రాస్‌లో జనవరి 2 నుంచి 4 వరకు 'ఇన్‌స్టిట్యూట్ ఓపెన్ హౌస్ 2026' జరగనుంది. ఐఐటీలోని అధునాతన ప్రయోగశాలలు, ఆవిష్కరణ కేంద్రాలు, విద్యార్థుల నేతృత్వంలో చేపట్టిన సాంకేతిక ప్రాజెక్టులు తిలకించవచ్చని ఐఐటీ సోమవారం ప్రకటన విడుదల చేసింది. https:///shaastra.org/open-house లింకు ద్వారా ఆసక్తి ఉన్నవారు డిసెంబరు 5లోపు పేర్లు నమోదు చేసుకోవాలి. రెండేళ్లుగా దాదాపు లక్ష మంది పాఠశాల, కళాశాల విద్యార్థులు సందర్శించారని ఐఐటీ ఆచార్యులు వి.కామకోటి తెలిపారు. 'అనైవరుక్కుం ఐఐటీఎం, ఐఐటీఎం ఫర్ ఆల్' పేరిట ఓపెన్ హౌస్ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రజలు, పాఠశాలలు, కళాశాలలు సహా దేశంలోని ఇతర ప్రాంతాలనుంచి కూడా అందరూ హాజరు కావాలని ఆహ్వానించారు.

ప్రత్యేకతలివీ...

- విద్యార్థులు, అధ్యాపకుల నేతృత్వంలోని పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టులు, ప్రత్యక్ష ప్రదర్శనలు, ఆవిష్కరణలతో కూడిన 80 ఎగ్జిబిషన్ స్టాల్స్.
- 4 జాతీయ పరిశోధన కేంద్రాలు, 11 ఇన్‌స్టిట్యూట్ పరిశోధన కేంద్రాలు, 18 విద్యా విభాగాల్లో విస్తరించి ఉన్న 15 ఎక్సలెన్స్ కేంద్రాలు సహా 100కు పైగా ప్రయోగశాలలు చూడొచ్చు.
- ఐఐటీఎంలో జరుగుతున్న వినూత్న పరిశోధనలు అందరూ తెలుసుకోవడానికి ఓపెన్ హౌస్ మంచి అవకాశమని స్టూడెంట్స్ డీన్, ఆచార్యులు సత్యనారాయణ గుమ్మడి పేర్కొన్నారు.

జూనియర్ హాకీ ప్రపంచకప్‌కు ఉచిత టికెట్లు

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నై, మదురైలలో 14వ జూనియర్ హాకీ ప్రపంచకప్ ఈనెల 28 నుంచి డిసెంబరు 10 వరకు జరగనున్న సంగతి తెలిసిందే. 24 జట్లు పాల్గొననున్నాయి. పోటీలు వీక్షించేందుకు టికెట్లు ఉచితంగా పొందొచ్చని హాకీ ఇండియా ప్రకటించింది. www.ticketgenic.in అనే వెబ్‌సైట్ ద్వారా లేదా హాకీ ఇండియా అధికారపూర్వ యాప్‌లో నమోదు చేసుకుని డిజిటల్ టికెట్లు పొంది ప్రత్యక్షంగా వీక్షించొచ్చని పేర్కొంది. ఒక వ్యక్తికి నాలుగు టికెట్లు మాత్రమే ఇస్తారు. హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ తిర్కే మాట్లాడుతూ... ఉచిత టికెట్లు ఇవ్వటం ద్వారా తమిళనాడుతోపాటు ఇతర రాష్ట్రాల విద్యార్థులు, యువ క్రీడాకారులు, వారి కుటుంబ సభ్యులు, ప్రత్యక్షంగా చూడొచ్చన్నారు.

సామాజిక మాధ్యమాలతో వ్యభిచార వల

■ యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ పరిశోధనలో వెల్లడి

ఒంటరి మహిళలు, భర్తతో విడిపోయినవారిపై అక్రమ రవాణాదారులు కన్నేసి ఉంచుతున్నారు. తెలివిగా వారిని ట్రాప్ చేసి.. పడుపు వృత్తిలోకి తీసుకొస్తున్నారు. ఆ ఊబిలో వారిని చిక్కుకునేలా చేసి భారీ మొత్తంలో డబ్బులు సంపాదిస్తున్నారు. ఆ చెర నుంచి బయటికొచ్చి ప్రభుత్వ ఆశ్రయం పొందుతున్న కొందరు బాధితులతో యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ పరిశోధకులు మాట్లాడారు. **- ఈనాడు-చెన్నై**

యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ క్రిమినాలజీ విభాగానికి చెందిన ఎం.ప్రేమానంద్, ప్రొఫెసర్ ఎం.శ్రీనివాసన్ జరిపిన పరిశోధన సమాజం కళ్లు తెరిపిస్తోంది. ఆడవారికి ఇప్పటికీ భద్రత అగమ్యగోచరంగా ఉందనే విషయాన్ని ఎత్తిచూపుతోంది. పడుపు వృత్తిలోకి తీసుకొచ్చేందుకు అక్రమ రవాణాదారులు ఎన్నుకున్న మార్గాలు ఆందోళన కలిగించేలా ఉన్నాయని వారంటున్నారు.

పరిచయం ఉన్నవారే..

అక్రమ రవాణాదారులు మహిళలను ఎంపిక చేసుకునేందుకు సామాజిక మాధ్యమాలు వాడటం విస్మయానికి గురిచేస్తోంది. ప్రధానంగా వాట్సప్ వినియోగిస్తున్నారు. తమపై మంచి అభిప్రాయం ఏర్పడేలా మాయమాటలు చెప్పడం నిందితుల తొలి ఎత్తుగడగా ఉంది. తమ మాట వినేలా చేసుకుని వారితో వ్యభిచారం చేయించేందుకు.. నిందితులు సామాజిక మాధ్యమాల ద్వారానే లైంగికపరమైన ప్రకటనలిచ్చి మగవారిని ఆకర్షిస్తున్నారు. వాట్సప్ ఛానెల్స్, ఫేస్‌బుక్, ఇతర త్రా వెబ్‌సైట్లను ఇందుకు వేదికగా మార్చుకున్నారు. చాలామంది బాధితులు చెప్పిన విషయమేమిటంటే.. తమను ఈ వృత్తిలోకి తీసుకొచ్చిన వారు పరిచయం ఉన్నవారేనని. స్నేహితులు ద్వారా తెలుసుకున్నానని, మీరు చాలా బాగున్నారనే మాటలు వారు వాడినట్లు వివరిస్తున్నారు.



ఎలా ఎంచుకున్నారంటే..

పరిశోధకులు 76 మంది బాధితురాళ్లతో మాట్లాడారు. తెలుసుకున్నారు. వారంతా చెన్నై, మదురై, తిరుచ్చి, సేలం, కోయంబత్తూరులోని ప్రభుత్వ సంరక్షణ గృహాల్లో తలదాచుకున్నారు. బాధితుల్లో సగం మంది తమిళనాడు నుంచి ఉండగా, 25 శాతం మంది పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్, మరికొందరు ఇతర రాష్ట్రాలనుంచి ఉన్నారు. వారిలో 45 శాతం మంది యువతులు 35ఏళ్లలోపు వారే. ఎక్కువమంది విడాకులు తీసుకున్నవారు, వితంతువులు, భర్తతో విడిపోయినవారే.

ఆర్థిక పరిస్థితులు సరిగా లేక..

ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడం, బతకడానికి ఎక్కువ డబ్బులిస్తారనే ఆశతో ఈ వృత్తిలోకి వచ్చినట్లు బాధితులు చెబుతున్నారు. పైగా 47.4శాతం మంది మహిళలు వాటికి ఆశపడి స్వచ్ఛందంగా ఈ ఊబిలోకి దిగినట్లు ఒప్పుకొంటున్నారు. కుటుంబం పేదరికంలో ఉండటంతో ఇంట్లోవారిని, పిల్లల్ని పోషించేందుకు చేసిన అప్పులు తీర్చడానికి, వైద్యఖర్చులకు ఈ పనులు చేసినట్లు గుర్తుచేసుకున్నారు.

లంచాలిస్తూ..

వ్యభిచార కేసుల్లో 85 మంది నిందితుల్ని పట్టుకోగా అందులోనూ 45 మంది దాకా మహిళలే ఉన్నారని గుర్తించారు. నిందితుల్లో అత్యధికులు తమిళనాడు ప్రాంతవాసులుకాగా.. వారిలో పలువురు అధికారులు, మిలటరీ సిబ్బంది, రాజకీయ నేపథ్యం ఉన్నవారు, న్యాయ వ్యవస్థలో పనిచేసేవారు ఉన్నారు. తమ పనికి ఎవరూ అడ్డురాకుండా, పోలీసులకు పట్టుబడకుండా చాలా పన్నాగాలే పన్నారు. నిందితుల్లో 30 శాతం మంది పోలీసులకు లంచం ఇవ్వడం ద్వారా బయటపడుతుండగా, 23.5శాతం మంది పోలీసులతో, విచారణాధికారులతో స్నేహం చేశారు. తద్వారా తమ పరిధిలోని యువతుల్ని, వ్యభిచారాన్ని ఎవరూ గుర్తించకుండా కొనసాగించుకోగలుగుతున్నారని తెలిపారు.

పోలీసుల్లో మార్పు రావాలి

వ్యభిచారంలాంటి నేరాల్ని ఛేదించేందుకు పోలీసులు చాలా రకాలుగా మార్పుచెందాల్సిన అవసరముందని పరిశోధకులు సూచిస్తున్నారు. వ్యభిచార ఊబిలోకి లాగే ప్రకటనల్ని ఆధునిక సాంకేతికత ద్వారా పట్టుకునేందుకు ప్రయత్నించాలని చెబుతున్నారు. నిందితుల్ని పట్టుకునేందుకు సాధారణ పోలీసింగ్ పనికిరాదని, ఆధునిక పద్ధతులు అన్వయిస్తేనే చాలా కేసుల్లో పురోగతి సాధించవచ్చని తెలిపారు. పేదరికంతోనే చాలామంది మహిళలు పడుపు వృత్తిలోకి దిగుతున్నారని, ఆయా కుటుంబాలకు ఉపాధి చూపి మంచి జీవితాల్ని ఇచ్చేలా యంత్రాంగం పనిచేయాలని సూచించారు.

విలేకర్లతో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

డీజీపీ నియామకంలో ఎందుకు తడబాటు?

సేలం, న్యూస్‌టుడే: డీజీపీ నియామకంలో డీఎంకే ప్రభుత్వం ఎందుకు తడబడుతోందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రశ్నించారు. సోమవారం ఆయన సేలం విమానాశ్రయంలో విలేకర్లతో మాట్లాడారు. గతంలో శైలేంద్రబాబు, శంకర్ జివాల్‌వంటి వారిని డీజీపీలుగా నియమించినప్పుడు పాటించిన విధానాన్ని డీఎంకే ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు అనుసరించడం లేదన్నారు. ప్రభుత్వానికి ముగ్గురు పేర్ల జాబితా వచ్చినా ఇంతవరకు శాశ్వత డీజీపీని నియమించకపోవడంపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఆ ముగ్గురు అధికారులు ప్రభుత్వానికి కీలుబొమ్మలుగా పనిచేయరనే ఉద్దేశంతో నియమించడంలేదనేది తన అభిప్రాయమన్నారు.

వర్షాలతో రైతులకు భారీ నష్టం..

వర్షాలకు డెల్టా ప్రాంతాల్లో ధాన్యం తడిసిపోయి రైతులు భారీగా నష్టపోయారన్నారు. ధాన్యం కొనుగోలులో డీఎంకే ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందని విమర్శించారు. ధాన్యం మొలకెత్తి అన్నదాతలు కన్నీరు పెట్టుకుంటుంటే ముఖ్యమంత్రి స్టాలిన్ సినిమా చూడటానికి వెళ్లారన్నారు. చనిపోయిన వారి ఓట్లను ఉపయోగించుకుని డీఎంకే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలని చూస్తోందని, అందుకే 'సర్' ప్రక్రియను అడ్డుకుంటోందన్నారు.

డిసెంబరు 13న ఉపాధ్యాయుల నిరాహారదీక్ష

సేలం, న్యూస్‌టుడే: పాత పింఛను పథకం అమలు కోసం డిసెంబరు 13న చెన్నైలో భారీ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తమిళనాడు హయ్యర్ సెకండరీ స్కూల్ ఫస్ట్ గ్రేడ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రత్యేక అధ్యక్షుడు మణివాసగన్ ప్రకటించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిమాండ్లు నెరవేర్చకపోతే పరీక్ష విధులు బహిష్కరిస్తామని పేర్కొన్నారు. 2026 శాసనసభ ఎన్నికలకు ముందు ఫిబ్రవరి 28లోపు ప్రకటన చేయాలని.. లేకుంటే వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆలోచించాల్సి వస్తుందని హెచ్చరించారు.

మాట్లాడుతున్న మణివాసగన్

గిరిజనులతో గవర్నర్ బృందనృత్యం

గిరిజనులతో కలిసి అడుగేస్తున్న గవర్నర్ ఆర్.ఎన్.రవి

చెన్నై, న్యూస్‌టుడే: గిరిజనులతో గవర్నర్ బృంద నృత్యం చేశారు. కేంద్ర హోం, యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ కింద కొనసాగే 'మై భారత్' తరఫున గిండి రాజ్‌భవన్‌లో సోమవారం 17వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం జరిగింది. గవర్నర్ ఆర్.ఎన్. రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిజనులతో కలిసి స్టెప్పులు వేసి వారిని ఉత్సాహపరిచారు.

అందరూ ఎంజీఆర్ పేరు స్మరించాల్సిందే

☛ డి.జయకుమార్

చెన్నై, న్యూస్‌టుడే: తనను టచ్ చేసినవారు ఎందుకు అలా చేశామా అని బాధపడతారన్న టీవీకే అధ్యక్షుడు విజయ్ వ్యాఖ్యలు డీఎంకేను ఉద్దేశించినవని అన్నాడీఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్ తెలిపారు. ఎంజీఆర్ నటించిన 'ఇదయకని' రీరిలీజ్ 150వ రోజు వేడుక ఎగ్మూర్‌లోని ఆల్బర్ట్ థియేటరులో జరిగింది. డి.జయకుమార్ అభిమానులతో కలిసి చిత్రాన్ని వీక్షించారు. తర్వాత విలేకర్లతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఏ పార్టీ అయినా ఎంజీఆర్ పేరు స్మరించకుండా రాజకీయాలు చేయలేవన్నారు. అన్నాదురై పేరుతో వ్యాపారం చేసే పార్టీ డీఎంకే అని విమర్శించారు. అందరికీ పక్కా ఇళ్లు, ఇంటికొక మోటారు సైకిల్, కారు తమ లక్ష్యంగా పేర్కొన్న విజయ్ హామీపై స్పందిస్తూ... ముందు అత్తకు మీసాలు రానివ్వండి, మిగిలినవి తర్వాత చూడొచ్చంటూ ఎద్దేవా చేశారు.

'సర్' గడువు పొడిగించే అవకాశం లేదు: అర్చనా పట్నాయక్

చెన్నై, న్యూస్‌టుడే: తగిన కారణం లేకుండా ఓటర్ల జాబితా నుంచి ఎవరినీ తొలగించడం సాధ్యంకాదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అర్చనా పట్నాయక్ తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(సర్) ప్రక్రియపై సచివాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 6.41 కోట్ల ఓటర్లలో 6.16 కోట్ల మందికి సర్ ఫారాలు అందించినట్లు తెలిపారు. పూర్తిచేసిన ఫారాలను 50శాతం వరకు తిరిగి పొందినట్లు పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో 68,647 మంది బీఎల్వోలు సహా 2.45 లక్షల మంది పాల్గొన్నారని, వారిలో ఎన్నికల కమిషన్ తరఫున 83వేల మంది ఉన్నారని చెప్పారు. చెన్నైలో 96శాతం మేర సర్ ఫారాలను అందించినట్లు, ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో 2లక్షల ఫారాలను పొందినట్లు పేర్కొన్నారు. పూర్తిచేసిన ఫారాలను తిరిగి పొందేందుకు విధించిన గడువు డిసెంబరు 4ను పొడిగించే అవకాశం లేదన్నారు.

అవగాహన ర్యాలీ

సైకిల్ ర్యాలీలో విద్యార్థినులు

చెన్నై: చెన్నై జిల్లాలోని ప్రజలకు ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(సర్) ఫారాలు భర్తీ చేసి అందించడంపై అవగాహనకు విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సోమవారం అన్నానగర్ సుబ్బరాయన్ వీధిలోని చెన్నై మహోన్నత పాఠశాల, బుల్లా వెన్యూలోని చెన్నై బాలికల మహోన్నత పాఠశాలల విద్యార్థులకు రంగోలి పోటీలు నిర్వహించారు. అనంతరం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు.

ఏడేళ్ల కష్టానికి గుర్తింపు..

● అంతర్జాతీయ డ్రోన్ ఫొటోగ్రఫీలో శివగంగై యువకుడికి అవార్డు

అవార్డుతో శాంతకుమార్

ప్యారిస్, న్యూస్‌టుడే: తమిళనాడులోని ఓ కుగ్రామానికి చెందిన యువకుడు డ్రోన్ ఫొటోగ్రఫీలో అత్యున్నత అవార్డు సాధించాడు. శివగంగై జిల్లా తిరుప్పువనంకి చెందిన శాంతకుమార్‌కు ఫొటోగ్రఫీ అంటే ఆసక్తి. 2015లో డ్రోన్ కెమెరా తీసుకుని శిక్షణ పొందాడు. అనంతరం ప్రపంచంలోని పలు ప్రాంతాలకు వెళ్లి డ్రోన్ కెమెరా ద్వారా వీడియోలు తీశాడు. ఇటీవల దుబాయ్‌లో జరిగిన 14వ హిపా అంతర్జాతీయ ఫొటోగ్రఫీ పోటీలో డ్రోన్ విభాగంలో మూడో బహుమతి అందుకున్నాడు. అతనికి రూ.17 లక్షల నగదు బహుమతి అందింది. అతను మాట్లాడుతూ... దుబాయ్‌లో జరిగే పోటీ గురించి స్నేహితుడి ద్వారా తెలుసుకుని దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. 143 దేశాల్లోని గ్రామాలు, నగరాలు, రాష్ట్రాలు, ప్రజల అభివృద్ధికి సంబంధించి రికార్డు చేసిన సన్నివేశాలను సమర్పించినట్లు చెప్పాడు. చిన్న గ్రామానికి చెందిన తన కలలను, ఆంగ్లాన్ని ఎగతాళి చేసేవారని, తనలాంటి వాళ్లు పెద్దగా సాధించలేరని చెప్పారని నేడు ప్రతిష్ఠాత్మకమైన హిపా అవార్డు విజేతలలో ఒకరిగా నిలిచానని తెలిపాడు. ఈ అవార్డు పొందిన వీడియో ఏడేళ్ల కష్టమని గుర్తుచేసుకున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని కోరాడు.

భాజపా కుట్రను బయటపెట్టాలి

ప్రసంగిస్తున్న తిరుమావళవన్

సైదాపేట, న్యూస్‌టుడే: కాంగ్రెస్, ద్రావిడ పార్టీలు లేని భారత్‌ను సృష్టించటమే భాజపా ఉద్దేశమని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ ఆరోపించారు. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(సర్)కు వ్యతిరేకంగా వీసీకే తరఫున సోమవారం ఆందోళన జరిగింది. చెన్నై ఎగ్మూర్‌లోని రాజరత్నం స్టేడియం దగ్గర జరిగిన ఆందోళనలో ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తిరుమావళవన్ మాట్లాడుతూ... ఎన్నికల కమిషన్, కేంద్ర భాజపా ప్రభుత్వ కుట్రను బయటపెట్టాల్సిన బాధ్యత అందరికీ ఉందని చెప్పారు. 'సర్'కు నిషేధం విధించాలని సుప్రీంకోర్టులో కేసు వేశామని తెలిపారు. ఓటరు జాబితాలో పేరు ఉంటేనే ఓటేయటం కుదురుతుందని, పార్టీ శ్రేణులు 'సర్' ప్రక్రియను పరిశీలించాలని సూచించారు. మోదీ, అమిత్‌షా, వారిని నడిపించే ఆర్ఎస్ఎస్‌ను సాధారణంగా తీసుకోలేమని, అధికారాన్ని ఉపయోగించి దేశాన్నే తల్లకిందులు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాలను బలహీనపరచటం, కాంగ్రెస్, ద్రావిడ పార్టీలు లేని భారత్‌ను సృష్టించటమే వారి ప్రధాన లక్ష్యమని చెప్పారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పార్టీ కార్యకర్తలు

(c) eenadu

వర్షానికి దెబ్బతిన్న ఫుడ్‌ఫెస్టివల్ గ్యాలరీలు

గ్యాలరీల్లోకి చేరిన వాననీరు

ప్యారిస్, న్యూస్‌టుడే: ఫుడ్ ఫెస్టివల్ గ్యాలరీలు వర్షానికి దెబ్బతిన్నాయి. మదురై తముక్కం మైదానంలో తమిళనాడు మహిళాభివృద్ధి సంస్థ తరఫున శనివారం సారస్ మేళా, ఫుడ్ ఫెస్టివల్‌ను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రారంభించారు. డిసెంబరు 3 వరకు కొనసాగనున్న మేళాకు 200 గ్యాలరీలు, ఫుడ్ ఫెస్టివల్‌కే 50 గ్యాలరీలు ఏర్పాటు చేశారు. మదురైలో కురిసిన భారీవర్షం కారణంగా గ్యాలరీల్లో నీరు చేరింది.

తెన్కాశి ప్రమాదంపై గవర్నర్ దిగ్భ్రాంతి

చెన్నై, న్యూస్‌టుడే: తెన్కాశి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై గవర్నర్ ఆర్.ఎన్.రవి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన 'ఎక్స్' పేజీలో... రోడ్డు ప్రమాదంలో అమూల్యమైన ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసి ఆవేదన చెందానన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

భద్రతకు భరోసా కల్పించాలి..

తెన్కాశి జిల్లా ప్రమాదంలోని క్షతగాత్రులు పూర్తిగా కోలుకునేలా అవసరమైన అన్ని వైద్య వసతులను కల్పించాలని, ఉన్నత వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టీవీకే అధ్యక్షుడు విజయ్ డిమాండ్ చేశారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై తన 'ఎక్స్' పేజీలో... ఈ విషాద ఘటనపై సమగ్ర దర్యాప్తు జరగాలన్నారు. ప్రజల ప్రాణాల భద్రతకు భరోసా కల్పించేలా అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎప్పుడు పూర్తయ్యేను?

నత్తనడకన కాశిమేడు ఫిషింగ్ హార్బర్ పనులు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కాశిమేడు ఫిషింగ్ హార్బర్ పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంది. మూడేళ్ల కిందట ప్రారంభించగా ఇప్పటికి 30 శాతం కూడా పూర్తి కాలేదు. పూర్తికి గడువు నెల రోజులు మాత్రమే ఉందని జాలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లక్ష మందికిపైగా జీవనాధారం..

కాశిమేడు ఫిషింగ్ హార్బర్.. 23 మత్స్యగ్రామాలకు చెందిన లక్ష మందికి పైగా జీవనాధారంగా ఉంది. ఇక్కడి నుంచి పొరుగు రాష్ట్రాలతోపాటు దుబాయ్, సింగపూర్, మలేషియా తదితర దేశాలకు కూడా చేపలు ఎగుమతి చేస్తున్నారు. నిర్వహణ సక్రమంగా లేక ఫిషింగ్ హార్బర్ అధ్వానంగా మారిందని, పడవలు నిలపడానికి స్థలం సరిపోవడంలేదని అభివృద్ధి పరచాలని మత్స్యకారుల సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వ 'సాగర్ మాల' పథకం కింద రూ.97.75 కోట్లతో పనులు 2022లో మొదలయ్యాయి. పోర్ట్స్ స్లిప్‌వే నిర్మాణం సహా 25 పనులు చేపట్టగా బీచ్‌కు ఆనుకొని ఉన్న ప్రాంతంలో కోస్టల్ రెగ్యులేటరీ అథారిటీ, పర్యావరణ శాఖ అనుమతి పొందలేదని దావా వేయడంతో ఆగిపోయాయి. మత్స్యవనరుల శాఖాధికారులు కోస్టల్ రెగ్యులేటరీ, పర్యావరణ శాఖ అనుమతి పొందారు. 2023 డిసెంబరులో రాయపురంలో మత్స్యకారుల అభిప్రాయాలను సేకరించారు. పనులు త్వరగా ప్రారంభించి, నిర్ణీత కాలంలో పూర్తి చేసి జీనాధారానికి భద్రత కల్పించాలని విన్నవించారు. 2024లో పునఃప్రారంభమైన పనులు నత్తనడకన నడుస్తున్నాయి. 30 శాతం కూడా పూర్తి కాలేదు. పైకప్పు పనులు మందకొడిగా సాగుతున్నందున చేపల వ్యాపారం దెబ్బ తింటోందని జాలర్లు వాపోతున్నారు. ఒప్పంద ప్రకారం ఈ ఏడాదిలోపు పూర్తి కావాల్సి ఉంది.

అసంపూర్తిగా నిర్మాణం

సాంకేతిక సమస్యలు..

మత్స్య వనరుల శాఖాధికారులు మాట్లాడుతూ.. కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలున్నాయని వాటిని పరిష్కరించి పనులు చేపడుతున్నామన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు వివరించారు.

చెక్కు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్

లబ్ధిదారులకు ఆర్థికసాయం పంపిణీ

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా తిరువేర్కాడు మున్సిపాలిటీ పరిధిలోని సుందరచోళపురంలో 1,12,294 మందికి రూ.1003.34 కోట్ల విలువైన ఆర్థిక సాయం సోమవారం అందించారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ లబ్ధిదారులకు చెక్కులు అందించారు. రూ.333.26 కోట్లతో నిర్మించిన భవనాలను ప్రారంభించారు. రూ.137.38 కోట్లతో నిర్మించనున్న భవనాలకు శంకుస్థాపన చేశారు. 25 మంది దివ్యాంగులకు ఎలక్ట్రిక్ వాహనాలు అందించారు. మంత్రి నాజర్, ఎంపీ శశికాంత్ సెంథిల్, ఎమ్మెల్యేలు గోవిందరాజన్, దురైచంద్రశేఖర్, కృష్ణస్వామి, వీజీ రాజేంద్రన్, చంద్రన్, సుదర్శనం, జిల్లా కలెక్టర్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు నిమిషాలకో ఎమ్మార్టీఎస్ రైలు

నడపడానికి యంత్రాంగం సన్నాహాలు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై బీచ్ నుంచి వేళచ్చేరి వరకున్న మాస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్(ఎమ్మార్టీఎస్) మార్గంలో ప్రయాణికుల సంఖ్య క్రమేణ పెరుగుతోంది. ఎమ్మార్టీఎస్‌ను సీఎంఆర్‌ఎల్ తన ఆధీనంలోకి తీసుకోవాలని ఆలోచనలో ఉన్నందున ప్రతి ఐదు నిమిషాల వ్యవధిలో మూడు బోగీలతో కూడిన ఏసీ కోచ్‌లను ప్రవేశపెట్టడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 90 బోగీలను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉంది. కొనుగోలుతో మూడు బోగీలతో కూడిన 25 రైళ్ల నిర్వహణకు వీలు కలగనుంది. అదనంగా ఐదు రైళ్లు నిర్వహణ కోసం ఉంటాయి. ప్రారంభంలో ప్రతి పది నిమిషాలకొకటి నడుస్తుంది. మరింతమంది ప్రయాణికుల సౌకర్యం కోసం ఐదు నిమిషాల వ్యవధిలో రైలు నడపాలని యంత్రాంగం సిద్ధమవుతోంది.

కుట్టపట్టి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి గణేశన్

కబడ్డీ విజేత.. కుట్టపట్టి జట్టు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కరూర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో కుట్టపట్టి జట్టు చాంపియన్‌గా నిలిచి ట్రోఫీ అందుకుంది. 50 జట్లు పోటీలో పాల్గొన్నాయి. నాకౌట్ పద్ధతిలో నిర్వహించిన తుది పోటీలు ఆదివారం రాత్రి జరిగాయి. కరూర్ కుట్టపుట్టి, సెవ్వందిపాలయం జట్లు తలపడగా 37-32 పాయింట్ల వ్యత్యాసంతో కుట్టపుట్టి విజయం సాధించింది. అర్జున్ అవార్డు పొందిన కబడ్డీ కోచ్ మణత్తి గణేశన్ విజేతలకు బహుమతులు అందజేశారు.

నీటి కాలుష్యంపై ఆందోళన

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: గుమ్మిడిపూండి పోలిమేరలో 48 ఎకరాల విస్తీర్ణంలో తామర చెరువు ఉంది. సమీపంలోని పరిశ్రమలు, గృహాల నుంచి వెలువడే వ్యర్థ జలాలను చెరువులోకి మళ్లించడంతో నీరు కలుషితమైంది. జలచరాలు చనిపోయి చేపలు మృతి చెందాయి. చెరువు కట్టపై నిర్మించిన బోరుబావుల నుంచి పట్టణంలో గృహాలకు మంచినీటి సరఫరా జరుగుతోంది. రంగు మారిన నీటిని తాగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పీఎంకే కార్యకర్తలు గుమ్మిడిపూండి రైల్వేస్టేషన్ రోడ్డులో సోమవారం ఆందోళనకు దిగారు. జిల్లా కార్యదర్శి ప్రకాష్ అధ్యక్షత వహించారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పీఎంకే కార్యకర్తలు

గైడ్ అందిస్తున్న మేయర్

విద్యార్థులకు గైడ్లు అందజేత

చెన్నై, న్యూస్‌టుడే: పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు సులభ శిక్షణ గైడ్‌లను మేయర్ ప్రియ అందించారు. చెన్నై పాఠశాలల్లో 10, 12వ తరగతులు చదివే విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఎక్కువ మార్కులు పొందేందుకు, అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించేందుకు అనువుగా సబ్జెక్టులను సులభ విధానంలో తయారు చేసి, ప్రశ్నాజవాబుల విధానంలో ఈజీ లెర్నింగ్ మెటీరియల్స్ అందించనున్నట్లు 2025-26వ ఏడాది బడ్జెట్‌లో మేయర్ ప్రకటించారు. ఆ మేరకు రిప్పన్ బిల్డింగ్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు సులభ శిక్షణ గైడ్‌ను మేయర్ ప్రియ అందించారు. వెంట డిప్యూటీ మేయర్ మహేశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వెట్టిచాకిరి నుంచి విముక్తి

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా గుడిపాల మండలం కొల్లమేడు చెక్‌పోస్టు సమీప ఇటుకబట్టీలో పనిచేస్తున్న వేలూరు జిల్లాకు చెందిన 16 మందికి విముక్తి కల్పించాలని కలెక్టరు సుబ్బులక్ష్మి.. చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు లేఖ రాయగా స్పందించి చర్యలు చేపట్టారు. గుడిపాల మండలం కొల్లమేడు చెక్‌పోస్ట్ సమీప ఇటుకబట్టీలో వేలూరు జిల్లాకు చెందిన 16 మంది బాలలు రెండేళ్లుగా వెట్టిచాకిరీ చేస్తున్నారు. వారి బంధువులు వేలూరు కలెక్టరును ఆశ్రయించి ఫిర్యాదు చేయగా ఆమె.. ఇక్కడి కలెక్టరుకు లేఖ రాశారు. స్పందించిన ఆయన వెంటనే వారి వివరాలు సేకరించి విముక్తి కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారిని నియమ నిబంధనల ప్రకారం అప్పగిస్తామని ఏపీ రెవెన్యూ శాఖ తెలిపింది.

కవిన్ పరువు హత్య కేసు

సుర్జిత్ తండ్రి బెయిల్ పిటిషన్ వాయిదా

ప్యారిస్, న్యూస్‌టుడే: తిరునెల్వేలికి చెందిన కవిన్ పరువు హత్య కేసులో అరెస్టైన సుర్జిత్ తండ్రి శరవణన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం వాయిదా వేసింది. ఘటన జరిగిన రోజున రాజపాళెయంలో విధుల్లో ఉన్నట్లు, మీడియాలో వార్తలు వెలువడిన తర్వాతే తనకు విషయం తెలిసిందనిశరవణన్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో తన కుమారుడికి తప్ప తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. బెయిల్‌కు దాఖలు చేసిన పిటిషన్‌ను కింది కోర్టు కొట్టివేసిందన్నారు. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ మురళీశంకర్ ముందు విచారణకు వచ్చింది. పిటిషనరు ఘటనాస్థలిలో ఉన్నారన్నదానికి ఆధారాలు ఉన్నాయని, కవిన్ తల్లి తరఫు అదనపు వాదనలు వినిపించేందుకు గడువు కావాలని సీబీసీఐడీ తరఫున కోరారు. న్యాయమూర్తి విచారణ 27కి వాయిదా వేశారు.

తిరునెల్వేలికి వరద ముప్పు లేదు

మాట్లాడుతున్న స్పీకర్ అప్పావు, చిత్రంలో కలెక్టర్ సుకుమార్

టీనగర్, న్యూస్‌టుడే: తమిళనాడులోని దక్షిణ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తిరునెల్వేలిలోని పాపనాశం, మణిముత్తారు ఆనకట్టల నుంచి తామరభరణి నదిలోకి ప్రస్తుతం 19 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుకుమార్ తెలిపారు. వర్షం అప్పుడప్పుడు కురుస్తున్నందున భారీ వరద ముప్పు ఉండే అవకాశం లేదని స్పష్టం చేశారు. వరద ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉందని వెల్లడించారు. జిల్లాలో 72 ప్రాంతాలు వరద ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటివరకు వర్షాల కారణంగా అరటి తోటలు భారీగా దెబ్బతిన్నాయని, గణాంకాల సేకరణ జరుగుతోందని వివరించారు.

కాలువ పనులు పూర్తి..

జిల్లాలో భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలపై చర్చించేందుకు శాసనసభ స్పీకర్ అప్పావు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుకుమార్‌ను కలిశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ తామరభరణి, మణిముత్తారు ఆనకట్టల నుంచి వృథాగా సముద్రంలోకి పోతున్న అదనపు నీటిని నాంగునేరి, రాధాపురం, సాత్తాన్‌కుళం, దిశయన్‌విళై తదితర వట్టిపోయిన పలు ప్రాంతాలకు మళ్లించేందుకు సుమారు రూ.1000 కోట్ల అంచనాతో చేపట్టిన కాలువ పనులు పూర్తయినట్లు తెలిపారు. వరదనీటి కాలువ ద్వారా సుమారు 50 వేల ఎకరాలు సాగులోకి రానుందన్నారు.

కొనసాగుతున్న లారీ యజమానుల సమ్మె

గుమ్మిడిపూండి: తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండిలో 50కి పైగా మురుగు నీటి తొలగింపు ట్యాంకర్ లారీలు ఉన్నాయి. 5 ఏళ్ల కిందట నిర్ణయించిన అద్దెను నేటికీ చెల్లిస్తున్నారు. పెట్రోల్ ధరల పెంపు కారణంగా తమకు గిట్టుబాటు కావడంలేదని, అద్దె పెంచాలని కోరుతూ యజమానులు శనివారం నిరవధిక సమ్మె ప్రారంభించారు. సోమవారం సమ్మె మూడో రోజుకు చేరింది.

ఉన్నతాధికారులతో సమీక్ష

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: చెన్నై కొట్టూర్‌పురంలోని అన్నా సెంటినరీ గ్రంథాలయ ప్రాంగణంలో సోమవాం మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యామొళి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. కాలానుగుణంగా సిలబస్‌లో మార్పులు, పదో తరగతి, ప్లస్‌టూ పరీక్షలకు సంబంధించి చర్చించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుత్ను మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యామొళి

సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

ఆటో డ్రైవర్లకు రూ.15వేలు అందించాలి

వేలూరు: ఆంధ్రప్రదేశ్‌లోలా తమిళనాడులోని ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఆర్థికసాయం కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద సంతకాల సేకరణ జరిగింది. హిందూ మున్నని రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు మహేశ్ అధ్యక్షత వహించారు. హిందూ ఆటో వర్కర్స్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహరన్ మాట్లాడుతూ తమిళనాడులో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్లు తీవ్రంగా ప్రభావితమయ్యారన్నారు. పోలీసులు ఆటోలకు జరిమానా విధించడం మానుకోవాలన్నారు. రాష్ట్రమంతటా 4 లక్షల సంతకాలు సేకరించి ముఖ్యమంత్రికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

'సర్' కాలవ్యవధి పెంచాలి: ఓపీఎస్

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా సమగ్ర సవరణ(సర్) కాల వ్యవధి పెంచాలని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీరుసెల్వం కోరారు. సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందుకున్న లక్షలాది మంది పూర్తి చేయడానికి తెలియక అవస్థలు పడుతున్నారని, మరింత సమయం కేటాయించాలని డిమాండు చేశారు. వచ్చే ఏడాది శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే నేతలంతా కలిసి పోటీ చేస్తేనే డీఎంకే కూటమిపై విజయం సాధించవచ్చని అభిప్రాయపడ్డారు.

రాతిబండలపై మరోమారు పరిశోధన

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: దిండుగల్ జిల్లా కొడైక్యానల్ సమీప దాండిక్కుడి ప్రాంతంలో ఎత్తైన పర్వత ప్రాంతం ఉంది. పర్వతంపై 20కి పైగా రాతి బండలు ఉన్నాయి. ఇవి రాతియుగ మానవుడు జీవించినట్లు భావిస్తున్న 3 వేల ఏళ్ల నాటివని తేలింది. ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా వివిధ కళాశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు పర్వత ప్రాంతానికి చేరుకుని సోమవారం ముళ్లపొదలు తొలగించారు. తిరుచ్చికి చెందిన పురావస్తు పరిశోధనా అధికారి ముత్తుకుమార్ మాట్లాడుతూ ఇక్కడి రాతి బండలపై మరోసారి పరిశోధనలు చేపట్టనున్నట్లు ప్రకటించారు.

ఇళ్ల మధ్య ఏనుగు సంచారం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లా గూడలూర్ సర్కిల్ దేవర్‌సోలై పట్టణ పంచాయతీ పరిధి కమ్మాత్తి అనే ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం అడవి ఏనుగు ఇళ్ల మధ్య సంచరించింది. ప్రజలు గజరాజును చూసి భయాందోళన చెందారు. ఏనుగును దట్టమైన అడవిలోకి పంపాలని స్థానికులు అటవీ శాఖ సిబ్బందికి విజ్ఞప్తి చేశారు.

సీమాన్‌పై కేసు నమోదు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: ఎన్టీకే కార్యకర్తల సమావేశం పుదుచ్చేరి సమీపంలోని విల్లియనూరులో ఆదివారం మధ్యాహ్నం నిర్వహించారు. పార్టీ సమన్వయకర్త సీమాన్ అధ్యక్షత వహించి వచ్చే ఏడాది జరగనున్న శాసనసభ ఎన్నికల్లో విజయంపై వ్యూహం రచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(సర్)కు వ్యతిరేకంగా డీఎంకే సుప్రీం కోర్టులో కేసు వేయడాన్ని ఓ విలేకరి గుర్తు చేశారు. ఆగ్రహించిన సీమాన్ ఆ విలేకరిని చూసి నీకు మతి భ్రమించిందా అంటూ వ్యక్తిగత దూషణలకు దిగారు. దీనిని దక్షిణ భారతదేశ పత్రికా సమాఖ్య తీవ్రంగా ఖండించింది. విల్లియనూరు పోలీసులు సీమాన్‌పై మూడు సెక్షన్ల కింద సోమవారం కేసు నమోదు చేశారు.

టీవీకే పోటీ కాదు: మంత్రి రఘుపతి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: టీవీకేను తాము పోటీదారుగా పరిగణించడంలేదని మంత్రి రఘుపతి తెలిపారు. పుదుకోట్టైలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. టీవీకే అంటే డీఎంకేకు భయమని టీటీవీ దినకరన్ పదేపదే పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. డీఎంకేను చూసి అనేక పార్టీలు రాజకీయాల్లో ఓనమాలు నేర్చుకున్నాయని, కొన్ని పార్టీలు ఉనికి కోల్పోయి తెరమరుగయ్యాయని, టీవీకేకు అదే గతి పట్టనుందన్నారు.

పోగొట్టుకున్న నగలు సొంతదారులకు అప్పగింత

నగలు అప్పగిస్తున్న పోలీసులు

వేళచ్చేరి: ఆలయంలో పోగొట్టుకున్న నగలను పోలీసులు సొంతదారులకు అప్పగించారు. విళుపురం జిల్లా సెంజి సమీపంలోని అంకాళ పరమేశ్వరి ఆలయ సమీపాన మైదానంలో 19న ఊంజల్ సేవ నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో పడి ఉన్న 8 సవర్ల నగలను తమిళనాడు ప్రత్యేక పోలీస్ 10వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్లు సతీష్, తిరుధర్మదురై తదితరులు గుర్తించి మేల్ మలయనూర్ ఇన్‌స్పెక్టర్ వనితకు అందజేశారు. నగల విషయమై ప్రసార మాధ్యమాల్లో పోలీసులు సమాచారం ఇచ్చారు. తన భార్య షకీలా చేతిసంచిలో నగలు తీసుకెళ్లి పోగొట్టుకున్నట్లు తిరువణ్ణామలై జిల్లా చెంగం పక్కిరిపాళ్యం గ్రామానికి చెందిన మునియాండి తెలియజేయడంతో వాటిని సోమవారం డీఎస్పీ రమేష్ రాజ్, ఇన్‌స్పెక్టర్ వనిత తదితరులు అప్పగించారు. కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు.

రోడ్డుపై పడిన ఆభరణాలు..

సదాశివానికి నగలు అందిస్తున్నపోలీసు

వేళచ్చేరి: విళుపురం జిల్లా పరంగిపేట సమీప షిల్లాంగ్‌పురానికి చెందిన సదాశివం పూల వ్యాపారి. శనివారం బ్యాంకులో తనఖాలో ఉంచిన ఆరున్నర సవర్ల నగలను సంచిలో పెట్టుకుని పరంగిపేట ప్రాంతంలో పూలు విక్రయించాడు. అనంతరం ఇంటికొచ్చి చూడగా నగల సంచి కనిపించలేదు. పరంగిపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం కొట్టాంతాంగరై వీధికి చెందిన సమోసాలు విక్రయించే ఢిల్లీకి రోడ్డుపై పడి ఉన్న నగల సంచి దొరికింది. దానిని పరంగిపేట పోలీసు ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌కు అప్పగించాడు. సదాశివం వద్ద వివరాలు తెలుసుకుని నగలు అప్పగించారు. సమోసా విక్రయించే ఢిల్లీని పలువురు ప్రశంసించారు.

లండన్ విమానం మూడు గంటలు ఆలస్యం

వడపళని, న్యూస్‌టుడే: ఆకాశంలో దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో సోమవారం చెన్నై నుంచి లండన్‌కు వెళ్లాల్సిన బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం మూడు గంటలు ఆలస్యంగా నడిచింది. సాధారణంగా ఉదయం 7.30కు విమానం చెన్నై నుంచి లండన్‌కు బయలు దేరుతుంది. తెల్లవారుజామున 4.30కు 160 మంది ప్రయాణికులు విమానాశ్రయానికి చేరుకున్నారు. తనిఖీలు పూర్తయిన తర్వాత ప్రయాణికులు విమానం కోసం వేచి ఉన్నారు. బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం తెల్లవారుజామున ఆకాశంలో మబ్బులు దట్టంగా కమ్ముకోవడంతో 5.50కి చెన్నైకి చేరుకుంది. ప్రయాణికులందరూ దిగిన తర్వాత ఇంజినీర్ల బృందం, సిబ్బంది విమానాన్ని శుభ్రం చేసి ప్రయాణానికి సిద్ధంగా ఉందని ప్రకటించిన తర్వాత ప్రయాణికులు విమానంలోకి వెళ్లారు. విమానం దాదాపు మూడు గంటలు ఆలస్యంగా లండన్‌కు బయలుదేరి వెళ్లిందని అధికారులు పేర్కొన్నారు.

తల్లిదండ్రులు నేరాలకు పాల్పడితే సమాచారమివ్వండి

క్రీడా విజేతలతో మయిల్‌వాగనన్ తదితరులు

పిల్లలకు ఎస్పీ సూచన

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు జిల్లా ఒడుగత్తూరు వద్ద పీంజమందై కొండ గ్రామంలో సామాజిక న్యాయం, మానవ హక్కులు తరఫున అవగాహన కార్యక్రమం సోమవారం పీంజమందై ప్రభుత్వ పాఠశాలలో జరిగింది. వేలూరు ఎస్పీ మయిల్‌వాగనన్ మాట్లాడుతూ... తల్లిదండ్రులు నేరాలకు పాల్పడితే పిల్లలు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇంత పెద్ద పర్వత గ్రామంలో ఇప్పటివరకు ఒక్కరే పోలీసుగా ఎంపికయ్యాడని చెప్పారు. రెండు నెలల్లో పర్వత గ్రామాల నుంచి 11 మంది విద్యార్థులు పాల్గొన్నారని, వారిలో తొమ్మిది మంది పోలీసు ఉద్యోగాలకు అర్హత పరీక్ష రాశారన్నారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించిన 150 మంది విద్యార్థులకు ఉచిత క్రీడా దుస్తులు, సర్టిఫికెట్లు, షీల్డ్‌లు, పతకాలు అందజేశారు. ఏడీఎస్పీ భాస్కరన్, ఆనకట్ట డీఎస్పీ నందకుమార్, సామాజిక న్యాయం, మానవ హక్కుల విభాగ డీఎస్పీ రవీంద్ర ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు

ఉపాధ్యాయినికి ప్రశంసాపత్రం

ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం జిల్లా ఉత్తిరమేరూర్ నియోజకవర్గంలో బీఎల్వోగా పనిచేసిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయిని అంబిక 'సర్' పనులు వంద శాతం పూర్తిచేశారు. సోమవారం కాంచీపురం కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబికను కలెక్టర్ కలైసెల్వి అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. ఉత్తిరమేరూర్ నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జయకుమార్ పాల్గొన్నారు.

కోవై శివారులో 26న రథయాత్ర

మాట్లాడుతున్న ప్రేమలత విజయ్‌కాంత్

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూరు పీళమేడులో ఉన్న ప్రైవేటు వేదికలో డీఎండీకే పోలింగ్ బూత్ ఏజెంట్ల సంప్రదింపుల సమావేశం సోమవారం జరిగింది. ఇందులో పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయ్‌కాంత్ పాల్గొని ప్రసంగించారు. తర్వాత ఆమె విలేకరులతో మాట్లాడుతూ... బుధవారం కోయంబత్తూరు శివారులో కెప్టెన్ రథయాత్ర జరుగుతుందన్నారు. సర్ భారంతో మృతి చెందిన వారికి ఆమె ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సర్‌లో పనిభారం ఉంటే కేంద్ర ప్రభుత్వం అదనపు సిబ్బందితో నిర్వహించాలని చెప్పారు. దీనిపై ప్రజలకు శ్వేత పత్రం విడుదల చేయాలని అన్నారు. సర్ సక్రమంగా నిర్వహించేందుకు ప్రత్యామ్నాయం లేదని, ప్రజలందరికీ ఓటు హక్కు ఉందని చెప్పారు. ఓట్లు దొంగలించబడితే ప్రజా విప్లవం వస్తుందని పేర్కొన్నారు.

గర్భిణులకు సీమంతం

పండ్లు, కానుకలు అందిస్తున్న రాజేంద్రన్

టీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ఈ నెల 27వ తేదీన జన్మదినం జరుపుకోనున్న సందర్భంగా సోమవారం సేలం జిల్లాలో గర్భిణీలకు సీమంతం వేడుకలు జరిగాయి. సేలం ఉదయనిధి స్టాలిన్ సేవా సంఘం ఆధ్వర్యంలో సుమారు 250 మంది గర్భిణులకు సామూహిక సీమంతం వేడుక జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రాజేంద్రన్ పాల్గొని గర్భిణీలకు పండ్లు, వస్త్రాలు తదితర కానుకలను పంపిణీ చేశారు.

కోవై, మదురైలలో మెట్రోరైలు పథకానికి అనుమతివ్వండి: ఓపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: కోయంబత్తూరు, మదురైలలో మెట్రో రైలు పథకాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతివ్వాలని మాజీ సీఎం పన్నీర్‌సెల్వం డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఆ నగరాల్లో మెట్రో రైలు అమలుకు మొట్టమొదట ప్రాజెక్టు నివేదిక తయారు చేసి కేంద్రానికి పంపింది జయలలిత అని తెలిపారు. ఆ తర్వాత పలు పార్టీలు డిమాండ్ చేశాయన్నారు. వివరణాత్మక ప్రాజెక్టు నివేదికను గతేడాది రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపగా అనుమతి నిరాకరించిందన్నారు.

మెరినా బ్లూఫ్లాగ్ బీచ్‌లో చెన్నై మహానగర పాలకసంస్థ(జీసీసీ) తరఫున ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న ప్రజలు -న్యూస్‌టుడే, న్యూస్‌టుడే

పురస్కార గ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

పేదల పాలిట పెన్నిధి.. సత్యసాయి

నాట్య ప్రదర్శనలో ఓ సన్నివేశం

సైదాపేట, న్యూస్‌టుడే: భగవాన్ సత్య సాయిబాబా పేదల పాలిట పెన్నిధి అని ప్రముఖ కళా పోషకుడు, పద్మభూషణ్ డాక్టర్ నల్లి కుప్పుసామిశెట్టి అభివర్ణించారు. ప్రముఖ నాట్యాచారిణి అనితా గుహ నిర్వహణలోని భరతాంజలి ఆధ్వర్యంలో సాయిబాబా శత జయంతి వేడుకలు మైలాపూర్‌లోని రసిక రంజని హాలులో ఆదివారం రాత్రి వైభవంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన నల్లి కుప్పుసామిశెట్టి నాట్యరంగంలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులను 'సుందరం' బిరుదులతో ఘనంగా సత్కరించారు. డాక్టర్ సుధా శేషయ్యన్, పద్మశ్రీ నర్తకి నటరాజ్, కలైమామణి పార్వతి, రవి ఘంటసాల విశిష్ట అతిథులుగా విచ్చేసి పురస్కార గ్రహీతలకు ప్రశంసా పత్రాలు బహూకరించారు. ముందుగా సీనియర్ గురువులకు అనితా గుహ పాదపూజ చేశారు. అనంతరం భరతాంజలి విద్యార్థినుల భరతనాట్య ప్రదర్శన నయన మనోహరంగా సాగింది.

(c) eenadu

మంచి కథలు ప్రోత్సహిస్తాం

అరుణ్ విశ్వ

నిర్మాత, దర్శకులతో నటులు

చెన్నై, న్యూస్‌టుడే: వర్ధమాన దర్శకుడు హరి హరసుదన్ దర్శకత్వంలో వైనల్ భాస్కర్, శాన్వీ మేఘన నటిస్తున్న చిత్రానికి తాత్కాలికంగా 'ప్రొడక్షన్ నంబరు 4'గా టైటిల్ పెట్టారు. అరుణ్ విశ్వ నేతృత్వంలోని శాంతి టాకీస్ నిర్మిస్తోంది. గతంలో శివకార్తికేయన్ నటించిన 'మావీరన్', సిద్ధార్థ్ నటించిన '3బీహెచ్‌కే' చిత్రాలను ఈ సంస్థ నిర్మించగా మూడో చిత్రంగా చియాన్ విక్రమ్ నటిస్తున్న చిత్రాన్ని ప్రకటించింది. నిర్మాత అరుణ్ విశ్వ మాట్లాడుతూ... నైపుణ్యం కలిగినవారిని, మంచి కథలను ప్రోత్సహించడమే తమ ఉద్దేశమన్నారు. బాల శరవణన్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారని, ఇతర నటీనటులు, సాంకేతిక కళాకారుల గురించి త్వరలో ప్రకటన వెలువడుతుందని తెలిపారు.

గోవా చిత్రోత్సవాల్లో లాక్‌డౌన్‌కు ప్రశంసలు

చెన్నై, న్యూస్‌టుడే: లైకా ప్రొడక్షన్స్ సుభాస్కరన్ నిర్మాణం, వర్ధమాన దర్శకుడు ఏ.ఆర్.జీవ దర్శకత్వంలో అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రధారిగా నటించిన చిత్రం 'లాక్‌డౌన్'. లాక్‌డౌన్ సమయంలో ప్రజలు మానసికంగా ఎదుర్కొన్న ఇబ్బందులను తెరపై చూపించే ప్రయత్నంతో నిర్మించిన చిత్రం ఫస్ట్‌లుక్ సినీ ప్రేక్షకుల్లో అంచనాలను పెంచింది. డిసెంబరు 5న విడుదలకానున్న నేపథ్యంలో గోవాలో జరిగిన 56వ అంతర్జాతీయ భారతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై పలువురి ప్రశంసలు అందుకుంది. కార్యక్రమంలో చిత్రబృందం తరఫున దర్శకుడు జీవ, లైకా ప్రొడక్షన్స్ ప్రతినిధి శివ, కొరియోగ్రాఫర్ కళా మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

దర్శకుడు జీవ, శివ, కళా మాస్టర్ తదితరులు

టెక్సాస్ టైగర్ ఫస్ట్‌లుక్ విడుదల

చెన్నై, న్యూస్‌టుడే: యుకే స్క్వాడ్ పతాకంపై మ్యూజికల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం 'టెక్సాస్ టైగర్'. చెన్నై నేపథ్యంతో భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న సినిమాలో హ్రిదు హరూన్ ప్రధాన పాత్రధారిగా నటిస్తున్నారు. 'ఫ్యామిలీ పడం' పుగళ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో రోహిణి, సాచ్చనా, వాఫా ఖతీజ, పీటర్ కె. పార్తిబన్‌కుమార్, ఆంటని దాసన్, సంయుక్త షాన్ తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. చిత్రీకరణ ముమ్మరంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఫస్ట్‌లుక్‌ను చిత్ర బృందం విడుదల చేసింది.

పూజా కార్యక్రమంతో ఏగన్ చిత్రం ప్రారంభం

ఏగన్

చెన్నై, న్యూస్‌టుడే: డాక్టర్ అరుళానందు, మాధ్యూ అరుళానందుకు చెందిన విజన్ సినిమా హౌస్ తన మూడో తమిళ చిత్రాన్ని ప్రకటించింది. 'ప్రొడక్షన్ నంబరు 3'గా తాత్కాలిక టైటిల్ పెట్టారు. 'ఆహా కల్యాణం' దర్శకుడు యువరాజ్ చిన్నసామి మెగాఫోన్ పట్టుకోనునన్నరు. ఏగన్ కథానాయకుడిగా నటిస్తున్నారు. శ్రీదేవి, ఫెమినా జార్జ్ నాయికలుగా నటిస్తున్నారు. చిత్రీకరణ పనులు పూజా కార్యక్రమంతో మొదలయ్యాయి.

సూపర్‌హీరోగా అర్జున్ దాస్



ఫస్ట్‌లుక్ పోస్టరు

చెన్నై, న్యూస్‌టుడే: విభిన్న పాత్రలు పోషించి అభిమానుల దృష్టిని ఆకర్షించిన నటుడు అర్జున్ దాస్. ఇప్పటికే ఆయన ప్రధాన పాత్రధారిగా నటించిన 'బాంబ్' విడుదలై ప్రదర్శితమవుతోంది. తదుపరి చిత్రానికి ప్రకటన వెలువడింది. 'సూపర్‌హీరో'గా టైటిల్ ఖరారు చేసిన ఈ చిత్రం ఫస్ట్‌లుక్, టైటిల్ పోస్టరును చిత్ర బృందం సోమవారం విడుదల చేసింది. తేజు అశ్విని నాయికగా నటిస్తుండగా కొరియోగ్రాఫర్, నటుడు శాండి కీలకపాత్రలో కనిపించనున్నారు. జాతీయ పురస్కారం పొందిన 'పార్కింగ్' నిర్మించిన సోల్జర్స్ ఫ్యాక్టరీ తెరకెక్కిస్తుండగా విఘ్నేశ్ వేణుగోపాల్ దర్శకత్వం వహించనున్నారు.

పంజాబ్ సీఎంకు జ్ఞాపిక అందజేత

భగవంత్ మాన్‌కు స్టాలిన్ రాసిన లేఖ అందిస్తున్న పళనివేల్ త్యాగరాజన్

చెన్నై, న్యూస్‌టుడే: తొమ్మిదో సిక్కు గురువు గురుతేజ్ బహదూర్ 350వ వర్ధంతి వేడుకలు సందర్భంగా పంజాబ్ సీఎం భగవంత్‌మాన్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ తరఫున జ్ఞాపిక అందించారు. పంజాబ్‌లో ఆదివారం జరిగిన వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి పళనివేల్ త్యాగరాజన్, ఎంపీ డాక్టర్ కళానిధి వీరాసామి పాల్గొన్నారు. స్టాలిన్ రాసిన లేఖను, జ్ఞాపికను భగవంత్ మాన్‌కు అందించారు.

పెంపుడు ప్రాణులకు టీకాలు వేసే గడువు పెంపు

పెంపుడుకుక్కకు యాంటీ రేబిస్ టీకా వేస్తున్న సిబ్బంది

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై మహానగర పాలక సంస్థ(జీసీసీ) పరిధిలో పెంపుడు ప్రాణులకు లైసెన్సు నమోదు, యాంటీ రేబిస్ టీకాలు వేయడం, మైక్రోచిప్ అమర్చడం వంటి పనులను యంత్రాంగం చేపడుతోంది. లైసెన్సు పొందేందుకు 23 వరకు గడువు కాగా డిసెంబరు 7వరకు పొడిగించారు. ఆదివారం నగరంలోని 7 కేంద్రాల్లో జరిగిన యాంటీ రాబిస్ వాక్సినేషన్ శిబిరాల్లో 3,091 పెంపుడు ప్రాణులకు టీకా వేసి చేసి మైక్రోచిప్ అమర్చారు. వాటి యజమానులకు లైసెన్సులు అందించారు. ఇప్పటి వరకు 77,707 పెంపుడు ప్రాణుల వివరాలను నమోదు చేసి వాటిలో 33,418 పెంపుడు ప్రాణులకు లైసెన్సులు అందించారు.

అలంకరణలో మరగదాంబిగై సమేత మరగదేశ్వరస్వామి

వేడుకగా కార్తిక సోమవారం

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: పళ్లిపట్టు తాలూకా ఆర్కేపేట యూనియన్ శ్రీకాళికాపురం గ్రామంలో పంచాక్షర కొండపై మరగదాంబిగై సమేత మరగదేశ్వర్ ఆలయం ఉంది. ఆలయంలో కార్తిక మాస రెండో సోమవారం సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. దీపారాధనలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

వినాయకుడి ఆలయంలో పూజ

విల్లివాక్కం, న్యూస్‌టుడే: చెన్నై ట్రిప్లికేన్‌లోని రాంనగర్‌లో కొలువుదీరిన శ్రీసర్వశక్తి వినాయకుడి ఆలయంలో సోమవారం మహద్వార ప్రతిష్ఠ పూజ భక్తిభావంతో నిర్వహించారు. కప్పల లక్ష్మయ్య, అనసూయమ్మ దంపతులు ద్వారాలను కైంకర్యంగా అందించారు.

పూజ చేస్తున్న దృశ్యం

కదిర్ ఆనంద్ కేసు 26కి వాయిదా

ట్రిప్లికేన్: వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్ కేసు బుధవారం 26వ తేదీకి వాయిదా పడింది. వేలూరు జిల్లాలో 2019 పార్లమెంటు ఎన్నికల ఆస్తి స్వాధీనం కేసులో వేలూరు ఎంపీ టీ.ఎం.కదిర్ ఆనంద్(డీఎంకే) సోమవారం హాజరు కావాల్సి ఉన్నా ఆయన హాజరుకాలేదు. ఎన్నికల సమయంలో కదిర్ ఆనంద్ ఇంటి నుంచి రూ.10 లక్షలు, అతని మద్దతుదారుడు, డీఎంకే కార్యనిర్వాహకుడు పూంజోలై శ్రీనివాసన్ ఇంటి నుంచి రూ. 11 కోట్లు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ రెండు ఘటనల ఆధారంగా కేసు నమోదు చేసిన నేపథ్యంలో ప్రస్తుతం వేలూరు కోర్టులో విచారణ జరుగుతోంది. సోమవారం విచారణకు పూంజోలై శ్రీనివాసన్, దామోదరన్ మాత్రమే హాజరయ్యారు. కదిర్ ఆనంద్ హాజరు కాకపోవడంతో న్యాయమూర్తి కేసును తదుపరి విచారణ కోసం ఈనెల 26వ తేదీకి వాయిదా వేశారు.

పోటీల్లో పాల్గొనేందుకు మదురై వచ్చిన విదేశీ క్రీడాకారులు

మదురై చేరుకున్న హాకీ క్రీడాకారులు

ప్యారిస్, న్యూస్‌టుడే: హాకీ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన విదేశీ క్రీడాకారులకు మదురై విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. మదురై రేస్‌కోర్స్ మైదానంలో ఈనెల 28న 14వ జూనియర్ హాకీ ప్రపంచ కప్ పోటీలు ప్రారంభం కానున్నాయి. పోటీల్లో పాల్గొనేందుకు సోమవారం ఇంగ్లాండ్, నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, నమీబియా దేశాల జట్లు మదురై విమానాశ్రయానికి వచ్చారు. మదురై ప్రభుత్వ రాజాజీ ఆస్పత్రి డీన్ అరుళ్ సుందరేశ్, పోలీసు కమిషనర్ లోకనాథన్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

కమీషన్ కోసం డీఎంకే బెదిరింపులు

నయినార్ నాగేంద్రన్

సైదాపేట, న్యూస్‌టుడే: కమీషన్ కోసం డీఎంకే నిర్వాహకులు అధికారిని బెదిరించటం ఖండించదగిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ తెలిపారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై పురసైవాక్కం ప్రాంతంలో మెట్రో వాటర్ కనెక్షన్ పొందిన నివాసితుల నుంచి లంచం రాకపోవటంతో సహాయ ఇంజినీర్‌ను డీఎంకే నిర్వాహకులు ఇద్దరు బెదిరిస్తున్నట్లు విడుదలైన ఆడియో దిగ్భ్రాంతి కలిగించిందని అన్నారు. ఉద్యోగాన్ని కాపాడుకోవాలంటే ఆ కనెక్షన్లు కట్ చేయాలని బెదిరించడం సమంజసం కాదన్నారు.

కొత్త కార్మిక చట్టాల్లో లోపాలు సవరించాలి: రామదాస్

సైదాపేట, న్యూస్‌టుడే: కొత్త కార్మిక చట్టాల్లో లోపాలు సవరించాలని పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. గతంలోని 29 కార్మిక చట్టాలను తొలగించి 4 కొత్త చట్టాలను 22న కేంద్రం అమల్లోకి తెచ్చిందన్నారు. వాటిలో చాలా అంశాలు స్వాగతించదగినవే అయినా అన్ని సంస్థల్లో మహిళలకు రాత్రి పని అనేది కుటుంబ పరామర్శ, మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకుని పునఃపరిశీలన చేయాల్సి ఉందన్నారు. పని సమయాన్ని 12 గంటలుగా పెంచటం కార్మిక సంక్షేమం, హక్కులకు వ్యతిరేకమని తెలిపారు.

ఆస్పత్రిలో చేరిన అన్నాడీఎంకే మాజీ మంత్రి

నత్తం విశ్వనాథన్

సైదాపేట, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే మాజీ మంత్రి, ఎమ్మెల్యే నత్తం విశ్వనాథన్ అనారోగ్యం కారణంగా చెన్నై గ్రీమ్స్ రోడ్డులోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. ప్రాథమిక నివేదిక ప్రకారం అధిక రక్తపోటు కారణంగా ఆస్పత్రిలో చేరినట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో చికిత్స పొంది డిశ్చార్జి అవుతారని ఆస్పత్రి వర్గాలు తెలిపారు.

రైళ్లకు ఎల్‌హెచ్‌బీ బోగీలు

వడపళని, న్యూస్‌టుడే: 22157/22158 ముంబై సీఎస్‌ఎంటీ-చెన్నై ఎగ్మూరు-ముంబై సీఎస్‌ఎంటీ మెయిల్‌కు ఎల్‌హెచ్‌బీ బోగీలు అమరుస్తున్నారు. ముంబైలో జనవరి 14, చెన్నై ఎగ్మూరులో జనవరి 15 నుంచి నడిచే రైలుకు కొత్త బోగీలు ఉంటాయి.

- 22153/22154 ఎగ్మూరు-సేలం, సేలం-ఎగ్మూరు రైలుకు కూడా ఎల్‌హెచ్‌బీ బోగీలు రానున్నాయి. ఎగ్మూరులో జనవరి 15, సేలంలో జనవరి 16 నుంచి బయలుదేరే రైలుకు వీటిని ఏర్పాటు చేస్తారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం

ఇస్రో ఛైర్మన్ నారాయణన్

సైదాపేట, న్యూస్‌టుడే: విద్యార్థులు పుస్తకాల పురుగులుగా ఉండటం కంటే క్రమశిక్షణ కలిగి ఉండటం ముఖ్యమని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ తెలిపారు. చెన్నై కొట్టూరుపురంలోని అన్నా సెంటినరీ గ్రంథాలయ హాలులో తమిళనాడు రాష్ట్ర విద్యా విధానం తదుపరి చర్యలపై ఉన్నత స్థాయి నిపుణుల కమిటీ, పాఠ్యాంశాల రూపకల్పన కమిటీ సమావేశం సోమవారం జరిగింది. నారాయణన్ మాట్లాడుతూ... తల్లిదండ్రులపై ప్రేమ, ఉపాధ్యాయులను గౌరవించటం, సహనం తదితర అన్ని గుణాలు కలగలిసిన విద్యార్థులను తయారు చేయటమే ఉద్దేశమని చెప్పారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, క్రీడల్లోనూ ఆసక్తి చూపాలని పేర్కొన్నారు. ఎక్కడ చదివినా బాగా విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యామొళి, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నారాయణన్

పొగమంచు వేళ ప్రమాదం.. నలుగురు చెన్నైవాసుల మృతి

సంఘటన స్థలంలో తిరగబడిన కారు

కోలారు, న్యూస్‌టుడే : బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిపై కర్ణాటకలోని మాలూరు తాలూకా అబ్బేనహళ్లి సమీపాన ఆదివారం అర్ధరాత్రి దాటిన అనంతరం సంభవించిన రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. చెన్నైకు చెందిన గోపి (38), గౌతమ రమేశ్ (28), హరిహరన్ (27), జయశంకర్ (30)లను మృతులుగా గుర్తించారు. పొగమంచు తీవ్రత ఎక్కువగా ఉండడంతో వారి కారు అదుపు తప్పి రహదారి విభాజకాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. మరణోత్తర పరీక్షలు పూర్తి చేసి, మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు. మాలూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బావిలో జారి పడి యువకుడు..

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ధర్మపురి జిల్లా సమీపంలోని జేకొళ్ళుప్పట్టికి చెందిన చిన్నసామి కుమారుడు శబరినాథన్(22) బెంగుళూరులో పాతపేపర్ దుకాణంలో పని చేసేవాడు. ఆదివారం పాప్పారపట్టి సమీపంలోని పాప్పినాయకన్ అళ్ళిలోని సహోదరి ఇంటికి వెళ్లాడు. రోడ్డుపక్కనున్న బావిలో జారిపడ్డాడు. చాలాసేపటి వరకు కనిపించకపోవడంతో బంధువులు పలుచోట్ల వెతికారు. బావిలో మృతిచెంది తేలుతున్న శబరినాథన్‌ను చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. పాప్పారపట్టి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో విశ్రాంత ఉద్యోగి..

ప్యారిస్, న్యూస్‌టుడే: తూత్తుకుడి జిల్లాలో పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం భారీవర్షం కురిసింది. నాల్వర్‌నగర్‌లో ఉంటున్న విశ్రాంత ఉద్యోగి పళనియాండి(75) సోమవారం స్థానిక దుకాణానికి నడుచుకుంటూ వెళుతూ రోడ్డుపై పడి ఉన్న విద్యుత్తు తీగపై కాలు వేశాడు. విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి...

విజయ కుమార్

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపం అళింజివాక్కానికి చెందిన విజయకుమార్(34) లారీ డ్రైవర్. భార్య తమిళ్‌సెల్వి, కుమార్తె ఇలక్య(8), కుమారుడు ఇనియన్‌తో కలిసి ఈనెల 16న ద్విచక్ర వాహనంపై ఏపీలోని సత్యవేడుకు బయలుదేరాడు. తచ్చూరులో లారీ ఢీకొనడంతో నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చెన్నై స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించగా ఇలక్య అదే రోజు రాత్రి మృతి చెందింది. తమిళ్‌సెల్వి, ఇనియన్ రెండ్రోజుల క్రితం డిశ్చార్జి అయ్యారు. విజయకుమార్ సోమవారం మృతి చెందాడు. కవరప్పేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మెడకు ఊయల బిగుసుకుని విద్యార్థి..

హరిహరన్

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా ఆవడి సమీపం గోవర్ధనగిరి కామరాజర్‌నగర్‌కు చెందిన సతీష్ ఆటో డ్రైవర్. ఈయన కుమారుడు హరిహరన్(13) ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం ఊయలపై ఆట్లాడుకుంటుండగా తాడు మెడకు బిగుసుకోవడంతో ఊపిరాడక మృతి చెందాడు.

చపాతీ తిని ఊపిరాడక బాలిక..

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం జిల్లా మేల్ మలయనూర్ సమీప కరడి కుప్పం గ్రామానికి చెందిన తవమణి కుమార్తె పూవరసి(14). స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఆదివారం రాత్రి ఇంట్లో వండిన చపాతీలను బంగాళాదుంప కుర్మాతో కలిపి తిని నిద్రించింది. రాత్రి 11 గంటల సమయంలో బాలిక నిద్రలో నుంచి లేచి నీళ్లు తాగి పడుకొంది. సోమవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో ఊపిరాడక పోవడంతో వెంటనే బాలికను తల్లిదండ్రులు తిరువణ్ణామలై ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. అవళూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

పులి దాడిలో మహిళ..

నాగమ్మాల్ (పాతచిత్రం)

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లా గూడలూర్ సమీపంలోని మసినక్కుడి పంచాయతీకి చెందిన బాలన్ భార్య నాగమ్మాల్(65). గిరిజన మహిళ అయిన నాగమ్మాల్ ఊరు సమీపంలోని అడవిలో మేకలు మేపుతుండగా నీరు తాగడానికి సమీపంలోని కాలువకు వచ్చిన ఆడపులి దాడి చేసింది. ఆమె అరుపులు విని దూరం నుంచి చూసిన బాలుడు గ్రామస్థులకు తెలిపాడు. గ్రామ ప్రజలు, మసినక్కుడి అటవీ శాఖ అధికారులు, పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. అప్పుడు పులి నాగమ్మాల్‌ను చంపి తింటోంది. ప్రజలు గుంపుగా రావడాన్ని చూసి పులి అడవిలోకి పరుగుదీసింది. శిరస్సు లేని నాగమ్మాల్ మొండెం స్వాధీనం చేసుకున్న పోలీసులు శవపంచనామా నిమిత్తం ఊటీ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. బోనుపెట్టి పులిని పట్టుకోవాలని ప్రజలు కోరారు.

మహిళా పోలీసు బలవన్మరణం

ప్యారిస్, న్యూస్‌టుడే: కుటుంబ సమస్యల కారణంగా మహిళా పోలీసు ఆత్మహత్య చేసుకున్నారు. చెన్నై టీపీ సత్రం పోలీసు క్వార్టర్స్‌లో ఉంటున్న మహిళా పోలీసు కార్తికరాణి(28)కి భర్త, ఇద్దరు పిల్లలున్నారు. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా రెండేళ్లుగా కార్తికరాణి వేరుగా ఉంటోంది. ఆదివారం విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మానసిక ఒత్తిడిలో ఉన్నట్లు, అందుకే ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో ఆడ శిశువు మృతదేహం లభ్యం

వేలూరు, న్యూస్‌టుడే: ఆస్పత్రి వద్ద కాలువలో చనిపోయిన ఆడశిశువును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వేలూరు పెంట్లాండ్ ప్రభుత్వ ఆస్పత్రి వెలుపల కాలువలో ఓ పసికందు చనిపోయి తేలుతూ కనిపించింది. సమాచారం మేరకు వేలూరు దక్షిణ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కొన్ని గంటల క్రితమే పాప జన్మించి ఉండొచ్చని పోలీసులు తెలిపారు. సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

చోరీ కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలుశిక్ష

జ్యోతి కుమారన్, తమిళ్‌సెల్వి

శోళింగర్, న్యూస్‌టుడే: బాణావరం వద్ద అయ్యన్‌తాంగల్ గ్రామం వినాయక గుడివీధికి చెందిన కూలీ కార్మికుడు కంబన్ ఇంట్లో 2022 జనవరి 26న చోరీ జరిగింది. 12.5 సవర్ల బంగారు నగలు, 100 గ్రాముల వెండి గొలుసు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు బాణావరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి శోళింగర్ వద్ద పారాంజి గ్రామానికి చెందిన సుదన్ భార్య తమిళ్‌సెల్వి, ఆయల్ ప్రాంతానికి చెందిన కృష్ణమూర్తి కుమారుడు జ్యోతి కుమారన్‌ను అరెస్టు చేశారు. శోళింగర్ క్రైం కోర్టులో విచారణ జరిగింది. నిందితులు జ్యోతికుమారన్, తమిళ్‌సెల్విలకు మూడేళ్లు చొప్పున జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి అగవిదన్ తీర్పు వెలువరించారు.

జీపు బోల్తా: 13 మందికి గాయాలు

బోల్తా పడిన జీపు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లాలో పండే క్యారెట్‌ను వివిధ రాష్ట్రాలకు పంపుతుంటారు. ఊటీ సమీపంలోని తేనాడుకంబై ప్రాంతానికి క్యారెట్ కోత పనులకు ఇందిరానగర్‌కు చెందిన కూలీలు 12 మంది ఆదివారం వేకువజామున జీపులో వెళ్లి తిరిగొస్తున్నారు. జీపు అదుపుతప్పి సమీపంలోని తోటలో బోల్తాపడింది. అటువైపు వెళ్తున్న వారు కూలీలను బయటికి తీసి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు.

ప్రభుత్వ బస్సు, కారు ఢీ

- ఆరుగురికి తీవ్ర గాయాలు

బస్సును వెనుక వైపు ఢీకొన్న కారు

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై నుంచి చెంగం వైపు సోమవారం ఉదయం ప్రభుత్వ బస్సు ప్రయాణికులతో వెళుతోంది. చెంగం పట్టణం లోపలకు బస్సును డ్రైవర్ తిప్పే సమయంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ కారులో బెంగళూరు నుంచి పుదుచ్చేరికి వెళుతున్న ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని పోలీసులు చికిత్స కోసం చెంగం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమల ఘాట్‌రోడ్డులో కారుబోల్తా

బోల్తా పడిన కారు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో కారు అదుపు తప్పి బోల్తా పడింది. సంబంధిత వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైకి చెందిన భక్తులు కారులో తిరుమల నుంచి తిరుపతి బయలు దేరారు. 2వ కిలోమీటర్ వద్ద బ్రేకులు ఫెయిలవడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ముగ్గురు భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కొంత సేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది చేరుకుని కారును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

పేలుడు మందులు దాచిన ముగ్గురి అరెస్ట్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: లైసెన్స్ పొందకుండా పేలుడు మందులు దాచుకున్న ముగ్గురిపై కేసు నమోదైంది. ధర్మపురి జిల్లా పెన్నాగరం సమీపం తాళప్పళ్లం ప్రాంతంలో అన్నాడీఎంకే రైతు విభాగ రాష్ట్ర అధ్యక్షుడి భార్య రత్నకు చెందిన బ్లూ మెటల్, కంకర, ఎం-శాండ్ క్వారీ రంగాపురం ప్రాంతంలో ఉంది. క్వారీలో అనుమతి లేకుండా పేలుడు పదార్థాలు దాచినట్లు సమాచారం అందడంతో ఇన్‌స్పెక్టర్ బాబుసురేష్ సిబ్బందితో చేరుకొని తనిఖీ చేశారు. పేలుడు మందు, జిలెటిన్ కడ్డీలు స్వాధీనం చేసుకున్నారు. జాకీర్ హుసేన్, రత్న, మాతయ్యన్ కుమారుడు సత్యరాజ్‌పై కేసు నమోదు చేశారు. సత్యరాజ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచి ధర్మపురి సబ్‌జైలుకు తరలించారు.

ఇష్టంలేని పెళ్లి చేశారని నవవధువు పరారీ

ప్యారిస్, న్యూస్‌టుడే: ఇష్టం లేని పెళ్లి చేశారని నవవధువు పరారైంది. కన్నియాకుమరి జిల్లా కుళచ్చల్‌కు చెందిన ఓ యువకుడు ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నాడు. ఇతనికి తూత్తుకుడికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన యువతితో నవంబరు 3న వివాహమైంది. కట్నం తీసుకోకుండా ఇరు కుటుంబాల అంగీకారంతో యువకుడు వివాహం చేసుకున్నాడు. 21న భర్త ఉద్యోగానికి వెళ్లిన తర్వాత యువతి తన మెడలో ఉన్న తాళి తీసివేసి అదృశ్యమైంది. ఇష్టం లేకుండా వివాహం చేశారని, సంతోషంగా ఉండలేనని భర్తకు వాయిస్ మెసేజ్ పంపింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విమానాశ్రయంలో రూ.4 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం

రెడ్‌హిల్స్: మలేషియా రాజధాని కౌలాలంపూర్ నుంచి తిరుచ్చి విమానాశ్రయానికి ఎయిర్ ఏషియా సంస్థకు చెందిన విమానం ఆదివారం రాత్రి చేరుకుంది. తంజావూరుకు చెందిన అబ్దుల్ అమీర్ అనే వ్యక్తికి చెందిన లగేజీని కస్టమ్స్ అధికారులు తనిఖీ చేపట్టి రూ.4 కోట్ల విలు చేసే గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

నగలు, నగదు చోరీ

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం జిల్లా దిండివనం సమీప రోషనై కాలనీకి చెందిన రాము విశ్రాంత ప్రభుత ఉద్యోగి. ఈనెల 12న ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి చెన్నైలో నివాసం ఉంటున్న కుమార్తెల వద్దకు వెళ్లాడు. ఆదివారం మధ్యాహ్నం తిరిగిరాగా తాళాలు పగులగొట్టి కనిపించాయి. బీరువాలోని రూ.13 లక్షల నగదు, ఆరున్నర సవర్ల నగలు చోరీకి గురైనట్లు గుర్తించి రోషనై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి వేలిముద్రలు సేకరించారు.

మారువేషంలో కిడ్నాప్‌నకు యత్నం

- వ్యక్తికి దేహశుద్ధి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరు సమీప సెంజి గ్రామానికి చెందిన పాల్ కుమారుడు భవనేష్(5) సోమవారం ఉదయం ఇంటి వద్ద ఆడుతుండగా మహిళ వేషధారణలో వచ్చిన వ్యక్తి కిడ్నాప్ చేయడానికి యత్నించాడు. స్థానికులు గమనించి పట్టుకుని దేహశుద్ధి చేసి కడంబత్తూరు పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. అతను పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన అమిత్‌గుండల్‌గా గుర్తించారు.

చెన్నైలో నకిలీ జీఎస్టీ రాకెట్ గుట్టురట్టు

వడపళని, న్యూస్‌టుడే: నకిలీ జీఎస్టీ ఇన్‌వాయిస్‌తో రూ.50 కోట్లకు పైగా పన్ను ఎగ్గొట్టిన కీలక వ్యక్తిని చెన్నై నార్త్ కమిషనరేట్ అధికారులు అరెస్టు చేశారు. నమోదు కాని పన్ను కన్సల్టెన్సీ సంస్థ 'ఏఎస్ అసోసియేట్స్'కు చెందిన నకిలీ ఇన్‌వాయిస్ నెట్‌వర్క్ వ్యక్తుల ఐడీ ఆధారాలతో తమిళనాడు, కర్ణాటకలో 95కి పైగా నకిలీ వ్యాపార సంస్థలను ప్రారంభించిందని పీఐబీ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. చెన్నై నార్త్‌లోని 12 సంస్థలకు సంబంధించి ఇప్పటివరకు జరిపిన ప్రాథమిక దర్యాప్తులో రూ.50.85 కోట్ల నకిలీ ఐటీసీని పొందడం వెలుగులోకి వచ్చింది. ఈ పరిధిలోని 83 సంస్థలపై దర్యాప్తు సాగుతోంది. మొత్తం జీఎస్టీ పన్ను ఎగవేత రూ.350 కోట్లకు పైగానే ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. క్షుణ్ణంగా అన్ని కోణాల్లో దర్యాప్తు చేసిన అనంతరం కీలక వ్యక్తి ఉండే ప్రదేశాన్ని గుర్తించారు. సోదాలో 196 సిమ్ కార్డు కవర్లు, సిమ్ కార్డులు, 42 చెక్కు పుస్తకాలు, 41 కీప్యాడ్ ఫోన్లు, పలు సంస్థల పేర్లతో కూడిన రబ్బరు స్టాంపులు వంటి ముఖ్యమైన వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. తగిన సాక్ష్యం, స్వచ్ఛందంగా నేరాన్ని అంగీకరించిన తర్వాత నిందితుడిని ఈనెల 22న అరెస్టు చేసి, చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి జ్యుడిషియల్ కస్టడీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

1న ముఖ్యమంత్రి రాక?

'ఉంగుటూరు'లో పింఛన్ల పంపిణీలో పాల్గొనే అవకాశం



ఈనాడు-ఏలూరు: పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డిసెంబరు ఒకటిన జిల్లాకు వచ్చే అవకాశం ఉంది. ఈమేరకు ప్రాథమికంగా సమాచారం అందడంతో జిల్లా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రతినెలా పింఛన్ల పంపిణీలో సీఎం ఏదో ఒక జిల్లాలో పాల్గొంటున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా డిసెంబరులో జిల్లాలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని అధికారవర్గాల ద్వారా తెలిసింది. ఆ రోజు ఉంగుటూరు నియోజకవర్గం పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించాలనే యోచనలో ఉన్నతాధికారులు ఉన్నారు. అయితే ఆ నియోజకవర్గంలో ఎక్కడ నిర్వహిస్తే బాగుంటుందనే విషయమై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య చర్చలు సాగుతున్నాయి. ఇంతకు ముందు నూజివీడు నియోజకవర్గంలో ఈ కార్యక్రమం జరిగిన సంగతి తెలిసిందే.

రైతేరాజు
మిశ్రమం.. ఫలవంతం! 6లో

స్వాగతాలు.. విన్నపాలు

- పలు అభివృద్ధి పనులకు ప్రారంభాలు
- ఆద్యంతం ఉత్సాహంగా ఉపముఖ్యమంత్రి పర్యటన

జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, కొయ్యలగూడెం గ్రామీణ, ద్వారకాతిరుమల న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఐఎస్ జగన్నాథపురం పర్యటన సోమవారం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన గ్రామంలో నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్‌ను ప్రారంభించారు. పలు అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాజమహేంద్రవరం నుంచి రోడ్డు మార్గంలో వచ్చిన ఆయనకు దారి పొడవునా ఘన స్వాగతం లభించింది. జగన్నాథపురంలో ఆయన ఓపెన్ టాప్ జీప్‌పై నుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పవన్‌ను చూసేందుకు, స్వాగతించేందుకు రోడ్లకు ఇరువైపులా ప్రజలు, అభిమానులు తరలివచ్చారు.

కొయ్యలగూడెం మండలం రాజవరంలో పొంగుటూరు-లక్కవరం రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తూ.. ప్రజలకు అభివాదం చేస్తున్న పవన్‌కల్యాణ్, పక్కన మంత్రి మనోహర్, ఎమ్మెల్యేలు

లక్ష్మీనరసింహస్వామి ఆలయం సందర్శన నిమిత్తం ఆరిపాటిదిబ్బలు, యర్రంపేట, రాజవరం, మంగపతిదేవిపాలెం మీదుగా పవన్ పర్యటన సాగింది. ఉదయం 11.30కు రాజవరం చేరుకున్న ఆయన వాహనం దిగి కొద్దిదూరం కాలి నడకన పర్యటించారు. రూ.1.64 కోట్లతో మరమ్మతులు చేసిన పొంగుటూరు, లక్కవరం రహదారిని పరిశీలించారు. మంగపతిదేవిపాలెం సమీపంలో గంగవరం కూడలిలో రహదారి నిర్మాణం కోరుతూ పలువురు ఫ్లెక్సీతో వేచి ఉండగా పోలీసులు అడ్డుకోవడంతో గంగవరం గ్రామస్థులు అసహనం వ్యక్తం చేశారు. ఐఎస్ జగన్నాథపురం పర్యటన ముగించుకుని తిరిగి వచ్చే క్రమంలో అదే కూడలి వద్ద వాహనం నుంచే పవన్ పలువురి నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి నాదెండ్ల మనోహర్, ప్రభుత్వ విప్‌లు బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, ఎమ్మెల్యేలు వెంకటరాజు, బాలరాజు, రాధాకృష్ణయ్య, ధర్మరాజు, రామాంజనేయులు, జనసేన జిల్లా అధ్యక్షులు గోవిందరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ మురళీ కృష్ణ, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ అప్పల నాయుడు, కలెక్టర్ వెట్రి సెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

యర్రంపేటలో రహదారి పక్కన చక్రాల కుర్చీలో వేచి ఉన్న తల్లోజు రామచరణ్ అనిరుధ్ అనే దివ్యాంగ బాలుడిని పవన్ పలకరించారు. అతడికి అవసరమైన సహాయాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వినతులు.. పవన్ కల్యాణ్‌కు ఈ సందర్భంగా పలువురు వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందించారు. అర్జీల స్వీకరణకు ప్రత్యేకంగా ఒక కౌంటర్ ఏర్పాటు చేశారు. అర్జీలను అక్కడికక్కడే ఆన్‌లైన్ చేశారు.

పుస్తకావిష్కరణ.. కొచ్చర్ల కోట నరసింహం గురువు ఆదేశాలు, సూచనల మేరకు శిష్యుడు ఆంజనేయశాస్త్రి ఆలయ చరిత్రను పుస్తక రూపంలో తీసుకొచ్చారు. ఆ పుస్తకాన్ని పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రదక్షిణ మండపం నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పవన్‌కల్యాణ్

సంకల్ప సిద్ధిరస్తు!

- ఇంటర్‌లో ఉత్తీర్ణత పెంపునకు చర్యలు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత పెంపునకు ఇంటర్ విద్యామండలి ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు 'సంకల్ప్-2026'కు శ్రీకారం చుట్టింది. సోమవారం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించగా.. దీన్ని వచ్చే ఏడాది ఫిబ్రవరి 20 వరకు అమలు చేస్తారు.

50 రోజుల ప్రణాళిక..

యాభై రోజుల ప్రణాళికను 'సంకల్ప్'లో అమలు చేయనున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రోజూ ఉదయం 9.10 నుంచి మధ్యాహ్నం 12.40 గంటల వరకు అపరిష్కృత పాఠ్యాంశాలు బోధించనున్నారు. మధ్యాహ్నం 1.20 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రివిజన్, ఇతర పరీక్షలు నిర్వహిస్తారు. డిసెంబరు 15 నుంచి 20 వరకు ప్రీ ఫైనల్ పరీక్షలుంటాయి. డిసెంబరు 22 నుంచి ఫిబ్రవరి 20 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు.

జిల్లాలో విద్యార్థుల వివరాలిలా..
ప్రభుత్వ జూనియర్ కళాశాలలు:19
ప్రథమం:2,310, ద్వితీయం:1,990

వెనుకబడిన వారిపై శ్రద్ధ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులను ఏ, బీ, సీ గ్రేడులుగా విభజిస్తారు. బాగా చదివే వారిని ఏ గ్రేడు, మోస్తరు విద్యార్థులను బీ గ్రేడు, సరిగా చదవని వారిని సీ గ్రేడుగా విభజించారు. సీ-గ్రేడు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి తప్పనిసరిగా అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తారు. ఆయా కళాశాలల విద్యార్థుల సంఖ్య ఆధారంగా సంరక్షకులను నియమించినట్లు ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేకంగా అధ్యయన పుస్తకాలు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

షష్ఠి సంబరాలకు వేళాయె

సుబ్రహ్మణ్యేశ్వరుడు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెం, చేవూరుపాలెం సెంటరులోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో వైభవోపేతంగా ఏటా నిర్వహించే తిరు కల్యాణ షష్ఠి మహోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఇక్కడ మార్గశిర శుద్ధ పంచమి నుంచి మార్గశిర బహుళ విదియ వరకు 13 రోజుల పాటు కనుల పండువగా ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇందుకు ఇప్పటికే భారీస్థాయిలో ఏర్పాట్లు చేశారు. పలు చోట్ల సీసీ కెమెరాలు బిగించారు. వీటితో ఎక్కడ రద్దీ ఉందో ఎప్పటికప్పుడు పరిశీలించి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టనున్నారు.

ఏర్పాటు చేసిన విద్యుత్తు కాంతులు

నేటి నుంచి ప్రారంభం : మంగళవారం సాయంత్రం స్వామిని పెండ్లి కుమారుడిని చేయడంతో ఉత్సవాలు మొదలవుతాయి. బుధవారం తెల్లవారుజామున పుట్టలో పాలు పోయడంతో షష్ఠి మహోత్సవాల సందడి మొదలవుతుంది. అదే రోజు రాత్రి 8 గంటలకు స్వామివారి దివ్య కల్యాణం నిర్వహిస్తున్నారు.

చుక్కల వెలుగుల్లో నడవాలా..!

అంధకారంలో పట్టణాలు

పరిశీలన

జంగారెడ్డిగూడెం, చింతలపూడి పట్టణం, నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: పురాల్లో వీధి దీపాల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. చీకటి పడితే పలు ప్రాంతాల్లో అంధకారం అలముకుంటుంది. జిల్లాలోని జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి పట్టణాల్లో వందల సంఖ్యలో వీధి దీపాలు పాడై వెలగడం లేదు. ప్రతి పట్టణంలో దీపాల నిర్వహణకు రూ.లక్షల్లో వ్యయం చేస్తున్నా.. చీకట్లు తొలగటం లేదు. మరమ్మతులకు నెలల తరబడి సమయం తీసుకుంటున్నారు.

చింతలపూడి 2,100 వీధి దీపాలు ఉన్నాయి. వీటిలో సుమారు 100కు పైగా మరమ్మతులకు గురై వెలగడం లేదు. చాలా స్తంభాలకు దీపాలు ఉంటున్నా.. చెడిపోతే.. బాగు చేయడానికి ఎక్కువ రోజులు పడుతోంది. దీంతో చాలా ప్రాంతాల్లో రాత్రయితే చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఇద్దరే ఎలక్ట్రీషియన్‌లు ఉండటంతో సకాలంలో మరమ్మతులు చేయలేకున్నారు. పాడైతే వెంటనే బాగు చేయిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ రాంబాబు తెలిపారు.

జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారుల్లోని సెంట్రల్ లైటింగ్ కొంత మెరుగైనా.. వీధుల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ఉప్పలమెట్ట రోడ్డులో పదుల సంఖ్యలో దీపాలు వెలగడం లేదు. రావూరి కూడలి నుంచి ఉప్పలమెట్ట వరకు అంధకారం నెలకొంది. కొవ్వూరు రోడ్డులో గంగానమ్మ గుడి నుంచి అగ్నిమాపకశాఖ కార్యాలయం వరకు, టెలిఫోన్ కాలనీలోనూ పలు దీపాలు లేవు. ఎస్ఎన్ఎల్ కార్యాలయం వీధి నుంచి శాలిపేట రోడ్డు వరకు ఒక్క దీపం వెలగడం లేదు. పట్టణ వ్యాప్తంగా 5,030 దీపాలు ఉండగా.. చాలా చోట్ల అంధకారం నెలకొంది. ప్రతిరోజు ప్రత్యేక బృందాలతో 50 వరకు మరమ్మతులు చేసి వెలిగిస్తున్నామని ఏఈ రాజేశ్ చెప్పారు.

ఉప్పలమెట్ట రోడ్డులో వెలగని వీధి దీపాలు

నూజివీడు.. నిత్యం 50 దీపాలు మరమ్మతులు చేస్తున్నారు. ఈ పట్టణంలో 4,060 దీపాలకు వందల సంఖ్యలో వెలగడం లేదు. నెలల తరబడి వెలగకున్నా.. పట్టించుకుంటున్న వారు లేరు. అజరయ్యపేటలో ఎస్సీ విద్యార్థుల వసతి గృహం వద్ద మూడు నెలలుగా వెలగడం లేదు. గంగానమ్మ గుడి సమీపంలోనూ చాలా రోజులుగా వెలగడం లేదు. పురపాలక బడ్జెట్‌లో రూ.10 లక్షలు కేటాయించారు. వీధి దీపాలు పాడైతే వెంటనే మరమ్మతులు చేసి వెలిగిస్తున్నట్లు మున్సిపల్ ఏఈ మారయ్య పేర్కొన్నారు.

అజరయ్య వీధిలోని హాస్టల్ వద్ద మూడు నెలలుగా వెలగని దీపం

పేదల బియ్యం.. ఉడికేది వ్యాపారుల ఇంట్లో..

'చింతలపూడి మండలం ప్రగడవరంలో దళారులు డీలర్లను సంప్రదించి.. ప్రతి నెలా భారీగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలోనూ ఇదే పరిస్థితి. అధికారులు అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నారే తప్ప.. పూర్తిగా కట్టడి చేయడంలేదు. ఫలితంగా పేదలకు అందాల్సిన బియ్యం దళారుల పాలవుతోంది.'

చింతలపూడి, న్యూస్‌టుడే: పేదలకు సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం డీలర్లకు వరంలా మారింది. వైకాపా ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాలు.. రేషన్ అక్రమ రవాణాకు అడ్డాగా మారడంతో వీటిని కూటమి ప్రభుత్వం తొలగించింది. నేరుగా రేషన్ దుకాణాల వద్దే బియ్యం సరఫరా చేసేలా నిబంధనలు మార్చినా.. అక్రమ వ్యాపారం ఆగడం లేదు. రేషన్ డీలర్లు బహిరంగంగా దుకాణాల వద్దే బస్తాలు అక్రమంగా అమ్ముతున్నా.. అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ప్రభుత్వం కిలో బియ్యం ప్రజలకు అందించేందుకు రూ.46 ఖర్చు పెడుతోంది. వాటిని తీసుకోవడానికి 50 శాతం మందికి పైగా కార్డుదారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో డీలర్లకే ఆ బియ్యాన్ని ఇచ్చి కిలోకు కేవలం రూ.12 తీసుకుని వేలిముద్ర వేసి వెళ్లిపోతున్నారు. డీలర్లు కిలో రూ.18కి లెక్క కట్టి అక్రమార్కులకు అమ్ముతున్నారు. నూజివీడు, తిరువూరు, చింతలపూడి నియోజకవర్గాల్లో పెద్దఎత్తున బియ్యం అక్రమ రవాణా సాగుతోంది.

విచ్చలవిడిగా అక్రమ రవాణా

రేషన్ డీలర్లు ఈ-పోస్‌లో వేలిముద్ర తీసుకున్న తర్వాత బియ్యం లబ్ధిదారులకు ఇచ్చారా? లేదా అన్నది పౌరసరఫరాలశాఖ డీటీలు నెలనెలా చూడాల్సి ఉన్నా.. డీలర్లు ఇచ్చే మామూళ్లకు అలవాటు పడి పలువురు దాడులకు వెనకడుగు వేస్తున్నారు. దళారులు డీలర్లకు ముందస్తు అడ్వాన్సులు కూడా ఇస్తున్నారని సమాచారం.

జిల్లాలో	
మొత్తం రేషన్ దుకాణాలు	1,123
సరఫరా చేస్తున్న బియ్యం	9వేల మెట్రిక్ టన్నులు (నెలకి)

వేగంగా దొరికేస్తారు..!

ఒక వాహనాన్ని మరొకటి ఓవర్‌టేక్ చేస్తూ..

జాతీయ రహదారులపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తుండటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ముందు వెళ్తున్న వాహనాలను అధిగమిస్తూ నియంత్రణ కోల్పోతున్నారు. వేగ నియంత్రణపై ఇప్పటికే పలుమార్లు వాహనదారులకు అవగాహన కల్పించారు. నిబంధనలను అతిక్రమించిన వారిని స్పీడ్‌హంటర్‌గన్ కెమెరాతో గుర్తిస్తున్నారు. వాహన నంబరు ప్లేటు ఆధారంగా జరిమానా విధిస్తామని అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు జగదీశ్‌బాబు తెలిపారు. పెదవేగి మండలం భోగాపురం సమీపంలోని జాతీయ రహదారిపై కనిపించిన చిత్రాలివి. **- ఈనాడు, ఏలూరు.**

స్పీడ్‌హంటర్‌గన్ కెమెరాతో రికార్డు చేస్తూ..

అపూర్వ లోగిలి.. పచ్చందాల వాకిలి!

యలమంచిలి, న్యూస్‌టుడే: రెండంతస్తులతో ఉన్న 150 ఏళ్ల నాటి ఈ పెంకుటిల్లు యలమంచిలి మండలం బూరుగుపల్లిలో వశిష్ఠ గోదావరి ఏటిగట్టుకు సమీపాన ఉంది. 22 గదులు, పెద్ద మండువా ఉన్న ఈ ఇంటి పై అంతస్తుకు వెళ్తే వశిష్ఠ గోదావరి అందాలు కనువిందు చేస్తుంటాయి. ముంగిట్లో ఉన్న భారీ వృక్షం నీడలో వాకిలి పచ్చదనాన్ని పంచుతుంది. జడ్పీటీసీ మాజీ సభ్యుడు బోణం వెంకటనరసింహారావు(నాని)కు చెందిన ఈ ఇంట్లో ఇప్పటి వరకు ఏడు తరాలు నివాసమున్నట్లు ఆయన చెబుతున్నారు. శ్రీకాంత్ హీరోగా వచ్చిన దేవరాయ, మరికొన్ని సినిమాల చిత్రీకరణలు ఈ భవనంలో జరిగాయి. ప్రస్తుతం సునీల్ ప్రధానపాత్రలో తెరకెక్కుతున్న 'కొక్కొరొక్కో' చిత్రంలో కొంత భాగాన్ని ఇక్కడ చిత్రీకరించేందుకు అనుమతులు తీసుకున్నారు.

రేపు పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవం

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగం ఆమోదించిన రోజును పురస్కరించుకుని నవంబరు 26న అన్ని పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. కేంద్ర విద్యాశాఖ సూచించిన మేరకు రాష్ట్ర విద్యాశాఖ ద్వారా అందుకు సంబంధించిన ఆదేశాలను పాఠశాలలకు అందాయి. రాజ్యాంగంలో నిక్షిప్తమైన విలువలు, సూత్రాలను పాఠశాలల ద్వారా విస్తృతంగా ప్రచారం చేసే ఉద్దేశంతోనే ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా సదస్సులు నిర్వహించి ప్రసంగాల ద్వారా రాజ్యాంగం గురించి వివరించడం, క్విజ్, వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నారు

ధాన్యం అమ్మకంలో ఇబ్బందులున్నాయా? : మంత్రి

గుండుగొలను(భీమడోలు), న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానీయొద్దని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం పర్యటనకు వెళ్తున్న ఆయనకు.. మార్గం మధ్యలోని గుండుగొలను కూడలిలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, జనసేన నాయకులు సోమవారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రోడ్డు పక్కన ఆరబోసిన ధాన్యాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం పొలం మాసూళ్లు చేస్తున్న అన్నదాతల వద్దకెళ్లి వారి సాధక బాధలు తెలుసుకున్నారు. పంట దిగుబడి ఎలా ఉంది? ధాన్యం కొనుగోలులో ఏవైనా సమస్యలు ఎదురవుతున్నాయా? అని ఆరా తీశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా సాంకేతిక ఇబ్బందులు నెలకొంటే వెంటనే పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

రైతుతో మాట్లాడుతున్న మనోహర్, చిత్రంలో ఎమ్మెల్యే ధర్మరాజు

'మీ కోసం'లో 277 అర్జీలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: 'మీ కోసం'లో అందిన వినతులను నిర్దేశిత గడువు లోపు పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)లో పలువురు వినతులు అందజేశారు. డీఆర్వోతోపాటు ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్, ప్రత్యేక ఉప కలెక్టర్లు కె.భాస్కర్, దేవకిదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.ముక్కంటి తదితరులు అర్జీలు స్వీకరించారు. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. 277 అర్జీలు అందాయన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రాధాన్య క్రమంలో పరిష్కరించనున్నట్లు చెప్పారు.

అర్జీ పరిశీలిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరరావు

మాటలా.. చేతలా!

- సమస్యలకు పరిష్కారం చూపేనా?
- నేడు స్థాయీ సంఘాలు, సర్వసభ్య సమావేశాలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు సమావేశంపై ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికందే దశలో తుపాను నిండా ముంచింది. 'మొంథా'తో నష్టపోయిన కర్షకులను ఆదుకోవాలని.. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేసేందుకు నిధులు విడుదల చేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఇటీవల మంత్రి నారా లోకేశ్, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజను వేర్వేరుగా కలిసి విన్నవించారు. మంగళవారం జరిగే స్థాయీ సంఘాలు, జడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయిలో హాజరై సమస్యలపై చర్చించి పరిష్కార మార్గం చూపాలని జిల్లా వాసులు ఆశిస్తున్నారు.

అధ్వానంగా రహదారులు ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే అధ్వానంగా మారిన రహదారులు.. తుపాను ప్రభావంతో మరింత ఛిద్రమయ్యాయి. పీఆర్, ర.భ.శా. రోడ్లు ఘోరంగా దెబ్బతిన్నాయి. కైకలూరు- భీమవరం, కైకలూరు- గుడివాడ రోడ్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. అంతర్గత, అనుసంధాన రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నష్టం రూ.75 కోట్లు పైగానే.. మొంథా తుపాను ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో రూ.75 కోట్లకు పైగా పంట నష్టం వాటిల్లింది. ఇదే విషయాన్ని ఇటీవల జిల్లాకొచ్చిన కేంద్ర బృందానికీ అధికార యంత్రాంగ విన్నవించింది. 4,807 హెక్టార్లలో వరి, 17.63 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. కర్షకులకు చేయూతనిచ్చేలా చర్చించాల్సిన అవసరముంది.

ఈ సారైనా.. హాజరయ్యేనా? జడ్పీ సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని అధికారులు తమ శాఖల్లో జరిగిన ప్రగతి, చేపట్టనున్న అభివృద్ధి పనులపై నివేదించాలి. కానీ, సమావేశాలు జరిగినప్పుడల్లా కొందరు అధికారులు గైర్హాజరవుతున్నారు. మరికొందరు ఉన్నతాధికారులు రాకుండా కిందిస్థాయి సిబ్బందిని పంపి మమ అనిపిస్తున్నారు.

ఆదాయంపై కొరవడిన శ్రద్ధ జడ్పీకి సొంత ఆదాయ వనరులు సమకూర్చుకునేందుకు పాలకవర్గం దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. మూణ్నెల్లకోసారి సమావేశాల్లో పాల్గొనడం మినహా ఇతర సమయాల్లో జడ్పీ ఆదాయం పెంపు, ఇతర మార్గాల్లో వనరుల అన్వేషణకు చొరవ చూపడం లేదన్న ఆరోపణలున్నాయి.

ఆన్‌లైన్లో .. పుంజుకున్నాయ్

సామాజిక మాధ్యమాల ద్వారా పందెం కోళ్ల విక్రయాలు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాలు, ఈ-కామర్స్ యాప్‌ల ద్వారా ద్విచక్ర వాహనాలు, కార్లు, గృహోపకరణాల కొనుగోళ్లు, విక్రయాలు సాధారణమే. సంక్రాంతి సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పుడు పందెం కోడి పుంజుల చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. కోడి చిత్రంతో పాటు జాతి పేరు, ప్రత్యేకతలు, వయసు, బరువు, ధర తదితర వివరాలను సామాజిక మాధ్యమాల్లో ఉంచుతున్నారు. కొన్నేళ్ల నుంచి ఈ ఒరవడి కొనసాగుతున్నా ఈ సారి విక్రేతలు వ్యాపారం పెంచుకొనేందుకు కొత్త వ్యూహాలు అమలు చేస్తున్నారు. పుంజుల వివరాల కోసం ఆరా తీసిన వారికి అవసరమైతే అవి పందెంలో తలపడిన వీడియోలు కూడా పంపుతున్నారు. దీనికి తోడు రాయితీలు కూడా ప్రకటిస్తున్నారు. దూర ప్రాంతాల వారికి అవసరమైతే డెలివరీ సదుపాయం కూడా కల్పిస్తామని పేర్కొంటున్నారు. మరోవైపు కొందరు పెంపకందారులు బుట్టల్లో కోడిపుంజులను తెచ్చి పాలకొల్లు పరిసర ప్రాంతాల్లోని కూడళ్లు, రహదారుల పక్కన విక్రయిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి కొందరు కార్లలో వచ్చి మరీ వీటిని కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

అమ్మకానికి ఉంచిన కోడి పుంజుల చిత్రాలు

డీఎఫ్‌వో బాధ్యతల స్వీకరణ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక డీఎఫ్‌వో కార్యాలయంలో జిల్లా అటవీ శాఖ(టెరిటోరియల్) అధికారిగా పోతంశెట్టి వెంకట్ సందీప్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సొంతూరు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట సమీప పసలపూడి గ్రామం. 2019లో ఐఎఫ్ఎస్‌కు ఎంపికైన ఆయన.. ప్రకాశం జిల్లా డోర్నాల సబ్ డివిజనల్ అటవీ శాఖాధికారిగా, ఆత్మకూరు ఇన్‌ఛార్జి డీఎఫ్‌వోగా, వైఎస్సార్ కడప, మన్యం జిల్లాల అటవీ శాఖాధికారిగా విధులు నిర్వర్తించారు. తాజా బదిలీల్లో భాగంగా ఏలూరు డీఎఫ్‌వోగా నియమితులయ్యారు. వెంకట్ సందీప్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో పచ్చదనం పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. నర్సరీల అభివృద్ధి, అటవీ, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ ఆక్రమణల అడ్డుకట్ట, ఎకో టూరిజం ప్రగతికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

వెంకట్ సందీప్‌రెడ్డి

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలపండి



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీస్‌లో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు. ఆకాంక్షించండి... వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు... తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు.

80080 12494

K.G.R.L COLLEGE OF PHARMACY
BHIMAVARAM
Phone: 08816-238828, 99485 67925,99854 85166
E-mail:kgrpharmacy@yahoo.co.in, kgrpharmacy2007@gmail.com
Website:www.kgrlpharmacy.com

APEAPCET-2025 NOTIFICATION FOR SPOT & CAT-B QUOTA ADMISSIONS B. PHARMACY

Applications are invited from Eligible candidates seeking admissions to the following left-over vacancies under Spot and CAT-B Admissions of B.Pharmacy for the Academic year 2025-26 as per APSCHE Guidelines. Eligible candidates shall contact the college office along with original certificates on or before 28-11-2025.

Course	Vacancies Under Spot Admissions	Category – B Seats
B.PHARMACY	16 Seats	30 Seats

Dr. D. Raghava, PRINCIPAL; Dr. K. Nageswara Rao, DIRECTOR; Mentey Ram Manohar, SECRETARY & CORRESPONDENT; Kotikalapudi Govinda Rao, PRESIDENT

WALK - IN INTERVIEWS

MAHAVEER FINANCE INDIA LTD., is looking for the Following Positions:
- SALES MANAGERS
- Sr.SALES EXECUTIVES
- SALES EXECUTIVES
- COLLECTION MANAGERS
- COLLECTION EXECUTIVES

For Used Commercial Vehicles, Construction Equipment & Cars.

LOCATIONS: Rajamundry,Kakinada,Tadepalligudem, Eluru, Visakhapatnam, Gajuvaka, Srikakulam, Vizianagaram.

Qalification & Exp: 10th & Inter for Sr.Sales Executives & Sales Executives, Minimum Degree For Managers.Min 2 years experience in NBFC for Sales Managers and collection manager positions Min.1 Year Experience in relevant field for Sales Executive and Sr.Sales Execurive,collection executive positions. Freshers also can apply as sales executive.

Interview: 26/11/2025, Wednesday, 9.30AM onwards

MAHAVEER FINANCE INDIA LTD.,
D.No.46-12-21/2,3, Venkat Plaza, Opp; Skvt High School, Ttd Kalyana Mandapam Road, Danavayi Peta, Rajamundry-533103.
WhatsApp: 8522082223, tvrsarama@mahaveerfinance.com

(c) eenadu

పురాలకు పెరిగిన ఆదాయం

ఆస్తి పన్నులపై ప్రత్యేక దృష్టి

పట్టణం	కొత్తగా పన్ను	తక్కువ పన్ను ఉన్నవి	ఆదాయం (రూ.లక్షల్లో)
ఏలూరు	1,308	790	144
జంగారెడ్డిగూడెం	352	574	46.91
నూజివీడు	198	462	40.14
చింతలపూడి	107	28	9.34

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పురపాలికలకు ప్రభుత్వ గ్రాంట్లతోపాటు ఇంటి పన్నులే కీలకం. ఈ ఆదాయంతోనే పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వివిధ కారణాలతో ఏళ్ల తరబడి పన్ను వేయని ఇళ్లు, దుకాణాలు, నిర్ణీత పన్ను కంటే తక్కువ కడుతున్న అసెస్‌మెంట్లపై పట్టణాలు దృష్టి పెట్టాయి. ఇందులో భాగంగా సచివాలయాల వారీగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. అసలు పన్ను కట్టని ఇళ్లను అన్ అసెస్డ్‌గా గుర్తిస్తారు. పాత ఇంటిని తొలగించి కొత్తగా కట్టడం, ఉన్న ఇంటిపై అదనపు అంతస్తులు వేయడం, ఇంటి చుట్టూ భాగం పెంచడం వంటివి చేస్తుంటారు. కానీ పన్ను మాత్రం పాత ఇంటిపైనే ఉంటుంది. ఇటువంటి వాటిని అండర్ అసెస్డ్‌గా గుర్తించి కొత్తగా కొలతలు వేసి పన్నులు విధిస్తున్నారు. ఈ ప్రక్రియతో పుర పాల పన్ను డిమాండ్‌లో గణనీయమైన పెరుగుదల చోటు చేసుకుంది.

ఇంటికి కొలతలు వేస్తున్న సిబ్బంది

జిల్లాలో ఏలూరు కార్పొరేషన్‌కు ఏకంగా రూ.7.71 కోట్ల మేర డిమాండ్ పెరిగింది. జంగారెడ్డిగూడెం, నూజివీడు లాంటి పట్టణాలకు సుమారు రూ.1.50 కోట్ల వరకు పెరుగుతోంది. పైగా ప్రతి కట్టడాన్ని తమ పరిధిలోకి తెస్తున్నారు.

ఆన్‌లైన్‌లో.. దశాబ్దాలుగా పన్ను వేయకుండా నెట్టుకొచ్చేవారు కూడా పురాల్లో ఉంటున్నారు. ప్రస్తుతం ఎన్ని సంవత్సరాల కిందట నిర్మాణం జరిగినా పన్నులు మాత్రం 2021 నుంచి లెక్కిస్తున్నారు. సర్వే నంబరు, ప్రాంతం ఆధారంగా ఈఆర్పీ విధానంలో పన్నులు ఆన్‌లైన్‌లో విధిస్తున్నారు. గతంలో మాన్యువల్‌గా అద్దె విలువ ఆధారంగా ఉండేది. ప్రస్తుతం ఇంటి విలువ ఆధారంగా పన్నులు విధిస్తున్నారు. ఏలూరు జిల్లాలో పట్టణాలకు గడచిన కొద్ది నెలల్లో సమకూరిన ఆదాయం.

మిశ్రమం.. ఫలవంతం..!

వ్యవసాయాన్ని పండగ చేస్తున్న యువ రైతు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జీలుగుమిల్లి మండలం దర్భగూడెం గ్రామానికి చెందిన యువ రైతు దారబోయిన మురళీ ఏడాది పొడవునా ఆదాయం వచ్చేలా సాగు ప్రణాళికతో ముందుకు సాగుతూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. మురళీది స్వతహాగా వ్యవసాయ కుటుంబం. అతడి చిన్ననాటి నుంచి తండ్రి వీర్రాజు సంప్రదాయ పంటలైన వరి, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలు పండించేవారు. కాలక్రమేణా వీర్రాజు ఆకుకూరల సాగుకే పరిమితమయ్యారు. మురళీ ఐటీఐ చదివి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. వ్యవసాయంపై మక్కువతో మురళీ తాను చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి తండ్రి వీర్రాజుకు చేదోడుగా ఉండేందుకు స్వగ్రామానికి వచ్చేశాడు.

జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో మురళీ సాగుచేసిన వేరుశెనగ చేను

మార్పు కోసం..

తొలినాళ్లలో మురళీ తన తండ్రితోపాటు ఎకరంలో తోటకూర, గోంగూర, కొత్తిమీర, పాలకూర, చుక్కకూర, మెంతి కూర వంటి వివిధ రకాలైన ఆకుకూరలను పండించేవారు. అయితే ఏకకాలంలో రెండు, మూడు రకాల ఆకుకూరలు వచ్చే విధంగా ప్రణాళిక రూపొందించిన మురళీ ఆ దిశగా మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఆకుకూరలతోపాటు తక్కువ పెట్టుబడితో ఏడాది పొడవునా లాభాలు వచ్చేలా ఇతర పంటలు వేయాలని అనుకున్నాడు. దీంతో వివిధ రకాల పంటల సాగుపై అన్వేషించి చివరకు వేరుశెనగ సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. సుమారు 16 ఎకరాలు కౌలుకు తీసుకుని వేరుశెనగ సాగు ప్రారంభించాడు.

ఉత్తమ సస్యరక్షణ చర్యలతో..

ఏడాదికి రెండు పర్యాయాలు చొప్పున వేరుశెనగ పంటను యువ రైతు పండిస్తున్నారు. విత్తనాలు చల్లే ముందు వ్యవసాయ క్షేత్రంలో పచ్చిరొట్ట విత్తనాలు, పశువుల పెంట, ఇతర పోషక లవణాలు మిళితమైన సహజసిద్ధ ఎరువులను చల్లి, కొద్ది రోజులు గడిచాక దుక్కి దున్నుతున్నారు. కాపు కాస్తున్న సమయంలో జీవామృతాన్ని డ్రిప్ ద్వారా అందిస్తూ పంటకు అదనపు బలం ఇస్తున్నారు.

★ 'మిశ్రమ వ్యవసాయంతో రైతులకు అదనపు ఆదాయం వస్తోంది. వేరుశెనగకు కూలీ ఖర్చులు తక్కువ. సొంతంగా చేసుకునే రైతులకు ఆదాయం బాగుంటుంది. ఏడాదికి సుమారు రూ.4 లక్షల పైగా మిగులుతోంది.' అని రైతు దారబోయిన మురళీ వివరించారు.

కపర్దేశ్వరుని సేవలో ప్రియాంక మోహన్

తణుకు, న్యూస్‌టుడే: ఓజీ చలన చిత్ర హీరోయిన్ ప్రియాంక మోహన్ సోమవారం తణుకు కపర్దేశ్వర స్వామిని దర్శించుకున్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ జ్యోతిష్యులు భమిడి అఖిల్, మనోహర్ భమిడి సీతారామ కృష్ణావధానులు నివాసానికి ఆమె వచ్చారు. అనంతరం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకుని సందడి వాతావరణం నెలకొంది. యువత ఆమెతో స్వీయచిత్రాలు దిగేందుకు ఎగబడ్డారు.

రైతు సంక్షేమమే లక్ష్యం: ఎంపీ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీ మహేశ్ కుమార్ అన్నారు. 'రైతన్నా మీ కోసం' పేరుతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన డిసెంబరు 2 వరకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టడం గొప్ప విషయమని కొనియాడారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో పోలవరం సహా అన్ని ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శివాలయానికి భూమి విరాళం

టి.నరసాపురం, న్యూస్‌టుడే: అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయానికి చాట్రాతి వీరవెంకట సూర్యప్రకాశరావు కుమారుడు యుగంధర్ తన సోదరులతో కలిసి ఐదు సెంట్ల భూమిని సోమవారం సమర్పించారు. ఈ స్థలాన్ని అర్చకుని గృహ నిర్మాణం నిమిత్తం వినియోగించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు మురళి తెలిపారు.

ఎండోస్కోపీ విధానంలో వెన్నెముక శస్త్ర చికిత్సలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో ఇప్పటి నుంచి ఎండోస్కోపీ విధానంలో వెన్నెముక శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉంటాయని ఆసుపత్రి చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. ఆసుపత్రిలో ఎండోస్కోపీ విధానంలో శస్త్ర చికిత్సలను సోమవారం విజయవంతంగా నిర్వహించారు. ప్రముఖ వెన్నెముక వైద్య నిపుణులు కే.సతీశ్, సాయి సందీప్, వైద్యుల బృందం ఐదుగురికి పరీక్షించి ముగ్గురికి శస్త్ర చికిత్సలు చేసింది. ఈ సందర్భంగా సుధాకరరావు మాట్లాడుతూ నడుము సమస్యలకు చిన్నపాటి కోతతో (సెంటీ మీటరు) ఎండోస్కోపీ విధానంలో ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి ట్రస్ట్ వి.నారాయణమూర్తి, ఎస్.వి.ఎస్.ఎన్.నివృతరావు, ట్రస్టు సభ్యులు ఎస్వీఎస్ఎస్ మూర్తి, ఆసుపత్రి వైద్యులు భువనంద్, హమీద్, బాలాజీ, పి.వి.నాగేంద్రబాబు, సింధు, రమ్య తదితరులు పాల్గొన్నారు.

విర్డ్ ఆసుపత్రిలో వైద్యుల బృందం

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి: ఏపీటీఎఫ్

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.రామారావు విజ్ఞప్తి చేశారు. స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంఘ నాయకులతో కలిసి డీఈవో వెంకట లక్ష్మమ్మకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల నుంచి వినతులు స్వీకరించేందుకు రోజూ సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు సమయం కేటాయించాలన్నారు. డీఎస్సీ-2025 ఉపాధ్యాయులకు లీప్ యాప్‌లో మాన్యువల్ సెలవులు మంజూరు చేస్తూ ఉత్తర్వులివ్వాలని కోరారు. గతేడాది పదో తరగతి పరీక్షలకు సంబంధించి వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యా శాఖలో సమగ్రశిక్షా విలీనానికి డిమాండ్

ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ఏలూరు వన్ టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యా శాఖలో సమగ్ర శిక్ష ఉద్యోగులను విలీనం చేయాలని ఐకాస రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసా శ్రీనివాసరావు, జిల్లా గౌరవాధ్యక్షులు డీఎన్‌వీడీ ప్రసాద్, వి.వినోద్ డిమాండ్ చేశారు. తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ.. 21 రోజుల సమ్మె కాలంలో ప్రభుత్వం రాసిచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా అన్ని విభాగాల వేతనాలు పెంచాలన్నారు. ఎంటీఎస్, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఒడిశా, పంజాబ్, కేరళ తరహాలో రాష్ట్రంలోనూ ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. డిమాండ్లు నెరవేర్చని పక్షంలో ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. వీరికి యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆర్.రవికుమార్ మద్దతు పలికారు.

నేటి నుంచి అంతర పాలిటెక్నిక్ క్రీడలు

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో ఈ నెల 25 నుంచి 28 వరకు 13వ అంతర పాలిటెక్నిక్ క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. తిరుపతి వేంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం (ఎస్వీవీయూ) పరిధిలోని 10 పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొనే ఈ పోటీలకు స్థానిక పాలిటెక్నిక్ కళాశాల అతిథ్యం ఇవ్వనుంది. ఈ పోటీలను ఎస్వీవీయూ వీసీ జేవీ రమణ ప్రారంభిస్తారని స్థానిక గేదెల పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త కె.ఆనందరావు, కళాశాల ప్రిన్సిపల్ వి.సమత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముందస్తు జాగ్రత్తలతో నష్ట నివారణ

మార్టేరు, న్యూస్‌టుడే: డెల్టాలో ఖరీఫ్ వరిచేలు కోత దశకు చేరాయి. ఇలాంటి తరుణంలో వర్షాలు కురిస్తే తీవ్ర నష్టం తప్పదు. ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే నష్టాన్ని చాలా వరకు తగ్గించుకోవచ్చని మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు టి.శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుత దశలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను ఆయన వివరించారు. ★ భారీ వర్ష సూచన ఉంటే కోతకు సిద్ధంగా ఉండి, నిలబడి ఉన్న చేలలో ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని (50 గ్రాములు లీటరు నీటికి) పిచికారీ చేయాలి. కోతలు పూర్తయి పనల మీద ఉంటే కంకులపై ఉప్పు చల్లాలి. దీని వల్ల కుంకులపై గింజలు మొలకెత్తకుండా, రంగు మారకుండా ఉంటాయి. ఎండరాగానే పనలను తిరగవేసి ఎండబెట్టి నూర్చుకోవచ్చు. ★ కోసిన వరి పనలు ఆరకుండా కుప్పలు వేయాల్సి వస్తే ఉప్పు చల్లడం ద్వారా ధాన్యానికి ఎలాంటి నష్టం వాటిల్లదు. 20 రోజుల వరకు కుప్పగా పనలను ఉంచవచ్చు. ★ నూర్పిడి దశలో ధాన్యం తడిస్తే గింజలు మొలకెత్తడమే కాకుండా రంగు మారి చెడు వాసన వస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉప్పు పొడి, ఊక కలిపి ధాన్యాన్ని పోగు పెడితే వారం రోజులు వరకు చెడిపోకుండా కాపాడుకోవచ్చు.

వర్షాలకు తడిసిన వరి కుప్ప

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

ప్రశ్న: కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో కొమ్ము పురుగు ఎలా అరికట్టాలి ? - ముళ్లపూడి జానకిరామారావు, తాడేపల్లిగూడెం

సమాధానం: చెట్ల మొవ్వ భాగంలో వచ్చే ఆకులు, కొబ్బరి మట్టలపై 'వి' ఆకారపు గుర్తులు ఉన్నప్పుడు వెంటనే యాజమాన్య చర్యలు చేపట్టాలి. తల్లి పురుగును ఆకర్షించడానికి నానో ఫిరమోన్ ఎరలు వాడాలి. ప్లాస్టిక్ బకెట్‌కు రెండు రంధ్రాలు పెట్టి మూతకు ఈ ఎరలను దారంతో కట్టాలి. బకెట్ లోపల అర లీటరు నీటిలో ఏదైనా పురుగుల మందు కలపాలి. ఎరకు ఆకర్షితమైన పురుగులు బకెట్‌లోని విషపు ద్రవంలో పడి చనిపోతాయి. కేవలం రూ.200తో 3-4 నెలల పాటు పురుగులను నియంత్రించవచ్చు. 10 గ్రా. క్లోరాంట్రానిప్రోల్ గుళికలు 100 గ్రా. ఇసుకతో కలిపి మొవ్వ, ఆకులో వేయాలి. తోటలో పశువుల ఎరువు ఉంటే కిలో మెటార్రిజియం, 20 కిలోల వేప చెక్క కలిపి టన్ను పశువుల ఎరువుపై వేస్తే పిల్ల పురుగులు చనిపోతాయి.

డా. పి.విజయలక్ష్మి, ప్రధాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

మీరూ అడగొచ్చు ✆ చరవాణి 73826 33692

లాభదాయకంగా చందువా సాగు

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: ఆక్వా చెరువుల్లో సముద్రజాతి చందువా (సిల్వర్ పాంపానో) చేప సాగు విజయవంతమైంది. వీటికి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. వీటి సాగు రైతులకు ప్రయోజనకరంగా, లాభదాయకంగా ఉంటుందని మత్స్యశాఖ సహాయ సంచాలకుడు ఎల్ఎల్ఎన్ రాజు తెలిపారు.

ప్రయోగం విజయవంతం శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాల్లోని సముద్రతీర ప్రాంత భూముల్లో చందువా చేపలను సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎంఎఫ్ఆర్ఐ), మత్స్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా సాగు చేశారు. ఇది విజయవంతం కావడంతో రైతులు ఉప్పునీటి క్షేత్రాల్లో వీటిని సాగు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఎంపిక చేసిన హేచరీల్లో పిల్లల ఉత్పత్తి ప్రారంభించారు. ఆచంట, భీమవరం మండలం దొంగపిండి గ్రామాల్లో రైతులు వీటి సాగు చేపట్టి సానుకూల ఫలితాలు సాధించారు.

చౌడు భూములు అనుకూలం.. సముద్రతీర, చౌడు భూములు వీటి సాగుకు అనుకూలం. మధ్యస్థ ఉష్ణోగ్రతలను తట్టుకుంటాయి. నీటిలో ఉప్పు శాతం ఐదు నుంచి 25 పీపీఎం అనుకూలం. పీహెచ్ 7.5-8.3 మధ్య ఉండాలి. నీటిలో ఆక్సిజన్ శాతం 4ఎంజీ పైన ఉండాలి. స్వచ్ఛమైన సముద్ర, ఉప్పుటేరు జలాల్లో ఇవి జీవిస్తాయి. ఆక్సిజన్ లోపం తలెత్తకుండా చెరువుల్లో నిరంతరం ఏరియేటర్లు తిప్పాలి.

☛ హేచరీల్లో ఉత్పత్తి చేసిన 1-2 అంగుళాల పొడవైన పిల్లలను ఎంపిక చేసుకోవాలి. ఎకరా చెరువులో మూడు వేల నుంచి నాలుగు వేల పిల్లలను వదలాలి. ☛ ఇవి మాంసాహార చేపలు. ప్రొటీన్ శాతం 40-50 మధ్య ఉండే తేలియాడే మేతలు వినియోగించాలి. ☛ 6-8 నెలల్లో ఈ చేప 400- 800 గ్రాముల వరకు బరువు పెరుగుతుంది. హెక్టారు చెరువులో సగటున 4-5 టన్నుల దిగుబడి సాధించేందుకు అవకాశం ఉంటుంది. ఎగుమతిదారులు కిలో చేపలకు రూ.400- రూ.450 వరకు ధర చెల్లిస్తున్నారని, రాబడి బాగుంటుందని ఏడీ తెలిపారు.

భీమవరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న నాయకులు

గణపవరాన్ని పశ్చిమలోనే కొనసాగించండి

గణపవరం, న్యూస్‌టుడే: ప్రజల సౌకర్యార్థం గణపవరం మండలాన్ని పశ్చిమ గోదావరి జిల్లాలోనే కొనసాగించాలని అఖిలపక్ష నాయకులు ఆందోళనకు దిగారు. సరిపల్లెలోని గణపవరం- భీమవరం రాష్ట్రీయ రహదారిపై సోమవారం బైఠాయించి నినాదాలు చేశారు. దాంతో రోడ్డుకిరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం ఎంపీడీవో బేబి శ్రీలక్ష్మి, తహసీల్దార్ అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు జగపతిరాజు, రామలింగరాజు, నరసింహరాజు పాల్గొన్నారు.

వ్యవసాయ అభివృద్ధికి రైతన్న.. మీ కోసం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యవసాయం అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన 'రైతన్న మీ కోసం' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా రైతులకు సూచించారు. పరింపూడి, రాజవరం గ్రామాల్లో నిర్వహించిన రైతన్న.. మీ కోసం కార్యక్రమాల్లో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 24 నుంచి 29వరకు జరిగే కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల ఉద్యోగులు రైతుల దగ్గరకు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని చెప్పారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి కెవిఎన్‌పోశారావు ఉన్నారు.

ఏపీ ఎన్జీవో కార్యవర్గం ఎన్నిక

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీ రాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘ భవనంలో ఏపీ ఎన్జీవో ఏలూరు తాలూకా యూనిట్ నూతన కార్యవర్గ ఎన్నికలు సోమవారం నిర్వహించారు. తొలుత సంఘ సభ్యులు నగరంలో ప్రదర్శన చేపట్టారు. ఎన్నికల అధికారులుగా నోరి శ్రీనివాస్, ఆర్.జగదీశ్వరి, పరిశీలకులుగా ఎన్.ఝాన్సీ లక్ష్మీబాయి వ్యవహరించారు. పంచాయతీరాజ్‌శాఖ అధ్యక్షుడిగా జి.శ్రీధర్‌రాజు, సహాయ కార్యదర్శిగా కె.డేవిడ్ హనన్య, వైద్యారోగ్యశాఖ అసోసియేట్ అధ్యక్షుడిగా జి.రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా జి.చంద్రశేఖర్, సహాయ కార్యదర్శిగా సాహిత్య, రాష్ట్ర కౌన్సిలర్‌గా కేఎన్‌వీఎస్ రామకృష్ణ, విద్యా శాఖ ఉపాధ్యక్షుడిగా కేఎస్‌ఆర్ మోహన్, వ్యవసాయ శాఖ ఉపాధ్యక్షుడిగా వీఎన్‌ఆర్ గంగాధర్, జలవనరుల శాఖ ఉపాధ్యక్షురాలిగా ఎ.సత్యభారతి, కార్యనిర్వాహణ కార్యదర్శిగా టి.జయరాజు, పే, అకౌంట్స్ ఉపాధ్యక్షుడిగా బి.పవన్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ కోశాధికారిగా పూడి శ్రీనివాస్, ప్రభుత్వ ఐటీఐ సహాయ కార్యదర్శిగా ఎం.సత్తిబాబు, ర.భ.శా. సహాయ కార్యదర్శిగా జి.దుర్గాప్రసాద్, వాణిజ్య పన్నుల శాఖ సహాయ కార్యదర్శిగా జీజీఎస్ఎస్ ఫణికుమార్, రాష్ట్ర కౌన్సిలర్‌గా కె.బాలాజీ, ఖజానా శాఖ సహాయ కార్యదర్శిగా మీనాకుమారి, బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర కౌన్సిలర్‌గా బి.ప్రభావతిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చోడగిరి శ్రీనివాస్, నెరుసు వెంకట రామారావు, సహాయ కార్యదర్శి ఆర్.ఎస్.హరినాథ్ తదితరులు అభినందనలు తెలిపారు.

ఎస్టీయూ జిల్లా కమిటీ ఎంపిక

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) కార్యాలయంలో సోమవారం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పీబీవీఎన్ఎల్ నారాయణ, ప్రధాన కార్యదర్శిగా కేఆర్ పవన్‌కుమార్, ఆర్థిక కార్యదర్శిగా జి.రాము ఎన్నికయ్యారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ పర్యవేక్షించారు. రాష్ట్ర సహాధ్యక్షుడు కె.రామచంద్రారావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

నారాయణ

పవన్‌కుమార్

రేషన్ నిల్వల్లో వ్యత్యాసాలు

జంగారెడ్డిగూడెం ఎంఎల్ఎస్ గిడ్డంగిలో విజిలెన్స్ తనిఖీలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం ఎంఎల్ఎస్ గిడ్డంగిలో రికార్డుల కంటే అధికంగా రేషన్ సరకులు ఉన్నట్లు గుర్తించామని విజిలెన్స్ తహసీల్దారు కన్యాకుమారి, ఎస్సై రంజిత్‌కుమార్‌లు తెలిపారు. గిడ్డంగిలో సోమవారం సాయంత్రం ఈ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాకుతో రికార్డులను సరిపోల్చగా బియ్యం, పంచదార, కందిపప్పుతోపాటు ఇతర సరకుల్లోను భారీ వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. వ్యత్యాసాలకు సంబంధించిన వివరాలు వెంటనే తాము చెప్పలేమని, నివేదిక మాత్రం పౌరసరఫరాల శాఖ డీఎంకు అందజేస్తామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. బియ్యం తూకంలో వ్యత్యాసం వస్తుందని డీలర్లు ఆరోపించడంతో ఈ సందర్భంగా సీఎస్ డీటీ వెంకట్ ఓ బియ్యం బస్తా తూకం వేయించారు. సంచితో కలిపి బియ్యం బరువు 50.580 కిలోలు ఉండాలి. కానీ ఇది 50 కిలోలు మాత్రమే ఉంది. 580 గ్రాములు తగ్గింది. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి తూకం వేయకుండా బస్తాలు లెక్క కట్టి ఇవ్వడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఈ సందర్భంగా ఓ డీలర్ ఆరోపించారు. దీంతో తూకం వేసే డీలర్లకు రేషన్ సరఫరా చేయాలని ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌ఛార్జిని అధికారులు ఆదేశించారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తూకం వేయగా అరకిలో తగ్గిన బియ్యం బస్తా

ప్రకటన

మహారాజశ్రీ విజయవాడ 6వ అదనపు సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ గారి దివ్యసముఖమునకు

O.S.No. 91/2025

Between

Sikhakolli Madhuni ...వాది

And

Kolli Koteswara Rao ...ప్రతివాది

S/o. Krishna Murthy, Prop. Annapurna Poultry Farm, Sri Balaji Talkies, Plot No. 101, Central Excise Colony, Vatluru Village, Pedapadu Mandal, Eluru

పై నెంబరు దావాను ప్రతివాది శ్రీ కోర్టు నందు హాజరు నిమిత్తం ది. 08-12-2025వ తేదీకి వాయిదా ఉత్తర్వులు దయచేసియున్నారు. సదరు తేదీకి అనగా 08-12-2025 తేదీ ఉదయం గం॥ 10-30 ని॥లకు ప్రతివాది శ్రీ కోర్టు నందు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరుకాని యెడల, ప్రతివాదికి పరోక్షంగా తీర్మానం గావించెదరని ఇందుమూలంగా తెలియజేయటం అయినది.

(ది. 19-11-2025 తేదీన శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

M.D.N. Nageswara Gupta,
Advocate, Hanumanpeta,
Vijayawada - 3

Vijayawada, Date: 19-11-2025

సముద్రంలో గల్లంతైన విద్యార్థి మృతి

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో గల్లంతైన ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందారు. ఏలూరు పరిధి కొత్తపేటకు చెందిన మునగాల మోహనసాయి గణేశ్ (19) కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలులోని ప్రయివేటు కళాశాలలో ఇంజినీరింగ్ రెండో ఏడాది చదువుతున్నారు. ఆదివారం ముగ్గురు మిత్రులతో కలిసి ద్విచక్ర వాహనాలపై పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. సముద్రంలో స్నానానికి దిగిన గణేశ్ అలల ఉద్ధృతికి లోనికి కొట్టుకువెళ్లి గల్లంతయ్యారు. అతడి ఆచూకీ కోసం మెరైన్ పోలీసులు, బంధువులు, స్నేహితులు తీరంలో గాలిస్తుండగా సోమవారం మోళ్లపర్రు వద్ద మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నరసాపురం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై జి.వాసు తెలిపారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఉరేసుకొని యువకుడు మృతి చెందిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు. . ఆర్‌ఆర్‌పేట గాదివారివీధికి చెందిన గేదెల సాయికిరణ్(33) రోజువారీ కూలీ. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో సాయికిరణ్ భార్య ఇటీవల ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయారు. అప్పట్నుంచి ఒంటరిగా ఉంటోన్న అతడు.. తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరేసుకొని మృతి చెందారు. రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పోలీసుల కథనం మేరకు.. ఏలూరు లోని మరడాని రంగారావు కాలనీకి చెందిన రామాయణపు గోపీనాథ్ అలియాస్ గోపి(22) తన స్నేహితుడితో కలిసి 2023 సెప్టెంబరు 4న బయటకు వెళ్లారు. అతడితో దక్షిణపు వీధి పరిధి జేపీ కాలనీకి చెందిన యర్రా గోవింద్ గొడవ పడ్డాడు. ఈ క్రమంలో గోవింద్ సీసా పగులగొట్టి గోపి మెడపై పొడిచి పరారయ్యాడు. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. దీనిపై మృతుడి తండ్రి అప్పారావు ఫిర్యాదు మేరకు యర్రా గోవింద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు తుది విచారణను జిల్లా రెండో అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఇందిరా ప్రియదర్శిని సోమవారం చేపట్టారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు నేడు

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: డిసెంబరు 3న ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా.. స్థానిక ఏఎస్ఆర్ స్టేడియంలో మంగళవారం విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో ఎస్.ఎ.అజీజ్ తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు వాలీబాల్, క్రికెట్, పరుగు, బ్యాడ్మింటన్ తదితర విభాగాల్లో పోటీలు ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని వివరాలకు 99487 79015 నంబరును సంప్రదించాలని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్ స్థిరాస్తి ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరంలేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ 9396999669.

JOBS

రాజమండ్రి దానవాయిపేట నందు పనిచేయుటకు నర్సులు కావలెను. (నో నైట్ డ్యూటీస్) Contact Cell: 76749 99906

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.45 పై॥

తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం CLASSIFIEDS

కెనరా బ్యాంక్ Canara Bank సిండికేట్ Syndicate

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీస్, డి.నెం.54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మీ అవెన్యూ, శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 8331011695, ఇ-మెయిల్ : armvij@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, విజయవాడ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన క్రింద పేర్కొను బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు [illegible]

ఇ-వేలం తేదీ & సమయం: తేది.15.12.2025, [illegible]

ఋణగ్రహీత / హామీదారుల & బ్రాంచ్ వివరాలు మరియు బకాయి మొత్తం	ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ.లలో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
[illegible] బకాయి మొత్తం: రూ.29,49,438.20 పై + వడ్డీ + ఇతర ఖర్చులు	[illegible]	రూ. 48.60 లక్షలు	రూ. 4.86 లక్షలు
[illegible] బకాయి మొత్తం: రూ.48,01,500.81 పై + వడ్డీ + ఇతర ఖర్చులు	[illegible]	రూ. 51.84 లక్షలు	రూ. 5.19 లక్షలు

[illegible] "https://baanknet.com/eauction-psb" [illegible] 7046612345/6354910172/8291220220/ 9892219848/8160205061, [illegible] support.baanknet@psballiance.com

తేది: 20-11-2025, ప్రదేశం : విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఏలూరు

●ఏలూరు ●దెందులూరు ●ఉంగుటూరు

మాట్లాడుతున్న పంకజ్ కుమార్

అభ్యసన సామర్థ్యాలు పెంచుదాం

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని సమగ్ర శిక్షా ఏపీసీ పంకజ్ కుమార్ అన్నారు. స్థానిక సుబ్బమ్మదేవి నగరపాలకోన్నత పాఠశాలలో పీఎంశ్రీ బడుల్లోని 'పాల్' ప్రయోగశాలల నిర్వహణపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీసీ మాట్లాడుతూ.. ప్రయోగశాలల ద్వారా విద్యార్థులకు మరింత మెరుగైన బోధన అందించాలన్నారు. సమగ్ర శిక్షా రాష్ట్ర పరిశీలకుడు కిశోర్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంపుల చెరువు ఆధునికీకరణకు చర్యలు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: పంపుల చెరువు ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు నగర కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. స్థానిక పంపుల చెరువు ప్రాంగణంలోని నీటి నిల్వ ట్యాంకులను సోమవారం ఆయన పరిశీలించారు. నగర వాసులు తాగునీటి అవసరాల దృష్ట్యా గోదావరితో పాటు కృష్ణా జలాలను సైతం నిల్వ చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే కృష్ణా కాలువ జలాలను మోటార్లతో తోడుతున్నట్లు వివరించారు. ఆయన వెంట నగరపాలక సంస్థ ఎంఈఈ సురేంద్రబాబు, ఎలక్ట్రికల్ డీఈఈ నారాయణ, ఏఈలు సాయి, పవన్ తదితరులు ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ? శ్రీరామ్‌నగర్‌లోని 11, 12 రహదారుల మధ్య మురుగు కాలువ పూడిపోయింది. పూడిక తీయకపోవడంతో మురుగు వెళ్లడం లేదు. **- ప్రభాకర్, స్థానికుడు**

✔ మురుగు కాలువలో పూడిక తీయిస్తాం. దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తాం. **- భానుప్రతాప్, కమిషనర్**

? శాంతినగర్ 12 నుంచి 3వ రహదారికి వెళ్లే మలుపులో మురుగు కాలువ ఆక్రమించేశారు. ఇంటి ముందు సిమెంట్ చప్టా నిర్మించడంతో ఇబ్బందులు పడుతున్నాం. **- మోహనరావు, స్థానికుడు**

✔ మురుగు కాలువపై అక్రమంగా నిర్మించిన చప్టా తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **- భానుప్రతాప్, కమిషనర్**

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ? చాటపర్రు రోడ్డు శివారులో వీధి దీపాలు కొన్నాళ్లుగా వెలగడం లేదు. రాత్రివేళ చీకట్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. **- నారాయణరావు**

✔ సిబ్బందిని పంపి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. అవసరమైతే కొత్తవి ఏర్పాటు చేస్తాం. **- పవన్, విద్యుత్తు ఏఈ**

దెందులూరు, న్యూస్‌టుడే: ? రాయితీ అపరాల విత్తనాలు ఇంకా అందించలేదు. బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు విత్తనాలు కొనాల్సి వస్తోంది. **- వెంకటేశ్వరరావు, రైతు, సీతంపేట**

✔ ఏపీ సీడ్స్ ద్వారా అపరాల విత్తనాలు అందిస్తున్నాం. రైతులు ఏవో కార్యాలయంలో సంప్రదించాలి. **- అనిల్‌కుమారి, ఏడీఏ**

అలా కొనేసి.. ఇలా చెల్లించేసి!

ఖరీఫ్ ధాన్యానికి త్వరితం నగదు జమ

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో వరి పండించి.. ప్రభుత్వానికి ధాన్యం విక్రయిస్తున్న రైతులకు 24 గంటల్లోనే నగదు జమవుతోంది. గత వైకాపా సర్కారు హయాంలో ఖరీఫ్, రబీ సీజన్లలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించిన రైతులు నెలల తరబడి నగదుకు నిరీక్షించేవారు. ధాన్యం కొన్న 21 రోజుల్లోపు నగదు చెల్లిస్తామని ప్రకటించి ఆచరణలో విఫలమైంది. కూటమి ప్రభుత్వం 48 గంటల్లో సొమ్ము ఖాతాల్లో జమ చేస్తామని హామీనిచ్చి.. కేవలం 24 గంటల్లోనే నగదు చెల్లిస్తోంది.

ముమ్మరంగా మాసూళ్లు.. ఉంగుటూరు, ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల్లో స్వర్ణ, సంపద స్వర్ణ, పీఎల్ఏ, ఎంటీయూ 1318, పీఆర్ 126 తదితర రకాలు ఎక్కువగా సాగు చేశారు. ప్రస్తుతం మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో వైపు ధాన్యం సేకరణ వేగంగా జరుగుతోంది. ఇప్పటి వరకు 4,868 మంది రైతుల నుంచి 37,875 టన్నుల ధాన్యం సేకరించగా.. రూ.51.86 కోట్లు జమయ్యాయి. మరో రూ.47.86 కోట్లు నేడో, రేపో జమ కానున్నాయి. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు సత్వరం నగదు జమయ్యేలా ట్రక్ షీటుతో పాటు ఎఫ్‌టీవో జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్ తెలిపారు.

బస్తాలను లారీలోకి ఎగుమతి చేస్తున్న కూలీలు

మూడు నియోజకవర్గాల్లో ఇదీ పరిస్థితి..

మండలం	రైతులు	సేకరణ (టన్నుల్లో)	జమైన నగదు (రూ.కోట్లలో)
ఉంగుటూరు	2,648	24,091	31.69
భీమడోలు	650	5,447	7.94
నిడమర్రు	235	1,520	0.39
గణపవరం	248	1,764	1.74
దెందులూరు	712	1,456	6.05
పెదపాడు	209	2,188	2.55
పెదవేగి	160	1,362	1.50

ఆపత్కాలంలో జనసేనాని అండ: పత్సమట్ల

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఆపత్కాలంలోని జనసేన కార్యకర్తలు, వారి కుటుంబాలకు జనసేనాని, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కొనియాడారు. స్థానిక విడిది కార్యాలయంలో ప్రమాదవశాత్తు ఇటీవల మరణించిన జనసేన క్రియాశీలక కార్యకర్తల కుటుంబాలకు సోమవారం బీమా చెక్కులు పంపిణీ చేశారు. గాలి వెంకట సత్యనారాయణ(చిలకంపాడు), అంజూరి మావుళ్లు(అప్పన్నపేట), తుంపల సుభాష్(చేబ్రోలు) కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తల శ్రేయస్సుకు రూ.5 లక్షల ప్రమాద బీమా చేయించిన ఏకైక నాయకుడు పవన్‌కల్యాణ్ అని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు ఇస్తున్న ధర్మరాజు

నగరాభివృద్ధికి పెద్దపీట: బడేటి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నగరాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక విడిది కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకొని.. వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగర శివారు ప్రాంతాల ప్రగతికి తోడ్పాటునందిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం సమర్థంగా పని చేస్తోందన్నారు. అనంతరం తంగెళ్లమూడి జాతర కొలుపుల కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేశారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

'అన్నదాత సుఖీభవ'తో ఆనందం

పెదవేగి (పెదపాడు), న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ యోజన'తో కర్షకుల్లో ఆనందం వెల్లి విరుస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం బాపిరాజుగూడెం, నడిపల్లి, విజయరాయి, జగన్నాథపురం, కవ్వకుంట, వంగూరు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. పలువురు రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు పంపిన అభినందనల పత్రాలు ఇంటింటికీ వెళ్లి అందజేశారు. చింతమనేని మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రైతులకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలో ఎవరికైనా అర్హులకు అన్నదాత సుఖీభవ నగదు అందకుంటే వ్యవసాయ, ఉద్యానాధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.

రైతుకు అభినందన పత్రం ఇస్తున్న ప్రభాకర్

గోడు వినరు.. గోస తీర్చరు!

'మీ కోసం'లో బాధితుల మొర

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: 'మా సమస్యల పరిష్కారానికి అధికారుల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నాం. మండల స్థాయిలో మా గోడు వినేవారు కరవయ్యారు. అధికారులు మా వినతులను బుట్టదాఖలు చేస్తున్నారు. చేసేది లేక.. వ్యయప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వచ్చాం. ఇక్కడైనా మా వెతలు తీర్చండి' అని పలువురు అర్జీదారులు విజ్ఞప్తి చేశారు. సోమవారం నిర్వహించిన మీ కోసంలో డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్, నగర కమిషనర్ భానుప్రతాప్ దృష్టికి తమ గోస తీసుకెళ్లారు.

దివ్యాంగురాలి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్

దివ్యాంగ పింఛను ఇప్పించండి: నా పేరు షేక్ మీరాబీ. మాది ఏలూరు మండలం మానూరు గ్రామం. నా కిడ్నీలు పాడయ్యాయి. ఊపిరితిత్తుల సమస్య ఉంది. అనారోగ్యం కారణాలతో పూర్తిగా నడవలేక పోతున్నాను. ప్రస్తుతం రూ.6 వేల పింఛను ఇస్తున్నారు. వైద్య సేవల నిమిత్తం నాకు దివ్యాంగ పింఛను రూ.15 వేలు ఇప్పిస్తే బాగుంటుంది.

ఆ సొమ్ము గ్రామాభివృద్ధి వినియోగించాలి: నా పేరు ఏలియా. మాది భీమడోలు మండలం ఆగడాలలంక. తమ గ్రామంలో కొల్లేరు కాంటూరు ఎగువన ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని కొందరు చెరువుగా మార్చి ఫలసాయం పొందుతున్నారు. ఆ భూమిని సర్వే చేయించి, ఫలసాయం పంచాయతీకి చెందేలా చూడాలి. ఆ సొమ్ము గ్రామాభివృద్ధికి వినియోగించాలి. ఆ దిశగా అధికారులు చొరవ చూపాలి.

ఆక్రమణలు తొలగిస్తేనే.. నా పేరు సీహెచ్ భూషణం. మాది పెదవేగి మండలం బాపిరాజుగూడెం. మా గ్రామంలోని శ్మశానవాటికను కొందరు ఆక్రమించేశారు. దాన్ని పక్కనే ఉన్న పొలాన్నీ ఆక్రమించేందుకు చూస్తున్నారు. ఈ విషయమై పెదవేగి తహసీల్దార్, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. పరిష్కారం దొరకలేదు. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగింపునకు చర్యలు తీసుకోవాలి.

ఆరోగ్య కేంద్రాన్ని వినియోగంలోకి తెస్తాం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: నారాయణపురంలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని త్వరితం వినియోగంలోకి తీసుకొస్తామని ఎంపీడీవో రాజ్ మనోజ్ తెలిపారు. భవన నిర్మాణం పూర్తై ఏడాది దాటినా.. కార్యకలాపాలు నిర్వహించకపోవడంపై 'నిర్మించారు.. వదిలేశారు' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. ఎంపీడీవో స్పందించి ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించారు. భవనంలో ఎందుకు కార్యకలాపాలు నిర్వహించలేదని సిబ్బందిని ప్రశ్నించారు. విషయాన్ని ఎమ్మెల్యే ధర్మరాజు దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

వైద్యుడికి సంజాయిషీ నోటీసులు

ఈనాడు కథనాలకు స్పందన

నిడమర్రు గ్రామీణం: పెదనిండ్రకొలను పీహెచ్‌సీ వైద్యుడికి జిల్లా ఉన్నతాధికారులు సంజాయిషీ నోటీసులిచ్చారు. వైద్యులు, సిబ్బంది విధులకు సరిగా రాకపోవడంపై 'ఆదివారం వైద్యానికి రాంరాం!' శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. 48 గంటల్లోపు వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు

పెదవేగి, న్యూస్‌టుడే: వంగూరులోని ఏఎన్ఎం క్రికెట్ అకాడమీలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన సోమవారం క్రికెట్ ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు తరలివచ్చారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్లేశ్వరరావు తెలిపారు. పీఈటీలు కె.శ్రీనివాస్, రమేశ్ పర్యవేక్షించారు.

జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన విద్యార్థులు

జాతీయ స్థాయి పోటీలకు స్నేహిత..
పెదపాడు, న్యూస్‌టుడే: వీరమ్మకుంట ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.స్నేహిత జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 23 వరకు ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైక్లింగ్ ట్రాక్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచారు. వచ్చే ఏడాది జనవరి 13న ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు.

సమగ్ర విచారణ చేపట్టండి: ఈయూ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరులో ఆర్టీసీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పెట్రోలు బంకులో నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలని ఐకాస నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక డిపో ఎదుట ఐకాస నేతృత్వంలో సోమవారం నిరాహార దీక్షలు చేపట్టారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ ఘటనలో అక్రమంగా సస్పెన్షన్‌కు గురైన సిబ్బందిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలని కోరారు. నాయకులు వి.రామారావు, ఎ.రమేశ్, ఎస్‌కే నాగూర్, కేవీఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

ఏలూరు గ్రామీణ, పెదపాడు- న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం పర్యటనకు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఏలూరు, దెందులూరు ఎమ్మెల్యేలు చంటి, ప్రభాకర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు అంశాలను వారు పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు.

ఎండు కొమ్మ.. ప్రమాదమేనమ్మా!

వట్లూరు- ఏలూరు మినీ బైపాస్ అంచుల్లో ఎండిన చెట్ల కొమ్మలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి గాలులకూ కొమ్మలు విరిగి రోడ్డుపై పడిపోతున్నాయి. కొన్నిచోట్ల విద్యుత్తు తీగలపై పడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, వట్లూరు(పెదపాడు)**

పెచ్చులూడి.. భద్రత కొరవడి

నిడమర్రులోని పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షానికే భవనం ఉరుస్తుండటంతో.. దస్త్రాలు, మందులు తడిసిపోతున్నాయి. పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో.. ఎప్పుడు ఏం జరుగుతుందోనని సిబ్బంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం**

సోమవారం సంత.. ట్రాఫిక్‌తో చింత

గణపవరంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరిగిపోతోంది. రోడ్డుకిరువైపులా ఆక్రమణలు పెరిగిపోవడం.. ఎక్కడికక్కడ వాహనాలు నిలిపివేస్తుండటంతో సమస్య ఏర్పడుతోంది. సోమవారం సంత కావడంతో.. రద్దీ మరింత ఎక్కువై వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. **- న్యూస్‌టుడే, గణపవరం**

దారుంది.. జాగ్రత్తంటోంది!

ఉంగుటూరు మండలం రాచూరు జడ్పీ ఉన్నత పాఠశాల సమీప మలుపు ప్రమాదకరంగా ఉంది. రోడ్డును ఆనుకుని మురుగు బోదె ఉండగా.. సరిగా మలుపులో రహదారి గట్టు కోతకు గురైంది. వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా.. బోదెలో దూసుకెళ్లే ప్రమాదముంది. **- న్యూస్‌టుడే, రాచూరు(ఉంగుటూరు)**

కాలువ ఇలా.. నీరు పారేదెలా!

నిడమర్రులోని పంట కాలువపై పిచ్చిమొక్కలు మొలిచి ఏపుగా పెరిగిపోయాయి. కొన్నిచోట్ల నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి. వీటిని నెలల తరబడి తొలగించకపోవడంతో.. సాగునీరు ముందుకెళ్లడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం**

ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు మండల ప్రజా పరిషత్తు అభివృద్ధి అధికారిగా ఎ.జనార్దన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూలు జిల్లా డోన్ డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తూ.. ఉద్యోగోన్నతిపై ఇక్కడికొచ్చారు. బాధ్యతలు తీసుకున్న జనార్దన్‌కు కార్యాలయ సిబ్బంది మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

దెందులూరు: దెందులూరు ఎంపీడీవోగా వీర ప్రతాప్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన డోన్ ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షకుడిగా పని చేస్తూ.. ఉద్యోగోన్నతిపై దెందులూరు ఎంపీడీవోగా వచ్చారు.

పట్టాభి సీతారామయ్యకు నివాళి

గుండుగొలను(భీమడోలు), న్యూస్‌టుడే: గుండుగొలనులో స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకుడు బోగరాజు పట్టాభి సీతారామయ్య జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. స్థానిక వింధ్యవాసి చెరువు గట్టు వద్దనున్న ఆయన విగ్రహానికి పట్టాభి అభ్యుదయ సంఘ నాయకులు పుష్పాంజలి ఘటించారు. కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్కందుని షష్ఠి ఉత్సవాలు

భీమడోలు, న్యూస్‌టుడే: గుండుగొలనులోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి షష్ఠి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొలి రోజు స్వామి వారికి 108 కలశాలతో పంచామృతాలతో అభిషేకాలు చేయనున్నారు. బుధవారం స్వామివారి కల్యాణోత్సవం, గురువారం రాహుకేతు పూజ, హోమం నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్ వెంకటరమణమూర్తి తెలిపారు.

సోమలింగేశ్వరుడికి ప్రత్యేకాలంకరణ
ఏలూరు ఆధ్యాత్మికం: తూర్పువీధిలోని సోమలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి ప్రత్యేకాభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం సోమలింగేశ్వరుడిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

విద్యార్థులకు బయోమెట్రిక్ ఆధార్ శిబిరాలు

భీమడోలు: విద్యార్థులకు ఆధార్, అపార్ ఐడీల జారీకి ఇబ్బందుల్లేకుండా ప్రత్యేకంగా ఆధార్ నమోదు శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో-2 భాస్కరకుమార్ తెలిపారు. గుండుగొలనులో నిర్వహిస్తున్న బయోమెట్రిక్ ఆధార్ శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై రమేశ్ కథనం మేరకు.. పెదనిండ్రకొలను తూర్పుపేటకు చెందిన పిండి మౌనిక (25), భర్త సంజీవరావు దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఇటీవల తరచూ భార్యాభర్తలు గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన మౌనిక.. సోమవారం ఇంట్లోనే ఉరేసుకున్నారు. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తండ్రి కొచ్చెర్ల ప్రసాద్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు నుంచి జారి పడి గాయాలు.. ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లాకు చెందిన యువకుడు పతివాడ నాని సోమవారం విజయవాడ నుంచి సొంతూరికి రైలులో వెళ్తున్నారు. మార్గం మధ్యలోని సత్రంపాడు సమీపంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి కింద పడి గాయపడ్డారు. స్థానికులు ఆతడిని 108 వాహనంలో సర్వజన ఆసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు.. పెదవేగి(పెదపాడు): పెదవేగి మండలం భోగాపురానికి చెందిన ఆరేపల్లి శివకుమార్‌కు పెదకడిమి శివారులో జామ తోట ఉంది. తోటలోకి ఆదివారం కోతులు రావడంతో.. పక్క తోట రైతు కొండయ్యతో కలిసి వాటిని బయటకు తరిమారు. పొరుగు రైతు చింతలచెరువు జోజి మా తోటలోకి కోతులు తోలుతారా అంటూ కత్తితో శివకుమార్‌పై దాడి చేశాడు. గాయపడిన శివకుమార్‌ను స్థానికులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వర్గాల సమాచారంతో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ షేక్ హైదర్ సాహెబ్ తెలిపారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, జిల్లా పరిశీలకుడు ప్రవీణ్ దావర్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణంపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ కార్యదర్శి పాలెక్ వర్మ అధ్యక్షత వహించారు. దావర్ మాట్లాడుతూ.. మంగళ, బుధ, గురువారాల్లో ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం కానున్నట్లు చెప్పారు. పీసీసీ ప్రతినిధులు ఎం.మోహనరావు, కె.శివాజీ, జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, మాజీ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రవీణ్ దావర్

లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ డిమాండ్ చేశారు. బువ్వనపల్లిలో సంఘ నాయకులు సోమవారం నిరసన చేపట్టారు. నాయకులు బాలయ్య, రాంబాబు, రమణ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

ఏలూరు విద్యా విభాగం: స్థానిక సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో ప్రత్యేక శిక్షణ తరగతులను ఐసీటీ అకాడమీ సమన్వయకర్త రఘురామ్ సోమవారం ప్రారంభించారు. 'ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయబిలిటీ'పై డిసెంబరు 10 వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. కరస్పాండెంట్ ప్రవీణరావు, ప్రధానాచార్యులు సరళ పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

ఇట్లు: జె.వి.ఆర్.ఎల్.నరసింహం
అడ్వకేట్
సెల్: 96760 45519, 95199 45937

గట్టు అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

భీమడోలు: పోలసానిపల్లి పంచాయతీలో పోలవరం కుడి కాలువ గట్టును కొందరు అక్రమంగా తవ్వేస్తున్నారని వార్డు సభ్యుడు భీమడోలు రామకృష్ణ సోమవారం మీ కోసంలో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్త అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారని, దీనిపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	కొదమసింహం
అంబిక మినీ	రాజు వెడ్స్ రాంబాయి
సాయిబాలాజీ	12ఏ రైల్వేకాలనీ
బాలాజీ	ఆవారా
సత్యనారాయణ స్క్రీన్ 1	కాంత
సత్యనారాయణ స్క్రీన్ 2	ప్రేమంటే
సత్యనారాయణ స్క్రీన్ 3	మాస్ జాతర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	మఫ్టీ పోలీస్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	సంతాన ప్రాప్తిరస్తు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	పాంచ్‌మినార్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	కాంత
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	ప్రేమంటే
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	12ఏ రైల్వేకాలనీ
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	కాంత

పుష్కర కాలం.. కల సాకారం!

పెదనిండ్రకొలను- పత్తేపురం రహదారి పూర్తి

నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనిండ్రకొలను- పత్తేపురం గ్రామాల మధ్య రహదారి నిర్మాణ పనులు పుష్కర కాలం తర్వాత పూర్తయ్యాయి. 2014లో పెదనిండ్రకొలను గాంధీ భవనం నుంచి పందికోడు వంతెన వరకూ సీసీ రహదారి నిర్మించారు. ఆ తర్వాత రోడ్డు నిర్వహణను అధికారులు, పాలకులు విస్మరించారు. తుపాన్లు, భారీ వర్షాలకు రోడ్డు దెబ్బతింది. అడుకో గుంత చందాన మారడంతో.. ఈ మార్గంలో రాకపోకలకు సాగించేందుకు చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

ఎట్టకేలకు నిధులు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. రోడ్డు అభివృద్ధికి ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు చొరవ చూపారు. సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.3 కోట్లు తీసుకొచ్చారు. ఈ నిధులతో పత్తేపురం నుంచి గాంధీ భవనం వరకూ తారురోడ్డు పనులు ప్రారంభించారు. ఎట్టకేలకు నిర్మాణం పూర్తవడంతో ఆరు గ్రామాల ప్రజలు సంతోషిస్తున్నారు. మరోవైపు పెదనిండ్రకొలను శివారు నుంచి నిడమర్రు మీసేవ కేంద్రం వరకున్న 1.6 కిలోమీటర్ల రహదారి అధ్వానంగా మారిందని, దీన్ని పునర్నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

బాగుపడిన రోడ్డు!

ఏలూరు సర్వజన ఆసుపత్రికి వెళ్లే రోడ్డును ఎట్టకేలకు బాగు చేశారు. నెల రోజుల కిందట రహదారి అధ్వానం ఉండటంతో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోయేది. వైద్య కళాశాల నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డును బాగు చేయడంతో సాంత్వన చేకూరింది. **- ఈనాడు, ఏలూరు**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవదాయ - ధర్మదాయ శాఖ
శ్రీ కొత్తమసు లింగయ్య గారి అన్న సత్రం, అగ్రహారం, ఏలూరు
షాపు లైసెన్సు హక్కునకు టెండర్-కమ్-బహిరంగ వేలం పాట ప్రకటన

ఏలూరు జిల్లా, ఏలూరు మండలం, ఏలూరు నగరం, అగ్రహారంలోగల శ్రీ కొత్తమసు లింగయ్య గారి అన్న సత్రంనకు, మెయిన్ బ్రాంచ్, గడియారా స్థంభం వద్ద ఈ దిగువ ఉదహరించిన రేకుల షెడ్‌తో గల షాపు నందు వ్యాపారం చేసుకొను లైసెన్సు ఫీజు హక్కునకు అప్పగించిన తేదీ నుండి మూడు సంవత్సరముల కాలమునకు గాను ది. 28-11-2025వ తేదీ ఉదయం 11.00 గంటలకు సదరు షాపు నందు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల వారి సమక్షంలో టెండర్-కమ్-బహిరంగ వేలం పాట నిర్వహించబడును. కావున ఆసక్తిగలవారు ప్రథమ ధరావతు కట్టి పాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది.

వ. నెం.	వివరము	విస్తీర్ణము	షాపు నెం.	చెల్లించవలసిన ధరావతు సొమ్ము	వేలం పాట తేదీ సమయం & ప్రదేశం	లీజు కాలపరిమితి
1	డోర్ నెం. 6 సి-1-46/3 రేకుల షెడ్డు	9.2X13.6 చ॥అ॥లు	షాపు	రూ. 5,000/-	ది. 28-11-2025 తేదీ ఉదయం 11.00 గంటలకు	అప్పగించిన కాలము నుంచి 3 సం॥ల వరకు

కె.కృష్ణమోహన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్
సెల్: 98484 92142

సం/- కార్యనిర్వహణాధికారి
సెల్: 83097 62049

(c) eenadu

పోలవరం
•పోలవరం •చింతలపూడి

వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయండి

మాట్లాడుతున్న పీవో రాములు నాయక్

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణతను సాధించేందుకు వచ్చే నెల 6 నుంచి ఐటీడీఏ ద్వారా చేపట్టే వంద రోజుల ప్రణాళికను ఉపాధ్యాయులు పక్కాగా అమలు చేయాలని ఐటీడీఏ పీవో రాములు నాయక్ ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్లు, వసతి గృహాల సంక్షేమాధికారులతో ఐటీడీఏలో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారాన్ని పెట్టాలని, ఆహారపట్టికను కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే తక్షణ వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. ప్రాథమిక తరగతుల విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాన్ని పెంచాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకుడు జగన్నాథం, ఉప విద్యాశాఖాధికారి రవిప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం

వేగవరం: కరపత్రాలను అందిస్తున్న రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం గ్రామీణ, కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో భాగంగా కర్షకులకు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును వివరించారు. ★ చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లోనూ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 'రైతన్న మీకోసం' కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది గ్రామాల్లోని అన్నదాతల ఇళ్ల వద్దకు వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన సందేశ పత్రాలను పంపిణీ చేశారు. కర్షకుల కష్టసుఖాలు, ఇతర వివరాలను తెలుసుకొని యాప్‌లో నమోదు చేశారు. ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యతను, వ్యవసాయానికి ప్రభుత్వ రాయితీలను గడపగడపలో వివరించారు.

కావ్య కుటుంబాన్ని ఆదుకుంటాం: ఎమ్మెల్యే

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గురుకుల పాఠశాల విద్యార్థిని కావ్య మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధిత కుటుంబానికి సత్వర న్యాయం చేస్తామని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం జొన్నవారిగూడెంలో బాలిక కుటుంబసభ్యులను ఆయన సోమవారం పరామర్శించారు. వారి నుంచి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కావ్య మృతి కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేసేలా అధికారులను ఆదేశించామన్నారు. బాలిక తల్లికి ప్రభుత్వం నుంచి మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కొండలు ఎక్కాలి.. గుట్టలు దాటాలి..!

ఉడతపల్లి నుంచి వింజరం వెళ్లే అభయారణ్యంలోని అడవి దారి

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అభయారణ్యాల్లోని మారుమూల కొండరెడ్డి గిరిజన గ్రామాల ప్రజలకు రోడ్డు సౌకర్యం ఎన్నో దశాబ్దాల కల. ప్రభుత్వం ఆ కలను సాకారం చేసేందుకు రూ.కోట్లు మంజూరు చేసినా అటవీ అనుమతుల జాప్యంతో రోడ్ల నిర్మాణానికి అడుగులు పడటం లేదు. ఇటీవల పోలవరం, బుట్టాయగూడెం మండలాల్లో పీఎం జన్‌మన్‌లో 34.87 కి.మీ. రోడ్లకు రూ.23.36 కోట్లు వచ్చాయి. పందిరి మామిడిగూడెం నుంచి ఇనుమూరుకు 1.7 కి.మీ., కన్నాపురం నుంచి దండిపూడికి 2.81 కి.మీ, దొరమామిడి నుంచి వీరమద్దిగూడేనికి 4.90 కి.మీ. వంతున రహదారుల నిర్మాణానికి అటవీ అనుమతులతో పని లేకపోవడంతో పనులు ప్రారంభించారు.

మరో నాలుగు దారులు.. అభయారణ్యంలో.. పోలవరం మండలంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న వింజరం, సున్నాలగండి, ఉడతపల్లి తదితర గ్రామాల ప్రజలకు నేటికీ కాలిబాటే దిక్కు. అభయారణ్యంలో కొండలు కోనల్లో వెళ్లే ఈ బాటలో ప్రయాణం ప్రమాదకరం. వింజరం నుంచి సున్నాలగండి మీదుగా ఉడతపల్లికి రూ.8.72 కోట్లతో 8.75 కిమీ రోడ్డు వేయనున్నారు. ఈ దారిలో 5.462 కి.మీ. పూర్తిగా అటవీ మార్గం. ఇందులో 2.485 కి.మీ. రిజర్వు ఫారెస్టు, 2.977 కి.మీ. అభయారణ్యం. 4.10 హెక్టార్ల భూమి అవసరం. పీసీసీఎఫ్ నుంచి అనుమతులు కావాలి. ఇందుకు సెప్టెంబరులోనే పంచాయతీరాజ్ అధికారులు దరఖాస్తు చేశారు.

పూచికగొందికి.. బుట్టాయగూడెం మండలంలోని మరో మారుమూల గ్రామం పూచికగొంది. ఎన్నో కొండలు ఎక్కిదిగితేనే కానీ చేరలేరు. గురుగుమిల్లి నుంచి పూచికగొంది వరకు చింతకొండ, గొట్టాలరేవు మీదుగా 6.30 కి.మీ. తారు రోడ్డుకు రూ.3.68 కొట్లు వచ్చాయి. అడవిలో 3 కి.మీ. రోడ్డు వేయడానికి 2.25 హెక్టార్ల అటవీ భూమి కావాలి.

వీరన్నపాలేనికి.. కన్నాపురం నుంచి వీరంపాలెం వెళ్లే 4.12 కిమీ రోడ్డులో 2.5 కి.మీ ఆర్ఎఫ్‌లో వెళ్తుంది. 2 హెక్టార్ల భూమి కావాలి.

రేగులపాడుకు... లంకపాకల నుంచి రేగులపాడుకు సుమారు 3.8 కి.మీ రోడ్డును రూ.3.50 కోట్లతో వేయాలి. ఇందులో 1.3 కి.మీ. రిజర్వు అడవుల్లో ఉంది. 0.77 హెక్టార్ల అటవీ భూమి కావాలి.

మొదలయ్యాయి.. 2026 మార్చి లోగా పూర్తి చేయాలనుకుంటున్నాం. అటవీ అనుమతులు రాగానే పనులు చేపడతామని జంగారెడ్డిగూడెం పి.ఆర్. ఈఈ శ్రీను పేర్కొన్నారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..	జంగారెడ్డిగూడెం: 80085 74478
	కొయ్యలగూడెం: 80085 74947
	చింతలపూడి: 76759 19086

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ? బుట్టాయగూడెం కొత్తపేటలోని ప్రధాన రహదారి అధ్వానంగా ఉండి రాకపోకలకు పలు అవస్థలు పడుతున్నాం. సీసీ రహదారి మంజూరు చేయాలి. **- స్థానికులు**

✔ ప్రతిపాదనలు పంపాం. మంజూరు కాగానే పనులు చేపడతాం. **- సత్యప్రకాశ్, పంచాయతీరాజ్ ఇన్‌ఛార్జి ఏఈ**

చింతలపూడి, న్యూస్‌టుడే: ? సిప్రియన్‌పేట గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. చిన్నారులు పాఠశాలలకు వెళ్తున్న సమయంలో భయంగా వెళ్లాల్సి వస్తోంది. **- సుధీర్, సిప్రియన్‌పేట**

✔ సిప్రియన్‌పేటలో కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకుంటాం. **- అంబటి రాంబాబు, కమిషనర్.**

? లింగపాలెం మండలం ధర్మాజీగూడెం, లింగపాలెంలో యువకులు శిరస్త్రాణం ధరించకుండా వేగంగా వాహనాలు నడుపుతున్నారు. **- వెంకటేశ్వరరావు**

✔ శిరస్త్రాణం వాడకంపై యువతకు అవగాహన కల్పిస్తాం. **-వెంకన్న, ఎస్సై, ధర్మాజీగూడెం**

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ? చింతలపూడి పట్టణం సుప్రియన్‌పేట శివారు ప్రాంతాల్లో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు.- **సూర్యకుమార్**

✔ వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేసి సమస్య పరిష్కరిస్తాం. **- రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్**

ఉత్సాహంగా ఉపన్యాసాలు
'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం సూర్య విద్యా సంస్థల్లో సోమవారం 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా జూనియర్ కళాశాల విద్యార్థులకు కృత్రిమ మేధ (ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు అన్న అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఎం. నిఖిలాంజలిశ్రీ, జి.నివిత, వి.సౌజన్య వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరికి సూర్య విద్యాసంస్థల డైరెక్టర్ కరుటూరి రమాదేవి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ అశోక్, అధ్యాపకుడు సాయికిషన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య ఉన్నత పాఠశాలలో.. సూర్య ఉన్నత పాఠశాలలోనూ ఉపన్యాస పోటీలు జరిగాయి. విద్యార్థుల జీవితాలపై సెల్ ఫోన్ ప్రభావం అన్న అంశంపై పోటీలు నిర్వహించారు. యు.శరణ్యశ్రీజ, ఎం.సాయికుసుమాంజలి, కె.కవిత వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరికి డైరెక్టర్ రమాదేవి, ప్రధానోపాధ్యాయుడు కృష్ణంరాజు, ఉపాధ్యాయిని ఖైరున్నీసా తదితరులు బహుమతులు అందజేశారు.

విరుల జల్లులు.. వేడుకోలు..!
ప్రశాంతంగా ముగిసిన పవన్ పర్యటన

ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటన సోమవారం ప్రశాంతంగా సాగింది. దారి పొడవునా అభిమానులు, కూటమి శ్రేణులు పూలవర్షంతో స్వాగతం పలికారు. ఆడపడుచులు ఆయనకు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరికీ ఆయన అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పలువురు తమ సమస్యలు తెలియజేసేందుకు ముందుకు రాగా వారి వద్దకు వెళ్లి వినతి పత్రాలు స్వీకరించి వివరాలు తెలుసుకున్నారు.

● మావోయిస్టుల కదలికల నేపథ్యంలో అడుగడుగునా పటిష్ఠ భద్రత చర్యలు తీసుకున్నారు. జగన్నాథపురం వచ్చే మార్గంలో భారీగా పోలీసులు మోహరించారు.

● రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఏపీఎంఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సోంబాబు ఆధ్వర్యంలో పవన్‌కు వినతి పత్రం అందజేశారు.

● రహదారుల సమస్యపై ఎమ్మెల్యేకు చెబుదామంటే ఎన్నికల్లో గెలిచాక ఒక్కసారి కూడా తమ గ్రామానికి రాలేదని ఆరోపిస్తూ, ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

● ఎన్నికల్లో పవన్ గెలిచి అసెంబ్లీకి వెళ్లాలని విజయవాడ కనకదుర్గమ్మకు కాలినడకన వెళ్లి మొక్కు చెల్లించానని, తనతో ఓ ఫొటో దిగాలని పేర్కొంటూ జంగారెడ్డిగూడెనికి చెందిన స్వామి అనే అభిమాని ప్రదర్శించిన ఫ్లెక్సీని పవన్ తీసుకుని అందరికీ చూపడంతో ఆ అభిమాని ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

స్వామివారి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ ఈవో, ధర్మకర్తలు

● కొయ్యలగూడెం మండలం గవరవరం నుంచి తిమ్మనకుంట వరకు గల రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతూ రహదారి దుస్థితిని కళ్లకు కట్టేలా గ్రామస్థులు ఫ్లెక్సీ ప్రదర్శించారు. ఆయా గ్రామాలతోపాటు మార్గమధ్యంలోని కృష్ణంపాలెం, ఏడువాడలపాలెం, గంగన్నగూడెం, తిమ్మనకుంట, యర్రంపేట గ్రామాలకు చెందిన విద్యార్థులు, మహిళలు సహా పలువురు ఐఎస్ జగన్నాథపురం వెళ్లి పవన్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

● రాజవరంలో తన కోసం వేచి ఉన్న అభిమానుల కేరింతల మధ్య ముందుకు సాగుతున్న పవన్ ఓ అభిమాని అందించిన చిన్నారిని ఎత్తుకుని ముద్దు చేశారు.

● ఓ అభిమాని తాను రచించిన అభివృద్ధి వైపు అడుగులు వేద్దాం పుస్తకాన్ని అందించడంతో పవన్‌కల్యాణ్ ఆసక్తిగా పుస్తకాన్ని పరిశీలించారు.

● తిరుగు ప్రయాణంలో రాజవరం సమీపంలో రహదారి పక్కన పొలాల్లో పనులు చేస్తున్న మహిళా కూలీలు పవన్ కాన్వాయ్ చూసి ఉత్సాహంగా నినాదాలు చేయడంతో వాహనం దిగి వారి వద్దకు వెళ్లి వారితో కాసేపు మాట్లాడి, ఫొటోలు దిగడంతో వారంతా హర్షం వ్యక్తం చేశారు.

సామాజిక ఆసుపత్రిలో సివిల్ సర్జన్ సేవలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పోలవరం సామాజిక ఆసుపత్రిలో రోగులకు సివిల్ సర్జన్ సేవలు అందుబాటులోకొచ్చాయి. జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి చెందిన జనరల్ సర్జన్ కె.సునీల్‌ను పోలవరం సామాజిక ఆసుపత్రికి సర్దుబాటుపై నియమించారు. ఆయన ప్రతి మంగళ, గురు, శనివారాల్లో విధులను నిర్వర్తించనున్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.రాంబాబు దొర తెలిపారు.

ఆదుకొనేది ఇంకెప్పుడు..?

మేడేపల్లిలో ధాన్యం ఆరబోస్తున్న రైతులు

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: రోజులు గడిచిపోతున్నాయి. మండలంలోని సుమారు 1800 ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. చాలా చోట్ల పంట కోత కోసి కల్లాల్లో సిద్ధం చేశారు. కానీ ధాన్యం కొనుగోలు కేంద్రం మాత్రం ప్రారంభం కాలేదు. మరో వైపు వాతావరణ పరిస్థితులు సహా సహకరించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కొందరు గిరిజన రైతులు కష్టాన్ని దాచుకోలేక తక్కువ ధరకే దళారులకు ఇచ్చేస్తున్నారు. వీలైనంత త్వరగా అధికారులు ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని కోరుతున్నారు. కొద్ది రోజుల్లో ప్రారంభిస్తామని మండల వ్యవసాయాధికారిణి సమీరజ తెలిపారు.

ఫిర్యాదులకు పరిష్కారం చూపించాల్సిందే: సబ్‌కలెక్టరు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: డివిజన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వస్తున్న ఫిర్యాదులకు ఆయా శాఖల అధికారులు తక్షణమే పరిష్కారం చూపించాలని సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న తెలిపారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరు కార్యాలయంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

● చిత్తపూరులో ఉషోదయ గ్రామైఖ్య సంఘం వీవోఏ బుక్‌కీపర్‌గా పనిచేస్తున్న తనను అన్యాయంగా ఆన్‌లైన్‌లో పేరు తొలగించిన ఏపీఎం ఎం.వెంకటేశ్వరరావు, సీపీ ప్రసాద్‌లపై చర్యలు తీసుకోవాలని, తనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని చిమట కనకదుర్గ కోరారు. మొత్తం 55 అర్జీలు రాగా వాటన్నింటిని సంబంధిత అధికారులకు ఆమె పంపించి పరిష్కారం చూపించాలని ఆదేశించారు.

అసంపూర్తి నిర్మాణాలు.. తీరని వెతలు!

అచ్చియ్యపాలెంలో అదనపు తరగతి గదుల నిర్మాణం ఇలా..

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం గ్రామాల్లోని పాఠశాలలకు చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు రెండేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయాయి. తరగతుల నిర్వహణకు పలు అవస్థలు పడుతున్నారు. చాలీచాలని ఇరుకు గదుల్లోనే కాలక్షేపం చేస్తున్నారు. బుట్టాయగూడెం మండలం అచ్చియ్యపాలెం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలకు నాడు - నేడు కింద అదనపు తరగతుల నిర్మాణానికి రూ.12 లక్షలు మంజూరు చేశారు. నేటికీ ఆ పనులు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. ఈ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 55 మంది విద్యార్థులు చదువుతున్నారు.

2, 3 తరగతులను వరండా, 4, 5 తరగతులను లోపల గదుల్లో, ఒకటో తరగతిని వంట షెడ్డులోనూ నిర్వహిస్తున్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చేసిన మేరకు బిల్లులు చెల్లించకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. ముంజులూరు, విప్పలపాడు, జగ్గిశెట్టిగూడెం తదితర పాఠశాలల్లో చేపట్టిన పనులు కూడా అసంపూర్తిగానే ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఈ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు నిర్లక్ష్యం నెలకొంది. గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణలో పనులు చేపట్టారు. 'జగ్గిశెట్టిగూడెంలో ప్రత్యామ్నాయ నిధులతో పనులు చేస్తున్నారు. మిగిలిన చోట్ల నిధులు రాగానే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం' అని ఎంఈవో తెల్లం బాబూరావు తెలిపారు.

సీలింగ్ చట్టం నిర్వీర్యం చేయొద్దంటూ ధర్నా

తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో పాల్గొన్న నాయకులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పేదలకు ఆసరాగా ఉన్న ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దంటూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అమ్మకాలు, కొనుగోలు చేయడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్రీ హోల్డ్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

పీడీఎస్‌యూ.. **బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుట్టాయగూడెం తహసీల్దారు కార్యాలయం ముందు సోమవారం ధర్నా చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇ.భూషణం ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉప తహసీల్దారు పాయం రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రైవేటీకరణ వద్దు.. **చింతలపూడి, న్యూస్‌టుడే:** వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని పీడీఎస్‌యూ నాయకుల ఆధ్వర్యంలో చింతలపూడిలో సోమవారం నిరసన ప్రదర్శన చేశారు.

ఘనంగా జరుగుతున్న కల్యాణ మహోత్సవాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణ కార్యక్రమాలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు.

నియంత్రణ లేక.. నియంత్రికల చోరీ..!
వ్యవసాయ బోరుల్లో తీగల చోరీలతో రైతుల బెంబేలు

➤ నాలుగు రోజుల కిందట చింతలపూడి మండలం యర్రంపల్లిలో ఇద్దరు రైతులకు చెందిన రెండు విద్యుత్తు నియంత్రికలను పగలగొట్టి అందులో ఉండే రాగి తీగలను గుర్తుతెలియని వ్యక్తులు తీసుకుపోయారు.

➤ ఏడాది కిందట చింతలపూడి మండలం ముక్కంపాడులో కొంత మంది వ్యక్తులు రాత్రి వేళల్లో సతీశ్ అనే రైతుకు చెందిన విద్యుత్తు నియంత్రిక పగులగొట్టి అందులో ఉండే రాగి తీగలు దొంగిలించారు.

యర్రంపల్లి శివారు పొలాల్లో పగులగొట్టిన విద్యుత్తు నియంత్రిక

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి నియోజకవర్గంలో ఆయిల్ పామ్, కొబ్బరి తోటలు, పొలాల్లో ఏర్పాటు చేసిన నియంత్రికలు, బోరు బావులకు అమర్చిన విద్యుత్తు తీగలను రాత్రి సమయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేస్తుండటంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. బోరుబావుల్లో ఉండే మోటారుకు సుమారు 60 మీటర్ల విద్యుత్తు తీగలను అమర్చాల్సి ఉంది. దానికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చు చేస్తున్నామని రైతులు చెబుతున్నారు. విద్యుత్తు నియంత్రికలు, విద్యుత్తు తీగలను చోరీ చేస్తుండటంతో వ్యవసాయ పెట్టుబడులకు తెచ్చిన అప్పులు వాటి మరమ్మతులకు సరిపోతున్నాయని వారు ఆవేదన చెందుతున్నారు. ధ్వంసమైన నియంత్రికల స్థానంలో కొత్తవాటి కోసం అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొత్తవాటి ఏర్పాటుకు కనీసం రెండు నెలల సమయం పడుతుండటంతో అప్పటి వరకు తమ పంటలను ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదన్నారు. ఏడాదిలో రెండుమూడు సార్లు ఇదే తరహా దొంగతనాలు జరుగుతున్నా పట్టించుకునే వారు లేకపోవడంతో తాము అప్పులపాలవుతున్నామని వాపోతున్నారు.

నియోజకవర్గంలోని వివరాలు
చింతలపూడి - 16
టి.నరసాపురం - 15
కామవరపుకోట - 14
లింగపాలెం - 7

రైతులు సహకరించాలి.. పొలాల్లో నియంత్రికలు, విద్యుత్తు తీగలు చోరీ చేస్తున్న వ్యక్తులపై నిఘా పెడతాం. దొంగలను పట్టుకునేందుకు రైతులు సహకరించాలి. పొలాల్లో అనుమానితులు కనబడినప్పుడు వారు ఎందుకు వచ్చారో వివరాలు తెలుసుకోండి. అవసరం అయితే వారి ఫొటోలు తీసి ఉంచండి. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.
- క్రాంతికుమార్, సీఐ, చింతలపూడి.

ఆలయ విశ్రాంత ఈవో మృతి

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం విశ్రాంత ఈవో వివిఎస్ఎన్ మూర్తి (83) అనారోగ్యంతో హైదరాబాద్‌లో సోమవారం మృతి చెందాడు. పాలకొల్లుకు చెందిన ఆయన గత కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆయన చిన వేంకన్న ఆలయంలో వివిధ హోదాల్లో సేవలు అందించారు. జూన్ 1993లో ఆయన శ్రీవారి దేవస్థానం ఈవోగా నియమితులై ఓ ఏడాది పనిచేశారు. ఆ తర్వాత ఏప్రిల్ 1998 నుంచి జనవరి 2000 వరకూ... ఆ తర్వాత ఆగస్టు 2000 నుంచి మరో ఏడాది ఈవోగా పనిచేశారు. మళ్లీ ఆగస్టు 2001 నుంచి ఆగస్టు 2002 వరకూ మరో ఏడాది కాలం పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆలయ ప్రత్యేక అధికారిగా సెప్టెంబరు 2002 నుంచి జూన్ 2004 వరకూ పనిచేశారు. అనంతరం 2004 నుంచి రెండేళ్లపాటు ఆలయ ధర్మకర్తగా సేవలందించారు. ఆయన మృతికి పలువురు ఆలయ ఉద్యోగులు సంతాపం తెలియజేశారు.

చికెన్ సరిపోలేదని ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆందోళన

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీలో హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో సమకూరుస్తున్న చికెన్ సరిపోకపోవడంతో ఆదివారం విద్యార్థులు మెస్‌ల బయటకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచారు. సోమవారం పలువురు విద్యార్థులు సమస్యను విలేకరుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి వారం ఇదే పరిస్థితి ఎదురవుతోందని వాపోయారు. యాజమాన్యం చికెన్ తినే విద్యార్థులకు ప్రత్యేకంగా టోకెన్లు జారీ చేసింది. అయినప్పటికి సరిపడ చికెన్ కొనుగోలు చేయకపోవడంతోనే ఈ పరిస్థితి ఉత్పన్నం అవుతోంది. గుడ్ల విషయంలోను ఇదే సమస్య వస్తోంది. ఈ విషయమై ఏవో లక్ష్మణరావు మాట్లాడుతూ.. చికెన్ వేరే డైనింగ్ హాల్స్‌లో ఉందని, విద్యార్థులకు ఆ విషయాన్ని చెప్పినా.. వినలేదని చెప్పారు. అప్పుడే విద్యార్థులతో మాట్లాడి.. వెంటనే అందరికీ చికెన్ అందించామన్నారు.

ఉచిత వైద్యశిబిరం

టి.నరసాపురం, న్యూస్‌టుడే: టి.నరసాపురంలో సామాజిక భవనం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని సొసైటీ అధ్యక్షుడు సోంబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో పి.చక్రపాణి, వేముల శివయ్య, అనిల్, మౌళి పాల్గొన్నారు.

మహారాజ శ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు భీమడోలు ప.గో.జిల్లా.

E.P.No.7/2025 In O.S No.726/2021

Between
టి.లెనిన్‌బాబు ...D.H.R
మరియు
కురేళ్ళ సుబ్బలక్ష్మి ...J.D.R

పై నంబరు E.P. వారెంటు గ్రంథలో శ్రీ కోర్టు వారు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని ది.08.12.2025వ తేదీ ఉదయం 10.30 ని॥లకు పై కోర్టులో వేలం వేయుదురు.ఆసక్తిగల వారు పాటలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు ఆస్థి :భీమడోలు సబ్‌రిజిస్ట్రీ, భీమడోలు మండలం,పూళ్ళ గ్రామంలోని, రి.స.నెం. 441/2 బ్లాక్‌నెం. 10,220 చ॥గ॥లో ఆర్.సి.సి.బిల్డింగ్, డోర్‌నెం. 9-51 హద్దులు.

తూర్పు :రాజవీధి అ30.00, దక్షిణం: దోసనపూడి రామకృష్ణ & కేతినీడి భవాని గార్ల స్థలం అ 28.00, పడమర:కాగిత వెంకటలక్ష్మి భవాని గారి స్థలం అ 70.00, ఉత్తరం :కాగిత వెంకటలక్ష్మి భవాని గారి స్థలం అ 70.00,

నోట్: మొదటి తనఖాకు లోబడి

డి.హెచ్.ఆర్ విలువ : 10,00,000
అమీనా విలువ : 13,00,000
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఎస్.గోపాలకృష్ణ అడ్వకేట్,
భీమడోలు, సెల్:93 91 33 53 73

గోడు వినరు.. గోస తీర్చరు!
'మీ కోసం'లో బాధితుల ఫిర్యాదు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: 'మా సమస్యల పరిష్కారానికి అధికారుల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నాం. మండల స్థాయిలో మా గోడు వినేవారు కరవయ్యారు. అధికారులు మా వినతులను బుట్టదాఖలు చేస్తున్నారు. చేసేది లేక.. వ్యయప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వచ్చాం. ఇక్కడైనా మా వెతలు తీర్చండి' అని పలువురు అర్జీదారులు విజ్ఞప్తి చేశారు. సోమవారం నిర్వహించిన మీ కోసంలో డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్, నగర కమిషనర్ భానుప్రతాప్ దృష్టికి తమ గోస తీసుకెళ్లారు.

దివ్యాంగురాలి వద్దకెళ్లి ఫిర్యాదు స్వీకరిస్తున్న అచ్యుత్ అంబరీశ్

దివ్యాంగ పింఛను ఇప్పించండి: నా పేరు షేక్ మీరాబీ. మాది ఏలూరు మండలం మానూరు గ్రామం. నా కిడ్నీలు పాడయ్యాయి. ఊపిరితిత్తుల సమస్య ఉంది. అనారోగ్యం కారణాలతో పూర్తిగా నడవలేక పోతున్నాను. ప్రస్తుతం రూ.6 వేల పింఛను ఇస్తున్నారు. వైద్య సేవల నిమిత్తం నాకు దివ్యాంగ పింఛను రూ.15 వేలు ఇప్పిస్తే బాగుంటుంది.

ఆక్రమణలు తొలగిస్తేనే.. నా పేరు సీహెచ్ భూషణం. మాది పెదవేగి మండలం బాపిరాజుగూడెం. మా గ్రామంలోని శ్మశానవాటికను కొందరు ఆక్రమించేశారు. దాన్ని పక్కనే ఉన్న పొలాన్నీ ఆక్రమించేందుకు చూస్తున్నారు. ఈ విషయమై పెదవేగి తహసీల్దార్, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. పరిష్కారం దొరకలేదు. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగింపునకు చర్యలు తీసుకోవాలి.

ఆ సొమ్ము గ్రామాభివృద్ధికి వినియోగించాలి.. నా పేరు ఏలియా. మాది భీమడోలు మండలం ఆగడాలలంక. తమ గ్రామంలో కొల్లేరు కాంటూరు ఎగువన ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని కొందరు చెరువుగా మార్చి ఫలసాయం పొందుతున్నారు. ఆ భూమిని సర్వే చేయించి, ఫలసాయం పంచాయతీకి చెందేలా చూడాలి. ఆ సొమ్ము గ్రామాభివృద్ధికి వినియోగించాలి. ఆ దిశగా అధికారులు చొరవ చూపాలి.

(c) eenadu

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

అందరికీ తెలిసేలా సర్వే చేయాలి

మాట్లాడుతున్న ఎంపీపీ నిర్మల

చాట్రాయి, న్యూస్‌టుడే: సొంతిల్లు కోసం నిర్వహించే సర్వేను ప్రతి దరఖాస్తుదారుడికి తెలిసేలా చేయాలని ఎంపీపీ లంక నిర్మల కోరారు. చాట్రాయి మండల పరిషత్తు సమావేశం సోమవారం నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. సర్వేలో కొందర్ని విస్మరిస్తున్నారని, కావాలనే దూరం పెట్టేలా చేస్తున్నారన్నారు. ఏఈ శ్రీనివాస్ బదులిస్తూ.. కొందరు ఇళ్ల వద్ద లేక సమస్య వస్తోందని, ఇకపై ఇలా జరగకుండా చూస్తామన్నారు. ఎంపీడీవో బీపీ సత్యనారాయణ, ఎంఈవో-2 వీఎస్వీ బ్రహ్మాచారి, ఏఈ రఘు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటుకు వినతి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: వడాలి జడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళా జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని తెదేపా నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు కోరారు. ఈ మేరకు ముదినేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం డీవైఈవో రవీంద్రభారతిని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. వడాలి జడ్పీ ఉన్నత పాఠశాల చిగురుకోట, సింగరాయపాలెం నుంచి దగ్గర, రవాణా సౌకర్యం ఉందన్నారు. అయితే గతంలో గురజ జడ్పీ పాఠశాలలో మహిళా జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసినా.. రవాణా సౌకర్యం లేక.. ఎవరూ రెండేళ్లుగా అందులో చేరక మూసివేశారన్నారు. అది వడాలికి మార్చితే స్థానిక విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు	:80085 74698	ఆగిరిపల్లి:	9121229090
ముసునూరు	:93983 81268	చాట్రాయి:	8008574700
కైకలూరు	:73060 88555	మండవల్లి:	8106099008
కలిదిండి	:90594 84862	ముదినేపల్లి:	8008574693

స్పందనకు వందనం

కైకలూరు, న్యూస్‌టుడే: గోపవరం పంచాయతీ రోడ్డులోని డ్రెయినేజీలో మురుగునీరు తిష్ఠ వేసి రాకపోకలకు అవస్థలు పడుతున్నామని స్థానికుడు పైడయ్య 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ దృష్టికి తీసుకురాగా.. స్పందించిన ఆయన డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరిచి సమస్య పరిష్కరించారు.

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు నుంచి చింతలవల్లి వైపు వెళ్లే రహదారి పక్కన చెత్త పారబోస్తున్నారు. స్థానికుడు కుమార్ 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను ఎంపీడీవో ఏసుబాబు దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్తను తొలగింపజేశారు.

క్రీడల్లో ప్రతిభ

విజయం సాధించిన కలిదిండి సహకార బ్యాంకు సిబ్బంది

కలిదిండి, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో సోమవారం గుడివాడ డీసీపీసీ ప్రాంగణంలో సోమవారం పీఏసీఎస్ సిబ్బందికి స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు సహకార బ్యాంకుల నుంచి వచ్చిన సిబ్బందికి క్రీడా పోటీలు నిర్వహించగా కలిదిండి సహకార బ్యాంకు జట్టు విజేతగా నిలిచింది. కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురామ్, బ్యాంకు సీఈవో శ్యామ్‌మనోహర్ విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బందికి కూటమి నేత యార్లగడ్డ రవికుమార్ అభినందనలు తెలియజేశారు.

బడికి సెలవొస్తే మందుబాబుల అడ్డానే..

రక్షణ లేని పాఠశాలలు.. ప్రహరీలు లేక ఇక్కట్లు

ముదినేపల్లి, మండవల్లి, న్యూస్‌టుడే

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీ లేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా, పశువులకు ఆవాసంగా మారుతున్నాయి. పాఠశాల పనిదినాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు కనిపెట్టుకుని ఉంటున్నా.. సెలవు రోజుల్లో భద్రత కరవైంది. మరోపక్క జాతీయ రహదారి వెంబడి ఉన్న పాఠశాలలో మరింత ఆందోళన నెలకొంది. కైకలూరు నియోజకవర్గంలో 224 పాఠశాలలు ఉండగా.. వాటిలో సుమారు 108 పాఠశాలలకు ప్రహరీలు లేవు.

ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందో.. ప్రహరీలు లేకపోవడంతో మధ్యాహ్న భోజనాల సమయాల్లో గుంపులుగా శునకాలు ఆవరణలో ఉంటున్నాయి. పశువులు, పాములు, శునకాల బెడదతో తమ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళన చెందుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..		
మండలం	పాఠశాలలు	ప్రహరీలు లేనివి
ముదినేపల్లి	59	26
మండవల్లి	49	32
కైకలూరు	54	22
కలిదిండి	62	28

➤ ముదినేపల్లి తూర్పు పాఠశాలలో ప్రహరీ లేకపోవడంతో సోమవారం ఉదయం ఉపాధ్యాయులు వచ్చేసరికి ఉన్న ఒక్క గది వరండాలో మద్యం సీసాలు, వాంతులు చేసుకుని అపరిశుభ్రంగా మారింది. దీంతో అప్పటికప్పుడు ఉపాధ్యాయులు దానిని శుభ్రం చేయించి తరగతులు నిర్వహించాల్సి వచ్చింది.

➤ మండవల్లి మండల కేంద్రంలోని రెండు ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీలు లేవు. ఫలితంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొన్ని పాఠశాలల్లో ప్రతి సోమవారం, సెలవు దినాల తర్వాత రోజు మద్యం సీసాలు, గుట్కా, ఖైనీ ప్యాకెట్లు పాడేసి ఉంటున్నాయని, వాటిని శుభ్రం చేయించుకోవడమే పెద్ద పని అవుతోందని పలువురు హెచ్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తిగా దేవరం పాఠశాల ప్రహరీ

ప్రభుత్వం అందించిన విలువైన విద్యా, క్రీడా సామగ్రిని భద్రపరచడం, కష్టపడి పెంచుకుంటున్న కిచెన్ గార్డెన్‌ను కాపాడుకోవడం ఇబ్బందిగా ఉందని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం.. 'ప్రహరీలు పూర్తిగా లేని, నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్న పాఠశాలల వివరాలను ఇటీవల నమోదు చేసి.. జాబితాలను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మన బడి- మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా నిధులు మంజూరు కావాల్సి ఉంది. ప్రతి పాఠశాలలో రక్షణ గోడల నిర్మాణానికి చర్యలు చేపడతాం.' అని సహాయక ప్రాజెక్టు అధికారి కురేళ్ల పంకజ్‌కుమార్ తెలిపారు.

వైకల్యం చదువుకు అడ్డు కాదు

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కైకలూరు, న్యూస్‌టుడే: వైకల్యం చదువుకు ఏమాత్రం అడ్డు కాదని, పట్టుదలతో శ్రమిస్తే విజయం సొంతమవుతోందని ఎస్ఎస్ఏ సమన్వయకర్త వి.భాస్కరరాజు, ఎంఈవోలు డి.రామారావు, వి.శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో సోమవారం స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక వైద్య బృందం వైకల్య నిర్ధారణ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి సుమారు 100కు పైగా దివ్యాంగ చిన్నారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వినికిడి, అంగ వైకల్యం, కంటి చూపు, మానసిక రుగ్మతలు, ఇతర సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థులకు అవసరమయ్యే ఉపకరణాల కొలతలు సేకరించారు. అనంతరం వైద్య శిబిరానికి వచ్చిన చిన్నారులతో పాటు వారి సంరక్షకులకు భోజన సదుపాయం కల్పించారు. భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చేయూత

కరపత్రాలు అందిస్తున్న నాయకులు, అధికారులు

కైకలూరు, న్యూస్‌టుడే: దేశానికి అన్నం పెట్టె రైతుకు అపత్కాలంలో చేయూతనిచ్చే మంచి ప్రభుత్వం రాష్ట్రంలో పాలన సాగిస్తోందని తెదేపా మండలాధ్యక్షుడు పి.త్రినాథరాజు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పి.లక్ష్మీరాణి అన్నారు. 'అన్నదాత సుఖీభవ' రెండో విడత నగదు జమైన రైతుల వాకిళ్లో జమయ్యాయి. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో సోమవారం కూటమి నాయకులు, ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి మండలంలోని వేమవరప్పాడు, తామరకొల్లు తదితర గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి రైతులకు అందిస్తున్న ప్రభుత్వ సేవలపై అవగాహన కల్పించారు. పండించిన పంటను అమ్ముకునేందుకు అవస్థలు పడకుండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూటమి నేతలు ఎండీ జాని, పటమట వాసు, గోవర్ధన్, వ్యవసాయం, మత్స్య, పశు వైద్యశాఖల ఏడీలు పార్వతీ, రాజ్‌కుమార్, ముస్తాఫాఖాన్, ఏవో ఆర్.దివ్య, వీఆర్వో రంగనాయకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్ర పురస్కారం

అందిస్తున్న సబ్‌కలెక్టరు వినూత్న

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలో ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులు సోమవారం సబ్‌కలెక్టరు బొల్లిపల్లి వినూత్న వస్త్ర పురస్కారాలు అందించారు. జీవీఎం ఆమె పట్టణ పారిశుద్ధ్యం నానాటికీ క్షీణిస్తున్న నేపథ్యంలో ప్రత్యేకంగా 'క్లీన్ అండ్ బ్యూటిఫుల్ నూజివీడు' పేరుతో ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశారు. దీనికి పట్టణ ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. ఈ నేపథ్యంలో ఆ కార్యక్రమం విజయవంతానికి క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వారంలో ఒకరికి నూతన వస్త్రాలు బహుమతిగా అందించే కార్యక్రమాన్ని దాతల సహకారంతో శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు ఉత్తమ పనితీరు కనబరిచిన 23 వార్డులో దలాయి రమేష్‌కుమార్, 2వ వార్డులో మత్తే రమేష్‌కు సోమవారం వస్త్రాలను అందించి అభినందించారు. మిగిలిన పారిశుద్ధ్య కార్మికులు కూడా ప్రతి వారం వస్త్రాలను పొందేందుకు పోటీ పడాలని సూచించారు.

ఫిర్యాదులకు పరిష్కారం చూపించాల్సిందే: సబ్ కలెక్టరు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: డివిజన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వస్తోన్న ఫిర్యాదులకు ఆయా శాఖల అధికారులు తక్షణమే పరిష్కారం చూపించాలని సబ్‌కలెక్టరు బొల్లిపల్లి వినూత్న తెలిపారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరు కార్యాలయంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ● చిట్టపురులో ఉపాధి గ్రామీణ సంఘం వీవోఏ బుక్కీపర్‌గా పనిచేస్తున్న తనను అన్యాయంగా ఆన్‌లైన్‌లో పేరు తొలగించిన ఏపీఎం ఎం.వెంకటేశ్వరరావు, సీసీ ప్రసాద్‌లపై చర్యలు తీసుకోవాలని, తనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని చిమట కనకదుర్గ కోరారు. మొత్తం 55 అర్జీలు రాగా వాటన్నింటిని సంబంధిత అధికారులకు ఆమె పంపించి పరిష్కారం చూపించాలని ఆదేశించారు.

మాట్లాడి.. మైమరపించి

'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు

విజేతలతో సెయింట్ ఆన్స్ పాఠశాల ప్రిన్సిపల్ తదితరులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పుస్తక పఠనంతోనే విజయం సాధ్యమని ప్రిన్సిపల్ సిస్టర్ లిబీటీజర్ అన్నారు. సోమవారం నూజివీడు సెయింట్ ఆన్స్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పి.జెన్నీ(9వ తరగతి), ఎన్.స్నేహ, జె.రేష్మ(8వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ చేతుల మీదుగా బహుమతులు అందించారు.

కుమార్ సీబీఎస్ఈ పాఠశాలలో జరిగిన పోటీలో టి.అక్షయ(ఏడో తరగతి), జె.జనప్రియ, ఎస్‌కే.ఫైజా(పదవ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల డైరెక్టర్ పీవీ కుమార్, ప్రిన్సిపల్ పద్మజ చేతులమీదుగా బహుమతులు అందించారు.

అన్నదాతకు ప్రభుత్వ అండ

చిగురుకోట: కరపత్రాలు పంపిణీ చేస్తున్న వినోద్, నాయకులు

ముదినేపల్లి, మండవల్లి, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని పర్యాటకాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కోడాలి వినోద్ అన్నారు. చిగురుకోటలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. వడాలిలో తెదేపా నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, అల్లూరులో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు ప్రారంభించి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ● మండవల్లి ఏవో శ్రీనివాసరావు అయ్యవారిరుద్రవరం, లింగాల గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి కరపత్రాలు అందించారు. ● గోపవరంలో సొసైటీ అధ్యక్షుడు, తెదేపా గ్రామ అధ్యక్షుడు ఉప్పలపాటి గణేశ్, ఏవో చాముండేశ్వరి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ● చాట్రాయి వ్యవసాయాధికారి బండారు శివశంకర్, ఎంపీడీవో సత్యనారాయణ చాట్రాయిలో రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ● ఆగిరిపల్లి మండల వ్యవసాయాధికారిణి జె.భవాని అమ్మవారిగూడెం, చిన్నఆగిరిపల్లి, కృష్ణవరం గ్రామాల్లో సర్వే తీరును పరిశీలించారు.

ఘనంగా అయ్యప్ప స్వాముల ఇరుముడి

మాలధారులతో ముద్దరబోయిన

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం కాట్రేనిపాడులో అయ్యప్ప మాలధారుల ఇరుముడి మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. మాలధారులు, బంధువులతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

కమిషనర్ పర్యటన

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పురపాలక సంఘం పరిధిలో వార్డుల్లో నెలకొన్న వివిధ సమస్యలపై మున్సిపల్ కమిషనర్ దృష్టి పెట్టారు. సోమవారం పట్టణంలోని 22వ వార్డులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

చెరువులో తూడు తొలగింపు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: బొమ్మినంపాడులో మంచినీటి చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క, నాచు తొలగింపు పనులను సోమవారం సర్పంచి దారం సుధ ప్రారంభించారు. ఏళ్లుగా చెరువు అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంతో కలుషితంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం శుభ్రమైన తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిచ్చి నిధులు కేటాయించడంతో పనులు నిర్వహిస్తున్నారు. తెదేపా నాయకులు యర్రా రాంబాబు, బాసింశెట్టి కిశోర్, నీటి సంఘం సభ్యుడు కోట జగన్, పంచాయతీ కార్యదర్శి మల్లెల శ్రీనివాసరావు తదితరులు పనులను పర్యవేక్షించారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడి మృతి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన నూజివీడులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పోతురెడ్డిపల్లికి చెందిన పల్లి ప్రవీణ్(30) ద్విచక్ర వాహనంపై సోమవారం నూజివీడు వచ్చారు. ప్రమాదవశాత్తు తన వాహనం అదుపు తప్పి ఆయన కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు ఆసుపత్రికి తరలించగా.. ప్రాథమిక చికిత్స అనంతరం విజయవాడ తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రవీణ్ మృతి చెందారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో పశువు.. చాట్రాయి, న్యూస్‌టుడే: జనార్దనవరంలో 11 కేవీ విద్యుత్తు లైను తీగలు తగిలి గుంట్రు నాగేశ్వరరావుకు చెందిన పాడి పశువు సోమవారం మృతి చెందింది. దాని విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని పోషకులు తెలిపారు. పశువులు మృతి చెందిన సమయంలో పంచాయతీ నివేదిక ఇస్తే పరిహారం మంజూరు చేస్తారని ఏఈ సంజయ్ తెలిపారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

కలిదిండి, న్యూస్‌టుడే: విద్యుత్తు తీగలు తగిలి ట్రాక్టరుపై తరలిస్తున్న వరి గడ్డి అగ్నిప్రమాదానికి గురైన సంఘటన సోమవారం సాయంత్రం కలిదిండిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కొందరి రైతుల పొలాల్లో వరి కోతలు పూర్తి కావడంతో కలిదిండి నుంచి కోట కలిదిండికి ట్రాక్టరులో గడ్డిని వారి నివాసాలకు తీసుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో స్థానిక సప్తగిరి గ్రామీణ బ్యాంకు వద్దకు రాగానే విద్యుత్తు తీగలు తగిలి భారీగా మంటలు వ్యాపించాయి. స్థానిక యువత చొరవ చూపి విద్యుత్తు సరఫరా నిలిపి వేయించి గడ్డిని ట్రాక్టరు నుంచి వేరు చేయడంతో పెనుప్రమాదం తప్పింది.

కొద్ది రోజుల్లో.. కలల గూడు సాకారం

★ క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్న అధికారులు

★ కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

నూజివీడు, న్యూస్‌టుడే

నీడ లేని పల్లె ప్రజలకు సొంత గూడు కల సాకారం చేసేందుకు కూటమి సర్కారు నడుంకట్టింది. దీని కోసం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) 2.0 పథకం కింద ఇళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటోంది. అవినీతి, అక్రమాలకు అవకాశం లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మంజూరు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాజకీయ నాయకులు, అధికారుల ప్రమేయం లేకుండా ప్రాధాన్యత క్రమంలో మంజూరు చేయాలన్నదే కార్యక్రమ ఉద్దేశం. ఆ దిశగా అధికారులు ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌తో ఇంటింటి సర్వే చేస్తున్నారు. దరఖాస్తు గడువు ఈనెల 30తో ముగియనుంది.

నియోజకవర్గ సమాచారం		
మండలం	దరఖాస్తులు	సర్వే చేసినవి
నూజివీడు	1502	1266
ఆగిరిపల్లి	974	683
ముసునూరు	1317	826
చాట్రాయి	1261	1099

ఇప్పటికే 3,874 పూర్తి.. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతంలో ఇళ్ల మంజూరుకు గత కొన్ని నెలలుగా లబ్ధిదారుల నుంచి 5,054 దరఖాస్తులు వచ్చాయి. వీటిపై ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌తో అధికారులు క్షేత్రస్థాయి సర్వే చేస్తున్నారు. మొదట సొంత స్థలంలో ఇల్లు కట్టుకునే వారిని పరిగణనలోకి తీసుకుంటారు. ఇప్పటి వరకు 3,874 దరఖాస్తులను సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇంకా 1,180 మందికి సంబంధించినవి సర్వే చేయాల్సి ఉంది. మరోవైపు సచివాలయాల్లో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులతో పాటు కొత్తవీ స్వీకరిస్తున్నారు.

సర్వే నిర్వహిస్తున్న అధికారులు

ఇంటింటి సర్వేకు సహకరించాలి.. ఇళ్ల నిర్మాణాలకు నిర్వహిస్తున్న సర్వేకు అర్హులు సహకరించాలి. లబ్ధిదారుల వివరాలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం. జియో ట్యాగింగ్ చేసిన చోటే ఇళ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది.' అని గృహనిర్మాణ శాఖ నూజివీడు ఈఈ రామోజీ నాయక్ తెలిపారు.

వైద్యాలయం.. సమస్యల నిలయం

ఆసుపత్రి పైభాగంలో మొక్కలు

మండవల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరడంతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. భవనం శ్లాబ్ పెచ్చులూడి పడటంతో పాటు ఇనుప చువ్వలు బయటపడి భయాందోళన కలిగిస్తోంది. చిన్నపాటి వర్షానికే గోడలు కురుస్తూ నీరు వార్డుల్లోకి వస్తోందని వైద్య సిబ్బంది వాపోతున్నారు. ఆసుపత్రి నిర్మించి 20 ఏళ్లు దాటడంతో ఎక్కడికక్కడ సిమెంటు పెచ్చులు ఊడి పడుతున్నాయి. వైద్యశాల పై భాగంలో పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా తయారైంది. ఏళ్ల కిందట వేసిన టైల్స్ పగిలిపోయి ప్రమాదకరంగా మారాయి. రోజూ ఆసుపత్రికి వందకు పైగా ఓపీ వస్తుండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. కనీసం మరమ్మతులైనా చేయించాలని గ్రామస్థులు, సిబ్బంది కోరుతున్నారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తుల తాకిడితో ఆలయం కిటకిటలాడింది. స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలను అర్చకులు అమరబాబు, భాస్కరరావు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. ఈవో సీతారామయ్య, ఛైర్మన్ బొమ్మకంటి శ్యామాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివాలయానికి విగ్రహాల వితరణ

చాట్రాయి, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా చాట్రాయి మండలం కోటపాడులోని పాత శివాలయానికి శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవ విగ్రహాలను తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి మండలం రామానగరానికి చెందిన మద్దిరాల సత్యనారాయణ, మారేశ్వరి, రాంబాబు, శివ నాగిని దంపతులు వితరణగా ఇచ్చినట్లు పూజారి పేటేటి గణేశ్ తెలిపారు. నూతన విగ్రహాలను సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకల్లో కల్యాణంలో వినియోగిస్తామని ఆయన తెలిపారు.

వైభవంగా గ్రామోత్సవం

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు శ్యాంప్ డ్రెయిన్ సమీపంలో కొలువుదీరిన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసంతాన నాగేంద్రస్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. వంశపరంపర్య అర్చకుడు చావలి శంకరశాస్త్రి ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాల అనంతరం గ్రామ పురవీధుల్లో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

షష్ఠి ఉత్సవాలకు కమిటీ నియామకం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలకు కమిటీని నియమిస్తూ.. దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఉత్తర్వులు ఇచ్చారు. బొంగు రవికుమార్, ఉప్పలపాటి కమల, వడ్లమాని నాగలలిత, నీలం శివరమేశ్, పరసా కృష్ణ, బూరుబోయిన సోవమ్మ, కొట్టి సుబ్బలక్ష్మి, దగాని నాగలక్ష్మి, బెజవాడ నాగవెంకటరాధాకృష్ణ, భట్టిప్రోలు నాగశిరీష, శొంఠి నాగకొండలను నియమించారు. ఆలయ కమిటీ ఏర్పాటుకు ఆగస్టులో నోటిఫికేషన్ విడుదల చేసినా.. కూటమిలో కుమ్ములాటలతో ఒక వర్గం న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కమిటీ ఏర్పాటు జరగలేదు. దీంతో ఉత్సవ కమిటీని నియమించారు.

అసైన్డ్ భూములకు రక్షణ కల్పించాలి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూములు, ఫ్రీ హోల్డ్ విషయంలో జోక్యం చేసుకుని పేదలు, దళితులకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆగిరిపల్లి తహసీల్దారు పీఎన్వీ ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు సత్తు కోటేశ్వరరావు, జి.రాజు, రవీంద్ర, అర్జునరావు, జహంగీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

చికెన్ సరిపోలేదని ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆందోళన

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీలో హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో సమకూరుస్తున్న చికెన్ సరిపోకపోవడంతో ఆదివారం విద్యార్థులు మెస్‌ల బయటకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచారు. సోమవారం పలువురు విద్యార్థులు సమస్యను విలేకరుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి వారం ఇదే పరిస్థితి ఎదురవుతోందని వాపోయారు. యాజమాన్యం చికెన్ తినే విద్యార్థులకు ప్రత్యేకంగా టోకెన్‌లు జారీ చేసింది. అయినప్పటికీ సరిపడ చికెన్ కొనుగోలు చేయకపోవడంతోనే ఈ పరిస్థితి ఉత్పన్నమవుతోంది. గుడ్ల విషయంలోను ఇదే సమస్య వస్తోంది. ఈ విషయమై ఏవో లక్ష్మణరావు మాట్లాడుతూ.. చికెన్ వేరే డైనింగ్ హాల్స్‌లో ఉందని, విద్యార్థులకు ఆ విషయాన్ని చెప్పినా.. వినలేదని చెప్పారు. అప్పుడే విద్యార్థులతో మాట్లాడి.. వెంటనే అందరికీ చికెన్ అందించామన్నారు.

ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా నరసింహారావు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఎస్టీయూ జిల్లా కార్యవర్గంలో ఆగిరిపల్లి మండలానికి చెందిన పలువురికి పదవులు దక్కాయి. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా తాడి నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్.ఎ.విఠల్, జిల్లా కార్యదర్శిగా కె.శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా బి.జె.సుందరరావు ఎన్నికైనట్లు ఆ సంఘ మండలాధ్యక్షుడు అంకం వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు.

వేణుగోపాల్ సేవలు ఆదర్శనీయం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఎస్టీయూ నాయకుడు మక్కే వేణుగోపాలరావు 12 ఏళ్లుగా ఆ సంఘ మండల అధ్యక్షుడిగా, వివిధ పదవుల్లో ఉపాధ్యాయుల సమస్యలపై చేసిన కృషి ఆదర్శనీయమని పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయనను ఘనంగా సత్కరించారు.

దాతల సహకారంతో రికార్డుల డిజిటలైజేషన్

పుస్తకాన్ని చూపుతున్న దాతలు, ప్రధానోపాధ్యాయిని

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ప్రధానోపాధ్యాయిని పి.పుష్పలత అన్నారు. ఆగిరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 50 ఏళ్ల విద్యార్థుల రికార్డులను డిజిటలైజేషన్ అవసరాన్ని గుర్తించిన గ్రామ ప్రముఖుడు మడుపల్లి గోపాల్ స్పందించారు. ఆయన సహకారంతో మడుపల్లి నారాయణరావు, నరసింహమూర్తి జ్ఞాపకార్థంగా వారి కుమారులు గోపాల్, చంద్రమోహన్, అశోక్, గోపాలకృష్ణ ప్రసాద్, వెంకట దిలీప్, ఉమామహేశ్వరరావు అందించిన రూ.70వేల ఆర్థిక సాయంతో రికార్డులు డిజిటలైజేషన్ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో దాతలను ఘనంగా సత్కరించారు.

భూమి వ్యవహారంలో ఘర్షణ

పలువురికి గాయాలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని హనుమంతులగూడెంలో భూమికి సంబంధించిన గొడవలో సోమవారం రాత్రి ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. కర్రలు, కత్తులతో దాడులు చేసుకోవడంతో పలువురు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు, బంధువులు నూజివీడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం.. నల్లిబోయిన నాగేశ్వరరావు, గంగరాజు కలిసి బాలస్వామి వద్ద వేర్వేరుగా 16.5 సెంట్ల చొప్పున భూమిని కొనుగోలు చేశారు. ఈ విషయంపై 1997లో అంగీకార పత్రం రాసుకున్నారు. రిజిస్ట్రేషన్ చేయించలేదు. సాగులో నాగేశ్వరరావు, గంగరాజులే ఉన్నారు. అయితే రీసర్వేలో బాలస్వామి పేరు రావడంతో ఆయన కుమారుడు నాగరాజు నాగేశ్వరరావు, గంగరాజుతో గొడవలు జరుగుతున్నాయి. ఈ వ్యవహారంలో గతంలోనూ గ్రామీణ పోలీసులకు ఒకరికొకరు ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసులు విచారించి ఈ వ్యవహారం తేల్చాలని తహసీల్దారుకు లేఖ రాశారు. అయితే ఆదివారం బాలస్వామి దుక్కు దున్ని మొక్కలు వేస్తున్నాడని తెలుసుకున్న గంగరాజు ఆయన కుమారుడు ప్రసాదు, నల్లిబోయిన నాగేశ్వరరావు, ఆదిశేషు పొలం వద్దకు వెళ్లి అడ్డుకున్నారు. ఈ విషయంపై సోమవారం సాయంత్రం గ్రామంలో ఘర్షణ ప్రారంభమైంది. నాగరాజు తూర్పుదిగవల్లి నుంచి వచ్చిన తన బంధువులతో కలిసి ఆదిశేషు, నాగేశ్వరరావుపై కర్రలు, కత్తులతో దాడి చేశారు. ఇరువురి తలలు పగిలాయి. గంగరాజు కుమారుడు కూడా ఈ దాడిలో గాయపడ్డారు. దీనిపై గ్రామీణ ఏఎస్సై శ్రీనివాసరావు, రైటర్ అజయ్ వివరాలు సేకరిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన వారిని విజయవాడ తరలించే యోచనలో ఉన్నారు.



ముసునూరులో నిరసన తెలుపుతున్న నాయకులు

లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్

ముసునూరు, న్యూస్‌టుడే: కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కార్మిక చట్టాలను కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.రాజు, మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం ముసునూరులో లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ప్రసాద్, శ్రీను, రాజా, గణేశ్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.రాజు అన్నారు. ఆగిరిపల్లి ప్రధాన కూడలిలో ధర్నా నిర్వహించారు. నాయకులు ఎ.రవీంద్ర, ముత్యాల నరేష్, జహంగీర్ బాషా, సత్తు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

అర్థాల రమాదేవి W/o పెద్దిరాజు, D.No: 8-13, వెస్ట్ హరిజనవాడ వేల్పుచర్ల, ముసునూరు మండలం, ఏలూరు జిల్లా అను నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. J3952558 మా ఇల్లు మారినప్పుడు ఎక్కడో పడిపోయినది. కావున దొరికిన వారు పై అడ్రస్‌లో గాని ఈ సెల్ నెంబర్‌కు గాని తెలియపరచగలరని మనవి చేస్తూ..

సెల్: 96187 19477

(c) eenadu

కాకినాడ ఆతిథ్యం.. అదరహో

సినీ హీరోయిన్, ఓజీ సినిమా ఫేం ప్రియాంక మోహన్.. సోమవారం కాకినాడ మెయిన్ రోడ్డులో ఓ కార్యక్రమానికి హాజరై సందడి చేశారు. తాను తొలిసారిగా నగరానికి వచ్చానని, ఇక్కడి ఆతిథ్యం, ప్రేమాభిమానాలు మరువలేనివన్నారు. ఓజీ సినిమాలో పవన్ కల్యాణ్ హావభావాలను చూపిస్తూ అభిమానులను ఉత్సాహపరిచారు.
– న్యూస్‌టుడే, కాకినాడ

కల్యాణ ప్రభ.. దీప శోభ

గొల్లప్రోలు మండలంలోని మల్లవరం గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఈ నెల 26న నిర్వహించేందుకు ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. అందులో భాగంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. వాటి ప్రతిబింబం కోనేరులో పడి చూపరులను ఆకట్టుకుంటోంది. షష్ఠి సందర్భంగా 26న తెల్లవారుజామున 2 గంటల నుంచి అభిషేకాలు, అనంతరం సర్వదర్శనాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

పెద్దాపురం ఏడీబీ రోడ్డుపై సోమవారం తెల్లవారుజామున పడిన భారీ బండరాయి

నిబంధనలపై బండ

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: భారీ గ్రానైట్ రాళ్ల రవాణాలో నిర్వాహకులు నిబంధనలు పక్కన పెట్టేస్తున్నారు. కనీస రక్షణ చర్యలు తీసుకోకపోవటంతో రాళ్లు ట్రక్కులపై నుంచి దొర్లి రోడ్లపై పడుతున్నాయి. సోమవారం తెల్లవారు జామున కర్నూల్ నుంచి కాకినాడ పోర్టుకు రెండు బండరాళ్లతో వెళ్తున్న టిప్పర్ పై నుంచి ఒక రాయి దొర్లి ఏడీబీ రోడ్డుపై పడింది. ఆ సమయంలో ఎటువంటి వాహనాలు రాకపోవటంతో ప్రమాదం తప్పింది.

అధిక లోడుతో వస్తున్నా పట్టించుకోరా

కర్నూలు, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి కాకినాడ పోర్టుకు నిత్యం సుమారు పది వరకు లారీలపై భారీ గ్రానైట్ రాళ్ల రవాణా చేస్తున్నారు. వాహనం సామర్థ్యం బట్టి రాళ్లను లోడ్ చేయటంతో పాటు పడిపోకుండా ఇనుప తీగలతో కట్టాలి. నిబంధనలు పట్టించుకోకుండా.. 12 నుంచి 15 టన్నుల బరువు రాళ్లను ఒక్కో ట్రక్‌పై రెండేసి ఉంచి జాగ్రత్తలు పాటించకుండా రవాణా చేస్తున్నారు. రవాణా అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుంది.

పుడితే ఇంత.. చనిపోతే కొంత!

కాకినాడ జీజీహెచ్‌లో సిబ్బంది వసూళ్ల పర్వం

న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

ఆసుపత్రిలో బిడ్డ పుడితే ఓ రేటు.. రోగి చనిపోయినా మరో ధర.. ఇవ్వకపోతే తిప్పలే.. ఇదీ కాకినాడ జీజీహెచ్‌లో సిబ్బంది తీరు.. ప్రభుత్వ ఆసుపత్రికి పేదవారు, మధ్యతరగతి వారే ఎక్కువగా వస్తుంటారు. ఇక్కడ చేయి తడపనిదే ఏ పనీ చేయడం లేదని పలువురు వాపోతున్నారు. రోగులు, వారి బంధువుల పట్ల సిబ్బంది ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ రోగిని అత్యవసర విభాగం నుంచి వార్డు, స్కానింగ్, ఎక్స్‌రే తదితర పరీక్షల నిమిత్తం తరలించడానికి డబ్బులు వసూలు చేయడం అలవాటుగా మారింది. పలువురు స్వచ్ఛందంగా ఇస్తుండగా, మరికొంతమందిని డిమాండ్ చేసి మరీ తీసుకుంటున్నారు. ఫిర్యాదులిస్తే తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నారు తప్ప పూర్తిస్థాయిలో లంచం మహమ్మారిని రూపుమాపే చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. సిబ్బంది వసూళ్లపై సైతం విచారణ చేపడతామని ఇటీవల గర్భిణి మృతి చెందిన ఘటనపై విచారణకు వచ్చిన డీఎంఈ చెప్పడం గమనార్హం.

● ఆడపిల్ల పుడితే ఒక రేటు, మగ పిల్లవాడికి ఒక రేటు పెడుతున్నారు. రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకూ ఇవ్వాల్సిందే. మా వద్ద ఇంతే ఉందని ఇస్తే తీసుకోరు.. అడిగినంతా ఇస్తేనే సేవలందిస్తారు.

● ఈ ఏడాది ఓ మహిళకు కు.ని.శస్త్రచికిత్స నిర్వహించారు. ఆపరేషన్ థియేటర్‌లో విధులు నిర్వహించే ముగ్గురు సిబ్బంది శస్త్రచికిత్సకు ముందు రూ.1200 డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తరువాత ఇస్తామని చెప్పినా వినలేదు. దీనిపై బాధితురాలి కుటుంబసభ్యులు ఆసుపత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం నిజమని తేలడంతో సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు.

● గతేడాది కాకినాడ గ్రామీణ మండలం పనసపాడుకి చెందిన వృద్ధురాలి చేయి విరగడంతో ఆసుపత్రిలో చేరింది. మధుమేహం కారణంగా ఆమె కాలును సైతం తొలగించారు. అనంతరం ఆమె చికిత్సపొందుతూ మృతిచెందింది. ఆసుపత్రిలో చేరినప్పటి నుంచి ఎంఎన్‌వోలు, బాడీబాయ్‌లు రూ.1900 తీసుకున్నారు. దీనిపై బాధితులు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది.

అన్నింటికీ డబ్బే..

'బిడ్డను శుభ్రం చేయాలన్నా డబ్బే.. రూమ్‌లోకి తీసుకెళ్లాలన్నా డబ్బే.. పేదవాళ్లం ఎలా ఇచ్చుకోగలం' అంటూ ఇటీవల జీజీహెచ్‌లో మృతిచెందిన తాళ్లరేవు మండల వాసి గర్భిణి మల్లీశ్వరి బంధువులు మండిపడ్డారు. తమ మనవరాలికి ఇక్కడే పురుడు పోశామని, రూ.3 వేలు ఇస్తే తప్ప బిడ్డను అప్పగించలేదన్నారు. ఇప్పుడు ఏకంగా మల్లీశ్వరినే పొట్టన పెట్టుకున్నారంటూ రోదించారు. ఆసుపత్రిలో చేర్పే ముందు ఆమెకు పడని ఇంజక్షన్ల చీటీని అందించినా, నిర్లక్ష్యంగా వ్యవహరించి, నిండు గర్భిణిని చంపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అన్యాయం ఇంకొకరికి జరగకూడదని, న్యాయం చేయాలంటూ సోమవారం బైఠాయించారు.

జీజీహెచ్ మాతా శిశు విభాగం వద్ద రోదిస్తున్న మృతురాలి బంధువులు

నాందేడ్-కాకినాడ ప్రత్యేక రైలు నేడు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: హెచ్‌ఎస్ నాందేడ్ నుంచి కాకినాడ టౌన్(07995)కు ఈనెల 25న ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు బాసర, నిజామాబాద్, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమహేంద్రవరం, సామర్లకోట మీదుగా కాకినాడకు చేరుకుంటుందన్నారు.

రేపు జిల్లాలో సంవిధాన్ దివస్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈనెల 26న జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హమరా సంవిధాన్-హమారా స్వాభిమాన్ అనే ఇతివృత్తంతో జరిగే వేడుకను బుధవారం ఉదయం 11.30 గంటలకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జరపాలని సూచించారు. రాజ్యాంగ పీఠికను సామూహికంగా చదివి, నిబద్ధతతో పాటిస్తామని పునరుద్ఘాటించాలని కోరారు. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించాలని సూచించారు.

భరోసా కల్పించరూ!

కాకినాడ నగరం కొత్త కాకినాడ 8వ వార్డుకు చెందిన స్పందన బుద్ధిమాంద్యంతో బాధపడుతోంది. ఎనిమిదేళ్లు వచ్చినా ఇప్పటికీ పసిబిడ్డలా మంచానికే పరిమితమైంది. ఎన్ని ఆసుపత్రులకు తిప్పినా ఫలితం లేదని, మరోవైపు పేదరికంతో, ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని బాలిక తల్లి వరిపల్లి మంగ చెప్పారు. దివ్యాంగ పింఛను ఇప్పటికీ మంజూరు కాలేదు. అధికారులు స్పందించాలని సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి విన్నవించారు. – ఈనాడు, కాకినాడ

నమ్మండి.. ఇది బస్‌షెల్టరే!

ఓ వ్యక్తి కాలుపై కాలు వేసుకుని స్టీలు బెంచీలో దర్జాగా నిద్రపోతున్న ఈ చిత్రం కాకినాడ నడిబొడ్డున రామారావుపేట ప్రధాన రహదారిలో ఉన్న వివేకానంద పార్క్ ఏసీ బస్‌షెల్టర్ లోనిది. స్మార్ట్ సిటీలో భాగంగా మూడేళ్ల కిందట ఆధునిక హంగులతో దీనిని నిర్మించారు. ఏడాది తిరగకుండా ఏసీ పాడై, పై భాగాన ఏర్పాటు చేసిన చెక్కలు ఊడిపోయి కళావిహీనంగా దర్శనమిస్తోంది. అప్పటినుంచి ఇది నిరుపయోగంగా మారింది. నిర్వహణకు నోచుకోకపోవడంతో యాచకులకు, ఆకతాయిలకు అడ్డాగా మారింది.
– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

కదిలొచ్చిన.. వైద్య విద్యాలయం!

వైద్యవిద్యలో అధునాతన శిక్షణ అందించే మొబైల్ ట్రైనింగ్ సెంటర్ 'జాన్సన్ అండ్ జాన్సన్ ఇన్‌స్టిట్యూట్ ఆన్ వీల్స్' సోమవారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాలకు చేరుకుంది. దీనిని డీఎంఈ రఘునందన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకుమారి, ప్రిన్సిపల్ డాక్టర్ విష్ణువర్ధన్ ప్రారంభించారు. లేప్రోస్కోపిక్ విధానంపై ప్రత్యేక శిక్షణను వైద్య విద్యార్థులకు అందిస్తున్నారు. – న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

తొలిరోజు 17,854 గృహాల సందర్శన

'రైతన్నా-మీకోసం'కు స్పందన

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా 337 రైతు సేవా కేంద్రాల పరిధిలో సోమవారం ప్రారంభించిన రైతన్నా-మీకోసం కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. తొలి రోజు పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు చినరాజప్ప, నెహ్రూ, సత్యప్రభ పాల్గొన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది, వ్యవసాయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు 17,854 గృహాలను సందర్శించారు. సీఎం చంద్రబాబు సందేశం, ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. వారం రోజులపాటు రైతుల గృహాల సందర్శన అనంతరం, వచ్చేనెల 3న గ్రామసభలు నిర్వహించనున్నారు.

నడవలేం.. నడపలేం..!

పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలు

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, మసీదు సెంటర్

ప్లాన్డ్ సిటీగా పేరొందిన కాకినాడలో ట్రాఫిక్ గాడి తప్పుతోంది. పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్యకు అనుగుణంగా రహదారుల విస్తరణ లేకపోవడం, పార్కింగ్ సదుపాయం సైతం లేకుండా వాణిజ్య సముదాయాలు నిర్మిస్తుండటం, రహదారుల ఆక్రమణలతో ట్రాఫిక్ చిక్కులు ఎదురవుతున్నాయి. చాలా కూడళ్లలో సిగ్నళ్లు లేవు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలున్న చోట రోడ్డు దాటాలంటే భయపడే పరిస్థితి.

జగన్నాథపురం మెయిన్‌రోడ్డులో అడ్డదిడ్డంగా రాకపోకలు

ఈనాడు పరిశీలన

నిత్యం రద్దీ

టూటౌన్ పోలీస్ స్టేషన్ నుంచి జగన్నాథపురం వంతెన వరకు మూడు కి.మీ ప్రధాన రహదారిలో వన్ వే అమలు చేస్తున్నారు. షాపింగ్‌మాళ్లు, పలు దుకాణాలు ఉండటంతో అన్నివేళల్లో రద్దీగా ఉంటోంది. రెండు మూడు వరుసల్లో వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో రోడ్డు కుంచించుకుపోతోంది. సినిమా రోడ్డు, దేవాలయం వీధి నుంచి వచ్చే వాహనాలు మెయిన్ రోడ్డు మీదుగా అటు, ఇటు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ వాహనాలు దాటే కూడళ్లలో సిగ్నళ్లు లేవు.



సిగ్నళ్లు నామమాత్రమే

భానుగుడి, నాగమల్లితోట, సర్పవరం జంక్షన్ ప్రాంతాల్లోనే ట్రాఫిక్ సిగ్నళ్లు ఉన్నాయి. భానుగుడి, సర్పవరం కూడళ్లలో కొంత కాలంగా పనిచేయడం లేదు. 'ట్రాఫిక్ సమస్య ఎప్పటికప్పుడు చక్కదిద్దుతున్నాం. కొన్ని కూడళ్లలో సిగ్నళ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. వాటిపైనే దృష్టిసారించాం.' అని ఎస్పీ బిందుమాధవ్ అన్నారు.

విద్యాలయాల సమీపంలో..

వెంకట్‌నగర్, శాంతినగర్, లక్ష్మీనారాయణనగర్, సాంబమూర్తినగర్‌లలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ఎక్కువగా ఉన్నాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో విద్యార్థులను తరలించే ఆటోలు, బస్సులు, సొంత వాహనాలతో రహదారులు రద్దీగా ఉంటున్నాయి. రంగరాయ కళాశాల ఎదుట మార్గంపై వాహనాలు రయ్‌మంటూ దూసుకెళుతుంటాయి.

రైతేరాజు

అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

హోరాహోరీ.. విజయంపై గురి

సఖినేటిపల్లి మండలం మోరి జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఫెన్సింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. –న్యూస్‌టుడే, సఖినేటిపల్లి

ఇదేనా స్వచ్ఛ తాగునీరు?

కలుషితమైన నీటిని ఎంత ఆలమ్, క్లోరిన్, పటికతో శుద్ధిచేసినా ఎంతోకొంత హానికరమైన రసాయనాలు ఉంటాయి. గోదావరి కాలువ ద్వారా వస్తున్న ఈ కలుషిత జలాలను పెద్దాపురం, సామర్లకోట రెండు పట్టణాలు, కాకినాడకు చెందిన సుమారు 4 లక్షల 5 వేల మంది ప్రజలు తాగుతున్నారు.
– న్యూస్‌టుడే, పెద్దాపురం, సామర్లకోట

కలుషితమవుతోంది ఇలా..

రాజమహేంద్రవరం గోదావరి నుంచి ధవళేశ్వరం కాలువ ద్వారా సామర్లకోట పట్టణానికి నీరు వస్తుంది. ధవళేశ్వరం కాలువ వెంబడి ఉన్న గ్రామాలతోపాటు, ద్వారపూడి, అనపర్తి, బిక్కవోలు, సామర్లకోట మండలం జి.మేడపాడు, వేట్లపాలెం గ్రామాల్లోని వివిధ పరిశ్రమల వారు వినియోగించిన కలుషిత నీటిని, ఆయా గ్రామాల మురుగు, మరుగుదొడ్ల నీరు కాలువల ద్వారా ఇందులో కలుస్తాయి. ఇందులోనే పశువుల శుభ్రం, బట్టలు ఉతకడం చేస్తారు.

సామర్లకోట వద్ద గోదావరి కాలువలో తాగునీరు దుస్థితి

శుద్ధి సక్రమంగా సాగక..

కాలువ ద్వారా వచ్చిన నీటిని సామర్లకోటలో ఉన్న సాంబమూర్తి రిజర్వాయర్ వద్ద శుద్ధిచేసి పెద్దాపురం, కాకినాడ పట్టణాల ప్రజలకు సరఫరా చేస్తారు. సామర్లకోటకు ప్రత్యేకంగా ఉండూరు రహదారిలో ఉన్న చెరువులో ఆలమ్, క్లోరిన్, పటికతో శుద్ధి చేసి పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తారు. కాని ఇది సక్రమంగా జరగడం లేదు.

ఏలేరు జలాలను అందించేందుకు చర్యలు

గోదావరి జలాలు కలుషితమవుతున్నందున వాటిని నిలుపుదల చేసి ఏలేరు కాలువ నీటిని పెద్దాపురం, సామర్లకోట పట్టణాలకు సరఫరా చేయడానికి నూతన పైపులైన్లు ఉపయోగించి శుద్ధి చేసేందుకు పథకం రూపకల్పన చేశారు. కిర్లంపూడి నుంచి ఏలేరు జలాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.
- బ్రహ్మతేజ, డీఈఈ, ప్రజారోగ్యశాఖ, కాకినాడ

వినతులు @ 462

సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ షాన్‌మోహన్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)కు వినతులు వెల్లువెత్తాయి. కలెక్టర్ షాన్‌మోహన్, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, డీఆర్వో వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, కేఆర్‌సీ ఎస్‌డీసీ రత్నమణి, సీపీవో త్రినాథ, డీపీవో రవికుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. భూముల రీ-సర్వే సమస్యలను పరిష్కరించాలని, ఆక్రమణలు అరికట్టాలని, కాలువల్లో పూడిక తొలగించాలని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, ఇళ్ల స్థలాలు, గృహాలు మంజూరు చేయాలని 462 మంది అర్జీలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీకి గడువులోగా పరిష్కారం చూపాలని జిల్లాస్థాయి అధికారులను ఆదేశించారు.

WALK - IN INTERVIEWS

MAHAVEER FINANCE INDIA LTD., is looking for the Following Positions:
- SALES MANAGERS
- Sr.SALES EXECUTIVES
- SALES EXECUTIVES
- COLLECTION MANAGERS
- COLLECTION EXECUTIVES

For Used Commercial Vehicles, Construction Equipment & Cars.
LOCATIONS: Rajamundry,Kakinada,Tadepalligudem, Eluru, Visakhapatnam, Gajuvaka, Srikakulam, Vizianagaram.
Qalification & Exp: 10th & Inter for Sr.Sales Executives & Sales Executives, Minimum Degree For Managers.Min 2 years experience in NBFC for Sales Managers and collection manager positions Min.1 Year Experience in relevant field for Sales Executive and Sr.Sales Execurive,collection executive positions. Freshers also can apply as sales executive.
Interview: 26/11/2025, Wednesday, 9.30AM onwards
MAHAVEER FINANCE INDIA LTD.,
D.No.46-12-21/2,3, Venkat Plaza, Opp; Skvt High School, Ttd Kalyana Mandapam Road, Danavayi Peta, Rajamundry-533103.
WhatsApp: 8522082223, tvrsarama@mahaveerfinance.com

రత్న 'సిరి'..

అన్నవరం, న్యూస్‌టుడే: ఈ ఏడాది కార్తికమాసంలో అన్నవరం దేవస్థానానికి వివిధ విభాగాల ద్వారా రూ.21.76 కోట్లు ఆదాయం సమకూరింది. గత ఏడాది కార్తికంలో రూ.21.14 కోట్లు ఆదాయం వచ్చింది. గత ఏడాది కన్నా వసతి, ప్రసాదం, వ్రతాలు, రవాణా తదితర ప్రధాన విభాగాల ద్వారా తగ్గినా లీజుల ఆదాయం ఎక్కువగా చూపించడం గమనార్హం. 49 రోజుల హుండీ ఆదాయాన్ని కార్తిక ఆదాయంగా లెక్కల్లో చూపించి గతం కన్నా పెరిగినట్లు పేర్కొన్నారు. మొంథా దృష్ట్యా వ్రతాలు, దర్శనానికి వచ్చిన భక్తుల సంఖ్య తగ్గినట్లు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఈవో సుబ్బారావు వివరాలు వెల్లడించారు.

అన్నవరంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

ప్రధాన విభాగాల ఆదాయం (అక్టోబరు 22 నుంచి నవంబరు 20 వరకు)

విభాగం	ఆదాయం (రూ.కోట్లలో)
వసతి	1.23
హుండీల ద్వారా	3.51
ప్రసాదం	4.57
వ్రతాలు	7.81
లీజులు, ఇతరాలు	2.27
దర్శనాలు	0.89
రవాణా	0.38

1,34,476 వ్రతాలు

◗ కార్తికంలో 1,34,476 వ్రతాలు జరిగాయి. గత ఏడాది కన్నా 12,666 తక్కువగా జరిగాయి. ◗ ఈ ఏడాది 10 లక్షల మంది స్వామిని దర్శించుకున్నారు. గత ఏడాది కన్నా ఈసారి 2.60 లక్షల మంది తక్కువగా వచ్చారని తెల్పారు. ◗ క్యూలైన్లు, మరుగుదొడ్లు, పార్కింగ్ తదితర అదనపు ఏర్పాట్లు, గిరి ప్రదక్షిణ, తెప్పోత్సవం నిర్వహణకు రూ.1.01 కోట్లు ఖర్చు చేశారు.

తీరం.. పెట్టుబడుల హారం..!

ఈనాడు, కాకినాడ

కాకినాడ తీరంలో రూ.వేల కోట్లతో పరిశ్రమల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదికగా జిల్లాలోనూ భారీ పెట్టుబడులు పెట్టేందుకు ఇటీవల ఒప్పందాలు జరిగాయి. వీటి ద్వారా వేలాదిమందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

కోరమండల్ విస్తరణ..

విశాఖ, కాకినాడ కేంద్రంగా కోరమండల్ ఎరువుల తయారీ కేంద్రాలున్నాయి. వీటిని రూ.2 వేల కోట్లతో విస్తరించడానికి ప్రభుత్వంతో ఇటీవల ఒప్పందం చేసుకుంది. విశాఖలో ఇది వరకే ఓ ప్లాంట్ విస్తరించారు. ఇప్పుడు కాకినాడపైనే పూర్తి దృష్టిసారించారు. రైల్వేలైన్ సమీపంలో సుమారు 200 ఎకరాలు కావాలని ప్రతిపాదించారు. సుమారు 500 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పిస్తామంటోంది.

భారీ పెట్టుబడితో ఏఎం గ్రీన్..

జిల్లాలో ఏఎం గ్రీన్ భారీ పెట్టుబడి పెడుతోంది. ఎన్‌ఎఫ్‌సీఎల్ కంపెనీ కొనుగోలు చేసి అందులో ఏఎం గ్రీన్ ఆమ్మోనియా, హైడ్రోజన్ ఉత్పత్తికి అనుగుణంగా మార్పులు చేయడానికి సన్నద్ధం అవుతోంది. దీనిపై రూ.10 వేల కోట్ల పెట్టుబడి పెడుతోంది. అదనంగా ఇదే కంపెనీకి చెందిన ఏఎంజీ మెటల్ అండ్ మెటీరియల్స్ ఉప్పాడ సమీపంలో నేమాం వద్ద గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ కంపెనీ ఏర్పాటుకు రూ.44 వేల కోట్ల పెట్టుబడి పెడుతోంది.

ఎల్‌జీ కెమ్, క్రౌన్ సంస్థల ఆసక్తి..

ఎల్‌జీ కంపెనీ పెట్రోలియం, అడ్వాన్స్‌డ్ మెటీరియల్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుకు ఆసక్తి చూపిస్తుంది. కాకినాడ, మూలపేట పోర్టుల సమీపంలో ఈ కంపెనీ ఏర్పాటు చేస్తే సహకరిస్తామని సీఎం పెట్టుబడుల సదస్సులో హామీ ఇచ్చారు. ✦ క్రౌన్ కంపెనీ కాకినాడలో ఏడాదికి 7.2 మిలియన్ టన్నుల సహజ వాయువు విదేశాల నుంచి దిగుమతి, సరఫరా చేసేందుకు అడుగులు పడుతున్నాయి. తీరంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూ.9 వేల కోట్ల పెట్టుబడితో టెర్మినల్‌ను నిర్మించనున్నారు.

పర్యాటక ప్రాజెక్టుల ప్రతిపాదనలు

గోదావరి కాలువల్లో అంతర్గత జలరవాణా దిశగా అడుగులు పడుతున్నాయి. వీటిలో సరకు రవాణాతో పాటు పర్యాటకులను తిప్పే క్రూయిజ్‌లు నడపాలని ప్రభుత్వం భావిస్తోంది.

(c) eenadu

224 మంది నవ వధువులకు నెహ్రూ ఫౌండేషన్ పెళ్లి కానుక

జగ్గంపేట (గ్రామీణం(జగ్గంపేట), న్యూస్‌టుడే: జగ్గంపేట నియోజకవర్గంలో గత ఆరునెలల్లో వివాహం చేసుకున్న 224 మంది నవ వధువులకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం "పెళ్లి కానుక" అందించారు. ఒక్కొక్కరికి రూ.20వేల వంతున రూ.44.80లక్షల చెక్కులను అందజేశారు. గోకవరం రోడ్డులోని కాపు కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ నాలుగు మండలాల పరిధిలో ఇప్పటివరకు 434 మంది నవ వధువులకు రూ.86.80 లక్షలు అందజేశామన్నారు. ఊపిరి ఉన్నంతవరకు సేవా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ముఖ్య అతిథి రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్, మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి నెహ్రూ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారన్నారు. ఫౌండేషన్ ఛైర్మన్ జ్యోతుల మణమ్మ మాట్లాడుతూ.. పెళ్లి చేసుకున్నవారు అన్యోన్యంగా జీవించాలన్నారు. ఫౌండర్ జ్యోతుల నవీన్ మాట్లాడుతూ.. తొలుత విద్యకు ప్రాధాన్యమిస్తూ పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణం, కుర్చీలు, బెంచీలు సమకూర్చామన్నారు. ఈయేడాది ప్రత్యేక డీఎస్సీ శిక్షణతో 24 మంది ఉపాధ్యాయులుగా కొలువులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. పలువురికి జ్ఞాపికలు అందజేశారు.

వధువుకు చెక్కు అందజేస్తున్న సుజయ్‌కృష్ణ, ఎమ్మెల్యే నెహ్రూ, ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ మణమ్మ, ఎమ్మెల్సీ పేరాబత్తుల, నవీన్

ఇండియన్ బ్యాంక్ Indian Bank ALLAHABAD
కాకినాడ శాఖ
37-1-7/2, గోల్డ్ మార్కెట్ సెంటర్, మెయిన్ రోడ్, కాకినాడ-533001
ఫోన్: 97050 21291, ఈమెయిల్: kakinada@indianbank.co.in

స్థిరాస్తుల అమ్మకానికి అమ్మకం ప్రకటన

"APPENDIX - IV-A" (రూలు 8 (6)ను నిబంధన చూడండి)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 8(6) నిబంధనతో చదవబడిన ఆర్థిక ఆస్తుల భద్రత మరియు పునర్నిర్మాణం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ అమలు చట్టం, 2002 కింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు. ... 10.12.2025 న ... రూ. 43,03,337/- ... 23.11.2025 నాటికి ... 5-57/1, ... 533005.

ఇ-వేలం విధానం ద్వారా విక్రయించడానికి ఉద్దేశించిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి.

ఆస్తియొక్క వివరణాత్మక వివరణ

ఆస్తి-1: కాకినాడ జిల్లా, పూర్వం తూర్పుగోదావరి జిల్లా, గండేపల్లి మండలం, పెద్దాపురం సబ్ రిజిస్ట్రీ, పి. నాయకంపల్లి గ్రామ పంచాయతీ, పి. నాయకంపల్లి గ్రామం, సర్వే నెం. 94/2, ... 83/2015/DTCPO/KKD, ... 183/2015/DTCPO/KKD ప్రకృతి నివాస్, ప్లాట్ నెం. 51 ...

రిజర్వు ధర : Rs.9,50,000/-, EMD: Rs.95,000/- తేదీ :10.12.2025,
ఇ-వేలం సమయం : 10 AM TO 4PM, ఆస్తి ID నెం.: IDIB06600466760A
ముందస్తు భారం : NIL, బిడ్ ఇంక్రిమెంట్ మొత్తం: Rs.10,000/-

ఆస్తి-2: కాకినాడ జిల్లా, పూర్వం తూర్పుగోదావరి జిల్లా, గండేపల్లి మండలం, పెద్దాపురం సబ్ రిజిస్ట్రీ, పి. నాయకంపల్లి గ్రామ పంచాయతీ, పి. నాయకంపల్లి గ్రామం, సర్వే నెం. 94/2, ... 32/2015/DTCPO/KKD, ... 183/2015/DTCPO/KKD ...

రిజర్వు ధర : Rs.14,00,000/-, EMD: Rs.1,40,000/- తేదీ :10.12.2025,
ఇ-వేలం సమయం : 10 AM TO 4PM, ఆస్తి ID నెం.: IDIB06600466760B
ముందస్తు భారం : NIL, బిడ్ ఇంక్రిమెంట్ మొత్తం: Rs.10,000/-

ఆస్తి-3: కాకినాడ జిల్లా, పూర్వం తూర్పుగోదావరి జిల్లా, గండేపల్లి మండలం, పెద్దాపురం సబ్ రిజిస్ట్రీ, పి. నాయకంపల్లి గ్రామ పంచాయతీ, పి. నాయకంపల్లి గ్రామం, సర్వే నెం. 94/2, ... 183/2015/DTCPO/KKD ...

రిజర్వు ధర : Rs.10,50,000/-, EMD: Rs.1,05,000/- తేదీ :10.12.2025,
ఇ-వేలం సమయం : 10 AM TO 4PM, ఆస్తి ID నెం.: IDIB06600466760C
ముందస్తు భారం : NIL, బిడ్ ఇంక్రిమెంట్ మొత్తం: Rs.10,000/-

బిడ్డర్లు మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ పీఎస్‌బి అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వెబ్‌సైట్ (https://www.ebkray.in) ని సందర్శించాలని సూచించారు. ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనడానికి సాంకేతిక సహాయం కోసం దయచేసి 8291220220 కి కాల్ చేయండి. నమోదు స్థితి మరియు ఇఎండి స్థితి కోసం దయచేసి support.ebkray@psballiance.com కు ఇమెయిల్ చేయండి. ఆస్తి వివరాలు మరియు ప్రాపర్టీ యొక్క ఫోటోగ్రాఫ్ మరియు వేలం నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి సందర్శించండి: https://www.ebkray.in మరియు ఈ పోర్టల్‌కు సంబంధించిన వివరణల కోసం దయచేసి పీఎస్‌బి రిలయన్స్ అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సంప్రదించు నెం. 8291220220.
https://www.ebkray.in తో వెబ్‌సైట్‌లో ఆస్తికోసం వెతుకుతున్నప్పుడు పైన పేర్కొన్న ఆస్తి ఐడి నంబర్‌ను ఉపయోగించాలని బిడ్డర్లు సూచించడ్డారు.
ప్రదేశం: కాకినాడ, తేదీ: 24.11.2025 Sd/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్
సంప్రదించండి: 1. కె. శంకరరావు - 9705021291, 2. డి. రాజేష్ - 9908124506

ఇండియన్ బ్యాంక్ Indian Bank ALLAHABAD
కాకినాడ శాఖ
37-1-7/2, గోల్డ్ మార్కెట్ సెంటర్, మెయిన్ రోడ్, కాకినాడ-533001
ఫోన్: 97050 21291, ఈమెయిల్: kakinada@indianbank.co.in

స్థిరాస్తుల అమ్మకానికి అమ్మకం ప్రకటన

"APPENDIX - IV-A" (రూలు 8 (6)ను నిబంధన చూడండి)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 8(6) నిబంధనతో చదవబడిన ఆర్థిక ఆస్తుల భద్రత మరియు పునర్నిర్మాణం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ అమలు చట్టం, 2002 కింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు. ... రూ. 6,60,954/- ... 23.11.2025 నాటికి ... ఇ-వేలం విధానం ద్వారా విక్రయించడానికి ఉద్దేశించిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి.

ఆస్తియొక్క వివరణాత్మక వివరణ

ఆస్తి-1: కాకినాడ జిల్లా, గండేపల్లి మండలం, పెద్దాపురం సబ్ రిజిస్ట్రీ, పి. నాయకంపల్లి గ్రామ పంచాయతీ, పి.నాయకంపల్లి గ్రామం,సర్వే నెం. 94/2, డిటిసిపి రాజమండ్రి సి.నెం. 808/2015/అర్1, టి.ఎల్‌పి నెం. 60/2015/అర్, **ప్లాట్ నెం. 54,** ప్రకృతి నివాస్, సరిహద్దుల కొలతలతో 286.75 చ.గ.ల విస్తీర్ణంతో. సరిహద్దులు: తూర్పు: 39'-లే అవుట్ ప్లాన్ కింద ప్లాట్ నెం.28, పడమర: 72' 60 అడుగుల వెడల్పు రోడ్డు, ఉత్తరం: 42.6" లేఅవుట్ ప్లాన్ కింద ప్లాట్ నెం.53, దక్షిణం: 50'6" అర్ఎస్.నెం.95 యొక్క అగ్రి లాండ్

రిజర్వు ధర : Rs.8,00,000/-, EMD: Rs.80,000/- తేదీ : 10.12.2025,
ఇ-వేలం సమయం : 10 AM TO 4PM, ఆస్తి ID నెం.: IDIB06421142489A
ముందస్తు భారం : NIL, బిడ్ ఇంక్రిమెంట్ మొత్తం: Rs.10,000/-

ఆస్తి-2: కాకినాడ జిల్లా, గండేపల్ల మండలం, పెద్దాపురం సబ్ రిజిస్ట్రీ, పి. నాయకంపల్లి గ్రామ పంచాయతీ, పి.నాయకంపల్లి గ్రామం,సర్వే నెం. 94/2, డిటిసిపి రాజమండ్రి సి.నెం. 808/2015/అర్1, టి.ఎల్‌పి నెం. 60/2015/5/అర్, **ప్లాట్ నెం. 53,** ప్రకృతి నివాస్, సరిహద్దుల కొలతలతో 153.08 చ.గ.ల విస్తీర్ణంతో. సరిహద్దులు: తూర్పు: 33' లే అవుట్ ప్లాన్ కింద ప్లాట్ నెం.28, పడమర: 33', 60 అడుగుల వెడల్పు రోడ్డు, ఉత్తరం: 41', లేఅవుట్ ప్లాన్ కింద ప్లాట్ నెం.52, దక్షిణం: 42'6", లే అవుట్ ప్లాన్ కింద ప్లాట్ నెం.54

రిజర్వు ధర : Rs.4,00,000/-, EMD: Rs.40,000/- తేదీ : 10.12.2025
ఇ-వేలం సమయం : 10 AM TO 4PM, ఆస్తి ID నెం.: IDIB06421142489B
ముందస్తు భారం : NIL, బిడ్ ఇంక్రిమెంట్ మొత్తం: Rs.10,000/-

ఆస్తి-3: కాకినాడ జిల్లా, గండేపల్లి మండలం, పెద్దాపురం సబ్ రిజిస్ట్రీ, పి. నాయకంపల్లి గ్రామ పంచాయతీ, పి.నాయకంపల్లి గ్రామం,సర్వే నెం. 94/2, డిటిసిపి రాజమండ్రి సి.నెం. 808/2015/అర్1, టి.ఎల్‌పి నెం. 60/2015/5/అర్, **ప్లాట్ నెం. 28,** ప్రకృతి నివాస్, సరిహద్దుల కొలతలతో 282.6 చ.గ.ల విస్తీర్ణంతో. సరిహద్దులు: తూర్పు: 41', 33 అడుగుల వెడల్పు రోడ్డు, పడమర: 72', ప్లాట్ నెం.53లో కొంత భాగం మరియు ప్లాట్ నెం. 54లో కొంత భాగం, ఉత్తరం: 40', లేఅవుట్ ప్లాన్ కింద ప్లాట్ నెం. 29, దక్షిణం: 50' అర్ఎస్‌నెం.95 యొక్క అగ్రి లాండ్

రిజర్వు ధర : Rs.8,00,000/-, EMD: Rs.80,000/- తేదీ : 10.12.2025
ఇ-వేలం సమయం : 10 AM TO 4PM, ఆస్తి ID నెం.: IDIB06421142489C
ముందస్తు భారం : NIL, బిడ్ ఇంక్రిమెంట్ మొత్తం: Rs.10,000/-

ఆస్తి-4: ఐటం 1: కాకినాడ జిల్లా, గండేపల్లి మండలం, పెద్దాపురం సబ్ రిజిస్ట్రీ, పి. నాయకంపల్లి గ్రామ పంచాయతీ, పి.నాయకంపల్లి గ్రామం,సర్వే నెం. 94/2, డిటిసిపి కాకినాడ సి.నెం. 183/2015/డిటిసిపిఓ/కెకెడి, టి.ఎల్‌పి నెం. 32/2015/డిటిసి కెకెడి, **ప్లాట్ నెం. 26**లో భాగం, ఇది త్రిభుజాకార ఆకారంలో ఉంది, ప్రకృతి నివాస్, 47.22 చ.గ.ల విస్తీర్ణంతో సరిహద్దుల కొలతలు ఉన్నాయి. సరిహద్దులు: తూర్పు: 17', ఈ ప్లాన్ కింద 33 అడుగుల వెడల్పు రోడ్డు, పడమర: 0', త్రిభుజాకార ఆకారంలో ఉన్నందున కొలత లేదు మరియు సరిహద్దు లేదు, ఉత్తరం: 50' ఇక్కడ పేర్కొన్న అంశం సంఖ్య 2, దక్షిణం: 50', లేఅవుట్ ప్లాన్ కింద ప్లాట్‌నెం. 26లో మిగిలిన భాగం.
ఐటం 2: కాకినాడ జిల్లా, గండేపల్లి మండలం, పెద్దాపురం సబ్ రిజిస్ట్రీ, పి. నాయకంపల్లి గ్రామ పంచాయతీ, పి.నాయకంపల్లి గ్రామం,సర్వే నెం. 94/2, డిటిసిపి రాజమండ్రి సి.నెం.1212/2015/అర్1, టిఎల్‌పి నెం. 83/2015/అర్, **ప్లాట్ నెం.50,** ప్రకృతి నివాస్ లో 230.55 చ.గ.ల విస్తీర్ణంలో సరిహద్దుల కొలలు ఉన్నాయి. తూర్పు: 33', ఈ ప్లాన్ కింద 33 అడుగుల వెడల్పు రోడ్డు, పడమర: 50', ప్లాట్ నెం. 51, ఉత్తరం: 50', ప్లాట్ నెం. 49, దక్షిణం: 50', ఇక్కడ పేర్కొన్న అంశం సంఖ్య 1. రెండు వస్తువులు కలిపి 277.77 చ.గ.ల వరకు అన్ని సులభ హక్కులు, నీటి మార్గాలు మొదలైనవి.

రిజర్వు ధర : Rs.8,00,000/-, EMD: Rs.80,000/-, తేదీ : 10.12.2025
ఇ-వేలం సమయం : 10 AM TO 4PM, ఆస్తి ID నెం.: IDIB06421142489D
ముందస్తు భారం : NIL, బిడ్ ఇంక్రిమెంట్ మొత్తం: Rs.10,000/-

బిడ్డర్లు మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ పీఎస్‌బి అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వెబ్‌సైట్ (https://www.ebkray.in) ని సందర్శించాలని సూచించారు. ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనడానికి సాంకేతిక సహాయం కోసం దయచేసి 8291220220 కి కాల్ చేయండి. నమోదు స్థితి మరియు ఇఎండి స్థితి కోసం దయచేసి support.ebkray@psballiance.com కు ఇమెయిల్ చేయండి.
ఆస్తి వివరాలు మరియు ప్రాపర్టీ యొక్క ఫోటోగ్రాఫ్ మరియు వేలం నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి సందర్శించండి: https://www.ebkray.in మరియు ఈ పోర్టల్‌కు సంబంధించిన వివరణల కోసం దయచేసి పీఎస్‌బి రిలయన్స్ అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సంప్రదించు నెం. 8291220220.
https://www.ebkray.in తో వెబ్‌సైట్‌లో ఆస్తికోసం వెతుకుతున్నప్పుడు పైన పేర్కొన్న ఆస్తి ఐడి నంబర్‌ను ఉపయోగించాలని బిడ్డర్లు సూచించడ్డారు.
ప్రదేశం: కాకినాడ, తేదీ: 24.11.2025. . Sd/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్
సంప్రదించండి: 1. కె. శంకరరావు - 9705021291, 2. డి. రాజేష్ - 9908124506

ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి

కాకినాడ కలెక్టరేట్: కాకినాడ నగరంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తెదేపా నాయకులతో కలిసి కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. నగరంలోని కీలకమైన చీడీలపోర ప్రాంతంలోని ప్రభుత్వ భూములు, గొడారిగుంట వరకు ఉన్న రహదారికి ఇరువైపులా కొంత మంది ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని కలెక్టర్‌కు వివరించారు. ఈ భూములను పరిరక్షించాలని కోరారు. చీడీలపోర ప్రాంతంలో వివిధ భవనాల నిర్మాణానికి గతంలో 20 ఎకరాలకు పైగా భూమిని కేటాయించారని తెలిపారు. ఇటీవల వాటిని కొంత మంది అడ్డదారుల్లో పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్

కాకినాడ కలెక్టరేట్: సమగ్రశిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని సోమవారం కలెక్టరేట్ వద్ద ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గతంలో చేసిన 21 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలని, మినిమం టైం స్కేల్ వర్తింప చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు , పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రధానోపాధ్యాయుల సంఘం, విశ్రాంత ఉద్యోగుల సంఘం, సీఐటీయూ, యూటీఎఫ్ ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్వో వెంకటరావుకు వినతి పత్రం అందజేశారు. ఫెడరేషన్ జిల్లా ఐకాస ఛైర్మన్ మాతా చంటిబాబు, గౌరవాధ్యక్షుడు చెక్కల రాజ్‌కుమార్, నాగమణి, డేనియేల్, రాంజీ, మీరాసాహెబ్ తదితరులు నాయకత్వం వహించారు.

నిరసన తెలుపుతున్న సమగ్రశిక్షా ఉద్యోగులు

రైతేరాజు

తైవాన్ జామ.. లాభాలు అందుకుందామా

న్యూస్‌టుడే, అంబాజీపేట

కోనసీమ జిల్లాలోని కొబ్బరి తోటల్లో సాధారణంగా అంతర పంటలుగా అరటి, కోకో, వక్క, కూరగాయలు పండిస్తుంటారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారానికి చెందిన అభ్యుదయ రైతు దొంగ నాగేశ్వరరావు ఇందుకు భిన్నంగా ముందుకు సాగుతున్నారు. తనకున్న నాలుగు ఎకరాల కొబ్బరి తోటలో అంతర పంటగా తైవాన్‌జామ పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. కడియపులంక నుంచి మొక్కలు తీసుకొచ్చి నాటారు. ఎకరాకు 200 చొప్పున మొత్తం 800 నాటారు. గతేడాది మరో 200 మొక్కలు నాటారు. ఎకరాకు రూ.20 వేలు చొప్పున నాలుగు ఎకరాలకు రూ.80 వేలు పెట్టుబడి అయ్యింది. మొదటి రెండేళ్లలోనే పెట్టుబడి వచ్చేసింది. ఇంకా 20 నుంచి 30 ఏళ్ల వరకు ఆదాయం తీసే అవకాశం ఉంది. పూర్తిగా సేంద్రియ పద్ధతులు అవలంబించడం ద్వారా ఎక్కువ కాలం ఆదాయం తీస్తున్నారు.

సేంద్రియ పద్ధతిలోనే..

స్ఫూర్తి

అందుబాటులో ఉన్న ప్రకృతి వనరులను వినియోగించుకుని కొబ్బరి తోటల్లో యాజమాన్య పద్ధతులను శాస్త్రీయంగా పాటిస్తూ నెల, సంపూర్ణ మేరకు పాటిస్తున్నారు. వీటికి అందించిన ఎరువులు పోషకాలతో జామ కాయలు అందంగా ఉంటున్నాయి. డ్రిప్ పద్ధతిలో తోటకు సాగునీరు అందిస్తున్నారు. పశువుల పేడ, గోమూత్రం, వివిధ రకాల పత్రులతో తయారు చేసిన కషాయాలను పిచికారీ చేస్తున్నారు. కిలో పరిమాణం గల జామకాయ రూ.30 నుంచి రూ.35కు తోటకు వచ్చి వర్తకులు కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. ప్రకృతి సిద్ధంగా పండించినవి కావడంతో వీటికి డిమాండ్ ఉంటుంది. వర్తకులు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి రూ.60కు విక్రయిస్తున్నారు.

కొబ్బరితోటలో సాగు చేసిన జామ పంటను పరిశీలిస్తున్న రైతు నాగేశ్వరరావు

మార్కెటింగ్ సమస్య లేదు

జామ తోటలో 45 రోజులకు ఒకసారి కొమ్మ కత్తిరింపులు చేయడంతో చెట్లకు పూత అధికంగా వచ్చి దిగుబడి బాగుంటుంది. మార్కెటింగ్ సమస్య లేదు. నెలకు రూ.25-30 వేల ఆదాయం వస్తుంది. పూర్తిగా సేంద్రియ పద్ధతిలో పాటించడంతో కాయ పరిమాణంతో పాటు రుచి బాగుంటుంది. - దొంగ నాగేశ్వరరావు, గంగలకుర్రుఅగ్రహారం, అంబాజీపేట

ఆయిల్‌పామ్‌లో కొమ్ముపురుగు నివారిద్దాం

మీ కోసం

నల్లజర్ల, న్యూస్‌టుడే: ఆయిల్‌పామ్ మొక్కలపై కొమ్ము పురుగు ప్రభావంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. నివారణ చర్యలపై కృషి విజ్ఞాన కేంద్రం(వెంకట్రామన్నగూడెం) ప్రధాన శాస్త్రవేత్త విజయలక్ష్మి వివరించారు. నాలుగేళ్ల వయసున్న మొక్కలపై పురుగు ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఆకుల చివర 'వి' ఆకారంలో కత్తిరించినట్టు కనిపిస్తుంది. పురుగు ఆకులను కొరికి పత్రహరితాన్ని బయటకు నెడుతుంది. మొవ్వులో ఈ పదార్థం ఉండిపోయి నష్టాన్ని సూచిస్తుంది.

నివారణ ఇలా..

కొమ్ముపురుగును ఒక ఇనుప చువ్వ ఉపయోగించి బయటకు తీసిన తర్వాత 25 గ్రాముల కార్బరిల్ మందును 10 గ్రాముల తడి ఇసుకతో కలిపి మొవ్వులో ఉంచాలి. 30 గ్రాముల వేపపిండిని మొవ్వులో వేయడం ద్వారా నివారించవచ్చు. 20 గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్ గుళికలు మొవ్వులో పెట్టాలి. పిల్ల పురుగులు పెరగకుండా నిరోధించేందుకు పెంట కుప్పలపై కార్బరిల్ మందు పిచికారీ చేయాలి. లింగాకర్షక బుట్టలను అమర్చడం ద్వారా ఉద్ధృతిని తగ్గించొచ్చు. తోటలను తరచూ కలుపు మొక్కలు లేకుండా ఉంచుకోవాలి.

ఉద్యాన రైతుకు రాయితీల తోడు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: కొత్తగా పండ్లతోటలు, కూరగాయలు, పూలసాగు చేపట్టే రైతులకు అందించే రాయితీల వివరాలను గొల్లప్రోలు ఉద్యానాధికారి రాజశేఖర్ వివరించారు. అర్హులు ఉద్యానశాఖ సిబ్బందికి దరఖాస్తులు అందించాలన్నారు.

- బంతి, చామంతి, గులాబీ, లిల్లీ వంటి పూలసాగు చేపట్టేందుకు హెక్టారుకు రూ.20 వేలు, హైబ్రిడ్ కూరగాయలు చేపట్టేవారికి రూ.24 వేలు చొప్పున రాయితీ అందజేస్తారు.
- శాశ్వత పందిరిపై హైబ్రిడ్ కూరగాయల సాగు చేపట్టేందుకు హెక్టారుకు రూ.లక్ష చొప్పున అందిస్తారు.
- ఆయిల్‌పామ్ తోటల సాగుకు హెక్టారుకు మొక్కల రాయితీ రూ.27,599, నిర్వహణ రాయితీ రూ.5,250, అంతరపంట రాయితీగా రూ.5,250 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు అందజేస్తారు.
- విద్యుత్తు పంపుసెట్టు, బోరు నీటిని నిల్వ చేసుకునే కుంటలు, వర్మీకంపోస్ట్ యూనిట్ ఏర్పాటుకు, ఆయిల్‌పామ్ కట్టర్, వైర్ మెష్, అల్యూమినియం నిచ్చెన, చాఫ్‌కట్టర్ వంటి పరికరాలకు 50 శాతం రాయితీ వర్తింపజేస్తారు. బిందుసేద్యం ఏర్పాటుకు 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు 90, 5 ఎకరాల కన్నా ఎక్కువ ఉన్న రైతులకు 50 శాతం రాయితీ వర్తింపజేస్తారు.

మామిడి తోట

తెలుసుకుందాం..

రాయితీ వివరాలు (రూ.లలో)		
పంట	మొదటి ఏడాది	రెండో ఏడాది
మామిడి	30	20
జీడిమామిడి	18	12
బొప్పాయి	18	12
డ్రాగన్‌ఫ్రూట్	1,62,000	1,08,000

యాజమాన్య పద్ధతులతో మేలైన దిగుబడి

ఆత్రేయపురం: పంట పొలాల్లో తగు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి ఫలితాలు పొందవచ్చని **కొత్తపేట సబ్‌డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎంవీ రామారావు** సూచించారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న సమాధానం

? మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించి మొక్కలు దెబ్బతింటున్నాయి. నివారణ చర్యలు తెలపండి. - సుబ్రహ్మణ్యం, రాజవరం

☛ పురుగు ఉద్ధృతి తక్కువగా ఉంటే క్లోరిఫైరిపాస్ 500 మి.లీ. ఎకరాకు, ఉద్ధృతి ఎక్కువగా ఉంటే స్పైనోసాడ్ 45 శాతం, ఎస్.సి. ద్రావణం 60 మి.లీ. కలిపి మొవ్వు లోపల ఆకులు పూర్తిగా తడిసేలా పిచికారీ చేయాలి.

? కొద్ది రోజుల్లో దాళ్వాసాగు ప్రారంభం కానుంది. ఇందులో వెదజల్లే పద్ధతులు వివరించండి. - ప్రకాశ్, కట్టుంగ

☛ ఈ విధానంలో సాధారణ పద్ధతి కంటే పది రోజుల ముందుగానే పంట చేతికొస్తుంది. దమ్ము చేసే ముందు జింకు, జిప్సం వినియోగించాలి. 15 రోజుల్లో రెండుసార్లు దమ్ము చేయాలి. వెదజల్లే ముందు కిలో విత్తనానికి మూడు గ్రాముల కార్బండిజమ్ లేదా మాంకోజెబ్ పొడిమందు కలిపి చల్లాలి. విత్తనాలు వేసిన తర్వాత చేలో నీటిని పూర్తిగా తొలగించి ఆపై ఎరువు చల్లుకోవాలి.

అందరికీ అందుబాటులో ఆధునిక వస్త్రాలు

కాకినాడలో లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభం

గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడ మెయిన్‌రోడ్డులో జైన్ టెంపుల్ దగ్గర నూతనంగా ఏర్పాటుచేసిన లక్కీ షాపింగ్ మాల్‌ను సోమవారం సినీనటి, ఓజీ ఫేం ప్రియాంక మోహన్, యాంకర్, నటి అనసూయ, కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. వేదికపై నటుడు హైపర్ ఆది, నటి, యాంకర్ ఐశ్వర్య అందరినీ ఉత్సాహపరిచారు. ప్రియాంక మోహన్, అనసూయ మాట్లాడుతూ లక్కీ షాపింగ్ మాల్‌ను కాకినాడలో ప్రారంభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. దుకాణ అధినేతలు స్వామి, రత్తయ్య, శ్రీను మాట్లాడుతూ నాలుగంతస్తుల విశాలమైన షోరూంలో అన్ని వర్గాల వారికి నచ్చేలా అద్భుతమైన కలెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్లు అందిస్తున్నామన్నారు. ది గోదావరి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గ్రంధి బాబ్జి, కాకినాడ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బచ్చు శేఖర్, ముత్తా శశిధర్, బాదం బాలకృష్ణ, సోము ప్రసాద్, సంగిశెట్టి అశోక్, నేమాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న సినీ నటి అనసూయ, షాపింగ్ మాల్ నిర్వాహకులు

చీరను ప్రదర్శిస్తున్న హీరోయిన్ ప్రియాంక మోహన్

జూడో ఛాంపియన్ కాకినాడ

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ డీఎస్ఏలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్స్ జూడో బాలుర విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌గా కాకినాడ, ద్వితీయ స్థానంలో తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు నిలిచారు. బాలికల విభాగంలోనూ కాకినాడ క్రీడాకారిణులు ఓవరాల్‌గా రెండో స్థానం సాధించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో రాష్ట్ర జట్టును ఎంపిక చేస్తామని చెప్పారు. విజేతలకు ముఖ్యఅతిథుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. రాష్ట్ర జూడో సంఘ సీఈవో వెంకట్, జిల్లా కోశాధికారి రమణ, సంఘ ఛైర్మన్ వెంకటకృష్ణారావు, కాజా మస్తాన్, పీవీ తేజ, పవన్ సందీప్, గోవిందు, రామకృష్ణ, గమిడి శ్రీనివాసరావు, ఉషారాణి, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీల విజేత ప్రకాశం

కాకినాడలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల అండర్-17 బాలుర ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రకాశం జట్టు విజేతగా నిలిచింది. చిత్తూరు ద్వితీయ, విశాఖ తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. సోమవారం జరిగిన ముగింపు వేడుకలకు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యంతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర జట్టును ఎంపికచేశారు. అనంతరం ఖోఖో ఆట ద్వారా ఉద్యోగాలు సాధించిన క్రీడాకారులను జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. డీఎస్‌డీవో సతీష్‌కుమార్, ఎంఈవోలు టీవీఎస్ రంగారావు, కె.శ్రీనివాస్, జిల్లా వ్యాయామోపాధ్యాయులు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, మాచరరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శులు కె.శ్రీనివాస్, పి.సుధారాణి, టోర్నమెంట్ సహకార్యదర్శి కె.పట్టాభిరామం, పరిశీలకుడు గురుప్రసాద్, ఖోఖో రాష్ట్ర కార్యదర్శి సీతారామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన జిల్లా జూడో క్రీడాకారులు

నేటి నుంచి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవల్లీదేవసేనా సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి కల్యాణ మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 25న సాయంత్రం 4 గంటలకు స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలను చేస్తారు. సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను శేష, మయూర వాహనాలపై గ్రామసేవ నిర్వహిస్తారు. 26న స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం జరగనుంది. తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతసేవ, 2.30 గంటలకు మహన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం 6 గంటల నుంచి భక్తులను సర్వదర్శనాలకు అనుమతిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు లక్షపత్రి పూజ జరుగుతుంది. రాత్రి 7 గంటలకు గ్రామంలోని దేవస్థానం ఉన్నత పాఠశాల ఆవరణలో కల్యాణ మహోత్సవం ప్రారంభమవుతుంది. 27న రాత్రి 7 గంటలకు ఊంజల్‌సేవ (ఉయ్యాలసేవ, 8 గంటలకు పవళింపు సేవ (శ్రీపుష్పయోగ మహోత్సవం) తదితర కార్యక్రమాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	19,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	17,000-18,000
కొత్త (పచ్చి) కాయ	15,000-16,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	103-00
రిటైల్ లైవ్	130-00
డ్రెస్డ్	189-00
స్కిన్‌లెస్	215-00

జీజీహెచ్‌లో గర్భిణి మృతిపై విచారణ

సాంబమూర్తినగర్(కాకినాడ), మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ జీజీహెచ్‌లో తాళ్లరేవు మండలం చినవలసలకు చెందిన గర్భిణి మల్లీశ్వరి మృతిచెందిన ఘటనపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) జి.రఘునందన్ సోమవారం విచారణ చేపట్టారు. సూపరింటెండెంట్ లావణ్యకుమారితో కలిసి యూనిట్ హెడ్, హెచ్‌ఓడీలు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెన్స్, హౌస్‌సర్జన్లు, పీజీలు, సిబ్బందిని విచారించారు. బాధిత కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తీసుకున్నారు. తొలుత గాడిమొగ పీహెచ్‌సీ సిబ్బందిని పిలిపించి విచారించారు. గర్భిణి తొలుత అక్కడ పీహెచ్‌సీలోనే చికిత్స తీసుకుంది. అక్కడ అంతా బాగానే ఉందని సమాచారం. అనంతరం డీఎంఈ మాట్లాడుతూ నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అన్ని సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జీజీహెచ్ సిబ్బందిపై రోగులు, వారి సహాయకుల నుంచి ఫిర్యాదులొస్తున్నాయని, దీనిపై కూడా విచారణ చేపడుతున్నామని పేర్కొన్నారు. కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్(ఇన్‌ఛార్జి) సుబ్రహ్మణ్యేశ్వరి తదితరులు ఉన్నారు.

వినాయక చిట్‌ఫండ్ బాధితులకు న్యాయం చేయాలి

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: మూడేళ్ల కిందట సుమారు 500 మంది నుంచి చిట్టీల రూపంలో రూ.30 కోట్లు వసూలు చేసి, బోర్డు తిప్పేసిన వినాయక చిట్స్ అండ్ ఫైనాన్స్ కంపెనీ డెరెక్టర్లపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని బాధితులు కోరారు. దీనిపై ఎస్పీ బిందుమాధవ్‌ని సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన సూచన మేరకు టూటౌన్ సీఐని కలిసి వివరాలు తెలిపారు. తెలుగు జనతా పార్టీ ప్రతినిధి వెంకటేశ్వరరావు, బాధితులు మాట్లాడుతూ రెండేళ్ల కిందట వినాయక మాధవరావు ఒక్కరిపై కేసు నమోదు చేశారన్నారు. చిట్స్ కంపెనీలో ఉన్న మిగతా డైరెక్టర్లు, వారి బంధువులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలుస్తామన్నారు.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మనప్పురం ఏ ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 98491 38626

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. ఆయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి, ✆ 73862 01191.

స్థిరాస్తులపై తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్ స్థిరాస్తి ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరంలేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ 9396999669.

HEALTH & CARE

SKIN

ఉచిత "బొల్లి మచ్చల" లేజర్ చికిత్స శిబిరం
అవును! మన అమలాపురంలో
బొల్లి మచ్చలకు అద్భుత పరిష్కారం
Triple Combination Treatment
అపాయింట్‌మెంట్ పొందిన 25 మంది పేద రోగులకు మాత్రమే. ఉచిత ప్రత్యేక కన్సల్టేషన్
హైదరాబాద్ నుండి
Dr.M.N.Rao, MBBS(OSM), DD(UHS) Skin, Cosmetology & Laser Specialist
తేది: 27.11.2025 (గురువారం)
సమయం: ఉ.11గం॥ల నుండి మ.2.గం॥ల వరకు
ప్రదేశం:శ్రీ శ్రీనివాస్ డయాగ్నోస్టిక్స్, వెంకటరమణ థియేటర్ వెనుక, గడియార స్తంభం, అమలాపురం
BARBIE SKIN & LASER CLINIC
7330696252

EENADU for Advertisement Contact: 8008597607

JOBS

Siris Electrik Corporation Vizag Requires: Marketing Executives - for Rajamundry/ Kakinada to Market Electrical Products. Freshers (or) Experience in B2B Segment are welcome. Contact: 9553392229.

Wanted Sales and Marketing person for hair transplantation center at Rajahmundry cont: 7674999906

సేల్స్‌గర్ల్స్ కావలెను. అనుభవం ఉన్నవారు మాత్రమే సంప్రదించండి. భవాని సిల్క్స్, శశికాంత్‌నగర్, కాకినాడ. Contact: 91339 59999

ఆఫీస్‌లో పనిచేయుటకు కంప్యూటర్ వర్క్ చేయగలిగిన యువకుడు కావలెను. Oly: Degree Cont: 92954 01601, రాజమండ్రి వారు మాత్రమే.

రాజమండ్రి దానవాయిపేట నందు పనిచేయుటకు నర్సులు కావలెను. (నో నైట్ డ్యూటీస్) Contact Cell: 76749 99906

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-45 పైII
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెలాఖరులోగా పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

కాకినాడ నగరం: పదో తరగతి విద్యార్థులు ఈ నెల 30వ తేదీ లోగా పరీక్ష రుసుం చెల్లించాలని డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. విద్యార్థుల నామినల్ రోల్స్‌ను పాఠశాల యూడైస్‌లో ధ్రువీకరించుకోవాలని ప్రధానోపాధ్యాయులకు ఆయన సూచించారు. యూడైస్, ఫీజులు, ఇతర సమస్యల పరిష్కారానికి 99595 67275, 94901 78184, 99515 58185 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

లింగ సమానత్వంపై ప్రచారం

కాకినాడ కలెక్టరేట్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి డిసెంబరు 23 వరకు లింగ సమానత్వంపై ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాకినాడ

నగరంలో సినిమాలు

గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- 12ఏ రైల్వేకాలనీ, శివ, ప్రేమంటే, కాంత, హ్యాపీజర్నీ, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- ప్రేమంటే, ఇట్లు మీ ఎదవ, కలివి వనం, కాంత, లక్ష్మీ- దిగర్ల్‌ఫ్రెండ్, సత్యగౌరి - 12ఏ రైల్వే కాలనీ, తిరుమల - ఆవారా, సీఅండ్‌సీ 1- 12ఏ రైల్వేకాలనీ, సీఅండ్‌సీ 2- పాంచ్ మినార్ (ఉ,సా), మస్తీపోలీస్(మ,రా), శ్రీప్రియ - కొదమసింహం(ఉ,రా), దిగర్ల్ ఫ్రెండ్(మ,సా), పద్మప్రియ- రాజు వెడ్స్ రాంబాయి, సూర్య1(వాకలపూడి) - 12ఏ రైల్వే కాలనీ, సూర్య 2 - ఆవారా(ఉ,మ), శివ.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
ఉ. 10 - మ. 1
కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

నిర్లక్ష్యంగా వదిలేశారు..

కాకినాడ నగర పాలక సంస్థ కార్యాలయం వెనుక దంటు కళాక్షేత్రానికి వెళ్లే దారిలో రోడ్డు పక్కన గతంలో మున్సిపల్ కార్యాలయంతో పాటు, ఆవీధిలో తొలగించిన చెట్టు కొమ్మలను అలాగే రోడ్డు పక్కన పడేశారు. నెలలు గడుస్తున్నా వీటిని తరలించలేదు. అవి ఎండిపోయి రోడ్డు పక్కన గుట్టలుగా పడి ఉన్నాయి. అధికారులు స్పందించి వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గాంధీనగర్

వ్యర్థాలను తొలగించరూ..

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ, శాంతినగర్ ప్రధాన రహదారి పక్కన కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు పారే వీలులేకుండా ఉంది. దాంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల వ్యాప్తి చెంది వ్యాధులబారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చెత్త తరలనుంది.. బాధ తీరనుంది!

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడను చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడానికి వడివడిగా అడుగులుపడుతున్నాయి. కొన్నేళ్ల నుంచి డంపింగ్ యార్డులో పేరుకుపోయిన పురాతన(లెగసీ) వ్యర్థాల తొలగింపు పనులు ఊపందుకున్నాయి. జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు వీటిని తరలించే ప్రక్రియ వేగంగా సాగుతోంది. నగరంలోని సంజయ్‌నగర్ వద్ద 15 ఎకరాల స్థలంలో లక్షల టన్నుల లెగసీ వేస్ట్ పేరుకుపోయింది. దీని తొలగింపు, ప్రాసెసింగ్‌కు గత ప్రభుత్వంలో రూ.30 కోట్ల వరకు నిధులు కేటాయించి, ఒక సంస్థకు పనులు అప్పగించారు. బిల్లులు ఇవ్వకపోవడంతో ఆ సంస్థ పలాయనం చిత్తగించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక.. ఇక్కడ లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్, తరలింపు పనులను పునరుద్ధరించింది. ఈ పనులను తరుణి ఏజెన్సీకి అప్పగించింది. డిసెంబరు 31 నాటికి ఈ పనులు నూరుశాతం పూర్తి చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పి.నారాయణ ఇటీవల డీడీఆర్సీ సమావేశంలో పురపాలక శాఖను ఆదేశించారు.

సంజయ్‌నగర్ డంపింగ్ యార్డులో జరుగుతున్న పనులు

పేరుకుపోయిన చెత్త	4,45,000 టన్నులు
ఇప్పటివరకు తరలింపు	3,28,796 టన్నులు

ప్రజలకు సాంత్వన

డంపింగ్‌యార్డుకు సమీపంలో పర్లోపేట, దుమ్ములపేట, సంజయ్ నగర్, పులె పాకలు ప్రాంతాలు, లారీ ఓనర్స్ అసోసియేషన్ యార్డు ఉంది. ఏళ్లతరబడి ఇక్కడ చెత్త పేరుకపోవడంతో వేల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్వాసనతో పాటు యార్డులో మంటలు రేగగా వచ్చే పొగతో ఉక్కిరిబిక్కిరి అయ్యేవారు. యార్డులో చెత్తను పూర్తిగా తొలగించనున్న నేపథ్యంలో ఇక్కడి ప్రజలు ఊరిరిపీల్చుకోనున్నారు.

రహదారికి మోక్షం

స్థానిక సంజయ్‌నగర్ నుంచి పోర్టు రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో కొంత భాగం డంపింగ్ యార్డు చెత్తతో నిండిపోయింది. ఈ ప్రదేశాన్ని వదిలేసి, రెండువైపులా గతంలో రహదారి అభివృద్ధి చేశారు. వ్యర్థాలు తరలించాక.. వదిలేసిన రహదారి అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నారు.

ఖాళీ స్థలంలో వివిధ యూనిట్లు

వ్యర్థాలు పూర్తిగా తరలించిన తర్వాత ఈ స్థలంలో తడి, పొడి చెత్త ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తాం. ప్లాస్టిక్ వ్యర్థాలను విభజించి, రీ-సైక్లింగ్ ప్రక్రియ చేపడతాం. జీవో వేస్ట్ నగరంగా కాకినాడను తీర్చిదిద్దడమే లక్ష్యం.
- కేటీ సుధాకర్, ఇన్‌ఛార్జి కమిషనర్

బాధ్యతలు స్వీకరిస్తున్న సత్యనారాయణ, చిత్రంలో అదనపు కమిషనర్ సుధాకర్, ఉప కమిషనర్ శ్రీనివాస్

నూతన కమిషనర్‌గా సత్యనారాయణ

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ కమిషనర్‌గా (పూర్తి అదనపు బాధ్యతలు) ఎన్‌వీవీ సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఉప కమిషనర్ కె.శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సత్యనారాయణ మాట్లాడుతూ నగరంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ప్రతి రోజూ వార్డు పర్యటనలు చేస్తానని చెప్పారు.

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 42 ఫిర్యాదులు

మసీదుసెంటర్(కాకినాడ): పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 42 మంది ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను విన్నవించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి, సకాలంలో సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సర్వే ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా దేవుడు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్, కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా ఎంపీ దేవుడు ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బి.రమేశ్, సంయుక్త కార్యదర్శిగా బి.శ్రీనివాసరావు, కోశాధికారిగా జేఎస్ పద్మ నియమితులయ్యారు.

సంతకాల సేకరణ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయొద్దని డిమాండ్ చేస్తూ సోమవారం వైకాపా నగర కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, కుడా మాజీ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ ఉప మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక జీజీహెచ్ వద్ద ప్రజల నుంచి సంతకాలు సేకరించారు.

పోటీలో పాల్గొన్న విద్యార్థులు

విజేతలతో సీఈవో ఎం.భానుప్రియాంక

ఉపన్యాసంతో ఆకట్టుకున్నారు..

సాంబమూర్తినగర్(కాకినాడ): కాకినాడ జగన్నాథపురంలోని దుర్గాప్రసాద్ స్కూల్లో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస(స్పీచ్) పోటీలో ఆర్.తేజ కార్తిక్ ప్రథమ, సిహెచ్.హర్షిత ద్వితీయ, జి.మోనిక లక్ష్మి తృతీయ బహుమతులు సాధించారు. సీఈవో ఎం.భానుప్రియాంక, ఎండీ ఎం.సంతోష్, అకడమిక్ హెడ్ టి.శంకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

హాజరైన విద్యార్థులు

విజేతలతో హెచ్ఎం ఎస్‌వీఎల్ రాజు, మల్లికార్జునరావు, అఫ్సర్ జహా

బహుమతులు గెలిచారు..

సాంబమూర్తినగర(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ గొడారిగుంటలోని మదర్ థెరిసా నగరపాలకోన్నత పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాసం(స్పీచ్) పోటీలో రమ్య కీర్తి ప్రథమ, ఎన్.స్వీటి ద్వితీయ, టి.సాయిగణేష్ అభయ్ తృతీయ బహుమలు సాధించారు. హెచ్ఎం ఎస్‌వీఎల్ రాజు, జి.మల్లికార్జునరావు, ఎండీ అఫ్సర్‌జహా పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ మనీషా

'పీఎం కేర్' లబ్ధిదారులతో ముఖాముఖి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పీఎం కేర్ లబ్ధిదారులైన బాలలతో కలెక్టర్ షాన్‌మోహన్, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా ముఖాముఖి నిర్వహించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఐసీడీఎస్, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 24 మంది లబ్ధిదారులు ఉండగా, వీరిలో ఎనిమిది మందికి 18 ఏళ్లు నిండాయి. వీరికి 23 ఏళ్లు వచ్చే వరకు పీఎం కేర్ డిపాజిట్ నుంచి వడ్డీ తీసుకునే అవకాశం కల్పించారు. తపాలా శాఖ ద్వారా ఖాతాలు తెరిచి, పాసు పుస్తకాలను అందజేశారు. ఐసీడీఎస్ పీడీ సీహెచ్.లక్ష్మి, జిల్లా బాలల సంరక్షణాధికారి సీహెచ్.వెంకటరావు, తదతరులు పాల్గొన్నారు.

తెదేపా కమిటీలు క్రియాశీలకంగా పనిచేయాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నియోజకవర్గాల్లో ఇటీవల నియమకం జరిగిన తెదేపా క్లస్టర్, యూనిట్, డివిజన్, గ్రామ, బూత్ స్థాయి కమిటీలు క్షేత్ర స్థాయిలో క్రియాశీలకంగా పని చేయాలని ఏపీ అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్, తెదేపా జోన్-2 సమన్వయకర్త సుజయ్‌కృష్ణ రంగారావు సూచించారు. ఆయన సోమవారం స్థానిక జిల్లా తెదేపా కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో వేర్వేరుగా భేటీ అయ్యారు. వారి నుంచి పార్టీ పనితీరు, ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. వినతులు స్వీకరించారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వనమాడి కొండబాబు, వరుపుల సత్యప్రభ, దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, కర్రి పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ మేయర్ సుంకర పావని, పిల్లి సత్యనారాయణమూర్తి, కటం కొశెట్టి బాబి, తోట నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సుజయ్‌కృష్ణ రంగారావు, నవీన్ కుమార్, ఎమ్మెల్యేలు నెహ్రూ, కొండబాబు, సత్యప్రభ, తదితరులు

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

సాంబమూర్తినగర్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా సైన్సు అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ అన్నారు. సాంబమూర్తినగర్ శ్రీచైతన్య పాఠశాల ప్రాంగణంలో విద్యాసంస్థల ఛైర్మన్ డా.బీఎస్ రావు స్మారక క్రీడా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. విజేతలకు పతకాలు అందించారు. ఏజీఎం సురేష్, రీజనల్ ఇన్‌ఛార్జి గోపీనాథ్, ప్రిన్సిపల్ సుల్తానా, కోఆర్డినేటర్ జనార్దన్, డీన్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మసీదు సెంటర్ (కాకినాడ): నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం నిర్వహించిన క్రీడా వారోత్సవాల్లో భాగంగా స్థానిక డీఎస్ఏలో సోమవారం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ ఛాంప్స్ కో ఆర్డినేటర్ రామ తులసి, ఏజీఎం రాఘవేంద్రరావు, ప్రిన్సిపల్స్ షర్మిల, కవిత, రవికిషోర్, వీరభద్రరావు, వినయ్ తదితరులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

అల్లుకున్న తీగలు..

కాకినాడ, జయేంద్రనగర్ ప్రధాన రహదారి పక్కన విద్యుత్తు స్తంభానికి, పక్కనే ఉన్న వైర్లకు పిచ్చి మొక్కలు, తీగలు అల్లుకున్నాయి. గాలి వీచే సమయంలో నిప్పు రవ్వలు వస్తున్నాయని, విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు పేర్కొన్నారు. విద్యుత్తు ప్రమాదాలు జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

పట్టించుకునేవారేరి?

కాకినాడ నగరంలో వివిధ ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనుల నిమిత్తం ఏర్పాటు చేసిన శిలాఫలకాలు శిథిలమై రహదారుల పక్కన, చెత్తకుప్పల వద్ద పడి ఉంటున్నాయి. విద్యుత్తునగర్‌లో నాలుగు రోడ్ల కూడలి వద్ద శిలాఫలకం శిథిలమవడంతో అక్కడున్న విద్యుత్తు స్తంభానికి చేర్చి వదిలేశారు. జనచైతన్య నగర్‌లో మరొకటి రోడ్డు పక్కన పడి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని తిరిగి యథాస్థానంలో పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్

తాగునీరు.. మురుగుపాలు

నగరంలో బాలాజీచెరువు సెంటర్‌లోని కాస్మోపాలిటన్ క్లబ్‌ను ఆనుకుని మంచినీటి పైపులైన్ పగిలి నీరంతా వృథాగా పోతోంది. మొత్తం మురుగు కాలువలో కలుస్తోంది. వారం రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. నగర పాలక అధికారులు స్పందించి మంచినీటి వృథారలను అరికట్టేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గాంధీనగర్

మరమ్మతులు ఇలాగేనా?

నగరంలోని పలు ప్రధాన రహదారులు గుంతలతో అధ్వానంగా కనిపిస్తున్నాయి. వెంకట్‌నగర్‌లోని ప్రధాన రహదారి గుంత ప్రమాదకరంగా ఉంది. గుంతలపై టైల్స్ ముక్కలతో ఉన్న రబ్బీస్ వేయడంతో అటుగా వెళ్లే పాదచారులకు అవి గుచ్చుకుంటున్నాయి. వాటిని తొలగించి గుంతపై రహదారి వేయాలని సంబంధిత అధికారులను స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

నిరసన తెలుపుతున్న సంఘ ప్రతినిధులు

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసన

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద మెడికల్ రిప్స్ ఆందోళన నిర్వహించారు. ఏపీ ఎంఎస్ఆర్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిరసన తెలిపారు. లేబర్ కోడ్‌ల ప్రతులను దహనం చేశారు. కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం కల్పించేందుకే కేంద్ర ప్రభుత్వం వీటిని అమల్లో తెచ్చిందని ధ్వజమెత్తారు. అనంతరం డీఆర్వో వెంకటరావుకు వినతి పత్రం అందజేశారు. జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అప్పలస్వామి, వర్మ, రాష్ట్ర కోశాధికారి దుంపల ప్రసాద్, సీఐటీయూ ప్రతినిధులు రాజ్‌కుమార్, వెంకటరమణ తదితరులున్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆదివాసీ ఎరుకుల గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాసగిరి రాంబాబు, ఉపాధ్యక్షుడు అమలదాసు నూకరాజు మాట్లాడుతూ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో జిల్లా కేంద్రంలో సామాజిక భవనాన్ని నిర్మించాలని కోరారు. స్వయం ఉపాధి రుణాలను గిరిజన కార్పొరేషన్ ద్వారా కల్పించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘ ప్రతినిధులు మానుపూడి రామకృష్ణ, సింగం వీరరాఘవులు, గాడా ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ నిల్వ కేసులో జైలు

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: అనుమతి లేకుండా మద్యం సీసాలు కలిగి ఉన్న కేసులో ఇద్దరు నిందితులకు ఆరునెలల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కాకినాడ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి తీర్పుచెప్పినట్లు కాకినాడ రెండో పట్టణ సీఐ ఎం.అప్పలనాయుడు సోమవారం తెలిపారు. 2023లో అధిక సంఖ్యలో మద్యం సీసాలు కలిగి ఉండటంతో నిందితులు కాకినాడకు చెందిన కాశి సాయిధన్, యడల దుర్గాప్రసాద్‌లపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాశి సాయిధన్‌పై రౌడీషీట్ ఉందని, ఇతనిపై అనేక కేసులు ఉన్నాయని సీఐ చెప్పారు. ఇటీవల కల్పనా సెంటర్ వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరిపై సాయిధన్, మరికొందరితో కలిసి దాడికి పాల్పడ్డాడని పేర్కొన్నారు.

డాక్టర్ అడ్డాలకు రాష్ట్రస్థాయి పురస్కారం

అడ్డాలకు పురస్కారాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లాలో అత్యధిక దంత వైద్య శిబిరాలను నిర్వహించడంతోపాటు, సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు కాకినాడ ఐడీఏ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణకు పురస్కారం లభించింది. విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి దంత వైద్యుల సదస్సులో ఆయన దీనిని అందుకున్నారు. అడ్డాల మాట్లాడుతూ భవిష్యత్తులోనూ ప్రజలకు దంత వైద్య శిబిరాలు నిర్వహిస్తానన్నారు. ఆయనకు వైద్యులు, లయన్స్, రోటరీ, అలయెన్స్ వంటి క్లబ్‌ల సభ్యులు తదితరులు అభినందనలు తెలిపారు.

26న విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు

మసీదు సెంటర్ (కాకినాడ): వచ్చేనెల 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా కాకినాడ డీఎస్ఏలో ఈనెల 26న ఓపెన్ కేటగిరీలో జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు పలు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో సతీష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్‌లో పురుషులు, మహిళలకు 100మీ పరుగుపందెం, చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 99851 13210 నంబరులో సంప్రదించాలని సూచించారు.

బిల్లులివ్వండి మహాప్రభో..!

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందిస్తున్న కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద ఏపీ మధ్యాహ్న భోజన పథక కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. సంఘ ప్రతినిధులు చంద్రమళ్ల పద్మ, షేక్ పద్మ, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, సత్యవతి, అమ్మాజీ తదితరులున్నారు.

ప్రశంసా పత్రాలతో పోలీసు అధికారులు తదితరులు

శాంతిభద్రతలను పరిరక్షించండి

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. పలు కేసుల్లో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను ప్రశంసాపత్రాలను అందించారు. ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ సత్యనారాయణ, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, జిల్లా పోలీసుకార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి మూర్తి, డీపీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి.. ఆసరా కల్పించండి

• పీజీఆర్ఎస్‌లో బాధితుల వేడుకోలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాలువలను ఆక్రమించేసి, ప్రవాహాలను అడ్డుకుంటున్నారు.. వంతెనలు పాడైపోయిన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.. వారసత్వంగా వచ్చిన భూమిని ఆక్రమించి అన్యాయం చేస్తున్నారు.. సంక్షేమ పథకాలు వర్తింప చేయమంటే లంచాలు డిమాండ్ చేస్తున్నారు.. సదరం ధ్రువపత్రాల్లేక ఇబ్బంది పడుతున్నాం.. పింఛను, రేషన్‌కార్డులు ఇవ్వక ఆర్థికంగా చితికిపోతున్నాం.. ఆదుకోండని పలువురు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఫిర్యాదు చేశారు. సమస్యలు ఆలకించి.. స్వాంతన చేకూర్చాలని వేడుకున్నారు.

ఇల్లు మంజూరుకు సొమ్ములు అడుగుతున్నారు

నాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. పీఎంఏవై-2.0లో ఇల్లు మంజూరు చేయాలని కత్తిపూడి గ్రామ సచివాలయం-1 సిబ్బందిని అడిగా. ప్రస్తుతం సర్వే చేస్తున్నారని చెప్పి, రూ.20 వేలు లంచం అడుగుతున్నారు. ఈ నెలాఖరులోగా వివరాలు ఆన్‌లైన్ చేయకపోతే మంజూరు కాదు. నాకు ఉన్న సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి అవకాశం కల్పించాలి.
- చిత్తారపు వీరబాబు, శాంతి, కొండవారిపేట, కత్తిపూడి, శంఖవరం మండలం

కాలువను కాపాడండి

కాకినాడ నగరంలోని 25వ డివిజన్, జగన్నాథపురం-పద్మనాభనగర్ మీదు కొవ్వూరు వెళ్లే పీడీ బ్ల్యాడీ కాలువను ఆక్రమించేశారు. గట్టుపై అనధికారికంగా ఇళ్లు నిర్మించుకుంటూ పోతున్నారు. కాలువ కుంచించుకుపోతోంది. వరదల వస్తే ముంపు వాటిల్లుతోంది. ఇక్కడున్న వంతెన శిథిలావస్థకు చేరింది. రాకపోకలు ఇబ్బంది మారాయి. ఆక్రమణలు తొలగించి, కాలువను బాగు చేయాలి.
- కొక్కిలిగడ్డ గంగరాజు, జగన్నాథపురం, కాకినాడ

స్థల కబ్జాకు యత్నం



నాకు సామర్లకోట మండలం, పవర గ్రామంలో రెండు దస్తావేజు నంబర్లలో 25 సెంట్లు, 75 సెంట్లు భూమి ఉంది. నా భూమి పక్కన వైకాపాకు చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధి రియల్ ఎస్టేట్ వెంచర్ వేసి, నా భూమిని ఆక్రమించాలని ప్రయత్నిస్తున్నారు. దీన్ని అడ్డుకోగా, మాపై సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్వే చేయించుకోమన్నారు. అతను రాకుండా తప్పించుకుని, నా భూమిని ఆక్రమించాలని చూస్తున్నారు.
- పేరూరు పద్మారావు, ఇంద్రపాలెం

ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకారవేతనాలు

ఉపకారవేతనాలు అందజేస్తున్న డాక్టర్ సుంకర సుమ, తిరుమల ప్రకాశ్ తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: అమెరికాలో నివసిస్తున్న ఎన్ఆర్ఐ అనిల్ చెరుకురి కాకినాడలో ప్రతిభావంతులైన ఐదుగురు విద్యార్థులకు రూ.2 లక్షల ఉపకార వేతనాలను ప్రకటించారు. సోమవారం కాకినాడలో జరిగిన కార్యక్రమంలో ఆ మొత్తాన్ని డాక్టర్ సుంకర సుమ, తిరుమల ప్రకాష్‌లు లబ్ధిదారులకు అందజేశారు. రాజేష్‌బాబు సుంకర(యుఎస్ఎ) సమన్వయం చేసిన కార్యక్రమంలో అనిల్ చెరుకురి అమెరికా నుంచి మాట్లాడుతూ విద్యే ప్రగతికి మూలమని చెప్పారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

కాకినాడ కలెక్టరేట్: కాకినాడ నగరంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. చీడీల పొర, బీచ్‌రోడ్డు విముక్తి స్కూల్‌కు ఉత్తరం వైపున గోదారిగుంటకు వెళ్లే దారిలో ఇరువుల ఆక్రమణలకు యత్నిస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని, ఇటువంటి అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని ప్రకటించారు.

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కాజులూరు: విద్యుత్తు కొత్త లైన్ల ఏర్పాటులో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎస్.ఉదయ్ భాస్కర్ తెలిపారు. కాజులూరు సబ్‌స్టేషన్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని కాజులూరు, ఆయితపూడి, టీఆర్‌పాలెం గ్రామాలకు సరఫరా నిలిపివేస్తామని వివరించారు. ★ తాళ్లరేవు: తాళ్లరేవు విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సీతారామపురం, పెద, చినబొడ్డువెంకటాయపాలెం, చినవలసల, పెదవలసల, లక్ష్మీపతిపురం, గాడిమొగ, భైరవపాలెం, తాళ్లరేవు గ్రామాల్లో మంగళవారం విద్యుత్తుకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఉదయ్ భాస్కర్ తెలిపారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

సామర్లకోట, పెద్దాపురం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి అన్నారు. సోమవారం పెద్దాపురం శంకరయ్య పేట, సామర్లకోట అంబేడ్కర్ కాలనీలోని 1, 2 అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది, ప్రీస్కూలు విద్యార్థులు హాజరు, వారికి అందించే పోషకాహారాన్ని, గుడ్లు, రికార్డులు పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు, సహాయకులకు పలు సూచనలు చేశారు.

సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ లక్ష్మి

నాయకులతో భేటీ అయిన సుజయ్‌కృష్ణ రంగారావు, చిత్రంలో జిల్లా తెదేపా అధ్యక్షుడు నవీన్‌కుమార్ తదితరులు

గ్రామీణ నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిని నియమించండి

కాకినాడ నగరం: కాకినాడ గ్రామీణ నియోజకవర్గానికి తెదేపా ఇన్‌ఛార్జిని నియమించాలని ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు కోరారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జోన్-2 సమన్వయకర్త సుజయ్‌కృష్ణ రంగారావును పలువురు కలిసి దీనిపై ప్రస్తావించారు. నియోజకవర్గానికి తెదేపా తరఫున ఇన్‌ఛార్జి లేకపోవడంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియటం లేదని వాపోయారు. అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి నియమకానికి చర్యలు తీసుకుంటానని ఆయన చెప్పారు. పిల్లి సత్యనారాయణమూర్తి, పెంకే శ్రీనివాసబాబా, నులుకుర్తి వెంకటేశ్వరరావు, కాశ సత్తిబాబు, చప్పిడి వెంకటేశ్వరరావు, కటకంశెట్టి బాబీ, కొల్లాబత్తుల అప్పారావు, రామదేవు సీతయ్యదొర, తదితరులున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవు

పెద్దాపురం: చట్టాలను అతిక్రమించి స్కానింగ్ కేంద్రాల వారు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి హెచ్చరించారు. సోమవారం ఆర్డీవో మాట్లాడుతూ చట్టాన్ని ఉల్లంఘించినవారికి మొదటిసారి రూ.3 వేలు జరిమానా, 10 సంవత్సరాల జైలు శిక్ష, రెండోసారి రూ.50 వేలు జరిమానా, 5 సంవత్సరాల జైలు శిక్షకు బాధ్యులవుతారన్నారు. డాక్టర్ ఎస్.ప్రకాశ్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పద్మ వాసవి, కందుల వెంకటలలం పాల్గొన్నారు.

విద్యార్థినులు అన్ని క్రీడల్లో రాణించాలి

లేఖానిహారికకు అభినందిస్తున్న పాఠశాల ఛైర్మన్ గంధి బాబ్జి

కరప, న్యూస్‌టుడే: బాలికలు ఆత్మస్థైర్యం పెంపొందించుకునేందుకు కరాటే, కుంగ్‌ఫూ వంటివి దోహదం చేస్తాయని గ్రీన్‌ఫీల్డ్ ప్రైవేటు పాఠశాల ఛైర్మన్ గంధి బాబ్జి సూచించారు. వాకాడలోని గ్రీన్‌ఫీల్డ్ పాఠశాలకు చెందిన 3. లేఖానిహారిక ఇటీవల కాకినాడలో జరిగిన మొదటి నేషనల్ కరాటే, కుంగ్‌ఫూ కరాటేలో పాల్గొని బ్లాక్ బెల్ట్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి కప్‌ను సాధించింది. స్థానిక పాఠశాలలో సోమవారం ఛైర్మన్ బాబ్జి ప్రతిభ కనబరిచిన లేఖానిహారికను ప్రిన్సిపల్ శిరీషతో కలిసి అభినందించి ఘనంగా సత్కరించారు. విద్యార్థినులు క్రీడల పట్ల మక్కువ కలిగి ఉండాలని సూచించారు.

నూరుశాతం ఉత్తీర్ణతకు సంకల్పం

పిఠాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణత కోసం ఇంటర్మీడియట్ విద్యాశాఖ ప్రత్యేక కసరత్తు చేస్తుంది. ఇందులో భాగంగా 'సంకల్ప్' పేరుతో 50 రోజుల ప్రణాళిక అమల్లోకి తెచ్చింది. కళాశాల్లో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి కేర్ టేకర్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేక టెస్టుల నిర్వహణతో వీరిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దనున్నారు.

ఆరంభం నుంచే ప్రత్యేక కార్యక్రమాలు

పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ గ్రామీణ నియోజకవర్గాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి ఉచిత పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమల్లోకి తెచ్చారు. అదే విధంగా కళాశాల తరగతులు వేసవికి ముందే ప్రారంభించారు. ఈ ఏడాది జూన్‌లో కాకుండా ఏప్రిల్‌లోనే నెలరోజులపాటు ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు తరగతులు నిర్వహించారు. ఇలా విద్యార్థుల ఉత్తీర్ణత పెంపునకు ఆరంభం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షల టైం టేబుల్‌ను అధికారులు ప్రకటించారు. దాంతో 'సంకల్ప్-2026' పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి ఉపాధ్యాయులు శ్రీకారం చుట్టారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 50 రోజుల ప్రణాళిక

ప్రత్యేక తరగతుల్లో పిఠాపురం ఇంటర్ విద్యార్థులు

కేర్‌టేకర్లతో సామర్థ్యాల పరీక్ష

ఈ నెల 24 నుంచి ఫిబ్రవరి 20 వరకు 50 రోజుల ప్రణాళికతో విద్యార్థులకు నూరుశాతం ఉత్తీర్ణతకు అధ్యాపకులు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. విద్యార్థులను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి వారికి కేర్ టేకర్లను నియమించారు. వారి సామర్థ్యాలను పరీక్షించి ఎందులో తక్కువ మార్కులు సాధిస్తున్నారో తెలుసుకుని వాటిల్లో ఎక్కువ మార్కులు వచ్చేవిధంగా కృషి చేస్తారు.

కళాశాలలు, విద్యార్థుల వివరాలు

కళాశాల	ప్రథమ సం॥	ద్వితీయ సం॥
పిఠాపురం	306	295
వేళంగి	102	63
గొల్లప్రోలు	118	66
సామర్లకోట	328	240

స్టడీ అవర్స్ మొదలయ్యాయి

ప్రభుత్వ ఆదేశాల మేరకు సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా స్టడీ అవర్స్ మొదలయ్యాయి. డిసెంబరు 22 నుంచి ఫిబ్రవరి 20 వరకు నెలరోజుల ప్రణాళిక మరింత పటిష్ఠంగా ఉంటుంది. డిసెంబరు 15 నుంచి 20 వరకు ప్రీఫైనల్ నిర్వహించి, వెనుకబడిన విద్యార్థులను బాగా చదివిస్తాం.

– కేశవరావు, ప్రిన్సిపల్, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, పిఠాపురం

27న కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: పెద్దాపురం పురపాలక మండలి సర్వసభ్య సమావేశం ఈనెల 27న ఉదయం 11 గంటలకు కౌన్సిల్‌హాలులో నిర్వహిస్తామని కమిషనర్ కే.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి విధిగా కౌన్సిల్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

పిఠాపురం: పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలు అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని పాడా ఏపీడీ వసంత మాధవి తెలిపారు. సోమవారం పిఠాపురం పాడా కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. 43 అర్జీలు అందాయని, అందులో రెవెన్యూకి 13, మున్సిపాల్టీకి 07, వ్యవసాయశాఖకు 03, ఇతర శాఖలకు 15 వచ్చాయన్నారు. వాటి కోసం అక్కడే సంబంధిత అధికారులు చర్చించి, అర్జీలు ఆన్‌లైన్ చేసినట్లు చెప్పారు. 1100కి కాల్ చేసి అర్జీల స్థితిని తెలుసుకోవచ్చన్నారు. కమిషనర్ రాజు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర విగ్రహ ప్రతిష్ఠ

తాళ్లరేవు: పిల్లంకలో గోదావరి తీరాన వల్లీ దేవసేన సుబ్రహ్మణ్వేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నెల 26న సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని సోమవారం స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

బాధ్యులను శిక్షించాలి

పిఠాపురం: అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీ రోజున బీ.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి అగౌరవం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని లేకుంటే ఉద్యమానికి సిద్ధమవుతామని పీవీ రావు మాలమహానాడు, బహుజన సమాజ్ పార్టీ నాయకులు హెచ్చరించారు. సోమవారం పాడా ఏపీడీకి వినతి పత్రాన్ని అందజేశారు. వేళంగి వెంకటేష్, కొంగు నూకరాజు, ఖండవల్లి లోవ రాజు, చిల్లి నూకరాజు తదితరులు ఉన్నారు.

ప్రాథమిక అక్షరాస్యత వివరాల నమోదు

పెదపూడి: విద్యార్థుల ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం నమోదు పక్కాగా చేపట్టాలని ఎంఈవో-2 సీవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నాలుగు క్లస్టర్లలో నమోదు చేస్తున్న లీప్ యాప్‌ను ఎంఈవో-1 విశ్వనాథంతో కలిసి పరిశీలించామన్నారు.

స్నేహితుడికి సాయం

తాళ్లరేవు: స్థానిక పెంకేవారిపేటకు చెందిన గుబ్బల శ్రీనివాస్ కొంతకాలంగా ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారు. తాళ్లరేవులోని నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి గెడ్డం అనిల్ కుమార్, రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులు కలిసి రూ.20వేలు శ్రీనివాస్ కుటుంబానికి సోమవారం అందించారు.

సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

తాళ్లరేవు: ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కాకినాడ డీఎంహెచ్‌వో జి.నరసింహనాయక్ హెచ్చరించారు. గాడిమొగ పంచాయతీ చినవలసలకు చెందిన గర్భిణి పెసింగి మల్లేశ్వరి (31) ఈ నెల 20న కాకినాడ జీజీహెచ్‌లో మృతి చెందారు. ఈ ఘటనపై కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో జి.నరసింహ నాయక్, డీఐవో కె.వి.సుబ్బరాజు సోమవారం గాడిమొగ పీహెచ్‌సీ వైద్యురాలు జయభార్గవి, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్త లీలావతి, హెల్త్ విజిటర్ నెహ్రూరాణి, ధనలక్ష్మిని సోమవారం విచారించారు. గర్భిణికి అందించిన వైద్య సేవలపై ఆరా తీశారు. వాటికి సంబంధించిన పత్రాలను తనిఖీ చేశారు. అనంతరం మృతురాలి స్వగృహం చినవలసలకు వెళ్లారు. కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని ఆయన తెలిపారు. ఎంపీహెచ్ఈవో బొడ్డు కుమార్, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గాడిమొగ పీహెచ్‌సీలో సిబ్బందిని విచారిస్తున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్

షష్ఠి సంబరాలకు సర్వం సిద్ధం

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 88వ షష్ఠి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. విద్యుద్దీపాలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. వేలసంఖ్యలో వచ్చే భక్తుల కోసం బారికేడ్లు ఏర్పాటుచేశారు. 60 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈనెల 26వ తేదీ వేకువజాము 3.30 గంటల నుంచి స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 7 గంటల నుంచి సర్వ దర్శనాలకు అనుమతిస్తారు. అదేరోజు రాత్రి దివ్య కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఈనెల 30న మయూర వాహనంపై స్వామివారి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

శ్రీవల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

జనసైనికులకు అండ

కార్యకర్త కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

సర్పవరం(కరప): కాకినాడ గ్రామీణ మండలం వాకలపూడికి చెందిన జనసేన కార్యకర్త పాలపర్తి అభినంద్ ఇటీవల ఓ ప్రమాదంలో మృతి చెందారు. అభినంద్‌కు జనసేన పార్టీ ప్రమాద బీమా చేపట్టగా వచ్చిన రూ.5లక్షల బీమా చెక్కును సోమవారం తాడేపల్లిలోని అన్నపూర్ణ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు, ఎమ్మెల్యే నానాజీ, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామితో కలిసి బాధిత కుటుంబానికి అందజేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

గొల్లప్రోలు: కష్టాల్లో ఉన్న ప్రజలను పెద్ద కొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ అన్నారు. గొల్లప్రోలులో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధిత కుటుంబాలకు సోమవారం పంపిణీ చేశారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, బస్సా సత్యనారాయణ, శీరం మాణిక్యం, దువ్వా తాతాజి, ఇందన శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాలనీయా.. డంపింగ్‌యార్డా

పెద్దాపురం పట్టణ పరిధి వాలుతిమ్మాపురం రహదారిలోని టిడ్కో కాలనీలో ప్రధాన రహదారి పక్కన చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇక్కడ చెత్తకుప్పలతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. చెత్తవేసేందుకు సరైన ఏర్పాట్లు లేకపోవడం, అప్పుడప్పుడూ కార్మికులు రావడంతో ఈ పరిస్థితి ఉందని కాలనీవాసులు అంటున్నారు. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. – న్యూస్‌టుడే, పెద్దాపురం

రక్షితనీటి వృథాతో వ్యథ..

గొల్లప్రోలు మండలం తాటిపర్తి - వన్నెపూడి మధ్య రహదారి పక్కన పైపులైను లీకుల నుంచి రక్షితనీరు వృథాగా పోతోంది. దీంతో గ్రామాల్లో కుళాయిల ద్వారా తాగునీరు సక్రమంగా సరఫరాకాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పైపులైను లీకులకు మరమ్మతులు చేపట్టి రక్షిత నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి పైపులైను లీకులకు మరమ్మతులు చేయిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పి.కృష్ణ తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

కల్వర్టు బాగు చేయరూ

పిఠాపురంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద కల్వర్టుపై స్లాబ్ రాళ్లు దెబ్బతిన్నాయి. భారీ వాహనాల రాకపోకలకు విరిగిపోయాయి. దాంతో స్థానికులు వాటిని పక్కకు తొలగించారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రి వద్ద నుంచి పాదగయ వైపు వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఏఈ అభిలాష్ మరమ్మతులు చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

నీటి ప్రవాహానికి ఆటంకం

కరప మండలం గొడ్డటిపాలెం ఎస్సీపేటలో విద్యుత్తు స్తంభాన్ని తొలగించకుండా డ్రెయినేజీ నిర్మాణం చేపట్టడంతో ఇళ్లల్లోని వాడకం సరిగా లాగక కాలనీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్తంభాన్ని వేరే చోట ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఏఈ ఈశ్వర్‌ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా విద్యుత్తు స్తంభాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కరప

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

సర్పవరం(కరప), న్యూస్‌టుడే: ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్లు తదితర కారణాలతో మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకి పెరుగుతుందని, ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ ఎం.రాఘవేంద్రరావు సూచించారు. కాకినాడ గ్రామీణం బోట్ క్లబ్ ఉద్యానంలో సోమవారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత రక్తపరీక్షల వైద్య శిబిరం నిర్వహించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లింగుమల్లి కృష్ణమూర్తి మాట్లాడుతూ మధుమేహ వ్యాధి వచ్చిన తర్వాత నియంత్రించడం కన్నా ఆ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సేవలకు సత్కారం

పెదపూడి: సంపరకు చెందిన ఖండవల్లి హనుమంతాచార్యుల దంపతులను సోమవారం సత్యసాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. హిందూధర్మాన్ని పాటించాలని ప్రచారం చేస్తూ ఆలయాల్లో పూజలు, పుణ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు సన్మానిస్తున్నట్లు సత్యసాయిబాబా సేవా సమితి అధ్యక్షుడు తబిరిశెట్టి త్రిమూర్తులు తెలిపారు.

రగ్బీ క్రీడలో బాలికల జట్టు సత్తా

పిఠాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని కోచ్ లక్ష్మణరావు తెలిపారు. సోమవారం అసోసియేషన్ సభ్యులు వారికి అభినందనలు తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో కర్నూలులో జరిగిన 69వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ రగ్బీ పోటీల్లో బాలికలు సత్తా చాటి ప్రథమ బహుమతి సాధించారని పేర్కొన్నారు. వీరిలో పలువురికి జాతీయ స్థాయిలో పోల్గొనే అవకాశం ఉంటుందని, వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి అక్కడ విజయం సాధించేలా తీర్చి దిద్దుతామని చెప్పారు. వీరికి కోచ్ మేనేజర్లుగా పిఠాపురానికి చెందిన పీడీలు శేషుకుమారి, నాగలింగేశ్వరరావు, భార్గవ్ వ్యవహరించారని తెలిపారు.

బహుమతి అందుకుంటున్న జట్టు సభ్యులు

రాష్ట్రస్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకోవాలి.. పిఠాపురం: జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకోవాలని ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ సూచించారు. పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆదివారం ఉండూరులో జరిగిన జిల్లాస్థాయి పోటీ పరీక్షల్లో తలపడి, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించడంతో వారిని అభినందించారు.

టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక

పెద్దాపురం: రామారావుపేటలోని శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్‌కి చెందిన విద్యార్థినులు జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ డైరెక్టర్ విజయప్రకాష్ తెలిపారు. ఈనెల 17 నుంచి 19 వరకు విశాఖపట్నం గీతం కళాశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో పాల్గొని 15 రజత పతకాలు సాధించారన్నారు. మొహర్దాస్, టి.సుదీక్ష, ఎం.శాంతి జ్యోతి, డి.గీతాంజలి పోటీలకు అర్హత సాధించినట్లు ఆయన తెలియజేశారు.

సామర్లకోట విద్యార్థినికి ప్రథమ బహుమతి

సామర్లకోట: చిల్డ్రన్స్ ఎక్స్‌పోజర్ విజిట్‌లో సామర్లకోట విద్యార్థినికి ప్రథమ బహుమతి లభించిందని సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి అన్నారు. ఇటీవల ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు విధులు వంటి వాటిపై అవగాహన కల్పించేందుకు చిల్డ్రన్ ఎక్స్‌పోజర్ విజిట్ నిర్వహించారన్నారు. ఇందులో పి. లక్ష్మీశరణ్య అనర్గళంగా మాట్లాడి ప్రథమ బహుమతి పొందిందన్నారు. ఈమేరకు అసిస్టెంట్ కలెక్టర్ మనీషా చేతులమీదుగా సోమవారం అవార్డును అందించారన్నారు.

రాష్ట్రస్థాయి లాంగ్‌జంప్ పోటీల్లో ప్రతిభ

సూర్యనారాయణ

పెదపూడి: సంపర జడ్పీ పాఠశాల విద్యార్థి సిరిశెట్టి సూర్యనారాయణ లాంగ్ జంప్‌లో మూడో స్థానం సాధించాడని హెచ్ఎం మూర్తి సోమవారం తెలిపారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-17 అథ్లెటిక్స్ లాంగ్‌జంప్ పోటీలు వినుకొండలో జరిగాయి. వాటిలో కాంస్య పతకం సాధించాడన్నారు.

రైతులకు పంచసూత్రాలపై అవగాహన

సామర్లకోట గ్రామీణం: మాధవపట్నంలో సోమవారం 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో భాగంగా పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప రైతుల ఇళ్లకు వెళ్లి ముఖ్యమంత్రి చెప్పిన పంచసూత్రాలు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. నిమ్మకాయల రంగనాగ్, పెంకే వెంకటేష్, నూనె రామారావు పాల్గొన్నారు. ● పిఠాపురం: పిఠాపురం జాతీయ రహదారి, పట్టణ రైతులకు మండల వ్యవసాయాధికారి గంగాధర్ కరపత్రాలు అందించి, వివిధ సేవల గురించి వివరించారు. ● గొల్లప్రోలు: చేబ్రోలులో ఈవో సత్యనారాయణ, వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు, సిబ్బంది ఇంటింటా పర్యటించి ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేశారు. దుర్గాడలో రైతులకు కరపత్రాలు పంచారు. ● చేబ్రోలులో పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారిణి గీతారాణి సిబ్బందితో కలిసి పట్టు రైతులను కలిసి వివరాలు సేకరించారు. ● సామర్లకోట: స్థానిక ఉప్పువారి వీధి పీబీసీ కాలువ సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం వద్ద సామర్లకోట మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ మణికుమారి పాల్గొని రైతులతో మాట్లాడారు. ● పెదపూడి: జి.మామిడాడలో ఏఎంసీ ఛైర్మన్ జుత్తుక సూర్యకుమారి పాల్గొన్నారు. ● తాళ్లరేవు: తాళ్లరేవు మండలంలోని పి.మల్లవరం, తాళ్లరేవు, పటవల, కోరింగ, చొల్లంగి, ఇంజరం గ్రామాల్లో తెదేపా మండల అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు ధూళిపూడి వెంకటరమణ, కట్టా త్రిమూర్తులుతో పాటు కొత్తూరు కాశీ ఈశ్వరుడు, దంగేటి అన్వేష్ పాల్గొన్నారు.

మాధవపట్నంలో కరపత్రాలు పంచుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు శివారు 216 జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువుకు చెందిన గంధం శ్రీను (40) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఈప్రమాదంలో పిఠాపురం మండలం నరసింగపురం గ్రామానికి చెందిన ఉండ్రు కృష్ణారావు అలియాస్ రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శ్రీను మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు.

మహిళపై అసభ్య ప్రవర్తన

నిందితుడు అరెస్టు

సర్పవరం(కరప): మహిళతో అసభ్యకరంగా మాట్లాడి చంపేస్తానని బెదిరించిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ బి.పెద్దిరాజు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం. . పిల్లి సతీష్ అనే నిందితుడు ఈ నెల 20వ తేదీన పాత గైగోలుపాడుకు చెందిన మహిళ ఇంట్లోకి వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించి చంపేస్తానని బెదిరించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు ఎస్సై శ్రీనివాసకుమార్ సిబ్బందితో కలిసి సోమవారం సర్పవరం వెళ్లే రోడ్డులో నిఘా ఉంచి నిందితుడు సతీష్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పరిశీలన

నాడు వైభోగం.. నేడు నిరుపయోగం

సామర్లకోట రైల్వే కల్యాణ మండపం నిర్వహణ శూన్యం

సామర్లకోట, న్యూస్‌టుడే: ఒకప్పుడు సామర్లకోట గాంధీబొమ్మ సెంటర్‌లో రైల్వే కల్యాణ మండపం ఎంతో వైభోగంతో కళకళలాడుతూ ఉండేది. రాను రాను పట్టణంలో అధునాతన హంగులు, ఏసీ వంటి సౌకర్యాలతో కల్యాణ మండపాలు నిర్మించడంతో ఈ మండపానికి ఏసీ లేకపోవడంతో ఆదరణ కరవయ్యింది. గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారింది. నిర్వహణ లేకపోవడంతో ప్రస్తుతం భవనం గోడలపై మొక్కలు పెరుగుతున్నాయి.

రైల్వే కల్యాణ మండపం, (అంతరచిత్రం) గోడలపై పెరుగుతున్న మొక్కలు

1000 మందికి సరిపడేలా..

సామర్లకోట పట్టణంలో రైల్వే ఉద్యోగులు, ప్రజల సౌకర్యార్థం రైల్వే శాఖ నిధులతో కల్యాణ మండపాన్ని 2007లో శంకుస్థాపన చేసి 2009 మేలో ప్రారంభోత్సవం చేశారు. భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో భోజనాలు, మొదటి అంతస్తులో కల్యాణ మండపం వేదిక, రెండవ అంతస్తులో వసతి గదులను నిర్మించారు. సుమారు వెయ్యిమంది కూర్చునే సామర్థ్యం గల మండపం నిర్మాణం చేయడంతో అనేక మంది ఈ మండపంలోనే వివాహాలు, కార్యక్రమాలు నిర్వహించేవారు.

ప్రస్తుతం ఆదరణ లేక శిథిలావస్థకు చేరే అవకాశం ఉందని.. కల్యాణ మండపానికి మరమ్మతులు చేసి, సౌకర్యాలు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాలని మానవహక్కుల సంఘం నాయకులు, సీనియర్ సిటిజన్‌లు, పలువురు ప్రజలు కోరుతున్నారు.

పూర్వవైభవం తీసుకువస్తాం..

రైల్వే కల్యాణ మండపాన్ని ఆధునీకీకరణ చేసి వినియోగంలోకి తీసుకుంటాం. పలువురి నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాం. మరమ్మతులు చేయడం, ఏసీల ఏర్పాటు, నిర్వహణకు ప్రతిపాదనలు పెట్టి అందుబాటులోకి తెస్తాం. కల్యాణ మండపానికి పూర్వ వైభవం తీసుకువస్తాం.

– ప్రభాకరరావు, ఏడీఈఎస్ సామర్లకోట రైల్వేస్టేషన్

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

సర్పవరం(కరప): తన సొంత స్థలంలోకి దౌర్జన్యంగా ప్రవేశించి ప్రహరీ కూల్చివేసిన బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని సర్పవరానికి చెందిన బలిరెడ్డి అప్పారావు కోరారు. కాకినాడ గ్రామీణమండలం సర్పవరంలో సోమవారం ఆయన మాట్లాడుతూ సర్వే నంబరు 36లో కొంత స్థలం ఉందని, అందులో ప్రహరీ ఉండగా విష్ణు, శేషారావులు గునపంతో గోడను కూల్చివేసి చంపేస్తామంటూ దాడికి ప్రయత్నించారని వాపోయారు. అనంతరం సర్పవరం పోలీసు స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పెద్దిరాజు తెలిపారు.

డాక్యుమెంట్స్ పడిపోయినవి

TADI GANGADHARA RAO, S/o Late TADI Suryanarayana, D.No.32-8-30, రాజాజీ వీధి, కాకినాడ అర్బన్, కాకినాడ జిల్లా. మా అమ్మ తాడి సుబ్బాయమ్మ గారికి సంబంధించిన స్థలం తాలూకా ఒరిజినల్ లింకు డాక్యుమెంట్స్ నెం. 2138/1979 డి.12-11-2025 మా ఇంటి వద్ద నుండి సామర్లకోట, గడియారం సెంటర్‌కు వెళ్లుచుండగా మార్గమధ్యలో పడిపోయినవి. చుట్టుప్రక్కల ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించండి.

Cell: 89770 15188

(c) eenadu

తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

జలకళతో పోలవరం

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: బీడు భూములను సస్య శ్యామలం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన పోలవరం కాలువ పనులు పూర్తికానుండటంతో జలకళతో కాలువ దర్శనం ఇవ్వడం విశేషం. మండలంలో 18 కి.మీ. పొడవునా నిర్మిస్తున్న పోలవరం కాలువ నిర్మాణ పనులు 90 శాతం వరకు పూర్తయ్యాయి. తుని మండలంలోని గవరపేట నుంచి హంసవరం వరకు కాలువ మొత్తం నీళ్లతో నిండి కళకళలాడుతోంది. రైతులు పొలాలకు మోటార్ల ద్వారా నీటిని అందిస్తున్నారు.

నందనవనంలో అన్నదానం

రౌతులపూడి, న్యూస్‌టుడే: శృంగవరం, ఎం.చామవరం గ్రామాల్లోని నందనవనంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. శ్రీఉమా నాగలింగేశ్వరస్వామి ఆలయంలో జరిగిన అభిషేకం, అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల సామాజిక తనిఖీ

ప్రత్తిపాడు: మండలంలో 2024-25లో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారు. 23 పంచాయతీల పరిధిలో రూ.12 కోట్లతో 560 పనులు జరిగాయి. వీటిలో వేతనాల చెల్లింపునకు రూ.9కోట్లు మిగతా మొత్తాన్ని నిర్మాణ సామగ్రికి వెచ్చించారని ఎంపీడీవో కుమార్‌బాబు తెలిపారు. తనిఖీ బృందాలు మంగళవారం నుంచి గ్రామాలకు వెళ్లి పనుల వాస్తవికతను పరిశీలించి గ్రామసభల్లో నివేదిస్తారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

పూడిక తీయించరూ..!

సమస్య: తిరుమాలి పాత గ్రామంలో మురుగు కాలువల్లో వ్యర్థాలు ఉన్నాయి. నీరు ముందుకు పారకపోవడంతో దోమల బెడద అధికమైంది. కాలువలను శుభ్రం చేయించాలి. - రమేష్, తిరుమాలి

సమాధానం: కాలువలను శుభ్రం చేసేందుకు పారిశుద్ధ్య కార్మికులకు ఆదేశాలిస్తా. - సూతి కృష్ణ ప్రసాద్, సర్పంచి, తిరుమాలి.

- న్యూస్‌టుడే, ఏలేశ్వరం

అన్నదాతల్లో ఆనందం

రైతుకు కరపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, కూటమి నాయకులు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: రైతులు సంతోషించేలా ప్రభుత్వం సాగుకు అన్ని దశల్లోనూ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ప్రత్తిపాడులో కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు, సింగిలిదేవి సత్తిరాజు, మేడిశెట్టి సూర్యకిరణ్ తదితరులతో కలిసి రైతుల ఇళ్లకు వెళ్లి అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం లబ్ధిదారులను కలిశారు. ప్రభుత్వ సంక్షేమం వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

29న ప్రత్తిపాడులో మెగా జాబ్‌మేళా

ప్రత్తిపాడు: కాకినాడ వికాస్ వారి ఆధ్వర్యంలో 29న మెగా జాబ్‌మేళాను ప్రత్తిపాడు ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన గోడపత్రికను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సోమవారం తెదేపా కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వికాస్ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు సిద్ధం

శోభాయమానంగా శరవణభవుని ఆలయాలు

కత్తిపూడిలో కొలువైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

శంఖవరం, న్యూస్‌టుడే: కోరిన కోరికలు తీర్చే దేవుడిగా కత్తిపూడి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రసిద్ధి. ఈ స్వామి షష్ఠి కల్యాణమహోత్సవాలు రేపటి నుంచి ప్రారంభంకానున్నాయి. శరవణభవ అంటూ వేడుకోవడమే తరువాయి భక్తుల కోరికలు తీరుతాయని నమ్మిక. సుమారు 80 ఏళ్ల కిందట ఇక్కడ కొండపై రాళ్లు తవ్వేవారికి స్వామి విగ్రహం దొరికిందని నమ్మకం.

రోజూ ఆలయ ఆవరణలో తిరుగుతున్న పాము

కత్తిపూడిలో స్వయంభువుగా పిలుపులందుకుంటున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద రోజూ ఆలయ ఆవరణలో సర్పం తిరుగుతుండడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఇక్కడ భక్తులు ఏడు వారాలు స్వామికి అభిషేకాలు చేసి కోరికలను కోరుకుంటే నెరవేరుతాయంటారు. ఏటా కమిటీ ఆధ్వర్యంలో 11 రోజులు పాటు ఉత్సవాలను నిర్వహిస్తారు.

ప్రత్తిపాడులో ఆలయం ముస్తాబు...

ప్రత్తిపాడు: సుబ్బారాయుడి షష్ఠి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. శరభవరం, గజ్జనపూడి ప్రజల ఆరాధ్య దైవంగా ఉన్న స్వయంభూ శ్రీనాగేంద్ర స్వామి సహిత వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో షష్ఠి మహోత్సవాల్లో భాగంగా 26న పుట్ట పూజ, ఏకవారాభిషేకాలు, ఊయల సేవ, అనంతరం శాంతి కల్యాణం నిర్వహిస్తారు. సంతాన జాగరణకు ఏర్పాట్లు చేశారు. 30న శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ తెలిపింది.

శరభవరంలో దేవేరులతో సుబ్రహ్మణ్యేశ్వరుడు

కష్టపడి పనిచేస్తేనే సముచిత స్థానం

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: పార్టీకి విధేయతతో కష్టపడి పనిచేస్తే సముచిత స్థానం దక్కుతుందని మాజీ మంత్రి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు తెలిపారు. రాష్ట్ర పెరిక కార్పొరేషన్ ఛైర్మన్ వనపర్తి వీరభద్రరావు మండలంలోని తేటగుంట పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా యనమలను కలిశారు. అధిష్ఠానం తన సేవలు గుర్తించి పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్ ప్రతినిధులు, సంఘ నాయకులు యనమలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొమిరిశెట్టి నరసింగరావు, గోడే బుజ్జి, యడ్ల సూరిబాబు, బెక్కం రాధాకృష్ణ, వనపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యనమలను సత్కరిస్తున్న నాయకులు

పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్

జగ్గంపేట గ్రామీణం(జగ్గంపేట), న్యూస్‌టుడే: పేదప్రజలు, బాటసారుల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట మెయిన్‌రోడ్డులో ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో భోజనాలు వడ్డించారు. గోకవరానికి చెందిన తెదేపా నాయకులు గంధ్రెడ్డి సన్యాసిరావు కుమార్తె పుట్టినరోజు సందర్భంగా సమకూర్చిన ఆర్థిక సహకారంతో కార్యక్రమం నిర్వహించారు. జగ్గంపేటలో నూతనంగా నిర్మించిన అన్న క్యాంటీన్ భవనం పూర్తయిందన్నారు. నాయకులు అప్పలరాజు, మణిబాబు, కొండబాబు, దేవరపల్లి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి

ఇర్రిపాకలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతన్నను సంపన్నుడిగా ప్రభుత్వం మారుస్తుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఇర్రిపాక, రామవరంల్లో 'రైతన్న మీకోసం' లో అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే నెహ్రూ, జిల్లా ఉద్యానశాఖాధికారి టి.వీరసిరిల్ మాట్లాడుతూ.. సాగులో చేపడుతున్న సాంకేతికత, ప్రభుత్వ రాయితీలను వివరించారు. ఎడిఎ శ్రీనివాస్, ఉద్యానశాఖాధికారిణి శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

తొండంగి, రౌతులపూడి, తుని గ్రామీణం, కిర్లంపూడి: అన్ని గ్రామాల్లో సోమవారం 'రైతన్న మీకోసం' కార్యక్రమం ప్రారంభమైంది. ఏవో పద్మశ్రీ, ఏఈవోలు, సిబ్బంది, కూటమి నాయకులు రైతుల ఇళ్లవద్దకు వెళ్లి ఈ పథకం లబ్ధి, ఇతర వివరాలపై అవగాహన కల్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పంచ సూత్రాల సందేశాన్ని రైతులకు చదివి వినిపించారు. ముఖ్యంగా నీటి భద్రత, అగ్రిటెక్, డిమాండ్ ఆధారిత పంటల సాగు, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ పథకాల గురించి తెలిపారు.

మిషన్ వాత్సల్యలో విద్యార్థుల ప్రతిభ

ప్రత్తిపాడు: మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా నిర్వహించిన ఛైల్డ్ ఎక్స్‌పోజర్ విజిట్‌లో మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ చూపారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి పౌరసేవలను స్వయంగా చూశారు. ఈ పర్యటనలో తమ అనుభవాలను దృశ్యరూపాన్నివ్వడంలో ప్రతిభ కనబరిచిన లంపకలోవ, గజ్జనపూడి హైస్కూలు విద్యార్థినులు చాపల జ్యోతి, యల్లపు హర్షవర్ధినిలు జిల్లా కలెక్టరు షాన్ మోహన్ నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థిని

నాడు-నేడు.. తీరు చూడు..!

✦ నిలిచిన రూ.17.86 కోట్ల పనులు ✦ అదనపు తరగతి గదుల్లేక అవస్థలు

న్యూస్‌టుడే, తుని గ్రామీణం, తొండంగి.

గత ప్రభుత్వం విద్యావ్యవస్థను సమూలంగా మార్చేస్తామంటూ గొప్పలు చెప్పిన ప్రభుత్వం ఆ మేరకు నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో అసంపూర్తి నిర్మాణాలు వెక్కిరిస్తున్నాయి. విద్యార్థులకు సరిపడా గదులు లేకపోవడంతో వారు ఇరుకుగదులు, వరండాల్లో చదువు సాగించాల్సిన పరిస్థితి.

నియోజకవర్గంలో పరిస్థితి ఇలా..

నాడు-నేడు రెండో విడతలో సుమారు 135 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.36.13 కోట్లు మంజూరుకు అనుమతులు ఇచ్చారు. అయితే నిధులు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించారు. దీంతో మొండి గోడలు, స్తంభాలు, అసంపూర్తిగా అదనపు తరగతి గదులు నిలిచిపోయాయి. వీటి నిర్మాణాలు పూర్తి చేయాలంటే సుమారు మరో రూ.17.86 కోట్లు నిధులు మంజూరు చేయాల్సిఉంది. ఈ నిధులు మంజూరు చేస్తే విద్యార్థుల అవస్థలు గట్టెక్కుతాయి. ఆ దిశగా కూటమి ప్రభుత్వం చొరవ చూపి అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తిమ్మాపురం జడ్పీ పాఠశాలలో స్తంభాలతో ఆగిన పనులు

నిధుల మంజూరు ఇలా (రూ.కోట్లలో..)

మండలం	గదులు	కేటాయింపు	నిధుల మంజూరు	రావాల్సిన నిధులు
తుని	36	9.77	4.04	5.73
తొండంగి	75	22.35	11.67	10.68
కోటనందూరు	24	4.01	2.56	1.45
మొత్తం	135	36.13	18.27	17.86

మాక్ అసెంబ్లీకి తరలిన విద్యార్థులు

కిర్లంపూడి: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీకి తామరాడ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జగ్గంపేట నియోజకవర్గస్థాయి పోటీల్లో గెలిచారు. వీరు అమరావతికి బయలుదేరుతున్న సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యార్థులను, వారికి తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే నెహ్రూ అభినందించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం కృష్ణ, ఉపాధ్యాయులు బావిశెట్టి లక్ష్మీనారాయణ, బాలిన నూకరాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

శంఖవరం: నెల్లిపూడి గ్రామానికి చెందిన రేవాడ రామాయ్యమ్మ ఇటీవల మృతి చెందారు. సోమవారం జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు తలపంటి అప్పారావు (బుజ్జి) ఆయా కుటుంబసభ్యులను కలిసి రూ.5 వేలు ఆర్థిక సహాయం, 50 కిలోల బియ్యం అందజేశారు. సత్యనారాయణ, వీరబాబు, జాన్ తదితరులు పాల్గొన్నారు.

వేలాడే తీగలకు కర్రలే ఊతంగా..

గ్రామాల్లో ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. గండేపల్లి మండల కేంద్రంలో ఇళ్ల ముందు నుంచి వెళ్లిన విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతుండడంతో గ్రామస్థులు కర్రను దన్నుగా పెట్టారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గండేపల్లి

మలుపుతో పొంచి ఉన్న ప్రమాదం

సోమరాయణింపేట గ్రామశివారు ర.భ.రోడ్డులో ప్రమాదకరంగా మారిన మలుపులో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గోనేడ నుంచి రామవరం వెళ్లే ర.భ.రోడ్డులో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. పాలెం, సోమరాయణింపేట మీదుగా బూరుగుపూడిలో హైవేకి వెళ్లే వాహనాల సంఖ్య పెరిగింది. మలుపుల్లో ప్రమాదహెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి రోడ్డుకు ఇరువైపులా ఉన్నతుప్పలను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలి. - న్యూస్‌టుడే, కిర్లంపూడి

పశువైద్యశాల మెరుగుపడేనా..!

పాలెం గ్రామంలో ఉన్న పశువైద్యశాల పూర్తిగా శిథిలమైంది. పది గ్రామాల పరిధిలోని పశువులకు ఇక్కడ వైద్యసేవలు అందిస్తున్నారు. సుమారు 40 ఏళ్ల కిందట నిర్మించిన ఈభవనం స్లాబ్ అచ్చులు ఊడి కిందపడుతున్నాయి. బీములు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సిబ్బంది విధులు నిర్వర్తించేందుకు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు చర్యలుచేపట్టాలని పశుపోషకులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కిర్లంపూడి

స్తంభాన్ని ఢీకొన్న టిప్పర్

రమణయ్యపేట వద్ద ప్రమాద దృశ్యం

ఏలేశ్వరం: రమణయ్యపేట వద్ద టిప్పర్ రహదారి సమీపంలో ఉన్న విద్యుత్తు స్తంభాన్ని సోమవారం ఢీకొట్టింది. నల్లరాళ్లతో ఏలేశ్వరం వస్తున్న వాహనం అదుపు తప్పి దూసుకుపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. స్తంభం పూర్తిగా పడిపోకపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. టిప్పర్ చోదకుడు ప్రమాదం నుంచి బయటపడ్డాడని స్థానికులు చెబుతున్నారు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

గిరాకీ ఉన్న పంటలే సాగు చేయాలి

అన్నదాత సుఖీభవ పత్రాన్ని అందిస్తున్న ఉద్యాన శాఖాధికారి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: గిరాకీ ఉన్న పంటలనే రైతులు సాగు చేయాలని జిల్లా ఉద్యాన శాఖాధికారిణి టీవీ సిరిల్ అన్నారు. యర్రవరంలో సోమవారం జరిగిన 'రైతన్నా మీ కోసం' అనే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన పంటలు వేసినప్పుడే అన్నదాతలకు మేలు జరుగుతుందన్నారు. పామాయిల్, చిరుధాన్యాల సాగు తదితరాలతో ఆర్థికంగా ప్రయోజనం ఉంటుందన్నారు. ప్రతి మూడు కుటుంబాలకు చెందిన రైతులను క్లస్టర్‌గా ఏర్పాటుచేసి అన్ని అంశాలపై వారికి అవగాహన కల్పిస్తామన్నారు. ఆయన అన్నదాత సుఖీభవ పత్రాలను రైతులకు అందించి ప్రయోజనాలను వివరించారు. వ్యవసాయ, ఉద్యాన మండల స్థాయి అధికారులు ఏవీ రాజేష్, కె.దివ్యశ్రీ, డిప్యూటీ ఎంపీడీవో రామరాజు వర్మ, తెదేపా నాయకులు బసా ప్రసాద్, మైరాల కనకారావు పాల్గొన్నారు.

చెకుముకిలో ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తొండంగి: కేపీపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సతీష్, ప్రవీణ్, ఉమాపుష్ప, తేజశ్రీ ఇటీవల మండల స్థాయిలో జరిగిన చెకుముకి పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీలు శనివారం ఉండూరు పాఠశాలలో జరిగాయి. జిల్లా స్థాయిలో కేపీపురం పాఠశాల విద్యార్థుల బృందం అయిదో స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం సత్యన్నారాయణ తెలిపారు. సోమవారం ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ ఛైర్మన్లు విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

అవకాశాలు అందిపుచ్చుకోండి..

మాట్లాడుతున్న నారాయణరావు

తుని, న్యూస్‌టుడే: విద్యార్థులు అవకాశాలు అందిపుచ్చుకుని భవిష్యత్తు తీర్చిదిద్దుకోవాలని నాట్కో ఫార్మా సంస్థల వైస్ ప్రెసిడెంట్, ఎనలైటికల్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ విభాగాధిపతి డా.కెఎంవీ నారాయణరావు అన్నారు. శ్రీప్రకాష్ అనుబంధ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో 'డ్రగ్ డెవలప్‌మెంట్ అండ్ క్యారెక్టరైజేషన్' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.రామకృష్ణారెడ్డి, డీన్ డా.బంగార్రాజు, డా.అరుణకుమార్ త్రిపాఠీ తదితరులు పాల్గొన్నారు.

తుని గ్రామీణం: పరీక్షల వేళ విద్యార్థులు ఒత్తిడిని జయిస్తేనే మంచి ఫలితాలు సాధించగలుగుతారని క్లినికల్ సైకాలజిస్టు జి.సాయిరామ్ అన్నారు. వి.కొత్తూరులో ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 'పది' ఇంటర్ విద్యార్థులు ఏకాగ్రతతో ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. ప్రిన్సిపల్ ప్రసన్న రాణి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష నిర్వహణ పరిశీలన

రౌతులపూడి, న్యూస్‌టుడే: రౌతులపూడి కోటవీధి ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ పరీక్షను ఎంఈవో కన్నూరి సతీష్‌బాబు పరిశీలించారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు డైట్ విద్యార్థులు, సీఆర్పీల ద్వారా ఈపరీక్ష నిర్వహిస్తున్నామన్నారు.

దేశాభివృద్ధిలో విద్యార్థులదే కీలక పాత్ర

శంఖవరం: దేశాభివృద్ధిలో విద్యార్థులదే కీలకపాత్ర అని ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు అన్నారు. కె.కొత్తూరు గ్రామంలో కత్తిపూడి సీతారామ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. చిన్న వయస్సు నుంచే సేవాగుణం అలవరుచుకుని చదువు, దేశభక్తిపై శ్రద్ధ చూపాలన్నారు. చరవాణిలను దూరం పెట్టి సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు వెంకటేశ్వరరావు, అక్కారావు, ఉపాధ్యాయులు రామేశ్వరరావు, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐ అప్పారావు

ప్రజలకు సత్వర సేవలు అందించాలి

తుని: ప్రజలకు సత్వర సేవలు అందించాలని ఛైర్‌పర్సన్ నార్ల భువన సుందరి సచివాలయ సిబ్బందికి సూచించారు. పట్టణంలోని సీతారాంపురం, అమ్మాజీపేటలలో ఉన్న సచివాలయాలను సోమవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఆమె వెంట వాసంశెట్టి శ్రీను, మొల్లేటి గణేష్, దంతులూరి శ్రీనివాసరాజు, అద్దేపల్లి బాలాజీ పాల్గొన్నారు. అనంతరం ఇసకలపేటలోని హిందూ శ్మశానవాటికలో రూ.70 లక్షలతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి డీఈ సతీష్‌కు సూచనలు చేశారు.

ప్రథమ చికిత్సపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: వైద్యపరంగా అత్యవసర సాయం అందాల్సిన పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ విజ్ఞతతో వ్యవహరించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.సునీత అన్నారు. పట్టణంలోని కళాశాలలో పీఎం ఉషా పథకంలో భాగంగా ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు శిక్షణ శిబిరం ఏర్పాటైంది. ప్రథమ చికిత్స, ఊపిరి అందించే విధానాలను కాకినాడకు చెందిన ఇండియన్ రెడ్‌క్రాస్ వైద్యుడు పరాశర వివరించారు. ఎన్ఎస్ఎస్ పీవో ప్రగడ ప్రయోగమూర్తి మాట్లాడుతూ. 30 మంది విద్యార్థులను ఒక సమూహంగా విభజించి రెడ్‌క్రాస్ సొసైటీ నేతృత్వంలో తక్షణ వైద్య సేవలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. ప్రగడ ప్రయోగమూర్తి, సురేశ్, మదీనా కన్వీనర్లగా వ్యవహరించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

తుని: ఏవిధమైన అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని హెచ్చరిస్తూ పది మంది రౌడీషీటర్లకు పట్టణ సీఐ ఎం.గీతా రామకృష్ణ కౌన్సెలింగ్ చేశారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయన సోమవారం రౌడీషీటర్లతో మాట్లాడారు. అనంతరం మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి, బైండోవర్ చేశారు.

11 వేల సంతకాలు సేకరణ

రౌతులపూడి: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మండలం నుంచి 11 వేల సంతకాలను సేకరించామని వైకాపా నాయకులు వాసిరెడ్డి జమీలు, భాస్కరబాబు, గొల్లు చిన్నదివాణం, చింతకాయల సత్యనారాయణ అన్నారు. కోటి సంతకాల సేకరణలో భాగంగా సేకరించిన సంతకాల ప్రతులను వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త ముద్రగడ గిరిబాబుకు అందించామని ఓప్రకటనలో తెలిపారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు తప్పవు..

పెద్దాపురం: చట్టాలను అతిక్రమించి స్కానింగ్ కేంద్రాల వారు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి హెచ్చరించారు. సోమవారం ఆర్డీవో మాట్లాడుతూ చట్టాన్ని ఉల్లంఘించినవారికి మొదటిసారి రూ.3 వేలు జరిమానా, 10 సంవత్సరాల జైలు శిక్ష, రెండోసారి రూ.50 వేలు జరిమానా, 5 సంవత్సరాల జైలు శిక్షకు బాధ్యులవుతారన్నారు. డాక్టర్ ఎన్.ప్రశాంతి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పళ్ల వాసవి, కందుల వెంకటాచలం పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా.. పల్లెల్లో వసతులు

న్యూస్‌టుడే, తొండంగి

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, గ్రామీణ విద్యాభివృద్ధికి 'దివీస్' సీఎస్ఆర్ నిధులను వెచ్చిస్తోంది. ఒంటిమామిడిలో నెలకొల్పిన 'దివీస్' ఫార్మా సంస్థ రెండేళ్ల వ్యవధిలో రూ.18 కోట్లకు పైగా నిధులు వెచ్చించింది. వీటితో రోడ్లు, తాగునీరు, పర్యావరణం, ప్రజారోగ్యం, క్రీడలను ప్రోత్సహించడం, పాడిపరిశ్రమ అభివృద్ధి, వీధి దీపాలు ఏర్పాటుతోపాటు బాలికా విద్యను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బాలికలకు సైకిళ్లు అందజేసింది. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు క్రికెట్, వాలీబాల్ కిట్లను పంపిణీ చేసింది. గ్రామాల్లో రక్షిత తాగునీటి ప్లాంట్ల ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తోంది.

✦ రెండేళ్లలో రూ.18కోట్లు వెచ్చించిన 'దివీస్'

బాలికలకు సైకిళ్లు పంపిణీ చేసిన 'దివీస్'

ప్రస్తుతం పెరుమాళ్లపురం తుపాను పునరావాస కేంద్రంలో డిగ్రీ కళాశాల నడుస్తోంది. వాకదారిపేటలో రూ.1.52 కోట్లతో నడుస్తున్న డిగ్రీ కళాశాల భవనం త్వరలో పూర్తికానుంది. భవనం అందుబాటులోకి వస్తే ఉన్నత విద్య పేదలకు అందుబాటులోకి వస్తుంది. తొండంగి మండలకేంద్రంలో సుమారు రూ.40 లక్షలతో రక్షిత తాగునీటి ప్లాంట్లను నిర్మిస్తున్నాం. వీటిని త్వరలో ప్రారంభించి అందరికీ రక్షిత తాగునీరు అందనుంది.

నిధులను వెచ్చించారిలా..

రంగం	ఖర్చు చేసింది.. (రూ.కోట్లలో)
విద్యాభివృద్ధి	2.39
ప్రజారోగ్యం	1.72
రక్షిత తాగునీరు	4.62
గ్రామీణాభివృద్ధి	8.69
క్రీడా ప్రోత్సాహం	0.13
పర్యావరణ అభివృద్ధి	1.13
పాడిపరిశ్రమాభివృద్ధి	0.18

ద్విచక్ర వాహనం చోరీ

పాయకరావుపేట: ఇంటి ముందు ఉంచిన మోటారు బైకు చోరీకి గురైంది. రాజమహేంద్రవరానికి చెందిన ఎం.డి.అక్రమ్ తన ద్విచక్ర వాహనంపై తునిలో జరిగే పెళ్లి ఫొటోలు తీసేందుకు ఈనెల 21న వచ్చారు. పాయకరావుపేటలోని ఎర్రతమ్మయ్య వీధిలో ఉన్న ఇంట్లో విశ్రాంతి తీసుకునేందుకు బైకును ఉంచారు. 22న ఉదయం 7 గంటలకు నిద్ర లేచి చూడగా బైకు చోరీ అయినట్లు గుర్తించారు. సీసీ కెమెరాలు పరిశీలించగా శనివారం తెల్లవారుజాము 2 గంటల దాటిన తర్వాత స్కూటీపై ఇద్దరు వచ్చి వీరిలో ఒకరు బైక్‌ను తీసుకువెళ్లినట్లు కెమెరాల్లో రికార్డైంది. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో గడ్డి ట్రాక్టర్ దగ్ధం

తుని పట్టణం: పట్టణంలోని సీతారాంపురం నిమ్మకాయలవారి వీధి ప్రాంతంలో కిందికి వేలాడుతున్న తీగలతో విద్యుదాఘాతం అవ్వడంతో గడ్డి ట్రాక్టర్‌కు నిప్పంటుకుంది. తక్షణం స్థానికులు అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు అదుపుచేశారు. ఇరుకైన వీధుల్లో ఇలా ఎత్తైన లోడు వాహనాలు రావడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు అంటున్నారు. ట్రాక్టర్ యజమాని రమణబాబు, గడ్డి వేయించుకుంటున్న నూకరాజు నుంచి వివరాలు సేకరించినట్లు అగ్నిమాపక అధికారి రాముడు తెలిపారు.

(c) eenadu

ఈనాడు కర్నూలు

మంగళవారం నవంబరు 25, 2025 5

జట్టుకట్టిన అనర్హులు

● రాష్ట్ర, జాతీయ జట్టులో చోటు

రాష్ట్ర, జాతీయస్థాయిలో జరిగే వివిధ పోటీలకు క్రీడాకారుల ఎంపికలో నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతున్నారు. పైరవీలకు పెద్దపీట వేస్తున్నారు. ప్రతిభావంతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడా కోటాను 3 శాతానికి పెంచింది. 90కి పైగా క్రీడలను గుర్తించింది. ప్రజాదరణ కలిగిన క్రీడలను ఏ, బీ క్యాటగిరీలుగా విభజించింది. ఉన్నత విద్యలో సీట్లు కేటాయించింది. దీంతో క్రీడా పత్రాలకు డిమాండ్ పెరిగింది. భారీ మొత్తంలో డబ్బు చెల్లించి మరీ కొందరు క్రీడా పత్రాలను కొనుగోలు చేస్తున్నారని క్రీడాకారులు చెబుతున్నారు. ఇదే అదనుగా సెలెక్టర్లు కాసులకు కక్కుర్తిపడి.. పైరవీలకు తలొగ్గి అనర్హులను ఎంపిక చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు క్రీడలు

కబడ్డీ క్రీడాకారుల ఆందోళన

జొహరాపురం దర్గా మైదానంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. రాష్ట్ర జట్టు ఎంపికలో తమకు అన్యాయం జరిగిందని అవనికరెడ్డి ఆరోపించారు. అర్హులను ఎంపికచేయడం లేదని ఆమెతో పాటు మరికొందరు క్రీడాకారులు ఆందోళన చేశారు.

స్వప్రయోజనాల కోసం అర్రులు

ఎస్‌జీఎఫ్ఐ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ ఆధారంగా ఏటా ఉత్తమ పాఠశాలలు/ కళాశాల, ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తారు. ఈ పురస్కారం అందుకున్న వ్యాయామోపాధ్యాయుడికి బదిలీల్లో ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉండటంతో తమ పాఠశాల/కళాశాలకు చెందిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయాలంటూ వ్యాయామ ఉపాధ్యాయులు కమిటీపై తీవ్ర ఒత్తిడిని తీసుకొస్తుండటం గమనార్హం.

ఎంపిక ఇలా..

● ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, 17, 19 విభాగాల్లో అన్ని క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నాయి. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, యోగా వంటి క్రీడలను మండల, నియోజకవర్గ స్థాయిలో నిర్వహించి.. రాష్ట్ర పోటీలకు పంపించాలి. మిగతా క్రీడలకు నేరుగా జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించుకోవచ్చన్న నిబంధనలు ఉన్నాయి.

● అన్ని జిల్లాల జట్లకు రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. రాష్ట్ర జట్టు ఎంపికకు కమిటీ, పోటీల నిర్వహణ పరిశీలకుడిని ఏపీ ఎస్‌జీఎఫ్ఐ నియమిస్తుంది. పోటీలు జరిగే ప్రాంతానికి కమిటీ వెళ్లి పోటీల తీరును పరిశీలించి రాష్ట్ర జట్టును ఎంపిక చేయాల్సి ఉంటుంది.

● రాష్ట్ర పోటీల్లో మొదటి నాలుగు స్థానాలు సాధించిన జట్ల క్రీడాకారులకు ప్రాధాన్యమిస్తారు. విజేత జట్టు నుంచి ముగ్గురు, రన్నర్స్-ఇద్దరు, మూడు, నాలుగో స్థానంలో నిలిచిన జట్ల నుంచి ఒక్కొక్కరు చొప్పున, మిగతా వెనకబడిన జట్లలోని ప్రతిభావంతులను 3 స్థానాలకు ఎంపిక చేస్తారు.

అక్రమ తవ్వకాలకు చెట్టంత సాక్ష్యం



కర్నూలు రింగ్‌రోడ్డు ప్రాంతంలో అక్రమార్కులు బరితెగించారు. పెద్ద ఎత్తున మట్టి తవ్వి తరలించి సొమ్ము చేసుకున్నారు. మట్టి మాఫియా అక్రమాలకు 'చెట్ట'ంత సాక్ష్యంగా సజీవంగా నిలిచింది. మట్టి భారీగా తరలిపోయినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

– ఈనాడు, కర్నూలు

కార్యదర్శుల కాసుల రాతలు

●వార్డు ప్లానింగ్ ప్రతినిధుల దందా

పురపాలికల్లో వార్డు ప్లానింగ్ కార్యదర్శులు 'కాసు'క్కుర్తున్నారు. గత వైకాపా సర్కారు హయాంలో వార్డు ప్లానింగ్ కార్యదర్శులను నియమించారు. వీరు ఆయా వార్డుల్లో కొత్త ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇప్పించడం, ప్రజా ఫిర్యాదులు, దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి. కొందరు వార్డుల ప్రగతి పర్యవేక్షణను పక్కనపెట్టి వసూళ్ల బాట పడుతున్నారు. ఇతరుల లాగిన్ ఐడీలతో సొంత ప్రణాళిక (ప్లాన్) అమలు చేస్తున్నారు. ఆదోని పురపాలక సంఘం పరిధిలో కొందరు వార్డు ప్లానింగ్ కార్యదర్శులపై వచ్చిన ఫిర్యాదే ఇందుకు నిదర్శనం.

– న్యూస్‌టుడే, కర్నూలు, నంద్యాల పురపాలక బృందం

మున్సిపాలిటీలు / కార్యదర్శుల పోస్టులు / ప్రస్తుతం ఉన్నవారు

	మున్సిపాలిటీలు	కార్యదర్శుల పోస్టులు	ప్రస్తుతం ఉన్నవారు
నంద్యాల	5	101	69
కర్నూలు	4	205	101

దరఖాస్తులు	నంద్యాల	కర్నూలు
వచ్చినవి	802	715
ఆమోదం	645	458
పెండింగ్	157	257

ఎల్టీపీల అవతారమెత్తారు

● పురపాలికల్లో లైసెన్సుడు టెక్నికల్ పర్సన్ (ఎల్టీపీ)లు ఉంటారు. వీరు మున్సిపాలిటీ, కుడా నుంచి లైసెన్సు తీసుకొంటారు. ఇళ్ల నిర్మాణ ప్రణాళిక రూపొందించడం.. ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయడం వంటివి చేస్తుంటారు. వీరికి ఏ మున్సిపాలిటీలోనైనా ప్లాన్లు గీసే అవకాశం ఉంది.

● భవన నిర్మాణాన్ని బట్టి రూ.5 వేలు మొదలు రూ.20 వేల వరకు రుసుం తీసుకుంటారు. వీరు అంతర్జాలంలో నమోదు చేసిన దరఖాస్తులు ఆయా వార్డు సచివాలయాలకు చేరుతాయి. వాటిని ప్లానింగ్ కార్యదర్శులు డౌన్‌లోడ్ చేసుకొని క్షేత్రస్థాయిలో పరిశీలించాలి.

● ప్లానింగ్ కార్యదర్శులే ఎల్టీపీల అవతారం ఎత్తారు. ఇతరుల వ్యక్తిగత లాగిన్, పాస్‌వర్డ్‌లు తీసుకొని వాటి ద్వారా సొంతంగా ప్లాన్లు వేసి పైఅధికారుల ఆమోదానికి సిఫార్సు చేస్తున్నారు. బినామీ పేర్లతో ఎల్టీపీల అవతారమెత్తి దందా చేస్తున్నారు. వారూ కళ్లు మూసుకొని ఆమోదించేస్తున్నారు.

ప్యాకేజీలుగా ఒప్పందం

● ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థతోపాటు ఎనిమిది పురపాలక సంఘాలు, నగర పంచాయతీలున్నాయి. ఆయా పట్టణాల్లో భవన అనుమతులకు సంబంధించి పక్కాగా పత్రాలు సమర్పించి అందుకనుగుణంగా నిర్మాణాలు జరిగేలా వార్డు ప్లానింగ్ కార్యదర్శులు పర్యవేక్షించాలి.

● నిర్మాణ ప్లానింగ్ మొదలు అనుమతుల వరకు అన్నీ తామే చూసుకొంటాం.. ఎవరికి ఇవ్వాల్సిన వాటాలు వారికిచ్చి మీ పనులు చేస్తామని ప్యాకేజీలుగా ఒప్పందాలు చేసుకొంటున్నారు. వీఎల్‌టీ, ప్లాన్ అనుమతులు, ఇంటి పన్ను, నీటి పన్ను వేసేంత వరకు ఒక ప్యాకేజీగా రూపొందించి ఇంటి యజమానుల వద్ద భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. భవనాలకు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు, బహుళ అంతస్తులకు రూ.4-5 లక్షలు డిమాండ్ చేస్తున్నారు.

● బీపీఎస్ పథకంలో భాగంగా గడువు దాటిన ఇళ్లను పాత తేదీలో చూపి ఆమోదించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

● గతంలో 300 చ.మీ. లోపు నిర్మాణాలకు మాత్రమే పురపాలికలకు అనుమతిచ్చేందుకు అర్హతలుండేవి. ఈ నిబంధనను 'కూటమి' సర్కారు సవరించింది. ఎంత విస్తీర్ణంలో నిర్మించిన భవనమైనా స్థానికంగానే అనుమతులివ్వొచ్చని 'కూటమి' సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. ఇది వీరికి మరింత కలిసొచ్చింది.

30న భగవద్గీత కంఠస్థ పోటీలు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : గీతా జయంతిని పురస్కరించుకుని కర్నూలు నగరంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో ఈనెల 30వ తేదీ ఉదయం 9 గంటల నుంచి భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. 6-9 తరగతుల విద్యార్థులు 14వ అధ్యాయం, 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు 16వ అధ్యాయంలోని శ్లోకాలు కంఠస్థం చేయాల్సి ఉంటుందని తితిదే ధర్మప్రచార పరిషత్ ప్రతినిధి మల్లు వెంకటరెడ్డి తెలిపారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని ఆయన చెప్పారు. ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని పిలుపునిచ్చారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలను 9059802265 నంబరుకు వాట్సప్ చేయాలని కోరారు.

ఆసుపత్రికి సమస్యల క్యాన్సర్

● రూ.కోట్లు ఖర్చు చేసినా సమకూరని సౌకర్యాలు

● పూర్తిస్థాయిలో ఉపయోగపడని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్

కర్నూలు సర్వజన ఆసుపత్రికి అనుబంధంగా ఏర్పాటైన స్టేట్ క్యాన్సర్ యూనిట్ అరకొర సేవలకే పరిమితమైంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నెలకు 300 పైగా క్యాన్సర్ కేసులు వెలుగుచూస్తున్నాయి. ఏడాదికి 4 వేల మంది వరకు క్యాన్సర్ బారినపడి ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రస్తుతం 175 మంది చికిత్సలు పొందుతున్నారు. ప్రతినెలా సుమారు 340 మంది కీమో థెరపీ, 40 మంది రేడియోథెరపీ చేయించుకుంటున్నారు. ఇక్కడ నామమాత్రం వైద్యసేవలు అందుతున్నాయి. చేసేది లేక రోగులు ప్రైవేటుకు వెళ్తున్నారు. స్టేట్ క్యాన్సర్ యూనిట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే బాధితులపై భారం తగ్గుతుంది.

– న్యూస్‌టుడే, కర్నూలు వైద్యాలయం

నెల	ఓపీ	ఐపీ	శస్త్రచికిత్సలు
జూన్	949	352	36
జులై	780	385	55
ఆగస్టు	1028	337	54
సెప్టెంబరు	879	353	62
అక్టోబరు	930	394	75

ఇబ్బందులు ఉన్నాయి

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రధానంగా వైద్య పరీక్షలకు కావాల్సిన మామోగ్రామ్, సీటీ, ఎమ్మారై, పెటీస్కాన్ ల్యాబ్‌లు లేవు. ఇది రోగులకు సమస్యగా మారింది. ఐసీయూ, వెంటిలేటర్లు, మానిటర్లు లేవు. ఓటీలు అందుబాటులో లేవు. రేడియాలజిస్ట్, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ ల్యాబ్‌లు అందుబాటులోకొస్తే పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించగలం.

– డాక్టర్ ప్రకాష్, డైరెక్టర్, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, కర్నూలు

ఊసేలేని వైద్య పరీక్షలు

● స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పెథాలజీ ప్రొఫెసర్ 1, అసోసియేట్ 1, అసిస్టెంట్ 3, రేడియేషన్ అంకాలజీ ప్రొఫెసర్ 1, అసోసియేట్ ప్రొఫెసర్లు 4, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 14 మంది ఉన్నారు. నర్సింగ్ సిబ్బంది 40 మందికి 25 మంది వరకు అందుబాటులో ఉన్నారు.

● క్యాన్సర్ నిర్ధారణలో కీలకమైన ఎమ్మారై, సీటీ స్కాన్, ఎక్స్‌రే యంత్రాలు, అల్ట్రాసౌండ్ మిషన్, మామోగ్రామ్, పెథాలజీ ల్యాబ్‌లు, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లు లేవు. అబ్డామిన్ స్కానింగ్, ఎక్స్‌రే చేయడానికి రేడియాలజిస్టు లేరు. దీంతో వైద్య పరీక్షలన్నీ సర్వజన వైద్యశాలలోని న్యూడయాగ్నోస్టిక్ ల్యాబ్‌కు రాసిస్తున్నారు. పెటీ స్కాన్ యంత్రం కూడా లేకపోవడంతో బయటికి రాసిస్తున్నారు. దీంతో రోగులు వైద్య పరీక్షల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆపరేషన్ థియేటర్ల కొరత

● 2018లో రూ.120 కోట్లతో పనులు ప్రారంభించింది.

● మూడు ఆపరేషన్ థియేటర్లకు గాను ఒక్కటి మాత్రమే అందుబాటులోకి వచ్చింది. శస్త్రచికిత్సలన్నీ అందులోనే నిర్వహించాల్సి వస్తోంది. దీంతో రోగులు తమవంతు కోసం నిరీక్షించాల్సి వస్తోంది.

● ప్రధానంగా ఐసీయూ వార్డు లేదు. వెంటిలేటర్లు, మానిటర్స్ కొరత ఉంది. అత్యవసర విభాగం పూర్తిస్థాయిలో లేదు. దీంతో వైద్యులు అందుబాటులో ఉన్నా అత్యవసర కేసులు చూడలేని పరిస్థితి.

పచ్చని సీతాకోకచిలుకలు

ఇవి మొక్కల ఆకులు కావండోయ్.. 'పచ్చని' సీతాకోక చిలుకలు. మహానంది నుంచి బోయలకుంట్ల మెట్టకు వెళ్లే దారిలో ఫారం వద్ద నల్లమల అడవి ప్రాంతంలో సందడి చేస్తున్నారు. ప్రధాన రహదారి పక్కనే పాలేరు వాగు ఒడ్డున గుంపులుగా తిరుగుతున్నాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులను కనువిందు చేస్తున్నాయి. దూరం నుంచి ఆకుల మాదిరిగా కనిపిస్తున్నాయి. దగ్గరికి వెళ్తే ఝుమ్మంటూ ఎగిరిపోతున్నాయి.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

అవిశ్రాంత పోరాటం

"ఎమ్మిగనూరు పీఆర్ఎల్ ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సూపరింటెండెంట్‌గా పని చేస్తూ 2007లో ఉద్యోగ విరమణ చేశా. ప్రభుత్వం నుంచి జీపీఎఫ్ రూ.1.80 లక్షలు, ఫ్యామిలీ బెనిఫిట్స్, ఇతరత్రా అన్నీ కలిపి రూ.3 లక్షల వరకు రావాల్సి ఉంది. ఆర్థిక ప్రయోజనాలు అందించాలంటూ గత 18 ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా. మంజూరు చేయాలంటూ ఏజీ నుంచి ఆదేశాలు వచ్చినా పట్టించుకోలేదు. కళాశాలలో కొన్నేళ్ల కిందటి రికార్డులను కొందరు కాల్చేశారు. కళాశాలలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్‌లు తనకు ప్రయోజనాలు అందకుండా అడ్డుపడుతున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తనకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయం ఇప్పించాలి' అని వెంకట్రామ్ విజ్ఞప్తి చేశారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా ఉన్నతాధికారులను కలిసి సమస్యను విన్నవించారు.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

ఆర్టీసీకి కార్తికకాంతలు

రద్దీగా పుణ్యక్షేత్రాలు ● ఉచిత బస్సు పథకంతో లబ్ధి

కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత బస్సు పథకం మహిళలకు ఎంతో ప్రయోజనకరంగా మారింది.. కార్తిక మాసంలో ఉమ్మడి జిల్లాలో లక్షలాదిమంది అతివలు వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శించారు. శ్రీశైలం, మహానంది, యాగంటి, అహోబిలం, కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, ఓంకారం క్షేత్రాల రూట్లలో ఆర్టీసీ బస్సులు మహిళా ప్రయాణికులతో కిటకిటలాడాయి. – న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు

● కార్తిక మాసంలో కర్నూలు జిల్లాలో 12.50 లక్షల మంది, నంద్యాలలో 28.8 లక్షల మంది మహిళా ప్రయాణికులు ఉచిత బస్సు పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ప్రతి బస్సులో 50 మంది మహిళా ప్రయాణికులు ఉంటే.. పురుషులు 10- 15 మందికే పరిమితం కావడం గమనార్హం.

● ప్రతి బస్సులో సీట్లన్నీ బస్టాండ్‌లోనే భర్తీ అయ్యాయి. కర్నూలు నుంచి శ్రీశైలానికి వెళ్లిన మహిళా ప్రయాణికులకు ట్రిప్పునకు ఒక్కొక్కరికి సగటున రూ.500 వరకు, ఓంకారం, యాగంటి, మహానంది, కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వంటి క్షేత్రాలకు వెళ్లిన వారికి సగటున ఒక్కొక్కరికి రూ.100- 200 వరకు లబ్ధి కలిగినట్లు అధికారులు తెలిపారు.

● అక్టోబరు 23 నుంచి నవంబరు 18వ తేదీ వరకు కర్నూలు, పత్తికొండ, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల నుంచి 9.50 లక్షల మంది శ్రీశైలం వెళ్లారు.

● కర్నూలు- యాగంటి : 50.01 వేలు

● కర్నూలు- యాగంటి, అహోబిలం, ఓంకారం : 2.5 లక్షల మంది

● నంద్యాల- శ్రీశైలం, ఓంకారం : 11.30 లక్షల మంది

● నంద్యాల- మహానంది, యాగంటి, అహోబిలం : 8.90 లక్షల మంది

● బనగానపల్లి- కొత్తూరు సుబ్బరాయుడి ఆలయం, యాగంటి : 7.91 లక్షల మంది

● ఆళ్లగడ్డ- అహోబిలం : 50 వేలు

దశాబ్దాల కట్టుబాటు.. సహపంక్తి సాపాటు

ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో కొన్నేళ్ల కిందట కరవు ఏర్పడింది. తినేందుకు తిండి లేక జనం అవస్థలు పడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆలూరు నుంచి వచ్చిన అవధూతలు ఉచ్చీరప్ప తాత, చెలువప్ప తాతలు ఇక్కడ భోజనం వండి గ్రామస్థుల కడుపు నింపారు. గ్రామం సుభిక్షంగా ఉండాలంటే కార్తిక మాసంలో గ్రామస్థులంతా కలిసి భోజనాలు చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో సుమారు 150 ఏళ్ల కిందట మొదలైన సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. కార్తిక మాసం సందర్భంగా 30 రోజులపాటు గర్జిలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి పూజలు చేశారు. గ్రామస్థులంతా కలిసి సోమవారం సహపంక్తి భోజనం చేశారు. నియమ నిష్ఠలతో ఇంట్లో వండిన భోజనాన్ని తెచ్చి ఆలయం వద్ద రాసిగా పోశారు. ఊరంతటికి సరిపడ సాంబారు ఆలయం వద్ద వండారు. తర్వాత అందరూ కలిసి భోజనం చేశారు.

– న్యూస్‌టుడే, ఆదోని గ్రామీణం, సాంస్కృతికం

సహపంక్తి భోజనం చేస్తున్న గ్రామస్థులు

ఆవాసయోగం

● నెలాఖరు వరకు గడువు

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పీఎం ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0 అమలుకు చర్యలు ప్రారంభించింది. ఇంటి స్థలం లేకపోయినా.. సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకునేందుకు ముందుకు వచ్చే వారి వివరాలు సేకరించేందుకు ఆవాస్ ప్లస్-2024 సర్వే నిర్వహిస్తోంది.. దరఖాస్తు చేసుకున్నవారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గుర్తించిన అర్హులకు గృహాలను ప్రభుత్వం మంజూరు చేయనున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

	కర్నూలు	నంద్యాల
సొంతిల్లు లేనివారు	41,045	28,714
దరఖాస్తు చేసుకొన్నవారు	9,432	12,630

ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 69,759 కుటుంబాలకు సొంతిల్లు లేనట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఆవాస్ ప్లస్-2024 సర్వే ప్రకారం పీఎంఏవై గ్రామీణ్ 2.0 కింద కర్నూలు 9,432, నంద్యాల జిల్లా పరిధిలో 12,630 కలిపి మొత్తం 22,062 మంది దరఖాస్తు చేసుకున్నారు. మిగిలినవారు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెలాఖరు వరకు గడువు ఉంది. ఆలోగా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు.

ఒక ఇంటికి రూ.1.80 లక్షలు

పీఎంఏవై గ్రామీణ్ 2.0 కింద ఇల్లు మంజూరైన ఒక్కో లబ్ధిదారుడికి కేంద్రం రూ.72 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.48 వేలు, స్వచ్ఛ భారత్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు, ఉపాధి హామీ పథకం ద్వారా 90 పని దినాలకు రూ.27 వేలు కలిపి మొత్తం రూ.1.59 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.21 వేలు కలిపి మొత్తం రూ.1.80 లక్షల ఇస్తారు.

అర్హులు ఎవరంటే..

● గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి స్థలం లేకపోతే పీఎంఏవై గ్రామీణ్ 2.0 కింద గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటి స్థలం ఉన్నవారూ అర్జీ పెట్టుకోవచ్చు.

● 2014-19లో ఎన్టీఆర్ హౌసింగ్ కింద ఇల్లు మంజూరై ఇప్పటివరకు నిర్మించుకోనివారికి ఈ పథకం వర్తిస్తుంది.

● ప్రస్తుతం ఇంటి పునాదులు, బేస్‌మెంట్, లెంటల్ లెవల్ వరకు నిర్మించుకున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు. గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకుంటే 2029 వరకు ఇదే జాబితా వర్తిస్తుంది.

పింఛను రూ.19 అందక 14 ఏళ్లు

వారి నెలవారీ పింఛను రూ.19 (అక్షరాలా పందొమ్మిది రూపాయలు).. ఇది నిజం. ప్రస్తుతం ప్రభుత్వం రూ.వేలల్లో పింఛను మొత్తం అందిస్తోంది. పాలేగార్ పింఛను మాత్రం రూపాయల్లోనే ఉందా? అని ఆశ్చర్యం కలగక మానదు. బ్రిటిష్ వారు భారతదేశాన్ని పాలిస్తున్న కాలంలో కర్నూలు జిల్లా మద్దికెర ప్రాంతాన్ని యాదవ కులానికి చెందిన యాదవరాజులు పాలించేవారు. వీరు సాగు చేసుకుంటున్న భూములను, అధికారాలను అప్పటి సర్కారు లాక్కొని వీరికి కొంత మేర గౌరవ భృతి ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఆ క్రమంలోనే ఈ కుటుంబాలకు పాలేగార్ పింఛను పేరుతో సొమ్ము అందేది. అందుకు గుర్తుగానే సర్కారు కొన్ని దశాబ్దాలుగా పింఛను చెల్లించే ఆనవాయితీని కొనసాగిస్తోంది. 14 ఏళ్లుగా అది కూడా అందడం లేదని వారి వారసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకోసం వారు జిల్లా అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయారు. " 2011 నుంచి పింఛన్ ఆగిపోయింది.. మంజూరు చేయాలంటూ జిల్లాకొచ్చిన ప్రతి కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తున్నామని" మద్దికెరకు చెందిన జయరామరాజు పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, పత్తికొండ

బడిలో భయం



పాత పాఠశాల వరండాలో పాఠాలు



పెచ్చులూడిన పైకప్పు

ఎమ్మిగనూరు మండలం గుడేకల్లు ప్రాథమిక పాఠశాలలో 487 మంది విద్యార్థుల చదువుకొంటున్నారు. సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఐదు తరగతులను 15 సెక్షన్లుగా విభజించారు. పాత భవనంలో ఆరు గదులు పెచ్చులూడి శిథిలమయ్యాయి. గదులు సరిపోక విద్యార్థులను వరండాలో కూర్చోబెడుతున్నారు. పెచ్చులూడుతున్న గదుల్లో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువుకుంటున్నారు. శిథిలమైన పాత భవనం కూల్చివేసి.. కొత్త గదులు నిర్మించాలని తల్లిదండ్రులు కోరినా నేటికీ స్పందన లేదు.

– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

తీరంలో పొరుగు బాదా

సంచిపై 3 కిలోల వరకు కోత ● వ్యాపారుల దగా

తుంగభద్ర తీరంలో ధాన్యం రైతులను 'పొరుగు' వ్యాపారులు దగా చేస్తున్నారు. కర్ణాటకకు చెందిన వ్యాపారులు స్థానికంగా దళారుల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. 70 కిలోల సంచికి బాదా పేరిట 3 కిలోలు కోత పెడుతున్నారు. క్వింటాకు మద్దతు ధర రూ.2,369 ఉండగా రూ.300 తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. అక్కడ ధాన్యానికి డిమాండ్ ఉండటంతో క్వింటాకు రూ.400 అధిక ధరకు విక్రయించి లాభం పొందుతున్నారు.

– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం, ఎమ్మిగనూరు

తూకం వేసిన ధాన్యం బస్తాలు లారీల్లో నింపుతూ..

ఆదాయానికి గండి

తుంగా తీరంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని రాయచూరు, సిరుగుప్ప, సింధనూరు, కాటిగి వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక లారీలో 200 సంచుల వరకు తరలిస్తున్నారు. 2 శాతం సెస్సు వసూలు రూపేణా లారీకి రూ.5వేల నుంచి రూ.6వేల వరకు మార్కెటింగ్ శాఖ అధికారులు వసూలు చేస్తున్నారు. బిల్లులు మాత్రం ఇవ్వడం లేదు. నిత్యం పదుల సంఖ్యలో లారీలు వెళ్తున్నా.. దస్త్రాల్లో నామమాత్రంగా రాసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

రూ.10 వేల వరకు నష్టం

● తుంగభద్ర తీరం వెంట హాలహర్వి, హొళగుంద, కౌతాళం, కోసిగి, నందవరం, మంత్రాలయం, సి.బెళగల్ మండలాల్లో 36 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35వేల వరకు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం పంట కోత దశకొచ్చింది. ఎకరానికి 30 నుంచి 35 సంచుల (సంచి 70 కిలోలు) దిగుబడి వస్తోంది.

● వరి మద్దతు ధర 'ఏ' గ్రేడ్ రకం క్వింటా రూ.2,389, సాధారణ రకం క్వింటా రూ.2,369 ఉండగా వ్యాపారులు రూ.2,000 నుంచి రూ.2,100 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు ఎకరానికి సుమారు రూ.10 వేల వరకు నష్టపోతుండటం గమనార్హం.

చి'వరి'కి అప్పు మిగిలింది

● "తుంగభద్ర నది తీరంలో 20 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి వేశా. కౌలు ఎకరాకు రూ.30 వేలు. పెట్టుబడి రూ.30 వేలు పెట్టా. ఎకరానికి 37 సంచుల దిగుబడి వచ్చింది. క్వింటా రూ.2,100లకు కొనుగోలు చేశారు. కనీసం అప్పు తీర్చే పరిస్థితి లేకుండా పోయిందని" అని కౌలు రైతు వీరేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

● " పదెకరాల్లో వరి వేశా. ఎకరానికి 35 సంచుల దిగుబడి వచ్చింది. పెట్టుబడి ఎకరానికి రూ.25వేలు పెట్టా. ధర తక్కువగా ఉండటంతో గిట్టుబాటు కాదని" అని గురుజాలకు చెందిన రంగస్వామి ఆందోళన వ్యక్తం చేశారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు 99899 97628

(c) eenadu

క్రిమినాశకాలు.. యమపాశాలు

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రస్తుతం పశువులు, కోళ్లలో వచ్చే పలు రకాల వ్యాధులు నియంత్రించేందుకు క్రిమినాశకాలు (యాంటి బయోటిక్స్) వాడకం చాలా ఎక్కువైందని ఆళ్లగడ్డ పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు వరప్రసాద్ తెలిపారు. పశువుల్లో పొదుగు వాపు వ్యాధులు రావడం సర్వసాధారణమైంది. తగ్గించేందుకు రోగ క్రిమినాశకాలను పొదుగు వద్ద చను మొనలతో ఎక్కువ మోతాదులో ఇస్తుంటారు. వ్యాధి తగ్గిన తర్వాత కూడా రోగ క్రిమినాశకాల అవశేషాలు పొదుగు నుంచి పాల ద్వారా సుమారు 10- 15 రోజులు నెమ్మదిగా సుమారు 92% విసర్జితం కాగా.. ఇతర వ్యాధులకు సంబంధించి 0. 3% మాత్రమే ఉంటాయి.

పెరటి కోళ్లలో కొంత మంది రైతులు అవసరం లేకపోయినా పరిమితికి మించి యాంటి బయాటిక్స్ వాడుతున్నారు. దీంతో రోగనిరోధక వ్యవస్థ, జీర్ణ వ్యవస్థ దెబ్బతింటాయి. వ్యాధి సోకినపుడు మందులు సరిగా పని చేయడం లేదు. క్రిమినాశకాల అవశేషాలు మాంసంలో ఉండటం వల్ల మానవాళికి హాని జరుగుతుంది. గొర్రెలు, మేకల పెంపకంలో అధిక మోతాదులో యాంటి బయోటిక్స్ వాడటంతో పశువులతో పాటు మనుషులకూ నష్టం వాటిల్లుతుంది.

పశువుల్లో చికిత్సకు పెన్సిలిన్, టెట్రాసెక్లిన్, క్లోరాంఫినికాల్, అంపిసిలిన్, స్ట్రెప్టోమైసిస్ వంటి రోగ క్రిమి నాశకాలను వినియోగిస్తారు. దీర్ఘకాలికంగా వాడటం ద్వారా పాలల్లో అవశేషాలు అధికమై నిరోధకత ఏర్పడుతోంది. సూక్ష్మజీవులు పాలు, పాల ఉత్పత్తుల ద్వారా మానవుల్లోకి ప్రవేశించి వ్యాధులను కలగజేస్తున్నాయి. ఫలితంగా మనుషుల్లో వ్యాధి నిరోధకత ఏర్పడి కొన్ని రోజుల వరకు యాంటి బయాటిక్స్ పని చేయవు. నైట్రోఫ్యురజోన్, సల్ఫామిథజోన్ వంటి రోగ క్రిమినాశకాలు నిరంతరం వాడటం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. అవశేషాలు ఉన్న పాలు, పాల ఉత్పత్తులు తీసుకుంటే మనుషుల్లో రక్తహీనత, ఎముకల బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తాయి. పాలను వేడి చేస్తే ఇవేమీ తగ్గవు.

- చికిత్స చేసిన పశువు పాలను 60-84 గంటల తర్వాత మాత్రమే వేరే పాలతో కలపాలి లేదా ఉపయోగించాలి.
- పాలిచ్చే ఆవులు, పశువుల్లో వ్యాధి నివారణ చర్యలు చేపట్టి, మందుల వాడకం తగ్గించాలి. పశువైద్యుడు సూచించిన మందులను తగిన మోతాదులో నిర్దేశించిన రోజులు మాత్రమే ఇవ్వాలి.
- పశువులు, కోళ్ల షెడ్లను శుభ్రంగా గాలి, వెలుతురు వచ్చేలా ఉంచడంతో రోగాల వ్యాప్తి తగ్గించవచ్చు.

కుళ్లిపోతున్న మిరప

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: మిరపకు ఆంత్రాక్నోస్ సోకడంతో చేతికొచ్చే అరకొర దిగుబడులను సైతం మార్కెట్‌లో అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రామచంద్రారావు తెలిపారు. ఎండు మిరపపై గోధుమ లేదా నల్లటి రంగు మచ్చలు కనిపిస్తాయి. మచ్చల మధ్యలో గులాబీ లేదా నారింజ రంగులో ఫంగస్ స్పోర్లు కనిపిస్తాయి. తీవ్రస్థాయిలో కాయలు కుళ్లిపోతాయి. మార్కెట్‌లో ధర పలకదు. ఆకులపై కూడా చిన్న చిన్న మచ్చలు ఏర్పడి ఆకులు ఎండిపోతాయి. విత్తనాలు నాటే ముందు కిలో విత్తనాన్ని నాలుగు గ్రాముల ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేసుకోవాలి. పంట మార్పిడి తప్పనిసరి. మిరప వేసిన తర్వాత మళ్లీ మిరప వేయరాదు. పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వ్యాధిగ్రస్త అవశేషాలను నాశనం చేయాలి. మిరప పంట దశలో లీటరు నీటిలో కార్బెండిజమ్ 0.1గ్రాములు లేదా మాంకోజెబ్ 0.25 శాతం లేదా అజోక్సిస్ట్రోబిన్ 23శాతం ఎస్‌సీ ఒక మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. పిచికారీ సమయంలో పండ్లను పూర్తిగా తడిచేలా పిచికారీ చేసుకోవాలి. మార్కెట్‌కు తీసుకెళ్లే ముందు పండు కాయలను బాగా ఎండబెట్టి తీసుకెళ్లాలి.

రైతేరాజు

మొక్కజొన్నకు కత్తెరేస్తోంది

రబీలో సాగు చేసిన మొక్కజొన్న పంట

కర్నూలు, నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో రబీలో సాగు చేసిన మొక్కజొన్న పంట వివిధ దశల్లో ఉంది. ఈ పంటను ఇటీవల కత్తెర పురుగు ఆశించి నష్టపరుస్తోంది. పురుగు తీవ్రత ఎక్కువగా ఉంటే.. దిగుబడిపై ప్రభావం చూపుతుంది. సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకుడు డాక్టర్ జాన్సన్, కీటక శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ తెలిపారు. ముందుగా మొక్కజొన్న పంట చుట్టూ నాలుగు వరుసల నేపియర్ గడ్డిని ఎర పంటగా వేసుకోవాలి. ఎకరానికి 4 నుంచి 5 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకొని పురుగు ఉధృతిని కనిపెట్టాలన్నారు. గుడ్లను గమనించిన వెంటనే ఎకరానికి ఒక లీటర్ వేపనూనె పిచికారీ చేయాలన్నారు. తొలిదశ గొంగళి పురుగులను నివారించేందుకు ఎకరానికి 500 ఎం.ఎల్. క్లోరిఫైరిపాస్‌ను పిచికారీ చేయాలి. గొంగళి పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే.. ఎమామెక్టిన్ బెంజోయేట్ లేదా స్పైనోశాప్ 45 శాతం ఎస్‌సీ 60 మి.లీ. ఎకరానికి సుడులు లేదా మొవ్వ లోపలి ఆకులు పూర్తిగా తడిసేలా పిచికారీ చేయాలి. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో కత్తెర పురుగును నివారించుకోవాలని వారు సూచించారు.

సందేహాలు సమాధానాలు

- డా.కృష్ణమూర్తి, పశుపోషణ కేవీకే శాస్త్రవేత్త, బనగానపల్లి

?: చలికాలంలో కోళ్లు ఆయాసంతో ఊపిరి తీసుకోవడం కష్టంగా కనిపిస్తున్నాయి. ముడుచుకు పోతున్నాయి.
- రాఘవులు, అవుకు.

✔: కోళ్లను ఉంచే ప్రదేశం పొడిగా ఉండే విధంగా చూసుకోవాలి. నేలపైన వరిపొట్టును నాలుగు అంగుళాల మేర చల్లాలి. ఎంరోఫ్లాక్ససీన్ లేదా లెవోఫ్లాక్సిసీన్ మందులను మూడు రోజులు వాడాలి. కొక్కెర తెగులు అయితే అసోటావ్యాక్సిన్ మందును వేయించుకుంటే నివారణ చేసుకోవచ్చు.

?: గొర్రెల్లో కాలి కింద పుండ్లు కనిపిస్తున్నాయి. గిట్టల మధ్య తెరిచి చూస్తే మొత్తబడి వాచినట్లు కనిపిస్తున్నాయి.
- బాలరాజు, కటికవానికుంట

✔: దీన్ని కాలిపుండ్ల వ్యాధి అంటాం. బురద నేలలో మేపితే ఈ వ్యాధి వస్తుంది. గిట్టల వద్ద 1:1000 పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి బోరిక్ వేపనూనె మందు రాయాలి.

?: గొర్రె పిల్లలు పుడుతున్నాయి. కొన్ని చనిపోతున్నాయి. మరణాలను తగ్గించడానికి నివారణ తెల్పండి.
- గోవిందు, యాగంటిపల్లె

✔: గొర్రె పిల్లలు పుట్టిన గంట లోపు ముర్రుపాలు తాగించాలి. పుట్టిన 24 గంటల్లో టీటీ ఇంజెక్షన్ వేయాలి. నాలుగు రోజుల లోపు యాంటీబయాటిక్ మందు తాగించాలి. 5 నుంచి 7 రోజుల్లో లివర్ టానిక్ తాగించాలి. 15వ రోజు నట్టల నివారణ మందు వేయాలి.
- న్యూస్‌టుడే బనగానపల్లి

కైరుప్పల వేదిక.. వీరభద్రుని నిశ్చితార్థ వేడుక

విద్యుత్తు దీపాలతో ముస్తాబైన ఆలయం

కైరుప్పల (ఆస్పరి), న్యూస్‌టుడే: కైరుప్పల గ్రామంలో కొలువైన వీరభద్రస్వామి ఆలయంలో వీరభద్రస్వామి, భద్రకాళి దేవతల నిశ్చితార్థ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. ఆలయంలోని మూల విగ్రహాలకు ఆలయ అర్చకులు ప్రసాద్, శేఖర్ అభిషేకాలు చేసి వివిధ పూలతో అందంగా అలంకరించారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్తు దీపాలతో ముస్తాబు చేశారు. అనంతరం గ్రామ పెద్దలు, ఆలయ నిర్వహకుల ఆధ్వర్యంలో దేవతల నిశ్చితార్థ వేడుకలు నిర్వహించారు. ఆస్పరి, ఆదోని, పత్తికొండ, కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు తరలొచ్చారు. అన్నదానం చేశారు. బందోబస్తు నిర్వహిస్తునట్లు ఆస్పరి సీఐ గంగాధర్ తెలిపారు.

రోగులకు మందులన్నీ ఆసుపత్రిలోనే ఇవ్వండి

మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్. చిత్రంలో వైద్యకళాశాల ప్రిన్సిపల్, ఆసుపత్రి పర్యవేక్షకుడు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : సర్వజన ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన పరీక్షలు చేయడంతో పాటు అన్ని మందులు ఇక్కడే ఇవ్వాలని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షలు, మందుల కోసం రోగులను బయటికి పంపించరాదని స్పష్టం చేశారు. కర్నూలు వైద్య కళాశాలలోని సమావేశ మందిరంలో సోమవారం మంత్రి అధ్యక్షతన సర్వజన వైద్యశాల, వైద్య కళాశాల అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సర్వజన వైద్యశాలలో 'పేపర్ రహిత' సేవలు అందుబాటులోకి తేవాలని చెప్పారు. అందుకు అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు సమకూర్చడంతో పాటు సిబ్బందిలో నైపుణ్యాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్‌ఐసీ డీవో ప్రవీణ్‌రెడ్డిని ఆదేశించారు. విశాఖలోని కేజీహెచ్ పూర్వ విద్యార్థులు రూ.50 కోట్లతో నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చారని, వారికి అనుకూలమైన స్థలం కేటాయించాలన్నారు. వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ, ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, స్టేట్ క్యాన్సర్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ ప్రవీణ్, రఘునాథరెడ్డి, జగదీష్, ప్రదీప్, ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీకి ౯౫ ఫిర్యాదులు

సమస్య వింటున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : పుల్లగుమ్మికి చెందిన వడ్డె వెంకటేశులు, వడ్డె వెంకటరాముడు ఎనిమిది నెలల కిందట వంద క్వింటాళ్ల మిరప కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని కృష్ణగిరి మండలం ఆగవెలికి చెందిన వడ్డె గిడ్డయ్య ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 95 మంది బాధితులు తమ సమస్యలపై ఎస్పీ వినతిపత్రాలు అందజేశారు. ఒర్వకల్లు ఎయిర్‌పోర్టుకు సంబంధించి ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో సీనియర్ ఫ్లోర్ మేనేజరు ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి తనకు ఇ-మెయిల్ పంపి రూ.23 వేలు తీసుకుని మోసగించాడని కర్నూలులోని శరీన్‌నగర్‌కు చెందిన పుల్లయ్య ఫిర్యాదు చేశారు. కోర్టు ఇంజక్షన్ ఆర్డర్‌తో సాగుచేసుకున్న తమ పొలంలోని పంటను దిన్నెసుంకన్న, మరికొందరు కలిసి కోసుకెళ్లారని కోడుమూరు మండలం లద్దగిరికి చెందిన విక్రమ్ ఫిర్యాదు చేశారు. కోడుమూరుకు చెందిన హనుమన్న ఓ కంపెనీ తరఫున నకిలీ జొన్న విత్తనాలు ఇచ్చి మోసగించారని తుగ్గలి మండలం లింగనేయపల్లెకు చెందిన శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. అదనపు ఎస్పీ హుస్సేన్‌పీరా, సీఐలు శివశంకర్, రామకృష్ణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగు విస్తరించాలి

❍ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఈనాడు, అమరావతి: "రాయలసీమ రైతులకు మరింత ఆదాయం పెరగాలంటే ఉద్యాన పంటల సాగును మరింత విస్తృతం చేయాలి. సీమలో మరింత అభివృద్ధి జరిగేందుకు అవసరమైన అన్ని వనరులూ ఉన్నాయి. ఇప్పటికే అనేక పరిశ్రమలు, కంపెనీలను ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయిస్తోంది. దీనికి తోడు పండ్ల ఎగుమతుల ద్వారా చక్కని ఆదాయం పొందొచ్చు" అని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సోమవారం ఆయన రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక, ఇతర శాఖల అధికారులతో సమావేశమయ్యారు. రాయలసీమ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్, కార్యదర్శి రోనాల్డ్ రోస్, జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి కేశవ్ ఏమన్నారంటే..

- తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను ఆనుకుని రాయలసీమ ఉంది. ఇది ఎంతో అనుకూలాంశం. ఉద్యాన పంటల ఉత్పత్తులను ఆయా రాష్ట్రాలకు ఎగుమతి చేయవచ్చు. కొన్ని ఉద్యాన పంటలకు విదేశాల్లో ఎంతో డిమాండ్ ఉంది. ఆ పంటల సాగు చేపట్టడం వల్ల విదేశాలకు ఎగుమతి చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.
- ఉద్యాన పంటల సమాచారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇప్పటికే సీమలో గతంలో ఎన్నడూ లేని స్థాయిలో సాగునీటిని అందిస్తున్నాం. ఆ నీటిని సద్వినియోగం చేసుకుని పంటలే కాదు పండ్ల తోటల పెంపకం చేపట్టాలి. అధికారులు సైతం ఈ విషయంలో అక్కడి రైతులకు అవగాహన కల్పించాలి.
- కియా పరిశ్రమ వల్ల ఉమ్మడి అనంతపురం జిల్లాలో జీఎస్‌డీపీ పెరిగింది. పరిశ్రమల వల్లే కాదు.. ఉద్యాన పంటల ద్వారా కూడా ఆదాయం సృష్టించవచ్చని రాయలసీమ రైతులు నిరూపించాలి.
- కోనసీమలో వరి సాగు చేసే రైతుల కన్నా రాయలసీమలో ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ఆదాయం ఎక్కువ వస్తోంది. రెండు ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేసి రూ.కోట్లలో ఆదాయం పొందిన వారూ ఉన్నారు. రూ.లక్షల్లో ఆదాయం పొందిన రైతులూ ఉన్నారు. ఆర్గానిక్ పంటలతో రాబడి ఎంతో బాగుంది.

మెరిసిన వేరుసెనగ ధరలు

ఆదోని మార్కెట్లో రాసులుగా పోసిన వేరుసెనగ దిగుబడులు

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వ్యాపారంలో వేరుసెనగ దిగుబడుల ధరలు పెరిగాయి. 265 క్వింటాళ్ల మేర దిగుబడులు వచ్చాయి. క్వింటాలు కనిష్ఠంగా రూ.3,216, గరిష్ఠంగా రూ.7,229, మధ్య ధర రూ.6,469 పలికాయి. విత్తుకు డిమాండ్ పెరగడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. దీనికి తోడు ఫైమార్కెట్లో వేరుసెనగ గింజ ధరలు సైతం పెరిగాయి. గత నెల వరకు కిలో రూ.95-98 ఉండేది.. ప్రస్తుతం నాణ్యమైన సరకుకు కిలో రూ.105-114 వరకు ధర పలుకుతోందని తెలిపారు.

నేటి నుంచి బీఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ పరీక్షలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు బీఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వీసీ వెంకటబసవరావు తెలిపారు. ఇందుకోసం 19 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 3వ సెమిస్టర్ కింద బీఈడీలో 3945, బీపీఈడీలో 166 మంది, ఎంపీఈడీలో 113 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు వెల్లడించారు.

వివరాలు తప్పుల్లేకుండా నమోదు చేయండి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : పదో తరగతి విద్యార్థుల వివరాలు యూడైస్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని డీఈవో శామ్యూల్‌పాల్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. నమోదు సమయంలో సాంకేతిక సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. డీఈవో కార్యాలయంలో ఏఎస్‌వో జయసింహ (9866814804), సూపరింటెండెంట్ సూర్యనారాయణరెడ్డి (9490500012), సిబ్బంది సమీవుల్లా ఖాన్ (9985629988), బాలాజీ (9000822394), శ్యామ్‌ప్రసన్నబాబు (8919045895)లను సంప్రదించాలన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గమనించాలన్నారు.

విద్యా సమాచారం

డిగ్రీ పరీక్షలో పదిమంది డిబార్

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం జరిగిన డిగ్రీ 3వ సెమిస్టర్ పరీక్షల్లో పదిమంది విద్యార్థులను డిబార్ చేసినట్లు వీసీ వెంకటబసవరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 8,958 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా 8,190 మంది పరీక్ష రాసినట్లు వెల్లడించారు.

నవోదయ పరీక్షకు 24 కేంద్రాలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్షలు రాసే విద్యార్థులకు 24 కేంద్రాలు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపల్ పద్మావతి వెల్లడించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో ఈ ఏడాది అత్యధికంగా 6469 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నంద్యాలలో 9, కర్నూలు జిల్లాలో 15 కేంద్రాలు ఎంపిక చేశామన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు జారీ చేసినట్లు తెలిపారు. డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష వచ్చే నెల 13వ తేదీన ఉంటుందన్నారు. ఆయా కేంద్రాల పరిధిలో విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో నిబంధనల మేరకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. సమస్య ఉంటే నేరుగా తమకు ఫిర్యాదు చేయాలని కోరారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ఎస్టీయూ కర్నూలు జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకుడు సూర్యుడు తెలిపారు. నగరంలోని ఎస్టీయూ భవన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా టీకే జనార్దన్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా చిన్న సుంకన్న, ఆర్థిక కార్యదర్శిగా శ్రీధర్‌తో పాటు నలుగురు సహాధ్యక్షులు, ఎనిమిది మంది ఉపాధ్యక్షులు, ఆరుగురు అదనపు కార్యదర్శులు, పదిమందిని సభ్యులుగా ఎన్నుకున్నట్లు సూర్యుడు వెల్లడించారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న డా.ఖాదర్‌వలి

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : రోజువారీ ఆహారంగా చిరుధాన్యాలను తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని పద్మశ్రీ డాక్టర్ ఖాదర్‌వలి చెప్పారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో సోమవారం చిరుధాన్యాల ప్రాధాన్యంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. చిరుధాన్యాలను తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ చిరుధాన్యాలు తీసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. అదితి మిల్లెట్స్ ప్రతినిధులు సీఏ మోహన్ కడింపల్లి, శేఖర్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, టీజీ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి ఉత్తీర్ణత పెంచడమే లక్ష్యం

మాట్లాడుతున్న డీఈవో శామ్యూల్‌పాల్

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత పెంచడమే లక్ష్యంగా విద్యా బోధన చేయాలని డీఈవో శామ్యూల్‌పాల్ ఉపాధ్యాయులను ఆదేశించారు. నగరంలోని నగరపాలక సమావేశ భవనంలో ఉన్న వీలెర్నింగ్ ల్యాబ్‌లో సోమవారం ఆయన సబ్జెక్టు నిపుణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కనీస మార్కులతో ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రెటరీ నాగరాజు, సబ్జెక్టు నిపుణులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో యాంటీ టెర్రరిస్టు మాక్‌డ్రిల్

మాక్ డ్రిల్‌లో ప్రత్యేక దళాలు

మంత్రాలయం, న్యూస్‌టుడే: రాఘవేంద్ర స్వామి మఠంలో యాంటీ టెర్రరిస్టు మాక్ డ్రిల్ నిర్వహించారు. విజయవాడ రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రనాయక్ ఆధ్వర్యంలో సీఐలు వరప్రసాద్, రాంమోహన్, నరేశ్ నాగస్వామిలతో పాటు దాదాపు 40 మంది ప్రత్యేక కమెండోలు, స్థానిక సీఐ రామానుజులు, ఎస్సై శివాంజల్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు సమక్షంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. దాదాపు 65 మంది సిబ్బందితో రెండు, మూడు గంటల పాటు నిర్వహించారు.

మల్లన్నసేవలో దర్శకుడు సుకుమార్

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను సోమవారం ప్రముఖ సినీ దర్శకుడు సుకుమార్ దర్శించుకున్నారు. స్వామి వారి స్పర్శ దర్శనం చేసుకున్న అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆయనకు అర్చకులు వేదాశీర్వచనాలు పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

54 మందికి డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే : పంచాయతీరాజ్ శాఖలో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారికి మండల జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి (డిప్యూటీ ఎంపీడీవో)గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జడ్పీ నుంచి 38 మంది, డీపీవో కార్యాలయంలో ఇద్దరు, 14 మంది గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి లభించింది. పదోన్నతులు పొందిన 54 మంది డిప్యూటీ ఎంపీడీవోలకు జిల్లాలను కేటాయిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియమించాల్సిన మండలాల జాబితాను జడ్పీ సీఈవో సిద్ధం చేసి కలెక్టర్‌కు పంపనున్నారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు వెలువడనున్నాయి. అనుకూల మండలాల్లో పోస్టింగ్ కోసం ఎమ్మెల్యేల వద్ద సిఫారసు లేఖలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

డాక్టర్ రామచంద్రారెడ్డికి ఉత్తమ కార్యదర్శి పురస్కారం

పురస్కారం అందుకుంటున్న డాక్టర్ రామచంద్రారెడ్డి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : విజయనగరంలో జరిగిన దంత వైద్యుల సదస్సులో కర్నూలు నగరానికి చెందిన డాక్టర్ ఆర్.రామచంద్రారెడ్డి ఉత్తమ రాష్ట్ర కార్యదర్శి పురస్కారం అందుకున్నారు. ఈసందర్భంగా ఆయన్ను దంత వైద్యుల సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. ఆయన ఎన్నిక పట్ల తోటి వైద్యులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కల్లూరు మండల పరిధి చిన్నటేకూరు వంతెన సమీపంలో సోమవారం రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఉలిందకొండ ఎస్సై ధనుంజయ వివరాల మేరకు.. కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన బోయ హర్ష, బోయ నాయుడు కల్లూరు మండల పరిధి చెట్లమల్లాపురంలోని వేడుకకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. చిన్నటేకూరు సమీపంలో వాహనం అదుపు తప్పి విభాగినిని ఢీకొట్టింది. వెనక కూర్చున్న హర్ష(18) మృతి చెందగా..గాయాలపాలైన నాయుడిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ సాఫ్ట్‌వేర్ ఇంజినీరు మృతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని బుధవారపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు కిరణ్‌కుమార్ (32) చికిత్స పొందుతూ మృతి చెందారు. కోడుమూరుకు చెందిన వీరి కుటుంబం కర్నూలులో స్థిరపడింది. కిరణ్‌కుమార్ ఇంటివద్దే ఉంటూ వర్క్ ఫ్రం హోమ్ విధానంలో పనిచేసేవారు. ఈనెల 20వ తేదీన రాత్రి జోహరాపురం వెళ్లి స్నేహితుడిని కలిశారు. అనంతరం ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని మారుతీహోమ్స్ వద్ద కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కన్నవారికి కడుపుకోత

వంశీ (పాతచిత్రం)

జొన్నగిరి(తుగ్గలి), న్యూస్‌టుడే: నిత్య కష్టాలతో కుటుంబాన్ని నెట్టుకొచ్చారు. రూపాయి రూపాయి కూడబెట్టి పిల్లలను పెంచి పెద్దచేశారు. విద్యాబుద్ధులు నేర్పి, ప్రయోజకులను చేశారు. కుమారుడు కొలువులో చేరాడని సంబరపడ్డారు. అంతలోనే కాలం కన్నీటి కడలిలో ముంచింది. చేతికొచ్చిన కుమారుడు మృత్యుఒడికి చేరడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామానికి చెందిన యువకుడు చల్లా వంశీ(25) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. అక్కడ ఆదివారం జరిగిన రహదారి ప్రమాదంలో తోటి ఉద్యోగినితో సహా మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. జొన్నగిరి గ్రామానికి చెందిన చల్లా వెంకటగిరి, వరలక్ష్మి దంపతులకు కుమారుడు వంశీ, కుమార్తె తులసి ఉన్నారు. వెంకటగిరి ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా, వరలక్ష్మి వ్యవసాయ కూలీగా పనిచేస్తూ.. వచ్చిన సంపాదనతో ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. కుమారున్ని, కూతురిని చదివించారు. వంశీ మూడేళ్లుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఆదివారం తోటి ఉద్యోగినితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. లారీని ఢీకొని ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. వంశీ మృతదేహాన్ని సోమవారం సాయంత్రానికి స్వగ్రామానికి తెచ్చారు. ఒక్కగానొక్క కుమారుడు మరణంతో ఆకుటుంబం శోకంలో మునిగి పోయారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 73821 14647.

PROFESSIONAL SERVICES

ASTROLOGY
శ్రీరాఘవేంద్ర జ్యోతిష్యాలయం బ్రొటనవేలి ముద్ర, రెండు హస్తరేఖలను పరీక్షించి సంపూర్ణ జ్యోతిష్యం తెలపగలరు. బళ్లారి చౌరస్తా, కర్నూలు. ✆ 97031 67293.

REAL ESTATE

HOUSE FOR SALE
నంద్యాల శ్రీనివాసనగర్ లో 5/50 సెంట్స్ లో గల 3 అంతస్తుల బిల్డింగ్ సేల్‌కు కలదు. Contact: 99890 03812.

TO LET
For Rent to Hospital, Poly Clinics, Diagnostic Centres 5200 Sft, G+1, 43/194-2, Line No-7, N.R.Peta, Kurnool. Cont: ✆ 89851 32552.

JOBS
ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్. HDFC/AXIS బ్యాంక్, క్లర్క్‌లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆: 9703971968.

కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్స్ (F) కావలెను. ఇంటర్‌నేషనల్ రిప్యూటెడ్ మ్యాట్రిమోనియల్ కన్సల్టెన్సీ, కర్నూలు బ్రాంచి కొరకు సంప్ర॥ 93938 23550.

EENADU THE WAY CLASSIFIEDS
అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

మాళవి మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణం గాంధీనగర్‌లో వెలిసిన మాళవి మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా నిర్వాహకులు స్వామి వారి కల్యాణం, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పట్టణ వీధుల్లో స్వామివారికి గ్రామోత్సవం చేపట్టారు.

ఆదోని
• ఆదోని • ఆలూరు • పత్తికొండ

తెల్ల మచ్చలుంటే వైద్యులను సంప్రదించాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: శరీరంపై ఎలాంటి తెల్లమచ్చలున్నా, స్పర్శ లేకున్నా తక్షణమే వైద్యులను సంప్రదించాలని వైద్యాధికారిణి సుజాత సూచించారు. కుష్ఠు నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం పత్తికొండ పట్టణంలో ఇంటింటికీ వెళ్లి మహిళలతో మాట్లాడారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సాయిబాబా, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

హొళగుంద, న్యూస్‌టుడే: ?: స్థానిక అయోధ్యనగర్ కాలనీకి వెళ్లే మార్గంలో విద్యుత్తు స్తంభానికి వీధి దీపం ఏర్పాటు చేయలేదు. – మారేష్, హొళగుంద
✔: వీధి దీపం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. – రాజశేఖర్‌గౌడ్ పంచాయతీ అభివృద్ధి అధికారి

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణంలో దోమల బెడద అధికంగా ఉంది. రోగాలు ప్రబలుతున్నాయి. నివారణ చర్యలు చేపట్టాలి. – నసీరుద్దిన్‌పటేల్, ఆదోని
✔: ప్రజారోగ్య సిబ్బందికి సూచించి సమస్య పరిష్కరిస్తాం. – నాసిర్‌హుసేన్, ఇన్‌ఛార్జి కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ?: ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్ పథకాలకు సంబంధించిన డబ్బులు ఖాతాల్లో జమకాలేదు. – బంగి యాదగిరెప్ప, శేషన్న, నారాయణపురం (ఆదోని)
✔: సాంకేతిక సమస్యలు ఉంటే పరిశీలించి, సమస్య పరిష్కరిస్తాం. – ఈశ్వరి, వ్యవసాయ సహాయకురాలు

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెరలోని రామనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన మినీ ట్యాంకు నుంచి నీరు నిరంతరం లీకవుతోంది. – బద్రి, మద్దికెర
✔: పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయిస్తాం. – మయాంక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, మద్దికెర

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: చిప్పగిరి మండలం, దేగలహాల్‌లోని మారెమ్మ ఆలయం వీధిలో పరిసారాలు శుభ్రం చేయాలి. – గోవిందరాజులు, దేగలహాల్
✔: పంచాయతీ సిబ్బందిని పంపి రెండు రోజుల్లో పరిసారాలు శుభ్రం చేస్తాం. – నీలకంఠ సర్పంచి, దేగలహాల్

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండల ఎంపీడీవోగా నాగరాజు స్వామి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఆదోని మండల పరిషత్తు కార్యాలయ పరిపాలన అధికారిగా పనిచేస్తూ.. పూర్తి అదనపు బాధ్యతలు తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పలువురు కలిసి అభినందించారు. ఇక్కడ పనిచేస్తున్న జనార్దన్ ఏలూరుకు బదిలీ అయ్యారు.

వివరాలు నమోదు చేసుకోండి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న గృహనిర్మాణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆదోని ఎంపీడీవో నాగరాజుస్వామి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇళ్లు లేని వారంతా ఈ నెల 30వ తేదీ లోపు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్, జాబ్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు అందజేయాలన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: గర్భిణులు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్‌లు భార్గవ్‌రామ్, జతీన్‌జైన్, అర్షిత్ గోయిల్, లోకేష్‌సింగ్, అమిత్‌మీనా అన్నారు. ఆదోని మండలం అరేకల్ గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రం-2లో గర్భిణులకు సీమంతం చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాల పనితీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శేకన్న, సచివాలయం, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని వినతి

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని 17వ వార్డులో దళితుల కోసం ప్రత్యేక శ్మశానవాటికను కేటాయించాలని సీపీఐ నాయకులు సోమవారం ఆదోని పురపాలక సంఘం అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి టి.వీరేశ్, నాయకులు [illegible], లక్ష్మీనారాయణ, కల్లుబావి రాజు, విజయ్, సత్యనారాయణ, ఈరన్న, అనుమప్ప, లింగప్ప, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేసి.. అక్రమాలకు అడ్డుకట్ట వేసి

☛ ఉపాధి కూలీలకు కొత్త విధానం ☛ కొనసాగుతున్న ఆధార్ అనుసంధానం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు తావు లేకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరి నుంచి ఈకేవైసీ (ముఖ నిర్ధారణ) తీసుకుంటున్నారు. పనులకు వెళ్లిన ప్రతి కూలీతో జియో ట్యాగింగ్‌తో గుర్తించిన పని ప్రదేశంలో ముఖ నిర్ధారణ తీసుకుంటారు. దీంతో ఉపాధి పనులకు వెళ్లిన వారికి మాత్రమే వేతనం అందించే అవకాశం ఉంటుంది. గత వైకాపా ప్రభుత్వంలో పలు అక్రమాలు జరిగాయి. స్థానికంగా లేనివారు కూడా పనులు చేసినట్లు నమోదు చేసి, నిధులు స్వాహాచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాటిని అరికట్టేందుకు జాబ్ కార్డులో నమోదైన ప్రతి వ్యక్తి ఈకేవైసీ తీసుకోవడంతో ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగే అవకాశం ఉండదు.

మండలం	వేతనదారులు	ఈకేవైసీ పూర్తయిన కూలీలు
వెల్దుర్తి	28,435	21,343
పత్తికొండ	24,262	18,915
మద్దికెర	15,297	11,864
కృష్ణగిరి	22,973	17,704
తుగ్గలి	41,571	30,020

మూడు నెలలుగా..

జిల్లాలోని 25 మండలాల్లో ఆగస్టు మొదటి వారం నుంచి ఉపాధి హామీ పథకం వేతనదారుల ఈకేవైసీ నమోదు చేపట్టారు. జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం చేస్తున్నారు. మూడు నెలలుగా ఈ ప్రక్రియ చేపట్టినా.. ప్రజల్లో అవగాహన కల్పించకపోవడంతో నేటికీ 22 శాతం ఈకేవైసీ పూర్తిచేయాల్సి ఉంది.

రామళ్లకోటలో ఉపాధి కూలీలతో ఈకేవైసీ తీసుకుంటున్న సిబ్బంది

రెడ్ మార్కు జాబితాలో..

ఈకేవైసీ నమోదులో 13 మండలాలు రెడ్ మార్కు జాబితాలో ఉన్నాయి. పత్తికొండ, వెల్దుర్తి, గుడూరు, ఆస్పరి, నందవరం, తుగ్గలి, కౌతాళం మండలాలతో పాటు ఆరు మండలాలు 80శాతం నమోదుకు చేరకపోవడంతో రెడ్ మార్కులో ఉన్నాయి. అక్టోబర్ 31 నాటికి వందశాతం పూర్తిచేయాలని ఉపాధి సిబ్బందికి లక్ష్యంగా విధించారు. కూలీలు అందుబాటులో లేక జాప్యం జరుగుతోంది.

ఉద్యోగుల తరహాలో..

ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది హాజరు ఈకేవైసీతో నమోదు చేస్తారు. ఉపాధి పనులకు వెళ్లిన కూలీలు ఇదే తరహా హాజరు వేయాలి. పనిచేసిన వ్యక్తికే వేతనాలు చెల్లిస్తారు. గతంలో మృతి చెందిన, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి పేర్లను సైతం నమోదు చేసి.. నీకు సగం, నాకు సగం పద్ధతిలో ఉపాధి పనులు గ్రామాల్లో చేపట్టారు. వీటి అమలుతో అక్రమాలకు స్వస్తి పలకనున్నారు.

పనులు చేసిన వారికే వేతనం

- పృథ్వీరాజ్, ఈసీ, వెల్దుర్తి

జాబ్‌కార్డుల ఆధారంగా ప్రతి ఒక్కరికి ఈకేవైసీ నమోదు చేస్తున్నాం. వీటి ద్వారా పనులకు వచ్చే వారికి మాత్రమే వేతనం అందుతుంది. ప్రస్తుతం చేపడుతున్న ఈకేవైసీతో మృతిచెందిన వారి పేర్లు తొలగిస్తున్నాం. ముఖనిర్ధారణతో హాజరు కానివారికి వేతనం చెల్లించే అవకాశం ఉండదు.

బనవనూరు.. ఏరు దాటలేరు

ఆస్పరి మండలంలోని మారుమూల గ్రామం బనవనూరు. ఈ ఊరి ప్రజలు ఇతర గ్రామాలకు వెళ్లాలంటే అవస్థలు పడాల్సిందే. ప్రధానంగా బెలుపుల నుంచి బనవనూరు గ్రామానికి 3 కి.మీ. దారి అధ్వానంగా మారింది. గ్రామానికి ఆనుకొని ఉన్న దేవనకొండ మండలంలోని పొట్లపాడుకు వెళ్లేందుకు హంద్రీవాగు దాటాలి. వాగు దాటే సమయంలో కొంతమంది నీటిలో జారి పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ రెండు గ్రామాలకు మధ్యన ఉన్న హంద్రీవాగుపై వంతెన ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, ఆస్పరి

కట్రవంక.. చూడరు ఈ వంక

జాతీయ రహదారి పనులు ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్నాయి. హాలహర్వి మండలం చింతకుంట నుంచి కట్రవంక వాగు మధ్యలోని వంతెన పనులు చేపట్టి ఇలా మధ్యలోనే వదిలేశారు. కట్రవంకవాగుపై వంతెన నిర్మాణ పనులు సైతం పూర్తికాలేదు. వర్షాలు కురిసిన ప్రతిసారి తాత్కాలికంగా వేసిన రోడ్డు కోతకు గురవడంతో సరిహద్దు గ్రామాల నుంచి అవతలి వైపు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా దృష్టి సారించి పనులు పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆలూరు గ్రామీణం

దేశ వ్యాప్త నిరసన 26న

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉప సంహరించుకోవాలని కోరుతూ.. ఈ నెల 26న చేపట్టనున్న దేశ వ్యాప్త నిరసన కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు వెంకటేశ్వరరెడ్డి, యు.కారుమంచి పిలుపునిచ్చారు. సీపీఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సంయుక్త సమావేశంలో వారు మాట్లాడారు. లేబర్‌కోడ్‌లు రద్దు చేసే వరకు ఐక్యంగా పోరాడాలన్నారు. సమావేశంలో సీపీఎం, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు కారన్న, రవిచంద్ర, గోపాల్, దస్తగిరి, నెట్టేకంటయ్య, ఉరుకుందు, రంగన్న, అల్లీపీరా, సిద్ధు, ప్రశాంత్, మాదన్న తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Know all men that my client Yaggati Mahadeva S/o. Y.Panchappa, R/o. D.No.25/607, Adoni is intending to purchase schedule property from Jalli Althaf S/o. J.Nabi Sab who got the same under registered sale deed No.1181/2020 and registered rectification deed No.476/2022 registered at Adoni Sub registrar Ofiice. If anyone has got right, kindly inform my client or his advocate within seven days of this public notice. Otherwise it will be treated that Jalli Althaf has got absloute title.

SCHEDULE

Plot no.13 measuring 688.93 sq.yrds (with Panchayat approval for construction of building) situated in sy.no.344 with sub division Sy.No.344/2A Extent: A.4.50 C pyki (Portion) in Mandigiri Village, Sadapuram gram Panchayat limits within Sub registration district of Adoni and registration district of Kurnool as follows.
Boundaries: East: Site of Molagavalli Saleem and plot no.19, **West:** Rastha, **North:** 100 Feet road, **South:** Plot no.14 of Mangali Ramanjani.
Total area: 688.93 Sq.Yards
Sd/- C.GIRIDHAR, Advocate, Adoni. Cell: 94402 44138.

పల్లె కబుర్లు

రాంపల్లి (తుగ్గలి), న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెదేపా మండల అధ్యక్షుడు తిరుపాలనాయుడు తెలిపారు. వ్యవసాయ సహాయకులు లోకేశ్, పశుసంవర్ధక సహాయకులు వంశీ, సంక్షేమ సహాయకులు రామకృష్ణతో కలిసి గ్రామంలో పర్యటించి, పథకాల గురించి వివరించారు.

తుగ్గలి, న్యూస్‌టుడే: తుగ్గలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విశ్వమోహన్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు సమావేశంలో తప్పకుండా పాల్గొనాలన్నారు.

ఆలూరు, న్యూస్‌టుడే: ఆలూరు గ్రామ పంచాయతీకి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి హనుమంతు, కృష్ణ డిమాండు చేశారు. ఎంపీడీవో మద్దిలేటిస్వామికి సోమవారం వినతిపత్రం అందించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

అరేకలు(ఆదోని ఎస్కేడీ కాలనీ), న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు పనిచేస్తున్నారని తెదేపా సీనియర్ నాయకుడు ఉమాపతినాయుడు అన్నారు. అరేకలు గ్రామంలో సోమవారం రైతన్నా మీకోసం - మన మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు జిందే శంకర్, రాష్ట్ర హౌసింగ్ బోర్డు డైరెక్టరు రామకృష్ణ, బెస్త కార్పొరేషన్ డైరెక్టరు రామాంజనేయులు, తెదేపా నాయకులు రంగస్వామి, లక్ష్మీనారాయణ, కృష్ణారెడ్డి, గిడ్డయ్య, విరుపాక్షి, శంకర్‌రెడ్డి, భీమా, లక్ష్మన్న, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని తెదేపా ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. హుళేబీడు గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన రైతన్నా మీ కోసం.. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి రైతు సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు రఘుబాబు, షేక్షావలి, కేశన్న, కేపేంద్ర, కొమ్ము రాజు, మసాల జగన్, కొండ రామాంజనేయులు, బొగ్గుల ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

పుచ్చకాయలమడ(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల సాయంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీఏ మోహన్ విజయ్ కుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది రియాజ్, రుక్సానా, సువర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

ఆదోని మండలం అరేకలు గ్రామంలో రైతులకు పథకాలు వివరిస్తూ.. పత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా సీనియర్ నాయకుడు ఉమాపతినాయుడు తదితరులు

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలో రైతుల ఇళ్లకు రైతు సంక్షేమ పథకాల గురించి వివరించారు.

అమకతాడు,(కృష్ణగిరి), న్యూస్‌టుడే: అమకతాడు గ్రామంలో వ్యవసాయ శాఖాధికారులు రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మహేంద్ర, ఏఈవో అనిల్, రైతులు పాల్గొన్నారు.

హొళగుంద, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ఏవో ఆనంద్ లోక్‌దళ్ ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో విరుపాక్షి, తెదేపా మండల కన్వీనర్ తిప్పయ్య, నాయకులు దుర్గయ్య, పంపాపతి, ఎర్రిస్వామి, రైతుసేవా కేంద్రం సిబ్బంది, నాయకులు మొయిన్, హుసేన్ పీరా, హనుమంతు, రైతులు పాల్గొన్నారు.

దేవనకొండ, న్యూస్‌టుడే: మండలంలోని మాచాపురం, ఈదులదేవరబండ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చి కరపత్రాలను పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారిణి ఉషారాణి తెలిపారు.

చిప్పగిరి, న్యూస్‌టుడే: అర్హులైన రైతులందరికీ పంట రుణాలు అందిస్తామని సీఈవో హరికృష్ణ సోమవారం తెలిపారు.

ఆలూరు: హుళేబీడు గ్రామంలో మాట్లాడుతున్న వైకుంఠం జ్యోతి

జాతీయస్థాయి పోటీలకు హొళగుంద విద్యార్థిని


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

హొళగుంద, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి అండర్-17 కబడ్డీ జట్టుకు సారథ్యం వహించిన హొళగుంద విద్యార్థిని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కబీర్‌సాబ్, పీఈటీ తేజస్వీరెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థిని భూమిక అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. త్వరలో తెలంగాణ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటి హొళగుందకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యూనుస్‌బాషా, శాంతమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు త్వరగా పరిష్కరించండి

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఆయా శాఖల అధికారులు త్వరగా పరిష్కరించేలా చూడాలని ఆదోని ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ కొండయ్య అన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది.

అర్జీలు స్వీకరిస్తున్న ఆదోని ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ కొండయ్య

పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే విరుపాక్షి, నాయకులు

ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలి

ఆస్పరి, న్యూస్‌టుడే: ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. మండలంలోని కైరుప్పల గ్రామంలో సోమవారం నిర్వహించిన వీరభద్రస్వామి భద్రకాళిదేవి నిశ్చితార్థ వేడుకలకు ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు బద్రి, గోవర్ధన్, నాగరాజు, రంగన్న, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన 2వ అదనపు జిల్లా జడ్జి కోర్టు: కర్నూలు అట్ ఆదోని
E.P.No.575/2018 IN A.C.P.No.134/2013
Between :
M/s. సుందరం ఫైనాన్స్ లిమిటెడ్, కర్నూలు, రెప్రెజెంటెడ్ బై ఆథరైజ్డ్ సిగ్నేటరీ - డిక్రీ హోల్డర్
మరియు
1) పి.వి.విక్రాంత్ రెడ్డి, 2) యన్.ఇందుశేఖర్ రెడ్డి - జడ్జిమెంట్ డెటార్స్
కోర్టు వారి ఆదేశాల మేరకు వేలం ప్రకటన
To
1) పి.వి.విక్రాంత్ రెడ్డి, S/o పి.దుర్గాప్రసాద్ రెడ్డి, H.No.82-D, 82-F, 82-J, రామదుర్గం గ్రామం, చిప్పగిరి మండలం, కర్నూలు జిల్లా.
2) యన్.ఇందుశేఖర్ రెడ్డి, S/o యన్.లోకిరెడ్డి, H.No.2-283, నగరడోణ గ్రామం, చిప్పగిరి మండలం, కర్నూలు జిల్లా.
పైన తెలిపిన జడ్జిమెంట్ డెటార్స్ నెం.1 మరియు 2 పై డిక్రీ హోల్డర్ అయిన M/s. సుందరం ఫైనాన్స్ లిమిటెడ్, కర్నూలు రెప్రెజెంటెడ్ బై ఆథరైజ్డ్ సిగ్నేటరీ వారు ఆర్బిట్రేషన్ అవార్డ్ పొంది యున్నారు. అవార్డ్ ఉత్తర్వుల మేరకు పై కోర్ట్ నందు E.P. దాఖలు చేసి డిక్రీ హోల్డర్‌కు రావలసిన డబ్బు రాబట్టుకొనుటకు జడ్జిమెంట్ డెటార్స్ నెం.1 మరియు 2కు చెందిన షెడ్యూలు ఆస్తులను కోర్ట్ వారు 12-12-2025 తేదిన ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 05.00 గంటల లోపల వేలం వేయుదురు. ఈ షెడ్యూల్ దాఖలా ఆస్తులు తాకట్టుకు లోబడి వేలము నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు పై కోర్ట్ నందు హాజరై వేలంలో పాల్గొనవచ్చును.
షెడ్యూల్ ఆస్తుల వివరములు
ఐటం నెం.1: జడ్జిమెంట్ డెటార్స్ నెం.1 కి చెందిన ఆస్తి: కర్నూలు జిల్లా, చిప్పగిరి మండలం, రామదుర్గం గ్రామం, రామదుర్గం గ్రామ పంచాయితీలో చేరిన సర్వే నెం.82/డి లో A.c.1.85cents విస్తీర్ణం కలిగిన కర్నూలు డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్, ఆలూరు సబ్- రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్‌కు చెందిన భూమి **చెక్కుబంది:** తూ॥ గిరప్ప భూమి, ప॥ రోడ్డు, ఉ॥ కొండ, ద॥ హరిజన ఈరప్ప భూమి.
డిక్రీహోల్డర్ విలువ : రూ.7,00,000/- (ఒక ఎకరాకు), అమీనా విలువ : రూ.7,00,000/- (ఒక ఎకరాకు): సబ్-రిజిస్ట్రార్ విలువ: రూ.4,07,000/- (ఒక ఎకరాకు)
ఐటం నెం.2: జడ్జిమెంట్ డెటార్స్ నెం.2 కి చెందిన ఆస్తి: కర్నూలు జిల్లా, ఆలూరు మండలం, హత్తిబెళగల్ గ్రామం, హత్తిబెళగల్ గ్రామ పంచాయితీలో చేరిన సర్వే నెం.513లో A.c.10.51cents విస్తీర్ణం కలిగిన కర్నూలు డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్, ఆలూరు సబ్- రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్‌కు చెందిన భూమి **చెక్కుబంది: తూ॥** రవీంద్రరెడ్డి భూమి, **ప॥** మల్లికార్జునగౌడ్ భూమి, **ఉ॥** కోట్ల రంగన్నస్వామి భూమి, **ద॥** ఈడిగ రంగన్నస్వామి భూమి.
డిక్రీహోల్డర్ విలువ : రూ.8,00,000/- (ఒక ఎకరాకు), అమీనా విలువ: రూ.8,10,000/- (ఒక ఎకరాకు), సబ్-రిజిస్ట్రార్ విలువ: రూ.26,27,500/- (ఒక ఎకరాకు)
// ఇట్లు కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
సం/- కె.విజయభాస్కర్ రెడ్డి, డిక్రీహోల్డర్ తరపు న్యాయవాది, ఆదోని
సెల్‌ఫోన్ నెం. 98857 64896

ఏళ్ల సమస్యలకు పరిష్కారం

పూర్తికావచ్చిన సీసీ రోడ్డు పనులు

దేవనకొండ, న్యూస్‌టుడే: దేవనకొండలోని బస్టాండు వద్ద 30 ఏళ్లుగా నివాసం ఉంటున్న కాలనీవాసుల ఇబ్బందులపై అక్టోబర్ 31న 'ఈనాడు'లో ప్రచురితమైన 'మూడు దశాబ్దాలు.. మారని తీరు' అనే కథనానికి స్పందించిన అధికారులు రూ.5 లక్షల వ్యయంతో మురుగు కాలువలు, సీసీ రోడ్డు పనులు చేపట్టి, పూర్తిచేశారు.

స్పందనకు వందనం

ఇస్వీ గ్రామంలో పారిశుద్ధ్య పనులు

ఇస్వీ(ఆదోని ఎస్కేడీ కాలనీ), న్యూస్‌టుడే: ఇస్వీ గ్రామంలో పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై 'ఈనాడు'లో ఈ నెల 23న ప్రచురితమైన 'ఇస్వీ.. సమస్యలతో సుస్తీ' అనే కథనానికి గ్రామ సర్పంచి శ్యామల, పంచాయతీ కార్యదర్శి మంజునాథ్ స్పందించారు. గ్రామంలో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పారిశుద్ధ్య సిబ్బందితో మురుగు కాల్వలు శుభ్రం చేయించడంతో పాటు చెత్తచెదారం తొలగించి శుభ్రం చేశారు.

తూనికలు కొలతల శాఖాధికారుల దాడులు

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని రెవెన్యూ డివిజన్‌లో కలెక్టర్ సిరి ఆదేశాల మేరకు తూనికలు కొలతల శాఖాధికారులు ఆకస్మికంగా దాడులు చేపట్టారు. ఈ నెల 17న 'ఈనాడు'లో ప్రచురితమైన 'అక్రమాలను పత్తించుకోరు' అనే కథనానికి అధికారులు స్పందించారు. కౌతాళం, కోసిగి, గవిగట్టు, బసలదొడ్డి, పెద్దతుంబలం తదితర మండలాలు, గ్రామాల్లో పత్తి కొనుగోళ్లలో తూకాలను పరిశీలించారు. ఆదోనిలో వే బ్రిడ్జిలను తనిఖీ చేసి, స్టాంపింగ్, టెస్ట్ వెయిట్స్ లేవని గుర్తించారు. రూ.20 వేలు జరిమానా విధించారు.

భవన నిర్మాణానికి శ్రీకారం

హొళగుంద, న్యూస్‌టుడే: మార్లమడికి గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు మండల విద్యాధికారులు సుధారాణి, కబీర్ సాబ్ తెలిపారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 101 మంది విద్యార్థులు చదువుతున్నారు. మూడేళ్ల కిందట పాఠశాల భవనాన్ని కూల్చేశారు. అప్పటి నుంచి ఆర్డీటీ భవనంలో కొనసాగుతోంది. ఈ నెల 7న 'ఈనాడు'లో ప్రచురితమైన 'తరగతులు 3.. గది 1' అనే కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. సమగ్ర శిక్ష అభియాన్ నిధులతో నిర్మాణం చేట్టినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరమేష్, సర్పంచి యంకప్ప, పాఠశాల కమిటీ ఛైర్మన్ భాస్కర్, తెదేపా నాయకులు తెలిపారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణానికి చెందిన విఠల్‌రావు బతికే ఉన్నా.. చనిపోయినట్లు పత్రాలు సృష్టించి, అతనికి సంబంధించిన భవనాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన ఘటనపై కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ జి.భార్గవ్ సోమవారం ఆదోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. 'ఈనాడు'లో ప్రచురితమైన 'బతికున్నా.. చనిపోయినట్లు చూపారు' అనే కథనానికి ఆయన స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న సంబంధిత వ్యక్తులకు తాఖీదులు జారీ చేశామన్నారు. అప్పటికీ స్పందించకపోతే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ రిజిస్ట్రేషన్ సమయంలో డాక్యుమెంటేషన్ ఎలా ఉందో తనిఖీ చేస్తామన్నారు.

(c) eenadu

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

అన్నదాతల అభ్యున్నతే లక్ష్యం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

గోనెగండ్ల, న్యూస్‌టుడే: అన్నదాతల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలతో పాటు కూటమి ప్రభుత్వం పంచ సూత్రాలను అమలులోకి తీసుకొస్తున్నట్లు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం తిప్పనూరు గ్రామంలో వ్యవసాయశాఖ ఏడీఏ మహ్మద్‌ఖాద్రి నిర్వహించిన 'రైతన్న..మీకోసం' కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధిపొందిన రైతుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే కరపత్రాలను అందజేసి మాట్లాడారు. వ్యవసాయంలో రైతులు పాత విధానాలను విడనాడి.. నూతన ఒరవడితో పంటలు సాగు చేసేలా ప్రోత్సాహకాలు అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో 618 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధిపొందినట్లు వెల్లడించారు. అనంతరం గ్రామస్థులు పింఛన్లు, తాగునీరు, దేవాలయ భూములు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కౌలుట్ల, రాఘవేంద్రనాయుడు, రామకృష్ణ, ఏలియా, తిరుపతయ్య, బేతాలబడేసా, రమణ, నజీర్, సాయి, నరసింహుడు, నూరహ్మద్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

రంగుమారిన చెరువు నీటిపై విచారణ

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని కులుమాల గ్రామంలో రంగుమారిన చెరువు నీటితో ప్రమాదం పొంచి ఉందని గ్రామస్థులు సోమవారం భయాందోళన చెందారు. గ్రామస్థుల విన్నపాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ డీఈ విద్యాసాగర్ సోమవారం చెరువును సర్పంచి బుడ్డన్న సమక్షంలో పరిశీలించారు. చెరువు నీటిని, సమీపంలో ఉన్న మూడు చేతిపంపుల నీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. డీఈ మాట్లాడుతూ వదంతులపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

గాజులదిన్నెకు హంద్రీనీవా నీటి విడుదల

గోనెగండ్ల,న్యూస్‌టుడే: మండలంలోని గాజులదిన్నె సంజీవయ్యసాగర్ జలాశయానికి హంద్రీనీవా పంట కాల్వ నుంచి నీటి విడుదల చేసినట్లు ప్రాజెక్టు డీఈ సుబ్బరాయుడు సోమవారం తెలిపారు. హంద్రీనీవా కాల్వ నుంచి జలాశయానికి 150 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు చెప్పారు. రబీ సాగు కోసం కుడి కాల్వకు 130 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఏఈ చిన్నఅలీ ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

నందవరం, న్యూస్‌టుడే: ?: మండలంలోని కనకవీడు గ్రామంలో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. - సురేష్, గ్రామస్థుడు.

✔: సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం. - ఈవోఆర్డీ సందీప్, నందవరం మండలం.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: మునెప్పనగర్ కాలనీకి వెళ్లే దారిలో చెత్తకుండి నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. -రంగన్న కాలనీవాసి

✔: చెత్తను శుభ్రం చేయిస్తాం -శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: రాఘవేంద్ర కాలనీ ఐదో లైన్‌లో మురుగు కాల్వలు నిర్మించండి -నరసింహులు, కాలనీవాసి

✔: కొత్త రహదారులకు ప్రతిపాదనలు పంపుతాం. -గంగిరెడ్డి, పురపాలక కమిషనర్

?: ఎస్ఎంటీ కాలనీలో ఆరోలైన్‌లో విద్యుత్తు దీపాలు వేయించండి -లక్ష్మన్న, కాలనీవాసి

✔: కొత్త దీపాలు అమర్చేందుకు చర్యలు తీసుకుంటాం - నీరజా, డీఈ

ఆదరణ లేక.. ఆగిన సంపద సృష్టి

☛ కోడుమూరులో మూలనపడిన కేంద్రం

తొట్లలో నిండిపోయిన ప్లాస్టిక్, అట్టపెట్టెలు

కోడుమూరు, న్యూస్‌టుడే: స్వచ్ఛ సంకల్పం-క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్)లో భాగంగా కోడుమూరు మేజరు గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం గత కొన్ని నెలలుగా ఆదరణ లేక ఆగిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్, స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాలను బలోపేతం చేసి పట్టణాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దడంతో పాటు పట్టణాల్లో పోగైన తడి, పొడి వ్యర్థాలను సేకరించి వాటి ద్వారా ఎరువులు తయారు చేయడం లక్ష్యం. తయారు చేసిన ఎరువులను రైతులు సాగుచేసే పంటలకు అతి తక్కువ ధరలకే విక్రయించాలనే ఉద్దేశం నెరవేరడం లేదు.

వృథాగా ఎరువు తయారీ యంత్రాలు

నామమాత్రంగా మారి..

కోడుమూరు పట్టణంలోని చెత్త నుంచి సంపద తయారు కేంద్రం పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. ప్రస్తుతం కేంద్రంలో నాలుగు బస్తాలు(ఒక్కో బస్తా 30-40 కిలోల) ఎరువు మాత్రమే అందుబాటులో ఉండటం గమనార్హం. ఉన్నతాధికారులు వస్తున్నారన్న సమాచారం తెలిసిన సందర్భాల్లోనే కేంద్రంలోని తొట్లలో అన్ని రకాల వ్యర్థాలు, ప్లాస్టిక్ పరికరాలు, అట్టపెట్టెలు, వానపాములు, మట్టి, పేడ వంటి వాటిని నింపి మమ అనిపిస్తున్నారు. దీనికి తోడు ఇక్కడ తయారు చేసిన ఎరువులను కొనేందుకు రైతులు ముందుకు రావడం లేదు. మార్కెట్లో లభించే రసాయన ఎరువులపైనే రైతులు మొగ్గు చూపుతున్నారు. అధికారులు సరైన అవగాహన కల్పించక పోవడమే ఇందుకు కారణం. 2025 ఏప్రిల్‌లో పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా జిల్లాలో నిర్వహిస్తున్న ఉత్తమ కేంద్రంగా అవార్డు పొందింది. కానీ నేడు సంపద సృష్టి ఆగిపోయి రైతుల నుంచి ఆదరణ లేక చతికిలపడింది. రూ.కోట్ల నిధులతో ఏర్పాటు చేసిన షెడ్, యంత్రాలు నిరుపయోగంగా మారిపోయాయి.

కోడుమూరు జనాభా: 40వేలు
వార్డుల సంఖ్య: 20
రోజుకు పోగయ్యే పొడి చెత్త: 20 కిలోలు
తడి చెత్త: 200 కిలోలు
స్వచ్ఛ సంకల్పం కోసం పనిచేసే సిబ్బంది వివరాలు:
పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య: 40
క్లాప్ మిత్రుల సంఖ్య: 16
చెత్త సేకరణ, తయారీ యంత్రాల వివరాలు:
స్వచ్ఛ భారత్ వ్యాన్: 1
చెత్త సేకరణ ఆటోలు: 3, ట్రాక్టర్లు: 3
ఎరువు తయారీ చేసే యంత్రాలు: 2
తడి, పొడి ఎరువుల కోసం ఏర్పాటు చేసిన తొట్లు: 20

రైతులు ఆసక్తి చూపడం లేదు - వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టరు

బయట మార్కెటులో విక్రయించే రసాయనిక ఎరువులతో పోల్చితే సంపద కేంద్రంలోని చౌకగా లభ్యమవుతుంది. కిలో రూ.8 చొప్పున విక్రయించేవాళ్లం. అయినా రైతులు కొనుగోలు చేయడం లేదు. దీంతో కిలో రూ.5 చొప్పున ధర పెట్టినా రైతుల నుంచి ఆదరణ లేకపోవడంతో గత 6 నెలలుగా ఎరువులు తయారు చేయడం లేదు. రైతులు కొనడానికి ముందుకు వస్తే ఎరువులు అందించడానికి సిద్ధంగా ఉన్నాం.

కన్నడ భక్తుల నగర సంకీర్తన

మంత్రాలయం, న్యూస్‌టుడే: కన్నడ భక్తుల నగర సంకీర్తన శ్రీమఠంలో భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నగరానికి చెందిన మైత్రేయి నిర్వాహణలో దాదాపు 65 మంది కన్నడ మహిళలు సోమవారం శ్రీమఠంలో నగర సంకీర్తనతో భక్తులను మైమరపించారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు కన్నడ భక్తులకు ఫలమంత్ర అక్షింతలు ఇచ్చి ఆశీర్వదించారు.

సరదా పడితే ఎలా..

సుంకేసుల జలాశయం నీటి విడుదల గేట్ల వద్ద ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. గేట్ల నుంచి నీటి విడుదల చేసే సమయంలో ప్రవాహాన్ని సందర్శకులు తొంగి చూడటం, సెల్ఫీల కోసం యువత ఆత్రుత పడటం ఎక్కువగా చోటు చేసుకుంటుంది. సెలవు దినాల్లో రద్దీ ఎక్కువగా రద్దీ ఉంటుంది. ఇటువంటి సమయాల్లో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

–న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

రహదారి నిండుగా.. ప్రమాదం మెండుగా..

గ్రామీణ రహదారుల వెడల్పు అంతంత మాత్రంగానే ఉంటాయి. ఇలాంటి దారుల్లో రైతులు ట్రాక్టర్లలో వరిగడ్డి, పశుగ్రాసం తరలిస్తున్నారు. ట్రాక్టరుపై రహదారి కనిపించనంత నిండుగా సుమారు 20 అడుగులకు పైగా వెడల్పుతో గ్రాసాన్ని అమర్చి తరలిస్తున్నారు. గ్రాసం ట్రాక్టరు రహదారిపై వెళ్తున్న సమయంలో ఇతర వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో కిందికి వేలాడుతున్న విద్యుత్తు తీగలు తగిలినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. గ్రాసాన్ని తరలించే రైతులు, ట్రాక్టర్ వాహనదారులకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కౌతాళం

వలసలు వెళ్లి..చదువులు మరచి

వలసల కారణంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య బాగా తగ్గింది. మండలంలోని చిన్నకడబూరు ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 264 మంది విద్యార్థులు చదువుతున్నారు. వలసల కారణంగా ప్రస్తుతం రోజు 129 మంది మాత్రమే హాజరవుతున్నారు. గైర్హాజరుపై పాఠశాల సిబ్బందిని ఆరా తీయగా వలసలు వెళ్లినట్లు పేర్కొన్నారు. దీంతో తరగతి గదుల్లో విద్యార్థుల కొరత కనిపిస్తోంది. ఐదో తరగతిలో 44 మంది విద్యార్థులు ఉండగా కేవలం 14 మంది మాత్రమే కనిపించారు. వలసలతో విద్యార్థులు చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. –న్యూస్‌టుడే, పెద్దకడబూరు

నది దారి.. అధ్వానంగా మారి

మండలంలోని రాయచోటి గ్రామంలో తుంగభద్ర నదికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఆ దారికి ఇరువైపులా ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి. దాంతో అటుగా వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్థులు, రైతులు పలు పనుల నిమిత్తం, తాగునీటికి అదే దారిలో వెళ్తున్నారు. గురజాల గ్రామ పంచాయతీ పరిధిలోని రాయచోటి గ్రామం ఉండటంతో సర్పంచి గ్రామాన్ని పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు రహదారిని బాగు చేయాల్సి ఉంది.

– న్యూస్‌టుడే, రాయచోటి(నందవరం)

రాయితీ రుణాలతో శీతల గిడ్డంగులు

రచ్చుమర్రి(మంత్రాలయం), న్యూస్‌టుడే: రైతుల శ్రేయస్సు కోసమే రాయితీ రుణాలతో శీతల గిడ్డంగులు, ప్రాసెసింగ్ యూనిట్ల మంజూరుకు కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించిందని నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జీ రాఘవేంద్రరెడ్డి తెలిపారు. సోమవారం రచ్చుమర్రి గ్రామంలో భాజపా ఇన్‌ఛార్జీ విష్ణువర్ధన్ రెడ్డి, రాజారెడ్డి, కూటమి నేతలతో కలిసి ఇంటింటి ప్రచారం

రైతులకు పథకాల గురించి వివరిస్తున్న రాఘవేంద్రరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి

చేస్తూ కరపత్రాలు అందజేశారు. రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం 90శాతం రాయితీతో రైతులకు డ్రిప్ ఇరిగేషన్ పైపులు అందిస్తుందని అన్నారు. మండల వ్యవసాయాధికారి జీరా గణేశ్, హార్టీకల్చరల్ అధికారి అపర్ణలు మాట్లాడుతూ.. కోల్డ్ స్టోరేజీలు నిర్మించుకోవడానికి రైతుల కోసం 35 శాతం రాయితీతో రుణాలు మంజూరు చేసిందని తెలిపారు. పశుసంవర్ధక శాఖ వైద్యుడు సంతోష్, తహసీల్దార్ రమాదేవి, డిప్యూటీ ఎంపీడీవో రామాంజినేయులు, మండల అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, లీగల్ సలహాదారుడు విజయ్‌కుమార్, నేతలు లక్ష్మయ్య, చావిడి వెంకటేశ్, మాలపల్లి లక్ష్మన్న, చాపల నాగేశ్, జనసేన నేతలు యేసేబు, పోలి వీరేశ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన రఘు(25) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సోమవారం పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక ఆదివారం రాత్రి మృతి చెందినట్లు తెలియజేశారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఎమ్మిగనూరు గ్రామీణం: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం 'రైతన్న మీ కోసం' కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అనుబంధ రంగాల సిబ్బంది కేటీ వెంకటేష్, లలిత, పద్మ గ్రామాల్లో పర్యటించి రైతులకు వివరించారు.

పోలకల్ (సి.బెళగల్): మండలంలోని పోలకల్‌లో సోమేశ్వరస్వామి ఆలయం సన్నిధిలో ఏర్పాటు చేసిన పల్లె నిద్ర కార్యక్రమంలో పాల్గొని ఎస్సై వేణుగోపాల్ రాజ్ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు.

పోలకల్(సి.బెళగల్): మండలంలోని పోలకల్‌లో సచివాలయం 3లో ఉమ్మడి వ్యవసాయ సహకార సంఘానికి వ్యవసాయ సంచాలకులుగా 7 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి టి.నాగరమణయ్య తెలిపారు. డిసెంబరు 3న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గూడూరు గ్రామీణం: క్రిమి సంహారక రసాయన మందుల వాడకం తగ్గించాలని కర్నూలు భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయాధికారిణులు హరిప్రియ, మంజుల అన్నారు. మండలంలోని జూలకల్లు ఆదర్శ పాఠశాలలో నేల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కంబదహాల్, సి.బెళగల్, ఈర్లదిన్నె గ్రామాల నుంచి ఐదుగురు రైతులు భూ సమస్యలపై వినతులు అందజేశారు. కార్యాలయంలో ఎంపీడీవో రాణెమ్మకు కొట్టారుమిట్టా ప్రాథమిక పాఠశాలలో గుంతల్లో ఎర్రమెరుసు తరలించడానికి అనుమతులు ఇవ్వాలని ప్రధానోపాధ్యాయుడు హనుమంతు వినతి అందజేశారు.

పెద్దకడబూరు: మండలంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జీవ పరిణామ దినోత్సవం నిర్వహించారు. చార్లెస్ డార్విన్ చిత్రపటానికి పాఠశాల తాత్కాలిక ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌బాబు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కంబదహాల్ (సి.బెళగల్): కంబదహాల్ గ్రామంలో ఏవో మల్లేషకుమార్ సిబ్బందితో రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా వీధుల్లో పర్యటిస్తూ రైతులకు వివరించారు.

మాధవరం తండా(మంత్రాలయం): మాధవరం తండా నుంచి రిజర్వ్ బ్యాంక్ మేనేజర్ పదవీ విరమణ చేసిన రమేశ్‌ను సత్కరించారు.

ఎమ్మిగనూరు: మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని బాధితులు సంకెళ్లు వేసుకొని నిరసనలు చేపట్టారు.

గూడూరు గ్రామీణం: పట్టణంలో ఎస్సై హనుమంతరెడ్డి వాహనాల తనిఖీలు నిర్వహించి, వాహన చోదకులకు శిరస్త్రాణం, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

కౌతాళం, న్యూస్‌టుడే: వరి కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ వ్యక్తుల నుంచి రైతులను రక్షించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు మల్లయ్య అన్నారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లా

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

డుతూ రైతులు అధిక వర్షాల కారణంగా ఉల్లి, పత్తి, వేరుశనగ, మిరప పంటలు పూర్తిగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వరి పంటకైనా కౌతాళం మండలంలో అన్ని సచివాలయాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు, ప్రకాష్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర కల్పించండి

కోసిగి, న్యూస్‌టుడే: రైతులు పండించిన పత్తి దిగుబడికి కనీసం రూ.12వేలు మద్దతు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం తాలూకా అధ్యక్షులు గోపాల్ అన్నారు. సోమవారం కోసిగి 4వ సచివాలయం బయట నిరసన వ్యక్తం చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సచివాలయం సిబ్బంది హరినాథ్‌కు అందజేశారు. డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు ఓంకార్ స్వామి, నరసింహులు, శ్రీనువాసులు పాల్గొన్నారు.

క్వింటా రూ.12వేలకు కొనుగోలు చేయాలి

నందవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం పత్తి క్వింటా రూ.12 వేలు ప్రకారం సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్ డిమాండ్ చేశారు. నందవరంలో సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. సీసీఐ కేంద్ర ద్వారా పత్తికి మద్దతు ధర దొరకక రైతులు నష్టపోతున్నారన్నారు.

కార్యక్రమంలో సభ్యులు దేవరాజ్, ముని, ఈరన్న, ఏసన్న, హుసేని తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంతో మంచి ఆదాయం

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: తేనెటీగల పెంపకంపై తీసుకున్న శిక్షణను వినియోగించుకొని ఉపాధితో పాటు ఆదాయాన్ని పొంది ఇతర రైతులకు ప్రోత్సాహం అందించాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి అన్నారు. సోమవారం తేనెటీగల పెంపకంపై శాస్త్రీయ శిక్షణ ముగిసింది. విద్యార్థులకు ధ్రువ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కేవీకే

శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో శాస్త్రవేత్తలు

సమన్వయకర్త మాట్లాడుతూ తేనెటీగల పెంపకంపై శాస్త్రీయ పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో రైతులు, గ్రామీణ యువత అనుసరించేలా చేయూతనందించాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీచందన, నిరంజన్‌రెడ్డి, మాస్టర్ శిక్షకుడు రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలపై కేసు నమోదు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: పట్టణంలోని పత్తి, ఫుడ్ గ్రేయిన్స్ దుకాణాలను సోమవారం తూనికలు కొలతల అధికారి ఎస్

కాటాను తనిఖీ చేస్తున్న ఎస్ఎండీ గౌస్

ఎండీ గౌస్ తనిఖీ చేశారు. షేక్షావలి కాటన్, ఈరన్న ఫుడ్‌గ్రేయిన్స్, గౌస్ కాటన్ ట్రేడర్స్, గిడ్డయ్య కాటన్, ఆశా ట్రేడర్స్, హెచ్‌కేజీఎన్ కాటన్ మర్చంట్, శ్రీలక్ష్మీనరసింహ ట్రేడర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. తూకాల్లో 10కిలోలకు 1200గ్రాములు తక్కువ చూపించినందున 2 కేసులు నమోదు చేసి రూ.35 వేలు జరిమానా విధించినట్లు వెల్లడించారు. వ్యాపారులు ఉపయోగిస్తున్న తూకం యంత్రాలు రీస్టాంపింగ్ గడువు, వెరిఫికేషన్ దాటినట్లు తనిఖీలో తేలింది.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఇల్లు, నీటి పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి ఆదేశించారు. మూడో వార్డులో సోమవారం పర్యటించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. రోడ్లపై అక్రమ కట్టడాలతో ప్రజలకు ఇబ్బందిగా మారుతున్నాయని తక్షణమే తొలగించాలని ఆదేశించారు. నీటి పన్నులను సకాలంలో చెల్లిస్తే కొత్తగా ఇతర ప్రాంతాల్లో అభివృద్ధి చేసేందుకు సులభంగా ఉంటుందన్నారు. మురుగు కాల్వలో చెత్త చెదారం వేయరాదన్నారు. తడి,పొడి చెత్తను వేరుగా వేయాలన్నారు. ప్రతి ఇంటికి మంచినీటి వసతి కల్పించాలని లక్ష్యంతో కొత్తగా పైపులైన్లు వేస్తున్నట్లు తెలిపారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: కోడుమూరు పట్టణానికి చెందిన జనసేన క్రియాశీలక కార్యకర్త బండ శ్రీనివాసులు మరణించగా, ఆయన కుటుంబానికి పార్టీ అధిష్ఠానం రూ.5 లక్షల ఆర్థిక సాయం చేసింది. తాడేపల్లిలోని జనసేన ప్రధాన కార్యాలయంలో శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు చెక్కును అందజేశారు. సోమవారం కుటుంబ సభ్యులు మాట్లాడుతూ రూ.5 లక్షల ఆర్థిక సాయం రావడానికి కృషి చేసిన జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఆకెపోగు రాంబాబు, పార్టీ క్రియాశీలక సభ్యత్వ వాలంటీర్ వినోద్, కృష్ణకు ధన్యవాదాలు తెలిపారు.

ఇరుకు దారితో ఇక్కట్లు

నందవరం(ఎమ్మిగనూరు గ్రామీణం), న్యూస్‌టుడే: నందవరం నుంచి గద్వాలకు వెళ్లే రహదారి ఇరుకుగా ఉంది. ఈ రహదారిలో తరచూ వాహనాలు ఇరుక్కొని ట్రాఫిక్ స్తంభించడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. సోమవారం ఎమ్మిగనూరు, గద్వాల డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా వెళ్తూ ఇరుక్కున్నాయి. దీంతో కొద్ది సేపు బస్సులు ముందుకు వెళ్లకుండా నిలిచిపోయాయి. భారీ వాహనాలు ఎదురుపడితే ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

లాభసాటి వ్యవసాయమే ధ్యేయం

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని జిల్లా వ్యవసాయాధికారిణి పీఎల్ వరలక్ష్మీ అన్నారు. సోమవారం మండలంలోని నాగలాపురం, బూడిదపాడు గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె

రైతులకు పంచసూత్రాలపై అవగాహన కల్పించి కరపత్రాలను అందజేస్తున్న వరలక్ష్మీ

మాట్లాడుతూ.. రానున్న ఐదేళ్లలో రైతును రాజును చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న పంచ సూత్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి దస్తగిరి రెడ్డి, తెదేపా మండల అధ్యక్షులు జె.సురేష్, సర్పంచి పార్వతమ్మ, వ్యవసాయాధికారులు ఫర్హాన, భరత్, నాగ వాసవి పాల్గొన్నారు.

నేడు దీపోత్సవం ముగింపు కార్యక్రమం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కార్తి దీపోత్సవం ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు శ్రీ నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త మాచాని నాగరాజు నీల మురళీధర్ తెలిపారు.

కనిపించని ఉద్యానవనాలు

☛ కబ్జాకు గురవుతున్న స్థలాలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఖాళీ స్థలాల్లో పచ్చదనం పెంచి.. రక్షణ కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఖాళీ స్థలాల్లో పచ్చదనంతో పాటు పార్కుల అభివృద్ధిపై అలసత్వం వహిస్తున్నారు. రూ.కోట్ల విలువైన స్థలాలపై అధికారులు తూతూ మంత్రంగానే చర్యలు చేపట్టి మమ అనిపిస్తున్నారు.

పట్టణంలో 16 ఖాళీ ప్రదేశాలు

◆ పట్టణంలో టీచర్స్‌కాలనీ సమీపంలో రెండు చోట్ల ఖాళీ స్థలాలకు ప్రహరీ నిర్మించారు. లోపల కనీసం మొక్కలు పెంచలేదు. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతోంది.

◆ అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో దాదాపు ఎకరంలో పార్కు కోసం స్థలం వదిలారు. శిల్పా, సాయినగర్, మిలటరీ కాలనీ, వెంకటాపురం, క్లబ్ ఏరియా, వెంకటసాయి, కొత్త



టీచర్స్ కాలనీలో ఉన్న ఖాళీ స్థలం

ఇందిరానగర్ కాలనీలో దాదాపు 22వేల మంది జనాభా నివసిస్తున్నారు. పిల్లలు ఆడేందుకు ఎలాంటి వసతులు కల్పించడం లేదు.

◆ కొత్త ఇందిరానగర్ కాలనీలో దాదాపు అర ఎకరం స్థలంలో మున్సిపల్ ఖాళీ స్థలానికి దాదాపు రూ.10లక్షలతో ప్రహరీ సగం నిర్మించి వదిలేశారు. ఇక్కడ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొంత ఆక్రమణలు చేశారు.

◆ ఎస్సీకాలనీలో ఉసేనప్ప కొట్టాలలో దాదాపు ఎకరంపైగానే ఖాళీ స్థలం ఉంది. పదివేల మంది జనాభా నివసిస్తున్నారు. పార్కులకు వెళ్లాలంటే మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే మాచాని సోమప్ప పార్కుకు వెళ్లాల్సిన పరిస్థితి.

◆ ఎస్ఎంటీ కాలనీలో ఖాళీ స్థలం ఉన్నా అక్కడ ప్రహరీ నిర్మించలేదు. అయితే కొందరు ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నించగా అధికారులు చర్యలు చేపట్టారు. వీటికి చుట్టూ రక్షణగా ప్రహరీ నిర్మించక వదిలేశారు. ఈ కాలనీ ప్రాంతంలో అసలు పార్కు వసతి లేదు.

◆ మిలటరి కాలనీలో దాదాపు ఎకరన్నర ఖాళీ స్థలం వదిలారు. పునాదుల తవ్వి వదిలేశారు. ప్రహరీ లేకపోవడంతో కొందరి కన్ను పడింది. పార్కుల కోసం అదనంగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

(c) eenadu

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

పరిశ్రమల ఏర్పాటుకు ఆటంకాలు తొలగించాలి

ఓర్వకల్లు న్యూస్‌టుడే: ఓర్వకల్లులో పరిశ్రమల ఏర్పాటుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని జేసీ నూరుల్ ఖమర్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. పూడిచెర్ల, హుసేనాపురం గ్రామాలను సోమవారం ఆయన సందర్శించారు. పూడిచెర్లలో పరిశ్రమలకు నీటి సౌకర్యం కల్పించే పైపులైన్ పనులు చూశారు. బాధిత రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హుసేనాపురం గ్రామంలో రిలయన్స్ పరిశ్రమకు వెళ్లాల్సిన రహదారిని పరిశీలించారు. కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్, ఏపీఐఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

హుసేనాపురంలో రహదారిని పరిశీలిస్తున్న జేసీ నూరుల్ ఖమర్

జీజీహెచ్‌కు రూ.41 లక్షలు ఇవ్వడం హర్షణీయం

కర్నూలు వైద్యాలయం: సర్వజన వైద్యశాలలోని పేయింగ్ బ్లాక్‌కు గదుల నిర్మాణానికి టీజీవీ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ నిధుల కింద రూ.41 లక్షలు కేటాయించడం హర్షణీయమని ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఇందుకుగాను మంత్రి టీజీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నూతన గదులను వీవీపీలకు వైద్య సేవలు అందించేందుకు వినియోగిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణ : 85010 05408, ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : **?** : ఎ.క్యాంపు, చాణిక్యపురి కాలనీల్లో మురుగు కాలువలను సరిగా శుభ్రం చేయడం లేదు. **- వినయ్**

? : జొహరాపురంలో దోమల బెడద తీవ్రంగా ఉంది. నియంత్రణ చర్యలు చేపట్టాలి. **- స్థానికులు**

✔: కాలువలను శుభ్రం చేయిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేస్తాం. **- నగరపాలక అధికారులు**

ఉపన్యసించారు.. విజేతలుగా నిలిచారు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ఉపన్యాస పోటీల్లో పాల్గొనడం ద్వారా భావవ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందుతాయని ప్రిన్సిపల్ పద్మావతి పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'డ్రోన్ టెక్నాలజీ' అన్న అంశంపై సోమవారం ఉపన్యాస పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వైష్ణవి, ప్రియాన్సి, గణేశ్వరి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్, అధ్యాపకులు బహుమతులు అందజేశారు.

పోటీలో పాల్గొన్న విద్యార్థిని

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : ఉపన్యాస పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం మెరుగవుతుందని ఆదిత్య విద్యా నిలయం పాఠశాల ప్రిన్సిపల్ బి.వాసుదేవయ్య తెలిపారు. కల్లూరులోని ఆదిత్య విద్యా నిలయంలో సోమవారం 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. ఎస్.అఫ్రా (ఎనిమిదో తరగతి), పి.వంశీ (పదో తరగతి), ఎం.ఆదిత్యరామ్ (తొమ్మిదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

ఉపన్యసిస్తున్న విద్యార్థి

బహుమతులు అందుకున్న విద్యార్థినులతో అధ్యాపకులు

బహుమతులు అందుకుంటున్న విజేతలు

నగరాన్ని ముంచెత్తుతున్న ప్లాస్టిక్

■ అమలుగాని నిషేధం.. విచ్చలవిడిగా వినియోగం

■ కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ప్రవాహానికి చిక్కులు

షరాఫ్ బజార్ సమీపంలో ప్రధాన రహదారి పక్కన చెత్తకుప్పలో ప్లాస్టిక్ కవర్లు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : నగరంలో నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగం రోజురోజుకు పెరిగిపోతోంది. నిషేధం ప్రకటనలకే పరిమితమైంది. నగరపాలక అధికారులు దుకాణాలపై దాడుల మాటే విస్మరించారు. దీంతో వ్యాపారులు కవర్లు, ప్లాస్టిక్ కప్పులు, పేట్లను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. చిల్లర దుకాణాలు, కూరగాయలు, పండ్లు, హోటళ్లు, కర్రీ పాయింట్లు ఇలా ప్రతిచోట ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు. వాడిన తర్వాత వాటిని ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. అవి కాలువల్లో పేరుకుపోయి మురుగు ప్రవాహానికి అడ్డుపడుతున్నాయి. ఫలితంగా ఎక్కడికక్కడ మురుగు నిల్వచేరి నగరంలో తీవ్ర పారిశుద్ధ్య లోపం వేధిస్తోంది.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

కర్నూలు నగరంలోని 52 వార్డుల పరిధిలో సుమారు 6.5 లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారు. ప్రతిరోజు సగటున 400 కిలోల నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులు వినియోగిస్తున్నట్లు అంచనా. వీటిలో కవర్లు, కప్పులు, ప్లాస్టిక్ ప్లేట్లు, ఇతర వస్తువులను ఎక్కువగా వాడుతున్నారు. వేల సంఖ్యలో కిరాణా దుకాణాలు, హోటళ్లు, కూరగాయలు, పండ్లు, మాంసం దుకాణాలు ఉన్నాయి. వీరంతా వినియోగదారులకు నిషేధిత కవర్లలోనే సరకులు ఇస్తున్నారు.

◆ కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, అటవీ, వాతావరణ శాఖ జారీ చేసిన ఆదేశాల మేరకు జులై 2022 నుంచి 18 రకాల ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం అమలులో ఉంది.

◆ నిబంధనలను ఉల్లంఘిస్తే మొదటిసారి జరిమానా, అనంతరం లైసెన్సు రద్దు చేయాల్సి ఉంటుంది. చిరు వ్యాపారులు, దుకాణదారులైతే రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు జరిమానా చెల్లించాలి.

◆ వినియోగదారుడి చేతిలో ప్లాస్టిక్ సంచి కనిపిస్తే రూ.200 నుంచి రూ.500 వరకు జరిమానా విధించాలి. నగరపాలక అధికారులు నామమాత్రపు తనిఖీలకే పరిమితం అవుతున్నారు. జరిమానా విధించడం లేదు. కేసులు కూడా నమోదు చేయడం లేదు.

నగరపాలక కమిషనర్ క్యాంపు కార్యాలయం ముందు కల్వర్టు నుంచి తీసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

నామమాత్రపు దాడులు

ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయం, వినియోగం విపరీతంగా పెరిగినా అధికారులు మొక్కుబడి దాడులకే పరిమితం అవుతున్నారు. తనిఖీలు చేసేక్రమంలో చేతులు తడిపిన వారికి జరిమానాలు వేయడం లేదన్న విమర్శలున్నాయి. శానిటరీ అధికారులు సచివాలయ సిబ్బంది, డివిజన్ల సిబ్బంది కుమ్మక్కై తనిఖీల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో వ్యాపారులు భయం లేకుండా కవర్లను వినియోగిస్తున్నారు.

◆ 2022- 23 ఆర్థిక సంవత్సరంలో నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించిన వారిపై దాడులు జరిపి రూ.7,96,150 జరిమానా విధించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1,97,370 జరిమానా మాత్రమే విధించారు.

కర్నూలు అభివృద్ధికి ప్రజలు సహకరించాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కర్నూలు నగరాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని, ప్రజలు సహకరించాలని పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ కోరారు. నగరంలోని మెడికల్ కళాశాల ముందు దుకాణాలను తొలగించి విస్తరించిన రహదారిని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కిడ్స్ వరల్డ్ నుంచి బుధవారపేట వంతెన వరకు రోడ్డు విస్తరించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఏ, బీ, సీ క్యాంపు క్వార్టర్లలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నగరపాలక కమిషనర్ విశ్వనాథ్, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు మన్సూర్ అలీఖాన్, బొందిలి కార్పొరేషన్ ఛైర్మన్ విక్రమ్‌సింగ్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, మసీదు కమిటీ సభ్యులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్

కులమతాలకు అతీతంగా అభివృద్ధి

కర్నూలు సచివాలయం: కర్నూలు నగరంలో కుల మతాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. గడియారం ఆసుపత్రి సమీపంలోని ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ ఉర్దూ వసతిగృహాలకు మహమ్మదీయ వక్ఫ్ కాంప్లెక్సు కేర్ టేకర్ కమిటీ ఆధ్వర్యంలో మంత్రి చేతులమీదుగా రెండు ఫ్రిజ్‌లు, కుర్చీలు, ప్లేట్లను అందించారు. జామియా మసీదుకు రెండు ఫ్రీజర్ బాక్సులను అందజేశారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

చిన్నటేకూరు (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. కల్లూరు మండల పరిధి చిన్నటేకూరు గ్రామంలో సోమవారం 'రైతన్నా.. మీ కోసం' నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీడీవో జీఎన్‌ఎస్‌రెడ్డి, ఏడీఏ సాలురెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణతో సామాజిక చైతన్యం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : ఎన్‌సీసీ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో సామాజిక చైతన్యం, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇందిరాశాంతి పేర్కొన్నారు. ఎన్‌సీసీ డే వేడుకల ముగింపు సందర్భంగా సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ శశికుమార్ ఎన్‌సీసీ అధికారి డా.ఆర్.కె.నాయక్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.

సైకిల్ ర్యాలీలో ఎన్‌సీసీ విద్యార్థులు

కర్నూలు బి.క్యాంపు : ఎన్‌సీసీ విద్యార్థులు సేవాభావంతో ముందుకు సాగాలని సిల్వర్‌జూబ్లీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డా.నాగరాజ్‌శెట్టి సూచించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఎన్‌సీసీ విద్యార్థులు రక్తదాన శిబిరం నిర్వహించారు.

గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డా.సిరి, అధికారులు

శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దత్తత అవగాహన కార్యక్రమాలు- 2025కు సంబంధించిన గోడపత్రాలను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. నవంబరు నెలను ప్రపంచ వ్యాప్తంగా దత్తత గుర్తింపు మాసంగా పాటిస్తున్న నేపథ్యంలో జిల్లాలో దత్తతపై అవగాహన మెరుగుపరచాలన్నారు. కార్యక్రమంలో జేసీ నూరుల్ ఖమర్, ఐసీడీఎస్ పీడీ విజయ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

లింగ సమానత్వం సాధనకు కృషి చేద్దాం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : సమాజంలో లింగ సమానత్వాన్ని సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ డా.ఎ.సిరి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో లింగ సమానత్వంపై నిర్వహించనున్న ప్రచార కార్యక్రమానికి సబంధించిన గోడపత్రాలను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. నయీ చేతన 4.0 ప్రచారాన్ని కేంద్ర వ్యవసాయ మంత్రి ఈనెల 25న దిల్లీలో ప్రారంభిస్తారని తెలిపారు. వర్చువల్‌గా జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ, స్థాయి సంఘ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో జేసీ నూరుల్ ఖమర్, డీఆర్డీఏ పీడీ రమణారెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారికి స్థిరమైన కుటుంబం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : దత్తత ద్వారా ప్రతి చిన్నారికి ప్రేమతో కూడిన స్థిరమైన కుటుంబాన్ని కల్పించాలని కలెక్టర్ డా.ఎ.సిరి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మహిళా,

పీఎంఏవై గ్రామీణ్ సర్వే వేగవంతం చేయాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ పథకం కింద మంజూరైన ఇళ్లకు సంబంధించిన సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ డా.ఎ.సిరి అధికారులను ఆదేశించారు. కర్నూలు కలెక్టరేట్ నుంచి సోమవారం ఆమె స్వామిత్వ సర్వే, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, చెరువుల్లో నీటిని నింపడం, రెవెన్యూ, హౌసింగ్ తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, డివిజన్, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. జిల్లాలోని ఇళ్లు లేని నిరుపేదలు ఈనెల 30వ తేదీలోగా గ్రామ సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. సర్వే సరిగా జరగలేదని ఒక ఫిర్యాదు వచ్చినా బాధ్యులైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సులో జేసీ నూరుల్ ఖమర్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, డీఎంహెచ్‌వో డా.భాస్కర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రగ్బీ విజేత కర్నూలు బాలుర జట్టు

పతకాలతో కర్నూలు బాలుర జట్టు క్రీడాకారులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నగర శివారులోని ఆదర్శ విద్యా మందిరం మైదానంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 బాల, బాలికల రగ్బీ పోటీలు సోమవారం ముగిశాయి. బాలుర విభాగంలో జరిగిన తుది పోరులో కర్నూలు జట్టు, నెల్లూరుపై గెలిచి టైటిల్ సాధించింది. బాలికల విభాగంలో తూర్పుగోదావరి జట్టు అనంతపురంపై గెలిచి టైటిల్ సొంతం చేసుకుంది. కర్నూలు జట్టు మూడో స్థానంలో నిలిచింది. గెలుపొందిన జట్లకు ఆదర్శ విద్యా సంస్థల డైరెక్టర్ డా.హరికిషన్ ట్రోఫీలు, పతకాలు అందజేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో గెలుపు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : మచిలీపట్నంలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-14 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో కర్నూలు బాలుర జట్టు విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్టును డీఈవో శామ్యూల్‌పాల్, కార్యదర్శి టి.కృష్ణ, మహిళా కార్యదర్శి నాగేశ్వరి అభినందించారు.

పత్తి కొనుగోలు కేంద్రాల తనిఖీ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కోడుమూరు, ఎమ్మిగనూరు ప్రాంతాల్లోని పత్తి కొనుగోలు కేంద్రాలను తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎండీ గౌస్ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వ్యాపారులు వినియోగిస్తున్న తూనిక యంత్రాలను తనిఖీ చేశారు. కొందరు వ్యాపారులు స్టాంపింగ్ గుడువు దాటిన తూనిక యంత్రాలు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. రెండు కేసులు నమోదు చేసి, రూ.35 వేల జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ ఎస్ఎండీ గౌస్ వెల్లడించారు.

దేవగుడి చిత్ర బృందం సందడి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : నగర శివారులోని పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలో దేవగుడి చిత్ర బృందం సోమవారం సందడి చేసింది. హీరో అభినవ్‌శౌర్య, హీరోయిన్ అనుశ్రీ, దర్శక, నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి విద్యార్థుల సమక్షంలో తమ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు.

చిత్ర బృందంతో హీరో హీరోయిన్లు అభినవ్‌శౌర్య, అనుశ్రీ

సమస్యలు పరిష్కరించాలంటూ పోరాట దీక్ష

పోరాట దీక్షలో పాల్గొన్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న ఉద్యోగులకు హెచ్.ఆర్ పాలసీ అమలు చేయాలని ఏపీ సమగ్ర శిక్షా ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సమాఖ్య ఐకాస రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్‌రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కర్నూలు జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద పోరాట దీక్ష చేపట్టారు. అనంతరం ఉద్యోగుల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు, జిల్లా విద్యాశాఖాధికారికి అందజేశారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోండి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : మహిళా మార్ట్ మూసివేతకు కారణమైన అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని మెప్మా ఆర్పీలు డిమాండ్ చేశారు. మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమాలు సోమవారం మూడోరోజూ కొనసాగాయి. ఈ కార్యక్రమానికి సీఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడారు. మార్ట్ ఏర్పాటు కోసం పొదుపు సంఘాల సభ్యులు కట్టిన డబ్బును తిరిగి చెల్లించాలని కోరారు. లేదంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మెప్మా ఆర్పీ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రుద్రమ్మ, ఉమాదేవి, కోశాధికారి సుజాత ప్రసాద్, నాయకులు కన్యక, మహాలక్ష్మి, జ్యోతి, పర్వీన్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మెప్మా ఆర్పీలు

శిరస్త్రాణంతో ప్రాణాలకు రక్షణ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరిస్తే ప్రాణాలకు రక్షణ ఉంటుందని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సూచించారు. స్థానిక పోలీసు కార్యాలయం సోమవారం పోలీసులు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ శిరస్త్రాణం ధరించి బైకు నడిపి వాహనదారులకు అవగాహన కల్పించారు. ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణమోహన్, కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్, సీఐలు మన్సూరుద్దీన్, విక్రమ్‌సింహ, తేజోమూర్తి, చంద్రబాబునాయుడు, మధుసూదరావు, పార్థసారథి పాల్గొన్నారు.

నేతలకు భూములు కట్టబెట్టేందుకు కుట్ర

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : దళితుల పొలాలను రికార్డుల్లో ప్రభుత్వ భూములు మార్చి రాజకీయ నాయకులకు కట్టబెట్టేందుకు అధికారులు కుట్ర పన్నుతున్నారని జొహరాపురం గ్రామ దళితులు పెద్దస్వామి, గుర్రం రవి తదితరులు ఆరోపించారు. తహసీల్దారు కార్యాలయంలో భూ రికార్డులను ఇష్టానుసారం మారుస్తున్నారని ఆరోపిస్తూ కర్నూలు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా నాయకులు సుమలత, తదితరులు పాల్గొన్నారు.

గుండ్రేవుల జలాశయం నిర్మించాలని డిమాండు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : జిల్లా ప్రజల తాగునీరు, సాగునీటి అవసరాలు తీర్చే గుండ్రేవుల ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేయాలని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీహర్ష కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. గుండ్రేవుల ప్రాజెక్టును నిర్మించాలని కోరుతూ రాజ్ విహార్ సెంటర్ నుంచి ధర్నాచౌక్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జల సమర దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోందన్నారు. గుండ్రేవుల జలాశయం నిర్మాణం పూర్తయితేనే రైతులకు మేలు జరుగుతుందన్నారు.

దీక్షలో పాల్గొన్న శ్రీహర్ష, జిల్లా రైతులు

రజక వృత్తిదారులకు సాయం అందించాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : రజక వృత్తిదారులకు శిక్షణ ఇచ్చి, ఆర్థిక సాయం అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖర్ కోరారు. విశ్వకర్మ కౌశల్ యోజన పథకం కింద అంతర్జాలంలో దరఖాస్తు చేసుకున్న వారికి పరికరాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం ఏపీ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గూడూరు పట్టణానికి చెందిన 200 మంది రజకులు 2023లో విశ్వకర్మ కౌశల్ యోజన పథకం కింద దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. రెండేళ్లయినా వారికి శిక్షణ ఇవ్వలేదన్నారు. శిక్షణ ఇప్పించడంతో పాటు బ్యాంకు రుణాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

చిరుధాన్యాల ఆహారంతో రోగాలు దూరం

ఓర్వకల్లు న్యూస్‌టుడే: ప్రతిరోజూ చిరుధాన్యాలు వాడకంతో రోగాలు దరి చేరవని, సంపూర్ణ ఆరోగ్యం పొందొచ్చని పద్మశ్రీ, కృషిరత్న డాక్టర్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. ఓర్వకల్లులోని పొదుపు భవనంలో ఓంప్లిస్ గౌరవ సలహాదారురాలు విజయభారతి ఆధ్వర్యంలో సోమవారం చిరుధాన్యాల వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొర్రలు, అండ్రు కొర్రలు, సామెలు, అరికెలు, తదితర వాటిని ఉపయోగించి చాలా జబ్బులను దూరం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులు, పొదుపు మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అన్నాతమ్ముడు.. తైక్వాండోలో దూకుడు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : ఆత్మ రక్షణ కోసం నేర్చుకున్న తైక్వాండో క్రీడను గెలుపు బాటగా మార్చుకున్నారు అన్నదమ్ములు కార్తీక్, కమలేశ్వర్. నాలుగేళ్లుగా సాధన చేస్తూ ఆటలో మెలకువలు నేర్చుకున్నారు. పోటీల్లో ప్రత్యర్థులను చిత్తు చేస్తూ విజేతలుగా నిలుస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన పలు పోటీల్లో సత్తా చాటి పతకాలు అందుకున్నారు.

కార్తీక్.. గెలుపు కిక్

నగరంలోని బంగారుపేటకు చెందిన మహేశ్వరి, కౌలుట్లయ్య దంపతుల కుమారుడు బి.కార్తీక్. ప్రభుత్వ టౌన్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. తైక్వాండో క్రీడను ఆసక్తితో నేర్చుకుని పోటీల్లో రాణిస్తున్నాడు. ● 2024 జూన్ 30న నంద్యాలలో జరిగిన అసోసియేషన్ జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో స్వర్ణం పతకం సాధించాడు. ● 2025 జూన్‌లో కర్నూలులో నిర్వహించిన అసోసియేషన్ జిల్లాస్థాయి పోటీల్లో స్వర్ణం గెలుపొందాడు. ● 2024 అక్టోబరులో తిరుపతిలోని శ్రీనివాస కాంప్లెక్స్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-14 రాష్ట్రస్థాయి పోటీల్లో రజత పతకం అందుకున్నాడు. ● 2025 జూన్‌లో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన అసోసియేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణం సాధించాడు. ● ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలీలో నిర్వహించిన అసోసియేషన్ జాతీయస్థాయి పోటీల్లో 45 కిలోల విభాగంలో రజత పతకం గెలుపొందాడు.

కమలేశ్వర్.. జోర్దార్

గాంధీనగర్ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బి.కమలేశ్వర్ అన్న స్ఫూర్తితో తైక్వాండో నేర్చుకున్నాడు. ● 2023 ఫిబ్రవరిలో కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో 38 కిలోల క్యాడెట్ విభాగంలో స్వర్ణ పతకం గెలుపొందాడు. ● 2023 అక్టోబరులో విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రజతం గెలుపొందాడు. ● 2024 జూన్‌లో నంద్యాల పట్టణంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో రజత పతకం అందుకున్నాడు. ● 2024 ఆగస్టులో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్యం అందుకున్నాడు. ● 2025 జూన్‌లో కర్నూలు నగరంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో స్వర్ణం, తాడిపత్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్యం సాధించాడు.

ఏఆర్ కానిస్టేబుల్ భుజంలోకి దూసుకెళ్లిన తూటా

అంబర్‌పేట, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని అంబర్‌పేట సెంట్రల్ పోలీస్ లైన్స్ (సీపీఎల్)లో తుపాకీ మిస్ ఫైర్ అయిన ఘటనలో ఏపీ స్పెషల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ (ఎస్ఏఆర్) కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. కాచిగూడ ఏసీపీ హరీష్‌కుమార్ వివరాల ప్రకారం...ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్‌కు చెందిన గోవర్ధన్‌రెడ్డి (39) అంబర్‌పేట సీపీఎల్‌లో ఎస్ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి అతను సెంట్రీగార్డు డ్యూటీ కోసం వచ్చారు. 12.10 గంటల సమయంలో ఎస్ఎల్ఆర్ తుపాకీ రౌండ్లను పరిశీలిస్తుండగా మిస్ ఫైర్ అయింది. ఒక బుల్లెట్ గాల్లోకి దూసుకెళ్లగా రెండోది అతని ఎడమ భుజంలోకి దూసుకెళ్లడంతో గాయపడ్డారు. అతన్ని చికిత్స నిమిత్తం నాంపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి నిలకడగా ఉందని ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

వాహన డ్రైవర్ అదృశ్యంపై ఫిర్యాదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని దేవనగర్‌కు చెందిన సుంకన్న అలియాస్ రాజు (39) అదృశ్యమయ్యారని పోలీసులు తెలిపారు. ఈయన వాహన డ్రైవర్‌గా పనిచేసేవారు. భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయారు. ఈ క్రమంలో ఈనెల 1వ తేదీన తన భార్య పిల్లలను చూసి వస్తానని ఇంటి నుంచి బయల్దేరి శిరివెళ్ల మండలం వెళ్లిన ఈయన తర్వాత కనిపించకుండాపోయారు. పలుచోట్ల గాలించినా జాడ తెలియకపోవడంతో తండ్రి సాగర్ కర్నూలు మూడో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రారంభోత్సవ శుభాకాంక్షలు

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda బ్యాంక్ ఆఫ్ బరోడా ఉలిందకొండ బ్రాంచ్

శ్రీ పి.అరుణ్‌కుమార్ గారు బ్రాంచ్ మేనేజర్, ఉలిందకొండ

బ్యాంకింగ్ రంగంలో ప్రత్యేక శైలితో నూతన విధి విధానాలతో ప్రత్యేకతనుచాటుకున్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఉలిందకొండ బ్రాంచ్ ఖాతాదారులకు మెరుగైనా సేవలు అందిస్తూ.. నూతన భవనంలోకి వెళుతున్న శుభసందర్భంగా బ్యాంక్ మేనేజర్ శ్రీ పి.అరుణ్‌కుమార్ గారికి మరియు సిబ్బందికి మా శుభాకాంక్షలు.

నూతన భవనం ప్రారంభం తేది 25-11-2025 మంగళవారం

ఇ.వి.రమణ, ఛైర్మన్, ఉలిందకొండ PACS ఇ.శ్రీకాంత్, ఉలిందకొండ.

శ్రీలక్ష్మి శ్రీనివాస RCC పోల్స్, ఉలిందకొండ.

సంబు ప్రసాద్, (B.C. Point) బిజినెస్ కరస్పాండెంట్, ఉలిందకొండ.

వి.శివరాంప్రసాద్ బిల్డింగ్ ఓనర్, ఉలిందకొండ.

కె.చంద్రశేఖర్ రెడ్డి వైస్ MPP, కల్లూరు మం॥, నాయకల్లు గ్రామం.

(c) eenadu

అత్యవసరం.. ప్రయోజనం

■ జీజీహెచ్‌లో క్రిటికల్ కేర్

రూ.20 కోట్ల కేటాయింపు

నంద్యాల పాత పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల సర్వజన ఆస్పత్రి అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పీఎం-అభిమ్ పథకం కింద 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. జీజీహెచ్. . బోధనాస్పత్రిగా మారినప్పటికీ అవసరమైన సౌకర్యాలు లేకపోవడంతో రోగులు అత్యవసర వైద్యం కోసం కర్నూలు వెళ్లేవారు. ఈ క్రమంలో నిధులు మంజూరు చేయడంతో శరవేగంగా పనులు చేపట్టేలా అధికారులు చర్యలు తీసకుంటున్నారు.

● నంద్యాల సర్వజన ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గత నెలలో శంకుస్థాపన చేశారు. భవనాల నిర్మాణానికి రూ.12.50 కోట్లు, వైద్య పరికరాలకు రూ.7.12 కోట్లకుపైగా నిధులు కేటాయించారు. వచ్చే ఏడాది జూన్ నాటికి అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రణాళికలు రూపొందించారు.

● క్రిటికల్ కేర్ బ్లాక్‌లోని కింది అంతస్తులో ఎమర్జెన్సీ వార్డు ఏర్పాటు చేస్తారు. ప్రత్యేకంగా పడకలు కేటాయించారు. దీంతోపాటు ట్రియాజ్, మైనర్ ఓటీ, ఐసోలేషన్ గదులు, ఎక్స్‌రే గది, ఫార్మసీ, ల్యాబ్, మెటర్నరీ వార్డు తదితరాలుంటాయి. అత్యవసర చికిత్స నిమిత్తం వచ్చే రోగులకు కావాల్సిన వైద్య సదుపాయాలన్నీ ఈ బ్లాక్‌లోనే ఉంటాయి.

మొదటి, రెండు అంతస్తుల్లో..

● మొదటి అంతస్తులో ఏర్పాటుచేసే ఐసోలేషన్ వార్డులో 12 పడకలు, ఐసీయూ, డయాలసిస్ వార్డు, వైద్యులు, నర్సులు, సిబ్బంది గదులుంటాయి. రెండో అంతస్తులో శస్త్రచికిత్సల గదులు, ఐసీయూ, ఎన్ఐసీయూ, జనరల్ వార్డు, స్టోర్‌గది తదితరాలు అందుబాటులోకి రానున్నాయి.

● "క్రిటికల్ కేర్ బ్లాక్‌లో అన్ని వసతులు అందుబాటులో ఉంటాయి. అత్యవసర సమయంలో రోగిని రెఫర్ చేయకుండా ఇక్కడే మెరుగైన వైద్యం అందించొచ్చు. రోగులకు సకాలంలో చికిత్స చేయడం ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి" అని సూపరింటెండెంట్ మల్లీశ్వరి పేర్కొన్నారు.

ప్లాట్‌ఫాంపై పాట్లు

గుంతకల్లు నుంచి గుత్తికి వెళ్లే డెమూ రైలు సోమవారం మధ్యాహ్నం డోన్ రైల్వే స్టేషన్‌లో నాలుగో నంబరు ప్లాట్‌ఫాంలో నిలపడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. రోజూ 2 లేదా 3వ ప్లాట్‌ఫాంలో నిలిపేవారు. రోజువారీగా ఆ ప్లాట్‌ఫాంలోనే నిలుపుతారనే ఉద్దేశంతో ప్రయాణికులు రైలు కోసం ఎదురుచూశారు. నాలుగో ప్లాట్‌ఫాంలో నిలపడంతో ప్రయాణికులు అవస్థలు పడుతూ రైలెక్కారు. – న్యూస్‌టుడే, డోన్ పట్టణం

కార్యదర్శుల కాసుల రాతలు

●వార్డు ప్లానింగ్ కార్యదర్శుల దందా

పురపాలికల్లో వార్డు ప్లానింగ్ కార్యదర్శులు 'కాసు'క్కూర్చున్నారు. గత వైకాపా సర్కారు హయాంలో వార్డు ప్లానింగ్ కార్యదర్శులను నియమించారు. వీరు ఆయా వార్డుల్లో కొత్త ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇప్పించడం, ప్రజా ఫిర్యాదులు, దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి. కొందరు వార్డుల ప్రగతి పర్యవేక్షణను పక్కనపెట్టి వసూళ్ల బాట పడుతున్నారు. ఇతరుల లాగిన్ ఐడీలతో సొంత ప్రణాళిక (ప్లాన్) అమలు చేస్తున్నారు. ఆదోని పురపాలక సంఘం పరిధిలో కొందరు వార్డు ప్లానింగ్ కార్యదర్శులపై వచ్చిన ఫిర్యాదులే ఇందుకు నిదర్శనం.

– న్యూస్‌టుడే, కర్నూలు, నంద్యాల పురపాలక బృందం

	నంద్యాల	కర్నూలు
మున్సిపాలిటీలు	5	4
కార్యదర్శుల పోస్టులు	101	205
ప్రస్తుతం ఉన్నవారు	69	101

దరఖాస్తులు	నంద్యాల	కర్నూలు
వచ్చినవి	802	715
ఆమోదం	645	458
పెండింగ్	157	257

ఎల్టీపీల అవతారమెత్తారు

● పురపాలికల్లో లైసెన్సుడు టెక్నికల్ పర్సన్ (ఎల్టీపీ)లు ఉంటారు. వీరు మున్సిపాలిటీ, కుడా నుంచి లైసెన్సు తీసుకొంటారు. ఇళ్ల నిర్మాణ ప్రణాళిక రూపొందించడం.. ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయడం వంటివి చేస్తుంటారు. వీరికి ఏ మున్సిపాలిటీలోనైనా ప్లాన్లు గీసే అవకాశం ఉంది.

● భవన నిర్మాణాన్ని బట్టి రూ.5 వేలు మొదలు రూ.20 వేల వరకు రుసుం తీసుకుంటారు. వీరు అంతర్జాలంలో నమోదు చేసిన దరఖాస్తులు ఆయా వార్డు సచివాలయాలకు చేరుతాయి. వాటిని ప్లానింగ్ కార్యదర్శులు డౌన్‌లోడ్ చేసుకొని క్షేత్రస్థాయిలో పరిశీలించాలి.

● ప్లానింగ్ కార్యదర్శులే ఎల్టీపీల అవతారం ఎత్తారు. ఇతరుల వ్యక్తిగత లాగిన్, పాస్‌వర్డ్‌లు తీసుకొని వాటి ద్వారా సొంతంగా ప్లాన్లు వేసి పైఅధికారుల ఆమోదానికి సిఫార్సు చేస్తున్నారు. బినామీ పేర్లతో ఎల్టీపీల అవతారమెత్తి దందా చేస్తున్నారు. వారూ కళ్లు మూసుకొని ఆమోదించేస్తున్నారు.

ప్యాకేజీలుగా ఒప్పందం

● ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థతోపాటు ఎనిమిది పురపాలక సంఘాలు, నగర పంచాయతీలున్నాయి. ఆయా పట్టణాల్లో భవన అనుమతులకు సంబంధించి పక్కాగా పత్రాలు సమర్పించి అందుకనుగుణంగా నిర్మాణాలు జరిగేలా వార్డు ప్లానింగ్ కార్యదర్శులు పర్యవేక్షించాలి.

● నిర్మాణ ప్లానింగ్ మొదలు అనుమతుల వరకు అన్నీ మేమే చూసుకొంటాం.. ఎవరికి ఇవ్వాల్సిన వాటాలు వారికిచ్చి మీ పనులు చేస్తామని ప్యాకేజీలుగా ఒప్పందాలు చేసుకొంటున్నారు. వీఎల్‌టీ, ప్లాన్ అనుమతులు, ఇంటి పన్ను, నీటి పన్ను వేసేంత వరకు ఒక ప్యాకేజీగా రూపొందించి ఇంటి యజమానుల వద్ద భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. భవనాలకు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు, బహుళ అంతస్తులకు రూ.4-5 లక్షలు డిమాండ్ చేస్తున్నారు.

● గతంలో 300 చ.మీ. లోపు నిర్మాణాలకు మాత్రమే పురపాలికలకు అనుమతిచ్చేందుకు అర్హతలుండేవి. అంతకు మించితే కుడా అనుమతి కావాలి. ఈ నిబంధనను 'కూటమి' సర్కారు సవరించింది. ఎంత విస్తీర్ణంలో నిర్మించిన భవనమైనా స్థానికంగానే అనుమతులివ్వొచ్చని ఉత్తర్వులిచ్చింది. ఇది వీరికి మరింత కలిసొచ్చింది.

● బీపీఎస్ పథకంలో భాగంగా గడువు దాటిన ఇళ్లను పాత తేదీలో చూపి ఆమోదించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

రైతుకు కట్టకట

బనకచర్ల వద్ద కాల్వ పూడ్చేయడంతో ఎత్తుగా కనిపిస్తున్న మట్టి కట్ట

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్ద నీటి నియంత్రణ అస్తవ్యస్తంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో కుందూ నదిలో వరద ఉద్ధృతి చూపి ఆ మేరకు నిధులు మంజూరు చేసుకునే ప్రణాళికలు రూపొందించారు.

బనకచర్ల క్రాస్ వద్ద మూడు రెగ్యులేటర్లు ఉన్నాయి. గతంలో 11 వేల క్యూసెక్కుల నీటిని తీసుకునేందుకు వీలుగా దీని నిర్మాణం జరిగింది. ఇందులో ఆరు వేల క్యూసెక్కులు తెలుగుగంగకు, 5 వేల క్యూసెక్కుల నీటిని ఎస్సార్బీసీకి తీసుకెళ్లేవారు. ఆ తర్వాత పోతిరెడ్డిపాడు నుంచి 44 వేల క్యూసెక్కుల నీటిని తీసుకునే అవకాశం లభించింది. ఈ నేపథ్యంలో ఎస్సార్బీసీ నుంచి 22 వేల క్యూసెక్కులు తీసుకొనేలా పాత రెగ్యులేటర్ స్థానంలో కొత్తది నిర్మించారు. ఆఘమేఘాలపై ఎలాంటి జీవో లేకుండానే కాల్వ పూడ్చేశారు. రైతులను ముంచేశారు.

గుట్టుచప్పుడు కాకుండా..

పాత రెగ్యులేటర్ నుంచి కొత్త రెగ్యులేటర్ మధ్యనున్న 250 మీటర్ల కాల్వను గుట్టుచప్పుడు కాకుండా 2022లో పూడ్చేశారు. ఇక్కడే కేసీ (కర్నూలు కడప) కాలువ కూడా పారుతుంది. లాక్‌ఇన్‌సాల దగ్గరే కేసీ కాలువకు నీళ్లు ఇస్తూ మిగతా దానిని నిప్పుల వాగులోకి పోస్తారు. సంతజూటూరు దగ్గర కూడా కొంత నీరిచ్చి.. మిగతా నీటిని కుందూలోకి పంపుతారు. ఇక్కడే గాలేరు నది నుంచి వచ్చిన నీరు కూడా కలిసి కుందూలో కలుస్తుంది. లాక్‌ఇన్‌సాల దగ్గర నీళ్లు పారే ప్రాంతంలో గతంలో కట్టిన ఎస్సార్బీసీ అక్విడేట్‌ను దిగువ ప్రాంతంలో పూడ్చేశారు. నీటి నియంత్రణ అనేది లేకుండా వచ్చిన నీటిని వచ్చినట్లే నిప్పుల వాగుకు తరలించారు. ఇదంతా గత మూడేళ్లుగా జరుగుతోంది. ఈ కాల్వను పూడ్చేందుకు ప్రత్యేకంగా నిధులు విడుదల కాలేదు. అంతా అనధికారికంగానే జరిగింది. గతంలో జలవనరుల శాఖలో కీలకంగా వ్యవహరించిన ఒకరి కనుసన్నల్లోనే జరిగిందన్న ప్రచారం జరుగుతోంది.

కుందూలో వరద చూపాలనే..

కుందూ నది ద్వారా వరద నీటిని తీసుకుపోయేలా నాటి ప్రభుత్వ హయాంలో ఆధునికీకరణకు చర్యలు తీసుకున్నారు. పోతిరెడ్డిపాడు నుంచి 80 వేల క్యూసెక్కుల నీటిని తరలించేలా ప్రణాళిక చేశారు. కానీ 44 వేల క్యూసెక్కులు తీసుకెళ్లడమే కనాకష్టంగా మారింది. ఇలాంటి సమయంలో కుందూ ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఈ క్రమంలోనే కుందూకు పెద్దఎత్తున వరద వస్తుందనే భావన తెప్పించేందుకు ఒకవైపు పూడ్చివేత, మరోవైపు పెద్దఎత్తున వరదను మళ్లించే ప్రయత్నాలు చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. కొందరు అస్మదీయ గుత్తేదారులకు లబ్ధి చేకూర్చేందుకే ఇలా చేశారన్న ఆరోపణలున్నాయి.

పంటల మునక

లాక్‌ఇన్‌సాల నుంచి నిప్పుల వాగుకు ఒక్కసారిగా నీళ్లు వచ్చి పడుతుండటంతో కుందూ పరివాహక ప్రాంతంలో తరచూ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వేల్పనూరు, వాడాల, బండిఆత్మకూరు, నంద్యాల, కోవెలకుంట్ల, మద్దూరు, తొగర్చేడు తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున పంటలు కుందూ వరదలో మునిగిపోతున్నాయి. ఆగస్టు నుంచి అక్టోబరు వరకు ఈ వరద గత మూడేళ్లుగా ఉంటోంది. ఫలితంగా రైతులు సాగు చేసిన వరి, మిరప పంటలు దెబ్బతింటున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

పచ్చని సీతాకోకచిలుకలు

ఇవి మొక్కల ఆకులు కావండోయ్.. 'పచ్చని' సీతాకోకచిలుకలు. మహానంది నుంచి బోయల కుంట్ల మెట్టకు వెళ్లే దారిలో ఫారం వద్ద నల్లమల అడవి ప్రాంతంలో సందడి చేస్తున్నారు. ప్రధాన రహదారి పక్కనే పాలేరు వాగు ఒడ్డున గుంపులుగా తిరుగుతున్నాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులను కనువిందు చేస్తున్నాయి. దూరం నుంచి ఆకుల మాదిరిగా కనిపిస్తున్నాయి. దగ్గరికి వెళ్తే ఝుమ్మంటూ ఎగిరిపోతున్నాయి.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

ఉచితం.. ధర అనుచితం

■ అధిక ధర ఖరారుపై వివాదం ■ ఆమోదిస్తే ప్రజలకు భారమే

ఈనాడు, నంద్యాల, డోన్, న్యూస్‌టుడే : వ్యక్తిగత అవసరాలకుగాను ఇసుకను ఉచితంగా తీసుకెళ్లొచ్చని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. చాలాచోట్ల ఇది అమలుకు నోచుకోవడం లేదు. జనం దళారులనే ఆశ్రయించాల్సి వస్తోంది. దళారులు కొనుగోలుదారుల నుంచి రవాణా ఛార్జీల పేరుతో భారీగా వసూలు చేస్తున్నారు. వాహనదారులందరూ సిండికేట్‌గా మారడంతో వారు నిర్ణయించిన ధరకే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డోన్‌లో ఇసుక డిపో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. నిర్వహణ బాధ్యతను ప్రైవేటుకు అప్పగించి.. వారితోనే విక్రయాలు చేయించాలని నిర్ణయించింది.

టన్ను రూ.759గా నిర్ణయించి..

★ టన్ను ఇసుక ధర రూ.759గా నిర్ణయించడంతో జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డోన్‌లో టన్ను ఇసుక ప్రస్తుతం రూ.650 నుంచి రూ.700కే లభిస్తోందని... దీనికి భిన్నంగా ప్రభుత్వ డిపోలో టన్ను రూ.759గా నిర్ణయించడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

★ స్టాక్‌యార్డ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం ఈనెల 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించింది. సుమారు 20 మంది ముందుకు వచ్చారు. లాటరీ విధానంలో ఒకరిని ఎంపిక చేయాలని అధికారులు భావిస్తున్నారు.

★ వాస్తవానికి డోన్‌వాసులు తాడిపత్రిలోని రీచ్ నుంచి ఇసుక తెప్పిస్తున్నారు. డోన్ నుంచి తాడిపత్రికి 70 కి.మీ.లు కాగా.. డోన్ నుంచి కర్నూలు జిల్లాలోని ఇసుక రీచ్ వద్దకు 90 కి.మీ.లు ఉంది. ఫలితంగా ప్రభుత్వ ఇసుక డిపోలో అధిక ధరకు విక్రయించాలని భావిస్తున్నారు.

ఆర్టీసీకి కార్తికకాంతులు

రద్దీగా పుణ్యక్షేత్రాలు ● ఉచిత బస్సు పథకంతో లబ్ధి

కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత బస్సు పథకం మహిళలకు ఎంతో ప్రయోజనకరంగా మారింది.. కార్తిక మాసంలో ఉమ్మడి జిల్లాలో లక్షలాదిమంది అతివలు వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శించారు. శ్రీశైలం, మహానంది, యాగంటి, అహోబిలం, కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, ఓంకారం క్షేత్రాల రూట్లలో ఆర్టీసీ బస్సులు మహిళా ప్రయాణికులతో కిటకిటలాడాయి. – న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు

● కార్తిక మాసంలో కర్నూలు జిల్లాలో 12.50 లక్షల మంది, నంద్యాలలో 28.8 లక్షల మంది మహిళా ప్రయాణికులు ఉచిత బస్సు పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ప్రతి బస్సులో 50 మంది మహిళా ప్రయాణికులు ఉంటే.. పురుషులు 10- 15 మందికే పరిమితం కావడం గమనార్హం.

● ప్రతి బస్సులో సీట్లన్నీ బస్టాండ్‌లోనే భర్తీ అయ్యాయి. కర్నూలు నుంచి శ్రీశైలానికి వెళ్లిన మహిళా ప్రయాణికులకు ట్రిప్పునకు ఒక్కొక్కరికి సగటున రూ.500 వరకు, ఓంకారం, యాగంటి, మహానంది, కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వంటి క్షేత్రాలకు వెళ్లిన వారికి సగటున ఒక్కొక్కరికి రూ.100-రూ.200 వరకు లబ్ధి కలిగినట్లు అధికారులు తెలిపారు.

● అక్టోబరు 23 నుంచి నవంబరు 18వ తేదీ వరకు కర్నూలు, పత్తికొండ, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల నుంచి 9.50 లక్షల మంది శ్రీశైలం వెళ్లారు.

● కర్నూలు- యాగంటి : 50.01 వేలు
● కర్నూలు- యాగంటి, అహోబిలం, ఓంకారం : 2.5 లక్షల మంది
● నంద్యాల- శ్రీశైలం, ఓంకారం : 11.30 లక్షల మంది
● నంద్యాల- మహానంది, యాగంటి, అహోబిలం : 8.90 లక్షల మంది
● బనగానపల్లి- కొత్తూరు సుబ్బరాయుడి ఆలయం, యాగంటి : 7.91 లక్షల మంది
● ఆళ్లగడ్డ- అహోబిలం : 50 వేలు

దశాబ్దాల కట్టుబాటు.. సహపంక్తి సాపాటు

ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో కొన్నేళ్ల కిందట కరవు ఏర్పడింది. తినేందుకు తిండి లేక జనం అవస్థలు పడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆలూరు నుంచి వచ్చిన అవధూతలు ఉచ్చీరప్ప తాత, చెలువప్ప తాతలు ఇక్కడ భోజనం వండి గ్రామస్థుల కడుపు నింపారు. గ్రామం సుభిక్షంగా ఉండాలంటే కార్తిక మాసంలో గ్రామస్థులంతా కలిసి భోజనాలు చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో సుమారు 150 ఏళ్ల కిందట మొదలైన సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. కార్తిక మాసం సందర్భంగా 30 రోజులపాటు గర్జిలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులంతా కలిసి సోమవారం సహపంక్తి భోజనం చేశారు. నియమ నిష్టలతో ఇంట్లో వండిన భోజనాన్ని తెచ్చి ఆలయం వద్ద రాసిగా పోశారు. చందాలు పోగుచేసి ఊరంతటికీ సరిపడ సాంబారు ఆలయం వద్ద వండారు. అర్చకులు అన్నం రాసికి పూజలు చేసిన తర్వాత అందరూ కలిసి భోజనం చేశారు.

సహపంక్తి భోజనం చేస్తున్న గ్రామస్థులు

అన్నం రాసికి హారతి ఇస్తున్న అర్చకుడు

విజయంపై పట్టు

ఆళ్లగడ్డ, రుద్రవరం, న్యూస్‌టుడే: విజయ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం ఎన్నికలు ఉత్కంఠ రేకెత్తించాయి. ఆరు విడతలుగా జరగాల్సిన ఈ ఎన్నికలు ఇప్పటి వరకు మూడు విడతలు జరిగాయి. నాలుగో విడత జిల్లా వ్యాప్తంగా 21 సంఘాలకు సోమవారం నామపత్రాల దాఖలు జరగాల్సి ఉంది. మండలాల వారీగా సంజామలలో 2, దొర్నిపాడులో 3, బనగానపల్లిలో 2, రుద్రవరంలో 2, బండిఆత్మకూరులో 2, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, శిరివెళ్ల, గోస్పాడు, మహానంది, పగిడ్యాల, జూపాడుబంగ్లా, బేతంచెర్ల, నంద్యాల, కోవెలకుంట్ల పరిధిలో ఒక్కో సంఘానికి సంబంధించి నామపత్రాలు దాఖలు కార్యక్రమం సోమవారం జరగాల్సి ఉంది.

మాచినేనిపల్లెలో

కీలకమైన మాచినేనిపల్లె సహకార సంఘం రెండు పాలకవర్గ సభ్యుల స్థానాలకు ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, ఎం.జెల్లయ్య నామపత్రాలు దాఖలు చేయడంతో వారే ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి టి.ప్రతాపరెడ్డి పేరుతో జారీ చేసిన పత్రం సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందాయి.

నామపత్రాల దాఖలు కార్యక్రమం మాచినేనిపల్లె పాల ఉత్పత్తిదారుల సమితి కార్యాలయం జరగాల్సి ఉండగా, అక్కడ కాకుండా మాజీ ఎమ్మెల్యే స్వగ్రామం ఎర్రగుడిదిన్నెలో అక్రమంగా నిర్వహించారని, ఇలాంటి అక్రమ ఎన్నిక చెల్లదని తెదేపా నేత భూమా విఖ్యాత్‌రెడ్డి అన్నారు. కార్యాలయం తలుపులు తెరవకుండానే నామపత్రాల దాఖలు చేసినట్లు ఎలా చెబుతారని ఆయన ప్రశ్నించారు.

గృహనిర్బంధంలో నేతలు

ఛైర్మన్ స్థానాన్ని సాధించాలంటే సహకార సంఘం పాలకవర్గ సభ్యుల అవసరం ఉంటుంది. వైకాపా, ఇటు తెదేపా గట్టి ప్రయత్నాలే చేశాయి.

ఆళ్లగడ్డలో ఆదివారమే 30 పోలీసు యాక్టును డీఎస్పీ కె.ప్రమోద్‌కుమార్ అమల్లోకి తెచ్చారు. సోమవారం ఉదయం నుంచే కీలక సభ్యులను గృహనిర్బంధంలోకి తీసుకున్నారు. తెదేపా నేత భూమా విఖ్యాత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డిలను ఇంటికే పరిమితం చేశారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని శాంతినగరం, మాచినేనిపల్లె, డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లె, గుండుపాపల పాలక వర్గ సభ్యుల ఎన్నికలకు నామపత్రాల దాఖలు సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

28న ఉద్యోగ మేళా

మీ కోసం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల జ్ఞానాపురంలోని నేషనల్ ఐటీఐ కళాశాలలో 28వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి కల్యాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ncs.gov.in లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

27న దివ్యాంగులకు ఆటల పోటీలు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: దివ్యాంగులకు 27వ తేదీన ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు రయీస్ ఫాతిమా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు తగిన పత్రాలతో కర్నూలు అవుట్ డోర్ స్టేడియానికి రావాలన్నారు. వివరాలకు 08518-277864 సంప్రదించాలన్నారు.

అయినోళ్లే శత్రువులయ్యారు

సంజీవరాయుడు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఆయనో వృద్ధుడు. వయస్సు మీరింది. అయినప్పటికీ కష్టపడి పొలం పనులు చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉండేవారు. అతని పొలంలోకి వెళ్లే దారి లేకపోవడం.. తమ్ముడు అడ్డుకోవడంతో కొన్నేళ్లుగా సాగు చేయలేకపోతున్నారు. అధికారులకు చెప్పినా సమస్య పరిష్కారం కావడం లేదు. జూపాడుబంగ్లా మండలం పి.లింగాపురం గ్రామానికి చెందిన సంజీరాయుడు వయస్సు 75 ఏళ్లు. ఎనిమిదేళ్ల కిందట భార్య కాలం చేసింది. ఐదుగురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేశారు. హమాలీ పనిచేస్తున్న కుమారుడి వద్దే ఉంటున్నారు. ఈయనకు గ్రామంలోని సర్వే నంబరు 56బీలో 1.50 ఎకరాలు ఉంది. తన పొలంలోకి అడుగు పెట్టాలంటే సొంత తమ్ముడు భూమిలో నుంచే వెళ్లాలి. తన పొలం మీదుగా వెళ్లొద్దని అతను హుకుం జారీ చేశాడు. గత మూడేళ్లుగా పొలం బీడుగా పెట్టేశారు. సమస్యను తహసీల్దారు నుంచి ఆర్డీవో వరకు అందరికీ ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. 'న్యాయం కోసం పెద్ద మనుషుల వద్దకెళ్తే పొలం తనకే విక్రయించాలని తమ్ముడు షరతు పెట్టాడు' అని సంజీవరాయుడు వాపోయారు. తన పొలంపై కన్నేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. పొలమొక్కటే తనకు ఆధారమని.. దానిని లాక్కునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కన్నీటి పర్యంతమయ్యారు. తనకు న్యాయం చేయాలంటూ కలెక్టరేట్‌లో సోమవారం అధికారులను కలిసి విన్నవించారు.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

ఆవాసయోగం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పీఎం ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0 అమలుకు చర్యలు ప్రారంభించింది. ఇంటి స్థలం లేకపోయినా.. సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకునేందుకు ముందుకు వచ్చేవారి వివరాలు సేకరించేందుకు ఆవాస్ ప్లస్-2024 సర్వే నిర్వహిస్తోంది.. ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నవారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గుర్తించిన అర్హులకు వచ్చే రెండు, మూడేళ్లలో గృహాలను ప్రభుత్వం మంజూరు చేయనున్నారు.

	కర్నూలు	నంద్యాల
సొంతిల్లు లేనివారు	41,045	28,714
దరఖాస్తు చేసుకొన్నవారు	9,432	12,630

నెలాఖరు వరకు గడువు

ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 69,759 కుటుంబాలకు సొంతిల్లు లేనట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఆవాస్ ప్లస్-2024 సర్వే ప్రకారం పీఎంఏవై గ్రామీణ్ 2.0 కింద కర్నూలు 9,432, నంద్యాల జిల్లా పరిధిలో 12,630 కలిపి మొత్తం 22,062 మంది దరఖాస్తు చేసుకున్నారు. మిగిలినవారు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెలాఖరు వరకు గడువు ఉంది. ఆలోగా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు.

ఒక ఇంటికి రూ.1.80 లక్షలు

పీఎంఏవై గ్రామీణ్ 2.0 కింద ఇల్లు మంజూరైన ఒక్కో లబ్ధిదారుడికి కేంద్రం రూ.72 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.48 వేలు, స్వచ్ఛ భారత్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు, ఉపాధి హామీ పథకం ద్వారా 90 పని దినాలకు రూ.27 వేలు కలిపి మొత్తం రూ.1.59 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.21 వేలు కలిపి మొత్తం రూ.1.80 లక్షలు ఇస్తారు.

అర్హులు ఎవరంటే..

● గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి స్థలం లేకపోతే పీఎంఏవై గ్రామీణ్ 2.0 కింద గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటి స్థలం ఉన్నవారూ అర్జీ పెట్టుకోవచ్చు.

● 2014-19లో ఎన్టీఆర్ హౌసింగ్ కింద ఇల్లు మంజూరై ఇప్పటివరకు నిర్మించుకోనివారికి ఈ పథకం వర్తిస్తుంది.

● ప్రస్తుతం ఇంటి పునాదులు, బేస్‌మెంట్, లెంటల్ లెవల్ వరకు నిర్మించుకున్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకుంటే 2029 వరకు ఇదే జాబితా వర్తిస్తుంది.

(c) eenadu

క్రిమినాశకాలు.. యమపాశాలు

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రస్తుతం పశువులు, కోళ్లలో వచ్చే పలు రకాల వ్యాధులను నియంత్రించేందుకు క్రిమినాశకాలు (యాంటీ బయోటిక్స్) వాడకం చాలా ఎక్కువైంది అని ఆళ్లగడ్డ పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు వరప్రసాద్ తెలిపారు. పశువుల్లో పొదుగు వాపు వ్యాధులు రావడం సర్వసాధారణమైంది. తగ్గించేందుకు రోగ క్రిమినాశకాలను పొదుగు వద్ద ఎక్కువ మోతాదులో ఇస్తుంటారు. వ్యాధి తగ్గిన తర్వాత కూడా రోగ క్రిమినాశకాల అవశేషాలు పొదుగు నుంచి పాల ద్వారా సుమారు 10- 15 రోజులు నెమ్మదిగా సుమారు 92% విసర్జిత కాగా.. ఇతర వ్యాధులకు సంబంధించి 0. 3% మాత్రమే ఉంటాయి.

పెరటి కోళ్లలో కొంత మంది రైతులు అవసరం లేకపోయినా పరిమితికి మించి యాంటీ బయోటిక్స్ వాడుతున్నారు. దీంతో రోగనిరోధక వ్యవస్థ, జీర్ణ వ్యవస్థ దెబ్బతింటాయి. వ్యాధి సోకినపుడు మందులు సరిగా పని చేయడం లేదు. క్రిమినాశకాల అవశేషాలు మాంసంలో ఉండటం వల్ల మానవాళికి హాని జరుగుతుంది.

పశువుల్లో పెన్సిలిన్, టెట్రాసైక్లిన్, క్లోరాంఫెనికాల్, ఆంపిసిలిన్, స్ట్రెప్టోమైసిన్ వంటి రోగ క్రిమి నాశకాలు వినియోగిస్తారు. దీర్ఘకాలంగా వాడటం ద్వారా పాలల్లో అవశేషాలు అధికమై నిరోధకత ఏర్పడుతుంది. సూక్ష్మజీవులు పాలు, పాల ఉత్పత్తుల ద్వారా మానవుల్లోకి ప్రవేశించి మనుషులను బలహీనపరుస్తాయి. ఫలితంగా మనుషుల్లో వ్యాధి నిరోధకత ఏర్పడి కొన్ని రోజుల వరకు యాంటీ బయోటిక్స్ పని చేయవు. సెఫ్టోపూరాజోన్, సల్ఫామిడజోన్ వంటి రోగ క్రిమినాశకాలు నిరంతరం వాడటం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. అవశేషాలు ఉన్న పాలు, పాల ఉత్పత్తులు తీసుకుంటే పిల్లల్లో రక్తహీనత, ఎముకల బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తాయి. పాలను వేడి చేసినా ఇవేమీ తగ్గవు.

● చికిత్స చేసిన పశువు పాలను 60-84 గంటల తర్వాత మాత్రమే వేరే పాలతో కలపాలి లేదా ఉపయోగించాలి.

● పాలిచ్చే ఆవులు, పశువుల్లో వ్యాధి నివారణ చర్యలు చేపట్టి, మందుల వాడకం తగ్గించాలి. పశువైద్యుడు సూచించిన మందులను తగిన మోతాదులో నిర్దేశించిన రోజులు మాత్రమే ఇవ్వాలి.

● పశువులు, కోళ్ల షెడ్లను శుభ్రంగా గాలి, వెలుతురు వచ్చేలా ఉంచడంతో రోగాల వ్యాప్తి తగ్గించవచ్చు.

కుళ్లిపోతున్న మిరప

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: మిరపకు ఆంత్రాక్నోస్ సోకడంతో చేతికొచ్చే దశలో కాయ దిగుబడులను సైతం మార్కెట్లో అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రామకృష్ణరావు తెలిపారు. ఎండు మిరపపై గోధుమ రంగు మచ్చలు కనిపిస్తాయి. మచ్చల మధ్యలో గులాబీ లేదా నారింజ రంగులో ఫంగస్ స్పోర్లు కనిపిస్తాయి. తీవ్రస్థాయిలో కాయలు కుళ్లిపోతాయి. మార్కెట్లో ధర పలకదు. ఆకులపై కూడా చిన్న చిన్న మచ్చలు ఏర్పడి ఆకులు ఎండి పోతాయి. విత్తనాలు నాటే ముందు కిలో విత్తనాన్ని నాలుగు గ్రాముల ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేసుకోవాలి. పంట మార్పిడి తప్పని సరి. మిరప వేసిన తర్వాత మళ్లీ మిరప వేయరాదు. పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వ్యాధి గ్రస్త అవశేషాలు నాశనం చేయాలి. పిచికారీ మిరప పంట దశలో లీటరు నీటిలో కార్బెండజిమ్ 0.1గ్రాములు లేదా మాంకోజెబ్ 0.25 శాతం లేదా అజాక్సిస్ట్రోబిన్ 23శాతం ఎస్‌సీ ఒక మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. పిచికారీ సమయంలో పండ్లను పూర్తిగా తడిచేలా పిచికారీ చేసుకోవాలి. మార్కెట్‌కు తీసుకెళ్లే ముందు పండు కాయలను బాగా ఎండబెట్టి తీసుకెళ్లాలి.

మొక్కజొన్నకు కత్తెరపోటు

మొక్కజొన్న పంటను ఆశించిన కత్తెర పురుగు

కర్నూలు, నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో రబీలో సాగు చేసిన మొక్కజొన్న పంట వివిధ దశల్లో ఉంది. ఈ పంటను ఇటీవల కత్తెర పురుగు ఆశించి నష్టపరుస్తోంది. పురుగు తీవ్రత ఎక్కువగా ఉంటే.. దిగుబడిపై ప్రభావం చూపుతుంది. సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహాయ సంచాలకుడు డాక్టర్ జాన్సన్, కీటక శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ తెలిపారు. ముందుగా మొక్కజొన్న పంట చుట్టూ నాలుగు వరుసలు నేపియర్ గడ్డిని ఎర పంటగా వేసుకోవాలి. ఎకరానికి 4 నుంచి 5 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకొని పురుగు ఉద్ధృతిని కనిపెట్టాలన్నారు. గుడ్లను గమనించిన వెంటనే ఎకరానికి ఒక లీటర్ వేపనూనె పిచికారీ చేయాలన్నారు. తొలిదశ గొంగళి పురుగులను నివారించేందుకు ఎకరానికి 500 ఎం.ఎల్. క్లోరిఫైరిపాస్‌ను పిచికారీ చేయాలి. గొంగళి పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉంటే.. ఎమామెక్టిన్ బెంజోయేట్ లేదా స్పైనోశాడ్ 45 శాతం ఎస్‌సీ 60 మి.లీ. ఎకరానికి సుడులు లేదా మొవ్వ లోపలి ఆకులు పూర్తిగా తడిసేలా పిచికారీ చేయాలి. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో కత్తెర పురుగును నివారించుకోవాలని వారు సూచించారు.

రైతేరాజు

సందేహాలు సమాధానాలు

?: చలికాలంలో కోళ్లు ఆయాసంతో ఊపిరి తీసుకోవడం కష్టంగా కనిపిస్తున్నాయి. ముడుచుకు పోతున్నాయి.
- రాఘవులు, అవుకు.

✔: కోళ్లను ఉంచే ప్రదేశం పొడిగా ఉండే విధంగా చూసుకోవాలి. నేలపైన వరిపొట్టును నాలుగు అంగుళాల మేర చల్లాలి. ఎన్రోఫ్లాక్ససీన్ లేదా లెవోఫ్లాక్సిసీన్ మందులను మూడు రోజులు వాడాలి. కొక్కెర తెగులు అయితే అసోటావ్యాక్సిన్ మందును వేయించుకుంటే నివారణ చేసుకోవచ్చు.

?: గొర్రెల్లో కాలి కింద పుండ్లు కనిపిస్తున్నాయి. గిట్టల మధ్య తెరిచి చూస్తే మొత్తబడి వాచినట్లు కనిపిస్తున్నాయి.
- బాలరాజు, కటికవానికుంట

✔: దీన్ని కాలిపుండ్ల వ్యాధి అంటాం. బురద నేలలో మేపితే ఈ వ్యాధి వస్తుంది. గిట్టల వద్ద 1:1000 పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి బోరిక్ వేపనూనె మందు రాయాలి.

?: గొర్రె పిల్లలు పుడుతున్నాయి. కొన్ని చనిపోతున్నాయి. మరణాలను తగ్గించడానికి నివారణ తెల్పండి.
- గోవిందు, యాగంటిపల్లె

✔: గొర్రె పిల్లలు పుట్టిన గంట లోపు ముర్రుపాలు తాగించాలి. పుట్టిన 24 గంటల్లో టీటీ ఇంజెక్షన్ వేయాలి. నాలుగు రోజుల లోపు యాంటీబయాటిక్ మందు తాగించాలి. 5 నుంచి 7 రోజుల్లో లివర్ టానిక్ తాగించాలి. 15వ రోజు నట్టల నివారణ మందు వేయాలి.

– డా.కృష్ణమూర్తి, కేవీకే పశుపోషణ శాస్త్రవేత్త, బనగానపల్లి

– న్యూస్‌టుడే బనగానపల్లి

నందనవనం.. నందవరం

పర్యావరణ సమతుల్యతకు పచ్చని చెట్లు దోహదం చేస్తాయి. వాటిని సంరక్షిస్తేనే మానవుని మనుగడ. దీనిని దృష్టిలో పెట్టుకుని నందవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు పెంచుతున్నారు. పాఠశాలలో దాదాపు 600 వేప, రావి, కానుగ తదితర చెట్లు, 110 కొబ్బరి చెట్లతో కోనసీమను తలపిస్తోంది. పాఠశాలలో దాదాపు 345 విద్యార్థులున్నారు. నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులు 5 గ్రూపులుగా ఏర్పడి మొక్కలను సంరక్షిస్తున్నారు. గ్రామాల్లో ర్యాలీలు చేపట్టి అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు ఉపాధ్యాయుల సహకారంతో ముందుకు సాగుతున్నట్లు జిల్లా గ్రీన్ కోర్ కన్వీనర్ కుమార్‌బాబు తెలిపారు.

– న్యూస్‌టుడే, నందవరం(బనగానపల్లి గ్రామీణం)

సంఘటితమై.. సేవకు కదలి

ఆళ్లగడ్డలోని నాయీబ్రాహ్మణులు(క్షౌరవృత్తి) ఆదర్శంగా నిలుస్తున్నారు. కుల వృత్తినే నమ్ముకుని సామాన్య జీవితం చేసే వీరు సమాజానికి తమ వంతు సేవలు అందించవచ్చని నిరూపిస్తున్నారు. ఆళ్లగడ్డ నాయీబ్రాహ్మణ సంఘంలో 40 మంది సభ్యులుగా ఉన్నారు. ప్రతి మంగళవారం ఆళ్లగడ్డతో పాటు చుట్టుపక్కలున్న అనాథాశ్రమాలకు, బాలసదన్‌లకు వెళ్లి అందులో ఉన్న వారికి ఉచితంగా క్షవరం చేస్తుంటారు. దీంతో పాటు ఎక్కడైనా అనాథలు, భిక్షాటన చేసే వాళ్లు కన్పించినా సేవలు అందించేందుకు సిద్ధమైపోతారు. నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం తమకు ఫోన్ చేస్తే చాలు అక్కడకు వెళ్లి అనాథలకు, వృద్ధులకు సేవలు అందిస్తున్నారు. అహోబిలంలో అన్నదాన సత్రం ఏర్పాటు చేసి నరసింహస్వామి భక్తుల ఆకలి తీరుస్తున్నారు. **– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ**

ఐఎంఏ నంద్యాల శాఖకు నాలుగు పురస్కారాలు

పురస్కారం అందుకుంటున్న సభ్యులు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: ఐఎంఏ నంద్యాల శాఖ గతేడాది కాలంలో చేసిన కార్యక్రమాలకు గాను అవార్డులు దక్కాయి. రాజంపేటలో శని, ఆదివారాల్లో జరిగిన 67వ రాష్ట్ర ఐఎంఏ సదస్సులో అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డా.దిలీప్ బానుశాలి చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. నంద్యాల ఐఎంఏకు ఉత్తమ శాఖ పురస్కారం, ఆ శాఖ నంద్యాల అధ్యక్షుడు డా.మధుసూదనరావుకు, మహిళా విభాగానికి ఉత్తమ సామాజిక సేవల పురస్కారం, వైద్య వైజ్ఞానిక సదస్సులు నిర్వహించినందుకు మరో పురస్కారం లభించినట్లు ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ తెలిపారు. నంద్యాల ఐఎంఏ ద్వారా సామాజిక సేవలు, నిరంతర వైద్య అవగాహన సదస్సులతో పాటు 146 కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ పురస్కారాలు అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

విద్యార్థుల అస్వస్థతపై విచారణ

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీసుధ పాఠశాల వసతిగృహంలో ఈ నెల 20వ తేదీన అల్పాహారం తిని కొందరు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న ఎంఈవో ఎ.ప్రభాకర్ సోమవారం పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఇన్‌ఛార్జి, వసతిగృహ పర్యవేక్షకుడిని, విద్యార్థులను కలిసి వివరాలను తెలుసుకున్నారు. ఆ రోజున నలుగురు విద్యార్థులు ఎక్కువగా బోండాలు తినడంతో కడుపునొప్పి, విరేచనాలతో అస్వస్థతకు గురైనట్లు విచారణలో తెలిసిందని ఎంఈవో పేర్కొన్నారు. పిల్లలకు ఆర్‌ఎంపీతో వైద్య సేవలందించారని, వారితో మాట్లాడి వివరాలు సేకరించామన్నారు. ఆ విద్యార్థులకు ఎటువంటి అనారోగ్యం లేదని తెలియజేశారు. ఈ విషయాన్ని డీఈవోకు నివేదిస్తున్నట్లు పేర్కొన్నారు.

పాఠశాలలో విచారిస్తున్న ఎంఈవో ప్రభాకర్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


పోలూరులో రైతుకు కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు అందజేయాలని సూచించారు.

వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం అండ

పోలూరు (నంద్యాల గ్రామీణం), న్యూస్‌టుడే: వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. మండలంలోని పోలూరులో మంగళవారం వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామంలోని రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను అందజేశారు. కూటమి ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు, తెదేపా మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, జోజిరెడ్డి, జయచంద్రారెడ్డి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ ఎన్నికల్లో నిబంధనల మేరకే వ్యవహరిస్తున్నాం

మాట్లాడుతున్న భూమా విఖ్యాత్‌రెడ్డి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: విజయ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం సభ్యుల ఎన్నికల్లో తాము నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నామని తెదేపా నేత భూమా విఖ్యాత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పోలీసులను అడ్డుపెట్టుకుని నామపత్రాల దాఖలు కార్యక్రమం అడ్డుకున్నారని గంగుల బ్రిజేంద్రరెడ్డి విమర్శించడం అర్థరహితమన్నారు. పోలీసులు శాంతియుతంగా ఎన్నికలను నిర్వహించేందుకు తనను కూడా గృహనిర్బంధంలో ఉంచారన్నారు. ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి నామపత్రం దాఖలుకు తాము అడ్డుకోలేదన్నారు. నామపత్రాల దాఖలు కార్యాలయం తలుపులే తెరుచుకోలేదని, ఇందుకు తమను విమర్శించడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. భూమా నాగిరెడ్డి కుమారుడిగా రాజకీయం చేస్తే ప్రత్యర్థులు తట్టుకోలేరన్నారు. తమను ఛాలెంజ్ చేసే స్థాయి ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డికి లేదన్నారు. విజయ డెయిరీలో చోటు చేసుకున్న అక్రమాలకు బయట పెడతానన్నారు. అధికారంలో లేనప్పుడే తాను ఎవరికీ భయపడలేదన్నారు.

ఉర్దూ కళాశాల మార్చాలని విద్యార్థినుల నిరసన

కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాలలో ఉర్దూ కళాశాలను బాలికల జూనియర్ కళాశాల స్థలంలో కాకుండా, వేరే చోట ఏర్పాటు చేయాలని ఏబీవీపీ నగర కార్యదర్శి నరసింహ డిమాండు చేశారు. నంద్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు, ఏబీవీపీ నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికల కళాశాలలో కో ఎడ్యుకేషన్ ఉండకూడదన్నారు. ఉర్దూ కళాశాలకు ఇక్కడ స్థలం కేటాయించాలని తీసుకొన్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని.. లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సాయి, వెంకట్, మణి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE (MACT): AT SIDDIPET
TELANGANA STATE
MV. OP. No. 12 of 2020
Between:
Uppara Vinay Kumar ...Claimant
AND
Komma Amarnath & another ... Respondents
NOTICE
To,
1. Komma Amaranath S/o Arogyam, Age 22 years, D/No. 30/158, Gopal Nagar, Nandyal Town and Mandal, Kurnool District (Driver of the Crime Vehicle No. AP 04 S 3896)
2. Shaik Habibullah, S/o Noor Ahmmad, Age 38 years, R/o D.No. 25/625-A, Srinivasa Nagar, Nandyala Town, Kurnool District (Owner of the Crime Vehicle)
Please take notice that, above named claimant filed the above case for compensation against them, the case is posted to 22-12-2025 for your appearance, hence I here by direct Respondent No.1 & 2 to appear before the Hon'ble Principal District Judge (MACT) Court at Siddipet, Telangana State, at 10-30 AM. in person or through advocate, failing which the matters will be decided ex-parte in your absence.
// BY THE ORDER OF THE COURT //
UPPARA MALLESHAM
BANDI YADAIAH
ADVOCATES - SIDDIPET
CEL: 9866864780

మల్లన్నసేవలో దర్శకుడు సుకుమార్

స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న దర్శకుడు సుకుమార్

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను సోమవారం ప్రముఖ సినీ దర్శకుడు సుకుమార్ దర్శించుకున్నారు. స్వామి వారి స్పర్శ దర్శనం చేసుకున్న అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆయనకు అర్చకులు వేదాశీర్వచనాలు పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేత్రపర్వంగా పల్లకిసేవ

యాగంటి(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయాధికారి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ నేత్రపర్వంగా సాగింది. పల్లకిలో ఉత్సవ విగ్రహాలుంచి ప్రాకార ఉత్సవం గావించారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచి మహేశ్వరరెడ్డి, యాగంటిపల్లి మౌళీశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరిట రూ.2.50 లక్షలు తీసుకుని మోసం

☛ నంద్యాల ఎస్పీకి బాధితురాలి ఫిర్యాదు

బాధితులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ సునీల్ షొరాణ్

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: యర్రగుంట్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఇమ్మానియేల్ అనే వ్యక్తి రూ. 2.50 లక్షలు తీసుకుని ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశాడని నంద్యాలకు చెందిన కాశమ్మ సోమవారం ఎస్పీ సునీల్ షొరాణ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఈ మేరకు అర్జీ అందజేశారు. కార్యక్రమంలో మొత్తం 82 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ పేర్కొన్నారు. వాటిని ఆయన బాధితుల నుంచి స్వయంగా స్వీకరించి సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సత్వరం పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు.

పీజీఆర్ఎస్‌లో వచ్చిన కొన్ని సమస్యలు...

● తనదికాని స్థలానికి నకిలీ దస్తావేజులు సృష్టించి బెస్త నాగరాజు అనే వ్యక్తి తనకు స్థలం అమ్మి రూ.10 లక్షలు తీసుకుని మోసం చేశాడని.. తనకు న్యాయం చేయాలని యాళూరు గ్రామానికి చెందిన మహమ్మద్ హుసేన్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

● రూ.6 లక్షలకు ఇంటిస్థలం ఇప్పిస్తానని చెప్పి.. రూ.4 లక్షలు తీసుకొని ఇంతవరకు ఇంటి స్థలం ఇవ్వకుండా, డబ్బులు తిరిగి ఇవ్వకుండా నరసింహులు మోసం చేశాడని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన భువనేశ్వరి పీజీఆర్ఎస్‌లో అర్జీ అందజేశారు.

● ప్రతి నెలా డబ్బులు చెల్లిస్తానని చెప్పి వెలుగోడుకు చెందిన ఖాజా హుసేన్ తన ట్రాక్టర్ తీసుకెళ్లి.. డబ్బులు ఇవ్వడం లేదని అదే గ్రామానికి చెందిన ముర్తుజావలి ఎస్పీ ఎదుట వాపోయారు. కనీసం ట్రాక్టర్ తెచ్చి ఇవ్వడం లేదని, అడిగితే బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేశారు.

నవోదయ పరీక్షకు 24 కేంద్రాలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్షలు రాసే విద్యార్థులకు 24 కేంద్రాలు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపల్ పద్మావతి వెల్లడించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో ఈ ఏడాది అత్యధికంగా 6469 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నంద్యాలలో 9, కర్నూలు జిల్లాలో 15 కేంద్రాలు ఎంపిక చేశామన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు జారీ చేసినట్లు తెలిపారు. డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష వచ్చే నెల 13వ తేదీన ఉంటుందన్నారు. ఆయా కేంద్రాల పరిధిలో విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో నిబంధనల మేరకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. సమస్య ఉంటే నేరుగా తమకు ఫిర్యాదు చేయాలని కోరారు.

వైభవంగా మల్లన్నకు వెండి రథోత్సవం

వెండి రథంపై కొలువైన స్వామి, అమ్మవార్లకు మంగళ హారతులు ఇస్తున్న అర్చకులు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లకు వెండి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవస్థాన అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను వెండి రథంపై కొలువుదీర్చారు. అర్చకులు మంగళహారతులు ఇవ్వగా, శివనామ స్మరణ మధ్య ఆలయ ప్రాంగణంలో వెండి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది.

సమస్యలు వేగంగా పరిష్కరించండి

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. సోమవారం స్థానిక పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. కార్యక్రమానికి 220 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రీ ఓపెన్ అయిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్వో రాము నాయక్ పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి సహకరించాలి

గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఏటా డిసెంబరు 7న నిర్వహించే సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా సైనికుల సంక్షేమ నిధికి జిల్లా ప్రజలు ఉదారంగా చేయూతనందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె ఫ్లాగ్ డే గోడపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు తన వంతు సహాయం చేయాలని కోరారు.

ఎమ్మెల్యేకు మంజూరు పత్రం అందిస్తున్న కలెక్టర్

ఎత్తిపోతల పథకానికి రూ.38 లక్షలు మంజూరు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : మండలంలోని నాగటూరు ఎత్తిపోతల పథకం మరమ్మతులకు కలెక్టర్ రాజకుమారి గనియా రూ.38లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆ పథకం కమిటీ సభ్యులు కలెక్టర్‌ను సోమవారం కలిసి సమస్యను విన్నవించారు. కలెక్టర్ స్పందించి మరమ్మతులకు రూ.38లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జూపాడుబంగ్లా మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, పగిడ్యాల మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 73821 14647.

JOBS
ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్. HDFC/AXIS బ్యాంక్, క్లర్క్‌లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆: 9703971968.
కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్స్ (F) కావలెను. ఇంటర్‌నేషనల్ రెప్యూటెడ్ మ్యాట్రిమోనియల్ కన్సల్టెన్సీ, కర్నూలు బ్రాంచి కొరకు సంప్ర॥ 93938 23550.

PROFESSIONAL SERVICES

ASTROLOGY
శ్రీరాఘవేంద్ర జ్యోతిష్యాలయం బ్రొటనవేలి ముద్ర, రెండు హస్తరేఖలను పరీక్షించి సంపూర్ణ జ్యోతిష్యం తెలపగలరు. బళ్లారి చౌరస్తా, కర్నూలు. ✆ 97031 67293.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

REAL ESTATE

HOUSE FOR SALE
నంద్యాల శ్రీనివాసర్ లో 5/50 సెంట్స్ లో గల 3 అంతస్తుల బిల్డింగ్ సేల్ కు కలదు. Contact: 99890 03812.

TO LET
For Rent to Hospital, Poly Clinics, Diagnostic Centres 5200 Sft, G+1, 43/194-2, Line No-7, N.R.Peta, Kurnool. Cont: ✆ 89851 32552.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

ఉపన్యసిస్తున్న థెరిస్సా కళాశాల విద్యార్థిని

బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ వసుంధర

వక్తృత్వ పోటీలతో భావ వ్యక్తీకరణపై పట్టు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: కళాశాల స్థాయిలో విద్యార్థులు వక్తృత్వ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపించటం వల్ల భవిష్యత్తులో భావ వ్యక్తీకరణపై పట్టు సాధించవచ్చని థెరిస్సా కళాశాల డైరెక్టర్ సాయి ప్రణీత్, కరస్పాండెంట్ వసుంధరలు స్పష్టం చేశారు. పట్టణంలోని గరీబ్‌నగర్‌లోని థెరిస్సా జూనియర్ కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కళాశాల విద్యార్థులు బీవీఎన్ గాయత్రి, గురు అనూష, శిరీషలు మొదటి మూడు స్థానాల్లో నిలువగా.. వారికి కళాశాల డైరెక్టర్ సాయి ప్రణీత్ బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హరికృష్ణ, సిబ్బంది షహీన్‌షా, ఫయాజ్, ప్రవీణ్, జగదీష్, మన్సూర్, నాగరాజు, అశోక్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని

విజేతలతో హెచ్‌ఎం, ఉపాధ్యాయినులు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించగా 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినులు స్వాతి, హఫీజ, మధుతేజశ్రీ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి పాఠశాల ప్రిన్సిపల్ చిత్రలేఖ, ఉపాధ్యాయినులు మాధవి, జోత్స్నమయి, మద్దమ్మ బహుమతులు అందజేశారు.

మహాసభలను జయప్రదం చేద్దాం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: రాజమండ్రిలో ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ అన్నారు. పట్టణంలోని సాయిబాబా నగర్ బీసీ వసతి గృహంలో పీడీఎస్‌యూ నాయకులు రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ డిమాండ్ చేశారు. బాపనంతాపురంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి రైతు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా పంట రుణాలు ఇవ్వాలని కోరారు.

దారులు గుంతలమయం.. ఒళ్లు హూనం

• పైపులైన్ పనుల కోసం ఇష్టారాజ్యంగా తవ్వకాలు

• వాహనదారులకు తప్పని అవస్థలు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో రహదారులు అధ్వానంగా మారాయి. ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్లు కావడంతో గుంతలు తేలి, పగుళ్లు ఏర్పడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో పైప్‌లైన్ పనుల కోసం ఇష్టానుసారం పగులగొట్టి వాటిని అలాగే వదిలేశారు. దెబ్బతిన్న రహదారుల స్థానంలో నూతనంగా రోడ్లు నిర్మించడం మాట అటుంచితే.. కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు. గుంతల రోడ్లపై ప్రయాణించడానికి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి. గుంతల దాటికి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయించాలని, అవసరం ఉన్న చోట్ల కొత్తవి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రమదానం బ్రిడ్జి పక్క సందులో దెబ్బతిన్న రోడ్డు

సమస్య ఉన్న ప్రాంతాలివే..

◆ నూనెపల్లె వంతెన కింద జాతీయ రహదారి దెబ్బతిని కంకర తేలింది. నిత్యం అత్యంత రద్దీగా ఉండే ఈ కూడలిలో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. దీంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలకు గురవుతున్నారు.

◆ పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ నుంచి ఎస్బీఐ కాలనీకి వెళ్లే రోడ్డుకు పగుళ్లు ఏర్పడి రాకపోకలకు ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ మలుపులో రోడ్డు కుంగింది.

◆ శ్రమదానం వంతెన పక్క సందులో నుంచి గోపాల్‌నగర్ వెళ్లే మార్గం పూర్తిగా దెబ్బతింది. నూతనంగా రోడ్డు నిర్మించాల్సిన అవసరముంది.

◆ నర్స్ క్వార్టర్స్, విజయనగరం కాలనీ, టెక్కె నుంచి పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే రోడ్డు, గిబ్సన్ కాలనీలలో పైప్ లైన్ పనుల కోసం రోడ్లను తవ్వారు. పనులు ముగిసిన తర్వాత మరమ్మతులు సరిగా చేయలేదు.

◆ ఆటోనగర్, వైఎస్సార్‌నగర్ ప్రాంతాల్లో అంతర్గత దారులన్నీ ఇప్పటికీ మట్టి రోడ్లుగానే ఉన్నాయి. వర్షాలు కురిసినప్పుడు చిత్తడిగా మారి ప్రయాణించడానికి వీల్లేకుండా తయారవుతున్నాయి.

◆ వీటితో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. మరి కొన్ని దెబ్బతిన్నాయి. వీటికి మరమ్మతులు చేయించాలని పురప్రజలు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని నౌమాన్‌నగర్‌లో కాల్వలు శుభ్రం చేయడం లేదు. దీంతో దోమలబెడద అధికమైంది. - **సలాంనాయక్, స్థానికుడు**

?: పట్టణంలోని పార్క్ రోడ్డులో శునకాలు గుంపులుగా సంచరిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. - **గురు, స్థానికుడు**

?: పట్టణంలోని బైర్మల్ వీధిలో దోమలబెడద అధికమైంది. - **మల్లికార్జున, స్థానికుడు**

✔: కాల్వలను శుభ్రం చేయిస్తాం. దోమల మందును పిచికారీ చేయిస్తాం. త్వరలోనే కుక్కలను పట్టించి సమస్యను పరిష్కరిస్తాం.

- **లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: ఏకలవ్యనగర్‌లో నీళ్ల ట్యాంకు వద్ద వాల్వ్ మరమ్మతుల కోసం గుంత తవ్వారు. నెల రోజులైనా పూడ్చకపోవటంతో ఇబ్బందికరంగా ఉంది. - **సంపత్, స్థానికుడు**

✔: పరిశీలించి వాల్వ్ గుంత పూడ్చివేయిస్తాం.

- **షాహీర్‌బాషా, పురపాలక ఏఈ**

?: వెంగళరెడ్డినగర్‌లో ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న కాల్వలో పూడిక పేరుకుపోయింది. - **రమేష్, స్థానికుడు**

✔: కాల్వల్లో పూడిక తొలగిస్తాం.

- **జీవన్, శానిటరీ ఇన్‌స్పెక్టరు**

మిడుతూరు, న్యూస్‌టుడే: ?: మిడుతూరులోని శివారు కాలనీకి తాగునీరు సక్రమంగా అందడం లేదు.

- **శ్యామ్, శివారు కాలనీవాసి**

?: మిడుతూరులో పలు కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదు. - **నాయుడు, మిడుతూరు.**

✔: సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం.

- **కల్యాణ్ సింగ్, తాత్కాలిక కార్యదర్శి, మిడుతూరు**

పగిడ్యాల, న్యూస్‌టుడే: ?: మండలంలోని పాలమర్రిలో ఎస్సీ కాలనీలో కాల్వలో వ్యర్థాలు పేరుకుపోయాయి. - **కిరణ్, స్థానికుడు**

✔: పారిశుద్ధ్య సిబ్బందికి సూచించి సమస్యను పరిష్కరిస్తాం. - **శేషన్న, సర్పంచి**

?: లక్ష్మాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయం ఎదుట మినీ ట్యాంక్ ఏర్పాటు చేయాలి.

- **శివ, స్థానికుడు**

✔: అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తాం.

- **గురు తరుణ్, పంచాయతీ కార్యదర్శి**

?: మండలంలోని సంకిరేణి పల్లెలో బీసీ కాలనీలో నూతన విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేయాలి.

- **చెన్నకేశవులు, స్థానికుడు**

✔: సమస్యను విద్యుత్తు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. - **ప్రభాకర్‌రెడ్డి, సర్పంచి**

నియంత్రిక ప్రమాద ఘంటిక

నంద్యాల ఆర్టీవో కార్యాలయం పక్కన రహదారిని ఆనుకొని విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేశారు. నియంత్రిక దిమ్మె ప్రమాదకరంగా మారింది. దిమ్మె శిథిలావస్థకు చేరింది. ఫలితంగా పగుళ్లు ఏర్పడి దెబ్బతింది. ఆ ప్రదేశంలోనే ప్రభుత్వ కార్యాలయం ఉంది. పనుల నిమిత్తం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దిమ్మె కూలితే ప్రమాదం జరుగుతుందేమోనని ప్రజలు భయపడుతున్నారు. అధికారులు దిమ్మెకు మరమ్మతులు చేయాల్సి ఉంది. – న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

బయటకు రాలేకున్నారు

ఆత్మకూరు పురపాలక సంఘంలో కుక్కలు వందల సంఖ్యలో ఉన్నాయి. వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ప్రజలను హడలెత్తిస్తున్నాయి. పట్టణంలోని కొత్తపేట, ఇస్లాంపేట, అగ్నిమాపక కేంద్రం, రహ్మత్‌నగర్, అర్బన్‌కాలనీ, వెంగళరెడ్డినగర్, గరీబ్‌నగర్, ఏకలవ్యనగర్, జల్లావీధి, నీలితొట్లవీధి, ఎస్సీపాలెం, ఏబీఎంపాలెంలో అధికంగా ఉన్నాయి. వారం క్రితం ఒకే రోజు 14 మందిపై దాడి చేశాయి. వారంతా ఆసుపత్రి పాలయ్యారు. దాంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. – న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

వంతెన వెతలు తీరేదెన్నడో

మండలంలోని పగిడ్యాల- పాత ముచ్చుమర్రి మధ్య కేసీ కెనాల్ వంతెన నిర్మాణం పూర్తికాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత వైకాపా హయంలో రూ. కోటి వ్యయంతో వంతెన నిర్మాణం చేపట్టారు. బిల్లులు అందలేదు. దాంతో గుత్తేదారు పనులు నిలిపివేశారు. ఫలితంగా రెండు గ్రామాల ప్రజలు శిథిలావస్థలోని పాత వంతెన పైనే రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు నూతన వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పగిడ్యాల

రక్షణ లేక.. రాకపోకలకు అవస్థలు

మండలంలోని మోతుకూరు గ్రామ శివారులో కుందూ నదిపై వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేవు. ప్రజలు రాకపోకలకు భయాందోళన చెందుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే ఇబ్బందులు పడుతున్నారు. వంతెనపై విద్యుత్తు దీపాలు లేవు. దాంతో రాత్రి సమయాల్లో చీకటి కమ్ముకుంటుంది. ఎలాంటి ప్రాణ నష్టం జరగకముందే అధికారులు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించి, దీపాలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మోతుకూరు(వెలుగోడు)

బాలల హక్కులపై అవగాహన

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం పాణ్యం గిరిజన పాఠశాల విద్యార్థులకు జిల్లా బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ సునీల్ కుమార్ బాలల హక్కులు, లైంగిక వేధింపుల గురించి అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ ఓబులమ్మ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అన్నదాతల మేలు చేస్తోందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పేర్కొన్నారు. పట్టణంలోని 21వ వార్డులో సోమవారం రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా వార్డులో పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. అంగన్వాడీ కేంద్రం, పశువైద్యశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు త్వరలో ప్రారంభం అవుతాయన్నారు.

ఆత్మకూరు, న్యూస్‌టుడే: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సాంకేతిక పద్ధతులను వినియోగించాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బాపనంతాపురంలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. రైతులు డిమాండ్ ఆధారిత పంటలు సాగు చేయాలన్నారు. తహసీల్దార్ రత్నరాధిక, ఏవో హేమలత తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: 'రైతన్నా మీకోసం'లో భాగంగా సంతజూటూరులో తెదేపా మండల అధ్యక్షుడు లాయర్ కృష్ణారెడ్డి పంచ సూత్రాలను వివరించారు. మొదటి రోజు 13 రైతు సేవా కేంద్రాల్లో 188 రైతు ఇళ్లకు వెళ్లి సర్వే పూర్తి చేసినట్లు ఏవో పవన్‌కుమార్ తెలిపారు. కార్యదర్శి చాందయ్య, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మిడుతూరు: మిడుతూరులో తెదేపా మండల అధ్యక్షుడు కాతా రమేష్ రైతులకు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కరపత్రాలను అందజేశారు.

మహానంది: మండలంలోని సీతారామాపురం, మసీదుపురం, తిమ్మాపురంతోపాటు పలు గ్రామాల్లో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్వినీ 'రైతన్నా-మీకోసం' 'రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం' కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేపట్టారు. అలాగే పగిడ్యాల, గడివేముల, గోస్పాడు మండలాల్లోనూ కార్యక్రమాలను నిర్వహించారు.


పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

విజన్ ప్లాన్ యూనిట్లను ఏర్పాటు చేయండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. జడ్పీ సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన వివిధ అంశాలను త్వరగా పరిష్కరించాలని ఆమె పేర్కొన్నారు. స్థానిక పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం అధికారులతో సమీక్షించారు. కొత్తపల్లె మండలంలో రీ సర్వే పనులకు తహసీల్దారు హాజరు కాకపోవడాన్ని ప్రస్తావిస్తూ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. శనగ విత్తనాల పంపిణీ పూర్తి స్థాయిలో జరగాలని ఆదేశించారు.



సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

ఎంటీఎస్ అమలు చేయాలని మంత్రికి వినతి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: తమ సమస్యలను పరిష్కరించాలని సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో మంత్రి ఫరూక్‌ను కలిశారు. సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ, ఎంటీఎస్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు కాంతారావు, ఆదిశేషయ్య, శేఖర్, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ఆత్మకూరు, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని మౌలాబి ఎస్‌జీఎఫ్ అండర్-17 విభాగంలో విజయవాడలో రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సుంకన్న తెలిపారు. బాక్సింగ్ విభాగంలో వైజాగ్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో జయశంకర్ మూడో స్థానంలో నిలిచారన్నారు. క్రీడాకారులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు.

క్రీడాకారులతో ప్రిన్సిపల్ సుంకన్న

భోగేశ్వర ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు

గడివేముల, న్యూస్‌టుడే: దుర్గాభోగేశ్వర ఆలయంలో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంత్రి ఆనం ఆలయాన్ని సందర్శించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు సోమవారం ఆలయ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఆలయ ప్రాంగణంలో యాగశాల, ఆంజనేయ స్వామి ఆలయం ఎదుట ముఖ మండపం, ఉత్తర రాజగోపురానికి మరమ్మతులు, ప్రాంగణంలో బండపరుపు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం మండప నిర్మాణం చేపట్టాలని తీర్మానాలు చేసినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఛైర్మన్ కంది శ్రీనివాసులు, అర్చకులు శ్యాంసుందరశర్మ, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి సమావేశంలో పాల్గొన్న ఛైర్మన్ శ్రీనివాసులు, ఈవో చంద్రశేఖర్‌రెడ్డి

నేటి నుంచి ఉత్సవాలు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: సున్నిపెంటలోని కుమారస్వామి దేవాలయంలో నేటి నుంచి కుమారస్వామి షష్టి మహోత్సవాలు జరగనున్నాయని ఆలయ పూజారి చుండీ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం, 26వ తేదీన ప్రత్యేక పూజలు చేసి స్వామి లీలా కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో జరిగిన ఫీస్ట్ మారథాన్ 5 కి.మీ పరుగు, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. స్థానిక డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో సోమవారం జిల్లా వైద్యాధికారి డా.వెంకటరమణ, ప్రోగ్రామ్ మేనేజరు అలీ హైదర్ తదితరులు పాల్గొని బహుమతులు అందించారు.

ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

జిల్లా సర్వజన ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: జిల్లా సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగరాజు, ఏసురత్నం డిమాండు చేశారు. పట్టణంలోని జిల్లా సర్వజన ఆసుపత్రి వద్ద ఆ పార్టీ నాయకులు నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. రోగులకు సరిపడా ఓపీ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, పుల్లా నరసింహులు, మహమ్మద్ గౌస్, వెంకటలింగం, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

శక్తియాప్‌తో ఆపదలో భరోసా

గడివేముల, న్యూస్‌టుడే: విద్యార్థినులు తప్పనిసరిగా శక్తి యాప్‌ను నమోదు చేసుకోవాలని శక్తి టీం సభ్యులు ప్రసాద్, వెంకటేశ్వర్లు సూచించారు. గడివేముల జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో శక్తియాప్ నంబరు 7993485111కు సమాచారం ఇస్తే పోలీసులు వెంటనే స్పందిస్తారన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యాప్‌పై అవగాహన కల్పిస్తున్న శక్తిటీం సభ్యులు

అభివృద్ధి పథంలో సున్నిపెంట

● రూ.5 కోట్లతో ఇంటింటికి తాగునీటి పైపులైన్

● సీసీ రహదారి పనులకు మరో రూ.5 కోట్లు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: సున్నిపెంట అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. శ్రీశైలం మండలంలో దాదాపు 35 వేల జనాభా కలిగిన ప్రాంతమిది. స్థానికంగా ఎక్కువ మంది పేద, మధ్య తరగతి ప్రజలే జీవిస్తున్నారు. ఇక్కడి ప్రధాన సమస్యలైన తాగునీరు, రహదారుల కోసం కూటమి ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది.

రామాలయం వీధిలో వేసిన ఇంటింటి కుళాయి

ఇక ఎదురు చూపులుండవు

తాగునీరు వచ్చినప్పుడల్లా కూలి పనులకు పోకుండా ఇంటి వద్దే ఉండి నీటిని పట్టుకోవాల్సిన పరిస్థితి. కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సమస్య తీర్చేందుకు జల్ జీవన్ మిషన్ కింద ఇంటింటికి కుళాయి పైపులైన్ వేసేందుకు రూ.5 కోట్లను మంజూరు చేయించి పనులను ప్రారంభించారు. పలు కాలనీల్లో ఇప్పటికే పనులు ప్రారంభించి 2 కి.మీ మేర పూర్తి చేశారు. దాదాపు 32 కి.మీ మేర గుత్తేదారు పనులు చేపట్టాలి. శ్రీశైలం ఆనకట్ట వద్ద అధికారులు 110 హెచ్‌పీ మోటారును బిగించనున్నారు.

తీరనున్న ట్రాఫిక్ సమస్య

సున్నిపెంట కాలనీలో ప్రధాన రహదారులు గుంతలు పడి వాహనాదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం పడితే రహదారి వాగును తలపిస్తోంది. దుకాణాలు రహదారికి ఇరువైపులా మార్గంపైకి రావడంతో సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. విషయాన్ని స్థానికులు పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీసీ రహదారుల నిర్మాణానికి ఉపాధిహామీ పథకం నిధులు రూ.5 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో అంబేద్కర్ సర్కిల్ నుంచి బస్టాండ్, బస్టాండ్ సర్కిల్ నుంచి ఆశ్రమం వరకు రెండు వరుసల రహదారి నిర్మాణానికి అధికారులు కొలతలు తీసుకున్నారు. 15 మీటర్ల వెడల్పుతో చేపట్టే ఈ పనుల్లో విభాగినులు, వాటి మధ్యలో విద్యుత్తు స్తంభాలు, మార్గానికి రెండు వైపులా కాలువలు, తాగునీటి పైపులైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

● అలాగే వెస్టన్ కాలనీ నుంచి పాలిటెక్నిక్ కళాశాల వరకు సీసీ రహదారి, రెండువైపులా డ్రైనేజి నిర్మించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. త్వరలోనే పనులు చేపట్టనున్నారు.

మృతదేహం లభ్యం

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని పొన్నాపురానికి చెందిన బాలుడు ఖాజావలి(17) మృతదేహం మంగళవారం గోస్పాడు మండలం సాంబవరం వద్ద కేసీ కాలువలో లభ్యమైనట్లు గ్రామీణ సీఐ ఈశ్వరయ్య తెలిపారు. బాలుడు సోమవారం పొన్నాపురం వద్ద కేసీ కాలువలో ప్రమాదవశాత్తు కాలు జారి గల్లంతైన విషయం తెలిసిందే. మృతుని కుటుంబ సభ్యులు, గ్రామీణ పోలీసులు కేసీ కాలువ వెంట గాలింపు చర్యలు చేపట్టగా సాంబవరం వద్ద మృతదేహం లభ్యమైంది.

అగ్నిప్రమాద ఘటనపై ఎంపీపీ విచారణ

సీతారామాపురం, (మహానంది), న్యూస్‌టుడే: మండలంలోని సీతారామాపురంలో గాజా పెద్ద వెంకటసుబ్బయ్యకు చెందిన పశువుల పాక ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు కాలిపోగా.. ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్వినీ సోమవారం విచారించారు. ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిందని బాధిత రైతు తెలిపారు. ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయాన్ని చేయించడానికి కృషిచేస్తామని ఆమె అన్నారు. సొంతంగా రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: డిసెంబరు 13న ఆత్మకూరు కోర్టు సముదాయంలో నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి సీనియర్ సివిల్ జడ్జి శోభారాణి తెలిపారు. రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ చక్కటి మార్గమన్నారు. కేసులు పరిష్కరించుకొని ప్రశాంత జీవనం గడపాలన్నారు. న్యాయవాదులు, పోలీసులు కక్షిదారులకు సరైన మార్గ నిర్దేశం చేయలన్నారు.

సంక్షిప్త సమాచారం

మహానంది: మనిషి వికాసానికి శాస్త్ర విజ్ఞానం, దైవవిశ్వాసం, రెండూ అసవరమేనని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, కవి డా.వైష్ణవ వేంకటరమణమూర్తి పేర్కొన్నారు. మహానందిలోని పరమశివుని గర్భగుడి ఎదుట సోమవారం శివలీలలు అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. దేవుణ్ణి ప్రతి ఒక్కరూ విశ్వసించాలని ఆయన చెప్పారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: పాణ్యంలోని రామస్వామి, సత్యనారాయణస్వామి ఆలయాలకు సంబంధించిన 6 గదులకు వేలం పాట నిర్వహించినట్లు ఈవో సువర్ణ తెలిపారు. సోమవారం ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నంద్యాల దేవదాయశాఖ పర్యవేక్షణ అధికారి స్వర్ణముఖి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. మూడేళ్ల కాలానికి గాను ఈ వేలం పాట నిర్వహించామన్నారు.

చెకుముకి పోటీల్లో ఆదర్శ విద్యార్థుల ప్రతిభ

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో నంద్యాలలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచి మొదటి స్థానంలో నిలిచారని ప్రిన్సిపల్ మల్లికార్జునప్ప తెలిపారు. క్రాంతినగర్‌లోని పాఠశాలలో సోమవారం ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అభినందించారు. తమ పాఠశాల విద్యార్థులు గోవర్ధన్, సారా, రజియాసుల్తానా జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

PASSPORT MISSING

I, SHAIK FAREEDA BANU, W/o. Shaik Haneef urf Nayab Mohammed Haneef, H.No: 28-759-194, NGOs Colony, Nandyal town Post and District, Andhra Pradesh - 518501, Indian. Would like to inform general public that i have lost my original passport (Passport No: N5263497, Dated: 26-11-2015) on 14-11-2025 while I was travelling in an motor bike from House to MRO office Nandyal. Inspite of my best efforts, I am unable to trace it, and it is lost beyond recovery. If anyone find in kindly contact me:

9701428742

IN THE COURT OF THE HONOURABLE III ADDITIONAL DISTRICT JUDGE: KURNOOL AT NANDYAL
G.O.P.No.13/2025

Sake Lakshmaiah ....Petitioner
V/s
To whom so ever ....Respondents

జాహిర్ నోటీసు

[illegible]

S.M.Subhani, K.Venkobha Rao,
Advocates for petitioner, Nandyal Town.
Cell: 9963920866

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం

ప్యాపిలి, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీతత్వం అలవరచుకుంటే అన్ని రంగాల్లో రాణిస్తారని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మాబాయి పేర్కొన్నారు. స్థానిక పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఎం.శ్రీకృష్ణ (తొమ్మిదో తరగతి), వెంకటకిశోర్‌కుమార్ (తొమ్మిదో తరగతి), హర్షతేజ (తొమ్మిదో తరగతి) విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఉపాధ్యాయులు సువర్ణ, కిరణ్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

పోటీతత్వంతోనే అన్ని రంగాల్లో రాణింపు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాల్సిన అవసరం ఉందని పాఠశాల డీన్ మహమ్మద్‌రఫి ఉపాధ్యాయులకు సూచించారు. నారాయణ ఆంగ్లమాధ్యమం ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా ఉపన్యాస పోటీలను నిర్వహించారు. పోటీల్లో బి.మేధాశ్రీ(తొమ్మిదో తరగతి), ఎం.నవ్యశ్రీరెడ్డి(ఎనిమిదో తరగతి), సోమ జాహ్నవి(ఏడో తరగతి) అనే విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల డీన్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ కె.ఈరన్న, ఉపాధ్యాయులు విజయ్‌భూషణ్‌రెడ్డి, చంద్రుడు బహుమతులను అందజేశారు.

పోటీల్లో ఉపన్యసిస్తున్న విద్యార్థిని

బహుమతులు అందుకున్న విజేతలతో ఉపాధ్యాయులు

రోటరీ కంటి ఆసుపత్రికి రూ.లక్ష విరాళం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో త్వరలో రోటరీ కంటి ఆసుపత్రి ఏర్పాటు చేస్తున్నారని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. దీనిద్వారా పేదలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆసుపత్రి కోసం తన వంతుగా రూ.లక్ష విరాళం అందజేశారు.

పేదలకు ఆర్థిక సాయం

బనగానపల్లి, న్యూస్‌టుడే: వసుధ ఫౌండేషన్ సేవలు మరువలేనివని తెదేపా వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు టంగుటూరి శీనయ్య పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద రోగులకు సోమవారం రూ.24 వేల చెక్కులను అందజేశారు. నాగరాజు, మల్లారెడ్డి, శరత్‌బాబు పాల్గొన్నారు.

పేరుకే జాతీయం.. నిర్వహణ అస్తవ్యస్తం

ఆళ్లగడ్డ గ్రామీణం, శిరివెళ్ల, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పరిధిలోని 40వ జాతీయ రహదారి సమస్యలకు నిలయంగా మారింది. హైవే నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో చాగలమర్రి నుంచి శిరివెళ్ల మండలంలోని గోవిందపల్లె గ్రామం వరకు సుమారు 51 కి.మీ. మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఆయా గ్రామాల వద్ద సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేశారు. హైవే నిర్వాహకులు పర్యవేక్షణ లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

బత్తలూరు వద్ద జాతీయ రహదారిపై పెరిగిన గడ్డి

పూర్తికాని సర్వీస్ రోడ్లు

● ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల గ్రామం వద్ద సర్వీస్ రోడ్డు అసంపూర్తిగా ఉంది. శివాలయం ఉండటంతో సగం వరకు నిర్మించారు. ఆ రోడ్డులో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ తిరిగేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

● కోటకందుకూరు, చింతకొమ్మదిన్నె, నల్లగట్ల, బత్తలూరు గ్రామాల వద్ద హైవే చివర్లో పెద్ద ఎత్తున గడ్డి మొక్కలు ఏపుగా పెరిగాయి. వాటిని తొలగించే చర్యలు చేపట్టడం లేదు. దీంతో ప్రమాదకర ప్రాంతాలు, వంతెనలు, కల్వర్టుల వివరాలను తెలియజేసే సూచిక బోర్డులు కనిపించడం లేదు.

● ఎస్.లింగందిన్నె సర్వీస్ రోడ్డులో రెండు వైపులా రోడ్డు ధ్వంసమైంది. గుంతల కారణంగా వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకునే వీలుంది. చింతకొమ్మదిన్నె గ్రామం వద్ద హైవేపై దీపాల ఏర్పాటు అవసరం ఉంది.

వెలగని దీపాలు

● యర్రగుంట్ల మండలంలో సర్వీస్ రోడ్ల వీధి దీపాలు వెలగక ఆరు నెలలవుతోంది. గతంలో విద్యుత్తు స్తంభాన్ని లారీ ఢీ కొట్టడంతో సమస్య ఏర్పడింది.

● యర్రగుంట్ల నుంచి వనికిన్‌దిన్నె రస్తాలో రెండు అడుగుల మేర గుంత ఏర్పడింది.

సర్వీస్ రోడ్డులో డ్రైనేజీ కాల్వలు పరిశుభ్రం చేయక చాలా కాలం అవుతోంది. దీంతో మురుగుతో నిండి అపరిశుభ్రత నెలకొంది.

● సర్వీస్ రోడ్డు నుంచి హైవేపైకి ఎక్కే ప్రదేశాల్లో ముళ్లపొదలు, గడ్డి పెరగడంతో రాకపోకలు చేసే వాహనాలు గుర్తించని దుస్థితి నెలకొంది.

అసంపూర్తి నిర్మాణంతో..

పరిశీలన

● చాగలమర్రి మండలం పెద్దబోధనం సమీపంలో రహదారి హెచ్చుతగ్గులు ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

● మల్లెవేముల రస్తాలో ఒక వైపు సర్వీస్ రోడ్డు అసంపూర్తిగా ఉంది. దీంతో ఒక వరుస లోనే వాహనాలు వెళ్లే దుస్థితి నెలకొంది.

● కలుగొట్లపల్లె వెళ్లే రహదారిలో నిర్మించిన అండర్‌పాస్‌తో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వాన నీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో నిత్యం నిల్వ ఉంటున్నాయి.

ముదిగేడులో గ్రామ సభ

ముదిగేడు (సంజామల), న్యూస్‌టుడే: ముదిగేడు గ్రామంలో సోమవారం స్వామిత్వ సర్వే కార్యక్రమంలో భాగంగా అధికారులు గ్రామసభను నిర్వహించారు. ఎంపీడీవో సాల్మన్ మాట్లాడుతూ గ్రామ కంఠంలోని ప్రతి ఇంటికి కొలతలు వేసి యాజమాన్య హక్కులు కల్పించి, ఇంటి యజమానికి పత్రం ఇస్తామన్నారు. వాటిని ఉపయోగించి అమ్మకాలు, కొనుగోలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

రుద్రవరం, న్యూస్‌టుడే: ?: నరసాపురం గ్రామం ఎస్సీ కాలనీలో మురుగు నిలిచి ఇబ్బంది పడుతున్నాం. చర్యలు తీసుకోండి. **- పాములేటి, గ్రామస్థుడు.**

✔: కాల్వ శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. **- రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి.**

?: నరసాపురం- అహోబిలం వెళ్లే రహదారిలో పాఠశాలల వద్ద వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలి. **- నరసింహులు.**

✔: పరిశీలించి వేగ నియంత్రికలను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ ఏఈ**

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ?: పాతపేటలోని కార్మిక శాఖ కార్యాలయం వీధిలో కాల్వలో వ్యర్థాలు పేరుకుపోయాయి. **- సురేష్, పాతపేట.**

✔: సిబ్బందితో వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేయిస్తాం. **- ప్రసాద్‌గౌడ్, కమిషనర్.**

?: రైల్వే స్టేషన్ రోడ్డులో ఇరువైపులా పలు చోట్ల వీధి దీపాలు కాలిపోయాయి. **- లోక్‌నాథ్‌రెడ్డి, ఉపాధ్యాయుడు.**

✔: కొత్త దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **- సురేష్, మున్సిపల్ ఏఈ.**

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ?: ఎర్రగుడి గ్రామంలో బీసీ కాలనీలో మురుగు నిలిచి దోమలకు నిలయంగా మారింది. **- రంగన్న, ఎర్రగుడి.**

✔: గ్రామంలోని సమస్యను గుర్తించి చర్యలు తీసుకుంటాం. **- నాగరాజు, ఎంపీడీవో, బనగానపల్లి.**

కోవెలకుంట్ల గ్రామీణం: ?: బిజనవేముల గ్రామం దస్తగిరిస్వామి దర్గా సమీపంలో రహదారి ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగిపోయాయి. **- హుశేని, స్థానికుడు.**

✔: పరిశీలించి పొదలు తొలగిస్తాం. **- సలీంబాషా, పంచాయతీ కార్యదర్శి.**

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

హుస్సేన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బేస్‌బాల్ పోటీలకు ఆళ్లగడ్డకు చెందిన మహమ్మద్ హుస్సేన్ ఎంపికయ్యాడు. ప్రజ్ఞ కళాశాలలో చదువుతున్న ఇతడు అండర్-19 విభాగంలో ఎంపికయ్యాడు. రైల్వేకోడూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఇతడు ప్రతిభ కనపరిచాడు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఇతడు ప్రాతినిధ్యం వహించనున్నాడు. దిల్లీలో 2026 జనవరిలో జాతీయ స్థాయిలో పాల్గొననున్నాడు. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మహేష్ బాబు, డిగ్రీ కళాశాల శివరామిరెడ్డి, పీడీ వెంకటేశ్ ఇతడికి అభినందనలు తెలిపారు.

యర్రగుంట్ల (శిరివెళ్ల), న్యూస్‌టుడే: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక పాఠశాలలో హెచ్ఎం సోమవారం మాట్లాడుతూ.. ఎనిమిదో తరగతి విద్యార్థి ఫిలిప్ అండర్-14వ విభాగం 25 కేజీల ఎస్‌జీఎఫ్ కరాటే రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. నాగకిశోర్ 50 కేజీల విభాగం ఎస్‌జీఎఫ్ తైక్వాండో జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపాడన్నారు. త్వరలో అనకాపల్లిలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనబోతున్నట్లు తెలిపారు.

ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీడీ

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం భాస్కర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన అభిషేక్‌రాజ్, అశోక్‌నాయక్‌లు ఈ నెల 22న యర్రగుంట్లలో జరిగిన జిల్లాస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

దొర్నిపాడు, న్యూస్‌టుడే: స్థానిక జిల్లా పరిషత్తు పాఠశాలకు చెందిన ప్రకాశ్ అనే విద్యార్థి తైక్వాండో పోటీల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి సోమవారం తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొని బంగారు పతకం సాధించాడు.

కేసీ ఉప కాల్వకు గండి

కేసీ కాల్వ హరివరం ఛానల్ పరిధిలోని ఉప కాల్వకు గండి పడింది. ఉయ్యాలవాడ- పడిగపాడు గ్రామాల మధ్య ముదుగుందవాగు సమీపంలో ఉప కాల్వ గండి పడటంతో నీరు వృథాగా పారుతోంది. దీంతో చివరి ఆయకట్టుకు నీరు అందటం లేదు. ఇప్పటికైనా కేసీ అధికారులు తక్షణమే స్పందించి కాల్వ గండిని పూడ్చాలని ఉయ్యాలవాడ నీటి సంఘం అధ్యక్షుడు ఆకుల చిన్నవెంకటసుబ్బయ్య కోరారు. **- న్యూస్‌టుడే, ఉయ్యాలవాడ**

మార్కెట్ కాదు.. మైదానమే

రుద్రవరం మండలం నరసాపురం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం ఇది. ఐదు ఎకరాలకు పైగా విస్తరించిన ఈ మైదానం పంట నూర్పిళ్లతో ధాన్యం కొనుగోలు కేంద్రంగా కన్పిస్తోంది. ఓ వైపు మొక్కజొన్న, మరోవైపు ధాన్యంతో మైదానం నిండిపోయింది. కల్లాలు లేకపోవడంతో గత్యంతరం లేక రైతులు ఇలా పాఠశాల మైదానాన్ని వినియోగించుకుంటున్నారు. ప్రభుత్వం రైతుల కోసం కల్లాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ, రుద్రవరం**

ప్రయాణం.. కారాదు ప్రమాదం

రహదారి ప్రమాదాలు అధికంగా జరుగుతున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. ప్రయాణాల్లో కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. ఆళ్లగడ్డ పట్టణ శివార్లలో ఓ ట్రాక్టర్ ఇంజిన్ ముందు భాగాన ప్రమాదకరంగా మహిళలు కూర్చొని ప్రయాణిస్తూ కన్పించారు. కాస్త పట్టుజారితే కింద పడితే ఊహించని ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలకు దూరంగా ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. **- న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ**

రోడ్లపై పశువులు.. రాకపోకలకు అవస్థలు

బేతంచెర్ల పట్టణంలో పాతబస్టాండు నుంచి కొత్తబస్టాండు వరకు ప్రధాన రహదారిపై పశువులు అడ్డదిడ్డంగా పడుకుంటున్నాయి. దీంతో వాహన రాకపోకలతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పశువులను రోడ్లపైకి వదలవద్దని పలుమార్లు వాటి యజమానులకు చెప్పినా పట్టించుకోక పోవడంతో రోడ్లపైనే పడుకోవడం, నిలబడి ఉండటం, పోట్లాడుకోవడం జరుగుతోంది. అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, బేతంచెర్ల**

పాముకాటుతో మహిళ అస్వస్థత

కొలుములపేట(చాగలమర్రి), న్యూస్‌టుడే: కొలుములపేట గ్రామానికి చెందిన ఓబులమ్మ పాము కాటుతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు ఓబులమ్మ అనే మహిళా రైతు సోమవారం పొలానికి వెళ్లింది. అక్కడ పనులు చేస్తుండగా పాముకాటుకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు చాగలమర్రి పట్టణంలోని కేరళ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రొద్దుటూరుకు తరలించారు.

క్రైం కార్నర్

నాలుగు ఇళ్లలో చోరీ

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పట్టణంలోని కొండపేటలో ఇంటికి తాళం వేసిన నాలుగు ఇళ్లను లక్ష్యంగా చేసిన దుండగులు నగదు, నగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం తెల్లవారుజామున కొండపేటకు చెందిన లక్ష్మీదేవి, దస్తగిరి, సుధారాణి, బ్రహ్మారెడ్డి ఇళ్లకు తాళం వేసి వారి పనుల నిమిత్తం వేరే ఊళ్లకు వెళ్లారు. దీన్ని గమనించిన దుండగులు తాళాలు పగులగొట్టి ఇళ్లలోకి ప్రవేశించి సొత్తును చోరీ చేసుకుని వెళ్లిపోయారు. నాలుగు ఇళ్లలో రూ.68 వేల నగదు, 25 తులాల వెండి, 8 తులాల బంగారు నగలు చోరీ అయినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

చాగలమర్రి పట్టణంలో..

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలోని రిక్వెస్ట్ స్టేజీ సమీపంలో కూలూరు రహదారిలో చిల్లర దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్న దుకాణాల్లో దుండగులు ఆదివారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. రమణయ్యకు చెందిన దుకాణంలో రూ.5వేల విలువ చేసే సరకులు, రూ.4వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. గోవిందమ్మ బంకు తాళాలు పగులగొట్టారు. విలువైన వస్తువులు లేకపోవడంతో వదిలేసి వెళ్లారు. విషయాన్ని బాధితులు పోలీసులకు తెలియజేశారు.

అన్నదాతల అభ్యున్నతే ధ్యేయం

డోన్: యు.కొత్తపల్లెలో కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

బేతంచెర్ల: వృద్ధురాలికి కరపత్రాన్ని అందిస్తున్న ఏవో విజయ్‌కుమార్‌రెడ్డి

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. సోమవారం వివిధ గ్రామాల్లో 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సిబ్బంది రైతుల ఇళ్లకు వెళ్లి పలు సాగు అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. పురుగుల మందు వాడకంలో నష్టాలు, డిమాండు ఆధారిత పంట సాగు, ఫుడ్ ప్రాసెసింగ్, నీటి భద్రత తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

- న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ, ఆళ్లగడ్డ గ్రామీణం, కోవెలకుంట్ల, కోవెలకుంట్ల గ్రామీణం, బనగానపల్లి, బనగానపల్లి గ్రామీణం, సంజామల, చాగలమర్రి, డోన్, రుద్రవరం

ఆళ్లగడ్డ గ్రామీణం: అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్న ఏవో కిశోర్‌కుమార్

కోవెలకుంట్ల: రైతులతో వ్యవసాయ శాఖ అధికారులు

నరసింహారెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: ప్రతి పౌరుడు అమర వీరుల త్యాగాలను మరువకూడదని ఆళ్లగడ్డ నియోజకవర్గం మిత్రమా సేవా సమితి అధ్యక్షుడు ఆలమూరు గోవిందరెడ్డి అన్నారు. ఉయ్యాలవాడలో సోమవారం స్వాతంత్ర్య సమరయోధుడు నరసింహారెడ్డి జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి గ్రామస్థులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న గోవిందరెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: రాబోయే స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని తెదేపా యువ నాయకుడు కోట్ల రాఘవేంద్రారెడ్డి తెలిపారు. స్థానిక తెదేపా కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రతి కార్యకర్త శ్రద్ధ, సమయపాలన, సమన్వయంతో వ్యవహరించాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు కేసీ హరి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొట్రికె ఫణిరాజ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొట్రికె హరికిషన్, పట్టణ అధ్యక్షుడు టీఈ రాఘవేంద్రారెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కోట్ల రాఘవేంద్రారెడ్డి

మహిళల హక్కుల కోసం ఉద్యమిస్తాం

సమావేశంలో మాట్లాడుతున్న శ్రావణి

డోన్, న్యూస్‌టుడే: మహిళల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రావణి అన్నారు. సోమవారం మహిళా సమాఖ్య కార్యాలయంలో జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షురాలుగా ఎస్తేరమ్మ, అధ్యక్షురాలిగా ప్రమీల, కార్యదర్శిగా లక్ష్మీదేవి తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రజిత, లక్ష్మీదేవి, నక్కిబాలమ్మ, హసీనా, అమృతారెడ్డి, మాధవి పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

ప్యాపిలి, న్యూస్‌టుడే: ప్రస్తుతం సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వెంకట్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం ప్యాపిలి, బూరుగలలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకసారి పోటీ పరీక్ష నిర్వహించి అందులో ఉత్తీర్ణులై ప్రభుత్వ విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు మళ్లీ అర్హత పరీక్ష నిర్వహించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో చిన్నపరెడ్డి, కిరణ్‌కుమార్, చంద్రమౌళి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు చేపడుతున్న ఎస్టీయూ నాయకులు

ఎయిడ్స్ నిర్మూలన అత్యవసరం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులను డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎయిడ్స్ నిర్మూలన సమాజానికి అత్యవసరం అన్నారు.



విద్యార్థినికి నగదు బహుమతి అందిస్తున్న డా.వెంకటరమణ

అతివ.. ఆర్థిక స్వావలంబన

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మహిళలు సంఘాలుగా ఏర్పడి పొదుపు బాట పడుతున్నారు. వారికి మెప్మా, డీఆర్‌డీఏ ఇచ్చే రుణాలు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక స్వావలంబన దిశగా రాణిస్తున్నారు. ఇళ్లలోనే చిన్నపాటి పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని పేదరికాన్ని జయించడమే కాదు, పలువురికి ఉపాధి కల్పిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. బేతంచెర్ల పట్టణంలోని మహిళ స్వయం ఉపాధిపై కథనం.

కుటుంబానికి ఆసరాగా నిలుస్తూ..

- కుల్లాయమ్మ, పిండిజిన్ను వీధి

బేతంచెర్ల పట్టణం పిండిజిన్ను వీధిలో నివాసం ఉంటున్న పొదుపు మహిళ కుల్లాయమ్మ.. లక్ష్మీవెంకటేశ్వర పొదుపు సంఘాన్ని పదేళ్ల కిందట ఏర్పాటుచేశారు. మొదట రూ.10 వేల ప్రకారం రుణం తీసుకుని చీరల వ్యాపారం మొదలు పెట్టారు. ఆ వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయంతో అప్పులు తీర్చి మళ్లీ రూ.50 వేలు, రూ.లక్ష ఒకసారి, రూ.1.50 లక్షల ప్రకారం మూడు సార్లు రుణం పొందారు. ఇలా తీసుకున్న రుణాలను వృథా చేయకుండా వ్యాపారానికి ఉపయోగించి ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ఖర్చులు పోనూ నెలకు రూ.10 నుంచి రూ.12 వేలకుపైగా ఆదా అవుతోందని, ఇది తన కుటుంబానికి ఆసరాగా ఉపయోగపడుతోందని చెబుతున్నారు కుల్లాయమ్మ.

పలువురికి ఉపాధి

- ప్రమీలమ్మ, బేతంచెర్ల

బేతంచెర్లకు చెందిన ప్రమీలమ్మ 15 ఏళ్ల కిందట గణేష్ పొదుపు సంఘంలో సభ్యురాలిగా చేరి రుణం తీసుకొని స్వీట్లు తయారీ చేయడం ప్రారంభించారు. ఈమె ఉపాధి పొందటంతో పాటు పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు. పొదుపు రుణంతో గ్రామంలో మొదట్లో చిన్న బజ్జీల బండి ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతూ జీవనం కొనసాగిస్తూ వ్యాపారాన్ని ప్రారంభించారు.

బ్యాంకు రుణం రూ.లక్ష, స్త్రీనిధి రూ.50 వేలు, ఆసరా కింద రూ.36 వేలు, పొదుపు రుణం రూ.లక్ష, ఉన్నతి రుణం రూ.50 వేలు.. ఇలా వివిధ రకాల రుణాలను తీసుకొని క్రమం తప్పకుండా చెల్లిస్తూ కొత్త రుణాలు తీసుకొని స్వీట్ల తయారీ వ్యాపారం చేశారు. కూలీలు, ఖర్చులు పోనూ నెలకు రూ.20 నుంచి రూ.25 వేల వరకుపైగా ఆదాయం పొందుతున్నారు. తానే కాకుండా పలువురికి ఉపాధి మార్గాన్ని కల్పిస్తున్నట్లు చెబుతున్నారు ప్రమీలమ్మ.

సంక్షిప్త సమాచారం

చాగలమర్రి, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ఉండే అన్ని రాష్ట్రాల్లో గవర్నర్ల వ్యవస్థ, శాసన మండలి వ్యవస్థను రద్దు చేయాలని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షులు కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పట్టణంలోని రామాలయంలో సోమవారం అయ్యప్ప దీక్షలో ఉన్న స్వాములకు వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమా కిశోర్‌రెడ్డి అన్నదానం నిర్వహించారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: ఎస్.రంగాపురం గ్రామంలో పొలం తగాదా విషయంలో బి.నరేష్‌పై దాడి చేయడంతో టి.ఆంజనేయులు, పెద్ద రామాంజినేయులు, నాగార్జున, నాగరాజులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుసూదన తెలిపారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: కొలిమిగుండ్లలోని కాలభైరవ దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు గంటను దొంగలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: మున్సిపాలిటీ కార్యాలయంలో వీఆర్వోలు, శానిటరీ సెక్రెటరీలతో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ సోమవారం సమావేశం నిర్వహించారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఇందిరానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ సోమవారం పరిశీలించారు. కేంద్రంలో విద్యార్థుల హాజరు శాతం, భోజనాన్ని పరిశీలించారు.

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి సమీపంలోని మాదాసుపల్లె కొండల్లో కోడి పందేలు ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు సీఐ ప్రవీణ్ కుమార్ సోమవారం తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచామన్నారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: రైతులు తప్పనిసరిగా ఆయా రైతు సేవా కేంద్రాల్లో ఈకేవైసీ నమోదు చేసుకోవాలని ఏవో సుధాకర్ సోమవారం తెలిపారు. మండల కేంద్రంలోని 2వ ఆర్ఎస్‌కేను ఏవో తనిఖీ చేసి పలు దస్త్రాలను పరిశీలించారు. రైతులు తాము సాగు చేసిన పంటలను ఈ-పంటగా నమోదు చేయించుకోవాలన్నారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆధ్యాత్మికత మనిషికి సంపూర్ణ ఆనందాన్నిస్తుందని పట్టణ సీఐ యుగంధర్ అన్నారు. సోమవారం ఆదిశంకరాచార్యుల ఆలయంలో ఆయన భగవద్గీత గొప్పదనాన్ని వివరించారు.

డి.కొత్తపల్లె(చాగలమర్రి), న్యూస్‌టుడే: సనాతన, హిందూ ధర్మం గొప్పతనం ప్రతి ఒక్కరూ తెలుసుకుని ధర్మమార్గంలో జీవనం సాగించాలని అభినవ శంకరానందస్వామి తెలియజేశారు. డి.కొత్తపల్లె గ్రామంలో హిందూ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపించారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: మండలంలోని గుల్లదుర్తి గ్రామం సీతారామ ఆశ్రమంలో సోమవారం చిన్నమ్మ 69వ ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పాల్గొని పూజలు చేశారు. శంకరానందస్వామి ఉపన్యసించారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: భగవాన్ సత్యసాయి బాబా ఆశయాలను అనుగుణంగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పూదోట ఆశ్రమ నిర్వాహకులు గుండా గోపాల్ పేర్కొన్నారు

(c) eenadu

ఈనాడు
పల్నాడు
మంగళవారం నవంబరు 25, 2025

ఆదరువు లేదు.. ఆదుకోండి

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, నరసరావుపేట టౌన్

కలెక్టరేట్‌లో వృద్ధుల అర్జీలు

పింఛన్ రావడం లేదని కొందరు.. ఇల్లు లేదని మరికొందరు వృద్ధులు, మహిళలు కలెక్టరేట్లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని విన్నవించారు.

పింఛన్ ఇప్పించండి.. 'కాలికి గాయమైంది. మధుమేహంతో అది కాలు మొత్తానికి పాకింది. ఏడాది కిందట వైద్యులు కాలు తొలగించారు. అప్పటినుంచి పనికి వెళ్లలేక ఇబ్బందిపడుతున్నా. నా భార్యే కుటుంబానికి ఆదరువు. సదరం ధ్రువపత్రం కూడా ఉంది. పింఛన్ కోసం సచివాలయం, తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరిగా.. అయినా రాలేదు. అందుకే కలెక్టరేట్‌కు వచ్చా. పింఛను వచ్చేలా చూడాలి' అని యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామానికి చెందిన చలమలపల్లి వెంకటేశ్వరరావు విన్నవించారు.

పరిహారం అందలేదు.. 'ఆగస్టు 8న కురిసిన భారీ వర్షానికి మా ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో లేకపోవడంతో మాకేం జరగలేదు. ఇల్లు కూలడంతో ఆదరువు లేకుండా పోయింది. ఇంత వరకు పరిహారం రాలేదు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందితే ఇల్లు నిర్మించుకుంటాం' అని సత్తెనపల్లి 7వ వార్డుకు చెందిన **మల్లేశ్వరరావు** తెలిపారు.

స్థలాన్ని ఆక్రమించారు.. 'మాకు సర్వే నంబరు 157లో ఎనిమిది సెంట్ల స్థలం ఉంది. ఆర్థిక పరిస్థితి బాగా లేక ఏలూరు వలస వెళ్లాం. అప్పుడప్పుడు వస్తుంటాం. ఇటీవల గ్రామానికొచ్చి చూసేసరికి చుట్టుపక్కల వారు మా స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఒంటరి మహిళను. అదే ఆదరువు. స్థలాన్ని కాపాడి మాకు ఇప్పించాలి' అని నకరికల్లు మండలం చీమలమర్రికి చెందిన కె.కోటేశ్వరమ్మ విన్నవించారు.

సాగులో నవ్యతతో లాభాల బాట

విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

నాదెండ్ల (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: నూతన సాగు విధానాలతో రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపేలా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం నాదెండ్లలో రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న నూతన సాగు విధానాలు, అందించే రాయితీలు, ప్రోత్సాహకాల్ని వివరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. పత్తి, మిరప తదితర సంప్రదాయ పంటల సాగుతో నష్టపోతున్న రైతులు కొత్త సాగు విధానాలపై దృష్టిపెట్టాలన్నారు. ప్రభుత్వం రాయితీపై అందించిన శనగ విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావు, ఏడీఏ శ్రీనివాసరావు, జనసేన ఇన్‌ఛార్జి తోట రాజారమేష్, నెల్లూరి సదాశివరావు, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పటిష్ఠ భద్రత

సత్తెనపల్లి, దుర్గి, న్యూస్‌టుడే

దుర్గి ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో జిల్లాలోని అన్ని ఆలయాల్లో పటిష్ఠ భద్రత ఏర్పాటుచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటివరకు ఆలయాల్లో ఒకటి, రెండు సీసీ కెమెరాలు ఉన్నా సరిగ్గా పనిచేయవు. వాటిని పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. ఒకవైపే కాకుండా ఆలయానికి నలువైపులా భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు గుర్తించేలా కెమెరాలు ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ నిర్ణయించింది.

జిల్లాలో ఇలా..

దేవాదాయ శాఖ పర్యవేక్షణలోని ఆలయాలు: 881

ఇప్పటికే ఆలయాల్లో ఏర్పాటైన సీసీ కెమెరాలు : 1,155

కొత్తగా ఏర్పాటు చేయబోతున్నవి: 2,268

❖ కోటప్పకొండ, అమరావతి, చేబ్రోలు, వైద, దుర్గి, నర్సింగపాడు, సత్తెశాల, మాచర్ల, కారంపూడి, కొండవీడు, దేవరంపాడుతో పాటు ప్రధాన ఆలయాల్లో నిఘా వ్యవస్థను మెరుగుపర్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆలయాల్లో దేవాదాయ శాఖ అధికారులు సందర్శించి నూతనంగా ఎన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందో పరిశీలన చేశారు. పాతవి, కొత్తగా ఏర్పాటుచేసే సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంతో అనుసంధానం చేయనున్నారు.

❖ పండగలు, తిరునాళ్లు, వార్షికోత్సవాల సమయంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, భద్రతాపరమైన ఏర్పాట్లను మరింత పకడ్బందీగా ఏర్పాటు చేస్తామని దేవాదాయ శాఖ జిల్లా పర్యవేక్షకాధికారి శ్రీనివాస్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

బాల ఉషస్సు.. భావి యశస్సు 6లో

వీఆర్‌కు వెల్దుర్తి ఎస్సై సమందర్‌వలీ

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి ఎస్సై సమందర్‌వలీని పోలీసు ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపారు. 'ఓ కేసు సెటిల్‌మెంట్ విషయంలో రూ.50 లక్షలు డిమాండ్ చేయడం.. వెల్దుర్తిలో జరిగిన బ్రహ్మారెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్‌కు సీఎం హాజరైనా అందుబాటులో లేకపోవడం.. గుండ్లపాడులో తెదేపా నేతల హత్య కేసులో నిందితులు వాడిన కార్లు డ్రైవరు అమ్ముకోవడం' వంటి విషయాలను 'ఈనాడు' వెలుగులోకి తీసుకొచ్చింది. పోలీసుల విచారణలోనూ ఎస్సై హస్తం ఉన్నట్లు తేలడంతో అతన్ని జిల్లా పోలీసు కార్యాలయానికి అటాచ్ చేశారు. ప్రస్తుతానికి విజయపురి సౌత్ ఎస్సై అశోక్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

Expert Advice Exclusive Properties
ప్రవేశం ఉచితం
EENADU PROPERTY SHOW 2025
29th - 30th November-2025 Saturday - Sunday
Timing: 10am - 8pm
Place: A.Convention Centre, Bunder Road, Vijayawada
Time: 10 AM to 8 PM
For Details Contact
80080 03297, 74168 34488

సిద్ధమైన మైదానాలు

వాలీబాల్ పోటీలకు సర్వం సిద్ధం

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, పీడీ ఈదర ఆదిబాబు సోమవారం తెలిపారు. కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో నాకౌట్ కమ్ లీగ్ పద్ధతిలో నిర్వహించే పోటీలకు కోర్టులు సిద్ధం చేశారు. వివిధ ప్రాంతాల క్రీడాకారులు ఇప్పటికే చేరుకున్నారు. మంగళవారం నుంచి మూడ్రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో మెరిసిన సమీర

సౌత్ జోన్‌కు ఎంపిక

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని రాధా డిగ్రీ కళాశాల మొదటి ఏడాది విద్యార్థిని ఆకుమల్ల సమీర సౌత్‌జోన్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. తమిళనాడులోని తెన్‌కాశిలో ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహించే 44వ సౌత్‌జోన్ పోటీల్లో మన రాష్ట్ర జట్టు తరపున పాల్గొననుంది. రాష్ట్ర జట్టుకు తిరుపతిలో సోమవారం ప్రారంభమైన శిక్షణకు ఆమె హాజరైంది. ఆమెను కళాశాల డైరెక్టర్ కేవీ రాధాకృష్ణమూర్తి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, అధ్యక్షుడు శివశంకర్, సంయుక్త కార్యదర్శి జోనానాయక్ అభినందించారు.

వాహనం ఆగిందా.. డీజిల్ గోవిందా!

న్యూస్‌టుడే, నరసరావుపేట

సత్తెనపల్లి పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్లో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీలో నుంచి ఈ నెల 7న 200 లీటర్ల డీజిల్‌ను దొంగల ముఠా చోరీ చేసింది. కొన్ని రోజుల కిందట ఇలాగే పెట్రోల్ బంకు వద్ద నుంచి లారీల్లో డీజిల్ చోరీ చేశారు.

సత్తెనపల్లి, పెదకూరపాడు, గురజాల, నరసరావుపేట తదితర నియోజకవర్గాల్లో రహదారుల పక్కన ఆగి ఉన్న పెద్ద వాహనాల నుంచి డీజిల్‌ను దొంగల ముఠా చోరీ చేస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన లారీలు, వ్యాన్లు పల్నాడులో తిరుగుతుంటాయి. రాత్రివేళ రహదారుల పక్కన నిలుపుదల చేసి మరుసటి రోజు పొరుగు రాష్ట్రాలకు ప్రయాణం సాగిస్తుంటారు. వాటితోపాటు స్థానిక వాహనాలను దొంగలు లక్ష్యంగా చేసుకుని డీజిల్ అపహరిస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో లీటరు డీజిల్ ధర రూ.98గా ఉంది. ఒక్కో వాహనం నుంచి 50 నుంచి 200 లీటర్ల మేర దొంగిలిస్తున్నారు. పెట్రోలు బంకులు, జాతీయ రహదారులు, దాబాల వద్ద నిలిపిన వాహనాల నుంచి ఇటీవల డీజిల్ చోరీ ఎక్కువగా జరుగుతోంది.

జైలుకు పంపినా తీరు మారలేదు

ఒక ముఠా రెక్కీ నిర్వహించి.. డీజిల్ చోరీ చేయడంలో ఆరితేరినట్లు పోలీసులు చెబుతున్నారు. గతంలో వారిని అరెస్టు చేసి జైలుకు పంపినా తీరు మారలేదని ఇటీవల వెలుగుచూసిన చోరీలే నిదర్శనం. క్రోసూరు, అమరావతి మండలాలకు చెందిన కొందరు పాత నేరస్థులు డీజిల్ చోరీలకు పాల్పడుతున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఏడుగురి ముఠాలో ఇద్దరిని ఇటీవలే అరెస్టు చేసి జైలుకు పంపించారు. చోరీ చేసిన చమురు తక్కువ ధరకు అమ్మి వచ్చిన డబ్బులతో విలాసంగా గడిపేందుకు ఆ ముఠా కొన్ని రోజుల పాటు అజ్ఞాతంలోకి వెళ్తున్నట్లు తెలుస్తోంది. వారి ఆట కట్టించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పోలీసు అధికారులు చెబుతున్నారు. వాహనాల్లో డీజిల్ చోరీ అవకుండా యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

'వంద'తో శత శాతం ఉత్తీర్ణత!

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే

జిల్లాలో పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యా శాఖ వంద రోజుల కార్యాచరణ అమలు చేస్తోంది. డిసెంబరు 6 నుంచి మార్చి 15వ తేదీ వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించనుంది. వెనుకబడిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు వీలుగా కలెక్టర్ చొరవతో జిల్లా విద్యా శాఖ ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్ తయారు చేసింది. దీనిని ఉపయోగించి బోధన చేసేందుకు జిల్లాలో మూడు వేల మంది ఉపాధ్యాయులకు వారం పాటు శిక్షణ తరగతులు నిర్వహించింది.

పది విద్యార్థుల సంఖ్య:	25658
ప్రభుత్వ పాఠశాలల వారు:	14920
ప్రైవేటు పాఠశాలల వారు :	10738
గతేడాది ఉత్తీర్ణత శాతం:	88
రాష్ట్రంలో జిల్లా స్థానం	11

డిసెంబరు 6 నుంచి మార్చి 15 వరకు ప్రత్యేక కార్యాచరణ

ప్రణాళిక ఇలా.. పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. తరగతిలో సబ్జెక్టుల వారీగా వెనకబడిన విద్యార్థుల బాధ్యత ఆయా సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయుడికే అప్పగిస్తారు. ఈనెలాఖరుకు సిలబస్ పూర్తి చేయనున్నారు. అనంతరం ప్రతి రోజు సబ్జెక్టుల వారీగా రెండు ప్రశ్నలు చదివించడం, రాయించడం చేస్తారు. విద్యార్థులు చదివింది మర్చిపోకుండా పునశ్చరణ చేయిస్తారు.

ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో డీఈవో చంద్రకళ

ప్రధాన అంశం హాజరు.. వంద రోజుల ప్రణాళికలో ప్రధాన అంశం పరీక్షల వరకు విద్యార్థులు తప్పనిసరిగా పాఠశాలకు హాజరయ్యేలా చూడటమని డీఈవో చంద్రకళ అన్నారు. ఇందుకు డిసెంబరు 5న తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి.. రోజూ పిల్లలను పాఠశాలలకు పంపేలా చూడాలని చెబుతామన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన స్టడీ మెటీరియల్ ఇప్పటికే విద్యార్థులకు అందజేశామని తెలిపారు. వంద రోజులు పూర్తిస్థాయిలో తరగతులు నిర్వహించి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తామని వివరించారు.

సరిహద్దులు దాటుతున్న ఇసుక

పల్నాడు మీదుగా తెలంగాణకు అక్రమ రవాణా

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

ఉచిత ఇసుకను అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఏకంగా సరిహద్దులు దాటించేసి అమ్ముకుంటున్నారు. తెలంగాణ- ఆంధ్ర సరిహద్దు వాడపల్లి చెక్‌పోస్టు వద్ద ఇటీవల వరుసగా ఇసుక లారీలు పట్టుపడుతున్నాయి. ఈ నెల 22న ఏకంగా ఏడింటిని పోలీసులు పట్టుకున్నారంటే అక్రమ రవాణా ఎంతలా జరుగుతుందో అర్థమవుతుంది. గుంటూరు జిల్లా తుళ్లూరు, పల్నాడు జిల్లా అమరావతి పరిసర ప్రాంతాల నుంచే అక్రమ రవాణా సాగుతున్నట్లు తెలంగాణ పోలీసులు గుర్తించారు. లారీలు జిల్లాలో ఎక్కువ దూరం ప్రయాణించి తెలంగాణలోకి వెళ్తున్నా మన పోలీసులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.

అక్కడ డిమాండ్.. తెలంగాణలో టన్ను ఇసుక ప్రభుత్వ ధర రూ.1350 ఉండగా, బయట మార్కెట్‌లో రూ.1600 ఉంది. ప్రభుత్వ ఇసుకను ఇందిరమ్మ ఇళ్లకే వాడుతున్నారు. మరోపక్క రీచ్‌లు తక్కువ. కృష్ణా, మూసీ నదుల ప్రవాహంతో ఇసుక లభ్యత తక్కువ ఉండటంతో డిమాండ్ పెరిగింది. ఇక్కడి ఇసుక నాణ్యత బాగుండటంతో కొందరు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ టన్ను ఇసుక రూ.వెయ్యి ఉంటే.. తెలంగాణలో రూ.1800కు అమ్ముతున్నారు.

ఇటీవల పట్టుపడ్డ ఇసుక లారీలు

వైకాపా నేతల దందా

పిడుగురాళ్ల, కారంపూడి, దాచేపల్లి మండలాలకు చెందిన వైకాపా నాయకులు, మరికొందరు ఈ ఇసుక దందా నడిపిస్తున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. వీరే ఇసుక లారీలు తెలంగాణకు పంపించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. స్థానికంగా అటు మైనింగ్, ఇటు పోలీసులకు వాటాలు ఇస్తూ సరిహద్దులు దాటిస్తున్నారు. అయితే పొందుగుల.. లేకపోతే తంగెడ మీదుగా ఇసుక లారీలను తెలంగాణకు పంపిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి అక్రమ రవాణా జరగకుండా కొంతమంది సిబ్బందిని నియమించినా వారికి కూడా వాటాలు ఇవ్వడంతో తంతు యథేచ్ఛగా సాగుతున్నట్లు తెలిసింది.

వలస జీవులకు భరోసా

జిల్లాలో మూడువైపులా పారిశ్రామికవాడలతో ఉపాధి

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, చిలకలూరిపేటగ్రామీణ, దాచేపల్లి, వినుకొండ

జిల్లాలో ఎంతోమందికి ఉపాధి లభిస్తోంది. చిలకలూరిపేటలో పత్తి ఆధారిత పరిశ్రమలు.. మాచర్ల, గురజాలలో సిమెంట్ పరిశ్రమలు.. వినుకొండలో కందిపప్పు మిల్లులు.. పిడుగురాళ్లలో సున్నపు పరిశ్రమలు ఎంతోమందికి పని కల్పిస్తున్నాయి. పొట్టకూటికి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారిని నిరాశపరచకుండా ఎక్కడో ఒకచోట పని దొరుకుతోంది. అందుకే జిల్లాను జీడీపీ వృద్ధిరేటులో వ్యవసాయం తర్వాత పారిశ్రామిక రంగం ఆదుకుంటోంది. వలస వచ్చిన ఒడిశా, బిహార్, బెంగాల్ వాసులకు జిల్లాలో ఉపాధి లభిస్తున్న తీరుతెన్నులు తెలుసుకుందాం.



సిమెంటు పరిశ్రమలు.. గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో మొత్తం ఏడు సిమెంటు పరిశ్రమలున్నాయి. కృష్ణానదీ తీరం. సున్నపురాయి గనులు ఉండటంతో ఈ ప్రాంతంలో సిమెంటు పరిశ్రమలు వెలిశాయి. స్థానిక యువతకు ఉపాధి ఇస్తున్నాయి. భారీసంఖ్యలో ఉత్తరాది వాసులు ఇక్కడ పనిచేస్తున్నారు. బిహార్, యూపీ, బెంగాల్ వాళ్లు అధికంగా ఉన్నారు.

రాష్ట్రంలోనే అధికంగా ఇక్కడే.. వినుకొండ పరిసర ప్రాంతాల్లో కందిపప్పు మిల్లులు సుమారు 50 వరకు ఉన్నాయి. ఇక్కడ కూడా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉపాధి పొందుతున్నారు. రాష్ట్రంలో పలుచోట్ల పండే కందులు ఇక్కడకు వచ్చి పప్పుగా మారతాయి.

జిల్లాకు పారిశ్రామికంగా వస్తున్న ఆదాయం(2024-25): రూ.8,827 కోట్లు

పెద్ద పరిశ్రమలతో ఉపాధి పొందుతున్నవారు: 80 వేల మంది

వలసజీవులు: 70 వేల మంది

పత్తి ఆధారిత పరిశ్రమలు.. మూడో అతిపెద్ద పారిశ్రామిక వాడగా చిలకలూరిపేట నియోజకవర్గంలోని పత్తి ఆధారిత పరిశ్రమలతో పాటు గ్రానైట్ పరిశ్రమలు ఉన్నాయి. స్పిన్నింగ్: 16, జిన్నింగ్: 13, కాటన్ ఆయిల్ మిల్లులు: 6, టెక్స్‌టైల్ 13 మొత్తం 48 వరకు భారీ మిల్లులున్నాయి. సుమారు 25 వేల మంది ఉపాధి పొందుతున్నారు. ఎక్కువగా ఉత్తరాంధ్ర, ఒడిశా వాసులు పనిచేస్తుంటారు. గ్రానైట్ కంపెనీలు 150 ఉన్నాయి. వీటికి సంబంధించి క్వారీలు 10 వరకు ఉన్నాయి. ఇందులో సుమారు 2500 మంది పనిచేస్తున్నారు.

చిలకలూరిపేటలో స్పిన్నింగ్ మిల్లు

ప్రత్యేక అవసరాల బాలలకు ఊరట

సంతగుడిపాడు (రొంపిచర్ల), న్యూస్‌టుడే

2025-26 విద్యా సంవత్సరానికి నిధులు విడుదల

భవిత కేంద్రాల్లో శిక్షణ పొందుతున్న ప్రత్యేక అవసరాల పిల్లలకు ఇవ్వాల్సిన వివిధ రకాల భత్యాలను కూటమి ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. 2025-26 విద్యా సంవత్సరం అయిదు నెలలకు జిల్లా వ్యాప్తంగా 1,491 మందికి వివిధ రకాల భత్యాల కింద రూ.31.25 లక్షలు మంజూరు చేశారు.

జిల్లాలో 28 భవిత కేంద్రాలు ఉండగా.. ప్రత్యేక ఉపాధ్యాయులు 56 మంది, ఆయాలు 28 మంది పని చేస్తున్నారు. సహాయకులు 332 మంది, ఇంట్లో ఉండి చదువుకునే వారు 218 మంది, బాలికలు 674 మంది, రవాణా భత్యం 267 మందికి సాయం అందనుంది.

భత్యాల చెల్లింపు ఇలా..

ప్రతి నెలా రూ.600 రవాణా భత్యం. సహాయకుల భృతి ఏడాదికి రూ.6 వేలు. బాలికలకు ఉపకార వేతనం సంవత్సరానికి రూ.2 వేలు. ఇంటి వద్దే చదువుకునే వారికి నెలకు రూ.600. ❖ భవిత కేంద్రాలకు ప్రత్యేక అవసరాల విద్యార్థులను తీసుకొచ్చే వారికి విభాగాల వారీగా నిధులు విడుదలయ్యాయని జిల్లా సహిత విద్య సమన్వయకర్త సెల్వరాజ్ తెలిపారు. వాటిని తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేశారన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

ఈపూరు, న్యూస్‌టుడే: వ్యవసాయాభివృద్ధి, రైతుల సంక్షేమం లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని రాష్ట్ర సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టరు రాపర్ల జగ్గారావు అన్నారు. ఈపూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని ముప్పాళ్ల, ఈపూరు, అంగలూరు, కొండ్రముట్ల రైతు సేవాకేంద్రాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ముప్పాళ్లలో కొనుగోలు కేంద్రాన్ని జగ్గారావు, అంగలూరులో కొనుగోలు కేంద్రాన్ని నర్రా కిషోర్ ప్రారంభించారు. అనంతరం ఆయా కేంద్రాల వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాలుకు రూ.2,389.. సాధారణ రకానికి రూ.2,369 చొప్పున రైతులకు చెల్లిస్తారని సొసైటీ సీఈవో పోకా కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఈపూరు సొసైటీ ఛైర్‌పర్సన్ విడపలపాటి హనుమయ్య, పులుకూరి నాగార్జున, సూరే కోటేశ్వరరావు, అంగలూరు వీఏహెచ్ నాగరాజు పాల్గొన్నారు.

సొంత బిడ్డలా.. ఆడబిడ్డకు అండగా..

యోగా క్రీడాకారిణికి జడ అల్లుతున్న బామ్మ

చిత్రంలో బామ్మ జడవేస్తున్నది తన మనవరాలికి అనుకుంటున్నారా? కాదు.. ఆ బాలిక ఓ యోగా క్రీడాకారిణి. ఏంటీ కథ అనుకుంటున్నారా.. చందలూరులో ప్రస్తుతం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి యోగా పోటీలు జరుగుతున్నాయి. వీటిలో పాల్గొనేందుకు ఉమ్మడి 13 జిల్లాల నుంచి బాలబాలికలు వచ్చారు. బాలురకు వద్దవల్లి శేషయ్య, అడ్డగడ్డ భద్రయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో వసతి కల్పించారు. బాలికలకు మాత్రం గ్రామంలో 25 ఇళ్లను ఎంపిక చేసి, వసతి ఏర్పాట్లుచేశారు. ఓ గృహంలోని సుమారు 80 ఏళ్ల వృద్ధురాలు ఇంటికి మనవరాలు వచ్చినట్లు.. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన బాలికకు ప్రేమగా జడ వేయడం, క్రీడాకారిణులతో ఆప్యాయంగా మాట్లాడుతున్న దృశ్యాలను 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.

– న్యూస్‌టుడే, చందలూరు (అద్దంకి, జె.పంగులూరు)

రేషన్ బండి.. బడ్డీకొట్టుగా మారిందండి

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసేందుకు రూ.1.50 లక్షలతో ఔత్సాహికులు వాహనం తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ వాహనాలు నిలిపేసింది. దీంతో చందోలుకు చెందిన ఒక వ్యక్తి రేషన్ వాహనాన్ని దుకాణంగా మార్చుకుని అందులో నిత్యావసరాలు, శీతల పానీయాలు విక్రయిస్తున్నారు. బ్యాంకులో రుణం ఉందని.. అది చెల్లించేందుకు ఉపాధి నిమిత్తం వాహనాన్ని ఇలా మార్పు చేసినట్లు తెలిపారు.

- న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం

మిరప మిలమిల

ఈనాడు – అమరావతి

క్వింటా రూ.20 వేలకు చేరే అవకాశం

రెండేళ్లుగా చతికిలపడిన ఎండు మిర్చి ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. క్వింటాలు రూ.20 వేల మార్కును తాకే అవకాశం కనిపిస్తుండడంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. శీతల గోదాముల్లో నిల్వలు క్రమంగా తగ్గిపోతుండడం, కొత్త పంట మార్కెట్‌కు పెద్దగా రాదన్న సంకేతాలే దీనికి ప్రధాన కారణం. మనరాష్ట్రంతోపాటు తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వర్షాల వల్ల దిగుబడులు ప్రభావితమవుతాయన్న అంచనాలున్నాయి. కర్ణాటకలో సాగు విస్తీర్ణం తగ్గడంతో ఏటా మాదిరిగా ఈసారి యార్డుకు సరకు వస్తుందా? రాదా? అన్న మీమాంస మార్కెట్‌ను ప్రభావితం చేస్తోంది. ఈ నేపథ్యంలో అక్టోబరులో మొదలైన మార్కెట్ చలనం నవంబరులోనూ కొనసాగుతోంది. ప్రత్యేక రకాల ధరలు అనూహ్యంగా పెరుగుదల నమోదు చేస్తున్నాయి.

సరకు రాక...

ముందుగా సాగైన పొలాల్లో కొత్త పంట చేతికి రావడం, పెట్టుబడుల కోసం రైతులు గోదాముల్లోని సరకు అమ్మేందుకు ఆసక్తి చూపడంతో నిత్యం యార్డుకు 45 వేల నుంచి 50 వేల బస్తాలొస్తున్నాయి.

తగ్గిన సాగు.. రెండేళ్లుగా ధరలు తగ్గుముఖం పట్టడంతో అన్నదాతలు నష్టాలను చవిచూశారు. ఏడాదికిపైగా శీతల గోదాముల్లో నిల్వ చేసినా.. రేట్లు పుంజుకోలేదు. ఈ కారణంగానే సాగు విస్తీర్ణం తగ్గుతోంది. రాష్ట్రంలో 2024 సీజన్లో 3.64 లక్షల ఎకరాల్లో సాగవగా.. ఈ సంవత్సరం 2.67 లక్షల ఎకరాలకు పరిమితమైంది. ఏటా సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో నర్సరీల్లో ఎక్కువ రోజులు పెంచిన మిరప మొక్కలను ఆలస్యంగా నాటేవారు. ఈ ఏడాది పరిస్థితి మరీ మందకొడిగా ఉంది.

వాతావరణం దెబ్బ

సాధారణంగా జూన్ నుంచి ఆగస్టు వరకు వర్షాలెక్కువగా కురుస్తాయి. మొక్కల పెరుగుదలకు ఆటంకం ఏర్పడడం, కలుపు పెరగడం, ఎరువులు చల్లే అవకాశం తగ్గడం తదితర కారణాల వల్ల చాలామంది రైతులు ఆగస్టు వరకు వేచి చూస్తుంటారు. ఆ తరువాత మొక్కలు నాటుతారు. ఈ ఏడాది పరిస్థితి మారిపోయింది. అధిక వర్షాలకు రైతులు ధైర్యం చేయలేకపోయారు.

నవంబరు 21న మిర్చి యార్డులో ధరలు ఇలా.. (క్వింటాలుకు రూ.ల్లో)

రకం	గరిష్ఠం
334	18,000
341	18,000
బ్యాడిగి	18,500
దేవనూర్ డీలక్స్	17,500
నంబరు-5	16,400
తేజ	16,000

నవంబరు మూడోవారం ముగిసేసరికి 3 రకాల మిర్చి ధరలు బాగా పెరిగాయి. క్వింటాలుకు గరిష్ఠంగా రూ.18,600 పలికింది.

వాహన ప్రదర్శన కాదు.. స్వాధీనం చేసుకున్నవి

చిత్రంలో కనిపిస్తున్న వాహనాల్ని చూసి పాత వాహన మేళా నిర్వహించారా? అనుకుంటే పొరపడినట్లే. నరసరావుపేటలోని చంద్రబాబునాయుడు కాలనీలో డీఎస్పీ హనుమంతరావు నేతృత్వంలో వంద మంది పోలీసులు సోమవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 41 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, మారణాయుధాలు స్వాధీనం చేసుకుని కోడెల క్రీడా ప్రాంగణం ఎదుట ఉంచారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు కాలనీలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐలు ప్రభాకర్, ఫిరోజ్, బ్రహ్మయ్య, ప్రభాకర్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట)

(c) eenadu

బాల ఉషస్సు.. భావి యశస్సు

ఆధునిక పరిజ్ఞానంతో.. సమస్యలకు పరిష్కారాలు

'ఈనాడు' వైజ్ఞానిక ప్రదర్శనలో అబ్బురపరిచిన ఆవిష్కరణలు

– ఈనాడు, అమరావతి
– కానూరు, పటమట, న్యూస్‌టుడే

సమాజంలో ఎదురయ్యే ప్రధాన సమస్యలన్నింటికీ ఆధునిక పరిజ్ఞానంతో పరిష్కారం చూపించొచ్చని పలువురు విద్యార్థులు చాటిచెప్పారు. రహదారి ప్రమాదాలను నివారించేందుకు వాహనాలకు ఆటోమేటిక్ బ్రేక్ సిస్టమ్, నగరాల్లో స్మార్ట్ పార్కింగ్, వ్యవసాయంలో కీటకాల ముప్పును నివారించేందుకు సోలార్ ట్రాపర్స్, వరదల వేళ మునిగిపోకుండా ఉండే స్మార్ట్ వంతెనలు, కృత్రిమ మేధతో పనిచేసే ఫైర్ ఇంజిన్లు, రైలు ప్రమాదాలను నివారించే రోబో టెక్నాలజీ, కుక్క కాటు నుంచి రక్షించేందుకు చేతులు, కాళ్లకు కవచాలు, యాంటీ సూసైడ్ ఫ్యాన్లు, విద్యుత్తును ఆదా చేసేలా స్మార్ట్‌సిటీ ప్రణాళికలు.. ఇలా విద్యార్థులు రూపొందించిన 85 ప్రాజెక్టులు ఔరా అనిపించాయి. వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు నిర్వహించిన 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన'కు అనూహ్య స్పందన వచ్చింది. కానూరులోని పి.వి.పి.సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో.. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని ఆరు నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులకు సోమవారం నిర్వహించిన ఈ మెగా సైన్స్ ఫెయిర్‌ను తిలకించేందుకు వేలాదిగా విద్యార్థులు తరలివచ్చారు.

శ్రీచైతన్య విద్యాసంస్థలు

1 ఎనర్జీ ఎఫీషియన్సీ స్మార్ట్ సిటీ

విద్యార్థులు: తేజస్విని, భరత్, 10వ తరగతి, జడ్పీహెచ్ఎస్ కానూరు

ఆధునిక పరిజ్ఞానంతో సమస్యలకు పరిష్కారం చూపించే నగరం నమూనా. వాహనాలు వచ్చేటప్పుడు వీధి దీపాలు వెలగడం, జాతీయ రహదారులపై గాలి మరల ద్వారా ఆటోమేటిక్‌గా దీపాలను వెలిగించడం, సెన్సార్ల ద్వారా బ్యాంకు చోరీలు జరగకుండా అప్రమత్తమవ్వడం, స్మార్ట్ చెత్త డబ్బాలు, అగ్నిప్రమాదాల వేళ మంటలను నీటితో ఆర్పే సెన్సార్ల వ్యవస్థ.. ఈ ఆరు అంశాలతో రూపొందించిన ఈ ప్రాజెక్టుకు మొదటి బహుమతి వచ్చింది.

2 స్మార్ట్ బ్రిడ్జి

విద్యార్థులు: జి.రోహిత్(9వ తరగతి), ఆర్.దుర్గ(8వ తరగతి), శ్రీమల్లికార్జున హైస్కూల్, గన్నవరం

వరదల సమయంలో వంతెనలు మునిగిపోకుండా పరిష్కారం చూపించే ప్రాజెక్టు. నీటిలో ఉండే సెన్సార్ల ద్వారా వరద ప్రవాహం ఉద్ధృతి, ఎత్తును అంచనా వేసి. దానికి తగ్గట్టుగా వంతెన ఆటోమేటిక్‌గా పైకి వస్తుంది. దీని వల్ల వాహనాలకు వరద ముంపు ప్రమాదం ఉండదు. ఈ ప్రాజెక్టుకు రెండో బహుమతి వచ్చింది.

3 యాంటీ సూసైడ్ ఫ్యాన్

విద్యార్థులు: బి.కార్తికేయ, బి.వెంకట సందీప్, కె.కార్తీక్, క్రైస్ట్ ది కింగ్ పాఠశాల, క్రీస్తురాజపురం, విజయవాడ

హాస్టల్ గదులు, ఇళ్లు, హోటళ్లలో ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడేవారు ఫ్యాన్లకే ఉరేసుకుంటారు. వీటిని నివారించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. బరువు పెరిగిన వెంటనే ఆటోమేటిక్‌గా ఫ్యాన్ నేల మీదకి దిగిపోతుంది. వెంటనే ఈ ఫ్యాన్లను బిగించిన సమయంలో నమోదు చేసిన ఫోన్ నంబరుకు అలర్ట్ మెసేజ్ వెళ్లిపోతుంది. పెద్ద శబ్దంతో అలారం మోగుతుంది. ఈ ప్రాజెక్టుకు మూడో బహుమతి వచ్చింది.

సందడే సందడి..

ప్రాజెక్టులకు పేటెంట్ తెప్పించాలి

-విజయరామరాజు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్

విద్యార్థులు చేసే ప్రాజెక్టులకు పేటెంట్ కోసం సైన్స్ టీచర్లు దరఖాస్తు చేయాలి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు ఉండాలి. విద్యార్థులు ఏ ఆవిష్కరణ చేయాలన్నా సామగ్రి అందుబాటులో ఉండాలి. కొందరు ఇంజినీరింగ్ విద్యార్థులు కూడా చెప్పలేని చిప్‌లు, సెన్సార్ల గురించి ఈ విద్యార్థులు చెప్పడం అభినందనీయం. ప్రభుత్వ పాఠశాలల్లోనూ అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రదర్శన ఏర్పాటు చేసినందుకు 'ఈనాడు'కు ధన్యవాదాలు.

జ్యోతి వెలిగిస్తున్న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు

ప్రాజెక్టులను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

మరిన్ని నిర్వహించాలి..

-పాలడుగు లక్ష్మణరావు, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి

వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థి జీవితంలో కీలకం. సుమారు 85 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని తమ ప్రాజెక్టులను ప్రదర్శించడం అభినందనీయం. 'ఈనాడు' ఆధ్వర్యంలో సమాజ చైతన్యం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. భవిష్యత్తులోనూ మరిన్ని జరగాలి.

ప్రోత్సాహక బహుమతులు

లేజర్ సెక్యూరిటీ అలారం

విద్యార్థులు: సి.హెచ్.నవీన్, ఇస్మాయిల్, 9వ తరగతి, జడ్పీహెచ్ఎస్ బంటుమిల్లి

ఇళ్లకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయడమే లక్ష్యం. ఇళ్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి సెన్సార్లతో అనుసంధానిస్తారు. ఎవరైనా వచ్చి దానిని తాకగానే పెద్ద శబ్దంతో అలారం మోగుతుంది. సెల్‌ఫోన్‌కు అలర్ట్ మెసేజ్ వెళ్లిపోతుంది.

రహదారులపై ప్రమాదాల నివారణ

విద్యార్థులు: పవన్‌కుమార్(10వ తరగతి), ప్రేమ్‌చంద్(9వ తరగతి), ఎం.కె.బేగ్ హైస్కూల్, అజిత్‌సింగ్‌నగర్

వాహనం వెళ్లేటప్పుడు ఆకస్మాత్తుగా వచ్చే ప్రమాదాల వేళ ఆటోమేటిగ్గా బ్రేకులు పడి ఆగిపోతుంది. వాహనానికి బిగించిన సెన్సార్ల ద్వారా.. నాలుగు వైపులా ఎంత దూరంలో ప్రమాదం ఉన్నా వెంటనే కారులో హెచ్చరిక సంకేతాలు వస్తాయి.

వినూత్నంగా ఆలోచిస్తే...

–రాజశేఖరబాబు, సీపీ

ప్రతి విషయాన్ని వినూత్నంగా ఆలోచించడం అలవాటు చేసుకోవాలి. అప్పుడే ఆకాశమే హద్దుగా చెలరేగిపోవచ్చు. ప్రతి సందర్భంలోనూ ఇంతకంటే బాగా ఎలా చేయొచ్చు అని ఆలోచించి ఆ దిశగా ప్రయత్నిస్తే మన ప్రయాణం అద్భుతంగా సాగుతుంది. ఏఐ, మిషన్‌లెర్నింగ్, డ్రోన్ ఇలా అన్నీ ఆధునిక పరిజ్ఞానం నుంచి పుట్టుకొచ్చినవే. పాలన, పోలీసింగ్ ఇలా ప్రతి రంగంలోనూ ఆవిష్కరణలు అవసరం.

పరిశ్రమల వ్యర్థాల నుంచి ఇంకు తయారీ

విద్యార్థులు: యు.ధనశ్రీనివాస్(10వ తరగతి), వేముల అఖిల్(8వ తరగతి), జడ్పీహెచ్ఎస్ పరిటాల

పరిశ్రమల నుంచి వాయువులను ఒడిసిపట్టి. వాటి నుంచి నల్లని ఇంకు తయారు చేయడం లక్ష్యం. ఒక కంటైనర్ లాంటి యంత్రాన్ని పరిశ్రమలు ఉండే ప్రాంతంలో పెడతారు. దాని ద్వారా వచ్చే గాలిలో నుంచి రసాయన వ్యర్థాలను తీసి పౌడర్‌గా మారుస్తారు. స్వచ్ఛమైన గాలిని వదిలేస్తారు. ఆ పౌడర్‌కు నూనెలను కలిపి ఇంకు తయారు చేస్తారు.

డాగ్ బైట్ సాక్స్

విద్యార్థులు: టి.విశ్వాస్, కుశల్ పవన్‌సాయి, 9వ తరగతి, జడ్పీహెచ్ఎస్ తేలప్రోలు

కుక్కలు కరిచినా గాయం కాకుండా తప్పించుకోవచ్చు. పలుచని కాపర్ రేకు, దానిపైన తోలు, గుడ్డతో సాక్స్ రూపంలో తయారు చేసి చేతులు, కాళ్లకు తొడుక్కోవచ్చు. ప్రస్తుతం వీధి కుక్కల బెడద పెరిగిపోయి చాలా మంది చిన్నారులు వాటి బారినపడుతున్నారు. ప్రధానంగా కాళ్లు, చేతులపైనే అవి కరుస్తున్నాయి. అందుకే ఈ డాగ్ బైట్ సాక్స్ తయారు చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ సూరజ్ గనోరే ఆదేశించారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణపై అవగాహన కల్పించేందుకు సోమవారం ఆయన స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో కలిసి గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2389, సాధారణ రకం ధాన్యానికి రూ.2369 చొప్పున మద్దతు ధరకు కొనుగోలు చేస్తారన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, రైతులకు సూచనలు, సలహాలు, సహాయం అందించటానికి 8897798430 నంబరును అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

What your parents meant by responsible spending.

Beyond betteR offer: On-road Price = Ex-showroom Price*

FASTFEST

LM AUTO CARS

VIJAYAWADA	GUNTUR	NELLORE	ONGOLE	BHIMAVARAM
8886691748	7799711129	7799711102	7799711125	8886691749

అర్జీదారుల్లో మహిళలు, దివ్యాంగులే అధికం

పీజీఆర్ఎస్‌కు 122 వినతులు

అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

నరసరావుపేట అర్బన్: తమ సమస్యలు పరిష్కరించండి అంటూ కలెక్టరేట్‌కు మహిళలు, దివ్యాంగులు బారులు తీరుతున్నారు. మోసానికి గురయ్యామని, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, అర్హత ఉన్నా పింఛన్లు మంజూరు చేయడం లేదంటూ పలువురు కలెక్టరేట్‌కు వచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో మురళి, జిల్లా అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 122 అర్జీలు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

★ పూర్వీకుల ద్వారా సంక్రమించిన భూమిని సర్వే చేయాలని ఏడాదిగా తిరుగుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని నరసరావుపేట ములకలూరుకు చెందిన మూలే. ఝాన్సీ అర్జీ అందజేసింది. .

★ పొలాలకు వెళ్లే దారిలో స్తంభాలు పాతారని, వాటిని తొలగించాలని కోరుతూ రాజుపాలెం మండలం రెడ్డిగూడేనికి చెందిన రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో వెంకటేశ్వర కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులు వరవడొంక, వాగు పోరంబోకు భూములను కొనుగోలు చేశామని దారి లేదని దౌర్జన్యం చేస్తున్నారని రైతులు అర్జీ ఇచ్చారు.

నేటి నుంచి నయీచేతన్ 4.0

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు నయీచేతన్ 4.0 పేరుతో మహిళా సాధికారతకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా లింగ వివక్ష, మహిళా సాధికారత, మహిళలకు ఆస్తుల్లో నిర్ణయాధికారం, సమాన పనికి సమాన వేతనం తదితర అంశాలపై చర్చలు, సమావేశాలు ఉంటాయని తెలిపారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ నుంచి నిర్వహించే ర్యాలీని ఇన్‌ఛార్జి కలెక్టర్ సూరజ్ గనోరే, ఎమ్మెల్యే అరవిందబాబు ప్రారంభిస్తారన్నారు.

వినుకొండలో క్రీడా సందడి

ఉత్సాహంగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్

విజేత బాలికలతో మక్కెన

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: వినుకొండలో లయోలా పాఠశాల వేదికగా 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-17 బాలబాలికల అథ్లెటిక్స్ సోమవారం ప్రారంభమయ్యాయి. దీంతో వినుకొండలో క్రీడా సందడి నెలకొంది. పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫాదర్ అవినాష్ ప్రారంభించగా విజేతలకు జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పతకాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కూటమి నేతలు, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు. పలు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేష్ తెలిపారు.

భూ వివాదాలపై ఫిర్యాదులు

బాధితురాలి సమస్య వింటున్న ఎస్పీ కృష్ణారావు

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరించనున్నట్లు ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 111 అర్జీలు అందినట్లు తెలిపారు.

ట్రేడింగ్ పేరిట రూ.81 లక్షలకు టోకరా...

నరసరావుపేట కాకతీయనగర్‌కు చెందిన ఓ యువకుడు ఎంసీఏ చదివి ఉద్యోగం రాక ఇంటి వద్దే ఉంటున్నాడు. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తే 200 రెట్లు అధిక లాభాలు వస్తాయని ఆశ చూపాడు. ఓ ప్రైవేటు కంపెనీ పేరుతో ఖాతా తెరిపించాడు. అందులోనే నగదు జమ చేయాలని సూచించాడు. మొదట రూ.3 లక్షలు వేయగా రూ.1.50 లక్షలు లాభం చూపారు. ఆ నగదు తీసుకునే అవకాశం కల్పించారు. అనంతరం నిత్యం ఓ వాట్సప్ గ్రూపులో వాళ్లు చెప్పిన ప్రకారం స్టాక్స్‌పై పెట్టుబడి పెట్టగా లాభాలు వచ్చాయి. దీంతో తమకు జీవనాధారమైన పొలం అమ్మేసి ఒకేసారి రూ.81 లక్షలు పెట్టుబడి పెట్టారు. అనంతరం వచ్చిన నగదు విత్‌డ్రా చేయడానికి ప్రయత్నిస్తే నంబర్ బ్లాక్ చేసి గ్రూపు నుండి తొలగించారని బాధితుడు ఎస్పీ వద్ద వాపోయాడు.

హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని..

దాచేపల్లికి చెందిన యువతి పదోతరగతి వరకు చదివింది. వివాహానంతరం ఆమెకు ఉద్యోగం ఏదైనా చూడాలని ఆమె భర్త అతని స్నేహితుడిని అడిగాడు. అతడు విజయవాడకు చెందిన ఓ మహిళను పరిచయం చేశాడు. ఆమె అమరావతిలో హైకోర్టులో తనకు తెలిసిన వాళ్లు ఉన్నారని రూ.5 లక్షలు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికింది. విడతల వారీగా రూ.5 లక్షలు తీసుకుంది. నగదు ఇచ్చి ఏడాది కావస్తున్నా ఉద్యోగం ఊసే లేకపోవడంతో మోసపోయామని గ్రహించారు. మహిళపై చట్టపరమైన చర్యలు తీసుకుని నగదు ఇప్పించాలని ఎస్పీని కోరారు.

ఏపీకే ఫైల్ క్లిక్ చేస్తే నగదు మాయం...

రొంపిచర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇటీవల పీఎం కిసాన్ పేరిట సెల్‌ఫోన్‌కు ఏపీకే ఫైల్ వచ్చింది. అతనికి తెలియకుండా దానిని క్లిక్ చేయగా గుర్తుతెలియని సైబర్ నేరగాళ్లు ఫోన్‌ను హ్యాక్ చేశారు. దీంతో ఖాతాలో ఉన్న రూ.2.20 లక్షల నగదు మాయమయ్యాయని బాధితుడు ఎస్పీ వద్ద వాపోయాడు.

డీలర్ల ఆదాయం పెంపే లక్ష్యం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: కార్డుదారులకు బియ్యం, పంచదారతో పాటు మిగిలిన సరకులు తక్కువ ధరకు అందజేసేందుకు, తద్వారా రేషన్ డీలర్లకు అదనపు ఆదాయం సమకూరేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎస్‌వో ఎం.వి ప్రసాద్ తెలిపారు. నరసరావుపేట డివిజన్ పరిధిలోని రేషన్ డీలర్లతో ఆర్డీవో కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో మాట్లాడుతూ రేషన్ దుకాణాలకు వచ్చిన కార్డుదారులకు ప్రభుత్వం అందజేసే బియ్యం, పంచదారతో పాటు వారికి అవసరమైన అన్ని నిత్యావసర సరకులు ఈజీమార్ట్ ద్వారా తక్కువ ధరకు తెప్పించి విక్రయించేలా ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ విధానంతో ప్రజలకు తక్కువ ధరకు సరకులు అందటంతో పాటు డీలర్లకు ఆదాయం పెరుగుతుందని చెప్పారు. ఇక నుంచి రేషన్ షాపుల్లో అన్ని నిత్యావసర సరకులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈజీమార్ట్ కోఆర్డినేటర్ బోస్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అన్ని వస్తువులు తక్కువ ధరకు అందించేందుకు ఈజీ మార్ట్ సిద్ధంగా ఉందని, మార్కెట్‌లో లభించే ధరల కన్నా తక్కువకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత, సీఎస్‌డీటీ ప్రభాకర్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

పారదర్శకతకు స.హ.చట్టం దోహదం

నరసరావుపేట అర్బన్: ప్రభుత్వ పాలనలో పారదర్శకత పెంచేందుకు స.హ. చట్టం 2005లో అమలులోకి తెచ్చారని డీఆర్వో మురళి పేర్కొన్నారు. స.హ. చట్టం 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కలెక్టరేట్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీఆర్వో మాట్లాడుతూ ప్రజలు ఈ చట్టం కింద దరఖాస్తు చేసి ప్రభుత్వ శాఖల సమాచారం పొందవచ్చని తెలిపారు. ఆర్డీవోలు మధులత, రమణాకాంత్ రెడ్డి, మురళీకృష్ణ ఉన్నారు.

91.9 FM Vijayawada 91.9 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

బ్రాయిలర్ ధరలు

(కిలో ఒకి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 108, రిటైల్ ధర - 135, చికెన్ విత్‌స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్ - 223.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 117, 124, 136 చికెన్ విత్ స్కిన్ - 222 చికెన్ స్కిన్‌లెస్ - 232.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

నరసరావుపేటలో యువకుడి దారుణహత్య

బాజీ (పాత చిత్రం)

నరసరావుపేట సెంట్రల్, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: నరసరావుపేట పట్టణ శివారున ఎస్ఆర్‌కేటీ కాలనీ వద్ద సోమవారం ఓ యువకుడి హత్యతో పట్టణ వాసులు ఉలిక్కి పడ్డారు. గ్రామీణ పోలీసుల కథనం మేరకు వివరాలు.. పట్టణంలోని కొండలరావుపేటలో నివాసం ఉండే బాజీ (34) ఎస్ఆర్‌కేటీ వద్ద ఓ హోటల్‌లో పనిచేసేవాడు. ఆ హోటల్ యజమాని ఆరిఫ్ అతనికి ఓ సెల్‌ఫోన్ కొనిచ్చాడు. ఆ తరువాత బాజీ అక్కడ పని మానేసి అదే ప్రాంతంలో టీస్టాల్ ప్రారంభించాడు. దీంతో హోటల్ యజమాని బాజీ ఇంటి వద్దకు వచ్చి తాను కొనిచ్చిన ఫోన్ ఇవ్వాలని లేదంటే డబ్బు ఇవ్వాలని అడిగాడు. ఈ క్రమంలో ఈనెల 15న ఆరిఫ్ డబ్బులు అడగ్గా బాజీ 100కు ఫోన్ చేసి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించటంతో వారు వచ్చి ఇద్దరికీ సర్ది చెప్పి పంపారు. ఇదిలా ఉంటే సోమవారం ఎస్ఆర్‌కేటీ వద్ద ఉన్న టీస్టాల్ వద్దకు ద్విచక్రవాహనంపై వెళుతున్న బాజీని గుర్తు తెలియని మహిళ, మరో వ్యక్తి అడ్డగించి కత్తితో పొడవటంతో కిందపడిపోయాడు. రక్తపు మడుగులో ఉన్న బాజీని స్థానికులు ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న గ్రామీణ సీఐ సుబ్బారావు, ఎస్సై కిశోర్ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. హత్య జరిగిన ప్రదేశంలో సీసీ ఫుటేజ్ పరిశీలిస్తున్నామని ఓ మహిళ, వ్యక్తి హత్య చేసినట్లు గుర్తించామన్నారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని, దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆర్థికపరమైన అంశాల నేపథ్యంలో హత్య జరిగిందా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలో విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ఇతను కొద్ది నెలల క్రితం వరకు బరంపేటలో నివాసం ఉండేవాడని, రెండు నెలల క్రితమే కొండలరావుపేటకు మకాం మార్చినట్లు స్థానికులు తెలిపారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

MARRIAGE SERVICES

వనజారావు క్విక్ మ్యారేజెస్ నందు అన్ని కులముల వారికి సంబంధములు కుదర్చబడును. లక్ష్మీపురం, గుంటూరు. సంప్ర॥ 98666 33988.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్, GNT. వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 9154085588, 9154935588.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

ఫ్లాష్! ఫ్లాష్! చిలకలూరిపేట హైవే ఫేసింగ్ CRDA అప్రూవల్ వెంచర్. బ్యాంకు లోన్ సౌకర్యం. గజం 7500/- మాత్రమే. Phone: 9133574455.

JOBS

URGENT Req office Manager to Manage and Coordinate field Incharges & Employees, Manage inventory (Drones), deal with customers & formers. Age: 30+, Q: Any Degree/ MBA. Exp any field. Adelix pvt ltd, GNT. 93811 75886.

భారతదేశ అగ్రగామి సంస్థలో పార్ట్/ఫుల్ టైం బిజినెస్ పార్ట్నర్‌గా చేరండి అధిక కమిషన్ పొందండి. అ: 10th, వ: 30-65 సం॥. 79892 46788.

PARUL University, GNT ఆఫీసులో పనిచేయుటకు టెలీకాలర్స్ & టెక్నీషియన్ కావలెను. జీ॥ 10-20K ✆ 83743 25002 & 88858 79076.

చైతన్య సాయి పేపర్‌మిల్స్, యడవల్లి నందు పనిచేయుటకు 1) సీనియర్ అకౌంటెంట్ 2) మెయింటెన్స్ సూపర్‌వైజర్స్ (మేనేజర్) 3) లోడింగ్ సూపర్‌వైజర్స్ (10th క్లాస్) 4) Eicher డ్రైవర్స్ (10th క్లాస్) 5) అటెండర్స్ (గుంటూరు ఆఫీస్). 9059514555.

మంగళగిరిలో క్రొత్తగా (ప్రారంభం కాబోతున్న) భారత్ పెట్రోలియం బంకులో పనిచేయుటకు పంపు బాయిస్ & గర్ల్స్ మరియు మేనేజరు కావలెను. Ph 9849582369.

గుంటూరులోని ఆస్పత్రి కోసం ఎంట్రీ కన్సల్టెన్సీకు 30 B.Sc/GNM నర్సింగ్ సిబ్బంది అవసరం. ఆసక్తి ఉన్నవారు. ✆ 83673 77590కు కాల్ చేయండి.

గుంటూరు, ఆటోనగర్‌లో HP పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మేనేజర్, పంపు బాయ్స్/గర్ల్స్ కావలెను. పార్ట్‌టైమ్/ ఫుల్ టైమ్. 77996 89889, 80745 46302.

బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, 3సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30సం॥ల లోపువారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

FACULTY/ TEACHERS

Faculty: Bio Chemistry - B.Sc., MSc & Nursing: B.Sc., M.Sc. & Employ: Inter, Degree, Computer. Age: 19-25, Con: Victoria Paramedical Institute, Gnt. ✆: 0863-2222683, 98481 34028, 8332004478.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం

పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 80085 10541

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80085 14589

నరసరావుపేట

●నరసరావుపేట ● వినుకొండ ● చిలకలూరిపేట

27న సీఆర్ కళాశాలలో మెగా జాబ్‌మేళా

గణపవరం (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: ఏపీ నైపుణ్య శిక్షణాభివృద్ధి సహకారంతో నాదెండ్ల మండలం గణపవరం సీఆర్ కళాశాలలో ఈనెల 27న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ఛైర్మన్, కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, డైరెక్టర్ చుండి రంగనాయకులు సోమవారం తెలిపారు. మెగా జాబ్‌మేళాలో సుమారు 10 కంపెనీలు పాల్గొంటున్నట్లు ప్రిన్సిపల్ ఏపీపీ మనోహర్ తెలిపారు. సీఆర్ కళాశాల విద్యార్థులు సహా చిలకలూరిపేట పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులంతా ఈ మేళాకు హాజరుకావచ్చునన్నారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఐటీఐ పూర్తి చేసి 18 ఏళ్ల నుంచి 35 సంవత్సరాల లోపు వయసు ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డుతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావచ్చన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలో నరసరావుపేట వైపు వెళ్లే రహదారి పక్కన గుంతలు ఏర్పడ్డాయి. రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. **- భాస్కరరావు, వాహన చోదకుడు** ✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి గుంతలు పూడ్చి ప్రమాదం లేకుండా చర్యలు తీసుకుంటాం. **- అల్తాఫ్, పురపాలక సంఘ ఏఈ**

– న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

? పట్టణంలోని రామిరెడ్డిపేటలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల వెనుక డ్రెయినేజీ పూడిక తీయడం లేదు. దుర్వాసన వస్తోంది. దోమలతో ఇబ్బందులు పడుతున్నాం.**- బాజీ, స్థానికుడు**
✔ సిబ్బందిని పంపి డ్రెయినేజీ శుభ్రం చేయిస్తాం.

- రమాదేవి, పారిశుద్ధ్య అధికారిణి

? పట్టణంలో బరంపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఓ చెట్టు మొంథా తుపాను సమయంలో ఈదురు గాలులకు విరిగింది. అది ఎండిపోయి ప్రమాదకరంగా వేలాడుతోంది. ఆ కొమ్మలు పడితే గాయాలు తథ్యం. **- గర్భిణులు, రోగులు** ✔ చెట్టు కొమ్మకు విద్యుత్తు తీగ అడ్డుగా ఉంది. దీనిపై విద్యుత్తు అధికారులకు సమాచారం ఇచ్చాం. వారితో సమన్వయం చేసుకుని చెట్టు కొమ్మ తొలగింపునకు చర్యలు చేపడతాం. **- చంద్రావతి, పీహెచ్‌సీ సీవో**

– న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

సోమేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి చేయూత

ఈవో నుంచి రసీదు అందుకుంటున్న దాతలు

బొల్లాపల్లి, వినుకొండ, న్యూస్‌టుడే: బొల్లాపల్లి మండలం వెల్లటూరులోని సోమేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన ఇద్దరు రూ. రెండు లక్షలు విరాళం సోమవారం అందజేశారు. గ్రామంలో పురాతన ఆలయాన్ని రూ.2.35కోట్లతో పునర్నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. మ్యాచింగ్ గ్రాంటు కింద భక్తులు రూ.78.33లక్షలు చెల్లించాల్సి ఉండగా గ్రామానికి చెందిన బేతపూడి వెంకటేశ్వర్లు, లింగరాజు రూ.లక్ష చొప్పున ఈవో శివనాగిరెడ్డిని కలిసి అందజేశారు.

వారాహి మందిర నిర్మాణానికి విరాళాలు

భూమి పూజ చేస్తున్న న్యాయవాది సైదారావు తదితరులు

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలో కొండ మెట్ల సమీపంలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద వారాహి అమ్మవారి మందిర నిర్మాణానికి పలువురు దాతలు రూ.5.40లక్షల విరాళాలు అందజేశారని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. మందిర నిర్మాణ పనులకు సీనియర్ న్యాయవాది సైదారావు దంపతులు సోమవారం భూమి పూజ నిర్వహించారు. పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు గొంట్ల నాగేంద్రుడు, సామ్రాజ్యం దంపతులు, తిరువాయిపాటి నరసింహారావు, సరోజని, దుబాయ్ నివాసి చిలుకూరి సురేష్‌కుమార్, లక్ష్మీప్రజ దంపతులు, గుంటూరుకు చెందిన తిరువాయిపాటి సత్యనారాయణ, అంజనీదేవి, తాడేపల్లిగూడెంకు చెందిన ఆత్కూరి కామేశ్వరరావు ఒక్కొక్కరు రూ.1.08 లక్షల వంతున విరాళాలు అందజేశారని ప్రకటించారు. అనంతరం దాతలను మందిర నిర్మాణ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు కృష్ణవేణి, రమ, భ్రమరాంబ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై 26న ప్రదర్శన

కళామందిర్ సెంటర్ (చిలకలూరిపేట పట్టణం): కేంద్రంలో భాజపా అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నరసరావుపేటలో ఈనెల 26న జరిగే ప్రదర్శనను విజయవంతం చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబూరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు కళామందిర్ కూడలిలోని ఏఐటీయూసీ, రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసా సాంబయ్య, నాయకులు తుబాటి సుభాని మేస్త్రి, శ్రీను, భవన కార్మికులు పాల్గొన్నారు.

మోయలేని భారం.. ఎప్పటికో మేలైన నిర్ణయం!

అద్దె భవనాల్లో కార్యాలయాలు.. అసౌకర్యాల నడుమ ఉద్యోగులు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే

నరసరావుపేట జిల్లా కేంద్రం కావడంతో పలు ప్రభుత్వ శాఖల జిల్లా కార్యాలయాలు ఇక్కడకు వచ్చాయి. కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో కార్యకలాపాలు నిర్వహించాల్సిన పరిస్థితి. ఈ భవనాలకు ప్రభుత్వం నెలకు రూ.లక్షల్లో అద్దె చెల్లించాల్సి రావడం ప్రభుత్వానికి భారంగా మారింది. ఈ భవనాల్లో కనీస సౌకర్యాలు లేక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శాశ్వత భవనాలు నిర్మిస్తే తప్ప అటు ఉద్యోగులు, ఇటు ప్రభుత్వానికి మేలు చేకూరదు.

ఏయే కార్యాలయాలు.. నరసరావుపేటలో గృహనిర్మాణ, తూనికలు, కొలతలు, పౌరసరఫరాలు, ఆదాయపన్ను, అగ్నిమాపక, అటవీ, ఉద్యానవన, ఔషధ నియంత్రణ, ఆహార నియంత్రణ శాఖలతో పాటు పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఒక్కో కార్యాలయానికి నెలకు రూ.15వేలకు పైగా అద్దె చెల్లిస్తున్నాయంటే ఎంత మొత్తం అవుతుందో అర్థం చేసుకోవచ్చు. శాశ్వత భవనాలుంటే అద్దెలకు చెల్లించే నగదుతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేయవచ్చనేది ప్రజల అభిప్రాయం.

సచివాలయాలదీ అదే బాట.. గత ప్రభుత్వం సచివాలయాలను నిన్న మొన్నటి వరకు అద్దె భవనాల్లో నడిపి రూ.లక్షల్లో ప్రభుత్వ సొమ్ము అనుయాయులకు కట్టబెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని ప్రభుత్వ కార్యాలయాల్లోకి మార్చే ప్రక్రియ చేపట్టింది. పట్టణంలో 1, 8, 10, 16, 32, 33 వార్డు సచివాలయాలు ఇంకా అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

నిరుపయోగంగా వదిలేసి.. పట్టణంలో కలెక్టర్ కార్యాలయానికి ఎదురుగా ప్రభుత్వ సొమ్ముతో నిర్మించిన రాజీవ్ గృహకల్ప సముదాయాలు ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్నాయి. జిల్లా కేంద్రం ప్రకటించిన సమయంలో ఈ భవనాలకు మరమ్మతులు చేయించి కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం చెప్పింది గానీ ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదు. కూటమి ప్రభుత్వం ఆ భవనాలకు మరమ్మతులు చేసి కార్యాలయాలు ఏర్పాటు చేస్తే రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు నిరుపయోగం కాకుండా ఉంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వంపై అద్దెల భారం తగ్గే అవకాశం ఉంది.

ప్రతిపాదనలు పంపాం.. జిల్లా కేంద్రంలో శాశ్వత భవనాల ఏర్పాటు విషయమై ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఇన్‌ఛార్జి కలెక్టర్ సూరజ్ గనోరే తెలిపారు. ప్రభుత్వ ఆమోదం మేరకు స్థల పరిశీలన చేపట్టి భవన నిర్మాణ పనులపై దృష్టిసారిస్తామన్నారు.

మానసిక.. శారీరక దృఢత్వంతో సత్ఫలితాలు

ఈనాడు- ఈటీవీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు

మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ శివప్రసాదరావు

హాజరైన పది, ఇంటర్ విద్యార్థినులు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుతూ మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటేనే ఆశించిన ఫలితాలు సాధించగలరని వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ పి.శివప్రసాదరావు అన్నారు. చిలకలూరిపేట మండలం పోతవరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో పది, ఇంటర్ విద్యార్థులకు పరీక్షల సన్నద్ధత, కెరీర్ గైడెన్స్, ఆరోగ్య జాగ్రత్తలపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడారు. పది, ఇంటర్ పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో అన్ని పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా చదువుకోవడానికి రోజువారీ ప్రణాళిక రూపొందించుకుని ముందుకు సాగాలన్నారు. ఇష్టపడి ఏకాగ్రతతో చదువుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. ఇంటర్ తర్వాత కేవలం ఇంజినీరింగ్, మెడిసిన్ కోర్సులు మాత్రమే కాదని, ఇంకా ఎన్నో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ఎస్ఎస్‌సీ (స్టాఫ్ సెలక్షన్) ద్వారా ఏటా పదో తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హతతో 20వేల ఉద్యోగాలు భర్తీ చేస్తుందని, దక్షిణాది రాష్ట్రాల నుంచి ఈ పరీక్షలు రాసే వారి సంఖ్య తక్కువగా ఉందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. రక్తహీనత రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని విషయాల్లో పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. విద్యాలయ ప్రిన్సిపల్ ఆఫ్రిఫూన్ మాట్లాడుతూ ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరమైన కార్యక్రమాన్ని నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పది, ఇంటర్‌లో నూరుశాతం ఫలితాలు సాధించేలా ప్రణాళికతో ముందుకు సాగుతామన్నారు. సచివాలయ ఆరోగ్య సిబ్బంది ముంతాజ్, శేషయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అబ్బురపడేలా.. ఆలోచింపజేసేలా..

ఉత్సాహంగా 'ఈనాడు' ప్రతిభాపాటవ పోటీలు

బహుమతులు అందుకున్న వారితో డీన్ కృష్ణ, ప్రిన్సిపల్

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: కృత్రిమ మేధ పరిజ్ఞానంతో ఉద్యోగ, ఉపాధి రంగాల్లో పెను మార్పులు వస్తాయని తద్వారా మానవాళికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని విద్యార్థులు అన్నారు. నరసరావుపేటలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'కృత్రిమ మేధతో భవిష్యత్తులో వచ్చే మార్పులు' అంశంపై సోమవారం వక్తృత్వ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ భవిష్యత్తులో పరిశ్రమల ఉత్పత్తి, వినియోగం, ఆరోగ్య వ్యవస్థలో వచ్చే మార్పులు వంటి అంశాలను ఉదహరిస్తూ ఇవన్నీ ఏఐ పరిజ్ఞానం ద్వారా ముందుగానే అంచనా వేసేందుకు ఉపయోగపడతాయన్నారు. తద్వారా గుణంగా పరిశ్రమలు ఉపాధి రంగాల్లో అవకాశాలు గుర్తించి నైపుణ్యాలను పెంచుకునే వీలు కలుగుతుందన్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. పోటీలో రాణించిన విద్యార్థులు ఎం.జ్ఞాన సరస్వతి, జె అవినేష్ కుమార్ (జూనియర్ ఇంటర్) డి.రోషిణి (సీనియర్ ఇంటర్) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు డీన్ కృష్ణ, ప్రిన్సిపల్ అశోక్, రాజ్యలక్ష్మి, శ్రావణి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు.

విజేత బాలికలతో హెచ్ఎం రత్నజ్యోతి, పీడీ ఖాసింబిడే, నాగేశ్వరాచారి, కొండలరావు

చిలకలూరిపేట గ్రామీణ: చిలకలూరిపేట శారద జడ్పీ ఉన్నత పాఠశాలలో 'విద్యార్థి జీవితంపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు దీటుగా ప్రసంగించారు. అవసరమైన మేరకే సెల్‌ఫోన్ వినియోగిస్తే అనర్థాలు రావన్నారు. శ్రోతలు అబ్బురపడేలా..ఆలోచింపజేసేలా ప్రసంగాలు సాగాయి. సత్తా చాటిన విద్యార్థులు లోలుగు రేహా (7వ తరగతి), మోటాని వైష్ణవి (9వ తరగతి), సాతులూరి పావని (8వ తరగతి) వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. శారద జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కె.రత్నజ్యోతి, పీడీ ఖాసింబిడే, ఉపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, డి.నాగేశ్వరాచారి, కొండలరావు వారికి బహుమతులు అందజేశారు.

జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపికపై హర్షం

నూజండ్ల, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు సీతారాంపురం ఉన్నత పాఠశాలలో చదివిన దూపాటి శ్రావణి ఎంపిక కావడంపై గ్రామస్థులు హర్షం వెలిబుచ్చారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఎంఈవో రవిచంద్ర మాట్లాడుతూ గత ఏడాది పదో తరగతిలో 546 మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చిందన్నారు. ఆమెకు ఎంఈవో, హెచ్ఎం కామేశ్వరరావు, ప్రసాద్, భారతీరాణి నగదు బహుమతి అందజేశారు. పీఈటీ విజయ సురేఖ శ్రావణిని సన్మానించారు.

దేశభక్తి పెంపొందించుకోవాలి

ఎన్‌సీసీ విద్యార్థుల విన్యాసం

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: విద్యార్థి స్థాయి నుంచే ప్రతి ఒక్కరూ దేశభక్తి పెంపొందించుకోవాలని డీఎస్పీ హనుమంతరావు అన్నారు. ఎంఏఎం పార్కుస్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఎన్‌సీసీ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్‌సీసీతో విద్యార్థుల్లో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు అలవరచుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రావ్య, ఒకటో పటాలం సీఐ ఫిరోజ్, పీరాల బెటాలియన్ హవల్దార్ మేజర్ రమేష్, హవల్దార్ షంషేర్ సింగ్, మేజర్ బీఎస్ఆర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

శిరస్త్రాణం తప్పనిసరి

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: విద్యార్థులు వాహనాలు నడిపే సమయంలో తప్పక శిరస్త్రాణం ధరించాలని తిరుమల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి నారాయణ అన్నారు. మండలంలోని జొన్నలగడ్డలో కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రారంభించారు. రహదారి భద్రత నిబంధనలపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మితిమీరిన వేగం ప్రమాదకరమన్నారు. ఈనెల 30 వరకు సాగే శిబిరంలో భాగంగా గ్రామంలో స్వచ్ఛభారత్, మురుగు కాలువలో బ్లీచింగ్ చల్లడం, మొక్కలు నాటడం, వైద్య శిబిరం, ప్రభుత్వ పథకాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించడం తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శైలేంద్రకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు క్రాంతికుమార్, హనుమంతరావు, జడ్పీ హైస్కూలు హెచ్ఎం మల్లికార్జునరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి సాంబశివరావు పాల్గొన్నారు.

భాజపా మండల అధ్యక్షుడిగా ఉదయభాస్కర్

ఈపూరు: భారతీయ జనతా పార్టీ ఈపూరు మండల అధ్యక్షుడిగా కాకుమాను ఉదయభాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బొగ్గరం గ్రామానికి చెందిన ఈయన ఆర్యవైశ్య సంఘంలో కీలకంగా ఉన్నారు.

అధ్వాన పారిశుద్ధ్యంతోనే జ్వరాలు

నూజండ్ల, న్యూస్‌టుడే: అధ్వాన పారిశుద్ధ్యంతోనే జ్వరాలు ప్రబలుతున్నాయని ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. పాతనాగిరెడ్డిపల్లెలో ఆమె సోమవారం పర్యటించారు. కాలువలు, రోడ్లపై మురుగునీరు గమనించి వెంటనే స్వచ్ఛత చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. జ్వరాలు అదుపులోకి వచ్చే వరకు ఆరోగ్య శిబిరం కొనసాగించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

మార్చి నాటికి టిడ్కో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : రెండో దశ టిడ్కో ఇళ్ల నిర్మాణం మార్చి నాటికి పూర్తి కావాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అధికారులకు సూచించారు. చిలకలూరిపేట ఎన్టీఆర్ కాలనీ రెండో దశలో నిర్మిస్తున్న టిడ్కో గృహాల నిర్మాణం, మౌలిక వసతులకు సంబంధించి రూ.7.18 కోట్లతో సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో దశలో 1008 ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరిబాబు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా నిలుస్తాం

నరసరావుపేట: కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట సెంట్రల్, రొంపిచర్ల, యడ్లపాడు, చిలకలూరిపేట గ్రామీణ, నూజండ్ల, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పలువురు వక్తలు అన్నారు. రైతులను రాజుగా చేసేందుకు వారిలో చైతన్యం నింపేందుకు ప్రభుత్వం చేపట్టిన 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమానికి నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లో సోమవారం శ్రీకారం చుట్టారు. నరసరావుపేట మండలం గురవాయిపాలెంలో ఎమ్మెల్యే అరవిందబాబు ఇంటింటికీ వెళ్లి రైతులతో మాట్లాడి నీటి కొరత, ఎరువుల సమస్యలు, రుణ సదుపాయాలు, మార్కెటింగ్ వంటి సమస్యలను తెలుసుకున్నారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, తెదేపా నాయకులు పాల్గొన్నారు. ★ మండలంలోని ఉప్పలపాడులో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులను కలిసి మాట్లాడారు. ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకొని పంటల సాగు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల వివరాలు ఉద్యాన సహాయకులు యాప్‌లో నమోదు చేసే తీరును పరిశీలించారు. ఉద్యానశాఖ జిల్లా అధికారి వెంకట్రావు, ఏవో నబీరసూల్ పాల్గొన్నారు.

కృషితో ఉన్నతి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థులు కృషితో ఉన్నత స్థాయికి చేరుతారని అమెరికాలోని మసాచుసెట్స్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ చెరిన్‌కిమ్ అన్నారు. ఏఎంరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఎక్స్‌పర్ట్ టాక్ ఆన్ మెంటల్ ఫోకస్, డిసిప్లిన్ టు ది గ్లోబల్ లీడర్స్ అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు చేయాల్సిన కృషి, వ్యక్తిగత అభివృద్ధికి అవసరమైన నైపుణ్యాలు వివరించారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతిశ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

క్రీడామైదానంలో స్వచ్ఛత పనులు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని కోడెల క్రీడా ప్రాంగణంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ సిబ్బంది, కూటమి నాయకులతో కలిసి స్వయంగా చీపురుపట్టి నడకదారి, పరిసరాలను శుభ్రం చేశారు. ఈనెల 30న ప్రారంభం కానున్న 69వ రాష్ట్ర స్థాయి అండర్-17 బాల బాలికల ఫుట్‌బాల్ పోటీలకు క్రీడాప్రాంగణాన్ని పూర్తిస్థాయిలో శుభ్రం చేస్తామన్నారు. నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గుప్తా, సుబ్బారావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యం

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: ఆటలతో యువతలో ఆరోగ్యం, ఐక్యత, క్రమశిక్షణ పెంపొందుతాయని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. పట్టణంలోని వల్లప్ప చెరువు సమీపంలోని క్రికెట్ మైదానంలో హాస్పిటల్స్ క్రికెట్ లీగ్‌ను ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం క్రీడల ప్రోత్సాహానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని తెలిపారు. క్రీడాకారులతో కలిసి ఆయన కొద్దిసేపు క్రికెట్ ఆడి యువతను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు నాగోతు ప్రకాష్, స్థానిక వైద్యులు, ఆసుపత్రి యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీ కుల జనగణన చేపట్టాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందుగానే బీసీ కుల గణన పూర్తి చేయాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. పట్టణంలోని సంఘం కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు సోమవారం ర్యాలీగా తరలివచ్చారు. బీసీల జనాభా నిష్పత్తిలో రిజర్వేషన్లను కూడా ఏ, బీ, సీ, డీ వర్గీకరణ తరహాలో అమలు చేయాలన్నారు. అలాగే బీసీల రక్షణ చట్టం వెంటనే చేయాలని, ఉద్యోగుల పదోన్నతుల్లో రిజర్వేషన్లు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. నేతలు బాదుగున్నల శ్రీను, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

అమ్మో.. వానర దండు

మండలంలోని నడిగడ్డ జడ్పీ పాఠశాలలో కోతుల బెడద రోజురోజుకు తీవ్రమవుతోంది. ఏడాదికి పైగా గ్రామంలో సంచరిస్తూ ఇళ్లలోకి చొరబడి దొరికిన వస్తువులు తీసుకుని పరారవుతున్నాయి. తరచూ పాఠశాలలోకి వస్తుండటంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. ఒక్కోసారి తరగతి గదుల్లోకి వస్తున్నాయని, మధ్యాహ్న భోజన సమయంలో వీటి బారి నుంచి పిల్లలను రక్షించడం కష్టతరం అవుతోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. పాఠశాలలో కొంత భాగానికి ఇనుప గ్రిల్స్ పెట్టిస్తే సమస్య కొంతమేర పరిష్కారం అవుతుందని దీనికి దాతలు సహకరించాలని కోరుతున్నారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో సుందరరెడ్డిని వివరణ అడగ్గా స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి అవసరమైతే కొన్ని రోజులు ఓ కొండముచ్చును పాఠశాలలో ఉంచే ఏర్పాటు చేస్తామన్నారు.

- న్యూస్‌టుడే, వినుకొండ రూరల్



తాగునీటి వృథా అరికట్టరూ!

నరసరావుపేటలో రైల్వేస్టేషన్ మొదటి గేట్ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో ప్రధాన రహదారిపై తాగునీటి పైపులైనుకు లీకేజీ ఏర్పడి నీరంతా రోడ్డుపై వృథాగా పారుతోంది. రెండ్రోజుల క్రితం చిన్న రంధ్రం ఏర్పడినా పట్టించుకోకపోవడంతో పెద్దదై భారీగా నీరు పోతోంది. అక్కడ ఓ బ్యారికేడ్‌ను అడ్డుగా పెట్టడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అసలే శివారు కాలనీలు నీటిఎద్దడి ఎదుర్కొంటున్న తరుణంలో విలువైన తాగునీరు నేలపాలు కావడంతో అధికారుల తీరుపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ డీఈ రఫీని వివరణ కోరగా పైపులైను లీకేజీకి మరమ్మతులు చేసి నీటి వృథాకు అడ్డుకట్ట వేస్తామని చెప్పారు.

- న్యూస్‌టుడే, శ్రీనివాసనగర్ (నరసరావుపేట టౌన్)

లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: కార్మిక, ఉద్యోగ వర్గాన్ని పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలంటూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో మస్టర్ పాయింట్ల వద్ద కార్మికులు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ పల్నాడు జిల్లా కార్యదర్శి సిలార్‌మసూద్ మాట్లాడుతూ కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయకుండా పెట్టుబడిదారులకు అనుకూలం, కార్మికులకు ద్రోహం చేసేలా లేబర్‌కోడ్‌లను అమలు చేయాలని చూడటం ప్రభుత్వాలకు తగదన్నారు. ఆందోళనలో ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షుడు షేక్ చిన్న అల్లాభక్షు, సోమశేఖర్, శ్రీనివాసరావు, నాగరాజు, సామ్రాజ్యం, ఖాసిం, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధికి వచ్చి అనంత లోకాలకు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కిషోర్ (పాత చిత్రం)

హైదరాబాద్, న్యూస్‌టుడే: భార్య, బిడ్డను పోషించుకునేందుకు నగరానికి వచ్చిన ఓ యువకుడిని రోడ్డు ప్రమాదం కబళించింది. దీంతో రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటన కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌యాదవ్ వివరాల ప్రకారం.. వినుకొండ మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన దేవరకొండ కిషోర్ (26) జీవనోపాధి కోసం నగరానికి వచ్చి కూకట్‌పల్లి శంషీగూడలో భార్య, 8 నెలల పాపతో నివాసం ఉంటున్నాడు. పండ్లు విక్రయించడం, డ్రైవింగ్ చేస్తుంటాడు. సోమవారం ఉదయం ప్రగతినగర్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్గంమధ్యలో చెరువు సమీపంలో మినీ బస్సును ఎడమ వైపు నుంచి దాటుతుండగా బైక్ అదుపు తప్పింది. బస్సు వెనక చక్రాల కింద కిషోర్ పడిపోవటంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పిచ్చికుక్క దాడిలో బాలికకు తీవ్ర గాయాలు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: నాగులవరంలో ఇంటి ముందు ఆడుకుంటున్న అయిదేళ్ల బాలిక భవనాశి అశ్వితను పిచ్చికుక్క కరవడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. కుక్క దాడి చేయడంతో బాలిక కేకలు వేయగా గమనించిన గ్రామస్థులు కర్రతో కొట్టి తరిమేశారు. వెంటనే బాలికను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా చికిత్స చేశారు. చిన్న పిల్లల వైద్యులు లేకపోవడంతో గుంటూరు వైద్యశాలకు తరలించారు. బాలికను ఆసుపత్రికి తరలించడంలో ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, ఏఎన్ఎం నాగవాణికి బాధితురాలి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

మద్యం అక్రమంగా కలిగి ఉన్న ముగ్గురి బైండోవర్

ఈపూరు, న్యూస్‌టుడే: ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజు స్టేషన్ సర్కిల్ పరిధిలో అక్రమ మద్యం కలిగి ఉన్న కేసుల్లో నిందితులైన ముగ్గురిపై సోమవారం బైండోవర్ కేసు నమోదు చేసినట్లు సీఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. రావులాపురం, రేమిడిచర్ల, మేళ్లవాగు గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు మద్యం గొలుసు దుకాణాలు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం కలిగి ఉన్నారు. వీరిని బొల్లాపల్లి తహసీల్దారు కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

ముందు జాగ్రత్తగా 16 మందిపై..

యడ్లపాడు: మండలంలో కొత్త సొలస ఎస్సీ కాలనీలో గతేడాది క్రిస్మస్ సందర్భంగా స్టార్ ఏర్పాటు చేసే క్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. ఇరు వర్గాలకు చెందిన 16 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు నిబంధనల మేరకు నిందితులను తహసీల్దార్ విజయశ్రీ ముందు సోమవారం హాజరుపరిచారు.

వెండి కిరీటాల చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

గణపవరం(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో సనాతన వేణుగోపాలస్వామి ఆలయంలో గత జులైలో జరిగిన మూడు వెండి కిరీటాల చోరీ కేసులకు సంబంధించి ఇద్దరిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై పుల్లారావు తెలిపారు. అందిన సమాచారం గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన మద్దాల అమృతకుమార్ ఆలయంలో విగ్రహాలను చోరీ చేసి చిలకలూరిపేట సుబ్బయ్యతోటలోని పఠాన్ సుభానికి విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఇద్దరినీ అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

మహారాజశ్రీ నర్సరావుపేట 13వ అడిషనల్ జిల్లా జడ్జి గారి కోర్టులో
O.S. 9/2012 EP 1/2022
కొల్లా పున్నారావు – D.H.R.
And
కనమర్లపూడి వెంకట సుబ్బారావు &వగైరాలు – JDRs
To: JDR 4. కనమర్లపూడి మాధూరి, D/o వెంకటసుబ్బారావు, JDR 5. కనమర్లపూడి రమ్య సుభాషిణి, D/o వెంకట సుబ్బారావు, JDRs 4,5 నివాసం డోర్ నెంబరు 5-331, సాదినేని చౌదరయ్య కల్యాణమండపం దగ్గర G.T రోడ్, చిలకలూరిపేట టౌన్.
పై నెంబరు అమలు దరఖాస్తులో మీకు ఎన్ని సార్లు నోటీసులు పంపిన మీరు నోటీసులు తీసుకోనందున యీ పేపరు నోటీసు ద్వారా పై కోర్టు వారి యెదుట ది.10-12-2025 తేది ఉదయం గం॥ 10:30లకు శ్రీ కోర్టు వారి యెదుట హాజరు అయి మీకు గల ఆక్షేపణములు తెలుపుకోవలెను లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.
తేది:24-11-2025, నరసరావుపేట
శ్రీ P.పాండురంగారావు, DHR తరఫు అడ్వకేటు మరియు నోటరీ చిలకలూరిపేట - 522616

(c) eenadu

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

పిల్లలులేని దంపతులకు దత్తత వరం

అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పిల్లలులేని దంపతులకు దత్తత వరం లాంటిదని సీడీపీవో శ్రీలత, డీసీపీవో ప్రకాశ్ అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డు యూపీహెచ్‌సీలో సోమవారం ఏర్పాటు చేసిన దత్తత అవగాహన వారోత్సవాల్లో వారు మాట్లాడారు. దత్తత తీసుకునేందుకు దంపతులు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం చట్టబద్ధంగా పిల్లల సంరక్షణ బాధ్యత అప్పగిస్తుందన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు విస్తృతంగా ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. ఏసీడీపీవో సంతోషకుమారి, సూపర్‌వైజర్ ప్రశాంతి, హెచ్‌వీ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

44 మందికి ఉద్యోగావకాశాలు

ఎంపికైన వారికి పత్రాలు అందజేస్తున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి రవీంద్రనాయక్ తదితరులు

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో క్రోసూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 44 మంది నిరుద్యోగులు ఎంపికైనట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి రవీంద్రనాయక్ తెలిపారు. పది కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారని, నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి 138 మంది నిరుద్యోగులు తరలివచ్చినట్లు చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? దైదలోని పొలాలకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. గ్రామంలోనూ సీసీ రహదారులు పూర్తి స్థాయిలో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. - **సాంబయ్య, దైద** ✔ అంచనాలు సిద్ధం చేశాం. నిధులు సమకూర్చిన తర్వాత పనులు ప్రారంభిస్తాం. - **సుధారాణి, పంచాయతీరాజ్ ఏఈ** - న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ

? పెదకూరపాడు ప్రియా హోటల్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. రహదారిని ఆక్రమించి కొందరు టిఫిన్ దుకాణాలు, కూరగాయల విక్రయాలు చేపట్టారు. అలాగే స్థానిక గృహాల నుంచి వచ్చే వృథా నీరు రహదారిపై ప్రవహిస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. - **హుస్సేన్, స్థానికుడు** ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, మురుగు పారుదల వ్యవస్థ మెరుగుకు కృషి చేస్తాం. - **శరత్, ఈవోపీఆర్డీ - పెదకూరపాడు**

రైతులకు ఎన్ని కష్టాలో!

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: నెలకొక గండం అన్నదాతల్ని భయపెడుతోంది. మొంథా తుపాను నుంచి కోలుకోక ముందే మరో వాయుగుండం వారిని కలవరపాటుకు గురి చేస్తోంది. దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం ఈ నెల 24వ తేదీకి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలతో సాగులో ఉన్న పంటలు చేతికందుతాయో లేదో అని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిశాయి. సత్తెనపల్లి, పెదకూరపాడు, గురజాల నియోజకవర్గాల్లో అధిక విస్తీర్ణంలో రైతులు ఈ ఏడాది వరి సాగు చేపట్టారు. మొక్కజొన్న సాగు పనులు ఇటీవలే ముమ్మరమయ్యాయి. పత్తి తీతలు తుదిదశకు చేరుకుంటున్నాయి. వర్షం భయంతో కోతల్ని వాయిదా వేసుకుంటున్నారు.

ఉరుకులు.. పరుగులు

దాచేపల్లి, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా 8000 హెక్టార్లలో పత్తి, 600 హెక్టార్లలో వరి సాగైంది. ప్రస్తుతం కోత దశలో ఉన్నాయి. మళ్లీ తుపాను హెచ్చరికలతో రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. పత్తి తీయడానికి కూలీల కొరత ఏర్పడింది. చిన్నపాటి వర్షం కురిసినా పత్తి తడిసి ఖరాబయ్యే ప్రమాదం ఉంది.

కూలీల కొరత

పదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేశా. పత్తి, వరి కోతలు ఒకేసారి రావడంతో కూలీల కొరత ఏర్పడింది. పత్తి తీత సమయంలో మళ్లీ వర్ష సూచనలు చేయడంతో దిగులు మొదలైంది. పెట్టుబడి కూడా వస్తుందన్న నమ్మకం లేదు. **- రాజేష్, శ్రీనగర్, రైతు**

వరి నూర్పిడికి అధిక ఖర్చు

జంగమహేశ్వరపురం (గురజాల గ్రామీణ): ఖరీఫ్ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. గురజాల డివిజన్ ప్రాంతంలో 12 వేల హెక్టార్లలో సాగు చేశారు. గతంలో పంట నూర్పిడికి గంటకు రూ.2,800 చెల్లించారు. తుపాను కారణంగా చాలాచోట్ల పంట నేలకొరిగింది. దాన్ని నూర్పిడి చేసేందుకు గంటకు రూ.3,500 పైనే డిమాండ్ చేస్తున్నారు. దీనికితోడు యంత్రాల కొరత నెలకొంది. డిమాండును ఆసరా చేసుకుని కొందరు యంత్రాలను కర్ణాటక నుంచి తెప్పించి ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. కూలీలతో నూర్పిడి చేయించాలంటే రూ.11 వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు.

వాతావరణ మార్పులతో ఆందోళన

పంట కోతకు వచ్చింది. యంత్రం కోసం రోజుల తరబడి ఎదురుచూస్తున్నా. మరోవైపు వాతావరణ మార్పులతో పంట ఇంటికి చేరుతుందో లేదో తెలియక భయాందోళనకు గురవుతున్నా.
– సైదయ్య, జంగమహేశ్వరపురం

కొమ్మాలపాటి, యరపతినేనిలకు సత్కారం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర భట్రాజ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితుడైన పట్టణానికి చెందిన సరికొండ వెంకటేశ్వరరాజు అలియాస్ మార్కెట్ రాజు సోమవారం తెదేపా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులను సత్కరించారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని వారితో చెప్పారు.

అన్నదానానికి రూ.1.50 లక్షల వితరణ

గురజాల, న్యూస్‌టుడే: పట్టణంలోని అయ్యప్ప స్వామి అన్నదాన సత్రంలో జరుగుతున్న సద్ది కార్యక్రమంలో సోమవారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఆయన కుమారుడు నిఖిల్ పాల్గొన్నారు. 5 రోజుల సద్ది కోసం రూ.1.50 లక్షలు అయ్యప్ప కమిటీ సభ్యులకు అందజేశారు.

చక్కటి సేవలకు ప్రోత్సాహకాలు

సిబ్బందికి జ్ఞాపికలు అందజేస్తున్న గ్రామీణ సీఐ కిరణ్

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: శాంతి భద్రతల నిర్వహణ, నేరాలకు కళ్లెం వేయడంలో ఆదర్శంగా విధులు నిర్వర్తించే పోలీసులకు ప్రోత్సాహకాలు అందజేసి, ఇతరుల్లో స్ఫూర్తి నింపుతామని సత్తెనపల్లి గ్రామీణ సీఐ కిరణ్ అన్నారు. తన కార్యాలయంలో సోమవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నకరికల్లు పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి పట్టుకోవడంతోపాటు చోరీ అయిన 35 ద్విచక్ర వాహనాల రికవరీలో కీలకంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుళ్లు నారాయణ, శ్రీను, కానిస్టేబుల్ సుభాని, జ్ఞానయ్య, రాజుపాలెం స్టేషన్ హోంగార్డు హసనేల్‌లకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఎస్సైలు మణికృష్ణ, సతీష్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పశుగణాభివృద్ధికి కృషి

రైతుకు మినరల్ మిక్చర్ అందజేస్తున్న డీడీ సుధాకర్

అచ్చంపేట, న్యూస్‌టుడే: పశుగణాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెట్టాయని, రైతులు వాటిని ఉపయోగించుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు సుధాకర్ తెలిపారు. సోమవారం కోనూరు గ్రామంలో 'రాష్ట్రీయ గోకుల్‌మిషన్ - గర్భకోశ వ్యాధుల చికిత్స' శిబిరాన్ని సహాయ సంచాలకులు వెంకట్రామయ్య, శివసారథితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యశాల స్థల దాత అచ్చయ్య, మాజీ సర్పంచి లక్ష్మీనారాయణ మాట్లాడారు. అనంతరం రైతులకు మినరల్ మిక్చర్ సంచులు పంపిణీ చేశారు. పశువైద్యాధికారి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గం దిశగా అడుగులు

పెదకూరపాడు: ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రారంభించిన 100 రోజులు 100 గ్రామాల కార్యక్రమం ఆదర్శనీయమని, నియోజకవర్గం అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయని ఎన్నారై తెదేపా సమన్వయకర్త మాగులూరి భానుప్రకాష్ అన్నారు. సోమవారం ఎన్నారై తెదేపా నేతలు ఎమ్మెల్యే ప్రవీణ్‌తో అంతర్జాల సమావేశం నిర్వహించి అభినందించారు.

చిత్తశుద్ధితో పనిచేయండి

గ్రామస్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, న్యూస్‌టుడే: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం వైకుంఠపురంలో ప్రజల వద్దకు ప్రవీణ్ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్రామంలోనే ఉండి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ సచివాలయం, ఇతర పలు అభివృద్ధి పనులు పరిశీలించారు. కరకట్ట బలహీనంగా ఉందని, వరదలు వచ్చినప్పుడల్లా భయాందోళన చెందుతున్నామని, కట్ట ఎత్తు పెంచాలని గ్రామస్థులు కోరారు. సర్వీసు ఈనాం భూములు 394 ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నాయని విన్నవించారు. వైకుంఠపురం ఆలయాన్ని తితిదేలో కలిపి అభివృద్ధి చేయాలని కోరారు. ఘాట్‌రోడ్డు బాగు చేయాలన్నారు. తహసీల్దార్ డానియేలు, ఎంపీడీవో శివపార్వతి, తెదేపా నాయకులు రాజ, సూర్యనారాయణ, నాగేశ్వరరావు, శేషుబాబు, రవికుమార్, సర్పంచి విఠల్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు రాజు పాల్గొన్నారు.

రైతును రాజుగా చూడాలన్నదే ధ్యేయం

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: అరాచకం రాజ్యమేలిన చోట అభివృద్ధికి తావులేదని, గత పాలకుల తీరుతో నియోజకవర్గం వెనుకబడిందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం శిరిగిరిపాడు గ్రామంలో ఏడీఏ జగదీశ్వరరెడ్డి అధ్యక్షతన రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో రైతులు తమ ఆలోచనా ధోరణి మార్చుకోవాలని, ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలని సూచించారు. రైతును రాజుగా చూడాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. వరికపూడిశెల పథకం పనులు జరుగుతున్నాయని, రెండేళ్లలో పూర్తిచేసి 84 వేల ఎకరాలకు సాగునీరందిస్తామన్నారు. తృణధాన్యాలు, ఉద్యాన పంటల వైపు రైతులు అడుగులు వేయాలని కోరారు. అనంతరం సభా ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయల స్టాళ్లను పరిశీలించారు. మాచర్ల మార్కెట్ యార్డు ఛైర్మన్ మధుయాదవ్, ఎంపీపీ సంజీవరెడ్డి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి కళ్లం రామాంజిరెడ్డి, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి కుర్రి శివారెడ్డి, వ్యవసాయాధికారి గంగాధర్‌బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు సమస్యలకు పరిష్కారం

వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: నిర్దేశిత గడువులోపు ప్రజాదర్బార్‌లో స్వీకరించిన వినతులకు పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలకు చేరువగా పాలన ఉండేలా కూటమి ప్రభుత్వం ప్రజాదర్బార్ నిర్వహిస్తుందన్నారు.

క్రీడలతో అంతర్జాతీయ గుర్తింపు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: క్రీడల్లో ప్రతిభతో అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఇటీవల బహ్రెయిన్‌లో జరిగిన యూత్ ఆసియన్ గేమ్స్ కబడ్డీలో రాణించిన గద్దె హరీష్‌ను సోమవారం తన కార్యాలయంలో ఎమ్మెల్యే సత్కరించారు. క్రీడాకారులకు అండగా ఉంటానని చెప్పారు.

లాభసాటి పంటలు సాగుచేయాలి

రైతుకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: లాభసాటి పంటలు సాగు చేయాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెప్పారు. రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని వీరాపురంలో సోమవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి కరపత్రాలు రైతులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ములకలూరిలో సాగు చేసే పంటలను అధ్యయనం చేసి, ఇక్కడ కొంతమందితో సాగు చేయించి గురజాల నియోజకవర్గాన్ని ఆదర్శంగా ఉంచుతామని చెప్పారు. వీరాపురం రైతులు అధిక దిగుబడి సాధిస్తున్నారని అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకవైపు ఐటీ రంగాన్ని, మరోవైపు వ్యవసాయాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ తురకా వీరస్వామి, వైద్యులు ఉన్నం నాగమల్లికార్జునరావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, రాజశేఖరరెడ్డి, ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, తహసీల్దారు మధుబాబు, ఏవో సంధ్యారాణి, మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్‌గా కోటిలింగం

అచ్చంపేట, న్యూస్‌టుడే: అచ్చంపేటకు చెందిన ఎరువుల వ్యాపారి సూరె కోటిలింగం వాసవీక్లబ్స్ ఇంటర్నేషనల్ వి204ఏ డిస్ట్రిక్ గవర్నర్‌గా ఎంపికయ్యారు. ఆయనతో ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయనను పలువురు అభినందించారు.

మోటివేషన్ స్పీకర్లుగా ఉపాధ్యాయులు

సత్తెనపల్లి గ్రామీణ: పాకాలపాడు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు పి.సత్యనారాయణ రాజు, ఆయన సతీమణి లక్ష్మీహేమలత మోటివేషన్ స్పీకర్లుగా శిక్షణ పొందారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో 36 రోజులు శిక్షణ పొందారు. ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో ఇంపాక్ట్ ట్రైనర్లుగా సర్టిఫికెట్ పొందారు.

26న కార్మిక ర్యాలీ

దాచేపల్లి, న్యూస్‌టుడే: కార్మిక, కర్షకుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 26న నరసరావుపేటలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొమెర వెంకటరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మికుల హక్కులను హరించేలా ఉన్నాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బయోడీజిల్ విక్రయాలకు అనుమతి తప్పనిసరి

రెంటచింతల: బయో డీజిల్ విక్రయాలకు వ్యాపారులు పౌరసరఫరాలశాఖ నుంచి అనుమతి పొందాలని జిల్లా డీఎస్‌ఓ ప్రసాద్ తెలిపారు. పాలువాయిజంక్షన్‌లోని బయోడీజిల్ కేంద్రంలో మంటలు చెలరేగి ఒకరు మృతి చెందిన ఘటనపై సమగ్ర నివేదికను తహసీల్దార్ మేరి కనకం ద్వారా ఆర్డీవో మురళీకృష్ణ కలెక్టర్ కృతికాశుక్లాకు అందజేశారు. ఈ ఘటన నేపథ్యంలో డీఎస్‌ఓ పలు సూచనలు చేశారు.

ప్లేట్లు, చలికోట్లు పంపిణీ

ముప్పాళ్ల: మాదల బీసీ బాలికల గురుకుల పాఠశాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ప్లేట్లు, చలికోట్లు పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ లక్ష్మీసునీత, దాతలు నిర్మల, సౌజన్య, సేవాసంస్థ బాధ్యుడు బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదే

మున్సిపాలిటీ నిర్లక్ష్యం.. ప్రజలకు ప్రాణసంకటంగా మారుతోంది. పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ ఆలయం సమీపంలో మురుగు కాలువపై ఉన్న చప్టా అధ్వానంగా మారింది. పూడికతీసే సమయంలో తొలగించిన రాళ్ల సరిచేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను తప్పించబోయి నందిగామకు చెందిన ద్విచక్ర వాహనదారుడు ప్రహ్లాద్ కాలువలో పడబోయారు. త్రుటిలో ప్రమాదం తప్పింది. నిత్యం వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవట్లేదు. ఈ సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ప్రమాదాలు జరగకుండా చూస్తామని తెలిపారు.
- న్యూస్‌టుడే, సత్తెనపల్లి

అటు.. ఇటు ఆక్రమణలే

పెదకూరపాడు నుంచి పాటిబండ్ల వెళ్లే మార్గంలో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఈ దారికి ఇరువైపులా ఆక్రమించుకుని ఇళ్ల నిర్మాణాలు, దుకాణాలు ఏర్పాటు చేశారు. రహదారిపైనే సామగ్రి నిల్వ చేస్తున్నారు. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పాలకులు, పోలీసు అధికారులు చొరవ తీసుకుని ఆక్రమణలు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, పెదకూరపాడు

మాచవరం ఎంపీపీ మృతి

అంబులమ్మ (పాత చిత్రం)

మాచవరం: మాచవరం మండల పరిషత్తు అధ్యక్షురాలు దారం అంబులమ్మ(78) సోమవారం మృతి చెందారు. కొద్దిరోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, నాయకుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, ఎంఈవో-2 శ్రీధర్ తదితరులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంబులమ్మ మోర్జంపాడు-2 స్థానం నుంచి వైకాపా తరపున ఎంపీటీసీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. 2021న ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు.

ప్రసంగించి.. ప్రశంసలు పొంది

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

ఆక్స్‌ఫర్డ్‌లో విజేతలతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

జూలకల్లులో విజేతలు, ఉపాధ్యాయులు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని తిరుమల ఆక్స్‌ఫర్డ్ కళాశాలలో, జూలకల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలను సోమవారం నిర్వహించారు. కళాశాల విద్యార్థులకు 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై ఉపన్యాస పోటీలను నిర్వహించగా.. ఎం.యశ్విని, వి.హెమిమా, ఎస్.కె.ఫిరోజ్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ పి.నరేష్ బహుమతులు అందజేశారు. జడ్పీ పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఆర్.మహిత, జె.సాహిత్య, కె.మాధవ్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు సుబ్బారామయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

సమస్యలు పరిష్కరించాల్సిందే

గ్రామ రెవెన్యూ సహాయకుల నిరసన

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: ఎంత మంది ముఖ్యమంత్రులు వచ్చినా గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బందగీ సాహెబ్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపి, అనంతరం ఏవో సరోజకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సహాయకుల శ్రమను దోచుకుంటున్నారని, తెలంగాణలో మాదిరి పేస్కేలు అమలు కావడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే విజయవాడ కేంద్రంగా ధర్నాకు దిగుతామని హెచ్చరించారు.

పిడుగురాళ్ల: సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని కోరారు. రోడ్లు భవనాల అతిథి గృహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం లేబర్‌కోడ్స్ ప్రతులను దహనం చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల విషయంలో దాడి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: సేద్యానికి అవసరమైన ఎద్దుల విషయంలో దాడి జరిగింది. ఇందులో ఒకరికి గాయాలయ్యాయి. వివరాలిలా.. మండలంలోని మరసపెంట గ్రామానికి చెందిన బిక్షాలునాయక్ తన మిరప పొలంలో సేద్యానికి ఎద్దులు అవసరం అయ్యాయి. ఆయన తెలంగాణ ప్రాంతానికి వెళ్లి ఓ రైతుకు సంబంధించిన ఎద్దులను రెండు నెలలపాటు తెచ్చుకునేందుకు రూ.20 వేలు చెల్లించేలా మాట్లాడుకొని వచ్చారు. ఇంతలో అదే గ్రామానికి చెందిన సర్దార్‌నాయక్ అవే ఎద్దులను గ్రామానికి తీసుకొచ్చి వ్యవసాయ పనులు చేపట్టారు. విషయం తెలిసిన బిక్షాలునాయక్ ఆదివారం రాత్రి సర్దార్‌నాయక్‌తో గొడవపడి, అతడిపై గొడ్డలితో దాడి చేశారు. ఈ దాడిలో సర్దార్ తలకు గాయమైంది. అతడ్ని మాచర్ల ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సెల్ టవర్ నిర్మాణం వద్దు

తహసీల్దారు ధనలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: స్థానిక పాలకేంద్రం సమీపంలో ఆవాసాల నడుమ ప్రైవేటు సెల్ టవర్ నిర్మాణ పనులను తక్షణం నిలిపివేయాలంటూ స్థానికులు ఆందోళన చేపట్టారు. సోమవారం తహసీల్దారు ధనలక్ష్మి, ఎంపీడీవో సాయిలీలను కలిసి వినతిపత్రం అదించారు. తమ అభిప్రాయాలను లెక్కచేయకుండా సెల్ టవర్ నిర్మాణానికి పంచాయతీ అనుమతి ఇవ్వడం సరికాదని, జనవాసాల నడుమ, పాఠశాల, కళాశాలలతోపాటు క్రైస్తవ ప్రార్థన మందిరం సమీపంలో టవర్ నిర్మాణంతో రేడియేషన్ ప్రభావం ఉంటుందని, ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇద్దరి ఘర్షణ

మాచర్ల (కారంపూడి): లింగాపురంలో పాతకక్షల నేపథ్యంలో ఇద్దరు ఘర్షణ పడ్డారు. గ్రామానికి చెందిన జింకల వెంకటేశ్వర్లు, రాగి నాగేశ్వరరావు మధ్య పాతకక్షలు ఉన్నాయి. తరచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం మరోసారి ఘర్షణ పడ్డారు. దాడికి పాల్పడ్డారు. ఇద్దరికీ గాయాలు కాగా వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆచారవంతుడి మృతిపై కేసు

కారంపూడి: విద్యుదాఘాతానికి గురై చిలకలూరిపేటకు చెందిన ఆచారవంతుడు నరసింహం మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఐఎంఏ అధ్యక్షుడికి అవార్డులు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పిడుగురాళ్ల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ధూళిపాళ్ల భరత్‌కుమార్ చేసిన సేవలకు మూడు అవార్డులు అందుకున్నారు. అన్నమయ్య జిల్లా రాజంపేటలో ఈనెల 22, 23వ తేదీల్లో రాష్ట్ర కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి భరత్‌కుమార్‌కు అవార్డు లభించింది, దాంతోపాటు ఐఎంఏలో సభత్వ నమోదు, డాక్టర్స్ దినోత్సవం సందర్భంగా వైద్యులకు విశిష్ట పురస్కారాలు అందజేసినందుకు అవార్డులు అందజేశారు.

మహిళకు తీవ్ర గాయాలు

మాచర్ల (కారంపూడి): పశువులను మేపుతూ రోడ్డుపైకి వచ్చిన మహిళను వేగంగా వచ్చిన కారు ఢీకొన్న ఘటన సోమవారం మాచర్ల మండలం కంభంపాడు శివార్లలో చోటు చేసుకుంది. రమణమ్మ పశువులను మేపి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో కారు ఢీకొట్టింది. ఆమెకు తీవ్ర గాయాలు కాగా స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

విద్యుత్తు లేక.. నీరందక..

నడికుడి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

దాచేపల్లి, న్యూస్‌టుడే: దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నడికుడి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు తిష్ఠ వేశాయి. రోగులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని నెలలుగా ఆసుపత్రిలోని బోరు మోటారు పనిచేయక సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని సిబ్బంది వాపోతున్నారు. విద్యుత్తు సమస్య వెంటాడుతోంది. బిల్లులు చెల్లించపోవడంతో సరఫరా నిలిపేసింది. సమీపంలోని చెత్త సేకరణ కేంద్రం నుంచి తాత్కాలిక కనెక్షన్ తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. సింగిల్ ఫేజ్ కావడంతో ఓల్టేజీ సరిపోక నెబ్యులైజర్, ఫ్రిజ్, ల్యాబ్ పరికరాలు పనిచేయడం లేదు. ఆసుపత్రి ఆవరణ మొత్తం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. విషసర్పాలు సంచరిస్తున్నాయని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి పక్కనే ఉన్న సెప్టిక్ ట్యాంకు మూతలేక దుర్వాసన వస్తోంది. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని రోగులు, స్థానికులు కోరుతున్నారు.

ఇదో మొక్కుబడి తంతు

తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు

గురజాల, న్యూస్‌టుడే: గురజాల రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రతి సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక మొక్కుబడిగా సాగుతోంది. తహసీల్దార్ కార్యాలయాల్లో ఉదయం 10 గంటలకు మండల అధికారులు అందుబాటులో ఉండాలి. సోమవారం ఉదయం 11 గంటలైనా గురజాల తహసీల్దార్ కార్యాలయంలో ఒక్కరూ అందుబాటులో లేరు. తహసీల్దార్ అందుబాటులో లేకపోతే ఇతర అధికారులు, సిబ్బంది ఫిర్యాదుల స్వీకరించాలి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు నిరీక్షించాల్సి వచ్చింది. మాచవరంలోనూ ఉదయం 11 గంటల వరకు తహసీల్దార్ అందుబాటులో లేరు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును కలిసేందుకు పిడుగురాళ్ల వెళ్లారని సిబ్బంది చెప్పారు. దాచేపల్లిలో ముప్పావు గంట ఆలస్యంగా కార్యక్రమం మొదలైంది. ఆర్డీవో కార్యాలయంలోనూ కార్యక్రమం జరగలేదు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆర్డీవో వెళ్లారని సిబ్బంది తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలో కార్యక్రమం మొక్కుబడిగా నిర్వహిస్తుండటంతో ప్రజలు వ్యయప్రయాసలతో జిల్లా కేంద్రానికి వెళుతున్నారు.

చదువుతో జీవితానికి వెలుగు

విద్యార్థులతో మాట్లాడుతున్న అమర సుబ్బయ్య

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: చదువు జీవితాన్ని మార్చుతుందని జిల్లా గిరిజన సంక్షేమాధికారి అమర సుబ్బయ్య చెప్పారు. పట్టణంలోని గిరిజన బాలుర గురుకుల విద్యాలయంలో వసతి గృహ నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకుని మంచి స్థాయికి ఎదగాలని చెప్పారు. పదోతరగతిలో మంచి మార్కులు సాధించి అందరూ ఉత్తీర్ణులు కావాలన్నారు. బాలుర గురుకుల విద్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆర్డీవో మురళీకృష్ణకు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. కిటికీలకు మెస్‌లు వెంటనే ఏర్పాటు చేసి, ఫ్యాన్లు బాగు చేయిస్తామన్నారు. ఈ సందర్భంగా ఓ ఉపాధ్యాయుడిపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది.

(c) eenadu

ఈనాడు
పార్వతీపురం మన్యం
మంగళవారం నవంబరు 25, 2025

కొడుకా లేవరా.. కళ్లు తెరవరా..!

కొడుకా లేవరా.. అని తల్లులు..
అన్నా.. పలకవేమిరా అని తమ్ముళ్లు, చెల్లెళ్లు..

రేయ్.. ఒక్కసారి కళ్లు తెరిచి చూడరా అని స్నేహితుల రోదనలతో జంఝావతి నదీ తీరం కన్నీటి చారికలతో నిండిపోయింది. ఒకే ఊరికి చెందిన, బంగారు భవిష్యత్తు ఉన్న ముగ్గురు యువకులు ఒకేసారి కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో రోదనలు మిన్నంటాయి.
– న్యూస్‌టుడే, కొమరాడ, పార్వతీపురం, పట్టణం

గోవిందనాయుడు మృతదేహాన్ని పట్టుకుని విలపిస్తున్న భార్య, బంధువులు

● నదీ తీరాన కన్నీటి చారికలు
● గల్లంతైన ముగ్గురి మృతదేహాలు లభ్యం

మూగబోయిన సివిని..

రాజ్యలక్ష్మీపురం సమీపంలోని రబ్బరు డ్యామ్ వద్ద నదిలో ఆదివారం గల్లంతైన ముగ్గురు యువకుల మృతదేహాలు సోమవారం లభ్యమయ్యాయి. ఆర్.శరత్ కుమార్(17)ను రక్షించేందుకు దూకి గల్లంతైన ఎ.ప్రతాప్(29), ఎ.గోవిందనాయుడు(35) మృతదేహాలు గుంప వద్ద కనిపించాయి. సోమేశ్వరుడి దర్శనానికి వెళ్లిన భక్తులు గుర్తించి, సీఐ రంగనాథం, ఎస్సై నీలకంఠంకు సమాచారం ఇచ్చారు. సాయంత్రానికి కోటిపాం సమీపంలో శరత్‌కుమార్ విగతజీవిగా కనిపించాడు. బంధువులు చేరుకుని అతడిని గుర్తించారు. మంత్రి సంధ్యారాణి, విప్ జగదీశ్వరి బాధితులను పరామర్శించారు.

★ ఒక్కసారి లేచి చూడండి అంటూ గోవిందనాయుడు భార్య సంధ్య ఏడ్చిన తీరు అక్కడివారిని కంటతడి పెట్టించింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. వారిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు.

★ తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంటాడనుకున్న కొడుకు అంత్యక్రియలు తాము చేయాల్సిన దుస్థితి వస్తుందనుకోలేదని శరత్‌కుమార్ తల్లిదండ్రులు శ్రీనివాస్, లక్ష్మి మృతదేహాన్ని పట్టుకుని విలపించారు.

★ ఆరునెలల క్రితం ఉద్యోగం వస్తే కష్టాలు తీరాయని అనుకున్నామని, ఇప్పుడు బిడ్డే లేకుండా పోయాడని ప్రతాప్ తండ్రి లక్ష్మణ కన్నీరుమున్నీరయ్యారు.

ప్రతాప్ మృతదేహం వద్ద తండ్రి వేదన

ఆశల దీపం ఆరిపోయింది

గరుగుబిల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అమ్మానాన్నలకు కబుర్లు చెబుతూ నిద్రపోయాడా విద్యార్థి.. ఎప్పటిలాగే తెల్లవారింది.. అమ్మా.. స్నేహితులతో రన్నింగ్‌కు వెళ్లొస్తా అంటూ బయటికి పరుగులు తీశాడు. అల్పాహారానికి వచ్చేస్తాడని ఎదురుచూసిందామె. కానీ దయలేని విధి మరొకటి తలచింది. నాగావళి కాలువలో మునిగిపోయాడన్న పిడుగులాంటి మాట విని తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో గుండెలవిసేలా రోదిస్తున్నారు.

గరుగుబిల్లి మండలం నందివానివలసకు చెందిన ఆర్.సింహాచలం, చిన్నమ్మ వ్యవసాయ కూలీలు. కుమార్తె జయంతి శ్రీకాకుళంలో బీఎస్సీ నర్సింగ్, కుమారుడు ఆర్.మణికంఠ(17) కురుపాంలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నారు. మణికంఠ రోజూ తెల్లవారుజామున 5 గంటలకు తోటపల్లి జలాశయం గట్టుపై రన్నింగుకు వెళ్తుండేవాడు. ఆదివారం కూడా నలుగురు యువకులతో కలిసి పరుగు ముగించుకొని ఉదయం నాగావళి ఎడమ కాలువ వద్దకు చేరుకున్నాడు. స్నానం చేద్దామని దిగి, సాగునీటి మదుము వద్ద జారి పడ్డాడు. అక్కడ లోతైన గొయ్యిలో ఈతకొట్టలేక మునిగి చనిపోయాడు. విషయం తెలుసుకున్న తండ్రి సింహాచలం చేరుకొని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. అల్లారుముద్దుగా పెంచిన బిడ్డ మరణంతో విలపిస్తున్నారు. గరుగుబిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మణికంఠ(పాతచిత్రం)

ఎవరిదీ పాపం ?

తోటపల్లి జలాశయం నుంచి పాత ఆయకట్టుకు సాగునీరు అందించే ఎడమ ప్రధాన కాలువలో పడి సోమవారం మణికంఠ అనే ఇంటర్ విద్యార్థి మృతిచెందాడు. ప్రాజెక్టు నుంచి ఎడమ కాలువ నిర్మాణంలో, ఇతర సాంకేతిక అంశాల్లో లోపాలతో ఇక్కడ ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. లోపాలను సవరించకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. దీంతో ఘటనలు జరుగుతున్నాయి.
– న్యూస్‌టుడే, పార్వతీపురం, గరుగుబిల్లి గ్రామీణం

ప్రమాదానికి కారణమైన తోటపల్లి ఎడమ ప్రధాన కాలువ

సంబంధం లేనట్లు..

ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఎడమ కాలువ ఏర్పాటైంది. ఇదొక్కటే పాలకొండ సబ్ డివిజన్‌లో ఉంది. మిగిలిన ప్రాంతమంతా జలాశయ డివిజను పర్యవేక్షణలో కొనసాగుతోంది. దీంతో ఎవరికి వారే యమునాతీరే అన్న చందంగా అధికారులు వ్యవహరిస్తున్నారు.

★ ఇప్పటికే షట్టర్లు పూర్తిగా పాడయ్యాయి. మరమ్మతులు లేక నీరు బయటకు వెళ్లిపోతోంది.

★ కాలువ సామర్థ్యం 414 క్యూసెక్కులు. కానీ షట్టర్లు బాగోలేక దానికి మించి ప్రవాహం బయటకు వస్తోంది. నీరు కిందికి పడేచోట భారీ గుంత ఏర్పడింది. అక్కడే విద్యార్థి మృత్యువాత పడ్డాడు.

★ ఆరేళ్ల క్రితమే రక్షణ గోడలు కొట్టుకుపోయాయి. వీటిని బాగు చేయక, ప్రవాహానికి నియంత్రణ లేకుండా పోయింది.

★ ప్రస్తుత పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించామని డీఈఈ గనిరాజు తెలిపారు.

★ ఆధునికీకరణకు గతంలో తెదేపా ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. వైకాపా సర్కారు నిర్లక్ష్యం చేసింది.

పట్టాలపై ప్రగతి ఎక్స్‌ప్రెస్

– న్యూస్‌టుడే, కొమరాడ, పార్వతీపురం పట్టణం, సీతానగరం, రింగురోడ్డు

ఇటీవల ప్రారంభమైనవి..
- రూ.11 కోట్లతో పార్వతీపురం- జమిడిపేట లైను
- 35 కి.మీ పరిధిలో ఉన్న బొబ్బిలి - దొంకినవలస ట్రాక్

ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో రైల్వే రంగానిది కీలక పాత్ర. రాకపోకలతో పాటు సరకు తరలింపు, ఉత్పత్తుల దిగుమతికి అదే ప్రధానాధారం. ఈ నేపథ్యంలో లైన్లను మరింత విస్తరించేందుకు ఆ శాఖ అడుగులు వేస్తోంది. ఇప్పటికే నిధులు మంజూరు కావడంతో.. మూడు, నాలుగో లైన్ పనులు జోరుగా సాగుతున్నాయి.

స్టేషన్లకు హంగులు.. బొబ్బిలి, దొంకినవలస, కోమటిపల్లి, గజపతినగరం, గరుడభద్ర రైల్వేస్టేషన్ల భవనాలను ఆధునిక హంగులతో నిర్మించారు. దాదాపు అన్నిచోట్ల రెండేసి అదనపు ప్లాట్ ఫారాలు నిర్మించారు.

గొట్లాం మీదుగా బైపాస్..

[illegible] నుంచి వచ్చే రైళ్లు జగదల్‌పూర్(ఛత్తీస్‌గఢ్) వెళ్లాలంటే విజయనగరం స్టేషన్‌కు వచ్చి ఇంజిన్ మార్చుకొని మళ్లీ వెనక్కి వెళ్లాల్సి వచ్చేది. దీని వల్ల సమయం వృథా అవుతోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు బైపాస్ విధానాన్ని తెర మీదకు తెచ్చారు. విశాఖపట్నం వెళ్లకుండా కొన్నింటిని దువ్వాడ మీదుగా రప్పించనున్నారు. ఈమేరకు గొట్లాం- నెల్లిమర్ల మధ్య అమృత్‌భారత్ నిధులతో సుమారు 9 కిలోమీటర్ల మేర ట్రాక్ నిర్మించారు.

తీరనున్న సమస్యలు.. పురిటిపెంట, కోమటిపల్లి, దిబ్బగుడ్డివలస, కనిమెరక ప్రాంతాల్లో గేట్లు పడితే సాధారణ వాహనాల్లో ప్రయాణికులు వేచి ఉండాల్సి వచ్చేది. ఆయా ప్రాంతాల్లో పైవంతెనలు మంజూరు చేశారు. కొన్ని గేట్ల వద్ద ఇప్పటికే ఆర్‌యూబీలు నిర్మించారు.

గడిచిన నాలుగేళ్లలో ఖర్చు రూ.1704.86 కోట్లు
లైన్ పొడవు: 126 కి.మీ

ఉపయోగాలివీ..

- లైన్ ఏర్పాటుతో మరిన్ని రైళ్లు వచ్చే అవకాశముంది
- ఇక నుంచి అదనపు హాల్ట్‌లు కల్పించే వీలుంది.
- ట్రాక్ సమస్య తీరనుంది
- ఇప్పటివరకు కొన్ని లూప్ లైన్లను వాడేవారు. ఇక నుంచి ఆ పరిస్థితి ఉండదు
- మన దగ్గర నుంచి మామిడి పండ్లు, తాండ్ర, ఆహార ఉత్పత్తులను తరలించవచ్చు.
- రెండు అప్, రెండు డౌన్ లైన్లు అందుబాటులోకి వస్తాయి
- గూడ్సులు సకాలంలో చేరుతాయి

రాయగడ నుంచి విజయనగరం వరకు మూడో లైను పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే బాడంగి మండలంలోని డొంకినవలస వరకు ప్రారంభించారు. ఇక్కడి నుంచి విజయనగరం మధ్య ఇంకా సాగుతున్నాయి. ఈ మార్గంలో విద్యుద్దీకరణ, వంతెనల నిర్మాణాలు, పట్టాల ఏర్పాటు ప్రక్రియ జరుగుతోంది. మరో ఏడాదిలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది.

నేటి నుంచి పుస్తక మహోత్సవం

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం నుంచి పార్వతీపురం పుస్తక మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు కలెక్టర్ ప్రభాకరరెడ్డి ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. వంద మందికి పైగా ప్రచురణ కర్తలు, సంస్థల నుంచి సాహితీ లోకానికి వచ్చిన లక్ష పుస్తకాలు ప్రదర్శిస్తారు. డిసెంబరు 5 వరకు పది రోజుల పాటు ఉత్సవంగా నిర్వహించేందుకు సాంస్కృతికశాఖ భాగస్వామ్యంతో ఏర్పాట్లు చేశారు.

కాలువలా.. కాలనాగులా!!

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, సాలూరు

ఉమ్మడి జిల్లాలో మురుగు కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా దర్శనమిస్తోంది. భారీ డ్రైన్లు, వరద కాలువలు అధ్వాన స్థితిలో ఉన్నాయి. వాటిపై పలకలు లేకపోవడం, ఇరువైపులా రక్షణ గోడల్లేక ముప్పు పొంచి చూస్తోంది. ఏమాత్రం అదుపుతప్పినా ప్రాణాలు గల్లంతయ్యే ప్రమాదముంది.

పలకల్లేక పిలుస్తోన్న మృత్యువు

విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయానికి కూతవేటు దూరంలోని కర్రలబట్టీ వద్దనున్న ప్రధాన కాలువిది. మురుగు, వరద నేరుగా పెద్దచెరువుకు వెళ్తుంది. గతంలో ఓ మహిళ పడి కొట్టుకుపోయింది. ఇంకా మూయకుండా ఇలానే ఉంచారు.

ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలు..

విజయనగరం: సిటీస్టాండ్, నగరపాలిక కూడలి, ప్రకాశం పార్కు, కర్రలబట్టీ, పద్మావతినగర్, సింహాద్రినగర్, నాయుడు కాలనీ, ఫూల్‌బాగ్

సాలూరు: బంగారమ్మకాలనీ, రామాకాలనీ, పెద మార్కెట్, కోటవీధి, పెదహరిజనపేట, బంగారమ్మ పేట

పార్వతీపురం: జగన్నాథపురం, కొత్తవలస, సాయినగర్, బైపాస్, బెలగాం

రాజాం: డోలపేట, పొనుగుటివలస, కొత్తవలస, కొండంపేట, గోపాలపురం, సారథి

బొబ్బిలి: ఫూల్‌బాగ్, పాత బొబ్బిలి, గొల్లపల్లి, ఆర్టీసీ కాంప్లెక్స్

అక్కడే ఎక్కువ..

విజయనగరం నగరపాలిక పరిధిలో సుమారు 450 కి.మీ మేర డ్రైన్లు విస్తరించాయి. ఇందులో పలకలున్నవి చాలా తక్కువ. వీటికి వరద కాలువలు అదనం. వీటి నిర్మాణాల కోసం ఏటా రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నారు. అనంతరం వదిలేస్తున్నారు. కల్వర్టులు సైతం రక్షణ లేకుండానే ఉన్నాయి. చాలావాటిపై పలకల్లేవు. కొన్నింటిపై వేసినా విరిగిపోయాయి. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

★ పెద్దచెరువు నుంచి అదనపు వరద కాలువ ఏర్పాటుకు రూ.3.50 కోట్లు మంజూరైనా పనులు జరగలేదు. ★ నగరం మీదుగా వెళ్తున్న ప్రధాన కాలువను వెడల్పు చేసేందుకు ఇటీవల రూ.35.51 కోట్లతో ప్రతిపాదించారు.

చర్యలు తీసుకుంటాం..

'ప్రధాన కాలువలున్న చోట ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకుంటున్నాం. పారిశుద్ధ్య పనులకు ఆటంకం కలగకుండా వాటిపై గ్రిల్స్ వేస్తున్నాం. కొన్నిచోట్ల పలకలు ఏర్పాటు చేస్తున్నాం. పూడికతీత పనులు ఎప్పటికప్పుడు సాగుతున్నాయి' అని పురపాలిక అధికారులు తెలిపారు.

కుక్కలకూ ఓ ఆసుపత్రి

న్యూస్‌టుడే- బొబ్బిలి

విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బస్సు, రైల్వే స్టేషన్లలోకి శునకాలు రాకుండా చర్యలు చేపట్టాలని దేశ అత్యున్నత న్యాయస్థానం ఇటీవల ఆదేశించింది. ప్రాంగణాల్లోకి చొరబడకుండా కంచెలు ఏర్పాటు చేయాలని సూచించింది. దీంతో పట్టణాల్లో శునకాల బెడద తగ్గుతుందని ప్రజలు భావిస్తున్నారు. జిల్లాలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన శస్త్ర చికిత్సల థియేటర్లు ఇప్పటికైనా వినియోగంలోకి వస్తాయనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బొబ్బిలిలో కుక్కల శస్త్రచికిత్సల కేంద్రం

పూర్తిస్థాయిలో వినియోగించని వైనం

ఉమ్మడి జిల్లాలోని బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు పురపాలక సంఘాల పరిధిలో కుక్కల నియంత్రణకు బొబ్బిలిలో సుమారు రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో ఆసుపత్రి, సంరక్షణ షెడ్లు నిర్మించారు. ఏడేళ్లవుతున్నా ఇంతవరకు పూర్తిస్థాయిలో వినియోగించడం లేదు. పుర అధికారులు కాకి లెక్కలతోనే సరిపెడుతున్నారు.

రూ.లక్షల్లో ఖర్చు..

శస్త్ర చికిత్సలు నిర్వహించి, రూ.లక్షల్లో వెచ్చిస్తున్నామని అధికారులు లెక్కలు చూపిస్తున్నారు. బొబ్బిలిలో ఈ ఏడాది 320 శస్త్రచికిత్సలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. జులై 31 నాటికి పూర్తిచేసినట్లు చెబుతున్నారు. ఒక్కోదానికి సుమారు రూ.800 చొప్పున రూ.2.56 లక్షలు వెచ్చించినట్లు పేర్కొన్నారు. పార్వతీపురంలోని 75 శునకాల కోసం రూ.1.65 లక్షలు, సాలూరులోని 135కి రూ.2.16 లక్షలు ఖర్చు చేశామని వెల్లడించారు. కానీ ఎక్కడికక్కడే కనిపిస్తున్నాయి.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం..

నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. నిర్మించిన ఆసుపత్రి సముదాయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొన్నింటిని గుర్తించి శస్త్రచికిత్సలు నిర్వహించాం. మిగిలిన పురపాలికలు కూడా వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశాం. – రామలక్ష్మి, పుర కమిషనర్

ఆమే ఆధారం.. కాపాడుకుందాం!

ఆమే జగతికి మూలం.. సృష్టి మనుగడకు ఆధారం.. ఆమెలేని ఇంటిని ఊహించలేం.. కుటుంబ అవసరాలు తీర్చి.. కుటుంబాన్ని చక్కదిద్దుతున్న అతివలపై మానసిక, శారీరక వేధింపులు ఎక్కువైపోతున్నాయి. ఒక్క మన్యం జిల్లాలోనే ఈ ఏడాదిలో ఇప్పటివరకు 200లకుపైగా గృహ హింస కేసులు నమోదయ్యాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వన్ స్టాప్ కేంద్రంలో భార్యాభర్తలకు సంబంధించి 270 వరకు ఉన్నాయి. నేడు 'అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినం' సందర్భంగా ఉమ్మడి జిల్లాలో కేసులు ఇలా..
– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

గత రెండేళ్లలో ఉమ్మడి జిల్లాలో

	2023	2024
వరకట్న మరణాలు	04	02
ప్రేరేపిత ఆత్మహత్యలు	09	04
వరకట్న వేధింపులు	374	324
లైంగిక వేధింపులు	169	137
అత్యాచారం/మోసం	28	30
అపహరణ	23	22

హోరాహోరీ.. పతకంపైనే గురి

స్కూల్‌గేమ్స్ అండర్-17 రాష్ట్రస్థాయి బాలికల ఖోఖో పోటీలు విజయనగరంలోని విజ్జీ మైదానంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. 13 ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు తరలిరాగా. రెండో రోజు సోమవారం హోరాహోరీగా తలపడ్డారు. చిత్తూరు, తూర్పుగోదావరి జట్లు ఫైనల్‌కు చేరాయి. మంగళవారం ఉదయం తుది పోరు ఉంటుందని స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు కోరాడ గోపాలరావు, ఎస్.విజయలక్ష్మి తెలిపారు.
– న్యూస్‌టుడే, విజయనగరం క్రీడావిభాగం

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ

పార్వతీపురం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడమే కాకుండా వారు వాటిని తీసుకునేలా చూడాలని మంత్రి జి.సంధ్యారాణి సూచించారు. సోమవారం పార్వతీపురంలో జరిగిన 'బేటీ బచావో' కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీ నెరవేర్చిందని చెప్పారు. పిల్లలకు పరిశుభ్రత ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రతిజ్ఞ చేస్తున్న సంధ్యారాణి, జగదీశ్వరి, విజయచంద్ర, కలెక్టర్ తదితరులు

'ముస్తాబు' కార్యక్రమాన్ని అన్ని కేంద్రాల్లో అమలు చేయాలని సూచించారు. 'ఆడపిల్లలను రక్షిస్తాం.. చదివిస్తాం.. బాల్య వివాహాలు నిర్మూలిస్తాం' అంటూ ప్రతిజ్ఞ చేశారు. కలెక్టరు ప్రభాకరరెడ్డి, ప్రభుత్వ విప్ జగదీశ్వరి, పాలకొండ ఎమ్మెల్యే విజయచంద్ర, జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టరు వైశాలి, ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ, సీడీపీవోలు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

గుమ్మలక్ష్మీపురం, పాలకొండ, న్యూస్‌టుడే: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ అన్నారు. ఎల్విన్‌పేట పోలీసు స్టేషన్‌ను సోమవారం సందర్శించి, మొక్కలు నాటారు. నమోదవుతున్న కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఏసీబీ, సీబీఐ, ఈడీ అంటూ ఈ-మెయిల్, వాట్సప్ ద్వారా వచ్చే సంక్షిప్త సమాచారాన్ని ప్రజలు నమ్మొద్దని చెప్పారు. 867 గంజాయి కేసుల్లో 2,467 మందిని అరెస్టు చేశామని, 65 మందిపై పీడీయాక్ట్ తెరిచామని, 500 వాహనాలు సీజ్ చేసి, 14 కేసుల్లో రూ.12 కోట్ల ఆస్తులు జప్తు చేసినట్లు తెలిపారు. ఎస్పీ మాధవరెడ్డి, డీఎస్పీ రాంబాబు, సీఐలు హరి, రమేష్‌కుమార్, ఎస్సై శివప్రసాద్ ఉన్నారు. అంతకు ముందు పాలకొండలో పోలీసు వెల్ఫేర్ పెట్రోల్ బంకును ప్రారంభించారు.

పెట్రోల్‌బంకును ప్రారంభిస్తున్న డీఐజీ గోపీనాథ్

రైతేరాజు 6లో

అమృతమూర్తికి అశ్రునివాళి
మంచికి, మమతానురాగాలకు మారుపేరుగా నిలిచి మేము గౌరవప్రదమైన స్థానంలో ఉండడానికి కారణమై మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మహోన్నత మాతృమూర్తి కీ॥శే॥ కొట్టక్కి సరస్వతి పట్నాయిక్ ఆకస్మిక మరణం మాకు తీరనిలోటు... దైవసన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ కొట్టక్కి సరస్వతి పట్నాయిక్
రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్
జననం: 16-08-1942 మరణం: 15-11-2025

కుమారులు - కోడళ్లు
సత్యానంద పట్నాయిక్ - కస్తూరి కుమారి (సురేఖ)
చక్రపాణి పట్నాయిక్ - సత్యవాణి
వెంకట కృష్ణ కుచేల్ - కమల ధరణి
కుమార్తెలు - అల్లుళ్లు
జయశ్రీ పట్నాయిక్ - కీ॥శే॥ మోహనరావు
శాంతిశ్రీ పట్నాయిక్ - కీ॥శే॥ విజయానందరావు
వాణిశ్రీ పట్నాయిక్ - తిరుపతిరావు
మనుమలు మరియు మనుమరాళ్లు, మునిమనుమరాళ్లు, బంధుమిత్రులు

పెద్దకర్మ: తేది: 26-11-2025 బుధవారం నాడు మా స్వగృహమునందు జరుగును
Address: Flat No: 301/Block - A, MVV Enclave, Water Tank Road, Midhilapuri Vuda Colony, Madhurawada, Visakhapatnam

తృతీయ వర్ధంతి
ప్రభువు నందు మృతినొందు మృతులు ధన్యులు.. ప్రకటన 14:13...
మా హృదయ ఫలకాలపై చెక్కిన సజీవ శిల్పం నీ రూపం. అందర్ని ఆప్యాయతగా పలకరించే మహోన్నత వ్యక్తిత్వం కలిగిన నీవు చిన్నతనములో దైవసన్నిధికి చేరి నేటికి మూడు వసంతాలు గడిచిననూ నిన్ను మరువలేకున్నాము.. నీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... బాధాతప్త హృదయాలతో...

కీ॥శే॥ శ్రీమతి చిగురువలస దీప్తి B.Sc. (Agri.)
అగ్రికల్చర్ అసోసియేట్
స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా - గజపతినగరం
జననం: 12-09-1990 మరణం: 25-11-2022

నాన్న
(రిటై) చిగురువలస ప్రభాకరరావు
Sr. Asst. District Police Office, VZM
అమ్మ
శ్రీమతి బొత్స రాణి రత్నకుమారి
Dy. Assistant Commissioner (ST) G.S.T.
తమ్ముడు: చిగురువలస దీపక్ PGHRA
మరియు కుటుంబసభ్యులు

ఇదే మా ఆహ్వానమండి!!

రండి.. రండి..


అందమైన లొద్ద జలపాతం

నీలంవలసలో వెదురు కర్రలతో వంతెన

మన్యంలో జలపాతాల వద్ద సందడి కనిపిస్తోంది. పర్యాటకులను ఆకట్టుకునేందుకు స్థానికులతో పాటు అటవీశాఖ అధికారులు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. సాలూరు మండలం కొదమ పంచాయతీ పరిధిలోని శిఖరాగ్ర గ్రామమైన లొద్ద సమీపంలో ఉన్న జలపాతానికి ఇటీవల రోడ్డేశారు. పైకి ఎక్కేందుకు ఎక్కడికక్కడే కర్రలతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ★ పాచిపెంట మండలంలోని నీలంవలస జలపాతం వద్ద వెదురుతో ఆర్చీలు, వంతెనలు, కుర్చీలు, బల్లలను తయారు చేశారు. ప్రధాన రహదారి నుంచి 600 మీటర్ల మేర మట్టి దారిని వేశారు. ఆయా పనులు చేపట్టేందుకు గిరిజనులకు అన్నివిధాలా సహకరిస్తున్నామని అటవీశాఖ సాలూరు రేంజర్ తవిటినాయుడు తెలిపారు.
– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం, పాచిపెంట

(c) eenadu

జ్ఞాపకాలు పదిలం

న్యూస్‌టుడే- గరివిడి

జ్ఞాపకాల పందిరిలో జీవితకాల సంతకం.. కరిగే కాలంలో చెదరని మధుర స్మృతుల ప్రతిబింబం.. గతాన్ని కళ్లముందుంచే సాధకం ఫొటో. మనిషి పుట్టుక నుంచి మరణం వరకు ప్రతి సన్నివేశాన్ని పదిలంగా దాచుకుని అల నాటి జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ వీక్షించుకునే అవకాశం ఫొటో ద్వారానే ఉంటుంది. ప్రతి దాని వెనుక ఒక జ్ఞాపకం.. ఓ అనుభూతి దాగుంటుంది. అలాంటి చిత్రాలను జతచేర్చి అందమైన ఫ్రేముల్లో బంధించి.. తమ ఇంట్లో భద్రపరచుకోవడం ఇప్పుడు నయా ట్రెండ్‌గా మారింది.

పెరుగుతున్న ప్రాధాన్యత

కేవలం జ్ఞాపకాలను భద్రపరచడమే కాదు.. గృహ అలంకరణ.. వ్యక్తిగత భావోద్వేగ అనుబంధంలోనూ ఫొటో ఫ్రేములు కీలకంగా మారాయి. జన్మదినం.. వివాహం.. తదితర శుభకార్యాలతో పాటు పలు సందర్భాల్లో బహుమతులుగా ఇవ్వడానికి ఎక్కువగా వినియోగిస్తున్నారు. అందమైన ఫ్రేముల్లో ఉంచిన చిత్రాలు ఆ ప్రత్యేక క్షణాలను భౌతిక రూపంలో మన కళ్ల ముందు ఉంచుతాయి. ఖాళీ గోడలకు జీవం పోసి ఇంటి వాతావరణాన్ని అందంగా మెరుగుపరుస్తాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఉన్న బంధాన్ని గుర్తుకు తెస్తుంటాయి.

అందమైన చిత్రం..

చిన్నారికి అందించిన బహుమతి

బుజ్జాయి గుర్తులు అపురూపంగా..

చిన్నారుల చిట్టి రూపాన్ని తలచుకుని తల్లిదండ్రులు ఆనందంతో మురిసిపోతుంటారు. అందుకే బుజ్జాయి తొలి స్పర్శను గుర్తుకు తెచ్చే ఆ చిట్టి చేతులు.. పాదాలూ ఎప్పటికీ తమ కళ్లముందుండేలా త్రీడీ నమూనా రూపంలో భద్రపరుచుకుని వాటికి చిత్రాలను చేర్చి అందమైన ఫ్రేముల్లో నేటి తరం భద్రపరుచుకుంటోంది. పిల్లలకు సంబంధించిన ప్రతిదీ ఓ అపురూప జ్ఞాపకంగానే నేటి తరం భావిస్తోంది.

వరిగడ్డికి నిప్పు.. నేలకు ముప్పు

రైతేరాజు

రక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

దోమల నుంచి పశువుల సంరక్షణ

తెల్లసుడిని వెళ్లగొట్టండిలా..

...వలయాకారంలో గుడ్లు పెడతాయి. తెల్లని దూది వంటి మెత్తని పదార్థంతో కప్పి రసాన్ని పీలుస్తాయి. ఆకులు ఎర్రబడి రాలిపోతాయి. క్రమంగా కాయను కూడా ఆశించి నష్టాన్ని కలిగిస్తాయి. నవంబరులో ముదురు ఆకులను ఆశించి ఏప్రిల్‌లో ...చిగురు ఆశిస్తుంది. గుర్తించిన వెంటనే కొమ్మలను కత్తిరించి లీటరు నీటిలో 5 మి.లీ. వేప నూనె కలిపి పిచికారీ చేసి నివారించొచ్చు. రాత్రి సమయంలో జిగురు పూసిన పసుపు రంగు డబ్బాలు లేదా జిగురు అట్టలను తెల్ల దోమ ఆశించిన మొక్కల వద్ద ఉంచాలి. - న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

అదితి పుట్టినరోజు వేడుకలు

విజయనగరం అర్బన్, పట్టణం, గ్రామీణం, నెల్లిమర్ల, న్యూస్‌టుడే: విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పుట్టినరోజు వేడుకలు సోమవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ శ్రేణులు, అధికారులు, మాన్సాస్ విద్యాసంస్థల సిబ్బంది, అభిమానులు అధికసంఖ్యలో తరలివచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. పేర్లవారి వీధిలోని చెవిటి, మూగ పాఠశాల విద్యార్థులతో కేకు కోయించారు. విద్యార్థుల దత్తత కోసం వారి కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు మొత్తం 27 మంది రూ.1.84 లక్షల విరాళాన్ని యాజమాన్యానికి అందజేశారు. ప్రేమసమాజానికి 25 బెంచీలు, పట్టణ నిరాశ్రయుల వసతిగృహానికి 25 దుప్పట్లు పంపిణీ చేశారు. పినవేమలిలో ఏబీసీ వృద్ధాశ్రమానికి పండ్లు, స్వీట్లు, భోజనాలను నాయకులు అందజేశారు. వి.టి.అగ్రహారం బీసీ బాలికల వసతిగృహంలో రూ.45 వేల విలువైన ఆర్వో ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు. నాయకుడు పిళ్లా విజయకుమార్ ఆధ్వర్యంలో 28 డివిజన్ సచివాలయాలకు సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలు అందజేశారు. నాయకులు ఉప్పలపాటి రాజేష్ వర్మ, అవనాపు విక్రమ్, ఐవీపీ రాజు, కర్రోతు నర్సింగరావు, కోరాడ వెంకటరావు, బి.చిరంజీవులు, రవిశేఖర్, వనజాక్షి, ఆనందకుమార్, కొండబాబు, భాస్కరనాయుడు, గంటా రవి, గంటా పోలినాయుడు, అవనాపు విజయ్, భార్గవి, అనురాధ బేగం, మురళీనాయుడు, పడాల జోగేష్ శుభాకాంక్షలు తెలిపారు.

గజమాలతో సత్కరిస్తున్న నెల్లిమర్ల నియోజకవర్గ నాయకులు

డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభం

డెంకాడ, న్యూస్‌టుడే: చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో 'క్వాంటమ్ మిషన్ లెర్నింగ్ ఫర్ నెక్ట్స్ జనరేషన్ కమ్యూనికేషన్ సిస్టమ్' అంశంపై అయిదు రోజుల ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభమైంది. తొలి రోజు పుదిచ్చేరి సెంట్రల్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ టి.షణ్ముఖ నాథం హాజరై క్వాంటమ్ ప్రింటెడ్ యాంటెన్నాలు, 6జీ యాంటెన్నా టెక్నాలజీ తదితరాలపై వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వై.ఎం.సి.శేఖర్, కోఆర్డినేటర్ ఎం.సత్యనారాయణ, విభాగాధిపతి రమాదేవి, డీన్ సునీల్ ప్రకాష్ పాల్గొన్నారు.

ఏఎస్పీ నాగేశ్వరరావుకు బదిలీ

ఈనాడు, విజయనగరం: విజయనగరం జిల్లా అదనపు ఎస్పీ(ఏఆర్) నాగేశ్వరరావుకు బదిలీ చేస్తూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలిచ్చారు.

ఏఐతో యువతకు ఉద్యోగాలు

మాట్లాడుతున్న నిపుణుడు అశ్విన్‌చంద్ర

పాల్గొన్న ఇంజినీరింగ్ యూజీ, పీజీ విద్యార్థులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: కృత్రిమ మేధ(ఏఐ)తో పరిశ్రమల అవసరాలు, యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఐబీఎం స్కిల్స్ బిల్డ్(చెన్నై)కు చెందిన నిపుణులు అశ్విన్ చంద్ర, షేక్ ఉస్మాన్ గనీ అన్నారు. జేఎన్‌టీయూ గురజాడ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఐబీఎం స్కిల్స్ బిల్డ్ ఆధ్వర్యంలో ఏఐ నైపుణ్యంపై ఇంజినీరింగ్ యూజీ, పీజీ విద్యార్థులకు నిర్వహించిన ఒక్క రోజు అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఏఐ పరిచయం, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ కంప్యూటర్ విజన్, మెషీన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, ఐబీఎం వాట్సన్ స్టూడియో ద్వారా ఏఐ నమూనాల నిర్వహణ, ఏఐ ఎథిక్స్ అంశాలపై శిక్షణ ఇచ్చారు. సీఎస్సీ ఇండియా సీనియర్ మేనేజర్ రామ్మోహన్, ఉపకులపతి డా.వి.వి.సుబ్బారావు, రిజిస్ట్రార్ జి.జయసుమ, ప్రధానాచార్యుడు ఆర్.రాజేశ్వరరావు, నైపుణ్యాభివృద్ధి సమన్వయాధికారిణి హేమ పాల్గొన్నారు.

లాభాలబాటన నడిపించేలా 'రైతన్నా మీకోసం'

కరపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టరు, వ్యవసాయానుబంధ శాఖల అధికారులు

పార్వతీపురం, న్యూస్‌టుడే: వ్యవసాయం, దాని అనుబంధ పరిశ్రమలకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన 'రైతన్నా మీకోసం' కార్యక్రమం కరప్రతులను కలెక్టరు ప్రభాకరరెడ్డి సోమవారం విడుదలచేశారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ, అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. లాభసాటి వ్యవసాయం, సేద్య విధానాలపై అవగాహన పెంపొందించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టరు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి అన్నపూర్ణ, జిల్లా పశుసంవర్ధక అధికారి మన్మథరావు, ఉద్యానశాఖాధికారి సత్యనారాయణ రెడ్డి, బిందు సూక్ష్మ సేద్యం పథక అధికారి రాధాకృష్ణ పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	118	206	216

గ్యారెంటీ ఉందా?

న్యూస్‌టుడే, పార్వతీపురం

ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించి వారం రోజులైనా.. మిల్లర్లు బ్యాంకులకు గ్యారెంటీ ఇంకా సమర్పించకపోవడంతో ధాన్యం బస్తాలు రైతుల కళ్లాల్లోనే మూలుగుతున్నాయి. అక్టోబరు చివరి వారంలో వర్షాలు కురవడంతో ఇబ్బందులు ఎదురవుతాయేమోననే అనుమానంతో అన్నదాతలు యంత్రాలు పెట్టి మరీ నూర్పులు పూర్తిచేశారు. జిల్లాలో దాదాపు అన్నిచోట్లా కొనుగోలు లాంఛనంగా ప్రారంభమైనా, బ్యాంకు హామీలకు మిల్లర్లు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

వాతావరణం మారుతుందనే ఆందోళనతో బస్తాల్లోకి ధాన్యం నింపుతున్న రైతులు

● రూ.300 కోట్లకు నాల్గో వంతూ కాని జమ

● ధాన్యం సేకరణపై అన్నదాతల ఆందోళన

హామీ కొండంత.. వచ్చింది గోరంత

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు లక్ష్యంగా తీసుకున్న 2.50 లక్షల మెట్రిక్ టన్నుల విలువ రూ.600 కోట్లు ఉంటుంది. ఇందులో 50 శాతం బ్యాంకు గ్యారెంటీగా మిల్లర్లు ఇవ్వాలి. ప్రస్తుతానికి అందులో దాదాపు నాల్గో వంతు కూడా జమకాని పరిస్థితి. జిల్లాలో 104 మిల్లులు ఈ ఏడాది కస్టమ్ మిల్లింగ్‌కు సిద్ధంగా ఉన్నాయి. హామీలిచ్చేందుకు వెనకడుగు వేస్తున్నాయి. ఫలితంగా మిల్లులకు ధాన్యాన్ని పంపించే ప్రక్రియ మొదలు కాలేదు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు వస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సంచులు సర్దుబాటు చేయాలి

చాలాచోట్ల ఇంకా సంచులు సర్దుబాటు కాలేదు. జిల్లాకు 50 లక్షలు వరకు ఇవి అవసరమని గుర్తించారు. మిల్లర్లు వీటిని సరఫరా చేస్తారని అధికారులు చెబుతున్నారు. వారి దగ్గర 11 లక్షలు వరకు ఉన్నాయని తేల్చారు. ప్లాస్టిక్ సంచులు కావడంతో ఏడాదిగా నిల్వ ఉంచడంతో ధాన్యం వేస్తే చిరిగిపోయే ప్రమాదముందని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నంతలో సొంతంగానే సంచులు సిద్ధం చేసుకోవాలని యోచిస్తున్నారు. కొమరాడ మండలంలో కొన్ని రైతు సేవా కేంద్రాలకు పదివేల వరకు సంచులు అందజేశారు. మరికొన్ని కేంద్రాల వద్ద సంచులే లేవు.

రైతులకు ఇబ్బందులు రానీయం

ఇటీవల శుభదినాలు కాకపోవడంతో చాలా మంది బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వలేదు. త్వరలో పూర్తిస్థాయిలో అందరూ హామీలు సమర్పిస్తారు. కొమరాడ మండలంలో కొత్తగా ఏర్పాటుచేసిన మిల్లు గ్యారెంటీ ఇచ్చింది. రైతులు అక్కడకు తరలించుకొనే వీలుంది. సంచులు రైతులే సమకూర్చుకొనేలా ముందుకొస్తున్నారు. వారికే చెల్లింపులు కూడా చేస్తాం. రెండ్రోజుల్లో జిల్లా అంతటా ధాన్యం మిల్లులకు చేరే పరిస్థితి ఉంది.

- శ్రీనివాస్, జిల్లా ప్రబంధకుడు, పౌరసరఫరాల సంస్థ, పార్వతీపురం మన్యం

వైటీసీలో ఉచిత శిక్షణ

సీతంపేట: వైటీసీలోని స్కిల్ కళాశాలలో ఉచిత కంప్యూటర్, ఆంగ్లంలో శిక్షణ, ప్లేస్‌మెంట్ కల్పించేందుకుగానూ 4 నెలల ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంబంధిత ఇన్‌ఛార్జి జె.రవికుమార్ తెలిపారు. ఉచిత భోజన, వసతి సదుపాయం, శిక్షణ తర్వాత ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఇంటర్, డిగ్రీ, ఆపై చదువులు చదివిన యువతీ, యువకులు ధ్రువపత్రాలతో వచ్చే నెల ఒకటో తేదీన వైటీసీకి హాజరు కావాలన్నారు. టూరిజం అండ్ హాస్పిటాలిటీ ఐటీ-ఐటీఈఎస్(సాఫ్ట్‌వేర్)పై శిక్షణ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 63034 64426, 95427 78064 నంబర్లను సంప్రదించాలన్నారు.

చెత్త కనిపిస్తే ఉద్యోగి ఇంటికే..

పార్వతీపురం, న్యూస్‌టుడే: డిసెంబరు ఒకటో తేదీ తర్వాత గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడ చెత్త కనిపించినా ఉపేక్షించేది లేదని కలెక్టరు ప్రభాకరరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం వివిధ కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పట్టణాల్లో పుర కమిషనర్లు, గ్రామీణ ప్రాంతంలో ఎంపీడీవోలు బాధ్యత వహించాలన్నారు. చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సీతంపేట ప్రాంతంలో మలేరియా కేసులు నమోదు నేపథ్యంలో నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్‌కలెక్టర్లు జగన్నాథ్, వైశాలి, డీఆర్వో పాల్గొన్నారు.

EENADU Classifieds

HEALTH & CARE

NEURO

నిర్మల న్యూరో & జనరల్ మెడికల్ సెంటర్
మెదడు, నరములు & వెన్నెముక వ్యాధి నిపుణులు
Dr.Nirmala Vangapandu
R.T.C.కాంప్లెక్స్ ఎదురుగా, INOX మల్టీప్లెక్స్ వెనుక వైపు,VZM
FOR APPOINTMENT : 63054 71147

REAL ESTATE

FLAT FOR SALE

3BHK G2 1st ఫ్లోర్ E/F 1380 Sft భాగ్యలక్ష్మి ఎన్‌క్లేవ్, ఈజీబై వెనుక రింగ్ రోడ్, విజయనగరం. for Sale. ✆ 9182650432.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

PLOT FOR SALE

200 చ॥గ॥ S/F "శ్రీకృష్ణ నగర్ లే-అవుట్" JNTU జంక్షన్, VZM. 267 చ.గ. N/F "భాస్కర్ నగర్" తాటిగూడ గ్రామం, గరివిడి అమ్మబడును. ✆ 8802889988, 9542031332.

TO LET

COMMERCIAL

Ground floor 3600 Sft building near MR College suitable for clinics, Hospitals and Office spaces Ph:9000773333.

JOBS

Walk in interview 25-11-25 10:30 AM to 4:00 PM 1. Accountant, 2. Computer Operator, 3. Office Assistant 4. Receptionist Candidates with fluency in English &Min 3 yrs Exp. Joshi Chambers G.K. Towers 3rd floor Dwarakanagar. Ct: 0891-2541137.

కావలెను
ఆఫీసు అకౌంటెంట్ (మహిళ): B.Com పాస్ అయ్యి అనుభవం గల రాజాం పరిసర ప్రాంత స్థానిక మహిళ కావలెను. జీతం: 15000 నుండి 20,000 వరకు సంప్రదించండి:
K.R.K. BUILDERS & DEVELOPERS శ్రీవారి టౌన్‌షిప్ సారధి రోడ్, రాజాం సెల్: 9666151133, 9440706846

Vision buzz కంపెనీలో డోర్ టూ డోర్ మార్కెటింగ్ చేయడానికి యువతి యువకులు స్టాఫ్ కావలెను. డైలీ Payment ఇవ్వబడును. ✆ 9550109729.

VZM 90రోజులు ఉచితంగా కంప్యూటర్ కోర్సు & ఎలక్ట్రానిక్స్ & హార్డ్‌వేర్ సెక్టార్‌లో ట్రైనింగ్‌తోపాటు, ఉద్యోగం కల్పించబడును. SSC (Pass), Inter, డిగ్రీ, ITI (పాస్/ఫెయిల్) Age: 18to35 ✆ 8919050156, 9493359472.

ప్రైవేట్ బ్యాంకుల్లో పనిచేయుటకు టెలికాలర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, అటెండర్స్, రికార్డ్ అసిస్టెంట్, సెక్యూరిటీ, క్యాషియర్స్ కావలెను. Qlf: 10th- డిగ్రీ, MBA, జీతం: 18K-28K. ✆ 9121044796, 9573635594.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కథలతో సామాజిక బాధ్యత తెలపాలి

పోటీల్లో విజేతలను సన్మానిస్తున్న సంస్థల ప్రతినిధులు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: భావితరాలకు సామాజిక బాధ్యత తెలిపే చరిత్ర కథలు అందించాలని ప్రముఖ రచయిత జయంతి ప్రకాష్‌శర్మ అన్నారు. సోమవారం రాత్రి గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జిల్లా రచయితల సంఘం, విశాఖ సంస్కృతి సమితి ఆధ్వర్యంలో బెహరా వెంకటసుబ్బారావు స్మారక జాతీయ కథల పోటీ-2025 విజేతలకు బహుమతి ప్రదానం చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన శర్మ మాట్లాడుతూ మనిషి మనుగడకు సహజత్వంతో కూడిన రచనలను రచయితలు అందించాలన్నారు. విజేతలను సత్కరించి, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో రచయితలు రఘునందన్, భోగారావు, సత్యనారాయణమూర్తి, వెంకటసుబ్బారావు, శ్రీనివాస్, సన్యాసిరావు, ఈశ్వరరావు, నాలుగెస్సుల రాజు, పద్మ పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

రాజాం, న్యూస్‌టుడే: మనస్తాపంతో ఉరివేసుకుని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాజాం పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ కె.అశోక్‌కుమార్ చెప్పిన వివరాల ప్రకారం.. భామిని మండలం బాలేరు గ్రామానికి చెందిన ఉర్లాపు సావిత్రి (44)కి శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం పారాపురం గ్రామానికి చెందిన గణపతితో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో పాలకొండలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్న మన్మథకుమార్ రుణం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి సావిత్రిని వలలో వేసుకున్నాడు. దీంతో భర్తతో మనస్పర్థలు వచ్చి దూరమైంది. రాజాం సారథి రోడ్డులోని ఓ అద్దె ఇంట్లో ఉంటూ.. పట్టణంలోని ఓ వస్త్రదుకాణంలో పనికి చేరింది. ఈ క్రమంలో మన్మథకుమార్ శారీరకంగా వేధించడం మొదలుపెట్టాడు. ఆదివారం రాత్రి దుకాణం నుంచి ఏడుస్తూ.. చరవాణిలో మాట్లాడుతూ ఇంటికి వచ్చింది. కుమార్తెను అమ్మమ్మ వద్దకు వెళ్లాలని చెప్పి, గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది. ఎంతకీ బయటకు రాకపోవడంతో చిన్నారి కిటికీలోంచి చూసి భీతిల్లిపోయింది. ఇంట్లోని పంకాకు ఉరివేసుకుని కనిపించడంతో బయటకు వెళ్లి కేకలు వేసింది. అందరూ వచ్చేసరికి ప్రాణం పోయింది. సీఐ కె.అశోక్‌కుమార్, ఎస్సై వై.రవికిరణ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

సావిత్రి (పాత చిత్రం)

అత్యాచారం కేసులో 12 ఏళ్లు జైలు

గరివిడి, న్యూస్‌టుడే: అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి 12 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ జిల్లా మహిళా కోర్టు సోమవారం తీర్పు వెల్లడించింది. ఎస్పీ దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం... గరివిడి మండలంలోని బొండపల్లిలో 2019లో ఓ మహిళపై నిందితుడు సవిరిగాన సూర్యనారాయణ(45) అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గరివిడి ఎస్సై కృష్ణప్రసాద్ అత్యాచార కేసు నమోదు చేశారు. దర్యాప్తులో నేరం రుజువు కావడంతో జిల్లా మహిళా కోర్టు న్యాయమూర్తి ఎన్.పద్మావతి నిందితుడికి 12 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసు విచారణలో సమర్థంగా పనిచేసిన చీపురుపల్లి సీఐ శంకరరావు, గరివిడి ఎస్సై లోకేశ్వరరావును ఎస్పీ అభినందించారు.

శిఖరమంత వేడుక!

మెంటాడ, న్యూస్‌టుడే: పైడితల్లి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు మండలంలోని పిట్టాడ గ్రామంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తొలి రోజు శిఖరం ఊరేగింపు, గణపతిపూజ, యాగశాల ప్రవేశం క్రతువు వేడుకగా నిర్వహించారు. శిఖర ఊరేగింపునకు భారీగా భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా మహిళల కోలాటం ఆకట్టుకుంది. 25న కుంకుమపూజ, ధాన్యాధివాసం, 26న ప్రతిష్ఠ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

యువతా.. సాయుధ దళాల్లోకి రండి

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: నేషనల్ క్యాడెట్ కార్ప్(ఎన్‌సీసీ) 77వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఆనందగజపతి కళాక్షేత్రంలో నిర్వహించారు. రెండో ఆంధ్రా బాలికల బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యువత సాయుధ దళాలవైపునకు రావాలని, ఎన్‌సీసీ ద్వారా ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని వక్తలు మాన్సాస్ కరస్పాండెంట్ డా.కె.వి.ఎల్.రాజు, బెటాలియన్ కమాండెంట్ కల్నల్ గోపేంద్ర, ప్రముఖ సామాజికవేత్త కవితా భండారీ పిలుపునిచ్చారు. విజయనగరం, విశాఖపట్నం జిల్లాల ఎన్‌సీసీ క్యాడెట్లు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాడెట్ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సాధనతో లక్ష్యం సుగమం

సాలూరు పట్టణంలోని దీప్తి ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై జరిగిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. ఆర్.గౌతమ్ శ్రీనివాస్ (పదో తరగతి) ప్రథమ, ఎం.సుమ నాగసాయి (పదో తరగతి) ద్వితీయ, కె.జ్ఞానేశ్వరి (ఎనిమిదో తరగతి) తృతీయ స్థానాలు సాధించారు. వీరికి హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించి అభినందించారు. - న్యూస్‌టుడే, సాలూరు

ఉపన్యాసం ఇస్తున్న బాలుడు

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించిన ఉపాధ్యాయులు

ఒరుగుతూ.. భయపెడుతూ!

సాలూరు పురపాలక సంఘం పరిధి పి.ఎన్.బొడ్డవలస గ్రామ సమీపంలోని పంట పొలాల్లో విద్యుత్తు స్తంభాలు నేల చూపులు చూస్తున్నాయి. ఒకటి ఒరిగిపోతుంటే.. మిగిలిన స్తంభాలు సైతం అదే రీతిన వాలిపోతున్నాయి. విద్యుత్తు తీగలు తెగితే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని స్థానిక రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు. దీనిపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది అందుబాటులో లేరు.

- న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

దారి తప్పుతోంది

గరుగుబిల్లి మండలంలోని రాయందొరవలస నుంచి పార్వతీపురం మండలం వీఆర్ పేట వరకు ఉన్న లింకు రోడ్డు కోతకు గురవుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి జారి, రాళ్లు తేలిపోయాయి. వాహనాలు నడపలేని స్థితి ఏర్పడింది. మరమ్మతులు చేసి రహదారి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. పంచాయతీరాజ్ పీఐయూ విభాగం దృష్టికి సమస్యను తీసుకెళ్లి బాగు చేసేందుకు కృషి చేస్తానని మండల ఇంజినీరు గౌరీశంకర్ తెలిపారు.

- న్యూస్‌టుడే, గరుగుబిల్లి గ్రామీణం

పనికిరాని రిక్షా.. ఎన్నాళ్లీ శిక్ష

గత ప్రభుత్వ హయాంలో సచివాలయాలకు అందించిన రిక్షాలు పూర్తిగా మరమ్మతులకు గురయ్యాయి. నాణ్యత లేని ఈ రిక్షాలు కొద్ది కాలానికే మూలకు చేరాయి. మరమ్మతులు చేసినప్పటికీ పనిచేయని వాటిని సచివాలయ సిబ్బంది విడిచిపెట్టేస్తున్నారు. ఇలా దాదాపు సగం వరకు రిక్షాలు పనికిరాకుండా పోయాయి. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తూ రిక్షాలు వినియోగిస్తున్నట్లు ఎంపీడీవో పార్వతి చెప్పారు.

- న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? వీరఘట్టం పోలీసు స్టేషన్ కూడలి నుంచి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నాం. మురుగు ఇళ్ల ముందు నిల్వ ఉంటోంది. - **సాయి, వీరఘట్టం**

● రహదారికి ఇరువైపుల శాశ్వతంగా మురుగు కాలువలు నిర్మించేందుకు రూ.1.30 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. పంచాయతీ అధికారులు నిధులు మంజూరు చేస్తే పనులు చేపడతాం. - **కవ్వశ్రీ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, జేఈ -న్యూస్‌టుడే, వీరఘట్టం**

? నిలవలస గ్రామంలోని బోరు మరమ్మతులకు గురైంది. నీటికోసం ఇబ్బందులు పడుతున్నాం. - **గ్రామస్థులు**

● పరిశీలించి మరమ్మతులు చేపడతాం. - **రామాంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ - న్యూస్‌టుడే, పాచిపెంట**

? గుచ్చిమి గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని శిథిల భవనం ప్రమాదకరంగా ఉంది. - **వెంకటరమణ, స్థానికుడు**

● పరిశీలించి నిర్మాణం తొలగింపునకు తగిన చర్యలు తీసుకుంటాం. - **ప్రసాద్, ఎంపీడీవో** - న్యూస్‌టుడే, సీతానగరం

రహదారులు నిర్మిస్తాం.. దీపాలు వెలిగిస్తాం

ఈనాడు ఫోన్ ఇన్ కార్యక్రమం

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: నగరపంచాయతీ పరిధిలో తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ రత్నరాజ్ పేర్కొన్నారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం నగరపంచాయతీ కార్యాలయంలో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా పలువురు తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.

కమిషనర్ రత్నరాజ్

ప్రశ్న: గారమ్మకాలనీలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. **-కె.నారాయణరావు**

సమాధానం: తక్షణమే సిబ్బందిని పంపి సరి చేస్తాం.

? పట్టణంలో అపరిశుభ్రతతో అవస్థలు పడుతున్నాం. - **వి.మణి** ● డంపింగ్‌యార్డు సమస్యతో ఇబ్బందులు ఉన్నాయి. చర్యలు తీసుకుంటాం.

? గారమ్మకాలనీలో పక్కా కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నాం. - **వాణి** ● నిధులు మంజూరయ్యాయి. చర్యలు చేపడతాం.

? పట్టణ ప్రధాన రహదారిలో ఆక్రమణలు పెరిగిపోయి ఇరుగ్గా మారుతోంది. విస్తరణ చేపట్టాలి. - **రాజేష్** ● ఆక్రమణలు తొలగిస్తాం. విస్తరణ విషయంపై ఎమ్మెల్యే జయకృష్ణ ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు.

? కుల ధ్రువీకరణ పత్రాల్లో ఇంటిపేరు తప్పుగా నమోదైంది. ఏం చేయాలి. - **ఎస్వీ ప్రసాద్** ● సంబంధిత ఆధారాలతో సచివాలయాన్ని సంప్రదిస్తే సరిచేస్తాం.

? పాలకొండ ఐసీడీఎస్ కార్యాలయం ఎదురుగా చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. **-నాగేశ్వరరావు, సతీష్** ● వ్యర్థాలు ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకుంటాం.

? జగన్నాథస్వామి ఆలయ సమీపంలో పందుల సమస్య తీవ్రంగా ఉంది. - **చక్రధర్** ● పెంపకందార్లకు నోటీసులు ఇచ్చి తగు చర్యలు తీసుకుంటాం.

? గారమ్మ కాలనీలో కాలువలు శుభ్రం చేయకపోవడం వల్ల దోమలతో అవస్థలు పడుతున్నాం. **-కృష్ణ, రమణ** ● వ్యర్థాలు తొలగించి, ఫాగింగ్ చేయిస్తాం.

? పట్టణంలోని సంపత్‌సాయి నగర్‌లో రహదారులు లేక ఇబ్బందులు పడుతున్నాం.- **నిర్మల, లావణ్య** ● రహదారుల నిర్మాణానికి కొలతలు వేశాం. పనులు ప్రారంభిస్తాం.

? ప్రధాన రహదారిని ఆనుకుని గాంధీనగర్‌లో చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలిచిపోతోంది. - **రమణ** ● నిధుల మేరకు పనులు చేపడతాం.

? కొమటిపేట సచివాలయం ఎక్కడ ఉందో తెలియడంలేదు. - **స్థానికుడు** ● సచివాలయాన్ని ఇటీవలే రాధాకృష్ణ మందిరం ఆనుకుని ఉన్న అద్దె భవనంలోకి మార్పు చేశాం.

? గారమ్మకాలనీలో బోర్ల వద్ద ప్లాట్‌ఫాంలు లేక ఇబ్బందులు పడుతున్నాం. - **కాలనీ వాసులు** ● ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం.

ఏఎన్‌ఎం కావాలి : పాలకొండ నగర పంచాయతీలో ఒకే ఆరోగ్యకార్యకర్త పనిచేస్తున్నారని, వైద్య సేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పట్టణ మహిళలు ఫిర్యాదు చేశారు.

పరిహారం ఇవ్వండి : జియ్యమ్మవలస మండలం చినకుదమలో 30 ఎకరాల చెరకు పంట బూడిదయ్యిందని, నష్టపరిహారం ఇవ్వాలని తెదేపా నాయకుడు డి.రామకృష్ణ, రైతులు కలెక్టరును కోరారు.

ఆక్రమణలు తొలగించాల్సిందే!

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలో చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను తొలగించాల్సిందేనని కలెక్టరు ప్రభాకరరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పీజీఆర్‌ఎస్‌లో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై ఆయన అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. మొత్తం 92 అర్జీలను పరిశీలించారు. జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో హేమలత, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, ఎస్‌డీసీలు దిలీప్‌చక్రవర్తి, ధర్మచంద్రారెడ్డి వినతులు పరిశీలించారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టరు ప్రభాకరరెడ్డి

అధికారులపై ఆగ్రహం

విద్యుత్తు విభాగానికి చెందిన ముగ్గురు ఉద్యోగులను సస్పెండు చేయాలని తాను ఇచ్చిన ఆదేశాలపై ఏం చర్యలు తీసుకున్నారని ఎస్‌ఈ మల్లికార్జునరావును కలెక్టరు ప్రశ్నించారు. సాయంత్రంలోగా ముగ్గురిని సస్పెండు చేస్తూ ఉత్తర్వులు విడుదల కావాలని ఆదేశించారు. విద్యుత్తుశాఖ పనితీరు సంతృప్తికరంగా లేదని, ఏ సమావేశాల్లోనూ ఉద్యోగి కనిపించడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ● కొన్నిశాఖల అధికారుల వ్యవహారశైలి బాగోలేదని జేసీ యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం కలెక్టరు నిర్వహించిన కార్యక్రమానికి హాజరుకాని అధికారుల నుంచి వివరణ కోరారు.

దారి ఇవ్వండి : పార్వతీపురం పట్టణంలోని ఇందిరా నగర్ నుంచి రైల్వే స్టేషనుకు వెళ్లేందుకు నడక దారి ఉండేదని, దీన్ని రైల్వేశాఖ మూసేసిందని శేషు తెలిపారు. ఈ మార్గాన్ని తెరిపించాలని కోరారు.

● ఎన్టీఆర్ ఆరోగ్య సేవల పర్యవేక్షణకు జిల్లాలో అధికారి లేకపోవడంపై కలెక్టరు స్పందించారు. జిల్లా అవసరాల నేపథ్యంలో సమన్వయాధికారిని ప్రత్యేకంగా నియమించేలా లేఖ రాయాలని డీఆర్వో హేమలతకు సూచించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తతో గొడవ కారణంగా మనస్తాపానికి గురైన మహిళ ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం పార్వతీపురం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... ఎంఆర్ నగర్‌కు చెందిన బి.రామలక్ష్మికి చరవాణి విషయంలో అత్తతో గొడవ జరిగింది. ఆమె గట్టిగా తిట్టిందన్న బాధతో ఎలుకల మందు తాగింది. కుటుంబీకులు గుర్తించి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

తండ్రి మద్యం మానడం లేదని..

పార్వతీపురం పట్టణం, పురపాలక, న్యూస్‌టుడే: తండ్రి మద్యం మానడం లేదని, ఆయనలో మార్పు తేవాలని బెదిరించేందుకు కుమార్తె రంగుల్లో కలిపే ద్రావణాన్ని తాగి తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పోలీసు స్టేషన్ వీధికి సమీపంలో ఉంటున్న ఇంటర్ విద్యార్థిని తండ్రి మద్యానికి బానిసయ్యాడు. డీ అడిక్షన్ సెంటర్‌లో మందులు వాడించాక కొన్నాళ్లు మానేశాడు. మళ్లీ ఇటీవల మద్యం తాగుతుండటంతో బెదిరించాలని కుమార్తె సోమవారం ద్రావణం తాగింది. కుటుంబీకులు గమనించి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

నాటుసారాతో ఒకరి అరెస్టు

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: లచ్చిరాజుపేట గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 715 నాటుసారా పొట్లాలతో ఒకరిని అరెస్టు చేసినట్లు సీఐ శిరీష తెలిపారు. ఒడిశా నుంచి తెస్తుండగా అదే గ్రామానికి చెందిన కె.సింహాచలంను పట్టుకున్నామన్నారు.

ఐటీడీఏకు 97 వినతులు

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం సహాయ ప్రాజెక్టు అధికారి ఎస్.వి.గణేష్, ఈఈ రమాదేవి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఐటీడీఏ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజనులు హాజరై తమ వ్యక్తిగత, గ్రామ సమస్యలపై 97 అర్జీలు అందించారు. మానాపురానికి చెందిన వినీత్ కోళ్లఫారం పెట్టేందుకు రుణం కోసం, జగ్గడుగూడకు చెందిన కరువయ్య ఒన్ బీ, అడంగల్ కోసం, అడ్డాకులగూడకు చెందిన గంగయ్య నూర్పిడి యంత్రం కోసం, జక్కరవలసకు చెందిన మాధవరావు వీధి కాలువ మంజూరు కోసం, ఈతమానుగూడకు చెందిన కూర్మారావు అన్నదాత సుఖీభవ పథకం డబ్బుల కోసం, చినవంగరకు చెందిన రమేష్ మినీ అంగన్‌వాడీ మంజూరు కోసం, జయపురానికి చెందిన అనిల్ కుమార్ ఉద్యోగం నిమిత్తం, వజ్జాయిగూడకు చెందిన సురేష్ రుణం కోసం.. ఇలా పలువురు వినతులు అందజేశారు. సమస్యలు పరిష్కరిస్తామని ఏపీవో అన్నారు. డిప్యూటీ డీఈవో రామ్మోహనరావు, ఏపీడీ శ్రీహరిరావు, జీసీసీ మేనేజర్ కృష్ణ, డీఈలు నాగభూషణరావు, రాధారాణి, ఏడీ శ్రీనివాసరావు, డీడీ కార్యాలయ పర్యవేక్షకుడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఐటీడీఏ ఏపీవో, ఈఈ

ధాన్యం విక్రయాల్లో అప్రమత్తంగా ఉండాలి

వీరఘట్టం, న్యూస్‌టుడే: ధాన్యం విక్రయాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సబ్‌కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. మరియగిరి సమీపంలో యు.వెంకంపేట రైతులు ఆరబోసిన ధాన్యాన్ని సోమవారం పరిశీలించారు. తూనికల్లో మోసాలు జరగకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. మిల్లర్లు 80 కిలోల కంటే ఎక్కువ ధాన్యాన్ని తూస్తే వెంటనే తనకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను రైతులు పాటించాలని తెలిపారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు.

ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

రైతు సంక్షేమ ప్రభుత్వమిది

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, న్యూస్‌టుడే: కూటమి రైతు సంక్షేమ ప్రభుత్వమని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పేర్కొన్నారు. 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని మండలంలోని వెలగవాడ గ్రామంలో సోమవారం సాయంత్రం నిర్వహించారు. తమ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. ప్రణాళిక ప్రకారం సాగు చేయడం ద్వారా మెరుగైన ఆదాయం పొందవచ్చన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. వ్యవసాయశాఖ ఏడీ రత్నకుమారి, ఏవో ప్రసాదరావు, ఎంపీడీవో ఎంవీ రంగారావు, నాయకులు సీమల కృష్ణారావు, గుణాకరరావు, అప్పలనాయుడు, కాశీంనాయుడు, అనిల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ● **వీరఘట్టం:** ప్రమాదవశాత్తు ఇటీవల మరణించిన వీరఘట్టం మండలం కొట్టుగుమ్మడ గ్రామానికి చెందిన శివగణేష్ కుటుంబానికి ఎమ్మెల్యే జయకృష్ణ రూ.5 లక్షల బీమా చెక్కును అందజేశారు. నాయకులు ఉన్నారు.

నిధులకు ప్రతిపాదనలు పంపాం

గరుగుబిల్లి, గ్రామీణం, న్యూస్‌టుడే: గరుగుబిల్లి మండలంలో రోడ్ల నిర్మాణం, శిథిల పాఠశాలల మరమ్మతులకు నిధులు కోరుతూ ప్రతిపాదనలు పంపించామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే టి.జగదీశ్వరి అన్నారు. సోమవారం ఎంపీపీ రామారావు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఉపాధిహామీ పథకం అధికారుల పనితీరు అసంతృప్తికరంగా ఉందన్నారు. గరుగుబిల్లి జూనియర్ కాలేజీలో బోధకులను నియమించాలని సర్పంచి కె.ఇందుమతి కోరారు. నాగూరు ఎంపీటీసీ డి.సత్యనారాయణ, కోట సుమన్, అంబటి తవిటినాయుడు పలు సమస్యలు వివరించారు. ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్డీ లెంక గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. ● ఉల్లిభద్రలో ఏర్పాటు చేసిన 'రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి జగదీశ్వరి అతిథిగా హాజరయ్యారు. సాగునీటి యాజమాన్యంలో బిందుసేద్యం, రాయితీలు, మేలైన విత్తనాలు, అన్నదాత సుఖీభవ, పొలం పిలుస్తోంది వంటి సంక్షేమ పథకాలతో చిన్న, సన్నకారు రైతులను ఆదుకుంటోందన్నారు. ఎంపీపీ రామారావు, స్వామి తదితరులు ఉన్నారు.

చర్చిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజలకు చేరువ కావడమే లక్ష్యం

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పోలీసు వ్యవస్థ ప్రజలకు చేరువ కావాలన్నదే తమ లక్ష్యమని జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. భార్య, భర్తల వివాదాలు, ఆస్తి తగాదాలు, అత్తారింటి వేధింపులు తదితర సమస్యలు ఎక్కువగా వచ్చాయి. ఫిర్యాదుల్లో వాస్తవాలు ఉంటే చట్టానికి లోబడి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఫిర్యాదు వింటున్న ఏఎస్పీ వెంకటేశ్వరరావు

రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట మండలం అచ్చబ గ్రామానికి చెందిన విద్యార్థులు కె.దీపక్, ఎన్.హర్ష రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించారు. శ్రీకాకుళంలో హేమంత్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఒకటో రాష్ట్రస్థాయి ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్-2025 పోటీల్లో వీరు సత్తా చాటారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు కరాటే, కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపడంపై పీసా అధ్యక్షులు ఎన్.నాగేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, వూయక రవితేజ, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఎం.విశ్వనాథం, కోచ్ కె.సందీప్, కన్నయ్య వీరికి అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

జాతీయస్థాయికి బిందుమాధవి

సాలూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని సీహెచ్.బిందుమాధవి జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైందని స్కూల్ హెచ్‌ఎం రాజశేఖరరావు సోమవారం తెలిపారు. పల్నాడులో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో హైజంప్‌లో ద్వితీయ స్థానం సాధించిందని పేర్కొన్నారు. హెచ్‌ఎం, పీడీ వనజ, ఉపాధ్యాయులు అభినందించారు.

డ్యామ్ పరిసరాల్లో రక్షణ చర్యలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జంఝావతి రబ్బరు డ్యామ్ పరిసర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని మంత్రి జి.సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. కొమరాడ మండలం సివిని గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు నదిలో గల్లంతైన విషయం తెలిసిందే. వారి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి వచ్చిన బాధిత కుటుంబాలను మంత్రి పరామర్శించారు. బాధితులను ఆదుకోవాలని నాయకులు వెంకటనాయుడు, శేఖర్ పాత్రుడు, ఎన్.మధు మంత్రిని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆమె చెప్పారు. విప్ జగదీశ్వరి, ఎమ్మెల్యే జయకృష్ణ, కలెక్టరు ప్రభాకరరెడ్డి, జేసీ యశ్వంత్ కుమార్‌రెడ్డి, సబ్‌కలెక్టరు వైశాలి ఉన్నారు.

అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలి

కొమరాడ, న్యూస్‌టుడే: కొమరాడ పంచాయతీలో నిధులు దుర్వినియోగం చేశారన్న అభియోగంపై పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేయడం సరికాదని కార్యదర్శుల సంఘ అధ్యక్షుడు ఎన్.రవీంద్ర అన్నారు. సస్పెన్షన్లను ఎత్తివేయాలంటూ సోమవారం ఎంపీడీవో రమేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఎటువంటి శ్రీముఖాలు, వివరణ లేకుండా విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఎలా చెబుతారని అసహనం వ్యక్తం చేశారు. ఏకపక్ష నిర్ణయాలతో ఉద్యోగులు పనిచేయాలంటే భయపడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు.

చెడు అలవాట్లకు దూరంగా..

పాచిపెంట, న్యూస్‌టుడే: పిల్లలను చెడు అలవాట్లకు దూరంగా ఉంచాలని పాచిపెంట ఏఎస్సై ముసలయ్య తెలిపారు. మండలంలో మాతుమూరులో పోలీసుశాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికల పెంపకంలో తల్లులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఏఎంసీ ఛైర్మన్ సూర్యనారాయణ, మహిళా పోలీసు రిజియా బేగమ్, గ్రామ మహిళలు హాజరయ్యారు.

వెంకన్నను దర్శించుకున్న డీఐజీ

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేటలోని తితిదే శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం విశాఖపట్టణం రేంజ్ డీఐజీ గోపీనాథ్, ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వారికి ఆశీర్వచనాలు అందజేశారు. డీఎస్పీ రాంబాబు, సీఐ ఎ.ప్రసాదరావు, ఎస్సై వై.అమ్మనరావు తదితరులు ఉన్నారు.

అభివృద్ధిలో ఏదీ పురోగతి..?

సాలూరు, న్యూస్‌టుడే: 'జిల్లా అభివృద్ధిలో పురోగతి లేదు. డీఆర్‌సీలో అధికారులు పాతపాటే పాడారు. నాయకులు, అధికారుల మధ్య సమన్వయం లేదు' అని జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర నివాసంలో వైకాపా నేతలతో సమావేశమై, మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని, పూటకో అబద్ధంతో ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కౌన్సిలర్లు జి.రఘు, జగన్, రమణ, ఈశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సార్.. మా ఇబ్బందులు వినండి

కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

కలెక్టరేట్ ప్రాంగణం, పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సీఆర్‌ఎంటీల సమస్యలు పరిష్కరించాలని సంఘ నాయకులు డిమాండు చేశారు. సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నూతన స్కూల్ కాంప్లెక్సుల్లో సీఆర్‌ఎంటీల మ్యాపింగ్ తక్షణమే నిలుపుదల చేయాలని, ప్రతి క్లస్టర్‌కు కనీసం ఇద్దరు సీఆర్‌ఎంటీలను కేటాయించాలని జిల్లా నాయకులు తేజేశ్వరరావు డిమాండు చేశారు. జీతాలు పెంచాలని, పని భారం తగ్గించాలని కోరారు. ప్రజా సంఘ నాయకులు బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు. ● కొమరాడ గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంలో సర్పంచిపై చర్యలు తీసుకోవాలని తెదేపా, సీపీఎం నాయకులు వెంకటనాయుడు, ఎన్.శ్రీను, సాంబమూర్తి డిమాండు చేశారు. కలెక్టర్ వద్ద విలేకర్లతో వారు మాట్లాడారు.

యంత్రాంగం పట్టించుకోవడం లేదు: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి కృష్ణరావు డిమాండు చేశారు. పార్వతీపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. తమకు ఉద్యోగ భద్రత లేదని, దాన్ని ఎన్నిసార్లు అడిగినా యంత్రాంగం పట్టించుకోవడం లేదని వాపోయారు. ఆరోగ్య భద్రత కల్పించి ఆదుకోవాలని కోరారు. మన్మథరావు, జి.వెంకటరమణ, రెడ్డి వేణు, గోవింద తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా ఉద్యమాలపై ఆంక్షలు తగదు'

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: ప్రజా ఉద్యమాలపై ఆంక్షలు పెట్టడం తగదని సీపీఐ ఎంఎల్ నాయకుడు పి.ఈశ్వరరావు అన్నారు. సోమవారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో జరిగిన వామపక్ష నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్య విలువలను పాలకవర్గాలు కాలరాస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు చట్ట వ్యతిరేక పనులు చేస్తున్నట్లు రుజువైతే శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు అన్నారు. మన్మథరావు, బీవీ రమణ, రామస్వామి, పి.రమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న ప్రజా సంఘ నాయకుడు

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

బలిజిపేట, న్యూస్‌టుడే: గళావల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో అధ్యక్షుడు మామిడి సాయికుమార్ సోమవారం ధాన్యం కొనుగోలు ప్రారంభించారు. ఎలాంటి ఆంక్షలు విధించకుండా అన్ని రకాల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. **పాచిపెంట:** మోసూరు పీఏసీఎస్ వద్ద ఏఎంసీ ఛైర్మన్ ముఖి సూర్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు సింహాచలం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ● **కొమరాడ:** కొమరాడ పీఏసీఎస్ అధ్యక్షుడు జి.సుదర్శనరావు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, మాట్లాడారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏవో ప్రసాద్, సీఈవో మాధవరావు, నాయకులు పాల్గొన్నారు.

మోసూరులో ధాన్యం తూస్తున్న నాయకులు

మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు

సీతంపేట, న్యూస్‌టుడే: చిన్నపల్లంకి గ్రామంలో సోమవారం మన ఊరికి మలేరియా వచ్చింది కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన హర్షవర్ధన్ అనే ఆరేళ్ల బాలుడికి మలేరియా పాజిటివ్ రావడంతో గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం జరిపారు. వీధుల్లో పలు చోట్ల క్లోరినేషన్, యాంటీ లార్వా ఆపరేషన్, దోమల నివారణ మందు పిచికారీ చేశారు. బాలుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్, సబ్ యూనిట్ అధికారి జె.మోహనరావు, ఎంపీడీవో బి.బి.మిశ్ర, దోనుబాయి వైద్యాధికారి ఎస్.భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

యాంటీ లార్వా ఆపరేషన్

పుట్టినరోజు వస్తే అక్కడ సంబరం

సాలూరు మండలంల శివరాంపురం గ్రామంలోని అంగన్‌వాడీ-1లో 12 మంది ప్రీస్కూల్ విద్యార్థులున్నారు. వీరంతా రైతు కుటుంబాలకు చెందిన వారు. ఈ కేంద్రంలో కార్యకర్త పార్వతి చిన్నారులకు పుట్టినరోజు వేడుకలు వైభవంగా జరుపుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తమ సొంత పిల్లలకు చేసినట్లే కేకు, బెలూన్లతో ప్రాంగణాన్ని అందంగా అలంకరించడం వంటివి చేస్తున్నారు. నల్లి చైత్ర అనే ఓ బాలిక పుట్టినరోజు సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో సందడి వాతావరణం నెలకొంది. - న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

(c) eenadu

గుడ్లప్పగించాల్సిందే.. ఈ గూబను చూస్తే!

చిత్రంలో కనిపిస్తోంది నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలోని కొర్రపోలు అటవీ రేంజ్‌లోని గుండ్లబ్రహ్మేశ్వరం అటవీ ప్రాంతంలో కనిపించే అరుదైన స్పాట్ బెల్లీడ్ ఈగల్ గుడ్లగూబ. ఆసియా దేశాల్లో కనిపించే ఈ పక్షి రాష్ట్రంలో తొలిసారిగా శేషాచలం అటవీ ప్రాంతంలో కనిపించగా, అనంతరం గుండ్లబ్రహ్మేశ్వరం అటవీ ప్రాంతంలోనూ కనిపిస్తోంది. ఇది భయంకరమైన రూపాన్ని కలిగి ఉండి బొద్దుగా విలక్షణమైన మచ్చలుంటాయి. వింతగా అరిచే ఈ పక్షి రాత్రి వేళల్లో పక్షులు, కుందేళ్లు, క్రిమికీటకాలను వేటాడుతుంది. పగలు విశ్రాంతి తీసుకుంటుంది. -న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

గ్రంథాలయానికి వెళ్తున్నారా.. పుస్తకాలు తెచ్చుకోండి!

- మూడేళ్లుగా నిలిచిన కొనుగోళ్లు
- పోటీ పరీక్షల అభ్యర్థులకు ఇబ్బందులు

ఏ పుస్తకమైనా అందుబాటులో ఉంటుందన్న భరోసాతో గ్రంథాలయానికి వెళతాం. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు పుస్తకాలు వెంట తీసుకెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గత మూడేళ్లుగా పుస్తకాల కొనుగోళ్లు లేకపోవడంతో ఉద్యోగార్థులు ఉన్న పాత పుస్తకాలతోనే కుస్తీ పడుతున్నారు. -ఈనాడు, ఒంగోలు

పోటీ పరీక్షలు రాసేవారి కోసం జిల్లా కేంద్ర గ్రంథాలయంలోని మొదటి అంతస్తులో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. ఉద్యోగార్థులు పెద్దసంఖ్యలో వస్తుండటంతో గ్రంథాలయ అధికారులు కింద అంతస్తులోని హాల్‌ను ఖాళీ చేయించి అదనపు చదువుకునే వీలు కల్పించారు. ఇక్కడ టెట్, డీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యేవారే ఎక్కువ మంది వస్తుండగా, కొందరు బ్యాంకు, గ్రూప్స్ పరీక్షలు రాసేవారు వస్తున్నారు. వీరికి 2022లో కొనుగోలు చేసిన పుస్తకాలే నేటికీ ఆసరాగా ఉన్నాయి. గత మూడేళ్లలో పోటీ పరీక్షల నిర్వహణ తీరులో ఎన్నో మార్పులు రావడంతో అప్పుడు ఆ పుస్తకాలు ఉపయోగం అంతంతమాత్రంగా ఉంటోంది.

అందుబాటులో లేక.. గ్రూప్స్ రాసే వారికి సోషియాలజీ పుస్తకాలు, టెట్ రాసేందుకు అవసరమైన జనరల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, బయాలజీ, సోషల్ స్టడీస్ పుస్తకాలు అందుబాటులో లేవు. వీటికి సన్నద్ధమయ్యేవారు పెద్దసంఖ్యలో ఉన్నందున పుస్తకాలు అందుబాటులోకి తీసుకురావాలని పాఠకులు కోరారు. డీఎస్సీ రాసేందుకు సన్నద్ధమవుతున్నా, ప్రతిరోజు పుస్తకాలు తెచ్చుకుని చదువుకుంటున్నామని ఓ అభ్యర్థి వాపోతున్నారు. అదే డీఎస్సీకి సంబంధించిన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటే, పోటీపరీక్షలో రాణించేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

మేలు జరిగేలా చూడాలని.. టెట్‌కు సిద్ధమయ్యేవారిలో పెద్దసంఖ్యలో యువతులుంటారు, పుస్తకాలు అందుబాటులోకొస్తే తమకు మేలు జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగార్థులకు అవసరమైన పుస్తకాలు దాతలు అందించవచ్చని ఇన్‌ఛార్జి డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ కోరారు.

దాతలు దయతలిస్తే.. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఐదు దశాబ్దాల నాటి పత్రికలు, వేల సంఖ్యలో వివిధ రచనలు అందుబాటులో ఉన్నాయి. ఈ విభాగానికి వచ్చేవారు అరకొరగా ఉండగా, పోటీ పరీక్షల విభాగానికి వచ్చే వారితో గ్రంథాలయం కిటకిటలాడుతోంది. గ్రంథాలయ కమిటీ ఏర్పడకపోవడం, పుస్తకాల కొనుగోళ్లకు సంబంధించిన కొంతకాలంగా ఎలాంటి సమీక్షలు చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. కొందరు దాతలు సహృదయంతో ముందుకొచ్చి పుస్తకాలు వితరణ చేస్తున్నారు.

ప్రకృతి రెండుగా.. కళ్లకు నిండుగా!

ప్రకృతిలో కనిపించే కొన్ని దృశ్యాలు కళ్లు తిప్పుకోనివ్వవు. ఎంతో అపురూపంగా హృదయాలను హత్తుకుంటాయి. మనసులను రంజింపజేస్తుంటాయి. నీలి ఆకాశంలోని తెల్లటి మేఘాలు, పచ్చని కొండలు నీటిలో ఇలా ప్రతిబింబిస్తూ రెండుగా కనిపించడం పర్యాటక ప్రేమికులను కట్టిపడేసింది. చారిత్రక కంభం చెరువులో సోమవారం ఈ దృశ్యం కనిపించింది. -న్యూస్‌టుడే, అర్ధవీడు

సర్వేజనా సుఖినోభవంతు

ఈయన పేరు గోపాలకృష్ణన్ అయ్యర్. ఈయనది తమిళనాడు రాష్ట్రం రామేశ్వరం. ప్రజలందరూ సుఖంగా ఉండాలని కోరుకుంటూ రామేశ్వరం నుంచి తిరుమల మీదుగా శ్రీశైలానికి సైకిల్ యాత్ర చేస్తూ కంభం పట్టణంలో సోమవారం ఇలా కొంత సమయం సేదతీరారు. సైకిల్‌పై అవసరమైన సామగ్రిని ఏర్పాటు చేసుకుని దానికి సోలార్ ప్యానెల్ సైతం అమర్చుకున్నారు. యాత్రలో భాగంగా పలు దేవాలయాల వద్ద ఆగుతూ వంట చేసుకుంటూ తిరిగి కొనసాగిస్తున్నట్లు వివరించారు. -న్యూస్‌టుడే, కంభం

ఊళ్లు... వారాల పేర్లు

జిల్లాలో వారాల పేరుతో కొన్ని ఊళ్లు ఏర్పడ్డాయి. మండల కేంద్రమైన బేస్తవారపేట (గురువారం) మేజరు పంచాయతీ ఉంది. ఇదే పంచాయతీలో ఆదివారపేట, సోమవార పేట గ్రామాలున్నాయి. రాజుల కాలంలో ఆయా గ్రామాల్లో ఆయా రోజుల్లో సంతలు జరగడంతో కాలక్రమంలో ఆ ఊళ్లకు బేస్తవారపేట, ఆదివారపేట, సోమవారపేట పేర్లు వచ్చాయి. -న్యూస్‌టుడే, బేస్తవారపేట గ్రామీణం

ఫీజు చెల్లింపునకు డిసెంబరు 15 వరకు గడువు

ఒంగోలు నగరం: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు డిసెంబరు 15లోగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించవచ్చునని డీఈవో కిరణ్‌కుమార్ సూచించారు. అపరాధ రుసుం లేకుండా డిసెంబరు 10 వరకు, రూ.25 అపరాధ రుసుంతో 12 వరకు, రూ.50 అపరాధ రుసుంతో 15 వరకు చెల్లించవచ్చునన్నారు.

వీటి వెంట ప్రయాణమంటే... గుండెను బండ చేసుకోవాల్సిందే!

నిత్యం రద్దీగా ఉండే ఒంగోలు-కర్నూలు రహదారిలో పగలు, రాత్రి తేడా లేకుండా పరిమితికి మించిన బరువుతో ఉన్న భారీ గ్రానైట్ బండలతో లారీలు ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండానే బండలను తరలిస్తున్నారు. ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న లారీల వెంట ద్విచక్రవాహనచోదకులు, ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ధైర్యంతో సాహసం చేయాల్సి వస్తోంది. బండలు జారిపడే అవకాశాలున్నా నియంత్రించలేకపోవడం గమనార్హం. -ఈనాడు, ఒంగోలు

అల్లూరులో వివరాలు సేకరిస్తున్న ప్రైవేటు సంస్థ ప్రతినిధులు

విమానాశ్రయం డీపీఆర్‌కు సర్వే

ఈనాడు, ఒంగోలు: ఒంగోలు విమానాశ్రయానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లో రూపకల్పనలో భాగంగా కొత్తపట్నం మండలంలో సోమవారం ప్రైవేటు సంస్థ ప్రతినిధులు పర్యటించారు. డీపీఆర్ తయారుచేసే బాధ్యతను చేపట్టిన కోల్‌కతాకు చెందిన సంస్థ ప్రతినిధులు విమానాశ్రయం ప్రతిపాదిత భూములను పరిశీలించడంతోపాటు అల్లూరు గ్రామంలో వివరాలు సేకరించారు. విమానాశ్రయానికి ప్రభుత్వ భూములు ఎంత వరకు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేటు భూమి ఎంత మేర సేకరిస్తున్నారు. భౌగోళిక పరిస్థితులపై అధ్యయనం చేశారు. అనంతరం అల్లూరులో ఎన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి?, ఉపాధిహామీ పథకం కూలీలు ఎంతమంది ఉన్నారు? ఏయే వృత్తులు ఉన్నాయి? తదితర వివరాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డితో మాట్లాడి వివరాలు సేకరించారు.

పీఎంఈజీపీ కింద పరిశ్రమల ఏర్పాటుకు రుణం

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పీఎంఈజీపీ కింద సూక్ష్మ, చిన్న పరిశ్రమల స్థాపనకు రాయితీపై రుణాలు పొందవచ్చునని కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పీఎంఈజీపీ కింద ఎంపికైన ఇద్దరు లబ్ధిదారులకు కలెక్టరేట్‌లో సోమవారం ఆయన రెండు కార్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత వ్యాపారులకు 35 శాతం రాయితీ (గరిష్ఠంగా రూ.10 లక్షలు) ప్రభుత్వం ఇస్తోందని, అర్హులైనవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు నారాయణ, జోసఫ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుకు కారు తాళం అందజేస్తున్న కలెక్టర్ రాజాబాబు

పరీక్ష కేంద్రానికి పక్కా దారి

వచ్చే ఏడాది మార్చి 16వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు పరీక్ష కేంద్రాలను సులువుగా గుర్తించి సకాలంలో చేరుకునేందుకు ప్రభుత్వం హాల్ టిక్కెట్‌పై క్యూఆర్ కోడ్ విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాలను సందర్శించి ఆయా కేంద్రాల చిత్రాలను జియోట్యాగ్ చేశామని, హాల్‌టిక్కెట్లపై పరీక్ష కేంద్రాల లోకేషన్‌ను చూపే క్యూఆర్ కోడ్ ముద్రించి వస్తాయన్నారు. తద్వారా పరీక్ష కేంద్రానికి విద్యార్థులు సులువుగా చేరుకోవచ్చునని డీఈవో కిరణ్‌కుమార్, జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 169 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 29,117 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. -న్యూస్‌టుడే, సి.ఎస్.పురం

కాళ్లరిగేలా తిరుగుతున్నా కనికరించరేం?

ఈమె పేరు లక్ష్మీరాజ్యం. ఈమెది కొండపి గ్రామం. పోలియోతో చిన్నప్పుడే రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. నడవడానికి వీలు కావడంలేదని, తనకు మూడుచక్రాల బండి ఇప్పించాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. తాజాగా కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలు ఇస్తున్నట్లు తెలిసి తనకు కూడా ఇప్పించాలని ఒంగోలు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో అధికారులకు విన్నవించారు. -ఈనాడు, ఒంగోలు

ప్రచారం కారాదు ప్రమాదం!

- ఇబ్బందికరంగా మారిన ఫ్లెక్సీల ఏర్పాటు
- కొత్త మార్గదర్శకాలతో మార్పు వచ్చేనా?

తమ అభిమాన హీరో సినిమా విడుదల సందర్భంగానో, తమ నాయకుడి పుట్టిన రోజనో ఇష్టానుసారంగా రహదారులపై కట్టే ఫ్లెక్సీలు ప్రజలను ప్రమాదంలోకి నెడుతున్నాయి. కొన్నిచోట్ల ఫ్లెక్సీలు చించేశారంటూ శాంతిభద్రతల సమస్యకు సైతం దారి తీస్తున్నాయి. ప్రభుత్వం కొత్తగా తీసుకురానున్న మార్గదర్శకాలతో ఆదాయం మాట అటుంచితే, తమ కష్టాలు తీరతాయని నగర, పట్టణ ప్రజలు భావిస్తున్నారు. -ఈనాడు, ఒంగోలు

అసలే ఇరుకుగా ఉండే నగర, పట్టణ రహదారుల్లో ఫ్లెక్సీలు ప్రజలకు ప్రమాదాలు తెచ్చిపెడుతున్నాయి. తమ నేతలను ఆకట్టుకోవాలనే ఉద్దేశంతో రహదారులను ఆక్రమించి మరీ ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా మలుపులున్నా గానీ పట్టించుకోకుండా వీటిని పెడుతుండటంతో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొన్నాళ్ల కిందట మార్కాపురం పట్టణంలోని పెద్దదోర్నాల బస్టాండు కూడలిలో ఫ్లెక్సీని ఏర్పాటు చేయగా, దానిని ద్విచక్రవాహనచోదకుడు ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. నాయకుల భారీ కటౌట్లు ఏర్పాటు చేసినప్పుడు ఎప్పుడు కూలి మీద పడతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది ఒక పండగ తరువాత మరో పండగ అంటూ ఏడాదంతా ఫ్లెక్సీలను రోడ్లపై ఉంచేస్తున్నారు. ఇది మరింత సమస్యగా మారింది.

ఒంగోలు నగరంలోని కొత్తపట్నం బస్టాండు కూడలిలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

వివాదాలకు దారితీస్తూ ఫ్లెక్సీలు కట్టే విషయమై చాలాచోట్ల వివాదాలు సాధారణమయ్యాయి. ఇటీవల ఒంగోలు నగరంలో ఓ హీరో జన్మదినం సందర్భంగా ఫ్లెక్సీల తొలగింపు వివాదాస్పదంగా మారింది. కొన్నిసార్లు అధికార పార్టీ నాయకుల మధ్య అంతర్గత పోరు ఫ్లెక్సీల యుద్ధానికి దారితీస్తోంది. ఫ్లెక్సీలు కట్టే విషయమై గొడవలకు దిగుతున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు కొన్నిచోట్ల ఆందోళనకు దిగడం శాంతిభద్రతల సమస్యకు దారితీస్తుంది.

కనిగిరి ఆదర్శం : ప్రభుత్వం కొత్తగా రూపొందిస్తున్న మార్గదర్శకాల ప్రకారం... ఫ్లెక్సీలు, హోర్డింగ్ ఏర్పాటు చేయాలంటే పురపాలక సంఘం నుంచి అనుమతితోపాటు ఫీజు చెల్లించాలి. తాత్కాలికంగా ఎన్ని రోజుల పాటు ఏర్పాటు చేస్తారో ఆ మేరకు రుసుం కట్టాలి. డబ్బులు చెల్లించాలంటే ముందుకొచ్చేవారు తక్కువగా ఉంటారు. ఇలా వచ్చినవారు ఒకట్రెండు రోజులే ఫ్లెక్సీ కడతారు. కనిగిరి పురపాలక సంఘానికి ఆదాయం పెంచాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి పార్టీలతో నిమిత్తం లేకుండా ఎవరైనా పన్ను చెల్లించాలనే నిబంధన తీసుకొచ్చారు. దీంతో ఏడాదిలో రూ.1.39 లక్షల ఆదాయం సమకూరింది.



గెలాక్సీపురి చీమకుర్తి

ప్రభుత్వానికి ఏటా రూ.400 కోట్లకుపైగా ఆదాయం, సంవత్సరానికి రూ.2 వేల కోట్ల మేర విదేశీ మారకద్రవ్యం, ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న గెలాక్సీ గ్రానైట్ ఒక్క చీమకుర్తిలో తప్ప ప్రపంచంలో మరెక్కడా లభించకపోవడం విశేషం. గెలాక్సీపురిగా పిలుచుకునే ఈ ప్రాంతంలో సుమారు 1,500 ఎకరాల్లో గెలాక్సీ గ్రానైట్ గనులు విస్తరించాయి. ప్రస్తుతం 35 సంస్థలు ఇక్కడ గ్రానైట్‌ను వెలికి తీస్తూ విదేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. వీటికి అనుబంధంగా 1,500 పాలిషింగ్ యూనిట్లు పనిచేస్తున్నాయి. ముడిరాళ్లలో సింహభాగం చైనాకు ఎగుమతి చేస్తుండగా, పాలిష్ చేసిన రాళ్లు ఇటలీ, వియత్నాం, ఈజిప్టు, అమెరికా దుబాయ్, సౌదీ అరేబియా తదితర దేశాలకు తరలుతున్నాయి. -న్యూస్‌టుడే, చీమకుర్తి

ఖోఖో పోటీల్లో మనోళ్ల సత్తా

కాకినాడలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల అండర్-17 బాలురు ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రకాశం జట్టు విజేతగా నిలిచింది. చిత్తూరు, విశాఖ జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. సోమవారం జరిగిన ముగింపు వేడుకల్లో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, అధికారులు, అతిథుల చేతుల మీదుగా ట్రోఫీని అందుకుంటున్న ప్రకాశం జట్టు క్రీడాకారులను చిత్రంలో చూడొచ్చు. -న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

వెలిగొండ నిర్వాసితుల్లో ఆశల వెలుగు!

న్యూస్‌టుడే, పెద్దారవీడు

ఇదిగో వెలిగొండ, అవిగో నీళ్లు అంటూ ఐదేళ్లు కాలయాపన చేసి కీలకమైన కాలువల నిర్మాణం పూర్తి చేయకుండా గద్దె దిగిపోయే ముందు ప్రాజెక్టు పూర్తయిందని, జాతికి అంకితం చేస్తున్నామని జగన్నాటకమాడిన గత ప్రభుత్వ గాయాలను పూడ్చే పనిలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రాధాన్య ప్రాజెక్టుల్లో వెలి గొండను చేర్చి పనులు పరుగులు పెట్టిస్తోంది. కీలకమైన ఫీడరు కాలువ నిర్మాణం, నిర్వాసితులకు పునరావాసం, నష్ట పరిహారం చెల్లింపు షయంలో ముందడుగు వేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల రెండుసార్లు మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాజెక్టు సందర్శనకు పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. వచ్చే ఏడాదికి వెలిగొండకు నీళ్లు ఇవ్వాలని, ఆ దిశగా పనులు సాగాలని ముఖ్యమంత్రి ఆదేశించిన నేపథ్యంలో నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి, పునరావాస కాలనీల్లో పట్టాలు కేటాయిస్తారనే ఆశలు చిగురించాయి.



ప్రాజెక్టు ముంపు గ్రామం కలనూతల

పట్టాల పంపిణీపై...: వెలిగొండ ప్రాజెక్టు కింద మొత్తం 11 ముంపు గ్రామాలుండగా, 7,319 మంది నిర్వాసితులు ఉన్నారు. ముంపు గ్రామాలు కలనూతల, చింతలముడిపికి ఇడుపూర్ సమీపంలో ఇడుపూర్-1, ఇడుపూర్-2 పేరిట పునరావాస కాలనీలు అభివృద్ధి చేశారు. గుండంచర్ల, కాటమరాజుతండాలకు దేవరాజుగట్టు వద్ద, మార్కాపురం మండలం గొట్టిపడియ, అక్కచెరువుతండాలకు వేములకోట వద్ద పునరావాస కాలనీలు ఏర్పాటు చేసి అన్ని ప్రభుత్వ భవనాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించారు. నేటికీ ఆయా గ్రామాల్లోని నిర్వాసితులకు పట్టాలు పంపిణీ జరగలేదు. గత పదేళ్లుగా ఇంటి పట్టాల కోసం ఎదురుచూస్తున్నామని, కూటమి ప్రభుత్వం పంపిణీకి చర్యలు తీసుకోవాలని నిర్వాసితులు కోరుతున్నారు.

రాజంపల్లిలో స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

సౌర విద్యుత్తు ప్లాంటుకు స్థల పరిశీలన

దర్శి, న్యూస్‌టుడే: పీఎం కుసుమ్ పథకం కింద సౌరవిద్యుత్తు ప్లాంటు ఏర్పాటుకు జిల్లాలో సోమవారం ఏపీసీపీడీసీఎల్ హెచ్‌ఆర్డీ డైరెక్టర్ టీవీఎస్ఎన్ మూర్తి అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. దర్శి మండలం రాజంపల్లి, బొట్లపాలెం, ముండ్లమూరు మండలం మారెళ్ల, శంకరాపురం గ్రామాల్లో అనువైన స్థలాల కోసం అన్వేషించారు. ఆయన వెంట విద్యుత్తుశాఖ ఈఈ శ్రీనివాసులు, డీఈఈ రవికుమార్, ఏఈలు, సిబ్బంది తదితరులున్నారు.

రైతేరాజు శీతాకాలం.. జీవాలను రక్షించుకుందాం! 6వ పేజీలో..

కొరమీనుతోనూ ఉపాధేనూ!

- మహిళల చేతికి చేపల పెంపకం
- జిల్లాలో 76 యూనిట్ల ఏర్పాటు

స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి చూపించడంతోపాటు వారి ఆర్థిక బలోపేతానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వ్యవసాయానికి అనుబంధ రంగమైన కొరమీను చేపల పెంపకాన్ని మరింత ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఇప్పటికే మద్దిపాడు మండలం అన్నంగి, తాళ్లూరు మండలం విఠలాపురంలో ఒక్కో చెరువును సాగు చేశారు. -న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

తాళ్లూరు మండలం విఠలాపురంలోని చేపల చెరువును పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

మండలానికి రెండేసి చొప్పున.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి మండలానికి రెండు యూనిట్ల చొప్పున జిల్లాలోని 38 మండలాల్లో కొరమీను చేపల పెంపకం కింద 76 యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎంపికైన మహిళలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి కింద రుణం మంజూరుతోపాటు 35 నుంచి 50 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నారు. సర్కిలేటరీ విధానంలో మంచినీటిలో చేపలు పెంచనున్నారు. తక్కువ ఖర్చుతో ఏడాదికి రూ.3 లక్షలకుపైగా ఆదాయం వచ్చేవిధంగా ప్రణాళిక చేస్తున్నారు.

పెంపకం ఇలా..

ఒక్కో చెరువులో విడతకు వెయ్యి పిల్లలను సాగు చేయనున్నారు. 10 నుంచి 30 గ్రాముల పిల్లలను ముందుగా చిన్నపాటి చెరువులో నాలుగు నెలలు పెంచుతారు. అనంతరం పెద్ద చెరువులో వేసి మరో నాలుగు నెలలు పెంచుతారు. ఈ సమయానికి ఒక్కో చేప కిలో వరకు బరువు పెరుగుతుంది. పిల్లలకు రూ.15 వేలు, మేత ఖర్చు రూ.1.12 లక్షలు పెట్టుబడి అవుతుంది. చేపలు పట్టే సమయానికి 1,000 కిలోల మేర దిగుబడి రానుండగా; మార్కెట్‌లో కిలో సరాసరి ధర రూ.280 వరకు పలుకుతుంది. చేపల విక్రయం ద్వారా రూ.2.80 లక్షల మేర ఆదాయం రానుంది. పెట్టుబడి పోనూ నికర ఆదాయం రూ.1.53 లక్షలు వస్తుంది. ఇలా తొలి ఏడాది రెండు, తర్వాత ఏడాది నుంచి మూడు పంటలు సాగు చేయొచ్చు. ఇప్పటివరకు 18 మంది దరఖాస్తు చేసుకోగా, వీరితో సాగు చేయించేందుకు అధికారులు ప్రణాళిక చేస్తున్నారు. కొరమీను చేపల పెంపకంపై మహిళలకు అవగాహన కల్పించేందుకు సాగు వైపు ప్రోత్సహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నారాయణ తెలిపారు.

అవసరమైన స్థలం	పెద్ద చెరువు	చిన్న చెరువు	యూనిట్ ఖర్చు	రాయితీ	లక్ష్యం
10 సెంట్లు	7.5 సెంట్లు	2.50 సెంట్లు	రూ.4.40 లక్షలు	35 నుంచి 50 శాతం	76 యూనిట్లు



రైతులతో మాట్లాడుతున్న జేడీఏ శ్రీనివాసరావు

గ్రామాల్లో రైతన్నా మీకోసం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా సోమవారం రైతన్నా మీకోసం వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. రైతులతో వ్యవసాయ. అనుబంధశాఖల క్షేత్రస్థాయి సిబ్బంది ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. మద్దిపాడు మండలం రాజవారిపాలెంలో జరిగిన కార్యక్రమంలో జేడీఏ ఎస్.శ్రీనివాసరావు, అధికారులు పాల్గొని నీటి పొదుపు, బోర్ల కింద వరికి ప్రత్యామ్నాయంగా పంటలు సాగుపై సూచనలిచ్చారు. సూక్ష్మసేద్యం రాయితీల వినియోగం, కూలీల కొరతను అధిగమించడం, డ్రోన్లు, ఇతర యంత్రాల వాడకంతోపాటు పంటలపై చీడపీడల నివారణకు పెస్ట్‌యాప్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. విద్యుత్తు ఆదాకు చర్యలు, జీవాలకు టీకాలు వేయించడం, రొయ్యలు, చేపల సాగులో మెలకువలు, ఉద్యానపంటల మార్కెటింగ్ తదితర అంశాలపై రైతులతో చర్చించారు. జిల్లావ్యాప్తంగా 528 రైతు సేవా కేంద్రాలున్నాయని, వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 29వ తేదీ వరకు రోజుకు 30 క్లస్టర్లలో కార్యక్రమాలు నిర్వహించనున్నామని జేడీఏ తెలిపారు.

ఒంటి చేత్తో జీవన పోరాటం

చిత్రంలో కనిపిస్తున్న ఈయన కొండపి మండలం నేతివారిపాలేనికి చెందిన దివ్యాంగుడు శివ. పుట్టుకతోనే ఒక చేయి లేకుండా, మరో చేయి పొట్టిగా ఉంది. టీటీసీ పూర్తి చేసిన ఈయన బ్యాక్‌లాగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసినా రాలేదు. ఉద్యోగం రాలేదని నిరాశ చెందకుండా కుటుంబ పోషణకు ఆటోడ్రైవరుగా మారారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలోని కలెక్టరేట్‌లో దివ్యాంగులకు ఎల్ఎల్ఆర్ మేళా నిర్వహిస్తుండటంతో లైసెన్స్ పొందేందుకు వచ్చారు. -ఈనాడు, ఒంగోలు

(c) eenadu

బరిలో దిగితే.. చిచ్చర పిడుగులే..

● హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణిస్తున్న గ్రామీణ క్రీడాకారులు

వారంతా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన బాలబాలికలు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. చదువుతోపాటు తమలోని క్రీడాసక్తికి సాధన జోడిస్తున్నారు. ఫలితంగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు. వారే ప్రకాశం జిల్లా అండర్ 19 హ్యాండ్‌బాల్ జట్టు విద్యార్థులు.

- న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

ముందుంటారు.. కీలకంగా మారతారు

రాష్ట్రంలో క్రీడా పోటీలంటే వారు ముందుంటారు. గత ఏడాది అండర్ 17 హ్యాండ్‌బాల్ పోటీల్లో జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన జట్లలో వీరు కీలకంగా వ్యవహరించారు. విద్యార్థులకు జిల్లా శిక్షకుడు విజయ్‌కుమార్ నిరంతరం ప్రత్యేక తర్ఫీదునిస్తున్నారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా పాల్గొనబోతున్నారు.

పోలీస్ ఉద్యోగమే లక్ష్యంగా సాధన

- విజయలక్ష్మి, ఇంటర్, ఎస్.ఎన్.పాడు

జాతీయ స్థాయిలో డిల్లీలో జరిగిన క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలిచా. మధ్యప్రదేశ్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించాం. క్రీడా కోటాలో పోలీసు అధికారి కావడమే లక్ష్యంగా సాధన చేస్తున్నా.

నిత్యం ప్రాక్టీస్ చేస్తున్నా

- కుసుమ, ఎస్.ఎన్.పాడు, ఇంటర్ ద్వితీయ

గత ఏడాది హ్యాండ్‌బాల్ అండర్ 17 విభాగంలో దొనకొండ రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి స్థానం, జాతీయస్థాయిలో మధ్యప్రదేశ్ మొదటి స్థానం సాధించా. ఇకముందు జరగబోయే క్రీడల్లో పాల్గొనేందుకు అలుపెరుగక నిత్యం ప్రాక్టీస్ చేస్తున్నాం.

మెలకువలు నేర్చుకుంటున్నాం

- చిన్ని పిల్లేశ్వరరావు, ట్రిపుల్ ఐటీ, ఒంగోలు

గత ఏడాది అండర్ 17 విభాగంలో జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటి సిల్వర్ మెడల్ సాధించా. రానున్న పోటీల్లో రాణించేందుకు అవసరమైన మెలకువలు కోచ్ నేర్పుతున్నారు. అనుసరిస్తున్నాం.

పట్టుదలతో ముందుకు వెళ్తున్నాం

- జస్వంత్‌నాయక్, ట్రిపుల్‌ఐటి ఒంగోలు.

ఆర్మీ ఉద్యోగిగా చేరాలనేది లక్ష్యం. ఇకముందు జరిగే క్రీడల్లో పాల్గొనేందుకు పట్టుదలతో ముందుకు వెళ్తున్నాం. రోజుకు 3 గంటలు సాధన చేస్తున్నాం.

ఆన్‌లైన్‌లో భూమి మార్పుపై ఫిర్యాదు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: మార్కాపురం మండలం పెద్ద నాగులవరం గ్రామ రెవెన్యూ పరిధిలో తమ అనుమతి లేకుండానే 0.20 సెంట్ల వ్యవసాయ భూమిని రెవెన్యూ అధికారులు అక్రమంగా తొలగించారంటూ మల్లె మంగమ్మ కలెక్టర్ పి.రాజాబాబుకు ఫిర్యాదు చేశారు. స్థానిక ప్రకాశం భవన్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్ పి.రాజాబాబు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో ఓబులేసు, ఎస్‌డీసీలు కుమార్, జాన్సన్, విజయ జ్యోతి, కళావతితోపాటు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజాబాబు

భోగరాజు పట్టాభి సీతారామయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

పట్టాభి సేవలు చిరస్మరణీయం

ఒంగోలు సాంస్కృతికం: ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య జయంతిని పురస్కరించుకొని, నగరంలో హౌసింగ్ బోర్డు కాలనీలోని శక్తిసదన్‌కు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రా బ్యాంక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ఆంధ్రా బ్యాంక్‌ను స్థాపించటమే కాక, జాతికి ఎంతో సేవ చేసిన పట్టాభి సేవలు చిరస్మరణీయ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి అధ్యక్షురాలు అరుణ, పార్థసారధి, రత్నం, శేషగిరిరావు, త్యాగరాజు పాల్గొన్నారు.

హింస లేని సమాజం కావాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: హింసలేని సమాజం కోసం సమైక్య ఉద్యమాలు సాగాలని ప్రముఖ వైద్యురాలు ఎన్.ఉదయని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ హింసా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐద్వా ఆధ్వర్యంలో డిసెంబర్ 10వ తేదీ వరకు నిర్వహించనున్న హింసా వ్యతిరేక ప్రచారోద్యమ కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా మహిళలపై హింస ఒక సాధారణ అంశంగా రూపు దాల్చడం ఆందోళనకరమన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి, నాయకురాలు జి.ఆదిలక్ష్మి, బి.రాజ్యలక్ష్మి, రాజేశ్వరి, నాగేశ్వరి పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైద్యురాలు ఎన్.ఉదయని, ఐద్వా సంఘం నాయకులు

దానిమ్మ.. నాణ్యంగా పండిద్దామా..!

జిల్లాలో దానిమ్మ సాగు విస్తీర్ణం ఏటికేడు పెరుగుతోంది. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే మేలైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్ తెలిపారు. ప్రస్తుతం తోటలు పిందె, కాయలతో ఉన్నాయి. నాణ్యత, సైజు పెంచేందుకు పాటించాల్సిన పద్ధతులు, ఇతర విషయాలను ఆయన వివరించారు. –న్యూస్‌టుడే, కంభం

దానిమ్మ తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్

మీ కోసం

కాయ రంగు కోసం..: పండ్ల నాణ్యత, రంగు, రుచి, పరిమాణం, నిల్వ ఉండే సామర్థ్యం.. చీడపీడలు, వాతావరణ పరిస్థితులు, పుష్పించే కాలంపైనే కాకుండా మనం చేపట్టే యాజమాన్య పద్ధతులపై ఆధారపడి ఉంటాయి. నేలలో నత్రజని, నీరు, మెగ్నీషియం నిల్వలు ఎక్కువగా ఉన్నప్పుడు కూడా గింజలు రంగు కోల్పోయి తెల్లగా ఉంటాయి. పొటాషియం డై హైడ్రా ఆర్థోఫాస్ఫేట్ 1-2 గ్రా. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే ఆకర్షణీయమైన రంగు కాయలు పొందవచ్చు.

పగుళ్ల నివారణకు..: కాయ పగుళ్లు సాధారణంగా ఉష్ణోగ్రతల్లో తేడాలు, క్రమపద్ధతిలో నీటి తడులివ్వకపోవడం, గాలిలో తేమశాతం తదితర కారణాల వల్ల ఏర్పడతాయి. కాయలోని కణజాలం ఎదుగుదల, తొక్క కణజాలం కంటే ఎక్కువైనప్పుడు ఒత్తిడి కలిగిస్తుంది. క్రమ పద్ధతిలో నీటి తడులివ్వడం వల్ల కాయపగుళ్ల అరికట్టవచ్చు. లేత తోటల్లో కాయపగుళ్లు ఎక్కువగా బోరాన్ ధాతు లోపంతో వస్తాయి. ఎరువుల్లో నత్రజని మోతాదు ఎక్కువైనా పగుళ్లు ఏర్పడే అవకాశం ఉంది. కాయ ఎదిగే దశల్లో కిలో కాల్షియం క్లోరైడ్, కిలో మెగ్నీషియం క్లోరైడ్‌లను 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. ఆ తర్వాత మళ్లీ 1.5 కిలోల డీఏపీ, 0.75 కిలోల మెగ్నీషియం సల్ఫేట్‌లను 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే కాయపగుళ్లను నివారించవచ్చు.

ఎండదెబ్బ నుంచి రక్షణకు..: వేసవిలో వచ్చే కాయలకు ఎండ పోడ ఎక్కువగా సోకుతుంది. సూర్యుడికి ఎదురుగా ఉన్న కాయ చెంప కమిలి రంగుమారి పొడలా ఏర్పడుతుంది. కణజాలం గట్టిపడుతుంది. ఎండపొడ సోకిన భాగంలో గింజలు రసహీనమై రంగు కోల్పోయి రుచి తగ్గుతాయి. నివారణకు లీటర్ నీటికి 20 గ్రా. సున్నం కలిపి చెట్టులోని కాయలపై ప్రత్యేకించి పడమటి వైపున ఉన్న కాయలపై స్ప్రే చేయాలి. తోటలో అక్కడక్కడ అవిశె చెట్లను పెంచితే ఎండదెబ్బ అంతగా సోకదు. తోట చుట్టూ మునగ, అవిశె, వెర్రి అవిశె వంటి చెట్లను పెంచితే వడగాలుల్ని ఆపి తోటలో సూక్ష్మ వాతావరణం చల్లగా ఉండి ఎండ ప్రభావం తగ్గుతుంది. ఎండా కాలంలో నీటి తడులు ఇవ్వడంలో క్రమపద్ధతి పాటించాలి.

సమస్య • పరిష్కారం

సమస్య: మా పశువుకు ఇటీవల టీకా వేయించాం. మెడ వద్ద పెద్దగా వాపు వచ్చింది. అది ప్రమాదకరమా ? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? – వెంకటేశ్వర్లు పూసలపాడు

నాగార్జునరెడ్డి, పశువైద్యాధికారి, పూసలపాడు

సమాధానం : టీకా వేసేటప్పుడు పశువును సరిగా పట్టుకోకపోతే, అది కదలడం, టీకా వేసిన చోట సరిగా మర్దన చేయకపోవడంతో వాపు వచ్చే అవకాశం ఉంది. వేడి నీటిలో ముంచిన గుడ్డతో వాపు ప్రాంతాన్ని నొక్కాలి. అయోడెక్స్ ఆయింట్మెంట్ రాస్తే ప్రయోజనం ఉంటుంది

సమస్య: మా జీవాలు ఇటీవల కాలంలో కొన్ని ఈసుకుపోయాయి. కారణం ఏమిటీ ?– నారాయణ, పూసలపాడు

సమాధానం : జీవాల్లో పోషకాహార లోపం, నాలుగు, అయిదు నెలల చూడితో ఉన్న జీవాలను తరలించేటప్పుడు ప్రయాణ ఒత్తిడి వల్ల వాటి డొక్కల్లో పొడవడం, బ్రూసెల్లోసిస్ వ్యాధి, ట్రైకోమోనియసిస్ వ్యాధులు, కొన్ని రకాల సూదులు, టీకాలు, నట్టల మందులు చూడి కట్టిన మొదటి 3 నెలల్లో వేయడం తదితర కారణాలతో జీవాలు ఈసుకుపోతాయి.

–న్యూస్‌టుడే, బేస్తవారపేట గ్రామీణం

శీతాకాలం.. జీవాలను రక్షించుకుందాం!

ప్రస్తుతం రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. దీంతో జీవాల్లో పలు వ్యాధులు సోకే అవకాశం ఉంది. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతాయి. పెంపకందారులు సరైన జాగ్రత్త చర్యలు తీసుకుంటే వ్యాధుల నుంచి జీవాలను కాపాడుకోవచ్చునని బేస్తవారపేట మండల పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ వంగా ఆశాజ్యోతి తెలిపారు. –న్యూస్‌టుడే, బేస్తవారపేట

న్యూమోనియా..: పాకల్లో తడి వాతావరణం, చల్లని గాలుల వల్ల జీవాలకు న్యూమోనియా సోకుతుంది. దగ్గు, శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది, ముక్కు నుంచి నీరు కారడం, జ్వరం, ఆకలి తగ్గడం, అలసట తదితర లక్షణాలుంటాయి. దీని నివారణకు జీవాలను గోరువెచ్చని గదిలో ఉంచి చలిగాలుల నుంచి రక్షణ కల్పించాలి. పాస్టురెల్లా వ్యాక్సిన్ ఇవ్వాలి. ఆక్సీటెట్రాసైక్లిన్, ఎన్రోఫ్లోక్సాసిన్, లేదా పెన్సిలిన్, స్ట్రెప్టోమైసిన్ తదితర యాంటీబయోటిక్స్ మందులు అందించాలి. జ్వరం తగ్గించేందుకు అనాల్జెసిక్స్ లేదా యాంటీపైరేటిక్స్ ఇవ్వాలి. గోరు వెచ్చని నీరు అందించాలి.

ఫుట్‌రాట్..: బురద వాతావరణం ఉన్న పాకల్లో జీవాలను పడుకోబెడితే ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. కాళ్లలో పూత, గాయాలు, దుర్వాసన, నడవడంలో ఇబ్బంది వంటివి దీని లక్షణాలు. నివారణకు పాకల్లోని నేలను పొడిగా ఉంచాలి. వాటి కాళ్లను క్రమం తప్పకుండా శుభ్రపరచాలి. 5 శాతం కాపర్ సల్ఫేట్ లేదా 10 శాతం జింక్ సల్ఫేట్ ద్రావణంలో జీవాల కాళ్లు ముంచాలి. పెన్సిలిన్, టైలాసిన్ యాంటీబయోటిక్ సూదిమందులు వేయించాలి. బాధిత జీవాలను మంద నుంచి వేరుగా ఉంచాలి.

కొలిక్ (కాస్టిపేషన్)..: నీటి కొరత, పొడి గడ్డి ఎక్కువ తినడం, చలి వల్ల గ్యాస్ ఏర్పడడం తదితర వాటి వల్ల ఈ వ్యాధి సోకుతుంది. జీవాల్లో పొట్ట ఉబ్బరం, మల విసర్జన కష్టతరం, ఆహారం తినకపోవడం వంటివి ఈ వ్యాధి లక్షణాలు. నివారణకు జీవాలకు గోరు వెచ్చని నీరు ఇవ్వడం, హరిత మేత అందించాలి. చికిత్స కోసం గోరువెచ్చని నీటిలో లిక్విడ్ ప్రాఫిన్‌ను 30 నుంచి 50 మి.లీ కలిపి ఇవ్వాలి. మెగ్నీషియం సల్ఫేట్‌తో పాటు గ్యాస్ తగ్గించేందుకు సైమ్ థీకోన్ అందించాలి.

రైతేరాజు

ఆ రైతు పండిస్తే.. లక్ష్మీ కటాక్షమే

సంప్రదాయ పద్ధతిలో కాకుండా వినూత్నంగా ఆలోచించి పంటలు వేస్తే తప్పకుండా లాభాలు పొందవచ్చని నిరూపించారు తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెనికి చెందిన రైతు పేరం లక్ష్మీరెడ్డి. తక్కువ స్థలంలోనే ఎక్కువ పంటలు పండిస్తూ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఆయన అనుసరించిన విధానాలు, ఇతర వివరాలను ఆయన మాటల్లోనే తెలుసుకుందాం. –న్యూస్‌టుడే, తాళ్లూరు

గ్రామంలో మాకున్న పొలంలోనే ముప్పయి సెంట్లలో దోస, ఇరవై సెంట్లలో టమోటా, మరో ముప్పయి సెంట్లలో బత్తాయి వేసి అంతర పంటగా మిరప సాగు చేపట్టాము. దోస పంట కోసం సుమారు రూ.నాలుగువేల మేరకు పెట్టుబడి అయింది. ఎటువంటి క్రిమికీటకాలు ఆశించకుండా సేంద్రియ పద్ధతుల్లోనే పంటను కాపాడుకున్నాం. ఇటీవల తొలికాపు మూడు టిక్కీలు (యాభై కిలోలు వంతున) కాయలు లభించాయి. ప్రస్తుత మార్కెట్‌లో టిక్కీ ధర రూ.1400 పలుకుతుంది. దీంతో తొలి కాపులోనే పెట్టుబడి వచ్చేసింది. ఇంకా అయిదారు కోతల్లో లభించే దోస కాయలతో లాభాలు వస్తాయి. మొంథా తుపాను కారణంగా అవరోధాలు కలిగినా.. వాటిని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల సూచనలతో అధిగమించాం. త్వరలో మిరప, టమోటా పంటల ద్వారా కూడా లాభాలు వస్తాయని రైతు ధీమా వ్యక్తం చేశారు.

మిరప తోటలో లక్ష్మీరెడ్డి

వాగులోకి దూసుకెళ్లిన కారు

పెద్దారవీడు, న్యూస్‌టుడే: వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి వాగులోకి దూసుకుపోయింది. వెంటనే స్థానికులు స్పందించి వారిని రక్షించడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ సంఘటన ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం రాజంపల్లి సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ నగరంలోని సింగ్‌నగర్‌కు చెందిన బుగత నాగరాజు, కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలానికి కారులో బయలుదేరారు. వారి వాహనం సోమవారం మధ్యాహ్నం పెద్దారవీడు మండలం రాజంపల్లి సమీపంలో అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న వాగులోకి దూసుకుపోయింది. వెంటనే గమనించిన స్థానికులు వాగులోకి దూకి..కారులో ఉన్న నలుగురిని కాపాడారు. వారికి స్వల్ప గాయాలు కావడంతో మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు.

వాగులో బోల్తాపడిన కారు

12 మంది మందుబాబులకు జరిమానా

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన 12మందికి న్యాయస్థానం జరిమానా విధించినట్లు ఒంగోలు ట్రాఫిక్ సీఐ ఎస్.జగదీష్ చెప్పారు. జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పట్టుబడిన 12మందిని సోమవారం ఒంగోలులోని న్యాయస్థానంలో హాజరుపరిచారు. వీరిలో 11మందికి ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. అతిగా మద్యంతాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ఒక వ్యక్తికి రెండురోజుల జైలుశిక్ష విధించినట్లు సీఐ జగదీష్ వెల్లడించారు

తీరంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొత్తపట్నం: గుర్తు తెలియని మృతదేహం సముద్రం నుంచి కొట్టుకొచ్చిన సంఘటన కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామం సముద్ర తీరం ఒడ్డున సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన ప్రకారం.. కొట్టుకొచ్చింది పురుషుని దేహమని, వయసు సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటుందని, ఎత్తు 5.7 అడుగులు అని తెలిపారు. ఫుల్ చేతుల చొక్కా, బ్లూ కలర్ షాట్ వేసుకొని ఉన్నాడు. ఆచూకీ తెలిసినవారు ఫోన్.. 9121102126, 9121102124 నంబర్లను సంప్రదించాలని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మీ కోసంలో 63 వినతులు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 63 ఫిర్యాదులు అందాయి. జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు ఒంగోలు మహిళా పీఎస్ డీఎస్పీ వి.వి. రమణకుమార్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి, యర్రగొండపాలెం, పొదిలి సీఐలు ఖాజావలి, కె.అజయ్‌కుమార్, ఎం.రాజేష్‌కుమార్, ఎస్సై జనార్దన్‌రావు పాల్గొన్నారు.

విన్నపాలు వింటున్న మహిళా పీఎస్ డీఎస్పీ రమణకుమార్

గంజాయి కేసులో 8 మంది అరెస్టు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: గంజాయి అక్రమరవాణా కేసులో ఎనిమిది మంది నిందితులను ఒంగోలు తాలూకా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పట్టుబడిన నిందితుల వద్దనుంచి 2.50 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒంగోలు తాలూకా సీఐ టి.విజయ్‌కృష్ణ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక దక్షిణ బైపాస్‌రోడ్డులో సోమవారం సాయంత్రం కొందరు అనుమానిత యువకులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరివద్ద గంజాయి లభ్యమైంది. వీరు ఒడిశా రాష్ట్రంలో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని చిన్నచిన్న ప్యాకెట్లుగా మార్చి స్థానికంగా యువకులు, కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. ● ఒంగోలు కమ్మపాలేనికి చెందిన షేక్ సాహిల్ అలియాస్ నాని, షేక్ నాయబ్ రసూల్, తాళ్లూరు మండలం తూర్పుగంగవరం గ్రామానికి చెందిన నాగులూరి వెంకటేశ్వర్లు, ఒంగోలు వడ్డెపాలేనికి చెందిన కొలకలూరి నవీన్, ఒంగోలు పాతమార్కెట్ సెంటర్ దండుపాలేనికి చెందిన పఠాన్ సాహుల్ అలియాస్ పిచ్చిపండు, పీర్లమాన్యం టీచర్స్ కాలనీకి చెందిన షేక్ షాహుల్, ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన ఘోడా శంకర్‌తో పాటు మరొక మైనర్‌ని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్ని న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు సీఐ విజయ్‌కృష్ణ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 108, రిటైల్ లైవ్ - 135, చికెన్ విత్ స్కిన్ - 196, చికెన్ స్కిన్‌లెస్- 223

దుకాణాల్లో అగ్ని ప్రమాదం

పీసీపల్లి, న్యూస్‌టుడే: విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకొని కిరాణా, వస్త్ర దుకాణాలు దగ్ధమైన సంఘటన మండలంలోని గుంటుపల్లిలో సోమవారం జరిగింది. స్థానికులు, అగ్నిమాపక శాఖ అధికారి బంగారుబాబు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన గాదంశెట్టి సాయికృష్ణ తన రెండంతస్తుల భవనంలో కిరాణా వస్తువులు, వస్త్రాల విక్రయ దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఉదయం షాపు తెరవకముందే భారీగా మంటలు అంటుకుని వ్యాపించాయి. పక్కనే ఉన్న మరో భవనంలో నివాసం ఉంటున్న యజమాని, కుటుంబ సభ్యులు గుర్తించారు. పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగిసి పడుతుండడంతో అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. అధికారులు ఆస్తి నష్టంపై అంచనా వేస్తున్నారు.

మంటల్లో కాలిపోయిన కిరాణా వస్తువులు

పోక్సో కేసు నిందితుడి బలవన్మరణం

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచార యత్నం కేసులో నిందితుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..పట్టణంలో నివాసముంటున్న రఫీ ఆదివారం ఓ ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఓ బాలికపై అత్యాచారానికి యత్నించినట్లు ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టి పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సైదుబాబు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రఫీ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గూడ్సు రైలు కింద పడి.. : మార్కాపురం గ్రామీణం: గూడ్సు రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మార్కాపురం రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. మార్కాపురం ఆర్పీ ఏఎస్సై వెంగళ్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున గుంటూరు నుంచి నంద్యాల వైపు గూడ్సు రైలు వస్తోంది. మార్కాపురం స్టేషన్ దాటిన తర్వాత ఓ వ్యక్తి అకస్మాత్తుగా పట్టాలపై పరిగెత్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు సేకరించగా, మృతుడు త్రిపురాంతకం మండలం దూపాడు గ్రామానికి చెందిన కొదమల కృపాలు (50)గా గుర్తించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జీజీహెచ్‌కు తరలించినట్లు ఏఎస్సై తెలిపారు.



ప్రమాదవశాత్తూ .. : కంభం: లారీ చక్రాల కింద నలిగి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన స్థానిక కందులాపురం కూడలిలో సోమవారం చోటుచేసుకుంది. ఏఎస్సై నారాయణ కథనం మేరకు.. పట్టణంలోని కందులాపురం కూడలి ప్రాంతంలో నివాసముండే **సయ్యద్ షేర్ అలీ** (23) ద్విచక్ర వాహనంపై వై జంక్షన్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వైపు వెళుతున్నారు. అక్కడి యూ టర్న్ తిరిగే క్రమంలో పిడుగురాళ్ల నుంచి అనంతపురానికి వెళుతున్న లారీ చక్రాల కింద పడి మృతి చెందాడు. ఇతను పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

బండ్లమూడి బాధితులకు ప్రభుత్వం చేయూత

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి మండలం బండ్లమూడిలో అగ్రవర్ణాల దాడిలో గాయపడిన బాధిత ఎస్సీ కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్ పేర్కొన్నారు. బండ్లమూడి ఎస్సీ కాలనీని సోమవారం ఆయన సందర్శించారు. దాడిలో గాయపడిన ఏసుదాసు తదితర కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ గాయపడిన వారిని పరామర్శించి ఇక్కడి పరిస్థితులను తెలుసుకొని ప్రభుత్వానికి నివేదిక అందజేసేందుకు వచ్చినట్లు చెప్పారు. బాధిత కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం, ఎకరా చొప్పున భూమి, నష్టపరిహారం అందించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారని ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. వీరిపై పెట్టిన కేసులను తొలగించాలని పోలీసు అధికారులకు సూచించామన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమాధికారి లక్ష్మణ్ నాయక్, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, తహసీల్దారు బ్రహ్మయ్య, ఎంపీడీవో రాఘవేంద్ర, ఎమ్మార్పీఎస్ నాయకులు రుద్రపోగు సురేష్ మాదిగ, వై.కె.విశ్వనాథ్‌న్, మున్నంగి నాగరాజు, దుడ్డు రామకృష్ణ, డి.సాంబయ్య, వెంకటేశ్వర్లు, తొరటి ఆనంద్ మాదిగ, శేషం మోషే తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలపండి



5% GST అదనం

మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు. ఆకాంక్షించండి వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు...

పూర్తి వివరాలకు: 9701112824

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

EDUCATION

B.ఫార్మసీ, Bachelor of Physiotherapy (BPT), B.Sc, నర్సింగ్, GNM నర్సింగ్, మేనేజ్‌మెంట్ సీట్లకై: 9866939320, 7013448102

DISTANCE EDUCATION

వన్ సిట్టింగ్ డిగ్రీ, B.Tech, MBA, MCA, M.Sc, నర్సింగ్ కోర్సులకు గుజరాత్, సిక్కిం, అరుణాచల ప్రదేశ్‌లో ప్రముఖ యూనివర్సిటీల నుండి ఇప్పించబడును. ఒంగోలు 7093621555

REAL ESTATE

FLAT FOR SALE

ఒంగోలు కర్నూల్ రోడ్డు మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ దగ్గర గుప్తాస్ అపార్ట్మెంట్ 2BHK 5వ అంతస్తు పడమర ఫేస్ 1250Sft అమ్మబడును. కార్‌పార్కింగ్ కలదు. నో బ్రోకర్స్. సెల్: 9247131337.

JOBS

Wanted Graphic Designer for Flex Shop Ongole 78936 27544, 95509 76649

తనిష్క్ జ్యువెలరీ స్టోర్‌లో పనిచేయుటకు ఫ్లోర్ మేనేజర్ కావలెను. జీతం : 25K to 35K+ ఇన్సెంటివ్స్. సంప్ర: సస్యగ్రూప్, ఒంగోలు. 9281452802.

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్, HDFC/AXIS బ్యాంక్ క్లర్క్స్, లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆: 76599 88728.

ITC కంపెనీ ఒంగోలులో పనిచేయుటకు సేల్స్‌మెన్స్ & సూపర్‌వైజర్స్ కావలెను. Q: 10th ఆపై Age: 20 to 30y. జీతం+ ఇన్సెంటివ్స్. ఇంటర్వ్యూ: 22, 24,25th. ✆ 6281198937

ఒంగోలు కర్నూల్‌రోడ్డులో Cheap & Best హెయిర్ సెలూన్ షాపు నందు పనిచేయుటకు Supervisors కావలెను. ✆: 99495 59898

కపిల్ గ్రూప్ మార్కెటింగ్ ఒంగోలు నందు పనిచేయుటకు మార్కెటింగ్ స్టాఫ్, రియల్ ఎస్టేట్ స్టాఫ్ కావలెను. మంచి జీతం ✆: 9505022019, 9848799788

ఒంగోలులోని మా లాయరు గారి ఆఫీసు నందు పనిచేయుటకు DTP ఆపరేటర్ కావలెను. సంప్ర: 92474 44225, 93928 19099.

రాఘవ ఆటోఫైనాన్స్, ఒంగోలు నందు ఫైనాన్స్‌లో 8సం||ల అనుభవం గల కలెక్షన్ మేనేజర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం+ ఇన్సెంటివ్స్+TA. ✆ 9100904979

స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్‌వారి ఆధ్వర్యంలో సింగరాయకొండలో నడపబడుచున్న మారుతి మహిళ సొసైటి సంస్థ నందు పని చేయుటకు క్రింది అభ్యర్థులు కావలెను. 1) ప్రాజెక్టు మేనేజరు-1, Q: సోషల్ వర్క్/ సోషియాలజీ+ కంప్యూటర్ నాలెడ్జి కలవారు. 2) అవుట్ రిచ్ వర్కర్ Q: డిగ్రీ, HIVఎయిడ్స్ ప్రాజెక్టులో పనిచేసిన వారికి కమ్యూనిటీ మెంబర్స్‌కి ఇవ్వబడును. చివరి తేది:3-12-2025. Email: mms_phs@yahoo.com Cell: 9573939766

DRIVERS

డ్రైవర్స్ కావలెను. ఒంగోలుటౌను ఫ్రూట్స్ షాపుకు TATA ACE, INDRA V-30 వ్యాన్‌కు బ్యాడ్జ్ లైసెన్స్‌కల నేషనల్ డ్రైవర్స్ కావలెను. ✆ 6304388821.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/w 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే

వివరాలకు.. 97011 12824 ఒంగోలు 80087 09902 మార్కాపురం 80081 11050

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 500 Colour : రూ. 700

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మ రియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మార్కాపురం
•మార్కాపురం •గిద్దలూరు •యర్రగొండపాలెం

పొదిలి: బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

గిద్దలూరు: విజేతలకు బహుమతులందిస్తున్న పాఠశాల అధినేత బ్రహ్మానందరెడ్డి

ఉపన్యాసాలతో సత్తా చాటి..

పొదిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీమహర్షి ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ బహుమతి ఎం.జాలిక్ (8వ తరగతి), ద్వితీయ బహుమతి పి.మేఘన (8వ తరగతి), తృతీయ బహుమతి ఎం.జ్యోతి (8వ తరగతి) గెలుపొందారు. వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్.మురళీకృష్ణ బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ డి.సురేష్‌బాబు, కార్యదర్శి జె.సాయిరాం, ఉపాధ్యాయులు వెంకట్రావు, నరసింహారావు, దుర్గాలక్ష్మి పాల్గొన్నారు.

◗ గిద్దలూరు పట్టణం: స్థానిక 'సూర్య' విద్యానికేతన్ పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎ.ఎంజిలె ప్రథమ, పదో తరగతి విద్యార్థిని కె.లహరిశ్రీ ద్వితీయ, డి.ఆశ్లీవర్షిత తృతీయ బహుమతి దక్కించుకున్నారు. విజేతలకు పాఠశాల అధినేత బ్రహ్మానందరెడ్డి, ఉపాధ్యాయులు జాఫర్, మోహన్, రాజన్, నాగూర్‌వలి, నాయక్ బహుమతులందజేశారు.

◗ మార్కాపురం పట్టణం: పట్టణంలోని జిల్లీబాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీహెచ్.ఆశోక్, వై.భవన చంద్రారెడ్డి, ఏ.సుధాకర ఆచారి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వారికి పాఠశాల సిబ్బంది బహుమతులు అందజేసి అభినందించారు.

◗ యర్రగొండపాలెం: పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపన్యాస పోటీలు ఉల్లాసభరితంగా సాగాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎం.చంద్రశేఖర్ రెడ్డి (ప్రథమ), పి.సద్విశ్రీ (ద్వితీయ), డి.ఉన్నాఏంజెల్ (తృతీయ) స్థానాల్లో నిలిచారు. 'ఈనాడు' అందించిన బహుమతులను ప్రిన్సిపల్ ఎం.కృష్ణ అందించారు. జీవీ రామకృష్ణ, పి.శివాజీ, రహమాన్, అరుణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మార్కాపురం పట్టణం: ప్రశంసాపత్రాలతో విద్యార్థులు. చిత్రంలో పాఠశాల సిబ్బంది

యర్రగొండపాలెం: బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్ కృష్ణ, ఉపాధ్యాయులు

తీగలే తప్ప.. సరఫరా లేదే!

న్యూస్‌టుడే, మార్కాపురం పట్టణం

☛ అసంపూర్తి పనులతో అవస్థలు

విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. రూ.లక్షలు వెచ్చించి పనులు చేపట్టినా.. పూర్తి చేయకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు. దీనికి ఐదేళ్లలో విద్యుత్తు లైన్ పనులు సజీవ సాక్ష్యంగా మిగిలాయి.

విద్యుత్తు లైన్ పనులు పూర్తికాకపోవడంతో స్థానికులకు ఎలాంటి ఉపయోగం ఉండటం లేదు. ఐదు నెలల క్రితం మార్కాపురం పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయం వద్దనున్న విద్యుత్తు సబ్‌స్టేషన్ నుంచి తర్లుపాడు వరకు 11 కేవీ విద్యుత్తు లైన్ పనులు చేపట్టారు. అంత వరకు బాగానే ఉన్నా.. తరవాత దానికి సరఫరా ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా మారింది. అయితే పనులు పక్కా చకచకా గుత్తేదారు పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలి వెళ్లిపోయారు. దీంతో పాతలైన్ నుంచే విద్యుత్తు సరఫరా అవుతోంది. చిన్నపాటి వర్షాలు పడినా సరఫరాకు అంతరాయం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జక్ సీతానాగులవరంలో నూతన విద్యుత్తు స్తంభాలు కొన్ని మాత్రమే వేసి వదిలేశారు. దీంతో మిగిలిన స్తంభాలు రోడ్డు పక్కనే వృథాగా పడి ఉన్నాయి. ఇప్పటికైనా విద్యుత్తు అధికారులు చర్యలు తీసుకొని పూర్తిస్థాయిలో స్తంభాలు వేసి సరఫరా పునరుద్ధరించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

అలంకారప్రాయంగా 11 కేవీ లైను, వృథాగా స్తంభాలు (అంతరచిత్రం)

కార్మికులు అందుబాటులో లేక..

విద్యుత్తు లైన్‌కు సంబంధించిన పనులు ఒంగోలుకు చెందిన ఓ గుత్తేదారు సంస్థ చేపడుతోంది. పనులు చేసే కార్మికులందరూ బిహార్ ప్రాంతానికి చెందిన వారు. వారంతా అందుబాటులో లేకపోవడంతో పనులు నిలిచాయి. పనులు పూర్తి చేయమని ఆదేశించాం. దీనిపై త్వరితగతిన చర్యలు తీసుకుంటాం. - ఎస్.సియానాయక్, ఏడీఈ

ఎన్‌సీసీతో చక్కని క్రమశిక్షణ

మాట్లాడుతున్న ఎంఈవో గిరిధరశర్మ

రాచర్ల, న్యూస్‌టుడే : ఎన్‌సీసీతో విద్యార్థుల్లో చక్కని క్రమశిక్షణ అలవడుతుందని ఎంఈవో గిరిధర శర్మ, ప్రధానోపాధ్యాయుడు రామానాయక్ అన్నారు. ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జెండా ఆవిష్కరించారు. విద్యార్థులకు ఎన్‌సీసీపై వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్‌సీసీ ఎంతో అవసరమని చెప్పారు. వారితో మాక్ డ్రిల్ చేయించారు. కార్యక్రమంలో కేర్ టేకర్ కె.వి.రమణారెడ్డి, షేక్ నాదిర్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

కంభం, న్యూస్‌టుడే : రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. జంగంగుంట్లలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సాగుకాని ఉన్న ప్రతి రైతు కుటుంబానికి అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద ఏడాదికి రూ.14 వేలు, పీఎం కిసాన్‌తో భాగంగా రూ.6 వేలు అందిస్తున్నట్లు చెప్పారు. రూ. వంద కోట్లు రైతు ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. బిందు సేద్యం పరికరాలు, భూసార పరీక్షల తదితర వాటిని పక్కాగా అమలు చేస్తున్నట్లు వివరించారు. కంభం, పెద్దరాలపాడు తదితర గ్రామాల్లో ఏపీ బాలాజీ నాయక్ రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మహమ్మద్, తెదేపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నగుడిపాడులో ముఖ్యమంత్రి లేఖ పత్రాలు రైతులకు పంపిణీ చేస్తున్న తెదేపా నియోజకవర్గ బాధ్యుడు ఎరిక్షన్‌బాబు

అన్ని వర్గాల వికాసానికి కృషి

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: అన్ని వర్గాల వికాసానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. చిన్నగుడిపాడులో సోమవారం జరిగిన 'రైతన్న.. మీకోసం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రైతుల అభ్యున్నతి కోసం ఎంతో విధానాలతో కార్యాచరణ అమలు చేస్తున్నారన్నారు. దానిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన రైతులకు ముఖ్యమంత్రి రాసిన లేఖలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమానదేవి, తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఏడీఏ వెంకటరమణ, ఏవో జవహర్‌లాల్‌నాయక్, తెదేపా నాయకులు ఐ.భుజంగయ్య, డి.పాలంకయ్య, బాబు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

పెద్దారవీడు: రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని పెద్దారవీడులో వ్యవసాయ అధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు దిలీప్‌కుమార్ అన్నారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి గొట్టం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎంపీడీవో జాన్ సుందరం, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎం.అభి జాతీయస్థాయి అండర్-17 కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు కర్నూలులో జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సత్తాచాటి జాతీయస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిని సోమవారం పాఠశాలలో ఘనంగా అభినందించారు. పాఠశాల పీడీలు డి.శ్యామలాదేవి, డి.దామోదర్‌రెడ్డి, కె.ఓబులేసు పాల్గొన్నారు.

పోటీలకు ఎంపికైన విద్యార్థి అభితో పాఠశాల సిబ్బంది

కరాటే పోటీల్లో..

పొదిలి: పొదిలి విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఆదివారం ఒంగోలులో జరిగిన పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. నరేందర్‌రెడ్డి, లిషితారెడ్డి, హర్షితారెడ్డి, ధర్మతేజ, రోహిత్, నిత్య, యశ్వంత్, ధర్మతేజ, భరత్, అర్షద్, వాజితారెడ్డి, శశివర్ధన్, సుహానా, షాజియా పతకాలు సాధించారు. సోమవారం వారిని ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రఫీ, కరీముల్లాబేగ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ కె.రాజు, ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రముఖులు, గ్రామ పెద్దలు

రాచమార్గమా.. డంపింగ్ యార్డా ?

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: వై.పాలెం మేజర్ పంచాయతీలోని జాతీయ రహదారి విభాగినులు రోగ కారకాలుగా మారుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా హోటళ్లు, టిఫిన్ బండ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నిర్వహిస్తున్న వ్యాపారులు.. వ్యర్థాలన్నీ తీసుకొచ్చి ఇక్కడే డివైడర్ చెంత పడేస్తున్నారు. దీంతో కుక్కలు, పందులు చేరి అపరిశుభ్రంగా మార్చేస్తున్నాయి. తెల్లారేసరికి ప్రధాన రహదారంతా వ్యర్థాలతో నిండిపోతోంది. దుర్వాసనతో జనాలు రోగాలబారిన పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. యూనియన్ బ్యాంకు నుంచి మాచర్ల రోడ్డులోని సినిమా హాలు దాకా ఇదే పరిస్థితి. అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డివైడర్‌పై వేసిన వ్యర్థాలు

ఉద్యోగుల నిరసన

బేస్తవారపేట: సమగ్ర శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసనలో పాల్గొనాలని ఎస్టీయూ ఐకాస ఇచ్చిన పిలుపు మేరకు సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు ఎంఈవో-2 రమణారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చకపోతే నిరసన కార్యక్రమాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా కమిటీ ఛైర్మన్‌కు నివాళి

రాచర్ల, న్యూస్‌టుడే : విద్యుదాఘాతంతో మృతి చెందిన ఆకవీడు ఎంపీపీ పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ రాజేష్ మృతదేహాన్ని ఎంఈవోలు గిరిధరశర్మ, మొయినుద్దీన్, స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ వి.భాస్కర్‌రెడ్డి సోమవారం సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం : 8008574135
యర్రగొండపాలెం : 8008552658

?: పాపినేనిపల్లి రామయోగితాత ఆలయ సమీపంలోని వీధిలో మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది. పారిశుద్ధ్య పనులు చేపట్టి సమస్యను పరిష్కరించాలి. – శ్రీను, పాపినేనిపల్లి.
✓: పంచాయతీ సిబ్బందికి తెలియజేసి పారిశుద్ధ్య పనులు చేపడతాం. – ఖాశింపీరా, ఎంపీడీవో, అర్ధవీడు.

?: వాగుమడుగు బస్టాండ్ సెంటర్ నుంచి గనివినపాడు వెళ్లే రహదారిపై వాన కురిసిన ప్రతిసారీ వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. –గురవయ్య, స్థానికుడు
✓: నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటాం. –శ్రీదేవి, ఈవోఆర్డీ

?: కంభం నుంచి అర్ధవీడు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. – మహేష్, అర్ధవీడు.
✓: రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే రహదారి పనులు చేపడతాం. –నరసింహులు,ర.భ.శాఖ, డీఈ, కంభం
- న్యూస్‌టుడే, అర్ధవీడు, కొనకనమిట్ల, అర్ధవీడు

వేళలు మార్చి.. వెతలు మిగిల్చి..

ఆర్టీసీ బస్సు వేళలు మార్చడంతో విద్యార్థులు గంటల తరబడి పడిగాపులు కాశారు. చిన్న ఓబినేనిపల్లి, పెద్ద ఓబినేనిపల్లి, మల్లాపురం, రోలుగుంపాడు, గొల్లపల్లె తదితర గ్రామాలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు బేస్తవారపేట జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, ప్రైవేటు బడుల్లో చదువుకుంటున్నారు. సోమవారం సాయంత్రం 5.30 గంటలకు రావాల్సిన బస్సు వేళలు మార్చడంతో విద్యార్థులు రాత్రి 7 గంటల వరకు రహదారి పక్కనే వేచున్నారు. బడులు వదిలే సమయానికి బస్సు ఏర్పాటుచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.– బేస్తవారపేట, న్యూస్‌టుడే

మూడేళ్లుగా మూలకు చేర్చి..

గత ప్రభుత్వ హయాంలో నాగంపల్లి పంచాయతీకి కేటాయించిన చెత్త సేకరణ వాహనం దుస్థితి ఇది. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు వీలుగా రూ.5 లక్షల విలువైన ఈ వాహనాన్ని పంచాయతీకి అప్పగించారు. నిర్వహణ భారంగా మారిందంటూ ఈ వాహనాన్ని మూడేళ్లుగా ఇలా మూలకు చేర్చారు. దీనిపై ఎంపీడీవో ఈశ్వరమ్మ మాట్లాడుతూ వాహనాన్ని ఉపయోగంలోకి తీసుకొస్తామన్నారు. – కొనకనమిట్ల, న్యూస్‌టుడే

టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు

ఒంగోలు నగరం: మార్కాపురంలోని శివసాయి ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న మూడు టీచర్ పోస్టులు భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు డీఈవో ఎ.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. స్కూలు అసిస్టెంట్ గణితం, సోషల్, గ్రేడ్-2 హిందీ పోస్టులకు ఎంపిక జరుగుతుందన్నారు. అన్నీ కూడా ఓసీ జనరల్ కేటగిరీకి కేటాయించినట్లు వివరించారు. ఎంపికైన వారు మూడు సంవత్సరాలు తాత్కాలిక కాంట్రాక్టు పద్ధతిన పనిచేయాలన్నారు. ఈనెల 30 లోగా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్కూలు కరస్పాండెంట్‌కు వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా పంపవచ్చన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: ప్రతి చిన్న ఇబ్బందికి అర్జీదారులు డివిజన్ కేంద్రానికి రాకుండా వీలైనంత వరకు మండల స్థాయిలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి ఆర్డీవో శివరామిరెడ్డి మండలస్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన 'మీకోసం కార్యక్రమం'లో పలు మండలాల నుంచి అర్జీదారులు వచ్చారు. తమకు తెలియకుండా శ్రీనిధి రుణాలు తీసుకోవడమే కాకుండా ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ నగదు కూడా ఇవ్వడం లేదని మార్కాపురం వడ్డేబజారుకు చెందిన కోటి నాయక్ ఫిర్యాదు చేశారు. తన పొలానికి సరైన దారి లేకుండా సర్వేయర్ అన్యాయం చేశారని తర్లుపాడుకు మహిళ నివేదించారు. విచారణ పేరుతో పిలిచి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉంచారని మార్కాపురం పట్టణానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలపై అధికారులకు 28 అర్జీలొచ్చాయి. కొన్ని సమస్యలను ఇన్‌ఛార్జి ఆర్డీవో శివరామిరెడ్డి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు.



చరవాణిలో ఆరాతీస్తున్న ఇన్‌ఛార్జి ఆర్డీవో శివరామిరెడ్డి

ఇంటి స్థలం ఆక్రమించారని ఫిర్యాదు

కంభం: స్థానిక అర్బన్ కాలనీలోని తమ ఇంటి స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడని షేక్ ఖాదర్‌బీ అనే మహిళ సోమవారం తహసీల్దార్ కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. తమ స్థలం అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో షేక్ నూర్జాహన్, షేక్ మహమ్మద్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

వై.పాలెంలో పిల్లల బడిబాట

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వై.పాలెం పట్టణంలో నలుగురు పిల్లలను అధికారులు గుర్తించి సోమవారం బడిలో చేర్చారు. స్థానిక ఎస్టీ కాలనీలో ఎంపీపీ పాఠశాలలో వీరిని చేర్పించారు. సార్డ్స్ సంస్థ సహకారంతో ఎంఈవో ఆంజనేయులు, తహసీల్దార్ మంజునాథరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బయ్య వారిని చేర్పించారు. సార్డ్స్ సంస్థ ప్రతినిధి బాబు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : దొడ్డంపల్లెలో తాళం వేసి ఉన్న ఆర్ఎంపీ వైద్యుడు ఇంట్లో చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ పల్లా రమణారెడ్డి ఇంటికి తాళంవేసి కుటుంబసభ్యులతో కలసి నెల రోజుల క్రితం ముంబయి వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున రమణారెడ్డి ఇంట్లో నుంచి శబ్దాలు వస్తుండటం, విద్యుత్తు లైటు వెలుగుతుండటంతో స్థానికులు గమనించి రమణారెడ్డికి ఫోన్ చేయగా.. తాము వేరే ఊర్లో ఉన్నామని చెప్పారు. దీంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమై అక్కడి వెళుతుండగా, దొంగ అక్కడి నుంచి పరుగులు తీశాడు. వారు అతన్ని వెంబడించగా, రోడ్డు పక్కన నిలిపివున్న కారు ఎక్కి పరారయ్యాడు. స్థానికులు సీఐ సురేష్‌కు సమాచారం అందించగా, ఆయన చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. ఏఏ వస్తువులు చోరీకి గురయ్యాయన్నది తెలియరాలేదు.

బీరువాను పరిశీలిస్తున్న సీఐ సురేష్

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు పరివర్తకాల నిర్వహణ పనుల కారణంగా మంగళవారం మార్కాపురం సబ్ స్టేషన్ పరిధిలోని వేములకోట, కొట్టాలపల్లి, రాయవరం పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదని ఏఈ నాగేంద్రరెడ్డి తెలిపారు. ప్రజలు ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పరివర్తకానికి దిమ్మె ఏర్పాటు

పెద్దారవీడు, న్యూస్‌టుడే: గుండంచర్ల ఎస్సీ కాలనీలోని పరివర్తకానికి కొత్త దిమ్మె ఏర్పాటుచేశారు. ఈ నెల 19న 'రాళ్లే ఆధారం.. జారితే ప్రమాదం' శీర్షికన వార్త ప్రచురించగా విద్యుత్తు అధికారులు స్పందించారు. ఏఈ రమేష్, జేఎల్ఎం రాజు క్షేత్రస్థాయిలో పరిశీలించి నూతనంగా దిమ్మెను నిర్మింపజేసి విద్యుత్తు సరఫరా ఇవ్వడంపై ఎస్సీ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు కథనానికి స్పందన

కుళాయికి మరమ్మతులు

తర్లుపాడు: తాడివారిపల్లెకు చెందిన మిట్టపల్లెలో నీటి కుళాయి నుంచి నీరు లీకవుతుండటంపై 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. నవంబర్ 21న ప్రచురితమైన వార్తకు స్పందించిన పంచాయతీ కార్యదర్శి అనూష సోమవారం మరమ్మతులు చేయించారు.

పాతికేళ్లుగా సద్ది సమకూరుస్తూ..

● దాతల సాయంతో భక్తులకు అన్నప్రసాదాలు

న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

అయ్యప్ప, భవానీ, ఆంజనేయస్వామి మాలధారులకు సద్ది అందిస్తూ వారు ఆదర్శంగా నిలుస్తున్నారు. దీక్షలో ఉన్న భక్తులకు దాతల సాయంతో అన్న ప్రసాదం సమకూరుస్తున్నారు గిద్దలూరు అయ్యప్ప దేవస్థాన కమిటీ నిర్వాహకులు.

గిద్దలూరు పట్టణంలో స్థానిక అయ్యప్ప దేవస్థాన కమిటీ నిర్వాహకులు ప్రతి ఏటా దాతల సహకారంతో మాలధారులకు సద్ది, భిక్ష ఏర్పాట్లు చేస్తున్నారు. దేవస్థాన శాశ్వత కమిటీకి చెందిన దివంగత కటకం రామకృష్ణ కుటుంబ సభ్యులు, అన్నదాన శాశ్వత కమిటీ సభ్యుడు కటకం నాగేశ్వరరావు, ఇతర సభ్యులు ఏటా రెండు నెలల పాటు మాలధారులకు అన్నదానం చేపడుతున్నారు. పేద కుటుంబాలకు చెందిన స్వాములకు సద్ది అనేది ఆర్థిక భారమే. దీనికితోడు పల్లె ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం గిద్దలూరు పట్టణానికి వచ్చిన అయ్యప్ప స్వాములు ఇబ్బందులు పడుతుండేవారు. వారి కష్టాలు గుర్తించిన అయ్యప్ప దేవస్థాన కమిటీ నడుం బిగించి ఇరవై అయిదేళ్లుగా సద్ది అందిస్తోంది. స్థానిక అయ్యప్ప స్వామి దేవస్థానంలో మధ్యాహ్నం సద్ది, రాత్రి వేళ భిక్ష ఏర్పాటు చేస్తున్నారు.

గిద్దలూరు అయ్యప్ప దేవస్థానంలో సద్ది చేస్తున్న మాలధారులు

నిత్యం వందలాదిమందికి..

ప్రతిరోజు మధ్యాహ్నం మూడొందల మంది స్వాములకు సద్ది, రాత్రి రెండు వందల మందికి భిక్ష అందిస్తున్నారు. దాతల వద్ద సద్దికి రూ.8 వేలు, భిక్ష కోసం రూ.5 వేలు వంతున విరాళం సేకరిస్తున్నారు. అలాగే పట్టణంలోని కాళికాంబ దేవస్థానం, కొండపేట ఆంజనేయస్వామి దేవస్థానంలో మాలధారులకు అన్నదానం చేస్తున్నారు. పాతికేళ్లుగా ఈ క్రతువు కొనసాగించడం ఎంతో ఆనందంగా ఉందని నిర్వాహకులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడి మృతి

పొదిలి, న్యూస్‌టుడే: తెదేపా సీనియర్ నాయకుడు, పొదిలి ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు ఆవులూరి కోటేశ్వరరావు అనారోగ్యంతో మృతిచెందారు. ఉత్తమ పొగాకు రైతుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆయన అవార్డులు అందుకున్నారు. విషయం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు కంభాలపాడులోని ఆయన స్వగృహంలో భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

కోటేశ్వరరావు (పాతచిత్రం)

పాఠశాలల్లో బేస్‌లైన్ పరీక్ష

కంభం, న్యూస్‌టుడే : ప్రాథమిక పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారిత బేస్‌లైన్ పరీక్ష ప్రారంభించినట్లు ఎంఈవో-2 శ్రీనివాసులు తెలిపారు. స్థానిక అర్బన్ కాలనీలో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలోని బేస్‌లైన్ పరీక్షను సోమవారం పరిశీలించారు. ప్రాథమిక స్థాయిలో భాషా నైపుణ్యాలు, గణిత సామర్థ్యాలను అంచనా వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఆర్పీ మురళీమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంక్షేమమే ఎస్టీయూ ధ్యేయం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమమే ఎస్టీయూ ధ్యేయమని రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ తెలిపారు. ఆయన సోమవారం రాత్రి గిద్దలూరులోని విశ్వభారతి పాఠశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పాలకులు విద్యారంగానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. పీఆర్‌సీ ఏర్పాటులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.రఘునాథరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య, ప్రధాన కార్యదర్శి జి.నరసింహారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బాలగురవయ్య పాల్గొన్నారు.

◗ పెద్దదోర్నాల: మినిమం టైమ్ స్కేలుతో పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. దోర్నాల, పెద్దబొమ్మలాపురం, రామచంద్రకోట, కటకానిపల్లె, చిన్నదోర్నాల, చిన్నగుడిపాడులోని పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆ సంఘం మండల అధ్యక్షుడు కాశయ్య తదితరులు ఉన్నారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. సాయి శ్రీనివాస్

(c) eenadu

అన్నదాతలూ.. మీ సమస్యలు చెప్పండి

❑ రేపు కనిగిరి ఏడీఏతో 'ఈనాడు' ఫోన్‌ఇన్

అన్నదాతలూ.. మీకు ప్రభుత్వ పథకాలు అందడం లేదా.. రాయితీపై యంత్ర పరికరాలు రావడం లేదా.. ఎరువులు, విత్తనాలు కొనుగోలులో ఇబ్బందులు ఎదురవుతున్నాయా.. నకిలీ విత్తనాలు అంటగడుతున్నారా.. ఇలాంటి సమస్యలుంటే కనిగిరి వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు 'షేక్ జైనులాబ్దీన్'తో నేరుగా చెప్పవచ్చు. అందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని ఉపయోగించుకోండి. ఫోన్ చేయండి.. ఏడీఏకు మీ సమస్యలు చెప్పండి.

ఫోన్ ఇన్ తేదీ: 26.11.2025
సమయం: ఉదయం 10.30 నుంచి 11.30గం॥ల వరకు
చేయాల్సిన ఫోన్ నంబర్: 83310 57148

కనిగిరి
•కనిగిరి • దర్శి • కొండపి

1,544 పొగాకు బేళ్ల కొనుగోలు

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 418 బేళ్లు తిరస్కరించినట్లు నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. బోర్డు పరిధిలోని వెంకటప్పాపురం, కోయవారిపాలెం, తాతాకులపాలెం, ముక్కోడిపాలెం, దాసరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1,416 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, అందులో 998 కొనుగోలు చేశారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.310, కనిష్ఠ ధర రూ.50 పలికిందన్నారు.

● టంగుటూరు: టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో గరిష్ఠ ధర రూ.311 పలికింది. కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 797 బేళ్లను తీసుకురాగా.. 546 బేళ్లను కొనుగోలు చేశారు. 251 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కనిష్ఠ ధర రూ.50, సగటు ధర రూ.172 పలికినట్లు వేలం కేంద్ర నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు.

ప్రయాణికులకు ఇబ్బందులు రానీయం

టంగుటూరు: టంగుటూరు బస్ స్టేషన్‌ను మోడల్ బస్ స్టేషన్‌గా తీర్చిదిద్దుతామని నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. టంగుటూరు బస్టాండును సోమవారం ఆయన పరిశీలించారు. ఆవరణ మొత్తం తిరిగారు. ఎక్స్‌ప్రెస్ బస్సులు ఇక్కడికి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని, మరుగుదొడ్లను నిర్మించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.

నారాయణ స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,55,460

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: మిట్టపాలెం నారాయణ స్వామి దేవస్థానం ఆదాయం రూ.1,55,460 వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.నరసింహారావు తెలిపారు. స్వామివారి దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.66,550, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.22,830, స్వామి వారి పంచామృత అభిషేకానికి రూ.5,116, స్వామివారి శ్రీపాదకానుకల వల్ల రూ.6,000 విరాళాలు వచ్చినట్లు చెప్పారు. శాశ్వత అన్నదాన పథకానికి రూ.54,964 విరాళాలు రాగా అందులో సి.ఎస్.పురం గ్రామానికి చెందిన గుర్రం వెంకటేశ్వర్లు రూ.10,116 అందజేసినట్లు పేర్కొన్నారు.

కాలక్షేపం వద్దు.. జ్ఞాన సముపార్జనే హద్దు

దర్శి, న్యూస్‌టుడే: మండలంలోని చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థిని విద్యార్థులు తమ ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన కె.రాజావిష్ణవి, ఎన్.గీతా మాధురి, కె.విశ్వారెడ్డిలకు హెచ్ఎం గురుప్రసాద్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, వై.వెంకటేశ్వర్లు, మల్లికార్జునరావు, ఎస్. వెంకటేశ్వర్లు, వివేక్, మారుతి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ◆ సింగరాయకొండ గ్రామీణం: 'ఈనాడు' ఆధ్వర్యంలో మండలంలోని ఊళ్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సెల్‌ఫోన్‌ను విజ్ఞానం పెంపొందించేందుకు మాత్రమే వినియోగించుకోవాలని, కాలక్షేపం కోసం కాదని వివరించారు. ఎస్. వర్షిత, ఎ.వెన్నెల, ఎన్.హరీష్‌కుమార్‌లు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు, ఉపాధ్యాయులు సుల్తాన్‌బాషా, దిలావర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ◆ కనిగిరి: మండలంలోని దిరిశవంచ జడ్పీ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కె.వి.నాగలక్ష్మి ప్రియ, పి.సంపూర్ణ, వి.జాషువా ఇస్రాయేల్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు కె.మాధవశర్మ బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు మురళీధర్ రావు, రాజకుమార్, చిరంజీవి, రాజ్యలక్ష్మి, నాగూర్ బాషా, రూత్ కిరణ్‌కుమారి పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఊళ్లపాలెం ఉన్నత పాఠశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

విజేతలతో దిరిశవంచ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాధవశర్మ, ఉపాధ్యాయులు

బెట్టింగ్ ఉచ్చు.. జీవితాల్లో చిచ్చు

❑ అప్పులపాలై ఊరు విడిచి వెళ్లిపోతున్న బాధితులు ❑ నేపాల్ పోలీసులకు చిక్కిన పామూరు యువకులు

● పామూరుకు చెందిన ఓ యువకుడు క్రికెట్ బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ జూదాలు ఆడి రూ.50 లక్షలకు పైగా అప్పులు చేశాడు. తిరిగి చెల్లించకపోవడంతో అప్పులిచ్చిన వారు ఆతడి తల్లిదండ్రులను ఆశ్రయించారు. చేసేదేమీ లేక ఇల్లు విక్రయించి అప్పులు తీర్చారు.

● సి.ఎస్.పురానికి చెందిన ఓ యువకుడు క్రికెట్ బెట్టింగ్‌లతో అప్పులపాలై తనకున్న వాహనాలను అమ్ముకున్నాడు.

● తాజాగా నేపాల్ ప్రీమియర్ లీగ్ (ఎన్‌పీఎల్)లో బెట్టింగ్‌లకు పాల్పడుతున్న పామూరుకు చెందిన ఏడుగురు యువకులు, సి.ఎస్.పురం మండలానికి చెందిన ఓ యువకుడిని ఆ దేశ పోలీసులు అరెస్టు చేశారు.

న్యూస్‌టుడే, పామూరు, సీఎస్‌పురం

వ్యాపార కేంద్రమైన పామూరులో బెట్టింగ్ భూతం విజృంభణపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దేశంలోనే కాకుండా ఇతర దేశాల్లో నిర్వహించే క్రికెట్ బెట్టింగ్‌లకు వెళ్లడం ఏమిటని ఆశ్చర్యానికి గురవుతున్నారు. దురాశతో డబ్బు సంపాదనే ధ్యేయంగా క్రికెట్ పందేలకు యువత ఆకర్షితులవుతున్నారు. ఈ ప్రాంతంలో కొంత మంది లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ యాప్‌లు, వాట్సాప్ ద్వారా బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. బెట్టింగ్ మోజులో పడి రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. భారీ మొత్తాల్లో పందేలు పెట్టి నష్టపోయిన వారు సొంత ఊర్లను వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లిన సంఘటనలు ఉన్నాయి. అప్పులు చేసి బెట్టింగుల్లో పెట్టడం, అవి తీర్చేందుకు వాహనాలు, బంగారు ఆభరణాలు, స్థలాలు, చివరికి ఇళ్లు అమ్ముకుంటున్నారు. నష్టపోయిన మరికొందరు దూరప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకుని జీవిస్తున్నారు. ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగులు, చిన్నపాటి వ్యాపారులు, యువకులు, విద్యార్థులు ఈ ఉచ్చులో ఎక్కువగా చిక్కుకుంటున్నారు.

భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

యువత, విద్యార్థులు, ఇతరులు క్రికెట్ బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ జూదాలు ఆడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. చెడు స్నేహాలు, వ్యసనాలకు లోనై బంగారు జీవితాన్ని పాడుచేసుకోవద్దు. తల్లిదండ్రులు తమ పిల్లలను గమనిస్తూ ఉండాలి. క్రికెట్ టోర్నీలు జరిగేటప్పుడు ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి బెట్టింగ్‌లకు పాల్పడరాదని అవగాహన కల్పిస్తున్నాం. బెట్టింగ్‌లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
-పి.సాయిఈశ్వర్ యశ్వంత్, డీఎస్పీ, కనిగిరి

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం ధర్నా

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: అర్హులైన పేదలకు నివేశన స్థల పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హనీఫ్ డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాల సమస్యలు, శ్మశానాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వాలు ఎన్నికలప్పుడు పేదలకు నివేశన స్థలాల పట్టాలు ఇవ్వకపోవడంతో వారు అద్దె ఇళ్లలో ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పేదలకు ప్రభుత్వం పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఆర్.వాసుదేవరావుకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఊసా వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి, నాయకులు కె.మాల్యాద్రి, రత్నారెడ్డి, షమ్మి పాల్గొన్నారు.

నిబంధనల మేరకు విధులు నిర్వర్తించడం మేలు

దర్శి: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు రాజకీయ పార్టీలపై అభిమానం ఉన్నా బహిరంగంగా పార్టీ రంగులు పూసుకుతిరగడం వంటివి చేయొద్దని ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.సురేష్‌బాబు సూచించారు. దర్శి ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం ఉద్యోగులతో మాట్లాడారు. పార్టీలకు అనుకూలంగా ప్రవర్తించడం వల్ల ప్రభుత్వాలు మారిన సమయంలో క్షేత్రస్థాయిలో కక్ష సాధింపు చర్యలు ఉంటాయని, ప్రభుత్వ నిబంధనల మేరకు ఉద్యోగులు వ్యవహరించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ నియామకాల్లో, పదోన్నతుల్లో సుప్రీంకోర్టు తీర్పు క్రిమిలేయర్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చెన్నకేశవులు, రవికుమార్, శంకరకుమార్ పాల్గొన్నారు.

నకిలీ మందు విక్రయించారంటూ వాగ్వాదం

కనిగిరి, న్యూస్‌టుడే: నకిలీ మందు విక్రయించారంటూ దుకాణదారుడిపై గొడవకు దిగిన సంఘటన సోమవారం రాత్రి పట్టణంలోని స్టేట్ బ్యాంకు ప్రాంతంలో జరిగింది. వివరాల్లోకెళితే.. మండలంలోని చాకిరాలకు చెందిన ఇద్దరు వ్యక్తులకు స్థానిక దుకాణదారుడు ఆయుర్వేద మందు విక్రయించారు. దానిని తాగడంతో విరేచనాలై పట్టణంలోని ఓ వైద్యశాలలో చేరారు. కోపగించుకున్న బాధితుల బంధువులు దుకాణదారుడిపై గొడవకు దిగారు.

మదర్సా నిర్మాణానికి శంకుస్థాపన

పామూరు, న్యూస్‌టుడే: పామూరులో నూతనంగా నిర్మించనున్న మసీద్, మదర్సాలకు ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

సీఎస్‌పురం తహసీల్దార్‌గా వాసుదేవరావు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: పామూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్.వాసుదేవరావు సోమవారం సి.ఎస్.పురం తహసీల్దార్(ఎఫ్ఏసీ)గా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న షేక్ మహమ్మద్ హుస్సేన్ ఈ నెల 24 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు వ్యక్తిగత సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో పామూరు తహసీల్దార్‌కు కలెక్టర్ పి.రాజాబాబు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. అందుబాటులో ఉండి వివిధ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో మంజూరయ్యేలా చూస్తానని ఆయన తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు, సి.ఎస్.పురం గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి 'రైతన్నా మీ కోసం' అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఇప్పటికే రెండు విడతలుగా రైతులకు నగదు అందించామన్నారు. వీటితో పాటు బిందు సేద్యానికి రాయితీ పెంపు, పలు పథకాల ద్వారా రైతులకు అబ్ధి చేకూర్చనున్నట్లు వివరించారు. గిట్టుబాటు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి వారికి త్వరితగతిన నగదు అందజేస్తామన్నారు. రైతులకు ముఖ్యమంత్రి రాసిన లేఖలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఏడీఏ షేక్ జైనులబ్దీన్, మండల తెదేపా అధ్యక్షుడు బొబ్బూరి రమేష్, సర్పంచి ఎస్.సాయిబీ, ఎస్.హెచ్.వెంకటరెడ్డి, హరిబాబు, సర్పంచి ఎస్.పద్మావతి, పి.నరసయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఉప్పలపాడులో రైతుకి సీఎం రాసిన లేఖను అందజేస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

ప్రజా దర్బార్‌కు 172 అర్జీలు

కనిగిరి: సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక అమరావతి మైదానంలో నియోజకవర్గ స్థాయిలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వినతులను స్వయంగా స్వీకరించారు. మొత్తం ఆరు మండలాలు, మున్సిపాలిటీకి సంబంధించి 172 అర్జీలు రాగా వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపించారు. ప్రతి అర్జీని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆలస్యం చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

చేతిపంపు.. మొరాయింపు

మండల కేంద్రం సింగరాయకొండ పరిధిలోని బుంగబావి వద్ద చేతిపంపు మూలకు చేరింది. రెండేళ్లుగా ఇది పనిచేయకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, వాడుక నీటి కోసం ఇక్కట్లు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అసలే కుళాయిల్లో నీరు వారానికొకసారి వస్తుందని, పాలకులు అధికారులు స్పందించి చేతిపంపును బాగు చేయాలని కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్‌బాబు మాట్లాడుతూ.. సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులను పంపించి వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు.

-న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

ప్రధాన దారి.. ప్రమాదకరంగా మారి

అద్దంకి-దర్శి ప్రధాన రహదారిలో రెడ్డినగర్ సమీపాన పెద్ద గుంత ఏర్పడింది. నిత్యం అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలతో ఈ మార్గం రద్దీగా ఉంటుంది. గుంత వద్ద అదుపు తప్పి ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. సంబంధిత అధికారులు సత్వరం స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై ర.భ. శాఖ డీఈ గోపీకృష్ణను సంప్రదించగా త్వరితగతిన రహదారికి మరమ్మతులు చేయిస్తామన్నారు.

-న్యూస్‌టుడే, ముండ్లమూరు (తాళ్లూరు)

పాలేరు.. వ్యర్థాలు చూడు!

కొంతకాలంగా పాలేరు నదిలో రసాయన వ్యర్థాలను రాత్రి వేళల్లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తీసుకొచ్చి వదులుతున్నారు. సమీప గ్రామాల ప్రజలు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను నదిలోనే పడేస్తున్నారు. మొంథా తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు నీటి ఉద్ధృతి పెరిగింది. దీంతో కొట్టుకొచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలు ముల్ల పొదలకు అంటుకొని ఉండిపోయాయి. బిట్రగుంట సమీపంలో నదిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాల చిత్రమిది. సంబంధిత అధికారులు స్పందించి నదిలోకి వ్యర్థాలు వేయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, జరుగుమల్లి

వీధి దీపాలు వెలగక చింత

తాళ్లూరు మండలంలోని బొద్దికూరపాడు పంచాయతీ పరిధి చింతలపాలెంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ రాకపోకలు సాగించే క్రమంలో చీకటిలో ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో పి. అజిత మాట్లాడుతూ.. త్వరితగతిన వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తామన్నారు. అవసరమైన చోట స్తంభాలకు కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

-న్యూస్‌టుడే, తాళ్లూరు

మురుగు నీరా.. రోడ్డుపైకి వదిలెయ్!

దర్శి మండలం పొతకమూరులోని ప్రధాన రహదారిపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. దర్శి-తూర్పుగంగవరం ప్రధాన రహదారిలోని ఆ గ్రామం వద్ద సీసీ రహదారి నిర్మించారు. పజేశారు. సమీప దుకాణదారులు వ్యర్థ నీటిని రోడ్డుపైకి వచ్చేలా చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామ సచివాలయం సమీపంలోనే ఈ దుస్థితి నెలకొనడం గమనార్హం. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఈవోఆర్డీ సుధాకర్‌రావు మాట్లాడుతూ.. వెంటనే పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

-న్యూస్‌టుడే, దర్శి(తాళ్లూరు)

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: జరుగుమల్లి మండలం బిట్రగుంట గ్రామంలో కొంత కాలంగా కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగు నీరు నిలిచి దోమలు అధికమయ్యాయి. –సోమయ్య, స్థానికుడు
✓: త్వరలో కాలువల్లో పూడిక తీయించి, దోమల నివారణకు చర్యలు చేపడతాం. –షఫి, పంచాయతీ కార్యదర్శి

?: పీసీపల్లి మండలంలోని చౌటగోగులపల్లికి సాగర్ పైపులైన్లు, ట్యాంకు ఉన్నా నీటి సరఫరా జరగడం లేదు. ఫ్లోరైడ్ నీరు తాగి వ్యాధుల బారిన పడుతున్నాం. –గ్రామస్థులు
✓: ఇటీవల పైపుల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిచిపోయింది. త్వరలోనే నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటాం. –పవన్‌కుమార్ ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

?: దొనకొండలోని ఎన్టీఆర్ కాలనీలో సాగర్‌నీటి కుళాయిలు ఏర్పాటు చేయలేదు. – శ్రీనివాసులు, కాలనీవాసి
✓: నిధులు వచ్చిన వెంటనే పైపులు వేసి కుళాయిలు ఏర్పాటు చేయిస్తాం. – కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

-న్యూస్‌టుడే, జరుగుమల్లి, పీసీపల్లి, దొనకొండ

కాలువలో వ్యక్తి మృతదేహం తేలిన ఘటనపై కేసు

దర్శి, న్యూస్‌టుడే: దర్శి-కురిచేడు రోడ్డులో సాగర్ ప్రధాన కాలువ వంతెన వద్ద పురుషుడి మృతదేహం కనిపించడంపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఈ మేరకు వీఆర్వో శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పట్టణంలోని సీహెచ్‌సీకి తరలించామని ఏఎస్సై రాంబాబు తెలిపారు. 40-45 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తి మృతదేహంపై దుస్తులు లేవని, ఎలాంటి పుట్టుమచ్చలు కూడా లేవన్నారు. అదృశ్యమైన వ్యక్తుల సమాచారం ఉంటే సంప్రదించాలని ఏఎస్సై కోరారు.

కోతి దాడిలో తీవ్ర గాయాలు

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరంలో సోమవారం సాయంత్రం కోతి దాడిలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన రఘుబాబు ఇంటి ముందు నిలిచి ఉండగా అటుగా వచ్చిన కోతి అతనిపైకి దూకి కరవడంతో గాయాల పాలయ్యాడు. ఇటీవల కాలంలో కోతుల బెడద అధికమైందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వాటి బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి...

కురిచేడు: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని ఆవులమంద కొత్తూరు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం. . ముడివేముల గ్రామానికి చెందిన కె. వెంకటేశ్వర్లు ద్విచక్రవాహనంపై ఆవుల మంద వెళుతుండగా వాహనం అదుపుతప్పింది. అంబులెన్సులో కురిచేడు పీహెచ్‌సీకి తీసుకెళ్లి, అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

కనిగిరి, న్యూస్‌టుడే: జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి బి. రూపశ్రీ సూచించారు. సోమవారం స్థానిక కోర్టులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకునేటట్లు చూడాలన్నారు. వాది, ప్రతివాదులకు లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకుని క్రిమినల్, భరణం, బ్యాంకులకు సంబంధించిన కేసులను పరిష్కరించుకునే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు పరిధిలోని న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాయవాదులతో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ

పథకాలపై అవగాహన కల్పించండి

హనుమంతునిపాడు: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సమయపాలన పాటించాలని ఎంపీడీవో రంగసుబ్బారాయుడు ఆదేశించారు. సోమవారం మండలంలోని దాసరిపల్లి సచివాలయాన్ని తనిఖీ చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు సత్వరం పరిష్కారం చూపాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

టంగుటూరు: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య కోరారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామికి సోమవారం తూర్పునాయుడుపాలెంలో వినతి పత్రాన్ని అందించారు. జిల్లాలో 2 లక్షల మంది కౌలు రైతులు పంటలు సాగు చేస్తున్నారని వారిని ఆదుకోవాలని కోరారు.

ఉపాధ్యాయులకు సత్కారం

పామూరు న్యూస్‌టుడే: పామూరు మండలంలోని మార్కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి, బదిలీల్లో వేర్వేరు పాఠశాలలకు వెళ్లిన అయిదుగురు ఉపాధ్యాయులను సోమవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. వెంకటేశ్వర్లు, మోహనరావు, శ్రీనివాసులు, శ్రీలక్ష్మీ, విజయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

జరుగుమల్లి: జరుగుమల్లి పశువైద్యశాలలో సోమవారం వైద్యాధికారిణి జె.శ్రావణి ఆధ్వర్యంలో పశుపోషకులకు దాణా పంపిణీ చేశారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన వారు 50 కేజీల దాణా బస్తాను యాభై శాతం రాయితీపై అందజేస్తున్నారు. కావాల్సిన రైతులు పశు వైద్యశాలలో నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. దగ్గుమాటి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా హ్యాండ్‌బాల్ పోటీలు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో రెండో రోజు సోమవారం అండర్-19 రాష్ట్రస్థాయి బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. బాలుర విభాగంలో ప్రకాశం, శ్రీకాకుళం జట్ల మధ్య, బాలికల విభాగంలో గుంటూరు, పశ్చిమ గోదావరి జట్ల మధ్య పోటీలు జరిగాయి. నిర్వాహకులు క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. దాతల సాయంతో తాగునీరు, భోజన సదుపాయం కల్పించారు. మంగళవారంతో పోటీలు ముగుస్తాయని, రాష్ట్రస్థాయి జట్టు ఎంపికలు చేస్తామని కళాశాల పీడీ శంకరరావు తెలిపారు.

పోటీలో తలపడుతున్న ప్రకాశం, శ్రీకాకుళం జట్లు

చుట్టూ చిల్లచెట్లు.. మధ్యలో ఇళ్లు!

న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

వైకాపా ప్రభుత్వంలో జగనన్న కాలనీల పేరుతో విలువైన ప్రజాధనాన్ని నాయకులకు అడ్డంగా దోచిపెట్టారు. నిరుపేదలకు ఇళ్లు కాదు ఊళ్లు కట్టిస్తున్నామంటూ వేదికలపై అప్పటి నాయకులు బీరాలు పలికారు. మట్టి చదును పనుల పేరుతో రూ.కోట్లు కొల్లగొట్టారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే లేఅవుట్లలో లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోలేని పరిస్థితి. నేడు ఆ వెంచర్లలో చిల్ల చెట్లు, ముళ్లపొదలు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమైనా వీటిపై దృష్టిసారించి పేదల సొంతింటి కల నెరవేర్చాలని అంతా కోరుతున్నారు.

స్థలం చదును పేరుతో రూ.కోట్లు దోచేసి..

మండల కేంద్రం సింగరాయకొండతోపాటు, కనుమళ్ల, కలికవాయ గ్రామాల్లో నివాసయోగ్యం కాని పంట చెరువు ప్రాంతాల్లో లేఅవుట్లు ఏర్పాటు చేశారు. మట్టి చదును పేరుతో సుమారు రూ.4 కోట్లు ఖర్చు చేశారు. చెరువు మట్టిని తూతూమంత్రంగా చదును చేసి అప్పటి వైకాపా నాయకులు దోచుకున్నారు. అంతర్గత రోడ్ల నిర్మాణానికి మరికొన్ని నిధులు వెచ్చించినా మట్టిరోడ్లు తప్ప అభివృద్ధి చేసినవి ఎక్కడా కనిపించడం లేదు. కనుమళ్ల లేఅవుట్లో పునాదుల కోసం లబ్ధిదారులు గుంతలు తవ్వితే నీరు వస్తుండడంతో ఎవరూ గృహ నిర్మాణాలకు ఆసక్తి చూపడం లేదు. భవిష్యత్తులో చెరువుకు నీరు వస్తే ఇళ్లు మునిగిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో 250 మందికి పట్టాలిచ్చినా 14 ఇళ్లు మాత్రమే నిర్మించారు. నిర్మించుకున్న వారు కూడా దొంగల భయం, చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి విషపు పురుగులు సంచరిస్తూ అడవిని తలపిస్తుండటంతో బిక్కుబిక్కుమంటున్నారు. కలికవాయ కాలనీలో 123 మందికి పట్టాలిచ్చినా ఏ ఒక్కరూ ఇల్లు నిర్మించుకోలేదు.

కనుమళ్ల జగనన్న కాలనీలో పెరిగిన ముళ్లపొదలు

అయోమయంలో లబ్ధిదారులు..

ప్రస్తుతం జగనన్న కాలనీల పరిధిలో ప్లాట్లు తీసుకున్న వారు అయోమయంలో పడ్డారు. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంత వాసులకు మూడు సెంట్ల స్థలంతో పాటు గృహ నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని చెప్పడంతో తమ పరిస్థితి ఏమిటని వాపోతున్నారు. దీనిపై గృహ నిర్మాణ శాఖ ఏఈ పృథ్వీని వివరణ కోరగా.. ప్రభుత్వ ఆదేశానుసారం ముందుకు వెళ్తామన్నారు. 2014-19 మధ్యలో పెండింగ్‌లో ఉన్న పాతబిల్లులను గృహ లబ్ధిదారులకు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఇళ్లు నిర్మించని వారికి నూతన ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు చేపడతామన్నారు.

సైన్సు ఫెస్టివల్‌కు ఎంపిక

ముండ్లమూరు(తాళ్లూరు): ముండ్లమూరు మండలం వేముల జడ్పీ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న **కాకి స్వర్ణలత** ఇండియా ఇంటర్నేషనల్ సైన్సు ఫెస్టివల్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు టాన్య తెలిపారు. వచ్చే నెల 5 నుంచి పదో తేదీ వరకు ఎడ్యుకేటర్ అండ్ టీచర్స్ వర్క్‌షాప్ నిమిత్తం చండీఘడ్‌లోని పంజాబ్ యూనివర్శిటీలో జరిగే ఉత్సవాలకు హాజరు కానున్నారు. సైన్సు పరంగా వినూత్న ఆలోచనలను ఆమె తెలియజేయనున్నారు. డీఈవో ఎ.కిరణ్‌కుమార్, ఒంగోలు ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళీశ్వరరావు, ఎంఈవో షేక్ కాలేషావలి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.

'హామీల అమలులో విఫలం'

సి.ఎస్.పురం: హామీలు అమలు చేయడంలో చంద్రబాబు విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు విమర్శించారు. శీలంవారిపల్లిలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగ భృతి, ఫీజు రీఎంబర్స్‌మెంట్, 20 లక్షల ఉద్యోగాల కల్పన తదితర వాటిని కూటమి ప్రభుత్వం సరిగా ఇవ్వకుండా ప్రజలను మోసగించిందన్నారు.

వేలం నోటీసు

ప్రకాశం జిల్లా, దర్శి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పడిపోయిన చెట్లను (ఒక వేప, ఒక గానుగ, ఒక కొబ్బరి మరియు ఒక ఆకాశమల్లి చెట్లు) వేలం వేయుటకు నిర్ణయించడమైనది.
వేలం తేది: 02-12-2025,
సమయం: ఉదయం 11:00 గంటలు,
స్థలం: మండల ప్రజా పరిషత్ కార్యాలయం, దర్శి.
ఆసక్తి కలిగినవారు వేలంలో పాల్గొనవచ్చు. వేలంలో పాల్గొనదలచినవారు వేలం ప్రారంభానికి 30 నిమిషాల ముందు నమోదు చేసుకొని రూ. 200 ధరావత్తు చెల్లించవలసి ఉంటుంది. పాట దక్కించుకున్న వారు ధరావత్తు పోను మిగిలిన మొత్తాన్ని వెంటనే చెల్లించవలెను.
సం/- పి.కల్పన, ఎంపీడీవో దర్శి

(c) eenadu

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

సెల్‌ఫోన్ లాభ, నష్టాలు చక్కగా వివరించారు

- 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థులు

బహుమతులు అందజేస్తున్న నారాయణ స్కూలు కరస్పాండెంట్

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు చేపట్టిన ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా సోమవారం స్థానిక నారాయణ హైస్కూలులో ఉపన్యాస పోటీ నిర్వహించారు. 'విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై జరిగిన పోటీలో 7,8,9,10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. నష్ట, లాభాలను చక్కగా వివరించారు. 9వ తరగతి విద్యార్థి సీహెచ్ పరమేశ్వరి, 8వ తరగతి విద్యార్థి బి.ప్రసన్న, అదే తరగతికి చెందిన ఎం.నవనీతలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ కె.సౌజన్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

నీటి నిల్వ పనులకు అధిక ప్రాధాన్యం

సామాజిక వనరుల చిత్రంతో పాటు సీజనల్ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో జ్యోతి

మద్దిపాడు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉపాధిహామీ పనుల్లో నీరు నిల్వ చేసే పనులకు అధిక ప్రాధాన్యత నిచ్చేవిధంగా క్షేత్ర సహాయకులు పనులను ఎంపిక చేయాలని ఎంపీడీవో జ్యోతి సోమవారం అన్నారు. సోమవారం మండల పరిధిలోని మల్లవరం గ్రామ పంచాయతీలో సర్పంచ్ నారా సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన 2026 -27 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ శ్రామికుల వేతనాలతో పాటు సామగ్రి అంచనా బడ్జెట్ గ్రామసభకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లేబర్ బడ్జెట్‌ను పూర్తి చేయాలన్నారు. గ్రామసభలో ప్రదర్శించిన సామాజిక వనరుల చిత్రంతో పాటు నెలల వారీగా పనులను రంగు రంగుల ముగ్గుల ప్రదర్శన గ్రామస్థులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ ధనుంజయ వర్మ, ఎంపీటీసీ వీరాంజనేయులు, ఉపాధి ఇంజినీర్ కిషోర్, గ్రామ కార్యదర్శి ఎస్ నీలిమ పాల్గొన్నారు. ● మల్లవరం గ్రామంలో ఎంపీడీవో జ్యోతి అధ్యక్షతన స్వామిత్వ శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సర్పంచి నారా సుబ్బారెడ్డి, ఎంపీటీసీ వీరాంజనేయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

11న సెమీ క్రిస్మస్ వేడుకలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: దళిత హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో డిసెంబరు 11న రాత్రి 6 గంటలకు స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ తెలిపారు. ఈ మేరకు స్థానిక గుంటూరురోడ్డులోని రవి ప్రియమాల్‌లో సోమవారం సెమీ క్రిస్మస్ కరపత్రాలను జనసేన పార్టీ నాయకులు కంది రవిశంకర్ ఆవిష్కరించారు. * చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి క్రిస్టియన్‌పాలెం బేతేలు ప్రార్థనా మందిరంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షులు మద్దాళి మాధవరావు సంఘ కాపరులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు.

వసతులు మరిచారు.. వేతలు మిగిల్చారు

అవస్థలకు నిలయంగా జగనన్న కాలనీ

పేదల సొంతింటి కష్టాలు తీరడంలేదు. గత ప్రభుత్వం కోట్ల రూపాయలతో పేదలకు స్థలాలిచ్చి, ఇళ్లు కట్టిస్తామని పదేపదే ప్రచారం చేసింది. కనీస మౌలిక సౌకర్యాల కల్పనను వైకాపా ప్రభుత్వం విస్మరించింది. దీంతో లబ్ధిదారులకు తిప్పలు తప్పడం లేదు.

- న్యూస్‌టుడే, మద్దిపాడు

జగనన్న కాలనీలో రోడ్డు కూడా కరవే..

గ్రామాలకు దూరంగా ఏర్పాటు

నియోజకవర్గ వ్యాప్తంగా వైకాపా హయాంలో జగనన్న కాలనీల పేరిట గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర చొప్పున లబ్ధిదారులకు నివేశన స్థలాలు కేటాయించారు. 90 శాతం పైగా కాలనీలు గ్రామాలకు చాలా దూరంగా ఉండడంతో ఇళ్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారులు ఇష్టపడలేదు. కొందరు నిర్మించుకున్నా నివసించలేకపోతున్నారు. దీంతో పట్టించుకునే వారు లేక గ్రామ శివారులో సదరు కాలనీలు చిట్టడవులను తలపిస్తున్నాయి.

రోడ్లు లేవు. వీధి దీపాలు ఏర్పాటుచేయలేదు

వర్షం కురిస్తే కాలనీల్లో బురద దారుల్లో ఎక్కడ జారీ కింద పడతామోనన్న భయాందోళనతో ఇంటికి చేరుకోవాల్సి వస్తోంది. విద్యుత్ వీధి దీపాలు లేకపోవడంతో సాయంత్రం 7 గంటల తరువాత బయటకు రాలేకపోతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు, కంపచెట్లు విష సర్పాలకు ఆవాసంగా మారాయి. నూతనంగా రహదారులు, మంచినీటి సదుపాయం, విద్యుత్ సౌకర్యం, మురుగు కాలువల నిర్మాణం చేపట్టడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది.

ఇళ్ల స్థలాల కేటాయింపులు ఇలా..

మద్దిపాడు మండలం పరిధిలో 1842 మంది లబ్ధిదారులకు సెంటున్నర స్థలం ఇచ్చారు. మండల వ్యాప్తంగా ఇచ్చిన లే అవుట్లలో 90 శాతంకు పైగా స్థలాల్లో ఇళ్ల నిర్మాణం ఊసేలేదు. నిర్మించుకున్న వారు మౌలిక సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం పేదింటి కలలు సాకారం చేసేందుకు కృషి చేస్తోంది. ఈ సందర్భంగా తమ ఇక్కట్లు గమనించి మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. తద్వారా ప్రయోజనం కలుగుతుందన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు అవసరం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతూ జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు సోమవారం కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ కె.నాగేశ్వరరావు, కొల్లా మధు, కంచర్ల వెంకటేశ్వర్లు, చిన్నాజీ, చిట్టెం వెంకటేశ్వర్లు తదితరులు కలసిన వారిలో ఉన్నారు.

రాయితీపై కారు మంజూరు

మద్దిపాడు, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా దళితునికి 35 శాతం రాయితీతో కియా కారు తాళాలను జిల్లా కలెక్టర్ రాజాబాబు, డీఆర్డీఏ పీడీ నారాయణ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. మద్దిపాడు మండలం నాగన్నపాలెం గ్రామానికి చెందిన పారాబత్తిన శ్రీనివాసరావు వ్యాపార పనుల నిమిత్తం దరఖాస్తు చేసుకోగా డీఆర్డీఏ వెలుగు కార్యాలయం కారు ధరలో 35 శాతం రాయితీతో కూడిన రుణం మంజూరు చేసింది. దీన్లో భాగంగా లబ్ధిదారునికి రూ 3,57,000ల రాయితీ లభించింది. కార్యక్రమంలో మద్దిపాడు ఏపీఎం సుబ్బారావు, డీపీఎం దానం, సీసీ ప్రేమానందం, రజనీకాంత్, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హిమగిరి కాలనీ ప్రాంతంలో పులి పాద ముద్రల పరిశీలనలో అధికారులు

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి పురపాలక సంఘం పరిధిలోని హిమగిరి కాలనీ సమీపంలోని గ్రానైట్ డంప్ యార్డుల వద్ద పులి సంచరిస్తోందనే ప్రచారం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అటవీ శాఖాధికారి వినోద్ కుమార్ సూచించారు. 'గ్రానైట్ డంప్ ప్రాంతంలో పులి సంచారం' అంటూ సోమవారం ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో డీఎఫ్‌వో తమ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారమైన వీడియో మహారాష్ట్రలోని పులి ప్రాంతానికి చెందినదిగా చెప్పారు. గ్రానైట్ డంప్ ప్రాంతంలో కాలిముద్రలు పరిశీలించి అవి కుక్కవిగా భావిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉప అటవీ అధికారి శ్రీనివాసరావు, రేంజ్ అధికారి నరసింహారావు, బీట్ అధికారి శశిభూషణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గెలాక్సీపురిలో గ్రంథాలయాల ఏర్పాటు

చీమకుర్తి, న్యూస్‌టుడే: గెలాక్సీపురి చీమకుర్తి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పాఠకులకు అందుబాటులో ఉండే విధంగా లయన్స్ క్లబ్, గెలాక్సీపురి క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం సార్వత్రిక గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి.పవన్ తదితరులు వీటిని ప్రారంభించారు. ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం, బస్టాండు కూడలి, ఎస్సీ బాల బాలికల వసతి గృహాల ప్రాంతాల్లో ఈ గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. క్లబ్ మాజీ గవర్నర్లు పి.విజయ్ కుమార్ రెడ్డి, వైస్ గవర్నర్ ఆర్.లక్ష్మీనారాయణ, చలువాది బదరీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భాజపా బలోపేతానికి కృషి

ఒంగోలు, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి, నేషనల్ ప్యానలిస్టు సాధినేని యామినీ శర్మను పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి రావులపల్లి నాగేంద్రయాదవ్ సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొద్దు నాగలక్ష్మితో కలిసి నెల్లూరులో జరుగుతున్న రాష్ట్ర ప్రశిక్షణ కార్యక్రమానికి వెళ్తున్న యామినీ శర్మ మార్గమధ్యంలో ఒంగోలులో ఆగారు. వీరిని నాగేంద్రయాదవ్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి గాయత్రి, గోగుల మల్లీశ్వరి, శారద తదితరులు పాల్గొన్నారు.

యామినీ శర్మను సన్మానిస్తున్న జిల్లా పార్టీ నాయకుడు నాగేంద్రయాదవ్

విద్యా సామగ్రి పంపిణీ

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కందిమళ్ల గంగాధరరావు సోమవారం రాత పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు చావ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య మాట్లాడుతూ పేద వర్గాల పిల్లలకు తోడ్పాటు అందజేసే దిశగా పుస్తకాలు, ఇతర సామగ్రి అందజేయడం అభినందనీయం అన్నారు. మాజీ ఛైర్మన్ కొల్లావు రామయ్య, కౌన్సిలర్ సోమా శేషాద్రి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మద్ది వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సంఘాలు.. కార్యవర్గాలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలులోని ఎన్జీవో హోమ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఏపీ హియరింగ్, హ్యాండీక్యాప్డ్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.వెంకటరావు, ఉపాధ్యక్షులుగా ఎం.అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఇమామ్ ఖాశిం, కార్య నిర్వాహక కార్యదర్శిగా ఐ.సునీల్, సంయుక్త కార్యదర్శిగా సీహెచ్.సాంబశివరావు, కోశాధికారిగా డి.మాధవయ్య, మహిళా కార్యదర్శిగా టి.అనితతోపాటు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యా శాఖలో విలీనం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్: విద్యాశాఖలో సమగ్ర శిక్షా ఉద్యోగులను విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా సమగ్ర శిక్షా జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ, వేతనాల పెంపుతోపాటు, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తగిన ఆరోగ్య పథకాన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర జేఏసీ ప్రధాన కార్యదర్శి కల్యాణి, నాయకులు రమేష్, హరిబాబు, అనిల్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సీమంతాలు

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక గురువులు అమ్మ భగవాన్ స్ఫూర్తితో శ్రీ పరంజ్యోతి మానవ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక మాత శిశు వైద్యశాలలో 70 మంది గర్భిణులకు సోమవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు సీమంతాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ సూపరింటెండెంట్ వెంకట్రావు, మెడికల్ ఆఫీసర్లు సర్దార్ సంధ్య, శ్రీ పరంజ్యోతి మానవ సేవా సమితి నిర్వాహకులు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

26న మాజీ ఎంపీ మాగుంట జయంతి

ఒంగోలు గ్రామీణం: మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి 78వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 26న ఒంగోలులో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్థానిక రామనగర్‌లోని 2వ లైన్‌లోని మాగుంట కార్యాలయంలో ఆయన చిత్రపటానికి; ఆ తర్వాత అభిలాష్ హోటల్ సెంటర్, రైల్వేస్టేషన్ రోడ్డు, అద్దంకి బస్టాండ్ ప్రాంతాల్లోని విగ్రహానికి నివాళి కార్యక్రమం నిర్వహించనున్నారు.

పీఆర్సీ వెంటనే నియమించాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: పీఆర్సీ కమిషన్‌ను ప్రభుత్వం వెంటనే నియమించాలని ఏపీజేఏసీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శరత్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో సోమవారం ఒంగోలు నగర, తాలుకా కార్యనిర్వాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి వరకుమార్, కోశాధికారి రంగారెడ్డి, నాయకులు ఎం.శ్రీనివాసరావు, సురేష్‌బాబు, రజిత, చంద్రశేఖర్, ప్రసన్న పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

మద్దిపాడు, న్యూస్‌టుడే

?: మద్దిపాడు మండలం కేంద్రంలో జాతీయ రహదారి పక్కన ఉన్న నివాసితులు, హోటళ్ల సముదాయం వారు వంతెన ప్రారంభం నుంచి చివరి వరకు 10 చోట్ల డ్రైనేజీ నీరు రోడ్డుపైకి వదులుతున్నారు. దీనివల్ల వాహనాల రాకపోకల సమయంలో మురుగు నీరు పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై పడుతోంది. మురుగు నీరు రోడ్డు మీదకు వదలకుండా చర్యలు తీసుకుని ఇబ్బందులు తొలగించగలరు.

- జి.శ్రీనివాసరెడ్డి, మద్దిపాడు

✓: జాతీయ రహదారి అధికారులతో చర్చిస్తాం. నివాసితులతో మాట్లాడి మురుగు నీరు సర్వీస్ రోడ్డులోకి వదలకుండా చర్యలు తీసుకుంటాం.

- నూరుల్లా, గ్రామ కార్యదర్శి మద్దిపాడు

కొత్తపట్నం, న్యూస్‌టుడే:

?: కొత్తపట్నం మండలం ఆలూరు గ్రామంలో కమిటీ భవనం రోడ్డులో ఇష్టారాజ్యంగా బెల్టు షాపులు అమ్మకాలు సాగుతున్నాయి. మందుబాబులు రోడ్డుపై ఈలలు వేస్తూ హల్‌చల్ చేస్తున్నారు. మహిళలు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి బెల్టు షాపుల దందాను కట్టడి చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలి. - గ్రామస్థులు, కొత్తపట్నం

✓: సిబ్బంది పంపించి తనిఖీలు చేయిస్తాం. ఎక్కడైతే బెల్టుషాపులు నిర్వహిస్తున్నారో వారిపై వెంటనే చర్యలు తీసుకుంటాం. మందుబాబుల ఆగడాలు కట్టడి చేస్తాం.

- అశోక్ కుమార్, ఎక్సైజ్ ఎస్సై

ఎస్.ఎన్.పాడు: రైతులతో చర్చిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

రైతును రాజుగా చేయడమే లక్ష్యం

మంగమూరు(సంతనూతలపాడు), న్యూస్‌టుడే: రైతులకు ఆదాయం పెంచేలా రైతన్న మీకోసం కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు ఏవో పి.పావని పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కామేపల్లివారిపాలెం, మంగమూరులో రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న అయిదేళ్లలో రైతులను రాజుగా మార్చేలా కూటమి ప్రభుత్వం కార్యాచరణ చేస్తుందన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు. ● నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: నాగులుప్పలపాడు ఎంపీడీవో కార్యాలయంలో రైతన్నా మీకోసం వారోత్సవాలపై గ్రామ స్థాయి బృందాలకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఏవో వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జి టీమ్ లీడర్‌గా ఏడు మంది సభ్యులతో ఒక బృందంగా ఏర్పాటు చేశామన్నారు. వీరు కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి రైతులకు సలహాలు సూచనలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తేళ్ల రవికుమార్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఏపీవో రవి, వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి స్వామిత్వ సర్వే తప్పనిసరి

కొత్తపట్నం, న్యూస్‌టుడే: కొత్తపట్నం మండలం మడనూరు గ్రామంలో స్వామిత్వ గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో శ్రీకృష్ణ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన, డిప్యూటీ ఎంపీడీవో వేణుగోపాల కృష్ణమూర్తి మాట్లాడుతూ.. స్వామిత్వ సర్వేలో పత్రాలు పొందిన ప్రతి కుటుంబ సభ్యులకు సచివాలయం సిబ్బంది 9(2) నోటీసు పత్రాలు ఇచ్చి మీటింగ్‌కు పిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు బాలాజీ నాథ్, శేషమ్మ, జకరయ్య, శ్రీనివాసరెడ్డి, ఖాసిం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామసభలో పాల్గొన్న స్థానికులు

ఎమ్మెల్యే దామచర్లకు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్ఎంలు

ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించండి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: వైద్య, ఆరోగ్యశాఖలోని ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక గుంటూరురోడ్డులోని తెదేపా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అందులో ఎక్కువగా రెవెన్యూతో పాటు, వ్యక్తిగత సమస్యలపై అర్జీలు వచ్చాయి. సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

26న విద్యార్థులకు పోటీలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: బుధవారం రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఈవో ఎ.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఉదయం అసెంబ్లీలో రీడింగ్ ఆఫ్ ది ప్రియాంబుల్ టు ది కాన్‌స్టిట్యూషన్ నిర్వహించాలన్నారు. దానిలో భాగంగా మంగళవారం సెమినార్లు, క్విజ్, వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు జరపాలన్నారు.

పతాక దినోత్సవ నిధికి విరాళాలు ఇవ్వండి

ఒంగోలు కలెక్టరేట్: సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి జిల్లా ప్రజలు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు విరాళాలు అందించాలని కలెక్టర్ పి.రాజాబాబు సూచించారు. వచ్చే నెల 7న సాయుధ దళాల పతాక దినోత్సవానికి సంబంధించిన స్టిక్కర్లు, కారు ఫ్లాగ్స్ పోస్టర్లను స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వీటి అమ్మకం ద్వారా వచ్చిన నగదును యుద్ధంలో వీర మరణం పొందిన/గాయపడిన సైనికుల కుటుంబాల సంక్షేమం కోసం వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఓబులేసు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

26న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి శంకుస్థాపన

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నూతన దేవాలయానికి శంకుస్థాపన మహోత్సవాన్ని ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సన్నమూరి సుబ్బనాచారి, కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

మద్దిపాడు,న్యూస్‌టుడే: మంగళవారం ఉదయం గం 10-00ల నుంచి సాయంత్రం గం 05-00 వరకు విద్యుత్తు మరమ్మతులు చేపడుతున్నారు. ఈ కారణంగా మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ చెన్నారెడ్డి తెలిపారు.

రూ.12.33 లక్షల సీఎం.సహాయ నిధి అందజేత

ఒంగోలు గ్రామీణం: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద ఒంగోలు నియోజకవర్గానికి చెందిన 20 మంది లబ్ధిదారులకు రూ.12.33 లక్షల మేర ఆర్థికసాయం విడుదలైంది. ఈ మేరకు స్థానిక గుంటూరురోడ్డులోని తెదేపా కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేతుల మీదగా లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళ నగర అధ్యక్షురాలు పెద్దిశెట్టి వరలక్ష్మి పాల్గొన్నారు.

● ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా కోర్టు పీపీగా నియమితులైన మొలకలపల్లి అజయ్‌బాబు స్థానిక గుంటూరు రోడ్డులోని తెదేపా కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వరద వదలదు.. వేదన తొలగదు

● ఇక్కట్లలో పేర్నమిట్ట ఇందిరానగర్ కొండ తూర్పు నివాసులు

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

మొంథా తుపాను గడిచి నెలరోజులైనా నగర పరిధిలోని పేర్నమిట్ట ఇందిరానగర్ కొండ తూర్పు నివాసులను వరద సమస్యలు వీడటం లేదు. కాలనీలో రహదారి నీటితో మునిగిపోయింది. ప్రస్తుతం కలుషిత నీటివల్ల వ్యాధులు సంక్రమిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జ్వరాలు, చర్మవ్యాధులు

కలుషిత నీటితో స్థానికులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. ఇద్దరు పిల్లలకు డెంగీ సోకి తగ్గిపోయింది. మరికొందరు జ్వరాలు, చర్మవ్యాధులతో బాధపడుతున్నారు. తుపాను వెలిశాక అక్కడి సమస్యను జనసేన నాయకులు కార్పొరేషన్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఇంజన్లు పెట్టి నీరు బయటికి పంపారు. మళ్లీ మూడురోజులకే నీరు చేరి రహదారి కనిపించకుండా పోయింది. కొండమీద నుంచి సీపేజీ నీరు వచ్చి కాలనీలో చేరుతోంది. అక్కడ పూర్తిస్థాయిలో రోడ్డులేదు. మురుగుకాలువలు లేవు.

నిధులు సరిపోలేదని సగంలో వదిలేశారు

గత వైకాపా ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణం చేపట్టి సగం అయ్యాక నిధులు సరిపోలేదని అంతటితో నిలిపివేశారు. వేసిన రోడ్డు సైతం వాటంలేక నీరు పోవడంలేదు. నెలరోజులుగా నీరు నిల్వఉండటంతో పాచిపట్టి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల ఒకటోతరగతి చిన్నారి నీటి మధ్య నడుస్తూ పడిపోవడంతో నీరు కడుపులోకి చేరి వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చేర్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. రహదారి ఎత్తుగా నిర్మించి కాలువలు కట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పేర్నమిట్ట ఇందిరానగర్ కొండ తూర్పున రహదారి ఇలా..

మట్టిగుంట మార్గంలో వంతెనలు నిర్మించండి

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ఉప్పుగుండూరు నుంచి మట్టిగుంట వెళ్లే దారిలో ఉన్న.. లో లెవల్ బ్రిడ్జిని హైలెవల్ బ్రిడ్జిగా నిర్మాణం చేపట్టాలని ఉప్పుగుండూరు తెదేపా నాయకులు సోమవారం ఆర్ అండ్ బీ ఈఈ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. వంతెనను పరిశీలించి అందుకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో తెదేపా గ్రామ అధ్యక్షులు కనగాల శ్రీను, పార్లమెంట్ ఎస్టీసెల్ అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శిద్దా సూర్యప్రకాష్‌రావు దంపతులను సన్మానిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

వాసవీ క్లబ్ సేవలు మరింత విస్తృతం

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ శిద్దా సూర్యప్రకాష్‌రావు, జయశ్రీ దంపతులను మండల వాసవీక్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. వాసవీక్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాదరావు ఆధ్వర్యంలో ఒంగోలులో వారిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవీ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ జిల్లా ప్రతినిధి జీఎల్ ప్రసాదరావు, మండలాధ్యక్షులు వేమూరి ఆంజనేయులు, కార్యదర్శి శిఘాకొల్లి రాజేష్, నాయకులు చక్కా సుబ్బారాయుడు, మహిళా క్లబ్ అధ్యక్షురాలు చలువాది చంద్రావతి, కార్యదర్శి, జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

కసుమూరు కొండపై.. అనకొండలు

అక్రమార్కుల బరితెగింపుతో వెంకటాచలం మండలంలో ఎంతో ప్రాచుర్యం కలిగిన కసుమూరు కొండ కనుమరుగవుతోంది. అలాగే వదిలేస్తే భవిష్యత్తులో ఆ అనకొండలు కొండనే మాయం చేస్తాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్టా భూమి మాదిరిగా కొండను ఆక్రమించి వేసిన గట్టు

న్యూస్‌టుడే, వెంకటాచలం

మస్తాన్‌వలీ బాబా తాను జీవించిన రోజుల్లో కసుమూరు కొండపైనే ఉండేవారని స్థానికులు చెబుతుంటారు. ఆ క్రమంలో దీన్ని దేవుడి కొండగానూ పిలుస్తారు. ఇంతటి కీలకమైన ఈ ప్రాంతం ఆక్రమణదారుల చెరలో చిక్కి కుంచించుకుపోతోంది. ఇప్పటికే కొండ చుట్టూ.. చెరువు పక్కన పెద్దఎత్తున ఆక్రమించేశారు. వాటి చుట్టూ పట్టా పొలాలు మాదిరిగా కంచె ఏర్పాటు చేయడంతో పాటు కొందరు సాగును ప్రారంభించారు. మరికొందరు గడ్డి వాములకు వినియోగిస్తున్నారు. ఇంకొందరు ఏకంగా క్రయ విక్రయాలు సాగిస్తున్నారు. ఇలా సుమారు వంద ఎకరాలకు పైగానే కబ్జాకు గురైనట్లు స్థానికులు చెబుతున్నారు.

రాత్రికి రాత్రే యంత్రాలతో చదును

ఇప్పటికే కొండ విస్తీర్ణం సగానికిపైగా తగ్గిపోయింది. ఇప్పటి వరకు తూర్పు, దక్షిణం, ఉత్తరం వైపుల్లో ఈ వ్యవహారాలు సాగగా.. పది రోజులుగా పడమర వైపు ఆక్రమణలకు తెరలేపారు. రాత్రివేళల్లో యంత్రాలు పెట్టి చదును చేసి.. హద్దులు వేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ సుమారు పది ఎకరాలకు పైగా కబ్జా చేయగా.. ఒకరిని చూసి ఒకరన్నట్లు వాటిని కొనసాగిస్తున్నారు.

● దీనిపై వెంకటాచలం తహసీల్దారు శ్రీనివాసులు మాట్లాడుతూ.. కసుమూరు కొండపై ఆక్రమణల విషయం నా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి.. ఆక్రమణలు జరిగి ఉంటే తగు చర్యలు తీసుకుంటామని అన్నారు.

తెల్లరాయి, గ్రావెల్‌పై కన్ను

ఆక్రమణలతో పాటు కొందరు తెల్లరాయి, గ్రావెల్ రూపంలో కొల్లగొడుతున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలోనే తిప్పను ధ్వంసం చేశారు. అప్పట్లో అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఫలితం లేకపోయింది. ఇప్పుడు కూడా తరచూ అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చర్యలన్నింటికీ అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

హాకీ జట్టు.. అదరహో

అనకాపల్లి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 హాకీ పోటీల తుది పోరులో జిల్లా బాలుర జట్టు తూర్పు గోదావరి జట్టుపై 3-0 తేడాతో గెలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. ట్రోఫీని అందుకుంటున్న క్రీడాకారులు. న్యూస్‌టుడే, నెల్లూరు

జర్మన్ భాష నేర్చుకో.. ఉపాధి చేజిక్కించుకో

ఐటీఐల్లో ఆన్‌లైన్ శిక్షణ తరగతులు

వర్చువల్‌గా జర్మనీ భాషా బోధన

విద్యార్థులు: గుటెన్ మార్గెన్ హెర్...
అధ్యాపకులు: డాంకే.. డాంకే..
ఇంతకీ ఈ పదాలు ఏమిటనేగా ప్రశ్న..

వీటికి సమాధానాలు కావాలంటే.. సంగంలోని ప్రభుత్వ ఐటీఐకు వెళ్లాల్సిందే. జర్మన్ భాషలో గుటెన్ మార్గెన్ అంటే శుభోదయం అని.. హెర్ అంటే సార్.. డాంకే డాంకే అంటే ధన్యవాదాలు అని అర్థం. మన యువత.. ఆ దేశంలో ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఐటీఐల్లో జర్మన్ భాషను నేర్పుతోంది.

న్యూస్‌టుడే, సంగం

జర్మనీలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ తదితరాల్లో నైపుణ్యం ఉన్న వారి అవసరం చాలా ఉంది. ఆ అవకాశాన్ని మన ఐటీఐ విద్యార్థులు అందిపుచ్చుకునేలా వృత్తి శిక్షణ సమయంలోనే జర్మన్ భాష నేర్పిస్తున్నారు. సెప్టెంబరు నుంచి ఈ ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. సోమ, బుధవారాల్లో గంట చొప్పున వర్చువల్ విధానంలో జర్మన్, ఆంగ్లం, తెలుగు భాషలను నిపుణులైన వారు బోధిస్తున్నారు. జర్మన్‌లో తొలుత 30 అక్షరాలతో కూడిన అక్షర మాలతో ప్రారంభించి.. పదాలు, అంకెలు, వ్యాకరణం నేర్పిస్తున్నారు.

నేర్చుకుంటున్న సంగం ఐటీఐ విద్యార్థులు

నాలుగు విడతల్లో పరీక్ష

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నాలుగు విడతలుగా ఆన్‌లైన్‌లో అర్హత పరీక్ష పెడతారు. ఏ1, ఏ2, బీ1, బీ2గా ఇవి జరుగుతాయి. వీటిలో ఉత్తీర్ణత సాధించిన వారికి తర్వాత ఆఫ్‌లైన్‌లో శిక్షణ ఉంటుంది. ఆఖరు విడత పరీక్షకు హాజరై ఉత్తీర్ణులైతే జర్మన్ భాష మాట్లాడటం.. రాయడంలో ప్రావీణ్యం పొందిన వారవుతారు. ఆ దేశానికి వెళ్లేందుకు అర్హత సాధిస్తారు.

వీసాతో పాటు ప్రయాణం

భాషలో పట్టు సాధించిన వారికి ప్రభుత్వం పాస్‌పోర్టు, వీసా అందించడంతో పాటు జర్మనీకి వెళ్లేందుకు అవసరమైన విమాన ప్రయాణ ఖర్చును భరిస్తుంది. పని ప్రదేశంలో వారిని వదిలిపెడుతుంది. మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి కేంద్రం అధికారి ఖయూం తెలిపారు.

మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసు

జేసీని కలిసిన 40 మంది కార్పొరేటర్లు

జేసీ వెంకటేశ్వర్లుకు నోటీసు అందిస్తున్న కార్పొరేటర్లు

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతిని పదవి నుంచి దించే యత్నాలను కూటమి నాయకులు ముమ్మరం చేశారు. అందులో భాగంగానే సోమవారం 40 మంది కార్పొరేటర్లు జేసీ మొగిలి వెంకటేశ్వర్లును కలిసి అవిశ్వాస తీర్మానం నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. 'కౌన్సిల్ ఏర్పడి నాలుగేళ్లవుతోంది. కేవలం ఏడు సమావేశాలే నిర్వహించారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో మేయర్ సహకారం పూర్తిగా కొరవడింది. మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వం నుంచి వివిధ పథకాల ద్వారా నిధులు తీసుకొస్తుంటే.. ఆటంకాలు సృష్టిస్తున్నారు. ఆమె భర్త నగరపాలక సంస్థ ఆదాయ వనరులను పరిరక్షించాల్సిందిపోయి. . కమిషనర్ సంతకాలనే ఫోర్జరీ చేసి జైలుపాలయ్యారు. కమిషనర్ సీసీని నిర్బంధించి దాడులు చేశారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని.. మేమంతా చర్చించుకుని.. అవిశ్వాసం తీర్మానం పెట్టాలని జేసీని కోరాం. ఎప్పుడు సమావేశం పెట్టినా కొత్త మేయర్‌ను ఎన్నుకుంటాం' అని తెలిపారు.

అక్కడా దక్కని మద్దతు

మేయర్ స్రవంతికి వైకాపా మద్దతు దక్కలేదు. వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి సమావేశమై చర్చించారు. మేయర్ వైకాపాకు రాజీనామా చేసి.. దూరంగా ఉన్న విషయం వారి మధ్య ప్రస్తావనకు వచ్చింది. డిప్యూటీ మేయర్ ఎన్నిక సమయంలోనూ ఆమె వైకాపాకు మద్దతు ఇవ్వలేదని.. ఇప్పుడు తాము మద్దతిస్తే.. సంకేతాలు మరోలా వెళతాయన్న అభిప్రాయానికి వచ్చారు.

కొత్తగా ఎవరికో..

ప్రస్తుత మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో... కొత్తగా ఎవరికి అవకాశం వస్తుందన్న చర్చ విస్తృతంగా జరుగుతోంది. 53వ డివిజన్ కార్పొరేటర్ సుజాత పేరు వినిపిస్తోంది. అదే సమయంలో ఇన్‌ఛార్జి మేయర్‌గా రూప్‌కుమార్ యాదవ్ కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయంటున్నారు.

ఏమో.. మాకు వర్తించవ్

నగరంలో ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించడమే లక్ష్యంగా ఆదివారం ఏడు కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్లు ప్రారంభించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. మరుసటి రోజుకే కొన్ని లైట్లు వెలగకపోవడం.. ప్రధాన కూడళ్లలో రెడ్ లైట్ వెలుగుతున్నా.. వాహనదారులు ఆగకుండా ముందుకు సాగిపోవడం కొత్త చిక్కులు తెచ్చింది. అసలు సిగ్నళ్లు ఏర్పాటు చేశారన్న విషయమే అత్యధికులకు పట్టలేదు. అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

– ఈనాడు, నెల్లూరు

చోటు కోసం.. కుస్తీ

స్థలం: నెల్లూరు
ప్రాంతం: ప్రధాన రైల్వేస్టేషన్
సమయం: సోమవారం ఉదయం 10.06

చెన్నై వెళ్లే 12711 నంబరు పినాకిని ఎక్స్‌ప్రెస్ రైలు సర్రున వచ్చి ఆగింది. అప్పటికే జనరల్ బోగీలు కిటకిటలాడుతున్నాయి. కాలుపెట్టే చోటు కూడా లేదు. అయినా వందల్లో ప్రయాణికులు ఎక్కేందుకు పోటీపడ్డారు. కొందరు లోపలకు వెళ్లగా.. మరెందరో ప్రవేశ ద్వారాల్లోని కమ్మీలు పటుకుని వేలాడుతూ నిలుచున్నారు. మరోవైపు రైలుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో కదిలింది. ప్రమాదకరంగా వేలాడుతున్న వారిని చూసి స్టేషన్‌లోని వారు భయంతో పెద్దఎత్తున కేకలు వేశారు. గమనించిన లోకోపైలెట్ రైలును ఆపి అందరూ ఎక్కాక ముందుకు నడిపారు. – న్యూస్‌టుడే, బిట్రగుంట

విస్తరణ సరే.. కూడళ్లలో పైవంతెనలేవీ?

అవస్థలు పడుతున్న ప్రజలు, వాహనదారులు

న్యూస్‌టుడే, దుత్తలూరు, కలిగిరి

జాతీయ రహదారులు నిర్మిస్తున్నా. . విస్తరిస్తున్నా.. మధ్యలో ఉన్న ప్రధాన కూడళ్లలో వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడటంతో పాటు ప్రమాదాలకు ఆస్కారం లేకుండా పై వంతెనలు నిర్మిస్తారు. తద్వారా భవిష్యత్తులో రద్దీ పెరిగినా, ప్రయాణం సాఫీగా సాగేలా చర్యలు చేపడతారు. జిల్లాలో మాత్రం ఇందుకు భిన్నంగా ఇటీవల నిర్మిస్తున్న.. నిర్మించిన జాతీయ రహదారుల్లో ఈ జాగ్రత్తలు విస్మరిస్తుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. నిర్మాణ సమయంలోనే స్థానిక ప్రజాప్రతినిధులు స్పందిస్తే పైవంతెనలు మంజూరయ్యే అవకాశం ఉంటుందని, డీపీఆర్ సిద్ధమయ్యాక కావాలంటే కుదిరే పరిస్థితి ఉండటం లేదని ప్రజలు కోరుతున్నారు.

నిత్యం రద్దీగా ఉండే కలిగిరి ప్రధాన రహదారి

ఇదీ పరిస్థితి...

జిల్లాలో 565వ జాతీయ రహదారి వరికుంటపాడు, దుత్తలూరు, మర్రిపాడు మండలాల మీదుగా 65 కి.మీ. మేర విస్తరించి ఉండగా- ప్రధాన కూడళ్లయిన వరికుంటపాడు, నర్రవాడ, నందిపాడు తదితర చోట్ల ఎలాంటి పైవంతెనలు నిర్మించలేదు. ఇక్కడ నిత్యం స్థానికులతో పాటు వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది.

● కావలి నుంచి సీతారామపురం వరకు నిర్మించిన 167బీజీది అదే పరిస్థితి. కీలకమైన కలిగిరి, వింజమూరు కూడళ్లలోనూ పైవంతెనలకు ఎలాంటి ప్రతిపాదనలు లేకుండానే డీపీఆర్‌లు సిద్ధం చేశారు. ఫలితంగా రోజూ ఎక్కడో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయి.

● నెల్లూరు నుంచి కడప జిల్లా వరకు 67వ జాతీయ రహదారి 102 కి.మీ. మేర ఉంది. బుచ్చిరెడ్డిపాళెం, నెల్లూరుపాళెం, మర్రిపాడు తదితర ప్రధాన కూడళ్లు ఉన్నాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆ క్రమంలో నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నా.. క్షతగాత్రులుగా మారుతున్నా.. దిద్దుబాటు చర్యలు కూడా ఉండటం లేదు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు... – కృష్ణచౌదరి, జాతీయ రహదారుల నిర్మాణశాఖ పీడీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన డీపీఆర్‌ల మేరకు జాతీయ రహదారులను నిర్మిస్తారు. ప్రధాన కూడళ్లలో పైవంతెనలు నిర్మించాలన్నా ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సిందే.

సఖీ సురక్ష

స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల ఆరోగ్య పరిరక్షణపై ప్రభుత్వం దృష్టిసారించింది. సఖి సురక్ష పథకం ద్వారా 35 ఏళ్లు పైబడిన సభ్యులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి.. అవసరమైన వారికి వైద్య సేవలందించే చర్యలు చేపడుతోంది. జాతీయ అర్బన్ ఆరోగ్య మిషన్(ఎన్‌యూహెచ్‌ఎం) సహకారం.. ఈ-వైద్య ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలను నిర్వహించనుంది. తొలి విడతలో 5,438 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించింది. శిబిరాలకు హాజరయ్యే మహిళలకూ వైద్య సేవలు అందించనున్నారు.

పట్టణం	లక్ష్యం	శిబిరాలు
నెల్లూరు	4,000	డిసెంబరు 8 నుంచి 11 వరకు
కావలి	850	6 తేదీ రెండు
కందుకూరు	588	10 తేదీ

ప్రయోజనాలివి..

ఆరోగ్య పరీక్షల రికార్డును డిజిటల్‌గా నిర్వహిస్తారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద ప్రత్యేక ఆరోగ్య కార్డులు అందిస్తారు. రూ. 5 లక్షల వరకు ఆరోగ్య బీమా కవరేజీ ఉంటుంది. ఏడాదికి నాలుగు సార్లు టెలీ కన్సల్టేషన్‌తో పాటు హెల్త్ సీఆర్పీలు ఆరోగ్య పరిస్థితిని గమనిస్తూ ఉంటారు. అవకాశాన్ని మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ లీలారాణి సూచించారు.

16 రకాల నిర్ధారణ పరీక్షలు

పట్టణ మహిళల్లో ఎక్కువ మంది వివిధ అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు ప్రభుత్వం చేసిన వివిధ సర్వేల్లో వెల్లడైంది. ఈ నేపథ్యంలో రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, కొలెస్ట్రాల్, గుండె జబ్బులు, రక్తహీనత, బ్రెస్ట్, ఓరల్, సర్వైకల్ క్యాన్సర్ తదితర 16 రకాల వ్యాధుల నిర్ధారణకు పరీక్షలు నిర్వహిస్తారు. ఆందోళన, కుంగుబాటు, ఒత్తిడి తదితరాలపై కౌన్సెలింగ్ అవసరాలు గుర్తిస్తారు. 48 గంటల్లోపు రిపోర్టును వారి ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నంబరుకు పంపిస్తారు. అనారోగ్య సమస్యలను గుర్తిస్తే.. సంబంధిత ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రికి సిఫార్సు చేసి.. వైద్య సేవలందిస్తారు.

రైతేరాజు బత్తాయి ఎంతో మధురం 6లో..

నేర్పుగా చదువు.. ఓర్పుగా సేవ!

న్యూస్‌టుడే, కావలి: సహాయం చేయడానికి కావాల్సింది డబ్బు కాదు.. మంచి మనసు అంటారు మదర్ థెరెసా.. ఈ మాటలను నిజం చేస్తూ కొందరు యువకులు తోటి వారికి సేవ చేస్తూ ఆత్మ సంతృప్తి పొందుతున్నారు కొందరు కావలి యువకులు.. పట్టణంలోని టీం సేవియర్స్ స్వచ్ఛంద సంస్థ ప్రేరణతో రక్తదానం చేస్తూ.. చేయిస్తూ భళా అనిపించుకుంటున్నారు.

40 శాతం కాలేయం ఇచ్చి...

వాయునందన వీధికి చెందిన కనమర్లపూడి భార్గవ్ ఆరేళ్లుగా రక్తదాన ఉద్యమంలో భాగస్వామిగా ఉన్నారు. ఇప్పటి వరకు పది సార్లు రక్తదానం చేశారు. తండ్రి లక్ష్మీనరసింహ గత ఏడాది అనారోగ్యానికి గురవగా.. కాలేయ మార్పిడి అనివార్యమైంది. తన కాలేయాన్ని 40 శాతం ఇచ్చారు.

తాను చేస్తూ.. ప్రోత్సహిస్తూ...

క్రిస్టియన్‌పేటకు చెందిన పెద్ది చరణ్‌తేజ సకాలంలో రక్త అందక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారనే మాట విన్నారు. అలాంటి వారికి సాయం చేయాలని నిర్ణయించుకుని 18 ఏళ్లు నిండగానే రక్తదాతగా మారారు. 15సార్లు తాను స్వయంగా రక్తదానం చేయడంతో పాటు తన స్నేహితులనూ ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నారు.

టీం సేవియర్స్‌లోనూ...

వేముల షణ్ముక్.. బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతూనే.. సమాజ సేవకూ ముందుంటానని అంటున్నాడు. ఇప్పటి వరకు పది సార్లు రక్తదానం చేసిన ఈయన.. టీఎం సేవియర్స్ సంస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారు. మున్ముందు కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉంటానని చెబుతున్నారు.

లెక్క తెలిస్తే.. డబ్బు ఆదా

మీ కోసం

న్యూస్‌టుడే, నెల్లూరు(విద్యుత్తు)

నగరంలోని ఓ గృహ విద్యుత్తు వినియోగదారుడు 125 యూనిట్లు విద్యుత్తు వాడగా.. రూ. 562.50 బిల్లు వచ్చింది. మరొకరు 127 యూనిట్లు కాల్చారు. ఇద్దరికీ రెండు యూనిట్లే తేడా! రెండో వ్యక్తికి రూ. 762 బిల్లు వచ్చింది. ఇదేమిటంటూ విద్యుత్తుశాఖ సిబ్బందిపై మండిపడ్డారు. కానీ, యూనిట్ల వినియోగంపై అవగాహన ఉంటే.. ప్రతి వినియోగదారుడు డబ్బు ఆదా చేయొచ్చు అంటున్నారు సంబంధిత అధికారులు. ఏపీ ఎస్పీడీసీఎల్ సంస్థ బిల్లు వెనుక భాగంలో గృహ, వాణిజ్య వినియోగానికి సంబంధించి యూనిట్లు, ధరల పట్టిక ముద్రిస్తోందని.. ఆ ప్రకారం వినియోగంలో పరిమితి పాటించి డబ్బు ఆదా చేసుకోవచ్చని అంటున్నారు. అదే సమయంలో వినియోగం కంటే బిల్లు ఎక్కువగా వచ్చినా.. ఇతర ఏ సమస్య అయినా ఏపీఎస్పీడీసీఎల్ యాప్, ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చని.. టోల్‌ఫ్రీ నంబరుకూ ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చని విద్యుత్తుశాఖ ఎస్ఈ కె.రాఘవేంద్రం తెలిపారు. జిల్లాలో గృహ వినియోగదారులు 8,99,151 మంది ఉండగా... రోజూ 5 నుంచి 6 మిలియన్ యూనిట్ల వినియోగం ఉందని వివరించారు.

విద్యుత్తు ఛార్జీలపై అవగాహన అవసరం

గృహ విద్యుత్తు ఛార్జీలు ఇలా...

యూనిట్లు	ఒక యూనిట్‌కు (రూ.లలో)
0-30	1.90పైసలు
31-75	3.00
76-125	4.50
126-225	6.00
226-400	8.75
401-ఆ పైన..	9.75

చేనేత.. కావాలి చేయూత!

అర్హులైన తమకు తుపాన్ సాయం అందించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట చేనేతలు నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు నూలు డిజైన్ అట్టలు మెత్తబడి గుంతల్లోకి నీరు చేరి రోజువారి ఉపాధిని కోల్పోయామని వాపోయారు. అధికారులు న్యాయం చేయాలని కోరారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

అక్కడ వినకే.. ఇక్కడి దాకా!

ఎస్పీ గ్రీవెన్స్‌కు పెరుగుతున్న బాధితులు

నవంబరులో ఇలా..

తేదీ	వచ్చిన అర్జీలు
3	202
10	134
17	130
24	113

ఈ నెల 16వ తేదీ ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లిన మా బిడ్డ తిరిగి రాలేదు. కందుకూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినా.. ఎలాంటి ప్రయోజనం లేకుండా ఉంది.

– ఓ తల్లిదండ్రుల ఆవేదన

అనంతసాగరంలో ఉంటున్న నా తమ్ముడి ద్వారా హైదరాబాద్‌లో ఉంటున్న కేత హరికృష్ణ నన్ను కలిశాడు. ఇంటి వద్ద నుంచే చేసే ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ. 12 లక్షలు తీసుకున్నాడు. తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడు.

– వింజమూరుకు చెందిన ఓ వ్యక్తి ఆక్రందన

న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం)

ఈ రెండు సంఘటనలే కాదు.. దాదాపు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ఇలాంటి జరుగుతున్నా స్థానికంగా కేసులు నమోదు చేయడం లేదు. చేసినా.. వాటిని పట్టించుకోవడం లేదు. దాంతో చేసేదేమీ లేక బాధితులు ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పెద్దఎత్తున తరలివస్తున్నారు. దూరాభారం నుంచి వ్యయప్రయాసలకు ఓర్చి వచ్చి.. అర్జీలు సమర్పిస్తున్నారు. గతంలో జిల్లా పోలీసు కార్యాలయానికి ప్రతి సోమవారం 50 నుంచి 80 వరకు మాత్రమే అర్జీలు వచ్చేవి. ఇప్పుడు ఆ సంఖ్య వందకుపైగానే పెరిగింది. స్థానిక పోలీసు స్టేషన్లలో సరిగా స్పందించడం లేదనే ఫిర్యాదులు అధికంగానే ఉంటున్నాయి.

నమోదు చేసేది.. కాదనేది వారే

జిల్లా వ్యాప్తంగా 12 సర్కిళ్లు, 52 పోలీసు స్టేషన్లు ఉండగా.. నగరంలోని ఆరు స్టేషన్లకు సీఐలే ఎస్‌హెచ్‌వోలు. 12 సర్కిళ్లు కాకుండా.. మిగతా చోట్ల ఎస్సైలదే రాజ్యం. కేసు నమోదు చేసేది.. కాదనేది వారి చేతుల్లోనే ఉంటుంది. ఎక్కువ చోట్ల నమోదు.. విచారణ.. దర్యాప్తులో కాలయాపన జరుగుతోందని బాధితులు వాపోతున్నారు.

బాధితుల సమస్యలు వింటున్న పోలీసు అధికారులు

బాధితులకు న్యాయం చేస్తాం

అజిత వేజెండ్ల, ఎస్పీ

ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి ఫిర్యాదును చట్ట ప్రకారం విచారణ జరిపిస్తాం. బాధితులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటాం. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తాం.

(c) eenadu

ఫలితాల పెంపే లక్ష్యంగా..

నందిపాడు కస్తూర్బాలో ప్రత్యేక పరీక్షలు రాస్తున్న బాలికలు

న్యూస్‌టుడే, దుత్తలూరు

జిల్లాలో దుత్తలూరు మండలంలోని నందిపాడు, కలిగిరి, కొండాపురం, సీతారామపురం, అనుమసముద్రంపేట, మర్రిపాడు, కావలి మండలంలోని ఒట్టూరు తదితర ప్రాంతాల్లో కస్తూర్బాగాంధీ విద్యాలయాలున్నాయి. వీటిలో ఆరునుంచి పదో తరగతి వరకు ఆరువేల మంది వరకు బాలికలు చదువుకుంటున్నారు. ఇంటర్‌లో 947 మంది ఉన్నారు. వీరిలో 50 నుంచి 80కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను గుర్తిస్తున్నారు. 80 శాతానికి పైగా సాధించిన వారికి ఫౌండేషన్ లిటరసీ అచీవర్స్‌గా వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించేలా తర్ఫీదు ఇస్తున్నారు. మిగిలినవారిని కనీసంకన్నా ఎక్కువ మార్కులు సాధించేలా శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

కస్తూర్బాల్లో ప్రత్యేక శిక్షణ

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచి.. ఉత్తమ ఫలితాలు సాధించంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులకు పదాలు, చతుర్విధ ప్రక్రియలు (కలపడం, తీసివేతలు, గుణకారాలు, భాగాహారాలు) నేర్పించేందుకు శ్రీకారం చుట్టింది.

పూర్తయిన సిలబస్

పదో తరగతి సిలబస్ ఇప్పటికే పూర్తయింది. ప్రస్తుతం రివిజన్ జరుగుతోంది. వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి మంచి ఫలితాల సాధనకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది అన్ని విద్యాలయాల్లో నూరుశాతం ఫలితాలే లక్ష్యంగా ప్రణాళికలను అమలు చేస్తున్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఇంటర్ విద్యార్థినులకు ప్రతి రోజూ ఉదయం 7.20 నుంచి 8.10 గంటల వరకు, సాయంత్రం 3.40 నుంచి 4.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించి వారి ప్రగతి అంచనా వేస్తున్నారు.

ముందుగానే పదో తరగతి పాఠాలు

తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు రోజు ఒక పీరియడ్‌లో పదో తరగతి పాఠ్యాంశాలు చెబుతున్నారు. వారానికి ఒకసారి వాటిపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. పర్యవేక్షణకు త్వరలోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రాష్ట్ర కార్యాలయానికి అనుసంధానం చేయనున్నారు. దీంతో నిరంతర పర్యవేక్షణ జరుగుతుంది. ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్నా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

మంచి ఫలితాల సాధనకే : వెంకటసుబ్బయ్య, ఏపీసీ, సర్వశిక్ష

నాణ్యమైన విద్యా ప్రమాణాలతో పాటు వంద శాతం ఫలితాలు సాధించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసి అమలు చేస్తున్నాం. ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఈమేరకు శిక్షణ ఇస్తున్నాం.

అరటి.. సిరుల పంట

రైతు కృష్ణారెడ్డి

అరటి సాగులో మంచి దిగుబడులు సాధించి లాభాలు సాధిస్తున్నారు వింజమూరుకు చెందిన శనివారపు కృష్ణారెడ్డి. ఆయనకున్న ఒకటిన్నర ఎకరాలో దీన్ని వేశారు. ఎకరానికి సుమారు 750 పిలకలు నాటారు. అచ్చు తోలి గుంతలు తీసి పశువుల ఎరువు వేసి నాటారు. 15 రోజులకోసారి నీరందించారు. 12 నెలలకు గెలలు వచ్చాయి. ఒక్కో గెల 20 నుంచి 25 కేజీల వరకు వచ్చాయి. కేజీ రూ. 15 వంతున విక్రయించారు. సుమారు 700 గెలలు రాగా రూ.1.50 లక్షల వరకు రాబడి వచ్చింది. ఎకరానికి సుమారు రూ. 70 వేలు ఖర్చులయ్యాయి. ఇవిపోను రూ.80 వేల వంతున రూ.1.4 లక్షలకు పైగా నికరాదాయం వచ్చింది. గెలకు వదిలిన చెట్టుకు పక్కన వచ్చిన పిలకల చెట్ల ఆకులు కూడా అమ్మారు. కట్ట రూ. 150 వంతున విక్రయించారు. సాధారణంగా ఫిబ్రవరి, మార్చి నెలల్లో సాగు చేస్తారు. తొలి ఏడాది పంట కాలం 12 నెలలు. రెండో ఏడాది నుంచి 10-12 నెలలలోపే పంట చేతికందుతుంది. వింజమూరు ఉద్యానాధికారి షమీల్ మాట్లాడుతూ టిష్యూ కల్చర్ ద్వారా సాగు చేస్తే మొక్కలకు వ్యాధులు సోకవన్నారు. రైతులు కొందరు ఖర్చు తగ్గుతుందని పిలకలు తెచ్చి నాటుతారన్నారు. దీంతో వ్యాధులు సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. –న్యూస్‌టుడే, వింజమూరు

సమస్య- సమాధానం

ప్రశ్న : జిలకర మసూర నారు పోశాం. ఎన్ని రోజులు వచ్చాక నాటుకోవాలి.
– రామయ్య, అల్లూరు

జవాబు : నెల రోజుల లోపు నాటుకుంటే మేలు.

ప్రశ్న : ఆకుచుట్టు పురుగు ఎక్కువగా సోకింది. దీని నివారణకు ఏ మందులు వాడాలి?
–శశి, అల్లూరుపేట

జవాబు : క్లోరిఫైడ్‌ఫాస్ లేదా ఇండాక్స్ కార్బ్ మందులు పిచికారీ చేయాలి. సిఫార్సు మేరకు యూరియా వేయాలి.

ప్రశ్న : జింక్‌సల్ఫేటు వేసిన తరువాత కాంప్లెక్స్ ఎరువు ఎన్ని రోజులకు చల్లాలి?
–శీనయ్య, అల్లూరు

జవాబు : కనీసం వారం రోజుల వ్యవధి ఉండాలి.

(రైతుల సందేహాలకు అల్లూరు మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సమాధానాలు ఇచ్చారు.)
–న్యూస్‌టుడే, అల్లూరు

రైతేరాజు

బత్తాయి ఎంతో మధురం

న్యూస్‌టుడే, వరికుంటపాడు

బత్తాయి తోట

మెట్ట ప్రాంతంలో తక్కువ పెట్టుబడితో పండ్ల తోటలు సాగు చేసి నాణ్యమైన దిగుబడులు పొందుతూ లాభాలు గడిస్తున్నారు మండలంలోని వెంగమాంబాపురం గ్రామానికి చెందిన నూతలపాటి రామయ్య. ఆయనకున్న 1.70 ఎకరాల్లో బత్తాయి తోట వేశారు. ఎక్కువ కాలం కావడంతో చెట్లు ఎండుముఖం పట్టగా 0.80 సెంట్లలో ఫలసాయం అందుతోంది. మిగిలిన పొలంలో ప్రస్తుతం మొక్కలు నాటి రెండేళ్లయింది. ఫలసాయం అందించే చెట్లలో స్వయంగా పనులు చేస్తున్నారు. ఏడాదికి రూ. 60 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. రెండుసార్లు వచ్చే దిగుబడిపై దాదాపు రూ. 3 లక్షల వరకు రాబడి వస్తోంది. పెట్టుబడి పోను రూ. 2.40 లక్షల వరకు ఏటా మిగులుతోందని రామయ్య తెలిపారు. మరో రెండేళ్లకు రెండేళ్ల కిందట నాటిన మొక్కలు కాపునకు వస్తాయని వివరించారు. ఇలా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సమకూర్చుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రకృతి విధానంలో..

రామయ్య

ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ఆచరిస్తున్నారు. భూమిలో సత్తువకు పేడ ఎరువుతో పాటు నత్రజని వంటివి సమకూర్చుకునేందుకు వివిధ రకాల పచ్చిరొట్ట పైర్లు వేస్తున్నారు. తెగుళ్లు ఆశించకుండా సొంతంగా తయారుచేసిన కషాయాలను వినియోగిస్తున్నారు. దీంతో నాణ్యమైన ఉత్పత్తులు పండుతున్నాయి.

ఇసుక నేల.. కాసుల గలగల

చేజర్ల, న్యూస్‌టుడే: ఇసుక నేలల్లో జల్లు విధానంలో నీటిని పెట్టి వేరుసెనగ సాగుతో పొదలకూరు మండలం సూరాయపాలేనికి చెందిన ఆవుల ప్రసాద్ లాభాలు గడిస్తున్నారు. సేంద్రియ విధానంలో సాధారణ పద్ధతి కంటె 20 శాతం అధిక దిగుబడి సాధించి లాభాల పంట పండిస్తున్నారు. ఎకరానికి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించారు. సాగుకు రూ. 60 వేలు ఖర్చవుతుండగా రూ.1.20 లక్షల వరకు రాబడి వస్తోంది. ఖర్చులు పోను రూ. 60 వేల వరకు ఆదాయం ఉంటుంది. ఏడెకరాల్లో పచ్చి వేరుసెనగ సాగుపై రూ. 4.20 లక్షల ఆదాయం సాధించారు.

సాగు చేస్తున్నారిలా: నేలను గడ్డి లేకుండా దుక్కి చేశారు. ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువు వేశారు. ఎకరానికి 100 కిలోల విత్తనాన్ని కూలీలతో పొలంలో సమాన దూరంతో నాటించారు. బిందు సేద్య పరికరాలు అమర్చి నీరు పెట్టారు. ఊడలు దిగే సమయంలో ఎకరానికి 200 కిలోల జిప్సం వేశారు. 105 రోజుల్లో పంట చేతికొచ్చింది.

బంతి.. లాభాలు ఇంతింతై

సీతారామపురం, న్యూస్‌టుడే: పూల తోటపై లాభాలు ఆర్జిస్తున్నారు సీతారామపురం తోట కాలనీకి చెందిన గుర్రం దుగ్గయ్య, లక్ష్మీదేవి దంపతులు. వీరికున్న 30 సెంట్లలో బంతి పూల మొక్కలు వేసి పెంచుతున్నారు. సాగుకు రూ.10 వేల వరకు ఖర్చు చేశారు. భార్యాభర్తలు కలిసి పనులు చేస్తున్నారు. దీంతో ఖర్చులు తగ్గించుకున్నామని తెలిపారు. నెల రోజులుగా పూలు దిగుబడి వస్తున్నాయి. ఇప్పటికే పెట్టిన పెట్టుబడి వచ్చినట్లు రైతు లక్ష్మీదేవి తెలిపారు. కార్తికమాసం ఆరంభం కావడంతో మంచి ధర వచ్చింది. ఆరెంజ్, పసుపు రంగు పూలు సాగు చేయడంతో వ్యాపారులు, పూజలకు పూలు అవసరమైన వారు నేరుగా వచ్చి కొనుగోలు చేస్తున్నారు. అవసరాన్ని బట్టి రోజూ లేదా రెండు రోజులకోసారి 15 కిలోలు కిలో రూ.50 చొప్పున సీతారామపురంలో విక్రయిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొంతమేర దిగుబడి తగ్గిందని లక్ష్మీదేవి తెలిపారు. కార్తిక మాసం కావడంతో.. ధర బాగుందని లాభాలు వచ్చాయని వివరించారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులపై దృష్టిసారించండి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: జిల్లాలో పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కోరారు. ఏపీ ఎడ్యుకేషనల్, వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంటు బోర్డ్ డైరెక్టర్ అబ్బూరి రమేష్ నాయుడు, సంబంధింత ఇంజినీరింగ్ అధికారులతో నెల్లూరు సంతపేటలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో విద్యాసంస్థలు, సంక్షేమ హాస్టళ్లలో తాగునీరు, మరుగుదొడ్లు, పరిశుభ్రత, కిటికీలు, తలుపులు, విద్యుత్తు సౌకర్యం తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో నూతన విద్యాసంస్థల ప్రతిపాదనలు, సంగంలో దాతలు సమకూర్చిన భవనాల్లో ఐటీఐ కళాశాల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పనకు త్వరితగతిన పనులు చేపట్టాలన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో స్లాబ్ దశ వరకు పూర్తయి అసంపూర్తిగా ఉన్న పాఠశాలలను గుర్తించి పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. ఈ విషయం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

జెండర్ వివక్షకు వ్యతిరేకంగా నయీ చేతన కార్యక్రమం

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: నయీ చేతన 4.0-మార్పు కోసం ముందడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేసీ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ నుంచి మండల, గ్రామ, జిల్లా స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసుకుని శాఖల వారీగా ర్యాలీలు నిర్వహించాలని తెలిపారు. జెండర్ వివక్షకు వ్యతిరేకంగా నెల రోజుల పాటు నిర్వహించే నయీ చేతన కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో విజయకుమార్, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, జడ్పీ సీఈవో శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులను రక్షించిన కానిస్టేబుల్‌కు ఎస్పీ అభినందన

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగడంతో బస్సును ఆపి ప్రయాణికులను రక్షించిన కానిస్టేబుల్ నాగార్జునను ఎస్పీ అజిత సోమవారం అభినందించారు. ఈ నెల 18న సాయంత్రం ఆత్మకూరు నుంచి నెల్లూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు భాగంలో మంటలు రావడాన్ని విజిబుల్ పోలీసింగ్‌లో ఉన్న కానిస్టేబుల్ నాగార్జున గమనించారు. బస్సును ఆపి వెంటనే ప్రయాణికులను బయటకు తీసుకువచ్చారు. సకాలంలో స్పందించిన కానిస్టేబుల్‌ను ఎస్పీ అభినందించి రివార్డు, ప్రశంసాపత్రం అందజేశారు.

సహకరించని కాళ్లు.. కనికరించక కన్నీళ్లు

మధుమేహం.. కుటుంబాలను ఆర్థికంగా.. మానసికంగా చిదిమేస్తోంది. చివరకు కాళ్లు తీసేయాల్సిన పరిస్థితులు వస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. షుగర్ వ్యాధి కారణంగా కాళ్లు పోగొట్టుకుని ప్రభుత్వ ఆసరా కోసం కార్యాలయాల చుట్టూ తిరిగినా.. ఆదుకునే వారు కరవవుతున్నారు. కోవూరు మండలం కొత్తూరు పంచాయతీ ఎన్టీఆర్ కాలనీకి చెందిన చెముడుగుంట వెంకటసుబ్బయ్య నిరుపేద. కూలి పనులు చేసుకుని భార్య, ముగ్గురు ఆడపిల్లలను పోషించుకుంటున్నారు. మధుమేహం సోకడంతో వైద్యులు గత ఏడాది ఫిబ్రవరిలో కుడికాలు మోకాలు కింది వరకు తొలగించారు. ఎడమ కాలు కూడా దెబ్బతిని నడవలేని పరిస్థితి. మందులకు డబ్బులు లేక అవస్థలు పడుతుండటంతోపాటు పస్తులుండాల్సి వస్తోంది. ఏడాది కాలంగా తిరుగుతున్నా పింఛను మంజూరు చేయడం లేదని వాపోయారు. 70 శాతంతో దివ్యాంగుల సర్టిఫికెట్ ఉందని, ఉన్నతాధికారులైనా స్పందించి పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని కన్నీటి పర్యంతమయ్యారు.

–ఈనాడు, నెల్లూరు, న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

సైబర్ కేసు ఛేదన.. నగదు రికవరీ

కావలి పోలీసులకు ఎస్పీ అభినందన

నెల్లూరు(నేర విభాగం): సైబర్ కేసును ఛేదించి ముఠాను అరెస్టుచేసి నగదు రికవరీ చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అజిత వేజెండ్ల సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. వివరాల్లోకెళితే.. కావలిలో ఇటీవల ఓ వ్యక్తికి ఆర్టీవో చలానా పేరుతో ఏపీకే ఫైల్ పంపించి అతని ఖాతాలోని సుమారు రూ.24లక్షల నగదును సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కావలి పోలీసులు కేసు నమోదు చేసి సాంకేతికత ఆధారంగా నిందితులు ఝార్ఖండ్ రాష్ట్రం జంతారా జిల్లాకు చెందిన వివేక్ కుమార్, రాకేష్ కుమార్, సంజయ్ మండల్‌గా గుర్తించారు. ప్రత్యేక బృందం ఈ నెల 14న జంతారాలో నిందితులను అదుపులోకి తీసుకుని.. 18న కావలి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. తదుపరి విచారణ నిమిత్తం కోర్టు అనుమతితో ఈ నెల 20న పోలీసులు నిందితులను కస్టడీకి తీసుకున్నారు. విచారించి వారి వద్ద నుంచి రూ.21.90 లక్షల నగదు రికవరీతో పాటు రూ.1,63,855 నగదు ఖాతాలో ఉండగా ఫ్రీజ్ చేశారు. కేసును ఛేదించిన కావలి ఒకటో పట్టణ ఇన్‌స్పెక్టర్ ఫిరోజ్, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వర్లు, ఒకటో పట్టణ ఎస్సై ఎస్.సుమన్, సిబ్బందిని ఎస్పీ అభినందించి.. ప్రశంసాపత్రాలు అందజేశారు.

అధికారులు, సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ

డీపీవో బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(జడ్పీ): డీపీవో వసుమతి సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆమె నెల్లూరు డీఎల్‌డీవోగా పనిచేస్తూ.. ఇన్‌ఛార్జి డీపీవోగా వ్యవహరించనున్నారు. ఆమెకు కార్యాలయ అధికారులు మాలకొండయ్య, విజయకృష్ణ స్వాగతం పలికారు. ఇక్కడ డీపీవోగా పనిచేస్తున్న ఎల్.శ్రీధర్‌రెడ్డిని జడ్పీ సీఈవోగా నియమించిన విషయం తెలిసిందే.

జగన్.. ఇప్పుడైనా నిజాయతీగా ఉండయ్యా

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ఇప్పుడైనా కాస్త నిజాయితీగా ఉండయ్యా అంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌కి తెదేపా సీనియర్ నాయకులు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హితవు పలికారు. తన ఎక్స్ వేదికగా సోమవారం ఓ పోస్ట్ విడుదల చేశారు. ‘2024 ఎన్నికలకు ముందు కూడా ‘సిద్ధం.. సిద్ధం’ అని జగన్ ఇలాగే ఫొటోలు, వీడియోలు పెట్టి హడావుడి చేశారు. లక్షల మంది జనం అన్నారు. జరిగింది ఏంటో జనమంతా చూశారు. ఏపీ ప్రజలు సాధారణ ఎన్నికల్లో పూర్తి ఆలోచన, అప్రమత్త, అవగాహనతో, చైతన్యంగా వ్యవహరించి ఓట్లేశారు. అయినా జగన్ మారలేదు. ఇంకా భ్రమల్లో ఉండి అయిపోయిన రాజకీయాలు చేస్తున్నారు. ఎన్నికల ముందు వాడి పడేసిన పాత వ్యూహాలు అమలు చేసి ప్రజలను మళ్లీ మోసం చేయాలని చూస్తున్నారు. వీటిని జనం గుర్తించారు. ఇప్పుడు జగన్ గుర్తించాలి. సొంత మీడియా ప్రచారం, డ్రోన్ కెమేరా ట్రిక్కులు, సోషల్ మీడియా ప్రచారం ఇకనైనా వదిలేసి కాస్త నిజాయితీగా(నీవల్ల కాదనుకో) ఉండడానికి ప్రయత్నిస్తే బెటర్ అని’ అని అన్నారు.

EENADU Classifieds

EDUCATION

DISTANCE EDUCATION

10th/Inter, BA, B.Com, B.Sc, BBA, BCA, BLIS, MA, M.Com, MSC, MCA, MBA, MLIS Dip, B.Tech, M.Tech, M.Phil, Ph.D, BNYS, BPT : 9030030125

FINANCIAL SERVICES

Live Trading in your Demat account. Join us & Grow Together. Minimum account Balance 5 lakhs for details DSR money growth ✆ 9059521999

REAL ESTATE

PLOT FOR SALE

నెల్లూరు మైపాడు రోడ్డుకి కిసాన్ నగర్‌కు అతి దగ్గరలో 30 అంకణముల కమర్షియల్ ప్లాట్ అమ్మకమునకు కలదు. అంకణం: 3,50,000/-. ✆ 89191 88010

TO LET

2BHK Flat for Rent హరనాథపురం 5వ వీధి HP పెట్రోల్‌బంకు ఆనుకుని ఉన్న Vensa Hanu Residency, 4వ ఫ్లోర్, flat No. 402 ✆ 91002 77551

JOBS

Vacancies at Naj Jewellery Pvt.Ltd., A unit of New Andhra Jewellery, require M/F for showroom Sales Executive, Office Executive, Accounts Executive, Senior Accounts Executive & Cashier, Salary (All Category 20-40k+ performace incentive), PF & ESI Apply, Walk-In-Interview at 11 AM to 1 PM on 28th November (Friday), Workplace -Nellore. Cont: 88850 81323

వృద్ధాశ్రమములో పనిచేయుటకు వంటవారు, కేర్‌టేకర్స్ కావలెను. నారాయణరెడ్డిపేట ✆ 63002 88170

నెల్లూరులో లైసెన్స్ కలిగిన అనుభవం గల కార్ డ్రైవర్ కావలెను. లేడీ టెలికాలర్స్ -5, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. P/F జీతం: 7to17K. ✆ 79977 12579

ఎలక్ట్రీషియన్లు కావలెను. APSPDCL పరిధిలో చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు & అనంతపురం జిల్లాల్లో వర్క్స్ చేయుటకు ఎలక్ట్రీషియన్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్లు కావలెను. జీతం 20K To 30K. Con: 73307 05344, 089131 41574.

FACULTY/ TEACHERS

Requirement of Teachers Ratnam High School. Subjects: Mathematics, English (6th to 10th) Both Part/Full timers are preferable. : 7702000050

TOURS AND TRAVELS

వేదవిద్యాసాధనా పరిషత్ వారిచే బద్రి, కేదార్ మొ॥ ఛార్‌ధామ్ యాత్ర-2026 బుకింగ్ 1000/- మాత్రమే 2)కాశీ-ప్రయాగ యాత్ర, ప్రతి నెల 3)జమ్ము, వైష్ణోదేవి, కురుక్షేత్ర. పూజాభిషేకం, పిండదాన సహితముగా కాల్: 9394142516, వాట్సాప్ 9873790017.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
వివరాలకు.. నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తీరం వెంట రక్షణకు గ్రేట్ గ్రీన్‌వాల్

పనులు ప్రారంభించిన అటవీ శాఖ

‘ఈనాడు-ఈటీవీ’తో డీఎఫ్‌వో మహబూబ్‌బాషా

న్యూస్‌టుడే, నెల్లూరు (కలెక్టరేట్)

‘జిల్లాలో 107 కిలోమీటర్ల దూరం తీరప్రాంతం విస్తరించి ఉంది. దాని పొడవునా రక్షణకు మొక్కలు పెంచి గ్రీన్‌వాల్‌గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. సముద్రం అలలు పొంగి గ్రామాల మీదకు రాకుండా ఉండేలా తాటి చెట్లు, మడ అడవులు పెంచాలనే కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో అటవీశాఖతో పాటు పలు శాఖలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. వచ్చే ఏడాది నుంచి కార్యక్రమం శరవేగంగా జరగనుంది’ అని జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్‌బాషా ‘ఈనాడు-ఈటీవీ’ ముఖాముఖిలో పేర్కొన్నారు. శాఖాపరంగా జిల్లాలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయన వివరించారు.

మడ అడవులు కాపాడుతాం

మడ అడవులు ప్రతిచోటా ఉండవు. వాటికి నిరంతరం వాటర్‌ఫ్లో ఉండాలి. ప్రస్తుతం జిల్లాలో వెయ్యి ఎకరాల్లో ఉన్నాయి. ఎక్కడ అనువుగా ఉంటే అక్కడే పెరుగుతాయి. కృష్ణపట్నం ఈపూరు, అల్లూరు, పెన్నా ప్రాంతంలో ఇవి ఉన్నాయి. వీటిని కాపాడుతాం. బకింగ్‌హామ్ కెనాల్ ఆక్రమణలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. రెవెన్యూశాఖ అధికారులే చర్యలు తీసుకోవాలి. మేము ఎలాంటి చర్యలు తీసుకోలేం అని తెలిపారు.

లక్ష తాటి టెంకలు నాటాం

జిల్లాలోని సముద్రతీరంలో రిజర్వు ఫారెస్టు 45 కి.మీ. దూరం ఉంది. 4,500 హెక్టార్లు అటవీశాఖ ఆధ్వర్యంలో ఉంది. వీటిలో క్యాసరీనా, క్యాషు, యూకలిప్టస్ మొక్కలు నాటాం. ఖాళీగా ఉన్న స్థలంలో నాటేందుకు ప్రభుత్వం గ్రేట్ గ్రీన్‌వాల్ కార్యక్రమం చేపడుతోంది. ఈ ఏడాది కావలి, నెల్లూరు తీరప్రాంతంలో లక్ష తాటి టెంకలు నాటాం. వచ్చే ఏడాది విరివిగా నాటేందుకు ప్రాంతాలను గుర్తించాం.

రక్షణ గోడలా పచ్చదనం అభివృద్ధి

తుపాన్లు, విపత్తులు వచ్చినప్పుడు ప్రజలను, ఆస్తులను రక్షించేందుకు గోడలా పచ్చదనాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం గ్రేట్ గ్రీన్‌వాల్‌ను తీసుకొచ్చింది. 5 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న రెవెన్యూ, అటవీశాఖ భూములను గుర్తించి వాటిలో పనులు చేస్తున్నాం. సముద్రతీర ప్రాంతంలోని టూరిజం స్థలాల్లో పోలీసు, రెవెన్యూశాఖల వారితో కలిసి రక్షణ చర్యలు చేపడుతున్నాం. తుపానుల సమయంలో సముద్రం కోతకు గురవుతోంది. నివారణకు చర్యలు చేపట్టాం.

విద్యార్థులతో అధ్యాపకులు, అధికారులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

విడవలూరు, కొడవలూరు : విద్యతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇచ్చి ప్రతిభ కనబరచాలని జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర అన్నారు. సోమవారం విడవలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేరా యువ భారత్, ఇండియా హ్యూమన్ లైఫ్ వెల్ఫేర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఆటల పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. వాలీబాల్, రన్నింగ్, షాట్‌పుట్, ఖోఖో తదితర పోటీలు జరగగా.. విడవలూరు, కొడవలూరు, బుచ్చిరెడ్డిపాలెం కళాశాలల విద్యార్థుల పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నగేష్‌కుమారి. డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డా.సుజాత, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దీనదయాళ్ పాల్గొన్నారు.

వామ్మో.. గోతుల్లో వెళ్లేదెలా!

నరకం ఎక్కడో కాదు.. ఈ రహదారిలో ప్రయాణిస్తే కనబడుతుంది. కలిగిరి-సంగం ప్రధాన రహదారిపై హసనాపురం నుంచి పాతనాపురం వరకు వాహనదారులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. గోతులతో అధ్వానంగా తయారైంది. బస్సుల్లో ప్రయాణించే వారి ఒళ్లు హూనమవుతోంది. – న్యూస్‌టుడే, కలిగిరి

జీజీహెచ్‌లో క్యాన్సర్‌కు అరుదైన శస్త్ర చికిత్స

నెల్లూరు(జీజీహెచ్) : సైనస్‌లో కనిపించే అరుదైన ట్యూమర్‌ను జిల్లా ఆసుపత్రి వైద్యులు తొలగించి విజయవంతంగా శస్త్ర చికిత్స చేశారు. నెల్లూరుకు చెందిన 38 సంవత్సరాల వయసున్న ఇ.వేలాంగణికి రెండు నెలలుగా ఎడమ ముక్కు దిబ్బడ, ఎడమ కన్ను వాపు, ముక్కు నుంచి రక్తం రావడం, ఎడమ ముఖంలో నొప్పి, తల నొప్పి వంటివి ఉండటంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చూపించినా ప్రయోజనం లేదు. ఆమె జీజీహెచ్‌లో చూపించారు. వైద్యులు ఆమెకు పరీక్షలు చేయగా సైనస్‌లో ట్యూమర్ ఉన్నట్లు గుర్తించారు. దాన్ని బయాప్సీకి పంపి.. అడెనోయిడ్సిస్టిక్కార్సినోమా (క్యాన్సర్) ఉందని గుర్తించారు. అది కూడా గ్రేడ్-3 స్టేజీలో ఉందని తేలింది. అనంతరం వైద్యులు విజయవంతంగా శస్త్ర చికిత్స చేసి ట్యూమర్‌ను తొలగించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.మాధవి మాట్లాడుతూ.. ఆసుపత్రిలో అనుభవం కలిగిన వైద్యులు, అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈఎన్‌టీ హెచ్‌వోడీ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన శస్త్ర చికిత్సలో వైద్యులు సుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితురాలితో ఆసుపత్రి వైద్యులు

నేడు జడ్పీ స్టాడింగ్ కమిటీ సమావేశాలు

నెల్లూరు(జడ్పీ): జిల్లా పరిషత్ పాలనలో ప్రధానమైన స్టాండింగ్ కమిటీ సమావేశాలు మంగళవారం నిర్వహిస్తున్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆధ్వర్యంలో వేర్వేరుగా ఏడు కమిటీల సమావేశాలు జరుగుతాయి. ఈ మేరకు సభ్యులకు సమాచారం అందించారు.

మంత్రి సత్యకుమార్ పర్యటన నేడు

నెల్లూరు(కలెక్టరేట్) : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు తోటపల్లిగూడూరు మండలం విలుకానిపల్లికి చేరుకుని.. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో సాయంత్రం వరకు పాల్గొంటారు.

ఉద్యోగ మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), కావలి, న్యూస్‌టుడే: కావలి పట్టణంలోని ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాలలో సీడాప్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం సోమవారం తెలిపారు. 16 కంపెనీల్లో 830 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంటర్, ఏదైనా డిగ్రీ చదివిన నిరుద్యోగులు ఇందులో పాల్గొనవచ్చని సూచించారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ. 11,788
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 94,304
వెండి గ్రాము :	రూ. 163.20

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	115
లేయర్	130
బ్రాయిలర్స్	210
బ్రాయిలర్స్‌స్కిన్‌లెస్	234
లేయర్ మాంసం	221

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కొండాపురం, న్యూస్‌టుడే: కొండాపురం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో మంగళవారం సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ దినేష్ కుమార్ సోమవారం తెలిపారు. ఉపకేంద్రంలో మరమ్మతులు జరుగుతున్నాయని తెలిపారు. దీంతో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపేస్తున్నామన్నారు.

27న ప్రభుత్వ ఉద్యోగుల తాలుకా సంఘం ఎన్నికలు

ఉదయగిరి, న్యూస్‌టుడే: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 27న రాష్ట్ర ప్రభుత్వ ఉదయగిరి తాలుకా ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి షేక్ మహమ్మద్ జావీద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదేరోజు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామన్నారు. ఉదయగిరి తాలుకా పరిధిలోని ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు మండలాల్లోని ఉద్యోగులు ఇందులో పాల్గొనాలన్నారు.

కావలి

•కావలి •ఉదయగిరి •కందుకూరు

1,231 జాబ్ కార్డులు తొలగింపు

ఉదయగిరి, న్యూస్‌టుడే : మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో 1,231 మంది కూలీల జాబ్ కార్డులను తొలగించినట్లు ఎంపీడీవో బి.శ్రీనివాసులు సోమవారం వెల్లడించారు. మండలంలో 14,631 కార్డులు ఉండగా 9,721 మందివి ఈకేవైసీ చేశామన్నారు. మరో 3,679 కార్డులకు ఈకేవైసీ చేయాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా 1,231 కార్డులు తొలగించామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)

కావలి: 80080 51666, 91548 46698
కందుకూరు: 70939 81624, ఉదయగిరి: 80085 73944

సమస్య: మా ప్రాంతంలో చెత్తాచెదారాలు పేరుకుపోతున్నాయి. దుర్గంధం భరించలేకున్నాం.
– మీసాల పార్వతి, మద్దూరుపాడు

సమాధానం: పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

? మా ప్రాంతంలో తాగునీటి కొరత తీవ్రంగా ఉంది. ట్యాంకర్లు కూడా రావడం లేదు.
– ఈమని కృష్ణార్జునరావు, వైకుంఠపురం

✓ మీ ప్రాంతంలో పైపులైన్ల వ్యవస్థ అందుబాటులో లేదు. దీంతో ట్యాంకర్ల ద్వారా పంపుతున్నాం. అవి సజావుగా వచ్చేలా చూస్తాం.

? మా ప్రాంతంలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. సరిపడా నీరు ట్యాంకర్లతో సరఫరా చేయాలి.
–హనుమాయ కృష్ణప్రసాద్, బుజంగుంట కాలనీ, కావలి

✓ రోజూ 27 ట్యాంకర్లు పంపుతున్నాం. చాలకుంటే మరిన్ని పంపుతున్నాం.

(పై సమస్యలకు కావలి పుర కమిషనర్ శ్రావణ్‌కుమార్ సమాధానాలు చెప్పారు)
– న్యూస్‌టుడే, కావలి

? మా గ్రామంలో వీధుల్లో నీరు నిలిచి దోమలు ఉద్ధృతమయ్యాయి. – రంగయ్య, దగదర్తి

✓ దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం.
– మయూరి, పంచాయతీ కార్యదర్శి, దగదర్తి

శివాలయం హుండీ రాబడి రూ.14 లక్షలు

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని పాతూరు శివాలయంలో 172 రోజులకు హుండీ ద్వారా రూ.14 లక్షల రాబడి వచ్చింది. కొవ్వూరు గ్రూప్ ఆలయాల ఈవో నాగమల్లేశ్వరరాజు నేతృత్వంలో సోమవారం హుండీ లెక్కించారు. కావలి ఆలయాల ఈవో అరవ రాధాకృష్ణ, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఉపన్యసించి.. విజేతలుగా నిలిచి

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని గాయత్రీనగర్ వీపీఎస్ ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా 'విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి.. బాలలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా వి.సాయిచరిష్మా, షేక్ షమ, పి.మహీచందన నిలిచారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ కొండపనాయుడు బహుమతులు అందజేశారు.

బహుమతులు అందజేస్తున్న కొండపనాయుడు

విద్యార్థులతో నారాయణ పాఠశాల ఉపాధ్యాయులు.. బహుమతులిస్తున్న సిద్దార్థ పాఠశాల ఉపాధ్యాయులు

కందుకూరు పట్టణం : పట్టణంలోని నారాయణ ఒలింపియాడ్ పాఠశాలలో బి.చేతన, బి.శ్రీహాస్య, ఎస్.కె.సుహేబ్‌ఆర్మన్ విజేతలుగా నిలవగా, వారికి పాఠశాల ఏజీఎం పి.విజయలక్ష్మి, కోఆర్డినేటర్ శ్రీహరి, ప్రిన్సిపల్ సుభాని, డీన్ అన్వేష్, పి.వెంకటేశ్వర్లు బహుమతులు అందజేశారు. ● సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో ఎస్.శ్రీవల్లి, ఎస్.కె.పర్వీన్, సయ్యద్ అమ్రీన్‌బాను విజేతలుగా నిలిచారు. వీరికి పాఠశాల హెచ్‌ఎం టి.హరిబాబు, ఇన్‌ఛార్జి మాల్యాద్రి బహుమతులు అందజేశారు.

విద్యాలయాల్లో ఏదీ రక్షణ?

న్యూస్‌టుడే, దుత్తలూరు

గ్రామాల్లో విద్యాలయాల్లో సమస్యలు ఏళ్లుగా విద్యార్థులను వేధిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో ఇటు ఉపాధ్యాయులు అటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి రక్షణ గోడలు నిర్మిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందని వారు పేర్కొంటున్నారు.

ఉదయగిరి నియోజకవర్గంలో 397 ప్రాథమిక , 49 ప్రాథమికోన్నత, 51 ఉన్నత పాఠశాలలున్నాయి. నాలుగు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, నాలుగు ఆదర్శ పాఠశాలలున్నాయి. ఆదర్శ, కస్తూర్బాగాంధీ విద్యాలయాలకు మాత్రమే ప్రహరీలున్నాయి. 80 శాతానికి పైగా ఉన్నత పాఠశాలలకు రక్షణ గోడలున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు లేకపోవడంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం భయం.. భయంగా గడుపుతున్నారు. 187 ప్రాథమిక పాఠశాలల్లో, 19 ప్రాథమికోన్నత, ఏడు ఉన్నత పాఠశాలల్లో లేకపోవడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు.

దుత్తలూరు: నర్రవాడ ఎస్సీ కాలనీ పాఠశాల పరిసరాల్లో కంప చెట్లు

కంపచెట్లతో భయం.. భయం

రక్షణ గోడలు లేకపోవడంతో పరిసరాల్లో కంపచెట్లు పెరుగుతున్నాయి. వీటితో విషపురుగుల సంచారం అధికంగా ఉంది. ఇవి గదుల్లోకి వస్తాయేమోనని భయాందోళన చెందుతున్నారు. కొన్ని పాఠశాలలు రహదారుల పక్కనే ఉండడంతో విద్యార్థుల రాకపోకల సమయంలో వాహనాలతో ప్రమాదాలు జరిగే అవకాశముందని తల్లిదండ్రులు భయపడుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా.. : ప్రహరీలు లేని పాఠశాలలు రాత్రి, సెలవు దినాల్లో ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. ఆయా రోజుల్లో మందుబాబులు మద్యం తాగి ఖాళీ సీసాలను మైదానాలు, అసంపూర్తి భవనాలు, వరండాల్లో వేస్తున్నారు. వీటిని పగలగొట్టడంతో చిన్నారుల కాళ్లకు ఈ పెంకులు గుచ్చుకుంటున్నాయి. పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారు.

ప్రహరీలు లేని పాఠశాలలు.. ఆకతాయిలకు నెలవు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం

– బాలాజీరావు, జిల్లా విద్యాశాఖాధికారి

జిల్లాలోని పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రహరీలు లేని మాట వాస్తవమే. నాడు- నేడులో చేపట్టగా.. పలు చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. కూటమి ప్రభుత్వం వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

కావలి, న్యూస్‌టుడే: వాహనదారులంతా తప్పక నిబంధనలు పాటించి ప్రమాదరహితంగా వాహనాలు నడపాలని కావలి ప్రాంత రవాణా శాఖ అధికారి మురళీధర్, ఎంవీఐ ఆర్.సుందర్‌రావు సూచించారు. సోమవారం కావలి మండలం గౌరవరం టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. కార్లు, బస్సులు, వ్యాన్లు, ఇతర నాలుగు చక్రాల వాహనదారులంతా విధిగా అగ్నిమాపక నిరోధక సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ద్విచక్రవాహనదారులు హైవేపై వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిరస్త్రాణం తప్పనిసరిగా ధరించాలని వివరించారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేదల కళ్లలో వెలుగులు

వరికుంటపాడు, న్యూస్‌టుడే: వీపీఆర్ నేత్ర పథకం పేదల కళ్లలో వెలుగులు నింపుతోందని తెదేపా మండల కన్వీనర్ చంద్రా మధుసూదన్‌రావు తెలిపారు. మండలంలోని పామూరుపల్లెలో సోమవారం వీపీఆర్ నేత్ర కార్యక్రమం నిర్వహించారు. 206 మందికి పరీక్షలు చేసి 93 మందికి కంటి అద్దాలను అందజేసినట్లు ఆర్గనైజర్ శంకరరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి సుశీల, నాయకులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు సౌండ్ బాక్స్ బహూకరణ

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని బసిరెడ్డిపాలెం జడ్పీ పాఠశాలకు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కె.మోహనార్జునరెడ్డి సోమవారం రూ.25 వేల విలువైన సౌండ్ బాక్స్ బహూకరించినట్లు హెచ్‌ఎమ్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. హెచ్‌ఎం స్నేహితుడు కావడంతో దీన్ని అందించానని దాత తెలిపారు.

పేదింటి బిడ్డలు క్రీడాకుసుమాలు

న్యూస్‌టుడే, కావలి

వారు పేదిళ్లలో పుట్టారు. తల్లిదండ్రులు రెక్కల కష్టంతో చదివిస్తున్నారు. పిల్లల భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా చదువుతున్నారు. మరోవైపు తమకు ఆసక్తి ఉన్న ఆటల్లో సాధన చేసి నైపుణ్యం సంపాదించారు. పోటీల్లో పాల్గొని సత్తా చాటుతున్నారు. జిల్లా, రాష్ట్రం దాటి జాతీయస్థాయికి ఎదిగారు. కన్నవారికియ గుర్తింపు తెచ్చారు పట్టణంలోని విశ్వోదయ ఎయిడెడ్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలికలు. ఇటీవల కర్నూలులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి కబడ్డీలో సత్తా చాటారు. వచ్చే నెలలో జరగనున్న అండర్-17 జాతీయ స్థాయి పోటీలకు హాజరుకానున్నారు వి.పొట్టెమ్మ, సీహెచ్ గాయత్రి. హెచ్‌ఎం లక్ష్మీమాధవి, పీఈటీ రాజ్యలక్ష్మి మార్గదర్శకంలో వీరు శిక్షణ పొందుతున్నారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థినులు

పొట్టెమ్మ.. కూతకెళితే పాయింటే!



పదో తరగతి చదువుతున్న **పొట్టెమ్మ** నాలుగేళ్లగా విద్యతోపాటు కబడ్డీలోనూ మేటిగా రాణిస్తుంది. కూతకెళితే పాయింట్ తేవాల్సిందేనన్న రీతిలో పేరు తెచ్చుకుంది. భవిష్యత్తులో క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలనే ధ్యేయంతో ఉంది. ఈ బాలిక సొంత గ్రామం కావలి మండలంలోని తుమ్మలపెంట పంచాయతీ మజరా పెద్దనట్టు. తండ్రి బాబు చేపలవేట సాగిస్తుంటారు. తల్లి మల్లీశ్వరి గృహిణి.

గాయత్రి ప్రతిభ

కావలి మండలం చెన్నాయపాలేనికి చెందిన **గాయత్రి** తొమ్మిదో తరగతి చదువుతుంది. గత ఏడాది నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమం, జిల్లాలో ద్వితీయ బహుమతి సాధించింది. అథ్లెటిక్స్‌లోనూ పాల్గొని వివిధ బహుమతులు అందుకుంది. తండ్రి లక్ష్మయ్య మత్స్యకారుడు. తల్లి నరసమ్మ గృహిణి.

రైతన్నా.. మీకోసంపై నాయకుల ప్రచారం

వింజమూరు, న్యూస్‌టుడే : మండలంలోని చంద్రపడియలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఇంటింటికీ పత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఎం కిసాన్ అన్నదాత- సుఖీభవ పథకంలో మండలంలోని 4489 మంది రైతులకు ఇప్పటివరకు సాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి ప్రవీణ, తెదేపా మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, నాయకులు చల్లా వెంకటేశ్వర్లు ఆనంగి రమణయ్య, వనిపెంట సుబ్బారెడ్డి, ఏవో ఎ.వాసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఇంటూరి

ఉలవపాడు: వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు రైతులకు అన్నదాత- సుఖీభవ పథకంలో కూటమి ప్రభుత్వం చేయూతనిస్తుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పెద్దపట్టపుపాలెంలో కరపత్రాలను అందిస్తూ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కరేడు పంచాయతీలో రూ.16 లక్షలతో సీసీ కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సుబ్బారావు, ఏడీఏ శేషారెడ్డి, మత్స్య శాఖ ఏడీ శాంతి తదితరులు పాల్గొన్నారు. **కొండాపురం, బిత్రగుంట, వరికుంటపాడు, దుత్తలూరు :** టెలికాం సలహా ఉదయగిరి నియోజకవర్గ కమిటీ డైరెక్టర్ తాటికొండ అనూష ఆర్.ఎస్.కె. అధికారులతో కలిసి సాయిపేట పంచాయతీ మక్కెనవారిపాలెంలో ఇంటింటికీ తిరిగి రైతన్నా.. మీకోసం పథకంపై అవగాహన కల్పించారు. బోగోలు మండల తెదేపా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు ఏవో శైలజతో ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. వరికుంటపాడు తెదేపా మండల కన్వీనర్ చంద్రా మధుసూదన్‌రావు, జడ్పీటీసీ సభ్యులు రావెళ్ల నాగేంద్ర, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.అరుణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దుత్తలూరు మండల కన్వీనర్ ఉండేల గురవారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ప్రచారం చేశారు.

చేతి పంపు.. పట్టించుకోరు!

మండలంలోని కలవళ్ల ఎస్సీ కాలనీలో రహదారి పక్కన పిచ్చిమొక్కల మధ్య చేతిపంపు నిరుపయోగంగా మారింది. గతంలో కాలనీవాసులకు తాగునీటి కష్టాలను తీర్చగా. మరమ్మతులకు గురైంది. అధికారులు పట్టించుకోకపోవడంతో ఇలా తయారైంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, వలేటివారిపాలెం

భవనం వినియోగంలోకి వచ్చేదెన్నడో!

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పాల సేకరణ కోసం అయ్యవారిపల్లి సచివాలయం పక్కనే బల్క్ మిల్క్ సెంటర్ నిర్మించారు. పనులు దాదాపు పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తిచేస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు సూచిస్తున్నారు.
– న్యూస్‌టుడే, సీతారామపురం

ఇదేనా పల్లె శుభ్రత?

పల్లెల్లో శుభ్రత కోసం ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. దుత్తలూరు పంచాయతీ పరిధిలోని కమ్మవారిపాలెం సమీపంలో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపై నీరు నిలిచింది. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి నజీముల్లా మాట్లాడుతూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, దుత్తలూరు

పరివర్తకం.. ప్రమాదకరం

పట్టణంలోని పేదలకు నివేశన స్థలాలు ఇచ్చేందుకు ఏర్పాటుచేసిన మహదేవపురం పంచాయతీలోని లేఅవుట్‌లో విద్యుత్తు పరివర్తకాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఒకే వీధిలో ఏర్పాటుచేసిన ఆరు పరివర్తకాలకు చిల్ల చెట్లు, పిచ్చిచెట్లు, తీగలు అల్లుకున్నాయి. ఇక్కడ నివాసాలు ఉంటున్న వారు వీటిని చూసి భయపడుతున్నారు.
– న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

శుభ్రం చేయక.. దుర్గంధం భరించలేక

పట్టణంలోని పోలీసుగ్రౌండ్స్‌లో ఇటీవల ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఆసమయంలో వెలువడిన చెత్త తీయకపోవడంతో అపరిశుభ్రంగా తయారైంది. దీంతో సమీపంలో నివసించే బాపూజీనగర్ కాలనీవాసులు దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు. ఈ విషయమై పురపాలక సంఘం కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు. – న్యూస్‌టుడే, కావలి

పదోన్నతులివ్వాలని వీఆర్‌ఏల వినతి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలుచేయాలని, అర్హులైన వారికి వీఆర్‌వోలుగా పదోన్నతులు కల్పించాలని సీఐటీయూ పట్టణాధ్యక్షుడు జి.రమేష్ కోరారు. సోమవారం ఆ సంఘం నాయకులు, సీఐటీయూ ప్రతినిధులు సబ్‌కలెక్టర్ హిమవంశీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.ఎ.గౌస్, టి.సురేష్, సీహెచ్.శ్రీనివాసులు, జి.తిరుపతయ్య, బి.విజయలక్ష్మి, బి.సుశీల, కాలేషా, కె.బ్రహ్మయ్య పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ హిమవంశీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గుర్తు తెలియని వాహనం ఢీ.. ఒకరి గాయాలు

ఉలవపాడు, న్యూస్‌టుడే: మండలంలోని రాజుపాలెం అడ్డరోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. పోలీసుల వివరాల ప్రకారం.. చాకిచర్లకు చెందిన వి.ఇసాక్ ద్విచక్రవాహనంపై ఉలవపాడు నుంచి స్వగ్రామానికి వెళుతుండగా వెనుక వైపు గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఆగకుండా వెళ్లింది. ఇసాక్‌కు గాయాలు కావడంతో 108 వాహనంలో కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తానని ఎస్‌ఐ అంకమ్మ చెప్పారు.

మద్యం గొలుసు దుకాణంపై దాడి

ఉదయగిరి, న్యూస్‌టుడే : మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీలో నిర్వహిస్తున్న మద్యం గొలుసు దుకాణంపై ఉదయగిరి ఎక్సైజ్ ఎస్సై దీప్తికరంత్ తమ సిబ్బందితో కలిసి సోమవారం దాడులు నిర్వహించారు. ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఉదయగిరి, న్యూస్‌టుడే : మండలంలోని శకునాలపల్లి సమీపంలో కారు అదుపుతప్పి బోల్తాపడడంతో త్రుటిలో ప్రమాదం తప్పిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. వివరాల మేరకు... పుల్లాయపల్లి గ్రామానికి చెందిన యువకులు కారులో ఎర్రపల్లిగడ్డ సెంటర్‌కు వెళుతున్నారు. ఈ క్రమంలో శకునాలపల్లి సమీపంలోకి రాగానే అదుపుతప్పి గుంతలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఎవరికీ గాయాలు కాలేదు.

బిందు సేద్య పరికరాలు సిద్ధం

సీతారామపురం: సూక్ష్మ బిందు పరికరాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి తెలిపారు. మండలంలోని బసినేనిపల్లిలో రైతన్నా..మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులకు నూరుశాతం, మిగతా రైతులకు 90శాతం రాయితీతో సూక్ష్మబిందు పరికరాలు అందజేయనున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు ఆధార్, బ్యాంకు ఖాతా, పట్టాదారు పాసుపుస్తకం, వన్‌బి నకలుతో రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

తెదేపాలో చేరికలు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: గుడ్లూరు మండలం మోచర్ల పంచాయతీలోని తెట్టు ఎస్టీ కాలనీకి చెందిన పలువురు సోమవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెదేపాలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపు

వరికుంటపాడు: స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో పెరిగిన కంపచెట్లను సర్పంచి దిలీప్‌కుమార్ సోమవారం పొక్లెయిన్‌తో తీయించారు. వీటితో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను పాఠశాల హెచ్‌ఎం సుమలత సర్పంచి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వాటిని తీయించారు. కార్యక్రమంలో చల్లగాలి వెంకటమోహన్ పాల్గొన్నారు.

రూ.లక్షల వ్యయం.. నెరవేరని లక్ష్యం

న్యూస్‌టుడే, సీతారామపురం

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచి సంపద సృష్టించేందుకు ఏర్పాటుచేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. దీంతో వీటికోసం ఖర్చు చేసిన లక్షలాది రూపాయలు నిరర్థకంగా మారుతున్నాయి. ఆలనాపాలన లేకపోవడంతో వీటిలో కంపచెట్లు పెరిగాయి. పరిసరాలు అధ్వానంగా మారాయి. అందుకు నిదర్శనమే మండలంలోని అయ్యవారిపల్లిలో సంపద తయారీ కేంద్రం. రూ.లక్షలు వెచ్చించి నాడెప్ కంపోస్టు తొట్టెలు ఏర్పాటు చేశారు. ఇంతవరకూ బాగానే ఉన్నా వినియోగించిన పాపాన పోలేదు. కేంద్రంలో కంపకర్ర చెట్లు పెరిగిపోతున్నాయి. షెడ్డు శిథిలావస్థకు చేరింది. గ్రామంలో సేకరించిన చెత్త శివారులో కుప్పలుగా పోస్తున్నారు. దీంతో ఆయాప్రాంతాలు అధ్వానంగా తయారవుతున్నాయి. ఆదారుల్లో వెళ్లేవారు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వినియోగంలోలేని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం

'నాడు - నేడు'.. ఎన్నాళ్లు?

అసంపూర్తి పనులతో విద్యార్థులకు అగచాట్లు

న్యూస్‌టుడే, దగదర్తి

మండలంలో గత ప్రభుత్వం 'నాడు - నేడు' పథకంలో చేపట్టిన పాఠశాలల ఆధునికీకరణ పనులు చివరి దశలో నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం పాఠశాలలను రెండు దశల్లో అభివృద్ధి చేయాలని సంకల్పించి మొదటి దశ పనులను పూర్తి చేసింది. రెండో దశ పనులు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వీటిలో 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులకు నిధులు విడుదల చేస్తే సమస్యలు తీరుతాయి.

రెండు దశల్లో ..

మండలంలో 57 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. వాటిలో 17 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను రూ.2.65 కోట్లతో అభివృద్ధి చేశారు. వీటిలో కార్పొరేట్ వసతులతో హంగులు కల్పించారు. రెండో దశలో 18 పాఠశాలల ఆధునికీకరణకు రూ.3.74 కోట్ల నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం ఊచగుంటపాలెం, కట్టుబడిపాలెం, దుండిగం, రామలింగాపురం ఉన్నత పాఠశాలల్లో ఆధునికీకరణ పనులు చివరి దశలో ఉన్నాయి. వీటిని పూర్తి చేస్తే విద్యార్థులు ఇబ్బందులు తీరుతాయి.

ఊచగుంటపాలెం ఉన్నత పాఠశాలలో నిలిచిన పనులు

దుండిగం ఉన్నత పాఠశాలలో ఆధునికీకరణ పనులు చివరిదశలో నిలిచి పోయాయి. వీటిని పూర్తి చేసేందుకు రూ.10 లక్షల వరకూ అవసరమని అధికారులు చెబుతున్నారు. వీటిని పూర్తి చేస్తే విద్యార్థులకు వసతులు సమకూరుతాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటిపై చర్యలు తీసుకోలేదు. 18 నెలలు గడుస్తున్నా పనుల్లో కదలిక లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 90 శాతం వరకు పనులు పూర్తయిన క్రమంలో వాటిని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పూర్తికి చర్యలు

- భాస్కర్, ఎంఈవో

మండలంలో 18 పాఠశాలలకు సంబంధించిన పనులు నిలిచిపోయాయి. నిధుల విషయమై ఇబ్బందులు లేవు. అధికారులతో చర్చించి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

విద్యార్థులకు క్రమశిక్షణతో బోధన

ఉదయగిరి, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని ఎంఈవో వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని ఆర్లపడియ మెయిన్ ప్రాథమిక పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను, పాఠశాల దస్త్రాలను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి రుచి చూశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అమరావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువూ.. నడతా ముఖ్యమే

వరికుంటపాడు, న్యూస్‌టుడే: చిన్న వయసు నుంచే చదువుతోపాటు మంచి నడవడిక తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలని పామూరు మానవతా సంస్థ అధ్యక్షులు వెండిదండి వెంకటేశ్వరరెడ్డి సూచించారు. మండలంలోని నార్త్ కొండాయపాలెం, పెద్దిరెడ్డి పల్లె జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు సోమవారం నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసంపై మానవతా సంస్థ ఆధ్వర్యంలో తరగతులు నిర్వహించి అవగాహన కల్పించారు. గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన 17 మంది విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు రంగారెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రవి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

పదోతరగతి విద్యార్థుల పరీక్షల ఫీజు చెల్లింపు

సీతారామపురం, న్యూస్‌టుడే : మండలంలోని నాలుగు ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాల, గౌతమి ప్రైవేటు ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదోతరగతి విద్యార్థుల పరీక్షల ఫీజును మండల తెదేపా అధ్యక్షుడు చింతల శ్రీనివాసులు చెల్లించారు. 241 మంది విద్యార్థులకు రూ.36,125 నగదును ఎంఈవో మస్తాన్‌వలికి అందజేశారు. కార్యక్రమంలో మండల తెదేపా ప్రధాన కార్యదర్శి సుమన్, మండల తెలుగు యువత అధ్యక్షుడు వికాస్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

నగదు అందజేస్తున్న తెదేపా నాయకులు

విద్యుత్తు శాఖ డీవైఈఈకి సన్మానం

ఉదయగిరి, న్యూస్‌టుడే : స్థానిక కార్యాలయంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విద్యుత్తు శాఖ ఉదయగిరి సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కె.సుధీర్‌చౌదరిని పట్టణవాసులు సోమవారం సన్మానించారు. రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్తు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు దస్తగిరి అహ్మద్, రామిరెడ్డి, జాఫర్ అహ్మద్, షంషీర్, సలీం, రాజా పాల్గొన్నారు.

(c) eenadu

గృహాలు నిర్మించినా బిల్లులు మంజూరు కాలేదా..!

ఈనాడు మీతోడు

బుచ్చిరెడ్డిపాళెం పురపాలక పరిధితోపాటు రేబాల, దామరమడుగు, మినగల్లు, పంచేడు, సాల్మానాంబాపురం, జొన్నవాడ, పెనుబల్లి, కళాయకాగొల్లు, రెడ్డిపాళెం తదితర ప్రాంతాల్లో అర్హులైన లబ్ధిదారులకు నూతన గృహాలు మంజూరు చేయడం లేదా..? నిర్మించిన వాటికి బిల్లులు మంజూరు కావడం లేదా..? గుత్తేదారులు సగం ఇళ్లు కట్టి వదిలేశారా..? కాలనీల్లో వసతులు సమకూర్చలేదా..? ఈ సమస్యలను నేరుగా గృహ నిర్మాణశాఖ ఏఈ కేసీ పెంచలయ్య దృష్టికి తీసుకురావచ్చు. ఇందుకోసం 'ఈనాడు- మీతోడు' ఆధ్వర్యంలో డయల్‌యువర్ ఏఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. లబ్ధిదారులు తమ సమస్యలు, వినతులు, ఫిర్యాదులకు దిగువ నంబరుకు ఫోన్ చేసి తెలియజేయొచ్చు.

తేదీ : 25-11-2025 (మంగళవారం)
సమయం : ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య

ఫోన్ నంబర్ 70939 30978

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

చేజర్ల, న్యూస్‌టుడే: స్వయంఉపాధి రుణాలను సద్వినియోగం చేసుకుంటే కుటుంబాల ఆర్థికస్థితి మెరుగుపడుతోందని సెర్ప్ ఎసెట్ వెరిఫికేషన్ మానిటరింగ్ అధికారి విమల తెలిపారు. మండలంలోని గ్రామాల్లో ప్రధానమంత్రి జీవనోపాధుల కింద మహిళలకు మంజూరైన రాయితీ యూనిట్లను ఆమె పరిశీలించారు. డీపీఎం మధుసూదన్, ఏపీఎం సుజీవన, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: టీపీగూడూరు మండలంఇస్కపాలెంలో రోడ్డు పక్కనే వ్యర్థాలు వేస్తున్నారు. - **రామకృష్ణ**
సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో**

? అనంతసాగరం మండలం గోగులపల్లిలో డ్రైనేజీ వ్యవస్థ లేక ఇళ్లల్లో నుంచి వచ్చే మురుగు రోడ్లపై పారుతోంది. **-రాఘవయ్య**
✓ డ్రైనేజీ నిర్మాణాల కోసం అధికారులకు నివేదించాం. **- తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి**
? ఏఎస్‌పేట మండలం గుంపర్లపాడులో పాఠశాల, వాటర్ ట్యాంకు వద్ద వ్యర్థాలు, పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా ఉంది. **- మీరాసాహెబ్**
✓ చెత్త, పిచ్చి చెట్లను తొలగించి సమస్య పరిష్కరిస్తాం. **- ప్రకాశ్‌రావు, పంచాయతీ కార్యదర్శి**
? పొదలకూరురూరల్ పరిధిలో ముత్యాలపేటలో తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరింది. **- హరి**
✓ నూతన ట్యాంకు నిర్మిస్తాం. **- రమేశ్, ఏఈ**
? సంగం మండలం చెన్నవరప్పాడు ఎస్టీ కాలనీకి వెళ్లే మార్గంలో వర్షపు నీటి నిల్వతో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. **- వెంకయ్య**
✓ వెంటనే అక్కడ నీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటాం **- ప్రవీణ, పంచాయతీ కార్యదర్శి**
? బుచ్చిరెడ్డిపాళెం పురపాలక సంఘంలోని తొమ్మిదో వార్డు నాల్గో వీధిలో స్తంభానికి ఉన్న దీపం వెలగడం లేదు. **రమేశ్, స్థానికుడు**
✓ వీధిదీపాలు వేయిస్తాం. **- బాలకృష్ణ, కమిషనర్**
? తోటపల్లిగూడూరు మండలం మల్లికార్జునపురం వద్ద పారుదల కాలువలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. **- పి.రమేశ్, స్థానికుడు**
✓ చర్యలు తీసుకుంటాం. **- అలీ, ఏఈ**

అధ్వానంగా జగన్నాథరావుపేట -ప్రియదర్శిని నగర్ రోడ్డు

ప్రతిపాదనల్లోనే అభివృద్ధి..
క్షేత్రంలో దుస్థితి

ఆత్మకూరులో కరవైన వసతులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు పురపాలకంలో మౌలిక వసతులు కరవయ్యాయి. ఏళ్లుగా అంతర్గత రోడ్లు అభివృద్ధికి నోచుకోవడం లేదు. మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వస్తూనే వీటి పరిష్కారానికి ప్రతిపాదనలు పంపారు. కానీ ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం పట్టణ పరిధిలో 32 వేలు పైనే జనాభా ఉంది. శివారు ప్రాంతాల్లో సక్రమంగా డ్రైనేజీ వ్యవస్థ లేదు. రోడ్లు లేవు. చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిలుస్తోంది.

ఎక్కడెక్కడంటే..

పురపాలిక పరిధిలో 120 కిలోమీటర్లు పైనే రోడ్లు ఉన్నాయి. పలు చోట్ల గుంతలతో దర్శనమిస్తున్నాయి. ఇబ్బందికరంగానే వాహనదారులు రాకపోకలు చేయాల్సి వస్తోంది. పట్టణంలోని టి. ముస్తాపురం, నరసాపురం, వెంకట్రావుపల్లి, పేరారెడ్డిపల్లి, జగన్నాథరావుపేట, లక్ష్మణరావుపల్లి, ఉలవదిబ్బ, ఎస్‌ఎస్సార్‌కాలనీ, వందూరుగంట, అనంతరాయునిఏని మార్గం, తదితర ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. డ్రైనేజీలు పూడికతో నిండిపోయాయి. నీరు ముందుకు కదలని పరిస్థితి ఉంది.

❖ అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, పూడికతీత పనులు, మరమ్మతులకు సంబంధించి రూ.7కోట్లు అందుబాటులోకి వచ్చాయి. పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రావాల్సి ఉంది అని కమిషనర్ గంగాప్రసాద్ తెలిపారు.

ఈసారైనా ధర దక్కేనా..?

ఊపందుకున్న పొగాకు నాట్లు

మర్రిపాడు, (ఆత్మకూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: వాణిజ్య పంటగా ఉన్న పొగాకును లాభనష్టాలతో సంబంధం లేకుండా పెద్దఎత్తున రైతులు సాగుచేస్తున్నారు. డి.సి. పల్లి పొగాకు బోర్డు పరిధిలో సాగునీటి కాలువలు లేకపోవడంతో ఎక్కువ మంది వర్షాలపైనే ఆధారపడుతున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు.

ఏ మాత్రం తగ్గడం లేదు

ఈ ఏడాది బోర్డు పరిధిలో ఇప్పటికే సుమారు 4324 హెక్టార్లలో నాట్లు పడ్డాయి. 1807 మంది 1490 బ్యారన్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రస్తుతానికి 5.5 మిలియన్ కిలోల మేర పండించాలని బోర్డు నిర్దేశించినా. ఏ మాత్రం తగ్గడంలేదు. గతేడాది 1738 బ్యారన్ల పరిధిలో 2081 మంది 5861 హెక్టార్లలో 7.47 మిలియన్ కిలోలు సాగుచేయాలని అనుమతి ఇవ్వగా రైతులు సుమారు 11 మిలియన్ కిలోల వరకు పండించారు. ప్రారంభంలో గరిష్ఠ ధర కిలో రూ.280 పలకగా, పంట కాలం చివరిలో గరిష్ఠంగా రూ.345 పలికింది. కనిష్ఠంగా రూ.100, సరాసరి కిలో రూ.219.92 పలికింది. 169 రోజుల పాటు వేలం జరగడంతో నిల్వ ఉంచిన పంట నాణ్యతతోపాటు, తూకం తగ్గడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. బ్యారన్‌కు రూ.1.5 లక్షల వరకు నష్టం వచ్చినట్లు చెబుతున్నారు. ఈ సరైనా మంచి ధరలు రావచ్చు అనే ఆశతో నాట్లు వేస్తున్నారు.

పొగాకు నాట్లు వేస్తున్న కూలీలు

పెరిగిన డిమాండ్

మొంథా తుపాను ప్రభావంతో నారుమళ్లు దెబ్బ తినడంతో ఒక్కసారిగా భారీ డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం 6 వేల మొక్క (మూట) రూ. 4 వేలు పలుకుతుంది. దీనికి తోడు ఈ ఏడాది ఎకరం భూమి కౌలు రూ.15 నుంచి 20 వేల వరకు పలుకుతోంది. భూమి స్వభావం, నీటి వసతి బాగున్న చోట రూ. 25 వేల వరకు ఉంది. బ్యారన్ లీజు సైతం రూ.1.50 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు ఉంది.

అనుమతి మేరకు పండించాలి

పొగాకు బోర్డు అనుమతి మేరకే రైతులు పొగాకును పండించాలి. ధరలు వచ్చే ఏడాది ఉంటాయని చెప్పలేం. అంతర్జాతీయంగా డిమాండ్ లేకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. పరిమితికి లోబడి నాణ్యమైన పొగాకు పండించాలి. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి.

జి.రాజశేఖర్, వేలం నిర్వహణాధికారి, డీసీపల్లి

కార్యక్రమంలో పాల్గొన్న మాలధారులు, భక్తులు

భక్తిశ్రద్ధలతో పడిపూజా మహోత్సవం

సంగం, న్యూస్‌టుడే: సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని స్వామి అయ్యప్ప మందిరం వద్ద ఆదివారం రాత్రి పడి పూజా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. స్వామి మాలాధారులు, ఉత్సవ మూర్తులను పుష్పాలంకారం చేశారు. మాలాధారులు భజనలు చేశారు. స్వామి వారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శివాలయం హుండీ ఆదాయం లెక్కింపు

పొదలకూరు : పట్టణంలోని కామాక్షితాయి రామలింగేశ్వరస్వామి ఆలయంలోని హుండీ ఆదాయాన్ని సోమవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్, ఆలయ ఈవో ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. గత ఎనిమిది నెలలకు గాను రూ.2,29,368 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

తోటపల్లిగూడూరు: తోటపల్లిగూడూరులో ప్రస్తుత కామాక్షిదేవి సమేత ఐశ్వర్యేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా మాజీ సర్పంచ్ మద్దెల నీలిమ నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆమె ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

క్రీడా దుస్తుల పంపిణీ

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ పూర్వపు విద్యార్థులు

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయురాలి జ్ఞాపకార్థం ఇందుకూరుపేట మండలం నరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థులు.. ప్రస్తుతం అక్కడ విద్యనభ్యసిస్తున్న 30 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. చదువుతో పాటు క్రీడల్లో సమానంగా రాణించాలని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, పీడీ ముజీర్ వారిని అభినందించారు.

హాస్టల్ వార్డెన్‌పై విచారణ

కలువాయి, న్యూస్‌టుడే: కలువాయిలోని ఎస్సీ బాలుర, బాలికల వసతిగృహాల వార్డెన్‌పై సోమవారం ఏఎస్‌డబ్ల్యూవో సుధారాణి విచారణ చేపట్టారు. ఇటీవల ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో వసతిగృహాల వార్డెన్ జడ్పీ ప్లస్ పాఠశాలకు వెళ్లి విద్యార్థుల హాజరు తీసుకుంటూ జడ్పీటీసీ సభ్యుడు అనిల్ కుమార్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. ఈ విషయంపై ఏఎస్‌డబ్ల్యూవో విచారణ చేపట్టారు. హైస్కూల్‌కు వెళ్లి ప్రధానోపాధ్యాయులు అబ్బాస్ అలీని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ విచారణను ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

సంగం బస్టాండు కూడలి వద్ద వర్షపు నీటితో ఏర్పడిన పెద్ద గుంతను సోమవారం ర.భ.శాఖ ఆధ్వర్యంలో వెట్ మిక్స్‌తో పూడ్చారు. ఈనెల 23న ఈనాడులో 'రోడ్డుపై మడుగు.. వేసేదెలా అడుగు' అనే శీర్షికతో చిత్రవార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు మరమ్మతులు చేపట్టారు. నీరు నిల్వకుండా ముందుకు సాగేలా రహదారి పక్కనే తాత్కాలికంగా కాలువ ఏర్పాటు చేశారు. **- న్యూస్‌టుడే, సంగం**

నిలిచిన నిర్మాణం



సోమశిలలో అసంపూర్తిగా నిలిచిపోయిన సచివాలయ భవన నిర్మాణం అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డాగా ఉంటోంది. రాత్రి వేళల్లో మద్యం తాగి కేకలు వేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని సర్వత్రా కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అనంతసాగరం**

చెత్త.. ప్రజలకు వెత

నరుకూరు పంచాయతీ పరిధిలో ప్రధాన రోడ్డు పక్కనే చెత్త నిల్వ చేస్తున్నారు. కూడలిలోని వ్యాపార దుకాణాల్లో వాడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు స్థానికులు ఇళ్లలోని చెత్తను అక్కడే పడేస్తున్నారు. ఇదే మార్గంలో నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగించే వాహనదారులు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు**

రహదారి ఛిద్రం.. రాకపోకలకు కష్టం

సంగం నుంచి గాంధీ జనసంఘం వరకు సంగం ఆనకట్ట నుంచి కనిగిరి జలాశయం ప్రధానకాలువ గట్టు మీదుగా వెళ్లే రోడ్డు మార్గం ధ్వంసమై అడుగుకో గుంత మాదిరిగా మారింది. వర్షపునీరు అందులో చేరడంతో రాకపోకలు కష్టతరంగా మారాయి. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సంగం**

In the Court of the IIIrd Addl. Junior Civil Judge: Nellore
O.S. No. 1029 / 2023
P. Nanda Kishore - Plaintiff
Vs.
Sk. Shafi - Defendant
Notice to Defendant
Sk. Shafi
S/o. Basha, resident of D.No. 3/76, Near Water Tank, Peddapadugupadu, Kovur, Kovur Mandalam, SPSR Nellore District.
పై నెంబరున [illegible] 10-12-2025కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
షేక్ మహబూబ్ బాషా, B.Com., B.L.,
వాది తరఫు అడ్వకేట్, నెల్లూరు

ప్రతిభ చూపారు.. విజేతలుగా నిలిచారు

కోవూరు, ఆత్మకూరు, మనుబోలు లోని పలు పాఠశాలల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాసం పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. **- ఆత్మకూరు, కోవూరు, మనుబోలు**

బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రధానోపాధ్యాయిని అమూల్య తదితరులు

మనుబోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో మురళి(ప్రథమ), హంసజా(ద్వితీయ), అనుస్మిత(తృతీయ) స్థానాల్లో నిలిచారు. ప్రధానోపాధ్యాయిని అమూల్య కుమారి బహుమతులు ప్రదానం చేశారు.

బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

ఆత్మకూరు పట్టణం లక్ష్మణరావుపల్లిలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో కె.హలసం ప్రణిత (ప్రథమ), ఎ.సుజిత(ద్వితీయ), ఎస్.ధరణి(తృతీయ) విజేతలుగా నిలిచారు. వారికి ప్రధానోపాధ్యాయులు కె.సురేష్, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

విజేతలతో ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు

ఆత్మకూరులోని శ్రీమన్నారాయణ ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించగా బి.రమ్యశ్రీ(ప్రథమ), బి.లాస్యశ్రీ (ద్వితీయ), ఎన్.కిరణ్(తృతీయ) విజేతలుగా నిలిచారు. వారికి ప్రిన్సిపల్ ఎ.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కల్పన, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, శ్రీలత, లక్ష్మిలు బహుమతులు అందజేశారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

కోవూరులోని జేబీఆర్ జడ్పీ హైస్కూల్‌లో పోటీల్లో పి.వెంకట్(ప్రథమ), సీహెచ్.శ్రీకృష్ణ(ద్వితీయ), ఎన్.కార్తికేయ(తృతీయ) విజేతలుగా నిలిచారు. వారికి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రాహేలమ్మ, తెలుగు ఉపాధ్యాయులు శ్రీభాను, అనుసూయమ్మ బహుమతులు అందజేశారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

లేగుంటపాడులో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

వెంకటాచలం, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. కనుపూరులో సోమవారం 'రైతన్నా నీకోసం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలోని పొలాలను పరిశీలించి.. అన్నదాతలతో ముఖాముఖి నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకం గురించి వైకాపా నాయకులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వ్యవసాయ మంత్రిగా పని చేసిన కాకాణి రైతులను పట్టించుకోలేదని విమర్శించారు. కోవూరు: అన్నదాతల అభ్యున్నతే ధ్యేయమని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. లేగుంటపాడులో 'రైతన్నా మీకోసం' కార్యక్రమం పాల్గొన్నారు. కరపత్రాలు అందజేశారు. అనంతరం నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో ఆమె నివాసంలో గృహనిర్మాణశాఖ, కోవూరు నియోజకవర్గంలోని ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం అందేలా చూడాలన్నారు. సంగం, చేజర్ల, ఆత్మకూరు, ఏఎస్‌పేట, మనుబోలు, పొదలకూరు, టీపీగూడూరు: ఆత్మకూరు పుర పరిధిలోని ముస్తాపురం, వెంకట్రావుపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నాయకులు చంద్రారెడ్డి, పులిమి శైలాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు. చేజర్ల, మనుబోలు, సంగంలో తెదేపా నాయకులు పంచసూత్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. తోటపల్లిగూడూరు, సైదాపురం, పొదలకూరు, ఏఎస్‌పేట మండలాల్లో వ్యవసాయ అధికారులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

ఆత్మకూరులో ప్రచారం చేస్తున్న తెదేపా నాయకులు

రెచ్చగొట్టే వ్యాఖ్యలు తగదు

పొదలకూరు, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని అసభ్యకర పదజాలంతో, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం పొదలకూరు తెదేపా శ్రేణులు పెద్దఎత్తున పోలీసు స్టేషనుకు చేరుకుని సీఐ శివరామకృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. మండల తెదేపా అధ్యక్షులు మస్తాన్ బాబు, నాయకులు కలిచేటి ప్రభాకర్ రెడ్డి, వెంకటరత్నంనాయుడు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం సమానంగా ఇవ్వాలి

పొదలకూరు : ఒకే సర్వే నంబరులో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం వేరు, వేరుగా ఇస్తామని అధికారులు చెపుతున్నారని ఇది ఎక్కడి న్యాయమంటూ నరసింహకండ్రిక గ్రామ రైతులు వాపోయారు. సోమవారం తహసీల్దారు శివకృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కడప జిల్లా బద్వేల్ నుంచి కృష్ణపట్నం పోర్టు వరకు నిర్మించే 67 నంబరు జాతీయ రహదారి కోసం సర్వే చేస్తున్నారు. నరసింహకండ్రికకు చెందిన రైతులకు కనుపర్తి గ్రామ రెవెన్యూలో ఒకే సర్వేలో ఉన్న పొలంలో కొంత మంది రైతులకు రెండున్నర ఏళ్ల క్రితమే ఎకరానికి రూ.7.90 లక్షలు చెల్లించారు. ప్రస్తుతం రూ.5.80 లక్షలు ఇస్తామని చెబుతున్నారన్నారు. ప్రస్తుతం మార్కెటులో ఎకరం భూమి భారీగా పలుకుతుందని ఆ మేరకు పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

In The Court of The 1st Addl. Junior Civil Judge: Nellore
E.P.No. 186/2019
O.S.No. 619/2018
Vellapalem Jaya Lakshmi
W/o Masthan Reddy - DHR/Plaintiff
Vs
Yellasiri Subrahmanyam
S/o Masthanaiah - JDR/Defendant
వేలం ప్రకటన
పై నెంబరున డిక్రీ హోల్డర్ డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు జె.డి.ఆర్ తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని తే **08-12-2025**దిన ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటలలోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలం పాట జరుపబడును. కావున పాటదారులు ఎవ్వరైనా వేలంపాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.
E.P.SCHEDULE
ITEM No.1: SPSR Nellore District - Gudur District Registration- Muthukur Sub Registration- Muthukuru Gram Panchayath- Muthukur Village- Muthukur Mandal- Puttaladoruvu- Near Door No.1-107- patta No.114- Dry land- an extent of Acs.7-32 cents in Sy. No.494 and Acs. 7-60 cents in Sy. No.495 of Muthukur- Total Acs. 14-92 cents- out of it Acs. 6-08 cents- laid into House site plots- approved by Muthukur Panchayath in P.R. No.20/71- and once again approved by Muthukur Panchayath- in P.R. No.29 dated 12-6-2008- Renewed Layout plan- "Sri Balaji Port City"- Plot No.49- measuring 33 1/3 ankanams, **Bounded by: East:** Plot No.68, **South:** Plot No.51, **West:** Layout Road, and **North:** Land of Machireddy Bhakthavatsala Reddy, with all its easmentary rights.
DHR Value of Rs: 3,00,000/-
Amin Value of Rs: 7,00,000/-
Market Value of Rs: 5,33,320/-
ITEM No.2: SPSR Nellore District - Gudur District Registration- Muthukur Sub Registration- Muthukuru Gram Panchayath- Muthukur Village- Muthukur Mandal- Puttaladoruvu- Near Door No.1-107- Patta No.114- Dry land- an extent of Acs.7-32 cents in Sy. No.494 and Acs. 7-60 cents in Sy. No.495 of Muthukur- Total Acs. 14-92 cents- out of it Acs. 6-08 cents- laid into House site plots- approved by Muthukur Panchayath in P.R. No.20/71- and once again approved by Muthukur Panchayath- in P.R. No.29 dated 12-6-2008- Renewed Layout plan- "Sri Balaji Port City"- Plot No.50- measuring 33 1/3 ankanams, **Bounded by: East:** Plot No.67, **South:** Plot No.51, **West:** Layout Road, and **North:** Plot No.49, with all its easmentary rights.
DHR Value of Rs: 3,00,000/-
Amin Value of Rs: 7,00,000/-
Market Value of Rs: 5,33,320/-
NB: Subject to Mortgage
N.శ్రీనివాసులురెడ్డి, B.Sc., BL.,
డిక్రీ హోల్డర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

ఆర్థిక సాయం అందజేత

ఆత్మకూరు : పట్టణంలో ఇటీవల మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలను సోమవారం శ్రీసాంబశివ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఒకటో వార్డులో మేకల సుబ్బరామయ్య, ఆరేటి అంకయ్య, 13వార్డులో కొండా చిన కొండమ్మ, 22వార్డులో దావా పరంధామయ్య, 23వార్డులో నంబూరు లక్ష్మమ్మ ఇటీవల మృతి చెందారు. ఒక్కో కుటుంబానికి రూ.పదివేల ఆర్థికసాయం అందజేశారు.

సీఆర్సీలో దీపా వెంకట్ పుట్టినరోజు వేడుకలు

వెంకటాచలం, న్యూస్‌టుడే: స్వర్ణభారత్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ 51వ జన్మదిన వేడుకలు మండలంలోని దివ్యాంగుల ప్రాంతీయ సంయుక్త కేంద్రం (సీఆర్సీ)లో డైరెక్టర్ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం జరిగాయి. ట్రస్టు ద్వారా గ్రామీణ ప్రజలకు, రైతులకు, యువత, అనాథలకు ఆమె చేస్తున్న సేవలను కొనియాడారు. కేకు కోసి పంచిపెట్టడంతోపాటు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగుల కుటుంబ సభ్యులకు, ఉద్యోగులు, విద్యార్థులకు, సిబ్బందికి మొక్కలు పంపిణీ చేశారు.

సర్వేయరుపై చర్యలు తీసుకోవాలి

తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్‌లో సమస్యపై అర్జీ ఇస్తే సర్వే చేయకుండానే పరిష్కరించినట్లు చూపుతున్న మండల సర్వేయరుపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. వరిగొండ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై గత వారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సర్వే చేయకుండానే చేసినట్లు వాట్సాప్‌లో సందేశం పంపినట్లు తెలిపారు. సోమవారం ఈ మేరకు పీజేఆర్ఆస్‌లో జిల్లా కలెక్టరుకు వినతి పత్రం అందజేశారు.

జూదరుల అరెస్ట్

ఇందుకూరుపేట న్యూస్‌టుడే: కుడితిపాలెం పెన్నానదిలో పడవలపై జూదం ఆడుతున్న 12 మంది జూదరులను శనివారం అరెస్టు చేసిన విషయం విధితమే. ఈ దాడుల్లో తప్పించుకున్న మరో ఐదుగురిని సోమవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచినట్లు ఎస్సై నాగార్జున రెడ్డి తెలిపారు. మరో ఏడు మంది దొరకాల్సి ఉందని పేర్కొన్నారు.

కుష్ఠు నిర్మూలనకు చర్యలు

మనుబోలు, న్యూస్‌టుడే: కుష్ఠు నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలీ పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీని సోమవారం ఆయన తనిఖీ చేసి నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలించారు. మండలంలోని చెర్లోపల్లి ఎస్టీకాలనీని సందర్శించి ఎల్‌సీడీసీ సర్వేను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రారంభ దశలోనే కుష్ఠును గుర్తిస్తే నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వైద్యురాలు పూజిత, సీహెచ్‌వో రాజయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలువలు మింగి..
కన్నీరు మిగిల్చి!

అనుమసముద్రం పేట, న్యూస్‌టుడే: వరవ, పంట కాలువలు ఆక్రమణకు గురవడంతో ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. పొలాలకు సక్రమంగా నీరందని పరిస్థితి వచ్చింది. ఏఎస్‌పేట మండలంలో 32 చెరువులు ఉన్నాయి. వాటి కింద సాగు, మెట్ట భూములు కలిపి సుమారు పది వేల ఎకరాలున్నాయి. చెరువుల నుంచి పొలాలకు నీరందించే వరవ కాలువలు అన్యాక్రాంతమయ్యాయి. ప్రధానంగా పెద్దబ్బీపురంలో చెరువు లోతట్టు భూములు, సీబీవరంలో మేత పోరంబోకు భూములు, అనుమసముద్రం, గుడిపాడు, హసనాపురం, చందలూరుపాడు, కాకర్లపాడు, గుంపర్లపాడు గ్రామాల్లో వరవ, పంట కాలువలు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి.

ఆక్రమణకు గురయిన గండువారిపల్లి పొలాలకు నీరు తరలించే కాలువ

సంవృద్ధిగా నీరున్నా..

ఇటీవల మొంథా తుపానుతో వచ్చిన వర్షాలకు చెరువులు జలకళ సంతరించుకున్నాయి. ఆక్రమణల కారణంగా పంటచేలకు నీరు వెళ్లేందుకు అడ్డంకిగా మారింది. దీనికి తోడు ఏళ్ల తరబడి పూడిక తీయకపోవడంతో చెట్లు పెరిగి దర్శనమిస్తున్నాయి. అన్నీ తెలిసినా రెవెన్యూ, జలవనరుల శాఖల అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి జలవనరులను పరిరక్షించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ యాసిన్‌ను సంప్రదించగా తమ దృష్టికి తీసుకువస్తే పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

➺ ఏఎస్‌పేట మండల పరిధిలో రాజవోలు, పొనుగోడు, సీబీవరం మీదుగా ఉత్తర కాలువ పోతోంది. దీని నుంచి నీరు తీసుకుపోయే వరవ కాలువ చౌటభీమవరం నుంచి గండువారిపల్లి వరకు సుమారు కి.మీ పొడవున ఉండగా.. చిన్నబ్బీపురంలో సమీప పొలాలు వారు ఆక్రమించడంతో గండువారిపల్లి పొలాలకు నీరు అందని పరిస్థితి వచ్చింది. దీంతో ఆ గ్రామానికి చెందిన రైతులు కొత్తగా కాలువను నిర్మించాలంటూ అధికారులు చుట్టూ తిరుగుతున్నారు.

➺ ఏఎస్‌పేట,చందులూరుపాడు గ్రామాల మధ్య ఉన్న నక్కలవాగు, బీరాపేరు వాగులను కలుపుతూ అర కి.మీ పొడవున మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్యానాయుడు సొంత ఖర్చుతో కాలువను తవ్వించారు. దీని వల్ల అనుమసముద్రంలోని 60 ఎకరాల్లో ఉన్న సీలింగ్ భూములకు నీటి సరఫరా అయ్యేది. ప్రస్తుతం కాలువ ఆక్రమణకు గురికావడంతో. . నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడింది.

జొన్నవాడ దేవస్థానం భూములకు వేలం

బుచ్చిరెడ్డిపాళెం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ మల్లికార్జునస్వామి కామాక్షితాయి అమ్మవారి ఆలయానికి సంబంధించిన భూములు, దుకాణాలకు సోమవారం వేలంపాటలు జరిగాయి. పెనుబల్లిలో ఉన్న 4.41 ఎకరాల మాగాణికి మూడు సంవత్సరాలకుగానూ. . రూ.2లక్షలు కౌలు పలికింది. దేవస్థానం ఉత్తరం వైపు ఉన్న దుకాణానికి నెలకు రూ.2,850 చొప్పున అద్దెకు పాట ఖరారైందని ఈవో వెంకట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వేలం నిర్వహణలో ఛైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ట్రస్టీలున్నారు.

జిల్లా వైద్యశాలలో ఆధార్ సేవలు

ఆత్మకూరు : జిల్లా వైద్యశాలలో మహిళా శిశు సంక్షేమశాఖ, కామన్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో శిశు ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఐదేళ్ల లోపు పిల్లలకు కొత్తగా ఆధార్ నమోదు చేస్తారని తెలిపారు. సేవలను వినియోగించుకోవాలని సీఎస్‌సీ నిర్వాహకులు వినోద్‌కుమార్ తెలిపారు.

ఉత్తరక్రియలు

ఎందరికో చేయూతగా, సహాయకారిగా ఎందరో జీవితాలలో వెలుగులు నింపిన మహనీయులు, అహర్నిశలు మా అభివృద్ధికి శ్రమించిన మనసున్న మంచి మనిషి, మా ఇంటి దైవం, మా తండ్రిగారైన శ్రీ కోడూరు రామయ్య గారు తేది 10-11-2025న సోమవారం నాడు స్వర్గస్తులైనారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలుగవలెనని భగవంతుని ప్రార్థిస్తూ... అశ్రునయనాలతో..

కీ॥ శే॥ కోడూరు రామయ్య గారు
జిల్లా SC, ST అట్రాసిటీ కమిటీ మెంబర్
విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్
Ex. MPTC, ఆత్మకూరు

ఇట్లు కుమారులు: **కోడూరు భార్గవ్, కోడూరు నవీన్**

ఉత్తరక్రియలు : తేది 26-11-2025 బుధవారం ఉదయం 10 గం॥లకు నెల్లూరు జిల్లా ఆత్మకూరు టౌన్ అరుంధతిపాలెం మెయిన్‌బజార్‌లో మా స్వగృహము నందు జరుగును. కావున బంధుమిత్రులకు పత్రికా ముఖంగా తెలియజేయడమైనది.

(c) eenadu

అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

కార్పొరేషన్‌లో 42 అర్జీలు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందుకున్న అర్జీలకు నాణ్యమైన పరిష్కారం అందించాలని నగరపాలకసంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తెలిపారు. సోమవారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌సెంటరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి.. నగరవాసుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 42 వినతులను అందుకున్నామని, నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ వేణు, ఈఈ రహంతుజానీ, మేనేజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

ఉపన్యాసంలో విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: నెల్లూరు నగరం ధనలక్ష్మీపురంలోని వీబీఆర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు 'ప్రతిభా పాటవ పోటీలు' జరిగాయి. 'విద్యార్థుల జీవితాల్లో సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస (స్పీచ్) పోటీలు నిర్వహించారు.. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని బహుమతులు సాధించారు. కె.చరణ్‌మనిత్ర ప్రథమ, జి.మహేంద్ర ద్వితీయ, జె.సాయివెన్నెల తృతీయ బహుమతులు సాధించగా.. పాఠశాల డైరెక్టర్ కె.శ్రీనివాసులు, ప్రిన్సిపల్ మాధవిరెడ్డి, ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు.

బహుమతులు సాధించిన వీబీఆర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు

వినతుల వెల్లువ

నెల్లూరు(నేర విభాగం): ఉద్యోగాల పేరుతో మోసాలు.. భర్త వేధింపులు.. ఆస్తి తగాదాలు.. వృద్ధులను పట్టించుకోవడం లేదంటూ పలువురు ఎస్పీ అజిత వేజెండ్ల ఎదుట వాపోయారు. సోమవారం పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. జిల్లా వ్యాప్తంగా 113 మంది బాధితులు సమస్యలు వివరించారు. విజయవాడకు చెందిన ఏలూరు హజరత్తయ్య పెళ్లి చేసుకుంటానని నమ్మించి తన వద్ద ఉన్న బంగారం, వెండి, రూ.6లక్షల నగదు తీసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని విజయవాడకు చెందిన మహిళ ఫిర్యాదు చేశారు. తమ పేరుతో ఉన్న ఆస్తులను రాసి ఇవ్వాలని బంధువులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని బుచ్చిరెడ్డిపాలేనికి చెందిన వృద్ధులు వాపోయారు. భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఎనిమిది నెలల నుంచి పుట్టింట్లోనే ఉంటున్నట్లు ముత్తుకూరుకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.

మొర ఆలకించండి.. పరిష్కారం చూపండి

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు అవస్థలు తెచ్చి పెడుతోంది. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. వ్యయప్రయాసలతో జిల్లా కేంద్రానికి తరలివస్తున్నారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, రైతులు ఇలా పెద్దఎత్తున తరలివచ్చి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇచ్చి న్యాయం చేయాలంటూ ఉన్నతాధికారులను వేడుకున్నారు.

పాలం ఆక్రమించారు

తోటపల్లిగూడూరు మండలం కొత్తకోడూరులో ధోబీఘాట్‌లో ఉతికిన దుస్తులు ఆరబెట్టుకునేందుకు రజకులకు 2.20 ఎకరాల భూమి ఉంది. గ్రామంలోని కొందరు దాన్ని ఆక్రమించారని రజకులు శ్రీనివాసులు, వెంకటశేషయ్య, రవి, సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. కుల వృత్తిని నమ్ముకుని బతికే తమ కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.

మూడేళ్లుగా తిరుగుతున్నా.. కనికరమేదీ

సైదాపురం మండలం అనంతమడుగు గ్రామానికి చెందిన **మద్దాలి యశోదమ్మకు** బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి కాళ్లు చేతులు పని చేయడం లేదు. మాటలు రావు. 50 శాతం అంగవైకల్యం ఉన్నట్లు అధికారులు సర్టిఫికెట్ ఇచ్చారు. అయినా ప్రభుత్వం నుంచి పింఛను రావడం లేదు. మూడేళ్లుగా అధికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు.

భూమి సాగుకు అధికారి అడ్డు

కలువాయి మండలం నూకానపల్లి గ్రామానికి చెందిన **షేక్ మస్తానయ్యకు** 6.21 ఎకరాల పొలం ఉంది. దాన్ని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కానీ మా మండల అధికారి ఒకరు ఆ భూమి సాగు చేసుకోనీయడం లేదని వాపోయారు. పొలం తనది కాదంటున్నారని, కోర్టును ఆశ్రయించగా తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని తెలిపారు.

పాసు పుస్తకం కోసం ప్రదక్షిణ

విడవలూరు మండలం ముదివర్తి జరా గాంధీనగర్‌కు చెందిన **జొన్నాదుల సుజనకు** తాడిసిలదిబ్బ ప్రాంతంలో 3.95 ఎకరాల పొలం ఉంది. అందుకు సంబంధించి 1బీ, అడంగళ్, పట్టా ఉన్నాయి. ఆమె పొలానికి సంబంధించిన పట్టాదారు ఖాతా నంబరు 400214 నోషనల్ ఖాతాలో తహసీల్దారు రాసి ఉన్నారు. నోషనల్ ఖాతా వారికి ప్రభుత్వ పథకాలు రావని చెబుతున్నారన్నారు. పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వమని ఎన్నిసార్లు అడిగినా తిప్పుకొంటున్నారని, పక్క పొలాల వారందరికీ ఇచ్చారని వాపోయారు.

రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

పథకాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రైతులకు పంటల సాగుకు అన్నదాత సుఖీభవ కార్యక్రమం ద్వారా ఇప్పటికే రెండు విడతలుగా నగదును రైతుల ఖాతాల్లో జమ చేసి వారికి పక్షపాతిగా పనిచేస్తోందని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామ పంచాయతీ, మొగళ్లపాలెంలో రైతన్న మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు.. నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ పరిధిలో రైతులకు యూరియా ఇబ్బందులు లేకుండా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, జొన్నవాడ పూరు శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ బూడిద విజయ్‌కుమార్, నెల్లూరు మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ శ్రీధర్ రెడ్డి, తెదేపా మండల కన్వీనర్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. ● మొగళ్లపాలెం గ్రామానికి చెందిన శంకరయ్య, మల్లయ్య, శీనయ్య, చెంచయ్య, పిచ్చయ్య తదితరుల 50కుటుంబాలు తెదేపాలో చేరారు. గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి సమక్షంలో తెదేపాలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ● మొగళ్లపాలెం గ్రామంలో చంద్రన్న విద్యుత్తు వెలుగులు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు.

జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలి

నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

నెల్లూరు(కలెక్టరేట్): రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.శ్రీహరిరావు కోరారు. సోమవారం కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేసి జేసీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, ఏబీసీడీలుగా వర్గీకరించాలని కోరారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించి ఓబీసీ మహిళలకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్మదాబాయ్, శైలజ, ఎస్కే సలీం, శేషయ్య, తరుణ్ సింగ్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా రక్త పూతల సేకరణ

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారిణి హుసేనమ్మ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ఫైలేరియా(బోదకాలు) నివారణలో భాగంగా జిల్లాలో నిర్దేశించిన ప్రాంతాల్లో రాత్రి పూట రక్తపూతల సేకరణకు ఫైలేరియా విభాగం సన్నద్ధమైంది. ఈ నెల 29వ తేదీ వరకు పెద్దఎత్తున అవగాహన కల్పించడం, రక్తపూతల సేకరణ చేయనున్నారు. అందులో భాగంగా సోమవారం నగర పరిధిలోని ఎన్‌బీటీ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెంగళరావు నగర్‌లో మలేరియా జిల్లా నివారణ అధికారిణి హుసేనమ్మ పర్యవేక్షణలో అవగాహన కార్యక్రమంతోపాటు రక్తపూతల సేకరణ జరిగింది. ఆమె మాట్లాడుతూ.. ఆడ క్యూలెక్స్ దోమ ద్వారా ఫైలేరియా వస్తుందని, దోమలు మురుగునీటి నిల్వల్లో పెరుగుతాయని తెలిపారు. వాటి నివారణకు ఇంటి ఆవరణాల్లో నీటి నిల్వలు లేకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి రీనా భారతి, పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి, ఫైలేరియా యూనిట్ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 26, 27 తేదీల్లో కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులను వార్డు సచివాలయ కార్యదర్శులతో పాటు కళాశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వైవో నందన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహించే తరగతుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లిష్ లెర్నింగ్ స్కిల్స్, టీం స్పిరిట్, కెరియర్ గైడెన్స్ తదితర అంశాలపై శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉద్యోగమేళాలతో ఉపాధి అవకాశాలు

పలు సంస్థల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ కోర్సులు పూర్తి చేస్తున్న విద్యార్థులు ఉన్న ఉద్యోగ అవకాశాలను వినియోగించుకొని ఆర్థికంగా స్థిరపడాలని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వినయ్ పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు, గూడూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉద్యోగ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో మరో డైరెక్టర్ డాక్టర్ దత్తాత్రేయశర్మ, ప్రిన్సిపల్స్ కె.విశ్వక్‌సేనారెడ్డి, రవిప్రసాద్, ప్లేస్‌మెంట్ అధికారి రాజేష్‌రెడ్డి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు నేత్రదానం

నెల్లూరు(మార్కెట్ సెంటర్): సైదాపురం మండలానికి చెందిన రిషీద్‌కుమార్ అనారోగ్యంతో నెల్లూరులో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. ఆయన నేత్రాలను కుటుంబసభ్యులు నెల్లూరు ప్రభుత్వ హాస్పిటల్‌కు దానం చేశారు. కార్నియా రికవరీ స్పెషలిస్ట్ సునీల్ నేత్రాలు సేకరించి కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ అందజేశారు.

ఉద్యోగాలు కల్పించాలని వినతి

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: తెలుగుగంగ భూ నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలనిభాజపా నేత మిడతల రమేష్ కోరారు. నెల్లూరులో తెలుగు గంగ ఎస్ఈ సుబ్రహ్మణ్యేశ్వరశర్మను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. భాజపా నాయకులు రాజేశ్వరి, సుబ్బారెడ్డి, లక్ష్మణరావు, బాలాజీ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు ఎంపిక

ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలో కేఎన్ఆర్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయప్రకాష్ తెలిపారు. సోమవారం మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థి ఎస్. తనీష్ సూర్య, 9వ తరగతి విద్యార్థి మహేంద్ర, 8వ తరగతి విద్యార్థిని ఎస్.జ్యోష్ణవి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

అయ్యప్పస్వామికి క్షీరాభిషేకం

అయ్యప్పస్వామికి సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. నెల్లూరు వేదాయపాలెంలో కొలువుదీరిన శ్రీ అయ్యప్ప దేవాలయంలో కేరళ సంప్రదాయం ప్రకారం మండల పూజలు జరుగుతున్నాయి. అందులో భాగంగా ముందుగా గణపతి హోమం, క్షీరాభిషేకం నిర్వహించారు. అర్చకుల పడిక ర్ద్వార దీపం పూజలు చేపట్టారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

కల్వర్టు అధ్వానం.. రాకపోకలకు అంతరాయం

నెల్లూరు నగరం పొదలకూరురోడ్డులోని ప్రగతినగర్ అయిదో వీధి అడ్డరోడ్డులో కాలువపై నిర్మించిన కల్వర్టు అధ్వానంగా తయారైంది. సగం వరకు పగిలిపోవడంతో ఏ మాత్రం ఆదమరిచినా వాహనదారులు కాలువలో పడే ప్రమాదం ఉంది. ఇక్కడ రోడ్డు కూడా కుంగి పగిలిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

శునకాలతో భయం

నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం ఆవరణలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఇక్కడ రాకపోకల సమయంలో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవడం లేదని నగరవాసులు అంటున్నారు. ఇప్పటికైనా దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతిసెంటర్)

గుంతలతో ప్రమాదం

నగరంలోని మాగుంట లేఅవుట్ రవీంద్రరెడ్డి నగర్ నుంచి డీమార్ట్‌కు వెళ్లే రోడ్డుపై ఉన్న గుంతలు ఇటీవలి వర్షాలకు పెద్దవిగా మారాయి. ఇది నిత్యం ప్రజలతో రద్దీగా ఉంటుంది. గుంతలు పడడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతిసెంటర్)

నిరవధిక సమ్మెకు సిద్ధం

నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికుల సమస్యలను ఈనెల 30వ తేదీలోపు పరిష్కరించకుంటే విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేపడతామని సీపీఎం నగర, రూరల్ కార్యదర్శులు కత్తి శ్రీనివాసులు, కొండా ప్రసాద్ స్పష్టం చేశారు. సోమవారం నగరపాలకసంస్థ కార్యాలయం ఎదుట 21వ రోజు మున్సిపల్ కార్మికులు ఆందోళన చేపట్టారు. ర్యాలీగా వెళ్లి డిప్యూటీ కమిషనర్ చెన్నుడుకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ 21 రోజులుగా గేటు వద్ద శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నా.. అధికారులు, పాలకులు పట్టించుకోలేదని వాపోయారు. నాయకులు పెంచలనరసయ్య, సుధాకర్, మాలకొండయ్య, అశోక్, శ్రీనివాసులు, వజ్రమ్మ, కొండమ్మ, భాగ్యమ్మ, కామాక్షమ్మ, సలోమి తదితరులు పాల్గొన్నారు.

ఆటో చోరీపై ఫిర్యాదు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: మనుబోలు మండలం కాగితాలపూరు ప్రాంతానికి చెందిన అలీ ఆటోడ్రైవరుగా పనిచేస్తున్నారు. ఈ నెల 22న నెల్లూరు వెంకటరమణ హోటల్‌లో టిఫిన్ చేసేందుకు వచ్చారు. ఆటోను హోటల్ బయట పార్కింగ్ చేసి లోనికి వెళ్లగా... గుర్తుతెలియని దుండగులు అపహరించుకెళ్లారు. బాధితుడు సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముత్తుకూరు మార్గం.. అవస్థలమయం

న్యూస్‌టుడే, నెల్లూరు (మార్కెట్ సెంటర్)

నెల్లూరు నగరం- ముత్తుకూరు మార్గంలో పలు సమస్యలు తిష్ఠ వేశాయి. హరనాథపురం నుంచి అపోలో హాస్పిటల్ సెంటర్ వరకు రహదారి అధ్వానంగా తయారైంది. అడుగడుగునా గుంతలు ఉండడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ముత్తుకూరు మార్గం వేలాది వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటోంది. ఈ మార్గంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. దీంతో నెల్లూరు వైపు వచ్చే మార్గంలో హరనాథపురం వద్ద కొంత దూరం ఓ వైపు మాత్రమే రాకపోకలు సాగుతున్నాయి. అడుగడుగునా గుంతలు ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. హాస్పిటల్స్‌కు వెళ్లే రోగులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగించే ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. పెద్ద పెద్ద గుంతలు కూడా ఉండటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ట్రాఫిక్ రద్దీ సమయంలో ద్విచక్రవాహనదారులు పడి గాయాలపాలవుతున్నారు. వర్షాకాలంలో వీటిలో నీరు చేరుతుండటంతో ప్రమాదాలబారిన పడుతున్నారు.

ముత్తుకూరు రోడ్డుపై గుంతలు

ఆక్రమణలు

ఈ ప్రాంతంలో ముత్తుకూరు కాలువ వైపు ఆక్రమణలకు గురైంది. వాహనాలు రోడ్డు పక్కకు రావాలంటే వీలుకావడం లేదు. రోడ్డు వెంట కాలువలు పూడికతో నిండడంతో వర్షం పడితే నీరంతా రోడ్డుపైనే చేరుతోంది. దీంతో రహదారి మరింత దెబ్బతింటోంది. మార్జిన్లు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయి. అపోలో హాస్పిటల్ వద్ద మలుపు దారుణంగా మారింది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు రోజుల తరబడి సాగుతుండటంతో రాకపోకలు సాగించాలంటే అపసోపాలు పడాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. అధికారులు స్పందించి పనులు త్వరతగతిన పూర్తి చేసి, రహదారిపై గుంతలకు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వివరాలు వెల్లడిస్తున్న బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్

మద్యానికి బానిసై.. బైక్‌ల దొంగగా మారి

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: కోవూరు మండలం ఇనమడుగు గ్రామం మిక్సిడ్ కాలనీకి చెందిన గూడూరు చిరంజీవి బైక్ మెకానిక్‌గా పని చేస్తూ.. మద్యానికి బానిసై ద్విచక్రవాహనాల దొంగగా మారాడు. ఈ నెల 8న పులే బొమ్మ వద్ద రవి బైక్‌ను అపహరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు పర్యవేక్షణలో ఎస్సై విజయ్ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి సాంకేతికత ఆధారంగా నిందితుడు చిరంజీవిగా గుర్తించారు. సోమవారం ఇనమడుగు వద్ద అదుపులోకి తీసుకుని విచారించారు. ఏడు బైకులు దొంగిలించినట్లు నిందితుడు అంగీకరించడంతో అరెస్టు చేసి అతని వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తెలిపారు. అతడ్ని అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్, ఎస్సై, సిబ్బంది కేవీ సుధాకర్, రమేష్, వెంకట్రావు, జయరామయ్య, శివకుమార్, కానిస్టేబుళ్లు శ్రీహరి, తిరుపతి, సాయికిషోర్‌లను పోలీస్ అధికారులు అభినందించారు.

అపహరణ కేసులో నిందితుల అరెస్టు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: ఆర్థిక వ్యవహారంలో నగరంలోని బాలాజీనగర్ కొప్పరపు వారి వీధికి చెందిన సి.మహేష్ బాబును అపహరించి బెదిరించిన ఘటనలో నెల్లూరుగ్రామీణ పోలీసులు వికేష్‌తో పాటు మరో ఇద్దరిని సోమవారం అరెస్టు చేశారు. మరోసారి నేరం చేయకుండా తహసీల్దారు ఎదుట హాజరు పరిచి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.5లక్షలు చొప్పున బైండోవరు చేసుకున్నారు.

మంత్రి దృష్టికి సచివాలయ ఉద్యోగుల సమస్యలు

మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతూ సోమవారం సింహపురి జీఎస్‌డబ్ల్యూఎస్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేశారు. మంత్రి మండలి సమావేశంలో సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని ఆ కమిటీ ఛైర్మన్ మురళీకృష్ణ విన్నవించారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను మాతృశాఖకు అప్పగించి నిర్దిష్టమైన సర్వీసు రూల్స్ ఇవ్వాలని, సీనియారిటీ ఆధారంగా బదిలీలు, ఉద్యోగోన్నతులు కల్పించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సురేష్, పాండురంగ, మల్లికార్జున, సతీష్‌రెడ్డి, కామాక్షి, కోటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: సంతపేట బ్రాహ్మణవీధిలోని బీకే ఎస్/4/ఎ4 స్తంభానికి విద్యుద్దీపం వెలగడం లేదు. రాత్రి పూట చీకటిగా ఉండి.. రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. - **కె.సుబ్బయ్య, స్థానికుడు**

సమాధానం: విద్యుద్దీపాన్ని ఏర్పాటు చేస్తాం. – **ముజాహిద్దీన్, నగరపాలకసంస్థ డీఈ**

? ములుమూడి బస్టాండు కంసాలివీధిలో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. - **స్థానికులు**

✓ కాలువలను శుభ్రం చేయిస్తాం. – **డాక్టర్ కనకాద్రి, ఆరోగ్యాధికారి**

-న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పరామర్శ

ఉద్యోగిని పరామర్శిస్తున్న జోనల్ ఛైర్మన్

నెల్లూరు (రవాణా), న్యూస్‌టుడే: విడవలూరు మండలంలో బస్సుకు మరమ్మతులు చేస్తూ ప్రమాదానికి గురైన ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మస్తాన్, శివశంకర్‌ను ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సోమవారం నగరంలోని జయభారత్ ఆసుపత్రిలో పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులకు సూచించారు. వారికి అన్నివిధాల అండగా ఉంటామని తెలిపారు. కార్మికులకు ఎలాంటి సహాయం కావాలన్నా సంస్థ తరపున అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

ఎం.ఐ సినిమాస్.: స్క్రీన్. 1 కొదమ సింహం (తెలుగు), శిశు (తెలుగు) స్క్రీన్ .2 12ఏ రైల్వే కాలనీ (తెలుగు) స్క్రీన్. .3. ప్రేమంటే (తెలుగు), రాజు వెడ్స్ రాంబాయి (తెలుగు) **స్పైస్.సినిమాస్:** స్క్రీన్ 1. ప్రేమంటే (తెలుగు), రాజు వెడ్స్ రాంబాయి (తెలుగు) స్క్రీన్ 2..కొదమ సింహం (తెలుగు), ప్రేమంటే (తెలుగు), స్క్రీన్ 3. ది గర్ల్ ఫ్రెండ్ (తెలుగు), మస్తీ 4 (హిందీ) స్క్రీన్.4.. శిశు (తెలుగు, ఇంగ్లీష్) స్క్రీన్.5..12ఏ రైల్వే కాలనీ (తెలుగు) **రెయిన్ సినిమా;** స్క్రీన్..1. ప్రేమంటే (తెలుగు), సిసు : రోడ్డుటు రివెంజ్ (ఇంగ్లిష్, తెలుగు) స్క్రీన్..2.. మఫ్టీ పోలీసు (తెలుగు) ది గర్ల్ ఫ్రెండ్ (తెలుగు), ప్రేమంటే (తెలుగు) స్క్రీన్..3.. 12ఏ రైల్వే కాలనీ (తెలుగు) స్క్రీన్..4..పాంచ్ మినార్ (తెలుగు), ది ఫేస్ ఆఫ్ ధి ఫేసులెస్(2025) (తెలుగు), రాజు వెడ్స్ రాంబాయి (తెలుగు)

జాతీయ పోటీ.. ప్రతిభతో మేటి

నెల్లూరు కార్టునిస్టులకు, మహిళా కవులకు గుర్తింపు

సత్కారం అందుకున్న డి.కె.కళాశాల అధ్యాపకురాలు భారతి

న్యూస్‌టుడే, నెల్లూరు (జడ్పీ)

సింహపురి సాహితీ సేవకులు, కవులు జాతీయస్థాయిలో ప్రతిభ చూపారు. ఇందుకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వేదికైంది. అక్కడ మల్లె తీగ సాహిత్య సేవా సంస్థ సహకారంతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఈనెల 22, 23 తేదీల్లో జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించారు. పోటీల్లో పలువురు పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు.

● **కార్టునిస్టుగా రాణించి..** నెల్లూరుకు చెందిన జడ్పీ మాజీ పాలనాధికారి గుర్రం శ్రీనాథ్ ప్రత్యేక బహుమతి అందుకున్నారు. పోటీల్లో దేశవ్యాప్తంగా 45 మంది కార్టునిస్టులు పాల్గొన్నారు. వారిలో పదిమంది పురస్కారాలకు ఎంపికయ్యారు. వారిలో శ్రీనాథ్ పచ్చదనం పరిశుభ్రతపై వేసిన కార్టున్ ప్రత్యేక బహుమతి అందుకుంది.

విజయవాడ కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న నాగేశ్వరి, శ్రీనాథ్

మహిళా కవులు మేంసైతం అంటూ..

పలు రాష్ట్రాల నుంచి దాదాపు 600 మంది కవులు పోటీలకు కవితలు పంపారు. జిల్లా కవులు జాతీయస్థాయి కవులతో పోటీ పడ్డారు. పురుషుల్లో చిన్ని నారాయణ, డి.శ్రీధర్‌బాబు ఎన్. రమేష్, జి.సురేష్, మరో ఆరుగురు ప్రతిభ చూపి సత్కారం అందుకున్నారు. నెల్లూరుకు చెందిన మహిళా సాహితీ వేత్తలు పి.నాగేశ్వరి, టి.శశికళ, సుభద్రాదేవి, పి.అన్నపూర్ణ తమ కలంతో సత్తాచాటి ఆ జిల్లా కలెక్టర్, ఐ.ఆర్.ఎస్. అధికారుల ద్వారా సన్మానం పొందారు. డి.కె.మహిళా కళాశాలకు చెందిన ఆధ్యాపకురాలు భారతీ అవార్డుతో పాటు నగదు పురస్కారం అందుకున్నారు.

సమస్యలకు నాణ్యమైన పరిష్కారం

అర్జీలు స్వీకరిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు, అధికారులు

నెల్లూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: పలు సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చే అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జేసీ మొగిలి వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్వో విజయకుమార్, జడ్పీ సీఈవో శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, డ్వామా పీడీ గంగా భవానీతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

26వ వర్ధంతి

కృష్ణప్రియా!
నీవు మా నుండి దూరమై నేటికి 26 సం॥లు గడిచినా నీ అనురాగం, ప్రేమ, నీతో గడిపిన మధుర స్మృతులు మా మదిలో సజీవంగానే ఉన్నాయి. నీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ... బాధాతప్త హృదయాలతో...
కృష్ణప్రియ, B.Sc., B.Ed., టీచర్, ZPHS, ముదివర్తి
జననం: 19-7-72
మరణం: 25-11-99
భర్త: బొమ్మిశెట్టి శ్రీధర్, M.Com., Sr. అసిస్టెంట్, జిల్లా ప్రజా పరిషత్, నెల్లూరు.
కుమార్తె: ప్రణతి
మరియు కుటుంబ సభ్యులు

(c) eenadu

ఉపాధి బిల్లులు అందజేత

ఈనాడు, పుట్టపర్తి: ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు మంజూరైన నిధులను ఎట్టకేలకు అధికారులు గుత్తేదారులకు అందజేశారు. తెదేపా హయాంలో(2014-19)లో పథకం కింద అంగన్వాడీ, సంపద కేంద్రాలు, పక్కా గృహాల నిర్మాణం, ముళ్లకంపల తొలగింపు, మొక్కల పెంపకం తదితర పనులు చేపట్టారు. తరువాత వచ్చిన వైకాపా సర్కారు.. గుత్తేదారులకు బిల్లులు చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని.. కేంద్రంతో మాట్లాడి నిధులు విడుదల చేయించారు. ఇదే అదనుగా అగళి మండలంలో నిధుల స్వాహాకు పాల్పడ్డారు. తమకు రావాల్సిన బిల్లులు ఇవ్వకుండా ఏపీవో మంజునాథ్ ఇతర ఖాతాలకు మళ్లించారని బాధితులు ఆరోపించారు. దీనిపై 'ఉపాధి బిల్లులు స్వాహా' శీర్షికన అక్టోబరు 26న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. విచారణ చేసిన అధికారులు సోమవారం గుత్తేదారులను పిలిపించి బిల్లులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ఉమేశ్, ఎంపీడీఓ గంగాధర్, తెదేపా మండల కన్వీనర్ తిప్పేస్వామి, ఉపాధి అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ఫిర్యాదులు స్వీకరిస్తున్న జేసీ మౌర్యభరద్వాజ్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని జేసీ మౌర్యభరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో జేసీతోపాటు డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీవో సువర్ణ, ఎస్‌డీసీ రామసుబ్బయ్య ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యలను సంతృప్తి స్థాయిలో సత్వరం పరిష్కరించాలన్నారు. మొత్తం 93 ఫిర్యాదులు స్వీకరించారు.

సత్వరమే పరిష్కరించండి

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: బాధితుల సమస్యలను విచారించి సత్వర న్యాయం చేయాలని ఎస్పీ సతీశ్‌కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి బాధితులు తరలివచ్చి అర్జీలు ఇచ్చారు. కుటుంబకలహాలు, ఆర్థిక మోసాలు, భూ, ఆస్తి వివాదాలు వంటి 50 అర్జీలను ఎస్పీ స్వీకరించారు. బాధితుల సమస్యలపై సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్లో మాట్లాడారు.

కుడి కాలువ గేట్లకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

ముమ్మరంగా పీఏబీఆర్ గేట్ల మరమ్మతు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: పీఏబీఆర్ కుడి కాలువ గేట్ల (షట్టర్ల) మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ గేట్ల మరమ్మతు కోసం రాష్ట్ర ప్రభుత్వం అత్యవసరంగా రూ.29 లక్షలు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. టెండర్ ద్వారా గుత్తేదారును ఎంపిక చేసి పనులు చేయిస్తున్నారు. మరమ్మతు పనుల కారణంగా ఈనెల 15న కుడి కాలువకు నీరు విడుదల చేయాల్సి ఉండగా.. ఇదే నెల 25కు వాయిదా పడింది. మంగళవారం (25న) నీటి విడుదల చేసే అవకాశం లేదు. ఇక్కడి గేట్ల పనులు ప్రాథమిక దశలోనే ఉన్నాయి. మంగళవారం గేట్ల పనులు ఓ కొలిక్కి వచ్చే వీలుంది. బుధవారం (26న) కుడి కాలువకు నీరు విడుదల చేసే అవకాశాలు మెండుగా ఉన్నట్లు తెలుస్తోంది. పీఏబీఆర్ సబ్ డివిజన్-2 డీఈ కులేశ, ఏఈ ఓబిరెడ్డిల సారథ్యంలో ఈ పనులు వేగంగా సాగుతున్నాయి. దగ్గరుండి పనులు కొనసాగిస్తున్నారు. హెచ్చెల్సీ ఎస్‌ఈ సుధాకర్‌రావు మంగళవారం ఆ మరమ్మతు పనులను పర్యవేక్షిస్తారు. అక్కడే నీటి విడుదలపై స్పష్టత రానుంది. ప్రస్తుతం గేట్ల మరమ్మతు పరిస్థితులు తెలుస్తుంటే కుడి కాలువ సర్ఫేస్ గేటును పైకి లేపారు. ఈ గేటు పైకెత్తితేనే నీరు విడుదల అయినట్లే. ఈ కుడి కాలువ నీటి కోసం ఉరవకొండ, శింగనమల, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల పరిధిలో ఆయకట్టుదారులు నిరీక్షిస్తున్నారు. 40 చెరువులకు నీరు ఇవ్వాల్సి ఉంది. పంటతోటల రైతులు నెల రోజులుగా ఎదురు చూస్తున్నారు.

అనుమతి లేని భవనాలను క్రమబద్ధీకరించుకోండి

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో అనుమతి తీసుకోకుండా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం బీపీఎస్-2025 పేరుతో పథకాన్ని తీసుకొచ్చిందని, సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సూచించారు. బీపీఎస్-2025 పథక వివరాలు, నియమ, నిబంధనలను వివరించడానికి ఆయన టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఆగస్టు ఆఖరు నాటికి నిర్మాణాలు పూర్తయిన వాటికి ఈ పథకం వర్తిస్తుందని, అనుమతి లేని భవనాలతో పాటు ఒక విధమైన నిర్మాణానికి అనుమతి తీసుకొని, మరో విధంగా నిర్మించి ఉన్నా, భవనం చుట్టూ నిబంధనల మేరకు స్థలం వదలని వారున్నా చేసుకోవాలని కోరారు. క్రమబద్ధీకరణ చేసుకోని భవనాలను కూల్చివేస్తామని హెచ్చరించారు. 400 భవనాలను ఇప్పటికే సిబ్బంది గుర్తించారని, ఇంటింటా సర్వే నిర్వహించి, మిగిలిన వాటిని గుర్తిస్తామన్నారు.

వందేళ్ల పండగ.. చిరస్మరణీయంగా!

15.65 లక్షల మందికి అన్న ప్రసాదం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శత జయంతి వేడుకలను పురస్కరించుకుని ఈనెల 13 నుంచి 24 వరకు నారాయణసేవ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా 15.65 లక్షల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

సేవాదళ్ సభ్యులు 11,250

వివిధ రాష్ట్రాలకు చెందిన 11,250 మంది సేవాదళ్ సభ్యులు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందించారు.

64,530 మందికి వైద్యసేవలు

అంతర్జాతీయ వైద్యశిబిరంలో 64,530 మంది సేవలందుకున్నారు. ఈనెల 1 నుంచి 24వ తేదీ దాకా నిర్వహించిన శిబిరంలో వివిధ దేశాలకు చెందిన 65 మంది వైద్యులు, 160 మంది సిబ్బంది చికిత్సలు చేసి.. మందులు ఉచితంగా అందించారు.

ఈనాడు, పుట్టపర్తి: పుట్టపర్తిలో సత్యసాయి శతజయంతి వేడుకలు పదిరోజుల పాటు వైభవంగా నిర్వహించారు. దేశ అత్యున్నత పదవుల్లో ఉన్న వారితోపాటు దేశ, విదేశాల నుంచి దాదాపు 8.50 లక్షల మంది వేడుకల్లో పాల్గొన్నారు. బృహత్తర కార్యక్రమంలో ప్రముఖులు, భక్తులకు భద్రత, వసతి సౌకర్యాలు కల్పించడం కత్తిమీద సామే. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సజావుగా నిర్వహించారు.

- సత్యసాయి శతజయంతి ఉత్సవాలు ఈనెల 13 నుంచి 23 వరకు పుట్టపర్తిలో నిర్వహించారు. ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించింది. అంతేకాదు.. రూ.10 కోట్లు విడుదల చేసింది. సీఎం మొదలు మంత్రులు, అధికారుల వరకు కార్యాచరణలో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దాదాపు 3 రోజులు పుట్టపర్తిలోనే ఉన్నారంటే ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారో అవగతమవుతుంది.

సమన్వయంతో పనిచేశాం

- శ్యామ్‌ప్రసాద్, కలెక్టర్, సత్యసాయి

ఉత్సవాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం చక్కటి సమన్వయంతో పనిచేసింది. అందరూ అంకితభావంతో పనిచేశారు. ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిటీలను పర్యవేక్షణ చేయడానికి సాయి ఆరామంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ సత్ఫలితాలనిచ్చింది. వీఐపీల నుంచి సామాన్యుల వరకు సంతృప్తి వ్యక్తం చేశారు.

నిరంతర తనిఖీలతో..

- సతీశ్‌కుమార్, ఎస్పీ

వీఐపీలు, భక్తుల భద్రత, వారి రాకపోకలకు ఎక్కడికక్కడ ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశాం. మందిరం, ఎయిర్‌పోర్టు, హిల్‌వ్యూ స్టేడియంలలో 24 గంటలూ ప్రత్యేక దళాలను నియమించాం. నిరంతరం తనిఖీలు చేయడం సత్ఫలితాలనిచ్చాయి.

పతకాలు అందుకున్న విద్యార్థినులు

ప్రతిభావంతులకు బంగారు పతకాలు

శత జయంతి వేడుకలను పురస్కరించుకుని, ఏపీ సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. సోమవారం సాయి కుల్వంత్ మందిరంలో మహాసమాధి చెంత ఆరుగురు విద్యార్థినులకు బంగారు పతకాలను ట్రస్టీ ఆర్‌జేరత్నాకర్ సతీమణి హిమవాహిని పంపిణీ చేసి, అభినందించారు. పోటీల్లో మొత్తం 4,182 విద్యా సంస్థల నుంచి 1,73,030 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 3,360 పాఠశాలల నుంచి 1,32,136 మంది, 566 జూనియర్ కళాశాల నుంచి 25,684 మంది, 256 డిగ్రీ కళాశాలల నుంచి 15,210 మంది పాల్గొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు.

పురమిత్ర.. తూతూమంత్రమేనా?

■ యాప్‌పై అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం

ధర్మవరం పట్టణం, కదిరి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు ప్రభుత్వం పురమిత్ర యాప్‌ను రూపొందించింది. ఇందులో సమస్యలు నమోదు చేసినా, చిత్రాలు అప్లోడ్ చేసినా సంబంధిత పురపాలిక శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి. ఈ యాప్‌లో 8 విభాగాల్లో 119 రకాల సేవలను వినియోగించుకునే అవకాశం ఉంది. కానీ పట్టణ పురపాలికల్లో పురమిత్ర యాప్‌లో సమస్యలను తూతూమంత్రంగా పరిష్కరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలు యాప్‌లో తెలిపిన సమస్యను పరిష్కరించినట్లు నమోదు చేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- ధర్మవరం పట్టణంలోని పార్థసారథినగర్-1, 2 వార్డు సచివాలయ పరిధిలో పురమిత్ర యాప్‌లో రెండు నెలల్లో 31 ఫిర్యాదులందాయి. వాటిలో ఎక్కువగా చెత్త, డ్రైనేజీ కాలువలు, తాగునీటి సమస్యలు ఉన్నాయి. అయితే 28 సమస్యలను పరిష్కరించినట్లు అధికారులు యాప్‌లో నమోదు చేశారు. క్షేత్రస్థాయిలో సమస్యలు అలాగే ఉన్నాయని కాలనీవాసులు శేషు, నరేష్, నాగమణి ఆరోపిస్తున్నారు.
- పట్టణంలోని సుందరయ్యనగర్‌లో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదని, వీధిదీపాలు వెలగడం లేదని కొందరు పురమిత్ర యాప్‌లో చిత్రాలతో సహా ఫిర్యాదులు నమోదు చేశారు. సంబంధిత వార్డు, సచివాలయ అధికారులు ఆయా ప్రదేశాలకు వెళ్లి పరిశీలించారు. ఆ తరువాత వాటిని పరిష్కరించినట్లు యాప్‌లో నమోదు చేశారు. అదే సమస్యను యాప్‌లో మళ్లీ ఫిర్యాదు చేస్తే దాన్ని కంప్లీట్ చేసినట్లు అందులో పొందుపర్చడంతో కాలనీవాసులు అవాక్కయ్యారు. పట్టణంలో ప్రతి చోటా ఇదే తంతు సాగుతోంది.

మున్సిపాలిటీల్లో ఇలా..

★ ధర్మవరం పట్టణంలో పురమిత్రకు 344 ఫిర్యాదులు అందితే.. వాటిలో 321 పరిష్కరించినట్లు నమోదు చేశారు.

★ కదిరి పట్టణంలో 225 ఫిర్యాదులు ఉంటే.. 219 పరిష్కరించామని, కేవలం 6 మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చూపారు.

ఓవైపు పునరుద్ధరణ.. మరోవైపు ఆక్రమణ

● పరిగి చెరువుపై కబ్జారాయుళ్ల కన్ను

కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు

పరిగి, హిందూపురం, న్యూస్‌టుడే: జిల్లాలోనే పెద్ద చెరువుల్లో ఒకటిగా గుర్తింపు పొందిన పరిగి చెరువు అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.1.80కోట్లు కేటాయించింది. ఆ నిధులతో పునరుద్ధరణ పనులు చేస్తున్నారు. ఇదిలా ఉంటే చెరువు ఒడ్డును కొందరు స్వార్థపరులు ఆక్రమించుకుని నిర్మాణాలను చేపడుతున్నారు. దీంతో చెరువు స్వరూపమే కోల్పోతోంది.

చెరువు విస్తీర్ణం
1910 ఎకరాలు
ఆయకట్టు
2,650 ఎకరాలు

ఇష్టారాజ్యంగా..

కొన్నేళ్లుగా అక్రమార్కులు పరిగి చెరువును చెరబడుతూనే ఉన్నారు. కొందరు ఇటుకల బట్టీలు ఏర్పాటు చేసుకున్నారు.

★ మరో వైపు సీతారామపురం కాలనీ నుంచి మరవ వరకు ఉన్న చెరువు ఒడ్డున అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. ముంపు ప్రాంతాన్ని మట్టితో నింపి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. మరి కొందరు పక్కాగృహాలు నిర్మించుకున్నారు. దీంతో చెరువు విస్తీర్ణం నానాటికీ తగ్గిపోతోంది.

కట్టను ఆక్రమించుకుని నిర్మించుకున్న షెడ్డు

సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరు

సాగునీటి చెరువుల్లో అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు తగు చర్యలు తీసుకోవాలని గతంలో సుప్రీంకోర్టు నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ బుట్టదాఖలు అయ్యాయి. నీటిపారుదల, రెవెన్యూ అధికారులు హడావుడి చేసి అక్రమ నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకొంటున్నారు.

నిర్మాణాల తొలగింపునకు చర్యలు

- రమణారెడ్డి, ఇరిగేషన్ డీఈ, పెనుకొండ, హసీనాసుల్తానా, తహసీల్దార్, పరిగి.

సాగునీటి చెరువుల్లో అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు చేపట్టాం. అక్రమంగా గృహాలు, దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారో వారందరికీ నోటీసులు జారీ చేస్తున్నాం. అక్రమ కట్టడాలను తొలగించేందుకు తగు చర్యలు తీసుకుంటాం.

బాలల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

పుట్టపర్తి : బాలల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని, కిశోర వికాసం కార్యక్రమాన్ని పటిష్ఠంగా నిర్వహించాలని జేసీ మౌర్యభరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కిశోర వికాస బ్యాడ్జ్‌లను జేసీ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. జిల్లా పరిధిలో అబ్బాయిలు, యువ అమ్మాయిల కోసం "సఖి" అనే పేర్లతో గ్రూపులు ఏర్పాటు చేసి, ఆయా గ్రూపుల నాయకత్వ బాధ్యతలు చేపట్టే లీడర్లకు ఈ బ్యాడ్జ్‌లు ఇస్తామన్నారు. 11నుంచి 14 సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులను ఒక గ్రూపుగా, 15 నుంచి 18 సంవత్సరాలలోపు వారిని మరో గ్రూపుగా విభజించి, 12 అంశాలపై అవగాహన కార్యక్రమాలను వేసవి శిబిరాల రూపంలో నిర్వహిస్తారని తెలిపారు. డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓ సువర్ణ, ఐసీడీఎస్ పీడీ ప్రమీల, డీఈఓ క్రిష్టప్ప పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్ష రుసుం 30లోపు చెల్లించండి

కొత్తచెరువు, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పదో తరగతి విద్యార్థుల వివరాల్లో ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలి. ఈనెల 30వ తేదీలోపు పరీక్ష రుసుం చెల్లించాలని డీఈవో క్రిష్టప్ప, జిల్లా పరీక్షల విభాగం ఏడీ లాజర్ తెలిపారు. అపార్ ఐడీ నమోదు కాని వారు ఆధార్, అడ్మిషన్ రిజిష్టర్ ద్వారా తల్లి దండ్రుల అనుమతి పత్రంతో విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్లో సరిచేసుకోవాలన్నారు. ఒకేషనల్ టీచర్లు లేని పాఠశాలలు డీఈవో దృష్టికి తీసుకువస్తే రాష్ట్ర పరీక్షల విభాగం శాఖకు సమాచారం అందించి ఒకేషనల్ ట్రేడ్ తొలగించి జనరల్‌గా పరీక్ష రాయడానికి అవకాశం కల్పిస్తామన్నారు. 2025లో పరీక్ష తప్పినవారు మాత్రమే పరీక్షల ఫీజు చెల్లించడానికి అవకాశం ఉందన్నారు. సందేహాల నివృత్తి కోసం జిల్లాస్థాయి గ్రీవెన్సు ఏర్పాటు చేశామని కార్యాలయ పనివేళల్లో ఏడీ 70328 61795, సూపరింటెండెంట్ 94911 00431 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శిశుగృహ సిబ్బంది తొలగింపు

■ మేనేజర్‌తోసహా ఆరుగురిపై వేటు

■ పసిబిడ్డ మృతి ఘటనే కారణం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: పసిబిడ్డ మృతి చెందిన యాభై రోజుల తర్వాత శిశుగృహ ఘటన బాధ్యులపై జిల్లా యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. కేంద్రంలో పని చేస్తున్న మొత్తం ఏడుగురిని తొలగిస్తూ కలెక్టర్ ఆనంద్ సోమవారం ప్రత్యేక దస్త్రంపై ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి ధ్రువీకరించారు. శిశుగృహ మేనేజర్ దీప్తి, సోషల్ వర్కర్ లక్ష్మీదేవి, ఏఎన్ఎం, ముగ్గురు ఆయాలు, ఒక వాచ్‌మెన్‌లను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. వీరి తొలగింపుతో శిశుగృహ మొత్తం ఖాళీ అయినట్లే. ఒకటి రెండు రోజుల్లో సదరు సిబ్బందికి ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. శిశుగృహలో రెండు మాసాల అనాథ పసిబిడ్డ ఆకలికి తాళలేక మృతి చెందిందన్న ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఈమేరకు గతనెల 5న 'పాపం.. పసివాడి ప్రాణం!' శీర్షికన 'ఈనాడు' ప్రధాన సంచికలో ప్రచురితమైంది. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు.

ముఖ్యమంత్రి ఆదేశాలతో..

గత నెల 3వ తేదీ తెల్లవారుజామున పసిబిడ్డ మృతి చెందింది. అదే రోజు గుట్టుచప్పుడు కాకుండా శ్మశానంలో పాతిపెట్టారు. ఈ విషయాన్ని అప్పటి పీడీ, కలెక్టర్, ప్రభుత్వ ఉన్నతాధికారులకు చెప్పలేదు. 4వ తేదీన బయటకు పొక్కింది. దీన్ని 'ఈనాడు' వెలుగులోకి తీసుకొచ్చింది. అదే రోజు సీఎం చంద్రబాబు సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు. 5వ తేదీనే డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవి, అప్పటి పీడీ నాగమణి, సర్వజన ఆస్పత్రి చిన్నపిల్లల వైద్యుడు ప్రవీణ్‌దీన్‌కుమార్‌తో కూడిన త్రిసభ్య కమిటీ విచారణ చేపట్టింది. 6న రాష్ట్ర మహిళా,శిశు సంక్షేమ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. ఈ ఘటన సమాచారాన్ని రాష్ట్ర కార్యాలయానికి సకాలంలో చెప్పలేదన్న అభియోగంపై పీడీ నాగమణిని సస్పెండ్ చేశారు. తర్వాత డీసీఓ అరుణకుమారికి ఇన్‌ఛార్జి పీడీ బాధ్యతలు అప్పగించారు.

పోస్టుల భర్తీపై కసరత్తు

ఏడుగురిని తొలగించడంతో శిశుగృహ కేంద్రంలో సిబ్బంది మొత్తం ఖాళీ అవుతుంది. దీంతో కలెక్టర్ ఆనంద్ ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రోజుకు మూడు షిఫ్టుల్లో ఆరోగ్య శాఖ ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. ఈ గృహంలో ప్రస్తుతం నలుగురు శిశువులు ఉన్నారు. వారి ఆలనాపాలన చూసుకోడానికి ఏఎన్ఎం, ఆశాలు బాధ్యతల్లో ఉన్నారు. ఈ కేంద్రంలో అన్ని కేడర్ల పోస్టుల భర్తీకి త్వరలో ప్రత్యేక ప్రకటన ఇచ్చే అవకాశం ఉంది. అప్పటివరకు సర్వజన ఆసుపత్రి, నగర పాలక సంస్థ నుంచి కొందరి పారిశుద్ధ్య కార్మికులను కొంత కాలం డిప్యుటేషన్‌పై నియమించే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం శిశుగృహలో ఒప్పంద విధానంలో పని చేస్తున్న సిబ్బంది నియామక గడువు ఈ ఏడాది మార్చికే ముగిసింది. అప్పటి నుంచి రెన్యూవల్ చేయనట్లు తెలుస్తోంది. రానున్న ప్రకటనతో కొత్త వారిని నియమిస్తారు.

పబ్లిక్ నోటీస్

ఇందుమూలముగా యావన్మందికి తెలుపడం ఏమనగా, నా కక్షిదారులు మా కంపెనీ **V.R.L. LOGISTICS LIMITED** వారు క్రింద కనపరచిన 1వ అయిటం భూమిని 1) మల్లెల పుల్లారెడ్డి, 2) పూల ఆనంద్, 3) కరణం శివయ్య, 4) యావర్ల తిరుపాల రెడ్డి గార్ల నుండి మరియు 2) అయిటం భూమిని యాపర్ల తిరుపాల్ రెడ్డి గారి నుండి విక్రయం పొందవలెనని సంకల్పించినారు. ఈ విక్రయంపై ఎవరికైనా ఆక్షేపణలున్న యెడల మాకు వారం రోజులు లోపల తెలుపవలెను. అట్లు తెలపని యెడల ఎవరికి ఆక్షేపణ లేదని భావిస్తాము.

షెడ్యూలు: అనంతపురము జిల్లా, బుక్కరాయసముద్రం మండలము, గోవిందంపల్లి గ్రామంలో భూమి వివరము:

అయిటం 1) సర్వే నెం. 78-4, వి. 6.00 ఎకరముల పైకి ఎ॥ 2.89 సెంట్లు **హద్దులు: తూర్పు:** ఇదే సర్వేనెంబరులో విక్రయదారుల భూమి. **పడమర:** సర్వే నెంబరు 77లో శివరాం భూమి **ఉత్తరము:** సర్వే నెంబరు 78/3లో రోడ్డు **దక్షిణం:** సర్వే నెంబరు 134 లో భూమి **అయిటం 2)** సర్వే నెం. 134-1బి2, వి. ఎ॥ 0.77 సెంట్ల పైకి ఎ॥ 0.28 సెంట్లు **హద్దులు: తూర్పు:** ఇదే సర్వే నెంబరులో మహమ్మద్ రఫీ భూమి **పడమర:** ఇదే సర్వే నెంబరులో మిగతా భూమి **ఉత్తరము:** సర్వే నెంబరు 78/4లో భూమి **దక్షిణం:** రోడ్డు

పి. కృష్ణస్వామికుమార్, అడ్వకేట్,
డి.నెం. 7-118, ప్రకాష్ రోడ్డు, అనంతపురము.
సెల్: 9441081584, 9966316772

జయమ్మ సంకల్పం.. అతివలకు ప్రోత్సాహం

■ సంఘాల సభ్యులకు ఉపాధి అవకాశాలు

చింతపండును శుద్ధి చేయడంపై సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్న జయమ్మ

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పిల్లలను చదివించి, ఆస్తులను సంపాదించి.. తాను మాత్రం ఆర్థికంగా బలపడితే చాలనుకోలేదు చౌళూరు గ్రామానికి చెందిన శ్రీఆంజనేయ స్వామి మహిళా సంఘం నాయకురాలు జయమ్మ. సభ్యురాలి నుంచి సంఘం నాయకురాలిగా గ్రామ, మండల సమాఖ్యల్లో పనిచేసి .. డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి సభ్యులను ఆర్థికంగా స్థిరత్వం పొందేలా కృషి చేస్తున్నారు. యుఎన్‌డీపీలో రాష్ట్ర శిక్షణ పరిశీలకురాలిగా ఆంధ్రా, తెలంగాణ, చత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు వెళ్లి వేలాది మహిళా సంఘాలకు శిక్షణ ఇచ్చి ఆర్థికంగా బలోపేతమయ్యేలా చైతన్యం కల్పించారు.

వనరులను ఉపయోగించుకొని..

హిందూపురం చుట్టుపక్కల అధికంగా చింతచెట్లు ఉన్నాయి. అదే వనరును ఆదాయ మార్గంగా ఎంచుకున్నారు జయమ్మ. రైతులు పండించిన చింతపండును మార్కెట్‌కు తరలిస్తారు. 2021లో చింతపండును శుద్ధి చేసే యంత్రాన్ని ఏర్పాటు చేసుకొని 40 మంది మహిళా కూలీలకు ఉపాధి చూపుతూ ఆర్థికంగా ఎదిగేలా దారి చూపిస్తున్నారు.

ఆమె ఏమంటున్నారంటే..

1995లో సంఘంలో సభ్యురాలిగా చేరాను. బ్యాంకు రుణాలతో చిన్న వ్యాపారాలు, వ్యవసాయం చేస్తూ వచ్చాను. చౌళూరు, ఇతర పంచాయతీల్లో 80 సంఘాలను ఏర్పాటుచేసి 940మంది సభ్యులు వినియోగించుకునేలా చేశాను. పిల్లలను విద్యావంతులను చేశాను. గత నెలలో సేవామందిర్‌లోని ఖాదీ సంస్థ ద్వారా నాసిక్‌కు వెళ్లి పేపర్ ప్లేట్లు తయారు చేసే విధానంపై శిక్షణ పొందాను. త్వరలో హిందూపురంలో కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసి గ్రామీణ మహిళలకు ఉపాధిమార్గం చూపాలనేదే నా లక్ష్యం అంటున్నారు జయమ్మ.

పరిశ్రమలతోనే కాదు.. ఉద్యాన సాగుతోనూ ఆదాయమే

● ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఈనాడు, అమరావతి: "రాయలసీమ రైతులకు మరింత ఆదాయం పెరగాలంటే ఉద్యాన పంటల సాగును మరింత విస్తృతం చేయాలి. సీమలో మరింత అభివృద్ధి జరిగేందుకు అవసరమైన అన్ని వనరులూ ఉన్నాయి. ఇప్పటికే అనేక పరిశ్రమలు, కంపెనీలను ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయిస్తోంది. దీనికి తోడు పండ్ల ఎగుమతుల ద్వారా చక్కని ఆదాయం పొందొచ్చు" అని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సోమవారం ఆయన రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక, ఇతర శాఖల అధికారులతో సమావేశమయ్యారు. రాయలసీమ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్, కార్యదర్శి రోనాల్డ్ రోస్, జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి కేశవ్ ఏమన్నారంటే..

- తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను ఆనుకుని రాయలసీమ ఉంది. ఇది ఎంతో అనుకూలాంశం. ఉద్యాన పంటల ఉత్పత్తులను ఆయా రాష్ట్రాలకు ఎగుమతి చేయవచ్చు. కొన్ని ఉద్యాన పంటలకు విదేశాల్లో ఎంతో డిమాండ్ ఉంది. ఆ పంటల సాగు చేపట్టడం వల్ల విదేశాలకు ఎగుమతి చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.
- ఉద్యాన పంటల సమాచారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇప్పటికే సీమలో గతంలో ఎన్నడూ లేని స్థాయిలో సాగునీటిని అందిస్తున్నాం. నీటిని సద్వినియోగం చేసుకుని పంటలే కాదు పండ్ల తోటల పెంపకం చేపట్టాలి. అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి.
- కియా పరిశ్రమ వల్ల ఉమ్మడి అనంతపురం జిల్లాలో జీఎస్‌డీపీ పెరిగింది. పరిశ్రమల వల్లే కాదు.. ఉద్యాన పంటల ద్వారా ఆదాయం సృష్టించవచ్చని రాయలసీమ రైతులు నిరూపించాలి.
- కోనసీమలో వరి సాగు చేసే రైతుల కన్నా రాయలసీమలో ఉద్యాన పంటలు సాగు చేసే వారికి ఆదాయం ఎక్కువ వస్తోంది. రెండు ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేసి రూ.కోట్లలో ఆదాయం పొందిన వారూ ఉన్నారు. ఆర్గానిక్ పంటలతో రాబడి ఎంతో బాగుంది.



(c) eenadu

ఆర్టీసీ ఆసుపత్రి.. ఉద్యోగులకు ఆరోగ్య భద్రత

హిందూపురంలో ఆర్టీసీ నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనం

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ ఆధ్వర్యంలో హిందూపురం డిపో ప్రాంగణంలో రూ.79.56లక్షల వ్యయంతో నూతనంగా ఆసుపత్రి భవనం నిర్మించారు. జిల్లా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రారంభోత్సవం చేశారు. తద్వారా అందుతున్న వైద్య సేవలతో కార్మిక, ఉద్యోగులకు ఆరోగ్య భద్రత లభిస్తోంది.

శ్రీసత్యసాయి జిల్లాలోని ఆరు డిపోల్లో 1042 మంది పని చేస్తున్నారు. 4,184 మంది కుటుంబసభ్యులు ఉన్నారు. గతంలో నిర్మించిన భవనం దెబ్బతిని ఉండటంతో సేవలకు అంతరాయం ఉన్నందున ప్రయోగశాల, మందులు, నర్సులు, బయట రోగులు, వైద్యులు ఉండే గదులతో ఆహ్లాద వాతావరణంలో నిర్మించారు. ఏడుగురు ఉద్యోగులు జిల్లాల విధి నిర్వహణలో ఉన్నారు. విజయవాడలోని విద్యాధరపురంలో ఉన్న ప్రధాన ఆస్పత్రి కేంద్రం ద్వారా ప్రతినెలా రూ.1.50లక్షల విలువ చేసే మందులు, ఇతర సామగ్రి సరఫరా అవుతోంది. ప్రతిరోజూ 60 నుంచి 65మంది కార్మికులు వచ్చి వైద్యసేవలు పొంది సలహాలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

అన్నిరకాల పరీక్షలు చేస్తున్నాం

- ఎల్.అపర్ణ, వైద్యురాలు

మధుమేహం, అధిక రక్తపోటు, ఊపిరితిత్తులు, థైరాయిడ్, ఊబకాయం, కిడ్నీ, ఈసీజీలతో పాటు అన్ని రకాల రక్త, వైద్య పరీక్షలు చేస్తున్నాం. మారుతున్న కొత్త మందులను రోగులకు అందిస్తున్నాం. ఉన్నత వైద్య సేవల కోసం పెద్ద ఆస్పత్రులకు పంపుతాం. ఆరోగ్య పరిస్థితి విషమించిన వారికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇస్తాం.

తీగజాతి పంట.. లాభాలే రైతింట!

ఆశాజనకంగా బీర దిగుబడి

సాగు చేసిన బీర పంట

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : స్వల్పకాలిక తీగజాతి పంటలు దిగుబడులతో పాటు మంచి లాభాలు అందిస్తున్నాయి. కళ్యాణదుర్గం మండలం పాతచెరువు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ అనే రైతు ఆరేళ్లుగా బీర పంట సాగు చేస్తూ దిగ్విజయంగా ముందుకెళ్తున్నారు.

● రైతు మూడెకరాల్లో బీర పంట సాగు చేస్తున్నాడు. ఒక్కోసారి పంట సాగుకు రూ.4.50 లక్షల పెట్టుబడి పెట్టారు. అనంతపురం నుంచి నీలో రకం బీర విత్తనాలను రెండున్న కిలోలు రూ.30వేలు వెచ్చించి కొనుగోలు చేశాడు. కర్రలకు రూ.లక్ష, దారాలకు, కూలీలకు రూ.80వేలు, మల్చింగ్ కవర్ ఒక్కో బండిల్ రూ.2,180 వంతున 9 బండిళ్లు కొనుగోలు చేశాడు. పురుగు మందుకు రూ.40వేలు వెచ్చించారు. పంటను ఎప్పటికప్పుడు కంటికి రెప్పలా చూసుకొంటూ అదే స్థాయిలో దిగుబడులు పొందుతున్నాడు.

ప్రణాళికతో దిగుబడులు ఇలా..

పంట సాగు చేసిన రెండునెలల్లోనే ఇప్పటి వరకు 8 సార్లు పంట కోత కోయగా 30 టన్నుల వరకు దిగుబడి రాగా రూ.7లక్షల వరకు లాభాలు వచ్చాయి. మరో ఆరు సార్లు కోత కోస్తే దాదాపుగా 20-25 టన్నుల దిగుబడి వస్తుందని, అదే స్థాయిలో మార్కెట్లో మంచి ధరలు ఉన్నాయంటే సుమారుగా రూ.8.50 లక్షల వరకు ఆదాయం రానుంది. తోట వద్దనే కిలో రూ.32లతో విక్రయిస్తున్నారు. దీంతో రవాణా, కమీషన్లు మిగులుతున్నాయి. ఒక్కోసారి పంటను అనంతపురం, బెంగళూరు మార్కెట్లకు రైతే తీసుకెళ్తుంటారు.

మంచి లాభాలొస్తున్నాయి

గతంలో వేరుసెనగ, టమోటా, కర్బూజ పంటలు సాగు చేసి లక్షలాది రూపాయలు నష్టపోయా. ఇతర ప్రాంతాలకు వెళ్లిన సమయలో తీగజాతి పంటల గురించి రైతులతో ఆరా తీశా. ఆరేళ్లుగా బీర పంట సాగు చేస్తూ దిగుబడులతో పాటు లాభాలు గడిస్తున్నా. మరికొంత మందికి పంట సాగుపై సలహాలు, సూచనలు ఇస్తున్నా. **- చంద్రశేఖర్, రైతు, పాతచెరువు**

పొలంలో గడ్డి కాలిస్తే నష్టం!

వరిపంట వ్యర్థాలు కాలుస్తున్న రైతులు

నార్పల , న్యూస్‌టుడే : వరి కోతలు పూర్తయ్యాక కొంతమంది రైతులు పంట అవశేషాలు, గడ్డిని కాల్చడం వల్ల రైతులకు అధిక నష్టాలు ఉంటాయని రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. గడ్డిని కాల్చడం వల్ల భూమిలో సేంద్రియ పోషకాలు కూడా కాలిపోయి వచ్చే పంట దిగుబడి తగ్గుతుందన్నారు. దీనికితోడు భూమి చౌడు భూమిగా మారుతుందన్నారు. వరి కొయ్యలు, గడ్డిని పొలంలో కాల్చకుండా రైతులు ట్రాక్టరుతో కలియ దున్నుకుని, రెండు వారాలు నీరు పెడితే గడ్డి కుళ్లి పోయి పోషకాలుగా మారుతాయన్నారు. తద్వారా సాగు చేసే పంటలు అధిక దిగుబడి సాధించవచ్చన్నారు.

చిట్కా

రైతేరాజు

టమాటాను రక్షించుకుందామిలా!

కళ్యాణదుర్గం గ్రామీణం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జాగ్రత్తలు తీసుకుంటే టమాటా పంటను రక్షించుకోవచ్చునని కళ్యాణదుర్గం ఉద్యాన అధికారి కృష్ణతేజ చెబుతున్నారు. నీటిముంపు, పోషకాలు కోల్పోవడం, కాయలు, మొక్కలు కుళ్లిపోవడం, చీడపీడల బెడద నుంచి రక్షించుకోవాలంటే మల్చింగ్, స్టేకింగ్ చేసుకోవాలి. వర్షాకాలంలో బ్యాక్టీరియాతో పాటు మచ్చ తెగుళ్ల నివారణకు 10 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్, గ్రాము స్ట్రెప్టో మైసిన్ 10 లీటర్ల నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

సమస్య సమాధానం

నారాయణస్వామి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు పంటల సాగులో ఎలాంటి సందేహాలున్నా రేకులకుంట వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త నారాయణస్వామి చరవాణి నంబరు: 6281284235 ఫోన్‌చేసి తగిన సలహాలు, సూచనలు పొందవచ్చు.

సమస్య : టమాటా పంటకు సూదిముక్కు పురుగులు ఆశించడంతో టమాటా కాయల నాణ్యత దెబ్బతింటోంది. ఈ పురుగులను ఎలా నివారించాలి.
- నరసింహులు, గూగూడు

సమాధానం: టమాటాకు ఆశించిన సూదిముక్కు పురుగులను నివారించడానికి రైతులు స్పైనోసాయిడ్ 0.3 మి.లీ, ఇండాక్సాకార్బ్ 0.2 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే తెగులు ఉద్ధృతి తగ్గుతుంది.

సమస్య : వేరుసెనగ పంట 25 రోజుల దశలో ఉంది. పంటలో కలుపు తొలగించడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలి. **- యల్లప్ప, యాడికి**

సమాధానం : 25 రోజుల దశలో ఉన్న రెండు నుంచి మూడు ఆకుల దశలో ఉన్న వేరుసెనగ పంటలో గడ్డిజాతి మొక్కలను నివారించడానికి రైతులు ఇమజితపైర్ కలుపు మందును 300 మి.లీ ద్రావణం, 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే కలుపు సమస్య తగ్గుతుంది.

మల్లెసాగులో తెగుళ్లా?

కత్తిరించిన మల్లెతోట

ఎండిపోయిన మొగ్గలు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే : శీతాకాలంలో గుండుమల్లెకు తెగుళ్లు విపరీతంగా సోకుతాయి. కొమ్మ కత్తిరింపు తర్వాత మొక్కలు కొత్తగా చిగురించి మొగ్గలు ఏర్పడుతున్నాయి. ఈక్రమంలో నల్లిపురుగు ఎండుతెగులు, మొగ్గతొలుచు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు.

నల్లి నివారణకు

పొడి వాతావరణంలో నల్లిపురుగు ఆకుల అడుగు భాగంలో చేరి రసాన్ని పీల్చడం వల్ల ఆకులు పసుపు రంగులోకి మారి రాలిపోతాయి. ఇది తొలి దశలో ఉన్నప్పుడు వేపనూనె ఒక మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. తీవ్రత పెరుగుతున్న సమయంలో పోనజాక్విన్ 1 ఎంఎల్ లేదా స్పిరో మెసిఫిన్ ఒక మి.లీ లీటరు నీటలో కలిపి పిచికారీ చేస్తే నల్లిపురుగు నశిస్తుంది.

ఆకుఎండు..

తెగులుసోకిన ఆకులపై ఎరుపు రంగు మచ్చలు రావడంతో వాటి తీవ్రత పెరిగేకొద్దీ సగానికిపైగా దిగుబడి తగ్గుతుంది. వాటి నివారణకు మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా కార్బండజిమ్ ఒక గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మొగ్గతొలుచు పురుగు

పురుగు లార్వా మొగ్గల్లోనికి చొచ్చుకునిపోయి లోపలిభాగాన్ని తినేస్తుంది. దీంతో మొగ్గ పూర్తిగా ముడుచుకుపోతుంది. నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా కార్బరీల్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

హనుమద్ వ్రతం ఏర్పాట్లపై సమీక్ష

మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్, అధికారులు

గుంతకల్లు పట్టణం: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో డిసెంబరు 2, 3 తేదీల్లో జరగనున్న హనుమద్ వ్రతానికి చేయాల్సిన ఏర్పాట్లపై సోమవారం అధికారులు చర్చించారు. ఆలయ ఈవో విజయరాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ శ్రీనివాసులు, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ భక్తులకు అన్ని వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. 2న గుంతకల్లులో హనుమాన్ సర్కిల్ నుంచి స్వామి ఉత్సవమూర్తి, ఇరుముడితో హనుమ మాలధారులు ఊరేగింపుగా కసాపురం చేరుకుంటారన్నారు. 3న వ్రతం ముగిసిన తర్వాత మాలధారుల దీక్ష విరమణ ఉంటుందన్నారు. సమావేశంలో మున్సిపల్, విద్యుత్తు, ఆర్ అండ్‌బీ, వైద్య, ఆర్టీసీ, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అప్రెంటీస్‌షిప్ అభ్యర్థుల పత్రాలు కర్నూలులో పరిశీలన

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: ఏపీఎస్ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్ ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో ఐటీఐ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు కర్నూలు జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాలలో పరిశీలిస్తారని ఐటీఐ ప్రిన్సిపల్ రాయపరెడ్డి తెలిపారు. ఎస్‌ఎస్‌సీ, ఐటీఐ ఎన్‌సీవీటీ, కుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారని ఆయన వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల అభ్యర్థులు శాశ్వత కుల ధ్రువీకరణ లేకుంటే ఆరు నెలల్లోపు జారీ చేసిన పత్రాలు సమర్పించాలని ఆయన తెలిపారు. దివ్యాంగులు, మాజీ సైనికులు కూడా వారి అర్హత పత్రాలు ఒరిజినల్ తీసుకువెళ్లాలని సూచించారు. డీజిల్ మెకానిక్ అభ్యర్థులకు డిసెంబరు ఒకటిన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి మోటరు మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్) అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. అనంతపురం జిల్లా నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఐటీఐ అభ్యర్థులు మాత్రమే హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు కర్నూలు శిక్షణ కళాశాల ఫోన్ నంబరు 08518-257025ను సంప్రదించాలన్నారు.

జిల్లా క్రికెట్ సంఘంలో మైనార్టీలకు పెద్దపీట

ఆరు పదవుల్లో మూడు వారికే

సి.శ్రీనాథ్

అనంతపురం (క్రీడలు), న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా క్రికెట్ సంఘం ఎన్నికలు మరోసారి ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్ష, కార్యదర్శి పదవులకు అనేక మంది పోటీ పడినా సీనియర్ల సమన్వయించడంతో చివరికి వివాదరహితంగా ముగిసింది. ఆరు పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు అయ్యాయి. సోమవారం అనంత క్రీడాగ్రామంలో జరిగిన నామినేషన్ల పర్వం ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల అధికారి, విశ్రాంత ఆర్డీవో ఈశ్వర్ నామినేషన్లు స్వీకరించారు. ఒక్కో పదవికి ఒకటే నామినేషన్ రావడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా ముగుస్తాయి. ఎలాంటి హడావుడి లేకుండా నామినేషన్లు స్వీకరించారు. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా సి.శ్రీనాథ్, ఉపాధ్యక్షుడిగా నూర్‌మహమ్మద్ ఖాన్, కార్యదర్శిగా ఎ.యుగంధర్‌రెడ్డి, కోశాధికారిగా జె.మురళీకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా ఎస్.సర్దార్, కౌన్సిలర్‌గా హెచ్.అన్వర్‌ఖాన్‌లు నామినేషన్లు సమర్పించారు. ఆరు పదవుల్లో మూడు మైనార్టీలకే కేటాయించడం విశేషం.

● ఎన్నో ఏళ్ల నుంచి క్రికెట్ సంఘాన్ని పరోక్షంగా నడిపిస్తున్న సి.శ్రీనాథ్ అధ్యక్షుడిగా పోటీ చేయాలని పలువురు ఒత్తిడి తేవడంతో ఎట్టకేలకు అంగీకరించారు. అన్ని పదవులకు ఎలాంటి పోటీ లేకుండా సింగిల్ నామినేషన్ దాఖలైంది. మంగళవారం నామినేషన్ల పరిశీలన, బుధవారం ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన తర్వాత ఈ నెల 29న అధికారికంగా ప్రకటిస్తారు. పదవులన్నీ ఏకగ్రీవం కావడంతో నామినేషన్లు దాఖలు చేసిన ఎ.యుగంధర్‌రెడ్డి, నూర్ మహమ్మద్ ఖాన్, సర్దార్‌ను పలువురు అభినందించారు. ఈనెల 29 అధికారికంగా ప్రకటిస్తామని ఎన్నికల అధికారి ఈశ్వర్ తెలిపారు.

అండర్-14 ఇంటర్ జోన్ క్రికెట్ పోటీలకు ఐదుగురు

అనంతపురం (క్రీడలు), న్యూస్‌టుడే: ఇంటర్ జోన్ అండర్-14 క్రికెట్ పోటీలకు జిల్లా నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. ఇటీవల కడపలో జరిగిన అంతర్ జిల్లా పోటీల్లో ప్రతిభ పాటవాలు చూపిన క్రీడాకారులను సౌత్‌జోన్ జట్టుకు ఎంపిక చేశారు. జిల్లాకు చెందిన ఎం.మోక్షిత తేజ్, పంకజ్, హేమ చంద్రానాయక్, కె.రోహిత్, ఎల్.క్రితికసాయిలు సౌత్‌జోన్ జట్టుకు ఎంపికయ్యారు. ఇంటర్ జోన్ పోటీల్లో సత్తాచాటి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావాలని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి పిలుపునిచ్చారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647

JOBS

PET with M.Ped, Tutors any Degree, Montessori Elite EM School, Gollapalli, Rapthadu, ATP. Contact: 9866676304, 9666332816.

FACULTY/ TEACHERS

Headmistress: Looking for an experienced headmistress to start a primary school (high school in the future) in Puttaparthi. At least 10 years of proven experience running an English Medium school as a senior teacher is mandatory. M.Ed. is preferable. B.Ed. is acceptable for 15 years of experience. Decent Salary + Accommodation. WhatsApp resume to: + 91 72075 92548

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS
5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు
8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


నవ్య

పవన్

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు పట్టణానికి చెందిన నవ్య, గొట్లూరు గ్రామానికి చెందిన పవన్ ఎంపికైనట్లు కోచ్ పృథ్వీ తెలిపారు. సోమవారం కోచ్ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు పల్నాడు జిల్లా వినుకొండలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో బాలుర, బాలికల విభాగంలో జిల్లా జట్టులో ఇద్దరు క్రీడాకారులు పాల్గొన్నారు. బాలికల కబడ్డీ జట్టు విజేతగా నిలపడంలో నవ్య కీలక పాత్ర పోషించింది. దీంతో హిమాచల్‌ప్రదేశ్‌లోని పోంటాసాహిబ్ నగరంలో డిసెంబర్ 22 నుంచి 26 వరకు జరిగే కబడ్డీ పోటీల్లో పాల్గొనే రాష్ట్రజట్టుకు నవ్యను ఎంపిక చేశారు. బాలుర జట్టులో అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించి పవన్ డిసెంబర్ 15 నుంచి 19 వరకు హరియాణా రాష్ట్రంలోని పానిపత్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు కోచ్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాసులు, ఆర్డీ హనుమంతప్ప, కోచ్ అనిల్ తదితరులు అభినందించారు.

అగ్రిగోల్డ్ భూములు.. నేలకొరుగుతున్న చెట్లు

పెద్దగువ్వలపల్లి వద్ద నరికేసిన నీలగిరి చెట్లు

రొద్దం, న్యూస్‌టుడే : రొద్దం పంచాయతీ పరిధిలోని పెద్దగువ్వలపల్లి వద్ద వందల ఎకరాల అగ్రిగోల్డ్ భూములో ఉన్న నీలగిరి చెట్లను కొందరు అడ్డూ అదుపు లేకుండా అక్రమంగా తొలగిస్తున్నారు. సోమవారం చెట్లను కొందరు అక్రమార్కులు నరికేసి యథేచ్ఛగా రవాణా చేయడానికి సిద్ధం చేశారు. ఈవిషయంపై వీఆర్వో శ్రీదేవిని వివరణ కోరగా అగ్రిగోల్డ్ భూముల్లో నీలగిరి చెట్లను తొలగిస్తున్నట్లు ఎవరూ ఎలాంటి అనుమతి తీసుకోలేదన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ పథకాలను రైతులకు తెలియజేయండి : మంత్రి

పెనుకొండ, న్యూస్‌టుడే: వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పలు పథకాలను అన్ని గ్రామాల్లోని అన్నదాతలకు వివరించాలని మంత్రి సవిత సూచించారు. సోమవారం ఆమె వ్యవసాయ శాఖ ఏడీలు కృష్ణమీనన్, కృష్ణయ్య, ఏవోలతో సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఖాతాలకు నగదు జమ, రైతుసేవా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై అవగాహన కల్పించాలన్నారు. పంటల సాగు, సస్య రక్షణకు సూచనలు, సలహాలను రైతులకు ఇవ్వాలని సూచించారు.

కీర్తి తెచ్చిన దీపిక.. తల్లిదండ్రులకు సత్కారం

దీపిక తల్లిదండ్రులను సన్మానించిన మాజీ ఎమ్మెల్సీ, తదితరులు

అమరాపురం, న్యూస్‌టుడే: అంధుల మహిళా టీ-20 క్రికెట్ పోటీల్లో ప్రపంచ కప్ గెలుపొంది మడకశిర నియోజకవర్గానికి దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన కెప్టెన్ దీపికను అభినందిస్తూ.. ఆమె తల్లిదండ్రులు చిక్కతిమ్మప్ప, చిత్తమ్మలను సోమవారం హేమావతి సిద్దేశ్వరాలయంలో మండల ప్రజలు ఘనంగా సన్మానించారు. ఆమె అభిరుచికి తగ్గట్లు క్రికెట్ పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించి ప్రపంచకప్ రావడానికి తమవంతు కృషి చేసిన తల్లిదండ్రులను సన్మానించడం తమకు ఆనందాన్ని కలిగించిందని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇష్టమైన రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గం బాసీసెల్ అధ్యక్షుడు ప్రసాద్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నరసింహమూర్తి, మండల కన్వీనర్ కృష్ణమూర్తి, తాలూక ఎస్సీసెల్ అధ్యక్షుడు జయకుమార్, నాయకులు రామచంద్ర, నాగరాజు, అనిల్‌కుమార్, ఓంకారస్వామి తదితరులు పాల్గొన్నారు.

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY ANANTAPUR
ANANTHAPURAMU - 515002 (A.P.) INDIA.
e-Procurement Tender Notices

1	Providing CC Cameras for newly allotted Block for School of Management Studies in JNT University, Anantapur, Ananthapuramu. With Tender ID No. 866823

Further Details can be seen at e-procurement market place i.e., www.tender.apeprocurement.gov.in. Sd/- REGISTRAR

‘ఒత్తిడి మేరకే కేసు.. నన్ను క్షమించు ప్రశాంత్’

మద్యం వ్యాపారితో అబ్కారీ సీఐ సంభాషణ ఆడియో వైరల్

మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య స్థానిక వైకాపా నాయకుడు, మద్యం వ్యాపారి ప్రశాంత్‌గౌడ్ మధ్య ఓ కేసు విషయంపై చరవాణిలో సంభాషించుకొన్నట్లు ఆడియో సోమవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఒత్తిడి మేరకే కేసు నమోదు చేయాల్సి వచ్చిందని, దయచేసి క్షమించు అని ఎక్సైజ్ సీఐ మద్యం వ్యాపారి వద్ద అన్నట్లు ఆ ఆడియోలో నమోదైంది. తాను మిమ్మల్ని కలవనే లేదు అలాంటి సమయంలో కేసు ఎలా నమోదు చేస్తారని వైకాపా నాయకుడు సీఐని ప్రశ్నించగా అతను ఇదొక్కసారి క్షమించు అని వైకాపా నాయకుడి వద్ద ప్రస్తావించారు. కేసు నమోదులో ఎవరి ఒత్తిడి ఉందని వైకాపా నాయకుడు సీఐని ప్రశ్నించగా నీవు అర్థం చేసుకో ప్రశాంత్ అని అన్నట్లు ఆడియోలో ఉంది.

అది నాస్వరమే కాదు.. నా చిత్రంతో అలా చేశారు

ప్రశాంత్‌గౌడ్ మద్యం దుకాణం నుంచి గొలుసు దుకాణాల నిర్వాహకుడు వెంకటరాముడు ఈనెల 16వ తేదీ రాత్రి 11 బాటిల్స్ తీసుకెళుతుండగా దాడులు చేసి కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. సూర్య వైన్స్ దుకాణం పురపాలక సంఘం పరిధిలో అన్ని మద్యం దుకాణాలకన్నా అత్యధికంగా వ్యాపారం జరుగుతోందన్నారు. అలాంటి సమయంలో తాము ఆ మద్యం దుకాణం యజమానిపై కేసు ఎలా నమోదు చేస్తామని అతనిపై తమకు ఎలాంటి కక్ష లేదన్నారు, అతనిపై కేసు నమోదు చేయమని ఎవరూ ఒత్తిడి తీసుకురాలేదన్నారు. తాను అతనితో మాట్లాడినట్లు క్షమాపణ కోరినట్లు ఉన్న ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసి తన పరువుకు భంగం కలిగించారని, దీనిపై చట్టపరంగా ముందుకు వెళ్లేందుకు న్యాయనిపుణుల సలహా తీసుకొంటున్నట్లు సీఐ వివరించారు.

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నేడు(మంగళవారం) ఉదయం పది గంటలకు శ్రీవారికి ఆర్జిత కల్యాణోత్సవం ఉంటుంది. రాత్రి ఏడున్నర గంటలకు వెండిరథ ప్రాకారోత్సవం జరుగుతుంది. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు సాధారణ దర్శనం. ఏడు నుంచి తొమ్మిది గంటల మధ్య అభిషేక, స్వర్ణకవచ సేవలు ఉంటాయి. తర్వాత తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది.

కాలువలో గొర్రెల కాపరి గల్లంతు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతైన ఘటన మండలంలోని పంపనూరు హంద్రీనీవా కాలువలో సోమవారం చోటు చేసుకుంది. కళ్యాణదుర్గం మండలం పీటీఆర్ పల్లికి చెందిన రామాంజనేయులు మండలం వై.కొత్తపల్లిలో నివాసం ఉంటున్నాడు. గత 12 సంవత్సరాల క్రితం వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన మహిళను వివాహం చేసుకొని ఇల్లరికం వచ్చి నివసిస్తున్నాడు. నిత్యం గొర్రెలు మేపుకొంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజువారీగా ఉదయం 10 గంటలకు గొర్రెలు తీసుకొని హంద్రీనీవా కాలువ వద్దకు రాగా అక్కడ చేపలు పట్టేందుకు కిందకు దిగాడు. కాలు జారి కాలువలో పడి కొట్టుకుపోయాడు. గమనించి తోటి గొర్రెల కాపర్లు సాయం చేసేందుకు ప్రయత్నించినా అప్పటికే నీటిలో మునిగిపోయాడు. గల్లంతయిన వ్యక్తికి భార్య, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కాలువ వెంబడి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే గత మూడు నెలల్లో నలుగురు కాలువలో పడి మృతి చెందారు.

గొంతుకోసుకున్న ప్రేమికుడు

ప్రేమించిన అమ్మాయి మరొకరితో వెళ్లిందని అఘాయిత్యం

గుడిబండ, న్యూస్‌టుడే: గుడిబండ మండలం మోపురుగుండు గ్రామానికి చెందిన ఈర రామప్ప, నాగమ్మల కుమారుడు రామాంజినేయులు(22) గుడిబండ సంత మార్కెట్లో సోమవారం కత్తితో గొంతుకోసుకున్నాడు. రామాంజినేయులు హిరేతుర్పి గ్రామానికి చెందిన గిరివాస్, అంబికల కుమార్తె మౌనిక ప్రేమించుకున్నారు. మరో వారంలో వివాహం చేయడానికి ఇరుకుటుంబాల పెద్దలు నిర్ణయించారు. సోమవారం మౌనిక కనిపించలేదు. కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా బుడసనహళ్లి గ్రామానికి చెందిన చంద్రప్ప కుమారుడు కిరణ్‌పై ఆమె తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలిసిన వెంటనే రామాంజినేయులు గొంతు కోసుకోగా స్థానికులు గుర్తించి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో సింగిల్ విండోఅధ్యక్షుడు మద్దనకుంటప్ప తన కారులో హుటాహుటిన మడకశిరకు తరలించారు. అక్కడి నుంచి బెంగళూరుకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని ఏఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు

మౌనిక సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఇంటినుంచి వెళ్లిపోయిందని ఆమె తల్లి అంబిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పావగడ తాలూకా బుడసనపల్లి గ్రామానికి చెందిన చంద్రప్ప కుమారుడు కిరణ్‌పై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్సై రాజకుళ్లాయప్ప తెలిపారు.

పెళ్లి కాలేదని యువకుడి బలవన్మరణం

సూర్య ప్రకాశ్

సోమందేపల్లి, న్యూస్‌టుడే: తన మరదళ్లకు వివాహాలైనా తనకు కావడం లేదని తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు సూసైడ్ నోట్ రాసి బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన మండలంలోని రంగేపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఏఎస్సై దేవానంద్ చెప్పిన వివరాలిలా.. రంగేపల్లి గ్రామానికి చెందిన రైతు, గొర్రెల పెంపకందారుడు నరసింహమూర్తి, కృష్ణవేణమ్మ దంపతులకు ఇద్దరు కుమారుల్లో పెద్దవాడు సూర్యప్రకాశ్(24). డిగ్రీ చదివి ఇంటి వద్ద చిల్లర దుకాణం ఏర్పాటు చేసుకొని కుటుంబానికి చేదోడువాదోడుగా నిలిచాడు. సోదరుడు పవన్‌కుమార్‌ను డిగ్రీ చదివించాడు. సొంతూరులో తన అత్తామామలకు ఉన్న ముగ్గురు కుమార్తెలపై ఎంతో ప్రేమాభిమానాలు పెంచుకొన్నా.. వారు ఇతరులను వివాహాలు చేసుకొని వెళ్లిపోయారని కొద్దిరోజులుగా మనస్తాపం చెందుతున్నాడు. తనకు ఇంకా పెళ్లి కాలేదని అవమానంగా భావించిన సూర్యప్రకాశ్ జీవితంపై విరక్తి చెంది మధ్యాహ్నం గ్రామ సమీపంలోని గుట్టపైకి వెళ్లి ఒక చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పశువుల కాపరులు అందించిన సమాచారంతో కుటుంబ సభ్యులు, బంధువులు చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఏఎస్సై ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని చెప్పారు.

ఆసుపత్రిపై దాడి ఘటనలో ఏడుగురి అరెస్ట్

దాడి చేసిన వారి అరెస్టు చూపుతున్న రెండో పట్టణ సీఐ శ్రీకాంత్, సిబ్బంది

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరంలో సాయినగర్ మూడో క్రాస్‌లోని శ్రీనివాస మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిపై దాడి చేసిన ఘటనలో రెండో పట్టణ పోలీసులు ఏడుగురిని సోమవారం అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు మొగలి సత్యనారాయణరెడ్డి, చిన్నగొర్ల సాయినాథ్‌రెడ్డి, బోయ సీతారాములు, యువరాజ్, ఎరుకల చంద్రశేఖర్, సున్నీ షాషావలి, బురుజుల నవీన్‌లను నగరంలోని ప్రసన్నాయపల్లి రైల్వే గేటు వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నేరానికి వినియోగించిన మూడు సుత్తిలు, రెండు మచ్చుకత్తులు, రెండు చెట్ల అడ్డాలు, రెండు కర్రలు, మూడు కార్లు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి జిల్లా కోర్టు ఎదుట హాజరు పరచగా.. కోర్టు నిందితులకు రిమాండ్ విధించింది. కేసు వివరాలను సీఐ శ్రీకాంత్ వెల్లడించారు. 2020లో సాయినగర్ మూడో క్రాస్ ఓల్డ్ పావని ఆసుపత్రి యజమాని గుత్తా పావని నుంచి శ్రీనివాసరావు, మొగలి సత్యనారాయణరెడ్డి, రాఘవేంద్ర, శ్రీలతలు భవనం కొనుగోలు చేసి, శ్రీనిలయం పర్మ్ మీద రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. భవనాన్ని పదేళ్ల పాటు లీజుకు ఇచ్చారు. అందులో భాగంగా ఆసుపత్రి ఓనర్లు శ్రీనివాసరావు, రాఘవేంద్ర రెనోవేషన్ చేసుకుని త్వరలో ప్రారంభించాలనుకున్నారు. సత్యనారాయణరెడ్డి దురుద్దేశంతో ఆసుపత్రిలో వాటా కావాలని ఆదివారం ఉదయం అనుచరులతో అక్రమంగా ప్రవేశించి మారణాయుధాలతో భయపెట్టి ఆసుపత్రిని ధ్వంసం చేశారని, ఆసుపత్రి ఓనర్లపై హత్యాయత్నానికి పాల్పడ్డాడని ఫిర్యాదు అందింది. ఈ ఘటనపై ఎస్పీ జగదీశ్ ఆదేశాలతో దాడికి పాల్పడిన నిందితులను పట్టుకుని కటకటాల వెనక్కు పంపారు.

(c) eenadu

హిందూపురం
• హిందూపురం • పెనుకొండ • మడకశిర

కరియమ్మకు జలది మహోత్సవం

జలది మహోత్సవంలో అమ్మవారు

గుడిబండ, న్యూస్‌టుడే: మండలంలోని మోరుబాగల్ కరియమ్మ దేవతకు సోమవారం మద్దనకుంట పరదేశమ్మ గుడివద్ద జలది మహోత్సవాన్ని నిర్వహించారు. మోరుబాగల్‌లో అమ్మవారి ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసి నూతనంగా నిర్మించారు. బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఏడు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: కోతి ఎన్టీర్ కాలనీలో మురుగు నీరు ప్రవహిస్తోంది. - భాగ్యమ్మ
సమాధానం: పారిశుద్ధ్యకార్మికుల ద్వారా తొలగిస్తాం. - నరసమ్మ, సర్పంచి జంబులబండ
సమస్య: మోరుబాగల్ ఇందిరమ్మ కాలనీలో వీధి దీపాలు లేవు. -చంద్రప్ప.
సమాధానం: వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. -తిప్పేస్వామి సర్పంచి, మోరుబాగల్.
- న్యూస్‌టుడే, గుడిబండ

స్పందించారు.. స్తంభం మార్చారు

రొద్దం, న్యూస్‌టుడే : నారనాగేపల్లి రోడ్డు పక్కనే ఓ రైతు పొలంలో 11 కేవీ విద్యుత్తు స్తంభం ఒరిగి ప్రమాదకరంగా ఉండేది. దీనిపై చిత్ర వార్త సోమవారం ప్రచురితం కావడంతో ఏఈ శ్రీనివాసమూర్తి వెంటనే స్పందించారు. ఏఈ, సిబ్బంది స్తంభాన్ని పరిశీలించి వెంటనే మార్చేశారు. ప్రజలు, రైతులు అధికారులకు, 'ఈనాడు'కు అభినందనలు తెలిపారు.

సమస్యలు.. పరిష్కారం

హిందూపురం అర్బన్ : పట్టణంలోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను 'ఈనాడు'లో మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకెళ్లడంతో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ సోమవారం రోడ్డు నుంచి శ్రీనివాస థియేటర్ వెళ్లే రహదారిలో కాలువలు శుభ్రం చేయించారు. ఎంజీఎం క్రీడా మైదానంలో చెత్తను తొలగింపజేశారు.

హామీ ఇచ్చారు.. అమలు మరిచారు

✦ రహదారి ఏర్పాటుపై గ్రామస్థుల ఆవేదన

లేపాక్షి, న్యూస్‌టుడే: లేపాక్షి మండలంలోని మానేపల్లి పంచాయతీ గౌరిగానిపల్లి, ఎం.వెంకటపురానికి వెళ్లే రహదారులు కంకర తేలి ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే ప్రమాదాలకు గురికావాల్సి వస్తోంది. 2018 అప్పటి తెదేపా ప్రభుత్వంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆయా గ్రామాలకు తారురోడ్డు ఏర్పాటు చేసేందుకు రూ.3.50కోట్లు మంజూరు చేయించారు. అప్పట్లో గుత్తేదారు కొంతమేర పనులు చేశారు. వెంటనే ఎన్నికలు రావడంతో గుత్తేదారు పనులు నిలిపేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం సదరు పనులను రద్దు చేసింది. మళ్లీ రహదారుల పనులు చేపట్టేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచినా... బిల్లులు వస్తాయన్న నమ్మకం లేక గుత్తేదారులు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఐదేళ్లుగా రహదారికి మోక్షం లేకుండా పోయింది.

కంకర తేలిన మానేపల్లి-గౌరిగానిపల్లి రహదారి

మొదలవ్వని పనులు

గత వైకాపా ప్రభుత్వంలో రీజినల్ కోఆర్డినేటర్‌గా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంత్రి హోదాలో గతేడాది జనవరి 10వ తేదిన మండలంలోని మానేపల్లిలో పర్యటించారు. ఆ సమయంలో గౌరిగానిపల్లి, ఎం.వెంకటాపురం గ్రామస్థులు మంత్రిని అడ్డుకుని తమ గ్రామాలకు రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సమస్యను మంత్రి దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన ఆయన ఎన్నికల్లోపు రహదారి నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. తర్వాత వైకాపా ప్రభుత్వం అధికారం కోల్పోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడం, గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు ఏర్పాటుకు అత్యధిక నిధులు కేటాయిస్తుండటంతో ప్రజలు తమ గ్రామాలకు రహదారిని ఏర్పాటుకు మార్గం సుగమమైందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో నరసింహమూర్తిని వివరణ కోరగా రహదారి ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు సంబంధిత శాఖాధికారులకు పంపామని, నిధులు విడుదల కావాల్సి ఉందన్నారు.

చరవాణి మంచికి వినియోగిస్తే ఉజ్వల భవిత

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ల ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 10వ తరగతి చదువుతున్న ఆర్.గగనశ్రీ ప్రథమ, 9వ తరగతి చదువుతున్న ఆర్.వైష్ణవి ద్వితీయ, 7వ తరగతికి చెందిన ఎ.మధుప్రియ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విజేతలతో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

బాలాజీ జూనియర్ కళాశాలలో..

హిందూపురంలోని బాలాజీ జూనియర్ కళాశాలలో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో కె.తనుష్ చంద్ర(బైపీసీ) ప్రథమ, టి.దివాకర్(సీఈసీ) ద్వితీయ, కె.మేఘన(బైపీసీ) తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి కళాశాల ప్రిన్సిపల్ వి.వీరభద్రప్ప బహుమతులు అందజేశారు. కళాశాల అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాలాజీ జూనియర్ కళాశాలలో విజేతలతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

దీపికకు అభినందనల వెల్లువ

మడకశిర, న్యూస్‌టుడే : అంధుల మహిళ టీ-20 ప్రపంచ కప్ విజేతగా నిలిచిన మడకశిర నియోజకవర్గ మాణిక్యం దీపికకు ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల నుంచి అభినందనలు వెల్లువెత్తున్నాయి. ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ మంత్రి రఘువీరారెడ్డి దీపికకు చరవాణి ద్వారా మాట్లాడి అభినందనలు తెలియజేశారు. మారుమూల ప్రాంతమైన మడకశిరకు గర్వ కారణమని, ఆమె రాక కోసం ఎదురుచూస్తున్నామని మన స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రపంచ స్థాయిలో మడకశిర పేరును నిలపడం ఆమె కృషికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.

సమాజ సేవను అలవరచుకోవాలి

గుడిబండ, న్యూస్‌టుడే: విద్యార్థి దశనుంచే సామాజిక సేవను అలవరచుకోవాలని సింగిల్ విండో అధ్యక్షుడు మద్దన కుంటప్ప పేర్కొన్నారు. గుడిబండ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ యశ్వంత్‌కుమార్ నేతృత్వంలో మండలపల్లిలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మద్దన కుంటప్ప మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను శుభ్రం చేసి, ఆరోగ్య సూత్రాలు, మొక్కలు నాటడం లాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో శివశంకర్, సర్పంచి అశ్వత్థనారాయణ, పంచాయతీ కార్యదర్శి రాధాదేవి, హైస్కూలు ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, పాండురంగప్ప, అధ్యాపకులు రామదాస్‌నాయక్, మురళీకృష్ణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

మండలపల్లిలో ఎన్ఎస్ఎస్ క్యాంప్ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

పెనుకొండ, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ సైనికుల్లాగా పని చేయాలని బీసీ సంక్షేమ మంత్రి ఎస్.సవిత పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం తమ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులతో మంత్రి సమావేశమై వారికి దిశానిర్దేశం చేశారు. పార్టీలో పదవి, తగిన గుర్తింపు లభించడం ఎంతో గొప్ప విషయమని, తెదేపా బలోపేతం కోసం పనిచేసిన వారికి తప్పక గుర్తింపు దక్కుతుందన్నారు. రూ.లక్షల అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పయనించేలా అనేక పరిశ్రమలను తీసుకొస్తున్నారని, పేదల సంక్షేమానికి పలు పథకాలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు రాత్రింబవళ్లు శ్రమిస్తున్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధి, పథకాల అమలు గురించి ప్రజలకు ఇంటింటా వివరించాలని, అన్ని స్థానిక సంస్థలను హస్తగతం చేసుకొనేందుకు శ్రమించాలని ఆమె తెలియజేశారు. అనంతరం వారందరినీ మంత్రి సత్కరించారు. సగర, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటరమణ, డైరెక్టర్ కేశవయ్య, నాయకులు పాల్గొన్నారు.


తెదేపా క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులతో మంత్రి సవిత, పార్టీ నాయకులు

తెదేపాలో చేరిక

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పందిపర్తి, మండేపల్లికి చెందిన పలు కుటుంబాలు సోమవారం సాయంత్రం మంత్రి సవిత సమక్షంలో తెదేపాలో చేరారు. వారికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. నాయకులు శ్రీనివాసరెడ్డి, ఆంజనేయులు, వెంకటరమణ, నాగరాజు, లక్ష్మయ్య, నాగిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనుకొండ : పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారిపై ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ సమీపంలో కియా అనుబంధ సంస్థకు సంబంధించిన బస్సు వేగంగా వెళ్తూ ముందు వెళ్తున్న కారును ఢీకొంది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న గోరంట్లకు చెందిన మహమ్మద్, సోనీ గాయపడ్డారు. క్షతగాత్రులను జాతీయ రహదారి అంబులెన్స్‌లో చికిత్స అందించారు. ప్రమాదంలో వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

నేతన్న నేస్తం అమలు చేయాలని వినతి

పెనుకొండ : పట్టు ముడిసరుకు ధరలు పెరిగిపోయి... కష్టపడి నేసిన చీరలు, వస్త్రాలకు గిట్టుబాటు ధరలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే నేతన్న నేస్తం, ఉచిత విద్యుత్తును అందించి ఆదుకోవాలని ఏఐటీయూసీ, చేనేత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకొన్న నాయకులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఘనంగా కనకదాస జయంతి

అమరాపురం: అమరాపురంలో సోమవారం కురుబల ఆరాధ్య దైవం కనకదాస జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. స్వామి వారి చిత్ర పటాన్ని ట్రాక్టర్ ఉంచి పూజలు చేశారు. గొరవయ్యలు నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, స్థానిక నాయకులు నరసింహమూర్తి, శివన్న, ప్రసాద్, కృష్ణమూర్తి, నాగరాజు, ఉయితారలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

నృత్యాలు చేస్తున్న గొరవయ్యలు

ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు

హిందూపురం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే బాలకృష్ణ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసులు అన్నారు. సోమవారం హిందూపురం గ్రామీణ మండలానికి సంబంధించి ప్రజల నుంచి సమస్యలపై అన్నిశాఖల అధికారులు వినతులు స్వీకరించారు. దాదాపు 75 మంది తమ సమస్యలను వినతిపత్రం రూపంలో తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి కొన్ని అక్కడికి అక్కడే పరిష్కరించారు. ఫిర్యాదుల స్వీకరణలో తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే కార్యదర్శులు వీరయ్య, బాలాజీ, మార్కెట్‌యార్డు ఛైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి, మండల తెదేపా అధ్యక్షుడు హెచ్ఎన్ రాము, మండలానికి చెందిన అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రీవెన్ సెల్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

అవీ.. ఇవీ.. అన్నీ..

దాత సహకారం.. విద్యార్థులకు శుద్ధజలం

మడకశిర : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు దాత సహకారంతో సోమవారం శుద్ధజలం ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. సాహితీ గగన్ మహల్ ట్రస్టు ఆధ్వర్యంలో బెంగళూరు ట్రాన్‌జాక్షన్ అనలిస్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1.70లక్షలతో వెయ్యి లీటర్ల సామర్థ్యం గల ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. సాహితీ గగన్ మహల్ ట్రస్టు అధ్యక్షుడు జె.ప్రతాప్‌రెడ్డి, ఆర్‌బీఐ మాజీ రీజినల్ డైరెక్టర్ ఎన్ స్వామి, ప్రిన్సిపల్ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ గోపుర కలశం చోరీ

గోరంట్ల: బూదిలిలో వెలసిన భవానీశంకర ఆలయ గోపుర కలశం ఆదివారం రాత్రి చోరులు ఎత్తుకెళ్లారు. పూజారి శ్రీధర్ సోమవారం ఉదయం యథావిధిగా పూజలు చేయడానికి ఆలయానికి వెళ్లగా విషయం వెలుగుచూసింది. అయిదేళ్ల క్రితం కదిరి ప్రాంతానికి చెందిన భక్తులు వితరణ చేశారని గ్రామస్థులు తెలిపారు. పరిసరాల్లో చిల్లర దొంగతనాలు ఎక్కువైనట్లు పేర్కొన్నారు.

15న డప్పు కళాకారుల జిల్లా మహాసభ

రొద్దం, న్యూస్‌టుడే : జిల్లా డప్పు కళాకారుల అభివృద్ధి, సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా డిసెంబరు 15న శ్రీసత్యసాయిలోని పుట్టపర్తిలో జరిగే డప్పు కళాకారుల మహాసభను విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రమణ, ఉపాధ్యక్షురాలు జ్యోతి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పెద్దాంజనేయస్వామి ఆలయం వద్ద కేవీపీఎస్, డప్పు కళాకారుల సంఘం నాయకులు కరపత్రాలను ప్రదర్శించారు. మండల నాయకులు వెంకటేశులు, అనిత, గోపాల్, నరేంద్ర పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

హిందూపురం అర్బన్ : పట్టణంలోని ఐదులాంతర్ల సర్కిల్‌లో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం స్థానిక శిర్డీసాయి ఆగ్రోస్ నిర్వాహకుడు మమత, భరత్‌లు రూ.2,01,116 ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ అధ్యక్షుడు ఎన్ఆర్ రాఘవేంద్ర, కార్యదర్శి నిమ్మకాయలరాము, సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విజయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పెనుకొండ, రొద్దం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పెనుకొండలోని రహదారి,భవవనాల శాఖ అతిథి గృహంలో రొద్దం మండలంలోని నారనాగేపల్లి, తురకలాపట్నం, చోళేమర్రి పంచాయతీల్లో సోమవారం జరిగిన తెదేపా సమన్వయ కమిటీల సమావేశాల్లో మంత్రి ప్రసంగించారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌కు స్వాగతం

గోరంట్ల: రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీన్‌బానును మండల మైనార్టీ నాయకులు సోమవారం సన్మానించారు. పార్టీ పరిశీలకురాలిగా గోరంట్లకు వచ్చిన నేపథ్యంలో మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు అజ్మతుల్లా ఆధ్వర్యంలో ఇంటిలో ఏర్పాటు చేసిన తేనీటి విందులో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా పూలమాలలు, శాలువతో సత్కరించారు. పార్టీ పరిస్థితిపై చర్చించినట్లు తెలిసింది.

గుంతల రోడ్డు.. బీటీగా మార్చండి

పీఎన్.పాళ్యం, వడ్రహట్టి గ్రామాల మధ్యనున్న రోడ్డును బీటీగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు. మట్టి రోడ్డుగా ఉండటంతో వర్షం వస్తే గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో నాగరాజ్‌నాయక్ మాట్లాడుతూ ప్రతిపాదనలు పంపించామన్నారు. **- న్యూస్‌టుడే, గుడిబండ**

'రైతన్న మీకోసం' ప్రారంభం

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన రైతన్న మీకోసం కార్యక్రమాన్ని సోమవారం ఎం.బీరేపల్లిలో హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి ప్రారంభించారు. అనంతరం అధికారులు ఇంటింటా సర్వే చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల శ్రేయస్సుకు అమలుచేస్తున్న వ్యవసాయ పథకాలు, ప్రయోజనాలు గురించి రైతులకు తెలియజేశారు. మూడు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లోనూ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మహిళా రైతుకు కరపత్రం అందజేస్తున్న మార్కెట్ యార్డు ఛైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి

కాలనీల్లో అపరిశుభ్రం.. రోగాలకు మూలం

హిందూపురం అర్బన్,న్యూస్‌టుడే: మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు లక్ష్మీపురంలోని కృష్ణ లేఅవుట్, ఎన్జీవో కాలనీల్లో అపరిశుభ్రత పేరుకుపోవడంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. డ్రైనేజీలు లేకపోవడంతో మురుగు రోడ్లపైకి చేరడంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. 1990లో ఇక్కడ 40 అడుగుల రోడ్డు వేయాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించినా ఏళ్లు గడుస్తున్నా సిమెంటు రోడ్డు విస్తరించలేదు. డ్రైనేజీలు నిర్మించలేదని కాలనీవాసులు వాపోతున్నారు.

కృష్ణ లేఅవుట్‌లో కాలువలు లేక నిలిచిన మురుగు

● కాలువలు లేక రోడ్లపైకి మురుగు

పారిశుద్ధ్య చర్యలు తీసుకోకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రమై దుర్వాసన వెదజల్లడంతో దోమలు బెడద ఓ వైపు ఉంటే మరో వైపు పందుల స్వైరవిహారంతో వీధుల్లో నడిచే పాదచారులే కాదు ఇళ్లల్లో ఉండే వారు సైతం భరించలేక ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ 487 నివాసగృహాలుంటే 1956మంది జనాభా ఉన్నారు. ఇంటిపన్ను, నీటిపన్నులు కడుతున్నా కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

తక్షణమే చేయాల్సిన పనులివే

- రోడ్ల పక్కన, వీధుల్లో, నివాసగృహాల సమీపంలో నిల్వ ఉన్న మురుగును తొలగించాలి.
- దోమల నివారణకోసం ఫాగింగ్ చేయించాలి.
- దుర్వాసన పోగొట్టడానికి అపరిశుభ్ర ప్రాంతాలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలి.
- పందుల నియంత్రణ కోసం యాజమానులకు వెంటనే నోటీసులు ఇవ్వాలి.
- శివారు ప్రాంతాల్లో విద్యుత్తు వీధిదీపాలు ఏర్పాటుచేయాలి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

పట్టణంలోని కాలనీలను పరిశీలించి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరిచేలా చూస్తాం. రోడ్లు, డ్రైనేజీలను నిర్మించేందుకు శ్రీకారం చుట్టాం.
- రమేశ్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్

బైపాస్ కాలువ పనులు ప్రారంభించాలని వినతి

మడకశిర, న్యూస్‌టుడే : రాష్ట్రంలోనే చిట్ట చివరన కర్ణాటక సరిహద్దులో ఉన్న మడకశిర ప్రాంతానికి హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు రావాలంటే చాలా ఇబ్బందిగా ఉందని, వెంటనే బైపాస్ కెనాల్ పనులు ప్రారంభించాలని మంత్రి నిమ్మల రామానాయుడును కోరినట్లు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు తెలిపారు. సోమవారం ఏపీ సచివాలయంలో రాష్ట్ర నీటి వనరుల శాఖ మంత్రికి వినతి పత్రం అందజేశారు. నీటి సమస్యలు పరిష్కరించేందుకు ఉద్దేశించిన బైపాస్ కెనాల్ విషయంలో సత్వర నిర్ణయం తీసుకోవాలని, అవసరమైన చర్యలు తీసుకుని పనులు మొదలు పెట్టాలని విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. స్పందించిన మంత్రి బైపాస్ కెనాల్ పనులు, కాలువ మరమ్మతులకు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలియజేశారు.

మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతి పత్రం ఇచ్చిన ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు

వేలంతో రూ.9.31 లక్షల ఆదాయం

చిలమత్తూరు, న్యూస్‌టుడే: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సోమవారం చిలమత్తూరు పోలీస్‌స్టేషన్‌లో వేలం పాట నిర్వహించినట్లు ఎస్సై మునీర్‌అహ్మద్ తెలిపారు. 26 వాహనాలను వేలం పాటతో రూ.9,31,020 ఆదాయం వచ్చినట్లు వివరించారు. మరో మూడు వాహనాలు వేలం పాటను వేయలేదని తెలిపారు.

అక్రమ కేసులతో వేధిస్తున్నారు : వైకాపా

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు, తెదేపా నాయకులు వైకాపా వారిని అక్రమ కేసులతో వేధిస్తున్నారని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపికా, బి.సి.విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, రాష్ట్ర నాయకురాలు మధుమతి, ప్రశాంత్‌గౌడ్ తదితరులు సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. వారు పార్టీ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. తమ పార్టీ నాయకుడు ప్రశాంత్ గౌడ్ మద్యం షాపును మూసివేయించేందుకు, వివిధ రకాల కేసులు బనాయించేందుకు, అన్ని ప్రయత్నాలు చేసి విఫలం అయ్యారని, అఖరుకు అక్రమ కేసు పెట్టారని మండిపడ్డారు. ప్రశాంత్ గౌడ్ ఎక్సైజ్ సీఐతో మాట్లాడకపోయినా దూషించినట్లు కేసు పెట్టించారని, అదే విషయాన్ని సీఐ స్వయంగా చెప్పారని, ఆయన క్షమాపణ చెబుతూ మాట్లాడిన మాటల రికార్డింగ్‌ను బయట పెట్టారు. తమ పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేసి, కార్యకర్తలను కొట్టి, తమ వారిపైనే ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టారని, ఆరోజు పట్టణంలోనే లేని వారిపైనా కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటామని తెలిపారు.

ఆవులు పోయే.. దూడలు వచ్చే!

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణంలోని రహదారులపై పశువులు విచ్చలవిడి సంచారంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకొన్నాయి. ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వీటిపై 'ఈనాడు'లో కథనాలు రావడంతో మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. రోడ్లపై ఉన్న పశువులను బంధించి, గోశాలకు తరలించేలా చూశారు. దీంతో పశువుల యజమానులు అప్రమత్తమయ్యారు. పశువులను రోడ్లపైకి వదలకుండా ఇళ్ల వద్దే కట్టేసుకొంటున్నారు. అయితే చిన్న చిన్న దూడలను రహదారులపైకి వదిలేస్తున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి.


రహదారిపై పడుకొన్న దూడలు..

ఎట్టకేలకు సీసీ రోడ్డు నిర్మాణం

రొద్దం, న్యూస్‌టుడే : రొద్దం పంచాయతీలో కందుకూర్లపల్లి నుంచి చిన్నకోడిపల్లి వెళ్లే రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం వచ్చింది. గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు, పాదచారులు ఇటుగా రాకపోకలు సాగించాలంటే ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం ఇటీవల ఈ సీసీ రోడ్డు నిర్మాణానికి మంత్రి సవిత చొరవతో రూ.3 కోట్లు ఉపాధి హామీ కింద నిధులు మంజూరు చేశారు. దీంతో పనులు తీసుకున్న గుత్తేదారు ధనుంజయ్య దాదాపు రెండు కిలో మీటర్ల వరకు సీసీ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేశారు. ప్రస్తుతం గుంతలన్నీ మాయమై చక్కటి రూపు సంతరించుకుంది. దీంతో మట్టి దారి సమస్యలు త్వరలోనే తీరిపోయాయని రెండు గ్రామాల ప్రజలు మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో రహదారి నిర్మాణం వద్ద మాజీ సర్పంచి అశ్వర్థనారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు హనుమన్న, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

కందుకూర్లపల్లి వద్ద చివరి దశలో పనులు

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
గోరంట్ల బ్రాంచ్, శ్రీ సత్యసాయి జిల్లా.

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా **"స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా"** ఈ క్రింది బ్రాంచీలో **"బంగారు నగలు"** తాకట్టుపెట్టి అప్పు తీసుకొన్న ఈ దిగువ తెలిపిన ఖాతాదారుడు గడువు మీరిననూ, పలుమార్లు కోరిననూ, అప్పు తిరిగి చెల్లించనందులకు రిజర్వు బ్యాంకు వారి నిబంధనల ప్రకారం దిగువ కనబరచిన షెడ్యూలు ప్రకారం **26-11-2025వ తేది బుధవారం సా॥ 4.30 గం॥లకు బ్రాంచ్ ఆవరణం నందు బహిరంగ వేలము వేయబడును.**

క్ర. సం.	ఖాతాదారుని పేరు, చిరునామా	అకౌంట్ నెంబర్	అప్పు మొత్తం (సుమారుగా) రూ॥
	గోరంట్ల బ్రాంచి, శ్రీ సత్యసాయి జిల్లా. మొబైల్ నెం: 7259215109		
1	మల్లికార్జున గురోళ్ళ, S/o క్రిష్ణప్ప, D.No. 2-490 వినాయకనగర్, గోరంట్ల - 515231	43404017462	1,10,000/-

వేలం షరతులు: 1) వేలం నందు పాల్గొనదలచినవారు రూ॥ 10,000/- ధరావత్తు కట్టి వేలములో పాల్గొనవలెను. 2) హెచ్చు పాటదారుడు మొత్తమును అదే రోజు నగదును చెల్లించి నగలను పొందవలెను. 3) ఈ ఖాతాదారుడు మరణించిన యెడల అతని వారసులకు ఈ ప్రకటన పూర్వకముగా తెలియపరచినట్లుగా భావించవలెను. 4) అప్పు వసూలు నోటీసు అందనివారు మరియు నోటీసు తిరస్కరించినవారు ఈ ప్రకటన తుది నోటీసుగా భావించి వేలం తేదీలోగా సొమ్ము చెల్లించవచ్చును. 5) వేలం ద్వారా వచ్చిన సొమ్ము బాకీ మొత్తమునకు సరిపోనియెడల చట్టరీత్యా చర్యలు తీసుకొని మిగిలిన బాకీ మొత్తము రాబట్టుకొనబడును. 6) వేలం పాటలో పాల్గొనదలచినవారు ఏదైనా ఫోటో గుర్తింపు కార్డుతో రావలెను. 7) ఇందలి ఖాతాదారునకు ఏ ఇతర రుణములు ఉన్నచో మిగిలిన సొమ్ము ఆ ఖాతాకు సర్దుబాటు చేయబడును. 8) ఈ ప్రకటనకు అయ్యే ఖర్చు పైన తెలిపిన ఖాతాదారుని నుంచి వసూలు చేయబడును. 9) నగల బరువునకు, నాణ్యతకు బ్యాంకువారికి పూచీలేదు.
గమనిక: ఏ విధమైన కారణం చూపకుండానే షరతులు మార్చుకొనుటకుగానీ, వేలం వాయిదా వేయుటకుగానీ, వేలం రద్దు చేయుటకు గానీ ఆయా బ్యాంకు మేనేజర్ల గారికి పూర్తి అధికారము కలదు.

తేది: 24-11-2025
స్థలం: గోరంట్ల
సం/- మేనేజర్
స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, గోరంట్ల

(c) eenadu

పుట్టపర్తి
•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

27న దివ్యాంగులకు క్రీడాపోటీలు

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ విజయవాడ వారి ఆదేశాల మేరకు డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న పెనుకొండ క్రీడ వికాస కేంద్రంలో దివ్యాంగులకు బ్యాడ్మింటన్, ఫెన్సింగ్, పవర్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్ (షాట్‌పుట్, లాంగ్‌జంప్, వంద మీటర్ల పరుగు పందెం) క్రీడలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తిగల దివ్యాంగ క్రీడాకారులు ఈనెల 26 సాయంత్రం 5 గంటలలోపు ఆధార్, వికలాంగ ధ్రువపత్రంతో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ప్రతిభ చూపారు.. బహుమతులు అందుకున్నారు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని బీఎస్ఆర్ పురపాలక బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం అనే' అంశంపై విద్యార్థులు ఉపన్యసించారు. పి.భవ్యశ్రీ పదోతరగతి, ఎస్.కుష్మ్యా పదోతరగతి, ఎస్.షణ్ముఖి తొమ్మిదో తరగతి వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఎంఈవో గోపాల్‌నాయక్, హెచ్ఎం జ్యోతిలక్ష్మి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయుడు సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో గోపాల్‌నాయక్, హెచ్ఎం జ్యోతిలక్ష్మి

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: కదిరి మండల పరిధిలోని చలమ కుంట్లపల్లి పంచాయతీ జౌకల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో కుళాయి లీకేజీతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. మరమ్మతులు చేపట్టి, పరిసరాలు శుభ్రం చేయాలి. - గ్రామస్థులు

సమస్య: జౌకల గ్రామంలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతూ విద్యుత్తు వృథా అవుతోంది. దీపాల నిర్వహణ చేపట్టి విద్యుత్తు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలి.
- శ్రీనివాసులు, జౌకల

సమాధానం: కుళాయికి మరమ్మతులు చేయిస్తాం. వీధి దీపాల నిర్వహణ చేపడతాం. (పై ప్రశ్నలకు చలమకుంట్లపల్లి పంచాయతీ కార్యదర్శి సంయుక్త సమాధానం ఇచ్చారు.)
- న్యూస్‌టుడే, కదిరి గ్రామీణం

సమస్య: ముదిగుబ్బలోని మలకవేముల క్రాస్ దగ్గర శివాలయం వీధిలో చెత్త, మురుగు పేరుకుపోయి అపరిశుభ్రంగా ఉంది. అధికారులు స్పందించి శీఘ్రం శుభ్రం చేయించాలి. - గ్రామస్థులు

సమాధానం: చెత్త వేయకూడదని స్థానికులకు అవగాహన కల్పిస్తున్నాం. అక్కడ కుండీ కొత్తది ఏర్పాటు చేయిస్తాం.
- బాబ్జాన్, పంచాయతీ కార్యదర్శి
- న్యూస్‌టుడే, ముదిగుబ్బ

దారి తప్పిన వంతెన.. రైతుల్లో ఆందోళన

వంక దాటడానికి పాట్లుపడుతున్న రైతులు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు మండలం బండ్లపల్లి పంచాయతీ ఎర్రపల్లి గ్రామ పరిధిలోని శెట్టిపల్లి వంకపై చేపట్టిన వంతెన నిర్మాణం దారి తప్పింది. చెన్న రాజుపల్లికి తూర్పువైపు, ఎర్రపల్లి గ్రామానికి పడమటి వైపు వందల ఎకరాల సాగు భూములున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా వంకలు రోజుల తరబడి ఉద్ధృతంగా ప్రవహించడంతో రెండు గ్రామాల రైతులు పొలాలకు చేరుకోవడం కష్టంగా ఉండేది. దీనిపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమవడంతో పాటు గ్రామ ప్రజల వినతుల మేరకు పంచాయతీరాజ్ శాఖ (ప్రాజెక్టు) అధికారులు ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద ప్రతిపాదనలు పంపారు. దీంతో వంగపేరు, శెట్టిపల్లి వంకలపై వంతెనల నిర్మాణాలకు మూడేళ్ల కిందట రూ.8 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వంతెనల నిర్మాణంతో కష్టాలు తీరుతాయని ప్రజలు, రైతులు ఆనందించారు.

మూడేళ్లయినా పునాదులకే పరిమితం

ఎర్రపల్లి గ్రామానికి పడమటి వైపు దాదాపు 500 ఎకరాల సాగు భూములున్నాయి. రైతులు పొలాలకు వెళ్లాలంటే శెట్టిపల్లి వంక దాటాల్సిందే. మూడేళ్ల కిందట వంతెన నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరవడంతో గుత్తేదారు పనులు ప్రారంభించారు. అయితే ముందు నుంచి కొనసాగుతున్న దారిలో కాకుండా వంతెన పిల్లర్లను దిగువ వైపు రైతు ఆంజనేయులు పొలంలోకి మళ్లించారు. వంక ప్రవాహంతో తన భూమి కోతకు గురవుతుందని రైతు పనులను నిలిపేసి అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే చెన్నరాజుపల్లి దగ్గర వంతెన నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఎప్పటికి పూర్తి చేస్తారో తెలియని పరిస్థితి ఉందని గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

నా పొలంలోకి మళ్లించారు

- ఆంజనేయులు, రైతు, ఎర్రపల్లి

శెట్టిపల్లి వంకకు ఎగువన నాకు 65 సెంట్ల సాగు భూమి ఉంది. పొలానికి వెళ్లాలంటే వంక దాటాల్సిందే. వంతెన పనులు మొదలుపెట్టడంతో కష్టాలు తీరుతాయని భావించాం. అయితే ఇంజినీర్, గుత్తేదారు పిల్లర్లను దారిలో కాకుండా నా పొలం వైపు మళ్లించారు. ప్రారంభంలోనే అభ్యంతరం చెప్పాను. గత వైకాపా ప్రభుత్వంలో స్థానిక రాజకీయ కారణంగా వంతెన దిశను మార్చి నా భూమిపైకి మళ్లించారు. వంక ప్రవాహంతో భూమి కోతకు గురవుతుంది.

త్వరగా పూర్తి చేయాలి

బండ్లపల్లి పంచాయతీలో ఏడు గ్రామాలున్నాయి. ప్రధానంగా వంగపేరు, శెట్టిపల్లి వంకలు దాటుకుని గ్రామాలకు వెళ్లాలి. నిత్యం పనులు జరుగుతున్నాయి. ఎర్రపల్లి దగ్గర వంతెన పనులతో రైతులకు ఇబ్బంది లేకుండా అధికారులు, గుత్తేదారుతో మాట్లాడుతాం. వంతెనలు త్వరగా పూర్తి చేస్తే రైతులకు సౌకర్యవంతంగా ఉంటుంది.
- గీతాబాయి, సర్పంచి, బండ్లపల్లి, కొత్తచెరువు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నిరసన తెలుపుతున్న సమగ్రశిక్షా ఉద్యోగులు

బుక్కపట్నం, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే విజయవాడలోని రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడిస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. బుక్కపట్నం సమగ్రశిక్షా జిల్లా కార్యాలయం వద్ద సోమవారం సమస్యలను ఏకరవు పెడుతూ ప్లకార్డుల ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగుల ఫెడరేషన్, జేఏసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఓబిరెడ్డి, రామన్న మాట్లాడారు. ప్రభుత్వం ఆరేళ్లుగా జీతం రూపాయి కూడా పెంచలేదన్నారు. 2014కు ముందు ఉద్యోగం చేరిన అందరిని క్రమబద్ధీకరించాలన్నారు. హెచ్ఆర్ పాలసీ, ఎంటీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత పుట్టపర్తిలో జిల్లా కలెక్టరు, డీఈఓలకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా నాయకులు ఓబులేసు, బాస్కర్, హారున్‌బాషా, గోవిందరెడ్డి, బాస్కర్ నాయుడు, కిష్టప్ప, నాగరాజు, ముకుంద, శేఖర్, వరలక్ష్మి, లక్ష్మీ, భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కృష్ణాజలాలు పారించిన ఘనత చంద్రబాబుదే

- ఎమ్మెల్యే కందికుంట

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట, నాయకులు

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో కృష్ణాజలాలు పారించి కరవును దూరం చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కదిరి మండలం కొండమనాయని పాళ్యం గ్రామంలో పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లో జమ కావడంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'రైతన్నా మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని, ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. గత వైకాపా పాలనలో కేవలం ప్రచారం కోసం జల దీక్షలు, నీటి విడుదల కార్యక్రమాలు చేశారని ఎమ్మెల్యే విమర్శించారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీన్‌బాను, జేడీఏ వెంకటేశ్వర్లు, పట్టు పరిశ్రమ శాఖ ఏడీఏ వెంకటస్వామి నాయక్, పశుసంవర్ధక శాఖ జేడీ శుభదాస్, ఏడీఏ సనావుల్ల, ఎంపీడీఓ పోలప్ప, ఏఓ శ్రీహరినాయక్, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

చట్టబద్ధమైన దత్తత శ్రేయస్కరం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రతి ఏటా నవంబరు దత్తత మాసంగా నిర్వహించాలని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (సీఏఆర్ఏ) సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లాలో దత్తతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను జేసీ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదికలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ రూపొందించిన దత్తత అవగాహన గోడపత్రాలను జేసీ విడుదల చేశారు. అనాథలు, విడిచిపెట్టిన పిల్లలు, సరెండర్ చేసిన పిల్లలను కేవలం చట్టపరమైన ప్రక్రియ ద్వారా మాత్రమే దత్తత తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ ఏడాది అవగాహన కార్యక్రమాల్లో భాగంగా వివిధ ప్రతిభావంతుల పిల్లల దత్తతను ప్రోత్సహించేలా ప్రత్యేక కార్యక్రమాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ సూర్యనారాయణరెడ్డి, ఐసీడీఎస్ పీడీ ప్రమీల, ఆర్డీవో సువర్ణ, డీఈవో కిష్టప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రైతన్నా మీకోసం వారోత్సవాలు

నంబులపూలకుంట: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ లోకేశ్వరరెడ్డి

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలను ఇంటింటికీ వెళ్లి పరిశీలించి, సంక్షేమ పథకాలు అందేలా చూడటానికే రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ఏడీ లోకేశ్వరరెడ్డి, తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీవో పార్థసారథి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బంది, కూటమి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి పథకాలపై వివరించారు.

తలుపుల: మండలంలో తెదేపా నాయకులు శంకర, రామాంజులు, ఓబుల్‌రెడ్డి, నరసింహులు, పురుషోత్తమరెడ్డి, రవి, విశ్వనాథ్‌రెడ్డి, శ్రావణి, తదితరులు ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు.

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ బాబు రావు, ఏవో షాదాబ్, పశువైద్యాధికారి చెన్నకేశవులు, ఎంపీపీ సోమశేఖర్‌రెడ్డి, తెదేపా మండల కన్వీనర్ కొండయ్య రైతులతో కలిసి ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి రైతులకు పీఎం కిసాన్ లేఖ అందించి, ఏపీఏఐఎంఎస్ యాప్‌ను చరవాణిలో పొందుపరిచారు.

నల్లమాడ: మండల కేంద్రంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఈవో అబ్దుల్‌హక్, ఏఈవో రాధ ఏపీఎం కేవీ రంగాచారి రైతన్నా మీకోసం నిర్వహించారు.

తనకల్లు: పంటలకు పచ్చిరొట్ట ఎరువులు వాడడం వల్ల పెట్టుబడి వ్యయం తగ్గి రైతులు అధిక ఆదాయం పొందవచ్చని వ్యవసాయాధికారి భారతి అన్నారు. మండలంలో 'రైతన్నా మీకోసం' నిర్వహించారు.

బత్తలపల్లి: ప్రకృతి వ్యవసాయంతో ఎక్కువ ఆదాయం పొందవచ్చని ఏపీ సీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్ పేర్కొన్నారు. మండలంలోని ముష్టూరులో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

ఉత్సవాలు విజయవంతం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి శత జయంత్యుత్సవాలను శాంతియుత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, పోలీసు యంత్రాంగం అద్భుతంగా పని చేశారని, సత్యసాయి ట్రస్టును పూర్తిగా సమన్వయం చేసుకున్నామని, ఎంతో సహకారం చారని కలెక్టర్ తెలిపారు. సోమవారం సాయి ఆరామంలో జిల్లా అధికారులతో కలెక్టర్, ఎస్పీ సతీష్‌కుమార్ సంయుక్త అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమాలు, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజా సౌకర్యాలు, స్వచ్ఛత, వైద్యసేవలు తదితర విభాగాల్లో అధికారులు పనితీరును, చేసిన కృషిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. జేసీ మౌర్యభరద్వాజ్ మాట్లాడుతూ అధికారుల మంచి అవగాహనతో సమన్వయంగా ఉత్సవాలు విజయవంతానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీవోలు సువర్ణ, శర్మ, మహేష్, ఆనంద్, డీఎస్పీ విజయ్ కుమార్, అడిషనల్ ఎస్పీ... ఎస్ఈ సంపత్‌కుమార్, డీఆర్డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.

26న ఉచిత మెగా వైద్యశిబిరం

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని శివానగర్ బ్రిలియంట్ పాఠశాలలో ఈ నెల 26వ తేదీన శ్రీసత్య జయంతి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ సీవీ శేషు తెలిపారు. శిబిరంలో కంటి, దంత, చిన్నారుల ఆరోగ్య సమస్యలపై నిపుణులైన వైద్య బృందం పరీక్షలు చేస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన సరస్ మేళా

ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీఆర్డీఏ పీడీ నర్సయ్య

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంత్యుత్సవాల సందర్భంగా పుట్టపర్తి శిల్పారామంలో ఏర్పాటు చేసిన సరస్ మేళా సోమవారం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్డీఏ పీడీ నరసయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో గ్రామీణ మహిళా సంఘాల సభ్యులు, గ్రామీణ కళాకారులు తయారు చేసిన ఉత్పత్తుల అమ్మకాలను ప్రోత్సహించడానికి రాయలసీమ జిల్లాల్లో మొదటిసారి సరస్ మేళా ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 15న ప్రారంభమై 24 వరకు కొనసాగిన ఈ మేళాలో వివిధ రాష్ట్రాలకు చెందిన 80 స్టాళ్ల ద్వారా అమ్మకాలు సాగించారన్నారు. మేళా చివరి రోజు పాల్గొన్న వ్యాపారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

సత్యసాయి సేవా మార్గంలో నడవాలి

రక్తదాతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

ధర్మవరం, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని యాదవవీధిలో సోమవారం శిర్డీసాయి పరిషత్ సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. స్థానిక యాదవవీధిలో నిర్మిస్తున్న వినాయకుడి ఆలయానికి రూ.లక్ష, ఓడీసీ మండలంలోని శివాలయానికి రూ.50 వేలు శిర్డీసాయి పరిషత్ సాయి సంస్థ నిర్వాహకుడు వై.రాజు అందజేశారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ సత్యసాయిబాబా చూపిన సేవా మార్గంలో నడవాలన్నారు. తెదేపా నాయకుడు సంధా రాఘవ, మాజీ కౌన్సిలర్ వై.రాజు, జనసేన పార్టీ పట్టణాధ్యక్షుడు అడ్డగిరి శ్యామ్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

దుప్పట్లు, విద్యా సామగ్రి అందజేత

ధర్మవరం, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా శతజయంతిని పురస్కరించుకుని పట్టణానికి చెందిన ఆర్యవైశ్య యువజన సంఘం మాజీ అధ్యక్షుడు నాగకిరణ్ సోమవారం పేదలకు, నిరాశ్రయులకు పంపిణీ చేసిందుకు దుప్పట్లు, విద్యార్థులకు విద్యాసామగ్రిని సాంస్కృతిక మండలి అధ్యక్షుడు ప్రసన్నకుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేషులు, డైరెక్టర్ అశ్వర్థనారాయణ, వినయ్‌కుమార్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: అండర్-17 జిల్లా క్రికెట్ పోటీలకు ధర్మవరం పట్టణానికి చెందిన గోవర్ధన్, బృందా, గోపిచందన ఎంపికైనట్లు కోచ్ రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ త్వరలో స్కూల్ గేమ్స్ క్రికెట్ పోటీలు ప్రారంభం అవుతాయని, బాలుర, బాలికల విభాగాల్లో ముగ్గురు ఎంపికయ్యారన్నారు. వీరు ఆర్టీటీ క్రీడ మైదానంలో గత మూడేళ్లుగా శిక్షణ తీసుకుంటున్నారని కోచ్ తెలిపారు.

గోవర్ధన్

బృందా

గోపిచందన

అరటి రైతులను ఆదుకోండి

కనగానపల్లి, న్యూస్‌టుడే: అరటి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహాదేవ, సీపీఎం మండల కార్యదర్శి బాలరాజు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో రైతులు సాగు చేసిన అరటి పంటను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. బోరుబావుల కింద వ్యవసాయ పొలాల్లో రైతులు విస్తారంగా అరటి పంటను సాగు చేశారని, లక్షలు వెచ్చించి సాగు చేసిన అరటి పంటకు మార్కెట్లో గిట్టుబాటు ధర లేకపోవడంతో పొలంలోనే వదిలివేయడమన్నారు. ప్రభుత్వం అరటి పంట సాగు చేసిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులు, సిబ్బందిని సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ కమిషనర్ డా.రమేష్‌నాథ్ ఆదేశించారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో ఆయన మాట్లాడారు. సూపరింటెండెంట్ డా.తిప్పేంద్రనాయక్ పాల్గొన్నారు.

ట్యాంకు శిథిలం.. మరమ్మతులు శూన్యం

ముదిగుబ్బ మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో తాగునీటి ట్యాంకు పైకప్పు శిథిలమైంది. 40 వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకు నిర్మించగా ప్రస్తుతం నిరుపయోగంగా మారడంతో పంచాయతీ బోరు నీరే గ్రామానికి సరఫరా అవుతోంది. పైభాగంలో రక్షణగా ఏర్పాటు చేసిన దిమ్మెలు దెబ్బతినడంతో ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. రహదారి పక్కనే ట్యాంకు నిర్మించడంతో రాకపోకల సమయంలో పైకప్పులు పెచ్చులూడిపడితే ప్రమాదముందని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ట్యాంకుకు మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ముదిగుబ్బ

రహదారులు మురుగుమయం

తలుపుల మండలంలోని గ్రామీణ రహదారులు, వీధులు మడుగులను తలపిస్తున్నాయి. పంచాయతీ ప్రాంతంలో మురుగు నీరు వీధుల్లో అడుగుతీసి అడుగు వేయాలన్నా ఇబ్బంది ఉందని స్థానికులు అంటున్నారు. ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న మలుపులో వర్షపునీరు నిలిచి అధ్వానంగా మారింది. తలుపులలో ప్రధాన వీధులు నీటికుంట లను తలపిస్తున్నాయి. ఈ కారణంగా వల్ల ఇబ్బందిగా ఉందని ప్రయోజనం లేకపోయిందని, కోతకు వచ్చిన వరి పంటకు నష్టం కలిగించేలా ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, తలుపుల

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరిపట్టణం పార్థసారథి కాలనీలో నివాసం ఉంటున్న అహ్మద్, ఆయన తల్లి పాతిమాపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పార్థసారథి కాలనీకి చెందిన రేవతి, పతివాళ్లతో ద్దులో నివాసం ఉండే అహ్మద్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఇటీవల తరచూ దంపతుల మధ్య గొడవలు జరుగుతుండటంతో రేవతి ఇద్దరు పిల్లలతో పుట్టింటికి వచ్చేసింది. పిల్లలను తీసుకెళ్లేందుకు సోమవారం అహ్మద్ తన తల్లితో కలిసి వచ్చారు. భార్యను, ఆమె అక్క రాధమ్మను వారు రోకలిబండతో కొట్టి కులంపేరుతో తిట్టారు. బాధితులు ఫిర్యాదు మేరకు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. పిల్లలను తీసుకెళ్లేందుకు వెళ్లగా తమను అంజన్న, భార్య రేవతి, ఆమె అక్క రాధమ్మ మరో ఇద్దరు ఇనుపరాడ్‌తో దాడి చేసి గాయపరిచారని అహ్మద్ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు

కొక్కంటిక్రాస్(తనకల్లు), న్యూస్‌టుడే: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన తనకల్లు మండలంలోని కొక్కంటిక్రాస్ లో సోమవారం జరిగింది. యూనియన్ బ్యాంక్ మేనేజరు శ్రీనివాసులురెడ్డి సాయంత్రం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో కదిరికి వెళ్తుండగా నల్లచెరువు మండలం పెద్దయల్లంపల్లికి చెందిన లక్ష్మీనారాయణ, అన్నమయ్య జిల్లా రంగసముద్రం కు చెందిన లోకేష్ ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాలు కొండా పంక్షన్‌హాల్ వద్ద ఢీకొన్నాయి. ప్రమాదంలో మేనేజరుకు కుడికాలు విరిగింది. మిగతా ఇద్దరికీ గాయాలయ్యాయి. వందేమాతరం బృంద సభ్యుడు అశోక్ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రులను కదిరి ప్రాంతీయ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

న్యామద్దల (చెన్నేకొత్తపల్లి), న్యూస్‌టుడే: పశుసంవర్ధకశాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గణాభివృద్ధి సంస్థ ఈడీ వెంకటేష్ పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దల గ్రామంలో సోమవారం ఉచిత గర్భకోశ చికిత్స, పెయ్యి దూడల జన్యుచే వీర్య ప్రాముఖ్యాన్ని రైతులకు తెలియజేశారు. అన్ని పశు వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 60 పశువులకు గర్భకోశ చికిత్సలు అందించామన్నారు. పాడి రైతులకు ఉచితంగా మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందించారు.

'మరచిపోయిన డబ్బును తిరిగి పొందండి'

కదిరి, న్యూస్‌టుడే: పాత బ్యాంకు ఖాతాల్లో మరచిపోయిన డబ్బును తిరిగి పొందేలా ఆర్బీఐ సహకరిస్తోందని ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ వీరమారుతి తెలిపారు. కదిరి పట్టణంలోని ఏపీజీ బ్యాంకు, ఎస్బీఐ, ఏపీజీబీ శాఖల్లో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాత బ్యాంకు ఖాతాల్లో మరచిన డబ్బును ఎలా పొందవచ్చో తెలిపే కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏడీసీ బ్యాంకు మేనేజరు శ్రీనివాసులు, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరభ్యంతర పత్రాలిచ్చేలా చర్యలు తీసుకోండి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి అడపాలవీధిలో ఇళ్లు నిర్మించుకున్న వారికి నిరభ్యంతర పత్రాలు అందించాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కదిరి ఆర్డీఓ వీవీఎస్ శర్మను యజమానులు కోరారు. 224, 683 సర్వే నంబర్లలో ఇళ్లు కట్టుకున్న వారికి నిరభ్యంతర పత్రాలు ఇవ్వించాలని కోరారు. దాదాపు రెండు దశాబ్దాల కిందట నిషిద్ధ జాబితాలో ఉన్న భూమిలో స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకున్నాం. ఆ తర్వాత జాబితాలో నుంచి తొలగించారు. చివరికి జల ప్రకారం కాకుండా మరోచోట, ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల నిర్మించుకోవడం వల్ల సమస్య పరిష్కారం కాలేదు. అధికారులు విచారణ చేసి న్యాయం చేయాలని ఇంటి యజమానులు కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ప్రభుత్వ చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆర్డీఓ వీవీఎస్ శర్మ హామీ ఇచ్చారు.

ఎక్కడ చూసినా కుక్కలు.. పశువులే

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి పట్టణంలో ఎక్కడ చూసినా కుక్కలు.. పశువుల గుంపులుగా సంచరిస్తుండటంతో జనం బెంబేలెత్తుతున్నారు. కుక్కలు చిన్నారులు, పెద్దలపై దాడులకు తెగబడుతున్నాయి. శ్రీలక్ష్మీనరసింహస్వామికి భక్తులు సమర్పించిన ఆవులతో పాటు ప్రైవేటు వ్యక్తులకు చెందిన పశువులు పెద్దసంఖ్యలో ప్రధాన రహదారులపై తిరుగుతున్నాయి. ఇక్బాల్‌రోడ్డు, శివాలయం ప్రాంతంలో కోడేలు తరచూ పోట్లాడుకుంటూ ప్రజల మీదకు వస్తున్నాయి. వాటిని తరిమే క్రమంలో భయంతో పారుగెడుతూ స్థానికులు గాయపడ్డారు. మరోవైపు పశువులు ఆకలి మేతకోసం ప్లాస్టిక్ వ్యర్థాలను తింటూ జీర్ణవ్యవస్థ దెబ్బతిని మృత్యువాత పడుతున్నాయి. రోడ్డుపై తిరుగుతూ లేగదూడలు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నాయి. స్వామివారికి భక్తులు సమర్పించిన ఆవులను గోశాలకు తరలించి సంరక్షించాలని, ప్రైవేటు వ్యక్తుల పశువులను వారికి అప్పగించాలని స్థానికులు కోరుతున్నారు.

రాయచోటి రోడ్డులో కుక్కల గుంపు

జాతీయ రహదారిపై పశువులు

సమస్య పరిష్కారానికి చర్యలు

- కిరణ్‌కుమార్, కమిషనర్, కదిరి మున్సిపాలిటీ

వీధికుక్కల సమస్యను పరిష్కరిస్తాం. ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా మరో ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకుంటాం. భక్తులు సమర్పించిన ఆవులను పుట్టపర్తి గోశాలకు తరలించే విషయమై ఆలయ ఈవోతో చర్చిస్తాం. పశువుల యజమానులకు నోటీసులు ఇస్తాం. పశువులను రోడ్డుపైకి వదలవద్దని సూచిస్తాం. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే వాటిని కూడా గోశాలకు తరలిస్తాం.

పదోతరగతి పఠన సామగ్రికి విరాళం

కదిరి, న్యూస్‌టుడే: పదోతరగతి స్టడీ మెటీరియల్ కోసం సిమ్స్ ఆసుపత్రి యాజమాన్యం సోమవారం కదిరిలో ఆర్థిక సాయాన్ని అందించారు. ఏటా పదోతరగతి చదివే పేద విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మాదిరి ప్రశ్నపత్రాల పుస్తకాలను తయారు చేస్తారు. కదిరి ప్రాంతంలోని వెయ్యిమంది పేద తరగతి విద్యార్థులకు ఆ పుస్తకాలను అందజేసేలా సిమ్స్ ఆసుపత్రి యాజమాన్యం నిసార్ యాసిన్‌ఖాన్, యూటీఎఫ్ నాయకులు మైనొద్దీన్ రూ.80 వేల విరాళం జిల్లా నాయకులు శ్రీనివాసులు, తాహెర్‌వలికి అందజేశారు. కార్యక్రమంలో సహాయ నారాయణ, మధుసూదన్, రాజేష్, వెంగమునాయుడు, జాజామోహిద్దీన్, రవివర్ధన్‌రెడ్డి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న దాతలు

(c) eenadu

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే కొత్తూరు, హిరమండలం

మాయదారి పురుగు కుడుతోంది..!

● జిల్లాలో దడ పుట్టిస్తున్న స్క్రబ్ టైఫస్..!

జిల్లాలో స్క్రబ్ టైఫస్ వ్యాధి బాధితులు పెరుగుతున్నారు. వారం రోజుల్లో ఏడు కేసులు నమోదు కావడంతో ఆందోళన నెలకొంది. ఇప్పటికే 3 మండలాల్లోని 7 గ్రామాల్లో ఒక్కొక్కరు చొప్పున ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, చిన్న పురుగు కుట్టడంతో దీని బారిన పడుతున్నారని చెబుతున్నారు.

● కొత్తూరు మండలం కడుము, దాశరథిపురం గ్రామాల్లోనూ కేసులు నమోదయ్యాయి. ● గార మండలం కేజేపేటలో ఓ విద్యార్థిని దీని బారిన పడింది.

● హిరమండలం: అక్కరాపల్లికి చెందిన ఓ మహిళ, మెండ దీడికి చెందిన విద్యార్థి, అంబావల్లి గ్రామానికి చెందిన 9 నెలల శిశువు స్క్రబ్ టైఫస్ వ్యాధి బారిన పడ్డారు.

ఏమిటీ వ్యాధి..

స్క్రబ్ టైఫస్ వ్యాధి చిన్న పాటి పురుగు కుట్టడం ద్వారా వస్తుంది. ఇది ఎక్కువగా వ్యవసాయ భూములు, కొండ ప్రాంతాల్లో ప్రబలుతుంది. అపరిశుభ్రత, చెత్త, పనికిరాని మొక్కలు, తేమ, ముదురు ఉన్న ప్రదేశాల్లో ఈ పురుగు ఉంటుంది. ఇది కుట్టడంతో వ్యాధిబారిన పడతారు. శీతాకాలంలో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. తాజాగా కొత్తూరు, హిరమండలం, గార మండలాల్లో పలు గ్రామాల్లో దీనిబారినపడుతున్నారు.

● 2022లో లావేరు మండలం అప్పాపురం గ్రామస్థులు ఈ వ్యాధి బారిన పడ్డారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టి వైద్య శిబిరాలు నిర్వహించడంతో నియంత్రణలోకి వచ్చింది.

లక్షణాలు..

- పురుగు కుట్టిన ప్రదేశంలో నల్లగా ఉండి చర్మం ఎర్రబారుతుంది. చిన్న పాటి దద్దుర్లు కనిపిస్తాయి.
- జ్వరం, దగ్గు, జలుబు, నీరసం, తల, కీళ్లనొప్పులతో బాధపడతారు. ప్లేట్‌లెట్లు తగ్గుతాయి.
- వైద్యులను సంప్రదించకుంటే తీవ్రమైన జ్వరం, ఊపిరితిత్తులు, పచ్చకామెర్లు, రక్తం గడ్డకట్టడం, శ్వాసకోస ఇబ్బందులు తలెత్తుతాయి.
- మూత్రపిండాలు, మెదడుపై ప్రభావం చూపే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- చెత్త పేరుకుపోకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి.
- ఇంట్లో తేమ లేకుండా పొడి వాతావరణం ఉండేలా చూసుకోవాలి.
- తడి దుస్తులు ధరించకూడదు.
- కాళ్లు, చేతులు పూర్తిగా కప్పి ఉండేలా దుస్తులు ధరించాలి.
- పొలాల్లో పని చేసే వారు ఏదైనా పురుగు కుట్టినట్లు గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

నిర్లక్ష్యం చేయకూడదు..

నల్లి వంటి పురుగు కుట్టడంతో స్క్రబ్ టైఫస్ వ్యాధి వస్తుంది. దీనికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బాధితులు నిర్లక్ష్యం చేయకూడదు. 3 రోజులకు పైగా తీవ్రమైన జ్వరం, ఆయాసం, దగ్గు వంటి లక్షణాలు ఉంటే ఆసుపత్రిలో చికిత్స తీసుకోవాలి.
– డాక్టర్ సనపల నరసింహమూర్తి, అసోసియేట్ ప్రొఫెసర్, సర్వజనాసుపత్రి, శ్రీకాకుళం

శరవణభవ..

సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. శరవణభవ నామం మారుమోగుతోంది. వేడుకల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్దఎత్తున పూజల్లో పాల్గొంటున్నారు. శ్రీకాకుళం నగరంలోని నక్కవీధి, గుడివీధిలో కొలువైన వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో సోమవారం క్షీర, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ఉమా జలలేశ్వరాలయంలో స్వామిని అభిషేకిస్తున్న చిత్రాన్ని చూడొచ్చు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

చల్లగా.. హాయిగా

ఈనాడు కథనానికి స్పందన

ఆదిత్యాలయంలో గతంలో భక్తులు ఎండకు, వానకు ఇబ్బంది పడకుండా దాతల సాయంతో ఏర్పాటు చేసిన రేకుల షెడ్లు తొలగించారు. ఇక్కడికొచ్చే భక్తులకు నిలువ నీడ లేకుండా పోయింది. ఇక్కడి పరిస్థితులపై 'ఈనాడు'లో వరుస కథనాలు రావడంతో మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. అధికారులు వాటి స్థానంలో తాటాకులతో చలువ పందిర్లు వేయిస్తున్నారు.. దీంతో కొంత వరకైనా ఉపశమనం కలుగుతోంది. మంత్రి ఆదేశాలతో ఏర్పాటు చేసినట్లు ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

గొంతు తడవాలంటే ఆరాటం..!

నీటిని ఇలా తెచ్చుకోవాల్సిందే..

ఇచ్ఛాపురం పుర పరిధి బెల్లుపడ ప్రాంతంలో ఏ కాలమైనా నీరు కావాలంటే నాలుగడుగుల లోతులోకి దిగి సేకరించుకోవాలి. లేదంటే దూరంగా ఉన్న బోర్లు, కృష్ణసాగర్ బావే దిక్కు. 12, 13 వార్డుల్లో కొన్ని వీధులకు కుళాయి పైపు లైన్లు అమర్చలేదు. ఉన్న చోట మూడు నుంచి నాలుగు అడుగుల లోతులో కుళాయిలున్నాయి. మెట్ల మార్గం ద్వారా లోపలకి దిగి, నీటిని చిన్న డబ్బాతో తోడుకుని బిందెలో సేకరించుకోవాలి. ప్రస్తుతం రెండు రోజులకోసారి నీరు సరఫరా చేస్తుండటంతో సరిపడా పట్టలేక, డబ్బాలను బయట కొనుగోలు చేసుకుని వాడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించండి

రైతులు రబీ కాలంలో వరితోపాటు ప్రత్యామ్నాయంగా ఉద్యాన, వాణిజ్య పంటలు వేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. 'రైతన్న మీ కోసం' వారోత్సవాల్లో భాగంగా ఎచ్చెర్ల మండలం పొన్నాడ గ్రామంలో సోమవారం పర్యటించి రైతులతో మాట్లాడారు. వేరు శనగ, చోడి, ఆయిల్ పామ్, పొద్దుతిరుగుడు ఇతర పంటలు సాగుచేసేలా రైతులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సేంద్రియ పద్ధతిలో కూరగాయ పంటలతో పాటు, బీడు భూముల్లో పశుగ్రాసం పండించడం, పాడి పోషణపై ఆసక్తి చూపాలన్నారు. – న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

రైతేరాజు 6లో

నీకు కొంత.. నాకు కొంత..!

న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

ఎచ్చెర్ల వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ అక్రమాలకు అడ్డాగా మారింది. ఇక్కడ ఉద్యోగుల ముసుగులో కొందరు ప్రైవేటు వ్యక్తులు దోపిడీకి పాల్పడుతున్నారు. ఇదంతా కమిటీ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నా అడిగేవారే లేరు. పట్టపగలే వాహనాలు నిలిపి వసూళ్లకు తెరతీస్తున్నారు. చిలకపాలెం పాత టోల్ గేట్ వద్ద జాతీయ రహదారిపై ఏఎంసీ చెక్‌పోస్టు నిర్వహిస్తున్నారు. వాహన రాకపోకలతో పాటు డిమాండ్ ఉన్న చెక్‌పోస్టు అయినా ఆదాయం మాత్రం అరకొరగానే రికార్డుల్లో చూపుతున్నారు.

చిలకపాలెం చెక్‌పోస్టు వద్ద లారీని నిలిపి అనధికారకంగా వసూలు చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు

అతనిదే హవా..

వ్యవసాయ మార్కెట్ కమిటీలో పని చేస్తూ రూ.3,22,57,819 అవినీతి రుజువు కావటంతో సస్పెండ్ అయిన ఓ ఉద్యోగి కొంతమంది ప్రైవేటు వ్యక్తులను పెట్టుకొని ఇక్కడ వాహనాల నుంచి అనధికారికంగా పన్ను వసూళ్లు చేసి దోపిడీకి పాల్పడుతున్నారు. ఫలితంగా ప్రభుత్వానికి రావాల్సిన రూ.కోట్ల ఆదాయం ప్రైవేటు వ్యక్తుల జేబుల్లోకి వెళుతోంది. ఇక్కడ నెలకు రూ.20 లక్షల వరకూ ఆదాయం వస్తుండగా, రూ.3- 4 లక్షలే అధికారులు లెక్కల్లో చూపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎచ్చెర్ల ఏఎంసీలో అనధికారక వసూళ్లు..!

ప్రైవేటు వ్యక్తుల సహకారంతో దోపిడీ

ఏం చేయాలి..

- ఈ ప్రాంతంలో సాగైన ఉత్పత్తులు ధాన్యం, పత్తి, మొక్కజొన్న, కూరగాయలు, నీలగిరి, సరుగుడు, చేపలు వంటివి రవాణా చేస్తున్న వాహనాల నుంచి ఏఎంసీ ఆధ్వర్యంలో పన్ను (సెస్) వసూలు చేయాల్సి ఉంటుంది.
- రవాణా జరుగుతున్న ఉత్పత్తి ధరలో ఒక్కశాతం పన్నుగా ఉద్యోగులు వసూలు చేసి రసీదు అందజేయాలి.

ఏం జరుగుతోంది..

☛ ఇక్కడ ప్రైవేటు వ్యక్తులు దందా కొనసాగుతోంది. రసీదులివ్వకుండా వాహనదారుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. అధికారులతో కుమ్మక్కై దందా కొనసాగిస్తున్నారు.

☛ ఒప్పంద, పొరుగుసేవల సిబ్బంది ఉన్నా కాగితాల్లోనే వారు విధుల్లో ఉన్నట్లు చూపించి ప్రైవేటు వ్యక్తులే దందా చేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు 'న్యూస్‌టుడే' వెళ్లగా ప్రైవేటు వ్యక్తులు పారిపోవటం దందాకు అద్దం పడుతోంది.

నామమాత్రంగానే చూపుతూ..

ఏఎంసీ సిబ్బంది పర్యవేక్షణలోనే పన్ను వసూలు చేసి కమిటీ ఖాతాలో జమచేయాలి. కానీ ఇక్కడ మాత్రం ఆ నిబంధనలు పట్టలేదు. వచ్చిన ఆదాయంలో నామమాత్రంగానే కొంత జమచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అక్రమార్జనలో కొంత ఉద్యోగులకు ముట్టజెప్పడంతో వారు మిన్నకుండిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సెక్యూరిటీ గార్డులే వసూలు చేస్తున్నారు..

రెగ్యులర్ సిబ్బంది లేకపోవటంతో ఒప్పంద విధానంలో పనిచేస్తున్న ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందికి వసూళ్ల విధులు అప్పగించాం. వారు రసీదు ఇవ్వాలి. ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం ఉండకూడదు. అదే జరిగితే పోలీసులకు ఫిర్యాదుచేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఆరోపణలపై పరిశీలించి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు తీసుకుంటాం.
– వి.ప్రసన్న, ఏఎంసీ కార్యదర్శి,
– బి.రవికిరణ్, ఏడీ, మార్కెటింగ్‌శాఖ

ఇసుక మేట.. ప్రమాద బాట..!

లావేరు మండలం అదపాక కూడలి సమీపంలో జాతీయ రహదారి పరిస్థితి ఇది.. సుమారు అరకిలోమీటరు మేర ఇసుక చేరడంతో రాకపోకలకు ఆటంకంగా మారింది. గాలికి ఇసుక రేగి రోడ్డుపైకి వచ్చేస్తోంది. చోదకులు ఏమరపాటుగా ఉంటే వాహనాలు అదుపు తప్పే ప్రమాదముంది. విశాఖ నగరానికి వెళ్లే ఇసుక లారీల వల్ల ఇలా జరుగుతోంది. ఎన్‌హెచ్‌ఏఐ డిప్యూటీ మేనేజర్ సీహెచ్.సతీష్ వద్ద ప్రస్తావించగా తొలగిస్తామన్నారు. – న్యూస్‌టుడే, లావేరు

తుప్పల్లో దాక్కుంది..

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకూర్మంలో పారిశుద్ధ్య నిర్వహణకు ఇచ్చిన మినీ ట్రాక్టరు దుస్థితి ఇది.. ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఇలా వదిలేశారు. వినియోగంలో ఉన్న వాహనం స్థానంలో పంచాయతీకి మరో రెండు ట్రాక్టర్లు సమకూరడంతో దీనిని పక్కన పడేశారు. అల్లుకున్న తుప్పల మధ్య నిరుపయోగంగా మారింది. రూ.లక్షల విలువైన ట్రాక్టరును వదిలేయడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'మరమ్మతులకు అనువుగా లేక వదిలేశారు. ఉన్నతాధికారులకు తెలియజేస్తాం' అని పంచాయతీ కార్యదర్శి కె.ఈశ్వరమ్మ తెలిపారు. – న్యూస్‌టుడే, గార (శ్రీకూర్మం)

ఎవరుంటే మాకేం భయం..!

ఈ చిత్రం చూడండి.. పక్కనే రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం ప్రజలతో సమావేశం నిర్వహిస్తున్నారు. అక్రమాలను పర్యవేక్షించే వ్యవస్థ మొత్తం అక్కడే ఉంది. కానీ మాకెవరు అడ్డు అన్నట్లుగా వంశధార నది నుంచి అనుమతి లేకుండా యథేచ్ఛగా ఇసుక ఎలా తరలిస్తున్నారో. గొట్టా బ్యారేజీ దిగువన తవ్వకాలు జరిపి ఎం.అవలంగి మీదుగా ఇసుక తరలిస్తున్న చిత్రమిది.. 'ఇసుక తీసుకెళ్లకుండా కందకాలు తవ్వించాం. మరోసారి పరిశీలించి చర్యలు తీసుకుంటాం' అని తహసీల్దారు జోగారావు తెలిపారు. – న్యూస్‌టుడే, హిరమండలం

అర్థం కాలేదా.. అందుకో ట్యాబ్..!

మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యాభ్యాసంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నాయి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనుగడ సాధించేలా విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలను నేర్పిస్తున్నారు.
– న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

● తరగతి గదిలో 30 మంది విద్యార్థులుంటే ఉపాధ్యాయుడు పాఠ్యాంశాన్ని బోధించి వెళ్లిపోతారు. విని అర్థం చేసుకునే సామర్థ్యం అందరికీ ఒకేలా ఉండదు. ఒక్కో విద్యార్థికి బోధించాలంటే కష్టమైన పని. ఈ అడ్డంకిని అధిగమించేందుకు రెండు ప్రభుత్వాలు పీఏఎల్ (పర్సనలైజ్ అడాప్టింగ్ లెర్నింగ్) ల్యాబ్‌లు ఏర్పాటు చేయనున్నాయి. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించేందుకు కార్యాచరణ అమలు చేస్తోంది.

● జిల్లాలో ఆరు నుంచి పది వరకు బోధన సాగించే ఉన్నత పాఠశాలలు 450 ఉన్నాయి. 98,269 మంది విద్యార్థులు చదువుతున్నారు.

● కస్తూర్బా 25, ఆదర్శ 13, బీసీ సంక్షేమం 11, ఆశ్రమ పాఠశాలలు 5 మొత్తం 54 పాఠశాలల్లో పీఏఎల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయగా మరో 12 పాఠశాలలు ఎంపికయ్యాయి.

● పీఎంశ్రీ పథకం అమలవుతున్న అన్ని పాఠశాలల్లోనూ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. ఒక్కో పాఠశాలకు 30 ట్యాబ్‌లు అందిస్తారు. గణితం, ఆంగ్లం, తెలుగు సబ్జెక్టులు బోధనకు సంబంధించిన పూర్తి సమాచారం అందులో నిక్షిప్తమై ఉంటుంది.

● విద్యార్థులకు పీఏఎల్ కార్యక్రమం

● పాఠ్యాంశాలు అర్థమయ్యేలా కార్యాచరణ

● 6 నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులకు ట్యాబ్‌లో ఆయా పాఠ్యాంశాలుంటాయి. విద్యార్థి ఏ అంశం కావాలని అనుకుంటున్నాడో అందులోని లీనం చేసేందుకు కొన్ని ప్రశ్నలు ఉంటాయి. విద్యార్థి సమాధానమిస్తే.. ఏ స్థాయి మేర ఉపాధ్యాయుడు చెప్పిన పాఠం అర్థమైందో బేరీజు వేసుకుని అతడికి అర్థమయ్యే రీతిలో చిత్రాలను చూపిస్తూ బోధన ఉంటుంది. కంప్యూటర్లు సైతం ఇందుకు వినియోగిస్తారు.

● 'పీఏఎల్ విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం పెంపొందించేందుకు ఉపయోగపడుతుంది. వెనకబడిన వారికి ఇదో మంచి అవకాశం.' అని సమగ్ర శిక్షా జిల్లా అదనపు సమన్వయ అధికారి పప్పల వేణుగోపాలరావు అన్నారు.

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే నరసన్నపేట

ఏళ్ల నిరీక్షణ ఏదీ వంతెన..?

● అసంపూర్తిగానే నదులపై నిర్మాణాలు ● కూటమి పాలకులపైనే ఆశలు

వంతెన నిర్మాణాలతో పల్లె ప్రజల ప్రయాణ దూరాన్ని తగ్గించేందుకు అప్పటి తెదేపా ప్రభుత్వం జిల్లాలో కీలకమైన వంతెనల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం గుత్తేదారులకు పైసా నిధులివ్వకుండా నిర్లక్ష్యం చేసింది.. ఫలితంగా ఏళ్లుగా వంతెనలు అసంపూర్తిగానే నిలిచిపోయాయి. గుత్తేదారులు సైతం రూ.కోట్లలో నష్టం చవిచూడాల్సి వచ్చింది. మళ్లీ కూటమి ప్రభుత్వం రాకతో పాలకులపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. పనులు పునఃప్రారంభించాలని కోరుతున్నారు.

వనితమండలం వద్ద వంశధార నదిపై అసంపూర్తిగా వారధి

శంకుస్థాపనతో సరి..

హిరమండలం మండలం జిల్లేడుపేట మధ్యలో మహేంద్రతనయ నది ఉంటుంది. వీరి అవస్థలు దృష్టిలో ఉంచుకుని అప్పటి తెదేపా ప్రభుత్వం 2019లో రూ.9.08 కోట్లు ఏఐబీ నిధులు మంజూరు చేసింది. అనంతరం వచ్చిన వైకాపా సర్కారు మూడేళ్లకు పైగా నిర్లక్ష్యం చేసి 2022 అక్టోబరు 22న అప్పటి ఎమ్మెల్యే రెడ్డి శాంతి శంకుస్థాపన చేసినా తట్టెడు మట్టి తీసిన పాపాన పోలేదు.

ప్రభుత్వాలు మారుతున్నా..

బలసలరేవు వద్ద నాగావళి నదిపై వంతెన నిర్మాణం 18 ఏళ్లుగా సాగుతోంది. 2007 కాంగ్రెస్ ప్రభుత్వం రూ.40 కోట్లతో పనులకు శంకుస్థాపన చేసింది. అనంతరం తెదేపా ప్రభుత్వంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ రూ.60 కోట్ల వ్యయంతో 25 శాతం పనులు చేపట్టారు. 2019 తర్వాత వైకాపా సర్కారు పాత టెండర్లు రద్దు చేసింది. రూ.87 కోట్ల అంచనాతో అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం పనులు పునః ప్రారంభించారు. కానీ గుత్తేదారుకు పైసా చెల్లించలేదు. ఇది పూర్తయితే శ్రీకాకుళం-విజయనగరం జిల్లాల పరిధిలో 40 గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు తప్పుతాయి.

ఏడున్నరేళ్లుగా గాల్లోనే...

గార- పోలాకి మండలాల మధ్య వంశధార నదిపై వనిత మండలం వద్ద వంతెన నిర్మాణానికి 2018 మే 20న అప్పటి రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా ఉన్న కె.అచ్చెన్నాయుడు శంకుస్థాపన చేశారు. రూ.72 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. అప్పట్లోనే 15 పిల్లర్లు, సిమెంట్ పనులు చేసి 60 శాతం పూర్తి చేశారు. గత పాలకుల పాపానికి ఏడున్నరేళ్లుగా గాలికి వదిలేశారు. ఇది పూర్తయితే తీరంలో మత్స్యకార గ్రామాలతో పాటు శ్రీకాకుళం, గార, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు రవాణా సదుపాయం మెరుగుపడుతుంది.

చర్యలు తీసుకుంటాం... వంతెన నిర్మాణాలకు అప్పటి తెదేపా ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడు మంజూరు చేసి పనులు ప్రారంభించాం. కానీ వైకాపా వాటిని పట్టించుకోలేదు. తెదేపాకి ఎక్కడ పేరు వస్తుందోనని పైసా నిధులివ్వకుండా వదిలేశారు. అసంపూర్తిగా ఉన్న పనులు తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. – కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర మంత్రి

అతివ ఆరోగ్యమస్తు..

● హెల్త్ పాయింట్ పర్సన్ల నియామకానికి సన్నాహాలు

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఇంటి నిర్వహణ, తీరిక లేని పనులతో మహిళలు సతమతమవుతుంటారు. చాలా మంది వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపకపోవడంతో వ్యాధుల బారిన పడుతున్నారు. అతివల సంక్షేమానికి వివిధ పథకాలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించింది. హెల్త్ పాయింట్ పర్సన్లను (హెచ్‌పీపీ) నియమించి క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా సన్నాహాలు చేస్తోంది. 2016లో తెదేపా ప్రభుత్వం వెలుగు పథకంలో భాగంగా మహిళల ఆరోగ్యాన్ని సంరక్షించడానికి నియమించిన హెల్త్ రీసోర్స్ పర్సన్లు విశేష సేవలందించారు. వైకాపా పాలనలో వారిని తొలగించారు. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా నియామకానికి చర్యలు చేపట్టింది.

జిల్లాలో మహిళా సంఘాలు	సభ్యులు	మండల స్థాయి ఆరోగ్య ఉప కమిటీలు	గ్రామ సంఘాలు
48,583	5,30,881	30	1,292

సంఘానికి ఒకరు..

★ మండల స్థాయి కమిటీ పరిధిలో గ్రామ సంఘాలు పని చేస్తాయి. వీటిలో గ్రామ సమన్వయకర్త, మహిళా పోలీసు, ఆశా కార్యకర్త, ఏఎన్‌ఎం, సీసీ ఉంటారు.

★ ఎప్పటికప్పుడు నిర్వహించే సమావేశాల్లో మహిళల ఆరోగ్యంపై ఆరా తీసి అవసరం మేరకు సాయం అందేలా పర్యవేక్షిస్తారు. మహిళా సంఘాల్లో సభ్యుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. సంఘానికో హెల్త్ పాయింట్ పర్సన్ ఉంటారు. ఈమేరకు వారి నియామకానికి ఆదేశాలిచ్చాం' అని పీడీ కిరణ్ కుమార్ తెలిపారు.

● **బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వకుండా ధాన్యం సేకరణ ఎలా చేస్తారు. అధికారులు నిర్లక్ష్యం చేస్తే ఊరుకునేది లేదు.** – బ్యాంకు అధికారుల తీరుపై వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆగ్రహం

కొంటారో.. కొనరో.. గ్యారెంటీ లేదు..!

న్యూస్‌టుడే, నరసన్నపేట

జిల్లాలో ఖరీఫ్ పంట చేతికొస్తోంది.. ఎక్కడ చూసినా ధాన్యపు రాశులే దర్శనమిస్తున్నాయి. అన్నదాతలు విక్రయానికి సిద్ధంగా ఉన్నారు. కానీ కొనుగోలు చేసేందుకు అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. ఇందుకు ప్రధాన కారణంగా మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీ ఇవ్వకపోవడమే. జిల్లాలో 267 రైసు మిల్లులుంటే, కేవలం 38 మిల్లులే బీజీలు ఇచ్చాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



● ఎస్‌బీఐ పరిధిలో మిల్లులు ఎక్కువగా ఉన్నాయి. ఎస్‌బీఐ 10శాతం మార్జిన్ నిర్ణయించడంతో ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది నుంచి ఈబీజీ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ ప్రక్రియంతా బ్యాంకుల ద్వారానే జరగాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో బ్యాంకు గ్యారెంటీల మార్జిన్ అంశం ధాన్యం సేకరణకు విఘాతం కలుగుతోంది.

ఎందుకీ జాప్యం..

బీజీలు ఇచ్చేందుకు మిల్లర్ల వెనుకంజ

రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు తొలుత మిల్లర్లు ముందుకు రావాలి. బీజీలు(బ్యాంకు గ్యారెంటీ) చెల్లించాలి. కానీ వీరు ఇందుకు మోకాలడ్డుతున్నారు. 5శాతం మార్జిన్ మిల్లర్లు కోరుతుండగా, బ్యాంకులు స్పందించడం లేదు. ప్రతి మిల్లుకు ఇచ్చే బీజీలో 10శాతం ధరావత్తుగా చెల్లిస్తే బ్యాంకులిచ్చిన గ్యారెంటీపై ఆయా మిల్లులకు పౌరసరఫరాల శాఖ ధాన్యం మర ఆడించేందుకు కేటాయిస్తుంది. బీజీల మార్జిన్‌ను 5శాతానికి తగ్గించాలని మిల్లర్లు కోరుతున్నారు. మన్యం జిల్లాలో 5 శాతమే నిర్ణయించడంతో జిల్లా మిల్లర్లు కూడా అంతే చెల్లిస్తామని పట్టుబడుతున్నారు.

● జిల్లాలో ఇంతవరకు 200 మెట్రిక్ టన్నులే ధాన్యం కొనుగోలు చేశారు. ఖరీఫ్‌లో 6.5 లక్షల టన్నుల సేకరించేందుకు ప్రభుత్వం లక్ష్యం పెట్టింది. ఈ నేపథ్యంలో ప్రైవేటు దళారులు మరోపక్క కొనేస్తున్నారు. 'బీజీల సమస్య వల్లే జాప్యం జరుగుతోంది. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం' అని పౌరసరఫరాల సంస్థ డీఎం వేణుగోపాల్ తెలిపారు.

POLYCAB LT/HT Power & Control Cables
Stockist:

SPARK ENTERPRISES
DABAGARDENS, VISAKHAPATNAM.
CELL: 9963223454, 9849022345
e-mail: spa_ark2004@yahoo.com

మధురమే..మధురమే..మధురమే..
ఈ క్షణములు ఇంకా మధురమే..
పదవీ విరమణ శుభాకాంక్షలు
మీ కుటుంబసభ్యులు, మీ బంధుమిత్రులు,
మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా!
అయితే వారికి అందించండి, అభినందన చందనాలు.
వారి భావి జీవితం సుఖమయంగా సాగాలని ఆకాంక్షిస్తూ,
ఈనాడు ద్వారా వారికి అందించండి.
పదవీ విరమణ శుభాకాంక్షలు.
మరిన్ని వివరాలకు :
8008597609

(c) eenadu

అక్రమమా.. సక్రమంగా మారుస్తాం

6 ఏళ్ల తర్వాత బీపీఎస్‌కు అనుమతి

న్యూస్‌టుడే, పలాస: పురపాలక సంఘాల పరిధిలో అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. 2019లో దరఖాస్తుల స్వీకరణతోనే ప్రక్రియ ఆగిపోయింది. ఆరేళ్ల తర్వాత బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్) కింద సరిచేసుకోవడానికి అనుమతించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

★ అప్పట్నుంచి క్రమబద్ధీకరణకు అవకాశం ఇవ్వకపోవడంతో అక్రమ కట్టడాల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఇటీవల బీపీఎస్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో పురపాలక సంఘాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి పట్టణ ప్రణాళిక విభాగం సిద్ధమవుతోంది.

794 మందికి అనుమతి

★ వైకాపా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో 870 మంది భవనాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోగా 794 మందికి ప్లాన్ అప్రూవల్ మంజూరు చేశారు.

★ షార్ట్‌ఫాల్‌లో 7, 69 దరఖాస్తులు తిరస్కరించారు.

వీరే అర్హులు

★ అనుమతి లేని నిర్మాణాలు, ప్లాన్‌కు విరుద్ధంగా కట్టిన భవనాలకు బీపీఎస్ కింద క్రమబద్ధీకరించుకోవచ్చు.

★ 1985 జనవరి 1 నుంచి 2025 ఆగస్టు 31 లోపు లోపు నిర్మించిన భవనాల యజమానులు దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు ఇలా..

★ యజమానులు రిజిస్టర్డ్ సేల్ డీడ్, ఈసీ, మార్కెట్ విలువ పత్రాలు, ప్లాన్, భవనాల ఫొటోలు, స్ట్రక్చరల్ ఇంజినీరు నుంచి ధ్రువపత్రం, ఇండెమ్నిటీ బ్యాండ్ జత చేసి www.bps.ap.gov.in లో అప్‌లోడ్ చేయాలి.

★ దరఖాస్తు సమయంలో రూ.10 వేలు చెల్లించాలి. క్రమబద్ధీకరణకు ప్లాట్ పరిమాణం, డీవియేషన్ శాతం, భూమి విలువ ఆధారంగా ఛార్జీలు వసూలు చేస్తారు.

★ 1997 డిసెంబరు 31 లోపు భవనాలకు 25 శాతం, మురికివాడల ప్రాంతాల్లో 50 శాతం తగ్గింపు ఇస్తారు.

★ నోటిఫికేషన్ ఇచ్చిన 120 రోజుల్లో దరఖాస్తు చేసుకున్న వారికే క్రమబద్ధీకరణకు అవకాశమిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి..

భవనాలను క్రమబద్ధీకరించుకోని యజమానులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. భవిష్యత్తులో అమ్మకాలు, కొనుగోలు.. బ్యాంకు రుణాలు సులభంగా పొందడానికి వీలవుతుంది. సచివాలయాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నాం.

– ఇ.శ్రీనివాసులు, కమిషనర్, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం

నిత్య నరకం..!

పెద్దపాడు రోడ్డులో రాకపోకలకు అవస్థలు

న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నగరం నుంచి జాతీయ రహదారికి చేరుకునే పెద్దపాడు రోడ్డు విస్తరణ పనులతో వాహనచోదకుల అవస్థలు తప్పడం లేదు. రద్దీ వేళల్లో బస్సులు, లారీలను అనుమతిస్తుండటంతో కిలోమీటరు మేర ప్రయాణానికి అరగంట సమయం పడుతోంది. ఉదయం 8 నుంచి 9, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రాకపోకలు సాగించే వారు నరకయాతన అనుభవిస్తున్నారు. సుడా నిధులతో నగరపాలక సంస్థ సెంటర్ డివైడర్ నిర్మాణం చేపట్టింది. దీని కోసం రోడ్డును ధ్వంసం చేయడంతో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఒక్కసారిగా భారీ వాహనాలు వచ్చేస్తుండటంతో శివాలయం వద్ద ఇరుకుగా మారి ట్రాఫిక్ నిలిచిపోతోంది. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తప్పించుకోలేని దుస్థితి నెలకొన్నా పోలీసుల పర్యవేక్షణ కొరవడింది. పనుల విషయమై ఆర్అండ్‌బీ శాఖ డీఈఈ కె.దనుంజయరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా పాతరోడ్డుపై ద్విచక్ర వాహనదారులు వినియోగించుకునేలా మరమ్మతు చేస్తామని, ఆ మార్గంలో భారీ వాహనాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

పెద్దపాడు మార్గంలో నిలిచిన వాహనాలు

ఆదిత్యాలయంలో వేలం పాటలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: రథసప్తమి వేడుకల్లో భాగంగా అరసవల్లిలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో విద్యుద్దీపాలు, మైక్ సెట్ల ఏర్పాటు, శానిటరీ సామగ్రి, తలనీలాల సేకరణ, సెల్‌ఫోన్లు భద్రపరిచే టోకెన్ హక్కు, ఇతర అంశాలకు సంబంధించి వేలం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన పాటల్లో నిబంధనల మేరకు ఉన్నవి ఖరారు చేయగా మరికొన్నింటిని రద్దు చేశారు. తలనీలాల సేకరణ, మరికొన్నింటికి నిర్వహించిన పాటలో ఎవరూ పాల్గొన లేదు. దేవాదాయ శాఖ అధికారులు కుమారస్వామి, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న రితికా నాయక్, చిత్రంలో సీఎంఆర్ గ్రూప్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ, ఎమ్మెల్యే శంకర్ సతీమణి స్వాతి తదితరులు

పద్మం సిల్వర్ జ్యువెలరీ షోరూం ప్రారంభం

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: పద్మం సిల్వర్ జ్యువెలరీ యాజమాన్యం తమ 11వ షోరూంను సోమవారం శ్రీకాకుళం నగరంలోని జీటీ రోడ్డులో విద్యుత్తు శాఖ కార్యాలయం ఎదురుగా అట్టహాసంగా ప్రారంభించింది. మిరాయ్ చిత్ర కథా నాయిక రితికా నాయక్ జ్యోతి వెలిగించి లాంఛనంగా ప్రారంభించారు. సీఎంఆర్ గ్రూప్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ, ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి స్వాతి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బియ్యం మాకివ్వరా..?

మీకోసంలో అర్జీల వెల్లువ

కలెక్టరేట్(శ్రీకాకుళం), శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: ఇటీవల తుపాను నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన 50 కిలోల ఉచిత బియ్యం, నిత్యావసర సరకులు అందలేదని శ్రీకాకుళం గ్రామీణ మండలం సింగుపురం గ్రామానికి చెందిన పలువురు చేనేత కార్మికులు మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. గ్రామంలో 100 కుటుంబాలుండగా 47 కుటుంబాలకే పంపిణీ చేశారని అందులో పేర్కొన్నారు. నేరుగా, ఆన్‌లైన్ ద్వారా 127 వినతులు అందాయని అధికారులు తెలిపారు. జిల్లా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఇన్‌ఛార్జి డీఆర్వో లక్ష్మణమూర్తి, పలువురు అధికారులు అర్జీలు స్వీకరించారు. ★ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 54 వినతులు అందాయని అధికారులు తెలిపారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి పలువురితో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. ★ హిరమండలం మండలం పెదసంకిలి

సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అధికారులు

నిర్వాసిత గ్రామంలో మిగులు భూములకు సంబంధించి రీసర్వే చేశారని.. అందులో 70 శాతం డీ పట్టా భూములున్నాయని.. 30 శాతం జిరాయితీ ఉన్నట్లు రైతులు తెలిపారు. కొన్నేళ్లుగా డీ పట్టా భూములు సాగులో ఉన్నాయని.. పాస్‌పుస్తకం, 1బీ తమ పేరిట ఉన్నాయని.. పట్టాలు లేకపోవడంతో అవి ప్రభుత్వ భూములుగా పరిగణిస్తామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారని.. న్యాయం చేయాలని కోరారు.

కట్టుకున్నోడే కడతేర్చాడు

వివాహిత హత్య కేసులో నిందితుడి అరెస్టు

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: నౌపడలో హత్యకు గురైన వివాహిత పుష్పలతను భర్తే అనుమానంతో హతమార్చినట్లు టెక్కలి డీఎస్పీ కె.లక్ష్మణరావు తెలిపారు. నౌపడ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 20న ఓ మహిళను గుర్తు తెలియని వ్యక్తి గాయపరిచి హత్య చేసినట్లు స్థానిక వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతి చెందిన మహిళ నందిగాం మండలం శివరాంపురం గ్రామానికి చెందిన దాసరి పుష్పలతగా గుర్తించిన విషయం తెలిసిందే. భర్త దాసరి బాలకృష్ణతో విభేదాల కారణంగా ఆమె ఇద్దరి పిల్లలతో వేరుగా ఉంటోంది. దీనిపై పలుమార్లు గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ జరగ్గా అందరి ముందు భార్య తనను అవమానించిందని బాలకృష్ణ కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా హతమార్చాలనుకున్నాడు. ఈ క్రమంలో పిల్లల గురించి మాట్లాడాలి రావాలని కోరాడు. నౌపడ మూడు రోడ్ల కూడలి నుంచి తుమ్మ పొదలు వద్ద ఆపి, ఆమెతో మాట్లాడుతున్నట్లు నటించాడు. ఒక్కసారిగా వెదురు కర్రతో తల, ముఖంపై బలంగా కొట్టి హత్యచేశాడు. అనంతరం పరారయ్యాడు. నిందితుడి కోసం పోలీసులు గాలించి కొండభీంపురం వద్ద అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీనివాస్, ఎస్ఐ జి.నారాయణస్వామి ఉన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లక్ష్మణరావు

వృద్ధుడి బలవన్మరణం



గార (వత్సవలస), న్యూస్‌టుడే: గార మండలం పేర్లవానిపేటకు చెందిన **కొమర నారాయణస్వామి** (62) రసాయనం తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు సీమెన్‌గా పని చేస్తున్న ఆయన మద్యానికి బానిసయ్యారు. ఇంట్లో తరచూ గొడవ పడుతూ ఏదో ఒకటి తాగి చనిపోతానంటూ భార్య సత్యవతిని బెదిరించేవారు. ఈ నెల 22న దంపతుల మధ్య గొడవ చోటు చేసుకుంది. ఆ తర్వాత ఓ శుభ కార్యక్రమంలో పాల్గొనడానికి విశాఖ బయలుదేరారు. ప్రయాణంలో ఆయనకు వాంతులు కావడంతో వెంటనే విశాఖపట్నంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. నారాయణస్వామి దంపతులకు వివాహమైన ముగ్గురు కుమార్తెలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

చెరువులో పడి మహిళ మృత్యువాత

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక చేరి వీధి శివారున ఉన్న ఊరచెరువులో పడి ప్రధాన రహదారి వీధికి చెందిన ఓ మహిళ (55) సోమవారం మృతి చెందారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. స్నానానికి చెరువులో దిగిన ఆమె అస్వస్థతకు గురై నీటిలో పడిపోయారు. కాసేపటికి గుర్తించిన స్థానికులు సపర్యలు చేసినప్పటికీ ప్రాణాలు నిలవలేదు. ఘటనపై తమకు ఫిర్యాదు లేదని పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మృతి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: గోపీనాథపురం ప్రాంతంలో నివాసముంటున్న కొమనాపల్లి పద్మనాభం (36) శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆదివారం టెక్కలిలోని ఓ వీధిలో తీవ్ర గాయాలతో పడి ఉన్న ఆయన్ను పోలీసులు టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం తరలించారు. అక్కడ కన్నుమూశారు. గతంలో రక్షణ రంగంలో ఉద్యోగం చేసిన ఆయన మానసిక స్థితి సరిగా లేకపోవడంతో స్థానికంగానే ఉంటున్నాడు. తరచూ ప్రజల్ని ఇబ్బందులకు గురి చేస్తుండటంతో కొంత మంది మూకుమ్మడిగా దాడి చేసినట్లు సమాచారం. ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని, విచారణ జరుపుతున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (భారత ప్రభుత్వ రంగ సంస్థ) ... విశ్వాసానికి మరో పేరు !

అస్సెట్ రికవరీ మోనిటరింగ్ బ్రాంచ్
డి.నెం. 9-13-45/2/9/1, 5వ అంతస్తు, ఎమ్‌వీఆర్ వినాయగర్ సెంటర్, విఐపి రోడ్డు, విశాఖపట్నం - 530003.
మొబైల్ : 98312 00669, 96409 33383

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ, యావన్మంది ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)కు నోటీసు జారీచేస్తూ తెలియజేయునది ఏమనగా, దిగువ సెక్యూర్డు క్రెడిటార్ గారికి తనఖా ఉంచిన / ఛార్జీలో ఉన్న స్థిరాస్తులను నిర్మాణాత్మకంగా / భౌతికంగా / లాంఛనాత్మకంగా బ్యాంకు అధీకృత అధికారిగారు సెక్యూర్డు క్రెడిటార్ గారు స్వాధీనత తీసుకుని వాటిని "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలానే పద్ధతి, అక్కడ ఏమున్నదో అదే పద్ధతిపై" దిగువ పట్టికలో తెలిపిన తేదీలలో బ్యాంకు / సెక్యూర్డు క్రెడిటార్ గారు సదరు ఋణగ్రహీత(లు) / హామీదారు(లు) నుండి రావలసిన బకాయిలను వసూలు నిమిత్తం ఈ నోటీసు జారీచేస్తున్నారు. ప్రతి ఆస్తికి ఎదుట దిగువ పట్టికలో రిజర్వు ధర & ధరావత్తు వివరములు తెలుపబడినవి.

బ్రాంచ్ ఆఫీస్: పంజాబ్ నేషనల్ బ్యాంక్, శ్రీకాకుళం: ఋణగ్రహీత పేరు/బ్యాంకుకు మొత్తం బకాయిలు: శ్రీ నిక్కు రవి కుమార్ (ఖాతా నెం. 13527811000073, 105610NB00000018 13525105015601), తండ్రి : ఎన్. తవిటి నాయు (లేటు), ఇ.నెం.1-10, కోమనపల్లి గ్రామం, పెద్దసీది పోస్ట్, హిర మండలం మండలం, శ్రీకాకుళం జిల్లా - 532214. శ్రీ నిక్కు రవి కుమార్, ఫ్లాట్ నెం.201, మొదటి అంతస్తు, హెచ్‌ఎన్‌ఆర్ ఆర్కేడ్, కొన్నా వీధి, బలగ వార్డు, శ్రీకాకుళం - 532001. డిమాండ్ నోటీసు తేది.09-02-2023, బకాయి మొత్తం: తేది.08-02-2023 నాటికి రూ.50,12,760/- + తేది.09.02.2023 నుండి తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు మొదలగునవి. భౌతిక స్వాధీనతా తేది : 01-06-2023

బయానా చెల్లింపునకు ఆఖరు తేది : 17-12-2025, మధ్యాహ్నం 3 గం॥ల లోపు

ఇ -వేలం తేది మరియు సమయం : 17-12-2025 ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు

సెక్యూరిటీ / ఆస్తుల వివరాలు మరియు ఆస్తుల యజమాని / తనఖా పెట్టిన వ్యక్తి పేరు

శ్రీ ఎన్. రవి కుమార్ గారి పేరున గల ఆస్తి : శ్రీకాకుళం మున్సిపాలిటీ, బలగ వార్డు, కొన్నా వీధి, టి.ఎస్.నెం.882/2, 882/3, ఎస్.నెం.42 వద్ద 43.4 చ॥గ॥ల అవిభాజ్యపు ఏరియా విస్తీర్ణంతో హెచ్‌ఎన్‌ఆర్ ఆర్కేడ్ లోని మొదటి అంతస్తు సందు 1025 చ॥అ॥ల విస్తీర్ణంతో గల నివాస ఫ్లాట్ నెం.201 యావత్తు ఆస్తి. ఆస్తి హద్దులు : తూర్పు: రోడ్డు, పడమర : హబీబున్నీసా బేగం గారి ఖాళీ భూమి, ఉత్తరం : రోడ్డు మరియు తంగి హరినారాయణ గారి స్థలం మరియు బొడ్డేపల్లి సునీల్ భరత్ కుమార్ గారి స్థలం, దక్షిణం : బొడ్డేపల్లి జనార్ధనరావు గారి ఖాళీ భూమి. ఫ్లాట్ హద్దులు: తూర్పు : ఓపెన్ టు స్కై, పడమర: కామన్ కారిడార్, ఉత్తరం : ఓపెన్ టు స్కై, దక్షిణం: డక్ట్ ఆ తరువాత ఫ్లాట్ నెం.202. సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.2304/2020, తేది.07.05.2020 ప్రకారం.

రిజర్వు ధర : రూ.33.20 లక్షలు, బయానా (ఇఎమ్‌డి) : రూ.3.32 లక్షలు, బిడ్ పెంపుదల మొత్తం : రూ.25,000/-

సెక్యూర్డ్ క్రెడిటర్ వారికి తెలిసినంత వరకు ఉన్న ఎన్‌కంబరెన్స్ వివరములు : బ్యాంక్ రికార్డ్స్ ప్రకారం ఏవిధమైన ఎన్‌కంబరెన్స్ లేవు

నియమ నిబంధనలు:
1. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని నియమ & నిబంధనలను అనుసరించి దిగువ తదుపరి తెలిపిన నిబంధనలను అనుసరించి అమ్మకం జరుపబడును.
2. ఆస్తులను 'ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నవో అదే పద్ధతిపై" విక్రయించబడతాయి.
3. అధీకృత అధికారి గారి వద్దగల పైన తెలిపిన షెడ్యూలులోని సెక్యూర్డు ఆస్తికి సంబంధించిన ఉత్తమ వివరముల మేరకు తెలుపబడినవి. కాని సదరు వివరములలోని తప్పులకు, తప్పుడు వివరములకు, వదిలివేయబడుటలకు అధీకృత అధికారి గారి సమాధానం తెలుపవలసిన అవసరం లేదు.
4. అమ్మకం ఇ-వేలం పోర్టల్ https://BAANKNET.COM ద్వారా ఆన్‌లైన్‌లో దిగువ సంతకందారు తేది.17.12.2025న ఉదయం 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు నిర్వహించబడును.
5. అమ్మకం యొక్క పూర్తి వివరములతో నియమ నిబంధనల కొరకు దయచేసి https://BAANKNET.COM & www.pnbindia.in వెబ్‌సైటులు చూడవలెను.

SARFAESI చట్టం 2002 లోని రూలు 8(6) r/w 9(1) ప్రకారం చట్టబద్ధమైన అమ్మకం ప్రకటన

తేది : 24-11-2025
ప్రదేశం : విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి
పంజాబ్ నేషనల్ బ్యాంక్

29న జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 29న జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈవో డి.సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 1 నుంచి 7వ స్థాయీ సంఘాల సమావేశాలు ఆయా సంఘాల అధ్యక్షుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	215	235

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

వినుకొండ, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా వినుకొండలోని లయోలా పాఠశాలలో రాష్ట్ర స్థాయి అండర్-17 బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు వివిధ అంశాల్లో సత్తా చాటారు.

బాలుర విభాగం
హైజంప్: **అశోక్**
లాంగ్‌జంప్: **హర్షవర్ధన్**
3 వేల మీటర్ల పరుగు: **సతీష్ కుమార్**
800 మీటర్ల పరుగు: **గణేష్**
100 మీటర్ల పరుగు: **హర్షవర్ధన్**
పోల్‌వాల్ట్: **టెండూల్కర్, శ్యాం సుందర్**
జావెలిన్ త్రో: **లింగప్రసాద్**

బాలికల విభాగం హైజంప్: **యశ్విత** జావెలిన్ త్రో: **సరిత**

క్యాబేజీతో లాభం



న్యూస్‌టుడే, జలుమూరు: కూరగాయల పంటల్లో క్యాబేజీ పువ్వు ఒకటి. కార్తికమాసంలో ప్రాధాన్యమిచ్చే పంటను ఆరేళ్లుగా పండించి ఆదర్శంగా నిలుస్తున్నాడు. జలుమూరు మండలం రాణా గ్రామానికి చెందిన రైతు వాన మోహనరావు, ఖరీఫ్‌లో వేసే వరి పంట కంటే మెట్ట వ్యవసాయమే రెట్టింపు ఆదాయం తెస్తోందని రైతు తెలిపారు. ఆరుతడి పంటలపై దృష్టి పెట్టినట్లు చెప్పారు.

● నారు పోసిన నుంచి 110 రోజుల్లో క్యాబేజీ పంట చేతికి అందుతుంది. పంట ప్రారంభం నుంచి సుమారు 40 రోజుల వరకు అందుతుంది. 40 సెంట్ల మెట్ట పొలంలో క్యాబేజీ వేసినట్లు వాన మోహనరావు వెల్లడించారు. విత్తనాలు, దుక్కి, కలుపు నివారణ మందులు, పురుగు మందులు ఇలా పంట చేతికి అందేవరకు రూ.24 వేలు వరకు ఖర్చు అవుతుంది. చేతికి అందే సరికి 2,200 కిలోల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.35 పలుకుతుంది. ప్రస్తుత ధర ప్రకారం.. రూ.77 వేలకు వస్తుంది. పెట్టుబడి మినహా రూ.53 వేల ఆదాయం వస్తుందని రైతు తెలిపారు.

సేంద్రియ ఎరువులు వాడుతాం

ముసురు వాతావరణం లేకుంటే మంచి దిగుబడులు వస్తాయి. ఎక్కువగా చీడపీడలు వచ్చే అవకాశం ఉంది. మొక్క నాటిన నుంచి పంట కోతకు వచ్చే వరకు కంటికి రెప్పలా కాపాడుకోవాలి. కుటుంబ సభ్యులమంతా పర్యవేక్షిస్తూనే ఉంటాం. సకాలంలో నీటి తడులు అందించాలి. సేంద్రియ ఎరువులతోపాటు రసాయనిక ఎరువులు వాడుతాం. రెండో పంటగా బెండ, ఆకు కూరలు వేస్తాం. – వాన మోహనరావు, రైతు రాణా

సస్యరక్షణ చర్యలు ఇలా..

మొక్కకు మొక్కకు మధ్య 30 సెంటీమీటర్ల దూరంలో నాటాలి. ఎక్కువగా రసం పీల్చే పురుగు, నల్లి, పువ్వు తెగులు, ఆకుమచ్చ తెగులు ఆశిస్తుంది. బ్లాచ్‌మచ్చ అనే తెగులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఆకు తినేపురుగు, తెగులు నివారణకు కోల్‌పాస్ -2 మి.లీ, రిడోమిల్ - 2 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నల్లి, పేనుబంక పురుగు నివారణకు పిప్రోనిల్ - 2 మి.లీ, శాఫ్- 2 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. బోరాన్, నత్రజని లోపం ఉన్నట్లు గుర్తిస్తే ఫార్ములా-4 మందు 5 గ్రాములు, 19 -19- 19 రకం ఎరువు 5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని ఉద్యాన శాఖ అధికారిణి కత్తెర సునీత తెలిపారు.

రైతేరాజు

మొక్కజొన్న వేయాలంటే
ఈ పద్ధతులు పాటించండి

–న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

రైతులు సాగు చేసే పంటల్లో అనువైన విత్తనాలు, ఎరువులు వినియోగం, కలుపు నివారణతో పాటు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని ఆమదాలవలస కేవీకే సస్యపోషణ శాస్త్రవేత్త ఎస్.కిరణ్‌కుమార్ అన్నారు. రైతులు చరవాణిలో అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

ప్రశ్న: మొక్కజొన్న వేయాలనుకుంటున్నాం. ఎరువులు ఏ విధంగా వినియోగించాలో తెలపండి

- ఎల్.ఆదినారాయణ, జి సిగడాం

సమాధానం: మొక్కజొన్న సాగులో యూరియా వినియోగం ఇటీవల ఎక్కువైంది. దాని వల్ల చీడపీడల సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. ఈ పంటలో విత్తనం వేసిన దగ్గర నుంచి కండె తీసే వరకు ఒక ఎకరాకు 220 కిలోల యూరియా, 75 కిలోల డీఏపీ, 45 కిలోల మొరైటా పొటాష్ వేసుకోవాలి. విత్తనం వేసేటప్పుడు 40 కిలోల యూరియా 75 కిలోల డీఏపీ 20 కిలోల మొరాటా పొటాష్ వేసుకోవాలి. తదుపరి ప్రతి ఎకరాకు 45 కిలో యూరియా చొప్పున వేసుకొని చివరి 55 రోజుల్లో మిగిలిన 25 కిలోల పొటాష్‌తో పాటు చివరి మోతాదు యూరియాను అందివ్వాలి.

ప్రశ్న: మినుము వేసి పది రోజులు దాటింది. ఆకులపై చిన్నచిన్న రంధ్రాలు పడుతున్నాయి. నివారణకు చర్యలు తెలియజేయండి.

- కె.చంద్రశేఖర్, నరసన్నపేట

సమాధానం: మినుము రెండాకుల దశలో ఉన్నప్పుడు చిత్త పురుగు ఆశించి మొక్క ఆకులు తినేయడంతో రంధ్రాలు చేస్తుంది. నివారణకు ఎసిఫేట్ అనే మందును ఒక గ్రాము ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకున్నట్లయితే సమస్య పరిష్కారమవుతుంది.

ప్రశ్న: వేరుశనగ పంట వేసి 20 రోజులు అవుతుంది. గడ్డి జాతి కలుపు అధికంగా ఉంది. నివారణకు మందును తెలియజేయండి.

-పి.మధుసూదన్, కోటబొమ్మాళి

సమాధానం: కలుపు నివారణకు క్విజలోపాస్ ఇథైల్ అనే మందును లీటరు నీటికి రెండు మిల్లీ లీటర్లు కలిపి పిచికారీ చేసుకుంటే కలుపు ఉండదు.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

వచ్చే వారం సాగులో చీడపీడల నివారణ, కొత్త వంగడాలు, ఇతర సమస్యలపై తొగరాం పాలిటెక్నికల్ వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నీలవేణి 7702394824 చరవాణి నంబరు సంప్రదించగలరు.

శీతాకాలం.. పాడి పశువులు భద్రం

శీతాకాలంలో పాడి పశువులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అచ్యుతాపురం పశువైద్యాధికారిణి ముద్దాడ దీప్తి తెలిపారు. చలి, మంచు గాలి ఎక్కువగా ఉన్నందున శ్వాసకోశ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. శీతాకాలంలో ఎదకు వచ్చే పశువుల్లో పునరుత్పత్తి సామర్థ్యం పెరగడం వల్ల పాడి పశువులకు అనువైన కాలమన్నారు. పశువుల షెడ్ చుట్టూ తెరలు, గోనెపట్టాలు చాలా తక్కువ స్థాయిలో గాలి వెళ్లేలా కట్టాలన్నారు. గడ్డిని నేలపై పరుపులా వేయాలని, ఆరుబయట కడితే పశువులకు ఎండతగిలేలా చూడాలని, మంచు తగ్గిన తరువాతే దాణాకు వదలాలని, మాంసకృత్తులు కలిగిన దాణా రోజుకు అదనంగా 20 శాతం వరకు అందించాలని సూచించారు.

– –న్యూస్‌టుడే, జలుమూరు

ఎకరాకు 5 సెంట్ల నారుమడి చాలు

సారవకోట, న్యూస్‌టుడే: ప్రస్తుతం చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో రైతులు వరి సాగుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీనిపై సారవకోట ఏవో కె.సీహెచ్.వెంకటరావు సూచనలు చేశారు. ఎకరా విస్తీర్ణంలో వరి నాట్లు

వేయాలంటే 5 సెంట్లలో నారుమడి, 20 కిలోల విత్తనాలు సరిపోతుందన్నారు. దమ్ముచేసి వారం, పది రోజుల పాటు మురగనివ్వాలన్నారు. విత్తనాలకు సంచిలో మూటకట్టి 24 గంటల పాటు నీటిలో ఉంచి బయటకు తీయాలని, మరో 24 గంటలు బయట ఉంచి గడ్డి కప్పితే మొలకలు వస్తాయన్నారు. నారుమడిలో పైపాటుగా 4కిలోల డీఏపీ, 2కిలోల పొటాష్ ఎరువు వేసిన తరువాత వరి విత్తనాలు చల్లుకోవాలన్నారు. 10-15 రోజుల్లో 1.5కిలోల త్రీజీ గుళికలు వేయాలని, నారు తీసేందుకు వారం రోజుల ముందు 8 కిలోల యూరియా చల్లాలన్నారు. నారు 21 రోజుల్లో నాటితే పిలకలు అధికంగా వచ్చి, దిగుబడి బాగుంటుందన్నారు.

ఎన్జీవో సంఘ కార్యవర్గ ఎన్నికలకు సిద్ధం కావాలి

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు ఎన్జీవో సంఘ కార్యవర్గ ఎన్నికలకు సమాయత్తం కావాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఎన్జీవో తాలుకా కార్యవర్గాల కాలపరిమితి ఈ నెలతో ముగియనున్న నేపథ్యంలో కొత్త కార్యవర్గాల ఎన్నిక నిర్వహించాల్సి ఉందని పేర్కొన్నారు. మొదటి విడతలో ఇచ్ఛాపురం, సోంపేట, పలాస తాలుకాలకు ఈ నెల 27న నామినేషన్లు స్వీకరించి డిసెంబరు 4న ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రెండో విడతలో పాతపట్నం, హిరమండలం, కొత్తూరు తాలుకాలకు ఈ నెల 29న నామినేషన్లు స్వీకరించి, డిసెంబరు 6న ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మూడో విడతలో టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట తాలుకాలకు డిసెంబరు 3న నామినేషన్లు స్వీకరించి, 10న ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. నాలుగో విడతలో పొందూరు, ఆమదాలవలస, రణస్థలం తాలుకాలకు డిసెంబరు 5న నామినేషన్లు స్వీకరించి, 12న ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని విభాగాల ఉద్యోగులు ఈ ప్రక్రియలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ బలోపేతానికి చర్యలు

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకున్నామని ఏఐసీసీ కార్యదర్శి సూరత్‌సింగ్ ఠాకూర్ తెలిపారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన శ్రీకాకుళం నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఇప్పటికే పలువురు దరఖాస్తు చేసుకున్నారని.. అన్ని నియోజకవర్గాల నాయకులతో సమావేశమై అభిప్రాయాలు సేకరిస్తామని తెలిపారు. ఆ నివేదికను రాహుల్‌గాంధీకి అందజేస్తామన్నారు. పీసీసీ నాయకులు ఎల్.రాజు, రామారావు, పాచిపెంట శాంతికుమారి మాట్లాడారు. తొలుత అందుబాటులో ఉన్న పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమై అభిప్రాయాలు సేకరించారు. డీసీసీ నాయకులు రెల్ల సురేష్, పేడాడ పరమేశ్వరరావు, అంబటి కృష్ణారావు, సనపల అన్నాజీరావు, పూడి కిరణ్‌కుమార్, దేశిల్ల గోవింద మల్లిబాబు, ఈశ్వరి, కె.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి సూరత్‌సింగ్ ఠాకూర్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

EENADU Classifieds

JOBS

Vision buzz కంపెనీలో డోర్ టూ డోర్ మార్కెటింగ్ చేయడానికి యువతీ యువకులు స్టాఫ్ కావలెను. డైలీ Payment ఇవ్వబడును. ✆ 9550109729.

చరణ్ రియల్‌ఎస్టేట్‌లో మార్కెటింగ్ అవకాశాలు! మీ నైపుణ్యానికి విలువ, మీ భవిష్యత్‌కు స్థిరత్వం! సంప్రదించండి మెడికవర్ లైన్, యూనియన్ బ్యాంక్ ఎదురుగా, శ్రీకాకుళం. ✆ 7893582285.

ప్రైవేట్ బ్యాంకుల్లో పనిచేయుటకు టెలికాలర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, అటెండర్స్, రికార్డ్ అసిస్టెంట్, సెక్యూరిటీ, క్యాషియర్స్ కావలెను. Qlf: 10th- డిగ్రీ, MBA, జీతం: 18K-28K. ✆ 9121044796, 9573635594.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

FACULTY/ TEACHERS

Reputed English Medium School in Srikakulam Requires Experienced Teachers with fluency in English for higher classes to teach English, Mathematics and Social Studies. Contact: 8500944175.

Wanted English Faculty for Higher Class. Contact : 9440609803, 9700636803.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

ఇరుకు దారి.. మారదా మరి

ఇచ్ఛాపురం పట్టణంలో ప్రధాన రహదారి తర్వాత రద్దీగా ఉండే మార్గం రథవీధి. ఈ మార్గంలో బ్యాంకు, దినసరి బజారు, రెండు లాడ్జీలు, వాణిజ్య సముదాయాలు, ప్రైవేటు సమావేశ మందిరాలున్నాయి. బజారుకు వచ్చే వారితోపాటు ఇతర వాహనదారులు రోడ్డుపక్కనే వాహనాలు నిలిపి, కార్యకలాపాలకు వెళ్తుంటారు. దీంతో వేరే వాహనాలొస్తే కనీసం పావుగంట ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీనికితోడు రోడ్డు పక్కనే కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు అధికమవుతున్నాయి. దీనిపై పుర కమిషనర్ రమేష్ స్పందిస్తూ, ఉన్నతాధికారులకు నివేదించి, ఇతర శాఖలతో కలిసి పార్కింగ్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

శంకర్‌రెడ్డికి కేంద్ర మంత్రి అభినందన

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఏపీ రాష్ట్ర రెడ్డిక వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడిగా నియమితులైన కొండ శంకర్‌రెడ్డిని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అభినందించారు. శ్రీకాకుళంలో మంత్రి కార్యాలయంలో సోమవారం సమావేశమయ్యారు. తనకు అవకాశం ఇచ్చినందుకు శంకర్‌రెడ్డి మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో భాగస్వామ్యం కావాలని మంత్రి సూచించారు.

శుభ్రత అందరి బాధ్యత

ఇచ్ఛాపురం గ్రామీణం, పలాస గ్రామీణం: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీవో ప్రభాకరరావు, వసంతకుమార్ అన్నారు. ఇచ్ఛాపురం, పలాస ఎంపీడీవో కార్యాలయాల్లో 'క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్' కార్యక్రమంపై వెలుగు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని కోరారు. సీనియర్ సహాయకులు రామారావు పాల్గొన్నారు.

బాహుదాపై వంతెన నిర్మించాలని వినతి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: బాహుదానదిపై రోడ్డు వంతెన భాగం 2023లో కూలిపోగా, నేటి వరకు నూతన నిర్మాణానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని, గత ప్రభుత్వం ప్రకటించిన టెండర్లు కూడా రద్దుచేశారని వైకాపా నాయకులు సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ ఫిర్యాదుల విభాగంలో సోమవారం జేసీకి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న నలుగురికి పింఛను ఇప్పించాలని కోరారు. పట్టణంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, వాటిపై సర్వే జరిపించాలని శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 8008574279 9063144707

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

సమస్య: రథవీధి-గోర్లేవీధి కూడలిలో రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన నీటి కుండీ ప్రమాదకరంగా ఉంది. -కె.రామరాజు, ఇచ్ఛాపురం

సమాధానం: వైకప్పు ఏర్పాటుచేస్తాం. - ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఉజ్జిడిమెట్ట పరిశీలన

ఉజ్జిడిమెట్ట ప్రాంతంలో జరుగుతున్న ఆక్రమణలపై సోమవారం 'ఉజ్జిడిమెట్టను.. ఊడ్చేస్తున్నారు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, సర్వేయర్ గిరి కంకర తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. - న్యూస్‌టుడే, కాశీబుగ్గ

ఈనాడు కథనానికి స్పందన

ముమ్మరంగా పనులు.. లింగాలపాడు ప్రాథమిక పాఠశాల రేకుల షెడ్డులో కొనసాగుతుంది. దీనిపై ఈనెల 13న 'ఈనాడు'లో వచ్చిన 'రేకుల చాటున..!' కథనానికి అధికారులు స్పందించారు. భవన నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేయడంతో పనులు ఊపందుకున్నాయి. - న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

ఇసుక అక్రమ నిల్వలపై దాడులు..

ఉచిత ఇసుక విధానాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. దీనిపై ఈ నెల 22న 'ఇసుక గుట్టలు.. అక్రమార్జన ధనాలు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ సీతారామయ్య నేతృత్వంలో పీఆర్వో బృందం సోమవారం అక్రమ నిల్వలు పరిశీలించి వ్యాపారులపై చర్యలు చేపట్టారు. అక్రమంగా ఇసుక అమ్మితే వాహనాల సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమ నిల్వల వివరాలు నమోదు చేసుకున్నారు. వీఆర్వోలు వసంతరాజు, రంగారావు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

అధికారం వారిదే.. అవస్థలు తీరవే

- న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పురపాలక సంఘాన్ని చాలా కాలం బెల్లుపడ వాసులే పాలించినా సమస్యలు మాత్రం తీరడం లేదు. తొలివిడతలో ప్రత్యక్ష ఎన్నికల్లో పిలక పద్మావతి, తర్వాత పిలక పోలారావు, పరోక్ష ఎన్నికల్లో బెల్లుపడలో భాగమైన 14వ వార్డు నుంచి లాభాల స్వర్ణమణి, గత రెండు విడతల్లో 13వ వార్డు నుంచి పిలక రాజలక్ష్మి ఎన్నికై పాలన సాగించారు. పంచాయతీ కాలంలోనూ ఇక్కడివారే సర్పంచిగా ఉన్నారు.

● వాస్తవంగా ఇచ్ఛాపురం రెవెన్యూ రికార్డుల్లో బెల్లుపడ గ్రామం అనే ఉంది. ఇప్పటికీ ఈ ప్రాంత వీఆర్వోను బెల్లుపడ వీఆర్వోగానే పరిగణిస్తారు. అలాంటి ప్రాంతంలో సరైన రోడ్లు, కాలువలు లేవు. తాగు నీటికి అవస్థలు తప్పడం లేదు. శాసనవీధి కూడలిలో కల్వర్టుకు గండి పడి రెండేళ్లవుతోంది. అక్కడ రాయి పెట్టి ప్రమాదాలను నివారిస్తున్నారు. బజారువీధి కూడలి గ్రామానికి ప్రధానమైంది. ఈ ప్రాంత రహదారులు అధ్వానస్థితిలో ఉన్నాయి. రోడ్ల అనుసంధానం సరిగా లేకపోవడం, కాలువలపై పలకలు తొలగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు.

● కొన్ని వీధులకు కుళాయి పైపులైన్లు కూడా అమర్చలేదు. చోట మూడు, నాలుగు అడుగుల లోతులో కుళాయిలున్నాయి. దీంతో తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు.

● నివాసాలు పెరుగుతున్న కృష్ణసాగర్ రోడ్డు, అప్పన్నపేట ప్రాంతాల్లోనూ సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. కృష్ణసాగర్ బావికి వెళ్లే మార్గం అభివృద్ధికి నోచుకోకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. వీధి స్తంభాలు ఏర్పాటు చేసి, దీపాలను అమర్చాలని స్థానికులు కోరుతున్నారు. అప్పన్నపేటలో కాలువ నిర్మాణం జరగలేదు. నీరు ఎగువ ప్రాంతాలకు ఉండడం లేదు.

• నీటి కోసం బెల్లుపడ వాసుల కష్టాలు

కృష్ణసాగర్‌బావి రోడ్డు దుస్థితి ఇది

ఆధ్యాత్మికంగా గుర్తింపు.. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు బెల్లుపడ ప్రత్యేకతను చాటుతోంది. ఆలయాలు అధికంగా ఉండడం, పండగలు కలిసి చేసుకోవడం, విశ్వశాంతి కోసం యజ్ఞయాగాలు చేయడం ఇక్కడి వారి ప్రత్యేకత. ఆధ్యాత్మిక విహార కేంద్రంగా శివానందగిరి అలరారుతోంది.

ఇబ్బందులు పరిష్కరించాం

బెల్లుపడ ప్రాంతంలో చాలా సమస్యలు పరిష్కరించాం. నీటి సమస్య ఏఐబీ పథకంతో పరిష్కారమవుతుంది. వీధులు చిన్నవి కావడంతో కాలువల నిర్మాణానికి ఇబ్బంది నెలకొంది. ప్రత్యేక విధానంలో సమస్యను పరిష్కరించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించాం. బెల్లుపడలో కేజీబీవీ, అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటయ్యాయి. ప్రధాన వీధుల్లో రోడ్లు పూర్తిచేశాం. - **పిలక రాజలక్ష్మి, పురాధ్యక్షురాలు, ఇచ్ఛాపురం**

వృథాగా పాఠశాల భవనం

విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో జన్నిపుట్టుగ ప్రాథమిక పాఠశాలను మూసివేశారు. దీంతో ఆ భవనంలో కొంత మంది కట్టెలు భద్రపరచుకోవడం, దుస్తులు ఆరబెట్టడం వంటి పనులకు వినియోగిస్తున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ అవసరాలకు భవనాన్ని వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంఈవో-2 చిట్టిబాబు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

నడకకూ నరకమే

మందస మండలం పాత జాతీయ రహదారి నుంచి సువర్ణాపురం వెళ్లే రహదారి ఇది. పల్లెపండగ కార్యక్రమంలో అభివృద్ధి పనులు చేపట్టారు. రెండు పొరలు వెట్‌మిక్స్ వేసి వదిలేశారు. దాదాపు ఏడాది కావస్తున్నా పనుల్లో పురోగతి లేదు. రాళ్లు తేలడంతో ప్రజలు నడకకూ నరక యాతన పడుతున్నారు. బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు పనులు ఆపేశారని, పనులు కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని పీఆర్‌డీఈఈ రవిబాబు తెలిపారు. – న్యూస్‌టుడే, హరిపురం (మందస)

కాలువ లేక.. మురుగు కదలక

కవిటి ఎంపీడీవో కార్యాలయం నుంచి చింతామణి అమ్మవారి ఆలయం వరకు కాలువ లేదు. దీంతో మురుగు నీరు ఎక్కడికక్కడే నిల్వ ఉంటోంది. చుట్టుపక్కల ప్రజలు దుర్వాసన, దోమల బెడదతో అవస్థలు పడుతున్నారు. దీనిపై ఈవో ఎం.రవిని వివరణ కోరగా సర్పంచితో మాట్లాడి కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

బోరుమంటోంది

ఇచ్ఛాపురం పుర పరిధి పూరేటివీధి కూడలిలో బోరు నిరుపయోగంగా మారింది. బోరుకు తల మాత్రం మిగిలి, నీరు తోడుకునే తెడ్డు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. కాలువ ఒడ్డున, కనీసం ప్లాట్‌ఫాం లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. మరమ్మతు చేసి, వినియోగానికి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. అది పనిచేయని బోరు అని, ఎప్పటినుంచో అలా వదిలేశారు, మరోసారి పరిశీలిస్తామని కమిషనర్ రమేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

వాడకుండా వదిలేశారు..

పశువుల దాహార్తి తీర్చే లక్ష్యంతో ఉపాధి పథకం ద్వారా వజ్రపుకొత్తూరులో నిర్మించిన నీటితొట్టెలు ఎక్కడా వినియోగించే పరిస్థితులు కనిపించడంలేదు. ఒక్కో నీటి తొట్టెకు రూ.35వేల వరకు ఖర్చుచేశారు. వీటి నిర్వహణ బాధ్యత పంచాయతీలు చేపట్టాల్సి ఉన్నా ఆ పరిస్థితి ఎక్కడా లేదు. ఈ విషయమై ఎంపీడీవో రమేష్‌నాయుడును వివరణ కోరగా నీటి తొట్టెలు వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషిచేస్తామని చెప్పారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

పలాస ఎస్టీ వసతిగృహం విద్యార్థినులతో మాట్లాడుతున్న పుర కమిషనర్ శ్రీనివాసులు

తాగునీటి సదుపాయం కల్పించండి

పలాస, న్యూస్‌టుడే: తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని, తమకు తాగునీటితోపాటు వాడకపు నీటిని ఏర్పాటు చేయాలని పలాస ఎస్టీ బాలికల వసతి గృహం విద్యార్థినులు కోరారు. సోమవారం పలాస-కాశీబుగ్గ పుర కమిషనర్ ఇ.శ్రీనివాసులు వసతి గృహాన్ని సందర్శించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చాకలివీధి కూడలి వద్ద కల్వర్టుకు పడిన రంధ్రం పేరిట 'ఈనాడు'లో ప్రచురించిన కథనంపై స్పందిస్తూ తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రామలక్ష్మణ, హడ్కోకాలనీ ప్రాంతాల్లో కాలువల్లో మురుగు తొలగించాలన్నారు. కేటీ రోడ్డులో హోటళ్ల యజమానులకు ప్లాస్టిక్ వాడొద్దని, ప్రత్యామ్నాయం చూసుకోవాలని సూచించారు. 30వ వార్డు తెదేపా నాయకులు డి.శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభా పోటీల విజేత మంచినీళ్లపేట

కంబాలరాయుడుపేటలో మాతృభూమి అభివృద్ధి సంఘాల సమాఖ్య నేతృత్వంలో ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ పర్యవేక్షణలో 3, 4, 5 తరగతుల విద్యార్థులకు సోమవారం ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఇందులో మంచినీళ్లపేట, కంబాలరాయుడుపేట, పీఎంపురం పాఠశాలలు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు మాతృభూమి సంఘాల సమాఖ్య సభ్యులు, గ్రామస్థులు బహుమతులు అందజేశారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

జన సైనికుడి కుటుంబానికి చేయూత

హరిపురం (మందస), న్యూస్‌టుడే: అంబుగాంకు చెందిన జనసేన పార్టీ క్రియాశీల కార్యకర్త బల్ల పాపారావు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. దీంతో ఆ కుటుంబానికి పార్టీ తరపున ప్రమాద బీమా కింద రూ.5 లక్షలు చెక్కు ఎమ్మెల్సీ కె.నాగబాబు మంగళగిరిలో అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు త్రినాథ్ అన్నారు. సమస్యలు పరిష్కారం కోరుతూ డివిజన్ పరిధి వీఆర్‌ఏలు పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న వీఆర్‌ఏలను వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. అనంతరం ఆర్డీవో వెంకటేశ్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్సీ పరామర్శ

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దకర్రివానిపాలెంలో వైకాపా నాయకులు ఎం.కేశవరావు, చిన్నకర్రివానిపాలెంలో చీకటి సీమారావు ఇటీవల మృతి చెందడంతో ఆయా కుటుంబాలను ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. కేశవరావు కుటుంబానికి రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఉప సర్పంచి సీహెచ్ బోసు, ఉప ఎంపీపీ కర్రి గోపయ్య, మత్స్యకార నాయకులు అప్పన్న, రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ అశోక్‌తో ఒడ్డి సామాజిక వర్గీయులు

గుర్తింపు లేక ఇక్కట్లు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇతర ప్రాంతాల్లోని ఒడ్డి సామాజిక వర్గానికి బీసీ-ఏ కులధ్రువీకరణ పత్రాలు మంజూరవుతుండగా, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఆ గుర్తింపు లేదని ఆ సామాజికవర్గ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. తెదేపా నాయకులు కొర్రాయి ధర్మరాజు, బి.హైమావతితో కలిసి సోమవారం ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు సమస్యను వివరించారు. సమస్యను కలెక్టరుకు వివరించి, న్యాయం జరిగేలా చేస్తానని విప్ హామీ ఇచ్చినట్లు ధర్మరాజు, హైమావతి తెలిపారు.

న్యాయవాది మృతికి సంతాపం

సోంపేట: సీనియర్ న్యాయవాది భగవాన్లు మృతి పట్ల సోంపేట బార్ అసోసియేషన్, పర్యావరణ పరిరక్షణ సంఘం సభ్యులు సంతాపం తెలిపారు. 35 ఏళ్లకు పైగా న్యాయవాదిగా సేవలందించిన భగవాన్లు సోంపేట థర్మల్ విద్యుత్తు ఆందోళనకారులకు న్యాయ సహాయం అందించారు.

ప్రతిభకు అభినందన

శ్రీకాకుళం బాలికోన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో మాణిక్యపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయికుమార్ బెహరా, సంతోష్ సాహు, హర్షవర్ధన్ సాహు బృందం నాలుగో స్థానంలో నిలిచింది. ఈ మేరకు సోమవారం ప్రధానోపాధ్యాయుడు వైకుంఠరావు పాఠశాల వద్ద వీరిని అభినందించారు. ఉపాధ్యాయులు తిరుపతిరావు, వేణుగోపాల్, రవి, లక్ష్మీబాలనాయక్, రవికుమార్, శైలజ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

వైభవంగా సత్యసాయి జయంతి

మందసలో సత్యసాయిబాబా జయంతి కార్యక్రమాల్లో భాగంగా సోమవారం నగర సంకీర్తన, ప్రశాంతి పతాకావిష్కరణ, రథోత్సవం నిర్వహించారు. సాయంత్రం శత దీపారాధన, నామసంకీర్తన, బాలవికాస్, చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, ఊయల ఉత్సవాన్ని చేపట్టారు. సత్యసాయి సేవాసమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శి వి.ఈశ్వరరావు, మద్ది శివ పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, మందస

శ్రీరామతత్వం ఆదర్శనీయం

శ్రీరామతత్వం మానవాళికి ఆదర్శనీయమని శివగురుస్వామి కొక్కిలి దేవదత్తం అన్నారు. సోంపేట నేతాజీనగర్‌లో సోమవారం శ్రీరామ మాలధార స్వాములు ఆంజనేయ ఆలయం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. తెప్పల రవిస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీరామ, ఆంజనేయ వేషధారణలతో ముప్పన ఈశ్వరరావు, సురేంద్ర చౌదరి ఆకట్టుకున్నారు. -న్యూస్‌టుడే, సోంపేట

పోలీసుల అదుపులో యువకులు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస మండలం శాసనాం వద్ద నలుగురు యువకులను సోమవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో గుర్తు తెలియని అయిదుగురు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు గ్రామానికి చేరుకునే సరికి ఒక యువకుడు తప్పించుకోగా మిగిలిన వారిని అదుపులోకి తీసుకున్నారు.

బాసటగా.. బాధ్యతగా

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

వారంతా యువకులే ఆ గ్రామం కోసం పాటుపడుతూ సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వారంతా పేదలకు సాయపడేందుకు ఓ సంస్థను ఏర్పాటు చేశారు. ఆదాయ వనరులపై దృష్టిపెట్టారు. క్యాటరింగ్‌కు వెళ్తూ వచ్చిన సంపాదనలో కొంత మొత్తాన్ని సామాజిక సేవకు వినియోగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వారే ఇచ్ఛాపురం మండలం బాలకృష్ణాపురం పంచాయతీలోని మునిభద్రకు చెందిన సంభవామి ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు.

సంభవామి ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

ప్రారంభం

మునిభద్రలో 25 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి 2016లో ట్రస్ట్ ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఇచ్ఛాపురం, పలాస, సోంపేట, కవిటి, టెక్కలి తదితర ప్రాంతాల్లో జరిగే వివాహాలు, శుభకార్యాల్లో క్యాటరింగ్ పనులు చేస్తూ వచ్చిన దాంట్లో ఒక్కొక్కరూ రూ.100మాత్రమే తీసుకొని మిగతా సొమ్మును వ్యవస్థాపకుడి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, పేద విద్యార్థులను ఆదుకొనేందుకు ముందుకొస్తున్నారు. ఇప్పటివరకు రూ.7లక్షల సాయం అందించారు.

సేవా కార్యక్రమాలు ఇలా

★ ప్రతి ఆరు నెలలకోసారి కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 12 శిబిరాలు ఏర్పాటు. 40 మంది నిరుపేదలకు సొంత ఖర్చుతో శస్త్రచికిత్సలు చేయించారు.

★ లక్ష్మీపురంలో రూ.2 లక్షలతో తులసికోట, రూ.లక్షతో గాంధీ విగ్రహం ఏర్పాటు చేయించారు. పరిసర గ్రామాల్లో నిరుపేద కుటుంబాలకు చెందిన యువతులకు వివాహ సమయంలో ఆర్థిక సాయం అందజేస్తున్నారు.

★ గ్రామంలో స్వచ్ఛభారత్, సేవా కార్యక్రమాలు చేపడుతున్న వారిని గుర్తించి సన్మాన కార్యక్రమాలు చేపడుతున్నారు. స్నేహ బెహరా అనే విద్యార్థినిని ఇంగ్లీషు మీడియం పాఠశాలలో చదివిస్తున్నారు.

★ సమీప పాఠశాలల్లో మొక్కలు నాటడం, రంగులు వేయడం, గ్రామంలో బావి, బోర్ల మరమ్మతులు వంటి వివిధ కార్యక్రమాలు చేపట్టారు.

అండగా నిలవడంలో ఆనందం

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశాం. కలిసికట్టుగా పనిచేస్తున్నాం. సేవా కార్యక్రమాలు ఆనందాన్ని ఇస్తున్నాయి. తారతమ్యాలు లేకుండా పేదలకు సాయం అందిస్తున్నాం. – **కోట రామారావు, ట్రస్ట్ వ్యవస్థాపకులు, మునిభద్ర**

రైతులకు పెద్దపీట

లొద్దభద్రలో పాల్గొన్న టీపీసీ ఛైర్మన్ బాబూరావు

కూటమి ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తోందని వక్తలు పేర్కొన్నారు. ఇచ్ఛాపురం మండలం ఇన్నేసుపేట, తేలుకుంచి, సోంపేట మండలం బుషాభద్ర, తాళ్లభద్ర, సోంపేట, బారువ, సుంకిడి, మందస మండలం రంగనాథపురం, వజ్రపుకొత్తూరు, పలాస మండలాల్లోని పలు గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీవో వెంకటేశ్, టీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టరు బి.దుర్యోధనరావు, ఏడీఏలు భవానీశంకర్‌రావు, రామారావు, తహసీల్దార్లు వెంకటరావు, సీతారామయ్య, కల్యాణ చక్రవర్తి, ఏవోలు అజయ్‌కుమార్, ధనంజయ, బి.నర్సింహమూర్తి, పోలారావు, ఎ.ఎం.సి ఛైర్మన్ మద్దిల విజయలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షులు కూర్మారావు, జగన్నాథరావు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం, వజ్రపుకొత్తూరు, సోంపేట, మందస, పలాస గ్రామీణం

కొండచిలువ హతం



మకరజోలలో సోమవారం ఓ కొండచిలువ స్థానికుల్లో దడ పుట్టించింది. ప్రధాన వీధిలోని ఓ కాలువ నుంచి పాము బయటకు రాగా జనాలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లలోకి చేరడానికి ప్రయత్నించగా స్థానికులు కర్రతో కొట్టి హతమార్చారు. – న్యూస్‌టుడే, మందస

ఉన్నత వ్యక్తిత్వంతోనే ఉజ్వల భవిష్యత్తు

సోంపేట, న్యూస్‌టుడే: ఉన్నత వ్యక్తిత్వంతోనే ఉజ్వల భవిష్యత్తు ముడిపడి ఉందని మనోవికాస నిపుణుడు రాంబుడ్డి గణపతి అన్నారు. సోమవారం పాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాగృతి సంస్థ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.నర్సింహులు అధ్యక్షతన పదోతరగతి విద్యార్థులకు మనోవికాస తరగతులు నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పదోతరగతి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గణపతి

మిల్లర్ల మోసాలకు అడ్డుకట్ట వేయాలి

మందస, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలులో మిల్లర్లు మోసాలకు పాల్పడుతున్నారని, గతేడాది వివిధ కారణాలు చెప్పి ధాన్యం దోచుకున్నారని, ఈ ఏడాది వాటికి అడ్డుకట్ట వేయాలని మహేంద్ర రైతు సంఘం సభ్యులు డిమాండు చేశారు. మందసలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో తహసీల్దారు శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘ అధ్యక్షుడు కామేశ్వరరావు, సభ్యులు హేమారావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు.. ఇచ్ఛాపురం గ్రామీణం: డొంకూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మూడు రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు నీటిని అందించే పైపులైన్ మరమ్మతులకు గురికావడంతో ఈ సమస్య తలెత్తింది. దీన్ని పంచాయతీ కార్యదర్శి కృష్ణ దృష్టికి తీసుకెళ్లగా సోమవారం మరమ్మతులు చేపట్టారు. ఆ పాఠశాలలో 300 మంది విద్యార్థులున్నారు. వారికి ఇబ్బంది కలగకుండా స్కూల్ ఛైర్మన్ జానకిరావు, సర్పంచి కల్యాణ్ పాఠశాలకు నీటి ట్యాంకర్లు పంపించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రధానోపాధ్యాయులు ఎం.మురళీప్రకాష్ అన్నారు. సోమవారం స్థానిక యువకుల ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం యువకులను అభినందించారు. ఉపాధ్యాయులు పి.పాపారావు, దుర్యోధన, లింగరాజు, యువకులు దేవరాజు, ప్రకాష్, జోగారావు, జగ్గారావు, నారాయణ, రాకేష్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కవిటి

డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు



డీసీసీ అధ్యక్ష పదవికి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి కిరణ్ కుమార్ దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం సంఘటన్ సృజన్ అభియాన్ (ఎస్ఎస్ఏ) కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఇందిర విజ్ఞాన్ భవన్‌కు వచ్చిన ఏఐసీసీ పరిశీలకులు సూరజ్ సింగ్ ఠాకూర్ (ఏఐసీసీ కార్యదర్శి), ఏపీసీసీ పరిశీలకులు లక్కరాజు రామారావు (అధ్యక్షులు ఏపీ, యూత్ కాంగ్రెస్) పీసీసీ ప్రధాన కార్యదర్శి శాంతకుమారికి దరఖాస్తు అందజేశారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

గోల్డ్ మెడలిస్ట్‌కు శుభాకాంక్షలు

శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ (SSSIHL) లో నవంబర్ 22న జరిగిన స్నాతకోత్సవం శుభసందర్భముగా గౌరవ ఉపరాష్ట్రపతి గారి చేతుల మీదుగా APJ అబ్దుల్‌కలాం పేరుతో గోల్డ్‌మెడల్ అందుకున్న శుభసందర్భముగా హృదయపూర్వక అభినందనలు

తాళాసు శ్రీరామ్ గారు
S/o తాళాసు శ్రీనివాసరావు, పలాస
ఉపాధ్యక్షులు, పారిశ్రామికవాడ

తాళాసు శ్రీనివాసరావు గారి మిత్రులు

మల్లా కాంతారావు APCMA వైస్‌ప్రెసిడెంట్ AICA బోర్డ్ మెంబర్, పలాస	మల్లా రామేశ్వరరావు అధ్యక్షులు, పారిశ్రామికవాడ	K.V. రామక్రిష్ణ వెంకటజ్యోతి ఫిల్లింగ్ స్టేషన్, పలాస
బోయిన జగన్నాథరావు (జగన్) నేషనల్ ఆడియో & వీడియో, కాశీబుగ్గ	సుడియా రత్నాకర్ పలాస	టంకాల సాయిరాం నివగాం, విశాఖ
పోట్నూరు నగేష్ శ్రీ గాయత్రి మెడికల్, కాశీబుగ్గ	తాళాసు శ్రీను (చాందిని) కాశీబుగ్గ	పూస వెంకటసుదీర్‌కుమార్ పలాస
మల్లా త్రినాథరావు చందన కాష్యూ కంపెనీ, పలాస	తాళాసు సాయిశంకరరావు పలాస	శ్రీ సత్యసాయి విద్యావిహార్ రామకృష్ణాపురం

(c) eenadu

టెక్కలి

●టెక్కలి ●నరసన్నపేట ●పాతపట్నం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

ఆక్రమణల తొలగింపు

నరసన్నపేట, న్యూస్టుడే: స్థానిక గోరువాని చెరువు గట్టుపై అక్రమ నిర్మాణాలను గ్రామ పంచాయతీ అధికారులు సోమవారం తొలగించారు. ఇటీవల గట్టుపై కొందరు అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని పలువురు గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా పనులు ఆగకపోవడంతో చర్యలు తీసుకున్నట్లు పంచాయతీ ఈవో దాక్షాయణి పేర్కొన్నారు.

రాళ్లు దారి.. మెరుగుపడదా మరీ

సారవకోట మండలంలోని వడ్డినవలస నుంచి తొగిరి మీదుగా కొమనాపల్లి వరకు 10 కి.మీ. మేర రోడ్డు నిర్మాణానికి గత వైకాపా ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేసింది. అప్పట్లో గుత్తేదారు కల్వర్టుల నిర్మాణం, రహదారి విస్తరణ పనులు చేపట్టారు. బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో మధ్యలో వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గుత్తేదారు తిరిగి పనులు ప్రారంభించారు. నెల రోజులుగా మరలా నిలిపేయడంతో రాళ్లు తేలిన దారిలో రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. గుత్తేదారుతో మాట్లాడి పనులు పూర్తి చేయిస్తామని ఏఈ సరోజ తెలిపారు. – న్యూస్టుడే, సారవకోట

ప్రసంగించారు.. ప్రశంసలు పొందారు

సంతబొమ్మాళిలోని కేజీబీవీలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. ధైర్యంగా మాట్లాడే అలవాటు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని ప్రిన్సిపల్ యు.లక్ష్మి అన్నారు. పి.దీపిక (9వ తరగతి), జి.సంధ్య (10వ తరగతి), జి.హాసిని (9వ తరగతి) మొదటి మూడుస్థానాల్లో నిలిచారు. విజేతలకు ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు.

– న్యూస్టుడే, టెక్కలి పట్టణం

సాంకేతిక పరిజ్ఞానం అవసరం

ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం అవసరమని, విద్యార్థి దశ నుంచి ప్రతిభ పెంపొందించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాతపట్నం విక్టరీ స్కూల్ ప్రిన్సిపల్ బి.వి.శంకరనారాయణ అన్నారు. పాఠశాలలో సోమవారం 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై సెల్ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. పెద్దింటి లక్ష్మీప్రసన్న (10వ తరగతి), తూలుగు జ్యోత్స్న (10వ తరగతి), శివకాల జస్మిత (8వ తరగతి) విజేతలుగా నిలిచారు. ఉపాధ్యాయులు పి.శ్రీనివాస రావు, కృష్ణారావు, కోటేశ్వరరావు, వెంకటరమణ బహుమతులు అందించారు. – న్యూస్టుడే, పాతపట్నం

అభివృద్ధి అంతంతే.. ఏళ్లుగా ఇంతే..!

– న్యూస్టుడే, ఎల్ఎన్పేట

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా పాతపట్నం నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. వైకాపా పాలనలో అయిదేళ్ల అభివృద్ధి మాటే లేదు. ప్రస్తుతమైనా పరిస్థితి మారుతుందని ఆశాభావం వ్యక్తం చేసిన ప్రజలకు చివరకు నిరాశే మిగిలింది. స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్నాయుడు, అచ్చెన్నాయుడు ఇప్పటికైనా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలపై 'న్యూస్టుడే' కథనం.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

● ఎల్ఎన్పేట, హిరమండలం, కొత్తూరు మండలాల మీదుగా వంశధార నది ప్రవహిస్తోంది. కరకట్టలు లేకపోవడంతో వరదల సమయంలో వేల ఎకరాల్లో పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పనులు చేపట్టేందుకు ఏటా అధికారులు అంచనాలు తయారు చేస్తున్నారే తప్ప అడుగులు మాత్రం పడటం లేదు.

● జంఝావతి వద్ద కడగండి జలాశయం నిర్మాణం చేపట్టి ఏళ్లు గడుస్తున్నా కాలువలు ఏర్పాటు చేయలేదు. దీంతో నీరు వృథాగా పోతోంది. ఎల్ఎన్పేట మండలంలో పోలీస్ స్టేషన్ లేదు. అవుట్పోస్టు పోలీస్స్టేషన్ ఏర్పాటుకు పనులు చేపట్టినా మధ్యలో వదిలేశారు. మెళియాపుట్టి మండలంలో మహిళా జూనియర్ కళాశాల, ఐటీడీఏ ఏర్పాటు, గోకర్ణపురం వంతెన పనులు కలగానే మిగిలాయి.

● హిరమండలం పరిధి జిల్లేడుపేట వద్ద మహేంద్రతనయ నదిపై వారధి నిర్మించక పోవడంతో గ్రామస్థులకు నాటు పడవే దిక్కు. వంశధార రిజర్వాయర్ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందలేదు. కొరాకకు సంబంధించి 100 కుటుంబాలకు 5 సెంట్లకు బదులు గతంలో రెండు సెంట్లు మాత్రమే ఇచ్చారు.

● పాతపట్నంలో అగ్నిప్రమాదం జరిగితే ఒడిశా, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి అగ్నిమాపక శకటం రావాల్సిన పరిస్థితి. దీంతో అప్పటికే నష్టం జరిగి పోతోంది. నియోజకవర్గ కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● కొత్తూరు మండలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, కుంటిభద్ర- సిరుసువాడ గ్రామాల మధ్య రోడ్డు నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వంశధార రిజర్వాయర్ నిర్మాణం, వంశధార- నాగావళి అనుసంధానం వంటి మేజర్ పనులు సాగడం లేదు.



ఎల్ఎన్పేట: కడగండి రిజర్వాయర్ నుంచి వృథాగా పోతున్న సాగునీరు

వంశధార నదిపై జిల్లేడుపేటలో నాటు పడవపై ప్రయాణం

చర్యలు తీసుకుంటాం..

నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలు గుర్తించాం. పనులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. త్వరితగతిన చర్యలు తీసుకుంటాం.

– మామిడి గోవిందరావు, ఎమ్మెల్యే, పాతపట్నం

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

కోటబొమ్మాళి, న్యూస్టుడే: మహారాష్ట్రలో ఈనెల 28 వరకు జరగనున్న అండర్- 17 జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు కోటబొమ్మాళిలో పదోతరగతి చదువుతున్న **నివగాన గీతిక** ఎంపికైనట్లు ఎంఈవో-2, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డబీరు గోవిందరావు తెలిపారు. కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో అవకాశం దక్కినట్లు చెప్పారు. బాలికతో పాటు, వ్యాయామోపాధ్యాయులు వాసుదేవరావు, గణేష్లను గ్రామస్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

గురుస్వాములకు సత్కారం

కొత్తూరు, న్యూస్టుడే: ఆధ్యాత్మిక భావనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్, నియోజకవర్గ జనసేన నాయకులు కొరికాన భవానీ అన్నారు. స్థానికంగా బత్తిలి రహదారిలో అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించారు. అనంతరం వివిధ సన్నిధానాలకు చెందిన గురుస్వాములను సత్కరించి, జ్ఞాపికలు అందించారు. కొత్తూరు, భామిని, ఒడిశాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు అండగా తెదేపా

మాట్లాడుతున్న సలాన మోహనరావు

మెళియాపుట్టి, న్యూస్టుడే: ఆఫ్షోర్ జలాశయం నిర్మాణంలో నిర్వాసితులైన చీపురుపల్లి గ్రామస్థులకు తెదేపా అండగా ఉంటుందని కొసమాల పీఏసీఎస్ అధ్యక్షుడు సలాన మోహనరావు అన్నారు. సోమవారం స్థానిక పీఏసీఎస్లో ఆయన మాట్లాడుతూ.. నిర్వాసితుల సమస్యలపై ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్పందించి, ఇబ్బందులు తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. సవర చీపురుపల్లిపై నుంచి ఏర్పాటు చేసిన అనుసంధాన రోడ్డు నిర్మాణంలో గ్రామానికి చెందిన 29 మంది డీపట్టా భూములు కోల్పోయారని.. బాధితులు తెలిపిన వివరాల మేరకు ఎమ్మెల్యే, కలెక్టర్తో మాట్లాడి రూ.41.71 లక్షలు మంజూరు చేయించారని పేర్కొన్నారు. అర్హులైన యువతకు ప్యాకేజీలు అందేలా సాంకేతిక సమస్యలు పరిష్కరించి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. తెదేపా నాయకులు వెంకట్రావు, బైరిసింగి దినకర్, ఇప్పిలి కృష్ణరావు, పైడిరాజు, పరమేశ్వర్రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

చల్లబంద గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని కూటమి నాయకులు, అధికారులు పేర్కొన్నారు. సోమవారం టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా 'రైతన్న మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. వారం రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వ్యవసాయ పరికరాలు కావాల్సిన వారు, ఇతర విషయాల గురించి తెలుసుకోవాలనుకునే వారు సచివాలయం, రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించాలన్నారు. సాంకేతికత వైపు అన్నదాతలు అడుగులు వేయాలని సూచించారు.

– న్యూస్టుడే బృందం

ఎం.అవలంగిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు, నాయకులు

మాతలలో తెదేపా పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటరమణ ఆధ్వర్యంలో..

ప్రారంభించారు.. తాళం వేశారు

పోలాకి మండలం కొత్తరేవు గ్రామంలోని రైతు సేవా కేంద్రం రెండేళ్లుగా తెరవడం లేదు. దీని నిర్మాణానికి రూ.17.30 లక్షలు వెచ్చించారు. ప్రారంభోత్సవం చేసి చేతులు దులుపుకొన్నారు. దీంతో సేవలందక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో రవికుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయ సిబ్బందికి తెలియజేస్తామన్నారు.

– న్యూస్టుడే, పోలాకి

తొలగించారు.. తరలించేదెప్పుడు..?

కోటబొమ్మాళి ప్రధాన రహదారిలోని ఇండియన్ బ్యాంకు సమీపంలో మురుగు కాలువల్లో పూడిక తొలగించారు. మూడు వారాలు అవుతున్నా.. వ్యర్థాలను తరలించక పోవడంతో స్థానికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. కాలువల మీద పలకలు సైతం అలాగే వదిలేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశముందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీవో ఫణీంద్రకుమార్ చెప్పారు.

– న్యూస్టుడే, కోటబొమ్మాళి

నిధులు లేక.. నిర్వహణ కానరాక

కొత్తూరు మండలం వెంకటాపురంలోని నరేంద్ర చెరువు పూడిక, పనికిరాని మొక్కలు పెరిగిపోయి అధ్వానంగా మారింది. 70 ఎకరాల విస్తీర్ణం గల ఈ కాసారం ద్వారా సుమారు 250 ఎకరాలకు సాగునీరందుతుంది. కొన్నేళ్లుగా నిధులు మంజూరు చేయకపోవడంతో అధికారులు నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో రైతులు అవస్థలు పడుతున్నారు. తటాకాన్ని మెరుగు పరుస్తామని నీటి పారుదల శాఖ ఏఈ కృష్ణప్రసాద్ తెలిపారు.

– న్యూస్టుడే, కొత్తూరు

దారి కాస్తాయి.. దాడి చేస్తాయి

నరసన్నపేట మేజర్ పంచాయతీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. పదుల సంఖ్యలో గుంపులుగా సంచరిస్తుండటంతో స్థానికులు బెంబేలెత్తి పోతున్నారు. పిల్లలు, మహిళలు, వృద్ధులపై దాడి చేస్తుండటంతో ఒంటరిగా బయటకు రాలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో పరిస్థితిని చిత్రంలో చూడొచ్చు. శునకాల సంఖ్య నియంత్రణకు చర్యలు తీసుకుంటామని ఈవో దాక్షాయణి అన్నారు.

– న్యూస్టుడే, నరసన్నపేట

ప్రమాదాన్ని నివారించారు

జలుమూరు: జలుమూరు మండలం హెచ్చర్లవానిపేటలో విద్యుత్తు నియంత్రిక స్విచ్ బోర్డు అడుగు ఎత్తులో ప్రమాదకరంగా ఉండేది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేసే వారు. సమస్యపై ఈనెల 16న ఈనాడులో 'ఎత్తు తక్కువ.. ప్రమాదం ఎక్కువ' శీర్షికతో వెలువడిన వార్తకు సంబంధిత శాఖ ఏఈ సూర్యారావు స్పందించి, స్విచ్ బోర్డు సరి చేశారు.

స్పందనకు వందనం

పనికిరాని మొక్కల తొలగింపు

సారవకోట: అన్నుపురం గ్రామ సమీపంలో విద్యుత్తు స్తంభాన్ని పనికిరాని మొక్కలు పూర్తిగా కప్పేశాయి. దీంతో తరచూ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు వాపోయారు. ప్రమాదాలు జరగక ముందే చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఈనెల 23న 'స్తంభాన్ని కప్పేశాయ్' శీర్షికతో వార్త ప్రచురితం కావడంతో ఏఈ రమేష్ సిబ్బందికి తెలియజేసి, సమస్యను పరిష్కరించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

హిరమండలం, ఎల్ఎన్పేట: శ్రీకాకుళం నగరంలో ఓ కల్యాణ మండపంలో జరిగిన అస్మిత ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లో హిరమండలం, కొత్తూరు, ఎల్ఎన్పేట మండలాలకు చెందిన పలు పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు శిక్షకుడు తోట సింహాచలం తెలిపారు. నాలుగు మండలాల నుంచి 70 మంది అండర్-5 నుంచి అండర్-18 వరకు పలు విభాగాల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. హిరమండలానికి చెందిన వారు ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించారని చెప్పారు.

ఐతమ్లో ఎంబీఏకు ఎన్బీఏ టైర్-I గుర్తింపు

టెక్కలి, న్యూస్టుడే: టెక్కలి సమీపంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ కోర్సుకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్(ఎన్బీఏ) టైర్-1 గుర్తింపు లభించినట్లు కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు వెల్లడించారు. సోమవారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంబీఏ కోర్సుకు ఎన్బీఏ గుర్తింపు పొందిన ఏకైక సంస్థగా తమ కళాశాల నిలుస్తోందని చెప్పారు. కళాశాల ప్రమాణాలు, అధ్యాపకుల నైపుణ్యత ఆధారంగా ఈ గుర్తింపు లభించిందన్నారు. ప్రిన్సిపల్ ఏఎస్ శ్రీనివాసరావు ఉన్నారు.

సందడిగా సాయిగణేష్ పుట్టినరోజు వేడుకలు

హిరమండలం, న్యూస్టుడే: హిరమండలం, ఎల్ఎన్పేట గ్రామాల్లో ఎమ్మెల్యే ఎం.గోవిందరావు కుమారుడు, తెదేపా నాయకుడు మామిడి సాయిగణేష్ పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పి.శ్రీధర్, నాగేశ్వరరావు, బుచ్చిబాబు ఆధ్వర్యంలో కేకు కోసి, మిఠాయిలు పంచిపెట్టారు. మోదుగులవలస శివాలయంలో ఎల్ఎన్పేట నాయకులు పూజలు చేశారు. ఎస్.గోవిందరావు, సాయి, మన్మథరావు పాల్గొన్నారు.

ఆధీనంలోని భూములకు పట్టాలివ్వాలి

కొత్తూరు: కడుము గ్రామంలో దళితుల ఆధీనంలో ఉన్న భూములకు తక్షణమే పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు డిమాండ్ చేశారు. కొత్తూరు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం స్థానికులతో కలిసి ఆయన ధర్నా చేపట్టారు. అనంతరం డీటీ మురళీకృష్ణకు వినతిపత్రం అందించారు. అధికారులు స్పందించాలని కోరారు.

ఘనంగా గీతా జయంత్యుత్సవాలు

పాతపట్నం: మండలంలోని కె.గోపాలపురం గ్రామంలోని శివానంద కుటీర్లో గీతా జయంత్యుత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వచ్చే నెల 1వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తుండగా.. సోమవారం గీతానందస్వామి ఆధ్యాత్మిక ప్రవచనాలు చెప్పారు. గోపాలపురం, పాతపట్నానికి చెందిన పలువురు భక్తులు పాల్గొన్నారు.

అంతర్జాలం ద్వారా చెల్లింపులు

జలుమూరు, న్యూస్టుడే: పన్నుల చెల్లింపులు అంతర్జాలం ద్వారా జరగాలని డీఎల్పీవో ఆర్.గోపీబాల అన్నారు. జలుమూరు, రావిపాడు గ్రామ సచివాలయాల్లో సోమవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. గృహ యజమాని ఆధార్కార్డుకు చరవాణి నంబరును అనుసంధానం చేయాలని చెప్పారు. దీంతో పన్నుల చెల్లింపులకు సంబంధించిన సమాచారం చరవాణికి వెళ్తుందని తెలిపారు. రసీదు గ్రామ సచివాలయానికి వెళ్లి తీసుకోవచ్చని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఈశ్వరరావు, చిన్నారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

టెక్కలి పట్టణం, పోలాకి, న్యూస్టుడే: టెక్కలి పట్టణంలోని గిరిజన బాలుర ఆశ్రమపాఠశాల ఆవరణలో మండలస్థాయి గ్రిగ్స్ పోటీలు సోమవారం నిర్వహించారు. వాలీబాల్ క్రీడకు సంబంధించి బాలబాలికల విభాగాల్లో 13 పాఠశాలల నుంచి 320 మంది హాజరయ్యారు. ఎంఈవోలు తులసీరావు, చిన్నారావు పోటీలను ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నందేశ్వరరావు, క్రీడల డివిజన్ ఇన్ఛార్జి నారాయణరావు, ఎంఎస్వో లక్ష్మణరావు పాల్గొన్నారు. ● విద్యార్థులు చదువుతో పాటు క్రీడల వైపు దృష్టి సారించి గుర్తింపు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఈదులవలస ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తూ అవసరమైన సదుపాయాలు కల్పిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

టెక్కలి పట్టణం: పోటీలు ప్రారంభిస్తున్న విద్యాశాఖాధికారులు, వ్యాయామోపాధ్యాయులు

ప్రైవేటుకు దీటుగా.. బోధనలో మేటిగా

– న్యూస్టుడే, సారవకోట, జలుమూరు, నరసన్నపేట గ్రామీణం

నరసన్నపేట నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా ఉపాధ్యాయులు బోధన చేస్తుండటంతో సర్కారు బడులకు ఆదరణ పెరుగుతోంది. దీంతో విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది.

వాండ్రాయి పాఠశాలలో బోధిస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు వేణుగోపాల్

విరాళాలు పోగు చేసి..

సారవకోట మండలంలోని వాండ్రాయి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు వినూత్న రీతిలో పాఠాలు చెబుతుండటంతో పిల్లలు ఆసక్తిగా నేర్చుకుంటున్నారు. 1 నుంచి 8 తరగతులకు గతంలో ఇక్కడ 70 వరకు విద్యార్థులుండే వారు. ఈ సంఖ్య క్రమంగా తగ్గి 38కి పడిపోయింది. ప్రస్తుతం 48కి చేరింది. ఉపాధ్యాయులు, గ్రామస్థులతో సమావేశమై పాఠశాలలో సమస్యలను తెలియజేయడంతో రూ.45 వేలు వరకు విరాళాలు పోగు చేసి తరగతి గదులకు రంగులు వేయించారు. వాలంటీరును నియమించారు. ఉపాధ్యాయుల కృషిని గుర్తించిన ఎంఈవో ఎం.వెంకటరమణ ఈ బడిని మండల స్థాయిలో ఉత్తమ పాఠశాలగా గుర్తించారు. ఇక్కడి ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎన్.వేణుగోపాల్కు ఎంఈవో వెంకటరమణ మండల అకడమిక్ ఫోరంలో సభ్యుడిగా నియమించారు. జలుమూరు ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో 2023 జూన్ నాటికి 9 మంది విద్యార్థులుండే వారు. ఈ ఏడాది ఈ సంఖ్య 82కి పెరిగింది. సిబ్బంది సమష్టి కృషి, గ్రామస్థుల సహకారం దీనికి కారణమని ఉపాధ్యాయుడు రామారావు చెబుతున్నారు.

జలుమూరులో కృత్యాధార పద్ధతిలో పిల్లలకు పాఠాలు చెబుతున్న రామారావు

నిరంతర పర్యవేక్షణ..

పాఠశాలలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. విద్యార్థులను ఆకట్టుకునేలా బోధన చేయాలని సిబ్బందికి సూచిస్తున్నాం. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రుల సమావేశాల్లో వివరిస్తున్నాం. వచ్చే విద్యా సంవత్సరానికి పిల్లల సంఖ్య మరింత పెంచేలా కృషి చేస్తున్నాం.

– ఎం.వెంకటరమణ, బి.మాధవరావు, యు.శాంతారావు, ఎంఈవోలు

సర్కారు బడుల్లో చేరిక

▶ సారవకోట మండలంలోని చీడిపూడి, అలుదు, కిన్నెరవాడ, బద్రి, పెద్దగుజ్జువాడ, తొగిరి, సవరమాళువ, మహాశింగి, అన్నుపురం, బాలానగర్, వడ్డినవలస, సరవడ్డపనస ప్రాథమిక పాఠశాలలు, కిన్నెరవాడ, బద్రి ప్రాథమికోన్నత, సారవకోట, చిన్నకిట్టాలపాడు, అలుదు, బుడితి ఉన్నత, సారవకోట కేజీబీవీల్లో పిల్లలను ఆకట్టుకునేలా తరగతులు నిర్వహిస్తుండటంతో సమీపంలోని ప్రైవేటు విద్యాలయాల నుంచి సర్కారు బడుల్లోకి పిల్లలు చేరుతున్నారు.

▶ జలుమూరు మండలం శ్రీముఖలింగం, చల్లవానిపేట, కరవంజ, అల్లాడ, తిమడాం, పెద్దదూగాం ఉన్నత, జలుమూరు బాలికోన్నత, టెక్కలిపాడు ప్రాథమికోన్నత, కొమనాపల్లి, నగిరికటకం, అచ్యుతాపురం, తిమడాం, గొల్లపేట, రాణ ప్రాథమిక విద్యాలయాల ఉపాధ్యాయులు గ్రామాల్లో పర్యటించి, మీ పిల్లల భవిష్యత్తుకు మాది హామీ అని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. దీంతో ఆయా చోట్ల గతం కంటే పిల్లల సంఖ్య పెరిగింది. ఇచ్చిన మాట ప్రకారం సిబ్బంది సైతం వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించి, సామర్థ్యాలు పెంచేందుకు కృషి చేస్తున్నారు.

▶ నరసన్నపేట మండలం బసివలస, గుండువిల్లిపేట ప్రాథమిక, దూకులపాడు, రావులవలస ప్రాథమికోన్నత, నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రైవేటు బడుల నుంచి చేరడం విశేషం.

శుభ్రత పాటించండి

నరసన్నపేట గ్రామీణం, న్యూస్టుడే: మధ్యాహ్న భోజన తయారీలో శుభ్రత పాటించి ఆహారాన్ని రుచికరం చేయాలని మండల విద్యాశాఖాధికారి ఉప్పాడ శాంతారావు నిర్వాహకులకు సూచించారు. సోమవారం సుందరాపురం, మామిడివలస పాఠశాలల్లో ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్టుడే: రాష్ట్రంలో కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఆర్.రాము, జిల్లా అధ్యక్షుడు రాజమహంతి భానుచందర్ డిమాండు చేశారు. ఈమేరకు జిల్లా పరిషత్తు కార్యాలయంలో సోమవారం సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్కు వినతిపత్రం అందజేశారు.

నిండుగా నిర్లక్ష్యం..!

జలుమూరు మండలం బొబ్బపాడు వద్ద 18 ఆర్ కాలువ, అనుబంధ కాలువల్లో గుర్రపుడెక్క పేరుకుపోతోంది. దీంతో కాలువ ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో ఉపాధి వేతనదారులు తొలగించినప్పటికీ రెండు, మూడు నెలల్లో మళ్లీ డెక్క పెరిగిందని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. సమస్యను వంశధార శాఖ జేఈ కె.ధనంజయ వద్ద ప్రస్తావించగా తొలగింపు పనులకు ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. – న్యూస్టుడే, జలుమూరు

(c) eenadu

శ్రీకాకుళం
•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

ఉపన్యాసం.. అదరగొట్టారు..!

ఆమదాలవలస పట్టణంలోని అశోక పాఠశాలలో సోమవారం ఈనాడు ఆధ్వర్యంలో 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం'పై ఉపన్యాసం పోటీలు జరిగాయి. ఇందులో టి.జశ్వంత్ (9వ తరగతి), కె.జ్యోతిష్ రూప్ (10వ తరగతి), టి.దేవాన్ష్ (8వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల యాజమాన్యం వి.టి.చౌదరి, ప్రధానోపాధ్యాయుడు జి.మహేష్, ఉపాధ్యాయులు అప్పలనాయుడు, సూర్యనారాయణ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. - న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..!

పాతశ్రీకాకుళంలోని టీపీఎం పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కె.వర్షిత (9వ తరగతి), టి.చరిత (10వ తరగతి), జి.కీర్తన (7వ తరగతి) వరుస స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఉపాధ్యాయులు సింహాచలం, సూర్యనారాయణ తదితరులు బహుమతులు అందజేశారు.
-న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

ఒడిశా గవర్నర్‌ను కలిసిన వీసీ రజని

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: డా. బి.ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.ఆర్. రజని ఒడిశా గవర్నర్ డా. కె.హరిబాబును విశాఖలోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఏయూలో అమలుచేస్తున్న విద్యా సంబంధిత కార్యక్రమాలు, అభివృద్ధి పనులు వివరించారు. వర్సిటీలో నిర్వహిస్తున్న నాలుగేళ్ల ఉపాధ్యాయ విద్యా కోర్సులో అధిక శాతం విద్యార్థులు ఒడిశా నుంచి చదువుతున్నారని వీసీ తెలిపారు.

గవర్నర్ హరిబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ రజని

శుద్ధజలం.. మూణ్నాళ్ల ముచ్చట..!

-న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

ఆమదాలవలస నియోజకవర్గంలో సరుబుజ్జిలి, ఆమదాలవలస, పొందూరు, బూర్జ మండలాల్లోని 348 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 996 మంది గర్భిణులు, 911 మంది బాలింతలు, 8,726 మంది 0-6 వయసు చిన్నారులు ఉన్నారు. వీరి తాగునీటి అవసరాలు తీర్చేందుకు 2 ఏళ్ల కిందట 28 కేంద్రాలకు 10 లీటర్ల శుద్ధ జలం యంత్రాలను అందించారు. అవి ప్రస్తుతం నిరుపయోగంగా మారింది.

❖ చిన్నారులకు శుద్ధ జలం అందించడానికి సిబ్బంది సొంత స్థలాల వచ్చే అవకాశం ఉంది.



మతలబుపేట అంగన్‌వాడీ కేంద్రంలో నిరుపయోగంగా మారిన నీటి శుద్ధి యంత్రం

కొంతమంది ఇంటి నుంచి నీళ్ల సీసా తెచ్చుకుంటున్నారు. మరి కొంతమంది దగ్గరలోని కుళాయి నీరు తాగేస్తున్నారు. సహించకపోతే జలుబు, దగ్గు, జ్వరం, నీళ్ల విరేచనాలకు గురవుతున్నామని తల్లిదండ్రులు వాపోతున్నారు.

❖ నియోజకవర్గంలోని 28 కేంద్రాల్లో నీటి శుద్ధి యంత్రాలు వైకాపా హయాంలో సమకూర్చారు. ఒక్కొక్కటి 10 లీటర్ల సామర్థ్యంతో ఉన్న వీటి ద్వారా శుద్ధి అయ్యే నీరు 3 లీటర్ల మాత్రమే. 6 నెలలుగా మరమ్మతులకు గురైనా.. అధికారులు పట్టించుకోవడం లేదు. చిన్నారుల ఆరోగ్యంతో ఆడుకోవద్దని తల్లిదండ్రులు, కార్యకర్తలు విజ్ఞప్తి చేస్తున్నారు. మరమ్మతులు చేయడంతోపాటు మిగతా కేంద్రాల్లో శుద్ధజల యంత్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

❖ మరమ్మతులకు గురైనట్లు సంబంధిత ఏజెన్సీకి ఫిర్యాదు చేశాం. వచ్చి సరిచేస్తామన్నారు. చిన్నారులకు తాగునీటి సమస్యలు ఎదురు కాకుండా చూస్తాం.' అని ఐసీడీఎస్ ప్రాజెక్టు పీవోలు ఎం.వి.సత్యశ్రీ, గీతారాణి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

సమస్య: పంతులుపేటకు వెళ్లే ప్రధాన రహదారిలో ఇరువైపులా పొదలు రహదారిపైకి వస్తున్నాయి, దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. -వినీత్, సానికుడు సమాధానం: తొలగిస్తాం. - టి.రవి, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస

?: బీఆర్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలు లేకపోవడంతో మురుగు గోతుల్లో ఉండిపోతోంది. - బాలకృష్ణ, సానికుడు ❖ త్వరలోనే నిర్మాణం చేపడతాం. - ఇన్‌ఛార్జ్ మున్సిపల్ ఏఈ, ఆమదాలవలస

?: ఆమదాలవలస పట్టణం నుంచి పెద్దరావు గ్రామానికి వెళ్లే రహదారి పక్క తోటల్లో రాత్రి పూట మద్యం తాగుతున్నారు. హాజరీ, స్థానికులు ❖ తగు చర్యలు చేపడతాం. - బాలరాజు, ఎస్సై, ఆమదాలవలస

విజిలెన్స్‌కు చిక్కుతామని తప్పించుకుంటున్నారా..?

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులకు సమాచారం దొరకడం లేదు. 2021 నుంచి 2023 వరకు చేపట్టిన ఉద్యోగ నియామకాల వివరాలు కావాలని 2024 ఫిబ్రవరిలో విజిలెన్స్ అధికారులు అడిగారు. స్పందించని డీఎంహెచ్‌వో కార్యాలయ యంత్రాంగం స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆరోగ్య కార్యకర్త (పురుషులు) సంబంధిత నియామకాల సమాచారం అందజేసి ఊరుకున్నారు. నాలుగో తరగతి ఉద్యోగ నియామకాలకు సంబంధించిన సమాచారం కావాలని అడుగుతున్నా తాత్సారం చేస్తున్నారు. సకాలంలో సమాచారమివ్వకపోవడంతో జూనియర్ సహాయకులకు డీఎంహెచ్‌వో మెమోలిచ్చారు. వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ అధికారి వద్ద పూర్తిస్థాయి సమాచారం దాచిపెట్టారని కింది స్థాయి సిబ్బంది ఈ నెల 15న రాతపూర్వకంగా డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ అధికారులు విచారణకు వస్తున్నట్లు తెలుసుకున్న ఆ అధికారి మరో సారి సెలవు పెట్టారని తెలిసింది. అవకతవకలు బయటపడతాయనే జాప్యం చేస్తున్నారని తెలుస్తోంది. డీఎంహెచ్‌వో డా.కె.అనితను 'న్యూస్‌టుడే' సంప్రదించగా నివేదిక సిద్ధం కాలేదన్నారు.

ఆర్మీ బ్రిగేడియర్ పర్యటన

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: ఆర్మీ బ్రిగేడియర్ ఎస్.రాజీవ్ సోమవారం జిల్లా పర్యటనకు వచ్చారు. శ్రీకాకుళం నగర పరిధిలోని సైనిక క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు, వీర నారీమణులతో ఆయన సమావేశమయ్యారు. క్యాంటీన్ బాగా ఇరుకుగా ఉందని మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షుడు కె.పూర్ణచంద్రరావు బ్రిగేడియర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇ-రిక్షా సదుపాయం, పాలీ క్లినిక్ మెషిన్‌ను క్యూటీ ఫండ్ నుంచి మాజీ సైనికుల సమాఖ్య కార్యాలయానికి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించారు. కల్నల్ అజిత్ శర్మ, యూఆర్‌సీ జనరల్ మేనేజర్ విశ్రాంత కల్నల్ ముత్తు, మాజీ సైనికుల సంఘ ఛైర్మన్ పి.ఈశ్వరరావు, మాజీ సైనికుల సంక్షేమాధికారులు ఎ.శైలజ (శ్రీకాకుళం), ప్రసాదరావు (విజయనగరం), ఆర్మీ క్యాంటీన్ మేనేజర్ పి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌కు స్వాగతం పలుకుతున్న మాజీ సైనికుల సమాఖ్య ప్రతినిధులు

రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుల ఎన్నికల ప్రచారం

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుల ఎన్నికల హడావుడి మొదలైంది. జిల్లాకు చెందిన న్యాయవాది, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు గేదెల వాసుదేవరావు, పార్వతీపురానికి చెందిన నల్ల శ్రీనివాసరావు ప్రచారం చేస్తున్నారు. సోమవారం పలువురు న్యాయవాదులతో మాట్లాడారు. పురుషోత్తమపురం గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది కిల్లి మల్లేశ్వరరావు పోటీలో ఉన్నారు. ఎన్నికల తేదీలు ప్రకటించక ముందే జోరుగా ప్రచారం చేస్తున్నారు.

ఆరోగ్యకరమైన జీవితం అలవాటు చేసుకోండి

రణస్థలం, న్యూస్‌టుడే: ఆరోగ్యకరమైన జీవితం అలవాటు చేసుకోవాలని ప్రముఖ ప్రసూతి వైద్యుడు దానేటి శ్రీధర్ అన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు దానేటి శ్రీధర్

ఆయన ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం రణస్థలంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లాలో తొలిసారిగా ఐవీఎఫ్‌ను ప్రారంభించింది తమ ఆసుపత్రిలోనే అన్నారు. తక్కువ ఖర్చుతో సేవలందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు పిన్నింటి భానోజీనాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కోనేరు శుభ్రం

రణస్థలం, న్యూస్‌టుడే: రణస్థలం మండల కేంద్రం జేఆర్‌పురం వలసలోని కోనేరులో పూజా సామగ్రి వ్యర్థాలతో నిండి నీరంతా కలుషితమైంది. ఈ నెల 11న ఈనాడులో 'కోనేరు నిండా వ్యర్థాలు' వార్తకు స్పందించిన పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ సోమవారం కోనేరును శుభ్రం చేయించారు.

స్పందనకు వందనం

మొక్కలు తొలగింపు

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం రామ్మోహనరావు నగర్ కాలనీలోని వసతి గృహం పక్క వీధిలో విద్యుత్తు స్తంభంపైకి తీగమొక్కలు అల్లుకున్నాయి. ఈ నెల 22న 'మొక్కల్లో విద్యుత్తు తీగలు' శీర్షికన వార్త ప్రచురితం కావడంతో విద్యుత్తుశాఖ ఏఈ సుధీర్ స్పందించి మొక్కలు తొలగించారు.

ప్రారంభమైన ఆరోగ్యకేంద్రం పనులు

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం దళ్లవలస గ్రామంలో వైకాపా హయాంలో ఆరోగ్యకేంద్రం నిర్మాణం చేపట్టి సగంలో ఆపేశారు. దీంతో సెప్టెంబరు 17న 'ఈనాడు'లో సగంలో చేతులెత్తేశారు.. శీర్షికన వచ్చిన వార్తకు స్పందించిన అధికారులు భవనం నిర్మాణ పనులు చేపట్టారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

పొందూరు గ్రామీణం, సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. పొందూరు సిస్టమ్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో 16 కంపెనీలు పాల్గొన్నాయి. ● డ్వాక్రా మహిళా సంఘాల్లో సభ్యులు వ్యాపార వేత్తలుగా మారాలని ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు 'సేవ కేంద్రంలో 'సూక్ష్మ వ్యాపార అభివృద్ధి' శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ ఛైర్మన్ శివ్వాల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవికుమార్

PUBLIC NOTICE

Public are hereby informed that my client Andhavarapu Bhagyalakshmi, W/o A.Malleswararao of Srikakulam Mandal, Srikakulam District, She got the Schedule propety through Registered Sale Deed No.2171/2014, from Yallapantulu Koteswararao, the link document for the schedule property is Registered Partition Deed No. 6324/2013, while travelling on bike from his residence to Srikakulam main road, unfortunately She lost the link document Original Registered Partition Deed No. 6324/2013 and the same is not deposited elsewhere. Hence if anybody has found the document shall come forward within 7 days from this date.

Schedule

The ACC House with Appurtenant Site is covered in T.Sy.No. 1339 Part is situated at Srikakulam District, Srikakulam sub-Divison, Srikakulam Mandalam, Srikakulam Town, Srikakulam Municipality, Balaga ward, Western Side of Punyapu Street Road, The ACC House with Appurtenant is covered in T.Sy.No. 1339 Part with Door No. 5-6/3-48/1, Old Assessment No. 1027 Part, New Assessment No. 1085001465 of Vacant Site Measuring of Vacant Site Measuring East-West: 27 feet or 8.234 mtrs; North - South: 8 feet or 6 inches or 2.591 mtrs; to an extent of 25.5 Sq.yards or 21.32 Sq.mtrs in which Constructed ACC House measuring to an extent of 229.5 Sq.feets is having Boundaries **East:** Punyapu Street Road; **South:** Kanukurthy Street Road; **West:** Property of Yallapantula Chandrasekhar; **North:** House of Nemani Balakrishnamma.

KARANAM APPALA NAIDU
Advocate, Srikakulam
Ph.No. 84649 67756

Dt. 24-11-2025

దోమల బెడద

సరుబుజ్జిలి మండలంలోని చిన్నకాకితాపల్లి గ్రామంలో వీధి కాలువలో మురుగు నిలిచి, దోమలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదని వాపోతున్నారు. ఈవోపీఆర్డీ రామారావు వద్ద ప్రస్తావించగా మురుగు తొలగిస్తామన్నారు.
- న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

కాలువలు లేవండీ

జి.సిగడాం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే దారిలో కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువలు శిథిలమవడంతో మురుగు రహదారిపైకి వచ్చేస్తోంది. ఎంపీడీవో రామకృష్ణతో మాట్లాడగా చర్యలు తీసుకుంటామన్నారు.
- న్యూస్‌టుడే, జి.సిగడాం

వాలింది.. భయపెడుతోంది

మండలంలోని కింతలి, కనిమెట్ట గ్రామాల మధ్య అంబేడ్కర్ విగ్రహం వద్ద విద్యుత్తు స్తంభం ఒకవైపునకు వాలిపోయింది. రాకపోకలు చేసేవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. విద్యుత్తుశాఖ ఏఈ సుధీర్ వద్ద ప్రస్తావించగా, సమస్యను పరిష్కరిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

దారి లేదు.. వసతులు మృగ్యం

పొందూరు మండలం లక్ష్మింపేట గ్రామ శ్మశాన వాటికలో పనికిరాని మొక్కలు పెరిగి అధ్వానంగా కనిపిస్తోంది. సరైన దారి లేకపోవంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. మృతదేహాలను తీసుకెళ్లేందుకు అవస్థలు తప్పడం లేదన్నారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా కార్యదర్శితో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, పొందూరు

ఇంకెన్నాళ్లు..?

మండలంలోని రొట్టవలస సచివాలయం పరిధిలో నిర్మించిన పాలవెల్లువ మహిళా డైరీ సహకార సంఘం కేంద్రం వినియోగంలోకి రాలేదు. ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికీ దానిపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రం ఉంది. ఎంపీడీవో పావని వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.
–న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

18 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశం

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస మండలం దన్నానపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 18 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.జానకీరామయ్య తెలిపారు. మంగళగిరి ఎఫ్రోనిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వీరిని తీసుకుందన్నారు.

పంటపై అవగాహనతో మంచి దిగుబడి

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులకు పంటపై అవగాహన కలిగి ఉండాలని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ భాగ్యలక్ష్మి, రాగోలు వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ మిథున్ కుమార్, ఉదయ్‌బాబులు అన్నారు. సోమవారం ఆమదాలవలస మండలం కొర్లకోట, కొరపాం, పీర్‌సాహెబ్‌పేట, కుద్దిరాం గ్రామాల్లో పర్యటించి రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటలకు సోకుతున్న తెగుళ్లు, నివారణ చర్యలు తెలిపారు.

కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఆర్.రాము, జిల్లా అధ్యక్షుడు రాజమహంతి భానుచందర్ డిమాండు చేశారు. ఈమేరకు జిల్లా పరిషత్తు కార్యాలయంలో సోమవారం సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు.

కారు డ్రైవింగ్‌లో శిక్షణ

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధిశిక్షణ సంస్థలో వచ్చే నెల 9 నుంచి కారు డ్రైవింగ్ శిక్షణకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు శిక్షణ సంస్థ డైరెక్టర్ రామ్‌జీ సోమవారం తెలిపారు. అదనపు సమాచారం కోసం 79933 40407, 95534 10809కు ఫోన్ చేయాలని సూచించారు.

పరుగు పోటీలకు విద్యార్థి ఎంపిక

జి.సిగడాం, న్యూస్‌టుడే: జి.సిగడాం కస్తూర్బా పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆర్.స్వాతి హరియాణాలోని జరుగుతున్న జాతీయస్థాయి క్రీడల్లో అండర్-19 పరుగు పందెం పోటీకి ఎంపికైంది. ప్రిన్సిపల్ ప్రమీల, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

డ్రగ్స్ వద్దు బ్రో

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని 'మిరాయ్ ఫేం' రితికా నాయక్ అన్నారు. నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని 'డ్రగ్స్ వద్దు బ్రో' గోడప్రతులు ఆవిష్కరించారు.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తా విభాగం



ఉపాధిహామీ క్షేత్ర సహాయకుడి తొలగింపు

జి.సిగడాం, న్యూస్‌టుడే: జి.సిగడాం మండలం మదుపాం ఉపాధిహామీ క్షేత్ర సహాయకుడు దుప్పాడ పోతయ్యను విధుల నుంచి తొలగిస్తున్నట్లు డ్వామా పీడీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు ఉపాధిహామీ ఏపీవో సత్యనారాయణ తెలిపారు. జి.సిగడాం మండల కేంద్రంలో గతంలో నిర్వహించిన సామాజిక తనిఖీలో పోతయ్యపై పలు ఆరోపణలు రావడంతో నిర్ధారించుకుని చర్యలు తీసుకున్నారు.

నలుగురికి గాయాలు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని కిన్నెర థియేటర్ ఎదురుగా ఆదివారం రాత్రి స్కూటీపై వెళుతున్న ముగ్గుర్ని పాతబస్టాండ్ నుంచి జిల్లా పరిషత్తు కార్యాలయం వైపు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో దమ్మల వీధికి చెందిన కె.లావణ్య, ఆమె భర్త చిన్నబాబు, వారి కుమారుడు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఇద్దరు యువకులు అక్కడి నుంచి వేగంగా పారిపోయారని స్థానికులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.
❖ శ్రీకాకుళం నగర పరిధి కొత్త వంతెన వద్ద నడక దారిపై కూర్చున్న ఆర్.లోకేశ్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కుడి చేయి విరిగిపోయింది. స్థానికులు 108 వాహనంలో సర్వజనాసుపత్రికి తరలించారు. అతని భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌ఛార్జి కమిషనర్‌గా శ్రీనివాసులు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా నగరపాలక సంస్థ ఇంజినీరు వి.శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు వ్యక్తిగత పనుల నిమిత్తం వచ్చే నెల 14 వరకు సెలవు పెట్టడంతో ఆయన స్థానంలో శ్రీనివాసులు ఇన్‌ఛార్జి కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో సత్తా

శ్రీకాకుళం నగరంలోని ఓ కల్యాణ మండపంలో మహిళల కిక్ బాక్సింగ్, మార్షల్ ఆర్ట్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు జ్ఞాపికలు, పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. హేమంత్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఆనంద్‌బాబు, సీనియర్ న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్, కొంక్యాణ వేణుగోపాల్, లయన్ డా.పైడి సింధూర, ధర్మశాస్త్ర ట్రస్ట్ అధ్యక్షుడు బరాటం సంతోష్, శిక్షకులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పాతబస్టాండ్

రైతన్నా..నీ కోసమే వచ్చాం..

గార (గొంటి), న్యూస్‌టుడే: రబీలో సాగు చేయాల్సిన పంటలు, ప్రభుత్వ తోడ్పాటును తెలియజేయడానికి రైతన్న. . నీకోసం పేరిట మీ వద్దకే వస్తున్నామని ఆర్డీవో సాయిప్రత్యూష అన్నారు. రైతు సేవా కేంద్రాల పరిధిలో సోమవారం రైతన్న.. నీకోసం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గార మండలం గొంటి పంచాయతీ దీపావళిలో రైతులకు ఆర్డీవో పలు సూచనలు చేశారు.

అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికైన అన్నదమ్ములు

శివకుమార్

దుర్గాప్రసాద్

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు మండలం లైదాం గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన దురగాసి శివకుమార్, దుర్గాప్రసాద్ అన్నదమ్ములు ఇటీవల విడుదలైన అగ్నివీర్ ఫలితాల్లో ఎంపికయ్యారు. పేద కుటుంబానికి చెందిన ఇద్దరు కుమారులు దేశ సేవకు ఎంపిక కావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

సంపద లేదు.. శుభ్రత కానరాదు..!

– న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం, సరుబుజ్జిలి, బూర్జ

పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలన్న ఉద్దేశంతో తెదేపా హయాంలో పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించింది. 2019లో వైకాపా రావడంతో అవి నిరుపయోగంగా మారి.. ఎక్కడికక్కడ పారిశుద్ధ్య నిర్వహణ పడకేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

గాజుల కొల్లివలస వద్ద నిరుపయోగంగా మారిన సంపద కేంద్రం

❖ ఆమదాలవలస నియోజకవర్గంలో ఆమదాలవలస, సరుబుజ్జిలి, పొందూరు, బూర్జ మండలాల్లో 110 పంచాయతీల్లో 108 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు మంజూరు చేయగా 80 మాత్రమే నిర్మించారు. మిగతావి పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

❖ ఆమదాలవలస నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఎక్కడ చూసినా.. చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. గతంలోలా కాకుండా కూటమి హయాంలో చెత్తను సంపద కేంద్రాలకు తరలిస్తే బాగుంటుందన్న స్థానికులు అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం వినియోగంలో లేక సంపద తయారీ కేంద్రాలు ఖాళీగా కనిపిస్తున్నాయి.

❖ 'గ్రామాల్లో సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు తీసుకుంటాం.' అని ఆమదాలవలస, సరుబుజ్జిలి, పొందూరు, బూర్జ మండలాల ఎంపీడీవోలు వెంకటరావు, పావని, మన్మథరావు, తిరుపతిరావు తెలిపారు.

(c) eenadu

సుదూర ప్రయాణం...
సూర్యచంద్రులే ఆధారం

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి వలస పక్షులు వేలాది కిలోమీటర్లు రేయింబవళ్లు ప్రయాణించి చేరుకుంటాయి. సూర్య, చంద్రుల గమనాన్ని ఆధారంగా చేసుకొని అవి గమ్యస్థానానికి చేరుకుంటాయి. ఇక్కడి రక్షిత కేంద్రానికి గూడబాతులు, తెడ్డుముక్కు కొంగలు, తెల్లకంకణాయిలు, శబరి కొంగలు సుదూర ప్రాంతాల నుంచి వలస వస్తాయి.



ఇలా చేరుకుంటాయి..

- వలస పక్షులు పగలు సూర్యుడు, రాత్రిళ్లు చంద్రుడు, ధ్రువ నక్షత్ర గమనం ఆధారంగా తమ ప్రయాణాన్ని సాగిస్తాయి.
- పక్షులు సముద్ర తీర ప్రాంతాలు, నదుల మీదుగా ప్రయాణం చేస్తాయి. అక్కడక్కడ ఆగి ఆహారం తీసుకొని.. విశ్రాంతి పొంది తరువాత ప్రయాణాన్ని కొనసాగిస్తాయి.
- ఆకాశంలో ఎగిరేటప్పుడు గాలి ఒత్తిడిని, వేగాన్ని అధిగమించేందుకు 'వి' ఆకారంలో ప్రయాణం చేస్తాయి. సుదూర ప్రాంతాలకు వలస వెళ్లేటప్పుడు ఆకాశంలో వీలైనంత ఎత్తులో ఎగురుతాయి.

ఆకాశంలో ప్రయాణిస్తున్న గూడబాతులు

పక్షులకూ పైలెట్..

కొన్ని పైలెట్ పక్షులు ముందు వెళ్లి.. మిగిలిన వాటికి మార్గం చుపుతూ దిశానిర్దేశం చేస్తాయి. అవి తరచుగా శీతాకాలంలో ఉత్తర ధ్రువం నుంచి దక్షిణ ధ్రువానికి వలస వస్తాయి. ఈ రెండు ధ్రువాల మధ్య దూరం సుమారు 20 వేల కిలోమీటర్లు ఉంటుంది. వాతావరణ పరిస్థితులను బట్టి సుమారు నెల నుంచి రెండు నెలల కాలం పడుతుంది.

దారి చూపు గోవిందా..!

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడంతో తిరుపతి నగర పరిధిలో పూతలపట్టు-నాయుడుపేట 'యాక్సెస్ కంట్రోల్డ్ హైవే' పనులకు నిధులు విడుదలయ్యాయి. ఈ మేరకు పది నెలల కిందట పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు 20 శాతం కూడా కాలేదు.

సి.మల్లవరం వద్ద నాలుగు నెలలుగా వదిలేసిన వంతెన పనులు

అడ్డంకులివీ..

- సి.మల్లవరం వద్ద నాలుగు నెలల కిందట పనులు ప్రారంభించారు. ఇక్కడ వంతెన నిర్మాణంలో భాగంగా పిల్లర్లు వేసి వదిలేయడంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- ఉప్పరపల్లి క్రాస్ వద్ద పనులు నత్తనడకన సాగుతున్నాయి. అక్కడ కూడా ఇదే పరిస్థితి.
- తిరుచానూరు నుంచి కేఎల్ఎం జంక్షన్ వరకు పనులు సక్రమంగా జరగక నిత్యం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు.

- జాతీయ రహదారి: పూతలపట్టు - నాయుడుపేట
- పెండింగ్ పనులు: 17.40 కి.మీ. (సి.మల్లవరం నుంచి కేఎల్ఎం సర్కిల్ వరకు)
- గడువు: 13.12.2026

చేయాల్సిన నిర్మాణాలు:

- ఐదు కింద వంతెనలు
- మూడు భారీ ఫ్లైఓవర్లు
- ఐదు అండర్‌పాస్‌లు

- జాతీయ రహదారుల్లో అసంపూర్తి పనులు
- నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న వాహన చోదకులు

సుదూర ప్రాంతాల నుంచి తిరుమల, శ్రీకాళహస్తి, కాణిపాకం పుణ్యక్షేత్రాలకు తరలివచ్చే భక్తులకు జాతీయ రహదారుల పనుల్లో జాప్యం నిత్యం అగ్నిపరీక్ష పెడుతోంది. రోడ్డు పనులు జరుగుతున్నాయని కనీసం సూచికలు ఉంచకపోవడంతో ప్రయాణాన్ని గండాలమయం చేస్తోంది. కొన్ని ఘటనల్లో వాహన చోదకులు మృత్యువాత పడుతున్నా జాతీయ రహదారుల సంస్థ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పూతలపట్టు-నాయుడుపేట, తిరుపతి - చెన్నై జాతీయ రహదారుల అసంపూర్తి పనులను పరిశీలిస్తే ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు నిత్యం ఆందోళన చెందుతున్నారు.

– న్యూస్‌టుడే, పుత్తూరు

- జాతీయ రహదారి: తిరుపతి - చెన్నై
- పెండింగ్ పనులు: 20.03 కి.మీ. (పుత్తూరు మరాఠీగేటు నుంచి తడుకుపేట వరకు)
- ఇప్పటి వరకు జరిగింది: 20 శాతం
- గడువు: 13.12.2026

చేయాల్సిన నిర్మాణాలు:

- నాలుగు పై వంతెనలు

అడ్డంకులివీ..

- పుత్తూరు మండలం పరమేశ్వర మంగళం ఆదిఆంధ్రవాడ వద్ద భూసేకరణ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ఆ గ్రామం వద్ద పనులు ప్రారంభించలేదు. ఇక్కడ రెండు వంతెనలు నిర్మించాల్సి ఉంది. ఈ ప్రాంతంలో సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో ఇటీవల ఓ ద్విచక్ర వాహన చోదకుడు కల్వర్టు గొయ్యిలో పడి గుండె సమీపంలో ఇనుప కమ్మీ గుచ్చుకుంది.

పరమేశ్వరమంగళం వద్ద సాగుతున్న కల్వర్టు పనులు

- పుత్తూరు మండలం వేపగుంట క్రాస్ వద్ద వంతెన పనులు ఓ పక్క చేపట్టారు. మరో పక్క ప్రారంభించకపోవడంతో రోడ్డు ఇరుగ్గా మారింది.
- పుత్తూరు మండలం మిద్దిగుంట క్రాస్ రోడ్డు వద్ద తవ్వేసి వదిలేయడంతో ఐదు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.
- కొన్ని గ్రామాల వద్ద పనులు అసంపూర్తిగా ఉండటంతో రాత్రిళ్లు వాహన చోదకులు ఇబ్బందులుపడుతున్నారు.
- పుత్తూరు మరాఠీగేటు నుంచి పరమేశ్వరమంగళం వరకు పూర్తి స్థాయిలో రోడ్డు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను వదిలేయవచ్చు.

ఆరు నెలల్లో.. ◆ జరిగిన ప్రమాదాలు: 10 ◆ మృతులు: ఐదుగురు ◆ క్షతగాత్రులు: 20 మంది



కనుల పండువగా రథోత్సవం

తిరుచానూరు, న్యూస్‌టుడే: కార్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ పద్మావతి అమ్మవారి రథోత్సవం సోమవారం కనుల పండువగా సాగింది. ముత్యపు కవచ అలంకరణలో సర్వాలంకార శోభితురాలైన అమ్మవారిని రథ మండపానికి తీసుకొచ్చి బ్రహ్మరథంపై కొలువుదీర్చారు. భక్తులు తిరువీధుల్లో రథాన్ని లాగుతూ ముందుకు కదిలారు. సుమారు రెండు గంటల పాటు రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. రాత్రి అశ్వవాహన సేవలో అమ్మవారు కల్కి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పది పరీక్షల్లో సందేహాలా..

ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: వచ్చే ఏడాది జరగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థులు, తల్లిదండ్రుల అనుమానాలు, సందేహాలను అధికారులు నివృత్తి చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ద్వారా సేవలు అందించనుంది. జిల్లాకు సంబంధించిన వివరాలను డీఈవో కేవీఎన్ కుమార్ సోమవారం విడుదల చేశారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, విద్యార్థుల నామినల్ రోల్స్ జాగ్రత్తగా పరిశీలించి, పొరపాట్లు లేకుండా వివరాలు సరిచూడాలన్నారు.

వీరిని సంప్రదించాలి..

- గురుస్వామిరెడ్డి, ఏసీజీఈ- 94403 11629
- రాఘవేంద్రరావు, సూపరింటెండెంట్- 79892 50005
- శిరీష్‌కుమార్, సీనియర్ సహాయకుడు- 96528 86699
- దాము ఏపీవో- 91823 21491

వినతులు స్వీకరించి.. పరిష్కారం చూపించి

ఈనాడు– తిరుపతి: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తరచూ అధికారులను ఆదేశిస్తున్నారు. అక్కడితో ఆగకుండా ప్రతి సోమవారం వచ్చే అర్జీలను ఎంతవరకు పరిష్కరిస్తున్నారు? నిజంగానే ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారా? అన్న వివరాలను ఐవీఆర్ఎస్ ద్వారా తెలుసుకుంటున్నారు. ఇలా పకడ్బందీగా వ్యవహరిస్తుండటంతో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వస్తున్న అర్జీల్లో రెండు జిల్లాల్లో 88 శాతం దరఖాస్తులు పరిష్కారమయ్యాయి.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఎప్పటికప్పుడు సమీక్ష

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రజలు ఇచ్చే అర్జీల్లో సింహభాగం రెవెన్యూ సమస్యలే ఉంటున్నాయి. కుటుంబ, న్యాయ వివాదాలు ఉన్నవాటిని మినహాయించి మిగతా దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత తహసీల్దార్లు, మండల సర్వేయర్లకు సూచిస్తున్నారు. సోమవారం అర్జీలు స్వీకరించిన అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు.

పక్కాగా ఆడిట్ నిర్వహిస్తూ

కొన్ని సందర్భాల్లో జనాలు ఇచ్చిన అర్జీలను పరిష్కరించకుండానే అధికారులు మూసేస్తున్నారు. ఈక్రమంలోనే నేరుగా దరఖాస్తుదారుడికే ఫోన్ చేసి అధికారి, సిబ్బంది వ్యవహారశైలి ఎలా ఉంది? లంచం డిమాండ్ చేశారా? మీరు సంతృప్తిగా ఉన్నారా? అంటూ ప్రశ్నలు అడుగుతున్నారు.

అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ

దీర్ఘకాలంగా వస్తున్న అర్జీలపై శ్రద్ధ చూపుతున్నాం. ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించి గడువులోపు నివేదిక ఇవ్వాలని అడుగుతున్నాం. అప్పటికీ పరిష్కారం కాకపోతే నా వద్దకే రావాలని సూచిస్తున్నా.

– వెంకటేశ్వర్, తిరుపతి కలెక్టర్

గతేడాది జూన్ 15 నుంచి ఈ ఏడాది అక్టోబరు 21 వరకు ఇలా..

తిరుపతి జిల్లాలో

మొత్తం అర్జీలు	32,089
పరిష్కరించినవి	28,277
పెండింగ్	3,812
పరిష్కార శాతం	88.12

ఖాతా ఇస్తే.. ఖతమే..!

- కమీషన్ ఆశచూపుతున్న సైబర్ నేరగాళ్లు
- వివరాలు ఇస్తే కటకటాలే

నీ బ్యాంకు ఖాతా వివరాలు ఇస్తావా.. అందులో జమయ్యే నా డబ్బులకు కమీషన్ ఇస్తాను..

నీ పేరుతో కరెంటు ఖాతా ఓపెన్ చేసి వివరాలు ఇవ్వు.. నీకు నెలనెలా జీతంలా కొత్త మొత్తం చెల్లిస్తాను..

ఈ మాటలు నమ్మి బ్యాంకు ఖాతా వివరాలు ఇచ్చావో.. ఎప్పుడో ఒకప్పుడు కటకటాలు లెక్కించాల్సిందే. సైబర్ నేరగాళ్లు అమాయకులకు కమీషన్ ఆశ చూపి వారి ఖాతాలను వాడుకుంటూ నేరాల ఉచ్చులోకి లాగుతున్నారు. ఇటీవల తిరుపతి పోలీసుల దర్యాప్తులో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

- న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం)

మ్యూల్ ఖాతా అంటే..?

మోసగాళ్లు వేరొకరి ఖాతాల్లోకి అక్రమంగా సొమ్ములు మళ్లిస్తారు. ఖాతా ఇచ్చినందుకు కొత్త మొత్తం కమీషన్‌గా ఇస్తారు. దీన్నే మ్యూల్ ఖాతా అంటారు.

బ్యాంకు సిబ్బందిపై అనుమానం

బ్యాంకు ఖాతా తెరిచే వ్యక్తి.. సిఫార్సు చేసే వ్యక్తి బ్యాంకుకు సరైన పత్రాలతో వెళ్తే కానీ ఖాతా తెరవరు. అలాంటిది చనిపోయిన వారు.. తప్పుడు పత్రాలు సమర్పించినా.. ఖాతా తెరుస్తుండటంతో బ్యాంకు సిబ్బందిపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మన ఖాతాలతో వాళ్లు 'గేమింగ్'

సాఫ్ట్‌వేర్, కాల్‌సెంటర్లలో ఉద్యోగాల పేరుతో తెలుగు యువతను కాంబోడియాకు రప్పించుకొని రెండు రాష్ట్రాల్లోని ప్రజలను మోసం చేసేలా బెదిరిస్తున్నారు. చివరికి వారికి భారీగా సహకరిస్తూ ప్రతి లావాదేవీపై కమీషన్ పొందుతున్నారు. ఇటీవల పోలీసులకు పట్టుబడ్డ హైదరాబాద్‌కు చెందిన కోటిబాబు ఇలాగే చేశారు. మోసం చేసిన సొమ్ము మ్యూల్ ఖాతాల్లో జమ చేసి తరువాత ఆన్‌లైన్ గేమింగ్‌లో డబ్బులు వచ్చిన వారి ఖాతాలకు జమ చేస్తారు.

బతికి చెడిన వారిపైనే గురి

గతంలో కరెంట్ బ్యాంకు ఖాతాల ద్వారా భారీగా లావాదేవీలు జరిపి ప్రస్తుతం స్తబ్దుగా ఉంచిన వారిపైనే సైబర్ నేరగాళ్లు దృష్టి పెడుతున్నారు. 'మీ ఖాతాకు మా కంపెనీ నుంచి డబ్బు వస్తుంది. దాన్ని మా సిబ్బంది ఖాతాల్లో జమ చేసుకునేందుకు' సహకరిస్తే కమీషన్ ఇస్తామని నమ్మిస్తారు. ఇలా సైబర్ వలలో పడిన వారి నుంచి ఈ ఖాతాలకు జమ చేసుకుని.. అక్కడి నుంచి వివిధ ఖాతాలకు బదిలీ చేస్తున్నారు. నా కమీషన్ నాకు వచ్చేస్తోంది అని మిన్నకుండిపోతే ఇబ్బందులు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

రైతన్నా.. మీ కోసమే

రేణిగుంట, న్యూస్‌టుడే: ఖరీఫ్, రబీ సీజన్ల అవసరం మేరకు యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని, ఎకరాకు కనీసం మూడు బస్తాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం గాజులమండ్యంలో నిర్వహించిన 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

రైతులతో చర్చిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పై పెచ్చు నిర్లక్ష్యం

కలెక్టరేట్ ఆవరణలోని మరుగుదొడ్ల సమీపంలో మెట్ల మార్గంలో సోమవారం భవనం పెచ్చులు ఊడిపడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

– న్యూస్‌టుడే, తిరుపతి (కలెక్టరేట్)

నగర పాలికలో కమీషన్ల రగడ

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతి నగరపాలక సంస్థలో గుత్తేదారుల కమీషన్ వ్యవహారం రచ్చకెక్కింది. కూటమి నేతల్లోని అంతర్గత విభేదాలతో సమస్య ఏర్పడింది. సంస్థలో చేపట్టే అభివృద్ధి పనుల టెండర్లు, నామినేషన్ కోసం తెదేపా, జనసేన నేతలు పోటీ పడుతున్న క్రమంలో ఈ వ్యవహారం చర్చనీయాంశమైంది.

కమీషన్ చెల్లించేలా ఒప్పందం..

నగర పరిధిలో అభివృద్ధి పనులకు టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు 10 శాతం కమీషన్‌ను నేతలు, అధికారులకు చెల్లించాలని గత ప్రభుత్వ హయాంలో ఒప్పందం జరిగింది. ఎలాంటి పనులు జరిగినా టెండరు దక్కించుకునేందుకు 60 మందికి పైగా గుత్తేదారులు అంతర్గతంగా మాట్లాడుకున్నారు. జనసేన, తెదేపాతో పాటు కొన్నింటిని భాజపా పేరుతో పనులు సొంతం చేసుకుంటున్నారు.



తిమ్మినాయుడు పాలెంలో అసంపూర్తిగా కాలువ నిర్మాణం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. దీంతో కమీషన్ల కోసం మూడు పార్టీల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయి. గత ప్రభుత్వంలో టెండర్ల వ్యవహారానికి సంబంధించి ఒకే నాయకుడి పర్యవేక్షణలో గుట్టుగా సాగిన వ్యవహారం ఇప్పుడు బయటపడింది. దీంతో అప్పట్లో పనులు చేయకుండా బిల్లులు పొందిన గుత్తేదారులు సైతం రంగంలోకి దిగుతున్నారు.

ఇవీ వివరాలు..

- సంవత్సరం: 2024- 25
  - సాధారణ నిధులు: రూ.30 కోట్లు
  - చేపట్టిన పనులు: 260
- సంవత్సరం: 2025- 26
  - సాధారణ నిధులు: రూ.35 కోట్లు
  - చేపట్టిన పనులు: 262
  - 15వ ఆర్థిక సంఘం, ఇతర నిధులు: రూ.64 కోట్లు
  - ప్రారంభించిన పనులు: 88

పాత బకాయిలకే ప్రాధాన్యం..

2019-24 మధ్య వైకాపా ప్రభుత్వం అక్రమంగా గుత్తేదారులకు పనులు అప్పగించింది. నగరపాలక సంస్థ ఆదాయం రూ.110 కోట్లు కాగా వార్షిక వ్యయం రూ.60 కోట్ల పైమాటే. బడ్జెట్‌తో సంబంధం లేకుండా వందల పనులను గుత్తేదారులకు అప్పగించేశారు.

- అప్పట్లో 10 శాతం కమీషన్ వసూలు చేసి వర్క్ ఆర్డర్‌లు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. ఈ ప్రభుత్వం వచ్చాక లోటు బడ్జెట్‌ను పరిగణనలోకి తీసుకొని వందలాది అభివృద్ధి పనులను రద్దు చేసింది. కానీ రూ.70 కోట్ల నుంచి రూ.80 కోట్ల బకాయిలు గుత్తేదారులకు చెల్లించాల్సి ఉంది.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటల్లో, రూ.300 ఎస్ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. సోమవారం శ్రీవారిని 78,974 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.3.61 కోట్లు హుండీ కానుకలు లభించాయి. తిరుమలలో చిరుజల్లులు కురుస్తున్నాయి.

పాస్‌పోర్టు కావాలా..
ఆన్‌లైన్లో దరఖాస్తు చేయండి

ఉన్నత విద్య, ఉపాధి, పర్యాటక ప్రాంతాల సందర్శనకు చాలామంది విదేశాలకు వెళ్తుంటారు. ఇందుకు పాస్‌పోర్టు తప్పనిసరి. దీన్ని ఎలా పొందాలో ఇప్పటికీ చాలా మందికి తెలియదు. ఆన్‌లైన్లో వివరాలను నమోదు చేసుకొని పాస్‌పోర్టు సులువుగా పొందవచ్చు.

- https://www.passportindia.gov.in వెబ్‌సైట్‌లో మెయిల్ ఐడీ లేదా ఫోన్ నంబరుతో రిజిస్టర్ చేసుకుని, పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి. లాగిన్లై దరఖాస్తు నింపాలి.

వ్యక్తిగత వివరాల నమోదు

- ఇంటి పేరు, వ్యక్తి పేరు పూరించాలి. కుటుంబ సభ్యులు, చిరునామా, అత్యవసర పరిస్థితిలో సంప్రదించాల్సిన వారి వివరాలు, చరవాణి నంబర్లు నమోదు చేయాలి.
- రెన్యువల్ అయితే పాత పాస్‌పోర్టు నంబరు, ఇతర వివరాలు నమోదు చేయాలి.
- దరఖాస్తును సబ్‌మిట్ చేశాక.. మార్పులు, చేర్పులకు అవకాశం ఉండదు.
- సబ్‌మిట్ చేయగానే రిఫరెన్స్ నంబరు (ఏఆర్ఎన్) వస్తుంది. పెద్దలకు రూ.1500, పిల్లలకు రూ.1000 చొప్పున రుసుము చెల్లించాలి.
- ఏ రోజు, ఎన్ని గంటలకు, ఎక్కడికి రావాలో సూచిస్తారు.

గుర్తింపు పత్రాలు..

చిరునామా గుర్తింపు పత్రం, పుట్టినరోజు ధ్రువీకరణ పత్రం ఒరిజనల్ ఉండాలి. ప్రభుత్వం సూచించిన 12 రకాల పత్రాల్లో ఏ ఒక్కటి తీసుకెళ్లినా చిరునామా గుర్తింపుగా పరిగణిస్తారు.

ధ్రువీకరణాలు, నకళ్లతో..

దరఖాస్తు ఫీజు చెల్లించిన పత్రం ప్రింట్ తీసుకోవాలి. చిరునామా, పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం అసలు, జిరాక్సు ప్రతులతో కేటాయించిన సమయానికి అర గంట ముందే పాస్‌పోర్టు సేవా కేంద్రానికి చేరుకోవాలి. ● అసలు పత్రాలు చూసి ఒక సీరియల్ నంబరు ఇస్తారు. ఫొటో, వేలిముద్రలు సేకరిస్తారు. దరఖాస్తు పరిశీలించి ఒక పత్రం ఇస్తారు. చరవాణికి ఒక నంబరు వస్తుంది. దాంతో స్టేటస్ తెలుసుకోవచ్చు.

పోలీస్ విచారణ..

చివరగా పోలీసు విచారణ ఉంటుంది. ఏమైనా కేసులు ఉన్నాయో విచారిస్తారు. అన్నీ సక్రమంగా ఉంటే పోలీసులు నివేదికను పై అధికారులకు పంపిస్తారు. ఆ తర్వాత ఎలక్ట్రానిక్ చిప్‌తో కూడిన పాస్‌పోర్టు వస్తుంది.

న్యూస్‌టుడే, తిరుపతి (విద్య)

ప్రభుత్వ ఐటీఐలో కొత్త కోర్సు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేవీవై-4.0) ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ అసెంబ్లీ ఆపరేటర్ కోర్సుకు సంబంధించి మూడు నెలల శిక్షణ డిసెంబరు పదో తేదీ నుంచి ప్రారంభించనున్నామని ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి సోమవారం తెలిపారు. ● 18 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు కలిగినవారు పదో తరగతి, ఆపై విద్యార్హత ఉన్నవారు అర్హులు. ● కోర్సు పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్ అందిస్తారు.

సంప్రదించాల్సిన నంబరు: 85003 84812, 91609 40479

రైతేరాజు 6లో

WANTED

To work on Outsourcing basis at Tirupathi (Hindu Religion only)

- STAFF NURSE: 07 No's — B.Sc (Nursing) / M.Sc. (Nursing) + 3-5 years experience
- PHARMACIST: 01 No's — Must have passed Diploma Pharmacy of recognized institution.
- ANAESTHESIA TECHNICIANS: 04 No's — Must have passed B.Sc in Anesthesia. Technician.
- MNO / FNO: 10 No's — Certificate Course + 3-5 years exp.
- STRETCHER BEARER: 11 No's — Must have practical exp. in the field for which he is appointed with good physique.

Interested people can apply with in 3 days 25th, 26th, 27th November 2025.

HARMONY CONSULTANCY TIRUPATI

Mail your Resumes and Certificates to harmonyconsultancytirupati@gmail.com

104FM Tirupati

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008555167, 9154991499

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

(c) eenadu

పాల ఉత్పత్తులు పెంచుకోండిలా..

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పశుపోషకులు పాల ఉత్పత్తులను పెంచుకోవడంతో పాటు తద్వారా ఆర్థిక ప్రయోజనాన్ని పొందడంపై అవగాహన కలిగి ఉండాలని శ్రీకాళహస్తి ఏడీఏ భాస్కర్ తెలిపారు.

■ పాలల్లో వెన్న, ఘన పదార్థాల శాతం (ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్) పెరగాలంటే పాడి పశువులకు రోజూ పాలకంకుల దశలో కోసిన 20 నుంచి 30 కిలోల పచ్చి మేతతో పాటు కచ్చితంగా 8 కిలోల ఎండు మేతను చిన్న ముక్కలుగా(ఒక ఇంచి సైజులో) ఇవ్వాలి. ■ రోజూ పాలు పితికే సమయం, వ్యక్తి, విధానం ఒకే విధంగా ఉండేలా చూసుకోవాలి. ■ పశువుకు పాలు పితికే ఒక గంట ముందు నీటిని ఇవ్వరాదు. ■ బీరుపొట్టు, పాలబడి పిండి, మొక్కజొన్న పిండి, మిగిలి పోయిన అన్నం ఎక్కువగా ఇవ్వడం వల్ల ఆమ్ల అజీర్తి చేసి పశువులు అనారోగ్యానికి గురికావడంతో పాటు పాల ఉత్పత్తి, ఫ్యాట్ ఎస్ఎన్ఎఫ్ తగ్గిపోతుంది. తద్వారా ధర తగ్గే అవకాశముంది. ■ పాలు పితికేటప్పుడు మొదటిసారి మాత్రమే దూడకు వదలాలి, చివరి పాలల్లో ఫ్యాట్ ఎస్ఎన్ఎఫ్ ఎక్కువగా ఉండటం కారణంగా పూర్తిగా పిండుకోవాలి. ■ వాతావరణానికి అనుగుణంగా పాడి పశువులను కాపాడుకోవాలి. ఎండలు ఎక్కువగా ఉంటే పాల ఉత్పత్తి తగ్గిపోతుంది కాబట్టి పశువులను నీటితో తడిపి చల్లబరచాలి. చలి ఎక్కువగా ఉంటే వెచ్చని ప్రదేశంలో కట్టివేయాలి. ■ మేతకుని పశువులను ఎక్కువ దూరం నడిపించరాదు. వాటి శరీరంపై పిడుదులు, గోమార్లు వంటి బాహ్య పరాన్న జీవులు లేకుండా చూసుకోవాలి. జలగలు, నత్తల వంటి అంతర పరాన్న జీవుల నివారణకు తరచూ మందులు వేయాలి. ■ మేతతో పాటు రోజూ ప్రతి మూడు లీటర్ల పాలకు ఒక కేజీ దాణా, పూటకు 50 గ్రాముల మినరల్ మిక్చర్ (ఖనిజ లవణ మిశ్రమం) ఇవ్వడం వల్ల ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ పెరుగుతుంది. ■ పాలు పితికే సమయంలో పొదుగును సున్నితంగా రుద్దడం ద్వారా పాల దిగుబడితో పాటు ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ పెంచుకునేందుకు వీలుంటుంది. ■ పాలను పూర్తిగా పితకాలి. ■ ఎస్ఎన్ఎఫ్ తక్కువగా వచ్చే పశువులకు రోజూ వంట సోడా 120 గ్రాముల నుంచి 240 గ్రాముల మూడు రోజుల పాటు తినిపించడం వల్ల పెంచుకునే వీలుంటుంది. ■ పొదుగువాపు వ్యాధి రాకుండా పాలు పితికిన వెంటనే శుభ్రంగా నీటితో కడిగి శుభ్రమైన వస్త్రంతో తుడవాలి. ■ పాలు పితికిన వెంటనే 15 నిమిషాల పాటు పడుకోకుండా పచ్చిదాణా తినిపించాలి. దీంతో పొదుగు వాపు రాకుండా నివారించవచ్చు.

సిరులు పంచే పుచ్చ

డ్రిప్ ఇరిగేషన్‌తో అధిక దిగుబడులు

రైతేరాజు

కోట, న్యూస్‌టుడే: గూడూరు నియోజకవర్గ పరిధిలోని కోట, చిల్లకూరు, చిట్టమూరు, వాకాడు మండలాల్లోని పలు గ్రామాల్లో 400 ఎకరాల్లో పుచ్చసాగు చేస్తూ రైతులు మంచి లాభాలు పొందుతున్నారు. ప్రధానంగా డ్రిప్ ఇరిగేషన్, ప్లాస్టిక్ మల్చింగ్ ద్వారా అధిక దిగుబడులు పొందే అవకాశముందని కోట మండలం గూడలికి చెందిన దేవేంద్రరెడ్డి నిరూపిస్తున్నారు. నాలుగు ఎకరాల్లో నవంబరు నుంచి పుచ్చ సాగుకు భూమిని సిద్ధం చేస్తాడు. ఎకరాకు రూ.50వేలు నుంచి రూ.60వేలు వరకు ఆదాయాన్ని పొందుతున్నాడు.

సాగు చేసే విధానం

● పుచ్చసాగుకు ఇసుక నేలలు, నల్లరేగడి నేలలను ఎంపిక చేసుకోవాలి. ● సాగు చేసే భూమిలో ముందుగా పచ్చిరొట్ట పంట నాటాలి. ● భూమిని చదును చేసుకోవాలి. ● ఎంపిక చేసిన విత్తనాలను పాదుల్లో 45 సెంటీ మీటర్ల దూరంలో వేసుకోవాలి. ● నీటికి డ్రిప్ ఏర్పాటు చేసుకోవాలి. తద్వారా నీటి వసతులతో పాటు మందులను సమపాళ్లలో పిచికారీ చేసే అవకాశముంది. సేంద్రియ ఎరువులను వినియోగించాలి. ● ఎండ, వేడికి, వర్షాలకు తట్టుకొనే విధంగా ప్లాస్టిక్ మల్చింగ్ వినియోగించాలి.

● 90 రోజుల వ్యవధిలో పంట దిగుబడికి వస్తుంది.

మార్కెటింగ్: నెల్లూరు, తిరుపతి, చెన్నైతో పాటు పలు రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తారు. స్థానిక మార్కెట్‌లలో వేసవిలో మంచి గిరాకీ ఉంది. కేజీ రూ.20లు నుంచి రూ.50 వరకు ఉంటుంది.

మంచి లాభాలు.. గూడలిలో మూడేళ్లుగా పుచ్చసాగు చేస్తున్నా. లాభాలు పొందుతున్నా. యాజమాన్య పద్ధతులు తోపాటు సేంద్రియ ఎరువులు వాడడం, డ్రిప్ ఇరిగేషన్, ప్లాస్టిక్ మల్చింగ్ చేస్తే లాభాలు పొందుతారు. పుచ్చసాగులో విజయం సాధిస్తారు.

- దేవేంద్రరెడ్డి, గూడలి, రైతు

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: **ప్రశ్న:** నారుమడి నుంచి నారు ప్రధాన పొలంలో నాటేటప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి? **- ధనంజయ, రైతు, గాజులమండ్యం**

జవాబు: 21 నుంచి 25 రోజుల నారు నాటడం లేదా మూడు లేదా నాలుగు ఆకులు వచ్చిన తర్వాత నారు నాటడంతో అధిక పిలకలు వచ్చి మంచి దిగుబడి ఇస్తుంది. నారును పైపాటుగా నాటుకోవాలి. లోపలికి నాటితే వేర్లకు గాలి ఆడక కుళ్లిపోయి పంట త్వరగా కుదురుకోదు, పిలకల సంఖ్య తగ్గి, దిగుబడి తగ్గుతుంది. పంట ఎండి పోయినట్టు కనపడటంతో రైతులు రోగం వచ్చిందని గులికలు, మందులను వాడుతున్నారు. ఈ కారణంగా ఖర్చు పెరగడం తప్ప ఏమీ లాభం లేదు. **- సునీల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, రేణిగుంట**

జింకుతో మంచి ఫలితాలు

తిరుపతి(వ్యవసాయం), న్యూస్‌టుడే: వరికి జింకు అతి తక్కువ పరిమాణంలో అవసరమయ్యే సూక్ష్మ పోషక పదార్థం. మొక్కల ఎదుగుదలకు అవసరమైన అనేక జీవ రసాయన చర్యలలో జింకు కీలకమైన పాత్ర పోషిస్తుంది. వరిని సాగు చేసే చాలా ప్రాంతాల్లో భూములు కొంత వరకు చౌడు లక్షణాలు కలిగి ఉంటాయి. భాస్వరం కలిగిన కాంప్లెక్స్ ఎరువులు వాడటం వలన భూముల్లో భాస్వరం నిలువలు అధికంగా ఉంటున్నాయి. చౌడు గుణం, అధిక భాస్వరం ఉన్న నేలల్లో జింకు మొక్కలకు అందని రూపంలో ఉంటుంది. ఆ నేలల్లో జింక్ ఉన్నప్పటికీ, మొక్కలు దాన్ని గ్రహించలేవు. ఇలాంటి భూముల్లో రైతులు పంటపై జింక్ పిచికారీ చేయడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చు. పైరు పిలకలు పెట్టే దశలో ఉన్నప్పుడు లీటరు నీటికి 2 గ్రా. జింక్ సల్ఫేట్, 5 గ్రాముల యూరియాను కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. * చీలేటెడ్ రూపంలో జింకు నేడు అనేక కంపెనీలు అందిస్తున్నాయి. చీలేటెడ్ జింకును పైరుపైన లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

- మెరుగు భాస్కరయ్య, ఏడీఏ(విశ్రాంత), సాగు సలహాదారు

పద్మసరోవరంలో పంచమీ తీర్థం వేదిక

సోమవారం రాత్రే గ్యాలరీల్లోకి వచ్చిన భక్తులు

పద్మావతి పంచమీ తీర్థానికి సర్వం సిద్ధం

లక్ష మందికి పైగా భక్తులు వస్తారని అంచనా

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు జరిగే పంచమీ తీర్థానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇక్కడ పుణ్యస్నానాలకు లక్ష మందికి పైగా తరలిరానున్న నేపథ్యంలో తితిదే, పోలీసు యంత్రాంగం భద్రత చర్యలు చేపట్టింది. మధ్యాహ్నం 12.10 నుంచి 12.20 మధ్య అమ్మవారికి చక్రస్నానం చేయనున్నారు. దీనిలో భాగంగా పద్మ సరోవరంలో స్నపన తిరుమంజనం జరిగే మండపాన్ని పుష్పాలతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు.

పుణ్యస్నానాలు చేసేందుకు భక్తులు సోమవారం రాత్రే తిరుచానూరు చేరుకున్నారు. వీరు వేచి ఉండేందుకు తిరుచానూరు ముఖద్వారం వద్ద షెడ్డు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించారు. తితిదే 150 అన్న ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేసింది. తాగునీరు, మరుగుదొడ్లను అందుబాటులో ఉంచారు. రాత్రి వచ్చిన వారు ముఖద్వారం వద్ద నున్న షెడ్డు సమీప గేట్ నంబరు-3 ద్వారా పద్మ సరోవరంలోకి వెళ్లాలి. ఇక్కడ 20 వేల మంది మాత్రమే పట్టే అవకాశం ఉండటంతో ఉదయం 10.30 తర్వాత భక్తులను దశల వారీగా స్నానాలకు అనుమతించనున్నారు. బందోబస్తుకు సుమారు 2 వేల మంది పోలీసులు తరలివచ్చారు.

భక్తులకు మర్యాదపూర్వక సేవలు

తిరుచానూరు, న్యూస్‌టుడే: పంచమీ తీర్థానికి వేల సంఖ్యలో భక్తులు రానున్నారని, పోలీసులు మర్యాదపూర్వక సేవలు అందించాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. పుణ్యస్నానాలు చేసేందుకు వచ్చే భక్తులను క్యూలైన్ల ద్వారా మాత్రమే అనుమతించాలన్నారు. భద్రత ఏర్పాట్లను సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి పరిశీలించారు.

నేడు పద్మావతికి శ్రీవారి సారె

తిరుమల: తిరుచానూరు బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని తిరుమల శ్రీవారి ఆలయం నుంచి పసుపు, కుంకుమ, ప్రసాదాలు, తులసి, వస్త్రాలు, ఆభరణాలతో కూడిన సారెను గజాలపై పంపనున్నారు. పద్మ పుష్కరిణి వద్ద సారె సమర్పిస్తారు.

ఇదెక్కడి కిరికిరి..!

■ చేరని చెల్లింపులు ■ ఏళ్లుగా.. రైతుల కన్నీళ్లు

ప్రాంతం: వికృతమాల
మండలం: ఏర్పేడు
భూసేకరణ: 35 ఎకరాలు
నిర్వాసితులు: 58 మంది
పరిహారం విలువ: రూ.1.60 కోట్లు

అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధికి వికృతమాల రైతుల నుంచి సేకరించిన భూములు

శ్రీకాళహస్తి, ఏర్పేడు, న్యూస్‌టుడే: రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి కలగా మారుతోంది. ఆధ్యాత్మికంగా, వ్యాపార పరంగా ఇక్కడి విమానాశ్రయాన్ని అంతర్జాతీయ స్థాయి వసతులతో అభివృద్ధి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలోని సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు గుప్పుమంటున్నాయి.

వివాదం లోగుట్టు

విమానాశ్రయం విస్తరించేందుకు వీలుగా ఏర్పేడు మండలం వికృతమాల గ్రామ పరిధిలో భూసేకరణకు 2015లో అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దశల వారీగా విమానాశ్రయం అధికారుల ద్వారా నిర్వాసితులకు పరిహారం పంపిణీ జరుగుతూ వచ్చింది. ఇంకా 35 ఎకరాలకు సంబంధించి 58 మంది రైతులకు పరిహారం అందలేదు. ప్రారంభంలో ఎకరాకు రూ.ఐదు లక్షల వంతున నిర్వాసిత రైతులకు చెల్లించగా, ఇంకా రూ.1.60 కోట్లు బకాయిలు నిలిచిపోయాయి.

వైకాపా నిర్వాకం

వైకాపా అధికారంలోకి వచ్చాక ఇక్కడున్న నిర్వాసితులకు ఎకరాకు రూ.8 లక్షల వంతున పరిహారం ఇప్పిస్తామంటూ హామీలిచ్చింది. అప్పటి నుంచి నిర్వాసితులు దీనిపై ఆశలు పెంచుకున్నారు. పలు దఫాలు పరిహారానికి ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. నేతల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆఖరున నేతలందరూ చేతులెత్తేశారు.

చెల్లింపులు ఏమైనట్టు

ఇక నేతలతో పనికాదని విమానాశ్రయ అధికారులను నిలదీయడంతో నిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎందుకంటే తాము చెల్లింపు చేయాల్సిన దాదాపు రూ.1.60 కోట్లు పరిహారం పూర్తిగా చెల్లించామని అధికారులు చెప్తున్నారు. పరిహారానికి ఏళ్లుగా నిరీక్షిస్తున్నామని, తమ ఖాతాలకు నగదు జమ కాలేదని నిర్వాసితులు అంటున్నారు. చెల్లింపులు ఏమయ్యాయన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ఈ నేపథ్యంలో విమానాశ్రయ అధికారులు ఇక్కడ ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించడం, నిర్వాసిత రైతులు ఈ పనులను అడ్డుకోవడంతో మళ్లీ వివాదం మొదటికి వచ్చింది. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు నిర్వాసితులకు చెల్లించాల్సిన చెల్లింపులపై దృష్టి సారించి అంతర్జాతీయ విమానాశ్రయ అభివృద్ధి పనులకు అడ్డంకులు తొలగించేలా దృష్టి సారించాల్సి ఉంది.

కోతలకు ముందే మొలకలు

మొంథా తుపాను ప్రభావం నుంచి రైతులు ఇప్పటికీ బయట పడలేకపోతున్నారు. ఆ సమయంలో వరి పంట చివరి దశలో నేలకొరిగింది. తర్వాత నుంచి వర్షాలు పడుతూనే ఉండటంతో రైతులు కోతలు చేపట్టలేదు. దీంతో కంకుల నుంచి ధాన్యం మొలకెత్తాయి. చంద్రగిరి మండలంలోని దోర్నకంబాల, కల్‌రోడ్‌పల్లి, బుచ్చినాయుడుపల్లి, రామిరెడ్డిపల్లి పంచాయతీల్లో ఈ సమస్య ఉంది. మళ్లీ తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. **- న్యూస్‌టుడే, చంద్రగిరి**

నేడు ఎస్వీయూకు సెలవు

తిరుపతి (ఎస్వీయూ): తిరుచానూరు పంచమి తీర్థం పర్వదినం సందర్భంగా మంగళవారం శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయానికి సెలవు ప్రకటిస్తున్నట్లు రిజిస్ట్రార్ భూపతినాయుడు ప్రకటన విడుదల చేశారు.

26న దివ్యాంగులకు ఆటల పోటీలు

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడాభివృద్ధి అధికారి శశిధర్ తెలిపారు. తిరుపతి ఎస్వీయూ స్టేడియం, శ్రీ శ్రీనివాస క్రీడా సముదాయంలో బాలబాలికలు, మహిళలు, పురుషులకు బ్యాడ్మింటన్, వాలీబాల్, అథ్లెటిక్స్, చదరంగం పోటీలు నిర్వహించనున్నారు. వివరాలకు 99668 82029, 90596 06346 నంబర్లను సంప్రదించాలన్నారు.

రూ.20 లక్షల వినికిడి యంత్రాల వితరణ

ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు యంత్రాలు అందజేస్తున్న దాత విరాట్

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుపతికి చెందిన ఎన్.విరాట్ రూ.20 లక్షల విలువైన 105 వినికిడి యంత్రాలను సోమవారం తిరుమల తిరుపతి దేవస్థానానికి అందజేశారు. యంత్రాలను తితిదే పరిపాలన భవనంలో ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు సోమవారం ఇచ్చారు. శ్రవణం ప్రాజెక్టులో శిక్షణ పూర్తి చేసుకుని బయటకు వెళ్లే పిల్లలకు వీటిని ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా దాతను ఈవో అభినందించారు.

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India

ఖమ్మం-2 గాంధీచౌక్ బ్రాంచ్ (03111) గాంధీచౌక్, ఖమ్మం-507003.
ఫోన్ నెం. (08742) 231889 (DIR)/258638 (ADV)/ 253007 (GEN)/258597 (PBC)
E-Mail : ubin0803111@unionbankofindia.bank

ఋణగ్రహీతకు అమ్మకం గురించి తెలియజేయు ప్రకటన (30 రోజుల నోటీసు)
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(2)/రూల్ 8 (6) ప్రకారం

కు,

తనఖా ఉంచిన ఆస్తి యొక్క వివరములు

తేదీ : 18-11-2025
స్థలం : ఖమ్మం
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బాలుర జట్టుకు ట్రోఫీ అందిస్తున్న కూటమి నాయకులు, నిర్వాహకులు

హాకీ పోటీల విజేత వైఎస్సార్ కడప

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరిలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14 విభాగం హాకీ పోటీల్లో వైఎస్ఆర్ కడప బాలబాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. వీరికి ఏఎంసీ అధ్యక్షుడు గౌస్‌బాషా, తెదేపా మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి ట్రోఫీలు అందజేశారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం: కలెక్టర్

తిరుపతి (కలెక్టరేట్): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 288 వినతులు వచ్చాయి. కలెక్టర్ డా.వెంకటేశ్వర్, శిక్షణ కలెక్టర్ సందీప్ రఘువాన్షీ, డీఆర్వో నరసింహులు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్‌మాండ్ అర్జీలు స్వీకరించారు. వాటికి సకాలంలో పరిష్కారాలు చూపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

తెలుగు అకాడమీ అభివృద్ధికి కృషి

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.డి.విల్సన్ సోమవారం తిరుపతి నగరంలోని పలు విశ్వ విద్యాలయాల ఉప కులపతులు, రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలుగు అకాడమీ అభివృద్ధికి, ముద్రణ పనులను అకాడమీ ద్వారా చేసేలా సహకరించాలని కోరారు. అనంతరం ఆయనను తిరుపతి పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు సత్కరించారు.

తెలుగు, సంస్కృత అకాడమీ రాష్ట్ర ఛైర్మన్ విల్సన్ శరత్‌చంద్రను సత్కరిస్తున్న ప్రతినిధులు

ప్రవేశ గోపురాల్లో సూచికలు

ఈనాడు కథనానికి స్పందన

రెండో ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరుని భక్తులు స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకునేందుకు నాలుగు ప్రవేశ గోపురాల గుండా వస్తుంటారు. వీటికి సంబంధించి సూచికలు లేకపోవడంతో సర్వత్రా గందరగోళానికి గురవుతున్నారని ఈ నెల 17వ తేదీన 'ఆలస్యంపై ఆగ్రహం' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆలయ ఈవో బాపిరెడ్డి నాలుగు ప్రవేశ గోపురాల పేర్లు, నంబర్లతో పాటు ప్రధాన భాషల్లో సూచికలు ఏర్పాటు చేశారు.

విద్యుత్తు శాఖ సమస్యలపై 65 వినతులు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం జరిగిన డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి 65 వినతులు వచ్చినట్లు సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు. అధికారులతో కలిసి ఆయన ఫోన్ ద్వారా సమస్యలు తెలుసుకున్నారు. కర్నూలు జిల్లా నుంచి 17, తిరుపతి నుంచి 12 సమస్యలు వచ్చాయన్నారు. వాటిని పరిష్కరించాలని ఆయా జిల్లాల అధికారులను ఆదేశించారు.

'హత్యకు వినుత దంపతులే కారణం'

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: రాయుడు హత్యకు జనసేన నియోజకవర్గ మాజీ సమన్వయకర్త వినుత కోటా దంపతులే కారణమని బాధితుడి సోదరి కీర్తి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై ఆమె మాట్లాడిన వీడియోలు సోమవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. రాయుడు హత్యకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ అంశాన్ని తప్పుదోవ పట్టించేందుకు వినుత దంపతులు ప్రయత్నిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వాళ్ల స్వార్థ ప్రయోజనాలకు రాయుడు మాట్లాడినట్లు సెల్ఫీ వీడియోను ప్రచారం చేశారన్నారు. తమ అన్న ఫోన్‌ను తమకు ఇవ్వాలని, దీనిపై పూర్తిస్థాయిలో విచారించి న్యాయం చేయాలని కోరడం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఇద్దరిపై పీడీ యాక్టు

ఈనాడు- తిరుపతి: గంజాయి, హత్య కేసుల్లో నిందితులైన ఇద్దరిపై పీడీ యాక్టు ప్రయోగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. పులిచెర్ల మండలం కమ్మపల్లికి చెందిన వట్టికుంట అరుణ్‌కుమార్ (32)పై నాలుగు కేసులు ఉన్నాయి. తిరుపతి నగరం కొర్లగుంటకు చెందిన సయ్యద్ అజీమ్ (30) గంజాయి, హత్య, దొమ్మీ కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే వీరిద్దరిపై పీడీ యాక్టు నమోదు చేశారు. ఈ నెల 21న తిరుపతి జిల్లాకు చెందిన నలుగురిపై పీడీ యాక్టు ప్రయోగించిన సంగతి తెలిసిందే.

ప్రతి గింజా కొంటాం

రేణిగుంట, న్యూస్‌టుడే: రైతులు కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు ధాన్యం విక్రయించాల్సిన పరిస్థితి రాకుండా ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. జిల్లాలో 20 వేల టన్నుల యూరియా అందుబాటులో ఉండగా ఇప్పటి వరకు 12,500 టన్నులు రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. 'రైతన్నా.. మీ కోసం' కార్యక్రమంలో భాగంగా ఆయన రేణిగుంట మండలం గాజులమండ్యంలో రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, లబ్ధి తదితర అంశాలను వివరించారు. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు, తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు మునిచంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్య రెడ్డి, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

బెంగళూరులో యువతిని హత్య చేసిన పెద్దకొండామర్రి యువకుడు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బిక్కంగారిపల్లెకు చెందిన దేవిశ్రీ(21) అనే యువతిని చౌడేపల్లె మండలం పెద్దకొండామర్రికి చెందిన యువకుడు ప్రేమవర్ధన్ అలియాస్ గోవర్ధన్ బెంగళూరులో హత్య చేసి పరారైనట్లు సోమవారం సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. బెంగళూరులో బీబీఏ చదువుకుంటూ అక్కడే ఉంటున్న యువతిని గోవర్ధన్ హత్య చేసినట్లు కర్ణాటక పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కాగా గోవర్ధన్ ఎంబీఏ పూర్తి చేసి కొన్నేళ్లుగా తిరుపతిలో ఉంటున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

కాకర్లవారిపల్లి పరిసరాల్లో చిరుత సంచారం

పాకాల, న్యూస్‌టుడే: మండలంలోని దామల చెరువు పంచాయతీ కాకర్లవారిపల్లి, మొరవపల్లి, ఐరాల మండలంలోని నాగులవారిపల్లి, గుట్టపాళ్యం, గూబలవారిపల్లి పరిసరాల్లో చిరుత సంచారం కలకలం రేపింది. గూబలవారిపల్లికి చెందిన యువకుడు తమ ఆవు తప్పిపోవడంతో ఆదివారం రాత్రి కాకర్లవారిపల్లి పొలాల వైపు వెళ్లాడు. చిరుత మీదకు రావడంతో పరుగులు పెట్టాడు. రెండు రోజుల క్రితం నాగులవారిపల్లి సమీపంలోని నెట్టుకనుమ వద్ద సైతం ఓ ద్విచక్రవాహనదారుడు చిరుతను చూసినట్లు చెప్పాడు. చుక్కావారిపల్లి పరిసరాల్లో లేగదూడలపై చిరుత దాడి చేసిందని గ్రామస్థులు చెప్పారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని, 83092 55631కు సమాచారం ఇవ్వాలని అటవీ అధికారులు సూచించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఏర్పేడు, న్యూస్‌టుడే: రైలు నుంచి జారిపడి ప్రయాణికుడు మృతి చెందాడు. ఈ ఘటన రేణిగుంట-ఏర్పేడు మధ్యలో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. అసోంకు చెందిన హరిశర్మ (42) రైల్లో తలుపు అంచున ప్రయాణిస్తూ అదుపుతప్పి జారి పడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి శవపంచనామా అనంతరం బంధువులకు అప్పగించారు.

పాకాల సమీపంలో యువకుడు..

పాకాల, న్యూస్‌టుడే: పాకాల సమీపంలోని ముద్దలపల్లి వద్ద రైలు పట్టాల పక్కన గుర్తు తెలియని యువకుడు (30) మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. నీలం రంగు గళ్లచొక్కా, జీన్ ప్యాంటు ధరించి ఉన్నట్లు చెప్పారు. రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చిత్తూరు ఆర్పీఎఫ్ ఎస్సై జి.ధర్మేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు ఘటనాస్థలాన్ని సందర్శించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వివాహిత బలవన్మరణం

పాకాల, న్యూస్‌టుడే: వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పేరసానిపల్లి పంచాయతీ గుండ్లగుట్టపల్లికి చెందిన పి.నందిని (25) కుటుంబంలో జరుగుతున్న గొడవల కారణంగా మనస్తాపానికి గురైంది. రెండు రోజుల క్రితం గన్నేరు పప్పు తిని అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు గుర్తించి తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

తిరుమల ఘాట్‌రోడ్డులో కారు బోల్తా

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో 2వ కిలోమీటర్ వద్ద బ్రేకులు ఫెయిలవడంతో చెన్నైకు చెందిన భక్తులు వెళ్తున్న కారు అదుపు తప్పి బోల్తా పడింది. ముగ్గురు భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఘాట్‌రోడ్డు భద్రతా సిబ్బంది కారును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

EENADU Classifieds
JOBS
WANTED CHEMIST (Male) B.Sc, Chemistry/ B.Pharmacy M/s. Coastal Laboratories, Akkampeta, TADA. 70133 32427, info@coastal-labs.com
Wanted Service Technicians Fresher or Exp. Electrical and Electronics ITI, Diploma or any Technical Exp. ✆ 93901 52768
ఎలక్ట్రీషియన్లు కావలెను. AP SPDCL ... 20K To 30K. Contact: 73307 05344, 089131 41574.
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/-
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600 Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును
గమనిక

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: విద్యార్థులకు నిత్యం వినూత్న విధానాల్లో బోధన సాగించాలని, డిజిటల్ విద్య చేరువ చేయాలని సమగ్ర శిక్షా ప్రాజెక్టు జిల్లా అదనపు కోఆర్డినేటర్ గౌరీశంకర్ సూచించారు. పద్మావతి ఉన్నత పాఠశాలలో జిల్లాలోని

In the Court of the III Additional Civil Judge (Junior Division) : Tirupati
O.S.No. 287 of 2025
A. Jhansi Lakshmi ...Plaintiff
Vs.
N. Nagaraju ...Defendant
SUIT SUMMONS TO THE DEFENDANT
To N. Nagaraju, S/o Govindhaiah, Bussiness, D.No. 10-11-389/A, Doddapuram Street, Jagannadhapuram, post office, TIRUAPTI.
Please take notice in the above suit it is posted to 06-01-2026 for your appearance and you have to appear before the said court on that day, either by yourself or through your advocate at about 10:30 am. or else you will be set exparte and the case will be proceeded in your absence.
Date of hearing : 06-01-2026
S.Hari Prasad, A.N. Balaji,
Advocates, # 7-6-282, Mitta Street, TIRUPATI.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) TIRUPATI
E.A.No. 81 of 2024
O.S.No. 1111 of 2021
T.Venugopal..... Petitioner
Vs
T.Thulasamma.... Respondent
Substituted Notice to the Respondent
T.Thulasamma, W/o.T.Jayachandra Reddy D.No.6-11-86, M.C.R. Colony, Tirupati, Tirupati District.
Madam,
Please take notice that the above E.A. filed by the petitioner against you to send for the attached amount from the Garnishee to the above said Hon'ble Court and the said E.A. stands posted to 08-12-2025 for your appearance at 10.30 a.m., before the above Court, and if you fail to appear in person or through pleader the matter will be decided exparte.
/by order of court/
K.B.Nagaraja,
Poojari Munireddy,
Advocates for Petitioner, Tirupati
Cell No.9440206155

డిజిటల్ బోధనపై శిక్షణ

పీఎంశ్రీ పాఠశాలల ఉపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సీఎంవో సురేష్, ఏపీవోలు చంద్రశేఖర్ నాయుడు, సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పట్టాభి సీతారామయ్యకు నివాళులు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: స్థానిక కోదండరామ దక్షిణ మాడ వీధిలోని చిగోర ఆధ్యాత్మిక కేంద్రంలో స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేంద్ర వ్యవస్థాపకుడు సీహెచ్. హనుమంతరావు, జి. గోపీనాథ్‌రెడ్డి, జయలక్ష్మి, సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

దేవస్థానం అభివృద్ధికి కృషి

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరి గ్రామ దేవత శక్తి స్వరూపిణి మూలస్థానమ్మ దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. సోమవారం సతీమణి సుధారెడ్డితో కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు, పూజా సామగ్రి సమర్పించారు. ప్రధాన అర్చకుడు అరుణాసూరి, ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికి దర్శనం చేయించారు. గర్భగుడి ముఖద్వార మందిరం వద్ద రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన పంచలోహ తాపడాన్ని ఎమ్మెల్యే దంపతులు ప్రారంభించారు.

అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే నాని దంపతులు

శాస్త్రోక్తంగా ఘటాభిషేకం

చంద్రగిరి మండలంలోని తొండవాడ అగస్త్యేశ్వర స్వామి మూలమూర్తికి సహస్ర ఘటాభిషేకం సోమవారం నిర్వహించారు. గర్భాలయంలో మూలమూర్తి మునిగే వరకు స్వర్ణముఖి నది జలాలను నింపి పూజలు చేశారు. – న్యూస్‌టుడే, చంద్రగిరి



నగర పాలికకు 31 వినతులు

మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 31 వినతులు అందాయి. కమిషనర్ ఎన్. మౌర్య వాటిని స్వీకరించారు. రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో పెరుమాళ్ ఆసుపత్రి వద్ద చెత్త తొలగించాలని, నారాయణపురంలో విద్యుత్తు స్తంభాలు మార్చాలని, నగరంలో భూగర్భ మురుగు వ్యవస్థలో మ్యాన్‌హోల్స్ లీకేజీలు అరికట్టాలని, మారుతీనగర్, బాలాజీకాలనీ, తిమ్మినాయుడుపాలెం ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు తొలగించాలని పలువురు కోరారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

పాకాల, న్యూస్‌టుడే: మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణం, ప్రజారోగ్యం కాపాడుకోవాలని పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ రమేష్‌కుమార్ సూచించారు. మండలంలోని ఇరంగారిపల్లిలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. సోమవారం ప్రాథమిక పాఠశాల పరిసరాలు శుభ్రం చేసి మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపల్ మాసిలామణి, అధ్యాపకులు ఈశ్వరబాబు, రమణమ్మ, ఢిల్లీప్రసాద్, హెచ్ఎం మునిరాజారెడ్డి పాల్గొన్నారు.



జేసీఆర్ చైతన్య ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రతిభకు ప్రశంసలు

తిరుపతి పట్టణంలోని జేసీఆర్ చైతన్య, రెడ్ చెర్రీస్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అంశంపై జరిగిన వక్తృత్వ పోటీల్లో 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఉపన్యాసాలు ఇచ్చారు. జేసీఆర్ చైతన్యలో ఎస్. వన్షిక, వై. ప్రీతమ్, బి. చందనప్రియ విజేతలుగా నిలవగా పాఠశాల అకడమిక్ కోఆర్డినేటర్ వై. వినయ్‌చైతన్య బహుమతులు అందజేశారు. రెడ్ చెర్రీస్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన సి. యుక్తిశ్రీ, జి. గ్రీష్మశ్రీ, ఎస్. పవిత్రకి స్కూల్ డైరెక్టర్ ఎన్. సునీల్‌కుమార్ రెడ్డి ప్రశంసాపత్రాలు ఇచ్చారు. – న్యూస్‌టుడే, తిరుపతి (విద్య)

రెడ్ చెర్రీస్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ప్రశంసాపత్రాల అందజేత

సృజనాత్మకత పెంచుకోవాలి

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: విద్యార్థినులు సృజనాత్మకతను పెంచుకోవాలని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఫార్మసీ విభాగం ఆచార్యులు విద్యావతి పేర్కొన్నారు. వర్సిటీ ఐఐసీ, ఉమెన్ బయోటెక్ ఇంక్యుబేషన్ ఫెసిలిటీ కేంద్రాల ఆధ్వర్యంలో సోమవారం 'బ్రైట్ మైండ్స్ సొసైటల్ ఛాలెంజెస్ పిచ్ హ్యాకథాన్' అంశంపై కార్యక్రమం నిర్వహించారు. సమాజంలోని వివిధ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు కనుగొనే దిశగా ప్రోత్సహించడమే హ్యాకథాన్ ఉద్దేశమన్నారు. అనంతరం విద్యార్థినులు ప్రోటోటైప్ నమూనాలు ప్రదర్శించారు. టీబీఐ సీఈవో సూర్యకుమార్, అధ్యాపకులు రజిత, బిందు, అమల పాల్గొన్నారు.

తైక్వాండోలో సత్తా

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: విస్టార్స్ కప్ సూపర్ లీగ్ ఛాంపియన్స్ ఛాలెంజ్ తైక్వాండో పోటీల్లో తిరుపతిలోని జీవకోన, రాఘవేంద్ర నగర్ క్రీడాకారులు సత్తా చాటారు. బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఎన్. నిఖిల్, టి. చైతన్య రెండేసి స్వర్ణాలు, వి. పవన్ కుమార్, ఎన్. పూర్ణ సాయి, బి. విక్రమ్ ఆదిత్య, పి. డోరన్ సుప్రిల్ ఒక్కొక్కటి చొప్పున స్వర్ణం, రజతాలు, కె.ఎస్. రాఘన్సి 2 రజతాలు సాధించారు. వీరిని గ్రాండ్ మాస్టర్ గోపీనాయుడు, శిక్షకుడు సురేష్ అభినందించారు.

పతకాలతో క్రీడాకారులు గోపీనాయుడు, సురేష్



ప్రైవేటీకరణ నిర్ణయాలు సరికాదు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ మత్తులో రాష్ట్రాన్ని అదానీ ప్రదేశ్‌గా మారుస్తోందని సీపీఎం నేత పి. మధు విమర్శించారు. సోమవారం తిరుపతిలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. అమరావతిని రూ.66,350 కోట్లకు ప్రైవేటు వ్యక్తులకు తాకట్టుపెట్టారని ఆరోపించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ ఆగిపోవడంతో 60 డిగ్రీ కళాశాలలు మూత పడినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కేంద్ర నిర్ణయాలను సమర్థిస్తూ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు మురళి, సుబ్రహ్మణ్యం, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత పెంపునకు సంకల్ప్

చంద్రగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఇంటర్మీడియట్ బోర్డు 'సంకల్ప్-2026' పేరుతో 50 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. చంద్రగిరి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపల్ శ్రీప్రకాశ్ ఆధ్వర్యంలో సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య ప్రత్యేక తరగతులు నిర్వహించారు. విద్యార్థులను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి బోధన చేపట్టనున్నారు.

డిజిటల్ విధానంలో బోధిస్తున్న అధ్యాపకులు

(c) eenadu

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

పాలేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు

నారాయణవనం, న్యూస్‌టుడే: పాలమంగళం ఉత్తరంలో వెలసిన శ్రీకమలవల్లీ సమేత పాలేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయంలో మూలవర్లకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, లలిత సహస్రనామ పూజలు చేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఊయలసేవ జరిపించారు. రాత్రి అఖండ దీపారాధన చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

సంస్థాగత నిర్మాణమే కాంగ్రెస్ బలం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పటిష్టమైన సంస్థాగత నిర్మాణమే కాంగ్రెస్ పార్టీకి బలమని ఏఐసీసీ పరిశీలకులు, తమిళనాడు ఎంపీ సుధారామకృష్ణన్ అన్నారు. పట్టణంలోని ప్రైవేటు సమావేశపు హాలులో సోమవారం పార్టీ చేపట్టిన సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమానికి ఆమె ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. జిల్లా పరిశీలకులు మదన్‌మోహన్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి వెంకటనరసింహులు, జిల్లా అధ్యక్షులు బాలగురవంబాబు, ప్రధాన కార్యదర్శి కలిందర్ పాల్గొన్నారు.

సుధారామకృష్ణన్‌తో స్థానిక నేతలు

కాలు తెగితే.. ముందున్న ఆసుపత్రికే

శ్రీకాళహస్తి ప్రాంతీయ ఆసుపత్రి ముఖద్వారంలో రోగులకు వారి సహాయకులకు పెనుముప్పు పొంచి ఉంది. ఇక్కడ ప్రధాన ద్వారం వద్ద పశువులు, ఇతర జంతువులు ఆస్పత్రి ఆవరణలోకి రాకుండా ఏర్పాటు చేసిన పైపులు రోగులకు ప్రమాదకరంగా మారుతోంది. ప్రస్తుతం అవి కుంగిపోవడంతో పాటు సగం వరకు విరిగిపోయాయి. ప్రమాదకరంగా మారిన పైపులతో వృద్ధులు ఇక్కట్లు పడుతున్నారు. కుంగడంతో అంబులెన్సులు కష్టంగా వెళ్తున్నాయి. **- న్యూస్‌టుడే, తొట్టంబేడు**

సిగ్నల్‌ను సరిచేయలేరా!

రేణిగుంట చెక్‌పోస్టు కూడలి నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఇక్కడ ఏవైపు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితి ఈ కూడలిలో పెద్ద సమస్యగా మారింది. శ్రీకాళహస్తి వైపు వచ్చే మార్గంలో గతంలో సిగ్నల్ లైట్‌ను ఏర్పాటు చేశారు. పలు వాహనాలు ఢీ కొనడంతో ఆ లైట్ కిందపడి సుమారు మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు దానిని సరిచేయాలన్న ఆలోచన సంబంధిత అధికారుల్లో కలగక పోవడం వాహన చోదకుల పాలిట శాపంగా మారింది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రేణిగుంట**

షెడ్లు ఉపయోగంలోకి వచ్చేనా..!

మార్కెట్ కమిటీ ఆవరణలో కూరగాయల వర్తకుల సౌకర్యార్థం తెదేపా హయాంలో షెడ్లు నిర్మించారు. వైకాపా హయాంలో వీటిని ఉపయోగంలోకి తీసుకురావాలన్న విషయాన్ని పూర్తిగా విస్మరించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు అందుబాటులోకి వచ్చారు. ఇప్పటికైనా సంతతో పాటు కూరగాయల వర్తకులకు వర్షాలకు, ఎండ తీవ్రతకు ఇబ్బందులు లేకుండా వీటిని అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని వాటర్ వర్క్స్ కాలనీ కాల్వల్లో వ్యర్థాలు పేరుకు పోయాయి. దీంతో అవస్థలు తప్పడం లేదు. **- మోహన్**

సమాధానం: రోజువారీ తొలగింపు జరుగుతోంది. ఎక్కడ సమస్య ఉందో తెలుసుకుని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

- దాము, పారిశుద్ధ్య విభాగం అధికారి, పురపాలక సంఘం

రేణిగుంట, న్యూస్‌టుడే: సమస్య: రేణిగుంట పంచాయతీలోని అన్నదాన సత్రం వీధిలో దీపం వెలగడం లేదు. దీంతో ఈ ప్రాంతమంతా చీకటిగా మారింది. **- బాబు**

సమాధానం: వెంటనే ఇక్కడ దీపం ఏర్పాటు చేయిస్తాం.

- రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి

విద్యుద్దీపాల ఏర్పాటు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీరాంనగర్ కాలనీలో దుస్థితికి చేరిన విద్యుద్దీపాలను అధికారులు మార్పు చేశారు. విద్యుత్తు దీపాలు వెలగడం లేదన్న సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా'లో అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కమిషనర్ భవానీప్రసాద్ సూచనలతో విద్యుత్తు శాఖ అధికారులు దీపాలను అమర్చారు.

స్పందనకు వందనం

వ్యర్థాల తొలగింపు

సత్యవేడు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఓం శక్తి దేవాలయ సమీపంలోని మురుగు కాలువలో వ్యర్థాలను ఎట్టకేలకు తొలగించారు. పట్టణం నుంచి వచ్చే మురుగునీరు ఓం శక్తి దేవాలయం వద్ద వ్యర్థాలతో పేరుకుపోతుందని ఈ నెల 11వ తేదీన ఈనాడులో మేమున్నాం. .మీకు తోడుగా శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మునిరవికుమార్ పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు.

చెత్త కుప్పలు..

నారాయణవనం, న్యూస్‌టుడే: జీఎన్‌కండ్రిగలో పలు వీధుల్లో చెత్త నిల్వలు తొలగించక పోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఈనాడులో మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సర్పంచి మురళి, కార్యదర్శి సుజన చెత్త నిల్వలను తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.

ఇన్‌ఛార్జి ఏవోగా ప్రవీణ

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండల ఇన్‌ఛార్జి వ్యవసాయాధికారిగా వెంకటగిరి మండల వ్యవసాయాధికారి ప్రవీణ సోమవారం నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఏవో గౌరి వ్యక్తిగత కారణాలతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఇన్‌ఛార్జిగా ప్రవీణను ఇక్కడ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

అసలు అధ్వానం.. కొసరు అవస్థల మయం

అధ్వానంగా వడ్డిపాళెం బీటీ రహదారి

నాగలాపురం, న్యూస్‌టుడే: సత్యవేడు నియోజకవర్గంలో రహదారుల పరిస్థితి దయనీయంగా మారింది. వైకాపా హయాంలో టిప్పర్ల జోరుతో గుంతలమయమైన రహదారులకు నాడు కనీస మరమ్మతులు కరవయ్యాయి. అనంతరం రహదారులపై దృష్టి సారించక పోవడంతో వాహన చోదకులతో పాటు పాదచారులకు అవస్థలు తప్పడం లేదు. దీనికి తోడు ఇటీవల మొంథా. . ప్రస్తుతం మరో తుపాను ధాటికి రహదారులు అతలాకుతలమయ్యాయి.

ఇరవై గ్రామాల ప్రజలకు అవస్థలు

నాగలాపురం గ్రామంలోని రెండు ఆర్చిల నడుమ రహదారిలో తారు అంతంతమాత్రమే మిగలడంతో గుంతలు అధికమై తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నాగలాపురం-టీపీకోటల నడుమ రహదారికి

వరుస వర్షాలతో దెబ్బతిన్న రహదారులు

ఏడు సంవత్సరాలుగా మోక్షం లభించక పోవడంతో ఇరవై గ్రామాల ప్రజలకు గుంతలదారులతో అవస్థలే మిగిలాయి. అడవికండ్రిగ, లింగమనాయుడుకండ్రిగ, వినోభానగర్, దొడ్డిమిట్టల రహదారులు ప్రతిపాదనలు మినహా కార్యాచరణ కరవవడంతో బురదతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. జంబుకేశవపురంలో నామమాత్రంగా ఉన్న బీటీ రహదారిపై అధికలోడు దుంగలతో రహదారి ధ్వంసమైంది.

నాగలాపురం దక్షిణపు బజారులో రహదారి దుస్థితి

మరమ్మతులు కరవు

నారాయణవనం మండలంలోని గోవిందప్పనాయుడుకండ్రిగ, సుబ్బానాయుడుకండ్రిగ, తిరువట్యం, తుంబూరు, పాలమంగళం రహదారులకు మరమ్మతులు లేక పోవడంతో కంకర, బురదలతో వాహన చోదకులకు ప్రమాదాలు తప్పడం లేదు. నారాయణవనంతో పాటు నాగలాపురం మీదగా సురుటుపల్లి వరకు జాతీయ రహదారి సైతం గుంతలతో ప్రమాదభరితంగా మారింది. గడిచిన నాలుగు నెలల్లో ఇరవై మందికి పైగా ప్రమాదాలతో మరణించారు.

సమాధానం చెప్పలేని అధికారులు

వరదయ్యపాళెం మండలంలోని పాండూరు, బీఎన్ కండ్రిగ-సంతవేలూరు, పిచ్చాటూరు-హనుమంతాపురం, శ్రీకాళహస్తి-తడ రహదారుల ఆధునికీకరణకు నోచుకోలేదు. ర.భ. శాఖకు నిధుల సమస్యతో మరమ్మతులు చేయలేని దుస్థితిలో అధికారులు సమాధానాలు చెప్పలేక పోతుండటం దారుణంగా ఉంది.

నిత్యం ప్రమాదాలు

పిచ్చాటూరు మండలంలోని అరణియార్‌ను ఆనుకుని శేషంబేడు రహదారి అత్యంత దయనీయంగా తయారైంది. ప్రస్తుత వర్షాలతో నిత్యం వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కేవీబీపురంలోని పూడీసీకేపురం, బీఎన్‌కండ్రిగలోని ఆర్.అనంతాపురం, జంబుగోళం, సత్యవేడు మండలంలోని కృష్ణాపురంతో పాటు పలు గ్రామీణ రహదారులు, వరదయ్యపాళెం మండలంలోని గోవర్ధనపురంలలో పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలోని రహదారులు అధ్వానంగా ఉన్నాయి.

ప్రస్తుత తుపాన్ల సమయంలో ప్రభుత్వం విడుదల చేసే ఎఫ్‌డీఆర్ నిధులతోనైనా కనీస మరమ్మతులు చేయాలని నియోజకవర్గ వాసులు కోరుతున్నారు.

పురాతన సంపదకు విఘాతం

అటవీశాఖ అభ్యంతరం

కొండను తొలచి వేసిన రోడ్డు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్న వేయిలింగాల కోనకు వెళ్లేందుకు రోడ్డు మార్గం పేరుతో పురాతన సంపదకు విఘాతం కలుగుతోందని భక్తులు వాపోతున్నారు. దీంతో పాటుగా అటవీశాఖ అభ్యంతరం వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. కైలాసగిరుల్లోని అటవీ ప్రాంతంలో పురాతన కాలం నాటి రాళ్లు, అరుదైన వృక్షజాతులు ఉన్నాయని దీన్ని యంత్రాలతో ధ్వంసం చేయడంపట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొండ మార్గం గుండా వెళ్లేందుకు పెద్ద సమయం పట్టదని, అయినా ఈ ప్రాజెక్టు మూలంగా దాదాపు 400 భారీ చెట్లు కూలదోయడంపై అటవీశాఖ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. గిరివలం రోడ్డుకు అటవీశాఖ తరపున రోడ్డును ఇచ్చారు. అయితే ప్రస్తుతం ఈ మార్గం అసాంఘిక కార్యకలాపాలకు నిలయం కావడం పట్ల పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతాన్ని మరింతగా విస్తరింపచేయడం, ఆహ్లాదాన్ని పెంచే మొక్కలు నాటించడం, భక్తులతో పాటు అరుదైన వృక్ష సంపద పరిరక్షణకు వాచ్ టవర్స్ ఏర్పాటు చేసి సంరక్షణ దిశగా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

చెక్కుల పంపిణీ

నాగలాపురం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని 11 మందికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను తన నివాసంలో సోమవారం పంపిణీ చేశారు. పిచ్చాటూరు మండలం పులికుండ్రానికి చెందిన మన్నాచిరాజుకు రూ. 82,106లు, రామగిరికి చెందిన ఏకాంబరానికి రూ. 22,400లు, పిచ్చాటూరుకు చెందిన ఆర్ముగానికి రూ. రూ. 1.50 లక్షలు, ఆండాళమ్మకు రూ. 61,572లు, భాస్కర్‌కు రూ. 1,12,958లు, నారాయణవనం మండలం పాలమంగళానికి చెందిన పవిత్రకు రూ. 30 వేలు, గోవిందస్వామికి రూ. 1,18,881లు, కేవీబీపురం మండలం కోటమంగాపురానికి చెందిన శివకుమార్‌కు రూ. 97,188లు, పవనవారికండ్రిగకు చెందిన తులసమ్మకు రూ. 42,158లు, మహేంద్రకు రూ. 25 వేలు, వరదయ్యపాళెం మండలం మరదవాడకు చెందిన మునీంద్రబాబుకు రూ. 27,348లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు.

లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

అంగన్‌వాడీ కేంద్రాలకు తూకపు యంత్రాల పంపిణీ

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 16 అంగన్‌వాడీ కేంద్రాలకు విజయవాహిని ఛారిటబుల్ ఫౌండేషన్- టాటా ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో డిజిటల్ తూకపు యంత్రాలను సోమవారం అందించారు. వీటిని సీడీపీవో సౌభాగ్యమ్మ అంగన్‌వాడీ కార్యకర్తలకు పంపిణీ చేశారు. మిగిలిన కేంద్రాలకు త్వరలోనే తూకపు యంత్రాలను అందిస్తామని ట్రస్టు ప్రతినిధి రామకృష్ణ తెలిపారు. సూపర్‌వైజర్ శ్రీదేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయ ఆవరణలో ధ్యానం చేస్తున్న రష్యన్లు

ధ్యానంలో నిమగ్నం

రష్యా దేశానికి చెందిన భక్తులు వాయులింగేశ్వరుని దర్శనార్థం వచ్చారు. మన సంస్కృతికి తగ్గట్టు వస్త్రధారణతో వచ్చిన విదేశీ భక్తులకు సోమవారం ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. శిల్పకళ అద్భుతాలను చూసి ఆనంద భరితులయ్యారు. దర్శనం పూర్తయ్యాక ఊంజల్‌సేవ మండపం వద్ద విదేశీయులు ధ్యానంలో నిమగ్నం కావడం ఇక్కడి భక్తులను ఆశ్చర్యానికి గురిచేసింది. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

రైతుల సంక్షేమానికి పెద్దపీట

శ్రీకాళహస్తి(గ్రామీణ(ఏర్పేడు) : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెంచయ్యనాయుడు తెలిపారు. శ్రీకాళహస్తి మండలంలోని అక్కుర్తిలో సోమవారం రైతన్నా మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. అధికారులతో ఇంటింటా తిరిగి ప్రభుత్వం చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్ వంటి వాటి గురించి వివరించారు. ఏర్పేడులో తెదేపా మండల అధ్యక్షుడు నాగరాజునాయుడు ఆధ్వర్యంలో ఏర్పేడు, కోబాక, ఆమందూరు, కొత్తవీరాపురం, ఎండీపుత్తూరులో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఏడీఏ రమేష్‌రెడ్డి, ఏవోలు సాగరిక, మమతారెడ్డి, నేతలు గురవారెడ్డి, కృష్ణయాదవ్, కామేష్‌యాదవ్, జగదీష్‌రెడ్డి, బాలగున్నయ్య పాల్గొన్నారు. **తొట్టంబేడు:** వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం అందించే పథకాలను చేరువ చేయడంతోపాటు సాగుకు అవసరమైన విలువైన సలహాలిస్తూ రైతన్నల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందిస్తామని వ్యవసాయశాఖ ఏడీ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన 'రైతన్నా మీ కోసం' కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని చిట్టత్తూరులో నిర్వహించారు. ముఖ్యమంత్రి పంపిన లేఖను రైతులకు అందజేశారు. ఏవో సురేంద్రరెడ్డి, సచివాలయ సిబ్బంది, తెదేపా నేత బాలాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడు: కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ రమేష్‌రెడ్డి

విజేతలతో ద ఇంగ్లిషు మీడియం స్కూలు ప్రిన్సిపల్ విశాల

విద్యార్థులతో శ్రీవివేకానంద ఇంగ్లిషు మీడియం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జితేంద్ర

మాటల్లో నైపుణ్యం.. బహుమతులు సొంతం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: 'ఈనాడు-ఈటీవీ' సంయుక్తంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో పట్టణంలోని ద స్కూలు, శ్రీవివేకానంద, ఇంగ్లిషు మీడియం ఉన్నత పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాలల ఆవరణలో సోమవారం జరిగిన పోటీల్లో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అన్న అంశంలో విద్యార్థులు చక్కగా మాట్లాడారు. దిస్కూలు పాఠశాలకు చెందిన కేతన్, రేషిత, రితికలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. శ్రీవివేకానంద పాఠశాలకు చెందిన మునిసిరిచందన, నాగశ్రీదుర్గ, శృతిషారోస్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. ప్రధానోపాధ్యాయిని విశాల, ప్రధానోపాధ్యాయులు జితేంద్ర విజేతలకు బహుమతులు అందజేశారు.

క్వారీ ఏర్పాటుకు వ్యతిరేకంగా ధర్నా

తహసీల్దార్ రోశయ్యకు వినతి పత్రం అందిస్తున్న గ్రామస్థులు

కేవీబీపురం, న్యూస్‌టుడే: మండలంలోని ఎగువపూడి వద్ద అక్రమంగా నిర్మిస్తున్న క్వారీ నిర్మాణానికి వ్యతిరేకంగా బాధిత గ్రామ ప్రజలు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. బాధితులు మాట్లాడుతూ క్వారీ నిర్మాణంవల్ల కాలుష్యంతో ఇబ్బందులు తప్పవన్నారు. పశువులను మేపేందుకు ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు. తాగే నీటి నుంచి పంటలకు అందించే సాగునీటి వరకు కలుషితమవుతాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని తహసీల్దార్ రోశయ్యకు వినతి పత్రం అందించారు.

ప్రజాకవికి ఘన నివాళి

ప్రజాకవి అందెశ్రీకి నివాళులు అర్పిస్తున్న ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళావేదిక సభ్యులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ప్రజాకవి అందెశ్రీకి ధూర్జటి సమాఖ్య సాహితీ కళావేదిక సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం ఆయన సంస్మరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆర్‌పీబీఎస్ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య మాట్లాడుతూ సాహిత్య పరంగా ఆయన చేసిన కృషిని కొనియాడారు. రచయితలు, కవులు రాధాకృష్ణయ్య, గురునాథం, మునిసుబ్బారెడ్డి, షణ్ముగం, రవీంద్ర, మునస్వామి, భారతి, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

తొట్టంబేడు: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేవీవై)4.0, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు వెబ్ డెవలపర్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు శ్రీకాళహస్తి ఎస్వీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.నాగరాజనాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో యువతీ, యువకులకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత, సైన్స్ కోర్సు చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న యువతీ, యువకులు విద్యార్హత ధృవపత్రాలు, ఆధార్‌కార్డు నకలు, బయోడేటాతో కళాశాలకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు నం. 79895 09540, 79814 73129లలో సంప్రదించాలని ఆయన కోరారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. న్యాయస్థాన భవన సముదాయంలోని బార్ అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో సోమవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పూడి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా వి.మల్లికార్జునయ్య, కార్యదర్శిగా తులసి, సంయుక్త కార్యదర్శిగా కె.ఎం.నాగరాజు, కోశాధికారిగా మునిశేఖర్, మహిళా ప్రతినిధిగా సునీత, కార్యవర్గ సభ్యులుగా సంతోష్‌కుమార్, కిరణ్‌కుమార్, మీర్జావలి ఎన్నికయ్యారు. వీరందరూ మర్యాదపూర్వకంగా న్యాయమూర్తులను కలిశారు.

రెండు గేట్లతో దిగువకు నీరు

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: అరణియార్ జలాశయ నీటి మట్టం సోమవారానికి 30.6 అడుగులకు చేరినట్లు డీఈ శ్రీనివాసులు తెలిపారు. జలాశయంలో 31 అడుగుల నీటి మట్టంతో 1.853 క్యూసెక్కుల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉండగా.. ప్రస్తుతం నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరువగా 1.796లకు రావడంతో స్పిల్‌వే గేట్లలో రెండు గేట్లను కొంతమేర తెరచి 400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వర్షాలు అధికమైతే అందుకనుగుణంగా నిర్దేశిత మోతాదులో నీటి విడుదలను పెంచుతామన్నారు.

గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

వగత్తూరు చెరువుకు బొగడ

కేవీబీపురం, న్యూస్‌టుడే: మండలంలోని వగత్తూరు చెరువుకు సోమవారం సాయంత్రం బొగడ పడింది. సాయంత్రం గ్రామానికి చెందిన కొంత మంది పొలం నుంచి ఇంటికి వెళుతున్న సమయంలో చెరువుకు పడిన బొగడను గుర్తించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందిన వెంటనే జేసీబీ, ట్రాక్టర్ సాయంతో బొగడను పూడ్చడంతో పెను ప్రమాదం తప్పింది.

ఉరేసుకుని వృద్ధురాలి మృతి

సత్యవేడు, న్యూస్‌టుడే: వృద్ధురాలు అనారోగ్యంతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండల కేంద్రంలోని గంగమిట్ట వీధిలో చోటుచేసుకుంది. ఎస్సై రామస్వామి కథనం మేరకు. . రాజేశ్వరి(70) పండ్లను విక్రయిస్తూ జీవనం సాగించేది. ఇటీవల భర్త మరణించడంతో మనస్థాపంతో ఆమె ఆరోగ్యం క్షీణించింది. ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని మృతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతానికి రెండెద్దులు ..

కేవీబీపురం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి రెండెద్దులు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని పెరిందేశం గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మురగయ్య మేతకోసం గ్రామానికి సమీపంలోని పొలాల వద్దకు తోలుకెళ్లాడు. ఆ సమయంలో వ్యవసాయ విద్యుత్తుకు రైతులు ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రిక వద్ద ఒక్కసారిగా విద్యుదాఘాతానికిగురై రెండెద్దులు మృతి చెందినట్లు బాధితుడు వాపోయారు. వీటి విలువ రూ.1. 20 లక్షలు ఉంటుందని పశు వైద్యాధికారి పార్థిబన్ తెలిపారు.

ప్రయాణికురాలి అప్రమత్తత.. తప్పిన ముప్పు

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: పిచ్చాటూరు నుంచి శ్రీకాళహస్తికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్న శ్రీకాళహస్తి డిపోకు చెందిన అద్దె బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. బస్సులో 70 మందికి పైగా ప్రయాణికులు పిచ్చాటూరు బస్టాండ్ బసెక్కారు. బస్సు డీజిల్ ట్యాంక్ నుంచి డీజిల్ లీక్ కావడాన్ని బస్సు ప్రయాణికురాలు గుర్తించింది. దీంతో ఆమె బస్సు డ్రైవరు, కండక్టరుకు దృష్టికి తీసుకు పోయింది. డీజిల్ లీకేజీని గుర్తించిన డ్రైవర్ బస్సును ఆపేశాడు. దీంతో ప్రమాదం తప్పింది.

పశుపోషణ - వ్యర్థాల నిర్వహణ

శిక్షణ పొందుతున్న మహిళలు

శ్రీకాళహస్తి(గ్రామీణ(ఏర్పేడు), న్యూస్‌టుడే: పశుపోషణతో పాటు వాటి వ్యర్థాల నిర్వహణతో సత్ఫలితాలు సాధించేందుకు ఎస్ఓఎస్ స్వచ్ఛంద సంస్థ శ్రీకారం చుట్టింది. తిరుపతి ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయంతో కలిసి శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని దత్తత గ్రామాల్లో మహిళలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. శిక్షణ పొందిన మహిళలు పాడి పరిశ్రమపై దృష్టి సారిస్తూ స్వయం ఉపాధితో సులభతరంగా ఆర్థికాభివృద్ధిని సాధిస్తూ ఆదర్శ వంతంగా నిలుస్తున్నారు. ఇదేరీతిలో సేంద్రియ పద్ధతులతో పంటలు సాగు, పాలకోవ తయారీ వంటివాటిపై శిక్షణ పొందడంతో మహిళలు ఆర్థికాభివృద్ధిలో మహరాణులుగా గుర్తింపు పొందుతున్నారు.

ఎస్ఓఎస్ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ

ఉచితంగా ఆవుల పంపిణీ

శ్రీకాళహస్తి, వెంకటగిరి నియోజకవర్గంలోని పేదలను గుర్తించి మూడేళ్ల కాలంలో 980మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.35వేలు విలువైన 980 ఆవులను ఎస్ఓఎస్ స్వచ్ఛంద సంస్థ వితరణగా అందజేసింది. ఈ క్రమంలోనే వాటి పోషణ విధానం, పాల ఉత్పత్తులు, ఇంటి నుంచే కోవా తయారీ విధానం వంటివాటిపై శిక్షణ కల్పించారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై దృష్టి సారించడంతో ఆదాయాన్ని పొందుతున్నారు.

ప్రమిదలు, విత్తన బంతుల తయారీ

ఆవుపేడతో సేంద్రియ ఎరువు, ప్రమిదలు, విత్తన బంతులను తయారు చేసే విధానంపై ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయ నిపుణులతో శిక్షణ కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రమిదలను ఇంటి అవసరాలకే కాకుండా బయట వారికి విక్రయిస్తుండటంతో మహిళలు ఆదాయం పొందుతున్నారు. సీడ్‌బాల్స్ పొలాల్లో సేంద్రియ ఎరువులుగా వినియోగించేందుకు ఉపయోగపడుతుంది.

మెలకువలతో ఆదాయం

వ్యవసాయంతో పాటు పశుపోషణపై అవగాహన ఏర్పడటంతో సులభతరంగా తక్కువ పెట్టుబడులతో అధిక ఆదాయం పొందుతున్నాం. ఆవులు, దూడల సంరక్షణలో మెలకువలు నేర్చుకోవడంతో పశుసంతతి, పాల ఉత్పత్తులను పెంపొందించేందుకు దోహదపడుతుంది. **- రాములమ్మ**

పేదరికంపై విజయం

పేదల ఆర్థికాభివృద్ధికి అవసరమైన సదుపాయాలను ఎస్ఓఎస్ సంస్థ సమకూర్చుతుంది. నిత్యం కొత్త ప్రయోగాలతో ఆదాయ వనరులను అందుబాటులోకి తీసుకొస్తుంది. దీంతో మాకు స్వయం ఉపాధి ఏర్పడటంతో తక్కువ కాలంలోనే పేదరికంపై విజయం సాధిస్తున్నాం.

- సుబ్బమ్మ

SEVEN HILLS COLLEGE OF PHARMACY
[AUTONOMOUS]
Venkatramapuram, Ramachandrapuram Mandal, TIRUPATI - 517 561, A.P, INDIA
B.Pharmacy / Pharm.D
SPOT & CAT-B ADMISSIONS - 2025-26 AY
Eligible & Interested Candidates are advised to report at college for B.Pharmacy & Pharm.D Spot & CAT-B Admissions for the AY 2025-26. Admissions will be done as per guidelines of APSCHE.
For details Contact: 7730084513, 7386220943 PRINCIPAL

(c) eenadu

గూడూరు
•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

విశేష అభిషేకాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయంలో కొలువుదీరిన శ్రీమృత్యుంజయ స్వామికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సోమవారం సంకల్ప పూజలు నిర్వహించారు.

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 21 నుంచి రూ. 30 వరకు
రెండో రకం: కిలో రూ. 10 నుంచి రూ. 20 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్ (రైతు ధర)	115
లేయర్	130
బ్రాయిలర్	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	232
లేయర్ మాంసం	221

గతుకులకు వేయలేదు అతుకులు

✦ పురపాలకలో ఇదీ పరిస్థితి

కాశీవిశ్వనాథ స్వామి ఆలయం మార్గంలో దుస్థితిలో రోడ్డు

వెంకటగిరి, న్యూస్‌టుడే: వెంకటగిరి పురపాలిక పరిధిలో కాంపాళెం నుంచి కాశీపేట వరకు మాజీ సీఎం జనార్దన్‌రెడ్డి పాలనలో 35 ఏళ్ల కిందట సిమెంట్ రోడ్డు వేశారు. ఇప్పుడు గతుకులు తేలిన రోడ్డుకు అతుకులు కూడా వేయకపోవడంతో నేడు ఈ రహదారి గోతుల మయంగా మారింది. రోడ్డంతా గుల్లబారి పోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వెంకటగిరి నుంచి గూడూరుకు వెళ్లే మార్గంలోని బంగారుపేట వద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. మూడు నెలల కిందట మరమ్మతులు చేసినా మళ్లీ దుస్థితి చేరింది.

గ్రామాలకు వెళ్లలేం

పట్టణంలో నుంచి పలు గ్రామాలకు వెళ్లే రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ప్రధానంగా కాశీపేట కూడలి నుంచి కుర్జాగుంట, మన్నేగుంట, చెలికంపాడు గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలు తేలింది. పట్టణ పరిధిలోని కాశీపేట నుంచి బొగ్గులమిట్ట వరకు రోడ్డంతా గోతులే దర్శనమిస్తున్నాయి. దాంతో ఈ మార్గంలో పాదచారులు, వాహనదారుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఆదిశేషనగరం పారవోలు, సిద్ధవరం, డక్కిలి మండలం తీర్థంపాడు గ్రామానికి వెళ్లే ర.భ రోడ్డుది ఇదే పరిస్థితి. మాసాపేట నుంచి పాళెంకోట, మొక్కలపాడు, పాలకొండసత్రం, లాలాపేటకు వెళ్లే రోడ్డు అక్కడక్కడ దెబ్బతింది. రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు పెరిగిపోవడంతో వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు.

'సమస్యలు పరిష్కరించకపోతే ఊరుకోను'

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పక్కన అధికారులు

బాలాయపల్లి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులను హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. భూ సమస్యలపై ఎక్కువగా వినతులు వచ్చాయి. వెంకటగిరి- గూడూరు రోడ్డు పనుల జాప్యంతో రాకపోకలకు అసౌకర్యంగా ఉందని సమస్యలు చెప్పడంతో ర.భ శాఖ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడారు. రాయి సత్యనారాయణ, మస్తానయ్య, సీనీ నాయుడు, రామచంద్రయ్య, రాజగోపాల్, ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు. పాకపూడిలో సర్పంచి గోపీరెడ్డి ఇంటికెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు.

సమస్యలపేట.. పరిష్కారం లేదిచట

◆ ప్రజావసరాలకు అరకొరగా నిధుల కేటాయింపు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో ఏ వీధికెళ్లినా గుంతలదారులు, దుస్థితికి చేరిన కాలువలు దర్శనమిస్తున్నాయి. కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో నాయుడుపేట సమస్యలపేటగా మారింది. ప్రజావసరాలను పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణవాసుల నుంచి పన్నులు వసూలు చేస్తున్న అధికారులు కనీస అవసరాలు తీర్చడంలో విఫలమవుతున్నారు.

ఏ వీధికెళ్లినా..

పట్టణంలోని ఏ వీధికి వెళ్లినా సమస్యలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అధికారులు, పాలకులు బయటకు వచ్చి పట్టణవాసుల బాధలు చూడటం లేదు. నిధుల కొరత పేరు చెప్పి అధికారులు తప్పించుకుంటున్నారు. అధికారులు రాజకీయ నాయకులు చెప్పిన పనులకు నిధులు కేటాయిస్తున్నారు. ప్రజలకు అత్యవసరమైన వాటికి నిధులు కేటాయింపు జరగడం లేదు.

వివరాలిలా..
పురపాలక సంఘం: నాయుడుపేట
వార్డులు : 25
జనాభా : 65 వేలు
ఏడాదికి రాబడి : రూ.15 కోట్లు
రోడ్లు : 60 కి.మీ
సైడుకాలువలు: 48 కి.మీ

సాయిబాబా మందిరం ఎదురుగా రోడ్డుపై నిలిచిన మురుగు

పాత ఉపకజానా కార్యాలయం వీధిలో మరమ్మతులు చేసేందుకు రూ.15 లక్షలు పైగానే వెచ్చించారు. అయినా పనులు నామమాత్రంగానే చేశారు. రూ. 10 లక్షలు ఖర్చు చేస్తే పురపాలిక పరిధిలోని ప్రధాన వీధుల్లో పెద్ద గుంతలను పూడ్చవచ్చు. కానీ ఆ దిశగా అడుగులు వేయడం లేదు.

ఇక్కడే అధికం

కెనరా బ్యాంకు మలుపులో ఏడాది నుంచి రోడ్డు, కాలువ దెబ్బతిన్నా చిన్నపాటి మరమ్మతులు కూడా చేయలేదు. పిల్లాగుడి వీధి, గడియారం సెంటర్, బ్రాహ్మణ వీధి మలుపు, రాజగోపాలపురం, ప్రిజేశ్ కాల్ కార్యాలయం ఎదురుగా, అగ్రహారపేట, అమరాగార్డెన్, బజారు వీధుల్లో ఎక్కడ చూసినా రోడ్లు, కాలువలు దెబ్బతిన్నాయి. ఈ విషయమై కమిషనర్ ఎస్‌కే.ఫజులుల్లాను వివరణ కోరగా రూ.2 కోట్లతో సిమెంటు రోడ్లు, కాలువల పనులు చేస్తున్నామని చెప్పారు. మిగిలిన పనులు త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

విద్యార్థి కార్తికేయకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపల్ అనిల్‌కుమార్

చిల్లకూరు, న్యూస్‌టుడే: స్థానిక డా. బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి టి.కార్తికేయ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. అండర్-17 విభాగంలో ఈ నెల 25 నుంచి 29 వరకు కర్ణాటకలో జరిగే ఎస్‌జీఎఫ్ జాతీయ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు ప్రిన్సిపల్ అనిల్‌కుమార్ సోమవారం తెలిపారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

గూడూరు పట్టణం: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించి, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయాలని వైకాపా దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా మోహన్ తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఏవో శిరీషాకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆవుల నాగేంద్ర, సుభాన్, ప్రభుదాస్, పోలయ్య, తులసిత, సన్నీ పాల్గొన్నారు.

29న టిడ్కో లబ్ధిదారులకు రుణమేళా

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: బిరదవాడ వద్ద పీఎం ఆవాస్ యోజన, ఎన్టీఆర్ నగర్ పథకం కింద టిడ్కో గృహాల లబ్ధిదారులకు 29న స్థానిక అంబేడ్కర్ భవనంలో రుణమేళా జరుగుతుందని కమిషనర్ ఎస్‌కే.ఫజులుల్లా సోమవారం పేర్కొన్నారు. 365, 430 చదరపు అడుగుల ఇళ్ల లబ్ధిదారులు బ్యాంకు రుణం పొందని వారికి రుణమేళా జరుగుతుందని వివరించారు. లబ్ధిదారులు ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు ఖాతా, ఫొటోలు అలాట్‌మెంట్ పత్రంతో రావాలన్నారు.

దంతాల పరిశుభ్రతతో ఆరోగ్యం

వెంకటగిరి, న్యూస్‌టుడే: చిన్నారులు తమ దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు మధుసూదన్‌రావు అన్నారు. బుసపాళెం ప్రాథమిక పాఠశాలలో ఈఎస్ఎస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో విద్యార్థులకు బ్రష్,పేస్టు అందించారు. అధ్యాపకులు రవిశంకర్, నాగూర్, రమేష్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విజయశ్రీ

గూడూరు: కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: రైతుల శ్రేయస్సే ధ్యేయంగా సీఎం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం దొరవారిసత్రం మండలంలోని వేటగిరిపాలెంలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. తహసీల్దారు శైలకుమారి, ఏవో జ్యోతిర్మయి, సొసైటీ అధ్యక్షులు ముప్పాళ్ల శ్రీహరిరెడ్డి, డైరెక్టర్ విజయకుమార్, మనోహర్‌రెడ్డి, నాగేంద్ర నాయుడు, ప్రమీలమ్మ పాల్గొన్నారు.

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలోని పోటుపాలెంలో రైతన్నా- మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఇంటింటికి వెళ్లి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఏడీఏ గోపీ నాయక్, వైద్యాధికారి డాక్టర్ సురేష్, నాయకులు పులిమి శ్రీనివాసులు, కొండూరు వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, నరేష్, ప్రకాశ్ నాయుడు, హరి, సునీల్ పాల్గొన్నారు.

వెంకటగిరి, న్యూస్‌టుడే: క్లస్టర్ పరిధిలో రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని ఏఎంసీ ఛైర్మన్ విశ్వనాథం ఆధ్వర్యంలో నిర్వహించారు.

నాయుడుపేట పట్టణం(పెళ్లకూరు) న్యూస్‌టుడే: పెళ్లకూరు మండలం జీలపాటూరు గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ సిబ్బందితో కలసి తెదేపా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందమూడి శివకుమార్ మొదలుపెట్టారు.

డక్కిలి, న్యూస్‌టుడే: వెలికల్లులో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రవీంద్రబాబు, వ్యవసాయ సహాయకుడు కండే గోపాలకృష్ణ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతన్నా.. మీకోసంపై సమీక్ష

కోట, న్యూస్‌టుడే: స్థానిక ఎంఆర్సీ భవనంలో సోమవారం ఎంపీడీవో దిలీప్‌కుమార్, వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్ 'రైతన్నా.. మీకోసం' పై సర్వే బృందాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌లపై అవగాహన కల్పించారు. మత్స్యశాఖ ఎఫ్‌డీవో రెడ్యా నాయక్, డిప్యూటీ ఎంపీడీవో వేణు, తెదేపా నాయకులు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వాకాడు: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో 'రైతన్నా మీకోసం'లో భాగంగా ఆరు రోజులపాటు నిర్వహించే ఇంటింటా సర్వేను సోమవారం ప్రారంభించినట్లు ఏవో ఆర్నూరి దీప తెలిపారు. వీఏఏ, వీఆర్వో, ఇంజినీరింగ్, పశుసంవర్ధక, మత్స్యశాఖ సహాయకులు బృందంగా ఏర్పడి వివిధ అంశాలను సేకరిస్తారని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు: 85002 02046	సమయం
నాయుడుపేట: 80085 73970	10 AM
సూళ్లూరుపేట: 88979 08890	TO
వెంకటగిరి: 80085 73966	1 PM

కోట, న్యూస్‌టుడే : సమస్య: స్థానిక ఎస్సీ గురుకుల కళాశాల సమీపంలో వరాహాల బెడద అధికంగా ఉంది.
– గజేంద్ర, విద్యార్థి
సమాధానం: వెంటనే సమస్యను పరిష్కరిస్తాం.
– దిలీప్ కుమార్, ఎంపీడీవో

సుగ్గుపల్లికి బస్సు సర్వీసు

స్పందనకు వందనం

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట నుంచి సుగ్గుపల్లి గ్రామం మీదుగా శ్రీకాళహస్తికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని సోమవారం నుంచి కల్పించారు. 'మేమున్నాం మీకు తోడుగా' లో ప్రచురితమైన సమస్యకు ఆర్టీసీ డిపో మేనేజర్ కళ స్పందించారు.

ఉపన్యాసంలో మెరిసి.. విజేతలుగా నిలిచి

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రాస్‌ఫరో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం ఈనాడు- ఈటీవీ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలను నిర్వహించారు. 7, 8, 9, 10వ తరగతుల వారికి 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను బిందు శ్రీవాసవి, హదియా, హర్షిత్‌రెడ్డి గెలుపొందారు. డైరెక్టర్లు దశరథరామిరెడ్డి, శంకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఆంటోని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుక్త ధర్మం ఇదేనా?

సూళ్లూరుపేట మండలంలోని డేగలపాలేం గ్రామంలో 11 కేవీ విద్యుత్తు స్తంభం ఒరిగిపోవడంతో ప్రమాదకరంగా మారింది. స్తంభం కిందకి వాలిపోవడంతో విద్యుత్తు తీగలు కిందకు జారిపోయాయి. దీంతో అటుగా వెళ్లే పశువుల కాపరులు, వ్యవసాయదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సూళ్లూరుపేట

ఇలా మట్టి తోలి.. అలా చదును చేసి

నాయుడుపేట బాలాజీ గ్రీన్‌సిటీలోని ప్రధాన మట్టి రోడ్డుకు దారి పొడవునా గుంతలు ఏర్పడటంతో స్థానికులు ఇళ్ల వ్యర్థాలను తోలి చదును చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలిచి రాకపోకలకు సమస్యగా మారడంతో మళ్లీ మట్టితోలి గుంతల్ని చదును చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఇదే తంతు సాగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కొత్తరోడ్డు నిర్మించాలని వారు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

దినదిన గండం.. ఈ రోడ్డుకో దండం

సూళ్లూరుపేట నుంచి వాటంబేడు వెళ్లే మార్గంలో ప్రయాణం దినదిన గండంలా మారింది. ర.భ.శాఖ పరిధిలోని ఈ రోడ్డుపై నాలుగు నెలల క్రితం తారులేచి చిన్నపాటి గుంతలు పడ్డాయి. వాటికి మరమ్మతులు చేయడంలో అధికారులు జాప్యం చేయడంతో ఇటీవలి వర్షాలకు గోతులుగా మారాయి. దాంతో ఏడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించలేక నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. – న్యూస్‌టుడే, తడ

గోడ ఉంది.. గేటు లేదు

సూళ్లూరుపేట మండలంలోని మన్నేముత్తూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ ఉన్నా గేట్లు లేకపోవడంతో భద్రత దృష్ట్యా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. గేటు లేకపోవడంతో పాఠశాల ప్రాంగణం రాత్రిపూట, ఇతర సెలవు దినాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇతరులు సులభంగా ప్రవేశించడానికి అవకాశం ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.
– న్యూస్‌టుడే, సూళ్లూరుపేట

త్వరలో ప్రాపర్టీ కార్డులు అందిస్తాం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని కాండ్ర, అయ్యవారిపాలెం గ్రామాల్లో డిప్యూటీ ఎంపీడీవో మోహన్ ఆధ్వర్యంలో స్వామిత్వ ప్రత్యేక గ్రామ సభలను సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే ప్రాపర్టీ కార్డులు అందించనున్నట్లు తెలిపారు. పంచాయతీ అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువు కట్ట ధ్వంసంపై ఫిర్యాదు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని సంతదాసుపల్లి చెరువు కట్టని సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి భారీ యంత్రంతో ధ్వంసం చేశాడని ఇరిగేషన్ ఏఈ సురేష్‌బాబు గ్రామీణ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పుర కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్లు

కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని వినతి

వెంకటగిరి, న్యూస్‌టుడే: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ప్రతి నెలా నిర్వహించాలని కమిషనర్ వెంకట్రామిరెడ్డికి కౌన్సిలర్లు సోమవారం వినతిపత్రం అందించారు. పుర ఉపాధ్యక్షుడు శాతరాసి బాలయ్య మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశం మూడు నెలలకోసారి నిర్వహించడం వల్ల ప్రజా సమస్యలు పరిష్కరించలేక పోతున్నామని వాపోయారు. వైకాపా కౌన్సిలర్లు రాధమ్మ, పూజారి లక్ష్మి, విజయలక్ష్మి, శంకరయ్య, కృష్ణమూర్తి, గోపాలకృష్ణ, సుబ్బారావు, నేతలు పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్యలు లేకుండా చర్యలు

నూతన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద డిస్కం అధికారులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని రాణిపేట వద్ద ఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు డిస్కం ఏఈ ఏడుకొండలు తెలిపారు. నూతన నియంత్రికను సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో విద్యుత్తు సమస్యలు ఉన్న ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డిస్కం సిబ్బంది మహేశ్వరయ్య, బాలయ్య, నయాజ్, నిమ్మకాయల నరసింహులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర శిబిరం

కోట, న్యూస్‌టుడే: స్థానిక తూర్పు వీధి సాయిబాబా మందిరంలో సోమవారం ఎంవీ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన వాసన్ ఐ కేర్ వైద్యులు ఉచితంగా 150 మందికి నేత్ర పరీక్షలు చేశారు. 25 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసేందుకు నెల్లూరుకు తరలించారు. ఫౌండేషన్ ఛైర్మన్ లీలా మోహన్ కృష్ణ, విజయలక్ష్మి, సాయిబాబా మందిర నిర్వాహకులు విజయభాస్కర్, వైద్యులు రవికుమార్, ఈశ్వర్‌పవన్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన శ్రావణి (30) అనే మహిళ తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. పట్టణంలోని సప్తగిరి మిల్లు వద్ద శ్రీకాళహస్తి రోడ్డుపై వారం రోజుల క్రితం మోటారుసైకిల్‌పై వెళ్తూ ఎదురుగా వస్తున్న ప్రైవేటు బస్సును ఢీకొన్న ప్రమాదంలో శివ అనే యువకుడు మృతి చెందగా, శ్రావణికి తీవ్ర గాయాలైన సంగతి తెలిసిందే. కొన్ని రోజులపాటుగా నెల్లూరులో చికిత్స చేయించి తర్వాత తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి..

తడ, న్యూస్‌టుడే: తడ - అక్కంపేట రైల్వేస్టేషన్ల మధ్య దిగువ మార్గంలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి రామేశ్వరం - అయోధ్య వెళ్లే శ్రద్ధ సేతు ఎక్స్‌ప్రెస్ కింద పడి మృతి చెందాడు. లోకో పైలెట్ సూళ్లూరుపేట రైల్వే అధికారులకు సమాచారం అందించారు. సంఘటన ప్రదేశాన్ని పరిశీలించిన జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుని ఎడమ చేతిపై ఎల్ ప్లస్ ఆర్ అనే పచ్చబొట్టు మాత్రం ఉందన్నారు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో రైల్వే ఉద్యోగికి జైలుశిక్ష

ఈనాడు, హైదరాబాద్: చెక్ బౌన్స్ కేసులో గూడూరు రైల్వే స్టేషన్ పార్శిల్ విభాగం ఉద్యోగి కందుకూరి శ్రీనివాసులుకు హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ సివిల్ కోర్టు ఏడాది సాధారణ జైలుశిక్ష విధింపుతో పాటు రూ.19 లక్షలు పరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. కూకట్‌పల్లి నివాసి పి.భరత్ రెడ్డి పేర్కొన్న వివరాల ప్రకారం 2022లో కందుకూరి శ్రీనివాసులు కుటుంబ అవసరాలకు రూ.9.50 లక్షలు అప్పు తీసుకొని సంవత్సరానికి 24 శాతం వడ్డీతో తిరిగి ఇస్తానని హామీ ఇచ్చి బకాయిలు చెల్లించలేదు. అనంతరం సంబంధిత మొత్తానికి చెక్ ఇవ్వడంతో ఫిర్యాదీ 2023 జనవరి 17న బేగంపేట్‌లోని ఎస్బీఐ బ్రాంచ్‌లో జమ చేశారు. ఖాతాలో నిధుల్లేకపోవడంతో అది బౌన్స్ అయింది. జనవరి 19న లీగల్ నోటీసు జారీ చేయగా 23న నిందితుడికి అందినా డబ్బు మాత్రం చెల్లించలేదు. దీంతో ఫిర్యాదారుడు ప్రైవేటుగా కంప్లైంట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన కోర్టు తీర్పు వెలువరిస్తూ.. నిర్దేశిత పరిహారాన్ని సకాలంలో చెల్లించకపోతే 3 నెలల జైలుశిక్ష పడుతుందని హెచ్చరించింది.

పెచ్చులూడి.. చువ్వలు తేలి

✦ ప్రభుత్వ భవనాల తీరిది

తహసీల్దార్ కార్యాలయంలో పెచ్చులూడిన పైకప్పు

బాలాయపల్లి, న్యూస్‌టుడే: కీలక శాఖలకు చెందిన ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. నూతన భవనాల కోసం ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కావడం లేదు. దీంతో నిత్యం ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి. బాలాయపల్లిలోని ప్రభుత్వ భవనాల పరిస్థితిపై వివరాలిలా..

ప్రతిపాదనలకే పరిమితం

1998లో రూ. 5 లక్షలతో తహసీల్దారు కార్యాలయాన్ని నిర్మించారు. నేడు భవనం దుస్థితికి చేరింది. పెచ్చులూడి ఇనుప చువ్వలు తేలి దర్శనమిస్తున్నాయి. ఇక వర్షం వస్తే భవనం ఉరుస్తోంది. తీవ్రతను గుర్తించిన ఉన్నతాధికారులు తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు గదులను గతంలో వీఆర్వోలకు కేటాయించిన భవనంలోకి మార్చారు. ఆర్ఐలు, మండల డిప్యూటీ సర్వేయర్, గణాంక అధికారి, కంప్యూటర్ ఆపరేటర్లు, కొందరు వీఆర్వోలూ పాత భవనంలో విధులు నిర్వర్తిస్తున్నారు. నూతన భవన నిర్మాణానికి వైకాపా పాలనలో ప్రతిపాదనలు పేరుతో హడావుడి చేసినా నిధులు మంజూరు కాలేదు.

వర్షం కురిస్తే అష్టకష్టాలే

మండల సముదాయంలో 1986లో నిర్మించిన పశు వైద్య కేంద్ర భవనం నేడు చినుకుపడితే చిత్తడవుతోంది. చివరకు అధికారి ఉండే గది పరిస్థితి అంతే. పాడి రైతులకు అందించే సరకులను వర్షం కురిస్తే నిల్వ చేయడానికి సిబ్బంది అష్టకష్టాలు పడుతున్నారు.

నేటి అవసరాలకు సరిపోని పోలీసు స్టేషన్

పోలీసు స్టేషన్ భవనం కూడా వర్షం వస్తే నీరంతా లోనికి కారుతోంది. 1999లో జన్మభూమి కార్యక్రమంలో భాగంగా రూ.లక్ష అంచనాతో నిర్మించిన భవనం నేడు వర్షాలకు ఉరుస్తోంది. నేటి అవసరాలకు భవనం ఏమాత్రం సరిపోవడం లేదు.

నత్తనడకన మండల కార్యాలయ నిర్మాణం

మండల పరిషత్ కార్యాలయానికి మూడేళ్ల క్రితం వైకాపా పాలనలో పనులు ప్రారంభించారు. భవనం నేటికీ అసంపూర్తిగానే ఉంది. స్థానిక గ్రామ సచివాలయ భవనం రెండో అంతస్తులో ఎంపీడీవో, ఎంపీపీలకు గదులు కేటాయించడం వల్ల ప్రజలకు అసౌకర్యం కలుగుతోంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి మండల కేంద్రంలోని ముఖ్యమైన కార్యాలయాలకు నేటి అవసరాలకు తగ్గట్లుగా నూతన భవనాలు నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'పిగిలాం రోడ్డు బాగుచేయండి'

నిడిగల్లు సమీపంలో రోడ్డు పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

బాలాయపల్లి, న్యూస్‌టుడే: బంగారుపేట- పిగిలాం మధ్య గుంతలమయమైన ర.భ శాఖ రహదారికి మరమ్మతులు చేయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నం పెంచలయ్య, నియోజకవర్గ కార్యదర్శి బాలకృష్ణయ్య రోడ్డును పరిశీలించారు.

మార్కెట్ యార్డ్ అభివృద్ధి పనులపై వినతి

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట ఏఎంసీ ఛైర్మన్ ఆకుతోట రమేష్ సోమవారం గుంటూరులో ఏపీ ప్రభుత్వ అగ్రికల్చరల్ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. మార్కెట్ యార్డ్ అభివృద్ధి పనులపై ఆమెకు వినతిపత్రం ఇచ్చారు.

ఉచిత శిక్షణ

తొట్టంబేడు: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేవీవై)4.0, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో యువతకు వెబ్ డెవలపర్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు శ్రీకాళహస్తి ఎస్వీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.నాగరాజనాయుడు ఓప్రకటనలో తెలిపారు.

(c) eenadu

పాల ఉత్పత్తులు పెంచుకోండిలా..

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పశుపోషణలో పాల ఉత్పత్తులను పెంచుకోవడంతో పాటు తద్వారా ఆర్థిక ప్రయోజనాన్ని పొందడంపై అవగాహన కలిగి ఉండాలని శ్రీకాళహస్తి ఏడీఏ భాస్కర్ తెలిపారు. ■ పాలల్లో వెన్న, ఘన పదార్థాల శాతం (ఫ్యాట్, ఎస్‌ఎన్‌ఎఫ్) పెరగాలంటే పాడి పశువులకు రోజూ [illegible] 20 నుంచి 30 కిలోల పచ్చి మేతతో పాటు [illegible] 8 కిలోల ఎండు మేతను చిన్న ముక్కలుగా (ఒక ఇంచి సైజులో) ఇవ్వాలి. ■ రోజూ పాలు పితికే సమయం, వ్యక్తి, విధానం ఒకే విధంగా ఉండేలా చూసుకోవాలి. ■ పశువుకు పాలు పితికే ఒక గంట ముందు నీటిని ఇవ్వరాదు. [illegible]

[illegible] కునే వీలుంటుంది. ■ పొదుగువాపు వ్యాధి రాకుండా పాలు పితికిన వెంటనే శుభ్రంగా నీటితో కడిగి శుభ్రమైన వస్త్రంతో తుడవాలి. ■ పాలు పితికిన వెంటనే 15 నిమిషాల పాటు పడుకోకుండా పచ్చి దాణా తినిపించాలి. దీంతో పొదుగు వాపు రాకుండా నివారించవచ్చు.

సిరులు పంచే పుచ్చ

డ్రిప్ ఇరిగేషన్‌తో అధిక దిగుబడులు

రైతేరాజు

కోట, న్యూస్‌టుడే: గూడూరు నియోజకవర్గ పరిధిలోని కోట, చిల్లకూరు, చిట్టమూరు, వాకాడు మండలాల్లోని పలు గ్రామాల్లో 400 ఎకరాల్లో పుచ్చసాగు చేస్తూ రైతులు మంచి లాభాలు పొందుతున్నారు. ప్రధానంగా డ్రిప్ ఇరిగేషన్, ప్లాస్టిక్ మల్చింగ్ ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందే అవకాశముండటంతో [illegible]

సాగు చేసే విధానం

[illegible]

- దేవేంద్రరెడ్డి, గూడలి, సాగు రైతు

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: ప్రశ్న: నారుమడి నుంచి నారు ప్రధాన పొలంలో నాటేటప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి? [illegible]

జవాబు: 21 నుంచి 25 రోజుల నారు [illegible]

- సుబీర్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, రేణిగుంట

జింకుతో మంచి ఫలితాలు

తిరుపతి(వ్యవసాయం), న్యూస్‌టుడే: [illegible]

[illegible] మొక్కలు దాన్ని గ్రహించలేవు. ఇలాంటి భూముల్లో రైతులు పంటపై జింక్ పిచికారీ చేయడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చు. పైరు పిలకలు పెట్టే దశలో ఉన్నప్పుడు లీటరు నీటికి 2 గ్రా. జింక్ సల్ఫేట్, 5 గ్రాముల యూరియాను కలిపి వారం [illegible] నేడు అనేక కంపెనీలు అందిస్తున్నాయి. చీలేటెడ్ జింకును పైరుపైన లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

- మెరుగు భాస్కరయ్య, ఏడీఏ(విశ్రాంత), సాగు సలహాదారు

పద్మసరోవరంలో పంచమీ తీర్థం వేదిక

సోమవారం రాత్రే గ్యాలరీల్లోకి వచ్చిన భక్తులు

పద్మావతి పంచమీ తీర్థానికి సర్వం సిద్ధం

లక్ష మందికి పైగా భక్తులు వస్తారని అంచనా

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు జరిగే పంచమీ తీర్థానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇక్కడ పుణ్యస్నానాలకు లక్ష మందికి పైగా తరలిరానున్న నేపథ్యంలో తితిదే, పోలీసు యంత్రాంగం భద్రత చర్యలు చేపట్టింది. మధ్యాహ్నం 12.10 నుంచి 12.20 మధ్య అమ్మవారికి చక్రస్నానం చేయనున్నారు. దీనిలో భాగంగా పద్మ సరోవరంలో స్నపన తిరుమంజనం జరిగే మండపాన్ని పుష్పాలతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు.

పుణ్యస్నానాలు చేసేందుకు భక్తులు సోమవారం రాత్రే తిరుచానూరు చేరుకున్నారు. వీరు వేచి ఉండేందుకు తిరుచానూరు ముఖ ద్వారం వద్ద షెడ్డు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించారు. తితిదే 150 అన్న ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేసింది. తాగునీరు, మరుగుదొడ్లను అందుబాటులో ఉంచారు. రాత్రి వచ్చిన వారు ముఖద్వారం వద్ద నున్న షెడ్డు సమీప గేట్ నంబరు-3 ద్వారా పద్మ సరోవరంలోకి వెళ్లాలి. ఇక్కడ 20 వేల మంది మాత్రమే పట్టే అవకాశం ఉండటంతో ఉదయం 10.30 తర్వాత భక్తులను దశల వారీగా స్నానాలకు అనుమతించనున్నారు. బందోబస్తుకు సుమారు 2 వేల మంది పోలీసులు తరలివచ్చారు.

భక్తులకు మర్యాదపూర్వక సేవలు

తిరుచానూరు, న్యూస్‌టుడే: పంచమీ తీర్థానికి వేల సంఖ్యలో భక్తులు రానున్నారని, పోలీసులు మర్యాదపూర్వక సేవలు అందించాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. పుణ్యస్నానాలు చేసేందుకు వచ్చే భక్తులను క్యూలైన్ల ద్వారా మాత్రమే అనుమతించాలన్నారు. భద్రత ఏర్పాట్లను సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి పరిశీలించారు.

నేడు పద్మావతికి శ్రీవారి సారె

తిరుమల: తిరుచానూరు బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని తిరుమల శ్రీవారి ఆలయం నుంచి పసుపు, కుంకుమ, ప్రసాదాలు, తులసి, వస్త్రాలు, ఆభరణాలతో కూడిన సారెను గజాలపై పంపనున్నారు. పద్మ పుష్కరిణి వద్ద సారె సమర్పిస్తారు.

సమస్యలతోనే ఆటలు

పద్మావతి డిగ్రీ కళాశాలలో అవస్థలు

అపరిశుభ్ర వాతావరణంలో ఇండోర్ స్టేడియం

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: వేల మంది విద్యార్థినులు ఉన్న కళాశాలలో క్రీడలు ఆడేందుకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో వారంతా అవస్థలు పడుతున్నారు. ఆటలపై మక్కువ ఉన్నప్పటికీ ప్రోత్సాహకం కరవవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు. ఇక్కడే ప్రత్యేకంగా క్రీడా మైదానం, ఇండోర్ స్టేడియం ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో వసతులు లేకుండా పోయాయి.

అధికారులు చర్యలు చేపట్టాలి..

క్రీడా మైదానం, ఇండోర్ స్టేడియంలో సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు కోరుతున్నారు. క్రీడల్లో రాణించాలంటే సదుపాయాలు, వసతులు కల్పించాలని వాపోతున్నారు. అపరిశుభ్రత, మొక్కలతో ఉన్న మైదానంలోకి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నామని, బాగు చేయాలని కోరుతున్నారు.

వసతుల లేమి..

కళాశాలలో 3 వేల మందికి పైగా విద్యార్థినులు చదువుతున్నారు. వందల సంఖ్యలో ఇండోర్ స్టేడియంలో పలు క్రీడల్లో శిక్షణ తీసుకుంటున్నారు. కానీ వారు సమస్యలతో క్రీడలు ఆడాల్సిన పరిస్థితి నెలకొంది. తాగునీటి కుళాయిలున్న చోట వ్యర్థాలు, స్టేడియం చుట్టూ పనికిరాని మొక్కలు, నాచుపట్టిన గోడలు, విరిగిన మరుగుదొడ్ల తలుపులే దర్శనమిస్తున్నాయి. విద్యార్థినులు వాటిని వినియోగించలేక అత్యావసర సమయాల్లో వసతి గృహానికి వెళ్లాల్సి వస్తోంది.

ఛాంపియన్‌కు సత్కారం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: చైనాలో జరిగిన ప్రపంచ కేటిల్ బెల్ ఛాంపియన్‌షిప్ అథ్లెటిక్స్‌లో రజతం సాధించిన మునీర్ అహ్మద్ షేక్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అభినందించారు. సోమవారం ఎమ్మెల్యేను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటివరకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో 18 సార్లు విజేతగా నిలిచినట్లు చెప్పారు. జనసేన నాయకుడు లోకేశ్, గంగమ్మ ఆలయ పాలక మండలి ఛైర్మన్ మహేష్‌యాదవ్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాటల రచయితకు సన్మానం

తిరుపతి (బైరాగిపట్టెడ): శ్రమజీవుల పక్షాన పాటలు రచిస్తున్న పరిశోధకుడు టి.సోమశేఖర్ (దివ్యాంగుడు)ను వేమన విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీ పి.మధు సత్కరించారు.

పీజీలో స్పాట్ అడ్మిషన్లు చేపట్టాలి

తిరుపతి (ఎస్వీయూ): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఏపీ పీజీసెట్ స్పాట్ అడ్మిషన్లు చేపట్టాలని ఎస్వీయూ పరిపాలనా భవనం వద్ద ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సోమవారం బైఠాయించారు. రిజిస్ట్రార్ భూపతినాయుడుకు వినతిపత్రం అందజేశారు. పీజీ ప్రవేశాలు తగ్గడంతో వర్సిటీలకు నష్టం కలుగుతుందన్నారు. నేతలు చలపతి, సాయికుమార్, ఉదయ్ కుమార్, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

కోతలకు ముందే మొలకలు

మొంథా తుపాను ప్రభావం నుంచి రైతులు ఇప్పటికీ బయట పడలేకపోతున్నారు. ఆ సమయంలో వరి పంట చివరి దశలో నేలకొరిగింది. తర్వాత నుంచి వర్షాలు పడుతూనే ఉండటంతో రైతులు కోతలు చేపట్టలేదు. దీంతో కంకుల నుంచి ధాన్యం మొలకెత్తాయి. చంద్రగిరి మండలంలోని దోర్నకంబాల, కల్‌రోడ్‌పల్లి, బుచ్చినాయుడుపల్లి, రామిరెడ్డిపల్లి పంచాయతీల్లో ఈ సమస్య ఉంది. మళ్లీ తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. - న్యూస్‌టుడే, చంద్రగిరి

నేడు ఎస్వీయూకు సెలవు

తిరుపతి (ఎస్వీయూ): తిరుచానూరు పంచమీ తీర్థం పర్వదినం సందర్భంగా మంగళవారం శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయానికి సెలవు ప్రకటిస్తున్నట్లు రిజిస్ట్రార్ భూపతినాయుడు ప్రకటన విడుదల చేశారు.

26న దివ్యాంగులకు ఆటల పోటీలు

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడాభివృద్ధి అధికారి శశిధర్ తెలిపారు. తిరుపతి ఎస్వీయూ స్టేడియం, శ్రీ శ్రీనివాస క్రీడా సముదాయంలో బాలబాలికలు, మహిళలు, పురుషులకు బ్యాడ్మింటన్, వాలీబాల్, అథ్లెటిక్స్, చదరంగం పోటీలు నిర్వహించనున్నారు. వివరాలకు 99668 82029, 90596 06346 నంబర్లను సంప్రదించాలన్నారు.

రూ.20 లక్షల వినికిడి యంత్రాల వితరణ

ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు యంత్రాలు అందజేస్తున్న దాత విరాట్

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుపతికి చెందిన ఎన్.విరాట్ రూ.20 లక్షల విలువైన 105 వినికిడి యంత్రాలను సోమవారం తిరుమల తిరుపతి దేవస్థానానికి అందజేశారు. యంత్రాలను తితిదే పరిపాలన భవనంలో ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు సోమవారం ఇచ్చారు. శ్రవణం ప్రాజెక్టులో శిక్షణ పూర్తి చేసుకుని బయటకు వెళ్లే పిల్లలకు వీటిని ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా దాతను ఈవో అభినందించారు.

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India

ఖమ్మం-2 గాంధీచౌక్ బ్రాంచ్ (03111) గాంధీచౌక్, ఖమ్మం-507003. ఫోన్ నెం. (08742) 231889 (DIR)/258638 (ADV)/ 253007 (GEN)/258597 (PBC) E-Mail : ubin0803111@unionbankofindia.bank

ఋణగ్రహీతకు అమ్మకం గురించి తెలియజేయు ప్రకటన (30 రోజుల నోటీసు)
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(2)/రూల్ 8 (6) ప్రకారం

టు,

మెస్సర్స్ శ్రీ వైష్ణవి డైరీ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఋణగ్రహీత & తనఖాదారుడు), సర్వే నెం. 381/2, పునబాక గ్రామం & పోస్ట్, పెళ్లకూరు మండలం, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా-524129.	శ్రీ పామిల్ జైన్ (డైరెక్టర్) తండ్రి : హేమచంద్ జైన్, ఇ.నెం. 199, ద్రోణపురి, జి.యం.యస్.రోడ్, కన్వాలి, డెహ్రాడూన్, ఉత్తరాఖండ్-248001.
శ్రీ విపిన్ జైన్ (డైరెక్టర్) తండ్రి : హేమచంద్ జైన్, ఇ.నెం.33, లేన్ 2, ద్రోణపురి, వార్డు నెం.49, కన్వాలి, డెహ్రాడూన్, ఉత్తరాఖండ్-248001.	శ్రీ రాజేష్ కుమార్ చౌడ (హామీదారులు) తండ్రి : మన్సుఖలాల్ చౌడ ఇ.నెం. 2-3-99, గాంధీచౌక్, ఖమ్మం, తెలంగాణ-507003
శ్రీ దివ్వెల వెంకటేశ్వరరావు (హామీదారులు) తండ్రి : సూర్యప్రకాష్ రావు, ఇ.నెం.3-8-216/217, జహీర్‌పుర, గాంధీచౌక్, ఖమ్మం, తెలంగాణ-507003	శ్రీ మురళీధర్ భుటడ (హామీదారులు) తండ్రి : పన్నాలాల్, ఇ.నెం. 2-2-2, గాంధీచౌక్, ఇల్లందు, ఖమ్మం జిల్లా, తెలంగాణ-507123.
శ్రీ దయారాం శ్రావణ్ కుమార్ (హామీదారులు) తండ్రి : దయారాం ప్లాట్ నెం.65, అంబియన్స్ ఫోర్ట్ కాలనీ, పిల్లర్ నెం.125 ఎదురుగా, అత్తాపూర్, రాజేంద్రనగర్, హైదరాబాద్, తెలంగాణ-500048.	మెస్సర్స్ శ్రీ వైష్ణవి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (కార్పొరేట్ హామీదారులు), సర్వే నెం. 254/ఎ, 254/ఎ/ఎఎ, 44/3/ఎ, గుండ్రాతిమడుగు గ్రామం, కొణిజర్ల మండలం, ఖమ్మం జిల్లా, తెలంగాణ-507165.

సర్ / మేడమ్,

విషయం : సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ 2002 (సర్ఫేసి యాక్ట్ 2002) కింద బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తాన్ని రాబట్టడం కోసం మెస్సర్స్ శ్రీ వైష్ణవి డయిరీ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఋణగ్రహీత & తానఖాదారు) కు చెందిన ఆస్తి అమ్మకం సర్వే నెం. 381/2, పునబాక గ్రామం & పోస్ట్ పెళ్లకూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-524129కు నోటీసు జారీచేయబడినది.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గాంధీచౌక్ బ్రాంచ్, ఖమ్మం-2, గాంధీచౌక్, ఖమ్మం-507003 వద్ద గల సురక్షిత ఋణదాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(2) క్రింద ది. 15-04-2025న ఒక డిమాండ్ నోటీసును జారీ చేసింది. అందులో పేర్కొన్న గడువులోగా బకాయిలను చెల్లించవలసినదిగా మిమ్మల్ని కోరడమైనది. మీరు ఆ నోటీసుకు అందులో నిర్దేశించిన కాలవ్యవధిలోగా స్పందించడంలో విఫలమైనందున అధీకృత అధికారి గారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 6/8తో కలిపి చదువుతూ ది.18-11-2025న ఆ సురక్షిత ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు.

సెక్యూర్డ్ ఆస్తిని స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తాన్ని చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు అందిన తేదీ నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ విధానం ద్వారా ప్రజా ఇ-వేలం నిర్వహించడం ద్వారా క్రింద పేర్కొన్న ఆస్తిని విక్రయించడం అవసరమైంది. ఇ-వేలం నిర్వహించబడే తేదీ, సమయం, ఆస్తి యొక్క రిజర్వు ధర మరియు ఇ-వేలం నిర్వహించుచున్న సర్వీసు ఏర్పాటుదారు వివరాలను మీకు విడిగా తెలియజేయడం జరుగుతుంది.

అందువల్ల మీరు అమ్మకపు నోటీసు ప్రచురింపబడే తేదీ కంటే ముందుగా బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తాన్ని తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు బ్యాంకుకు అయిన ఇతర వ్యయాలతో సహా చెల్లించినట్టయితే, ఆస్తి అమ్మకానికి సంబంధించి తదుపరి చర్యలు తీసుకోబడవు. మరియు మీరు ఆ చట్టంలోని సెక్షన్ 13(8) లో నిర్దేశించినట్లుగా మీ ఆస్తిని విముక్తి చేసుకోవచ్చు.

తనఖా ఉంచిన ఆస్థి యొక్క వివరములు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, పెళ్లకూరు మండలం, పునబాక గ్రామం సర్వే నెం. 381/2, విస్తీర్ణం ఎ. 9.25 సెంట్లు పారిశ్రామిక ఫ్యాక్టరీ స్థలం మరియు భవనం, ప్లాంటు మిషనరీ మొత్తం యావదాస్థి యొక్క సరిహద్దులు : తూర్పు : శాఖామూరి విజయలక్ష్మి మరియు శాఖామూరి సుశీలమ్మ గార్ల భూమి, పడమర : పునబాక రోడ్డు, ఉత్తరం : మట్టి రోడ్డు మరియు గొంగిరెడ్డి సుధాకర్ రెడ్డి మరియు ఇతరుల భూమి, దక్షిణం : చెంబేడు రోడ్డు.

తేది : 18-11-2025 సం/- అధీకృత అధికారి,
స్థలం : పునబాక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బాలుర జట్టుకు ట్రోఫీ అందిస్తున్న కూటమి నాయకులు, నిర్వాహకులు

హాకీ పోటీల విజేత వైఎస్సార్ కడప

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరిలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14 విభాగం హాకీ పోటీల్లో వైఎస్సార్ కడప బాలబాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. వీరికి ఏఎంసీ అధ్యక్షుడు గోస్‌బాషా, తెదేపా మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి ట్రోఫీలు అందజేశారు.

విద్యుత్తు శాఖ సమస్యలపై 65 వినతులు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం జరిగిన డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి 65 వినతులు వచ్చినట్లు సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు. అధికారులతో కలిసి ఆయన ఫోన్ ద్వారా సమస్యలు తెలుసుకున్నారు. కర్నూలు జిల్లా నుంచి 17, తిరుపతి నుంచి 12 సమస్యలు వచ్చాయన్నారు. వాటిని పరిష్కరించాలని ఆయా జిల్లాల అధికారులను ఆదేశించారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం: కలెక్టర్

తిరుపతి (కలెక్టరేట్): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 288 వినతులు వచ్చాయి. కలెక్టర్ డా.వెంకటేశ్వర్, శిక్షణ కలెక్టర్ సందీప్ రఘువాన్షీ, డీఆర్వో నరసింహులు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్‌మాండ్ అర్జీలు స్వీకరించారు. వాటికి సకాలంలో పరిష్కారాలు చూపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకురాలు సుధా రాధాకృష్ణన్

కాంగ్రెస్ బలోపేతంపై దృష్టి

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: గ్రామస్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) పరిశీలకురాలు, ఎంపీ ఆర్.సుధా రామకృష్ణన్ సూచించారు. తిరుచానూరులో తిరుపతి నియోజకవర్గం పార్టీ నేతలతో సమావేశమయ్యారు. క్రమశిక్షణ, కష్టపడి పనిచేసే వారికి అవకాశం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ నాయకులు ప్రాధాన్యం ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీసీసీ పరిశీలకుడు మదన్మోహన్, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్, పీసీసీ ఉపాధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, జిల్లా, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరిపై పీడీ యాక్టు

ఈనాడు- తిరుపతి: గంజాయి, హత్య కేసుల్లో నిందితులైన ఇద్దరిపై పీడీ యాక్టు ప్రయోగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. పులిచెర్ల మండలం కమ్మపల్లికి చెందిన వట్టికుంట అరుణ్‌కుమార్ (32)పై నాలుగు కేసులు ఉన్నాయి. తిరుపతి నగరం కొర్లగుంటకు చెందిన సయ్యద్ అజీమ్ (30) గంజాయి, హత్య, దొమ్మీ కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే వీరిద్దరిపై పీడీ యాక్టు నమోదు చేశారు. ఈ నెల 21న తిరుపతి జిల్లాకు చెందిన నలుగురిపై పీడీ యాక్టు ప్రయోగించిన సంగతి తెలిసిందే.

రైతుల సంక్షేమంపై దృష్టి

కార్యక్రమం ప్రారంభిస్తున్న నాయకులు

తిరుపతి (గ్రామీణం), రామచంద్రాపురం, పాకాల, చిన్నగొట్టిగల్లు: రైతుల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. తిరుపతి మండలం మల్లంగుంటలో 'రైతన్నా.. మీ కోసం' కార్యక్రమం ప్రారంభించారు. మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. రామచంద్రాపురం మండలం మిట్టకండ్రిగలో తెదేపా నాయకులు హరిప్రసాద్‌నాయుడు, మహేష్‌నాయుడు, చిన్నగొట్టిగల్లులో తెదేపా మండలాధ్యక్షుడు మురళి, క్లస్టరు ఇన్‌ఛార్జి శివకుమార్, పాకాల మండలంలో ఏవో హరితకుమారి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: మత్తు పదార్థాలు జీవితాలను నాశనం చేస్తాయని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి సూచించారు. కళాశాలలో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, రాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. డైరెక్టర్లు రామసుబ్బారెడ్డి, అరవిందుకుమార్‌రెడ్డి, దామోదర్, ప్రిన్సిపల్ కె.జయచంద్ర, జేవీవీ కార్యదర్శి రెడ్డెప్ప, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం కన్వీనర్ ఎస్.చక్రిశ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ధ్రువపత్రం ఇస్తున్న ప్రిన్సిపల్ నారాయణమ్మ

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

తిరుపతి (మహిళా వర్సిటీ, విద్య), న్యూస్‌టుడే: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థిని లహరి ప్రతిభ చూపింది. భగవద్గీత కంఠస్థ పోటీలోనూ బహుమతి సాధించింది. ప్రిన్సిపల్ నారాయణమ్మ, తెలుగు విభాగాధిపతి కృష్ణవేణి అభినందించారు. ● తితిదే ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని ఎస్.హసన్‌వల్లీ తెలుగు వ్యాసరచన పోటీల్లో ద్వితీయ బహుమతి, కె.తులసి సాక్ష ఆంగ్ల వ్యాసరచన పోటీలో తృతీయ బహుమతి సాధించారు. ప్రిన్సిపల్ డా.వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా.మల్లికార్జున, తెలుగు విభాగాధిపతి డా.భీమన్న, విజయశ్రీ, కిరణ్‌కుమార్‌రాజు, శ్రీదేవి అభినందించారు.

తెలుగు అకాడమీ అభివృద్ధికి కృషి

తెలుగు, సంస్కృత అకాడమీ రాష్ట్ర ఛైర్మన్ విల్సన్ శరత్‌చంద్రను సత్కరిస్తున్న ప్రతినిధులు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.డి.విల్సన్ సోమవారం తిరుపతి నగరంలోని పలు విశ్వ విద్యాలయాల ఉప కులపతులు, రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలుగు అకాడమీ అభివృద్ధికి, ముద్రణ పనులను అకాడమీ ద్వారా చేసేలా సహకరించాలని కోరారు. అనంతరం ఆయన్ను తిరుపతి పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు సత్కరించారు.

తప్పిపోయిన చిన్నారి.. గంటలోనే గుర్తింపు

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు పద్మావతి అమ్మవారి దర్శనానికి వచ్చి తప్పిపోయిన చిన్నారిని పోలీసులు గంటలోనే గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. సోమవారం తమిళనాడు తిరువళ్లూరు జిల్లా కొత్తగుమ్మిడిపూండికి చెందిన సురేంద్ర, సుమన్ దంపతుల రెండేళ్ల కుమార్తె దాన్వితో తిరుచానూరు వచ్చారు. రద్దీ ఎక్కువ ఉండటంతో దాన్వి తప్పిపోగా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు సిబ్బందిని అప్రమత్తం చేసి.. సీసీ కెమెరాల్లో పుష్కరిణి పరిసర ప్రాంతాల్లో చిన్నారిని గుర్తించారు. ఎస్సై సాయినాథ్ చౌదరి దాన్విని తల్లిదండ్రులకు అప్పగించారు.

కాకర్లవారిపల్లి పరిసరాల్లో చిరుత సంచారం

పాకాల, న్యూస్‌టుడే: మండలంలోని దామల చెరువు పంచాయతీ కాకర్లవారిపల్లి, మొరవపల్లి, ఐరాల మండలంలోని నాగులవారిపల్లి, గుట్టపాళ్యం, గూబలవారిపల్లి పరిసరాల్లో చిరుత సంచారం కలకలం రేపింది. గూబలవారిపల్లికి చెందిన యువకుడు తమ ఆవు తప్పిపోవడంతో ఆదివారం రాత్రి కాకర్లవారిపల్లి పొలాల వైపు వెళ్లాడు. చిరుత మీదకు రావడంతో పరుగులు పెట్టాడు. రెండు రోజుల క్రితం నాగులవారిపల్లి సమీపంలోని నెట్టుకనుమ వద్ద సైతం ఓ ద్విచక్రవాహనదారుడు చిరుతను చూసినట్లు చెప్పాడు. చుక్కావారిపల్లి పరిసరాల్లో లేగదూడలపై చిరుత దాడి చేసిందని గ్రామస్థులు చెప్పారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని, 83092 55631కు సమాచారం ఇవ్వాలని అటవీ అధికారులు సూచించారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

పాకాల, న్యూస్‌టుడే: పాకాల సమీపంలోని ముద్దలపల్లి వద్ద రైలు పట్టాల పక్కన గుర్తు తెలియని యువకుడు (30) మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. నీలం రంగు గళ్లచొక్కా, జీన్ ప్యాంటు ధరించి ఉన్నట్లు చెప్పారు. రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చిత్తూరు ఆర్పీఎఫ్ ఎస్సై జి.ధర్మేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు ఘటనాస్థలాన్ని సందర్శించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వివాహిత బలవన్మరణం

పాకాల, న్యూస్‌టుడే: వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పేరసానిపల్లి పంచాయతీ గుండ్లగుట్టపల్లికి చెందిన పి.నందిని (25) కుటుంబంలో జరుగుతున్న గొడవల కారణంగా మనస్తాపానికి గురైంది. రెండు రోజుల క్రితం గన్నేరు పప్పు తిని అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు గుర్తించి తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

తిరుమల ఘాట్‌రోడ్డులో కారు బోల్తా

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో 2వ కిలోమీటర్ వద్ద బ్రేకులు ఫెయిలవడంతో చెన్నైకు చెందిన భక్తులు వెళ్తున్న కారు అదుపు తప్పి బోల్తా పడింది. ముగ్గురు భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఘాట్‌రోడ్డు భద్రతా సిబ్బంది కారును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

EENADU Classifieds JOBS

WANTED CHEMIST (Male) B.Sc., Chemistry/ B.Pharmacy M/s. Coastal Laboratories, Akkampeta, TADA. 70133 32427, info@coastal-labs.com.

Wanted Service Technicians Fresher or Exp. Electrical and Electronics ITI, Diploma or any Technical Exp. ✆ 93901 52768

ఎలక్ట్రీషియన్లు కావలెను. AP SPDCL పరిధిలో చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు & అనంతపురం జిల్లాల్లో వర్క్స్ చేయుటకు ఎలక్ట్రీషియన్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్లు కావలెను. జీతం 20K To 30K. Con: 73307 05344, 089131 41574.

EENADU THE Ec WAY CLASSIFIEDS B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి B/W: రూ. 600 Colour: రూ. 800 ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఇంటికే ఉద్యోగం!

సచివాలయాల్లో ఎంపిక పరీక్షలకు సన్నాహాలు

తగరపువలస, గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ‘కౌశలం’ పేరిట ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన ‘వర్క్ ఫ్రం హోం’ విధానంలో ఉద్యోగాల ఎంపికకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణకు వెబ్ కెమెరాలు, హెడ్ ఫోన్లను అందించింది. ప్రతి సచివాలయంలో ఇద్దరు సిబ్బందికి ఇటీవల ఆన్‌లైన్ నమూనా పరీక్షలను విజయవంతంగా చేపట్టింది.

★ విద్యార్హత ఆధారంగా ఉపాధి కల్పనకు పదో తరగతి నుంచి పీజీ వరకూ చదివిన అభ్యర్థుల వివరాలను సచివాలయ సిబ్బంది ద్వారా సర్వే చేశారు. వీరికి సొంత కంప్యూటర్, ల్యాప్‌టాప్, ఇంటర్‌నెట్ సదుపాయం, ప్రత్యేక గది వంటి సదుపాయాలు ఉన్నాయా లేవా అన్న అంశాలను సేకరించారు. విద్యార్హత ఆధారంగా సచివాలయాల్లోనే ఆన్‌లైన్‌లో ఎంపిక పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా కంపెనీల అవసరాల మేరకు భర్తీ జరుగుతుంది.

★ అర్హులైన వారికి ఉద్యోగ నియామకాల సమాచారం ఫోన్, ఈ-మెయిల్ ద్వారా చేరుతుంది.

జిల్లాలో పరిస్థితి ఇలా...

వర్క్ ఫ్రం హోం దరఖాస్తుకు గుర్తించినవారు	సర్వేలో నమోదు చేసుకున్న వారు :	ప్రభుత్వ లేదా ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న వారు:	★ ఆసక్తి లేనివారు: 9,267
1,73,763	85,490	2,724	★ మృతులు: 330

★ వలసదారులు: 16,300 ★ మిగిలిన వారు: 59,652

★ కౌశలం (వర్క్ ఫ్రం హోం)లో పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులకు త్వరలో ఎంపికలు నిర్వహించేందుకు ప్రభుత్వపరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సమీప సచివాలయాల్లోనే ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి.

– నిర్మలాదేవి (భీమిలి డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి)

ఫిర్యాదుదారులతో అధికారులు మాట్లాడాల్సిందే | కలెక్టర్ హరేంధిర ప్రసాద్ స్పష్టీకరణ 6లో

కనువిందుగా అలంకరణ

మార్గశిర మాసం నేపథ్యంలో కనకమహాలక్ష్మి ఆలయానికి సోమవారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి కనువిందుగా అలంకరణ చేశారు. –న్యూస్‌టుడే, వన్‌టౌన్

పేరు నీళ్లది.. పెత్తనం వీళ్లది!!

నీటి సరఫరా టెండర్లలో కుమ్మక్కు!!

ఈనాడు–విశాఖపట్నం: మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మంచి నీటి సరఫరా విభాగంలో కొందరు అధికారుల హవా నడుస్తోంది. అనుకున్న గుత్తేదారుకే పనులన్నీ కట్టబెట్టేందుకు చక్రం తిప్పుతున్నారు. టెండర్లు ఓపెన్ చేయకుండా తాత్సారం చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు సైతం కమిషనర్ దృష్టికి వెళ్లకుండా ఓ విశ్రాంత అధికారి కీలకంగా వ్యవహరిస్తున్నారు.

▶▶ **రూ.35లక్షల టెండర్:** జీవీఎంసీ పరిధిలో పదివేల లీటర్ల ట్యాంకర్, 5వేల లీటర్ల ట్యాంకర్‌తో ఏడాది పాటు నీటి సరఫరా చేయడానికి రూ. 35.57 లక్షలతో టెండర్లు పిలిచారు. కొందరు అధికారులు లోపాయికారీగా గుత్తేదారుతో ఒప్పందాలు చేసుకుని గత కొన్నేళ్లుగా ఒకరికే దక్కేలా చూస్తున్నారు. తాజా టెండర్‌ను కూడా సదరు గుత్తేదారు 25శాతం లెస్‌కు వేసినట్లు చెప్పుకుంటున్నారు. అయితే పోటీలో ఉన్న మరో గుత్తేదారు ఏకంగా 28శాతం లెస్‌కు టెండరు వేశారు.

ఈ విషయం తెలుసుకున్న ఓ అధికారి... అక్టోబర్ 3న టెండర్ ఓపెన్ చేయాల్సి ఉన్నా ఇంత వరకు తెరవలేదు. ఎవరికీ కాంట్రాక్టు అప్పగించకుండా జాప్యం చేస్తున్నారు.

కొందరు అధికారులు కుమ్మక్కై డమ్మీ టెండర్లు వేయించినట్లు తెలిసింది. నకిలీ రసీదులు ముద్రించిన గుత్తేదారుకే ఈ కాంట్రాక్టు దక్కేలా చక్రం తిప్పారు. విచిత్రమేమంటే టెండర్‌లో చూపించిన ట్యాంకర్ దేనికీ పనికిరాని డొక్కు స్థితిలో ఉంది. తుక్కుగా ఉన్న ఈ వాహనాన్ని అడ్డంపెట్టుకొని రూ. లక్షలు కొట్టేసేలా అడుగులు వేశారు.

ఏడాదిపాటు జీవీఎంసీ అవసరాలకు ట్యాంకర్‌తో నీటిసరఫరా చేయడంతోపాటు, మరమ్మతుల సామగ్రి, ఇతర పనులకు ఉపయోగించుకునేలా ఓ టాటా ఏస్ వాహనానికి రూ. 28 లక్షలకు తాజాగా టెండర్ పిలిచారు.

పాతదైన ఈ ట్యాంకర్‌కే కాంట్రాక్టు కట్టబెట్టారు.

కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా: ‘టీఎస్ఆర్’లో నకిలీ రసీదులు ఉపయోగించి నీటిని తీసుకెళుతూ పట్టుబడినా, ట్యాంకర్లకు బదులు టీవీఎస్ ద్విచక్రవాహనాల నెంబర్లు పెట్టి బిల్లులు మింగేసినా అధికారులు సదరు గుత్తేదారుకే పెద్దపీట వేస్తున్నారు. తాజాగా సుమారు రూ. కోటిపైగా విలువైన పనులు కట్టబెట్టి స్వామిభక్తి చాటుకున్నారు. ఈ వ్యవహారంపై కొందరు జీవీఎంసీ కమిషనర్‌కు ఆధారాలతో పీజీఆర్ఎస్‌లో మూడుసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. నీటిసరఫరా విభాగంలో ఉన్నతస్థాయిలో పదవీ విరమణ పొంది, తిరిగి జీవీఎంసీలో పాగా వేసేందుకు చూస్తున్న ఓ అధికారి ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుంటున్నట్లు సమాచారం.

దిగ్గజాల రాకతో వైభవమే!!

జనవరి నుంచి కాగ్నిజెంట్ కార్యకలాపాలు

త్వరలో మిలీనియం టవర్స్‌లో టీసీఎస్ ప్రారంభోత్సవం

ఈనాడు–విశాఖపట్నం

సాగర తీరంలో ఐటీ దిగ్గజ కంపెనీలు తమ కార్యకలాపాలకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే రుషికొండ ఐటీ హిల్-3లోని మిలీనియం టవర్స్‌లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) గ్రూపు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. ఇదే బాటలో మరో దిగ్గజ సంస్థ ‘కాగ్నిజెంట్’ అడుగులు వేస్తోంది. వచ్చే ఏడాది జనవరి నుంచి తన కార్యకలాపాలను తాత్కాలికంగా ప్రారంభించేందుకు ప్రణాళిక చేస్తోంది. ఇందుకు అవసరమైన భవనాలను సైతం వారం రోజుల క్రితం ఐటీ హిల్స్‌లో గుర్తించి, లీజుకు తీసుకున్నట్లు సమాచారం.

కేటాయింపు	22 ఎకరాలు (కాపులుప్పాడలో)
పెట్టుబడి	రూ. 1,583 కోట్లు
ఉపాధి	800 మందికి (సుమారు)

మొదటి దశలో మూడు దశల్లో ‘కాగ్నిజెంట్’ క్యాంపస్ విస్తరించేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. 2029 నాటికి మొదటి దశ శాశ్వత క్యాంపస్ పూర్తి చేయనున్నారు. అప్పటి వరకు 800 మంది ఉద్యోగులతో తాత్కాలిక కార్యాలయం వచ్చే ఏడాది జనవరి నుంచి ప్రారంభించనున్నారు. ఇందుకు అవసరమైన భవనాల నిమిత్తం మహతి బ్లాక్‌ను లీజుకు తీసుకుని వారం రోజుల క్రితం ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది. మొదట జనోసాఫ్ట్ ఎక్సెటీ గ్లోబల్ కంపెనీకి ఉన్న భవనాన్ని చూశారు. అయితే అక్కడ కొన్ని సమస్యలుండటంతో, ప్లగ్ అండ్ ప్లేకు సిద్ధంగా ఉన్న ఫిన్‌టెక్ వ్యాలీలోని మహతి భవనాన్ని ఎంచుకున్నట్లు సమాచారం.

ఏ క్షణంలోనైనా సిద్ధంగా

రుషికొండ ఐటీహిల్స్‌పై టీసీఎస్ కార్యకలాపాలు ప్రారంభించడానికి సిద్ధంగా ఉంది. హిల్-3లోని మిలీనియం టవర్లో లీజు ప్రాతిపదికన కేటాయించిన 16, 17 అంతస్తుల్లో టీసీఎస్ కంపెనీ నెమ్మదిగా ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. తొలిదశలో రెండు షిఫ్టుల్లో 2 వేల మంది ఉద్యోగులతో ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ఒప్పందం చేసుకున్న ఐటీ కంపెనీ ఇదే. ఐటీ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా ఏ క్షణంలోనైనా ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

కేటాయింపు	22 ఎకరాలు (ఐటీ హిల్-3పై)
పెట్టుబడి	రూ. 1,379 కోట్లు
ఉపాధి	12,000 మందికి (సుమారు)

ఇదిగో వరల్డ్ కప్!

హాకీ మెన్స్ జూనియర్ వరల్డ్‌కప్ పోటీలు తమిళనాడులో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో విజేతలకు అందించే ట్రోఫీని నగరంలో ప్రదర్శించి హాకీ క్రీడాకారుల్లో సరికొత్త ఉత్సాహం నింపారు. విశాఖ ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. 6లో

అధునాతనం.. అంధులకు వరం!

ఈనాడు, విశాఖపట్నం: పుట్టుకతోనే అంధులైన, ప్రమాదవశాత్తూ చూపు కోల్పోయినవారికి బ్రెయిలీ లిపి ఒక వరం. దీన్ని నేర్చుకోవడంలో చిన్నారులు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారు. అలాంటి వారిలో అక్షరాస్యత పెరగడానికి గీతం విశ్వవిద్యాలయానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఖాజా మొయినుద్దీన్ చిష్తీ అధునాతన బ్రెయిలీ లెర్నింగ్ కిట్‌ను అభివృద్ధి చేశారు. సాధారణంగా విద్యార్థులకు బ్రెయిలీ నేర్పాలంటే ఉపాధ్యాయులు ఎక్కువ సమయం, ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సి వస్తోంది. ప్రారంభంలో చాలా మంది విద్యార్థులు ఒకేలా ఉండే అక్షరాలను తెలుసుకోవటానికి, వాటి మధ్య భేదం గుర్తించడానికి ఇబ్బంది పడుతుంటారు. ఈ కిట్ ద్వారా విద్యార్థులు స్వతంత్రంగా నేర్చుకోవచ్చు. ఇందులో సెన్సార్లతో కూడిన హాల్ హెమీస్ఫియర్ బ్రెయిలీ సెల్ అమర్చారు. విద్యార్థులు ఏదైనా నమోదు చేస్తే.. సెన్సార్లు దాన్ని కచ్చితత్వంతో గుర్తిస్తాయి. వాటిని డీకోడ్ చేసి.. అక్షరాలు, సంఖ్యలు, పదాలను ఆడియో రూపంలో తెలియజేస్తుంది. ఈ ఆవిష్కరణకు పేటెంట్ కోసం దరఖాస్తు చేశారు. ‘తక్షణ ప్రతిస్పందనతో ఉపాధ్యాయులు లేకున్నా విద్యార్థులు సాధన చేయడానికి, తప్పులు సరిదిద్దుకోవడానికి, అవగాహన పెంచుకోవడానికి ఉపయోగపడుతుంది. ఈ ఆవిష్కరణ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచుతుంది’ అని ప్రొఫెసర్ మొయినుద్దీన్ అభిప్రాయపడ్డారు.



బ్రెయిలీ లెర్నింగ్ కిట్

పర్యవేక్షణ శూన్యం.. కుంగిన మార్గం!!

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియం వద్ద జీవీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల సోమవారం నడక మార్గం కుంగిపోయింది. గతంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్సు స్థానంలో రూ.1.80 కోట్లతో కొత్తగా నిర్మాణ పనులు చేపట్టి గోతులు తవ్వారు. ఈ గోతుల కారణంగా..ఇటీవల నిర్మించిన నడకమార్గం కిందనున్న మట్టి జారిపోయి ఒక్కసారిగా కుంగిపోయింది. ఆ సమయంలో అక్కడెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అధికారుల పర్యవేక్షణ లేకుండా నిర్మాణాలు చేపట్టడమేమిటనే విమర్శలొస్తున్నాయి. డీఈ చంద్రమౌళి, ఏఈ సుజాత వద్ద ఈ విషయం ప్రస్తావించగా కుంగిన నడక మార్గం వ్యర్థాలను తొలగించి ఆ మేరకు కొత్తగా నిర్మిస్తామన్నారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కొరాపుట్ వరకే కిరండూల్ రైలు

రైల్వే స్టేషన్, న్యూస్‌టుడే: కొరాపుట్-దంతెవాడ మధ్య భద్రతా పరమైన పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈనెల 25న విశాఖ - కిరండూల్(58501/02) రైళ్లు కొరాపుట్‌లో నిలిచిపోయేలా మార్పు చేసినట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె. పవన్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే ఈ రైళ్లను దంతెవాడ వరకు కుదించి నడుపుతున్నప్పటికీ మంగళవారం కొరాపుట్ వరకే నడిచేలా మార్పు చేశారు. కొరాపుట్-దంతెవాడ-కొరాపుట్ మధ్య రాకపోకలన్నీ రద్దు చేశారు. ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

ఆకృతులతో ఆటలా!

బీచ్ రోడ్‌లోని వుడా పార్కులో పచ్చటి మ్యాట్‌లతో ఏనుగు ఆకృతులను రూపొందించారు. పార్కులోకి వచ్చే వారిని ఇవి ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. అయితే...నిర్వాహకుల పర్యవేక్షణ లోపించడంతో పలువురు సందర్శకులు ఫొటోల నిమిత్తం పిల్లలను వాటిపై కూర్చోబెడుతున్నారు. కొందరు వీటిపైకి చేరి ఆటలాడుతున్నారు. నిరోధించాల్సిన సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఇలాగే కొన్ని రోజులు గడిస్తే ఏనుగుల ఆకృతులు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. –ఈనాడు, విశాఖపట్నం

‘పురమిత్ర’ ఫిర్యాదులను పరిష్కరించండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పురమిత్ర యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. ఆయన కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జోనల్ కమిషనర్లతో మాట్లాడారు. ప్రతి ఫిర్యాదుపై వార్డు సచివాలయ కార్యదర్శులు స్పందించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వార్డు సచివాలయ కార్యదర్శులు నిత్యం క్షేత్రస్థాయిలో తిరుగుతూ సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రతివారం పురమిత్ర సమస్యలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని వాటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. వచ్చిన ఫిర్యాదులే మళ్లీ వస్తున్నాయని అలా కాకుండా చూడాలన్నారు.

మాటిస్తున్నాం.. మార్పు తెస్తున్నాం

★ జిల్లాలో భవిత కేంద్రాలు: 11

★ ప్రభుత్వ పాఠశాలల్లో మానసిక దివ్యాంగ పిల్లలు: 2625

★ ఫిజియో థెరపిస్టులు: 03

★ శిక్షకులు: 22

ఈనాడు, విశాఖపట్నం: ప్రత్యేక అవసరాల పిల్లలకు కొత్త విషయం నేర్పించాలంటే కొంచెం కష్టమే. వారిని ఇంట్లోనే ఉంచేస్తే బయటి విషయాలపై అవగాహన రాదు. అలాగని ప్రైవేటు శిక్షణ కేంద్రాల్లో చేరిస్తే బోలెడంత ఖర్చు. అలాంటి పిల్లల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న భవిత కేంద్రాలు వరంలా మారాయి. ఆరోగ్యం, వికాసం పరంగా దివ్యాంగ, మానసిక వైకల్య బాధిత చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నాయి. అక్కడ చదువు, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ అందిస్తూ... ఇతర కార్యకలాపాలు చేయిస్తున్నారు. వీరికి ఇచ్చే భత్యం తల్లిదండ్రుల ఖాతాల్లోనే జమ చేస్తున్నారు.

‘భవిత’ కేంద్రాల్లో అపురూప సేవలు

స్పీచ్ థెరపీ ఇస్తున్న శిక్షకురాలు

వయసును బట్టి...

» ఏటా వేసవిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, చిన్నారుల వయసును బట్టి తగిన తరగతిలో ప్రవేశాలు కల్పిస్తారు.

» పిల్లల సామర్థ్యాలకు అనుగుణంగా స్వతహాగా ఎదిగేందుకు అవసరమైన నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తారు. కేంద్రాల్లో వారంలో రెండు సార్లు ఫిజియోథెరపీ చేస్తారు.

» ఇంట్లో ఉండే చిన్నారులకు ప్రతి శనివారం శిక్షకులు వెళ్లి కనీస అవసరాలు నేర్పిస్తారు. సొంతంగా పనులు చేసుకోలేని పిల్లలకు తల్లిదండ్రుల సమక్షంలోనే శిక్షణ ఇచ్చి.. వారితోనే రోజూ చేయించేలా చూస్తారు.

ఏటా ఆలిమ్కో సంస్థ వైద్య శిబిరం నిర్వహించి, చిన్నారుల అవసరాలకు తగ్గట్టుగా పరికరాలు అందిస్తుంది. » ఉన్నత పాఠశాలల్లోనూ 11 మంది ప్రత్యేక విద్యా నిపుణులు ఉంటారు. ఆ పిల్లలకు అవసరాలకు తగ్గట్టుగా అవసరమైన పరికరాలు అందిస్తారు. వారికి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు.

ఏడాదికోసారి భత్యం

పాఠశాలలకు వెళ్లడానికి ముందుగా భవిత కేంద్రాల్లో చేర్చుకుంటాం. పాఠశాల పిల్లలకు మాదిరిగానే అన్ని సదుపాయాలు కల్పిస్తాం. వారికి ఏడాదికోసారి భత్యం అందిస్తున్నాం. 2024-25 సంవత్సరానికి సంబంధించి ప్రత్యేక అవసరాలున్న 1,006 మంది విద్యార్థులకు భత్యాలు మంజూరు చేసింది’ అని సమగ్ర శిక్షా ఏపీసీ డా. చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు.



‘అనిశా’ కేసున్నా అందలమేనా?!

కీలక పోస్టుపై కన్నేసిన అధికారి

ఈనాడు, విశాఖపట్నం

అవినీతి నిరోధకశాఖ(అనిశా) కేసులున్న అధికారులు విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ(వీఎంఆర్‌డీఏ)లో డీఎఫ్‌వోగా చేరేందుకు ప్రయత్నాలు సాగిస్తుండటం చర్చనీయాంశమవుతోంది. ‘అనిశా’ కేసుల నేపథ్యంలో సస్పెండ్ అయిన ఓ అధికారి ఇక్కడ చేరేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు సైతం రానున్నట్లు సమాచారం. ప్రస్తుత నగర అభివృద్ధి, సుందరీకరణలో కీలకంగా ఉన్న వీఎంఆర్‌డీఏలో అటువంటి అధికారులు చేరితే అక్రమాలకు ఆస్కారం తప్పదంటున్నారు. ప్రస్తుతం ఎఫ్ఆర్‌వో సుజాత శివాని ఇన్‌ఛార్జి డీఎఫ్‌వోగా కొనసాగుతున్నారు. ఏడాదిగా ఇన్‌ఛార్జి పాలనలోనే ఈ పోస్టు ఉంది. గతంలో కేసులున్న ఒకరిద్దరు ఇక్కడ చేరేందుకు నేతలను ఆశ్రయించారు. కేసులుండడంతో అప్పట్లో వారిని చేర్చుకోలేదు. గతంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పలు హోదాల్లో పనిచేసి అనిశాకు చిక్కి సస్పెండ్ అయిన ఓ అధికారి మళ్లీ వీఎంఆర్‌డీఏ వైపు చూస్తున్నారు.

అక్కడ అంతేనా

వీఎంఆర్‌డీఏ అటవీ విభాగంలో అనేక రకాల ప్రాజెక్టులు నిర్వహించాలి. పార్కుల నిర్వహణ, సుందరీకరణ కీలకం. మొక్కలు పెద్ద సంఖ్యలో నాటాలి. వీటికి భారీగానే సొమ్ములు ఖర్చు పెట్టాలి. అంతటి కీలకమైన పోస్టులో నిబద్ధత కలిగిన అధికారులను నియమించాలి. కానీ, వీఎంఆర్‌డీఏలో కొంతకాలంగా అనిశా కేసులున్న వ్యక్తులు పనిచేయడం పరిపాటిగా మారిపోయింది. గతంలో డీఎఫ్‌వోలుగా పనిచేసిన ముగ్గురు, నలుగురిపై ఏసీబీ దాడులు జరిగిన నేపథ్యం ఉంది.

WANTED Experienced

1. **CAD Engineers / Draftman : 10 Nos**
ITI/Diploma and having basic knowledge /experience in 2D & 3D Modelling in Mechanical field.
2. **CNC Operators (Milling/ Turning) : 10 Nos**
Experience: 01 Year and above

for Ultra Dimensions Factory

Interested Candidates with relevant experience can contact :

M/s **Ultra Dimensions Pvt Ltd**
Plot No. 2B, 3, Near IIM,
IT - Gambheeram, Anandapuram
Visakhapatnam-531163.
Ph: 08933-293333/ 293666/293888,
hr@ultradimensions.com

పెట్టెలు సరే... మందులేవీ?

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, మద్దిలపాలెం: ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు అలంకార ప్రాయంగా మారాయి. ఏ బాక్సు తెరిచినా ఖాళీగానే కనిపిస్తోంది. చాలా వరకు తుప్పుపట్టి ఉంటున్నాయి. కొన్నింటిని కనీసం తెరిచి తనిఖీ చేసిన దాఖలాలే లేవు. ఎవరికైనా గాయాలైతే వెంటనే చికిత్స అందే పరిస్థితి కనిపించడం లేదు. క్షతగాత్రులకు తగిన చికిత్సకు, రక్తస్రావం తగ్గడానికి తగిన మందులు, సామగ్రితో ప్రథమ చికిత్స పెట్టెలు ఉంచాలి. నిబంధనల ప్రకారం ప్రయాణికులను తీసుకువెళ్లే ప్రతి వాహనంలో ఇవి తప్పనిసరి. రక్తస్రావం కాకుండా, నొప్పి నివారణకు, తెగిన, కాలిన గాయాలకు ఉపయోగించే బ్యాండేజ్‌లు, మందులు, ఆయింట్‌మెంట్‌లు, ప్రూఫ్ ప్లాస్టర్ ఉండాలి.

ఏవీ ఎక్కడ: కొన్ని బస్సులను పరిశీలించగా మందులే లేవు. వాటి స్థానంలో టికెట్ల రోల్స్, కొన్ని కాగితాలు కనిపించాయి. మరికొన్ని ఖాళీగా వేలాడుతున్నాయి. నగర పరిధిలో నడుస్తున్న చాలా బస్సుల్లోనూ వీటికి తగిన ప్రాధాన్యం కల్పించలేదు. సుదూర ప్రాంతాలకు వెళ్లే కొన్నింటిల్లోనూ లేకపోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలోని పది డిపోల పరిధిలో వెయ్యి బస్సులుండగా దాదాపు 90 శాతం బస్సుల్లో అదే పరిస్థితి.

541 నంబరు బస్సులోని పెట్టె చూస్తే ఇలా..

ఏటా రోడ్డు ప్రమాదాల్లో బస్సుల వల్ల క్షతగాత్రులవుతున్న వారు: 800 మంది(సుమారు)

ఏర్పాటుచేస్తాం: బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలుండాలి. దాతల సాయంతో మొదటి దశలో కొన్నింటిలో ఏర్పాటు చేశాం. దశలవారీగా పూర్తిస్థాయిలో చేస్తాం. నిర్వహణ లోపం వల్ల ఇవి కొన్ని బస్సుల్లో ఉండకపోవచ్చు. దూర ప్రాంతం, అవసరమైన సిటీ సర్వీసుల్లో తనిఖీలు చేపట్టి తప్పనిసరిగా మందులు ఉండేలా చూస్తాం’ అని ఆర్ఎం అప్పలనాయుడు పేర్కొన్నారు.

కనుచూపు కోసం వెళ్తూ.. కన్నుమూత!

కుమార్తె కళ్లెదుటే ఊపిరొదిలిన తండ్రి

వేపగుంట, న్యూస్‌టుడే : తండ్రికి కళ్లు సరిగా కనిపించడం లేదని చికిత్స కోసం తీసుకెళ్తుండగా.. ఆమె ముందే తండ్రి మృతిచెందిన సంఘటన విశాఖలో జరిగింది. ఈ విషాదం వివరాలివి. పెందుర్తి మండలం చింతల గ్రహారానికి చెందిన కంపర సత్తిబాబు(45) సైకిల్‌పై తిరుగుతూ కొత్తిమీర విక్రయిస్తుంటారు. ఇటీవల కళ్లు సరిగా కనిపించడం లేదని నగరంలోని ఓ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. అయినా చూపు సరిగా లేకపోవడంతో మరో ఆసుపత్రికి వెళ్లాలనుకున్నారు. దీంతో కుమార్తె నందిని సోమవారం సత్తిబాబును తీసుకొని నగరంలోని ఆసుపత్రికి బయల్దేరింది. వేపగుంటలో ఆటో దిగి బస్‌స్టాప్ వద్దకు వెళ్తుండగా.. సత్తిబాబు నీరసించిపోయి గుండెలో నొప్పిగా ఉందని కూర్చుండిపోయారు. ఆ కాసేపటికే మృతిచెందారు. తండ్రి తన కళ్లెదుటే విగతజీవిగా మారడంతో ఆమె విషాదంలో మునిగిపోయింది. సత్తిబాబు ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే కావడంతో గ్రామస్థులు నిధులు సేకరించి అంత్యక్రియలు పూర్తిచేశారు.

బస్‌స్టాపులో తండ్రి సత్తిబాబు మృతదేహం వద్ద కుమార్తె నందిని

ఐఫోన్ కొనివ్వలేదని బలవన్మరణం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: ఐఫోన్ కొనివ్వలేదని బాలుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన విశాఖ నగరంలో చోటుచేసుకుంది. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివి. పాతనగరం కోటవీధిలో నివాసముంటున్న బాలుడు(17) 6వ తరగతి వరకు చదివి మానేశాడు. ఇంట్లో ఖాళీగా ఉంటున్నాడు. తండ్రి కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వారం రోజుల క్రితం బాలుడు తన తండ్రిని ఐఫోన్ కొనివ్వాలని అడిగాడు. దీంతో తండ్రి తన వద్ద అంత డబ్బు లేదని, తన వల్ల కాదని చెప్పేశాడు. నాటి నుంచి బాలుడు అలిగి ఇంటికి సరిగా రావడం లేదు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

(c) eenadu

27, 28 తేదీల్లో విశాఖలో జాతీయ సదస్సులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీల్లో నోవోటెల్ హోటల్ వేదికగా మూడు ప్రధాన సదస్సులు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినందున, దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు, నోడల్ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో సదస్సు నిర్వహణ ఏర్పాట్లపై ఆయన పలు సూచనలు చేశారు. బాల్ వివాహ ముక్త్ భారత్(బీవీఎంబీ) ఔట్‌రీచ్ కార్యక్రమాన్ని ఈనెల 27న విశాఖలో ప్రారంభిస్తోందని, దేశవ్యాప్తంగా వంద రోజుల పాటు కొనసాగుతుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ(సీఏఆర్ఎ), నేషనల్ అడాప్షన్ అవేర్‌నెస్ కాంక్లేవ్‌ను నిర్వహిస్తోందన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి పలువురు ప్రతినిధులు దీనికి హాజరవుతారన్నారు. 28న మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖకు అనుబంధంగా ఉన్న పార్లమెంట్ సంప్రదింపుల కమిటీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనుందన్నారు. కేంద్రమంత్రులు, ప్రముఖులు, సీనియర్ ప్రభుత్వ అధికారులు సదస్సులో పాల్గొంటారన్నారు. ప్రొటోకాల్ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, విమానాశ్రయంలో శాస్త్రీయ నృత్య కళాకారుల సాయంతో సంప్రదాయ స్వాగత ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పూర్వ వైభవం దిశగా హాకీ

వరల్డ్ కప్ ట్రోఫీని ఆవిష్కరించిన ఎమ్మెల్యేలు

హాకీ వరల్డ్ కప్ ట్రోఫీతో ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పారావు తదితరులు

వన్‌టౌన్, విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: జాతీయ క్రీడ హాకీకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్సులో మాదిరిగా కొమ్మాది క్రీడా ప్రాంగణంలో టర్ఫ్ మైదానాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై, మధురైలో ఈనెల 28 నుంచి డిసెంబరు 10 తేదీ వరకు జరగనున్న హాకీ మెన్స్ జూనియర్ వరల్డ్ కప్ పోటీల ట్రోఫీని జిల్లా పరిషత్ సమీపంలోని అంకోసా సమావేశ మందిరంలో సోమవారం ఆవిష్కరించారు. ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, హాకీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాణక్యరాజు, జిల్లా అధ్యక్షుడు ఎస్.కె.ఈ.అప్పారావు, అంజిశ్రీ భవానీశంకర్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ టర్ఫ్ మైదానంతో జిల్లా ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయి హాకీ ఆటతీరు, మెళకువలు తెలుసుకోవచ్చునని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నారని చెప్పారు. హాకీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాణక్యరాజు మాట్లాడుతూ ఒడిశాలో 24, పంజాబ్‌లో 14 టర్ఫ్ మైదానాలు ఉండగా ఏపీలో కేవలం 3 మాత్రమే ఉన్నాయన్నారు. ఎమ్మెల్యేలు హాకీ స్టిక్‌లు పట్టుకొని పరిశీలించారు. కార్యక్రమంలో హాకీ క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఏబీఎల్ ధ్రువపత్రాన్ని మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ రత్నకుమారికి అందజేస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి

హెచ్ఐవీ పరీక్షా కేంద్రానికి ఎన్ఏబీఎల్ గుర్తింపు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేజీహెచ్‌లోని మైక్రోబయాలజీ విభాగానికి అనుబంధంగా ఉన్న హెచ్ఐవీ పరీక్షా కేంద్రానికి నేషనల్ అక్రెడిటేషన్ బోర్డు ఆఫ్ ల్యాబొరేటరీస్(ఎన్ఏబీఎల్) గుర్తింపు లభించింది. రాష్ట్రంలోనే తొలిసారిగా ఎన్ఏబీఎల్ గుర్తింపు పొందిన ల్యాబ్‌గా కేజీహెచ్‌లోని హెచ్ఐవీ ల్యాబ్ నిలిచిందని మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పూసపాటి రత్నకుమారి తెలిపారు. ఇక్కడ నిర్వహించే పరీక్షలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని అక్టోబరులో ఎన్ఏబీఎల్ ధ్రువీకరించి ధ్రువపత్రం జారీ చేసిందన్నారు. ఈ ధ్రువపత్రాన్ని సోమవారం ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి పరిశీలన చేసి విభాగాధిపతి రత్నకుమారికి అందజేశారు. కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగ అధికారులు డాక్టర్ కల్యాణి, డాక్టర్ శిరీష, డాక్టర్ బి.అరుణ, ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు అసౌకర్యం కలగరాదు

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు, చిత్రంలో ఈఓ శోభారాణి తదితరులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరంలోని బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల నేపథ్యంలో దర్శనాలకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు ఆదేశించారు. అమ్మవారి ఆలయాన్ని సంస్థ సభ్యులతో కలిసి సోమవారం ఆయన సందర్శించారు. భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం మినహా మిగిలిన రోజుల్లో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల సమయంలో కూడా దర్శనాలు కల్పించాలన్నారు. దేవస్థానం చేసిన ఏర్పాట్ల పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శోభారాణి, కమిటీ సభ్యులు పి.సత్యనారాయణ, సద్గృహుడు తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎస్‌లకు ఇంక్రిమెంట్లు ఇవ్వండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థలో ఎంటీఎస్(మినిమం టైం స్కేల్)గా పని చేస్తున్న 34 మందికి వార్షిక ఇంక్రిమెంట్లు ఇవ్వాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఎంటీఎస్‌లకు ఆరు నెలలలోపు వార్షిక ఇంక్రిమెంట్ నిధులు ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జీవీఎంసీ కమిషనర్ తదుపరి చర్యలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

24 మంది ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పదోన్నతి పొందినవారు అంకితభావంతో పని చేయాలని ఆర్టీసీ ఆర్ఎం బి.అప్పలనాయుడు సూచించారు. ఆర్టీసీలోని వివిధ డిపోల్లో పని చేస్తున్న 24 మంది అసిస్టెంట్ డిపో క్లర్కులకు డిపో క్లర్కులుగా, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్-3లుగా పదోన్నతులు కల్పించారు. వీరికి సంబంధిత ధ్రువీకరణ పత్రాలను సోమవారం ఆయన తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సేవలందించాలని సూచించారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.పద్మావతి, పర్సనల్ అధికారి తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన వారితో ఆర్ఎం అప్పలనాయుడు

సెక్టోరియల్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: విశాఖపట్నం సమగ్ర శిక్షా కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులుగా పనిచేయడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు అదనపు పథక సమన్వయకర్త జె.చంద్రశేఖరరావు ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు సమగ్ర శిక్షా కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

'కనకమ్మ' ఆలయానికి పోటెత్తిన భక్తులు

దర్శనాల కోసం వరుసలో భక్తులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరంలోని బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి సోమవారం భారీగా భక్తులు తరలివచ్చారు. మార్గశిర మాసం కావడంతో ఉదయం నుంచి భక్తుల తాకిడి అధికంగా ఉంది. రాత్రి పొద్దుపోయే వరకు రద్దీ కొనసాగింది. అమ్మవారికి శ్రీచక్రనవావర్చన, లక్ష్మీహోమం, వేద విద్వత్ సప్తశతీపారాయణ, మహాపుణ్యాహవాచన వంటి పూజలు జరిపారు. మెయిన్‌రోడ్డులోని జగన్నాథ స్వామి ఆలయ ఆవరణలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ఫిర్యాదుదారులతో అధికారులు మాట్లాడాల్సిందే

కలెక్టర్ హరేంధిర ప్రసాద్ స్పష్టీకరణ

పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, అధికారులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో అర్జీలు సమర్పించిన ఫిర్యాదుదారులతో సంబంధిత అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా మాట్లాడాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 358 అర్జీలు వచ్చాయి. రెవెన్యూ-118, జీవీఎంసీ-129, పోలీసు-20, ఇతరశాఖలు-91 వచ్చాయి. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారం తీరు మారాలని సూచించారు. ప్రజల్లో సంతృప్తికర స్థాయి పెరగాలన్నారు. తరచూ వస్తున్న వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాల్‌సెంటర్ ఫీడ్‌బ్యాక్ మరింత మెరుగుపడాలన్నారు.

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 119 ఫిర్యాదులు వచ్చాయి. జోన్-1కు 2, జోన్-2కు 21, జోన్-3కు 14, జోన్-4కు 9, జోన్-5కు 14, జోన్-6కు 14, జోన్-7కు 1, ప్రధాన కార్యాలయానికి 27 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో పరిపాలనకు సంబంధించి 8, రెవెన్యూకు 11, ప్రజారోగ్యానికి 6, ప్రణాళికకు 56, ఇంజినీరింగ్‌కు 22, ఉద్యానవన విభాగానికి 2, యూసీడీకి 14 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. నీటి సరఫరా విభాగంలో విధులు నిర్వర్తిస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు విన్నవించారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్

PUBLIC NOTICE

All the public in general are hereby informed through this public notice that one of my clients, intending to enter into a Development agreement with GPA in respect to the below schedule property with **Pasupuleti Srinivasa Rao**, who said to have got it as gift, through a Gift Deed No. 839/2007, registered at Visakhapatnam SRO and Settlement Deed 7831/2025. Hence, if any one has any objections or encumbrances, attachments, agreements etc., may raise the same within 5 days from the date of this notice in writing to the under mentioned.

SCHEDULE : All that site measuring 547 Sq.yds., together with RCC building Dr.No. 49-14-12, Plot no.1, , S.No.. 24, T.P.No. 37/66 of Allipuram Ward, Maduranagar area, within the limits of GVMC, Visakhapatnam District and bounded by: ***East:-B.V.M.V Gopala Rao; South: House of R. Lakshmi Devi; West: Road; North: Other's House.***

M. HARI MEHAR
Advocate, 54-11-20, Opp.Veeru Babu Temple, Isukathota, Visakhapatnam Ph.No. 9246625646

వాల్‌చంద్ హీరాచంద్‌కు ఘన నివాళి

వాల్‌చంద్ హీరాచంద్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న షిప్‌యార్డు సీఎండీ కమొడోర్ గిరిదీప్‌సింగ్

సింధియా, న్యూస్‌టుడే : భారత తొలితరం పారిశ్రామిక వేత్తగా పేరొందిన శేర్ వాల్‌చంద్ హీరాచంద్ 143వ జయంతిని సోమవారం హిందుస్థాన్ షిప్‌యార్డు ఆవరణలో యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. యార్డు సర్కిల్ వద్ద ఉన్న వాల్‌చంద్ హీరాచంద్ విగ్రహానికి సంస్థ సీఎండీ కమొడోర్ గిరిదీప్‌సింగ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశ చరిత్రలో తొలి ఎయిర్‌క్రాఫ్ట్, తొలి నౌక, తొలి కార్ల తయారీ సంస్థలను స్థాపించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. డైరెక్టర్లు, గుర్తింపు కార్మిక సంఘ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని యువకుడి బలవన్మరణం

ప్రియురాలి వేధింపులే కారణమని తల్లి ఆరోపణ

పి.రాజేశ్‌రెడ్డి (పాతచిత్రం)

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే : జీవీఎంసీ 69వ వార్డు చుక్కవానిపాలెంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టాన రాజేశ్‌రెడ్డి (30) డ్రైవర్‌గా పనిచేస్తూ తల్లి దుర్గతో కలిసి ఉంటున్నాడు. ఆదివారం అర్ధరాత్రి గదిలోకి వెళ్లిన కుమారుడు తిరిగి రాకపోవడంతో తల్లి వెళ్లి చూడగా ఫ్యానుకు ఉరి వేసుకొని ఉన్నాడు. స్థానికుల సాయంతో కిందకు దించి షీలానగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో కేజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు తెలిపారు. రాజేశ్‌రెడ్డి కొంతకాలంగా అదే కాలనీలో ఉంటున్న ఓ యువతితో ప్రేమలో ఉన్నాడని.. ఆమె వేధిస్తుండటంతోనే మానసిక వేదనకులోనై ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి దుర్గ ఆరోపించారు. రెండు రోజుల క్రితం రాజేశ్ రైలు పట్టాల వద్ద కనిపించగా.. స్నేహితులు అడ్డుకొని ఇంటికి తీసుకువచ్చారని ఆమె తెలిపారు. రాజేశ్ తండ్రి గతంలోనే చనిపోగా... సోదరికి వివాహమైంది. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగద్గురు పీఠం ఛైర్మన్ కె.ఎస్.శాస్త్రి మృతి

డాక్టర్ కె.ఎస్.శాస్త్రి (పాతచిత్రం)

తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ప్రముఖ హోమియో వైద్యులు, జగద్గురు పీఠం జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.ఎస్.శాస్త్రి(89) సోమవారం ఉదయం అక్కయ్యపాలెంలోని తన స్వగృహంలో మృతి చెందారు. మాస్టర్ ఇ.కె. నుంచి స్ఫూర్తి పొందిన కె.ఎస్.శాస్త్రి తన జీవితాన్ని హోమియో వైద్యసేవలకు అంకితం చేశారని ఐదు దశాబ్దాల పాటు వేలాది మందికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పీఠం ఉపాధ్యక్షుడు ఎన్.వి.ఎస్.మూర్తి, సంస్థ డైరెక్టర్లు చింతలపాటి సత్యదేవ్, అజ్జరపు శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు శాస్త్రి కుమారుడు కె.శ్రీనివాస్ తెలిపారు.

'సంగీత కళాసాగర' బిరుదుతో సత్కారం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో విశాఖ మ్యూజిక్ అకాడమీ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం చెన్నైకి చెందిన వయోలిన్ విద్వాంసుడు వి.వి.సుబ్రహ్మణ్యంకు నిర్వాహకులు సంగీత కళాసాగర బిరుదును ప్రదానం చేశారు. అనంతరం ఆయన వయోలిన్‌పై చేసిన కచేరీ సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేసింది. ఈ కార్యక్రమంలో విశాఖ మ్యూజిక్ అకాడమీ అధ్యక్షులు కె.వి.రామ్మూర్తి, ఉపాధ్యక్షులు బి.ఎ.రాజారావు, పేరాల బాలమురళీకృష్ణ, కార్యదర్శి వి.చంద్రశేఖర్, కోశాధికారి సి.హెచ్.దుర్గాప్రసాద్, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణంను బిరుదుతో సత్కరిస్తున్న మ్యూజిక్ అకాడమీ సభ్యులు

ట్రాఫిక్ చలానాలు 'ఫోన్‌పే'లోనూ చెల్లించొచ్చు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: ట్రాఫిక్ చలానాలను 'ఫోన్‌పే'లో కూడా చెల్లించవచ్చునని సీపీ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. ఇంతవరకు పరివాహన్ యాప్‌లో చెల్లించేవారని ఈ యాప్‌లో చెల్లించడం కాస్త కష్టంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. అయితే ఎక్కువమంది వినియోగిస్తున్న ఫోన్‌పే ద్వారా కూడా చలానాలు చెల్లించే వెసులుబాటు ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న చలానాలను త్వరితగతిన చెల్లించాలని సూచించారు.

చికెన్ ధరలు

(కిలో - రూ.ల్లో)

	[illegible]	[illegible]
ఫారం గేటు	100	98
లైవ్	127	118
డ్రెస్డ్	184	206
స్కిన్‌లెస్	210	216

బహిరంగ ప్రకటన

పూర్ణలైన మా తల్లిదండ్రులకు వివాహ 25వ వార్షికోత్సవ (సిల్వర్ జూబ్లీ) శుభాకాంక్షలు
నేడు వివాహ వార్షికోత్సవం జరుపుకుంటున్న మీకు మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ... మీ అన్యోన్య దాంపత్య జీవితం నిండునూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఆనందంగా గడవాలని కోరుకుంటూ...
శ్రీమతి & శ్రీ కాకర గణేష్‌కుమార్ - సుభాషిణి

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
RACPC-1
ఇ-వేలం ద్వారా వాహనము అమ్మకం

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
APPENDIX-IV-A [See Proviso to Rule 8 (6)]
స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన
ఇ-వేలం తేదీ & సమయం: 11.12.2025, ఉ॥ 12.00 గం.ల నుండి సా॥ 5.00 గం.ల వరకు

బ్యాంక్ ఆఫ్ ఇండియా Bank of India BOI సిరిపురం బ్రాంచ్
డిమాండ్ నోటీసు (సంక్షిప్తంగా)

EENADU Classifieds
BUSINESS SERVICES · REAL ESTATE · FLAT FOR SALE · SEETHAMMADHARA · HOUSE FOR SALE · ATCHYUTAPURAM · PLOT FOR SALE · BHOGAPURAM · FINANCIAL SERVICES · GENERAL · JOBS

పెందుర్తి

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ ప్లెక్స్-1 ప్రేమంటే (మార్నింగ్, ఫస్ట్ షో), 12a రైల్వేకాలనీ (మ్యాట్నీ, సెకండ్ షో) ప్లెక్స్-2 – రాజు వెడ్స్ రాంబాయి

భూలోకమాంబ పండగ ప్రారంభం

వేపగుంట, న్యూస్‌టుడే: భూలోకమాంబ అమ్మవారి పండగ మంగళవారం జరుగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పేర్కొన్నారు. తెల్లవారుజాము నుంచే పూజలు మొదలవుతాయన్నారు. సాయంత్రం అమ్మవారి ఘటాలు పురవీధుల్లో ఊరేగింపు జరిపి రాత్రి అనుపు ఉత్సవం జరుగుతుందన్నారు. డిసెంబరు 2న అమ్మవారి మారు వారం పండగ రోజున భారీ అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

పెండింగ్ పనులపై చర్చ

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న ఎన్. తేజ్‌భరత్‌ను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం నగరంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెందుర్తి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఆయా పనులను వేగవంతం చేయాలని కమిషనర్‌ను కోరారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్ తేజ్‌భరత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట వరకు

వేపగుంట, న్యూస్‌టుడే: ?: నాయుడుతోట నుంచి మేహాద్రి రిజర్వాయర్‌కు వెళ్లే రహదారిలో గోతులు స్థానికుల రాకపోకలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. – రాజారావు, నాయుడుతోట. ✓: ఈ రహదారిలో పైప్ లైను నిర్మాణం జరుగుతోంది. ఆ పనులు పూర్తయిన అనంతరం రహదారి నిర్మాణానికి పూర్తిచర్యలు తీసుకుంటాం. – శంకర్‌రావు, ఇన్‌ఛార్జి జోనల్ కమిషనర్

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం కేజీబీవీ వద్ద వ్యర్థాలు పేరుకుపోయాయి. – పి. వెంకటరావు, సబ్బవరం. ✓: పరిశీలించి వ్యర్థాలను తరలించే ఏర్పాటు చేస్తాం. – డి. ప్రసాదరావు, గ్రామ సర్పంచ్ సబ్బవరం

?: సబ్బవరం మండలం ఐదవాద కాలనీ సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. – స్థానికులు. ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – వై. రాజేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ సబ్బవరం

పరవాడ, న్యూస్‌టుడే: ?: మండలంలోని పెద్దస్వయంభూవరంలోని నిరుపయోగంగా ఉన్న శిథిల పాఠశాల భవనం భయపెడుతోంది. – శ్రీను, స్థానికుడు. ✓: శిథిల భవనం తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. – మురళీధర్ పట్నాయక్, ఈవోపీఆర్డీ, పరవాడ

స్వాగత ద్వారం.. అభివృద్ధికి దూరం

విస్తరణకు నోచుకోని పెందుర్తి బీఆర్టీఎస్ రహదారి

పెందుర్తి, న్యూస్‌టుడే

జిల్లాల పునర్విభజన అనంతరం మన్యం, అల్లూరి, విజయనగరం జిల్లాల నుంచి విశాఖ వచ్చే వారికి పెందుర్తి కూడలి ముఖద్వారంగా మారింది. తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్న ప్రముఖ పర్యాటక కేంద్రం అరకు వెళ్లే పర్యాటకులు పెందుర్తి కూడలి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. దేశ విదేశాలకు చెందిన పర్యాటకులు, ప్రముఖులు ప్రయాణించే ఈ పెందుర్తి బీఆర్టీఎస్ రహదారి గత పదిహేనేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో నగరంలోకి స్వాగతం పలికే ఈ కూడలి గ్రేటర్‌లో ఉన్నా.. ఇంకా పల్లెటూరుగానే మిగిలిపోయింది.

పెందుర్తి బీఆర్టీఎస్ రహదారిలో వాహనాల రద్దీ

పెరుగుతున్న వాహనాల రద్దీ..

పెందుర్తి బీఆర్టీఎస్ రహదారిలో వాహనాల రద్దీ విపరీతంగా పెరుగుతోంది. పరిసర ప్రాంతాల్లో నివాసాలు విస్తరించడంతో నగరానికి రాకపోకలు సాగించే వారి సంఖ్య గణనీయంగా ఉంటోంది. ఉద్యోగాలు, చదువులు, ఇతర పనులపై ప్రయాణాలు చేసే వారు నిత్యం వేలల్లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం కార్యాలయాలు, విద్యాలయాల సమయాల్లో తరచుగా ట్రాఫిక్ నిలిచిపోతుంది. ప్రజారవాణా వాహనాలతో పాటు వ్యక్తిగత వాహనాల వినియోగం బాగా ఎక్కువైన నేపథ్యంలో ఇరుకైన రహదారుల సామర్థ్యం చాలడం లేదు.

పదిహేనేళ్లుగా నిలిచిన విస్తరణ..

★ పెందుర్తి పాత పీహెచ్‌సీ కూడలి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు బీఆర్టీఎస్ రహదారి గత పదిహేనేళ్లుగా నిలిచిపోయింది. ఈ మార్గంలో కొందరు నివాసితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో విస్తరణకు ఆటంకం ఏర్పడింది. పాలకులు, అధికారులు వివాదం పరిష్కారంపై కనీసం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

★ ప్రభుత్వాలు మారినా పెందుర్తి కూడలి దశ, దిశ మారడం లేదు. బీఆర్టీఎస్ రహదారి నిర్మాణంతో సుజాతనగర్, చినముషిడివాడ ప్రాంతాలు నగరానికి దీటుగా అభివృద్ధి చెందగా పనులు నిలిచిపోయిన పెందుర్తి మాత్రం పాత పట్టణంగానే మిగిలిపోయింది. అంతగా ప్రాధాన్యం లేని అనకాపల్లి - ఆనందపురం మార్గాన్ని విస్తరిస్తున్న పాలకులు బీఆర్టీఎస్‌ను పట్టించుకోవడం లేదన్న విమర్శలొస్తున్నాయి.

★ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భోగాపురం విమానాశ్రయాన్ని అనుసంధానించేలా రహదారుల అభివృద్ధిపై దృష్టిసారించింది. అదే క్రమంలో పెందుర్తి రహదారి ప్రాధాన్యతను గుర్తించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

'అధికారంలో ఉన్నా పనులు చేసుకోలేని పరిస్థితి'

పీజీఆర్ఎస్‌లో అధికారులతో మాట్లాడుతున్న గండి బాబ్జీ

సబ్బవరం, న్యూస్‌టుడే: అధికారంలో ఉన్నా పనులు చేసుకోలేని పరిస్థితి తమకు ఏర్పడిందని తెదేపా పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అన్నారు. ఆయన సోమవారం కార్యకర్తలతో కలిసి పీజీఆర్ఎస్‌కు హాజరయ్యారు. 'కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కాలం అవుతోంది. ఉమ్మడి నాయకులంతా కలిసి పని చేయాల్సి ఉంది. కానీ ఇక్కడ అలా జరగడం లేదు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నాకు ఏం జరిగినా పర్వాలేదు కానీ కార్యకర్తలు వచ్చినపుడు ఒక పనికి పదిసార్లు తిరిగితే మనం గవర్నమెంటులో ఉన్నామా? లేక ప్రతిపక్షంలో ఉన్నామా? అన్న అనుమానం వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. ఈ విషయమై తహసీల్దార్, అధికారులను అడిగామన్నారు. గత పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులు ఎంత వరకు పరిష్కరించారని ప్రశ్నించగా ... తహసీల్దార్ చెప్పారన్నారు. కొత్తగా మరో 5 దరఖాస్తులు రాగా వాటిని కూడా పరిశీలిస్తామన్నారని అన్నారు. కార్యక్రమంలో సబ్బవరం మండల తెదేపా అధ్యక్షుడు గండి ముత్యాలు నాయుడు, తాతారావు, బొండా కల్యాణ్, దాడి కన్నంనాయుడు, బొండా రాజు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

పెందుర్తి, న్యూస్‌టుడే: రాంపురం పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మీనగర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు విశాఖ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం సమర్పించారు. కాలనీలో రోడ్లు, కాలువలు, అంతర్గత రహదారులు నిర్మించాలని విన్నవించారు. ఆయనతో పాటు కాలనీవాసులు నరసింహమూర్తి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు. అక్కడ జరిగిన పీజీఆర్ఎస్‌లో మండల తెదేపా అధ్యక్షుడు కునిగంటి కనకరాజు, నాయకులు అవగడ్డ అప్పలనాయుడు, కోరుబిల్లి సుందర్రావు, తదితరులు పలు సమస్యలపై ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతులు సమర్పించారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రెడ్డి నారాయణరావు

ఉత్తమ ఉద్యోగులకు అవార్డుల ప్రదానం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదాలను నివారించడంలో కీలకపాత్ర పోషించిన పలువురు రైల్వే ఉద్యోగులను వాల్తేర్ డీఆర్ఎం లలిత్ బోహ్రా సోమవారం అవార్డులు అందజేసి సత్కరించారు. ఉద్యోగుల అసాధారణ పని తీరును ప్రశంసించారు. 2025-26వ సంవత్సరంలో రైలు కార్యకలాపాల సమయంలో ఎదురయ్యే భద్రతా ముప్పులకు వృత్తి నైపుణ్యం, వేగవంతమైన ప్రతిస్పందనకు గుర్తింపుగా ట్రాక్‌మెన్, కీమెన్, స్టేషన్ మాస్టర్లు, లోకోపైలెట్లకు అవార్డులు ప్రదానం చేశారు. ట్రాక్‌మెన్స్ కుమార్ సాహెబ్, సురేష్‌కుమార్, జ్ఞానరంజన్ సాహూ, ఎన్. వరప్రసాద్, ఎం. కూర్మారావు, కీమెన్ రాకేష్ కుమార్, పియాంట్స్ మెన్ ఎం. కృష్ణంనాయుడు, స్టేషన్ మాస్టర్ సంతోష్‌కుమార్, ఏఎల్‌పీ బి. తిరుపతిరావు తదితరులకు వీటిని అందజేశారు.

ట్రాక్ నిర్వాహకుడికి ధ్రువపత్రం అందజేస్తున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా

పునరావాస కేంద్రానికి తరలింపు

పెందుర్తి, న్యూస్‌టుడే: మద్యానికి బానిసైన ఓ వ్యక్తిని పెందుర్తి పోలీసులు సోమవారం పునరావాస కేంద్రంలో చేర్పించారు. దీనికి సంబంధించి పెందుర్తి సీఐ కె.వి. సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాపయ్యరాజుపాలేనికి చెందిన నైపల్లి కనకరాజు(36) మద్యానికి బానిసై కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అతడి కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వారి అభ్యర్థన మేరకు పోలీసులు అతడిని చినముషిడివాడలోని న్యూలైఫ్ డ్రగ్ రిహాబిలిటేషన్ కేంద్రంలో చేర్పించారు. అతడితో మద్యం అలవాటు మాన్పించాలని నిర్వాహకులను కోరారు.

పునరావాస కేంద్రం నిర్వాహకులకు వ్యక్తిని అప్పగిస్తున్న పోలీసులు

పీజీ వైద్య కోర్సుల్లో ప్రవేశాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ)లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు శ్రీకారం చుట్టారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలు ఆరంభమయ్యాయి. అఖిల భారత కోటా(ఏఐక్యూ) కింద కళాశాలకు కేటాయించిన సీట్లలో సోమవారం కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో డాక్టర్ ఎన్. సోనుకు తొలి ప్రవేశం కల్పించారు. ఈ మేరకు సీటు కేటాయిస్తూ ప్రవేశపత్రాన్ని డాక్టర్ సోనుకు ప్రిన్సిపల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి అందజేశారు. ఏఐక్యూ ప్రవేశాలు పూర్తయిన తర్వాత రాష్ట్ర కోటా ప్రవేశాలు చేపడతామని ప్రిన్సిపల్ తెలిపారు. కార్యక్రమంలో ఉప ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. కృష్ణవేణి, ఏడీ ఎం. రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతులు

వేపగుంట, న్యూస్‌టుడే : జోనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ 18 అర్జీలు ఇచ్చారు. ఇన్‌ఛార్జి జోనల్ కమిషనర్ శంకర్రావు సమస్యల పరిష్కారానికి తగుచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాజీ జంక్షన్‌లో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు, పశువుల ఆసుపత్రి ఎదురుగా అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని, పురుషోత్తపురంలో యూజీడీ సమస్య పరిష్కరించాలని వినతుల్లో కోరారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఇన్‌ఛార్జి జెడ్సీ శంకర్రావు

సేవా శిబిరం ప్రారంభం

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తికి చెందిన ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1లో సోమవారం సేవా శిబిరం ప్రారంభమైంది. కళాశాల కరస్పాండెంట్ టి. థియోఫిలస్, ఎన్ఎస్ఎస్ పీవో డీఎస్ ప్రదీప్ ఆధ్వర్యంలో తొలిరోజు సత్యానగర్ పార్కు ఆవరణలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సత్యానగర్, అశోక్‌నగర్‌కాలనీ సంఘం ప్రతినిధులు సీఎన్ రావు, సన్యాసిరావులను శాలువాతో సత్కరించారు. విద్యార్థులు పార్కు ఆవరణలో పరిశుభ్రత పనులు చేశారు.

పార్కు ఆవరణలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

25 నుంచి నయా చేతన 4.0 కార్యక్రమం

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: లింగ ఆధారిత వివక్షపై పోరాటం చేసేందుకు పౌరులందరిలో బాధ్యత పెరగాలని, క్రియాశీల అవగాహన కల్పించడం ద్వారా నివారణ చర్యలను బలోపేతం చేయవచ్చునని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. స్త్రీ, పురుషుల సమానత్వం ద్వారానే సమాజం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నవంబరు 25 నుంచి డిసెంబరు 3వరకు 'నయా చేతన 4.0 - మార్పు కోసం ముందడుగు' అనే పేరుతో చేపట్టనున్న కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను సోమవారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఏడీసీ వర్మ, ఎన్ఐసీ అధికారి హమీద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సంబంధిత ఉత్పత్తులపై అవగాహన

కార్యక్రమంలో పాల్గొన్న ఐఐఎం విద్యార్థులు, ప్రొఫెసర్లు

సబ్బవరం, న్యూస్‌టుడే: జాగృతి సంస్థ, అమృతఫల రైతు ఉత్పత్తిదారుల కంపెనీలను సోమవారం విశాఖపట్నం ఐఐఎం మేనేజ్‌మెంటు విద్యార్థులు, ప్రొఫెసర్లు సందర్శించారు. ఆ క్యాంపస్ నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన 80 మంది విద్యార్థులకు ఇక్కడ గ్రామీణ భారతదేశంలో వ్యాపారం చేయడంపై శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా జాగృతి సంస్థ ఎండీ కె. సుజాత హాజరయ్యారు. ఈ సంస్థ మూడు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతంలో సభ్యులకు అందిస్తున్న ఆరోగ్య, సామాజిక, వ్యవసాయ, డిజిటలైజేషన్, బ్యాంకింగ్ తదితర సర్వీసును ఆ సంస్థ సీఈవో కెఎల్ఎన్ వివరించారు. రైతులతో చేస్తున్న వివిధ కార్యక్రమాలు, మార్కెటింగ్ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. అమృతపురం గ్రామంలో టమాటా, మిరప, డ్రాగన్‌ఫ్రూట్, తదితర పంటలను సందర్శించి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమం ఐఐఎం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రొఫెసర్ జయంత్, సుధారాణి, భరత్ పేర్కొన్నారు.

అసలే గోతులు... ఆపై తవ్వకాలు..

ఫోకస్

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట - పినగాడి రహదారి గోతులతో ప్రమాదకరంగా ఉన్న విషయం అందరికి తెలిసిందే. దీనికితోడు ప్రస్తుతం భూగర్భ విద్యుత్తు లైను కోసం తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో రహదారి మరింత చిన్నదిగా మారింది. ఓ వైపు గతంలో ఏర్పడిన గోతులు, మరోవైపు భూగర్భ విద్యుత్తు లైను పనులతో వాహనదారులు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే రహదారిలో భారీవాహనాల రాకపోకలు సాగుతున్నాయి. రహదారి చిన్నదిగా ఉండటంతో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ రహదారిని 60 అడుగులకు విస్తరించే పనులు ప్రారంభించామని ఇటీవల అధికారులు ప్రకటించారు. పనులను వేగవంతంగా పూర్తిచేసి వాహనదారులకు ఇబ్బందిలేకుండా చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. వేపగుంట నుంచి చింతలగ్రహారం బ్రిడ్జి వరకు పనులు జీవీఎంసీ చేయాలని నిర్ణయించింది. ఆ పనులు ఇంకా ఎక్కడా ప్రారంభం కాకపోవడంతో ఎప్పటికి పనులు పూర్తవుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వేపగుంట - పినగాడి రహదారిలో జరుగుతున్న భూగర్భ విద్యుత్తు లైను పనులు

క్రమశిక్షణతో ఉన్నత భవితకు బాటలు

విద్యార్థులకు సూచనలు చేస్తున్న రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్

పరవాడ, న్యూస్‌టుడే: విద్యార్థులంతా క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి భవిష్యత్తులోని ఉన్నతస్థాయిలో రాణించాలని రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె. శ్రీకాంత్ అన్నారు. రాంకీ ఫౌండేషన్, మ్యాజిక్ బస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం లంకెలపాలెం హైస్కూల్‌లోని 9, 10 తరగతుల విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులంతా బాల్యం నుంచి మంచి ప్రణాళికతో పాటు పట్టుదల, క్రమశిక్షణతో చదివితేనే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించవచ్చునన్నారు. మ్యాజిక్ బస్ ఇండియా సంస్థ మేనేజర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ. . విద్యార్థులంతా ఒత్తిడి లేని విద్యను అభ్యసించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, రాంకీ ఫౌండేషన్, మ్యాజిక్ బస్ ఇండియా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్జీల స్వీకరణ

వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగరాజు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో రమేశ్‌నాయుడు మండలస్థాయి అధికారులు హాజరయ్యారు. ప్రజల నుంచి 5 అర్జీలను స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

★ అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో మండల పరిషత్తు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఇళ్లులేని పేదలకు స్థలాలు, ఇళ్లు అందించి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం, అన్నపూర్ణ, సీతమ్మ పాల్గొన్నారు.

గోదాము పైనుంచి పడి వ్యక్తి మృతి

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే: ఆటోనగర్‌లో ఓ గోదాము పైకప్పు మీద నుంచి పడి దినసరి కూలీ ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే విజయనగరానికి చెందిన జంకల చంటి(32) ఆదివారం ఆటోనగర్‌లోని ఓ కార్ల గోదాము పైకప్పు మరమ్మతులు పని చేస్తుండగా సిమెంట్ రేకు అకస్మాత్తుగా విరిగిపోవడంతో పై నుంచి కిందకు పడిపోయాడు. ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం మృతిచెందాడు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రధానార్చక వివాదంపై నోటీసుల జారీకి సన్నాహాలు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి ఆలయ ప్రధానార్చకుల నియామకంలో సీనియారిటీని పరిగణనలోకి తీసుకోలేదని ఆలయ ఉపప్రధానార్చకుడు కేకేఎస్ ప్రసాదాచార్యులు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నేపథ్యంలో న్యాయమూర్తి ఇటీవల వివాద పరిష్కారానికి ఉత్తర్వులు వెలువరించారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఆలయ ప్రధానార్చకుడిగా తనకు అధికారులు ఉద్యోగోన్నతి కల్పించకుండా చేశారని అభియోగాలు చేస్తూ 2022లో ప్రసాదాచార్యులు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ప్రధానార్చక నియామకంపై నూతన ఉత్తర్వులు జారీ చేయాలని రెండు నెలల క్రితం న్యాయస్థానం ఆదేశించడంతో వాటి అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి డాక్టర్ ఎం. హరిజవహర్‌లాల్ ఈ నెల 6న ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే విషయంపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ ఈ నెల 18న సింహాచలం దేవస్థానం ఈవోకు మెమో ద్వారా ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాలకు నోటీసులు జారీ చేసి సీనియారిటీకి సంబంధించి లిఖిత పూర్వక అభిప్రాయాలు, ఆధారాలు తీసుకోనున్నట్లు దేవస్థానం పరిపాలనా విభాగం పర్యవేక్షకుడు కంచి మూర్తి తెలిపారు. ఈ మేరకు పిటిషనర్‌తో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి నోటీసులు జారీ చేయడానికి దేవస్థానం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

పోలీసు శాఖకు 115 ఫిర్యాదులు రాక

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 115 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ శంఖబ్రత బాగ్చీ ఫిర్యాదులను పరిశీలించి వారితో స్వయంగా మాట్లాడారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఫిర్యాదులపై విచారణ జరిపి త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్యాభర్తల గొడవలు, మోసాలకు సంబంధించి అధిక ఫిర్యాదులు అందాయన్నారు.

బాధితుల సమస్యలు వింటున్న సీపీ శంఖబ్రతబాగ్చీ

ప్రకృతి సాగుపై దృష్టి సారించాలి

మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం

పరవాడ, న్యూస్‌టుడే: రైతులంతా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని అనకాపల్లి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సీహెచ్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలోని తానాం గ్రామంలో సోమవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ వ్యవసాయం చేయడం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. భూసారం పెరగడంతో పాటు భూమిలో వానపాములు వృద్ధి చెందుతాయన్నారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి కషాయాలు వాడటం వల్ల తెగుళ్లు, పురుగులను నివారించవచ్చునన్నారు. రైతులంతా దీనిపట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి రమాదేవి, ఆత్మసంస్థ ఏటీఎం రామకృష్ణ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

E.A.No. 70/2024 in
E.P. No. 15/2018 in
O.S.No. 393/1997

Between:
Smt. Gopey Vajramma - పిటీషనర్లు/DHR's
And
Sri Chinnam Bhimanna (died) & Others - రెస్పాండెంట్లు/JDR's

To: 9వ రెస్పాండెంట్లు / 9వ JDR అరిగెల జ్యోత్స్న, W/o. రజని గారు (బాలు) గారు, నియర్ వేపగుంట జంక్షన్, సింహాచలం హిల్స్, విశాఖపట్టణం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు గ్రంథములో 9వ రెస్పాండెంటు / 9వ JDR అయిన మీకు నోటీసులు పంపగా, మీరు నోటీసు సంగతులు తెలిసి యుండి నోటీసు తీసుకొనకుండా evade చేయుచున్నందున Substitute Service ద్వారా అమలు జరుపుటకు గాను ది. 02-12-2025వ సం॥రం॥ తేదీకి శ్రీ కోర్టు వారు order చేసినారు. కావున ది. 02-12-2025న వాయిదా రోజు ఉదయం గం. 10.30 ని॥లకు పై కోర్టులో మీరు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీపై పరోక్షమందు పై నెంబరు దావా తీర్మానించబడును. ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

సం/- BVSRK Manohar
Advocate, Tadepalligudem,
West Godavari District, Cell: 94410 54463

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సబ్బవరం, న్యూస్‌టుడే: పరవాడ మండలంలో ఈ నెల 15న జరిగిన అండర్-17 జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో సబ్బవరం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని కె. లాస్య ప్రతిభ చూపింది. దీంతో రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. సోమవారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్. తిరుపతిరావు, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఆర్. ప్రసాద్ విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ శంకరరావు, వైస్ ఛైర్మన్ వై. జ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయుడు అబ్దుల్ రెహ్మాన్, రత్నాలమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కె.లాస్యను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావు

ఏకగ్రీవంగా వీఆర్వోల సంఘం ఎన్నిక

సబ్బవరం, న్యూస్‌టుడే: మండలంలోని వీఆర్వోల సంఘం ఎన్నిక మాజీ వీఆర్వో కె. శేఖర్‌రావు అధ్యక్షతన సోమవారం జరిగింది. అధ్యక్షులుగా కోడూరు శేఖర్, ఉపాధ్యక్షులుగా ఆదిరెడ్డి రవి, కార్యదర్శిగా కె. వాత్సల్యరాయ్, సహాయ కార్యదర్శిగా ఎం. గోవిందరావు, కోశాధికారిగా ఎస్. నూకరత్నంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కె. శేఖరరావు, ఎస్. కామరాజు, అప్పారావు, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గంతో సంఘం సభ్యులు

ఖోఖో పోటీలకు ఏర్పాట్లు

లంకెలపాలెం (పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు జరగనున్నాయని పాఠశాల హెచ్ఎం ఆర్. నాగేశ్వరరావు తెలిపారు. బాలబాలికలకు వేర్వేరుగా జరిగే పోటీలకు క్రీడా మైదానం సిద్ధం చేయడంతో పాటు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. క్రీడామైదానం అభివృద్ధి పనులను సోమవారం వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. నిర్వహణకు సంబంధించి లారస్‌ల్యాబ్స్ సంస్థ ఆర్థిక సహకారాలు అందించడానికి ముందుకొచ్చిందని వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడామైదానం అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

అమృతమూర్తికి అశ్రునివాళి

మంచికి, మమతానురాగాలకు మారుపేరుగా నిలిచి మేము గౌరవప్రదమైన స్థానంలో ఉండదానికి కారణమై మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మహోన్నత మాతృమూర్తి కీ॥శే॥ కొట్టక్కి సరస్వతి పట్నాయిక్ ఆకస్మిక మరణం మాకు తీరనిలోటు... దైవసన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ కొట్టక్కి సరస్వతి పట్నాయిక్
రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్
జననం: 16-08-1942 మరణం: 15-11-2025

కుమారులు - కోడళ్లు
సత్యానంద పట్నాయిక్ - కస్తూరి కుమారి (సురేఖ)
చక్రపాణి పట్నాయిక్ - సత్యవాణి
వెంకట కృష్ణ కుచేల్ - కమల ధరణి

కుమార్తెలు - అల్లుళ్లు
జయశ్రీ పట్నాయిక్ - కీ॥శే॥ మోహనరావు
శాంతిశ్రీ పట్నాయిక్ - కీ॥శే॥ విజయానందరావు
వాణిశ్రీ పట్నాయిక్ - తిరుపతిరావు

మనుమలు మరియు మనుమరాళ్లు, మునిమనుమరాళ్లు, బంధుమిత్రులు

పెద్దకర్మ: తేది: 26-11-2025 బుధవారం నాడు మా స్వగృహమునందు జరుగును

Address: Flat No: 301/Block - A, MVV Enclave, Water Tank Road, Midhilapuri Vuda Colony, Madhurawada, Visakhapatnam

(c) eenadu

భీమిలి

సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్- మఫ్టీ పోలీస్
రాములమ్మ- 12 ఏ రైల్వే కాలనీ
తాతా- ప్రేమంటే
సప్తగిరి- రాజు వెడ్స్ రాంబాయి

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం కూడలిలో ట్రాఫిక్ పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అవగాహన కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ మేరకు మొబైల్ వాహనంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా విశాఖ జిల్లాలో జరిగిన ప్రమాదాలను ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరించారు. ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు, హెచ్‌సీ మూర్తి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

27 నుంచి గీతంలో అంతర్జాతీయ సదస్సు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సుస్థిర సమాజాభివృద్ధికి సరికొత్త వాణిజ్య నమూనాలు అనే అంశంపై గీతం డీమ్డ్ వర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచంలోని పలు దేశాల నుంచి 150 మందికి పైగా పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, ప్రణాళిక, వాణిజ్య నిపుణులు సదస్సుకు హాజరుకానున్నారన్నారు. ఆర్థికరంగంలో వస్తున్న మార్పులు వంటి అంశాలపై ప్రసంగాలు ఉంటాయన్నారు. వాణిజ్యరంగంపై పర్యావరణ మార్పుల ప్రభావం, డిజిటల్ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానంపై చర్చిస్తామన్నారు. అమెరికా, చైనా, యూకే, కెనడా తదితర దేశాల నుంచి విద్యారంగ నిపుణులు సైతం ఈ సదస్సుకు విచ్చేయనున్నారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, పీఎంపాలెం, న్యూస్‌టుడే: ?: గుడ్లవానిపాలెం నుంచి సాగర్‌నగర్‌కు వెళ్లే రోడ్డులో వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నాం. - రవి, సాగర్‌నగర్ ✓: వీధి దీపాలకు మరమ్మతులు చేపడతాం. - సాయిరాం, ఏఈ.

?: పోర్టుకాలనీ (మధురవాడ) నగరపాలెం రోడ్డులో పందులు బెడద తీవ్రంగా ఉంది. - శాంతి, మధురవాడ ✓: పందుల నివారణకు చర్యలు తీసుకుంటాం. - రాజా రవికుమార్, ఆరోగ్య అధికారి.

?: ఎస్సీకాలనీ (ఎండాడ)లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. - కాలనీవాసులు ✓: వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. - రాజా రవికుమార్, ఆరోగ్య అధికారి

?: రుషికొండలో ఏ1 గ్రేండ్ ఎదురుగా మందుబాబుల బెడద తీవ్రంగా ఉంది. - రుషికొండ వాసులు ✓: మందుబాబులపై చర్యలు తీసుకుంటాం. - పీఎంపాలెం గస్తీ పోలీసులు

?: ఓజోన్ వ్యాలీ(మధురవాడ) రోడ్డు గతుకులమయంగా ఉంది. - రాజారావు, మధురవాడ ✓: త్వరలో రోడ్డుకు మరమ్మతులు చేపడతాం. - కనకమహాలక్ష్మి, జెడ్సీ

?: ఇస్కాన్ మందిరం (సాగర్‌నగర్) పరిసరాల్లో వీధి కుక్కలు బెడద తీవ్రంగా ఉంది. - కృష్ణ, భక్తుడు ✓: వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. - రాజా రవికుమార్, ఆరోగ్య అధికారి.

స్పందనకు వందనం

పందుల నివారణకు చర్యలు

ఎండాడ, న్యూస్‌టుడే: చంద్రపాలెం (మధురవాడ)లో పందులు సంచరిస్తూ పరిసరాలను పాడు చేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన ఆరోగ్య అధికారి రాజా రవికుమార్ పందుల నివారణకు చర్యలు తీసుకున్నారు.

బిల్లుల పెంపు.. పోషకాల వడ్డింపు

మధురవాడ, న్యూస్‌టుడే

సర్కారు బడుల్లో చదివే పిల్లలకు రుచికరమైన, నాణ్యతతో కూడిన ఆహారం అందించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పాఠశాలల్లో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంట ఖర్చులను ప్రభుత్వం పెంచింది. దీంతో విద్యార్థులకు మరింత రుచికరమైన భోజనం అందించడానికి అవకాశం ఏర్పడింది. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచి వారికి పోషకాహారం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. గత వైకాపా ప్రభుత్వం ఈ పథకంపై నిర్లక్ష్యం వహించడంతో పాటు నాసిరకం బియ్యం అందించేవారు. వాటితో వండిన అన్నం ముద్దగా ఉండటంతో పిల్లలు తినేవారు కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బడులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేసేలా నిర్ణయం తీసుకుని అమలు చేస్తోంది. దీంతో భోజనం తినే విద్యార్థుల సంఖ్య క్రమక్రమంగా పెరిగింది. తాజాగా వంట ఛార్జీలను పెంచడం వల్ల భోజనం మరింత నాణ్యతతో వడ్డించేందుకు అవకాశం ఏర్పడింది.

మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

✦ పెరిగిన ఛార్జీలు ఇలా..: ప్రస్తుతం వంట ఖర్చుల నిమిత్తం 1-5 తరగతుల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5.45 చొప్పున చెల్లించేవారు. ప్రస్తుతం ఈ ధరను రూ.6.19కి పెంచారు. అలాగే 6-8, 9-10 తరగతుల వారికి రూ.8.17 చొప్పున చెల్లించే నగదును ఇక నుంచి రూ.9.29కి పెంచి అందించనున్నారు. గతేడాది నవంబర్‌లో ఛార్జీల పెంపుదలపై ప్రతిపాదనలు చేయగా ఏడాది తర్వాత అధికారికంగా ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి పెంచిన ఛార్జీలతో నిర్వాహకులకు నగదు అందిస్తారు.

✦ చినగదిలి మండలం పరిధిలో 51 (ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత) పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. ఆయా పాఠశాలల్లో 113 మంది భోజన నిర్వహణ కార్మికులు పని చేస్తున్నారు. దాదాపు 14 వేల మంది విద్యార్థులకు పథకంలో భాగంగా భోజనం అందిస్తున్నాం. చంద్రంపాలెంతో పాటు మరో నాలుగు పాఠశాలల్లో అక్షయపాత్ర ఫౌండేషన్ భోజనం సరఫరా చేస్తున్నారు. పెరిగిన వంట ఛార్జీల ధరలు ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి అందించేలా ఉత్తర్వులు అందాయి. - పి.రవీంద్రబాబు, మండల విద్యాశాఖాధికారి

పీజీఆర్‌ఎస్‌కు వినతుల వెల్లువ

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో 16 వినతిపత్రాలను ఈఈ శాంతి రాజు, డీఈ మణికుమార్‌లు స్వీకరించారు. మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఆదాయపు పన్ను డబ్బులు చెల్లించాలని యూనియన్ నాయకులు అప్పలరాజు వినతి పత్రం ఇచ్చారు. పీఎంపాలెం తులసీనగర్‌లో అంతర్గతరహదారులు, కాలువలు నిర్మించాలన్నారు. 8వ వార్డు ఎండాడ ముబారక్‌కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటుచేయాలని, ఎండాడ రెడ్డిలకాలనీ, శాంతినగర్‌లో ప్రమాదకరంగా వీధిదీపాల తీగలు ఉన్నాయని, వాటిని సరిచేయాలని కోరారు. బింద్రానగర్, షిప్‌యార్డ్ లే-అవుట్‌లో పార్కు సరిహద్దు గోడను నిర్మించాలన్నారు. కొమ్మాది ఎస్సీకాలనీలో, బక్కన్నపాలెం బాస్కర్‌నగర్ లే-అవుట్‌లో సీసీరోడ్డు, కాలువలు నిర్మించాలని ఆయా కాలనీవాసులు వినతిపత్రాలు అందించారు. 6వ వార్డు ఎస్టీఆర్‌కాలనీ, ఎస్సీ ఎస్టీ కాలనీల్లో వీధిదీపాలు వెలగడం లేదని షేక్‌బాబు ఫిర్యాదు చేశారు. 6వ వార్డు కొమ్మాది దేవిమెట్ట శాంతినగర్ కాలనీలో రహదారిని నిర్మించాలని కాలనీవాసులు కోరారు.



జోన్-2 కార్యాలయంలో అధికారులకు సమస్యలు తెలుపుతున్న అర్జీదారులు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలోని జమ్ముచెరువు(జేసీ) పార్కును సుందరీకరణ కోసం మరింత అభివృద్ధి చేయాలని కోరుతూ జేసీ పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జోనల్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో జెడ్పీ అయ్యప్పనాయుడుకు వినతిపత్రాన్ని అందించారు. ఎస్.జోగారావు, టి.అప్పారావు, వై.వెంకటరావు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి సన్‌స్కూల్లో ఏడో తరగతి చదువుతున్న ఎద్దు ప్రార్థన శ్రేష్ఠ ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు మచిలీపట్నం ఇండోర్ స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు హాజరుకానున్నట్లు కరస్పాండెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ ఏడాది అక్టోబరు 29న అనకాపల్లిలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో 14 ఏళ్లలోపు బాలబాలికలకు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

◄ విద్యార్థినితో సన్‌స్కూలు కరస్పాండెంట్ కె.శ్రీనివాస్

'రైతన్నా.. మీకోసం' సర్వే ప్రారంభం

పద్మనాభం, న్యూస్‌టుడే: రైతుల సమగ్ర వివరాల సేకరణ కోసం ప్రభుత్వం చేపడుతున్న 'రైతన్నా.. మీకోసం' సర్వే ప్రక్రియ మండల వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైంది. వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ సిబ్బంది గ్రామంలోని ప్రతి రైతు ఇంటికి వెళ్లి రైతు భూమి, సాగు చేస్తున్న పంట, పాడి పశువులు, పండ్ల తోటలు తదితర వివరాలు నమోదు చేసి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. వారం రోజుల పాటు ఈ సర్వే ప్రక్రియ సాగుతుందని మండల వ్యవసాయాధికారి ఎంవీఎస్.చలం తెలిపారు.

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం మండలంలోని పలు గ్రామాల్లో 'రైతన్నా.. మీ కోసం' సర్వే వ్యవసాయ శాఖాధికారులు సోమవారం ప్రారంభించారు. గ్రామాల్లో ప్రత్యేక బృందాల సభ్యులు రైతులకు వ్యవసాయానికి సంబంధించిన ఐదు సూత్రాలను వివరించారు. మండల వ్యవసాయ శాఖాధికారి సంధ్యారత్నప్రభ, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప పీఠంలో అన్నదానం

చిట్టివలస(తగరపువలస)న్యూస్‌టుడే: తగరపువలస దుర్గాలమ్మ అయ్యప్పస్వామి సేవా పీఠంలో జీవీఎంసీ ఒకటోవార్డు తెలుగు యువత అధ్యక్షులు గరే సదానంద, తెదేపా మాజీ అధ్యక్షులు గరే చంద్రమౌళి ఆర్థిక సాయంతో సోమవారం ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. సుమారు 1000 మంది స్వాములు, భవానీలు, ఇతర మాలలే వేసుకున్న వారు అయ్యప్ప అన్నదాన భిక్షను స్వీకరించారు. పీఠం నిర్వాహకులు, తమ్మిన సూరిబాబు, దొంతల పైడిరాజు, సూర్య, పలువురు గురుస్వాములు, తదితరులు పాల్గొన్నారు.

అనర్గళంగా ప్రసంగించి.. విజేతలుగా నిలిచి

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి వారిని మెరికల్లా తయారు చేసేందుకు 'ఈనాడు-ఈటీవీ' నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీలు పిల్లల్లో ఉత్సాహం నింపుతున్నాయని పీఎంపాలెం మాలతాంబ విద్యానికేతన్ కరస్పాండెంట్ సునీల్‌మహంతి అన్నారు. సోమవారం సంబంధిత పాఠశాలలో ఏడు నుంచి పదో తరగతి విద్యార్థులకు 'విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. పలువురు విద్యార్థులు ఏ మాత్రం బెరుకు లేకుండా అనర్గళంగా ప్రసంగించి అబ్బురపరిచారు. పదో తరగతి విద్యార్థి వై.అఖిల్ (ప్రథమ), 9వ తరగతి విద్యార్థి పి.హర్షిత్ (ద్వితీయ), ఏడో తరగతి విద్యార్థి కె.తేజ (తృతీయ) విజేతలుగా నిలిచారు. వీరికి జనరల్ మేనేజర్ జి.పి.ఆర్.కృష్ణ, ప్రిన్సిపల్ బి.శ్రీదేవి, ఉప ప్రిన్సిపల్ సీహెచ్.అనూరాధ తదితరులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న జనరల్ మేనేజర్, ప్రిన్సిపల్ తదితరులు

పీఎంపాలెం మాలతాంబ విద్యానికేతన్‌లో ప్రసంగిస్తున్న విద్యార్థిని

ఎండాడ, న్యూస్‌టుడే: దసపల్లాలేఅవుట్ (ఎండాడ) సెయింట్ జేమ్స్ పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. హన్సిక బిశ్వాల్ (9వ తరగతి), బి.షాలిని (9వ), బి.తను ప్రియ (7వ) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఉపాధ్యాయులు సీహెచ్ దేవి, పి.శివరామకృష్ణ, కె.అనిషా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

విజేతలతో ఉపాధ్యాయులు, సెయింట్ జేమ్స్ పాఠశాలలో ఉపన్యాసం చేస్తున్న విద్యార్థిని

డాబా పైనుంచి పడి మహిళ దుర్మరణం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఓ మహిళ ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ఆరిలోవ ఎస్.ఐ. కృష్ణ తెలిపారు. ఆ వివరాలిలా.. ఎండాడ ప్రాంతానికి చెందిన **కణితి రాణి** (35).. డ్రైవర్‌గా పనిచేస్తున్న భర్త వసంత్, ఇద్దరు పిల్లలతో స్థానిక రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. రాణి ఎప్పటి మాదిరిగానే ఆదివారం సమీపంలోని ఓ ప్రార్థనా మందిరానికి వెళ్లింది. అక్కడ కనకరాజు అనే వ్యక్తి రాణి పక్కన కూర్చున్నారు. ఆ విషయం కనకరాజు భార్యకు తెలిసి ఆమె రాణి ఇంటి వద్దకెళ్లి ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం తలెత్తింది. దాంతో కోపాన్ని అదుపు చేసుకోలేక అదే రోజు రాత్రి 9.30 గంటల ప్రాంతంలో రాణి కూడా కనకరాజు ఇంటికి వెళ్లి ఆయన సమక్షంలోనే అతడి భార్యను నిలదీసింది. వసంత్ కూడా అక్కడికి చేరుకుని ఆమెను వెనక్కి రప్పించేందుకు యత్నించారు. ఈ క్రమంలో కింది నుంచి గట్టిగా పిలవగా రెండో అంతస్తు పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను ఓ ప్రైవేటు అసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ప్రాణాలు కోల్పోయినట్లు ఎస్.ఐ. పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం, న్యూస్‌టుడే: బోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని శిర్లపాలెం ఫీడర్‌లో మంగళవారం నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని గంధవరం, తిమ్మాపురం గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బస్సుల గ్యారేజీ నిర్మాణానికి సన్నాహాలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్ ప్రాంత బీచ్‌రోడ్డులోని విద్యుత్తు ఛార్జింగ్ కేంద్రం ప్రాంగణంలో మూడు డబుల్‌డెక్కర్ బస్సులు నిలుపుదల చేయడానికి అనువుగా గ్యారేజీ నిర్మించడానికి టూరిజం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు ఇటీవల సర్వే చేపట్టి బస్సుల నిర్వహణ సిబ్బందితో ఆయా అంశాలపై చర్చించారు. బీచ్‌రోడ్డులో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం తిరుగుతున్న రెండు బస్సులతో పాటు 20 రోజుల క్రితం కొత్తగా ఓపెన్‌టాప్ బస్సు వచ్చిన విషయం తెలిసిందే. దీనిని త్వరలో నడిపే దిశగా ట్రయల్‌రన్ నిర్వహించారు. ఇక్కడి బస్సులు నిలిపే ప్రదేశం సముద్ర తీరానికి అతి చేరువలో ఉంటుంది. దీంతో ఉప్పుగాలుల కారణంగా బస్సులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా త్వరితగతిన గ్యారేజీ ఏర్పాటు చేయాలని సిబ్బంది అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. విధుల నిర్వహణలో భాగంగా ఉండేందుకు సైతం ఎలాంటి వసతి లేక అసౌకర్యకర పరిణామాలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్యారేజీ నిర్మాణానికి అధికారుల పర్యవేక్షణలో సర్వే చేపట్టినట్లు సిబ్బంది పేర్కొన్నారు.

ఆరుబయట డబుల్‌డెక్కర్ బస్సులు

సిటీనగర్‌లో పరిసరాలు అధ్వానం

చిప్పాడ (తగరపువలస), న్యూస్‌టుడే: చిప్పాడ పంచాయతీ సిటీనగర్‌లో సమస్యలు తిష్ఠ వేశాయి. గ్రామంలో వీధులు అపరిశుభ్రంగా చెత్త, చెదారం, పిచ్చిమొక్కలతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ప్రధానరోడ్డుపై గుంతలతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొళాయిలు సరిగా రాకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు.

అస్తవ్యస్తంగా ఉన్న పరిసరాలు

కళావిహీనంగా ఉద్యానవనం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్ ప్రాంతంలోని ఎన్టీఆర్ ఉద్యానవనం పిచ్చిమొక్కలతో కళావిహీనంగా దర్శనమిస్తోంది. ప్రజావసరాలకు అనువుగా ఇక్కడ 80 సెంట్లు విస్తీర్ణంలో ఉన్న విశాలమైన పార్కును గతంలో జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగాధికారులు సుమారు రూ.20 లక్షలు వెచ్చించి పలు సదుపాయాలు కల్పించారు. చుట్టూ ప్రహరీతో పాటు లోపల వాకింగ్ ట్రాక్ నిర్మాణం, కూర్చోవడానికి అనువుగా సిమెంట్ బెంచీలు తదితర సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చారు. దాదాపు నాలుగేళ్లుగా నిర్వహణను పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారైంది. పిచ్చిమొక్కలు పార్కు అంతా వ్యాపించడంతో పరిసరాలు నిరుపయోగంగా మారాయి. ఒకప్పుడు ఆహ్లాదంగా ఉండే పార్కుకు ప్రస్తుతం ఇలాంటి దుస్థితి ఏర్పడటంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పూర్వవైభవం తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బెంచీ చుట్టూ పిచ్చిమొక్కలు

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కొమ్మాది, న్యూస్‌టుడే: జాతీయస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు బిట్స్‌వైజాగ్ విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని ఆ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం పీఎంపాలెంలో ఉన్న బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (బిట్స్‌వైజాగ్) ఇంజినీరింగ్ కళాశాలలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. టి-10 టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకూ హిమాచల్‌ప్రదేశ్‌లో సుజానాపూర్ మైదానంలో జరగనున్న జాతీయస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు విశాఖ నుంచి 16 మంది ఎంపికైనట్లు జిల్లా కార్యదర్శి కె.విజయకుమార్ తెలిపారు. ఎం.పవన్‌కుమార్, టి.హఫీస్‌నాయుడు కెప్టెన్, వైస్‌కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.శ్రీలక్ష్మి, ప్రిన్సిపల్, అధ్యాపక బృందం అభినందించారు.

ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీలక్ష్మి

తాత్కాలిక ఎసైన్‌మెంట్ పేరుతో.. భూములపై హక్కుల నిరాకరణ సరికాదు

పిటిషనర్ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించండి

ఈనాడు, అమరావతి: మాజీ సైనికోద్యోగులకు ప్రొవిజినల్ (తాత్కాలిక) ఎసైన్‌మెంట్ చేశారనే కారణంతో భూములపై హక్కులను నిరాకరించడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ భూమిని ఒకసారి సాగులోకి తెచ్చినప్పుడు డి-ఫారం పట్టా జారీ చేయడం లాంఛనప్రాయమేనని తెలిపింది. ఎసైన్ చేసిన పదేళ్ల తర్వాత ఆ భూములను విక్రయించుకోవచ్చని సూచించింది. ఇండియన్ నేవీలో జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ హోదాలో పనిచేసిన అధికారి మాజీ సైనికోద్యోగుల కోటా కింద ఎసైన్డ్ భూమి పొందేందుకు అర్హులని స్పష్టంచేసింది. పిటిషనర్‌కు కేటాయించింది 'ఇసుక దిబ్బ పోరంబోకు' భూములని, వాటిని ఎసైన్ చేయడానికి వీల్లేదన్న ప్రభుత్వ సహాయ న్యాయవాది(ఏజీపీ) వాదనను తోసిపుచ్చింది. పిటిషనర్ అప్పారావు భూమిని నిషేధిత జాబితా (సెక్షన్ 22ఏ) నుంచి తొలగించాలని, ఆరు వారాల్లో నిరభ్యంతర పత్రం జారీచేయాలని విశాఖ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తితో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చింది.

✦ విశాఖపట్నానికి చెందిన పి.సి.అప్పారావు ఇండియన్ నేవీలో జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ హోదాలో పదవీ విరమణ చేశారు. విశాఖ జిల్లా కొత్తవలస గ్రామంలో ఆయనకు 1978లో మాజీ సైనికోద్యోగుల కోటా కింద 5.10 ఎకరాలను ప్రభుత్వం ఎసైన్ చేసింది. ఆ భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో 22ఏ నుంచి తొలగించాలని ఆయన విశాఖ కలెక్టర్‌ను కోరారు. ఆ అభ్యర్థనను తిరస్కరిస్తూ కలెక్టర్ 2020 జూన్ 19న ఉత్తర్వులిచ్చారు. దీన్ని సవాలు చేస్తూ అప్పారావు 2022లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 15న విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. 22ఏ నుంచి తొలగించే వ్యవహారంపై కలెక్టర్‌కు తాజాగా విజ్ఞప్తి చేయాలని సూచించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆయన ధర్మాసనం ముందు అప్పీల్ చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది జీఎల్ నరసింహారెడ్డి వాదనలు వినిపించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం అప్పారావుకు చెందిన భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్‌ను ఆదేశించింది.

వార్డుల్లో దోమల నివారణకు చర్యలు

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 పరిధిలో కొన్ని నెలలుగా ఫాగింగ్ చేయకపోవడంతో దోమల బెడద తీవ్రంగా పెరిగిపోయిందని 'ఈనాడు'లో 'దోమలతో సహవాసం.. కానరాని ఫాగింగ్' శీర్షికతో సోమవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన జెడ్సీ కె.కనకమహాలక్ష్మి, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.రాజారవికుమార్ ఆదేశాలతో డెంగీ, మలేరియా తదితర రోగాలబారిన పడకుండా వార్డుల్లో దోమల నివారణకు చర్యలు తీసుకున్నారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ మంగరాజు సారథ్యంలో సిబ్బంది టీచర్స్ లే-అవుట్, ఎస్సీ, ఎస్టీకాలనీ, టీబీసీ పాయింట్, అంబేడ్కర్‌నగర్‌తో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల పరిసర ప్రాంతాల్లో మినీ యంత్రంతో ఫాగింగ్ చేశారు. స్ప్రే చేసి ఆయిల్‌బాల్స్ సైతం వేయాలని, ప్రతి రోజూ ఫాగింగ్ చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని ఏఎంహెచ్‌వో సిబ్బందిని హెచ్చరించారు.

ఈనాడు కథనానికి స్పందన

ఫాగింగ్ చేస్తున్న మలేరియా సిబ్బంది

సింహాద్రినాథుడికి వేడుకగా నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి సన్నిధిలో సోమవారం నిత్య కల్యాణోత్సవం వేడుకగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని జరిపించారు.

నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

గోవిందుడికి వైభవంగా గరుడ వాహన సేవ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో సోమవారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. తులసీ దళాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. భక్తులు పాల్గొని స్వామికి ప్రదక్షిణలు చేశారు. అర్చకులు భక్తులను వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గరుడ వాహన సేవ చేస్తున్న అర్చక స్వామి

ప్రధానార్చక వివాదంపై నోటీసుల జారీకి సన్నాహాలు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి ఆలయ ప్రధానార్చకుల నియామకంలో సీనియారిటీని పరిగణనలోకి తీసుకోలేదని ఆలయ ఉపప్రధానార్చకుడు కేకేఎస్ ప్రసాదాచార్యులు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నేపథ్యంలో న్యాయమూర్తి ఇటీవల వివాద పరిష్కారానికి ఉత్తర్వులు వెలువరించారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఆలయ ప్రధానార్చకుడిగా తనకు అధికారులు ఉద్యోగోన్నతి కల్పించకుండా చేశారని అభియోగాలు చేస్తూ 2022లో ప్రసాదాచార్యులు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ప్రధానార్చక నియామకంపై నూతన ఉత్తర్వులు జారీ చేయాలని రెండు నెలల క్రితం న్యాయస్థానం ఆదేశించడంతో వాటి అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి డాక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ ఈ నెల 6న ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే విషయంపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఈ నెల 18న సింహాచలం దేవస్థానం ఈవోకు మెమో ద్వారా ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాలకు నోటీసులు జారీ చేసి సీనియారిటీకి సంబంధించి లిఖిత పూర్వక అభిప్రాయాలు, ఆధారాలు తీసుకోనున్నట్లు దేవస్థానం పరిపాలనా విభాగం పర్యవేక్షకుడు కంచి మూర్తి తెలిపారు. ఈ మేరకు పిటిషనర్‌తో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి నోటీసులు జారీ చేయడానికి దేవస్థానం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఘనంగా కార్తిక వనసమారాధన

కొమ్మాది, న్యూస్‌టుడే: ఒడియా బ్రాహ్మణులంతా ఐక్యంగా ఉండాలని అప్పుడే ఏదైనా సాధించవచ్చని ఎన్టీఆర్ వైద్యసేవా ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ పేర్కొన్నారు. మధురవాడ శిల్పారామం (జాతర)లో ఒడియా బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒడియా బ్రాహ్మణుల కార్తిక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూల నుంచి వందల సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా ఎన్టీఆర్ వైద్యసేవా ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, ఒడియా బ్రాహ్మణుల రాష్ట్ర అధ్యక్షులు శివాజీ పాణిగ్రాహి, ఎన్ఐఎస్ఎఫ్ విద్యాసంస్థల అధినేత సునీల్‌మహంతి, విశ్రాంత అదనపు ఎస్పీ టి.ఎస్.ఆర్. ప్రసాద్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు కృష్ణచంద్రమహంతి తదితరులు పాల్గొని రాష్ట్రంలో ఉన్న ఒడియా బ్రాహ్మణుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని హామీ ఇచ్చారు. సినీ కళాకారులు రవి తేజ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాలు చేపట్టారు. ఒడియా బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్‌కుమార్, బాలుపాత్రో తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐఎస్ఎఫ్ అధినేత సునీల్‌మహంతిని సత్కరిస్తున్న నిర్వాహకులు

PUBLIC NOTICE

My client **M/s. S.S. INFRA rep., by its Proprietor Sri. Satyala Kalyan S/o. Satya Rao,** residing at D.No.16-2-96, Ramalayam Street, Yarada, Visakhapatnam

My client instructed me to issue this general notice informing the public that, My client intends to purchase the Schedule property from Smt. Bonthu Eswari @ Bonthula Eswari W/o. Hari Venkat Krishna residing at D.No. 45-58-3/6, Narasimha Nagar, Akkayyapalem, Visakhapatnam District.

She acquired the property under a Regd. Sale Deed vide Doc. No. 1064/2007 dated 08-03-2007 Registered at SRO Madhurawada from Smt. Korada Sanyasiamma and others and ever since then she has been uninterrupted possession and enjoyment of the property.

Hence any person having objections, claim, interest over the below said property may inform me or my client within 15 days from the date of this publication, failing which, my client will treat that there are no objections and proceed with the sale transaction.

SCHEDULE OF PROPERTY

All that vacant site measuring an extent of 327.76 Sq.yds or 274.06 Sq.mts (as per RC.No. LSR/10828/08/PLG/L5 dated 26-05-2010), being in Plot No. 19 & 20, covered by S.No. 278 Madhurawada Village, within the Limits of Greater Visakhapatnam Municipal Corporation, Visakhapatnam District and bounded by : **East :** 33 Feet Wide Road, **South:**33 Feet Wide Road, **West:** Land in Plot No. 18, **North :** Land in Plot No.21 & 22

B.ANANTHA LAKSHMI, ADVOCATE
Opp. Sowndarya Shoppee, Carshed Jn. Madhurawada, Visakhapatnam-41
MOBILE: 9963234888

(c) eenadu

విశాఖ తూర్పు

27 నుంచి గీతంలో అంతర్జాతీయ సదస్సు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సుస్థిర సమాజాభివృద్ధికి సరికొత్త వాణిజ్య నమూనాలు అనే అంశంపై గీతం డీమ్డ్ వర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచంలోని పలు దేశాల నుంచి 150 మందికి పైగా పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, ప్రణాళిక, వాణిజ్య నిపుణులు సదస్సుకు హాజరుకానున్నారన్నారు. ఆర్థిక రంగంలో వస్తున్న మార్పులు వంటి అంశాలపై ప్రసంగాలు ఉంటాయన్నారు. వాణిజ్యరంగంపై పర్యావరణ మార్పుల ప్రభావం, డిజిటల్ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానంపై చర్చిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769

మద్దిలపాలెం: 9912120229

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ?: చినవాల్తేరు రజక వీధి వద్ద వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. –వాసు, వెంకటరావు, స్థానికులు ✓: రెండు రోజుల్లో సిబ్బందిని పంపి వ్యర్థాలు తొలగిస్తాం. –ప్రకాష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ?: చినవాల్తేరు నేతాజీ వీధిలో భూగర్భ డ్రైనేజీ లీకుల కారణంగా దుర్వాసనతో అవస్థలు పడుతున్నాం. –రామకృష్ణ, స్థానికుడు ✓: రెండు రోజుల్లో సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తాం. –శంకరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 17వ వార్డు పరిధి ఆదర్శనగర్ ప్రాంత కాలువల్లో పూడికలు తొలగించక దుర్వాసన వెదజల్లుతోంది. –సాయికిరణ్, ఆదర్శనగర్ ✓: తక్షణమే సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తాం. –ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ?: ఆరిలోవ టీఐసీ పాయింట్ నుంచి ఆరిలోవ కాలనీ చివరి బస్‌స్టాప్ వరకు వెళ్లే ప్రధాన మార్గంలో యూజీడీ గోతుల కారణంగా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. –వి.శ్రీనివాసరావు, ఆరిలోవ కాలనీ ✓: వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. –వెంకటరావు, డీఈ

ఇందిరానగర్ (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: పదో వార్డు పరిధి ఆదర్శనగర్ కొండవాలు ప్రాంతంలో కుళాయిల్లో ధార సన్నగా వస్తుండడంతో నీటికి అవస్థలు పడుతున్నాం. –షేక్ సలీమా, గృహిణి ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే సమస్య పరిష్కరిస్తాం. –శ్రీనివాస్, ఏఈ

స్పందనకు వందనం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 22వ వార్డు మంగాపురం కాలనీ రహదారిపై వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ సమస్యపై సోమవారం 'ఈనాడు'లో వెలువడిన వార్తాకథనానికి వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ స్పందించారు. సిబ్బందితో వ్యర్థాలు తీయించి శుభ్రత పనులు చేపట్టారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పదో వార్డు పరిధి బీఎన్ఆర్ నగర్‌లో కొద్ది రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. ఈ సమస్యపై స్థానికులు 'ఈనాడు-మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో వీధిదీపాల విభాగ పర్యవేక్షకులు స్పందించారు. సిబ్బందితో మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కొట్టుకొచ్చిన మరో విద్యార్థి మృతదేహం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సముద్రంలో గల్లంతైన మరో విద్యార్థి మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. ఈనెల 22న సాయంత్రం బీచ్ రోడ్డు ఎం.జీ.ఎం. పార్కు వెనుక లైట్‌హౌస్ సమీపంలో ఇద్దరు విద్యార్థులు సాగరంలో స్నానానికి దిగి అలల తాకిడికి గల్లంతైన విషయం తెలిసిందే. అదే రోజు మూడో పట్టణ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టిన ఫలితం లేకపోయింది. 23వ తేదీన సాలూరు ప్రాంతానికి చెందిన మానేపల్లి తేజేష్ మృతదేహం ఒడ్డుకు చేరగా.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన ఆదిత్య (20) మృతదేహం సోమవారం ఉదయం ఎంజీఎం పార్కు సమీపంలో తీరానికి కొట్టుకొచ్చింది. మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించినట్లు సీఐ పైడయ్య తెలిపారు. వీరిద్దరూ బుల్లయ్య కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వీధుల్లో అంధకారం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే

తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో చీకటి పడితే అంధకారం నెలకొంటోంది. వీధి దీపాల నిర్వహణ అంతంతమాత్రంగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 14వ వార్డులో దాదాపు ప్రతి వీధిలోను ఈ సమస్య రాజ్యమేలుతోంది. వీటికి కారణం పూర్తిస్థాయిలో సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడమేనని పలువురు ఆరోపిస్తున్నారు.

కిర్లంపూడి లేఅవుట్ సమీపంలో చెట్ల కొమ్మల కారణంగా ఇలా..

★ ఆటోమోటివ్‌కూడలి జ్యోతి నర్సింగ్‌హోమ్ ప్రాంతం, 16వ వార్డు అబ్దుల్‌కలాం పార్కు రహదారి, ఇసుకతోట, సింహాద్రిపురం, హెచ్‌బికాలనీ, స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ ఏరియాలో ఈ సమస్య వెంటాడుతోంది.

★ చినవాల్తేరు, కిర్లంపూడి లేఅవుట్, పాండురంగాపురం ఏరియా, శివాజీపాలెం, పిఠాపురంకాలనీ, పాత సీబీఐ కూడలి ప్రాంతాల్లో చెట్ల కొమ్మల కారణంగా వెలుగుల్లేవు. శాఖల మధ్య సమన్వయలోపం వల్ల ఈ దుస్థితి తలెత్తిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

★ భానునగర్, రామాలయం, అంబేడ్కర్‌కాలనీ, సీఎంఆర్ శ్మశాన మార్గం, డీసీఐ కార్యాలయం వెనుకభాగం వంటి ప్రాంతాలతోపాటు 23వ వార్డు చైతన్యనగర్, కేఆర్ఎంకాలనీ, ఎంవీపీ కాలనీ, అప్పుఘర్, ప్రశాంతి పార్కు ఏరియాతో పాటు తి.తి.దే. కల్యాణ మండపం వెనుకభాగం తదితర చోట్ల కూడా ఈ సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

★ ఆరిలోవ సమీప రాజీవ్‌నగర్, డెయిరీ ఫారం కూడలి నుంచి రవీంద్రనగర్ మార్గంలోనూ వీధిదీపాలు వెలగడం లేదు. తోటగురువు పాఠశాల వెనుకనున్న బీఎన్ఆర్ నగర్, గ్రామీణ తహసీల్దార్ కార్యాలయ మార్గం, హనుమంతువాక కొండవాలు ప్రాంతంలోనూ ఇబ్బందులు తప్పడం లేదు.

★ ఈ సమస్యపై వినతులు ఇస్తున్నా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో సుమారు 25శాతం వరకు వీధి దీపాల నిర్వహణ పడకేసిందని, కొన్ని చోట్ల దీపాలు ఎప్పుడు వెలుగుతాయో, ఎప్పుడు ఆరిపోతాయో తెలియదని అంటున్నారు.

★ జీవీఎంసీ విద్యుత్తు విభాగ డీఈ అన్నంనాయుడు వద్ద ఈ విషయం ప్రస్తావించగా.. కొన్ని ప్రాంతాల్లో వీధిదీపాల మరమ్మతులు చేపట్టామని క్షేత్రస్థాయిలో పరిశీలించి మొరాయించిన దీపాలకు వెంటనే మరమ్మతులు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

పాతసీబీఐ కూడలిలో వెలగని వీధి దీపం

ఉత్తమ ఉద్యోగులకు అవార్డుల ప్రదానం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదాలను నివారించడంలో కీలకపాత్ర పోషించిన పలువురు రైల్వే ఉద్యోగులను వాల్తేర్ డీఆర్ఎం లలిత్ బోహ్రా సోమవారం అవార్డులు అందజేసి సత్కరించారు. ఉద్యోగుల అసాధారణ పని తీరును ప్రశంసించారు. 2025-26వ సంవత్సరంలో రైలు కార్యకలాపాల సమయంలో ఎదురయ్యే భద్రతా ముప్పులకు వృత్తి నైపుణ్యం, వేగవంతమైన ప్రతిస్పందనకు గుర్తింపుగా ట్రాక్‌మెన్, కీమెన్, స్టేషన్ మాస్టర్లు, లోకోపైలెట్లకు అవార్డులు ప్రదానం చేశారు. ట్రాక్‌మెన్స్ కుమార్ సాహెబ్, సురేష్‌కుమార్, జ్ఞానరంజన్ సాహూ, ఎన్.వరప్రసాద్, ఎం.కూర్మారావు, కీమెన్ రాకేష్ కుమార్, పియాంట్స్ మెన్ ఎం.కృష్ణంనాయుడు, స్టేషన్ మాస్టర్ సంతోష్‌కుమార్, ఏఎల్‌పీ బి. తిరుపతిరావు తదితరులకు వీటిని అందజేశారు.

ట్రాక్ నిర్వాహకుడికి ధ్రువపత్రం అందజేస్తున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా

బీసీ స్టడీ సర్కిల్ పనితీరుపై ఆరా..

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఎంవీపీకాలనీలోని బీసీ స్టడీ సర్కిల్‌ను సోమవారం ఏపీ బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ ఎస్. సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు అందించనున్న ఉచిత శిక్షణకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?, ఈ పరీక్షకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారని ఆరా తీశారు. గ్రంథాలయాన్ని పరిశీలించి పాత పుస్తకాల స్థానంలో నూతన సిలబస్‌కు అనుగుణంగా పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలని, అందుకు ప్రభుత్వం తరపున తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. భవనం ఆధునికీకరణకు సీఎస్ఆర్ నిధులు సమకూర్చుకోవాలని సూచించారు. బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కె.వి.సుబ్బారావు, ఉత్తరాంధ్ర ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు, ప్రతినిధులు కట్టా మల్లేశ్వరరావు, ఎల్.గణేష్, చంద్రశేఖర్, రాజశేఖర్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాజేశ్వరి, సమన్వయకర్త జీవన్ శంకర్, సహాయ సంక్షేమాధికారి రావి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ సర్కిల్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న బీసీ సంక్షేమశాఖ సెక్రటరీ సత్యనారాయణ

డాబా పైనుంచి పడి మహిళ దుర్మరణం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఓ మహిళ ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ఆరిలోవ ఎస్.ఐ. కృష్ణ తెలిపారు. ఆ వివరాలిలా.. ఎండాడ ప్రాంతానికి చెందిన కణితి రాణి (35) డ్రైవర్‌గా పనిచేస్తున్న భర్త వసంత్, ఇద్దరు పిల్లలతో స్థానిక రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. రాణి ఎప్పటి మాదిరిగానే ఆదివారం సమీపంలోని ఓ ప్రార్థనా మందిరానికి వెళ్లింది. అక్కడ కనకరాజు అనే వ్యక్తి రాణి పక్కన కూర్చున్నారు. ఆ విషయం కనకరాజు భార్యకు తెలిసి ఆమె రాణి ఇంటి వద్దకెళ్లి ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం తలెత్తింది. దాంతో కోపాన్ని అదుపు చేసుకోలేక అదే రోజు రాత్రి 9.30 గంటల ప్రాంతంలో రాణి కూడా కనకరాజు ఇంటికి వెళ్లి ఆయన సమక్షంలోనే అతడి భార్యను నిలదీసింది. వసంత్ కూడా అక్కడికి చేరుకుని ఆమెను వెనక్కి రప్పించేందుకు యత్నించారు. ఈ క్రమంలో కింది నుంచి గట్టిగా పిలవగా రెండో అంతస్తు పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను ఓ ప్రైవేటు అసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ప్రాణాలు కోల్పోయినట్లు ఎస్.ఐ. పేర్కొన్నారు.

రాణి (పాతచిత్రం)

రేపు పద్మావతి అమ్మవారికి పుష్పయాగం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి పుష్పయాగం సందర్భంగా మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంవీపీకాలనీ తి.తి.దే. కల్యాణమండపంలో పుష్పాలు సేకరిస్తున్నట్లు నిర్వాహకులు హిమాంశు ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. కలువ, గులాబీ, సంపెంగ వంటి పుష్పాలను భక్తులు ఇవ్వవచ్చునని, వాటిని బుధవారం ఉదయం తిరుచానూరు పంపిస్తామని పేర్కొన్నారు.

ఏయూ సమాచారం

ఏయూలో పుస్తకావిష్కరణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి ప్రభుత్వ పాలనా శాస్త్రం విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం ఆధ్వర్యంలో 'భారతదేశం, యూరప్‌లలో ప్రజాస్వామ్య వైవిధ్యం, మార్పు' అన్న పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఏయూ పూర్వ రెక్టార్ ఆచార్య ఇ.ఎ.నారాయణ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. భారత్, యూరప్‌లలో అమలవుతున్న ప్రజాస్వామ్య పద్ధతుల గురించి వివరించారు. ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, పుస్తక సంపాదకులు ఆచార్య ప్రేమానందం కూడా మాట్లాడారు. సహ సంపాదకులు డా. కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య నారాయణ, ఆచార్య నరసింహారావు తదితరులు

మత్స్యకారుల సాధికారతపై కార్యశాల

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ (సీఎస్ఎస్ఐ) ఆధ్వర్యంలో సోమవారం అభివృద్ధి చెందిన భారతదేశం కోసం మత్స్యకారుల సాధికారత అనే అంశంపై కార్యశాల జరిగింది. ఈ కార్యక్రమానికి ఆచార్య పి.కింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఎస్ఎస్ఐ డైరెక్టర్ డా.పి.సుబ్బారావు కార్యశాల లక్ష్యాన్ని వివరించారు. ఏపీ ఫిష్‌కాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దాసు మాట్లాడుతూ మత్స్యకారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు, డా.బి.శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏయూ రెక్టార్ ఆచార్య కింగ్

జాతీయ సదస్సుకు ఆహ్వానం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఛైర్ ప్రొఫెసర్ ఆచార్య మేకా జేమ్స్ స్టీఫెన్‌కు అరుదైన గౌరవం లభించింది. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని 'డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్' ఆయనను అధికారికంగా ఆహ్వానించింది. ఈనెల 26న దిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరగనున్న జాతీయ సదస్సులో విశిష్ట అతిథిగా పాల్గొని ప్రసంగించడమే కాకుండా ఉన్నత స్థాయి ప్యానల్ చర్చకు అధ్యక్షత వహించనున్నారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించాక 75 ఏళ్ల వేడుకల ముగింపు సందర్భంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు స్టీఫెన్ పేర్కొన్నారు.

ఆచార్య జేమ్స్ స్టీఫెన్

26న జాబ్ మేళా

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం మోడల్ కెరీర్ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 26న జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఇందులో ఫ్రెషర్స్, గ్రాడ్యుయేట్లు, పోస్ట్-గ్రాడ్యుయేట్, పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణత గల నిరుద్యోగులు పాల్గొనవచ్చునని మోడల్ కెరీర్ సెంటర్ ప్రతినిధులు ఓ ప్రకటనలో కోరారు.

ఉపన్యసించారు...బహుమతులు పొందారు..

ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

ప్రసంగిస్తున్న అరుణోదయ పాఠశాల విద్యార్థి

బహుమతులందిస్తున్న ఉపాధ్యాయులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: సెల్‌ఫోన్.. విద్యార్థుల జీవితంపై ప్రభావం అనే అంశంపై ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించగా.. పలువురు ప్రతిభ చాటి బహుమతులు గెలుచుకున్నారు. ★ పదోవార్డు ఆదర్శనగర్ అరుణోదయ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో నిర్వహించిన పోటీలలో ఎనిమిది, తొమ్మిది, పదోతరగతి విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో అమిషకుమారి యాదవ్ (ప్రథమ), డి.లక్ష్మి వైభవి (ద్వితీయ), పి.శ్రీరాం తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయిని జి.దేవి, ఉపాధ్యాయులు బహుమతులందించి అభినందించారు.

★ ఆరిలోవ శ్రీఅంజన పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో డి.తేజశ్రీ (ప్రథమ), వై.చైత్ర (ద్వితీయ), డి.ప్రణిత వర్మ తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ ఎన్.గణేష్, ఉపాధ్యాయులు ఎన్.హారిక, జె.జాన్‌విజయ్ బహుమతులందించి అభినందించారు.

శ్రీఅంజన పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బహుమతులందిస్తున్న ఉపాధ్యాయులు

సంతానోత్పత్తిపై అవగాహన ర్యాలీ

పెదవాల్తేరు: ఒయాసిస్ సంస్థ ఆధ్వర్యంలో సంతానోత్పత్తిపై అవగాహన కల్పిస్తూ బీచ్‌రోడ్డులో సోమవారం ర్యాలీ నిర్వహించారు. జనని పేరిట పలు జంటలతో ఈ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బస్సుయాత్రను ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సమాజంలో ఆరోగ్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రీజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాధిక, సీఈవో పుష్కరాజ్ తదితరులు పాల్గొన్నారు.

యాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్

ఆటోను ఢీకొన్న కారు: వ్యక్తికి గాయాలు

డివైడర్‌పైకి ఎక్కేసిన ఆటో

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ముందు వెళ్తున్న వాహనాన్ని మరో వాహనం ఢీకొనగా ఓ వ్యక్తి గాయపడినట్లు ఆరిలోవ ట్రాఫిక్ ఎస్సై కనకారావు తెలిపారు. ఆ వివరాలిలా.. హనుమంతువాక నుంచి సింహాచలం వైపు ఓ ఆటో వెళ్తుండగా.. అదే మార్గంలో దాని వెనుక ఓ కారు వస్తోంది. ఆ కారు ముడసర్లోవ పార్కు వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న ఆటో వేగాన్ని చోదకుడు అకస్మాత్తుగా తగ్గించడంతో కారుడ్రైవర్ వేగాన్ని నియంత్రించలేక ఢీకొట్టాడు. దాంతో సంబంధిత ఆటో డివైడర్ ఎక్కేసి అందులోని ప్రయాణికుడికి గాయాలయ్యాయి. అతడిని సమీప ఆసుపత్రికి తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించినట్లు ఎస్.ఐ. పేర్కొన్నారు.

గోవిందుడికి వైభవంగా గరుడ వాహన సేవ

గరుడ వాహన సేవ చేస్తున్న అర్చక స్వామి

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో సోమవారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. తులసీ దళాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. భక్తులు పాల్గొని స్వామికి ప్రదక్షిణలు చేశారు. అర్చకులు భక్తులను వేద మంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సింహాద్రినాథుడికి వేడుకగా నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి సన్నిధిలో సోమవారం నిత్య కల్యాణోత్సవం వేడుకగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని జరిపించారు.

ఘనంగా అవినీతి నిరోధక వారోత్సవం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: అవినీతి నిరోధక వారోత్సవాల్లో భాగంగా డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం శ్రీకృష్ణాపురం గురుకుల విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. డెప్యూటీ మేనేజర్ సుధాకర్ విద్యార్థులకు అవినీతి వల్ల కలిగే అనర్థాలపై వివరించి విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపల్ రత్నవల్లి, ఉపాధ్యాయులు పి.సుధాకర్, వై.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి బహుమతి అందిస్తున్న అధ్యాపకులు, అధికారులు

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

కార్పొరేషన్, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షాలో పని చేస్తున్న ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సమగ్ర శిక్షా ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల ఫెడరేషన్ ప్రతినిధి పి.మణి డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం సమగ్ర శిక్షా ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ వేతనాలతో, ఉద్యోగ భద్రత లేకుండా జీవనం సాగిస్తున్న వారిని ఆదుకోవాలన్నారు. తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, ఆరోగ్య బీమా, ఉచిత వైద్య సదుపాయం కల్పించి ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

అలరించిన కవి సమ్మేళనం

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-13 భరద్వాజ క్షేత్రంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన అమరావతి విశ్వసాహితీ కవి సమ్మేళనం ఆద్యంతం అలరించింది. సంస్థ ప్రధాన కార్యదర్శి సి.హెచ్.చినసూర్యనారాయణ శ్రీకృష్ణదేవరాయలు - అష్టదిగ్గజాలపై వివరించగా, జ్యోతిష్య పండితుడు అడబాల సత్యనారాయణ తెలుగు అక్షరాల పరిణామక్రమాన్ని వివరించారు. తెలుగుభాష వర్ధిల్లాలని కోరుతూ కవులు చల్లా రాంబాబు, పిల్లా అర్జునుడు, రొంగలి రాములు, జి.ఎస్.ఆర్.మూర్తి, పి.సింహాచలం, బి.వెంకటేశ్వరరావు, పి.చెల్వరాజు, ఆర్.దుర్గాప్రసన్న, కె.కృష్ణ, డి.సంతోష్‌బాబు, బి.వి.రమణమూర్తి, డి.ఎస్.కుమార్, కె.రామారావు తమ కవితలను వినిపించారు. కోశాధికారి పి.ఎల్వీ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో భద్రత కట్టుదిట్టం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఇటీవల దొంగతనాలు పెరగడంతో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇందులో భాగంగా అపరిచితులు లోపలికి ప్రవేశించకుండా అవసరం లేని కొన్ని మార్గాలను మూసివేయాలని నిర్ణయించారు. విద్యార్థులు, పరిశోధకులు, బోధన, బోధనేతర సిబ్బంది తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ధరించాలని నిర్దేశించారు. ఈ క్రమంలో ఏయూలోకి వచ్చి వెళ్తున్న సందర్శకులు. . ఏ పని కోసం వచ్చారో తెలుసుకుంటున్నారు. ఇక్కడి భద్రతా సిబ్బందిలో చాలా మంది గతంలో ఏయూ మెస్‌లలో వంట మనుషులుగా పనిచేశారని, వారిని తిరిగి పాత విధులకు పంపించి యువతను సెక్యూరిటీ గార్డులుగా నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు.



ఎకనామిక్స్ డిపార్టుమెంట్ వద్ద మూసివేసిన గేటు

వీఎంఆర్డీఏలో వినతుల స్వీకరణ

వినతులు స్వీకరిస్తున్న వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ తేజ్‌భరత్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రజాదర్బార్‌కు వచ్చే వినతుల పరిష్కారానికి తగిన ప్రాధాన్యమివ్వాలని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ అధికారులను ఆదేశించారు. సిరిపురం వద్ద వీఎంఆర్డీఏలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు వచ్చిన వినతులను సంస్థ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, కమిషనర్ తేజ్‌భరత్‌లు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత విభాగాల అధికారులకు వాటిని అందజేసి గడువులోగా పరిష్కరించాలని సూచించారు. విభాగాల వారీగా వచ్చిన అర్జీలను పరిశీలిస్తే ప్రణాళిక విభాగానికి-9, పరిపాలన-2, ఎస్టేట్-2, సాంకేతిక విభాగానికి-1 వచ్చినట్లు తెలిపారు. వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, ప్రధాన ఇంజినీర్ వినయ్‌కుమార్, ముఖ్య ప్రణాళికాధికారి శిల్ప, కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జోన్-3 కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జోన్-3 పరిధిలోని ప్రజలు తమ సమస్యలు విన్నవించారు. వాటిని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ స్వీకరించారు. జోన్-3 కార్యాలయానికి సంబంధించి 13 వినతులు వచ్చాయన్నారు. వాటిలో రెవెన్యూ-2, ప్రజారోగ్యం-3, పట్టణ ప్రణాళిక-4, ఇంజినీరింగ్-3, యూసీడీ విభాగానికి-1 వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

వినతులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ శివప్రసాద్

నియామక పత్రాలు అందజేత

నియామక పత్రాలు అందుకున్న వారితో భాజపా జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: లాసన్స్‌బే కాలనీ భాజపా కార్యాలయంలో సోమవారం సాయంత్రం పలువురికి నూతన బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా అధ్యక్షులు పరశురామరాజు నియామక ఉత్తర్వులు అందజేశారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులుగా నాదెళ్ల జ్యోతి, ఓబీసీ జిల్లా అధ్యక్షులుగా రోణంకి విజయచంద్రుడు, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులుగా షేక్ నూర్ బాషా షరీఫ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులుగా పొట్నూరు వెంకట కృష్ణలకు నియామక పత్రాలు అందజేశారు. కొత్తగా నియమితులైన వివిధ విభాగాల అధ్యక్షులు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

CAUTION NOTICE

This is to notify the public that the tiled house / RCC buildig at **D.No: 13-11-1,** situated at **Dibbalapalem, Maharanipeta, Visakhapatnam** belonging to our client **ATTILI SRINIVASA RAO** has been encroached by **1. Attili Lakshmi, 2. Attili Babji, 3. Attili Karthik, 4. Molli Kamal Kumar, 5. Attili Venkata Ramanamma** by force.

This property has been under GVMC demolition notice, failing which the building may collapse at any time causing great harm to people, property and environment around the area.

Our client is the rightful owner and we claim that our cleint Attili Srinivasa Rao cannot be liable for any such incidents as he and his family has been thrown out of the property by the illegal occupants.

P. CHANDRA MOULI, POOJITHA GUNTURU, M. PRAVEEN, B. CHANDRA SEKHAR, N.V. LAKSHMI
Advocates
50-21-06, T.P.T. Colony, Seethammadhara, Visakhapatnam-530013.
Ph: 8523074017, 9848999976

(c) eenadu

విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

అలంకరణలో స్వామిఅమ్మవార్లు

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: రెండోపట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలోని శివరామకృష్ణ ఆలయంలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో డి.సురేష్ బాబా మాట్లాడుతూ ఈనెల 26న సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానికులంతా స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 24వ వార్డు టీపీటీకాలనీలో వీధి దీపాలు వెలగక వీధులన్నీ అంధకారంలో ఉంటున్నాయి. – రాజారావు, ✓: దీపాలు సరిచేసి వెలిగేలా చేస్తాం. – వీధి దీపాల నిర్వహణ కార్యదర్శి

మురళీనగర్, న్యూస్‌టుడే: ?: సెక్టార్-10లోని 11ఏ/2/4కు ఉన్న వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నాం. కుక్కలు భయపెడుతున్నాయి. – శరత్‌చంద్ర, ✓: వెంటనే పరిష్కరిస్తాం. – అర్చన, వీధిదీపాల ఏఈ

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 41వ వార్డులోని బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారిపై వీధి దీపాలు కొన్ని వెలగడం లేదు. రాత్రుళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. – మరియదాసు, ✓: తక్షణం వీధి దీపాలు మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటాం. – బి.రాము, జెడ్సీ జోన్–5

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ సెక్టార్-8లోని కాలువలో వ్యర్థాలు నిల్వ ఉన్నాయి. తీవ్ర దుర్వాసనతో పాటు దోమల ప్రబలి విషజ్వరాల బారిన పడుతున్నాం. – బి.రాజు ✓: కాలువను శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. – సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

అరకొర పనులు.. అవస్థలే మిగులు!

సుబ్బలక్ష్మినగర్(తాటిచెట్లపాలెం), న్యూస్‌టుడే

పనుల ప్రారంభంలో ఉన్న శ్రద్ధ వాటిని పూర్తి చేయడంలో చూపడం లేదు. ప్రజల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీవీఎంసీ 41వ వార్డు సుబ్బలక్ష్మినగర్‌లో నిరంతర తాగునీటి సరఫరా కోసం పైపులైన్లను ఏర్పాటు చేశారు. దీనికోసం రహదారులను ఇష్టానుసారం తవ్వేశారు. వాటిని సక్రమంగా పూడ్చకుండా నెల తరబడి అలాగే వదిలేశారు. దీంతో ఎక్కడ చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. స్థానికులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డులో ప్రయాణమంటే వాహన చోదకులు హడలిపోతున్నారు. గతంలో యూజీడీ పైపుల కోసం తవ్వి చాలాకాలం మరమ్మతులు చేయకుండా వదిలేయడంతో వర్షాకాలంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని వాటిని ఇటీవలే పూడ్చారని మళ్లీ ఇప్పుడు తవ్వకాలు చేయడంతో పరిస్థితి మొదటికొచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు ఇళ్ల నుంచి వచ్చేటప్పుడు అందులో పడి గాయాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుబ్బలక్ష్మినగర్‌లో పైపులైన్ల కోసం రోడ్డు తవ్వేసి వదిలేశారిలా..

■ **పట్టించుకోని ప్రజాప్రతినిధులు:** సుబ్బలక్ష్మినగర్, రైల్వేన్యూకాలనీ ప్రాంతాల్లో దశాబ్దాల క్రితం డ్రైనేజీలు నిర్మించడంతో చాలాచోట్ల అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పూడికలు, వ్యర్థాలు పేరుకుపోయి ఎక్కడికక్కడ మురుగు నిలిచి దోమలకు ఆవాసాంగా మారుతున్నాయి. తీవ్ర దుర్వాసన, దోమల బెడదతో జ్వరాల బారినపడి తరచూ ఆసుపత్రుల పాలవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. డ్రైనేజీలపై పలు చోట్ల దిమ్మెలు సరిగా వేయకపోవడంతో ప్రమాదకరంగా తయారయ్యాయి. ఇక్కడి సమస్యలపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు ఎప్పుడో తప్ప ఈ కాలనీని సందర్శించడానికి రాకపోవడంతో తమ సమస్యలు ఎవరితో చెప్పుకోవాలో తెలియడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

గురుద్వారా, న్యూస్‌టుడే: నగరంలోని అశీల్‌మెట్ట సెక్షన్ పరిధిలో విద్యుత్తు మరమ్మతులు చేపట్టనున్నందున మంగళవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 డీఈఈ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. సీతంపేట, కృష్ణుడి, వినాయకుడి ఆలయ ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

అఖిల భారత మహా సభల గోడపత్రిక ఆవిష్కరణ

జగదాంబ కూడలి, న్యూస్‌టుడే: డిసెంబర్ 31 నుంచి జనవరి 4 తేదీ వరకు విశాఖలో జరగనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలు విజయవంతం చేయాలని సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం జగదాంబ కూడలి వద్దగల పార్టీ కార్యాలయంలో గోడపత్రికను ఆవిష్కరించారు. సిటూ నాయకులు శ్రీనివాస్, జ్యోతిరావు, వెంకటరెడ్డి, అయోధ్యరామ్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రిక విడుదల చేస్తున్న ఆర్‌కేఎస్‌వీ కుమార్, నాయకులు

'హల్దీ కుంకుమ్' హిందీ పుస్తకావిష్కరణ

సీతంపేట, న్యూస్‌టుడే: కళాప్రపూర్ణ గణపతిరాజు అచ్యుత రామరాజు స్మారక సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో పెన్మత్స లలిత వాశిష్ఠ 2006లో తెలుగులో రచించిన 'ఊయల' కథా సంపుటిని రేగులగెడ్డ వెంకటలక్ష్మి గాయత్రి హిందీలోకి అనువదించిన 'హల్దీ కుంకుమ్' పుస్తకాన్ని విశాఖ పౌర గ్రంథాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంచూరియన్ వర్సిటీ కులపతి ఆచార్య జీఎస్‌ఎన్ రాజు పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం తెలుగు, హిందీ రచయితలిద్దరినీ అభినందించారు. మరో అతిథి ఆచార్య వి.బాలమోహన్ దాస్ మాట్లాడుతూ లలిత వాశిష్ఠ చేయి తిరిగిన రచయిత్రి అని కొనియాడారు. కార్యక్రమంలో డి.వి.సూర్యారావు, పి.కె.జయలక్ష్మి, దేవులపల్లి పద్మజ, చిరంజీవిరావు, రేగలగడ్డ వెంకటలక్ష్మి గాయత్రి, అక్కినపల్లి భాగ్యలక్ష్మి, పెన్మత్స లక్ష్మీనరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జీఎస్ఎన్ రాజు, బాలమోహన్‌దాస్ తదితరులు

సమావేశంలో పాల్గొన్న అమరావతి విశ్వ సాహితీ సభ్యులు

విశాఖ రైల్వే జోన్ గెజిట్ విడుదల చేయాలి

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం వెంటనే విశాఖ రైల్వే జోన్ గెజిట్ విడుదల చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పేర్కొన్నారు. అక్కయ్యపాలెంలోని [illegible] సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జోన్ ప్రకటించి నేటికి 10 నెలలు అవుతున్నా గెజిట్ విడుదల చేయకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. రాష్ట్రంలోని ఎంపీలు, కేంద్ర మంత్రులు తగినంత ఒత్తిడి తీసుకురాకపోవడంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. లోక్‌సత్తా విశాఖ నగర అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.మూర్తి, నాయకులు ఎ.ఎస్.నాగభాస్కరం, దామరాజు శివరామకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-13 భరద్వాజ క్షేత్రంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన అమరావతి విశ్వసాహితీ కవి సమ్మేళనం ఆద్యంతం అలరించింది. సంస్థ ప్రధాన కార్యదర్శి సి.హెచ్. [illegible] ఆధ్యక్షతన [illegible] విపరించగా, జ్యోతిష్య పండితుడు అడబాల సత్యనారాయణ తెలుగు అక్షరాల పరిణామక్రమాన్ని వివరించారు. తెలుగుభాషా వల్లభులు [illegible] కవులు చల్లా రాంబాబు, పిల్లా అర్జునుడు, రొంగలి రాములు, జి.ఎస్.ఆర్. మూర్తి, పి.సింహాచలం, బి.వెంకటేశ్వరరావు, పి.చెల్వరాజు, ఆర్.దుర్గాప్రసన్న, కె.కృష్ణ, డి.సంతోష్‌బాబు, బి.వి.రమణ మూర్తి, డి.ఎస్.కుమార్, కె.రామారావు తమ కవితలను వినిపించారు. కోశాధికారి పి.ఎల్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్

గురుద్వారా, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సీతమ్మధారలోని భాజపా కార్యాలయంలో సోమవారం ఉదయం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఉత్తరం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పాల్గొని ప్రజల వినతులు స్వీకరించారు. నియోజకవర్గంలో మౌలిక వసతులు, వ్యక్తిగత సమస్యలు వంటివి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కొన్నింటిని పరిష్కరించారు. కార్యక్రమంలో [illegible] దివ్య, రామకృష్ణ, [illegible] తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

25 నుంచి నయా చేతన 4.0 కార్యక్రమం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: లింగ ఆధారిత వివక్షపై పోరాటం చేసేందుకు పౌరులందరిలో బాధ్యత పెరగాలని, క్రియాశీల అవగాహన కల్పించడం ద్వారా నివారణ చర్యలు బలోపేతం చేయవచ్చని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. స్త్రీ, పురుషుల సమానత్వం ద్వారానే సమాజం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నవంబరు 25 నుంచి డిసెంబరు 3వరకు 'నయా చేతన 4.0 - మార్పు కోసం ముందడుగు' అనే పేరుతో చేపట్టనున్న కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను సోమవారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఏడీసీ వర్మ, ఎన్ఐసీ అధికారి హమీద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్ తదితరులు

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

కార్పొరేషన్, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షాలో పని చేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సమగ్ర శిక్షా ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల ఫెడరేషన్ ప్రతినిధి పి.మణి డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం సమగ్ర శిక్షా ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ వేతనాలతో, ఉద్యోగ భద్రత లేకుండా జీవనం సాగిస్తున్న వారిని ఆదుకోవాలన్నారు. తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, ఆరోగ్య బీమా, ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

ఉమారామలింగేశ్వరుడికి విశేష అలంకరణ

మురళీనగర్, న్యూస్‌టుడే: స్థానిక ఉమారామలింగేశ్వర ఆలయంలో సోమవారం ఈశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన ప్రదోషకాల పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ అర్చకులు మంచిలి భానుమూర్తి నందీశ్వరుడికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

అలంకరణలో పరమశివుడు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: నగరంలోని జ్ఞానాపురం దరి వడిచర్లవీధిలో సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి, కళాశాల అధ్యాపకురాలు కె.మాణిక్యకుమారి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ బృందం సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఇన్వోడెంట్ ఆసుపత్రి వైద్యులు వెంకటమౌనిక, నిఖిల, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యురాలు

పోలీసు శాఖకు 115 ఫిర్యాదులు రాక

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 115 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ శంఖబ్రత బాగ్చీ ఫిర్యాదులను పరిశీలించి వారితో స్వయంగా మాట్లాడారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఫిర్యాదులపై విచారణ జరిపి త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్యాభర్తల గొడవలు, మోసాలకు సంబంధించి అధిక ఫిర్యాదులు అందాయన్నారు.

బాధితుల సమస్యలు వింటున్న సీపీ శంఖబ్రతబాగ్చీ

కలెక్టరేట్ వద్ద నిరసనల హోరు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టరేట్ వద్ద వివిధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసనలు తెలిపారు. అనంతరం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. బీసీ జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లను ఏబీసీడీగా వర్గీకరించి చట్టబద్ధంగా అమలు చేయాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం కోరింది. సంఘం జిల్లా అధ్యక్షుడు కామన వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ★ ప్రముఖ బౌద్ధ క్షేత్రమైన తొట్లకొండపై క్యాంటీన్ ఏర్పాటుకు ఎంపిక చేసిన కాంట్రాక్టర్‌ను నిలిపివేయాలని బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ, ఇతర నాయకులు సోడదాసి సుధాకర్, వసంత పాల్గొన్నారు. ★ ఎల్‌జీ పాలీమర్స్ గ్యాస్ లీక్ ఘటనకు సంబంధించి ఇప్పటికీ పరిహారం పొందని 51 కుటుంబాలు, కిరాణా దుకాణాలు, ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 107 మంది బాధితులపై విచారణ నివేదికలు సమర్పించడంలో అధికారులు చూపుతున్న నిర్లక్ష్యంపై ఎల్‌జీ పాలీమర్స్ గ్యాస్ విక్టిమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. తమకు న్యాయం చేసి త్వరగా పరిహారం అందించాలని కోరారు.

నిరసన తెలుపుతున్న ఎల్‌జీ పాలీమర్స్ బాధితులు

భాజపా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా విజయచంద్రుడు

మాధవధార, న్యూస్‌టుడే: భాజపా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా జీవీఎంసీ 50వ వార్డు మాధవధార ప్రాంతానికి చెందిన రోణంకి విజయచంద్రుడు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం భాజపా జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు ఉత్తర్వులు అందజేశారు. పార్టీ పటిష్టతకు నిరంతరం కృషి చేస్తానని విజయచంద్రుడు తెలిపారు. ఈ సందర్భంగా భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు, జిల్లా అధ్యక్షుడు పరశురామరాజుతో పాటు పలువురు భాజపా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

విజయచంద్రుడుకి నియమాక పత్రాన్ని అందజేస్తున్న పరశురామరాజు

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు; విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ పి.సునీతకుమారి, ఉపాధ్యాయులు

ఉపన్యాసంతో మెప్పించి.. బహుమతులు గెలుచుకొని..

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో చరవాణికి దూరంగా ఉండి శ్రద్ధగా చదువుకోవాలని జ్ఞాననికేతన్ ఎయిడెడ్ పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ పి.సునీతకుమారి పేర్కొన్నారు. 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం లలితానగర్‌లోని జ్ఞాననికేతన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై సోమవారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కొమ్ము లావణ్య(10వ తరగతి) ప్రథమ, ఉరుకుటి శ్రావ్య(7వ తరగతి) ద్వితీయ, కోటిపాము వర్షిణి(9వ తరగతి) తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్ పి.సునీతకుమారి, ఉపాధ్యాయులు టి.అంజనీకుమారి, నిర్వాహకుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: డాబాగార్డెన్స్‌లోని పెన్‌స్కూల్‌లోని విద్యార్థులకు 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం 'విద్యార్థుల జీవితంపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కె.హారిక(10వ తరగతి)ప్రథమ, రిషి అభిషేక్(7వ తరగతి) ద్వితీయ, దీక్షిత్ కుమార్(9వ తరగతి) తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి బహుమతులు, ప్రశంసా పత్రాలను పాఠశాల ఛైర్‌పర్సన్ అనీత పెరైరా, నిర్వాహకుల చేతులమీదుగా అందజేశారు.

పోటీల్లో పాల్గొన్న పెన్ స్కూల్ విద్యార్థులు; విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఛైర్‌పర్సన్ అనీత పెరైరా

డాక్టర్ కె.ఎస్.ప్రకాశరావు కుటుంబ సభ్యులకు ప్రముఖుల పరామర్శ

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: రైల్వేన్యూకాలనీ ప్రాంతంలో పేదల వైద్యుడిగా గుర్తింపు పొంది, శనివారం రాత్రి మృతి చెందిన డాక్టర్ కె.ఎస్.ప్రకాశరావు కుటుంబ సభ్యులను ఎంపీ ఎం.శ్రీభరత్, దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జిల్లా తెదేపా అధ్యక్షుడు గండి బాబ్జీ సోమవారం పరామర్శించారు. రైల్వేన్యూకాలనీలోని కె.ఎస్.ప్రకాశరావు నివాసానికి వెళ్లి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశరావు కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. 60 ఏళ్ల పాటు వైద్య సేవలు అందించడం సాధారణ విషయం కాదని ఎంపీ పేర్కొన్నారు. వీరి వెంట తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి ఆకిరెడ్డి జగదీశ్ ఉన్నారు. అంతిమయాత్రలో పలువురు వైద్యులు, నగర ప్రజలు, ఆయన అభిమానులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కె.ఎస్.ప్రకాశరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

ఉత్తమ ఉద్యోగులకు అవార్డుల ప్రదానం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదాలను నివారించడంలో కీలకపాత్ర పోషించిన పలువురు రైల్వే ఉద్యోగులను వాల్తేర్ డీఆర్ఎం లలిత్ బోహ్రా సోమవారం అవార్డులు అందజేసి సత్కరించారు. ఉద్యోగుల అసాధారణ పని తీరును ప్రశంసించారు. 2025-26వ సంవత్సరంలో రైలు కార్యకలాపాల సమయంలో ఎదురయ్యే భద్రతా ముప్పులకు వృత్తి నైపుణ్యం, వేగవంతమైన ప్రతిస్పందనకు గుర్తింపుగా ట్రాక్‌మెన్, కీమెన్, స్టేషన్ మాస్టర్లు, లోకోపైలెట్లకు అవార్డులు ప్రదానం చేశారు. ట్రాక్‌మెన్స్ కుమార్ సాహెబ్, సురేష్‌కుమార్, జ్ఞానరంజన్ సాహూ, ఎన్.వరప్రసాద్, ఎం.కూర్మారావు, కీమెన్ రాకేష్ కుమార్, పియాంట్స్ మెన్ ఎం.కృష్ణంనాయుడు, స్టేషన్ మాస్టర్ సంతోష్‌కుమార్, ఏఎల్‌పీ బి.తిరుపతిరావు తదితరులకు వీటిని అందజేశారు.

ట్రాక్ నిర్వాహకుడికి ధ్రువపత్రం అందజేస్తున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా

పీజీ వైద్య కోర్సుల్లో ప్రవేశాల ప్రారంభం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ)లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు శ్రీకారం చుట్టారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలు ఆరంభమయ్యాయి. అఖిల భారత కోటా(ఏఐక్యూ) కింద కళాశాలకు కేటాయించిన సీట్లలో సోమవారం కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో డాక్టర్ ఎన్.సోనుకు తొలి ప్రవేశం కల్పించారు. ఈ మేరకు సీటు కేటాయిస్తూ ప్రవేశపత్రాన్ని డాక్టర్ సోనుకు ప్రిన్సిపల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి అందజేశారు. ఏఐక్యూ ప్రవేశాలు పూర్తయిన తర్వాత రాష్ట్ర కోటా ప్రవేశాలు చేపడతామని ప్రిన్సిపల్ తెలిపారు. కార్యక్రమంలో ఉప ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.కృష్ణవేణి, ఏడీ ఎం.రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎన్.సోనుకు ప్రవేశపత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి తదితరులు

విద్యుదాఘాతానికి గురై ఎలక్ట్రీషియన్ మృతి

గాజువాక, న్యూస్‌టుడే: గాజువాకలోని డంపింగ్ యార్డులో సోమవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై ఎలక్ట్రీషియన్ మృతిచెందారు. సీఐ పార్థసారథి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డంపింగ్ యార్డులోని సీసీఎస్ ప్రాజెక్టులో వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన ఎలక్ట్రీషియన్ సీహెచ్ త్రినాథ్(27) ట్రాన్స్‌ఫార్మర్ వద్ద లైన్లు సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యారు. సిబ్బంది ఆటోలో అగనంపూడి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

CAUTION NOTICE

This is to notify the public that the tiled house / RCC buildig at **D.No: 13-11-1,** siluated al **Dibbalapalem, Maharanipeta, Visakhapatnam** belonging to our client **ATTILI SRINIVASA RAO** has been encroached by **1. Attili Lakshmi, 2. Attili Babji, 3. Attili Karthik, 4. Molli Kamal Kumar, 5. Attili Venkata Ramanamma** by force.

This property has been under GVMC demolition notice, failing which the building may collapse at any time causing great harm to people, property and environment around the area.

Our client is the rightful owner and we claim that our cleint Attili Srinivasa Rao cannot be liable for any such incidents as he and his family has been thrown out of the property by the illegal occupants.

P. CHANDRA MOULI, POOJITHA GUNTURU, M. PRAVEEN, B. CHANDRA SEKHAR, N.V. LAKSHMI
Advocates
50-21-06, T.P.T. Colony, Seethammadhara, Visakhapatnam-530013.
Ph: 8523074017, 9848999976

బీసీ స్టడీ సర్కిల్ పనితీరుపై ఆరా..

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఎంవీపీకాలనీలోని బీసీ స్టడీ సర్కిల్‌ను సోమవారం ఏపీ బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు అందించనున్న ఉచిత శిక్షణకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?, ఈ పరీక్షకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారని ఆరా తీశారు. గ్రంథాలయాన్ని పరిశీలించి పాత పుస్తకాల స్థానంలో నూతన సిలబస్‌కు అనుగుణంగా పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలని, అందుకు ప్రభుత్వం తరఫున తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. భవనం ఆధునికీకరణకు సీఎస్ఆర్ నిధులు సమకూర్చుకోవాలని సూచించారు. బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కె.వి.సుబ్బారావు, ఉత్తరాంధ్ర ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు, ప్రతినిధులు కట్టా మల్లేశ్వరరావు, ఎల్.గణేష్, చంద్రశేఖర్, రాజశేఖర్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాజేశ్వరి, సమన్వయకర్త జీవన్ శంకర్, సహాయ సంక్షేమాధికారి రావి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ సర్కిల్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న బీసీ సంక్షేమశాఖ సెక్రటరీ సత్యనారాయణ

ప్రధానార్చక వివాదంపై నోటీసుల జారీకి సన్నాహాలు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి ఆలయ ప్రధానార్చకుల నియామకంలో సీనియారిటీని పరిగణనలోకి తీసుకోలేదని ఆలయ ఉపప్రధానార్చకుడు కేకేఎస్ ప్రసాదాచార్యులు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నేపథ్యంలో న్యాయమూర్తి ఇటీవల వివాద పరిష్కారానికి ఉత్తర్వులు వెలువరించారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఆలయ ప్రధానార్చకుడిగా తనకు అధికారులు ఉద్యోగోన్నతి కల్పించకుండా చేశారని అభియోగాలు చేస్తూ 2022లో ప్రసాదాచార్యులు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ప్రధానార్చక నియామకంపై నూతన ఉత్తర్వులు జారీ చేయాలని రెండు నెలల క్రితం న్యాయస్థానం ఆదేశించడంతో వాటి అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి డాక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ ఈ నెల 6న ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే విషయంపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఈ నెల 18న సింహాచలం దేవస్థానం ఈవోకు మెమో ద్వారా ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాలకు నోటీసులు జారీ చేసి సీనియారిటీకి సంబంధించి లిఖిత పూర్వక అభిప్రాయాలు, ఆధారాలు తీసుకోనున్నట్లు దేవస్థానం పరిపాలనా విభాగం పర్యవేక్షకుడు కంచి మూర్తి తెలిపారు. ఈ మేరకు పిటిషనర్‌తో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి నోటీసులు జారీ చేయడానికి దేవస్థానం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

నవ్వులు పూయించిన హాస్యనాటిక

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-8 వాకర్స్ క్లబ్ సభా ప్రాంగణంలో భద్రం ఫౌండేషన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఎస్.డేవిడ్‌రాజు దర్శకత్వంలో ప్రదర్శించిన 'దొందూదొందే' అనే హాస్య నాటిక చూపరులను కడుపుబ్బా నవ్వించింది. కళాభినయ ఆధ్వర్యంలో పి.టి.మాధవ్ రచించిన 'ఓ కాశీవాసి రావయ్యా' సాంఘిక నాటికలో ఆస్తులు అంతస్తులు కంటే మానవత్వం మిన్న అనే ఇతివృత్తంతో సాగిన నాటిక అందరినీ ఆకట్టుకుంది. దీనికి కె.కవిప్రసాద్ దర్శకత్వం వహించారు. క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, కార్యదర్శి చొల్లంగి ప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నాటికలో ఓ సన్నివేశం

ఏయూలో భద్రత కట్టుదిట్టం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయంలో దొంగతనాలు పెరగడంతో భద్రతను కట్టదిట్టం చేశారు. ఇందులో భాగంగా అపరిచితులు లోపలికి ప్రవేశించకుండా అవసరం లేని కొన్ని మార్గాలను మూసివేయాలని నిర్ణయించారు. విద్యార్థులు, పరిశోధకులు, బోధన, బోధనేతర సిబ్బంది తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ధరించాలని నిర్దేశించారు. ఈ క్రమంలో ఏయూలోకి వచ్చి వెళ్తున్న సందర్శకులు.. ఏ పని కోసం వచ్చారో తెలుసుకుంటున్నారు.

(c) eenadu

25 నుంచి నయా చేతన 4.0 కార్యక్రమం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: లింగ ఆధారిత వివక్షపై పోరాటం చేసేందుకు పౌరులందరిలో బాధ్యత పెరగాలని, క్రియాశీల అవగాహన కల్పించడం ద్వారా నివారణ చర్యలను బలోపేతం చేయవచ్చునని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. స్త్రీ, పురుషుల సమానత్వం ద్వారానే సమాజం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నవంబరు 25 నుంచి డిసెంబరు 3వ రకు 'నయా చేతన 4.0 - మార్పు కోసం ముందడుగు' అనే పేరుతో చేపట్టనున్న కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను సోమవారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఏడీసీ వర్మ, ఎన్ఏసీ అధికారి హమీద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

గాజువాక

● గాజువాక ● విశాఖ పశ్చిమం

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

గాజువాక, న్యూస్‌టుడే: గాజువాక డంపింగ్ యార్డులో సోమవారం రాత్రి విద్యుదాఘాతానికి ఎలక్ట్రీషియన్ మృతిచెందారు. ఈ మేరకు గాజువాక పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ అళహరి పార్థసారథి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డంపింగ్ యార్డులో సీసీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. నగరంలోని వన్‌టౌన్‌కు చెందిన ఎలక్ట్రీషియన్ సీహెచ్ త్రినాధ్(27) విద్యుత్తు పనుల నిమిత్తం అక్కడికి వచ్చారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద లైన్లు సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యారు. అక్కడ ఉన్న సిబ్బంది ఆటోలో అగనంపూడి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని సీఐ తెలిపారు. గాజువాక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

సమస్య: సుందరయ్యకాలనీ, దుర్గానగర్ రోడ్లపై ఎక్కడికక్కడ గోతుల వల్ల నానా ఇబ్బందులు పడుతున్నాం. -సత్యనారాయణ, రాజారావు, శ్రీనగర్ **సమాధానం:** మరమ్మతులకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. -శేషాద్రి, జేడీ

?: జోగవానిపాలెం, పంతులుగారి మార్గంలో వీధి దీపాలు అక్కడక్కడే వెలుగుతున్నాయి. -పరశురామ్, గాజువాక ✓: సిబ్బందిని పంపి అవసరమైన చర్యలు తీసుకుంటాం. -శివ, వీధి దీపాల నిర్వాహకుడు

న్యూస్‌టుడే, గోపాలపట్నం: ?: జీవీఎంసీ 52వ వార్డు రిక్షాకాలనీలో టిడ్కో గృహాల వెనుక పెరిగిన తుప్పలు, డొంకలు తొలగించాలి. – కొండబాబు, రిక్షాకాలనీ ✓: ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడతాం. – మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: జీవీఎంసీ 90వ వార్డు ఎస్సీకాలనీ-పాత గోపాలపట్నం రోడ్డులో వీధిదీపాలు వెలగడం లేదు. – మూర్తి, పాతగోపాలపట్నం ✓: వీధిదీపాలను పరిశీలించి మరమ్మతులు చేపడతాం. – గోవిందరావు, వీధిదీపాల నిర్వాహకులు

దోమలకు 'పొగ'బెట్టారు...

గంగవరం (పెదగంట్యాడ), న్యూస్‌టుడే : గంగవరం మత్స్యకార గ్రామాలు, పెదగంట్యాడ ఉక్కు నిర్వాసితకాలనీల్లో అపరిశుభ్రత, దోమల బెడదపై 'ఈనాడు'లో వచ్చిన వార్తలకు జీవీఎంసీ ప్రజారోగ్య సిబ్బంది స్పందించారు. ఆయాచోట్ల మినీ ఫాగింగ్ యంత్రాల సాయంతో దోమల పొగను వదిలారు. మలేరియా సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షించారు.

వంద రోజుల దీక్ష

'పది' పరీక్షల సన్నద్ధతకు ప్రత్యేక ప్రణాళిక

గోపాలపట్నం, న్యూస్‌టుడే : పదో తరగతి పరీక్షల షెడ్యూలును ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. షెడ్యూలు ప్రకారం వంద రోజులు సమయం ఉంది. దీంతో విద్యాశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గతంలో కన్నా ఈ ఏడాది శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీనికి సంబంధించి ఈనెలాఖరులోగా అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికే బాధ్యతలు కేటాయించారు.

★ పశ్చిమ నియోజకవర్గంలోని గోపాలపట్నం, ములగాడ మండలాల పరిధిలో సుమారు 4225 మంది పదో తరగతి విద్యార్థులు మార్చి 16న పరీక్ష రాయనున్నారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాల ఎంపిక, అక్కడ ఉన్న వసతులపై విద్యాశాఖాధికారులు పరిశీలన చేశారు. అవసరమైన చోట వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. గత ఏడాది ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఈసారి ప్రత్యేక ప్రణాళికతో ముందు కెళుతున్నారు.

ఉపాధ్యాయుల బాధ్యతలు: ★ విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రేడులుగా విభజించి సీ, డీ గ్రేడ్లలో ఉన్నవారిపై ప్రత్యేక శ్రద్ధచూపాలి. ★ కొందరు విద్యార్థులను దత్తత తీసుకుని, అవసరమైన విద్యాసామగ్రి అందించాలి.

★ రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆరు పిరియడ్లు, స్టడీ అవర్స్ నిర్వహించాలి. ఆరో పిరియడ్‌లో పరీక్ష ఉండాలి.

★ ప్రతిరోజూ పాఠ్యాంశ నిపుణులు తయారు చేసిన ప్రశ్నపత్రాన్ని ఆన్‌లైన్‌లో తీసుకుని విద్యార్థులతో పరీక్ష రాయించాలి. జనవరి, ఫిబ్రవరి, మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల వరకు ప్రీఫైనల్, గ్రాండ్ టెస్ట్ పరీక్షలు నిర్వహించాలి.

★ అంతర్గత పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన మార్కులను తల్లిదండ్రులకు అందజేయాలి.

ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

విద్యార్థులు పాటించాల్సినవి..

» ప్రతీరోజు తెల్లవారుజామున 4 గంటలకే నిద్రలేచి చదువుకోవాలి.
» ఏ సబ్జెక్టు అయినా రెండు లేదా మూడు భాగాలుగా విభజించుకోవాలి.
» పరీక్ష గడువు కాలాన్ని బట్టి కొంత సమయం పునశ్చరణకు కేటాయించి, మిగిలిన వాటిని పాఠ్యాంశాలు చదవడానికి కేటాయించాలి.
» రోజూ 20 నిమిషాల పాటు ధ్యానం చేయాలి.
» గత పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు చదివి సాధన చేయాలి. » చదివిన ప్రశ్నలను చూడకుండా రాయాలి. వేగంగా రాసే విధానం అలవాటు చేసుకోవాలి. » బిట్‌పేపరుపై నిర్లక్ష్యం చూపకూడదు.
» పాఠ్యాంశాల్లో ఉన్న సందేహాలను ఉపాధ్యాయులతో చర్చిస్తూ అనుమానాలు నివృత్తి చేసుకోవాలి.

వంద శాతం వచ్చేందుకు..: ఈసారి మా పాఠశాలల్లో 10 శాతం ఉత్తీర్ణత వచ్చేలా లక్ష్యం పెట్టుకున్నాం. వంద రోజుల ప్రణాళిక పగడ్బందీగా అమలు చేస్తాం. వారాంత, మాసాంత పరీక్షలు నిర్వహించి వారి పురోగతిని తెలుసుకుంటాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెడుతున్నాం.

- వేణుగోపాల్‌రావు, హెచ్.ఎం. గోపాలపట్నం బాలుర ఉన్నత పాఠశాల, - స్వర్ణలత, హెచ్.ఎం., బాలికోన్నత పాఠశాల

నైపుణ్య ప్రదర్శన

'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ట్వింకిల్ కిడ్స్ పాఠశాల ప్రతినిధులు... స్పీచ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

శ్రామికనగర్ (గాజువాక), న్యూస్‌టుడే: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో గాజువాక 70వ వార్డు శ్రీనివాసనగర్‌లోని ట్వింకిల్ కిడ్స్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అన్న అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన హిమబిందు, బిందుప్రియ, భవానీలకు పాఠశాల డైరెక్టర్ డి.శ్యామ్, ప్రిన్సిపల్ ఎస్.కరుణకుమారి, చంద్రశేఖర్, గీతా, పద్మజల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

నారాయణ జూనియర్ కళాశాలలో..

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : గాజువాక నారాయణ జూనియర్ కళాశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'కృత్రిమ మేధ (ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు..' అన్న అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విజేతలుగా నిలిచిన చిరాగ్, పవన్‌కుమార్, కుసుమచరణ్‌లకు కళాశాల కోర్ డీన్ హనుమంతురావు, డీన్‌లు శ్రీనివాస్, స్వామినాయుడు, ప్రిన్సిపల్ సింహాచలం చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న నారాయణ కళాశాల ప్రతినిధులు... ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉత్తమ ఉద్యోగులకు అవార్డుల ప్రదానం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదాలను నివారించడంలో కీలకపాత్ర పోషించిన పలువురు రైల్వే ఉద్యోగులను వాల్తేర్ డీఆర్ఎం లలిత్ బోహ్రా సోమవారం అవార్డులు అందజేసి సత్కరించారు. ఉద్యోగుల అసాధారణ పని తీరును ప్రశంసించారు. 2025-26వ సంవత్సరంలో రైలు కార్యకలాపాల సమయంలో ఎదురయ్యే భద్రతా ముప్పులకు సత్వర స్పందన, వేగవంతమైన ప్రతి స్పందనకు గుర్తింపుగా ట్రాక్‌మెన్, కీమెన్, స్టేషన్ మాస్టర్లు, లోకోపైలెట్లకు అవార్డులు ప్రదానం చేశారు. ట్రాక్‌మెన్ కుమార్ సాహెబ్, సురేష్‌కుమార్, జూనరజుణ్ సింగ్, ఎస్.వరప్రసాద్, ఎం.కూర్మారావు, కీమెన్ రాకేష్ కుమార్, పియాంట్స్ మెన్ ఎం.కృష్ణంనాయుడు, స్టేషన్ మాస్టర్ సంతోష్‌కుమార్, ఎల్‌పీ బి.తిరుపతిరావు తదితరులకు వీటిని అందజేశారు.

ట్రాక్ నిర్వాహకుడికి ధ్రువపత్రం అందజేస్తున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా

భక్తిశ్రద్ధలతో కల్యాణ రాట

అక్కిరెడ్డిపాలెం(నాతయ్యపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలోని శ్రీ వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం ఉదయం కల్యాణ రాటను ప్రతిష్ఠించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు అర్చకుల ప్రత్యేక పూజలు నిర్వహించి రాట వేయించారు. కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఈనెల 26న కల్యాణం సందర్భంగా రాట వేశామన్నారు.

అమ్మ పేరున ఓ మొక్క

అక్కిరెడ్డిపాలెం(బీహెచ్‌పీవీ), న్యూస్‌టుడే : జీవీఎంసీ 68వ వార్డు మింది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం చిన్నారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని విశ్రాంత ఉపాధ్యాయుడు, పర్యావరణ ప్రేమికుడు ఐంటూరి భూషణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలో ప్రతి ఒక్క విద్యార్థి పుట్టిన రోజున వారి అమ్మ పేరిట మొక్కను నాటి ఆ మొక్కను పెంచే బాధ్యత వారే తీసుకునేలా ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీడీ సుజాత, సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న బాలిక

అక్రమ కట్టడం కూల్చివేత

ఎన్ఏడీకూడలి(కాకానినగర్), న్యూస్‌టుడే : జోన్ 8 పరిధిలో అక్రమ నిర్మాణాన్ని జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. 8వజోన్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రామలింగేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్‌లో రెండు అనధికార అదనపు అంతస్తులను సోమవారం కూల్చివేశారు. టీపీఓ, గోపన్న పర్యవేక్షణలో సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ పావని, సిబ్బంది పనులను పర్యవేక్షించారు.

కట్టడాన్ని తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

● **దువ్వాడ రైల్వేస్టేషన్లో తనిఖీలు**

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : దువ్వాడ రైల్వేస్టేషన్లో తూర్పు కోస్తా రైల్వే వాల్తేరు సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ అజయ్ ప్రకాష్ దూబే సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఒకటో ప్లాట్‌ఫారం వద్ద నిర్మించిన భవనం, సదుపాయాలను పరిశీలించారు. ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ ఆవరణ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇన్‌స్పెక్టర్ బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

● **కోటి సంతకాల సేకరణ**

గాజువాక, న్యూస్‌టుడే : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా గాజువాక చైతన్యనగర్‌లో వైకాపా ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు జలక్షర నాగేంద్ర ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు పల్లా చిన్నతల్లి, ఎం.శంకరనారాయణ, బొండా గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

● **శబరి యాత్రకు పయనం**

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : నెల్లిముక్కు అయ్యప్ప సేవా పీఠం సభ్యులు (ఉక్కు ఉద్యోగులు) సుమారు 36 మంది శబరిమల యాత్రకు బయల్దేరారు. స్టీల్‌ప్లాంటును పూర్తి ప్రైవేట్ పరం కాకుండా రక్షించాలని కోరుతూ గురుస్వామి సోమనాథరెడ్డి, పిళ్లా గురునాథ స్వామి ఆధ్వర్యంలో వీరు సోమవారం మంత్రాలయం రాముల్వ్రపాన్ని దర్శించుకున్నారు. నేరుగా శబరిమల వెళ్లి అయ్యప్పస్వామిని దర్శించుకోనున్నట్లు వీరు తెలిపారు.

● **రేవు కావడి యాత్ర ఉత్సవం**

న్యూస్‌టుడే, సింధియా : ఈనెల 26న జరగనున్న సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి ఉత్సవానికి పారిశ్రామిక ప్రాంతంలో పలు ఆలయాల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. ములగాడ కాలనీలో ఇందుకోసం ప్రత్యేకంగా 108 కావిళ్లను, తాళ్లతో ఉట్టెలను, వాటిలో పెట్టేందుకు మట్టి (చిన్న) కుండలను సిద్ధం చేశారు.

ఉత్సవానికి కావిళ్లను సిద్ధం చేస్తున్న మహిళలు

● **భక్తిశ్రద్ధలతో అంబలం పూజ**

కరాస, న్యూస్‌టుడే : శ్రీఅయ్యప్పస్వామి అంబలం పూజలను స్థానిక యువత ఆదివారం రాత్రి పాత కరాసలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఉప మేయర్ జియ్యాని శ్రీధర్ హాజరయ్యారు.

సత్యసాయికి ప్రత్యేక పూజలు

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి బీసీ కాలనీలో సోమవారం శ్రీ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు ముదునూరి వర్మరాజు, అనూష దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో శిరీషా సేవాసమితి ప్రతినిధులు, మహిళా కమిటీ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాయి భక్తులు వ్యాసర్వ, పీఎల్ఎన్ రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జయంతి వేడుకల్లో పాల్గొన్న మహిళలు

రద్దీ సమయాల్లో బస్సులు పెంచాలి

సింధియా(జవహర్‌నగర్), న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతంలో రద్దీ సమయంలో సిటీ బస్సులు పెంచాలని ఉద్యోగులు, విద్యార్థులు డిమాండు చేస్తున్నారు. ముఖ్యంగా కొత్తవలస, సింహాచలం, అనకాపల్లి, నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్సులకు వెళ్లే సిటీ బస్సులను ఉదయం, సాయంత్రం పూట పెంచాలని కోరుతున్నారు. రద్దీ వల్ల బస్సులను ఎడమవైపు బస్ స్టాప్‌లో ఆగకుండా కుడివైపు డివైడర్‌వైపు ఆపడం వల్ల మధ్యలో ఆటోలను దాటుకుంటూ ఎక్కాల్సి వస్తోందని వాపోతున్నారు.

శ్రీహరిపురం బస్‌స్టాప్‌లో రద్దీ

ఏటీఎం కేంద్రాల్లో అపరిశుభ్రత

మల్కాపురం, న్యూస్‌టుడే : కొన్ని ఏటీఎం కేంద్రాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. కాగిత వ్యర్థాలు పేరుకుపోయి కనిపిస్తున్నాయి. వాటిని శుభ్రం చేయకపోవడంతో వినియోగదారులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. మల్కాపురం పరిధిలోని ఓ ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం కాగితాలలో నిండిపోయి ఉంది. ఇలాంటి వాటిపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఏటీఎం కేంద్రం లోపల ఇలా..

సిమెంటు కంపెనీ ఏర్పాటు తగదు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : పెదగంట్యాడలోని అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం సిమెంటు కంపెనీ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌కు ఉక్కు నిర్వాసిత, అఖిలపక్ష సంఘాల నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. 75వ వార్డు ప్రతినిధి గొందేశి బుజ్జి ఆధ్వర్యంలో నాయకులు మార్పుల్లాడ వరదేశ్, గొందేశి మహేశ్వరరెడ్డి, జీటీ రమణారెడ్డి, ముఖ్య ప్రకాశరెడ్డిలు పరిస్థితిని వివరించారు. ఇప్పటికే పెదగంట్యాడలో కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని గుర్తుచేశారు.

కలెక్టర్‌కు పరిస్థితి వివరిస్తున్న నాయకులు

స్థానికులకు ఉపాధి కల్పించాలి

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ఉక్కులో నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, ఇతర రాష్ట్రాల కార్మికుల నియామకాలు ఆపాలని డిమాండ్ చేస్తూ ఇంటక్, సిటూ, హెచ్‌ఎంఎస్, డీవైఎఫ్ఐ యూనియన్ల ఆధ్వర్యంలో ఉక్కు బీసీ గేటు వద్ద సోమవారం నిరసన చేపట్టారు. యాజమాన్యం తీరుకు వ్యతిరేకంగా కార్మికులు నినదించారు. నాయకులు వంశీకృష్ణ, రమణమూర్తి, నమ్మి రమణ, భాస్కర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరసనలో పాల్గొన్న ఉక్కు కార్మిక సంఘాల సభ్యులు

రాత్రికి రాత్రే ఆక్రమణలు

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : వికాస్‌నగర్ ఐటీఐ వద్ద గెడ్డను ఆనుకుని స్టీల్‌ప్లాంటు ఖాళీస్థలాల్లో రాత్రికి రాత్రే అనధికార కట్టడాలు వెలియడం కలకలం రేపింది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఈ స్థలం తమదంటూ కొందరు చదును చేసి సిమెంటు, ఇటుకలతో షెడ్ల నిర్మాణాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న ఉక్కు భూసేకరణ విభాగం, పెదగంట్యాడ మండల రెవెన్యూ అధికారులు వెళ్లి ఆయాచోట్ల హెచ్చరిక బోర్డులు పాతారు. ఆక్రమణలు జరగకుండా వీఆర్వోలను పరిశీలనకు ఉంచినట్లు తహసీల్దార్ అమల తెలిపారు.

అనధికార నిర్మాణాల వద్ద పెట్టిన హెచ్చరిక బోర్డు

ఫార్మా బస్సులపై ఆంక్షలు

ఆకస్మిక నిర్ణయంపై ఆయా సంస్థల అభ్యంతరం

గాజువాక, న్యూస్‌టుడే: గాజువాక ట్రాఫిక్ పోలీసులు మంగళవారం నుంచి గాజువాక మీదుగా ఫార్మాసిటీకి తిరిగే బస్సులకు ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ షేక్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మా కంపెనీలకు చెందిన సుమారు 200 బస్సులు వారి ఉద్యోగులను మూడు షిఫ్టుల్లో తీసుకెళ్లే క్రమంలో పాత గాజువాకలో యూటర్న్ తీసుకోవడం, అక్కడే దించడం, ఎక్కించుకోవడం వల్ల శ్రీనగర్ వరకూ విపరీతమైన రద్దీ ఉంటోందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఫార్మా బస్సులు గాజువాకలోకి ప్రవేశించకుండా శ్రీనగర్ జంక్షన్ నుంచి ఆటోనగర్‌కి వెళ్లి, అన్నక్యాంటీన్ వద్ద రివర్స్ తీసుకుని అదే రోడ్డులో శ్రీనగర్ ఆర్చ్ వద్ద ఉద్యోగులను ఎక్కించుకోవాలని సూచించారు. ఇక నుంచి ఈ బస్సులన్నీ పాతగాజువాక కాకుండా శ్రీనగర్ నుంచి మాత్రమే ఆపరేట్ చేయాల్సి ఉంటుందన్నారు. అయితే దీనిపై ఫార్మా సంస్థలు దీనిపై అభ్యంతరం తెలుపుతున్నాయి. ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించడం ఏమిటన్నారు. దీనివల్ల వందలాది మంది ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. అంతా ఏకాభిప్రాయం వచ్చాక నిర్ణయం తీసుకుని ఉండాల్సిందంటున్నారు.

పబ్లిక్ నోటీస్

ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అనకాపల్లి జిల్లా, చోడవరం మండలం కోట వీధి H.No.19-29 కాపురస్థులైన తుమ్మల వెంకట కృష్ణారావు గారు ఈ క్రింది ఉదహరించిన షెడ్యూల్ ఆస్తిని విశాఖపట్నం, హైదరాబాద్, సర్కిల్-7, వార్డు నెం.8, బంజారాహిల్స్ ఏరియా, కమలాపురి కాలనీ, ఫేజ్-3, డోర్‌నెం. 8-2-293/కె/13రు కాపురస్థులు శొంఠి (లేటు) వీరాస్వామి గారి కుమారుడు శొంఠి వెంకటగిరి వద్ద నుండి క్రయం పొందటానికి నిర్ణయించుకున్నారు. కావున ఈ క్రయం విషయమై, ఆస్తుల ఎవరికైనా ఎటువంటి క్లైములు ఉన్నట్లు, తనఖాలు మరియు ఏవిధమైన అభ్యంతరములు ఉన్నయెడల ఈ దినం నుండి 7 రోజులలో ఈ క్రింద ఉదహరించిన న్యాయవాదిగారిని సరైన ఆధారాలతో సంప్రదించగలరు. తదుపరి వచ్చు అభ్యంతరాలు నా క్లయింటుకు బందింపజాలవు.

షెడ్యూలు ఆస్తి

విశాఖపట్నం జిల్లా, గాజువాక మండలంలో చేరిన అనకాపల్లి రిజిస్ట్రార్ వారి పరిధిలో చేరిన సబ్బవరం సబురి గ్రేటర్ విశాఖలో చేరిన దువ్వాడ గ్రామం తాలూకా జిరాయితీ పట్టా తాలూకా మెట్టు సర్వేనెం.17/1రులో చేరిన లేఅవుట్ ప్లాన్ ప్రకారంగా ప్లాటు నెం. 26రు చ॥గ॥ 350లు స్థలమునకు హద్దులు: తూర్పు : ప్లాటు నెం.29రు స్థలము; దక్షిణం: ప్లాటు నెం.27రు స్థలము; పడమర: అ॥ 30లు వెడల్పుగల రోడ్డు; ఉత్తరం: ప్లాటు నెం. 25రు స్థలం.

M.S.NAGESH B.Com, B.L.
Advocate & Notary
D.No.31-23-36, Kurmannapalem, Vadlapudi (P.O), Gajuwaka, Visakhapatnam - 530046. ఫోన్: 9246672990

మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

అగనంపూడి, న్యూస్‌టుడే : మహిళల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇచ్చి సౌకర్యాలు కల్పించడం జరుగుతోందని విశాఖ పార్లమెంటు సభ్యుడు ఎం.శ్రీభరత్ తెలిపారు. సోమవారం జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి శివారు ఆటోనగర్ వద్ద రూ. 17 కోట్లతో నిర్మించనున్న ఆధునిక మహిళా వసతిగృహ సముదాయానికి ఆయన శంకుస్థాపన చేశారు. మేయర్ పీలా శ్రీనివాస్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్, జోనల్ కమిషనర్ శేషాద్రి, స్థానిక కార్పొరేటర్ బొండా జగన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా వసతిగృహానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా తదితరులు

నిర్వాసితకాలనీల అభివృద్ధికి కృషి : మేయర్

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ఉక్కు నిర్వాసితకాలనీల్లో సౌకర్యాల మెరుగునకు తగిన కృషిచేస్తున్నట్లు మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం 75వ వార్డులో రూ. 70 లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, తెదేపా నగర ఉపాధ్యక్షుడు పులి రమణారెడ్డి, సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కూటమి నాయకులు నమ్మి అప్పారావు, కోన చినఅప్పారావు, పెద్దాడ సోమునాయుడు, దాసరి జ్యోతిరెడ్డి, శ్రీముసిరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

శిలా ఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పల్లా తదితరులు

శ్రీశ్రీశ్రీ వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి వారి 28వ షష్ఠి మహోత్సవములు

తేది. 25-11-2025 మంగళవారం నుండి తేది. 27-11-2025 గురువారం వరకు
మురుగన్ టవర్స్ వద్ద, ఎన్.ఎ.డి. కొత్తరోడ్, విశాఖపట్నం-09

తేది. 26-11-2025 బుధవారం శ్రీశ్రీశ్రీ సుబ్రహ్మణ్య షష్ఠి
ఉ॥ 4.00 గం॥లకు శ్రీ స్వామివారికి **పంచామృతాభిషేకములు, విభూది అర్చనలు** మరియు ఉ॥ 8.30 గం॥లకు కళ్యాణ మహోత్సవములు మరియు సా॥ 5.30 ని॥లకు **రథోత్సవము** జరుగును.
తేది. 27-11-2025 గురువారం మ॥ 12.00 గం॥ల నుండి భక్తులకు & అయ్యప్పస్వామి భక్తులకు **అన్నసంతర్పణ**, సా॥ 6.00 గం॥లకు జ్యోతిర్లింగార్చన (వెయ్యి దీపాలతో) జరుగును.

ఇట్లు... ఆలయ ధర్మకర్త: శ్రీమతి & శ్రీ
ఆర్. మాణిక్యం, మహేశ్వరి దంపతులు మరియు ఆలయ కమిటీ

చెత్త కుండీలు తొలగించాలి

గాజువాక, న్యూస్‌టుడే: బీసీరోడ్డు ఖడ్గమృగం సెంటర్ మీడియం పార్కు చెంతన చెత్త కుండీ వద్ద వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఇక్కడ గౌతమ బుద్ధుని పాలరాతి విగ్రహం, దాని ముందు ఖడ్గమృగం ఉంటుంది. సమీపవాసులు అక్కడే కూర్చొని సేద తీరుతుంటారు. దాన్ని ఆనుకుని చెత్త కుండీ, చుట్టూ వ్యర్థాలు పేరుకుపోవడంతో సందర్శకులు తీవ్ర అసహనం వ్యక్తంచేస్తున్నారు. చెత్త కుండీని వేరేచోటుకు మార్చి దుర్గంధం నుంచి ముక్తి కలిగించాలని వీరంతా కోరుతున్నారు.

బుద్ధుని విగ్రహం చెంతనే చెత్త

కాలువ నిర్మించి.. కష్టాలు మిగిల్చి

ఫోకస్

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : గాజువాక 65వ వార్డు బీసీ రోడ్డు-భానోజీతోట కాలనీకి వెళ్లే వీధిలో జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి ఇటీవల సీసీ డ్రైను నిర్మించారు. ఇంతవరకూ బాగానే ఉన్నా తవ్విన మట్టి, రాళ్ల గుట్టలను తీయకుండా వదిలేయడంతో అటుగా రాకపోకలు సాగించేవారంతా బిక్కు బిక్కుమంటున్నారు. అసలే ఇరుకుదారి, ఆపై రాళ్లు, మట్టి కారణంగా ద్విచక్ర వాహనదారులు పడిపోతున్నారు. వ్యర్థాలు తీసి ఇబ్బందులు తీర్చాలని వీరంతా కోరుతున్నారు.

కొత్తగా నిర్మించిన డ్రైనేజీ

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోపాలపట్నం(కొత్తపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 89వ వార్డు దుర్గానగర్ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు సుమారు రూ. 36 లక్షల జీవీఎంసీ నిధులు మంజూరయ్యాయి. దీంతో సోమవారం స్థానిక వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ చేతుల మీదుగా శంకుస్థాపన పనులు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ సంక్షేమ డైరెక్టర్ రమణ, పనుల విభాగం ఏఈ గాయత్రీ, తెదేపా నాయకులు దాడి సురేశ్, గవ్వ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

★ గోపాలపట్నం(ఆర్.ఆర్.వి.పురం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 92వ వార్డు ఎస్సీబీసీకాలనీలో సుమారు రూ. 10.85 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థానిక వార్డు తెదేపా ఇన్‌ఛార్జి దాడి రమేశ్‌నాయుడు శంకుస్థాపన చేశారు.

(c) eenadu

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం, బొబ్బిలి, రాజాం

కాలువలా.. కాలనాగులా!!

పలకల్లేక పిలుస్తోన్న మృత్యువు

ఉమ్మడి జిల్లాలో మురుగు కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా దర్శనమిస్తోంది. భారీ డ్రైన్లు, వరద కాలువలు అధ్వాన స్థితిలో ఉన్నాయి. వాటిపై పలకలు లేకపోవడం, ఇరువైపులా రక్షణ గోడల్లేక ముప్పు పొంచి చూస్తోంది. ఏమాత్రం అదుపుతప్పినా ప్రాణాలు గల్లంతయ్యే ప్రమాదముంది.

విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయానికి కూతవేటు దూరంలోని కర్రలబట్టీ వద్దనున్న ప్రధాన కాలువిది. మురుగు, వరద నేరుగా పెద్దచెరువుకు వెళ్తుంది. గతంలో ఓ మహిళ పడి కొట్టుకుపోయింది. ఇంకా మూయకుండా ఇలానే ఉంచారు.

ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలు..

విజయనగరం: సిటీస్టాండ్, నగరపాలిక కూడలి, ప్రకాశం పార్కు, కర్రలబట్టీ, పద్మావతినగర్, సింహాద్రినగర్, నాయుడు కాలనీ, పూల్‌బాగ్

సాలూరు: బంగారమ్మకాలనీ, రామాకాలనీ, పెద మార్కెట్, కోటవీధి, పెదహరిజన పేట, బంగారమ్మ పేట

పార్వతీపురం: జగన్నాథపురం, కొత్తవలస, సాయి నగర్, బైపాస్, బెలగాం

రాజాం: డోలపేట, పొను గుటివలస, కొత్త వలస, కొండంపేట, గోపాలపురం, సారధి

బొబ్బిలి: పూల్‌బాగ్, పాత బొబ్బిలి, గొల్లపల్లి, ఆర్టీసీ కాంప్లెక్స్

అక్కడే ఎక్కువ..

విజయనగరం నగరపాలిక పరిధిలో సుమారు 450 కి.మీ మేర డ్రైన్లు విస్తరించాయి. ఇందులో పలకలున్నవి చాలా తక్కువ. వీటికి వరద కాలువలు అదనం. వీటి నిర్మాణాల కోసం ఏటా రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నారు. అనంతరం వదిలేస్తున్నారు. కల్వర్టులు సైతం రక్షణ లేకుండానే ఉన్నాయి. చాలావాటిపై పలకల్లేవు. కొన్నింటిపై వేసినా విరిగిపోయాయి. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

★ పెద్దచెరువు నుంచి అదనపు వరద కాలువ ఏర్పాటుకు రూ.3.50 కోట్లు మంజూరైనా పనులు జరగలేదు.

★ నగరం మీదుగా వెళ్తున్న ప్రధాన కాలువను వెడల్పు చేసేందుకు ఇటీవల రూ.35.51 కోట్లతో ప్రతిపాదించారు. పనులు జరగాల్సి ఉంది.

చర్యలు తీసుకుంటాం..

'ప్రధాన కాలువలున్న చోట ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకుంటున్నాం. పారిశుద్ధ్య పనులకు ఆటంకం కలగకుండా వాటిపై గ్రిల్స్ వేస్తున్నాం. కొన్నిచోట్ల పలకలు ఏర్పాటు చేస్తున్నాం. పూడికతీత పనులు ఎప్పటికప్పుడు సాగుతున్నాయి' అని పురపాలిక అధికారులు తెలిపారు.

స్థలం మాదే.. పట్టా వేరొకరికి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: తన ఇంటి స్థలంపై అధికారులు వేరొకరికి తప్పుడు పట్టా సృష్టించి ఇచ్చారని విజయనగరంలోని బొగ్గులదిబ్బ ప్రాంతానికి చెందిన కె.ఆదిలక్ష్మి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ సేధు మాధవన్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో గుంకలాం కాలనీలో తనకు ఇల్లు మంజూరైందని, ఆ స్థలంలోనే వేరొకరికి పట్టా ఇచ్చారన్నారు. ఆన్‌లైన్‌లో తన పేరు ఉందని, రిజిస్ట్రేషన్ కూడా చేసినట్లు చెప్పారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, నాలుగేళ్లుగా తిప్పుతున్నారని, న్యాయం చేయాలని కోరారు.

ఆదిలక్ష్మి

206 వినతులు..

కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు 206 వినతులు అందాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా 94 వరకు వచ్చాయి. డీఆర్‌డీఏ- 24, సచివాలయాలు- 14, పంచాయతీరాజ్- 12, మిగిలినవి ఇతర శాఖలకు అందాయి. జేసీతో పాటు డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, ప్రత్యేక ఉప కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హోరాహోరీ.. పతకంపైనే గురి

స్కూల్‌గేమ్స్ అండర్- 17 రాష్ట్రస్థాయి బాలికల ఖోఖో పోటీలు విజయనగరం జిల్లా కేంద్రంలోని విజ్జీ మైదానంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. 13 ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారిణులు తరలిరాగా.. రెండో రోజు సోమవారం హోరాహోరీగా తలపడ్డారు. ఉత్కంఠంగా సాగిన సెమీస్‌లో చిత్తూరు, తూర్పుగోదావరి జట్లు సత్తా చూపి ఫైనల్‌కు చేరాయి. మంగళవారం ఉదయం తుది పోరు ఉంటుందని స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు కోరాడ గోపాలరావు, ఎస్.విజయలక్ష్మి తెలిపారు.

– న్యూస్‌టుడే, విజయనగరం క్రీడావిభాగం

ఇదిగో స్వయం ఉపాధి

కొత్తవలస, న్యూస్‌టుడే: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు స్టేట్ బ్యాంక్ గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఏపీఎం వెంకటరమణ తెలిపారు. హౌస్ వైరింగ్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, ఏసీ మెకానిక్ తదితర విభాగాల్లో ఈ నెల 27 నుంచి విజయనగరంలోని వీటీ అగ్రహారం ప్రాంతంలో ఉన్న టీటీడీసీ మహిళా ప్రాంగణంలో తర్ఫీదు ఉంటుందన్నారు. నిపుణుల ఆధ్వర్యంలో శిక్షణ సాగుతుందని, ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. వివరాలకు 99857 87820, 99595 21662ను సంప్రదించాలన్నారు.

– న్యూస్‌టుడే, రింగురోడ్డు, గజపతినగరం, కొత్తవలస, బొబ్బిలి, కొమరాడ

పట్టాలపై ప్రగతి ఎక్స్‌ప్రెస్

ఇటీవల ప్రారంభమైనవి..

- రూ.11 కోట్లతో పార్వతీపురం- జిమిడిపేట లైను
- 35 కి.మీ పరిధిలో ఉన్న బొబ్బిలి - డొంకినవలస ట్రాక్

గొట్లాం మీదుగా బైపాస్..

భువనేశ్వర్ నుంచి వచ్చే రైళ్లు జగదల్‌పూర్(ఛత్తీస్‌గఢ్) వెళ్లాలంటే విజయనగరం స్టేషన్‌కు వచ్చి ఇంజిన్ మార్చుకొని మళ్లీ వెనక్కి వెళ్లి రాయగడ మీదుగా చేరుకోవాలి. దీని వల్ల సమయం వృథా అవుతోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు బైపాస్ విధానాన్ని తెర మీదకు తెచ్చారు. విశాఖపట్నం వెళ్లకుండా కొన్నింటిని దువ్వాడ మీదుగా రప్పించనున్నారు. ఈమేరకు గొట్లాం- నెల్లిమర్ల మధ్య అమృత్‌భారత్ నిధులతో సుమారు 9 కిలోమీటర్ల మేర ట్రాక్ నిర్మించారు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో రైల్వే రంగానిది కీలక పాత్ర. రాకపోకలతో పాటు సరకు తరలింపు, ఉత్పత్తుల దిగుమతికి అదే ప్రధానాధారం. ఈ నేపథ్యంలో లైన్లను మరింత విస్తరించేందుకు ఆ శాఖ అడుగులు వేస్తోంది. ఇప్పటికే నిధులు మంజూరు కావడంతో.. మూడు, నాలుగో లైన్ పనులు జోరుగా సాగుతున్నాయి.



తీరనున్న సమస్యలు..

పురిటిపెంట, కోమటిపల్లి, దిబ్బగుడ్డివలస, కనిమెరక ప్రాంతాల్లో గేట్లు పడితే సాధారణ వాహనాల్లో ప్రయాణికులు వేచి ఉండాల్సి వచ్చేది. ఆయా ప్రాంతాల్లో పైవంతెనలు మంజూరు చేశారు. కొన్ని గేట్ల వద్ద ఇప్పటికే ఆర్‌యూబీలు నిర్మించారు.

స్టేషన్లకు హంగులు..

బొబ్బిలి, డొంకినవలస, కోమటిపల్లి, గజపతినగరం, గరుడబిల్లి రైల్వేస్టేషన్ల భవనాలను ఆధునిక హంగులతో నిర్మించారు. దాదాపు అన్నిచోట్లా రెండేసి అదనపు ప్లాట్ ఫారాలు నిర్మించారు.

ఉపయోగాలివీ..

- లైన్ ఏర్పాటుతో మరిన్ని రైళ్లు వచ్చే అవకాశముంది
- ఇక నుంచి అదనపు హాల్ట్‌లు కల్పించే వీలుంది.
- ట్రాఫిక్ సమస్య తీరనుంది
- ఇప్పటివరకు కొన్ని లూప్ లైన్లను వాడేవారు. ఇక నుంచి ఆ పరిస్థితి ఉండదు
- మన దగ్గర నుంచి మామిడి పండ్లు, తాండ్ర, ఆహార ఉత్పత్తులను తరలించవచ్చు.
- రెండు అప్, రెండు డౌన్ లైన్లు అందుబాటులోకి వస్తాయి
- గూడ్సులు సకాలంలో చేరుతాయి

రాయగడ నుంచి విజయనగరం వరకు మూడో లైను పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే బాడంగి మండలంలోని డొంకినవలస వరకు ప్రారంభించారు. ఇక్కడి నుంచి విజయనగరం మధ్య ఇంకా సాగుతున్నాయి. ఈ మార్గంలో విద్యుద్దీకరణ, వంతెనల నిర్మాణాలు, పట్టాల ఏర్పాటు ప్రక్రియ జరుగుతోంది. మరో ఏడాదిలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది.

నేటి నుంచి పుస్తక మహోత్సవం

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం నుంచి పార్వతీపురం పుస్తక మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు కలెక్టరు ప్రభాకరరెడ్డి ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. వంద మందికి పైగా ప్రచురణకర్తలు, సంస్థల నుంచి సాహితీ లోకానికి వచ్చిన లక్ష పుస్తకాలు ప్రదర్శిస్తారు. డిసెంబరు 5 వరకు పది రోజుల పాటు ఉత్సవంగా నిర్వహించేందుకు సాంస్కృతికశాఖ భాగస్వామ్యంతో ఏర్పాట్లు చేశారు.

జామి మండలంలోని అన్నమరాజుపేట గ్రామ సమీపంలో ఒకేచోట ॥ గోతులు

నాకు గాట్లు.. మీకు పాట్లు

3.16 కి.మీ పొడవు.. 260 గుంతలు

న్యూస్‌టుడే పరిశీలన

మొన్నే ఓ బైకర్ బోల్తా కొట్టి నన్ను అనకూడని మాటలన్నీ అన్నాడు.. ఆటో చోదకులైతే తిట్టని రోజంటూ ఉండదు.. చిన్న పిల్లాడి నుంచి పెద్దల వరకు, సైకిల్ తొక్కేవారి నుంచి లారీలు తోలేవారి వరకు అందరూ నన్ను ఆడిపోసుకోవడమే. . నా కారణంగా వారు పడుతున్న కష్టాలు అన్ని మరి.. నా ఒంటిపై 260కి పైగా గాట్లున్నాయని ఇటీవల 'న్యూస్‌టుడే' ప్రతినిధి లెక్కగట్టారు.. ఇవన్నీ ఏ వందల కిలో మీటర్లలోనో లేవు. కేవలం 3.16 కి.మీల పొడవునే కనిపిస్తున్నాయి. జామి మండలంలోని భీమసింగి- అన్నమరాజుపేట మధ్య నా దూరం అంతే మరి. 20 ఏళ్ల నాటి నిర్మాణం నాది. అందుకే శిథిలమైపోయా. మరమ్మతులు చేయకుంటే వాహనాల బరువు కాయగలనా చెప్పండి. కాస్త మట్టో, కాంక్రీటో, తారో పోయకుంటే ఎలా బాగుంటా. అందుకే నా ఒంటిపై ఇన్ని తూట్లు. చక్కెర కర్మాగారం, పలు పరిశ్రమలు, ప్రసిద్ధి చెందిన పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయం, విశాఖ జిల్లాలోని పద్మనాభం, సింహాచలం, ఆనందపురం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రజలకు నేనే దిక్కు. జామి, విజయనగరం, కొత్తవలసకు నిత్యం 5 వేల మంది వరకు నామీదుగా రాకపోకలు సాగిస్తారు. రోజూ 10 వరకు పాఠశాలల బస్సుల్లో విద్యార్థులు తిరుగుతుంటారు. పాపం వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ వాళ్లు సైతం నీకో దండమని వాళ్ల సర్వీసులు ఆపేశారు. కొన్నేళ్లుగా ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప ఎవరూ పట్టించుకోవడం లేదు. నా అవసరం ఉన్న పలువురు ఇటీవల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో మాట్లాడారట. ఈ మేరకు రూ.1.20 కోట్లతో ప్రతిపాదనలు వెళ్లాయని చెప్పారట. ఆ అనుమతులు ఎప్పుడొస్తాయో.. నన్నెప్పుడు బాగుచేస్తారోనని ఆశగా ఎదురు చూస్తున్నా. అప్పటివరకైనా కాస్త జాగ్రత్త'.. **భీమసింగి- అన్నమరాజుపేట రోడ్డు** ఆవేదనిది.

– న్యూస్‌టుడే, జామి

ఈనాడు, విజయనగరం

మిల్లర్లకు ఎలా చెల్లించారు?

చేతులు మారిన సంచుల సొమ్ము

డీఎంపై కొలిక్కిరాని విజిలెన్స్ విచారణ

పౌర సరఫరాల సంస్థ పూర్వపు డీఎం మీనాకుమారిపై వెల్లువెత్తిన ఆరోపణలపై విజిలెన్స్ విచారణ కొలిక్కిరాలేదు. వైకాపా హయాంలో ఓ కీలక ప్రజాప్రతినిధి అండతో తనను అడిగేవారెవరని ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ధాన్యం నుంచి గోనె సంచుల కొనుగోళ్ల వరకు అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదులొచ్చాయి. ఈమేరకు సమగ్ర విచారణ చేపట్టాలని మేలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, హోం మంత్రి అనిత ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్ర అధికారులకు లేఖ రాశారు. దీంతో పలు ఆధారాలు లభించినట్లు సమాచారం.

ధాన్యం సేకరణలో రైతులు సొంతంగా కొనుగోలు చేసి వినియోగించిన గోనె సంచుల సొమ్ము తనకు అనుకూలమైన మిల్లర్లకు చెల్లించారన్నది ప్రధాన ఆరోపణ. అనంతరం వారి నుంచి ఆ సొమ్మును ప్రైవేటు వ్యక్తులకు బదలాయించారని, చివరకు ఆమె లబ్ధిపొందినట్లు అనుమానిస్తున్నారు. గన్నీ బ్యాగుల వ్యవహారంలో రిజిస్టర్ కాని మిల్లర్లకు ఎలా నగదు చెల్లించారు.. అసలు నిబంధనలేంటి.. వాటిని మీరు పాటించారా.. రాతపూర్వకంగా సమాధానం చెప్పాలని పూర్వపు డీఎంకు విజిలెన్స్ అధికారులు గత నెలాఖరున నోటీసులిచ్చారు. వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని సూచించారు. ఆమె నెల రోజులు అడిగినట్లు తెలిసింది. కానీ ఇప్పటికీ స్పందన లేదు. ఈ వ్యవహారం నుంచి తనను గట్టెక్కించాలని పొరుగు జిల్లాలోని కీలక ప్రజాప్రతినిధి సోదరులను ఆశ్రయించినట్లు సమాచారం.



మిల్లరు నుంచి ప్రైవేటు వ్యక్తి ఖాతాకు నగదు బదలాయింపునకు సంబంధించిన బ్యాంకు రసీదు

మరికొన్ని ఇలా..

గోనె సంచులకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదైన రైతుల పేర్లు తొలగించి మిల్లర్లవి చేర్చారు. ఇలా రూ.కోటికి పైగా నిధులను మళ్లించారు. మరోవైపు రేషన్ కింద ఇవ్వాల్సిన కందిపప్పు నాసిరకంగా ఉందని శ్రీకాకుళం జిల్లాలో తిరస్కరిస్తే.. స్థానికంగా పంపిణీకి ఎలా తీసుకున్నారని.. పొరుగు సేవల కింద డాటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టుల నియామకాల్లో అర్హులకు అన్యాయం చేశారని ఆమెపై లోకాయుక్తకు సైతం ఫిర్యాదులు అందాయి. ఆయా అంశాలపై ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు విచారణ చేస్తామని ఓ అధికారి 'ఈనాడు'కు తెలిపారు.

ఒక్కసారి జైలుకెళితే జీవితం నాశనమే

సైకిల్ ర్యాలీలో డీఐజీ గోపీనాథ్, ఎస్పీ దామోదర్, జేసీ సేధు మాధవన్ తదితరులు

నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాల వినియోగం, రవాణాకు సంబంధించి ఉత్తరాంధ్ర పరిధిలో గత 16 నెలల్లో 2,467 మందిని అరెస్టు చేశామని, 67 మందికి పది సంవత్సరాల కంటే ఎక్కువ జైలు శిక్ష పడిందని డీఐజీ గోపీనాథ్ అన్నారు. సోమవారం సాయంత్రం కోట వద్ద 'అభ్యుదయం' సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. గంజాయి కేసుల్లో ఒక్కసారి జైలుకు వెళితే జీవితం నాశనమైనట్లేనన్నారు. ఇప్పటివరకు 19,740 అవగాహన కార్యక్రమాలు చేపట్టగా, 11,58,870 మంది పాల్గొన్నారన్నారు. సమాచారం అందించాలనుకుంటే 100, 112, 1972ను సంప్రదించాలని కోరారు. ఎస్పీ దామోదర్, జేసీ సేధు మాధవన్, ఏఎస్పీలు సౌమ్యలత, నాగేశ్వరరావు, డీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతేరాజు 6లో

ఇటు రత్నాలు.. అటు రాజులు

చిత్రాలపై ప్రముఖులు

కళలకు నిలయం విజయనగరం. విద్యలనగరంగా, రాజులేలిన నేలగానూ గుర్తింపు పొందింది. ఎంతో మంది ప్రముఖులు ఇక్కడే పుట్టి, ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందారు. ఎందరో రాజులు నాటి పాలనలో చెరగని ముద్ర వేశారు. వారి చరిత్రను భావితరాలు తెలుసుకునేలా, మదిలో నిలుపుకొనేలా నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఇప్పటికే మూడులాంతర్లపై ప్రముఖుల ఫొటోలను ఏర్పాటు చేసింది. తాజాగా మహనీయుల చిత్రాలను ఎంఆర్ కళాశాల వద్ద ప్రదర్శనగా పెట్టింది. గజపతులతో పాటు గంటసాల, గురజాడ, పి.సుశీల, శ్రీరంగం గోపాలరత్నం తదితరుల చిత్రాలు దర్శనమిస్తుండగా.. పట్టణవాసులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

– న్యూస్‌టుడే, బొబ్బిలి

కుక్కలకూ ఓ ఆసుపత్రి

పూర్తిస్థాయిలో వినియోగించని వైనం

విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బస్సు, రైల్వే స్టేషన్లలోకి శునకాలు రాకుండా చర్యలు చేపట్టాలని దేశ అత్యున్నత న్యాయస్థానం ఇటీవల ఆదేశించింది. ప్రాంగణాల్లోకి చొరబడకుండా కంచెలు ఏర్పాటు చేయాలని సూచించింది. దీంతో పట్టణాల్లో శునకాల బెడద తగ్గుతుందని ప్రజలు భావిస్తున్నారు. జిల్లాలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన శస్త్ర చికిత్సల థియేటర్లు ఇప్పటికైనా వినియోగంలోకి వస్తాయనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు పురపాలక సంఘాల పరిధిలో కుక్కల నియంత్రణకు బొబ్బిలిలో సుమారు రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో ఆసుపత్రి, సంరక్షణ షెడ్లు నిర్మించారు. ఏడేళ్లవుతున్నా ఇంతవరకు పూర్తిస్థాయిలో వినియోగించడం లేదు. పుర అధికారులు కాకి లెక్కలతోనే సరిపెడుతున్నారు.

రూ.లక్షల్లో ఖర్చు..

శస్త్ర చికిత్సలు నిర్వహించి, రూ.లక్షల్లో వెచ్చిస్తున్నామని అధికారులు లెక్కలు చూపిస్తున్నారు. బొబ్బిలిలో ఈ ఏడాది 320 శస్త్రచికిత్సలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. జులై 31 నాటికి పూర్తిచేసినట్లు చెబుతున్నారు. ఒక్కోదానికి సుమారు రూ.800 చొప్పున రూ.2.56 లక్షలు వెచ్చించినట్లు పేర్కొన్నారు. పార్వతీపురంలోని 75 శునకాల కోసం రూ.1.65 లక్షలు, సాలూరులోని 135కి రూ.2.16 లక్షలు ఖర్చు చేశామని వెల్లడించారు. కానీ ఎక్కడికక్కడే కనిపిస్తున్నాయి.

బొబ్బిలి పట్టణంలోని కుక్కల శస్త్రచికిత్సల కేంద్రం

ప్రత్యేక చర్యలు ..

నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. నిర్మించిన ఆసుపత్రి సముదాయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొన్నింటిని గుర్తించి శస్త్రచికిత్సలు నిర్వహించాం. మిగిలిన పురపాలికలు కూడా వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశాం. – రామలక్ష్మి, పుర కమిషనర్

ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసన

గుర్ల, గరివిడి, న్యూస్‌టుడే: గుర్ల మండలం కెల్ల పరిధిలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ కెల్ల, బెల్లానపేట, మణ్యపురిపేట, దమరసింగి, వల్లాపురం, ఎస్ఎస్ఆర్‌పేట గ్రామాల రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. 1,085 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని డిమాండు చేశారు. ఆరు గ్రామాల్లో రెండు పంటలు పండే పొలాలను వదులు కోవడం వల్ల 10 వేల మంది జీవనాధారం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామసభలు జరపకుండా.. రైతుల ఆమోదం లేకుండా కేటాయించడం తగదన్నారు. అనంతరం రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహసీల్దారు ఆదిలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు కేవీ.సూర్యనారాయణరాజు, పి.సన్యాసినాయుడు, ఎస్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుర్లలోని విజయనగరం- పాలకొండ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న ఆందోళనకారులు

అమృతమూర్తికి అశ్రునివాళి

కీ.శే. కొట్టక్కి సరస్వతి పట్నాయక్

రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్

జననం: 16-08-1942 మరణం: 15-11-2025

పెద్దకర్మ: తేదీ: 26-11-2025 బుధవారం నాడు మా స్వగృహమునందు జరుగును

Address: Flat No: 301/Block - A, MVV Enclave, Water Tank Road, Midhilapuri Vuda Colony, Madhurawada, Visakhapatnam

తృతీయ వర్ధంతి

కీ.శే. శ్రీమతి చిగురుపల్లి దీప్తి B.Sc. (Agri.)

అగ్రికల్చర్ ఆఫీసర్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా - గజపతినగరం

జననం: 12-09-1990 మరణం: 25-11-2022

కుటుంబసభ్యులు

(c) eenadu

అందమైన చిత్రం.. జ్ఞాపకాలు పదిలం

న్యూస్‌టుడే- గరివిడి

జ్ఞాపకాల పందిరిలో జీవితకాల సంతకం.. కరిగే కాలంలో చెదరని మధుర స్మృతుల ప్రతిబింబం.. గతాన్ని కళ్లముందుంచే సాధకం ఫొటో. మనిషి పుట్టుక నుంచి మరణం వరకు ప్రతి సన్నివేశాన్ని పదిలంగా దాచుకుని ఆ నాటి జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ వీక్షించుకునే అవకాశం ఫొటో ద్వారానే ఉంటుంది. ప్రతి దాని వెనుక ఒక జ్ఞాపకం.. ఓ అనుభూతి దాగుంటుంది. అలాంటి చిత్రాలను జతచేర్చి అందమైన ఫ్రేముల్లో బంధించి.. తమ ఇంట్లో భద్రపరుచుకోవడం ఇప్పుడు నయా ట్రెండ్‌గా మారింది.

చిన్నారికి అందించిన బహుమతి

పెరుగుతున్న ప్రాధాన్యత

కేవలం జ్ఞాపకాలను భద్రపరచడమే కాదు.. గృహ అలంకరణ.. వ్యక్తిగత భావోద్వేగ అనుబంధంలోనూ ఫొటో ఫ్రేములు కీలకంగా మారాయి. జన్మదినం.. వివాహం.. తదితర శుభకార్యాలతో పాటు పలు సందర్భాల్లో బహుమతులుగా ఇవ్వడానికి ఎక్కువగా వినియోగిస్తున్నారు. అందమైన ఫ్రేముల్లో ఉంచిన చిత్రాలు ఆ ప్రత్యేక క్షణాలను భౌతిక రూపంలో మన కళ్ల ముందు ఉంచుతాయి. ఖాళీ గోడలకు జీవం పోసి ఇంటి వాతావరణాన్ని అందంగా మెరుగుపరుస్తాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఉన్న బంధాన్ని గుర్తుకు తెస్తుంటాయి.

బుజ్జాయి గుర్తులు అపురూపంగా..

చిన్నారుల చిట్టి రూపాన్ని తలచుకుని తల్లిదండ్రులు ఆనందంతో మురిసిపోతుంటారు. అందుకే బుజ్జాయి తొలి స్పర్శను గుర్తుకు తెచ్చే ఆ చిట్టి చేతులు.. పాదాలు ఎప్పటికీ తమ కళ్లముందుండేలా త్రీడీ నమూనా రూపంలో భద్రపరుచుకుని వాటికి చిత్రాలను చేర్చి అందమైన ఫ్రేముల్లో నేటి తరం భద్రపరుచుకుంటోంది. పిల్లలకు సంబంధించిన ప్రతీ ఓ అపురూప జ్ఞాపకంగానే నేటి తరం భావిస్తోంది.

అదితి పుట్టినరోజు వేడుకలు

గజమాలతో సత్కరిస్తున్న నెల్లిమర్ల నియోజకవర్గ నాయకులు

విజయనగరం అర్బన్, పట్టణం, గ్రామీణం, నెల్లిమర్ల, న్యూస్‌టుడే: విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పుట్టినరోజు వేడుకలు సోమవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ శ్రేణులు, అధికారులు, మాన్సాస్ విద్యాసంస్థల సిబ్బంది, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. పేదవారి వీధిలోని చెవిటి, మూగ పాఠశాల విద్యార్థులతో కేక్ కోయించారు. విద్యార్థుల దత్తత కోసం వారి కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు మొత్తం 27 మంది రూ.1.84 లక్షల విరాళాన్ని యాజమాన్యానికి అందజేశారు. ప్రేమసమాజానికి 25 బెడ్‌లు, పట్టణ నిరాశ్రయుల వసతిగృహానికి 25 దుప్పట్లు పంపిణీ చేశారు. పినవేమలిలో ఏబీసీ వృద్ధాశ్రమానికి పండ్లు, స్వీట్లు, భోజనాలను నాయకులు అందజేశారు. వి.టి.అగ్రహారం బీసీ బాలికల వసతిగృహంలో రూ.45 వేల విలువైన ఆర్వో ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు. నాయకుడు పిల్లా విజయకుమార్ ఆధ్వర్యంలో 28 డివిజన్ సచివాలయాలకు సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలు అందజేశారు. నాయకులు ఉప్పలపాటి రాజేష్ వర్మ, అవనాపు విక్రమ్, ఐవీపీ రాజు, కర్రోతు నర్సింగరావు, కోరాడ వెంకటరావు, బి.చిరంజీవులు, రవిశేఖర్, వనజాక్షి, ఆనందకుమార్, కొండబాబు, భాస్కరనాయుడు, గంటా రవి, గంటా పోలినాయుడు, అవనాపు విజయ్, భార్గవి, అనురాధ బేగం, మురళీనాయుడు, పడాల జోగేష్ శుభాకాంక్షలు తెలిపారు.

డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభం

డెంకాడ, న్యూస్‌టుడే: చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో 'క్వాంటమ్ మిషన్ లెర్నింగ్ ఫర్ నెక్స్ట్ జనరేషన్ కమ్యూనికేషన్ సిస్టమ్స్' అంశంపై ఆరురోజుల ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభమైంది. తొలి రోజు పుదుచ్చేరి సెంట్రల్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ టి.షణ్ముగ నాథం క్వాంటమ్ మిషన్ లెర్నింగ్ ప్రెసెంట్ యాంటెన్నాలు, 6జీ యాంటెన్నా టెక్నాలజీ తదితరాలపై వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వై.ఎం.సి.శేఖర్, కోఆర్డినేటర్ ఎం.సత్యనారాయణ, విభాగాధిపతి రమాదేవి, డీన్ సునీల్ ప్రకాష్ పాల్గొన్నారు.

ఏఎస్పీ నాగేశ్వరరావుకు బదిలీ

ఈనాడు, విజయనగరం: విజయనగరం జిల్లా అదనపు ఎస్పీ(ఏఆర్) నాగేశ్వరరావుకు బదిలీ చేస్తూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలిచ్చారు.

ఏఐతో యువతకు ఉద్యోగాలు

మాట్లాడుతున్న నిపుణుడు అశ్విన్‌చంద్ర

పాల్గొన్న ఇంజినీరింగ్ యూజీ, పీజీ విద్యార్థులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: కృత్రిమ మేధ(ఏఐ)తో పరిశ్రమల అవసరాలు, యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఐబీఎం స్కిల్స్ బిల్డ్(చెన్నై)కు చెందిన నిపుణులు అశ్విన్ చంద్ర, షేక్ ఉస్మాన్ గనీ అన్నారు. జేఎన్‌టీయూ గురజాడ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఐబీఎం స్కిల్స్ బిల్డ్ ఆధ్వర్యంలో ఏఐ నైపుణ్యంపై ఇంజినీరింగ్ యూజీ, పీజీ విద్యార్థులకు నిర్వహించిన ఒక్క రోజు అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఏఐ పరిచయం, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ కంప్యూటర్ విజన్, మెషీన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, ఐబీఎం వాట్సన్ స్టూడియో ద్వారా ఏఐ నమూనాల నిర్వహణ, ఏఐ ఎథిక్స్ అంశాలపై శిక్షణ ఇచ్చారు. సీఎస్సీ ఇండియా సీనియర్ మేనేజర్ రామ్మోహన్, ఉపకులపతి డా.వి.వి.సుబ్బారావు, రిజిస్ట్రార్ జి.జయసుమ, ప్రధానాచార్యుడు ఆర్.రాజేశ్వరరావు, నైపుణ్యాభివృద్ధి సమన్వయాధికారిణి హేమ పాల్గొన్నారు.

లాభాలబాటన నడిపించేలా 'రైతన్నా మీకోసం'

కరపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టరు, వ్యవసాయానుబంధ శాఖల అధికారులు

పార్వతీపురం, న్యూస్‌టుడే: వ్యవసాయం, దాని అనుబంధ పరిశ్రమలకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన 'రైతన్నా మీకోసం' కార్యక్రమం కరప్రతులను కలెక్టరు ప్రభాకరరెడ్డి సోమవారం విడుదలచేశారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ, అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. లాభసాటి వ్యవసాయం, సేద్య విధానాలపై అవగాహన పెంపొందించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టరు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి అన్నపూర్ణ, జిల్లా పశుసంవర్ధక అధికారి మన్మథరావు, ఉద్యానశాఖాధికారి సత్యనారాయణరెడ్డి, బిందు సూక్ష్మసేద్యం పథక అధికారి రాధాకృష్ణ పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	118	206	216

EENADU e Classifieds

HEALTH & CARE

NEURO

నిర్మల న్యూరో & జనరల్ మెడికల్ సెంటర్
మెదడు, నరములు & వెన్నెముక వ్యాధి నిపుణులు
Dr.Nirmala Vangapandu M.D.(Gen.Med) DM (Neuro) JIPMER Specialist in Brain & Nerve Problems & General Physician
ఆదివారం నుండి శుక్రవారం వరకు ఉ 9 గం. నుండి సా. 6 గం. వరకు
R.T.C.కాంప్లెక్స్ ఎదురుగా, INOX మల్టీప్లెక్స్ వెనుక వైపు, VZM
FOR APPOINTMENT : 63054 71147

REAL ESTATE

FLAT FOR SALE

3BHK G2 1st ఫ్లోర్ E/F 1380 Sft భాగ్యలక్ష్మి ఎన్‌క్లేవ్, ఈజీబై వెనుక రింగ్ రోడ్, విజయనగరం. for Sale. ✆ 9182650432.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

PLOT FOR SALE

200 చ॥గ॥ S/F "శ్రీకృష్ణ నగర్ లే-అవుట్" JNTU జంక్షన్, VZM. 267 చ.గ. N/F "భాస్కర్ నగర్" తాటిగూడ గ్రామం, గరివిడి అమ్మబడును. ✆ 8802889988, 9542031332.

TO LET

COMMERCIAL

Ground floor 3600 Sft building near MR College suitable for clinics, Hospitals and Office spaces Ph:9000773333.

JOBS

Walk in interview 25-11-25 10:30 AM to 4:00 PM 1. Accountant, 2. Computer Operator, 3. Office Assistant 4. Receptionist Candidates with fluency in English &Min 3 yrs Exp. Joshi Chambers G.K. Towers 3rd floor Dwarakanagar. Ct: 0891-2541137.

కావలెను
ఆఫీసు అకౌంటెంట్ (మహిళ): B.Com పాస్ అయ్యి అనుభవం గల రాజాం పరిసర ప్రాంత స్థానిక మహిళ కావలెను.
జీతం: 15000 నుండి 20,000 వరకు సంప్రదించండి:
K.R.K. BUILDERS & DEVELOPERS శ్రీవారి టౌన్‌షిప్ సారధి రోడ్, రాజాం సెల్: 9666151133, 9440706846

Vision buzz కంపెనీలో డోర్ టూ డోర్ మార్కెటింగ్ చేయడానికి యువతి యువకులు స్టాఫ్ కావలెను. డైలీ Payment ఇవ్వబడును. ✆ 9550109729.

VZM 90రోజులు ఉచితంగా కంప్యూటర్ కోర్సు & ఎలక్ట్రానిక్స్ & హార్డ్‌వేర్ సెక్టార్‌లో ట్రైనింగ్‌తోపాటు, ఉద్యోగం కల్పించబడును. SSC (Pass), Inter, డిగ్రీ, ITI (పాస్/ఫెయిల్) Age: 18to35 ✆ 8919050156, 9493359472.

ప్రైవేట్ బ్యాంకుల్లో పనిచేయుటకు టెలికాలర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, అటెండర్స్, రికార్డ్ అసిస్టెంట్, సెక్యూరిటీ, క్యాషియర్స్ కావలెను. Qlf: 10th- డిగ్రీ, MBA, జీతం: 18K-28K. ✆ 9121044796, 9573635594.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

వరిగడ్డికి నిప్పు.. నేలకు ముప్పు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే

జిల్లాలో రైతుల ప్రధాన ఆహార పంట వరి. పంటను నూర్పిడి చేసినప్పుడు లక్షల టన్నుల వరి పొట్టు, తవుడు, బియ్యం వస్తున్నాయి. వీటి నుంచి ఉప ఉత్పత్తులు తయారుచేసి నికరాదాయం పొందుతున్నారు. పంట కోత, నూర్పిడి అనంతరం చాలా వరకు గడ్డికి నిప్పంటిస్తున్నారు. దీనివల్ల నేలకు ముప్పు వాటిల్లుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వరి పంట అవశేషాల సమర్థ యాజమాన్యంపై వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.తేజేశ్వరరావు వివరించారు.

యాజమాన్యంతో ప్రయోజనం

ఉమ్మడి జిల్లాలో సుమారు 1.60 లక్షల హెక్టార్లలో వరి సాగవుతోంది. ఏడాదికి సుమారు 19 లక్షల మెట్రిక్ టన్నుల గడ్డి వస్తుంది. దీన్ని తగలబెట్టకుండా యూరియాతో మాగబెట్టి పోషక విలువలు పెంచి పశువుల మేతగా వాడుకోవచ్చు. పంట అవశేషాలను ప్రధానంగా పశువుల మేతగా, నేలపై మాల్చ్‌గా, బయోగ్యాస్, జీవన ఎరువు ఉత్పత్తికి, గృహాలకు పైకప్పుగా, పుట్టగొడుగుల పెంపకానికి, గృహ, పారిశ్రామిక అవసరాలకు ఇంధనంగా ఉపయోగించవచ్చు.

దుష్ఫలి తాలివీ..

కూలీల కొరత, యంత్రాలతో కోతలు, ఖర్చుల కారణంగా పంట అవశేషాలను పొలంలో కాల్చివేస్తున్నారు. తద్వారా మానవాళికి ఊపిరితిత్తుల సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. గాలి కలుషితం అవుతోంది. ● టన్ను గడ్డిని కాల్చడం వల్ల నేల 5.5 కిలోల నత్రజని, 2.3 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాషియం, 1.2 కిలోల సల్ఫర్‌తో పాటు సేంద్రియ కర్బనాన్ని కోల్పోతుంది. పంట అవశేషాలను నేలలో చేర్చినట్లయితే నేలకు సేంద్రియ కర్బనం, నత్రజని అంది సారవంతమవుతుంది. ఇది పంట వేరు వృద్ధికి దోహద పడుతుంది. ● మండే అవశేషాల నుంచి వచ్చే వేడి వల్ల నేల ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. దీంతో నేలలో ప్రయోజనకర సూక్ష్మజీవులు మరణిస్తాయి. ● పంట వేరు వృద్ధి జరగదు. మీథేన్, బొగ్గు పులుసు, నైట్రస్ ఆక్సైడ్ వాయువులు వాతావరణంలోకి విడుదలై విషప్రభావం చూపుతాయి. కాలిన వ్యర్థాల వల్ల ఏర్పడిన బూడిదలో ఉన్న పొటాషియం పంటలకు పెద్దగా ఉపయోగపడదు. వరి, చెరకు, మొక్కజొన్న, అపరాలు, నువ్వుల పంటల నుంచి వచ్చే వ్యర్థాలను వినియోగించుకుని సేంద్రియ ఎరువుగా మలచుకుంటే దిగుబడి పెరుగుతుంది.

- డాక్టర్ తేజేశ్వరరావు, శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం

రైతేరాజు

రక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

డా.కె.లక్ష్మణ్, విజయనగరం జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: రబీలో వేసుకోదగ్గ అపరాల పంటల సాగులో తెగుళ్ల నివారణకు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో చీడపీడల నుంచి పంటను కాపాడుకుని అధిక దిగుబడులు సాధించొచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా.కె.లక్ష్మణ్ తెలిపారు.

ప్రశ్న: రబీలో అపరాల్లో ఏఏ రకాలను సాగు చేసుకోవాలి?

- మిత్తిరెడ్డి రాము, సారధి గ్రామం

సమాధానం: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లాంఫామ్ నుంచి విడుదలైన ఎల్బీజీ 884, ఎల్బీజీ 904, టీబీజీ 104 వంటి రకాలు పల్లాకు తెగులును పూర్తిగా తట్టుకొని అధిక దిగుబడిని ఇస్తాయి.

ప్రశ్న: వంగ పంటలో తొలిదశలో ఆకుల్ని కన్నం చేస్తుంది. అదేవిధంగా తామర పురుగులు వ్యాపించాయి.

-రావు రవీంద్ర, సీతారాంపురం

సమాధానం: వంగ పంటలో తొలిదశలో రసం పీల్చే పురుగులైన తామర, తెల్లదోమ వ్యాపిస్తుంది. ఇవి రసం పీల్చడం వల్ల ఆకులు ముడతలు పడడం గమనిస్తాం. చిత్తపురుగులు వంటి లార్వా కూడా మొక్కలకు రంధ్రాలు చేస్తాయి. వీటి నివారణకు తొలిదశలో వేపనూనె 5 మిల్లీలీటర్లు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

రబీలో చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడులిచ్చే ఎలాంటి కూరగాయ పంటలు వేసుకోవచ్చు. జీడి, మామిడిలో పూతకు ముందు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు వంటి సలహాల కోసం 87908 28484 నంబరును సంప్రదించాలని రస్తాకుంటుబాయి కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డా.ఎస్.శ్రీనివాసరాజు తెలిపారు.

దోమల నుంచి పశువుల సంరక్షణ

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: పశువుల్లో దోమల కాటువల్ల ఫైలేరియాసిస్ వ్యాధి సోకితే మరణించే పరిస్థితులు ఏర్పడతాయని కురుపాం పశుసంవర్ధక వైద్యురాలు శైలజ పేర్కొన్నారు. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను ఆమె వివరించారు..

లక్షణాలు...: ★ ఈ వ్యాధి సోకిన పశువుల్లో జ్వరం 104-106 డిగ్రీలు ఉంటుంది. ★ కొన్ని పశువుల్లో జ్వరం లేకపోయినా లక్షణాలు కనిపిస్తాయి. ★ ఎంత మేత తిన్నా బక్కచిక్కిపోతాయి. ★ వ్యాధి లక్షణాలు ముదిరిపోతే పశువు తనచుట్టూ తాను తిరగడం, తలను గోడకు పొడవడం చేస్తుంది. ఇది పొదుగు వాపునకు కారణమవుతుంది.

నిర్ధారణ...: ★ రక్త నమూనా పరీక్ష చేస్తే ఏలిక పాముల మాదిరిగా కదులుతున్న ఫైలేరియా క్రిములు ఉంటే వ్యాధి నిర్ధారణ చేసుకోవచ్చు.

నివారణ...: ★ పశువుల కొట్టాలు పరిశుభ్రంగా ఉంచాలి. ★ పేడ ఎప్పటికప్పుడు తీసేసి శుభ్రం చేసుకోవాలి. ★ పశువుల పాకలకు దూరంగా పెంట కుప్పలు ఉంచాలి.

తెల్లసుడిని వెళ్లగొట్టండిలా..

ఇటీవల జామ సాగులో తెల్లసుడిదోమ ఉద్ధృతి ఎక్కువగా ఉందని ఉద్యానశాఖాధికారిణి గిరిజ తెలిపారు. తెల్లదోమలు ఆకుల అడుగు భాగంలో వలయాకారంలో గుడ్లు పెడతాయి. తెల్లని దూది వంటి మెత్తని పదార్థంతో కప్పి రసాన్ని పీలుస్తాయి. ఆకులు ఎర్రబడి రాలిపోతాయి. క్రమంగా కాయను కూడా ఆశించి నష్టాన్ని కలిగిస్తాయి. నవంబరులో ముదురు ఆకులను ఆశించి ఏప్రిల్‌లో చిగురుటాకులను చేరతాయి. ఆకులపై దోమ విసర్జించిన తేనె వంటి జిగురు పదార్థంపై మసి తెగులు ఆశిస్తుంది. గుర్తించిన వెంటనే కొమ్మలను కత్తిరించి లీటరు నీటిలో 5 మి.లీ. వేప నూనె కలిపి పిచికారీ చేసి నివారించొచ్చు. రాత్రి సమయంలో జిగురు పూసిన పసుపు రంగు డబ్బాలు లేదా జిగురు అట్టలను తెల్ల దోమ ఆశించిన మొక్కల వద్ద ఉంచాలి. - న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

గ్యారెంటీ ఉందా?

న్యూస్‌టుడే, పార్వతీపురం

వాతావరణం మారుతుందనే ఆందోళనతో బస్తాల్లోకి ధాన్యం నింపుతున్న రైతులు

● రూ.300 కోట్లకు నాల్గో వంతూ కాని జమ

● ధాన్యం సేకరణపై అన్నదాతల ఆందోళన

ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించి వారం రోజులైనా.. మిల్లర్లు బ్యాంకులకు గ్యారెంటీ ఇంకా సమర్పించకపోవడంతో ధాన్యం బస్తాలు రైతుల కళ్లాల్లోనే మూలుగుతున్నాయి. అక్టోబరు చివరి వారంలో వర్షాలు కురవడంతో ఇబ్బందులు ఎదురవుతాయేమోననే అనుమానంతో అన్నదాతలు యంత్రాలు పెట్టి మరీ నూర్పులు పూర్తిచేశారు. జిల్లాలో దాదాపు అన్నిచోట్లా కొనుగోలు లాంఛనంగా ప్రారంభమైనా, బ్యాంకు హామీలకు మిల్లర్లు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

హామీ కొండంత.. వచ్చింది గోరంత

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు లక్ష్యంగా తీసుకున్న 2.50 లక్షల మెట్రిక్ టన్నుల విలువ రూ.600 కోట్లు ఉంటుంది. ఇందులో 50 శాతం బ్యాంకు గ్యారెంటీగా మిల్లర్లు ఇవ్వాలి. ప్రస్తుతానికి అందులో దాదాపు నాల్గో వంతు కూడా జమకాని పరిస్థితి. జిల్లాలో 104 మిల్లులు ఈ ఏడాది కస్టమ్ మిల్లింగ్‌కు సిద్ధంగా ఉన్నాయి. హామీలిచ్చేందుకు వెనకడుగు వేస్తున్నాయి. ఫలితంగా మిల్లులకు ధాన్యాన్ని పంపించే ప్రక్రియ మొదలు కాలేదు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు వస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సంచులు సర్దుబాటు చేయాలి

చాలాచోట్ల ఇంకా సంచులు సర్దుబాటు కాలేదు. జిల్లాకు 50 లక్షలు వరకు ఇవి అవసరమని గుర్తించారు. మిల్లర్లు వీటిని సరఫరా చేస్తారని అధికారులు చెబుతున్నారు. వారి దగ్గర 11 లక్షలు వరకు ఉన్నాయని తేల్చారు. ప్లాస్టిక్ సంచులు కావడంతో ఏడాదిగా నిల్వ ఉంచడంతో ధాన్యం వేస్తే చిరిగిపోయే ప్రమాదముందని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నంతలో సొంతంగానే సంచులు సిద్ధం చేసుకోవాలని యోచిస్తున్నారు. కొమరాడ మండలంలో కొన్ని రైతు సేవా కేంద్రాలకు పదివేల వరకు సంచులు అందజేశారు. మరికొన్ని కేంద్రాల వద్ద సంచులే లేవు.

రైతులకు ఇబ్బందులు రానీయం

ఇటీవల శుభదినాలు కాకపోవడంతో చాలా మంది బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వలేదు. త్వరలో పూర్తిస్థాయిలో అందరూ హామీలు సమర్పిస్తారు. కొమరాడ మండలంలో కొత్తగా ఏర్పాటుచేసిన మిల్లు గ్యారెంటీ ఇచ్చింది. రైతులు అక్కడకు తరలించుకొనే వీలుంది. సంచులు రైతులే సమకూర్చుకొనేలా ముందుకొస్తున్నారు. వారికే చెల్లింపులు కూడా చేస్తాం. రెండ్రోజుల్లో జిల్లా అంతటా ధాన్యం మిల్లులకు చేరే పరిస్థితి ఉంది.

- శ్రీనివాస్, జిల్లా ప్రబంధకుడు, పౌరసరఫరాల సంస్థ, పార్వతీపురం మన్యం

వైటీసీలో ఉచిత శిక్షణ

సీతంపేట: వైటీసీలోని స్కిల్ కళాశాలలో ఉచిత కంప్యూటర్, ఆంగ్లంలో శిక్షణ, ప్లేస్‌మెంట్ కల్పించేందుకుగానూ 4 నెలల ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంబంధిత ఇన్‌ఛార్జి జె.రవికుమార్ తెలిపారు. ఉచిత భోజన, వసతి సదుపాయం, శిక్షణ తర్వాత ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఇంటర్, డిగ్రీ, ఆపై చదువులు చదివిన యువతీ, యువకులు ధ్రువపత్రాలతో వచ్చే నెల ఒకటో తేదీన వైటీసీకి హాజరు కావాలన్నారు. టూరిజం అండ్ హాస్పిటాలిటీ ఐటీ-ఐటీఈఎస్(సాఫ్ట్‌వేర్)పై శిక్షణ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 63034 64426, 95427 78064 నంబర్లను సంప్రదించాలన్నారు.

చెత్త కనిపిస్తే ఉద్యోగి ఇంటికే..

పార్వతీపురం, న్యూస్‌టుడే: డిసెంబరు ఒకటో తేదీ తర్వాత గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడ చెత్త కనిపించినా ఉపేక్షించేది లేదని కలెక్టరు ప్రభాకరరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం వివిధ కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పట్టణాల్లో పుర కమిషనర్లు, గ్రామీణ ప్రాంతంలో ఎంపీడీవోలు బాధ్యత వహించాలన్నారు. చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సీతంపేట ప్రాంతంలో మలేరియా కేసులు నమోదు నేపథ్యంలో నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్‌కలెక్టర్లు జగన్నాథ్, వైశాలి, డీఆర్వో పాల్గొన్నారు.

కథలతో సామాజిక బాధ్యత తెలపాలి

పోటీల్లో విజేతలను సన్మానిస్తున్న సంస్థల ప్రతినిధులు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: భావితరాలకు సామాజిక బాధ్యత తెలిపే చరిత్ర కథలు అందించాలని ప్రముఖ రచయిత జయంతి ప్రకాష్‌శర్మ అన్నారు. సోమవారం రాత్రి గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జిల్లా రచయితల సంఘం, విశాఖ సంస్కృతి సమితి ఆధ్వర్యంలో బెహరా వెంకటసుబ్బారావు స్మారక జాతీయ కథల పోటీ-2025 విజేతలకు బహుమతి ప్రదానం చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన శర్మ మాట్లాడుతూ మనిషి మనుగడకు సహజత్వంతో కూడిన రచనలను రచయితలు అందించాలన్నారు. విజేతలను సత్కరించి, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో రచయితలు రఘునందన్, భోగారావు, సత్యనారాయణమూర్తి, వెంకటసుబ్బారావు, శ్రీనివాస్, సన్యాసిరావు, ఈశ్వరరావు, నాలుగెస్సుల రాజు, పద్మ పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

సావిత్రి (పాత చిత్రం)

రాజాం, న్యూస్‌టుడే: మనస్తాపంతో ఉరివేసుకుని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాజాం పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ కె.అశోక్‌కుమార్ చెప్పిన వివరాల ప్రకారం.. భామిని మండలం బాలేరు గ్రామానికి చెందిన ఉర్లాపు సావిత్రి (44)కి శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం పారాపురం గ్రామానికి చెందిన గణపతితో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో పాలకొండలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్న మన్మథకుమార్ రుణం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి సావిత్రిని వలలో వేసుకున్నాడు. దీంతో భర్తతో మనస్పర్ధలు వచ్చి దూరమైంది. రాజాం సారథి రోడ్డులోని ఓ అద్దె ఇంట్లో ఉంటూ.. పట్టణంలోని ఓ వస్త్రదుకాణంలో పనికి చేరింది. ఈ క్రమంలో మన్మథకుమార్ శారీరకంగా వేధించడం మొదలుపెట్టాడు. ఆదివారం రాత్రి దుకాణం నుంచి ఏడుస్తూ.. చరవాణిలో మాట్లాడుతూ ఇంటికి వచ్చింది. కుమార్తెను అమ్మమ్మ వద్దకు వెళ్లాలని చెప్పి, గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది. ఎంతకీ బయటకు రాకపోవడంతో చిన్నారి కిటికీలోంచి చూసి భీతిల్లిపోయింది. ఇంట్లోని పంకాకు ఉరివేసుకుని కనిపించడంతో బయటకు వెళ్లి కేకలు వేసింది. అందరూ వచ్చేసరికి ప్రాణం పోయింది. సీఐ కె.అశోక్‌కుమార్, ఎస్సై వై.రవికిరణ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

అత్యాచారం కేసులో 12 ఏళ్లు జైలు

గరివిడి, న్యూస్‌టుడే: అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి 12 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ జిల్లా మహిళా కోర్టు సోమవారం తీర్పు వెల్లడించింది. ఎస్పీ దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం... గరివిడి మండలంలోని బొండపల్లిలో 2019లో ఓ మహిళపై నిందితుడు సవిరిగాన సూర్యనారాయణ(45) అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గరివిడి ఎస్సై కృష్ణప్రసాద్ అత్యాచార కేసు నమోదు చేశారు. దర్యాప్తులో నేరం రుజువు కావడంతో జిల్లా మహిళా కోర్టు న్యాయమూర్తి ఎన్.పద్మావతి నిందితుడికి 12 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసు విచారణలో సమర్థంగా పనిచేసిన చీపురుపల్లి సీఐ శంకరరావు, గరివిడి ఎస్సై లోకేశ్వరరావును ఎస్పీ అభినందించారు.

శిఖరమంత వేడుక!

మెంటాడ, న్యూస్‌టుడే: పైడితల్లి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు మండలంలోని పిట్టాడ గ్రామంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తొలి రోజు శిఖరం ఊరేగింపు, గణపతిపూజ, యాగశాల ప్రవేశం క్రతువు వేడుకగా నిర్వహించారు. శిఖర ఊరేగింపునకు భారీగా భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా మహిళల కోలాటం ఆకట్టుకుంది. 25న కుంకుమపూజ, ధాన్యాధివాసం, 26న ప్రతిష్ఠ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

యువతా.. సాయుధ దళాల్లోకి రండి

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ) 77వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఆనందగజపతి కళాక్షేత్రంలో నిర్వహించారు. రెండో ఆంధ్రా బాలికల బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యువత సాయుధ దళాలవైపునకు రావాలని, ఎన్‌సీసీ ద్వారా ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని వక్తలు మాన్సాస్ కరస్పాండెంట్ డా.కె.వి.ఎల్.రాజు, బెటాలియన్ కమాండెంట్ కల్నల్ గోపేంద్ర, ప్రముఖ సామాజికవేత్త కవితా భండారీ పిలుపునిచ్చారు. విజయనగరం, విశాఖపట్నం జిల్లాల ఎన్‌సీసీ క్యాడెట్లు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాడెట్ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? ఎం.బూర్జవలసలో ఇంటింటి కుళాయిల ద్వారా నీరు రావడంలేదు. - స్థానికులు ★ పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. - విశ్వతేజ, ఏఈ - న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

? పోరాం గ్రామంలో ఉన్నత పాఠశాలకు సమీపంలో వ్యర్థాలు వేస్తున్నారు. - రామునాయుడు ★ వ్యర్థాలు తొలగింపజేస్తాం. -ప్రసాద్, కార్యదర్శి - మెంటాడ

? రాజాం పట్టణం నుంచి సారధి వెళ్లే దారిలో బడి రుల పాఠశాల వద్ద కాలువలో వ్యర్థాలు నిండి ఉన్నాయి. - స్థానికులు ★ చెత్త తొలగించేందుకు చర్యలు చేపడతాం. - ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ - న్యూస్‌టుడే, రాజాం పట్టణం

ధాన్యం తరలింపు

ప్రకృతికి వందనం

గజపతినగరం, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో.. మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీలు ఇవ్వకపోవడంతో పొలాల్లోనే ధాన్యం బస్తాలు ఉండిపోయాయి. దీనిపై సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మరుపల్లి, మదుపాడ, పురిటిపెంట, గంగచోళ్లపెంట, కొనిశ తదితర గ్రామాలతో పాటు మెంటాడ మండలంలో ధాన్యం నిల్వలు కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్లు రత్నకుమార్, అరుణకుమారి తెలిపారు.

రైతులు దళారుల బారిన పడొద్దు

బొబ్బిలి, న్యూస్‌టుడే: రైతులు దళారుల బారిన పడొద్దని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. సోమవారం పక్కిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని, 24 గంటల్లోనే నగదు జమవుతుందన్నారు. నాయకులు అల్లాడ భాస్కరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ★ అన్ని పీహెచ్‌సీలకు మందులు కొనుగోలు చేసి, పంపిణీ చేస్తామని పక్కి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే అన్నారు.

బొబ్బిలి

•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో సోమవారం కూరగాయల ధరలు (కిలో రూ.ల్లో) ★ టమాట: 60 ★ వంకాయలు: 60 ★ దొండ: 50 ★ బీర: 50 ★ బెండ: 60 ★ కాకర: 60 ★ చిక్కుడు: 50 ★ ఆనపకాయ (ఒకటి): 30 ★ అరటి (డజను): 20 ★ మునగ: 70 ★ ఉల్లి: 32 ★ బంగాళదుంప: 28 ★ అల్లం: 80 ★ వెల్లుల్లి: 80 ★ పచ్చిమిర్చి: 60 ★ క్యాబేజీ: 40 - న్యూస్‌టుడే, రాజాం

తెరపై ఈనాడు

★ ఎస్వీసీ సీతారామా: 12 ఏ రైల్వేకాలనీ ఎస్వీసీ సీతారామా మినీ: కొదమ సింహం, పాంచ్‌మినార్ ★ ఎస్వీసీ అప్సర: ప్రేమంటే - న్యూస్‌టుడే, రాజాం బొబ్బిలిలో.. ★ లక్ష్మీ: [illegible] ★ వాసవి: రాజా వెడ్స్ రాంబాయి ★ టీబీఆర్ స్క్రీన్-1: 12 ఏ రైల్వే కాలనీ ★ టీబీఆర్ స్క్రీన్-2: ప్రేమంటే - న్యూస్‌టుడే, బొబ్బిలి

పురపాలిక.. అభివృద్ధి నత్తనడక

న్యూస్‌టుడే - బొబ్బిలి

బొబ్బిలి పురపాలక పరిధిలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం, ఎంపీ ల్యాడ్స్, సాధారణ నిధులు సుమారు రూ.3.50 కోట్లతో టెండర్లు పిలిచినా.. 50 శాతం పనులు కూడా పూర్తికాలేదు. సాంకేతిక కారణాలు, ఇంజినీర్లు, గుత్తేదారుల మధ్య సమన్వయ లోపంతో, సకాలంలో బిల్లుల చెల్లింపులు లేనందున తదితర కారణాలతో పనులు పడకేస్తున్నాయి.

రాపాక నుంచే ఎందుకు?

రహదారులు, కాలువలు తదితర అభివృద్ధి పనులు చేసేందుకు మెటల్ గుమటాలు గుర్తించిన క్వారీ నుంచి మాత్రమే తీసుకురావాలి. శ్రీకాకుళం జిల్లా రాపాక నుంచి తెప్పించేందుకు గత ప్రభుత్వ హయాంలో అనుమతులు ఇచ్చారు. బొబ్బిలికి రాపాక సుమారు 60 కి.మీ.ల దూరంలో ఉంది. అక్కడి నుంచి వచ్చేసరికి ఒక లారీకి రూ.10 నుంచి రూ.12 వేలు ఖర్చవుతోంది. సమీపంలోని రామభద్రపురం మండలం చందాపురం, సాలూరు మండలం బొడ్డవలస, సీతానగరం మండలం మిరిదివలస ప్రాంతాల్లో క్వారీలు ఉన్నాయి. అంత దూరం నుంచి ఎందుకు తెస్తున్నారని విషయంపై ప్రశ్నలు రేకెత్తున్నాయి. దీంతో రాపాక నుంచి తెచ్చేందుకు ఇంజినీర్లు అనుమతులు నిలుపుదల చేశారు. సమీప క్వారీల నుంచి తెచ్చేందుకు అనుమతులు ఇవ్వలేదు. ఈ ప్రభావం అభివృద్ధి పనులపై పడింది.

గొల్లవీధిలో కాలువ పనుల తీరిది..

మార్చి నాటికి పూర్తయ్యేనా?

15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనులు మార్చి నాటికి పూర్తి చేయాల్సి ఉంది. మొదటి విడత నిధులు రూ.3 లక్షలతో అయిదో వార్డు మీగడవీధిలో డ్రైన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.2.25 లక్షలు దాసాలవీధిలో.. రూ.1.60 లక్షలు పదో వార్డులో.. రూ.6 లక్షలు అల్లారాజువీధిలో కాలువల నిర్మాణాలు చేయాల్సి ఉంది. కానీ పనులు జరగడంలేదు. ఇప్పటివరకు 50 శాతం కూడా పూర్తికాలేదు. రెండోవిడత నిధులు 23 పనులకు కేటాయించారు. అన్నీ టెండరు దశలోనే ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం..

టెండర్లు పూర్తయిన పనులు త్వరితగతిన ప్రారంభించాలని గుత్తేదారులకు ఆదేశించాం. మరికొన్నింటికి టెండర్లు పిలిచాం. వాటిని కూడా ప్రారంభిస్తాం. సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. మెటల్ రాపాక నుంచి తీసుకురావడంతో కొన్ని ఇబ్బందులు ఉత్పన్నమవుతూ వచ్చాయి. సమీపంలో గుర్తింపు ఉన్న క్వారీల నుంచి తెచ్చేందుకు గనుల శాఖ అధికారులకు లేఖ రాశాం. - ఎల్.రామలక్ష్మి, పుర కమిషనర్, బొబ్బిలి

జోడుబందర.. సమస్యల జాతర

జోడుబందర (రేగిడి), న్యూస్‌టుడే: రేగిడి మండలం సరసనాపల్లి పంచాయతీ జోడుబందరలో ప్రజలు సమస్యలతో సావాసం చేస్తున్నారు. సక్రమంగా తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుళాయిలు అలంకారప్రాయంగా ఉన్నాయి. పక్కనే ఉన్న కందిశ గ్రామం వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి. పాఠశాల సమీపంలోని బోరు మరమ్మతులకు గురైనా ఇంతవరకు బాగుచేయలేదు. శ్మశానానికి రహదారి లేదు. బూరాడ- మద్దువలస ప్రధాన రోడ్డు నుంచి గ్రామానికి సుమారు 600 మీటర్ల దూరం మట్టి దారి బురదమయంగా మారుతోంది. రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రెండు నెలల క్రితం శంకుస్థాపన చేసినా.. పనుల్లో కదలిక లేదు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో కొత్తది నిర్మించారు. ఇంతవరకు రంగులు వేయలేదు. వీధి కాలువల్లో మురుగు తొలగించడంలేదు. చెత్త సేకరణ సక్రమంగా జరగడంలేదు. గ్రామంలో అంగన్‌వాడీ శాశ్వత భవనం లేదు. పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో శ్యామలాకుమారి అన్నారు.

గ్రామంలో వీధి కాలువ దుస్థితి..

రాజాం: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

బొబ్బిలి: బహుమతులు, ప్రశంసాపత్రాలతో విజేతలు

ఉపన్యాసం.. అనర్గళం

రాజాం పట్టణంలోని డోలపేట ఉన్నత పాఠశాల, బొబ్బిలి పట్టణంలోని సాయినగర్ చైతన్య విద్యానికేతన్‌లో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో "ప్రతిభా పాటవ పోటీలు" జరిగాయి. 'విద్యార్థుల జీవితంపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు అనర్గళంగా మాట్లాడారు. రాజాంలో పి.హరిప్రియ (10వ తరగతి), వి.ఆషిని (9వ తరగతి), బి.మనీషా (10వ తరగతి).. బొబ్బిలిలో బంకురు దీక్షిత (10వ తరగతి), యాసరపు ప్రణతి (10వ తరగతి), పి.షర్మిల (9వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. డోలపేటలో హెచ్ఎం ఆర్‌వీజీఎస్ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు ఇ.మురళీకృష్ణ, బి.రామకృష్ణ, ఎస్.ప్రసాద్, యు.శాంతికుమారి, జి.సుజాత, సునీతా జోషఫ్.. బొబ్బిలిలో హెచ్ఎం పద్మ, పాఠశాల సమన్వయకర్త గౌరీశంకర్, ఉపాధ్యాయులు గణపతి, అనురాధ, అపర్ణ విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. - న్యూస్‌టుడే, రాజాం, బొబ్బిలి

ప్రసంగించారు.. ప్రశంస పొందారు

గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో "ప్రతిభా పాటవ పోటీలు" జరిగాయి. "కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు" అనే అంశంపై జరిగిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్.శ్రావణి (ద్వితీయ ఏడాది), బి.లావణ్య (ద్వితీయ ఏడాది), ఎం.మైత్రీ పద్మజ (ద్వితీయ ఏడాది) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. కళాశాల ప్రధానాచార్యుడు పీవీఎల్ఎన్ ప్రకాశ్‌రావు పట్నాయక్ విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అధ్యాపకులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, గజపతినగరం

రహదారి పనులకు శంకుస్థాపన

బొబ్బిలి, న్యూస్‌టుడే: రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. చింతాడపాలెం- రామభద్రపురం- రాయగడ ప్రధాన రహదారి పరిధిలో ఉత్తరావల్లి కూడలి నుంచి బొబ్బిలి వరకు మరమ్మతుల పనులకు సోమవారం గొల్లపల్లితారాపురం వద్ద శంకుస్థాపన చేశారు. ఈ పనులకు ప్రభుత్వం రూ.4.50 కోట్లు మంజూరు చేసిందన్నారు. బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, తెదేపా నాయకులు చింతల రామకృష్ణ, అల్లాడ భాస్కరరావు, రాంబార్కి శరత్‌బాబు పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఉపాధ్యాయుడికి పురస్కారం.. రాజాం గ్రామీణం: సంతకవిటి మండలం మామిడిపల్లి ఉన్నత పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు గడే అప్పలనాయుడు జిల్లాస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ఆదివారం డీఈవో మాణిక్యంనాయుడు అవార్డు అందజేశారన్నారు.

అంగన్‌వాడీ నిర్మాణం.. అసంపూర్ణం

రేగిడి మండలం తునివాడలో అంగన్‌వాడీ నిర్మాణం ఏడేళ్లుగా అసంపూర్తిగా ఉంది. చిన్నారులు, నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని రెండు కేంద్రాలకూ సొంత భవనాలు లేవు. నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడంతో పనికిరాని మొక్కలు పెరిగి, విషసర్పాలు పాఠశాలలోకి వస్తున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనం పూర్తిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. సమస్యను ఎంపీడీవో శ్యామలాకుమారి వద్ద పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. - న్యూస్‌టుడే, రేగిడి

పాఠశాలకు రక్షణ కరవు..!

గుర్ల మండలం గుజ్జంగివలస ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలోని విలువైన కంప్యూటర్లు, వాటర్‌ప్లాంట్ తదితర సామగ్రికి రక్షణ కరవైంది. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోంది. ఇక్కడ 163 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతంలో కొంతవరకు ప్రహరీ నిర్మాణం చేపట్టారు. స్థలం తమదని కొందరు అభ్యంతరం తెలపడంతో పనులు నిలిచిపోయాయి. విషయం ఎంఈవో భానుప్రకాష్ వద్ద ప్రస్తావించగా.. స్థానికులు అంగీకరిస్తేనే సమస్య పరిష్కారమవుతుందన్నారు. - న్యూస్‌టుడే, గుర్ల

మధ్యాహ్న భోజనం వండేదెలా?

రామభద్రపురం ఉన్నత పాఠశాలలో వంటశాల శిథిలావస్థకు చేరడంతో ఆరుబయట వంటలు చేస్తూ.. నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో 700 మంది విద్యార్థులు చదువుతున్నారు. కారేడువలస, రొంపల్లి, వంగపండువలస, తారాపురం, మూలసెలగాం, రావివలస, ఎనుబొరువు, చందాపురం, జమ్మువలస, చింతవలస, జగన్నాథపురం, రొంపల్లివలస పాఠశాలల్లోనూ ఇదే దుస్థితి. విషయం ఎంఈవో తిరుమల ప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. - న్యూస్‌టుడే, రామభద్రపురం

దారిలా.. వెళ్లేదెలా..?

రాజాం పురపాలిక పరిధిలోని తిమ్మయ్యపేట గ్రామానికి సరైన రహదారి లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. రాజాం- చీపురుపల్లి రహదారి నుంచి గ్రామానికి వెళ్లే దారిలో కల్వర్టు కూలిపోవడంతో స్థానికులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. నిత్యం వందలాది మంది పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. గ్రామాన్ని సందర్శించి, పరిశీలిస్తామని కమిషనర్ రామచంద్రరావు అన్నారు. - న్యూస్‌టుడే, రాజాం పట్టణం

రైతుల సంక్షేమమే ధ్యేయం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కళా వెంకటరావు అన్నారు. సోమవారం చీపురుపల్లి మండలం మెట్టపల్లిలో 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ● **మెంటాడ, బాడంగి, రామభద్రపురం, గజపతినగరం, దత్తిరాజేరు:** తెదేపా మెంటాడ మండలాధ్యక్షుడు సీహెచ్ వెంకటరావు జి.టి.పేటలో, ఆర్డీవో రామ్మోహన్‌రావు బాడంగి, ముగడ గ్రామాల్లో, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీహెచ్.రామకృష్ణ రామభద్రపురంలో మాట్లాడారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం.. గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతులకు మద్దతు ధర లభిస్తోందని గంట్యాడ తెదేపా మండలాధ్యక్షుడు కొండపల్లి భాస్కరరావు అన్నారు. సోమవారం నరవ, గంట్యాడ గ్రామాల్లో ఎంపీడీవో రమణమూర్తితో కలిసి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. రైతులు దళారుల బారిన పడొద్దన్నారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక.. బొబ్బిలి: ఎస్ఎఫ్ఐ బొబ్బిలి మండల శాఖ నూతన కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా తేజ, కార్యదర్శిగా కిరణ్, ఉపాధ్యక్షుడిగా మహేష్, సహాయ కార్యదర్శిగా జాన్ ఎన్నికయ్యారు. విద్యారంగంలోని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు.

ఉనుకూరు.. అధికారులు పట్టించుకోరు

ఉనుకూరు (రేగిడి), న్యూస్‌టుడే: రేగిడి మండలం ఉనుకూరు ఒకప్పటి నియోజకవర్గ కేంద్రం. గ్రామం మధ్యలోంచి వంగర- మడ్డువలస ప్రధాన రహదారి ఉంది. నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. రోడ్డు గోతులమయమైంది. వర్షం పడితే గోతుల్లో నీరుచేరి దారుణంగా తయారవుతుంది. గ్రామంలో తాగునీటి సమస్య వేధిస్తోంది. రక్షితనీటి పథకం ట్యాంక్, ఇంటింటి కుళాయిలు ఉన్నా.. పలు వీధులకు నీరు అందడం లేదు. పాఠశాలలో వంటశాల నిర్మించలేదు. ప్రధాన వీధిలో మురుగు కాలువలు లేవు. రహదారిపైకి మురుగు చేరుతోంది. సచివాలయం నిర్మాణం పూర్తికాక పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో శ్యామలాకుమారి అన్నారు.

అధ్వానంగా ప్రధాన రహదారి

వంగర.. అవస్థలే నిండారా..!

వంగర, న్యూస్‌టుడే: వంగర మండల కేంద్రంలో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. భారతీయ స్టేట్ బ్యాంక్‌కు వెళ్లే దారి గుంతలతో అధ్వానంగా ఉంది. పలు గ్రామాల ప్రజలు నిత్యం బ్యాంక్ పనిమీద వస్తుంటారు. ఎస్సీ కాలనీ సమీపంలో పెద్ద నీటి మడుగులు ఉండడంతో రాత్రివేళల్లో ఇళ్లల్లోకి విషసర్పాలు వస్తున్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కాలనీ చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు. గ్రామంలో చెత్త సంపద కేంద్రం లేకపోవడంతో సేకరించిన వ్యర్థాలను ప్రధాన రహదారి పక్కన పడేసి నిప్పు పెడుతున్నారు. సచివాలయ భవన నిర్మాణం ఏళ్లుగా పునాదుల్లోనే ఉంది. చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. వేరే భవనంలో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. విషయం ఎంపీడీవో రాజారావు వద్ద ప్రస్తావించగా.. వీధుల్లో పరిశీలిస్తామని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పునాదులకు పరిమితమైన సచివాలయం నిర్మాణం

బకాయి వేతనాలు చెల్లించాలి.. బాడంగి: మధ్యాహ్న భోజన పథక కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకుడు సురేష్ డిమాండు చేశారు. ఎంపీడీవో రామకృష్ణకు వినతిపత్రం అందించారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), బొబ్బిలి వారి కోర్టులో
SOP 8/2025
Between:
1) లోచర్ల బాలకృష్ణ,
2) చిలుకూరి అమ్మాజీ,
3) శ్రీపాడు ఆదిలక్ష్మి,
4) లోచర్ల రాజేశ్వరి,
5) తోట ఆదివరలక్ష్మి
...వాదులు
And:
1) విజయనగరం జిల్లా కలెక్టర్ గారు
2) బొబ్బిలి మండలం తహసిల్దార్ గారు.
...ప్రతివాదులు
RESPONDENTS NOTICE
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది ఏమనగా లేటు లౌచర్ల సీతమ్మ గారి కుమారుడు మరియు కుమార్తెలు మరియు కోడలు వారసులుగా వారి వారసత్వం సర్టిఫికేట్ కొరకు వారందరూ కలిసి పై కోర్టులో దావ SOP 8/2025 ఫైల్ చేసి ఉన్నారు. సదరు విషయముపైన ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్నయెడల తేది. 11-12-2025 ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి వారి యొక్క అక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేనియెడల పరోక్షమున తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా శ్రీ కోర్టు వారి ఆర్డరుతో తెలియజేయడమైనది.
జొన్నలగడ్డ మోహన్ రావు
వుండవల్లి బ్రహ్మ రత్నాకర్ చౌదరి
బురిడీ శివప్రసాద్
న్యాయవాదులు - విశాఖపట్నం
సెల్: 9290221049 7801082715

కళాసీ సంఘ భవనం ప్రారంభం

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి మార్కెట్ యార్డు సమీపంలో నిర్మించిన పట్టణ కళాసీ సంఘం నూతన భవనాన్ని ఎమ్మెల్యే బేబీనాయన సోమవారం ప్రారంభించారు. కళాసీల సేవలు మరువలేనివని, వారికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. పుర అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, ఉపాధ్యక్షుడు చెలికాని మురళీకృష్ణారావు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు డైరెక్టర్ రౌతు రామ్మూర్తినాయుడు, పట్టణ తెదేపా అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు కళాసీ సంఘం గౌరవాధ్యక్షుడు మజ్జి జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు పిరిడి అప్పారావు, కార్యదర్శి దంతులూరి వర్మ తదితరులు పాల్గొన్నారు. బోగాది అప్పలస్వామి కార్మిక జెండాను ఆవిష్కరించారు.

జెండా ఆవిష్కరిస్తున్న కళాసీ సంఘ నేతలు

విశాఖ జిల్లా కాంగ్రెస్ పరిశీలకుడిగా నియామకం.. గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి మండలం శేరిపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత, పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి జమ్ము ఆదినారాయణను ఆ పార్టీ విశాఖపట్నం జిల్లా పరిశీలకుడిగా నియమించింది. ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ: ఇద్దరికి గాయాలు

రాజాం, న్యూస్‌టుడే: రాజాం మండలం పెనుబాక వద్ద రాజాం నుంచి చీపురుపల్లి వెళ్తున్న ఆటోను చీపురుపల్లి నుంచి రాజాం వస్తున్న లారీ సోమవారం ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న రాజాం మండలం పెనుబాక గ్రామానికి చెందిన రమణ, చీపురుపల్లి మండలం అగ్రహారానికి చెందిన వెంకటరావుకు గాయాలయ్యాయి. రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

9 మంది బైండోవర్

బొబ్బిలి: బొబ్బిలి మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న 9 మందిని బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ చిన్నంనాయుడు సోమవారం తెలిపారు. నిందితులను తహసీల్దారు శ్రీను ముందు హాజరుపర్చగా.. పూచీకత్తుపై విడుదల చేశారన్నారు.

ఇరువర్గాల కొట్లాట: కేసుల నమోదు

బాడంగి: రెండు గొర్రెల గొడవ రెండు వర్గాల మధ్య కొట్లాటకు దారితీసింది. బాడంగి మండలం కోటిపల్లిలో రెండు కుటుంబాలు సోమవారం ఒకే దగ్గర గొర్రెలు మేపారు. అవి పోట్లాడుకున్నాయి. దీంతో కాపరులు గొడవకు దిగారు. చివరకు పోలీసుస్టేషన్‌కు చేరారు. పడాల గంగులు ఫిర్యాదు మేరకు నీలబోను రాములు, మరో ఆరుగురిపై.. నీలబోను అనంత్ ఫిర్యాదు మేరకు పడాల గంగులు, మరో ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తారకేశ్వరరావు తెలిపారు.

అన్నదాత కష్టం అగ్నిపాలు

దత్తిరాజేరు: దత్తి గ్రామంలో సోమవారం అగ్నిప్రమాదం జరిగి రాపాక రాముకు చెందిన నాలుగు క్వింటాళ్ల ధాన్యం, గడ్డి కుప్ప దగ్ధమయ్యాయి. సుమారు రూ.20 వేలు నష్టం జరిగినట్లు బాధిత రైతు తెలిపారు. వరిచేను నూర్పు చేసి, భోజనం చేస్తుండగా.. గడ్డి కుప్ప నుంచి మంటలు వ్యాపించాయన్నారు. గజపతినగరం అగ్నిమాపక సిబ్బంది అదుపు చేశారు.

ఏపీవోపై చర్యలు తీసుకోవాలి

వంగర: వంగర ఉపాధిహామీ ఏపీవో సత్యవతి సమయపాలన పాటించడంలేదని, నీలయ్యవలస, సీతారాంపురం, శివ్వాం తదితర గ్రామాల్లో పనులు జరగడంలేదని శివ్వాం పీఏసీఎస్ అధ్యక్షుడు బెజ్జిపురం రవికుమార్ తదితరులు ఆరోపించారు. సమస్యలు తెలియజేయడానికి సోమవారం మండల పరిషత్తు కార్యాలయానికి వెళ్లేసరికి ఏపీవో రాకపోవడంతో ఎంపీడీవో రాజారావుకు ఫిర్యాదు చేశారు. నాయకులు పిన్నింటి మోహనరావు, మజ్జి గణపతి తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

బొబ్బిలి, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలో 2 వేల మంది వయోజనులను అక్షరాస్యులుగా మార్చాలని పుర అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు అన్నారు. సోమవారం పుర కార్యాలయంలో 200 మంది అక్షరాంధ్ర వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. నిరక్షరాస్యతను తగ్గించడానికి కృషి చేయాలని కమిషనర్ రామలక్ష్మి అన్నారు. రిసోర్స్‌పర్సన్లు గురుమూర్తి, శంకరరావు, టీపీఆర్‌వో వేణుగోపాలరావు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

రూ.11 లక్షల విరాళం

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లిలో నిర్మిస్తున్న గోలింగేశ్వర ఆలయానికి గ్రామానికి చెందిన రాంబార్కి రామారావు, విజయలక్ష్మి కుమారుడు ఉదయ్‌కుమార్, రాధాకుమారి దంపతులు రూ.11 లక్షలు సోమవారం విరాళం అందజేశారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం.. బాడంగి, న్యూస్‌టుడే: మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనమవుతాయని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు అన్నారు. సోమవారం బాడంగి మండలం గొల్లాది ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ★ బొబ్బిలి: సీఐ సతీష్‌కుమార్ పక్కి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అరసాడ.. ఏదీ అభివృద్ధి జాడ

అరసాడ (వంగర), న్యూస్‌టుడే: వంగర మండలం అరసాడ గ్రామంలో ప్రజలు సమస్యలతో సతమవుతున్నారు. నాలుగు నెలలుగా కాలువలు శుభ్రం చేయకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసనతో ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి. దోమల బెడద అధికంగా ఉంటోంది. చెత్త సేకరణ సక్రమంగా జరగడంలేదు. అప్పుడప్పుడు సేకరించిన వ్యర్థాలను రహదారి పక్కనే పడేస్తున్నారు. కొన్ని నెలలుగా మంచినీటి ట్యాంకు శుభ్రం చేయలేదు. నిత్యం లోఓల్టేజీ సమస్య వస్తోంది. గతంలో గ్రామంలో 500 విద్యుత్తు కనెక్షన్లు ఉన్నప్పుడు రెండు నియంత్రికలు ఉండేవి. ప్రస్తుతం 1100 కనెక్షన్లు ఉన్న నేపథ్యంలో 63 కేవీ నియంత్రిక ఏర్పాటు చేయాల్సి ఉంది. ఎస్సీ వీధి, నెయ్యిల వీధిలో స్తంభాలు ఏర్పాటు చేయాల్సిఉంది. వీధికుక్కల బెడద అధికంగా ఉంది. ఇటీవల కొంతమందిని గాయపర్చాయి. సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎంపీడీవో రాజారావు తెలిపారు.

సారథిలో ఎన్ఎస్ఎస్ శిబిరం

రాజాం, న్యూస్‌టుడే: రాజాం ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సారథి గ్రామంలో వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సోమవారం గ్రామంలో పరిశుభ్రత పనులు చేపట్టారు. వీధులు ఊడ్చారు. పనికిరాని మొక్కలు తొలగించారు. కాలువలను శుభ్రం చేశారు. కళాశాల ప్రధానాచార్యుడు కె.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చీపురుపల్లి మండలం పెదనడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు కె.ఇందు, కె.కావ్య, ఎం.భారతి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ రామారావు సోమవారం తెలిపారు. డిసెంబర్ 22 నుంచి 26 వరకు కేరళలో జరగనున్న 37వ జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

Phone No. 9440282067 e-mail: sdsprincipal@yahoo.com www.sdscollege.info
Shri Durgaprasad Saraf College of Arts & Applied Sciences
SHREERAMNAGAR-535 101, Dist. Vizianagaram, A.P.
(Pvt. & Autonomous Institution affiliated to Andhra University, Visakhapatnam)
(Accredited by NAAC with B grade)
ADMISSIONS INTO SPOT ADMISSION CATEGORY and CATEGORY-B (Management Quota) Seats AY 2025-26
Interested and eligible candidates may apply for admission under spot admission category and category B seats of all the Majors of B.Sc (Honors) & B.Com (Honors & Computer application).these seats will be filled as per the guidelines of the competent authority.
The applications forms may be had from the office of the college from 20.11.2025. For further details, please visit college website: www.sdscollege.info or contact:9440282067 & 9849134697
(PRINCIPAL) Secretary & Correspondent

విజయనగరం
• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం: 80089 02900
విజయనగరం గ్రామీణం: 80085 74317
ఎస్.కోట: 80085 74326
భోగాపురం: 70959 54646

?: పద్మావతి స్కూలుకు వెళ్లే దారిలో వీధి దీపాలు వెలగడం లేదు. – స్థానికులు ❖ సిబ్బందిని పంపించి బాగు చేయిస్తాం. – ప్రవంతి, ఏఈ, నగర పాలక సంస్థ – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

?: జొన్నవలస శివారులో వీధి దీపాలు వెలగడం లేదు. – స్థానికులు ❖ చర్యలు తీసుకుంటాం. – ఆర్.రవి, కార్యదర్శి – న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

?: బత్తులరాజుల వీధిలో చెత్త పేరుకుపోయింది. దోమలతో ఇబ్బంది పడుతున్నాం. – బి.కల్యాణ్ ❖ చెత్త తొలగించి, ఇబ్బందులు లేకుండా చూస్తాం. – ఉమాభాస్కరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ – న్యూస్‌టుడే, నెల్లిమర్ల

తెరపై ఈనాడు

ఎస్వీఎన్: పాంచ్‌మినార్ ❖ శ్రీకృష్ణ: రాజు వెడ్స్ రాంబాయి ❖ అదితి: కె.ర్యాంప్ ❖ లీలామహల్: ప్రేమంటే ❖ రంజని ప్రీమియర్-1: 12ఎ రైల్వే కాలనీ, కొదమ సింహం ❖ శివరంజని స్క్రీన్-2: ప్రేమంటే ❖ హిమగిరి: 12ఎ రైల్వే కాలనీ ❖ సప్తగిరి: శివ, మ్యాజిక్ పోలీస్ – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

విజయనగరం పట్టణం: నిర్వహణ పనుల నిమిత్తం వంటితాడి అగ్రహారంలోని 132/33 కేవీ విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.త్రినాథరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యామ్నాయంగా 33/11 కేవీ ఉపకేంద్రాలకు ఇతర ప్రాంతాల నుంచి (గరివిడి, పైడిమాంబపురం, ఆనందపురం) సరఫరా ఏర్పాటు చేశామన్నారు.

చెత్తకుప్పల తరలింపు

నగరంలోని కల్యాణ్ నగర్‌లో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలను సిబ్బంది తొలగించారు. సమస్యపై 'మేమున్నాం.. మీకు తోడుగా'కు స్థానికులు తెలిపారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె. సాంబమూర్తి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చర్యలు తీసుకున్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

స్పందనకు వందనం

దీపాలు వెలిగాయ్

గాజులరేగ శ్రీనగర్ కాలనీ, వైఎస్సార్ నగర్ కాలనీ వెంటనే దాటిన తర్వాత, అలకనందకాలనీలో వీధి దీపాలు వెలిగేలా సిబ్బంది చర్యలు తీసుకున్నారు. మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా తెలుసుకున్న ఏఈ ప్రవంతి స్పందించి చర్యలు తీసుకున్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

శునకాలకు శస్త్రచికిత్సలు

నగరంలోని వీసీబీ కాలనీలో కుక్కలను పట్టుకొని సంతాన నిరోధక శస్త్రచికిత్సలకు సిబ్బంది తరలించారు. మేమున్నాం మీకు తోడుగా ద్వారా కమిషనరు పి.నల్లనయ్య దృష్టికి సమస్యను తీసుకెళ్లగా చర్యలు తీసుకున్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

స్థల పరిశీలన

జామి: జామిలో రైతు బజారు ఏర్పాటుకు జిల్లా మార్కెటింగ్ అధికారి రవికిరణ్, కొత్తవలస మార్కెటింగ్ శాఖ అధ్యక్షుడు మల్లునాయుడు సోమవారం స్థలం పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యపై 'బజారు లేక బేజారు' శీర్షికతో ఈనాడులో వచ్చిన వార్తకు ఎమ్మెల్యే లలితకుమారి స్పందించి, చర్యలకు ఆదేశించారు.

కాలువపై పలకల ఏర్పాటు

జామి: బీసీ కాలనీలో కాలువపై పలకలు విరిగిపోవడంతో 'ఈనాడు'లో 'ఏమరుపడితే కాలువలోకే' శీర్షికతో వార్త వెలువడింది. పంచాయతీ అధికారులు స్పందించారు. ఈవో ప్రసాదరావు ఆధ్వర్యంలో పలకలు వేశారు.

అక్షరం దిద్దిస్తాం.. అందలం ఎక్కిస్తాం

8,004 మంది గుర్తింపు..

శిక్షణా తరగతుల్లో పాల్గొన్న వాలంటీరు టీచర్లు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. దీనికోసం నోడల్ ఏజెన్సీ వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. నగరపాలక సంస్థ పరిధిలో దీనిపైన చర్యలు చేపట్టారు. జీఎస్‌డబ్ల్యూఎస్ శాఖ సచివాలయాల్లోని సంక్షేమ కార్యదర్శుల ద్వారా ఆయా సచివాలయాల పరిధిలో ఎంత మంది నిరక్షరాస్యులైన మహిళలు ఉన్నది గుర్తించారు. వంద రోజుల వ్యవధిలో రోజుకు గంట చొప్పున వాలంటీరు టీచర్ల ద్వారా బోధన చేయించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. వారికి చివరిలో పరీక్షలు నిర్వహిస్తారు.

ఉల్లాస్ కోసం రూపొందించిన పుస్తకం

నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 8,004 మంది నిరక్షరాస్యులను గుర్తించారు. వీరికి బోధన చేసేందుకు ఆయా సచివాలయాల పరిధిలోని పదో తరగతి చదివిన వాలంటీర్ టీచర్లు 802 మందిని ఎంపిక చేశారు. ఒక్కొక్కరికీ 10 మందితో బ్యాచింగ్ చేశారు. గత శుక్రవారం వీరికి నగరంలో వయోజన విద్యా, మెప్మా ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. మొదటి బ్యాచ్‌లో 405 మంది, రెండో బ్యాచ్‌లో 398 మందికి శిక్షణ ఇచ్చారు. వర్ణమాల నుంచి డిజిటల్ లెటరసీ వరకు పలు అంశాలు నేర్పిస్తారు. దీనికోసం ఎనిమిది పుస్తకాలు వాలంటీర్లకు అందజేశారు. రోజూ సాయంత్రం 5 నుంచి 6గంటల మధ్య ప్రభుత్వ పాఠశాలలు, సామాజిక భవనాలు, వసతి గృహాల వద్ద బోధిస్తారు. చివరిలో పరీక్షలు నిర్వహిస్తారు.

గంట బోధన..

మహిళలందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే అక్షరాంధ్ర ఉల్లాస్ ముఖ్య ఉద్దేశం. ఇది వంద రోజుల కార్యక్రమం. దీనికి సంబంధించి పుస్తకాలను వాలంటీర్ టీచర్లకు ఇచ్చాం. రోజూ గంటపాటు బోధన ఉంటుంది.
– పి.నల్లనయ్య, కమిషనర్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విజేతలకు బహుమతులు ఇస్తున్న కరస్పాండెంట్, ప్రధానాచార్యుడు

గీతాంజలి పాఠశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న వెంకటరావు, కరస్పాండెంట్, డైరెక్టర్

కృత్రిమ మేధతోనే భవిష్యత్తు

విజయనగరంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం 'కృత్రిమ మేధ(ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు', గీతాంజలి ఉన్నత పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం'పై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. జూనియర్ కళాశాలలో ప్రతిభ పాటవ పోటీల్లో కె.యోగిత (ప్రథమ హెచ్ఈసీ), బి.మౌనిక(ప్రథమ బైపీసీ), ఎస్. హెచ్. మోహిత్ (ప్రథమ సీఈసీ) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. ప్రధానాచార్యుడు కృష్ణారావు, అధ్యాపకులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. గీతాంజలి

కళాశాలలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాఠశాలలో గాజుల మేఘన (తొమ్మిదో తరగతి), ఎ.దీప్ ప్రభాకర్ (ఎనిమిదో తరగతి), నల్లి హేమశ్రీ (ఏడో తరగతి) తొలి మూడుస్థానాల్లో నిలిచారు. ప్రైవేటు విద్యా సంస్థల జిల్లా అధ్యక్షుడు ఎం.వి.ఎన్.వెంకటరావు, కరస్పాండెంట్ ఎ.వెంకటలక్ష్మి, డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు, ఉపాధ్యాయిని లక్ష్మి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. – న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

వినుకొండలో క్రీడా సందడి.. వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా వినుకొండలో లయోలా పాఠశాల వేదికగా 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-17 బాలబాలికల అథ్లెటిక్స్ సోమవారం ప్రారంభమయ్యాయి. పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫాదర్ అవినాష్ ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేష్ ఉన్నారు. జిల్లాకు చెందిన బిందుమాధవి హైజంప్‌లో, జ్యోత్స్న 3కి.మీ. పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పతకాలు అందజేసి అభినందించారు.

దారి ఇలా.. వెళ్లేదెలా..!

విజయనగరం నుంచి డెంకాడ మీదుగా నాతవలస వైపు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గం అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. ర.భ.శాఖ జేఈ రవికుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ.. మరమ్మతులు చేపడతామని తెలిపారు. - న్యూస్‌టుడే, డెంకాడ.

కాజ్‌వే లేక ఇక్కట్లు

జామి మండలంలో తానవరం, విజినిగిరి గ్రామాల మధ్యలో గోస్తనీ నది ఉంది. కాజ్‌వే లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విజినిగిరిలో సచివాలయం ఉండడంతో తానవరం గ్రామస్థులు ఎస్.కోట మీదుగా 10కి.మీ. ప్రయాణించి వెళ్తున్నారు. ఎమ్మెల్యే లలిత కుమారి వారధి నిర్మాణానికి శంకుస్థాపన చేసి నెలలు సమీపిస్తున్నా పనులు ప్రారంభించలేదు. నదిలో నీరు పారుతోందని, తగ్గితే పనులు చేయిస్తామని పీఆర్ డీఈ స్వామినాయుడు తెలిపారు. – న్యూస్‌టుడే, జామి

చెత్త తరలదు.. దుర్వాసన వీడదు

నెల్లిమర్ల నగర పంచాయతీలోని శివాలయం వద్ద చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. దీంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. గుడికి వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు, దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని, తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమాభాస్కర్ మాట్లాడుతూ చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లిమర్ల

పొంచిఉన్న ప్రమాదం.!

నగర పంచాయతీ పరిధి నెల్లిమర్ల ప్రాంతంలో ఉన్న బాలికల ఉన్నత పాఠశాలలోని ఓ భవనం శిథిలస్థితికి చేరి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. విద్యార్థులు, చిన్నారులు అటువైపు వెళ్తుంటారని, ఎప్పుడు కూలి ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎంఈవో యు.సూర్యనారాయణమూర్తి వద్ద వివరణ కోరగా జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, నెల్లిమర్ల

లీకులు అరికట్టరూ.!

నియోజకవర్గ పరిధిలోని వంద గ్రామాలకు తాగునీరు అందించే పైలెట్ ప్రాజెక్టు పైపులైనుకు బొడ్డవర కూడలి వద్ద లీకులు ఏర్పడ్డాయి. రోజుల తరబడి వృథా అవుతున్నా చర్యలు కానరావడం లేదు. నీరు రోడ్డుపైకి చేరుతుండడంతో గుంతలు ఏర్పడుతున్నాయి. రాకపోకలకూ అవస్థలు పడుతున్నారు. లీకైన ప్రాంతంలోనే పలువురు చెత్త వేస్తుండడంతో అపరిశుభ్రంగా మారుతోంది. కలుషిత నీరు సరఫరా అయ్యే అవకాశం ఉంది. దీనిపై ప్రాజెక్టు జేఈ శైలజ వద్ద ప్రస్తావించగా లీకులు అరికట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, శృంగవరపుకోట

శాశ్వత ఉద్యోగులుగా గుర్తించండి

కలెక్టరేట్ వద్ద దీక్షలో సమగ్రశిక్షా ఉద్యోగులు

ఉడాకాలనీ, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగుల సంఘం (జేఏసీ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద దీక్ష చేపట్టారు. జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ బి.కాంతారావు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత లేదని, తక్కువ జీతాలతో, సరైన హెచ్‌ఆర్ విధానం లేకుండా ఉద్యోగులు కష్టాల్లో ఉన్నారన్నారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. డిసెంబర్ 10న చలో విజయవాడ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. నాయకులు రామకృష్ణ, శ్రీనివాసరావు, రవీంద్రబాబు, జయగణేష్, లక్ష్మునాయుడు పాల్గొన్నారు.

టెట్‌తో ఉపాధ్యాయుల్లో ఆందోళన

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2010కి ముందు నియామకమైన గురువులకు టెట్ పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం చెప్పడంతో ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొందని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు అన్నారు. సోమవారం పూసపాటిరేగ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ దీనిపై పునఃపరిశీలన కోరుతూ రివ్యూ పిటిషన్ వేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎన్‌సీఈఆర్టీ నిబంధనల్లో సవరణలకు కృషి చేయాలన్నారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ పైడిరాజు, జిల్లా కార్యదర్శి పి.దామోదర్, కె.అప్పలనాయుడు, మండలాధ్యక్షుడు కె.గోవిందనాయుడు, కె.అప్పలరాజు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వరరావు

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

మాట్లాడుతున్న రాఘవేంద్రదాస్

విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామస్థాయి నుంచే కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఏఐసీసీ, ఏపీసీసీ పరిశీలకుడు రాఘవేంద్రదాస్ సూచించారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ అధ్యక్షతన విజయనగరంలో సమావేశం నిర్వహించారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో పార్టీకి రాష్ట్రంలో పునర్వైభవం తీసుకురావాలన్నారు. త్వరలో నూతన కమిటీలు వేస్తామన్నారు. నాయకులు శ్రీను, డా.తిరుపతి, శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విలీనంలోనూ.. వెంటాడుతున్నాయి.!

మహాలక్ష్మినగర్‌లో రహదారి దుస్థితి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగరంలోని 44వ డివిజన్, అయ్యన్నపేట నగరపాలక సంస్థలో విలీనమైనప్పటికీ సమస్యలు వీడడంలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహాలక్ష్మినగర్, షిర్డీ కాలనీ, మారుతీనగర్‌లలో రహదారులు, కాలువలు లేవు. మట్టిదారులు కావడంతో చిన్నపాటి వర్షం పడినా అడుగుతీసి వేయలేని పరిస్థితి. అయ్యన్నపేట జంక్షన్, ఎస్సీ, బీసీ కాలనీ, విజయనగర్ కాలనీ, చిన్నవీధిలో రోడ్లు రాళ్లు తేలి అధ్వానంగా మారాయి. కుక్కల బెడద వేధిస్తోంది. దోమలు విజృంభించి రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. మండల పరిషత్తు పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె గదుల్లో నడుస్తున్నాయి. ఎర్రచెరువు అవుట్‌ఫ్లో లేక చెత్త పేరుకుపోతోంది. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు.

అవినీతి ఆరోపణలపై నేడు బహిరంగ విచారణ

విజయనగరం అర్బన్, గ్రామీణం, న్యూస్‌టుడే: విజయనగరం మండలం రాకోడు గ్రామ రైతుల ఫిర్యాదుపై యంత్రాంగం కదిలింది. రైతుల భూములను మ్యుటేషన్, పట్టాదారు పాసుపుస్తకాల జారీకి ఎకరాకు రూ.లక్ష ఇవ్వాలని రెవెన్యూ అధికారులు అడుగుతున్నారని గ్రామానికి చెందిన రైతులు గత సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాలతో బహిరంగ విచారణకు సిద్ధమైనట్లు పీజీఆర్ఎస్ నోడల్ అధికారి మురళీ తెలిపారు. ఫిర్యాదుదారులు ఆధారాలతో మంగళవారం ఉదయం 11 గంటలకు హాజరుకావాలని కోరారు.

పుణ్యగిరి హుండీ ఆదాయం రూ.4.78లక్షలు

ఎస్.కోట, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన పుణ్యగిరి ఆలయానికి కార్తికమాసంలో హుండీ ఆదాయం రూ.4.78లక్షలు వచ్చినట్లు ఈవో నాగేంద్ర తెలిపారు. సోమవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వై.రమణి ఆధ్వర్యంలో లెక్కించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

లక్కవరపుకోట: చందులూరు ఉన్నత పాఠశాల విద్యార్థి రొంగలి జశ్వంత్ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శివరామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీరాములు తెలిపారు. ఈ నెల 25 నుంచి 27 వరకు కృష్ణా జిల్లా గన్నవరంలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థిని అభినందించారు.

ఆలయ పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

నెల్లిమర్ల: రామతీర్థం దేవస్థానంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి సూచించారు. ఆలయాన్ని సందర్శించి పరిశీలించారు. పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.

అనారోగ్యంతో ఉప తహసీల్దార్ మృతి

నెల్లిమర్ల: మండలంలో ఎన్నికల ఉప తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న వీవీఆర్ జగన్నాథరావు అనారోగ్యంతో మిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. తెదేపా విశాఖ ఉత్తర పరిశీలకుడు ఎస్.రవిశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి రాజారావు, మండలాధ్యక్షుడు కె.ఆనంద్‌కుమార్, తహసీల్దార్ కె.శ్రీకాంత్, సిబ్బంది సంతాపం తెలిపారు.

అనుమతులు ఇవ్వండి

పూసపాటిరేగ: ముస్లిం మైనార్టీ కుటుంబాలు ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ తెదేపా మండల కార్యదర్శి పి.సన్యాసినాయుడుతో కలిసి తహసీల్దార్ ఎన్.వి.రమణకు వినతి పత్రం అందజేశారు. ఏళ్లుగా చిన్న రేకుల షెడ్డుల్లోనే నివాసం ఉంటూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. కె.రామారావు, షేక్ ఖారీం, షేక్ మూస, షేక్ సల్మాన్ ఉన్నారు.

అవకతవకలపై విచారణ జరపాలి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: జిందాల్ వ్యవహారంలో బినామీలు ఉద్యోగాలు పొందడం, నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తామని డబ్బులు వసూలు చేయడం, భూమి లేనివారికి వేతనాలు చెల్లించడంపై సమగ్ర విచారణ చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్టు ఎమ్మెల్సీ రఘురాజు తెలిపారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండు

సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్ తదితరులు

మయూరి కూడలి: కేంద్రంలో కార్మిక, రైతు వ్యతిరేక నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న అఖిల భారత కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపడుతున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, రాష్ట్ర కార్యదర్శి పి.రమణ తెలిపారు. సోమవారం ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం అమర్‌భవనంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గం ఒత్తిడికి లోనవుతోందన్నారు. 29 కార్మిక చట్టాలను వ్యతిరేకించి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందన్నారు. వీటితో హక్కులు కోల్పోతారన్నారు. వెంటనే రద్దు చేయకుంటే పోరాడుతామన్నారు. నాయకులు రంగరాజు, బుగత అశోక్, కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: జిల్లాలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకుల సమస్యలు పరిష్కరించాలని సంఘ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎస్.రాజారావు, ఎ.గౌరీశంకర్ డిమాండు చేశారు. సోమవారం పోలీస్ బ్యారెక్స్ రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ గేటు వద్ద బైఠాయించి ధర్నా చేశారు. సాగు పనుల నేపథ్యంలో ఉపాధి పనులకు ఎవరూ రావడం లేదని, ఫారంపాండ్ల తవ్వకానికీ అవకాశం ఇవ్వడం లేదన్నారు. క్షేత్ర సహాయకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వారి కుటుంబానికి ఆరోగ్య కార్డులివ్వాలని, ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. నాయకులు నారాయణప్పడు, రాంబాబు, వెంకటరమణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద బైఠాయించిన క్షేత్ర సహాయకులు

గ్రేడ్-I కార్యదర్శులకు ఉద్యోగోన్నతి

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొండకరకం, గుంకలాం గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న చింతాడ కన్నబాబు, డోల శంకరరావుకు ఉద్యోగోన్నతి లభించింది. వీరిని విజయనగరం, బొండపల్లి మండలాలకు జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పాటల సీడీ ఆవిష్కరణ

పాటల సీడీ ఆవిష్కరణ కార్యక్రమంలో కమిషనరు, డీసీపీ

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగరాలు, పురపాలికల్లో అక్రమ నిర్మాణాలు, లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్, బీపీఎస్ ద్వారా కల్పిస్తున్న అవకాశాలపై విస్తృత ప్రచారానికి చర్యలు తీసుకున్నట్లు నగర పాలక సంస్థ కమిషనరు పి.నల్లనయ్య అన్నారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇందు కోసం రూపొందించిన పాటల సీడీని అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. క్రమబద్ధీకరణకు ఇదో అవకాశమన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కమిషనరు నల్లనయ్య పాటలు రాయడం అభినందనీయమన్నారు.

ఈ చిన్నారులు.. చిచ్చరపిడుగులు!

వేపాడ, న్యూస్‌టుడే: మారుమూల గ్రామాల్లో నివాసం.. దీనికితోడు పేదరికం.. ఇవేవీ వారి ప్రతిభకు అడ్డు కాలేదు. వేపాడ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిరంతర సాధనతో వివిధ క్రీడలు, సంప్రదాయ నృత్య ప్రదర్శనల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్నారు.

రెండేళ్లుగా రాష్ట్రస్థాయికి..

వేపాడ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి అభిషేక్ బాస్కెట్‌బాల్ పోటీల్లో సత్తా చాటుతున్నాడు. తల్లిదండ్రులు ముత్యాలనాయుడు, వీరసత్యవతి ఈశ్వరమ్మ. గతేడాది జిల్లా పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయిలో ఆడాడు. ఈ ఏడాదీ ప్రతిభ చాటి, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. ఇదే పాఠశాలకు చెందిన ఎ.మనోజ్ గతేడాది కబడ్డీకి, ఈ ఏడాది ఖోఖోలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. బాలికల బాస్కెట్ బాల్ విభాగంలో తనూజ వరుసగా రెండేళ్లు ఎంపికైంది.

థింసాలో దిట్టలు..

థింసా నృత్యం చేస్తున్న బక్కునాయుడుపేట గురుకులం చిన్నారులు

బక్కునాయుడుపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు థింసా నృత్యంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. 2017లో నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో ప్రథమ స్థానం దక్కించుకున్నారు. 2019 ఆగస్టు 15న దిల్లీలోని ఆంధ్రాభవన్‌లో ప్రదర్శించిన 'దిబిరి దిబిరి' నృత్యానికి అప్పటి రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ చేతుల మీదుగా ప్రథమ బహుమతి అందుకున్నారు. 2021-24లో నాలుగేళ్ల పాటు విజయవాడ వడ్డేశ్వరంలోని కె.ఎల్.యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో విజేతలుగా నిలుస్తున్నారు.

జాతీయ స్థాయికి ఎంపిక

బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలకు చెందిన హేమశ్రీ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తోంది. ఈ ఏడాది జాతీయ స్థాయి ఇండోర్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంది. నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలో జరిగిన స్టాండింగ్ లాంగ్‌జంప్‌లో ఇదే పాఠశాల విద్యార్థిని బి.జనార్దిని ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపికైంది. మరో ఏడుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు.

కిడ్నాప్ కలకలం

నేరవార్తా విభాగం: తనను గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారంటూ ఓ బాలిక(14) ఏడుస్తూ కుటుంబ సభ్యులకు ఫోను చేయడంతో పట్టణంలో కలకలం రేగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నగరానికి చెందిన బాలిక సోమవారం సైకిల్‌పై పాఠశాలకు బయలుదేరింది. దారిలో కొందరు ఆమెను అపహరించి రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఆమె తప్పించుకుని తల్లిదండ్రులకు ఫోను చేసింది. వారి సమాచారంతో పోలీసులు స్టేషన్‌కు చేరుకుని బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల దర్యాప్తులో బాలికే సైకిల్‌పై రైల్వే స్టేషన్‌కు వెళ్లి, పార్కింగ్‌లో పెట్టి, అక్కడే తిరిగినట్లు సీసీ ఫుటేజ్‌లో నమోదైంది. దీంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జైలు, జరిమానా

నేరవార్తా విభాగం: మద్యం తాగి వాహనాలు నడిపిన నగరానికి చెందిన అర్జున్, విశాఖకు చెందిన కనకరావుకు 15 రోజుల జైలు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ విజయనగరం అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేటు ఎంఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి సోమవారం తీర్పిచ్చినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ వెల్లడించారు. ❖ కొత్తవలస: పట్టణానికి ఇద్దరికి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వారం జైలు, రూ.10 వేలు జరిమానాను జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయ చందర్ విధించారని సీఐ సీహెచ్.షణ్ముఖరావు తెలిపారు. ❖ ఎస్.కోట: పట్టణానికి చెందిన దార్ల నరేష్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గండి అప్పలనాయుడు తీర్పిచ్చారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు అయిన విజయనగరం జిల్లా, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కణపాక శివాలయం దరి, మహంతి వీధి, డోర్. నెం. 1-23-1-11, కాపురస్తులు పొట్నూరు శంకరరావు గారి కుమారుడు పొట్నూరు వెంకటేష్ గారు ఇచ్చిన భోగట్టా ప్రకారం నా క్లయింట్ తేది. 07-11-2025న ఉదయం గం॥ 10.30 ని॥ ప్రాంతంలో తన నివాస గృహం నుంచి కలెక్టరు వారి ఆఫీసు జంక్షన్‌కు ఒరిజినల్ దస్తావేజులు జిరాక్స్‌లు తీయు నిమిత్తం మోటారు సైకిల్‌పై వెళుతుండగా మార్గ మధ్యలో సదరు ఒరిజినల్ దస్తావేజులు మరియు వాటి ఒరిజినల్ లింకు దస్తావేజులు పోయినవి. (1) ఒరిజినల్ దస్తావేజు నెం. 2825/2014, తేది. 03-07-2014 మరియు (2) ఒరిజినల్ లింకు దస్తావేజు నెం. 6875/2007 తేది. 21-06-2007న శ్రీ విజయనగరం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రీ ద్వారా పొందియున్నారు. నా క్లయింట్ యొక్క ఒరిజినల్ దస్తావేజులు మరియు వాటి యొక్క ఒరిజినల్ లింకు దస్తావేజులు ఎవరికైనా దొరికినా ఏ విధమైన చట్టవ్యతిరేక చర్యలు చేయరాదని అట్టివి చెల్లనేరవని, భవిష్యత్‌లో నా క్లయింట్‌కు బంధింపజాలవని మరియు సదరు దస్తావేజులు దొరికిన యెడల నాకు గాని నా క్లయింట్‌కు గాని అందజేయగలరని ఈ పత్రికా ముఖంగా ప్రకటన చేయడమైనది. ఇట్లు

సంఘంరెడ్డి మధుసూధనరావు
న్యాయవాది, శివాలయం వీధి, విజయనగరం
సెల్: 9052446888, 9440163944

(c) eenadu

పాపం.. కదల్లేని స్థితిలో హాసిని..

నా కుమార్తె కొమ్ము హాసిని తాడేపల్లిగూడెం పట్టణంలోని మాగంటి అన్నపూర్ణదేవి బాలికల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఈ నెల 22న ఇద్దరు విద్యార్థులు కొట్టుకుంటూ.. తన బిడ్డను వెనుక నుంచి తోయడంతో పై అంతస్తు నుంచి కిందపడి రెండు కాళ్లు, దవడ ఎముక విరిగిపోయాయి. తాడేపల్లిగూడెం, ఏలూరు ఆసుపత్రుల చుట్టూ తిరిగి చివరికి మెరుగైన వైద్యం కోసం విజయవాడ తీసుకెళ్లాం. అప్పటి వరకు ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు మీ అమ్మాయి వాటర్ సింక్ దగ్గర పడటం వల్ల గాయమైందని చెప్పారు. దెబ్బలకు వారి మాటలకు పొంతన లేదని, పాప స్పృహలోకి వచ్చాక జరిగిన విషయమంతా చెప్పింది. మా ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. అప్పు చేసి రూ.లక్షలు ఖర్చు పెట్టాం. మా పాపకు న్యాయం చేయాలి. **- కొమ్ము రవికుమార్, పెంటపాడు**

ఎన్టీఆర్ వైద్యసేవలో సాయం.. హాసిని పరిస్థితిని చూసిన జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా వైద్యం చేయిస్తామని, ఇప్పటి వరకు ఖర్చు పెట్టిన బిల్లులతో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంటే ఎమ్మెల్యేతో మాట్లాడి మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

జాలికే.. జాలేస్తోంది

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎవరో చేసిన తప్పునకు ఆ చదువుల తల్లి జీవితం తలకిందులైంది. విధి ఆడిన నాటకంలో పాపం.. ఆ బిడ్డలకు అన్నీ మంచమే లోకమైంది. . వారిని చూస్తే జాలికే జాలేసింది. మీరే వారిని ఆదుకోవాలని కన్నవారు అధికారుల ఎదుట కన్నీరు పెట్టుకున్నారు. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలువురితో స్వయంగా మాట్లాడి వారి బాధలు విన్నారు. మొత్తం 169 అర్జీలు వచ్చాయి.

మా అబ్బాయి తమ్మా అభినవ్ వయసు తొమ్మిదేళ్లు. పుట్టుకతోనే మానసిక దివ్యాంగుడు. పోలియో వల్ల కాళ్లు పనిచేయవు. మంచం పైనే సేవలందించాలి. ఇప్పుడొస్తున్న ఆరువేల పింఛను మందులకే సరిపోవడం లేదు. రూ.15 వేల పింఛను ఇప్పించి ఆదుకోవాలి. **- తమ్మా కోట నాగేశ్వరరావు, రామచంద్రపురం, పెంటపాడు**

జోశ్యశ్రీనిధి

నా కుమార్తె జోశ్యశ్రీనిధి పుట్టినప్పటి నుంచి సెరిబ్రల్ పాల్సీ వ్యాధితో బాధపడుతోంది. దివ్యాంగురాలు కావడంతో జీవనం కష్టంగా ఉంది. రూ.15 వేల పింఛను ఇప్పించాలి. **- మురుకుపూడి బాలాజీ, భీమవరం**

బహిరంగంగా చెత్త కాల్చితే చర్యలు : కలెక్టర్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎక్కడైనా బహిరంగంగా చెత్త తగలబెడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ నాగరాణి హెచ్చరించారు. జిల్లాలో పారిశుద్ధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. అందరికీ ఇళ్ల పథకంలో లబ్ధిదారులు వివరాలు నమోదు చేయాలని, తల్లికి వందనం పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న 1,465 అర్జీలు పరిష్కరించాలని ఆదేశించారు.

రైతేరాజు మిశ్రమం.. ఫలవంతం! 6లో

భూమి.. కనిపించదేమి?

వీడని రీసర్వే చిక్కులు

● అంతా రికార్డుల్లోనే.. క్షేత్రస్థాయిలో ఏదీ

ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు, నరసాపురం, ఉండి, పెనుగొండ గ్రామీణం, న్యూస్‌టుడే

వైకాపా హయాంలో చేపట్టిన రీసర్వే చిక్కులు నేటికీ వీడటం లేదు. దస్త్రంలో ఉన్న భూమి క్షేత్రంలో లేకపోవడంతో కార్యాలయాల చుట్టూ యజమానులు తిరుగుతూనే ఉన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా చేపట్టడంతో నిన్నమొన్నటి వరకు కలిసున్న సరిహద్దు రైతులు భూమి కోసం తగవులు పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

మూడేళ్లుగా.. 'మొగల్తూరు మండలం శేరేపాలెంలో నాకు అయిదెకరాల పొలం ఉంది. సరిహద్దు రైతులకు చెందిన 25 సెంట్ల భూమిని నా పేరుమీద కలిపేశారు. నాది కాదని ఆన్‌లైన్‌లో తీయించాను. అదే గ్రామంలో మరోచోట నాది 4 సెంట్లు తగ్గిందని, వాటిని సరిచేయాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా' అని పాలకొల్లుకు చెందిన ఇనుకొండ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్లుగా.. 'నాకు 70 సెంట్ల భూమి ఉంది. రీసర్వే సమయంలో సరిహద్దు రైతులకు చెందిన 6 సెంట్లు కలపడంతో అధికారికి ఫిర్యాదు చేసి, తీయించాను. తర్వాత సంయుక్త ఎల్పీ నంబర్లు కేటాయించడంతో 6 సెంట్ల విస్తీర్ణం తగ్గింది. పరిష్కరించాలని అధికారులను కలుస్తూనే ఉన్నా' అని దొంగరావిపాలేనికి చెందిన కోన సత్యనారాయణ తన బాధను వెలిబుచ్చారు.

ఒకటి కాదు.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వేలో భూమి సరిహద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్లు, కొలతల్లో వ్యత్యాసం, అంతర్జాలంలో నమోదు చేయకపోవడం, పట్టా సబ్ డివిజన్ చేయక భూమి మొత్తం ఆ సర్వే నెంబరులో ఉన్నదాన్ని ఒకే రైతు పేరున చూపడం వంటి అనేక సమస్యలు తలెత్తాయి. వాటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో 174 గ్రామాల్లో సభలు, రెవెన్యూ సదస్సులు నిర్వహించి అర్జీలు స్వీకరించారు.

జిల్లాలో మొత్తం	
రెవెన్యూ గ్రామాలు	293
రీసర్వే పూర్తయినవి	174
వచ్చిన ఫిర్యాదులు	7,021
పరిష్కారమైనవి	5,100

రీసర్వేలో భూ విస్తీర్ణం హెచ్చుతగ్గులకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించి ఒకరికొకరు ఒప్పందంతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని భూరీసర్వే జిల్లా అధికారి జాషువా తెలిపారు.

అంగీకారం తెలుపక.. కూటమి ప్రభుత్వం చొరవ చూపుతున్నా క్షేత్రస్థాయిలో వివిధ కారణాలతో కొన్ని పరిష్కారం కావడం లేదు. విస్తీర్ణం తగ్గడం, భూమిని సరిహద్దు రైతులకు కలవడం, వారి మధ్య సమన్వయం కుదరకపోవడంతో సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. సిబ్బంది రైతులను పొలాల వద్దకు పిలిచి గ్రౌండ్ ట్రూథింగ్ చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక దస్త్రాలు తయారు చేయాలి. క్షేత్రస్థాయి సమాచారంతో వీటికి రెండు నెలలు పడుతుంది. ఈ క్రమంలో రీసర్వేకు ముందు దస్త్రాల్లోని భూ విస్తీర్ణానికి, తర్వాత చూపిన విస్తీర్ణానికి వ్యత్యాసంతో రైతులు అంగీకారపత్రాలు ఇవ్వడం లేదు. 59 సెంట్లు తగ్గిందని, సరిహద్దు రైతులకు పెరిగిందని, పరిష్కరించాలని మూడేళ్లుగా అర్జీలు పెడుతూనే ఉన్నానని యండగండికి చెందిన పీవీఎస్ గోపాల రాధాకృష్ణంరాజు ఆవేదన వ్యక్తం చేశారు.

1న ముఖ్యమంత్రి రాక?

'ఉంగుటూరు'లో పింఛన్ల పంపిణీలో పాల్గొనే అవకాశం



ఈనాడు-ఏలూరు: పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డిసెంబరు ఒకటిన ఏలూరు జిల్లాకు వచ్చే అవకాశం ఉంది. ఈమేరకు ప్రాథమికంగా సమాచారం అందడంతో జిల్లా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రతినెలా పింఛన్ల పంపిణీలో సీఎం ఏదో ఒక జిల్లాలో పాల్గొంటున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా డిసెంబరులో జిల్లాలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని అధికారవర్గాల ద్వారా తెలిసింది. ఆ రోజు ఉంగుటూరు నియోజకవర్గం పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించాలనే యోచనలో ఉన్నతాధికారులు ఉన్నారు. అయితే ఆ నియోజకవర్గంలో ఎక్కడ నిర్వహిస్తే బాగుంటుందనే విషయమై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య చర్చలు సాగుతున్నాయి. ఇంతకు ముందు నూజివీడు నియోజకవర్గంలో ఈ కార్యక్రమం జరిగిన సంగతి తెలిసిందే.

గుడ్డు.. రికార్డు

తణుకు, న్యూస్‌టుడే: గుడ్డు ధర రికార్డు సృష్టిస్తోంది. హోల్‌సేల్‌గా రూ.6.70కు విక్రయిస్తుండగా.. బహిరంగ మార్కెట్లో రూ.7.50 నుంచి రూ.8కు అమ్ముతున్నారు. మొన్నటి వరకు వ్యాధులు, వాతావరణ మార్పులు, మేతల ధరలతో డీలా పడిన పౌల్ట్రీ పరిశ్రమకు.. ప్రస్తుత ధర కొంత ఊరటనిస్తుంది. ధర మరింతగా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

సాధారణంగా శీతాకాలంలో ఏటా గుడ్డు ధరలు పెరుగుతుంటాయి. నేషనల్ ఎగ్ కోర్డినేషన్ కమిటీ (నెక్) ధరల ప్రకారం ఇదే నెల 2021లో సగటు ధర రూ.4.39, 2022లో రూ.5.16, 2023లో రూ.5.27, 2024లో రూ.5.66 ఉంది. ఈ ఏడాది ఈ నెలలో ఇప్పటి వరకు సగటు రూ.6.09 ధర పలకడం పౌల్ట్రీ రైతులకు ఉపశమనం కలిగిస్తోంది.

పెరిగిన ఉత్పత్తి.. ఉమ్మడి జిల్లాలో దాదాపుగా 500 లేయర్ కోళ్ల ఫారాలు ఉండగా కోటిన్నర వరకు కోళ్లను పెంచుతున్నారు. వీటి ద్వారా సాధారణ రోజుల్లో కోటి వరకు గుడ్లు ఉత్పత్తి అవుతుండగా.. ప్రస్తుతం మరో పది శాతం వరకు ఉత్పత్తి పెరుగుతుందని పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు.

స్వాగతాలు.. విన్నపాలు

✪ పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
✪ ఆద్యంతం ఉత్సాహంగా ఉపముఖ్యమంత్రి పర్యటన

జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, కొయ్యలగూడెం గ్రామీణ, ద్వారకాతిరుమల న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఐఎస్ జగన్నాథపురం పర్యటన సోమవారం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన గ్రామంలో నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్‌ను ప్రారంభించారు. పలు అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాజమహేంద్రవరం నుంచి రోడ్డు మార్గంలో వచ్చిన ఆయనకు దారి పొడవునా ఘన స్వాగతం లభించింది. జగన్నాథపురంలో ఆయన ఓపెన్ టాప్ జీప్‌పై నుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పవన్‌ను చూసేందుకు, స్వాగతించేందుకు రోడ్లకు ఇరువైపులా ప్రజలు, అభిమానులు తరలివచ్చారు.

కొయ్యలగూడెం మండలం రాజవరంలో పొంగుటూరు-లక్కవరం రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తూ.. ప్రజలకు అభివాదం చేస్తున్న పవన్‌కల్యాణ్, పక్కన మంత్రి మనోహర్, ఎమ్మెల్యేలు

● యర్రంపేటలో రహదారి పక్కన చక్రాల కుర్చీలో వేచి ఉన్న తల్లోజు రామచరణ్ అనిరుధ్ అనే దివ్యాంగ బాలుడిని పవన్ పలకరించారు. అతడికి అవసరమైన సహాయాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వినతులు.. పవన్ కల్యాణ్‌కు ఈ సందర్భంగా పలువురు వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందించారు. అర్జీల స్వీకరణకు ప్రత్యేకంగా ఒక కౌంటర్ ఏర్పాటు చేశారు. అర్జీలను అక్కడికక్కడే ఆన్‌లైన్ చేశారు.

✪ లక్ష్మీనరసింహస్వామి ఆలయం సందర్శన నిమిత్తం ఆరిపాటిదిబ్బలు, యర్రంపేట, రాజవరం, మంగపతిదేవిపాలెం మీదుగా పవన్ పర్యటన సాగింది. ఉదయం 11.30కు రాజవరం చేరుకున్న ఆయన వాహనం దిగి కొద్దిదూరం కాలి నడకన పర్యటించారు. రూ.1.64 కోట్లతో మరమ్మతులు చేసిన పొంగుటూరు, లక్కవరం రహదారిని పరిశీలించారు. మంగపతిదేవిపాలెం సమీపంలో గంగవరం కూడలిలో రహదారి నిర్మాణం కోరుతూ పలువురు ఫ్లెక్సీతో వేచి ఉండగా పోలీసులు అడ్డుకోవడంతో గంగవరం గ్రామస్థులు అసహనం వ్యక్తం చేశారు. ఐఎస్ జగన్నాథపురం పర్యటన ముగించుకుని తిరిగి వచ్చే క్రమంలో అదే కూడలి వద్ద వాహనం నుంచే పవన్ పలువురి నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి నాదెండ్ల మనోహర్, ప్రభుత్వ విప్‌లు బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, ఎమ్మెల్యేలు వెంకటరాజు, బాలరాజు, రాధాకృష్ణయ్య, ధర్మరాజు, రామాంజనేయులు, జనసేన జిల్లా అధ్యక్షులు గోవిందరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ మురళీ కృష్ణ, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ అప్పల నాయుడు, కలెక్టర్ వెట్రి సెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ.. కొచ్చర్ల కోట నరసింహం గురువు ఆదేశాలు, సూచనల మేరకు శిష్యుడు ఆంజనేయశాస్త్రి ఆలయ చరిత్రను పుస్తక రూపంలో తీసుకొచ్చారు. ఆ పుస్తకాన్ని పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రదక్షిణ మండపం నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన పవన్‌కల్యాణ్

రైతే రారాజుగా వెలుగొందాలి

రైతన్నా మీకోసం యాప్‌ను చూపించి చిరునవ్వులు చిందిస్తున్న రైతు, ఉప సభాపతి రఘురామకృష్ణరాజు, కలెక్టర్ నాగరాణి

చిలుకూరు (ఉండి), న్యూస్‌టుడే: రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు అండగా నిలుస్తున్న వ్యవసాయ రంగంలో రైతే రారాజుగా వెలుగొందాలనేది ప్రభుత్వ లక్ష్యమని ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. చిలుకూరులో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని కలెక్టర్ సీహెచ్ నాగరాణి, జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావులతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. రానున్న అయిదేళ్లల్లో నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు వంటి పంచ విధానాలతో కార్యాచరణ అమలు చేస్తున్నామని వివరించారు. విచక్షణారహితంగా ఎరువులు, పురుగు మందుల వినియోగంతో మన ఆరోగ్యాన్ని మనమే నాశనం చేసుకుంటున్నామనే విషయాన్ని గుర్తించాలన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా 1,03,761 మంది రైతులకు రూ.68.97 కోట్లు వారి ఖాతాల్లో జమచేశామన్నారు. సర్పంచి ముదునూరి వెంకట సోమరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు, ఏడీఏ కె.ప్రతాప్‌జీవన్, నీటి సంఘం అధ్యక్షుడు సత్యనారాయణరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసరావు, తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉక్కు మనిషి పటేల్

ప్రదర్శనలో పాల్గొన్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, భాజపా నాయకులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: దేశ ఐక్యతకు, దేశభక్తికి ప్రతీక భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. పటేల్ జయంతి ఉత్సవాల్లో భాగంగా భీమవరం డీఎన్నార్ కళాశాల రామకృష్ణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ఉన్నా దేశ సమైక్యత, సమగ్రత విషయంలో అందరికీ ఏకాభిప్రాయం ఉండాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారన్నారు. అనంతరం పట్టణంలో సమైక్యతా ప్రదర్శన నిర్వహించారు. డీఎన్నార్ ఉపాధ్యక్షుడు జి.పాండురంగరాజు, భాజపా నాయకులు భోగిరెడ్డి ఆదిలక్ష్మి, ఉన్నమట్ల కపర్ధి, అయినంపూడి శ్రీదేవి, కాయిత సురేంద్ర, అరసవల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వేగంగా పట్టేస్తారు..!

జాతీయ రహదారులపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తుండటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ముందు వెళ్తున్న వాహనాలను అధిగమిస్తూ నియంత్రణ కోల్పోతున్నారు. వేగ నియంత్రణపై ఇప్పటికే పలుమార్లు వాహనదారులకు అవగాహన కల్పించారు. నిబంధనలను అతిక్రమించిన వారిని స్పీడ్‌హంటర్‌గన్ కెమెరాతో గుర్తిస్తున్నారు. వాహన నంబరు ప్లేటు ఆధారంగా జరిమానా విధిస్తామని అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు జగదీశ్‌బాబు తెలిపారు. పెదవేగి మండలం భోగాపురం సమీపంలోని జాతీయ రహదారిపై కనిపించిన చిత్రాలివి. **- ఈనాడు, ఏలూరు.**

అపూర్వ లోగిలి.. పచ్చందాల వాకిలి!

యలమంచిలి, న్యూస్‌టుడే: రెండంతస్తులతో ఉన్న 150 ఏళ్ల నాటి ఈ పెంకుటిల్లు యలమంచిలి మండలం బూరుగుపల్లిలో వశిష్ఠ గోదావరి ఏటిగట్టుకు సమీపాన ఉంది. 22 గదులు, పెద్ద మండువా ఉన్న ఈ ఇంటి పై అంతస్తుకు వెళ్తే వశిష్ఠ గోదావరి అందాలు కనువిందు చేస్తుంటాయి. ముంగిట్లో ఉన్న భారీ వృక్షం నీడలో వాకిలి పచ్చదనాన్ని పంచుతుంది. జడ్పీటీసీ మాజీ సభ్యుడు బోణం వెంకటనరసింహారావు(నాని)కు చెందిన ఈ ఇంట్లో ఇప్పటి వరకు ఏడు తరాలు నివాసమున్నట్లు ఆయన చెబుతున్నారు. శ్రీకాంత్ హీరోగా వచ్చిన దేవరాయ, మరికొన్ని సినిమాల చిత్రీకరణలు ఈ భవనంలో జరిగాయి. ప్రస్తుతం సునీల్ ప్రధానపాత్రలో తెరకెక్కుతున్న 'కొక్కొరొక్కో' చిత్రంలో కొంత భాగాన్ని ఇక్కడ చిత్రీకరించేందుకు అనుమతులు తీసుకున్నారు.

9.55కి ఇక్కడ ఉండాలి సమయానికి రాని అధికారులపై జేసీ ఆగ్రహం 6లో

I నుంచి భీమవరం-పిప్పర మార్గంలో భారీ వాహనాలు బంద్

భీమవరం కలెక్టరేట్, పాలకోడేరు, న్యూస్‌టుడే: భీమవరం-పిప్పర మార్గంలో డిసెంబరు 1 నుంచి భారీ వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ర.భ.శాఖ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. గరగపర్రు వద్ద ఉండి పంట కాలువపై వంతెన శిథిలస్థితికి చేరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. భీమవరం-తాడేపల్లిగూడెం మధ్య తిరిగే భారీ వాహనాలు ఉండి-గణపవరం-పిప్పర మీదుగా, పాలకోడేరు-అత్తిలి-పిప్పర మీదుగా వెళ్లాలని సూచించారు.

K.G.R.L COLLEGE OF PHARMACY
BHIMAVARAM
Phone: 08816-238828, 99485 67925,99854 85166
E-mail:kgrpharmacy@yahoo.co.in, kgrpharmacy2007@gmail.com
Website:www.kgrlpharmacy.com

APEAPCET-2025 NOTIFICATION FOR SPOT & CAT-B QUOTA ADMISSIONS B. PHARMACY

Applications are invited from Eligible candidates seeking admissions to the following left-over vacancies under Spot and CAT-B Admissions of B.Pharmacy for the Academic year 2025-26 as per APSCHE Guidelines. Eligible candidates shall contact the college office along with original certificates on or before 28-11-2025.

Course	Vacancies Under Spot Admissions	Category – B Seats
B.PHARMACY	16 Seats	30 Seats

Dr. D. Raghava, PRINCIPAL · Dr. K. Nageswara Rao, DIRECTOR · Mentey Ram Manohar, SECRETARY & CORRESPONDENT · Kotikalapudi Govinda Rao, PRESIDENT

WALK - IN INTERVIEWS
MAHAVEER FINANCE INDIA LTD., is looking for the Following Positions:
- SALES MANAGERS
- Sr.SALES EXECUTIVES
- SALES EXECUTIVES
- COLLECTION MANAGERS
- COLLECTION EXECUTIVES

For Used Commercial Vehicles, Construction Equipment & Cars.
LOCATIONS: Rajamundry,Kakinada,Tadepalligudem, Eluru, Visakhapatnam, Gajuvaka, Srikakulam, Vizianagaram.
Qalification & Exp: 10th & Inter for Sr.Sales Executives & Sales Executives, Minimum Degree For Managers.Min 2 years experience in NBFC for Sales Managers and collection manager positions Min.1 Year Experience in relevant field for Sales Executive and Sr.Sales Execurive,collection executive positions. Freshers also can apply as sales executive.
Interview: 26/11/2025, Wednesday, 9.30AM onwards
MAHAVEER FINANCE INDIA LTD.,
D.No.46-12-21/2,3, Venkat Plaza, Opp; Skvt High School, Ttd Kalyana Mandapam Road, Danavayi Peta, Rajamundry-533103.
WhatsApp: 8522082223, tvrsarama@mahaveerfinance.com

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలపండి



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీస్‌లో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు.
ఆకాంక్షించండి... వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు...
తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు.
80080 12494

కొక్కొరోకో.. నచ్చితే కొనుక్కో!

సామాజిక మాధ్యమాల ద్వారా పందెం పుంజుల విక్రయాలు

అమ్మకానికి ఉంచిన కోడి పుంజుల చిత్రాలు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాలు, ఈ-కామర్స్ యాప్‌ల ద్వారా ద్విచక్ర వాహనాలు, కార్లు, గృహోపకరణాల కొనుగోళ్లు, విక్రయాలు సాధారణమే. సంక్రాంతి సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పుడు పందెం కోడి పుంజుల చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. కోడి చిత్రంతో పాటు జాతి పేరు, ప్రత్యేకతలు, వయసు, బరువు, ధర తదితర వివరాలను సామాజిక మాధ్యమాల్లో ఉంచుతున్నారు. కొన్నేళ్ల నుంచి ఈ ఒరవడి కొనసాగుతున్నా ఈ సారి విక్రేతలు వ్యాపారం పెంచుకొనేందుకు కొత్త వ్యూహాలు అమలు చేస్తున్నారు. పుంజుల వివరాల కోసం ఆరా తీసిన వారికి అవసరమైతే అవి పందెంలో తలపడిన వీడియోలు కూడా పంపుతున్నారు. దీనికి తోడు రాయితీలు కూడా ప్రకటిస్తున్నారు. దూర ప్రాంతాల వారికి అవసరమైతే డెలివరీ సదుపాయం కూడా కల్పిస్తామని పేర్కొంటున్నారు. మరోపక్క కొందరు పెంపకందారులు బుట్టల్లో కోడిపుంజులను తెచ్చి పాలకొల్లు పరిసర ప్రాంతాల్లోని కూడళ్లు, రహదారుల పక్కన విక్రయిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి కొందరు కార్లలో వచ్చి మరీ వీటిని కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

సేవలు ఎలా ఉన్నాయ్

విద్యుత్తు శాఖపై ఐవీఆర్ఎస్ సర్వే

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులకు అందుతున్న సేవలపై ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే చేయిస్తోంది. సరఫరాలో ఎదురయ్యే ఇబ్బందులు, నాణ్యత, సిబ్బంది పనితీరుపై ప్రజల అభిప్రాయాలు తీసుకుంటోంది. లోపాలను అధిగమించి మెరుగైన సేవలు అందజేసేలా చర్యలు చేపట్టింది. గత నెలలో జరిగిన సర్వే వివరాల ఆధారంగా జిల్లా రాష్ట్రంలో 13వ స్థానంలో ఉంది.

జిల్లావ్యాప్తంగా విద్యుత్తు వినియోగదారుల నుంచి వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సేవలు మెరుగుపరిచేలా చర్యలు తీసుకున్నట్లు విద్యుత్తు సంస్థ జిల్లా ఎస్ఈ డి.ఉషారాణి చెప్పారు. లోవోల్టేజీ సమస్యలు ఉన్న చోట పరివర్తకాల ఏర్పాటు, వినియోగదారులు లోడు క్రమబద్ధీకరించుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. తద్వారా సేవలపరంగా ఈ నెలలో 7వ స్థానంలోకి చేరుకున్నామన్నారు. వినియోగదారులకు సమస్యలు ఉంటే 1912 నంబరుకు ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

(c) eenadu

మాటలా.. చేతలా!

- సమస్యలకు పరిష్కారం చూపేనా?
- నేడు స్థాయీ సంఘాలు, సర్వసభ్య సమావేశాలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు సమావేశంపై ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతి కందే దశలో తుపాను నిండా ముంచింది. 'మొంథా'తో నష్టపోయిన కర్షకులను ఆదుకోవాలని.. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేసేందుకు నిధులు విడుదల చేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఇటీవల మంత్రి నారా లోకేశ్, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజను వేర్వేరుగా కలిసి విన్నవించారు. మంగళవారం జరిగే స్థాయీ సంఘాలు, జడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయిలో హాజరై సమస్యలపై చర్చించి పరిష్కార మార్గం చూపాలని జిల్లా వాసులు ఆశిస్తున్నారు.

అధ్వానంగా రహదారులు ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే అధ్వానంగా మారిన రహదారులు.. తుపాను ప్రభావంతో మరింత ఛిద్రమయ్యాయి. పీఆర్, ర.భ.శా. రోడ్లు ఘోరంగా దెబ్బతిన్నాయి. కైకలూరు- భీమవరం, కైకలూరు- గుడివాడ రోడ్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. అంతర్గత, అనుసంధాన రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నష్టం రూ.75 కోట్లు పైగానే.. మొంథా తుపాను ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో రూ.75 కోట్లకు పైగా పంట నష్టం వాటిల్లింది. ఇదే విషయాన్ని ఇటీవల జిల్లాకొచ్చిన కేంద్ర బృందానికీ అధికార యంత్రాంగ విన్నవించింది. 4,807 హెక్టార్లలో వరి, 17.63 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. కర్షకులకు చేయూతనిచ్చేలా చర్చించాల్సిన అవసరముంది.

ఈ సారైనా.. హాజరయ్యేనా? జడ్పీ సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని అధికారులు తమ శాఖల్లో జరిగిన ప్రగతి, చేపట్టనున్న అభివృద్ధి పనులపై నివేదించాలి. కానీ, సమావేశాలు జరిగినప్పుడల్లా కొందరు అధికారులు గైర్హాజరవుతున్నారు. మరికొందరు ఉన్నతాధికారులు రాకుండా కిందిస్థాయి సిబ్బందిని పంపి మమ అనిపిస్తున్నారు.

ఆదాయంపై కొరవడిన శ్రద్ధ జడ్పీకి సొంత ఆదాయ వనరులు సమకూర్చుకునేందుకు పాలకవర్గం దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. మూణ్నెల్లకోసారి సమావేశాల్లో పాల్గొనడం మినహా ఇతర సమయాల్లో జడ్పీ ఆదాయం పెంపు, ఇతర మార్గాల్లో వనరుల అన్వేషణకు చొరవ చూపడం లేదన్న ఆరోపణలున్నాయి.

మిశ్రమం.. ఫలవంతం..!

రైతేరాజు

వ్యవసాయాన్ని పండగ చేస్తున్న యువ రైతు

జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో మురళీ సాగుచేసిన వేరుశెనగ చేను

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జీలుగుమిల్లి మండలం దర్భగూడెం గ్రామానికి చెందిన యువ రైతు దారబోయిన మురళీ ఏడాది పొడవునా ఆదాయం వచ్చేలా సాగు ప్రణాళికతో ముందుకు సాగుతూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. మురళీది వ్యవసాయ కుటుంబం. అతడి చిన్నతనంలో తండ్రి వీరాజు సంప్రదాయ పంటలైన వరి, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలు పండించేవారు. కాలక్రమేణా వీరాజు ఆకుకూరల సాగుకు పరిమితమయ్యారు. మురళీ బీటెక్ చదివి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేశారు. వ్యవసాయంపై మక్కువతో మురళీ తాను చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి తండ్రి వీరాజుకు చేదోడుగా ఉండేందుకు స్వగ్రామానికి వచ్చేశాడు.

మార్పు కోసం.. తొలినాళ్లలో మురళీ తన తండ్రితోపాటు ఎకరంలో తోటకూర, గోంగూర, కొత్తిమీర, పాలకూర, చుక్కకూర, మెంతి కూర వంటి వివిధ రకాలైన ఆకుకూరలను పండించేవారు. అయితే ఎకరాలలో రెండు, మూడు రకాల ఆకుకూరలు వచ్చే విధంగా ప్రణాళిక రూపొందించిన మురళీ ఆ దిశగా మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఆకుకూరలతోపాటు తక్కువ పెట్టుబడితో ఏడాది పొడవునా లాభాలు వచ్చేలా ఇతర పంటలు వేయాలని అనుకున్నాడు. దీంతో వివిధ రకాల పంటల సాగుపై అన్వేషించి చివరకు వేరు శెనగ సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. సుమారు 16 ఎకరాలు కౌలుకు తీసుకుని వేరుశెనగ సాగు ప్రారంభించారు.

ఉత్తమ సస్యరక్షణ చర్యలతో.. ఏడాదికి రెండు పర్యాయాలు వేరుశెనగ పంటను యువ రైతు పండిస్తున్నారు. విత్తనాలు చల్లే ముందు వ్యవసాయ క్షేత్రంలో పచ్చిరొట్ట విత్తనాలు, పశువుల పెంట, ఇతర పోషక లవణాలు మిళితమైన సహజసిద్ధ ఎరువులను చల్లి, కొద్ది రోజులు గడిచాక దుక్కి దున్నుతున్నారు. కాపు కాస్తున్న సమయంలో జీవామృతాన్ని డ్రిప్ ద్వారా అందిస్తూ పంటకు అదనపు బలం ఇస్తున్నారు. ★ 'మిశ్రమ వ్యవసాయంతో రైతులకు అదనపు ఆదాయం వస్తోంది. వేరుశెనగకు కూలీ ఖర్చులు తక్కువ. సొంతంగా చేసుకునే రైతులకు ఆదాయం బాగుంటుంది. ఏడాదికి సుమారు రూ.4 లక్షల పైగా మిగులుతోంది.' అని రైతు దారబోయిన మురళీ వివరించారు.



పందిరి అలంకరణ

కపర్దేశ్వరుని సేవలో ప్రియాంక మోహన్

తణుకు, న్యూస్‌టుడే: ఓజీ చలనచిత్ర హీరోయిన్ ప్రియాంక మోహన్ సోమవారం తణుకు కపర్దేశ్వర స్వామిని దర్శించుకున్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ జ్యోతిష్యులు భమిడి అఖిల్, మనపాటి భమిడి సీతారామ కృష్ణప్రసాద్ నివాసానికి ఆమె వచ్చారు. అనంతరం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకుని సందడి వాతావరణం నెలకొంది. యువత ఆమెతో స్వీయచిత్రాలు దిగేందుకు ఎగబడ్డారు.

నేడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

అత్తిలి గ్రామీణ, న్యూస్‌టుడే: అత్తిలి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం వేద పండితుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి 7.20 గంటలకు కనులపండువగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణాన్ని శోభాయమానంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు వేశారు. వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలంకరణ సెట్టింగులు వేశారు. బుధవారం తెల్లవారుజాము నుంచి స్వామివారి దర్శనభాగ్యం కల్పిస్తున్నారు. ఉదయం స్వామివారి తీర్థం, మధ్యాహ్నం బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్సై ప్రేమ రాజు తెలిపారు. ప్రాంగణంలో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

నేటి నుంచి అంతర పాలిటెక్నిక్ క్రీడలు

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో ఈ నెల 25 నుంచి 28 వరకు 13వ అంతర పాలిటెక్నిక్ క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. తిరుపతి వెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం (ఎస్వీవీయూ) పరిధిలోని 10 పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొనే ఈ పోటీలకు స్థానిక పాలిటెక్నిక్ కళాశాల అతిథ్యం ఇవ్వనుంది. ఈ పోటీలను ఎస్వీవీయూ వీసీ జేవీ రమణ ప్రారంభిస్తారని స్థానిక గేదెల పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త కె.ఆనందరావు, కళాశాల ప్రిన్సిపల్ వి.సమత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సర్వేశ్వరాయ విద్మహే

పంచారామ క్షేత్రం గునుపూడి సోమేశ్వరజనార్దనస్వామికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, సహస్రనామ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. - న్యూస్‌టుడే, భీమవరం ఆధ్యాత్మికం

ఆర్టీసీలో 40 రోజుల శిక్షణ

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ఎన్ఎస్ కార్పొరేషన్ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో 40 రోజుల శిక్షణ ప్రారంభించినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి వరప్రసాద్ సోమవారం తెలిపారు. శిక్షణ కోసం ఒక్కో అభ్యర్థికి రూ.20 వేలు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు.

ముందస్తు జాగ్రత్తలతో నష్ట నివారణ

వర్షాలకు తడిసిన వరి కుప్ప

మార్టేరు, న్యూస్‌టుడే: డెల్టాలో ఖరీఫ్ వరిచేలు కోత దశకు చేరాయి. ఇలాంటి తరుణంలో వర్షాలు కురిస్తే తీవ్ర నష్టం తప్పదు. ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే నష్టాన్ని చాలా వరకు తగ్గించుకోవచ్చని మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు టి.శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుత దశలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను ఆయన వివరించారు. ★ భారీ వర్ష సూచన ఉంటే కోతకు సిద్ధంగా ఉండి, నిలబడి ఉన్న చేలలో ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని (50 గ్రాములు లీటరు నీటికి) పిచికారీ చేయాలి. కోతలు పూర్తయి పనల మీద ఉంటే కంకులపై ఉప్పు చల్లాలి. దీని వల్ల కుంకులపై గింజలు మొలకెత్తకుండా, రంగు మారకుండా ఉంటాయి. ఎండరాగానే పనలను తిరగవేసి ఎండబెట్టి నూర్చుకోవచ్చు. ★ కోసిన వరి పనలు ఆరకుండా కుప్పలు వేయాల్సి వస్తే ఉప్పు చల్లడం ద్వారా ధాన్యానికి ఎలాంటి నష్టం వాటిల్లదు. 20 రోజుల వరకు కుప్పగా పనలను ఉంచవచ్చు. ★ నూర్పిడి దశలో ధాన్యం తడిస్తే గింజలు మొలకెత్తడమే కాకుండా రంగు మారి చెడు వాసన వస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉప్పు పొడి, ఊక కలిపి ధాన్యాన్ని పోగు పెడితే వారం రోజులు వరకు చెడిపోకుండా కాపాడుకోవచ్చు.

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

ప్రశ్న: కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో కొమ్ము పురుగు ఎలా అరికట్టాలి ? - ముళ్లపూడి జానకిరామారావు, తాడేపల్లిగూడెం

సమాధానం: చెట్ల మొవ్వ భాగంలో వచ్చే ఆకులు, కొబ్బరి మట్టలపై 'వి' ఆకారపు గుర్తులు ఉన్నప్పుడు వెంటనే యాజమాన్య చర్యలు చేపట్టాలి. తల్లి పురుగును ఆకర్షించడానికి నానో ఫిరమోన్ ఎరలు వాడాలి. ప్లాస్టిక్ బకెట్‌కు రెండు రంధ్రాలు పెట్టి మూతకు ఈ ఎరలను దారంతో కట్టాలి. బకెట్ లోపల అర లీటరు నీటిలో ఏదైనా పురుగుల మందు కలపాలి. ఎరకు ఆకర్షితమైన పురుగులు బకెట్‌లోని విషపు ద్రవంలో పడి చనిపోతాయి. కేవలం రూ.200తో 3-4 నెలల పాటు పురుగులను నియంత్రించవచ్చు. 10 గ్రా. క్లోరాంట్రానిప్రోల్ గుళికలు 100 గ్రా. ఇసుకతో కలిపి మొవ్వ, ఆకులో వేయాలి. తోటలో పశువుల ఎరువు ఉంటే కిలో మెటారైజియం, 20 కిలోల వేప చెక్క కలిపి టన్ను పశువుల ఎరువుపై వేస్తే పిల్ల పురుగులు చనిపోతాయి.

డా. పి.విజయలక్ష్మి, ప్రధాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

మీరూ అడగొచ్చు ✆ చరవాణి 73826 33692

లాభదాయకంగా చందువా సాగు

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: ఆక్వా చెరువుల్లో సముద్రజాతి చందువా (సిల్వర్ పాంపానో) చేప సాగు విజయవంతమైంది. వీటికి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. వీటి సాగు రైతులకు ప్రయోజనకరంగా, లాభదాయకంగా ఉంటుందని మత్స్యశాఖ సహాయ సంచాలకుడు ఎల్ఎల్ఎన్ రాజు తెలిపారు.

ప్రయోగం విజయవంతం శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాల్లోని సముద్రతీర ప్రాంత భూముల్లో చందువా చేపలను సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎంఎఫ్ఆర్ఐ), మత్స్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా సాగు చేశారు. ఇది విజయవంతం కావడంతో రైతులు ఉప్పునీటి క్షేత్రాల్లో వీటిని సాగు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఎంపిక చేసిన హేచరీల్లో పిల్లల ఉత్పత్తి ప్రారంభించారు. ఆచంట, భీమవరం మండలం దొంగపిండి గ్రామాల్లో రైతులు వీటి సాగు చేపట్టి సానుకూల ఫలితాలు సాధించారు.

చౌడు భూములు అనుకూలం.. సముద్రతీర, చౌడు భూములు వీటి సాగుకు అనుకూలం. మధ్యస్థ ఉష్ణోగ్రతలను తట్టుకుంటాయి. నీటిలో ఉప్పు శాతం ఐదు నుంచి 25 పీపీఎం అనుకూలం. పీహెచ్ 7.5-8.3 మధ్య ఉండాలి. నీటిలో ఆక్సిజన్ శాతం 4ఎంజీ పైన ఉండాలి. స్వచ్ఛమైన సముద్ర, ఉప్పుటేరు జలాల్లో ఇవి జీవిస్తాయి. ఆక్సిజన్ లోపం తలెత్తకుండా చెరువుల్లో నిరంతరం ఏరియేటర్లు తిప్పాలి.

☛ హేచరీల్లో ఉత్పత్తి చేసిన 1-2 అంగుళాల పొడవైన పిల్లలను ఎంపిక చేసుకోవాలి. ఎకరా చెరువులో మూడు వేల నుంచి నాలుగు వేల పిల్లలను వదలాలి. ☛ ఇవి మాంసాహార చేపలు. ప్రొటీన్ శాతం 40-50 మధ్య ఉండే తేలియాడే మేతలు వినియోగించాలి. ☛ 6-8 నెలల్లో ఈ చేప 400- 800 గ్రాముల వరకు బరువు పెరుగుతుంది. హెక్టారు చెరువులో సగటున 4-5 టన్నుల దిగుబడి సాధించేందుకు అవకాశం ఉంటుంది. ఎగుమతిదారులు కిలో చేపలకు రూ.400- రూ.450 వరకు ధర చెల్లిస్తున్నారని, రాబడి బాగుంటుందని ఏడీ తెలిపారు.

భీమవరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న నాయకులు

గణపవరాన్ని పశ్చిమలోనే కొనసాగించండి

గణపవరం, న్యూస్‌టుడే: ప్రజల సౌకర్యార్థం గణపవరం మండలాన్ని పశ్చిమ గోదావరి జిల్లాలోనే కొనసాగించాలని అఖిలపక్ష నాయకులు ఆందోళనకు దిగారు. సరిపల్లెలోని గణపవరం- భీమవరం రాష్ట్రీయ రహదారిపై సోమవారం బైఠాయించి నినాదాలు చేశారు. దాంతో రోడ్డుకిరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం ఎంపీడీవో బేబి శ్రీలక్ష్మి, తహసీల్దార్ అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు జగపతి రాజు, రామలింగరాజు, నరసింహరాజు పాల్గొన్నారు.

ఎండోస్కోపీ విధానంలో వెన్నెముక శస్త్ర చికిత్సలు

విర్డ్ ఆసుపత్రిలో వైద్యుల బృందం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో ఇప్పటి నుంచి ఎండోస్కోపీ విధానంలో వెన్నెముక శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉంటాయని ఆసుపత్రి ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. ఆసుపత్రిలో ఎండోస్కోపీ విధానంలో శస్త్ర చికిత్సలను సోమవారం విజయవంతంగా నిర్వహించారు. ప్రముఖ వెన్నెముక వైద్య నిపుణులు కె.సతీశ్, సాయి సందీప్, వైద్యుల బృందం ఐదుగురిని పరీక్షించి ముగ్గురికి శస్త్ర చికిత్సలు చేసింది. ఈ సందర్భంగా సుధాకరరావు మాట్లాడుతూ నడుము సమస్యలకు చిన్నపాటి కోతతో (సెంటీ మీటరు) ఎండోస్కోపీ విధానంలో ఆపరేషన్లు చేసినట్లు తెలిపారు. ఆసుపత్రి ట్రస్టీ వి.నారాయణమూర్తి, ఎస్.వి.ఎన్.ఎన్.నివృతరావు, ట్రస్టు సభ్యులు ఎన్వీఎస్ఎన్ మూర్తి, ఆసుపత్రి వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, పి.వి.నాగేంద్రబాబు, సింధు, రమ్య, మహిత తదితరులు పాల్గొన్నారు.

UCO BANK భీమవరం శాఖ (2921), జి2 ప్రగతి కాంప్లెక్స్, గరగపర్రు రోడ్, భీమవరం- 534201.

ఇ-వేలం అమ్మకం ప్రకటన (SARFAESI చట్టం 2002 క్రింద)

స్థిరాస్తి అమ్మకం కొరకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9(1) క్రింద 30 రోజుల నోటీసు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002) యొక్క రూల్స్ 5, 6, 7, 8 మరియు 9 తో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (SARFAESI చట్టం)క్రింద...

తేదీ: 25.11.2025, ప్రదేశం: భీమవరం. సం/- అధీకృత అధికారి, యూకో బ్యాంక్

సైబర్ మోసం.. పూటకో రూపం!

సందేశాలతో వల వేసి.. సొమ్ము లాగేస్తున్న నేరగాళ్లు

పాలకొల్లు, న్యూస్‌టుడే

☛ పాలకొల్లుకు చెందిన యువకుడు విశాఖపట్నంలో ఉద్యోగం చేస్తున్నారు. గతంలో తీసుకున్న రుణం చెల్లించాలంటూ ఒకరోజు అతడి వాట్సాప్‌కు విదేశీ నంబరు నుంచి సందేశం వచ్చింది. తాను ఎలాంటి రుణం తీసుకోలేదని సమాధానమివ్వగా.. అసభ్యకర మెసేజ్‌లు మొదలయ్యాయి. నంబరు బ్లాక్ చేస్తే కాంటాక్ట్ లిస్ట్‌లో ఉన్న నంబర్లకు అతడి న్యూడ్ ఫొటోలు పంపిస్తామనే బెదిరింపులు మొదలయ్యాయి. సదరు యువకుడు పోలీసులను ఆశ్రయించగా విదేశీ నంబరు కావడంతో ఏమీ చేయలేమని.. కొద్ది రోజుల పాటు వాట్సాప్ యాప్‌ను తొలగించాలని సూచించారు.

సైబర్ నేరాలు పూటకో కొత్త రూపం దాలుస్తున్నాయి. దుండగులు ఎప్పుడు ఏ తరహా మోసాలకు పాల్పడుతున్నారో అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆర్థిక లావాదేవీల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

బ్యాంకు లావాదేవీలను పసిగట్టి.. ఇటీవల వెలుగు చూసిన కొన్ని మోసాలను పరిశీలిస్తే ఆయా బ్యాంకు ఖాతాల లావాదేవీల ఆధారంగా నేరగాళ్లు వల విసురుతున్నట్లు తెలుస్తోంది. నరసాపురం మండలానికి చెందిన వ్యాపారి గతంలో బెట్టింగ్ యాప్‌లో యూపీఐ ఖాతా నుంచి నగదు లావాదేవీలు చేసేవారు. ఆయన దీపావళి సమయంలో చేసిన వ్యాపారానికి సంబంధించిన సొమ్ము రూ.15 లక్షలు ఆ ఖాతాలో జమ కాగా రూ.10 లక్షల వరకు సైబర్ నేరగాళ్లు కాజేశారు. చరవాణికి వచ్చిన విత్‌డ్రా సందేశం చూసిన ఆ వ్యాపారి పోలీసులను ఆశ్రయించారు. తనిఖీ చేయగా బంగ్లాదేశ్‌కు చెందిన ముఠా ఆ మొత్తాన్ని కాజేసినట్లు తేలింది. అంతటితో ఆగకుండా మర్నాడు మరో రూ.40 లక్షలు విత్‌డ్రా చేసేందుకు ఆ ముఠా రంగం సిద్ధం చేసినట్లు తనిఖీలో గుర్తించడంతో అప్రమత్తమైన బ్యాంకు అధికారులు ఆ ఖాతాను స్తంభింపజేశారు.

జాగ్రత్తలు తప్పనిసరి.. ఆన్‌లైన్ గేములు, రుణ యాప్‌లకు యూపీఐ లింకుల నుంచి లావాదేవీలు నిర్వహించకూడదు. ఎందుకంటే ఆ లింకును ఉపయోగించి సైబర్ నేరగాళ్లు ఎప్పుడైనా ఖాతా నుంచి సొమ్ము కాజేసే అవకాశం ఉంది. ☛ తెలియని వారికి అనవసరంగా చరవాణి నంబర్లు ఇవ్వడం కూడా ప్రస్తుత పరిస్థితుల్లో ఇబ్బందులకు దారితీస్తుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ☛ మన పేరిట బ్యాంకుల్లో ఇతరాత్ర ఖాతాలేవైనా కొనసాగుతున్నాయేమో తనిఖీ చేసుకోవాల్సిన ఆవశ్యకత కూడా ఉందంటున్నారు. నకిలీ ఖాతాల బెడద ఎక్కువైనందున ఇది తప్పనిసరని పాలకొల్లు గ్రామీణ సీఐ జి.శ్రీనివాస్ పేర్కొన్నారు.

రేషన్ నిల్వల్లో వ్యత్యాసాలు

జంగారెడ్డిగూడెం ఎంఎల్ఎస్ గిడ్డంగిలో విజిలెన్స్ తనిఖీలు

తూకం వేయగా అరకిలో తగ్గిన బియ్యం బస్తా

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం ఎంఎల్ఎస్ గిడ్డంగిలో రికార్డుల కంటే అధికంగా రేషన్ సరకులు ఉన్నట్లు గుర్తించామని విజిలెన్స్ తహసీల్దారు కన్యాకుమారి, ఎస్సై రంజిత్‌కుమార్‌లు తెలిపారు. గిడ్డంగిలో సోమవారం సాయంత్రం ఈ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాకుతో రికార్డులను సరిపోల్చగా బియ్యం, పంచదార, కందిపప్పుతోపాటు ఇతర సరకుల్లోను భారీ వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. వ్యత్యాసాలకు సంబంధించిన వివరాలు వెంటనే తాము చెప్పలేమని, నివేదిక మాత్రం పౌరసరఫరాల శాఖ డీఎంకు అందజేస్తామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. బియ్యం తూకంలో వ్యత్యాసం వస్తుందని డీలర్లు ఆరోపించడంతో ఈ సందర్భంగా సీఎస్ డీటీ వెంకట్ ఓ బియ్యం బస్తా తూకం వేయించారు. సంచితో కలిపి బియ్యం బరువు 50.580 కిలోలు ఉండాలి. కానీ ఇది 50 కిలోలు మాత్రమే ఉంది. 580 గ్రాములు తగ్గింది. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి తూకం వేయకుండా బస్తాలు లెక్క కట్టి ఇవ్వడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఈ సందర్భంగా ఓ డీలర్ ఆరోపించారు. దీంతో తూకం వేసే డీలర్లకు రేషన్ సరఫరా చేయాలని ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌ఛార్జిని అధికారులు ఆదేశించారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

9.55కి ఇక్కడ ఉండాలి

సమయానికి రాని అధికారులపై జేసీ ఆగ్రహం

ఈనాడు డిజిటల్, భీమవరం

- సమయం: ఉదయం 10.20
- రహదారులు భవనాల శాఖ అధికారులు వచ్చారా?...
- దేవాదాయ శాఖ అధికారులు ఇంకా రాలేదా?...
- మీ శాఖ జిల్లా ఉన్నతాధికారి ఎందుకు రాలేదు.. ఎవరి అనుమతి తీసుకుని కింది స్థాయి అధికారులను పీజీఆర్ఎస్‌కు పంపిస్తున్నారు?
- ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి తమ సమస్యలను చెప్పుకునేందుకు మన దగ్గరకు వస్తున్నారు... సమయానికి రాకపోతే ఎలా?
- అందరికీ చెబుతున్నా 9.55కి ఇక్కడ ఉండాలి.

జిల్లా ఉన్నతాధికారులు పీజీఆర్ఎస్‌కు సమయానికి రాకపోవడంతో వారిని ఉద్దేశించి జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలివీ... ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నారు. వ్యవసాయ శాఖ మొదలు ఆర్అండ్‌బీ వరకు 77 శాఖలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతారు. కానీ కొంత మంది సమయానికి రావడం లేదు. మరికొందరు కింది స్థాయి సిబ్బందిని పంపిస్తున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే పీజీఆర్ఎస్‌కు 10.30 వరకు అధికారులు వస్తూనే ఉన్నారు. దీన్ని గమనించిన రాహుల్‌కుమార్ రెడ్డి సంతకాల రిజిస్టర్‌ను పరిశీలించి ఆరా తీశారు. ప్రజలు ఎంతో దూరం నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం వస్తున్నారని, వారికి అంకిత భావంతో సేవలందించాలని సున్నితంగా హెచ్చరించారు.

అనుమతి తీసుకుని రండి.. పీజీఆర్ఎస్‌కు జిల్లాస్థాయి అధికారులు కాకుండా కింది స్థాయి సిబ్బంది వచ్చినట్లయితే కచ్చితంగా కలెక్టర్ అనుమతి తీసుకోవాలని, ఆలస్యంగా వచ్చినట్లయితే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ జేసీ ఆదేశించారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పోలీసుల కథనం మేరకు.. ఏలూరులోని మరడాని రంగారావు కాలనీకి చెందిన రామాయణపు గోపీనాథ్ అలియాస్ గోపి(22) తన స్నేహితుడితో కలిసి 2023 సెప్టెంబరు 4న బయటకు వెళ్లారు. అతడితో దక్షిణపు వీధి పరిధి జేపీ కాలనీకి చెందిన యర్రా గోవింద్ గొడవ పడ్డాడు. ఈ క్రమంలో గోవింద్ సీసా పగులగొట్టి గోపి మెడపై పొడిచి పరారయ్యాడు. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. దీనిపై మృతుడి తండ్రి అప్పారావు ఫిర్యాదు మేరకు యర్రా గోవింద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు తుది విచారణను జిల్లా రెండో అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఇందిరా ప్రియదర్శిని సోమవారం చేపట్టారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

సముద్రంలో గల్లంతైన విద్యార్థి మృతి

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెం బీచ్‌లో గల్లంతైన ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందారు. ఏలూరు పరిధి కొత్తపేటకు చెందిన మునగాల మోహనసాయి గణేశ్ (19) కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలులో ఇంజినీరింగ్ రెండో ఏడాది చదువుతున్నారు. ఆదివారం ముగ్గురు మిత్రులతో కలిసి ద్విచక్ర వాహనాలపై పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. సముద్రంలో స్నానానికి దిగిన గణేశ్ అలల ఉద్ధృతికి లోనికి కొట్టుకువెళ్లి గల్లంతయ్యారు. అతడి ఆచూకీ కోసం మెరైన్ పోలీసులు, బంధువులు, స్నేహితులు తీరంలో గాలిస్తుండగా సోమవారం మోళ్లపర్రు వద్ద మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై జి.వాసు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

ధాన్యం అమ్మకంలో ఇబ్బందులున్నాయా? : మంత్రి

రైతుతో మాట్లాడుతున్న మనోహర్, చిత్రంలో ఎమ్మెల్యే ధర్మరాజు

గుండుగొలను(భీమడోలు), న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానీయొద్దని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం పర్యటనకు వెళ్తున్న ఆయనకు.. మార్గం మధ్యలోని గుండుగొలను కూడలిలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, జనసేన నాయకులు సోమవారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రోడ్డు పక్కన ఆరబోసిన ధాన్యాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం పొలం మాసూళ్లు చేస్తున్న అన్నదాతల వద్ద కెళ్లి వారి సాధక బాధలు తెలుసుకున్నారు. పంట దిగుబడి ఎలా ఉంది? ధాన్యం కొనుగోలులో ఏవైనా సమస్యలు ఎదురవుతున్నాయా? అని ఆరా తీశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా సాంకేతిక ఇబ్బందులు నెలకొంటే వెంటనే పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

FINANCIAL SERVICES

JOBS

గమనిక

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం CLASSIFIEDS

అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉద్యోగోన్నతి

పెదఅమిరం (కాళ్ల), న్యూస్‌టుడే: ఉండి నియోజకవర్గంలో 13 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉద్యోగోన్నతి లభించింది. వారికి సోమవారం ఉప సభాపతి రఘురామకృష్ణరాజు తన కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. 13 మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చడం వల్ల అక్కడ పనిచేసే వారికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయని సీడీపీవో వి.వాణీవిజయలక్ష్మి తెలిపారు.

కొవ్వాడలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: కొవ్వాడలో విష్ణు విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరం ఏర్పాటు చేశారు. మొదటి రోజు గ్రామస్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ నెల 30 వరకు శిబిరం కొనసాగుతుందని విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ మంగం వేణు తెలిపారు.

భీమవరం

•భీమవరం •ఉండి

నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో గుండె వ్యాధులపై చిన్న పిల్లలకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు ఛైర్మన్ బి. బలరాం తెలిపారు. నిపుణులు విక్రమ్ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచిత శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు.

27న రైతుల సమస్యలపై సదస్సు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ ఉద్దరాజు రామం వర్ధంతి సందర్భంగా ఏఎస్ఆర్ నగర్‌లోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో 27న రైతు సమస్యలపై సదస్సు నిర్వహించనున్నట్లు నాయకులు సీతారాం, బి.బలరాం, గోపాలన్ తెలిపారు.

ఆలయానికి రంగులు

కుమారస్వామి విగ్రహం

షష్ఠి మహోత్సవాలకు ముస్తాబు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు ఆనాల చెరువు వద్ద నున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం షష్ఠి మహోత్సవాలకు ముస్తాబైంది. 26న అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకునే అవకాశం ఉందని అంచనా వేసి దానికి అనుగుణంగా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. సోమవారం ఆలయం వద్ద ఏర్పాట్లను ఎస్సై నాగరాజు, తహసీల్దార్ ఫరూక్, ఆర్ఐ ఆంజనేయులు, దేవాలయ తనిఖీదారు అల్లూరి సత్యనారాయణరాజు పరిశీలించారు. ఆలయ ఛైర్మన్ జి. సుబ్రహ్మణ్యంరాజు, మోటుపల్లి రామకృష్ణ, కిమిడి నాగరాజు తదితరులు ఉన్నారు.

ఉండి, న్యూస్‌టుడే: ఉండి రాజులపేటలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం స్వామి వారి ఊరేగింపు, సాయంత్రం కల్యాణం జరుగుతాయని, 29 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు.

సారూ.. ఇటు చూడరూ..

ప్రమాదకరంగా రహదారి అంచు

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం-బాలేపల్లి ఆర్అండ్‌బీ రహదారి పక్కనే ఉన్న పశ్చిమ పంట కాలువలోకి కుంగిపోతోంది. కోతకు గురైన రహదారి అంచులు ప్రమాదకరంగా ఉండటంతో అటుగా వెళ్లే వాహన చోదకులు భయపడుతున్నారు. ఆర్అండ్‌బీ ఏఈ డీఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ రహదారి అభివృద్ధికి రూ.3 కోట్లతో అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. వీలైనంత త్వరగా కోతకు గురైన ప్రాంతంలో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

ఊక బండి పగలే వస్తుందండి

వీరవాసరం, న్యూస్‌టుడే: 165 జాతీయ రహదారిపై ఊక ట్రాక్టర్లు తరచూ ట్రాఫిక్ అవాంతరాలు సృష్టిస్తున్నాయి. నిబంధనల ప్రకారం రాత్రి 8 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు మాత్రమే ప్రయాణించాల్సి ఉంది. కానీ పలువురు నిబంధనలు విస్మరించి పగలే నడపటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇటు పోలీసులు, అటు రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు.

నీటి కుండలకు.. నిర్లక్ష్యపు చిల్లు

ప్రమాదంగా ఓవర్‌హెడ్ ట్యాంకులు

కొత్తపూసలమూరు చెరువును అభివృద్ధి చేసి శుద్ధ జలాలు ఇవ్వాల్సి ఉన్నా అలా జరగడం లేదు. ఒక్కోసారి శుద్ధి చేయకుండానే నీటిని ఇస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఆక్వా చెరువుల్లో నీరు చేరుతుందని గతంలో ప్రజలు రోడ్డెక్కి ఆందోళన కూడా చేశారు.

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: వేసవి కాలం కాకపోయినా చాలా గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందడం కష్టంగా మారింది. ప్రధానంగా చాలా గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు శిథిలస్థితికి చేరాయి. వాటిని నెలలో రెండు సార్లయినా శుభ్రం చేయాలి. చాలా చోట్ల వాటిపైకి ఎక్కేందుకు ఉండే మెట్లు శిథిలమై రెండు నుంచి ఐదేళ్లు దాటింది. వాటి స్థానంలో కొత్తవి నిర్మించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

☛ భీమవరం మండలంలో తోకతిప్ప మంచినీటి చెరువు వద్ద ఉన్న రక్షిత మంచినీటి పథకం (ఓవర్ హెడ్ ట్యాంకు) ఎప్పుడో శిథిలమైంది. దాని లోపల తరచూ క్లోరినేషన్ చేసి శుభ్రం చేయాలి. మెట్లు విరిగిపోయి పైకి ఎక్కే అవకాశం లేకుండా పోయింది. దీన్ని శుభ్రం చేసి కొన్నేళ్లు గడిచిపోయింది. తర్వాత పైభాగంలో ఉండే శ్లాబ్ కూలిపోయింది. గత పాలకులు రూ.53 లక్షలతో ఇక్కడ ఫిల్టర్‌బెడ్, సంపు నిర్మించారు. కీలకమైన ఓవర్‌హెడ్ ట్యాంకును విస్మరించారు.

బేతపూడిలో మెట్లు పాడైన ఓహెచ్ఎస్ఆర్

నియోజకవర్గంలో ఇలా..

మండలాలు: 2 (భీమవరం, వీరవాసరం)	పంచాయతీలు: 48
	ఓహెచ్ఎస్ఆర్‌లు: 93
శిథిలస్థితికి చేరినవి: 14	నిర్వహణకు అవకాశం లేనివి: 23

ప్రతిపాదించాం..

'కొన్ని చోట్ల కొత్త ట్యాంకులు నిర్మించాలని ప్రతిపాదించాం. కొన్నింటికి మరమ్మతులు చేయించేందుకు కసరత్తు చేస్తున్నామని' గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ కనకారావు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం: 80085 74471	10 AM to 1 PM
భీమవరం మండలం: 80085 74533	వీరవాసరం: 80085 74475
పాలకోడేరు: 80085 74467	ఉండి: 80085 74526
ఆకివీడు: 80085 74525	కాళ్ల: 94401 04042

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ? భీమవరంలోని రైల్వే అండర్ పాస్‌ల్లో మురుగు తీయడం లేదు. కొన్నిచోట్ల పూడికలో ద్విచక్ర వాహనాలు పడిపోతున్నాయి. - పి.రామారావు, ప్రైవేటు ఉద్యోగి

? యనమదుర్రు కాలువ గట్టున చెత్త వేసి నిప్పు పెట్టడంతో ఇబ్బందిగా ఉంది. వాసన భరించలేకపోతున్నాం. - సాయిబాబు, చిరువ్యాపారి

✔ రైల్వే అండర్‌పాస్‌లను వెంటనే శుభ్రం చేయిస్తాం. ప్రైవేటు వ్యక్తులు చెత్త వేస్తున్నారు. అక్కడ వేయవద్దని చెబుతాం. వినకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. - ఎ.రాంబాబు, సహాయ కమిషనర్

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ? పట్టణంలోని 13వ వార్డులో నల్లంవారితోట ప్రధాన రహదారిలో పలుచోట్ల వీధి దీపాలు వారం నుంచి వెలగడం లేదు. - స్థానికులు

✔ పరిశీలించి దీపాలు వెలిగేలా చూస్తాం. - సాంబశివరావు, పురపాలక ఏఈ

ఉండి, న్యూస్‌టుడే : ? చిలుకూరు నుంచి వెలివర్రు వచ్చే పంట కాలువలో నీరు సరిగ్గా ప్రవహించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. - వరలక్ష్మి, చిలుకూరు

✔ పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. - ప్రసాదరాజు, ఏఈ, జల వనరుల శాఖ

స్పందనకు వందనం

ఉండి, న్యూస్‌టుడే: రామాపురం నుంచి మట్టి, ఇతర వ్యర్థాలతో పూడిపోయిన పాములపర్రు పంట బోదెను జల వనరుల శాఖ ఉండి ఏఈ ఫణిశంకర్ సోమవారం పరిశీలించారు. మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన ఈనాడులో సోమవారం ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి పంపుతామని ఏఈ వివరించారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపల్ రామకృష్ణ

ఉపన్యాసంలో విజేతలు

'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలను భీమవరంలోని నారాయణ ఆంగ్లమాధ్యమ పాఠశాలలో సోమవారం నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై విద్యార్థులు ఉపన్యాసంతో ఆకట్టుకున్నారు. అనవసర విషయాలకు చరవాణి ఉపయోగించడంతో సమయం వృథా, ఆరోగ్యం ఎలా దెబ్బతింటుందో వివరించారు. 8వ తరగతి విద్యార్థులు జె.సత్య శ్రీధర్, కె.ధర్షిక, ఆర్.పావని వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించగా ప్రిన్సిపల్ జి.రామకృష్ణ, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

ప్రజలందరికీ సురక్షిత జలాలు

నీటి బిందెను మహిళలకు అందిస్తున్న ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, కలెక్టర్ నాగరాణి

కలిసిపూడి, చిలుకూరు, (ఉండి), న్యూస్‌టుడే: ప్రజలందరికీ సురక్షిత జలాలు సరఫరా చేయాలనే తన లక్ష్యానికి కెనరా బ్యాంకుతో పాటు దాతలు ముందుకురావడం అభినందనీయమని ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు తెలిపారు. చిలుకూరు, కలిసిపూడిలో మైక్రోఫిల్టర్లను ఆయన కలెక్టర్ నాగరాణితో కలిసి ప్రారంభించారు. సర్పంచులు కేశబోయిన జానకి శ్రీనివాస్, ముదునూరి వెంకట సోమరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో రఘురామకృష్ణరాజు మాట్లాడారు. స్వచ్ఛమైన తాగునీటి సరఫరాతో వివిధ రకాల వ్యాధులను అరికట్టవచ్చని, ప్రజలు నీటిని వృథా చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్ ఫణికుమార్, ఏఎంసీ ఛైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు, ఉండి డీసీ వైస్ ఛైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు, చిలుకూరు నీటి సంఘం అధ్యక్షుడు సత్యనారాయణరాజు, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, ఉప సర్పంచులు మంతెన చంటిరాజు, రుద్రరాజు పరమేశ్వర రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసరావు, ఏఈ హరనాథరాజు, తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు. చిలుకూరులో ఇంటిగ్రేటెడ్ ఆక్వా టెస్టింగ్ ల్యాబ్‌ను ఉపసభాపతి రఘురామకృష్ణరాజు ప్రారంభించారు.

తెలుగు మాధ్యమం చాలా అవసరం

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెన్మెత్స సాయి వర్మ అన్నారు. ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహించారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని కోరారు. సంఘ నాయకులు ఉంగరాల బ్రహ్మానందం, శ్రీనివాసరావు, దావీదు పాల్గొన్నారు.

15 అర్జీల స్వీకరణ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమానికి 15 అర్జీలు అందాయని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భర్త, అత్తింటి వేధింపులు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్, ప్రేమిస్తున్నానని మోసాలపై వచ్చిన ఫిర్యాదులను చట్టపరిధిలో పరిష్కరించాలని సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులను ఆదేశించారు.

రొయ్యల చెరువులో విషప్రయోగం

కుప్పనపూడి (ఆకివీడు), న్యూస్‌టుడే: ఆకివీడు మండలం కుప్పనపూడి గ్రామానికి చెందిన మారుబోయిన రాంబాబు అదే గ్రామంలో ఎకరం చెరువు లీజుకు తీసుకుని రొయ్యల సాగు చేస్తున్నారు. 24వ తేదీ ఉదయం చెరువు వద్దకు వెళ్లి చూడగా రొయ్యలు చనిపోయినట్లు గుర్తించారు. చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు పురుగు మందు కలిపారని, దీంతో 35 కౌంటులో ఉన్న సుమారు 2.50 టన్నుల రొయ్యలు చనిపోవడంతో సుమారు రూ.10 లక్షల నష్టం వాటిల్లినట్లు సాగుదారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై నాగరాజు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిశీలిస్తున్న ఎస్సై నాగరాజు

రమాదేవికి అభినందనలు

చెరుకువాడ (ఉండి), న్యూస్‌టుడే: జాతీయ స్థాయిలో జరిగే యోగాసన, క్లాసికల్ పాటల పోటీలకు హిందీ పండితురాలు హెచ్ రమాదేవి ఎంపికవ్వడం అభినందనీయమని చెరుకువాడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ అక్బర్ చక్రవర్తి తెలిపారు. పాఠశాలలో ఆమెను విద్యార్థులతో కలిసి అభినందించారు.

పదవికి రాజీనామా

వీరవాసరం, న్యూస్‌టుడే: వైకాపా రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి పదవికి రాజీనామా చేసినట్లు కొణితివాడకు చెందిన ఆ పార్టీ నాయకుడు నాగరాజు శ్రీనివాసరాజు సోమవారం తెలిపారు. ఈమేరకు లేఖను భీమవరం వైకాపా ఇన్‌ఛార్జి వెంకటరాయుడికి అందజేసినట్లు చెప్పారు.

జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమగ్ర కుల గణన చేపట్టి జనాభా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కేటాయించి ఆ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ కోరారు. ఈ అంశంపై సంఘం ప్రతినిధులతో పాటు ఆయన కలెక్టర్ నాగరాణిని కలిసి వినతిపత్రం అందజేశారు.

రంగసాయికి పరామర్శ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణానికి చెందిన శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి అస్వస్థతకు గురయ్యారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సోమవారం పరామర్శించారు.

అప్పారావుకు నివాళి

కొణితివాడ (వీరవాసరం), న్యూస్‌టుడే: కమ్యూనిస్టు నాయకుడు కిలాడి అప్పారావు అయిదో వర్ధంతిని కొణితివాడలో సోమవారం నిర్వహించారు. సీపీఎం సీనియర్ నాయకుడు యాళ్లబండి నారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో అప్పారావు చిత్రపటానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జుత్తిగ నరసింహమూర్తి, వ్యకాసం నాయకులు ఆకుల హరేరాం, అయినంపూడి బాబూరావు, పాలా అజయ్‌ఘోష్, మైగాపుల త్రిమూర్తులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

మద్యం తాగారని వదంతులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని ఓ కళాశాలకు చెందిన విద్యార్థినులు తరగతి గదిలోని బల్లలపై కూర్చొని మద్యం తాగినట్లు సామాజిక మాధ్యమాల్లో వార్తలు చక్కర్లు కొట్టాయి. దీనిపై సంబంధిత విద్యాసంస్థ నుంచి వివరాలు సేకరిస్తున్నామని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ప్రభాకర్ తెలిపారు.

ధాన్యం దిగుబడులు వర్షార్పణం

అధిక వానలతో నష్టపోయిన అన్నదాతలు

ఉండి, కాళ్ల, భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో అక్టోబరులో కురిసిన అధిక వర్షాలు ఖరీఫ్ వరి పంటపై కంటికి కనిపించని స్థాయిలో తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఈనిక, గింజ పాలుపోసుకోవడం, గింజ తయారీ దశల్లో వర్షాలు పడటంతో పంట పూర్తిగా పక్వానికి రాకపోవడంతో తాలుతప్పల శాతం పెరిగి ఆశించిన దిగుబడులు రావడం లేదు. దీంతో పెట్టుబడులు దక్కక చిన్న, సన్నకారు, కౌలు రైతులు నష్టాలను మూటగట్టుకున్నారు.

ఉండి, భీమవరం నియోజకవర్గాల్లోని ఆరు మండలాల్లో 48,563 ఎకరాల్లో వరి సాగు చేశారు. తొలుత ఎకరానికి 35 బస్తాలకు మించి దిగుబడులొస్తాయని అంచనా వేశారు. అక్టోబరులో కురిసిన వర్షాలతో అన్నదాతల ఆశలు ఒక్కసారిగా ఆవిరైపోయాయి. చేలు నిలబడిన చోట్ల తాలు, తప్పలుగా మారి 30 బస్తాల్లోపు దిగుబడులు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. నేలకొరిగిన చోట్ల 25 బస్తాలు కూడా రావడం గగనమైపోతోందని ఆవేదన చెందుతున్నారు. బురద, పదును ఉన్న చేల్లో యంత్రాలు దిగబడిపోతున్నాయి. గంటలో ఎకరంలో పంట కోత పూర్తవ్వాల్సి ఉండగా.. అది రెండు, మూడు గంటలకు మించి సమయం పడుతోంది. కొన్నిచోట్ల ఎకరాకు రూ.7-8 వేల మధ్య కోత ఖర్చులు అవుతున్నాయి. ధాన్యం ఒడ్డుకు చేరేసరికి రూ.35 - 36 వేల వరకూ పెట్టుబడి వ్యయమవుతోంది. ఎకరానికి 12-14 బస్తాల చొప్పున మక్తా తీసేయాలి. ఈ దశలో ఎకరానికి రూ.10 వేలకు మించి అప్పు ఉంటుందని సాగుదారులు ఆవేదన చెందుతున్నారు.

ఉండిలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

చిలుకూరులో పంట కోస్తున్న యంత్రం

సాగు వివరాలు (ఎకరాల్లో)

మండలం	విస్తీర్ణం	కోసిన విస్తీర్ణం
ఉండి	10,815	796
కాళ్ల	3,822	330
ఆకివీడు	4,056	208
పాలకోడేరు	11,400	1,215
వీరవాసరం	12,120	151
భీమవరం	6,050	1,022

25-30 బస్తాలు వస్తుంది

వర్షాల ప్రభావంతో కొన్నిచోట్ల ఎకరాకు 25-30 బస్తాల మధ్య దిగుబడులు వస్తున్నాయి. పంట కోత ప్రయోగాల్లో మాత్రం దిగుబడులు సాధారణంగానే ఉన్నాయి. కొన్ని రకాలైతే 30-35 బస్తాల మధ్య వస్తుంది. - కె.ప్రతాప్ జీవన్, ఏడీఏ, ఉండి

భీమవరం: చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు

పట్టాభి సేవలు ఆదర్శనీయం

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడు పట్టాభి సీతారామయ్య నేటితరానికి ఆదర్శమని గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక వైఎస్ఆర్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో పట్టాభి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పాలకోడేరు, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడు పట్టాభి సీతారామయ్య జయంతిని పాలకోడేరు శాఖా గ్రంథాలయంలో సోమవారం నిర్వహించారు. గ్రంథాలయాధికారి కృష్ణమూర్తి, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి వేతనాలు పెంచాలని సర్వశిక్షా అభియాన్ ఒప్పంద ఉద్యోగులు డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే డిసెంబరు 10న విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, జనవరి నుంచి సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా నాయకులు నరేష్, ఆనంద్, వాసు, తాతయ్య పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షలో ఒప్పంద ఉద్యోగులు

అమ్మా నీ దర్శనం ఎలా

అన్నప్రసాదం క్యూలైను, దర్శనానికి వెళ్లే భక్తుల మధ్య వాహనాలు

ఎండకు ఎండుతూ వర్షానికి తడుస్తున్న రథం

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: నిత్యం మావుళ్లమ్మ దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. శుక్రవారం, ఆదివారం వారి రద్దీ మరింత పెరుగుతుంది. ఆలయం - కార్యాలయం మధ్య ఉన్న రహదారిలో అన్నప్రసాదం స్వీకరించే భక్తులు టోకెను తీసుకుని క్యూలో ఉంటారు. అదే దారిలో భక్తులు దర్శనానికి వెళ్తుంటారు. ఇదిలా ఉండగా వాహన చోదకులు అక్కడే వాహనాలు నిలిపేస్తున్నారు. కొందరు రయ్‌మని రావడంతో భక్తులు ప్రమాదాలకు గురవుతున్నారు. పైగా రూ.లక్షల వ్యయంతో భక్తులు ఇచ్చిన అమ్మవారి రథం రహదారిపై పెట్టి వదిలేశారు. అది ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తోంది. ఆలయాధికారి నగేష్ మాట్లాడుతూ రథం మరో చోటుకు మారుస్తామని, ట్రాఫిక్ విషయమై పోలీసులు, పురపాలక అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

కార్డులు ఇక్కడ.. లబ్ధిదారులు ఎక్కడ

పంపిణీ కానివి 8,533

స్మార్ట్ కార్డు

వీరవాసరం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం టన్నుల కొద్దీ పక్కదారి పట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పౌర సరఫరాల శాఖను బలోపేతం చేసి బియ్యం దారి మళ్లకుండా పలు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఇటీవల స్మార్ట్ రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకొచ్చింది. రెండు నెలలుగా వీటి పంపిణీ ప్రక్రియ జరుగుతోంది. భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో వందల సంఖ్యలో లబ్ధిదారులు కార్డులు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. దీంతో అవి రద్దు అయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

భీమవరం, ఉండి నియోజకవర్గాల్లోని ఆరు గ్రామీణ మండలాల్లో 1,61,476 కార్డులకు ఇప్పటి వరకు 1,53,063 సచివాలయ, రెవెన్యూ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఇంకా 8,533 సిబ్బంది వద్ద ఉన్నాయి. వీటికి సంబంధించిన వారు ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి. మృతులు, శాశ్వతంగా, తాత్కాలికంగా వలస వెళ్లిన వారు కూడా ఉన్నట్లు సమాచారం. కొన్ని బోగస్ కార్డులు కూడా ఉండవచ్చనే అనుమానాలు ఉన్నాయి. మిగిలిపోయిన కార్డులను తహసీల్దార్ కార్యాలయాల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అందజేస్తున్నారు.

నియోజకవర్గంలో పంపిణీ ఇలా..

మండలం	మొత్తం	ఇచ్చినవి	పెండింగ్
కాళ్ల	21,666	21,020	646
పాలకోడేరు	18,472	17,898	694
ఉండి	20,345	19,252	1,093
ఆకివీడు	21,772	20,625	1,147
భీమవరం	59,258	55,153	4,105
వీరవాసరం	19,963	19,115	848

తొలగించే అవకాశం

స్మార్ట్ రేషన్ కార్డులు తీసుకోని వారికి ప్రభుత్వం రేషన్ రద్దు చేసే అవకాశం ఉంది. తాత్కాలికంగా ఉపాధి నిమిత్తం వలస వెళ్లిన వారు ఎక్కడ ఉన్నా తహసీల్దార్ కార్యాలయాలకు వచ్చి తీసుకోవాలి. - ఏవీ. రామాంజనేయులు, తహసీల్దార్, వీరవాసరం

రైతుల ఇంటికి వెళ్లి కరపత్రాలు అందజేస్తున్న జేసీ

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

పాలకోడేరు, న్యూస్‌టుడే: రైతు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మలుచుకోవాలని జేసీ టి. రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం పాలకోడేరులో పలువురు రైతుల ఇంటికి వెళ్లి ఆధునిక వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు ధర, మార్కెటింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారిణి బి.సంధ్య, పశు వైద్యాధికారిణి హేమ, డీటీ రఘు పాల్గొన్నారు.

శాస్త్రీయ వ్యవసాయంతో గిట్టుబాటు

పెదఅమిరం (కాళ్ల), న్యూస్‌టుడే: శాస్త్రీయ పద్ధతి ద్వారా వ్యవసాయం చేస్తే రైతుకు మంచి గిట్టుబాటు ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వరరావు అన్నారు. 'రైతన్న మీ కోసం' కార్యక్రమంలో భాగంగా పెదఅమిరంలో రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన ఐదు సూత్రాలను వివరించారు. కరపత్రాలను అందజేశారు. సర్పంచి సోమేశ్వరరావు, ఏడీఏ ప్రతాప్‌జీవన్, ఏవో పి. రమేష్‌నాయుడు, తహసీల్దార్ సుందర్‌సింగ్ పాల్గొన్నారు.

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మాదివాడ ప్రాంతంలో 'రైతన్న-మీ కోసం' కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ బొల్లా వెంకట్రావు తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు. రైతుల ఇంటికి వెళ్లి సీఎం సందేశం వినిపించి, కరపత్రాలను అందించారు. ఏవో ప్రియదర్శిని, తహసీల్దార్ ఫరూక్, ఆర్ఐ ఆంజనేయులు, ఆకివీడు నీటి సంఘం అధ్యక్షుడు మోటుపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

యూరియా వాడకం తగ్గించండి

రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

పాలకోడేరు, న్యూస్‌టుడే: వరి పంటకు యూరియా వాడకం తగ్గించి, నీటి యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే మంచి దిగుబడులతో పాటు లాభాలు ఆర్జించవచ్చని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా గొరగనమూడి, శృంగవృక్షం, విస్సాకోడేరు, వేండ్ర, పాలకోడేరులో రైతులను కలిసి ప్రకృతి వ్యవసాయం, డ్రోన్ల వినియోగం, యాంత్రీకరణ పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు ఎన్.మల్లికార్జునరావు, ఎ.శ్రీనివాసరావు, పి.వినయలక్ష్మి, సమన్వయకర్తలు ఎన్.డెబోరామెస్సియానా పాల్గొన్నారు.

చోరీలు అరికట్టాలని వినతి

నరసాపురం, న్యూస్‌టుడే: ఆక్వా చెరువులు, వరి చేల వద్ద విద్యుత్తు మోటార్లు, ఇతర ఉపకరణాల చోరీలు అరికట్టాలని కోరుతూ డీఎస్పీ జి.శ్రీవేదఅరవిందకు రైతులు సోమవారం వినతి పత్రం అందించారు. మొగల్తూరు పోలీస్‌స్టేషన్ పరిధి భీమవరం మండలం వెంపలో ఇటీవల పదుల సంఖ్యలో చోరీలు జరిగాయని, రూ.లక్షల విలువైన సామగ్రి అపహరణకు గురైందని చెప్పారు.

(c) eenadu

భూ సమస్యలతో ఇబ్బందులా? రేపు ఆర్డీవోతో ఫోన్ ఇన్

తేదీ: 26.11.25 (బుధవారం)
సమయం: ఉదయం 10-11 గంటల మధ్య
చరవాణి సంఖ్య: 93911 85874

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని పట్టణాలు, గ్రామాల్లో స్థలాలు, సాగు, ఇతర భూములకు సంబంధించిన సమస్యలు ఎదుర్కొంటున్నారా..? సర్వే పరమైన ఇబ్బందులు ఉన్నాయా? వీటితో రెవెన్యూశాఖ పరిధిలో సమస్యలను ఆర్డీవో దాసి రాజు దృష్టికి తీసుకువెళ్లే అవకాశాన్ని 'ఈనాడు' మీకు కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా నిర్ణీత సమయంలో ఇక్కడ పేర్కొన్న చరవాణి నంబరుకు ఫోన్‌చేసి పేరు, ఊరు తదితర వివరాలతో సమస్యను క్లుప్తంగా తెలియజేయవచ్చు.

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

ఉపముఖ్య మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

నరసాపురం, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా ఐఎస్ జగన్నాథపురంలో సోమవారం పర్యటించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయనతో మాట్లాడినట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తెలిపారు.

బసవేశ్వరుడికి మహా బిల్వార్చన

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలోని పార్వతీ బసవేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం సహస్ర మహా బిల్వార్చన, పంచామృత అభిషేకాలు చేశారు. పట్టణంలోని పలు శివాలయాల్లో స్వామికి అభిషేకాలు, సహస్ర నామార్చనలు చేసి పంచహారతులు ఇచ్చారు.

విశ్వేశ్వరస్వామికి అభిషేకాలు.. పోడూరు, న్యూస్‌టుడే: మినిమించిలిపాడులో కొలువైన అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామికి సోమవారం అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

షష్ఠి మహోత్సవాలకు ముస్తాబు

ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణ

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలకు పట్టణంలో ఆలయాలను చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. పాలకొల్లులో వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పంచాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవాలకు సోమవారం అంకురార్పణ జరిగింది. 25న కల్యాణం, 26న రథోత్సవం జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

సాధనతో నైపుణ్యం

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

ఆచంట, న్యూస్‌టుడే: సాధన ద్వారా వేదికలపై నిర్భయంగా మాట్లాడే నైపుణ్యం సంపాదించవచ్చని వక్తలు అన్నారు. ఆచంట మండలం వల్లూరు పరిధి ఎంపీపాలెం పాఠశాల (హైస్కూల్ ప్లస్)లో విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం వక్తృత్వ పోటీలు జరిగాయి. కృత్రిమ మేధ- భవిష్యత్తు పరిణామాలు' అంశంపై విద్యార్థులు చక్కటి ఉపన్యాసాలు ఇచ్చారు. ఈ పోటీల్లో పూరెళ్ల ఆశాప్రణీత, ఉండవల్లి సౌమ్య, బొంతు సంధ్య వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు ఆకిన రామకృష్ణ, ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

మాటు వేసి.. అదను చూసి!

వరుస చోరీలతో కలవరం

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణం, సమీప గ్రామాల్లో జరిగిన వరుస చోరీలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దుండగులు తాళం వేసిన ఇళ్లతో పాటు దుకాణాలు, పొలాల్లో సైతం చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల బ్యాంకుల వద్ద, రద్దీ ప్రాంతాల్లో మాటు వేసి ద్విచక్ర వాహనాల్లో నగదును సైతం అపహరించారు. తాజాగా ఆదివారం రాత్రి నరసాపురం పట్టణంలో తాళం వేసిన ఇళ్ల తలుపుల గడియలను పగలకొట్టి చోరీలకు తెగబడ్డారు.

నరసాపురం: ఆదివారం రాత్రి దొంగతనం జరిగిన ఇంట్లో ఇలా..

నెల రోజుల నుంచి.. గత నెల రోజులుగా నరసాపురం పట్టణంలో పలు ప్రాంతాల్లో చోరీలు జరిగాయి. వ్యాపారం నిమిత్తం ఓ కుటుంబం రూ.3.70 లక్షలు సమకూర్చుకుని ఇంట్లో భద్రపరచగా ఆ సొమ్మును దొంగలు ఎత్తుకెళ్లిపోయారు.

✦ వేములదీవికి చెందిన రైతు తన ద్విచక్రవాహనం కవర్లో ఉంచిన రూ.2 లక్షల నగదు పట్టణంలో అపహరణకు గురైంది. ✦ పట్టణంలోని ఇనుప సామగ్రి దుకాణంలో చోరీకి పాల్పడిన నిందితులు నగదుతో పాటు కంప్యూటర్ హార్డ్ డిస్క్‌ను కూడా వెంట తీసుకువెళ్లారు.

✦ నియోజకవర్గంలో ఏదో ఒక చోట నిత్యం వాహన చోరీలు జరుగుతున్నాయి. బాధితులు ఫిర్యాదు చేసినా ఒకటీ.. అరా మాత్రమే కేసులు నమోదవుతున్నాయి.

వ్యవసాయ క్షేత్రాల్లోనూ.. పొలాల్లో, ఆక్వా చెరువుల వద్ద విద్యుత్తు మోటార్లు, సామగ్రిని చోరులు అపహరించుకుపోతున్నారు. ఇటీవల కొత్తపాలెంలో ఆక్వా చెరువు వద్ద ఆయిల్ ఇంజిన్ చోరీకి గురైంది. భీమవరం మండలం వెంపలో గత రెండు నెలల్లో సుమారు 150 వరకు మోటార్లు, ఆయిల్ ఇంజిన్లు, సామగ్రి అపహరణకు గురైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియంత్రణకు చర్యలు చోరీల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. దొంగలను పట్టుకోవడంతో పాటు చోరీ సొత్తు రికవరీకి కృషిచేస్తాం. ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో సమీప పోలీస్‌స్టేషన్లో సమాచారం ఇస్తే ఆ ప్రాంతంలో నిఘా పెంచుతాం. నేరాల నియంత్రణకు ప్రజలు కూడా సహకరించాలి. - బి.యాదగిరి, పట్టణ సీఐ, నరసాపురం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం	80085 74504	ఆచంట	90631 44737
పాలకొల్లు	80085 74510	పెనుగొండ	80085 74469
పోడూరు	90631 44741	పెనుమంట్ర	91212 29087

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ? కంచర్లవారి వీధిలో కొద్ది రోజులుగా వీధిదీపాలు వెలగడం లేదు. - **గోపాలకృష్ణ, పాలకొల్లు**
✔ పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. -**రాజ్‌కుమార్, పురపాలక డీఈ**

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ? పాలకొల్లు మండలం పూలపల్లిలో ప్రధాన రహదారిపై చెత్త వేస్తున్నారు. దుర్వాసన భరించలేక పోతున్నాం. - **శివ, స్థానికుడు**
సమాధానం: ఆ ప్రాంతాన్ని పరిశీలించి చెత్త తొలగింపు పనులు చేయిస్తాం. - **పి.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి**

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? పట్టణంలో రైతుబజారు వద్ద చెత్తను సక్రమంగా తొలగించడం లేదు. పశువులు వ్యర్థాలను చెల్లాచెదురు చేస్తున్నాయి. - **ఎ. శ్రీనివాస్, నరసాపురం**
✔ చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి తరలించేలా చర్యలు తీసుకుంటాం. - **ఎం. అంజయ్య, పురపాలక కమిషనర్**

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? మెట్టురేరు ప్రాంతంలో విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. తరచూ సరఫరా నిలిచిపోతుంది. - **రాము, కేపీపాలెం**
✔ పరిశీలించి వెంటనే పాదుల తొలగింపు, ఇతర నిర్వహణ పనులు చేయిస్తాం. - **ప్రభాకరరావు, ఇన్‌ఛార్జి ఏఈ**

దోమల నివారణకు చర్యలు.. స్పందనకు వందనం

పెనుగొండ, న్యూస్‌టుడే: మునమర్రులోని పలు ప్రాంతాల్లో మురుగు నిలిచిపోయి దోమలు విజృంభిస్తున్న తీరుపై ఈ నెల 6న 'ఈనాడు- మేమున్నాం. .మీకు తోడుగా'లో ప్రచురితమైన వార్తకు సర్పంచి టి.వెంకటసత్య నాగరత్నం, ఎంపీడీవో టి.సూర్యనారాయణ మూర్తి స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో పలు ప్రాంతాల్లో దోమలు నివారణ మందు పిచికారీ చేయించారు.

గడువులోపు అర్జీల పరిష్కారం: ఆర్డీవో

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చిన అర్జీలు, ఫిర్యాదులకు నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలని ఆర్డీవో దాసి రాజు అధికారులకు సూచించారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా వినతుల పరిష్కార వేదిక'లో ఆయన పాల్గొని నుంచి వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి సంబంధింత శాఖల సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

సమస్యలు తెలుసుకుంటున్న దాసి రాజు

మొత్తం 38 వినతులు అందాయని కార్యాలయ సిబ్బంది తెలిపారు. ● పక్షవాతంతో ఇబ్బంది పడుతున్నానని, సంక్షేమ పింఛను మంజూరు చేయలేదని, కుమారుడు తన బాగోగులు చూడటంలేదని ముత్యాలపల్లికి చెందిన కొల్లాటి సత్యవతి అర్జీ ఇచ్చారు. ● కళాశాల యాజమాన్యం తమపై నిరంకుశంగా వ్యవహరిస్తోందని పి.ఝాన్సీ లక్ష్మీ కుమారి, తల్లిదండ్రులు లేని చిన్నారిని తాను సాకుతున్నానని, ఆ బిడ్డకు అపార్ నమోదు చేయించాలని పట్టణానికి చెందిన కొల్లాబత్తుల బుజ్జి అర్జీలు ఇచ్చారు.

వ్యాపార రంగంలో అపార అవకాశాలు

పాలకొల్లు, న్యూస్‌టుడే: వ్యాపార రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని. . వీటిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని పాలకొల్లుకు చెందిన ప్రముఖ వ్యాపారి గాదె సుబ్బారావు అన్నారు. పాలకొల్లు ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'విజయవంతమైన ఆవిష్కర్తలు- వ్యవస్థాపకులు' అంశంపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడారు. వ్యాపారంలో సృజనాత్మకతను జోడిస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చన్నారు. ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి, అధ్యాపకులు టి.కృష్ణ, కె.భద్రాచలం, ఎం.రామకృష్ణ, బూసి వెంకటస్వామి పాల్గొన్నారు.

మీరైనా.. ఆదుకుంటారని!

'ప్రజా వినతుల పరిష్కార వేదిక'లో ఫిర్యాదులు

రుస్తుంబాద (నరసాపురం), న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలంటూ పురపాలక సంఘాలు, పంచాయతీల్లో అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందికి వినతులు అందిస్తున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి తమ కష్టం తీరుస్తారనే ఆశతో ఇక్కడి వరకు వచ్చామని సోమవారం నరసాపురం ఆర్డీవో కార్యాలయంలో అర్జీలు ఇచ్చిన పలువురు తెలిపారు.

ముంపుతో సాగు చేయలేక



కొప్పర్రు, లిఖితపూడి, సరిపల్లి, రుస్తుంబాద ప్రాంతాల్లో విస్తరించిన నత్తలావ డ్రెయిన్ కొన్నేళ్లుగా ప్రక్షాళనకు నోచుకోలేదు. దీని ఆయకట్టు పరిధిలో సుమారు 2 వేల ఎకరాలు ముంపుబారిన పడి సాగు చేయడానికి వీలులేకుండా కొల్లేరును తలపిస్తున్నాయి. దీనిపై స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.
- వాండ్రప్పు వెంకటసత్యనారాయణ, లిఖితపూడి

బాధితులను ఆదుకోలేదు

తూర్పుతాళ్లు గ్రామంలో గణపతి నిమజ్జనోత్సవాల్లో ట్రాక్టర్ దూసుకెళ్లిన ఘటనలో నా కుమారుడితో పాటు మరో ముగ్గురు మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తులు బెయిలుపై బయటకు వచ్చి తిరుగుతున్నారు. మేమంతా ఆ బాధతో కుమిలిపోతున్నాం. ప్రభుత్వ పరంగా మాకు ఎలాంటి సాయం అందలేదు.
- కడియం వెంకట్రావు, తూర్పుతాళ్లు

అందుబాటులో ప్రభుత్వ భవనం

పట్టణంలోని స్టీమర్ రోడ్డులోని అన్న క్యాంటీన్ సమీపాన గతంలో నర్సింగ్ కళాశాలకు భవనం నిర్మించారు. కళాశాల ఏర్పాటు చేయకపోవడంతో అది ఖాళీగా ఉంది. లక్ష్మణేశ్వరంలోని బహుళ ప్రయోజన తుపాను రక్షిత భవనంలో నిర్వహిస్తున్న ఆక్వా విశ్వవిద్యాలయాన్ని దీనిలో ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఆర్థిక భారం తగ్గుతుంది. - **సంగాని వెంకటేశ్వరరావు, నరసాపురం**

తెలుగు పోటీ పరీక్షలో తృతీయ స్థానం

పెనుగొండ, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో 'మన సంస్కృతి' సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 6న నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి తెలుగు పోటీ పరీక్ష జరిగింది. ఈ పోటీలో తమ పాఠశాలలో అయిదో తరగతి విద్యార్థిని ఎల్లాప్రగడ శ్రీలత ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం కైవసం చేసుకున్నట్లు పెనుగొండలోని భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ ఎన్.వెంకట అప్పారావు తెలిపారు. డిసెంబరు 14న తిరుపతిలో జరిగే కార్యక్రమంలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉప కులపతి జీఎస్ఆర్ కృష్ణమూర్తి నుంచి శ్రీలతకు అవార్డు, నగదు బహుమతి అందుకోనుందని వివరించారు. ఈ సందర్భంగా శ్రీలతను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీలతను అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

పొగతో ఉక్కిరిబిక్కిరి

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సమీపాన చెత్తకు సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో దట్టమైన పొగ వెలుబడి రహదారితో పాటు సమీప ప్రాంతాలను కమ్మేయడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. పట్టణంలో సేకరించిన చెత్తను ఇటీవల ఆ ప్రాంతంలో డంప్ చేశారు. దానిలో ఉన్న థర్మాకోల్ వ్యర్థాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. వాటి నుంచి ఘాటైన వాసన, దట్టమైన పొగ వెలువడటంతో ఆ ప్రాంతంలో వీర భవానీ ఆలయానికి వచ్చిన భక్తులు, రహదారిపై రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమీపాన విద్యుత్తు తీగలు ఉండటంతో ముందు జాగ్రత్త చర్యగా ఆశాఖ అధికారులు కొద్దిసేపు సరఫరాను నిలివేశారు.

ఒరిగినవి.. విరిగితే ముప్పే!

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండల పరిధిలో ప్రధాన రహదారుల వెంబడి కొబ్బరి చెట్లు ఒరిగిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. పోడూరు- వేమవరం- పెనుమంచిలి మీదుగా కరుగోరుమిల్లి వెళ్లే రోడ్డులో ఇలాంటి చెట్లు పదుల సంఖ్యలో ఉన్నాయి. పెనుమంచిలి వద్ద ఈ చెట్ల కింద విద్యుత్తు, స్తంభాలు కూడా ఉన్నాయి. ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో ఆచంట- వేమవరం మధ్య ఒక కొబ్బరి చెట్టు రోడ్డుపై కూలిపోయింది. తూర్పుపాలెం- పోడూరు మార్గంలో మరో చెట్టు విద్యుత్తు పరివర్తకంపై పడి విరిగిపోయింది. కోడేరు- పెదమల్లం- చినమల్లం రహదారిలోనూ ఇదే పరిస్థితి. గతంలో ఆర్అండ్‌బీ రోడ్ల అంచుల్లో చెట్లు ప్రమాదకరంగా ఉంటే క్షేత్ర స్థాయి సిబ్బంది గుర్తించి ఎప్పటికప్పుడు తొలగించే వారు. కొన్నేళ్లుగా క్షేత్ర స్థాయి సిబ్బంది లేకపోవడంతో పర్యవేక్షణ లేకుండా పోయింది. ఈ అంశంపై ఆర్అండ్‌బీ ఏఈ టీఆర్‌వీ ప్రసాద్ స్పందిస్తూ ఆయా మార్గాల్లో చెట్ల పరిస్థితిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

పెనుమంచిలి వద్ద రోడ్డుపైకి వాలిన కొబ్బరి చెట్లు

కల్లాలు లేక ఇక్కట్లు!

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ఖరీఫ్ వరి మాసూళ్లు అన్ని ప్రాంతాల్లోనూ జోరందుకున్నాయి. యంత్రాలతో మాసూళ్లు చేసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు గ్రామాల్లో కల్లాలు, అనువైన ఖాళీ స్థలాలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యంలో తేమ 17 శాతం లోపు ఉంటేనే ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోలు చేస్తారు. ఈ నేపథ్యంలో రైతులు మరో మార్గం లేక రహదారులపైనే ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లోనూ ఇలాంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి.

దొంగరావిపాలెంలో రహదారిపై ధాన్యం ఆరబోత

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండలం పెదమల్లం లంక గ్రామంలో సోమవారం ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఆచంట ఎస్సై కె.వెంకటరమణ కథనం ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన మాత దొరబాబు(23) సోమవారం మధ్యాహ్నం తన ఇంటి వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలోని ఆసుపత్రికి తరలించారు. వైద్య సిబ్బంది పరీక్షించి అతడు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ప్రేమ వ్యవహారం కారణంగా యువతి కుటుంబ సభ్యులు గత నెలలో దొరబాబును మందలించి పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారని.. అతడి మృతిపై అనుమానాలున్నాయని బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ మరమ్మతులకు వెళ్లి అదృశ్యం

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండలం కొడమంచిలి శివారు బొల్లాప్రగడవాని చెరువు గ్రామానికి చెందిన కె.శ్రీనివాసరావు ఈ నెల 18వ తేదీ నుంచి కనిపించడం లేదని అతడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.వెంకటరమణ తెలిపారు. ట్రాక్టర్ మరమ్మతుల నిమిత్తం తాడేపల్లిగూడెం వెళ్లిన శ్రీనివాసరావు తిరిగి రాలేదని, చరవాణి కూడా పనిచేయడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు.

రెండు ఇళ్లలో చోరీలు

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణ పరిధిలో ఆదివారం రాత్రి రెండు ఇళ్లలో చోరీలు జరిగాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. జోశ్యులవారి వీధికి చెందిన సుబ్బలక్ష్మి ఇటీవల ఇంటికి తాళంవేసి హైదరాబాద్‌లోని కుమారుడి వద్దకు వెళ్లారు. సిద్ధానివారి వీధికి చెందిన శ్రీనివాస్ ఉత్తరభారతదేశ యాత్రకు వెళ్లారు. ఈ రెండు ఇళ్ల తాళాలు పగులకొట్టి ఉన్నట్లు స్థానికులు సోమవారం గుర్తించి యజమానులకు సమాచారం ఇచ్చారు. ఆయా ప్రాంతాల్లో క్లూస్‌టీం సభ్యులు ఆధారాలు సేకరించారని పోలీసులు తెలిపారు.

ఇక బడిలోనే సుజలం!

ఆచంట, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు రెండేళ్ల నుంచి వృథాగా పడి ఉన్న మినీ ఆర్వో ప్లాంట్లను వినియోగంలోకి తెచ్చేలా కూటమి సర్కారు చర్యలు చేపట్టింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో సాధారణ ఎన్నికలకు ముందు 'నాడు-నేడు' పథకం పేరిట ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు హడావుడిగా ఆర్వో యూనిట్లు సరఫరా చేశారు. అప్పట్లో కొన్నిచోట్ల మాత్రమే వాటిని వినియోగంలోకి తీసుకువచ్చారు. అవి కూడా తర్వాత నిర్వహణ లేక మూలకు చేరాయి. ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల పరిధిలో పాఠశాలలకు 400 వరకు ఆర్వో యూనిట్లు సమకూర్చారు. కొద్ది రోజులుగా వీటిని అమర్చి వినియోగంలోకి తెచ్చే పనులు చేపట్టారు. ఆచంట మండల పరిధిలో 37 పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లను ఇప్పటికే వినియోగంలోకి తెచ్చినట్లు ఎంఈవో రాజేంద్రప్రసాద్ తెలిపారు.

పాఠశాలలో వినియోగంలోకి తెచ్చిన ఆర్వో యూనిట్

స్థలం స్వాధీనానికి ఆదేశాలు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లులో క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం వెనుక భాగంలో ఆక్రమణకు గురైన పురావస్తుశాఖ స్థలాన్ని వెంటనే స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశాలు జారీ చేశారు. పాలకొల్లు పురపాలక కమిషనర్ బి.విజయసారథి, తహసీల్దారు వై.దుర్గాకిశోర్‌లకు ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు అందాయి. ఆ ప్రాంతంలో ఆక్రమణలు గుర్తించి వెంటనే తొలగించాని గత నెల 22న సమాచారం ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం 36 సెంట్లకు గాను 18 సెంట్లలో ఉన్న ఆక్రమణలను తొలగించి నివేదిక సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఆక్రమణకు గురైన జాగా

సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పాలకొల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వివిధ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు 10 రోజుల పాటు పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం పాలకొల్లు లయన్స్ సామాజిక భవనంలో సోమవారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ త్సవటపల్లి సత్యనారాయణ మూర్తి(బాబ్జీ) ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేలా లయన్స్ క్లబ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో మొగల్తూరు వివేకానంద ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో, పాలకొల్లు ఎంఎంకేఎన్ఎం ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానంలో, ఏవీఎస్ఎంఎం ఉన్నత పాఠశాల బృందాలు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులు, విద్యాసామగ్రిని క్లబ్ రీజియన్ ఛైర్‌పర్సన్ నందుల రమణి అందజేశారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న సభ్యులు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పెనుగొండ, న్యూస్‌టుడే: వాహన చోదకులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పెనుగొండ ఎస్సై కె.గంగాధర్ హెచ్చరించారు. పెనుగొండలోని పలు కూడళ్లలో ఆయన పోలీసు సిబ్బందితో కలిసి సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. చోదకుల వద్ద వాహన రికార్డులు తప్పనిసరిగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. శిరస్త్రాణం లేకుండా వాహనాలు నడిపిన వారికి అపరాధ రుసుము విధించారు.

రైతుల అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణ

పెనుమంట్ర, ఆచంట, న్యూస్‌టుడే: 'రైతన్న మీ కోసం' వారోత్సవాలను సమర్థంగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. పెనుమంట్ర మండలం ఆలమూరు, ఆచంట మండలంలో సోమవారం ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన స్థానిక రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే లక్ష్యంగా ఐదు అంశాలపై ప్రత్యేక కార్యాచరణతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. రైతుల ఇళ్లకు వచ్చే సిబ్బందికి తగు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. సర్వే వివరాల నమోదు ప్రక్రియలో లోపాలు లేకుండా జాగ్రత్త వహించాలని సిబ్బందికి సూచించారు.

నరసాపురంగ్రామీణ, న్యూస్‌టుడే: ఎల్‌బీచర్లలో నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, ఆర్డీవో దాసి రాజు, పలువురు నాయకులు పాల్గొని కరపత్రాలు ఆవిష్కరించారు.

ఎల్‌బీచర్ల: కరపత్రాలు ప్రదర్శిస్తున్న రామరాజు, నాయకులు

పోడూరు, న్యూస్‌టుడే: పెనుమదంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కోడి విజయభాస్కర్, ఏడీఏ పి మురళీకృష్ణ, సర్పంచి తానేటి బాబూరావు, నీటి సంఘం అధ్యక్షుడు దేవరపు దొరబాబు, సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ కడలి ఆంజనేయులు పాల్గొన్నారు.

చోరీలు అరికట్టాలని వినతి

నరసాపురం, న్యూస్‌టుడే: ఆక్వా చెరువులు, వరి చేలవద్ద విద్యుత్తు మోటార్లు, ఇతర ఉపకరణాల చోరీలు అరికట్టాలని కోరుతూ డీఎస్పీ జి.శ్రీవేదఅరవిందకు రైతులు సోమవారం వినతిపత్రం అందించారు. మొగల్తూరు పోలీస్‌స్టేషన్ పరిధి భీమవరం మండలం వెంపలో ఇటీవల పదుల సంఖ్యలో చోరీలు జరిగాయని, రూ.లక్షల విలువైన సామగ్రి అపహరణకు గురైందని పేర్కొన్నారు.

పట్టాభి సీతారామయ్యకు నివాళి

పోడూరు, న్యూస్‌టుడే: జిన్నూరు శాఖా గ్రంథాలయంలో సోమవారం ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడు పట్టాభి సీతారామయ్య జయంతిని నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి బత్తుల జోగారత్నం, అభివృద్ధి కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెన్మెత్స సూర్యనారాయణ రాజు, తాళాబత్తుల వెంకటేశ్వరరావు తదితరులు సీతారామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చిట్టడవుల్లా పేదల కాలనీలు!

కనీస వసతులు లేక అవస్థలు

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: పలు గ్రామాల్లో గతంలో ఏర్పాటు చేసిన పేదల కాలనీల్లో కనీస వసతులు లేక లబ్ధిదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. పెనుగొండ మండల పరిధిలో దాదాపు 39 కాలనీలు ఏర్పాటు చేశారు. అన్ని చోట్లా గ్రామ శివార్లు, పొలాల మధ్య పల్లపు ప్రాంత భూములను సేకరించారు. ఈ జాగాలు నివాస యోగ్యంగా లేకపోవడంతో పాటు కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో లబ్ధిదారుల ఎక్కువ మంది గృహ నిర్మాణాలకు ఆసక్తి చూపలేదు. కొందరు అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకోగా రహదారులు, డ్రెయిన్లు, తాగునీరు లేక నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

☛ పెనుగొండ మండలం సిద్ధాంతం శివారు ఘటాల దిబ్బ వద్ద పేదల కాలనీ ఇది. గత ప్రభుత్వ హయాంలో పొలాల మధ్య ఏర్పాటు చేసిన ఈ లేఅవుట్‌లో దాదాపు 60 మందికి స్థలాలు కేటాయించారు. రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సదుపాయం లేకపోవడంతో కొందరు మాత్రమే ఇక్కడ ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ఇళ్లు, నిర్మాణాల చుట్టూ రెల్లుగడ్డి, పొదలు భారీగా పెరిగిపోవడంతో ఈ ప్రాంతమంతా చిట్టడవిలా మారింది. సదుపాయాల లేమికి తోడు నిత్యం పాములు, విష పురుగుల బెడదతో ఇబ్బంది పడుతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు.

✦ దేవ గ్రామంలోని కాలనీలో 40 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల ముందే మురుగు నిలిచిపోతోంది. వర్షం కురిస్తే మార్గాలు బురదగా మారి రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడుతోంది.

✦ ములపర్రు శివారు సీతారాముని చెరువు ప్రాంతంలో కొన్నేళ్ల కిందట ఏర్పడిన కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ లేదు. నిత్యం దోమల బెడదతో సతమతమవుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం: ఈ అంశంపై డిప్యూటీ ఎంపీడీవో సూర్యప్రకాశరావు స్పందిస్తూ పేదల కాలనీల్లో సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని తెలిపారు.

పాస్‌పోర్ట్ పోయినది

దొంగ రేఖ W/o ఏడుకొండలు, D.No: 6-46/1, ముత్యాలపల్లి (గ్రా), మొగల్తూరు (మం) ప.గో.జిల్లా, ఆంధ్రప్రదేశ్ నేను ది.30-09-2025వ తేదీన ముత్యాలపల్లి నుండి మొగల్తూరు రోడ్‌కు ఆటోలో వెళ్తుండగా నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. S3813025 పోయినది. ఎంత వెతికిననూ దొరకలేదు. కావునా ఎవరికైనను దొరికిన యెడల అందజేయగలరు.

సెల్: 77026 78391

(c) eenadu

తాడేపల్లిగూడెం

● తాడేపల్లిగూడెం ● తణుకు

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం భాగ్యలక్ష్మిపేటలోని విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో వార్షిక మరమ్మతుల్లో భాగంగా మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని ఈఈ కె.నరసింహమూర్తి సోమవారం తెలిపారు. తణుకు రోడ్డు, మార్కెట్, తాళ్లముదునూరుపాడు, బైపాస్ రోడ్డు, భాగ్యలక్ష్మి పేట, యాగర్లపల్లి ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. ● పెంటపాడు, ముదునూరు, ఆకుతీగపాడు, రావికుంట, బిళ్లగుంట ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలుపుదల చేస్తామని ఈఈ తెలిపారు.

సామాజిక స్పృహ అవసరం

పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

కొండ్రుప్రోలు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలులో ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్నెస్సెస్(జాతీయ సేవా పథకం) అవగాహన కార్యక్రమం సోమవారం ముగిసిందని కార్యక్రమ అధికారి కేడీఎస్ఎస్ రాజు తెలిపారు. ప్రతి ఒక్కరు సామాజిక స్పృహకలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి సుంకర శ్రీనివాస్, రిజిస్ట్రార్ స్వామి, ప్రిన్సిపల్ టి.అశోక్, తెదేపా, జనసేన నాయకులు నాగరాజు, సత్తిరాజు, పీపీ ఎస్ ప్రసన్నశ్రీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సోమవారం సంత.. ట్రాఫిక్‌తో చింత

గణపవరంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరిగిపోతోంది. రోడ్డుకిరువైపులా ఆక్రమణలు పెరిగిపోవడం.. ఎక్కడికక్కడ వాహనాలు నిలిపేస్తుండటంతో సమస్య ఏర్పడుతోంది. సోమవారం సంత కావడంతో.. రద్దీ మరింత ఎక్కువై వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంది. - న్యూస్‌టుడే, గణపవరం

హెచ్చరిక బోర్డులు ఏవీ?

హౌసింగ్ బోర్డు కూడలిలో..

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే

కె.ఎన్.రోడ్డులో తాడేపల్లిగూడెం నుంచి పెదతాడేపల్లి వరకు ఉన్న ప్రధాన కూడళ్లలో హెచ్చరిక బోర్డులు లేవు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ నెలకొంటోంది. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు రాకపోకలు సాగించేవారు ఒకేసారి రోడ్లపైకి రావడంతో ఈ సమస్య తలెత్తుతోంది. కె.ఎన్. రోడ్డులో బస్టాండు ప్రాంతం నుండి పెదతాడేపల్లి వరకు వున్న వివిధ ప్రధాన కూడళ్లు ప్రమాదభరితంగా మారాయి. హౌసింగ్‌బోర్డు కాలనీ కూడలి, డి-మార్ట్ కూడలి, చినతాడేపల్లి రిలయన్స్ పెట్రోల్ బంక్, మదర్‌వన్నిని, ట్రినిటీ ఆసుపత్రి కూడళ్లలో రోడ్డు దాటేందుకు పాదచారులు బెంబేలెత్తిపోతున్నారు. ఎందుకంటే ప్రధాన కూడళ్లలో రోడ్డుపై హెచ్చరిక బోర్డులు, జీబ్రాలైన్లు లేవు. దీంతో ద్విచక్ర వాహనదారులు, బస్సులు, లారీలు వేగంగా దూసుకుపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో రద్దీ సమయాల్లో రోడ్డును దాటేందుకు పిల్లలు, వృద్ధులు, మహిళలు భయపడుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రజలకు కనపడే విధంగా ఫ్లోరోసెంట్ స్టిక్కర్లతో తయారుచేసిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు.

చినతాడేపల్లిలో పెట్రోల్‌బంకు వద్ద..

గుంతలమయం.. చీకట్లో భయం

ఏపీనిట్ (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: నిట్ నుంచి తాడేపల్లిగూడెం పట్టణంలోకి వచ్చే మార్గం ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడ్డాయి. వీధి దీపాలు వెలగక రాత్రి సమయాల్లో నరక యాతన అనుభవిస్తున్నామని వాహన చోదకులు ఆవేదన చెందుతున్నారు. గుంతలు తప్పించే క్రమంలో పడిపోయి గాయాలపాలవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. గతంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా మళ్లీ యథాస్థితికి చేరడంతో ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. ఈ రహదారి వెంబడి పట్టణ ప్రజలతో పాటు, కొండ్రుప్రోలు, ఎల్.అగ్రహారం, మెట్టఉప్పరగూడెం, మోదుగగుంట, ఇటుకులగుంట, లింగరాయుడుగూడెం, దండగర్ర, ఉప్పరగూడెం, మాధవరం తదితర గ్రామాల ప్రజలు రాక పోకలు సాగిస్తుంటారు. దీనిపై అధికారులు నాయకులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. 'పట్టణానికి రావాలంటే సుమారు 3 కిలోమీటర్ల మేర అధ్వానంగా ఉందని, నిత్యం వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని లింగరాయుడుగూడేనికి చెందిన నాగేంద్ర వాపోయారు. 'పట్టణం నుంచి ఏపీనిట్ వరకు రహదారి మరమ్మతులకు చర్యలు చేపడతాం' అని ఆర్ అండ్‌బీ డీఈ మణికుమార్ తెలిపారు.

రైతుల ఆరాటం.. కొంగల పోరాటం

పెదతాడేపల్లి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ వరి మాసూళ్లు పూర్తయిన నేపథ్యంలో రైతులు పొలాల్లో నారుమళ్లకు సిద్ధమవుతున్నారు. ట్రాక్టరు సాయంతో దుక్కులు తీసి దమ్ములు పూర్తిచేసేందుకు తొందరపడుతున్నారు. ఈ క్రమంలో కొల్లేరు నుంచి వచ్చిన కొంగలు పంటకు నష్టం కలిగించే కీటకాలు, పురుగులను తిని ఆకలి తీర్చుకుంటున్నాయి. పరోక్షంగా రైతులకు మేలు చేస్తున్నాయి. ఆ మార్గంలో వెళుతున్న వారు వాటిని ఆసక్తిగా తిలకించారు. సోమవారం పెదతాడేపల్లిలోని ఓ రైతు వ్యవసాయ క్షేత్రంలో కొంగలు కోలాహలంగా కనిపించడాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	99488 53114
తణుకు	85558 50851
తణుకు (గ్రామీణం)	63005 79402
అత్తిలి	91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? తాడేపల్లిగూడెం 'హెచ్‌పీ గోడౌను'కు వెళ్లే రోడ్లో కుళాయి మరమ్మతులకు తవ్విన గుంత పూడ్చక పోవడంతో ప్రమాదకరంగా మారింది. -సుబ్బారావు

✔ గుంతను త్వరితగతిన పూడ్చేలా చర్యలు చేపడతాం. -వెంకటేశ్వరరావు, ట్యాప్ ఇన్‌స్పెక్టర్

? తాడేపల్లిగూడెం టీటీడీ కల్యాణ మండపం రోడ్డులో చెత్త పేరుకుని రహదారిలోకి వస్తోంది. -విజయ్, స్థానికుడు

✔ రహదారిలో చెత్తను తొలగించేలా చర్యలు చేపడతాం. -సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

కల్వర్టుకు నెర్రెలు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు మండలం కొమరవరం లక్ష్మీగణేష్ నగర్‌లోని పెదవలి డ్రెయిన్ కాలువపై నిర్మించిన కల్వర్టు రెయిలింగ్ నెర్రెలు తీసింది. నిత్యం అనేక మంది ఇటుగా రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ కార్యదర్శి చిట్టి మాట్లాడుతూ రెయిలింగ్ మరమ్మతులకు చర్యలు చేపడతామన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన పంట

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, ఇరగవరం, తణుకు, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల్లో సోమవారం నాయకులు, వ్యవసాయ అధికారులు 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రైతుల గడప గడపకు వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించే కరపత్రాలను అందించారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో సర్పంచులు పోతుల అన్నవరం, ఉండ్రాజవరపు చంద్రం, తెదేపా మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, పెదతాడేపల్లి సొసైటీ ఛైర్మన్ పరిమి వెంకటకృష్ణ(సురేష్), ఏడీఏ ఆర్.గంగాధర్, పెంటపాడు తహసీల్దార్ రాజేశ్వరి, వ్యవసాయ అధికారులు నారాయణరావు, రవికుమార్, తెలుగు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పాతూరి రాంప్రసాద్ చౌదరి పాల్గొన్నారు. ● ఇరగవరంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వై.రామచంద్రరావు పాల్గొన్నారు. రైతులకు కరపత్రాలు అందించారు. ఏపీఏఐఎంఎస్ యాప్‌ను రైతుల చరవాణుల్లో డౌన్‌లోడ్ చేశారు. వ్యవసాయ సహాయకులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ● ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలని, దీనివల్ల నాణ్యమైన పంటతో పాటు సాగు ఖర్చు కూడా తగ్గుతుందని తణుకు మండల వ్యవసాయాధికారి కె.రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. 'రైతన్నా మీకోసం'లో భాగంగా కొమరవరంలో రైతులకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్లు ఉన్న రైతులకు ఇన్‌స్టాల్ చేస్తున్నామన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ సర్వే చేస్తున్నామని తెలిపారు. దువ్వలో నిర్వహించిన కార్యక్రమంలో తణుకు ఏఎంసీ ఛైర్మన్ కొండేటి శివ పాల్గొన్నారు.

దర్శిపర్రు: రైతులతో తహసీల్దార్ రాజేశ్వరి, అధికారులు

దువ్వ: కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఏఎంసీ ఛైర్మన్ శివ, రైతులు

పుస్తకమే ముద్దు.. చరవాణి మాకొద్దు

తణుకు, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం ఇరగవరం మండలం రేలంగి జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై 'సెల్‌ఫోన్' ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పుస్తకమే ముద్దు.. చరవాణి మాకొద్దు అంటూ చరవాణితో కలిగే అనర్థాలపై అనర్గళంగా ఉపన్యాసాలు ఇచ్చారు. పి.చంద్రశేఖర్, వి.ఉజ్వల నాగపవన్, ఆర్.యజ్ఞ నాగసత్య వరసన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయిని రెడ్డి మణిబాల బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.అరుణదేవి, కె.ఎ.ఎల్.శాంతి ప్రియ పాల్గొన్నారు.

ఉపన్యసించి.. బహుమతులు గెలిచి

సంజీవ్‌నగర్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం సంజీవ్‌నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్ ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వై.సంకీర్తన, వై.కావ్య, ఎం.దివ్య శ్రీలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.బ్రహ్మం, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

సీపీఎం శ్రేణుల ధర్నా

తణుకు, న్యూస్‌టుడే: పట్టణంలో విపరీతంగా పెరిగిపోయిన కుక్కలు, ఆవులు, కోతుల బారి నుంచి ప్రజలను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కమిషనర్ స్పందిస్తూ రెండు రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రంగారావు, శేషవేణి, శారద, గంగాధర రెడ్డి పాల్గొన్నారు.

26 వరకు ఆధార్ శిబిరాలు

ఇరగవరం, న్యూస్‌టుడే: మండలంలోని కత్తవపాడు, రేలంగి, గోటేరు, కె.కుముదవల్లి, ఏలేటిపాడు గ్రామాల్లో ఈ నెల 26 వరకు మొబైల్ ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఆధార్ నమోదు, తప్పుల సవరణ, నవీకరణ చేసుకునే సదుపాయం కల్పించినట్లు పేర్కొన్నారు.

తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెన్మెత్స సాయివర్మ అన్నారు. ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహించారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని కోరారు. సంఘ నాయకులు ఉంగరాల బ్రహ్మానందం, శ్రీనివాసరావు, దావీదు పాల్గొన్నారు.

సామర్థ్యాల మదింపునకు పరీక్ష

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం రూరల్, పట్టణంలో 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను ఎఫ్ఎల్ఎన్ బేస్‌లైన్ పరీక్ష ద్వారా మదింపు చేస్తున్నట్లు మండల విద్యాధికారి వి.హనుమ సోమవారం తెలిపారు. ఈమేరకు డైట్ విద్యార్థులు, సీఆర్ఎంటీలు, క్లస్టర్‌ను కేటాయించినట్లు వివరించారు.

ఖాళీ స్థలాలు.. ప్రబలుతున్న రోగాలు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణంలోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు చిట్టడవులను తలపిస్తున్నాయి. చాలాకాలంగా వాటి యజమానులు స్థలాలను శుభ్రం చేయకుండా, ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా అలాగే వదిలివేయడంతో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. చాలా ప్రాంతాల్లో మొక్కలతో పాటు నీరుకూడా నిల్వ ఉండి దోమలకు ఆవాసాలుగా మారాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా రోగాలబారిన పడుతున్నామని వాపోతున్నారు. విషపురుగులు సమీప ఇళ్లలోకి వచ్చి భయపెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పురపాలక అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.

సంతోష్‌నగర్‌లోని ఓ జాగాలో పెరిగిన మొక్కలు

15 అర్జీల స్వీకరణ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమానికి 15 అర్జీలు అందాయని ఎస్పీ అద్నాన్ నయిం అస్మి తెలిపారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భర్త, అత్తింటి వేధింపులు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్, ప్రేమిస్తున్నానని మోసాలపై వచ్చిన ఫిర్యాదులను చట్టపరిధిలో పరిష్కరించాలని సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులను ఆదేశించారు.

వీరభద్రుడికి విశేష పూజలు

తణుకు, న్యూస్‌టుడే: పైడిపర్రులోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున స్వామికి అభిషేకాలు చేసి పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో నక్షత్ర హారతి ఇచ్చి భక్తులకు దర్శనమిచ్చారు.

వీరేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ

కొండ్రుప్రోలు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలులో భద్రకాళి సమేత వీరేశ్వరస్వామిని సోమవారం ప్రత్యేకంగా అలంకరించారు అనంతరం విశేష పూజలు నిర్వహించారు. ఈ క్రతువులో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అర్చకుడు రామేశ్వరపు రమేష్ శర్మ అందజేసిన తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

E.A.No. 70/2024 in
E.P. No. 15/2018 in
O.S.No. 393/1997

Between:
Smt. Gopey Vajramma - పిటీషనర్సు/DHR's
And
Sri Chinnam Bhimanna (died) మరియు వగైరా - రెస్పాండెంట్లు/JDR's

To: 7వ రెస్పాండెంటు / 7వ JDR మానుకొండ ఉదయశ్రీ, W/o. ప్రవీణ్‌కుమార్ (టీచర్), నియర్ సాయి శ్వేత హాస్పటల్, నియర్ డీమార్ట్, తణుకు, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు గ్రంథములో 7వ రెస్పాండెంట్లు / 7వ JDR అయిన మీకు నోటీసులు పంపగా మీరు నోటీసు సంగతులు తెలిసియుండి నోటీసులు తీసుకొనకుండా evade చేయుచున్నందున శ్రీ కోర్టు వారు Substitute Service ద్వారా అమలు జరుపుటకు గాను order చేసినారు. కావున సదరు కోర్టు ఆర్డరు ప్రకారము మీరు ది. 2-12-2025న వాయిదా రోజు ఉదయం గం. 10.30 ని॥లకు పై కోర్టులో మీరు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీపై పరోక్షమందు పై నెంబరులో గ్రంథము తీర్మానించబడును. ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
సం/- **BVSRK Manohar**
పిటీషనర్సు/DHR Advocate,
Tadepalligudem, Cell: 94410 54463, W.G.District

లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్

సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తణుకు, న్యూస్‌టుడే: కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లు రద్దు చేయకపోతే పోరాటాల రూపంలో కార్మికులు గుణపాఠం చెబుతారని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజంటేటివ్స్ యూనియన్ (ఏపీఎంఎస్ఆర్‌యూ) తణుకు కార్యదర్శి ఎం.రమేశ్ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీఎంఎస్ఆర్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. లేబర్ కోడ్‌ల అమలుతో వేతనాలు, పనిగంటలు, సమ్మె, ఉద్యోగ భద్రత వంటి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మోదీ అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలపై ఈ నెల 26న దేశవ్యాప్తంగా జరిగే ఆందోళనలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అధ్యక్షుడు సీహెచ్.రామకృష్ణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి: సీపీఎం

నిరసన తెలుపుతున్న నాయకులు

పెంటపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పెంటపాడు గాంధీ బొమ్మ సెంటరులోని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ సిరపరపు రంగారావు, నాయకులు చిర్లపల్లా రెడ్డి, బంకురు నాగేశ్వరరావులు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ నష్టాలు రావడానికి కార్మికులే కారణమని, వారు పనిచేయకుండా ఇంటివద్దనే ఉండి సోమరిపోతుల్లా జీతాలు తీసుకోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని సీఎం విలేకర్ల సమావేశంలో అనడం చాలా బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెనుగంటి దుర్గ, దత్తు రాము, సత్తి శివారెడ్డి, గంటా కోటి బర్ల బాలాజీ, మాదాసు రాజు, పూడి బాలాజీ పాల్గొన్నారు.

షాపులు లైసెన్స్ లీజునకు టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన

పశ్చిమగోదావరి జిల్లా, తణుకు మండలం, తణుకు పట్టణం, హనుమంతరావు పేటలో వేంచేసియున్న శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి దేవస్థానము తాలూకు షాపులు 1 నుండి 9 వరకు గల షాపులు 3 సం॥లు లైసెన్స్ హక్కునకు ది. 16-12-2025వ తేదీ మంగళవారం ఉదయం గం. 11-00లకు శ్రీయుత తనిఖీదారు, దేవదాయ ధర్మదాయ శాఖ, తణుకు వారి సమక్షములో దేవస్థానము కార్యనిర్వహణాధికారి వారిచే లైసెన్సు హక్కునకు టెండర్ కమ్ బహిరంగ వేలం పాట పెట్టబడును. కావున యావన్మంది పాటలో పాల్గొనవలెను. హెచ్చుపాటదారుడు సంవత్సరం అద్దె ముందుగా కట్టవలెను.

వ. నెం.	గ్రామము	షాపులు మొత్తం కాలపరిమితి	విస్తీర్ణము	ధరావతు	పాట తేదీ
1	హనుమంతరావుపేట, తణుకు	1 నుండి 9 వరకు 3 సం॥ కాలము	18×9	5000/-రూ. షాపు ఒక్కొంటికి	16-12-2025 మంగళవారం ఉ.గం. 11-00లకు

తణుకు
తేది: 24-11-2025
సం/- **ముత్యాల సత్యనారాయణ**
కార్యనిర్వహణాధికారి, సెల్: 98663 97623

ఆర్‌టీఐతో పరిపాలనలో పారదర్శకత

తణుకు, న్యూస్‌టుడే: పరిపాలనలో జవాబుదారీతనాన్ని, పారదర్శకతను తీసుకురావడంతో సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) 2005 ప్రాధాన్యత ఎంతో ఉందని తణుకు ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠ రెడ్డి పేర్కొన్నారు. ఆర్‌టీఐ అమలులోకి వచ్చి 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో చట్టం అమలుపై కార్యశాల నిర్వహించి మాట్లాడారు. ఈ చట్టం ద్వారా ఏటా 60 లక్షల దరఖాస్తులు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు బి.లక్ష్మి, ఆర్.మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు మిషన్ వితరణ

తణుకు, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన ఆనందం సావిత్రి అంగవైకల్యంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సోమవారం తణుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. స్థానిక గమిని ఫంక్షన్ హాల్‌లో అధ్యక్షుడు కడించెర్ల రాజరాజేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దాత చిట్టూరి సుజాత ఆర్థిక సహకారంతో రూ. 8 వేల విలువైన కుట్టుమిషన్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా శాంతి ర్యాలీ ఛైర్మన్ గమిని రాంబాబు, రీజినల్ కన్వీనర్ ఎస్.వి.సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల చెరువులో విషప్రయోగం

కుప్పనపూడి (ఆకివీడు), న్యూస్‌టుడే: ఆకివీడు మండలం కుప్పనపూడి గ్రామానికి చెందిన మారుబోయిన రాంబాబు అదే గ్రామంలో ఎకరం చెరువు లీజుకు తీసుకుని రొయ్యల సాగు చేస్తున్నారు. 24వ తేదీ ఉదయం చెరువు వద్దకు వెళ్లి చూడగా రొయ్యలు చనిపోయినట్లు గుర్తించారు. చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు పురుగు మందు కలిపారని, దీంతో 35 కౌంటులో ఉన్న సుమారు 2.50 టన్నుల రొయ్యలు చనిపోవడంతో సుమారు రూ.10 లక్షల నష్టం వాటిల్లినట్లు సాగుదారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై నాగరాజు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహారాజశ్రీ XI (11వ) అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు నందు తాడేపల్లిగూడెం

I.A.No. 1/2025 in D.O.P.No. 54/2025

Between:
శ్రీమతి కాకర ఎస్తేరు కమల ... పిటిషనరు / పిటిషనరు
మరియు
శ్రీ కళింగపట్నం ప్రవీణ్ దుర్గాప్రసన్న కుమార్ ... రెస్పాండెంట్ / రెస్పాండెంట్

శ్రీ కళింగపట్నం ప్రవీణ్ దుర్గాప్రసన్న కుమార్, S/o. శ్రీనివాస్, పురుషుడు, వయస్సు 35 సం॥లు, ప్రైవేటు ఉద్యోగి, డోర్ నెం. 4-5-56, కోతిబొమ్మ సెంటర్ దగ్గర, సుబ్బారావుపేట, తాడేపల్లిగూడెం.

పై నెంబరు గ్రంథములో పిటిషనరు గారు శ్రీ కోర్టు వారి ద్వారా మిమ్ములను శ్రీ కోర్టు వారి ఎదుట హాజరుకావాలని పలుమార్లు కోర్టు వారి ద్వారా మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారా నోటీసులు పంపినప్పటికి మీరు కోర్టు వారి నోటీసులు తీసుకోకుండా ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు అని కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది. 15-12-2025వ తేది నాటికి వాయిదా వేసియున్నారు. మీరు ఆరోజు ఉదయం గం. 10.30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా మీ లాయర్ గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలయును. లేనియెడల పై నెంబరు గ్రంథమును మీ పరోక్షమున తీర్మానించబడును.

(ది. 17-11-2025న శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము)
సం/- **కోపెల్లి జేమ్స్ కెన్నెడి,** M.A., B.L.
అడ్వకేట్, Ex. A.G.P., తాడేపల్లిగూడెం, సెల్: 94401 88079

రోడ్డు ప్రమాదంలో భవానీ భక్తుడి దుర్మరణం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో భవానీ భక్తుడు మృతి చెందాడు. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తణుకు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన కుక్కునూని జయరామ్(33) స్థానికంగా నూనె గానుగ నిర్వహిస్తుంటారు. ఇటీవల భవానీ మాల ధరించిన ఆయన విజయవాడ కనక దుర్గమ్మను దర్శించుకునేందుకు స్నేహితుడు అల్లబూని సాయితేజతో కలిసి ద్విచక్ర వాహనంపై వచ్చారు. అమ్మవారి దర్శనం అనంతరం తిరుగు పయనమవ్వగా, వీరి వాహనం కృష్ణా జిల్లా బాపులపాడు మండలం కోడూరుపాడు ఫ్లైఓవర్ సమీపంలో అదుపు తప్పి రహదారి రక్షణ గోడను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న జయరామ్‌కు తీవ్ర గాయాలవ్వడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. అత్యవసర వాహనం సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించే సరికే ప్రాణాలు కోల్పోయారు. సాయితేజ మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వీరవల్లి పోలీసులు మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

భీమవరం కలెక్టరేట్; న్యూస్‌టుడే: సమగ్ర కులగణన చేపట్టి జనాభా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కేటాయించి ఆ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ కోరారు. ఈ అంశంపై సంఘం ప్రతినిధులతో పాటు ఆయన కలెక్టర్ నాగరాణిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షలో ఒప్పంద ఉద్యోగులు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి వేతనాలు పెంచాలని సర్వశిక్షా అభియాన్ ఒప్పంద ఉద్యోగులు డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే డిసెంబరు 10న విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, జనవరి నుంచి సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా నాయకులు నరేష్, ఆనంద్, వాసు, తాతయ్య పాల్గొన్నారు.

(c) eenadu

కడప.. హాకీ విజేత

తిరుపతి జిల్లా చంద్రగిరిలో నిర్వహించిన అండర్-14 రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో వైఎస్సార్ కడప బాల, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. విశాఖపట్నంపై బాలురు, అనంతపురంపై బాలికల జట్లు గెలుపొంది ట్రోఫీలు అందుకున్నాయి. అనంతరం వివిధ జిల్లాల తరపున సత్తా చాటిన వారిని రాష్ట్రస్థాయి జట్లకు నిర్వాహకులు ఎంపిక చేశారు. - న్యూస్‌టుడే, చంద్రగిరి

చీకటిలో ప్రజా సమస్యలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లా పరిపాలనకు గుండె వంటి కడపలోని కలెక్టరేట్ సుమారు గంట పాటు విద్యుత్తు సరఫరా లేక అంధకారంలో ఉండిపోయింది. దీంతో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ప్రజలు, అధికారులు ఇబ్బంది పడ్డారు. ఉదయం పదిన్నరకు ఈ కార్యక్రమం మొదలైంది.

టార్చ్‌లైట్ వెలుగులో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ అదితిసింగ్

కొద్ది సేపటికే విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో సభా భవనంలో చీకటైంది. అప్పటికే పెద్ద సంఖ్యలో అర్జీదారులు ఉండటంతో జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, పలువురు ఎస్డీసీలు దీపాల వెలుగుల్లో అర్జీలు స్వీకరించాల్సి వచ్చింది. కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో విద్యుత్తు తీగలు తెగిపోవడంతో ఈ సమస్య తలెత్తింది.

గడ్డా మసీదు భూముల్లో గద్దలు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: జమ్మలమడుగులో గండికోట కాలంనాటి గడ్డా మసీదు భూములు ఆక్రమణకు గురయ్యాయి. కోట్లాది రూపాయల విలువైన భూములు అన్యాక్రాంతం కావడంతో కమిటీ సభ్యులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కబ్జాకు గురైన స్థలాలను తిరిగి బదిలీ చేయాలని కోరుతున్నారు.

● **మొత్తం 27.70 ఎకరాలు:** జమ్మలమడుగులోని గడ్డా మసీదుకు 27.70 ఎకరాల భూములు ఉన్నాయి. గండికోట నవాబుల కాలంలో జమ్మలమడుగు, మైలవరం మండలాల్లో భూములు, పొలాలను దానం చేశారు. వక్ఫ్ బోర్డు ఆధీనంలో ఉన్న వీటి ఆస్తులు పలు చోట్ల ఆక్రమణకు గురైనట్లు కమిటీ సభ్యులు విమర్శిస్తున్నారు. మైలవరం, జమ్మలమడుగు మండలాల్లో 4.56, 3.35 ఎకరాలు ఇతరుల ఆధీనంలో ఉన్నాయని., జమ్మలమడుగు శివారులోనూ విలువైన భూములు ఆక్రమణకు గురైనట్లు వాపోతున్నారు. పట్టణంలో ఉన్న స్థలాలను తక్కువ అద్దెకు ఇవ్వడంతో వక్ఫ్ ఆదాయానికి కూడా గండి పడుతోంది.

ఇవీ భూముల వివరాలు...

సర్వే నంబరు	ఎకరాలు
369	0.41
371	3.64
184	2.04
209	3.35
369	0.24
402-ఏ	1.06
402-బీ	0.84
483	4.56
525	7.28
333	4.28

ఆ వేళల్లో ప్రయాణమొద్దు బ్రో!

రహదారులను కమ్మేస్తున్న పొగ మంచు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: శీతాకాలం మొదలైంది. పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఈ కారణంగా పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున అయిదు గంటల్లోపు ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మంచు కురిసే వేళల్లో ఎదుటి వాహనాలు కనిపించకపోవడమే ఇందుకు కారణమని పలువురు హెచ్చరిస్తున్నారు. నవంబరు, డిసెంబరు, జనవరి మాసాల్లో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. అత్యవసరమైతే ఫాగ్‌లైట్లు ఉంటేనే ప్రయాణం చేయాలని సూచిస్తున్నారు. ఈ ఫాగ్‌లైట్ ఎల్లో రంగులో ఉండి కాంతి కిరణాలు పొగమంచును చీల్చుకుని దారి చూపించేందుకు అవకాశం ఉండటం ఇందుకు కారణమని చెబుతున్నారు.

గడిచిన మూడేళ్లలో పొగమంచు కారణంగా చోటుచేసుకున్న ప్రమాదాలు...

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు
2022	12	09
2023	15	11
2024	11	08

హవ్వ.. కుక్కల కట్టడిలోనూ కక్కుర్తే!

కోడ్ కూత వేళలో కొట్టేశారు

బరితెగించిన వైకాపా పాలకులు

కడప నగరపాలక, న్యూస్‌టుడే: వైకాపా కడప నగర పాలక సంస్థలోని కొందరు పాలకులు, అధికారులు కక్కుర్తితో వ్యవహరించారు. గత సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన సమయాన్ని తమకు అనుకూలంగా మలచుకున్నారు. కుక్కల కట్టడిలో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. ఎక్కువ సంఖ్యలో శస్త్రచికిత్సలు చేసినట్లు చూపి జేబులు నింపుకొన్నారు.

● 2018 జులై నుంచి 2019 మార్చి వరకు తొమ్మిది నెలల కాలంలో ఒక్కొక్కటికి రూ. 750 చొప్పున 611 కుక్కలకు కు.ని. చేసినట్లు చూపారు. 2019 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఒక్కో శునకానికి రూ. 950 చెల్లించి 300 వాటికి శస్త్రచికిత్సలు చేశారు. ఆ తర్వాత 2023 ఆగస్టు వరకు ఆ ఊసే ఎత్తలేదు. 2023 ఆగస్టులో ఈ పనిని తిరుపతికి చెందిన అనిమల్ కేర్‌ల్యాండ్‌కు కేఎంసీ అప్పగించింది. 2023 ఆగస్టు 8 నుంచి 2024 ఫిబ్రవరి వరకు 1,117 కుక్కలకు శస్త్రచికిత్సలు చేసినట్లు చూపినా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ ఆ సంస్థ కాంట్రాక్టును రద్దు చేశారు. ఆ తర్వాత జీవన్ సంతులన్ కల్యాణ్‌కు ఎలాంటి టెండర్లు లేకుండా అప్పగించారు.

673 2024 మార్చి 23 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు కేఎంసీ ఆధ్వర్యంలో కుక్కలకు చేసిన శస్త్రచికిత్సలు.

600 ఏప్రిల్ 7 నుంచి 20 వరకు చేపట్టినవి.

502 ఏప్రిల్ 24 నుంచి మే 6 వరకు చేయించిన శస్త్రచికిత్సల సంఖ్య.

519 మే 7 నుంచి 16 వరకు కుక్కలకు చేసిన సంతాన నిరోధక శస్త్రచికిత్సలు.

● దాదాపు 42 పనిదినాల్లో 2,294 కుక్కలకు అంటే రోజుకు సగటున యాభై నాలుగింటికి శస్త్రచికిత్సలు చేసినట్టు దస్త్రాల్లో చూపారు. ఇందుకుగాను జీవన్ సంతులన్ కల్యాణ్ అనే సంస్థకు కేఎంసీ రూ. 29,80,000 చెల్లించాల్సి వచ్చింది. ఇక్కడే అక్రమాలకు తెర లేపారు. రోజుకు సరాసరిన 50 నుంచి 60 కుక్కలను పట్టే సామర్థ్యం ఉందా? ఒక్క రోజులో 50 కుక్కలకు శస్త్రచికిత్సలు చేసే పరికరాలు.. మావన వనరులు ఉన్నాయా? అనే విషయాలను పట్టించుకోలేదు. కుక్కల కట్టడి పేరుతో బొక్కారు.

రైతన్న కోసం.. జిల్లా ప్రథమం!

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతుల బాగోగులు తెలుసుకుంటూనే పంచ సూత్రాలపై అవగాహన కల్పించేందుకు 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. ఇందుకుగాను అధికార యంత్రాంగం బృందాలుగా ఏర్పడి వారం రోజులపాటు రైతుల గడప తొక్కాలని ఆదేశించింది. అమలు ఆరంభంలోనే జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానం దక్కించుకుంది. అదే సమయంలో కొన్ని శాఖలు మాత్రం ముఖం చాటేశాయి. జిల్లాలో మొత్తం 361 రైతు సేవా కేంద్రాలున్నాయి. ఆయా పరిధిలోని అన్ని గ్రామాల్లో కార్యక్రమం తొలిరోజైన సోమవారం 27,797 కుటుంబాలను యంత్రాంగం కలిసింది. దీంతో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానం దక్కించుకుంది. ఇంకా కలవాల్సిన కుటుంబాల సంఖ్య 20,380 వరకు ఉన్నాయి.

● **పట్టించుకోని కొన్ని శాఖలు:** వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖలన్నీ రైతు కుటుంబాలను తప్పనిసరిగా కలవాలనేది ప్రభుత్వ ఆదేశం. కొన్ని శాఖలు ఈ ఆదేశాలను విస్మరించాయి. విద్యుత్తు, సహకార, మార్కెటింగ్, ఇంజినీరింగ్ తదితర శాఖల ప్రతినిధులు ఇటువైపు తొంగి చూడలేదు. కార్యక్రమం అమలును ఆయా శాఖల జిల్లా అధికారులూ సీరియస్‌గా తీసుకోలేదు. విషయం తెలుసుకున్న ప్రభుత్వం సీరియస్ అయినట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లా అధికారుల నుంచి రాష్ట్ర ఉన్నతాధికారులు సమాచారం సేకరించినట్లు తెలిసింది.

నాగసానిపల్లెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న చంద్రానాయక్, అధికారులు

రాజు మంచి బాలుడు



'నేను కమలాపురంలో చదివే సమయంలో హెచ్. అయ్యంగార్ అనే ఉపాధ్యాయుడు ఉండేవారు. ఆయనంటే విదార్థులంతా భయపడేవారు. వస్తున్నారంటే మేమందరం మరో మార్గంలో వెళ్లేవాళ్లం. ఓ రోజూ ఆయన నన్ను కర్ర తీసుకుని రాజు అని పిలిచారు. ఆ తర్వాత ఎందుకు నన్ను చూసి వేరే దారిలో వెళ్తున్నావని అడిగారు. నేను మిమ్మల్ని చూడలేదు సార్. . నోట్ బుక్ తెచ్చుకునేందుకు వెళ్లానంటూ సత్యం చెప్పాను. కాదు నువ్వు అబద్ధం చెబుతున్నావంటూ కొట్టేందుకు కర్ర ఎత్తారు. మీకంతగా కొట్టాలనే ఆశ ఉంటే కొట్టండి సార్ అంటూ నేను ధైర్యంగా చెయ్యి చాచాను. దాంతో ఆయన కళ్ల నుంచి నీళ్లొచ్చాయి. తప్పు చేయని నిన్ను శిక్షించను అన్నారు. గుడ్ బాయ్ అని మెచ్చుకున్నారు. ఆ తర్వాత నిర్వహించిన పరీక్షల్లో మంచిగా రాసినందుకు వెరీ వెరీ గుడ్ అని రాశారు. ఓ రోజు హెచ్ఎం నన్ను పిలిచి ప్రార్థనకు పాట పాడమన్నారు. సర్వమతాల పేర్లతో పాడటంతో అందరూ ఆశ్చర్యపోయారు. నాటి నుంచీ సర్వమత సమ్మతం అని బోధిస్తూ వచ్చాను'

- ఇవీ పుట్టపర్తిలో చేసిన ఓ ప్రసంగంలో సత్య సాయిబాబా మాటలు. కమలాపురంలో తాను చదివిన పాఠశాల.. అక్కడ ఉపాధ్యాయులు తనపై చూపిన అభిమానాన్ని ఆయన గుర్తు చేసుకున్నసందర్భంలోని ఓ వీడియో విస్తృతంగా ప్రచారమైంది. - కమలాపురం, న్యూస్‌టుడే

కమలాపురంలో సత్య సాయిబాబా విద్యాభ్యాసం

సత్య సాయిబాబా చిన్ననాటి పేరు రత్నాకరం సత్యనారాయణరాజు. ఆయన కడప జిల్లా కమలాపురం పట్టణంలోని బీఎం పాఠశాలలో ఫస్ట్ ఫారం చదివారు. పుట్టపర్తికి చెందిన సత్యనారాయణరాజు సోదరుడైన శేషమరాజు ఈ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించారు. దీంతో తమ్ముడైన సత్యనారాయణరాజును తానుండే పాఠశాలలో ఫస్ట్ ఫారంలో చేర్పించారు. తర్వాత ఆయన తన స్వగ్రామానికి బదిలీ కావడంతో రాజు కూడా అక్కడికే వెళ్లి విద్యాభ్యాసం కొనసాగించారు. ఇప్పటికీ సత్య సాయిబాబా చదివినట్లు గుర్తుగా బదిలీ సర్టిఫికెట్(టీసీ)ని కమలాపురం పాఠశాలలో భద్రంగా ఉంచారు.

సమావేశ మందిరంలో చిత్రపటం వద్ద ప్రార్థనలు చేస్తున్న సాయిబాబా సేవా సమితి సభ్యులు, హెచ్ఎం, భక్తులు

● **గుర్తుగా సామాజిక సేవలు:** సత్యనారాయణరాజు పుట్టపర్తిలో భగవాన్ సత్య సాయిబాబాగా అవతరించిన తర్వాత కూడా తాను చదువుకున్న కమలాపురం పాఠశాలను మర్చిపోలేదు. ట్రస్ట్ తరపున అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. పేరును కూడా భగవాన్ శ్రీ సత్యసాయి పాఠశాలగా మార్చారు. సేవా సమితి సభ్యులు, భక్తులు రూ. లక్షలు వెచ్చించి సమావేశ హాల్ నిర్మించారు. అందులో బాబా చిత్రపటాలు ఏర్పాటు చేశారు. ఏటా జన్మదినాన్ని ఘనంగా నిర్వహించేవారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సత్య సాయిబాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్న వేళ.. ఈ విషయాలను స్థానికులు స్మరించుకుంటున్నారు.

సాయిబాబా బదిలీ సర్టిఫికెట్(టీసీ)

బెంగళూరులో విద్యార్థిని దారుణ హత్య

రామసముద్రం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని ఆచార్య కళాశాలలో బీబీఏ డిగ్రీ నాలుగో సంవత్సరం చదువుతున్న దేవశ్రీ(21) అనే జిల్లా విద్యార్థిని దారుణ హత్యకు గురైంది. దేవశ్రీ రామసముద్రం మండలం బిక్కింవారిపల్లెకు చెందిన రెడ్డెప్ప, జగదాంబ దంపతుల కుమార్తె. కళాశాలలో చదువుతూ అక్కడే ఓ అద్దె గదిలో ఉంటోంది. ఆమెకు సన్నిహితుడైన చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం పెద్దకొండామర్రికి చెందిన ప్రేమవర్ధన్ అనే యువకుడు తలపై మోది హత్య చేసినట్లు మాదనాయనకహళ్లి పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. నిందితుడు పరారీలో ఉండటంతో గాలింపు తీవ్రం చేశారు. చదువు పూర్తి చేసుకుని పట్టాతో ఇంటికి వస్తుందన్న కుమార్తె హత్యకు గురికావడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేక గుండెలవిసేలా రోదిస్తున్నారు.

దేవశ్రీ (పాత చిత్రం)

ప్రేమవర్ధన్

చేస్తారా! చేతులెత్తేస్తారా!!

● డంపింగ్ యార్డుల్లా కూడళ్లు

● స్వచ్ఛ కలకు దూరంగానే పట్టణాలు

కడప నగరపాలక, న్యూస్‌టుడే: '2026 జనవరి 1 నాటికి రహదారులు, వీధులు, కూడళ్లలో చెత్త కనిపించకూడదు' ఇవీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు. సీఎం విధించిన గడువుకు మరికొద్ది రోజులే గడవుంది. ఈలోపు పుర, నగర పాలక సంస్థల్లోని బహిరంగ ప్రదేశాల్లో చెత్త కనిపించకుండా చేయాల్సి ఉంది. ప్రస్తుత పరిస్థితులను చూస్తే ఆ దిశగా ప్రయత్నాలైనా మొదలెట్టలేదనిపిస్తోంది. జిల్లా కేంద్రమైన కడప నగర పాలక సంస్థలోని పరిస్థితులే ఇందుకు నిదర్శనం.

దేవుని కడప రోడ్డులోని హోటల్ వ్యర్థాలను పడేస్తున్న వైనం

● **కానరాని జవాబుదారీతనం:** ఇంటింటి నుంచి చెత్త సేకరణకు రోజుకు 91 ఆటోలను వినియోగిస్తున్నారు. ఒక్కో ఆటో మూడు ట్రిప్పుల్లో రెండు టన్నులు తీసుకెళ్లాలి. ప్రతి రోజూ అన్నీ చెత్త సేకరణ చేస్తున్నట్లు అధికారులు కాగితాలపై లెక్కలేస్తున్నారు. వాస్తవంలో పరిస్థితులను విస్మరిస్తున్నారు. ఈ విషయాలపై కడప నగర పాలక వైద్యాధికారి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ.. ప్రతి రోజూ ఇంటింట చెత్త సేకరణకు ఆటో రవాణా వ్యవస్థను ఆధునికీకరిస్తున్నట్లు చెప్పారు. అన్ని ప్రాంతాలకు ఆటోలు వెళ్లేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న వారిపై నిఘా పెట్టామని, తొలిదశలో జరిమానాలు విధిస్తామని, ఆ తర్వాత వాణిజ్య సంస్థలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

దారులన్నీ చెత్తకుప్పలమయం

● కడప నగరం రెండో గాంధీబొమ్మ నుంచి బిల్టప్‌కు వెళ్లే ప్రధాన మార్గంలో మోచంపేట వద్ద నిత్యం చెత్త దర్శనమిస్తుంటుంది.

● ఊరగాయలు స్వగృహ ఫుడ్స్ విక్రయించే వీధి నుంచి బీకేఎం మార్గంలోకి వెళ్లే దారి దుర్వాసన వెదజల్లుతుంటుంది.

● పాత మార్కెట్ వెనుక వైపు రోడ్డుపైనే మాంసం వ్యర్థాలు పడేస్తున్నారు.

● బళ్లారి రోడ్డులో జంతువధశాల సమీపంలోనూ అదే దుస్థితి.

● శంకరాపురంలో అమ్మాయమ్మ గారి మఠం వద్ద మద్రాసు రోడ్డు పక్కనే చెత్త పేరుకుపోయింది.

● దేవుని కడప రోడ్డులో కొత్త మార్కెట్‌కు ఎదురుగా ఉన్న వీధి డంపింగ్ యార్డులా మారింది.

● దేవుని కడప ప్రధాన రహదారిని అనధికారిక చెత్త కుప్పలా వినియోగిస్తున్నారు.

మట్టిలో కలుస్తున్న మట్లి రాజుల కోట

పట్టించుకోని పురావస్తు శాఖ అధికారులు

సిద్దవటం, న్యూస్‌టుడే

● **ఇదీ చరిత్ర:** సిద్దవటంలోని మట్లి రాజుల దుర్గం(కోట) చారిత్రకంగా ఎంతో ప్రసిద్ధి. పెన్నా నది ఒడ్డున పురాతన కాలంలో రాజులు మట్టి కోట నిర్మించారు. 1527లో మట్లి ఎల్లమరాజు ఆ కోట స్థానంలో రాతి కోటను పునర్నిర్మించారు. ఈ కట్టడాన్ని కేంద్రంగా చేసుకుని అనేక రాజ వంశీయులు పరిపాలన సాగించారు. నైజాం నవాబులు, 1800లో ఈస్ట్ ఇండియా కంపెనీ వారు కూడా ఇక్కడి నుంచే తమ కార్యకలాపాలు సాగించారు. తర్వాత కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పురావస్తు శాఖ ఆధీనంలోకి వెళ్లింది.

కోటలో ప్రధాన ముఖద్వారం పక్కన నేలకూలిన రాతి ప్రహరీ

● **ఎన్నెన్నో విశేషాలు:** కోటలో ప్రధానంగా మొదటి ముఖద్వారం, మొదటి మండపం, ఢంకానగర్, రెండో మండపం, శిలాశాసనం, కామాక్షి గుడి, బయల్పడిన శివలింగం, బిస్మిల్లా షావలి దర్గా, మసీదు, సొరంగ మార్గం, రాణిమహల్, భారీ బురుజులు వంటివి ఉన్నాయి. ఇవన్నీ వారసత్వ సంపదకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

● **కూలుతున్న కట్టడాలు:** శతాబ్దాల కిందట నిర్మించిన ఈ కోట కట్టడాలు నిర్వహణ లేక కూలుతున్నాయి. 2021, ఆ తర్వాత కురిసిన భారీ వర్షాలకు ప్రధాన ముఖద్వారం పక్కన, తూర్పు వైపున, పెన్నానది వైపున ఉన్న ప్రహరీ కూలింది.

● **కానరాని మరమ్మతులు:** ప్రహరీకి మరమ్మతులు చేయాలని పురావస్తు శాఖ అధికారులు ఏడాది కిందట తాడిపత్రి నుంచి పెద్ద రాతి బండలను ఇక్కడికి తెచ్చారు. నిర్మాణ పనులకు సిద్ధం చేశారు. కొన్ని నెలల కిందట సున్నం బస్తాలూ తెచ్చి కోటలోని మొదటి మండపంలో నిల్వ ఉంచారు. మండపం పైకప్పు వర్షానికి ఉరుస్తుండడంతో కొన్ని బస్తాలు తడిసి గడ్డ కట్టాయి. మరికొన్నింటిలోని సున్నం ఉండలుగా మారింది. అయినా మరమ్మతు పనులు మాత్రం చేపట్టడం లేదు.

త్వరలో చేపట్టేలా చర్యలు: కోటలో దెబ్బతిన్న ప్రహరీకి మరమ్మతులు చేయించేందుకు కృషి చేస్తున్నాం. పనులకు టెండర్ పిలవాల్సి ఉంది. నిబంధనలకు అనుగుణంగా సదరు ప్రక్రియ చేపట్టకపోవడంతో రద్దు అయింది. సాధ్యమైనంత వరకు మరమ్మతులు త్వరగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.

- ధాకారెడ్డి, జిల్లా పురావస్తుశాఖ అధికారి

ఆడబోతే ప్రయాణం భారం

రైలు, బస్సుల్లో లభించని రాయితీ

కడప క్రీడలు, న్యూస్‌టుడే: క్రీడలు ఐక్యతకు నిదర్శనాలు.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతుంటాయి. ఇతర ప్రాంతాలకు వెళ్లి ఆడేందుకు 75 శాతం ప్రయాణ రాయితీని అందించేవి. కరోనా సమయంలో వీటిని రద్దు చేశాయి. కరోనా తర్వాత కూడా పునరుద్ధరించలేదు. దీంతో క్రీడాకారులపై ఆర్థిక భారం పడుతోంది. స్కూల్ గేమ్స్‌లో ఆడేవారికి రాష్ట్ర ప్రభుత్వమే ఆ మొత్తాన్ని భరిస్తుండగా.. అసోసియేషన్ క్రీడలకు వెళ్లే వారికి మాత్రం ఆర్థిక భారం తప్పడం లేదు. దీంతో చాలా మంది పేద క్రీడాకారులు దూర ప్రాంతాల్లో నిర్వహించే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ముఖం చాటేస్తున్నారు.

ఖోఖోలో సత్తా చాటుతున్న క్రీడాకారులు

● **పోటీలపై ప్రభావం:** ఉమ్మడి కడప జిల్లాలో సుమారు నాలుగు వేల మందికి పైగా క్రీడాకారులు ఏటా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు వెళుతుంటారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిని రైలు జనరల్ బోగీల్లో పంపుతున్నారు. కిక్కిరిసిన ప్రయాణికుల మధ్య తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. దూర ప్రాంతాలకు ప్రయాణం చేసి వెంటనే పోటీల్లో పాల్గొనడం ఆటతీరుపై ప్రభావం చూపుతోంది. జాతీయ స్థాయి పోటీలకు సంబంధించి ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు స్లీపర్ తరగతిలో ప్రయాణించొచ్చు. దగ్గర ప్రాంతాలకు వెళ్లేందుకు మహిళా క్రీడాకారిణిలకు స్త్రీశక్తి పథకం ఉపయోగపడుతున్నా.. పురుషులకు వ్యయం తప్పడం లేదు. రైళ్లల్లో కూడా గతంలో వలే 75 శాతం ప్రయాణ రాయితీని కొనసాగిస్తే క్రీడాకారులను కొంతైనా ఆర్థిక భారం తగ్గుతుంది.



● **పునరుద్ధరణతో ప్రోత్సాహం:** కొన్నిచోట్ల క్రీడా సంఘాలే దాతల ద్వారా సేకరించి క్రీడా దుస్తులు, ఛార్జీలు అందిస్తున్నాయి. మరికొన్ని ఆర్థిక ఇబ్బందులతో క్రీడాకారులను పోటీలకు పంపించలేకపోతున్నాయి. ప్రయాణ రాయితీని పునరుద్ధరిస్తే క్రీడాకారులకు ఎంతో మేలు. క్రీడాభివృద్ధికి కూడా ఎంతో ప్రోత్సాహం అందించినట్లు అవుతుంది.

- శివశంకర్‌రెడ్డి, ఏపీ పీఈటీస్-ఎస్ఏ పీఈ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

ఆహా అనేలా పోటీ

ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలల అంతర్ జిల్లా క్రీడా పోటీలు పులివెందులలో సోమవారం సందడిగా ప్రారంభమయ్యాయి. ఆచార్య ఎన్జీ రంగా విశ్వ విద్యాలయ ఉప కులపతి డాక్టర్ శారద జయలక్ష్మీ దేవి, విద్యార్థి వ్యవహారాల డీన్ జి. రామచంద్రరావు తదితరులు కపోతాలను ఎగురవేసి వీటిని ప్రారంభించారు. - న్యూస్‌టుడే, పులివెందుల

అరటి రైతుల్ని ఆదుకునేలా చర్యలు

ఈనాడు, కడప: అరటి రైతుల్ని ఆదుకునేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. మార్కెటింగ్‌పై ప్రత్యామ్నాయ ప్రయత్నాలు చేస్తోంది. జిల్లా నుంచి ఎక్కువగా దిల్లీ మార్కెట్‌కు ఎగుమతి అవుతుంటుంది. ఈ సారి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారుల సంఖ్య తగ్గడంతో పోటీలేక ధర పతనమైనట్లు ఓ కారణంగా గుర్తించారు. ధర ఆశాజనకంగా.. స్థిరంగా ఉండేలా చర్యలు చేపట్టారు. ఈ మేరకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సోమవారం అధికారులతో సమీక్షించారు. మహారాష్ట్ర ట్రేడర్స్‌తో సంప్రదింపులు సాగించారు. దిల్లీ, మహారాష్ట్రకు ఎగుమతులకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ప్రస్తుతం మొదటి రకం కిలో రూ. 8 నుంచి రూ. 9 వరకు., రెండో రకం రూ. 4 నుంచి రూ. 5 పలుకుతోంది.

● **వ్యాగన్ల ద్వారా ఎగుమతులు:** జిల్లాలో సుమారు 13 వేల హెక్టార్లలో అరటి పంట సాగులో ఉంది. పులివెందుల నియోజకవర్గంలో ఎక్కువ విస్తీర్ణం ఉంది. ఇటీవల పంట ధర అకస్మాత్తుగా పడిపోయిన నేపథ్యంలో రైలు వ్యాగన్ల ద్వారా డిమాండ్ ఉన్న ప్రాంతాలకు ఎగుమతి అవకాశాలకు అధికారులు అన్వేషిస్తున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఇప్పటికే రైల్వే ఉన్నతాధికారులతో చర్చించారు. మరోవైపు ఉద్యాన శాఖ అధికారులు క్షేత్రస్థాయికి చేరుకుని రైతులతో సంప్రదింపులు చేపట్టారు. పంట కోతకు వచ్చిన రైతుల్ని గుర్తించి వారికి మార్కెటింగ్ సౌకర్యంపై వివరిస్తున్నారు.



(c) eenadu

సమస్యల పరిష్కారానికి పడిగాపులు

● గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. కొందరు రెండు దఫాలుగా వస్తే ఇంకొందరు ఐదారేసి సార్లు వచ్చినట్లు చెబుతున్నారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా సుమారు 300 అర్జీలు రావడం విశేషం. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ వారి నుంచి వినతులు స్వీకరించి మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలపై అధికారులు బాధ్యతాయుతంగా సానుకూలంగా స్పందించాలని ఆదేశించారు. జేసీ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఎస్డీసీలు వెంకటపతి, శిరీష, రంగస్వామి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ఇంటి నిర్మాణానికి బిల్లు మంజూరు చేయండి

ఆరేళ్ల కిందట ఇంటి నిర్మాణం కోసం బేస్‌మట్టం నిర్మించుకున్నా. గత ప్రభుత్వంలో బిల్లులు మంజూరు కాలేదు. కూటమి ప్రభుత్వంలో పలు దఫాలుగా మాయమైన్న సచివాలయంలో ఫిర్యాదు చేశా. సిద్దవటం మండలం అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదు. అరకొరగా బేస్‌మట్టంతోనే పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం ఉన్న ఇంట్లో వర్షం కురుస్తోంది. అధికారులు బిల్లులు మంజూరు చేస్తే ఇంటి నిర్మాణం చేపడతా. **- సుబ్బరాయుడు, మూలపల్లె, సిద్దవటం**

పింఛను ఇప్పించండయ్యా!

నా బిడ్డ మానసిక దివ్యాంగుడు. నడవలేడు. కూర్చోలేడు. పింఛను ఇవ్వాలని మూడు దఫాలుగా కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేశా. 14 ఏళ్ల నుంచి నా బిడ్డ ఇలాగే ఇబ్బందులు పడుతున్నాడు. పనులన్నీ మానుకుని వాడి కోసం ఇంటి వద్దే ఉండాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి రూ.16 వేల పింఛను మంజూరు చేస్తే ఆసరాగా ఉంటుంది. అధికారులు స్పందించాలి. **- సుజాత, కృష్ణాపురం**

పలుమార్లు తిరిగినా పట్టించుకోలేదు..

స్థానికంగా ఉన్న నా స్థలానికి సర్వే చేసి హద్దులు చూపించాలని కోరుతూ పలు దఫాలుగా అట్లూరు తహసీల్దారుకు వినతి పత్రం ఇచ్చా. స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి ఆక్రమించుకున్నారని చెబుతున్నా పట్టించుకోవటం లేదు. పోలీసులను సంప్రదించినా ఫలితం లేదు. అందుకే కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చా. నాకు న్యాయం చేసేలా చూడాలి. **- లక్ష్మిరెడ్డి, చిన్నకామసముద్రం, అట్లూరు**

ఖైదీల ఆరోగ్యంపై న్యాయమూర్తి ఆరా

కడప చిన్నచౌకు, జమ్మలమడుగు, న్యూస్‌టుడే: జిల్లాలోని సబ్ జైళ్లలో ఉన్న ఖైదీల ఆరోగ్యంపై జైలు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. ఏపీ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని ఆదేశాలతో సోమవారం కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు సబ్‌జైళ్లను తనిఖీ చేశారు. సబ్‌జైళ్లకు సంబంధించిన దస్త్రాలను పరిశీలించారు. ఖైదీలకు చెందాల్సిన హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధానం తదితర వాటిపై ఖైదీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్‌జైళ్ల అధికారులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

దస్త్రాలు పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్

నిర్ణీత సమయంలోనే బాధితులకు న్యాయం: ఎస్పీ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: బాధితుల సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పోలీసులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో బాధితుల నుంచి ఎస్పీ వినతులు స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి 71 ఫిర్యాదులు రాగా ఆయా ఠాణాలకు బదిలీ చేశారు. తక్షణమే పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. చోరీ కేసులపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలన్నారు.

బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

4న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: డిసెంబరు 4వ తేదీ అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కడప, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు డిపోల నుంచి ఒక్కో బస్సు సర్వీసు ఏర్పాటు చేశామన్నారు. అరుణాచలానికి వెళ్లే భక్తులు ఆయా డిపో మేనేజర్లను సంప్రదించాలని ఆర్‌ఎం కోరారు.

ఉద్యోగ విరమణ ప్రయోజనాలు చెల్లించాలని వినతి

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: ఏపీ పంచాయతీ రాజ్-రూరల్ డెవలప్‌మెంట్ ఇంజినీరింగ్ విశ్రాంత ఉద్యోగులకు 2024 జనవరి నుంచి రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని ఆ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగాచార్యులు, జిల్లా అధ్యక్షుడు ముకుందరెడ్డి విజ్ఞప్తి చేశారు. జడ్పీలోని డీఆర్‌సీ భవనంలో సోమవారం ఆ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన డీఏ అరియర్స్, పీఆర్‌సీ అరియర్స్ వెంటనే విడుదల చేయాలని కోరారు. అనంతరం జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు, ప్రధాన కార్యదర్శి రమణ, కోశాధికారి కృష్ణారెడ్డి, సలహాదారు వెంకటేషులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రంగాచార్యులు

పొదుగునకు అపరిశుభ్రతే శత్రువు

పీలేరు, న్యూస్‌టుడే: పశువుల ఆరోగ్య సమస్యల్లో ప్రధానమైనది పొదుగు వాపు వ్యాధి. ఇది సూక్ష్మ జీవుల కారణంగా సోకుతుందని, పాల ఉత్పత్తి తగ్గిపోతుందని పీలేరు పశువైద్యాధికారి డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. పాలు పితికే వ్యక్తి పరిశుభ్రతను పాటించకపోవడం వ్యాధికి ప్రధాన కారణమని చెప్పారు. పశువులను శుభ్రంగా ఉంచాలి. పాడి పశువులకు ఇదే నియమం పాటించాలి. పాలు పితికే ముందు పొదుగును నీళ్లతో కడిగి శుభ్రమైన వస్త్రంతో తుడవాలి. నివారణకు డ్రై థెరపీని అమలు చేయాలని సూచించారు.

ఆవుకు సోకిన పొదుగు వ్యాధి

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

ప్రశ్న: మినుములో తామర పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తెలుపగలరు.
- రెడ్డిప్రసాద్, రైతు నాగిరెడ్డిపల్లి

సమాధానం: ఎకరాకు 20 నీలిరంగు జిగురు అట్టలను ఉంచితే పురుగు ఉనికి, ఉద్ధృతిని అంచనా వేసుకోవచ్చు. ఎసిఫేట్-1 గ్రాము లేదా ఫిప్రోనిల్ 1.5 మి.లీ.లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.2 గ్రా.లు ఇందులో ఏదైనా ఒక మందు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల తామర పురుగును నివారించవచ్చు.
- నాగలక్ష్మి, ఏవో రాజంపేట
- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

చీడలను నివారిస్తే జామలో చేసుకోవచ్చు లాభాలు

కడప, న్యూస్‌టుడే: జామ పండ్ల వినియోగం పెరగడంతో మార్కెట్లో మంచి గిరాకీ లభిస్తోంది. మరోవైపు చీడ పీడల ఉద్ధృతి పంటను దెబ్బతీస్తోంది. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే జామ పంట లాభదాయకమవుతుందని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. మానస సూచించారు.

పండు ఈగ

కాయపై పండు ఈగలు

కాయలు పక్వానికి రాగానే పండు ఈగ ఆశిస్తుంది. ఇది సోకిన కాయలను తోటల్లోనే ఏరి నాశనం చేయాలి. పిందె దశ దాటిన నుంచి మిథైల్ యూజినాల్ ఎరలను ఎకరాకు 6-8 చొప్పున ఏర్పాటు చేయాలి. నెలకొకసారి పంట కాలంలో మార్చి వేసే ఈగల బెడదను తగ్గించవచ్చు. తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చు. మిథైల్ యూజినాల్ 2 మి.లీ+మలాథియాన్ 2 మి.లీ లీటరు నీటిలో కలిపి ఆ ద్రావణంలో నానబెట్టిన చిన్న చిన్న ప్లైవుడ్ ముక్కలను ప్లాస్టిక్ సీసాల్లో ఉంచి తోటల్లో అమర్చితే ఈగలు చెట్టుకు వాల్చి చెందవు. ప్లైవుడ్ ముక్కలను సీసాలో దారంతో వేలాడదీసి సీసా అడుగున పులిసిన గంజిని పెడితే పండు ఈగతో జరిగే నష్టాన్ని తగ్గించవచ్చు.

తెల్లసుడి దోమ

ఆకులపై తెల్లని దూది లాంటి మెత్తని పదార్థంతో కప్పబడుతుంది. రసం పీల్చడంతో ఆకులు ఎర్రగా మారి ముడతలు పడతాయి. రాత్రి పూట జిగురు పూసిన పసుపు రంగు డబ్బాలను తెల్లదోమ ఆశించిన చెట్ల వద్ద ఉంచాలి. ప్రథమ దశలో ఉంటే ఆశించిన కొమ్మలను కత్తిరించాలి. వేపనూనె 5 మి.లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే వీటి తీవ్రతను అదుపు చేయవచ్చు.

చెట్టుకు అల్లుకున్న బూజు

కాయ తొలుచు పురుగు

జామలో రెండు రకాల కాయ తొలుచు పురుగులు ఆశించి నష్టాన్ని కలుగజేస్తాయి. రెక్కల పురుగులు గుడ్లను పూత, పిందెలపై పెడతాయి. లార్వాలు కాయ లోపలికి తొలుచుకొని పోయి గుజ్జును తింటాయి. వీటి నివారణకు నివారణకు పూత, మొగ్గ దశలోనే ఉన్నప్పుడు 5 శాతం వేపగింజల కషాయం లేదా వేపనూనె 5 మి.లీ లీటరు నీటికి లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఆశించిన కాయలను ఏరి నాశనం చేయాలి.

కాండం తొలిచే పురుగు

ఈ రకం పురుగు చెట్టు మొదళ్లలోకి చొచ్చుకుని పోయి విసర్జించిన పదార్థం రంధ్రాల్లో నిండి ఉంటుంది. వాటిని శుభ్రపరిచి ఇనుప చువ్వ సహాయంతో పురుగును చంపి తర్వాత రంధ్రాల్లో పెట్రోలు లేదా కిరోసిన్‌లో తడిపిన దూదిని ఉంచి రంధ్రాలను తడి రేగడి మట్టితో పూడ్చాలి.

రైతేరాజు

మెరిసినమ్మ విజయమ్మ

దిగుబడులను చూపుతున్న మహిళా రైతు జయమ్మ



స్ఫూర్తి

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటి మండలం యండపల్లెకు చెందిన మహిళా రైతు జయమ్మ తనకున్న 1.50 ఎకరాల పొలంలో గత ఖరీఫ్‌లో వర్షాధారంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించి వేరుసెనగ పంటను సాగు చేశారు. తొలుత లోతు దుక్కులు దున్ని పంట అవసరమైన పశువుల ఎరువులు వేశారు. విత్తనం, దున్నకాలు, ఎరువులు కలిపి రూ.20 వేలలోపు పెట్టుబడి ఖర్చులు వచ్చాయి. 1.50 ఎకరా భూమిలోనే వేరుసెనగ ప్రధాన పంటగా వేయగా అనుబంధ పంటలుగా కంది, అలసంద, పెసలు, ఆముదం వంటి రకాలను వేశారు. పూత, పిందె దశలో పంటను ఆశించిన తెగుళ్ల నివారణకు రసాయన మందులకు బదులు పంట వద్దనే తయారు చేసిన కషాయాలను పిచికారీ చేసి తెగుళ్లను నివారించారు. పంటకు సమయానుకూలంగా ఆరుతడి నీరు అందించడంతో ఒక్కో చెట్టుకు 20-50 కాయలు వరకు దిగుబడి వచ్చింది. పశువుల ఎరువు వాడడంతో కాయ నాణ్యతగా రావడంతో ఔటన్ బాగుందని ప్రకృతి వ్యవసాయ అధికారులు గుర్తించారు. మార్కెట్‌లో ప్రస్తుతం 42 కిలోల వేరుసెనగ బస్తా రూ.3,300 ధర పలుకుతోంది. ఈ లెక్కన జయమ్మకు రూ.80 వేల వరకు ఆదాయం సమకూరింది.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం ఏర్పాటుకు డిమాండ్

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని కడపలో ఏర్పాటు చేయాలని ఇంటాక్ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు లయన్ కె.చిన్నప్పరెడ్డి డిమాండ్ చేశారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి సందర్భంగా సోమవారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం స్థలం, వనరులను సమకూర్చాలని కోరారు. తమకు స్థలం కేటాయిస్తే మూడు నెలల్లో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్డిసేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, మానవతా సంస్థ డైరెక్టరు రామాంజుల రెడ్డి, జానుమద్ది సాహితీ పీఠం ట్రస్ట్ సభ్యులు జానుమద్ది విజయభాస్కర్, సీపీఎం నగర కార్యదర్శి రాంమోహన్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, జనార్ధన్‌రాజు, చంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

ఉయ్యాలవాడ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కె.చిన్నప్పరెడ్డి, నాయకులు

ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎంపిక

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా అవధానం శ్రీనివాస్ (కడప), ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు (కడప), సూరిబాబు (అనంతపురం), నాగన్న (ఆత్మకూరు), సుధాకర్‌రెడ్డి(జమ్మలమడుగు), ప్రధాన కార్యదర్శిగా రఘునాథరెడ్డి (కడప), సంయుక్త కార్యదర్శులుగా పారిజాతమ్మ, అమీనా పర్వీన్ (కడప), సునీల్‌కుమార్ (కర్నూలు), శ్రీనివాసులు (కదిరి), కోశాధికారిగా రత్నకిషోర్, సహాయకోశాధికారిగా నసీరుల్లాఖాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతకుముందు కడప ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో డివిజన్ మహాసభ నిర్వహించారు. సమావేశానికి జాతీయ కోశాధికారి రవి, జోనల్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్‌లు మాట్లాడుతూ.. కార్మిక వర్గ హక్కులను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఈ నెల 26వ తేదీన జరిగే చేపట్టనున్న నిరసనను జయప్రదం చేయాలన్నారు.

ఏకగ్రీవంగా ఎంపికైన ప్రతినిధులు

మహారాజశ్రీ కడప ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P.No. 71/2025

రాచగొర్ల వెంకటేష్, తండ్రి వెంకటేష్, హిందూ, వయస్సు 30 సం॥లు కూలీ, డి.నెం. 5/183-ఎ, పులవలపల్లె గ్రామం, పెండ్లిమర్రి (మం.), కడప జిల్లా, ఆధార్ నెం. 5414 6005 8360. **...పిటీషనరు**

Vs

1. సుందరి వీరాంజనేయులు, తండ్రి రామాంజనేయులు, 35 సం॥, 5/73, పులవలపల్లె గ్రామం, పెండ్లిమర్రి (మం.).
2. తుంగ చెన్నకేశవ, తండ్రి ప్రసాద్, 30 సం॥, డి.నెం. 5/54,
3. సుందరి శ్రీనివాసులు, తండ్రి వెంకటన్న, 40 సం॥, 5/54,
4. కుడుముల పవన్ కుమార్‌రెడ్డి, తండ్రి వెంకట కొండారెడ్డి, 5/142,
5. కుడుముల చంద్రశేఖర్‌రెడ్డి, తండ్రి మునిరెడ్డి, 54 సం॥, 5/138,
6. పాలేటి, తండ్రి బాలగుర్రయ్య, 40 సం॥, 5/133,
7. లావనూరు వెంకట కొండారెడ్డి, తండ్రి లక్ష్మిరెడ్డి, 37 సం॥, 5/167,
8. సుందరి వెంకట్రాములు, తండ్రి వెంకట నారాయణ, 63 సం॥, 5/174,
9. తుంగా రవిచంద్ర, తండ్రి చంద్రాయుడు, 44 సం॥, 5/82,
10. కొక్కు ఓంప్రసాద్, తండ్రి బాలాపన్ని, 36 సం॥, 5/183,
11. సూకనబోయిన ఓబులేసు, తండ్రి గంగన్న, 33 సం॥, 5/172-ఎ,
12. చిట్టిబోయిన రామాంజనేయులు, తండ్రి వీరన్న, 5/195,
13. మల్లెబోయిన జాస్మీ, భర్త శ్రీనివాసులు 45 సం॥, 5/189,
14. రాచగొర్ల శ్రీనివాసులు, తండ్రి పెద్దక్క, 50 సం॥, 5/189,
15. సూకనబోయిన బోగడి, తండ్రి పెద్దఓబన్న, 45 సం॥, 5/108,
16. చిట్టిబోయిన గంగయ్య, తండ్రి గంగన్న, 55 సం॥, 5/195,
17. సూకనబోయిన జయరాముడు, తండ్రి నారాయణ, 60 సం॥, 5/104,
18. అంకల రాములు, తండ్రి చిన్నమల్లయ్య, 60 సం॥, 5/193,
19. మల్లెబోయిన యల్లయ్య, తండ్రి గుర్రయ్య, 45 సం॥, 5/190,
20. సూకనబోయిన ప్రసాద్, తండ్రి ఓబులేసు, 38 సం॥, 5/105,
21. చిట్టిబోయిన చంద్రాయుడు, తండ్రి చెన్నయ్య, 44 సం॥, 2/22,
22. సుందరి వేణుగోపాల్, తండ్రి నారాయణ, 57 సం॥, 5/89,

1-22 అందరిదీ సాకిన్ పులవలపల్లె, H/o పెండ్లిమర్రి మం., కడప జిల్లా.

23. చింతలపల్లె శిద్దారెడ్డి, తండ్రి శిద్దారెడ్డి, 40 సం॥లు, 5/20-ఎ,
24. ఓబనబోయిన బ్రహ్మయ్య, తండ్రి వీరయ్య, 45 సం॥, 5/27,
25. ఓబనబోయిన భారతీ, భర్త శ్రీనివాసులు, 35 సం॥ 5/20,

23-25 అందరిదీ సాకిన్ నల్లయ్యగారిపల్లె గ్రామం, పెండ్లిమర్రి (మం.),

26. మల్లెబోయిన లక్ష్మిదేవి, భర్త బాలక్రిష్ణ, 3/25, మల్లికవాండ్లపల్లె గ్రామం, చక్రాయ పేట మం.,
27. రాచగొర్ల శ్రీనివాసులు, తండ్రి పెద్దక్క, 50 సం॥, 1/107, సాకిన్ పాయసంపల్లె గ్రామం, వి.ఎన్.పల్లె మం., కడప జిల్లా.
28. సూకనబోయిన రామాంజనేయులు, తండ్రి చిన్న రామయ్య, 34 సం॥, డి.నెం. 5/48, చౌటపల్లె గ్రామం, పెండ్లిమర్రి మం.,
29. మోపూరి శివరాం, తండ్రి లక్షుమయ్య, 50 సం॥లు, ICL సిమెంటు ఫ్యాక్టరీ, 1/10, మధురానగర్, సి.మఠం మం., కడప జిల్లా.
30. యర్రంరెడ్డి ప్రవీణ్‌కుమార్ రెడ్డి, తండ్రి చంద్రశేఖర్‌రెడ్డి, 34 సం॥, 2/59,
31. ఆదిమూలం పెద్ద శిద్దయ్య, తండ్రి నిత్య గంగన్న 46 సం॥, 1/87,
32. దాసరి సంటెప్పగారి గంగరాజు, తండ్రి గంగన్న, 40 సం॥, 1/108,
33. సుంటరి దివాకర్, తండ్రి ప్రసాద్, 27 సం॥లు., 5/146. **...రెస్పాండెంట్లు**

30-32 సాకిన్ పాయసంపల్లె గ్రామం, వి.ఎన్.పల్లె మం., కడప జిల్లా.

నోటీసు ప్రకటన

పై నెంబరు దావాలో పిటీషనరును ఇన్‌సాల్వెన్సీగా తీర్మానించమని రెస్పాండెంట్లు అయిన మీపైన I.P. పిటీషన్ను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్లులో మీరు **3.12.2025**వ తేదీన ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గానీ, మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెల్పుకోవలయును. లేనంతట మీ పరోక్షంగా తీర్మానించబడును.

ఇట్లు : శ్రీ పి. రాజేశ్వరరెడ్డి, B.A.,B.L.,
శ్రీ ఎం. గంగశేఖర్, B.A., LL.B.,
పిటీషనరు పరం అడ్వకేట్స్, కడప.

నేటి నుంచి లింగ వివక్ష నిర్మూలనకు చర్యలు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో లింగ వివక్ష నిర్మూలనకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటోందని డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నేటి నుంచి వచ్చే నెల 23 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం మోక్ష గుండం విశ్వేశ్వరయ్య కూడలి నుంచి జిల్లా సచివాలయం వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.

27న విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: కడప డీఎస్ఏ స్టేడియంలో ఈ నెల 27న పారా స్పోర్ట్స్ విభాగాల్లో విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో షేక్ గౌస్‌బాషా తెలిపారు. డిసెంబరు 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించడానికి శాప్ ఆదేశాలతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఒక వాలీబాల్ విభాగంలో బాలురు మాత్రమే పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

ఉరేసుకుని కౌలు రైతు ఆత్మహత్య

రామ్మోహన్ రెడ్డి (పాత చిత్రం)

కొండాపురం, న్యూస్‌టుడే: కొండాపురం గ్రామానికి చెందిన కౌలు రైతు సోమల రామ్మోహన్ రెడ్డి (40) బలవన్మరణానికి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల మేరకు.. రామ్మోహన్‌రెడ్డి మూడున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని కొద్ది కాలంగా కూరగాయ పంటలను సాగుచేస్తున్నారు. దిగుబడి సరిగా రాకపోవడంతో సాగు కోసం చేసిన అప్పులు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో కుటుంబ పోషణ భారమైంది. అలాగే పంట పెట్టుబడులకు డబ్బులు సర్దుబాటు కాక మనస్తాపంతో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బాలయ్య (పాత చిత్రం)

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: జమ్మలమడుగు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారిలోని దానవులపాడు గ్రామం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు.. దానవులపాడు గ్రామానికి చెందిన ఆవుల బాలయ్య (53) సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై రహదారి దాటుతుండగా అదే సమయంలో ప్రొద్దుటూరు నుంచి జమ్మలమడుగుకు వస్తున్న కారు ఢీకొంది. ఘటనలో బాలయ్య తీవ్రంగా గాయపడ్డారు. జమ్మలమడుగు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలయ్య వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

గల్లంతైన యువకులు మృత్యువాత

● కన్నీరుమున్నీరుగా విలపించిన కుటుంబ సభ్యులు

నరేష్ రోహిత్‌కుమార్ (పాత చిత్రాలు)

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: రీల్స్ చిత్రీకరించేందుకు పెన్నా నదిలోకి వెళ్లి సుడిగుండాల్లో చిక్కుకుని గల్లంతైన ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. రామాంజనేయపురం దండోరా కాలనీకి చెందిన కె.నరేష్ (18), అశోక్‌నగర్‌కు చెందిన రోహిత్‌కుమార్(16)లు వాటర్‌గండి సమీపంలోని పెన్నానదిలోకి ఆదివారం వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. సాయంత్రం నుంచి రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది వెనక్కి వచ్చేశారు. సోమవారం ఉదయం చెన్నూరు సీఐ కృష్ణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో మళ్లీ గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన ప్రాంతం నుంచి 200 మీటర్ల దూరంలో మృతదేహాలను గుర్తించి వెలికితీశారు. మృతదేహాలను చూసిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు.

రోహిత్ మృతదేహాన్ని తీసుకొస్తూ విలపిస్తున్న బంధువులు

వినుకొండలో క్రీడా సందడి

● ఉత్సాహంగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా వినుకొండలో లయోలా పాఠశాల వేదికగా 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-17 బాలబాలికల అథ్లెటిక్స్ సోమవారం ప్రారంభమయ్యాయి. దీంతో వినుకొండలో క్రీడా సందడి నెలకొంది. పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫాదర్ అవినాష్ ప్రారంభించగా విజేతలకు జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పతకాలు అందజేసి అభినందించారు.

బాలికల విభాగాల్లో విజేతలు : 800 మీటర్ల పరుగు: వర్షిత (అనంతపురం), లక్ష్మి (కడప), దీక్ష (అనంతపురం). **4X100 మీటర్లు రిలే:** భవిత, కావ్య, లక్ష్మి, జస్వీత (కడప).

బాలుర విభాగంలో.. : హైజంప్: అశోక్ (శ్రీకాకుళం), రాఘవేంద్ర (కడప), తేజేశ్వర్‌రెడ్డి (పశ్చిమ గోదావరి), **400 మీటర్ల పరుగు:** రాజేశ్ (అనంతపురం), శశాంక్ (వైజాగ్), దివాకర్ (కడప), **100 మీటర్ల పరుగు:** రాఘవేంద్ర వరప్రసాద్ (కడప), అరవింద్ (అనంతపురం), **ట్రిపుల్ జంప్:** చంద్రశేఖర్ (గుంటూరు), తిమ్మప్ప (కడప), అరవింద్ (అనంతపురం), **జావెలిన్ త్రో:** చరణ్ (గుంటూరు), గంగాధర్ (కడప), లింగప్రసాద్ (శ్రీకాకుళం).

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఫాదర్ అవినాష్

బంగారం వ్యాపారుల అరెస్టు

కోర్టులో హాజరుపరిచిన పోలీసులు

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులోని బంగారం వ్యాపారి తనికంటి శ్రీనివాసులు అతని సోదరుడు తాడిపత్రిలో నివాసం ఉంటున్న వెంకటస్వామిలను పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు 10 కిలోల బంగారం తీసుకుని అందుకు సంబంధించిన డబ్బులు చెల్లించకుండా మోసం చేసి, తనను కిడ్నాప్ చేసి దాడి చేసి బెదిరించారని హైదరాబాద్‌కు చెందిన బంగారం వ్యాపారి హేమంత్ శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 20న కేసు నమోదు చేశారు. కేసులో తనికంటి సోదరులను అదుపులోకి తీసుకున్న వ్యవహారం వివాదంగా మారిన విషయం తెలిసిందే. వారిని అరెస్టు చేసిన పోలీసులు వైద్య పరీక్షల అనంతరం సోమవారం రాత్రి ప్రొద్దుటూరు కోర్టులో మేజిస్ట్రేట్ వద్ద హాజరు పరిచారు. పోలీసుల తీరు, వారు ఇబ్బంది పెట్టిన వ్యవహారాన్ని వారు మేజిస్ట్రేట్ దృష్టికి తీసుకెళ్లారు. గాయాలను సైతం చూపించారు. ఈ క్రమంలో మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు వెంకటస్వామిని వైద్య పరీక్షల కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తర్వాత కోర్టుకు తీసుకెళ్లగా న్యాయమూర్తి వారి రిమాండ్‌ను తిరస్కరించి, బెయిల్ మంజూరు చేశారు.

ప్రొద్దుటూరు పోలీసులపై చర్యలు?

ప్రొద్దుటూరులో బంగారం వ్యాపారులు తనికంటి శ్రీనివాసులు, వెంకటస్వామి కేసు వ్యవహారంలో ఓ సీఐ వ్యవహరించిన తీరుపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఆయన్ను వీఆర్‌కు పంపుతూ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆయనతో పాటు మరికొందరి పోలీసులపై వేటు పడే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే పోలీసు ఉన్నతాధికారులు ఆ విషయాన్ని అధికారికంగా తెలియజేయాల్సి ఉంది.

తనికంటి సోదరులను తీసుకెళ్తున్న పోలీసులు

గ్రామీణ ప్రాంత మహిళలకు ఉచిత శిక్షణ

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: కడప నగర శివారులోని కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో డిసెంబరు 10 నుంచి గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలకు టైలరింగ్ (31 రోజులు), జ్యూట్‌బ్యాగుల (14 రోజులు) తయారీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ సోమవారం తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయసు కలిగిన వారు అర్హులని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 94409 05478, 99856 06866 నంబర్లను సంప్రదించాలన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ © 7382114647

ఎలక్ట్రీషియన్లు కావలెను. APSPDCL పరిధిలో చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు & అనంతపురం జిల్లాల్లో వర్క్స్ చేయుటకు ఎలక్ట్రీషియన్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్లు కావలెను. జీతం 20K To 30K. Con: 73307 05344, 089131 41574.

TO LET

COMMERCIAL

ITI సర్కిల్ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ క్రింద పార్క్ దగ్గర BNR రైస్ మిల్ ప్రక్కన 7400 SFT గల గోడౌన్ బాడుగకు ఇవ్వబడును. సెల్: 9848277001, 9110593250.

JOBS

Wanted Service Technicians Fresher or Exp. Electrical and Electronics ITI, Diploma or any Technical Exp. © 93901 52768

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ॥ 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

వసతి గృహం.. నిరుపయోగం

ఈ ఏడాది మార్చి 14న డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్యతో ఖాళీ అయిన వసతి గృహం నేటి వరకు వినియోగంలోకి రాలేదు. విద్యార్థినుల మధ్య గొడవ తలెత్తడంతో విష ద్రావణం తాగి ఓ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటనలో పలువురు ఉద్యోగులపై ఉన్నతాధికారులు వేటు వేశారు. విద్యార్థినులకు సరైన రక్షణ లేదని స్థానిక ఎంపీడీవో కార్యాలయం వీధిలోని బాలికల వసతి గృహంలోకి మిగిలిన విద్యార్థినులను తరలించారు. అప్పటి నుంచి నిరుపయోగంగా మారింది. ఈ విషయమై ఎస్సీ వసతి గృహం ఏఎస్‌డబ్ల్యూవో రామయ్యను వివరణ కోరగా.. డిగ్రీ, నర్సింగ్ విద్యార్థినులు చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, వారి అడ్మిషన్లు రాగానే వసతి గృహాన్ని పునఃప్రారంభిస్తామన్నారు. - న్యూస్‌టుడే, జమ్మలమడుగు

ఎమ్మెల్యే వరదకు సత్కారం

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డిని రాష్ట్ర షేక్ అభివృద్ధి, సంక్షేమ సొసైటీ ఛైర్మన్‌గా నియమితులైన ముక్తియార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఛైర్మన్ నియామకానికి సహకరించినందుకు సోమవారం ఎమ్మెల్యే నివాసంలో వరదరాజులురెడ్డికి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డిని కలిసి మాట్లాడారు.



ఎమ్మెల్యే వరదరాజులురెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ముక్తియార్

ట్యాంకులో నీరు.. తాగేదెలా సారూ..!

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు తాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రక్షిత మంచి నీటి పథకాన్ని తీసుకొచ్చింది. ఓవర్‌హెడ్, మినీ ట్యాంకులను ఏర్పాటు చేసి అక్కడి నుంచి ప్రజలకు కొళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే గ్రామాల్లో ట్యాంకులను ప్రతి 15 రోజులకొకసారి శుభ్రం చేసి ప్రజలకు మంచి నీటిని అందించాలి. గ్రామాల్లోని మినీ ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో అపరిశుభ్రత నెలకొంది. దీంతో గ్రామీణులకు కలుషితమవుతున్న నీరే దిక్కవుతోంది. ట్యాంకుల వద్ద నీరు నిలిచి పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది. నెలల తరబడి ట్యాంకుల నిర్వహణ పట్టించుకోకపోవడంతో రోగాలు వస్తాయనే భయంతో ప్రజలు ప్రైవేటు వ్యాపారుల నుంచి తాగునీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గూడెంచెరువు ఎస్సీ కాలనీలో అపరిశుభ్రంగా ట్యాంకు

చర్యలు తీసుకుంటాం

ట్యాంకులు శుభ్రం చేయించడం, రక్షిత నీటిని పరీక్షించే బాధ్యత పంచాయతీ, సచివాలయ అధికారులదే. నిర్ణీత వ్యవధిలో ట్యాంకులను శుభ్రం చేసి తేదీలు నమోదు చేయాలి. గ్రామాల్లో ట్యాంకులు శుభ్రం చేయించి, ప్రజలకు రక్షితనీటి ప్రాజెక్టు ద్వారా స్వచ్ఛమైన నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటాం. - సుధీర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, జమ్మలమడుగు

నిబంధనలు బేఖాతరు

జమ్మలమడుగు మండల పరిధిలోని 14 పంచాయతీల్లో 14 జీఎల్ఆర్, 21 ఓవర్‌హెడ్ ట్యాంకులున్నాయి. ఆయా గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య సిబ్బంది నెలకు రెండు సార్లు నీటి ట్యాంకులను శుభ్రం చేయాల్సి ఉంటుంది. శుభ్రం చేసిన తర్వాత క్లోరినేషన్ చేయాల్సి ఉన్నా ఆ దిశగా పనులు చేపట్టలేదు. శుభ్రం చేసిన తేదీలను ట్యాంకుల వద్ద విధిగా నమోదు చేయాలనే నిబంధన ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదు. నీటి నమూనాలు పరీక్షించేందుకు కిట్లు సరఫరా చేసినా వినియోగించిన దాఖలాలు కనిపించడం లేదు. సిబ్బంది సకాలంలో ఆ పని చేయకపోవడంతో ట్యాంకుల్లో సూక్ష్మజీవులు చేరి నీరు కలుషితమవుతోంది. ట్యాంకులను శుభ్రం చేయకుండానే కొళాయిల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేస్తుండటంతో అవి తాగి పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి ట్యాంకులను సకాలంలో శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశంసాపత్రాలు అందుకున్న విజేతలతో ఖాజీపేట బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం సుజాతమ్మ

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఖాజీపేట బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం బాల అంకిరెడ్డి

ఉపన్యాస పోటీల్లో విద్యార్థుల సత్తా

ఖాజీపేట, న్యూస్‌టుడే: ఖాజీపేట బాలికల ఉన్నత పాఠశాలలో ఈనాడు ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో జె.వైష్ణవి, ఎస్.సల్మా, ఎస్.పూజిత విజేతలుగా నిలిచారు. వీరికి హెచ్ఎం సుజాతమ్మ, ఉపాధ్యాయులు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

✶ ఖాజీపేట బాలుర ఉన్నత పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై సెల్ ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎన్.ఆకాష్, కె.వినయ్, డి.అవినాష్‌లు విజేతలుగా నిలవగా హెచ్ఎం బాల అంకిరెడ్డి, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

మైదుకూరు : ఈనాడు ఆధ్వర్యంలో సోమవారం మైదుకూరులోని సెయింట్ ఆల్ఫోన్స్ లిగోరి హైస్కూల్‌లో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై పోటీ నిర్వహించారు. ఆర్.దావూద్ నిహాల్, ఎ.పవిత్ర, కేవీమోక్షిత్ విజేతలుగా నిలిచారు. వీరికి ఛైర్మన్ ఎస్.ఎం.ఎం.బాషా, కరస్పాండెంట్ ఇందిరా జయదేవి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

✶ సాయి హైస్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో హర్షిణిరెడ్డి, జాహ్నవి, దివ్యాన్షి వరుస విజేతలుగా నిలిచారు. పాఠశాల కరస్పాండెంట్ తవ్వా ఓబులరెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతి చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

విజేతలతో మైదుకూరు సెయింట్ ఆల్ఫోన్స్ పాఠశాల ఛైర్మన్ ఎస్.ఎం.ఎం.బాషా, కరస్పాండెంట్ ఇందిరా జయదేవి

సత్తా చాటిన విద్యార్థులతో మైదుకూరు సాయి హైస్కూల్ కరస్పాండెంట్ తవ్వా ఓబులరెడ్డి, ప్రిన్సిపల్ జ్యోతి

అనధికార భవనాల క్రమబద్ధీకరణకు అవకాశం

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలో నవంబరు 12 నుంచి రాష్ట్ర ప్రభుత్వం బీపీఎస్ అమలు చేసిందని పుర కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. పురపాలక కార్యాలయంలో సోమవారం సాయంత్రం సచివాలయ వార్డు ప్లానింగ్ కార్యదర్శులతో కమిషనర్ సమావేశాన్ని నిర్వహించారు. అనధికారిక భవనాల క్రమబద్ధీకరణకు బీపీఎస్ పథకం అమలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సహాయక కమిషనర్ నాగరాజు, టీపీవోబీ చంద్రమోహన్, పురపాలక ఇంజినీరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

గోకుల్‌నగర్‌లో కమిషనర్ పర్యటన : ప్రొద్దుటూరు పట్టణం: ప్రొద్దుటూరు పట్టణ శివారు ప్రాంతం గోకుల్‌నగర్‌లో సోమవారం ఉదయం పుర కమిషనర్ రవిచంద్రారెడ్డి పర్యటించారు. ఈ నెల 24న 'చిన్నపాటి వర్షం.. వీధులన్నీ జలమయం' శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన కమిషనర్ ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ ప్రాంతంలో వర్షపునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నారు. మిగతా సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

అన్నదాతల అభ్యున్నతికే రైతన్నా మీకోసం

మైదుకూరు, బద్వేలు, ఎర్రగుంట్ల, దువ్వూరు, ఖాజీపేట, రాజుపాళెం, బి.కోడూరు, అట్లూరు, న్యూస్‌టుడే : అన్నదాతల అభ్యున్నతికే రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని అధికారులు, నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల వ్యాప్తంగా రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంట సాగుపై అవగాహన కల్పించారు. ప్రతి రైతు ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా అని ఆరా తీశారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రానాయక్, తెదేపా బద్వేలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి, ఆర్డీవో చంద్రమోహన్, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రాజుపాళెం: తొండలదిన్నెలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు, రైతులు

ఎర్రగుంట్ల మండలం తిప్పలూరులో అన్నదాతలతో వ్యవసాయ శాఖ ఉద్యోగులు

మైదుకూరు: అన్నలూరులో సిబ్బందికి సూచనలిస్తున్న డీఏవో చంద్రనాయక్

బద్వేలు మండలం పాపిరెడ్డిపల్లెలో మాట్లాడుతున్న తెదేపా ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి

ఉయ్యాలవాడకు ఘన నివాళి

నివాళులర్పిస్తున్న రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం ప్రతినిధులు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: స్వరాజ్య పోరాటంలో ఉద్యమించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ వైవీ స్వరూప్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. సోమవారం ఉయ్యాలవాడ జయంతి సందర్భంగా స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, సంఘం నాయకులు రాంప్రసాద్‌రెడ్డి, మారుతీప్రసాద్, ఓబులరెడ్డి, వీరన్న, గురుమోహన్‌రెడ్డి, నాగమణిరెడ్డి, రుక్మానందరెడ్డి, వెంకటరామిరెడ్డి, కొండారెడ్డి, మునిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని నిరసన

కలసపాడు, న్యూస్‌టుడే: మండలంలో అర్హులైన పేదలకు ప్రభుత్వ భూమి, ఇంటిస్థలాలు కేటాయించాలని కోరుతూ సోమవారం సీపీఐ నాయకులు, పేద ప్రజలు తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తొలుత మూడు రోడ్ల కూడలి నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరశేఖర్, ఏఐయూకేఎస్ కార్యదర్శి చిన్నసుబ్బయ్య మాట్లాడారు. మండలంలో వందల ఎకరాలు కబ్జా అయినా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దారు మధురవాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సునీల్‌కుమార్, రమణ, రవికుమార్, కేశవ, చెన్నయ్య, షరీఫ్, హరి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వసతులుండే పాఠశాలల్లోనే క్లస్టర్ సమావేశాలు

కొండాపురం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు ప్రతి నెల నిర్వహించే క్లస్టర్ సమావేశాలను వసతులున్న పాఠశాలల్లోనే నిర్వహించాలని ఎస్టీయూ, ఏపీటీఎఫ్-257 యూనియన్ మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, నాగరాజు, భాస్కర్‌రెడ్డి కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ.. చౌటిపల్లె జడ్పీ పాఠశాలలో సరైన వసతులు లేకపోవడంతో ఉపాధ్యాయుల అభిప్రాయం మేరకు సమీపంలోని గురుకుల విద్యాలయంలో సమావేశం నిర్వహించారని స్పష్టం చేశారు. చౌటిపల్లె జడ్పీ పాఠశాలలో కేవలం ఆరు గదులు మాత్రమే ఉన్నాయని ఉపాధ్యాయుల సమావేశం ఒకే సారి నిర్వహించడానికి 8 గదులు అవసరమన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీకి బారులు

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: జమ్మలమడుగు ప్రాంతీయ ఆసుపత్రి సోమవారం రోగులతో కిక్కిరిసిపోయింది. వాతావరణ పరిస్థితుల కారణంగా జ్వరాలు రావడంతో ఉదయం ఓపీ గది, మందులు, రక్త పరీక్షల కోసం బారులు తీరారు. సుమారు 900 మంది రోగులను వైద్యులు పరీక్షించారు. అధిక సంఖ్యలో రోగులు రావడంతో వైద్యం కోసం గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. పరిసరాలు శుభ్రంగా ఉంటే వ్యాధులు రావని వైద్యురాలు లలిత సూచించారు.

తెలుగు పండితుడికి పురస్కారం



మనోజ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే : కవయిత్రి మొల్ల సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి, తెలుగు పండితుడు గానుగపెంట వెంకట మనోజ్‌కుమార్‌కు మల్లెతీగ పురస్కారం వరించింది. ఈ మేరకు సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పురస్కారం అందజేసి సత్కరించారు. 25 ఏళ్లుగా విద్యార్థులను, వివిధ రంగాల్లోని ప్రతిభావంతులను ప్రోత్సహించినందుకు పురస్కారం అందజేస్తున్నట్లు మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ నిర్వాహకులు తెలిపారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.చిన్ని, శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. నిరుద్యోగులకు నెలకు రూ.3000 వేలు ఇస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు పెరుగుతున్నా భర్తీకి నోచుకోవడం లేదు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం జరగలేదన్నారు.

వీఆర్ఏలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని వినతి

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: డివిజన్ పరిధిలో గ్రామ రెవెన్యూ సహాయకులుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగోన్నతులు కల్పించాలని వీఆర్ఏలు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని వీఆర్ఏలు స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో సాయిశ్రీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి గురుమోహన్, డివిజన్ అధ్యక్షుడు ప్రసాద్, సీఐటీయూ గౌరవ సలహాదారుడు ఏసుదాసు, పట్టణ ఉపాధ్యక్షుడు వినయ్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల అందజేత

క్రీడా దుస్తులు ధరించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చాపాడు, న్యూస్‌టుడే: నరహరిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 32 మంది విద్యార్థులకు ఉపాధ్యాయులు సొంత డబ్బుతో క్రీడా దుస్తులు అందించారు. ఉపాధ్యాయులు పుష్పలత, నాగమణి, శ్రీరాములు, రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ శిరీష దుస్తులు కొనుగోలు చేశారు. విద్యార్థులకు వారే స్వయంగా దుస్తులు కొనుగోలు చేయడంతో పీఈటీ నరసింహశాస్త్రి, పీడీ ప్రశాంతి హర్షం వ్యక్తం చేశారు.

వైఎంఆర్ కాలనీలో సర్వే పరిశీలన

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: కుష్ఠు లక్షణాలున్న వారిని ప్రాథమిక దశలోనే గుర్తించి అంగవైకల్యానికి గురికాకుండా కాపాడవచ్చని డీపీఎంవో శివశంకరయ్య అన్నారు. ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీలో నిర్వహిస్తున్న కుష్ఠు బాధితులను గుర్తించే ఇంటింటి సర్వేను వారు పరిశీలించారు. ఈ నెల 30 వరకు సర్వే కొనసాగుతుందని ప్రతి ఒక్కరిని పరిశీలించి వ్యాధి లక్షణాలను గుర్తించాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శోభారాణి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

స్థల వివాదమై ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

అట్లూరు, న్యూస్‌టుడే : స్థల విషయమై అట్లూరు క్రాస్ రోడ్డులో పరస్పరం దాడులు చేసుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. రెడ్డిపల్లెకు చెందిన ఆంజనేయులు ఇంటి నిర్మాణ పనులు చేయిస్తుండగా అయ్యప్ప ఆలయ నిర్మాణ కార్యనిర్వాహకుడు నరసింహారెడ్డి అడ్డు చెప్పారు. ఇరువురు పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఘటనలో అయ్యప్ప మాల వేసుకున్న నరసింహారెడ్డి తలకు గాయలయ్యాయి. ఆంజనేయులుకు ఎడమ చేయి విరిగింది. ఇరువురిని వేర్వేరు 108 వాహనాలలో చికిత్స కోసం రిమ్స్‌కు తరలివెళ్లారు. అయ్యప్ప భక్తుడు నరసింహారెడ్డిపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని భక్తులు అట్లూరు క్రాస్‌రోడ్డులో ఆందోళన చేశారు. సంఘటనా స్థలానికి ఎస్సై రామకృష్ణ చేరుకొని విచారించారు.

కుంగిన వంతెన.. పొంచి ఉన్న ప్రమాదం

పెద్దముడియం మండల పరిధిలోని జంగాలపల్లె-సుద్దపల్లె రహదారిలోని దత్తాత్రేయస్వామి గుడి సమీపంలో ఉన్న కాశన్న వంక వంతెన సోమవారం రాత్రి కుంగిపోయింది. ప్రధాన రహదారి కావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారి దెబ్బతినడంతో పాటు భారీ వాహనాలు వెళ్లడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఆర్అండ్‌బీ ఏఈ అభిలాష్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన చర్యలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. - న్యూస్‌టుడే, పెద్దముడియం

తొలగని మురుగు.. ఖాళీ స్థలంలో ముళ్లపొదలు

పారిశుద్ధ్యంపై దృష్టి సారించని పురపాలక అధికారులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలో పారిశుద్ధ్య పనులపై అధికారులు దృష్టి సారించలేదనే విమర్శలున్నాయి. బురుసాధుమఠం వీధి, మసీదు వీధికి ఎదురుగా ఉన్న సందులు, రామాలయం, చౌడేశ్వరినగర్ తదితర ప్రాంతాల్లో స్వచ్ఛత పనులు అధ్వానంగా ఉన్నాయి.

★ చౌడేశ్వరినగర్‌లో కాలువలు దెబ్బతినడంతో మురుగు పారడం లేదు. మరికొన్ని ప్రాంతాల్లో కాలువలో పూడిక తొలగించకపోవడంతో మురుగు పారక దుర్వాసన వస్తోంది. వర్షాకాలంలో నీరు వెళ్లే అవకాశం లేదు. మసీదు వీధికి ఎదురుగా ఉన్న కాలనీల్లోని కాలువల్లో పూడిక తొలగించలేదు. ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలు పెరగడంతో పాములు, విష పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు సచివాలయంలో ఫిర్యాదు చేశారు. ఖాళీ స్థలం యజమాని తెలియకపోవడంతో సచివాలయ సిబ్బంది ముళ్లకంపలను తొలగించాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బ్యానర్ ఏర్పాటు చేశారు. రామాలయం వెనుక వీధిలో రోడ్డు నెర్రలు చీలింది. దెబ్బతిన్న రోడ్డులో వాహనాల రాకపోకలు ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో పూడిక తీయాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఖాళీస్థలంలో ముళ్లకంపలను తొలగించాలని హెచ్చరిక బ్యానరు ఏర్పాటు చేసిన అధికారులు

ప్రథమ వర్ధంతి
కీ॥శే॥ శ్రీ పబ్బతి శ్రీరాములు
సాంబయ్యగారి వీధి, ప్రొద్దుటూరు.
జననం : 19.11.1948 మరణం : 25.11.2024
అందరినీ చిరునవ్వుతో పలకరిస్తూ... అందరి మంచికోరే మంచి మనస్సున్న మా మిత్రుడు శ్రీ పబ్బతి శ్రీరాములు గారి ప్రథమ వర్ధంతి సందర్భంగా మిమ్మల్ని స్మరిస్తూ...
నీ మిత్రుడు : వంకదార విజయ్‌కుమార్ & సిబ్బంది
శ్రీ మహాలక్ష్మి మెడికల్ స్టోర్స్
పుట్టపర్తి సర్కిల్, మైదుకూరు రోడ్డు, ప్రొద్దుటూరు.

మోతాదుకు మించిన ఔషధంతో అనర్థం

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: వైద్య నిపుణుల సూచనలు, సలహాలు లేకుండా అధిక మొత్తంలో వ్యాధి నిరోధక ఔషధాల వినియోగంతో ప్రమాదం పొంచి ఉందని డిప్యూటీ డీఎంహెచ్‌వో గీత హెచ్చరించారు. సోమవారం స్థానిక కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని వీధుల్లో ప్రపంచ ఏఎంఆర్ వారోత్సవాల సందర్భంగా అవగాహన, ప్రచార ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఒక్కరూ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏఎంఆర్ తగ్గిపోయేవిధంగా ప్రైవేటు వైద్యులు, ఆర్ఎంపీలు వ్యవహరిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు వరప్రసాదు, చంద్రకళ, ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: వైద్యుల అనుమతి లేనిదే మందులు వినియోగించడం ప్రమాదకరమని వైద్యాధికారి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం బద్వేలు మండలంలోని తిమ్మరాజుపల్లె గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రపంచ ఏఎంఆర్ అవగాహన వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. చిన్న జబ్బులకు మోతాదుకు మించిన ఔషధం వినియోగిస్తే అనర్థమన్నారు. కార్యక్రమంలో జనార్దన్, నాగలక్ష్మీ, నారాయణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కామనూరులో ర్యాలీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో గీత, వైద్య సిబ్బంది

కర్షకులను ఆదుకోవాలని డిమాండ్

మైదుకూరు, న్యూస్‌టుడే : రైతులను ఆదుకునేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎ.వి.రమణ డిమాండ్ చేశారు. మైదుకూరు పట్టణంలో సమితి ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తొలి సంవత్సరం అన్నదాతా సుఖీభవ అమలు చేయలేదన్నారు. రెండో ఏడాది పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఉల్లి రైతులకు రూ.50 వేలు ప్రకటించి రెండు నెలలు అవుతున్నా పరిహారం అందలేదన్నారు. అరటి, మొక్కజొన్న దిగుబడులకు గిట్టుబాటు ధర అందక రైతులు అవస్థలు పడుతున్నా ఆదుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులకు చేసింది ఏమీ లేకపోయినా రైతన్నా మీకోసం పేరుతో వారి వద్దకు వెళ్లడం కేవలం ప్రచారం కోసమేనన్నారు. సమావేశంలో పాములేటి నరసింహ, కానగూడూరు రామమోహన్, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, మిద్దె వెంకటరమణ, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన భవన ప్రారంభోత్సవ ఆహ్వానం
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఖాజీపేట శాఖ.
ముఖ్య అతిథులు
ప్రారంభోత్సవ తేదీ : 25.11.2025 మంగళవారం ఉదయం 10 గంటలకు
శ్రీమతి డా॥ జి.రాజ్యలక్ష్మి గారు ప్రాజెక్ట్ డైరెక్టర్, DRDA, కడప.
శ్రీ పత్రి శ్రీనివాసకుమార్ గారు జోనల్ హెడ్, తిరుపతి.
శ్రీమతి ఎ.లక్ష్మీతులసి గారు రీజనల్ హెడ్, కడప.
ఖాతాదారుల సౌకర్యార్థం కొరకు కడప రోడ్డులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఖాజీపేట శాఖను అందరికీ అందుబాటులో, అన్ని వసతులతో, మైదుకూరు రోడ్డు యందు విజేత స్కూల్ ఎదురుగా ఉన్న నూతన భవనంలోనికి మారుస్తున్న శుభసందర్భంగా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు మా హృదయపూర్వక ఆహ్వానం.
యం.మధుబాబు, గోల్డ్ అప్రైజర్
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఖాజీపేట.

(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

వైభవంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం

గ్రామోత్సవంలో దీపాలతో మహిళలు, యువతులు

కమలాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని సొసైటీకాలనీలో వెలసిన అయ్యప్పస్వామి వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం జ్యోతిష్య శాస్త్ర పరిశోధకులు, ఆలయ గురుస్వామి డాక్టర్ నరసింహశర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు, అయ్యప్ప మాలధారులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు.

ధైర్య సాహసాలకు ప్రతీక ఎన్‌సీసీ

అలరించిన ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రదర్శన

కడప విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు ఎన్‌సీసీలో శిక్షణ పొందడం వల్ల ధైర్య సాహసాలను, జీవితంలో ఎలాంటి ఒడిదుడుకులనైనా ఎదుర్కొగల శక్తి సామర్థ్యాలు కలిగి ఉంటారని కోటిరెడ్డి మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా అన్నారు. స్థానిక కళాశాల ఆవరణలో సోమవారం ఎన్‌సీసీ ఫ్లాగ్ డే నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాలలో 150 మంది విద్యార్థులతో ఏటా ఎన్‌సీసీ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైస్‌ప్రిన్సిపల్, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ స్వరూప, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్రశిక్షా ఉద్యోగులు

కడప విద్య, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ, ఎంటీఎస్ అమలు చేయాలని జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట 'పోరాట దీక్ష'లో భాగంగా ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా తమ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే డిసెంబర్ పదో తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర, జేసీ చిన్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగభూషణం, శివ, భద్ర, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు రానీయం

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యలు సత్వరం పరిష్కరించాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ అన్నారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయం నుంచి సోమవారం ఆయన డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నుంచి అయిదు మంది వినియోగదారులు తమ సమస్యలను విన్నవించారు. జిల్లా అధికారులు వాటిని పరిష్కరించాలని సీఎండీ ఆదేశించారు.

ట్రస్టు స్థలం.. వివాదాస్పదం

అనధికారిక నిర్మాణాలపై నగరపాలక కమిషనర్‌కు ఫిర్యాదు

యాదాళ్ల పిచ్చయ్య శెట్టి ఛారిటబుల్ అసోసియేషన్‌కు చెందిన స్థలం

కడప నగరపాలక, న్యూస్‌టుడే: యాదాళ్ల పిచ్చయ్య శెట్టి ఛారిటీస్ అసోసియేషన్.. ఈ పేరు కడప నగరవాసులందరికీ సుపరిచితం. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఈ ట్రస్టుకు చెందిన విలువైన భూములున్నాయి. యాదాళ్ల పేరిట ఉన్న భూములు ఇప్పటికే పలుచోట్ల ఆక్రమణకు గురయ్యాయి. కడప పాతబస్టాండు పక్కనే ఈ సంస్థకు విలువైన ఆస్తులున్నాయి. రూ.కోట్ల విలువ చేసే ఈ స్థలాన్ని కాపాడుకోవడానికి అక్కడి పురాతన కట్టడాలన్నింటినీ కొంత కాలం కిందట కూల్చి స్థలం చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఆ సర్వే నెంబరులోని స్థలాన్ని లీజుకివ్వాలని ట్రస్టు-దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్ణయించాయి. సీల్డ్ టెండర్లు, ఈ టెండర్లు బహిరంగ వేలం పాట ద్వారా స్థలాన్ని 11 ఏళ్ల పాటు లీజుకివ్వడానికి ఈ ఏడాది జులై నెలలో బహిరంగ ప్రకటన జారీ చేశారు. అత్యధిక మొత్తానికి పాడగా 37.09 సెంట్లను ఒకరికి 38.22 సెంట్లను మరొకరికి లీజుకిచ్చారు. ఈ స్థలంలో హిందూ వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టరాదని, మద్యం, మాంసం దుకాణాలు, బాణసంచా విక్రయాలు ప్రభుత్వంతో నిషేధించబడిన ఇతర వ్యాపారాలు నిర్వహించరాదని నిబంధన విధించారు. ఎండోమెంట్ అధికారుల అనుమతితో లీజుదారులు వారి సొంత ఖర్చులతో అక్కడ నిర్మాణాలు చేపట్టవచ్చని పేర్కొన్నారు.

కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం..

లీజుదారులు ఈ స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్ కట్టడానికి సన్నాహాలు చేశారు. ఈ నేపథ్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆ స్థలాన్ని పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని వెంటనే వాటిని ఆపాలని డిమాండ్ చేశారు. సోమవారం కమ్యూనిస్టు నాయకులు చంద్ర, బాదుల్లా తదితరులు ఈ అంశంపై కమిషనర్ మనోజ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. వీఎల్‌టీ (ఖాళీ స్థలంపై పన్ను) చెల్లించకుండా నిర్మాణాలు చేపడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

సర్వే చేస్తున్నాం

వీఎల్‌టీ కట్టాలని ట్రస్టు వారికి గతంలో నోటీసులు పంపాం. దీంతో వారు హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. ఎండోమెంట్ యాక్ట్‌లోని నిబంధనల ప్రకారం ట్రస్ట్ నుంచి పన్ను వసూలు చేయరాదని కోర్టు తీర్పునిచ్చింది. దీంతో ఆ స్థలంపై ప్రస్తుతం పన్ను విధించలేం. సర్వే నెంబరు అయిదులోని వివిధ అసెస్‌మెంట్ల మధ్య లీజుదారులు కడుతున్న నిర్మాణాలు ఏ అసెస్‌మెంటు కిందకి వస్తాయనే అంశంపై సర్వే చేస్తున్నాం. సర్వే పూర్తి అయిన తర్వాత తగిన మార్పులతో ప్లాన్ సబ్మిట్ చేస్తాం.

- నగరపాలక కమిషనర్, మనోజ్‌రెడ్డి

తెలుగు సాహిత్యానికి తవ్వా సేవలు ఘనం

సాహిత్య పరిశోధకుడు తవ్వా వెంకటయ్యను సత్కరిస్తున్న రచయితల సంఘం ప్రతినిధులు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: తెలుగు సాహిత్యానికి, కథా సాహిత్యానికి తవ్వా వెంకటయ్య చేసిన పరిశోధనలు కలకాలం గుర్తిండిపోతాయని జిల్లా రచయితల సంఘం నేతలు స్పష్టం చేశారు. కడప జిల్లా రచయితల సంఘం తవ్వా వెంకటయ్యను సోమవారం సత్కరించింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు మూల మల్లికార్జునరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వెల్లాల వెంకటేశ్వ రాచారిలు మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంతో పాటు రాజకీయ రంగంలో తన ప్రతిభ నిరూపించుకుంటున్నారన్నారు. రాజేశ్, ఆల్‌ఫ్రెడ్, ఓబులేసు, సాహిత్యప్రియులు పాల్గొన్నారు.

టమాట ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం

టమాట ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభోత్సవంలో ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ అధికారులు

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో టమాట ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆచార్య ఎన్జీ రంగా విశ్వ విద్యాలయ వీసీ డాక్టర్ శారదజయలక్ష్మిదేవి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వి.రమణలు ప్రారంభించారు. ఐకార్ ఎస్సీ సబ్ ప్లాన్ ప్రాజెక్టు కింద ఏర్పాటైన ఈ ప్రాసెసింగ్ యూనిట్ పులివెందుల ప్రాంతం వారికి ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కేంద్రాన్ని ఏవిధంగా వాడాలో.. ఉపాధి అవకాశాలు గురించి, విలువ ఆధారిత మెలకువలను విద్యార్థులకు నేర్పిస్తారన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధవ, ప్రాజెక్టు ప్రధాన పరిశోధకురాలు నజ్మా, ప్రాజెక్టు సభ్యులు పాల్గొన్నారు.

పంచ సూత్రాలు పాటిస్తే ప్రయోజనం

పాత కడపలో సమావేశమైన కడప తహసీల్దారు నారాయణరెడ్డి, వ్యవసాయధికారి సురేష్‌కుమార్‌రెడ్డి, రైతులు

కడప వ్యవసాయం, వేంపల్లె, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించిన పంచ సూత్రాలు పాటిస్తే రైతులకు ప్రయోజనం ఉంటుందని మండల తహసీల్దారు నారాయణరెడ్డి, వ్యవసాయాధికారి సురేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా పాత కడపలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేంపల్లెలోని 1వ సచివాలయం పరిధిలోని కాపువీధి, ఇతర ప్రాంతాల్లో మండల తెదేపా కన్వీనర్ రామమునిరెడ్డిరైతుల ఇళ్ల వద్దకు వెళ్లి అన్నదాత సుఖీభవ ప్రయోజనాలను రైతులకు వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు.

వేంపల్లెలో రైతులకు కరపత్రాలు అందిస్తున్న మండల తెదేపా కన్వీనర్ రామమునిరెడ్డి, తదితరులు

పులివెందుల, వేముల, చింతకొమ్మదిన్నె: పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లెలో పులివెందుల వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ అమర్నాథ్‌యాదవ్ ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, ఏవో చెన్నారెడ్డితో కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వేములలో మండల ప్రత్యేకాధికారి రామశివ దీక్షిత్ రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీకే దిన్నె మండలం ఇప్పపెంటలో పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రైతులు కేవలం వ్యవసాయమే కాకుండా అనుబంధ రంగాలపై దృష్టి సారించాలన్నారు.

పోరాట యోధుడు ఉయ్యాలవాడ

నరసింహారెడ్డి విగ్రహం వద్ద ఎంపీ అవినాష్‌రెడ్డి, నాయకులు

పులివెందుల: ఆంగ్లేయుల పాలనలో రైతుల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. పులివెందులలో రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ(ఆర్‌సీడీఎస్) ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణలో ఆయన పాల్గొని ఆవిష్కరించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. పురపాలక ఛైర్మన్ వరప్రసాద్, వైస్ ఛైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, వైకాపా నేత చవ్వా దుష్యంత్‌రెడ్డి, ఆర్‌సీడీఎస్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేంపల్లె: స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని మాజీ ఎంపీ తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ జయంతి వేడుకలు నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, నేతలు రామకృష్ణ, అమర్, ఉత్తన్న పాల్గొన్నారు.

కార్తిక ఉత్సవం పేరిట ఉన్నత పాఠశాలలకు సెలవు

• విస్మయం వ్యక్తం చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మండలంలోని పెన్నపేరూరు పంచాయతీ వెంకటాయపల్లె శివారులో ఉన్న ఓబులేసుకోనలో కార్తిక ఉత్సవం జరుగుతుందని సోమవారం మండలంలోని అన్ని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలకు సెలవు ప్రకటించారు. విద్యార్థులతో ఓబులేసుకోనలో జరుగుతున్న వేడుకలకు వెళ్లడానికి సెలవు ఇవ్వాలని ఎంఈవో, డిప్యూటీ ఈవోలకు ప్రధానోపాధ్యాయులు సమాచారం ఇచ్చారు. ఒంటిమిట్ట, పెన్నపేరూరు, రాచపల్లె, మంటపంపల్లె, కొత్తమాధవరం, చింతరాజుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలకు ఒకరోజు సెలవు ప్రకటించారు. మూడు రోజుల కిందటే కార్తిక మాసం ముగిసినా వేడుకల పేరిట బడులను మూత వేయడమేంటి అని విద్యార్థుల తల్లిదండ్రులు విస్మయం వ్యక్తం చేశారు.

లీప్ యాప్ నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న గురుకులాల ఉద్యోగులు

జిల్లా సచివాలయం: గురుకులాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు లీప్ యాప్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఉద్యోగులు నిరసన చేపట్టారు. సోమవారం గురుకులాల విద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులు కడప కలెక్టరేట్‌లో జిల్లా ఉన్నతాధికారులకు వినతి పత్రం అందించి నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మంత్రిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్, ఆప్కాస్ ఉపాధ్యక్షుడు రవివరప్రకాశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పద్మనాభుడు తదితరులు మాట్లాడుతూ.. స్కూల్ ఎడ్యుకేషన్ ఉద్యోగులు ఒక్క యాప్‌మాత్రమే వేస్తుంటే తాము రెండు అటెండెన్స్ ఎందుకు వేయాలని ప్రశ్నించారు. తక్షణమే కలెక్టర్ స్పందించి మా సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రతినిధులు శ్రీనివాసులు, కోటేశ్వరరావు, వెంకటశ్రీనివాసులు, రాజకుమార్, సుభాన్ పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించి న్యాయం చేయాలని ధర్నా

కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ఎస్సీలకు రిజర్వేషన్ల సౌకర్యం కల్పించి విద్య, ఉద్యోగ రాజకీయాల్లో ప్రత్యేక వసతులు కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ఏపీఎమ్మార్పీఎస్ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లవుతున్నా రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు 15 శాతం నుంచి ఒక్క శాతం కూడా పెరగలేదన్నారు. అసైన్డ్, ల్యాండ్ సీలింగ్, జెడ్‌హెచ్‌డీసీ, భూదాన బోర్డు తదితర ప్రభుత్వ భూములకు అడ్డంకులు తొలగించి దళితులకు అప్పగించాలన్నారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వివిధ విభగాల నేతలు నాగభూషణం, ఆంజనేయులు, వెంకటనారాయణ, తిరుమలయ్య, ఆరోగ్యం, బాల నర్సింహులు, నాగరాజు, విజయ్‌కుమార్, వెంకటలక్ష్మీ, రమాదేవి, బాలగురమ్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

కమలాపురం, న్యూస్‌టుడే: మండలంలోని చదిపిరాళ్లలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.66,136 వచ్చినట్లు ఆలయ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్తిక మాసం సందర్భంగా భక్తులు కానుకలు హుండీలో వేశారు. సోమవారం హుండీలోని కానుకలను కమిటీ సభ్యులు, భక్తుల సమక్షంలో లెక్కించారు.

రాయలసీమ అభివృద్ధికి పోరాటం

వేంపల్లె, న్యూస్‌టుడే: రాయలసీమ ప్రాంత సమగ్రాభివృద్ధి పోరాటాలే శరణ్యమని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు యాదవ్ అన్నారు. సీమ సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు ఈ నెల 30న కడప ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు మాజీ ఎంపీ తులసిరెడ్డిని, వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డిని, ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు రమణారెడ్డిని కలిసి ఈ సమావేశానికి హాజరు కావాలని ఆహ్వానపత్రం అందించారు.

తోటి వారికి సేవ చేసినప్పుడే సార్థకత

శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ రమేష్‌నాయుడిని సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కడప విద్య, న్యూస్‌టుడే: సాటి మనుషులకు సేవ చేసినప్పుడే జీవితానికి సార్థకత చేకూరుతుందని లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య జోన్ ఛైర్మన్ లయన్ అనంతబొట్ల వెంకటసుబ్బయ్య అన్నారు. కడప నగరంలో సోమవారం క్లబ్ జోన్ సమావేశం నిర్వహించారు. శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన రాజంపేటకు చెందిన క్లబ్ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడును క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతబొట్ల వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ.. పేదలు, అభాగ్యులను ఆదుకునేందుకు లయన్స్‌క్లబ్ చక్కటి వేదిక అన్నారు. లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు కె.చిన్నపరెడ్డి, జొన్నలగడ్డ రామచంద్రప్రకాశరావు, లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ప్రెసిడెంట్ డాక్టర్ రంగనాథ్‌రెడ్డి, రీజనల్ ఛైర్మన్ షేక్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బర్సీ మహోత్సవం

కమలాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని దర్గా-ఏ-గఫారియాలో శ్రీహజరత్ అబ్దుల్ గఫార్ షాఖాద్రి బర్సీ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షాఖాద్రి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భక్తుల నడుమ వేడుకలు జరిపించారు. పాత బస్టాండ్ సమీపంలోని ఓ ఇంటి నుంచి గంధాన్ని ప్రత్యేకంగా అలంకరించిన చాందినీలో ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. అనంతరం ముజావర్లపై పూల చాదర్లు సమర్పించారు. అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఊరేగింపులో మత పెద్దలు, భక్తులు

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

ఆర్జేడీ సురేష్‌బాబుకి వినతిపత్రం సమర్పిస్తున్న ఆర్ఎస్‌వో నాయకులు

కడప విద్య: రాయలసీమ జిల్లాల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కడప నగరంలోని ఇంటర్మీడియట్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కార్యాలయంలో ఆర్జేడీ సురేష్‌బాబును కలిసి రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఆర్ఎస్‌వో) నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ.. ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో పలుచోట్ల షాపింగ్ కాంప్లెక్స్, అపార్ట్‌మెంట్లలో జూనియర్ కళాశాలలు నిర్వహిస్తామని మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు అక్కడ లేవని ఆరోపించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఆయా కళాశాలల గుర్తింపు రద్దుచేయాలన్నారు.

విధుల్లోకి తిరిగి తీసుకోవాలని ఆందోళన

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: రిమ్స్‌లో తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ నేతృత్వంలో పలువురు కార్మికులు సోమవారం కడప కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ రిమ్స్‌లో 15 ఏళ్లుగా పనిచేస్తున్న శానిటేషన్ సూపర్‌వైజర్లను క్వాలిఫికేషన్ పేరుతో విధుల నుంచి తొలగించడం సరికాదన్నారు. అనంతరం జేసీ అదితిసింగ్‌కు వినతి పత్రం అందించారు. బీసీ సంక్షేమ వసతిగృహాల్లోని కార్మికులను వార్డెన్‌లు వేధిస్తున్నారంటూ ఏఐటీయూసీ నాయకులు డీఆర్వో విశ్వేశ్వర నాయుడుకు ఫిర్యాదు చేశారు.

29, 30 తేదీల్లో కడప బాలోత్సవం

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కడప విద్య, న్యూస్‌టుడే: నగరంలోని సెయింట్ జోసెఫ్ బాలికల పాఠశాలలో నవంబరు 29, 30 తేదీల్లో కడప బాలోత్సవం పిల్లల సంబరాలు నిర్వహించనున్నామని కమిటీ నాయకులు తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం కమిటీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలనే ఉద్దేశంతో 28 అంశాలతో జూనియర్, సబ్ జూనియర్ విభాగాలుగా రెండు రోజుల పాటు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. మంగళవారంతో రిజిస్ట్రేషన్ గడువు ముగుస్తుందన్నారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కడప బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు నాగమునిరెడ్డి, అధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రాహుల్, గౌరవ సలహాదారు వీరసుదర్శన్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

వీఆర్ఏల ఉద్యోగోన్నతుల కల్పనకు వినతి

చక్రాయపేట, న్యూస్‌టుడే: వీఆర్ఏలుగా పనిచేస్తున్న వారందరికీ గౌరవ వేతనం రూ.25 వేలు ఇవ్వాలని చక్రాయపేట మండల రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్షులు నారాయణ పేర్కొన్నారు. ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రిజిస్ట్రేషన్ 89/86 రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం రెవెన్యూ డివిజనల్ అధికారి చిన్నయ్యను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వీఆర్ఏలుగా పనిచేస్తున్న వారికి అటెండర్, వాచ్‌మెన్, వీఆర్‌ఓలుగా ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్ఏలు నరసింహులు, రామచంద్ర, రమణ, యల్లమ్మ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు అధికారి నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు పాఠశాలలు, కళాశాల్లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. వాటి వల్ల కలిగే నష్టాలను తెలియజేశారు. మత్తు, గంజాయి జోలికి వెళ్లొద్దంటూ సూచించారు. ● ఈగల్ సిబ్బంది మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి గోడపత్రాలను ఆవిష్కరించి మత్తుతో కలిగే అనర్థాలను తెలియజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

పులివెందుల, న్యూస్‌టుడే: క్రీడలతో మానసికోల్లాసం కలగడంతో పాటు నాయకత్వ లక్షణాలు అలవడుతాయని ఆచార్య ఎన్జీ రంగా విశ్వ విద్యాలయ ఉపకులపతి డాక్టర్ శారద జయలక్ష్మిదేవి, విద్యార్థి వ్యవహారాల డీన్ జి.రామచంద్రరావులు అన్నారు. పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో అంతర్ జిల్లాల కళాశాలల క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. పులివెందుల కళాశాలలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 19 కళాశాలల విద్యార్థులు క్రీడా పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నీస్, బాస్కెట్‌బాల్ తదితర క్రీడల్లో విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి షేక్ గౌస్‌బాషా, కళాశాల డీన్ డాక్టర్ మాధవ పాల్గొన్నారు.

పులివెందులకు పీజీ కళాశాల రావడం అదృష్టం

● పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలకు పీజీ (ఎంటెక్) కళాశాల రావడం అదృష్టమని ఆచార్య ఎన్జీ రంగా విశ్వ విద్యాలయ వీసీ డాక్టర్ శారద జయలక్ష్మిదేవి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వి.రమణలు అన్నారు. పీజీ కళాశాలలు ప్రధానంగా పెద్ద పట్టణాలకు వస్తాయని అలాంటిది ఇక్కడికి రావడం సంతోషకరమన్నారు. ఈ కళాశాలలో మంచి వసతులుండడం వల్లే సాధ్యమైందన్నారు. విద్యార్థి వ్యవహారాల డీన్ జి.రామచంద్రరావు, కళాశాల డీన్ మాధవలు ప్రసంగించారు.

డిసెంబరులో రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

కడప విద్య, న్యూస్‌టుడే: కాకినాడలో డిసెంబరు 21, 22, 23 తేదీల్లో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు జరగనున్నాయని జన విజ్ఞాన వేదిక (జవివే) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సమీర్‌బాషా, శివరాంలు అన్నారు. స్థానిక ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల ముగింపు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రొద్దుటూరులోని ఎస్‌పీసీఎస్ఎం హైస్కూల్ విద్యార్థులు ఎం.సాయిశ్రీ దీక్షిత, వై.ప్రణీత్‌రెడ్డి, వి.నరసింహతరూర్, ప్రైవేట్ పాఠశాలల విభాగంలో కడప నగరంలోని శ్రీసాయివిజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు హర్షిత్‌సాయి, రిషిత, రామ్‌చరణ్ విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఒంటిమిట్ట ఎంఈవో-2 బ్రహ్మం, యోగివేమన విశ్వవిద్యాలయం అధ్యాపకుడు వెంకటరామిరెడ్డి, డిగ్రీ కళాశాల అధ్యాపకుడు కృష్ణారెడ్డి విజేతలకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జవివే నాయకులు రాజశేఖర్‌రాహుల్ పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులను సత్కరిస్తున్న నాయకులు, అతిథులు

బెట్టింగ్‌లకు పాల్పడితే కేసులు

స్పందనకు వందనం

మలకాటిపల్లెలో ప్రజలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్.ఐ ప్రణయ్‌కుమార్‌రెడ్డి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఎస్.ఐ ప్రణయ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఒంటిమిట్ట, శివారు గ్రామాల్లో కొంతమంది యువకులు ఆన్‌లైన్ బెట్టింగులు, గేమింగ్ యాప్‌ల్లో అక్రమంగా నగదు లావాదేవీలు నిర్వహిస్తున్నారు. దీనిపై సోమవారం 'ఆంధ్రా భద్రాద్రిలో బెట్టింగ్ బంగార్రాజులు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా పోలీస్ అధికారులు దృష్టి సారించారు. ఒంటిమిట్ట, పరిసర గ్రామాల్లో అసలేం జరుగుతుందని ఆరా తీశారు.

రైతుబజారులో కూరగాయల ధరలు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతుబజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా...బంగాళదుంప-34, క్యాబేజి-30, క్యారెట్-50, బీన్స్-45, బీట్‌రూట్-50, కీర-30, దోస-40, దొండకాయలు-46, ముల్లంగి-40, అల్లం-60, 80, కాలీఫ్లవర్-38, క్యాప్సికం-70, టమాట-30, మిరపకాయలు 45, వంకాయలు-30, బెండకాయలు-40, బీర-46, కాకర-45, మటిక్కాయ-40, చిక్కుడు-60, అలసందకాయలు-50, అనపకాయలు-65, ఉల్లిపాయలు-20, మునగకాయలు-60.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu